'ఈనాడు వైజ్ఞానిక ప్రదర్శన' రేపు

విశాఖపట్నంలోని 'డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ హాల్, బుల్లయ్య కాలేజ్ పక్కన, రామా టాకీస్ వద్ద నిర్వహణ.

ఈనాడు– విశాఖపట్నం: విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు 'ఈనాడు వైజ్ఞానిక ప్రదర్శన' నిర్వహిస్తోంది. 'డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ హాల్, బుల్లయ్య కాలేజ్ పక్కన, రామా టాకీస్ దరి, విశాఖపట్నంలో మంగళవారం ఉదయం 9.30 గంటలకు ఈ మెగా సైన్స్ ఫెయిర్ ప్రారంభం కానుంది. విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లోని వివిధ పాఠశాలలకు చెందిన ఆరు నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు తమ ప్రాజెక్టులతో పాల్గొననున్నారు. విద్యార్థులను వినూత్న ఆలోచనలతో ప్రయోగాలు చేసేలా ప్రోత్సహించడం 'ఈనాడు వైజ్ఞానిక ప్రదర్శన' ముఖ్య ఉద్దేశం. సుమారు 100 ప్రాజెక్టులు ప్రదర్శించనున్నారు.



కనికట్టు కాదు.. చెట్టుపై చెట్టు

సాధారణంగా చెట్లు నిటారుగా పెరుగుతాయి. వాటి కొమ్మలు శాఖోపశాఖలుగా విస్తరిస్తాయి. గూడెంకొత్తవీధి - సీలేరు మార్గంలో లంకపాకలు సమీపంలో ఓ చెట్టు ఇందుకు భిన్నంగా ఉంది. చెట్టు ఏటవాలుగా, కొమ్మలు నిటారుగా పెరుగుతున్నాయి. చెట్టుపై చెట్టు కనికట్టులా కనిపిస్తున్నాయి.

– న్యూస్‌టుడే, గూడెంకొత్తవీధి

48 గంటల్లోనే జాబ్‌కార్డు

అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఉపాధి హామీ పథకంలో పలు మార్పులు చేసింది. పథకం పేరును వికసిత్ భారత్ గ్యారెంటీ పర్ గ్రామీణ్ రోజ్‌గార్ అండ్ అజీవికా మిషన్ (వీబీ జీ రామ్‌జీ)గా మారుస్తూ పని దినాలను 125 రోజులకు పెంచింది. ఇకపై సమయానికి వేతన చెల్లింపులు చేసేలా, ఆలస్యానికి పరిహారం అందించేలా భరోసానిస్తూ పథకాన్ని రూపొందించింది. కొత్తగా జాబ్‌కార్డు కావాలనుకునే వారికి జారీ సులభతరం చేసింది. దరఖాస్తు చేసిన 48 గంటల్లోనే జాబ్‌కార్డు జారీ చేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు. అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు ఈకేవైసీని అమల్లోకి తెచ్చింది. రెండు, మూడుచోట్ల పేర్లు నమోదు చేసుకోవడం, ఒకరి బదులు మరొకరు పనులు చేయడం, పనులకు రాని వారికి మస్తర్లు వేయడం వంటి అక్రమాలకు సాంకేతిక పరిజ్ఞానంతో అడ్డుకట్ట వేసేలా చర్యలు చేపట్టింది. ఆధార్ కార్డుతో నేరుగా ఉపాధి హామీ క్షేత్ర సహాయకుడిని సంప్రదిస్తే ఈకేవైసీ పూర్తి చేసి దరఖాస్తు చేస్తారు. ఉన్నతాధికారులు పరిశీలించి జాబ్‌కార్డు జారీ చేస్తారు.

కొండకోనల్లో జలధారలు.. పండ్ల తోటలతో సస్యశ్యామలం

నాబార్డు సాయంతో గ్రావిటీ పథకాల ఏర్పాటు

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే

అల్లూరి జిల్లా పూర్తిగా వ్యవసాయాధారిత ప్రాంతం. 90 శాతం గిరిపుత్రులు వర్షాధారంగానే పంటలు పండిస్తున్నారు. కాఫీ, మిరియాలు, పసుపు, అల్లం, రాజ్‌మా, రాగులు తదితర పంటలను సాగు చేస్తున్నారు. కాలానికి అనుగుణంగా గిరిజన రైతులూ ఉద్యాన పంటల సాగుకు ముందుకొస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు నాబార్డు, ఐటీడీఏ ఉద్యాన తోటల సాగుకు ఆర్థిక వనరులు అందించడంతోపాటు సాంకేతిక సహకారం అందిస్తున్నాయి.

▼ గూడెంకొత్తవీధి మండలంలోని 15 గ్రామాల్లో గిరిజన అభివృద్ధి పథకం కింద 500 ఎకరాల్లో పండ్ల తోటల పెంపకానికి నాబార్డు తోడ్పాటు అందిస్తోంది. క్షేత్రస్థాయిలో ఈ పథకాన్ని గిరిజన వికాస్ సంస్థ పర్యవేక్షిస్తోంది. ఈ పథకంలో ప్రతి రైతు ఎకరా విస్తీర్ణంలో పండ్ల తోటలను సాగు చేయాల్సి ఉంటుంది. మొక్కలు నాటేందుకు తవ్వే గోతుల మొదలు మొక్కల సరఫరా, తోటల సంరక్షణ, నీటి తడులు, అవసరమైన ఎరువులు వంటి నిర్వహణ చర్యలన్నింటికీ సంబంధిత రైతుల బ్యాంకు ఖాతాలకు నిధులు జమయ్యేలా పథకాన్ని రూపొందించారు. ఒక్కో రైతుకు 37 లిచీ, 37 సపోటా, 60 జామ, 60 వక్క మొక్కలు పంపిణీ చేశారు.

శ్రమదానంతో పనులు చేస్తున్న రైతులు

▼ కొండలపై ఉద్యాన పంటలు పండించాలంటే ఏడాది పొడవునా సాగునీరు అవసరం. కొండకోనల్లో వర్షాధారం తప్పా మరో ప్రత్యామ్నాయం లేదు. గిరిజన వికాస్ సంస్థ ప్రతినిధులు గ్రావిటీ పథకాల ద్వారా ఉద్యాన తోటలకు సాగునీరందించే దిశగా చర్యలు చేపట్టారు. కొండలపై ఉండే నీటి వనరుల ఆధారంగా అక్కడే నీటిని ట్యాంకుల్లో నిల్వ చేసి వాటిని పైపుల ద్వారా పండ్ల తోటలకు నీరందించే ప్రయత్నంలో విజయం సాధించారు. ఇందుకు అవసరమైన సాంకేతిక సహకారాన్ని, అవసరమైన సామగ్రిని నాబార్డు సాయంతో గిరిజన వికాస్ అందించింది. రైతులంతా ఏకమై శ్రమదానంతో గ్రావిటీ పథకాలను నిర్మించుకుని పండ్ల తోటలకు నీటిని మళ్లించుకోగలిగారు. పైసా ఖర్చు లేకుండా ఏడాది పొడవునా తోటలకు పుష్కలంగా నీరందుతోందని సాగులు, బూసులు గ్రామాలకు చెందిన రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గిరిజన ప్రాంతాల్లో సుస్థిర ఆదాయం పొందేందుకు వనరులు పుష్కలంగా ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకుంటే సత్ఫలితాలు సాధించవచ్చని గిరిజన వికాస్ సంస్థ సీఈవో సత్యనారాయణ పేర్కొన్నారు.

మేలో మోదకొండమ్మ జాతర

పాడేరు, న్యూస్‌టుడే: మోదకొండమ్మ అమ్మవారి జాతర మే 10, 11, 12 తేదీల్లో జరగనుంది. ఈ వేడుకలకు సంబంధించి ఆదివారం మధ్యాహ్నం ఆలయ కమిటీ ఛైర్మన్, ప్రధాన కార్యదర్శి, సభ్యులు, గ్రామ పెద్దలు సమావేశమై చర్చించారు. సమావేశం అనంతరం ఆలయ ప్రధానార్చకులు సుబ్రహ్మణ్యం జాతర తేదీలను వెల్లడించారు. ఉత్సవ కమిటీ అధ్యక్షులుగా ఆలయ కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు వ్యవహరించనున్నారు. రెండు రోజుల్లో ఉత్సవ కమిటీని ప్రకటిస్తామని ఆలయ కమిటీ ప్రతినిధులు చెప్పారు.

ఆలయ మండపంలో కమిటీ సభ్యుల సమావేశం

ప్రణాళికతోనే మెరుగైన ఫలితాలు

'పది'లో శత శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

పాడేరు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం విద్యారంగంలో అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. ప్రస్తుతం పదో తరగతి పరీక్షలపై ప్రత్యేక దృష్టిసారించింది. జిల్లాలో గతేడాది పదో తరగతి ఫలితాల్లో అల్లూరి జిల్లా రాష్ట్ర వ్యాప్తంగా చివరి స్థానంలో నిలిచింది. ఈసారి మొదటి స్థానమే లక్ష్యంగా ప్రత్యేకంగా కార్యాచరణ రూపొందించి అమలు చేస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి రామకృష్ణారావు చెప్పారు. 'చదువులో వెనుకబడిన విద్యార్థులను ఉపాధ్యాయులు దత్తత తీసుకుని చదివిస్తున్నారు. కనీసం 35 మార్కులు సాధించలేని వారిని వసతి గృహాల్లో ఉంచి ప్రత్యేక తరగతులు, సబ్జెక్టు నిపుణులతో వీడియో తరగతులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పదో తరగతి పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయడంపై 'న్యూస్‌టుడే'తో మాట్లాడారు.

మార్కుల ఆధారంగానే స్టార్స్: ప్రభుత్వ పాఠశాలల నుంచి పదో తరగతి రెగ్యులర్ విద్యార్థులు 7,299 మంది ఈ ఏడాది పరీక్షలకు హాజరుకానున్నారు. పరీక్ష కేంద్రాల్లో పూర్తిస్థాయిలో వసతులు ఉండేలా చర్యలు చేపడుతున్నాం. విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు వంద రోజుల ప్రణాళికను అమలు చేస్తున్నాం. రోజూ ఉదయం, సాయంత్రం గంట చొప్పున అదనపు తరగతులు జరుగుతున్నాయి. రోజుకో సబ్జెక్టుపై సాయంత్రం 20 మార్కులకు పరీక్ష పెడుతున్నాం. 0 నుంచి 11 మార్కులొచ్చిన వారికి రైజింగ్ స్టార్స్‌గా, 11 నుంచి 20 మార్కులు వచ్చిన వారికి షైనింగ్ స్టార్స్‌గా విభజించి చదివిస్తున్నాం.

▮ పాడేరు ఐటీడీఏ పరిధిలో 109 గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, గురుకులాల్లో 5,175 మంది పదో తరగతి విద్యార్థులు ఉన్నారు. కలెక్టర్ ఆదేశాలతో మూడేళ్ల కిందట సూపర్ 50 కార్యక్రమం అమలవుతోంది. రాత్రి 10 గంటల వరకు స్టడీ అవర్స్ కొనసాగుతున్నాయి. మెరుగైన ఫలితాలు సాధించేందుకు మండలానికో ప్రత్యేక అధికారిని నియమించాం. వారంతా రోజూ పర్యవేక్షిస్తున్నారు.

వసతిగృహాల్లో ప్రత్యేక శిక్షణ: చదువులో బాగా వెనుకబడిన విద్యార్థులను వసతి గృహాల్లో ఉంచి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. ప్రస్తుతం ఉమ్మడి అల్లూరి జిల్లాలో ఐదు ప్రభుత్వ వసతి గృహాల్లో సుమారు 301 మంది విద్యార్థులకు తరగతులు కొనసాగుతున్నాయి. ఒక్కో విద్యార్థికి నెలకు రూ.1600 చొప్పున ప్రభుత్వం చెల్లిస్తోంది. పాఠశాలలో పదో తరగతి విద్యార్థులను అక్కడి ఉపాధ్యాయుల సంఖ్య ఆధారంగా దత్తత ఇచ్చి చదివిస్తున్నాం. మార్చి 15 వరకు ఈ ప్రత్యేక తరగతులు కొనసాగుతాయి.

రంజాన్ వేళలు	
ఇఫ్తార్: సోమవారం సాయంత్రం	6:10 గం॥లకు
సహరి: మంగళవారం తెల్లవారుజాము	5:01 గం॥లకు

ఆరంభంలోనే కటకట

పెదబయలు, ముంచంగిపుట్టు మండలాల్లోని పలు గిరిజన గ్రామాల్లో వేసవి ఆరంభంలోనే తాగునీటి ఎద్దడి మొదలైంది. బోర్లు, చేతిపంపుల నుంచి నీరు రాకపోవడంతో గ్రామాలకు సమీపంలోని గెడ్డలను ఆశ్రయించాల్సి వస్తోంది. పెదబయలు మండలం పర్రెడ పంచాయతీ కేంద్రంతోపాటు గ్రామాల్లో సమస్య తీవ్రత అధికంగా ఉంది. ఆర్డబ్ల్యూఎస్ అధికారులు స్పందించి తాగునీటి ఎద్దడిని అధిగమించేందుకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, పెదబయలు

పెరిగిన కేంద్రాలు.. తగ్గిన దూరం

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

పాడేరు, పెదబయలు, న్యూస్‌టుడే: ఇంటర్మీడియట్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభంకానున్నాయి. జిల్లాలో 11 మండలాలు ఉండగా.. అన్నిచోట్లా పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. గతంతో పోలిస్తే కేంద్రాల సంఖ్య పెరగడంతో పరీక్ష రాసేందుకు విద్యార్థులు ప్రయాణించే దూరం తగ్గింది. ఇంతకుముందు పెదబయలు, ముంచంగిపుట్టు మండలాల విద్యార్థులు ముంచంగిపుట్టులోనే, డుంబ్రిగుడ, అనంతగిరి కళాశాల విద్యార్థులు అరకులోయలో, కొయ్యూరు విద్యార్థులు కృష్ణదేవిపేటలో, గూడెంకొత్తవీధి విద్యార్థులు చింతపల్లిలో పరీక్ష రాయాల్సి వచ్చేది. కిలోమీటర్ల దూరం వెళ్లి రావాల్సి ఉండటంతో విద్యార్థులు దూరభారంతో ఒత్తిడికి గురయ్యేవారు.

బల్లలపై హాల్ టికెట్ నంబర్లు వేస్తున్న అధ్యాపకులు

ఈ ఏడాది ఆ ఇబ్బంది లేకుండా కొత్తగా ముంచంగిపుట్టు, పెదబయలు, హుకుంపేట, జి.మాడుగుల, డుంబ్రిగుడ, అనంతగిరి, కొయ్యూరు, గూడెంకొత్తవీధి, సీలేరుల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటయ్యాయి. పాడేరులో రెండు, అరకులోయలో మూడు, చింతపల్లిలో రెండు పరీక్ష కేంద్రాలు చొప్పున 11 మండలాల్లో 16 కేంద్రాలను ఏర్పాటు చేశారు. కళాశాలకు అనుసంధానంగా బాలబాలికలకు వేర్వేరుగా ఆశ్రమ వసతి గృహాలుండడంతో ఎటువంటి ఒత్తిడి లేకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్ష రాసేందుకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది.

▼ ముంచంగిపుట్టు, డుంబ్రిగుడ పరీక్ష కేంద్రాలకు ప్రహరీ లేదు. కొన్ని కేంద్రాల్లో ఫ్యాన్లు లేవు. రెండేళ్లుగా కళాశాలలకు బల్లలు సమకూరడంతో కింద కూర్చుని పరీక్ష రాసే పరిస్థితి ఎక్కడా లేదు. పాడేరు, అరకులోయ నియోజకవర్గాల్లో నాలుగు ఫ్లయింగ్ స్క్వాడ్‌లతోపాటు ఇద్దరు సిట్టింగ్ స్క్వాడ్లు, ఉన్నతాధికారులు పర్యవేక్షించనున్నారు. చూచిరాతలు, మాస్ కాపీయింగుకు అస్కారం లేకుండా సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశారు.

▼ పాడేరులోని రెండు పరీక్ష కేంద్రాలకు వెళ్లేందుకు కేజీబీవీ, గురుకుల విద్యార్థినులకు ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేసినట్లు డీఈవో భీమశంకరరావు చెప్పారు. రవాణా ఛార్జీల కోసం ఒక్కో విద్యార్థికి రూ.350 చొప్పున తల్లుల ఖాతాలకు జమ చేశారు. విద్యార్థులను ఉదయం 8.30 గంటల నుంచి కేంద్రాల్లోకి అనుమతిస్తారు. తొమ్మిది గంటల తర్వాత ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించరు.

జిల్లాలో మండలాలు	పరీక్ష కేంద్రాలు	విద్యార్థులు	ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్‌లు
11	16	14,608	06

సమస్యలు ఎదురైతే ఫిర్యాదు చేయాల్సిన ఫోన్ నంబర్లు

కంట్రోల్ రూమ్ టోల్‌ఫ్రీ నంబరు: 94408 78176
ఇంటరు బోర్డు అధికారి: 94403 01461
జిల్లా పరీక్ష కమిటీ: 94946 71511, 94932 59259, 94410 92332, 78934 28561, 94945 64473

ఉద్యోగానికి 'ఆరు' మెట్లు..!

✦ 'ఏఐ' ప్రభావంలోనూ అవకాశాలు
✦ విద్యార్థులకు నిపుణుల సూచనలు

ఈనాడు, విశాఖపట్నం

ప్రపంచ వ్యాప్తంగా అన్ని రంగాల్లో కృత్రిమ మేధ కీలకంగా మారుతోంది. ఇది ఉద్యోగాలపై ప్రతికూల ప్రభావం చూపుతుందనే ఆందోళన విద్యార్థులు, నిరుద్యోగుల్లో వ్యక్తమవుతోంది. అయితే మారుతున్న సాంకేతికతకు తగ్గట్టుగా ఎప్పటికప్పుడు కొత్త నైపుణ్యాలు నేర్చుకుంటే.. ఉద్యోగావకాశాలు పెరుగుతాయని నిపుణులు సూచిస్తున్నారు. ఏఐ ప్రభావం పెరుగుతున్న నేపథ్యంలో గీతం విశ్వవిద్యాలయంలో ఇటీవల నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు ఆరు నైపుణ్యాలపై దృష్టి సారించాలని నిపుణులు సూచించారు.

1 కొత్త అంశాలు నేర్చుకోవాలి: మార్పులను అందిపుచ్చుకుని, నిరంతరం కొత్త విషయాలను నేర్చుకోవాలనే ఆసక్తి ఉన్నవారినే కంపెనీలు ఎంపిక చేసుకుంటున్నాయి. మీకు ఎంత అనుభవమున్నా.. కొత్త అంశాలు నేర్చుకోవడంపై దృష్టి సారించాలి. సాంకేతికతను ఒత్తిడి పెంచే అంశంగా కాకుండా.. సరదాగా నేర్చుకోవాలి.

2 నైపుణ్యాలు కూడబెట్టుకుంటేనే..: ఏఐతో వివిధ కొత్త ఉద్యోగాలు పుట్టుకొస్తున్నాయి. ఎంట్రీ లెవెల్ ఉద్యోగాల అర్థాన్ని ఏఐ మారుస్తోంది. దీన్ని బాధ్యతాయుతంగా వినియోగించాలి. ఏదో ఒక నైపుణ్యముంటే ఉద్యోగం సాధించవచ్చని అనుకోవడం సరికాదు. మీరు ఎంత మేర నైపుణ్యాలను కూడబెట్టుకుంటే.. అన్ని ఎక్కువ అవకాశాలొస్తాయి.

3 పరిమితులు వద్దు..: ఉద్యోగాలు తక్కువ.. అభ్యర్థులు ఎక్కువగా ఉంటే కంపెనీలు నియామకాలు తగ్గించుకోవాలని చూస్తాయి. కంపెనీల అవసరాలకు తగ్గట్టుగా మీలో మార్పులు చేసుకోవాలి. కేవలం విశాఖలోనో, దక్షిణాదిలోనో పనిచేస్తామని పరిమితులు పెట్టుకోవద్దు. ఆ పరిధి దాటి ఆలోచించండి.

4 సామర్థ్యాలను వివరించాలి: సైబర్ సెక్యూరిటీ రంగంలో ఉద్యోగం సాధించాలంటే.. ఆ విభాగంలో మీకున్న నైపుణ్యాలు, సామర్థ్యాలపై 30 సెకన్ల వీడియోను సామాజిక మాధ్యమాల్లో పంచుకోండి. ఆయా నిపుణుల కోసం చూస్తున్న కంపెనీలకు మీరు చేసిన వీడియో చేరుతుంది. రెండు వారాల్లోనే ఇంటర్వ్యూకు ఆహ్వానిస్తూ సమాచారం వస్తుంది.

5 సమస్య పరిష్కారానికే ప్రాధాన్యం..: ప్రస్తుతం నియామక ప్రక్రియలో.. మార్కుల కంటే నైపుణ్యాలకే ఎక్కువ ప్రాధాన్యమిస్తున్నారు. 9.5 సీజీపీఏ ఉన్నప్పటికీ.. 7.5 సీజీపీఏతో ఇంటర్న్‌షిప్, హ్యాకథాన్, ప్రాజెక్టులు, సమస్య పరిష్కారంలో ఎక్కువ అనుభవమున్న వారినే కంపెనీలు ఎంపిక చేసుకుంటున్నాయి.

6 ప్రాథమిక అంశాలపై శ్రద్ధ: ఇంజినీరింగ్ చివరి రెండేళ్లలో వీలైనన్ని ఎక్కువ ప్రాజెక్టులు చేయడంపై దృష్టి పెట్టాలి. ఎలాంటి పరిస్థితులనైనా తట్టుకునేందుకు సిద్ధంగా ఉండాలి. ఇంటర్వ్యూకు వెళ్లే ముందు రెజ్యూమ్ ప్రత్యేకంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. ఇంటర్వ్యూల్లో కంపెనీల ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు సూటిగా సమాధానం చెప్పగలగాలి.

ఆధార్ కార్డుల్లేక చదువుకు దూరం

సమస్య వివరిస్తున్న చేటరాయి గ్రామస్థులు

సీలేరు, న్యూస్‌టుడే: పంచాయతీ కేంద్రానికి దూరంగా ఉన్న ఆ గ్రామంలో చిన్నారులకు ఆధార్‌కార్డులు లేక చదువుకు దూరమవుతున్నారు. గూడెంకొత్తవీధి పంచాయతీ కేంద్రానికి సుమారు పది కిలోమీటర్ల దూరంలో చేటరాయి గ్రామం ఉంది. ఈ గ్రామంలో ఐదు కుటుంబాలకు చెందిన సుమారు 28 మంది నివసిస్తున్నారు. వీరిలో పది మంది చిన్నారులు ఉన్నారు. వీరిని పాఠశాలలో చేర్పించాలని ఉన్నా.. ఆధార్‌కార్డులు లేకపోవడంతో మిన్నకుండిపోవాల్సి వస్తోందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్నారుల పేర్లు రెండు, మూడు సార్లు ఆధార్ కేంద్రంలో నమోదు చేయించినా కార్డులు రాలేదని పేర్కొన్నారు. జిల్లా యంత్రాంగం స్పందించి ఆధార్ కార్డుల జారీకి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ఈ విషయాన్ని ఎంపీడీవో రమణబాబు వద్ద ప్రస్తావించగా.. గూడెంకొత్తవీధిలో ఇప్పటికే ఒక ఆధార్ కేంద్రం ఉందని, త్వరలో సంచార వాహనం రానుందని చెప్పారు. సంచార వాహనాన్ని పంపి అక్కడి వారందరికీ ఆధార్ కార్డులు వచ్చేలా చర్యలు చేపడతామన్నారు.

పాఠశాలలకు పక్కా భవనాలు

వచ్చే విద్యా సంవత్సరం నాటికి అందుబాటులోకి!

పాడేరు పట్టణం, న్యూస్‌టుడే: సర్కారు పాఠశాలల రూపురేఖలను మార్చే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. వైకాపా ప్రభుత్వ హయాంలో పాఠశాల అభివృద్ధికి నిధులు ఖర్చు చేసినా.. విద్యార్థుల్లేక బడులు మూత పడ్డాయి. తాజా బడ్జెట్‌లో పాఠశాలల అభివృద్ధికి రూ.800 కోట్లు కేటాయించారు. గతంలో జరిగిన తప్పిదాలు పునరావృతం కాకుండా సమగ్ర ప్రణాళికతో క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టి అభివృద్ధి చేసే దిశగా ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

▼ 2026-27 విద్యా సంవత్సరం నాటికి ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని, ఇప్పటికే స్కూల్ మేనేజిమెంట్ కమిటీ (ఎస్ఎంసీ)లో రూ.200 కోట్లు నిధులు అందుబాటులో ఉన్నట్లు, తాజా బడ్జెట్‌లో మరో రూ.800 కోట్లు కేటాయించినట్లు విద్యాశాఖ మంత్రి లోకేశ్ ఇటీవల బడ్జెట్‌పై జరిగిన చర్చలో అసెంబ్లీలో ప్రకటించిన విషయం తెలిసిందే.

జి.మాడుగుల మండలం కోట్లగరవులో ఇదే పాఠశాల

జిల్లా వ్యాప్తంగా పాఠశాలల స్థితిగతులపై ఇటీవల ప్రభుత్వం సర్వే చేయించింది. నాడు-నేడులో చేపట్టిన పనులు నిధుల లేమితో మధ్యలో వదిలేశారు. అటువంటి పాఠశాలలకు అదనపు నిధులు సమకూర్చి నిర్మాణాలు చేపట్టనున్నారు. మారుమూల గ్రామాల్లో నేటికీ పక్కా భవనాలు లేక విద్యా బోధనకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వచ్చే విద్యా సంవత్సరం ఆరంభం నాటికి భవనాలను అందుబాటులోకి తీసుకురానున్నారు.

జిల్లాలో పాఠశాలలు : 2,975	విద్యార్థులు : 1.7 లక్షలు
కొత్తగా భవనాలు మంజూరు : 373	నిధులు : రూ.45 కోట్లు

ఎనిమిది పదుల వయసులో మూడు స్వర్ణాలు

చోడవరం, న్యూస్‌టుడే: చోడవరానికి చెందిన ముత్యం లక్ష్మి(80) మరో మూడు స్వర్ణాలు తన ఖాతాలో వేసుకున్నారు. జాతీయ స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్-2026లో జావెలిన్, డిస్కస్‌త్రో, షార్ట్‌పుట్‌లో ప్రథమ స్థానంలో నిలిచి పతకాలు అందుకున్నారు. మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌లో జరిగిన 45వ జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో ఈ ఘనత సాధించారు. 85 ఏళ్ల నుంచి 90 ఏళ్ల విభాగంలో మూడు ఈవెంట్లతో పాల్గొని సత్తా చాటారు.

ఈదురుగాలులతో భారీ వర్షం

పాడేరు, న్యూస్‌టుడే: అల్లూరి జిల్లాలో ఆదివారం పలుచోట్ల ఈదురుగాలులతో భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ కాసింది. మధ్యాహ్నం 2 గంటల తర్వాత వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. హుకుంపేట మండలం ఉప్ప, బాకూరు, దుర్గం, పట్టాం, అరకు పరిసర ప్రాంతాల్లో భారీ వర్షం పడింది.

నేడు 'డయల్ యువర్ సీఎండీ'

విశాఖపట్నం, న్యూస్‌టుడే: విద్యుత్తు సంబంధ సమస్యలను మరింత వేగవంతంగా పరిష్కరించే లక్ష్యంతో గురుద్వారాలోని ఈపీడీసీఎల్ కార్యాలయంలో సోమవారం 'డయల్ యువర్ సీఎండీ' కార్యక్రమం నిర్వహించనున్నట్లు సంస్థ సీఎండీ పృథ్వీతేజ్ తెలిపారు. సంస్థ పరిధిలోని 13 జిల్లాలకు చెందిన వినియోగదారులు 86884 00499 నంబరుకు ఫోన్ చేసి సమస్యలు తెలియజేయవచ్చన్నారు. ఉదయం 10.30 నుంచి 11.30 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. విద్యుత్తు సరఫరాలో తరచూ అంతరాయాలు, హెచ్చుతగ్గులు, కొత్త సర్వీసుల జారీ, సరఫరా పునరుద్ధరణలో జాప్యం, ట్రాన్స్‌ఫార్మర్ల మార్పిడి తదితర సమస్యలపై నేరుగా ఫోన్ చేసి తెలియజేయవచ్చన్నారు.

నేటి నుంచి యూసీసీ క్రికెట్ టోర్నీ

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే: యునైటెడ్ క్రికెట్ క్లబ్ (యూసీసీ) 12వ మెగా టోర్నీ సోమవారం నుంచి ప్రారంభం కానుంది. రైల్వే స్టేడియం, ఏసీఏ-వీడీసీఏ అంతర్జాతీయ స్టేడియంలో ఈ నెల 27 వరకు పోటీలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. రైల్వే స్టేడియంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆయా జట్ల కెప్టెన్లు పాల్గొని జెర్సీలు ఆవిష్కరించారు. తొలి మ్యాచ్ రైల్వే స్టేడియంలో రైల్వే జట్టు, వైజాగ్ బ్లూస్ జట్ల మధ్య జరుగుతుందని యూసీసీ కార్యదర్శి వెంకటేష్ చెప్పారు.

ఆశ్రమాల్లో వసతి సంక్షోభం

జి.మాడుగుల, న్యూస్‌టుడే: ఏజెన్సీలోని ఆశ్రమ పాఠశాలల్లో వసతి సమస్య విద్యార్థులను తీవ్రంగా వేధిస్తోంది. విద్యార్థుల సంఖ్యకు తగ్గట్లుగా వసతి గృహాలు, తరగతి గదులు లేకపోవడంతో చదువు, నివాసం రెండూ ఒకేచోట సాగించాల్సిన పరిస్థితి. వైకాపా ప్రభుత్వ హయాంలో నాడు- నేడు పథకం కింద ఆశ్రమ పాఠశాలల భవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టినా.. చాలాచోట్ల మధ్యలో నిలిచిపోయాయి. ఫలితంగా వసతి గృహాలనే తరగతి గదులుగా మార్చుకుని బోధన కొనసాగిస్తున్నారు.

కొత్తూరు బాలుర ఆశ్రమ పాఠశాలలో అసంపూర్తిగా అదనపు తరగతుల భవనం

▮ జి.మాడుగుల మండలం బొయితిలి ఆశ్రమ పాఠశాలలో అదనపు వసతిగృహ భవన నిర్మాణం జరగకపోవడం విద్యార్థుల ఇక్కట్లను మరింత పెంచింది. కులుపాడు ఆశ్రమ పాఠశాలలో వసతి గదులే తరగతి గదులుగా మారడంతో బోధన సమయంలో విద్యార్థులకు ఏకాగ్రత లోపిస్తోంది. చదువుకు అనుకూలమైన వాతావరణం లేకపోవడంతో వారి విద్యా ప్రగతిపై ప్రభావం పడుతోందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

▮ కొత్తూరు ఆశ్రమ పాఠశాల-1లో అదనపు తరగతి గదుల నిర్మాణం అసంపూర్తిగా దర్శనమిస్తోంది. ప్రారంభించిన భవనాలు పూర్తి చేయకపోవడంతో ఇరుకు గదుల్లో చదువుకోవాల్సిన పరిస్థితి. అసంపూర్తి భవనాలను పూర్తి చేసి, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా వసతి గృహాలు, తరగతి గదులు నిర్మించాలని కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపాం

ఆశ్రమ పాఠశాలల్లో అసంపూర్తిగా నిలిచిన వసతి గృహాలు, అదనపు తరగతి గదుల నిర్మాణాలు పూర్తి చేసేందుకు ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరైన వెంటనే నిర్మాణాలు ప్రారంభిస్తాం. భవనాలు లేని, శిథిలావస్థకు చేరుకున్న జీపీఎస్ పాఠశాలలకు నూతన భవనాలు నిర్మించేందుకు చర్యలు చేపడతాం. – నాగశిరీషా, ఏటీడబ్ల్యూవో, జి.మాడుగుల

ఉపాధి నిధులు కాజేసినా చర్యలేవీ?

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: పేదలకు పనులు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉపాధి హామీ పథకం అక్రమార్కులకు కాసులు కురిపిస్తోంది. కొన్ని ప్రాంతాల్లో పనులు చేయకుండా, కూలీలతో పని చేయించకుండా దొంగ మస్తర్లు వేసి నిధులు కాజేస్తున్నారు. జిల్లాలోని పలు మండలాల్లో జరిగిన పనులకు సంబంధించి సామాజిక తనిఖీలు జరిగాయి. పలుచోట్ల అక్రమాలు రూ.కోట్లలో ఉంటే జరిమానా, రికవరీ రూ.వేలల్లో ఉంటోంది. క్షేత్ర, సాంకేతిక, మండల స్థాయి అధికారుల ఖాతాలకు నిధులు మళ్లించుకుంటున్నారు.

❖ జిల్లాలో జాబ్‌కార్డులు 2.59 లక్షలు ఉన్నాయి. శ్రామికులు 4.95 లక్షల మంది ఉన్నారు. చింతపల్లి మండలంలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో 5,605 పనులు జరిగాయి. కూలీలకు రూ.36 కోట్లు చెల్లించారు. చేయని పనులు చేసినట్లు చూపి సిబ్బంది, గుత్తేదారులు రూ.46.36 లక్షలు స్వాహా చేశారు.

❖ ఉపాధి హామీ పథకం అమలు క్షేత్రస్థాయిలో లోపభూయిష్టంగా ఉంది. నిత్యం పని ప్రదేశాలను అధికారులు పర్యవేక్షించాలి. తనిఖీలు పడకేయడంతో గ్రామాల్లో పనులను చూసే వారే లేరు. దీంతో పనులు ఇష్టారాజ్యంగా చేస్తూ నిధులను పక్కదారి పట్టిస్తున్నారు. పనుల్లోనూ నాణ్యత లోపం కనిపిస్తోంది.

❖ వైకాపా ప్రభుత్వ హయాంలో ఉపాధి హామీ పథకం అక్రమాల పుట్టగా మారింది. ఉపాధి సిబ్బంది నకిలీ మస్తర్లు, లేని పనులకు బిల్లులు చేసి నిధులు స్వాహా చేశారని గతంలో నిర్వహించిన ప్రజావేదికలో వెల్లడైంది. ఇటీవల ఏర్పాటైన ప్రజావేదికలోనూ అక్రమాలు జరుగుతున్నాయని విమర్శలు వెల్లువెత్తాయి.

నిధులు రికవరీ చేస్తాం..

పక్కదారి పట్టిన నిధులను రికవరీ చేసి, బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. ఉపాధి పనులను నిత్యం పర్యవేక్షణ చేయాలి. సిబ్బందితోపాటు ఏపీవో, సాంకేతిక సహాయకులు పర్యవేక్షించేలా చూస్తాం. – లాలం సీతయ్య, ఏపీడీ, చింతపల్లి

(c) eenadu

కార్యకర్తలకు వేదికగా తెదేపా కార్యాలయం

అనకాపల్లి, న్యూస్‌టుడే: అనకాపల్లిలో తెదేపా జిల్లా కార్యాలయ భవనానికి హోం మంత్రి అనిత ఆదివారం శంకుస్థాపన చేశారు. నూతన కార్యాలయం కార్యకర్తలకు వేదికగా ఉంటుందని, ప్రజా సమస్యల పరిష్కారానికి కేంద్ర బిందువుగా నిలుస్తుందన్నారు. పార్టీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బత్తుల తాతయ్యబాబు, లాలం కాశీనాయుడు, ఎమ్మెల్యే వేపాడ చిరంజీవిరావు, ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, నాయకులు పప్పల చలపతిరావు, పీలా గోవిందసత్యనారాయణ, బుద్ధ నాగజగదీశ్వరరావు, కోట్ని బాలాజీ, బీవీజీ కుమార్, మళ్ల సురేంద్ర, ప్రగడ నాగేశ్వరరావు, గండి బాబ్జీ, పార్టీ నాయకులు దాడి రత్నాకర్, చింతకాయల రాజేష్ పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న మంత్రి అనిత

రైల్వేస్టేషన్‌లో పర్యవేక్షిస్తున్న ఏడీఆర్ఎం రామారావు, అధికారులు

ప్రయాణికులకు మెరుగైన సేవలు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: రైల్వే ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని తూర్పు కోస్తా రైల్వే వాల్తేర్ ఏడీఆర్ఎం కె.రామారావు తెలిపారు. ఆదివారం ఆయన విశాఖ రైల్వేస్టేషన్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆన్‌బోర్డ్ హౌస్‌కీపింగ్ సిబ్బంది, లినెన్ సరఫరాదారులతో మాట్లాడారు. ప్రయాణికులకు పరిశుభ్రమైన వసతులు అందించాలని, ప్రతి ఒక్కరితో మర్యాదగా మాట్లాడాలని సూచించారు. అనంతరం సిబ్బంది, సూపర్‌వైజర్లు, హెల్త్ ఇన్‌స్పెక్టర్లతో కౌన్సెలింగ్ నిర్వహించారు.

కొండైనా కొట్టేస్తాం.. వాగైనా కప్పేస్తాం!

■ ఇష్టారాజ్యంగా ప్రభుత్వ భూమిలో రోడ్డు నిర్మాణం
■ భూముల విలువ పెంచుకోవడానికి ఓ నేత పన్నాగం

ఆనందపురం, న్యూస్‌టుడే

ఆనందపురం మండలం బిల్లాపురం గిరిజన గ్రామంలో ఆక్రమణదారులు రెచ్చిపోతున్నారు. తమ భూముల విలువను పెంచుకోవడానికి కొండను తవ్వి, వాగును పూడ్చేసి రోడ్డును నిర్మిస్తున్నారు. కిలోమీటరుకు పైగా 30అడుగుల వెడల్పుతో భారీ యంత్రాలతో ఆయా పనులు సాగుతున్నాయి. ఇంత జరుగుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు.

గెడ్డవాగుపై నుంచి కల్వర్టు నిర్మాణం

■ గత ప్రభుత్వ హయాంలో..: గిరిజనులకు కొంత జిరాయితీ, డీ-పట్టా భూములున్న బిల్లాపురం గ్రామంలో వైకాపాకు చెందిన ఓ మాజీ ప్రజాప్రతినిధి కన్ను పడింది. ఈ నేపథ్యంలో ఫ్రీహోల్డ్ చేసుకునేందుకు 2019లోనే తక్కువ ధరకు కొందరు గిరిజనుల నుంచి సుమారు 50 ఎకరాలు కొనుగోలు చేశారు. ఆయా భూముల్లోకి వెళ్లేలా రహదారి నిర్మించేందుకు 2020లోనే ప్రయత్నించారు. నాడు స్థానిక గిరిజన పెద్దలు అడ్డుకోవడంతో నిర్మాణం ఆగిపోయింది. అప్పట్లో అడ్డుకున్న వారిలో కొందరు పెద్దలు ఇటీవల మరణించడంతో ఆ నేత అమాయకులైన కొందరు గిరిజనులకు మాయమాటలు చెప్పి మళ్లీ రోడ్డు నిర్మాణం ప్రారంభించారు.

■ వెలుగులోకి ఇలా..: గిరిజనుల భూముల్లో నుంచి [illegible] రహదారి నిర్మించడంపై పోలీసులు, గనుల శాఖ అధికారులకు ఫిర్యాదులందడంతో ఆక్రమం వెలుగులోకి వచ్చింది. ఈ విషయం బయటపడకముందే తామే రోడ్డు వేయించుకుంటున్నట్లు స్థానిక గిరిజనులతో చెప్పించే ప్రయత్నం చేస్తున్నారు. విచారణకు వచ్చిన రెవెన్యూ అధికారులకు అలానే చెప్పించారు. మరో వైపు గనుల శాఖ అధికారులు అక్కడి యంత్రాలను స్వాధీనం చేసుకుని పోలీసులకు అప్పగించారు. వాస్తవానికి అనుమతి లేకుండా అటవీ భూమి సమీపంలో కొండలను తొలిచి రహదారి నిర్మించడం నేరం. దీన్నుంచి తప్పించుకునేందుకు కొంతమంది స్థానికులతో కలిసి ఆ నేత నాటకం ఆడుతున్నారు.

■ ఈ విషయమై తహసీల్దార్ శ్రీనుబాబును వివరణ కోరగా ప్రభుత్వ భూముల్లోనైనా, సొంత స్థలాల్లోనైనా రోడ్డు నిర్మాణానికి పంచాయతీ నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. గిరిజన గ్రామంలో రహదారి నిర్మాణంపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

బ్రిటిష్ సైనికుల వెన్నులో 'ఉయ్యాలవాడ' వణుకు

కలెక్టరేట్, న్యూస్‌టుడే: బ్రిటిష్ సైన్యం వెన్నులో వణుకు పుట్టించిన వీరుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చరిత్రలో ఎప్పటికీ నిలిచిపోతారని కలెక్టర్ విజయకృష్ణన్ పేర్కొన్నారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఉయ్యాలవాడ వర్ధంతి నిర్వహించారు. ముందుగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలందరి కోసం బ్రిటిష్ వారితో పోరాడారన్నారు. నేటి యువత ఆయనను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలన్నారు.

ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్

అప్పన్న సన్నిధిలో పట్నా హైకోర్టు న్యాయమూర్తి

సింహాచలం, న్యూస్‌టుడే: పట్నా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.అనుపమ చక్రవర్తి కుటుంబ సమేతంగా సింహాద్రి అప్పన్న స్వామిని దర్శించుకున్నారు. వారికి డిప్యూటీ ఈవో సింగం రాధ, అర్చకులు స్వాగతం పలికారు. కప్పస్తంభం ఆలింగనం చేసుకుని బేడామండపం ప్రదక్షిణ చేశారు. అంతరాలయంలో స్వామిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. పండితులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. డిప్యూటీ ఈవో రాధ స్వామివారి ప్రసాదం, చిత్రపటం, శేషవస్త్రాలు అందజేశారు.

జస్టిస్ అనుపమ చక్రవర్తి దంపతులకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న డిప్యూటీ ఈవో రాధ

డాక్ సేవక్‌లకు పురస్కారాలు

పురస్కారం అందుకుంటున్న విశ్వేశ్వరరావు (అనకాపల్లి)

గుంటూరు (ఏటీ అగ్రహారం), న్యూస్‌టుడే: గుంటూరు నగర శివారులోని సత్యసాయి ఆధ్యాత్మిక నగరిలో ఆదివారం జాతీయ స్థాయి గ్రామీణ డాక్ సేవక్ సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా రాష్ట్రంలో ఉత్తమ పనితీరు కనబర్చిన గ్రామీణ డాక్ సేవక్‌లకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పురస్కారాలు అందించి సత్కరించారు.

కొత్త ఉప్పు వచ్చిందోచ్!

కొంతకాలంగా నిలిచిపోయిన ఉప్పు పంట తిరిగి ప్రారంభమైంది. ఎస్.రాయవరం మండలం రేవుపోలవరం, బంగారయ్యపేట, అచ్యుతాపురం మండలం పూడిమడక తదితర ప్రాంతాల్లో కొత్తగా వేసిన ఉప్పు పంట చేతికి అందడంతో రైతులు విక్రయాలు ప్రారంభించారు. కొద్ది రోజులుగా ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో తొలివిడత తీశారు. జిల్లాలో పాయకరావుపేట నుంచి భీమునిపట్నం వరకు సముద్రతీర ప్రాంతం విస్తరించి ఉంది. తీరం వెంబడి పలువురు రైతులు గళ్లను సిద్ధం చేసుకుని ఉప్పు పండిస్తున్నారు. ఈ పంటపై ఆధారపడి వేలాది మంది కూలీలు ఉపాధి పొందుతున్నారు. ప్రత్యేకంగా తమిళనాడు నుంచి ఉప్పు సాగులో నైపుణ్యం ఉన్న వారు ఇక్కడకు వచ్చి పనిచేస్తున్నారు. గతేడాది తుపాను, అల్పపీడనాల వల్ల వరుసగా మూడు నెలలపాటు వర్షాలు పడ్డాయి. నదులు పొంగి ప్రవహించాయి. చాలాచోట్ల ఉప్పు మడులు దెబ్బతిన్నాయి. వాటికి మళ్లీ మరమ్మతులు చేసి ఉప్పు సాగు ప్రారంభించారు. జిల్లాలో 300 ఎకరాల్లో ఉప్పు సాగవుతోంది. ప్రస్తుతం 150 ఎకరాల్లో తొలి పంట వచ్చింది. ప్రస్తుతం క్వింటాల్ ఉప్పు ధర రూ.550 పలుకుతోంది. ఎకరాకు 20 బస్తాల దిగుబడి వచ్చిందని రైతులు పేర్కొన్నారు.

– న్యూస్‌టుడే, ఎలమంచిలి, అచ్యుతాపురం

పూడిమడకలో పండించిన కొత్త ఉప్పు

'త్రిశూల్'.. మరో మణిహారం..!

★ కైలాసగిరిపై 65 అడుగుల్లో నిర్మాణం
★ పుణె నుంచి వచ్చిన ఆకృతులు

ఈనాడు, విశాఖపట్నం

పర్యాటక సిటీ.. కైలాసగిరిపై మరో ఆకర్షణ సిద్ధమవుతోంది. ఇప్పటికే శివపార్వతుల విగ్రహాలు, రోప్‌వే, స్కై సైక్లింగ్, జిప్‌లైనర్ పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఇప్పుడు చేపట్టిన త్రిశూల్ ప్రాజెక్టు మరింత ఆసక్తి కలిగిస్తోంది. దీనికి సంబంధించిన పనులు యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్నాయి. వాస్తవానికి వీఎంఆర్‌డీఏ శివరాత్రి నాటికి దీన్ని పూర్తి చేయాలనుకున్నప్పటికీ పలు కారణాలతో ఆలస్యమైంది. ఉగాది నాటికి ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

తుపానును తట్టుకునేలా..: తుపాను గాలులు, భూకంపాలను తట్టుకునేలా ఈ త్రిశూల్ ప్రాజెక్టు చేపడుతున్నారు. హాట్ ఎయిర్ బెలూన్‌తో అధ్యయనం చేసి ఎంత ఎత్తులో నిర్మించాలో పరిశీలించారు. మొదట 55 అడుగుల్లో నిర్మించాలనుకున్నప్పటికీ తర్వాత 65 అడుగులకు పెంచారు. కింద నుంచి పైవరకు త్రిశూలం పొడవు 65 అడుగులైతే అందులో ఒక్క ఢమరుకం 10 అడుగుల ఎత్తు, 18 అడుగుల వెడల్పు ఉండనుంది.


త్రిశూలం నమూనా

త్రిశూలమైతే 25 అడుగుల ఎత్తు, 20 అడుగుల వెడల్పుతో తయారు చేశారు. ఆయా ఆకృతులను పుణెలో రూపొందించారు. ఇవి ప్రస్తుతానికి విశాఖ చేరుకున్నాయి. సుదూరంలోని నగర ప్రజలకు కనిపించేలా త్రిశూలం లోపలి భాగంలో ఎల్ఈడీ దీపాలు అమర్చనున్నారు. అలాగే చుట్టూ 30 అడుగుల విస్తీర్ణంలో వేదిక నిర్మిస్తున్నారు. మొదట్లో ఈ వేదిక నిర్మాణం ఆలోచన చేయలేదు. తర్వాత పర్యాటకులు సెల్ఫీలు తీసుకునేందుకు, కూర్చునేందుకు వీలుగా దాన్ని చేపడుతున్నారు.

■ ఉగాదికి పూర్తయ్యేలా..: సందర్శకుల కోసం కైలాసగిరిపై పలు ప్రాజెక్టులు చేపడుతున్నాం. ఇప్పటికే శివపార్వతుల విగ్రహాలు ఉన్నాయి. అదనంగా భారీ త్రిశూలం నిర్మిస్తే బాగుంటుందని ఆలోచన చేశాం. పర్యాటకులు కాసేపు సేదతీరేలా ఆ ప్రదేశాన్ని అభివృద్ధి చేస్తున్నాం. ఉగాది నాటికి అందుబాటులోకి తెచ్చేలా చర్యలు తీసుకుంటాం.

– ప్రణవ్‌గోపాల్, వీఎంఆర్‌డీఏ ఛైర్మన్

ఇదీ ప్రాజెక్టు స్వరూపం..	వ్యయం:	ఎత్తు:	చుట్టు కొలత:	మెటీరియల్:	డయాస్ విస్తీర్ణం:	ఎల్ఈడీ దీపాలు :
	రూ.2.50 కోట్లు	65 అడుగులు	3 అడుగులు	ఫైబర్ రీఇన్‌ఫోర్స్‌డ్ ప్లాస్టిక్	30 అడుగుల వెడల్పు	100

భూములు లాక్కోవడం అన్యాయం

రాంబిల్లి, న్యూస్‌టుడే: దళిత రైతులకు ప్రభుత్వం ఇచ్చిన డి.పట్టా భూములు లాక్కోవడం అన్యాయమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తెలిపారు. జిల్లా పర్యటనకు వచ్చిన ఆయనను ఆదివారం సీపీఎం నాయకుల ఆధ్వర్యంలో పంచదార్ల దళిత రైతులు అనకాపల్లిలో కలిసి వినతిపత్రం అందజేశారు. 48 ఏళ్ల క్రితం ప్రభుత్వం తమకు ఇచ్చిన డి.పట్టా భూములను తప్పుడు పద్ధతుల్లో అధికారులు తీసుకోవాలని చూస్తున్నారని రైతులు వివరించారు. తాము 21 రోజులుగా శాంతియుతంగా నిరసన తెలియజేస్తున్నామని, తమకు అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.శంకరరావు, గంటా శ్రీరామ్, మండల కార్యదర్శి జి.దేవుడునాయుడు, నాయకులు చందక రామకృష్ణ, బాధిత రైతులు అప్పారావు, అబద్దం, రాజు, రమేశ్ పాల్గొన్నారు.

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావుకు వినతిపత్రం ఇస్తున్న రైతులు, నాయకులు

ప్రతిభావంతులకు ప్రోత్సాహకాలు

నగదు ప్రోత్సాహకాలు అందుకున్న విద్యార్థులు

ఎలమంచిలి గ్రామీణం, న్యూస్‌టుడే: పాఠశాల విద్యలో ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందించడానికి ములకలాపల్లి సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం ఎప్పుడూ ముందుంటుందని యూనిట్ హెడ్ రామస్వామి పేర్కొన్నారు. ఏటికొప్పాక, జంపపాలెం, పులపర్తి, పురుషోత్తపురం, రేగుపాలెం, సోమలింగపాలెం, స్టేషన్‌రోడ్డు, బాలికోన్నత, కొత్తపేట ఉన్నత పాఠశాలల్లో 8, 9 తరగతుల్లో అత్యధిక మార్కులు సాధించి ప్రస్తుతం 10వ తరగతి చదువుతున్న వారిలో ఒక్కో పాఠశాల నుంచి ముగ్గురికి ప్రథమ బహుమతి కింద రూ. 8 వేలు, ద్వితీయ- రూ.6 వేలు, తృతీయ- రూ.4 వేలు చొప్పున నగదు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

కాజ్‌వే పనుల పరిశీలన

డుంబ్రిగుడ: గుంటగన్నెల పంచాయతీ మసుర్లంక కాజ్‌వేను కూటమి నాయకులు ఆదివారం పరిశీలించారు. కాజ్‌వే నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలపై ఆరా తీశారు. అరకులోయ నియోజకవర్గ అధికార ప్రతినిధి చినగెన్ను మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ముసర్లంకలో రూ.90 లక్షలతో కాజ్‌వే నిర్మాణం చేపట్టిందన్నారు. ఈ కాజ్‌వే నిర్మాణంతో ఆంధ్ర, ఒడిశా రాష్ట్రాల ప్రజల రాకపోకలకు వీలు కలిగిందన్నారు. కూటమి నాయకులు విశ్వనాథం, కామేష్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కాజ్‌వేను పరిశీలిస్తున్న కూటమి నాయకులు

సౌత్‌జోన్ రగ్బీలో కాంస్య పతకం

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: సౌత్‌జోన్ రగ్బీ పోటీల్లో ఏపీ జట్టుకు కాంస్య పతకం దక్కింది. చెన్నైలో ఈ నెల 20 నుంచి 22 వరకు జరిగిన పోటీల్లో కేరళ మొదటి స్థానం, తమిళనాడు ద్వితీయ, ఏపీ తృతీయ స్థానంలో నిలిచాయని కోచ్ వెంకట్ చెప్పారు. విజేతలకు నటుడు నవీన్‌రాయ్, ఏపీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు రూ.48 వేల చెక్కు, పతకాలు అందజేశారు. ఆంధ్ర జట్టులో ఎక్కువమంది అచ్యుతాపురం మండలానికి చెందిన క్రీడాకారులే ఉన్నారు. తృతీయ స్థానంలో నిలిచిన జట్టు సభ్యులను, కోచ్ వెంకట్, మేనేజర్ దివ్యను అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు కూండ్రపు వెంకునాయుడు, కార్యదర్శులు జగదీశ్, సుధీర్, వెంకట్ ఆదివారం అభినందించారు.

క్రీడాకారులతో నిర్వాహకులు

సరకు రవాణాలో... 'విశాఖ పోర్టు' రికార్డు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: విశాఖ పోర్టు అథారిటీ (వీపీఏ) సరకు రవాణాలో సరికొత్త రికార్డును నెలకొల్పింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోని 327 రోజుల్లో (ఈనెల 21 వరకు) 80.08 మిలియన్ మెట్రిక్ టన్నుల (ఎంఎంటీ) సరకును రవాణా చేసింది. పోర్టు చరిత్రలో ఇదే ప్రథమమని ఛైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇదే ఉత్సాహంలో ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి 90 ఎంఎంటీ లక్ష్యాన్ని చేరుకుంటామని ఆశాభావం వ్యక్తం చేశారు. 2024-25 ఏడాదిలో 357 రోజుల్లో 80.11 ఎంఎంటీ సరకు, 2023-24 ఏడాదిలో 362 రోజుల్లో 80.02 ఎంఎంటీ సరకు రవాణా చేసినట్టు ఆయన వివరించారు. పోర్టు కార్యాచరణ, సిబ్బంది నైపుణ్యం, మెరుగైన నిర్వహణ, భాగస్వామ్య సంస్థల సమన్వయంతోనే సరకు రవాణాలో స్థిరమైన పురోగతి సాధించామన్నారు.

ఇంటర్ పరీక్షల నిర్వహణకు పొరుగు జిల్లాల అధ్యాపకులు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: జిల్లాలో ఇంటర్ పరీక్షల నిర్వహణకు తగినంత మంది అధికారులు, సిబ్బంది లేకపోవడంతో పొరుగున్న అనకాపల్లి, అల్లూరి సీతారామారాజు జిల్లాల నుంచి అధికారులను రప్పిస్తున్నారు. ఆయా జిల్లాల నుంచి 44 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ అధికారుల)ను తీసుకొచ్చినట్లుమ ఆర్ఐఓ పి.మురళీధర్ తెలిపారు. వీరితోపాటు ఇన్విజిలేటర్లుగా పనిచేసేందుకు విద్యాశాఖ నుంచి 153 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులను తీసుకుంటున్నామన్నారు.

'పాత పింఛను పునరుద్ధరించాలి'

ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేస్తున్న ఉద్యోగులు

విశాఖపట్నం, న్యూస్‌టుడే : ప్రభుత్వ ఉద్యోగులకు పాత పింఛను అమలు చేయాలని ఉద్యోగులు కోరారు. ఆదివారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద 'ఆంధ్రప్రదేశ్ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయీస్ అసోసియేషన్' ఆధ్వర్యంలో సాగర సంగ్రామ దీక్ష పేరిట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోరుకొండ సతీష్ మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం ఎన్నికలకుముందు ఇచ్చిన హామీ మేరకు పాత పింఛను పునరుద్ధరించాలన్నారు. ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు వెంటనే విడుదల చేసి, పెండింగ్‌లో ఉన్న సమస్యల్ని పరిష్కరించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు అధిక సంఖ్యలో హాజరై.. ప్లకార్డులు చేతపట్టుకుని నినదించారు. కార్యక్రమంలో సంఘం గౌరవ సలహాదారులు అప్పలరాజు, ప్రకాష్, ప్రతినిధులు త్రినాథస్వామి, లోహితాస్యుడు, ఏపీ ఎన్జీఓ సంఘం అధ్యక్షుడు ఈశ్వరరావు, సభ్యులు చంద్రరావు, టి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సరుగుడు తోట దగ్ధం

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: విజయరామరాజుపేటలో జరిగిన అగ్నిప్రమాదంలో ఆదివారం సరుగుతోట దగ్ధమైంది. ప్రమాదవశాత్తూ మంటలు వ్యాపించినట్లు బాధిత రైతుల పినపోలు తాతారావు తెలిపారు. రూ.2 లక్షల పంట నష్టం వాటిల్లినట్లు అంచనా. చోడవరం నుంచి అగ్నిమాపక సిబ్బంది చేరుకొని మంటలను అదుపు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు కామరాజు

పాడేరు, న్యూస్‌టుడే: మండలంలో చింతలవీధి సమీపంలోని అడారిమెట్ట కూడలిలో ఎదురెదురుగా రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ముగ్గురు తీవ్ర గాయాలయ్యారు. ఆదివారం మధ్యాహ్నం 1 గంట సమయంలో గుత్తులపుట్టు నుంచి ద్విచక్ర వాహనంలో ముగ్గురు కుటుంబ సభ్యులు చింతల వీధి మీదుగా హుకుంపేట వైపు వెళ్తుండగా ఎదురుగా అడారిమెట్ట మార్గం నుంచి అధిక వేగంతో ముగ్గురు యువకులతో వస్తున్న ద్విచక్రవాహనం బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో గుత్తులపుట్టు గ్రామానికి చెందిన పోస్టల్ బ్రాంచీ పోస్టు మాస్టర్ కామరాజు కుడికాలు తీవ్రగాయలైంది. ఆయన భార్య, మరో మహిళకు కాలు చేతులు తీవ్ర గాయాలైంది. క్షతగాత్రులను హుటాహుటిన 108 వాహనంలో పాడేరు జిల్లా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు మెరుగైన వైద్య పరీక్షలు నిర్వహించి ఇద్దరికి కాలు విరిగినట్లు గుర్తించారు. మరొకరికి చేతుల మోద గాయాలైనట్లు తెలిపారు. ఈ ద్విచక్రవాహన ప్రమాదానికి కారణమైన ముగ్గురు విద్యార్థులు ఒకరు ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థి, మరో ఇద్దరు డిగ్రీ చదువుతున్న విద్యార్థులుగా గుర్తించారు.

లారీ నుంచి మంటలు.. హడలెత్తిన ప్రయాణికులు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: లారీలో నుంచి మంటలు చెలరేగిన ఘటన ఆదివారం మధ్యాహ్నం జాతీయ రహదారి శాంతిపురం కూడలిలో చోటుచేసుకుంది. సకాలంలో పోలీసులు స్పందించి మంటలు అదుపు చేయడంతో ప్రమాదం తప్పింది. ఏపీ35 టీబీ2699 నెంబరు లారీ కోళ్ల లోడుతో చిప్పాడ వెళ్లి కోళ్లను దించేసి తిరిగి పోర్టుకు వెళ్లేందుకు బయలుదేరింది. సరిగ్గా శాంతిపురం కూడలి పెట్రోల్ బంకు సమీపానికి వచ్చేసరికి ఇంజిన్‌లో నుంచి మంటలు వ్యాపించడంతో అక్కడ ఉన్న ట్రాఫిక్ కానిస్టేబుల్ గమనించి నాలుగో పట్టణ పోలీసులకు సమాచారం అందించారు సకాలంలో పోలీసులు అక్కడికి చేరుకుని అటుగా నీళ్ల డబ్బాలతో వెళ్తున్న వాహనాన్ని ఆపి ఆ నీటితో మంటలను అదుపు చేశారు. లారీలో నుంచి దట్టమైన పొగ రావడంతో అటుగా రాకపోకలు సాగిస్తున్న ప్రయాణికులు హడలిపోయారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా వాహనాన్ని అక్కడ నుంచి తరలించారు. సీఐ ఉమాకాంత్, ఎస్సై బాలకృష్ణ ఘటనా స్థలానికి చేరుకుని మంటలకు గల కారణాలపై ఆరా తీశారు.

లారీ నుంచి వెలువడుతున్న పొగ

విషపురుగు కుట్టి బాలుడి మృతి

కశింకోట, న్యూస్‌టుడే: కశింకోట మండలం మోసయ్యపేట గ్రామానికి చెందిన బాలుడు విషపురుగు బారినపడి శనివారం రాత్రి మృతిచెందాడు. విజయవాడకు చెందిన వరలక్ష్మి ఇటీవల తన మూడేళ్ల కుమారుడిని తీసుకొని పుట్టింటికి వచ్చింది. బాలుడు సాయంత్రం పిల్లలతో కలిసి వీధిలో ఆడుకుంటుండగా ఏదో కుట్టిందని పెద్దగా ఏడవగా కుటుంబ సభ్యులు వచ్చి చూసేసరికి అపస్మారకస్థితికి చేరుకున్నాడు. బాలుడిని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. దీనిపై పోలీసులకు ఎటువంటి ఫిర్యాదు అందలేదు.

యథావిధిగా మాంసం దుకాణాలు

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: చింతపల్లిలో రహదారికి ఇరువైపులా మాంసం దుకాణాలను యథావిధిగా ఏర్పాటు చేశారు. అధికారుల ఆదేశాలను ఒక్క వారమే పాటించిన వ్యాపారులు పాత స్థలాల్లోనే దుకాణాలు పెట్టుకున్నారు. ట్రాఫిక్, దుర్గంధం సమస్య మళ్లీ మొదటికొచ్చింది. మేజర్ పంచాయతీ చింతపల్లిలోని జాతీయ రహదారి, ఆర్టీసీ కాంప్లెక్స్ మొదలుకొని దిగువన పాత బస్టాండు వరకు రహదారికి ఇరువైపులా వర్తకులు మాంసం దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్య, వీధి కుక్కలు పెరిగిపోవడం, దుర్గంధంతో గ్రామస్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారంరోజుల క్రితం ఎంపీడీవో సీతామహాలక్ష్మి పోలీసుల సహకారంతో దుకాణాలను తొలగించి, సంతబయలు వద్ద షాపులను వర్తకులకు కేటాయించారు. మళ్లీ యథావిధిగా జాతీయ రహదారిపై చేపలు, రహదారికి ఇరువైపులా మాంసం దుకాణాలను వర్తకులు ఏర్పాటు చేశారు.

పోలీసుల అరెస్టుకు డిమాండ్

విశాఖపట్నం: దళిత యువకుడు వీధి సుబ్రహ్మణ్యం హత్యకేసులో ప్రధాన నిందితుడు, వైకాపా ఎమ్మెల్సీ అనంతబాబుకు అనుకూలంగా వ్యవహరించిన నాటి పోలీసు అధికారులను సస్పెండ్ చేయడమే కాకుండా, అరెస్టు చేయాలని విదసం (విశాఖ దళిత సంఘాలు) సమన్వయకర్త బూసి వెంకట్రావు డిమాండ్ చేశారు. విశాఖపట్నంలోని జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఆదివారం సంఘం ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఈ కేసులో దోషులతో కుమ్మక్కైన అధికారుల పేర్లు ఛార్జ్‌షీట్‌లో నమోదు చేయాలని కోరారు. విదసం ప్రతినిధులు ఓంకార్, సుధాకర్, ప్రసాద్, రాజు, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

మూడేళ్ల బాలికకు అరుదైన చికిత్స !

విశాఖపట్నం: అగనంపూడి హోమీభాభా క్యాన్సర్ ఆసుపత్రి వైద్య సిబ్బంది మూడేళ్ల బాలికకు అరుదైన చికిత్స అందించారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఓ బాలికకు ఎంబ్రాయినల్ ట్యూమర్ విత్ మల్టీ లేయర్డ్ రోసెట్స్ అనే అరుదైన వ్యాధి సోకింది. ఈమెకు ముంబయిలోని టాటా మెమోరియల్ కేంద్రంలో శస్త్రచికిత్స నిర్వహించి కిమోథెరపీ అందించారు. అక్కడి నుంచి టాండమ్ ఆటోలాగస్ స్టెమ్ ట్రాన్స్‌ప్లాంట్ కోసం హోమీభాభా ఆసుపత్రికి సిఫార్సు చేశారు. ఇక్కడ అనుభవం కలిగిన వైద్యులు చికిత్సను విజయవంతంగా పూర్తిచేశారు. బాలిక కోలుకోవడంతో డిశ్చార్జ్ చేశారు.

లోవకొత్తూరులో ఘర్షణ

తుని గ్రామీణం, న్యూస్‌టుడే: కాకినాడ జిల్లా తుని గ్రామీణ మండలం లోవకొత్తూరు గ్రామంలో ఒక దుకాణ యజమాని లోవరాజు కుమారుడు **శ్రీనుని** తలుపులమ్మ ఆలయానికి వస్తున్న భక్తుడొకరు గాయపరిచారు. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలివీ.. అనకాపల్లి జిల్లా నర్సీపట్నం సమీపంలోని గురుద్వారపాలెం గ్రామానికి చెందిన పలువురు యాత్రికులు ఆదివారం ఉదయం లోవ తలుపులమ్మ దర్శనానికి వస్తూ మార్గమధ్యలో లోవకొత్తూరు గ్రామంలోని ఒక దుకాణం వద్ద చాకు కొనేందుకు ఆగారు. దుకాణంలోకి చొచ్చుకొని వస్తున్న ఒక వ్యక్తిని లోవరాజు లోపలకు రావొద్దంటూ వారించాడు. దీంతో వారు ఘర్షణకు దిగారు. వీరిని అడ్డుకోబోయిన దుకాణ యజమాని తనయుడు శ్రీనుని చాకుతో గాయపరిచాడు. మెడపై గాయం కావడంతో తుని ప్రాంతీయ ఆసుపత్రికి తీసుకెళ్లారు. దీంతో స్థానికులు నిందితుడికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారన్నారు. ఘటనపై గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణామాచారి తెలిపారు.

చెట్టుపై నుంచి జారిపడి యువకుడు..

మునగపాక: నాగులాపల్లిలో శనివారం రాత్రి కొబ్బరిచెట్టు నుంచి జారిపడి యువకుడు మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. బొందల పెంట జగన్నాథరావు (21) శనివారం స్నేహితులతో కలిసి వివాహ కార్యక్రమానికి హాజరయ్యారు. అక్కడి నుంచి వచ్చి కొబ్బరి చెట్టు ఎక్కి జారిపడి గాయాలయ్యాయి. ఇతనిని అనకాపల్లి జిల్లా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు తెలిపారు.

JOBS
MARKETING/ SALES
Anand Masale Require Sales & Marketing Manager, Marketing Executives. Contact: 9849655105, 9848053144 Email:anandmasalaappltd@gmail.com.

ద్విచక్ర వాహనం బోల్తా: ఒకరి మృతి

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: ఆంధ్ర ఒడిశా రాష్ట్రాల సరిహద్దులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్రగాయలయ్యాయి. ముంచంగిపుట్టు మండలంలోని బూసిపుట్టు పంచాయతీకి సమీపంలో ఉన్న జన్‌బై(ఒడిశా) గ్రామ సమీపంలో ద్విచక్రవాహనం బోల్తా పడింది. ఈ సంఘటనలో బుంగాపుట్టు గ్రామానికి చెందిన సుకో(32), బర్మన్‌గుడకు చెందిన సురేష్‌బాబులకు తీవ్ర గాయలయ్యాయి. ఇద్దరిని రూడకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడి నుంచి పెదబయలు పీహెచ్‌సీకి తరలిస్తుండగా సుకో మార్గమధ్యలో మృతి చెందాడని ప్రమాద సంఘటన వద్ద ఉన్న స్థానికులు తెలిపారు. తీవ్రగాయలతో ఉన్న సురేష్‌బాబు వైద్యం అందించారు.

చికిత్స పొందుతున్న సురేష్‌బాబు

బంగారు నెక్లెస్ అందజేత

నెక్లెస్ అందజేస్తున్న ఎస్సై ఆలీ

పాయకరావుపేట, న్యూస్‌టుడే: పోగొట్టుకున్న బంగారు నెక్లెస్‌ను బాధితులకు పోలీసులు అందజేశారు. నక్కపల్లి మండలం చినదొడ్డిగల్లుకు చెందిన కట్టా భాను మరో మహిళతో కలిసి ఆటోలో పాయకరావుపేట వచ్చారు. లక్కీ షాపింగ్ మాల్‌లో దుస్తులు కొనుగోలు చేసి బయటకు వచ్చారు. అనంతరం మెడలో వేసుకున్న మూడు తులాల బంగారు గొలుసు పోయినట్లు భాను గుర్తించి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ అప్పన్న ఆధ్వర్యంలో క్రైం టీం సతీష్, మదీనాలకు బాధ్యత అప్పగించారు. చినదొడ్డిగల్లు నుంచి షాపింగు మాల్ వరకు ఉన్న సీసీ కెమెరాల్లో రికార్డయిన సీసీ ఫుటేజ్ పరిశీలించారు. ఆటో దిగుతున్న సమయంలో నెక్లెస్ జారిపడినట్లు గుర్తించారు. గొలుసు మరో మహిళకు దొరికింది. కెమెరాలో ఉన్న ఆమె నక్కపల్లి మండలం రాజయ్యపేటకు చెందిన మహిళగా గుర్తించారు. ఏఎస్ఐ తాతీలును పంపించగా నెక్లెస్‌ను ఆమె పోలీసులకు అప్పగించారు. దీనివిలువ రూ.ఐదు లక్షలు ఉంటుందని సీఐ చెప్పారు.

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	115	110
లైవ్	142	130
డ్రెస్‌డ్	206	230
స్కిన్‌లెస్	234	240

(c) eenadu

రెండో పంటకు రైతులు సిద్ధం

హుకుంపేట, న్యూస్‌టుడే: గిరిజన ప్రాంతాల్లో రైతులు రెండో వరి పంటకు సిద్ధమవుతున్నారు. ఎ. కొత్తూరు, బాకూరు, సంతారి పంచాయతీలతోపాటు మారుమూల గ్రామాల్లో రెండో పంట వేసి వాటికి సమృద్ధిగా నీటిని పెడుతున్నారు. కొండల నుంచి నీరు ప్రవహిస్తున్న గెడ్డల సమీపంలోను, ఊట కాలువలు, బావుల వద్ద ఉండి రెండో పంటలు వేస్తున్నారు. వర్షం కురవక పోయినా సాగునీటికి ఇబ్బంది లేని ప్రదేశాల్లో పంటలు వేస్తున్నట్లు రైతులు తెలిపారు. దీనిని పునాస పంటగా పిలుస్తున్నారు. మండలంలోని 30 నుంచి 40 ఎకరాల్లో ఈ ఏడాది పునాస (రెండో) పంటను వేస్తున్నారని వ్యవసాయ శాఖ అధికారులు వివరించారు.

నిండుగా చెరువు

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: చెరువుల నీటితో రబీ సీజన్‌లో ఆరుతడి పంటలతోపాటు గిరిజనులు వరి సాగు చేపడుతున్నారు. ప్రస్తుతం కింతలో ఎండ తాపం ఉన్నప్పటికి చెరువులు నిండుగా ఉండటంతో గిరిజనులు కొరగాయాలు, వరి సాగును చేపడుతు బీజీగా గడుపుతున్నారు. ఐడిమెట్ట గ్రామంలో చెరువు నీటితో నిండుగా ఉంది.

వరి పంటతో పచ్చగా పొలాలు

'దల్లాపల్లి' దశ మారింది

నాడు పెంకిటిల్లు... నేడు పక్కా భవనాలు

పాడేరు పట్టణం, న్యూస్‌టుడే: కలి సొచ్చిన రోజులొచ్చే.. అంతా మంచే జరుగుతుందనే నానుడి మారుమూల ఆదివాసీ గ్రామమైన దల్లాపల్లికి సరిగ్గా సరిపోతుందని చెప్పొచ్చు. సముద్ర మట్టానికి 3,500 మీటర్ల ఎత్తులో ప్రకృతి రమణీయంగా ఉండే ప్రదేశంగా దల్లాపల్లి గ్రామానికి ఇప్పటికే గుర్తింపు ఉంది. గ్రామంలో 63 ఆదివాసీ కుటుంబాలు నివాసముంటున్నాయి. దశాబ్దం క్రితం దల్లాపల్లికి చేరుకోవాలంటే కాలినడకలో మూడు, నాలుగు కొండలు దాటుకుంటూ చేరుకోవాలి. ప్రభుత్వ పథకాలు పొందడంలో ఈ గ్రామం వెనుక బడింది. పదేళ్ల కిందట ఈ గ్రామానికి తారురోడ్డు నిర్మించారు. రోడ్డు సదుపాయం ఏర్పడిన తర్వాత మౌలిక సదుపాయాలు ఒక్కొక్కటిగా అమలవుతున్నాయి. నిన్నటి వరకు పెంకిటిల్లే ఆధారంగా ఇక్కడి ప్రజలు జీవనం సాగించారు. ఇప్పుడు పరిస్థితులు పూర్తిగా మారుతున్నాయి. పీఎం జన మన్ పథకం ద్వారా ప్రభుత్వం పక్కా ఇళ్లు నిర్మించింది. ప్రతి కుటుంబానికి కాఫీ తోటలు అందించారు. గతంలో నిర్మించిన తారురోడ్డు రవాణా అవసరాలకు లేకపోవడంతో తాజాగా రూ. మూడు కోట్లు మంజూరు చేసి రోడ్డు విస్తరణ చేపట్టారు. కొత్త పంచాయతీ ఏర్పాటులో భాగంగా దల్లాపల్లి కేంద్రంగా పంచాయతీని ఏర్పాటు చేయాలని పంచాయతీరాజ్ కమిషనరేట్ అధికారులు ప్రతిపాదనలు సమర్పించారు. ఈ ప్రాంతం దశ మారిందని స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



గ్రామంలో కొత్తగా నిర్మించుకున్న స్లాబు ఇళ్లు

పూర్తిచేయరు.. ప్రారంభించరు..

పెదబయలు, న్యూస్‌టుడే: పెదబయలులోని గిరిజన, సాంఘిక సంక్షేమ వసతిగృహాల విద్యార్థులు వసతి కష్టాలు ఎదుర్కొంటున్నారు. అసంపూర్తి భవనంతో గిరిజన విద్యార్థులు ఇబ్బందులు పడుతుండగా.. నిర్మాణం పూర్తయినా సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు వసతి గృహ భవనాన్ని ప్రారంభించడంలేదు.

★ గిరిజన సంక్షేమ ఆశ్రమ వసతి గృహానికి అయిదేళ్ల క్రితం వైకాపా ఆధ్వర్యంలో మంజూరైన భవనం నిధుల కొరత కారణంగా నేటికి పునాదుల దశలోనే నిలిచిపోయింది. ఉన్న భవనం విద్యార్థులకు సరిపోవడం లేదు.

అసంపూర్తిగా గిరిజన ఆశ్రమ వసతిగృహం భవనం

★ పెదబయలులో సాంఘిక సంక్షేమ శాఖ వసతిగృహ భవనం పూర్తయి సుమారు రెండు నెలలు కావొస్తున్నా నేటికి ప్రారంభించలేదు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు అనుసంధానంగా ఈ భవనాన్ని నిర్మించారు. ఈ పాఠశాల విద్యార్థులు చెంతనే ఉన్న ఆశ్రమ వసతి గృహంలో అసౌకర్యాల మధ్యే ఉంటున్నారు. ఈ భవనాన్ని ప్రారంభిస్తే వీరికి ఈ సమస్య తీరనుంది. కూటమి ప్రభుత్వం స్పందించి అసంపూర్తి భవనం పూర్తికి నిధులివ్వడంతో పాటు... పూర్తయిన భవనాన్ని ప్రారంభిస్తే విద్యార్థులకు వసతికష్టాలు తీరుతాయని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

పూర్తయిన సాంఘిక సంక్షేమ శాఖ వసతిగృహం

వినియోగపడేదెప్పుడో..

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: ఏనుగురాయిలో నిర్మిస్తున్న రైతు సేవా కేంద్రం భవనం పూర్తి చేయక రైతులకు ఉపయోగపడటంలేదు. పంచాయతీ పరిధిలోని 18 గ్రామాల రైతులకు వ్యవసాయ, ఉద్యాన, పశు సంవర్ధక సేవలు అందుబాటులోకి తేవాలనే లక్ష్యంతో భవన నిర్మాణం చేపట్టారు. మూడేళ్ల క్రితం రూ.22 లక్షల ఖర్చుతో భవనం నిర్మించారు. నిర్మాణం పూర్తయినా వినియోగంలోకి రాలేదు. పూర్తిస్థాయిలో పెయింటింగ్‌లు, విద్యుత్తు సదుపాయం కల్పించకుండా భవనం ప్రారంభించక వదిలేశారు. రైతు సేవాకేంద్రం అందుబాటులోకి వస్తే విత్తనాలు, వ్యవసాయ పరికరాలు, రాయితీపై ప్రభుత్వం అందించే పథకాలు, రైతులు సాగుచేసిన వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెటింగ్, పశువులకు వైద్యం అందుబాటులోనికి వస్తాయని భవనాన్ని వినియోగంలోకి తేవాలని రైతులు కోరుతున్నారు.

ఏనుగురాయిలో మూతపడిన రైతు సేవా కేంద్రం

అందుబాటులోకి అరకులోయ పోలీస్‌స్టేషన్...

అరకులోయ, న్యూస్‌టుడే: అరకులోయ పోలీస్ స్టేషన్‌కు నూతన భవనం అందుబాటులోకి వచ్చింది. దివంగత మాజీ ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వర రావు, మాజీ ఎమ్మెల్యే సోమ హత్యల అనంతరం జరిగిన పరిణామాల్లో ఈ పోలీస్ స్టేషన్ ధ్వంసమైంది. నాటి తెదేపా ప్రభుత్వం నూతన భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. పోలీస్‌స్టేషన్ ఆవరణలోనే సుమారు రూ.1.60 కోట్లతో నూతన భవనం నిర్మాణ పనులన్నీ పూర్తయ్యి సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. కొద్ది రోజుల్లో ప్రారంభం కానుంది.

అరకులోయలో నిర్మాణం పూర్తయిన పోలీస్‌స్టేషన్ భవనం

ఇలా ప్రయాణం.... ప్రాణాలు పణం

ద్విచక్రవాహనంపై పిల్లలతో సహా ఐదుగురు ప్రయాణం

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: వాహనాల రాకపోకలపై పోలీసుల పర్యవేక్షణ కొరవడుతోంది. చింతపల్లి పాత బస్టాండు వద్ద ద్విచక్రవాహనంపై ఐదుగురు ప్రయాణిస్తున్న దృశ్యం ఆదివారం కనిపించింది. పాత బస్టాండు, హైవే, పాఠశాలలు, కళాశాలలు వద్ద ఈ దృశ్యాలు కనిపిస్తుంటాయి. నిత్యం ఎక్కడో ఒకచోట రహదారి ప్రమాదాల్లో పలువురు మృత్యువాత పడుతున్నారు. మరికొందరు దివ్యాంగులుగా మారుతున్నారు. అయినా వాహనదారుల్లో మార్పు రావడం లేదు. పోలీసులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

నిలిచిన పనులు

కొయ్యూరు, న్యూస్‌టుడే: డౌనూరులో కాఫీ ప్రాసెసింగ్ యూనిట్ నిలిచిపోయాయి. ఎన్నికల ముందు హడావుడిగా ఈ పనులకు రూ.4 కోట్లతో 2023 అక్టోబర్ 20న శంకుస్థాపన చేశారు. అక్కడ ఉన్న జీసీసీ కొనుగోలు కేంద్ర భవనాన్ని తొలగించి పిల్లర్లు వేసి వదిలేశారు. పనులు ముందుకు సాగక గిరిజనులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. కూటమి ప్రభుత్వం దృష్టిసారించి ఈ పనులను పూర్తి చేయాలని పలువురు కోరుతున్నారు.

పునాదులతో నిలిచిన నిర్మాణం

నిర్లక్ష్యానికి 'మైలురాళ్లు'

దారకొండ ఘాట్‌రోడ్లో పడిపోయి ఉన్న మైలురాయి

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: మన్యంలో రహదారుల పక్కన ఏర్పాటు చేసే మైలురాళ్ల నిర్వహణను ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకోవడం లేదు. రహదారుల్లో ప్రయాణించే వారికి దిక్సూచిలా పనిచేస్తాయి. తాము ప్రయాణించాల్సిన దూరం, గమ్య స్థానంతో పాటు మైలురాళ్లపై ఉన్న రంగులు జాతీయ రహదారి, రాష్ట్ర రహదారిని కూడా తెలియజేస్తుంది. కానీ మన్యంలో మైలురాళ్లు ఆలనాపాలనా కరువై నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. చింతపల్లి నుంచి సీలేరు వెళ్లే మార్గంలో గూడెంకొత్తవీధి మొదలుకుని సీలేరు వెళ్లే వరకూ ఉన్న మైలురాళ్లన్నీ దాదాపు ఇదే పరిస్థితిలో ఉన్నాయి. ఊరి పేర్లు, కిలోమీటర్ల వివరాలేవీ మైలురాళ్లపై లేకపోవడంతో ఈ మార్గంలో ప్రయాణించే వారు అయోమయానికి గురవుతున్నారు.

తితిదే నిధులతో శ్రీవారి ఆలయాలు

చింతపల్లి, న్యూస్‌టుడే: తిరుమల తిరుపతి దేవస్థానం నిధులతో జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో వేంకటేశ్వర స్వామి ఆలయాలను నిర్మిస్తున్నట్లు దేవాదాయ ధర్మాదాయ శాఖ పర్యవేక్షక అధికారి అప్పారావు తెలిపారు. చింతపల్లి మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం ఆయన పర్యటించారు. వంగసార కాశీవిశ్వనాథ క్షేత్రంలో నిర్మాణంలో వున్న వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని పరిశీలించారు. చింతపల్లి, గూడెంకొత్తవీధి, జి.మాడుగుల, పాడేరు, మండలాల్లో తొలివిడతగా కొన్ని ఆలయాలు మంజూరయ్యాయన్నారు. వంగసార ఆశ్రమ నిర్వాహకులు కృష్ణారావు పాల్గొన్నారు.

నూకాలమ్మ శోభాయాత్రకు శ్రీకారం

అనకాపల్లి, న్యూస్‌టుడే: ఉత్తరాంధ్ర భక్తుల ఇలవేల్పు అనకాపల్లి నూకాలమ్మ నూతన ఆలయాన్ని మార్చి 8న ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ తెలిపారు. ఇందుకు సంబంధించిన గోడప్రతులను ఆదివారం ఆవిష్కరించారు. అమ్మవారి ఉత్సవ విగ్రహంతో శోభాయాత్రకు జెండా ఊపారు. ఆలయ పునఃప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రులు, ఉత్తరాంధ్రలోని ప్రజాప్రతినిధులు హాజరవుతారని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై దృష్టిసారించండి

అరకులోయ, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలని పాడేరు డీఎస్పీ అభిషేక్ అన్నారు. అరకులోయ పోలీస్ స్టేషన్‌ని ఆదివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అరకులోయ పోలీస్‌స్టేషన్ పరిధిలో సందర్శిత ప్రాంతాలకు పర్యాటకులు అధిక సంఖ్యలో వస్తుంటారన్నారు. స్థానికంగా రహదారులపై అవగాహన లేని వీరు రోడ్డు ప్రమాదాలకు గురికాకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆయన ఆదేశించారు. వాహనాల తనిఖీని ముమ్మరం చేసి వాహనదారులు వేగ నియంత్రణలో ఉండేలా చూడాలన్నారు. గంజాయి రవాణా జరగకుండా నిఘా ముమ్మరం చేయాలన్నారు. సీఐ హిమగిరి, ఎస్ఐ గోపాలరావు పాల్గొన్నారు.

అరకులోయ పోలీసస్టేషన్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎస్పీ అభిషేక్

రహదారి భద్రతా నియమాలు పాటించాలి

కొయ్యూరు, న్యూస్‌టుడే: రహదారి భద్రతా నియమాలు పాటించాలని సీఐ శ్రీనివాసరావు అన్నారు. రాజేంద్రపాలెం వారపు సంతకు వచ్చిన గిరిజనులకు రహదారి భద్రత, సైబర్ నేరాలు, డ్రగ్స్‌తో కలిగే అనర్థాలపై ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సంతలో ప్లకార్డు, బ్యానర్లు ప్రదర్శిస్తూ ర్యాలీ చేశారు. సీఐ మాట్లాడుతూ తాగి వాహనాలను నడపకూడదన్నారు. గంజాయి రవాణాపై తమకు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొయ్యూరు, మంప ఎస్సైలు కిశోర్‌వర్మ, శ్రీనివాస్ పాల్గొన్నారు. అంతకు ముందు మంప ఎస్సై శ్రీనివాస్ మంప పంచాయతీ ఆకులపాడు, చిక్కుడుపాడు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి యువతకు వాలీబాల్ కిట్లను అందించారు.

ఇళ్ల నిర్మాణ బకాయిలు విడుదల చేయాలి

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: జిల్లాలో వెనుకబడిన ఆదివాసీ తెగల జీవన ప్రమాణాలు మెరుగుపర్చాలని, పీఎం జన్‌మన్ కింద ప్రభుత్వం మంజూరు చేసిన పక్కా ఇళ్ల నిర్మాణాలు చేపట్టిన లబ్ధిదారుల బకాయిలు తక్షణమే విడుదల చేయాలని గిరిజన సంఘం మండల శాఖ కార్యదర్శి నర్సయ్య డిమాండు చేశారు. సంఘ కార్యాలయంలో ఆదివారం అధ్యక్షులు శ్రీను ఆధ్వర్యంలో నిర్వహించిన మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాడేరు ఐటీడీఏ పరిధిలో 28,570 మందికి ఇళ్లు మంజూరు చేశారని, నిర్మాణాలు వివిధ దశల్లో పూర్తి చేసిన లబ్ధిదారులకు సాయం అందక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.లక్ష సాయం కూడా విడుదల చేయాలని, అర్హులైన పేదలందరికి ఇళ్లు మంజూరు చేయాలని డిమాండు చేస్తు ఈ నెల 27న చలో ఐటీడీఏ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. సంఘ నాయకులు జీనబందు, సుబ్బారావు, సీతారామ్, డొంబ్రు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కార్యదర్శి నర్సయ్య

రంజాన్ ఉపవాస దీక్షలు

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: రంజాన్ ఉపవాస దీక్షలను ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. చింతపల్లి మసీదును విద్యుద్దీపాలతో తీర్చిదిద్దారు. మసీదు గురువు సాహిద్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మసీదు వద్ద ఆదివారం సాయంత్రం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. పలువురు ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

చింతపల్లి మసీదు వద్ద ముస్లింల ఇఫ్తార్ విందు

ప్రభుత్వం ఆదుకోవాలని వినతి

అనంతగిరి, న్యూస్‌టుడే: మండలంలో లక్ష్మీపురం గ్రామానికి చెందిన సొమెల శుక్రయ్య, రాములకు చెందిన సుమారు 6.5ఎకరాల కాఫీ తోట గురువారం రాత్రి దగ్ధమైంది. దీంతో వారికి ఉన్న ఏకైక జీవనాధారం కోల్పోయి తాము రోడ్డున పడ్డామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పంట అనుకున్న ధరకు అమ్ముడుపోని పరిస్థితి ఉండగా ఈ తరుణంలో తోటను కోల్పోవడంతో వారు అధికారులకు వినతిపత్రం అందించారు. ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాలని కోరారు.

సిరిబాలలో నిలిచిన చరవాణి సేవలు

సీలేరు, న్యూస్‌టుడే: గూడెం కొత్తవీధి మండలం సిరిబాలలో వారం రోజులుగా చరవాణి సేవలు నిలిచిపోవడంతో గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. వంచుల పంచాయతీ పరిధిలోని సిరిబాలలో చరవాణి సంకేతాలు రాకపోవడంతో బాహ్యప్రపంచంతో సంబంధాలు నిలిచిపోయాయి. అత్యవసర సేవలు, అనారోగ్యం పాలైనప్పుడు 108కు సమాచారం అందివ్వడానికి అవకాశం లేకుండా పోయిందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై అధికారులకు సమాచారం ఇచ్చినా ఇప్పటివరకూ ఎవ్వరూ స్పందించలేదని గిరిజనులు ఆరోపిస్తున్నారు. సంకేతాలు రాకపోవడంతో అత్యవసరమైతే కొండలు దిగి పక్క ఊరికి వెళ్లాల్సివస్తోందని అధికారులు వెంటనే స్పందించి సిరిబాలలో నెట్‌వర్క్ సమస్య పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

చర్చ సజావుగా సాగాలి

పాయకరావుపేట, న్యూస్‌టుడే: మండలిలో చర్చలు సజావుగా సాగాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు అభిప్రాయపడ్డారు. తుని రైల్వేస్టేషన్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సభా సమయం వృథా కావడం వల్ల సమస్యలపై సంపూర్ణంగా చర్చ సాగడం లేదన్నారు. ఇకపై జరిగే సమావేశాల్లో ఇలా జరుగకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరతామన్నారు. ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై ప్రధానంగా దృష్టి సారిస్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులు ఎదురైనా సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తున్న విధంగానే ఉపాధ్యాయ, ఉద్యోగుల ఇబ్బందులు తీర్చే విషయంలో సూపర్-7గా భావించి పరిష్కరించాలన్నారు. సీపీఎస్ రద్దు విషయంలోనూ ఉద్యోగులు ఆవేదనను అర్థం చేసుకోవాలన్నారు. పదవీ విరమణ తర్వాత వచ్చే పింఛనుపైనే ఉద్యోగి ఆధారపడతారని చెప్పారు. సీపీఎస్ వల్ల ఉద్యోగానంతరం ఇబ్బందులు పడే అవకాశముందన్నారు. సమస్యల పరిష్కారాన్ని వేగవంతం చేయాలన్నారు. దీంతోపాటు పాఠశాలల్లో బోధనేతర పనులను ఉపాధ్యాయులకు అప్పగించవద్దన్నారు. పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డి.గోపీనాథ్, మండలశాఖ అధ్యక్షుడు ఎ.వి.సూర్యనారాయణ (ప్రకాష్), ప్రధాన కార్యదర్శి హరికృష్ణ, వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శ్రీనివాసులునాయుడు

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

అనంతగిరి, న్యూస్‌టుడే: ఇంటర్మీడియట్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తయినట్లు ప్రిన్సిపల్ ప్రమీల తెలిపారు. అనంతగిరి కేంద్రంలో మొదటి సంవత్సరం 207, ద్వితీయ సంవత్సరం 176 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నట్లుగా చెప్పారు. పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. అన్ని గదులలో సీసీ కెమెరాలు ఉన్నాయని నిఘా నీడలో పరీక్షలు జరగనున్నట్లుగా చెప్పారు. ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగు చర్యలు చేపట్టినట్లుగా పేర్కొన్నారు.

డిపార్ట్‌మెంట్ అధికారిగా అప్పారావు

కొయ్యూరు, న్యూస్‌టుడే: కాకరపాడు గిరిజన సంక్షేమ బాలుర గురుకుల జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షలకు డిపార్ట్‌మెంట్ అధికారిగా చింతపల్లి గురుకుల కళాశాలకు చెందిన ఎం.అప్పారావును నియమించారు. చీఫ్ సూపరింటెండెంట్‌గా కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మణ్ వ్యవహరించనున్నారు. సోమవారం జరిగే పరీక్షకు 190 మంది ఇంటర్ మొదటి ఏడాది విద్యార్థులు హాజరుకానున్నారు. పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని తహసీల్దార్ మురళీబాబు తెలిపారు.

పెదబయలు గ్రామీణం: పెదబయలు పరీక్ష కేంద్రంలో మూడు కళాశాల నుంచి 516 మంది ఇంటర్ విద్యార్థులు సోమవారం నుంచి పరీక్షలు రాయనున్నారు. వీరిలో మొదటి సంవత్సరంలో 259, ద్వితీయ సంవత్సరం విద్యారుర్థులు 257 మంది ఉన్నారని ప్రిన్సిపాల్ పి. కేశవరావు తెలిపారు. పరీక్ష కేంద్రాలో విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేశామన్నారు.

సీలేరు: ఇంటర్ పరీక్షలకు సీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ముఖ్య పర్యవేక్షణాధికారి వి.శంకర్రావు తెలిపారు. మొదటి సంవత్సరం పరీక్షలకు 45 మంది, ద్వితీయ సంవత్సరానికి 49 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారని తెలిపారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: మండలంలోని పెదగుడ గ్రామంలో గంగమ్మ ఉత్సవాలు సందర్భంగా క్రికెట్ పోటీలు మొదలయ్యాయి. తెదేపా గ్రామ శాఖ అధ్యక్షురాలు సన్యాసమ్మ ఆదివారం పోటీలు ప్రారంభించారు. క్రీడలు మానసిక ఆరోగ్యంతో పాటు ఆనందాన్ని ఇస్తాయని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు జగదీష్, నవీన్‌కుమార, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

పెదగుడలో క్రికెట్‌పోటీలు ప్రారంభిస్తున్న సన్యాసమ్మ

తగ్గిన పర్యాటకులు

చింతపల్లి, న్యూస్‌టుడే: మన్యంలో పర్యాటకుల సంఖ్య గణనీయంగా తగ్గింది. వాతావరణంలో మార్పుల కారణంగా చలి, మంచు ప్రభావం బాగా తగ్గి, ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. వారాంతాల్లో లంబసింగి, తాజంగి, చెరువులవెనం పర్యాటక ప్రాంతాలకు వచ్చే వారి సంఖ్య పడిపోయింది. ఆదివారం పరిమితంగా వచ్చిన పర్యాటకులు లంబసింగి పరిసర ప్రాంతాల్లో స్ట్రాబెరీ తోటలను సందర్శించి ఫొటోలు దిగారు.

సందడి లేని అరకులోయ....

అరకులోయ, న్యూస్‌టుడే: ఆంధ్రా ఊటీ అరకులోయలో సందర్శకుల తాకిడి బాగా తగ్గింది. గత కొద్ది రోజుల నుంచి పర్యాటకుల సందడి లేకపోవటంతో సందర్శిత ప్రాంతాలైన గిరిజన మ్యూజియం, పద్మాపురం ఉద్యానం, కాఫీ తోటలు, వ్యూపాయింట్ తదితరాలు వెలవెలబోయాయి. పది, ఇంటర్ పరీక్షల కాలం ప్రారంభం కావడంతో వారాంతపు రోజుల్లోనూ అరకులోయ ప్రాంతంలోని సందర్శిత ప్రాంతాలకు పర్యాటకులు రావడంలేదు.

స్ట్రాబెరీ తోటల్లో ఫొటోలు దిగుతున్న పర్యాటకులు

రాజకీయాలకు ఎన్టీఆర్ ఆదర్శం : అయ్యన్న

నర్సీపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: రాజకీయ నాయకులకు ఎన్టీఆర్ ఆదర్శమని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. నీలంపేట తెదేపా అధ్యక్షుడు బోళెం వెంకట శ్రీనివాస ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆదివారం సాయంత్రం ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతీకైన ఎన్టీఆర్ రాజకీయ జీవితాన్ని యువత తెలుసుకోవాలన్నారు. మహిళలకు ఆస్తిహక్కు, రాజకీయాల్లో రిజర్వేషన్లు, రూ.2కే కిలో బియ్యం లాంటి ఎన్నో కార్యక్రమాలు ఆయన తీసుకొచ్చినవేనని పేర్కొన్నారు. అభివృద్ధే లక్ష్యంగా గ్రామాల్లో నాయకులు పనిచేయాలని సూచించారు. విగ్రహావిష్కరణ సందర్భంగా వెంకటశ్రీనివాస 180మంది పేదలకు పాతిక కిలోల చొప్పున బియ్యాన్ని పంపిణీ చేశారు. నీలంపేటలో రహదారుల నిర్మాణానికి రూ.71 లక్షలు మంజూరు చేశామని తెలిపారు. జడ్పీటీసీ సభ్యురాలు రమణమ్మ, జిల్లా అధికార ప్రతినిధి శ్రీరంగస్వామి, కౌన్సిలర్ రాజేష్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ వెంకటరమణ, బోళెం వెంకినాయుడు పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన దారాలమ్మ ఆలయం

సీలేరు, న్యూస్‌టుడే: గూడెం కొత్తవీధి దారకొండ ఘాటీ రహదారిలో దారాలమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. శివరాత్రి ముగియడంతో బాటు కొత్త అమావాస్య సమీపిస్తున్న తరుణంలో అమ్మవారి ఆలయానికి భక్తుల తాకిడి రోజు రోజుకు పెరుగుతుంది. శివరాత్రి అయిన తరువాత మొదటి ఆదివారం కావడంతో ఈ నేపథ్యంలో ఆదివారం తెల్లవారుజాము నుంచి భక్తులు రాక ప్రారంభమైంది. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తమ మొక్కులను చెల్లించుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో రావడంతో దారాలమ్మ ఆలయం వద్ద సందడి నెలకొంది. వాహనాలతో ఆలయ ప్రాంగణం రద్దీగా మారింది. ఆలయ నిర్వాహకులు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు.

మోదకొండమ్మ పాదాల వద్ద భక్తుల సందడి

కిముడుపల్లిలో శివకేశవస్వామి ఆలయ ఉత్సవ కమిటీ ఎన్నిక

పెదబయలు, న్యూస్‌టుడే: పెదబయలు మండలం కిముడుపల్లిలో అయిదేళ్లకు నిర్వహించే శివకేశవస్వామి ఆలయ వార్షికోత్సవం ఏప్రిల్ 26 నుంచి 28వ తేదీ వరకు మూడురోజులపాటు నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది. ఆలయ అర్చకులు, పంచాయతీ ప్రజల ఆధ్వర్యంలో ఆదివారం నూతన ఉత్సవ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కోడా ఈశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా గండేరు నిరీక్షణరావులను ఎన్నుకున్నారు. అయిదేళ్లకోసారి జరిగే ఈ జాతరను అంగరంగా వైభంగా నిర్వహిస్తామని, ప్రజలంతా సహకరించి విజయవంతం చేయాలని ఉత్సవ కమిటీ సభ్యులు కోరారు. కమిటీ గౌరవాధ్యక్షులు మర్రిచెట్టు రంగనాయుడు, కోడా సింహాద్రి, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

శివకేశవస్వామి ఉత్సవ కమిటీ

మోదకొండమ్మ పాదాలకు భక్తుల రద్దీ

పాడేరు పట్టణం, న్యూస్‌టుడే: మోదకొండమ్మ పాదాల వద్ద భక్తులు రద్దీ ఎక్కువైంది. అమ్మవారికి ప్రీతి పాత్రమైన ఆదివారం వేకువజాము నుంచే భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. మైదాన ప్రాంతాలైన మాడుగుల, చోడవరం, అనకాపల్లి, నర్సీపట్నం నుంచి వచ్చిన భక్తులు అమ్మవారి పాదాలను దర్శించుకుని సమీపంలో కాఫీ తోటల్లో వంటావార్పు చేసుకున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

పాడేరు 89853 66570	అరకులోయ: 63034 86346 చింతపల్లి: 94404 07658

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో స్త్రీశక్తి భవనం సమీపంలోని బోరు నిరుపయోగంగా ఉంది. బోరు మరమ్మతు చేపట్టి వినియోగంలోనికి తేస్తే, ఆ ప్రాంతంలో ప్రజలకు ఉపయోగపడుతుంది. **– రామారావు, స్థానికుడు.** ✔: మండల కేంద్రంలో నీటి ఎద్దడి ఏర్పడకుండా చర్యలు చేపడతాం. బోరును పరిశీలించి మరమ్మతులు చేపడతాం. **– రాజేష్, ఏఈ, గ్రామీణ నీటి సరఫరా విభాగం, ముంచంగిపుట్టు.**

పెదబయలు, న్యూస్‌టుడే: పర్రెడ పంచాయతీలోని పలు గ్రామాల్లో నీటి ఎద్దడి తీవ్రంగా ఉంది. పంచాయతీ కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో ఊటనీరే ఆధారం. **– రాజుబాబు, పర్రెడ, పెదబయలు మండలం,** ✔: గ్రామంలో పర్యటించి తాగునీటి సౌకర్యాలు పరిశీలించి పంచాయతీ సిబ్బందితో చర్చించి సాధ్యమైనంత వరకు నీటిఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటాం. **– జగదీష్, గ్రామీణ నీటి సరఫరా విభాగం, జేఈ, పెదబయలు**

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: కొల్లాపుట్టు పంచాయతీ బిట్రగండ, నిట్టమామిడి, వై కొల్లాపుట్టు గ్రామాల్లో బీటీ రోడ్లు మధ్యలో నిలిచిపోయాయి. ఏడాది అవుతున్న పనులు పునఃప్రారంభించక ఇబ్బందులు పడుతున్నాం. **– సింహాచలం, స్థానికుడు,** ✔: పనులు చేపట్టిన గుత్తేదారులకు కొంతమేర బిల్లులు చెల్లించాం. పనులు పునఃప్రారంభించాలని గుత్తేదారులకు ఆదేశాలు జారీ చేశాం. **– అజయ్‌కుమార్, పంచాయతీరాజ్ ఏఈఈ**

చింతపల్లి, న్యూస్‌టుడే: ఎర్రబొమ్మలకు వెళ్లేందుకు సరైన మార్గం లేదు. 516-ఈ జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న ఈమార్గం ఇరుగ్గా ఉండటంతో పెద్దవాహనాలు రావడం లేదు. గతంలో ఆర్టీసీ బస్సు తిరిగేది. **– సత్యనారాయణ ఎర్రబొమ్మలు,** ✔: జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న కొన్ని ప్రధాన మార్గాలను అనుసంధాన రహదారులుగా గతంలోనే గుర్తించారు. అధికారులతో చర్చించి అవసరమైన చర్యలు తీసుకుంటాం. **– శంకర్రావు, తహసీల్దారు, చింతపల్లి**

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం

గొలుగొండ, న్యూస్‌టుడే: జోగుంపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో 1995-96లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం సమావేశమయ్యారు. 30 ఏళ్ల తరవాత అందరూ ఒకచోట కలుసుకుని ఆప్యాయంగా పలకరించుకున్నారు. కొందరు ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. మరికొందరు పలు ప్రాంతాలకు వెళ్లి వ్యాపారులు చేస్తున్నారు. ఆత్మీయకలయిక కారణంగా వీరంతా ఓచోట కలిసి సరదాగా గడిపారు. ఆహ్లాదకర వాతావరణంలో కలిసి అప్పట్లో తమకు చదువు చెప్పిన గురువులు ప్రకాశరావు, కామేశ్వరరావు, లక్ష్మణరావులకు సమస్కరించి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఆర్థిక ఇబ్బందులో ఉన్న స్నేహితురాలి కుటుంబానికి రూ. 10 వేలు సాయం అందించారు.

హైస్కూల్ ఆవరణలో కలిసిన 1995-96 సంవత్సర పదో తరగతి విద్యార్థులు

(c) eenadu

సేవల సారథులు.. ప్రజలకు వారధులు

- ప్రతి పల్లెవాసికి ఆత్మీయ స్నేహితులు జీడీఎస్‌లు
- సమ్మేళనంలో సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి

'అద్భుతమైన సేవలకు సారథులు మీరు.. ప్రజల మధ్య సమాచార మార్పిడికి వారధులు మీరు.. ప్రతి పల్లెవాసికి ఆత్మీయ స్నేహితులు గ్రామీణ డాక్ సేవక్‌లు. ఎంత సాంకేతికత అభివృద్ధి చెందినా, ఏఐ తరహా పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చినా మీరు లేని లోటు ఊహించలేం. మారుతున్న కాలానికి అనుగుణంగా తపాలా శాఖలోనూ ఆధునికత సంతరించుకునేలా కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు చొరవ చూపుతాం. మిమ్మల్ని చూస్తుంటే నా చిన్నతనం గుర్తొస్తోంది.'' అని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. ఆదివారం సాయంత్రం గుంటూరు శివారులోని సత్యసాయి ఆధ్యాత్మిక నగరిలో జరిగిన జాతీయ స్థాయి గ్రామీణ డాక్ సేవక్ సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సాయంత్రం 3.30 గంటలకు హెలికాప్టర్‌లో గుంటూరుకు చేరుకున్న సీఎం చంద్రబాబుకు అధికారులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. ఆలోపే కాజ టోల్‌గేట్ నుంచి కేంద్రమంత్రులు జ్యోతిరాదిత్య సింధియా, పెమ్మసాని చంద్రశేఖర్ భారీ ర్యాలీగా సభాప్రాంగణానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా జీడీఎస్ సమూహాన్ని ఉద్దేశించి చంద్రబాబు ప్రసంగించారు.

అనుబంధాన్ని నెమరవేసుకుని..

కార్యక్రమంలో కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా, సీఎం చంద్రబాబు మధ్య ఆత్మీయ పలకరింపులు ఆకట్టుకున్నాయి. సభ జరుగుతున్నంతసేపు ఇద్దరూ అభిమానంగా మాట్లాడుకోవడం కనిపించింది. అనంతరం ఇద్దరూ చేసిన ప్రసంగాల్లోనూ తమ అనుబంధాన్ని నెమరు వేసుకున్నారు. జీడీఎస్‌లు చేస్తోన్న దేశసేవ వల్ల 38 కోట్ల తపాలా ఖాతాలు ప్రస్తుతం ఉన్నాయని, రూ.22 లక్షల కోట్ల మూలనిధి ఉందని జ్యోతిరాదిత్య అన్నారు. సుకన్య సమృద్ధి యోజన, మేరీలాడ్లీ లక్ష్మి కింద 3.8 కోట్లు ఖాతాలు రూ.2.7 లక్షల కోట్ల కార్పస్ ఫండ్ అందించాయని వివరించారు. పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ భారత తపాలా వ్యవస్థ మన మట్టిలోనే ఉంది. సందేశం తీసుకెళ్లే పాదాలు పరుగులు పెడుతున్నాయని ఉత్సాహపరిచారు.

స్ఫూర్తి నింపి.. ఉత్తమ సేవలందించిన గ్రామీణ డాక్ సేవక్‌లను ఈ సందర్భంగా సీఎం, కేంద్రమంత్రులు సత్కరించారు. వారి యూనిఫామ్ స్వయంగా జ్యోతిరాదిత్య తొడగడం ఆకట్టుకుంది. భారీగా పోటెత్తిన జీడీఎస్‌లతో సభాప్రాంగణం నిండిపోయింది. నేతలు జీడీఎస్‌ల సేవలను కొనియాడుతూ వారు మరింత ఉత్సాహంగా పనిచేసేలా స్ఫూర్తినింపారు. కార్యక్రమం ఆద్యంతం అత్యంత ఉత్సాహంగా కొనసాగింది.


సింధియాకు అమ్మవారి ప్రతిమను బహూకరిస్తున్న సీఎం చంద్రబాబు

కాజ టోల్ ప్లాజా వద్ద కేంద్రమంత్రులు జ్యోతిరాదిత్య సింధియా, పెమ్మసాని చంద్రశేఖర్‌లకు గజమాలతో స్వాగతం

పోస్టల్ ఉద్యోగి విశ్వేశ్వరరావును సత్కరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర మంత్రులు జ్యోతిరాదిత్య, పెమ్మసాని

ప్రతి జీడీఎస్‌కు లభించిన గౌరవం

పోస్టల్‌శాఖలో 38 ఏళ్లుగా పనిచేస్తున్నాను. మారుమూల గ్రామాల్లో బ్రాంచి పోస్టుమాస్టర్‌గా పనిచేస్తున్న నాకు సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రులు సన్మానం చేయడాన్ని పదోన్నతిగా భావిస్తున్నాను. ఈగౌరవం ప్రతి జీడీఎస్ ఉద్యోగిది. మావద్ద సెజ్ కంపెనీలు ఉండడంతో పార్సిళ్లన్నీ తపాలా శాఖ ద్వారా బుక్ చేస్తున్నాను. ప్రతి ఇంటికి వెళ్లి అవగాహన కల్పించి ఖాతాలు తెరిపించాను. నాకు వేతనంతోపాటు నెలకు రూ.18 వేలు అదనంగా వస్తోంది. సూపర్-6 పథకాల ద్వారా వచ్చిన సొమ్ము నేరుగా లబ్ధిదారుల ఇంటివద్దకే తీసుకెళ్లి అందించాం.

\- వీఎస్ విశ్వేశ్వరరావు, అనకాపల్లి డివిజన్

జీవితంలో మరిచిపోలేని రోజు

పోస్టల్ శాఖలో 20 ఏళ్లుగా పనిచేస్తున్నాను. ఈరోజు ఇక్కడ జరిగిన సన్మానం మాజీవితంలో మరిచిపోలేని రోజు. టీచర్, పోలీసు, పోస్టల్‌లో ఉద్యోగాలు వస్తే పోస్టల్‌లో చేరాను. సొంత గ్రామంలో సొంత గ్రామస్థులకు సేవ చేసే అవకాశం లభించింది. ప్రధాని పిలుపు మేరకు బేటీ బచావో. .బేటీ పఢావో, సుకన్య సమృద్ధి యోజన పథకాలు అర్హులందరికీ అందించాను. గ్రామం మొత్తం బీమా చేయించాను. మాగ్రామస్థులు నన్ను ఎంతగానో ప్రోత్సహించడంతో అన్నింట్లో ముందంజలో ఉన్నాను. కేంద్రప్రభుత్వ ఉద్యోగులకు 8వ వేతన సంఘం వేశారు. జీడీఎస్‌లకు కూడా వేతన సంఘం వేయాలని అందరి తరపున కోరుతున్నాను.

\- అరుణ, బ్రాంచి పోస్టుమాస్టర్, చిత్తూరు డివిజన్

గ్రామోత్సవంలో స్వామివారు, పాల్గొన్న భక్తులు

బ్రహ్మాండనాయకునికి కల్యాణ శోభ

ప్రారంభమైన నృసింహుని బ్రహ్మోత్సవాలు

మంగళగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: మంగళగిరి శ్రీపానకాల లక్ష్మీనరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాలు మొదటి రోజైన ఆదివారం పెండ్లి కుమారుని ఉత్సవంతో ఘనంగా ప్రారంభం అయ్యాయి. తెల్లవారుజామున స్వామివారి తీర్థ బిందె తీసుకురావడం, ప్రాతఃకాల అర్చన తదితర పూజలు చేశారు. ఉదయం 8 గంటలకు పద్మశాలీయ బహూత్తమ సంఘం ఆధ్వర్యంలో పట్టువస్త్రాలను మేళతాళాల నడుమ ఆలయానికి తీసుకురాగా.. ప్రధాన అర్చకుడు మాల్యవంతం శ్రీనివాస దీక్షితులు ఆధ్వర్యంలో పంచామృతాలతో అభిషేకం నిర్వహించి స్వామి, అమ్మవార్లను పెళ్లి కుమారుడు, పెళ్లి కుమార్తెలుగా అలంకరించారు. రాత్రి 8 గంటలకు స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ మాడ వీధుల్లో డప్పువాయిద్యాలు, నృత్యాల నడుమ స్వామి వారిని ఊరేగించారు. దేవుడి వేషధారణలు, కూచిపూడి నృత్యాలు అలరించాయి. ఆలయ ఈవో కోగంటి సునీల్ కుమార్, ధర్మకర్తల మండలి సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

ప్రతిభావంతులకు ప్రోత్సాహం ప్రభుత్వ బాధ్యత

మంత్రి మనోహర్‌తో జానపద నృత్య కళాకారిణులు

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: అన్ని వయస్సుల వారిలోనూ ప్రతిభ ఉంటుందని దానిని ప్రదర్శించేందుకు ఒక వేదికగా ఉండాలని.. అదే ఆనంద ఆదివారమని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణ సత్యనారాయణ పార్కు వద్ద నిర్వహించిన 'హ్యాపీ సండే' కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతిభ గల వారికి ప్రోత్సాహం కల్పించడాన్ని ప్రభుత్వం బాధ్యతగా తీసుకుందని తెలిపారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రతి నెలా 2, 4 ఆదివారాల్లో ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా నగరపాలక సంస్థలు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో నిర్వహించాలని సూచించినట్లు పేర్కొన్నారు.

సందడిగా ఆనంద ఆదివారం.. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో సత్యనారాయణ పార్కులో నిర్వహించిన ఆనంద ఆదివారం కార్యక్రమం [illegible] కూచిపూడి, జానపద, శాస్త్రీయ నృత్యం, [illegible] అలరించారు. దేశభక్తి గీతాలకు అనుగుణంగా అభినయించిన మున్సిపల్ పాఠశాలల, తదితర విద్యార్థులు, యువతను మంత్రి ప్రశంసించారు. వారితో ఫొటోలు దిగి జోష్ నింపారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు మున్సిపల్ అధికారులు బహుమతులు అందజేశారు.

విజేతలకు బహుమతులు అందిస్తున్న జ్యోతి యర్రాజీ, వీఐటీ ఏపీ వర్సిటీ ప్రతినిధులు

విభిన్న సంస్కృతుల సమ్మేళనం 'విటోపియా'

తుళ్లూరు, న్యూస్‌టుడే: విభన్న సంస్కృతులు, సంప్రదాయాలు, క్రీడా పోటీల సమ్మేళనంగా 'విటోపియా 2026' నిలిచిందని వీఐటీ ఏపీ వైస్ ఛాన్సలర్ డా.పి ఆరుల్మోళివర్మన్ పేర్కొన్నారు. అమరావతిలోని ఆ వర్సిటీలో ఆదివారం ఈ కార్యక్రమ ముగింపు సందర్భంగా విజేతలకు బహుమతుల ప్రదానోత్సవం జరిగింది. ముఖ్యఅతిథిగా అథ్లెటిక్స్ క్రీడాకారిణి, అర్జున అవార్డు గ్రహీత జ్యోతి యర్రాజీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతోపాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ సత్తాచాటాలని సూచించారు. సాయంత్రం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వర్సిటీ రిజిస్ట్రార్ డా.జగదీష్ చంద్ర ముదిగంటి, విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

ప్రభుత్వ జూనియర్ కాలేజీలో పరీక్షల ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఆర్ఐవో సునీత

గుంటూరు విద్య, న్యూస్‌టుడే: ఇంటర్మీడియట్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. దీనికి సంబంధించి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. వచ్చే నెల 24వ తేదీ వరకు జరగనున్న ఈపరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 87 కేంద్రాల్లో 68,898 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. పరీక్ష ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరగనుంది. విద్యార్థులు పరీక్ష ప్రారంభమయ్యే అర్ధగంట ముందుగానే పరీక్ష కేంద్రానికి రావాల్సి ఉంది. 8.30 గంటల నుంచే పరీక్ష హాల్‌లోకి అనుమతించనున్నారు. పరీక్షల ఏర్పాట్లకు సంబంధించి ఏవైనా సమస్యలు ఉంటే హెల్ప్‌లైన్ నెంబరు 0863- 2221544కు తెలియజేయవచ్చు.

★ ఆర్ఐవో జి.సునీత సాంబశివపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాట్లను పరిశీలించారు. పరీక్ష నిర్వహణ గదులను తనిఖీ చేసి హాల్‌టికెట్ నంబర్లు వేసిన తీరు పరిశీలించి అధికారులకు సూచనలిచ్చారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా రూమ్ నంబర్ల వారీగా హాల్‌టికెట్ నంబర్లను కళాశాల ప్రవేశం ద్వారం వద్దనే ఏర్పాటు చేయాలని సూచించారు.

కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్ నేడు

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ హాలులో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నామని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీఆర్ఎస్‌తో పాటు ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ రెవెన్యూ సమస్యలకు త్వరితగతిన పరిష్కారం అందించేందుకు జిల్లా స్థాయి రెవెన్యూ క్లినిక్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందులో అన్ని మండలాల తహసీల్దార్లు, డివిజన్ అధికారులు రికార్డులతో హాజరై సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతారన్నారు. ప్రజలు 1100 నంబర్‌కు ఫోన్ చేసి.. పీజీఆర్ఎస్‌లో అందించిన అర్జీల స్థితి తెలుసుకోవచ్చని తెలిపారు.

పోలీసు కార్యాలయంలో.. గుంటూరు నేరవార్తలు: పోలీసు కార్యాలయంలో ఈనెల 23న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు ఎస్పీ కార్యాలయ వర్గాలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపాయి. ప్రజల నుంచి అర్జీలను పోలీసు అధికారులు స్వీకరిస్తారని పేర్కొన్నారు.

పతకాలు, ప్రశంసాపత్రాలతో నాగరమణేశ్వరి

నడకే విజయ మంత్రం

పెదనందిపాడు, న్యూస్‌టుడే: పట్టుదల, కృషి ఉంటే ఏ వయసులోనైనా విజయాలు సాధించవచ్చని పెదనందిపాడు మండలం నాగులపాడుకు చెందిన ఎస్. నాగరమణేశ్వరి నిరూపిస్తున్నారు. 65 ఏళ్ల ఆమె గతంలో పాఠశాల ప్రధానోపాధ్యాయినిగా పని చేశారు. ప్రస్తుతం రాష్ట్ర, జాతీయ స్థాయిలలో మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలలో పాల్గొని పతకాలు సాధిస్తున్నారు. 2025లో రాష్ట్రస్థాయిలో జరిగిన మూడు కిలోమీటర్ల నడక పందెం, 200, 400 మీటర్ల పరుగు పందెంలో వరుసగా మూడు బంగారు పతకాలు సాధించారు. 2026లో జాతీయస్థాయిలో జరిగిన పోటీలలో మూడు కిలోమీటర్ల నడక పందెంలో బంగారు పతకం, 200, 400 మీటర్ల విభాగంలో వెండి పతకాలు పొందారు. 400 మీటర్ల రిలే పరుగు పందెంలో రెండు కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు. తన భర్త రామసుబ్బారావు నిత్యం 12 నుంచి 15 కిలోమీటర్లు నడుస్తారని, ఆయన స్ఫూర్తితోనే నిత్యం సాధన చేస్తున్నట్లు ఆమె చెబుతున్నారు.

పిక్కలకు గాట్లు.. పిల్లలకు పాట్లు

గుంటూరు నగరంలో భయపెడుతున్న శునకాలు

శుక్రవారం రాత్రి:
గుంటూరు నగరంలోని నల్లచెరువుకు చెందిన ఫణీంద్రరెడ్డి అనే ఆరేళ్ల చిన్నారిపై ఆరు కుక్కలు దాడి చేశాయి. తీవ్ర గాయాలైన పసివాడికి జీజీహెచ్‌లో వైద్యులు చికిత్స అందిస్తున్నారు.

పది రోజుల క్రితం:
పట్టాభిపురం డీఆర్ఎం కార్యాలయ సమీపంలో తండ్రీ కుమార్తెలు నడిచి వెళ్తుండగా కుక్కలు పాపపై దాడి చేసేందుకు ప్రయత్నించాయి. తండ్రి తరిమి కొట్టడంతో గండం తప్పింది.

గతేడాది అక్టోబర్ 7:
ఏటీ అగ్రహారంలో ఓ చిన్నారిపై వీధి కుక్కలు దాడి చేయగా.. తప్పించుకునే క్రమంలో పక్కనే ఉన్న స్తంభంపై పడిపోయాడు. తీవ్రగాయాలవడంతో ఆసుపత్రిలో చేర్చాల్సి వచ్చింది.

ఈనాడు – అమరావతి

గుంటూరు నగరాన్ని వీధి శునకాలు వణికిస్తున్నాయి. ఎప్పుడు ఎవరి మీద దాడి చేస్తాయో.. ఎవరి ప్రాణాలను బలిగొంటాయో అన్న ఆందోళన. రాత్రి సమయాల్లో మరీ భయానక పరిస్థితి. రైల్వేస్టేషన్ పరిసరాల్లో అయితే ప్రయాణికులే వాటి లక్ష్యం. విద్యార్థులు పాఠశాలలు, ట్యూషన్లకు వెళ్లాలన్నా వణికిపోతున్నారు. గతంలో కుక్కల దాడిలో ఓ చిన్నారి ప్రాణాలు కోల్పోయిన ఉదంతం ఉంది. పిల్లలు, పెద్దలు తీవ్రంగా గాయపడిన ఘటనలు కోకొల్లలు.

ఇదీ పరిస్థితి

ఏడాది క్రితం పశుసంవర్ధక శాఖ లెక్కల ప్రకారం....

వీధి కుక్కలు	: 28,350
పెంపుడు శునకాలు	: 4,650

- అనధికార లెక్కల ప్రకారం 70 వేలకు పైగానే ఉంటాయని కార్పొరేషన్ వర్గాల మాట.
- వీటి సంతతి ఏటా పెరుగుతున్నా కట్టడికి పకడ్బందీ చర్యల్లేకపోవడం సమస్యగా పరిణమిస్తోంది.

రైల్వేస్టేషన్ పరిసరాల్లో..

నిత్యం దాదాపు 9 వేలమంది ప్రయాణికులు రాకపోకలు సాగించే గుంటూరు రైల్వేస్టేషన్ పరిసరాల్లో శునకాలు బెంబేలెత్తిస్తున్నాయి. వందలాదిగా ఇక్కడే తిష్ట వేస్తున్నాయి. ఎన్ని కట్టడి చర్యలు చేపట్టినా ఫలితం ఉండడం లేదు. స్టేషన్ పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడం ప్రధాన కారణం. రైల్వే ఉన్నతాధికారులకు సైతం ఫిర్యాదులు వెళ్తున్నాయంటే తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. రైల్వేశాఖ నుంచి జీఎంసీవర్గాలకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినా స్పందన లేదు.

ఏబీసీ సెంటర్ ఏదీ?

కుక్కలకు శస్త్రచికిత్స కోసం ఏబీసీ సెంటర్ ఏర్పాటుకు జీఎంసీ అధికారులు నాలుగు నెలల క్రితం చర్యలు చేపట్టారు. పనులు పూర్తి కాలేదు. తాజా ఘటనతో స్పందించిన కమిషనర్ మయూర్ అశోక్ ఈ నెలాఖరులోగా కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. యానిమల్ బోర్డ్ ఆఫ్ ఇండియా నుంచి స్నేహ ఏజెన్సీకి అనుమతులొచ్చాయని చెప్పారు. వెటర్నరీ వైద్యుడి నియామకంపై పశుసంవర్ధకశాఖ నుంచి స్పష్టత రావాల్సి ఉంది.

★ గతంలో ఏ ప్రాంతం నుంచి కుక్కలు తెచ్చి శస్త్రచికిత్సలు చేశారో తిరిగి అదే ప్రాంతంలో వదిలేసేవారు. దీనికితోడు శునక ప్రేమికులు అడ్డు చెబుతుండడం మరో సమస్య. వీటికి శాశ్వత పరిష్కారం చూపాల్సి ఉంది.

బ్యాంకు లాకరులోని 328 గ్రాముల బంగారం మాయం

మహిళా ఉద్యోగి చేతివాటం

తుళ్లూరు, న్యూస్‌టుడే: ప్రస్తుతం బంగారం ధరలు ఆకాశానంటాయి. ఈ నేపథ్యంలో భద్రంగా ఉంటాయని చాలా మంది బ్యాంకు లాకర్‌లో ఉంచుతున్నారు. అక్కడ కూడా రక్షణ లేకపోతే ఏంటన్న పరిస్థితి ఉత్పన్నమవుతోంది. రాజధాని గ్రామం వెంకటపాలెం యూనియన్ బ్యాంకులో స్థానికులు తాకట్టు పెట్టుకున్న సుమారు 328 గ్రాముల బంగారం కనిపించటం లేదని బ్రాంచ్ మేనేజర్ భుక్యా వీరాంజనేయులు శనివారం తుళ్లూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 2న బ్యాంక్ మేనేజర్ బ్యాంకులోని లాకర్‌లను సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. ఆ సమయంలో బ్యాంకు సేఫ్ లాకరులోని 2 పౌచ్‌లలో ఉంచిన సుమారు రూ.50 లక్షలు విలువైన 328 గ్రాముల బంగారం కనిపించలేదు. దీంతో సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించారు. అదే బ్యాంకులో పని చేస్తున్న మహిళా ఉద్యోగి ఒకరు లాకర్ తాళం చెవి తీసుకొని అందులోని రెండు పౌచ్‌లను బయటకు తీసుకువెళ్లినట్టుగా రికార్డు అయ్యింది. ఈ ఘటనపై మేనేజర్ శనివారం తుళ్లూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తుళ్లూరు సి.ఐ కె. శ్రీనివాసరావు తెలిపారు.

ఆధార్ దుర్వినియోగం చేసి రూ.6 కోట్లు స్వాహా!

ఆందోళనలో పొదుపు సంఘాల సభ్యులు

న్యూస్‌టుడే, పొన్నూరు

సాధారణంగా బ్యాంకులో రుణం పొందాలంటే లబ్ధిదారు స్వయంగా సంతకం చేసిన ఆధార్‌కార్డు నకలు, రుణం తీసుకుంటున్న తేదీ రాసి సంబంధిత పత్రాలకు జతచేయాలి. కానీ ఇలాంటివేమీ లేకుండానే స్వయం సంఘాల మహిళల ఆధార్ కార్డులతో ఆర్పీలు, మెప్మా అధికారులు రూ.కోట్లు స్వాహాచేయడంపై పోలీసులు విచారణ చేస్తున్నారు. బ్యాంకు అధికారుల తప్పిదమేంటి.. ఆర్పీలు, మెప్మా అధికారులు చేసిన మోసమేంటి అనే అంశాలపై పొన్నూరు పట్టణ పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. బ్యాంకు రుణం మంజూరు చేసే ప్రక్రియలో ఆధార్ కార్డు కీలకం. పొదుపు సంఘ సభ్యులకు రుణం ఇచ్చే ముందు ఆధార్ నకలుతోపాటు కొన్ని పత్రాలపై సభ్యుల సంతకాలు, వాటిని ధ్రువీకరిస్తూ మెప్మా అధికారుల సంతకాలు తీసుకున్న తర్వాత ఆర్పీ వాటిని బ్యాంకు అధికారులకు అప్పగిస్తారు. అయితే 2022లో కొన్ని గ్రూపుల సభ్యుల వద్ద నమ్మకంగా తీసుకున్న ఆధార్ కార్డులను దుర్వినియోగం చేసి వారి ప్రమేయం లేకుండా వంద బినామీ గ్రూపులను ఏర్పాటు చేసి నాటి వైకాపా మహిళా నేతలు ఆర్పీలు, మెప్మా అధికారులు, సుమారు రూ.6 కోట్లు స్వాహా చేసినట్లు వెలుగులోకి వచ్చింది. పొన్నూరు ఎనిమిదో వార్డు చెందిన చుట్టా లక్ష్మి ఆధార్ కార్డు తీసుకుని ఆ వార్డు ఆర్పీ ఇలా బ్యాంకులో రూ.50 వేల రుణం తీసుకుని చెల్లించకపోవడంతో ఆధార్‌ను దుర్వినియోగం చేసినట్లు గుర్తించారు. బ్యాంకు రుణం చెల్లించలేదంటూ సంబంధిత అధికారులు కోర్టు ద్వారా నోటీసులు పంపుతుండటంతో సభ్యులు బిత్తరపోతున్నారు. తమకు తెలియకుండా ఆర్పీ రుణం తీసుకున్న ఘటనపై లక్ష్మితో సహా కొందరు సభ్యులు పొన్నూరు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇలా పలువురు పోలీసులను ఆశ్రయిస్తుండటంతో లోతుగా విచారణ చేస్తున్నారు. ఆధార్ కార్డుపై తమ సంతకంతోపాటు తేదీ లేకుండా వాటిని ఎలా పరిగణనలోకి తీసుకున్నారని సభ్యులు ప్రశ్నిస్తున్నారు. సభ్యులకు సంబంధం లేకుండా ఆధార్‌కార్డు ఉపయోగించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఆధార్ కార్డులపై సంతకాలు ఫోర్జరీ చేశారా. . లేక సభ్యుల సంతకం తీసుకొని మోసగించారా అనేది తేలాల్సి ఉంది. పొన్నూరు అర్బన్ సీఐ వీరనాయక్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా ఆధార్ కార్డును దుర్వినియోగం చేసినట్లు సభ్యులు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారని, విచారణ చేసి వాస్తవమని తేలితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

దిగుబడి తగ్గి.. ధర పెరిగి..

నిమ్మకాయల సాగు రైతుల పరిస్థితి ఇదీ

ఈనాడు, అమరావతి

నిమ్మకాయల ధరలు కొన్నాళ్లుగా పెరుగుతున్నాయి. సాధారణంగా ఫిబ్రవరిలో ధరలు తక్కువగా ఉండాలి. ఈ సారి అందుకు భిన్నంగా పరిస్థితి ఉంది. కిలో గరిష్ఠంగా రూ.92 వరకు రైతులకు ధర లభించింది. తెనాలి మార్కెట్‌కు సరకు తగ్గడంతో ధరలు పెరుగుతున్నాయి. మంచి ధరలు లభిస్తున్నా అందిపుచ్చుకుంటున్న రైతులు కొందరే ఉన్నారు. ప్రతికూల వాతావరణం, మొంథా తుపానుతోపాటు జనవరి, ఫిబ్రవరి నెలల్లో అధికంగా మంచు కురవడం వల్ల పూత దశలోనే సమస్య ఏర్పడి దిగుబడులు తగ్గాయి.

తెనాలి మార్కెట్‌కు సాధారణంగా వచ్చే నిమ్మకాయల్లో నాలుగోవంతు మాత్రమే సరకు వస్తోంది. నిరుడు ఇదే సమయంలో ఉన్న ధరలతో పోలిస్తే మూడు రెట్లు పెరగడం గమనార్హం.

ఈ ఏడాది జనవరి నుంచి నిమ్మకాయల ధరలు పుంజుకుంటున్నాయి. కిలో కాయలకు ఫిబ్రవరిలో సగటు ధర సైతం రూ.80కు తగ్గడం లేదు. డిమాండ్‌కు తగినంతగా సరకు లభ్యత లేదని మార్కెటింగ్‌శాఖ అధికారులు చెబుతున్నారు. తెనాలితోపాటు ఏలూరు, గూడూరు నిమ్మ మార్కెట్లలోనూ ఇదే పరిస్థితి కొనసాగుతోంది. నిమ్మకాయలకు అధిక ధరలు పలకడం రైతులను ఊరిస్తోంది. ఈ సమయంలో ఏటా లభించే ధరలు కన్నా మూడు రెట్లు అధికంగా పలకడం వారిని ఆలోచనకు గురిచేస్తోంది. పూత, కాపు కాపాడుకున్న రైతులకు ప్రస్తుత ధరలు లాభాలు తెచ్చిపెడుతున్నాయి. అయితే 90 శాతం మంది రైతుల తోటల్లో పూత రాలిపోయింది. వీరంతా పూతను కాపాడుకునే ప్రయత్నాల్లో ఉన్నారు. నిమ్మ పంటకు కీలకమైన సమయమైన చలికాలం నుంచి ప్రతికూల వాతావరణం ఏర్పడింది. పూత మొదలయ్యే దశలో మొంథా తుపాను ఇబ్బందికరంగా మారింది. ఇటీవల అధికంగా కురుస్తున్న హిమపాతానికి చాలా తోటల్లో పూత రాలిపోయింది.

ఈ అవకాశాన్ని అందిపుచ్చుకునేలా శాస్త్రవేత్తలు సరైన సలహాలు అందించాలని వారు కోరుతున్నారు. నిమ్మకాయలకు ఎక్కువ డిమాండ్ కొనసాగే వేసవి ప్రారంభమవుతుండటంతో రైతులు మరింత జాగ్రత్తగా తోటలను కాపాడుకుంటున్నారు. పూత రాలిపోవడం వల్ల కాయ తగ్గి సరఫరా తగ్గడంతో ధర పెరిగిందని, నాణ్యమైన కాయలు తెచ్చి అవకాశాన్ని రైతులు ఉపయోగించుకోవాలని తెనాలి మార్కెట్‌యార్డు కార్యదర్శి సుబ్బారావు సూచించారు.

తెనాలి మార్కెట్ యార్డులో నిమ్మకాయల ధరలు (రూ.) ఇలా....

కాలం	కనిష్ఠం	గరిష్ఠం	మోడల్ ధరలు
గత జనవరి	2800	3500	3100
ఈ ఏడాది జనవరి	2200	3500	2800
నిరుడు ఫిబ్రవరి	4300	5300	4900
ప్రస్తుత నెలలో..	7200	8800	8000


తెనాలి మార్కెట్‌కు వచ్చిన నిమ్మకాయలు

వెలుగులీనుతూ.. వైభవం చాటుతూ..

తుళ్లూరు, న్యూస్‌టుడే: రాజధాని అమరావతిలోని సీఆర్డీఏ కార్యాలయం విద్యుత్తు వెలుగుల్లో ధగధగలాడుతోంది. ఆటోమేటిక్ ఎల్ఈడీ లైట్లతో రంగులు మారేలా ఏర్పాటు చేసిన ఈ అలంకరణ..రాత్రి వేళ సీడ్ యాక్సెస్ రహదారిపై వెళుతున్న వారికి కనువిందు చేస్తోంది.

25న విభిన్న ప్రతిభావంతులకు ఇంటర్వ్యూలు

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: విభిన్న ప్రతిభావంతులకు మూడు చక్రాల స్కూటర్ల మంజూరుకు ఈ నెల 25న ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకుడు ఎన్.వెంకటరవణప్ప ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో శారీరక విభిన్న ప్రతిభావంతులు మూడు చక్రాల స్కూటర్ల మంజూరుకు గతంలోనే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారన్నారు. వీరికి బృందావన్ గార్డెన్స్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో ఎంపిక కమిటీ ఆధ్వర్యంలో 25న ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి మాత్రమేనని తెలిపారు. అభ్యర్థులు ఒరిజినల్ ధ్రువపత్రాలతో ఇంటర్వ్యూకు హాజరుకావాలని తెలిపారు.

(c) eenadu

'చలో విజయవాడ' జయప్రదం చేయండి

పోస్టర్ ఆవిష్కరిస్తున్న జోసఫ్‌సుధీర్‌బాబు తదితరులు

గుంటూరు విద్య, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లకు ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీల అమలు కోరుతూ ఈనెల 25న నిర్వహించనున్న చలో విజయవాడ కార్యక్రమం జయప్రదం చేయాలని ఏపీ ఎస్‌టీఎఫ్ జాతీయ ఆర్థిక కార్యదర్శి సీహెచ్ జోసఫ్‌సుధీర్‌బాబు పిలుపునిచ్చారు. ఆదివారం రాష్ట్రోపాధ్యాయ సంఘం(ఎస్టీయూ) కార్యాలయంలో చలో విజయవాడ పోస్టర్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా జోసఫ్‌సుధీర్‌బాబు మాట్లాడుతూ 12వ వేతన సంఘాన్ని నియమించాలని, పీఆర్‌సీ నివేదిక వచ్చే వరకు 30 శాతం మధ్యంతర భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీపీఎస్, జీపీఎస్‌లను రద్దు చేసి పాతపెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలు, బకాయిలు విడుదల చేయాలని తదితర డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ బాజీ, వై.శ్యాంబాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు కాజావలి, గురుబ్రహ్మం, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

శనగ పంటపై విల్ట్ ఫంగస్ పంజా

భారీగా పడిపోతున్న దిగుబడి
సాగుదారుల ఆవేదన

కాకుమాను, ప్రత్తిపాడు, న్యూస్‌టుడే

శనగ రైతులకు 'విల్ట్ ఫంగస్' కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. దిగుబడిపై ప్రతికూల ప్రభావం చూపుతోంది. గుంటూరు జిల్లాలో 12,740, పల్నాడు జిల్లాలో 8852, బాపట్ల జిల్లాలో 34,232 హెక్టార్లలో ఈ ఏడాది రైతులు శనగ పైరు సాగు చేశారు. ఈ ఏడాది రబీలో మొక్కజొన్నతో పాటు శనగ పైరును రైతులు సాగు చేశారు.

ఏంటీ ఫంగస్.. విల్ట్ అనేది ఓ ఫంగస్ వ్యాధి. నేల ద్వారా వ్యాపించి మొక్కకు వ్యాపించి పూర్తిగా ఎండిపోయేలా చేస్తుంది. మొక్క కాండం చీల్చి చూస్తే గోధుమ రంగు గీతలు కూడా కనిపిస్తుంటాయి. వేర్లలోకి నీరు చేరకుండా ఈ ఫంగస్ ఆపివేయడంతో ఒక్కసారిగా మొక్క వడలిపోతుంది.

కాకుమాను పరిధిలో ఎండిపోయిన శనగ పైరు

కారణం ఇదీ.. ప్రధానంగా ఒకే పొలంలో మూడేళ్ల కంటే ఎక్కువ సార్లు శనగ పైరు సాగు చేయడం వల్ల ఈ వ్యాధి సోకుతుంది. నీరు నిల్వ ఉండడం, కలుషిత విత్తనం కూడా కారణం కావచ్చు.

10 నుంచి 5 క్వింటాళ్లకు.. సాధారణంగా శనగ సాగు చేసిన రైతులకు 10 నుంచి 12 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. విల్ట్ వ్యాధితో దిగుబడులు 5 క్వింటాళ్లు కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు.

వ్యవసాయాధికారుల సూచనలు..

ఒకే భూమిలో మూడేళ్ల కంటే ఎక్కువగా శనగ సాగు చేయకుండా ప్రత్యామ్నాయంగా వరి, జొన్న, మొక్కజొన్న, ఇతర పంటలు సాగు చేయాలి. ● మే నెలలో భూమిని లోతుగా దున్నితే భూమిలో ఉన్న ఫంగస్ చనిపోయే అవకాశం ఎక్కువగా ఉంది. ● పశువుల ఎరువు ఎకరాకు కనీసం 2 నుంచి 3 టన్నులు వేయాలి. ● యూరియా వాడకం పూర్తిగా తగ్గించాలి. ● విత్తన శుద్ధి, పంట మార్పిడి, నీరు నిల్వలేకుండా చేస్తే 80 శాతం పైగా ఫంగస్ నుంచి పైర్లను కాపాడుకోవచ్చు. ● వ్యాధి సోకిన మొక్కను వెంటనే పీకివేయాలి.

ప్రతి ఇంటిలో జనసేన సభ్యత్వం ఉండాలి

గోడపత్రిక ఆవిష్కరిస్తున్న హరిప్రసాద్ తదితరులు

గుంటూరు నగరం, న్యూస్‌టుడే: ప్రతి జనసైనికుడు, వీరమహిళలు జనసేన సభ్యత్వ నమోదులో కీలకపాత్ర పోషించాలని శాసన మండలి సభ్యుడు పిడుగు హరిప్రసాద్ అన్నారు. సభ్యత్వ నమోదుకు సంబంధించి గుంటూరు పార్లమెంటు సమన్వయకర్తగా నియమితులైన హరిప్రసాద్ ఆదివారం జిల్లా కార్యాలయంలో పార్టీ ముఖ్యులతో ఏర్పాటు చేసిన సమావేశంలో సభ్యత్వ నమోదుకు సంబంధించిన గోడపత్రికను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజం పట్ల గురుతర బాధ్యత, సమాజంలో ఉన్నత గౌరవం సమపాళ్లలో ఉండే జనసేన పార్టీ సభ్యత్వమన్నారు. పవన్‌కల్యాణ్ భావజాలం, ఉన్నత ఆశయాలు, పార్టీ సిద్ధాంతాల స్ఫూర్తితో రికార్డు స్థాయిలో సభ్యత్వం నమోదు చేయించాలన్నారు. ఈనెల 26 నుంచి ప్రారంభమయ్యే సభ్యత్వ నమోదును పండగలా జరపాలని పిలుపునిచ్చారు. ప్రతి ఇంట్లో జనసేన సభ్యత్వం ఉండేలా క్షేత్రస్థాయిలో ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు చిల్లపల్లి శ్రీనివాస్, వడ్రాణం మార్కండేయబాబు, నాయబ్‌కమాల్, చందు సాంబశివరావు, కొర్రపాటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర రాజకీయాల్లో కోడెల స్థానం ప్రత్యేకం

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే: రాష్ట్ర రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేక స్థానం పొందిన వ్యక్తి మాజీ సభాపతి డాక్టర్ కోడెల శివప్రసాదరావు అని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. మండలంలోని పెద్దరెడ్డిపాలెంలో ఆదివారం కోడెల విగ్రహాన్ని నరసరావుపేట ఎమ్మెల్యే అరవిందబాబు, తెదేపా జిల్లా అధ్యక్షుడు జానీసైదా, డాక్టర్ కోడెల శివరాంతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చీఫ్ విప్ మాట్లాడుతూ పల్నాడు ప్రాంత అభివృద్ధికి కోడెల ఎనలేని సేవలందించారన్నారు.

గుండె జబ్బులను సకాలంలో గుర్తిస్తే ప్రాణాలు కాపాడొచ్చు

మాట్లాడుతున్న డాక్టర్ రమేష్

గుంటూరు నగరం, న్యూస్‌టుడే: గుండె జబ్బులను సకాలంలో గుర్తిస్తే విలువైన ప్రాణాలను కాపాడుకోవచ్చు. అమెరికా, యూరప్ వంటి అభివృద్ధి చెందిన దేశాల్లో విజయవంతంగా అమలవుతున్న అత్యాధునిక వైద్య విధానాలను మన దేశంలో అందుబాటులోకి తీసుకురావడంలో ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ చీఫ్ కార్డియాలజిస్ట్ డాక్టర్ పోతినేని రమేష్ అన్నారు. ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ గుంటూరు శాఖ సహకారంతో జింకానా ఆడిటోరియంలో సీఎంఈ కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ రమేష్ మాట్లాడుతూ ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్‌లో ఇప్పటివరకు నిర్వహించిన 30 వేలకు పైగా సీటీ కరోనరీ యాంజియోగ్రామ్ పరీక్షల డేటాను సమగ్రంగా విశ్లేషించగా విలువైన శాస్త్రీయ అవగాహన లభించిందన్నారు. ఆధునిక డేటా అనలిటిక్స్, మెషిన్ లెర్నింగ్ ఆధారిత అల్గారిథమ్‌లు, గణాంక పద్ధతులు ఉపయోగించటం ద్వారా రోగుల్లో గుండె రక్తనాళాల సంకుచిత తీవ్రత, ప్లాక్ లక్షణాలు, భవిష్యత్తు ప్రమాద సూచికలు వంటి అంశాలను మెరుగ్గా అంచనా వేయగలిగామన్నారు. సీటీ గైడెడ్ పీసీఐ విధానంలో మ్యాప్ ముందుగా, ప్రక్రియ తర్వాత అనే సూత్రంతో క్యాథ్‌ల్యాబ్‌లోకి వెళ్లే ముందే పూర్తి చిత్రం ప్రణాళిక సిద్ధం చేసుకోవడం వల్ల సరైన స్టెంట్ ఎంపిక, ప్రక్రియ సమయం తగ్గింపు, రోగులకు దీర్ఘకాలిక ఫలితాలు సాధించడం వీలవుతుందన్నారు. ఈ విధానంతో గుండె రక్తనాళాల చికిత్సలో విప్లవాత్మక మార్పు వచ్చిందన్నారు. తమ హాస్పిటల్ ఆధ్వర్యంలో 100వ సీఎంఈ కార్యక్రమం ఏర్పాటు చేసి అన్ని అంశాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. సీఎంఈలో 800 మంది వైద్యులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు. ఐఎంఏ గుంటూరు శాఖ అధ్యక్ష, కార్యదర్శులు సుబ్బరాయుడు, సాయికృష్ణ, మెడికల్ కౌన్సిల్ సభ్యుడు నందకిషోర్, ప్రముఖ గుండె వైద్య నిపుణులు రాజా రమేష్, అనూప్, రామ్‌మనోహర్, మహేష్, శబరి గిరీష్, స్వరాజ్యం, ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మమత రాయపాటి, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్స్ సుమ, నితిన్ తదితరులు పాల్గొన్నారు.

సంస్థాగతంగా పార్టీ బలోపేతమే లక్ష్యం

మాట్లాడుతున్న భాజపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్

గుంటూరు నగరం, న్యూస్‌టుడే: సంస్థాగతంగా పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలని భాజపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మట్టా ప్రసాద్ అన్నారు. గుంటూరు లాలుపురం రోడ్డులోని భాజపా కార్యాలయంలో పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహా అభియాన్ జిల్లా కార్యశాల ఆదివారం జరిగింది. పార్టీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు అధ్యక్షతన జరిగిన కార్యశాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ భావాలతో భాజపా జిల్లా ప్రశిక్షణ మహా అభియాన్ వర్క్‌షాప్ సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. పర్యావరణ పరిరక్షణ, సామాజిక సమరసత, స్వదేశీ భావజాలం, కుటుంబ ప్రబోధనలు, పౌర విధులు పాటించడం.. ఈ ఐదు సూత్రాలు చాలా ముఖ్యమన్నారు. పర్యావరణ మార్పుల వల్ల ప్రజలకు ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని, ప్రతి ఒక్కరు ఒక మొక్క నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలన్నారు. తల్లిదండ్రులను వృద్ధాశ్రమాలకు పంపకుండా.. వారి సంరక్షణను బాధ్యతగా తీసుకోవాలన్నారు. సమాజంలో హక్కులు కోరుకునే వారు బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించాలన్నారు. సమాజంలో కులమత భేదాల్లేకుండా కలిసిమెలిసి ఉండాలన్నారు. భారత్ పూర్తిగా అభివృద్ధి చెందాలంటే ప్రతి ఒక్కరు స్వదేశీ వస్తువులు వాడాలన్నారు. రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరి జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలు పార్టీ సిద్ధాంతాలు తెలుసుకోవాలన్నారు. మండల ప్రశిక్షణ సమావేశాలు మార్చి 7 నుంచి ఏప్రిల్ 14వ తేదీ వరకు అన్ని మండలాల్లో పూర్తి చేయాలన్నారు. తొలుత భరతమాత, శ్యాంప్రసాద్ ముఖర్జీ, పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా ప్రశిక్షణ కన్వీనర్ భీమినేని చంద్రశేఖర్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రశిక్షణ నిర్వహణ తీరు వివరించారు. పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శివన్నారాయణ, సీనియర్ నాయకులు రంగరాజు, పొగాకు బోర్డు ఛైర్మన్ యశ్వంత్‌కుమార్, అధికార ప్రతినిధి శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

చందూస్ కప్ విజేత విజ్ఞాన్ వర్సిటీ

ట్రోఫీతో విజ్ఞాన్ విశ్వవిద్యాలయం జట్టు

ఎస్వీఎన్‌కాలనీ, న్యూస్‌టుడే: కళాశాల అధ్యాపకుల కోసం జేకేసీ కళాశాల ఆధ్వర్యంలో ఈనెల 18 నుంచి జరుగుతున్న 29వ చందూస్ సిల్వర్ కప్ క్రికెట్ టోర్నమెంట్‌ను విజ్ఞాన్ విశ్వవిద్యాలయం జట్టు సొంతం చేసుకుంది. గుంటూరులోని జేకేసీ కళాశాల మైదానంలో జరిగిన తుది పోరులో ఆర్‌కే ఇంజినీరింగ్ జట్టుపై బ్యాటింగ్, బౌలింగ్‌లో ఆధిపత్యం ప్రదర్శించిన విజ్ఞాన్ క్రీడాకారులు జయకేతనం ఎగురవేశారు. టాస్ గెలిచిన విజ్ఞాన్ జట్టు తొలుత 20 ఓవర్లలో 164 పరుగులు చేసింది. తర్వాత బరిలోకి దిగిన ఆర్‌కే ఇంజినీరింగ్ జట్టు 108 పరుగులకు ఆలౌటైంది. సాయంత్రం జరిగిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ పాల్గొని విజ్ఞాన్, ఆర్‌కే జట్లకు ట్రోఫీలు అందజేశారు. ఉత్తమ బ్యాటర్‌గా శ్రీగిరి(విజ్ఞాన్-138 పరుగులు), ఉత్తమ బౌలర్‌గా మహమ్మద్‌యాసిన్(ఆర్‌కే-13 వికెట్లు), ఉత్తమ ఆల్‌రౌండర్‌గా లోకేశ్ (విజ్ఞాన్ 140 పరుగులు, 13 వికెట్లు) ఎంపికయ్యారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ పి.గోపీచంద్, వైస్ ప్రిన్సిపల్ కె.సాంబశివరావు, పీడీ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

పెళ్లి డ్రామా.. ఒంటరి మహిళలే టార్గెట్

మహిళను మోసం చేసిన కేసులో నిందితుడి అరెస్ట్

వివరాలు వెల్లడిస్తున్న సీఐ సాంబశివరావు. వెనుక ముసుగులో నిందితుడు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: రోల్డ్ గోల్డ్ చైను, బ్రాస్‌లెట్, ఉంగరాలతో టిప్‌టాప్‌గా తయారై మహిళలను కలుస్తాడు. మాయ మాటలతో వారిని మురిపిస్తాడు. అటుపై మోసం చేస్తాడు. ఇటీవల తెనాలికి చెందిన మహిళను పెళ్లి చేసుకుంటానని మోసం చేసి రూ.12.20 లక్షలు తీసుకున్న కేసులో నిందితుడి బాగోతం ఇది. నిందితుడిని అరెస్టు చేసినట్లు త్రీ టౌన్ సీఐ సాంబశివరావు తెలిపారు. ఆదివారం వివరాలు వెల్లడించారు. పట్టణానికి చెందిన మహిళకు గతంలో వివాహం జరిగి.. భర్తతో విభేదాల కారణంగా విడాకులు తీసుకున్నారు. రెండో వివాహం కోసం వివాహ పరిచయ వేదికలో వివరాలు నమోదు చేసుకున్నారు. కొల్లిపర మండలం కొత్తూరు లంకకు చెందిన అరవపల్లి వంశీ ఆ వేదిక ద్వారా ఆమెను పరిచయం చేసుకున్నాడు. భార్యతో విడాకులు తీసుకున్నానని, మిమ్మల్ని వివాహం చేసుకుంటానని ఆమెకు చెప్పాడు. అటుపై వారి ఇంటికి వచ్చి తనకు ఇసుక, మైనింగ్ వ్యాపారాలు, టిప్పర్లు, ట్రాక్టర్లు ఉన్నాయని చెప్పాడు. కొత్తగా టిప్పర్ కొంటున్నానని అందుకు నగదు అవసరం అని మహిళ వద్ద ఉన్న బంగారం బ్యాంకులో తాకట్టు పెట్టించి రూ.12.20 లక్షలు తీసుకున్నాడు. అటుపై మహిళతో శారీరక చనువు పెరిగిన తర్వాత మరింత నగదు డిమాండ్ చేశాడు. తన వద్ద లేవని చెప్పడంతో ఆమెను కొట్టి, విషయం బయటకు చెబితే వ్యక్తిగత జీవితాన్ని బహిర్గతం చేస్తానని బెదిరించాడు. ఈ క్రమంలో సదరు మహిళ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల విచారణలో నిందితుడు రాష్ట్రంలోని మరి కొంత మంది మహిళలను కూడా ఇదే రీతిలో మోసం చేశాడని గుర్తించారు. వారిని సంప్రదిస్తే తాము నష్టపోయిన తీరును తెలిపిన వారు పరువు పోతుందని ఫిర్యాదులు చేయలేదని పోలీసులకు చెప్పారు. నిందితుడిని తెనాలి న్యాయస్థానంలో హాజరుపరచగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించడంతో బాపట్ల జైలుకు తరలించారు. సమగ్ర విచారణ చేయడానికి మరోమారు కస్టడీ కోరనున్నామని, సస్పెక్ట్ షీట్‌ను కూడా తెరుస్తున్నట్లు సీఐ వివరించారు.

కేఎల్‌యూలో ప్రారంభమైన అభ్యాస హ్యాకథాన్

ఏఎన్‌యూ(తాడేపల్లి), న్యూస్‌టుడే: తాడేపల్లి మండలం వడ్డేశ్వరం వద్ద ఉన్న కేఎల్ విశ్వవిద్యాలయంలో శనివారం అర్ధరాత్రి నుంచి అభ్యాస హ్యాకథాన్‌ను డీన్ డాక్టర్ శ్రీనాథ్ ప్రారంభించారు. కేఎల్‌యూలోని స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో స్కిల్ పలావర్ మూడో దశను విజయవంతంగా నిర్వహించామని ఆదివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపారు. బీసీఏ, ఎంసీఏ, ఇంజినీరింగ్ ఆఖరి సంవత్సర విద్యార్థుల కోసం ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. మొదటి దశలో ప్రధానంగా సమస్యలకు పరిష్కారం చూపడం, రెండో దశలో అంతర్గత మూల్యాంకనం, ప్రాథమిక డిజైన్‌లు, మూడో దశలో సమీక్షలు చేశామని డీన్ తెలిపారు. చివరి దశను ఫిబ్రవరి 28న నిర్వహిస్తామన్నారు. మూడో దశలో విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులను, అభివృద్ధి చేసిన నమూనాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఉపకులపతి డాక్టర్ పార్థసారథి వర్మ, ప్రో వైస్ ఛాన్సెలర్ డాక్టర్ వెంకట్రామ్ తదితరులు పాల్గొన్నారు.

EENADU e Classifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి అధిక ధరకు కొనబడును (స్పాట్ క్యాష్). ✆ 87907 41166

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph.81422 92071.

REAL ESTATE

SHOP FOR SALE

GENERAL

నరసరావుపేట అరండల్‌పేటలోని వాజ్‌పేయి రహదారిలో గల 66 గజాల కమర్షియల్ షాపు అమ్మకానికి కలదు. సెల్ 94903 42266, 94949 52020.

JOBS

Wanted B or D Pharmacy candidates to work in a pharmacy, n Guntur city, pci registration mandatory. Call: 6300975241.

Wanted b.com or M.B.A candidates to work as an accountant in medical distribution firm in guntur city. ✆ : 63009 75241.

భారతదేశ అగ్రగామి సంస్థలో పార్ట్/ ఫుల్‌టైం బిజినెస్ పార్టనర్‌గా చేరండి. అధిక కమీషన్ పొందండి. అ:10th, వ:30-65 సం|| ✆ 79892 46788.

TATA AIA లైఫ్‌ఇన్సూరెన్స్ నందు పనిచేయుటకు టీమ్ లీడర్స్, మార్కెటింగ్ మేనేజర్స్, ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్స్ (M/F) రిటైర్డ్‌వారు, గృహిణులు, స్టూడెంట్స్ కావలెను. 9705313661.

మెస్ ఇన్‌చార్జీలు కావలెను. కనీసం మూడు సంవత్సరాలు హోటల్ మరియు కాలేజి మెస్‌లో పనిచేసిన అనుభవం ఉండాలి. వంటకు ఉపయోగించే ఆధునిక పరికరాలు అయిన గ్యాస్‌స్టీమ్, తరిగే పరికరాలు, గ్రైండర్లు, చపాతి తయారీ యంత్రాలు వాడటం తెలిసి ఉండాలి. పనిచేయు ప్రదేశం: గుంటూరు మాస్టర్ మైండ్స్ కాలేజి, జీతం: 25000 వరకు ఇవ్వబడును. సంప్ర|| ఫోన్ నెం: 89784 80435.

ప్రముఖ విద్యా సంస్థకు 1 నుండి 10 తరగతులకు బోధించుటకు టీచర్స్ & మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ✆: 96038 65657/ 658, తెనాలి.

తాడికొండ, అడ్డరోడ్ హోటల్ KK గ్రాండ్ రూమ్స్ & కన్వెన్షన్. కంప్యూటర్ నాలెడ్జి కలిగి హోటల్ నిర్వహణ చేయుటకు సూపర్‌వైజర్ కావలెను. 98492 14413.

శివ కార్తికేయ హోంకేర్‌లో వృద్ధులు, పేషంట్స్, పిల్లలను చూసుకొనుటకు నర్సులు, వర్కర్స్ కావలెను. ఫ్రీ వసతి, భో, జీ. 20K. ✆ 99120 11499, 99120 11899

గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజ్ నందు Senior Civil Engineersగా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతము 50,000/- నుండి 60,000/- వరకు ఇవ్వబడును. విద్యార్హతలు: Civil Engineering. వయస్సు: 30 సంవత్సరములపైన ఉండవలెను. వివరములకు సంప్రదించగలరు. ఫోన్‌నెంబర్: 8978480429.

ప్రముఖ లోన్స్ ఏజెన్సీ నందు లోన్స్ చేయుటకు టెలికాలర్స్ & మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. 97014 79569, 80081 00872.

MARKETING/ SALES

Anand Masale Require Sales & Marketing Manager, Marketing Executives. Contact: 9849655105, 98480 53144 Email: anandmasalaappltd@gmail.com

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

Book your 5 lines Classified Colour Rs.770/-
3Ads Package Rs.1945/-
5 lines Classified B/W Rs.650/-
3Ads Package Rs.1625/-
ప్రకటనపై 5% జి.ఎస్.టి. అదనం

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం..
ఈనాడు లో ప్రకటన ఇవ్వటం
పూర్తి వివరాలకు సంప్రదించండి:
8008510541

గృహ నిర్మాణ రంగంలో కొత్త ప్రాజెక్టుకు శ్రీకారం

బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మాధవి, రామచంద్రరావు దంపతులు

పట్టాభిపురం, న్యూస్‌టుడే: శ్రీభ్రమర రియల్ ఎస్టేట్ సంస్థ రాగ మెలోడి ఆఫ్ లివింగ్ పేరుతో నూతన ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టిందని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి పేర్కొన్నారు. గుంటూరుకు సమీపంలోని నారాకోడూరులో ప్రాజెక్టు బ్రోచర్లను ఆదివారం ఆమె శ్రీభ్రమర గ్రూప్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ గళ్లా రామచంద్రరావు, డైరెక్టర్లతో కలిసి ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ వినూత్న ఆలోచనలతో గృహ నిర్మాణ రంగంలో శ్రీభ్రమర అద్భుతాలు సృష్టిస్తుందన్నారు. సీఆర్‌డీఏ, రెరా ఆమోదం పొంది నారాకోడూరులోని మామిడితోటలో వీకెండ్ హోమ్స్ కాన్సెప్ట్‌తో ఈ ప్రాజెక్టును అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు చెప్పారు. రామచంద్రరావు మాట్లాడుతూ ఈ ప్రాజెక్టులో రిసార్ట్స్, కాటేజీలు, ప్లాట్లు ఉన్నాయన్నారు. మామిడి తోటలో సుందరంగా తీర్చిదిద్దిన ల్యాండ్‌స్కేప్ గ్రీనరీ, థీమ్ పార్కులు, విశాలమైన రహదారులు, పిల్లల పార్కులు, పచ్చదనంతో నిండి ఉంటుందని వివరించారు.

విజయకీలాద్రిపై విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు

పూజలు చేస్తున్న చినజీయర్‌స్వామి

ఏఎన్‌యూ, తాడేపల్లి, న్యూస్‌టుడే: తాడేపల్లిలోని విజయకీలాద్రిపై విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. ఈ నెల 26వరకు ఈ కార్యక్రమాలు కొనసాగుతాయని విజయకీలాద్రి ఆలయ అధికారులు తెలిపారు. ఆదివారం విగ్రహాలకు చినజీయర్ స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అగ్ని ప్రతిష్ఠ, యంత్ర స్థాపన, పంచగవ్య స్నపనం, సామూహిక ఉపనయనాలు, పూర్ణాహుతి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 115, రిటైల్ ధర - 142, చికెన్ విత్‌స్కిన్ - 206, చికెన్ స్కిన్‌లెస్ - 234.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -115 రిటైల్ ధర 142 చికెన్ విత్ స్కిన్ - 206 చికెన్ స్కిన్‌లెస్ - 234.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 128, 137, 148 చికెన్ విత్ స్కిన్ - 240 చికెన్ స్కిన్‌లెస్ - 250.

మానవత్వం చాటిన ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్

క్షతగాత్రుడిని ఆసుపత్రికి పంపిస్తున్న ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే : రోడ్డుప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బాధితుడిని ఆదివారం ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ వెంటనే ఆసుపత్రికి తరలించి మానవత్వం చాటుకున్నారు. నగరంపాలెంలో క్యాటరింగ్ పనులు చేసే శ్రీను ద్విచక్రవాహనంపై జడ్పీ రహదారిలో వెళుతున్న క్రమంలో అటుగా వస్తున్న కారు ఢీకొంది. ఈ ఘటనలో శ్రీను తీవ్ర గాయాలపాలయ్యాడు. అదే సమయంలో కారులో అటుగా వెళుతున్న ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ అక్కడ ఆగి గాయాలతో బాధపడుతున్న శ్రీనును అంబులెన్స్‌లో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు అతనికి చికిత్స అందించడంతో ప్రాణాపాయం తప్పిందని పోలీసులు తెలిపారు. కాలుకు బలమైన గాయమవడంతో చికిత్స అందిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న ట్రాఫిక్ సీఐ సింగయ్య ఘటనాస్థలిని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

91.9FM Vijayawada
ఈ FM 91.9 Mee FM
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
80080 03297

బ్రికెట్ మాన్యుఫ్యాక్చరింగ్ కంపెనీలకు రాయితీలివ్వాలని వినతి

యశ్వంత్ కుమార్

పట్నంబజారు, న్యూస్‌టుడే: ఏపీ బయోమాస్ బ్రికెట్ మాన్యుఫ్యాక్చరింగ్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా బచ్చు యశ్వంత్‌కుమార్ ఎన్నికయ్యారు. నగరంలోని ఒక హోటల్‌లో ఆదివారం జరిగిన సమావేశంలో కార్యవర్గ ఎన్నిక జరిగింది. ప్రధానకార్యదర్శిగా మల్లికార్జునరావు, కోశాధికారిగా చంద్రకాంత్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా యశ్వంత్‌కుమార్ మాట్లాడుతూ కొద్దిరోజుల్లో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి బ్రికెట్ మాన్యుఫ్యాక్చరింగ్ కంపెనీలకు రాయితీలు ఇవ్వాలని వినతిపత్రం అందజేస్తామన్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 80085 10541
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80085 14589

తెనాలి

• తెనాలి • పొన్నూరు

ముగిసిన ఎన్ఎస్ఎస్ శిక్షణ శిబిరం

మాట్లాడుతున్న ఆచార్య దివ్యతేజోమూర్తి

ఏఎన్‌యూ, న్యూస్‌టుడే: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లకు గత వారం రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ శిబిరం ఆదివారంతో ముగిసింది. చివరి రోజు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు సాంస్కృతిక ప్రదర్శనలతో సందడి చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎన్ఎస్ఎస్ విభాగం సమన్వయకర్త ఆచార్య దివ్యతేజోమూర్తి మాట్లాడుతూ.. సమాజాభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. సేవా మనస్తత్వం, నాయకత్వ లక్షణాలు, నైతిక విలువలను అలవర్చుకోవాలని చెప్పారు. శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న వాలంటీర్లకు జ్ఞాపికలు అందజేశారు. ఎన్ఎస్ఎస్ అధికారులు సుధీర్‌కుమార్, సునీత, రాధిక, సుమలత తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు పరీక్షలతో గుండె జబ్బుల నివారణ

డాక్టర్ రామకిశోర్‌ను సత్కరిస్తున్న ప్రతినిధులు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: గుండెపోటు ఆకస్మికంగా సంభవించే అవకాశాలు చాలా అరుదని, ముందస్తు పరీక్షలతో తొలి దశలోనే గుర్తించి సరైన చికిత్స పొందితే నష్టాన్ని నివారించుకోవచ్చని కార్డియాలజిస్ట్ డాక్టర్ రామకిశోర్ తెలిపారు. వయస్సు, శక్తికి మించిన శ్రమ, వ్యాయామాలు చేయరాదని, ఆహారపరంగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వివరించారు. తెనాలి సీనియర్ సిటిజెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సంఘ భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన గుండె జబ్బులు, నివారణపై మాట్లాడారు. సందేహాలకు సమాధానాలు ఇచ్చారు. అధ్యక్ష, కార్యదర్శులు మొవ్వా సత్యనారాయణ, ప్రసాదం పూర్ణచంద్రరావు పర్యవేక్షించారు. అనంతరం డాక్టర్ రామకిశోర్‌ను ఘనంగా సత్కరించారు.

'ప్రతి ఆదివారం తెలుగు వారాన్ని ప్రోత్సహించాలి'

రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ పూర్ణచంద్‌తో విద్యార్థులు

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే: తెలుగు భాషకు ప్రాచుర్యం కల్పించేందుకు విశ్రాంత ఉపాధ్యాయుడు అవధాని ప్రారంభించిన ప్రతి ఆదివారం తెలుగు వారం కార్యక్రమాన్ని అందరూ ప్రోత్సహించాలని రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ ఈదర పూర్ణచంద్ పేర్కొన్నారు. ఆదివారం నందులపేటలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా 1 నుంచి 7 తరగతుల ఆంగ్ల మాధ్యమం చదువుతున్న విద్యార్థులకు వేమన శతక పుస్తకాలు అందజేశారు

జీవితంలో స్నేహితులు ఎంతో ముఖ్యం

విద్యార్థినికి బహుమతి అందిస్తున్న న్యాయమూర్తి పవన్‌కుమార్

భవానీపురం, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరి జీవితంలో స్నేహితులు ఎంతో ముఖ్యమని తెనాలి కోర్టు న్యాయమూర్తి పవన్‌కుమార్ పేర్కొన్నారు. పింగళి వెంకయ్య మునిమనుమడు మనిపల్లి వెంకటేశ్వరరావు జ్ఞాపకార్థం ఆయన స్నేహితులు రామరాజ్యనగర్‌లోని జీఎన్ఆర్ నగరపాలక సంస్థ పాఠశాలలో ఆదివారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. న్యాయమూర్తి పవన్‌కుమార్ మాట్లాడుతూ మిత్రుడు మునిపల్లి వెంకటేశ్వరరావు కొవిడ్ సమయంలో చనిపోయారని, ఆయన్ని దక్కించుకునేందుకు స్నేహితులమంతా ఎంతో ప్రయత్నించినట్లు తెలిపారు. స్నేహితుని జ్ఞాపకార్థం విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలను నిర్వహించి బహుమతులను అందిస్తున్నట్లు వెల్లడించారు. విజేతలకు బహుమతులను అందజేశారు. తెలుగు ఉపాధ్యాయుడు ఆర్.బి. ఉదయ్‌కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

కన్నెగంటి హనుమంతు సేవలు చిరస్మరణీయం

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: స్వాతంత్ర్య సమరయోధుడు కన్నెగంటి హనుమంతు సేవలు చిరస్మరణీయమని వక్తలు కొనియాడారు. ఆయన వర్ధంతి సందర్భంగా పట్టణంలో ఆదివారం తన్నీరు శివశంకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పొన్నం విజయ్‌కుమార్, చందు జనార్దన్, రజనీ, ఏడుకొండలు, సురేష్‌గోపి, కోటేశ్వరరావు, తదితరులు మాట్లాడారు. డీఎస్పీగా ఎంపికైన వెంకటనాగేశ్వరరావు, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ పసుపులేటి మురళీకృష్ణ, ఏపీ ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ బోర్డు డైరెక్టర్ దివ్వెల మధుబాబు, తెదేపా జిల్లా ఉపాధ్యక్షుడు చందు సుబ్బారావు, తెనాలి మండల ఉపాధ్యక్షుడు వెంకట్, పట్టణ ఉపాధ్యక్షుడు దంతాల ప్రేమ్‌కుమార్ తదితరులను ఘనంగా సత్కరించారు.

కులం పేరుతో తిట్టారని ఫిర్యాదు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: ఆస్తి వివాద కేసు విషయంగా తమకు సరైన సమాచారం ఇవ్వకుండా, కేసు ఓడిపోవడానికి కారణమైన న్యాయవాది ఇంటికి వెళ్లి ఆ విషయంపై ప్రశ్నిస్తే కులం పేరుతో దుర్భాషలాడారని పట్టణానికి చెందిన ఓ మహిళ ఫిర్యాదు చేసినట్లు రెండో పట్టణ పోలీసులు ఆదివారం తెలిపారు. దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

పుష్కరకాలంగా కన్నీళ్లు.. ఎప్పటికొచ్చేనో తాగునీరు..!

పలు వార్డుల్లో నీరందక ప్రజల ఇక్కట్లు

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే

మూడు దశాబ్దాలకు సరిపోయే 30.50 ఎంఎల్‌డీ సామర్థ్యం కలిగిన కృష్ణా నదీజలాల శుద్ధి ప్లాంటు తెనాలిలో నిర్మించి పుష్కర కాలం గడిచింది. అప్పటి నుంచి 17 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం కలిగిన పట్టణంలోని 40 వార్డులకు గాను 17, 18, 33, 34 వార్డుల్లోని సుమారు 600 కుళాయిలకు, 14, 16, 17 వార్డుల్లోని సుమారు 400 కుళాయిలకు తాగు నీరు అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. శుద్ధజలం సరఫరా పైపులు ఇళ్ల ముంగిట ఉండీ ఉపయోగం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మాదీ ఇదే పరిస్థితి అని 1, 2, 15, 16, 36, 37, 38 వార్డుల్లోని సుమారు మరో వెయ్యి కుళాయిదారులు వాపోతున్నారు.

ట్యాంకర్లతో అందిస్తూ..

పులె కాలనీ వాసుల కోసం భూగర్భంలో వేసిన తాగునీటి పైపుల ద్వారా సరఫరా కావట్లేదని ట్యాంకర్లతో నీరు అందిస్తున్నారు. అమృత్ పథకం 1.0లో 162 కి.మీ తాగునీటి పైపులైన్ల పరిధిలోని ఇంటింటికీ కుళాయిలు ఇచ్చేందుకు మంజూరైన రూ.7 కోట్లు ప్రణాళికాబద్ధంగా ఖర్చు చేయకపోవడమే ఈ తాగునీటి వెతలకు కారణమని విమర్శలు విన్పిస్తున్నాయి.

2014లో ప్రారంభం...

అప్పటి ఉపసభాపతి నాదెండ్ల మనోహర్ 2010లో పట్టణంలో కృష్ణాజలాల శుద్ధిప్లాంటుకు భూమి పూజ చేశారు. పనులు దక్కించుకున్న గుత్తేదారు 33 కి.మీ. భూగర్భంలో పైపులైన్లు వేశారు. 12.50 లక్షల లీటర్ల శుద్ధి చేసిన నీటిని కుళాయిలకు ఇచ్చేందుకు ఏడు రిజర్వాయర్లు నిర్మించారు. నాదెండ్ల మనోహర్ 2014లో ప్రారంభించి పట్టణ వాసులకు అంకితం చేశారు. తరువాత ఇంటింటికి కుళాయిల పనులు దక్కించుకున్న గుత్తేదారు 11

పట్టణంలోని కృష్ణానదీ జలాల శుద్ధి ప్లాంటు..

వేలు పైన ఇచ్చి మమ అనిపించారు. తాగునీరు వస్తున్న కుళాయిల బిల్లులు మాత్రమే అధికారులు చేయాలి. కానీ వారు రాని వాటికీ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. విచారణ చేపడితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని పలువురు విశ్రాంత ఇంజినీర్లు, మేధావులు పేర్కొంటున్నారు.

నూతన రిజర్వాయర్ పూర్తయితే..

దీనిపై మున్సిపల్ అధికారులను సంప్రదించగా పట్టణానికి 300 కి.లీ. సామర్థ్యం కలిగిన రూ.2.25 కోట్ల విలువగల రిజర్వాయర్ మంజూరైనట్లు తెలిపారు. ఇది పూర్తయితే తాగునీరు రాని కుళాయిలకు సమృద్ధిగా నీరు వస్తుందని తెలిపారు.

వైభవంగా మహాసుదర్శన హోమం

పంచామృతాభిషేకాలు అందుకుంటున్న కల్యాణ వేంకటేశ్వరస్వామి

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: విఖనస శ్రీనివాస ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం బాలాజీరావుపేట నారాయణ అష్టాక్షరి దివ్యక్షేత్రం నిర్మించనున్న స్థలంలో చేపట్టిన మహాసుదర్శన హోమం వైభవంగా కొనసాగింది. అర్చకులు కల్యాణ వెంకటేశ్వరస్వామికి విశేష పూజలు, పంచామృత అభిషేకాలు చేశారు. అలాగే ఇంటర్మీడియట్ పరీక్షల సందర్భంగా హయగ్రీవ స్వామికి విశేష పూజలు నిర్వహించి.. విద్యార్థులకు ఉచితంగా పెన్నులు అందజేశారు. ట్రస్టు నిర్వాహకులు ఆర్.వి.కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిబద్ధతకు నిదర్శనం మార్గదర్శి

తెనాలిలో నూతన ప్రాంగణంలోకి కార్యాలయం మార్పు

ప్రారంభోత్సవ వేడుకలో కొత్త సుబ్రహ్మణ్యం, ఉప్పలపాటి రామకృష్ణప్రసాద్, సిబ్బంది

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: నిబద్ధతకు నిదర్శనం మార్గదర్శి అని, దశాబ్దాలుగా ఆ సంస్థతో తమ అనుబంధం కొనసాగుతుందని తెనాలి కుమార్ పంప్స్ అధినేత కొత్త సుబ్రహ్మణ్యం, విజయవాడ ఎస్‌వీఈ కన్సల్టెంట్స్ అధినేత ఉప్పలపాటి రామకృష్ణప్రసాద్ పేర్కొన్నారు. తెనాలి రైల్వేస్టేషన్ రోడ్డులో ఉన్న మార్గదర్శి చిట్ ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్ శాఖ కార్యాలయాన్ని అదే రోడ్డులోని నూతన భవంతిలోకి మార్చిన సందర్భంగా ఆదివారం నిర్వహించిన ప్రారంభోత్సవ వేడుకలో వారు ముఖ్య అతిథులుగా హాజరై రిబ్బన్ కత్తిరించారు. ఎండీ శైలజా కిరణ్ నేతృత్వంలో.. నాలుగు రాష్ట్రాల్లో 129 శాఖలతో 2.25 లక్షల చందాదారులతో ఏడాదికి రూ.15 వేల కోట్ల టర్నోవర్ దిశగా సాగుతున్న మార్గదర్శి సంస్థ, చందాదారులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తుందని వైస్ ప్రెసిడెంట్ లేళ్ల శ్రీనివాసరావు, జనరల్ మేనేజర్ కొసరాజు రవీంద్రనాథ్ వివరించారు. తెనాలిలో 30 సంవత్సరాలుగా ప్రజాదరణ పొందుతున్న శాఖ రూ.80 కోట్ల టర్నోవర్‌తో ఉందని, రూ.100 కోట్ల లక్ష్యంతో సాగుతున్నామని, రూ.2 లక్షలతో మొదలు రూ.కోటి వరకు చిట్లు అందుబాటులో ఉన్నాయని తెనాలి శాఖ మేనేజర్ తిరువీధుల శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ మేనేజర్లు కరణం నాగేశ్వరరావు, సోంపల్లి వెంకటేష్, కల్లూరి శ్రీనివాసరావు, ఆర్‌బీజీ తిలక్, న్యాయ సలహాదారు బీఎమ్ఎస్ దుర్గాప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ

తల్లిని కోల్పోయిన చిన్నారులకు సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర

పొన్నూరు, న్యూస్‌టుడే: అనారోగ్య కారణాలతో చికిత్స చేయించుకున్న పలువురికి ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ఆదివారం చింతలపూడిలోని ఆయన స్వగృహంలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ చేశారు. పొన్నూరు పట్టణ, మండల పరిధిలోని 25 మందికి రూ.13,15,872 విలువైన చెక్కులను అందించారు.

ఎక్స్‌గ్రేషియా అందజేత

పట్టణంలోని 4వ వార్డుకు చెందిన షేక్ వలి అనారోగ్యం తోనూ, చింతలపూడి గ్రామానికి చెందిన కర్రి దాసు అనే వ్యక్తి గతంలోనే భార్య పిల్లల్ని వదిలి వెళ్లిపోయాడు. తల్లి నాగలక్ష్మి కూలి పనులు చేసుకుని ఇద్దరు చిన్నారులను చదివిస్తుంది. ఈ క్రమంలో ఇటీవల పిల్లలకు భోజనం తీసుకుని పొన్నూరు వైపు వస్తుండగా ద్విచక్రవాహనం పైనుంచి జారిపడి చికిత్స పొందుతూ మృతి చెందారు. అనాథలుగా మిగిలిన చిన్నారులైన పల్లవి, మోహన్ కృష్ణలకు ఎక్స్‌గ్రేషియా కింద రూ.1.5 లక్షల చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. స్థానిక తెదేపా నాయకులు పాల్గొన్నారు.

ప్రపంచ స్కౌట్స్ ఆవిర్భావ దినోత్సవం

రాబర్ట్ బాడెన్ పావెల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న స్కౌట్లు

చేబ్రోలు, న్యూస్‌టుడే: మండలంలోని నారాకోడూరు పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం ప్రపంచ స్కౌట్స్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్కౌట్స్ వ్యవస్థాపకుడు రాబర్ట్ బాడెన్ పావెల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్కౌట్, గైడ్స్ జిల్లా కార్యదర్శి ఏడు కొండలు మాట్లాడుతూ.. స్కౌట్ ఉద్యమం, ఆవిర్భావం, దాని ఆవశ్యకత గురించి విద్యార్థులకు వివరించారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

కొల్లిపర, న్యూస్‌టుడే: శ్రీదేవి భూదేవి సమేత జనార్ధనస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు కొల్లిపరలో సోమవారం ప్రారంభం కానున్నట్లు ఆలయ అర్చకులు పరాశరం జగన్నాథాచారి తెలిపారు. మార్చి 1వ వరకు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. స్వామి వారి కల్యాణ మహోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఉత్సవ ఏర్పాట్లను ఆలయ ఈవో శ్రీనివాసరెడ్డి పర్యవేక్షించనున్నట్లు తెలిపారు.

వీనులవిందుగా సంగీత విభావరి

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే: అమర గాయకులు ఘంటసాల వెంకటేశ్వరరావు ఆలపించిన ఆణిముత్యాల్లాంటి పాటలను గాయనీగాయకులు జి.హరికృష్ణ, మల్లిక, డాక్టర్ ప్రభాకరరావు, డాక్టర్ ప్రసాదరావు మధురంగా ఆలపించారు. డాక్టర్ కె.పురుషోత్తమరావు తన వ్యాఖ్యానం ద్వారా ఆ పాటల కోసం ఘంటసాల చేసిన విశేష కృషిని చాలా చక్కగా వివరించారు. శ్రీవేంకటేశ్వర వైద్య కళాశాల పూర్వ విద్యార్థులు పురుషోత్తమరావు బృందం ఆధ్వర్యంలో అమర గాయకుల వర్ధంతి సందర్భంగా ఆదివారం తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో నిర్వహించిన 'మన ఘంటసాల' సంగీత విభావరి కార్యక్రమం వీనులవిందుగా సాగింది.

గంగానమ్మతల్లికి ప్రత్యేక పూజలు

పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్, మురళీకృష్ణ, రజక సంఘం సభ్యులు

తక్కెళ్లపాడు(పెదకాకాని), న్యూస్‌టుడే: తక్కెళ్లపాడులో ఆదివారం నిర్వహించిన గంగానమ్మతల్లి 10వ వార్షికోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలు అందరూ సంతోషంగా ఉండాలని కోరుకున్నట్లు ఆయన తెలిపారు. ఆలయ నిర్వాహకులు వేల సంఖ్యలో వచ్చిన భక్తులకు అన్నదానం చేశారు. అనంతరం పొంగళ్లు నిర్వహించే భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. తెదేపా మండల అధ్యక్షుడు వలివేటి మురళీకృష్ణ, గ్రామ రంజక సంఘం నాయకులు, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

చేబ్రోలు, న్యూస్‌టుడే: మండలంలోని మంచాలలో ఉన్న ఢిల్లీ పోలేరమ్మ తల్లిని ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక కూటమి నాయకులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం

ఆలయ ఛైర్మన్ పూర్ణచంద్రరావు, ఈవో లీలాకుమార్‌కు నగదు అందజేస్తున్న భాస్కరరావు కుటుంబం

పెదకాకాని, న్యూస్‌టుడే: పెదకాకాని మల్లేశ్వరస్వామి దేవస్థానంలోని నిత్యాన్నదాన పథకానికి ఆదివారం విజయవాడ మధురానగర్‌కు చెందిన బలగా భాస్కరరావు రూ.50 వేల నగదును ఆలయ ఛైర్మన్ కోసూరి పూర్ణచంద్రరావు, ఈవో గోగినేని లీలాకుమార్‌కు అందజేశారు. స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం దాతలను సత్కరించి ప్రసాదం ఇచ్చారు. ఆలయ అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని వారు తెలిపారు

ఆదర్శ మహిళ కస్తూర్బా గాంధీ

ప్రపంచ ఆదర్శ మహిళ కస్తూర్బా గాంధీ అని, మహాత్మా గాంధీ సత్య అహింస దీక్షలను ఆచరణలో పెట్టిన ధీశాలి అని.. శ్రీమహాత్మా గాంధీ సేవా శాంతి ఆశ్రమ వ్యవస్థాపకులు వజ్రాల రామలింగాచారి పేర్కొన్నారు. ఆమె 82వ ఆరాధన మహోత్సవం సందర్భంగా ఆదివారం ఆశ్రమంలోని కస్తూర్బా గాంధీ, మహాత్మా గాంధీజీ విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. **- న్యూస్‌టుడే, తెనాలి టౌన్**

రెండు లారీలు ఢీ.. ఒకరి మృతి

సింగరాయకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రకాశం జిల్లా సింగరాయకొండ పరిధిలో 16వ నంబరు జాతీయ రహదారిపై శనివారం అర్ధరాత్రి రెండు లారీలు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతిచెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. స్థానిక కందుకూరు రోడ్డు ఫైవంతెన వద్ద ఒంగోలు వైపు వెళుతున్న కంటైనర్ లారీని.. నెల్లూరు వైపు నుంచి పుచ్చకాయల లోడుతో వేగంగా వస్తున్న మినీ లారీ అదుపు తప్పి వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మినీలారీ చోదకుడు ఇగ్గోలు వెంకటసుబ్బారావు(35)కు తీవ్ర రక్తగాయాలై సంఘటనా స్థలంలోనే మృతిచెందాడు. అతనిది గుంటూరు జిల్లా నందివెలుగుగా గుర్తించారు. లారీ ముందు భాగం నుజ్జునుజ్జు కాగా.. పుచ్చకాయలు రహదారిపై చెల్లాచెదురుగా పడిపోయాయి. సమాచారం అందుకున్న హైవే పోలీసులు.. ఆయా వాహనాలను తొలగించి రాకపోకలకు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకున్నారు. వెంకట సుబ్బారావు మృతదేహాన్ని ఒంగోలు రిమ్స్‌కు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేంద్ర తెలిపారు.

'చలో విజయవాడ' జయప్రదానికి పిలుపు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 25న చేపట్టనున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎస్‌టీయూ ఏపీ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు ఆదివారం తెనాలి కార్యాలయంలో ప్రచార గోడప్రతులను ఆవిష్కరించారు.

పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

చేబ్రోలు, న్యూస్‌టుడే: చేబ్రోలులోని సూర్యదేవర నరసయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం నుంచి జరిగే ఇంటర్ పరీక్షలకు 177 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు పరీక్షల ప్రత్యేక అధికారి లక్ష్మణరావు తెలిపారు. విద్యార్థులు పరీక్షలు రాసేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

ఉచిత వైద్య శిబిరం

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: శారద సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో తెనాలి బుర్రిపాలెం రోడ్డులో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మధుమేహం, రక్త పోటు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి నెల రోజులకు సరిపడా మందులు అందించారు. డాక్టర్ శిరీష, సిబ్బంది వైద్య సేవలు అందించారు.



(c) eenadu

మంగళగిరి

• మంగళగిరి • తాడికొండ • ప్రత్తిపాడు



కూటమి శ్రేణుల ఉత్సాహం

గుంటూరు రూరల్, ప్రత్తిపాడు: గ్రామీణ డాక్ సేవక్ సమ్మేళనంలో పాల్గొనేందుకు గుంటూరు విచ్చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర మంత్రులకు ప్రత్తిపాడు ఎమ్మెల్యే రామాంజనేయులు, తెదేపా నేతలు, కూటమి నాయకులు ఆదివారం ఘన స్వాగతం పలికారు. నగరంలోని పార్టీ కార్యాలయం నుంచి ప్రదర్శనగా కాజా టోల్ ప్లాజా వద్దకు వెళ్లి గజమాలతో మంత్రులను సత్కరించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

మంగళగిరి: 80085 73111 ప్రత్తిపాడు: 99596 89564 తాడికొండ: 97053 99233

? నవులూరు టిడ్కో గృహాల వద్ద మురుగు కాలువలు పూడి పోయాయి. దుర్వాసన, దోమలతో నిత్యం నరకం చూస్తున్నాం. ఇదే పరిస్థితి కొనసాగితే రోగాల పాలవుతాం. -స్థానికులు

✔ ఆ ప్రాంతంలో మురుగును తొలగించి.. దోమల నివారణ మందు, బ్లీచింగ్ పిచికారీ చేయిస్తాం. పారిశుద్ధ్య పనులు చేపడతాం. -ఇంచు, శానిటేషన్ అధికారి

24న ఆలయ వార్షికోత్సవం

దుగ్గిరాల: స్థానిక రైలుపేటలోని శ్రీకల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయ తృతీయ వార్షికోత్సవాలు ఈ నెల 24వ తేదీ నుంచి 28 వరకు జరుగుతాయని నిర్వాహక కమిటీ తెలిపింది. 24న గోపూజ, విష్వక్సేన ఆరాధన, 27న కల్యాణం 28న అన్నప్రసాద వితరణ ఉంటుందని తెలిపారు.

నీటి నమూనాల సేకరణ

దుగ్గిరాల, న్యూస్‌టుడే: దుగ్గిరాల పరిధిలో తాగునీటి కలుషితంపై 22న 'జలమా...గరళమా' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, పంచాయతీ సిబ్బంది స్పందించారు. ఆదివారం గ్రామంలో పర్యటించి నీటి నమూనాలను సేకరించారు. పరీక్షకు పంపుతామని చెప్పారు.

ఇంటర్ పరీక్షలకు అంతా సిద్ధం

పెదనందిపాడు, మేడికొండూరు, న్యూస్‌టుడే: పెదనందిపాడు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయినట్లు ప్రిన్సిపల్ వీరాంజనేయులు తెలిపారు. కేంద్రం ప్రాంతంలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని తహసీల్దార్ హేనాప్రియ తెలిపారు. మేడికొండూరు మండలం సిరిపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేశారు.

దరఖాస్తు చేసుకున్నారా..!

దుగ్గిరాల, న్యూస్‌టుడే: అన్ ఎయిడెడ్, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 25 శాతం కోటా కింద ఒకటో తరగతిలో ఉచిత ప్రవేశం కోసం దరఖాస్తులు తీసుకుంటున్నట్లు ఎంఈవో-2 టీవీ కృష్ణారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అనాథలు, హెచ్‌ఐవీ బాధితులు, వికలాంగ ప్రతిభావంతులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన పిల్లలు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. మార్చి నెల 10వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. సచివాలయం లేదా మండల విద్యాశాఖ కార్యాలయం, మీ సేవా కేంద్రాల్లో సంప్రదించాలన్నారు.

ఫిరంగిపురం, న్యూస్‌టుడే: మండలంలోని అన్ని గ్రామాల్లో అర్హత కలిగిన వారు కొత్తగా దివ్యాంగ, వితంతు, వృద్ధాప్య, ఒంటరి మహిళ తదితర కేటగిరీల్లో అర్హులైన లబ్ధిదారుల నుంచి పింఛన్ల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎంపీడీవో పి.శివ సుబ్రహ్మణ్యం శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన వారు సంబంధిత సచివాలయాల్లో వెల్ఫేర్, ఎడ్యుకేషన్ సహాయకులను సంప్రదించవచ్చన్నారు.

నీరు పుష్కలం.. అందిన ప్రతిఫలం

పట్టించుకోని గత వైకాపా ప్రభుత్వం..

పెదవడ్లపూడి ఎత్తిపోతలతో తీరిన రైతుల ఇక్కట్లు ✤ మంత్రి లోకేశ్ చొరవ

కొండూరు వద్ద పంట కాల్వలో నీరు

దుగ్గిరాల, న్యూస్‌టుడే: దశాబ్దాల సమస్యకు పరిష్కారం లభించింది. మంత్రి లోకేశ్ చొరవతో రెండెకరాలు కాదు ఏకంగా 27 వేల ఎకరాల ఆయకట్టుకు ఇప్పుడు సాగునీరు అందుతోంది. ఒకప్పుడు పెదవడ్లపూడి ఉన్నత వాహిని కింద చేలు సాగు చేయడమంటే గాలిలో దీపం పెట్టడమే. కృష్ణా పశ్చిమ డెల్టా ప్రధాన కాల్వ నుంచి పెదవడ్లపూడి వద్ద ఈ హైలెవల్ ఛానల్ ఏర్పడింది. దీని ద్వారా మంగళగిరి, దుగ్గిరాల, తెనాలి గ్రామీణ, చేబ్రోలు, పెదకాకాని, గుంటూరు గ్రామీణ మండలాల్లో 27,000 ఎకరాలు సాగవుతున్నాయి. కృష్ణా పశ్చిమ డెల్టా ప్రధాన కాల్వకు 5000 క్యూసెక్కుల నీరు వచ్చి మిగతా అన్ని కాల్వలు బంద్ చేస్తే కానీ నీటిమట్టం పెరిగి ఈ హైలెవల్ ఛానల్‌కు నీటి సరఫరా జరిగేది కాదు. అలా చేస్తే పశ్చిమ డెల్టాలోని మిగిలిన 5 లక్షలకు పైగా ఎకరాల రైతులు ఇబ్బంది పడతారు. ఒక విడత ఖరీఫ్‌కే సాగు నీరు అందించడం కష్టంగా ఉండేది. ఇక రబీ నీరు ఇవ్వనట్టే. ఈ నేపథ్యంలో మొదటి పంటకే నీరు అందక అన్నదాతలు పలుసార్లు రోడ్డు ఎక్కారు. పంటకు నీరు అందక రెండేళ్లు పూర్తిగా కోట్ల రూపాయలు నష్టపోయారు.

పెదవడ్లపూడి ఉన్నత వాహినిపై గతంలో తెలుగుదేశం ప్రభుత్వ అధికారంలో ఉన్నప్పుడు రూ.15 కోట్లతో ఎత్తిపోతల ప్రతిపాదన చేశారు. రూ.14 కోట్లు వరకూ ఖర్చు పెట్టి పనులు జరిగాక ఎన్నికలు వచ్చాయి. వైకాపా అధికారంలోకి రావడంతో ఎత్తిపోతల పనుల్ని పూర్తిగా ఆపేశారు. దీంతో రైతుల కష్టాలు తీరలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మంత్రి లోకేశ్ దీన్ని ప్రధాన సమస్యగా తీసుకుని రూ. కోటికి పైగా నిధులు విడుదల చేయించారు. ఫలితంగా ప్రాజెక్టు పూర్తయింది. ఇప్పుడు రైతుల కళ్లలో ఆనందం కన్పిస్తోంది.

ఎంతో ఆనందంగా ఉంది..

'పదెకరాల వ్యవసాయం చేస్తున్నా. ఏటా ఖరీఫ్‌లోనే సాగునీటికి ఇబ్బందులు తప్పేవి కావు. ఇప్పుడు రబీలోనూ కాలువల్లో నీరు కనిపిస్తోంది. నాకు 32 ఎకరాలు ఉంది. ఖరీఫ్‌లో చేలకు నీరు రావడం ఎంతో ఆనందంగా ఉంది. ఇప్పుడు రబీలో కూడా నీరు కన్పిస్తోంది. ఇలా చూస్తామని ఎప్పుడూ అనుకోలేదు' అని కొండూరుకు చెందిన రైతులు కొరిటాల వెంకట శివరావు కృష్ణ ప్రసాద్, దానబోయిన వేణుగోపాలకృష్ణలు చెబుతున్నారు.

మువ్వల సవ్వడి.. విజయాల సందడి

మంగళగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: మంగళగిరి పట్టణానికి చెందిన యువతులు కూచిపూడి నృత్యంలో రాణిస్తూ ప్రతిభ చాటుతున్నారు. అద్భుత ప్రదర్శనలిస్తూ అవార్డులు సైతం అందుకుంటున్నారు.

అంతర్జాతీయ గుర్తింపే లక్ష్యం..

మంగళగిరి పట్టణానికి చెందిన సెయింట్ ఫ్రాన్సిస్ పాఠశాలలో మునగాల నేయ అక్షిత 9వ తరగతి చదువుతోంది. కొన్నేళ్లుగా కూచిపూడి నృత్యంలో సాధన చేస్తోంది. 2023లో జాతీయ స్థాయిలో పోటీల్లో మొదటి స్థానం సాధించి, 'నాట్య మయూరి' అవార్డు అందుకుంది. 2025లో ఏలూరు వేదికగా జరిగిన అఖిలాంధ్ర నృత్య భారతి నేషనల్ లెవల్ పోటీల్లో తొలిస్థానంలో నిలిచింది. 'బాల రత్న' అవార్డు గెలుచుకుంది. అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకోవడమే లక్ష్యమని ఆమె చెబుతోంది.

పతకాల పంట..

పట్టణానికి చెందిన విప్పడవు శ్రీరామలీల విజయవాడ మేరిస్ స్టెల్లా కాలేజీలో బీఏ రెండో ఏడాది చదువుతున్నారు. కూచిపూడి నాట్యంలో రాణిస్తూ పలు బహుమతులు, అవార్డులు అందుకున్నారు. 2025లో విట్ ఏపీ యూనివర్సిటీ నిర్వహించిన రాష్ట్ర స్థాయి, కృష్ణా యూనివర్సిటీ, ఎన్‌సీసీ జోనల్ స్థాయి పోటీల్లో మొదటి స్థానం సాధించారు. 2023లో ఇస్కాన్ సౌత్ జోన్ నృత్య పోటీల్లో మొదటి స్థానం సాధించారు. రాష్ట్రస్థాయిలో 'నర్తన జ్యోతి' అవార్డు అందుకున్నారు.

మౌలానా జీవితం స్ఫూర్తిదాయకం

మంగళగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: మంగళగిరి తెదేపా కార్యాలయం ఎన్‌టీఆర్ భవన్‌లో మౌలానా అబుల్ కలాం ఆజాద్ వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ మహమ్మద్ ఇబ్రహీం మాట్లాడుతూ.. దేశానికి తొలి విద్యా శాఖ మంత్రిగా ఆజాద్ ఎన్నో గొప్ప కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారన్నారు. తెదేపా మంగళగిరి పట్టణ అధ్యక్షుడు పడవల మహేష్, పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, సుభాని, గోవాడ దుర్గారావు, నజీర్, ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.

దుగ్గిరాల, న్యూస్‌టుడే: దేశం తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలు మరువలేనివని, ఆయన జీవితం స్ఫూర్తిదాయకమని వైకాపా మైనార్టీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని అన్నారు. ఆదివారం మౌలానా వర్ధంతి కార్యక్రమాన్ని స్థానిక ముర్తుజా నగర్ జెండా చెట్టు వద్ద నిర్వహించారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

మంగళగిరిలో నివాళులర్పిస్తున్న తెదేపా నాయకులు

ఉత్సాహంగా 'హ్యాపీ సండే'

మంగళగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: మంగళగిరిలోని వీజేఐఎం అండ్ ఏబీటీఆర్ కళాశాలలో ఆదివారం మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో 'హ్యాపీ సండే' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం వ్యాయామాలు, యోగా క్రీడా పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి.. విజేతలకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా నగరపాలక కమిషనర్ అలీంబాషా మాట్లాడుతూ.. ప్రజల్లో ఆరోగ్యం, సామాజిక చైతన్యం, క్రీడా స్ఫూర్తిని పెంపొందించడమే ఈ కార్యక్రమం ముఖ్యఉద్దేశమన్నారు. కళాశాల సూపరింటెండెంట్ యశోదరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న కమిషనర్ అలీంబాషా

ప్రభుత్వ స్థలం కనిపిస్తే పాగానే!

మంగళగిరి పరిధిలో ఆక్రమణల జోరు

మంగళగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: మంగళగిరి పరిధిలో ప్రభుత్వ స్థలం కనిపిస్తే పాగా వేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారు కొంత మంది ఆక్రమార్కులు. రాజధాని ప్రాంతం కావడంతో భూముల ధరలు కూడా ఆ స్థాయిలో పెరిగాయి. దీంతో అక్రమార్కుల కన్నుపడుతోంది. మంగళగిరి పట్టణం రత్నాలచెరువు ప్రాంతంలో సర్వే నంబరు 194లోని చెరువు భూమి కబ్జా కోరల్లో చిక్కుకుంది. దీని సెంటును విజిబిలిటీ అమరావతిలో క్రయవిక్రయాలు నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల ఈ ప్రాంతంలో కట్టిన అక్రమ నిర్మాణాన్ని నగరపాలక అధికారులు కూల్చివేశారు. రాజకీయ ముసుగులో కొంతమంది కొత్త అవతారం ఎత్తి ఈ దందాకు పాల్పడుతున్నారు. ఖాళీగా ఉన్నా భూమిని చదును చేసి కాగితాలు సృష్టించి దళారులు ఒకే భూమిని నలుగురు, ఐదుగురికి విక్రయించడం వెన్నతో పెట్టిన విద్యగా మారింది. గత నాలుగేళ్ల కాలంలో సుమారు రూ.5 కోట్లు విలువైన క్రయవిక్రయాలు జరిగినట్లు తెలుస్తోంది. గత ప్రభుత్వ హయాంలో భూదందాలు, సెటిల్మెంట్లు క్రయవిక్రయాలు జరిపిన వారే పార్టీలు మారి తమ దందా యథావిధిగా కొనసాగిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వ భూములను కాపాడుకునేందుకు చర్యలు తీసుకోవడంతో పాటు భూ దందాలను అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

రత్నాల చెరువులో నగరపాలిక అధికారులు కూల్చివేసిన అక్రమ కట్టడం

దుకాణాలు కట్టి.. అద్దెలకు ఇచ్చి.. కొంతమంది న్యాయస్థానం పరిధిలో ఉన్న స్థలాల్లో ఎటువంటి కట్టడాలు జరగరాదని తెలిసినా పట్టించుకోవడం లేదు. స్థలాలను ఆక్రమించి షాపులు నిర్మించి అద్దెలకు ఇచ్చి సొమ్ము చేసుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. యర్రబాలెం దాటాక నుంచి రైలు ట్రాక్ వైపు వెళ్లే మార్గం వెంబడి స్థలాన్ని ఆక్రమించి లావాదేవీలు చేస్తున్నట్లు తెలుస్తోంది. భూ ఆక్రమణలు, అక్రమ కట్టడాలపై ప్రత్యేక దృష్టిసారించామని, ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని నగరపాలక కమిషనర్ అలీంబాషా తెలిపారు.

ప్రకృతి సాగుతో సమాజానికి మేలు

కొర్నెపాడు(వట్టిచెరుకూరు), న్యూస్‌టుడే: 1960 నుంచి ప్రజల జీవన శైలిలో సమూల మార్పులు వచ్చాయని, పెరుగుతున్న జనాభాకు అవసరమయ్యే ఆహారం కోసం సాగులో రసాయనాల వాడకం కూడా వృద్ధి చెందిందని రైతునేస్తం ఫౌండేషన్ ఛైర్మన్ యడ్లపల్లి వెంకటేశ్వరరావు అన్నారు. కొర్నెపాడులోని ఆ సంస్థ ప్రాంగణంలో ఆదివారం కోస్తా జిల్లాల సేంద్రియ రైతులు, బీఆర్‌సీలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంచి ఆహారం తీసుకుంటే ఎక్కువ రోజులు జీవనం సాగించగలుగుతామని, ఇందువల్ల ఆరోగ్యకరమైన పంటలను పండించి సమాజానికి అందించాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయంలో పంటలను అత్యంత శ్రద్ధతో సాగు చేయాలన్నారు. తెగుళ్ల రాకముందే నివారణకు కావాల్సిన ద్రావణాలు, కషాయాలు సిద్ధం చేసుకోవాలని తెలిపారు. వేసవిలో దేశవాళీ ఆవుల పేడ, మూత్రంలను భద్రం చేసుకుని ప్రకృతి వ్యవసాయంలో ఉపయోగించుకోవాలని చెప్పారు.

మాట్లాడుతున్న రైతునేస్తం ఫౌండేషన్ ఛైర్మన్ యడ్లపల్లి వెంకటేశ్వరరావు

శిథిలం.. పట్టించుకుంటే పదిలం

మంగళగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: కాజ గ్రామంలోని పుల్లయ్య నగర్ ఏరియా సమీపంలో మంచినీటి ట్యాంక్ శిథిలావస్థలో ఉంది. మెట్లు విరిగి ఇనుప ఊచలు బయటకు వచ్చాయి. ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు వాపోతున్నారు.

జారితే.. గల్లంతే..

మంగళగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: మంగళగిరి నుంచి గుంటూరు ప్రయాణించు రోడ్డుపై చినకాకాని గ్రామంలో హైవే ఎన్‌హెచ్ 16పై ప్రమాదకరంగా ఇసుక ఉందని వాహనదారులు తెలిపారు. ద్విచక్ర వాహనదారులు ఇసుకను తప్పించబోయి ప్రమాదానికి గురి అయ్యే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఉన్నా.. ఉపయోగం సున్నా

మంగళగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: చినకాకాని గ్రామ సచివాలయం సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్ నిరుపయోగంగా మారింది. ఈ ప్రాంతంలో ఏసీలు ఎక్కువగా ఉపయోగించడం వల్ల విద్యుత్తు హెచ్చుతగ్గులు సంభవిస్తున్నాయి. దీన్ని వినియోగంలోకి తీసుకువస్తే ఆ సమస్యలకు పరిష్కారం లభిస్తుంది.

ఇక్కడ కర్రలే స్తంభాలు

తాడికొండ, న్యూస్‌టుడే: పాములపాడు గ్రామ శివారులో విద్యుత్తు స్తంభాలు లేక స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ఇళ్లకు విద్యుత్తు కనెక్షన్ కోసం స్తంభం నుంచి ఇచ్చే సర్వీసు వైరు కర్రలకు కట్టుకున్నారు. గాలికి తీగలు కదులుతూ సరఫరాకు అంతరాయం కలుగుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇంకా మార్పు రాలేదేంటో..!

గొట్టిపాడు(ప్రత్తిపాడు), న్యూస్‌టుడే: ప్రభుత్వం మారినా, పథకం పేరు మార్చినా గొట్టిపాడు పీహెచ్‌సీకి వర్తించదేమో..? అన్న విమర్శలు వస్తున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 20 నెలలు అవుతున్నా. ఇంకా ఇక్కడ జగన్ చిత్రం, అప్పటి పథకం వివరాలతో ఫ్లెక్సీ దర్శనమిస్తోంది. ప్రస్తుతం అమల్లో ఉన్న ఎన్టీఆర్ వైద్య సేవపై ప్రచారం లేకపోవడం గమనార్హం.

ఎప్పుడు కూలిపోతుందో!

తాడికొండ, న్యూస్‌టుడే: తాడికొండ గ్రామం ఎస్సీ కాలనీలో మండల పరిషత్ పాఠశాలలోని ఉపాధ్యాయుల భవనం శిథిలావస్థకు చేరింది. తరగతి గదులు సరిపడా లేకపోవడంతో దీన్ని కూడా బోధనకు ఉపయోగిస్తున్నారు. అధికారులు స్పందించి నూతన భవనాన్ని నిర్మించాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.

గుంటూరు-అనంతవరప్పాడు రోడ్డుకు మహర్దశ

రూ.4.97 కోట్లు మంజూరు

అనంతవరప్పాడు(వట్టిచెరుకూరు), న్యూస్‌టుడే: గుంటూరు నగరపాలకసంస్థ, వట్టిచెరుకూరు మండలం అనంతవరప్పాడు మధ్య రహదారిని తారు రోడ్డుగా అభివృద్ధి చేసేందుకు రూ. 4.97 కోట్ల సీఆర్‌డీఏ నిధులను కూటమి ప్రభుత్వం మంజూరు చేసింది. దానిలో భాగంగానే పనుల టెండర్ ప్రక్రియను అధికారులు వేగంగా నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఇది 3.5 కి.మీ పొడవున విస్తరించి డొంక రోడ్డుగా ఉంది. గుంటూరు నగరం చుట్టూ విస్తరించిన బైపాస్ రోడ్డు నుంచి అనంతవరప్పాడు మధ్య ఉండడంతో రెండు వైపులా పంట పొలాలు ఉన్నాయి. ఇప్పటి వరకు అభివృద్ధికి నోచుకోకపోవడంతో గుంటూరు ఆర్టీసీ బస్టాండ్, బైపాస్‌రోడ్డు, పొన్నూరు వెళ్లేవారు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నిర్మాణం పూర్తయితే నిమిషాల వ్యవధిలో గమ్యస్థానాలకు చేరుకుంటారు. కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయుల చొరవతోనే నిధులు మంజూరయ్యాయి.

తారురోడ్డుగా అభివృద్ధి చెందనున్న రహదారి ఇదే..

ఆటో బోల్తా.. అయిదుగురికి గాయాలు

ఏఎన్‌యూ, తాడేపల్లి, న్యూస్‌టుడే: రాజధానిలోని సీడ్ యాక్సెస్ రహదారిపై వేగంగా వస్తున్న ఆటో అదుపు తప్పి బోల్తాకొట్టింది. ఈ ప్రమాదంలో అందులోని ప్రయాణిస్తున్న సుమారు అయిదుగురు గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను అంబులెన్స్‌లో విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తెలంగాణకు చెందిన ఆటో తుళ్లూరు మండలం తాళ్లాయపాలెంలోని శైవక్షేత్రానికి వెళ్తున్నట్లు సమాచారం.

గర్భాశయ క్యాన్సర్ నివారణకు టీకా తప్పనిసరి

పెదపాలెం(దుగ్గిరాల), న్యూస్‌టుడే: గర్భాశయ క్యాన్సర్ నివారణకు టీకా తప్పనిసరిగా వేయించుకోవాలని కేఎల్‌యూ ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సీహెచ్ నాగమణి అన్నారు. ఆదివారం పెదపాలెంలో సీఎస్‌ఈ-2 విద్యార్థుల ఎన్‌ఎస్‌ఎస్ కార్యక్రమంలో భాగంగా వైద్యశిబిరాన్ని సర్పంచి పాటిబండ్ల కృష్ణప్రసాద్ ప్రారంభించారు. వివిధ ఆస్పత్రులకు చెందిన వైద్యులు గ్రామ ప్రజలకు రక్తపోటు, ఈసీజీ, నేత్రవైద్యపరీక్షలు చేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ పి. శ్రీకాంత్‌రెడ్డి, సురేష్ తదితరులున్నారు.

శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచి కృష్ణప్రసాద్ తదితరులు

'మన్‌కీ బాత్'పై క్విజ్ పోటీలు

గుంటూరు రూరల్, న్యూస్‌టుడే: ప్రధాని మోదీ 'మన్‌కీ బాత్' కార్యక్రమంపై అడవి తక్కెళ్లపాడులోని అంబేడ్కర్ గురుకులంలో ఆదివారం క్విజ్ పోటీలు నిర్వహించారు. ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు దారా అంబేడ్కర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రతిభ చూపిన వారికి ధ్రువీకరణపత్రాలు అందజేశారు. విజేతలను దేశవ్యాప్తంగా ఉన్న విశ్వవిద్యాలయాలు, పార్లమెంట్ భవనం, అంబేడ్కర్ దీక్షా భూమి, సంత్ రవిదాస్ జన్మస్థలం తదితర 9 ప్రసిద్ధ ప్రాంతాల సందర్శనకు తీసుకెళ్లనున్నట్లు ప్రిన్సిపల్ నాగభూషణం తెలిపారు.

విద్యార్థులతో ప్రిన్సిపల్, ఎస్సీ మోర్చా నాయకులు

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం

తుళ్లూరు, న్యూస్‌టుడే: పెదపరిమిలోని గుంటూరు రోడ్డు పక్కన ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద ఆదివారం సీతా రామచంద్ర స్వామి విగ్రహం, ధ్వజ స్తంభం, విమాన గోపుర ప్రతిష్ఠా మహోత్సవం శాస్త్రోక్తంగా జరిగింది. సాయంత్రం సీతారాముల శాంతి కల్యాణం జరిపించారు. వేలాది మంది భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యేలు తెనాలి శ్రావణ్‌కుమార్, భాష్యం ప్రవీణ్, ప్రత్తిపాటి పుల్లారావులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు.

ఆలయం వద్ద భక్తుల సందడి

శాస్త్రోక్తంగా గాయత్రీ మహాయజ్ఞం

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: గాయత్రి పరివార్ ప్రత్తిపాడు శాఖ ఆధ్వర్యంలో స్థానిక అక్షయ పాఠశాలలో 54 కుండముల గాయత్రీ మహాయజ్ఞం ఆదివారం వైభవంగా జరిగింది. హోమం నిర్వహకులు పేరిశాస్త్రి ఆధ్వర్యంలో నామకరణ సంస్కారం, అక్షరాభ్యాసం, గురుదీక్ష, ఉపనయన, పెళ్లిరోజు, పుట్టినరోజు సంస్కారములు వేద పద్ధతిలో నిర్వహించారు. అన్నప్రసాద వితరణ చేశారు. గాయత్రి పరివార్ ప్రతినిధి మదమంచి సుధాకర్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

పోటీలతో సృజనాత్మకత పెంపు

మంగళగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: మంగళగిరి మోడల్ లైబ్రరీలో 6 నుంచి 9వ తరగతి విద్యార్థులకు ఆదివారం 'సోషల్ మీడియా ప్రయోజనాలు, నష్టాలు' అనే అంశంపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించినట్లు గ్రంథాలయ అభివృద్ధి అధికారి సీతారామయ్య తెలిపారు. మంత్రి నారా లోకేశ్ ఆదేశాల మేరకు వీటిని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సృజనాత్మకత పెంపునకు ఈ పోటీలు దోహదపడతాయన్నారు. బండికట్ల లక్ష్మీసువర్చల న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్.ఆరోగ్యం, అబ్దుల్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

పాల్గొన్న విద్యార్థులు

పెంచిన బంధం రుణం తీర్చుకుని..!

మంగళగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: చిన్నతనం నుంచి కన్నతల్లి దూరమైనా అన్ని తానై పెంచిన నానమ్మకు అంత్యక్రియలు నిర్వహించి రుణం తీర్చుకుంది ఓ మనమరాలు. గుంటూరు నగరానికి చెందిన పాశం లక్ష్మమ్మ(88), ఆమె మనవరాలు కొన్నేళ్లుగా మంగళగిరి మండలం యర్రబాలెంలో నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో లక్ష్మమ్మ వయోభారం, అనారోగ్య కారణాలతో శనివారం అర్ధరాత్రి మృతి చెందగా ఆమె మనవరాలు ఆదివారం అంతిమసంస్కారాలు నిర్వహించారు.

రయ్..రయ్‌మని సాగేలా..

✤ ఎప్పటికప్పుడు రోడ్లకు మరమ్మతులు

తాడేపల్లి, న్యూస్‌టుడే: గుంతలు లేని రహదార్లు ఉండేలా మంగళగిరి నియోజకవర్గాన్ని తీర్చిదిద్దే లక్ష్యంతో మంత్రి నారా లోకేశ్ చేపట్టిన కార్యాచరణ వేగం పుంజుకుంది. ఇందుకోసం రూ. 1.48 కోట్ల వ్యయంతో పాత్ హోల్ రిపేర్ వాహనాన్ని సమకూర్చారు. దీని ద్వారా రోడ్లపై ఉన్న గుంతలను ఎప్పటికప్పుడు పూడ్చివేస్తున్నారు. గత వైకాపా ప్రభుత్వం రోడ్లను పట్టించుకోకపోవడంతో ప్రజలు నరకం చూశారు. బయటకు వెళితే బిక్కుబిక్కుమని రాకపోకలు సాగించాల్సిన పరిస్థితిని నగర ప్రజలు చూశారు. ఈ నేపథ్యంలో లోకేశ్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రహదారుల ఆధునికీకరణకు ప్రాధాన్యం ఇస్తున్నారు. మంగళగిరిలోని గౌతమ బుద్ధా రోడ్డు, తాడేపల్లిలోని ప్రధాన వీధి, నగరంలోని అంతర్గత రోడ్లపై ఉన్న గుంతలకు రాత్రి వేళల్లో మరమ్మతులు చేసేందుకు నగరపాలక సంస్థ ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసింది. రహదారులను ప్రయాణానికి అనువుగా తీర్చిదిద్దుతుండడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తాడేపల్లి పరిధిలో కొనసాగుతున్న పనులు

హమ్మయ్య.. తూడు తొలగించారు

వట్టిచెరుకూరు, న్యూస్‌టుడే: గుంటూరు వాహినిలో పలు పలు చోట్ల అల్లుకుని పేరుకు పోయిన గుర్రపు డెక్క, తూటి కాడలను డీసీ కమిటీ ఛైర్మన్ ఉప్పుటూరి తిరుపతయ్య..సాగునీటి పారుదలశాఖ సిబ్బంది సాయంతో తొలగింపజేశారు. ఈ నెల 19న 'ఈనాడు'లో 'తూడు తొలగదు..నీరు అందదు' శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందన ఈ చర్యలు చేపట్టారు.

శుభ్రపడిన కాట్రపాడు-గారపాడు మధ్య గుంటూరు వాహిని

దుగ్గిరాల, న్యూస్‌టుడే: మోరంపూడి వద్ద తూటాకుతో నిండిపోయిన కాల్వ వల్ల ముందుకు నీరు సాగడం లేదంటూ 'కదలని తూడు-పట్టించుకోరు' శీర్షికన ఈ నెల 21న 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి స్పందన లభించింది. స్పందించిన జలవనరుల శాఖ ఏఈ లక్ష్మీనారాయణ తూడు తొలగింపు పనులు చేయించారు. నాలుగు రోజుల పాటు ఇవి కొనసాగుతాయని ఆయన తెలిపారు.

ఆరోగ్యానికి నడక దోహదం

పెదనందిపాడు, న్యూస్‌టుడే: పెదనందిపాడు వాకర్స్ అసోసియేషన్, శ్రీనివాస కాటన్ అండ్ ఆయిల్ మిల్స్ సౌజన్యంతో మార్చి 1న జరగనున్న మహిళా, పురుషుల 5కె 'ఫ్రెండ్లీ వాక్‌'ను విజయవంతం చేయాలని కోరుతూ ఆదివారం స్థానిక పాత బస్టాండ్ కూడలిలో వాకర్స్ అసోసియేషన్ సభ్యులు ఫ్లెక్సీని ఆవిష్కరించారు. 1న ఉదయం 7 గంటలకు పెదనందిపాడు శ్రీనివాస పబ్లిక్ స్కూల్ నుండి కాకుమాను స్పిన్నింగ్ మిల్ వరకు 5కే వాక్ ఉంటుందని వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డి. శేషగిరిరావు తెలిపారు. ఆరోగ్యంగా జీవించడానికి నడక అలవాటు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వాక్‌లో పాల్గొన్న వారందరికీ పతకాలు, ప్రశంసాపత్రాలు ఇస్తారని పేర్కొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరించిన పెదనందిపాడు వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

(c) eenadu

గుంటూరు తూర్పు

ధర వరలు

ఎన్టీఆర్ రైతుబజారులో ధరలు నిన్నటివి... (కిలో ఒక్కింటికి రూ.ల్లో) టమాట 14, వంగ 20, బెండ 26, పచ్చిమిర్చి 46, కాకర 42, క్యారెట్ 24, క్యాబేజీ 18, బీర 40, దొండ 45, బంగాళదుంప 20, ఉల్లిపాయలు 24, గోరుచిక్కుడు 35, దోస 34, పొట్ల 25, చామ 23, గోంగూర 10, తోటకూర 15, చుక్కకూర 15, మెంతికూర 5, కొత్తిమీర 20, బీట్‌రూట్ 25, కీర 42, క్యాప్సికం 65, అల్లం 75, ఫ్రెంచ్ బీన్స్ 60, సొర 10, అరటి 8 - న్యూస్‌టుడే, పట్నంబజారు

మేమున్నాం.. మీకు తోడుగా..

10 AM to 1 PM
94406 38515, 80085 73097

నగరపాలకసంస్థ(గుంటూరు), న్యూస్‌టుడే: బాలాజీనగర్ 4వ లైన్ సైడు కాల్వల్లో పూడికలు చేరి మురుగునీరు పారుదలకు ఆటంకంగా ఉందని స్థానికులు శ్రీనివాస్ 'మేమున్నాం.. మీకుతోడుగా'కు తెలిపారు. సమస్యను శానిటరీ సూపర్‌వైజర్ అయూబ్ ఖాన్‌కు తెలియజేయడంతో కాల్వల్లో పూడికలు తీయించారు.

★ విజయశాంతినగర్ రెండోలైన్‌లో చెత్తకుప్పలు తీయకపోవడంతో పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటున్నాయని స్థానికులు మణికంఠ 'మేమున్నాం.. మీకుతోడుగా'కు తెలిపారు. సమస్య ప్రజారోగ్య అధికారులకు తెలియజేయడంతో ట్రాక్టర్ పంపి చెత్త కుప్పలు తీయించి తరలించారు.

మొక్కలు నాటారు.. శుభ్రత మరిచారు

నగరపాలకసంస్థ(గుంటూరు), న్యూస్‌టుడే

ఏటుకూరు చాకలికుంట ప్రాంతంలో అభివృద్ధి పనులను నగరపాలక సంస్థ అధికారులు పట్టించుకోవడం లేదు. ఇటీవల రోజువారీ పర్యటనల్లో భాగంగా కమిషనర్ మయూర్ అశోక్ ఏటుకూరురోడ్డు చాకలికుంట ప్రాంతం వైపువచ్చి పరిశీలించారు. స్థానికంగా చాకలికుంట నీటిలోకి మురుగునీరు చేరడం తూటాకు పెరగడం గమనించారు. కుంటలోని మురుగునీటి దుర్వాసనకు దోమల వ్యాప్తి అధికంగా ఉండి ఇబ్బంది పడుతున్నామని స్థానికులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే అధికారులకు ఇక్కడ పారిశుద్ధ్యం మెరుగు పరిచేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తర్వాత ఉద్యాన విభాగం సిబ్బంది చెరువు చుట్టూ మొక్కలు నాటారు. కుంటలో మురుగు నీరు, చెత్త, వ్యర్థాలను తొలగించకుండా ప్రజారోగ్య విభాగం అధికారులు వదిలేశారు. ఇప్పటికైనా చాకలికుంట పరిసరాల్లోని వ్యర్థాలు తొలగించి కాల్వల నుంచి మురుగునీరు కలవకుండా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

ఏటుకూరు రోడ్డులోని కుంట

పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తే ఉపయోగం

చాకలికుంట చుట్టూ ఇప్పటికే పలుమార్లు రక్షణగా ఫెన్సింగ్ వేయించారు. రక్షణ కంచె కాకుండా శాశ్వత ప్రాతిపదికన ప్రహరీ నిర్మించి వాకింగ్‌ట్రాక్ అభివృద్ధి చేస్తే చుట్టుపక్కల ఉన్న బీసీనగర్, గాంధీనగర్ తదితర ప్రాంతాల వాసులకు ఉపయోగంగా ఉంటుంది. కుంట ప్రాంగణాన్ని గతంలో కొందరు ఆక్రమించి భవన నిర్మాణాలకు ఆస్కారం ఇచ్చే సమస్య పెట్టారు. అధికారులు దృష్టిసారించి ఇక్కడ అభివృద్ధి చర్యలు తీసుకుంటే ఆక్రమణలకు గురయ్యే అవకాశం ఉండదు.

ముఖ్యమంత్రికి ఘన స్వాగతం

పట్నంబజారు, నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగర శివారులోని శ్రీసత్యసాయి స్పిరిచ్యువల్ సిటీలో నిర్వహించిన గ్రామీణ డాక్ సేవక్ సమ్మేళనానికి విచ్చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు పలువురు ప్రజాప్రతినిధులు, తెదేపా నాయకులు స్వాగతం పలికారు. ఆదివారం మధ్యాహ్నం 3.30 గంటలకు సీ.ఎం.చంద్రబాబునాయుడు హెలికాప్టర్‌లో గుంటూరుకు చేరుకున్నారు. ఆయనకు అధికారులు పలువురు నేతలు పుష్పగుచ్ఛాలు, పూలమొక్కలు అందజేసి స్వాగతం పలికారు. సీఎంకు స్వాగతం పలికిన వారిలో జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎమ్మెల్యేలు నసీర్, గల్లా మాధవి, బూర్ల రామాంజనేయులు, జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ పీతల భీమినేని వందనాదేవి తదితరులు ఉన్నారు.



సీఎం చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎమ్మెల్యే నసీర్, మేయర్ కోవెలమూడి రవీంద్ర

సమితి సేవలు అభినందనీయం

ప్రదర్శనలు ఇచ్చిన బాలలతో అతిథులు, ఆశ్రమ నిర్వాహకులు

గుంటూరు నగరం, న్యూస్‌టుడే: సమాజంలో నిరాదరణకు గురైన వృద్ధులు, పిల్లలకు మానవత సేవా సమితి అందిస్తున్న నిరంతర సేవలు ప్రశంసనీయమని కొండిస్తు ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఛైర్మన్, జేకేసీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ డాక్టర్ రవి నారాయణ అన్నారు. రెడ్డిపాలెంలో మానవత సేవా సమితి, శ్రీరాజేంద్ర సూరి జైన సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వయోవృద్ధుల, బాలుర ఆశ్రమ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవత సంస్థ సేవలు మానవత్వానికి నిదర్శనం అన్నారు. శ్రీరాజేంద్రసూరి జైన సేవాసమితి అధ్యక్షుడు సురేశ్‌కుమార్ మాట్లాడుతూ 25 సంవత్సరాలుగా వృద్ధులు, బాలురకు సేవ చేసే అవకాశం తమ దైవం శ్రీరాజేంద్రసూరి తమకు ఇచ్చిన వరం అన్నారు. తొలుత విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. సెంట్రల్ ట్యాక్స్ అండ్ కస్టమ్స్ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, కార్యదర్శి చెన్నంశెట్టి రామారావు, కుమారదేవి, రాజేంద్రజైన్, మార్కండేయులు, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

పట్టాభిపురం, న్యూస్‌టుడే: విద్యార్థినులు ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలని కమ్మజన సేవా సమితి అధ్యక్షుడు మల్లెల హరీంద్రనాథ్ చౌదరి పేర్కొన్నారు. విద్యార్థినుల వసతి గృహంలో శంకర కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని హరీంద్రనాథ్ చౌదరితో పాటు ఉపాధ్యక్షుడు మాదల రత్నగిరిబాబు ప్రారంభించారు. 355 మంది విద్యార్థినులకు కంటి పరీక్షలు నిర్వహించి 190 మందికి కళ్లద్దాలు సిఫార్సు చేశారు. రత్నగిరిబాబు మాట్లాడుతూ కళ్లద్దాలు ఉచితంగా అందజేస్తామన్నారు.

భవిత ఉపాధ్యాయుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా

గుంటూరు విద్య, న్యూస్‌టుడే: భవిత కేంద్రాల ఐఈఆర్‌పీ ఉపాధ్యాయులు ఆదివారం వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద బాబు ఆధ్వర్యంలో నోబుల్ టీచర్స్ అసోసియేషన్(ఎన్టీఏ)లో చేరి సభ్యత్వం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎన్టీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హైమారావు మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు భవిత కేంద్రాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను క్రమబద్ధీకరించి పేస్కేలు అమలు చేయాలన్నారు. 2002 నుంచి ఉపాధ్యాయులు పనిచేస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్యే ఆనందబాబు మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో ఉపాధ్యాయులు ఎంతో మానసిక వేదనకు గురయ్యారని చెప్పారు. భవిత ఉపాధ్యాయుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. కార్యక్రమంలో నోబుల్ టీచర్ అసోసియేషన్ ముస్లిమ్ ప్రతినిధులు కస్తూరి పి.ఆలి తబారు, ఐఈఆర్‌పీ ఉపాధ్యాయులు సుబ్బారావు, రామన్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు సమక్షంలో ఎన్టీఏ సభ్యత్వం తీసుకున్న భవిత కేంద్రాల ఉపాధ్యాయులు

గొప్పవీరుడు ఉయ్యాలవాడ

నరసింహారెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్ఎస్సై సుబ్బారెడ్డి

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా సాయుధ పోరాటం చేసిన గొప్ప వీరుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి అని ఆర్ఎస్సై సుబ్బారెడ్డి తెలిపారు. ఆదివారం ఉయ్యాలవాడ వర్ధంతి సందర్భంగా పోలీస్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సిబ్బంది పాల్గొన్నారు.

మంచి చేతిరాతతో ఆత్మవిశ్వాసం మెరుగు

నగరపాలకసంస్థ(గుంటూరు), న్యూస్‌టుడే: మంచి చేతిరాతతో ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, కాలిగ్రాఫీ నిపుణులు వి.రామ్మోహనరావు పేర్కొన్నారు. స్తంభాలగరువు మహాత్మా పూలే నగరపాలకసంస్థ ఉన్నత పాఠశాలలో వివిధ జిల్లాల నుంచి వచ్చిన 45 మంది ఉపాధ్యాయులకు చేతిరాత శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షణ తీసుకున్న ఉపాధ్యాయులు తమ పాఠశాలల్లో విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నారు.

శిక్షణ తీసుకున్న ఉపాధ్యాయులు

మెడికల్ ఎగ్జిబిషన్‌కు స్పందన

నమూనాలు తిలకిస్తున్న విద్యార్థులు

గుంటూరు నగరం, న్యూస్‌టుడే: గుంటూరు ప్రభుత్వ వైద్య కళాశాలలో ఏర్పాటు చేసిన మెడికల్ ఎగ్జిబిషన్‌కు విద్యార్థులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఆదివారం కావడంతో కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలకు చెందిన విద్యార్థులూ వచ్చారు. వివిధ విభాగాల వారు ప్రదర్శించిన నమూనాలను చూడడానికి విద్యార్థులు ఆసక్తి చూపారు.

కమనీయం.. కల్యాణం

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: మారుతినగర్‌లోని శ్రీకంచి కామకోటి పీఠ మారుతి దేవాలయం 40వ వార్షిక బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా ఆదివారం హోమాలు, బాలసువాసిని పూజలు, హోమ కార్యక్రమాలు నిర్వహించారు. రాజ్యలక్ష్మి సమేత నరసింహస్వామి కల్యాణం వేడుకగా సాగింది. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా అభయ్ హిందా మనోహర్ దాస్ ప్రవచనం చెప్పారు. ఆలయ పాలకమండలి కార్యదర్శి తంగిరాల శ్రీనివాస్ పర్యవేక్షించారు. తొలుత గుంటూరు శ్రీపీఠం స్వామి పరిపూర్ణానందభారతి స్వామి జ్యోతి వెలిగించి కార్యక్రమాలను ప్రారంభించారు.

నరసింహస్వామి కల్యాణోత్సవం

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ

నూతన విగ్రహాలకు పూజలు చేస్తున్న భక్తులు

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: దేవాదాయశాఖకు చెందిన కొత్తపేట శివాలయంలో బాలాత్రిపుర సుందరీదేవి, నందీశ్వరుడు విగ్రహాల పునః ప్రతిష్ఠ మహోత్సవాలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి దేవతాపూజలు, జలాధివాసములు, నీరాజన మహామంత్ర పుష్పం, తీర్థప్రసాద వినియోగం చేశారు. అర్చకులు పవిశమూర్తిశర్మ, వేణుగోపాల్ బృందం ప్రత్యేక పూజలు చేశారు. ఈవో వీరారెడ్డి, ధర్మకర్తలమండలి ఛైర్మన్ శేషుల్య సాయి, సభ్యులు పర్యవేక్షించారు.

కనులపండువగా పుష్పయాగం



గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: కృష్ణనగర్ లక్ష్మీనారాయణ స్వామి ఆలయం 80వ వార్షిక బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఈసందర్భంగా ఆదివారం వేదవిన్నపాలు, శాత్తుమొర, వేద ఆశీర్వచనం, ఆచార్య మంగళాశాసనం, లక్ష్మీనారాయణ మంత్ర హవన పూర్ణాహుతి జరిగాయి. అనంతరం అన్న సంతర్పణ నిర్వహించారు. మూల మూర్తులకు కోటి పుష్ప యాగం కనులపండువగా సాగింది. ఆలయ వ్యవస్థాపకుడు ధనకుదరం సీతారామానుజాచార్యులు పర్యవేక్షించారు.

'కులాల మధ్య చిచ్చు పెట్టడమే అంబటి లక్ష్యం'

పట్టాభిపురం, న్యూస్‌టుడే: కులాల మధ్య చిచ్చు పెట్టడమే మాజీ మంత్రి, వైకాపా నేత అంబటి రాంబాబు లక్ష్యమని రాష్ట్ర టీఎన్ఎస్ఎఫ్ ఉపాధ్యక్షుడు రాయపాటి అమృతరావు విమర్శించారు. గుంటూరులో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'జగన్ ఆదేశాల మేరకే అంబటి నోటికొచ్చినట్లు అవాకులు, చవాకులు పేలుతూ కులాల మధ్య తగాదాలు పెట్టాలని కుట్రలు పన్నుతున్నారు. చట్టాన్ని అతిక్రమిస్తూ.. అనుమతి లేని ప్రదర్శనలు చేస్తున్నారు. రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేయడం తగదన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం...

మణిపురం వంతెన పైమార్గంలో విద్యుత్తు ఫ్యూజ్ బాక్సులకు మూతలు తెరిచి ఉంచడంతో ప్రమాదకరంగా మారిందని పాదచారులు ఆందోళన చెందుతున్నారు. హై పవర్ విద్యుత్తు లైన్లకు సంబంధించిన తీగలు బయటకు వేలాడుతున్నాయి. ఆ మార్గంలో ఉన్న అన్ని బాక్సులు తెరిచి వదిలేయడంతో ప్రమాదం పొంచి ఉందని ఆందోళన చెందుతున్నారు.

-న్యూస్‌టుడే, నెహ్రూనగర్

గుంతలమయంగా రహదారి

సీతానగర్ 1వ వీధిలో రహదారి గుంతలమయంగా మారడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారిందని వాహన చోదకులు చెబుతున్నారు. రైస్‌మిల్లు సమీప రోడ్డులో వాహనాలు వెళ్లే క్రమంలో అదుపు తప్పి పడిపోతున్నామని చోదకులు ఆందోళన చెందుతున్నారు. మరమ్మతులు చేయించి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, గుంటూరు నేరవార్తలు

స్వచ్ఛతకు తూట్లు..

అరండల్‌పేట నుంచి డొంకరోడ్డుకు వచ్చే ప్రధాన రహదారిలో, నగరపాలక సంస్థ కార్యాలయం సమీపంలోని రాజాగారి తోటలో రోడ్లపై వ్యర్థాల గుట్టలు పేరుకుపోయి దర్శనమిస్తున్నాయి. నివాసగృహాలు, వ్యాపార సముదాయాల నుంచి వచ్చే చెత్తను తరలించేందుకు వందల సంఖ్యలో కార్మికులు, వాహనాలు ఉన్నా పరిస్థితి మారడం లేదని స్థానికులు, అటుగా ప్రయాణించే వాహన చోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, గుంటూరు నగరం

మూడు వంతెనల దారిలో ఇలా..

ఇంటర్ పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ఠ బందోబస్తు

ఎస్పీ వకుల్ జిందాల్

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ఈనెల 23 నుంచి ప్రారంభమవుతున్న ఇంటర్ పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ఠ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. ఆదివారం ఎస్పీ మాట్లాడుతూ పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించామన్నారు. విద్యార్థులు పరీక్ష కేంద్రాల్లోకి ఫోన్, ఎలక్ట్రానిక్ వాచ్, బ్లూటూత్, ఇయర్‌బడ్స్ తీసుకురాకూడదని స్పష్టం చేశారు. ఎవరైనా కేంద్రాల పరిసర ప్రాంతాల్లోకి వచ్చి విద్యార్థులకు జవాబులు చెప్పడం, సైగలు చేయడం నిషేధమని, అలా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పరీక్ష కిట్లు అందజేత

గుంటూరు విద్య: పది, ఇంటర్ విద్యార్థులు ఒత్తిడిని దూరం చేసుకుని పరీక్ష రాస్తే మంచి ఫలితాలు వస్తాయని ఎంపీడీవో బండి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం ముత్యాలరెడ్డినగర్‌లోని క్రైస్ట్ ఆర్ఫన్ సెంటర్ మినిస్ట్రీస్ వ్యవస్థాపక అధ్యక్షులు స్టీఫెన్ సుందర్ ఆధ్వర్యంలో పదోతరగతి, ఇంటర్ పేద విద్యార్థులకు పరీక్ష కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సముద్రాల చిన్నకోటేశ్వరరావు, సువర్ణకుమారి, అభిరామ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు సరఫరాలో అంతరాయం నేడు

గుంటూరు నగరం, న్యూస్‌టుడే: ఎస్వీఎన్ కాలనీ ప్రధాన రహదారి విస్తరణ పనుల్లో భాగంగా విద్యుత్తు లైన్లకు అడ్డుగా ఉన్న చెట్లను తొలగించడానికి సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరా ఉండదని డీఈఈ గురవయ్య తెలిపారు. ఎస్వీఎన్ కాలనీ, తారకరామానగర్‌లలో సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు సహకరించాలని డీఈఈ కోరారు.

నేడు ప్రజాఫిర్యాదుల స్వీకరణ

నగరపాలకసంస్థ: ప్రజల వినతులు స్వీకరించేందుకు సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ఉంటుందని కమిషనర్ మయూర్ అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. కౌన్సిల్ హాల్‌లో ఉదయం 10.30 నుంచి ఒంట గంట వరకు అర్జీలు స్వీకరించనున్నట్లు వెల్లడించారు. ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు జీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కాల్‌సెంటర్ 0863- 2345103, వాట్సాప్ నెం.98499 08391కి స్థానిక సమస్యలు, ఫిర్యాదులు తెలియజేస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కారు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

పట్నంబజారు, న్యూస్‌టుడే: కారు ఢీకొన్న సంఘటనలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ట్రాఫిక్ పోలీసుల కథనం ప్రకారం.. శనివారం మధ్యాహ్నం ఎన్టీఆర్ ఐలాండ్‌సెంటర్‌లో రోడ్డుపై నడుస్తూ వెళుతున్న వ్యక్తిని కారు ఢీకొట్టింది. ఈ సంఘటనలో తీవ్ర గాయాలపాలైన అతడ్ని స్థానికులు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆవ్యక్తి ఆదివారం మృతి చెందాడు. మృతుడి వయసు సుమారు 45 సంవత్సరాలు ఉంటుంది. మృతుడి కుటుంబసభ్యులు బస్టాండు సెంటర్‌లోని ట్రాఫిక్ పోలీసుస్టేషన్‌లో సంప్రదించాలని సీఐ అశోక్‌కుమార్ సూచించారు.

రాజీవ్‌గాంధీ భవన్‌పై దాడి తగదు

పట్నంబజారు, న్యూస్‌టుడే: ప్రధాని మోదీ నియంతృత్వంగా పాలన కొనసాగిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే షేక్ మస్తాన్‌వలి అన్నారు. భాజపా శ్రేణులు శనివారం రాజీవ్‌గాంధీభవన్‌పై దాడి చేసిన సంఘటన కారణంగా మలినమైన కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ఆదివారం పసుపు, సున్నం, బ్లీచింగ్‌లతో శుద్ధి చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మస్తాన్‌వలి మాట్లాడుతూ భాజపా ఆర్ఎస్ఎస్, యువ మోర్చా పేరుతో రాజీవ్‌గాంధీభవన్‌పై దాడి చేశారన్నారు. మాజీ ఎమ్మెల్యే లింగంశెట్టి ఈశ్వరరావు, కరీం, వలి, శశి, జానీ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దాడి కారకులను అరెస్టు చేయాలి: సీపీఎం

నెహ్రూనగర్, న్యూస్‌టుడే : కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంపై భాజపా కార్యకర్తలు కోడిగుడ్లు, రాళ్లతో దాడి చేయడం హేయమైన చర్య అని, దీన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీలు, ప్రజాసంఘాలు ప్రజా సమస్యలపై నిరసన తెలపడం సహజమన్నారు. అందుకు భిన్నంగా ఒక పార్టీ కార్యాలయంపై మరో పార్టీ వాళ్లు దాడి చేయడం, ఆందోళనలకు దిగడం ప్రజాస్వామ్య వ్యవస్థలో అనుమతించకూడదన్నారు. ఇలాంటి అప్రజాస్వామిక దాడులు పునరావృతం కాకుండా ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంపై దాడికి పాల్పడిన వారిని తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

భాజపాకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యేలు మస్తాన్‌వలి, లింగంశెట్టి ఈశ్వరరావు

విశ్లేషణాత్మక నైపుణ్యం పెంచుకోండి

గుంటూరు విద్య, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, విశేషణాత్మక నైపుణ్యాలు, తార్కిక ఆలోచనలను ప్రోత్సహించేందుకు కృషి చేస్తున్నట్లు అపుస్మా రాష్ట్ర అధ్యక్షుడు కొలసాని తులసివిష్ణుప్రసాద్ అన్నారు. ఆదివారం అరండల్‌పేట కెనడీ హైస్కూల్‌లో ఈ-అభ్యాస్ అకాడమీ సహకారంతో సైంటిఫిక్ ఆప్టిట్యూడ్ టెస్ట్(సాట్) లెవల్ టు ఒలింపియాడ్ ప్రతిభ పరీక్ష నిర్వహించారు. పరీక్షను ఈఅభ్యాస్ అకాడమీ ఛైర్మన్ డాక్టర్ భువనగిరి ఫణిపవన్‌శాస్త్రి, సీఈవో బి.సాయిరామకృష్ణలు పర్యవేక్షించారు. అంతకుముందు పరీక్ష పత్రాల ఆవిష్కరణలో అపుస్మా రాష్ట్ర నాయకులు శ్రీకాంత్‌బాబు, విజ్డమ్ రవి, చైతన్య సాంబిరెడ్డి, చక్రనాగ్ తదితరులు పాల్గొన్నారు.

ఒలింపియాడ్ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

పింఛన్లు, నిత్యావసరాల అందజేత

పట్నంబజారు, న్యూస్‌టుడే: సమాజాభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు సాయం అందించాలని మిర్చియార్డు డైరెక్టర్ కొనకళ్ల సత్యం పేర్కొన్నారు. ఆర్యవైశ్య అఫిషియల్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (అవోపా) ఆధ్వర్యంలో ఆదివారం పట్నంబజారులోని సంస్థ కార్యాలయంలో 108 మంది పేదలకు పింఛన్లు, నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. డా.కె.దినేశ్ మాట్లాడుతూ అవోపా ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు, పేదలకు పింఛన్లు అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో చార్టర్డ్ అకౌంటెంట్ రేపాల మంగేశ్వరరావు, అవోపా అధ్యక్షుడు కె.వి.బ్రహ్మం, రాధాకృష్ణయ్య, మహంకాళి శ్రీనివాసరావు, మద్దిసాయి రమేష్, స్వామిగుప్తా, అమర రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో కొనకళ్ల సత్యం, కె.వి.బ్రహ్మం

ఇష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు

పట్టాభిపురం, న్యూస్‌టుడే: పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో పిల్లల్ని సెల్‌ఫోన్లు, టీవీలకు దూరంగా ఉంచాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ పేర్కొన్నారు. గుంటూరు రింగ్ రోడ్డులోని సాయి ఆదిత్య పాఠశాల 33వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రవీణ్ మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టపడి చదివితే పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధిస్తారన్నారు. లక్ష్యాన్ని నిర్దేశించుకుని అందుకనుగుణంగా ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో రెరా సభ్యులు దామచర్ల శ్రీనివాసరావు, డాక్టర్ అనురాధ, పల్నాడు జిల్లా తెదేపా అధ్యక్షుడు జాని, వారాహి ఇన్‌ఫ్రా ఛైర్మన్ కొండవీటి శ్రీనివాసరావు, పాఠశాల డైరెక్టర్లు మోదేపల్లి రవీంద్రబాబు, సూరె రామ్మోహనరావు, ప్రిన్సిపల్ సుజాత తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్‌ను సత్కరిస్తున్న మోదేపల్లి రవీంద్రబాబు, సూరె రామ్మోహనరావు

ఉన్నత విద్యకు పునాది వేసిన ఆజాద్

పట్టాభిపురం, న్యూస్‌టుడే: మౌలానా అబుల్ కలాం ఆజాద్ విద్యాశాఖ మంత్రిగా దేశంలో ఉన్నత విద్యకు పునాది వేశారని తెదేపా రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ లాల్‌వజీర్ పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ వర్ధంతిని తెదేపా జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఆజాద్ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. లాల్‌వజీర్ మాట్లాడుతూ ఖిలాఫత్, సహాయనిరాకరణ, ఉప్పు సత్యాగ్రహం వంటి అనేక ఉద్యమాల్లో ఆయన చురుగ్గా పాల్గొని స్వాతంత్ర్య సముపార్జనలో ముఖ్య పాత్ర పోషించారని కొనియాడారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు షేక్ చినబాజి, షేక్ ఫిరోజ్, బాజీ మాస్టారు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శంకరశాస్త్రి పురస్కార ప్రదానోత్సవం

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఆదివారం పద్మశ్రీ ఈమని శంకరశాస్త్రి పురస్కార ప్రదానోత్సవం జరిగింది. రామరాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో తొలుత వీణా ఝురి కార్యక్రమం నిర్వహించారు. సంస్థ అధ్యక్షుడు డాక్టర్ రామరాజు శ్రీనివాస్ దంపతులు జ్యోతి వెలిగించి కార్యక్రమాలను ప్రారంభించారు. రాష్ట్ర, రాష్ట్రేతర ప్రాంతాల నుంచి వచ్చిన వీణ కళాకారులు ఎనిమిది మంది కచేరీలు చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభా కార్యక్రమంలో విశ్రాంత ఐఏఎస్ అధికారి కె.లక్ష్మీనారాయణ, సాహితీవేత్త ఓలేటి పార్వతీశం, డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు, డాక్టర్ వంశీ రామరాజు తదితరులు ప్రసంగించారు. అతిథులు, నిర్వాహకులు.. వీణ విద్వాంసురాలు పారుపల్లి సుజనకు ఈమని శంకరశాస్త్రి పురస్కారం ప్రదానం చేసి సత్కరించారు.

పురస్కారం అందుకుంటున్న పారుపల్లి సుజన

ప్రభుత్వ వాహన డ్రైవర్ల సంఘ జిల్లా అధ్యక్షుడిగా పాపారావు

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: ఏపీ ప్రభుత్వ వాహన డ్రైవర్ల సంఘం జిల్లా అధ్యక్షుడిగా వేంపాటి పాపారావు మరోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కలెక్టరేట్ సమీపంలోని డ్రైవర్ల సంఘ కార్యాలయంలో జిల్లా కార్యవర్గ ఎన్నికలు ఆదివారం జరిగాయి. గౌరవాధ్యక్షుడిగా బి.సీహెచ్.నాగులు, ప్రధాన కార్యదర్శిగా జె.మునిబాబు, కార్యవర్గ సభ్యులుగా కె.నాగేశ్వరరావు, ఎ.కోటయ్య, జె.ఏడుకొండలు, పి.నరసింహనాయుడు, ఎస్.భాస్కర్‌బాబు, సాదిక్ బాషా, షేక్ మహబూబ్ సుభానీ ఎన్నికయ్యారు.

సందడిగా కళా ఉత్సవం

నృత్యప్రదర్శనకు వచ్చిన బాలలతో నిర్వాహకులు

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: స్థానిక వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో శ్రీమంజునాథ నాట్య క్షేత్రం ఆధ్వర్యంలో నృత్య, సంగీత, కళా ఉత్సవం ఆదివారం జరిగింది. పలుప్రాంతాల నుంచి వచ్చిన బాలలు ప్రదర్శనలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కృష్ణ కిశోర్, ఎస్.వెంకటరమణ ఫణి కుమార్, డాక్టర్ ఎల్.రమణారావు, కె.శ్రీనివాసమూర్తి, కె.వి.ఆర్.ఎస్.లక్ష్మి తదితరులు పాల్గొని నిర్వాహకుల కృషిని అభినందించారు.

(c) eenadu

గుంటూరు పశ్చిమ

ప్రజాఫిర్యాదుల స్వీకరణ నేడు

నగరపాలకసంస్థ: ప్రజల వినతులు స్వీకరించేందుకు సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కారవేదిక కార్యక్రమం ఉంటుందని కమిషనర్ మయూర్ అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. కౌన్సిల్ హాలులో ఉదయం 10.30 నుంచి ఒంటి గంట వరకు అర్జీలు స్వీకరించనున్నట్లు వెల్లడించారు. ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు జీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కాల్‌సెంటర్ 0863- 2345103, వాట్సాప్ నెం.98499 08391కు స్థానిక సమస్యలు, ఫిర్యాదులు తెలియజేస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ధర వరలు

కృష్ణనగర్ రైతుబజార్‌లో నిన్నటి ధరలు (కిలో రూ.లో): టమాట 14, వంగ 22, బెండ 27, పచ్చిమిర్చి 46, కాకర 48 బీర 37, క్యాలీఫ్లవర్ 26, క్యాబేజి 18, క్యారెట్ 27, దొండ 38, బంగాళదుంప 28, ఉల్లి 30, పొయలు 24, గోరుచిక్కుళ్లు 34, దోస 29, సొర 15, పొట్లకాయ 25, అరటికాయ 10, పెద్ద చిక్కుళ్లు 40, చామ దుంప 22, బీట్‌రూట్ 25, మునగ 15, కీరదోసకాయ 40, బీన్స్ 65, క్యాప్సికం 60, కొత్తిమీర 20, ఆకుకూరలు 15, నిమ్మకాయలు 55, అల్లం 75, వెల్లుల్లి 155, పండుమిర్చి 60. **-న్యూస్‌టుడే, పట్టాభిపురం**

మేమున్నాం.. మీకు తోడుగా..

10 AM to 1 PM

80086 22566, 97042 53525, 80085 74897

కాలువలో పూడికతీత: నగరంపాలెం గోరీలదొడ్డి ప్రాంతంలో రహదారి పక్కనున్న డ్రెయిన్‌లో మురుగు ముందుకు కదలడం లేదు. దీంతో దుర్వాసన వెదజల్లడంతో పాటు దోమలతో ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా జీఎంసీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ అంగడి వెంకటేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లాం. ఆయన స్పందించి డ్రెయిన్‌లో పూడిక తీయించి మురుగు ముందుకు కదిలేలా చర్యలు తీసుకున్నారు.

వ్యర్థాల తొలగింపు: బ్రాడీపేటలో సైడ్ కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోవడంతో దోమల బెడద ఎక్కువైంది. సమస్యను 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా జీఎంసీ శానిటరీ సూపర్‌వైజర్ ఎస్‌ఎస్‌వీ ప్రసాద్ దృష్టికి తీసుకెళ్లాం. ఆయన వెంటనే స్పందించి పారిశుద్ధ్య సిబ్బందితో బ్రాడీపేటలో గ్యాంగ్‌వర్క్‌తో కాలువలో వ్యర్థాలు తొలగింపు చర్యలు తీసుకోవడంతో సమస్య పరిష్కారమైంది. **- న్యూస్‌టుడే, ఏటీ అగ్రహారం**

విద్యుత్తు సరఫరాలో అంతరాయం నేడు

గుంటూరు నగరం, న్యూస్‌టుడే: ఎస్‌వీఎన్ కాలనీ ప్రధాన రహదారి విస్తరణ పనుల్లో భాగంగా విద్యుత్తు లైన్లకు అడ్డుగా ఉన్న చెట్లను తొలగించడానికి సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరా ఉండదని డీఈఈ గురవయ్య తెలిపారు. ఎస్‌వీఎన్ కాలనీ, తారకరామనగర్‌లలో సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు సహకరించాలని డీఈఈ కోరారు.

కొట్టేసి వదిలేస్తే ఎలా..?

ప్రజలకు తప్పని తిప్పలు

పట్టాభిపురం, న్యూస్‌టుడే

విద్యుత్తు తీగలకు అడ్డుగా ఉంటున్నాయని.. ఆ శాఖ సిబ్బంది చెట్ల కొమ్మలను ఎడాపెడా నరికేస్తున్నారు. కొట్టేసిన కొమ్మల్ని తొలగించాల్సిన బాధ్యత విద్యుత్తు శాఖ అధికారులదేనని నగరపాలక సంస్థ అధికారులు పేర్కొంటున్నారు. అయితే కటింగ్.. లిఫ్టింగ్ పద్ధతిని గుత్తేదారులు పాటించకపోవడంతో ప్రజలు తిప్పలు తప్పడం లేదు. రోజుల తరబడి అక్కడే ఉంచడం వల్ల రహదారులు చిన్నపాటి డంపింగ్ యార్డులను తలపిస్తున్నాయి. విద్యుత్తు శాఖ సిబ్బంది చెట్ల కొమ్మలు కొట్టేసి చేతులు దులిపేసుకుని వెళ్లిపోతున్నారు. దీంతో ఆ భారం పారిశుద్ధ్య సిబ్బందిపై పడుతోంది. నగరపాలక సిబ్బంది రోజులుగా వాటిని పట్టించుకోకపోవడంతో పారిశుద్ధ్యం క్షీణిస్తుందని ప్రజలు విమర్శిస్తున్నారు.

చంద్రమౌళీనగర్‌లో రహదారిలో చెట్ల కొమ్మలు ఇలా

పట్టించుకోరా.. పర్యవేక్షించరా..!

వారానికోసారి ఏదో ఒక ప్రాంతంలో చెట్ల కొమ్మల్ని తొలగించే కార్యక్రమం నిర్వహిస్తుంటారు. అధికారం శానిటరీ... అత్యవసరమైతే మినహా రోజుల్లోనూ కొమ్మల్ని నరికేస్తుంటారు. వాస్తవంగా చెట్ల కొమ్మల్ని నరికేయగానే ట్రాక్టర్లలో తొలగించాల్సిన బాధ్యత విద్యుత్తు శాఖ సిబ్బంది పైనే ఉందని నగరపాలక సంస్థ శానిటేషన్ అధికారులు చెబుతున్నారు. కటింగ్.. లిఫ్టింగ్ పద్ధతిలోనే ఒప్పందం ఉంటుందని గుర్తు చేస్తున్నారు. అయితే చెట్ల కొమ్మల్ని నరికేయడం వరకే వెళ్లిపోతున్నారు. విద్యుత్తు శాఖ అధికారులు సర్దుకోవట్లేదు.. కొమ్మలు ఎండిపోయి ఆకులు గాలికి రోడ్లు మీదకు చేరుకుని కళ్లలో పడుతున్నాయి. విద్యుత్తు సిబ్బంది కొమ్మల్ని తొలగించడంలో తరలించేలా చర్యలు తీసుకోవాలని శానిటేషన్ అధికారులు పలుమార్లు ప్రజాప్రతినిధులు, నగరపాలక సంస్థ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

★ పట్టాభిపురం, బృందావన్‌గార్డెన్స్, రాజేంద్రనగర్, కృష్ణనగర్, చంద్రమౌళీనగర్, విజానగర్, విద్యానగర్, శ్యామలానగర్, అమరావతిరోడ్డు తదితర ప్రాంతాల్లో రోడ్ల వెంబడి కొట్టేసిన చెట్ల కొమ్మలు రోజుల తరబడి ఉంటున్నాయి. విద్యుత్తు శాఖ, నగరపాలక సంస్థ అధికారుల మధ్య సమన్వయ లోపించడంతో ఈ సమస్య కొలిక్కి రావడంలేదు. చెట్ల కొమ్మల్ని ఏ ప్రాంతంలో నరికేస్తున్నారో.. గుత్తేదారు వాహనాలను సిద్ధంగా పెట్టుకొని వెంటనే కొమ్మల్ని తొలగించేలా జాగ్రత్తలు తీసుకోవాలని నగరపాలక సంస్థ అధికారులు చెబుతున్నారు.

కాంగ్రెస్ కార్యాలయంపై దాడి హేయం: సీపీఎం

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంపై భాజపా కార్యకర్తలు కోడి గుడ్లు, రాళ్లతో దాడి చేయడం హేయమైన చర్య అని, దీన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీలు, ప్రజాసంఘాలు ప్రజా సమస్యలపై నిరసన తెలపడం సహజమన్నారు. అందుకు భిన్నంగా ఒక పార్టీ కార్యాలయంపై మరో పార్టీ వాళ్లు దాడి చేయడం, ఆందోళనలకు దిగడం ప్రజాస్వామ్య వ్యవస్థలో అనుమతించకూడదన్నారు. ఇలాంటి అప్రజాస్వామిక దాడులు పునరావృతం కాకుండా ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంపై దాడికి పాల్పడిన వారిని శిక్షించాలని డిమాండ్ చేశారు.

ఇంటర్ పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ఠ బందోబస్తు

మాట్లాడుతున్న ఎస్పీ వకుల్ జిందల్

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ఈనెల 23 నుంచి ప్రారంభమవుతున్న ఇంటర్ పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ఠ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. ఆదివారం ఎస్పీ మాట్లాడుతూ పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించామన్నారు. విద్యార్థులు పరీక్ష కేంద్రాల్లోకి ఫోన్, ఎలక్ట్రానిక్ వాచ్, బ్లూటూత్, ఇయర్‌బడ్స్ తీసుకురాకూడదని స్పష్టం చేశారు. ఎవరైనా కేంద్రాల పరిసర ప్రాంతాల్లోకి వచ్చి విద్యార్థులకు జవాబులు చెప్పడం, సైగలు చేయడం నిషేధమని, అలా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మానవత సమితి సేవలు అభినందనీయం

గుంటూరు నగరం, న్యూస్‌టుడే: సమాజంలో నిరాదరణకు గురైన వృద్ధులు, పిల్లలకు మానవత సేవా సమితి అందిస్తున్న నిరంతర సేవలు ప్రశంసనీయమని కొండిన్య ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఛైర్మన్, టీజీపీఎస్ విశ్రాంత ప్రిన్సిపల్ డాక్టర్ ఈవీ నారాయణ అన్నారు. రెడ్డిపాలెంలో మానవత సేవా సమితి, శ్రీరాజేంద్ర సూరి జైన సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వయోవృద్ధులు, బాలల ఆశ్రమ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవత సంస్థ సేవలు మానవత్వానికి నిదర్శనం అన్నారు. శ్రీరాజేంద్రసూరి జైన్ సేవాసమితి అధ్యక్షులు సురేష్‌కుమార్ మాట్లాడుతూ 25 సంవత్సరాలుగా వృద్ధులు, బాలలకు సేవ చేసే అవకాశం తమ దైవం శ్రీరాజేంద్రసూరి తనకు ఇచ్చిన వరం అన్నారు. తొలుత విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. సెంట్రల్ ట్యాక్స్ అండ్ కస్టమ్స్ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, కార్యదర్శి చెన్నంశెట్టి రామారావు, కమలాదేవి, రాజేంద్రజైన్, మార్కండేయులు, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

ప్రదర్శనలు ఇచ్చిన బాలలతో అతిథులు, ఆశ్రమ నిర్వాహకులు

కమనీయం.. కల్యాణం

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: మారుతీనగర్‌లోని శ్రీరామ కామకోటి పీఠ మారుతి దేవాలయం 40వ వార్షిక బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా ఆదివారం హోమాలు, బాలసువాసిని పూజలు, హోమ కార్యక్రమాలు నిర్వహించారు. రాజ్యలక్ష్మి సమేత నరసింహస్వామి కల్యాణం వేడుకగా సాగింది. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా అభయ్ హిందూ సేన వ్యవస్థాపకులు రాధా మనోహర్ దాస్ ప్రవచనం చెప్పారు. ఆలయ పాలకమండలి కార్యదర్శి తంగిరాల శ్రీనివాస్ పర్యవేక్షించారు. తొలుత గుంటూరు శ్రీపీఠం స్వామి పరశివానందభారతి స్వామి జ్యోతి వెలిగించి కార్యక్రమాలను ప్రారంభించారు.

నరసింహస్వామి కల్యాణ క్రతువు జరిపిస్తూ..

కనులపండువగా పుష్పయాగం

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: కృష్ణనగర్ లక్ష్మీనారాయణ స్వామి ఆలయం 80వ వార్షిక బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఈసందర్భంగా ఆదివారం వేద విన్నపాలు, శాత్తు మొర, వేద ఆశీర్వచనం, ఆచార్య మంగళాశాసనం, లక్ష్మీనారాయణ మంత్ర హవన పూర్ణాహుతి జరిగాయి. అనంతరం అన్న సంతర్పణ నిర్వహించారు. మూల మూర్తులకు కోటి పుష్ప యాగం కనులపండువగా సాగింది. ఆలయ వ్యవస్థాపకుడు ధనకుధరం సీతారామానుజాచార్య స్వామి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

అలంకృత లక్ష్మీనారాయణులు

పచ్చని తీగలు ప్రమాదమే..!

ఏటీ అగ్రహారం 4వలైన్‌లో నేతాజీనగర్ విజేత గ్రౌండ్స్ ఎదురుగా ఉన్న విద్యుత్తు స్తంభం, నియంత్రికలను పిచ్చిమొక్కలు అల్లుకుపోయాయి. గాలులు వీచినప్పుడల్లా నియంత్రిక వద్ద నిప్పురవ్వలు ఎగసి పడుతున్నాయి. నియంత్రిక పక్కనే ప్రాథమిక పాఠశాల ఉండడంతో విద్యార్థులు ఈ దారిలో వెళుతుంటారు. తరచూ విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడుతోందని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి పిచ్చిమొక్కలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, ఏటీ అగ్రహారం**

స్వచ్ఛతకు తూట్లు..

అరండల్‌పేట నుంచి డొంక రోడ్డుకు వచ్చే ప్రధాన రహదారిలో, నగరపాలక సంస్థ కార్యాలయం సమీపంలోని రాజాగారి తోటలో రోడ్లపై వ్యర్థాల గుట్టలు పేరుకుపోయి దర్శనమిస్తున్నాయి. నివాసగృహాలు, వ్యాపార సముదాయాల నుంచి వచ్చే చెత్తను తరలించేందుకు వందల సంఖ్యలో కార్మికులు, వాహనాలు ఉన్నా పరిస్థితి మారడం లేదని స్థానికులు, అటుగా ప్రయాణించే వాహన చోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, గుంటూరు నగరం**

వైద్య ప్రదర్శనకు స్పందన

గుంటూరు నగరం, న్యూస్‌టుడే: గుంటూరు ప్రభుత్వ వైద్య కళాశాలలో ఏర్పాటు చేసిన మెడికల్ ఎగ్జిబిషన్‌కు విద్యార్థులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఆదివారం కావడంతో కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలకు చెందిన విద్యార్థులూ వచ్చారు. వివిధ విభాగాల వారు ప్రదర్శించిన నమూనాలను చూడడానికి విద్యార్థులు ఆసక్తి చూపారు.

నమూనాలు తిలకిస్తున్న విద్యార్థులు

ఇష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు

పట్టాభిపురం, న్యూస్‌టుడే: పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో పిల్లల్ని సెల్‌ఫోన్లు, టీవీలకు దూరంగా ఉంచాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ పేర్కొన్నారు. గుంటూరు రింగ్‌రోడ్డులోని సాయి ఆదిత్య పాఠశాల 33వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రవీణ్ మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టపడి చదివితే పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధిస్తారన్నారు. లక్ష్యాన్ని నిర్దేశించుకుని అందుకనుగుణంగా ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో రెరా సభ్యులు దామచర్ల శ్రీనివాసరావు, డాక్టర్ అనురాధ, పల్నాడు జిల్లా తెదేపా అధ్యక్షుడు జాని, వారాహి ఇన్‌ఫ్రా ఛైర్మన్ కొండవీటి శ్రీనివాసరావు, పాఠశాల డైరెక్టర్లు మోదేపల్లి రవీంద్రబాబు, సూరె రామ్మోహనరావు, ప్రిన్సిపల్ సుజాత తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్‌ను సత్కరిస్తున్న రవీంద్రబాబు, రామ్మోహనరావు

గోతుల దారులు.. అధ్వానంగా కాలువలు

ఏటీ అగ్రహారం, న్యూస్‌టుడే:

నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దుతామని ప్రజాప్రతినిధులు పదేపదే చెబుతున్నా అమలుకు నోచుకోవడంలేదు. అభివృద్ధి చేస్తామని పాలకులు, అధికారులు ఇస్తున్న హామీలు నీటిమూటలుగా మిగులుతున్నాయి. నగరంలోని 25వ డివిజన్‌లోని మహాత్మాగాంధీనగర్‌లో వందల కుటుంబాలు నివసిస్తున్నాయి. ఇక్కడ రహదారులు, మురుగునీటి పారుదల వ్యవస్థ అధ్వానంగా తయారయ్యాయి. ప్రజాప్రతినిధులు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసినా కార్యరూపం దాల్చలేదు.

★ చిన్న వర్షం కురిసినా రహదారి గుంతలమయంగా ఉండడంతో తటకాలను తలపిస్తుంటాయి. గెలాక్సీ బార్ వెనుక వైపు రోడ్డు మహాత్మాగాంధీనగర్ రెండో లైన్ పరిస్థితి మరీ అధ్వానంగా ఉంటుంది. నిత్యం ఈ మార్గంలో మిర్చి తొడాలు తీసేవారు అధిక సంఖ్యలో తిరుగుతుంటారు. సరైన రహదారి లేక గుంతల దారితో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ★ సైడ్ కాలువలు సైతం నిర్మించకపోవడంతో రోడ్లపై మురుగు నిలిచి అస్తవ్యస్తంగా తయరవుతోంది. కొన్నిచోట్ల ఖాళీ స్థలాల్లో మురుగు చేరుతోంది. అక్కడి నుంచి వర్షం నీరు వెళ్లే మార్గం లేక చిన్నపాటి చెరువుల్లా మారాయి. అవి పాములు, విషపురుగులకు, దోమలకు ఆవాస కేంద్రాలుగా తయారయ్యాయి. పరిసర ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ★ పందులు అధిక సంఖ్యలో నివాసాల మధ్య తిరుగుతున్నాయి. తద్వారా దోమలు వ్యాప్తి చెంది రోగాల బారిన పడుతున్నట్లు ప్రజలు వాపోతున్నారు. పన్నులు చెల్లిస్తున్నా అభివృద్ధి మాత్రం కనిపించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మహాత్మాగాంధీనగర్ 1, 2 లైన్లకు రహదారులు, కాలువలు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మహాత్మాగాంధీనగర్ వెళ్లేందుకు ఇదే దారి..

మురుగు వెళ్లే మార్గం లేక..

మురుగుతో అవస్థలు

గోరంట్ల, న్యూస్‌టుడే: గుంటూరు నగరంలో భూగర్భ డ్రెయినేజీ వ్యవస్థ తీసుకొచ్చారు. అంతవరకు బాగానే ఉన్నా..యూజీడీ మూతల వద్ద మురుగునీరు పొంగి రోడ్డుపైకి చేరుతోంది. రోడ్డెక్కిన మురుగులో రాకపోకలతో నీరు చింది పైన పడుతోందని వాహనచోదకులు వాపోతున్నారు. రోజులు కాదు నెలల తరబడి సమస్య ఉన్నా పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. అరండల్‌పేట, బ్రాడీపేట, శ్రీనగర్, భారత్‌పేట తదితర ప్రాంతాల్లో తరచూ యూజీడీ మ్యాన్‌హోల్ మూతల నుంచి మురుగునీరు రోడ్డుపైకి పొంగుతున్నాయి. మురుగు నుంచి వచ్చే దుర్వాసనతో స్థానికంగా ఉండలేకపోతున్నామని ఆప్రాంత వాసులు వాపోతున్నారు. పలుచోట్ల యూజీడీపై వేసిన మూతలు విరిగిపోయాయని వాటిని కూడా వేయడం లేదని స్థానికులంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యకు పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

చంద్రబాబుకు స్వాగతం పలికిన యంత్రాంగం

గుంటూరు నగరానికి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా, ఎమ్మెల్యేలు గల్లా మాధవి, మహమ్మద్ నసీర్, బూర్ల రామాంజనేయులు, ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ, కూటమి నేతలు పుష్పాలు అందించి స్వాగతం పలికారు. **- న్యూస్‌టుడే, కలెక్టరేట్**

ప్రభుత్వ వాహన డ్రైవర్ల సంఘ జిల్లా అధ్యక్షుడిగా పాపారావు

సంఘ నూతన కార్యవర్గంతో నాయకులు

కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఏపీ ప్రభుత్వ వాహన డ్రైవర్ల సంఘం జిల్లా అధ్యక్షుడిగా వేంపాటి పాపారావు మరోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కలెక్టరేట్ సమీపంలోని డ్రైవర్ల సంఘ కార్యాలయంలో జిల్లా కార్యవర్గ ఎన్నికలు ఆదివారం జరిగాయి. గౌరవాధ్యక్షుడిగా బి.సీహెచ్.నాగులు, ప్రధాన కార్యదర్శిగా జె.మునిబాబు, కార్యవర్గ సభ్యులుగా కె.నాగేశ్వరరావు, ఎ.కోటయ్య, జె.ఏడుకొండలు, పి.నరసింహనాయుడు, ఎస్.భాస్కర్‌బాబు, సాదిక్ బాషా, షేక్ మహబూబ్ సుభానీ ఎన్నికయ్యారు.

సందడిగా కళా ఉత్సవం

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: స్థానిక వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో శ్రీమంజునాథ నాట్య క్షేత్రం ఆధ్వర్యంలో నృత్య, సంగీత, కళా ఉత్సవం ఆదివారం జరిగింది. పలుప్రాంతాల నుంచి వచ్చిన బాలలు ప్రదర్శనలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కృష్ణ కిశోర్, ఎస్.వెంకటరమణ ఫణి కుమార్, డాక్టర్ ఎల్.రమణారావు, కె.శ్రీనివాసమూర్తి, కె.వి.ఆర్.ఎస్.లక్ష్మి తదితరులు పాల్గొని నిర్వాహకుల కృషిని అభినందించారు.

చిన్నారుల నృత్య ప్రదర్శన

ఘనంగా శంకరశాస్త్రి పురస్కార ప్రదానోత్సవం

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఆదివారం పద్మశ్రీ ఈమని శంకరశాస్త్రి పురస్కార ప్రదానోత్సవం జరిగింది. రామరాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో తొలుత వీణా ఝరి కార్యక్రమం నిర్వహించారు. సంస్థ అధ్యక్షుడు డాక్టర్ రామరాజు శ్రీనివాస్ దంపతులు జ్యోతి వెలిగించి కార్యక్రమాలను ప్రారంభించారు. రాష్ట్ర, రాష్ట్రేతర ప్రాంతాల నుంచి వచ్చిన వీణ కళాకారులు ఎనిమిది మంది కచేరీలు చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభా కార్యక్రమంలో విశ్రాంత ఐఏఎస్ అధికారి కె.లక్ష్మీనారాయణ, సాహితీవేత్త ఓలేటి పార్వతీశం, డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు, డాక్టర్ వంశీ రామరాజు తదితరులు ప్రసంగించారు. అతిథులు, నిర్వాహకులు.. వీణ విద్వాంసురాలు పారుపల్లి సుజనకు ఈమని శంకరశాస్త్రి పురస్కారం ప్రదానం చేసి సత్కరించారు.

పురస్కారం అందుకుంటున్న పారుపల్లి సుజన

ఉన్నత విద్యకు పునాది వేసిన ఆజాద్

అబుల్ కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న లాల్‌వజీర్

పట్టాభిపురం, న్యూస్‌టుడే: మౌలానా అబుల్ కలాం ఆజాద్ విద్యాశాఖ మంత్రిగా దేశంలో ఉన్నత విద్యకు పునాది వేశారని తెదేపా రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ లాల్‌వజీర్ పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ వర్ధంతిని తెదేపా జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఆజాద్ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. లాల్‌వజీర్ మాట్లాడుతూ ఖిలాఫత్, సహాయనిరాకరణ, ఉప్పు సత్యాగ్రహం వంటి అనేక ఉద్యమాల్లో ఆయన చురుగ్గా పాల్గొని స్వాతంత్ర్య సముపార్జనలో ముఖ్య పాత్ర పోషించారని కొనియాడారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు షేక్ చినబాజి, షేక్ ఫిరోజ్, బాజీ మాస్టారు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

పట్టాభిపురం, న్యూస్‌టుడే: విద్యార్థినులు ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలని కమ్మజన సేవా సమితి అధ్యక్షుడు మల్లెల హరీంద్రనాథ్ చౌదరి పేర్కొన్నారు. విద్యార్థినుల వసతి గృహంలో శంకర కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని హరీంద్రనాథ్ చౌదరితో పాటు ఉపాధ్యక్షుడు మాదల రత్నగిరిబాబు ప్రారంభించారు. 355 మంది విద్యార్థినులకు కంటి పరీక్షలు నిర్వహించి 190 మందికి కళ్లద్దాలు సిఫార్సు చేశారు. రత్నగిరిబాబు మాట్లాడుతూ కళ్లద్దాలు ఉచితంగా అందజేస్తామన్నారు.

విద్యార్థినులకు కంటి పరీక్షలు చేస్తూ..

ఉయ్యాలవాడ త్యాగం చిరస్మరణీయం

జిల్లాపరిషత్తు(గుంటూరు): నిరుపేద వర్గాల హక్కుల కోసం పోరాటం చేసి ప్రాణ త్యాగం చేసిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చిరస్మరణీయులని జిల్లాపరిషత్తు సీఈవో వి.జ్యోతిబసు అన్నారు. ఉయ్యాలవాడ వర్ధంతిని పురస్కరించుకుని జిల్లాపరిషత్తు సమావేశ మందిరంలో ఆదివారం నరసింహారెడ్డి చిత్రపటానికి జ్యోతిబసు పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఈవో సీహెచ్.కృష్ణ, గణాంక అధికారి పి.శామ్యూల్‌పాల్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నరసింహారెడ్డి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన జడ్పీ సీఈవో జ్యోతిబసు, సిబ్బంది

కులాల మధ్య చిచ్చు పెట్టడమే అంబటి లక్ష్యం

పట్టాభిపురం, న్యూస్‌టుడే: కులాల మధ్య చిచ్చు పెట్టడమే మాజీ మంత్రి, వైకాపా నేత అంబటి రాంబాబు లక్ష్యమని రాష్ట్ర టీఎన్‌ఎస్‌ఎఫ్ ఉపాధ్యక్షుడు రాయపాటి అమృతరావు విమర్శించారు. గుంటూరులో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'జగన్ ఆదేశాల మేరకే అంబటి నోటికొచ్చినట్లు అవాకులు, చవాకులు పేలుతూ కులాల మధ్య తగాదాలు పెట్టాలని కుట్రలు పన్నుతున్నారు. చట్టాన్ని అతిక్రమిస్తూ.. అనుమతి లేని ప్రదర్శనలు చేస్తున్నారు. రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేయడం, పోలీసుల విధులకు ఆటంకం కలిగించడమే పనిగా పెట్టుకున్నారు. ఇప్పటికైనా నోరు దగ్గర పెట్టుకుంటే మంచిది. నోటికొచ్చినట్లు మాట్లాడితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయి'.. అని హెచ్చరించారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు పేరయ్య, శ్యామ్, జాన్‌సైదా, ప్రశాంత్ గౌడ్, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రాయపాటి అమృతరావు

కారు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

పట్నంబజారు, న్యూస్‌టుడే: కారు ఢీకొన్న సంఘటనలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ట్రాఫిక్ పోలీసుల కథనం ప్రకారం..శనివారం మధ్యాహ్నం ఎన్టీఆర్ ఐలాండ్‌సెంటర్‌లో రోడ్డుపై నడుస్తూ వెళుతున్న వ్యక్తిని కారు ఢీకొట్టింది. ఈ సంఘటనలో తీవ్ర గాయాలపాలైన అతడ్ని స్థానికులు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆవ్యక్తి ఆదివారం మృతి చెందాడు. మృతుడి వయసు సుమారు 45 సంవత్సరాలు ఉంటుంది. మృతుడి కుటుంబసభ్యులు బస్టాండు సెంటర్‌లోని ట్రాఫిక్ పోలీసుస్టేషన్‌లో సంప్రదించాలని సీఐ అశోక్‌కుమార్ సూచించారు.

నిత్యావసర సరకుల పంపిణీ

ఏటీ అగ్రహారం, న్యూస్‌టుడే: గుంటూరు శ్రీసత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఏటీ అగ్రహారం శ్రీసత్యసాయి భజన మండలి సభ్యులు సత్యసాయిబాబా శత జయంతి వేడుకలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే ఎనిమిది ఆలయాల్లో నగర సంకీర్తనలు, భజనలు చేసిన సమితి సభ్యులు సంపత్‌నగర్‌లోని శ్రీరామనామ క్షేత్రంలో ఆదివారం సంకీర్తన నిర్వహించారు. శ్రీసత్యసాయి ఎడ్యుకేషన్ సర్వీస్ అండ్ సొసైటీ సభ్యులు కోవెలమూడి లక్ష్మీ అపర్ణ జ్యోతి వెలిగించి కార్యక్రమాలు ప్రారంభించారు. 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. రామనామ క్షేత్రంలో సేవ చేస్తున్న సిబ్బందికి నెలకు సరిపడా నిత్యావసర సరకులు అందజేశారు. కార్యక్రమంలో భజన మండలి కన్వీనర్లు పి.ఎల్.నరసింహారావు, మహంకాళి శ్రీనివాస్, సమితి కన్వీనర్ రామకృష్ణ, శ్రీసత్యసాయి విద్యా విహార్ ప్రిన్సిపల్ సీతామహాలక్ష్మి, ట్రస్ట్ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సిబ్బందికి సరకులు అందజేస్తున్న సభ్యులు

ఐఈఆర్‌పీ ఉపాధ్యాయులకు ఎన్టీఏ సభ్యత్వం

గుంటూరు విద్య, న్యూస్‌టుడే: భవిత కేంద్రాల ఐఈఆర్‌పీ ఉపాధ్యాయులు ఆదివారం వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ఆధ్వర్యంలో నోబుల్ టీచర్స్ అసోసియేషన్(ఎన్టీఏ)లో చేరి సభ్యత్వం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎన్టీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హైమారావు మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు భవిత కేంద్రాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను క్రమబద్ధీకరించి పేస్కేలు అమలు చేయాలన్నారు. 2002 నుంచి ఉపాధ్యాయులు పనిచేస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్యే ఆనందబాబు మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో ఉపాధ్యాయులు ఎంతో మానసిక వేదనకు గురయ్యారని చెప్పారు. భవిత ఉపాధ్యాయుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. కార్యక్రమంలో నోబుల్ టీచర్ అసోసియేషన్ మున్సిపల్ పాఠశాలల కన్వీనర్ పి.లలితబాబు, ఐఈఆర్‌పీ ఉపాధ్యాయులు సుబ్బారావు, రాఘవన్ తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

మంగళగిరి శ్రీ పానకాల లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభం అయ్యాయి. మొదటిరోజు స్వామి, అమ్మవార్లను పెళ్లి కుమారుడు, కుమార్తెలుగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు.

- మంగళగిరి గ్రామీణం, న్యూస్‌టుడే

బ్రహ్మాండనాయకునికి కల్యాణ శోభ

ప్రజా సమస్యల పరిష్కార వేదిక నేడు

కలెక్టరేట్(మచిలీపట్నం), న్యూస్‌టుడే: కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తారని కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. జిల్లాలోని అన్ని మండల, డివిజన్ కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయాల్లోనూ పరిష్కార వేదిక ఉంటుందన్నారు. ప్రజలు సమీపంలోని కేంద్రాల్లో అర్జీలు సమర్పిస్తే అధికారులు చర్యలు తీసుకుంటారని స్పష్టం చేశారు. కాల్ సెంటరులోని 1100 నంబరుకు కాల్ చేసి అర్జీలు నమోదు చేసుకుని వాటి స్థితిగతులు తెలుసుకోవచ్చని స్పష్టం చేశారు.

వేసే మందు.. చూడు ముందు

☛ కొన్నవన్నీ అమ్మేయాలనే నకిలీ తేదీలు

☛ అధికంగా వాడే ఔషధాలే లక్ష్యం

ఈనాడు, అమరావతి

గ్రామాల నుంచి పట్టణాలు, నగరాల వరకూ ప్రస్తుతం గ్యాస్ బిళ్లలను విచ్చలవిడిగా వాడుతున్నారు. కనీసం వైద్యుల సూచన లేకుండా నేరుగా మెడికల్ షాపుల్లో కొనుగోలు చేసి మింగేస్తున్నారు. ఇదే అదనుగా కాలంచెల్లిన గ్యాస్ట్రిక్ ట్యాబ్లెట్లను సైతం నకిలీ తేదీలు, వివరాలతో మార్కెట్‌లో అమ్మేసి సొమ్ము చేసుకునే అక్రమార్కులు పెరిగారు. ఔషధాల గడువు ఒకటి రెండు నెలల్లో ముగుస్తోందనగా.. దానికి మరో ఆరు నెలలు పొడిగించి నకిలీ స్టాంపులతో తేదీలను ముద్రిస్తున్నారు. వాటి ఎక్స్‌పైరీ తేదీలను టిన్నర్లను వాడి చెరిపేస్తున్నారు. మందుల బ్యాచ్ నంబర్లు సైతం మార్చేస్తూ తయారీ తేదీలు నకిలీవి ముద్రించి.. రోగులకు అంటగడుతున్నారు.

వెనక్కిచ్చే వీల్లేక అక్రమాలు

ఔషధాల రంగంలో 'ప్రోపగాండా కం డిస్ట్రిబ్యూషన్(పీసీడీ)' అనేది బాగా ప్రాచుర్యం పొందిన విక్రయ విధానం. మెడికల్ ఫీల్డ్‌లో అనుభవం ఉన్న కొంతమంది.. డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్(డీసీఏ) నుంచి అనుమతి తీసుకుని మందులు సరఫరా చేస్తుంటారు. తాజాగా విజయవాడ సత్యనారాయణపురంలో నకిలీ తేదీలను ముద్రించి ఔషధాలను విక్రయిస్తూ దొరికిన.. డైకన్ హెల్త్‌కేర్ డిస్ట్రిబ్యూషన్ సంస్థ కూడా ఇలాంటిదే. వీళ్లు ఫార్మా సంస్థల నుంచి బల్క్‌గా ఔషధాలు కొంటారు. వాటిని తమ కంపెనీ పేరుతోనే మార్కెట్‌లో హోల్‌సేల్‌గా విక్రయిస్తారు. ప్రధానంగా వైద్యులతో అనుసంధానమై, ఆస్పత్రులకు అనుబంధంగా ఉండే మెడికల్ షాపుల్లోనే వీరి ఔషధాలు అమ్ముకుంటారు. ఒకవేళ ఔషధాల గడువు తీరిపోతే వాటిని తిరిగి ఫార్మా కంపెనీకి పంపించడానికి అవకాశం ఉండదు. మిగతా మెడికల్ షాపుల్లో ఉండే ఏ మందైనా.. గడువు తీరిపోతే.. దానిని తయారు చేసిన సంస్థకు వెనక్కి పంపించేయొచ్చు. ఈ పీసీడీ విధానంలో డిస్ట్రిబ్యూషన్ చేసే వ్యాపారులకు ఆ అవకాశం లేకపోవడంతో ఎలాగైనా తెచ్చిన మందులన్నీ గడువులోగా అమ్మేయాలి. అందుకే నకిలీ తేదీలు ముద్రిస్తున్నట్లు అధికారులు గుర్తించారు.

మధుమేహ, గ్యాస్ బిళ్లలు..

తాజాగా నకిలీ తేదీలతో దొరికిన మందులన్నీ మధుమేహ, గ్యాస్ట్రిక్ సమస్యకు వినియోగించేవే కావడం గమనార్హం. జనం ఎక్కువగా వినియోగించే గ్యాస్, మధుమేహం, రక్తపోటు, గుండె సంబంధిత సమస్యలు, నరాలు, ఎముకలకు సంబంధించిన అనారోగ్య సమస్యల మందులపైనే.. విజయవాడలో పీసీడీ వ్యాపారం జరుగుతోంది. గడువు రెండు మూడు నెలలుంటే.. వైద్యులు వీటిని తీసుకోరు. అందుకే ఆరేడు నెలలు పొడిగించి.. తొమ్మిది నెలలుందని నమ్మించి అంటగడుతున్నారు.

భానుడి సెగ.. భక్తులకు కష్టమేగా..

కొండపైకి వెళ్లడానికి దుర్గాఘాట్ వద్ద భక్తులు ఒకరినొకరు తోసుకుంటూ బస్సులు ఎక్కడానికి దేవస్థానం వరుసలు ఏర్పాటు చేయడం మంది ఆలోచనే. అయితే భక్తులు ఎండ తీవ్రత తట్టుకోలేక, బస్సుల కోసం నిరీక్షించలేక అవస్థలు పడుతున్నారు. రానున్న రోజుల్లో ఎండలు మరింత తీవ్రం కానున్న నేపథ్యంలో భక్తులకు నీడ ఏర్పాట్లు చేస్తే సౌకర్యంగా ఉంటుంది. -ఈనాడు అమరావతి

సర్వోత్తమ స్ఫూర్తి.. సాహిత్య దీప్తి..

ఉచితంగా 40వేల పుస్తకాల పంపిణీ

విజయవాడ సర్వోత్తమ గ్రంథాలయంలో నిర్వహించిన పుస్తకాల పండగ.. సాహిత్య పరిమళాన్ని వెదజల్లింది. గ్రంథాలయ ప్రాంగణమంతా పుస్తక ప్రియులతో కళకళలాడింది. సామాజిక మాధ్యమాలు రాజ్యమేలుతున్న కాలంలోనూ పుస్తకం వన్నె తగ్గలేదని నిరూపించారు. రెండు రోజుల పుస్తక ప్రదర్శన, పంపిణీ ఆదివారంతో ముగిసింది.

– పటమట, న్యూస్‌టుడే

ఈ ఏడాది సుమారు 15 వేల మంది సందర్శించారు. మనిషికి 2 చొప్పున పుస్తకాలు ఉచితంగా ఇచ్చారు. అన్ని రంగాల పుస్తకాలు 40 వేలకుపైగా పంపిణీ చేసినట్లు నిర్వాహకులు చెప్పారు. అక్కడే పుస్తకాల హుండీ ఏర్పాటు చేశారు. ఎవరైనా తాము చదివిన పుస్తకాలు తీసుకొచ్చి అందులో వేస్తే చాలు. వాటినే తిరిగి పంపిణీ చేస్తారు. ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘ ప్రధాన కార్యదర్శి రావి శారద మాట్లాడుతూ.. 'పుస్తకాల పంపిణీ 2015లో ప్రారంభించాం. మొదట్లో ఆరు వేలు, ఇప్పుడు దాదాపు 40 వేల పుస్తకాలు పంపిణీ చేశాం. కొందరు రచయితలు వారి వద్ద ఉన్న పుస్తకాలు మాకు ఇచ్చారు. అన్ని రకాల పుస్తకాలకు ఆదరణ లభిస్తోంది.' అని వివరించారు.

పుస్తకాలు పరిశీలిస్తున్న సాహిత్య ప్రియులు

ఎంపిక సులభం

నేను ఎంబీఏ చదువుతున్నా. కళాశాల గ్రంథాలయంలో నింపాదిగా పుస్తకాలు చదవడానికి వీలు కలగడం లేదు. ఇక్కడ ప్రదర్శించిన పుస్తకాలు సబ్జెక్టు వారీగా ఉన్నందున ఎంపిక సులభమైంది. మాలాంటి వాళ్లెందరో ఈ గ్రంథాలయానికి రుణపడి ఉంటారు. - మానస, ఎంబీఏ విద్యార్థిని

అమ్మానాన్న చెబితే వచ్చా

నేను ఐదో తరగతి చదువుతున్నా. పుస్తకాలంటే ఇష్టం. మా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఉచిత పుస్తక ప్రదర్శన గురించి చెబితే వచ్చా. ఇక్కడ కథలు, శాస్త్రవేత్తల జీవిత చరిత్రలు, అన్ని తరగతుల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. కొత్త ప్రపంచంలో అడుగు పెట్టినట్లు ఉంది.- జైష్ణవి, విద్యార్థిని

ఊహించిన కంటే ఎక్కువే ఉన్నాయి

మాధ్యమాల ద్వారా ఉచిత పుస్తక వితరణ గురించి తెలుసుకున్నా. ఈ విషయాన్ని మా కళాశాల పాలకవర్గానికి తెలియజేశా. వాళ్లు పరిశీలించి రమ్మన్నారు. ఇక్కడకు వచ్చి చూస్తే నేను ఊహించిన దానికంటే ఎక్కువ పుస్తకాలు కనబడ్డాయి. ప్రత్యేక అనుమతితో కళాశాల గ్రంథాలయంలో లేని 500 పుస్తకాలు తీసుకెళ్తున్నా. - ఎ.వసుంధర, గ్రంథాలయాధికారిణి, తీగల రామిరెడ్డి విద్యాసంస్థలు, హైదరాబాద్

కృష్ణమ్మ చెంత.. దుర్గంధం చింత

ఇది కృష్ణా పుష్కరాల సమయంలో రూ.కోట్లతో విజయవాడలో నిర్మించిన కృష్ణవేణి స్నానఘాట్. నాడు లక్షల మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు ఇక్కడ. కానీ నేడు నీరు నిలిచి మురుగు మడుగు కట్టింది. ఘాట్ వద్దకు వచ్చే పర్యాటకులు, శనైశ్చరస్వామి దేవస్థానానికి వచ్చే భక్తులు అపరిశుభ్రతను చూసి దుర్వాసన భరించలేక ఇబ్బందులు పడుతున్నారు.

-ఈనాడు, అమరావతి

రంజాన్ వేళలు

ఇఫ్తార్: (సోమవారం) సాయంత్రం: 6.17

సహరి: (మంగళవారం) ఉదయం: 5.09

సీసీ కెమెరాల నీడలో ఇంటర్ పరీక్షలు

నేటి నుంచి ప్రారంభం

ఉయ్యూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ఇంటర్మీడియట్ పరీక్షలు నేటి (సోమవారం) నుంచి ప్రారంభం కానున్నాయి. కృష్ణా జిల్లాలో ఇంటర్ ప్రథమ సంవత్సరం 24,173 మంది, ద్వితీయ సంవత్సరం 25,406 మంది. . మొత్తం 49,579 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. వారికి జిల్లాలోని వివిధ కళాశాలల్లో 63 కేంద్రాలు ఏర్పాటు చేశారు. 900 మంది ఇన్విజిలేటర్లు విధులు నిర్వహించనున్నారు. 3 సిటింగ్ స్క్వాడ్, 3 ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు ఏర్పాటు చేశారు.

గౌతమి జూనియర్ కళాశాలలో పరిశీలిస్తున్న డీఐఈవో సరళకుమారి

ఉదయం 9 గంటలకు పరీక్ష ప్రారంభం అవుతుంది. ఉదయం 8.30 గంటలకల్లా విద్యార్థులు కేంద్రానికి చేరుకోవాలని డీఐఈవో సరళకుమారి తెలిపారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని కేంద్రాల్లో వసతులు కల్పించాం. కేంద్రాల వద్ద వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటారు. హాల్ టికెట్, పెన్ను మినహా ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదు. మాల్‌ప్రాక్టీస్‌కు తావు లేకుండా అన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. పటిష్ఠ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశాం. సందేహాలు, సమస్యలు ఉంటే 81066 28910 నంబరుకు ఫోన్ చేయాలి' అని ఆమె వివరించారు.

మేము సైతం.. ప్రకృతి హితం

ఆర్గానిక్ సాగులో దూసుకుపోతున్న హాలికులు

ఈనాడు, అమరావతి

రసాయన ఎరువుల వాడకానికి తాళలేక తల్లడిల్లుతున్న నేల తల్లికి సేంద్రియ సాగుతో సాంత్వన కలిగించడమే లక్ష్యంగా ఈ రైతులు ఆర్గానిక్ సాగులో దూసుకెళ్తున్నారు. ప్రకృతిలో దొరికే ఔషధ గుణాలున్న ఆకులు, ఇతర పదార్థాలతో తయారు చేసిన కషాయాలు, ఎరువులతో అద్భుతాలు చేస్తున్నారు. తక్కువ పెట్టుబడితో అధిక రాబడి పొంది తోటి ప్రజల ఆరోగ్యానికి రక్షణ కవచాల్లా మారుతున్నారు. ఆదివారం విజయవాడలో నిర్వహించిన ఆర్గానిక్ రైతోత్సవంలో వీరి ఉత్పత్తులు ప్రదర్శించారు.

14 రకాల వరి

✪ ఏ.కొండూరుకు చెందిన శబరీనాథ్ పదేళ్లుగా సేంద్రియ సాగులో కొనసాగుతున్నారు. కాజీపాలిలు, నవారా, మైసూరు మల్లిగ, బ్లాక్‌రైస్, కాలాబట్ట, రాజముడి, రత్నశాలి వంటి 14 వరి రకాలను పండిస్తున్నారు. మిరపకు అంతర పంటలుగా శనగలు, కందులు, పసుపు, మునగను 54 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ✪ సాధారణంగా వరికి ఎకరానికి రూ.40వేలు పెట్టుబడి అవుతుంటే ఈయన రూ.25వేలతో సాగు చేస్తున్నారు. స్వయంగా తయారు చేసుకున్న బీజామృతం, ఘన, ద్రవ జీవామృతాలనే వినియోగిస్తున్నారు. తాను పండించిన వరి, పప్పుధాన్యాలు, మిరప మర పట్టించి ప్యాకింగ్ చేసి విక్రయిస్తున్నారు. ✪ వీటి వినియోగం వల్ల బైరాక్ సామర్థ్యం పెంపుతో పాటు మలబద్ధకం, మధుమేహం, రక్తహీనత, అధిక బరువు, మహిళల్లో పీసీవోడీ సమస్యలకు చెక్ పెట్టవచ్చు. సేంద్రియ సాగులో శబరీనాథ్ కృషికి 2021లో అప్పటి ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు చేతులమీదుగా రైతు నేస్తం పురస్కారం పొందారు.

సేంద్రియ ఉత్పత్తులతో శబరీనాథ్, సిబ్బంది

విభిన్న పంటలతో...

తాను పండించిన స్వీట్‌కార్న్ చూపుతున్న వీరభద్రరావు

✪ పెనుగంచిప్రోలు మండలం అనిగండ్లపాడుకు చెందిన వీరభద్రరావు 14 ఏళ్లుగా సేంద్రియ వ్యవసాయం చేస్తున్నారు. 8.5 ఎకరాల్లో మిరప ప్రధాన పంటగా ధనియాలు, ఆవాలు, ఉల్లిపాయ, పెసర, స్వీట్‌కార్న్, బొబ్బెర వంటి 10 అంతర పంటలుగా సాగు చేస్తున్నారు. ✪ రసాయన ఎరువులు వాడిన పొలాల్లో ఎకరానికి 12 క్వింటాళ్ల దిగుబడి వస్తే గొప్ప. సేంద్రియ సాగు ద్వారా ఎకరానికి రూ.1.5లక్షలు పెట్టుబడితో 20 క్వింటాళ్ల దిగుబడి సాధిస్తున్నారు. ✪ సాధారణంగా క్వింటాల్ మిర్చి రూ.15-20వేలు ఉండడం గగనం. వీరభద్రరావు రూ.50వేలకు అమ్ముతున్నారు. మిర్చి విక్రయాలతో పాటు ఆయనే కారం మర పట్టించి అమ్ముతున్నారు. ఈ సీజన్‌లో 12క్వింటాళ్ల కారం అమ్మారు. ఏటా రూ.లక్షల్లో ఆదాయం పొందుతున్నారు.

చూస్తే మీరు.. ఫ్లాట్ అవుతారు!

గత వైకాపా పాలనలో మొట్టూ పిచ్చి మొక్కలతో భూత్ బంగ్లాల మారిన టిడ్కో గృహాలపై కూటమి ప్రభుత్వం రాగానే దృష్టి సారించింది. విజయవాడ గ్రామీణ మండలం జక్కంపూడి పరిధిలో 3వేల గృహాలను రంగులు వేసి పూర్తి స్థాయిలో సిద్ధం చేశారు. ఏప్రిల్‌లో లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నారు.

–ఈనాడు, అమరావతి

'దైవంతో రాజకీయం చేస్తే పుట్టగతులుండవు'

మచిలీపట్నం(కోనేరుసెంటరు), న్యూస్‌టుడే: అవినీతి, అక్రమాల్లో నిండా మునిగి.. చివరకు రాజకీయ మనుగడ కోసం వేంకటేశ్వరస్వామిపై తీవ్ర అపవాదులకు పాల్పడుతున్న వైకాపా పుట్టగతులుండవని కూటమి నాయకులు హెచ్చరించారు. ఆదివారం స్థానిక తెదేపా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మంత్రి కొల్లు రవీంద్ర, ఆప్కాబ్ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు, ఎమ్మెల్సీ పంచుమర్తి అనూరాధ, ఎమ్మెల్యేలు యార్లగడ్డ వెంకట్రావు, వెనిగండ్ల రాము తదితరులు మాట్లాడారు. పవిత్ర లడ్డూ ప్రసాద కల్తీ విషయంలో అడ్డంగా దొరికిపోయిన జగన్మోహన్‌రెడ్డి తప్పించుకునేందుకు చట్టసభల్లోకి స్వామివారి చిత్రపటాలను తీసుకువచ్చి అవమానించడం అత్యంత హేయమన్నారు. దేవునిపై భక్తి లేకుండా హిందువుల మనోభావాలను తీవ్రంగా అవమానపరుస్తున్న వైకాపా నాయకులంతా తగు మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. స్వామివారి మాడవీధుల్లో చెప్పులేసుకుని తిరిగిన జగన్.. తన ఐదేళ్ల పాలనలో ఏనాడూ ముఖ్యమంత్రి హోదాలో సతీసమేతంగా స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించలేదన్నారు. శ్రీవారి మహా ప్రసాదాన్ని ఏనాడు తినని ఆయన దానిని కల్తీ నెయ్యితో చేయించేందుకు తెగబడడం మహాపాపమన్నారు. జగన్ డైరెక్షన్‌లో దుశ్చర్యలకు పాల్పడుతూ శ్రీవారితో పెట్టుకుంటే కాలం ఏవిధంగా శిక్షిస్తుందో వైకాపా నాయకులు గుర్తెరిగి మెలగాలని మంత్రి కొల్లు, ఆప్కాబ్ ఛైర్మన్ కొనకళ్ల, ఎమ్మెల్సీ అనూరాధ, ఎమ్మెల్యేలు యార్లగడ్డ, వెనిగండ్లలు హితవు పలికారు. తెదేపా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వీరంకి గురుమూర్తి, గోపు సత్యనారాయణ, డీసీఎంఎస్ ఛైర్మన్ బండి రామకృష్ణ, భాజపా జిల్లా అధ్యక్షుడు తాతినేని శ్రీరామ్‌లు మాట్లాడుతూ వేంకటేశ్వర స్వామిని రాజకీయ వేదికగా మార్చుకోవడం వైకాపా దిగజారుడుతనాన్ని బహిర్గత పరుస్తోందన్నారు. ఇప్పటికైనా వైకాపా నాయకులు బహిరంగ క్షమాపణలు కోరుకోవాలని డిమాండ్ చేశారు.

సమావేశంలో పాల్గొన్న మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యేలు యార్లగడ్డ వెంకట్రావు, వెనిగండ్ల రాము, కొనకళ్ల, అనూరాధ తదితరులు

పగలంతా దడదడ.. రాత్రయితే గడగడ

నందివాడ మండలం కురిపిరాల నుంచి రామాపురం వరకు సుమారు 10 కి.మీ మేర రహదారి అత్యంత దారుణంగా ఉంది. ముక్కలు చెక్కలుగా మారింది. అక్కడక్కడా మాత్రమే రోడ్డు కనిపిస్తోంది. గుంతలు కూడా పూడ్చడం లేదని, ఒళ్లు హూనమైపోతోందని, వాహనాలు పాడవుతున్నాయని చోదకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళ క్షేమంగా ఇల్లు చేరడం కూడా కష్టంగా ఉందని వాపోతున్నారు.

- ఈనాడు, కృష్ణా

అరిపిరాల సమీపంలో..

రామాపురంలో రహదారుణం..

నాటి నిర్లక్ష్యం.. నేడు శాపం!

గత వైకాపా పాలనలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల భవనాలను అట్టహాసంగా ప్రారంభించారు. భవనాల నిర్మాణంలో నాణ్యత లేక చాలా చోట్ల గోడలు బీటలు వారుతున్నాయి. నందివాడ మండలం రామాపురంలో కాకరాల భాస్కరరావు పీహెచ్‌సీలో పైకప్పు పెచ్చులూడిపడుతోంది. ప్రాంగణం మెట్ల వద్ద ఫ్లోరు కుంగిపోయింది. అందులో నుంచి కేంద్రంలోకి తాచుపాము రావడంతో సిబ్బంది, రోగులు భయభ్రాంతులకు లోనయ్యారు. ఈ భవనం దుస్థితిని గత బుధవారం శాసనసభలో ఎమ్మెల్యే లేవనెత్తి పరిష్కరించాలని కోరారు. -ఈనాడు, కృష్ణా

పైకప్పు పెచ్చులూడిపడుతూ..

భవనం మెట్ల వద్ద కుంగిన ఫ్లోర్

కక్కుర్తిపడితే.. కటకటాలే..!

అనిశాకు చిక్కుతున్న ఉద్యోగులు

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే

✪ నగరానికి చెందిన సుబ్బారావుకు బ్యాంకు లాకరుతో పాటు ఖాతాల్లో రూ.50 లక్షల వరకు నగదు ఉంది. పెద్ద మొత్తంలో స్థిరాస్థులూ ఉన్నాయి. ఒక రోజు అకస్మాత్తుగా చనిపోయారు. ఆయన పేరుతో ఉన్న ఆస్తుల కోసం కుటుంబ సభ్యులు బ్యాంకును ఆశ్రయించారు. కుటుంబ ధ్రువీకరణ పత్రం తెస్తేనే.. అవి ఇస్తామన్నారు.

✪ వారసత్వంగా వచ్చిన ఆస్తి విషయంలో అన్నదమ్ముల మధ్య వివాదం నెలకొంది. తర్వాత ఇద్దరూ రాజీపడ్డారు. రెవెన్యూ అధికారులను సంప్రదించగా.. కుటుంబ ధ్రువీకరణ పత్రం తెస్తేనే ఆస్తిని బదలాయిస్తామని స్పష్టం చేశారు.

ప్రస్తుత పరిస్థితుల్లో ఆస్తుల బదలాయింపు, ఇతర ఆర్థిక లావాదేవీల్లో కుటుంబ ధ్రువీకరణ పత్రం అత్యంత కీలకంగా మారింది. దీన్నే ఆసరాగా చేసుకున్న కొంత మంది అధికారులు.. లంచం డిమాండ్ చేస్తున్నారు. దీనికి ఇష్టపడని ప్రజలు.. అనిశా అధికారులకు ఫిర్యాదు చేసి.. అక్రమార్కులను పట్టిస్తున్నారు. గత నెల 23న రామలింగేశ్వరపేటకు చెందిన కూచిభొట్ల వెంకట పర్వతేశ్వర రవికుమార్ అనే వ్యక్తి.. కుటుంబ పత్రం కోసం దరఖాస్తు చేసుకున్నారు. వార్డు రెవెన్యూ కార్యదర్శి వంజరపు వెంకటేశ్.. రూ.5లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తర్వాత రూ.50 వేలు తెమ్మన్నారు. చివరకు రూ.45వేలు తీసుకుంటూ అనిశా అధికారులకు దొరికిపోయాడు. ఇదే కేసులో మరో రెవెన్యూ కార్యదర్శి గుడ్డేటి విజయ గాంధీ అనిశా అధికారులకు దొరకకుండా పారిపోయాడు. తాజాగా శనివారం విజయవాడ నార్త్ ఎమ్మార్వో కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దారుగా పని చేస్తున్న అప్పారావు రూ.12వేలు లంచం తీసుకుంటూ దొరికిపోయాడు.

లంచం అడిగితే ఈ నంబర్లకు ఫిర్యాదు చేయండి.
టోల్ ఫ్రీ: 1064
విజయవాడ రేంజ్ డీఎస్పీ: 94404 46164

జనవరి 23న అనిశా అధికారులకు దొరికిన వంజరపు వెంకటేశ్

జారీ చేసే పద్ధతి ఇదీ.. కుటుంబ ధ్రువీకరణ పత్రం కోసం వచ్చిన దరఖాస్తులను రెవెన్యూ అధికారులు పరిశీలిస్తారు. దరఖాస్తుదారుని ఇంటికి వెళ్లి చుట్టుపక్కల వారిని విచారిస్తారు. కుటుంబ సభ్యుల వివరాలను ఆరా తీసి నిర్ధారించుకుంటారు. ఆ సమయంలో దరఖాస్తులో పేర్కొన్న సభ్యులందరితో మాట్లాడతారు. అన్నీ నిర్ధారించుకుని, సక్రమంగా ఉంటే పత్రం ఇస్తారు. దీనికి కొన్ని రోజులు పడుతుంది. అలాంటిది ఏమీ లేకుండా.. తూతూమంత్రంగా విచారణ జరిపి, కుటుంబ పత్రం ఇస్తామని కొందరు అధికారులు లంచం డిమాండ్ చేస్తున్నారు. అన్నీ సక్రమంగా ఉన్నా.. లంచం ఎందుకు ఇవ్వాలని దరఖాస్తుదారులు అనిశా అధికారులకు ఫిర్యాదు చేసి పట్టించేస్తున్నారు.

(c) eenadu

ఎండాకాలంలోనూ మోకాళ్ల లోతు నీరు

జగనన్న కాలనీ లబ్ధిదారుల గగ్గోలు

మురుగులో ఓ పేదవాడు వేసుకున్న రహదారి

కాలనీలో నిలిచిన నీరు

గుడివాడ, న్యూస్‌టుడే

వైకాపా ప్రభుత్వ హయాంలో గుడివాడ పట్టణంలోని నిరుపేదల కోసం మల్లాయపాలెం గ్రామ పరిధిలో సుమారు 77 ఎకరాలలో 7007 ఇళ్ల ప్లాట్లను 'జగనన్న కాలనీ'గా ఇచ్చారు. అయితే ఈ ప్లాట్ల మెరక కాంట్రాక్టును ఆనాటి మంత్రి కొడాలి నాని అంతరంగీకులు చేపట్టారు. ఈ పనుల్లో సుమారు రూ.45 కోట్లకు పైగా దండుకుని ఇళ్ల ప్లాట్లను అడుగు ఎత్తు కూడా మెరక చేయలేదని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. పాములు, విష పురుగుల భయం, మోకాళ్ల లోతు మురుగులో జీవనం చేయలేక మళ్లీ అద్దె ఇళ్లలోనే జీవనం సాగిస్తున్నారు. గత్యంతరం లేని కొందరు మాత్రం నిత్యం మురుగు నీటిలోనే రాకపోకలు సాగిస్తున్నారు.

☛ మల్లాయపాలెంలోని జగనన్న కాలనీలో 7007 ఇళ్ల ప్లాట్లను ఏర్పాటు చేసి వాటిలో 4363 మందికి ఇళ్ల పట్టాలను ఇచ్చి గృహ నిర్మాణ రుణాలు మంజూరు చేశారు. కానీ ఇక్కడ రోడ్లు, తాగు నీటి వసతి, డ్రెయినేజీ సదుపాయం లేక పడరాని పాట్లు పడుతూ 1636 మందే ఇళ్ల నిర్మాణం పూర్తి చేశారు. అయినా వీరిలో వేయి మంది కూడా వారిళ్లలో వారు నివాసం ఉండటం లేదంటే ఇక్కడ పరిస్థితి ఎంత ఘోరమో అర్థం చేసుకోవచ్చు. తక్షణం అధికారులు స్పందించి కనీస వసతులు కల్పించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

కొండలమ్మకు పూజలు

వేమవరం(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే: మండలంలోని వేమవరం శ్రీకొండలమ్మ తల్లి దేవస్థానాన్ని ఆదివారం జిల్లా నలుమూలల నుంచి 20 వేల మంది భక్తులు సందర్శించి పూజలు చేశారు. మహిళలు సామూహిక పాలపొంగళ్లు వండి నైవేద్యంగా సమర్పించారు. ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, గుడివాడ స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్‌క్లాస్ కోర్టు మేజిస్ట్రేట్ దాసరి సుధాకర్ కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు. గుంటూరుకు చెందిన పి.ఈశ్వర్‌కుమార్ దంపతులు రూ.25 వేల నగదును విరాళంగా అందించారు. ఛైర్మన్ ఈడే మోహన్, ఈవో కొండలరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.



మేజిస్ట్రేట్ సుధాకర్‌కు ప్రసాదాలు అందజేస్తున్న ఈవో కొండలరావు

శ్రీలక్ష్మణ యోగీంద్రుల విగ్రహ ప్రతిష్ఠ

వక్కలగడ్డ(చల్లపల్లి): ధ్యానం ద్వారా మనిషి మనస్సు ప్రశాంతతను కోరుకుంటుందని శ్రీలక్ష్మణ యోగీంద్రుల విద్యాకేంద్రం గురువులు మద్దుల వసంత నాగలక్ష్మి-రామకృష్ణ దంపతులు అన్నారు. ఆదివారం వక్కలగడ్డలో దాతల సహకారంతో నిర్మించిన శ్రీలక్ష్మణ యోగీంద్రుల సనాతన బ్రహ్మ వికాసకేంద్రాన్ని ఆదివారం ప్రారంభించారు. అన్న ప్రసాద వితరణ చేశారు.

యూరాలజీ సేవలు.. మరింత నాణ్యంగా..!

సిద్ధార్థ మెడికల్ కళాశాలకు పీజీ సీట్ల మంజూరు

కొత్తాసుపత్రిలో వైద్యుల కొరతకు పరిష్కారం

ఈనాడు, అమరావతి

డాక్టర్ శ్రీధర్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపల్ డాక్టర్ ఏడుకొండలు

విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో యూరాలజీ సూపర్ స్పెషాలిటీ సేవల నిర్వహణ మరింత మెరుగుపడనుంది. ప్రభుత్వ ఆసుపత్రికి అనుబంధంగా ఉన్న సిద్ధార్థ వైద్య కళాశాలకు.. తాజాగా యూరాలజీ విభాగంలో రెండు సూపర్ స్పెషాలిటీ పీజీ సీట్లు మంజూరయ్యాయి. ఎంబీబీఎస్, ఎంఎస్ పూర్తి చేసిన ఇద్దరు వైద్యులు.. ఇక్కడ ఎంసీహెచ్ యూరాలజీ సూపర్‌స్పెషాలిటీ కోర్సు చేస్తూ ఆసుపత్రిలో సేవలు అందించనున్నారు.

కొత్త ప్రభుత్వ ఆసుపత్రిలో సూపర్‌స్పెషాలిటీ సేవల కోసం రూ.150 కోట్లతో గత తెదేపా ప్రభుత్వ హయాంలో అధునాతనంగా ఐదంతస్తుల భవనాన్ని నిర్మించారు. కానీ సూపర్‌స్పెషాలిటీ సేవలు అందించేందుకు వైద్య సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తోంది. సిద్ధార్థ కళాశాలలో ప్రస్తుతం న్యూరో సర్జరీ 05, ప్లాస్టిక్ సర్జరీ 05, న్యూరాలజీ 05 చొప్పున సూపర్‌స్పెషాలిటీ పీజీ సీట్లున్నాయి. గతంలో ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా ఉన్న డాక్టర్ ఎ.వి.రావు, సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపల్, ప్రస్తుత ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ డాక్టర్ ఎ.ఏడుకొండలరావు ఆధ్వర్యంలో.. నెఫ్రాలజీ, కార్డియాలజీ విభాగాల్లో నాలుగేసి, యూరాలజీకి రెండు సూపర్‌స్పెషాలిటీ సీట్లు కావాలంటూ ఎన్ఎంసీకి ప్రతిపాదన పెట్టారు. ఈ నేపథ్యంలోనే యూరాలజీకి రెండు సీట్లను ఎన్ఎంసీ కేటాయించింది.

వైద్యులు లేక ఇబ్బందులు..

ఆసుపత్రిలోని యూరాలజీ విభాగంలో ప్రొఫెసర్, ఒక అసోసియేట్, ఇద్దరు అసిస్టెంట్లుండాలి. కానీ ఒక ప్రొఫెసర్, అసిస్టెంట్ వైద్యులు మాత్రమే ఉన్నారు. వైద్య సేవలు అందించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. తాజాగా ఎన్ఎంసీ రెండు ఎంసీహెచ్ యూరాలజీ సీట్లను కేటాయించడంతో ఇద్దరు వైద్యులు అదనంగా సేవలు అందించేందుకు రాబోతున్నారు.

ఈ ఏడాది నుంచే అందుబాటులోకి..

సిద్ధార్థ వైద్య కళాశాలలో ఈ విద్యా సంవత్సరం నుంచే రెండు ఎంసీహెచ్ యూరాలజీ సూపర్‌స్పెషాలిటీ సీట్లు అందుబాటులోకి రానున్నాయని ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.ఏడుకొండలు తెలిపారు. యూరాలజీ విభాగానికి ఈ రెండు సీట్లు కేటాయించడం.. కళాశాలకు గౌరవ కారణమని ఆనందం వ్యక్తం చేశారు. యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ శ్రీధర్, ఇతర వైద్యులను ఆయన అభినందించారు. గత కొన్నేళ్లుగా అందిస్తున్న ఉత్తమ వైద్య సేవలు, అధ్యాపకుల కృషి వల్లే ఇది సాధ్యమైందన్నారు. మరింత నాణ్యంగా సూపర్‌స్పెషాలిటీ సేవలను ప్రజలకు అందించేందుకు వీలు కలుగుతుందన్నారు.

వికసిత్ భారత్‌లో భాగస్వాములు కావాలి

ఆత్కూరు(గన్నవరం గ్రామీణం), న్యూస్‌టుడే: యువత తమకు నచ్చిన రంగంలో ప్రావీణ్యం సాధించి వికసిత్ భారత్‌లో భాగస్వాములు కావాలని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు సూచించారు. ఉంగుటూరు మండలం ఆత్కూరు స్వర్ణభారత్ ట్రస్టు ఆవరణలో నైపుణ్య శిక్షణ పొందుతున్న యువతీయువకులతో ఆయన ఆదివారం ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భారత్ శక్తివంతమైన దేశమని, నూతన ఆవిష్కరణల దిశగా అడుగులు వేయాలన్నారు. ప్రధాని మోదీ నిర్దేశించిన 2047 వికసిత్ భారత్ లక్ష్యం దిశగా యువత ముందుకు సాగాలన్నారు. జీవనైపుణ్యాలను మెరుగు పరుచుకుంటూ ఆహారపు అలవాట్లు, సమయపాలన, ఇతర అంశాలపై పలు సూచనలు, సలహాలు చేశారు. అనంతరం వివిధ నైపుణ్య శిక్షణ కోర్సులు పూర్తిచేసుకున్న యువతకు ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు డైరెక్టర్ పరదేశి, సీఈవో శరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ పూర్తి చేసుకున్న యువతీయువకులతో మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు తదితరులు

☛ ట్రస్టు ఆవరణలో ఉచిత హోమియోపతి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వెంకయ్యనాయుడు సందర్శించారు. రోగులతో ముచ్చటించి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ప్రముఖ హోమియోపతి వైద్యులు పీవీ.సత్యనారాయణ పర్యవేక్షణలో డా.జీవీ [illegible] మెమోరియల్ హోమియోపతి సెల్ఫ్ రియలైజేషన్ ఫోరం, స్వర్ణభారత్ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 25వ తేదీ వరకు ఉచిత హోమియో వైద్యం కొనసాగనుంది.

తెలుగుజాతి సంక్షేమమే తెదేపా ధ్యేయం

మచిలీపట్నం(కోనేరుసెంటరు), న్యూస్‌టుడే: తెదేపా తెలుగుజాతి సంక్షేమం కోసం కట్టుబడి ఉంటుందని మంత్రి రవీంద్ర అన్నారు. నగరంలోని వలందపాలెంలో నూతనంగా నిర్మిస్తున్న తెదేపా జిల్లా కార్యాలయ భవన నిర్మాణానికి ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు, పార్టీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వీరంకి గురుమూర్తి, గొర్రెపాటి సత్యనారాయణ, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులతో కలిసి మంత్రి శంకుస్థాపన చేశారు. కొల్లు మాట్లాడుతూ నాలుగు దశాబ్దాలుగా కలగా మిగిలిపోయిన జిల్లా కేంద్రంలో పార్టీ కార్యాలయ భవనానికి శంకుస్థాపన చేసుకోవడం ఎంతో సంతోషకరమన్నారు. అధికారంలో ఉన్నా లేకపోయినా నిరంతరం ప్రజా సమస్యలపై దృష్టిపెట్టడమే పార్టీ లక్ష్యమన్నారు. జిల్లా అభివృద్ధి, పేద, బడుగు, బలహీన వర్గాల భవిష్యత్తు తదితరాలకు సంబంధించిన కార్యాచరణ వేదికగా కీలక నిర్ణయాలు తీసుకుంటామన్నారు. ఎమ్మెల్యేలు బోడె ప్రసాద్, యార్లగడ్డ వెంకట్రావు, వెనిగండ్ల రాము, కాగిత కృష్ణప్రసాద్, వర్ల కుమార్‌రాజా, ఎమ్మెల్సీ అనూరాధ, పార్టీ నాయకులు వైవీబీ రాజేంద్రప్రసాద్, రావి వెంకటేశ్వరరావు, బూరగడ్డ వేదవ్యాస్, స్వర్ణలత, ఆళ్ల వెంకట గోపాలకృష్ణ, శంకర్‌బాబు, కనపర్తి శ్రీనివాస్, జిల్లా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన నాయకులు, కూటమి నేతలు పాల్గొన్నారు.

శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి రవీంద్ర, నాయకులు

స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడకు నివాళి

కలెక్టరేట్(మచిలీపట్నం), న్యూస్‌టుడే: స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం కలెక్టరేట్, జిల్లా ఎస్పీ కార్యాలయాల్లో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కలెక్టరేట్‌లో ఉయ్యాలవాడ చిత్రపటానికి నివాళులర్పించిన కలెక్టర్ డీకే బాలాజీ మాట్లాడుతూ సిపాయిల తిరుగుబాటుకు ముందే ఆంగ్లేయుల పాలనను ఎదురించి పోరాడిన తెలుగు యోధుడు ఉయ్యాలవాడ అని పేర్కొన్నారు. అన్యాయమైన శిస్తులు, భూ వివాదాలపై పోరాడుతూ వీరమరణం పొందిన ఆయన చిరస్మరణీయులన్నారు. జిల్లా గిరిజన సంక్షేమ శాఖాధికారి ఫణిధూర్జటి, డిప్యూటీ కలెక్టర్ నారాయణ, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

☛ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఉయ్యాలవాడ చిత్రపటానికి ఏఆర్ ఏఎస్పీ సత్యనారాయణ పూలమాల వేసి నివాళులర్పించారు. ఏఆర్ డీఎస్పీ వెంకటేశ్వరరావు, ఆర్ఐలు రవికుమార్, రవికిరణ్, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ బాలాజీ

చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఏఎస్పీ సత్యనారాయణ

రోశయ్య జీవితం ఆదర్శనీయం

మచిలీపట్నం(గొడుగుపేట), న్యూస్‌టుడే: రోశయ్య సేవలు ఆదర్శనీయమని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. నగరంలోని బైపాస్ రోడ్డు వాసవీ భవన్‌లో ఏర్పాటు చేసిన మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య విగ్రహాన్ని ఆదివారం ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు తదితరులతో కలిసి మంత్రి ఆవిష్కరించారు. కొల్లు మాట్లాడుతూ రోశయ్య స్పీకర్, మంత్రి, ముఖ్యమంత్రి ఇలా వివిధ హోదాల్లో తనదైన గుర్తింపు పొందారని అన్నారు. [illegible] సుందరయ్య, గౌతు లచ్చన్న రోశయ్యలాంటి వారి హయాంలో అర్థవంతమైన చర్చలు జరిగేవన్నారు. ప్రస్తుతం అలాంటి చర్చల [illegible] సమయం సరిపోతోందన్నారు. రోశయ్య జీవితం నేటి రాజకీయ నాయకులకు ఆదర్శనీయమన్నారు. ఆర్యవైశ్యులకు కూటమి ప్రభుత్వం అన్నివిధాలా అండగా ఉంటుందన్నారు. ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు సన్నిధి నాగసాయిశ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు చిన్ని రామసత్యనారాయణ, కార్పొరేషన్ [illegible] ప్రగడ వీరాంజనేయులు, జిల్లా ప్రధాన కార్యదర్శి [illegible] శ్రీనివాస్, ప్రతినిధులు మాటూరి రంగనాథ్, మామిడి వరప్రసాద్, [illegible] మురళీకృష్ణ, తాడేపల్లి మెహెర్‌బాబు, మున్సిపల్ మాజీ ఛైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, కార్పొరేటర్ [illegible] తదితరులు ప్రసంగించారు. తొలుత నగరంలో ర్యాలీ నిర్వహించారు. ఆర్యవైశ్య ప్రముఖులు గుడివాడ గున్నయ్య శెట్టిని సత్కరించారు.

విగ్రహావిష్కరణలో కొల్లు రవీంద్ర, కొనకళ్ల నారాయణ తదితరులు

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు.. ఆస్పత్రిలో మృతి

అవనిగడ్డ(గ్రామీణం), న్యూస్‌టుడే: పులిగడ్డ - పెనుమూడి వారధిపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలై ఆస్పత్రిలో మృతి చెందినట్లు ఎస్సై కె.శ్రీనివాసరావు చెప్పారు. మోపిదేవికి చెందిన నాగదొరబాబు(28) [illegible] జీవనం సాగిస్తున్నాడు. శనివారం రాత్రి మోటారు సైకిల్‌పై నాగాయలంక రేపల్లె నుంచి తిరుగు ప్రయాణంలో పులిగడ్డ- పెనుమూడి వారధిపై ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి అదుపు తప్పి కింద పడిపోయాడు. తలకు తీవ్ర గాయం కాగా 108 వాహనంలో అవనిగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లుగా ఎస్సై చెప్పారు.

రూ.110 కోట్లతో గుడివాడలో తాగునీటి పైపులైన్లు

గుడివాడ, న్యూస్‌టుడే: అమృత్ 2.0 పథకంలో భాగంగా రూ.110 కోట్లతో తాగునీటి పైపులైన్ల నిర్మాణ ప్రాజెక్టు టెండర్లు పూర్తయ్యాయని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. స్థానిక పురపాలక సంఘ కార్యాలయంలో అధికారులతో ఆయన సమావేశం అయ్యారు. యూఐడీఎఫ్ పథకం ద్వారా డ్రెయినేజీల అభివృద్ధికి భారీగా నిధులు విడుదల కానున్నాయన్నారు. ఈ వేసవి కాలం పూర్తయ్యేలోగా బైపాస్ రోడ్డుకు ఇరువైపులా డ్రెయినేజీ నిర్మాణం చేస్తామన్నారు. వర్షాకాలం వచ్చేలోగా పట్టణంలోని ప్రధాన డ్రెయినేజీలను, కల్వర్టులను, రహదారులను నిర్మించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కమిషనర్ సింహాద్రి మనోహర్, మున్సిపల్ డీఈ సతీష్ చంద్ర, నేతలు బూరగడ్డ శ్రీకాంత్, పంద్రాజు సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

చరిత్రకారుడు బాబూరావు మృతి



యద్దనపూడి(కూచిపూడి), న్యూస్‌టుడే: కూచిపూడి, దివిసీమలపై పరిశోధన చేసి నేటి తరానికి విలువైన గ్రంథాలను అందించిన చరిత్రకారుడు యద్దనపూడి విఠల్ వేణుగోపాలరావు అలియాస్ బాబూరావు(88) మృతికి పలువురు సంతాపం తెలిపారు. మొవ్వ మండలం యద్దనపూడి గ్రామానికి చెందిన ఆయన అనారోగ్యంతో హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మరణించారు. ప్రత్యేకంగా శాసనలిపిని నేర్చుకున్న బాబూరావు కూచిపూడి చరిత్ర, దివిసీమ వైభవం, దివిసీమ సర్వస్వం వంటి పుస్తకాలు రచించి మన్ననలు పొందారు. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. అవనిగడ్డ శాసనసభ్యుడు మండలి బుద్ధప్రసాద్, సీపీఎం మండల కార్యదర్శి శీలం నారాయణరావు, మొవ్వ వ్యవసాయమార్కెట్ కమిటీ పూర్వ కార్యదర్శి శివరామ ప్రసాద్, కళారత్న డాక్టర్ వేదాంతం రాధేశ్యామ్, డాక్టర్ వేదాంతం రామలింగశాస్త్రి, డాక్టర్ చింతా రవిబాలకృష్ణ, పసుమర్తి హరనాధశాస్త్రి, మండల సీపీఎం కమిటీ సభ్యులు తమ సంతాపం తెలిపారు.

బ్రాయిలర్ ధరలు

(కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -115 రిటైల్ ధర 142 చికెన్ విత్ స్కిన్ - 206 చికెన్ స్కిన్‌లెస్ - 234.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 132, 141, 152 చికెన్ విత్ స్కిన్ - 250 చికెన్ స్కిన్‌లెస్ - 260.

రైలు ఢీకొని వ్యక్తి...

గుడ్లవల్లేరు: స్థానిక నీలకంఠేశ్వరపురం రైల్వే వంతెన వద్ద ఆదివారం ఉదయం బీదరు-మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొని గుర్తుతెలియని 50-55 ఏళ్ల వ్యక్తి మృతి చెందినట్లు మచిలీపట్నం రైల్వే కానిస్టేబుల్ కుమార్ వెల్లడించారు. మృతుడి ఒంటిపై నీలం రంగు చొక్కా, కాషాయం రంగు తువాలు ఉన్నట్లు, మృతదేహాన్ని మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రిలో భద్రపరిచినట్లు తెలిపారు.

జిల్లా సమన్వయ అధికారి వారి కార్యాలయం
ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ - కృష్ణా జిల్లా

బహిరంగ వేలం పాట

ఇందుమూలముగా యావన్మందికీ తెలియజేయునది ఏమనగా.. కృష్ణా జిల్లాలోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకులం, రుద్రవరం, (సాంఘిక సంక్షేమ గురుకుల (బాలుర) పాఠశాల) పాత భవనములు తొలగించి తీసుకువెళ్ళుటకుగాను బహిరంగ వేలము **ది. 27-02-2026న ఉ॥ 11.00 గం॥లకు** Dr. B.R.అంబేద్కర్ గురుకులం, రుద్రవరం, కృష్ణా జిల్లా నందు వేయబడును. కావున ఆసక్తి కలిగినవారు టెండర్ దరఖాస్తు రుసుము రూ. 2,000/- మరియు షరతులకు లోబడి 10% ధరావత్తు సొమ్ము డిడి రూపంలో District Coordinator, APSWREIS, Vijayawada పేరు మీదగా 26.02.2026 సాయంత్రం 05.00లోపు DCO, APSWREIS, Krishna District, Vijayawada కార్యాలయంనందు అందచేసి పేరు నమోదు చేయించుకొనవలసినదిగా తెలియజేయడమైనది. మరియు మిగిలిన వివరముల కొరకు కార్యాలయము పనిచేయు వేళల్లో సంప్రదించగలరు. **ఫోన్ నెం: 80080 03622, 80745 45224.**

జిల్లా కలెక్టర్ వారి తరుపున డిస్ట్రిక్ట్ కో-ఆర్డినేటర్,
ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ - కృష్ణా జిల్లా

పురాణాలు.. భారతీయ సంస్కృతికి మూలాలు

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే: పురాణాలు.. భారత జాతీయ సంస్కృతికి మూలాలని వాఙ్మయి అంతర్జాతీయ తెలుగు సాహితీవేదిక నిర్వాహకులు డా.చింతలపాటి మురళీకృష్ణ తెలిపారు. సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం బమ్మెర పోతనామాత్య విరచిత శ్రీమదాంధ్ర మహాభాగవత మహాయజ్ఞం కార్యక్రమంలో భాగంగా జూమ్‌లో సమావేశం నిర్వహించారు. చింతలపాటితో పాటు ముద్దూరి రామమోహనరావు(మచిలీపట్నం), అక్కిపెద్ది రామసూర్యనారాయణ(రాజమహేంద్రవరం), మునుకుట్ల సూర్యనారాయణమూర్తి(తణుకు)లు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ భక్తిత్వం నైతికతను కాపాడుతుందని, నైతిక విలువలు సంస్కృతిని పోషించి ప్రజలకు సంతృప్తి కలిగిస్తాయన్నారు. అవే అవినీతిని నిర్మూలిస్తాయని తద్వారా సమాజం శాంతిసౌఖ్యాలతో పరిఢవిల్లుతుందన్నారు. భాగవత పురాణం ప్రజల్లో భయభక్తులను పాపభీతిని కలిగించి, పుణ్యమార్గం వైపు నడిపిస్తుందని వివరించారు. భాగవతానికి మతంతో సంబంధం లేదని, కేవలం భక్తి, ఆధ్యాత్మిక చింతన, నైతికత ఇవే ప్రధాన ధర్మాలు అని పేర్కొన్నారు. భగవద్గీత ఏవిధంగా మతాతీతమైన ధర్మాన్ని ప్రబోధిస్తుందో.. భాగవతం కూడా అలాంటిదేనని అన్నారు. పోతన భాగవతం భక్తితో పాటు తెలుగుభాష, పద్యాలకు అద్భుత నిలయమని చెప్పారు. ఇది భవిష్యత్తు తరాలకు అందించడం పండితులు, పెద్దల బాధ్యతన్న విషయాన్ని అందరూ గుర్తించాలని వక్తలు కోరారు.

మాట్లాడుతున్న చింతలపాటి తదితరులు

రావు కొంచాడ(ఆస్ట్రేలియా), నందగిరి శ్రీనివాస్(న్యూజిలాండ్), ఆదిభట్ల కామేశ్వరశర్మ(అబుదాబి), ఉప్పులూరి సర్వమంగళ(అమెరికా), యడవల్లి శిరీష(ఆస్ట్రేలియా)తో పాటు రాష్ట్రంలో వివిధ ప్రాంతాలకు చెందిన సాహితీ ప్రముఖులు పాల్గొన్నారు.

పది విద్యార్థుల అపూర్వ కలయిక

గుడివాడ (నందివాడ): నందివాడ మండలం రుద్రపాక జడ్పీ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి 1989-90 బ్యాచ్ పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం ఆదివారం ఆనందోత్సాహాల మధ్య జరిగింది. ఈసందర్భంగా 36 ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు వారి మధుర స్మృతులను నెమరువేసుకున్నారు. ఉదయం నుంచి వారు ఆడి పాడారు. వారి జీవితాల్లో జరిగిన పలు సంఘటనలను స్నేహితులతో పంచుకున్నారు.

పూర్వ విద్యార్థుల బృంద చిత్రం

చలో విజయవాడ విజయవంతం చేయాలి

గోడపత్రికను ఆవిష్కరిస్తున్న ఎస్టీయూ నేతలు

గుడివాడ, న్యూస్‌టుడే: ఉద్యోగ, ఉపాధ్యాయులు ఆర్థిక బకాయిలు, ఇతర పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 25వ తేదీన ఎస్టీయూ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలో విజయవాడ కార్యక్రమం విజయవంతం చేయాలని సంఘ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి డి.చంద్రశేఖర్ కోరారు. స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో ఈమేరకు సన్నాహక సమావేశం ఆదివారం నిర్వహించి గోడపత్రికను ఆవిష్కరించారు. పీఆర్సీ కమిషన్ నియామకం, 30 శాతం మధ్యంతర భృతి మంజూరు, నాలుగు పెండింగ్ డీఏలు, పెండింగ్ బకాయిల విడుదల, 2003 డీఎస్సీ వారికి పాత పెన్షన్ విధానం అమలు తదితర డిమాండ్లతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఎస్టీయూ నాయకులు ఎంవీఎస్ఎన్.ప్రసాద్, ఐ.అరవింద్, సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఇస్మాయిల్, విజయ్ కుమార్, ఏఎస్‌వీ.ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

నమో.. సూర్యదేవ

వేకనూరులోని సూర్యదేవాలయంలో కల్యాణ మూర్తి అలంకరణ - అవనిగడ్డ గ్రామీణం, న్యూస్‌టుడే

దార్శనిక పత్రం.. జీవనవేదం

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

గుడివాడ, న్యూస్‌టుడే: ఆధ్యాత్మికం నుంచి విప్లవం వైపు జ్ఞాన వారధి నిర్మించే దార్శనిక పత్రంగా జీవనవేదం అనే పుస్తకాన్ని మన్నె శ్రీనివాసరావు అద్భుతంగా మలిచారని ప్రముఖ కవి మంతెన వెంకట శివరామరాజు పేర్కొన్నారు. స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మందిరంలో శ్రీప్రభాకర నాట్య మండలి వారి ఆధ్వర్యంలో మట్టా రాజా అధ్యక్షతన జీవనవేదం కావ్యాన్ని ఆదివారం ఆవిష్కరించారు. సృష్టిని, ప్రకృతిని మానవుడు అవగాహన చేసుకుని సమాజ వికాసానికి ఎలా కృషి చేయాలో తెలిపే ఉత్తమ కావ్యం ఈ జీవనవేదం అన్నారు. వంకాయలపాటి హరిబాబు మాట్లాడుతూ సాహిత్య, కళారంగాలకు మన్నె చేస్తున్న సేవలు ఆదర్శనీయం అన్నారు. ఆయన చరిత్రలో నిలిచిపోయే 80కు పైగా రచనలు చేశారని, నటప్రయోక్తగా 1200 ప్రదర్శనలు ఇచ్చారన్నారు. కార్యక్రమంలో సాహితీ వేత్తలు డాక్టర్ కొడాలి సోమసుందరరావు, యార్లగడ్డ సత్యనారాయణ, పులుగుచిన వీరరాఘవులు, అమరనేని హరిబాబు, పోలూరు సుబ్బారావు, పట్టణ తెదేపా అధ్యక్షురాలు యార్లగడ్డ సుధారాణి, వంగా వంశీ, గోగులమ్మ, నరహరిశెట్టి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

91.9FM Vijayawada 91.9 Mee FM

ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 8008003297

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి అధిక ధరకు కొనబడును (స్పాట్ క్యాష్). ✆ 87907 41166

బంగారం కొనబడును బ్యాంకులలో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి ఈరోజు మార్కెట్ ధరకు కొనబడును స్పాట్‌క్యాష్. 81422 92071

BUSINESS OFFER

విజయవాడ గుంటూరు జిల్లాలో ఉద్యోగ అవకాశాలు మీ ఇంటి నుంచి సంపాదించే అవకాశం. ఏవిధమైన పెట్టుబడి లేని వ్యాపార ఉద్యోగాల కోసం 93999 99867.

FOR SALE

Sale- ఎలెక్ట్రోప్లేటింగ్ రేక్టిఫైర్లు, నికెల్ సొల్యూషన్, టైటానియం బాస్కెట్స్, కేబుల్స్. Cont: 94401 95400, 93476 80600

FINANCIAL SERVICES

Govt. ఉద్యోగస్తులకు, రిటైర్డ్ పెన్షనర్లకు EMI వాయిదా పద్ధతిలో పర్సనల్ ఫైనాన్స్, అన్నితరగతుల వారికి స్థిరాస్తులపై ఫైనాన్స్ ఇవ్వబడును. Cell: 73862 01191.

REAL ESTATE

HOUSE FOR SALE

గుడివాడ 200 గజాలు, నీలామహల్ దగ్గరలో సూరంవారి వీధి నందు రెండు అంతస్తుల ఇంటితో అమ్మకానికి కలదు. గజం-75 వేలు. సంప్ర: 81064 03490

LAND FOR SALE

కృష్ణాజిల్లా మల్లవల్లి A.P. ఇండస్ట్రియల్ ఫుడ్‌పార్క్‌కు ఆనుకుని 6 ఎకరములు ఆదాయం వచ్చు మామిడితోట అమ్మకము. కాంటాక్ట్: 99483 16161.

PLOT FOR SALE

GANNAVARAM

Vacant Plot 150 sqy West Facing near Highway Pottipadu Gannavaram sale. contact Malleswara: 96769 24785

TO LET

COMMERCIAL

బందరు రాజాగారి సెంటర్ మెయిన్‌రోడ్డు సిరివెంకట్ థియేటర్ ప్రక్కన 3x1000Sft 3ఫ్లోర్స్ కొత్తబిల్డింగ్ కమర్షియల్‌గా లీజుకు, లిఫ్ట్‌కలదు. ✆ 92474 33232

విజయవాడలో హైవే ఫేసింగ్‌తో కమర్షియల్ / రిటైల్ స్పేస్ లీజు / అద్దెకు 10,500 చ.అ. మెజ్జనైన్ 2500 చ.అ.. వెస్ట్‌సైడ్ ఎదురుగా, ఎనికేపాడు, విజయవాడ 9866 9966 44 8712 3355 77

JOBS

విజయవాడలోని ప్రముఖ ఎడ్యుకేషన్ కన్సల్టెన్సీ నందు పనిచేయుటకు డేటాఎంట్రీ ఆపరేటర్స్, టెలీకాలర్స్, కౌన్సిలర్స్ కావలెను. Age:18-30Yrs. ✆ 89777 96932

నర్సింగ్ హోమ్ నందు పని చేయుటకు నర్సులు (ANM) మరియు ల్యాబ్ టెక్నీషియన్లు కావలెను. ఉచిత వసతి కలదు. కానూరు, విజయవాడ. ✆ 96667 08089

ప్రముఖ కన్‌స్ట్రక్షన్ & రియల్ ఎస్టేట్ కంపెనీకి మార్కెటింగ్ పర్సన్స్, కార్ డ్రైవర్, DTP ఆపరేటర్ కావలెను. జీతం: 12,000 to 18,000 ✆ 94901 84848

శివ కార్తికేయ హోంకేర్‌లో వృద్ధులు, పేషంట్స్, పిల్లలను చూసుకొనుటకు నర్సులు, వర్కర్స్ కావలెను. ఫ్రీ వసతి, భో.జీ. 20K. ✆ 99120 11499, 99120 11899

MARKETING/ SALES

Anand Masale Require Sales & Marketing Manager, Marketing Executives. Contact: 98496 55105, 98480 53144 Email: anandmasalaappltd@gmail.com.

BOOK YOUR COLOUR CLASSIFIED ₹ 1200/- (5 Lines) PH: 98496 97616 ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

మచిలీపట్నం
•మచిలీపట్నం •పెడన

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

మచిలీపట్నం : 80089 02911, పెడన : 63099 94687

స్పందన: ◆ నగరంలోని డీమార్ట్ నుంచి మాచవరం వెళ్లే రహదారి పక్కన వేసిన చెత్త తొలగించకపోవడంతో రాకపోకలకు అవస్థలుపడుతున్నామని స్థానికులు, ప్రయాణికులు 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా అధికారుల దృష్టికి తీసుకురాగా వారు స్పందించారు. సిబ్బందిని పంపి చెత్త తొలగించి ఆ ప్రాంతాన్ని శుభ్రం చేయించారు. * నగరంలోని జవ్వారుపేటలో రహదారి పక్కన ఉన్న డ్రెయిన్‌లో చెత్త వేయడంతో మురుగుపారుదలకు ఆటంకంగా మారిందని ఆ ప్రాంతవాసులు అధికారులకు ఫిర్యాదు చేయడంతో వారు స్పందించి సిబ్బందిని పంపి పూడిక తొలగింపునకు చర్యలు తీసుకున్నారు. - న్యూస్‌టుడే, మచిలీపట్నం కార్పొరేషన్

◆ బంటుమిల్లి నుంచి గుడివాడ వెళ్లే ప్రధాన రహదారిలో పలు చోట్ల గుంతలు పడ్డాయి. దీంతో వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యపై పలుమార్లు 'ఈనాడు'లో కథనాలు ప్రచురితమవ్వడంతో పాటు ప్రజలు 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా సమస్యను అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారు. కూటమి ప్రభుత్వం స్పందించి ఇప్పటికే గుంతలు పూడ్చి తారు వేసి ఇబ్బంది లేకుండా చేశారు. సుమారు 9 కి.మీ దూరానికి రూ.4 కోట్ల నిధులు మంజూరయ్యాయని వాటితో బీటీ రోడ్డుపై మరో లేయర్ వేయనున్నట్లు బంటుమిల్లి ఆర్‌అండ్‌బీ ఇన్‌ఛార్జి ఏఈ కిశోర్ తెలిపారు.

? బంటుమిల్లి- గుడివాడ ప్రధాన రహదారిలో పెదతుమ్మిడి పరిధిలోని మురుగు కాలువపై ఉన్న వంతెన శిథిలావస్థకు చేరింది. రెయిలింగ్ లేకపోవడంతో వాహన చోదకులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. నూతన వంతెన నిర్మించండి. - ప్రయాణికులు ✔ ప్రభుత్వానికి నివేదిక పంపాం. అనుమతులు రాగానే వంతెన నిర్మాణం ప్రారంభమవుతుంది. - కిశోర్, ఇన్‌ఛార్జి ఏఈ, ఆర్‌అండ్‌బీ, బంటుమిల్లి - న్యూస్‌టుడే, బంటుమిల్లి

ప్రజా సమస్యల పరిష్కార వేదిక నేడు

పెడన: ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీకోసం కార్యక్రమం మండల రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఉదయం జరుగుతుందని తహసీల్దార్ కె.అనిల్ కుమార్ తెలిపారు. ఉదయం 10.30గం.ల నుంచి ప్రారంభం కానున్న ఈ కార్యక్రమానికి ప్రజలు తమ వినతులను అందజేయాలని సూచించారు. వాటిపై సత్వర చర్యలు తీసుకుని పరిష్కారం చేపడతామన్నారు.

నేడు ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం

పామర్రు గ్రామీణం: నిమ్మకూరులో సోమవారం ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా ఆదివారం తెలిపారు. ఎన్టీఆర్ ట్రస్టు సహకారంతో బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రి వారు కల్యాణ మండపంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు శిబిరం నిర్వహిస్తున్నారన్నారు.

విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ

అవనిగడ్డ గ్రామీణం: అశ్వారావుపాలెంలో గల తాగునీటి పథకం వద్ద గ్రామ సర్పంచి పంద్రాజు నాగ వెంకట లంకమ్మప్రసాద్ అధ్వర్యంలో మండలి వెంకటకృష్ణారావు విగ్రహం ఏర్పాటుకు ఆదివారం మండలి వెంకట్రామ్ భూమి పూజ చేశారు.

ధర వరలు

కిలో టమాట రూ.15, వంగ 20, బెండ 24, పచ్చిమిర్చి 44, కాకర 30, క్యాబేజీ 16, క్యారెట్ 24, దొండ 33, బంగాళదుంప 23, ఉల్లిపాయలు 22, గోరుచిక్కుడు 26, దోస 27, సొర 10,08, అరటికాయ 7,6, బీట్‌రూట్ 26, బీర 24, చామదుంప 24, ముల్లంగి 08/10, కంద 40, క్యాప్సికం 64, అల్లం 60, కీరదోస 40, బీన్స్ 60, అలసందలు 24, చిలకడదుంప 30, కొత్తిమీర 12/06, పుదీనా 15/05.(ఆదివారం ఉదయం 7 గంటల వరకు ఉన్న ధరలు వర్తిస్తాయి.) ఏదైనా సమస్యలుంటే ఎస్టేట్ అధికారి బలిచక్రవర్తి ఫోన్ నంబరు 91823 61295కు సంప్రదించవచ్చు.

సినిమాలు

రేవతి: నవాబ్ కేఫ్
మినీ రేవతి: బాకీ
సిరికృష్ణ: మన శంకరవరప్రసాద్
సిరివెంకట్: హే బల్వంత్
-మచిలీపట్నం(గొడుగుపేట), న్యూస్‌టుడే

మారేనా తీరు.. అందేనా సాగునీరు?

మచిలీపట్నం(గొడుగుపేట), గూడూరు, న్యూస్‌టుడే: సాగునీటి కాలువల్లో పూడిక ఇతర సమస్యలను పరిష్కరించేందుకు ఏటా వేసవిలో ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ పనులు చేయాల్సి ఉంది. ఈ ఏడాది ఇప్పటి వరకు ఎలాంటి ప్రతిపాదనలు చేయకపోవడం, కొన్నేళ్లుగా సమస్యలను అలానే వదిలేయడంతో ఆయా ప్రాంతాల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

★ బందరు, పెడన నియోజకవర్గాల్లోని ప్రధాన కాలువలన్నీ కుంచించుకుపోయి గట్టు కోతకు గురై బలహీనంగా తయారయ్యాయి. బంటుమిల్లి కాలువ ద్వారా పెడన, కృత్తివెన్ను మండలాల్లో వేలాది ఎకరాల ఆయకట్టు సాగవుతోంది. ఈ కాలువను గత వైకాపా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో అధ్వానంగా మారింది. గతంలో పెడన మండలంలోని లంకలకలవగుంట పరిధిలో కాలువకు గండి పడడంతో వందలాది ఎకరాలు ముంపుబారిన పడ్డాయి.

★ గూడూరు, పెడన, బందరు మండలాల్లో విస్తరించి ఉన్న రామరాజుపాలెం వంతెన వద్ద గట్టు కోతకు గురయ్యాయి. అనేకచోట్ల ఇదే పరిస్థితి నెలకొంది. కుంకటవ పరిసర గ్రామాలకు నీరు అందించే మామిడికోళ్ల ఛానల్ కూడా అధ్వానంగా ఉంది.

గూడూరు: రామరాజుపాలెం వద్ద కుంచించుకుపోయిన కాలువ గట్టు

★ మల్లవోలు పంచాయతీ పరిధిలో 6 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. మల్లవోలు కాలువ, కొత్తమేజర్, దిడిని కాలువల్లో తూడుతో నిండిపోయాయి. దీంతో ఏటా చివరి భూములకు సాగునీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

★ మరోవైపు ప్రధాన కాలువలకు అనుబంధంగా ఉన్న పంట కాలువలు అస్తవ్యస్తంగా మారాయి. కాలువలు తవ్వకాలు, తూడు తొలగింపు పనులు సక్రమంగా చేపట్టకపోవడంతో పొలాలకు నీరందని దుస్థితి నెలకొంది. వివిధ ప్రాంతాల్లో ఉన్న కాలువలు గుర్రపుడెక్కతో నిండిపోయాయి. ప్రధాన కాలువల నుంచి వచ్చే నీరు పొలం, చెరువు వరకు చేరాలంటే ఈ కాలువలే ఆధారం. వీటిని పట్టించుకోకపోవడంతో పొలాలకు నీరందక రైతులే తలా కొంత వేసుకుని పూడిక తొలగింపు పనులు చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది.

★ బందరు కాలువ వెంట పలుచోట్ల ఆక్రమణల ద్వారా కాలువ గట్టు కుంచించుకుపోయి గండ్లుపడే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. గూడూరు మండలం ఆకుమర్రు లాకులు, పెడన మండలం కమలాపురం లాకుల వద్ద డ్రాప్‌ల తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. లాకులు పటిష్ఠం చేస్తే చాలా వరకు సమస్యలను పరిష్కరించినట్టవుతుంది. కానీ అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకుంటున్న దాఖలాలు కనిపించడంలేదు. ప్రభుత్వం స్పందించి త్వరితగతిన పనులు చేపట్టేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

కమలాపురంలో చోరీ

పెడన, న్యూస్‌టుడే: పెడన మండలం కమలాపురంలో మూసి ఉన్న ఇంట్లో చోరీ జరిగిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఈ గ్రామ వాసి కొట్టి శివన్నారాయణ ఇటీవల మృతి చెందారు. దీంతో కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి సమీపంలోని శింగరాయపాలెంలో నివాసం ఉంటున్నారు. ఈ విషయాన్ని గమనించిన గుర్తు తెలియని వ్యక్తులు మూడు రోజుల కిందట తలుపులు ధ్వంసం చేసి ఇంట్లోకి ప్రవేశించి కొన్ని వెండి వస్తువులు, కొంత బంగారాన్ని అపహరించారు. సొత్తు విలువ దాదాపు రూ.5 లక్షలు ఉంటుందని అంచనా వేస్తున్నారు. దీనిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ గ్రామానికి సమీపంలో ఉన్న చేవేంద్రపాలెంలో నాలుగు నెలల కిందట ఇదే తరహా సంఘటన జరిగింది. కుటుంబ సభ్యులు గృహానికి తాళం వేసి మచిలీపట్నం వెళ్లిన సమయంలో ఇంట్లో ప్రవేశించిన దుండగులు రూ. 20 లక్షలకు పైగా విలువైన సొత్తును దొంగిలించారు. ఈ కేసు ఇప్పటి వరకు కొలిక్కి రాలేదు.

ఆలయ ఇన్‌ఛార్జి ఈవోగా మోహనరావు

కోడూరు: కోడూరు మండలంలోని విశ్వనాథపల్లిలో కొలువై ఉన్న శ్రీఅద్దంకి నాంచారమ్మ అమ్మవారి ఆలయానికి ఇన్‌ఛార్జి ఈవోగా టీవీవీ. మోహనరావు నియమితులయ్యారు. ఆయన గతంలో ఇక్కడ పని చేసి మచిలీపట్నం బదిలీ అయ్యారు. ప్రస్తుతం మచిలీపట్నంలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయానికి ఈవోగా పని చేస్తున్నారు. ఆయనకే ఇన్‌ఛార్జి బాధ్యతలను అప్పగించారు.

నిధులున్నా.. నీరసమేనా?

పెడన మండలంలోని చేవేంద్రపాలెం నుంచి ఉప్పలకలవగుంట వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. రహదారి పొడవునా గుంతలు పడడంతో స్థానికులు, రాకపోకలు సాగించే వివిధ గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తెదేపా హయాంలోనే రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించినా పనులు ప్రారంభించే సమయానికి వైకాపా ప్రభుత్వం రావడంతో ఆగిపోయాయి. మరలా కూటమి సర్కారు అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ చొరవతో రూ.32 లక్షల నిధులు కేటాయించారు. ఇది జరిగి కూడా నెలలు గడుస్తున్నా, పనులు ప్రారంభించకపోవడంతో గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. - న్యూస్‌టుడే, గూడూరు

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

చినగొల్లపాలెం(కృత్తివెన్ను), న్యూస్‌టుడే: మండలంలోని చినగొల్లపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ రిబ్బన్ కత్తిరించి శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం వైద్యులు మొత్తం 500 మంది రోగులకు పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలోని అభిరామ్ ఆసుపత్రి వైద్య బృందం, కూటమి నాయకులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కృష్ణప్రసాద్

డ్రెయిన్‌లో కలిసిన ద్రావకాలు

పోతేపల్లి జ్యువెలరీ పార్కు నుంచి వెలువడిన వ్యర్థాలు ఇక్కడ తెచ్చి పడేస్తున్నారు. రోల్డ్‌గోల్డ్ పరిశ్రమలో ఉపయోగించే ద్రావకాలు డ్రెయిన్ నీటిలో కలవడం వల్ల రంగు మారి ఆందోళన కలిగిస్తోంది. పోతేపల్లిలో డ్రెయిన్‌ను తవ్వ పాలెం కాలువతో అనుసంధానించే కార్యక్రమం ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉండడంతో మురుగునీరు పారడం లేదు. దీంతో భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయని గ్రామస్థులు వాపోతున్నారు. డ్రెయిన్ సమస్యకు త్వరలోనే పరిష్కారం చూపాలని కోరుతున్నారు. - పోతేపల్లి(మచిలీపట్నంరూరల్), న్యూస్‌టుడే

ఎక్కడి చెత్త అక్కడే

పోతేపల్లి జ్యువెలరీ పార్కు ప్రాంగణంలో చెత్త మేటలు సకాలంలో తొలగించకపోవడంతో స్థానికులతో పాటు రాకపోకలు సాగించే ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. పార్కులోని వివిధ పరిశ్రమల నుంచి వచ్చే ఇతర వ్యర్థాలను రహదారుల పక్కన వేస్తున్నారు. కొన్నిసార్లు వాటిని తొలగించకుండా అక్కడే తగలబెడుతున్నారని ఆ ప్రాంతవాసులు వాపోతున్నారు. అధికారులు స్పందించి రోజూ సక్రమంగా తొలగించేలా చర్యలు తీసుకోవాలని పరిశ్రమల నిర్వాహకులు, స్థానికులు కోరుతున్నారు. - మచిలీపట్నం(గొడుగుపేట), న్యూస్‌టుడే

రాకపోకల సమయం తెలిసేదెలా?

మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్‌స్టాండ్‌లో బస్సుల రాకపోకలకు సంబంధించిన సమయ పట్టిక చిరిగిపోయింది. దీంతో బస్సులు ఎప్పుడు వస్తాయో తెలియక బస్‌స్టాండ్‌కు వచ్చిన ప్రయాణికులు ఇతర వాహనాలను ఆశ్రయిస్తున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి గండి పడుతుంది. అధికారులు స్పందించి దాన్ని ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, బంటుమిల్లి



పూడిక తీయక.. మురుగు పారక



నగరంలోని ధర్నాచౌక్ ప్రాంతం నుంచి కొబ్బరితోటకు వెళ్లే రహదారి పక్కన ఉన్న డ్రెయిన్ పూడికతో నిండింది. దీంతో మురుగు పారడం లేదు. దుర్గంధం వెదజల్లుతోంది. ఎప్పటి నుంచో ఇలాగే ఉంటున్నా ఎవ్వరూ పట్టించుకోవడం లేదని ఆ ప్రాంతవాసులు వాపోతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి పూడిక తొలగించి మురుగుపారేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. - మచిలీపట్నం(గొడుగుపేట), న్యూస్‌టుడే

అధ్వాన రహదారితో అవస్థలు

బందరు మండలం కరగ్రహారం కాలనీలో ప్రధాన రహదారి అభివృద్ధి చేయాలని ఏళ్లతరబడి మొరపెట్టుకుంటున్నా పట్టించుకున్న దాఖలాలు లేవు. దారి పొడవునా అధ్వానంగా తయారయ్యింది. చినుకుపడితే నీళ్లు చేరి రోడ్డు కూడా కనిపించని విధంగా మారుతోందని కాలనీ వాసులు వాపోతున్నారు. ఇళ్ల వద్దకు వెళ్లాలన్నా.. ఇళ్లు నిర్మించుకునే వారు సామగ్రి తీసుకెళ్లాలన్నా అవకాశం లేకుండాపోతోందని, క్షేత్రస్థాయిలో సమస్యను గుర్తించి కూటమి ప్రభుత్వం అయినా చొరవ తీసుకుని కనీసం రహదారిని అయినా అభివృద్ధి చేయాలని కోరుతున్నారు. - మచిలీపట్నం(గొడుగుపేట), న్యూస్‌టుడే

మార్చి 23న కృత్రిమ కాళ్ల పంపిణీ

మచిలీపట్నం(గొడుగుపేట), న్యూస్‌టుడే: దివ్యాంగులకు ఉచితంగా కృత్రిమ కాళ్లు పంపిణీ చేస్తున్నట్లు జిల్లా ఛాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా అధ్యక్షుడు మద్దుల గిరీష్ అన్నారు. ఆదివారం నగరంలో బృందావన కల్యాణ మండపంలో కృత్రిమ కాళ్లు అవసరమైన వారికి కొలతలు తీసుకున్నారు. ఆయన మాట్లాడుతూ జిల్లా ఛాంబర్ ఆఫ్ కామర్స్, బ్రహ్మ సమాజం, దివ్య డయాగ్నస్టిక్ సెంటర్‌ల ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లాతో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన వారు పాల్గొనగా కృత్రిమ కాళ్లు అమర్చేందుకు 128 మందిని ఎంపిక చేయడం జరిగిందని అన్నారు. వారికి మార్చి 23న అందజేస్తామని చెప్పారు. ప్రతినిధులు యండూరి సురేష్, దాతి సురేష్, రాంబాబు తదితరులు పర్యవేక్షించారు.

శిబిరంలో పాల్గొన్న దివ్యాంగులు, పర్యవేక్షిస్తున్న ప్రతినిధులు

ఉత్సాహంగా ఆనంద ఆదివారం

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే: యువతుల కూచిపూడి నృత్య ప్రదర్శన, సినీ గేయాలకు చిన్నారుల చిందులు, జానపద నృత్య ప్రదర్శనలు, కళాకారుల బుర్రకథలు ఇలా సాంస్కృతిక కార్యక్రమాలతో నగరంలోని ప్రధాన పార్కు ప్రాంగణం హోరెత్తిపోయింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆదివారం మచిలీపట్నం నగరపాలకసంస్థ ఆధ్వర్యంలో నగరంలో ప్రధాన పార్కు ప్రాంగణంలో హ్యాపీ సండే కార్యక్రమం నిర్వహించారు. తెదేపా రాష్ట్ర నాయకుడు గొర్రెపాటి గోపీచంద్ మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యంగా ఉండాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నందున అందరూ వినియోగించుకోవాలని కోరారు. నగరపాలకసంస్థ కమిషనర్ బాపిరాజు మాట్లాడుతూ ప్రతి నెలా 2, 4 ఆదివారాల్లో ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పీవీ ఫణికుమార్, తెదేపా నాయకులు రాంబాబు, నగర పాలకసంస్థ ఉద్యోగులు పాల్గొన్నారు. నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు చిన్నా, పెద్దా తారతమ్యంలేకుండా పాల్గొని సంతోషం వ్యక్తం చేశారు.

డ్యాన్స్ చేస్తున్న బాలికలు

మహనీయుల చిత్రపటాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులతో కమిషనర్, అతిథులు

ఆలోచింప చేసేలా.. ఆకట్టుకునేలా..

మచిలీపట్నం(గొడుగుపేట), న్యూస్‌టుడే: భావతరంగిణి సంస్థ ఆధ్వర్యంలో సంస్థ నిర్వాహకులు భవిష్య రచించిన నివేదన సందేశాత్మక నాటక ప్రదర్శన కార్యక్రమాన్ని ఆదివారం సాయంత్రం మహతీ కళావేదికలో నిర్వహించారు. రావినూతల సత్యనారాయణ, దండిబొట్ల దత్తాత్రేయశర్మ, వీవీఎన్ఎస్ ప్రభాకర్, వై.శ్రీరామ్, ఏఎస్‌ఏ ప్రసాద్, ఆర్.వెంకటేశ్వరరావు, పి.శాంతి, బాలలు జైకృష్ణ, కౌండిన్యదత్, సీహెచ్ జాహ్నవి, ఎస్.ప్రణీత, ఎం.వైష్ణవి, జె.యస్విత సాయిపూర్ణ తదితరులు వివిధ పాత్రల్లో నటించి ఆకట్టుకున్నారు. పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ నిషేధం, జల, వాయి కాలుష్యంతో ఎదుర్కొంటున్న ఇబ్బందులు తదితర అంశాలపై అవగాహన కల్పించేలా నాటక ప్రదర్శన సాగింది. ప్రతి సన్నివేశం ప్రేక్షకులను ఆలోచింప చేసింది. మంత్రి కొల్లు రవీంద్ర, మున్సిపల్ మాజీ ఛైర్మన్ మోటమర్రి బాబాప్రసాదు, బ్రాహ్మణ కార్పొరేషన్ కార్పొరేటర్ డైరెక్టర్ పీవీ ఫణికుమార్, జిల్లా రచయితల సంఘ అధ్యక్షుడు గుత్తికొండ సుబ్బారావు, సాహితీవేత్త డా.బి.ధన్వంతరి ఆచార్య తదితరులు నాటకాన్ని తిలకించి రచయిత భవిష్య, నటులను అభినందించారు.

నాటికలో ఓ సన్నివేశం

నృత్యం చేస్తున్న బాలలు

మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలు స్ఫూర్తిదాయకం

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలు స్ఫూర్తిదాయకమని స్వర్ణాంధ్ర టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్‌సలార్, ప్రధాన కార్యదర్శి మీర్జా రియాజ్ హుస్సేన్‌లు అన్నారు. భారతదేశ మొట్టమొదటి విద్యా శాఖామంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ వర్ధంతి ఆదివారం సంఘ ఆధ్వర్యంలో నగరంలోని రాజుపేటలో నిర్వహించారు. స్వాతంత్ర్య సమరయోధునిగా, విద్యాశాఖ మంత్రిగా ఆయన అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న నాయకులు

క్యాన్సర్‌ను ముందస్తుగానే గుర్తించి చికిత్స పొందండి

వక్కలగడ్డ(చల్లపల్లి), న్యూస్‌టుడే: క్యాన్సర్ వ్యాధి పట్ల భయాందోళనలు చెందకుండా, ముందస్తుగా గుర్తించినట్లయితే చికిత్స ద్వారా కోలుకుంటారని యువనేత మండలి వెంకట్రామ్(రాజా) అన్నారు. ఆదివారం చల్లపల్లి మండలం వక్కలగడ్డ గ్రామంలో పీఏసీఎస్ ఛైర్మన్ మల్లుపెద్ది దుర్గామహేష్ ఆధ్వర్యంలో బసవతారకం ఇండో-అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ వారిచే ఎన్.టి.ఆర్.ట్రస్ట్ సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత క్యాన్సర్ పరీక్షా శిబిరాన్ని ప్రారంభించారు. హెచ్‌వోడీ కృష్ణప్రసాద్ పర్యవేక్షణలో ప్రత్యేక బస్సు ద్వారా వైద్యులు డాక్టర్ రవిశంకర్, డాక్టర్ స్వర్ణకుమారి, డాక్టర్ మన్విత, డాక్టర్ జ్యోతి, డాక్టర్ శరత్‌లు 180 మంది మహిళలకు వైద్య పరీక్షలు చేసి పలు సూచనలు, సలహాలు అందించారు. తెదేపా నేతలు మోర్ల రాంబాబు, యార్లగడ్డ శ్రీనివాసరావు, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, పైడిపాముల స్వప్న, మోర్ల శివ, సూదాని నందగోపాల్, సాయి, వాసిరెడ్డి రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరంలో వెంకట్రామ్, తెదేపా నేతలు, వైద్యులు

112 మంది షీటర్లకు కౌన్సెలింగ్

గుడివాడ, న్యూస్‌టుడే: గుడివాడ పట్టణంలోని 1వ, 2వ పోలీసు స్టేషన్లు, రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలోని 112 మంది అనుమానిత షీటర్లు, రౌడీ షీటర్లకు ఆదివారం ఆయా పోలీసు అధికారులు కౌన్సెలింగ్ ఇచ్చారు. హిస్టరీ షీటర్లు ఎలాంటి అల్లర్లలో పాల్గొనరాదని, శాంతి భద్రతలకు విఘాతం కల్గించే చర్యలకు పాల్పడరాదన్నారు. చెడు నడతలకు దూరంగా ఉండాలని, లేకుంటే కఠిన చర్యలు తప్పవన్నారు. భవిష్యత్‌లో ఎలాంటి నేరాలలో ఉండరాదని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐలు కొండపల్లి శ్రీనివాస్, జె.ఆర్.కె.హనీష్, రూరల్ ఎస్.ఐ ఎన్.చంటిబాబు తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచి మృతికి నివాళి

పెడన, పెడన గ్రామీణం, న్యూస్‌టుడే : పెడన మండలం కాకర్లమూడి గ్రామ మాజీ సర్పంచి మద్దంశెట్టి వాకాలరావు(68) ఆదివారం మృతి చెందారు. గత కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈయనకు కుమార్తె, ఇరువురు కుమారులు ఉన్నారు. కాకర్లమూడి గ్రామ ప్రగతికి విశేషంగా కృషి చేశారు. వాకాలరావు మృతికి పలువురు ప్రముఖులు సంతాపం ప్రకటించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

వాకాలరావు (పాత చిత్రం)

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

ముగిసిన శ్రీపోతురాజుస్వామి జాతర

నాగాయలంక: స్థానిక శ్రీ పోతురాజు స్వామి వారి ఆలయంలో వార్షిక జాతర మహోత్సవాలు ఆదివారం ముగిసాయి. గణచారులు ఊరేగించిన ఘటాలను ఆలయ ప్రాంగణంలో ఉంచగా భక్తులు నైవేద్యాలు సమర్పించారు. దాతల సాయంతో భారీ అన్నసంతర్పణ నిర్వహించారు.

వెంకటేశ్వరాలయంలో మాసకల్యాణోత్సవం

కార్యక్రమంలో దంపతులు

దోకిపర్రు(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే: మండలంలోని దోకిపర్రు శ్రీభూ వెంకటేశ్వరాలయంలో ఆదివారం స్వామివారి మాస కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. పలువురు దంపతులు ఉభయదాతలుగా స్వామివారి కల్యాణంలో పాల్గొన్నారు. నిర్వాహకులు కొమ్మారెడ్డి బాపిరెడ్డి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైభవంగా అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ

అవనిగడ్డ, న్యూస్‌టుడే: గుర్రపు చెరువు గట్టున నూతనంగా నిర్మించిన వాసవీ కన్యకా పరమేశ్వరి విగ్రహ ప్రతిష్ఠ ఆదివారం వైభవంగా జరిగింది. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.

కిటకిటలాడిన లంకమ్మ దేవాలయం

అవనిగడ్డ, న్యూస్‌టుడే: స్థానిక గ్రామ దేవత లంకమ్మ అమ్మవారి దేవాలయం ఆదివారం భక్తులతో కిటికిటలాడింది. అమ్మవారికి ఘటం బిందెలు సమర్పించడానికి డప్పు వాయిద్యాలతో వచ్చి గులాంలు చల్లుకుంటూ, డాన్సులు చేస్తూ సందడి చేశారు. బంటుమిల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఎస్.జగన్‌మోహన్‌రావు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

భాజపా బలోపేతానికి కృషి

కంకిపాడు గ్రామీణం: భాజపా బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలని ఆ పార్టీ జిల్లా మైనార్టీ మోర్చా అధ్యక్షుడు షేక్.చిన్నా అన్నారు. ప్రధాని మోదీ పిలుపు మేరకు ముస్లింలకు స్నేహ హస్తాన్ని అందించే క్రమంలో వారికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

వ్యాలిడేషన్ క్లాజు రద్దు చేయాలి

గుడివాడ(సత్యనారాయణపురం), న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం ఆర్థిక బిల్లు 2025లో సెంట్రల్ సివిల్ సర్వీసెస్ పెన్షన్ వ్యాలిడేషన్ క్లాజును వెంటనే రద్దు చేయాలని పెన్షనర్ల నేత ఆర్.మాధవరావు పేర్కొన్నారు. గుడివాడ దూరవాణి ప్రాంతీయ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ భవిష్యతులో పాత, కొత్త పెన్షనర్లకు వేతన సవరణలు సమానంగా అమలు చేయాలని కోరారు. 26న విజయవాడ రామ్మోహన గ్రంథాలయంలో జరిగే రాష్ట్ర స్థాయి పెన్షనర్ల సమావేశంలో కార్యాచరణపై చర్చిస్తామన్నారు. నేతలు పి.అశోక్‌బాబు, కేఎస్‌సీ బోస్, ఎన్.రామారావు, రమేష్‌బాబు, కొల్లి లక్ష్మీనారాయణ, ఎల్.మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మాధవరావు

కొండల్లో సరదాగా కాసేపు

కానూరు: సిద్ధార్థ డీమ్డ్ విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ విద్యార్థులు కొండపల్లి అటవీప్రాంతంలో ట్రెక్కింగ్ చేశారు. ఆదివారం ఉదయం 50 మంది ఎన్ఎస్ఎస్ బృందం ప్రకృతి సౌందర్యాన్ని తిలకిస్తూ, అటవీ ప్రాముఖ్యతను అవగాహన చేసుకుంటూ, పర్యావరణ పరిరక్షణపై చైతన్యం కల్పిస్తూ యాత్రను పూర్తి చేశారని విశ్వవిద్యాలయం ఉపకులపతి పి.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. డీన్ డి.వెంకటరావు, ప్రోగ్రామ్ అధికారులు నారాయణ, వేణుగోపాల్, పూర్ణచంద్రరావు, ప్రోవైస్ ఛాన్సలర్ ఏవీ రత్నప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మండలి వెంకట కృష్ణారావుకు నివాళి

కోడూరు, న్యూస్‌టుడే: దివంగత మండలి వెంకట కృష్ణారావు శతజయంతి ఉత్సవాల్లో భాగంగా కోడూరులోని ప్రధాన కూడలిలో ఉన్న ఆయన విగ్రహానికి డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ యువసేన ఆధ్వర్యంలో ఆదివారం పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

విగ్రహం వద్ద యువసేన, కూటమి నాయకులు

(c) eenadu

పెనమలూరు
• పెనమలూరు • గన్నవరం

నిత్యాన్నదానానికి విరాళాలు

అమ్మవారి చిత్రపటం అందుకుంటున్న దాతలు

విజయవాడ పటమట, న్యూస్‌టుడే: అమ్మవారి ఆలయంలో జరిగే నిత్యాన్నదాన కార్యక్రమానికి ఆదివారం పలువురు విరాళాలు అందజేశారు. హైదరాబాద్ సంజీవరెడ్డి నగర్‌లోని జె.కిషోర్ కుటుంబ సభ్యులు రూ.5 లక్షలు, విజయవాడ లయోల కళాశాల ఫిలిం నగర్ ప్రాంతానికి చెందిన తన్నీరు మారుతి వనీకాంత్ కుటుంబ సభ్యులు రూ.లక్ష, కృష్ణా జిల్లా గన్నవరం గొడవర్రు చెందిన మోచర్ల భవాని కుటుంబ సభ్యులు రూ.1,01,116 విరాళంగా అందజేశారు. ఆలయ అధికారులు దాతలకు అమ్మవారి దర్శనం కల్పించి, ప్రసాదాలు, చిత్రపటాలను అందజేశారు.

28న సర్వసభ్య సమావేశం

హనుమాన్‌జంక్షన్: బాపులపాడు మండల పరిషత్తు సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 28వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జోగేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ నగేష్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో వివిధ శాఖలకు సంబంధించి సమీక్ష నిర్వహిస్తామని, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు విధిగా హాజరు కావాలని సూచించారు.

సుభానికి కళాశ్రీ పురస్కారం

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: మల్లవల్లి గ్రామానికి చెందిన కళాకారుడు ఎస్‌ఎం సుభాని కళాశ్రీ పురస్కారం అందుకున్నారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 21న విజయవాడ ముత్యాలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన వేడుకల్లో రాష్ట్ర జానపద అకాడమీ ఛైర్మన్ పొట్లూరి హరికృష్ణ, సుభానికి ఈ పురస్కారం ప్రదానం చేసి సత్కరించారు. గాయకుడిగా, నాటక దర్శకుడిగా, జాతీయ జెండా ప్రచారకర్తగా సుభాని చేసిన కృషిని ఈ సందర్భంగా పలువురు అభినందించారు.

బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కమిటీ ప్రతినిధులు

పెనమలూరు, న్యూస్‌టుడే: ఈనెల 23 నుంచి 25వ తేదీ వరకు పెదపులిపాక శ్రీవిజయరాజరాజేశ్వరీ దేవి ఆలయంలో నిర్వహించనున్న దశమ వార్షిక బ్రహ్మోత్సవాల కరపత్రాలను ఆలయ అభివృద్ధి కమిటీ, విశ్వబంధుపరిపోషకసభ ప్రతినిధులు ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రతినిధులు కె.వెంకటేశ్వరరావు, గుత్తికొండ రమేష్‌బాబు మాట్లాడుతూ.. 23న సహస్రగళార్చన, 24న విరాట్ హనుమాన్‌చాలీసా సమ్మేళనం, 25న మహా చండీహోమం, రథోత్సవాలు నిర్వహించనున్నట్లు వివరించారు. భక్తులు అధిక సంఖ్యలో ఆయా ఆధ్యాత్మిక కార్యక్రమాలకు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ ప్రతినిధులు నాగేశ్వరరావు, సభి చంద్రశేఖర్, శ్రీమన్నారాయణ, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

భాజపా బలోపేతానికి కృషి చేయండి

కంకిపాడు గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో భాజపా బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషిచేయాలని ఆ పార్టీ జిల్లా మైనార్టీ మోర్చా అధ్యక్షుడు షేక్.చిన్నా అన్నారు. ఇందులో భాగంగా ప్రధానమంత్రి మోదీ పిలుపు మేరకు ముస్లింలకు స్నేహ హస్తాన్ని అందించే క్రమంలో వారికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారని ఈ క్రమంలో పార్టీలో ముస్లింలు పెద్ద సంఖ్యలో వచ్చేలా కృషిచేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా జిల్లా మైనార్టీ మోర్చా కార్యదర్శిగా షేక్.కరీముల్లాను నియమించినట్లు పేర్కొన్నారు. ఆదివారం కరీముల్లాకు నియామక పత్రం అందజేసి అభినందించారు.

కిట్టు.. వాడితే ఒట్టు

కొరవడిన నీటి నాణ్యత పరీక్షలు

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే

❋ 6 నెలల కిందట ఉంగుటూరు మండలంలోని ఓ మేజర్ పంచాయతీలో డయేరియా బాధితుల సంఖ్య ఎక్కువగా రావడంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ప్రత్యేక పరీక్షలు జరిపారు. స్థానికంగా ఉన్న ఓ ఆర్వో ప్లాంటు నుంచి అపరిశుభ్రమైన తాగునీరు సరఫరా కావడమే దీనికి కారణంగా గుర్తించి, ప్లాంటును మూసివేయించాల్సిందిగా సదరు గ్రామ పంచాయతీ వర్గాలను ఆదేశించారు.

❋ నియోజకవర్గ కేంద్రమైన గన్నవరంలో గతేడాది జులైలో ఓ ప్రైవేటు ప్లాంటు ద్వారా వచ్చే నీటిలో నాచు.. దుర్గంధం రావడం స్థానికుల్ని భయాందోళనలకు గురి చేసింది.

❋ 2 నెలల కిందట బాపులపాడు గ్రామ పంచాయతీ పరిధిలోని హనుమాన్‌నగర్‌లో చేతిపంపు ద్వారా బురద నీరు రావడం కలకలం రేపింది. దశాబ్దాలుగా ఈ చేతిపంపు నీరుకు అలవాటుపడిన స్థానికులు మరమ్మతులు జరిగే వరకు నీటి వినియోగం నిలిపివేయాల్సి వచ్చింది.

బాధ్యతలు బేఖాతరు..

గ్రామాల్లో సరఫరా అవుతున్న తాగునీటిని ప్రతి 15 రోజులకోసారి పరీక్షించాలి. ఈ విధులకు కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రత్యేకంగా కిట్లు పంపిణీ చేశారు. ప్రతి స్వర్ణ గ్రామ నిధి(సచివాలయం) వీటిని సమకూర్చి, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు బాధ్యతలు అప్పగించారు. కానీ చాలాచోట్ల ఈ కిట్లను అసలు వినియోగించిన దాఖలాల్లేవు. మరికొన్నిచోట్ల నామమాత్రపు పరీక్షలతో సరిపెట్టేశారు. దీంతో ప్రజారోగ్యంలో కీలకమైన మంచినీటి నాణ్యత ప్రశ్నార్థకంగా మారింది. ఐదేళ్ల ముఖ్యమంత్రి చంద్రబాబు సైతం పలుమార్లు నీటి పరీక్షలు కచ్చితంగా నిర్వహించాలని ఆదేశించినా అధికార యంత్రాంగంలో అంతగా చలనం కన్పించకపోవడం గమనార్హం.

ఏదీ భరోసా?: చెరువులు, బోర్లు ఆధారంగా రక్షిత నీటి పథకాల నుంచి వచ్చే నీరు సురక్షితం కాదనే అభిప్రాయంతో దాదాపుగా అందరూ ఆర్వో పథకాలనే ఆశ్రయిస్తున్నారు. వీటి ద్వారా 20 లీటర్ల నీటిని రూ.2 నుంచి రూ.10 వరకు విక్రయిస్తున్నారు. వ్యాపార ధోరణిలో ఎక్కువ చోట్ల ఆర్వో ప్రైవేటు ప్లాంట్లు పుట్టుకొచ్చాయి. ఎన్‌ఓసీ గుర్తింపు పత్రం లేకుండానే కొన్ని ప్రమాణాలు కూడా లేకుండానే నిర్వహిస్తున్నారు. ముడి నీటి వనరు దగ్గర్నుంచి పైపులైన్ లీకేజీలు, నీటిలో పీహెచ్, టీడీఎస్ శాతం, మైక్రో, కార్బన్ ఫిల్టర్లు, ఇసుక వడపోత, ఆర్వో పొర నాణ్యత వంటి అంశాల్లో జాగ్రత్తలు పాటించడంలేదనే ఆరోపణలున్నాయి.

నియోజకవర్గంలో ఇదీ పరిస్థితి

మండలాలు - 4
గ్రామ పంచాయతీలు - 84
స్వర్ణ గ్రామాలు - 82
జనాభా -3.63 లక్షలు
రక్షిత పథకాలు 184
ఆర్వో పథకాలు-240 (సుమారు)

నిరుపయోగంగా ఉన్న కిట్లు

పక్కాగా అమలు..

ప్రతి గ్రామ పంచాయతీలో క్రమం తప్పకుండా నీటి పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నాం. తరచూగా ఇంజినీర్ అసిస్టెంట్‌తో సమావేశాలు. - సుధాకర్, డీఈ, ఆర్‌డబ్ల్యూఎస్

మేమున్నాం.. మీకు తోడుగా..

10 AM to 1 PM

కానూరు : 80085 74647 హనుమాన్‌జంక్షన్, 98486 27585

❋ కానూరు మాతృశ్రీనగర్‌లో కొన్ని రోజులుగా చెత్తతీయడం లేదని స్థానికులు మేమున్నాం మీకు తోడుగా ద్వారా ఫిర్యాదు చేయగా కమిషనర్ షేక్‌నాజర్ స్పందించారు. సిబ్బందిని పంపి చెత్తతీయించి సమస్య పరిష్కరించారు. ❋ పోరంకి సెంటర్లో చెత్త పేరుకుపోయిందని స్థానికులు మేమున్నాం మీకు తోడుగా ద్వారా చేసిన ఫిర్యాదును అసిస్టెంట్ కమిషనర్ కిరణ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లగా స్పందించారు. సిబ్బందితో శుభ్రం చేయించారు. - న్యూస్‌టుడే, కానూరు, పోరంకి

స్పందన: ❋ పెనమలూరు- చోడవరం ఆర్‌అండ్‌బీ రహదారిలో పలు చోట్ల వీధిదీపాలు వెలగడం లేదని పెనమలూరు గ్రామస్థులు మేమున్నాం మీకు తోడుగా ద్వారా గ్రామకార్యదర్శికి శనివారం ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆయన ఆదివారం దీపాలను తనిఖీ చేయించి అవసరమైన చోట్ల కొత్తదీపాలను ఏర్పాటు చేయించారు. ❋ యనమలకుదురులోని మూడు ప్రాంతాల్లో తాగునీటి పైపులైన్లు పగిలిపోతుండడంతో నీరు వృథా కావడంతో పాటు కలుషితమవుతున్నాయంటూ నాలుగురోజుల కిందట గ్రామస్థులు మేమున్నాం మీకు తోడుగా ద్వారా గ్రామకార్యదర్శి దుర్గాప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆయన ఆయా ప్రాంతాల్లో ఆదివారం నుంచి కొత్తపైపులైన్లు ఏర్పాటు చేయిస్తున్నారు. మరో నాలుగు రోజుల్లో పనులు పూర్తి చేస్తామన్నారు. ❋ జగన్నకాలనీ-2లో కొన్ని చోట్ల వీధిదీపాలు నిత్యం వెలుగుతున్నాయని స్థానికులు మేమున్నాం మీకు తోడుగా ద్వారా గ్రామకార్యదర్శి దుర్గాప్రసాద్‌కు శనివారం సమాచారం అందించారు. స్పందించిన ఆయన ఆదివారం ఆయా ప్రాంతాల్లో 16 చోట్ల స్విచ్‌బోర్డులు ఏర్పాటు చేయించారు. ❋ పెదపులిపాక గణపతి నగర్‌లో కొన్ని చోట్ల వీధిదీపాలు వెలగడం లేదని కాలనీ వాసులు గ్రామకార్యదర్శి వెంకటరత్నంకు శనివారం ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆయన ఆదివారం ఆయా ప్రాంతాల్లో 6 చోట్ల కొత్త దీపాలను ఏర్పాటు చేయించారు. - న్యూస్‌టుడే, పెనమలూరు

❋ గన్నవరం ఇస్తాంపేట పరిసరాల్లో రోడ్లపై చెత్త పేరుకుని తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఈవో చెన్నకేశవుల దృష్టికి తీసుకెళ్లగా స్పందించారు. సిబ్బందిని పంపి వ్యర్థాలను తొలగింపజేశారు. ❋ గన్నవరం మండలం కేసరపల్లి పంచాయతీ శివారు వీఎన్‌పురం కాలనీలో మురుగు పేరుకుందని స్థానికులు ఈవో ప్రసాద్ దృష్టికి తీసుకెళ్లగా స్పందించారు. సిబ్బందితో మురుగు పారుదల సక్రమంగా జరిగేలా చర్యలు చేపట్టారు. - న్యూస్‌టుడే, గన్నవరం గ్రామీణం

ఆక్యుపంక్చర్ వైద్యంతో రుగ్మతలు నయం

ధ్రువపత్రాలు అందుకున్న వారితో శంకరబాబు, సత్యనారాయణ

కానూరు, న్యూస్‌టుడే: ఆక్యుపంక్చర్ వైద్యవిధానంతో శరీరంలోని అనేక రుగ్మతలు మందులు లేకుండా నయం అవుతాయని [illegible] సభ్యుడు వెంకపూడి శంకరబాబు అన్నారు. ఆదివారం కానూరులోని ఇండియన్ ఓం కార్యాలయంలో శిక్షణ పూర్తి చేసిన విద్యార్థులకు ధ్రువపత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ ప్రాచీన వైద్యవిధానాలకు ప్రపంచవ్యాప్త గుర్తింపు ఉందన్నారు. ఇండియన్ ఓం ఛైర్మన్ మాకాల సత్యనారాయణ మాట్లాడుతూ.. దేశంలోనే మొదటిసారిగా రాష్ట్రప్రభుత్వ ఖాదీ అండ్ విలేజ్ ఇండస్ట్రీస్ బోర్డు తరపున ఆక్యుపంక్చర్, యోగా విభాగాలలో ఆరు నెలల పాటు శిక్షణ అందించి ధ్రువపత్రాలు అందజేశామన్నారు.

అవసరాలకు అనుగుణంగా మెరుగైన సేవలు

పెనమలూరు, న్యూస్‌టుడే: పెనమలూరు నియోజకవర్గంలో అభివృద్ధికి తగ్గట్టుగా నాణ్యమైన విద్యుత్తు సౌకర్యాలను అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ పేర్కొన్నారు. రూ.4.06కోట్ల వ్యయంతో పెదపులిపాకలో నిర్మించనున్న 33-11కేవీ విద్యుత్తు సబ్‌స్టేషన్ నిర్మాణపనులకు ఆయన ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కృష్ణాజిల్లాలో అత్యంత వేగంగా పెనమలూరు నియోజకవర్గం అభివృద్ధి చెందుతుండడంతో ప్రజల అవసరాలకు అనుగుణంగా విద్యుత్తు సరఫరా వ్యవస్థను ఆధునికీకరిస్తున్నట్లు తెలిపారు. త్వరలో పోరంకిలో మరో సబ్‌స్టేషన్‌ను నిర్మించనున్నట్లు వెల్లడించారు. విద్యుత్తు శాఖ ఎస్‌ఈ హనుమయ్య మాట్లాడుతూ.. ఈ సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తయితే 25 వేల గృహ, వ్యాపార, వాణిజ్య విద్యుత్తు కనెక్షన్లకు అంతరాయం లేని నాణ్యమైన సరఫరా అందుబాటులోకి వస్తుందన్నారు. సర్పంచి గుంటూరు శ్రీనివాస్ చౌదరి, ఆ శాఖ ఉన్నతాధికారులు రవికిషోర్, హరిబాబు, నవీన్, తెదేపా నాయకులు కోయ ఆనంద్, అనుమోలు ప్రభాకరరావు, ముసునూరు శ్రీనివాస్, నిర్మల్‌కుమార్, శ్రీధర్, గ్రామస్థులు పాల్గొన్నారు.

శంకుస్థాపనలో ఎమ్మెల్యే బోడే ప్రసాద్, ఉన్నతాధికారులు

సమన్వయంతోనే అభివృద్ధి సాధ్యం

సర్పంచులను సత్కరిస్తున్న ఎంపీపీ రవి, ప్రజాప్రతినిధులు

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: పల్లె అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీపీ అనగాని రవి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ శాఖల వారీగా సమీక్ష జరిపారు. కొత్తగా రూ.2 కోట్లతో అభివృద్ధి పనులు చేసేందుకు తీర్మానించారు. స్టాంపు అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ద్వారా మండల పరిషత్‌కు రావాల్సిన రూ.3 కోట్లు వెంటనే విడుదల చేయాలని, ఎంపీటీసీల పెండింగ్ గౌరవ వేతనాలను ప్రభుత్వం మంజూరు చేయాలని తీర్మానాలు చేశారు. కొందరు అధికారుల గైర్హాజరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్ని గ్రామాలకు సమాన ప్రాధాన్యమిస్తూ అభివృద్ధి పనులకు అవసరమైన నిధులను కేటాయిస్తున్నట్లు ఎంపీపీ వెల్లడించారు. ఈ ఏడాది ఏప్రిల్ ఒకటో తేదీతో పదవీకాలం పూర్తిచేసుకుంటున్న అన్ని గ్రామాల సర్పంచులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి, జడ్పీ కోఆప్షన్ సభ్యులు ఎండీ గౌసాని, వైస్ ఎంపీపీ కొమ్మరాజు సుధీర్, ఎంపీడీవో టి.స్వర్ణలత, ఎంపీటీసీలు మద్దినేని వెంకటేశ్వరరావు, పటమట రంగారావు, సర్పంచులు, పీఏసీఎస్ అధ్యక్షులు పాల్గొన్నారు.

ఊపిరినిచ్చే చెట్లను కాపాడండి

విజయవాడ- అవనిగడ్డ కరకట్ట రహదారి వెంట ఏపుగా పెరిగిన చెట్లు అగ్నికి ఆహుతవుతున్నాయి. కరువుకాల్వకు. .కరకట్టకు కరకట్టకు మధ్య ఉన్న నీటిపారుదలశాఖ స్థలాల్లో కొందరు గడ్డివాములు, కట్టెల గుట్టలు పేర్చుతుండటంతో తరచూ అగ్ని ప్రమాదాలు జరిగి అక్కడి చెట్లన్నీ కాలిపోతున్నాయి. పెదపులిపాక, చోడవరం ప్రాంతాల్లో ఈ ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. కరకట్ట కోతకు గురవకుండా ఉండడంతో పాటు పర్యావరణానికి హితం చేసే ఈ వృక్షాలను కాపాడాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, పెనమలూరు

ఎడాపెడా మురుగు మళ్లింపు

బాపులపాడుకు నాగార్జునసాగర్ జలాలు తీసుకొచ్చే ప్రధాన కాల్వ అత్యంత దారుణంగా తయారైంది. పైలెట్ ప్రాజెక్టు దగ్గర నుంచి జాతీయ రహదారి వరకు ఉన్న పంట కాల్వ పూర్తిగా మురుగు కాల్వగా మారిపోయింది. కాల్వ వెంట నివాసాలు, దుకాణాలు, ఇతరత్రా కార్యకలాపాలు నిర్వహిస్తున్న వారిలో చాలామంది మురుగునీటిని నేరుగా దీనిలోకి వదిలేస్తున్నారు. దీంతో కాల్వ ప్రస్తుతం పూర్తిగా నిండిపోయి, సమీపంలోని పొలాలు, ఖాళీస్థలాల్లోకి సైతం భారీగా మురుగు చేరి ఇబ్బందిగా తయారైంది. - న్యూస్‌టుడే, హనుమాన్‌జంక్షన్

చదును చేయాలి కదా..!

బాపులపాడు నుంచి వేలేరు వెళ్లే ప్రధాన రహదారి ఎక్కడికక్కడ ఛిద్రమై, గుంతలమయంగా మారింది. దీంతో కొందరు గుంతలు పూడ్చే ఉద్దేశంతో సిమెంట్, కంకర మిశ్రమాన్ని పోసి చదును చేయకుండా అలాగే వదిలేశారు. దీంతో రాత్రి సమయంలో ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా వీటి కారణంగా వాహనదారులు ప్రమాదానికి గురయ్యే పరిస్థితి. ఆర్‌అండ్‌బీ అధికార్లు స్పందించి రహదారిని అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, హనుమాన్‌జంక్షన్

చూసి వెళ్లండి.. కోత ఉందండి

గండిగుంట పరిధిలో కాటూరురోడ్డుకు సమీపంలో విజయవాడ మచిలీపట్నం జాతీయ రహదారి పై వంతెన పక్కన సర్వీస్ రహదారి కొంత మేర కోతకు గురైంది. రక్షణగా ఉన్న అప్రోచ్ గోడలు కూలిపోయాయి. ఇది గమనించక ద్విచక్రవాహనదారులు, పాదచారులు రాత్రి సమయంలో పక్కకు వెళ్తే ప్రమాదం జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరమ్మతులు చేయించాలని అధికారులను కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, గండిగుంట (ఉయ్యూరుగ్రామీణం)

ఎక్కడికక్కడ.. నిలిచిపోతోందిక్కడ..!

బాపులపాడు గ్రామ పంచాయతీలో మురుగు ఎక్కడికక్కడ స్తంభించిపోతోంది. అవుట్‌లెట్లు పూడుకుపోవడం, వాటిని పునరుద్ధరించే దిశగా పంచాయతీ యంత్రాంగం సరైన కార్యాచరణ చేపట్టడంలేదు. ప్రధాన డ్రెయినేజీ సహా అంతర్గత రహదార్ల వెంబడి ఉన్న కాల్వలన్నీ మురుగుతో నిండిపోయాయి. మరోపక్క ప్లాస్టిక్ వినియోగం విచ్చలవిడిగా పెరగడం, ఒకసారి వినియోగించే ప్లాస్టిక్ అమ్మకాలు జరపరాదని, ఎవరూ వీటిని వాడరాదంటూ నోటీసులు జారీ చేసి సరిపెట్టడంతో డ్రెయిన్లన్నీ ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయి మురుగు నిలిచిపోతోంది. ఉన్నతాధికార్లు స్పందించాల్సి ఉంది. - న్యూస్‌టుడే, హనుమాన్‌జంక్షన్

కోటయ్యస్వామికి ఘనంగా పూజలు

లడ్డూ ప్రసాదాన్ని అందజేస్తున్న సంఘ ప్రముఖులు

గన్నవరం గ్రామీణం: పట్టణంలోని కొత్తపేట శ్రీకోటయ్యస్వామి ఆలయంలో ఉరుసు మహోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉత్సవ కమిటీ, కృష్ణ బలిజ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో తొలుత శ్రీకోటయ్యస్వామికి ప్రత్యేక పూజలు చేసి ఉత్సవాలను ప్రారంభించారు. లడ్డూ ప్రసాదాన్ని మసిముక్కు శ్రీనివాసరావు వేలంలో దక్కించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారిని కృష్ణబలిజ, పూసల కార్పొరేషన్ ఛైర్మన్ గంటా త్రిమూర్తులు, కృష్ణబలిజ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తిర్లక శ్రీనివాసరావు, గౌరవ అధ్యక్షుడు బత్తుల వెంకటేశ్వర్లు, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సోదరుడు సతీష్ బాబు తదితరులు దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన ఏర్పాటు చేశారు. కృష్ణ బలిజ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వీసం శ్రీనివాసరావు, సంఘ నాయకులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం

నూలు సంచులు అందుకున్న విద్యార్థులు

పునాదిపాడు (కంకిపాడు): పర్యావరణహిత సంచులు, పరికరాల వాడకంతో క్యాన్సర్ వంటి ప్రమాదకర వ్యాధులను నివారించవచ్చని కె.పి.ఎ. సంస్థ అధినేత కాసరనేని కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం పునాదిపాడులోని కాకతీయ జడ్పీ బాలుర వసతి గృహంలోని విద్యార్థులు, గ్రామస్థులకు నూలు సంచులు అందజేశారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ పర్యావసనాలను తెలియజేశారు. పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలన్నారు. వసతి గృహ బాధ్యులు వెంకటరత్నం, రాజారామ్, శ్రీహరిరావు, లయన్స్‌క్లబ్ విజయవాడ రూరల్‌శాఖ కోశాధికారి ప్రసాద్, విద్యావేత్త శ్రీనివాస్ పాల్గొన్నారు.

కొండల్లో సరదాగా కాసేపు

కానూరు: సిద్ధార్థ డీమ్డ్ విశ్వవిద్యాలయం ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు కొండపల్లి అటవీప్రాంతంలో ట్రెక్కింగ్ చేశారు. ఆదివారం ఉదయం 50 మంది ఎన్‌ఎస్‌ఎస్ బృందం ప్రకృతి సౌందర్యాన్ని తిలకిస్తూ, అటవీ ప్రాముఖ్యతను అవగాహన చేసుకుంటూ, పర్యావరణ పరిరక్షణపై చైతన్యం కల్పిస్తూ యాత్రను పూర్తి చేశారని విశ్వవిద్యాలయం ఉపకులపతి పి.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. డీన్ డి.వెంకటరావు, ప్రోగ్రామ్ అధికారులు నారాయణ, వేణుగోపాల్, పూర్ణచంద్రరావు, ప్రోవైస్ ఛాన్సలర్ ఏవీ రత్నప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చేశారు.. అవస్థలు తీర్చారు

కంకిపాడు, పెనమలూరు, న్యూస్‌టుడే

పెనమలూరు నియోజకవర్గంలోని కీలక రహదారులకు మోక్షం కలిగింది. గత వైకాపా ప్రభుత్వం శీతకన్ను చూపడంతో గుంతలమయంగా మారి ప్రయాణికులు ఇబ్బందులు పడిన విషయం తెలిసిందే. కానీ 'కూటమి' ప్రభుత్వం ప్రజల అవస్థలు తీర్చింది. అధికారంలోకి వచ్చిన 20 నెలల వ్యవధిలో సుమారు రూ.50కోట్లతో రోడ్డు పనులు పూర్తిచేసింది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు, ఇతర ప్రాంతాల ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రహదారులు బాగుపడడంతో ఇళ్లు, అపార్ట్‌మెంట్లు, సామూహిక భవనాలు, విద్యా సంస్థల క్యాంపస్‌ల నిర్మాణాలు ఊపందుకున్నాయి. దీంతో ప్రభుత్వ, స్థానిక సంస్థల ఆదాయం పెరుగుదల, వివిధ రంగాలకు చెందిన కార్మికులకు ఉపాధి, గ్రామాల ప్రగతికి బాటలు పడుతున్నాయి. ఆర్టీసీ సర్వీసులు పునరుద్ధరించడంతో ప్రయాణ సౌకర్యం మెరుగుపడింది. తరచూ బస్సులు, వాహనాల మరమ్మతులు, ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు తగ్గిపోయాయి.

ఈ మార్గాల్లో అభివృద్ధి..: కంకిపాడు-రొయ్యూరు, చోడవరం-పెనమలూరు, ఈడుపుగల్లు-ఉప్పులూరు, ఉప్పులూరు-వేల్పూరు, తెన్నేరుపరిధిలో బుడమేరు రహదారి, ఎన్‌హెచ్65-గంగూరు, ఎన్‌హెచ్65-గంగూరు తూర్పు రహదారులను అభివృద్ధి చేశారు. ❖ ఇవికాక కోలవెన్ను, కంకిపాడు లాకుల రోడ్డు, పునాదిపాడు-ఉప్పులూరు తదితర రహదారులకు మరమ్మతులు చేయడంతో కొంతమేర ఉపశమనం లభించింది. ❖ మద్దూరు-గోసాల (వయా వణుకూరు) రహదారి, కోమటిగుంట-తెన్నేరు తదితర రహదారులకు నిధులు సిద్ధంగా ఉండగా త్వరలోనే పనులు ప్రారంభిస్తామని ఎమ్మెల్యే బోడే ప్రసాద్ తెలిపారు.

పునరుద్ధరించిన ఈడుపుగల్లు-ఉప్పులూరు మార్గం

విద్యార్థుల సంక్షేమానికి పెద్దపీట

విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఏపీ సామాజిక సంక్షేమ బోర్డు ఛైర్మన్ పోతుల బాలకోటయ్య అన్నారు. సంక్షేమ ఆదివారం కార్యక్రమంలో గన్నవరం పట్టణం, దావాజీగూడెంలోని సాంఘిక సంక్షేమ బాలురు, బాలికల వసతి గృహాలను ఆయన సందర్శించారు. విద్యార్థులకు అందుతున్న వసతులపై ఆరా తీశారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పలు సూచనలు, సలహాలు చేశారు. కార్యక్రమంలో వసతిగృహ సిబ్బంది పాల్గొన్నారు. - గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే

నమోదు ఉంటేనే.. పథకాలు అందేది

రైతు గుర్తింపు పెండింగ్‌లో రెండు వేలమంది రైతులు

కంకిపాడు, ఉయ్యూరు గ్రామీణం, న్యూస్‌టుడే : రైతు గుర్తింపు నమోదుతో కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ, రాయితీ పథకాలకు అర్హత పొందవచ్చు. దీనిపై గత నెల రోజులుగా పెనమలూరు నియోజకవర్గంలో కసరత్తు చేస్తున్నారు. 100 శాతం నమోదుతో ప్రతి రైతుకూ ప్రయోజనం చేకూర్చాలనే ఉద్దేశంతో జిల్లా వ్యవసాయ అధికారులు సైతం క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నారు. గడువు ముగిసే సమయం దగ్గరకి వస్తున్నా ఇంకా దాదాపు రెండు వేల మంది (13శాతం) రైతులు నమోదుకు దూరంగా ఉన్నారు. కంకిపాడు మండలంలో ఇంకా 841మంది పెండింగ్ జాబితాల్లో ఉన్నట్లు వ్యవసాయాధికారిణి ఉషారాణి తెలిపారు. పెనమలూరు, ఉయ్యూరు గ్రామీణంలోనూ ఇదే పరిస్థితి నెలకొందని చెబుతున్నారు.

పునాదిపాడు : నమోదును పర్యవేక్షిస్తున్న డీఏవో పద్మావతి

నమోదు సులభం..: రైతే 'క్యూఆర్' కోడ్ స్కాన్ చేసి అవసరమైన సమాచారాన్ని 'ఆధార్' అనుసంధానంతో చేసుకోవచ్చు. లేకుంటే సమీప రైతు సేవా కేంద్రంలోనూ ఈ ప్రక్రియ చేస్తారు. ❖ పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డ్, అనుసంధానిత మొబైల్ నంబరుతో సంప్రదిస్తే అక్కడి అధికారులు నమోదు చేస్తారు.

ప్రయోజనాలు ఇలా..: పీఎం కిసాన్, పంటల బీమా తదితర వ్యవసాయ పథకాలు వర్తిస్తాయి. అవసరమైతే టోల్‌ఫ్రీ నంబరు 155251 ద్వారా సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు.

పీఎం కిసాన్ అందనిది ఇందుకే..: గత కొన్ని విడతలుగా విడుదల చేస్తున్న పీఎం కిసాన్ సాయం అందలేదని వివిధ సందర్భాల్లో పలువురు ఫిర్యాదు చేయడం తెలిసిందే. దీనిపై విచారణ చేయగా వీరిలో 80శాతం మంది రైతు గుర్తింపు 'ఐడీ' పొందకపోవడమేనని స్పష్టమైంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని మిగతావారూ నమోదు చేసుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

వామ్మో వానరం.. బయటకు వెళ్లలేం..

గన్నవరం మండలం కేసరపల్లిలో కోతుల బెడద ప్రజలను తీవ్రంగా వేధిస్తోంది. గుంపులు గుంపులుగా తిరుగుతున్న వానరాలతో భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంట్లో సామగ్రి ఎత్తుకెళ్తూ.. మొక్కజొన్న, జొన్న పంటలను నాశనం చేస్తున్నాయని.. ఒంటరిగా రోడ్డుపై వెళ్లాలన్నా భయంగా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. - న్యూస్‌టుడే, గన్నవరం గ్రామీణం

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

(c) eenadu

గుడివాడ

•గుడివాడ •పామర్రు •అవనిగడ్డ

సభ్యత్వ నమోదులో అగ్రస్థానంలో నిలపాలి

అవనిగడ్డ: జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదులో అవనిగడ్డ నియోజకవర్గాన్ని రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలపాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పిలుపు ఇచ్చారు. ఈమేరకు ఆదివారం కార్యాలయంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పార్టీ సభ్యత్వ నమోదుకు రూ.2 కోట్లు విరాళం అందించి, తొలి సభ్యత్వాన్ని తీసుకున్నారని చెప్పారు. ఈ నెల 26వ తేదీ నుంచి ప్రారంభమయ్యే సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పార్టీ సిద్ధాంతాలు, ఆశయాలు, ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేసేందుకు ముందుకు వచ్చే వారికి సభ్యత్వం ఇవ్వాలని సూచించారు. నియోజకవర్గంలో గత ఏడాది అత్యధిక సభ్యత్వాలు నమోదు చేసిన బచ్చు కృష్ణకుమారి, పసుపులేటి రవికుమార్, బచ్చు వెంకటేశ్, పూతబోయిన కరుణకుమార్, తుంటారు మురళి, తుంగల నరేష్, ముమ్మారెడ్డి సురేష్, కారేటి జగన్‌లను అభినందించారు.

ఎస్సై పవన్‌కు సత్కారం

ఘంటసాల, న్యూస్‌టుడే: చిట్టూరు జోడుగూడెనికి చెందిన రాజమండ్రి సిటీ ఎస్సై చిట్టూరి పవన్ ఆదివారం ఘంటసాల పోలీస్ స్టేషన్‌కు వచ్చి బ్యాచ్‌మేట్ అయిన ఘంటసాల ఎస్సై వేమన చందనను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈసందర్భంగా పవన్‌ను సత్కరించారు. హెచ్‌సీ నాగేశ్వరరావు, సర్పంచి రామారి ప్రసాద్‌బాబు, మాజీ సర్పంచి ఆరుంబాక రవి, తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
గుడివాడ: 89775 35999 పామర్రు: 80085 74684 అవనిగడ్డ: 80085 74679

★ పెదపారుపూడి మండలం వెంట్రప్రగడలో మేమున్నాం మీకు తోడుగా ద్వారా ప్రజలు తెలుపుతున్న సమస్యలకు ఆ గ్రామ పంచాయతీ కార్యదర్శి సాగరాణి తక్షణం స్పందించి పరిష్కరించారు. గ్రామ శివారు శివాపురం అంగన్‌వాడీ కేంద్రంలో తాగునీటి సమస్యకు పరిష్కారంగా తాగునీటి పైపులైను వేయించారు. బీసీ కాలనీలో వీధి దీపాలు వేయించారు. పంచాయతీ పరిధిలో సేకరణ వ్యాను పంపి చెత్తను తరలించారు. ★ పెదపారుపూడి మండలం మోపర్రు పంచాయతీ కార్యాలయం వద్ద చెత్త పేరుకుపోయిందని అధికారుల దృష్టికి తీసుకెళ్లగా, స్పందించిన పంచాయతీ కార్యదర్శి పుల్లారావు సిబ్బందితో చెత్తను తీయించారు. - న్యూస్‌టుడే, పెదపారుపూడి

కోడి పందేలపై దాడి

దోకిపర్రు (గుడ్లవల్లేరు): దోకిపర్రు శివారులో ఆదివారం కోడిపందేల శిబిరంపై దాడి చేసి కోడికత్తులు, 6 ద్విచక్ర వాహనాలు, 6 చరవాణులు, రూ.3150 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్.ఐ సత్యనారాయణ వెల్లడించారు.

జాగ్రత్తలు చెప్పిన చోటే రోడ్డు ప్రమాదం!

అవనిగడ్డ, అవనిగడ్డ గ్రామీణం, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదాల నివారణకు, అతివేగంగా వాహనాలు నడిపే వారికి కనువిప్పు కలిగేలా అవనిగడ్డ పోలీసులు వినూత్న ప్రచారానికి శ్రీకారం చుట్టారు. రోడ్డు ప్రమాదంలో దెబ్బతిన్న కారును రేడియం స్టిక్కర్లు అంటించి పులిగడ్డ చౌరస్తాలో ఒక ప్రయోగంగా ఏర్పాటు చేశారు. అతివేగంగా వాహనాలను నడిపితే ఈ కారులాగానే మీ వాహనాలు కూడా దెబ్బతింటాయని, అందులో ప్రయాణించే వారి ప్రాణాలు సైతం పోతాయని వాహనదారులకు తెలిసేలా అవనిగడ్డ సీఐ యువకుమార్ ఏర్పాటు చేయించారు.

★ అలా ఏర్పాటు చేసిన వారం రోజులు కాకుండానే అదే ప్రాంతంలో శనివారం అర్థరాత్రి దాటిన తరువాత రెండు లారీలు ఎదురెదురుగా వస్తూ ఢీకొన్నట్లు ఎస్సై కె.శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈ ఘటనలో రేపల్లె వైపు వెళ్తున్న లారీ ముందుభాగం నుజ్జునుజ్జు అయింది. ఎవరికీ ఎటువంటి ప్రాణహాని లేదని ఎస్సై పేర్కొన్నారు. మితిమీరిన వేగంతో పాటు నియంత్రణ లేని డ్రైవింగ్ ప్రమాదానికి కారణంగా ఆయన పేర్కొన్నారు.

చిట్టడవిలా.. జగనన్న కాలనీ

అవనిగడ్డ, న్యూస్‌టుడే: స్థానిక తిప్ప పాలెం జగనన్న కాలనీలో 42 ప్లాట్లు మంజూరు చేయగా, నిర్మాణాలు ప్రారంభించి 5 సంవత్సరాలైనప్పటికీ ఇప్పటికీ పూర్తయిన గృహాలు 6 మాత్రమే. వాటిలో నివాసం ఉండటానికి భయపడి 5గురు గృహ ప్రవేశాలు ఇప్పటికీ చేయలేదు. ఒకే ఒక కుటుంబం మాత్రమే 500 మీటర్ల దూరం నుంచి విద్యుత్ లైను సొంతంగా ఏర్పాటు చేసుకుని నివాసం ఉంటున్నారు. కాలనీ చూస్తే చిట్టడవిని తలపిస్తుంది. తాగునీటి వసతి లేదు. చేపపిల్లలు వేసినా ఉప్పు నీరే వస్తోంది. కనీసం ముళ్ల పొదలైనా తొలగించి, విద్యుత్ సౌకర్యం కల్పించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

వెంటనే రద్దు చేయాలి...

గుడివాడ(సత్యనారాయణపురం), న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం ఆర్థిక బిల్లు 2025లో సెంట్రల్ సివిల్ సర్వీసెస్ పెన్షన్ వ్యాలిడేషన్ బిల్లును వెంటనే రద్దు చేయాలని పెన్షనర్ల నేత ఆర్.మాధవరావు పేర్కొన్నారు. గుడివాడ దూరవాణి ప్రాంతీయ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో పాత, కొత్త పెన్షనర్లకు వేతన సవరణలు సమానంగా అమలు చేయాలని కోరారు. 26న విజయవాడ ధర్నాచౌక్ (ఏలూరు కాలువ గట్టు) గ్రంథాలయంలో జరిగే రాష్ట్ర స్థాయి పెన్షనర్ల సమావేశంలో కార్యాచరణపై చర్చిస్తున్నారు. నేతలు పి.అశోక్‌బాబు, కేపీసీ బోస్, ఎస్.రామారావు, రమేష్‌బాబు, కొల్లి లక్ష్మీనారాయణ, ఎల్.మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మాధవరావు

క్యాన్సర్‌ను ముందస్తుగానే గుర్తించి చికిత్స పొందండి

వక్కలగడ్డ(చల్లపల్లి), న్యూస్‌టుడే: క్యాన్సర్ వ్యాధి పట్ల భయాందోళనలు చెందకుండా, ముందస్తుగా గుర్తించినట్లయితే చికిత్స ద్వారా కోలుకుంటారని యువనేత మండలి వెంకట్రామ్(రాజా) అన్నారు. ఆదివారం చల్లపల్లి మండలం వక్కలగడ్డ గ్రామంలో పీఏసీఎస్ ఛైర్మన్ మల్లంపల్లి దుర్గామహేష్ ఆధ్వర్యంలో బసవతారకం ఇండో-అమెరికన్ క్యాన్సర్ హస్పిటల్ వారిచే ఎన్.టి.ఆర్.ట్రస్ట్ సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత క్యాన్సర్ పరీక్షా శిబిరాన్ని ప్రారంభించారు. హెచ్‌డీ కృష్ణప్రసాద్ పర్యవేక్షణలో ప్రత్యేక బస్సు ద్వారా వైద్యులు డాక్టర్ రవిశంకర్, డాక్టర్ స్వర్ణకుమారి, డాక్టర్ మనీష్, డాక్టర్ జ్యోతి, డాక్టర్ శరత్‌లు 180 మంది మహిళలకు వైద్యపరీక్షలు చేసి పలు సూచనలు, సలహాలు అందించారు. తెదేపా నేతలు మోర్ల రాంబాబు, యార్లగడ్డ శ్రీనివాసరావు, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, పైడిపాముల స్వప్న, మోర్ల శివ, సూదాని నందగోపాల్, సాయి, వాసిరెడ్డి రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న వెంకట్రామ్, తెదేపా నేతలు, వైద్యులు

అల్లర్లలో పాల్గొంటే కఠినచర్యలు

గుడివాడ, న్యూస్‌టుడే: గుడివాడ పట్టణంలోని 1వ, 2వ పోలీసు స్టేషన్లు, రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని 112 మంది అనుమానిత షీటర్లు, రౌడీ షీటర్లకు ఆదివారం ఆయా పోలీసు అధికారులు కౌన్సెలింగ్ ఇచ్చారు. హిస్టరీ షీటర్లు ఎలాంటి అల్లర్లలో పాల్గొనరాదని, శాంతి భద్రతలకు విఘాతం కల్గించే చర్యలకు పాల్పడరాదన్నారు. చెడు నడతలకు దూరంగా ఉండాలని, లేకుంటే కఠిన చర్యలు తప్పవన్నారు. భవిష్యత్‌లో ఎలాంటి నేరాలలో ఉండరాదని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐలు కొండపల్లి శ్రీనివాస్, జె.ఆర్.కె.హనీష్, రూరల్ ఎస్.ఐ ఎన్.చంటిబాబు తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లతో మాట్లాడుతున్న సీఐ హనీష్

అశ్వారావుపాలెంలో భూమి పూజ

అవనిగడ్డ (గ్రామీణం, న్యూస్‌టుడే): మండలంలోని అశ్వారావుపాలెంలో గల తాగునీటి పథకం వద్ద గ్రామ సర్పంచి పంజ్రాజు నాగ వెంకట లక్ష్మీప్రసాద్ ఆధ్వర్యంలో మండలి వెంకటకృష్ణారావు విగ్రహం ఏర్పాటుకు ఆదివారం మండలి వెంకట్రామ్ భూమి పూజ చేశారు. నాయకులు పాల్గొన్నారు.

నాగరాజు ఎదిగిన తీరు యువతకు ఆదర్శం

చల్లపల్లి, న్యూస్‌టుడే: ప్రమాదంలో కంటిచూపును కోల్పోయినా ఆత్మవిశ్వాసాన్ని కూడగట్టుకుని పట్టుదలతో గ్రూప్-2 విజేతగా నిలిచిన నందం నాగరాజు గమనం నేటి యువతకు మార్గదర్శకమని ఇండియా విలేజ్ మినిస్ట్రీస్ ప్రెసిడెంట్ డాక్టర్ వేములపల్లి సురేష్ అన్నారు. ఆదివారం పురిటిగడ్డ ఐవీఎం హోమ్‌లో జరిగిన కార్యక్రమంలో నాగరాజును, అతని తల్లి వెంకటేశ్వరమ్మను నూతన దుస్తులు, దుప్పట్లు, రూ.25వేల నగదు ప్రోత్సాహక బహుమతితో సత్కరించారు. ఐవీఎం ప్రతినిధి వేములపల్లి రోజా పాల్గొన్నారు.

నాగరాజు, తల్లిని సత్కరిస్తున్న సురేష్, రోజా దంపతులు

121 మందికి ఉచిత వైద్య సేవలు

భట్లపెనుమర్రు (కూచిపూడి), న్యూస్‌టుడే: మొవ్వ మండలం భట్లపెనుమర్రులో పింగళి వెంకయ్య రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 120 మంది రోగులకు ఉచితంగా వైద్యసేవలు, మందులు అందించారు. ట్రస్ట్ ఛైర్మన్ చలసాని బలరామయ్య, చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి డాక్టర్ టి.ఎం.వి.ప్రసాదరావు పర్యవేక్షణలో ట్రస్ట్ సీఈవో, జీర్ణకోశ వ్యాధులు, లివర్ స్పెషలిస్ట్ డాక్టర్ సి.ఎల్.వెంకట్రావు, పి.వి.ఆర్ మల్టీ స్పెషాలిటీ వైద్యశాల(విజయవాడ) డాక్టర్ మంజుభార్గవి, విజయవాడ ఎల్.వి.ప్రసాద్ కంటి వైద్యశాల వైద్యులు పాల్గొన్నారు. మధుమేహ పరీక్షలు, ఈసీజీ, గుండె సంబంధిత 2డి ఎకో, కంటి పరీక్షలు ఉచితంగా చేశారు.

రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ మంజుభార్గవి

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

మొవ్వ(కూచిపూడి), న్యూస్‌టుడే: సోమవారం నుంచి నిర్వహించే ఇంటర్మీడియట్ పరీక్షలకు మొవ్వ క్షేత్రయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సర్వం సిద్ధం చేశారు. ఈ విషయాన్ని పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ డాక్టర్ డి.సుధాకరరావు, డీవో ఎం.ఆదినిష్ణు ఆదివారం స్థానిక విలేకరులకు తెలిపారు. మొవ్వ కళాశాల విద్యార్థులతో పాటు పామర్రు ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్(+) విద్యార్థినులు ఈ కేంద్రంలో పరీక్షలు హాజరుకానున్నారు. కళాశాలలో ఏడు సీసీ కెమెరాల పర్యవేక్షణలో సిటింగ్ స్క్వాడ్, ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీల నడుమ పరీక్షలు జరుగుతాయని చెప్పారు. ప్రతి గదిలో 22 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తారని పేర్కొన్నారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షలకు అనుమతి ఉండదని వివరించారు. నిడుమోలు జడ్పీ పాఠశాలలో ప్లస్(+) విద్యార్థినులు 21 మంది పామర్రు కేంద్రంలో పరీక్షలు రాస్తున్నట్లు పాఠశాల హెచ్‌ఎం కాసాని అరుణ తెలిపారు.

సీఎస్, డీవోల సమక్షంలో నెంబర్లు వేస్తున్న సిబ్బంది

పామర్రు, న్యూస్‌టుడే: సోమవారం నుంచి ప్రారంభమయ్యే ఇంటర్ పరీక్షల నిర్వహణపై ఇన్విజిలేటర్లకు చీఫ్ సూపరింటెండెంట్ ఎన్.నాగవేణు ఆదివారం అవగాహన కల్పించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తొలి రోజు పరీక్షకు మొదటి సంవత్సరం ఇంటర్ విద్యార్థులు 299 మంది హాజరవుతారన్నారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు జరిగే పరీక్షలకు అరగంట ముందుగా పరీక్ష కేంద్రంలోకి ప్రవేశం కల్పిస్తామన్నారు. విద్యార్థులు చూచిరాతకు పాల్పడితే డిబార్ చేస్తామని హెచ్చరించారు.

పామర్రు గ్రామీణం: నిమ్మకూరు గురుకుల వృత్తివిద్యా జూనియర్ కళాశాలలో సోమవారం నుంచి జరిగే ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని ప్రిన్సిపల్ ఎస్.లక్ష్మీకుమారి ఆదివారం తెలిపారు. మొత్తం 270 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని వారిలో మొదటి సంవత్సరం 148 మంది, ద్వితీయ సంవత్సరం 122 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారన్నారు.

మంగళగిరికి తరలిన చేనేత కార్మికులు

కాజ(కూచిపూడి): చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర వ్యాప్తంగా తలపెట్టిన చలో మంగళగిరి కార్యక్రమానికి మొవ్వ మండలం కాజ గ్రామానికి చెందిన చేనేత మహిళలతోపాటు చేనేత కార్మికులు తరలివెళ్లారు. వెళ్లిన వారిలో జిల్లా చేనేత కార్మిక సంఘ అధ్యక్షులు కోడాటి నారాయణరావు చొరవతో చేనేత గర్జనకు వెళ్లారు. సీపీఐ పామర్రు నియోజకవర్గ సమితి కార్యదర్శి చెరకు శ్రీనివాసరావు, సమితి సహాయ కార్యదర్శి చందోలు నాగేశ్వరరావు తదితరులున్నారు.

ఉల్లిపాలెంలో ముగ్గురు జూదరుల అరెస్టు

కోడూరు: ఉల్లిపాలెంలో జూదం ఆడుతున్న వారిపై దాడి చేసి ముగ్గురిని ఆదివారం అరెస్టు చేసినట్లు ఎస్సై కె.చాణక్య తెలిపారు. వారి వద్ద నుంచి రూ.1070 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. మండలంలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

సీఎం సహాయనిధి పంపిణీ

అవనిగడ్డ: పేదల వైద్యానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ చెప్పారు. ఆదివారం ఆలయన కార్యాలయంలో 30 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.41,61,456 చెక్కులను పంపిణీ చేశారు.

ఆలయ ఇన్‌ఛార్జి ఈవోగా మోహనరావు

కోడూరు: కోడూరు మండలంలోని విశ్వనాథపల్లిలో కొలువై ఉన్న శ్రీఅద్దంకి నాంచారమ్మ అమ్మవారి ఆలయానికి ఇన్‌ఛార్జి ఈవోగా టీవీవీ.మోహనరావు నియమితులయ్యారు. ఆయన గతంలో ఇక్కడ పని చేసి మచిలీపట్నం బదిలీ అయ్యారు. ప్రస్తుతం మచిలీపట్నంలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయానికి ఈవోగా పని చేస్తున్నారు. ఆయనకే ఇన్‌ఛార్జి బాధ్యతలను అప్పగించారు.

తెదేపా నేతల ప్రత్యేక పూజలు

విశ్వనాథపల్లి(కోడూరు): నాంచారమ్మ అమ్మవారిని నియోజకవర్గ తెదేపా పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఏఎంసీ అధ్యక్షులు కొల్లూరు వెంకటేశ్వరరావు, కోడూరు మండల తెదేపా అధ్యక్షులు బండే శ్రీనివాసరావు, తోట వెంకట సూర్యనరసింహారావు, తోట సాంబయ్య పాల్గొన్నారు.

పెరటి సేద్యం.. ప్రయోజనాలు విభిన్నం!

అవనిగడ్డ, న్యూస్‌టుడే

ఓ ప్రయివేటు కళాశాలలో అధ్యాపకుడిగా పని చేస్తున్న కొండవీటి సందీప్‌కి పెరటి తోటల పెంపకంపై ఆసక్తి ఎక్కువ. వీలు చిక్కినప్పుడల్లా ఆయన తన ఇంటి పెరట్లోని మొక్కల ఆలనాపాలనా చూస్తూ ఉంటారు. ప్రయోగాలూ చేస్తుంటారు.

సంప్రదాయ పద్ధతిలో సేకరించిన విత్తనాలతో పాటు ఆన్‌లైన్‌లో తెప్పించిన విత్తనాల్నీ తన పెరటిలో నాటి ఉత్పత్తుల్ని పరిశీలిస్తూ ఉంటారు. ఇటీవల ఆయన ఆన్‌లైన్లో తెప్పించిన అమెరికన్ టమాటా రకాల విత్తనాలు మొక్కలుగా ఎదిగి నీలం రంగు, పసుపు రంగులలో కాచి ఆకట్టుకుంటున్నాయి. కొన్ని టమాటాలు గుత్తులుగా, అతి చిన్న సైజు కాశీ గుమ్మడి కాయ ఆకారంలో పెరుగుతున్నాయి. అవి నాటిన 2 నెలలకే కాపునకు వచ్చాయట. అడవి (కొండ) మామిడిగా పిలిచే మామిడి మొక్కను బెంగాల్ నర్సరీ నుంచి తెప్పించగా ఏడాదిన్నర కాలంలో కాయలు గుత్తులుగా కాచింది. పుల్లగా ఉండే ఈ కాయలు సైజు మాత్రం చిన్నగానే ఉంటాయి. పులుపు కూడా తక్కువగానే ఉంటుందని, సందీప్ చెప్పారు. ఎర్ర ముల్లంగి విత్తనాలను కూడా ఆన్‌లైన్‌లో తెప్పించి నాటారు. విత్తనం నాటిన 3 నెలలకు దుంపలు తయారై ఎర్రగా ఆకర్షణీయంగా పెరుగుతున్నాయి. ఆవు పేడ ఎరువు, నీళ్లు పోస్తున్నట్లు రామ్‌ప్రసాద్ చెప్పారు. ఇలా తన పెరట్లో పెట్టిన విత్తనాలు కాచిన పంటను తన ఇంటి అవసరాలకు వినియోగించుకోవడంతో పాటు తెలిసిన వారికీ పంచుతుంటారు. రసాయనాలు వినియోగించి పెంచుతున్న కూరగాయల్ని వినియోగిస్తూ అనారోగ్యాల పాలయ్యే బదులు అవకాశం ఉన్నవారు తమ పెరట్లో సేద్యం చేయడం ద్వారా వచ్చే పంట ఉత్పత్తుల్ని వినియోగించుకుంటే ఆరోగ్యం సమకూరుతుందని చెబుతున్నారు. మొక్కల్ని సాకడం ద్వారా శారీరక మానసిక సాంత్వన కలుగుతుందని చెబుతున్నారు. ఈమేరకు ఆయన విద్యార్థులకు, స్థానికులకు అవగాహన కల్పిస్తున్నారు.

అడవి (కొండ) మామిడి చెట్టు కాయలు

పసుపురంగు టమాటా కాయలతో సందీప్

ఎర్ర ముల్లంగి మొక్కకు వచ్చిన దుంపలు

స్ఫూర్తి ప్రదాత అంబేడ్కర్

మొవ్వ(కూచిపూడి), న్యూస్‌టుడే: దళితజాతి, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడిన డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ స్ఫూర్తి ప్రదాత అని పామర్రు శాసనసభ్యుడు వర్ల కుమార్‌రాజా అన్నారు. మొవ్వలో ఆదివారం అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు శంకుస్థాపన, పూజా కార్యక్రమంలో బౌద్ధమత పీఠాధిపతి బంతీజీ(ఘంటసాల)తోపాటు ఎమ్మెల్యే కుమార్‌రాజా పాల్గొని మాట్లాడారు. రేపటి పౌరులకు అంబేడ్కర్ గొప్పతనం తెలిసేలా ఆయన విగ్రహాలను ప్రతివాడలో ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. సర్పంచి తూము పూర్ణచంద్రరావు, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ లింగమనేని రామలింగేశ్వరరావు, తెదేపా సీనియర్ నాయకులు వీరేంద్ర, రత్నగిరిరావు, బాబూరావు, పూర్ణచంద్రరరావు, బుజ్జికోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనం ప్రారంభం

అవనిగడ్డ, న్యూస్‌టుడే: స్థానిక అగ్నిమాపక కేంద్రం వెనుక నూతనంగా నిర్మించిన రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘ భవనం, లైబ్రరీ కం రీడింగ్ హాలును ఎమ్మెల్యే మండలి ప్రారంభించారు. ఎమ్మెల్యేను సభ్యులు ఘనంగా సత్కరించారు. సంఘ శాశ్వత అధ్యక్షులు కాశీభట్ల నాగేశ్వరరావును ఎమ్మెల్యే సత్కరించారు. సంఘ అధ్యక్షుడు భూపతి భాస్కర్‌రావు, ప్రధాన కార్యదర్శి బొప్పన కాశీవిశ్వేశ్వరరావు, కోశాధికారి బడే దానారావు, సంఘం జిల్లా అధ్యక్షుడు కె.రాజేంద్రప్రసాద్, వడ్లమూడి సాగర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

భవనం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

మండలికి ఘన నివాళి

కోడూరు, న్యూస్‌టుడే: దివంగత మండలి వెంకట కృష్ణారావు శతజయంతి ఉత్సవాల్లో భాగంగా కోడూరులోని ప్రధాన కూడలిలో ఉన్న ఆయన విగ్రహానికి డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ యువసేన ఆధ్వర్యంలో ఆదివారం పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.



వెంకట కృష్ణారావు విగ్రహం వద్ద యువసేన, కూటమి నాయకులు

నేడు నిమ్మకూరులో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం

పామర్రుగ్రామీణం, న్యూస్‌టుడే: నిమ్మకూరులో సోమవారం ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా ఆదివారం తెలిపారు. ఎన్టీఆర్ ట్రస్టు సహకారంతో బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రి వారు నిమ్మకూరు కల్యాణ మంటపంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు శిబిరం నిర్వహిస్తుందన్నారు.

గుంటూరు తరలివెళ్లిన తపాలా సిబ్బంది

పామర్రు, న్యూస్‌టుడే: గుంటూరులో ఆదివారం సాయంత్రం నిర్వహించిన గ్రామీణ డాక్ సమ్మేళనానికి తపాలా సిబ్బంది తరలివెళ్లారు. పామర్రు పోస్టల్ సబ్‌డివిజన్ నుంచి రెండు బస్సుల్లో వంద మంది వెళ్లారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

ముగిసిన శ్రీపోతురాజుస్వామి జాతర

నాగాయలంక: స్థానిక శ్రీ పోతురాజు స్వామి వారి ఆలయంలో వార్షిక జాతర మహోత్సవాలు ఆదివారం ముగిసాయి. గణచారులు ఊరేగించిన ఘటాలను ఆలయ ప్రాంగణంలో ఉంచగా భక్తులు నైవేద్యాలు సమర్పించారు. దాతల సాయంతో భారీ అన్న సంతర్పణ నిర్వహించారు.

స్వామివారి కల్యాణంలో దంపతులు

వెంకటేశ్వరాలయంలో మాసకల్యాణోత్సవం

దోకిపర్రు(గుడ్లవల్లేరు): మండలంలోని దోకిపర్రు శ్రీభూ వెంకటేశ్వరాలయంలో ఆదివారం స్వామివారి మాస కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. పలువురు దంపతులు ఉభయ దాతలుగా స్వామివారి కల్యాణంలో పాల్గొన్నారు. నిర్వాహకులు కొమ్మారెడ్డి బాపిరెడ్డి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైభవంగా విగ్రహం పునఃప్రతిష్ఠ

పెదపారుపూడి, న్యూస్‌టుడే: నాగాపురం శివారు సోమవరప్పాడు గ్రామంలో శ్రీరామమందిర పునర్నిర్మాణంలో భాగంగా ఆదివారం విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. గణపతి, వాస్తు పూజలు చేసి నవగ్రహ మండపారాధనలు, వాస్తు నవగ్రహ శ్రీరామసీతా ఆంజనేయ స్వామివార్ల మూల మంత్ర హోమాలు జరిపారు. మహిళలు భక్తి గీతాలు ఆలపించారు. పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నసమారాధన చేశారు. ఈకార్యక్రమంలో కె.హరిప్రసాద్, వెంకట నారాయణరావు, బాలకృష్ణ, వీరరాజు, తుమ్మల రత్న, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పాల్గొన్న గ్రామ పెద్దలు

రేపటి నుంచి తాడంకిలో..

తాడంకి(పమిడిముక్కల): తాడంకిలో భక్తుల సహకారంతో నూతనంగా నిర్మించిన శ్రీ సీతారామ చంద్రస్వామి ఆలయ ప్రతిష్ఠ మహోత్సవాలు ఈ నెల 24, 25, 26 తేదీల్లో జరుగుతాయి. 24న గోపూజ, నూతన విగ్రహాల గ్రామోత్సవం, అగ్నిమథనం పూజా కార్యక్రమాలు జరుగుతాయి.. 25న విగ్రహాలకు జలాధివాసం, క్షీరాధివాసం, పంచగవ్యాధివాసాలు, ధాన్యాధివాసం, పంచశయ్యాధివాసం, నీరాజన మంత్రపుష్పం నిర్వహిస్తారు. 26వ తేదీ ఉదయం 10.08 గంటలకు యంత్రస్థాపన, శ్రీహనుమత్ లక్ష్మణ సహిత సీతారామచంద్రస్వామి విగ్రహ, శిఖర ప్రతిష్ఠలు, శాంతికల్యాణం జరుగుతాయి. అనంతరం అన్నసమారాధన నిర్వహిస్తారు. కాకినాడ శ్రీపీఠ వ్యవస్థాపకులు శ్రీ పరిపూర్ణానందస్వామి ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొని అనుగ్రహభాషణ చేస్తారు.

ప్రతిష్ఠకు సిద్ధమవుతున్న రామాలయం

కిటకిటలాడిన లంకమ్మ దేవాలయం

అవనిగడ్డ, న్యూస్‌టుడే: స్థానిక గ్రామ దేవత లంకమ్మ అమ్మవారి దేవాలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. అమ్మవారికి ఘటం బిందెలు సమర్పించడానికి డప్పు వాయిద్యాలతో వచ్చి గులాంలు చల్లుకుంటూ, డాన్సులు చేస్తూ సందడి చేశారు. బంటుమిల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఎస్.జగన్‌మోహన్‌రావు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అవనిగడ్డ, న్యూస్‌టుడే: గుర్రపు చెరువు గట్టున నూతనంగా నిర్మించిన వాసవీ కన్యకా పరమేశ్వరి విగ్రహ ప్రతిష్ఠ ఆదివారం వైభవంగా జరిగింది. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా గంగానమ్మ నెల సంబరం

పామర్రు, న్యూస్‌టుడే: పామర్రులో గంగానమ్మ అమ్మవారి నెల సంబరాన్ని ఆదివారం ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అలంకరించారు. పెద్ద సంబరం రోజు మొక్కులు తీర్చుకోలేని భక్తులు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. పశువులను, వాహనాలను ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. అమ్మవారికి పాలపొంగళ్లు పెట్టారు. రెడ్డీ వెల్ఫేర్ అసోసియేషన్ భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేసింది. ఆలయ కమిటీ సభ్యులు రామిరెడ్డి, బాలసుబ్రహ్మణ్యేశ్వరరెడ్డి, రాజారెడ్డి తదితరులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు.

అలంకరణలో అమ్మవారు

గోడపత్రికల ఆవిష్కరణ

పామర్రు: 'స్టేట్ టూ బూత్ లెవెల్' సమాచారం అందుకోవడానికి తెదేపా నాయకులు, కార్యకర్తలు క్యూఆర్ కోడ్‌ను స్కాన్‌చేసి యాప్‌ను డౌన్లోడ్ చేసుకోవాలని ఎమ్మెల్యే కుమార్‌రాజా అన్నారు. ఆదివారం పీ4 కార్యాలయంలో ఇందుకు సంబంధించిన గోడపత్రికలను పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఈ యాప్‌ను డౌన్లోడ్ చేసుకుని పార్టీ బలోపేతానికి కృషిచేయాలన్నారు.

అట్టలు, కలాల అందజేత

తోట్లవల్లూరు : తోట్లవల్లూరు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 65 మంది విద్యార్థులకు ఆదివారం 1999-2000 బ్యాచ్ విద్యార్థులు అట్టలు, కలాలు, పెన్సిళ్లు అందజేశారు.

పది విద్యార్థులతో పూర్వ విద్యార్థులు

చరవాణుల జోలికి పోవొద్దు

అగినపర్రు(పమిడిముక్కల) : ప్రతి విద్యార్థి చదువు దశలో చరవాణుల జోలికి పోకుండా తీరిక సమయాన్ని పుస్తకపఠనం, క్రీడలతో గడపాలని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమారరాజా అన్నారు. అగినపర్రు జిల్లాపరిషత్తు ఉన్నత పాఠశాలలో ఆదివారం జరిగిన పాఠశాలల మండల స్థాయి క్రీడా పోటీల ముగింపు సభలో ఆయన మాట్లాడారు. విజేతలైన విద్యార్థులకు బహుమతులందజేశారు.

విజేతలైన విద్యార్థుల బృందం

(c) eenadu

ఈనాడు
అమరావతి
ఎన్టీఆర్
సోమవారం ఫిబ్రవరి 23, 2026

విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఆర్గానిక్ రైతోత్సవం ఆదివారంతో ముగిసింది. చివరిరోజు కలెక్టర్ లక్ష్మీశ రైతులకు తమ ఉత్పత్తులు అమ్ముకునేందుకు ఉన్న అవకాశాలు, జిల్లా యంత్రాంగం తరపున అందిస్తున్న సేవలపై వివరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ స్టాళ్లను పరిశీలించారు. - ఈనాడు, అమరావతి

'ప్రజాసమస్యల పరిష్కార వేదిక' నేడు

ఎన్టీఆర్ కలెక్టరేట్: ఈ నెల 23వ తేదీ సోమవారం 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. అన్ని మండల కేంద్రాలు, మున్సిపల్/ నగరపాలక సంస్థ, రెవెన్యూ డివిజనల్ కార్యాలయాల్లో అర్జీలు స్వీకరిస్తారని పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో వినతి పత్రాలు స్వీకరించనున్నట్లు వివరించారు. అర్జీలను Meekosam.ap.gov.in లోనూ దాఖలు చేసుకోవచ్చని కలెక్టర్ సూచించారు. అర్జీల స్థితి తెలుసుకునేందుకు 1100 నంబరుకు ఫోన్ చేయవచ్చన్నారు.

వేసే మందు.. చూడు ముందు

☛ కొన్నవన్నీ అమ్మేయాలనే నకిలీ తేదీలు
☛ అధికంగా వాడే ఔషధాలే లక్ష్యం

ఈనాడు, అమరావతి

గ్రామాల నుంచి పట్టణాలు, నగరాల వరకూ ప్రస్తుతం గ్యాస్ బిళ్లలను విచ్చలవిడిగా వాడుతున్నారు. కనీసం వైద్యుల సూచన లేకుండా నేరుగా మెడికల్ షాపుల్లో కొనుగోలు చేసి మింగేస్తున్నారు. ఇదే అదనుగా కాలంచెల్లిన గ్యాస్ట్రిక్ ట్యాబ్లెట్లను సైతం నకిలీ తేదీలు, వివరాలతో మార్కెట్‌లో అమ్మేసి సొమ్ము చేసుకునే అక్రమార్కులు పెరిగారు. ఔషధాల గడువు ఒకటి రెండు నెలల్లో ముగుస్తోందనగా.. దానికి మరో ఆరు నెలలు పొడిగించి నకిలీ స్టాంపులతో తేదీలను ముద్రిస్తున్నారు. వాటి ఎక్స్‌పైరీ తేదీలను టిన్నర్లను వాడి చెరిపేస్తున్నారు. మందుల బ్యాచ్ నంబర్లు సైతం మార్చేస్తూ తయారీ తేదీలు నకిలీవి ముద్రించి.. రోగులకు అంటగడుతున్నారు.

వెనక్కిచ్చే వీల్లేక అక్రమాలు

ఔషధాల రంగంలో 'ప్రోపగాండా కం డిస్ట్రిబ్యూషన్(పీసీడీ)' అనేది బాగా ప్రాచుర్యం పొందిన విక్రయ విధానం. మెడికల్ ఫీల్డ్‌లో అనుభవం ఉన్న కొంతమంది.. డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్(డీసీఏ) నుంచి అనుమతి తీసుకుని మందులు సరఫరా చేస్తుంటారు. తాజాగా విజయవాడ సత్యనారాయణపురంలో నకిలీ తేదీలను ముద్రించి ఔషధాలను విక్రయిస్తూ దొరికిన.. డైకన్ హెల్త్‌కేర్ డిస్ట్రిబ్యూషన్ సంస్థ కూడా ఇలాంటిదే. వీళ్లు ఫార్మా సంస్థల నుంచి బల్క్‌గా ఔషధాలు కొంటారు. వాటిని తమ కంపెనీ పేరుతోనే మార్కెట్‌లో హోల్‌సేల్‌గా విక్రయిస్తారు. ప్రధానంగా వైద్యులతో అనుసంధానమై, ఆస్పత్రులకు అనుబంధంగా ఉండే మెడికల్ షాపుల్లోనే వీరి ఔషధాలు అమ్ముకుంటారు. ఒకవేళ ఔషధాల గడువు తీరిపోతే వాటిని తిరిగి ఫార్మా కంపెనీకి పంపించడానికి అవకాశం ఉండదు. మిగతా మెడికల్ షాపుల్లో ఉండే ఏ మందైనా.. గడువు తీరిపోతే.. దానిని తయారు చేసిన సంస్థకు వెనక్కి పంపించేయొచ్చు. ఈ పీసీడీ విధానంలో డిస్ట్రిబ్యూషన్ చేసే వ్యాపారులకు ఆ అవకాశం లేకపోవడంతో ఎలాగైనా తెచ్చిన మందులన్నీ గడువులోగా అమ్మేయాలి. అందుకే నకిలీ తేదీలు ముద్రిస్తున్నట్లు అధికారులు గుర్తించారు.

మధుమేహ, గ్యాస్ బిళ్లలు..

తాజాగా నకిలీ తేదీలతో దొరికిన మందులన్నీ మధుమేహ, గ్యాస్ట్రిక్ సమస్యకు వినియోగించేవే కావడం గమనార్హం. జనం ఎక్కువగా వినియోగించే గ్యాస్, మధుమేహం, రక్తపోటు, గుండె సంబంధిత సమస్యలు, నరాలు, ఎముకలకు సంబంధించిన అనారోగ్య సమస్యల మందులపైనే.. విజయవాడలో పీసీడీ వ్యాపారం జరుగుతోంది. గడువు రెండు మూడు నెలలుంటే.. వైద్యులు వీటిని తీసుకోరు. అందుకే ఆరేడు నెలలు పొడిగించి.. తొమ్మిది నెలలుందని నమ్మించి అంటగడుతున్నారు.

సర్వోత్తమ స్ఫూర్తి.. సాహిత్య దీప్తి..

ఉచితంగా 40వేల పుస్తకాల పంపిణీ

విజయవాడ సర్వోత్తమ గ్రంథాలయంలో నిర్వహించిన పుస్తకాల పండగ.. సాహిత్య పరిమళాన్ని వెదజల్లింది. గ్రంథాలయ ప్రాంగణమంతా పుస్తక ప్రియులతో కళకళలాడింది. సామాజిక మాధ్యమాలు రాజ్యమేలుతున్న కాలంలోనూ పుస్తకం విలువ తగ్గలేదని నిరూపించింది. రెండు రోజుల పుస్తక ప్రదర్శన, పంపిణీ ఆదివారంతో ముగిసింది. - పటమట, న్యూస్‌టుడే

ఈ ఏడాది సుమారు 15 వేల మంది సందర్శించారు. మనిషికి 2 చొప్పున పుస్తకాలు ఉచితంగా ఇచ్చారు. అన్ని రంగాల పుస్తకాలు 40 వేలకు పైగా పంపిణీ చేసినట్లు నిర్వాహకులు చెప్పారు. అక్కడే పుస్తకాల హుండీ ఏర్పాటు చేశారు. ఎవరైనా తాము చదివిన పుస్తకాలు తీసుకొచ్చి అందులో వేస్తే చాలు. వాటిని తిరిగి పంపిణీ చేస్తారు. ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘ ప్రధాన కార్యదర్శి రావి శారద మాట్లాడుతూ.. 'పుస్తకాల పంపిణీ 2015లో ప్రారంభించాం. మొదట్లో ఆరు వేలు, ఇప్పుడు దాదాపు 40 వేల పుస్తకాలు పంపిణీ చేశాం. కొందరు రచయితలు వారి వద్ద ఉన్న పుస్తకాలు మాకు ఇచ్చారు. అన్ని రకాల పుస్తకాలకు ఆదరణ లభిస్తోంది.' అని వివరించారు.

పుస్తకాలు పరిశీలిస్తున్న సాహిత్య ప్రియులు

ఎంపిక సులభం

నేను ఎంబీఏ చదువుతున్నా. కళాశాల గ్రంథాలయంలో నింపాదిగా పుస్తకాలు చదవడానికి వీలు కలగడం లేదు. ఇక్కడ ప్రదర్శించిన పుస్తకాలు సబ్జెక్టు వారీగా ఉన్నందున ఎంపిక సులభమైంది. మాలాంటి వాళ్లెందరో ఈ గ్రంథాలయానికి రుణపడి ఉంటారు. - మానస, ఎంబీఏ విద్యార్థిని

అమ్మానాన్న చెబితే వచ్చా

నేను ఐదో తరగతి చదువుతున్నా. పుస్తకాలంటే ఇష్టం. మా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఉచిత పుస్తక ప్రదర్శన గురించి చెబితే వచ్చా. ఇక్కడ కథలు, శాస్త్రవేత్తల జీవిత చరిత్రలు, అన్ని తరగతుల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. కొత్త ప్రపంచంలో అడుగుపెట్టినట్లు ఉంది. - జైష్ణవి, విద్యార్థిని

ఊహించిన కంటే ఎక్కువే ఉన్నాయి

మాధ్యమాల ద్వారా ఉచిత పుస్తక వితరణ గురించి తెలుసుకున్నా. ఈ విషయాన్ని మా కళాశాల పాలకవర్గానికి తెలియజేశా. వాళ్లు పరిశీలించి రమ్మన్నారు. ఇక్కడకు వచ్చి చూస్తే నేను ఊహించిన దానికంటే ఎక్కువ పుస్తకాలు కనబడ్డాయి. ప్రత్యేక అనుమతితో కళాశాల గ్రంథాలయంలో లేని 500 పుస్తకాలు తీసుకెళ్తున్నా. - ఎ.వసుంధర, గ్రంథాలయాధికారిణి, తీగల రామిరెడ్డి విద్యాసంస్థలు, హైదరాబాద్

రంజాన్ వేళలు

ఇఫ్తార్: (సోమవారం)
సాయంత్రం: 6.17
సహరి: (మంగళవారం)
ఉదయం: 5.11

నిమిషం ఆలస్యమైనా అనుమతించం

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే

ఇంటర్మీడియట్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం అవుతున్నాయి. ఎన్టీఆర్ జిల్లాలో ప్రథమ సంవత్సరం విద్యార్థులు 36,928 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 39,980 మంది, మొత్తం 76,908 మంది పరీక్షలు రాయనున్నారు. వారి కోసం జిల్లాలోని వివిధ కళాశాలలో 98 కేంద్రాలు ఏర్పాటు చేశారు. 1235 మంది ఇన్విజిలేటర్లు విధులు నిర్వహించనున్నారు. 4 సిటింగ్ స్క్వాడ్, 4 ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు ఏర్పాటు చేశారు.

ఎస్ఆర్ఆర్ కళాశాలలో డీఐఈవో ప్రభాకర్ పరిశీలన

★ ఉదయం 9 గంటలకు పరీక్ష ప్రారంభం అవుతుంది. ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షకు అనుమతించేది లేదని డీఐఈవో బి.ప్రభాకర్ తెలిపారు. ఉదయం 8.30 గంటలకు కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా కేంద్రాల వద్ద తాగునీటి వసతితో పాటు అన్ని సౌకర్యాలు ఏర్పాట్లు పూర్తి చేశామని పేర్కొన్నారు. హాల్ టికెట్, పెన్ను మినహా ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతించమని తెలిపారు. ★ మాల్‌ప్రాక్టీస్ జరగకుండా అన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాలు బిగించారు. 144 సెక్షన్ అమలులో ఉన్నందున కేంద్రాల వద్ద పటిష్ఠమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. పరీక్షలకు సంబంధించి సందేహాలు, సమస్యలు ఉంటే 0866-2442362 నంబరుకు ఫోన్ చేయాలని సూచించారు.

భానుడి సెగ.. భక్తులకు కష్టమేగా..

కొండపైకి వెళ్లడానికి దుర్గాఘాట్ వద్ద భక్తులు ఒకరినొకరు తోసుకోకుండా బస్సులు ఎక్కడానికి దేవస్థానం వరుసలు ఏర్పాటు చేయడం మంచి ఆలోచనే. అయితే భక్తులు ఎండ తీవ్రత తట్టుకోలేక, బస్సుల కోసం నిరీక్షించలేక అవస్థలు పడుతున్నారు. రానున్న రోజుల్లో ఎండలు మరింత తీవ్రం కానున్న నేపథ్యంలో భక్తులకు నీడ ఏర్పాటు చేస్తే సౌకర్యంగా ఉంటుంది. -ఈనాడు అమరావతి

కృష్ణమ్మ చెంత.. దుర్గంధం చింత

ఇది కృష్ణా పుష్కరాల సమయంలో రూ.కోట్లతో విజయవాడలో నిర్మించిన కృష్ణవేణి స్నానఘాట్. నాడు లక్షల మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు ఇక్కడ. కానీ నేడు నీరు నిలిచి మురుగు మడుగు కట్టింది. ఘాట్ వద్దకు వచ్చే పర్యాటకులు, శనైశ్చరస్వామి దేవస్థానానికి వచ్చే భక్తులు అపరిశుభ్రతను చూసి దుర్వాసన భరించలేక ఇబ్బందులు పడుతున్నారు. -ఈనాడు, అమరావతి

మేము సైతం.. ప్రకృతి హితం

ఆర్గానిక్ సాగులో దూసుకుపోతున్న హాలికులు

ఈనాడు, అమరావతి

రసాయన ఎరువుల తాకిడికి తాళలేక తల్లడిల్లుతున్న నేల తల్లికి సేంద్రియ సాగుతో సాంత్వన కలిగించడమే లక్ష్యంగా ఈ రైతులు ఆర్గానిక్ సాగులో దూసుకెళ్తున్నారు. ప్రకృతిలో దొరికే ఔషధ గుణాలున్న ఆకులు, ఇతర పదార్థాలతో తయారు చేసిన కషాయాలు, ఎరువులతో అద్భుతాలు చేస్తున్నారు. తక్కువ పెట్టుబడితో అధిక రాబడి పొందుతూనే ప్రజల ఆరోగ్యానికి రక్షణ కవచాల్లా మారుతున్నారు. ఆదివారం విజయవాడలో నిర్వహించిన ఆర్గానిక్ రైతోత్సవంలో వీరి ఉత్పత్తులు ప్రదర్శించారు.

14 రకాల వరి

✪ ఏ.కొండూరుకు చెందిన శబరీనాథ్ పదేళ్లుగా సేంద్రియ సాగులో కొనసాగుతున్నారు. కూజీపటాలియ, నవారా, మైసూరు మల్లిగ, బ్లాక్‌రైస్, కాలాబట్ట, రాజముడి, రక్తశాలి వంటి 14 వరి రకాలను పండిస్తున్నారు. మిరపకు అంతర పంటలుగా శనగలు, కందులు, పసుపు, మునగను 54 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ✪ సాధారణంగా వరికి ఎకరానికి రూ.40వేలు పెట్టుబడి అవుతుంటే ఈయన రూ.25వేలతో సాగు చేసేస్తున్నారు.

సేంద్రియ ఉత్పత్తులతో శబరీనాథ్, సిబ్బంది

స్వయంగా తయారు చేసుకున్న బీజామృతం, ఘన, ద్రవ జీవామృతాలనే వినియోగిస్తున్నారు. తాను పండించిన వరి, పప్పుధాన్యాలు, మిరప మర పట్టించి ప్యాకింగ్ చేసి విక్రయిస్తున్నారు. ✪ వీటి వినియోగం వల్ల లైంగిక సామర్థ్యం పెంపుతో పాటు మలబద్ధకం, మధుమేహం, రక్తహీనత, అధిక బరువు, మహిళల్లో పీసీవోడీ సమస్యలకు చెక్ పెట్టవచ్చు. సేంద్రియ సాగులో శబరీనాథ్ కృషికి 2021లో అప్పటి ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు చేతులమీదుగా రైతు నేస్తం పురస్కారం పొందారు.

విభిన్న పంటలతో...

తాను పండించిన స్వీట్‌కార్న్ చూపుతున్న వీరభద్రరావు

✪ పెనుగంచిప్రోలు మండలం అనిగండ్లపాడుకు చెందిన వీరభద్రరావు 14 ఏళ్లుగా సేంద్రియ వ్యవసాయం చేస్తున్నారు. 8.5 ఎకరాల్లో మిరప ప్రధాన పంటగా ధనియాలు, ఆవాలు, ఉల్లిపాయ, పెసర, స్వీట్‌కార్న్, బొబ్బర వంటి 10 అంతర పంటలుగా సాగు చేస్తున్నారు. ✪ రసాయన ఎరువులు వాడిన పొలాల్లో ఎకరానికి 12 క్వింటాళ్ల దిగుబడి వస్తే గొప్ప. సేంద్రియ సాగు ద్వారా ఎకరానికి రూ.1.5లక్షల పెట్టుబడితో 20 క్వింటాళ్ల దిగుబడి సాధిస్తున్నారు. ✪ సాధారణంగా క్వింటాల్ మిర్చి రూ.15-20వేలు ఉండడం గగనం. వీరభద్రరావు రూ.50వేలకు అమ్ముతున్నారు. మిర్చి విక్రయాలతో పాటు ఆయనే కారం మర పట్టించి అమ్ముతున్నారు. ఈ సీజన్‌లో 12క్వింటాళ్ల కారం అమ్మారు. ఏటా రూ.లక్షల్లో ఆదాయం పొందుతున్నారు.

పర్యవేక్షణ కరవు.. అక్రమాల నెలవు!

కేజీబీవీల నిర్వహణపై విమర్శల వెల్లువ

ఈనాడు, అమరావతి

★ ఎ.కొండూరు కేజీబీవీలో విద్యార్థినులపై ఎలుకల దాడి ఘటనతో అంతా ఉలిక్కిపడ్డారు. వసతి గృహంలో పరిస్థితి దారుణంగా ఉందని.. బాలికలు చెప్పినా.. అధికారులు పెడచెవిన పెట్టారు. 12 మంది విద్యార్థినులపై ఎలుకలు దాడి చేయడంతో ఉరుకులు పరుగులు పెట్టారు. వసతి గృహంలో పరిస్థితి చూసి.. ఉన్నతాధికారులు ముక్కున వేలేసుకున్నారు.
★ రెడ్డిగూడెం మండలం రంగాపురంలోని కేజీబీవీలో సరకులు పక్కదారి పట్టిస్తున్న విషయం తాజాగా వెలుగు చూసింది. 687 కిలోల బియ్యం అక్రమంగా నిల్వ చేసినట్లు గుర్తించారు. స్కూల్ బ్యాగులు, పుస్తకాలు లాంటివి బయటకు తరలించేందుకు దాచినట్లు తేలింది. దీంతో ప్రిన్సిపల్ శ్యామలపై చర్యలకు ఉపక్రమించారు.

రంగాపురం కేజీబీవీలో అక్రమంగా దాచిన బియ్యం బస్తాలు

పేద బాలికల కోసం వెనుకబడిన ప్రాంతాల్లో కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఏర్పాటు చేసిన కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయి. సమస్యలను ఏళ్ల తరబడి పరిష్కరించకుండా వదిలేస్తున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేక కొందరు సిబ్బంది అక్రమాలకు పాల్పడుతున్నారు. జిల్లాలో రంగాపురం, ఎ.కొండూరు, గంపలగూడెంలో కేజీబీవీలున్నాయి. ఎ.కొండూరులో ఎలుకలు, అపరిశుభ్రత, రంగాపురంలో సరకుల పక్కదారి వంటి ఘటనలు బయటపడ్డాయి. ఈ తంతు చాలాకాలంగా జరుగుతుండగా.. ఇప్పటికి వెలుగులోకి వచ్చాయి.

అధికారులకు మామూళ్లు..

★ ప్రతి నెలా ఒక్కో విద్యాలయం నుంచి.. జిల్లా స్థాయి అధికారులకు మామూళ్లు ఇవ్వాలనే కారణంతో సరకులు పక్కదారి పట్టిస్తున్నట్టు తెలుస్తోంది. అందుకే.. అక్రమాలు జరుగుతున్నా.. ఉన్నతాధికారులు కూడా పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. ★ ఎ.కొండూరు విద్యాలయంలో 2024 సెప్టెంబరులో బాలికలను ఎలుకలు కరిచాయి. సెప్టిక్ ట్యాంక్ నిండి.. దుర్వాసన వస్తోందని, ఎలుకలు తిరుగుతున్నాయని విద్యార్థినులు చెప్పినా అధికారులు పట్టించుకోలేదు. తాజాగా 12 మందిని ఎలుకలు కొరకడంతో.. అధికారులు పరుగులు పెట్టారు. కిటికీలకు మెష్‌లు సరిగా లేవు. దోమల వల్ల తరచూ అనారోగ్యానికి గురవుతున్నారు. స్నానాల గదులకు గొళ్లాలు సరిగా లేవని చెప్పినా.. పట్టించుకునే వారు కరవయ్యారు. నిర్వహణ ఖర్చుల కింద ఏటా ఇస్తున్న రూ.2 లక్షలు ఏం చేస్తున్నారో తెలియని పరిస్థితి.

చూస్తే మీరు.. ఫ్లాట్ అవుతారు!

గత వైకాపా పాలనలో చుట్టూ పిచ్చి మొక్కలతో బూత్ బంగ్లాల్లా మారిన టిడ్కో గృహాలపై కూటమి ప్రభుత్వం రాగానే దృష్టి సారించింది. విజయవాడ గ్రామీణ మండలం జక్కంపూడి పరిధిలో 3వేల గృహాలకు రంగులు వేసి పూర్తి స్థాయిలో సిద్ధం చేశారు. ఏప్రిల్‌లో లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నారు. -ఈనాడు, అమరావతి

బ్రహ్మాండనాయకునికి కల్యాణ శోభ

మంగళగిరి శ్రీ పానకాల లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభం అయ్యాయి. మొదటిరోజు స్వామి, అమ్మవార్లను పెళ్లి కుమారుడు, కుమార్తెలుగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. - మంగళగిరి గ్రామీణం, న్యూస్‌టుడే

విద్యుత్తు అదాలత్ రేపు

సూర్యారావుపేట, న్యూస్‌టుడే : విద్యుత్తు వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి మంగళవారం విద్యుత్తు అదాలత్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.రవీంద్రబాబు తెలిపారు. సూర్యారావుపేట లోక్‌భవన్ సమీపంలోని సర్కిల్ కార్యాలయంలో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తారు. విద్యుత్తు వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక ఛైర్‌పర్సన్ ఎన్.విక్టర్ ఇమ్మానుయేల్ ఈ అదాలత్ నిర్వహిస్తారు. అంతరాయాలు, మీటర్, లోవోల్టేజీ, బిల్లింగ్ సమస్యలు, సరఫరాలో లోపాలు వంటివాటిపై రాతపూర్వకంగా ఇస్తే.. పరిష్కరిస్తారు. విజయవాడ టౌన్ డివిజన్ పరిధిలోని గొల్లపూడి, భవానీపురం, కేజీ మార్కెట్, కొత్తపేట, రామరాజ్యనగర్, చిట్టినగర్, పాయకాపురం, అజిత్‌సింగ్‌నగర్, గాంధీనగర్, ముత్యాలంపాడు, మధురానగర్, గవర్నర్‌పేట, సూర్యారావుపేట, మొగల్‌రాజపురం, కృష్ణలంక, స్క్యూబ్రిడ్జి విద్యుత్తు సెక్షన్ల పరిధిలోని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఈఈ కోరారు.

కక్కుర్తిపడితే.. కటకటాలే..!

అనిశాకు చిక్కుతున్న ఉద్యోగులు

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే

✪ నగరానికి చెందిన సుబ్బారావుకు బ్యాంకు లాకరుతో పాటు ఖాతాల్లో రూ.50 లక్షల వరకు నగదు ఉంది. పెద్ద మొత్తంలో స్థిరాస్తులూ ఉన్నాయి. ఒక రోజు అకస్మాత్తుగా చనిపోయారు. ఆయన పేరుతో ఉన్న ఆస్తుల కోసం కుటుంబ సభ్యులు బ్యాంకును ఆశ్రయించారు. కుటుంబ ధ్రువీకరణ పత్రం తెస్తేనే.. అవి ఇస్తామన్నారు.
✪ వారసత్వంగా వచ్చిన ఆస్తి విషయంలో అన్నదమ్ముల మధ్య వివాదం నెలకొంది. తర్వాత ఇద్దరూ రాజీపడ్డారు. రెవెన్యూ అధికారులను సంప్రదించగా.. కుటుంబ ధ్రువీకరణ పత్రం తెస్తేనే ఆస్తిని బదలాయిస్తామని స్పష్టం చేశారు.
ప్రస్తుత పరిస్థితుల్లో ఆస్తుల బదలాయింపు, ఇతర ఆర్థిక లావాదేవీల్లో కుటుంబ ధ్రువీకరణ పత్రం అత్యంత కీలకంగా మారింది. దీన్నే ఆసరాగా చేసుకున్న కొంత మంది అధికారులు.. లంచం డిమాండ్ చేస్తున్నారు. దీనికి ఇష్టపడని ప్రజలు.. అనిశా అధికారులకు ఫిర్యాదు చేసి.. అక్రమార్కులను పట్టిస్తున్నారు. గత నెల 23న రామలింగేశ్వరపేటకు చెందిన కూచిభొట్ల వెంకట పర్వతేశ్వర రవికుమార్ అనే వ్యక్తి.. కుటుంబ పత్రం కోసం దరఖాస్తు చేసుకున్నారు. వార్డు రెవెన్యూ సెక్రటరీ వంజరపు వెంకటేశ్.. రూ.5లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తర్వాత రూ.50 వేలు తెమ్మన్నారు. చివరకు రూ.45వేలు తీసుకుంటూ అనిశా అధికారులకు దొరికిపోయాడు. ఇదే కేసులో మరో రెవెన్యూ సెక్రటరీ గుడ్డేటి విజయ గాంధీ అనిశా అధికారులకు దొరకకుండా పారిపోయాడు. తాజాగా శనివారం విజయవాడ నార్త్ ఎమ్మార్వో కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దారుగా పని చేస్తున్న అప్పారావు రూ.12వేలు లంచం తీసుకుంటూ దొరికిపోయాడు.

జనవరి 23న అనిశా అధికారులకు దొరికిన వంజరపు వెంకటేశ్

జారీ చేసే పద్ధతి ఇదీ.. కుటుంబ ధ్రువీకరణ పత్రం కోసం వచ్చిన దరఖాస్తులను రెవెన్యూ అధికారులు పరిశీలిస్తారు. దరఖాస్తుదారుని ఇంటికి వెళ్లి చుట్టుపక్కల వారిని విచారిస్తారు. కుటుంబ సభ్యుల వివరాలను ఆరా తీసి నిర్ధారించుకుంటారు. ఆ సమయంలో దరఖాస్తులో పేర్కొన్న సభ్యులందరితో మాట్లాడతారు. అన్నీ నిర్ధారించుకుని, సక్రమంగా ఉంటే పత్రం ఇస్తారు. దీనికి కొన్ని రోజులు పడుతుంది. అలాంటిది ఏమీ లేకుండా.. తూతూమంత్రంగా విచారణ జరిపి, కుటుంబ పత్రం ఇస్తామని కొందరు అధికారులు లంచం డిమాండ్ చేస్తున్నారు. అన్నీ సక్రమంగా ఉన్నా.. లంచం ఎందుకు ఇవ్వాలని దరఖాస్తుదారులు అనిశా అధికారులకు ఫిర్యాదు చేసి పట్టించేస్తున్నారు.

లంచం అడిగితే ఈ నంబర్లకు ఫిర్యాదు చేయండి.
టోల్ ఫ్రీ: 1064
విజయవాడ రేంజ్ డీఎస్పీ: 94404 46164

యూరాలజీ సేవలు.. మరింత నాణ్యంగా..!

సిద్ధార్థ మెడికల్ కళాశాలకు పీజీ సీట్ల మంజూరు

కొత్తాసుపత్రిలో వైద్యుల కొరతకు పరిష్కారం

ఈనాడు, అమరావతి

డాక్టర్ శ్రీధర్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపల్ డాక్టర్ ఏడుకొండలు

విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో యూరాలజీ సూపర్ స్పెషాలిటీ సేవల నిర్వహణ మరింత మెరుగుపడనుంది. ప్రభుత్వ ఆసుపత్రికి అనుబంధంగా ఉన్న సిద్ధార్థ వైద్య కళాశాలకు.. తాజాగా యూరాలజీ విభాగంలో రెండు సూపర్ స్పెషాలిటీ పీజీ సీట్లు మంజూరయ్యాయి. ఎంబీబీఎస్, ఎంఎస్ పూర్తి చేసిన ఇద్దరు వైద్యులు.. ఇక్కడ ఎంసీహెచ్ యూరాలజీ సూపర్‌స్పెషాలిటీ కోర్సు చేస్తూ ఆసుపత్రిలో సేవలు అందించనున్నారు.

కొత్త ప్రభుత్వ ఆసుపత్రిలో సూపర్‌స్పెషాలిటీ సేవల కోసం రూ.150 కోట్లతో గత తెదేపా ప్రభుత్వ హయాంలో అధునాతనంగా ఐదంతస్తుల భవనాన్ని నిర్మించారు. కానీ సూపర్‌స్పెషాలిటీ సేవలు అందించేందుకు వైద్య సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తోంది. సిద్ధార్థ కళాశాలలో ప్రస్తుతం న్యూరో సర్జరీ 05, ప్లాస్టిక్ సర్జరీ 05, న్యూరాలజీ 05 చొప్పున సూపర్‌స్పెషాలిటీ పీజీ సీట్లున్నాయి. గతంలో ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా ఉన్న డాక్టర్ ఎ.వి.రావు, సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపల్, ప్రస్తుత ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ డాక్టర్ ఎ.ఏడుకొండలరావు ఆధ్వర్యంలో.. నెఫ్రాలజీ, కార్డియాలజీ విభాగాల్లో నాలుగేసి, యూరాలజీకి రెండు సూపర్‌స్పెషాలిటీ సీట్లు కావాలంటూ ఎన్ఎంసీకి ప్రతిపాదన పెట్టారు. ఈ నేపథ్యంలోనే యూరాలజీకి రెండు సీట్లను ఎన్ఎంసీ కేటాయించింది.

వైద్యులు లేక ఇబ్బందులు..

ఆసుపత్రిలోని యూరాలజీ విభాగంలో ప్రొఫెసర్, ఒక అసోసియేట్, ఇద్దరు అసిస్టెంట్లుండాలి. కానీ ఒక ప్రొఫెసర్, అసిస్టెంట్ వైద్యులు మాత్రమే ఉన్నారు. వైద్య సేవలు అందించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. తాజాగా ఎన్ఎంసీ రెండు ఎంసీహెచ్ యూరాలజీ సీట్లను కేటాయించడంతో ఇద్దరు వైద్యులు అదనంగా సేవలు అందించేందుకు రాబోతున్నారు.

ఈ ఏడాది నుంచే అందుబాటులోకి..

సిద్ధార్థ వైద్య కళాశాలలో ఈ విద్యా సంవత్సరం నుంచే రెండు ఎంసీహెచ్ యూరాలజీ సూపర్‌స్పెషాలిటీ సీట్లు అందుబాటులోకి రానున్నాయని ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.ఏడుకొండలు తెలిపారు. యూరాలజీ విభాగానికి ఈ రెండు సీట్లు కేటాయించడం.. కళాశాలకు గౌరవ కారణమని ఆనందం వ్యక్తం చేశారు. యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ శ్రీధర్, ఇతర వైద్యులను ఆయన అభినందించారు. గత కొన్నేళ్లుగా అందిస్తున్న ఉత్తమ వైద్య సేవలు, అధ్యాపకుల కృషి వల్లే ఇది సాధ్యమైందన్నారు. మరింత నాణ్యంగా సూపర్‌స్పెషాలిటీ సేవలను ప్రజలకు అందించేందుకు వీలు కలుగుతుందన్నారు.

సేంద్రియ స్వప్నం.. సాకారం సాధ్యం

విజయవంతంగా ముగిసిన ఆర్గానిక్ రైతోత్సవం

ఈనాడు, అమరావతి, విజయవాడ, క్రీడలు న్యూస్‌టుడే: 'సేంద్రియ సాగు విస్తరించాలన్న ఉద్దేశంతో జిల్లాలో రెండు రోజుల పాటు నిర్వహించిన ఆర్గానిక్ రైతోత్సవం విజయవంతంగా ముగిసింది. రెండో రోజైన ఆదివారం విజయవాడ ఇందిరాగాంధీ క్రీడా మైదానంలో ముగింపు కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లోని ఆర్గానిక్ రైతులను ఒకే వేదికపైకి తీసుకొచ్చారు. వారి ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకాలకు స్టాళ్లు ఏర్పాటు చేశారు. పెద్ద సంఖ్యలో వచ్చిన వినియోగదారులు వాటిని ఆసక్తిగా కొనుగోలు చేశారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన మార్కెటింగ్ నిపుణులు రైతుల సందేహాలు నివృత్తి చేశారు. కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ.. రైతులకు తమ ఉత్పత్తులు అమ్ముకునేందుకు ఉన్న అవకాశాలు, జిల్లా యంత్రాంగం తరఫున అందిస్తున్న సేవలపై వివరించారు.

సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులు వినియోగిస్తామని ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ లక్ష్మీశ, పట్టాభి, దినకర్, గద్దె అనూరాధ, దేవదత్, జేసీ ఇలక్కియా తదితరులు

ఒక్కో మండలంలో 3 రోజుల సదస్సులు

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ..'కేశినేని ఫౌండేషన్ ద్వారా జిల్లాలోని అన్ని మండలాల్లో సేంద్రియ సదస్సులు నిర్వహించేందుకు నా సొంత నిధులు ఖర్చు చేస్తా. ఒక్కో మండలంలో మూడు రోజుల పాటు అవగాహన, శిక్షణ, క్షేత్ర పర్యటన తదితర కార్యక్రమాలు నిర్వహిస్తాం. ఒక్కో గ్రామం నుంచి ఐదుగురు రైతుల చొప్పున మండలానికి 100 మంది సదస్సులో పాల్గొంటారు. మొత్తం 225 రోజుల పాటు ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని' తెలిపారు. - ఎంపీ శివనాథ్

5లక్షల టన్నుల సేంద్రియ ఎరువు ఉత్పత్తి

స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభి మాట్లాడుతూ..'అర్బన్ ప్రాంతాల్లో ఉత్పత్తి అవుతున్న చెత్తను సేకరించి వేస్ట్ ప్రాసెసింగ్ సెంటర్ల ద్వారా ఆర్గానిక్ పంటలకు ఏటా 5లక్షల టన్నుల ఎరువులు తయారు చేస్తాం. మార్క్‌ఫెడ్ ద్వారా బ్రాండ్ ఏర్పాటు చేసి విక్రయిస్తాం' అన్నారు. - కొమ్మారెడ్డి పట్టాభి

స్టాల్స్ వద్ద సందర్శకుల సందడి

- తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌రావు మాట్లాడుతూ..'ఆర్గానిక్ పంటల వ్యాప్తికి ప్రభుత్వం ఇప్పటికే మంచి ప్రోత్సాహం ఇస్తోందని, రైతుల ఆలోచన విధానం మారాలని' తెలిపారు.
- 20 సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్ లంకా దినకర్ మాట్లాడుతూ..' ఆరోగ్యవంతమైన రాష్ట్రం కావాలంటే ఆరోగ్యకరమైన పంటలు ఉండాలి. కేంద్ర, రాష్ట్ర బడ్జెట్ కేటాయింపుల్లో సేంద్రియ సాగుకు పెద్దపీట వేస్తున్నారని' తెలిపారు.
- కార్యక్రమంలో తెదేపా జిల్లా అధ్యక్షురాలు గద్దె అనురాధ, జేసీ ఇలక్కియా, డీపీఎం శంకర్‌నాయక్, ఆర్డీవో కావూరి చైతన్య తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాలు కలుషితం కావడం బాధాకరం

రాజ్యసభ మాజీ సభ్యుడు కనకమేడల

రవీంద్రకుమార్‌ను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే : సమాజంలో నేర ప్రవృత్తి పెరిగిపోవడం బాధాకరమని రాజ్యసభ మాజీ సభ్యుడు, సుప్రీం కోర్టులో భారత ప్రభుత్వ అదనపు సొలిసిటర్ జనరల్ కనకమేడల రవీంద్ర కుమార్ అన్నారు. రెండ్రోజులుగా మొగల్రాజపురంలోని సిద్ధార్థ ఆడిటోరియంలో నిర్వహించిన పర్వతనేని బ్రహ్మయ్య సిద్ధార్థ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం స్వర్ణోత్సవం ఆదివారం ముగిసింది. ముఖ్యఅతిథిగా హాజరైన రవీంద్రకుమార్ మాట్లాడుతూ.. ప్రస్తుతం మానవ సంబంధాలు దెబ్బతింటున్నాయి, రాజకీయ నాయకుల ప్రవర్తన మారిపోయింది, రోజురోజుకూ రాజకీయాలు కలుషితం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ప్రజలు ప్రాథమిక హక్కుల కోసం పోరాడేవారని, ప్రస్తుతం ఆత్మరక్షణ కోసం పోరాడాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. సామాజిక ప్రయోజనాల కోసం యువత ప్రజా లాభాపేక్షలు ఉంటాయని, దానిని మంచికే వినియోగించుకోవాలని సూచించారు. విజన్ 2047 కోసం సీఎం, పీఎం కృషి చేస్తున్నారని తెలిపారు. అనుభవంతో అందరూ అంకితభావంతో కృషి చేయాలని కోరారు. ఇక్కడ తాను చదువుకోవడం గర్వంగా భావిస్తున్నానని అన్నారు. ప్రతి విద్యార్థి పట్టుదలతో చదివితే జీవితంలో విజయాలు సాధించవచ్చని పేర్కొన్నారు. పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. 'నేను పీబీ సిద్ధార్థ కళాశాలలో ఇంటర్ చదువుతుండగా రసాయన శాస్త్రంలో తక్కువ మార్కులు వచ్చాయి. అధ్యాపకులు కృష్ణప్రసాద్ బాధపడ్డారు. బెటర్‌మెంట్ రాసి 59/60 మార్కులు సాధించాను. ఆ జ్ఞాపకాలు గుర్తున్నాయి' అని తెలిపారు. సిద్ధార్థ అకాడమీ మేకా రమేష్, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు, కార్యదర్శి ఎ.ప్రకాశ్, కోశాధికారి డి.మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

జీవన శైలి మార్పులతో గుండె జబ్బుల నివారణ

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న పూర్ణానంద్, భానుప్రసాద్, కిరణ్, సుధాకర్ తదితరులు

రాఘవయ్యపార్క్ కూడలి(కృష్ణలంక), న్యూస్‌టుడే : ఆరోగ్యకరమైన జీవన శైలితో 80 శాతం గుండె జబ్బుల నివారణ సాధ్యపడుతుందని గుండె వైద్య నిపుణులు డాక్టర్ ఎ.పూర్ణానంద్ అన్నారు. ప్రజారోగ్య వేదిక ఎన్టీఆర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో యువతలో సహా పెరుగుతున్న గుండె జబ్బులు-కారణాలు- నివారణ మార్గాలు అంశంపై ఎంబీ విజ్ఞాన కేంద్రంలో ఆదివారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన.. రకాలు, కారణాలు, నివారణ మార్గాలపై వివరించారు. యువత, వృద్ధుల్లో అధికంగా ఉండే గుండె జబ్బులు ప్రస్తుతం యువతలో అధికమవుతున్నాయని చెప్పారు. కొవిడ్ తర్వాత మరింత పెరిగాయని ఆందోళన కలిగిస్తోందన్నారు. జీవనశైలిలో మార్పులు, అనారోగ్యకరమైన ఆహార అలవాట్లు, అధికమైన మానసిక ఒత్తిడి, మద్యం, ధూమపానం వంటి వ్యసనాలు జబ్బులకు కారణమవుతున్నాయన్నారు. మధుమేహం, రక్తపోటు ఉన్నవారు క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలన్నారు. సమతుల ఆహారం, ప్రతిరోజు వ్యాయామం, సరిపడా నిద్ర, సంతోషకరమైన కుటుంబం, సామాజిక సంబంధాలు, మానసిక, శారీరక విశ్రాంతి ద్వారా జబ్బులను నివారించవచ్చన్నారు. ఆయన రచించిన 'గుండెపోటు-నివారణ మార్గాలు' పుస్తకాన్ని 'సేవ్ యంగ్ హార్ట్ ఫౌండేషన్', కిరణ్ తేజ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధుల సమక్షంలో చదలవాడ భానుప్రసాద్ తదితరులు ఆవిష్కరించారు. భానుప్రసాద్ మాట్లాడుతూ.. తమ ఫౌండేషన్ ద్వారా 30-45 మధ్య వయసు ఉన్న వారికి ఉచితంగా గుండె పరీక్షలు చేసి, కొంతమందిని సైనా కాపాడే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. ప్రజారోగ్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఎం.వి.రమణయ్య మాట్లాడుతూ.. యువత తమ ఆరోగ్య పట్ల శ్రద్ధ వహించాలన్నారు. ప్రభుత్వం ప్రజారోగ్య వ్యవస్థను పటిష్ఠం చేయాలని కోరారు. వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి జి.విజయ్ ప్రకాష్ అధ్యక్షత వహించారు. డాక్టర్ మాకినేని కిరణ్, జిల్లా గౌరవ అధ్యక్షుడు డాక్టర్ సుధాకర్, డాక్టర్ ఎం.సీతారామారావు, డాక్టర్ శ్రీలేఖ తదితరులు పాల్గొన్నారు.

స్టాల్‌లో ఆకర్షణీయంగా వివిధ ఆకారాల్లో సొరకాయలు

చిన్నచెంబు ఆకారంలో..

సొర.. విభిన్నంగా..

విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియంలో ఎన్టీఆర్ ఆర్గానిక్ మేళా-2026 ప్రదర్శనలో భాగంగా వన్ ఎర్త్-వన్ లైఫ్ టెర్రస్ గార్డెన్ గ్రూప్‌లో ఏర్పాటు చేసిన మిద్దె తోటల సాగు స్టాల్‌లో ప్రదర్శనకు ఉంచిన విభిన్న ఆకారాల సొరకాయలు ఆకట్టుకున్నాయి. వీటిలో పొడవుగా ఎదిగిన, గుండ్రని ఆకారంలోని, చిన్న, పెద్ద సైజుల సొరకాయలను ప్రదర్శనకు ఉంచారు. ఇవన్నీ మిద్దె తోటలపై పండించినవి కావడం విశేషం. - ఈనాడు, అమరావతి

క్రీడలకు సిద్ధం..

ఈ నెల 25 నుంచి జరగబోయే ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మంత్రుల క్రీడల కోసం ఇందిరాగాంధీ మైదానాన్ని సిద్ధం చేస్తున్నారు. పోటీలను, రోజూ రాత్రి సాయంత్రం వేళల్లో మైదానం మొత్తం చదును చేశారు. స్టేడియంలో ఫ్లడ్‌లైట్లను సైతం ఏర్పాటు చేశారు. - ఈనాడు, అమరావతి

నార్త్ ఏసీపీ స్రవంతిరాయ్ బదిలీ

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : నార్త్ ఏసీపీ స్రవంతిరాయ్‌ను అనూహ్య బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నార్త్ డివిజన్ పరిధిలోని సత్యనారాయణపురం, అజిత్‌సింగ్‌నగర్, నున్న పోలీస్‌స్టేషన్లు అత్యంత సున్నితమైనవి. కేసుల నమోదు ఎక్కువే. అలాంటి కీలకమైన పోలీస్‌స్టేషన్లలో సంచలనాత్మక కేసులను ఆమె సులువుగా ఛేదించారు. పోలీసులతో తప్పు లేకుండా సేవలు అందించారు. తాజాగా ఆమెను అనూహ్యంగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం (నేడు) రిలీవ్ అయి.. పండిట్ నెహ్రూబస్‌స్టేషన్‌లోని ఆనిశా కేంద్ర కార్యాలయంలో రిపోర్టు చేయనున్నారు.

విభిన్న సంస్కృతుల సమ్మేళనం 'విటోపియా'

తుళ్లూరు, న్యూస్‌టుడే: విభిన్న సంస్కృతులు, సంప్రదాయాలు, క్రీడా పోటీల సమ్మేళనంగా 'విటోపియా 2026' నిలిచిందని వీఐటీ ఏపీ వైస్ ఛాన్సలర్ డా.పి ఆరుల్మోళివర్మన్ పేర్కొన్నారు. అమరావతిలోని ఆ వర్సిటీలో ఆదివారం ఈ కార్యక్రమ ముగింపు సందర్భంగా విజేతలకు బహుమతుల ప్రదానోత్సవం వేడుకగా జరిగింది. ముఖ్యఅతిథిగా అథ్లెటిక్ క్రీడాకారిణి, అర్జున అవార్డు గ్రహీత జ్యోతి యర్రాజీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ సత్తాచాటాలని సూచించారు. సాయంత్రం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వర్సిటీ రిజిస్ట్రార్ డా.జగదీష్ చంద్ర ముదిగంటి, విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందిస్తున్న జ్యోతి యర్రాజీ, వీఐటీ ఏపీ వర్సిటీ ప్రతినిధులు

మాచవరం పోలీస్ స్టేషన్ వద్ద ఉద్రిక్తత

ఫిర్యాదుపై విచారణకు పాస్టర్‌ని పిలిచిన పోలీసులు

స్టేషన్ వద్దకు వచ్చిన విశ్వాసులు

రిసెప్షన్ వద్ద ప్రదీప్‌కుమార్

పటమట, న్యూస్‌టుడే: మాచవరం పోలీస్ స్టేషన్ వద్ద ఆదివారం ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఓ ఫిర్యాదుపై విచారణ నిమిత్తం పాస్టర్‌ను పోలీసులు ఫోన్ చేసి పిలవడంతో.. ఆతనితో పాటు చర్చికి వచ్చిన విశ్వాసులు పెద్ద సంఖ్యలో స్టేషన్‌కు చేరుకున్నారు. మాచవరం సీఐ వెంకటరమణ వివరాల ప్రకారం.. మాచవరం గ్రామీణ మండలం ఎనికేపాడులోని ఓ చర్చి పాస్టర్‌గా పని చేస్తున్న ప్రదీప్ కుమార్ మీద తూర్పు గోదావరి జిల్లా ఆసుపత్రికి చెందిన కె.హరినారాయణ సీఎంవో కార్యాలయం పీజీఆర్ఎస్‌కు ఫిర్యాదు చేశారు. ప్రదీప్ విజయవాడ మొగల్రాజపురంలోని ఫ్లాట్ తనకు విక్రయిస్తానని చెప్పి విడతల వారీగా రూ.70 లక్షలు తన వద్ద తీసుకున్నారని అందులో పేర్కొన్నారు. దానిని సీఎంవో కార్యాలయం నుంచి మాచవరం పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. మూడు రోజుల కిందట మాచవరం పోలీసులు ప్రదీప్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు నిమిత్తం మాట్లాడేందుకు రావాలని పిలవగా.. రెండు రోజులు ఆగి వస్తానని ఆయన పేర్కొన్నారు. ఆకస్మాత్తుగా ఆదివారం 150 మందిని వెంట పెట్టుకొని స్టేషన్‌కు వెళ్లారు. పాస్టర్‌ని మాట్లాడేందుకు మాత్రమే పిలిచామని, అరెస్టు చేసేందుకు కాదని పోలీసులు చెప్పినా.. విశ్వాసులు వెళ్లిపోయారు. స్టేట్‌మెంట్ తీసుకుని ప్రదీప్‌ని కూడా పంపించారు. ప్రదీప్‌పై గతంలో స్నాప్ జిమ్ ఘటనతో పాటు పలు కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. భారీ సంఖ్యలో జనాలను స్టేషన్ వద్దకు తీసుకువచ్చి నిరసన తెలిపి శాంతి భద్రతలకు విఘాతం కలిగించినందుకు పాస్టర్‌పై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

కేఎల్‌యూలో ప్రారంభమైన అభ్యాస హ్యాకథాన్

ఏఎన్‌యూ(తాడేపల్లి), న్యూస్‌టుడే: తాడేపల్లి మండలం వడ్డేశ్వరం వద్ద ఉన్న కేఎల్ విశ్వవిద్యాలయంలో శనివారం అర్ధరాత్రి నుంచి అభ్యాస హ్యాకథాన్‌ను డీన్ డాక్టర్ శ్రీనాథ్ ప్రారంభించారు. కేఎల్‌యూలోని స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో స్కిల్ పలావర్ మూడో దశను విజయవంతంగా నిర్వహించామని ఆదివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపారు. బీసీఏ, ఎంసీఏ, ఇంజినీరింగ్ ఆఖరి సంవత్సర విద్యార్థుల కోసం ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. మొదటి దశలో ప్రధానంగా సమస్యలకు పరిష్కారం చూపడం, రెండో దశలో అంతర్గత మూల్యాంకనం, ప్రాథమిక డిజైన్‌లు, మూడో దశలో సమీక్షలు చేశామని డీన్ తెలిపారు. చివరి దశను ఫిబ్రవరి 28న నిర్వహిస్తామన్నారు. మూడో దశలో విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులను, అభివృద్ధి చేసిన నమూనాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఉపకులపతి డాక్టర్ పార్థసారథి వర్మ, ప్రో వైస్ ఛాన్సెలర్ డాక్టర్ వెంకట్రామ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

ఖజానా, లెక్కల గెజిటెడ్ అధికారుల సంఘం నూతన కార్యవర్గం

రాఘవయ్యపార్క్ కూడలి(కృష్ణలంక), న్యూస్‌టుడే : ఏపీ ఖజానా, లెక్కల గెజిటెడ్ అధికారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పేర్కొన్నారు. బాలోత్సవ భవన్‌లో ఆదివారం సంఘం నూతన కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కాజ రాజకుమార్, డి.జె.సంపత్‌రావు, 14 మందితో కూడిన నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. ఖజానా శాఖలో పలువురు పైస్థాయి పదోన్నతులు రాకుండానే పదవీ విరమణ చేస్తున్నారని చెప్పారు. ఎంతోకాలంగా అపరిష్కృతంగా ఉన్న డిసిప్లినరీ కేసులను పరిష్కరించేందుకు తగు చర్యలు చేపట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆరేళ్లుగా అడ్‌హక్ బేసిస్‌లో పనిచేస్తున్న వారి సమస్యలను పరిష్కరించి, పదోన్నతుల ప్రక్రియను ప్రారంభించాలని కోరారు. ప్రధాన కార్యదర్శి సంపత్‌రావు మాట్లాడుతూ... ఆరేళ్లుగా ఎలాంటి జవసత్వాలు లేకుండా నిర్వీర్యమైన సంఘాన్ని పటిష్ఠపరిచేందుకు చర్యలు చేపడతామన్నారు. 26జిల్లాల నుంచి ఖజానా, లెక్కల గెజిటెడ్ అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

విలు విద్య చరిత్రపై అవగాహన అవసరం

బాణాన్ని ఎక్కుపెట్టిన కలెక్టర్ లక్ష్మీశ, పక్కనే సత్యనారాయణ, రమణ, శ్రావణ్‌కుమార్ తదితరులు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులకు ఎన్టీఆర్ జిల్లా కేంద్ర బిందువు కావాలని కలెక్టర్ జి.లక్ష్మీశ పేర్కొన్నారు. స్థానిక సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రాంగణంలో ఆదివారం నుంచి 3వ ఎన్టీపీసీ ఖేలో ఇండియా జాతీయ ర్యాంకింగ్ ఆర్చరీ టోర్నీ (మహిళలు) నిర్వహిస్తున్నారు. కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై తొలి బాణం సంధించి టోర్నీ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. విలువిద్య క్రీడ చరిత్రను ప్రతి క్రీడాకారుడు అవగాహన చేసుకోవాలని సూచించారు. టోర్నీలో మంచి ఫలితాలు సాధించి మీ మీ ప్రాంతాలకు విజయాలు అందించాలని అన్నారు. క్రీడల అభివృద్ధి కోసం ప్రభుత్వం తలపెట్టిన ప్రతి కార్యక్రమంలో పాల్గొనేందుకు వందలాది మంది క్రీడాకారులు దరఖాస్తు చేస్తున్నారని వివరించారు. క్రీడలతో ఆత్మవిశ్వాసం, శారీరక దృఢత్వం కలుగుతుందని చెప్పారు. ముందుగా అంతర్జాతీయ కోచ్ దివంగత చెరుకూరి లెనిన్ చిత్రపటానికి పుష్పాంజలి అర్పించారు. టోర్నీ కాంపిటీషన్ డైరెక్టర్ అరుంధతి సిలో, రాష్ట్ర ఆర్చరీ సంఘం ఛైర్మన్ చెరుకూరి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి బెవర వెంకట రమణ, కోశాధికారి చెరుకూరి కృష్ణకుమారి, ఉమ్మడి కృష్ణా జిల్లా ఆర్చరీ సంఘం కోశాధికారి గొట్టిపాటి ప్రేమ్‌కుమార్, ఒలింపియన్ బొమ్మదేవర ధీరజ్ తండ్రి శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

అంతలోనే ఆయువు తీరింది

బారికేడ్‌ను తప్పించబోయి వ్యక్తి దుర్మరణం

ఏసుబాబు (పాత చిత్రం)

కొండపల్లి, న్యూస్‌టుడే : రెండు నిమిషాల్లో ఇంటికి చేరతాడనుకున్న వ్యక్తి తిరిగి రాని లోకాలకు వెళ్లారు. రోడ్డుపై రక్షణగా ఉంచిన బారికేడు ఆ ప్రాణాన్ని భక్షించేసింది. వివరాలు ఇలా ఉన్నాయి.. కొండపల్లి వడ్డే నగర్‌కు చెందిన ఏసుబాబు(61) ఆదివారం ఉదయం వ్యక్తిగత పనుల నిమిత్తం ఇబ్రహీంపట్నం వెళ్లి మధ్యాహ్నం తన ద్విచక్ర వాహనంపై తిరిగి బయలు దేరారు. స్థానిక డీఏవీ పాఠశాల వద్ద బారికేడును తప్పించబోయి రోడ్డుపైనున్న ఇసుక జారడంతో వేగంగా వెళ్లి బారికేడును ఢీకొన్నారు. ఆ సమయంలో తలకు శిరస్త్రాణం ఉన్నా అది పగిలిపోయి తలకు తీవ్ర గాయమై కిందపడ్డారు. ప్రమాదాన్ని గుర్తించిన వాహనదారులు ఆయన్ను చూసే సరికి మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న భార్య, పిల్లలు అక్కడకు వచ్చి భోరున విలపించారు. డీఏవీ పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన ఈ బారికేడ్లతో నెల తిరగకుండానే మరో ప్రాణం పోయింది. ప్రమాదాల నివారణకు పోలీసులు ఎన్ని చర్యలు చేపట్టినా ఫలితం లేదని స్థానికులు చెబుతున్నారు. దీనిపై ఇబ్రహీంపట్నం పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని విజయవాడ ఆసుపత్రికి తరలించారు.



బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -115 రిటైల్ ధర 142 చికెన్ విత్ స్కిన్ - 206 చికెన్ స్కిన్‌లెస్ - 234.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 132, 141, 152 చికెన్ విత్ స్కిన్ - 250 చికెన్ స్కిన్‌లెస్ - 260.

జీవిత ఖైదీ మృతి

భవానీపురం, న్యూస్‌టుడే: బాలికపై అత్యాచారం చేసి జీవిత ఖైదు అనుభవిస్తున్న వ్యక్తి జైలులో అనారోగ్యంతో ఆదివారం మృతిచెందాడు. భవానీపురం అవుట్ ఏజెన్సీ ప్రాంతంలో నివాసం ఉండే మద్ది సుబ్బారావు(65) ఐదేళ్ల క్రితం ఎనిమిదేళ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. పోలీసులు అతడిని అరెస్టు చేసి న్యాయమూర్తి ముందు హాజరుపరచగా రిమాండ్ విధించారు. అప్పటినుంచి సుబ్బారావు నెల్లూరు జైలులో శిక్ష అనుభవిస్తున్నాడు. గత ఏడాది మే నెలలో అతడికి యావజ్జీవ కారాగార శిక్ష ఖరారైంది. జైలులో ఉన్న సుబ్బారావు కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. జైలులో చనిపోయిన విషయాన్ని భవానీపురం పోలీసులకు జైలు అధికారులు సమాచారం అందించారు.

శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానము
ద్వారకా తిరుమల (చిన్న తిరుపతి), ఏలూరు జిల్లా-534426, ఫోన్: 08829 - 271427
Website: www.dwarakatirumala.org, e-mail: eo_dwarakatirumala@yahoo.co.in
REV65-OPOM0EOFF/1/2023-D1, Dt:21/02/2026
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీసు
శ్రీ స్వామి వారి దేవస్థానమునకు అవసరమగు పూలు మరియు పూల దండలు ది.01-04-2026 నుండి ది.31-03-2027 వరకు ఒక సంవత్సర కాల పరిమితికి సప్లయి చేయుటకు గాను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మరియు సీల్డ్ టెండరు ద్వారా టెండర్లు కోరబడుచున్నవి. పూర్తి వివరములకు కొరకు www.apeprocurement.gov.in నందు తెలుసుకొనగలరు. ఇ-ప్రొక్యూర్‌మెంట్ మరియు సీల్డ్ టెండరు టెండర్ బాక్స్ నందు దాఖలు చేయు ప్రారంభ తేది:23-02-2026 ఉ॥ 10.00 గం॥ల నుండి చివరి తేది:09-03-2026 మ॥ 01.00 గం॥ వరకు. ఇతర వివరముల కొరకు ఫోన్: 9866730425, 9037567894 లను సంప్రదించగలరు.
శ్రీ యస్.వి. సుధాకరరావు, అధ్యక్షులు మరియు వ్యవస్థాపక ధర్మకర్త
సం/- వై. భద్రాజీ, కార్యనిర్వహణాధికారి (FAC)

91.9FM Vijayawada
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 8008003297

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి అధిక ధరకు కొనబడును (స్పాట్ క్యాష్). ✆ 87907 41166

బంగారం కొనబడును బ్యాంకులలో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి ఈరోజు మార్కెట్ ధరకు కొనబడును స్పాట్‌క్యాష్. 81422 92071

BUSINESS OFFER

విజయవాడ గుంటూరు జిల్లాలో ఉద్యోగ అవకాశాలు మీ ఇంటి నుంచి సంపాదించే అవకాశం. ఏవిధమైన పెట్టుబడి లేని వ్యాపార ఉద్యోగాల కోసం 93999 99867.

FOR SALE

Sale- ఎలెక్ట్రోప్లేటింగ్ రేక్టిఫైర్లు, నికెల్ సొల్యూషన్, టైటానియం బాస్కెట్స్, కేబుల్స్. Cont: 94401 95400, 93476 80600

FINANCIAL SERVICES

Govt. ఉద్యోగస్తులకు, రిటైర్డ్ పెన్షనర్లకు EMI వాయిదా పద్ధతిలో పర్సనల్ ఫైనాన్స్, అన్నితరగతుల వారికి స్థిరాస్తులపై ఫైనాన్స్ ఇవ్వబడును. Cell: 73862 01191.

REAL ESTATE

HOUSE FOR SALE

గుడివాడ 200 గజాలు, నీలామహల్ దగ్గరలో సూరంవారి వీధి నందు రెండు అంతస్తులు ఇంటితో అమ్మకానికి కలదు. గజం-75 వేలు. సంప్ర: 81064 03490

LAND FOR SALE

కృష్ణాజిల్లా మల్లవల్లి A.P. ఇండస్ట్రియల్ ఫుడ్‌పార్క్‌కు ఆనుకుని 6 ఎకరములు ఆదాయం వచ్చు మామిడితోట అమ్మకము. కాంటాక్ట్: 99483 16161.

PLOT FOR SALE

GANNAVARAM

Vacant Plot 150 sqy West Facing near Highway Pottipadu Gannavaram sale. contact Malleswara: 96769 24785

TO LET

COMMERCIAL

బందరు రాజాగారి సెంటర్ మెయిన్‌రోడ్డు సిరివెంకట్ థియేటర్ ప్రక్కన 3x1000Sft 3ఫ్లోర్స్ కొత్తబిల్డింగ్ కమర్షియల్‌గా లీజుకు, లిఫ్ట్‌కలదు. ✆ 92474 33232

విజయవాడలో హైవే ఫేసింగ్‌తో కమర్షియల్ / రిటైల్ స్పేస్ లీజు / అద్దెకు 10,500 చ.అ. మెజ్జనైన్ 2500 చ.అ.. వెస్ట్‌సైడ్ ఎదురుగా, ఎనికేపాడు, విజయవాడ 9866 9966 44 8712 3355 77

JOBS

విజయవాడలోని ప్రముఖ ఎడ్యుకేషన్ కన్సల్టెన్సీ నందు పనిచేయుటకు డేటాఎంట్రీ ఆపరేటర్స్, టెలీకాలర్స్, కౌన్సిలర్స్ కావలెను. Age:18-30Yrs. ✆ 89777 96932

నర్సింగ్ హోమ్ నందు పని చేయుటకు నర్సులు (ANM) మరియు ల్యాబ్ టెక్నీషియన్లు కావలెను. ఉచిత వసతి కలదు. కానూరు, విజయవాడ. ✆ 96667 08089

ప్రముఖ కన్‌స్ట్రక్షన్ & రియల్ ఎస్టేట్ కంపెనీకి మార్కెటింగ్ పర్సన్స్, కార్ డ్రైవర్, DTP ఆపరేటర్ కావలెను. జీతం: 12,000 to 18,000 ✆ 94901 84848

శివ కార్తికేయ హోంకేర్‌లో వృద్ధులు, పేషంట్స్, పిల్లలను చూసుకొనుటకు నర్సులు, వర్కర్స్ కావలెను. ఫ్రీ వసతి, భో,జీ. 20K. ✆ 99120 11499, 99120 11899

MARKETING/ SALES

Anand Masale Require Sales & Marketing Manager, Marketing Executives. Contact: 98496 55105, 98480 53144 Email: anandmasalaappltd@gmail.com.

BOOK YOUR COLOUR CLASSIFIED ₹1200/- (5 Lines) PH: 98496 97616 ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

తిరువూరు

• తిరువూరు • మైలవరం

వ్యాపారాల్లో ఉన్నతంగా ఎదిగేందుకు అవకాశం

ఏఐపై అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం (గ్రామీణం), న్యూస్‌టుడే : గుంటుపల్లి రైజ్ కేంద్రంలో ఆదివారం స్వయం సహాయక సంఘాల సభ్యులకు హైదరాబాద్‌కు చెందిన సిటిల్లా ఏఐ ఏజెన్సీ 'ఏఐ ఫర్ షేర్' కార్యక్రమం నిర్వహించింది. ఇందులో భాగంగా మహిళా వ్యాపారవేత్తలకు కృత్రిమ మేధ(ఏఐ) వినియోగంపై అవగాహన, సొంత వ్యాపార బ్రాండ్ల రూపకల్పన, ఆన్‌లైన్ మార్కెటింగ్ కోసం ప్రచార వీడియోలు రూపొందించడం తదితరాలపై శిక్షణ ఇచ్చారు. సిటిల్లా ఏఐ ఏజెన్సీ మేనేజింగ్ డైరెక్టర్ సతీష్ మాట్లాడుతూ.. ఈ శిక్షణ ద్వారా మహిళా పారిశ్రామికవేత్తలకు ఏఐపై అవగాహనతో పాటు భవిష్యత్తులో వారి వ్యాపారాల్లో ఉన్నతంగా ఎదిగేందుకు అవకాశముంటుందని చెప్పారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

గంగినేని రామాలయం సమీపంలోని పంచాయతీ బోరు మరమ్మతులకు గురై నీటి కోసం అవస్థలు పడుతున్నామని స్థానికులు 'ఈనాడు' 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా సమస్యను పంచాయతీ కార్యదర్శి హరికృష్ణ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి సిబ్బందితో బోరుకు మరమ్మతులు చేయించారు. – న్యూస్‌టుడే, జి.కొండూరు

★ విస్సన్నపేట తిరువత్తమ్మ గుడి ఏరియాలో చెత్త పేరుకుపోవడం, దీంతో దుర్వాసన వస్తోందని స్థానికులు పంచాయతీ అధికారులకు తెలిపారు. ఈవో కేశవ హరికృష్ణ కుమార్ స్పందించి పారిశుద్ధ్య కార్మికులను పంపించి శుభ్రం చేయించి సమస్య పరిష్కరించారు. – న్యూస్‌టుడే, విస్సన్నపేట

యోగా సాధనతో చక్కని ఆరోగ్యం

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే : ఆరోగ్యకరమైన చక్కని జీవితానికి యోగా ఎంతో మేలు చేస్తుందని ఎన్టీటీపీఎస్ ముఖ్య ఇంజినీర్ శివరామానేయులు అన్నారు. శాంతివన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎన్టీటీపీఎస్ ఎస్సీ సీటీ కల్యాణ మండపంలో యోగా కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్టీటీపీఎస్ ఉద్యోగులు, ఫౌండేషన్ అధ్యక్షుడు జనార్దన్ పాల్గొన్నారు.

ఉచిత ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

గంపలగూడెం, న్యూస్‌టుడే : ప్రైవేటు, అన్ ఎయిడెడ్ విద్యాలయాల్లో 2026- 27 ఏడాదిలో ఒకటో తరగతిలో ఉచిత ప్రవేశాలకు అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని డీవైఈవో ఎ. శ్యామ్‌సుందరరావు కోరారు. విద్యాహక్కు చట్టం మేరకు ప్రభుత్వ ఆదేశంపై బలహీన, పేద కుటుంబాలకు చెందిన పిల్లలకు ప్రైవేటు విద్యాలయాల్లో ఉచిత విద్య అందించేందుకు 25 శాతం సీట్లు ఒకటో తరగతిలో కేటాయించినట్లు తెలిపారు.

ఆదర్శ పాఠశాలలో..రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : మద్దులపర్వ ఆదర్శ పాఠశాలలో 2026-27 విద్యా ఏడాదిలో 6వ.తరగతిలో ప్రవేశానికి ఈ నెల 24 నుంచి మార్చి 31 వరకు దరఖాస్తులను సమర్పించుకోవాలని ప్రిన్సిపల్ ఆర్.శైలజ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

తిరువూరు, న్యూస్‌టుడే : తిరువూరులోని నాగార్జున, ప్రభుత్వ, శ్రీనిధి, రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలల్లో సోమవారం నుంచి ఇంటర్ పరీక్షలు జరుగుతాయని అధికారులు తెలిపారు. విద్యార్థులు 30 నిమిషాలు ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు.

ఎ.కొండూరు, న్యూస్‌టుడే : కంభంపాడులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి అయ్యాయని ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ తెలిపారు.

విద్యార్థుల సంఖ్య పెంచడమే లక్ష్యం

ఎ.కొండూరు, న్యూస్‌టుడే : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడమే లక్ష్యంగా మండల పరిధిలోని కోడూరు మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యు.రాంప్రసాద్ ఒక వినూత్న కార్యక్రమాన్ని రూపొందించారు. ఆదివారం కోడూరు గ్రామంలో ఇంటింటా తిరుగుతూ తమ పిల్లలను బడిలో చేర్చాలని తల్లిదండ్రులను విజ్ఞప్తి చేశారు.

పనుల్లో వేగం.. పరిశ్రమలకు ఊతం

మైలవరం, న్యూస్‌టుడే

నియోజకవర్గ ప్రగతిరథ చక్రంగా భావిస్తున్న ఎంఎస్ఎంఈ పార్కు నిర్మాణ పనులు వేగవంతమయ్యాయి. తొలి దశలో కేటాయించిన నిధులతో పునాదులు వేసేందుకు కావాల్సిన తవ్వకాలు చేపట్టడంతో ఒక రూపు రానుంది. ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కులను ఏర్పాటు చేసి, పరిశ్రమలను ప్రోత్సహించాలన్న కూటమి ప్రభుత్వ లక్ష్యాల మేరకు గతేడాది నవంబరులో ముఖ్యమంత్రి వర్చువల్‌గా మండలంలోని చంద్రగూడెంలోని రెవెన్యూ గుట్టపై పనులకు శంకుస్థాపన చేశారు. ఈ ప్రాంతం జాతీయ రహదారి నుంచి సుమారు 4 కి.మీ దూరంలో ఉంది. హైవే నుంచి అనంతవరానికి నిర్మించిన రోడ్డుకు అనుబంధంగా, ఇరుకైన రహదారి కావడంతో పరిశ్రమలకు అనుకూలతపై తొలుత సంశయాలు నెలకొన్నాయి. దాంతో నిదానంగా ప్రారంభించిన పనులను, గత నెలలో పరిశీలించిన కలెక్టర్ లక్ష్మీశ వేగవంతం చేయాల్సిందేనని సూచించారు.

పునాదులకు సిద్ధం చేస్తున్న ఇనుము

ఎంఎస్ఎంఈ వివరాలు ఇలా..	
కేటాయించిన భూమి	6.21 ఎకరాలు
నిధులు మంజూరు	రూ.14.50 కోట్లు
తొలి దశ విస్తీర్ణం	2 ఎకరాల్లో..
నిర్మాణ విస్తీర్ణం	26 వేల చ.అ

రెండు విభాగాలుగా.. విశాఖ భాగస్వామ్య సదస్సులో ప్రకటన మేరకు చంద్రగూడెంలోని గుట్ట పోరంబోకు భూమి 6.21 ఎకరాలను ఏపీఐఐసీ ద్వారా ఎంఎస్ఎంఈకి కేటాయించారు. పనులు దక్కించుకున్న సంస్థ రెండు విభాగాలుగా పునాదుల నిర్మాణం చేపట్టేందుకు కావాల్సిన తవ్వకాలను నెల రోజులుగా కొనసాగిస్తున్నారు. జిల్లాలోనే ప్రథమంగా శంకుస్థాపన చేసిన ఎంఎస్ఎంఈ కావడంతో కలెక్టర్ దీనిపై దృష్టి సారిస్తున్నారు. ఇప్పటికే మౌలిక వసతులు, పరిశ్రమల ఏర్పాటుకు కావాల్సిన అవసరాలు సమకూర్చేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయగా పనులు సాగుతున్నాయి. ఇది పూర్తి అయితే నియోజకవర్గంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలతో పాటు రవాణా సౌకర్యం మరింత మెరుగవుతుందని పలువురి నుంచి ఆశాభావం వ్యక్తమవుతోంది.

తిరువూరు నగర పంచాయతీని అప్‌గ్రేడ్ చేయాలి

ఎంపీ కేశినేని చిన్నికి వినతిపత్రం ఇస్తున్న తెదేపా నాయకులు

తిరువూరు, న్యూస్‌టుడే : తిరువూరు నగర పంచాయతీని తృతీయశ్రేణి నుంచి రెండవ శ్రేణి పురపాలక సంఘంగా అప్‌గ్రేడ్ చేయడానికి సహకరించాలని కోరుతూ తెదేపా నాయకులు ఆదివారం ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని)కి ఆయన కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఎంపీ హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం..
గంపలగూడెం, న్యూస్‌టుడే : మండలంలోని నెమలి వేణుగోపాల స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో పాల్గొనాలని కోరుతూ ఎంపీ కేశినేని చిన్నికి ఆలయ అధికారులు, తెదేపా నాయకులు ఆహ్వానపత్రం అందజేశారు. విజయవాడలోని ఆయన కార్యాలయంలో ఆదివారం కలిసి ఈ నెల 28 నుంచి మార్చి 5 వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తామని, అలాగే మార్చి 4, 5 తేదీల్లో నిర్వహించే పోటీ లగుడు ఎడ్ల ప్రదర్శన కార్యక్రమాలకు హాజరుకావాలని ఆహ్వానించారు. స్వామి వారి ప్రసాదం, శేషవస్త్రం అందించారు.

కలసి పని చేద్దాం.. ఉత్తమ సేవలు అందిద్దాం

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే : కలసి పనిచేద్దాం.. సంస్థ ఉత్తమ సేవలను ప్రజలకు అందిద్దామని ఏపీఈపీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ సునీల్ అన్నారు. ఎంప్లాయిస్ వెల్ఫేర్ అమరావతి సర్కిల్ సమావేశాన్ని ఇబ్రహీంపట్నంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం దిశగా యూనియన్ ముందుకెళ్తుందన్నారు. మార్చి నెలలో జనరల్ బాడీ మీటింగ్‌ను నిర్వహించనున్నామని చెప్పారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు సతీష్, శ్రీనివాస్, విజయమాధవి, దిలీప్, వినీత తదితరులు పాల్గొన్నారు.

ఫంక్షన్‌హాల్ ప్రారంభం

నందిగామ (గ్రామీణం), న్యూస్‌టుడే: మండలంలోని జొన్నలగడ్డ భోగలింగేశ్వరస్వామి సమేత రామలింగేశ్వరస్వామి దేవాలయంలో దాత సహకారంతో నిర్మించిన ఫంక్షన్‌హాల్‌ను ఆదివారం ప్రారంభించారు. దాత వేమువల్లి లక్ష్మణరావు తన సొంత నిధులు రూ.12 లక్షలు విరాళంగా ఇవ్వడంతో 500 మందికి భోజనాలు ఏర్పాటు చేసుకునేలా హాల్ నిర్మించారు. దీనిని దాతతో పాటు సర్పంచి లగడపాటి పుష్పరేణి, గ్రామ తెదేపా నాయకుడు బాబి ప్రారంభించారు.

గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు కృషి

తిరువూరు, న్యూస్‌టుడే : జి.కొత్తూరు గ్రామంలో ఆదివారం నిర్వహించిన ముత్యాలమ్మ ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమంలో ఎమ్మెల్యే కె. శ్రీనివాసరావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం తిరువూరులోని 8,14,16 వార్డుల్లో సీసీ రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు రాష్ట్ర జట్టు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: గుజరాత్ రాష్ట్రం వడోదరలో ఈ నెల 24 నుంచి 27వ తేదీ వరకు జరిగే 72వ జాతీయ సీనియర్ పురుషుల కబడ్డీ చాంపియన్‌షిప్‌లో తలపడే రాష్ట్ర జట్టును రాష్ట్ర కబడ్డీ సంఘం ప్రధాన కార్యదర్శి యలమంచిలి శ్రీకాంత్ ఆదివారం వెల్లడించారు. రైల్వే స్టేడియంలో నిర్వహించిన కార్యక్రమంలో జట్టు సభ్యులను ఆర్‌సీటీ (రైల్వే క్లెయిమ్స్ ట్రైబ్యునల్) అదనపు సంచాలకుడు కె. రాజేంద్రప్రసాద్, రాష్ట్ర కబడ్డీ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ నక్కల అర్జునరావు, సంయుక్త కార్యదర్శి కేవీ నాంచారయ్య అభినందించారు. పి. దుర్గారావు (కెప్టెన్, తూర్పు గోదావరి), పి. గోపి, జి. హరీష్ (పల్నాడు), జి. లక్ష్మారెడ్డి, పి. బ్రహ్మారెడ్డి, కె. హరిప్రసాదరెడ్డి (బాపట్ల), ఎన్. తేజ (విశాఖ), సీహెచ్ నాగబాబు, కె. మనోహర్ (కాకినాడ), కె. రాంబాబు, కె. దినేష్ (తిరుపతి), కె. ఫణేంద్ర (ఎన్టీఆర్), జి. పవన్‌కుమార్ (కృష్ణా), ఎస్కే బాషా (గుంటూరు) జట్టులో స్థానం సాధించారు.

క్రీడాకారులతో రాజేంద్రప్రసాద్, అర్జునరావు, శ్రీకాంత్ తదితరులు

వైభవంగా శాంతి కల్యాణం

మైలవరం, న్యూస్‌టుడే : స్థానిక కోదండ రామాలయంలో ఆదివారం స్వామి వారి శాంతి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. మేళతాళాలతో ప్రదక్షిణ చేసి, పట్టువస్త్రాలతో పూజలు చేశారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మైలవరంలో హారతి ఇస్తున్న పండితులు

భక్తిశ్రద్ధలతో పుట్లమ్మ, మారెమ్మల విగ్రహ ప్రతిష్ఠ

కొండపల్లి, న్యూస్‌టుడే : పుట్లమ్మ, మారెమ్మల నూతన ఆలయ, విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఆదివారం కొండపల్లిలో నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువ జాము నుంచే ప్రత్యేక పూజలు చేశారు. తెదేపా నాయకుడు సీతారామయ్య పూజా కార్యక్రమాల్లో పాల్గొని భక్తులకు అన్నదానం ప్రారంభించారు. కార్యక్రమంలో పుట్లమ్మ గట్టు ప్రాంతవాసులు, తెదేపా కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు, తెదేపా నాయకులు

నేటి నుంచి దేవతా విగ్రహాల ప్రతిష్ఠోత్సవం

సత్యాలపాడు(గంపలగూడెం), న్యూస్‌టుడే : మండలంలోని సత్యాలపాడులో విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన గుడిలో విగ్రహాల ప్రతిష్ఠోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభమవుతాయని కమిటీ సభ్యులు తెలిపారు.

నూతనంగా నిర్మించిన శివాలయం ఇదే..

శిశు సంక్షేమం.. అనారోగ్యం పాలు!

తిరువూరు, న్యూస్‌టుడే

సరకుల నాణ్యతలో పలు అనుమానాలు

తిరువూరు డివిజన్‌లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు ప్రతి నెల అంగన్‌వాడీ కార్యకర్తలు పోషకాహారం అందిస్తున్నారు. కానీ వీటిలో రాగి పిండి, కోడి గుడ్లు, పాలు, బియ్యం, కందిపప్పు, నూనె, చిక్కీలు తదితరాల నాణ్యతపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. వీటిని కేంద్రాలకు సరఫరా చేసే గుత్తేదారులు ప్రభుత్వ నిబంధనలు పాటించడం లేదని వాపోతున్నారు. సరకుల పంపిణీలో అవకతవకలు, తక్కువ బరువు, నాసిరకం పదార్థాలను ఇస్తున్నారని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధ్వాన పరిస్థితులు

డివిజన్‌లోని 265 అంగన్‌వాడీ కేంద్రాల్లో కొన్ని చోట్ల పారిశుద్ధ్య పరిస్థితులు అధ్వానంగా ఉంటున్నాయి. సరైన తాగునీటి సదుపాయం లేదు. ప్రభుత్వం అమలు చేస్తున్న సమగ్ర శిశు అభివృద్ధి సేవలు లబ్ధిదారులకు చేరేందుకు అధికారులు సమన్వయంతో పని చేయడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆయా సమస్యలను పరిష్కరించాలని పిల్లల తల్లిదండ్రులు కోరుతున్నారు. డివిజన్ పరిధి తిరువూరు, గంపలగూడెం, ఏ.కొండూరు, విస్సన్నపేట మండలాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో 2,545 మంది చిన్నారులు, 2,082 మంది గర్భిణులు, బాలింతలు ఉన్నారు. 125 సొంత అంగన్‌వాడీ భవనాలు, 77 అద్దె వాటిల్లో చిన్నారులకు ప్రాథమిక అందిస్తున్నారు.

☛ ఈ విషయమై సీడీపీవో కృష్ణకుమారి మాట్లాడుతూ.. కొన్నిచోట్ల పారిశుద్ధ్యం, తాగునీటి సమస్యలు ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందని చెప్పారు. త్వరలోనే వాటిపై చర్యలు తీసుకుంటామన్నారు. కేంద్రాలకు సరకులు సరఫరా చేసే గుత్తేదారులపై ఆరోపణలపై జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని ఆమె తెలిపారు.

ఉచిత వైద్య శిబిరాలకు విశేష స్పందన

మైలవరం, న్యూస్‌టుడే : చంద్రగూడెంలో స్థానిక ఏఎంసీ ఛైర్మన్ పి. నవ్యశ్రీ, జనసేన మండల అధ్యక్షుడు శీలం బ్రహ్మయ్య ఆధ్వర్యంలో బెస్ట్ ఆసుపత్రి సహకారంతో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి అక్కల రామ్మోహన్‌రావు, నాయకులు శ్రీకాంత్, నాని, శివరాంప్రసాద్, తిరుపతిరావు పాల్గొన్నారు.

మైలవరంలో శిబిరం ప్రారంభిస్తూ..

విస్సన్నపేట, న్యూస్‌టుడే : కొండపర్వలోని స్వర్ణ గ్రామ పంచాయతీ సచివాలయంలో స్టాన్లీ కంటి ఆసుపత్రి వారి సౌజన్యంతో వైద్యుడు ప్రభుదాసు ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గ్రామస్థులకు కంటి పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించారు.

గంపలగూడెం, న్యూస్‌టుడే : ఊటుకూరులో ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్, కేశినేని ఫౌండేషన్ ఆధ్వర్యంలో తెలుగు రైతు జిల్లా అధ్యక్షుడు సీహెచ్.రాజేశ్వరరావు సతీమణి రాణి వర్ధంతి సందర్భంగా రక్తదానం, ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఏఎంసీ ఛైర్‌పర్సన్ ఆర్.లక్ష్మీఅనిత శిబిరాన్ని ప్రారంభించారు. తెదేపా మండల అధ్యక్షుడు ఎం.రామకృష్ణ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఊటుకూరు: ఆరోగ్య పరీక్షలకు వచ్చిన ప్రజలు

కొండపర్వలో..

కౌలు రైతులను ఆదుకోండి

కంభంపాడులో గోడప్రతులు ఆవిష్కరిస్తున్న కౌలు రైతులు

ఎ.కొండూరు, న్యూస్‌టుడే : ప్రభుత్వం కౌలు రైతులను ఆదుకోవాలని కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు జెట్టి.వెంకటేశ్వరరావు కోరారు. ఈ మేరకు ఆదివారం మండల పరిధిలోని కంభంపాడులో గోడ ప్రతులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రావుల.రామకృష్ణ, బి.శ్రీను, కేశవులు, రాము తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సౌకర్యాల నిమిత్తం విరాళం

మైలవరం, న్యూస్‌టుడే : స్థానిక లయన్స్ వైకుంఠధామంలో ఏర్పాటు చేసిన మార్చురీ గది సౌకర్యాల నిమిత్తం రూ.75 వేల నగదు విరాళాన్ని గౌడ సంఘీయులు ఆదివారం గ్రామ పెద్దలు, ద్వారకా తిరుమల దేవస్థాన ఛైర్మన్ ఎస్వీ.సుధాకరరావుకు అందజేశారు. వైకుంఠధామంలో ఇప్పటికే పలు సౌకర్యాలను అందుబాటులోకి తెచ్చామని, అంతర్గత రహదారుల అభివృద్ధి, గ్యాస్ ఆధారిత దహన ప్లాంటు ఏర్పాటుకు దాతలు సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బాలాజీ ప్రసాద్, సంఘం నాయకులు సాంబశివరావు, శ్రీను, రవి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సాయం

మైలవరం, న్యూస్‌టుడే : మండలంలోని గణపవరానికి చెందిన తెదేపా కార్యకర్త చుట్టుకుదురు జమలయ్య అనారోగ్యంతో ఇటీవల మరణించారు. ఈ మేరకు అతని కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సాయాన్ని తెదేపా నాయకులు ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో బుజ్జిరెడ్డి, శ్యాంప్రసాద్, అంబేడ్కర్, రాజేష్, జమలయ్య తదితరులు పాల్గొన్నారు.

మనస్తాపంతో బాలిక బలవన్మరణం

జి.కొండూరు, న్యూస్‌టుడే : తండ్రి చనిపోయాడు, తల్లి వేరే చోట ఉండడంతో నాయనమ్మ వద్ద ఉంటూ తనను ఎవరు పట్టించుకునేవారు లేరని మనస్తాపంతో ఓ బాలిక మృతి చెందిన సంఘటన జి.కొండూరు మండలంలో చోటు చేసుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించడంతో జి.కొండూరు ఎస్సై కె.సతీష్ కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మైలవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం మత్తులో వ్యక్తి వీరంగం

కొండపల్లి, న్యూస్‌టుడే : కొండపల్లి ఖిల్లా రోడ్డు నాలుగు కూడళ్ల ప్రాంతంలో ఓ వ్యక్తి మద్యం మత్తులో ప్రాణాపాయ చేష్టలు చేసిన సంఘటన ఆదివారం మధ్యాహ్నం జరిగింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. సుమారు నలభై సంవత్సరాలు కలిగిన ఓ వ్యక్తి తీవ్రంగా మద్యం తాగాడు. నాలుగు కూడళ్ల ప్రాంతంలోకి వచ్చి అటుగా రాకపోకలు సాగించే వాహనాలకు అడ్డుగా నిల్చున్నాడు. ఒకనొక సమయంలో వెళ్తున్న లారీ దగ్గరకు వెళ్లి అడ్డుగా పడుకొన్నాడు. వెంటనే లారీ డ్రైవర్ అప్రమత్తమై సడన్ బ్రేక్ వేశాడు. డ్రైవర్ లారీ నుంచి కిందకు దిగి ఆ వ్యక్తికి దేహశుద్ధి చేశాడు. అప్పటికే అక్కడ విధుల్లో ఉన్న పోలీసు సిబ్బంది మత్తులో ఉన్న వ్యక్తిని పలుమార్లు వారించినా ప్రయోజనం లేకపోయింది.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల
(అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

అబాకస్ పోటీల్లో ప్రతిభ

మైలవరం, న్యూస్‌టుడే : రాష్ట్ర స్థాయి అబాకస్ పోటీల్లో స్థానిక ఎస్ఎస్‌కే హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటి పతకాలు సాధించినట్లు పాఠశాల డైరెక్టర్ గొల్లపూడి మోహనరావు తెలిపారు. పలు విభాగాల్లో మొత్తం 15 మంది విద్యార్థులు బహుమతులు పొందారని చెప్పారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్, కరస్పాండెంట్ శ్రీభావన, ఉపాధ్యాయులు తదితరులు వారిని అభినందించారు.

సాధించిన పతకాలతో విద్యార్థులు

'వైఫల్యాలు ప్రశ్నిస్తుంటే దాడులా?'

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే : ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తుంటే దాడులు చేయడం హేయమని అసెంబ్లీ మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. ఇబ్రహీంపట్నంలో మాజీ మంత్రి జోగి రమేష్‌ను ఆయన ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైఫల్యాలను ఎదుర్కోలేక భౌతిక దాడులు చేయడం దారుణమన్నారు. కార్యక్రమంలో వైకాపా నాయకులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఇలా ఐతే రాకపోకలు ఎలా

తిరువూరులోని జైభావి సెంటర్ నుంచి ప్రధాన రహదారికి వెళ్లే మార్గంలో రోడ్డు ఆక్రమణలకు గురై వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కొందరు రోడ్డు మధ్యలో ఇసుక, కంకరను గుట్టలుగా పోశారు. దీంతో రాకపోకలకు అంతరాయం కలుగుతోందని పలువురు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వాటిని తీయించాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, తిరువూరు

ఉత్సాహంగా మిడ్ టౌన్ బ్యాడ్మింటన్ లీగ్-2026

విజేతగా నిలిచిన ఉమా ఈవెంట్స్ అండ్ స్పీడ్ పూల్

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: స్థానిక సీహెచ్‌ఆర్‌కే వీఎంసీ ఇండోర్ స్టేడియంలో రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ మిడ్ టౌన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన 'మిడ్‌టౌన్ బ్యాడ్మింటన్ లీగ్-2026'ని కలెక్టర్ జి.లక్ష్మీశ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు ఆరోగ్యానికి ఎంతో ముఖ్యమని అన్నారు. క్లబ్ ఛైర్మన్ టి.కిషన్‌బాబు మాట్లాడుతూ క్రీడా స్ఫూర్తి, ఆరోగ్య చైతన్యం, స్నేహ సంబంధాలు పెంపొందించాలనే లక్ష్యంతో లీగ్‌ని ప్రారంభించామని తెలిపారు. లీగ్‌లో బాలబాలికలు, స్త్రీ, పురుషులు సుమారు 150 మంది పాల్గొన్నారని, వారిని 8 జట్లుగా విభజించి పోటీలు నిర్వహించామని చెప్పారు. దీని ద్వారా సమకూరే రూ.1.5 లక్షలను పల్స్ పోలియో నిధికి అందజేస్తామని తెలిపారు. పోటీలకు ప్రాయోజకులుగా 'ముకుతశ్రీ గోల్డ్ అండ్ డైమండ్స్', సహ ప్రాయోజకులుగా 'దివి స్వచ్ఛ సిల్వర్ జువెలరీ' వ్యవహరించినట్లు తెలిపారు. 'ఉమా ఈవెంట్స్ అండ్ స్పీడ్ పూల్' ప్రథమ, 'త్రినాథ్ ఇన్‌ఫ్రా' ద్వితీయ స్థానం కైవసం చేసుకున్నాయి. క్లబ్ అధ్యక్షుడు వి.చంద్రశేఖర్ నాయకత్వంలో నిర్వహించిన పోటీలో కో-ఛైర్మన్లు టి.ఉదయ్, కె.మధుసూదనరావు, కార్యదర్శి పొదిలె నాగ వసంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. క్లబ్ ఛైర్మన్ టి.కిషన్‌బాబు విజేతలకు ట్రోఫీలు బహూకరించారు.

స్తంభించిన సేవలు.. అన్నదాతలకు అవస్థలు

గంపలగూడెం, న్యూస్‌టుడే

ఆందోళన చేస్తున్న పీఏసీఎస్‌ల ఉద్యోగులు

పీఏసీఎస్ ఉద్యోగుల నిరవధిక సమ్మెతో తిరువూరు రెవెన్యూ డివిజన్‌లో వారం రోజులుగా సహకార సంఘాల్లో సేవలు స్తంభించాయి. తమ దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 2025 డిసెంబరు 6 నుంచి దశల వారీగా ఉద్యోగులు ఆందోళన చేస్తున్నారు. ఈ నెల 16 నుంచి నిరవధిక సమ్మె చేపట్టి సంఘాలకు తాళాలు వేశారు. ఎరువుల విక్రయాలు ఆపేశారు. దీంతో ఆర్థిక లావాదేవీలు జరగడం లేదు.

స్పందన కొరవడడంతో..

తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ పీఏసీఎస్ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో ప్రభుత్వంతో చర్చలు జరుపుతున్నా స్పందన కొరవడడంతో సమ్మెకు దిగినట్లు సంఘం రాష్ట్ర నాయకుడు బొల్లినేని రఘురామ్ తెలిపారు. ఉద్యోగులకు చట్టపరంగా గ్రాట్యుటీ చెల్లించాలని, ఉద్యోగ విరమణ వయసు 62 ఏళ్లకు పెంచాలని, 2019 తర్వాత చేరిన తాత్కాలిక ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, 2019- 24 వరకు వేతన సవరణ అమలు చేయాలని 70 రోజులుగా దశల వారీగా ఉద్యమం సాగుతోంది. ఈ నేపథ్యంలో కార్యాలయాల తలుపులకు తాళాలు వేసి సమ్మె నోటీసు అంటించారు. మండల వారీగా గంపలగూడెం- 12, తిరువూరు- 8, ఎ.కొండూరు- 7, రెడ్డిగూడెం- 4, విస్సన్నపేట- 7 పీఏసీఎస్‌లు ఉన్నాయి. మొత్తం 38 సంఘాల్లో 170 మంది ఉద్యోగులు పని చేస్తుండగా వీరిలో 80 మంది తాత్కాలిక ఉద్యోగులున్నారు. ప్రభుత్వం స్పందించి తమ డిమాండ్లు పరిష్కరించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

కోతుల ఆగడాలు.. తప్పించుకోవడానికి విన్యాసాలు

విస్సన్నపేట, న్యూస్‌టుడే

రబీలో వరి కంటే మొక్కజొన్న లాభదాయకంగా ఉంటుందని అన్నదాతలు అధిక శాతం దాని వైపు మొగ్గు చూపారు. విస్సన్నపేట మండలంలో కలగర, తాతకుంట్ల, కొర్లమండ తదితర గ్రామాల్లో మెరక, మాగాణి భూముల్లో 2,600 ఎకరాల్లో రైతులు మొక్కజొన్న సాగు చేపట్టారు. వర్షాలు అధికంగా ఉండడంతో ఈ ఏడాది విత్తనాలు ఆలస్యంగా నాటారు. దీంతో ఇప్పుడు ఎక్కడ చూసినా పంట కంకి, పొట్ట దశలో ఉంది. కానీ అన్నదాతల ఆశలపై నీళ్లు చల్లినట్లు కోతుల బెడద వారికి కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. వానరాలు గుంపులుగా పొలాలపైకి రావడంతో పంటను రక్షించుకోవడం ఇబ్బందిగా ఉందని రైతులు వాపోతున్నారు.

ధ్వనులు పలికిస్తూ..

వీటి బెడద నుంచి తప్పించుకోవడానికి కొందరు మైకుల ద్వారా రకరకాల ధ్వనులు పలికిస్తున్నారు. మరికొందరు అవి భయపడే విధంగా పొలాల ముందు ఫ్లెక్సీలు వేలాడదీశారు. కొన్ని గ్రామాల్లో నాటు తుపాకులు, దీపావళి టపాసులు పేల్చి కోతులను పారదోలుతున్నారంటే వానరాల బెడద ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ విషయమై మండల ఏవో మాట్లాడుతూ మొక్కజొన్న పంట ఆశాజనకంగా ఉందన్నారు. కోతుల బెడద వాస్తవమేనని, పొలాలకు సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేసుకోవడం, లౌడ్ స్పీకర్ల ద్వారా ధ్వనులు వినిపించడం వంటి వాటితో పంట రక్షించుకోవచ్చని సాగుదారులకు సూచించారు.

(c) eenadu

విజయవాడ తూర్పు

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం, జోనల్ కార్యాలయాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం నిర్వహిస్తున్నట్లు వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. నగర పరిధిలో నివాసం ఉండే ప్రజలు వారు ఎదుర్కొంటున్న సమస్యలను ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు లిఖిత పూర్వకంగా తెలియజేయవచ్చని పేర్కొన్నారు. అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

కరెన్సీనగర్ : 80085 74652

స్పందన: ★ 4వ డివిజన్ వెటర్నరీ కాలనీ వీధిలో భూగర్భ డ్రైనేజీ పొంగుతోందని స్థానిక నివాసి శ్రీమన్నారాయణ మేమున్నాం... మీకు తోడుగా ద్వారా ఈనాడు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సిబ్బందిని పంపించి పూడిక తీయించారు. ★ 3వ డివిజన్ గుణదల ఈఎస్ఐ హాస్పటల్ ఎదురు రహదారిలో దోమల బెడద ఎక్కువగా ఉందని స్థానిక నివాసి అంబేడ్కర్ మేమున్నాం...మీకు తోడుగా ద్వారా మలేరియా అధికారి శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సిబ్బందితో దోమల మందులు, పొగ పెట్టించారు. ★ 4వ డివిజన్ కనకదుర్గ గెజిటెడ్ ఆఫీసర్స్ కాలనీ రోడ్డు నెంబరు 5లో 4-6/149 విద్యుత్ స్తంభానికి ఉన్న వీధి దీపం వెలగడం లేదని స్థానిక నివాసి నాగేశ్వరరావు మేమున్నాం...మీకు తోడుగా ద్వారా ఏఈ ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన కొత్త దీపాన్ని ఏర్పాటు చేయించారు. **- న్యూస్‌టుడే, కరెన్సీనగర్**

అల్పాహార పాత్రలు అందజేత

పటమట: గుణదలలోని ప్రభుత్వ బీసీ కళాశాల బాలికల వసతి గృహంలో హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ సహకారంతో విద్యార్థులకు ఆదివారం అల్పాహార పాత్రలు అందజేశారు. ఏపీబీసీడబ్ల్యూఏ రవి ప్రసాద్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ ప్రతినిధులు, వికాస్ కళాశాల ప్రిన్సిపల్ హరిశ్, డాక్టర్ హరిక్, వసతి గృహ సంక్షేమ అధికారిణి మేరీ పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా సూర్యోపాసన పూజ

విజయవాడ వన్‌టౌన్: ఇంద్రకీలాద్రిపై ఆదివారం సూర్యోపాసన పూజలు నిర్వహించారు. వైదిక క్రతువు, ఆలయ వైదిక కమిటీ, వేదపండితులు పూజ జరిపించారు. లోక కల్యాణం, భక్తులకు ఆరోగ్యసిద్ధి కోసం ఈ పూజలు నిర్వహిస్తున్నామని వివరించారు.

దాతల సహకారం.. వసతులు సాకారం

సీఎస్ఆర్ నిధులతో పాఠశాలల అభివృద్ధి

పటమట, న్యూస్‌టుడే

కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధులతో తూర్పు నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారుతున్నాయి. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ చొరవతో కార్పొరేట్ సంస్థలు విద్యాలయాల అభివృద్ధికి ముందుకు వస్తున్నాయి. మౌలిక వసతులు కల్పిస్తున్నాయి. క్రీడా మైదానాలు, ఆట పరికరాలు, తరగతి గదులు, వంట శాలలు, వంట సామగ్రి, తాగునీటి సదుపాయాలు సమకూరుస్తున్నాయి. ఫలితంగా విద్యార్థులు మెరుగైన వాతావరణంలో చదువుకొనే అవకాశం కలుగుతోంది. ఇంకా మరికొన్ని సంస్థలు ముందుకు వచ్చి పాఠశాలలను అభివృద్ధి చేయాలని ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

చేపట్టిన పనులు కొన్ని...

■ 14వ డివిజన్ ఎన్టీఆర్ సర్కిల్ సమీపంలోని అంగన్‌వాడీ భవనం శిథిలావస్థకు చేరింది. పైకప్పు నుంచి వర్షం నీరు కారడంతో పాటు ఇనుప చువ్వలు బయటకు కనిపించి ప్రమాదకరంగా మారింది. స్థానిక ఆయుష్ ఆసుపత్రి యాజమాన్యం ముందుకు వచ్చి సీఎస్ఆర్ నిధులతో భవనానికి మరమ్మతులు చేపట్టింది. రూ.5 లక్షలపైగా వెచ్చించి భవనం రూపురేఖలు మార్చడమే కాకుండా అదనంగా తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు నిర్మించింది.

దర్శిపేటలో మరమ్మతులు చేపట్టిన అంగన్‌వాడీ భవనం

■ పటమట లంకలోని కేబీసీ జడ్పీ పాఠశాలకు భోజన శాల లేదు. విద్యార్థులు పాఠశాల బయట కూర్చొని భోజనం తినేవారు. వర్షాకాలం వస్తే చాలా ఇబ్బంది పడేవారు. ఉజ్జీవన్ ఫైనాన్స్ బ్యాంకు అధికారులు సీఎస్ఆర్ నిధుల రూ.10 లక్షలు వెచ్చించి భోజన శాల నిర్మించారు. ప్రస్తుతం విద్యార్థులు ఇబ్బందులు లేకుండా భోజనం చేస్తున్నారు. 12వ డివిజన్ మున్సిపల్ పాఠశాలలో సౌకర్యాలు కల్పించడానికి కూడా బ్యాంకు ముందుకు వచ్చింది.

■ కృష్ణలంకలోని పొట్టి శ్రీరాములు పాఠశాల అభివృద్ధికి శ్రీరామ్ ఫైనాన్స్ కంపెనీ ముందుకు వచ్చింది. పాఠశాల చుట్టూ ప్రహరీ నిర్మాణం, క్రీడా మైదానం, వాకింగ్ ట్రాక్ తదితర అభివృద్ధి పనులు చేయడానికి సీఎస్ఆర్ నిధుల నుంచి రూ.35 లక్షలు కేటాయించింది. ఆ చెక్కును గత ఏడాది డిసెంబర్‌లో కలెక్టర్ లక్ష్మీశకు ఆ కంపెనీ ప్రతినిధులు అందజేశారు. ప్రస్తుతం పనులు వేగంగా జరుగుతున్నాయి. అవన్నీ పూర్తయితే పిల్లలకు మెరుగైన వసతులు సమకూరుతాయి. ఇంకా కొన్ని పాఠశాలల్లో వసతులు అవసరం ఉంది. దాతలు స్పందించి ముందుకు వస్తే పిల్లల బంగారు భవితకు బాటలు వేసిన వారవుతారు.

ఇంటి నుంచే పరిశుభ్రత మొదలు కావాలి

కృష్ణవేణి ఘాట్‌ను శుభ్రం చేస్తున్న క్యాడెట్లు

కృష్ణలంక, న్యూస్‌టుడే: ఎన్‌సీసీ విద్యార్థులు చిన్నతనంలోనే సమాజ సేవ, దేశభక్తిని పెంపొందించుకోవాలని ఎనిమిదో ఆంధ్రా ఎయిర్ స్క్వాడ్రన్ ఎన్‌సీసీ కమాండింగ్ అధికారి, గ్రూప్ కెప్టెన్ కేవీ శ్రీనివాస్, ఎనిమిదో ఆంధ్రా నావల్ యూనిట్ కమాండింగ్ అధికారి సుజిత్ కుమార్ అన్నారు. ఎన్‌సీసీ కాకినాడ గ్రూప్ ఆదేశాల మేరకు ఎనిమిదో ఆంధ్రా ఎయిర్ స్క్వాడ్రన్ ఎన్‌సీసీ, ఎనిమిదో ఆంధ్రా నావల్ సంయుక్త ఆధ్వర్యంలో పద్మావతి, కృష్ణవేణి ఘాట్ ప్రాంతాల్లో ఆదివారం పరిశుభ్రత, అవగాహన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ.. పరిశుభ్రత ప్రతి ఇంటి నుంచి మొదలు కావాలని, అనంతరం పరిసర ప్రాంతాలు, నగరాన్ని పరిశుభ్రంగా మార్చడం సాధ్యపడుతుందని అన్నారు. ఎన్‌సీసీ విద్యార్థులతో ప్రారంభమైన కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ స్ఫూర్తిగా తీసుకొని నగర పరిశుభ్రతకు పాటుపడాలని పిలుపునిచ్చారు. జూనియర్ వారెంట్ ఆఫీసర్ కేడర్ సూరజ్, ఎం.గోపిరెడ్డి, ఎస్ సింగ్, ఎన్.హారిక తదితరులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు పతకాలు అందించి అభినందించారు.

అందరికీ విద్య.. ఉపాధితోనే సామాజిక న్యాయం

మాట్లాడుతున్న ఈశ్వరయ్య

కృష్ణలంక, న్యూస్‌టుడే: భారత కమ్యూనిస్ట్ పార్టీ వందేళ్ల పయనంలో అమరులైన ఉద్యమ వీరుల ఆశయాలతో నేటి భారత వ్యవస్థను రూపుమాపేందుకు పేదల చేతిలో అంకుశంలా మారుతాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య అన్నారు. కృష్ణలంక 22వ డివిజన్‌లో పార్టీ వందేళ్ల వేడుక ముగింపు సందర్భంగా ఆదివారం ప్రజా ప్రదర్శన నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో కార్పొరేట్ వైద్య వ్యవస్థ, రూ.వేల కోట్లు ఆర్జిస్తున్న మెడికల్ మాఫియాలు పాలక పక్షాలకు పెట్టుబడులు పెడుతూ.. వారి చెప్పుచేతల్లో ప్రభుత్వాలు నడిచే విధంగా చేసుకుంటున్నాయని ఆరోపించారు. ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్తే.. పరీక్షల పేరుతో ప్రజల బలహీనతలను వైద్యులు సొమ్ము చేసుకుంటున్నారని విమర్శించారు. సుదీర్ఘ కమ్యూనిస్టు ప్రయాణంలో అసువులు బాసిన అమరుల దోపిడీ వ్యవస్థ లేని సమ సమాజ స్థాపనే లక్ష్యంగా అనేక ఉద్యమాలు, పోరాటాలు చేసినట్లు తెలిపారు. అందరికీ విద్య, ఉపాధి అవకాశాలు కల్పిస్తేనే నిజమైన సామాజిక న్యాయం జరిగినట్లని అన్నారు. నాయకులు జి.కోటేశ్వరరావు, యలమందలి ఈశ్వరరావు, లంకా దుర్గారావు, నక్కా వీరభద్రరావు, మందలపు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

డ్రెయిన్‌లో పూడిక తొలగింపు

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: మూడో డివిజన్ కరెన్సీనగర్ హైవే సర్వీస్ రోడ్డులోని కాలువలు వ్యర్థాలతో నిండి దుర్వాసన వెదజల్లుతోందని 'మురుగు పారక ఇక్కట్లు' శీర్షికన ఈ నెల 20న 'ఈనాడు'లో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. సిబ్బందితో వ్యర్థాలను తీయించి ఆయిల్ బాల్స్ విడిచిపెట్టారు. దుర్వాసన రాకుండా చర్యలు తీసుకున్నారు.

ప్రజలను సంతోషంగా ఉంచడమే ప్రభుత్వ లక్ష్యం

కృష్ణలంక, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని ప్రజలందరినీ సంతోషంగా ఉంచడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. 18వ డివిజన్ రివర్ ఫ్రంట్ పార్కులో ఆదివారం హ్యాపీ సండే కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పిల్లల్లో ఉత్సాహాన్ని రెట్టింపు చేసేందుకు ప్రతి నెల రెండు, నాలుగు ఆదివారాల్లో హ్యాపీ సండే కార్యక్రమాలు నిర్వహించాలని ముఖ్యమంత్రి నిర్ణయించినట్లు చెప్పారు. హైదరాబాద్‌కు దీటుగా అమరావతిని తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని తెలిపారు. పార్కులను అభివృద్ధి చేసి,

నృత్య కళాకారిణులతో ఎమ్మెల్యే రామ్మోహన తదితరులు

వ్యాయామ పరికరాలు అమర్చి, వాకింగ్ ట్రాక్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అందువల్ల సెలవు దినాల్లో పార్కులు చిన్నారులు, పెద్దలతో కళకళలాడుతున్నాయని తెలిపారు. ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ రోజుకో గంట వ్యాయామం చేయాలని సూచించారు. రానున్న రోజుల్లో మరిన్ని కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. జోనల్ కమిషనర్ షమ్మి, ఈఈ సామ్రాజ్యం, ఎంవోహెచ్ గోపాల్ నాయక్, కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్, వేముల దుర్గారావు, రాయి రంగమ్మ, మైలమూరి పీరుబాబు తదితరులు పాల్గొన్నారు.

తగిన జాగ్రత్తలతో క్యాన్సర్ దూరం

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: చిన్నారుల ప్రాణాలు కాపాడేందుకు మందులతో పాటు మనసున్న దాతల సహకారం ఎంతో అవసరమని రెయిన్ బో హాస్పిటల్ పీడియాట్రిక్ హెమటో ఆంకాలజిస్ట్ డాక్టర్ వీణ అన్నారు. చిన్నారుల క్యాన్సర్ చికిత్సకు వైద్యంతో పాటు మానసిక ఉల్లాసం, సరైన ఆహారం అవసరమని అన్నారు. అంతర్జాతీయ చైల్డ్‌హుడ్ క్యాన్సర్ డేని పురస్కరించుకొని హాస్పిటల్‌లో ఆదివారం క్యాన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించి, దాతలను సత్కరించారు. ముఖ్యఅతిథిగా హాజరైన విశ్వహిందూ పరిషత్ జాతీయ ట్రస్టీ పుట్టగుంట సతీష్ కుమార్ మాట్లాడుతూ.. క్యాన్సర్ బారిన పడకుండా ఆహార నియమాలతో పాటు వ్యాయామం, ధ్యానం అలవాటు చేసుకోవాలని సూచించారు. వ్యాధి గ్రస్తులకు మందుల కంటే కుటుంబ సభ్యులు ఇచ్చే మనోధైర్యమే సగం బలమని అన్నారు. క్యాన్సర్ వ్యాధి బారిన పడిన చిన్నారులకు వైద్య సహాయం అందించేందుకు రూ.2 లక్షలు విరాళంగా అందజేశారు. చిన్నారుల వైద్య ఖర్చుల కోసం నిరంతరం తోడ్పాటునందిస్తున్న దాతలను ఆస్పత్రి యాజమాన్యం సత్కరించింది. డాక్టర్ రాజు, మేనేజర్ శివరామకృష్ణ పర్యవేక్షించారు.

దాతలతో సతీష్, డాక్టర్ వీణ తదితరులు

నేడు, రేపు అంతర్జాతీయ సదస్సు

గోడపత్రిక ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపల్ మిల్కీయోర్ తదితరులు

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: ఆంధ్రా లయోల కళాశాల వృక్ష, జంతు, సూక్ష్మ జీవ, బయోటెక్నాలజీ, ఆహార సాంకేతిక, వ్యవసాయ గ్రామీణాభివృద్ధి విభాగాల ఆధ్వర్యంలో ఈ నెల 23, 24 తేదీల్లో అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఫాదర్ మిల్కీయోర్ తెలిపారు. గోడ పత్రికను ఆదివారం ఆవిష్కరించారు. విద్యావేత్తలు, పరిశోధకులు తమ పరిశోధనలను పెంపొందించుకోవడానికి, జీవ శాస్త్రాల్లో స్థిరమైన భవిష్యత్తు ఆధారిత పద్ధతులను అన్వేషించడానికి సదస్సు దోహదపడుతుందని ఆయన తెలిపారు. అమెరికా అలబామా విశ్వవిద్యాలయం ఆచార్యుడు ఎం.ఎన్.వి.రవికుమార్ ప్రధాన వక్తగా మాట్లాడతారని చెప్పారు. ఇప్పటికే జాతీయ, అంతర్జాతీయ సంస్థల నుంచి 150కి పైగా పరిశోధన పత్రాలు వచ్చాయని, అత్యుత్తమ పరిశోధనను గుర్తించి యంగ్ సైంటిస్ట్ అవార్డు అందజేస్తామని సదస్సు కన్వీనర్ కె.బాలచంద్ర తెలిపారు.

వృద్ధులతో హ్యాపీ సండే

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరంలోని నిర్మల హృదయభవన్‌లో ఆదివారం వృద్ధులతో కలిసి హ్యాపీ సండే కార్యక్రమాన్ని నిర్వహించారు. అదనపు కమిషనర్ డి.చంద్రశేఖర్ అతిథిగా పాల్గొన్నారు. చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని ప్రతి నెలా రెండు, నాలుగు ఆదివారాల్లో నిర్వహిస్తామని పేర్కొన్నారు. వృద్ధులతో కేకు కోయించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వృద్ధులకు పండ్లు అందజేశారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ కె.ప్రభుదాస్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మహనీయుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి

నరసింహారెడ్డి చిత్రపటానికి నివాళులు అర్పించిన చంద్రశేఖర్ తదితరులు

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: రాయలసీమ ప్రాంతంలో బ్రిటిషు వారిపై పోరాటం చేసిన ఘనత ఉయ్యాలవాడ నరసింహారెడ్డికే దక్కుతుందని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ డి.చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతిని ఆదివారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించారు. అదనపు కమిషనర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ నరసింహారెడ్డి సిపాయిల తిరుగుబాటుకు ముందే రాయలసీమలో బ్రిటిషు వారికి వ్యతిరేకంగా పోరాడారని తెలిపారు. అలాంటి మహనీయుడిని స్మరించుకోవటం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. నగరపాలక సంస్థ పౌర సంబంధాల అధికారి రజియా షబీనా, నగరపాలక సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

పక్కకు వెళ్తే... ప్రమాదమే

ఏడో డివిజన్ ఉడ్‌పేట, నెహ్రూనగర్‌కు వెళ్లే రహదారి పక్కన పైపులైన్లు ఏర్పాటు చేసేందుకు తవ్వారు. పనులు పూర్తయ్యాక పూడ్చకుండా వదిలేశారు. రాత్రి గమనించకుండా ద్విచక్ర వాహనదారులు, పాదచారులు ఏ మాత్రం పక్కకు వెళ్లినా.. పడిపోయే అవకాశం ఉంది. అధికారులు గుంత పూడ్చించాలని స్థానికులు కోరుతున్నారు. **- మొగల్రాజపురం(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే**

పేరుకున్న వ్యర్థాలతో అవస్థ

16వ డివిజన్‌లో పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా లేదని స్థానికులు చెబుతున్నారు. నగర పాలక సంస్థ పారిశుద్ధ్య సిబ్బంది రోజువారీ వ్యర్థాలను తొలగించడం లేదని, ఫలితంగా చెత్త పేరుకుపోయి దుర్వాసన వస్తోందని వాపోతున్నారు. పైగా వ్యర్థాలను కుక్కలు, ఆవులు చిందరవందరగా చేస్తున్నాయని, అధికారులు స్పందించాలని ఆ ప్రాంతవాసులు కోరుతున్నారు. **- కృష్ణలంక, న్యూస్‌టుడే**

కార్ల పార్కింగ్‌తో ఇబ్బందులు

ఏపీఐఐసీ కాలనీలోని రైతుబజారులో వినియోగదారుల వాహనాల పార్కింగ్ స్థలంలో కొంతకాలం నుంచి 'ఆన్ గవర్నమెంట్ డ్యూటీ' అని రాసిన రెండు కార్లు నిలుపుతున్నారు. కూరగాయలకు వచ్చే ప్రజలు రైతుబజారు బయట వాహనాలు నిలుపుతున్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. అధికారులు చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు. **- పటమట, న్యూస్‌టుడే**

చెత్త తీయక.. మురుగు వెళ్లక

ఆటో నగర్ వందడుగుల రోడ్డులోని కాలువలో వ్యర్థాలు తిష్ఠ వేశాయి. మురుగు ముందుకు కదలడం లేదు. మురుగు రోజుల తరబడి నిల్వ ఉండడం వల్ల నల్ల రంగులోకి మారి దుర్వాసన వస్తోందని కార్మికులు చెబుతున్నారు. దోమలు కూడా వృద్ధి చెందుతున్నాయి. ఇలా అధికారులు స్పందించి వ్యర్థాలు తొలగించి మురుగు పారేలా చూడాలని కోరుతున్నారు. **- ఆటోనగర్, న్యూస్‌టుడే**

దీపాలు వెలగవు.. అంధకారం వీడదు

ఆటోనగర్ రామ ఇండస్ట్రీస్ రోడ్డులో వీధి దీపాలు వెలగడం లేదు. చీకటిమయంగా మారింది. రాకపోకలకు కార్మికులు ఇబ్బంది పడుతున్నారు. కార్మికుల నుంచి సెల్‌ఫోన్లు, బంగారు ఆభరణాలను దుండగులు చోరీ చేస్తున్నారని, అధికారులు దృష్టికి ఎన్ని సార్లు తీసుకెళ్లినా.. వీధి దీపాలు ఏర్పాటు చేయడం లేదని, ఇప్పటికైనా స్పందించాలని కోరుతున్నారు. **- ఆటోనగర్, న్యూస్‌టుడే**

తితిదే నిత్యాన్నదానానికి కూరగాయలు

జెండా ఊపి లారీ పంపిస్తున్న ప్రసన్నకుమార్

లబ్బీపేట (విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : శ్రీవారి భక్తులకు ఏర్పాటు చేసే అన్నప్రసాదంలో నగర సభ్యులు భాగస్వామ్యం కావడం అభినందనీయమని ఐసీఏఐ అధ్యక్షుడు డి.ప్రసన్నకుమార్ అన్నారు. తితిదే నిత్యాన్నదానానికి ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ), విజయవాడ బ్రాంచి సభ్యుల ఆర్థిక సాయంతో పది టన్నుల కూరగాయలు సిద్ధం చేశారు. వాటిని ఆదివారం లబ్బీపేట వైవీరావు హాస్పిటల్ రోడ్డులోని జీఆర్టీ హోటల్ వద్ద నుంచి తిరుమలకు పంపించారు. లారీకి ప్రసన్నకుమార్ జెండా ఊపి ప్రారంభించారు. ఐసీఏఐ విజయవాడ బ్రాంచి ఛైర్మన్ ఉప్పులూరి జయంత్, ఎక్స్ అఫిషియో ఛైర్మన్ ముప్పాల సుబ్బారావు, కార్యదర్శి వేమూరు వీర పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇరుకు దారి.. ఇబ్బందిగా మారి..

తరచూ ఆగిపోతున్న ట్రాఫిక్

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే

నగరం రోజురోజుకూ విస్తరిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ, ప్రైవేటు ప్రధాన కార్యాలయాల కార్యకలాపాలు ఇక్కడ నుంచే కొనసాగుతున్నాయి. ప్రభుత్వ, కార్పొరేట్ ఆస్పత్రులు, విద్యా, వాణిజ్య సంస్థలు నెలకొన్నాయి. మరోవైపు అపార్టుమెంట్లు పెరుగుతున్నాయి. నగరంలో నివసించే వారి సంఖ్య పెరుగుతోంది. రాకపోకలు సాగించేవారు అధికమయ్యారు. అందుకు తగినట్లు వసతులు కనిపించడం లేదు. ఏళ్ల కిందట నిర్మించిన వంతెనలు ప్రస్తుతం వినియోగంలో ఉన్నాయి. వాటిపై రాకపోకలు కొనసాగించే ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

వంతెనపై నిలిచిపోయిన వాహనాలు

బందరు కాలువపై..

నగరంలోని అమెరికన్ ఆస్పత్రి సమీపంలో బందరు కాలువపై 1990 సంవత్సరంలో వంతెన నిర్మించారు. కృష్ణలంక, నెహ్రూనగర్, తాడేపల్లి, గుంటూరు వైపు నుంచి వచ్చే వారు ఈ వంతెన మీదుగా నగరంలోని ఎంజీ రోడ్డులోకి వస్తారు. అమెరికన్ ఆస్పత్రి మీదుగా తిరిగి మళ్లీ ఆయా ప్రాంతాలకు వెళ్తారు. నిత్యం వందలాది మంది వాహనదారులు రాకపోకలు కొనసాగిస్తుంటారు. దీని వల్ల తరచూ ట్రాఫిక్ స్తంభిస్తోంది. అటుగా రాకపోకలు కొనసాగించే వారు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. అమెరికన్ ఆస్పత్రి నుంచి వంతెన మీదుగా వెళ్లే సమయంలో.. నగరం వైపు వచ్చే వాహనాలు వారధిపై నిలిచిపోతున్నాయి. ఇది వన్‌వే కావడం వల్ల ఈ సమస్య ఉత్పన్నమవుతోంది. ఇక్కడ కొత్తగా ప్రస్తుత అవసరాలకు సరిపడా వంతెన నిర్మించాలి. ఆ దిశగా ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ చూపాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

పటమట న్యూస్‌టుడే: స్థానిక కోనేరు బసవయ్య చౌదరి ఉన్నత పాఠశాల 1978-79 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల సమ్మేళనం ఆదివారం పటమటలోని ఫన్‌టైమ్ క్లబ్‌లో నిర్వహించారు. ఆనాటి మధుర స్మృతులను నెమరువేసుకున్నారు. చిన్న పిల్లలుగా మారి పాఠశాలలో తాము చేసిన అల్లరి పనులను గుర్తు చేసుకున్నారు. పాఠశాల అభివృద్ధికి రూ.లక్ష విరాళం ఇచ్చిన శ్రీనివాస్ మూర్తిని సత్కరించారు. అందరినీ ఒక వేదికపైకి తీసుకువచ్చిన మాదు రామకృష్ణారావు, మోహన్ నూశెట్టు, కోనేరు శ్రీను, జగన్‌కు అభినందనలు తెలిపారు.

దుర్గగుడికి విరాళాలు

విజయవాడ వన్‌టౌన్, న్యూస్‌టుడే: అమ్మవారి ఆలయంలో జరిగే నిత్యాన్నదాన కార్యక్రమానికి ఆదివారం పలువురు విరాళాలు అందజేశారు. హైదరాబాద్ సంజీవరెడ్డి నగర్‌లోని జె.కిషోర్ కుటుంబ సభ్యులు రూ.5 లక్షలు, విజయవాడ లయోల కళాశాల ఫిలింనగర్ ప్రాంతానికి చెందిన తన్నీరు మారుతి ఫణికాంత్ కుటుంబ సభ్యులు రూ.లక్ష , కృష్ణా జిల్లా గన్నవరం గౌడపేటకు చెందిన మోచర్ల భవానీ కుటుంబ సభ్యులు రూ.1,01,116 విరాళంగా అందజేశారు. ఆలయ అధికారులు దాతలకు అమ్మవారి దర్శనం కల్పించి, ప్రసాదాల్ని, చిత్రపటాలను అందజేశారు.

ఐసీఏఐ విజయవాడ బ్రాంచ్ ఛైర్మన్‌గా జయంత్

నూతన కార్యవర్గ సభ్యులు

మొగల్రాజపురం (విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) విజయవాడ బ్రాంచ్ ప్రమాణ స్వీకారోత్సవం మొగల్రాజపురంలోని ఓ హోటల్‌లో ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఐసీఏఐ అధ్యక్షుడు డి.ప్రసన్నకుమార్ హాజరయ్యారు. ఛైర్మన్‌గా ఎన్నికైన ఉప్పులూరి జయంత్, ఉపాధ్యక్షుడు మనీష్‌కుమార్ జైన్, కార్యదర్శి వేమూరు వీర పవన్‌కుమార్, కోశాధికారి టి.వినీల, విద్యార్థి విభాగం ఛైర్మన్ బొర్రా అజయ్‌చౌదరిలతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఐసీఏఐ సదరన్ ఇండియా రీజనల్ కౌన్సిల్ ఛైర్మన్ ముప్పాల సుబ్బారావు, ఈసీ సభ్యుడు దామా వేణు, కంచమరెడ్డి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు రాష్ట్ర జట్టు

క్రీడాకారులతో రాజేంద్రప్రసాద్, అర్జునరావు, శ్రీకాంత్ తదితరులు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: గుజరాత్ రాష్ట్రం వడోదరలో ఈ నెల 24 నుంచి 27వ తేదీ వరకు జరిగే 72వ జాతీయ సీనియర్ పురుషుల కబడ్డీ ఛాంపియన్‌షిప్‌లో తలపడే రాష్ట్ర జట్టును రాష్ట్ర కబడ్డీ సంఘం ప్రధాన కార్యదర్శి యలమంచిలి శ్రీకాంత్ ఆదివారం వెల్లడించారు. రైల్వే స్టేడియంలో నిర్వహించిన కార్యక్రమంలో జట్టు సభ్యులను ఆర్‌సీటీ (రైల్వే క్లెయిమ్స్ ట్రైబ్యునల్) అదనపు సంచాలకుడు కె.రాజేంద్రప్రసాద్, రాష్ట్ర కబడ్డీ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ నక్కల అర్జునరావు, సంయుక్త కార్యదర్శి కేవీ నాంచారయ్య అభినందించారు. పి.దుర్గారావు (కెప్టెన్, తూర్పు గోదావరి), పి.గోపి, జి.హరీష్ (పల్నాడు), జి.లక్ష్మారెడ్డి, పి.బ్రహ్మారెడ్డి, కె.హరిప్రసాదరెడ్డి (బాపట్ల), ఎన్.తేజ (విశాఖ), సీహెచ్ నాగబాబు, కె.మనోహర్ (కాకినాడ), కె.రాంబాబు, కె.దినేష్ (తిరుపతి), కె.ఫణేంద్ర (ఎన్టీఆర్), జి.పవన్‌కుమార్ (కృష్ణా), ఎస్‌కే బాషా (గుంటూరు) జట్టులో స్థానం సాధించారు.

ఉత్సాహంగా మిడ్ టౌన్ బ్యాడ్మింటన్ లీగ్-2026

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: స్థానిక సీహెచ్ఆర్‌కే వీఎంసీ ఇండోర్ స్టేడియంలో రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ మిడ్ టౌన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన 'మిడ్‌టౌన్ బ్యాడ్మింటన్ లీగ్-2026'ని కలెక్టర్ జి.లక్ష్మీశ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు ఆరోగ్యానికి ఎంతో ముఖ్యమని అన్నారు. క్లబ్ ఛైర్మన్ టి.కిషన్‌బాబు మాట్లాడుతూ క్రీడా స్ఫూర్తి, ఆరోగ్య చైతన్యం, స్నేహ సంబంధాలు పెంపొందించాలనే లక్ష్యంతో లీగ్‌ని ప్రారంభించామని తెలిపారు. లీగ్‌లో బాలబాలికలు, స్త్రీ, పురుషులు సుమారు 150 మంది పాల్గొన్నారని, వారిని 8 జట్లుగా విభజించి పోటీలు నిర్వహించామని చెప్పారు. దీని ద్వారా సమకూరే రూ.1.5 లక్షలను పల్స్ పోలియో నిధికి అందజేస్తామని తెలిపారు. పోటీలకు ప్రాయోజకులుగా 'ముకుతశ్రీ గోల్డ్ అండ్ డైమండ్స్', సహ ప్రాయోజకులుగా 'దివి స్వచ్ఛ సిల్వర్ జువెలరీ' వ్యవహరించినట్లు తెలిపారు. 'ఉమా ఈవెంట్స్ అండ్ స్పీడ్ పూల్' ప్రథమ, 'త్రినాథ్ ఇన్‌ఫ్రా' ద్వితీయ స్థానం కైవసం చేసుకున్నాయి. క్లబ్ అధ్యక్షుడు వి.చంద్రశేఖర్ నాయకత్వంలో నిర్వహించిన పోటీలో కో-ఛైర్మన్లు టి.ఉదయ్, కె.మధుసూదనరావు, కార్యదర్శి పొదిలె నాగ వసంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. క్లబ్ ఛైర్మన్ టి.కిషన్‌బాబు విజేతలకు ట్రోఫీలు బహూకరించారు.

విజేతగా నిలిచిన ఉమా ఈవెంట్స్ అండ్ స్పీడ్ పూల్

క్రీడలూ చదువులో భాగమే

పతకాలు అందుకున్న క్రీడాకారులతో అతిథులు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: క్రీడలూ చదువులో భాగమేనని, ప్రతి ఒక్కరూ ఏదో ఒక క్రీడాంశంలో ప్రావీణ్యం సంపాదించాలని నున్న గ్రామీణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్ పేర్కొన్నారు. డీఎస్ఏ ఆధ్వర్యంలో ఆదివారం నున్న నుంచి గుణదల వెళ్లే బైపాస్ రోడ్డు మొదటి క్రాస్ వద్ద నిర్వహించిన శాప్ లీగ్ జిల్లా స్థాయి సైక్లింగ్ అండర్-18 బాలబాలికల పోటీలు, జిల్లా జట్టు ఎంపిక ప్రక్రియ ముగింపు కార్యక్రమంలో సీఐ మాట్లాడుతూ.. క్రీడల ద్వారా నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ అలవడుతాయని చెప్పారు. సబ్ ఇన్‌స్పెక్టర్లు భూక్యా సోని, ఆర్.మధుశ్రీ మాట్లాడుతూ.. చదువుతో పాటు క్రీడల్లో రాణించిన వారికి ఉన్నత విద్య, ఉద్యోగావకాశాల్లో రిజర్వేషన్లు ఉంటాయని చెప్పారు. జిల్లా క్రీడాభివృద్ధి అధికారి కాకర్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ.. జిల్లా స్థాయిలో ఎంపికైన వారు ఈ నెల 28 నుంచి జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. అండర్-18 టైమ్ ట్రయల్ బాలురు విభాగంలో డి.అమర్‌కుమార్, కె.శివమహేష్, ధనుష్‌కుమార్, డి.ధ్రువ, బాలికల్లో సిమ్రాన్, పి.స్నేహలత, బాలురు మాస్ స్టార్ట్‌లో పి.యశ్వంత్‌కుమార్, జి.సిద్ధు, హేమంత్‌సాయి, కె.నాగహర్ష, బాలికల్లో హారిక, పి.స్నేహ జిల్లా జట్లలో స్థానం సాధించారు. ఎస్ఐలు ఆర్.మధుశ్రీ, జె.కృష్ణ, డీఎస్‌డీవో కాకర్ల కోటేశ్వరరావు, శాప్ కోచ్ కె.కనకారావు, కె.సుగుణరావు, టి.శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

(c) eenadu

నందిగామ

• నందిగామ • జగ్గయ్యపేట

జనఔషధి దుకాణం ప్రారంభిస్తున్న విప్ సౌమ్య

తక్కువ ధరకు నాణ్యమైన జనరిక్ మందులు

నందిగామ, న్యూస్‌టుడే: ప్రధాన మంత్రి భారతీయ జనఔషధి కేంద్రం ద్వారా తక్కువ ధరలకు నాణ్యమైన మందులు అందుబాటులో ఉన్నాయని ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య తెలిపారు. ఆదివారం నందిగామలోని ప్రభుత్వ వైద్యశాల రోడ్డులో జనఔషధి దుకాణాన్ని ఆమె ప్రారంభించారు. విప్ సౌమ్య మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని మార్కెట్ ధరలు కంటే తక్కువకు జనరిక్ మందులు అందించేందుకు ఈ దుకాణం ఏర్పాటు చేశారన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి, యార్డు వైస్ ఛైర్మన్ అమ్మినేని జ్వాలాప్రసాద్, ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ ఛైర్మన్ వేపూరి నాగేశ్వరరావు, తెదేపా పట్టణ అధ్యక్షుడు ఏచూరి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
జగ్గయ్యపేట: 8008 574714, నందిగామ: 8008 574713

స్పందన: ★ నందిగామలో ప్రధాన వీధుల్లో చెత్త డబ్బాలు వద్ద అపరిశుభ్రంగా ఉంటోందని, దుర్గంధం వస్తోందని స్థానికులు మున్సిపల్ కమిషనర్ లోవరాజు దృష్టికి తీసుకురాగా ఆయన స్పందించారు. పారిశుద్ధ్య కార్మికులతో శుభ్రం చేయిస్తున్నారు. స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ★ స్థానిక రెండు, ఆరు వార్డుల్లో డ్రెయిన్లు అధ్వానంగా ఉన్నాయని స్థానికులు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి కార్మికులతో శుభ్రం చేయించారు. ★ స్థానిక విజయా టాకీస్ వద్ద చెత్త కుప్పలు పేరుకుని స్థానికులు ఇబ్బందిపడుతున్న విషయాన్ని మున్సిపల్ ఛైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి దృష్టికి తీసుకు రాగా వెంటనే చెత్త తొలగించి శుభ్రం చేయించారు. ★ పట్టణంలో ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉండడం వల్ల స్థానికులు ఇబ్బందిపడుతున్నారని పలువురు సీఐ వైవీఎల్ నాయుడు దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించారు. ప్రధాన రోడ్డుపై స్పీడ్ బ్రేకర్లు, ముఖ్యమైన ప్రాంతాల్లో డివైడర్లు ఏర్పాటు చేయడానికి ఏర్పాట్లు చేశారు. - న్యూస్‌టుడే, నందిగామ

ఒకటో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నందిగామ గ్రామీణం: 2026-27 విద్యా సంవత్సరానికి ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటో తరగతిలో ప్రవేశాలకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభించారని, అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో-2 ఎం.పద్మ ఆదివారం కోరారు. విద్యా హక్కుచట్టం-2009 ప్రకారం ఒకటో తరగతిలో ప్రవేశాలకు మార్చి 10 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారని చెప్పారు. మార్చి 25న లాటరీ, ఏప్రిల్ 13 నుంచి 23 వరకు ప్రవేశాల నిర్ధారణ చేస్తారని అన్నారు. అనాథలు, హెచ్ఐవీ బాధితుల పిల్లలు, దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు దీనికి అర్హులన్నారు. తల్లిదండ్రుల వార్షికాదాయం గ్రామీణ ప్రాంతంలో రూ.1.20 లక్షలు, పట్టణ ప్రాంతంలో రూ.1.44 లక్షలు లోపు ఉండాలన్నారు. అవసరమైన ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఇతర వివరాలకు హెల్ప్‌లైన్ నంబరు(టోల్‌ఫ్రీ) -1800-4258-599ను ఉదయం 9 నుంచి సాయంత్రం 6గంటల లోపు సంప్రదించాలని సూచించారు. గ్రామ సచివాలయాలు, ఎంఈవో కార్యాలయాలు, మీసేవ కేంద్రాల్లో దీనికి సంబంధించిన వెబ్‌సైట్‌లో నమోదు చేయించుకోవాలని తెలిపారు.

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

నందిగామ గ్రామీణం: ఈ నెల 23 నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లు చేశారు. స్థానిక కేవీఆర్, చైతన్య తదితర కళాశాలల్లో ఏడు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రథమ సంవత్సరం 2372 మంది, ద్వితీయ ఏడాది 2241 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉంది. పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తారు. నందిగామ కేవీఆర్ కళాశాలలో ప్రథమ ఇంటర్ విద్యార్థులు 253 మంది పరీక్షలు రాయనున్నారు. పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాలు, ఫ్యాన్లు, బల్లలు, తాగునీరువంటి సౌకర్యాలు కల్పించామని కళాశాల ప్రిన్సిపల్ పి.రాయప్ప తెలిపారు.

కంచికచర్ల, న్యూస్‌టుడే: కంచికచర్లలో ఎన్టీఆర్ ప్రభుత్వ, ఇమ్మాక్యులేట్, దీక్షా, అక్షర జూనియర్ కళాశాలలో నాలుగు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు కస్టోడియన్ అధికారి యు.వాసుదేవరావు తెలిపారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రంలోకి అనుమతించేది లేదని స్పష్టం చేశారు.

గొంతు తడవడం కష్టమే.. నందిగామలో దాహం కేకలు

నందిగామ, న్యూస్‌టుడే

వేసవి రాకముందే నందిగామ పట్టణంలో దాహం కేకలు వినిపిస్తున్నాయి. ఇప్పుడే ఇలా ఉంటే రానున్న రెండు నెలలు తాగునీటి ఎద్దడి ఏ స్థాయిలో ఉంటుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పట్టణానికి పక్కనే మునేరు ఉన్నా సక్రమంగా సాగునీరు సరఫరా కాని దుస్థితి నెలకొంది. పురపాలక సంఘం అధికారులు, పాలకులు ఐదారురోజులకోసారి కూడా నీరందించలేకపోతున్నారు. దీంతో ప్రజలు తాగునీటికి అలమటిస్తున్నారు.

మున్సిపాలిటీ పరిధిలో నందిగామతో పాటు అనాసాగరం, హనుమంతుపాలెం ప్రాంతాల పరిధి 20 వార్డుల్లో 55 వేల మంది జనాభా నివసిస్తున్నారు. కొత్త మునేరు, కీసర రక్షిత మంచినీటి పథకాలు, కృష్ణా నది నుంచి ఆర్‌డబ్ల్యూఎస్ పథకం నుంచి పట్టణానికి నీరు సరఫరా అవుతుంది. చందర్లపాడు మండలం కాసరబాడు వద్ద కృష్ణా నదిపై స్కీం మోటార్లకు మరమ్మతులకు గురవడం వల్ల సరఫరాలో ఆటంకం కలిగింది. అదే విధంగా కొత్త మునేరు పథకంలో మూడు బోర్లలో రెండు మాత్రమే పనిచేస్తున్నాయి. మరో బోరు మోటార్ల రిపేర్లతో ఆగింది. దీంతో సమస్య తీవ్రరూపం దాల్చింది. రోజూ కనీసం ఏడు ఎంఎల్‌డీ తాగునీరు వస్తేనే అన్ని ప్రాంతాలకు సరఫరా అవుతుంది. ఇప్పుడు కేవలం 2.5 ఎంఎల్‌డీ మాత్రమే సరఫరా అవుతోంది. దీనివల్ల వారం రోజులకోసారి ఇవ్వడం గగనంగా మారింది. కొన్ని ప్రాంతాలకు పది రోజులకోసారి కూడా నీరు రాకపోవడంతో ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. దీనివల్ల అనాసాగరం, కృష్ణబలిజనగర్, రైతుపేట డౌన్, చెరువు బజారు, బీసీ కాలనీ, డీవీఆర్ కాలనీ తదితర ప్రాంతాల ప్రజలు ఇబ్బందిపడుతున్నారు.

ద్విచక్ర వాహనాలు.. సైకిళ్లతో వచ్చి..

పట్టణంలో ప్రధాన రక్షిత మంచినీటి పథకం కుళాయి వద్దకు వచ్చి డబ్బాల్లో తాగునీటిని పట్టుకెళ్తున్నారు. రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో వేర్వేరు ప్రాంతాలకు చెందిన ప్రజలు ద్విచక్ర వాహనాలు, సైకిళ్లపై వచ్చి క్యాన్లలో నీటిని తీసుకెళ్లడానికి ఇబ్బందిపడుతున్నారు. తమ ప్రాంతానికి తాగునీరు ఇవ్వట్లేదని వాపోతున్నారు. మరికొంత మంది 20 లీటర్ల మినరల్ వాటర్ క్యాన్లు కొనుగోలు చేసుకుంటున్నారు. కొన్ని ప్రాంతాలకు అరకొరగా ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నారు.

ట్యాంకు వద్ద నీరు పట్టుకుంటున్న స్థానికులు

మోటార్లకు మరమ్మతులు: ఏఈ

ఈ సమస్యపై మున్సిపల్ ఏఈ పణిశ్రీనివాసరావు మాట్లాడుతూ మోటార్లకు మరమ్మతులు చేయిస్తున్నామని తెలిపారు. అవసరమైన ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నామన్నారు. కృష్ణా నది నుంచి నీరు రాకపోవడం ఇబ్బందికరంగా ఉందని పేర్కొన్నారు.

అమరజీవి విగ్రహ ఏర్పాటుకు సహకారం అందించండి

కరపత్రాలు ప్రదర్శిస్తున్న ఆర్యవైశ్య సంఘ నాయకులు

నందిగామ, న్యూస్‌టుడే: నవ్యాంధ్ర రాజధాని అమరావతిలో అమరజీవి పొట్టి శ్రీరాములు 58 అడుగుల కాంస్య విగ్రహ నిర్మాణానికి సహకారం అందించాలని ఆర్యవైశ్య సంఘ నాయకుడు పారేపల్లి సాయిబాబు విజ్ఞప్తి చేశారు. ఆదివారం స్థానిక శ్రీనివాస ఆర్యవైశ్య కల్యాణ మండపంలో సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ డూండీ రాకేష్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం పొట్టి శ్రీరాములు విగ్రహ నిర్మాణానికి శ్రీకారం చుట్టిందన్నారు. మూడు దశల్లో నిర్మించనున్న నిర్మాణంలో అంతా భాగస్వాములు కావాలని కోరారు. తమవంతుగా విగ్రహ నిర్మాణానికి అంగుళానికి రూ.5116 విరాళం ఇవ్వాలని కోరారు. కుల, మత, ప్రాంతాలు, వర్గాలకు అతీతంగా అందరూ సహకరించి వేగంగా విగ్రహ నిర్మాణం పూర్తయ్యేందుకు సహకరించాలని సాయిబాబు కోరారు. సంఘ నాయకులు మహంకాళి కోటి, కొత్త బాలప్రసాద్, పబ్బతి జగన్నాథరావు, అగ్గిరి కృష్ణమూర్తి, పబ్బతి కిషోర్, దివ్వెల వీరభద్రరావు, చల్లా గాంధీ, కేతేపల్లి సత్యంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై దృష్టి పెట్టండి

జగ్గయ్యపేట గ్రామీణం: ప్రతి ఒక్కరిలో ఆనందం, వినోదంతో పాటు ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించేందుకు పట్టణంలో హ్యాపీ సండే కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య పాల్గొని వ్యాయామం చేస్తూ ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ ఛైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, కమిషనర్ వెంకటకృష్ణయ్య, సచివాలయ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

24న దుర్గామల్లేశ్వరస్వామి వార్షికోత్సవం

జగ్గయ్యపేట గ్రామీణం: పట్టణంలోని దుర్గామల్లేశ్వరస్వామి వార్షికోత్సవం 24న నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రైవేట్ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చన, రుద్ర, చండీ, మూలమంత్ర సహిత రాజశ్యామల నవగ్రహ హోమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

భాగవత సప్తాహం

జగ్గయ్యపేట గ్రామీణం: బలుసుపాడు రోడ్డులోని వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఈనెల 24 నుంచి మార్చి 2 వరకు భాగవత సప్తాహం నిర్వహించనున్నట్లు భగవద్రామానుజ గోష్ఠి ప్రతినిధులు తెలిపారు. రోజూ సాయంత్రం 6 నుంచి తట్ట రంగరామానుజాచార్యులు పారాయణం చేస్తారన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం

జగ్గయ్యపేట గ్రామీణం: తిరుమలగిరి వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో నిత్యాన్నదానానికి నందిగామ మండలం హనుమంతపాలెం గ్రామానికి చెందిన తేజస్వి, శ్రీహర్షలు రూ.25 వేల విరాళాన్ని అందజేశారు.

దాత వితరణతో ఫంక్షన్ హాల్ నిర్మాణం

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని జొన్నలగడ్డ భూలాంజనేయస్వామి సమేత రామలింగేశ్వరస్వామి దేవాలయంలో దాత సహకారంతో నిర్మించిన ఫంక్షన్ హాల్‌ను ఆదివారం ప్రారంభించారు. దాత వేములపల్లి లక్ష్మణచౌదరి తన సొంత నిధులు రూ.12 లక్షలు విరాళంగా ఇవ్వడంతో 500 మందికి భోజనాలు ఏర్పాటు చేసుకునేలా హాల్ నిర్మించారు. దీనిని దాతతో పాటు సర్పంచి లగడపాటి పుష్పరేణి, గ్రామ తెదేపా నాయకుడు బాబీలు ప్రారంభించారు. దేవాలయానికి మరో రూ.3 లక్షలు విరాళంగా ఇస్తానని దాత హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా దాతను సన్మానించారు. గ్రామ నాయకులు పోలేపల్లి ప్రసాద్, బోయపాటి నరేంద్ర, పూర్ల రమేష్, గింజుపల్లి నరసింహారావు, లగడపాటి శ్రీనివాసరావు, కొల్లి పూర్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభోత్సవంలో దాత లక్ష్మణ చౌదరి, బాబి తదితరులు

సిలువగిరి తిరునాళ్లలో స్వస్థతా ప్రార్థనలు

ప్రసంగిస్తున్న ఫాదర్ ఫిలోమెన్‌రాజు

కార్యక్రమంలో పాల్గొన్న విశ్వాసులు

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: పల్లగిరి శివారు సిలువగిరి తిరునాళ్లకు ఆదివారం రాత్రి విశ్వాసులు భారీగా తరలివచ్చారు. మంగళగిరి డివైన్‌మెర్సీ ధ్యానాశ్రమానికి చెందిన రెవరెండ్ ఫాదర్ జేసన్, స్థానిక సిలువగిరి విచారణ ఫాదర్ ఎం.ఫిలోమెన్‌రాజు క్రీస్తు సువార్త స్వస్థత ప్రార్థనలు, సమష్టి దివ్యబలిపూజ నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల విశ్వాసులు, ఉపవాసదీక్షలు ఆచరిస్తున్న వారు ప్రార్థనలు చేశారు. రామిరెడ్డిపల్లి గాయక బృందం క్రైస్తవ భక్తి గీతాలు ఆలపించింది. కమ్మవారిపాలెం విశ్వాసులు మేరీమాత కోలాటం ప్రదర్శించారు. వెల్లటూరుకు చెందిన కళాకారులు యోసేబు విజయం నాటకం ప్రదర్శించారు. ఆర్సీఎం సంఘ పెద్దలు పి.ఆంథోనిరాజు, బి.మరియన్న, కె.పెద్దమరియన్న, సిలువగిరి సిస్టర్స్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై స్పందించరేం?

నందిగామ, న్యూస్‌టుడే: నందిగామ మున్సిపాలిటీ పరిధిలో ప్రజా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో నాయకులు, ప్రజలు నిరసన తెలిపారు. ఆదివారం పార్టీ నాయకులు పట్టణంలోని పలు వార్డుల్లో పర్యటించారు. అనాసాగరంలో అసంపూర్తిగా ఉన్న రక్షిత మంచినీటి ట్యాంకు నిర్మాణాన్ని పరిశీలించారు. గత రెండేళ్లుగా పనులు పూర్తి చేయకపోవడంపై నిరసన తెలిపారు. వెంటనే ట్యాంకు నిర్మాణాన్ని పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక 16వ వార్డులో సిమెంట్ రోడ్లు, డ్రెయిన్లు నిర్మించాలని కోరారు. ఖాళీ స్థలాల్లో మురుగునీరు నిల్వ ఉండడం వల్ల దుర్గంధం వస్తోందని తెలిపారు. సీపీఎం జిల్లా నాయకుడు కోట కల్యాణ్ మాట్లాడుతూ అనాసాగరంలో రోజూ తాగునీటిని సరఫరా చేయాలని కోరారు. జాతీయ రహదారి విస్తరణ వల్ల గృహాలు, భూములు కోల్పోయిన బాధితులకు నష్టపరిహారం పంపిణీ చేయాలన్నారు. పార్టీ మండల కార్యదర్శి కటారపు గోపాల్, నాయకులు సయ్యద్ ఖాసిం, కర్ర వెంకటేశ్వరరావు, గోపీనాయక్, రవిశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తి ట్యాంకు వద్ద సీపీఎం నాయకుల నిరసన

గిరిజనుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి



కార్యక్రమంలో పాల్గొన్న శ్రీరాం తాతయ్య, నెట్టెం రఘురాం

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో నియోజకవర్గ ఎస్టీ నాయకులు హుస్సేన్ నాయక్, ఎల్.కుసుమలత ఆధ్వర్యంలో సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతిని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, కేడీసీసీ బ్యాంకు ఛైర్మన్ నెట్టెం రఘురాం, రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు మూడావతు దారునాయక్, మార్కెట్ యార్డు ఛైర్మన్ మల్లెల సీతమ్మ ముఖ్య అతిథులుగా పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజనుల అభ్యున్నతి కోసం కూటమి ప్రభుత్వం పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో రహదారులు, విద్య, వైద్య సదుపాయాలు, గిరిజన గురుకుల పాఠశాలల బలోపేతం, ఉపాధి అవకాశాల కల్పన, భూస్వామ్య హక్కుల పరిరక్షణ వంటి అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. కార్యక్రమంలో నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పేదల గూడు.. పిచ్చిమొక్కలు చూడు

మండల పరిధి జుజ్జూరులోని చిన్నడొంకకు వెళ్లే మార్గంలోని జగనన్న కాలనీలోని దుస్థితి ఇది. గత వైకాపా హయాంలో గ్రామానికి దూరంగా ఇళ్ల స్థలాలు కేటాయించారు. అప్పటి ప్రభుత్వం సరైన వసరులు కల్పించకపోవడంతో లబ్ధిదారులు పునాది దశలోనే నిర్మాణాన్ని ఆపివేశారు. దీంతో ఆ కాలనీలో పిచ్చి చెట్లు దట్టం పెరిగి దర్శనమిస్తున్నాయి.

- న్యూస్‌టుడే, జుజ్జూరు(వీరులపాడు)

తెలుగు వీరుడు హనుమంతుకు నివాళి

నందిగామ, న్యూస్‌టుడే: నందిగామలో స్వాతంత్ర్య సమరయోధుడు, తెలుగు వీరుడు పల్నాటి కన్నెకంటి హనుమంతు 104వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. స్థానిక బళ్లారి రాఘవా కళా సమితి కార్యాలయంలో ఆదివారం సంఘ అధ్యక్షుడు బబ్బెళ్లపాటి గోపాలకృష్ణసాయి ఆధ్వర్యంలో హనుమంతు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గోపాలకృష్ణసాయి మాట్లాడుతూ బ్రిటిష్ పాలకులు పల్నాటి ప్రాంత రైతులను పుల్లరి చెల్లించాలని ఇబ్బందులకు గురిచేశారన్నారు. ఈ సమయంలో రైతులకు అండగా ఉండి పుల్లరి వ్యతిరేక ఉద్యమాన్ని హనుమంతు నడిపించారని కొనియాడారు. అనంతరం ఆయన బ్రిటిష్ వారి తూటాలకు బలైపోయారని చెప్పారు. కళాకారులు రాపోలు వెంకటేశ్వరరావు, రాయిడి నాగేశ్వరరావు, చింతోటి ఘంటయ్య, షేక్ జానీ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న గోపాలకృష్ణసాయి

అంతర్గత రహదారులకు మహర్దశ

పల్లె పండగ-2.0లో సీసీ రోడ్లకు రూ.13.62 కోట్లు మంజూరు

నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాలకు మేలు

కంచికచర్ల, వత్సవాయి, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వ అస్తవ్యస్త విధానాలతో గ్రామాల ప్రగతి కుంటుపడింది. ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రోడ్ల పరిస్థితి దారుణంగా మారింది. నాడు కనీస మరమ్మతులకు కూడా నోచుకోలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత రోడ్ల అభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపింది. ఇందులో భాగంగా గత ఏడాది 'పల్లె పండగ' పేరుతో గ్రామాల్లో అంతర్గత రహదారుల అభివృద్ధికి నిధులు మంజూరు చేయడంతో పలుచోట్ల పనులు పూర్తయ్యాయి. తాజాగా కూటమి ప్రభుత్వం పల్లె పండగ 2.0 కింద నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లో మరిన్ని సీసీ రోడ్ల అభివృద్ధికి రూ.13.62 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో ఈ రెండు నియోజకవర్గాల్లో 107 అంతర్గత సీసీ రహదారులు అభివృద్ధి చేయనున్నారు.

ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించనున్న ఈ రహదారులకు నందిగామ నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల్లో మొత్తం 62 పనులను గుర్తించారు. వీటి కోసం రూ.7.9 కోట్లతో అంచనాలు రూపొందించిన అధికారులు ఈ పనులను త్వరలోనే మొదలు పెట్టేందుకు సన్నాహాలు చేపట్టారు. ఇవి త్వరితగతిన పూర్తి చేయాలనే ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా అధికారులు చర్యలు చేపడుతున్నారు.

వత్సవాయి: వేములనర్వలో అభివృద్ధి చేయనున్న దారి

★ జగ్గయ్యపేట నియోజకవర్గ పరిధిలోని మూడు మండలాల్లో మొత్తం 45 పనులు గుర్తించిన అధికారులు.. వాటి అభివృద్ధికి మొత్తం రూ.5.72 కోట్లతో అంచనాలు రూపొందించారు. ఈ పనులకు త్వరలోనే శంకుస్థాపన చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. పల్లె పండగ 2.0 కింద రెండో విడతలో నిధులు మంజూరు చేయడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజలకు తీరనున్న కష్టాలు

★ కంచికచర్ల మండలం చెవిటికల్లులో రూ.12.3 లక్షలతో సీసీ రహదారి నిర్మించనున్నారు. వీరులపాడు మండలం వెల్లంకిలో గత ఏడాది వెల్లంకి నుంచి జుజ్జూరు వరకు నిర్మించిన బీటీ రహదారికి అనుసంధానంగా వెల్లంకిలో రూ.23.50 లక్షలతో సీసీ రోడ్డు నిర్మించనున్నారు. ఇదే మండలం దొడ్డదేవరపాడులో రూ.24.50 లక్షలు, నందలూరులో రూ.22 లక్షల నిధులతో సీసీ రహదారులు నిర్మించనున్నారు. ఈ పనులు సత్వరమే చేపట్టి పూర్తి చేస్తే గత కొన్నేళ్లుగా ప్రజలు పడుతున్న ఇబ్బందులు గట్టెక్కనున్నాయి.

డ్రగ్స్ రహిత రాష్ట్రమే ప్రభుత్వ ధ్యేయం

సైకిల్ తొక్కుతున్న ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, డీసీపీ లక్ష్మీనారాయణ, సీఐ వెంకటేశ్వర్లు తదితరులు

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: విజయవాడలో డ్రగ్స్‌పై దండయాత్ర పేరుతో అయిదు గురు మహిళా పోలీసులు ప్రారంభించిన సైకిల్ యాత్ర ఆదివారం జగ్గయ్యపేట నియోజకవర్గంలోని చిల్లకల్లు గ్రామానికి చేరుకుంది. ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, డీసీపీ లక్ష్మీనారాయణ, సీఐ వెంకటేశ్వర్లు వారికి స్వాగతం పలికి సైకిల్ ర్యాలీలో పాల్గొన్నారు. విద్యార్థులు, యువత, ప్రజలు, పెద్ద సంఖ్యలో పాల్గొని నినాదాలు చేస్తూ ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డ్రగ్స్ రహిత రాష్ట్రమే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని తెలిపారు. పోలీసు ఉద్యోగం గొప్ప బాధ్యతని ఈ దండయాత్ర ద్వారా నిరూపించారని కొనియాడారు. డీసీపీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ డ్రగ్స్ మాఫియాకు సమాజంలో స్థానం లేదని.. గంజాయి, మాదకద్రవ్యాల విక్రయాలపై తీవ్ర చర్యలు తీసుకుంటామన్నారు. 'డ్రగ్స్‌కు నో చెప్పండి-జీవితానికి ఎస్ చెప్పండి' నినాదంతో ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమంలో ఎస్ఐలు సూర్యశ్రీనివాస్, మణికంఠ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి అబాకస్ పోటీల్లో ప్రతిభ

బహుమతులు అందుకున్న విద్యార్థులతో పాఠశాల యాజమాన్యం

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: ఏలూరులో ఏపీ మెమరీ మ్యాథ్స్ అకాడమీ నిర్వహించిన రాష్ట్ర స్థాయి అబాకస్ పోటీల్లో నందిగామ కాకతీయ అపోలో పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారని పాఠశాల ఛైర్మన్ కాపా రవీంద్రనాథ్ ఆదివారం తెలిపారు. వేదిక్ ఇంటిగ్రేటెడ్ మ్యాథ్స్ సీనియర్ విభాగంలో కె.చిన్నికోటేశ్వరి(ప్రథమ, తొమ్మిదో తరగతి), అబాకస్ లెవెల్-1లో కార్తీక్(నాలుగో తరగతి) ద్వితీయ స్థానం, షేక్ అక్మల్(ఆరో తరగతి) తృతీయ, వి.అమృత(మూడో తరగతి) మొదటి బహుమతి, అబాకస్ లెవెల్-2లో ఎన్.గౌరీనాథ్(ఆరో తరగతి), డి.పరశురామ్(ఏడో తరగతి), జి.అఖిలేశ్వర్(ఏడో తరగతి) ప్రత్యేక బహుమతులను కాకినాడ ఎస్పీ సింగంపల్లి శ్రీనివాసరావు, తెలుగు రాష్ట్రాల మెమరీ మ్యాథ్స్ అకాడమీ ఛైర్మన్ చెరుకూరి వెంకటేశ్వరరావు, ఏపీ ఛైర్మన్ కృష్ణమోహన్ చేతుల మీదుగా అందుకున్నారు. వీరిని పాఠశాల వైస్ ఛైర్మన్ భారతి, కాకతీయ సీబీఎస్ఈ పాఠశాల డైరెక్టర్లు కార్తికేయ, సుష్మాంజలి, దిక్లవర్ నెస్ట్ స్కూల్ డైరెక్టర్ స్ఫూర్తి అభినందించారు.

ఫిర్యాదు చేస్తే.. కేసులు పెడతారా..!

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: ముక్త్యాల గ్రామ పంచాయతీలో అవినీతి జరిగిందని ఫిర్యాదు చేసిన వైకాపా నాయకులపై గ్రామ తెదేపా సర్పంచి భర్త ఉమ్మర్ అనుచరులు అక్రమంగా దాడులు చేసి కేసులు పెట్టడం తగదని వైకాపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి తన్నీరు నాగేశ్వరరావు తెలిపారు. పట్టణంలోని వైకాపా కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. గ్రామంలో రోడ్ల అభివృద్ధి చేయమని వైకాపా నాయకులు పలుసార్లు అడిగినా వాటికి నిధులు లేవని బుకాయించారన్నారు. వైకాపా నాయకుల ఫిర్యాదుతో స్పందించిన అధికారులు విచారణ జరిపి సర్పంచి, పంచాయతీ కార్యదర్శులు రూ.2.90 కోట్లు దుర్వినియోగం చేశారని తేల్చారన్నారు. దీంతో సర్పంచి అనుచరులు... వైకాపా నాయకులు, కార్యకర్తలు, మహిళలపై దాడులు చేయడం దారుణమన్నారు.

'నా భర్తకు ప్రాణహాని'

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: తన భర్త షేక్ ఉమ్మర్‌కు వైకాపా గ్రామ నాయకుడు షేక్ నాగుల్‌మీరా నుంచి ప్రాణహాని ఉందని ముక్త్యాల గ్రామ సర్పంచి షేక్ హస్మాతున్ పేర్కొన్నారు. రెండు రోజుల కిందట నాగుల్‌మీరా అనుచరుల పుట్టినరోజు పేరుతో తెదేపా నాయకులపై కవ్వింపు చర్యలకు పాల్పడి తన భర్తపై దాడి చేశారని తెలిపారు. ఆదివారం వైకాపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి తన్నీరు నాగేశ్వరరావు మాట్లాడిన విషయంపై ఆమె తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. వైకాపా నాయకులు గ్రామంలో అవినీతి జరిగిందంటూ ఆరోపణలు చేయడం మానుకోవాలని ఆమె పేర్కొన్నారు. గ్రామాభివృద్ధి దిశగా వెళ్తున్న మమ్మల్ని ఇబ్బందులు పెట్టడం సరికాదన్నారు.

పలువురిపై కేసు నమోదు

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని ముక్త్యాల గ్రామంలో ఈ నెల 18న జరిగిన ఘర్షణలో పోలీసులు నలుగురిపై కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ముస్లింలు షేక్ అల్లాభక్షు పుట్టినరోజు వేడుకల్లో బాణసంచా కాల్చుతున్న సమయంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. గ్రామ సర్పంచి భర్త ఉమ్మర్ ఫిర్యాదుపై నాగుల్‌మీరా, బాజీబాబా, అక్బర్, షేక్ లాలుపై శనివారం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

దయనీయస్థితి.. ఆదుకోవాలని వినతి

వైకల్యంతో మంచంలోనే వెంకటేశ్వర్లు

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: పెనుగంచిప్రోలు రామాలయం సెంటర్‌కు చెందిన 74 సంవత్సరాల కంభం వెంకటేశ్వర్లు పక్షవాతంతో మంచాన పడ్డారు. 30 ఏళ్ల కిందటే భార్య మృతి చెందారు. నలుగురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు కాగా.. అందరికీ వివాహాలై వేర్వేరు చోట్ల ఉంటున్నారు. పూర్తి వైకల్యంతో మంచాన పడ్డ తండ్రికి పెద్ద కుమారుడు గోపి ఆసరాగా ఉంటున్నాడు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం ఇచ్చే పింఛన్ నగదు. రోజువారీ మందులు, కుటుంబ ఖర్చులకు సరిపోక ఇబ్బందులు పడుతున్నారు. రూ.15 వేల పింఛను మంజూరు చేయాలని కొన్నేళ్లుగా కోరుతున్నా ఫలితం ఉండట్లేదు. స్థానిక ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య వెంకటేశ్వర్లు పరిస్థితి చూసి పూర్తి పింఛన్ ఇవ్వాలని లేఖ అందించారు. కంటి చూపు సరిగా లేక ఎక్కడికీ వెళ్లలేకపోతున్నారు. మధుమేహం, రక్తపోటు, ఇతర అనారోగ్య సమస్యలతో జీవనం భారంగా మారిందని, ప్రభుత్వం రూ.15 వేలు పింఛన్ అందించడంతో పాటు ఆదుకోవాలని వెంకటేశ్వర్లు కోరుతున్నారు.

కోడెదూడలతో తిరుపతమ్మ రథోత్సవం

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: స్థానిక తిరుపతమ్మ అమ్మవారి గోశాల కోడె దూడలతో రథోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి భక్తులు సమర్పించిన గోవులను గోశాలలో సంరక్షిస్తున్నారు. ఆలయంలో అమ్మవారి విగ్రహాలతో రథోత్సవాన్ని నిర్వహిస్తుంటారు. దీనిలో భాగంగా తొలిసారి కోడెదూడలను రథానికి కట్టి ముందుకు నడిపించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారికి పాల పొంగళ్లు, మొక్కుబడులు సమర్పించారు.

శ్రద్ధాంజలి

కల్మషమెరుగని మంచి మనస్సుతో ఆప్యాయంగా పలుకరిస్తూ మాకు విద్యాబుద్ధులు నేర్పించి మా భవిష్యత్‌కి బంగారు బాటలేసిన మా మాష్టారు కీ॥శే॥ శ్రీ తాడేపల్లి రామారావు గారి మరణం మాకు తీరని లోటు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ.. బాధాతప్త హృదయాలతో.. మీ

కీ॥శే॥ శ్రీ తాడేపల్లి రామారావు గారు
Rtd. టీచర్ S.A.(సోషల్)
శ్రీ కాకాని వెంకటరత్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పెనుగంచిప్రోలు

పెద్దకర్మ: ది. 23-02-2026 సోమవారం హైదరాబాద్, హయత్‌నగర్ వారి స్వగృహము నందు జరుగును.

1979-80 10వ తరగతి పూర్వ విద్యార్థినీ విద్యార్థులు
శ్రీ కాకాని వెంకటరత్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పెనుగంచిప్రోలు, NTR జిల్లా

విజయవాడ పశ్చిమ

శాస్త్రోక్తంగా సూర్యోపాసన పూజ

విజయవాడ వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై ఆదివారం సూర్యోపాసన పూజలను అత్యంత వైభవంగా నిర్వహించారు. వైదిక క్రతువు, ఆలయ వైదిక కమిటీ, వేదపండితులు అత్యున్నత స్థాయిలో ఈ పూజ జరిపించారు. లోకకల్యాణం, భక్తులకు ఆరోగ్యప్రాప్తి కోసం ఈ పూజను నిర్వహిస్తున్నామని వివరించారు. ఆలయ ఈఓ వీకే శీనానాయక్ పూజలో పాల్గొన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం, జోనల్ కార్యాలయాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం నిర్వహిస్తున్నట్లు వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. నగర పరిధిలో నివాసం ఉండే ప్రజలు వారు ఎదుర్కొంటున్న సమస్యలను ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు లిఖితపూర్వకంగా తెలియజేయవచ్చని పేర్కొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

విజయవాడ వన్‌టౌన్ : 90320 99986

? చిట్టినగర్ మట్టా లాజరస్ పాఠశాల ఆవరణలో కాలువలో పూడిక పేరుకుంది. - **రాజేంద్ర, స్థానికుడు** ✔ పూడిక తీసేందుకు చర్యలు తీసుకుంటాం. -**కృష్ణ, స్థానిక శానిటరీ అధికారి**

? గొల్లపాలెం గట్టు క్వారీ సెంటర్ ప్రాంతంలో కుక్కల బెడద అధికంగా ఉంది. - **రవికృష్ణ, స్థానికుడు** ✔ వాటిని పట్టేందుకు చర్యలు తీసుకుంటాం. - **సోమశేఖర్, అసిస్టెంట్ వెటర్నరీ విభాగం అధికారి - విజయవాడ వన్‌టౌన్, న్యూస్‌టుడే**

స్పందన: పంజా సెంటర్ బీఆర్పీ రోడ్డులో కుక్కలు విపరీతంగా ఉన్నాయని స్థానికులు మేమున్నాం మీకు తోడుగాకు సమాచారం ఇచ్చారు. దీనిపై ఆదివారం వార్త ప్రచురితమైంది. స్పందించిన వెటర్నరీ విభాగం అధికారులు సిబ్బందితో వాటిని పట్టించి తరలించారు. **విజయవాడ వన్‌టౌన్, న్యూస్‌టుడే**

రూ.లక్షలు వెచ్చించి.. లక్షణంగా వదిలేసి..

భవానీపురం, న్యూస్‌టుడే

భవానీపురం బాలభాస్కర్‌నగర్‌లో ఉన్న రైతుభరోసా కేంద్రం నిరుపయోగంగా మారింది. నాలుగు దశాబ్దాల కిందట భవానీపురం ప్రాంతం గ్రామంగా ఉన్న సమయంలో పంట పొలాలు ఉండేవి. దీంతో భవానీపురం, గొల్లపూడి, విద్యాధరపురం, తదితర గ్రామాల వారికి ఉపయోగంగా వ్యవసాయ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. అక్కడే రైతులకు అధికారులు అందుబాటులో ఉంటూ సేవలు అందించేవారు. రైతులకు అవసరమైన ఎరువులు, పురుగు మందులను సైతం పంపిణీ చేసేవారు. ఆపై భవానీపురం ప్రాంతాన్ని విజయవాడ నగరపాలక సంస్థలో విలీనం చేశారు. పంట పొలాలు తగ్గిపోయాయి. ఫలితంగా కార్యాలయం నిరుపయోగంగా మారింది. పిచ్చి మొక్కలు, చెత్త, వ్యర్థాలతో అధ్వానంగా తయారైంది.

నిధులు వెచ్చించినా...

గత వైకాపా ప్రభుత్వ హయాంలో నిధులను కేటాయించి రైతు భరోసా కేంద్రంగా మార్చారు. కార్యాలయానికి మరమ్మతులు, రంగులు వేసి వదిలేశారు. వినియోగంలో లేకపోవడంతో కార్యాలయ ప్రాంగణం అసాంఘిక శక్తులకు అడ్డాగా మారింది. చుట్టూ ప్రహరీ కూడా లేకపోవడంతో చుట్టుపక్కల వాళ్లు ఆక్రమించుకుంటున్నారు. కొందరు సొంత అవసరాలకు ఈ కార్యాలయాన్ని వినియోగించుకుంటున్నారు. జాతీయ రహదారికి సమీపంలోనే ఉండడంతో ఆ స్థలం విలువ రూ.కోట్లలోనే ఉంటుంది. స్థలాన్ని పట్టించుకోకపోవడంతో ఆక్రమణలకు గురవుతోందని స్థానికులు చెబుతున్నారు. ★ విజయవాడ నగర పరిధిలో ఉన్న భవనం ఖాళీ స్థలంలో ఏదైనా ప్రభుత్వం కార్యాలయం నిర్మాణం చేపడితే ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుంది. ప్రస్తుతం అనేక ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. ఈ స్థలంలో సొంత భవనం నిర్మిస్తే అద్దెల భారం తప్పుతుంది.

భవానీపురంలోని రైతు భరోసా కేంద్రం

★ గతంలో కొన్నాళ్ల పాటు విజయవాడ గ్రామీణ మండలం వ్యవసాయ శాఖ అధికారి కార్యాలయాన్ని అక్కడే ఏర్పాటు చేశారు. దీంతో 14 గ్రామాలకు సంబంధించిన రైతులు వారి సమస్యలను తెలిపేందుకు ఈ కార్యాలయం వద్దకు వచ్చేవారు. రైతులతో సమావేశాలు, అవగాహన కార్యక్రమాలను సైతం నిర్వహించారు. సంబంధిత అధికారులు స్పందించి కార్యాలయం అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఆహ్లాదపరిచేలా 'హ్యాపీ సండే'

కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

భవానీపురం, న్యూస్‌టుడే: విజయవాడ నగర ప్రజలను ఆహ్లాదపరిచేలా హ్యాపీ సండే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నగరపాలక సంస్థ జోనల్ కమిషనర్ రమ్యకీర్తన పేర్కొన్నారు. విజయవాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో భవానీపురంలోని హరిత బరంపార్కులో హ్యాపీ సండే కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. రమ్యకీర్తన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి నెలా రెండు, నాలుగు ఆదివారాల్లో హ్యాపీ సండే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వాకర్స్ క్లబ్, లాఫింగ్ క్లబ్, వెల్ఫేర్ అసోసియేషన్‌లు, నగర ప్రజలు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సాంస్కృతిక, ఆరోగ్య కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సహాయ వైద్యాధికారులు అన్నపూర్ణ, సోమశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిర్మల హృదయ్ భవన్‌లో వృద్ధులతో..

నగరపాలక సంస్థ: నగరంలోని నిర్మల హృదయభవన్‌లో ఆదివారం వృద్ధులతో కలిసి హ్యాపీ సండే కార్యక్రమాన్ని నిర్వహించారు. అదనపు కమిషనర్ డి.చంద్రశేఖర్ అతిథిగా పాల్గొన్నారు. చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని ప్రతి నెలా రెండు, నాలుగు ఆదివారాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని పేర్కొన్నారు. వృద్ధులతో కేకు కోయించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వృద్ధులకు పండ్లు అందజేశారు. జోనల్ కమిషనర్ కె.ప్రభుదాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

వృద్ధులను సాంస్కృతిక కార్యక్రమాలతో అలరిస్తూ..

దొర వంశీయుల అభ్యున్నతికి కృషి చేయాలి

గాంధీనగర్, న్యూస్‌టుడే : రాష్ట్రంలో దొర వంశీయుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ దొరవంశ (దొమ్మర) సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వి.గోపాల్ కోరారు. ఆదివారం ఆయన ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 5 లక్షల మంది జనాభా కలిగిన తమ సామాజిక వర్గానికి ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. త్వరలోనే మంత్రి లోకేశ్‌ను తమకు జరుగుతున్న అన్యాయాన్ని వివరిస్తామన్నారు.

హైదరాబాద్‌కు చెందిన జె.కిషోర్ కుటుంబసభ్యులకు అమ్మవారి ప్రసాదాన్ని, చిత్రపటాన్ని అందజేస్తున్న ఆలయ అధికారులు

ఫిలింనగర్‌కు చెందిన మారుతి ఫణికాంత్ కుటుంబ సభ్యులకు చిత్రపటం అందజేస్తూ..

గన్నవరం గొడపేటకు చెందిన మోచర్ల భవానీ కుటుంబ సభ్యులకు పటం అందజేస్తూ..

నిత్యాన్నదానానికి విరాళాలు

విజయవాడ వన్‌టౌన్, న్యూస్‌టుడే: అమ్మవారి ఆలయంలో జరిగే నిత్యాన్నదాన కార్యక్రమానికి ఆదివారం పలువురు విరాళాలు అందజేశారు. హైదరాబాద్ సంజీవరెడ్డి నగర్‌లోని జె.కిషోర్ కుటుంబ సభ్యులు రూ.5 లక్షలు, విజయవాడ లయోల కళాశాల ఫిలింనగర్ ప్రాంతానికి చెందిన తన్నీరు మారుతి ఫణికాంత్ కుటుంబ సభ్యులు రూ.లక్ష, కృష్ణా జిల్లా గన్నవరం గొడపేటకు చెందిన మోచర్ల భవానీ కుటుంబ సభ్యులు రూ.1,01,116 విరాళంగా అందజేశారు. ఆలయ అధికారులు దాతలకు అమ్మవారి దర్శనం కల్పించి, ప్రసాదాల్ని, చిత్రపటాలను అందజేశారు.

బకాయిల విడుదల కోరుతూ ధర్నా

గాంధీనగర్, న్యూస్‌టుడే : ఈ నెల 27న విజయవాడలో తలపెట్టిన ధర్నాను జయప్రదం చేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) రాష్ట్ర అధ్యక్షుడు కె.భాస్కర్, కార్యదర్శి ఐ.రాజేష్ పిలుపునిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఉపకార వేతనాలు, ఫీజు రీఎంబర్స్‌మెంట్ విడుదల చేయాలని.. జీవో నంబరు 77ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేస్తున్నట్లు చెప్పారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ప్రచార పత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఫీజు రీఎంబర్స్‌మెంట్, ఉపకార వేతనాల బకాయిలు రూ.7600 కోట్లు పెండింగ్ ఉన్నాయని చెప్పారు.

జీవితంలో స్నేహితులు ఎంతో ముఖ్యం

విద్యార్థినికి బహుమతి అందిస్తున్న న్యాయమూర్తి పవన్‌కుమార్

భవానీపురం, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరి జీవితంలో స్నేహితులు ఎంతో ముఖ్యమని తెనాలి కోర్టు న్యాయమూర్తి ఆకా పవన్‌కుమార్ పేర్కొన్నారు. పింగళి వెంకయ్య మునిమనుమడు మనిపల్లి వెంకటేశ్వరరావు జ్ఞాపకార్థం ఆయన స్నేహితులు రామరాజ్యనగర్‌లోని జీఎన్ఆర్ నగరపాలక సంస్థ పాఠశాలలో ఆదివారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. న్యాయమూర్తి పవన్‌కుమార్ మాట్లాడుతూ మిత్రుడు మునిపల్లి వెంకటేశ్వరరావు కొవిడ్ సమయంలో చనిపోయారని, ఆయన్ని దక్కించుకునేందుకు స్నేహితులమంతా ఎంతో ప్రయత్నించినట్లు తెలిపారు. స్నేహితుని జ్ఞాపకార్థం విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలను నిర్వహించి బహుమతులను అందిస్తున్నట్లు వెల్లడించారు. విజేతలకు బహుమతులను అందజేశారు. తెలుగు ఉపాధ్యాయుడు ఆర్.బి.ఉదయ్‌కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు అంతర్జాతీయ సదస్సు

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: ఆంధ్రా లయోల కళాశాల వృక్ష, జంతు, సూక్ష్మ జీవ, బయోటెక్నాలజీ, ఆహార సాంకేతిక, వ్యవసాయ గ్రామీణాభివృద్ధి విభాగాల ఆధ్వర్యంలో ఈ నెల 23, 24 తేదీల్లో అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఫాదర్ మిల్కీయోర్ తెలిపారు. గోడ పత్రికను ఆదివారం ఆవిష్కరించారు. విద్యావేత్తలు, పరిశోధకులు తమ పరిశోధనలను పెంపొందించుకోవడానికి, జీవ శాస్త్రాల్లో స్థిరమైన భవిష్యత్తు ఆధారిత పద్ధతులను అన్వేషించడానికి సదస్సు దోహదపడుతుందని ఆయన తెలిపారు. అమెరికా అలబామా విశ్వవిద్యాలయం ఆచార్యుడు ఎం.ఎన్.వి.రవికుమార్ ప్రధాన వక్తగా మాట్లాడతారని చెప్పారు. ఇప్పటికే జాతీయ, అంతర్జాతీయ సంస్థల నుంచి 150కి పైగా పరిశోధన పత్రాలు వచ్చాయని, అత్యుత్తమ పరిశోధనను గుర్తించి యంగ్ సైంటిస్ట్ అవార్డు అందజేస్తామని సదస్సు కన్వీనర్ కె.బాలచంద్ర తెలిపారు.

భాజపా ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో క్విజ్ పోటీలు

భవానీపురం, న్యూస్‌టుడే: భాజపా ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో ఆదివారం విద్యార్థులకు క్విజ్ పోటీలను నిర్వహించారు. విజయవాడలోని బి.ఆర్.అంబేడ్కర్ రెసిడెన్షియల్ పాఠశాలలో మన్‌కీబాత్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఎస్సీ మోర్చా జాతీయ అధ్యక్షుడు లాల్ సింగ్ ఆర్య, జాతీయ సోషల్ మీడియా కన్వీనర్ అనిమాలు అతిథులుగా పాల్గొన్నారు. మన్‌కీ బాత్ క్విజ్ పోటీలో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. క్విజ్‌లో విజయం సాధించిన విద్యార్థులకు దిల్లీ విశ్వవిద్యాలయం, ఐఐటీ దిల్లీ, జేఎన్‌యూ, తదితర విశ్వవిద్యాలయాలను సందర్శించే అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. పార్లమెంటు, దీక్షాభూమి, తదితర చారిత్రక ప్రదేశాలను చూపిస్తామని తెలిపారు.

అలరించిన కూచిపూడి నృత్యాలు

విజయవాడ వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై మహామండపం ఆవరణలో ధర్మపథం సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరిస్తున్నాయి. ఆదివారం విజయవాడ క్యాపిటల్ అమరావతి కల్చరల్ సొసైటీ కళాకారులు నృత్యప్రదర్శన ఇచ్చారు. పీవీఎస్‌వీ ప్రసాదరావు ఆధ్వర్యంలో కళాకారులు అన్నమాచార్య సంకీర్తనలతో ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

దారికి అడ్డుగా వ్యర్థాల గుట్టలు

లంబాడీపేట అడ్డ రోడ్డులోని తోట లక్ష్మయ్య వీధిలో భవన శిథిలాలు గుట్టలుగా పడేశారు. రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. తాజ్‌నోత్ రాముల వీధిలో ర్యాంపులు, మెట్లు నిర్మాణం చేసిన సమయంలో వ్యర్థాలను గుట్టగా వేశారు. రెండు నెలలు గడుస్తున్నా వాటిని తొలగించలేదు. రోడ్డు అడ్డుగా ఉన్న శిథిలాల బస్తాలను వెంటనే తొలగించాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, చిట్టినగర్**

ధ్వంసమైన కాలువలతో ఇక్కట్లు

కొండప్రాంతంలోని చిట్టినగర్ పార్కు ఎదురు వీధిలో సాయి అరుణ పాఠశాల వెనుక కాలువ అధ్వానంగా ఉంది. టేనర్‌పేట, చిటినగర్ ఉప్పలపాటి రామచంద్రరాజు వీధి, కేవీరావునగర్ కొళ్ల ఫారం పక్కన , లంబాడీపేట అడ్డరోడ్డులో, భీమనవారిపేటలోని వీధుల్లోనూ దెబ్బతిన్న కాలువల్లో మురుగు పొంగిపొర్లి రోడ్ల మీదకు వస్తోంది. ఈ వేసవిలో మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, చిట్టినగర్**

ప్రమాదభరితంగా ఉన్నా పట్టించుకోరే..!

కేఎల్‌రావు పార్కులో బోటు షికారు కోసం నిర్మించిన నీటి కొలను గోడ కూలి ప్రమాదకరంగా మారినా పట్టించుకునే వారు లేరు. కొలను చుట్టూ ఉన్న కాంక్రీటు పగుళ్లు రావడం, దానిలోకి వర్షపు నీరు ఇంకి కొలను గోడ విరిగి పడింది. దాదాపు 7 నెలలు దాటినా మరమ్మతులు చేపట్టలేదు. కొలను చుట్టూ ఉన్న ఇనుప రెయిలింగ్ కూడా కూలిపోయే స్థితిలో ఉంది. వేసవిలో సందర్శకులు ఎక్కువగా వస్తారని ఈలోపు మరమ్మతులు చేసి ప్రమాదాలు జరగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు. **చిట్టినగర్, న్యూస్‌టుడే:**

అలరించారు!

భవానీపురం, న్యూస్‌టుడే: భవానీపురంలోని రవీంద్ర భారతి జాబిల్లి పాఠశాల విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. యూకేజీ నుంచి ఒకటో తరగతికి వెళ్తున్న విద్యార్థులతో పాఠశాల ప్రాంగణంలో ఆదివారం వేడుక నిర్వహించారు. తెలుగు, హిందీ గీతాలకు చిన్నారులు నృత్యాలు చేసి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ఆయుర్వేద వైద్యురాలు బి.సుస్మిత, పాఠశాల డైరెక్టర్లు వంశీకృష్ణ, శాంతి, తదితరులు పాల్గొన్నారు.

మహనీయుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి

నరసింహారెడ్డి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న సహాయ వైద్య అధికారి చంద్రశేఖర్, అధికారులు

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: రాయలసీమ ప్రాంతంలో బ్రిటిష వారిపై పోరాటం చేసిన ఘనత ఉయ్యాలవాడ నరసింహారెడ్డికే దక్కుతుందని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ డి.చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతిని ఆదివారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించారు. అదనపు కమిషనర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ నరసింహారెడ్డి సిపాయిల తిరుగుబాటుకు ముందే రాయలసీమలో బ్రిటిష వారికి వ్యతిరేకంగా పోరాడారని తెలిపారు. అలాంటి మహనీయుడిని స్మరించుకోవటం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. నగరపాలక సంస్థ పౌర సంబంధాల అధికారి రజియా షబీనా, నగరపాలక సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

మౌలానా సేవలు మరువలేం

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : భారతదేశపు తొలి విద్యా శాఖామంత్రిగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ చేసిన సేవలు మరువలేనివని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. ఆదివారం ఆంధ్రరత్న భవన్‌లో ఆజాద్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ఏపీసీసీ ఉపాధ్యక్షుడు వి.గురునాథం తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్య సమరయోధుల్లో ఒకరైన ఆజాద్ కవి, పండితుడని.. అరబిక్, ఇంగ్లిష్, ఉర్దూ, హిందీ, పెర్షియన్, బెంగాలీ భాషల్లో ప్రవీణుడని కొనియాడారు. ఏఐసీసీ అధ్యక్షుడిగా రెండుసార్లు ఎన్నికై పార్టీ పటిష్టతకు కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో షేక్ అన్సారీ, గౌస్, నేలపాటి సుభాష్, మండేపూడి సునీత, ప్రమీల గాంధీ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

మందులు పంపిణీ చేస్తున్న సిబ్బంది

చిట్టినగర్, న్యూస్‌టుడే: మారుతున్న జీవనశైలి వ్యాధుల ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలని ఓపెన్ హార్ట్ సోషల్ ఆర్గనైజేషన్ అండ్ చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకులు నందకిశోర్ అన్నారు. కొత్తపేట కేబీఎన్ కళాశాలలో ఆ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. కళాశాలల విద్యార్థులు, అధ్యాపకులు, ఆప్రాంత ప్రజానీకం ఈ సేవలను సద్వినియోగం చేసుకున్నారు. శిబిరంలో నాసా ఆసుపత్రి, వాసన్ ఐకేర్, లలిత డెంటల్ మల్టీ స్పెషాలిటీ, ఏఐఐ ఆసుపత్రుల వైద్య నిపుణులు తమ సేవలను ఉచితంగా అందించినట్లు వివరించారు. తమ సేవలను ఎన్టీఆర్ జిల్లా అదనపు వైద్య ఆరోగ్య శాఖాధికారి భానునాయక్ అభినందించినట్లు వివరించారు. కార్యక్రమంలో కేబీఎన్ కళాశాల ప్రిన్సిపల్ కృష్ణవేణి, ఏవో నారాయణరావు, ట్రస్టు అధ్యక్షులు తనూజరాణి తదితరులు పాల్గొన్నారు.

భవానీపురంలో..

భవానీపురం, న్యూస్‌టుడే: కొండవీడు అకాడమీ ఆధ్వర్యంలో భవానీపురం క్రాంబ్వే రహదారి వెంబడి ఉన్న కల్యాణమండపంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యులు జి.వి.రెడ్డి, సమరసింహారెడ్డి, దినేష్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, తదితరులు రోగులను పరీక్షించారు. రూ.లక్ష విలువైన మందులను అందజేశారు. కార్యక్రమంలో అకాడమి కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

మహిళను పరీక్షిస్తున్న వైద్యురాలు

ఉత్సాహంగా మిడ్ టౌన్ బ్యాడ్మింటన్ లీగ్-2026

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: స్థానిక సీహెచ్ఆర్‌కే వీఎంసీ ఇండోర్ స్టేడియంలో రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ మిడ్ టౌన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన 'మిడ్‌టౌన్ బ్యాడ్మింటన్ లీగ్-2026'ని కలెక్టర్ జి.లక్ష్మీశ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు ఆరోగ్యానికి ఎంతో ముఖ్యమని అన్నారు. క్లబ్ ఛైర్మన్ టి.కిషన్‌బాబు మాట్లాడుతూ క్రీడా స్ఫూర్తి, ఆరోగ్య చైతన్యం, స్నేహ సంబంధాలు పెంపొందించాలనే లక్ష్యంతో లీగ్‌ని ప్రారంభించామని తెలిపారు. లీగ్‌లో బాలబాలికలు, స్త్రీ, పురుషులు సుమారు 150 మంది పాల్గొన్నారని, వారిని 8 జట్లుగా విభజించి పోటీలు నిర్వహించామని చెప్పారు. దీని ద్వారా సమకూరే రూ.1.5 లక్షలను పల్స్ పోలియో నిధికి అందజేస్తామని తెలిపారు. పోటీలకు ప్రాయోజకులుగా 'ముకుతశ్రీ గోల్డ్ అండ్ డైమండ్స్', సహ ప్రాయోజకులుగా 'దివి స్వచ్ఛ సిల్వర్ జువెలరీ' వ్యవహరించినట్లు తెలిపారు. 'ఉమా ఈవెంట్స్ అండ్ స్పీడ్ పూల్' ప్రథమ, 'త్రినాథ్ ఇన్‌ఫ్రా' ద్వితీయ స్థానం కైవసం చేసుకున్నాయి. క్లబ్ అధ్యక్షుడు వి.చంద్రశేఖర్ నాయకత్వంలో నిర్వహించిన పోటీలో కో-ఛైర్మన్లు టి.ఉదయ్, కె.మధుసూదనరావు, కార్యదర్శి పొదిలె నాగ వసంత్‌కుమార్ పాల్గొన్నారు.

విజేతగా నిలిచిన ఉమా ఈవెంట్స్ అండ్ స్పీడ్ పూల్

అత్తింటి వేధింపులు.. కేసు నమోదు

చిట్టినగర్, న్యూస్‌టుడే: అత్తింటి వేధింపులు భరించలేక ఓ వివాహిత పోలీసులకు ఫిర్యాదు చేసిన ఉదంతమిది కొత్తపేట, బ్రాహ్మణ వీధిలో సందక ప్రియాంకకు, నాగేశ్వరరావుతో 2012లో అన్ని లాంఛనాలతో వివాహమైంది. వారికి ఇద్దరు సంతానం. గర్భిణిగా ఉన్న సమయంలో తిరుపతి వెళ్లాలని అత్తింటి వారు ఒత్తిడి చేశారు. నిండు గర్భిణి కావడంతో వైద్యులు ఎటూ కదలకూడదు, ప్రయాణాలు చేయవద్దని సూచించారు. అత్తింటి వారు అవేమీ పట్టించుకోకుండా తిరుపతి తీసుకెళ్లారు. అక్కడ ఆమెకు ఇబ్బంది అయితే తిరుమల తిరుపతి దేవస్థానం ఆసుపత్రిలో చేర్పించారు. అప్పటికే గర్భంలో శిశువు మృతి చెందినట్లు తెలిపారు. ఏడాది అనంతరం మళ్లీ గర్భం దాల్చగా మగ శిశువు అంగవైకల్యంతో జన్మించాడు. అప్పటి నుంచి ప్రియంకను ఆమె కుమారుణ్ని పట్టించుకోకుండా నానా ఇబ్బందులకు గురిచేశారు. బాధలు భరించలేక అత్తింటి వారి వేధింపులపై కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా ఆదివారం కేసు నమోదు చేశారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు రాష్ట్ర జట్టు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: గుజరాత్ రాష్ట్రం వడోదరలో ఈ నెల 24 నుంచి 27వ తేదీ వరకు జరిగే 72వ జాతీయ సీనియర్ పురుషుల కబడ్డీ ఛాంపియన్‌షిప్‌లో తలపడే రాష్ట్ర జట్టును రాష్ట్ర కబడ్డీ సంఘం ప్రధాన కార్యదర్శి యలమంచిలి శ్రీకాంత్ ఆదివారం వెల్లడించారు. రైల్వే స్టేడియంలో నిర్వహించిన కార్యక్రమంలో జట్టు సభ్యులను ఆర్‌సీటీ (రైల్వే క్లెయిమ్స్ ట్రిబ్యునల్) అదనపు సంచాలకుడు కె.రాజేంద్రప్రసాద్, రాష్ట్ర కబడ్డీ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ నక్కల అర్జునరావు, సంయుక్త కార్యదర్శి కేవీ నాంచారయ్య అభినందించారు. పి.దుర్గారావు (కెప్టెన్, తూర్పు గోదావరి), పి.గోపి, జి.హరీష్ (పల్నాడు), జి.లక్ష్మారెడ్డి, పి.బ్రహ్మారెడ్డి, కె.హరిప్రసాదరెడ్డి (బాపట్ల), ఎన్.తేజ (విశాఖ), సీహెచ్ నాగబాబు, కె.మనోహర్ (కాకినాడ), కె.రాంబాబు, కె.దినేష్ (తిరుపతి), కె.ఫణేంద్ర (ఎన్టీఆర్), జి.పవన్‌కుమార్ (కృష్ణా), ఎస్‌కే బాషా (గుంటూరు) జట్టులో స్థానం సాధించారు.

ఈనాడు

దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు

Cell: 98496 97616

సినిమాలు

★ **హే బలవంత్:** ఊర్వశి ఐనాక్స్(గాంధీనగర్), లైలా మాల్, పీవీపీ మాల్, పీవీఆర్ మాల్(బందరు రోడ్డు), ట్రెండ్‌సెట్ మాల్(క్యాపిటల్ సినిమాస్), ఎల్ఈపీఎల్ ఐనాక్స్(పటమట), పవర్ వన్ మాల్(కానూరు), ఏబీఆర్ సినిమాస్(కానూరు) ★ **నవాబ్ కేఫ్:** ఎల్ఈపీఎల్ ఐనాక్స్(పటమట), ఏబీఆర్ సినిమాస్(కానూరు)

★ **బూకి:** జయరామ్, ఊర్వశి ఐనాక్స్(గాంధీనగర్), లైలా మాల్, పీవీపీ మాల్, పీవీఆర్ మాల్(బందరు రోడ్డు), ట్రెండ్‌సెట్ మాల్(క్యాపిటల్ సినిమాస్), ఎల్ఈపీఎల్ ఐనాక్స్(పటమట), పవర్ వన్ మాల్(కానూరు), ఏబీఆర్ సినిమాస్(కానూరు)

★ **అల్ఫా:** స్వర్ణాకాంప్లెక్స్(గవర్నర్‌పేట), రామ్ సినిమాస్(గుణదల)

★ **త్రిశంకు:** ఊర్వశి ఐనాక్స్(గాంధీనగర్)

★ **సీతా పయనం:** ఊర్వశి ఐనాక్స్(గాంధీనగర్), స్వర్ణాకాంప్లెక్స్(గవర్నర్‌పేట), రామ్ సినిమాస్(గుణదల), లైలా మాల్, పీవీపీ మాల్, పీవీఆర్ మాల్(బందరు రోడ్డు), ట్రెండ్‌సెట్ మాల్(క్యాపిటల్ సినిమాస్), ఎల్ఈపీఎల్ ఐనాక్స్(పటమట), పవర్ వన్ మాల్(కానూరు), ఏబీఆర్ సినిమాస్(కానూరు)

★ **కపుల్ ఫ్రెండ్లీ:** శైలజ(గాంధీనగర్), సాయిరామ్, స్వాతి(భవానీపురం)

★ **ఫంకీ:** జీ-3(రాజ్-యువరాజ్), ఊర్వశి ఐనాక్స్(గాంధీనగర్), అప్సర, స్వర్ణాకాంప్లెక్స్(గవర్నర్‌పేట), తారా స్క్రీన్స్, రవీంద్ర సినిమాస్(పాయకాపురం), రామ్ సినిమాస్(గుణదల), సాయిరామ్, సౌమ్య(వన్‌టౌన్), స్వాతి(భవానీపురం), లైలా మాల్, పీవీపీ మాల్, పీవీఆర్ మాల్(బందరు రోడ్డు), ట్రెండ్‌సెట్ మాల్(క్యాపిటల్ సినిమాస్), ఎల్ఈపీఎల్ ఐనాక్స్(పటమట), పవర్ వన్ మాల్(కానూరు), ఏబీఆర్ సినిమాస్(కానూరు)

★ **నిలవే:** ఊర్వశి ఐనాక్స్(గాంధీనగర్), స్వర్ణాకాంప్లెక్స్(గవర్నర్‌పేట), రామ్ సినిమాస్(గుణదల), లైలా మాల్, పీవీపీ మాల్, పీవీఆర్ మాల్(బందరు రోడ్డు), ట్రెండ్‌సెట్ మాల్(క్యాపిటల్ సినిమాస్), ఎల్ఈపీఎల్ ఐనాక్స్(పటమట)

★ **యుఫోరియా:** ఊర్వశి ఐనాక్స్(గాంధీనగర్), స్వర్ణాకాంప్లెక్స్(గవర్నర్‌పేట), రామ్ సినిమాస్(గుణదల), లైలా మాల్, పీవీపీ మాల్, పీవీఆర్ మాల్(బందరు రోడ్డు), ట్రెండ్‌సెట్ మాల్(క్యాపిటల్ సినిమాస్), ఎల్ఈపీఎల్ ఐనాక్స్(పటమట), పవర్ వన్ మాల్(కానూరు), ఏబీఆర్ సినిమాస్(కానూరు)

- విజయవాడ వన్‌టౌన్, న్యూస్‌టుడే

హిజ్రా అనుమానాస్పద మృతి

చిట్టినగర్, న్యూస్‌టుడే: వైఎస్ఆర్ కాలనీలో ఉంటున్న అంజలి(25) అనే హిజ్రా ఆదివారం అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. తోటి హిజ్రాలతో కలిసి ఉంటున్న ఆమె శనివారం అదే కాలనీలో ఉంటున్న తల్లిదండ్రుల వద్దకు వెళ్లి భోజనం చేసి సాయంత్రం తాను ఉంటున్న నివాసానికి వెళ్లింది. ఆదివారం ఉదయం 6 గంటలకు ఒకరు వచ్చి అంజలి ఉరేసుకుందని, ఆసుపత్రికి తీసుకెళ్లినట్లు ఆమె తల్లికి చెప్పారు. ఈలోగా మార్గం మధ్యలో అంజలి మృతిచెందింది. హిజ్రాల మధ్య గొడవ జరగడం వల్ల మనస్తాపం చెంది బలవన్మరణానికి పాల్పడి ఉండవచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ చినకొండలరావు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో కాపలాదారుకు గాయాలు

భవానీపురం, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో వాచ్‌మెన్ గాయపడినట్లుగా భవానీపురం పోలీసులు తెలిపారు. గొల్లపూడి పాత పోస్టాఫీసు రోడ్డులో పి.వినోదరావు(55) కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నారు. ఆయన గొల్లపూడిలోని ఒక అపార్ట్‌మెంటుకు వాచ్‌మెన్‌గా పని చేస్తున్నారు. ఈనెల 22వ తేదీ ఉదయం వైజంక్షన్ వద్ద టీ తాగేందుకు సైకిల్‌పై వెళ్తుండగా అటుగా వెళ్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో గాయపడిన వినోదరావును విజయవాడలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతున్నాడు. భవానీపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువతి అదృశ్యం

చిట్టినగర్, న్యూస్‌టుడే: చిట్టినగర్, కలరా ఆసుపత్రి సమీపంలో నివసించే 19 ఏళ్ల యువతి అదృశ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. మేనమామ వద్ద పెరుగుతున్న ఆ యువతి శనివారం తెల్లవారుజామున చెప్పకుండా ఇంట్లో నుంచి బయటకు వెళ్లింది. చుట్టుపక్కల, బంధువుల వద్ద ఆరా తీసినా ఆచూకీ తెలియలేదు. ఈ మేరకు కొత్తపేట పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

(c) eenadu

విజయవాడ మధ్య

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
సీతారాంపురం-63036 11232, పాయకాపురం- 90631 44761

స్పందన : సీతారాంపురం, న్యూస్‌టుడే : గుణదల సీతాప్ కార్యాలయం వెనుక ఖాళీ స్థలంలో పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. విషసర్పాలు, దోమలకు నిలయంగా మారింది. స్థానికులు ఈ సమస్యను 'మేమున్నాం.. మీకు తోడుగా..' దృష్టికి తీసుకొచ్చారు. వీఎంసీ సర్కిల్-2 ఇన్‌ఛార్జి ఏఎంవోహెచ్ పి.అన్నపూర్ణ స్పందించారు. తమ సిబ్బందితో పిచ్చి మొక్కలను తొలగింపజేశారు.

? గుణదల సీతాప్ కార్యాలయం వెనకవైపు.. డోర్ నం: 44-9-4/a పక్కన ఉన్న ఖాళీ స్థలంలో పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. విషసర్పాలు, దోమలకు నిలయంగా మారుతున్నాయి. - **జి.జ్యూనేష్, స్థానికుడు** ✔ పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం. - **డాక్టర్ పి.అన్నపూర్ణ, ఏఎంవోహెచ్** - సీతారాంపురం, న్యూస్‌టుడే

? ప్రశాంతినగర్ రెండో లైనులోని కాలువలో పూడిక పేరుకుంది. తీవ్ర దుర్వాసన వస్తోంది. - **రమణ, స్థానికుడు** ✔ పూడిక తీసేందుకు చర్యలు తీసుకుంటాం. - **శివరామ కృష్ణ, శానిటరీ అధికారి** ? కండ్రిక జేఎన్‌యూఆర్‌ఎం గృహాల వద్ద రోడ్డుపై చెత్త వేస్తున్నారు. తరచూ తొలగించకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. - **రాజు, స్థానికుడు** ✔ తరచూ చెత్త తరలించేలా చూస్తాం. - **గోపిరాజు, శానిటరీ అధికారి** - న్యూస్‌టుడే, పాయకాపురం

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు రాష్ట్ర జట్టు

విజయవాడ క్రీడలు: గుజరాత్ రాష్ట్రం వడోదరలో ఈ నెల 24 నుంచి 27వ తేదీ వరకు జరిగే 72వ జాతీయ సీనియర్ పురుషుల కబడ్డీ ఛాంపియన్‌షిప్‌లో తలపడే రాష్ట్ర జట్టును రాష్ట్ర కబడ్డీ సంఘం ప్రధాన కార్యదర్శి యలమంచిలి శ్రీకాంత్ ఆదివారం వెల్లడించారు. రైల్వే స్టేడియంలో నిర్వహించిన కార్యక్రమంలో జట్టు సభ్యులను ఆర్‌సీటీ (రైల్వే క్లెయిమ్స్ ట్రిబ్యునల్) అదనపు సంచాలకుడు కె.రాజేంద్రప్రసాద్, రాష్ట్ర కబడ్డీ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లూ అర్జునరావు, సంయుక్త కార్యదర్శి కేవీ నాంచారయ్య అభినందించారు. పి. దుర్గారావు (కెప్టెన్, తూర్పు గోదావరి), పి.గోపి, జి.హరీష్ (పల్నాడు), జి.లక్ష్మారెడ్డి, పి.ప్రేమ్‌రెడ్డి, కె.హరిప్రసాద్‌రెడ్డి (బాపట్ల), కె.వసంత్ (ఎన్టీఆర్), జి.పవన్‌కుమార్ (కృష్ణా), ఎస్‌కే బాషా (గుంటూరు) తదితరులు స్థానం సాధించారు.

ధర వరలు

కూరగాయలు-20/22, టమాటా-14, బెండ-24, పచ్చిమిర్చి-44, కాకర-30, బీర-26/24, క్యాలీ ఫ్లవర్-15/20, క్యాబేజీ-14, క్యారెట్-24, దొండ-32, బంగాళదుంప-22, ఉల్లిపాయలు-22, గోరుచిక్కుడు-26, దోస-16/26, సొర-8/10, పొట్ల-30, అరటికాయ-7/6, చామదుంప-24, అల్లం-76, మునగ-10/8, ఆకు కూరలు (కట్ట)-2.50, కంద-40, బీట్ రూట్-26, కీరదోస-40, బీన్స్-60/70, క్యాప్సికమ్-60, చిలకడదుంప-65, నిమ్మ (డజను)-36/48, కొత్తిమీర-5/10, పుదీనా-5/15, ముల్లంగి-8, పచ్చిమిరపకాయలు-20/25/30. (నిన్నటిది). నగరంలోని రైతుబజార్లలో ఈ ధరలు (రూ.లో) వర్తిస్తాయి. - న్యూస్‌టుడే, విజయవాడ రైతుబజారు

మార్కెట్ ఆదాయానికి గండి

గాంధీనగర్, న్యూస్‌టుడే : స్థానిక 36వ డివిజన్‌లోని రాజగోపాలాచారి మార్కెట్ శిథిలావస్థకు చేరి.. వెలవెలబోతోంది. నిత్యం కొనుగోలుదారులతో కిటకిటలాడేది. అధికారుల నిర్లక్ష్యం వల్ల.. ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. వైకాపా హయాంలో మార్కెట్‌ని

శిథిలావస్థకు చేరిన దుకాణాల్లోనే వ్యాపారాలు

పట్టించుకోకపోవడంతో భారీ ఆదాయాన్ని కోల్పోయింది. నగరంలో నగరపాలక సంస్థ నిర్మించిన పెద్ద మార్కెట్లలో ఇదొకటి. నగరం నడిబొడ్డున గాంధీనగర్‌లో.. దుకాణాలకు మంచి డిమాండ్ ఉంది. కూరగాయలు, పచారీ సరుకులు, మాంసం దుకాణాలు, కమర్షియల్ కాంప్లెక్స్‌లో వివిధ రకాల వ్యాపారాలు జరుగుతున్నాయి. అద్దెల రూపేణా నగరపాలక సంస్థకు లక్షల ఆదాయం వచ్చేది. దుకాణాలు పాడైపోవడంతో ప్రస్తుతం చాలా మంది వ్యాపారాలు చేయడం లేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు మార్కెట్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టి, నిధులు మంజూరు చేసేలా కృషి చేశారు. కూరగాయల దుకాణాలతో పాటు చేపల మార్కెట్ ఇక్కడ ఉంది. ప్రస్తుతం చాలా వరకు దుకాణాలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ప్రైవేటు వ్యక్తులు తోపుడు బండ్లు పెట్టుకుంటున్నారు. వీటివల్ల ట్రాఫిక్‌కు ఆటంకం ఏర్పడుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మార్కెట్‌ను ఆధునికీకరించాలని వినియోగదారులు కోరుతున్నారు.

- ❖ మొత్తం దుకాణాలు : సుమారు 100
- ❖ ఖాళీ దుకాణాలు : సుమారు 50
- ❖ ప్రతి రోజూ సందర్శకులు : సుమారు 2వేల మంది
- ❖ ప్రతి నెలా ఆదాయం : రూ.రెండు లక్షల వరకు
- ❖ ప్రాంతాలు : సత్యనారాయణపురం, గాంధీనగర్, హనుమాన్‌పేట, ముత్యాలంపాడు, బావాజీపేట, దుర్గాపురం, అయోధ్యనగర్, కేదారేశ్వరపేట, పెజ్జోనిపేట, పూర్ణానందంపేట, ఆర్‌టీసీ కాలనీ, హర్షపేట, బ్రాహ్మణపాలెం, బొగ్గులైను రైల్వే కాలనీ

త్వరలోనే పనులు ప్రారంభం

గత ప్రభుత్వం మార్కెట్‌ను పూర్తి నిర్లక్ష్యంగా వదిలివేయడంతో నగరపాలక సంస్థకు వచ్చే ఆదాయం పడిపోయింది. ఇప్పటికే నిధులు మంజూరుకు ఆమోదం లభించింది. త్వరలోనే పనులు ప్రారంభించి, నిర్ణీత వ్యవధిలోనే వినియోగదారులకు అందుబాటులోకి తెస్తాం. - బొండా ఉమా మహేశ్వరరావు, ఎమ్మెల్యే

పోరాట యోధుడు.. ఉయ్యాలవాడ

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : ఆంగ్లేయుల వెన్నులో వణుకు పుట్టించి, స్వాతంత్య్ర ఉద్యమానికి ఊపిరిలూదిన గొప్ప వీరుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి అని కలెక్టర్ జి.లక్ష్మీశ కొనియాడారు. ఆయన పోరాట పటిమ చిరస్మరణీయమన్నారు. నగరంలోని వివిధ కార్యాలయంలో ఉయ్యాలవాడ వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి కలెక్టర్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వాతంత్య్ర సమరయోధుల త్యాగాలను స్మరించుకోవడం ప్రతి భారతీయుడి బాధ్యత, మహనీయుల త్యాగాలు యువతకు స్ఫూర్తిదాయకమని ఆయన అన్నారు.


నరసింహారెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

విద్యుత్తు సరఫరా నిలిపివేత నేడు

మధురానగర్, న్యూస్‌టుడే : విద్యుత్తు లైన్ల తనిఖీలు, మరమ్మతుల కారణంగా మధురానగర్ విద్యుత్తు సెక్షన్ పరిధిలోని పలు ప్రాంతాలకు సోమవారం సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.రవీంద్రబాబు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి 10.30 గంటల వరకు పసుపుతోట 1 నుంచి 9వ లైను వరకు, లెక్చరర్స్ కాలనీ, ఇందిరాకాలనీ, జాన్ టీ స్టాల్ రోడ్డు, మధురానగర్ మెయిన్ రోడ్డు తదితర ప్రాంతాల్లో విద్యుత్తు ఉండదని ఈఈ చెప్పారు.

నైటింగేల్ స్ఫూర్తితో నిస్వార్థ సేవలు

సత్యనారాయణపురం (గాంధీనగర్), న్యూస్‌టుడే: ఫ్లోరెన్స్ నైటింగేల్ స్ఫూర్తితో రోగులకు అంకితభావంతో సేవలు అందించాలని ప్రభుత్వ ఉపవైద్య నర్సింగ్ సూపరింటెండెంట్ ఎంవీడీవీసీఎస్ విజయలక్ష్మి సూచించారు. ఆదివారం స్థానిక దుర్గాపురం విజయ నర్సింగ్ కళాశాలలో విమ్స్ మదర్ థెరెసా కాలేజ్ ఆఫ్ నర్సింగ్, మదర్ థెరెసా స్కూల్ ఆఫ్ నర్సింగ్, విజయ స్కూల్ ఆఫ్ నర్సింగ్ విద్యార్థులకు నిర్వహించిన ల్యాంప్ లైటింగ్ అండ్ క్యాపింగ్ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విజయవాడ గవర్నమెంట్ స్కూల్ ఆఫ్ నర్సింగ్ వైస్ ప్రిన్సిపల్ కె.హైదరాబీ, పాత ప్రభుత్వాసుపత్రి ఇన్‌ఛార్జ్ నర్సింగ్ సూపరింటెండెంట్ కె.రాజేశ్వరి, కళాశాల ఛైర్మన్ కూకల తట్టి అధ్యాపకులు తదితరులతో కలిసి ఫ్లోరెన్స్ నైటింగేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నర్సింగ్ అనేది ఒక వృత్తి మాత్రమే కాదని.. సేవ అని పేర్కొన్నారు. సేవ ద్వారా ఆరోగ్యకర సమాజం ఏర్పడుతుందన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. వి.కె.ఎస్.జయలక్ష్మి, శాంతి సాహు, కె.జాన్సన్, బాబీ, పాల్గొన్నారు.

కార్యక్రమంలో అధికారులు, నర్సింగ్ విద్యార్థులు, సిబ్బంది

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ గోపిమూర్తి, పక్కన లక్ష్మణరావు, విజయగౌరి తదితరులు

బాలుడి ఘటనపై ఏడీఆర్ఎం ఆగ్రహం

సత్యనారాయణపురం(గాంధీనగర్), న్యూస్‌టుడే : స్థానిక రైల్వే కాలనీలో ఇంజినీరింగ్ సిబ్బంది తవ్విన ఇంకుడు గుంతలో బాలుడు పడిన ఘటనపై ఏడీఆర్ఎం ఎడ్విన్ సీరియస్ అయ్యారు. రైల్వే ఉద్యోగి కుమారుడు శనివారం అందులో పడగా.. త్రుటిలో ప్రాణాపాయం తప్పింది. కాలనీల్లో ఏర్పాటు చేసిన ఇంకుడు గుంతలకు ఎలాంటి రక్షణ లేకుండా వదిలివేయడం తీవ్ర నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలుడి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. పలువురు అధికారులు వెళ్లి వైద్యులు, చిన్నారి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ప్రస్తుతం వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నాడు. ఏడీఆర్ఎం ఆగ్రహంతో.. ఆదివారం సెలవు రోజైనా ఇంజినీరింగ్ సిబ్బంది హుటాహుటిన కాలనీలోని అన్ని ఇంకుడు గుంతలను పూడ్చివేశారు. బాధ్యులపై క్రమశిక్షణ చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం.

గుంత పూడుస్తున్న ఇంజినీరింగ్ సిబ్బంది

వైకాపాపై చర్యలు తీసుకోవాల్సిందే

పాయకాపురం, న్యూస్‌టుడే : కలియుగ దైవమైన శ్రీవేంకటేశ్వర స్వామిని అవమానించిన వైకాపా ఎమ్మెల్సీలపై చర్యలు తీసుకుని, వారందరినీ బర్తరఫ్ చేయాలని తెదేపా 61వ డివిజన్ అధ్యక్షుడు ఆవుల సూర్యప్రకాష్ డిమాండ్ చేశారు. ఆదివారం డివిజన్‌లోని హెచ్ బ్లాక్ వద్ద ఉన్న శ్రీదేవి భూదేవి సమేత సంతాన వేంకటేశ్వర స్వామి వారి ఆలయాన్ని శుద్ధి చేశారు.

ఆలయాన్ని శుద్ధి చేస్తున్న తెదేపా నాయకులు

ఆయన మాట్లాడుతూ... బూట్లతో స్వామి వారి చిత్రపటాన్ని పట్టుకుని, ప్లకార్డులను కిందపడేశారని మండిపడ్డారు. ఇది హైందవుల్ని అవమానించడమేనని పేర్కొన్నారు. పులివెందుల ఎమ్మెల్యే జగన్ మోహన్‌రెడ్డి ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డివిజన్ నాయకులు అన్నాబత్తుల వెంకటేశ్వరరావు, దాసరి దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక నేడు

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం, జోనల్ కార్యాలయాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం నిర్వహిస్తున్నట్లు వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. నగర పరిధిలో నివాసం ఉండే ప్రజలు వారు ఎదుర్కొంటున్న సమస్యలను ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు లిఖితపూర్వకంగా తెలియజేయవచ్చని పేర్కొన్నారు.

కేజీబీవీ ఉపాధ్యాయులను క్రమబద్ధీకరించండి

రామవరప్పాడు (గాంధీనగర్), న్యూస్‌టుడే : కేజీబీవీ (కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం) టీచర్లు విద్యా వ్యవస్థలో కీలకపాత్ర పోషిస్తున్నప్పటికీ వారికి తగిన గుర్తింపు, భద్రత కల్పించకపోవడం దురదృష్టకరమని ఎమ్మెల్సీ బి.గోపి మూర్తి అన్నారు. బాలోత్సవ భవన్‌లో ఆదివారం నిర్వహించిన కేజీబీవీ టీచర్ల రాష్ట్ర సదస్సులో ఆయన మాట్లాడారు. టీచర్ల క్రమబద్ధీకరణ, మినిమం టైమ్ స్కేల్ అమలు బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. అసెంబ్లీ, మండలిలో ఈ అంశాలను ప్రస్తావించి, న్యాయం జరిగేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ.. సమాన పనికి సమాన వేతనం రాజ్యాంగం కల్పించిన హక్కు అని చెప్పారు. కేజీబీవీ టీచర్లకు సర్వీస్ రూల్స్ లేకపోవడంతో బదిలీల్లో అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈపీఎఫ్, ఈఎస్ఐ, గ్రాట్యుటీ, ఆరోగ్య భద్రత వంటి సంక్షేమ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమగ్ర శిక్షా ఎంప్లాయీస్ జేఏసీ రాష్ట్ర ఛైర్మన్ బి.కాంతారావు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై బాధ్యత నెట్టే ప్రయత్నాలు మానుకుని, తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. 22మంది సభ్యులతో కూడిన సంఘం రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని సదస్సులో తీర్మానం చేశారు. కె.విజయగౌరి, జి.శ్రీరేఖ, పి.తేజేశ్వరి, మాధవి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు బాసట

సత్యనారాయణపురం (గాంధీనగర్): ఎలాంటి ఆదరణ లేని వృద్ధులను ఆదరించడం.. ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతగా తీసుకోవాలని వసుధైక కుటుంబం చారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ చల్లా హరికుమార్ కోరారు. స్థానిక దుర్గాపురం విజయ నర్సింగ్ కళాశాలలో ఆదివారం ట్రస్టు ఆధ్వర్యంలో దాత వీరమాచనేని లలిత కిషోర్ సహకారంతో వృద్ధులకు నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత 225 నెలలుగా నిర్విరామంగా వృద్ధులకు చేయూత ఇస్తున్నట్లు చెప్పారు. ట్రస్టు వైస్ ఛైర్మన్ తేజ్‌రాజ్ సోలంకీ మాట్లాడుతూ.. ప్రతి నెలా సరకులతో పాటు వారికి ఉచితంగా వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేస్తున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో షేక్ నయీం పాషా, అర్జునరావు, సతీష్‌కుమార్, పి.లక్ష్మీనరసింహారావు పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

శాస్త్రోక్తంగా సూర్యోపాసన పూజ

విజయవాడ వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై ఆదివారం సూర్యోపాసన పూజలను అత్యంత వైభవంగా నిర్వహించారు. వైదిక క్రతువు, ఆలయ వైదిక కమిటీ, వేదపండితులు అత్యున్నత స్థాయిలో ఈ పూజ జరిపించారు. లోకకల్యాణం, భక్తులకు ఆరోగ్య ప్రాప్తి కోసం ఈ పూజను నిర్వహిస్తున్నామని వివరించారు. ఆలయ ఈఓ వీకే శీనానాయక్ పూజలో పాల్గొన్నారు.

మరమ్మతులు మరిచారు..

మ్యూజియం రోడ్డులో కలెక్టర్ కార్యాలయం సమీపంలో ఓపెన్ డ్రెయిన్ రక్షణ గోడ ధ్వంసమైంది. నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గంలో.. రోడ్డు కుంగిపోయింది. రక్షణగా ఏర్పాటు చేసిన గోడ విరిగిపోయి ప్రమాదకరంగా మారింది. యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయాల్సిన అధికారులు.. గోడ వద్ద కర్రలు పాతి ఊరుకున్నారు. ఏ వాహనమైనా అంచుకు వస్తే.. ఓపెన్ డ్రెయిన్‌లో పడిపోవటం ఖాయమని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. రక్షణ గోడ నిర్మించాలని డిమాండ్ చేస్తున్నారు. **- న్యూస్‌టుడే, గవర్నర్‌పేట**

పొంచి ఉన్న ప్రమాదం

స్థానిక 36వ డివిజన్, సత్యనారాయణస్వామి ఆలయం రోడ్డు చివర.. జ్ఞానోలైవ్ రహదారి సమీపంలో కాలువపై చప్టాలు వేయకుండా వదిలేశారు. రాత్రి సమయాల్లో వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. నిత్యం ఇటుగా పెద్ద సంఖ్యలో ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. వారి రక్షణ దృష్ట్యా.. కాలువపై చప్టా వేయాలని చోదకులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, గాంధీనగర్**

కూలితే.. పోయేది ప్రాణాలేగా..?

అజిత్‌సింగ్‌నగర్ డాబా కొట్లు సెంటర్ ప్రధాన రహదారిలోని విద్యుత్తు స్తంభాలకు తుప్పుపట్టి పడిపోయే స్థితిలో ఉన్నాయి. కూలితే పెను ప్రమాదం వాటిల్లుతుందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత శాఖాధికారులు స్పందించి.. శిథిలావస్థకు చేరిన స్తంభాలను తొలగించి కొత్తవి ఏర్పాటు చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.
- న్యూస్‌టుడే, అజిత్ సింగ్‌నగర్

ట్రాఫిక్ కష్టాలు తీరేనా?

మధురానగర్ మెయిన్ రోడ్డులో పైవంతెన వద్ద నిత్యం వాహనాలు నిలిచిపోతున్నాయి. లెక్చరర్స్ కాలనీ నుంచి వచ్చే వాహనాలు, పై వంతెన నుంచి కిందకు వచ్చే వాహనాలు మలుపులో కలుస్తున్నాయి. వంతెన దిగువ భాగంలో రోడ్డు పక్కన వరుసగా వాహనాలు నిలుపుతుండడంతో.. రాకపోకలు స్తంభిస్తున్నాయి. వంతెన దిగువన అడ్డుగా వాహనాలు పెట్టవద్దని హెచ్చరిస్తున్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదు. ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి అధికారులు చొరవ చూపాల్సిన అవసరం ఉంది.
- న్యూస్‌టుడే, మధురానగర్

తాగునీరు వృథా

గవర్నర్‌పేట గోపాలరెడ్డిరోడ్డులోని అరండల్ మున్సిపల్ కాంప్లెక్సు వద్ద పైపులైను లీకేజీ ఏర్పడి నీరు వృథా అవుతోంది. ఇక్కడి మూత్రశాలలకు నీరు సరఫరా చేసేందుకు పైపులైను వేశారు. దానికి లీకేజీ ఏర్పడడంతో నీరు పెద్ద మొత్తంలో రహదారిపై పోతోంది. అధికారులు తక్షణం పరిశీలించి.. మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, గవర్నర్‌పేట**

మౌలానా సేవలు మరువలేం

గవర్నర్‌పేట: భారతదేశపు తొలి విద్యా శాఖామంత్రిగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ చేసిన సేవలు మరువలేనివని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. ఆదివారం ఆంధ్రరత్నభవన్‌లో ఆజాద్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ఏపీసీసీ ఉపాధ్యక్షుడు వి.గురునాథం తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వాతంత్య్ర సమరయోధుల్లో ఒకరైన ఆజాద్ కవి, పండితుడని.. అరబిక్, ఇంగ్లిష్, ఉర్దూ, హిందీ, పెర్షియన్, బెంగాలీ భాషల్లో ప్రవీణుడని కొనియాడారు. ఏఐసీసీ అధ్యక్షుడిగా రెండు సార్లు ఎన్నికై పార్టీ పటిష్టతకు కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో షేక్ అన్సారీ, గౌస్, నేలపాటి సుభాష్, మండేపూడి సునీత, ప్రమీలగాంధీ తదితరులు పాల్గొన్నారు.

ఆజాద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

కండ్రికలో ముస్లిం కమిటీ నాయకులు, సభ్యులు..

పాయకాపురం: దేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్‌కలాం ఆజాద్ గొప్ప వ్యక్తి అని, విద్యావ్యవస్థలో మార్పులు తీసుకొచ్చిన మహనీయుడు అని ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు నాగుల్‌మీరా అన్నారు. కండ్రికలోని రాష్ట్ర కార్యాలయంలో ఆజాద్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. యూసఫ్, ఆరీఫ్, జానీ, పఠాన్, అక్బర్ అలీఖాన్ తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధి కేంద్ర నిర్మాణానికి శంకుస్థాపన

సీతారాంపురం: సీతారాంపురంలోని శ్రీసత్యసాయి సేవాసమితి మందిరంలోని రెండో అంతస్తులో రాష్ట్ర కార్యాలయం, నైపుణ్యాభివృద్ధి కేంద్రం నిర్మాణానికి ఆదివారం సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు శంకుస్థాపన చేశారు. కమలాత్రివేణి, జాతీయ సేవా మహిళా సమన్వయకర్త శశిబాల, ఉపాధ్యక్షుడు సురేంద్ర,రాష్ట్ర సేవాదళ్ సమన్వయకర్తలు శ్యామ్‌ప్రసాద్, శాంతి, జిల్లా అధ్యక్షుడు సాయి విశ్వనాథం, సమితి కన్వీనర్ నరసింహారావు, రాష్ట్ర, జిల్లా, సమితి పదాధికారులు హాజరయ్యారు. సేవాదళ్ సమన్వయకర్తలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. క్రమశిక్షణ, అంకితభావం, ఐక్యత, నిస్వార్థ సేవా స్ఫూర్తిపై మార్గదర్శనం చేశారు.

పూజా కార్యక్రమంలో లక్ష్మణరావు

బకాయిల విడుదల కోరుతూ ధర్నా

విజయవాడ (గాంధీనగర్), న్యూస్‌టుడే : ఈ నెల 27న విజయవాడలో తలపెట్టిన ధర్నాను జయప్రదం చేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) రాష్ట్ర అధ్యక్షుడు కె. భాస్కర్, కార్యదర్శి ఐ.రాజేష్ పిలుపునిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఉపకార వేతనాలు, ఫీజు రీఎంబర్స్‌మెంట్ విడుదల చేయాలని.. జీవో నంబరు 77ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేస్తున్నట్లు చెప్పారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ప్రచార పత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఫీజు రీఎంబర్స్‌మెంట్, ఉపకార వేతనాల బకాయిలు రూ. 7600 కోట్లు పెండింగ్ ఉన్నాయని చెప్పారు. అసెంబ్లీ సమావేశాలకు ముందు రూ.1200 కోట్లు మాత్రమే విడుదల చేశారని.. బకాయిలు రూ.6400 కోట్లు విడుదల చేయాలని కోరారు. బడ్జెట్‌లో ఉన్నత విద్యకు కేవలం 0.77 శాతం నిధులు కేటాయించడం సరికాదన్నారు. విశ్వవిద్యాలయాల్లోని 4200 పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా నాయకులు గణేష్, మహేష్, పవన్, వెంకటేష్, ధీరజ్, సన్నీ పాల్గొన్నారు.

గోడపత్రికలు ఆవిష్కరిస్తున్న సమాఖ్య నాయకులు

నిత్యాన్నదానానికి విరాళం అందజేత

సత్యనారాయణపురం(గాంధీనగర్): ముత్యాలంపాడు శిర్డీ సాయిబాబా ఆలయంలో నిత్యాన్నదానానికి దాతలు ముప్పా ఇంద్రకీల గిరీష్, వీరవెంకట శ్రావ్య రూ.50వేల విరాళాన్ని ఆదివారం కమిటీ గౌరవాధ్యక్షుడు పూనూరు గౌతమ్‌రెడ్డికి అందజేశారు. దాతలకు బాబావారి శేషవస్త్రం, చిత్రపటం, ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో సత్యశ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

దొర వంశీయుల అభ్యున్నతికి కృషి చేయాలి

విజయవాడ (గాంధీనగర్), న్యూస్‌టుడే : రాష్ట్రంలో దొర వంశీయుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ దొరవంశ (దొమ్మర) సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వి.గోపాల్ కోరారు. ఆదివారం ఆయన ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 5 లక్షల మంది జనాభా కలిగిన తమ సామాజిక వర్గానికి ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. త్వరలోనే మంత్రి లోకేశ్‌ను కలిసి విద్య, వైద్యం, అభివృద్ధి విషయంలో జరుగుతున్న అన్యాయాన్ని వివరిస్తామని చెప్పారు. త్వరలోనే రాష్ట్ర స్థాయి సభ నిర్వహించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు కె.వి.ఎస్.సత్యం, ఎ.గంగాధర్, ఎన్.వరప్రసాద్, ఎన్.తిరుపతయ్య, వీరరాఘవులు, వెంకట కృష్ణయ్య, పెద్దకోటయ్య, రామకృష్ణయ్య, శ్రీనివాస్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు శిక్షణ తరగతులు

భగవద్గీత శ్లోకాలు పఠిస్తున్న విద్యార్థులు

గవర్నర్‌పేట: భగవద్గీత.. పిల్లలకు మంచి మార్గదర్శిని అని, వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఎంతో ఉపయోగపడుతుందని భగవద్గీత శిక్షకులు మల్లెల వరలక్ష్మి పేర్కొన్నారు. మహాత్మాగాంధీ రోడ్డులోని ఠాగూర్ గ్రంథాలయంలో ఆదివారం ఆటవిడుపు కార్యక్రమాల్లో భాగంగా చిన్నారులకు భగవద్గీత శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చిన్ననాటి నుంచి ఈ పుస్తకం చదివితే వ్యక్తిత్వ వికాసంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. గ్రంథాలయాధికారిణి కె.రమాదేవి మాట్లాడుతూ.. ప్రతి ఆదివారం ఉదయం 10 గంటలకు ప్రత్యేక తరగతులు ఉంటాయని, పిల్లలను పంపించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు.

క్రీడలూ చదువులో భాగమే

విజయవాడ క్రీడలు: క్రీడలూ చదువులో భాగమేనని, ప్రతి ఒక్కరూ ఏదో ఒక క్రీడాంశంలో ప్రావీణ్యం సంపాదించాలని నున్న గ్రామీణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కృష్ణ మోహన్ పేర్కొన్నారు. డీఎస్‌ఏ ఆధ్వర్యంలో ఆదివారం నున్న నుంచి గుణదల వెళ్లే బైపాస్ రోడ్డులో నిర్వహించిన శాప్ లీగ్ జిల్లా స్థాయి సైక్లింగ్ అండర్-18 బాలబాలికల పోటీలు, జిల్లా జట్టు ఎంపిక ప్రక్రియ ముగింపు కార్యక్రమంలో సీఐ మాట్లాడుతూ.. క్రీడల ద్వారా నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ అలవడుతాయని చెప్పారు. సబ్ ఇన్‌స్పెక్టర్లు భూక్యా సోని, ఆర్.మధుశ్రీ మాట్లాడుతూ.. చదువుతో పాటు క్రీడల్లో రాణించిన వారికి ఉన్నత విద్య, ఉద్యోగావకాశాల్లో రిజర్వేషన్లు ఉంటాయని చెప్పారు. జిల్లా క్రీడాభివృద్ధి అధికారి కాకర్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ.. జిల్లా స్థాయిలో ఎంపికైన వారు ఈ నెల 28 నుంచి జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. అండర్-18 టైమ్ ట్రయల్ బాలురు విభాగంలో డి.అమర్‌కుమార్, కె.శివమహేష్, ధనుష్‌కుమార్, డి.ధ్రువ, బాలికల్లో సిమ్రాన్, పి.స్నేహలత, బాలురు మాస్ స్టార్ట్‌లో పి.యశ్వంత్‌కుమార్, జి.సిద్ధు, హేమంత్‌సాయి, కె.నాగహర్ష, బాలికల్లో హారిక, పి.స్నేహ జిల్లా జట్లలో స్థానం సాధించారు. ఎస్‌ఐలు తదితరులు పాల్గొన్నారు.

పతకాలు అందుకున్న క్రీడాకారులతో అతిథులు

ఉత్సాహంగా మిడ్ టౌన్ బ్యాడ్మింటన్ లీగ్-2026

విజయవాడ క్రీడలు: స్థానిక సీహెచ్‌ఆర్‌కే వీఎంసీ ఇండోర్ స్టేడియంలో రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ మిడ్ టౌన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన 'మిడ్‌టౌన్ బ్యాడ్మింటన్ లీగ్-2026'ని కలెక్టర్ జి.లక్ష్మీశ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు ఆరోగ్యానికి ఎంతో ముఖ్యమని అన్నారు. క్లబ్ ఛైర్మన్ టి.కిషన్‌బాబు మాట్లాడుతూ క్రీడా స్ఫూర్తి, ఆరోగ్య చైతన్యం, స్నేహ సంబంధాలు పెంపొందించాలనే లక్ష్యంతో లీగ్‌ని ప్రారంభించామని తెలిపారు. లీగ్‌లో బాలబాలికలు, స్త్రీ, పురుషులు సుమారు 150 మంది పాల్గొన్నారని, వారిని 8 జట్లుగా విభజించి పోటీలు నిర్వహించామని చెప్పారు. దీని ద్వారా సమకూరే రూ.1.5 లక్షలను పల్స్ పోలియో నిధికి అందజేస్తామని తెలిపారు. పోటీలకు ప్రాయోజకులుగా 'ముకుతశ్రీ గోల్డ్ అండ్ డైమండ్స్', సహ ప్రాయోజకులుగా 'దివి స్వచ్ఛ సిల్వర్ జువెలరీ' వ్యవహరించినట్లు తెలిపారు. 'ఉమా ఈవెంట్స్ అండ్ స్పీడ్ పూల్' ప్రథమ, 'త్రినాథ్ ఇన్‌ఫ్రా' ద్వితీయ స్థానం కైవసం చేసుకున్నాయి.

మహిళల ప్రతిభకు పట్టాభిషేకం

విజయవాడ సాంస్కృతికం: శ్రీదేవి సాంస్కృతిక సాంఘిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మార్చి 8న మహిళా దినోత్సవం సందర్భంగా వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన మహిళలకు పట్టాభిషేకం చేయనున్నట్లు ఆ సంస్థ వ్యవస్థాపకురాలు శ్రీదేవి తెలిపారు. సంగీతం, నృత్యం, గాత్రం, వయోలిన్, నాదస్వరం, వీణ, కవితలు, మృదంగం, ఉపాధ్యాయులు, యాంకర్, ఆర్ట్, వ్యాపారం, పోలీస్, కోలాటం.. తదితర ఏ రంగాల్లోనైనా ప్రతిభ కలిగిన వారు పాల్గొనవచ్చని తెలిపారు. మార్చి 1వ తేదీలోపు 94402 63055 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని ఆమె కోరారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల
(అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

(c) eenadu

'ఈనాడు వైజ్ఞానిక ప్రదర్శన' రేపు

విశాఖపట్నంలోని 'డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ హాల్, బుల్లయ్య కాలేజ్ పక్కన, రామా టాకీస్ వద్ద నిర్వహణ.

ఈనాడు- విశాఖపట్నం: విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు 'ఈనాడు వైజ్ఞానిక ప్రదర్శన' నిర్వహిస్తోంది. 'డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ హాల్, బుల్లయ్య కాలేజ్ పక్కన, రామా టాకీస్ దరి, విశాఖపట్నంలో మంగళవారం ఉదయం 9.30 గంటలకు ఈ మెగా సైన్స్ ఫెయిర్ ప్రారంభం కానుంది. విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లోని వివిధ పాఠశాలలకు చెందిన ఆరు నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు తమ ప్రాజెక్టులతో పాల్గొననున్నారు. విద్యార్థులను వినూత్న ఆలోచనలతో ప్రయోగాలు చేసేలా ప్రోత్సహించడం 'ఈనాడు వైజ్ఞానిక ప్రదర్శన' ముఖ్య ఉద్దేశం. సుమారు 100 ప్రాజెక్టులు ప్రదర్శించనున్నారు.

హోరాహోరీగా చదరంగం పోటీలు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: గీతం డీమ్డ్ వర్సిటీ వేదికగా అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ (ఏఐయూ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సౌత్ జోన్ అంతర విశ్వవిద్యాలయాల మహిళల చదరంగం పోటీలు రెండోరోజు ఆదివారం హోరాహోరీగా సాగాయి. లక్ష్మీబాయ్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ డీన్ (గ్వాలియర్) కృష్ణకాంత్ సాహు పర్యవేక్షణలో పోటీలు జరుగుతున్నాయి. మూడు రౌండ్లు పూర్తయ్యేసరికి యూనివర్సిటీ ఆఫ్ మద్రాస్, ఎస్ఆర్ఎం, అన్నా, జేఎన్‌టీయూ (కాకినాడ) విశ్వవిద్యాలయాలు ముందంజలో ఉన్నాయని గీతం డీన్ అరుణ్‌కార్తిక్, క్రీడా విభాగం డిప్యూటీ డైరెక్టర్ జి.శ్రీనివాస్, మేనేజర్ కె.తపస్వి పేర్కొన్నారు. సోమవారం ఫైనల్స్ పోటీలు జరుగుతాయన్నారు.

పోటీల్లో తలపడుతున్న క్రీడాకారిణులు

ఆదర్శ పాఠశాలలు పిలుస్తున్నాయ్

అందుబాటులో 500 సీట్లు ■ మార్చి 31 వరకు దరఖాస్తు గడువు ■ ఏప్రిల్ 12న ప్రవేశ పరీక్ష

చీడికాడ, నెహ్రూచౌక్ (అనకాపల్లి), న్యూస్‌టుడే: ఏపీ ఆదర్శ పాఠశాలల్లో 2026-27 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశాలకు విద్యాశాఖ దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఈ నెల 23 నుంచి మార్చి 31 వరకు అర్హులైన వారంతా సమీపంలోని ఆదర్శ పాఠశాలలకు దరఖాస్తు చేయవచ్చు. బాలబాలికలకు ఆంగ్లంలో ఉచిత బోధన అందిస్తారు. రాత పరీక్ష నిర్వహించి ప్రతిభ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు.

■ జిల్లాలో మంచాల (చీడికాడ), మరుపాక (రావికమతం), వేములపూడి (నర్సీపట్నం), తేగాడ (కశింకోట), పాటిపల్లి (మునగపాక)లో ఆదర్శ పాఠశాలలు ఉన్నాయి. ఆరో తరగతిలో ప్రవేశానికి ఒక్కో పాఠశాలలో వంద చొప్పున 500 సీట్లు ఉన్నాయి. ఆరో తరగతిలో చేరితే ఇంటర్మీడియట్ వరకు ఉచితంగా చదువుకోవచ్చు. ■ ఓసీ, బీసీ విద్యార్థులు 2014 సెప్టెంబరు ఒకటి నుంచి 2016 ఆగస్టు 31లోపు జన్మించి ఉండాలి. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 2012 సెప్టెంబరు ఒకటి నుంచి 2016 ఆగస్టు 31లోపు జన్మించిన వారై ఉండాలి.

■ ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 2024-25, 2025-26 విద్యా సంవత్సరాల్లో చదివి ఉత్తీర్ణత సాధించాలి.

■ **దరఖాస్తు ఇలా..:** మార్చి 31 వరకు www.csc.ap.gov.in వెబ్‌సైటులో దరఖాస్తు చేయవచ్చు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.200, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.125 పరీక్ష రుసుం ఆన్‌లైన్‌లో చెల్లించాలి. ఫీజు చెల్లించగానే ఓ ప్రత్యేక నంబరు కేటాయిస్తారు. ఆ నంబరు ఆధారంగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఏప్రిల్ 12న తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఆయా ఆదర్శ పాఠశాలల్లో పరీక్షలు జరుగుతాయి. ఐదో తరగతి స్థాయిలో ఆబ్జెక్టివ్ విధానంలో ప్రశ్నపత్రం ఉంటుంది. ఓసీ, బీసీ విద్యార్థులు కనీసం 35 మార్కులు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 30 మార్కులు పొంది ఉండాలి. ప్రతిభ, రిజర్వేషన్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తామని మంచాల ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ **వెంకటలక్ష్మి** చెప్పారు.

మీ ఇంటిని ఇలాగే ఉంచుతారా!

వసతిగృహాల్లో అధ్వాన పారిశుద్ధ్యం ❑ సమస్యలపై స్పందించని సంక్షేమాధికారులు

పరిశీలన

నక్కపల్లి, పాయకరావుపేట, నర్సీపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే

ప్రభుత్వ వసతిగృహాల్లో విద్యార్థుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతున్నా యంత్రాంగం నిర్లక్ష్యంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. పారిశుద్ధ్య సమస్య, వంట తయారీ పరిసరాలు అధ్వానంగా ఉండటం, తాగునీరు కలుషితం శాపంగా మారుతోంది. ఇటీవల పోలవరం జిల్లా దేవరపల్లిలో పిల్లలకు వండి పెట్టే సరకుల్లో నాణ్యత లేకపోవడం వారిని ఆసుపత్రి పాల్జేసింది. గతంలో అనకాపల్లి జిల్లాలోనూ ఇలాంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. ఈ పరిస్థితులు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాల్సిన అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటంతో ముప్పు తప్పేలా లేదు. జిల్లాలో 30 ఎస్సీ, 36 బీసీ వసతిగృహాల పరిధిలో సుమారు తొమ్మిది వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. సమస్యలను అధికారులు పట్టించుకోకపోవడంతో విద్యార్థులకు అవస్థలు తప్పడంలేదు.

నక్కపల్లిలోని ఎస్సీ వసతి గృహంలో చేతులు కడిగే చోట మురుగు

■ నక్కపల్లి ఎస్సీ వసతిగృహంలో ప్రస్తుతం ఎస్సీ, బీసీ వసతిగృహాల బాలురు ఉంటున్నారు. ఇక్కడ చేతులు కడిగే చోట నీరు బయటకు పోయే దారి లేక మురుగు తటాకంలా మారింది. వసతిగృహం చుట్టూ మురుగు కాలువ ఉంది. దుర్గంధంతోపాటు పందులు, దోమలకు ఆవాసమైంది. ■ గొడిచెర్ల బీసీ వసతిగృహంలో విద్యార్థులను తాగునీటి కష్టాలు వేధిస్తున్నాయి. ఉప్పు నీటినే తాగాల్సి వస్తోంది. ఇక్కడి సమస్యను ఎవరూ పట్టించుకోవడంలేదు.

■ మంత్రి అనిత పాయకరావుపేటలోని బాలికల జూనియర్ కళాశాల వసతిగృహం పరిశీలించినప్పుడు అధ్వాన పరిస్థితులు చూసి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఫలితంగా ఇక్కడి మహిళా వార్డెన్ సస్పెన్షన్ గురయ్యారు. అయినప్పటికీ ఇక్కడ పెద్దగా మార్పు లేదు. ఎస్సీ బాలుర వసతిగృహం అద్దె భవనంలో నడుస్తోంది. ఇందులో పారిశుద్ధ్య లోపం తీవ్రంగా వేధిస్తోంది. ■ నర్సీపట్నం ఎస్సీ బాలుర వసతిగృహంలో వంటగది నుంచి వచ్చే వాడుక నీరు పోయే మార్గం లేక ఆవరణలో నిలుస్తోంది. భవనం పెచ్చులూడి పడుతున్నాయి. ఇందులోనే విద్యార్థులు ఉంటున్నారు. 130 మంది విద్యార్థులకు తొమ్మిది మరుగుదొడ్లే ఉన్నాయి.

■ **పారిశుద్ధ్యంపై దృష్టిసారిస్తాం:** వసతిగృహాల్లో పారిశుద్ధ్య ఇబ్బందులు తొలగించేందుకు ప్రభుత్వం ఏజెన్సీకి బాధ్యతలు అప్పగించింది. ప్రస్తుతం వాడుక నీరు నిల్వ ఉండకుండా చూస్తున్నాం. ఇంకుడు గుంతలు తవ్వి అందులోకి మళ్లిస్తున్నాం. ఎక్కడైనా ఇబ్బందులుంటే పరిష్కరిస్తాం. ఆహారంలో నాణ్యతాలోపం తలెత్తకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తాం. **- బి.రామానందం, డీడీ, సాంఘిక సంక్షేమ శాఖ**

నూకాలమ్మ శోభాయాత్రకు శ్రీకారం

8న ఆలయం ప్రారంభం

అనకాపల్లి, న్యూస్‌టుడే: ఉత్తరాంధ్ర భక్తుల ఇలవేల్పు అనకాపల్లి నూకాలమ్మ నూతన ఆలయాన్ని మార్చి 8న ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ తెలిపారు. ఇందుకు సంబంధించిన గోడప్రతులను ఆదివారం ఆవిష్కరించారు. అమ్మవారి ఉత్సవ విగ్రహంతో శోభాయాత్రకు జెండా ఊపారు. ఆలయ పునఃప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రులు, ఉత్తరాంధ్రలోని ప్రజాప్రతినిధులు హాజరవుతారని పేర్కొన్నారు. మార్చి 5 నుంచి కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. 8వ తేదీ ఉదయం 10.58 గంటలకు కలశ స్థాపనకు ముహూర్తం ఖరారైందని చెప్పారు. 17 నెల జాతర ప్రారంభమవుతుందన్నారు. వైస్సు పీలా నాగశ్రీను, ఈఓ శ్రీధర్, కార్పొరేటర్ వైస్సు మళ్ల సురేంద్ర, పీవీజీ కుమార్, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

రంజాన్ వేళలు
ఇఫ్తార్: సోమవారం సాయంత్రం 6:05 గం॥లకు
సహరి: మంగళవారం తెల్లవారుజాము 5:03 గం॥లకు

గోడప్రతులు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ తదితరులు

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

జ్ఞానభూమి యాప్‌లో రూట్ మ్యాప్

ఎలమంచిలి, నక్కపల్లి, న్యూస్‌టుడే: ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు సోమవారం నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. పరీక్షల సంబంధించి కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఇంటర్ బోర్డు జిల్లా అధికారి వినోద్‌బాబు చెప్పారు. పరీక్షా కేంద్రాలు సులభంగా తెలిసేలా ఆయా కూడళ్లలో బ్యానర్లు ఏర్పాటు చేశారు. జ్ఞానభూమి యాప్ ద్వారా పరీక్షా కేంద్రాల రూట్‌మ్యాప్ తెలుసుకోవచ్చు. ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చినా అనుమతించరు.

వినోద్‌బాబు

■ జిల్లాలో ఈ ఏడాది ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు 13,153 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 13,148 మంది పరీక్షలకు హాజరుకానున్నారు. కేంద్రాల్లోకి ఉదయం 8.30 గంటల నుంచి అనుమతిస్తారు. హాల్ టికెట్, పెన్నులు మినహా ఇతర వస్తువులను తీసుకువెళ్లకూడదు. తనిఖీలకు సంబంధించి సిట్టింగ్ స్క్వాడ్, ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశారు. ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు పరిశీలిస్తారు. పరీక్షా కేంద్రాలను నో ఫోన్ జోన్‌గా ప్రకటించారు. చీఫ్ సూపరింటెండెంట్లు పరీక్షల నిర్వహణలో భాగంగా బేసిక్ ఫోన్ ఉపయోగించవచ్చు. ■ ఫీజు బకాయిలు ఉన్నాయని హాల్‌టికెట్లు ఇవ్వకుండా ఎవరైనా ఇబ్బంది పెడితే చర్యలు తీవ్రంగా ఉంటాయి. ప్రైవేటు కళాశాల యాజమాన్యాలు ఎక్కడైనా ఇలాంటి చర్యలకు పాల్పడితే డిజిటల్ హాల్ టికెట్ పొందవచ్చు. మన మిత్ర వాట్సాప్ నంబరు 95523 00009కు 'హాయ్' అని మెసేజ్ పెట్టి హాల్ టికెట్ పొందవచ్చు. వాటిపై ప్రిన్సిపల్ సంతకం లేకపోయినా పరీక్షలకు అనుమతిస్తారని ఇంటర్ బోర్డు జిల్లా అధికారి వినోద్‌బాబు చెప్పారు.

పరీక్షా కేంద్రాలు	34
సీసీ కెమెరాలు	595
ఇన్విజిలేటర్లు	500
విద్యార్థులు	26,301
సమయం	ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు
కంట్రోల్ రూం నంబర్లు	0892 422 0224, 83099 18638

ఆరోగ్యమే విజయానికి తొలిమెట్టు

పరీక్షల వేళ అశ్రద్ధ వద్దు

నర్సీపట్నం, న్యూస్‌టుడే: పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించడం ఎంత ముఖ్యమో ఆరోగ్యాన్ని కాపాడుకోవడమూ అంతే ముఖ్యం. ఆరోగ్యంగా ఉంటేనే విజయానికి తొలిమెట్టు. పరీక్షల సమయంలో ఆరోగ్యం క్షీణిస్తే ఏడాదిపాటు చదివిందంతా వృథా అవుతుంది. ఆహారపు అలవాట్లు మార్చుకుంటే మెరుగైన ఫలితాలు సాధించవచ్చు. రోజూ పోషకాహారం తీసుకోవడం తప్పనిసరి. చదువులో పడి ఆకలిని విస్మరిస్తే మొదటికే మోసం వస్తుంది. చదివింది గుర్తుపెట్టుకుని పరీక్షల్లో రాయడం ఒక ఎత్తు. పరీక్షకు శారీరక, మానసిక సన్నద్ధత మరో ఎత్తు. పోషకాహారం ఇందుకు ఎంతో ఉపకరిస్తుంది. వైద్యాధికారులు, పోషకాహార నిపుణులు విద్యార్థులకు పలు సూచనలు చేస్తున్నారు.

★ ఉదయం అల్పాహారం 8.30 గంటల్లోగా తీసుకోవాలి. సులభంగా జీర్ణమయ్యే ఇడ్లీ, ఉడికించిన కోడి గుడ్లు, గ్లాసు పాలు తీసుకోవచ్చు. ★ రాత్రుళ్లు నానబెట్టి తొక్క తీసిన మూడు, నాలుగు బాదం పప్పు గింజలు తినాలి. దీని వల్ల మెదడుకు గ్లూకోజ్ అంది చదివింది బాగా గుర్తుంటుంది. ★ మధ్యాహ్నం ఒంటి గంటలోగా పప్పు, కాయగూరలతో భోజనం, కొద్దిగా పెరుగు తీసుకోవాలి. మూడు గంటలకు అల్పాహారంగా కూరగాయల సలాడ్/ బిస్కెట్లు, సాయంత్రం ఉడికించిన శనగలు, వేరుసెనగ చిక్కీ తీసుకోవచ్చు. ★ రాత్రి 8 గంటల్లోగా భోజనం ముగించాలి. కొద్దిగా అన్నం, కూరతో రెండు చపాతీలు తినొచ్చు. నిద్రకు ముందు గ్లాసు గోరువెచ్చని పాలు తాగాలి. ★ రోజులో రెండు నుంచి మూడు లీటర్ల శుభ్రమైన నీరు తాగాలి. 8 గంటలపాటు నిద్ర అవసరం. కొబ్బరి నీళ్లు, తాజా పండ్ల రసాలు తాగడం వల్ల ఏకాగ్రత పెరుగుతుంది. ★ తగినంత నిద్ర, పోషకాహారంతో చురుగ్గా ఉండి పరీక్షలు బాగా రాయగలుగుతారు. జంక్ ఫుడ్స్, కూల్ డ్రింక్స్‌కు దూరంగా ఉండాలని చీడిగుమ్మల పీహెచ్‌సీ వైద్యాధికారిణి **వనిత** సూచిస్తున్నారు.

జిల్లా స్థాయి సైక్లింగ్ పోటీలు రేపు

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: అనకాపల్లిలో ఈ నెల 24న జిల్లాస్థాయి సైక్లింగ్ పోటీలు జరగనున్నాయి. శాప్ లీగ్స్ క్రీడా పోటీల్లో భాగంగా జిల్లా స్థాయిలో గెలుపొందిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు క్రీడాభివృద్ధి అధికారిణి శైలజ చెప్పారు. అండర్-18 విభాగంలో ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 93327 77778, 81254 16870 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

ఎనిమిది పదుల వయసులో మూడు స్వర్ణాలు

చోడవరం, న్యూస్‌టుడే: చోడవరానికి చెందిన పతకాల బామ్మ ముత్యం లక్ష్మి(80) మరో మూడు స్వర్ణాలు తన ఖాతాలో వేసుకున్నారు. జాతీయ స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్-2026లో జావెలిన్, డిస్కస్‌త్రో, షాట్‌పుట్‌లో ప్రథమ స్థానంలో నిలిచి పతకాలు అందుకున్నారు. మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌లో జరిగిన 45వ జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్-2026 పోటీల్లో ఈ ఘనత సాధించారు. 85 ఏళ్ల నుంచి 90 ఏళ్ల విభాగంలో మూడు ఈవెంట్లతో పాల్గొని సత్తా చాటారు.

జావెలిన్ త్రో విసురుతున్న లక్ష్మి

సర్వే.. సంక్షేమానికి మార్గదర్శనం

అర్హులకు పథకాలు అందించడమే లక్ష్యం

అచ్యుతాపురం, ఎలమంచిలి, న్యూస్‌టుడే: అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించి వారి మోముపై చిరునవ్వులు చూడాలనే లక్ష్యానికి కూటమి ప్రభుత్వం మరింత పదును పెట్టింది. సంక్షేమ పథకాలు పక్కాగా అమలుకు చర్యలు తీసుకుంది. ఏకీకృత కుటుంబ సర్వే పేరుతో ఇంటింటికి వెళ్లి ప్రజల ఆర్థిక, సామాజిక, ఆరోగ్య, విద్య సమాచారాన్ని సేకరించడంతో సిబ్బంది నిమగ్నమయ్యారు.

■ ఏకీకృత కుటుంబ సర్వేలో భాగంగా కుటుంబానికి సంబంధించిన మొత్తం సమాచారాన్ని ఒకే డిజిటల్ ప్లాట్‌ఫాం మీదకు తీసుకురావడానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే (యూఎఫ్ఎస్) పేరుతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించింది. ప్రభుత్వం నుంచి అందే సంక్షేమ పథకాలతోపాటు ప్రజలకు అవసరమైన అన్ని ధ్రువపత్రాలను క్షణాల్లో జారీ చేసేందుకు ఉపయోగపడేలా ఈ సర్వేను రూపొందించారు. ప్రభుత్వపరంగా అందించే సేవలు, సంక్షేమానికి సర్వేను ప్రామాణికంగా తీసుకోనున్నారు.

■ గతంలో వైకాపా ప్రభుత్వం నిర్వహించిన హౌస్ హోల్డ్ సర్వే తప్పులతడకగా ఉండటం, అర్హులకు పథకాలు అందకపోవడంతో కూటమి ప్రభుత్వం ఏకీకృత సర్వే నిర్వహిస్తోంది. ప్రతి ఇంటికి సంబంధించిన సమగ్ర వివరాలను తెలుసుకోవడంతోపాటు సంబంధిత ధ్రువపత్రాలను ఆధార్‌తో లింక్ చేస్తున్నారు. దీని వల్ల నకిలీలను నివారించడంతోపాటు అర్హులకు పథకాలు అందనున్నాయి. గిరిజన గ్రామాలు, కొండప్రాంతాలు, దట్టమైన అటవీ ప్రాంతాల్లో సైతం సర్వే చేపట్టాలని నిర్దేశించారు.

దేవరాపల్లిలో సర్వే చేస్తున్న సచివాలయ ఉద్యోగిని

■ జిల్లాలో 24 మండలాలు, రెండు మున్సిపాలిటీలు, జీవీఎంసీ పరిధిలో 5,60,129 గృహాలు ఉన్నాయి. గతేడాది ప్రభుత్వం యూఎఫ్ఎస్ కార్యక్రమాన్ని జిల్లాలో 711 గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ప్రారంభించింది. ఇప్పటివరకు 4,11,291 ఇళ్ల సర్వే పూర్తయింది. 1,48,838 గృహాలకు సర్వే సిబ్బంది వెళ్లి వివరాలు సేకరించాల్సి ఉందని సచివాలయాల పర్యవేక్షణ అధికారిణి ఎస్.మంజులవాణి చెప్పారు.

28 వరకు పొడిగింపు..

కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఉద్యోగులు సర్వేలో పాల్గొనకపోవడం, సాంకేతిక కారణాలు, ఇళ్ల వద్ద కుటుంబ వివరాలు లభ్యం కాకపోవడంతో ఇన్నాళ్లూ సర్వే ముందుకు సాగలేదు. జిల్లాలో డిసెంబరు 18న సర్వే ప్రారంభమైంది. ఒక్కో సచివాలయ ఉద్యోగి 250 కుటుంబాలను సర్వే చేయాలి. జిల్లా వ్యాప్తంగా 45 శాతమే పూర్తవడంతో తాజాగా ప్రభుత్వం ఈ నెల 28 వరకు గడువు పొడిగించింది.

నేడు 'డయల్ యువర్ సీఎండీ'

విశాఖపట్నం, న్యూస్‌టుడే: విద్యుత్తు సంబంధ సమస్యలను మరింత వేగవంతంగా పరిష్కరించే లక్ష్యంతో గురుద్వారాలోని ఈపీడీసీఎల్ కార్యాలయంలో సోమవారం 'డయల్ యువర్ సీఎండీ' కార్యక్రమం నిర్వహించనున్నట్లు సంస్థ సీఎండీ పృథ్వీతేజ్ తెలిపారు. సంస్థ పరిధిలోని 13 జిల్లాలకు చెందిన వినియోగదారులు 86884 00499 నంబరుకు ఫోన్ చేసి సమస్యలు తెలియజేయవచ్చన్నారు. ఉదయం 10.30 నుంచి 11.30 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. విద్యుత్తు సరఫరాలో తరచూ అంతరాయాలు, హెచ్చుతగ్గులు, కొత్త సర్వీసుల జారీ, సరఫరా పునరుద్ధరణలో జాప్యం, ట్రాన్స్‌ఫార్మర్ల మార్పిడి తదితర సమస్యలపై నేరుగా ఫోన్ చేసి తెలియజేయవచ్చన్నారు.

నేటి నుంచి యూసీసీ క్రికెట్ టోర్నీ

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే: యునైటెడ్ క్రికెట్ క్లబ్ (యూసీసీ) 12వ మెగా టోర్నీ సోమవారం నుంచి ప్రారంభం కానుంది. రైల్వే స్టేడియం, ఏసీఏ-వీడీసీఏ అంతర్జాతీయ స్టేడియంలో ఈ నెల 27 వరకు పోటీలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. రైల్వే స్టేడియంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆయా జట్ల కెప్టెన్లు పాల్గొని జెర్సీలు ఆవిష్కరించారు. తొలి మ్యాచ్ రైల్వే స్టేడియంలో రైల్వే జట్టు, వైజాగ్ బ్లూస్ జట్ల మధ్య జరుగుతుందని యూసీసీ కార్యదర్శి వెంకటేష్ చెప్పారు.

'ఉగాది'కి చేదు కష్టమేనా..

విశాఖపట్నం, న్యూస్‌టుడే: ఉగాది పేరు చెప్పగానే గుర్తుకు వచ్చేది వేపపువ్వు. ఈ ఏడాది షడ్రుచుల పచ్చడిలో వేప పువ్వు కలవడం కష్టమయ్యేలా కనిపిస్తోంది. గడచిన మూడేళ్లుగా వేప చెట్లను పట్టి పీడిస్తున్న 'డైబ్యాక్' (కొమ్మల ఎండు తెగులు) ఈ సారి మరింత ఉగ్రరూపం దాల్చింది. నగరంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడ చూసినా ఎనభై శాతానికి పైగా చెట్లు ఆకులు ఎండిపోయి మోడుల్లా దర్శనమిస్తున్నాయి. సాధారణంగా ఏటా ఫిబ్రవరిలో వేపచెట్లు చిగురించి తెల్లని పూతతో కళకళలాడుతుండేవి. మరో నెల రోజుల్లో ఉగాది పర్వదినం రానున్న నేపథ్యంలో ఎండిన వేపచెట్లు చూసి ప్రజలు నిరుత్సాహ పడుతున్నారు. మిగిలిన చెట్లన్నీ పచ్చదనంతో కళకళలాడుతుండగా కేవలం వేప చెట్లకే ఈ గండం రావడం పర్యావరణ ప్రేమికులను సైతం కలవరపెడుతోంది. దీనిపై మధురవాడ జోన్ ఉద్యానవన విభాగం అధికారి గుప్త మాట్లాడుతూ.. వాతావరణ మార్పులు, 'ఫోమోప్సిస్ అజాడిరాక్టే' అనే శిలీంధ్రం తెగులు వ్యాపించడం వల్ల వేపచెట్లు ఆకులు ఎండిపోవడం, క్రమంగా చెట్టు మొత్తం వాడిపోవడం జరుగుతుందన్నారు. తద్వారా పూత పూయాల్సిన దశలో చెట్లు శక్తిని కోల్పోవడం తెగులు ప్రధాన లక్షణమన్నారు.

ఆటపాటలతో ఆనంద ఆదివారం

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: బాలికల కూచిపూడి, జానపద నృత్యాలు, సినిమా పాటలకు యువకుల డ్యాన్స్‌లు, క్విజ్ పోటీలకు ఆదివారం ఉదయం ఎన్టీఆర్ మినీ స్టేడియం వేదికైంది. 'హ్యాపీ సండే' కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన వేదికపై అన్ని వయసుల వారు సందడి చేశారు. ధనం మాస్టారి శిష్యులు ప్రదర్శించిన జానపద నృత్యం ఆకట్టుకుంది. ప్రతిభను వెలికి తీసేందుకు వారాంతంలో నిర్వహించే హ్యాపీ సండే ఓ వేదికగా నిలుస్తుందని మున్సిపల్ కమిషనర్ సురేంద్ర చెప్పారు. అన్ని వర్గాల భాగస్వామ్యంతో మరింత ఉత్సాహంగా కొనసాగిస్తామని పేర్కొన్నారు.

చిన్నారుల నృత్యం

అంబా.. నీళ్లేవి?

☛ అక్కరకు రాని నీటితొట్టెలు
☛ వేసవిలో తప్పని ఇక్కట్లు

నర్సీపట్నం గ్రామీణం, నక్కపల్లి, బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే

ప్రభుత్వ లక్ష్యాన్ని నీరు గార్చడం అధికార యంత్రాంగానికి పరిపాటిగా మారింది. మూగజీవాలకు గుక్కెడు నీరందించాలనే సదుద్దేశంతో ప్రతిష్ఠాత్మకంగా ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించిన నీటి తొట్టెలు చాలాచోట్ల అక్కరకు రాకుండాపోయాయి. గ్రామాల్లో వ్యవసాయం తర్వాత ఎక్కువ మంది పాడి పరిశ్రమ పైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. గేదెలు, ఆవులు, మేకలు, గొర్రెలను పశుగ్రాసం నిమిత్తం గ్రామాల శివారు ప్రాంతాలకు, సమీపంలోని అటవీ ప్రాంతానికి తోలుకెళ్తుంటారు. వేసవి సమీపిస్తుండటంతో చెరువుల్లో నీరు అడుగంటి పశువుల దాహార్తి తీర్చేందుకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం గతేడాది జిల్లా వ్యాప్తంగా 24 మండలాల పరిధిలో రూ.1.2 కోట్లతో 401 నీటి తొట్టెలు నిర్మించింది.

బుచ్చెయ్యపేట మండలం కోమళ్లపూడిలో నిరుపయోగంగా..

■ జిల్లాలో ఎలమంచిలి, గొలుగొండలో 27, సబ్బవరం 26, రాంబిల్లి, బుచ్చెయ్యపేటలో 20, అనకాపల్లిలో 19, నాతవరం, రాంబిల్లి, మునగపాక, రోలుగుంట, కె.కోటపాడు మండలాల్లో 17 చొప్పున నిర్మించగా, మిగిలిన చోట్ల ఇంతకంటే తక్కువగా ఉన్నాయి. ఈ తొట్టెలను కుళాయి నీటితో నింపాలి. వారానికి రెండుసార్లు శుభ్రం చేయాల్సి ఉన్నా.. ఎక్కాడా అమలు కావడం లేదు. చాలాచోట్ల నీటి వసతి కల్పించకుండానే తొట్టెలను వదిలేశారు. పంచాయతీలు దృష్టిసారిస్తే పశువులకు దాహార్తి తీరుతుంది.

■ నక్కపల్లి మండలం అమలాపురంలో తొట్టె నిర్మించి కుళాయి కనెక్షన్ ఇచ్చినా నీరు రావడం లేదు. పాటిమీద గ్రామ శ్మశానం వద్ద నీటి సదుపాయం లేకుండా తొట్టె కట్టి వదిలేశారు. సమీపంలో బోరు ఉన్నా ట్యాంకులోకి నీరు చేరే పరిస్థితి లేదు. ఉపాధి శ్రామికులు, పంచాయతీ హరిత రాయబారులతో నీటిని తోడి పోయిస్తే పశువుల దాహార్తి తీరుతుంది.

■ నర్సీపట్నం మండలంలో తొమ్మిది పంచాయతీల్లో నీటితొట్టెలు నిర్మించారు. మొదట్లో నీటితో నింపినా తర్వాతర్వాత వదిలేశారు. ప్రస్తుతం నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. కొన్నిచోట్ల శ్మశానాల్లో నిర్మించారు. ఇక్కడ చేతిపంపులున్నా నీరు వెళ్లే దారిలేదు.

■ బుచ్చెయ్యపేట మండలంలో కోమళ్లపూడి, కృష్ణానగర్, దిబ్బిడి, బంగారుమెట్ట, వడ్డాది సంతబయలు, కస్పారోడ్డు తదితర ప్రాంతాల్లో 18 నీటితొట్టెలు నిర్మించారు. కృష్ణానగర్‌లో నిర్మించిన తొట్టెకు సమీపంలో చేతిపంపు ఉన్నా నీరు చేరే పరిస్థితి లేదు. కొన్నిచోట్ల నాచుపట్టి కనిపిస్తున్నాయి. కస్పారోడ్డులో తొట్టెకు పగుళ్లు ఏర్పడ్డాయి.

కొత్త ఉప్పు వచ్చిందోచ్!

కొంతకాలంగా నిలిచిపోయిన ఉప్పు పంట తిరిగి ప్రారంభమైంది. ఎస్.రాయవరం మండలం రేవుపోలవరం, చినఉప్పలం, అచ్యుతాపురం మండలం పూడిమడక తదితర ప్రాంతాల్లో కొత్తగా వేసిన ఉప్పు పంట చేతికి అందడంతో రైతులు విక్రయాలు ప్రారంభించారు. కొద్ది రోజులుగా ఎండ తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో తొలినాబు తీశారు. జిల్లాలో పాయకరావుపేట నుంచి భీమునిపట్నం వరకు సముద్రతీర ప్రాంతం విస్తరించి ఉంది. తీరం వెంబడి పలుచోట్ల రైతులు గళ్లీలు సిద్ధం చేసుకుని ఉప్పు పండిస్తున్నారు. ఈ పంటపై ఆధారపడి వేలాది మంది కూలీలు ఉపాధి పొందుతున్నారు. ప్రత్యేకంగా తమిళనాడు నుంచి ఉప్పు సాగులో నైపుణ్యం ఉన్న వారు ఇక్కడకు వచ్చి పనిచేస్తుంటారు. గతేడాది తుపాన్లు, అల్పపీడనాల వల్ల వరుసగా మూడు నెలలపాటు వర్షాలు పడ్డాయి. నదులు పొంగి ప్రవహించాయి. చాలాచోట్ల ఉప్పు మడులు దెబ్బతిన్నాయి. వాటికి మళ్లీ మరమ్మతులు చేసి ఉప్పు సాగు ప్రారంభించారు. జిల్లాలో 300 ఎకరాల్లో ఉప్పు సాగవుతోంది. ప్రస్తుతం 150 ఎకరాల్లో తొలి పంట వచ్చింది. ప్రస్తుతం క్వింటాల్ ఉప్పు ధర రూ.550 పలుకుతోంది. ఎకరాకు 20 బస్తాల దిగుబడి వచ్చిందని రైతులు పేర్కొన్నారు.

– న్యూస్‌టుడే, ఎలమంచిలి, అచ్యుతాపురం

పూడిమడకలో ఉప్పు నిల్వలు

కార్యకర్తలకు వేదికగా తెదేపా కార్యాలయం

అనకాపల్లి, న్యూస్‌టుడే: అనకాపల్లిలో తెదేపా జిల్లా కార్యాలయ భవనానికి హోం మంత్రి అనిత ఆదివారం శంకుస్థాపన చేశారు. నూతన కార్యాలయం కార్యకర్తలకు వేదికగా ఉంటుందని, ప్రజా సమస్యల పరిష్కారానికి కేంద్ర బిందువుగా నిలుస్తుందన్నారు. పార్టీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బత్తుల తాతయ్యబాబు, లాలం కాశీనాయుడు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, నాయకులు పప్పల చలపతిరావు, పీలా గోవిందసత్యనారాయణ, బుద్ధ నాగజగదీశ్వరరావు, కోట్ని బాలాజీ, పీవీజీ కుమార్, మళ్ల సురేంద్ర, ప్రగడ నాగేశ్వరరావు, గండి బాబ్జి, పార్టీ నాయకులు దాడి రత్నాకర్, చింతకాయల రాజేష్ పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న మంత్రి అనిత

రైల్వేస్టేషన్‌లో పర్యటిస్తున్న ఏడీఆర్ఎం రామారావు, అధికారులు

ప్రయాణికులకు మెరుగైన సేవలు

విశాఖపట్నం, న్యూస్‌టుడే : రైల్వే ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని తూర్పు కోస్తా రైల్వే వాల్తేర్ ఏడీఆర్ఎం కె.రామారావు తెలిపారు. ఆదివారం ఆయన విశాఖ రైల్వేస్టేషన్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆన్ బోర్డు హౌస్‌కీపింగ్ సిబ్బంది, లినెన్ సరఫరాదారులతో మాట్లాడారు. ప్రయాణికులకు పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించాలని, ప్రతి ఒక్కరితో మర్యాదగా మాట్లాడాలని సూచించారు. అనంతరం సిబ్బంది, సూపర్‌వైజర్లు, హెల్త్ ఇన్‌స్పెక్టర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు.

కొండైనా కొట్టేస్తాం.. వాగైనా కప్పేస్తాం!

- ఇష్టారాజ్యంగా ప్రభుత్వ భూమిలో రోడ్డు నిర్మాణం
- భూముల విలువ పెంచుకోవడానికి ఓ నేత పన్నాగం

ఆనందపురం, న్యూస్‌టుడే

ఆనందపురం మండలం ఇచ్ఛాపురం గిరిజన గ్రామంలో ఆక్రమణదారులు రెచ్చిపోతున్నారు. తమ భూముల విలువను పెంచుకోవడానికి కొండను తవ్వి, వాగును పూడ్చేసి రోడ్డును నిర్మిస్తున్నారు. కిలోమీటరుకు పైగా 30అడుగుల వెడల్పుతో భారీ యంత్రాలతో ఆయా పనులు సాగుతున్నాయి. ఇంత జరుగుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు.

గెడ్డవాగుపై నుంచి కల్వర్టు నిర్మాణం

గత ప్రభుత్వ హయాంలో..: గిరిజనులకు కొంత జిరాయితీ, డి-పట్టా భూములున్న ఇచ్ఛాపురం గ్రామంపై వైకాపాకు చెందిన ఓ మాజీ ప్రజాప్రతినిధి కన్ను పడింది. ఈ నేపథ్యంలో ఫ్రీహోల్డ్ చేసుకునేందుకు 2019లోనే తక్కువ ధరకు కొందరు గిరిజనుల నుంచి సుమారు 50 ఎకరాలు కొనుగోలు చేశాడు. ఆయా భూముల్లోకి వెళ్లేలా రహదారి నిర్మించేందుకు 2020లోనే ప్రయత్నించాడు. నాడు స్థానిక గిరిజన పెద్దలు అడ్డుకోవడంతో నిర్మాణం ఆగిపోయింది. అప్పట్లో అడ్డుకున్న వారిలో కొందరు పెద్దలు ఇటీవల మరణించడంతో ఆ నేత అమాయకులైన కొందరు గిరిజనులకు మాయమాటలు చెప్పి మళ్లీ రోడ్డు నిర్మాణం ప్రారంభించాడు.

వెలుగులోకి ఇలా..: గిరిజనుల భూముల్లో నుంచి దొడ్డిదారిన రహదారి నిర్మించడంపై పోలీసులు, గనుల శాఖ అధికారులకు ఫిర్యాదులందడంతో అక్రమం వెలుగులోకి వచ్చింది. ఈ విషయం బయటపడకుండా తామే రోడ్డు వేయించుకుంటున్నట్లు స్థానిక గిరిజనులతో చెప్పించే ప్రయత్నం చేస్తున్నారు. విచారణకు వచ్చిన రెవెన్యూ అధికారులకు అలానే చెప్పించారు. మరో వైపు గనుల శాఖ అధికారులు అక్కడి యంత్రాలను స్వాధీనం చేసుకుని పోలీసులకు అప్పగించారు. వాస్తవానికి అనుమతి లేకుండా అటవీ భూములకు సమీపంలో కొండలను తొలిచి రహదారి నిర్మించడం నేరం. దీన్నుంచి తప్పించుకునేందుకు కొంతమంది స్థానికులతో కలిసి ఆ నేత నాటకం ఆడుతున్నారు.

ఈ విషయమై తహసీల్దార్ శ్రీనుబాబును వివరణ కోరగా ప్రభుత్వ భూమిలోనైనా, సొంత స్థలాల్లోనైనా రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. గిరిజన గ్రామంలో రహదారి నిర్మాణంపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

బ్రిటిష్ సైనికుల వెన్నులో 'ఉయ్యాలవాడ' వణుకు

కలెక్టరేట్, న్యూస్‌టుడే: బ్రిటిష్ సైన్యం వెన్నులో వణుకు పుట్టించిన వీరుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చరిత్రలో ఎప్పటికీ నిలిచిపోతారని కలెక్టర్ విజయకృష్ణన్ పేర్కొన్నారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఉయ్యాలవాడ వర్ధంతి నిర్వహించారు. ముందుగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాబలంతో బ్రిటిష్ వారితో పోరాడారన్నారు. నేటి యువత ఆయన్ను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలన్నారు.

ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్

చర్చలు సజావుగా సాగాలి

పాయకరావుపేట, న్యూస్‌టుడే: మండలిలో చర్చలు సజావుగా సాగాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు అభిప్రాయపడ్డారు. తుని రైల్వేస్టేషన్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సభా సమయం వృథా కావడం వల్ల సమస్యలపై సంపూర్ణంగా చర్చ సాగడం లేదన్నారు. ఇకపై జరిగే సమావేశాల్లో ఇలా జరుగకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరుతామన్నారు. ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై ప్రధానంగా దృష్టి సారిస్తున్నామని పేర్కొన్నారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తున్న విధంగానే ఉపాధ్యాయ, ఉద్యోగుల ఇబ్బందులు తీర్చే విషయంలో సూపర్-7గా భావించి పరిష్కరించాలన్నారు. సీపీఎస్ రద్దు విషయంలోనూ ఉద్యోగులు ఆవేదనను అర్థం చేసుకోవాలన్నారు. పదవీ విరమణ తర్వాత వచ్చే పింఛనుపైనే ఉద్యోగి ఆధారపడతారని చెప్పారు. సీపీఎస్ వల్ల ఉద్యోగ అనంతరం ఇబ్బందులు పడే అవకాశముందన్నారు. సమస్యల పరిష్కారాన్ని వేగవంతం చేయాలన్నారు. దీంతోపాటు పాఠశాలల్లో బోధనేతర పనులను ఉపాధ్యాయులకు అప్పగించవద్దన్నారు. పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డి.గోపీనాథ్, మండలశాఖ అధ్యక్షుడు ఎ.వి.సూర్యనారాయణ (ప్రకాష్), ప్రధాన కార్యదర్శి హరికృష్ణ, వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శ్రీనివాసులునాయుడు

అప్పన్న సన్నిధిలో పట్నా హైకోర్టు న్యాయమూర్తి

సింహాచలం, న్యూస్‌టుడే: పట్నా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.అనుపమ చక్రవర్తి కుటుంబ సమేతంగా సింహాద్రి అప్పన్న స్వామిని దర్శించుకున్నారు. వారికి డిప్యూటీ ఈవో సింగం రాధ, అర్చకులు స్వాగతం పలికారు. కప్పస్తంభం ఆలింగనం చేసుకుని బేడామండపం ప్రదక్షిణం చేశారు. అంతరాలయంలో స్వామిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. పండితులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. డిప్యూటీ ఈవో రాధ స్వామివారి ప్రసాదం, చిత్రపటం, శేషవస్త్రాలు అందజేశారు.

జస్టిస్ అనుపమ చక్రవర్తి దంపతులకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న డిప్యూటీ ఈవో రాధ

పురస్కారం అందుకుంటున్న విశ్వేశ్వరరావు (అనకాపల్లి)

డాక్ సేవక్‌లకు పురస్కారాలు

గుంటూరు (ఏటీ అగ్రహారం), న్యూస్‌టుడే: గుంటూరు నగర శివారులోని సత్యసాయి ఆధ్యాత్మిక నగరిలో ఆదివారం జాతీయ స్థాయి గ్రామీణ డాక్ సేవక్ సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా రాష్ట్రంలో ఉత్తమ పనితీరు కనబర్చిన గ్రామీణ డాక్ సేవక్‌లకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పురస్కారాలు అందించి సత్కరించారు.

ఉద్యోగానికి ఆరు మెట్లు..!

- 'ఏఐ' ప్రభావంలోనూ అవకాశాలు
- విద్యార్థులకు నిపుణుల సూచనలు

ఈనాడు, విశాఖపట్నం

ప్రపంచ వ్యాప్తంగా అన్ని రంగాల్లో కృత్రిమ మేధ కీలకంగా మారుతోంది. ఇది ఉద్యోగాలపై ప్రతికూల ప్రభావం చూపుతుందనే ఆందోళన విద్యార్థులు, నిరుద్యోగుల్లో వ్యక్తమవుతోంది. అయితే మారుతున్న సాంకేతికతకు తగ్గట్టుగా ఎప్పటికప్పుడు కొత్త నైపుణ్యాలు నేర్చుకుంటే.. ఉద్యోగావకాశాలు పెరుగుతాయని నిపుణులు సూచిస్తున్నారు. ఏఐ ప్రభావం పెరుగుతున్న నేపథ్యంలో గీతం విశ్వవిద్యాలయంలో ఇటీవల నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు ఆరు నైపుణ్యాలపై దృష్టి సారించాలని నిపుణులు సూచించారు.

1 కొత్త అంశాలు నేర్చుకోవాలి: మార్పులను అందిపుచ్చుకుని, నిరంతరం కొత్త విషయాలను నేర్చుకోవాలనే ఆసక్తి ఉన్నవారినే కంపెనీలు ఎంపిక చేసుకుంటున్నాయి. మీకు ఎంత అనుభవమున్నా.. కొత్త అంశాలు నేర్చుకోవడంపై దృష్టి సారించాలి. సాంకేతికతను ఒత్తిడి పెంచే అంశంగా కాకుండా.. సరదాగా నేర్చుకోవాలి.

2 నైపుణ్యాలు కూడబెట్టుకుంటేనే..: ఏఐతో వివిధ కొత్త ఉద్యోగాలు పుట్టుకొస్తున్నాయి. ఎంట్రీ లెవెల్ ఉద్యోగాల అర్థాన్ని ఏఐ మారుస్తోంది. దీన్ని బాధ్యతాయుతంగా వినియోగించాలి. ఏదో ఒక నైపుణ్యముంటే ఉద్యోగం సాధించవచ్చని అనుకోవడం సరికాదు. మీరు ఎంత మేర నైపుణ్యాలను కూడబెట్టుకుంటే.. అన్ని ఎక్కువ అవకాశాలు వస్తాయి.

3 పరిమితులు వద్దు..: ఉద్యోగాలు తక్కువ.. అభ్యర్థులు ఎక్కువగా ఉంటే కంపెనీలు నియామకాలు తగ్గించుకోవాలని చూస్తాయి. కంపెనీల అవసరాలకు తగ్గట్టుగా మీలో మార్పులు చేసుకోవాలి. కేవలం విశాఖలోనో, దక్షిణాదిలోనో పనిచేస్తామని పరిమితులు పెట్టుకోవద్దు. ఆ పరిధి దాటి ఆలోచించండి.

4 సామర్థ్యాలను వివరించాలి: సైబర్ సెక్యూరిటీ రంగంలో ఉద్యోగం సాధించాలంటే.. ఆ విభాగంలో మీకున్న నైపుణ్యాలు, సామర్థ్యాలపై 30 సెకన్ల వీడియోను సామాజిక మాధ్యమాల్లో పంచుకోండి. ఆయా నిపుణుల కోసం చూస్తున్న కంపెనీలకు మీరు చేసిన వీడియో చేరుతుంది. రెండు వారాల్లోనే ఇంటర్వ్యూకు ఆహ్వానిస్తూ సమాచారం వస్తుంది.

5 సమస్య పరిష్కారానికే ప్రాధాన్యం..: ప్రస్తుతం నియామక ప్రక్రియలో.. మార్కుల కంటే నైపుణ్యాలకే ఎక్కువ ప్రాధాన్యమిస్తున్నారు. 9.5 సీజీపీఏ ఉన్నప్పటికీ.. 7.5 సీజీపీఏతో ఇంటర్న్‌షిప్, హ్యాకథాన్స్, ప్రాజెక్టులు, సమస్య పరిష్కారంలో ఎక్కువ అనుభవమున్న వారినే కంపెనీలు ఎంపిక చేసుకుంటున్నాయి.

6 ప్రాథమిక అంశాలపై శ్రద్ధ: ఇంజినీరింగ్ చివరి రెండేళ్లలో వీలైనన్ని ఎక్కువ ప్రాజెక్టులు చేయడంపై దృష్టి పెట్టాలి. ఎలాంటి పరిస్థితులనైనా తట్టుకునేందుకు సిద్ధంగా ఉండాలి. ఇంటర్వ్యూకు వెళ్లే ముందు రెజ్యూమ్ ప్రత్యేకంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. ఇంటర్వ్యూల్లో కంపెనీల ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు సూటిగా సమాధానం చెప్పగలగాలి.

భూములు లాక్కోవడం అన్యాయం

రాంబిల్లి, న్యూస్‌టుడే: దళిత రైతులకు ప్రభుత్వం ఇచ్చిన డి.పట్టా భూములు లాక్కోవడం అన్యాయమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తెలిపారు. జిల్లా పర్యటనకు వచ్చిన ఆయనను ఆదివారం సీపీఎం నాయకుల ఆధ్వర్యంలో పంచదార్ల దళిత రైతులు అనకాపల్లిలో కలిసి వినతిపత్రం అందజేశారు. 48 ఏళ్ల క్రితం ప్రభుత్వం తమకు ఇచ్చిన డి.పట్టా భూములను తప్పుడు పద్ధతుల్లో అధికారులు తీసుకోవాలని చూస్తున్నారని రైతులు వివరించారు. తాము 21 రోజులుగా శాంతియుతంగా నిరసన తెలియజేస్తున్నామని, తమకు అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.శంకరరావు, గంటా శ్రీరామ్, మండల కార్యదర్శి జి.దేవుడునాయుడు, నాయకులు చందక రామకృష్ణ, బాధిత రైతులు అప్పారావు, అబద్ధం, రాజు, రమేష్ పాల్గొన్నారు.

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావుకు వినతిపత్రం ఇస్తున్న రైతులు, నాయకులు

ప్రతిభావంతులకు ప్రోత్సాహకాలు

నగదు ప్రోత్సాహకాలు అందుకున్న విద్యార్థులు

ఎలమంచిలి గ్రామీణం, న్యూస్‌టుడే: పాఠశాల విద్యలో ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందించడానికి ములకలాపల్లి సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం ఎప్పుడూ ముందుంటుందని యూనిట్ హెడ్ రామస్వామి పేర్కొన్నారు. ఏటికొప్పాక, జంపపాలెం, పులపర్తి, పురుషోత్తపురం, రేగుపాలెం, సోమలింగపాలెం, స్టేషన్‌రోడ్డు, బాలికోన్నత, కొత్తపేట ఉన్నత పాఠశాలల్లో 8, 9 తరగతుల్లో అత్యధిక మార్కులు సాధించి ప్రస్తుతం 10వ తరగతి చదువుతున్న వారిలో ఒక్కో పాఠశాల నుంచి ముగ్గురికి ప్రథమ బహుమతి కింద రూ. 8 వేలు, ద్వితీయ- రూ.6 వేలు, తృతీయ- రూ.4 వేలు చొప్పున నగదు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

పబ్లిక్ నోటీస్

ఇందుమూలంగా యావత్ ప్రజానీకంనకు తెలియజేయునది నా క్లయింట్లు 1. బుద్ధ శ్రీనివాసరావు S/o (లేట్) నూకరాజు, అనకాపల్లి, 2. బుద్ధ కిషోర్ S/O (లేట్) వెంకటరావు, అనకాపల్లి, 3. మద్దాల నాగ శివ S/O (లేట్) పరదేశి నాయుడు, అనకాపల్లి, 4. శరకం వెంకట సింహాచలం S/o సత్యన్నారాయణ, విశాఖపట్నం గార్లు, మహారాజశ్రీ విశాఖపట్నం 6వ అదనపు జిల్లా కోర్టులో O.S.No.25/2026 ద్వారా షెడ్యూల్ దాఖలా ఆస్థి నిమిత్తం SPECIFIC PERFORMANCE దావా దాఖలు చేసి యున్నారు. సదరు దావాతో పాటుగా I.A No. 24/2026 కూడా దాఖలు చేసి యున్నారు. సదరు I.A No. 24/2026లో మహారాజశ్రీ విశాఖపట్నం 6వ అదనపు జిల్లా కోర్టు వారు తేది 10-02-2026న పై దావాలో ప్రతివాదిగా చేర్చిన Md. Noohman S/o late Abdul Rehaman, ఆశీపాప వీధి, AVN College దరి, విశాఖపట్నం. క్రింది షెడ్యూల్ దాఖలా ఆస్థిని ఎవ్వరికినీ (THIRD PARTY) విక్రయించకుండా ఉండగలందులకు INJUNCTION ORDERS జారీచేసి యున్నారు. సదరు ఆర్డర్స్ ప్రకారం పై ప్రతివాద ఆసామి Md.Noohman S/o late Abdul Rehaman గారికి, ఆశీపాప వీధి, AVN College దరి, విశాఖపట్నం. క్రింది షెడ్యూల్ దాఖలా ఆస్థిని విక్రయించు వీలు లేదు. అట్లు విక్రయించినప్పటికీ, కొన్నవారికి సక్రమమైన హక్కులు సంక్రమించవనిన్నీ మరియు సదరు క్రయం చట్టవిరుద్ధం అనిన్నీ, చెల్లనేరదనిన్నీ ఇందుమూలంగా యావన్మందికీ తెలియజేయడమయినది.

క్రయాస్తి వివరం: అనకాపల్లి జిల్లా, యలమంచిలి సబ్.డి, అచ్యుతాపురం మండలం, ఇరువాడ గ్రామంలో, చేరియున్నటు వంటి జిరాయితీ ఖాతా నెం.93రులో గల జిరాయితీ సర్వే నెంబరు 152/1,152/2 మరియు 152/3రులో చేరిన య.5- 22 సెంట్లు విస్తీర్ణంలో అనిర్దిష్టపు మరియు అవిభాజ్యపు సర్వే నెం 152/3లో చేరిన య1-74 సెంట్లు విస్తీర్ణం గల జిరాయితీ మెట్టు భూమికి హద్దులు :

1వ ప్రతి : తూర్పు: రస్తా మరియు ముప్పన రామ క్రిష్ణ మరియు ప్రసాద్ బాబుల భూములు; **పడమర** : మొహమ్మద్ గఫ్రూన్ గారికి విక్రయించిన జిరాయితీ మెట్టు.; **ఉత్తరం** : మొహమ్మద్ గఫ్రూన్ గారికి విక్రయించిన జిరాయితీ మెట్టు; **దక్షిణం** : రహదారి

2వ ప్రతి : య. 3-48 సెంట్లు విస్తీర్ణం గల జిరాయితీ మెట్టు భూమికి హద్దులు: **తూర్పు** : యర్ర చెరువు ఆక్రమణ మరియు మార్గం; **పడమర** : మొహమ్మద్ గఫ్రూన్ గారికి విక్రయించిన జిరాయితీ మెట్టు.; **ఉత్తరం** : హౌసింగ్ కాలనీ; **దక్షిణం** : ముప్పన రామక్రిష్ణ గారి జిరాయితీ మెట్టు.

పై సదరు 1వ, 2వ ప్రతులలో ఉన్న అనిర్దిష్టపు, అవిభాజ్యపు య 5-22 సెంట్లులో ఎక్కచ్చిగా య 2-00 సెంట్లు భూమి

యస్. నరసింగరావు, యాళ్ల సుధాబాబు

వాది తరుపు అడ్వకేట్స్ చోడవరం. Cell: 9989986535.

సౌత్‌జోన్ రగ్బీలో కాంస్య పతకం

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: సౌత్‌జోన్ రగ్బీ పోటీల్లో ఏపీ జట్టుకు కాంస్య పతకం దక్కింది. చెన్నైలో ఈ నెల 20 నుంచి 22 వరకు జరిగిన పోటీల్లో కేరళ మొదటి స్థానం, తమిళనాడు ద్వితీయ, ఏపీ తృతీయ స్థానంలో నిలిచాయని కోచ్ వెంకట్ చెప్పారు. విజేతలకు నటుడు నవీన్‌రాయ్, ఏపీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు రూ.48 వేల చెక్కు, పతకాలు అందజేశారు. ఆంధ్ర జట్టులో ఎక్కువమంది అచ్యుతాపురం మండలానికి చెందిన క్రీడాకారులే ఉన్నారు. తృతీయ స్థానంలో నిలిచిన జట్టు సభ్యులను, కోచ్ వెంకట్, మేనేజర్ దివ్యను అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు కూండ్రపు వెంకునాయుడు, కార్యదర్శులు జగదీశ్, సుధీర్, వెంకట్ ఆదివారం అభినందించారు.

క్రీడాకారులతో నిర్వాహకులు

సరకు రవాణాలో... 'విశాఖ పోర్టు' రికార్డు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: విశాఖ పోర్టు అథారిటీ (వీపీఏ) సరకు రవాణాలో సరికొత్త రికార్డును నెలకొల్పింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోని 327 రోజుల్లో (ఈనెల 21 వరకు) 80.08 మిలియన్ మెట్రిక్ టన్నుల (ఎంఎంటీ) సరకును రవాణా చేసింది. పోర్టు చరిత్రలో ఇదే ప్రథమమని ఛైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇదే ఉత్సాహంలో ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి 90 ఎంఎంటీ లక్ష్యాన్ని చేరుకుంటామని ఆశాభావం వ్యక్తం చేశారు. 2024-25 ఏడాదిలో 357 రోజుల్లో 80.11 ఎంఎంటీ సరకు, 2023-24 ఏడాదిలో 362 రోజుల్లో 80.02 ఎంఎంటీ సరకు రవాణా చేసినట్టు ఆయన వివరించారు. పోర్టు కార్యాచరణ, సిబ్బంది నైపుణ్యం, మెరుగైన నిర్వహణ, భాగస్వామ్య సంస్థల సమన్వయంతోనే సరకు రవాణాలో స్థిరమైన పురోగతి సాధించామన్నారు.

ఇంటర్ పరీక్షల నిర్వహణకు పొరుగు జిల్లాల అధ్యాపకులు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: జిల్లాలో ఇంటర్ పరీక్షల నిర్వహణకు తగినంత మంది అధికారులు, సిబ్బంది లేకపోవడంతో పొరుగునున్న అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల నుంచి అధికారులను రప్పిస్తున్నారు. ఆయా జిల్లాల నుంచి 44 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ అధికారుల)ను తీసుకొచ్చినట్లుమ ఆర్ఐఓ పి.మురళీధర్ తెలిపారు. వీరితోపాటు ఇన్విజిలేటర్లుగా పనిచేసేందుకు విద్యాశాఖ నుంచి 153 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులను తీసుకుంటున్నామన్నారు.

'పాత పింఛను పునరుద్ధరించాలి'

విశాఖపట్నం, న్యూస్‌టుడే : ప్రభుత్వ ఉద్యోగులకు పాత పింఛను అమలు చేయాలని ఉద్యోగులు కోరారు. ఆదివారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద 'ఆంధ్రప్రదేశ్ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయీస్ అసోసియేషన్' ఆధ్వర్యంలో సాగర సంగ్రామ దీక్ష పేరిట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోరుకొండ సతీష్ మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం ఎన్నికలకుముందు ఇచ్చిన హామీ మేరకు పాత పింఛను పునరుద్ధరించాలన్నారు. ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు వెంటనే విడుదల చేసి, పెండింగ్‌లో ఉన్న సమస్యల్ని పరిష్కరించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు అధిక సంఖ్యలో హాజరై.. ప్లకార్డులు చేతపట్టుకుని నినదించారు. కార్యక్రమంలో సంఘం గౌరవ సలహాదారులు అప్పలరాజు, ప్రకాష్, ప్రతినిధులు త్రినాథస్వామి, లోహితాస్యుడు, ఏపీ ఎన్జీఓ సంఘం అధ్యక్షుడు ఈశ్వరరావు, సభ్యులు చంద్రరావు, టి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేస్తున్న ఉద్యోగులు

EENADU Classifieds

BUSINESS SERVICES

లోకేష్ గోల్డ్ లోన్స్ బ్యాంక్/ ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదేరోజు మార్కెట్ రేటుకు కొనబడును. ✆ 9848488068, 7799223300.

FINANCIAL SERVICES

Govt. **ఉద్యోగస్తులకు,** రిటైర్డ్ పెన్షనర్లకు EMI వాయిదా పద్ధతిలో పర్సనల్ ఫైనాన్స్, అన్నితరగతుల వారికి స్థిరాస్తులపై ఫైనాన్స్ ఇవ్వబడును. Cell: 73862 01191.

REAL ESTATE

LAND FOR SALE

GENERAL

పూసపాటిరేగ 'మం' గోవిందాపురం రోడ్డు హైవేకి 1/2KM తారురోడ్డు ఫేసింగ్ 9&4 ఎకరాలు కొబ్బరితోట అమ్మకం & హోటల్ లీజుకు కలదు. ✆ 9440255187.

54 సెంట్లు మెట్టుభూమి (NH16 కి 5KM దూరంలో) అమ్మకం బర్నికం పంచాయతీ, పరవాడ మం॥, అనకాపల్లి జిల్లా. Cont: 7013929308.

PLOT FOR SALE

ANANDAPURAM

ఆనందపురం AI గూగుల్ డేటా సెంటర్‌కు దగ్గరలో VMRDA ప్రపోజ్డ్ లేఅవుట్‌లో నూతన లాంచింగ్ ఆఫర్ రేట్‌లో ప్లాట్స్ అమ్మకమునకు కలవు. ✆ 9000254116

KOTHAVALASA

కొత్తవలస-రాయపూర్ హైవేకి 1KMలో 516E పెందుర్తి-అరకు రానున్న హైవేకి 2KMలో VMRDA PLOTS గజం: 12వేలు. 7416862947, 9182857713

PENDURTHI

VMRDA Approved Plots. Gated Community Layout. Just 10 Minutes from Tarluwada (Upcoming Google DataCentre) Facing NH-16, Nr. Pendurthi. 9398694446

TO LET

WANTED

GENERAL

RK బీచ్‌రోడ్డుకు దగ్గరగా 2BHK (or) 3BHK Full Furnished House required 3Months ఇల్లు అద్దెకు కావలెను. ✆ 9848299619.

JOBS

Wanted Plot Sale Agents. Reputed Real Estate Company seeking experienced Plot Sale Agents. * Attractive commission structure * High earning potential * Flexible working Hours * Immediate joining. Candidates must have good communication skills and knowledge of Local Property Market. ✆ 7675964466, 9000086556.

Required Sr. Accountant (F) Experience in GST Filing and Tally & MS Office for our Granite Export Comp., VSP. 9908664521.

Wanted Exp. Marketing Field Staff to Promote SS Kitchenware items. Two Wheeler is must. ✆ 9346519358, 7993640075.

ఉద్యోగ అవకాశాలు ప్రముఖ వ్యాపార సంస్థలో ఈక్రింది ఉద్యోగాలకు అభ్యర్థులు కావలెను. 1. మేనేజర్స్ / మేనేజర్ ట్రైనీలు (స్త్రీ/పు) 2.బిజినెస్ కో-ఆర్డినేటర్ (స్త్రీ/పు) All Depts. State/ Central Retd./ Working/ VRS/ Insurance Sector. Degree 30+ Salary+ Perks 1.5L to 2.5L PM (T&C apply) Int 23rd & 24th. 7981588758, 8142580999.

ప్రముఖ FMCG సంస్థలో పనిచేయుటకు ఫ్రెషర్స్ (M) సేల్స్/ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. జీతం, పెట్రోల్+ Inc. ✆ 9390918114, 8367797975.

హైదరాబాద్ యూనిట్ హోంకేర్‌లో ఏజెంట్లకు మంచి అవకాశం. మీరు వర్కర్స్‌ని పంపితే మొదటినెల 5వేలు కమీషన్. వర్కర్స్ జీ:15K, ఫ్రీవసతి,ఫుడ్. 8121541212

MARKETING/ SALES

Anand Masale Require Sales & Marketing Manager, Marketing Executives. Contact: 9849655105, 9848053144 Email: anandmasalaappltd@gmail.com.

SECURITY GUARDS

సెక్యూరిటీగార్డ్స్ :- మధురవాడ ఏరియాలో చేయుటకు గార్డ్స్ కావలెను. 8 గం॥ డ్యూటీ, వ: 25-45, 10th, మంచి జీతం. ✆ 9440387815, 0891-2721672

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

లారీ నుంచి మంటలు.. హడలెత్తిన ప్రయాణికులు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: లారీలో నుంచి మంటలు చెలరేగిన ఘటన ఆదివారం మధ్యాహ్నం జాతీయ రహదారి శాంతిపురం కూడలిలో చోటుచేసుకుంది. సకాలంలో పోలీసులు స్పందించి మంటలు అదుపు చేయడంతో ప్రమాదం తప్పింది. ఏపీ35 టీబీ2699 నెంబరు లారీ కోళ్ల లోడుతో చిప్పాడ వెళ్లి కోళ్లను దించేసి తిరిగి పోర్టుకు వెళ్లేందుకు బయలుదేరింది. సరిగ్గా శాంతిపురం కూడలి పెట్రోల్ బంకు సమీపానికి వచ్చేసరికి ఇంజిన్‌లో నుంచి మంటలు వ్యాపించడంతో అక్కడ ఉన్న ట్రాఫిక్ కానిస్టేబుల్ గమనించి నాలుగో పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. సకాలంలో పోలీసులు అక్కడికి చేరుకుని అటుగా నీళ్ల డబ్బాలతో వెళ్తున్న వాహనాన్ని ఆపి ఆ నీటితో మంటలను అదుపు చేశారు. లారీలో నుంచి దట్టమైన పొగ రావడంతో అటుగా రాకపోకలు సాగిస్తున్న ప్రయాణికులు హడలిపోయారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా వాహనాన్ని అక్కడ నుంచి తరలించారు. సీఐ ఉమాకాంత్, ఎస్సై బాలకృష్ణ ఘటనా స్థలానికి చేరుకుని మంటలకు గల కారణాలపై ఆరా తీశారు.

లారీ నుంచి వెలువడుతున్న పొగ

విషపురుగు కుట్టి బాలుడి మృతి

కశింకోట, న్యూస్‌టుడే: కశింకోట మండలం మోసయ్యపేట గ్రామానికి చెందిన బాలుడు విషపురుగు బారిన పడి శనివారం రాత్రి మృతిచెందాడు. విజయవాడకు చెందిన వరలక్ష్మి ఇటీవల తన మూడేళ్ల కుమారుడిని తీసుకొని పుట్టింటికి వచ్చింది. బాలుడు సాయంత్రం పిల్లలతో కలిసి వీధిలో ఆడుకుంటుండగా ఏదో కుట్టిందని పెద్దగా ఏడవగా కుటుంబ సభ్యులు వచ్చి చూసేసరికి అపస్మారకస్థితికి చేరుకున్నాడు. బాలుడిని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. దీనిపై పోలీసులకు ఎటువంటి ఫిర్యాదు అందలేదు.

మూడేళ్ల బాలికకు అరుదైన చికిత్స !

విశాఖపట్నం: అగనంపూడి హోమీబాబా క్యాన్సర్ ఆసుపత్రి వైద్య సిబ్బంది మూడేళ్ల బాలికకు అరుదైన చికిత్స అందించారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఓ బాలికకు ఎంబ్రాయినల్ ట్యూమర్ విత్ మల్టీ లేయర్డ్ రోసెట్స్ అనే అరుదైన వ్యాధి సోకింది. ఈమెకు ముంబయిలోని టాటా మెమోరియల్ కేంద్రంలో శస్త్రచికిత్స నిర్వహించి కిమోథెరపీ అందించారు. అక్కడి నుంచి టాండమ్ ఆటోలాగస్ స్టెమ్ ట్రాన్స్‌ప్లాంట్ కోసం హోమీబాబా ఆసుపత్రికి సిఫార్సు చేశారు. ఇక్కడ అనుభవం కలిగిన వైద్యులు చికిత్సను విజయవంతంగా పూర్తిచేశారు. బాలిక కోలుకోవడంతో డిశ్చార్జ్ చేశారు.

లోవకొత్తూరులో ఘర్షణ

తుని గ్రామీణం, న్యూస్‌టుడే: కాకినాడ జిల్లా తుని గ్రామీణ మండలం లోవకొత్తూరు గ్రామంలో ఒక దుకాణ యాజమాని లోవరాజు కుమారుడు **శ్రీనుని** తలుపులమ్మ ఆలయానికి వస్తున్న భక్తుడొకరు గాయపరిచారు. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలివీ.. అనకాపల్లి జిల్లా నర్సీపట్నం సమీపంలోని గురుద్వారపాలెం గ్రామానికి చెందిన పలువురు యాత్రికులు ఆదివారం ఉదయం లోవ తలుపులమ్మ దర్శనానికి వస్తూ మార్గమధ్యలో లోవకొత్తూరు గ్రామంలోని ఒక దుకాణం వద్ద చాకు కొనేందుకు ఆగారు. దుకాణంలోకి చొచ్చుకొని వస్తున్న ఒక వ్యక్తిని లోవరాజు లోపలకు రావొద్దంటూ వారించాడు. దీంతో వారు ఘర్షణకు దిగారు. వీరిని అడ్డుకోబోయిన దుకాణ యజమాని తనయుడు శ్రీనుని చాకుతో గాయపరిచాడు. మెడపై గాయం కావడంతో తుని ప్రాంతీయ ఆసుపత్రికి తీసుకెళ్లారు. దీంతో స్థానికులు నిందితుడికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారన్నారు. ఘటనపై గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణమాచారి తెలిపారు.

చెట్టుపై నుంచి జారిపడి యువకుడు..

మునగపాక: నాగులాపల్లిలో శనివారం రాత్రి కొబ్బరిచెట్టు నుంచి జారిపడి యువకుడు మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. బొందల పెంట జగన్నాథరావు (21) శనివారం స్నేహితులతో కలిసి వివాహ కార్యక్రమానికి హాజరయ్యారు. అక్కడి నుంచి వచ్చి కొబ్బరి చెట్టు ఎక్కి జారిపడి గాయాలయ్యాయి. ఇతనిని అనకాపల్లి జిల్లా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు తెలిపారు.

నెక్లెస్ అందజేస్తున్న ఎస్సై ఆలీ

బంగారు నెక్లెస్ అందజేత

పాయకరావుపేట, న్యూస్‌టుడే: పోగొట్టుకున్న బంగారు నెక్లెస్‌ను బాధితులకు పోలీసులు అందజేశారు. నక్కపల్లి మండలం చినదొడ్డిగల్లుకు చెందిన కట్టా భాను మరో మహిళతో కలిసి ఆటోలో పాయకరావుపేట వచ్చారు. లక్కీ షాపింగ్ మాల్‌లో దుస్తులు కొనుగోలు చేసి బయటకు వచ్చారు. అనంతరం మెడలో వేసుకున్న మూడు తులాల బంగారు గొలుసు పోయినట్లు భాను గుర్తించి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ అప్పన్న ఆధ్వర్యంలో క్రైం టీం సతీష్, మదీనాలకు బాధ్యత అప్పగించారు. చినదొడ్డిగల్లు నుంచి షాపింగ్ మాల్ వరకు ఉన్న సీసీ కెమెరాల్లో రికార్డయిన సీసీ ఫుటేజ్ పరిశీలించారు. ఆటో దిగుతున్న సమయంలో నెక్లెస్ జారిపడినట్లు గుర్తించారు. గొలుసు మరో మహిళకు దొరికింది. కెమెరాలో ఉన్న ఆమె నక్కపల్లి మండలం రాజయ్యపేటకు చెందిన మహిళగా గుర్తించారు. ఏఎస్ఐ తాతీలును పంపించగా నెక్లెస్‌ను ఆమె పోలీసులకు అప్పగించారు. దీనివిలువ రూ.ఐదు లక్షలు ఉంటుందని సీఐ చెప్పారు.

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	115	110
లైవ్	142	130
డ్రెస్‌డ్	206	230
స్కిన్‌లెస్	234	240

అనకాపల్లి
• అనకాపల్లి • ఎలమంచిలి • పాయకరావుపేట

తెరపై ఈనాడు

అనకాపల్లి పట్టణం: రాజా: **హాయ్ బల్వంత్,** రామచంద్ర: **నిలవే,** వెంకటేశ్వర: **స్కయ్,** ఉదయం, మొదటి ఆట, **చథా పచ్ఛ** మేట్నీ, రెండోఆట, సత్యనారాయణ స్క్రీన్1: **అనగనగా ఒకరాజు,** స్క్రీన్2: **ఆల్ఫా,** పర్తిసాయి: **మన శంకర వరప్రసాద్‌గారు,** షిర్డిసాయి: **వితలవ్,** **అచ్యుతాపురం:** శ్రీబాలాజీ విలేజ్ సినిమా స్క్రీన్-1: **కపుల్ ఫ్రెండ్లీ,** స్క్రీన్-2: **ఫంకీ.**

తీర ప్రాంతాలపై నిఘా

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: వారాంతంలో తీర ప్రాంతాలపై ప్రత్యేక నిఘా పెట్టి తనిఖీలు నిర్వహిస్తున్నామని ఎస్సైలు సుధాకరరావు, వెంకటరావు తెలిపారు. తంతడి-వాడపాలెం తీర ప్రాంతంలో ఆదివారం తనిఖీలు చేపట్టారు. మద్యం తాగి వాహనాలు నడిపేవారితో పాటు బహిరంగంగా తాగే వారిపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కాలువలో పూడిక తీత

ఎలమంచిలి, న్యూస్‌టుడే: ఎలమంచిలి అయోధ్యాపురి కాలనీలో కాలువల్లో పూడికలు తొలగించారు. పూడుకుపోయిన కాలువకు కొత్త రూపు తెచ్చారు. కాలనీని ఆనుకుని ఉన్న కాలువను చాలా సంవత్సరాలుగా అధికారులు పట్టించుకోలేదు. ఈ సమస్యను స్థానికులు ఎమ్మెల్యే విజయకుమార్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన అధికారులతో మాట్లాడి కాలువలో పూడికలు తీయించమని ఆదేశించారు. మున్సిపల్ అధికారులు యంత్రాల సాయంతో కాలువలో పూడిక తీసి సమస్య పరిష్కరించారు. చిరకాల సమస్య పరిష్కారం కావడంతో కాలనీ వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అయోధ్యాపురి కాలనీలో..

అ వీ ఇ వీ

● నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: యర్రవరం, ఉప్పవరం, మల్లవరం, నరేంద్రపురం, ఎం.జగన్నాథపురం గ్రామాలకు సోమవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ రాజశేఖర్, ఏఈ భానుప్రకాశ్ తెలిపారు.

● ఇద్దరు జూదరుల అరెస్ట్

కశింకోట, న్యూస్‌టుడే: కశింకోట శివారులో జూదం ఆడుతున్న ఇద్దరిని ఆదివారం అరెస్ట్ చేసినట్లు సీఐ అల్లు స్వామినాయుడు తెలిపారు. ఎస్సై పి.మనోజ్‌కుమార్ సిబ్బందితో దాడిచేసి నిందితుల నుంచి రూ.1200 నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వివరించారు.

● 20 మద్యం సీసాలు స్వాధీనం

కశింకోట, న్యూస్‌టుడే: తాళ్లపాలెం శివారులో అక్రమంగా 20 మద్యం సీసాలు తరలిస్తున్న అనకాపల్లి మండలం తుమ్మపాల గ్రామానికి చెందిన కొణతాల కాశీవిశ్వనాథంను అరెస్ట్ చేసినట్లు సీఐ అల్లు స్వామినాయుడు తెలిపారు. ఆదివారం ఎస్సై పి.మనోజ్‌కుమార్ వాహనాలను తనిఖీ చేస్తుండగా మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

● జాతీయ రహదారిపై హెచ్చరిక బోర్డులు

ఎలమంచిలి, న్యూస్‌టుడే: జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు పోలీసులు చర్యలు చేపట్టారు. ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్న కూడళ్ల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. మద్యం తాగి వాహనాలు నడపొద్దని, అమిత వేగం వద్దని, డ్రైవింగ్‌లో సెల్‌ఫోన్ మాట్లాడొద్దని బోర్డులు ఏర్పాటు చేశారు. ఎలమంచిలి సర్కిల్‌పరిధిలోని జాతీయ రహదారి పొడవునా వీటిని ఏర్పాటు చేశారు. రోడ్డు ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించడానికి వీటిని ఏర్పాటు చేస్తున్నామని సీఐ ధనుంజయరావు చెప్పారు.

● పేటలో పోలీసుల ప్రచారం

పాయకరావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: హెల్మెట్ ధారణపై పోలీసులు వినూత్న ప్రచారం చేపడుతున్నారు. గ్రామాల నుంచి జాతీయ రహదారిపైకి వచ్చే కూడలిలో ప్రత్యేక ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. రహదారి పైకి వచ్చిన వెంటనే ద్విచక్ర చోదకులను అప్రమత్తం చేసేలా వీటిని భారీ సైజ్‌లో అమర్చారు. దీంతో చోదకులు ఈ బోర్డు చూసిన వెంటనే హెల్మెట్ ధరిస్తున్నారు. వీటిని పాయకరావుపేట జాతీయ రహదారి పై కూడలి, నామవరం, నర్సీపట్నం రోడ్డు, సీతారాంపురం తదితర చోట్ల ఏర్పాటు చేశారు. ఈ ప్రచారం చోదకులను అప్రమత్తం చేస్తోంది.

ఆసుపత్రులకు తీరిన వైద్యుల కొరత

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే

ఆసుపత్రుల్లో వైద్యుల పోస్టులను ప్రభుత్వం భర్తీ చేసింది. కొంతకాలంగా వెంటాడుతున్న కీలక సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంది. రెగ్యులర్ వైద్యులతో పాటు పీజీ వైద్యులతో సేవలు విస్తరించింది. దీంతో రోగులకు మెరుగైన వైద్యం లభించేందుకు అవకాశం ఏర్పడింది.

అనకాపల్లి జిల్లా ఆసుపత్రిలో 76 మంది వైద్యులతో రోగులకు సేవలు అందుతున్నాయి. ఈ ఆసుపత్రి జిల్లా స్థాయికి చేరినప్పటికీ వైద్యుల పోస్టులను భర్తీ చేయలేదు. గత ప్రభుత్వ హయాంలో వైద్యపోస్టుల భర్తీపై నిర్లక్ష్యం చూపారు. దీంతో అంతంత మాత్రంగానే సదుపాయాలు అందేవి. కూటమి ప్రభుత్వం స్పెషలిస్ట్ పోస్టుల భర్తీపై దృష్టి సారించారు. రేడియాలజిస్టు, ఎముకలు, జనరల్ సర్జన్లు, ఈఎన్‌టీ, నేత్ర, గైనిక్ వైద్య నిపుణుల పోస్టులను భర్తీ చేశారు. ప్రస్తుతం ఆసుపత్రిలో 42 మంది రెగ్యులర్ వైద్యులు విధులు నిర్వహిస్తున్నారు. వీరికి ఆయా విభాగాల్లో తొమ్మిది మంది సీనియర్ రెసిడెన్స్ వైద్యులు ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్నారు. మరో 25 మంది పీజీ చదువుతున్న వైద్యులు వారి శిక్షణలో భాగంగా రోగులకు సేవలు అందిస్తున్నారు. ఇక్కడికి వైద్యం కోసం వచ్చిన రోగులను కేజీహెచ్‌కు పంపకుండా అనకాపల్లి ఆసుపత్రిలోనే సేవలు అందించేలా చేపడుతున్న చర్యలు మంచి ఫలితాలను ఇస్తున్నాయి.

తొలగిన ఇబ్బందులు: జిల్లాలోని ఆసుపత్రుల్లో వైద్యుల పోస్టులు భర్తీ చేశారు. అనకాపల్లి, నర్సీపట్నం ఏరియా ఆసుపత్రుల్లో రెగ్యులర్ వైద్యులతో పాటు సీనియర్ రెసిడెన్స్ పీజీ వైద్యులతో సేవలు అందుతున్నాయి. ఎనిమిది సీహెచ్‌ల్లోనూ పోస్టులను భర్తీ చేశాం. – డాక్టర్ శ్రీనివాసరావు, డీసీహెచ్ఎస్

సదుపాయాలకు దూరం.. దుర్భర జీవనం

అచ్యుతాపురం, న్యూస్‌టుడే

కుమారపురంలో రేకుల షెడ్లలోనే వలస కార్మికుల నివాసం

సెజ్ కార్మికులు కనీస సదుపాయాలకు దూరంగా గడుపుతున్నారు. కాయకష్టం చేసుకోవడానికి ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన వారంతా పగలంతా యంత్రాల హోరులో పనిచేస్తూ రాత్రికి గుడారాల్లో దుర్భర జీవితాలు గడుపుతున్నారు. అంతర్జాతీయ సౌకర్యాలతో నిర్మించిన సెజ్ కంపెనీల్లో పనిచేస్తున్న వివిధ రాష్ట్రాలకు చెందిన వేలాదిమంది కార్మికులతో పాటు మన రాష్ట్రంలో విజయనగరం, శ్రీకాకుళం, మన్యం జిల్లాల నుంచి వచ్చే కార్మికులు దయనీయస్థితిలో జీవిస్తున్నారు. వీరి నివాసాలు కనీసం కోళ్లఫారాల్లా కూడా లేవు. రేకుల షెడ్లలో నివాసం ఉంటున్న వీరు ఆరుబయటే కాలకృత్యాలు తీర్చుకునే పరిస్థితి ఎదురవుతోంది. వీరిని పని కోసం తీసుకొస్తున్న గుత్తేదారులు కూడా వీరిని పట్టించుకోని పరిస్థితి ఎదురవుతోంది. ఎంతమంది వలస కార్మికులు పని చేస్తున్నారనే వివరాలు కూడా యంత్రాంగం వద్ద లేవు. ప్రమాదాలు సంభవించిన సమయాల్లో హడావుడి చేయడం తప్ప ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంలేదు. అనుమతులు లేని గుడారాల్లో వీరు జీవనం సాగిస్తున్నా కనీస సదుపాయాలు కల్పించడానికి కూడా చొరవ తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

చీడికాడలో అకాల వర్షం

చీడికాడ, న్యూస్‌టుడే: మండలంలో కేంద్రంతో పాటు పరిసర గ్రామాల్లో ఆదివారం మధ్యాహ్నం అకాల వర్షం కురిసింది. అప్పటివరకు ఎండ తీవ్రత ఎక్కువగానే ఉంది. ఒక్కసారిగా మేఘావృతమై.. గాలులు మొదలై... వర్షం దంచికొట్టింది. దాదాపుగా 25 నిమిషాలు పాటు వర్షం ఏకధాటిగా కురిసింది. మహాశివరాత్రి తర్వాత ఫిబ్రవరి నెలలోనే ఎండల తీవ్రత పెరిగింది. సాధారణ ఉష్ణోగ్రతలు 35 డిగ్రీల వరకు పెరిగాయి. దీంతో ప్రజలు వారం రోజులగా ఎండ ప్రభావానికి ఇబ్బంది పడుతున్నారు. ఈ సమయంలో ఆదివారం చీడికాడలో కురిసిన వర్షం ప్రజలకు ఉపశమనం కలిగించింది. వర్షంతో వాతావరణం చల్లబడింది. మినుము పంట మాత్రం కొన్ని ప్రాంతాల్లో వర్షానికి తడిసిపోయింది. చీడికాడతో పాటు పరిసర గ్రామాల్లోనే వర్షం కురిసింది.

తవ్వేసి వదిలేస్తే ఎలా...?

కోటవురట్ల, న్యూస్‌టుడే: బోడపాలెం శివారు కొత్తూరులో తాగునీటి పైపుల మరమ్మతుల కోసం గుంతలను తవ్వేసి వదిలేశారు. రెండు నెలల క్రితం ఈ పనులు చేపట్టినప్పటికి.. గుంతలు పూడ్చకపోవడంతో ప్రమాదకరంగా మారాయి. ప్రధాన రహదారి పక్కన తవ్వేసి వదిలేసిన గుంతలు ఉండటంతో, ఆదమరుపుగా ఉంటే పడిపోతున్నామని వాహనచోదకులు ఆవేదన చెందుతున్నారు.

కానరాని మౌలిక సదుపాయాలు

పాయకరావుపేట, న్యూస్‌టుడే: పేటలో డ్రైనేజీ అస్తవ్యస్తంగా మారింది. నియోజకవర్గ కేంద్రంగా ఉన్నా ఆ స్థాయిలో మౌలిక వసతులు కానరావడం లేదు. ప్రధానంగా ముందుచూపు లేకుండా చేపడుతున్న రోడ్లు, డ్రైనేజీల ఏర్పాటు సమస్యను మరింత జఠిలం చేస్తోంది. పట్టణంలోని పెదిరెడ్డినగర్, రాజుగారిబీడు, బృందావనంలోని ప్రాథమిక పాఠశాల వద్ద, మంగవరం రోడ్డు తదితర ప్రాంతాల్లో డ్రైనేజీల్లో మురుగు పేరుకుపోయింది. రోడ్డుపైకి నీరు చేరి రాకపోకలకు ఇబ్బందులు వస్తున్నాయి.

వాహన చోదకుల అవస్థలు

పాయకరావుపేట, న్యూస్‌టుడే: ఒడ్డిమెట్ట కూడలి నుంచి గుంటపల్లి వెళ్లే రోడ్డు శిథిలావస్థకు చేరుకుంది. దీనికి మరమ్మతులు చేపట్టకపోవడంతో వాహనచోదకులకు ఇబ్బందులు తప్పడం లేదు. గతంలో జాతీయ రహదారి ఒడ్డిమెట్టకు ఇవతల వైపు నుంచి వెళ్లేది. ఆ తర్వాత నాలుగు వరుసల రోడ్డు విస్తరణలో భాగంగా ఒడ్డిమెట్ట వెలుపల నుంచి కొత్తగా మరో రోడ్డు వేశారు. మరో అర కిలోమీటరు పొడిగిస్తే పాత రహదారికి కొత్తరూపు వచ్చే అవకాశముంది.

అధ్వానంగా కాలువలు

ఎలమంచిలి, న్యూస్‌టుడే: ఎలమంచిలిలో కాలువలు అధ్వానంగా మారాయి. మురుగు పోయే మార్గంలేక ఎక్కడ నీరు అక్కడే నిలిచి పోతోంది. నిధులు లేమితో ఈ సమస్యను పరిష్కరించలేకపోతున్నారు. ఎర్రవరం, పెదపల్లి, కొక్కిరాపల్లి, తెరువుపల్లి, కట్టుపాలెం, సోమలింగపాలెం, రామారాయుడుపాలెం, కొత్తపాలెం గ్రామాల్లో 28కి.మీ.పైగా కచ్చా కాలువలు ఉన్నాయి. వీటిని శాశ్వత ప్రాతిపదికన బాగు చేయడానికి రూ. కోటి అవసరం. నిధుల లేక పనులు చేపట్టలేకపోతున్నారు.

రోడ్డు పనులు ప్రారంభం

పనులు ప్రారంభిస్తున్న కూటమి నాయకులు

నక్కపల్లి, న్యూస్‌టుడే: కూటమి పాలనలో రహదారి కష్టాలకు చెక్ పడిందని మాజీ ఎంపీపీ వైబోయిన రమణ అన్నారు. గొడిచెర్లలో ఆసుపత్రి నుంచి కొత్త కాలనీకి రూ. పది లక్షల నిధులతో నిర్మించే సీసీ రోడ్డు పనులను కూటమి నాయకులతో కలిసి ఆదివారం ఆయన ప్రారంభించారు. జనసేన మండల ఉపాధ్యక్షుడు నల్లల రత్నాజీ, నారాయణరావు, ఎన్నెస్వీ సత్యనారాయణ, రమణ, దివాణం తదితరులు పాల్గొన్నారు.

26 నుంచి సభ్యత్వ నమోదు

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఈనెల 26 నుంచి జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభిస్తున్నామని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ పేర్కొన్నారు. పట్టణంలోని జనసేన కార్యాలయంలో ఆదివారం నాయకులు, వీరమహిళలు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉద్యమంలో సభ్యత్వ నమోదులో భాగస్వామ్యం కావాలన్నారు. 20 మందికి ప్రమాద బీమా, తొమ్మిది మందికి వైద్యఖర్చులకు రూ.1.02 కోట్ల మేర బీమా నగదు అందజేశామన్నారు. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాలన్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేసిన వారిని ప్రదాతగా పిలవాలని పార్టీ అధ్యక్షుడు ఆదేశించారన్నారు. పార్టీ అభ్యున్నతికి కృషి చేయాలన్నారు. అందరూ ఎక్కువ సభ్యత్వ నమోదుకు కృషి చేయాలన్నారు. అనంతరం వివిధ సమస్యలపై ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయకుమార్

రాంబిల్లి, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలు, జరిగిన అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ కోరారు. హరిపురంలోని జనసేన కార్యాలయంలో ఆదివారం నాలుగు మండలాల కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. పార్టీ బలోపేతమే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని చెప్పారు. గ్రామాల్లో ప్రజలకు ఎటువంటి సమస్యలు ఉన్నా నేరుగా తనకు తెలియజేయాలని సూచించారు. పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని కోరారు. కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తుందని, వీటిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఎలమంచిలి ఎంపీపీ రాజాన శేషు, జనసేన మండలాల అధ్యక్షులు పప్పల నూకన్నదొర, బైలపూడి శ్రీరాందాసు, నాయకులు పాల్గొన్నారు.

కనకదుర్గ ఆలయానికి రూ. 5 లక్షల విరాళం

చెక్కు అందజేస్తున్న వెంకటేశ్వరరావు

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: సత్యనారాయపురం కొండపై వెలసిన కనకదుర్గమ్మ ఆలయ అన్నదాన భవన నిర్మాణానికి రూ. 5,00,116 విరాళాన్ని వ్యాపార వేత్త ముత్యాల వెంకటేశ్వరరావు(ఎంవీఆర్) ప్రకటించారు. ఆదివారం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ ఛైర్మన్ బోన రమణకు చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బోయిన రమణాజీ, సత్తిబాబు, గైపూరి రాజు, కడిమి వెంకట్ పాల్గొన్నారు.

అపరిశుభ్రంగా మరుగుదొడ్లు

పాయకరావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఉన్న మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉండడంతో కంపు కొడుతున్నాయి. దుర్వాసనతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్త్రీశక్తి పథకంలో భాగంగా ఆర్టీసీ బస్సుల్లో మహిళ ప్రయాణికుల సంఖ్య భారీగా పెరిగింది. దీంతో నిత్యం వందల సంఖ్యలో అనకాపల్లి, రాజమహేంద్రవరం, కాకినాడ, అన్నవరం, విశాఖ వంటి ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తున్నారు. ప్రయాణికులకు అనుగుణంగా బస్టాండ్‌లో మరుగుదొడ్లు, బల్లలు, ఫంకాలు వంటి సౌకర్యాలు లేవు. దీంతో బస్సుల కోసం గంటల కొద్దీ నిల్చోని అవస్థలు పడుతున్నామని పలువురు వాపోతున్నారు. రాత్రి అయితే ఈ ప్రాంతమంతా మందుబాబులు, జేబు దొంగల తాకిడి ఎక్కువగా తాకిడి అధికంగా ఉంటోంది. అధికారులు సమస్యపై స్పందించి సౌకర్యాలతో పాటు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో మరుగుదొడ్లు

ఉత్సవ పనుల పరిశీలన

పనులు పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

నక్కపల్లి, న్యూస్‌టుడే: ఉపమాక వెంకన్న కల్యాణోత్సవ ఏర్పాట్లను తితిదే అధికారులు, తెదేపా నాయకులు ఆదివారం పరిశీలించారు. ఇక్కడ ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు ఉండరాదని, ఆలయానికి వేసిన రంగులు మరీ పేలవంగా ఉన్నాయని, మంత్రి అసంతృప్తి వ్యక్తం చేసిన నేపథ్యంలో అధికార యంత్రాంగం దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టింది. ఇక్కడకు వచ్చిన డీఈ ఆనందరామ్, ఏఈ శివరామరాజు కొన్ని కొత్త రంగులను వేయాలని సిబ్బందికి సూచించారు. దీంతోపాటు మంత్రి సమీక్షలో చర్చించిన అంశాలను నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్, పీఏసీఎస్ అధ్యక్షుడు కొప్పిశెట్టి బుజ్జి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. విద్యుత్తు, తాగునీరు, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. మంత్రి అనిత ఈనెల 26న ఆలయానికి వచ్చి తుది ఏర్పాట్లు చూస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో తెదేపా మండలశాఖ అధ్యక్షుడు గింజాల లక్ష్మణరావు, జిల్లా ఉపాధ్యక్షుడు కురందాసు నూకరాజు, ఇనస్పెక్టర్ కూర్మేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్తుకు క్రమశిక్షణ కీలకం

కశింకోట, న్యూస్‌టుడే: విద్యార్థుల భవిష్యతుకు క్రమశిక్షణ, ప్రణాళిక కీలకమని సీఐ అల్లు స్వామినాయుడు అన్నారు. విద్యార్థులు మంచి లక్ష్యాలను నిర్దేశించుకోవడం ఎంత ముఖ్యమో, వాటిని కష్టపడి అమలు చేయడం అంతే ముఖ్యమని సూచించారు. కశింకోట వివేకానంద ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో ఆదివారం పది విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో యువత, విద్యార్థులు సెల్‌ఫోన్లకు బానిసలవుతున్నారని అన్యుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, ఓటీపీలు, సోషల్ మీడియా లింక్‌లు క్లిక్ చేయవద్దని సూచించారు. యువత మాదక ద్రవ్యాలకు అలవాటు పడి బతుకులు చేతులారా నాశనం చేసుకుంటున్నారని వివరించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కరస్పాండెంట్ మళ్ల జగదీష్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ మళ్ల శైలజ, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లి దండ్రులు హాజరయ్యారు.

ఘనంగా మరిడిమాంబ విగ్రహ ప్రతిష్ఠ

విగ్రహప్రతిష్ఠలో గ్రామపెద్దలు

మునగపాక, న్యూస్‌టుడే: తోటాడ, గవర్ల అనకాపల్లిలో రూ.80లక్షల విరాళాలతో నిర్మించిన మరిడిమాంబ, సత్తమ్మతల్లి ఆలయాలను ఆదివారం ప్రారంభించారు. అమ్మవారి విగ్రహాలను ఊరేగించి ప్రతిష్ఠించారు. ప్రత్యేక పూజలు చేశారు. వేలాదిమంది భక్తులు మరిడిమాంబ, సత్తమ్మతల్లి విగ్రహాలను దర్శించుకున్నారు. ఆలయాల గోపురాలపై కలశాలను ప్రతిష్ఠించారు. మధ్యాహ్నం భారీ ఎత్తున అన్నసమారాధన చేశారు. మునగపాకలో శ్రీకృష్ణుని దేవాలయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో ఆలయ వార్షికోత్సవం

అనకాపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: కోడూరులో పంచముఖ ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారు జాము నుంచే ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించారు. గ్రామీణ ఎస్సై రవికుమార్, నాయకులు దర్శించుకొని పూజలు నిర్వహించారు. పట్టణంలోని శారదా నగర్ వినాయక మందిరం వార్షికోత్సవ గోడ ప్రతులను ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ కమిటీ ప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు.

ఎస్.రాయవరం: ఎస్.రాయవరంలో బల్లల పండగ ఘనంగా జరిగింది. గ్రామానికి చెందిన రజకులు ఊరేగింపుగా వరాహనది వద్దకు శక్తి వేషాలతో ఊరేగింపుగా చేరుకుని బల్లలకు పూజలు చేశారు.

స్వామిని దర్శించుకుంటున్న ఎస్సై తదితరులు

ఆకట్టుకున్న శక్తివేషాలు

మైదానం అభివృద్ధికి రూ. 1.11 లక్షలు

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: ఎస్.రాయవరం మండలం రేవుపోలవరంలో తయారు చేస్తున్న క్రికెట్ మైదానం అభివృద్ధికి మాజీ సర్పంచి చోడిపల్లి బంగారి రూ.1,11,101 ఆర్థిక సాయం అందజేశారు. నక్కపల్లి క్యాంపు కార్యాలయంలో హోంమంత్రి వంగలపూడి అనిత సమక్షంలో ఆదివారం చెక్కును గ్రామస్థులకు అందించారు. గ్రామాభివృద్ధికి సాయం అందిస్తామని బంగారి తెలిపారు. తెదేపా మండల శాఖ అధ్యక్షుడు అమలకంటి అబద్ధం, మాజీ అధ్యక్షుడు నల్లపరాజు వెంకటరాజు తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఉద్యమాలకు స్ఫూర్తి పార్వతమ్మ

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: సారా వ్యతిరేక ఉద్యమానికి నాయకత్వం వహించిన కర్రి పార్వతమ్మకు వర్ధంతి సందర్భంగా ప్రజాసంఘాలు, ఐద్వా నాయకులు నివాళులర్పించారు. తిమ్మరాజుపేటలో వివిధ సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి రొంగలి రాము, బుద్ద రంగారావు, కర్రి వెంకునాయుడు, రాజు పాల్గొన్నారు.

పార్వతమ్మ చిత్రపటం వద్ద ప్రజాసంఘాల నాయకుల సంఘీభావం

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ఎలమంచిలి, న్యూస్‌టుడే: వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలు విధిగా పాటించాలని ఎలమంచిలి ట్రాఫిక్ ఎస్సై రామకృష్ణ కోరారు. ఆదివారం ఎలమంచిలి పట్టణంలోని రైల్వే పైవంతెన వద్ద వాహనచోదకులకు ఆయన ట్రాఫిక్ నిబంధనలపై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఆక్రమణల తొలగింపు పూర్తయ్యేదెన్నడో..

పాయకరావుపేట, న్యూస్‌టుడే: పేట ప్రధాన రహదారి ఆక్రమణల తొలగింపులో జాప్యం జరుగుతోంది. దీన్ని తొలి విడతలో రూ.5.25 కోట్లతో విస్తరించనున్న విషయం తెల్సిందే. ఈ పనులకు ఇటీవల హోంమంత్రి వంగలపూడి అనిత శంకుస్థాపన చేశారు. పట్టణంలోని పాండురంగస్వామి దేవస్థానం నుంచి పై కూడలి వరకు రెండు వరుసల రహదారి, సెంట్రల్ లైటింగు, డ్రైనేజీ సౌకర్యం కల్పించనున్నారు. అయితే రహదారిపై ఏళ్ల తరబడి పాతుకుపోయిన ఆక్రమణలను దాదాపు తొలగించారు. బృందావనం, కంటోన్మెంట్, ఆర్‌సీఎం చర్చి, పార్కు పక్కన తదితర చోట్ల ఇంకా ఆక్రమణలు పూర్తిస్థాయిలో తొలగించలేదు. వీటిని తీయడంలో ఎందుకు జాప్యం చేస్తున్నారంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. నెలాఖరు నాటికి ఈ పనులు ప్రారంభించనున్నారు. అక్కడక్కడ ఆక్రమణలు వదిలేయడంపైనా విమర్శలు వస్తున్నాయి. ఇదే అదనుగా మరికొంతమంది తోపుడు బండ్లు, చిన్న బడ్డీలు ఏర్పాటు చేసుకుని రోడ్డు స్థలంలో వ్యాపారాలకు శ్రీకారం చుడుతున్నారు. పాండురంగస్వామి దేవస్థానం సమీపంలో వంతెనపైనా ఫుట్‌పాత్‌ను ఆక్రమించి దుకాణాలు నిర్వహిస్తున్నారు.

రహదారి ఏర్పాటుచేసిన బడ్డీలు

ప్రజావేదిక 25న

మాకవరపాలెం, న్యూస్‌టుడే : మండలంలో ఏప్రిల్ 2024 నుంచి ఈ ఏడాది మార్చి 25 వరకు జరిగిన ఉపాధి పనులపై మంగళవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఛాయ సుధా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 31 పంచాయతీ గ్రామాలలో సర్వే బృందం సభ్యులు నిర్వహించిన సర్వేలో వెల్లడైన వివరాలు ఉదయం 10 గంటల నుంచి చదివి వినిపించడం జరుగుతుందన్నారు.

దిబ్బపాలెంలో కంటివైద్య శిబిరం

రోగులకు వైద్యం చేస్తున్న వైద్యులు

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: దిబ్బపాలెం సెజ్‌కాలనీలో ఆదివారం అమ్మ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం జరిగింది. అనురాధ కంటి పరీక్షా కేంద్రం, శంకర్ ఫౌండేషన్ వైద్యులు 64 మందికి పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించారు. 25మందికి శస్త్రచికిత్సలకు గుర్తించి తరలించారు. వైద్యులు అనురాధ, శాంతి, లెక్కల స్వామినాయుడు, సర్పంచి శాంతికుమారి, మేనేజర్ అరుణ్‌కుమార్, గౌరీ, ఛైర్మన్ గొంప వెంకటరావు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యంతో శాశ్వత పరిష్కారం

నెహ్రూచౌక్ (అనకాపల్లి), న్యూస్‌టుడే: ఆయుర్వేద వైద్యంతో ఆరోగ్య సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని రోటరీక్లబ్ అధ్యక్షులు బుద్ద శ్రీనివాసరావు పేర్కొన్నారు. రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సిద్ధి ఆయుర్వేద ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరానికి స్పందన లభించింది. ఈ శిబిరంలో 200 మందికి వైద్యం చేసి ఉచితంగా మందులు అందజేశారు. రోటరీక్లబ్ ట్రైనర్ బుద్ద సత్యనారాయణ, కాండ్రేగుల జగన్నాథరావు, దాడి రవికుమార్, వీరభద్ర, వైద్యులు శ్యామ్ సుందర్, జగదీష్ పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందజేత

కశింకోట, న్యూస్‌టుడే: ప్రపంచ ఆలోచన దినోత్సవాన్ని కశింకోట సెయింట్ జాన్స్ ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్కౌట్స్, గైడ్స్ రూపకర్త రాబర్ట్ బెడన్ పావెల్ చిత్రపటానికి ప్రిన్సిపల్ రూపానంది పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పతాకావిష్కరణ చేశారు. విద్యార్థులు కవాతు నిర్వహించి వందన సమర్పణ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

మునగపాక, న్యూస్‌టుడే: గణపర్తి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆలోచన దినోత్సవాన్ని స్కౌట్ ఉపాధ్యాయులు పైలా దేముడుబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. శారీరక దారుఢ్యం, క్రమశిక్షణ, నీతి, సత్ప్రవర్తన కలిగి మంచి పౌరులుగా దేశానికి సేవ చేయాలని విద్యార్థులకు సూచించారు.

వరాహనదిలో వ్యర్థాల తొలగింపు

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: ఎస్.రాయవరం మండలం వమ్మవరం నేస్తాలమ్మ ఆలయం వద్ద ధన్ నిరంకార్ జీ సంత్ నిరంకారి మిషన్ ఆధ్వర్యంలో వరాహనదిలో వ్యర్థాలు తొలగించారు. స్వచ్ఛ జలం.. స్వచ్ఛ మనసు కార్యక్రమంలో భాగంగా ఆదివారం కశింకోట సంయోజకులు చిదంబరావు ఆధ్వర్యంలో వ్యర్థాలు తొలగించారు. వేలాది ఎకరాలకు సాగునీరు అందిస్తున్న నదులను కలుషితం చేయకుండా ప్రజలంతా బాధ్యత తీసుకోవాలని కోరారు. వ్యర్థాలను నదుల్లో వేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సంత్ నిరంకారి మిషన్ సభ్యులు నాగరాజు, సత్యవతి, వెంకటలక్ష్మి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరి

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: సెజ్‌లో పరిశ్రమల నుంచి వెలువడుతున్న కాలుష్యం ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల పరిధిలో 210 ఫార్మా, రసాయన పరిశ్రమలు ఉన్నాయి. ఉదయం, సాయంత్రం తేడా లేకుండా గాఢత కలిగిన వాయువులు విడుదల అవుతున్నా కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు కానరావడంలేదు. పూడి వద్ద ఏర్పాటు చేసిన సీఈటీపీ నుంచి వస్తున్న దుర్గంధాన్ని భరించలేకపోతున్నామని వేలాదిమంది నిర్వాసితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పరిశ్రమలకు అనుమతులు ఇవ్వడంలో చూపిస్తున్న శ్రద్ధ కాలుష్య నివారణపై చూపడంలేదని పలువురు మండిపడుతున్నారు. సెజ్ నుంచి వస్తున్న దుర్గంధం పది కిలోమీటర్ల దూరం వరకు వస్తోందని కొండకర్ల వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గాలి నాణ్యతను కొలిచే పరికరాలను ఇక్కడ లేకపోవడం అధికారుల తీరుకు అద్దం పడుతోంది. అచ్యుతాపురంలో 70 వేల మంది, పూడిమడకలో 20 వేల మంది, సెజ్ పరిశ్రమలను ఆనుకొని 26 గ్రామాల సెజ్ నిర్వాసితులు, వెదురువాడ ఆర్ అండ్ఆర్ కాలనీ వద్ద పది గ్రామాల ప్రజలు నివాసం ఉంటున్నారు. సీఈటీపీ ప్లాంటు నుంచి వస్తున్న దుర్గంధం వల్ల నిత్యం నరకం అనుభవిస్తున్నామని చినపూడి గ్రామస్థులు విచారం వ్యక్తం చేస్తున్నారు. ఎంతమందికి మొరపెట్టుకున్నా ఫలితం లేకపోతోందని వాపోతున్నారు. ఇక్కడి పరిస్థితిని అంచనా వేయడానికి ఇప్పటికైనా అధికారులు ముందుకు రావాలని తాళ్లదిబ్బ, చినపూడి, ఉద్దపాలెం, చిప్పాడ, దుప్పితూరు గ్రామస్థులు కోరుతున్నారు.

సెజ్‌లో సీఈటీపీ ప్లాంట్

(c) eenadu

నర్సీపట్నం

• నర్సీపట్నం • చోడవరం • మాడుగుల

రాజకీయ నాయకులకు ఎన్టీఆర్ ఆదర్శం

ఎన్టీఆర్ విగ్రహం ఆవిష్కరించి మాట్లాడుతున్న సభాపతి అయ్యన్న

నర్సీపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: రాజకీయ నాయకులకు ఎన్టీఆర్ ఆదర్శమని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. నీలంపేట తెదేపా అధ్యక్షుడు బోళెం వెంకట శ్రీనివాస ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆదివారం సాయంత్రం ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతీకైన ఎన్టీఆర్ రాజకీయ జీవితాన్ని యువత తెలుసుకోవాలన్నారు. మహిళలకు ఆస్తి హక్కు, రాజకీయాల్లో రిజర్వేషన్లు, రూ.2కే కిలో బియ్యం లాంటి ఎన్నో కార్యక్రమాలు ఆయన తీసుకొచ్చినవేనని పేర్కొన్నారు. అభివృద్ధే లక్ష్యంగా గ్రామాల్లో నాయకులు పనిచేయాలని సూచించారు. విగ్రహావిష్కరణ సందర్భంగా వెంకటశ్రీనివాస 180మంది పేదలకు పాతిక కిలోల చొప్పున బియ్యాన్ని పంపిణీ చేశారు. నీలంపేటలో రహదారుల నిర్మాణానికి రూ.71 లక్షలు మంజూరు చేశామని తెలిపారు. జడ్పీటీసీ సభ్యురాలు రమణమ్మ, జిల్లా అధికార ప్రతినిధి శ్రీరంగస్వామి, కౌన్సిలర్ రాజేష్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ వెంకటరమణ, బోళెం వెంకినాయుడు పాల్గొన్నారు.

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: ఈనెల పన్నెండున నూకాలమ్మ అమ్మవారి ఆలయ పునఃప్రారంభ కార్యక్రమాన్ని తలపెట్టినందున పనులన్నీ యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయించాలని శాసన సభాపతి అయ్యన్నపాత్రుడు సూచించారు. మార్కెట్‌కమిటీ ఛైర్మన్ వెంకటరమణ, దుర్గాదేవి ఆలయ ఛైర్మన్ నాగేంద్రరాజు, దేవాదయశాఖ ఈవో సాంబశివరావు పాల్గొన్నారు. అనంతరం మరిడి మహలక్ష్మి ఆలయాన్ని సందర్శించారు. ఏప్రిల్‌లో అమ్మవారి జాతర వైభవంగా జరగనున్నందున ఏర్పాట్లు త్వరితంగా పూర్తి చేయాలని ఆదేశించారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

మాడుగుల గ్రామీణం, న్యూస్‌టుడే: అనారోగ్యంతో ఆసుపత్రిలో ఎక్కువ ఖర్చయిన వారికి ప్రభుత్వం ఆర్థికంగా అండగా ఉంటుందని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి పేర్కొన్నారు. మండలంలోని ఆర్అండ్‌బీ భవనం వద్ద మాడుగుల నియోజకవర్గంలో 30 మందికి సీఎం సహాయనిధి నుంచి రూ.11,88,272 సంబంధించి చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ పుప్పాల అప్పలరాజు, మండల తెదేపా అధ్యక్షుడు నందారపు సన్యాసిరావు, కార్యదర్శి రమేశ్, మండల జనసేన అధ్యక్షుడు శివాజీ పాల్గొన్నారు.

చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి

కె.కోటపాడు : వివిధ గ్రామాలకు చెందిన ఏడుగురికి రూ.2.65 లక్షల చెక్కులను అందచేశారు. అనారోగ్యం బారినపడి చికిత్సకోసం భారీగా ఖర్చులు చేసినా ప్రభుత్వం తరపున సాయం అందకపోతే దీనికి దరఖాస్తుల చేసుకోవాలని సూచించారు.

తెరపై ఈనాడు

నర్సీపట్నం: శ్రీకన్య **ఆడి1:** 100 డేస్ లవ్ స్టోరీ, ఒన్ ఫ్లస్ ఒన్ ఆఫర్, సైక్, అమరావతికి ఆహ్వానం, **ఆడి2:** యుఫోరియా, **ఆడి3:** ఫన్‌కీ, **ఆడి4:** ఓ రోమియో, క్రైం 101. **చోడవరం:** సాయిలక్ష్మి: హే భగవాన్, శ్రీసాయి లక్ష్మి: ఫిబ్-14, పూర్ణా: మన శంకర వరప్రసాద్ గారు

ప్రజావేదిక 25న

మాకవరపాలెం, న్యూస్‌టుడే : మండలంలో ఏప్రిల్ 2024 నుంచి ఈ ఏడాది మార్చి 25 వరకు జరిగిన ఉపాధి పనులపై మంగళవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఛాయసుధా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 31 పంచాయతీ గ్రామాలలో సర్వే బృందం సభ్యులు నిర్వహించిన సర్వేలో వెల్లడైన వివరాలు ఉదయం 10 గంటల నుంచి చదివి వినిపించడం జరుగుతుందన్నారు.

క్రమబద్ధీకరణ.. వర్తింపునకు స్పందన

నర్సీపట్నం, న్యూస్‌టుడే: మున్సిపాలిటీలోని అనుమతులు లేని పాత నిర్మాణాలకు మోక్షం లభిస్తోంది. ప్రభుత్వం ఆదేశాలతో వీటికి అనుమతులు పొందగలుగుతున్నారు. వీటి యజమానులకు భవనాల క్రమబద్ధీకరణ పథకం(బీపీఎస్) మంచి అవకాశంగా అందుబాటులోకి వచ్చింది. దీనిపై అధికారుల విస్తృత ప్రచారం నేపథ్యంలో మంచి స్పందన లభిస్తోంది. ఇందులోభాగంగా ఇప్పటికే దాదాపు యాభైశాతం నిర్మాణాలకు అధికారికంగా హక్కులు వచ్చాయి. ఫలితంగా నిబంధనలకు విరుద్ధమైన మొత్తం 160 భవనాల నుంచి ఫీజు కింద రూ.2.15 కోట్లు పురపాలికకు ఆదాయంగా సమకూరింది.

అనుమతులు పొందిన భవనాలు

▼ నర్సీపట్నం పురపాలికకు ఇప్పటికి నాలుగు సార్లు బీపీఎస్‌కు అవకాశం కల్పించారు. 2025 ఆగస్టు 31కి ముందు నిర్మించిన వాటిని సైతం ఇప్పుడు ఈ జాబితాలో చేర్చారు. మున్సిపాలిటీలో ప్రస్తుతం 20 వేలకు పైగా ఇళ్లు, భవనాలు ఉన్నాయి. వీటిలో ప్రస్తుతం బీపీఎస్ పరిధిలోకి వచ్చేవి 338 ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వీటిని లక్ష్యంగా నిర్దేశించి నిబంధనలు అనుసరించి అపరాధ రుసుం వసూళ్లకు చర్యలు తీసుకోవల్సిందిగా ఆదేశాలు జారీ అయ్యాయి. దీనికి దరఖాస్తు చేసుకోవడానికి వీలుగా గతేడాది డిసెంబరులో ఆన్‌లైన్ మాడ్యూల్ అందుబాటులోకి వచ్చింది. ఇప్పటి వరకు పురపాలిక పరిధిలోని మొత్తం 220 మంది ముందుగా దీని నిమిత్తం రూ.10 వేలు చొప్పున చెల్లించి దరఖాస్తులు చేసుకున్నారు.

▼ బీపీఎస్‌కు దరఖాస్తు చేసుకున్న వారిలో ఇప్పటికే 160 మంది రుసుం మొత్తం చెల్లించి తమ నిర్మాణాలకు పక్కా అనుమతులు పొందారని పట్టణ ప్రణాళిక విభాగం అధికారి (టీపీఓ) సత్యనారాయణ తెలిపారు. దీని ద్వారా ఈ బీపీఎస్‌లో రాష్ట్రంలో నర్సీపట్నం 36 స్థానంలో ఉన్నట్లు పేర్కొన్నారు. పట్టణంలో కొందరు రూ.90 లక్షలు వరకు రుసుం చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. దీనికి వచ్చే మార్చి 13నాటికి గడువుగా నిర్ణయించారన్నారు. మొత్తం రూ.4 కోట్లు వరకు ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చే అవకాశం ఉన్నట్లు తెలిపారు. దరఖాస్తుల సంఖ్య 300 వరకు పెరుగుతుందని భావిస్తున్నామని అనధికారిక నిర్మాణాలు యజమానులంతా ఈ ఆఖరి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని టీపీఓ సత్యనారాయణ కోరారు.

సరుగుడు తోట దగ్ధం

బుచ్చెయ్యపేట: విజయరామరాజుపేటలో జరిగిన అగ్నిప్రమాదంలో ఆదివారం సరుగుతోట దగ్ధమైంది. ప్రమాదవశాత్తూ మంటలు వ్యాపించినట్లు బాధిత రైతుల పినపోలు తాతారావు తెలిపారు. రూ.2 లక్షల పంట నష్టం వాటిల్లినట్లు అంచనా చోడవరం నుంచి అగ్నిమాపక సిబ్బంది చేరుకొని మంటలను అదుపు చేశారు.

మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

జంపెనలో అగ్నిప్రమాదం

మాడుగుల గ్రామీణం, న్యూస్‌టుడే : మాడుగుల మండలంలోని జంపెన గ్రామంలో ఆదివారం సాయంత్రం అగ్నిప్రమాదం జరిగింది. ఈ ఘటనలో గ్రామానికి చెందిన రైతు పెచ్చెట్టి అప్పారావు చెందిన రెండు పశువుల పాకలు, వరికుప్ప పూర్తిగా కాలిపోయాయి. స్థానికులు మంటలు ఆర్పడానికి ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. ఇది ప్రమాదవశాత్తూ జరిగింది కాదని, కావాలనే ఎవరో ఈ దుశ్చర్యకు పాల్పడ్డారని స్థానికులు చెబుతున్నారు.

చీడికాడలో అకాల వర్షం

చీడికాడ, న్యూస్‌టుడే: మండలంలో కేంద్రంతో పాటు పరిసర గ్రామాల్లో ఆదివారం మధ్యాహ్నం అకాల వర్షం కురిసింది. అప్పటివరకు ఎండ తీవ్రత ఎక్కువగానే ఉంది. ఒక్కసారిగా మేఘావృతమై.. గాలులు మొదలై... వర్షం దంచికొట్టింది. దాదాపుగా 25 నిమిషాలు పాటు వర్షం ఏకధాటిగా కురిసింది. మహాశివరాత్రి తర్వాత ఫిబ్రవరి నెలలోనే ఎండల తీవ్రత పెరిగింది. సాధారణ ఉష్ణోగ్రతలు 35 డిగ్రీల వరకు పెరిగాయి. దీంతో ప్రజలు వారం రోజులుగా ఎండ ప్రభావానికి ఇబ్బంది పడుతున్నారు. ఈ సమయంలో ఆదివారం చీడికాడలో కురిసిన వర్షం ప్రజలకు ఉపశమనం కలిగించింది. మినుము పంట వర్షానికి తడిసిపోయింది. మండల కేంద్రం చీడికాడతో పాటు పరిసర గ్రామాల్లోనే వర్షం కురిసింది. అయితే చీడికాడ మండలంలోని కొన్ని గ్రామాల్లో చినుకు పడకపోవడం మరో విశేషం. సిరిజాం-ఖండివరం రోడ్డులో గాలులకు చెట్టు కూలిపోయింది.

మెడికల్ మాఫియాపై పోరాటం

కె.కోటపాడు: మెడికల్ మాఫియాపై సీపీఐ చేస్తున్న పోరాటానికి ప్రజలు సహకరించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రాజాన దొరబాబు కోరారు. ఆయన ఆదివారం మర్రివలసలో మెడికల్ పరంగా జరుగుతున్న మోసాలపై ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి గొర్లె దేముడుబాబు,వేచలపు కాసుబాబు,రెడ్డి అప్పలనాయుడు,రామారావు పాల్గొన్నారు.

క్రికెట్ విజేత డాన్‌బాస్కో జట్టు

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: డాన్‌బాస్కో కళాశాల ఆధ్వర్యంలో ఈనెల 16 నుంచి 22 వరకు నిర్వహించిన క్రికెట్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఇందులో 16జట్లు పాల్గొనగా ఫైనల్స్‌లో డాన్‌బాస్కో కళాశాల జట్టు శివపురం వారియర్స్ జట్టుపై గెలుపొందింది. విజేతలకు మొదటి బహుమతిగా రూ.10వేలు, ట్రోఫీ, ద్వితీయ బహుమతిగా రూ.5వేలు నగదు జ్ఞాపిక అందజేశారు. బాలశౌరి, మరియదాస్, ప్రిన్సిపల్ ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న 'భువన విజయం'

చీడికాడ, న్యూస్‌టుడే: చీడికాడ మండలం జి.కొత్తపల్లిలో చారిత్రాత్మక భువన విజయం నాటక ప్రదర్శన ఎంతో ఆకట్టుకుంది. ఈ నాటకం సంస్కార భారతి అనకాపల్లి శాఖ అధ్యక్షుడు ఎఆర్‌జీ శర్మ, ప్రధాన కార్యదర్శి జి.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో అభయాంజనేయ స్వామి తీర్థం సందర్భంగా ప్రదర్శించారు. భువన విజయం చారిత్రాత్మక నాటక ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేయడానికి చోడవరంకు చెందిన ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు, అధ్యాపకులు సమిష్టిగా శ్రీకారం చేపట్టారు. చక్కటి పౌరాణిక వేషధారణతో ప్రదర్శించిన నాటకాన్ని ప్రజలు ఎంతో ఆసక్తిగా తిలకించారు. కళాకారులను పెందుర్తి ఎంపీడీఓ కొల్లి వెంకటరావు, గ్రామ సర్పంచి కొల్లి సూర్యనారాయణ, మాజీ సర్పంచి పైడినాయుడు, యువనేత పాత్రిన సురేశ్ కలిసి సన్మానించారు.

సంస్కార భారతి జిల్లా అధ్యక్షుడు శర్మను సన్మానిస్తున్న గ్రామపెద్దలు

దశలవారీగా గ్రామీణ రోడ్లు అభివృద్ధి

రావికమతం, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని గ్రామీణ రోడ్లు అన్నింటినీ దశల వారిగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్.రాజు తెలిపారు. రావికమతం నుంచి నాగన్నపాలెం మీదుగా మరుపాక గ్రామానికి రూ.90 లక్షలతో రోడ్డు నిర్మాణానికి ఆదివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రావికమతం మండల పరిధిలో రోడ్డు నిర్మాణానికి ఇప్పటికే రూ.6 కోట్ల మేర నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. రావికమతం నుంచి గుడ్డిప వరకు రూ.3 కోట్లు, ఆర్ఈసీ రోడ్డు నుంచి మట్టవానిపాలెం మీదుగా బుచ్చెయ్యపేట వరకు రోడ్డు నిర్మాణానికి రూ.2.75 కోట్లు, కొత్తకోట నుంచి జెడ్.కొత్తపట్నం ప్రత్యామ్నాయ రహదారికి నాబార్డ్ ఆర్ఐడీఎఫ్ నిధులు రూ.70 లక్షలతో అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల తెదేపా అధ్యక్షుడు శంకరరావు, ఎంపీటీసీ సభ్యుడు సూర్యనారాయణ, మాజీ ఎంపీటీసీ సభ్యుడు రాంబాబు, గొర్లె శ్రీను, సత్తిబాబు, రామరాజు పాల్గొన్నారు.

భూమి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే రాజు తదితరులు

చోడవరం, న్యూస్‌టుడే: నియోజకవర్గంలో వివిధ పద్దుల కింద మంజూరైన అభివృద్ధి పనులను వేగంగా జరిగేలా ఆయా శాఖల ఇంజినీరింగ్ అధికారులు ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజు సూచించారు. తన క్యాంపు కార్యాలయంలో నాలుగు మండలాల ఇంజినీరింగ్ అధికారులు, డీఈఈలతో ఆయన సమావేశమై సమీక్ష నిర్వహించారు. శాఖల వారీగా జరుగుతున్న పనులు అడిగి తెలుసుకున్నారు. పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ, ఆర్‌డబ్ల్యూఎస్, జలవనరుల శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఆసుపత్రి ముఖద్వారం వద్ద గండం

చీడికాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద సిమెంటు రోడ్డులో గండం పొంచివుంది. సిమెంటు రోడ్డు శిథిలమై... పెద్ద ముక్కలైంది. దీంతో ఇక్కడ రోడ్డు చాలా ప్రమాదకరంగా ఉంది. రామాలయానికి రోడ్డులోని ఆసుపత్రి ముఖద్వారం ప్రమాదకరంగా మారింది. ఏమాత్రం ఆదమరిస్తే పెను ప్రమాదం తప్పదని చోదకులు, ఆసుపత్రి రోగులు ఆందోళన చెందుతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి సిమెంటుకు మరమ్మతులు చేయాల్సి ఉంది. **- న్యూస్‌టుడే, చీడికాడ**

ప్రమాదకరంగా సిమెంటు రోడ్డు

యంత్రం కదిలింది.. చెత్త తరిగింది!

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: నర్సీపట్నం పురపాలికలోని ఘన వ్యర్థాల నిర్వహణ పార్కులో 2021 నుంచి పోగుపడిన వ్యర్థాల తొలగింపు ప్రక్రియ ముగింపు దశకు చేరుకుంది. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ పంపిన వ్యర్థాల మైనింగ్ యంత్రాల ద్వారా ఆదివారానికి 20,249 టన్నుల వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతిలో తొలగించారు. చివరగా మిగిలిన రెండువేల టన్నుల చెత్తని ప్రస్తుతం తొలగిస్తున్నారు. ఈ పనులు పూర్తయితే 1.60 ఎకరాల భూమి పూర్తిగా ఖాళీ అయినట్టే. ఇక నుంచి పురపాలక సంఘం పర్యవేక్షణలోనే ఈ పనులు కొనసాగించేలా చూడటానికి యంత్రాలు, ఇతర సామగ్రి కొనుగోలుకు ఖర్చు చేయడానికి ప్రభుత్వం రూ.3.5 కోట్లు మంజూరు చేసింది. టెండర్ ప్రక్రియ పూర్తికాగానే యంత్రాలను ఏర్పాటు చేస్తారు. డంపింగ్‌యార్డులో ఇందుకోసం 1.20 ఎకరాలను కేటాయించారు.

వ్యర్థాలను పొడి చేస్తున్న యంత్రం

✦ పట్టణంలో రోజుకు 30 టన్నుల వరకు చెత్త సమకూరుతోంది. ఏర్పాటు కానున్న యంత్రాల ద్వారా మండే స్వభావం కలిగిన చెత్తను వేరు చేసి విశాఖపట్నంలోని జిందాల్ పరిశ్రమకు తరలిస్తారు. ప్లాస్టిక్, గాజు, ఇనుము తదితర రీసైక్లింగ్‌కు ఉపయోగపడే వస్తువులను వేరు చేసి ఆదాయ వనరుగా మార్చుతారు. పట్టణంలో ఇప్పటికే ఈ-వ్యర్థాల సేకరణ కేంద్రం ఏర్పాటైంది. ఇళ్లలో వృథాగా పడి ఉంటే ఎలక్ట్రానిక్ వస్తువులను పారిశుద్ధ్య సిబ్బంది సేకరిస్తున్నారు. వందల కిలోల ఈ-వ్యర్థాలు ఇలా సేకరించారు. ప్రతినెలా పది, ఇరవై తేదీల్లో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ సిబ్బంది వచ్చి వీటిని తరలించనున్నారు. పట్టణంలో 2016లోనే రూ.116 లక్షల ఖర్చుతో ఏడు ఎకరాల్లో ఘన-వ్యర్థాల నిర్వహణ పార్కు ఏర్పాటైంది. ఈ పార్కు ఆవరణలోనే ఊళ్లోని చెత్తనంతా గుట్టగా వేసేవారు. ఈ గుట్టంతా ఇప్పుడు యంత్రాల ద్వారా తొలగించారు. స్వచ్ఛ నర్సీపట్నం సాకారానికి ఇక నుంచి పటిష్ఠ కార్యాచరణ అమలు చేయనున్నారు.

చెక్ పవర్ పునరుద్ధరణ

మాకవరపాలెం, న్యూస్‌టుడే : జి.కోడూరు పంచాయతీ సర్పంచి అమ్మాజి లక్ష్మి కార్యక్రమాలు, విధులు సక్రమంగా విధులు నిర్వహించట్లేదన్న ఆరోపణలపై కలెక్టర్‌రుకు అందిన ఫిర్యాదుపై ఏడాది కిందట సర్పంచి పదవితో పాటు చెక్‌పవర్ రద్దు చేస్తూ ఆదేశాలు జారీచేశారు. ఈ మేరకు సర్పంచి న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో శనివారం రాత్రి సర్పంచి పదవి, చెక్‌పవర్ కొనసాగిస్తున్నట్లు ఆదేశాలు వచ్చినట్లు ఈఓఆర్డీ మేరీజోన్సు ఆదివారం తెలిపారు.

పార్టీ సభ్యత్వం నమోదుపై ప్రత్యేక దృష్టి

చీడికాడ, న్యూస్‌టుడే: జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమం ఈనెల 26 నుంచి మొదలవుతుందని, జనసైనికులు ప్రత్యేక దృష్టిసారించాలని ఆ పార్టీ చీడికాడ మండలాధ్యక్షుడు జీవీ మూర్తి సూచించారు. చీడికాడ శివాలయం వద్ద ఆదివారం జనసేన పార్టీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 12 మంది సభ్యులతో కూడిన జనసేన పార్టీ మండల కమిటీ ఏర్పాటు చేశారు. మండల ఉపాధ్యక్షుడిగా మజ్జి కృష్ణ, ప్రధాన కార్యదర్శులుగా మురుకుటి అప్పారావు, పెంటకోట సూరిబాబు, సోషల్ మీడియా ఇన్‌ఛార్జి మధుమతి శివ, ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా రాజు, కార్యదర్శులుగా రాము, నాయుడు, స్వామి, సోమునాయుడు, అనీల్, రామారావు, విజయ్‌లను నియమించారు.

ఆలయ నిర్మాణానికి అంకురార్పణ

రావికమతం, న్యూస్‌టుడే: టి.అర్జాపురంలో అన్నపూర్ణ సమేత ఓంకారేశ్వర, విజయ గణపతి దేవాలయం నిర్మాణానికి అంకురార్పణ ఆదివారం ఘనంగా జరిగింది. సుమారు రూ.3 కోట్లు ఖర్చుతో అంతా రాతితో ఓంకారేశ్వర స్వామి ఆలయ నిర్మాణం జరుగుతోంది. తెదేపా సర్పంచి మాడుగుల పాల్గుణ దంపతుల ఆధ్వర్యంలో ఆలయ నిర్మాణానికి పూజా కార్యక్రమాలు జరిగాయి. టి.అర్జాపురం, చిలకవానిపాలెం గ్రామస్థులు ఆలయ నిర్మాణం కార్యక్రమానికి కార్యక్రమానికి భారీగా తరలి వచ్చారు. ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్.రాజు, తెదేపా జిల్లా అధ్యక్షుడు, హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ బత్తుల తాతయ్యబాబు, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ కొండనాయుడు, మండల తెదేపా అధ్యక్షుడు శంకరరావు పాల్గొన్నారు.

పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ చిరంజీవిరావు, జిల్లా తెదేపా అధ్యక్షుడు తాతయ్యబాబు తదితరులు

పనుల్లో నిర్లక్ష్యం.. పొంచి ఉన్న ప్రమాదం

వడ్డాది కూడలికి సమీపంలో రోడ్డు పక్కన గొయ్యి

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: బీఎన్ రోడ్డు విస్తరణ పనుల్లో అడుగడుగునా నిర్లక్ష్యం కనిపిస్తోంది. ఏళ్లుగా పనులు నత్తనడకన సాగుతున్నాయి. వడ్డాది-చోడవరం మార్గంలో పనులను అసంపూర్తిగా వదిలేశారు. విశాఖ డెయిరీ బల్క్‌కూలింగ్ కేంద్రం సమీపంలో రోడ్డు పక్కన సుమారు పది మీటర్ల పొడవున మట్టి తవ్వి వదిలేశారు. వెట్‌మిక్స్‌తో గుంతను పూడ్చి పటిష్ఠం చెయ్యాల్సి ఉంది. దీంతో నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రోలుగుంటలో 'వరల్డ్ థింకింగ్ డే'

రోలుగుంట, న్యూస్‌టుడే: 'వరల్డ్ థింకింగ్ డే' సందర్భంగా స్థానిక జిల్లాపరిషత్తు ఉన్నత పాఠశాలలో 'స్కౌట్స్ అండ్ గైడ్స్' వ్యవస్థాపకుడు 'లార్డ్‌బాడెన్ పావెల్' జయంతి సందర్భంగా సేవా కార్యక్రమాలను నిర్వహించారు. సమాజ సేవ, స్నేహభావం తదితర విలువలపై ప్రజలకు అవగాహన కలిగించారు. ఈనెల 21న 'వరల్డ్ థింకింగ్ డే' సందర్భంగా చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి రోలుగుంట హెచ్ఎం. శేషగిరిరావు అధ్యక్షత వహించగా స్కౌట్ మాస్టర్ గోవిందు, గైడ్ కెప్టెన్ నాగజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

జ్యోతి వెలిగిస్తున్న శేషగిరిరావు

రూ.10లక్షలతో కాలువల నిర్మాణం

చోడవరం, న్యూస్‌టుడే: రాయపురాజు పేట గ్రామంలో కాలువలు, రహదారుల నిర్మాణ పనులు కొత్తవి చేపడుతున్నట్లు గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ గంగాధర్, సర్పంచి రామునాయుడు తెలిపారు. అభివృద్ధి పనులకు గ్రామస్థుల సమక్షంలో ఆదివారం కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఉపాధి నిధులు రూ.10 లక్షలు ఎమ్మెల్యే రాజు మంజూరు చేయించారని డైరెక్టర్, సర్పంచి పేర్కొన్నారు.

రా.రా.పేటలో అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న గంగాధర్, రామునాయుడు, నాయకులు

కంటి శిబిరంతో పేదలకు సాంత్వన

నర్సీపట్నం, న్యూస్‌టుడే: మండలంలోని చెట్టుపల్లిలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం ద్వారా నిరుపేదలు సాంత్వన చేకూరింది. గ్రామంలోని కూటమి నాయకుల ఆధ్వర్యంలో కాకినాడ కిరణ్ కంటి ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది శిబిరంలో మొత్తం 240 మందికి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 26 మందిని శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించారు. ఇందులో జనసేన నాయకుడు చక్రవర్తి, గ్రామ సర్పంచి సూరిబాబు ఇతర నాయకులు రమణ, సత్యప్రసాద్ పాల్గొన్నారు.

శిబిరంలో రోగికి కంటి పరీక్ష

ఉత్సవ ఏర్పాట్ల పరిశీలన

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: వడ్డాది వెంకటేశ్వరస్వామి 153వ కల్యాణోత్సవ ఏర్పాట్లను ఆదివారం కొత్తకోట సీఐ కోటేశ్వరరావు, ఎస్సై శ్రీనివాసరావు పరిశీలించారు. ఈనెల 27 నుంచి మార్చి 4 వరకు ఉత్సవాలు జరగనున్నాయి. జిల్లా నలుమూలల నుంచి భారీగా భక్తులు తరలిరానున్నారు. ఈ సందర్భంగా భక్తులకు ఇబ్బంది లేకుండా ఉండటానికి క్యూలైన్లు, బారికేడ్లు ఏర్పాటు, వాహనాల పార్కింగ్ స్థలాలను పోలీసులు పరిశీలించారు. ఈవో శర్మ, ఉత్సవ కమిటీ సభ్యులతో మాట్లాడి ఏర్పాట్లపై సూచనలు చేశారు.

కారు ప్రమాదం కేసులో కొనసాగుతున్న దర్యాప్తు

కె.కోటపాడు, న్యూస్‌టుడే : బుచ్చెయ్యపేట మండలం విజయరామరాజుపేటకు చెందిన నవ వధువరుల ఇళ్లల్లో విషాదానికి కారణమైన నిర్లక్ష్యంగా వేగంగా కారు నడిపిన డ్రైవరు ఎవరన్నది తెలియలేదు.కారు ఎవరిది..దీనిని నడిపినవారు ఎవరన్నది బయటపడటం లేదు. కె.కోటపాడు మండలం బత్తివానిపాలెం వద్ద శనివారం జరిగిన ప్రమాదంలో బుచ్చెయ్యపేట మండలం విజయరామరాజుపేటకు పలువురికి గాయాలైన సంగతి తెలిసిందే. ఈ దుర్ఘటనకు కారణమైన డ్రైవరు ఎవరన్నది తెలియలేదు. గాయపడివారు సైతం విషయాన్ని చెప్పడం లేదు. దీనిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం

గొలుగొండ, న్యూస్‌టుడే: జోగుంపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో 1995-96లో పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం సమావేశమయ్యారు. 30 ఏళ్ల తరవాత అందరూ ఒకేచోట కలుసుకుని ఆప్యాయంగా పలకరించుకున్నారు. కొందరు ఉద్యోగాల్లో స్థిరడ్డారు. మరికొందరు ఇతర ప్రాంతాల్లో వ్యాపారులు చేస్తున్నారు. ఆత్మీయ కలయిక కారణంగా వీరంతా ఓచోట కలిసి సరదాగా గడిపారు. ఆహ్లాదకర వాతావరణంలో కలిసి అప్పట్లో తమకు చదువు చెప్పిన గురువులు ప్రకాశరావు, కామేశ్వరరావు, లక్ష్మణరావులకు సమస్కరించి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఆర్థిక ఇబ్బందులో ఉన్న స్నేహితురాలి కుటుంబానికి రూ.10 వేలు సాయం అందించారు.

హైస్కూల్ ఆవరణలో కలిసిన 1995-96 విద్యార్థులు

మేమున్నాం.. మీకు తోడుగా

నర్సీపట్నం - 80085 74743	చోడవరం - 80085 74732
మాడుగుల - 80085 74740	చీడికాడ - 80085 74742

కె.కోటపాడు, న్యూస్‌టుడే: చౌడువాడలో ఇందిరమ్మకాలనీకి చేరే రోడ్డు మలుపు వద్ద ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాద సూచికలను ఏర్పాటు చేయండి- **రాపేటి నాయుడు, చౌడువాడ,** ✔: ప్రమాదాన్ని సూచించే బోర్డులను ఏర్పాటు చేస్తాం. **- సత్యప్రసాదు, ఏఈ, చోడవరం**

గొలుగొండ, న్యూస్‌టుడే: లింగంపేట కాలనీ వీధిలో సీసీ రోడ్లు నిర్మించారు. అవసరమైన రెండు చోట్ల కల్వర్టులు నిర్మించకుండా వదిలేయడంతో దాటడానికి ఇబ్బంది పడుతున్నాం. **- లింగమూర్తి, స్థానికుడు,** ✔: కాలువల వద్ద కల్వర్టులు నిర్మించాల్సిన అవసరాన్ని గుర్తించాం. ఇప్పటి వరకు పంచాయతీలో నిధులు కొరత ఏర్పడింది. ఆర్థిక సంఘం నిధులు అందుబాటులోకి వచ్చిన వెంటనే పనులు పూర్తిచేస్తాం. **- సంతోష్, కార్యదర్శి**

ఘనంగా ప్రారంభోత్సవాలు.. విగ్రహ ప్రతిష్ఠలు

దేవరాపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని మారేపల్లిలో నూతనంగా నిర్మించిన అభయాంజనేయ స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. జైశ్రీరాం నినాదాలతో మారేపల్లి గ్రామం మార్మోగింది. ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శని, ఆదివారాల్లో పూజాకార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరిగాయి. స్వామి వారిని మాజీ మంత్రి బూడి ముత్యాలనాయుడు, కూటమి నాయకులు కిల్లి గోవింద తదితరులు దర్శించుకున్నారు.

రోలుగుంట, న్యూస్‌టుడే: మండలంలో కురసర్లపూడి పెద్దింటమ్మ ఉత్సవాల నిర్వహణకు సంబంధించి పత్రికలను ఎమ్మెల్యే రాజు ఆవిష్కరించారు. జాతరను ఈనెల 27న ప్రారంభించి వచ్చేనెల 3న ఉత్సవాలను ముగించడానికి కమిటీ నిర్ణయించింది. ఈ మేరకు ముద్రించిన పత్రికలను ఎమ్మెల్యే రాజుతోపాటు నాయకులు గేదెల సత్యనారాయణ, గూనూరు మల్లునాయుడుతో కలిసి పత్రికలను విడుదల చేశారు. మండల నాయకులు పంచాడ చంద్ర, సబ్బవరపు పెద్దినాయుడు, సుర్ల రామకృష్ణ, బాబులునాయుడు పాల్గొన్నారు.

గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రాజు, నాయకులు

రావికమతం, న్యూస్‌టుడే: కొత్తకోటలో పోతురాజుబాబు నూతన ఆలయం ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్ఠాపన ఘనంగా జరిగింది. గ్రామానికి చెందిన తంటపురెడ్డి కుటుంబీకులు ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేశారు. ముహూర్తం ప్రకారం ఉదయం 11.48 గంటలకు విగ్రహ ప్రతిష్ఠాపన నిర్వహించారు. కొత్తకోట తెదేపా నాయకులతో కలిసి ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్.రాజు కార్యక్రమంలో పాల్గొన్నారు. వైకాపా జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ తదితరులు హాజరయ్యారు.


మారేపల్లిలో విగ్రహ ప్రతిష్ఠలో భక్తులు

చీడికాడ, న్యూస్‌టుడే: చీడికాడ మండలం అడవి అగ్రహారంలో ఆదివారం అభయాంజనేయస్వామి తీర్థం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మధ్యాహ్నం జిల్లా స్థాయి ఎడ్లబళ్ల పరుగు పోటీలు జరిగాయి. వీటితోపాటు కోలాటం, పలు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు.

(c) eenadu

తెరపై ఈనాడు
లక్ష్మీకాంత్ స్క్రీన్-1: హే బలవంత్
స్క్రీన్-2: ఆల్ఫా

రహదారి నిర్మాణం.. నివాసితుల హర్షం

చినముషిడివాడ (పెందుర్తి), న్యూస్‌టుడే: జీవీఎంసీ 97వ వార్డు చినముషిడివాడ శ్రమశక్తినగర్ కాలనీ 6వ లేఅవుట్‌లో కొత్తగా రహదారి నిర్మాణ పనులు ప్రారంభించడంపై నివాసితులు, కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. ఈ లేఅవుట్‌లోని పార్కు చుట్టూ రహదారి అభివృద్ధి నోచుకోకపోవడంతో నివాసితులు తీవ్ర అవస్థలు ఎదుర్కొన్నారు. ఈ సమస్యపై 'ఈనాడు'లో పలుమార్లు వెలువడిన కథనాలకు వార్డు కార్పొరేటర్ శానాపతి వసంత స్పందించారు. నిధుల మంజూరుకు కృషి చేయడంతో పనులు ప్రారంభమయ్యాయి.

పెందుర్తి

సీఐ బాలికల వసతిగృహం సందర్శన

విద్యార్థినులతో మాట్లాడుతున్న సీఐ మల్లికార్జునరావు

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలం భరణికం గ్రామంలో న్యూహోమ్ బాలికల వసతిగృహాన్ని ఆదివారం పరవాడ సీఐ మల్లికార్జునరావు సందర్శించారు. ఇక్కడ బాలికలకు అందిస్తున్న సౌకర్యాలపై ఆరా తీసి సమస్యలు తెలుసుకున్నారు. బాలికలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా పోలీసులకు తెలియజేయాలని సూచించారు. ఎస్సై మహాలక్ష్మి పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

80085 74978 సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

వేపగుంట, న్యూస్‌టుడే: ?: 94వ వార్డు అప్పలనరసయ్యకాలనీలోని కాలువల్లో చెత్త పేరుకుపోయి దుర్గంధం వెలువడుతోంది. –నారాయణరావు, రాజుగారి, స్థానికులు. ✓: వెంటనే పరిశీలించి శుభ్రత పనులు చేపడతాం. –ప్రసాదరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్.

సబ్బవరం, న్యూస్‌టుడే: ?: విద్యుత్తు సబ్‌స్టేషన్‌కు వెళ్లే రహదారి పూర్తిగా శిథిలం కావడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. –వి.రాజేష్, సబ్బవరం. ✓: ఈ సమస్యపై ఉన్నతాధికారులకు తెలియజేస్తాం. –అశోక్‌కుమార్, ఏఈ, ఏపీఈపీడీసీఎల్.

?: సబ్బవరం సామాజిక భవనం వెనుక రహదారి పూర్తిగా దెబ్బతినడంతో స్థానికులు ఇబ్బందులు గురవుతున్నారు. –ఎస్.నాగేంద్రకుమార్, సబ్బవరం ✓: ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తాం. –డి.ప్రసాదరావు, సబ్బవరం

పరవాడ, న్యూస్‌టుడే: ?: పరవాడ పార్కులోని ఆట వస్తువులు తుప్పు పట్టి, పిచ్చిమొక్కలతో అధ్వానంగా మారింది. –శ్రీను, పరవాడ ✓: పార్కులోని పరిసరాలను శుభ్రం చేయించి వినియోగంలోకి తెచ్చేందుకు చర్యలు చేపడతాం. –మల్లికార్జునరావు, ఈవోపీఆర్డీ, పరవాడ.

ప్రమాదకరంగా వేగ నియంత్రికలు

ఫోకస్

పరవాడ, న్యూస్‌టుడే: వాహన చోదకులు సురక్షితంగా గమ్యం చేరేందుకు పలుచోట్ల ఏర్పాటు చేసిన వేగ నియంత్రికలు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయి. ఇవి పలు చోట్ల వాహన చోదకులకు స్పష్టంగా కనిపించేలా లేకపోవడంతో కిందపడి కొందరు మృత్యువాత పడగా, మరికొందరు గాయాలపాలయ్యారు. ★ పరవాడ మండలంలోనూ పలుచోట్ల ఇవి ప్రమాదకరంగా మారాయి. పరవాడ గండివానిపాలెం, బొంకులదిబ్బ ప్రాంతాలతో పాటు వెన్నెలపాలెం, తానాం, తాడి ఇవే సీపీఎల్ కంపెనీ, జీవీఎంసీ ఫార్మాసిటీలో వేసిన వేగనిరోధకాలకు రేడియం స్టిక్కర్లు, రంగులు లేవు. రాత్రి వేళ ఇవి కనిపించక ద్విచక్రవాహనదారులు అదుపుతప్పి పడుతున్నారు. వేగంగా ప్రయాణించే వాహనదారులు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వేగ నిరోధకాలు స్పష్టంగా కనిపించేలా రంగులు వేయించాలని, రేడియం స్టిక్కర్లు అమర్చాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

పరవాడ రహదారిలో ఇలా..

వేపగుంట బీఆర్‌టీఎస్ మధ్య దారిలో.. భూమిలోకి చొచ్చుకుపోయిన స్పీడ్‌బ్రేకర్

వేపగుంట, న్యూస్‌టుడే: వేపగుంట కూడలి నుంచి గోపాలపట్నం పెట్రోల్ బంక్ వరకు, వేపగుంట-పెందుర్తి రహదారిలో పురుషోత్తపురం వరకు, వేపగుంట నుంచి పాతగోశాల కూడలి వరకు, పాతగోశాల కూడలి నుంచి గోపాలపట్నం పెట్రోల్‌బంక్ వరకు ఉన్న స్పీడ్‌బ్రేకర్లపై తెలుపు రంగు సూచికలు పూర్తిగా చెరిగిపోయాయి. ఈ మూడు మార్గాల్లోని మధ్య దారుల్లో 26, సేవా మార్గాల్లో 15 స్పీడ్‌బ్రేకర్లు ఉన్నాయి. వీటికి రేడియం స్టిక్కర్లు ఇరువైపులా వేయాల్సి ఉన్నప్పటికీ కొన్నిచోట్లకే పరిమితం అయ్యాయి. వేపగుంట నుంచి పురుషోత్తపురం వరకు వీటిని ఒకవైపున అమర్చలేదు. గతంలో వేసిన రబ్బరు స్పీడ్‌బ్రేకర్లు భూమిలోకి కూరుకుపోయాయి.

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలంలో ఎన్‌హెచ్-16 రహదారికి ఇరువైపులా సుమారు 45 చోట్ల వేగ నియంత్రికలు ఉన్నాయి. అయిదేళ్ల క్రితం వాటిని వేసినందున ప్రస్తుతం రంగులు చెరిగిపోయి రాత్రి పూట ప్రాణాంతకంగా మారాయి. ★ నారపాడు హైవే మైదానానికి ఆనుకుని వేసిన స్పీడ్ బ్రేకర్లు కనిపించక ఓ వ్యక్తి అదుపు తప్పి కింద పడి మృతి చెందాడు. సబ్బవరం పోలీస్‌స్టేషన్ వద్ద ఒకరు ప్రాణాలు కోల్పోయారు. ★ అనకాపల్లి-ఆనందపురం హైవే (బైపాస్ రహదారి) ఇరువాడ కూడలి వద్ద ఎలాంటి సూచికలు లేక వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. సబ్బవరం ఎన్టీఆర్ సర్కిల్, ఆర్టీసీ కాంప్లెక్స్, ప్రభుత్వ ఆసుపత్రి, బాలుర వసతిగృహం, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కొత్త, పాత రోడ్ల వద్ద వేగ నియంత్రికలున్నా అవి కనిపించేలా లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

సబ్బవరం బైపాస్‌లో అసకపల్లి కూడలి వద్ద..

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

రోగులను పలకరిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు

సరిపల్లి (పెందుర్తి), న్యూస్‌టుడే: నగరానికి చెందిన అర్క ఆసుపత్రి వైద్యుడు డాక్టర్ రాయవరపు రేవంత్ ఆధ్వర్యంలో ఆదివారం పెందుర్తి మండలం సరిపల్లి గ్రామంలో ఉచిత మెగా వైద్య శిబిరం జరిగింది. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన శిబిరాన్ని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. యువ వైద్యులు ఇలాంటి శిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. సరిపల్లి పరిసర గ్రామాలకు చెందిన సుమారు 300మందికి వివిధ వైద్య, ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ మాజీ ఫ్లోర్‌లీడర్ రెడ్డి నారాయణరావు, ఎంపీటీసీ సభ్యుడు గొల్లవిల్లి వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ కలయిక

ప్రహ్లాదపురం(వేపగుంట), న్యూస్‌టుడే: నేవల్ డాక్‌యార్డ్‌లోని విద్యుత్తు శాఖ విశ్రాంత ఉద్యోగులు ఆదివారం ప్రహ్లాదపురంలో కలుసుకుని సందడి చేశారు. ఈ సందర్భంగా పలువురు సీనియర్ విశ్రాంత అధికారులను ఘనంగా సత్కరించారు. దూరమైన స్నేహితులకు శ్రద్ధాంజలి ఘటించారు. ఆడారి పాపారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి కమిటీ సభ్యులు జి. శ్యాంప్రసాద్, పి.ఎస్.ఎన్.మూర్తి, పి.శ్రీహరి, ఎస్.ప్రకాశరావు, ఎం.పి.దత్, ఎండీ హుస్సేన్, పి.ఆదినారాయణ తదితరులు సహాయ సహకారాలు అందించారు. ఈ సమావేశానికి వివిధ ప్రాంతాల నుంచి పలువురు విశ్రాంత ఉద్యోగులు హాజరై పరస్పరం యోగక్షేమాలు తెలుసుకుని రోజంతా ఉత్సాహంగా గడిపారు.

చేతులెత్తి ఐక్యత చాటుతున్న నేవల్ డాక్‌యార్డ్ విశ్రాంత ఉద్యోగులు

ఘనంగా అమ్మవార్ల ఊరేగింపు

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ పైడిమాంబ, తానాం పరదేశిమాంబ, దేశపాత్రునిపాలెం పోలమాంబ వేడుకలు ఆదివారం రాత్రి ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పైడిమాంబ గరగ, పరదేశిమాంబ, పోలమాంబ ఘటాలను మేళతాళాలు, బాణసంచా కాల్పుల నడుమ గ్రామపురవీధుల్లో ఊరేగించారు. సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

నేడు ఉద్యోగ మేళా

పెందుర్తి, న్యూస్‌టుడే: స్థానిక ఆదర్శ్ డిగ్రీ కళాశాలలో సోమవారం ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ ఫ్లోరా ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి జరగనున్న ఈ శిబిరంలో 2015 నుంచి 2026 వరకు డిగ్రీ, బీటెక్ పూర్తి చేసినవారు, ఇంకా చివరి సంవత్సరం చదువుతున్న అభ్యర్థులు పాల్గొనవచ్చునని తెలిపారు. వివిధ సంస్థల ప్రతినిధులు మౌఖిక పరీక్షలు నిర్వహిస్తారని వివరించారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రాకపోకలకు మార్గం సుగమం

స్పందనకు వందనం

పెందుర్తి, న్యూస్‌టుడే: జీవీఎంసీ 96వ వార్డు పాత పెందుర్తిలోని జెడ్పీ ఉన్నత పాఠశాల సమీపంలో వేగ నియంత్రికలు ప్రమాదకరంగా మారిన నేపథ్యంలో ఇటీవల 'ఈనాడు'లో 'ఎంతటి వాహనమైనా.. అక్కడ ఆగి వెళ్లాల్సిందే..!' శీర్షికన వెలువడిన కథనానికి జీవీఎంసీ అధికారులు స్పందించారు. ప్రమాదకరంగా ఉన్న వేగ నియంత్రికలను తొలగించి వాటి స్థానంలో వాహనాలు సాఫీగా ప్రయాణించేలా పరిమితమైన ఎత్తుతో కొత్తగా నిర్మించడంతో వాహన చోదకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత నియంత్రికలు రాత్రి వేళ స్పష్టంగా కనిపించేలా రేడియం స్టిక్కర్లు, అవసరమైన సూచికలు ఏర్పాటు చేయాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

అబాకస్ పోటీల్లో ప్రతిభ

పతకాలు సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

పెందుర్తి, న్యూస్‌టుడే: ఏలూరులో ఆదివారం జరిగిన రాష్ట్రస్థాయి అబాకస్, వేద గణితం పోటీల్లో పెందుర్తి లిటిల్ ఫ్లవర్స్ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రదర్శన కనబరిచినట్లు ప్రిన్సిపల్ కేఎస్ఎన్ రాజు తెలిపారు. అబాకస్ లెవెల్-2లో రేష్మ, షణ్ముఖప్రియ మొదటి బహుమతి, ప్రీ లెవెల్ విభాగంలో అనన్య మూడవ బహుమతి, వేద గణితంలో ఈశ్వర్ రెండవ, తనుశ్రీ మూడవ బహుమతులు సాధించినట్లు వివరించారు. దీంతో పాటు బెస్ట్ టీచింగ్ అవార్డు కూడా సొంతమైనట్లు వివరించారు. ఈ సందర్భంగా సంబంధిత విద్యార్థులను ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు అభినందించారు.

రైల్వేస్టేషన్ రోడ్డులో ఆక్రమణల బెడద

ఎంఈవో కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన దుకాణం

పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తి రైల్వేస్టేషన్ రోడ్డులో ఆక్రమణలు పెరుగుతున్నాయని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలీస్ స్టేషన్ నుంచి రైల్వేస్టేషన్‌కు వెళ్లే దారి ఇరుకుగా ఉంటుంది. రద్దీ సమయాల్లో ఈ రోడ్డులో తరచూ ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ క్రమంలో ఎంఈవో కార్యాలయ సమీపంలో గతంలో పాడైపోయిన ఓ లారీ ఉండేది. దాన్ని ప్రస్తుతం తొలగించడంతో ఆ ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తులు బడ్డీ పెట్టారు. ఈ మార్గంలో పెందుర్తి సీహెచ్‌సీ, మండల వ్యవసాయ, విద్యాశాఖ, పీ-4 ప్రగతి కార్యాలయాలున్నాయి. ఇక్కడికి వేర్వేరు పనుల కోసం వచ్చే వారంతా తమ వాహనాలను రోడ్డుపైనే పార్కింగ్ చేస్తున్నారు. ఆ ప్రదేశంలోనే తాజాగా బడ్డీ ఏర్పాటు చేయడంతో వాహనాల పార్కింగ్‌కు తీవ్ర ఇబ్బంది ఏర్పడుతోంది. దీంతో పాటు ట్రాఫిక్ సమస్యలు తీవ్రమవుతున్నాయని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి ఈ మార్గంలోని ఆక్రమణలు తొలగించాలని కోరుతున్నారు.

గెడ్డలో పేరుకుపోయిన వ్యర్థాలు..

దర్పణం

పాపయ్యరాజు పాలెం (పెందుర్తి), న్యూస్‌టుడే: జీవీఎంసీ 95వ వార్డు పాపయ్యరాజుపాలెంలోని సాయిబాబా ఆలయ సమీప గెడ్డలో వ్యర్థాలు పేరుకుపోయి దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు వాపోతున్నారు. ఇక్కడ మురుగు నిలిచిపోవడంతో దోమల బెడద కూడా వెంటాడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత కొన్నేళ్లుగా ఇక్కడ పరిశుభ్రత పనులు జరగకపోవడం వల్ల ఈ పరిస్థితి తలెత్తిందని అంటున్నారు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

విజేతలకు బహుమతుల అందజేత

తానాం(పరవాడ) న్యూస్‌టుడే: పరవాడ మండలం తానాం గ్రామంలో పరదేశిమాంబ ఉత్సవాల సందర్భంగా ఆర్‌జికె యువసేన, తెలుగు యువత సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండలస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు ముగిశాయి. ఈ పోటీల్లో ప్రతిభ చాటిన సాలాపువానిపాలెం, తాడి, తానాం-1, తానాం-2 జట్లు వరస విజేతలుగా నిలిచాయి. వీరికి ఆదివారం రాత్రి రూ. 8వేలు, రూ. 6వేలు, రూ. 4వేలు, రూ. 2వేలు చొప్పున నగదు బహుమతులతో పాటు జ్ఞాపికలను మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అందజేశారు. 79వవార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి క్రికెట్ పోటీల విజేత 'దోసూరు'

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ పైడిమాంబ వేడుకల సందర్భంగా రెండు వారాలుగా జరుగుతున్న జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు ఆదివారం సాయంత్రం ముగిశాయి. ఈ పోటీల్లో అచ్యుతాపురం మండలం దోసూరు జట్టు (ప్రథమ), గొర్లెవానిపాలెం జట్టు (ద్వితీయ), ఎలమంచిలి జట్టు (తృతీయ) విజేతలుగా నిలిచాయి. వీరికి వరసగా రూ. 25వేలు, రూ. 15వేలు, రూ. 10వేలు నగదు బహుమతులు, జ్ఞాపికలను స్థానిక నాయకులు సిరిపురపు అప్పలనాయుడు, పైలా శ్రీనివాసరావు, చుక్క రామునాయుడు, పైలా సన్యాసిరావు చేతులమీదుగా అందజేశారు. నిర్వాహకులు వర్రి చంద్రశేఖర్, పైలా బుజ్జి, పైలా కృష్ణ, గండి మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

విజేత జట్టుకు జ్ఞాపికతో పాటు నగదు అందజేస్తున్న నాయకులు, నిర్వాహకులు

అ వీ ఇ వీ

85 యూనిట్ల రక్త నిల్వల సేకరణ

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలం జోడుగుళ్ల బంగారమ్మతల్లి సేవా సమితి ఆధ్వర్యంలో తాసుబిల్లి ఫౌండేషన్ ఛైర్మన్ శంకర్‌నాయుడు జన్మదినాన్ని పురస్కరించుకుని సబ్బవరంలో ఆదివారం స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో రోటరీ బ్లడ్ బ్యాంకు ప్రతినిధులు 85 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. బంగారమ్మతల్లి సేవా సమితి అధ్యక్షుడు సింగంపల్లి వెంకట్రావు, తదితర నాయకులు రక్తదానం చేసిన వారిని అభినందించారు.

24న పైడిమాంబ జాతర

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ పైడిమాంబ అమ్మవారి జాతర ఈనెల 24వ తేదీన జరగనుంది. ఈ మేరకు సోమవారం అర్ధరాత్రి నుంచి అమ్మవారి దర్శనాలు ప్రారంభమై మంగళవారం రాత్రి వరకు కొనసాగుతాయి. ఇందుకోసం ఆలయం వద్ద జరుగుతున్న ఏర్పాట్లను గ్రామపెద్దలు, ఉత్సవ కమిటీ ప్రతినిధులతో కలిసి సీఐ మల్లికార్జునరావు పరిశీలించారు. భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన క్యూలైన్లు, బారికేడ్లు, టెంట్లు పరిశీలించారు. భక్తులకు తాగునీరు అందుబాటులో ఉంచాలని, ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా తగిన చర్యలు చేపట్టాలని సూచించారు.

సంప్రదాయబద్ధంగా బల్లల పండగ

అగనంపూడి, న్యూస్‌టుడే : అగనంపూడి పరిధి కొండయ్యవలస కాలనీలో ఆదివారం శ్రీ బొర్రమాంబ రజక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సంప్రదాయబద్ధంగా బల్లల పండగను నిర్వహించారు. కులదైవం వడివేలు దేవుడికి ప్రత్యేక పూజలు చేశారు. విశాఖ జిల్లా రజక సంక్షేమ సంఘం అధ్యక్షుడు తోకాడ రాము పాల్గొన్నారు.

ఘనంగా 'బ్రహ్మకుమారీస్' వార్షికోత్సవం

పురుషోత్తపురం (పెందుర్తి), న్యూస్‌టుడే: ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయ వార్షికోత్సవం పురుషోత్తపురంలోని ఆదివారం సాయంత్రం రాజయోగ ధ్యాన కేంద్రంలో ఘనంగా జరిగింది. 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు, పెందుర్తి ఎస్ఐ లక్ష్మీ, భాజపా జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు నాదెళ్ల జ్యోతి, పెందుర్తి భాజపా కన్వీనర్ గొర్లె రామునాయుడు ఈ వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా బ్రహ్మకుమారీస్ సమాజానికి అందిస్తున్న సేవలను నిర్వాహకులు వివరించారు. బ్రహ్మకుమారీస్ ప్రతినిధులు సత్యవతి, తదితరులు పాల్గొన్నారు.

వేడుకల్లో పాల్గొన్న బ్రహ్మకుమారీలు, అతిథులు

శ్రీనివాసుడి సన్నిధిలో ప్రముఖులు

ఎమ్మెల్యే గణబాబుకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న అర్చకులు

నాయుడుతోట(వేపగుంట), న్యూస్‌టుడే: నాయుడుతోట సమీప రవినగర్ శేషాద్రి శిఖరంపై గల కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం హయగ్రీవ హోమం నిర్వహించారు. ఈ పూజల్లో ప్రభుత్వ విప్, పశ్చిమం ఎమ్మెల్యే గణబాబు, జనసేన నాయకుడు బెహరా భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు. వారిని అర్చకులు ఆశీర్వదించి స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. పలు కళాశాలల విద్యార్థులు ఈ పూజల్లో పాల్గొన్నారు. సాయంత్రం మహాలక్ష్మీ అమ్మవారికి సామూహిక కుంకుమ పూజలు చేపట్టారు. ఈనెల 23న ఉదయం నృసింహ హోమం, పంచామృతాభిషేకాలు, సాయంత్రం 5గంటల నుంచి స్వామివారి వార్షిక కల్యాణోత్సవం జరుగుతుందని అర్చకులు తెలిపారు.

భూలోకమాంబ పండగ

అప్పన్నపాలెం(వేపగుంట), న్యూస్‌టుడే: అప్పన్నపాలెం పరిసర ప్రాంతాల ప్రజల ఆరాధ్యదైవం భూలోకమాంబ అమ్మవారి పండగ ఆదివారం ఘనంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అధ్యక్షుడు పీతల విష్ణుమూర్తి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఘటాల ఊరేగింపు, మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. సాయంత్రం నిర్వహించిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్పొరేటర్లు పీవీ నరసింహం, బల్ల శ్రీనివాసరావులతో పాటు స్థానిక పెద్దలు పీతల అప్పలరాజు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సిరుల తల్లికి శ్రీసూక్త పూజలు

మహాలక్ష్మి అమ్మవారు

పెందుర్తి, న్యూస్‌టుడే: వేంకటాద్రిపై జరుగుతున్న ఫాల్గుణ పక్షోత్సవాల్లో భాగంగా సిరులొలికే శ్రీమహాలక్ష్మీ అమ్మవారికి ఆదివారం శ్రీసూక్త సహిత కుంకుమార్చన జరిగింది. ఆలయ ప్రధానార్చకులు మహర్షి రామానుజాచార్యులు నేతృత్వంలో అర్చకులు జగన్మాతను పట్టు పీతాంబరాలు, ఆభరణాలతో అలంకరించి ధూపదీప సేవలు జరిపారు. భక్తులు పాల్గొని సామూహిక స్తోత్ర పారాయణం చేశారు.

శివలింగం ప్రతిష్ఠాపన

ప్రహ్లాదపురం(వేపగుంట), న్యూస్‌టుడే: ప్రహ్లాదపురం శిరిడి సాయిబాబా ఆలయ ప్రాంగణంలో కొత్తగా శివలింగ ప్రతిష్ఠాపనోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శివుడ్ని దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన చేపట్టారు. ఆలయ కమిటీ సభ్యులు సహాయ సహకారాలు అందించారు.

సింహపురికాలనీ (వేపగుంట), న్యూస్‌టుడే: సింహపురికాలనీ సీతారామాలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. ముగింపు పూజల్లో కార్పొరేటర్లు పి.వి.నరసింహం, బల్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని కార్పొరేటర్లు ప్రారంభించారు. బ్రహ్మోత్సవాలకు సహకరించిన భక్తులకు, దాతలకు ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ముగిసిన ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు

అన్నసమారాధన ప్రారంభిస్తున్న కార్పొరేటర్లు నరసింహం, శ్రీనివాసరావు తదితరులు

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం శ్రీఉమారామలింగేశ్వర స్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం ఈనెల 26వ తేదీన నిర్వహించనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఆరోజు ఉదయం 6గంటల నుంచి స్వామికి ప్రత్యేక పూజలు, 10గంటల నుంచి శివ పార్వతుల కల్యాణం జరుగుతుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

వేపగుంట, న్యూస్‌టుడే: వేపగుంట ఓపెన్ జిమ్ వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం ఆదివారం ఓపెన్‌జిమ్ ప్రాంగణంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ఇంటర్నేషనల్ వాకర్స్ అసోసియేషన్ డిస్ట్రిక్ట్ గవర్నర్ మహేశ్ అతిథిగా హాజరై నూతన సభ్యులతో ప్రమాణం చేయించారు. అసోసియేషన్ అధ్యక్షులుగా బి.ఎన్.కుమార్, కార్యదర్శిగా నానాజీ, కోశాధికారిగా రాజు, ఇతర సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. అసోసియేషన్ గతంలో చేపట్టిన రక్తదాన, ఉచిత వైద్య శిబిరాలతో పాటు ఇతర సేవలను మహేశ్ అభినందించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులంతా పాల్గొన్నారు.

కమిటీ సభ్యులతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న డిస్ట్రిక్ట్ గవర్నర్ మహేశ్

మత్తు వదిలితే బంగారు భవిత

జంగాలపాలెంలో యువతకు సూచనలిస్తున్న సీఐ సతీశ్‌కుమార్

జంగాలపాలెం (పెందుర్తి), న్యూస్‌టుడే: దురలవాట్లను దూరంగా ఉంచితే బంగారు భవిత సొంతమవుతుందని పెందుర్తి సీఐ కె.వి.సతీశ్‌కుమార్ యువతకు సూచించారు. ఆదివారం ఆయన పెందుర్తి మండలం జంగాలపాలెం గ్రామంలోని హెలిప్యాడ్ మైదానంలో ఆటలాడుతున్న యువతతో సమావేశమయ్యారు. గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలతో సంబంధం ఉండే వారికి సహకరించడం వల్ల తలెత్తే చట్టపరమైన ఇబ్బందులను తెలియజేశారు. అలాంటి కేసుల్లో ఇరుక్కుంటే జీవితంపై చూపే ప్రభావాన్ని వివరించారు. క్రమశిక్షణ, మంచి అలవాట్లతో యువత ఆదర్శవంతంగా ఉండాలని సూచించారు.

నేరాల నియంత్రణపై అవగాహన

మాట్లాడుతున్న సీఐ చంద్రమౌళి

సత్తివానిపాలెం(వేపగుంట), న్యూస్‌టుడే: సత్తివానిపాలెంలోని కాలనీవాసులకు ఆదివారం నేరాల నియంత్రణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు స్థానిక ఆకృతి అపార్ట్‌మెంట్ ప్రాంగణంలోని కాలనీ సంఘాలకు క్రైం సీఐ ఎం.చంద్రమౌళి, ఎస్ఐ డి.సూరిబాబు పలు సూచనలు చేశారు. చోరీల నివారణకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. పోలీసులకు అపరిచిత వ్యక్తుల సమాచారం అందించాలని కోరారు.

(c) eenadu

ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

నేటి నుంచి మార్చి 24 వరకూ నిర్వహణ

పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థినులు

జేఎన్‌టీయూ, న్యూస్‌టుడే: ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ఈనెల 23 (సోమవారం) నుంచి ప్రారంభం కానున్నాయి. అనంత జిల్లాలో 48,146 మంది విద్యార్థులు ఇంటర్ పరీక్షలు రాయనున్నారు. 64 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. 64 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 64 మంది డిపార్ట్‌మెంట్ అధికారులు, 14 మంది కస్టోడియన్లు, 2 ఫ్లైయింగ్ స్క్వాడ్లు, 4 సిట్టింగ్ స్క్వాడ్లు, 1051 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. పరీక్ష కేంద్రాల్లో 917 సీసీ కెమెరాలు అమర్చారు. ఆర్ఐవో కార్యాలయం, జిల్లా కలెక్టరేట్‌లో పరీక్షా కేంద్రాలను సీసీ కెమెరాల ద్వారా పరిశీలిస్తారు. ఇంటర్మీడియట్ బోర్డులో కూడా అన్ని జిల్లాల పరీక్ష కేంద్రాలను పరిశీలించనున్నారు.

> పరీక్షలపై సమస్యలు, సందేహాల నివృత్తికి విద్యార్థులు 08554- 277626 నంబరులో సంప్రదించవచ్చు

ఉదయం 9 గంటలకు ఆరంభం

ఉదయం 9 గంటలకు పరీక్షలు ఆరంభమవుతాయి. విద్యార్థులు 8.15 గంటలలోపు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాల్సి ఉంటుంది. ఇంటర్ ప్రథమ సంవత్సరం జనరల్ విద్యార్థులు 22,366 మంది, ఒకేషనల్ విద్యార్థులు 2,202 మంది మొత్తం 24,568 మంది, ద్వితీయ సంవత్సరం జనరల్ విద్యార్థులు 21,613, ఒకేషనల్ విద్యార్థులు 1,965 మొత్తం 23,578 మంది పరీక్షలకు హాజరు కానున్నారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరాల జనరల్ విద్యార్థులు 43,979 మంది, ఒకేషనల్ విద్యార్థులు 4167 మంది, మొత్తం 48,146 మంది ఇంటర్మీడియట్ విద్యార్థులు పరీక్షలు రాయడానికి సన్నద్ధమవుతున్నారు.

★ ఫిబ్రవరి 23 నుంచి మార్చి 24 వరకూ ఇంటర్ పరీక్షలు జరగనున్నాయి. గతంలో ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఉదయం, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం పరీక్షలు జరిగేవి. ఈ సంవత్సరం రోజు ఒక పరీక్ష మాత్రమే నిర్వహించేలా కాల నిర్ణయ పట్టిక రూపొందించారు. మొదటి రోజు ప్రథమ సంవత్సరం విద్యార్థులకు తెలుగు, సంస్కృతం, ఉర్దూ, హిందీ తదితర భాషా పరీక్షలు నిర్వహిస్తారు. రెండో రోజు ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు భాషా పరీక్షలు ఉంటాయి. 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకూ పరీక్షలు జరుగుతాయి.

నిమిషం ఆలస్యమైనా..

వెంకటరమణనాయక్, ఇంటర్ పరీక్షల నిర్వహణ కన్వీనర్, అనంతపురం

పరీక్ష కేంద్రానికి కనీసం 45 నిమిషాల ముందు విద్యార్థులు చేరుకోవాలి. 15 నిమిషాల ముందుగా సీట్లలో కూర్చోవాలి. 9 గంటలకు పరీక్షలు ఆరంభమవుతాయి. 9 గంటలకు ఒక నిమిషం ఆలస్యమైనా పరీక్షలకు అనుమతించం. కేంద్రంలోనికి పుస్తకాలు, మొబైల్ ఫోన్లు, పేజర్లు, క్యాలిక్యులేటర్లు ఎలక్ట్రానిక్ పరికరాలు, స్మార్ట్ గడియారాలు తీసుకు రాకూడదు. విద్యార్థులు ఇన్విజిలేటర్లతో మాట్లాడటం, మాస్ కాపీయింగ్‌లకు పాల్పడితే మాల్‌ప్రాక్టీస్‌కు గురవుతారని హెచ్చరించారు.

కలెక్టరేట్‌లో అర్జీల స్వీకరణ నేడు

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: రెండు వారాలుగా వాయిదా పడుతూ వస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని ఈనెల 23న నిర్వహిస్తామని, ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తామని కలెక్టర్ ఆనంద్ తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట దాకా వినతులు తీసుకుంటాం. ఇందులో భాగంగా రెవెన్యూ క్లినిక్ కూడా జరుగుతుందన్నారు. సమస్యలు, వ్యథలు ఉన్న ప్రజలు నేరుగా అర్జీలు ఇవ్వవచ్చన్నారు. తనతోపాటు, జేసీ, అన్ని శాఖల జిల్లా అధికారులు ఇందులో పాల్గొంటారని చెప్పారు. గతంలో అర్జీలు ఇచ్చినట్లు రసీదులు ఉంటే వెంట తీసుకుని రావాలన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రాలుతున్న పూత.. రైతుల్లో గుబులు

మామిడిని వెంటాడుతున్న వాతావరణ పరిస్థితులు

విరబూసిన మామిడి పూత

అనంతపురం (వ్యవసాయం), న్యూస్‌టుడే : జిల్లాలో ఈ ఏడాది భారీ స్థాయిలో మామిడి పూత పట్టింది. అదంతా కాయ కాస్తే చెట్టు నిలబడుతుందా? అన్న అనుమానం రైతుల్లో వ్యక్తమవుతోంది. డిసెంబరులోనే పూత వస్తే ఏప్రిల్‌లో పంటకోతకు వచ్చేది. ఏప్రిల్, మే, జూన్ మొత్తం అమ్మకాలు సాగేవి. అయితే ఈసారి అలా జరగలేదు. ఫిబ్రవరిలో పూత పట్టింది. జూన్ నెలాఖరుకు పంట కోత మొదలవుతుంది. ఈ వెంటనే వర్షాలు, తెగుళ్లు ఉంటాయి. ఈ పరిస్థితి రైతుల్లో ఆందోళన పెంచుతోంది.

ఉమ్మడి జిల్లాలో మామిడి సాగు ఇలా..

- ★ విస్తీర్ణం : 85,026 ఎకరాలు
- ★ రకాలు : బెంగళూరు (తోతపూరి), బేనీషా, నీలం, అల్ఫాన్సా, సోనారేఖ, మల్లిక, చిన్న, పెద్ద రసాలు
- ★ ఎగుమతి : ప్రధాన మెట్రో నగరాలైన బెంగళూరు, హైదరాబాద్, దిల్లీ, చెన్నై

ఉష్ణోగ్రత 50 డిగ్రీలు అంచనా

★ శివరాత్రి దాటిన తర్వాత రాత్రి, పగలు ఉష్ణోగ్రతలు పెరిగాయి. జిల్లాలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 35 డిగ్రీలు దాటింది. ఈసారి మార్చిలో 50 డిగ్రీలు నమోదు కావచ్చని వాతావరణశాఖ తెలిపింది. వేడిమికి పూత మాడిపోయి నల్లగా మారి రాలడం ఇప్పటి నుంచే మొదలు కావడంతో ఆందోళన నెలకొంది.

★ చెట్లకు పూతను చూసిన వ్యాపారులు కొందరు ముందుస్తుగా మామిడి తోపులు కొనుగోలు చేశారు. వేలాది రూపాయలు వెచ్చించి సస్యరక్షణ చర్యలు చేపట్టారు. రాలుతున్న పూత చూసి వ్యాపారులు దిగాలు చెందుతున్నారు. కొందరు రైతులు మామిడి తోటలు విక్రయించకుండా సంరక్షించుకుంటూ యాజమాన్య పద్ధతులు ఆచరిస్తూ పంట నిలుపుకొంటున్నారు.

సస్యరక్షణ ముఖ్యం..

దిగుబడులపై మామిడి రైతులు దిగాలు చెందాల్సిన పని లేదు. ఈ ఏడాది పూత రావడం ఆలస్యమైంది. అంతే.. గతేడాది నవంబరు, డిసెంబరు నెలల్లో భూమిలో తేమ శాతం అధికంగా ఉండడం, చలి తీవ్రత, పొగ మంచు అధికంగా ఉండటం వంటి పరిస్థితులు ఎదురయ్యాయి. భూమిలో అధిక తేమ శాతం కారణంగా పూత ఆలస్యమైంది. ఇపుడు వేడి పెరగ్గానే తెగుళ్ల తీవ్రత తగ్గి, వేడికి పూత రాలుతోంది. ఇది సాధారణమే. వంద పూవుల్లో 2 శాతం పూత, కాయ నిలిచినా ఎకరాకు 3-4 టన్నులు దిగుబడి వస్తోంది. ఉన్న పూతను కాపాడుకునేలా సస్యరక్షణ చర్యలు చేపట్టడంపై దృష్టి పెట్టాలి.

- ఉమాదేవి, ఉప సంచాలకులు (ఉద్యానశాఖ)

ఉచిత న్యాయ సహాయంపై సందేహాలున్నాయా?

ఈనాడు మీ తోడు

అనంతపురం (మూడోరోడ్డు), న్యూస్‌టుడే: ఉచిత న్యాయ సహాయం పొందటంపై ఏవైనా సందేహాలున్నాయా? తగిన సలహాలు, సూచనలు ఆశిస్తున్నారా? నివృత్తికి 'ఈనాడు' అవకాశం కల్పిస్తోంది. జిల్లా న్యాయసేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) అందించే సేవలకు పాఠకులకు తెలియజెప్పే కార్యక్రమాన్ని రూపొందించింది. ఉచిత న్యాయ సహాయంపై సందేహాలకు డీఎల్ఎస్ఏ కార్యదర్శి, న్యాయమూర్తి ఎన్.రాజశేఖర్ సమాధానాలు ఇస్తారు. పాఠకులు తమ సందేహాలను ఫోన్ చేసి తెలుసుకోవచ్చు. మహిళలు, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, సంవత్సర వార్షిక ఆదాయం రూ.3 లక్షల్లోపు ఉన్న వారికి డీఎల్ఎస్ఏ ఉచిత న్యాయ సహాయం అందిస్తుంది. జాతీయ విపత్తుల బాధితులు, ఇతర పీడిత వర్గాల వర్గాల ప్రజలు తమకు ఉన్న సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు.

- తేది: 23-02-2026 (సోమవారం)
- సమయం: ఉదయం 11 నుంచి 12 గంటలలోపు

ఫోన్ చేయాల్సిన నంబరు: **94409 01044**

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (సా॥)	సహర్ (ఉ॥)
అనంతపురం	6.27	5.23
గుంతకల్లు	6.31	5.21
తాడిపత్రి	6.28	5.16

కాటికోటేశ్వరుడికి విశేష పూజలు

తాడిమర్రి, న్యూస్‌టుడే: మండల పరిధిలోని చిల్లవారిపల్లి గ్రామ సమీపంలో ఉన్న కాటికోటేశ్వర క్షేత్రంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పురోహితుడు బాలశివ స్వామిని ప్రత్యేకంగా అలంకరించి కుంకుమాభిషేకం, తైలాభిషేకం చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

కేంద్రాల వద్ద 144 సెక్షన్

అనంతపురం (ఆజాద్‌నగర్), న్యూస్‌టుడే: ఇంటర్ వార్షిక పరీక్షల నిర్వహణకు అన్ని విధాలుగా భద్రతా చర్యలు చేపట్టినట్లు ఎస్పీ జగదీశ్ తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా నిర్వహించేలా బందోబస్తు ఏర్పాట్లు చేసిన ఎస్పీ తెలిపారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో సెక్షన్ 144 అమల్లో ఉంటుంది. నలుగురికి పైగా గుంపులుగా గుమికూడటం, అనుమానాస్పదంగా తిరగడం నిషేధం. ప్రశ్నపత్రాల లీక్ వంటి అసత్య సమాచారాన్ని వ్యాప్తి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

నిరుద్యోగులకు భరోసా!

అనంతపురం (అశోక్‌నగర్), న్యూస్‌టుడే: పదో తరగతి ఉత్తీర్ణత ఆపైన చదివినా ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగానికి ఎంపిక చేస్తారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలోని యువకులు అవకాశాన్ని వినియోగించుకోవచ్చు. ఏవైనా సందేహాలు ఉంటే ఫోన్ నంబరు 89850 91256ను సంప్రదించాలని డీఆర్‌డీఏ పీడీ శైలజ తెలిపారు.

ఉద్యోగం పొందే కంపెనీ ఏదంటే: పేటీఎం

ఉద్యోగం పేరు: ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, టీం లీడరు

ఎంత వయసు ఉండాలంటే: 19 నుంచి 35 సంవత్సరాల్లోపు

వేతనం ఎంతిస్తారంటే: రూ.16,500 నుంచి రూ.21 వేలు (ఈఎస్ఐ, పీఎఫ్, ఇన్సెంటివ్, మెడికల్ ఇన్సూరెన్సు అదనం)

ఉద్యోగం చేసే ప్రాంతాలు: అనంతపురం, రాయదుర్గం, తాడిపత్రి, గుంతకల్లు, గుత్తి, కళ్యాణదుర్గం, కదిరి, హిందూపురం, ధర్మవరం, మడకశిర

ఇవి తప్పని సరి: డ్రైవింగ్ లైసెన్సు, బైకు

ఇంటర్వ్యూ ఎక్కడ, ఎప్పుడంటే: రాప్తాడు పంగల్ రోడ్డు వద్ద టీటీడీసీలో.. 24.2.2026

మెరిసిన బాలలు.. మోమున నవ్వులు

గ్రామీణ నేపథ్య సాంస్కృతిక కార్యక్రమాలకు పిల్లల పండగ 'అనంత బాలోత్సవం వేదికైంది. విద్యార్థులు తమ అంతర్లీన, సృజనాత్మకతకు పదును పెట్టి ఆలోచింపజేసే పరిశోధనలు, ప్రయోగాలు చేసి అబ్బుర పరిచారు. జాతీయ నాయకులు, దేవతలు, సైనికులు, పోలీసులు, పోరాట యోధుల వేషధారణల్లో చిన్నారులు ప్రతిభ చాటారు. విద్యార్థులు చేసిన గిరిజన, జానపద సంప్రదాయ నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

- న్యూస్‌టుడే, ఆజాద్‌నగర్ (అనంతపురం)

రైళ్లల్లో.. ఆగని చోరీలు

ఆందోళనలో ప్రయాణికులు

గుత్తి, గుంతకల్లు, న్యూస్‌టుడే: రైళ్లల్లో చోరీలకు అడ్డూఅదుపులేకుండా పోతోంది. తరచూ ఘటనలు వెలుగుచూస్తున్నా ఎవరికీ పట్టడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. రాత్రి సమయాల్లో వెళ్లే రైళ్లను లక్ష్యంగా ఎంచుకుని దుండగులు పథకం ప్రకారం ప్రయాణికులు విలువైన వస్తువులను ఎత్తుకెళ్తున్నారు. మారణాయులతో రైళ్లల్లో ప్రయాణికుల్లా ఉంటూ దోపిడీలకు తెగబడుతున్నారు. మహిళలు రాత్రిళ్లు రైలు ప్రయాణమంటేనే హడలిపోతున్నారు.

తాజా ఘటనలతో కలవరం

గుత్తి పరిసరాల్లో మూడు రోజుల వ్యవధిలోనే రెండు రైళ్లల్లో దుండగులు చోరీలకు పాల్పడ్డారు. మైసూర్ నుంచి కాచిగూడకు వెళుతున్న ఎక్స్‌ప్రెస్ రైలు గుత్తి స్టేషన్‌లో ఆగింది. శుక్రవారం తెల్లవారుజామున దండగుడు ఒకడు కిటికీ వద్ద ఉన్న హైదరాబాద్‌కు చెందిన అరుణ అనే ప్రయాణికురాలి మెడలోని బంగారు నగను లాక్కొని పారిపోయాడు. ఇది జరిగి మూడు రోజులు గడవకముందే కల్లూరు వద్ద లాథూర్ ఎక్స్‌ప్రెస్‌లో ఓ మహిళ మెడలోని బంగారు నగలు తీసుకుని రైలు చైన్‌ను లాగి పారిపోయాడు. రైళ్లల్లో ప్రయాణికులు ఎక్కడెక్కడివారో ఉంటున్నా.. వారు సమీప స్టేషన్లలో ఫిర్యాదు చేసి వెళ్లిపోతున్నారు. తర్వాత ఎవరూ పట్టించుకోవడం లేదు.

రాత్రి ప్రయాణమంటే హడల్

రైళ్లల్లో తగినంత ఎస్కార్ట్ ఉండటం లేదు. ఒక వేళ ఉన్నా ఆర్‌పీఎఫ్‌లు, జీఆర్‌పీ పోలీసులు విధులకు వచ్చి ఏసీ బోగీల్లో నిద్రపోతున్నారన్న విమర్శలు ఉన్నాయి. రైల్వే పోలీసు ఉన్నతాధికారులు ఏమాత్రం పట్టించుకోవడంలేదన్న విమర్శలున్నాయి. మరోవైపు ఎస్కార్ట్‌ను పెంచడంలేదు. జీఆర్‌పీ పోలీసుల సంఖ్య తక్కువగా ఉంటోంది. ఇదే దుండగులకు కలిసొస్తోంది.

గస్తీ పెంచుతాం

-అజయ్‌కుమార్, సీఐ, జీఆర్‌పీ, గుంతకల్లు

రైళ్లల్లో దోపిడీల నివారణకు చర్యలు చేపట్టాం. రాత్రి సమయాల్లో రైళ్లకు ఎస్కార్ట్‌ను పెంచుతున్నాం. గస్తీని ఏర్పాటు చేస్తున్నాం. అవుటర్లలో సిగ్నళ్ల వద్ద గస్తీ ముమ్మరం చేస్తాం. గుత్తి-గుంతకల్లు స్టేషన్ల మధ్య పోలీసు పహారాను పెంచుతున్నాం. తాజా ఘటనల్లోని నిందితులను వీలైనంత త్వరలో పట్టుకొని బాధితులకు న్యాయం చేస్తాం.

ఘనంగా చైనీస్ నూతన సంవత్సర వేడుకలు

వేడుకలను ప్రారంభిస్తున్న ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్

పుట్టపర్తి, న్యూస్‌టుడే: పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయంలో చైనీస్ నూతన సంవత్సర వేడుకలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. సాయి సన్నిధిలో ఏటా చైనీస్ వేడుకలు నిర్వహించడం ఆనవాయితీ. ఈ వేడుకలను సత్యసాయి ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రశాంతి నిలయాన్ని భక్తులు చైనీస్ సంప్రదాయం ఉట్టిపడేలా అలంకరించారు. విద్యుత్తు లాంతర్లు, చైనీస్ దీపాలు ఏర్పాటు చేశారు. సత్యసాయిని కీర్తిస్తూ భక్తులు సంగీత విభావరి నిర్వహించారు. రెండు రోజులపాటు జరిగే ఈ వేడుకల్లో పాల్గొనేందుకు వివిధ దేశాలకు చెందిన భక్తులు విశేష సంఖ్యలో తరలిరావడంతో మందిరం పరిసరాలు కిటకిటలాడుతున్నాయి. భక్తులు బారులుదీరి బాబా మహాసమాధిని దర్శించుకున్నారు.

చెరువులను చెరబట్టి.. మట్టి కొల్లగొట్టి

బసాపురం చెరువులో కట్టను ఆనుకుని తవ్వడంతో ఏర్పడిన గొయ్యి

ట్రాక్టరులో మట్టిని కర్ణాటకకు తరలిస్తూ..

కుందుర్పి, న్యూస్‌టుడే: కుందుర్పి మండలంలోని చెరువుల్లో మట్టిని కొందరు పార్టీల నాయకులు యథేచ్ఛగా తవ్వేస్తున్నారు. బసాపురం, మలయనూరు, నిజవల్లి, కుందుర్పి చెరువుల్లో రాత్రి పగలు తేడా లేకుండా పొక్లెయిన్‌లతో మట్టిని తవ్వి సరిహద్దులోని కర్ణాటక రాష్ట్రంలోని గ్రామాలకు తరలిస్తున్నారు. అక్కడ నూతన గృహ నిర్మాణాల్లో బేస్ మట్టంలకు, ఇటుక బట్టీలు, పొలాలకు మట్టి అవసరం కావడంతో డిమాండ్ పెరుగుతోంది. దీన్ని ఆసరాగా తీసుకున్న అక్రమార్కులు జోరుగా దందా సాగిస్తున్నారు. మలయనూరు, బసాపురం చెరువుల్లో నిత్యం మట్టి తవ్వకాలు జరుగుతున్నాయి. రోజూ ట్రాక్టర్లలో 100 నుంచి 150 ట్రిప్పుల దాకా తరలిస్తున్నారు. ఒక ట్రాక్టరు మట్టిని రూ.2 వేలకు విక్రయిస్తున్నారు. దూరాన్ని బట్టి ధర పెంచుతున్నారు. ఈ లెక్కన రూ.లక్షల్లో వెనకేసుకుంటున్నారు. అక్రమ తవ్వకాల బాగోతం అధికారులకు తెలిసినా కన్నెత్తి చూడటం లేదని ఆయా గ్రామాల ప్రజలు, రైతులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై తహసీల్దార్ ఓబులేసు వివరణ కోరగా అనుమతులు లేకుండా మట్టి తవ్వడం నేరం. రెవెన్యూ సిబ్బందితో నిఘా ఏర్పాటు చేసి అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

బంధం దూరమై.. గుండె బరువై..

రక్తసంబంధాలు, ఆత్మీయతలు, మృత్యుబాధలు, రోదనలు మనుషులకే ఉంటాయనుకుంటే పొరపాటే. ప్రతి జీవిలోనూ ఈ చలించే తత్వం ఉంటుంది. అది ఒక్కసారిగా పెల్లుబికినపుడే మనకు కనిపిస్తాయి. అలాంటి వేదనే ఈ కుక్కపిల్లది. తనతో కలిసి మెలిసి పెరిగి.. అకస్మాత్తుగా చనిపోయిన తోటి పిల్లను చూసినపుడు శోకం తన్నుకు వచ్చింది. తాకుతూ, ముఖంపై రుద్దుతూ, అది కదలకుండా ఉండటం చూసి గట్టిగా అరుస్తూ వేదన వ్యక్తపరిచింది. దీన్ని చూసిన స్థానికులు.. కుక్కపిల్ల బాధాతప్త హృదయాన్ని అర్థం చేసుకున్నారు. గుడిబండ మండలం గుడిబండ - పళారం రోడ్డులో మరువ నీరు ప్రవహించే కాజ్‌వే వద్ద ఆదివారం సాయంత్రం కుక్కపిల్ల మృతి చెందిన సమయంలో తోటి కుక్కపిల్ల మూగ రోదన దృశ్యమిది..

- న్యూస్‌టుడే, గుడిబండ

అంత్యక్రియలు

కీ॥శే॥ డా॥ చందమూరి నరసింహారెడ్డి గారు

(Dr. C N Reddy) M.Sc (Ag) Ph.D.,

Chemtex Environmental Laboratories, Texas, USA.

తల్లిదండ్రులు: స్వర్గీయ C.ఆదిలక్ష్మమ్మ & స్వర్గీయ C.బాబిరెడ్డి

జవుకులదిన్నె, గోరంట్ల మండలం, శ్రీ సత్యసాయి జిల్లా

శ్రీ సత్యసాయి జిల్లా, గోరంట్ల మండలం, జవుకులదిన్నె వాసి డా॥ సి.ఎన్.రెడ్డి గారు 1974 నందు USA వెళ్ళి అక్కడే స్థిరపడి.Texas నందు Chemtex సంస్థలు స్థాపించి వేల కుటుంబాలకు ఉపాధికల్పించి ఎంతో పేరు ప్రఖ్యాతలు గడించిన నా... దేహం నా మాతృభూమిలోనే కలవాలనే వారి సంకల్పం మేరకు వారి పార్థివదేహానికి అంత్యక్రియలు 24-02-2026వ తేది మంగళవారం ఉదయం 9.00 నుండి 10.00లోపు గోరంట్ల మండలం జవుకులదిన్నె గ్రామంలో జరుగును.

దైవ సన్నిధికి చేరినవారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతున్ని ప్రార్థిస్తూ..

భార్య: శ్రీమతి డా॥ నాగరత్నారెడ్డి USA

కుమారుడు: బాబి స్వరూప్‌రెడ్డి చందమూరి USA, కుమార్తె: స్వప్న రెడ్డి చందమూరి USA

సోదరులు: సి.గోవిందరెడ్డి, సి.గోపాల్‌రెడ్డి, సి.నర్సిరెడ్డి USA, సి.రామచంద్రారెడ్డి USA

మరియు చందమూరి వారి కుటుంబ సభ్యులు

జవుకులదిన్నె, గోరంట్ల మండలం, శ్రీ సత్యసాయి జిల్లా

Cell: 9573133480, 9440930298

వైకుంఠ సమారాధన: 26-02-2026వ తేది గురువారం మధ్యాహ్నం 12.00 గం॥లకు జవుకులదిన్నె గ్రామంలో జరుగును.

(c) eenadu

రాజకీయాల కోసం హిందూమతాన్ని కించపరుస్తారా?

జగన్‌పై ఎన్డీయే కూటమి నేతల ధ్వజం

మాట్లాడుతున్న అధ్యక్షుడు పూలనాగరాజు, వరుణ్, సురేంద్రబాబు, శ్రీధర్‌చౌదరి, రాజేశ్, తదితరులు

రాంనగర్ (అనంతపురం), న్యూస్‌టుడే: దేవుడంటే భక్తిలేదు. హిందువుల మనోభావాలంటే గౌరవం లేదు. అధికారంలో ఉన్నప్పుడు హిందూ ధర్మాన్ని అవమానించి, ఇప్పుడు రాజకీయ ప్రయోజనాల కోసం దేవుడినే వాడుకుంటూ కించపరుస్తారా? అంటూ ఎన్డీయే కూటమి నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం జిల్లా తెదేపా కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పూలనాగరాజు అధ్యక్షతన మీడియా సమావేశం నిర్వహించారు. జనసేన అధ్యక్షుడు వరుణ్, భాజపా అధ్యక్షుడు రాజేశ్, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే సురేంద్రబాబు, ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌చౌదరి, మాజీ గ్రంథాలయ జిల్లా అధ్యక్షుడు గోనుగుంట్ల విజయ్, తదితరులతో కలిసి పూలనాగరాజు మాట్లాడుతూ.. రాష్ట్రంలో అభివృద్ధి చూసి ఓర్వలేక వైకాపా నాయకులు పిచ్చి పట్టి మాట్లాడుతున్నారని ప్రజలు బుద్ధి చెప్పినా వారి తీరు మారలేదని మండిపడ్డారు. శాసనమండలిలో కల్తీ నెయ్యి వ్యవహారాన్ని తప్పుదోవ పట్టించడానికే లేనిపోని మాట్లాడటం వారికే చెల్లుతోందన్నారు. శాసన మండలిలో జగన్ దర్శకత్వంలో వైకాపా సభ్యులు వికృతంగా ప్రవర్తించారని నీచ రాజకీయాలకు ఇది నిదర్శనమని ధ్వజమెత్తారు.

రాష్ట్రస్థాయి శాప్ లీగ్ చెస్‌లో జిల్లాకు రెండు స్వర్ణాలు

అనంతపురం క్రీడలు: తిరుపతిలో ఆదివారం ముగిసిన రాష్ట్రస్థాయి శాప్ లీగ్ చదరంగం పోటీల్లో జిల్లా క్రీడాకారులు పరిమళించారు. ఎత్తులకు పైఎత్తులతో ప్రత్యర్థులను చిత్తుచేసి పతకాలు గెలిచారు. రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లాకు మూడు ట్రోఫీలు రావడం గమనార్హం. చెస్‌లో అంతర్జాతీయ పోటీల్లో మెరిసి స్ఫూర్తిగా నిలుస్తున్న తమ్మూళ్ల స్టీఫెన్ నోబెల్ అండర్-15 విభాగంలో టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు. చక్కటి ఆటతీరుతో ప్రత్యర్థులను అవలీలగా ఓడించి ట్రోఫీని కైవసం చేసుకున్నాడు. అండర్-13 బాలుర విభాగంలో ఎంపీ సహృద్ ద్వితీయ స్థానం సాధించాడు. త్రుటిలో ప్రథమస్థానం చేజారింది. అండర్-13 బాలికల విభాగం టైటిల్‌ను ఎ.యశస్విని సొంతం చేసుకుంది. ప్రత్యర్థులను చిత్తుచేసి రాష్ట్రస్థాయిలో ప్రథమస్థానం సాధించింది. రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా క్రీడాకారులు రాణించడం పట్ల డీఎస్‌డీవో ఎస్ఎం మంజుల హర్షం వ్యక్తం చేశారు.



తమ్మూళ్ల స్టీఫెన్ నోబెల్

యశస్విని

సహృద్

EENADU Classifieds

AGRI BUSINESS

అనంతపురం నగరంలోని రుద్రంపేట, ఆలమూరు సమీపంలో అన్ని సదుపాయాలతో కూడిన 55x125 ఫ్లాట్‌గా విలువైన గొర్రెల పారం లీజుకు ఇవ్వబడును. ఆసక్తిగలవారు సంప్ర: 9133399361

BUSINESS SERVICES

BUSINESS OFFER

బంగారం, వెండి, డైమండ్స్ జ్యూయలరీ షాప్, ఫైనాన్స్‌తో తాకట్టుకు ఇవ్వబడును. 7382114647.

EDUCATION

COACHING CENTRES

ఉచిత శిక్షణ & ఉద్యోగావకాశం 10th పాస్/ ఇంటర్/ డిగ్రీ పాస్ లేదా ఫెయిల్ అయినా విద్యార్థి విద్యార్థినులకు In-store Demonstrator/ MS-Office/ Soft Skills కోర్సుల నందు ఉచిత హాస్టల్ & భోజనం సదుపాయాలతో కూడిన ఉచిత శిక్షణకై సంప్ర: Sun Skills ట్రైనింగ్ సెంటర్, 2nd ఫ్లోర్, Agisam Complex, డ్రస్‌సర్కిల్ ఎదురుగ, కమలానగర్, అనంతపురం. ✆ 6304081005.

REAL ESTATE

హిందూపురం రైల్వేస్టేషన్‌కి 3kmలో అద్భుతంగా డెవెలప్ చేసిన ప్రాజెక్ట్‌లో ప్లాట్లు & 38 లక్షలకే డబుల్ బెడ్‌రూమ్ హౌసెస్ కలవు. సం: 6281824204

PLOT FOR SALE

అరవకూరు దగ్గర, బళ్లారి హైవేకి మొదటి బిట్టు, కార్గో హబ్- ఎయిర్‌పోర్ట్ దగ్గరలో 50 సెంట్స్ ప్లాటు అమ్మకానికి కలదు. సంప్ర: 9908469828.

JOBS

హైదరాబాద్ యూనిటీ హోంకేర్‌లో ఏజెంట్లకు మంచి అవకాశం. మీరు వర్కర్స్‌ని పంపితే మొదటినెల 5వేలు కమీషన్. వర్కర్స్ జీ: 15K, ఫ్రీ వసతి, ఫుడ్. 8121541212

MARKETING/ SALES

Anand Masale Require Sales & Marketing Manager, Marketing Executives. Contact: 9849655105, 9848053144 Email: anandmasalaappltd@gmail.com.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

Eenadu Classifieds 5 లైన్ల ప్రకటన రూ. 395/- మాత్రమే

తక్కువ ఖర్చుతో... ప్రతిరోజు క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వండి.... అధిక స్పందనలు పొందండి. వాహనాల అమ్మకం... ఉద్యోగాల భర్తీ... ఇళ్లు, ఫ్లాట్లు, స్థలాల అమ్మకాలు, కొనుగోళ్లు... ఇళ్లు, షాపులు, ఫ్లాట్లు అద్దెకు మరియు అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు...

వివరాలకు : 8008709784

ప్రకటనలపై జి.ఎస్.టి. 5% వర్తించబడును

అనుకూల మార్పులు.. మెరుగైన మార్కులు

అనంతపురం (వైద్యం), న్యూస్‌టుడే: ఏడాది మొత్తం చదివింది ఒక ఎత్తైతే పరీక్షల సమయంలో చదవటం మరో ఎత్తు.. పరీక్షలు ప్రారంభమవుతాయంటేనే విద్యార్థుల్లో ఒకింత భయం పుడుతుంది. ఈ సమయంలో తెలివైన విద్యార్థులు సైతం ఒత్తిడికి లోనవుతుంటారు. పరీక్షలు ఎలా రాస్తామో. . మంచి మార్కులు వస్తాయో లేదోనన్న బెంగ సహజం. ఈ కారణాలతో కొందరు

పరీక్షల వేళ తిండి, నిద్ర ముఖ్యం

విద్యార్థులు తినరు. కంటి నిండి నిద్రపోరు. ఈ ధోరణి ఏ మాత్రం ఆరోగ్యానికి మంచిది కాదని ఆహార నిపుణులు చెబుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో విద్యార్థుల వివరాలిలా	
పదోతరగతి	: 54,182
ఇంటర్	: 65,121
ఒకేషనల్	: 6,877

లక్షణాలను పసిగట్టాలి..

ఆందోళన, ఒత్తిడి పెరిగితే విద్యార్థులకు తలనొప్పి, వికారం వంటివి వస్తుంటాయి. కొందరికి కడుపునొప్పి, వణుకు లక్షణాలు రావటంతో ఏకాగ్రత కోల్పోతారు. తాము ఎంత చదివినా గుర్తుండటం లేదని, అనుకున్నంతగా చదవటం లేదని. . తదితర ప్రతికూల భావనలతో ఆత్మవిశ్వాసం సన్నగిల్లి నిరాశకు లోనవుతారు.

ఇలా చేయండి..

● జాగ్రత్తలు : పరీక్షల సమయంలో తిండి, నిద్ర విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని తగినంత ఆహారం, కంటి నిండా నిద్రపోవాలి. అప్పుడే మెదడు చురుగ్గా పనిచేస్తుంది. పాఠ్యాంశాలను గుర్తించుకోవాలంటే భయాన్ని వీడి మళ్లీ మళ్లీ మననం చేయడం ముఖ్యం.

● తినాల్సినవి : తేలిగ్గా జీర్ణమయ్యే ఆహారం తీసుకోవాలి. అల్పాహారం తినకుండా ఉండకూడదు. మాంసాహారం, నూనెతో చేసిన పదార్థాలు తక్కువగా తీసుకోవాలి. అన్నం తక్కువ మోతాదులో తీసుకుంటూ పప్పుధాన్యాలు, సోయాగింజలు, పెరుగు, పాల పదార్థాలు ఆహారంలో భాగం చేసుకోవాలి. జొన్న, సజ్జ, గోధుమ, రొట్టెలు తీసుకుంటే మంచిది. ఆకుకూరలు, రాగిజావ, నువ్వులు, బాదం, ఉసిరికాయలు కూడా తినొచ్చు. నీరు ఎక్కువ మోతాదులో తీసుకోవాలి. నిమ్మకాయ, గ్లూకోజ్, పండ్ల రసాలు తీసుకోవచ్చు.

● దూరం పెట్టండి : చిప్స్, శీతల పానీయాలు, తీపి పదార్థాలను ఎక్కువగా తింటే నిద్ర ఎక్కువగా వస్తుంది.. కాబట్టి వీటిని తీసుకోకపోవటం మంచిది. కాఫీ, టీలను తగ్గించాలి. బయట నుంచి కొనుగోలు చేసే ఆహార పదార్థాలను తీసుకోకపోవటం ఉత్తమం.

అలవాట్లు సైతం

పరీక్షల సమయంలో ఆహారపు అలవాట్లు మార్చుకుంటే మెరుగైన ఫలితాలు సాధించగలరు. పోషకాహారం తీసుకుంటే మెదడు చురుగ్గా పనిచేసేందుకు దోహదపడే బి కాంప్లెక్స్, విటమిన్ సి, జింక్, ఐరన్ వంటివి తినే పదార్థాల్లో ఉండేలా చూసుకోవాలి. వీటిని తీసుకుంటే హార్మోన్లను సమతుల్యం చేస్తాయి. జ్ఞాపకశక్తి పెరిగేందుకు సెనగ, నువ్వులు వంటి గింజలు వంటివి తీసుకోవచ్చు. **- సౌజన్య, పోషకాహార నిపుణురాలు, సర్వజన వైద్యశాల, అనంతపురం**

కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

సిద్ధేశ్వర ఆలయ హుండీ ఆదాయం లెక్కింపు

అమరాపురం, న్యూస్‌టుడే: మండలంలోని హేమావతి సిద్ధేశ్వరాలయంలో ఆదివారం బ్రహ్మోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన హుండీలో భక్తులు వేసిన కానుకలను లెక్కించారు. తాత్కాలిక హుండీ ద్వారా రూ.3.33 లక్షలు, శాశ్వత హుండీ ద్వారా రూ.6.67 లక్షల ఆదాయంతో పాటు 130 మిల్లీగ్రాముల బంగారం సమకూరినట్లు ఈవో నరసింహరాజు, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కరేగౌడ్ తెలిపారు.

కసాపురం ఆలయ సమాచారం

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయంలో సోమవారం జరిగే పూజ కార్యక్రమాలు ఇలా.. వేకువ జామున 4.15 నుంచి 5.15గంటల వరకు స్వామికి పంచామృతాభిషేకం, 5.30 నుంచి 6గంటల వరకు స్వామి నిజరూప దర్శనం, ఉదయం 6నుంచి మధ్యాహ్నం 12.50 గంటల వరకు భక్తులకు సర్వదర్శనం, ఆర్జిత సేవలు ఉంటాయి. తిరిగి మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 8.30గంటల వరకు భక్తులకు సర్వ దర్శన భాగ్యం కల్పిస్తారు.

సంతల ఆదాయం రూ.4.08 లక్షలు

అనంతపురం (వ్యవసాయం), న్యూస్‌టుడే: అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులోని వారం సంతల్లో మొత్తం 4,08,950 ఆదాయం వచ్చింది. అందులో శనివారం గొర్రెలు, మేకల సంతలో రూ.2,39,850 ఆదాయం రాగా, ఆదివారం జరిగిన పశువుల సంతలో 1,69,100 ఆదాయం వచ్చినట్లు ఎంపిక శ్రేణి ఇన్‌ఛార్జి కార్యదర్శి, ఏఎంసీ రామచంద్రకుమార్ తెలిపారు. వచ్చిన ఆదాయాన్ని సోమవారం ప్రభుత్వ ఖజానాకు జమ చేస్తామని ఏడీఎం తెలిపారు.

నేడు డయల్ యువర్ ఏపీ ఎస్పీడీసీఎల్ సీఎండీ

తిరుపతి(జీవకోన), న్యూస్‌టుడే: ఎస్పీడీసీఎల్ సర్కిల్ స్థాయిలో విద్యుత్తు వినియోగదారుల సమస్యలపై ఫిర్యాదు, పరిష్కారానికి సోమవారం డయల్ యువర్ సీఎండీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సంస్థ సీఎండీ శివశంకర్ లోతేటి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్కిల్ పరిధిలోని తొమ్మిది జిల్లాలకు సంబంధించిన వినియోగదారులు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు 89777 16661 నంబరుకు ఫోన్ చేయవచ్చని పేర్కొన్నారు. అనంతపురం జిల్లా వినియోగదారులు ఎస్ఈ నంబర్ 91547 90350ను, శ్రీసత్యసాయి జిల్లా వినియోగదారులు ఎస్ఈ నంబర్ 99637 07847కు ఫోన్ చేసి సమస్యలపై ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

పెయ్య దూడల లక్ష్యం నెరవేరిన వేళ..!

కొండ్రెడ్డిపల్లిలో ఆవు, దూడ

గోరంట్ల, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం పశుసంవర్ధకశాఖ ద్వారా మేలుజాతి (పెయ్య దూడలు) ఆవులను ఉత్పత్తి చేయడానికి ఎస్ఎస్ (సెక్స్‌డ్ సార్టెడ్ సెమెన్) పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి చంద్రశేఖర్ పేర్కొన్నారు. కేవలం పెయ్య దూడలను మాత్రమే ఉత్పత్తి చేస్తూ.. పాడి సంపద పెంచుతూ, ఆవులకు సుఖప్రసవం జరగడానికి చేపట్టిన ఈ పథకం గోరంట్ల మండలంలో విజయవంతమైందని వివరించారు. మండలంలోని కొండ్రెడ్డిపల్లి, గోపిదేవరపల్లిలో రెండు పెయ్య దూడలు శుక్రవారం పుట్టాయని తెలిపారు.

తొమ్మిది నెలలకు: ఇంజెక్షన్ వేసిన తొమ్మిది నెలలకు ఆవు ఈనుతుందని కేవలం పెయ్య దూడనే పుడుతుందని పశువైద్యాధికారి చెప్పారు. గోరంట్ల మండల వ్యాప్తంగా విడతల వారీగా ఇప్పటి వరకు 450 పశువులకు ఇంజక్షన్ వేశామన్నారు. మొదటి విజయంగా శుక్రవారం రెండు దూడలు పుట్టాయని వివరించారు.

ఉమ్మడి అనంతపురంలో ఉచితం

ఒక్కో పశువుకు ఈ ఇంజెక్షన్ వేయడానికి రూ.1300 ఖర్చు అవుతుందని, రాష్ట్ర వ్యాప్తంగా పశుపోషకం దారుల నుంచి రాయితీపై కేవలం రూ.150 వసూలు చేస్తున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాకు ఈపథకం పూర్తిగా ఉచితం.

ప్లానర్ల సమస్యల పరిష్కారానికి కృషి

అనంత నగరపాలక, న్యూస్‌టుడే: అనంతపురం జిల్లాలో ప్లానింగ్ సెక్రటరీలు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర స్థాయి నేతల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి మార్గం ఏర్పడిందని అనంతపురం జిల్లా నేతలు బాబు రావు, ధనుంజయరెడ్డి, వినయ్ తెలిపారు. ఆదివారం ప్లానింగ్ సెక్రటరీల టెక్నికల్ అసోసియేషన్ సమావేశానికి అనంతపురం జిల్లా నుంచి సంఘం నేతలతో పాటు పలువురు ప్లానింగ్ సెక్రటరీలు పాల్గొన్నారన్నారు. ఏపీ జేఏసీ ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు దృష్టికి తీసుకెళ్లగా తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు.

కళాత్మక బోధన.. వినూత్న సాధన

జాతీయ సమృద్ధి పోటీల్లో సత్తాచాటిన రోజ్‌మేర్రీరాణి

లేపాక్షి, హిందూపురం అర్బన్, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయి జిల్లా లేపాక్షి మండలం పులమతి ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్న డి.రోజ్‌మేర్రీరాణి కళలను సమన్వయం చేసుకుంటూ వినూత్న పద్ధతుల్లో పాఠ్యాంశాలను బోధిస్తున్నారు. ఇటీవల ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్‌లో 'కళ సమన్వయ బోధన విధానం' అంశంపై ఉపాధ్యాయులకు నిర్వహించిన జాతీయస్థాయి సమృద్ధి పోటీల్లో పాల్గొని పేరు ప్రఖ్యాతలు పొందారు. దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి 98 మంది ఉపాధ్యాయులు పాల్గొన్న ఈ పోటీల్లో రాష్ట్రం నుంచి 4 జట్లు పాల్గొన్నాయి. ఇందులో రోజ్‌మేర్రీరాణి పాల్గొని ఆంగ్ల పాఠ్యాంశమైన 'గ్రీన్‌సెన్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్‌'లో 'కోయ ట్రైబల్' గురించి వినూత్న కళారూపాలను ప్రదర్శించి ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు.

విద్యార్థులకు కళాత్మక బోధన చేస్తున్న ఉపాధ్యాయురాలు రోజ్‌మేర్రీరాణి

ఆంగ్లంపై మక్కువ పెరిగేలా....

గ్రామీణ విద్యార్థులకు ఆంగ్లం అంటే ఎనలేని భయం. ఆ భయం ఏ విద్యార్థిలో కనిపించని విధంగా ఉపాధ్యాయురాలు బొమ్మలు, ఉపకరణాలు, బుర్రకథ వంటి సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు పాఠ్యాంశాలను వివరిస్తూ పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత, ఆంగ్లంపై పూర్తి అవగాహన కల్పిస్తోంది. జిల్లా రిసోర్స్ పర్సన్‌గా పాఠ్యాంశాలకు సంబంధించి ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వడం ప్రత్యేక గుర్తింపు సొంతం చేసుకుంది. బుర్రకథలో పాత్రదారుడిలా నటిస్తూ విద్యార్థులకు పాఠ్యాంశాలు సులువుగా అర్థమయ్యేలా వివరిస్తోంది. ప్రతి యేటా నిర్వహించే కళాఉత్సవ్‌లో విద్యార్థులతో పలు అంశాలపై ప్రదర్శనలు ఇప్పించి వారిలో సృజనాత్మకతను వెలికి తీస్తోంది. ప్రతి బుధవారం పాఠశాలలో ఆంగ్ల దినం పాటించి ఆంగ్ల క్లబ్ ద్వారా స్పోకెన్ ఇంగ్లిష్‌పై శిక్షణ ఇస్తున్నారు. చిన్నతనం నుంచే కళలలో ప్రావీణ్యం కల్గి ఉండటమే కాకుండా క్రీడల్లో రాష్ట్ర స్థాయిలో రాణించేది. స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో గైడ్ కెప్టెన్‌గా యూనిట్‌ను నడిపిస్తూ విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, సేవాభావం పెరిగేలా కృషి చేస్తున్నారు.

రథాన్ని లాగుతున్న భక్తులు

నేత్రపర్వం.. శ్రీసుంకలాపార్వతిదేవి రథోత్సవం

విడపనకల్లు, న్యూస్‌టుడే: విడపనకల్లు మండలం పాల్తూరులో శ్రీసుంకలాపార్వతి దేవి రథోత్సవం ఆదివారం సాయంత్రం నేత్రపర్వంగా సాగింది. చుట్టుపక్కల ప్రాంతాలతోపాటు కర్ణాటక నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం అశేష భక్త జనం నడుమ రథోత్సవం ఘనంగా నిర్వహించారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

పట్టులో సాంకేతికతతోనే అధిక దిగుబడులు

వివిధ రకాల పట్టుగూళ్లను పరిశీలిస్తున్న అధికారులు, రైతులు

పెనుకొండ, న్యూస్‌టుడే: పట్టు రైతులు సాగులో అధునిక సాంకేతిక పద్ధతులను ఉపయోగించి అధిక దిగుబడులు సాధించవచ్చని సీఎస్ఆర్అండ్‌టీఐ(సెంట్రల్ సెరికల్చర్ రీసర్చ్ అండ్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్) మైసూర్ డైరెక్టర్ దీప పేర్కొన్నారు. ఆదివారం స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో అనంతపురం ప్రాంతీయ పట్టుపరిశోధన కేంద్రం ఇన్‌ఛార్జి మురళి ఆధ్వర్యంలో పట్టు రైతుల సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భం నిర్వహించిన సమావేశంలో నూతన సాగు పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ఏర్పాటు చేసిన వివిధ రకాల ప్రదర్శనలు పరిశీలించారు. కార్యక్రమంలో పట్టుపరిశ్రమశాఖ అడిషనల్ డైరెక్టర్ అరుణకుమారి, జిల్లా సంయుక్త సంచాలకులు శోభారాణి, డీడీ ఉమాశ్వర్, సిబ్బంది, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పీఎస్‌హెచ్‌ఎంల సమస్యలు పరిష్కరించాలి

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని పీఎస్‌హెచ్‌ఎంల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీవీ ప్రసాద్ డిమాండ్ చేశారు. ఉమ్మడి అనంత జిల్లా పీఎస్‌హెచ్‌ఎంల సంఘం సమావేశం స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో ఆదివారం జరిగింది. తమ సమస్యలపై చర్చించారు. ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలనే ఉద్దేశంతో ఆదర్శ ప్రాథమిక పాఠశాలలు ప్రవేశపెట్టారు. స్కూల్ అసిస్టెంట్లను పీఎస్‌హెచ్‌ఎంలుగా నియమించారు. కానీ ఎలాంటి జాబ్‌చార్ట్ ప్రకటించలేదన్నారు. జాబ్‌చార్ట్ ప్రకటించాలన్నారు. రాబోయే బదిలీల్లో తిరిగి స్కూల్ అసిస్టెంట్లుగా వెనక్కు వెళ్లడానికి ప్రాధాన్యం కల్పించాలన్నారు. యూడైస్ కేటాయించాలన్నారు. పీఎస్‌హెచ్‌ఎంలను గ్రేడ్-3 ప్రధానోపాధ్యాయులుగా మార్చాలన్నారు. శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షులు మహబూబ్ బాషా, అనంతపురం జిల్లా అధ్యక్షులు రామాంజనేయులు, నాయకులు రంగారెడ్డి, సూర్యనారాయణ,, సాయిరాం నాయక్, సత్యనారాయణరెడ్డి, రవీంద్రనాయక్ పాల్గొన్నారు.

ప్లకార్డులు ప్రదర్శిస్తున్న పీఎస్‌హెచ్‌ఎం సంఘం నాయకులు

చెంబులన్నాడు.. సొమ్ము దోచాడు

వైకాపా నాయకుడి అరెస్ట్

కదిరి, న్యూస్‌టుడే: రైస్‌పుల్లింగ్ పేరిట మహిమలున్న చెంబులు తయారు చేసి ఇస్తానంటూ డబ్బులు తీసుకొని మోసం చేసిన కేసులో చింతకుంట కృష్ణారెడ్డి అలియాస్ డిక్కీబాబును అరెస్టు చేసినట్లు డీఎస్పీ శివనారాయణస్వామి తెలిపారు. నిందితుడి నుంచి ఒక కారు, ఐదు రాగి చెంబులు, మూడు సెల్‌ఫోన్లు, రూ.1.08 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. కదిరి రూరల్ సర్కిల్ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో డీఎస్పీ కేసు వివరాలను వెల్లడించారు. శ్రీసత్యసాయి జిల్లా తలుపుల మండలం బురుజుపల్లి గ్రామానికి చెందిన కృష్ణారెడ్డి తలుపులలో నివాసం ఉంటున్నాడు. ఇతడు ప్రస్తుతం తలుపుల మండల వైకాపా కన్వీనర్‌గా ఉన్నాడు. తనకు రైస్‌పుల్లింగ్ మహిమ చెంబులు తయారు చేసే విద్య తెలుసని, మార్కెట్‌లో అమ్మితే రూ.2 కోట్లు పొందవచ్చని నమ్మించాడు. ప్రలోభ పడిన వేణుగోపాల్‌రెడ్డి 2025 జూన్‌లో రూ.5 లక్షలు, జులైలో రూ.5 లక్షలు ఇచ్చాడు. మరో రూ.10 లక్షలు ఇస్తే మహిమలున్న రాగి చెంబును తయారు చేసి అమ్మిస్తానని నిందితుడు చెప్పాడు. అనుమానం కలిగిన బాధితుడు చెంబు అవసరం లేదు, తానిచ్చిన రూ.10 లక్షలు వెనక్కు ఇవ్వాలని కోరాడు. డబ్బు వెనక్కి ఇవ్వనని, రాగి చెంబు నీవద్ద పెట్టుకో తర్వాత అమ్మిస్తానని నమ్మించాడు. చాలాసార్లు రాగిచెంబు అమ్మివ్వాలని అడిగినా నిందితుడు పట్టించుకోలేదు. బాధితుడు ఈనెల 15న డిక్కీబాబు ఇంటి కెళ్లి రాగిచెంబు ఇచ్చేసి, డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరాడు. నువ్వే రూ.10 లక్షలు ఇవ్వాలని, లేదంటే చంపుతానంటూ వేణుగోపాల్‌రెడ్డిని నిందితుడు బంధించి బెదిరించాడు. బాధితుడు విషయం స్నేహితులకు చెప్పటంతో వారొచ్చి రూ.3 లక్షలు ఇచ్చారు. మిగిలిన రూ.7 లక్షలకు ప్రాంసరీ నోట్లపై బలవంతంగా సంతకాలు పెట్టించుకున్నాడని వేణుగోపాల్‌రెడ్డి ఫిర్యాదు మేరకు శనివారం నిందితుడ్ని అరెస్టు చేసినట్లు డీఎస్పీ వివరించారు. డిక్కీబాబుపై ఇప్పటికే ఎనిమిది కేసులు నమోదయ్యాయని, ఒక కేసులో శిక్ష పడిందన్నారు. ఇతని ఆస్తులు అటాచ్ చేసి బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని, బహిష్కరణకు చర్యలు చేపడతామని డీఎస్పీ తెలిపారు.

స్వాధీనం చేసుకున్న చెంబులు, నగదును చూపుతున్న పోలీసులు

రైలులో చైన్ లాగి.. బంగారం గొలుసు చోరీ

అనంతపురం (రైల్వే), న్యూస్‌టుడే: శనివారం రాత్రి.. సమయం 11 గంటలు. యశ్వంతపూర్ నుంచి లాథూర్‌కు (16583) వెళ్లే రైలు గంటకు 120 కి.మీ. వేగంతో కల్లూరు రైల్వేస్టేషన్ సమీపాన పరుగులు తీస్తుంది. అందరూ నిద్రలోకి జారుకుంటున్నారు. ఈ సమయంలో రైలు గొలుసు లాగిన శబ్దం. వేగం నెమ్మదించాక.. వెంటనే స్లీపర్ బోగీలో ప్రయాణికురాలు శారద మెడలో ఉన్న 5 తులాల బంగారు ఆభరణాలు లాక్కొని ఓ ఆగంతుకుడు రైలు దిగిపారిపోయాడు. ధర్మవరం తర్వాత ఈ రైలు గుంతకల్లులో మాత్రమే ఆగుతుంది. ఈ రైలుకు అనంతపురంలో స్టాపేజీ లేదు. యాదగిరి వెళ్లడానికి ఆమె ధర్మవరంలో రైలు ఎక్కింది. చోరీ విషయమై ఆమె రైల్వే పోలీసులకు సమాచారం అందజేసింది. గుంతకల్లు స్టేషన్‌లో పోలీసులు ఆమెను విచారించారు. యాదగిరి పోలీస్‌స్టేషన్‌లో రాతపూర్వక ఫిర్యాదు ఇవ్వాలని సూచించారు.

వృద్ధురాలి మెడలో..

హిందూపురం, న్యూస్‌టుడే: హిందూపురం గ్రామీణ మండలం చౌళూరుకు చెందిన వృద్ధురాలు సంజీవమ్మ ఆదివారం ఉదయం పాలు తీసుకొని ఇంటి లోపలికి వెళ్లగా మాటు వేసిన దొంగ ఆమె ముఖంపై టవల్ బిగించి మెడలో ఉన్న ఐదు తులాల రెండు వరుసల బంగారు గొలుసును అపహరించి పరారయ్యాడు. ఆమె కుమారుడు, కోడలు శనివారం వివాహానికి బంధువుల ఊరికి వెళ్లటంతో అవకాశం కోసం వేచి చూస్తున్న దొంగ వృద్ధురాలు ఒంటరిగా ఉండటంతో ఈ ఘటనకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు.

లారీ ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలు

సోమందేపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని పాపిరెడ్డిపల్లి వద్ద జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి కియా అనుబంధ పరిశ్రమలోకి విధులకు వెళ్తున్న సాయికిరణ్, నాగేంద్ర ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరికీ తీవ్రగాయాలయ్యాయి. ఏఎస్సై దేవానంద్, సిబ్బంది రామకృష్ణ తదితరులు ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను పెనుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం ట్రాఫిక్‌ను తొలగించి, వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు.

రెండు ద్విచక్ర వాహనాల ఢీ.. ఒకరి దుర్మరణం

శివన్న

గుమ్మఘట్ట, న్యూస్‌టుడే: మండలంలోని గోనబావి గ్రామం వద్ద ఆదివారం రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఒకరు మృతిచెందారు. పోలీసుల వివరాల మేరకు.. రాయదుర్గం వైపు నుంచి ద్విచక్ర వాహనంలో ఇద్దరు వ్యక్తులు వస్తుండగా.. రాయదుర్గం వైపు ద్విచక్ర వాహనంలో కొండాపురం శివన్న వెళ్తున్నారు. వీరి వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో శివన్న(55) రోడ్డుపై పడటంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఆయన్ను స్థానికులు రాయదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఎస్ఐ చిన్నరాయుడు ఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. శిరస్త్రాణం లేకపోవటంతోనే ప్రాణాలు పోయాయని పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో భవన నిర్మాణ కార్మికుడు..

కూడేరు(ఉరవకొండ), న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో భవన నిర్మాణ కార్మికుడు మృతి చెందిన ఘటన కూడేరు మండలంలో చోటు చేసుకుంది. సీఐ రాజు తెలిపిన వివరాలిలా.. మండలంలోని అంతరగంగ గ్రామానికి చెందిన వెంకటేశ్ (35) భవన నిర్మాణ కార్మికుడిగా పని చేస్తూ, కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆదివారం అనంతపురంలో పని ముగించుకుని రాత్రి ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వస్తున్నాడు. కమ్మూరు సమీపంలో జాతీయ రహదారిపై ఎదురుగా వచ్చిన కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతను అక్కడికక్కడే మృతి చెందాడు. అతనికి భార్య అరుణ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కారులో ప్రయాణిస్తున్న లక్షిత్ అనే చిన్నారికి స్వల్ప గాయాలయ్యాయి. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

మణేసముద్రంలో లారీ కిందపడి వృద్ధుడు..

హిందూపురం, న్యూస్‌టుడే: లారీ చక్రాలు ఎక్కడంతో ఓ వృద్ధుడు మృతి చెందిన ఘటన ఆదివారం హిందూపురం గ్రామీణ మండలం మణేసముద్రంలో చోటుచేసుకుంది. ఆదివారం సాయంత్రం మణేసముద్రానికి చెందిన నారాయణప్ప(80) ఆగి ఉన్న లారీ వెనకాల ఉన్నాడు. అది చూసుకోని డ్రైవర్ లారీని వెనక్కి తీసే సమయంలో వెనుక చక్రాలు ఎక్కడంతో వృద్ధుడు అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. సంఘటనపై గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని శవపరీక్షకు హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

కృష్ణమనాయుడు

ముదిగుబ్బ, న్యూస్‌టుడే: విద్యుత్తు మరమ్మతులు చేస్తుండగా ప్రమాదవశాత్తు తీగలు తగిలి ఓ రైతు అక్కడికక్కడే మృతి చెందిన విషాద ఘటన ఆదివారం ముదిగుబ్బలోని సంకేపల్లి దగ్గర చోటుచేసుకుంది. ముదిగుబ్బలోని గీతా మందిరం కాలనీకి చెందిన కృష్ణమనాయుడు (42) వ్యవసాయంతోపాటు ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ పనులు చేస్తూ జీవనం సాగించేవారు. ఆదివారం సంకేపల్లి సమీపంలో బేల్దారి వెంకటరమణకు చెందిన తోటలో విద్యుత్తు సమస్య తలెత్తడంతో, దాన్ని సరిచేయడానికి కృష్ణమనాయుడు వెళ్లారు. ఎల్‌సి తీసుకోకుండానే స్తంభం ఎక్కి మరమ్మతులు చేస్తుండగా ప్రమాదవశాత్తు 11కేవీ విద్యుత్తు తీగలు తగిలి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. అతనికి మూడేళ్ల కిందటే రజితతో వివాహమైంది. ఇంటికి పెద్ద దిక్కును కోల్పోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.

హెచ్చెల్సీలో నగరవాసి గల్లంతు!

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: స్థానిక మూడో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సుబ్రహ్మణ్యేశ్వర ఆలయానికి వచ్చి హెచ్చెల్సీ నీటిలో పడి వ్యక్తి గల్లంతు అయినట్లు పోలీసులు తెలిపారు. కమలానగర్‌కు చెందిన రామాంజనేయులు (55) స్థానికంగా చేపల మార్కెట్ వద్ద మారుతీ సప్లయర్స్ నిర్వహిస్తున్నాడు. అతడు శనివారం సాయంత్రం ఆలయానికి వచ్చి తిరిగి ఇంటికి వెళ్లలేదు. ఎంతసేపటికి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆలయం వద్దకు వచ్చి చూడగా, పక్కన ఉన్న హెచ్చెల్సీ కాలువ ఒడ్డున పర్స్, చెప్పులు కనిపించాయి. ప్రమాదవశాత్తు నీటిలో పడ్డాడా, బలవన్మరణానికి పాల్పడ్డాడా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఆదివారం ఉదయం నుంచి అగ్నిమాపక సిబ్బంది హెచ్చెల్సీ నీటిలో గాలించినా ఫలితం లేదు.

సోదనపల్లిలో పది మందికి అస్వస్థత

శింగనమల, న్యూస్‌టుడే: మండల పరిధిలోని సోదనపల్లి గ్రామంలో శనివారం రాత్రి వాంతులు విరేచనాలు కావడంతో పది మందికి పైగా అస్వస్థతకు గురయ్యారు. బాధితులను గ్రామస్థులు శింగనమల ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. వైద్యాధికారులు సోదనపల్లిలో పర్యటించారు. దీనిపై శింగనమల ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి రోహినాథ్ వివరణ కోరగా బాధితులందరూ ఆరోగ్యంగా ఉన్నారని, బాధితులు తిన్న ఆహారం కలుషితం అయి ఉండవచ్చని అనుమానాలు వ్యక్తం చేశారు. మరోవైపు తాగునీటి కలుషితం అయిందని గ్రామంలో ప్రచారం జరుగుతోంది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

చికిత్స పొందుతున్న రోగులు

రాయదుర్గం

• రాయదుర్గం • కళ్యాణదుర్గం • ఉరవకొండ

వైభవంగా ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

బొమ్మనహాళ్, న్యూస్‌టుడే: మండలంలోని గౌనూరు గ్రామంలో ఆదివారం ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా జరిగింది. గ్రామస్థులు, దాతల సహకారంతో ఆలయాన్ని నిర్మించి వేదమంత్రోచ్ఛారణల నడుమ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ప్రత్యేక పూజల అనంతరం ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని స్వామికి మొక్కులు తీర్చుకున్నారు. అన్నదానం నిర్వహించారు.

ప్రత్యేక అలంకారంలో ఆంజనేయుడు

పాదయాత్రగా వెళుతున్న గొల్లలదొడ్డి గ్రామస్థులు

ఘనంగా బడప్పస్వామి జాతర

బెళుగుప్ప, న్యూస్‌టుడే : నాలుగురోజుల పాటు జరిగే బడప్పస్వామి వీరభూమి పెద్ద జాతరపూజ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని నరసాపురం గొల్లలదొడ్డి గ్రామంలోని యాదవులు, యల్లమ్మ దేవాలయంలో ఆదివారం పూజలు చేశారు. సమీపంలోని పెన్నా నది ఒడ్డున కొలువైన తమ వీరభూమికి పాదయాత్రగా తరలివెళ్లారు. 12 సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే ఈ జాతర 25న బూదిగుమ్మ పెద్దదేవర జాతరతో ముగుస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు.

అపూర్వ సమ్మేళనం

అధ్యాపకులతో పూర్వ విద్యార్థులు

రాయదుర్గం పట్టణం, న్యూస్‌టుడే: పూర్వ విద్యార్థులు ఉన్నతంగా ఎదిగినప్పటికీ తమ కళాశాలను గుర్తించుకొని సేవ చేయడం అభినందనీయమని ప్రిన్సిపల్ శ్రీనివాసులు అన్నారు. ఆదివారం పట్టణంలోని కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఏర్పాటు చేశారు. 2004-07 విద్యా సంవత్సరంలో బీఏ బ్యాచ్ విద్యార్థులు తమ సొంత చందాలు రూ.2.90 లక్షల వ్యయంతో అదనపు గదిని నిర్మించి కళాశాలకు అప్పగించారు. అధ్యాపకులు ఎర్రిస్వామి, లక్ష్మీనారాయణ, నారాయణ, గోవర్ధన్, పాండురంగ, పూర్వ విద్యార్థులు వంశీ, గురు, సోము, నాగేంద్ర, కిరణ్, హనుమంతు, నరేంద్ర, మమత, లక్ష్మి, వన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆదివారం.. ఆనందం.. ఆహ్లాదం

రాయదుర్గం, న్యూస్‌టుడే: పట్టణంలోని చంద్రబాబు నాయుడు పార్కులో హ్యాపీ సండే కార్యక్రమాన్ని ఆదివారం ఉదయం మున్సిపల్ అధికారులు ఘనంగా నిర్వహించారు. మెప్మా సీవో వెంకటలక్ష్మి, మున్సిపల్ డీఈ.సురేశ్ ఆధ్వర్యంలో యోగా, భరతనాట్యం, నృత్యాలు నిర్వహించారు.

కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే: పిల్లలు.. పెద్దలు ఆదివారం ఆనందంగా ఆహ్లాదంగా గడిపారు. పట్టణంలోని కరణం చిక్కప్ప ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మున్సిపల్ అధికారులు ఆనంద ఆదివారం కార్యక్రమం నిర్వహించారు. పిల్లలు, పెద్దలను ఒకచోటికి చేర్చి సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటలు, ఆరోగ్యంపై అవగాహన కల్పించారు.

రాయదుర్గం : నృత్యం చేస్తున్నబాలికలు

చెరువుల్లో నీరు పుష్కలం.. ఆయకట్టు సస్యశ్యామలం

కణేకల్లు, బొమ్మనహాళ్, న్యూస్‌టుడే : సాగు, తాగునీటితో పాటు భూగర్భ జలాలు పెంపొందించాలన్న కూటమి ప్రభుత్వ చొరవతో ఉమ్మడి అనంతపురం జిల్లాలోని చెరువులు తుంగభద్ర హెచ్చెల్సీ, హంద్రీనీవా నీటితో చెరువులు కళను సంతరించుకున్నాయి. జిల్లాలో కణేకల్లు చిక్కణ్ణేశ్వర వడియార్ చెరువు, బొమ్మనహాళ్ మండలంలో శ్రీధరఘట్ట చెరువులలో పుష్కలంగా నీరు చేరి కళకళలాడుతున్నాయి. చెరువుల ద్వారా రెండో పంటకు నీరు ఇస్తామని, కణేకల్లు ఎన్నికల పర్యటనలో ఇచ్చిన హామీ మేరకు శ్రీధరఘట్ట చెరువుకు నీరు. హెచ్చెల్సీ ప్రత్యేక తూము ఏర్పాటు చేసి నీరు ఇస్తామని నేమకల్లు పర్యటనలో ముఖ్యమంత్రి ప్రకటించారు. చెరువులు నీటితో నింపినందుకు అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కణేకల్లు చెరువులో నిండుగా నీరు

గత ప్రభుత్వ నిర్లక్ష్యం..

గత వైకాపా ప్రభుత్వం జిల్లా జీవనాడి హెచ్చెల్సీని నిర్లక్ష్యం చేసింది. అత్యవసర మరమ్మతులను పట్టించుకోకుండా గాలికొదిలేసింది. చెరువులను, కర్షకుల బాగోగులను విస్మరించడంతో ఆయకట్టులో పంట సాగుకు భరోసా కరవైంది. ఈ నేపథ్యంలో అన్నదాతలు సందిగ్ధంలో ఉండి సాగు చేయడానికి కొట్టుమిట్టాడాల్సిన దుస్థితి.

విస్తారంగా పంటల సాగు..

కూటమి ప్రభుత్వ చొరవతో రబీలోనూ చెరువు ఆయకట్టు సస్యశ్యామలంగా మారింది. నీటిని పొదుపు చేస్తూ కణేకల్లు, శ్రీధరఘట్ట చెరువుల కింద మాత్రమే 3200ఎకరాలలో వరి పంట వేశారు. వ్యవసాయ బోర్ల కింద ప్రధాన పంటలు వరి, పత్తి, మొక్కజొన్న తదితర పంటలు ఎక్కువగా సాగు చేశారు. జిల్లా వ్యాప్తంగా 25వేల ఎకరాల్లో వరి, 20వేల ఎకరాలలో జొన్న, 15వేల ఎకరాలలో పత్తి, 70వేల ఎకరాలలో మొక్కజొన్న, 37వేల ఎకరాలలో వేరుసెనగ సాగైనట్లు అధికారులు నివేదిస్తున్నారు.

కూటమి ప్రభుత్వం చొరవతో..

- మల్లికార్జున, ఆయకట్టు రైతు, శ్రీధరఘట్ట

కూటమి ప్రభుత్వ చొరవతో ఆయకట్టు కింద రెండో పంట వరి సాగు చేశాం. హెచ్చెల్సీ నీటితో చెరువు నింపేలా ప్రత్యేక తూము ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించడం శుభపరిణామం. దీంతో చెరువు ఆయకట్టు రైతులకు ఎంతో భరోసా కలిగింది.

మేమున్నాం.. మీకు తోడుగా

రాయదుర్గం పట్టణం: 9666888046
కళ్యాణదుర్గం గ్రామీణం: 9985668661
ఉరవకొండ: 8008573071

సమస్య: మండలంలోని మల్లికేతి గేటు నుండి నాగలాపురం గ్రామానికి వెళ్లే రోడ్డులో అక్కడక్కడ పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి.

-నాగలాపురం, స్థానికుడు

సమాధానం: రోడ్డు మరమ్మత్తు పనులకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. మంజూరైన వెంటనే పనులు చేపడతాం

-నాగేంద్రప్రసాద్, ఆర్‌అండ్‌బీ ఏఈ డి.హీరేహాళ్

సమస్య: మల్లికేతి గ్రామంలో ప్రధానరోడ్డుపై నీరు చేరడంతో బురదగా మరి రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం

-మల్లికేతి గ్రామస్థులు

సమాధానం: రోడ్డపై మట్టి లేకుండా తీసివేసి, దారిలోకి నీరు రాకుండా మళ్లిస్తాం

-మహేష్, పంచాయతీ కార్యదర్శి మల్లికేతి

– న్యూస్‌టుడే, డి.హీరేహాళ్

గుంతల దారిలో ప్రయాణం నరకం

డి.హీరేహాళ్ మండలంలోని రాయదుర్గం-బళ్లారి ప్రధాన రహదారిలో మల్లికేతి గేటు నుంచి మల్లికేతి, నాగలాపురం, తిమ్మాలాపురం గ్రామాల మీదుగా ఉద్దేహాళ్‌కు వెళుతున్న ఈ ఆర్‌అండ్‌బీ రోడ్డులో గుంతలు పడి, రాళ్లు తేలడంతో వాహనదారులు రాకపోకలకు తీవ్ర అవస్థలుగా మారింది. రాత్రివేళ పొరపాటున వేగంగా వచ్చిన వాహనాలు అదుపుతప్పి కిందపడి ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. ఆర్‌అండ్‌బీ ఏఈ నాగేంద్రప్రసాద్ 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ ప్రతిపాదనలు పంపామని తెలిపారు.

-న్యూస్‌టుడే, డి.హీరేహాళ్

బాధితులకు సహాయనిధి చెక్కుల పంపిణీ

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రజల కోసం పని చేసే కూటమి ప్రభుత్వం మరో ఐదేళ్ల పాటి అధికారంలోకి ఉంటుందని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అన్నారు. ఆదివారం స్థానిక ప్రజావేదికలో నాయకులతో కలిసి సీఎం సహాయ నిధి చెక్కులను బాధితులకు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి నెలా రెండు, మూడు సార్లు సహాయనిధిని అందజేస్తూ ఆయా కుటుంబాలకు భరోసా కల్పిస్తోందని చెప్పారు. వైకాపా హయాంలో హిందువులను కించపరిచే వై.వి.సుబ్బారెడ్డి, కరుణాకర్‌రెడ్డిలను టీటీడీ ఛైర్మన్లుగా జగన్ నియమించి అవినీతి, అక్రమాలకు పాల్పడేలా చేశారని దుయ్యబట్టారు. నియోజకవర్గంలోని 29 మంది బాధితులకు రూ. 42 లక్షల విలువ చేసే చెక్కులు అందించారు.

చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

'వైద్యకళాశాలల ప్రైవేటీకరణ వద్దు'

రాయదుర్గం పట్టణం, న్యూస్‌టుడే: మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వెంటనే ఆపాలని సీపీఐ తాలూకా కార్యదర్శి నాగార్జున డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ రంగాలు, ప్రైవేటు ఆస్పత్రుల్లో దోపిడీని అరికట్టాలన్నారు. వైద్య వ్యవస్థ నేడు వ్యాపార రంగంగా మారిపోయిందన్నారు. పేదలకు ఉచిత వైద్యం దూరం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. నాయకులు తిప్పేస్వామి, నరసింహులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

పాలవెంకటాపురం(బ్రహ్మసముద్రం), న్యూస్‌టుడే: మండలంలోని పాలవెంకటాపురం గ్రామంలో ఆదివారం తెదేపా మండల కన్వీనర్ శ్రీరాములు, నాయకులు కలిసి సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ నిర్వహించారు. ఆదివారం స్థానిక ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు చొరవతో గ్రామంలో రూ.కోటి నిధులతో పనులు చేపడుతున్నట్లు తెలిపారు. గత కొన్నేళ్లుగా గ్రామంలో గుంతల రోడ్లు ఏర్పడ్డాయన్నారు. పనులు వేగవంతం చేసి నాణ్యతతో పూర్తి చేస్తామన్నారు.

భూమి పూజ చేస్తున్న తెదేపా మండల కన్వీనర్ శ్రీరాములు, నాయకులు

కార్యాలయం.. పశువులకు ఆవాసం

కళ్యాణదుర్గంలోని స్థానిక తహసీల్దారు కార్యాలయ ఆవరణలో పశువులు గుంపులుగా తిరుగుతున్నాయి. కార్యాలయ సేవల కోసం వచ్చిన ప్రజలను అక్కడ ఉన్న పశువులు ఒక్కోసారి పొడవడంతో పరుగులు తీస్తున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. అక్కడికి వెళితే ఎలాంటి ప్రమాదం వస్తుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మూగజీవాలను కార్యాలయంలోకి, రోడ్లపైకి రానీయకుండా ఆయా శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు, స్థానికులు కోరుతున్నారు.

-న్యూస్‌టుడే, కళ్యాణదుర్గం గ్రామీణం

కంప ఇలా.. రాకపోకలెలా

జాతీయ రహదారి నుంచి ఉరవకొండ మండలంలోని కోనాపురం మీదుగా పెన్నహోబిలం దిగువ వివిధ గ్రామాలను కలుపుతూ వెళ్లే రహదారి కంపతో మూసుకుపోయింది. దారికి ఇరువైపుల కంప ఉండటంతో రాత్రివేళ ప్రయాణించాలంటే చోదకులు భయాందోళనలకు గురవుతున్నారు. దీనిపై పీఆర్ ప్రాజెక్టు డీఈఈ మదన్‌మోహన్‌ను వివరణ కోరగా పీఎంజీఎస్‌వై కింద ప్రతిపాదనలు పంపాం, త్వరలో మంజూరయ్యే అవకాశం ఉంది. అయిన వెంటనే పూర్తి చేస్తామని తెలిపారు.

- న్యూస్‌టుడే, ఉరవకొండ

పిచ్చిమొక్కలు తొలగించరూ..

వజ్రకరూరు మండలం గడేహోతూరు గ్రామం కడప వీధిలో దారి పక్కన ఉన్న కాలువలో పిచ్చిమొక్కలు పెరిగి మురుగు ముందుకు కదలడంలేదు. మురుగు అక్కడే నిలవడంతో ఆవాసప్రాంతంలో కాలనీవాసులు అటుగా వెళ్లేందుకు దుర్వాసన వస్తోందని వాపోతున్నారు. అలాగే దారికి ఇరువైపులా కంప చెట్లు పెరగడంతో రాకపోకలకు ఇబ్బంది పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి కాలువలో ఉన్న పిచ్చి మొక్కలు తొలగించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, వజ్రకరూరు

ట్యాంకు ఉన్నా ప్రయోజనమేదీ?

ఉరవకొండ మండలంలోని లత్తవరంలో ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న చిన్న నీటి ట్యాంకుకు కొన్నేళ్లుగా నీరు సరఫరా కావడం లేదు. బోరులోని మోటారు మరమ్మతులకు గురవడం ఆ తర్వాత దానిపై అధికారులు దృష్టి సారించలేదు. వేసవి రావడంతో స్థానికులు తాగు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. పంచాయతీ అధికారులు ట్యాంకును అందుబాటులోకి తీసుకురావాల్సి అవసరం ఉంది. దీనిపై పంచాయతీ కార్యదర్శి రామచంద్ర దృష్టికి తీసుకెళ్లగా సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

- న్యూస్‌టుడే, ఉరవకొండ

విద్యుత్తు స్తంభాలు వాలుతున్నాయ్!

విడపనకల్లు మండలం పాల్తూరు గ్రామ పొలాల్లో విద్యుత్తు స్తంభాలు ప్రమాదకరంగా నేలకొరిగాయి. స్తంభానికి తీగలు కిందకి వేలాడుతుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని రైతులు భయాందోళనకు గురవుతున్నారు. కొన్ని నెలలుగా ప్రమాదకరంగా ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని అన్నదాత కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, విడపనకల్లు

దాతల సాయంతో కల్యాణమండపం

కణేకల్లు, న్యూస్‌టుడే : పేద, మధ్యతరగతి కుటుంబాల సౌకర్యార్థం అద్దెకు అందుబాటులో ఉండేలా దాతల ఆర్థిక సహకారంతో కల్యాణ మండపం నిర్మించడం అభినందనీయమని వక్తలు కొనియాడారు. కొత్తపల్లి క్రాస్ వద్ద శిర్డి సాయి మందిర ఆవరణలో దాతల సహకారంతో రూ.90లక్షల వ్యయంతో నిర్మించిన మండపాన్ని, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తెదేపా నాయకులు ఆదివారం ప్రారంభించారు. దాత సుజాతతో పాటు మరికొందరిని సత్కరించారు. తెదేపా మండల కన్వీనర్ వన్నారెడ్డి, నాయకులు ఆనందరాజు, లాలెప్ప, ఫకృద్దీన్, ఆది, బసవరాజు, సుదర్శన్, రమేష్, చంద్రశేఖరగుప్త, గోపాల్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కల్యాణ మండపాన్ని ప్రారంభిస్తున్న తెదేపా నాయకులు

ఆదర్శ పాఠశాల ప్రవేశాలకు దరఖాస్తులు

వజ్రకరూరు, న్యూస్‌టుడే: వజ్రకరూరులోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో 2026-27 విద్యా సంవత్సరానికి ఆరో తరగతి ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ గంగాధర్ ఆదివారం వెల్లడించారు. ఆరో తరగతికి మొత్తం 100 సీట్లు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ప్రస్తుతం అయిదు చదువుతున్న విద్యార్థులు ఈనెల 23 నుంచి మార్చి 31లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 12న ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 9052548047, 8008949107 చరవాణుల్లో సంప్రదించాలని తెలిపారు.

బొలెరోను ఢీకొన్న ట్రాక్టర్

గుమ్మఘట్ట, న్యూస్‌టుడే: కేపీదొడ్డి సమీపంలో ఆదివారం బొలెరో వాహనాన్ని వెనుక నుంచి వస్తున్న ట్రాక్టర్ ఢీకొంది. ఈ ఘటనలో శిరిగేదొడ్డి గ్రామానికి చెందిన తిప్పమ్మ, మారెక్కలకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుల వివరాల మేరకు కొత్తిమీర తొలిచేందుకు వెళ్లి, తిరిగి స్వగ్రామానికి వస్తుండగా కేపీ దొడ్డి సమీపాన ఉన్న వేగనిరోధకం వద్ద డ్రైవర్ బ్రేకు వేశాడు. వెనుక నుంచి వేగంగా వస్తున్న ట్రాక్టర్ బొలెరోను ఢీకొంది. అందులోని ఇద్దరు మహిళలకు తీవ్రగాయాలవ్వడంతో రాయదుర్గం ఆస్పత్రికి తరలించారు. మిగతా 5మందికి చిన్న గాయాలయ్యాయి. స్థానిక ఎస్సై చిన్నరాయుడు ఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు.

జూదరుల అరెస్టు

కంబదూరు, న్యూస్‌టుడే: పోలీసులకు అందిన సమాచారం మేరకు మండలంలోని వైసీపల్లి గ్రామ శివారులో జూద స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఆదివారం ఎస్సై లోకేశ్ తన సిబ్బందితో స్థావరాలపై జరిపిన దాడిలో 9 మంది జూదరులు పట్టుకున్నారు. వారి వద్ద ఉన్న రూ.22.600 నగదు, 5 చరవాణులు, 6 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం కళ్యాణదుర్గం కోర్టుకు తరలించనున్నట్లు ఎస్సై చెప్పారు.

50మందికి కంటి శస్త్రచికిత్సలు

రాయదుర్గం, న్యూస్‌టుడే: పేదల సంక్షేమానికి లయన్స్‌క్లబ్ అహర్నిశలు కృషి చేస్తుందని క్లబ్ అధ్యక్షుడు పొరాళు ధనార్జున తెలిపారు. ఆదివారం స్థానిక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం జరిగింది. ఈ సందర్భంగా పొరాళు ధనార్జున, అబ్దుల్ మాలిక్ మాట్లాడుతూ ఇప్పటికే మూడు ఉచిత నేత్ర శిబిరాల ద్వారా వందలాది మందికి శంకర్ కంటి ఆసుపత్రిలో ఆపరేషన్లు చేయించామని వివరించారు. 175 మందికి పరీక్షలు జరుపగా 50మంది శస్త్రచికిత్సలకు ఎంపికయ్యారని వారిని బెంగళూరుకు పంపినట్లు పేర్కొన్నారు. ఆర్పీ. శంకర్‌బాబు, సద్గురు ఆప్టికల్స్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కళాకారులకు సత్కారం

కుందుర్పి, న్యూస్‌టుడే: కుందుర్పి మండల కేంద్రంలోని విలువల బడి వ్యవస్థాపకులు, ఎస్‌కే ఛారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు ఎస్‌కే లెనిన్ బాబు ఆధ్వర్యంలో మండలంలోని పలువురు కవులు, కళాకారులు, గ్రామ సేవకులను సోమవారం ఘనంగా సన్మానించారు. స్థానిక గడినాడు సాంస్కృతిక కళాభవనంలో వారందరినీ

అ వీ.. ఇ వీ.. అ న్నీ..

ఆహ్వానించి, దుశ్శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. లెనిన్ మాట్లాడుతూ మాతృభాష దినోత్సవాన్ని పురస్కరించుకొని, తమ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం సమావేశం ఏర్పాటు చేసి అందరి సమక్షంలో నిర్వహించుకోవడం గర్వకారణమన్నారు.

25న ఉచిత కంటి వైద్య శిబిరం

విడపనకల్లు, న్యూస్‌టుడే: గడేకల్లులోని ప్రభుత్వ వసతి గృహంలో ఈనెల 25న పయ్యావుల సోదరుల ఆధ్వర్యంలో హైదరాబాదుకు చెందిన ఎల్.వి ప్రసాద్ వైద్యులు కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు గడేకల్లు తెదేపా నాయకులు తెలిపారు. 25న బుధవారం ఉదయం కంటి సమస్యలతో బాధపడుతున్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు తెలియజేశారు. అనంతరం అపరేషన్లు అవసరమైన వారిని వాహనంలో తరలించి అపరేషన్లు చేయిస్తామని తెలిపారు.

ప్రాజెక్టు త్వరగా పూర్తి చేయాలని డిమాండ్

నాగిరెడ్డిపల్లి(బ్రహ్మసముద్రం), న్యూస్‌టుడే: నాగిరెడ్డిపల్లిలో ఆదివారం 'జనం మాట- జగన్న బాట' కార్యక్రమంలో వైకాపా నాయకులు డిజిటల్ రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గ వైకాపా సమన్వయకర్త తలారి రంగయ్య, సీఈసీ సభ్యుడు మాదినేని ఉమామహేశ్వర నాయుడు పాల్గొని ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పోతిరెడ్డిపాడు ప్రాజెక్టును త్వరగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. బీటీ ప్రాజెక్టు కాలువ పనులు పూర్తి చేసి సాగునీటి కోసం చెరువులకు నీరందించాలన్నారు. పేద ప్రజలకు అండగా నిలిచే ఆర్డీటీ సంస్థ ఎఫ్‌సీఆర్ఏను వెంటనే రెన్యువల్ చేయాలన్నారు. కన్వీనర్ చంద్రశేఖర్, ఎంపీపీ చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు తలారి సత్యప్ప, అశోక్‌రెడ్డి, మహదేవప్ప తదితరులు పాల్గొన్నారు.

కలుషిత నీరు తాగి 5 మేకల మృతి

కంబదూరు, న్యూస్‌టుడే: కురాకులపల్లి గ్రామం రామాంజినమ్మకు చెందిన 5 మేకలు కలుషితం నీరు తాగి మృతి చెందాయి. ఆదివారం సాయంత్రం తిరిగి ఇంటికి వస్తుండగా గ్రామ చివర తోటలో మొక్కలకు పిచికారి చేయడానికి కలిపిన విష ద్రావణం తాగి మృతి చెందినట్లు బాధితురాలు ఆవేదన వ్యక్తం చేశారు. వీటి విలువ సుమారు రూ.60వేలు ఉంటుందని తనను ఆదుకోవాలని ఆమె ప్రభుత్వాన్ని కోరింది.

రూ.లక్షలు వెచ్చించారు.. నిరుపయోగంగా వదిలేశారు

ఉరవకొండ, న్యూస్‌టుడే: పల్లెల్లో స్వర్ణ గ్రామం భవనాల నిర్మాణం కోసం రూ.లక్షలు వెచ్చించారు. అయితే వినియోగంలోకి తేవడంలో తగిన దృష్టి సారించకపోవడంతో అవి నిరుపయోగంగా దర్శనం ఇస్తున్నాయి. ఉరవకొండ నియోజకవర్గంలో 86 గ్రామ పంచాయతీలు ఉండగా, 3.20లక్షల వరకు జనాభా ఉంది. వారి సౌకర్యార్థం 75 స్వర్ణ గ్రామ కార్యాలయాల కార్యకలాపాలకు గతంలో భవనాలు నిర్మించారు. ఒక్కోదానికి రూ.43లక్షల చొప్పున నిధులు కేటాయించారు. ఉరవకొండ -18, బెళుగుప్ప -14, కూడేరు -11, వజ్రకరూరు -14, విడపనకల్లు -18 స్వర్ణ గ్రామ కార్యాలయాలు ఉన్నాయి. వాటిలో చాలా వరకు నిర్మాణాలు ప్రారంభం అయ్యాయి. కొన్ని పూర్తి దశకు చేరుకున్నాయి. వైకాపా ప్రభుత్వం వాటికి పూర్తిస్థాయిలో నిధులు సమకూర్చలేక నిర్మాణాలు నిలిచిపోయాయి. నియోజకవర్గంలో 20 భవనాలు కూడా అందుబాటులోకి రాకపోవడంతో అవి గ్రామాల్లో నిరుపయోగంగా మారి శిథిలావస్థలోకి వెళుతున్నాయి. దీంతో అసాంఘిక కార్యకలాపాలకు వేదికగా మారుతున్నాయి.

ఉరవకొండలోని స్వర్ణగ్రామ భవనం-4

సౌకర్యాలు లేక ప్రజల పాట్లు

గ్రామస్థాయి పాలన చాలా వరకు స్వర్ణ గ్రామ కార్యాలయాల అనుసంధానంగానే నడుస్తోంది. ఒక్కో దానిలో 10 మంది వరకు ఉద్యోగులు ఉన్నారు. వీటికి పూర్తిస్థాయిలో సొంత భవనాలు లేకపోవడంతో సింహభాగం పంచాయతీ కార్యాలయాల్లోనే నిర్వహిస్తున్నారు. అక్కడ తగిన సదుపాయాలు, స్థలం లేక కొన్ని చోట్ల పది మంది జనం వచ్చినా కూర్చోవడానికి లేని దుస్థితి నెలకొంది. కొన్ని భవనాల్లో చిన్న చిన్న పనులే మిగిలాయి. నిర్మాణం ఆగిపోయిన భవనాలపై ప్రభుత్వం దృష్టి సారించి, వాటిని పూర్తి చేయించి వాటిని అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం..

దీనిపై పీఆర్ ఏఈఈ రవీంద్రను వివరణ కోరగా.. మిగిలి పోయిన నిర్మాణాలను పూర్తి చేయడానికి అవసరమైన నిధులు కోరుతూ ఉన్నతాధికారులకు ప్రతిపాదించామని, అవి సమకూరితే నిర్మాణాలను పూర్తి చేస్తామని తెలిపారు.

సందడిగా సిద్ధేశ్వరస్వామి రథోత్సవం

ఉరవకొండ, న్యూస్‌టుడే: నింబగల్లులో ఆదివారం సాయంత్రం సిద్ధేశ్వరస్వామి రథోత్సవం వైభవంగా సాగింది. ఉదయం నుంచి స్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం ఉత్సవ మూర్తిని అలంకరించి, మంగళ వాద్యాల నడుమ రథం మీదకు చేర్చారు. అర్చకుల సూచనల మేరకు భక్తులు రథాన్ని లాగారు. ఈ కార్యక్రమంలో భారీగా భక్తులు పాల్గొన్నారు. గ్రామంలో జనమంతా కనులారా ఈ ఘట్టాన్ని వీక్షించారు. ఎస్‌ఐ జనార్దన్‌నాయుడు ఆధ్వర్యంలోని పోలీసు బృందం బందోబస్తు నిర్వహించింది.

ఉరవకొండ: నింబగల్లులో భక్తుల సందడి

వైభవంగా శ్రీవీరాంజనేయస్వామి..

వడ్డేపాళ్యం: రథాన్ని లాగుతున్న భక్తులు

కుందుర్పి, న్యూస్‌టుడే: వడ్డేపాళ్యం గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం శ్రీవీరాంజనేయస్వామి రథోత్సవం వైభవంగా జరిగింది. వేదపండితులు, ఆలయ ప్రధాన అర్చకులు రథంపై స్వామివారిని కొలువుదీర్చారు. మేళతాళాలు, ఉర్రాలు, సాంస్కృతిక విన్యాసాలతో గ్రామం చివరి నుంచి ప్రధాన రహదారి వరకూ రథాన్ని లాగారు. స్వామి రథోత్సవం చూసేందుకు పలు గ్రామాలతోపాటు కర్ణాటకలోని భక్తులూ తరలివచ్చారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఈ మేరకు పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

చువ్వలున్నాయ్.. జాగ్రత్త

కళ్యాణదుర్గం పట్టణంలోని 20వ వార్డు పీర్ల మసీదు సమీపంలో కల్వర్టు అధ్వానంగా మారింది. కాలువపై ఇనుప చువ్వలతో వేయగా.. అది కాస్తా వాహనాల రాకపోకల రద్దీతో కాలువలోకి కుంగిపోయింది. దీంతో వాహనాల రాకపోకలకు, నడవటానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. గతంలో ఆ కల్వర్టు కారణంగా కిందకు పడిన సంఘటనలు చాలా ఉన్నాయి. మున్సిపల్ అధికారులు పాడైన కల్వర్టును బాగుచేయాలని కాలనీవాసులు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, కళ్యాణదుర్గం

(c) eenadu

గుంతకల్లు

•గుంతకల్లు •శింగనమల •తాడిపత్రి

సచివాలయాల్లో పనిచేయని ప్రింటర్లు

గుత్తి, న్యూస్‌టుడే : గుత్తిలోని పలు సచివాలయాల్లో ప్రింటర్లు పని చేయడం లేదు. దీంతో ఉద్యోగులు, ప్రజలు అవస్థలు పడుతున్నారు. కోట, న్యూ సీపీఐ కాలనీతోపాటు మూడో వార్డు సచివాలయంలో ప్రింటర్లు ఆరు నెలల నుంచి పని చేయడం లేదు. ఉద్యోగులు తమకు అవసరమైన పత్రాలను ప్రింట్ తీసుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఉద్యోగులు పురపాలికకు వచ్చి ప్రింట్లు తీసుకోవాల్సి వస్తోంది. అప్పటికి అధికారులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు ఇబ్బందికరంగా ఉద్యోగులను కసురుకొనే పరిస్థితి ఉంటోంది. ఇప్పటికైనా సచివాలయాలకు కొత్త ప్రింటర్లను తెప్పించేందుకు పురపాలిక అధికారులు చర్యలు తీసుకోవాలని ఉద్యోగులు కోరుతున్నారు.

గుంటి సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

గార్లదిన్నె గ్రామీణం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని కోటంక గ్రామ సమీపంలో కొండల మధ్య వెలసిన గుంటి సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిగాయి. అర్చకులు రామాచార్యులు ఉదయం అర్చనలు, క్షీరాభిషేకాలు చేసి స్వామిని పూల మాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. చుట్టు పక్కల గ్రామాల ప్రజలు ఆలయానికి వచ్చి భక్తిశ్రద్ధలతో స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

పూజలందుకున్న స్వామి

కుళ్లాయి స్వామి ఆలయ ప్రగతి పట్టదా?

నార్పల, న్యూస్‌టుడే : జిల్లాలోనే ప్రసిద్ధిగాంచిన గూగూడు కుళ్లాయి స్వామి ఆలయ ప్రగతి ఎవరికీ పట్టడం లేదని భక్తులు ఆవేదన చెందుతున్నారు. ఏటా రూ.కోట్లలో ఆదాయం ఉన్నా.. ఆలయ అభివృద్ధి కనిపించడం లేదు. ఏటా ఉత్సవాల సమయంలో హడావుడి తప్పితే మౌలిక వసతుల కల్పనలో శ్రద్ధ ఉండటం లేదని సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా కుళ్లాయి స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి లక్షల్లో భక్తులు వస్తుంటారు. ఇక్కడ ఒక రోజు విడిది చేయడానికి ఆలయం తరఫున ఎలాంటి వసతిగృహాలు లేవు. దేవాలయం పరిసరాల్లో అన్నదానం సత్రం దారుణంగా ఉంది. బస్సులు వెళ్లడానికి సరైన రహదారి సౌకర్యం లేదు. పార్కింగ్ స్థలం లేక వాహనాలు రోడ్లపైనే నిలిపివేయడంతో ట్రాఫిక్ సమస్యలు మరింత తీవ్రంగా మారుతున్నాయి. ఆలయం తరఫున భక్తులకు జవాబుదారీ తనం లేకుండా పోతోందని భక్తులు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

ఆలయం వద్ద అడ్డదిడ్డంగా వాహనాలు

‘కలియుగ దైవంతో రాజకీయాలొద్దు’

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: కలియుగ దైవం తిరుమల వేంకటేశ్వరస్వామి పేరుతో వైకాపా నాయకులు నీచ రాజకీయాలకు దిగడం తగదని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అన్నారు. ఆదివారం ఆమె ‘న్యూస్‌టుడే’తో మాట్లాడుతూ వైకాపా అధినేత జగన్‌కు దేవుడంటే భయం, భక్తి ఏమీ లేవన్నారు. శాసన మండలిలో ఎమ్మెల్సీలు చెప్పులు వేసుకుని, దేవుడి చిత్రపటాలతో రాజకీయం చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. వైకాపా పాలనలో తిరుమలలో సంప్రదాయాలను తుంగలో తొక్కి అపవిత్రం చేశారన్నారు.

పన్నులకు తగ్గ అభివృద్ధి చూపరేం!

ఇబ్బందుల్లో ప్రజలు

గుంతకల్లు, న్యూస్‌టుడే : గుంతకల్లు రోజురోజుకూ విస్తరిస్తున్నా కాలనీల ప్రగతి విషయంలో మాత్రం పాలకులు ముందుకు నాలుగు అడుగులు వెనక్కు అన్న చందంగా ఉంది. మౌలిక వసతులు కల్పించాలని కాలనీవాసులు విన్నవిస్తున్నా ఎవరికీ పట్టడం లేదు. మున్సిపల్ అజెండాల్లో తమ కాలనీల సమస్యలను చేర్చాలని, వాటికి నిధులు కేటాయిస్తూ కౌన్సిల్ సమావేశాల్లో తీర్మానాలు చేయాలన్న డిమాండ్ నెరవేరడం లేదు. ఈక్రమంలో తప్పకుండా పన్నులు చెల్లిస్తున్నా.. ఇదే దుస్థితి అని ప్రజలు వాపోతున్నారు.

● గుంతకల్లు - ఆలూరు రహదారి పక్కనున్న ద్వారకానగర్‌లో కనీస సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కాలనీలో సిమెంటు రోడ్డును నిర్మించడానికి మున్సిపల్ అధికారులు పనులను చేపట్టి ఆయా పనులు మధ్యలోనే ఆపేశారు. ఇక్కడ విద్యుత్తు స్తంభాలు అడ్డుగా ఉండటమే. వాటిని తొలిగించాలని మున్సిపాలిటీవారు విద్యుత్తు అధికారులను కోరినా వారు పట్టించుకోక పోవడంతో ఆగిపోయిన రోడ్డు పక్కన మరో రోడ్డు నిర్మాణం చేపట్టారు. దీన్ని నిధుల కొరతతో రెండు సంవత్సరాల నుండి సాగించడానికి వారు అవస్థ పడుతున్నారు.

● కాలనీలో మిగిలిన వీధుల్లో సిమెంటు రోడ్లు, మురుగు కాలువలను ఏర్పాటు చేయలేదు. వర్షం పడిన సమయాల్లో వారు పడుతున్న బాధలు అన్నీఇన్నీ కావు. మున్సిపల్ స్థలాలు ఇక్కడ ఆక్రమణకు గురవుతున్నా ఎవరికీ పట్టడం లేదు. కాలనీలో రోడ్డు పక్కన ముళ్లచెట్లు ఏపుగా పెరిగి, రాకపోకలకు ఇబ్బందిగా మారింది. కాలనీలో ఎక్కడా పార్కును, చిన్ననీటి పథకాలను నిర్మించలేదు. సమీపంలో ఎక్కడా పాఠశాల కూడా లేక పిల్లలు ఇబ్బంది పడుతున్నారు. సమస్యలను పరిష్కరించి తమను ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పురపాలిక	గుంతకల్లు
కాలనీ	ద్వారకానగర్
నివాసగృహాలు	1100
జనాభా	4500

విద్యుత్తు స్తంభాలు ఉండటంతో అసంపూర్తిగా రోడ్డు పనులు

పరిశీలించి తగు చర్యలు చేపడతాం

ద్వారకానగర్‌లో సమస్యలను పరిష్కరించడానికి చర్యలు చేపడతాం. రోడ్డు నిర్మాణానికి ఆటంకంగా ఉన్న విద్యుత్తు స్తంభాలను ట్రాన్స్‌కో వారు తొలగించడానికి కృషి చేయలేదు. కాలనీవాసులు ఇబ్బంది పడుతున్నారని మధ్యలో రోడ్డు పనులను ఆపివేసి మరోరోడ్డు పనులు చేపట్టాం. నిధుల కొరత కారణంగా ఆ పనులూ ఆగిపోయాయి. త్వరలో పనులను పూర్తి చేయడమే కాకుండా మురుగు కాలువలను నిర్మిస్తాం. **- హరికృష్ణ, ఏఈ**

మేమున్నాం.. మీకు తోడుగా

గుంతకల్లు పట్టణం: 80085 73072
తాడిపత్రి: 79950 67001
శింగనమల: 8008612342

సమస్య: పాత గుంతకల్లులో జగద్గురు మఠం ఏరియాలో చెత్తకుండీ లేదు. పారిశుద్ధ్య కార్మికులు సైతం చెత్త సేకరణకు రావడం లేదు. **- సురేశ్‌బాబు**

సమాధానం: కొన్ని వీధిల్లో చెత్తకుండీలు లేవు. సమస్యను కమిషనర్ దృష్టికి తీసుకెళ్తాం. **- ముస్తాక్ అహమ్మద్, శానిటేషన్ కార్యదర్శి, 4వ డివిజన్ ఇన్‌ఛార్జి**

సమస్య: గుంతకల్లులోని తిలక్ నగర్‌లో మహేంద్ర కల్యాణ మండపం ఏరియాలో రెండు రోజులైనా చెత్తకుప్పలు అలాగే ఉంటున్నాయి. **- కుమార్**

సమాధానం: చెత్త కుప్పలు తొలగిస్తాం. **- సుధాకర్, శానిటేషన్ కార్యదర్శి, ఇన్‌ఛార్జి**
- న్యూస్‌టుడే,గుంతకల్లు పట్టణం

సమస్య: గార్లదిన్నె మండల పరిధి పి. కొత్తపల్లి గ్రామంలోని ప్రధాన దారిలో రోడ్డుపైన మురుగు పారుతోంది.
- వాహనదారులు, ఎంపీఆర్‌డ్యామ్

సమాధానం: పంచాయతీ కార్యదర్శికి చెప్పి రోడ్డుపై మురుగు రాకుండా చర్యలు తీసుకుంటాం.
- గోపాల్, ఇన్‌ఛార్జి ఎంపీడీవో, గార్లదిన్నె
- న్యూస్‌టుడే, గార్లదిన్నె గ్రామీణం

ఉచిత వైద్యసేవలు

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: గుంతకల్లులో ఆదివారం మున్సిపల్ కూరగాయల మార్కెట్ రోడ్డులో ఇల్లూరు భవనం దగ్గర అంతర్జాతీయ కవలల దినోత్సవం సందర్భంగా నారాయణ ఛారిటబుల్ ట్రస్టు ఉచిత వైద్యసేవలు అందించారు. వైద్యులు 60 మందికి రక్తపోటు, చక్కెర వ్యాధి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

అభివృద్ధి పథంలో సహకార బ్యాంకు

గుత్తి, న్యూస్‌టుడే : గుత్తిలో వందేళ్ల కిందట ఏర్పాటు చేసిన పట్టణ సహకార బ్యాంకు సేవలను ఉమ్మడి అనంతపురం జిల్లాతోపాటు నంద్యాల జిల్లాలో కూడా విస్తరిస్తున్నట్లు బ్యాంకు అధ్యక్షుడు అబ్దుల్ జిలాన్ పేర్కొన్నారు. జిల్లాలోని గుంతకల్లు, అనంతపురం, పామిడిలతోపాటు కదిరిలలో ఏడు శాఖలను ఏర్పాటు చేసి ఖాతాదారులకు ఉత్తమ సేవలను అందిస్తున్నట్లు తెలిపారు. ఆదివారం గుత్తిలోని ఓఫంక్షన్ హాల్‌లో సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈఏడాది రూ.3.95కోట్లు లాభాలు రానున్నాయన్నారు. డైరెక్టర్లు నాగరాజు, వీరన్న, మాబు, కృష్ణ, మధుసూదన్,మహేశ్‌తోపాటు ఉపాధ్యక్షుడు రాము పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బ్యాంకు అధ్యక్షుడు అబ్దుల్ జిలాన్

సేవలు గుర్తుంచుకోవాలి

గుంతకల్లు, న్యూస్‌టుడే : దేశానికి అంకిత భావంతో సేవలు అందించిన నాయకులను గుర్తుంచుకోవాలని తెదేపా పట్టణ ఇన్‌ఛార్జి నారాయణస్వామి, యాదవ ఫెడరేషన్ డైరెక్టరు మస్తాన్ యాదవ్ అన్నారు. కూటమి పార్టీల ఆధ్వర్యంలో పట్టణంలో ఆదివారం దేశ మొదటి విద్యా శాఖామంత్రి దివంగత అబుల్ కలాం ఆజాద్ వర్ధంతి కార్యక్రమం జరిగింది. తెదేపా నాయకులు మహమ్మద్ ఖాజా, అంజి, ఫజులు, హనుమంతు, నందీశ్వర్, మస్తాన్, చంద్రశేఖర్, విద్యారాణి, మహాదేవ్, భాజపా నాయకుడు రామాంజనేయులు, ముస్లింలు పాల్గొన్నారు.

మంచి ఆలోచనలతో ముందుకు సాగుదాం

గుంతకల్లు, న్యూస్‌టుడే : ప్రతి ఒక్కరూ మంచి ఆలోచనలు చేస్తూ ముందుకు వెళితే మంచి సమాజ నిర్మాణం జరుగుతుందని గుంతకల్లు డివిజన్ రైల్వే సహాయ పర్సనల్ అధికారిణి కల్పన అన్నారు. భారత్ స్కౌట్స్ అండ్ గౌడ్స్ వ్యవస్థాపకులు బ్యాడన్ పౌల్, లేడీ బ్యాడెన్ పౌల్‌ల జయంతులను పురస్కరించుకొని ప్రపంచవ్యాప్తంగా ఆలోనా దినోత్సవాన్ని నిర్వహిస్తారన్నారు. ఆదివారం రైల్వే ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆమె స్కౌట్ పతాకాన్ని ఆవిష్కరించి బ్యాడన్ పౌల్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. స్కౌట్ సికింద్రాబాదు జోనల్ శిక్షకురాలు విజయకళ మాట్లాడారు. ఈకార్యక్రమంలో స్కౌట్ అండ్ గైడ్స్ ప్రతినిధులు ఎడ్వర్డ్, హరుమేశ్‌బాబు పాల్గొన్నారు.

స్కౌట్ పతాకాన్ని ఆవిష్కరించి వందనం చేస్తున్న సహాయ పర్సనల్ అధికారిణి కల్పన

అత్యవసర వాహనాలకు తిప్పలు

సోదనపల్లి గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా దెబ్బతినింది. దారంతా గుంతలమయంగా మారడంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైతులు, విద్యార్థులు, అత్యవసర సేవల వాహనాలు ప్రయాణించడానికి నానాపాట్లు పడాల్సి వస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారిని బాగు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. గ్రామాభివృద్ధి దృష్ట్యా వెంటనే చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. **-న్యూస్‌టుడే, నార్పల**

చెత్త సేకరణకు ఆటంకం

పామిడి మేజర్ పంచాయతీ కార్యాలయంలో చెత్త సేకరణ వాహనాలు కొన్ని నెలలుగా మూలకు చేరాయి. దీంతో పట్టణ పరిధిలోని గ్రామాల్లో చెత్తసేకరణ చేయాలంటే పారిశుద్ధ్య కార్మికులకు ఇబ్బందులు తప్పడం లేదు. పంచాయతీ అధికారులు తక్షణమే వాహనాలకు మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, పామిడి**

ఆదమరిస్తే ప్రమాదమే!

పెద్దపప్పూరులోని రామకోటి కాలనీలో చౌడేశ్వరీదేవి ఆలయం సమీపంలో విద్యుత్తు నియంత్రికకు ఏర్పాటు చేసిన ఫ్యూజులు ప్రమాదకరంగా ఉన్నాయి. అవి చేతికందే ఎత్తులో ఉండటం, దీనికి తోడు ఎలాంటి రక్షణ లేకుండా బయటకు ఉండటం స్థానికులను ఆందోళనకు గురి చేస్తోంది. విద్యుత్తుశాఖ అధికారులు స్పందించి రక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. **-న్యూస్‌టుడే, పెద్దపప్పూరు**

నిత్యం ప్రయాణ నరకం

చిత్రచేడుకు వెళ్లే రహదారి అధ్వానంగా ఉంది. నిత్యం ఈమార్గంలో ప్రయాణం నరకంగా ఉంటోందని ప్రయాణికులు వాపోతున్నారు. ప్రభుత్వం మరమ్మతుల నిమిత్తం నిధులు మంజూరు చేసినా ఎవరూ పట్టించుకోలేదని జనం ఆరోపిస్తున్నారు. ఇది వరకు ప్రభుత్వం దిమ్మగుడి వరకు రహదారికి మరమ్మతులు చేసి వదిలేసింది. మిగిలిన రోడ్డు అసంపూర్తిగా మిగిలిపోయింది. **-న్యూస్‌టుడే, పెద్దవడుగూరు**

రహదారి భద్రత అంతేనా?

జాతీయ రహదారి భద్రత కోసం ఏర్పాటు చేసిన రాళ్ల కట్టకు ఉన్న రాళ్లను కొందరు గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. గుత్తిఅనంతపురం సమీపంలో ఉన్న 44వ జాతీయ రహదారికి ఎడమ, కుడివైపలా రోడ్డు భద్రత కోసం రాళ్లను పరచగా ప్రస్తుతం అవి కనిపించకుండా పోయాయి. రాత్రివేళల్లో కొందరు రాళ్లను పొలాలకు, మరికొందరు ప్లాట్లకు తరలిస్తున్నట్లు తెలుస్తోంది. అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, పెద్దవడుగూరు**



హోరాహోరీగా బండలాగు పోటీలు

గార్లదిన్నె గ్రామీణం, న్యూస్‌టుడే : కల్లూరు గ్రామ సమీపంలో శింగరప్ప కొండపై వెలసిన శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం సీనియర్ కేటగిరి ఎద్దులకు నిర్వహించిన బండలాగు పోటీలు రసవత్తరంగా జరిగాయి. కృష్ణా జిల్లా గన్నవరం రాజా చౌదరి, విజయవాడ మోహన్‌రావుకు చెందిన ఎద్దులు 4200అడుగులు లాగి మొదటి స్థానంలో నిలిచి రూ.లక్ష బహుమతి, నంద్యాల జిల్లా పెద్దకొట్టాలకు చెందిన కేశవరెడ్డికి చెందిన ఎద్దులు 3900 అడుగులు లాగి రెండో బహుమతి రూ.80 వేలు, అనంతపురం జిల్లా రేగడికొత్తూరుకు చెందిన ఆర్‌కే బుల్స్ గౌతమిరెడ్డికి చెందిన ఎద్దులు 3638.02 అడుగులు లాగి మూడో బహుమతి రూ.60వేలు, గుంటూరు జిల్లా గార్లదిన్నె రామాంజనేయులు, కొండబాలవారి పాలెం జీపీ చౌదరికి చెందిన ఎద్దులు 3606.03 అడుగులు లాగి నాలుగో బహుమతి కింద రూ.40వేలు గెలుచుకున్నాయి. కృష్ణాజిల్లా గన్నవరానికి చెందిన రాజాచౌదరి, అనంతపురం జిల్లా మేడిమేకలపల్లె తిరుపాల్‌రెడ్డికి ఎద్దులు 3306 అడుగులు లాగి ఐదో బహుమతి రూ.30వేలు, బాపట్ల జిల్లా వెటపాలెంకు చెందిన శిరీష చౌదరి, శివకృష్ణ చౌదరిలకు చెందిన ఎద్దులు 3022.03అడుగులు లాగి ఆరో బహుమతి రూ.29 వేలు, అనంతపురం జిల్లా సోముల దొడ్డికి చెందిన రామసుబ్బారెడ్డి ఎద్దులు 2804.04అడుగులు లాగి ఏడో బహుమతి రూ.15వేలు, నంద్యాల జిల్లా డి.రంగాపురం రామకృష్ణారెడ్డి ఎద్దులు 2263.02అడుగులు లాగి ఎనిమిదో కింద బహుమతి రూ.12వేలు , అనంతపురం జిల్లా గార్లదిన్నెకు చెదిన రమేష్ ఎద్దులు 2167.05అడుగులు లాగి తొమ్మిదో బహుమతి రూ.10వేలను దాతల చేతుల మీదుగా అందుకున్నారు.

రాతిదూలం లాగుతున్న ఎద్దులు

‘దేశ ప్రతిష్ఠను దిగజార్చేందుకు కాంగ్రెస్ యత్నం’

తాడిపత్రి, న్యూస్‌టుడే: అనేక దేశాల ప్రతినిధులతో నిర్వహిస్తున్న ఏఐ సమ్మిట్‌లోకి కాంగ్రెస్ యువనాయకులు చొరబడి నిరసన చేపట్టి దేశ ప్రతిష్ఠను దిగజార్చేవిధంగా ప్రవర్తించారని భాజపా రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్ పీవీ ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఆయన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ దేశాన్ని అభివృద్ధి చేసేందుకు కృషిచేస్తుంటే కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ అండ చూసుకుని నిరసన చేపట్టడం అన్యాయమన్నారు. దేశంలో అధికారం లేకపోవడంతో కాంగ్రెస్ నాయకులు దేశ విద్రోహక చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. భాజపా రాష్ట్ర ప్రతినిధి శేషానందరెడ్డి కాంగ్రెస్ దిగజారుడు రాజకీయాలు చేస్తోందని ఆరోపించారు. ఈకార్యక్రమంలో భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, నాయకులు ఓబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న భాజపా రాష్ట్ర లీగల్‌సెల్ కన్వీనర్ పీవీ ప్రతాప్‌రెడ్డి

అశ్వర్థ ఆలయంలో విశేష పూజలు

పెద్దపప్పూరు, న్యూస్‌టుడే: మండలంలో ప్రసిద్ధి చెందిన అశ్వర్థ ఆలయంలో ఆదివారం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అశ్వర్థ నారాయణస్వామి, చక్రభీమలింగేశ్వరస్వామికి వేద పండితులు అభిషేక పూజలు, అర్చనలు నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు పెన్నానదిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు.

జూదరుల అరెస్ట్

తాడిపత్రి, : తాడిపత్రిలోని వెలమకూరు గ్రామ శివారుల్లో జూదం ఆడుతున్న 10 మందిని అదుపులోకి తీసుకున్నట్లు సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. స్థానిక సమాచారం మేరకు సిబ్బందితో కలిసి తనిఖీలు చేయగా 10 మంది జూదరులతో పాటు 3 ద్విచక్రవాహనాలు, 11 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.72,980 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

తాడిపత్రి, న్యూస్‌టుడే: తాడిపత్రి పరిధిలోని కడప రోడ్డు చర్చి స్కూల్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలయ్యాయి. కడప వైపు నుంచి తాడిపత్రి వస్తున్న కారు చర్చి స్కూలు వద్ద నిలిపి ఉన్న లారీని వెనుకవైపు నుంచి ఢీకొంది. లారీ డ్రైవర్ బాబా వాహనాన్ని నిలిపి ఆయిల్ ఫిల్ చేసుకుంటుండా అదేసమయంలో వేగంగా వచ్చిన కారు వెనుకభాగంలో ఢీ కొంది. దీంతో లారీ ముందుకు రావడంతో బాబాకు, కారులో ఉన్న మంజునాథకు మరొకరికి తీవ్రగాయాలయ్యాయి.

విద్యుదాఘాతంతో ఎనుము, దూడల మృతి

గార్లదిన్నె గ్రామీణం, న్యూస్‌టుడే : బూదేడు గ్రామం నాగేంద్రకు చెందిన ఎనుము, రెండు దూడలు విద్యుదాఘాతానికి గురై ఆదివారం మృతి చెందాయి. చెరువు సమీపంలోని పొలం వద్ద పశువు నీరు తాగడానికి వెళ్లి ప్రమాదానికి గురై మృత్యువాతపడ్డాయి. దాదాపు రూ.1.30 లక్షల నష్టం జరిగిందని బాధిత రైతు వాపోయారు.

స్వాతంత్ర్య వీరుల త్యాగాలు చిరస్మరణీయం

ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి నివాళి అర్పిస్తున్న రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు

గుంతకల్లు, న్యూస్‌టుడే : దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను త్యాగం చేసిన వారి త్యాగాలను మరువకుండా గుర్తుంచుకోవల్సిన అవసరముందని గుంతకల్లు రెడ్డి సంక్షేమసంఘం నాయకులన్నారు. మొదటి స్వాతంత్ర్య సమరయోధుడు రేనాటి ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్థంతిని ఆదివారం సంఘం కార్యాలయంలో నిర్వహించారు. సంఘం ఉపాధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి, రంగారెడ్డి, ప్రధానకార్యదర్శి జగదీశ్‌రెడ్డి మాట్లాడారు. తొలుత ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చిత్రపటానికి నాయకులు పూమాల వేసి అంజలి ఘటించారు. సంఘం నాయకులు మల్లారెడ్డి, కంగస్వామి రెడ్డి, కొండారెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, జయరాం రెడ్డి, చంద్రారెడ్డి పాల్గొన్నారు.

ఆరోగ్యంపై నిర్లక్ష్యం వీడాలి

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంత ప్రజలు వ్యవసాయ పనుల్లో తీరిక లేకుండా ఉంటున్నారని, తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని వైద్యశిబిరం నిర్వాహకుడు రవికాంత్ రమణ అన్నారు. ఆదివారం ఆయన బుక్కరాయసముద్రం ప్రాథమిక పాఠశాలలో ఎంప్లాయిస్ రిక్రియేషన్ క్లబ్‌తో కలిసి ఉమ్మడిగా ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామంలో 350 మందికి పైగా ప్రజలకు వైద్య పరీక్షలు చేయించారు. కంటి పరీక్షలు చేయించుకున్న ప్రజలకు ఉచితంగా కళ్లఅద్దాలు అందించారు. తెదేపా నాయకులు కేశన్న, లక్ష్మీనారాయణ, నారాయణస్వామి, క్లబ్ సభ్యులు నాగేంద్ర, ప్రభాకర్, సూర్యనారాయణ, శివకుమార్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల అ‘పూర్వ’ కలయిక

ఒకే వేదికపై పదవీ విరమణ ఉద్యోగులు

గుంతకల్లు, న్యూస్‌టుడే : గుంతకల్లు రైల్వే డివిజన్‌లోని కమర్షియల్ విభాగంలో పని చేసిన విశ్రాంత ఉద్యోగుల అపూర్వ కలయిక పట్టణంలో ఆదివారం జరిగింది. ప్రతిభావికాస్ పాఠశాలలో వారందరూ కలుసుకున్నారు. యోగక్షేమాలను ఆప్యాయంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం అందరూ కలిసి ఒకేచోట సహపంక్తి భోజనం చేశారు. ఈకార్యక్రమాన్ని సత్యం, మహమ్మద్ హుసేన్ నిర్వహించారు.

సంబరంగా హ్యాపీ సండే

తాడిపత్రి, న్యూస్‌టుడే : తాడిపత్రిలో పెన్నానది ఒడ్డున ఉన్న జాయ్‌క్లబ్ ఉద్యానంలో ఆదివారం హ్యాపీ సండే కార్యక్రమాన్ని సంబరంగా నిర్వహించారు. చిన్నారులు, మహిళలకు క్రీడాపోటీలు నిర్వహించారు. పురపాలిక కమిషనర్ శివరామకృష్ణ, పలువురు అధికారులు ఆటలు ఆడారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ వారమంతా విద్యార్థులు పాఠశాలలో, ఉద్యోగులు పనిఒత్తిడిలో తీవ్ర ఇబ్బందులు పడుతుంటారు. ఆదివారం సమయంలో అందరూ ఆహ్లాదంగా గడపాలని ఆయన తెలిపారు. కౌన్సిలర్లు మల్లికార్జున, తదితర తెదేపా నాయకులు పాల్గొన్నారు.

గుంతకల్లు, న్యూస్‌టుడే : పట్టణ ప్రజలు, యువతీయువకులు, ఉద్యోగుల మధ్య స్నేహాన్ని పెంపొందించడానికి ప్రభుత్వం హ్యాపీ సండే కార్యక్రమాన్ని ప్రారంభించిందని మున్సిపల్ కమిషనర్ లక్ష్మీదేవి అన్నారు. ఆటల పోటీల కార్యక్రమాన్ని ఆమె ఆదివారం క్రికెట్‌తో ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ అందరూ కలిసి పాటలు పాడడం, ఆటలు ఆడడం అలవర్చుకుంటే ఇరుగుపొరుగు వారి మధ్య బంధాలు పెరుగుతాయని, సమస్యలు ఎదురుకాకుండా ఉంటాయని అన్నారు. పనుల ఒత్తిడి నుంచి ఉపశమనం పొందడానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయన్నారు. మున్సిపల్ ఈఈ ఇంతియాజ్, రెవెన్యూ అధికారి జయరాం, డీఈ రవిప్రకాశ్ నాయుడు, ఏఈ ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రి : పోటీలో గెలుపొందిన వారికి ధ్రువపత్రం అందజేస్తున్న కౌన్సిలర్

గుంతకల్లు : క్రికెట్‌ను ప్రారంభిస్తున్న కమిషనర్ లక్ష్మీదేవి

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

గుంతకల్లు పట్టణం: గుంతకల్లులో సోమవారం నుంచి ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించడానికి అధికారులు ఏర్పాట్లు సిద్ధం చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఎస్ఎస్‌జీఎస్ ఎయిడెడ్ జూనియర్ కళాశాల, నారాయణ జూనియర్ కళాశాల, సరస్వతి జూనియర్ కళాశాలల్లో మొదటిరోజు ప్రథమ సంవత్సరం ఇంటర్ పబ్లిక్ పరీక్షలకు 1797మంది విద్యార్థులు హాజరు కానున్నారు. 24న ద్వితీయ సంవత్సరం ఇంటర్ పరీక్షలకు 1548 మంది విద్యార్థులు హాజరువుతున్నట్లు సీఎస్‌లు, డీవోలు పేర్కొన్నారు.

‘సమాజాన్ని బాగుచేయడమే వీహెచ్‌పీ లక్ష్యం’

మాట్లాడుతున్న అజేయకుమార్ జీ పారీక్

గుంతకల్లు, న్యూస్‌టుడే : విశ్వ హిందూ పరిషత్ సేవా విభాగం ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా పెద్దఎత్తున సేవా కార్యక్రమాలు చేస్తున్నామని సేవా విభాగం జాతీయ అధ్యక్షుడు అజేయకుమార్ జీ పారీక్ అన్నారు. గుంతకల్లులోని సేవా విభాగ్ ఆధ్వర్యంలో ఆదివారం దక్షిణాంధ్ర సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా ఆయన ప్రసంగించారు. తాము విద్య, వైద్యంతో పాటు 7165 సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. యువతలో ఆత్మస్థైర్యాన్ని నింపడమే లక్ష్యంగా సాగుతున్నామన్నారు. సమాజాన్ని బాగుచేయడానికి వీహెచ్‌పీ పాటుపడుతోందన్నారు. అనంతరం వీహెచ్‌పీ నాయకులు సావనీర్‌ను ఆవిష్కరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర నాయకులు డాక్టర్ రామమూర్తి, ప్రకాశ్‌రెడ్డి, శంకరనారాయణ గుప్తా, విష్ణువర్ధన్‌రెడ్డి, సత్యరవికుమార్, రమేశ్, సాయిరెడ్డి, కోటేశ్వర్ రావు, గురుమూర్తి పాల్గొన్నారు.

మరుగుదొడ్లు ఉన్నా వృథానే!

తాడిపత్రిలో ఉన్న ఆర్టీసీ బస్టాండులో ప్రయాణికులకు సరైన మరుగుదొడ్లు లేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. బస్టాండు ఆవరణలో ఉన్న బహిరంగ మరుగుదొడ్ల నీటి సరఫరా లేకపోవడంతో ప్రజలు ఎక్కడపడితే అక్కడ అపరిశుభ్రం చేస్తున్నారు. దీనిపై ఆర్టీసీ డీఎం మురళీధర్‌ను వివరణ కోరగా ప్రస్తుతం పెరిగిన ప్రయాణికుల తాకిడికి ఆధునిక మరుగుదొడ్లు నిర్మించేందుకు నివేదిక పంపించాం. అధికారుల ఆదేశాలతో నిర్మించి, ఉన్నవాటికి నీటి వసతి కల్పించి ప్రయాణికుల ఇబ్బందులను తొలగిస్తామన్నారు. **-న్యూస్‌టుడే, తాడిపత్రి**

(c) eenadu

అనంతపురం

• అనంతపురం • రాప్తాడు

సౌత్‌జోన్ క్రికెట్ ఛాంపియన్‌గా నెల్లూరు

కడప క్రీడలు, న్యూస్‌టుడే: వైఎస్ఆర్ఆర్-ఏసీఏ స్టేడియం, కేఎస్ఆర్ఎం క్రికెట్ మైదానాల్లో జరుగుతున్న ఏసీఏ సౌత్‌జోన్ అండర్-12 క్రికెట్ పోటీల్లో ఛాంపియన్‌గా నెల్లూరు జట్టు నిలిచింది. ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లోనూ నెల్లూరు జట్టు విజయాలను సాధించి 8 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. కడప జట్టు 2 మ్యాచ్‌లు గెలిచి 4 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది. మూడో స్థానంలో కర్నూలు, నాలుగో స్థానంలో చిత్తూరు, ఐదో స్థానంలో అనంతపురం జట్లు నిలిచాయి. టోర్నమెంట్ చివరి రోజు ఆదివారం కర్నూలుపై కడప, చిత్తూరుపై నెల్లూరు జట్లు విజయం సాధించాయి.

డివిజన్ కార్యాలయాన్ని కొనసాగించాలని వినతి

గుల్బర్గపేట, న్యూస్‌టుడే: కళ్యాణదుర్గం పట్టణంలో ఉన్న ఆర్ అండ్ బీ డివిజన్ కార్యాలయాన్ని యథావిధిగా కొనసాగించాలని ఎమ్మార్పీఎస్ రాయలసీమ అధ్యక్షుడు అక్కులప్ప పేర్కొన్నారు. ఆదివారం అనంతపురంలోని ఆర్ అండ్ బీ అతిథి భవనంలో దళిత సంఘాల నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. 2011లో ప్రజలకు అందుబాటులో ఉండాలని అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ నాయకులు ఆర్ అండ్ బీ డివిజన్ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారన్నారు. ప్రస్తుతం హిందూపురానికి బదిలీ చేయటం సరికాదని, యథావిధిగా కొనసాగించాలన్నారు. ఎమ్మెల్యేలు అమిలినేని సురేంద్రబాబు, కాలవ శ్రీనివాసులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో ఉద్యమాలు చేపడతామన్నారు. నాయకులు రమేష్, రాజు, మల్లేష్, నరేంద్ర, రవీంద్ర పాల్గొన్నారు.

మేమెందుకు కడతాం.. మాకేం సంబంధం!

✤ విద్యుత్తు బిల్లుల రూపంలో నగరపాలక ఆదాయానికి గండి

అనంతపురం (అశోక్‌నగర్), న్యూస్‌టుడే: సంబంధం లేని విద్యుత్తు బిల్లుల చెల్లింపులతో నగరపాలక సంస్థ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. యంత్రాంగం తేరుకుని గండి పూడ్చుకునే పనిలో ఉన్నారు.

- నగరపాలక సంబంధం లేని విద్యుత్తు కనెక్షన్లు: 1013
- చెల్లించిన బిల్లులు: రూ.40 లక్షలు
- వడపోతతో మిగిలిన కనెక్షన్లు: 913
- ప్రస్తుతం చెల్లిస్తున్న బిల్లులు: రూ.32.76 లక్షలు

గతంలో నెలనెలా రూ.40 లక్షల బిల్లులు చెల్లిస్తూ వచ్చారు. తేరుకొని ప్రతినెలా వడపోత చేయడంతో రూ.40 లక్షల నుంచి రూ.32.76 లక్షలకు చేరుకుంది. ఇంకా తవ్వే కొద్దీ సంబంధం లేని విద్యుత్తు బిల్లులు వెలుగు చూస్తూనే ఉన్నాయి. అనంతపురం నగరపాలక పరిధిలోని వీధి లైట్లు, పవర్ బోర్లు, నగరపాలక ఆధ్వర్యంలో నడిచే పలు ప్రభుత్వ భవనాలకు కాకుండా.. అసలు సంబంధం లేని వాటికి బిల్లులు చెల్లించడంతో నెలనెలా విద్యుత్తు బిల్లులు తడిసిమోపెడు అవుతున్నాయి.

గ్రామీణ ప్రాంతాలకు నీటిని సరఫరా చేసే కేంద్రం

✦ అనంతపురం కలెక్టరేట్ ఎదుట ఉన్న ఎస్ఎస్ ట్యాంకు నుంచి గతంలో నగరపాలకకు తాగునీటిని సరఫరా అయ్యేది. 2018 నుంచి ఆ నీటి ట్యాంకు నుంచి రాప్తాడు నియోజకవర్గంలోని పలు గ్రామీణ ప్రాంతాలకు గ్రామీణ తాగునీటి విభాగం (ఆర్‌డబ్ల్యూఎస్) ఆధ్వర్యంలో తాగునీటిని అందిస్తున్నారు. విద్యుత్తు శాఖ అధికారులు మాత్రం నగరపాలక బిల్లులు చెల్లించాలంటూ నెలకు రూ.4 లక్షల బిల్లులు పంపేవారు. ఇన్నాళ్లు అలాగే చెల్లిస్తూ వచ్చారు. తమకు సంబంధం లేదని నగరపాలక అధికారులు ఏపీఎస్‌పీడీసీఎల్‌కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినా చెవికెక్కించుకోకుండా బిల్లులు పంపుతూనే ఉన్నారు. ఏకంగా 2026 జనవరి వరకు రూ.42.33 లక్షలు చెల్లించాలంటూ బిల్లు పంపారు.

✦ శింగనమల, రాప్తాడు, అనంత గ్రామీణ మండలాల్లో వందల్లోనే ఇతరత్రా కనెక్షన్ల బిల్లులను నగరపాలకకు కలిపేస్తున్నారు. ఎక్కువగా వచ్చే బిల్లుల్లో ప్రభుత్వ టీబీ ఆసుపత్రి బిల్లు నెలకు రూ.4619, ఆర్‌అండ్‌బీ సెక్షన్ అధికారి కార్యాలయం రూ.23,211 బకాయితో కలిపి మొత్తం రూ.2.54 లక్షలు, సెయింట్ జాన్ పాఠశాల వద్ద ఉన్న పంచాయతీ బోరు నెలకు రూ.55,455 బకాయితో కలిపి రూ.3.74 లక్షలు, అనంతపురం గ్రామీణ ప్రాంతంలోని సచివాలయానికి నెలకు రూ.30,886 బకాయితో కలిపి రూ.2.54 చెల్లించాలని నగరపాలక బిల్లుల్లో కలిపారు.

✦ తమకు సంబంధం లేని బిల్లులు గుర్తించి తొలగించామని, ఇంకా ఏమైనా ఉంటే వాటికి బిల్లులు చెల్లించే ప్రసక్తే లేదని నగరపాలక డీఈ దాక్షాయిణి తెలిపారు.

సన్మానం అందుకుంటున్న అవార్డు గ్రహీతలు

కళాకారులకు సన్మానం

అనంత సాంస్కృతికం: నగరంలో జరుగుతున్న బాలోత్సవంలో స్థానిక లలిత కళాపరిషత్ ఉపాధ్యక్షుడు రామగోవింద సాగర్, సాధు శేఖరంలకు ఆదివారం ఆత్మీయ సన్మానం అందింది. గత ఏడాది కళాపూర్ణ బళ్లారి రాఘవ అవార్డు అందుకున్న నేపథ్యంలో ఎస్‌కేయూ రిజిస్ట్రార్ రమేష్ బాబు, విద్యా కార్యదర్శి సాది [illegible] వారు సన్మానం అందుకున్నారు. ఈ సత్కారంపై లలిత కళాపరిషత్ కార్యదర్శి, ప్రముఖ [illegible] పద్మజ హర్షం వ్యక్తం చేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా

అశోక్‌నగర్: 8008573011
రాంనగర్: 8008573001
కమలానగర్: 7032975446

సమస్య: రాంనగర్ ఆర్కోక్లాలేని కాలువల్లో నెలపైగా మురుగు నిండి, ఎక్కడికక్కడ నిలిచి ఉంది. - **హనుమంతు, సోనికుడు**

సమస్య: బళ్లారిరోడ్డు ఇండియన్ పెట్రోల్ బంకు తూర్పు దిక్కులో వీధిలో కుండి వద్ద చెత్త బయట పడేస్తున్నారు. - **లక్ష్మీదేవి, ఆజాద్‌నగర్**

సమస్య: లక్ష్మీనగర్‌లో వెళ్లే జన్మభూమి రోడ్డులో నడిమధ్యలో పొదల్లోనే కప్పలుగా చెత్తను పడేస్తున్నారు. చెత్త ఎత్తకుండా నిత్యం నిప్పు పెడుతున్నారు. - **రంగస్వామి (లక్ష్మీనగర్)**

సమస్య: కళ్యాణదుర్గం-బళ్లారి జాతీయ రహదారి మధ్యలో సైప్లలు పంక్షన్‌హాలు వెళ్లేదారి పొదల్లో చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. - **బాబావల్లుద్దీన్ (ఆజాద్‌నగర్)**

సమస్య: పాతూరు నీరుగంటివీధి వైద్య ఆసుపత్రి ఎదురుగా కాలువలు చెత్తచెదారంతో నిండి మురుగు పారడం లేదు. - **వెంకటరమణ**

సమాధానం: పారిశుద్ధ్య కార్మికులను పంపించి కాలువలు శుభ్రం చేసి మురుగు పారేలా చర్యలు తీసుకుంటాం.

(పై ప్రశ్నలకు నగరపాలక ఇన్‌ఛార్జి ప్రజారోగ్య అధికారి నరసింహ సమాధానం ఇచ్చారు.)

- న్యూస్‌టుడే, రాంనగర్ (అనంతపురం)

ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న డీఆర్‌ఓ మాలోల, ఏవో అలెగ్జాండర్, తదితరులు

'ధైర్యశాలి ఉయ్యాలవాడ'

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: బ్రిటీష్ వలస పాలనకు వ్యతిరేకంగా ప్రజా తిరుగుబాటుకు నాయకత్వం వహించిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి గొప్ప మానవతావాది, ధైర్యశాలి అని డీఆర్‌ఓ మాలోల పేర్కొన్నారు. ఆదివారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్సు హాలులో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతిని నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. ఆ తర్వాత డీఆర్‌ఓ మాట్లాడుతూ 1806 నవంబరు 24న నరసింహారెడ్డి కర్నూలు జిల్లా కోయిలకుంట్ల రూపనగుడి గ్రామంలో జన్మించారు. ఆయన అసలు పేరు మజ్జర నరసింహారెడ్డి. అప్పట్లో గ్రామ పరిపాలన, భూయాజమాన్య, స్థానిక ప్రజల భద్రత వంటి వాటిపై పాలెగారు కుటుంబ వారసుడిగా ఉన్నారు. ఈ వ్యవస్థను రద్దు అయ్యాక బ్రిటీష్ పాలన మొదలైంది. వలస పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందన్నారు. ప్రజల పక్షాన నిలబడి బ్రిటీష్‌కు వ్యతిరేకంగా పోరాటం చేశారని గుర్తు చేశారు. ఏవో అలెగ్జాండర్, పర్యాటక అధికారి జయకుమార్, ఆన్‌సెట్ ఇన్‌ఛార్జి మేనేజర్ శ్రీనివాసులు, డీవైడ బ్యూరో పర్యవేక్షకుడు అన్వర్‌బాషా పాల్గొన్నారు.

ఇష్టంగా చదివితేనే ఉజ్వల భవిష్యత్తు

అనంత నగరపాలక, న్యూస్‌టుడే: విద్యార్థులు ఇష్టంగా చదివితేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కమ్మన్న పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో చదువుతో మార్కెట్ల కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు పాఠ్యపుస్తకాలతో పాటు గ్రంథాలయాలను వినియోగించుకోవాలన్నారు. చరవాణులకు దూరంగా ఉండాలన్నారు. నీతి కథలు, తెలుగు పద్యాలతో చదవడంపై ఆసక్తి పెంచారు. ఇటీవల తెలుగు కవుల మహాసభల్లో సన్మానం పొందిన కాశాషేక్ దాదాషా అంకె రామలింగయ్యను సన్మానించారు.

చిన్నారుల కుర్చీ ఆట

తైక్వాండో ప్రదర్శన ఇస్తున్న బాలురు

ఉప్పొంగిన ఉల్లాసం

ఎప్పుడూ చరవాణులకు అతుక్కుపోయే ఉద్యోగులు చిన్నారులు.. ఈ ఆదివారం ఆనందం బాటపట్టారు.. ఆటపాటలతో గడిపారు. ఉమ్మడి జిల్లాలోని పురపాలికల్లో పట్టణ ప్రజల సంతోషమే ధ్యేయంగా సాగిన ఆనందాల ఆదివారం కార్యక్రమం సందడిగా సాగింది. మొదటి రోజు అనంతపురం నగరంతో పాటు పలు పురపాలికల్లో ఉదయం 7 నుంచి 10 వరకు సరదాగా గడిచింది. ● పలు రకాల ఆటలు ఆడటంతో, సాంస్కృతిక కార్యక్రమాలతో ఉల్లాసంగా గడిపారు. అనంతపురం నగర రాజీవ్ చిల్డ్రన్ పార్కు, ముందు భాగాన పలు రకాల కార్యక్రమాలు నిర్వహించారు. పలు రకాల క్రీడలు, తాడులాగుడు, తైక్వాండో, సాంస్కృతిక కార్యక్రమాలు, యోగా, కుర్చీ ఆట, కరాటే, ఫిట్‌నెస్ సెషన్స్ ఎంతో ఉత్సాహంగా సాగాయి. చిన్నారులు, పలువురు కుటుంబ సభ్యులు, మహిళా సంఘాల సభ్యులతో పాటు వారి పిల్లలు ఇందులో భాగస్వాములయ్యారు. నగరపాలక ఈఈ షాకీర్, హార్టికల్చర్ ఏడీ లక్ష్మయ్య, టీపీఆర్‌ఓ సుబ్బరాయుడు, సీఎంఎం కాటమయ్య పాల్గొన్నారు.

- న్యూస్‌టుడే, అనంతపురం (అశోక్‌నగర్)

తెరపైకి ఈనాడు

అనంతపురం (కమలానగర్), న్యూస్‌టుడే: గౌరి: బాబీ, గాయత్రి: నవాబ్ కేఫ్, గౌతమి: విత్ లవ్, నీలిమ: అల్ఫా, త్రివేణి: కపుల్ ఫ్రెండ్లీ, ఎస్వీ సినిమా: పంకీ, శాంతి: హే బల్వంత్, సుధ: మన శంకర వరప్రసాద్.

నగరంలో ఈనాడు

కమలానగర్, న్యూస్‌టుడే: జిల్లా కలెక్టరేట్, పోలీసు కార్యాలయాల్లో నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాల నిర్వహణ.

పూడికతీశారు.. రోడ్డుపై వదిలేశారు

అశోక్‌నగర్ ప్రధాన రహదారిలో 4 రోజుల క్రితం కాలువల్లో పూడిక తీశారు. కాలువల్లోని మురుగు, వ్యర్థాలు రోడ్డుపై కుప్పలు కుప్పలుగా వేశారు. తొలగించకుండా వదిలేశారు. వాస్తవానికి కాలువల్లోని వ్యర్థాలు మురుగుతో కలిసి ఉంటాయి. కొంచెం ఆరిన తరువాత వ్యర్థాలు తొలగిస్తారు. ఒకరోజు తరువాత కుప్పలు తొలగించాలి. నాలుగురోజులైనా శుభ్రం చేయకుండా వదిలేశారు. దుర్వాసన వస్తోంది. వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు.

- న్యూస్‌టుడే, జేఎన్‌టీయూ

ఆకట్టుకున్న జానపద నృత్యం

ఉత్సాహంగా బాలోత్సవం

ఆజాద్‌నగర్ (అనంతపురం), న్యూస్‌టుడే: పిల్లల పండగ 'అనంత బాలోత్సవం-2026' వేడుకలు ఆదివారం ముగిశాయి. నగరంలోని ఎస్ఎస్‌బీఎన్ కళాశాల ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమం ఆద్యంతం ఉల్లాసంగా ...ఉత్సాహంగా సాగింది. ముఖ్యంగా సాంస్కృతిక కార్యక్రమాలు, గ్రామీణ నేపథ్యం, గిరిజన, జానపద సంప్రదాయాలు ఉట్టిపడేలా విద్యార్థులు గీతాలకు నృత్యాలు చేశారు. లఘు నాటికల్లో అద్భుతంగా నటించారు. అకడమిక్ విభాగంలో పిల్లల్లో సాంకేతిక విజ్ఞానాన్ని పెంపొందించే ప్రయోగాలకు ఈ కార్యక్రమం వేదికైంది. విద్యార్థులు తమ అంతర్లీన, సృజనాత్మకతకు పదును పెట్టి ఆలోచింపజేసే పరిశోధనలు, ప్రయోగాలు చేసి అబ్బుర పరిచారు. జాతీయ నాయకులు, దేవతలు, సైనికులు, పోలీసులు, పోరాటయోధుల వేషధారణల్లో చిన్నారులు మెరిశారు. చిత్రలేఖనం, కార్టూన్, వక్తృత్వం, కథ విశ్లేషణ విభాగాల్లో పాల్గొని ప్రతిభ చూపారు. పోటీలు ముగిసిన అనంతరం ముగింపు సభ నిర్వహించారు. రెండో రోజు పోటీల్లో పాల్గొన్న విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా బాలోత్సవ కమిటీ ఛైర్మన్ షమీమ్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు మాట్లాడారు. రెండు రోజుల పాటు నిర్వహించిన బాలోత్సవం పండగ కార్యక్రమానికి మంచి స్పందన లభించిందన్నారు. విద్యార్థులు తమ ప్రతిభను చాటుకున్నారని, అందుకు తల్లిదండ్రుల ప్రోత్సాహం మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు రమణయ్య, సావిత్రి, కోటేశ్వరప్ప, గోవిందరాజులు, సుబ్బరాయుడు, న్యాయ నిర్ణేతలు వెంకటసుబ్బయ్య, కత్తి విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సంప్రదాయ దుస్తుల్లో విద్యార్థినుల నృత్యం

నిందితులను శిక్షించాలని డిమాండ్

ఆజాద్‌నగర్ (అనంతపురం), న్యూస్‌టుడే: తెలంగాణ రాష్ట్రం కమ్మెర మల్లన్న స్వామి జాతరలో రజకులపై దాడిని ఖండిస్తూ, ఆ దాడిలో మృతి చెందిన చిన్నారికి నివాళి అర్పిస్తూ అనంతపురం నగరంలోని రజకులు ఆదివారం రాత్రి గడియార స్తంభం వద్ద కొవ్వొత్తులతో ప్రదర్శన చేశారు. సామాజిక వర్గ నాయకులు లింగమయ్య, ఫణిభూషణ్, హనుమన్న మీడియాతో మాట్లాడారు. ఈ దాడిలో రెండు నెలల పసికందు ప్రాణాలు కోల్పోవడం దురదృష్టకరమన్నారు.

కమలానగర్: దేవుని దర్శనానికి వెళ్లిన రజకులపై అత్యంత కిరాతకంగా దాడులకు పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని రజక సంఘం నాయకులు ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. ఆదివారం అంబేడ్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులను నాయకులతో కలిసి నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. నాయకులు అనిల్, ఆంజనేయులు, రామాంజనేయులు, ఈశ్వరయ్య, సాకే హరి పాల్గొన్నారు.

గడియార స్తంభం వద్ద కొవ్వొత్తులతో రజకుల నిరసన

నేర్చుకో.. గుర్తుంచుకో

పరీక్ష సమయంలో సమాధానాలు మరచిపోకుండా ఉండాలంటే ఏం చేయాలి.. సమాధానాలు సులువుగా ఎలా గుర్తించాలని వంటి విషయాలపై గిన్నిస్ ప్రపంచ రికార్డు గ్రహీత సుధాకర్‌రాజు విద్యార్థులకు మెలకువలు తెలిపారు. హౌసింగ్ బోర్డు కాలనీలోని శ్రీచైతన్య బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన కళ్లకు గంతలు కట్టుకొని విద్యార్థులు అడిగిన 150 సంఖ్యలను వరుసగా వెనుక నుంచి చెప్పి అబ్బురపర్చారు. విద్యార్థులు జ్ఞాపకశక్తి పెంచుకోవడంపై మెలకువలు తెలిపారు. వ్యక్తిత్వ వికాస నిపుణులు క్రియేటర్ కృష్ణ విద్యార్థులు సూచనలు, సలహాలు ఇచ్చారు.

- న్యూస్‌టుడే, జేఎన్‌టీయూ

విద్యార్థులకు తర్ఫీదు ఇస్తున్న సుధాకర్‌రాజు

'కలియుగ దైవంతో రాజకీయాలొద్దు'

బుక్కరాయసముద్రం: కలియుగ దైవం తిరుమల వేంకటేశ్వరస్వామి పేరుతో వైకాపా నాయకులు నీచ రాజకీయాలకు దిగడం తగదని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అన్నారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ వైకాపా అధినేత జగన్‌కు దేవుడంటే భయం, భక్తి ఏమీ లేవన్నారు. శాసన మండలిలో ఎమ్మెల్సీలు చెప్పులు వేసుకుని, దేవుడి చిత్రపటాలతో రాజకీయం చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. వైకాపా పాలనలో తిరుమలలో సంప్రదాయాలను తుంగలో తొక్కి అపవిత్రం చేశారన్నారు.

ఆకట్టుకున్న సంగీత స్వరార్చన

అనంత సాంస్కృతికం: సంగీత స్వరాంజలి కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కళా తపస్వి సినీ దర్శకుడు కె విశ్వనాథ్ జయంతి వేడుకలు ఆదివారం రాత్రి సందడిగా జరిగింది. నగరంలోని ఆఫీసర్స్ క్లబ్ ఆవరణలో సంగీత స్వరాంజలి 13వ మధుర గీతాల కార్యక్రమానికి ఆదిశేషు సారథ్యం వహించగా డీఆర్వో మాలోల, ఆచార్య సుధాకర్‌బాబు జీవీ రామయ్యలు, ఓబుళదాసు ముఖ్య అతిథిలుగా, గాయకులుగా హాజరయ్యారు. విశ్వనాథ్ చిత్రపటానికి పూజలు చేసిన అనంతరం కేక్ కట్ చేసి జయంతి వేడుకలు ప్రారంభించారు. విశ్వనాథ్ చిత్రాల్లోని మధుర గీతాలకు సంగీత దర్శకుడు రమేశ్ నాయుడు స్వరాలు సమకూర్చిన సుమధుర గీతాల సమ్మిళిత కార్యక్రమాన్ని 13 మంది గాయనీ గాయకులతో స్వరార్చన జరిగింది. సంగీతాభిమానులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

సామూహిక గీతాలాపనలో గాయనీ గాయకులు

గుంటి సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

గార్లదిన్నె గ్రామీణం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని కోటంక గ్రామ సమీపంలో కొండల మధ్య వెలసిన గుంటి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం స్వామికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిగాయి. అర్చకులు రామాచార్యులు ఉదయం అర్చనలు, క్షీరాభిషేకాలు చేసి స్వామిని పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. చుట్టు పక్కల గ్రామాల ప్రజలు ఆలయానికి వచ్చి భక్తిశ్రద్ధలతో స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

స్వామి సన్నిధిలో..

శివబాలయోగి ఆశ్రమం

ఉదయం 6.30కు సుప్రభాత సేవ ✦ 7.30 నుంచి 9 వరకు పరమేశ్వరుడుకు రుద్రాభిషేకం 9 గంటలకు అలంకరణ సేవ ✦ 9.30కు వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరులకు పంచామృతాభిషేకం ✦ 10.30కు అలంకరణ సేవ ✦ 11 గంటలకు మహా మంగళ హారతులు ✦ సాయంత్రం 5 గంటలకు అర్చనలు, పూజలు ✦ 8 గంటలకు మహామంగళ హారతులు, ప్రసాద వితరణ

హౌసింగ్ బోర్డు కాశీవిశ్వేశ్వరాలయం

✦ ఉదయం 6 గంటలకు సుప్రభాత సేవ ✦ 6.30కు పంచామృతాభిషేకం ✦ 8.30కు మహామంగళ హారతులు ✦ 8.45 ప్రసాద వితరణ ✦ సాయంత్రం 5.00లకు సర్వదర్శనం ✦ 6.30 మహా మంగళహారతులు ✦ రాత్రి 8.00 పవళింపు సేవ

శ్రీచిన్మయ జగదీశ్వరాలయం

ఉదయం 6 గంటలకు ఏకవార రుద్రాభిషేకం ✤ 8 గంటలకు అలంకరణ సేవ ✤ 9 కు మహామంగళ హారతులు, ప్రసాద వితరణ ✤ సాయంత్రం 6.30 నుంచి 8 వరకు భజన సంకీర్తనలు ✤ 8 గంటలకు పల్లకీ సేవ ✤ 8.30కు మహామంగళ హారతులు, ప్రసాద వితరణ

పాతూరు విరూపాక్షేశ్వరాలయం

ఉదయం 6 గంటలకు మహాగణపతి పూజ ✦ 6.30కు రుద్రాభిషేకం ✦ 7.30కు బిల్వార్చన ✦ 8 గంటలకు అలంకరణ సేవ ✦ 11కు మహా మంగళ హారతులు, ప్రసాద వితరణ ✦ సాయంత్రం 5.30 ప్రదోష కాల పూజ ✦ 6.30కు కుంకుమార్చన ✦ 7.30కు మహామంగళ హారతులు

- అనంత సాంస్కృతికం, న్యూస్‌టుడే

మొదటి రోడ్డు శివాలయం

ఉదయం 5.30కు సుప్రభాత సేవ ✤ 7.30 నుంచి 8.30 వరకు రుద్రాభిషేకం ✤ 8.30 అలంకరణ సేవ, పల్లకీ ప్రాకారోత్సవ సేవ ✤ 9 గంటలకు మహామంగళ హారతులు ✤ 9.20కు అల్పాహార వితరణ సాయంత్రం 5 గంటలకు దర్శనం ✤ 5.30కు దీపారాధన ✤ రాత్రి 8.00కు మహా మంగళ హారతులు, ఊంజల్ సేవ

విద్యార్థిని అదృశ్యం

అనంత నేరవార్తలు: అనంతపురం నగర శివారులోని ఓ ప్రైవేటు కళాశాలలో బీటెక్ చదువుతున్న విద్యార్థిని ఆదివారం అదృశ్యమైంది. హిందూపురం పట్టణానికి చెందిన విద్యార్థిని కళాశాల వసతి గృహంలోనే ఉంటూ చదువుతోంది. ఆదివారం ఉదయం నుంచి వసతిగృహంలో కనిపించలేదు. సిబ్బంది పోలీసులకు సమాచారం ఇచ్చారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

CHANGE OF NAME

I GURRAM RATHNAMMA, W/o Adinarayana Gurram, R/o D.No: 25/168A, Amidala Street, Anantapuramu City and District. I have changed my name from **GURRAM NAGARATHNA** (Old Name) to **GURRAM RATHNAMMA** (New Name) Hence forth Iam being called as **GURRAM RATHNAMMA** for all future Purpose.

టమాటా కొనుగోళ్లు కొన్నాళ్లేనా?

కక్కలపల్లి మార్కెట్‌కు వచ్చిన టమాటా బుట్టలు

అనంతపురం (వ్యవసాయం), న్యూస్‌టుడే: జిల్లాలో టమాటా పంట విస్తారంగా పండుతోంది. అనంతపురం గ్రామీణం కక్కలపల్లి మార్కెట్‌కు 600-800 టన్నులు వరకు టమాటా తీసుకొస్తున్నారు. బయటకు మరో 200-300 టన్నులు అమ్ముకుంటున్నారు. అయితే ఈ మధ్య ధరలు మరింత దిగజారిపోయాయి. రైతుకు గిట్టుబాటు కాని పరిస్థితి. ధరలు తగ్గడంతో జిల్లా మార్కెటింగ్‌శాఖ రంగంలోకి దిగింది.

✤ కక్కలపల్లి మార్కెట్‌లో టమాటా కొనుగోలు చేసి ఇతర జిల్లాలతో పాటు అనంతపురం నగరంలో రెండు ఆటోలు పెట్టి టమాటా అమ్మకాలు చేపట్టారు. రెండ్రోజులు కొనుగోలు చేసి వదిలేశారు. ధరలు పడిపోవడంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. కిలో రూ.8 ధరలు పడిపోతే.. మార్కెటింగ్‌శాఖ నేరుగా రంగంలోకి దిగి రైతుల నుంచి కొనుగోలు చేయాలి. వారం రోజులుగా ధరలు పడిపోతూనే ఉన్నాయి. మొక్కుబడిగా మార్కెటింగ్‌శాఖ కొనుగోలు చేస్తోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

దిగజారుతున్న ధరలు

కక్కలపల్లి మార్కెట్‌కు నిత్యం 600-700 టన్నులు సంతకు టమాటా వస్తుంది. ధరలు మాత్రం రోజురోజుకు దిగజారిపోతున్నాయి. అన్నదాతల్లో ఆందోళన నెలకొంది.

టమాటా కొంటాం

ఇతర రాష్ట్రాల్లో టమాటా అత్యధికంగా పండింది. జిల్లాలో పండించే టమాటాకు డిమాండ్ తగ్గింది. ఆదివారం మార్కెట్‌లో ఏడు టన్నులు కొనుగోలు చేశాం. తాడిపత్రి, ఆదోని పట్టణాలకు 3.5 టన్నులు చొప్పున 7 టన్నులు కొనుగోలు చేసి పంపించాం. ధరలు కొంతమేర పెరిగే వరకు కొనుగోలు చర్యలు తీసుకుంటాం.

- రాఘవేంద్రకుమార్, ఏడీఎం

ఆరు రోజుల ధరలు పరిశీలిస్తే..

ఈనెల 18న గరిష్ఠం రూ.14, మధ్యస్థం రూ.10, కనిష్ఠం రూ.6 ధరలు పలకగా 19న గరిష్ఠం రూ.12, మధ్యస్థం రూ.8, కనిష్ఠం రూ.6 చొప్పున పలికింది. 20న గరిష్ఠం రూ.11, మధ్యస్థం రూ.8, కనిష్ఠం రూ.6 పలుకగా 21న గరిష్ఠం రూ.11, మధ్యస్థం రూ.7, కనిష్ఠం రూ.5 చొప్పున ధరలు పలికాయి.

● ఆదివారం ధరలు మరింత దిగువకు చేరాయి. కనీసం రైతులకు గిట్టుబాటు కూడా కావడం లేదు. మార్కెట్‌కు మొత్తం 600 టన్నులు టమాటా వచ్చింది. కిలో గరిష్ఠం రూ.10, మధ్యస్థలం రూ.6, కనిష్ఠం రూ.4 చొప్పున ధరలు పలికాయి.

విశ్వేశ్వరాలయానికి రూ.1.46 లక్షల విరాళం

అనంత సాంస్కృతికం: నగరంలోని మొదటి రోడ్డు కాశీ విశ్వేశ్వర, కోదండ రామాలయ పునర్నిర్మాణానికి ఆదివారం పలువురు దాతలు రూ. 1,46,348లు చెక్కుల రూపంలో విరాళాలందించారు. ఆలయ కమిటీ ఛైర్మన్ అమిలినేని నరేంద్రచౌదరి, ఈవో నాగేంద్రుడు తెలిపిన మేరకు జైన్ టెంపుల్ రూ. 51 వేలు, హంపాపురం కళ్యాణ్‌రాం రూ.50,116లు, మల్లెపూటి ప్రకాశ్‌బాబు రూ.25వేలు, అంబారపు శ్రీధర్ రూ.10,116,బి మహేశ్ రూ.10,116లు విరాళం అందించారని తెలిపారు. దాతలకు సన్మానం చేసి కృతజ్ఞతలు తెలిపారు.

ఆలయ కమిటీకి విరాళం అందిస్తున్న దాతలు

గురుపౌర్ణమి అంకురార్పణకు..

అనంత సాంస్కృతికం: గురుపౌర్ణమి పర్వదినం పురస్కరించుకుని స్థానిక వేణుగోపాలనగర్‌లోని శిర్డీసాయినాథ దేవస్థానానికి పాతూరులోని ప్రముఖ 'నారాయణ క్లాత్ స్టోర్స్' యజమాని బ్రాండెడ్ నారాయణ ఆదివారం రూ. 50 వేలు నగదు వితరణ చేశారు. గురు పౌర్ణమి వేడుకలకు అంకురార్పణగా ఈ వితరణ చేసినట్లు మందిరం కార్యదర్శి దండు నగేశ్ తెలిపారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడమేమనగా మా కక్షిదారురాలు అయిన B.సుహాసిని W/o Late B.రామ స్వరూప్ రెడ్డి D.No. 4-2-895-2, జనశక్తినగర్, అనంతపురం నగరం & జిల్లా అనువారు ఈ క్రింద తెలిపిన షెడ్యూలు దాఖలా ఆస్తిని 3480/1983; 3687/2010 నంబర్లుగా రిజిస్టర్ కాబడి ఆ లగాయత్తు నాకు హక్కు అనుభవం కలిగి ఉండిన ఆస్తి విక్రయ అగ్రిమెంట్‌తో కూడిన జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ పొందిన 1.H.మహమ్మద్ బుడేన్ సాహెబ్ మరియు 2.ఖలీఖుల్లా ఖాన్ గారు అనువారి ఆస్తిని అందులో P.ఖలీఖుల్లా ఖాన్ గారు చనిపోవడం వలన అతని వారసులు ఎవరైనా ఉన్నా మరియు ఇతర ఆక్షేపణలు ఉన్నయెడల ఈ క్రింద తెలిపిన అడ్రస్‌కు 10 రోజుల లోపల తెలియచేయవలసినదిగా కోరుచున్నాము. షెడ్యూలు దాఖలా ఆస్తిపై ఎటువంటి ఆక్షేపణలు రానిచో మా క్లయింట్ విక్రయ రిజిస్టర్ పొందుదురని యావన్మందికి తెలియచేయడమైనది.

షెడ్యూలు

అనంతపురం రి॥డి॥, అనంతపురము సబ్॥డి॥కి చేరిన శోత్రియం పాపంపేట గ్రామ పొలం పై మాయిషీ నెం.27 పైకి అనంతపురం మున్సిపల్ ఏరియాలో నేను 04-05-1983వ తేదిన సుంకన్న వగైరాలలో జి॥పి॥ఎ పొందిన ఏజెంట్ అయిన సి.వి.సుబ్బరాయుడు వగైరాలతో విక్రయించుకొని అనంతపురం రిజిస్టర్ గారి ఆఫీస్‌లో 1 పుస్తకం 722 వాల్యుమ్, 297ల 299 పుటలలో దస్తావేజు నెం. 3480/1983; 3687/2010 నెంబర్లుగా రిజిస్టర్ కాబడి ఆ లగాయత్తుం నాకు హక్కు అనుభవము కలిగి ఉండిన ఆస్తి వివరం.

Ward	Sy.No	A.C			
Old-Nil	77/7	2.25			
New:4	77/5	1.22	A.C	H.S	Plot No's
Present:4		3.47 పైకి	0.07.4	0.029	19 & 20

గల ప్లాట్లకు కలిపి ఒకే **చెక్కుబంది: తూర్పు:** ప్లాట్ నెం. 19 పైకి మిగతా ప్లాటు, **దక్షిణం:** 33 అడుగులు రోడ్డు, **పడమర :** సర్వే నెం. 76 గల జమీను, **ఉత్తరం:** ప్లాట్ నెం.13 ఈ మధ్యగల దక్షిణ దిశన **తూ-ప :** 50 అడుగులు లేక 15-24 మీటర్లు, తూర్పు దిశన **ఉ-ద :** 96 అడుగులు లేక 29-36 మీటర్లు, ఉత్తర దిశన **తూ-ప :** 13 అడుగులు లేక 3.96 మీటర్లు, పడమర దిశన **ఉ-ద :** 104 అడుగులు లేక 31-70 మీటర్లు. ఈ విశాలం గల ఏడు పాయింట్ నాలుగు సెంట్లు గల ప్లాట్లు మాత్రము. ఈ ఆస్తి చ॥గ॥ కి రూ.2100/- ప్రకారం మొత్తం. 958.16 చ॥గ॥లు.

K.HUSSAIN NIZAMI, Advocate, Ananthapuramu. Cell No : 9908935964

(c) eenadu

64 గడులు.. బుడతలే రాజులు

☛ చదరంగంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ఎత్తుకు పైఎత్తులు వేస్తున్న చిన్నారులు

విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లోనూ ప్రావీణ్యం సంపాదిస్తున్నారు... అందులో మేదడుకు పదును పెట్టే 64 గడుల చదరంగం ఆటలో రాణిస్తున్నారు. తమ ఎత్తులతో ప్రత్యర్థులను చిత్తు చేస్తూ ముచ్చెమటలు పట్టిస్తున్నారు. ఇటీవల మదనపల్లెలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో సత్తా చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. తిరుపతిలో జరుగుతున్న ఈ పోటీల్లో జిల్లా తరఫున పాల్గొంటున్నారు. జిల్లా క్రీడాభివృద్ధి అధికారి జి.చంద్రశేఖర్, ఎస్జీఎఫ్ కార్యదర్శి నాగరాజు, కోచ్ మహమ్మద్ ఆలీల ప్రోత్సాహంతో రాష్ట్రస్థాయిలోనూ రాణిస్తామని ధీమాగా చెబుతున్నారు. - న్యూస్టుడే, మదనపల్లె విద్య

హంపి, హారిక స్ఫూర్తి



చదరంగంలో దేశానికి పేరు తెచ్చిన కోనేరు హంపి, హారిక ద్రోణవల్లి స్ఫూర్తితో చదరంగం నేర్చుకోవాలని నిర్ణయించాను. అమ్మా, నాన్న ఇందిర ప్రియదర్శిని, శంకరప్పల ప్రోత్సాహంతో శిక్షణ తీసుకున్నా. ఇటీవల జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో అండర్-13 విభాగంలో సత్తా చాటా. అక్కడ రాణించి జాతీయ స్థాయికి ఎంపికవ్వాలని సాధన చేస్తున్నా. - అక్షర, ఏడో తరగతి, ఎంపీపీఎస్, కురవంక, మదనపల్లె

జిల్లా స్థాయిలో ప్రథమం

అమ్మా నాన్నలు కల్పన, కిరణ్‌బాబు ప్రోత్సాహంతో చదరంగం చేర్చుకున్నా. ఇంటి వద్ద ఎక్కువగా సాధన చేయడంతో నైపుణ్యం వచ్చింది. హరికృష్ణ, గుకేశ్‌లను స్ఫూర్తిగా తీసుకుని అంతర్జాతీయ స్థాయిలో పేరు సాధించాలని ఉంది. అండర్-17 విభాగంలో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలవడంతో రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. చదరంగంతో ఏకాగ్రత పెరుగుతుంది. - సుశాంత్‌సాయి, పదో తరగతి, ఢిల్లీ పబ్లిక్ స్కూల్, మదనపల్లె

బోయకొండలో వీఐపీ దర్శనాల రద్దు

బోయకొండ (చౌడేపల్లె), న్యూస్‌టుడే: కోరిన కోర్కెలు తీర్చే శక్తి స్వరూపిణి బోయకొండ గంగమ్మ దర్శనానికి పలు ప్రాంతాల నుంచి భక్తులు అధికంగా తరలివచ్చారు. ఉదయం నుంచి క్యూలైన్లు కిక్కిరిశాయి. దర్శనానికి సుమారు 3 గంటల సమయం పట్టింది. రద్దీకి అనుగుణంగా ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వీఐపీ దర్శనాలు రద్దు చేశారు.

ఆలయంలో భక్తుల రద్దీ

అలంకరణలో బోయకొండ గంగమ్మ

జలధార: భూమాత కడుపార!

☛ రాష్ట్రంలో ఆదర్శం మన జిల్లా ☛ భూగర్భ జలాల పెంపులో 2వ స్థానం


జలసంరక్షణ పనులపై కలెక్టర్ నిశాంత్‌కుమార్‌తో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు (పాత చిత్రం)

రాయలసీమ ప్రాంతంలో నీటి నిర్వహణకు కొత్త అర్థాన్ని చెబుతూ జిల్లా మార్పు సాధించింది. ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'ప్రాజెక్టు జలధార' కార్యక్రమంతో సుస్థిరమైన నీటి భద్రతకు రాష్ట్రంలో రోల్ మోడల్‌గా నిలిచింది. జలవనరుల శాఖ, జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా)లు సమన్వయంతో సాగునీటి ప్రణాళికలు రూపొందించారు. కనుమరుగైన నీటి మార్గాలను అన్వేషించడంతో పాటు రైతులకు ఉన్న సంప్రదాయ పరిజ్ఞానాన్ని జోడించి నీటి నిల్వ పెంచగలిగారు. ఈ వినూత్న ప్రయోగాన్ని అమరావతిలో సీఎం చంద్రబాబుకు.. పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్ నిశాంత్‌కుమార్, జలవనరుల అధికారులు వివరించి సీఎం నుంచి అభినందనలు అందుకున్నారు. - ఈనాడు, అన్నమయ్య, న్యూస్‌టుడే, రాయచోటి

ప్రతి నీటిచుక్కను ఒడిసిపట్టాలని..

భవిష్యత్తు అభివృద్ధి, ఆర్థికాభివృద్ధికి నీటి భద్రతే కీలకం. దీన్ని గుర్తించిన జిల్లా అధికారులు తీవ్ర నీటి ఎద్దడి ఉన్న జిల్లాలో ప్రతి నీటిచుక్కను ఒడిసి పట్టడం తద్వారా పశు సంవర్ధక, ఉద్యాన, వ్యవసాయ రంగాలను విస్తరించి ఆర్థికాభివృద్ధిని సాధించడమే 'ప్రాజెక్టు జలధార' లక్ష్యం. అధికారులు నీటి సంరక్షణ పనులు చేపట్టారు. మిగులు బేసిన్ల నుంచి లోటు బేసిన్లకు నీటిని అనుసంధానం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మిగులు ప్రాంతాల నుంచి లోటు ప్రాంతాలకు నదులను అనుసంధానం చేసినట్లే.. జిల్లాలో వాగులు, వంకలు, నదులను అనుసంధానం చేయడంతో నీటి నిల్వ పెంచవచ్చనే ఆలోచనకు వచ్చారు. ఖరీదైన కొత్త ప్రాజెక్టుల నిర్మాణం అవసరం లేకనే వాడుకలో లేని, శిథిలావస్థకు చేరిన చెరువులు, కాలువలను ఆధునికీకరించి నదుల నీటితో అనుసంధానం చేయడంతో జల సంరక్షణ ఫలితాలు సాధించారు.

ఉప కాలువలకు పునరుజ్జీవం

● పాత కాలువలు పునరుద్ధరించి నదులు, వాగుల నుంచి చెరువులను అనుసంధానించడం ద్వారా 3.9 టీఎంసీల మిగులు నీటిని లోటు ప్రాంతాలకు తరలించారు. 40 ఏళ్ల తర్వాత అనేక చెరువులు జలకళను సంతరించుకున్నాయి.

వెలిగల్లు ప్రాజెక్టు నీటి తరలింపుతో కళకళలాడుతున్న గుండ్లచెరువు

ఇవిగో నీటి సంరక్షణ పనులు

● జిల్లాలో నదుల అనుసంధానం చేసుకుని నిరుపయోగంగా ఉన్న 6 వేల కాలువలు గుర్తించారు. ఉపాధి హామీ పథకం కింద 4 వేల కాలువలను పునరుద్ధరించి నీటిని చెరువులకు అనుసంధానించారు. చెరువులకు అందుబాటులో ఉన్న జలవనరుల నుంచి మరో 310 కాలువలను కొత్తగా తవ్వించారు. ● 214 పంట కుంటలు తవ్వారు. పూడిపోయిన 102 నీటి కుంటల్లో.. పూడిక తొలగించి 532 వాగులను పునరుద్ధరించారు.

రికార్డు స్థాయిలో నీటి నిల్వ వృద్ధి

జిల్లాలో ఉపరితల నీటి నిల్వ సామర్థ్యం గతేడాది 13.15 టీఎంసీలు ఉండగా.. డిసెంబరు నాటికి 48.86 టీఎంసీలకు చేరింది. జల సంరక్షణ పనులు చేసిన ప్రాంతాల్లో 8 మీటర్ల లోతులోనే నీరు లభ్యం కావడంతో ఉద్యాన తోటలకు ఉపయుక్తంగా మారింది. రాయలసీమలో సగటు భూగర్భజల మట్టం వృద్ధి 3.6 మీటర్లు కాగా.. జిల్లాలో 8.7 మీటర్లుగా నమోదైంది. రాష్ట్రంలో నీటి లభ్యతలో 25వ స్థానంలో ఉన్న జిల్లా ఇప్పుడు 2వ స్థానానికి చేరింది.

ఆదర్శ నమూనా

"జిల్లాలో ప్రాజెక్టు జలధార ప్రణాళిక స్థిరమైన నీటి నిర్వహణకు ఆదర్శ నమూనా. శాస్త్రీయంగా తక్కువ ఖర్చుతోనే పాత వనరులు పునరుద్ధరించాం. కరవు కాటకాలతో అల్లాడే ప్రాంతాలు నేడు వేసవి ప్రారంభానికి జలవనరుల్లో నీటి నిల్వలతో జలకళ సంతరించుకున్నాయి. జీవనోపాధి వృద్ధి చెందుతాయని ఆశిస్తున్నాం." - నిశాంత్‌కుమార్, కలెక్టర్

నాడు గుడిపల్లం.. నేడు గుడిమల్లం

ఏకశిలపై కొలువుదీరిన బ్రహ్మ, విష్ణువు, మహేశ్వరుడు

మీకు తెలుసా

దేశంలోని మొట్టమొదటి శివాలయంగా గుర్తింపు పొందిన శ్రీపరశురామేశ్వరస్వామి ఆలయంలో ఐదు అడుగుల ఏకశిల్పంపై బ్రహ్మ, విష్ణువు, మహేశ్వరులు కొలువుదీరిన అంతరాలయం పల్లంగా ఉంటుంది. దీంతో ఈ ప్రాంతాన్ని పూర్వీకులు గుడిపల్లంగా పిలిచేవారు. కాలక్రమేణా గుడిమల్లంగా మారింది. ఏర్పేడు మండలంలోని ఈ గ్రామానికి పక్కనే ప్రవహిస్తున్న స్వర్ణముఖి నది నీరు 60 ఏళ్లకో పర్యాయం స్వామివారి పాదాలు తాకుతాయని చరిత్రకారులు చెబుతుంటారు. ఏటా ఉత్తరాయణం నుంచి దక్షిణాయంలోకి సూర్యభగవానుడు మారే సమయంలో కిరణాలు స్వామివారి పాదాలపై పడతాయి. ముఖద్వారం నుంచి ఆలయ శిఖరపైభాగం కనువిందు చేస్తుండటం విశేషం. - న్యూస్‌టుడే, ఏర్పేడు

సెస్సు.. వసూళ్లలో తుస్స్స్!

పుంగనూరు, న్యూస్‌టుడే: జిల్లాలో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలు చేరుకోవడంలో కొన్ని మార్కెట్ కమిటీలు ముందుండగా, మరికొన్ని దూరంగా ఉండిపోయాయి. మార్చి 31లోగా లక్ష్యాలను చేరుకోవడం గగనంగా మారుతోంది. గడువు దగ్గర పడుతుండటంతో సెస్ వసూలు చేస్తాయా..? లేదా? అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ప్రభావం పడనుంది.

జిల్లా వివరాలివి..
- మొత్తం కమిటీలు: **10**
- వసూళ్ల లక్ష్యం: రూ.**880.54** లక్షలు
- ఇప్పటి వరకు వసూలు: రూ.**827.8** లక్షలు
- ఇంకా చేయాల్సింది: రూ.**76.03** లక్షలు

ఎక్కడెక్కడ ఎలా ఉందంటే..

☛ జిల్లాలో కొన్ని కమిటీలు లక్ష్యాలకు మించి వసూలు చేశాయి. పుంగనూరు రూ.134 లక్షలకు గాను రూ.140.70 లక్షలు, ములకలచెరువు రూ.140 లక్షలకు రూ.152.57, బి.కొత్తకోట రూ.55 లక్షలకు రూ.59.02 లక్షలు సాధించి ముందు స్థానాల్లో ఉన్నాయి.

☛ లక్కిరెడ్డిపల్లె రూ.50 లక్షలకు ఇప్పటి వరకు కేవలం రూ.22.50 మాత్రమే వసూలు చేసింది. రాయచోటి రూ.65 లక్షలకు రూ. 41.43, కలికిరి రూ.70 లక్షలకు రూ.59.10, పీలేరు రూ.35 లక్షలకు రూ.28.41, మదనపల్లె రూ.225 లక్షలకు రూ.219.90, సోమల రూ.8.54 లక్షలకు రూ.6.65, వాల్మీకిపురం రూ.98 లక్షలకు రూ.97.52 లక్షలు వసూలు చేసి వెనుకంజలో ఉన్నాయి.

అల్లంత.. లాభాల పుంత

దాదాపు రెండు కిలోల బరువున్న అల్లం గడ్డ

అంతర పంటగా సాగు చేసిన అల్లం

వాల్మీకిపురం మండలంలోని జార్రవారిపల్లె పంచాయతీ గెలసంవారిపల్లెకు చెందిన రైతు రెడ్డెప్ప తనకున్న పదెకరాల్లో మహాగణి, అల్లనేరుడు పంటలను సాగు చేశారు. ఇందులో అంతర పంటగా నాలుగెకరాల్లో అల్లం సాగు చేశారు. కేరళ-కర్ణాటక రాష్ట్రాల సరిహద్దులో రైతులు ఎక్కువగా అల్లం సాగు చేస్తారని తెలుసుకుని రూ.2.5 లక్షలు వెచ్చించి దాదాపు 3.5 టన్నుల (రెగోడి రకం) విత్తనాన్ని దిగుమతి చేసుకున్నారు. దాదాపు రూ.15 లక్షలు పెట్టుబడి పెట్టారు. తొమ్మిది నెలల అనంతరం దిగుబడి చేతికి అందింది. ఒక్కో మొక్కకు కిలోకి పైగా అల్లం గడ్డలు విరగ్గాశాయి. దాదాపు 75 టన్నుల వరకు దిగుబడి వచ్చింది. ప్రస్తుతం కిలో అల్లం ధర రూ.50 దాక పలుకుతుండగా దాదాపు రూ.35 లక్షల వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉందని రైతు రెడ్డెప్ప తెలిపారు. - న్యూస్‌టుడే, వాల్మీకిపురం

పశువులు దండి.. రాయితీలో తొండి

☛ బీమాపై పెంపకందారుల ఆసక్తి ☛ నిధుల్లేక అధికారుల ఎదురుచూపు

చెట్ల కింద మేత మేస్తున్న పాడి పశువులు

చిన్నమండెం, న్యూస్‌టుడే: జిల్లాలో వ్యవసాయ అనుబంధ రంగాల్లో ప్రధానమైన పాడి పశువుల పెంపకంపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలు అధికం.. కరవులోనూ ఆయా కుటుంబాలకు ఆదరవుగా మారిన పాడి పశువుల ధరలు రూ.వేలల్లో ఉంటాయి. ఇలాంటి వాటికి అనుకోకుండా వ్యాధులు, ఇతర ప్రమాదాలు, ప్రకృతి విపత్తులు సంభవించి మృత్యువాత పడితే పెంపకందారులు భారీగా నష్టపోయే ప్రమాదం ఉంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని కూటమి ప్రభుత్వం పశువులు, మేకలు, గొర్రెలకు బీమా సౌకర్యం కల్పించింది. అందులోనూ 85 శాతం రాయితీని ప్రభుత్వమే చెల్లిస్తోంది. పెంపకందారులు కేవలం 15 శాతం చెల్లిస్తే మూడేళ్ల వ్యవధి కల్పించింది. అయితే జిల్లాకు వచ్చిన బీమా రాయితీ అయిపోవడంతో పశువైద్య అధికారులు ఏమీ చేయలేని స్థితిలో ఉన్నారు.

ఉత్సాహంగా ముందు కొచ్చినా..

జనవరి 19 నుంచి నెలాఖరు వరకు జిల్లావ్యాప్తంగా పశు ఆరోగ్య శిబిరాల్లో బీమాపై రైతులకు అవగాహన కల్పించారు. రూ.30 వేలు ఖరీదు చేసే పశువుకు రాయితీ పోను.. రూ.298 చెల్లిస్తే మూడేళ్ల వరకు బీమా ఉండటంతో రైతులు ఉత్సాహంగా ముందుకొచ్చి 465 పశువులకు బీమా చేశారు. ఇందులో సంకరజాతి పశువులు 356, గేదెలు 109 ఉన్నాయి. జిల్లాకు వచ్చిన రాయితీ సొమ్ము ప్రస్తుతం అయిపోయింది. ఈ నెల మొదటి వారం నుంచి రాయితీ సొమ్ము లేక.. బీమా చేయలేక పోతున్నారు.

● ఇప్పటికే రూ.9.10 లక్షల ప్రీమియం చెల్లించాం ఈ ఆర్థిక సంవత్సరం మొదటి విడతలో రూ.8 లక్షలు, తర్వాత రూ.లక్ష, రూ.10 వేలు వచ్చాయి. రైతుల్లో చైతన్యం కల్పించాం. ఎవరైతే ముందుగా వచ్చి బీమా చేసుకున్నారో వారికి ప్రీమియం చెల్లించాం. ప్రస్తుతానికి నిధులు అయిపోయాయి. బీమా చేయించేందుకు రైతులు ముందుకొస్తున్నారు. అదనంగా రూ.16 లక్షలు కావాలని ఉన్నతాధికారులకు నివేదించాం. నిధులు వస్తే బీమా కార్యక్రమం మొదలు పెడతాం. -కె.గుణశేఖరపిళ్లై, జేడీ, పశు సంవర్ధక శాఖ

జిల్లాలో పశు సంపద ఇలా.. ఆవులు: 2,87,713 గేదెలు: 21,440 గొర్రెలు: 14,59,985 మేకలు: 2,24,068

ఈ-పంట.. ఎక్కడికక్కడే నమోదు

కంభంవారిపల్లి, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అన్నదాతలను అన్ని విధాలుగా ఆదుకుంటోంది. రైతులకు రాయితీ విత్తనాలివ్వడం, ఉపాధి హామీ పథకంలో ఆర్థికంగా చేయూతనిచ్చే కార్యక్రమాలు చేపట్టింది. రైతులను ఆదుకోవడానికి ఈ-పంట నమోదు చేస్తోంది. ప్రస్తుతం రైతులే తాము సాగు చేసిన పంటకు ఈ-పంట నమోదు చేసుకొనే అవకాశం కల్పించింది. రైతులు తాము సాగు చేసిన పంటకు ఈ-పంట నమోదు తప్పకుండా చేసుకోవాలి. పంట నష్టపోయినా, పంట రాయితీ పొందాలన్నా రైతుల పంట నమోదు తప్పనిసరి. ఇప్పటి వరకు వ్యవసాయశాఖ సిబ్బంది రైతు పొలం వద్దకు వచ్చి, పంటను పరిశీలించి నమోదు చేసేవారు. ప్రస్తుతం పంటల వివరాలను ఈ-పంట వెబ్‌సైట్‌లో అన్నదాతలే స్వయంగా నమోదు చేసుకొనే వెసులుబాటు కల్పించింది. తప్పులుంటే ఫిర్యాదు చేసే అవకాశాన్ని కల్పించింది. వ్యవసాయ సిబ్బంది వెంటనే రైతులు ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.



ఎలా చేయాలంటే

● రైతులు వారి మొబైల్ ఫోన్‌లో గూగుల్ ప్లే స్టోర్ నుంచి ఏపీఏఐఎమ్ఎస్ 2.0 మొబైల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ● ఆధార్ సంఖ్య ద్వారా రిజిస్ట్రేషన్ చేసి ఎమ్‌పీఐఎన్ సెట్ చేసుకోవాలి ● ఆధార్ నంబరు ఆధారంగా వెబ్‌ల్యాండ్‌తో అనుసంధానమైన రైతుకు చెందిన అన్ని భూమి వివరాలు ఇందులో కనిపిస్తాయి. ● ఇప్పటి వరకు రైతు సేవా కేంద్రం సహాయకులు పంట నమోదు చేయని భూములకు సంబంధించి ఈ-పంట నమోదు రైతులే స్వయంగా చేసుకోవచ్చు.

● పంట నమోదు సమయంలో 20 మీటర్ల జియో రెఫరెన్సుతో కూడిన హద్దులతో కూడిన పొలంలో ఫొటో తీసుకోవాలి. దీనికోసం పొలంలోనే ఉండాలి.

● నమోదు చేసిన సంబంధిత రైతు సేవా కేంద్రం సహాయకుడి లాగిన్‌కు వెళ్తుంది. అతను పరిశీలించి, పంట నమోదును ధ్రువీకరిస్తాడు. ● పంట నమోదు వివరాలు సక్రమంగా ఉన్నాయో లేదో రైతు పరిశీలించుకోవచ్చు. ● పంట వివరాలు తప్పుగా ఉంటే, ఫిర్యాదు చేసే అవకాశం రైతులకు ఉంది.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి

రైతులు తాము సాగు చేసిన పంటను తామే నమోదు చేసుకోవడం వల్ల తప్పులు జరిగే అవకాశం తక్కువ. ఒకవేళ జరిగినా ఫిర్యాదు చేయవచ్చు. - వైవీ రమణరావు, ఏడీఏహెచ్, పీలేరు

పోస్టుమాస్టర్‌కు ముఖ్యమంత్రి ప్రశంసలు

సీఎం, కేంద్ర మంత్రి చేతుల మీదుగా జ్ఞాపిక అందుకుంటున్న నాగలత

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే: మదనపల్లె మండలం బసినికొండ పోస్టుమాస్టర్ కె.నాగలత సీఎం నారా చంద్రబాబు, కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ నుంచి ప్రశంసలు అందుకున్నారు. ఆదివారం గుంటూరులో జరిగిన కార్యక్రమంలో నాగలతకు జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందజేశారు. 2025-26 ఏడాదికి 6 వేలకు పైగా ఎస్బీ ఖాతాలు, 600కు పైగా ఆర్పీఎల్ అకౌంట్లు ఓపెన్ చేయించి ఆమె రాష్ట్రంలో ద్వితీయ స్థానంలో నిలిచారు.

ఓటరు సేవ.. సులువైన తోవ

కలకడ, న్యూస్‌టుడే : ఎలక్ట్రానిక్ ఓటరు కార్డు డౌన్‌లోడ్ చేసుకోవాలా.. ఓటరు కార్డు చిరునామా మార్చుకోవాలా.. కొత్త ఓటరు కార్డు నమోదు చేసుకోవాలా.. మీ ఓటు ఏ పోలింగ్ కేంద్రం పరిధిలో ఉందో తెలుసుకోవాలా.. ఈ సేవలన్నీ ఇకపై ఒకే వేదికలో లభ్యమవుతున్నాయి. అదే ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా వారి సరికొత్త ఈసీఐ నెట్ యాప్‌తో పాటు వెబ్ ఆప్షన్‌లోనూ అందుబాటులో ఉంది.

యాప్ రూపంలో..

గూగుల్ ప్లే స్టోర్‌లో నుంచి ఈసీఐనెట్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. గతంలో మీ చరవాణి నంబరు, ఓటరు కార్డు, నంబరుతో ఎన్నికల పోర్టల్‌లో నమోదై ఉంటే.. దీనిలో సులువుగా లాగిన్ అవ్వొచ్చు. చరవాణి నంబరు నమోదు చేస్తే ఓటీపీ వస్తుంది. దీని ద్వారా ఈసీఐనెట్ యాప్‌లోకి వెళతారు.

అన్ని రకాల సేవలు ఇక్కడే..

కొత్త ఓటరుగా ఫారం-6 ద్వారా రిజిస్టర్ చేసుకోవచ్చు. చిరునామా మార్చుకోవచ్చు. చనిపోయిన వారిని ఓటరు జాబితా నుంచి తొలగించడానికి దరఖాస్తు చేసుకోవచ్చు. మీ దరఖాస్తు ఏదశలో ఉందో ట్రాక్ చేసుకోవచ్చు. కార్డులో తప్పులుంటే ఫిర్యాదు చేయవచ్చు. ఎలక్ట్రానిక్ ఓటరు కార్డు డౌన్‌లోడు చేసుకోవచ్చు. జాబితాలో మీ పేరు వెతుక్కోవచ్చు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన తర్వాత ఫిర్యాదు చేసే వెసులుబాటు అందుబాటులోకి తెస్తారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు, వారి బయోడేటా, అఫిడవిట్లు ఇవన్నీ కూడా ఎన్నికల సమయంలో అన్ని భాషల్లో వివరాలు అందుబాటులో ఉంచుతారు.

టమాట కిలో రూ.15

మదనపల్లె గ్రామీణ: మదనపల్లె మార్కెట్‌లో టమాట ధరలు అత్యల్పంగా కిలో రూ.9 నుంచి రూ.15 మధ్య పలికాయి. మార్కెట్‌కు 65 టన్నుల పంటను రైతులు ఆదివారం తీసుకొచ్చారు. ఏ-గ్రేడ్ కిలో రూ.13 నుంచి రూ.15, బీ-గ్రేడ్ రూ.9 నుంచి రూ.11 వరకు పలికింది.

రంజాన్ వేళలు	ఇఫ్తార్ సోమవారం (సా)	సహర్ మంగళవారం (ఉ)
మదనపల్లె	6.28	5.15
రాయచోటి	6.26	5.14

ఉయ్యాలవాడ.. వెలుగు జాడ

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: ఉయ్యాలవాడ నరసింహారెడ్డిని యువత స్ఫూర్తిగా తీసుకొని భవిష్యత్తుకు బాటలు వేయాలని డీఆర్వో మధుసూదన్‌రావు పేర్కొన్నారు. ఆదివారం కలెక్టరేట్‌లో యువజన సర్వీసులు, పర్యాటక శాఖల ఆధ్వర్యంలో ఉయ్యాలవాడ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద జ్యోతి వెలిగించి నివాళులర్పించారు. డీఆర్వో మాట్లాడుతూ.. 1846లో బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా కర్నూలు ప్రాంతంలో సాయుధ పోరాటం ప్రారంభించి, స్వాతంత్ర్య సంగ్రామానికి పునాది వేసిన తొలి వీరుడని కొనియాడారు. ఆయన ధైర్యం, దేశభక్తి నేటి తరానికి ఆదర్శమన్నారు. పర్యాటకశాఖ అధికారి నాగభూషణం, యువజన సర్వీసుల శాఖ మేనేజరు సుబ్బారావు, జిల్లా ఫీల్డ్ అధికారి నారాయణ, కుమ్మరి, శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్ భావన, శ్రీకృష్ణ విద్యా సంస్థల కరస్పాండెంట్ కృష్ణారెడ్డి, విద్యార్థులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డీఆర్వో మధుసూదన్‌రావు, వివిధ శాఖల జిల్లా అధికారులు

మార్చిలో విద్యాలక్ష్మి.. కల్యాణలక్ష్మి

☛ పొదుపు మహిళలకు ఆర్థిక తోడు

కలకడ, న్యూస్‌టుడే : స్వయం సహాయక సంఘాలుగా ఏర్పడి... పొదుపు చేసుకొంటున్న మహిళలకు కూటమి ప్రభుత్వం తీపిక బురు చెప్పింది. వ్యక్తిగత అవసరాల నిమిత్తం స్వల్ప వడ్డీకే రుణాలిచ్చేలా మూడు నెలల క్రితం ప్రకటించిన ఎన్టీఆర్ విద్యాలక్ష్మి.. ఎన్టీఆర్ కల్యాణ లక్ష్మి పథకాలను ఈ మార్చి నుంచి అమలు చేసేందుకు నిర్ణయించింది. వీరందరికి ఆర్థిక తోడు లభించనుంది.

జిల్లాలో ఇలా
- డ్వాక్రా సంఘాలు : **29,673**
- సభ్యులు : **2,93,446** మంది
- బ్యాంకు రుణం : రూ.**2,037.92** కోట్లు
- స్త్రీనిధి : రూ.**254.87** కోట్లు
- ఉన్నతి : రూ.**10.30** కోట్లు

● జిల్లాలోని డ్వాక్రా సభ్యులు బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుని ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. కొందరు మహిళలు బాగా ఆర్థికంగా వెనుకబడి ఉండటంతో వీరికి కుటుంబ వ్యక్తిగత అవసరాలు నిమిత్తం ప్రైవేటు రుణాలను అధిక వడ్డీలకు తీసుకుంటున్నారు. ఇది భారంగా మారింది. ● ఇక స్త్రీనిధి ద్వారా తీసుకున్న రుణంపై దాదాపు రూపాయి వడ్డీ ఉంటుంది. దీంతో కేవలం పావలా వడ్డీకే విద్య, కల్యాణలక్ష్మీ పథకాల ద్వారా గరిష్ఠంగా రూ. లక్ష రుణం ఇవ్వనున్నారు. దీన్ని తీర్చడానికి నాలుగేళ్ల కాలపరిమితి ఇవ్వనున్నారు.

సదస్సుకు హాజరైన డ్వాక్రా మహిళలు

రుణాలు పొందేది ఇలా...

● సభ్యురాలి కుటుంబంలో ఇద్దరు పిల్లలు పాఠశాల/కళాశాలల్లో చదివితే వారి చదువు నిమిత్తం నగదు అవసరమైతే రూ.10 వేల నుంచి రూ.లక్ష వరకు ఇవ్వనున్నారు. ఇందుకోసం సంబంధిత పాఠశాల/కళాశాలలో చేర్పించిన ప్రవేశ పత్రం, ఫీజు వివరాల రసీదు చూపించాలి.

● కుటుంబంలో వివాహం చేయాల్సిన కుమార్తె ఉంటే పెళ్లి ఖర్చుల నిమిత్తం ఇదే తరహాలో గరిష్ఠంగా రూ.లక్ష వరకు రుణం ఇస్తారు. దీనికి పెళ్లి శుభలేఖ, వివాహ ఖర్చు అంచనా వివరాలను సమర్పించాలి. దీన్ని పరిశీలించిన అధికారులు అర్హత ఉంటే రెండు రోజుల్లోనే వారి ఖాతాలకు కేటాయించిన రుణంగా నగదు జమ చేస్తారు.

● సభ్యురాలు సంఘంలో చేరి కనీసం ఆరునెలలై ఉండాలి. బ్యాంకు, స్త్రీనిధి, ఉన్నతి ద్వారా రుణాలు తీసుకుని ఉన్నా, వాటిని సక్రమంగా చెల్లిస్తూ ఉంటేనే అర్హత పొందుతారు. రుణగ్రహీత ప్రమాదవశాత్తు మరణిస్తే రుణం మొత్తం మాఫీ అవుతుంది. ప్రభుత్వం నుంచి పూర్తి స్థాయి మార్గదర్శకాలు రావాల్సి ఉందని డీఆర్‌డీఏ పీడీ నాగేశ్వరరావు తెలిపారు.

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి
లీగల్ ప్రకటనలు
ఈనాడు క్లాసిఫైడ్స్
వేడుక ఏదైనా.. ఈనాడు ను చేసుకోండి వేదిక
జన్మదిన శుభాకాంక్షలు
అంత్యక్రియలు, దశదిన, సంతాపం
ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి
ప్రకటనల కొరకు సంప్రదించండి : 80085 13290

(c) eenadu

▶ పూజలందుకుంటున్న అమ్మవారు ▶ క్యూలైన్లో దర్శనం కోసం వెళ్తున్న భక్తులు

గంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

లక్కిరెడ్డిపల్లె: అనంతపురం గ్రామంలో వెలసిన గంగమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, పూజాది కార్యక్రమాలు చేపట్టారు. జాతర ముగిసినప్పటికీ చుట్టుపక్కల గ్రామాల ప్రజలతో పాటు ఇతర జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఇక్కడ పూజలు నిర్వహించడం విశేషం. భక్తులకు ఆలయ సిబ్బంది తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఉద్యాన పరిశోధన కేంద్రానికి సొంత భవనం

బి.కొత్తకోట, న్యూస్‌టుడే: మండలంలోని బయ్యప్పగారిపల్లె ఉద్యాన పరిశోధన కేంద్రానికి రూ.60.54 లక్షల వ్యయంతో సొంత భవనం సమకూరుతోంది. రాష్ట్రీయ కృషి వికాస యోజన పథకంలో భాగంగా నిధులు మంజూరై టెండర్లు ఖరారైన పనులు జాప్యం జరిగింది. గత నెల 22న 'ఈనాడు'లో 'దశాబ్దమైనా కదలని పనులు' శీర్షికతో కథనం ప్రచురించగా అధికారులు స్పందించారు. కేంద్ర కార్యాలయంతో పాటు ప్రయోగశాలల పనులు ప్రారంభించారు. రెండో విడత భవన నిర్మాణాల కోసం అదనంగా రూ.25 లక్షలు కేటాయించాలని ఉన్నతాధికారులకు నివేదిస్తామని సీనియర్ శాస్త్రవేత్త ప్రతాప్ తెలిపారు.

పీఆర్సీ వెంటనే ప్రకటించాలి

రాయచోటి, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ, ఉద్యోగులకు పీఆర్సీ వెంటనే ప్రకటించాలని ఆపస్ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు నరసింహులు తెలిపారు. రాయచోటిలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 30 శాతం ఐఆర్ ప్రకటించి డీఏ త్వరగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన ఏపీజీఎల్ఐ బకాయిలు చెల్లించాలన్నారు. రాష్ట్ర కార్యదర్శి వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను ఆపస్ సాధిస్తుందన్నారు. రానున్న కాలంలో టెట్ సమస్య పరిష్కారమవుతుందని తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి, సహాధ్యక్షుడు సుధాకర్, నాగేంద్రబాబు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పరశురాం, నాగేశ్వరరావు, మధుమతి, బాలాజీ, నాగరాజు, శివశంకర్, రామ్మోహన్ పాల్గొన్నారు. అనంతరం సీపీఎస్ జిల్లా కన్వీనర్ వి.రమేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

మాట్లాడుతున్న ఆపస్ జిల్లా అధ్యక్షుడు నరసింహులు

మూగ జీవాలకు.. మృత్యుమార్గాలు

పీటీఎం నుంచి ములకలచెరువు వెళ్లే మార్గంలో నిరుపయోగంగా ఉన్న సాసర్ పిట్

జీవితకాలంలో వరుస ప్రమాదాల్లో మూగ జీవాలు మృత్యువాత పడుతున్నాయి. తాగునీరు లభించక రోడ్డెక్కుతున్న వాటిని వాహనాలు ఢీకొంటున్నాయి. కొన్నిసార్లు కుక్కల దాడుల్లో ప్రాణాలు కోల్పోతున్నాయి. అడవుల్లోని కుంటలు, వాగుల్లో నీరు ఇంకి పోవడంతో అవి గ్రామాల బాట పడుతున్నాయి.

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే:

తాగునీటి కోసం రాక..

వేసవి కాలంలో అడవుల్లో నీరు లభించదు. దీంతో నెమళ్లు, జింకలు గ్రామాల బాట పడుతున్నాయి. ఈ సమయంలో కొన్ని రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందుతున్నాయి. మదనపల్లె పరిధిలో 40 వేల హెక్టార్లలో అటవీ శాఖ విస్తరించి ఉంది. చిరుతలు, జింకలు, కణితలు, దుప్పిలు, పందులు, నెమళ్లు, ఎలుగుబంట్లు ఉంటున్నాయి. వీటికి వేసవిలో తాగునీరు లభించక జనారణ్యంలోకి వస్తున్నాయి. గత నవంబరు, డిసెంబరు నెలల్లో వర్షాలు తక్కువగా కురవడంతో అడవుల్లో నీటి జాడ కనిపించడం లేదు.

జింకలు మృత్యువాత..

పీటీఎం మండల కేంద్రం నుంచి ములకలచెరువు వెళ్లే రోడ్డు జింకలకు మృత్యుమార్గంగా మారింది. ఈ ప్రాంతంలో కృష్ణ జింకలు వందల సంఖ్యలో ఉంటాయి. వేసవిలో తాగునీటి కోసం రోడ్డు దాటే క్రమంలో ప్రమాదాలకు గురవుతున్నాయి. ములకలచెరువు, పీటీఎం మండలాల్లో ఏడాదిలో సుమారు 25 జింకలు ప్రాణాలు కోల్పోయాయి. తాగునీటి కోసం అధికారులు అక్కడక్కడ సాసర్ పిట్లు, నీటి తొట్టెలు ఏర్పాటు చేసినా నిర్వహణ సక్రమంగా లేదు. గతేడాది ఏప్రిల్‌లో నక్కలదిన్నెలోకి జింక రావడంతో కుక్కలు దాడి చేశాయి. ఇటీవల ములకలచెరువు, చౌడేపల్లె ప్రాంతాల్లో మూడు జింకలు మృతి చెందగా, మరికొన్ని ప్రమాదాల బారిన పడ్డాయి.

30 సాసర్ పిట్ల ఏర్పాటు..

పీటీఎం నుంచి ములకలచెరువు వెళ్లే మార్గంలో అటవీ ప్రాంతంలో 30 సాసర్ పిట్లు ఏర్పాటు చేయించాం. వేసవిలో వాటిలో తాగునీరు నింపుతాం. రోడ్డుపై వాహనాల్లో వెళ్లేవారు జాగ్రత్తలు తీసుకుంటే జింకలు ప్రమాదాలకు గురికాకుండా నివారించవచ్చు.

- ప్రసాద్‌రావు, రేంజర్, మదనపల్లె అటవీశాఖ కార్యాలయం

హ్యాపీ సండే.. మనసులో సంతోషం నిండే

■ పిల్లల నృత్యాలను తిలకిస్తున్న తల్లిదండ్రులు, స్థానికులు ■ నృత్యం చేస్తున్న విద్యార్థులు

రాయచోటి పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రారంభించిన హ్యాపీసండే కార్యక్రమాన్ని పురపాలక అధికారులు ఆదివారం ఘనంగా పట్టణంలో నిర్వహించారు. డైట్ మున్సిపల్ పాఠశాలలో కార్యక్రమాన్ని పురపాలక కమిషనర్ జి.రవి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రజల మానసిక ఉల్లాసం, సామాజిక అనుబంధాలను పెంపొందించడమే లక్ష్యంగా ప్రభుత్వం హ్యాపీసండే కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల్లో ప్రతి నెల రెండు, నాలుగు ఆదివారాల్లో నిర్వహించాలని నిర్ణయించిందన్నారు. ప్రజాభాగస్వామ్యంతో సాగే ఈ కార్యక్రమాన్ని రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లు, స్వచ్ఛంద సంస్థలు నిర్వహణ బాధ్యతలు చేపడతాయన్నారు. సంగీతం, నృత్యం, చిత్రలేఖనం, కళల ప్రదర్శన, యోగా, చిన్నపిల్లల ఆటలతో సమాజంలో సంతోషాన్ని నింపడమే లక్ష్యమని వివరించారు. పలు పాఠశాలల విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. డ్వాక్స్ స్కూల్‌కు చెందిన కళాకారుల ప్రదర్శన అలరించింది. పిల్లలతో కలిసి తల్లిదండ్రులు భారీగా తరలివచ్చారు.

పాఠశాలల్లో క్రీడలకు ప్రాధాన్యం

ఫుట్‌బాల్స్ అందజేస్తున్న డీఈవో సుబ్రహ్మణ్యం, ఎస్జీఎఫ్ కార్యదర్శి నాగరాజు

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే: పాఠశాలల్లో చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని డీఈవో సుబ్రహ్మణ్యం సూచించారు. ఆదివారం నవోదయ విద్యాలయంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పీఎంశ్రీ పాఠశాలలకు అంతర్జాతీయ అసోసియేషన్ ఫుట్‌బాల్ సమాఖ్య సహకారంతో ఫుట్‌బాల్స్ అందజేశారు. ఎస్జీఎఫ్ కార్యదర్శి నాగరాజు, ఫుట్‌బాల్ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు దిలీప్, మురళీధర్, క్రీడాభారతి సభ్యులు నరేష్, నవోదయ ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ శైలజ, ఎంఈవో ప్రభాకర్‌రెడ్డి, పీడీలు శివశంకర్, భద్రయ్య, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

▶ పార్వేటకు వెళ్తున్న వీరభద్రస్వామి ▶ జనసంద్రంగా మారిన పార్వేట ఉత్సవం

వైభవోపేతంగా వీరభద్రుని పార్వేట

రాయచోటి, న్యూస్‌టుడే: శ్రీ భద్రకాళీ సమేత వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలు చివరి రోజు ఆదివారం అత్యంత వైభవంగా జరిగాయి. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం వీరభద్రస్వామిని చక్కగా అలంకరించి పల్లకీపై ఉంచి ఆలయం నుంచి మార్కెట్‌వీధి, గాంధీబజార్, ఠాణా, రవిహాల్ వద్ద ఉన్న తేళ్ల మండపం వరకు ఊరేగించారు. గతంలో జరిగిన ఘటనల నేపథ్యంలో ఎస్పీ ధీరజ్ ఆధ్వర్యంలో ఏఎస్పీ వెంకటాద్రి బందోబస్తు పర్యవేక్షించారు. ముస్లిం సోదరులు ఊరేగింపులో భక్తులకు మజ్జిగ, నీళ్లు, పండ్ల రసాలు అందించి మత సామరస్యాన్ని చాటుకున్నారు. రాత్రి 12 గంటల వరకు స్వామివారి పార్వేట ఉత్సవం కనులపండువగా సాగింది. ఆలయ కమిటీ ఛైర్మన్ మనోజ్‌కుమార్, ఆర్డీవో శ్రీనివాస్, ఈవో వెంకటరమణారెడ్డి, డీఎస్పీ కృష్ణమోహన్, అధికారులు, భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రేనాటి సూర్యుడు ఉయ్యాలవాడ

నరసింహారెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఏఎస్పీ వెంకటాద్రి

రాయచోటి, న్యూస్‌టుడే: తెలుగు నేల గర్వించదగ్గ తొలితరం స్వాతంత్ర్య సమరయోధుడు,, బ్రిటిష్ సామ్రాజ్య వాదాన్ని గడగడలాడించిన వీరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి అని ఏఎస్పీ వెంకటాద్రి తెలిపారు. నరసింహారెడ్డి వర్ధంతిని ఆదివారం పోలీసు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. 1846లో బ్రిటిష్ పాలకులు పాలెగాళ్ల వ్యవస్థను రద్దు చేసి భారతీయుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయాలని చూసినపుడు నరసింహారెడ్డి సింహంలా గర్జించారన్నారు. కోయిలకుంట్ల ఖజానా వద్ద జరిగిన అవమానాన్ని సహించలేక తన పరిధిలోని 66 గ్రామాల ప్రజల సంక్షేమం కోసం ఆంగ్లేయులపై యుద్ధం ప్రకటించిన ధీశాలి అని కొనియాడారు. ప్రజల రక్షణ కోసం పని చేసే పోలీసు వ్యవస్థకు ఆయన చూపిన ధైర్యం ఒక నిరంతర ప్రేరణ అన్నారు. ఈ కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ పెద్దయ్య, డ్యూటీ ఆఫీసర్ శ్రీనివాసులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ ఏపీ ఎస్పీడీసీఎల్ సీఎండీ

తిరుపతి(జీవకోన), న్యూస్‌టుడే: ఎస్పీడీసీఎల్ సర్కిల్ స్థాయిలో విద్యుత్తు వినియోగదారుల సమస్యలపై ఫిర్యాదు, పరిష్కారానికి సోమవారం డయల్ యువర్ సీఎండీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సంస్థ సీఎండీ శివశంకర్ లోతేటి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సర్కిల్ పరిధిలోని తొమ్మిది జిల్లాలకు సంబంధించిన వినియోగదారులు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల కాల్ చేయవచ్చని అందులో వివరించారు. తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలకు సంబంధించిన వినియోగదారులు చరవాణి సంఖ్య 8977716661కు కాల్ చేయవచ్చని పేర్కొన్నారు.

జిల్లాల వారీగా చరవాణి సంఖ్యలు

తిరుపతి: 87126 52679

చిత్తూరు: 79931 47979

అన్నమయ్య: 94408 17449

24 నుంచి ఎస్వీయూ దూరవిద్య ప్రవేశాలు

తిరుపతి (ఎస్వీయూ), న్యూస్‌టుడే: ఎస్వీయూ దూరవిద్య విభాగంలో 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి పలు యూజీ, పీజీ, డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాల నిమిత్తం రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ఈనెల 24వ తేదీ నుంచి ప్రారంభం కానుంది. ఇందుకు సంబంధించి విద్యార్థులు www.svudoe.ac.in, www.svudde.in వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్లు, విభాగాలు ఎంపిక చేసుకోవచ్చని డీడీఈ డైరెక్టర్ ఆచార్య వి.రమేష్‌బాబు తెలిపారు. ఇతర వివరాలకు 0877 289380, 97051 05270 నంబర్లలో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

ఇంటర్మీడియట్ పరీక్షలకు పక్కాగా ఏర్పాట్లు

మదనపల్లె విద్య: జిల్లా వ్యాప్తంగా సోమవారం నుంచి ప్రారంభం కానున్న ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ ధీరజ్‌కునుబిల్లి తెలిపారు. 144 సెక్షన్ అమలు చేస్తామన్నారు. జిరాక్స్ కేంద్రాలు మూసివేయాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు చేపడతామన్నారు. ఎవరైనా మాస్ కాపీయింగ్, మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. కేంద్రాల్లోకి చరవాణి, ఎలక్ట్రానిక్ పరికరాలు, బడ్స్ తీసుకెళ్లకుండా పోలీసు సిబ్బంది తనిఖీ చేస్తారన్నారు. బయట వారు జవాబులు చెప్పడం, సంజ్ఞలు చేస్తే ఉపేక్షించమన్నారు. విద్యార్థులు ఒత్తిడికి గురి కాకుండా పరీక్షలు రాసి తల్లిదండ్రులకు, జిల్లాకు పేరు తీసుకురావాలని సూచించారు.

నిఘా ముమ్మరం చేస్తాం

ఈనాడు కథనానికి స్పందన

'చూడరు తవ్వేయ్.. అడగరు అమ్మేయ్' శీర్షికన ఈ నెల 19న 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి జిల్లా గనుల శాఖ అధికారి రంగకుమార్ స్పందించారు. సంబంధిత కార్యాలయ సిబ్బంది సంబేపల్లె మండల పరిధిలోని బుడ్డారెడ్డిగారిపల్లె, దేవపట్ల మిట్ట, నారాయణరెడ్డి పల్లెలో అక్రమ తవ్వకాలు పరిశీలించారు. అనంతరం తహసీల్దార్‌తో చర్చించారు. రెవెన్యూ సిబ్బందితో నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు.

- న్యూస్‌టుడే, సంబేపల్లె

నిందితుడి గాలింపునకు ప్రత్యేక బృందాలు

ములకలచెరువు, న్యూస్‌టుడే: మండలానికి చెందిన బాలిక అదృశ్యంపై ములకలచెరువు పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడి కోసం రెండు బృందాలతో గాలిస్తున్నట్లు సీఐ వెంకటేశులు చెప్పారు. ఈ నెల 19న హరినాథ్ అనే వ్యక్తి బాలికను తీసుకెళ్లినట్లు ప్రాథమిక విచారణలో తేలిందన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఇప్పటికే వారిద్దరికీ పెద్దలు కౌన్సెలింగ్ ఇచ్చినా ఏమాత్రం ఫలితం లేదన్నారు.

ఎత్తులు వేశారు.. విజేతలుగా నిలిచారు

విజేతలతో కలెక్టర్ వెంకటేశ్వర్, భానుప్రకాష్ రెడ్డి, నరసింహ యాదవ్, శ్రీధర్ వర్మ

తిరుపతి(క్రీడలు), న్యూస్‌టుడే: శాప్ లీగ్ పోటీల్లో భాగంగా తిరుపతిలోని శ్రీశ్రీనివాస క్రీడా సముదాయం వేదికగా రెండ్రోజులపాటు జరిగిన రాష్ట్రస్థాయి చదరంగం పోటీలు ఆదివారం ఉత్సాహంగా ముగిశాయి. పోటీల్లో పలు జిల్లాలకు చెందిన బాలబాలికలు ఎత్తులకు పైఎత్తులు వేస్తూ ప్రత్యర్థులపై సత్తాచాటారు. మొదటిమూడు స్థానాల్లో నిలిచిన వారికి ఆదివారం ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, తితిదే పాలకమండలి సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్, తెదేపా రాష్ట్ర మీడియా సమన్వయకర్త, శాప్ మాజీ డైరెక్టర్ శ్రీధర్‌వర్మ ట్రోఫీ, పతకం, ప్రశంసా పత్రాలు ప్రదానం చేశారు. జిల్లా క్రీడాభివృద్ధి అధికారి శశిధర్, చదరంగం సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాసనూరి, శాప్ శిక్షకులు పాల్గొన్నారు.

24న అండర్-18 సైక్లింగ్ పోటీలు

చిత్తూరు(క్రీడలు), న్యూస్‌టుడే: శాప్ లీగ్ జిల్లా స్థాయి అండర్-18 సైక్లింగ్ పోటీలు ఈ నెల 24న చిత్తూరులోని డీఎస్ఏ స్టేడియంలో నిర్వహించనున్నట్లు డీఎస్‌డీవో ఉదయభాస్కర్ తెలిపారు. బాలురు, బాలికలకు వేర్వేరుగా పోటీలు నిర్వహిస్తామన్నారు. ఆసక్తిగల ఆటగాళ్లు తమ పేర్లను శాప్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలన్నారు. విజేతలు త్వరలో ఎన్టీఆర్ జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధిస్తారని ఆయన పేర్కొన్నారు.

ఆదర్శనీయులు అనంతాళ్వార్

తిరుమల: శ్రీవైష్ణవ భక్తాగ్రేసరుడు, ఆళ్వారుల్లో ప్రముఖుడైన శ్రీఅనంతాళ్వార్ జీవితం అందరికీ ఆదర్శప్రాయమని తితిదే జేఈవో డాక్టర్ ఎ.శరత్ పేర్కొన్నారు. స్థానిక అనంతాళ్వార్ తోట (పురుశైవారితోట)లో శ్రీఅనంతాళ్వార్ 972వ అవతార మహోత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. భక్తి అంటే సేవ అని నిరూపించిన మహానుభావుడు అనంతాళ్వార్ అని ఆయన కీర్తించారు. వేంకటకృష్ణ స్వామి, భరద్వాజస్వామి పాల్గొన్నారు.

వైకాపా పతనానికి కారణం పవన్‌కల్యాణ్

ములకలచెరువు, న్యూస్‌టుడే: గత వైకాపా అవినీతి పాలనకు పాతర వేసి కూటమి ప్రభుత్వ విజయానికి జనసేన అధినేత పవన్‌కల్యాణ్ వారధిగా నిలిచారని రాష్ట్ర హస్తకళల అభివృద్ధి ఛైర్మన్ పసుపులేటి హరిప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం తంబళ్లపల్లెలో జనసేన నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. తంబళ్లపల్లె క్రాస్ రోడ్డులో పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో హరిప్రసాద్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలో జనసేన బలోపేతానికి సాయినాథ్ సారథ్యంలో కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ రాష్ట్ర భవిష్యత్తు కోసం అలుపెరగని కృషి చేస్తున్నారన్నారు. నియోజకవర్గంలో 25 వేలు సభ్యత్వాలు చేపడితే పవన్‌కల్యాణ్‌ను తంబళ్లపల్లె తీసుకువస్తామన్నారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి సాయినాథ్, మదనపల్లె ఇన్‌ఛార్జి రాందాస్‌చౌదరి, ఏఎంసీ ఛైర్మన్ శివరాం, నాయకులు సురేంద్ర, సిద్దమల్‌రెడ్డి, నరసింహులు, నరేందర్‌రెడ్డి, కరుణాకర్, మనోహర్, సూరి తదితరులు పాల్గొన్నారు.

పత్రాలు ఆవిష్కరిస్తున్న హరిప్రసాద్, నాయకులు

మామిడి.. తీపి అందించేనా!

☛ వీడని తెగుళ్లు.. ఆందోళనలో రైతులు ☛ అనుకూలించని వాతావరణం

■ మందులను పిచికారి చేస్తున్న రైతులు ■ చెట్టులో నల్లగా మారిన పూత

చిన్నమండెం, న్యూస్‌టుడే: ఏటికేడు మామిడి పంటకు సరిపడా వాతావరణ పరిస్థితులు అనుకూలించడం లేదు.. ఫలితంగా పంట దిగుబడులు ఆశించిన స్థాయిలో రావట్లేదు.. ఉమ్మడి చిత్తూరు జిల్లా సహా ఇక్కడా మామిడి పంట ప్రధానమైనదే. జిల్లాలో మామిడి దాదాపు 67 వేల హెక్టార్లలో సాగవుతోంది.. గతేడాది నవంబరులో కురిసిన వర్షాలకు తేమ శాతం అధికమై పూత ఆలస్యమైంది.. ప్రస్తుతం పూత పుష్కలంగా కనపడుతున్నా తెగుళ్ల బెడద, అనుకూలించని వాతావరణ పరిస్థితుల కారణంగా పంట ఏమాత్రం చేతికందుతుందోనన్న బెంగ రైతుల్లో నెలకొంది.. గతేడాది తెగుళ్లతో పంట ఆశించిన స్థాయిలో రాలేదు.. ధర అంతంతమాత్రంగానే పలికింది.. చివర్లో తోతాపురి రకాన్ని అడిగే వారే లేకుండా పోవడం గమనార్హం.

నాలుగుసార్లు మందుల పిచికారీ..

ఈసారి పూత పలు దశల్లో వస్తోంది. కొన్ని చెట్లలో పుష్కలంగా రావడం, మరికొన్నింటిలో పూత, చిగురు ఏకంగా కలిసి వచ్చాయి. ఈ ఏడాది బేనీషా రకం మరీ ఆలస్యంగా పూసింది. ముందుగా పూత వచ్చిన వాటిలో తేనె మంచు పురుగు, ఇతర తెగుళ్ల కారణంగా బంక కనబడటంతో రైతులు ఇప్పటికే మూడు నుంచి నాలుగుసార్లు మందులు పిచికారీ చేశారు. ఇంకా చాలా చెట్లు చిగురిస్తుండటంతో మళ్లీ బంక వస్తుందన్న ఆందోళన రైతుల్లో నెలకొంది. రాత్రి వేళ చల్లగా, పగటిపూట ఉష్ణోగ్రతలు పెరగడంతో పిందె ఏ మాత్రం నిలబడుతుందోనని వారు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. వేలాది రూపాయలు వెచ్చించి రసాయన మందులు పిచికారీ చేస్తున్నా ఏమాత్రం పంట చేతికొస్తుందో తెలియడం లేదని వాపోతున్నారు.

అధికారులు సంప్రదించాలి

ఉష్ణోగ్రతలు పెరగడంతో తెగుళ్ల బెడద తగ్గే అవకాశం ఉంది. మందుల విషయంలో అధికారులను సంప్రదించి తగు మోతాదులోనే పిచికారీ చేయాలని రాయచోటి ఉద్యానశాఖ అధికారి సురేష్‌బాబు పేర్కొన్నారు.

- సురేష్‌బాబు, ఉద్యానశాఖ అధికారి

సౌత్‌జోన్ క్రికెట్ ఛాంపియన్‌గా నెల్లూరు

కడప క్రీడలు, న్యూస్‌టుడే: వైఎస్‌ఆర్‌ఆర్-ఏసీఏ స్టేడియం, కేఎస్‌ఆర్‌ఎం క్రికెట్ మైదానాల్లో జరుగుతున్న ఏసీఏ సౌత్‌జోన్ అండర్-12 క్రికెట్ పోటీల్లో ఛాంపియన్‌గా నెల్లూరు జట్టు నిలిచింది. ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లోనూ నెల్లూరు జట్టు విజయాలను సాధించి 8 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. కడప జట్టు 2 మ్యాచ్‌లు గెలిచి 4 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది. మూడో స్థానంలో కర్నూలు, నాలుగో స్థానంలో చిత్తూరు, అయిదో స్థానంలో అనంతపురం జట్లు నిలిచాయి. టోర్నమెంట్ చివరి రోజు ఆదివారం కర్నూలుపై కడప, చిత్తూరుపై నెల్లూరు జట్లు విజయం సాధించాయి.

హోరాహోరీ పోరులో సింహపురి గెలుపు.. కేఎస్‌ఆర్‌ఎం క్రికెట్ మైదానంలో జరిగిన క్రికెట్ మ్యాచ్‌లో చిత్తూరుపై నెల్లూరు జట్టు విజయం సాధించింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన నెల్లూరు జట్టు నిర్ణీత 35 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 205 పరుగులు చేసింది. జట్టులో జాన్సన్ 90, శ్రీరామ్ 39 పరుగులు చేశారు. చిత్తూరు బౌలర్లలో హేమ్ సాత్విక్, పునీత్‌సాయిరెడ్డి చెరో మూడు వికెట్లు తీసుకున్నారు. 206 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌ను ఆరంభించిన చిత్తూరు జట్టు నిర్ణీత 35 ఓవర్లలో 190 పరుగులకు ఆలౌట్ అయింది. జట్టులో గోకుల్‌సాయి 58, భువన్‌సాయి 21 పరుగులు చేశారు. నెల్లూరు బౌలర్లలో సుచిత్‌రెడ్డి 4, ఆయూష్, శ్రీరామ్ చెరో రెండు వికెట్లు తీసుకున్నారు. హోరాహోరీగా జరిగిన ఈ మ్యాచ్‌లో నెల్లూరు జట్టు 15 పరుగుల తేడాతో గెలుపొందింది.

పంపిణీకి సిద్ధంగా కూరగాయల నారు మొక్కలు

చిత్తూరు(వ్యవసాయం): కుప్పంలోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్(సీవోఈ)లో అధిక దిగుబడులిచ్చే నాణ్యమైన కూరగాయల నారు మొక్కలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని జిల్లా ఉద్యాన శాఖ డీడీ రామాంజనేయులు తెలిపారు. సీవోఈలో టమాట నారు మొక్కలు 11 లక్షలు, కాకర 10 వేలు, బీర 11 వేలు, వంగ 7 వేల మొక్కలు సిద్ధంగా ఉన్నాయని..90శాతం రాయితీపై రైతులకు అందజేస్తామన్నారు. నారు మొక్కలు కావలసిన రైతులు ఉద్యాన శాఖ అధికారులను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

హత్య కేసులో వీడని మిస్టరీ

గాలివీడు, న్యూస్‌టుడే: మండలంలో ఈ నెల 17న జరిగిన ఓ వ్యక్తి హత్య కేసు మిస్టరీ వీడలేదు. వివిధ కోణాల్లో పోలీసులు విచారణ చేపట్టారు. అనుమానం కింద ఇప్పటికే కొందరిని విచారించారని విశ్వసనీయ సమాచారం. గోరాన్‌చెరువు పంచాయతీ వడిశలవంకపల్లికు చెందిన గుర్రం కృష్ణారెడ్డిని గత మంగళవారం రెక్కీ నిర్వహించిన గుర్తు తెలియని వ్యక్తులు మామిడితోటలోనే కత్తితో దాడి చేసి గొంతు కోసి హత్య చేసిన సంఘటన విదితమే. పోలీసులు అదేరోజు జాగిలంతో దర్యాప్తు ప్రారంభించారు. వారం రోజులు కావస్తున్నా ఈ ఘటనపై పలు ఊహాగానాలు వెలువడుతున్నాయి. మృతుడి భార్య, కుమారులు ఇంకా.. ఆ షాక్ నుంచి బయటపడలేదు. పోలీసులు వివిధ కోణాల్లో అందిన సమాచారం మేరకు దర్యాప్తు ముమ్మరం చేసిన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే మృతుడి సొంత గ్రామంలో కొందరిని విచారించారని సమాచారం. హత్య కేసు దర్యాప్తును గోప్యంగా ఉంచారు. త్వరలో పోలీసులు వాస్తవాలు వెల్లడించే అవకాశం ఉంది.

మనస్తాపానికి గురై వివాహిత ఆత్మహత్య

లక్కిరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: మండలంలోని కస్తూరి రాజుగారిపల్లె పంచాయతీని దేవలంపల్లెకు చెందిన అరుణ (25) ఉరివేసుకుని మృతి చెందినట్లు ఎస్సై గోల్కొండ శోభ తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.. అరుణను.. చిన్నమండెం మండలంలోని మల్లూరు గ్రామానికి చెందిన వ్యక్తికి ఇచ్చి నాలుగు నెలల క్రితం వివాహం చేశారు. అయితే భార్యాభర్తలు విడిపోయి వేర్వేరుగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో ఆమె మనస్తాపానికి గురై ఆదివారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుంది. శవపరీక్షల కోసం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి మృతదేహాన్ని తరలించి కేసు నమోదు చేశామని ఎస్సై శోభ తెలిపారు.

బొలేరో ఢీకొనడంతో ఒకరి మృతి

ఇద్దరికి తీవ్ర గాయాలు

సుండుపల్లి, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనాన్ని బొలేరో ఢీకొట్టడంతో ఒకరు మృతి చెందగా.. ఇద్దరు తీవ్రంగా గాయపడిన ఘటన వైఎస్సార్ కడప జిల్లా సుండుపల్లి మండల పరిధిలోని సుండుపల్లి-రాయచోటి ప్రధాన రహదారిపై ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. అన్నమయ్య జిల్లా రాయచోటి మండలానికి చెందిన రఘుపతి(40) నాగూర్ బాషా, షేక్‌షావలి భవన నిర్మాణ పనుల నిమిత్తం సుండుపల్లికి వస్తున్నారు. ముచ్చుగుంతరాళ్ల గుట్ట సమీపంలో కోళ్లను దింపి రాయచోటికి వెళ్తున్న బొలేరో వారిని ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న ముగ్గురూ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తలకు బలమైన గాయమైన రఘుపతి చికిత్స పొందుతూ మృతి చెందారు. మిగిలిన ఇద్దరినీ మెరుగైన చికిత్స కోసం తిరుపతికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై హుస్సేన్ తెలిపారు.

ద్విచక్ర వాహనం డివైడర్‌ను ఢీకొన్న ఘటనలో..

మాసాపేట(రాయచోటి), న్యూస్‌టుడే: స్థానిక మాసాపేటలోని జడ్పీ ఉన్నత పాఠశాల వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ధర్మారెడ్డి(45) మృతి చెందారు. రాయచోటిలో జరిగిన వివాహం చూసుకుని రామాపురం మండలం బండపల్లిలోని పొత్తుకూరుపల్లెకు ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా వాహనం నడుపుతున్న వ్యక్తి అజాగ్రత్తగా వెళ్లడంతో డివైడర్‌ను ఢీకొందని పోలీసులు తెలిపారు. వాహనంపై వెనుక కూర్చొన్న ధర్మారెడ్డి తీవ్రంగా గాయపడగా.. స్థానికులు 108 వాహనంలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని తెలిపారన్నారు. కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

EENADU e Classifieds

HEALTH & CARE

PAEDIATRIC

శ్రీవిష్ణు చిన్నపిల్లల హాస్పిటల్: డా॥ కె.కీర్తన (M.D., Pediatrics, SVMC & Ex. Senior Resident RUIA, Fellow in Neonatology) పుట్టిన బిడ్డలు & చిన్నపిల్లల వైద్యనిపుణులు, 24X7 ఎమర్జెన్సీ కేసులు చూడబడును. మనోహరి హాస్పిటల్ ప్రక్కన, రెడ్డి & రెడ్డి కాలనీ, తిరుపతి ✆ 63035 53359.

REAL ESTATE

FLAT FOR SALE

GENERAL

TIRUPATI 3BHK Flat for SALE. Spacious 2000 Sqft East Facing in Narayana Puram, Lift & Car Parking Available.9703358869.

తిరుపతి గెస్ట్‌లైన్ హోటల్‌కి ఆనుకొని మాస్టర్‌ప్లాన్ 80 feet రోడ్డుకు AB Aavas Phoenix Tower Smart Homesలో 2 BHK, 3 BHK Flats సేల్స్‌కు కలవు. RERA PROJECT ✆ 95055 02346

PLOT FOR SALE

GENERAL

రేణిగుంట, బుగ్గవీధి నుంచి ఇమామ్ వీధిలోకి వెళ్లే కార్నర్ ఇంటి డి.నెం12-296, వెనుకఉన్న, పడమరఫేసింగ్ కొ:29x40 ఉన్న ఖాళీజాగా అమ్మబడును No Brokers ✆ 94911 35998.

తిరుపతి IIT దగ్గర దుర్గిపేరి నందు 25x40 కొలతలతో పడమర ఫేసింగ్ ప్లాట్ కలదు. కేవలం 4,20,000/- మాత్రమే. ✆ 80997 85333.

TO LET

చంద్రగిరి కొత్తపేట, బజారువీధి D.No. 2/7, 2BHKహౌస్, 24 hrs వాటర్ మరియు ఏసీతో కలిపి అద్దెకు ఇవ్వబడును ✆ 98858 01024, 94903 62354.

JOBS

Job Openings for Tele callers Salary 10,000-25,000 per month work from office, Bairagipatteda, Tirupati ✆ 97899 96435.

హైదరాబాద్ యూనిటీ హోంకేర్‌లో ఏజెంట్లకు మంచి అవకాశం. మీరు వర్కర్స్‌ని పంపితే మొదటినెల 5వేలు కమీషన్. వర్కర్స్ జీ:15K, ఫ్రీవసతి,ఫుడ్. 8121541212

అడ్మినిస్ట్రేటివ్ పర్సన్స్ కావలెను. Qly: డిగ్రీ/ MBA అనుభవం, ఉత్సాహవంతులైన వారు తిరుపతి టౌన్‌లో పని చేయుటకు. ఆకర్షణీయమైన జీతం. ✆ 97034 02722.

ఆటో డ్రైవర్ కావలెను. అనుభవం, లైసెన్స్ కలిగి ఉండవలెను. (తిరుపతి టౌన్‌లో పని చేయుటకు) ఆకర్షణీయమైన జీతం. Cont: 97034 02722.

MARKETING/ SALES

Anand Masale Require Sales & Marketing Manager, Marketing Executives. Contact: 98496 55105, 98480 53144 Email: anand masalaap-pltd @ gmail.com.

మా సౌత్ ఇండియన్ హోమ్ బేస్డ్ స్నాక్స్ కంపెనీకి నగరి మరియు పుత్తూరు సమీప ప్రాంతాలలో సేల్స్ ఏజెంట్స్ కావలెను. (ఫుల్ టైం & పార్ట్ టైం). మంచి జీతం + ప్రోత్సాహకాలు. సెల్: 74117 41878.

EENADU THE WAY CLASSIFIEDS B/W 5 లైన్ల ప్రకటన రూ. 500/- Colour 5 లైన్ల ప్రకటన రూ. 600/- మాత్రమే తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల్లో అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు వివరాలకు... 80085 13290

మీ చిన్నారులకు పుట్టిన రోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి B/W: రూ. 600 Colour: రూ. 800

ప్రకటనలపై 5% GST వర్తించును

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

రాయచోటి
• రాయచోటి • పీలేరు

నేడు పీలేరు ఆర్డీవో కార్యాలయంలో గ్రీవెన్స్

పీలేరు, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్‌ఎస్) కార్యక్రమాన్ని సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించనున్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల పక్కన ఉన్న డివిజనల్ కార్యాలయంలో.. ఆర్డీవో శ్రీనివాస్ డివిజన్ పరిధిలోని అర్జీదారుల నుంచి వినతులు స్వీకరిస్తారని అధికారులు తెలిపారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

కంభంవారిపల్లి, న్యూస్‌టుడే: తీతవగుంటపల్లె పంచాయతీ కుమ్మరపల్లెలో శ్రీనివాస చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలోని వృద్ధాశ్రమంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 19 మందికి పరీక్షలు నిర్వహించి, వారిలో 8 మందిని శస్త్రచికిత్సకు ఎంపిక చేసి ఆపై మందులు పంపిణీ చేశారు. ట్రస్టు సభ్యులు బ్రహ్మారెడ్డి, నిపుణులు ప్రసన్నకుమార్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

బస్టాండ్‌లో మెరుగైన వసతులు కల్పిస్తాం

పీలేరు: ఆర్టీసీ ప్రాంగణంలో ఖాళీగా ఉన్న స్థలాలను టెండర్ల ద్వారా ఐదు, 15ఏళ్ల ప్రాతిపదికన అద్దెకు ఇస్తామని, ఇందుకు ఈడీ, ఆర్‌ఎంకు నివేదించామని డీఎం రోషన్ తెలిపారు. ఆదివారం ఆయన బస్టాండ్ మేనేజరు బాబునాయక్‌తో కలిసి ప్రాంగణంలో పెరిగిన పిచ్చిమొక్కలను జేసీబీతో తొలగింపజేశారు. బస్టాండులో రూ.45 లక్షలతో చేపట్టిన మరుగుదొడ్ల నిర్మాణం పూర్తయిందన్నారు. బస్టాండులో నీరు నిలవకుండా రూ.7.5 లక్షలతో తిరుపతి ప్లాట్‌ఫారం నుంచి వెలుపలకు కాలువ నిర్మిస్తున్నామన్నారు.

ముగిసిన పోలేరమ్మ తిరుణాల

గాలివీడు: శెట్టివారిపల్లి వద్ద పోలేరమ్మ జాతర ఆదివారం ఘనంగా నిర్వహించారు. మరు తిరుణాలలో ఉదయాన్నే బోనాలు ఎత్తుకుని మహిళలు అమ్మవారి ఆలయ ప్రదక్షిణ చేశారు. ఆపై పూజలు చేశారు. మొక్కుబడులు తీర్చుకున్నారు. తూముకుంట పెద్దగొడుగు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

శ్రీసత్యమ్మ తల్లి ఆలయానికి కవచాల వితరణ

గండబోయనపల్లె(వాల్మీకిపురం), న్యూస్‌టుడే: మండలంలోని గండబోయన పల్లె గ్రామంలో వెలసిన శ్రీ సత్యమ్మ తల్లికి హైదరాబాద్‌కు చెందిన దాసరి వెంకటేష్, వరలక్ష్మి దంపతులు పంచలోహ కవచాలను ఆదివారం అందజేశారు. బెంగళూరుకు చెందిన చింతకుంట వీర శివప్రసాద్ రెడ్డి, యజ్ఞిత దంపతులు ఈ ఆలయంలోని మూల విరాట్ చిన్న ఆలయానికి పంచలోహ కవచాలు అందజేశారు. ఎర్రావాండ్లపల్లెకు చెందిన సునీల్ కుమార్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి కుటుంబ సభ్యులు ఆలయానికి 10 బెంచీలు వితరణగా ఇచ్చారు. దాతలు అందజేసిన పంచలోహ కవచాలను అమ్మవారికి అర్చకులు అలంకరింపజేశారు. ఆలయ ధర్మకర్త సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు తత్తేజస్వామి, సర్పంచి గిరిజమ్మ, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి, చక్రపాణి ఓబుల్‌రెడ్డి, అమరనాథరెడ్డి, జయరామిరెడ్డి, రెడ్డప్ప, రెడ్డిశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి ఏర్పాటు చేసిన నూతన కవచాలు

ప్రణాళికాబద్ధంగా సేవా కార్యక్రమాలు

వాల్మీకిపురం: మానవత స్వచ్ఛంద సంస్థ సేవా కార్యక్రమాలను ప్రణాళిక బద్ధంగా ముందుకు తీసుకెళ్లాలని సంస్థ జిల్లా అధ్యక్షుడు కృష్ణమూర్తి అన్నారు. ఆదివారం సత్యసాయి సేవా సమావేశ మందిరంలో సంస్థ సభ్యులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అధ్యక్షుడు కేశవరెడ్డి, సభ్యులు ఆనంద శెట్టి, రామకృష్ణారెడ్డి, శంకర, చంద్ర, పీవీ, సత్యనారాయణ, నాగరాజ, మురళి, రాజారెడ్డి, లక్ష్మన్న, లక్ష్మీనారాయణ, చంద్రశేఖర్ పాల్గొన్నారు. **కలకడ:** ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను ప్రోత్సహించేలా మానవత సంస్థ సేవలు ఉండాలని సంస్థ మండల అధ్యక్షుడు సయ్యద్‌సాబ్ సూచించారు. సంస్థ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. సభ్యులు పాల్గొన్నారు.

ఆక్రమించేయ్.. అడిగేదెవరు..!

❖ రోడ్లపై దర్జాగా ఆక్రమణలు ❖ రాకపోకలకు తీవ్ర ఇక్కట్లు ❖ చోద్యం చూస్తున్న అధికారులు

న్యూస్‌టుడే, రాయచోటి

పట్టణంలోని పలు రహదారులపై వ్యాపార సముదాయాలు దర్జాగా వెలుస్తున్నాయి. అసలే ఇరుకైన రోడ్లతో వాహనదారులు ఇప్పటికే అవస్థలు పడుతున్నారు.. ఈ పరిస్థితుల్లో చిరు వ్యాపారులు రహదారులను ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు చేస్తుండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎవరికివారు బహిరంగంగా ఆక్రమిస్తున్నా అడ్డుకునే నాథుడే కరవయ్యాడు.. అడిగేవారు లేకపోవడంతో ఎవరికివారికి ఇష్టారాజ్యంగా మారింది.

ఎస్‌ఎన్ కాలనీలో రోడ్డుపైనే వాహనాలు..

దర్జాగా వ్యాపారం..

పురపాలక అధికారులు తాత్కాలిక దుకాణాల వ్యాపారుల నుంచి రోజువారీ గేట్ పన్నులు వసూలు చేసుకుంటూ రహదారులపై ఉన్న ఆక్రమణల గురించి పట్టించుకోవడం లేదు. ట్రాఫిక్ సమస్య తలెత్తినప్పుడు పోలీసులు నానా హడావుడి చేసి సదరు ఆక్రమణలపై దృష్టి సారిస్తున్నారు. మిగిలిన సమయాల్లో పట్టించుకోకపోవడంతో ఎలాంటి అనుమతులు లేక అడ్డదిడ్డంగా దుకాణాలు ఏర్పాటు చేసి దర్జాగా తమ వ్యాపారాలు సాగిస్తున్నారు. రాయచోటి, పీలేరులో ఇలాంటి సమస్యలు నిత్యకృత్యమయ్యాయి. ఫలితంగా తరచూ ఏదో ఒక ప్రాంతంలో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

ప్రధాన మార్గాలే లక్ష్యం..

రాయచోటి పట్టణంలో ప్రధాన రహదారులనే లక్ష్యంగా చేసుకుని వ్యాపారులు ఆక్రమిస్తున్నారు. తోపుడుబండ్లు, గుడారాలు వేసుకుని మరీ వ్యాపారాలు చేస్తున్నారు. రాజా కూడలి నుంచి దిగువ పెట్రోల్‌బంక్, ఎగువ నేతాజీ కూడలి, చిత్తూరు రోడ్డు, ఎస్‌ఎన్ కాలనీ, మదనపల్లె రోడ్డు, గాలివీడు రోడ్డు, కొత్తపేట, కె.రామాపురం మార్గాల్లో ఆక్రమణలు తొలగించలేదు. పీలేరులోని రాయచోటి-పీలేరు, పీలేరు-తిరుపతి, పీలేరు-చిత్తూరు, మదనపల్లె రోడ్లపై ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు చేశారు. కొందరు అధికార బలంతో విచ్చలవిడిగా రోడ్లకు ఇరువైపులా దుకాణాలు పెట్టి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నారు. కొనుగోళ్లకు వచ్చేవారు ద్విచక్ర వాహనాలను రోడ్డుపైనే పెట్టి వస్తువులు, కూరగాయలు కొనుగోలు చేస్తుంటారు. ఆ సమయాల్లో ట్రాఫిక్ తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. పురపాలక, ఆర్‌అండ్‌బీ, ఎన్‌హెచ్, పోలీసు అధికారుల మధ్య సమన్వయం కొరవడటంతో ఆక్రమణల తొలగింపు ప్రశ్నార్థకంగా మారింది. పట్టణంలోని వీధి వ్యాపారులను గుర్తించి వారికి ప్రత్యేక స్థలం కేటాయించాల్సి ఉన్నా ఆ దిశగా చర్యలు కరవయ్యాయి. దీంతో ఎక్కడ ఖాళీ స్థలం దొరికితే అక్కడే దుకాణాలు పెట్టడంతో ఈ సమస్య తలెత్తుతోంది. ఉన్నతాధికారులు చొరవ తీసుకుని ఆక్రమణలు తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

నోటీసులిచ్చి తొలగింపజేస్తాం..

రహదారులను ఆక్రమించిన వారికి నోటీసులు ఇస్తాం. గడువు లోగా తొలగించకుంటే తామే తొలగిస్తాం. రహదారులకు ఇరువైపులా ఆక్రమణల తొలగింపునకు కొన్ని ప్రాంతాల్లో సర్వే చేయించాం. చిరు వ్యాపారులు పట్టణంలో ఖాళీగా ఉన్నచోట దుకాణాలు ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకుంటాం. **-జి.రవి, పురపాలక కమిషనర్**

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
రాయచోటి : 9703622242
పీలేరు : 8008574958
చిన్నమండెం: 9440170752

న్యూస్‌టుడే, గాలివీడు

సమస్య: పెద్దపల్లి రక్షిత మంచినీటి పథకం కోసం రెండు నెలల కిందట విద్యుత్తు వైర్లు లాగారు. మిగిలిన వైరు ఎరువుల పేడదిబ్బపై ఉంచారు. ఈ దారిలోనే ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. **-బసిరెడ్డి, స్థానికుడు**

సమాధానం: ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటాం. **-కృష్ణయ్య, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్**

న్యూస్‌టుడే, చిన్నమండెం

సమస్య: కలిబండ కస్పాలో రామాలయం మార్గంలో వీధిదీపాలు చాలాకాలం నుంచి వెలగడం లేదు. ఫలితంగా రాత్రి వేళ చీకటిగా ఉంటుంది. **-స్థానికులు, కలిబండ కస్పా**

సమాధానం: సమస్య పరిశీలించి వీధిదీపాలు మరమ్మతులు చేయిస్తాం. **-శ్రీధర్‌కుమార్‌రెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో**

ప్రతి గ్రామానికీ ఝరికోన నీరు

జలకళ సంతరించుకున్న ఝరికోన ప్రాజెక్టు

కంభంవారిపల్లి, న్యూస్‌టుడే: తువ్వపల్లె పంచాయతీ సరిహద్దులో ఝరికోన ప్రాజెక్టు నిర్మించారు. 12 సంవత్సరాల క్రితం ఝరికోన నుంచి కంభంవారిపల్లె, కలకడ, కలికిరి మండలాలకు రూ.50 కోట్లతో తాగునీటి వసతి కల్పించారు. ఈ మూడు మండలాలకు 120 కిలోమీటర్ల మేర పైపులైన్ వేసి, తాగునీరు సరఫరా చేస్తున్నారు. స్థానికంగా ఉన్న నీటి పథకం బోర్లు మరమ్మతుకు గురైనా, బోర్లు ఎండిన సమయాల్లో ఝరికోన నీటిని అందజేస్తున్నారు. గతంలో పైపులైన్‌కు అక్కడక్కడ మరమ్మతులు ఉన్నా, ప్రస్తుతం వాటికి మరమ్మతు చేసి, నీటిని సరఫరా చేస్తున్నారు. ఈ మూడు మండలాలకు సంబంధించి 625 పల్లెలకు తాగునీరు సరఫరా చేయాల్సి ఉన్నా.. ప్రస్తుతం 494 పల్లెలకే సరఫరా చేస్తున్నారు. సమస్య ఉన్న గ్రామాల్లో ఝరికోన నీటిని సరఫరా చేయడానికి చర్యలు తీసుకుంటున్నారు.

అధికారుల దృష్టికి తీసుకురావాలి..

గ్రామాల్లో నీటి సమస్య ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలి. ఝరికోన నీటిని మూడు మండలాల్లో నిర్ణయించిన గ్రామాలకు సరఫరా చేస్తున్నాం. పైపులైన్‌కు చిన్నపాటి మరమ్మతులు చేస్తున్నాం. **-మధుసూదన్, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్**

విద్యాలయాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

గురువులతో పూర్వ విద్యార్థులు

వాల్మీకిపురం, న్యూస్‌టుడే: స్థానిక ప్రభుత్వ పీవీసీ ఉన్నత పాఠశాలలో 1998-1999లో పదో తరగతి చదివిన విద్యార్థులందరూ ఆదివారం తాము చదువుకున్న విద్యాలయంలో ఒకేచోట కలిశారు. ఆ రోజుల్లో తరగతి గదులు, విద్యాలయంలోని క్రీడా మైదానం తదితర ప్రాంతాల్లో వారు కలియ తిరిగి నాటి జ్ఞాపకాలు గుర్తుచేసుకున్నారు. ఆర్‌ఎం ఫంక్షన్‌హాల్‌లో 1998లో నాటి గురువులతో సమావేశమై అప్పటి విషయాలు చర్చించి అందరూ కలిసి భోజనాలు చేశారు. నాటి గురువులు ప్రస్తుత డివిజనల్ విద్యాధికారి లోకేశ్వర్‌రెడ్డి, మురళి, నజీరుల్లా, ఓబుల్‌రెడ్డి, శంకర్, వెంకటరమణ, బీవీరమణ తదితరులతో పాటు ప్రస్తుత హెచ్‌ఎం వసుంధరను ఘనంగా సత్కరించారు. గురువులకు పాదాభివందనం చేసి వారి ఆశీర్వాదం తీసుకున్నారు. తాము చదివిన ఈ విద్యాలయాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దాలని తీర్మానించారు. పూర్వ విద్యార్థులు శ్రీకాంత్, చంద్రశేఖర్ నాయక్, హబీబ్, రెడ్డిరామ్, శ్రీనివాసులు, హరి, సురేష్, శ్రీనాథ్, రమేష్, ఆనంద్, రాజేష్ పాల్గొన్నారు.

ఆందోళన చెందకుండా పరీక్షలు రాయాలి

గాలివీడు: ఇంటర్, పదో తరగతి విద్యార్థులు ఆందోళన చెందకుండా పబ్లిక్ పరీక్షలు రాయాలని ఎంఈవో-1 పి.నాగరాజు కోరారు. కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల విద్యాలయంలో ఆదివారం ఇంటర్, పదో తరగతి విద్యార్థులకు పరీక్షల సామగ్రి దాత, తెదేపా మండల ప్రధాన కార్యదర్శి వెంకట శివారెడ్డి అందజేశారు. పాఠశాల బాధ్యురాలు శిల్ప, 108 వాహన సిబ్బంది రామాంజులు, పాల్గొన్నారు.

అమ్మవారికి ఇత్తడి పాత్రల వితరణ

గుర్రంకొండ: చెర్లోపల్లెలో వెలసిన రెడ్డెమ్మ తల్లికి ఆదివారం కాణిపాకానికి చెందిన రెడ్డెప్ప ఇత్తడి కలశం, బిందె, తీర్థం, గిన్నె, ఉద్ధరిణి, పంచామృత పాత్రలు అందజేశారు. ఆలయ ఛైర్మన్ రాజన్న నాయుడు, ఈవో మంజుల పాల్గొన్నారు.

'కాంగ్రెస్ నేతలపై దాడులు సరికాదు'

కలకడ: ప్రజాస్వామ్య విలువలు దెబ్బతీసేలా తమ నేతలపై దాడులు జరుగుతున్నాయంటూ కలకడలో కాంగ్రెస్ నాయకులు ఆదివారం నిరసన తెలిపారు. రోడ్డుపై బైఠాయించి, నోటికి నల్లవస్త్రాలు కట్టుకుని నిరసన తెలియజేశామని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి సోమశేఖర్‌రెడ్డి తెలిపారు. నాయకులు మల్లిక, సమీర్, ఖాజా, ఆదినారాయణ, చెన్నకృష్ణ, నస్రుల్లా తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అభయహస్త ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

ప్రతిష్ఠించిన ఆంజనేయస్వామి విగ్రహం.. తరలివచ్చిన భక్తులు

చిన్నమండెం, న్యూస్‌టుడే: స్థానికంగా నిర్మించిన ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం తెల్లవారుజామున అభయహస్త ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా నిర్వహించారు. అర్చకుల వేద మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల మధ్య వైభవంగా ప్రతిష్ఠోత్సవం జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు విచ్చేసి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ ఆవరణలో సీతారామ కల్యాణోత్సవం నిర్వహించారు. **వాల్మీకిపురం:** నల్లంవాండ్లపల్లెలో వీరాంజనేయస్వామి రాతి విగ్రహానికి ప్రాణప్రతిష్ఠ చేశారు. భక్తులు తరలివచ్చారు.

బాలబడికి.. రాజకీయ గ్రహణం

కొర్నమిట్టపల్లె అంగన్‌వాడీ భవన నిర్మాణానికి రాజకీయ గ్రహణం పట్టింది. 2018లో రూ.7.5 లక్షలతో స్థానిక ప్రాథమిక పాఠశాల ఆవరణలో అంగన్‌వాడీ భవనం మంజూరైంది. పనులు పైకప్పు దశకు చేరడంతో రూ.3.50 లక్షలు మంజూరయ్యాయి. మిగిలినవి మంజూరు కాకపోవడం. ఆ సమయంలో ప్రభుత్వం మారి.. ఆయా పనులను తెదేపా నాయకులు చేపట్టారు. దీంతో వైకాపా నాయకులు నిధుల మంజూరును రాజకీయం చేయడంతో భవనం అసంపూర్తిగా నిలిచింది. దీన్ని పూర్తిచేయడానికి గుత్తేదారు ఆసక్తిగా లేడు. ప్రస్తుతం ఈ కేంద్రం ఓ అద్దె భవనంలో నడుస్తోంది. దీనిపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుంధతిని అడగ్గా.. ఉన్నతాధికారులకు నివేదించి పూర్తి చేయిస్తామన్నారు. **-న్యూస్‌టుడే, కలికిరి**

ఈ వృథాకు అడ్డుకట్ట పడేనా..?

మండలంలోని గర్నిమిట్టకు సమీపంలో ఝరికోన నీరు వృథాగా పోతున్నాయి. ఇక్కడ గతంలో నీటి తొట్టె నిర్మించి, కుళాయి ఏర్పాటు చేసి, ఝరికోన నీరు సరఫరా చేసేవారు. ప్రస్తుతం నీటి తొట్టె శిథిలావస్థకు చేరుకుంది. ఓ వైపు గోడ శిథిలమై పడిపోయింది. అయినా అధికారులు తొట్టెలోనికి నీటిని సరఫరా చేస్తున్నారు. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి నీటి వృథా అరికట్టాల్సి ఉంది. **-న్యూస్‌టుడే, కంభంవారిపల్లి**

నిధులు రాక.. నిర్మాణాలు పూర్తికాక

పీలేరు పంచాయతీ ఒకటో గ్రామ సచివాలయం భవనాన్ని రూ.42 లక్షలతో గత ప్రభుత్వంలో నిర్మాణాలు ప్రారంభించారు. 50 శాతం పూర్తయ్యాక నిధులు రాక గుత్తేదారు పనులు నిలిపేశారు. ప్రస్తుతం సచివాలయం కోటపల్లె మార్గంలో ప్రైవేట్ అద్దె భవనంలో నడుస్తోంది. ఈ కార్యాలయానికి వెళ్లేవారు దారి కనుక్కోవడానికి ఇబ్బంది పడుతున్నారు. అద్దె భవనంలో ఒకే హాల్ ఉండటంతో అక్కడే ఒకచోట రెవెన్యూ, వైద్య, సచివాలయ సిబ్బంది ఉన్నందున ప్రజలు ఎవరిని సంప్రదించాలో తెలియక తికమకపడుతున్నారు. దీనిపై పీఆర్ ఏఈ రామకృష్ణనాయక్‌ను వివరణ కోరగా మండలంలో గత ప్రభుత్వంలో నిర్మాణాలు పూర్తి కాని పనుల వివరాలు ఉన్నతాధికారులకు పంపామని నిధులు విడుదలయ్యాక పూర్తి చేయిస్తామన్నారు. **-న్యూస్‌టుడే, పీలేరు**

ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి ఘన నివాళి

నరసింహారెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కలికిరి, న్యూస్‌టుడే: బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా రాయలసీమలో సాయుధ పోరాటం చేసిన స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ధరణీ హోటల్‌లో ఆయన చిత్రపటం ఏర్పాటుచేసి నివాళులర్పించి ఆయన సేవలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు, సత్యమ్మ తల్లి ఆలయ కమిటీ ఛైర్మన్ సత్యనారాయణరెడ్డి, కవి, రచయిత వేంపల్లె అబ్దుల్ ఖాదర్, రామకృష్ణారెడ్డి, పురుషోత్తంరెడ్డి, జనార్ధన్‌రెడ్డి, అమరనాథరెడ్డి, వెంకట్రమణారెడ్డి, రాజారెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, రంజిత్ కుమార్‌రెడ్డి, వెంకీ, ప్రభాస్‌కుమార్, కుమార్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సమష్టి కృషి

సమావేశంలో పాల్గొన్న విశ్రాంత ఉద్యోగులు

వాల్మీకిపురం, న్యూస్‌టుడే: విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి అందరం కలిసి కట్టుగా ఉంటూ పనిచేద్దామని ఏపీ విశ్రాంత ఉద్యోగుల సంఘం వాయల్పాడు యూనిట్ అధ్యక్షుడు సిద్ధారెడ్డి కోరారు. ఆదివారం పింఛనర్ల భవన్‌లో విశ్రాంత ఉద్యోగుల సంఘం సమావేశాన్ని నిర్వహించారు. యూనిట్ ప్రధాన కార్యదర్శి వి.శంకర మాట్లాడుతూ జీవితకాల సర్టిఫికెట్ కాల పరిమితి గడువు వారం రోజులే ఉందని, ఉప ఖజానాధికారి కార్యాలయంలో తక్షణమే అందజేయాలన్నారు. ఈహెచ్‌ఎస్ కార్డుల జారీపై చర్చించారు. వాయల్పాడులో విశ్రాంత ఉద్యోగుల సంఘానికి నూతన భవన నిర్మాణం చేపట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. సమావేశంలో సంఘ నాయకులు శంకర్‌రెడ్డి, రామ్మూర్తి, కృష్ణమూర్తి, అన్వర్‌బాషా, జీవీవీవర్మ, వెంకటరమణ, వెంకటస్వామి, మురళి, యూనిట్ విశ్రాంత ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

'చట్టసభలపై వైకాపా సభ్యులకు గౌరవం లేదు'

రాయచోటి, న్యూస్‌టుడే: చట్టసభలంటే వైకాపా సభ్యులకు గౌరవం లేదని తెదేపా రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా పేర్కొన్నారు. స్థానిక తెదేపా కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. శాసనమండలిలో వైకాపా సభ్యుల తీరును ప్రజలు అసహ్యించుకుంటున్నారన్నారు. హిందువుల మనోభావాలను వైకాపా పూర్తిగా దెబ్బతీసిందన్నారు. ప్రజలు బుద్ధి చెప్పి 11 సీట్లు ఇచ్చినా వారికి కనువిప్పు కాలేదని విమర్శించారు. ఇప్పటికీ ఆ పార్టీ నాయకులు రాజకీయంగా కుట్రలు చేస్తూనే ఉన్నారన్నారు. భగవంతుడంటే అసలు వారికి భక్తిభావమే లేదని, చెప్పులతో వేంకటేశ్వరస్వామి చిత్రపటాలు చేబూని మహాపచారం చేసి సిగ్గు లేకుండా దాన్ని సమర్థించుకుంటున్నారని విమర్శించారు. ఐటీడీపీ నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు నాగభూషణ్‌రెడ్డి, మహేంద్ర నాయుడు, సాంబశివారెడ్డి, రెడ్డిశేఖర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ శ్రీనివాసులు నాయుడు, కొండారెడ్డి, రౌఫా తదితరులు పాల్గొన్నారు.

ఫ్రీజర్ బాక్సు వితరణ

ఫ్రీజర్ బాక్సుతో సంస్థ ప్రతినిధులు

పీలేరు, న్యూస్‌టుడే: మానవత సంస్థకు ఆదివారం ఎం.శ్రీకాంత్‌రెడ్డి తన తండ్రి మూగ పుల్లారెడ్డి జ్ఞాపకార్థం రూ.85 వేలు విలువజేసే ఫ్రీజరు బాక్సును వితరణగా అందజేశారు. సంస్థ ఛైర్మన్ వి.రామచంద్ర, ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఫ్రీజరును.. పార్థివదేహాల అంతిమయాత్రకు తీసుకుపోయేందుకు ఉచితంగా ఇస్తామన్నారు. ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు బి.వేణుగోపాల్ మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో అందరూ భాగస్వాములు కావాలన్నారు. రాజ్‌బుక్స్ సెల్లర్స్ అధినేత చెంగయ్య మాట్లాడుతూ సంస్థ సభ్యులు ఇప్పటికే ప్రభుత్వ ఆసుపత్రి, ఎంపీడీవో కార్యాలయం, న్యాయస్థానంలో ప్రజలు కూర్చొనేందుకు సిమెంటు బెంచీల ఏర్పాటు అభినందనీయమన్నారు. కో-ఛైర్మన్ కృష్ణమూర్తి, కన్వీనర్ రమేష్, సభ్యులు శ్రీనివాసులురెడ్డి, లక్ష్మీప్రసాద్ నాయుడు, రహత్‌బాషా, అక్రమ్‌బాషా, హరినాథ్, ఎర్రయ్యశెట్టి పాల్గొన్నారు.

అనంతపురమ్మ ఆలయంలో చోరీ

శాఖంవారిపల్లె(వాల్మీకిపురం), న్యూస్‌టుడే: శాఖంవారిపల్లెలోని అనంతపురమ్మ ఆలయంలో ఆదివారం తెల్లవారుజామున దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఆదివారం ఉదయం గ్రామస్థులు ఆలయం వద్దకు వెళ్లగా ఆలయ తలుపులకు ఉన్న తాళాలు పగులగొట్టి ఉండటాన్ని గమనించి ధర్మకర్తకు తెలియజేశారు. గర్భాలయంలో అమ్మవారికి ఉన్న తొమ్మిది గ్రాముల బంగారు తాళిబొట్టుతో పాటు హుండీలోని రూ.నాలుగు వేల నగదు చోరీ చేసినట్లు గుర్తించారు. దొంగలు ఆలయ సీసీ కెమెరాలను సైతం ధ్వంసం చేసి హార్డ్‌డిస్క్‌ను సైతం కాజేశారని ధర్మకర్త భాస్కర్ నాయుడు.. ఎస్సై తిప్పేస్వామికి ఫిర్యాదు చేశారు.

గ్రామాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

గ్రామస్థులతో మాట్లాడుతున్న ప్రసాద్‌బాబు

రాయచోటి గ్రామీణ: గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెదేపా రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు సుగవాసి ప్రసాద్‌బాబు తెలిపారు. ఆదివారం వరిగ గ్రామంలో పర్యటించి గ్రామస్థుల సమస్యలు తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. **గాలివీడు:** తెదేపా రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు సుగవాసి ప్రసాద్‌బాబు.. గాలివీడులో పర్యటించారు. పోలేరమ్మ జాతర నేపథ్యంలో దాసరి కార్పొరేషన్ డైరెక్టర్ ఆనంద్‌కుమార్ ఆత్మీయ విందు ఏర్పాటు చేయగా ప్రసాద్‌బాబు విచ్చేసి మాట్లాడారు. కూటమి పాలనలో సీఎం చంద్రబాబు.. కార్పొరేషన్ల అభివృద్ధికి బాటలు వేశారన్నారు. మాజీ ఎంపీపీ వెంకటనారాయణరెడ్డి, ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షుడు లక్ష్మయ్య, నాయకులు రామాంజులు పాల్గొన్నారు.

ఈ రహదారులకు మోక్షమెన్నడో..?

అవస్థల్లో గ్రామీణులు

సదిపిరివాండ్లపల్లె మార్గంలో కంకర తేలిన తారురోడ్డు

కొత్తపల్లె బిడికి మార్గంలోని మట్టిరోడ్డు దుస్థితి

సంబేపల్లె, న్యూస్‌టుడే: గత పాలకుల నిర్లక్ష్యమో, అధికారుల అలసత్వమో తెలియదు కానీ గ్రామీణ రహదారులు అభివృద్ధికి దూరంగా ఉన్నాయి. గ్రామాల్లో మౌలిక వసతులు అనగానే ప్రధానంగా గుర్తొచ్చేవి రహదారులు, డ్రైన్లు, తాగునీటి సరఫరా. ముఖ్యంగా రహదారులు.. ఒక గ్రామం నుంచి మరొక గ్రామానికైనా, ఇతర పల్లెలకైనా చక్కగా ఉండాలి. అలాంటిది పలు రోడ్లు ఎక్కడికక్కడ అధ్వానంగా మారడంతో గ్రామీణులు పడుతున్న తిప్పలు చెప్పనలవికావు.

మండల పరిధిలోని పెద్ద గ్రామమైన శెట్టిపల్లె గ్రామంలో రహదారుల పరిస్థితి అధ్వానంగా ఉంది. శెట్టిపల్లె కస్పా నుంచి సదిరిపిరివాండ్ల, ఉన్న రోడ్డు.. తారు లేచి పోయి కంకర తేలింది. దీంతో రోడ్డు గుంతల మయంగా మారింది. ఇక రెడ్డిమల్లువారిపల్లె నుంచి కొత్తపల్లెబిడికి వరకు ఉన్న మట్టిరోడ్డు ఎగుడుదిగుడుగా ఉంది. దీంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అసలే మారుమూల ప్రాంతాలైన ఈ రెండు పల్లెల్లోని ప్రజలకు ఏదైనా అనారోగ్య సమస్య తలెత్తి అత్యవసర పరిస్థితి నెలకొన్నపుడు అంబులెన్సు రావడానికి కూడా ఇబ్బందిగా ఉంది. రహదారులు సరిగా లేక సకాలంలో అంబులెన్స్ రావడానికి అత్యధిక సమయం పడుతోందని గ్రామస్థులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామస్థుల సొంత వాహనాలు సైతం ఈ గుంతల రోడ్లతో తరచూ మరమ్మతులకు గురవుతున్నాయని వారు వాపోతున్నారు. సంబంధిత అధికారులు చొరవ చూపి రోడ్లు నిర్మించాలని కోరుతున్నారు.

మదనపల్లె

• మదనపల్లె • తంబళ్లపల్లె • పుంగనూరు

మోటారు సైకిళ్ల ర్యాలీ నిర్వహిస్తున్న యువత

భరతమాత ముద్దుబిడ్డ శివాజీ

పుంగనూరు, న్యూస్‌టుడే: ఛత్రపతి శివాజీ తరతరాలకు నిలిచిపోయే చరిత్ర అని.. భరతమాత ముద్దుబిడ్డ అని హిందూ జాగరణ సమితి ప్రతినిధులు పేర్కొన్నారు. ఆయన జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పుంగనూరు పట్టణంలో మోటారు సైకిళ్ల ర్యాలీ నిర్వహించారు. ప్రస్తుత యువత శివాజీ పోరాటాలను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు వెళ్లాలన్నారు.

శ్రద్ధగా చదివితే ఉత్తమ ఫలితాలు

అధికారులు, ఉపాధ్యాయులతో విద్యార్థులు

చౌడేపల్లె, న్యూస్‌టుడే: తల్లిదండ్రుల కష్టాన్ని, గురువులు చెప్పే మాటలను శ్రద్ధగా విని చదివితే జీవితంలో ఉన్నత స్థానాలకు వెళ్తారని పుంగనూరు సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శ్రీరాములనాయక్ అన్నారు. ఆదివారం ఆయన చౌడేపల్లెలో సదుం, సోమల, పుంగనూరు, చౌడేపల్లె మండలాల వసతి గృహాల విద్యార్థులకు ప్రేరణ తరగతులు నిర్వహించారు. పదో తరగతి పరీక్షల నేపథ్యంలో పిల్లలకు అవగాహన కల్పించారు. మోటివేషన్ స్పీకర్ రామమూర్తి, హెచ్‌ఎం నాగరాజ, వార్డెన్లు విజయ్‌భాస్కర్‌రెడ్డి, వాణీబాయి, రాజేష్, సురేష్‌బాబు, దీపారాణి, షరీఫ్‌బాషా, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా సహాయనిధి

చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

రామసముద్రం, న్యూస్‌టుడే: పేదలను ఆదుకోవడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. మండలంలోని అరికెల, కేసీపల్లె, మూగవాడి, రామసముద్రం, ఊలపాడు, పెద్దకురప్పల్లె, చెంబకూరు, ఆర్.నడింపల్లె పంచాయతీల్లో 38 మందికి రూ.60 లక్షల విలువైన సీఎం సహాయనిధి చెక్కులు ఆదివారం పంపిణీ చేశారు. ఇప్పటివరకు రూ.7.5 కోట్లకు పైగా చెక్కులు ఇచ్చామన్నారు. తెదేపా, భాజపా మండలాధ్యక్షులు విజయ్ కుమార్‌గౌడ్, ఆనందకుమార్‌నాయుడు, నాయకులు కృష్ణమరాజుయాదవ్, తిప్పన్న, మునివెంకటస్వామి, శివారెడ్డి, చలపతినాయుడు తదితరులు పాల్గొన్నారు.

దారి లేదు.. నీరూ రాదు

పేదల కాలనీల్లో కష్టాలు

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే: పేదల సొంతింటి కల సాకారం చేస్తామని గత ప్రభుత్వం చెప్పడంతో అందరూ ఆనందం వ్యక్తం చేశారు. కానీ చాలా చోట్ల నివాసయోగ్యం కాని ప్రదేశాల్లో స్థలాలు కేటాయించడంతో ఇప్పటికీ ఇళ్లు కట్టుకోలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికి తోడు కాలనీల్లో మౌలిక వసతులు కల్పించకపోవడంతో అవస్థలు పడుతున్నారు.

పోతబోలు జగనన్న కాలనీలో నీటి ట్యాంకు దుస్థితి

కానరాని సౌకర్యాలు..

వైకాపా ప్రభుత్వ పాలనలో మదనపల్లె పురపాలక సంఘంలో 24 కాలనీలు ఏర్పాటు చేసి 10 వేలకు పైగా ఇళ్ల స్థలాలు ఇచ్చారు. 1,800 మంది వరకు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్నారు. కానీ వారికి సరిపడా సౌకర్యాలు ఒక్క కాలనీలోనూ కల్పించలేదు. దీంతో ప్రస్తుతం ఆయా గృహాల్లో ఉంటున్నవారికి కష్టాలు తప్పడం లేదు. బాబుకాలనీ వెనుక భాగంలో ఉన్న కాలనీలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. వర్షం వస్తే రోడ్లు బురదగా మారుతున్నాయి. కోళ్లబైలు, పోతబోలు, లాభాలగంగమ్మ గుడి, నవోదయ కాలనీల్లో రోడ్లు అధ్వానంగా మారడంతో లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

దీపాలు వెలగడం లేదు..

పురపాలకసంఘం పరిధిలోని కాలనీల్లో రక్షిత తాగునీటి వసతి కల్పించలేదు. అరకొర బోర్లు తవ్వించినా పైపులైన్లు వేయలేదు. రామసముద్రం రోడ్డు లాభాల గంగమ్మగుడి వద్ద కాలనీలో పైపులైను లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వీధుల్లో విద్యుత్ దీపాలు సక్రమంగా వెలగడం లేదు. కోళ్లబైలు పంచాయతీ అమ్మచెరువు మిట్టలో ఏర్పాటు చేసిన కాలనీలు గుట్టలే దర్శనమిస్తున్నాయి. పురపాలికలో అతి పెద్ద లేఔట్ అయిన పోతబోలులో 3 వేలకు పైగా ఇళ్లు మంజూరు చేశారు. 50 శాతం పైగా లబ్ధిదారులు ఇళ్లలో చేరినా.. మౌలిక వసతులు లేవు.

పీహెచ్‌సీ సిబ్బందిపై ఎమ్మెల్యే ఆగ్రహం

రామసముద్రం, న్యూస్‌టుడే: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఆదేశించారు. ఎంపీపీ వెంకటరమణారెడ్డి అధ్యక్షతన జరిగిన మండల సమావేశంలో పాల్గొన్నారు. ఏడాదిన్నరలో మండలంలోని 501 మంది రైతులకు వ్యవసాయ నియంత్రికలు అందజేశామన్నారు. రామసముద్రం పీహెచ్‌సీలో వైద్యసేవలు సక్రమంగా అందడం లేదని, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఫిర్యాదులు ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. పనితీరు మారకపోతే చర్యలు చేపడతామని వైద్యాధికారి పృథ్వీరాజ్‌కు సూచించారు. ✪ ఎంఈవో ఆంజనేయులుకు పాఠశాలల ప్రహరీలు, అదనపు తరగతి గదుల కోసం, ఏపీవో మాధవికి పశువుల షెడ్ల బిల్లుల బకాయిల కోసం జాబితాలు సిద్ధం చేయాలన్నారు. ✪ 1,750 ఇళ్లకు కూటమి ప్రభుత్వం బిల్లులు మంజూరు చేసిందని, మరో 2,900 దరఖాస్తులు వచ్చాయన్నారు. గైర్హాజరైన అటవీ, ఆర్‌అండ్‌బీ, అబ్కారీ శాఖల అధికారులకు నోటీసులు ఇవ్వాలని ఎంపీడీవో లతీఫ్‌ఖాన్‌ను ఆదేశించారు. డిప్యూటీ ఎంపీడీవో గఫూర్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

చౌడేపల్లె, న్యూస్‌టుడే: చౌడేపల్లె ఎస్సైగా వీఆర్ నుంచి వచ్చిన చిన్నరెడ్డెప్ప ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన నాగేశ్వరరావు మదనపల్లె రెండో పట్టణ పోలీసు ఠాణాకు బదిలీ అయ్యారు.

ఆలయ వార్షికోత్సవం

సదుం, న్యూస్‌టుడే: ఊటుపల్లె క్రాస్ వద్ద అభయాంజనేయ స్వామి ఆలయ 9వ వార్షికోత్సవ పూజలు ఆదివారం వైభవంగా జరిగాయి. చాందినీ బండ్లు, కోలాటాలు, చెక్క భజనలు భక్తులను ఆకట్టుకున్నాయి.

వాహనం బోల్తా.. టమాటాలు నేలపాలు

సరకుతో వెళ్తున్న బొలెరో వాహనం బోల్తా పడటంతో టమాటాలు నేలపాలయ్యాయి. ములకలచెరువు మండలం నాయునివారిపల్లెకి చెందిన రైతు బావాజాన్ టమాటాలను వాహనంలో ములకలచెరువు మార్కెట్‌కు తీసుకువెళ్తున్నారు. రైల్వేగేట్ సమీపంలో ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి వాహనం బోల్తా పడింది. రైతుకు గాయాలవగా, సరకు పూర్తిగా పాడైంది. **- న్యూస్‌టుడే, ములకలచెరువు**

గుంతలు తవ్వారు.. పూడ్చటం మరిచారు

మదనపల్లె మండలంలోని తట్టివారిపల్లె పంచాయతీ దేవతానగర్ సమీపంలో తిరుపతి రహదారిపై కొందరు ప్రైవేటు కేబుల్ సిబ్బంది మరమ్మతుల నిమిత్తం గుంతలు తవ్వారు. తర్వాత పూడ్చివేయక పోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ మార్గంలో రోజూ తిరుపతి, బెంగళూరుకు ఎక్కువగా రాకపోకలు సాగుతాయి. రాత్రి వేళ ప్రమాదాలు జరుగుతున్నట్లు పలువురు వాపోతున్నారు. **- న్యూస్‌టుడే, మదనపల్లె గ్రామీణ**

విద్యార్థులూ జాగ్రత్త

పుంగనూరు మేలుపట్ల ఎస్టీ గురుకుల పాఠశాల ముందు దుస్థితి ఇది. ఇక్కడ కాలువపై బండను తొలగించడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. అది ద్వారం వద్ద ఉండటంతో పాఠశాల విడిచిపెట్టే సమయంలో విద్యార్థులు గుంపులుగా వచ్చే సమయంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని పలువురు చెబుతున్నారు. వెంటనే కాలువను సరిచేయాలని చెబుతున్నారు. **- న్యూస్‌టుడే, పుంగనూరు గ్రామీణం**

ఇక్కడ కాలువ కట్టండి సారూ!



మదనపల్లె మండలంలోని కోళ్లబైలు పంచాయతీ బయ్యారెడ్డికాలనీలో ప్రభుత్వ ఆదర్శ పాఠశాలకు వెళ్లే మార్గంలో కొండ వంక ఉంది. ఇందిరమ్మ, వైఎస్సార్, బయ్యారెడ్డి కాలనీల్లో మురుగు ఈ వంకలో నుంచి రోడ్డు పైనుంచి పారుతోంది. దీంతో పాఠశాలకు వెళ్లే విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ఇక్కడ కాలువ నిర్మించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, మదనపల్లె గ్రామీణ**

మురుగు నిలిచింది.. ముప్పు తెచ్చింది

మదనపల్లె పట్టణంలోని బెంగళూరు రోడ్డు సమీప కాలువలో కొన్నాళ్లుగా మురుగు నిలిచిపోతోంది. ప్రభుత్వ కార్యాలయాలు, పోలీస్‌స్టేషన్లు ఈ ప్రాంతంలోనే ఉన్నాయి. రోజూ అధికారులు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తారు. అయినప్పటికీ మురుగు తొలగించే చర్యలు లేకపోవడంతో దుర్వాసన వస్తోంది. దోమలు విజృంభిస్తున్నాయని పలువురు వాపోతున్నారు. పురపాలక అధికారులు కాలువను శుభ్రం చేయాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, మదనపల్లె పట్టణం**

'తప్పు చేసుంటే ఏ శిక్షకైనా సిద్ధమే'

తంబళ్లపల్లె, ములకలచెరువు, న్యూస్‌టుడే: తప్పుచేసి ఉంటే ఏ శిక్షకైనా సిద్ధమేనని నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి సాయినాథ్ అన్నారు. సామాజిక మాధ్యమాల్లో తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నట్లు చెప్పారు. తన సహకారంతో అన్న హరినాథ్ ఓ బాలికను కిడ్నాప్ చేశారని నిందలు వేయడం సరికాదన్నారు. కిడ్నాప్ విషయం తెలియగానే పోలీసులకు సమాచారం ఇచ్చానన్నారు. కిడ్నాప్‌తో తనకు, పార్టీకి ఎలాంటి సంబంధం లేదన్నారు. తన అన్న హరినాథ్ తప్పు చేసి ఉంటే ఎలాంటి చర్యలు తీసుకున్నా ఇబ్బంది లేదన్నారు. ఆరు నెలలుగా సోదరుడితో మాట్లాడటం లేదని సాయినాథ్ చెప్పారు.

ఆలయానికి రూ.1.10 లక్షల విరాళం

బి.కొత్తకోట, న్యూస్‌టుడే: మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌లోని ఏనుగుమల్లమ్మ ఆలయానికి స్థానికులు అవధూత రామలక్ష్మి, కృష్ణమ్మ రూ.1,10,000 విరాళం ప్రకటించారు. గర్భగుడి మహాద్వారానికి బంగారంతో కవచం చేసేందుకు ముందస్తుగా ఆదివారం రూ.50,000 అందజేశారు.

ముందే మేల్కోండి

సోమల: నెల్లిమంద కమ్మపల్లె సమీపంలో తాగునీటి బోరు మీటరు నేలకు దగ్గరగా ఉంది. మూగజీవాలు, పిల్లలు ప్రమాదానికి గురవ్వకముందే పంచాయతీ వారు స్పందించి ఎత్తు పెంచాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఆరో తరగతిలో ప్రవేశాలకు ఆహ్వానం

పెద్దమండ్యం, న్యూస్‌టుడే: మండలంలోని ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతిలో ప్రవేశాలకు ఈనెల 24 నుంచి 31 దరఖాస్తులు స్వీకరిస్తామని ప్రిన్సిపల్ కార్తీక్ వీరార్జున తెలిపారు. ఏప్రిల్ 12న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలియజేశారు.

లారీ ఢీకొని సెంట్రల్ లైటింగ్ ధ్వంసం

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే: లారీ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టిన ఘటన మదనపల్లె పట్టణంలో ఆదివారం జరిగింది. మదనపల్లె నుంచి కదిరివైపు వెళ్తున్న లారీ నీరుగట్టువారిపల్లెలో డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో సెంట్రల్ లైటింగ్ పోల్ విరిగి రోడ్డు మధ్యలో పడింది. అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

వెంకన్న ఉత్సవాలు.. చూసొద్దాం రండి

✶ 24 నుంచి పుంగనూరులో బ్రహ్మోత్సవాలు

కల్యాణ వెంకటరమణ ఆలయం

పుంగనూరు, న్యూస్‌టుడే: తితిదే ఆధ్వర్యంలో పుంగనూరు పట్టణంలో ఉన్న కల్యాణ వెంకటరమణ స్వామి ఆలయం వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 24 నుంచి మార్చి 5 వరకు నిర్వహించనున్నారు. సంబంధిత ఏర్పాట్లను తితిదే అధికారులు చేపట్టారు. ఈ ఆలయానికి పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల భక్తులు తరలిరావడంతో నిత్యం కళకళలాడుతుంది.

పశ్చిమ ముఖంగా దర్శనం..

పుంగనూరు పాలకులు సుగుటూరు ఇమ్మడి చిక్కరాయ యశోవంత బహద్దూర్ క్రీ.శ.1644లో ఆలయాన్ని నిర్మించారు. కల్యాణ వెంకటరమణుడి మూలవిరాట్ విగ్రహం తిరుమలలోని విగ్రహాన్ని పోలినట్లు ఉంటుంది. ఇక్కడ దర్శనం, మొక్కులు చెల్లిస్తే సాక్షాత్తు తిరుమల స్వామివారికి చేసుకున్నట్లేనని భక్తుల నమ్మకం. స్వామితో పాటు శ్రీదేవి, భూదేవి విగ్రహాలు దర్శనమిస్తాయి. ఆలయంలో స్వామి పశ్చిమ ముఖంగా దర్శనమివ్వడం ప్రత్యేకత. ఆలయం మధ్యలో నాలుగు స్తంభాలతో నిర్మించిన ఎత్తయిన మండపం ఉంది.

అష్టలక్ష్మి.. సత్యనారాయణుడు..

ఈ ఆవరణలో అష్టలక్ష్మి ఆలయం, అద్దాల మండపం, సత్యనారాయణ స్వామి, విశాలమైన పుష్కరిణి, 33 అడుగుల దీపస్తంభం ఉన్నాయి. స్వామిని దర్శించుకుంటే సంతాన భాగ్యం కలుగుతుందని చెబుతారు. ఏటా శ్రావణంలో, ప్రతి శనివారం భక్తుల రద్దీ ఉంటుంది. పౌర్ణమికి గరుడ సేవ నిర్వహిస్తారు. ఈనెల 24 నుంచి శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో వేర్వేరు వాహనాలపై స్వామి విహరించనున్నారు.

ఇవీ కార్యక్రమాలు..

24న ధ్వజారోహణం, పెద్దశేష వాహన సేవ. 25న చిన్నశేష, హంస వాహనాలపై ఊరేగింపు. 26న సింహ, ముత్యపు పందిరి వాహనం, 27న కల్పవృక్ష, హనుమంత వాహనాలపై సేవ ఉంటుంది. 28న మోహినీ ఉత్సవం, గరుడసేవ, మార్చి 1న సూర్యప్రభ, చంద్రప్రభ వాహనాలు, 2న శ్రీవారి కల్యాణం, గజ వాహన సేవ, 3న రాత్రి అశ్వవాహనోత్సవం, 4న రథోత్సవం, ధ్వజావరోహణం, 5న తిరుప్పావడ, శయనోత్సవం ఉంటాయని ఆలయ ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి తెలియజేశారు.

పనులు మరిచారు.. అవస్థలు తెచ్చారు..

మండలంలోని గాజులవారిపల్లెలో తాగునీరు సరఫరా లీకుల నివారణకు గుంతలు తవ్వారు. పది రోజులు అవుతున్నా పట్టించుకోలేదు. దీంతో పైపుల్లో బురద నీరు చేరుతోంది. కుళాయిల నుంచి రంగు మారిన నీరు సరఫరా అవుతోందని స్థానికులు చెబుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పైపులు వేగంగా వేసి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు. విషయం ఈవోపీఆర్డీ మహేష్ వద్ద ప్రస్తావించగా.. పరిశీలించి చర్యలు చేపడతామన్నారు. **- న్యూస్‌టుడే, చౌడేపల్లె**

ఆనందంగా ఆదివారం

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలతో పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఆనంద ఆదివారం కార్యక్రమం నిర్వహించారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ. ఆదివారాన్ని ప్రజలు సంతోషంగా గడపాలన్నదే ప్రభుత్వం ఉద్దేశమన్నారు. ప్రతి నెలా రెండు, నాలుగు వారాల్లో కార్యక్రమం ఉంటుందన్నారు. విద్యార్థులు నృత్యాలు, కోలాటాలతో అలరించారు. కమిషనర్ ప్రమీల, డీఈఈ శ్రావణి, మెప్మా సీఎంఎం, ఆర్పీలు పాల్గొన్నారు.

హంస వాహనంపై స్వామివారు

కల్లూరు (మంగళంపేట), న్యూస్‌టుడే: తితిదే ఆధ్వర్యంలో మంగళంపేటలో ప్రసిద్ధి చెందిన శ్రీదేవి భూదేవి సమేత శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారు ఆదివారం చిన్నశేష, హంస వాహనంపై ఊరేగారు. కల్లూరుకు చెందిన సానేవారు, మంగళంపేటకు చెందిన భూపతి కుటుంబీకులు ఉభయదారులుగా వ్యవహరించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

మదనపల్లె పట్టణం: 80085 74611
తంబళ్లపల్లె: 94416 29636
పుంగనూరు: 80085 74622
(10 AM TO 1 PM)

? పుంగనూరు పట్టణంలోని ఎన్‌ఎస్‌పేట అనుబంధ వీధుల్లో దీపాలు వెలగడం లేదు. **- నరసింహులు** ● వీధి దీపాలు బాగు చేయిస్తాం. **- మహేష్, డీఈఈ, పురపాలక సంఘం** – న్యూస్‌టుడే, పుంగనూరు

? మోదుగులపల్లెలో వీధి దీపాలకు మీటర్లు ఏర్పాటు చేసి రాత్రి వేళల్లో వెలిగేలా చూడాలి. **- హరి** ● వీధి దీపాల నిర్వహణ చేపడతాం. **- వెంకటరమణ, కార్యదర్శి** – పుంగనూరు గ్రామీణం

? చెరువుకిందపల్లెలో కాలువలు లేక మురుగు నిలిచిపోతోంది. దుర్వాసన, దోమల బెడదతో ఇబ్బంది పడుతున్నాం. **- రవి** ● కాలువల ఏర్పాటుకు చర్యలు చేపడతాం. **- పంచరత్నం, కార్యదర్శి** ? పెద్దమండ్యంలోని రెడ్డివారిపల్లె, ప్రేమనగర్‌లో వీధి దీపాలు వెలగడం లేదు. **- రమణయ్య** ● వీధి దీపాలు బాగు చేస్తాం. **- శ్రీధర్‌రావు, ఎంపీడీవో** ? చెరువుకిందపల్లెలో తాగునీటి సమస్య పరిష్కరించాలి. **- చలపతి** ● మోటార్లు బాగు చేసి నీరందిస్తాం. **- పంచరత్నం, కార్యదర్శి** – న్యూస్‌టుడే, పెద్దమండ్యం

? సోమల మండలంలోని రాశెట్టివారిపల్లెలో మురుగు రోడ్డుపై పారుతోంది. దుర్వాసన భరించలేకపోతున్నాం. **- స్థానికులు** ● రోడ్డుపైకి మురుగు రాకుండా చూస్తాం. **- రెడ్డెప్ప, సర్పంచి - సోమల**

? బసినేపల్లె గ్రామంలో మురుగు కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోయాయి. **- వెంకటరమణ** ● గ్రామంలో పారిశుద్ధ్య చర్యలు చేపడతాం. **- సుబ్రహ్మణ్యం, కార్యదర్శి** – పుంగనూరు గ్రామీణం

కందకాలు తవ్వారు.. వ్యర్థాలు తొలగించారు

స్పందనకు వందనం

మదనపల్లె గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని బాలాజీ కాలనీ, చీకలబైలు రోడ్డు, బసినికొండ పంచాయతీ కార్యాలయం సమీపంలో చెత్త దిబ్బలు పేరుకుపోయాయని ఈనెల 8న ఈనాడులో వార్త ప్రచురితమైంది. పంచాయతీ అధికారులు స్పందించి శుభ్రత పనులు చేపట్టారు. ● భవానీనగర్‌లో మట్టితవ్వకాలు చేపట్టకుండా అధికారులు కందకాలు తవ్వించారు. ఇక్కడ మట్టి తవ్వకాలపై ఈనాడులో ఈనెల 8న వార్త ప్రచురితమవగా అధికారులు స్పందించారు.

కోటవీధిలో కాలువలు శుభ్రం

పెద్దతిప్పసముద్రం, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని కోటవీధి కాలువల్లో మురుగు నిలిచిపోతోందని స్థానికులు ఈనాడుకు తెలియజేశారు. వార్త ప్రచురించగా కార్యదర్శి నరేష్ స్పందించి శుభ్రం చేయించారు.

రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే: వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలయ్యాయి. కలకడ మండలం దిగువపాళ్యానికి చెందిన ఉదయ్‌కుమార్, ఆయన కుమారుడు ఛత్రపతి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా కదిరాయ చెరువు వద్ద ఎదురుగా వచ్చిన సురేష్ ద్విచక్ర వాహనంతో ఢీకొట్టాడు. ఉదయ్‌కుమార్, ఛత్రపతికి తీవ్రగాయాలు కావడంతో మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ❖ మదనపల్లె పట్టణంలోని నీరుగట్టువారిపల్లె సమీపంలో ఆదివారం గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వృద్ధుడికి గాయాలయ్యాయి. రోడ్డు పక్కన పడిఉన్న ఆయనను స్థానికులు మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స అందజేశారు.

దాడి ఘటనలో నలుగురిపై కేసు

నిమ్మనపల్లె, న్యూస్‌టుడే: ఇద్దరు గొడవ పడుతుండగా సర్ది చెప్పేందుకు వెళ్లిన వ్యక్తిపై దాడి చేసిన ఘటనలో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు. నిమ్మనపల్లె మండలం గంగాపురంపల్లెకు చెందిన జి.చిన్న రెడ్డెప్ప, సీహెచ్.యువరాజు మధ్య దారి సమస్య ఉంది. ఈనెల 14న వారు ఘర్షణ పడుతుండగా గ్రామస్థుడు విజయకుమార్ వెళ్లారు. ఆయనపై యువరాజు వర్గంలోని వ్యక్తులు దాడి చేయడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నాలుగెకరాల మామిడి తోట దగ్ధం

చౌడేపల్లె, న్యూస్‌టుడే: మండలంలోని కేతనపల్లెకు చెందిన జె.రెడ్డెప్ప మామిడితోట ఆదివారం దగ్ధమైంది. గుర్తు తెలియని వ్యక్తులు సిగరెట్ తాగి పడేయటంతో మంటలు వ్యాపించినట్లు అగ్నిమాపక అధికారులు గుర్తించారు. నాలుగు ఎకరాల మామిడితోట, కొబ్బరి చెట్లు కాలిపోయినట్లు చెప్పారు. ❖ **పెద్దమండ్యం:** ఎర్రగుట్టపల్లెకు చెందిన శ్రీరాములు మూడు ఎకరాల్లో సాగు చేసిన ఉలవ చేను ఇంటి సమీపంలో నిల్వ ఉంచారు. శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో కాలిపోయిందని ఫిర్యాదు చేశాడు.

ట్రాక్టర్ డ్రైవర్ ఆత్మహత్యాయత్నం

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే: కుటుంబ సమస్యలతో పెద్దతిప్పసముద్రానికి చెందిన హరికృష్ణ (27) ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఆదివారం ఇంట్లో తలకు రాసుకునే నూనె తాగి అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు గుర్తించి ఆయనను మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతి ఆసుపత్రికి రిఫర్ చేశారు. ఈ ఘటనపై విచారణ చేపట్టినట్లు పెద్దతిప్పసముద్రం పోలీసులు తెలియజేశారు.

13 మంది జూదరుల అరెస్టు

ములకలచెరువు, న్యూస్‌టుడే: మండలంలోని గోపిదిన్నె ప్రాంతంలో జూదం ఆడుతున్న 13 మందిని అరెస్టు చేసినట్లు ఎస్సై అనిల్‌కుమార్ తెలిపారు. ఆదివారం సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించామన్నారు. వారి నుంచి రూ.14,300, ఆరు చరవాణులు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

కాలుష్య నియంత్రణ అందరి బాధ్యత

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే: కాలుష్య నియంత్రణ అందరి బాధ్యతని కడప పర్యావరణ ఇంజినీరు సుధ పేర్కొన్నారు. ఆదివారం మిట్స్ డీమ్డ్ టుబీ విశ్వవిద్యాలయంలో అవగాహన కల్పించారు. ప్రస్తుతం కాలుష్యం పెరుగుతోందని, నియంత్రణకు స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్లాస్టిక్ వినియోగం తగ్గించి, రీసైక్లింగ్‌ను ప్రోత్సహించాలన్నారు. విరివిగా చెట్లు నాటి సంరక్షించాలన్నారు. డీన్ డాక్టర్ దీపాంకర్‌రాయ్, విభాగాధిపతి డాక్టర్ విజయ్‌కుమార్, డాక్టర్ పవన్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిజ్ఞ చేస్తున్న అధ్యాపకులు, ఇంజినీరు సుధ

వెంకన్న ఆలయం నిర్మాణానికి శంకుస్థాపన

కలశ స్థాపనలో పాల్గొన్న అధికారులు, నాయకులు

మదనపల్లె అర్బన్, న్యూస్‌టుడే: పట్టణ శివారులోని అనపగుట్ట గరుడాచలంలో సంతాన వెంకటరమణ ఆలయ నిర్మాణానికి గోవిందమాల సంఘం కన్వీనర్ రాజశేఖర్ ఆధ్వర్యంలో ఆదివారం శంకుస్థాపన చేశారు. కృష్ణాలయం సమీపంలో కలశ స్థాపన, అభిషేక పూజలు, హోమాలు నిర్వహించారు. 30 ఏళ్లుగా ఇక్కడ వేంకటేశ్వరుని విగ్రహానికి పూజలు చేస్తున్నామన్నారు. తెదేపా నాయకులు కె.మల్లికార్జున్‌నాయుడు, విజయ్‌నాయుడు, జ్ఞానోదయ విద్యాసంస్థల ఛైర్మన్ కె.ప్రసాదరావు దంపతులు తదితరులు పాల్గొన్నారు.

మానవతా సంస్థ సేవలు విస్తరిస్తాం

పుంగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: నిరుపేదలకు సేవలందించడమే మానవతా సేవా సంస్థ ఉద్దేశమని సంస్థ కార్యదర్శి డాక్టర్ ప్రభాకర్ తెలిపారు. ఆదివారం స్థానిక విశ్రాంత భవన్‌లో ఛైర్మన్ నందీశ్వరయ్య అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ. సంస్థ ద్వారా రక్తదాన శిబిరాలు నిర్వహించామని, పట్టణంలోని కూడళ్లలో ప్రయాణికులు సేద తీరేలా బెంచీలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అధ్యక్షుడు నారాయణరెడ్డి, కోశాధికారి నరసింహారెడ్డి, సభ్యులు భక్తవత్సలంరాజు, చెంగారెడ్డి, వనిత, రామకృష్ణారెడ్డి, రఘునాథరెడ్డి, రెడ్డెప్పరెడ్డి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కార్యదర్శి డాక్టర్ ప్రభాకర్

అమ్మ బాబోయ్.. గుంపు మళ్లీ వచ్చింది

కల్లూరు(కేకేపేట), న్యూస్‌టుడే: పులిచెర్ల మండలంలో నాలుగు నెలలుగా కనిపించని 16 ఏనుగుల గుంపు మళ్లీ రావడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఎల్లంకివారిపల్లె పంచాయతీ దిగువమూర్తివారిపల్లె వ్యవసాయ పొలాల్లో పంటలను 16 ఏనుగులు తొక్కి ధ్వంసం చేశాయి. పలువురు రైతులకు చెందిన మామిడి చెట్లను విరిచేశాయి. ఈ విషయమై అటవీ విభాగం రేంజర్ థామస్‌కుమార్ మాట్లాడుతూ.. ఏనుగులు ప్రస్తుతం తిరుపతి జిల్లా భీమవరం అటవీ ప్రాంతానికి చేరుకున్నాయని తెలిపారు.

ఏనుగుల దాడిలో దెబ్బతిన్న పంట

బత్తలాపురంలో గంగమ్మ విగ్రహ ప్రతిష్ఠ

చౌడేపల్లె, న్యూస్‌టుడే: మండలంలోని గడ్డంవారిపల్లె పంచాయతీ బత్తలపురంలో బోయకొండ గంగమ్మ విగ్రహాన్ని ఆదివారం ప్రతిష్ఠించారు. గ్రామానికి చెందిన మద్రెప్ప కుటుంబ సభ్యులు భూమి విరాళంగా ఇవ్వడంతో దేవాదాయ శాఖ నిధులు మంజూరు చేసింది. గ్రామస్థులు అందరూ కలిసి గంగమ్మ ఆలయాన్ని నిర్మించుకున్నారు. సర్పంచి భాగ్యలత పర్యవేక్షణలో కార్యక్రమాలు జరిగాయి.

CHANGE OF NAME
I, **SHAIK MAHAMMED RAHEEM** (Old Name), S/o SHAIK MOHAMMED ALI, resident of D.No. 3-60-2-B, Teachers Colony, Madanapalle Mandal, Annamayya District. Henceforth be known as **SHAIK MOHAMMED RAHEEM** (New Name).

(c) eenadu

కర్రల వంతెన.. ఎన్నాళ్లీ యాతన!

నిజాంపట్నం పంచాయతీ పరిధిలోని గోకర్ణమఠం పక్కన మీదుళ్లపర్ర ప్రాంతంలో 2వేల మంది రైతులు 5 నుంచి 6 వేల ఎకరాల్లో ఆక్వా సాగు చేస్తుంటారు. ఈ క్రమంలో అక్కడ ఉన్న మురుగు కాలువను దాటాల్సి ఉంటుంది. వంతెన లేకపోవడంతో కర్రలతో వంతెన మాదిరి ఏర్పాటు చేసుకుని కాలువ దాటుతున్నారు. రొయ్య పిల్లలకు మేత, పండించిన పంటను దానిపైనే తరలిస్తున్నారు. ప్రమాదవశాత్తు రైతులు కాలువలో పడి మృతిచెందిన ఘటనలు ఉన్నాయి. 20 ఏళ్ల నుంచి ఈ కాలువపై వంతెన నిర్మించాలని రైతులు కోరుతున్నా ఫలితం లేదు. ఈ విషయమై మురుగు కాలువల నిర్వహణ ఏఈ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వంతెన నిర్మాణానికి రూ.నాలుగున్నర కోట్లతో ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి నివేదికలు పంపామన్నారు. - న్యూస్‌టుడే నిజాంపట్నం

ప్రసన్న వదనం.. ప్రత్యేక రూపం

చీరాల బోస్‌నగర్‌లోని సువర్చలా సమేత వీరాంజనేయ ఆలయం పునర్నిర్మించి పుష్కర కాలం పూర్తవడంతో మహా కుంభాభిషేక మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. భక్తులు బహూకరించిన సువర్ణ కిరీటాన్ని ఆదివారం స్వామి వారికి ప్రత్యేకంగా అలంకరించారు. రాత్రికి స్వామి వారి కల్యాణం జరిపించారు.
- న్యూస్‌టుడే, చీరాల అర్బన్

కీలక నేత.. కమీషన్ల మేత

ధాన్యం సేకరణలో క్వింటాకు రూ.పది చెల్లించాలని డిమాండ్

న్యూస్‌టుడే, బాపట్ల, వేమూరు

రైతుల నుంచి ధాన్యం సేకరణలో జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీకి (డీసీఎంఎస్) చెందిన కొందరు సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారు. క్వింటాకు రూ.పది ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. డీసీఎంఎస్‌లో కీలక స్థానంలో ఉన్న గుంటూరు జిల్లాకు చెందిన ఓ కీలక నేత ప్రోద్బలంతో సంస్థలో తాత్కాలికంగా చేరిన సిబ్బంది నగదు వసూళ్లలో మునిగి తేలుతున్నారు. డబ్బు ఇవ్వకుంటే ధాన్యం సేకరణలో జాప్యం చేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

డీసీఎంఎస్‌లో ముఖ్యస్థానంలో ఉన్న నేత ధాన్యం సేకరణ ఆరంభంలో జిల్లాకు వచ్చి మిల్లర్లతో సమావేశం ఏర్పాటు చేసి బహిరంగంగా ధాన్యం బస్తాకు రూ.పది చొప్పున తనకు కమీషన్ ఇవ్వాలని కోరారు. దీనికి మెజార్టీ మిల్లర్లు తిరస్కరించారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతుల నుంచి, సీఎంఆర్‌లో ధాన్యం మర ఆడిస్తున్న మిల్లర్ల నుంచి నగదు వసూలు చేయాలని సహకార మార్కెటింగ్ సొసైటీ అధికారులు, ఉద్యోగులను సదరు నేత ఆదేశించారు. కమీషన్ల వసూలును వారు తిరస్కరించారు. తన మాట వినడం లేదని అధికారులు, ఉద్యోగిని పక్కన పెట్టి బాపట్ల, రేపల్లె, వేమూరు నియోజకవర్గాల్లో తన సొంత మనుషులను తాత్కాలిక సిబ్బందిగా నియమించారు. వారి ద్వారా వసూళ్ల పర్వానికి తెరతీశారు.

చేయి తడిపితేనే మిల్లులకు తరలేది

ప్రభుత్వం జిల్లాలో ఇప్పటి వరకు 1.65 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసింది. రైతులకు రూ.379 కోట్లు చెల్లించింది. ఆర్‌ఎస్‌కే సిబ్బంది ద్వారా డీసీఎంఎస్ సిబ్బంది రైతుల నుంచి బలవంతంగా నగదు వసూలు చేస్తున్నారు. తమకు కమీషన్ చెల్లిస్తే ఆర్‌ఎస్‌కేలో వేగంగా ట్రక్‌షీట్ జనరేట్ చేసి ధాన్యాన్ని మిల్లులకు పంపించి రైతు బ్యాంకు ఖాతాలో నగదు వెంటనే జమయ్యేలా చేస్తామని చెప్పి జేబులు నింపుకొంటున్నారు. రేపల్లె, వేమూరులో సిబ్బంది వసూళ్ల విషయం అక్కడి ప్రజాప్రతినిధులకు తెలిసి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రత్యేకంగా నియమించిన సిబ్బందిని పంపించారు.

రేషన్ కొనే వ్యక్తిని తాత్కాలిక ఉద్యోగిగా..

పొన్నూరులో రేషన్ బియ్యం కొని విక్రయించే ఓ వ్యక్తిని బాపట్లలో డీసీఎంఎస్ తాత్కాలిక ఉద్యోగిగా నియమించారు. బాపట్ల నియోజకవర్గంలో ధాన్యం సేకరణపై అతను పరోక్షంగా పెత్తనం చెలాయిస్తున్నాడు. రైతుల నుంచి నగదు వసూలు చేసి ఇచ్చే ఆర్‌ఎస్‌కేలకు ధాన్యం కొనుగోలుకు వేగంగా అనుమతులు ఇచ్చేలా చక్రం తిప్పుతున్నాడు. బాపట్ల మండలంలో వరి అత్యధికంగా సాగయ్యే రెండు గ్రామాల్లో ధాన్యం కొనుగోలుకు రైతులు నగదు చెల్లించాలని తన మనుషుల ద్వారా తాత్కాలిక ఉద్యోగి డిమాండ్ చేశాడు. కమీషన్ ఇవ్వమని కొందరు రైతులు అడ్డం తిరిగారు. అతడు బాపట్లలో కార్యాలయం ఏర్పాటు చేసుకుని కర్లపాలెం, పిట్టలవానిపాలెం మండలాల్లోనూ దందా చేస్తున్నాడు. కిందిస్థాయి నుంచి రూ.లక్షల్లో వసూళ్లకు పాల్పడి సొసైటీలోని పైస్థాయి నేతకు ముట్టజెబుతున్నాడు.

❖ నగదు వసూళ్ల విషయాన్ని పౌరసరఫరాల డీఎం శ్రీలక్ష్మి దృష్టికి తీసుకెళ్లగా రైతులు ఎవరికీ పైసా చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. డీసీఎంఎస్‌లో అక్రమాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

అమృత్ రైల్వేస్టేషన్లో అవస్థలు

అమృత్ భారత్ రైల్వే స్టేషన్ బాపట్లలో ఆధునికీకరణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. పట్టణంలో వాణిజ్య ప్రాంతం, ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు, ఆసుపత్రుల నుంచి రైల్వే స్టేషన్ మీదుగా ప్రజలు రైలుపేటకు వెళ్లే కాలినడక వంతెనను రెండున్నరేళ్ల క్రితం మూసేశారు. కొత్త వంతెన పనులు ఆలస్యంగా జరుగుతున్నాయి. స్టేషన్లో ఒకటి నుంచి రెండు, మూడు ప్లాట్‌ఫారాలకు వెళ్లటానికి ప్రయాణికులు ప్రమాదకరంగా రైల్వేట్రాక్ దాటుతున్నారు.

ప్రమాదకరంగా పట్టాలు దాటుతున్న జనం

న్యూస్‌టుడే, రైలుపేట (బాపట్ల)

పట్టణంలోని రైలుపేట ప్రాంతంలో ఎనిమిది వార్డులు ఉన్నాయి. గతంలో రైల్వేస్టేషన్ నుంచి ఉన్న కాలినడక వంతెన ద్వారా పాదచారులు రైలుపేట నుంచి రథంబజారు, పాత బస్టాండ్, గడియార స్తంభం కూడళ్లు, సూర్యలంక రోడ్డు, పురపాలక మార్కెట్, భావనారాయణ స్వామి, సోమేశ్వర స్వామి ఆలయాలకు వచ్చి వెళ్లేవారు. రోజూ వేల మంది ఇటుగా రాకపోకలు సాగించేవారు. బాపట్ల రైల్వేస్టేషన్‌ను అమృత్ భారత్ స్టేషన్‌గా ఎంపిక చేసి రూ.వంద కోట్ల నిధులు మంజూరు చేసి ఐదు, ఆరు ట్రాక్‌లు, నూతన ప్లాట్‌ఫాం నిర్మాణాలు చేపట్టారు. ఒకటి, రెండు, మూడు ప్లాట్‌ఫాంలను ఆధునికీకరిస్తున్నారు. కొత్త ట్రాక్‌ల నిర్మాణం కోసం పొట్టిశ్రీరాములు పార్కు నుంచి ఉన్న పాదచారుల కాలినడక వంతెన తొలగించారు. దాని స్థానంలో కొత్తది నిర్మిస్తామని ప్రకటించారు.

కాలినడక వంతెనకు ఇనుప పిల్లర్లు ఇలా..

లగేజీతో వెళ్లడానికి ఇబ్బందులు

రైల్వేస్టేషన్లో రోజూ 42 రైళ్లు ఆగుతున్నాయి. ఎక్కువగా రెండు, మూడు ప్లాట్‌ఫాంలకు వస్తున్నాయి. ప్రస్తుతం స్టేషన్లో తూర్పు భాగంలో మాత్రమే ఒకటి నుంచి రెండు, మూడు ప్లాట్‌ఫాంలకు వెళ్లటానికి వంతెన, లిఫ్ట్ సౌకర్యం ఉన్నాయి. ఒంగోలు, నెల్లూరు, తిరుపతి, చెన్నై వైపు రైలు ఎక్కాల్సిన ప్రయాణికులు మెట్ల వంతెనపై నుంచి లగేజీ మోస్తూ ప్లాట్‌ఫాం మీదుగా వెళ్లి మరో కి.మీ. దూరం నడవాల్సి రావటం ఇబ్బందిగా ఉంది. స్టేషన్లో రైలు కేవలం రెండు నుంచి మూడు నిమిషాలు మాత్రమే ఆగుతుంది. ఈలోగా లగేజీతో పరుగు తీస్తూ రిజర్వేషన్ బోగీ ఎక్కడానికి అవస్థలు పడుతున్నారు.

రైలుపేట వాసులకు దూరాభారం

ప్రయాణికుల అవసరాల దృష్ట్యా మరో మెట్ల వంతెన, లిఫ్ట్ నిర్మాణానికి రైల్వే ఉన్నతాధికారులు అనుమతులు మంజూరు చేశారు. ఈ వంతెన నుంచి ప్లాట్‌ఫాంలతో పాటు రైలుపేటకు వెళ్లటానికి అవకాశం కల్పిస్తామని ప్రకటించారు. అయితే ఏడాదిగా వంతెన నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. దీంతో రైలుపేట వాసులు చుట్టూ నాలుగు కి.మీ. తిరిగి వెళ్లాల్సి వస్తోంది. ప్రయాణికులు ఒకటో నంబరు ప్లాట్‌ఫాం నుంచి రెండు, మూడు ప్లాట్‌ఫాంకు వెళ్లటానికి ప్రమాదకరంగా రైల్వే ట్రాక్‌లు దాటుతున్నారు. రైళ్ల కోసం వేచి చూసే వారు నీడ లేక అల్లాడుతున్నారు.

అసంపూర్తిగా గదులు.. వరండాలో చదువులు

గత ప్రభుత్వ హయాంలో పందిళ్లపల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు ఎనిమిది అదనపు తరగతి గదులతోపాటు మౌలిక వసతుల కల్పనకు రూ.1.26 కోట్ల ప్రతిపాదనలు తయారుచేసి ప్రభుత్వానికి నివేదించారు. ఆ మేరకు రూ.48 లక్షలు పాఠశాల బ్యాంకు ఖాతాకు జమవగా మొదటి అంతస్తుతో కూడిన భవనం నిర్మించారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో నాలుగు, పై అంతస్తులో మరో నాలుగు గదులు ఏర్పాటుచేశారు. నిధులు లేక పైఅంతస్తులోని గదుల్లో ప్లాస్టింగ్,

ఫ్లోరింగ్ పనులు నిలిచిపోయాయి. గడిచిన రెండేళ్లుగా ఇదే పరిస్థితి ఉంది. ఫలితంగా తరగతి గదులు చాలక విద్యార్థులు వరండాల్లోనే విద్యనభ్యసిస్తున్నారు.
- న్యూస్‌టుడే, పందిళ్లపల్లి (వేటపాలెం)

నిమిషం ఆలస్యమైనా అనుమతించరు

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

బాపట్ల, చీరాల అర్బన్, న్యూస్‌టుడే: బాపట్ల జిల్లాలో సోమవారం నుంచి జరిగే ఇంటర్ పరీక్షలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. బాపట్ల పోలీస్‌స్టేషన్‌కు ఇంటర్ ప్రశ్నాపత్రాలు వచ్చాయి. ఆదివారం వాటిని అధికారుల ఆధ్వర్యంలో సిబ్బంది పెట్టెల్లో సర్దారు. మార్చి 24 వరకు పరీక్షలు జరగనున్నాయి. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. విద్యార్థులు అరగంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి. జిల్లాలో పరీక్ష కేంద్రాలు 36 ఉన్నాయి. 19,292 మంది పరీక్షలకు హాజరుకానున్నారు. నిమిషం ఆలస్యమైనా పరీక్షకు అనుమతించబోమని జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారి జుబేర్ తెలిపారు. అన్ని కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మాల్ ప్రాక్టీస్‌కు ఎవరు పాల్పడకుండా పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు

వేటపాలెంలో పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరా

ఏర్పాటు చేసినట్లు వివరించారు. వీటిని జిల్లా ఇంటర్ విద్యాశాఖ కార్యాలయంతో పాటు కమిషనరేట్‌కి అనుసంధానం చేయడంతో నిరంతరం వీటిపై పర్యవేక్షణ ఉంటుందన్నారు. పరీక్షల నిర్వహణలో ఎటువంటి సందేహాలు, అనుమానాలున్నా జిల్లాలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం నంబరు 90007 97779కి సంప్రదించాలని సూచించారు.

నేడు కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్

బాపట్ల, న్యూస్‌టుడే: కలెక్టరేట్‌లో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) జరుగుతుందని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదివారం తెలిపారు. ఉదయం 10 నుంచి 1 గంట వరకు ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తామని తెలిపారు. ప్రతి రెవెన్యూ డివిజన్, తహసీల్దారు, ఎంపీడీవో కార్యాలయాల్లోనూ ప్రజా సమస్యలపై అధికారులు అర్జీలు తీసుకుంటారని చెప్పారు. జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వైకాపాకు పట్టలేదు.. కూటమి వదల్లేదు

అమరావతి వ్యవసాయక్షేత్రంలో ప్రయోగశాలల ప్రారంభానికి ప్రణాళిక

చారిత్రక అమరావతిలోని వ్యవసాయక్షేత్రంలో ఆధునిక సాంకేతిక ప్రయోగశాలల ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ప్రయోగశాలలపై ఐదేళ్లపాటు వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యం వహించింది. దీంతో భవనాలు పగుళ్లు రావడంతోపాటు పరిసరాల్లో పిచ్చిమొక్కలు పెరిగి రూ.7.30 కోట్లతో నిర్మించినవి నిరుపయోగంగా మారాయి. ఈ పరిస్థితిపై 'ఈనాడు'లో వరుస కథనాలు రావడంతో కూటమి ప్రభుత్వం స్పందించింది.

ఈనాడు, అమరావతి

వ్యవసాయ క్షేత్రంలో డీఎన్‌ఏ వేలిముద్రలు, జన్యుమార్పిడి పంటల పర్యవేక్షణ ప్రయోగశాలలతో పాటు ప్రాంతీయ డీకోడింగ్ కేంద్రం, మరో రెండు భవనాల నిర్మాణానికి కేంద్రం 2017లో రూ.7.30 కోట్లు మంజూరు చేసింది. 2018లో మొదలైన పనులు 2021 నాటికి పూర్తయ్యాయి. గత వైకాపా ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో గుత్తేదారు వ్యవసాయశాఖకు భవనాలు అప్పగించలేదు. నాటి నుంచి వృథాగా ఉండటంతో చుట్టూ పిచ్చిమొక్కలు పెరగడం, సామగ్రి చోరీకి గురవడం, ప్రయోగశాల అద్దాలు కొన్ని పగిలిపోయి అధ్వానంగా తయారయ్యాయి. గతంలో నాసిరకంగా పనులు చేసిన గుత్తేదారుకు రూ.35 లక్షల జరిమానా విధించిన సొమ్ముతో పాటు మౌలిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం రూ.1.58 కోట్లు మంజూరు చేయడంతో పనులు జరుగుతున్నాయి. మార్చిలో ప్రయోగశాలలు అందుబాటులోకి తీసుకురావడానికి వ్యవసాయశాఖ చర్యలు చేపట్టింది.

భూసార పరీక్ష ప్రయోగశాల భవనం

అంతర్గత రహదారుల నిర్మాణం..

కూటమి ప్రభుత్వం వ్యవసాయ క్షేత్రంపై ప్రత్యేక దృష్టి సారించింది. డీఎన్‌ఏ ప్రయోగశాలలో కొన్ని పరికరాలు, వ్యవసాయ క్షేత్రంలో ఆయా భవనాల వద్దకు వెళ్లడానికి అంతర్గత రహదారులు నిర్మిస్తోంది. రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో అత్యాధునిక భూసార పరీక్ష ప్రయోగశాల ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో డ్రై కెమిస్ట్రీ విధానంలో భూసారాన్ని పరీక్షించేలా ప్రయోగశాల ఏర్పాటవుతోంది. ఇప్పటికే ఒక భవనంలో ఎరువులు, పురుగు మందులు, విత్తనాల నమూనాలను డీకోడింగ్ చేసి వివిధ ప్రయోగశాలలకు పంపే ప్రక్రియ ఓ భవనంలో కొనసాగుతోంది. డీఎన్‌ఏ ప్రయోగశాలలో వేలిముద్రలు, జన్యుమార్పిడి పంటల ప్రయోగశాలలోనే కొంతభాగంలో నానో ఎరువులు, బయో ఉత్ప్రేరకాల ఉత్పత్తుల పరీక్ష ప్రయోగశాలలు ఏర్పాటు చేస్తారు. ఎరువులు, పురుగు మందులు, విత్తనాల పరీక్ష ప్రయోగశాల మరో భవనంలో ఏర్పాటవుతుంది. నిర్మాణాలు పూర్తయిన నాలుగు భవనాలకు ప్రహరీలు నిర్మిస్తున్నారు. 120 ఎకరాల విస్తీర్ణంలో భూములు ఉన్నందున పలు పరీక్ష కేంద్రాలతోపాటు షేడ్‌నెట్, పాలీహౌస్‌లలో మొక్కల పెంపకానికి ప్రాధాన్యం ఇస్తారు. అమరావతి క్షేత్రం వ్యవసాయ ప్రయోగశాలల హబ్‌గా రూపుదిద్దుకుంటుందని పనులు పర్యవేక్షిస్తున్న వ్యవసాయశాఖ అధికారి తెలిపారు.

దిగుబడి తగ్గి.. ధర పెరిగి..

నిమ్మకాయల సాగు రైతుల పరిస్థితి ఇదీ

ఈనాడు, అమరావతి

నిమ్మకాయల ధరలు కొన్నాళ్లుగా పెరుగుతున్నాయి. సాధారణంగా ఫిబ్రవరిలో ధరలు తక్కువగా ఉండాలి. ఈ సారి అందుకు భిన్నంగా పరిస్థితి ఉంది. కిలో గరిష్ఠంగా రూ.92 వరకు రైతులకు ధర లభించింది. తెనాలి మార్కెట్‌కు సరకు తగ్గడంతో ధరలు పెరుగుతున్నాయి. మంచి ధరలు లభిస్తున్నా అందిపుచ్చుకుంటున్న రైతులు కొందరే ఉన్నారు. ప్రతికూల వాతావరణం, మొంథా తుపానుతో పాటు జనవరి, ఫిబ్రవరి నెలల్లో అధికంగా మంచు కురవడం వల్ల పూత దశలోనే సమస్య ఏర్పడి దిగుబడులు తగ్గాయి. తెనాలి మార్కెట్‌కు సాధారణంగా వచ్చే నిమ్మకాయల్లో నాలుగోవంతు మాత్రమే సరకు వస్తోంది. నిరుడు ఇదే సమయంలో ఉన్న ధరలతో పోలిస్తే మూడు రెట్లు పెరగడం గమనార్హం.

ఈ ఏడాది జనవరి నుంచి నిమ్మకాయల ధరలు పుంజుకుంటున్నాయి. కిలో కాయలకు ఫిబ్రవరిలో సగటు ధర సైతం రూ.80కు తగ్గడం లేదు. డిమాండ్‌కు తగినంతగా సరకు లభ్యత లేదని మార్కెటింగ్‌శాఖ అధికారులు చెబుతున్నారు. తెనాలితోపాటు ఏలూరు, గూడూరు నిమ్మ మార్కెట్లలోనూ ఇదే పరిస్థితి కొనసాగుతోంది. నిమ్మకాయలకు అధిక ధరలు పలకడం రైతులను ఊరిస్తోంది. ఈ సమయంలో ఏటా లభించే ధరలు కన్నా మూడు రెట్లు అధికంగా పలకడం వారిని ఆలోచనకు గురిచేస్తోంది. పూత, కాపు కాపాడుకున్న రైతులకు ప్రస్తుత ధరలు లాభాలు తెచ్చిపెడుతున్నాయి. అయితే 90 శాతం మంది రైతుల తోటల్లో పూత రాలిపోయింది. వీరంతా పూతను కాపాడుకునే ప్రయత్నాల్లో ఉన్నారు. నిమ్మ పంటకు కీలకమైన సమయమైన చలికాలం నుంచి ప్రతికూల వాతావరణం ఏర్పడింది. వేసవి ప్రారంభమవుతుండటంతో రైతులు మరింత జాగ్రత్తగా తోటలను కాపాడుకుంటున్నారు. పూత రాలిపోవడం వల్ల కాయ తగ్గి సరఫరా తగ్గడంతో ధర పెరిగిందని, నాణ్యమైన కాయలు తెచ్చి అవకాశాన్ని రైతులు ఉపయోగించుకోవాలని తెనాలి మార్కెట్‌యార్డు కార్యదర్శి సుబ్బారావు సూచించారు.

తెనాలిలో నిమ్మకాయల ధరలు (రూ.ల్లో)

కాలం	కనిష్ఠం	గరిష్ఠం	మోడల్
గత జనవరి	2800	3500	3100
ఈ ఏడాది జనవరి	2200	3500	2800
నిరుడు ఫిబ్రవరి	4300	5300	4900
ప్రస్తుత నెలలో..	7200	8800	8000

సేవల సారథులు.. ప్రజలకు వారధులు

ఈనాడు, అమరావతి

'అద్భుతమైన సేవలకు సారథులు మీరు.. ప్రజల మధ్య సమాచార మార్పిడికి వారధులు మీరు.. ప్రతి పల్లెవాసికి ఆత్మీయ స్నేహితులు గ్రామీణ డాక్ సేవక్‌లు. ఎంత సాంకేతికత అభివృద్ధి చెందినా, ఏఐ తరహా పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చినా మీరు లేని లోటు ఊహించలేం. మారుతున్న కాలానికి అనుగుణంగా తపాలాశాఖలోనూ ఆధునికత సంతరించుకునేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపుతాం. మిమ్మల్ని చూస్తుంటే నా చిన్నతనం గుర్తొస్తోంది.'' అని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. ఆదివారం సాయంత్రం గుంటూరు శివారులోని సత్యసాయి ఆధ్యాత్మిక నగరిలో జరిగిన జాతీయస్థాయి గ్రామీణ డాక్ సేవక్ సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సాయంత్రం 3.30 గంటలకు హెలికాప్టర్‌లో గుంటూరుకు చేరుకున్న సీఎం చంద్రబాబుకు అధికారులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. ఆలోపే కాజ టోల్‌గేట్ నుంచి కేంద్రమంత్రులు జ్యోతిరాదిత్య సింధియా, పెమ్మసాని చంద్రశేఖర్ భారీ ర్యాలీగా సభాప్రాంగణానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా జీడీఎస్ సమూహాన్ని ఉద్దేశించి చంద్రబాబు ప్రసంగించారు.

పోస్టల్ ఉద్యోగి విశ్వేశ్వరరావును సత్కరిస్తున్న సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రులు పెమ్మసాని, జ్యోతిరాదిత్య

ఆత్మీయ పలకరింపులు.. కార్యక్రమంలో కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా, సీఎం చంద్రబాబు మధ్య ఆత్మీయ పలకరింపులు ఆకట్టుకున్నాయి. సభ జరుగుతున్నంతసేపు ఇద్దరూ అభిమానంగా మాట్లాడుకోవడం కనిపించింది. అనంతరం ఇద్దరూ చేసిన ప్రసంగాల్లోనూ తమ అనుబంధాన్ని నెమరు వేసుకున్నారు. జీడీఎస్‌లు చేస్తోన్న దేశసేవ వల్ల 38 కోట్ల తపాలా ఖాతాలు ప్రస్తుతం ఉన్నాయని, రూ.22 లక్షల కోట్ల మూలనిధి ఉందని జ్యోతిరాదిత్య అన్నారు. సుకన్య సమృద్ధి యోజన, మేరీలాడ్లీలక్ష్మి కింద 3.8 కోట్లు ఖాతాలు రూ.2.7 లక్షల కోట్ల కార్పస్ ఫండ్ అందించాయని వివరించారు. పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ భారత తపాలా వ్యవస్థ మన మట్టిలోనే ఉంది. సందేశం తీసుకెళ్లే పాదాలు పరిగెత్తికెళ్లాయని ఉత్సాహపరిచారు.

స్ఫూర్తి నింపి.. ఉత్తమ సేవలందించిన గ్రామీణ డాక్ సేవక్‌లను ఈ సందర్భంగా సీఎం, కేంద్రమంత్రులు సత్కరించారు. వారి యూనిఫామ్ జ్యోతిరాదిత్య తొడగడం ఆకట్టుకుంది. భారీగా పోటెత్తిన జీడీఎస్‌లతో సభాప్రాంగణం నిండిపోయింది.

నారసింహాయ నమోనమః

మంగళగిరి గ్రామీణం: శ్రీపానకాల లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం పెండ్లి కుమారుని ఉత్సవంతో

గ్రామోత్సవంలో స్వామి

ప్రారంభమయ్యాయి. వేకువన స్వామివారి తీర్థ బిందె తీసుకురావడం, ప్రాతఃకాల అర్చన తదితర పూజలు చేశారు. ఉదయం 8 గంటలకు పద్మశాలీయ బహూత్తమ సంఘం ఆధ్వర్యంలో పట్టువస్త్రాలను మేళతాళాలతో తీసుకురాగా.. ప్రధాన అర్చకుడు శ్రీనివాస దీక్షితులు ఆధ్వర్యంలో అభిషేకం నిర్వహించి స్వామి, అమ్మవార్లను అలంకరించారు.

కూటమి ప్రభుత్వంతో యువతకు ఉజ్వల భవిష్యత్తు

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పార్థసారథి

బాపట్ల, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం మరో ఇరవై ఏళ్లు అధికారంలో ఉంటే దేశంలోనే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో అగ్రగామిగా నిలిచి యువతకు ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. వెదుళ్లపల్లి బధిరుల ఆశ్రమ పాఠశాల సమీపంలో ప్రభుత్వం కేటాయించిన రెండెకరాల భూమిలో బాపట్ల పార్లమెంటు తెదేపా కార్యాలయ భవన నిర్మాణానికి మంత్రులు కొలుసు, అనగాని, ఎంపీ, ఎమ్మెల్యేలతో కలిసి ఆదివారం భూమిపూజ చేశారు. అనంతరం నిర్వహించిన సభలో బాపట్ల పార్లమెంట్ తెదేపా అధ్యక్షుడు సలగల రాజశేఖర బాబు, ప్రధాన కార్యదర్శి నక్కల రాఘవ, నూతన కార్యవర్గ కమిటీతో ఇన్‌ఛార్జి మంత్రి పార్థసారథి ప్రమాణ స్వీకారం చేయించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా, పారిశ్రామికవేత్తలను భయపెట్టడానికి వైకాపా అధినేత జగన్ చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలన్నారు. 2029 ఎన్నికల్లో కూటమిని అధికారంలోకి తీసుకురావటం ద్వారా రాష్ట్రాన్ని కాపాడుకోవాలన్నారు. మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ 2019లో జగన్ మాయ మాటలు నమ్మి ప్రజలు అధికారమిస్తే ఐదేళ్లు నరకం చూపించి భావితరాల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టారన్నారు. వైకాపా కల్తీ, అబద్ధాల పార్టీ అని ధ్వజమెత్తారు. కలియుగ ప్రత్యక్ష దైవం వేంకటేశ్వరస్వామిని రాజకీయాల్లోకి తెచ్చి హిందువులను అవమానిస్తూ వైకాపా చేస్తున్న దుర్మార్గాలను ప్రజలకు తెదేపా శ్రేణులు వివరించి చెప్పాలన్నారు. ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ మాట్లాడుతూ కేంద్రం, రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వాలు అధికారంలో ఉండటం వల్ల బాపట్ల లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో రూ.32 వేల కోట్లతో భారీగా అభివృద్ధి పనులు చేస్తున్నట్లు తెలిపారు.

భూమి పూజ చేస్తున్న మంత్రులు పార్థసారథి, అనగాని సత్యప్రసాద్, ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, ఎమ్మెల్యేలు సాంబశివరావు, నరేంద్రవర్మ, విజయకుమార్

బాపట్లలో ఎన్టీఆర్ భవన్ నిర్మాణం ఆనందం

ఎమ్మెల్యేలు నక్కా ఆనందబాబు, ఏలూరి సాంబశివరావు, వేగేశన నరేంద్రవర్మ, విజయకుమార్, కొండయ్య మాట్లాడుతూ సలగల రాజశేఖరబాబు నాయకత్వంలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను కూటమి పార్టీలు క్లీన్ స్వీప్ చేయాలన్నారు. బాపట్లలో ఎన్టీఆర్ భవన్‌ను నిర్మించుకోవటం ఆనందంగా ఉందన్నారు. కూటమి పాలనలో అన్ని సమస్యలను పరిష్కరిస్తూ ప్రగతిని పరుగులు పెట్టిస్తున్నట్లు చెప్పారు. వైకాపా చేస్తున్న కుల, మత రాజకీయాలను సమర్థంగా తిప్పికొట్టాలన్నారు. మాజీ ఎమ్మెల్యేలు బాచిన చెంచుగరటయ్య, చీరాల గోవర్ధన్‌రెడ్డి, హ్యాండ్లూమ్ కార్పొరేషన్ ఛైర్మన్ సజ్జా హేమలత, గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ సుచరిత, తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తాతా జయప్రకాష్ నారాయణ, పరిశీలకుడు శివసాంబిరెడ్డి, ఏఎంసీ ఛైర్మన్ కావూరి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

తొలి తెలుగు స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ

బాపట్ల, న్యూస్‌టుడే: తొలి తెలుగు స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి అని ఎస్పీ ఉమామహేశ్వర్ అన్నారు. ఆయన వర్ధంతి సందర్భంగా జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో నరసింహారెడ్డి చిత్రపటానికి ఎస్పీ పూలమాల వేసి నివాళి అర్పించారు. ఉమామహేశ్వర్ మాట్లాడుతూ సిపాయిల తిరుగుబాటు కంటే పదేళ్ల ముందే 1846-47లో బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీకి వ్యతిరేకంగా రాయలసీమలో సాయుధ పోరాటం చేసిన ధీశాలి ఉయ్యాలవాడ అని పేర్కొన్నారు. ఆ మహనీయుని త్యాగానికి గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం 2017లో నరసింహారెడ్డి చిత్రంతో తపాలా బిళ్లను విడుదల చేసిందన్నారు. కర్నూలు విమానాశ్రయానికి రాష్ట్ర ప్రభుత్వం ఆయన పేరు పెట్టడం అందరికీ గర్వకారణమన్నారు. ఎస్బీ సీఐ నారాయణ, ఆర్ఐ మౌలుద్దీన్, సీఐ ఆనందరావు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

నరసింహారెడ్డి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఎస్పీ ఉమామహేశ్వర్, పోలీసు అధికారులు

65వ సం॥లోకి అడుగిడుతున్న సందర్భంగా
శ్రీరామా రూరల్ అకాడమి అధ్యక్షులు
శ్రీ తులసి విష్ణు ప్రసాద్ గారికి
M.Tech
STATE PRESIDENT - APPUSMA
VICE PRESIDENT - NISA
జన్మదిన శుభాకాంక్షలు
SRI RAMA SAINIK SCHOOL
CHILUMURU, ANDHRA PRADESH
SRI RAMA RURAL ACADEMY
JEEVANANDA HIGH SCHOOL
DHARMAVARAM
KVSRT JUNIOR COLLEGE
CHILUMURU
శ్రీ మహిత విద్యాసంస్థలు
తెనాలి - రేపల్లె
AP PRIVATE SCHOOL'S MANAGEMENTS ASSOCIATION
NISA National Independent Schools Alliance

ఉపాధి పనుల పూర్తికి ఆపసోపాలు

మార్చి 15లోపు పూర్తి చేయకుంటే నిధులు వెనక్కి వెళ్లే ప్రమాదం

ఎంజీసీ కాలనీ (చీరాల అర్బన్), న్యూస్‌టుడే

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకాన్ని కేంద్ర ప్రభుత్వం వీబీ జీ రామ్‌జీగా ఇటీవల పేరు మార్పు చేసింది. ఇది ఈ ఏడాది ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి అమల్లోకి రానుంది. ఈ నేపథ్యంలో ఇప్పటి వరకు అమల్లో ఉన్న ఉపాధి పథకం కింద ఇచ్చిన నిధులను ఆ లోపు ఖర్చు చేయాలనే ఆదేశాలు సైతం జారీ చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఈ పథకం కింద పల్లెల్లో రహదారులకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వడంతో ప్రతిచోట వీటి నిర్మాణాలు ఊపందుకున్నాయి. దీంతో పాటు గోకులం షెడ్లు మంజూరు చేసింది. 2026-27 ఆర్థిక సంవత్సరం నుంచి కొత్త పథకం కింద నిధులు మంజూరు చేయనున్నారు. ఇప్పటి వరకు మంజూరైన పనులు పూర్తి చేయడానికి కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలూ విడుదల చేసింది. దీంతో జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో ఎంపీడీవోలు, ఏపీవోలు, పీఆర్ ఏఈలు ఈ పనులను త్వరితగతిన పూర్తి చేయించే పనిలో నిమగ్నమయ్యారు.

చీరాల మండలం దేవాంగపురిలో జరుగుతున్న సీసీ రోడ్డు పనులు

☛ జిల్లాలో 2025-26 సంవత్సరంలో ఎన్ఆర్‌జీఈఎస్ కింద 1053 పనుల కోసం రూ.115 కోట్లు కేటాయించారు. ఇందులో 618 వరకు సీసీ, మెటల్, బీటీ రహదారులు, మురుగు కాలువలు, భవనాలు ఉన్నాయి. అన్ని పనులు ప్రారంభించారు. ఇక పశువుల గోకులం షెడ్లు 435 వరకు ఉన్నాయి. ఇప్పటి వరకు 89 రహదారుల పనులు, గోకులం షెడ్లు 260 వరకు పూర్తి చేశారు. దీని కోసం రూ.46 కోట్ల వరకు వ్యయం చేశారు. ప్రస్తుతం క్షేత్రస్థాయిలో పూర్తి చేసిన పనులకు సంబంధించిన బిల్లులు అప్‌లోడ్ చేసే పనిలో సిబ్బంది ఉన్నారు. మిగిలిన 23 రోజుల్లో పనులు పూర్తి చేయకపోతే వెనక్కి వెళ్లే ప్రమాదం ఉండటంతో అధికారులు పనులు మరింత ముమ్మరం చేసి, నిర్దేశించిన సమయానికి పూర్తి చేసే దిశగా కసరత్తు చేస్తున్నారు.

సముద్రంలో శిక్షణకు అర్హత పొందిన రామకృష్ణ

నిజాంపట్నం, న్యూస్‌టుడే: కేంద్రప్రభుత్వం మత్స్యశాఖకు సంబంధించి మరొక కీలక అడుగు ముందుకేసింది. దీనిలో భాగంగా కేంద్ర ప్రభుత్వం గత ఏడాది గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ప్రత్యేక ఆర్థిక మండలి విధానాన్ని అమలు చేస్తోంది. దానిలో భాగంగా మత్స్యకారులకు సముద్రం లోపల శిక్షణ ఇచ్చేందుకు బృందాల వారీగా పంపనున్నారు. ఈ నేపథ్యంలో నిజాంపట్నం నుంచి రాష్ట్ర ఫిషరీస్ బోర్డు డైరెక్టర్ బొమ్మిడి రామకృష్ణ వెళ్లేందుకు అనుమతి పొందారు. అందుకు సంబంధించి కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ నుంచి ఆదివారం అర్హత పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా బొమ్మిడి రామకృష్ణ మాట్లాడుతూ ఆర్థిక మండలి విధానం ద్వారా భారత సముద్ర సరిహద్దుల్లో, అదేవిధంగా సముద్రపు లోతుల్లో చేపల వేట చేసేందుకు మరింత అవకాశాలు లభిస్తాయని అన్నారు. బోటు యజమానులు తగిన ఆధారాలతో అంతర్జాలంలో దరఖాస్తు చేసుకుంటే అనుమతులు జారీ చేస్తారని తెలిపారు. మత్స్యకారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ నుంచి అనుమతి పత్రం అందుకొంటున్న రామకృష్ణ

పిల్లల చదువులు.. వివాహాలకు రుణాలు

స్వయం సహాయ సంఘాల సభ్యులకు ప్రభుత్వం చేయూత

ఎంజీసీ కాలనీ, ఈపూరుపాలెం (చీరాల అర్బన్), న్యూస్‌టుడే: స్వయం సహాయక సంఘాల్లోని మహిళల పిల్లల చదువులు... ఆడపిల్లల వివాహాలకు రుణాలు అందజేయడానికి కూటమి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీనికి సంబంధించిన విధి విధానాలు విడుదల చేసింది. ఈ పథకాలకు ఎన్టీఆర్ విద్యా లక్ష్మి, కల్యాణ లక్ష్మిగా నామకరణం చేశారు. వీటిని మార్చి 8న మహిళా దినోత్సవం రోజున ప్రారంభించాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. స్త్రీ నిధి, కో-ఆపరేటివ్ సంస్థ ద్వారా రుణాలు ఇవ్వనున్నారు.

జిల్లాలో 33,380 స్వయం సహాయక సంఘాలు ఉండగా వీటిల్లో సుమారు 3,40,935 మంది సభ్యులు ఉన్నారు. ఏటా సుమారు 20 వేల మందికి దీని ద్వారా లబ్ధి చేకూరుతోందనే అభిప్రాయాన్ని అధికారులు వ్యక్తం చేస్తున్నారు. విద్యాలక్ష్మి పథకం కింద సభ్యురాలికి చెందిన ఇద్దరు పిల్లల కేజీ నుంచి పీజీ చదువు వరకు రుణం అందజేస్తారు. దీనికోసం పాఠశాల ప్రవేశపత్రం, ఫీజు కట్టిన రసీదుతో దరఖాస్తు చేసుకోవాలి. రూ.10 వేల నుంచి రూ.లక్ష వరకు రుణం ఇవ్వనున్నారు. నాలుగు శాతం వడ్డీతో దీన్ని 48 వాయిదాల్లో తిరిగి చెల్లించాలి. ఇక కల్యాణ లక్ష్మి కింద పైన పేర్కొన్న వడ్డీ వర్తిస్తోంది. తీసుకున్న రూ.లక్ష రుణాన్ని వాయిదాల రూపంలో జమ చేయాలి. లగ్నపత్రిక, శుభ కార్యక్రమం నిర్వహణకు సంబంధించిన పత్రం, పెళ్లి ఖర్చుల వివరాలు అందజేస్తే సొమ్మును నేరుగా లబ్ధిదారు ఖాతాలో జమ చేస్తారు. దీనికి బీమా సౌకర్యం ఉంది. ప్రమాదవశాత్తు సభ్యురాలు చనిపోతే రుణం చెల్లించాల్సిన పనిలేదు.

గృహ నిర్మాణ రంగంలో కొత్త ప్రాజెక్టుకు శ్రీకారం

పట్టాభిపురం, న్యూస్‌టుడే: శ్రీభ్రమర రియల్ ఎస్టేట్ సంస్థ రాగ మెలోడి ఆఫ్ లివింగ్ పేరుతో నూతన ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టిందని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి పేర్కొన్నారు. గుంటూరుకు సమీపంలోని నారాకోడూరులో ప్రాజెక్టు బ్రోచర్లను ఆదివారం ఆమె శ్రీభ్రమర గ్రూప్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ గళ్లా రామచంద్రరావు, డైరెక్టర్లతో కలిసి ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ వినూత్న ఆలోచనలతో గృహ నిర్మాణ రంగంలో శ్రీభ్రమర అద్భుతాలు సృష్టిస్తుందన్నారు. సీఆర్‌డీఏ, రెరా ఆమోదం పొంది నారాకోడూరులోని మామిడితోటలో వీకెండ్ హోమ్స్ కాన్సెప్ట్‌తో ఈ ప్రాజెక్టును అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు చెప్పారు. రామచంద్రరావు మాట్లాడుతూ ఈ ప్రాజెక్టులో రిసార్ట్స్, కాటేజీలు, ప్లాట్లు ఉన్నాయన్నారు. మామిడి తోటలో సుందరంగా తీర్చిదిద్దిన ల్యాండ్‌స్కేప్ గ్రీనరీ, థీమ్ పార్కులు, విశాలమైన రహదారులు, పిల్లల పార్కులు, పచ్చదనంతో నిండి ఉంటుందని వివరించారు.

బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గళ్లా మాధవి, రామచంద్రరావు దంపతులు

ఎత్తు వేశారు.. విజేతలుగా నిలిచారు

తిరుపతి(క్రీడలు), న్యూస్‌టుడే: శాప్ లీగ్ పోటీల్లో భాగంగా తిరుపతిలోని శ్రీశ్రీనివాస క్రీడా సముదాయం వేదికగా రెండ్రోజులపాటు జరిగిన రాష్ట్రస్థాయి చదరంగం పోటీలు ఆదివారం ఉత్సాహంగా ముగిశాయి. పోటీల్లో పలు జిల్లాలకు చెందిన బాలబాలికలు ఎత్తులకు పైఎత్తులు వేస్తూ ప్రత్యర్థులపై సత్తాచాటారు. అండర్ -14, 17, 19 విభాగాల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విజేతలకు ఆదివారం ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, తితిదే పాలకమండలి సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్, తెదేపా రాష్ట్ర మీడియా సమన్వయకర్త శ్రీధర్ వర్మ ట్రోఫీ, పతకం, ప్రశంసాపత్రాలు ప్రదానం చేశారు. జిల్లా క్రీడాభివృద్ధి అధికారి శశిధర్, చదరంగం సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాససూరి పాల్గొన్నారు.

విజేతలతో కలెక్టర్ వెంకటేశ్వర్, భానుప్రకాష్ రెడ్డి, నరసింహ యాదవ్, శ్రీధర్ వర్మ

వైద్యుడి పేరుతో రూ.56 వేలు కాజేత

సైబర్ పోలీసులను ఆశ్రయించిన బాధితుడు

పెదకూరపాడు, న్యూస్‌టుడే: వైద్యుడని నమ్మించి ట్యాక్సీ చోదకుడి క్రెడిట్ కార్డు నుంచి రూ. 56 వేలు కొట్టేసిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పెదకూరపాడులోని గుంటూరు రోడ్డుకు చెందిన షేక్ మాబు సుభాని బస్టాండ్ సెంటర్‌లో బియ్యం దుకాణం నిర్వహిస్తున్నాడు. ఖాళీ సమయాల్లో కారు చోదకుడిగా వెళుతుంటాడు. ఈనెల 16న బస్టాండ్ సెంటర్ వద్ద ఉన్న జ్యూస్ పాయింట్ నిర్వాహకుడు సందిరెడ్డి శ్రీనివాసరావుతో గుర్తుతెలియని వ్యక్తి పరిచయం పెంచుకున్నాడు. ప్రభుత్వాసుపత్రి వైద్యుడినని, అత్యవసరంగా గుంటూరు వెళ్లాల్సి ఉందని, కారు బాడుగకు ఏర్పాటు చేయాలని కోరాడు. శ్రీనివాస్ సుభానితో మాట్లాడి గుంటూరు పంపించారు. అక్కడికి వెళ్లాక తనవద్ద స్మార్ట్ ఫోన్ లేదని, తెలిసిన వ్యక్తులు తనకు నగదు ఫోన్‌పే చేస్తారని నమ్మించాడు. అతనికి ట్యాక్సీ చోదకుడు చరవాణి ఇచ్చి ఆసుపత్రి బయట 15 నిమిషాలు వేచిచూశాడు. సదరు వ్యక్తి కనిపించకపోవడంతో అనుమానం వచ్చి మరో ఫోన్‌ద్వారా బ్యాంక్ శాఖకు ఫోన్‌చేసి, తన ఖాతాను స్తంభింపచేయాలని కోరాడు. అప్పటికే సుభాని ఖాతా నుంచి ఆటోనగర్ బీసీ పాయింట్‌వద్ద రూ.11వేలు, కాకాని సూపర్‌మార్కెట్ వద్ద రూ.25వేలు, హెచ్‌పీ పెట్రోల్ బంకులో మరో రూ.20వేలు చొప్పున డ్రాచేసినట్లు బ్యాంకు అధికారులు తెలిపారు. బాధితుడు సుభాని సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రమేష్ ఆసుపత్రి సీసీ కెమెరాలో నగదు కాజేసిన దుండగుడి చిత్రం నమోదవగా బాధితుడు గుర్తించాడు.

చరవాణిలో సందేశం చూపుతున్న సుభాని

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి అధిక ధరకు కొనబడును (స్పాట్ క్యాష్). ✆ 87907 41166

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph.81422 92071.

REAL ESTATE

SHOP FOR SALE

GENERAL

నరసరావుపేట అరండల్‌పేటలోని వాజ్‌పేయి రహదారిలో గల 66 గజాల కమర్షియల్ షాపు అమ్మకానికి కలదు. సెల్ 94903 42266, 94949 52020.

JOBS

Wanted B or D Pharmacy candidates to work in a pharmacy, n Guntur city, pci registration mandatory. Call: 6300975241.

Wanted b.com or M.B.A candidates to work as an accountant in medical distribution firm in guntur city. ✆ : 63009 75241.

భారతదేశ అగ్రగామి సంస్థలో పార్ట్ / ఫుల్‌టైం బిజినెస్ పార్టనర్‌గా చేరండి. అధిక కమీషన్ పొందండి. అః10th, వ:30-65 సం|| ✆ 79892 46788.

TATA AIA లైఫ్‌ఇన్సూరెన్స్ నందు పనిచేయుటకు టీమ్ లీడర్స్, మార్కెటింగ్ మేనేజర్స్, ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్స్ (M/F) రిటైర్డ్‌వారు, గృహిణులు, స్టూడెంట్స్ కావలెను. 9705313661.

మెస్ ఇన్‌ఛార్జ్‌లు కావలెను. కనీసం మూడు సంవత్సరాలు హోటల్ మరియు కాలేజి మెస్‌లో పనిచేసిన అనుభవం ఉండాలి. వంటకు ఉపయోగించే ఆధునిక పరికరాలు అయిన గ్యాస్‌స్టీమ్, తరిగే పరికరాలు, గ్రైండర్లు, చపాతి తయారీ యంత్రాలు వాడటం తెలిసి ఉండాలి. పనిచేయు ప్రదేశం: గుంటూరు మాస్టర్ మైండ్స్ కాలేజి, జీతం: 25000 వరకు ఇవ్వబడును. సంప్ర|| ఫోన్ నెం: 89784 80435.

ప్రముఖ విద్యా సంస్థకు 1 నుండి 10 తరగతులకు బోధించుటకు టీచర్స్ & మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ✆: 96038 65657/ 658, తెనాలి.

తాడికొండ, అడ్డరోడ్ హోటల్ KK గ్రాండ్ రూమ్స్ & కన్వెన్షన్. కంప్యూటర్ నాలెడ్జి కలిగి హోటల్ నిర్వహణ చేయుటకు సూపర్‌వైజర్ కావలెను. 98492 14413.

శివ కార్తికేయ హోంకేర్‌లో వృద్ధులు, పేషంట్స్, పిల్లలను చూసుకొనుటకు నర్సులు, వర్కర్స్ కావలెను. ఫ్రీ వసతి, భో, జీ. 20K. ✆ 99120 11499, 99120 11899

గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజ్ నందు Senior Civil Engineersగా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతము 50,000/- నుండి 60,000/- వరకు ఇవ్వబడును. విద్యార్హతలు: Civil Engineering. వయస్సు: 30 సంవత్సరములపైన ఉండవలెను. వివరములకు సంప్రదించగలరు. ఫోన్‌నెంబర్: 8978480429.

ప్రముఖ లోన్స్ ఏజెన్సీ నందు లోన్స్ చేయుటకు టెలికాలర్స్ & మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. 97014 79569, 80081 00872.

MARKETING/ SALES

Anand Masale Require Sales & Marketing Manager, Marketing Executives. Contact: 9849655105, 98480 53144 Email: anandmasalaappltd@gmail.com.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టవరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

Book your 5 lines Classified Colour Rs.770/-
3Ads Package Rs.1945/-
5 lines Classified B/W Rs.650/-
3Ads Package Rs.1625/-
ప్రకటనపై 5% జి.ఎస్.టి. అదనం

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం..
ఈనాడులో ప్రకటన ఇవ్వటం
పూర్తి వివరాలకు సంప్రదించండి:
8008510541

శనగ పంటపై విల్ట్ ఫంగస్ పంజా

భారీగా పడిపోతున్న దిగుబడి సాగుదారుల ఆవేదన

కాకుమాను,ఇంకొల్లు, న్యూస్‌టుడే

శనగ రైతులకు 'విల్ట్ ఫంగస్' కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. దిగుబడిపై ప్రతికూల ప్రభావం చూపుతోంది. గుంటూరు జిల్లాలో 12,740, పల్నాడు జిల్లాలో 8852, బాపట్ల జిల్లాలో 34,232 హెక్టార్లలో ఈ ఏడాది రైతులు శనగ పైరు సాగు చేశారు. ఈ ఏడాది రబీలో మొక్కజొన్నతో పాటు శనగ పైరును రైతులు సాగు చేశారు.

ఏంటీ ఫంగస్.. విల్ట్ అనేది ఓ ఫంగస్ వ్యాధి. నేల ద్వారా వ్యాపించి మొక్కకు వ్యాపించి పూర్తిగా ఎండిపోయేలా చేస్తుంది. మొక్క కాండం చీల్చి చూస్తే గోధుమ రంగు గీతలు కూడా కనిపిస్తుంటాయి. వేర్లలోకి నీరు చేరకుండా ఈ ఫంగస్ ఆపివేయడంతో ఒక్కసారిగా మొక్క వడలిపోతుంది.

కాకుమాను పరిధిలో ఎండిపోయిన శనగ పైరు

కారణం ఇదీ.. ప్రధానంగా ఒకే పొలంలో మూడేళ్ల కంటే ఎక్కువ సార్లు శనగ పైరు సాగు చేయడం వల్ల ఈ వ్యాధి సోకుతుంది. నీరు నిల్వ ఉండడం, కలుషిత విత్తనం కూడా కారణం కావచ్చు.

10 నుంచి 5 క్వింటాళ్లకు.. సాధారణంగా శనగ సాగు చేసిన రైతులకు 10 నుంచి 12 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. విల్ట్ వ్యాధితో దిగుబడులు 5 క్వింటాళ్లు కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు.

వ్యవసాయాధికారుల సూచనలు..

ఒకే భూమిలో మూడేళ్ల కంటే ఎక్కువగా శనగ సాగు చేయకుండా ప్రత్యామ్నాయంగా వరి, జొన్న, మొక్కజొన్న, ఇతర పంటలు సాగు చేయాలి. ● మే నెలలో భూమిని లోతుగా దున్నితే భూమిలో ఉన్న ఫంగస్ చనిపోయే అవకాశం ఎక్కువగా ఉంది. ● పశువుల ఎరువు ఎకరాకు కనీసం 2 నుంచి 3 టన్నులు వేయాలి. ● యూరియా వాడకం పూర్తిగా తగ్గించాలి. ● విత్తన శుద్ధి, పంట మార్పిడి, నీరు నిల్వలేకుండా చేస్తే 80 శాతం పైగా ఫంగస్ నుంచి పైర్లను కాపాడుకోవచ్చు. ● వ్యాధి సోకిన మొక్కను వెంటనే పీకివేయాలి.

సంస్థాగతంగా పార్టీ బలోపేతమే లక్ష్యం

గుంటూరు నగరం, న్యూస్‌టుడే: సంస్థాగతంగా పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలని భాజపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మట్టా ప్రసాద్ అన్నారు. గుంటూరు లాలుపురం రోడ్డులోని భాజపా కార్యాలయంలో పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహా అభియాన్ జిల్లా కార్యశాల ఆదివారం జరిగింది. పార్టీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు అధ్యక్షతన జరిగిన కార్యశాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ భావాలతో భాజపా జిల్లా ప్రశిక్షణ మహా అభియాన్ వర్క్‌షాప్ సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. పర్యావరణ పరిరక్షణ, సామాజిక సమరసత, స్వదేశీ భావజాలం, కుటుంబ ప్రబోధనలు, పౌర విధులు పాటించడం.. ఈ ఐదు సూత్రాలు చాలా ముఖ్యమన్నారు. పర్యావరణ మార్పుల వల్ల ప్రజలకు ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని, ప్రతి ఒక్కరు ఒక మొక్క నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలన్నారు. తల్లిదండ్రులను వృద్ధాశ్రమాలకు పంపకుండా.. వారి సంరక్షణను బాధ్యతగా తీసుకోవాలన్నారు. సమాజంలో హక్కులు కోరుకునే వారు బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించాలన్నారు. సమాజంలో కులమత భేదాల్లేకుండా కలిసిమెలిసి ఉండాలన్నారు. భారత్ పూర్తిగా అభివృద్ధి చెందాలంటే ప్రతి ఒక్కరు స్వదేశీ వస్తువులు వాడాలన్నారు. రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరి జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలు పార్టీ సిద్ధాంతాలు తెలుసుకోవాలన్నారు. మండల ప్రశిక్షణ సమావేశాలు మార్చి 7 నుంచి ఏప్రిల్ 14వ తేదీ వరకు అన్ని మండలాల్లో పూర్తి చేయాలన్నారు. తొలుత భరతమాత, శ్యాంప్రసాద్ ముఖర్జీ, పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా ప్రశిక్షణ కన్వీనర్ భీమినేని చంద్రశేఖర్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రశిక్షణ నిర్వహణ తీరు వివరించారు. పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శివన్నారాయణ, సీనియర్ నాయకులు రంగరాజు, పొగాకు బోర్డు ఛైర్మన్ యశ్వంత్‌కుమార్, అధికార ప్రతినిధి శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

పెళ్లి డ్రామా.. ఒంటరి మహిళలే టార్గెట్

మహిళను మోసం చేసిన కేసులో నిందితుడి అరెస్ట్

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: రోల్డ్ గోల్డ్ చైను, బ్రాస్‌లెట్, ఉంగరాలతో టిప్‌టాప్‌గా తయారై మహిళలను కలుస్తాడు. మాయ మాటలతో వారిని మురిపిస్తాడు. అటుపై మోసం చేస్తాడు. ఇటీవల తెనాలికి చెందిన మహిళను పెళ్లి చేసుకుంటానని మోసం చేసి రూ.12.20 లక్షలు తీసుకున్న కేసులో నిందితుడి బాగోతం ఇది. నిందితుడిని అరెస్టు చేసినట్లు త్రీ టౌన్ సీఐ సాంబశివరావు తెలిపారు. ఆదివారం వివరాలు వెల్లడించారు. పట్టణానికి చెందిన మహిళకు గతంలో వివాహం జరిగి.. భర్తతో విభేదాల కారణంగా విడాకులు తీసుకున్నారు. రెండో వివాహం కోసం వివాహ పరిచయ వేదికలో వివరాలు నమోదు చేసుకున్నారు. కొల్లిపర మండలం కొత్తూరు లంకకు చెందిన అరవపల్లి వంశీ ఆ వేదిక ద్వారా ఆమెను పరిచయం చేసుకున్నాడు. భార్యతో విడాకులు తీసుకున్నానని, మిమ్మల్ని వివాహం చేసుకుంటానని ఆమెకు చెప్పాడు. అటుపై వారి ఇంటికి వచ్చి తనకు ఇసుక, మైనింగ్ వ్యాపారాలు, టిప్పర్లు, ట్రాక్టర్లు ఉన్నాయని చెప్పాడు. కొత్తగా టిప్పర్ కొంటున్నానని అందుకు నగదు అవసరం అని మహిళ వద్ద ఉన్న బంగారం బ్యాంకులో తాకట్టు పెట్టించి రూ.12.20 లక్షలు తీసుకున్నాడు. అటుపై మహిళతో శారీరక చనువు పెరిగిన తర్వాత మరింత నగదు డిమాండ్ చేశాడు. తన వద్ద లేవని చెప్పడంతో ఆమెను కొట్టి, విషయం బయటకు చెబితే వ్యక్తిగత జీవితాన్ని బహిర్గతం చేస్తానని బెదిరించాడు. ఈ క్రమంలో సదరు మహిళ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల విచారణలో నిందితుడు రాష్ట్రంలోని మరి కొంత మంది మహిళలను కూడా ఇదే రీతిలో మోసం చేశాడని గుర్తించారు. వారిని సంప్రదిస్తే తాము నష్టపోయిన తీరును తెలిపిన వారు పరువు పోతుందని ఫిర్యాదులు చేయలేదని పోలీసులకు చెప్పారు. నిందితుడిని తెనాలి న్యాయస్థానంలో హాజరుపరచగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించడంతో బాపట్ల జైలుకు తరలించారు. సమగ్ర విచారణ చేయడానికి మరోమారు కస్టడీ కోరనున్నామని, సస్పెక్ట్ షీట్‌ను కూడా తెరుస్తున్నట్లు సీఐ వివరించారు.

వివరాలు వెల్లడిస్తున్న సీఐ సాంబశివరావు. వెనుక ముసుగులో నిందితుడు

నకిలీ సిగరెట్ల అమ్మకాలు!

కారంపూడి, న్యూస్‌టుడే : సిగరెట్లపై కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏడాది పన్నులు విధిస్తున్న నేపథ్యంలో పల్నాడులోని కొన్ని ప్రాంతాల్లో నకిలీ సిగరెట్ల తయారీకి అక్రమార్కులు తెరలేపారు. ప్రముఖ కంపెనీలకు చెందిన సిగరెట్ల బండిళ్లను తక్కువ ధరకు ఇస్తుండటంతో బడ్డీకొట్ల నిర్వాహకులు కొనుగోళ్లు చేసి అమ్ముతున్నారు. గురజాల నియోజకవర్గంలో నకిలీ సిగరెట్లు తయారు చేసి మాచర్ల, గురజాల నియోజకవర్గాల్లో అమ్మకాలు చేస్తున్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలో ||కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 115, రిటైల్ ధర - 142, చికెన్ విత్‌స్కిన్ - 206, చికెన్ స్కిన్‌లెస్ - 234.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -115 రిటైల్ ధర 142 చికెన్ విత్ స్కిన్ - 206 చికెన్ స్కిన్‌లెస్ - 234.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 128, 137, 148 చికెన్ విత్ స్కిన్ - 240 చికెన్ స్కిన్‌లెస్ - 250.

91.9FM Vijayawada
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 80080 03297

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

కావూరు (చెరుకుపల్లి గ్రామీణ), న్యూస్‌టుడే: మండలంలోని కావూరు వద్ద జాతీయ రహదారిపై గుర్తు తెలియని కారు ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం తుమ్మలపాలెం పంచాయతీ పరిధి జొన్నగడ్డవారిపాలేనికి చెందిన మువ్వ ముత్యాలరావు (45) కావూరు నుంచి నడుచుకుంటూ వెళ్తూ కావూరు ఉన్నత పాఠశాల వద్ద రోడ్డు దాటుతుండగా చెరుకుపల్లి నుంచి వేగంగా చందోలు వైపు వెళ్తున్న గుర్తు తెలియని కారు బలంగా ఢీకొట్టి వెళ్లిపోయింది. ఘటనలో అతడికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో చెరుకుపల్లి పోలీసులు అక్కడికి చేరుకుని వివరాలను సేకరించారు.

సహకార సంఘాలకు సూపర్‌వైజర్లు

సత్తెనపల్లి, న్యూస్‌టుడే : ఉద్యోగుల సమ్మెతో సహకార సంఘాల్లో కార్యకలాపాలు స్తంభించిన నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంది. ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల(పీఏసీఎస్) లావాదేవీలకు ఇబ్బందిలేకుండా సేవలు కొనసాగేలా సూపర్‌వైజర్లను నియమించింది. జిల్లాలో 60 పీఏసీఎస్‌లు ఉన్నాయి. డిమాండ్లు నెరవేర్చాలని సహకార సంఘాల్లో పనిచేసే కార్యదర్శులు, గుమస్తాలు, నాలుగో తరగతి సిబ్బంది సమ్మెలోకి వెళ్లారు. దీంతో ఈ నెల 16 నుంచి అవి మూతపడ్డాయి. ఉద్యోగుల సమ్మె ముగిసే వరకు రైతులు ఇబ్బందిపడకుండా ఉండేందుకు పీఏసీఎస్‌ల నిర్వహణను జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఉద్యోగులకు అప్పగించేలా ఉన్నత స్థాయి నుంచి మార్గదర్శకాలు అందాయి. జిల్లాలో 14 కేంద్ర సహకార బ్యాంకులు ఉన్నాయి.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 80085 10541
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80085 14589

బాపట్ల
•బాపట్ల •రేపల్లె •వేమూరు

26న నగరంలో మెగా ఉద్యోగ మేళా

చెరుకుపల్లి, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, మంత్రి అనగాని సత్యప్రసాద్ సహకారంతో ఈనెల 26న నగరంలోని వెలగపూడి రామకృష్ణ మెమోరియల్ డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నారని చెరుకుపల్లి ఎంపీడీవో షేక్ మహబూబ్ సుభానీ తెలిపారు. వివరాలకు సెల్‌నెం. 93462 80289, 91005 66581 లేదా 96406 95229 సంప్రదించాలని కోరారు.

ఉచితంగా మందుల పంపిణీ

తురుమెళ్ల, (అమృతలూరు), న్యూస్‌టుడే: గుంటూరులోని ఓ ప్రైవేటు వైద్యశాల ఆధ్వర్యంలో తురుమెళ్లలో ఆదివారం ఉచిత వైద్యసేవలు అందించారు. వైద్యులు కొసరాజు కమలాకర్, సింధు, దుర్గాహరిప్రసాద్, వంశీకృష్ణ రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మెరుగైన చికిత్సల కోసం తమ వైద్యశాలకు రావాల్సిందిగా పలువురికి సూచించారు. ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు చేశారు.

ఏపీపీఎస్ఈఏ నూతన కార్యవర్గం ఎన్నిక

బాపట్ల టౌన్, న్యూస్‌టుడే: జిల్లా ఏపీపీఎస్ఈఏ నూతన కార్యవర్గం ఎన్నిక బాపట్లలోని ఏపీ జేఏసీ అమరావతి కార్యాలయంలో ఆదివారం జరిగింది. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా జి.మురళీమోహన్, అనిల్ ఎన్నికయ్యారు. ఆర్థిక కార్యదర్శిగా పి.వి.శివరామకృష్ణ అసోసియేట్ అధ్యక్షుడిగా ఎన్.వైద్దాన్, అదనపు ప్రధాన కార్యదర్శిగా విజయ్, జిల్లా మహిళా అధ్యక్షురాలిగా సుధారాణి ఎంపికయ్యారు. ఎన్నికల పరిశీలకుడిగా రాష్ట్ర అధ్యక్షుడు బాజీ పఠాన్ వ్యవహరించారు.

ప్రమాణ స్వీకారం చేస్తున్న నాయకులు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
బాపట్ల : 80085 73141, రేపల్లె : 80085 73136, వేమూరు: 91107 83738

? బోరమాదిగపల్లి శివారు జంగంలంకలో వీధి దీపాలు వెలగడం లేదు. -ఫిరోజ్, బోరమాదిగపల్లి ✔ జంగంలంక కాలనీలో వెలగని దీపాలను తొలగించి వాటి స్థానంలో కొత్త దీపాలు ఏర్పాటు చేయిస్తాం. -జానకి, కార్యదర్శి, బోరమాదిగపల్లి –న్యూస్‌టుడే, నగరం

? చెరుకుపల్లి చెన్నకేశవ నగర్ కాలనీలో తాగునీటి సరఫరా సక్రమంగా జరగడం లేదు. -ఉప్పలపాటి సుబ్బయ్య, చెన్నకేశవనగర్, చెరుకుపల్లి ✔ సిబ్బందిని పంపి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. -కేజేపీ శ్రీనివాసన్, డిప్యూటీ ఎంపీడీవో, చెరుకుపల్లి –న్యూస్‌టుడే, చెరుకుపల్లి


నూతన పాలక మండలి సభ్యులతో ఎమ్మెల్యే ఆనందబాబు

ఆలయ పాలక మండలి ప్రమాణ స్వీకారం

పోతార్లంక(కొల్లూరు), న్యూస్‌టుడే: మండలంలోని పోతార్లంకలోని మల్లేశ్వరస్వామి ఆలయ నూతన పాలక మండలి సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం జరిగింది. చైర్మన్‌గా మోర్ల వెంకటేశ్వరరావు, మండలి సభ్యులతో ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, అధికారులు ప్రమాణ స్వీకారం చేయించారు. ఆలయ అభివృద్ధికి సమష్టిగా కృషిచేయాలని సూచించారు. తెదేపా నాయకులు, ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

విజేతలతో అధికారులు

బాల్ బ్యాడ్మింటన్ జిల్లాస్థాయి పోటీలు

నగరం, న్యూస్‌టుడే: బాల్ బ్యాడ్మింటన్ జిల్లాస్థాయి పోటీలు ఆదివారం నగరం బాల యేసు ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి పది జట్లు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహించిన పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ, నాల్గో స్థానాల్లో దుర్గి జిల్లా పరిషత్తు, నగరం బాలయేసు ఉన్నత, ధూళిపాళ్ల, శేకూరు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలల విద్యార్థులు నిలిచారు. విజేతలకు రాష్ట్ర బాల్ బ్యాడ్మింటన్ అధ్యక్షుడు శివశంకర్, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు, నరసయ్య, పాఠశాల కరస్పాండెంట్ సునా, ప్రిన్సిపల్ సజీవా బహుమతులు అందజేశారు.

కొనేవారు రాక.. వ్యాపారం సాగక

వెలవెలబోతున్న మార్కెట్ సముదాయం

బాపట్ల టౌన్, ఆర్ట్స్ కాలేజీ (బాపట్ల), న్యూస్‌టుడే: బాపట్ల మున్సిపాలిటీలో ప్రజల వినియోగార్థం ఏర్పాటు చేసిన కూరగాయల మార్కెట్ నేడు వెలవెలబోతోంది. దీనికి కారణం గ్రామాలు, మండల కేంద్రాల్లో సందుకొక కూరగాయల దుకాణం వెలిసింది. దీంతో వినియోగదారులు మార్కెట్‌కు రావడం లేదు. ఐతుమతమయిన నియోజకవర్గంలోని గ్రామాలకు చెందిన కూరగాయల వ్యాపారులు మార్కెట్‌కు వచ్చి కొనుగోలు చేసి గ్రామస్థులకు విక్రయించేవారు. పట్టణ ప్రజలు తమ అవసరాలకు మార్కెట్‌కు వచ్చే వారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. మార్కెట్‌లో మొత్తం 76 దుకాణాలు ఉన్నాయి. వ్యాపారం సాగక 28 దుకాణాలు మాత్రమే నడుస్తున్నాయి. నిత్యం ఆటోల్లో కూరగాయలు తీసుకొచ్చి రోడ్లపైన ఒకవైపు ఏర్పాటు చేసి చవకగా అమ్ముతున్నారు. కొందరు ఆటోల్లో బజార్లలో తిరిగి అమ్ముతున్నారు. గ్రామాల్లో, మండల కేంద్రాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. దీనికి తోడు బాపట్ల కూరగాయల మార్కెట్ పక్కనే రైతుబజారు నెలకొల్పడంతో పూర్తిగా మార్కెట్‌లో వ్యాపారం తగ్గిపోయింది.

పెట్టుబడి కూడా రాని పరిస్థితి

మార్కెట్‌లో కూరగాయల వినియోగదారులకు సౌకర్యాలు ఉన్నప్పటికీ ఎవరూ రావటంలేదు. దీంతో దుకాణదారులు అద్దెలు కట్టుకోలేని పరిస్థితి నెలకొంది. మార్కెట్‌లో రెండు విధాలుగా అద్దెలు ఉన్నాయి. మార్కెట్ ప్రవేశద్వారం సమీపంలో దుకాణానికి నెలకు రూ.2124, కొంచెం దూరంగా ఉన్నవాటికి రూ.1534 వ్యాపారులు అద్దెలు చెల్లిస్తున్నారు. కూరగాయలు ఎక్కువ రోజులు నిల్వ ఉండకపోవడంతో పాడైపోతాయి. దీంతో పెట్టుబడి కూడా రావటం లేదని వ్యాపారులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో వారు అద్దెలు చెల్లించలేకపోతున్నారు.

ఉన్నతాధికారులు పట్టించుకోవటం లేదు: ఆర్.వీరబ్రహ్మం, మార్కెట్ కార్యదర్శి

గత పదేళ్లనుంచి కూరగాయల వ్యాపారంలో నష్టాలు చూస్తున్నాం. విషయం ఉన్నతాధికారులకు ఎన్నోసార్లు తెలిపినప్పటికీ వ్యాపారుల సమస్యలను పట్టించుకోవటం లేదు. దుకాణాల అద్దెలు తగ్గించాలి. రూ.30 వేల వరకు అద్దె చెల్లించాలి.

రూ.80 వేల పైనే అద్దె చెల్లించాలి: శ్రీరామ్మూర్తి, వ్యాపారి

సుమారు మూడు ఏళ్లనుంచి అద్దె చెల్లించలేకపోతున్నా. రైతుల వద్ద కూరగాయలను కొని దుకాణంలో ఉంచినా ప్రజలు కూరగాయలు కొనడానికి రావడం లేదు. రూ.80 వేలు వరకు అద్దె చెల్లించాలి.

అద్దెల పరిధి నాచేతుల్లో లేదు: రఘునాథరెడ్డి, కమిషనర్

దుకాణాలకు అద్దె తగ్గించే అధికారం నాకులేదు. అది ప్రభుత్వానిది. దుకాణాలకు వేలం పాట నిర్వహించినప్పుడు మూడుసార్లు ఎవరూ పాటలో పాల్గొనకపోతే అప్పుడు షాపులకు 10 శాతం అద్దె తగ్గించే అవకాశం ఉంటుంది.

అల్లూరమ్మకు ప్రత్యేక పూజలు

పిట్టలవానిపాలెం, న్యూస్‌టుడే: మండలంలోని అల్లూరు గ్రామ దేవత అల్లూరమ్మకు ఫాల్గుణమాసం మొదటి ఆదివారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి పొంగళ్లు పొంగించి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారు ప్రత్యేక అలంకరణలో 'భక్తానుగ్రహయిని'గా భక్తులకు దర్శనమిచ్చారు.

భక్తానుగ్రహయినిగా అల్లూరమ్మ

ఐశ్వర్యాంబికగా చందోలు బండ్లమ్మ

చందోలు (పిట్టలవానిపాలెం), న్యూస్‌టుడే: చందోలు బండ్లమ్మ అమ్మకు ఆదివారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని సువర్ణమాతృకా బంగారు కాసులహారం, రజత కవచంతో అలంకరించగా 'ఐశ్వర్యాంబిక'గా భక్తులకు దర్శనమిచ్చారు. పిట్టలవానిపాలెం, గోకరాజు నల్లిబోయినవారిపాలెంలోని బండ్లమ్మ వార్లకు భక్తులు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

అంబికా కృష్ణ నుంచి పురస్కారం అందుకుంటున్న గౌరీరామకుమారి, శ్రీనివాసరావు

సేవాతత్పరులకు అవార్డుల అందజేత

రేపల్లె అర్బన్, భట్టిప్రోలు, న్యూస్‌టుడే: రేపల్లె పట్టణ ఆర్యవైశ్య మహిళా సంఘం గౌరవాధ్యక్షురాలు పొన్నూరు గౌరీ రామకుమారి పురస్కారం పొందారు. విజయవాడ తుమ్మలపల్లి క్షేత్రంలో ఆదివారం సర్ సీవీ రామన్ అకాడమీ రుద్రాక్ష పీఠం ఆధ్వర్యంలో ఐదు రాష్ట్రాలకు చెందిన 100 మంది సేవాతత్పరులకు ఆదివారం అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. గౌరీరామకుమారికి అవార్డు, గోల్డ్‌మెడల్, సువర్ణకంకణం బహూకరించి వాసవీ సేవా మహిళ బిరుదు ప్రదానం చేశారు. పలువురు ప్రముఖులు అభినందనలు ప్రకటించారు.
✦ విద్యారంగంలో చేసిన కృషికి భట్టిప్రోలు అద్దేపల్లికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు బొలిశెట్టి శ్రీనివాసరావుకు సేవా విద్యారంగ వైభవ రత్న అవార్డు వరించింది. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో అంబికా కృష్ణ, రుద్రాక్ష వైభవం పీఠాధిపతి, అకాడమీ కన్వీనరు ఎం.వెంకటేశ్వరరావు, ఇతర అతిథులు అవార్డు అందించి సన్మానించారు.

ఆక్వాటిక్ ఛాంపియన్‌షిప్ టెక్నికల్ అధికారిగా చందోలు వాసి

బాపట్ల, న్యూస్‌టుడే: ఈనెల 23 నుంచి 28 వరకు నేషనల్ పోలీస్ అకాడమీ స్విమ్మింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో 73వ ఆల్ ఇండియా పోలీస్ ఆక్వాటిక్ ఛాంపియన్‌షిప్ పోటీలు జరుగనున్నాయి. దీనికి స్విమ్మింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వారు పిట్టలవానిపాలెం మండలం చందోలుకు చెందిన షేక్ ఖాజా మొహిద్దీన్‌ను టెక్నికల్ అధికారిగా విధులు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం గ్రామస్థులు ఆయనకు అభినందనలు తెలియజేశారు.

షేక్ ఖాజా మొహిద్దీన్

వైభవంగా వీరాంజనేయుడి విగ్రహ ప్రతిష్ఠ

యజ్ఞంలో పాల్గొన్న దంపతులు

వేటపాలెం, న్యూస్‌టుడే: మండల పరిషత్ కార్యాలయ సమీపంలో దాతల విరాళాలతో నూతనంగా నిర్మించిన అభయాంజనేయ స్వామి ఆలయంలో స్వామివారి విగ్రహ ప్రతిష్ఠను ప్రవాస భారతీయుడు కోడూరి కిరణ్ కుమార్, గట్టుపల్లి తిరుమలరావు, దోగుపర్తి మల్లికార్జునరావు, చల్లా రాజశేఖర్ దంపతుల ఆధ్వర్యంలో ఆదివారం వైభవంగా నిర్వహించారు. స్వామిని మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నసంతర్పణ జరిగింది. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వసతులు కరవు.. ప్రయాణం భారం

రెండో నంబరు ప్లాట్‌ఫాంపై ఎండలో నిలబడిన ప్రయాణికులు

న్యూస్‌టుడే, వేమూరు

వేమూరు రైల్వే స్టేషన్‌లో వసతులు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఐదేళ్ల క్రితం రైల్వేస్టేషన్‌లో క్రాసింగ్ కోసం ట్రాక్ వేశారు. రెండో నంబరు ప్లాట్‌ఫాం కూడా నిర్మించారు. ఒకటో నంబరు ప్లాట్‌ఫాం నుంచి రెండో నంబరుకు వెళ్లడానికి సైతం పైవోవర్ కూడా వేశారు. కానీ రెండో నంబరు ప్లాట్‌ఫాంపై రైలు కోసం వేచి చూసే ప్రయాణికులకు షెడ్లు ఏర్పాటు చేయలేదు. దీంతో ఎండ వానల్లో ప్లాట్‌ఫాంపై నిలబడి వేచి చూడాల్సి వస్తోంది. పరిస్థితి ఇలా ఉన్నా అధికారులు స్పందించడం లేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. కనీసం మహిళా ప్రయాణికులకు మరుగు దొడ్లు లేవు. ఒక చోట ఉన్నా అవి ఎప్పుడూ తాళాలు వేసి ఉంటాయి. క్రాసింగ్ సమయంలో రైలు ఆలస్యమైతే వారి అవస్థలు అంతా ఇంత కాదు. తాగునీటి సరఫరా అంతంతమాత్రంగానే ఉంది. ఇప్పటికైనా రైల్వే అధికారులు చొరవ తీసుకుని వీలైనంత త్వరగా వసతులు కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

నిత్యం అవస్థలే..

నేను నిత్యం కళాశాలకు వెళ్లడానికి వేమూరు నుంచి రేపల్లె రైలులో ప్రయాణిస్తాను. ఏడాది నుంచి వేమూరు స్టేషన్‌లో ఆగే రైళ్లన్నీ రెండో నంబరు ప్లాట్‌ఫాం పైకి వస్తున్నాయి. అక్కడ కనీసం నిల్వ నీడ లేకపోవడంతో చిన్నారులు, వృద్ధులు, మహిళలు అవస్థలు పడుతున్నారు.
- వి.రవికుమార్, విద్యార్థి, వేమూరు

దిండి రోడ్డులో జాగ్రత్త సుమా

మండలంలోని దిండి- అడవులదీవి రోడ్డు ప్రమాదభరితంగా మారింది. రోడ్డుపై పడిన గుంతతో వాహనదారులు రాత్రి సమయంలో కనపడక ప్రమాదాలకు గురవుతున్నారు. పరిస్థితి ఇలా ఉన్నా అధికారులు పట్టించుకోకపోవడంపై ప్రజలు విమర్శిస్తున్నారు. ఈ విషయమై ఏఈ విద్యాసాగర్ మాట్లాడుతూ ఇటీవలే గుంతలు పూడ్చే పనులు చేపట్టినట్లు తెలిపారు. పరిశీలించి మరమ్మతులు చేయిస్తామని చెప్పారు. -న్యూస్‌టుడే, నిజాంపట్నం

నమ్మండి..ఇది తాగునీటి చెరువే

నిజాంపట్నం ప్రజల దాహార్తి తీరుస్తున్న తాగునీటి చెరువులో తూటుకాడ దట్టంగా పెరిగి అపరిశుభ్రంగా తయారైంది. 20 వేల జనాభా ఉన్న గ్రామంలోని వారికి తాగునీరు ఈ చెరువు నుంచే సరఫరా అవుతోంది. పంచాయతీ సరఫరా చేస్తున్న నీటి వల్ల రోగాలు వస్తున్నాయని గ్రామస్థులు వాపోతున్నారు. అధికారులు స్పందించి చెరువు శుభ్రంచేసి స్వచ్ఛమైన తాగునీటిని అందించే చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు మాట్లాడుతూ రానున్న వేసవిలో ఉపాధి హామీ పథకం ద్వారా చెరువులో తూటుకాడ తొలగించి ప్రజలకు ఇబ్బంది లేకుండా స్వచ్ఛమైన తాగునీరు అందిస్తామని తెలిపారు. -న్యూస్‌టుడే, నిజాంపట్నం

ఒరిగిన విద్యుత్తు స్తంభం

పెద్దవరం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు సమీపంలో విద్యుత్తు స్తంభం కూలేందుకు సిద్ధంగా ఉంది. రహదారికి మలుపులో ఉన్న స్తంభానికి సపోర్ట్ తీగ కూడా లేక పోవడంతో ఎప్పుడు కూలుతుందోనని స్థానికులు భయపడుతున్నారు. పక్కకు వాలిన స్తంభం తీగలు పక్కనే ఉన్న చెట్లకు తాకుతున్నాయి. ప్రమాదాలు జరగకముందే విద్యుత్తుశాఖ అధికారులు స్పందించి పాత విద్యుత్తు స్తంభాన్ని తొలగించి దాని కొత్త స్తంభం ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, నగరం

శిథిల భవనం తొలగించండి

మండల పరిధిలోని కొత్త వాడరేవులో ప్రాథమిక పాఠశాల భవనం పక్కనే శిథిలావస్థలో భవనం ఉంది. గతంలో ఈ భవనంలో పాఠశాల నిర్వహించారు. ప్రస్తుతం భవనం ఎప్పుడు కూలుతుందోనని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. పక్కనే పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. శిథిల భవనాన్ని వెంటనే తొలగించాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ విషయమై ఎంఈవో ప్రసాదరావు మాట్లాడుతూ శిథిల భవనంపై ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చామని, త్వరలోనే తొలగిస్తామని ఆయన తెలిపారు. -న్యూస్‌టుడే, బాపట్ల టౌన్

ఊపందుకున్న మినుము కోతలు

మండలంలో మినుము కోతలు ఊపందుకున్నాయి. దూర ప్రాంతాల నుంచి కంబైన్డ్ హార్వెస్టర్లు మండలానికి చేరుకున్నాయి. కొంతమంది రైతులు కూలీలతో మినుము కోతలు పూర్తి చేస్తుండగా కొంతమంది మరికొంతమంది ఒకేసారి కంబైన్డ్ హార్వెస్టర్లతో నూర్పిళ్లు కూడా చేయిస్తున్నారు. మినుము ధరలు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకన్నా అధికంగా ఉండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తూ ధరలు తగ్గకముందే అమ్మేందుకు వీలుగా యంత్రాలతో నూర్పిళ్లకు ప్రాధాన్యం ఇస్తున్నారు. -న్యూస్‌టుడే, చెరుకుపల్లి

ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరికి గాయాలు

కొల్లూరు, న్యూస్‌టుడే: రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరికి గాయాలైన ఘటన కొల్లూరులో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన మున్నంగి మోషే పెట్రోలు బంక్‌లో ఆయిల్ పోయించుకొని కొల్లూరు వైపునకు వస్తున్నాడు. మండలంలోని ముసలిపాడుకు చెందిన కట్టుపల్లి ప్రవీణ్ ద్విచక్ర వాహనంపై ఎదురుగా వస్తుండగా, గౌడపాలెం వద్ద రెండు వాహనాలు ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ఇద్దరిని వైద్యశాలకు తరలించారు. ఘటనపై కేసు నమోదు కాలేదు.

ఆశాజనకంగా పసుపు ధరలు

న్యూస్‌టుడే, పెదపులివర్రు (భట్టిప్రోలు), కొల్లూరు

కృష్ణానది పరివాహక లంక గ్రామాల్లో సాగుచేసే వాణిజ్య పంటల్లో పసుపు పంట ముఖ్యమైనది. రూ.లక్షల్లో వ్యవసాయ పెట్టుబడులైనా దిగుబడితో సిరులు కురిపించేది. గత ఏడాది కృష్ణానదికి రెండు సార్లు వరదలు వచ్చి చేతికొచ్చిన పసుపు కాస్త నీటి పాలైంది. పల్లపు ప్రాంతాల్లో ఉన్న రైతులు దెబ్బతిన్నారు. ప్రస్తుతం భట్టిప్రోలు, కొల్లూరు మండలాల పరిధిలో పసుపు తీస్తున్నారు. క్వింటాకు రూ.14 వేల వరకు ధర ఉండటంతో రైతులకు కొంతమేర ఊరటనిచ్చింది. వరదల ప్రభావంతో దిగుబడి భారీగా తగ్గింది. ప్రస్తుతం ఎకరానికి 15 నుంచి 20 క్వింటాళ్ల వరకు పసుపు దిగుబడి వచ్చే అవకాశం ఉంది. వరదలు రాకుంటే 30 నుంచి 40 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చేది. ఈ ఏడాది రైతులకు ఎకరానికి రూ.లక్షకుపైగా పెట్టుబడులు పెట్టారు. ఊహించకుండా వరద రావడం రైతుల కష్టం నీటి పాలైంది.

కల్లంలో ఆరబెట్టిన పసుపు

లంక గ్రామాల్లో పసుపు పనులు.. లంక గ్రామాల్లో ప్రస్తుతం రైతులు పసుపు పనుల్లో ముమ్మరమయ్యారు. దిగుబడి తగ్గినా ఖర్చులు మాత్రం యథావిధిగానే ఉంటున్నాయని తెలిపారు. గతంలో వరదలు రావడంతో పసుపు దెబ్బతిని పసుపు విత్తనాలు సైతం ఇతర ప్రాంతాలనుంచి కొనుగోలు చేయాల్సిన పరిస్థితి వచ్చేది. వరదలకు నష్టపోయిన రైతులను ఇప్పటివరకు ప్రభుత్వం ఆదుకోకపోవడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. కనీసం పండించిన పంటకు మరింత ధర కల్పిస్తే బాగుంటుందని కోరుతున్నారు.

చేనేత గర్జనకు తరలిన కార్మికులు

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: చేనేత సమస్యలపై ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో తమ గళాన్ని వినిపించేందుకు మంగళగిరిలో ఏర్పాటు చేసిన గర్జన సభకు అధిక సంఖ్యలో నాయకులు, కార్మిక సంఘాల ప్రతినిధులు బస్సుల్లో ఆదివారం తరలివెళ్లారు. వీరిలో రాష్ట్ర చేనేత జన సమాఖ్య వ్యవస్థాపకుడు మాచర్ల మోహనరావు, ఐక్యకార్యాచరణ కమిటీ నాయకులు దామర్ల శ్రీకృష్ణ, దేవన నాగేశ్వరరావు, అనుభవం వెంకటేశ్వర్లు, అండగుండ నారాయణ, కార్మికులు ఉన్నారు.

సంపద సృష్టిద్దాం.. ఆదాయం పొందుదాం

నగరం, న్యూస్‌టుడే:

చెత్త నుంచి సంపదను సృష్టించే దిశగా పంచాయతీలు సన్నద్ధమవుతున్నాయి. 2014-19లో అధికారంలో ఉన్న తెదేపా ప్రభుత్వం గ్రామాల్లో సంపూర్ణ పారిశుద్ధ్యంపై దృష్టి సారించింది. అందులో భాగంగా గ్రామాల్లో సంపద సృష్టి కేంద్రాలను నిర్మించింది. ఇళ్లలో సేకరించిన చెత్తను వేరు చేసి దాని నుంచి సంపదను సృష్టించేలా రూ.లక్షలతో షెడ్లు నిర్మించింది. అనంతరం అధికారం చేపట్టిన ప్రభుత్వం సంపద తయారీ కేంద్రాలను నిర్వీర్యం చేసింది. అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటోంది.

ఎరువులను సిద్ధం చేయిస్తున్న అధికారి

ముళ్ల పొదలతో నిండిన సంపద సృష్టి కేంద్రాలను మళ్లీ వినియోగంలోకి తెచ్చే ప్రయత్నాలను మండల స్థాయి అధికారుల చేపట్టారు. తొలి దశలో మండల పరిధిలోని యేలేటిపాలెం, నగరం, సజ్జావారిపాలెం, ఉల్లిపాలెం, బెల్లంవారిపాలెం, పూడివాడ గ్రామాల్లోని చెత్త శుద్ధి కేంద్రాలను ఆయా పంచాయతీ అధికారులు సిద్ధం చేస్తున్నారు. ఇళ్లల్లో సేకరించిన తడి పొడి చెత్తలను వేరు చేసి వాటి నుంచి వర్మీ కంపోస్టు తయారు చేసే పనులను ప్రారంభించారు. వర్మీ ఎరువులు తయారు చేసేందుకు ఉపయోగించే పశువుల ఎరువులు, కొబ్బరి చిప్పలు, వానపాములను ఆయా పంచాయతీలే కొనుగోలు చేసి కేంద్రాలకు తరలిస్తున్నాయి. వర్మీ ఎరువు తయారు చేసేందుకు పారిశుద్ధ్య కార్మికులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చినట్లు ఎంపీడీవో బొర్రా శ్రీనివాస్ తెలిపారు. దీని వల్ల గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగు పడటంతో పాటు గ్రామాలకు ఆదాయం దక్కుతుందన్నారు. కేంద్రాల్లో తయారయిన ఎరువులను రైతులకు విక్రయిస్తామన్నారు. మూడు వారాల్లో ఎరువులు రైతులకు అందుబాటులోకి వచ్చేలా పనులు జరుగుతున్నట్లు ఆయన తెలిపారు.

పబ్లిక్ నోటీసు

బాపట్లజిల్లా, పిట్టలవానిపాలెం మండలం, ఖాజీపాలెం, డోర్ నెం.5-173రు కాపురస్తుడు జంపని నరసరాజు గారి కుమారుడు జంపని లక్ష్మీపతిరాజు, ఆధార్ నెం. 8060 0235 3909రు అను నేను ప్రమాణ పూర్వకముగా యిచ్చిన అఫిడవిట్.

బాపట్ల జిల్లా, ఇంకొల్లు మండలం, ఇంకొల్లు గ్రామ కాపురస్తుడైన పెనుమత్స సూర్యనారాయణరాజు అనువారికి బాపట్ల జిల్లా, పిట్టలవానిపాలెం మండలం, ఖాజీపాలెం గ్రామము తాలూకు సర్వే నెం. 300/9రులో య. 0-04 సెంట్లు స్థలము అందులో నిర్మించిన డోర్ నెం. 3-133రుగా ఆర్.సి.సి. డాబా కలదు. సదరు ఆస్తి ఓ.యస్.నెం. 16/2012 రుగా వివాదములో ఉండి శ్రీయుత బాపట్ల సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఇ.పి. నెం. 1/2023 రుగా డిక్రీ కాబడి యున్నందున నేను కొనుగోలు చేయుటకు నిర్ణయించుకొనియున్నాను. సదరు ఆస్తిపై గతములో ఏవైనా వివాదములు ఉన్న యెడల సంబంధిత వ్యక్తుల వినతిని స్వీకరించగలవాడను.

సంప్రదించవలసిన ఫోన్ నెం.
94401 73505

అడుగడుగునా గుంతలే

చినగాదెలవర్రు నుంచి వలివేరు వెళ్లే రహదారి యడ్లపల్లి ఛానల్ వంతెన వద్ద నుంచి అధ్వానంగా మారింది. రహదారిపై అడుగడుగునా గుంతలు పడ్డాయి. రాకపోకలకు ప్రజలు అవస్థలు పడుతున్నారు. పరిస్థితి ఇలా ఉన్నా పట్టించుకునే నాథులు లేరు. సమస్యపై పంచాయతీ రాజ్ శాఖ ఏఈ మరియదాసు మాట్లాడుతూ ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకువెళ్లి పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు.
–న్యూస్‌టుడే, వలివేరు (చుండూరు)

ఉద్యాన వనం.. ఆహ్లాదకరం

న్యూస్‌టుడే, (రైలుపేట), బాపట్ల టౌన్

పట్టణ ప్రజలకు ఆహ్లాదం, ఆరోగ్యాన్ని అందించేందుకు పురపాలక అధికారులు ప్రణాళికలను అమలు చేస్తున్నారు. గతేడాది పట్టణంలోని పార్కులపై ప్రభుత్వం శ్రద్ధ పెట్టి వాటి అభివృద్ధికి కృషి చేస్తున్నారు. గత ప్రభుత్వం వీటిని పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం పార్కుల్లో ఆట పరికాలు, వ్యాయామం సౌకర్యం కల్పించడంతో ప్రజలు, చిన్నారులు సేదతీరుతూ ఆహ్లాదంగా గడుపుతున్నారు.

వివేకానంద కాలనీలో పార్కు

ప్రత్యేక ఏర్పాట్లు.. పట్టణంలో ప్రధానమైన వివేకానంద కాలనీ పార్కును ఇటీవల రూ. 15 లక్షలతో పూర్తిస్థాయిలో అభివృద్ధి చేశారు. వాకింగ్ ట్రాక్ జిమ్ సామగ్రితో పాటు వివిధ రకాల మొక్కలు నాటి సుందరంగా తీర్చిదిద్దారు. రూ. 5 లక్షలు ఎంపీ నిధులతో పిల్లలకు జారుడు బల్లలు, రంగుల రాట్నం, ఇతర ఆట సామగ్రి సమకూర్చారు. ముఖ్యంగా పార్కులో ఏర్పాటు చేసిన వాటర్ ఫాల్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. విశ్వబ్రాహ్మణ కాలనీలోని పార్కు, చంద్రకళ పార్కులను రూ.10 లక్షలతో అభివృద్ధి చేశారు. ఆయా రకాల పూల మొక్కలు, చెట్లతో సుందరంగా తీర్చిదిద్దారు. చిన్నారుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ పార్కులకు రోజు 100 నుంచి 200 మంది వస్తుంటారు. చంద్రకళ పార్కు రైల్వేస్టేషన్ వద్ద ఉండటంతో ఎక్కువగా ప్రయాణికులు సేదతీరుతారు. పెయింటర్స్ కాలనీలోని పార్కును ప్రస్తుతం రూ. 5 లక్షలతో అభివృద్ధి చేస్తున్నారు. పనులు చాలా వరకు పూర్తయ్యాయి.

ప్రజల సహకారం అవసరం

ప్రజలకు ఆహ్లాదం పంచేందుకు ఎమ్మెల్యే వేగేశన, కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశాల మేరకు పార్కులను అభివృద్ధి చేస్తున్నాం. పట్టణంలోని పార్కుల్లో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసే దిశగా మున్సిపాలిటీ అడుగులు వేస్తోంది. ప్రజలు తమ వంతు సహకారం అందించి సౌకర్యాలను ఉపయోగించుకోవాలి.
- రఘునాథరెడ్డి కమిషనర్

(c) eenadu

చీరాల

• చీరాల • పర్చూరు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

చీరాల: 9154846713 వేటపాలెం: 8008574099
చీరాల గ్రామీణ: 6309994673 పర్చూరు: 9063144743
మార్టూరు: 8008574106 ఇంకొల్లు: 8008574102
చినగంజాం: 8008574103

? చీరాల శివాలయం, కృష్ణుని గుడి వద్ద చీరాల వారి వీధిలో తరచూ డ్రైనేజీలో వ్యర్థాలు తొలగించక అడ్డుపడి, మురుగు నీరు రహదారిపై ప్రవహించి దుర్వాసన వ్యాపిస్తోంది. సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలి. - **స్థానికులు**
✔ సిబ్బందిని పంపించి మురుగు కాలువను బాగు చేయిస్తా. - **ప్రవీణ్, పారిశుద్ధ్య పర్యవేక్షకుడు, చీరాల**
– న్యూస్‌టుడే, చీరాల గ్రామీణం

? ఓరుగంటిరెడ్డి వీధికి వెళ్లేదారిలో ఉన్న విద్యుత్తు నియంత్రిక వద్ద చెత్త పేరుకుంది. గడిచిన నాలుగు రోజులుగా పారిశుద్ధ్య సిబ్బంది చెత్తను తొలగించకపోవడంతో దుర్వాసన వస్తోంది. - **శ్రీనివాస్,** స్థానికుడు ✔ వెంటనే సిబ్బందిని పంపి అక్కడ బాగుచేయిస్తా. - **సురేంద్ర, పంచాయతీ కార్యదర్శి, వేటపాలెం** – న్యూస్‌టుడే, వేటపాలెం

? పెదగంజాం పరిధిలోని బుచ్చిగుంటలో వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రి వేళల్లో రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. సమస్యను పరిష్కరించండి. - **ప్రసాదరావు** ✔ ఆ ప్రాంతాన్ని పరిశీలించి, రెండు రోజుల్లో వీధి దీపాలకు మరమ్మతులు చేయించి సమస్యను పరిష్కరిస్తా. - **కె.కృపారావు, ఇన్‌ఛార్జి గ్రామ కార్యదర్శి, పెదగంజాం** – న్యూస్‌టుడే, చినగంజాం

? ఇంకొల్లు నాగుల చెరువు కట్టపై ఏర్పాటు చేసిన విద్యుత్తు స్తంభాల ఎత్తు తక్కువగా ఉన్నందున గృహాలకు అమర్చిన సర్వీసు వైర్లకు భారీ వాహనాలు తగిలి, తెగిపోతున్నాయి. పాతవి తొలగించి ఎత్తు స్తంభాలు ఏర్పాటు చేయాలి. - **వి. శ్రీనివాసరావు, ఇంకొల్లు** ✔ కొత్త స్తంభాలు కొనుగోలు చేస్తున్నాం. గుత్తేదారు సరఫరా చేసిన వెంటనే సమస్య పరిష్కరిస్తాం. - **రామకృష్ణ, ఏఈ, ఇంకొల్లు** – న్యూస్‌టుడే, ఇంకొల్లు

నేడు కౌలు రైతుల నిరాహార దీక్ష

చీరాల, న్యూస్‌టుడే: భూయజమానితో సంబంధం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, పెట్టుబడి సాయం రూ.20 వేలు అందించాలని డిమాండ్ చేస్తూ 23,24వ తేదీల్లో కలెక్టర్ కార్యాలయం వద్ద 30 గంటలపాటు నిరాహార దీక్షలు చేయనున్నట్లు కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి.కొండయ్య తెలిపారు. కౌలు రైతులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ప్రభుత్వ కార్యాలయాలకు సొబగులు

నియోజకవర్గ వ్యాప్తంగా రూ.2.80 కోట్లతో పనులు

స్వర్ణ(కారంచేడు), ఇడుపులపాడు(ఇంకొల్లు), పూనూరు(యద్దనపూడి), న్యూస్‌టుడే

కూటమి సర్కారు ప్రభుత్వ కార్యాలయాలను బలోపేతం చేయడమే లక్ష్యంగా అడుగులు వేస్తోంది. వివిధ పనుల నిమిత్తం ఇక్కడికి వచ్చే ప్రజలకు సౌకర్యాలు కల్పించేందుకు వీలుగా పనులు చేపట్టింది. వైద్యశాలలు, రెవెన్యూ శాఖతో పాటు పలు కార్యాలయాలకు వచ్చే ప్రజలతో పాటు ఉద్యోగులు, అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులు, బాలింతలు, గర్భిణుల అవసరాలు తీర్చేలా మరుగుదొడ్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్ధ్య విభాగం ఆధ్వర్యంలో మరుగుదొడ్లు, మంచినీటి సదుపాయాలు కల్పించే పనులు చేపట్టి 60 శాతానికిపైగా పూర్తి చేశారు. పర్చూరు నియోజకవర్గ వ్యాప్తంగా స్వచ్ఛభారత్ మిషన్ కింద ప్రభుత్వ కార్యాలయాలు, మహిళా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ద్వారా అంగన్‌వాడీ కేంద్రాలకు రూ.2.80 కోట్ల నిధులు విడుదల చేశారు. 85 సర్కారు కార్యాలయాల్లో.. ఒక్కొక్క యూనిట్(నాలుగు గదుల మరుగుదొడ్లు, మంచినీటి సౌకర్యం)కు రూ.3 లక్షలు, 55 అంగన్‌వాడీ కేంద్రాల్లో.. ఒక్కొక్క మరుగుదొడ్డి నిర్మాణానికి రూ.36 వేలు, 29 కేంద్రాల్లో.. ఒక్కొక్కచోట మంచినీటి సదుపాయానికి రూ.17 వేల చొప్పున కేటాయించారు. వీటితో ప్రజలు, ఉద్యోగుల అవసరాలకు తగ్గట్టుగా పనులు చేపడుతున్నారు. ఇవి నాణ్యతతో జరిగేలా గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్ధ్య విభాగం అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో యూనిట్లు మంజూరు ఇలా..

పర్చూరు	26
కారంచేడు	11
ఇంకొల్లు	18
యద్దనపూడి	15
మార్టూరు	07
చినగంజాం	08

మార్చి ఆఖరు నాటికి పనులు పూర్తి చేస్తాం

మార్చి నెలాఖరు నాటికి పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలు, ఉద్యోగులకు మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా ఈ నిర్మాణాలు జరుగుతున్నాయి. నాణ్యతా ప్రమాణాల్లో ఎక్కడా రాజీలేకుండా పర్యవేక్షిస్తున్నాం. – **సతీష్‌చంద్ర, డీఈ, ఆర్‌డబ్ల్యూఎస్, పర్చూరు**

ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుకు ఆటంకాలు

భూమి పూజ కోసం ఏర్పాట్లు

కొత్తపాలెం (ఇంకొల్లు), న్యూస్‌టుడే: కొత్తపాలెం గ్రామస్థులు భారీ వ్యయంతో ఏర్పాటు చేయనున్న నందమూరి తారకరామారావు కాంస్య విగ్రహ నిర్మాణానికి ఆదిలోనే ఆటంకాలు ఎదురయ్యాయి. పావులూరు శివారు గ్రామమైన కొత్తపాలెంలో 60 గృహాలు, 300 జనాభా ఉంది. తొలి నుంచి గ్రామంలో ఎన్టీఆర్ అభిమానులు ఎక్కువ. గ్రామస్థులంతా కలిసి ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు చేయాలని సంకల్పించారు. శాసనసభ్యుడు సాంబశివరావును కలిసి విగ్రహం ఏర్పాటు చేస్తున్నామని తెలుపగా ఆయన సమ్మతించారు. పావులూరు రహదారి పక్కన గ్రామానికి చెందిన వెంకయ్య అధీనంలోని రెండు సెంట్ల స్థలాన్ని విగ్రహం ఏర్పాటుకు రాయించుకున్నారు. ఈనెల 20న భూమి పూజ కోసం ఏర్పాట్లు చేశారు. ఆహ్వాన పత్రాలు ముద్రించి పంపిణీ చేశారు. ఉన్నట్లుండి 19వ తేదీ రాత్రి రెవెన్యూ సిబ్బంది వచ్చి విగ్రహ నిర్మాణ ప్రదేశం ప్రభుత్వ భూమి అని, అందులో ఎటువంటి నిర్మాణాలు చేపట్టరాదంటూ అడ్డుకున్నారు. దీంతో అక్కడ ఏర్పాట్లు చేస్తున్న గ్రామస్థులు, తెదేపా కార్యకర్తలు హతాశులయ్యారు. వారం రోజులుగా భూమి పూజ ఏర్పాటు చేసుకుంటున్నా లేని అభ్యంతరం ఇప్పటికిప్పుడేమిటని వారికి అర్థం కాలేదు. 20వ తేదీ రెవెన్యూ సిబ్బంది అక్కడే ఉండి భూమిపూజ చేయనీయకుండా అడ్డుకున్నారు.

వైకాపా నేత ఆర్థిక సాయమే కారణమా? విగ్రహం ఏర్పాటుకు గ్రామస్థులు దాతల సాయం కోరారు. ఈ క్రమంలో పక్క గ్రామానికి చెందిన వైకాపా నేత రూ.9 లక్షల వ్యయంకాగల కాంస్య విగ్రహం అందజేస్తానన్నారు. ఈ విషయం తెలిసిన తెదేపా నాయకులు వైకాపా నేత సాయంతో విగ్రహం ఏర్పాటు చేయటమేమిటని గ్రామస్థులను ప్రశ్నించగా ఎన్టీఆర్‌పై అభిమానంతో ఇస్తున్నారని వారు తెలిపారు.. ఈక్రమంలోనే రెవెన్యూ సిబ్బంది రంగప్రవేశం చేసి భూమిపూజ చేయడానికి అభ్యంతరాలు తెలిపారు. దీంతో గ్రామస్థులకు పాలుపోని పరిస్థితి ఏర్పడింది. తమ సొంత స్థలంలో విగ్రహం ఏర్పాటుకు సమాయత్తమవుతున్నారు.

భక్తితో ఖాదర్ మస్తాన్ స్వాముల ఆరాధన

పందిళ్లపల్లి (వేటపాలెం), న్యూస్‌టుడే: పాతూరులోని మహనీయాశ్రమంలో ఆదివారం అత్యంత భక్తి శ్రద్ధలతో ఖాదర్ మస్తాన్ స్వాముల వారి 77వ వార్షిక ఆరాధన మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం అఖండ దీపారాధనతో కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ స్వామివారిని దర్శించుకుని, పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం, రాత్రికి స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించిన పీఠంపై ఉంచి పురవీధుల్లో మేళతాళాలు, తప్పెట్ల మధ్య ఘనంగా ఊరేగించారు. కార్యక్రమాన్ని స్వామివారి శిష్యబృందం పర్యవేక్షించింది.

సీపీఎం ప్రత్యేక సమావేశం

మార్టూరు, న్యూస్‌టుడే: ప్రపంచవ్యాప్తంగా సమతరమైన సామ్రాజ్య స్థాపన కోసం లెనిన్ 1916లోనే రెడ్‌బుక్ రాశారని సీపీఎం జిల్లా నాయకులు చార్ మజుందార్, బత్తుల హనుమంతరావు అన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కొన్ని దేశాల అధినేతలు ప్రపంచ వ్యాప్తంగా ఇంధనంపై ఆధిపత్యం చెలాయించేందుకు అభివృద్ధి చెందిన దేశాలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. ఈ విషయాలపై 1916లోనే లెనిన్ రెడ్‌బుక్‌లో తెలిపారన్నారు.

మద్దతు ధరకు శనగల కొనుగోలు

యద్దనపూడి, న్యూస్‌టుడే: మండలంలో శనగ పంట సాగుచేసిన రైతులు మద్దతు ధరకు అమ్ముకునేలా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఏవో కుమారి ఆదివారం తెలిపారు. క్వింటా శనగ విత్తనాలను రూ.5,875 నిర్ణీత ధరకు కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తామన్నారు. పండించిన పంటలో తేమ శాతం 14 శాతం ఉండేలా చూసుకోవాలన్నారు. ఈ-పంట నమోదైన రైతులు గ్రామాల్లో వ్యవసాయ సహాయకుల ద్వారా ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. వీరినే సీఎం యాప్‌లో నమోదు చేస్తారని తెలిపారు.

నేడు పరీక్ష రాయనున్న 226 మంది విద్యార్థులు

పర్చూరు, న్యూస్‌టుడే: స్థానిక బీఏఆర్ అండ్‌టీపీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం నుంచి ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు జరగనున్నాయి. ఈ కేంద్రంలో 226 మంది రాయనున్నారు. ఈ ఏడాది నూతనంగా యద్దనపూడి గురుకుల, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఈ కేంద్రాన్ని కేటాయించారు. వీరికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు పరీక్షల సూపరింటెండెంట్ జి.రవికుమార్ తెలిపారు. ఉదయం 9నుంచి 12గంటల సమయం వరకు కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధిస్తున్నట్లు పర్చూరు ఎస్సై పులి గోపి తెలిపారు. కేంద్రాలకు 200 మీటర్ల దూరంలోని దుకాణాలు, జిరాక్సు షాపులు మూసివేయాలని వ్యాపారులకు సూచించారు.

24 గంటలూ వెలుగులే!



ఈ చిత్రంలో వరుసగా వెలుగుతున్న వీధి దీపాలు చల్లారెడ్డిపాలెం పంచాయతీ కొత్తపాలెంలో శనివారం పగలు కనిపించిన దృశ్యం. ఈ ప్రాంతంలో దాదాపు 50 స్తంభాలకు బిగించిన అన్ని లైట్లు వెలగడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం. ఇదే ప్రాంతంలోని కొణిజేటి చేనేతపురి-3 కాలనీలో ఆరు నెలలుగా వీధి లైట్లు వెలగడంలేదు. దీపాలు వేయాలని ఆ కాలనీవాసులు అధికారులకు విన్నవిస్తున్నా ఆ సమస్య నేటికీ పరిష్కారంలేదు. ఇకనైనా స్పందించి నిత్యం వెలిగే వాటిని నిలిపేసి, వెలగని వాటిని బాగుచేయాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. - న్యూస్‌టుడే, వేటపాలెం

ట్రాఫిక్ చక్రవ్యూహం పేరాల కూడలి

చీరాలలోని ప్రధాన కూడళ్లలో పేరాల ఒకటి. దీని మీదుగా వెళ్లాలంటే వాహనదారులు హడలిపోతున్నారు. వాహనాల రద్దీకి తోడు ఇరుకుగా ఉండటంతో తరచూ ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. పట్టణం నుంచి వాడరేవు, కారంచేడు నుంచి వచ్చే వాహనాలు బైపాస్‌కు తప్పనిసరిగా ఇటు నుంచే వెళ్లాలి. భారీ వాహనాలు సైతం ఇటుగానే వెళతాయి. దీంతో ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి. ఇక్కడ ఆక్రమణలు తొలగించడంతో పాటు వాహనాలు రోడ్డుపై అడ్డంగా లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు. - **న్యూస్‌టుడే చీరాల**

ముక్కుపుటాలు అదరాల్సిందే

మండల పరిధిలోని గర్నెపూడి గ్రామ ప్రారంభంలో పరిసర ప్రాంతాల ప్రజలు రోడ్డుకు ఇరువైపులా చెత్తను పడేస్తుండటంతో దుర్వాసన జాతీయ రహదారి 167(ఏ)పైకి వ్యాపిస్తోందని స్థానిక ప్రజలు తెలుపుతున్నారు. ఇదే దారిలో ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు బస్సుల కోసం జాతీయరహదారి వెంబడి వేచి ఉండే సమయంలో గాలులకు వ్యర్థాల దుర్వాసనతో ఇబ్బందులు తప్పడం లేదని మరికొందరు వాపోతున్నారు. సంబంధిత అధికారులు చెత్తాచెదారం తొలగించాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, గర్నెపూడి (పర్చూరు)

ఇలాగైతే మురుగు పారేదెలా?

చీరాల పట్టణంలోని గంజిపాలెం నుంచి రంగారావు నగర్, ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లే ప్రధాన రహదారి వెంట మురుగు కాలువల పరిస్థితి అధ్వానంగా మారాయి. ఆ ప్రాంతంలోని కాలువలపై మున్సిపల్ అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా పూడిక పేరుకుపోయింది. దీంతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. కాలువలు కొన్నిచోట్ల పూడిపోయి, మరికొన్నిచోట్ల పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. దుర్వాసన వెదజల్లడంతో పాటు దోమల పునరుత్పత్తికి కేంద్రాలుగా మారాయి. అధికారులు దృష్టి సారించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, పేరాల

రొంపేరు వంతెనపై బేజారు

రొంపేరు వంతెనపై రోడ్డు కుడి ఎడమ పక్కల ప్రమాదం పొంచి ఉంది. దీనిపై ఏర్పాటు చేసిన రక్షణ దిమ్మెలు ఒకవైపు అన్నీ పగిలి వాగులో పడిపోయాయి. దీంతో కాస్త ద్విచక్ర వాహనాలకు రక్షణ కరవైంది. రాత్రి పూట వాహనాలు పరస్పరం ఎదురుపడితే జాగ్రత్తగా వెళ్లాల్సిందే. లేకపోతే కాలువలోకి ఒరిగిపోయే ఆస్కారం ఉంది. చీరాల-పేరాల గ్రామాల మధ్య అధికంగా రాకపోకలు సాగుతున్నాయి. రైతులతో పాటు ఉద్యోగులు, వ్యాపారులు, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో చదివే విద్యార్థుల వాహనాలు ఎక్కువగా రాకపోకలు సాగిస్తుంటాయి. అధికారులు రక్షణ ఏర్పాట్లు చేయాల్సి ఉంది. - న్యూస్‌టుడే, చీరాల గ్రామీణం

మంచు కమ్మేసింది.. ప్రయాణం నెమ్మదించింది

ఆదివారం తెల్లవారుజాము నుంచి గ్రామాలపై మంచు దుప్పటి పరుచుకుంది. ఉదయం 8.30 గంటల వరకు రోడ్లపై మంచు కమ్ముకోవడంతో వాహనదారులు ప్రయాణాలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. యద్దనపూడి మండలం అనంతవరం సమీపంలోని బ్రహ్మ దుం-సుమద్రు రహదారిలో మంచుతో రోడ్డు కనిపించక ప్రజలు అవస్థలు పడ్డారు. మార్టూరు మండలంలోని 16వ నంబర్ జాతీయ రహదారిపైన ఇదే పరిస్థితి ఉండటంతో వందలాది వాహనాలు నెమ్మదిగా వెళ్లాయి. కనీసం ముందున్న వాహనం కనిపించని స్థాయిలో మంచు కమ్ముకుపోయింది. - న్యూస్‌టుడే, యద్దనపూడి

కాకోలుకు పలువురి అభినందనలు

వెంకటేశ్వర్లును అభినందిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి

మార్టూరు, యద్దనపూడి, న్యూస్‌టుడే: తెదేపా బాపట్ల పార్లమెంటు కార్యనిర్వాహక కార్యదర్శిగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన మార్టూరుకు చెందిన తెదేపా నేత కాకోలు వెంకటేశ్వర్లును పలువురు పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు కలిసి అభినందనలు తెలిపారు. ఆదివారం బాపట్ల జిల్లా కేంద్రంలో తెదేపా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సీనియర్ నేతల సమక్షంలో తెదేపా పార్లమెంటు నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం నిర్వహించారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు చొరవతో ఈ కార్యవర్గంలో కాకోలుకు జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శిగా, యద్దనపూడి మండలం పోలూరుకు చెందిన రావిపాటి సీతయ్యకు జిల్లా ఉపాధ్యక్షుడిగా పదవులు వరించాయి. వీరంతా ప్రత్యేక వాహనాల్లో తమ అభిమానులు, కార్యకర్తలతో కలిసి బాపట్ల తరలివెళ్లి పెద్దల ముందు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం కాకోలు, సీతయ్యలను ఎమ్మెల్యే ఏలూరితో పాటు మార్టూరు, యద్దనపూడి మండలాల పార్టీ శ్రేణులు అభినందించారు. కాకోలును అభినందించిన వారిలో గన్నవరం బుడే, కన్నెగంటి శ్రీనివాసరావు, బూదయ్య తదితరులున్నారు.

ముమ్మరంగా సమగ్ర ఏకీకృత సర్వే

న్యూస్‌టుడే, చీరాల

అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందాలని, చదువుకున్న అందరికి ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ముందుకెళ్తోంది. ఈ లక్ష్యాన్ని చేరుకునేందుకు రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర ఏకీకృత సర్వే చేయిస్తోంది. ప్రస్తుతం ఇది ముమ్మరంగా జరుగుతోంది. ఇందుకోసం ప్రత్యేకంగా మొబైల్ యాప్‌ను ఉపయోగిస్తున్నారు. దీనిలో భాగంగా గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది ఇంటింటికీ వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలు సేకరిస్తున్నారు. ఇందులో సామాజిక, ఆర్థిక, విద్య, స్థితిగతులు, ఉపాధి, ప్రభుత్వ పథకాల లబ్ధి, ఆస్తి తదితర వివరాలు ఉన్నాయి. వీటిని ప్రత్యేక మొబైల్ యాప్‌లో సిబ్బంది నమోదు చేస్తున్నారు. ఈ సర్వే మొత్తం పూర్తయిన తరువాత కుటుంబానికి స్మార్ట్ కార్డు అందజేస్తారు. ఇందులో ప్రతి కుటుంబ సభ్యుడి పూర్తి వివరాలు నిక్షిప్తమై ఉంటాయి. దీని ద్వారా అర్హులైన ప్రతిఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తారు. పథకాల అమల్లో పారదర్శకత ఉంటుంది. వివిధ కులాల ఆర్థిక, సామాజిక పరిస్థితిని అంచనా వేసి వారి అభివృద్ధికి తోడ్పాటునివ్వనున్నారు. ఈ సర్వే ఉపయోగపడుతుంది. ప్రస్తుతం ఇది చీరాల నియోజకవర్గంలో ముమ్మరంగా సాగుతోంది. ఫిబ్రవరి చివరికి దీన్ని పూర్తిచేయాలని ప్రభుత్వం ఆదేశించింది.

ప్రాంతాలు	మొత్తం గృహాలు	పూర్తయినవి
చీరాల పట్టణం	26,434	7,396
చీరాల మండలం	28,299	19,470
వేటపాలెం మండలం	27,152	18,574

ప్రజల నుంచి కొరవడుతున్న స్పందన

ఈ సర్వే కోసం వస్తున్న సిబ్బందికి ప్రజల నుంచి సరైన సహకారం లభించడం లేదు. దీనిపై సరైన అవగాహన కల్పించకపోవడంతో పాటు ఓటీపీ నంబర్లు చెప్పాలని అడుగుతుండటంతో ఇంట్లో మహిళలు భయపడుతున్నారు. ఈ పరిస్థితుల్లో పూర్తిస్థాయి వివరాలు చెప్పేందుకు ప్రజలు సుముఖత చూపడం లేదని సర్వే సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారుల నుంచి త్వరగా పూర్తిచేయాలని ఒత్తిళ్లు వస్తున్నాయని, షోకాజ్ నోటీసులు జారీచేస్తున్నారని అంటున్నారు. ఇదే సమయంలో బీఎల్‌ఓలుగా విధులు ఉండటంతో ఒకేసారి రెండు కీలకమైన పనులు చేయలేక అవస్థలు పడుతున్నామని సిబ్బంది ఆవేదన చెందుతున్నారు. దీనిపై ప్రభుత్వం అవగాహన కల్పిస్తూ ప్రచారం చేయడంతో పాటు గుర్తింపు కార్డులతో ఉద్యోగులు వస్తే బాగుంటుందని గృహ యజమానులు అంటున్నారు.

యజ్ఞంలో పాల్గొన్న దంపతులు

వైభవంగా వీరాంజనేయుడి విగ్రహ ప్రతిష్ఠ

వేటపాలెం, న్యూస్‌టుడే: మండల పరిషత్ కార్యాలయ సమీపంలో దాతల విరాళాలతో నూతనంగా నిర్మించిన అభయాంజనేయ స్వామి ఆలయంలో స్వామివారి విగ్రహ ప్రతిష్ఠను ప్రవాస భారతీయుడు కోడూరి కిరణ్ కుమార్, గట్టుపల్లి తిరుమలరావు, దోగుపర్తి మల్లికార్జునరావు, చల్లా రాజశేఖర్ దంపతుల ఆధ్వర్యంలో ఆదివారం వైభవంగా నిర్వహించారు. స్వామిని మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణ మోహన్ దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నసంతర్పణ జరిగింది. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా సొసైటీ ఎన్నికలు

ఓటు వేయడానికి లైనులో ఉద్యోగులు

కొత్తపేట (వేటపాలెం), న్యూస్‌టుడే: ది ఐఎల్‌టీడీ కో-ఆపరేటివ్ సొసైటీ హౌస్ కన్‌స్ట్రక్షన్ ఇండస్ట్రియల్ లిమిటెడ్ ఎన్నికలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. ఉదయం ఏడు నుంచి సాయంత్రం అయిదు గంటల వరకు పోలింగ్ సాగింది. 965 ఓటర్లకు 634 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నట్లు ఎన్నికల అధికారి, న్యాయవాది ఎం.సాయికృష్ణ తెలిపారు. సాయంత్రం నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టారు. ఈ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రెండో పట్టణ పోలీసుల బందోబస్తు ఏర్పాటు చేశారు.

కడవకుదురు శివాలయంలో పూజల్లో తెదేపా జిల్లా కార్యదర్శి నక్కల రాఘవ

బాపట్లకు భారీగా తరలిన తెదేపా కార్యకర్తలు

చినగంజాం, న్యూస్‌టుడే: బాపట్లలో మంత్రులు, ఎమ్మెల్యేల సమక్షంలో ఆదివారం జరిగిన ప్రమాణ స్వీకారోత్సవంలో కడవకుదురుకు చెందిన నక్కల రాఘవ తెదేపా నూతన కమిటీలో జిల్లా కార్యదర్శిగా ప్రమాణ స్వీకారం చేశారు. బాపట్ల పార్లమెంటు నూతన భవనం శంకుస్థాపన పూజలు అనంతరం నూతన ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్నారు. దీనికి ముందు ఉదయం స్వగ్రామం కడవకుదురులోని శివాలయంలో జరిగిన పూజల్లో రాఘవ పాల్గొన్నారు. మండల పరిధిలోని అన్ని గ్రామాల నుంచి వాహనాల్లో భారీగా తెదేపా నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు.

పునర్విక‌కు అండగా విరాళాల సేకరణ

విరాళాలు సేకరిస్తున్న పర్చూరులోని యువత

పర్చూరు, న్యూస్‌టుడే: అరుదైన జన్యు వ్యాధితో బాధపడుతూ వైద్యం కోసం ఎదురుచూస్తున్న నెల్లూరు జిల్లా ఆత్మకూరుకు చెందిన చిన్నారి పునర్వికకు తమవంతు సాయంగా పర్చూరు యువత ఆదివారం ముందుకు కదిలారు. చిన్నారి వైద్యానికి భారీగా ఆర్థిక సాయం అవసరం కావడంతో యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పునర్వికకు పునర్జన్మ ఇవ్వండి అంటూ ఫ్లెక్సీలు చేతబూని, విరాళాల సేకరణ చేపట్టారు. చిన్నా, పెద్ద తేడా లేకుండా పర్చూరులో దుకాణాలు, ఇళ్ల వద్దకు వెళ్లి పునర్విక ఆరోగ్యంగా కోలుకునేందుకు తమవంతు నగదు సాయం అందించాలని కోరారు. యువత సమీయుల్లా, రాజు, హేమ వసంత్, ఆక్స్‌ఫర్డ్, శారదా పాఠశాల విద్యార్థులు, ఏసీపీ సబ్‌సెంటర్ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

ఆగిన ట్రాక్టర్‌ని ఢీకొని ఒకరికి గాయాలు

పర్చూరు, న్యూస్‌టుడే: పెద్దివారిపాలెం గ్రామానికి చెందిన చెరుకూరి హరిబాబు ఆదివారం రాత్రి పర్చూరు నుంచి ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వెళ్తుండగా గ్రామ సమీపంలో రోడ్డు పక్కనే ఆగి ఉన్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొట్టినట్లు స్థానికులు తెలిపారు. హరిబాబు తలకు గాయాలు కాగా చికిత్స నిమిత్తం పర్చూరు వైద్యశాలకు తరలించారన్నారు.

ద్విచక్ర వాహనం చోరీపై కేసు

యద్దనపూడి: మండలంలోని సూరవరపుపల్లిలో జరిగిన ద్విచక్ర వాహనం చోరీపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రత్నకుమారి ఆదివారం తెలిపారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం మురికిపూడి గ్రామానికి చెందిన షేక్ కరీంబాషా సూరవరపుపల్లిలోని తన బంధువుల ఇంటి వద్ద బండిని పెట్టాడన్నారు. వచ్చి చూసే సరికి కనిపించకపోవడంతో ఫిర్యాదు చేశాడన్నారు.

మంగళగిరి చేనేత గర్జనకు కార్మికులు

చీరాల నుంచి బస్సులో బయలుదేరిన చేనేతలు

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: చేనేత సమస్యలపై ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో తమ గళాన్ని వినిపించేందుకు మంగళగిరిలో ఏర్పాటు చేసిన గర్జన సభకు అధిక సంఖ్యలో నాయకులు, కార్మిక సంఘాల ప్రతినిధులు బస్సుల్లో ఆదివారం తరలివెళ్లారు. వీరిలో రాష్ట్ర చేనేత జన సమాఖ్య వ్యవస్థాపకుడు మాచర్ల మోహనరావు, ఐక్యకార్యాచరణ కమిటీ నాయకులు దామర్ల శ్రీకృష్ణ, దేవన నాగేశ్వరరావు, అనుభవం వెంకటేశ్వర్లు, అండగుండ నారాయణ, కార్మికులు ఉన్నారు.

సీసీ రహదారికి భూమి పూజ

కార్యక్రమంలో తెదేపా నేతలు

ఇంకొల్లు, న్యూస్‌టుడే: స్థానిక పావులూరు రహదారిలోని డీఎన్‌టీ కాలనీలో సీసీ రోడ్డుకు ఆదివారం భూమిపూజ నిర్వహించారు. పర్చూరు ఏఎంసీ ఛైర్మన్ గుంజి వెంకట్రావు, ఇంకొల్లు, గంగవరం, పావులూరు సహకార సంఘాల అధ్యక్షులు శ్రీనివాసరావు, సుబ్బారావు, రాంబాబు, తెదేపా నాయకులు హనుమంతరావు, మార్కు, సాంబయ్య, శివయ్య కాలనీ పెద్దలు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పర్చూరు, న్యూస్‌టుడే: పర్చూరులోని రామాలయం వీధికి చెందిన వి.సాంబశివరావు(38) గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడని అందిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పులి గోపి తెలిపారు. రెండేళ్ల క్రితం ప్రమాదంలో గాయపడి ఇంట్లోని మంచం మీదనే ఉంటున్న సాంబశివరావు ఈనెల 20వ తేదీ అర్ధరాత్రి కొడవలితో పొట్టభాగంపై గాయపరుచుకున్నాడని, కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారన్నారు. నాటి నుంచి చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందినట్లు అక్కడి వైద్యులు సమాచారం ఇచ్చారన్నారు. మృతుడి భార్య ఉమాదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గోపి వివరించారు.

సేవా పురస్కారానికి ఎంపిక

నాగమల్లేశ్వరరావు

చినగంజాం, న్యూస్‌టుడే: చినగంజాం మండలం సోపిరాలకు చెందిన సిద్దం నాగమల్లేశ్వరరావు రామచంద్రానగర్ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఈయన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి సేవా పురస్కారానికి ఎంపికయ్యారు. ఎంపికైన సేవా పురస్కార పత్రాన్ని ఆన్‌లైన్ ద్వారా ఆదివారం అందుకున్నట్లు నాగమల్లేశ్వరరావు తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి సందర్భంగా కడప జిల్లాకు చెందిన వాజ్‌పేయీ, అడ్వాణీ సేవా సంస్థ ఈ అవార్డును ప్రకటించింది. నాగమల్లేశ్వరరావును ప్రధానోపాధ్యాయుడు షేక్ నాయబ్ రసూల్, పేరెంట్ కమిటీ ఛైర్మన్ మస్తాన్‌రావు, ఉపాధ్యాయులు హిమంతేశ్వరి, సరళ, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు అభినందించారు.

ప్రతాప్‌రెడ్డి సైకిల్ యాత్ర పూర్తి

వేటపాలెం, న్యూస్‌టుడే: పంచవృత్తిదారుల (కమ్మరి, వడ్రంగి, కంచరి, శిల్పి, స్వర్ణకార) సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేసి సంక్షేమాన్ని అందించాలనే నినాదంతో గత నెల 10న సైకిల్ యాత్ర చేపట్టిన ఆ సంఘ రాష్ట్ర సమన్వయకర్త నాయుడు ప్రతాప్‌రెడ్డి 44 రోజుల అనంతరం ఆదివారం స్వగ్రామానికి చేరుకున్నారు. ఈక్రమంలో ఆయన్ని కార్పెంటర్స్ అసోసియేషన్ ప్రతినిధులు సత్కరించారు. ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు మీదుగా ఆయా వృత్తిదారులను కలుసుకుంటూ నాలుగువేల కిలోమీటర్లు ఈ యాత్ర సాగినట్లు ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కుప్పంలో సీఎం పేషీ, పిఠాపురంలో డిప్యూటీ సీఎం కార్యాలయాల్లో వినతిపత్రాలు అందించినట్లు చెప్పారు.

ప్రతాప్‌రెడ్డిని సత్కరించిన కార్పెంటర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

(c) eenadu

అపురూప వేడుక.. ఆనంద వీచిక

ఒకే రూపం కలిగిన కవలలను చూస్తే.. ఔరా అనిపిస్తుంది. అలాంటిది ఒకే వేదికపై వంద మంది కవలలు ఉంటే.. కనులకు ఇంపుగా మారుతుంది. ఈ అపురూప దృశ్యం ఆదివారం తిరుపతిలోని వేమన విజ్ఞాన కేంద్రం కనిపించింది. తిరుపతికి చెందిన హేమావతి, హేమలత కవలలు. వీరు బెంగళూరులో ఓ ప్రైవేటు సంస్థలో విధులు నిర్వర్తిస్తున్నారు. కన్నెర్నిగా ఆంధ్ర, తెలంగాణ కవలలను ఒకే వేదిక పైకి తెచ్చి వేడుక నిర్వహిస్తున్నారు. పండగ వాతావరణంలో కార్యక్రమం జరిగింది. - న్యూస్‌టుడే, తిరుపతి (బైరాగిపట్టెడ)

వరసిద్ధుడి దర్శనానికి ఐదు గంటలు

కాణిపాకం, న్యూస్‌టుడే: శ్రీవరసిద్ధి వినాయక స్వామి దర్శనానికి భక్తులు ఆదివారం ఆలయానికి పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. వేకువజాము నుంచి దర్శనానికి క్యూలైన్లలో బారులు తీరారు. దర్శనానికి సుమారు ఐదు గంటల సమయం పట్టింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

దర్శనానికి క్యూలైన్లలో ఉన్న భక్తులు

పదింతల ఫలితాలకు దిశానిర్దేశం

- 'ఈనాడు- జిల్లా విద్యాశాఖ' ఆధ్వర్యంలో ఫోన్‌ఇన్‌కు విశేష స్పందన
- విద్యార్థుల సందేహాలు నివృత్తి చేసిన పాఠ్యాంశాల నిపుణులు

చిత్తూరు విద్య, న్యూస్‌టుడే: పదో తరగతి పరీక్షలు మరో 20 రోజుల్లో ప్రారంభం కానున్న నేపథ్యంలో 'ఈనాడు- జిల్లా విద్యాశాఖ' ఆధ్వర్యంలో ఆదివారం మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు చిత్తూరులోని డీఈవో కార్యాలయంలో ఫోన్ ఇన్ కార్యక్రమం జరిగింది. జిల్లా వ్యాప్తంగా విద్యార్థుల నుంచి మంచి స్పందన లభించింది. విద్యార్థుల సందేహాలను పాఠ్యాంశ నిపుణులు నివృత్తి చేశారు.

ఫోన్ ఇన్‌లో విద్యార్థుల ప్రశ్నలకు సమాధానాలు ఇస్తున్న సబ్జెక్టు ఉపాధ్యాయులు

తెలుగు: అక్షర దోషాలు, కొట్టివేతలు ఉండకూడదు

తెలుగు భాష పరీక్షల్లో అక్షర దోషాలు, కొట్టివేతలు లేకుండా చక్కని చేతిరాతతో రాయాలి. ఒక ప్రశ్నకు సమాధానం పూర్తైన తర్వాత గీత గీసి కొద్దిగా ఖాళీ వదిలి.. తర్వాత ప్రశ్నకు సమాధానం రాయడం ఉత్తమం. భాషాంశాలలో 11వ ప్రశ్న నుంచి 33వ ప్రశ్న వరకు అన్నీ క్రమ పద్ధతిలో ఒకే సమాధానాలు రాయాలి. వంద రోజుల ప్రణాళికలోని మూడు మాదిరి ప్రశ్నపత్రాల్లోని ప్రశ్నలకు సమాధానాలు నేర్చుకోవాలి. నేర్చుకునే సమయంలో కఠినమైన ప్రశ్నలకు ఎక్కువ సమయం కేటాయించాలి. మాదిరి ప్రశ్న పత్రం ప్రకారం ప్రతి స్పందనకు 24, వ్యక్తీకరణ, సృజనాత్మకతకు 44 మార్కులు, భాషాంశాలకు 32 మార్కులు చొప్పున మొత్తం 100 మార్కుల ప్రశ్నపత్రం ఉంటుంది. **- పాపయ్య, ఉపాధ్యాయుడు**

ఆంగ్లం: చదివి బాగా అర్థం చేసుకోవాలి

ఆంగ్లంలో మంచి మార్కులు సాధించాలంటే ప్రతి భాగాన్ని రాయడానికి సిద్ధం కావాలి. స్పెల్లింగ్ దోషాలు లేకుండా శుభ్రంగా రాయడం ముఖ్యం. రీడింగ్ కాంప్రహెన్షన్‌లో 30 మార్కులు సులభంగా సాధించవచ్చు. పేరాగ్రాఫ్‌లు బాగా చదివి అర్థం చేసుకోవాలి. 16వ, 17వ ప్రశ్నలకు సులభంగా అర్థం చేసుకోవడం ద్వారా 10 మార్కులు సాధించవచ్చు. గ్రామర్ వొకాబులరీ ప్రశ్నలు బాగా చదవడం ద్వారా సమాధానాలు బాగా రాయొచ్చు. సృజనాత్మక రచన భాగంలో సంభాషణ, దినచర్య, నమోదు, లేఖ రచన సమాచారం మార్పిడి ప్రశ్నలు వస్తాయి. **-జయకుమార్, ఉపాధ్యాయుడు**

జీవశాస్త్రం: బొమ్మలు, ప్రయోగాలపై పట్టు సాధిస్తే..

జీవశాస్త్రంలో బొమ్మల్లోని పుష్పం నిలువుకోత, మొక్కల్లో వలదీకరణం, జీర్ణ విధానం, నెఫ్రాన్, మూత్రపిండ నిర్మాణం, స్త్రీ ప్రత్యుత్పత్తి వ్యవస్థపై గీయడం సాధన చేయాలి. ప్రయోగాల్లో క్లోరోఫిల్, ఆకుల్లో పిండి పదార్థం, మొక్కల్లో కాంతి అనువర్తనం, మోనోహైబ్రిడ్ క్రాస్, లింగ నిర్ధారణ, శ్వాస ప్రక్రియలో సీవో2 ప్రయోగం, రైబోఫస్ ప్రయోగం, బడ్డింగ్ ఇన్ ఈస్ట్‌లకు సంబంధించి ప్రశ్నలు వస్తాయి. స్లోగన్స్, అడ్వటైజ్‌మెంట్స్ పైన ప్రశ్న తప్పనిసరిగా ఉంటుంది. నాడీ నియంత్రణకు, హార్మోన్ల నియంత్రణకు మధ్య తేడాలు, మెండల్ సిద్ధాంతాలను గుర్తుపెట్టుకోవాలి. **-శివలింగం, జీవశాస్త్రం ఉపాధ్యాయుడు**

సాంఘికం: ప్రశ్నలన్నింటికీ సమాధానాలు రాయాలి

ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రశ్నల రూపకల్పనలో మార్పులు రాగా జ్ఞాపక శక్తి ఆధారిత సమాధానాలతో పరిమితం కాకుండా అవగాహన వేయడం, సృష్టించడం ఉన్నతస్థాయి సామర్థ్యాలను పరీక్షించే ప్రశ్నలు ఉండే అవకాశం ఉంది. ఒక మార్కు, రెండు మార్కులు, నాలుగు మార్కుల ప్రశ్నలన్నింటికీ సమాధానాలు రాయాలి. సమాచార నైపుణ్యాల కింద ఇచ్చిన ప్రశ్నకు సరైన సమాధానాలు రాస్తే పూర్తి మార్కులు వస్తాయి. భారతదేశ పటం, ప్రపంచ పటం ఇస్తారు. **-కృష్ణవేణి, ఉపాధ్యాయురాలు**

గణితం: ప్రణాళికతో మంచి మార్కులు

గణితం అంటే భయపడి, కష్టంగా భావించే విద్యార్థులు సరైన ప్రణాళికతో చదివితే మంచి మార్కులు సాధించవచ్చు. అన్ని ప్రశ్నలకు (33 ప్రశ్నలకు) సమాధానాలు రాయడానికి ప్రయత్నించాలి. సాంఖ్యక శాస్త్రం, సంభావ్యత, గ్రాఫ్ లెక్కలు, ఇచ్చిన సంఖ్యను కరణీయ సంఖ్య అని చూపడం నేర్చుకుంటే చాలు. ఒక మార్కు, రెండు మార్కుల ప్రశ్నలపై ఎక్కువ శ్రద్ధ పెట్టాలి. ఒక మార్కు ప్రశ్నలో భావన, కారణాలుగల సమస్య సృజనాత్మకతో ఉంటుంది. వాటిని జాగ్రత్తగా పరిశీలించి సమాధానాలు రాయాలి. ఎనిమిది మార్కుల ప్రశ్నలకు అంతర్గత ఎంపిక ప్రశ్నలకు కూడా సమాధానాలు రాయాలి. **- అరుణశివప్రసాద్, గణిత నిపుణులు**

భౌతికశాస్త్రం: చిత్రాలు విధిగా నేర్చుకోవాలి

కిరణ చిత్రాలు, కుంభాకార కటకం, పుటకార దర్పణాలకు సంబంధించిన చిత్రాలు విధిగా నేర్చుకోవాలి. నాలుగు మార్కులకు సంబంధించి ఆమ్లాలు, క్షారాలు, లవణాలు పాఠంలో, లోహాలు, ఆ లోహాలు పాఠంలోని ఉపయోగాలు, అనువర్తనాలు తప్పక నేర్చుకోవాలి. సమాచారం/దత్తాంశం ఇచ్చి ప్రశ్నలు అడుగుతారు. లేదా పట్టికలోని ఖాళీలను పూరించడం.. ఈ ప్రశ్న కాంతి పరావర్తనం-వక్రీభవనం పాఠం నుంచి రావచ్చు. రసాయన శాస్త్రం సంబంధించి రసాయన చర్యల్లో రకాలు, సమీకరణాలు తుల్యం చేయడం, కర్బన సమ్మేళనాలు, సబ్బు- దుస్తులను శుభ్రపరచే విధానం, అల్కేన్, ఆల్కీన్, ఆల్కైన్ ప్రమేయ సమూహాలు, ఫార్ములాలు బాగా అభ్యాసనం చేయడంతో అధికారులు మార్కులు సొంతం చేసుకోవచ్చు. **- షమీషీర్‌ఖాన్, ఉపాధ్యాయుడు**

హిందీ: మంచి దస్తూరితో ఎక్కువ మార్కులు

తప్పులు లేకుండా హిందీ పదాలు రాయడంతో పాటు మంచి దస్తూరి ఉంటే ఎక్కువ మార్కులు సాధించవచ్చు. ప్రశ్నపత్రంలోని మొదట ఏడు ప్రశ్నలకు పేరాగ్రాఫ్‌లో సమాధానం ఉండడంతో బాగా చదివి రాస్తే మంచి మార్కులు వస్తాయి. బిట్ పేపర్‌లో ప్రశ్నలు బాగా చదివి ఆప్షన్స్ గుర్తించాలి. 6, 7 ప్రశ్నలు కవి పరిచయం. వందరోజుల ప్రణాళికలోని ప్రశ్నలు బాగా చదివి గుర్తుపెట్టుకుని రాయాలి. **- చిట్టి, హిందీ పండితులు**

మట్టి మాఫియా.. అడ్డే లేదయా!

కార్వేటినగరం, న్యూస్‌టుడే: ప్రభుత్వం మారి రెండేళ్లు కావస్తున్నా మాఫియా ఆగడాలు ఆగడం లేదు. మండలంలో మట్టి దందా నిరాటంకంగా కొనసాగుతోంది. దళారులు, కిందిస్థాయి అధికారులు, ద్వితీయ శ్రేణి కూటమి నాయకుల అండతో అక్రమార్కులు యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. గోపిశెట్టిపల్లికి సమీపంలో తమిళనాడుకు చెందిన ఓ వ్యక్తి రియల్ ఎస్టేట్ భూములకు వందల ట్రాక్టర్ల మట్టిని కొందరు తవ్వి తరలిస్తున్నట్లు రెవెన్యూ అధికారులకు కొందరు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. గ్రామ శివారు ప్రాంతాల్లోని గుట్టలు, చెరువులు, కుంటలు, ప్రభుత్వ భూములను ఇష్టారాజ్యంగా తవ్వి తరలిస్తున్నారు. దళారులు యంత్రాలతో మట్టి తవ్వి తరలించాక చదునుగా ఉన్న ప్రభుత్వ భూములను కబ్జాదారులు ఆక్రమించుకుని డీకేటీ పట్టాల కోసం ప్రయత్నిస్తున్నారు.

సెలవు రోజుల్లో రెచ్చిపోతూ..

గోపిశెట్టిపల్లి, కార్వేటినగరం, అన్నూరు, నిత్యకందద్రం, ఎల్ఆర్ పేట, ఆర్‌కేవీబీపేట, కొల్లాగుంట, పరిసర ప్రాంతాల్లో కొండలు, చెరువులను తవ్వి మట్టిని తమిళనాడుకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు దినాల్లో దళారులు జేసీబీలతో కొండల్ని తవ్వి మట్టిని ప్రైవేటు వ్యక్తులకు, ఇటుక బట్టీలకు, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు విక్రయిస్తున్నారు. జాతీయ రహదారిపై కొద్దిదూరంలో మట్టిని తరలిస్తున్నా పోలీసులు, రెవెన్యూ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. రైతుల పట్టా భూముల్లోనూ అక్రమంగా మట్టి తవ్వి బట్టీలకు తరలిస్తున్నారు.

- తహసీల్దారు నాగరాజును వివరణ కోరగా మట్టి తవ్వకాలకు అనుమతులు ఇవ్వలేదన్నారు. గోపిశెట్టిపల్లిలో అక్రమంగా మట్టి తరలిస్తున్న వాహనాలు సీజ్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

ఎత్తు వేశారు.. విజేతలుగా నిలిచారు

తిరుపతి(క్రీడలు), న్యూస్‌టుడే: శాప్ లీగ్ పోటీల్లో భాగంగా తిరుపతిలోని శ్రీశ్రీనివాస క్రీడా సముదాయం వేదికగా రెండ్రోజులపాటు జరిగిన రాష్ట్రస్థాయి చదరంగం పోటీలు ఆదివారం ఉత్సాహంగా ముగిశాయి. పోటీల్లో పలు జిల్లాలకు చెందిన బాలబాలికలు ఎత్తులకు పైఎత్తులు వేస్తూ ప్రత్యర్థులపై సత్తాచాటారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి ఆదివారం ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, తితిదే పాలక మండలి సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్, తెదేపా రాష్ట్ర మీడియా సమన్వయకర్త, శాప్ మాజీ డైరెక్టర్ శ్రీధర్‌వర్మ ట్రోఫీ, పతకం, ప్రశంసా పత్రాలు ప్రదానం చేశారు. జిల్లా క్రీడా భివృద్ధి అధికారి శశిధర్, చదరంగం సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాససూరి, శాప్ శిక్షకులు పాల్గొన్నారు.

విజేతలతో కలెక్టర్ వెంకటేశ్వర్, భానుప్రకాష్‌రెడ్డి, నరసింహ యాదవ్, శ్రీధర్ వర్మ

అడవికి హనుమాన్ అభయం

తిరుపతి (మంగళం), న్యూస్‌టుడే: వన్యప్రాణుల సంరక్షణ, తక్షణ కార్యకలాపాల నిర్వహణకు అటవీ, పర్యావరణ శాఖ నేతృత్వంలో హనుమాన్ ప్రాజెక్టు రూపుదిద్దుకుంటోంది. అటవీ పరిధి ఎక్కువగా కలిగిన జిల్లాల్లో వన్యప్రాణులకు.. మనుషులకు మధ్య ఘర్షణ వాతావరణాన్ని నివారించడం, రెండువైపులా ప్రాణాపాయ పరిస్థితులు నివారించడం లక్ష్యంగా ప్రభుత్వం దీన్ని తెరపైకి తెచ్చింది.

తిరుపతి బయోట్రిమ్‌లో బృందాలకు శిక్షణ

ఏనుగుల టాస్క్‌ఫోర్స్ తరహాలో

తొలి విడతలో ఏనుగులకు మనుషులకు మధ్య ఘర్షణ వాతావరణాన్ని నివారించేందుకు కుంకీ ఏనుగుల ప్రాజెక్టును ఏర్పాటు చేసి, ప్రత్యేకంగా శిక్షణ పొందిన బలగాల (ఎలిఫెంట్ టాస్క్‌ఫోర్స్)ను ఏర్పాటు చేశారు. ఇప్పుడు వన్యప్రాణులన్నింటికీ వర్తింపజేస్తూ ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్ (ఆర్‌ఆర్‌టీ)ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా 12 టెరిటోరియల్ ఫారెస్ట్ సర్కిళ్ల పరిధిలో 43 డివిజన్లు ఉండగా వాటిలో విశాఖపట్నం, రాజమహేంద్రవరం, అనంతపురం, గుంటూరు, కర్నూలు, తిరుపతి వైల్డ్‌లైఫ్ మేనేజ్‌మెంట్ సర్కిళ్లు వన్యప్రాణుల మనుగడకు అత్యంత ప్రధానమైనవిగా ప్రభుత్వం గుర్తించింది. అటవీ విస్తీర్ణం అధికంగా ఉన్న జిల్లాలనూ ఈ ప్రాజెక్టులో చేర్చి మార్చిలో ప్రారంభించేలా చర్యలు మొదలుపెట్టారు.

బృందాల ఏర్పాటు ఇలా..

రేంజ్, సెక్షన్, బీటు అధికారులతోపాటు వాచర్లను కలిపి ఐదుగురు సభ్యులతో ర్యాపిడ్ రెస్పాన్స్ బృందాలు ఏర్పాటు చేస్తున్నారు. వన్యప్రాణుల రక్షణకు ఉపయోగించే పరికరాలపై ఇప్పటికే శిక్షణ ప్రారంభించారు. వీటిని నెలాఖరులోగా పూర్తిచేసి.. గ్రామాల్లోని యువకులను వాలంటీర్లుగా నియమించి శిక్షణ ఇస్తారు. వీరందరికీ రేంజ్ అధికారి నాయకుడిగా వ్యవహరిస్తారు.

ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు

ఒక్కో సర్కిల్ పరిధిలో రెండు బృందాలు విధులు నిర్వహించనుండగా వీటికి వైర్‌లెస్ సెట్లు, యానిమల్ మేనేజ్‌మెంట్ పరికరాలు అందజేస్తారు. గాయపడే వన్యప్రాణులకు తక్షణ చికిత్స అందించేలా రెండు అంబులెన్సులు, ఇద్దరు వెటర్నరీ వైద్యులు ఉంటారు. సర్కిల్ పరిధిలో వన్యప్రాణులు, మనుషులకు మధ్య ఎక్కడ ఎలాంటి ఘటన ఎదురైనా ఈ బృందాలు వెళ్లేలా ఏర్పాట్లు చేస్తున్నారు. బృందాలకు క్షేత్రస్థాయి నుంచి తక్షణ సమాచారం వచ్చేలా టోల్‌ఫ్రీ నంబర్లు కేటాయించనున్నారు. ప్రత్యేక యాప్ సైతం సిద్ధం చేయనున్నారు.

వన్యప్రాణులకు రక్షణ కవచం

తిరుపతి, అన్నమయ్య జిల్లాల పరిధిలో విస్తరించిన శేషాచలం అడవుల్లో అరుదైన, అంతరించిపోతున్న వన్యప్రాణులు ఉన్నాయి. తిరుపతి, పనపాకం, భాకరాపేట, శ్రీకాళహస్తి, ఏర్పేడు, పుత్తూరు రేంజ్‌ల పరిధితోపాటు అన్నమయ్య జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో ఎక్కువగా ఘర్షణ వాతావరణం నెలకొంటోంది. ఈ నేపథ్యంలోనే ప్రత్యేక బృందాలు రక్షణ కవచాల్లా ఉపయోగపడుతాయి.

- సి.సెల్వం, కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్

చెత్త తరలింపు.. చిక్కులతో తలవంపు

పుత్తూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలులోకి తీసుకొస్తున్నా పట్టణాల్లో చెత్త సమస్యలకు పరిష్కారం లభించడం లేదు. నివాస గృహాలు, వ్యాపార సముదాయాలు, కార్యాలయాల నుంచి సేకరించిన వ్యర్థాలను సక్రమంగా డంపింగ్ యార్డులకు తరలించలేని పరిస్థితులు క్షేత్రస్థాయిలో ఎదురవుతున్నాయి. ఈక్రమంలో తడి, పొడి వ్యర్థాలను వేర్వేరుగా సేకరించి వాటి నుంచి సంపద సృష్టించాలనే ఆశయం నీరుగారుతోంది. పట్టణాలను పరిశుభ్రంగా మార్చేందుకు గత ప్రభుత్వం క్లీన్ ఆంధ్రప్రదేశ్ (క్లాప్) చేపట్టగా అదికాస్తా నీరుగారిపోయింది. కూటమి ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేసి స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ నేపథ్యంలో డంపింగ్ యార్డుల్లోని చెత్తను 80 శాతం వరకు సెగ్రిగేషన్ చేయగలిగారు. ప్రతి శనివారం కార్యక్రమాలు నిర్వహిస్తుండగా ఇదే సమయంలో క్షేత్రస్థాయిలో తడి, పొడి చెత్త సేకరణ మొక్కుబడిగా మారి ఎక్కడికక్కడ దర్శనమిస్తోంది. పక్కా సేకరణ, విభజనకు అడుగులు పడటం లేదు.

పుత్తూరులో రోడ్డుపై కనిపిస్తున్న చెత్త కుప్పలు

బుట్టల పంపిణీ జరిగినా..

ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని నగరాలు, పట్టణాల్లో తడి, పొడి చెత్తతోపాటు హానికర వ్యర్థాల్ని వేర్వేరుగా సేకరించాలని సుమారు రూ.6.53 కోట్లు వెచ్చించి బుట్టలు పంపిణీ చేశారు. అయితే ఏ పురపాలికలోనూ అమలుకావడం లేదు. దీంతో ప్రభుత్వం అనుకున్న లక్ష్యం నెరవేరడం లేదు. ఈ నేపథ్యంలో సంపద సృష్టి ఆగమ్యగోచరంగా తయారైంది.

వేర్వేరుగా సేకరించాల్సిందే..

రాష్ట్ర ప్రభుత్వం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా తడి, పొడి చెత్త సేకరణ వేర్వేరుగా జరగాల్సిందేనని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. డంపింగ్ యార్డుల్లోని చెత్త పూర్తిగా తొలగించి సంపద సృష్టి జరిగేలా చూడాలని కమిషనర్లకు సూచనలు చేశాం. ఆ దిశగా చర్యలు చేపట్టేలా చూస్తాం. **- నాగరాజు, పురపాలకశాఖ ఆర్డీ**

రోజువారీగా పోగవుతున్న చెత్త (టన్నుల్లో)

పలమనేరు	25
కుప్పం	15
చిత్తూరు	40
నగరి	25
పుత్తూరు	25
తిరుపతి	150
శ్రీకాళహస్తి	30
వెంకటగిరి	30
సూళ్లూరుపేట	30
నాయుడుపేట	30

జీవనియంత్రణ ప్రయోగశాలకు జీవం ఎప్పుడు?

- వృథాగా రూ.లక్షల విలువ చేసే పరికరాలు

చిత్తూరు(వ్యవసాయం), న్యూస్‌టుడే: నూతన సాంకేతిక ప్రమాణాలతో ఏర్పాటు చేసిన జీవ నియంత్రణ ప్రయోగశాల ప్రారంభానికి ఇంకా ఎంత సమయం కావాలో? ప్రయోగశాలకు జీవం ఎప్పుడొస్తుందో? తెలియడం లేదు. 2016లో అప్పటి తెదేపా ప్రభుత్వం దీన్ని నిర్మించగా.. గత వైకాపా ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది. కూటమి ప్రభుత్వం రాగానే ప్రయోగశాలకు నిధులు కేటాయించి.. పరికరాలు సరఫరా చేసి ఆరు నెలలు కావస్తున్నా నేటికీ కార్యరూపం దాల్చలేదు. దీంతో భవనం కాస్త నిరుపయోగంగా మారింది.

భవనానికే పరిమితమైన ప్రయోగశాల

ఎందుకు నిర్మించారంటే?: జీవన ఎరువులు, జీవన నియంత్రణ మందులు ఉత్పత్తి చేయడమే లక్ష్యంగా నిర్మించారు. తెగుళ్ల నివారణకు రసాయనాలు వాడకుండా, జీవన ఎరువుల వినియోగంతో రైతులకు లబ్ధి చేకూరుతుంది. వీటిని ఉత్పత్తి చేసి జిల్లా వ్యాప్తంగా పంపిణీ చేయాలని నిర్దేశించారు.

ప్రయోజనాలెన్నో: జీవ నియంత్రణ ప్రయోగశాలతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రసాయనాల వాడకం తగ్గించి.. ప్రకృతి సాగును ప్రోత్సహిస్తున్నాయి. ఈ దిశగా రైతులను నడిపించేందుకు ఇది దోహదపడుతుంది. యూరియా వినియోగం మరింత తగ్గించే దిశగా అడుగులు పడతాయి.

నిర్మించింది	జిల్లా వ్యవసాయ శాఖ జేడీ కార్యాలయ ప్రాంగణం
ప్రయోగశాల అంచనా	2.80 కోట్లు
పనుల ప్రారంభం	2016

అధికారులు దృష్టి సారిస్తేనే: కూటమి ప్రభుత్వం ప్రయోగశాలను అందుబాటులోకి తెచ్చేందుకు ఆరు నెలల క్రితం రూ.లక్షల విలువ చేసే పరికరాలు, ఏసీ యంత్రాలను సరఫరా చేసింది. కొన్ని పరికరాలను అమర్చగా.. మరికొన్ని ప్యాకింగ్‌లోనే ఉన్నాయి. ప్రస్తుతం అన్ని పరికరాలు నిరుపయోగంగా ఉన్నాయి. రాష్ట్రస్థాయి అధికారులు దీనిపై దృష్టి సారించి అందుబాటులోకి తీసుకొస్తే సాగుకు లబ్ధి చేకూరుతుందని రైతులు పేర్కొంటున్నారు.

శయనోత్సవం.. నయనోత్సవం

శ్రీకాళహస్తి: మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాల్లో శయనోత్సవ వైభవాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. ఈ విశేషోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం రాత్రి శ్రీఉమాదేవి సమేత చంద్రశేఖరస్వామి ఉత్సవమూర్తులకు విశేష అలంకరణలు చేపట్టారు.

పల్లకీని మోసుకువస్తున్న భక్తులు

శయనోత్సవ మందిరంలో ఉత్సవమూర్తుల శోభ

24 నుంచి ఎస్వీయూ దూరవిద్య ప్రవేశాలు

తిరుపతి (ఎస్వీయూ), న్యూస్‌టుడే: ఎస్వీయూ దూరవిద్య విభాగంలో 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి పలు యూజీ, పీజీ, డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాల నిమిత్తం రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ఈనెల 24వ తేదీ నుంచి ప్రారంభం కానుంది. ఇందుకు సంబంధించి విద్యార్థులు www.svudoe.ac.in, www.svudde.in వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్లు, విభాగాలు ఎంపిక చేసుకోవచ్చని డీడీఈ డైరెక్టర్ ఆచార్య వి.రమేష్‌బాబు తెలిపారు. ఇతర వివరాలకు 0877 289380, 97051 05270 నంబర్లలో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల: నేరుగా వచ్చే భక్తులకు 10 గంటలు, రూ.300 టికెట్లు కలిగిన భక్తులకు మూడు గంటల్లో శ్రీవారి దర్శనం లభించనుంది. శనివారం శ్రీవారిని 82,043 మంది భక్తులు దర్శించుకున్నారు. రూ.3.74 కోట్ల హుండీ కానుకలు లభించాయి. శ్రీనివాసం, విష్ణు నివాసం, భూదేవి కాంప్లెక్స్ వద్ద ఆదివారం 12 వేల సర్వ దర్శన టోకెన్లు జారీ చేశారు. వీరికి సోమవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు దర్శనం కానుంది.

104FM Tirupati
ఈ FM 104 Mee FM
ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వానేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
8008555167, 9154991499

తూకాల్లో మోసాలే తూచేది

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో 65 రకాల వ్యాపారాలు జరుగుతున్నాయి. వ్యాపారులు ఈ-కాటాల(ఎలక్ట్రానిక్ కాటాలు) లైసెన్స్ ఏడాదికోసారి, మాన్యువల్ కాటాలు రెండేళ్లకోసారి పునరుద్ధరించుకోవాలి. ప్రతి వస్తువుపై గరిష్ఠ చిల్లర ధర(ఎంఆర్‌పీ) ఉండాలి. అంతకుమించి విక్రయించకూడదు. ధర కనిపించకుండా ఇతర స్టిక్కర్లు అతికించకూడదు. చాలామంది ఇవేమీ పాటించట్లేదు. వివిధ వ్యాపారాలపై ఫిర్యాదులు రావడంతో తూనికలు-కొలతల శాఖ అధికారులు తనిఖీలు చేసి జరిమానాలు విధిస్తున్నారు.

❖ ఇటీవల యూరియాకు డిమాండ్ ఏర్పడింది. ఇదే అదునుగా అధిక ధరలు వసూలు చేసిన చిత్తూరులోని ఫర్టిలైజర్ దుకాణంలో అధికారులు తనిఖీ చేశారు. దుకాణదారుడికి రూ.25 వేల జరిమానా విధించారు. ❖ ఇటీవల కిలో కన్నా తక్కువ తూకం ఉన్న విషయం తనిఖీల్లో వెలుగు చూడటంతో ఓ నిత్యావసరాల దుకాణదారుడికి రూ.25 వేలు జరిమానా విధించారు. ❖ విజిలెన్స్ శాఖ, తూనికలు-కొలతల శాఖ సంయుక్త తనిఖీల సమయంలో బ్రాండెడ్ ఫుట్‌వేర్ షోరూంలో షూస్ బాక్స్‌పై ఉన్న ఎంఆర్‌పీ ధరపై స్టిక్కర్ వేసి ఉండటం, డిస్‌క్లెయిమర్‌లో తయారీ కంపెనీ, ప్రొడక్ట్ వివరాలు లేకపోవడాన్ని గుర్తించి.. మూడు దుకాణాలపై కేసులు నమోదుచేసి రూ.75 వేలు జరిమానా విధించారు.

చిత్తూరు బస్టాండ్‌లో తనిఖీ చేస్తున్న అధికారులు

చర్యలు తీసుకుంటున్నాం

జిల్లాలో మండలాల వారీగా నిత్యం తనిఖీలు చేస్తున్నాం. సిబ్బంది తక్కువ ఉన్నా.. దాడులు చేస్తూ కేసులు నమోదుచేస్తూ, జరిమానాలు విధిస్తున్నాం. తూకాలు, ధరల్లో మోసాలపై వినియోగదారులు 1100 టోల్ ఫ్రీ నంబరుతోపాటు నా చరవాణి 78938 13707 చరవాణిలో సంప్రదించవచ్చు. **- స్వామి, అసిస్టెంట్ కంట్రోలర్, తూనికలు-కొలతల శాఖ, తిరుపతి**

2025-26 ఆర్థిక సంవత్సరంలో కేసుల నమోదు ❖ తూకాల్లో వ్యత్యాసంపై : 45 ❖ అధిక ధరలు : 51 ❖ జరిమానాల వసూలు : రూ.12 లక్షలు ❖ స్టాంపింగ్ రుసుములు: రూ.29.97 లక్షలు

(c) eenadu

తెదేపా కార్యాలయ భవన నిర్మాణానికి భూమిపూజ

చిత్తూరు(జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: చిత్తూరు నగరంలో తెదేపా జిల్లా నూతన కార్యాలయ భవన నిర్మాణానికి ఆదివారం భూమిపూజ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏడు పార్లమెంటు నియోజక వర్గాల్లో పార్టీ నూతన కార్యాలయాల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా స్థానిక ఆర్టీసీ బస్టాండు సమీపంలో చిత్తూరు పార్లమెంటు నియోజక వర్గ పార్టీ అధ్యక్షుడు షణ్ముగరెడ్డి, ప్రధాన కార్యదర్శి సునీల్‌కుమార్‌చౌదరి ఆధ్వర్యంలో నిర్వహించిన పూజా కార్యక్రమంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్, గాలి భానుప్రకాష్, మురళీమోహన్, థామస్, చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, మాజీ ఎమ్మెల్సీ రాజసింహులు, పుంగనూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి చల్లాబాబు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.


భూమిపూజ చేస్తున్న మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలు

వైకాపావి నీతిమాలిన రాజకీయాలు: మంత్రి మండిపల్లి

వైకాపా నీతిమాలిన రాజకీయాలు చేస్తోందని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం స్థానిక తెదేపా కార్యాలయంలో ఆయన మాట్లాడారు. 'తిరుమల వెంకటేశ్వరస్వామిని అడ్డుపెట్టుకొని రాజకీయాలు చేస్తున్నారంటే వైకాపా నేతలు ఎంతగా దిగజారిపోయారో ప్రజలు గ్రహించాలి. వైకాపా నాయకులు తప్పును ఒప్పుకొని క్షమాపణ చెప్పకుండా బుకాయించి ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారు. శాసనసభలో శ్రీవారి చిత్రపటాలను పాదరక్షలు వేసుకుని ప్రదర్శించి అపచారం చేసి హిందువుల మనోభావాలను దెబ్బతీశారు. చిత్తూరులో నూతన పార్టీ కార్యాలయ నిర్మాణం పూర్తయ్యాక, ప్రస్తుత కార్యాలయం ఉన్న స్థానంలో ఎన్టీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో పాఠశాలలను ఏర్పాటు చేయాలని సీఎం చంద్రబాబు, నారా భువనేశ్వరిని కోరతాం' అని మంత్రి చెప్పారు.


వన్యప్రాణుల వేటగాళ్లపై అటవీశాఖ నిఘా

వేట.. ప్రాణాంతక ఆట

ఇవీ ఘటనలు

❖ నవంబరులో బంగారుపాళ్యం మండలం బండ్ల దొడ్డి వద్ద మామిడి తోటలో వణ్యప్రాణుల వేట కోసం గుర్తు తెలియని వ్యక్తులు విద్యుత్తు తీగలు అమర్చారు. ఆ గ్రామానికి చెందిన గోవిందప్ప, కుట్టి వేటకు బయలుదేరారు. మామిడి తోటలో విద్యుత్తు తీగలు తగిలి వారిద్దరూ ప్రాణాలు కోల్పోయారు.

❖ యాదమరి మండలం వేపనపల్లి వద్ద గతంలో వేటగాళ్లు వణ్యప్రాణుల కోసం అమర్చిన విద్యుత్తు తీగలకు చిక్కి ఇద్దరు మరణించారు. పాచిగుంట వద్ద పొలంలో వణ్యప్రాణుల కోసం అమర్చిన విద్యుత్తు తీగలు తగిలి యువకుడు మృతి చెందాడు.

❖ జంబువారిపల్లి సమీపంలో అడవి పందుల కోసం అమర్చిన నాటు బాంబు పేలి ఏనుగు గాయపడింది. అదే స్థలంలో మరో బాంబును కుక్క కొరకడంతో మృతిచెందింది.

❖ యాదమరి మండలం కీనాటంపల్లి బీట్‌లో నాటు తుపాకులతో చిరుతను వేటాడారు. మృతి చెందిన చిరుతతో స్వీయ చిత్రాలు దిగారు. ఏడాదిన్నర అనంతరం ఆ చిత్రాలను సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. అటవీశాఖ అధికారులు చిరుత కళేబరాన్ని గుర్తించి, వేటాడిన ఐదుగురిని అరెస్టు చేశారు.

చిత్తూరు(జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: అటవీ సమీప ప్రాంతాల్లో వన్యప్రాణులను వేటాడుతున్నారు. అడవి పందులు, దుప్పిల కోసం ఇనుప తీగలను పొలాల చుట్టూ అమర్చి, రాత్రి వేళల్లో విద్యుత్తు సరఫరా పెడుతుండటంతో అవి తగిలి వన్యప్రాణులు చనిపోతున్నాయి. కొన్ని సందర్భాల్లో ఏనుగులు, మనుషులు మృత్యువాత పడుతున్నారు. దీంతో అటవీ శాఖ అధికారులు వేటగాళ్లపై నిఘా ఉంచారు.

తాళ్లమడుగు సమీపంలో ఉచ్చులో చిక్కి మృతి చెందిన చిరుత

చిరుతను చంపిన నిందితుల అరెస్టు చూపుతున్న అధికారులు

చట్టం ఏం చెబుతుందంటే

అటవీ వన్య ప్రాణుల చట్టం 1972 ప్రకారం వన్యప్రాణులను చంపడం, వేటాడటం, పట్టుకోవడం, అమ్మడం, అవయవాల వ్యాపారం నేరం. 2022లో చేసిన సవరణ ప్రకారం ఆయా వ్యక్తులపై కఠిన చర్యలు ఉంటాయి. షెడ్యూల్-1, 2 పరిధిలోని పులులు, ఏనుగులు, సింహం, చిరుత, ఎలుగుబంట్లను వేటాడితే మూడు నుంచి ఏడేళ్ల జైలు శిక్ష, రూ.10-25 వేల జరిమానా. ఇతర షెడ్యూల్‌లోని సాధారణ వన్యప్రాణులను వేటాడితే మూడేళ్ల జైలు, రూ.25 వేల జరిమానా విధిస్తారు.

24న కాణిపాకం ఆలయ హుండీల లెక్కింపు

కాణిపాకం, న్యూస్‌టుడే: శ్రీవరసిద్ధి వినాయక స్వామికి భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకలను ఈ నెల 24వ తేదీ లెక్కించనున్నట్లు ఆలయ పాలకమండలి ఛైర్మన్ వి.మణినాయుడు, ఈవో పెంచల కిశోర్ ఆదివారం తెలిపారు.

పంపిణీకి సిద్ధంగా కూరగాయల నారు

చిత్తూరు(వ్యవసాయం): కుప్పంలోని సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్(సీవోఈ)లో అధిక దిగుబడులిచ్చే నాణ్యమైన కూరగాయల నారు మొక్కలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని జిల్లా ఉద్యాన శాఖ డీడీ రామాంజనేయులు తెలిపారు. సీవోఈలో టమాట నారు మొక్కలు 11 లక్షలు, కాకర 10 వేలు, బీర 11 వేలు, వంగ 7 వేల మొక్కలు సిద్ధంగా ఉన్నాయని..90శాతం రాయితీపై రైతులకు అందజేస్తామన్నారు. నారు మొక్కలు కావలసిన రైతులు ఉద్యాన శాఖ అధికారులను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

గంగమ్మ దర్శనం.. సకల పాపహరణం

బోయకొండ (చౌడేపల్లె), న్యూస్‌టుడే: కోరిన కోర్కెలు తీర్చే శక్తి స్వరూపిణి బోయకొండ గంగమ్మ దర్శనానికి పలు ప్రాంతాల నుంచి భక్తులు ఆదివారం తరలివచ్చారు. ఉదయం నుంచి క్యూలైన్లు కిక్కిరిశాయి. దర్శనానికి సుమారు 3 గంటల సమయం పట్టింది. రద్దీకి అనుగుణంగా ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వీఐపీ దర్శనాలు రద్దు చేశారు.

అలంకరణలో బోయకొండ గంగమ్మ

ఆలయంలో భక్తుల రద్దీ

ఆదర్శనీయులు అనంతాళ్వార్

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవైష్ణవ భక్తాగ్రేసరుడు, ఆళ్వారుల్లో ప్రముఖుడైన శ్రీఅనంతాళ్వార్ జీవితం అందరికీ ఆదర్శప్రాయమని తితిదే జేఈవో డాక్టర్ ఎ.శరత్ పేర్కొన్నారు. స్థానిక అనంతాళ్వార్ తోట (పురుశైవారితోట)లో శ్రీఅనంతాళ్వార్ 972వ అవతార మహోత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. భక్తి అంటే సేవ అని నిరూపించిన మహానుభావుడు అనంతాళ్వార్ అని ఆయన కీర్తించారు. 972 సంవత్సరాలుగా అనంతాళ్వార్ వంశీకులు శ్రీవారికి పుష్పకైంకర్యం చేస్తున్నారని, వారి పరంపర ఎల్లప్పటికీ కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా అనంతాళ్వార్ వంశీకులు 'నాలాయిర దివ్యప్రబంధ గోష్ఠిగానం' నిర్వహించారు. పెద్దజీయర్, చిన్నజీయర్ స్వామి అనుగ్రహభాషణం చేశారు. వేంకటకృష్ణ స్వామి, భరద్వాజస్వామి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జేఈవో డాక్టర్ ఎ.శరత్, చిత్రంలో పెద్దజీయర్, చిన్నజీయర్, అనంతాళ్వార్ వంశీకులు

శ్రీవారిని దర్శించుకున్న కేంద్ర మంత్రి

తిరుమల, తిరుచానూరు, న్యూస్‌టుడే: శ్రీవారిని కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ ఆదివారం దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్‌లో శ్రీవారి ఆలయం వద్దకు చేరుకున్న కేంద్ర మంత్రికి తితిదే అదనపు ఈవో వెంకయ్యచౌదరి స్వాగతం పలికి శ్రీవారి మూలమూర్తి దర్శనం చేయించారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించగా తితిదే అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు. వీరితోపాటు రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్, మాజీ ఎంపీ చింతామోహన్, తితిదే బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి దర్శించుకున్నారు. పద్మావతి అమ్మవారిని కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్, మంత్రి అచ్చెన్నాయుడు వేర్వేరుగా దర్శించుకున్నారు.

ఆలయం ఎదుట కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్, అదనపు ఈవో వెంకయ్యచౌదరి, బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి తదితరులు

మంత్రి అచ్చెన్నాయుడు కుటుంబం


ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్

పిల్లలను తల్లిదండ్రులు గమనిస్తుండాలి

చిత్తూరు విద్య, న్యూస్‌టుడే: చిన్నప్పటి నుంచి పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రులు దృష్టి సారించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి భారతి తెలిపారు. నగరంలోని నాగయ్య కళాక్షేత్రంలో ఆదివారం హాలోకిడ్స్ 5వ వార్షికోత్సవానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలతో ఎక్కువ సమయం గడిపే విధంగా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. సమాజంలో చిన్న పిల్లలని కూడా చూడకుండా కొంతమంది మృగాలుగా ప్రవర్తించడం బాధాకరమన్నారు. జిల్లా అగ్నిమాపక అధికారి పెద్దిరెడ్డి మాట్లాడుతూ పిల్లలు గురువులు, పెద్దల పట్ల గౌరవం కలిగి ఉండాలని చెప్పారు. పిల్లల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. లిటిల్‌రోస్ పాఠశాల ఛైర్మన్ గోపాలకృష్ణమూర్తి, డైరెక్టర్లు రాధిక, లోహిత్‌కుమార్, ఉపాధ్యాయులు, పిల్లలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జ్యోతి వెలిగిస్తున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి భారతి

24న అండర్-18 సైక్లింగ్ పోటీలు

చిత్తూరు(క్రీడలు), న్యూస్‌టుడే: శాప్ లీగ్ జిల్లా స్థాయి అండర్-18 సైక్లింగ్ పోటీలు ఈ నెల 24న చిత్తూరులోని డీఎస్ఏ స్టేడియంలో నిర్వహించనున్నట్లు డీఎస్‌డీవో ఉదయభాస్కర్ తెలిపారు. బాలురు, బాలికలకు వేర్వేరుగా పోటీలు నిర్వహిస్తామన్నారు. ఆసక్తిగల ఆటగాళ్లు తమ పేర్లను శాప్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలన్నారు. విజేతలు త్వరలో ఎన్టీఆర్ జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధిస్తారని ఆయన పేర్కొన్నారు.

నేడు డయల్ యువర్ ఏపీ ఎస్పీడీసీఎల్ సీఎండీ

తిరుపతి(జీవకోన), న్యూస్‌టుడే: ఎస్పీడీసీఎల్ సర్కిల్ స్థాయిలో విద్యుత్తు వినియోగదారుల సమస్యలపై ఫిర్యాదు, పరిష్కారానికి సోమవారం డయల్ యువర్ సీఎండీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సంస్థ సీఎండీ శివశంకర్ లోతేటి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సర్కిల్ పరిధిలోని తొమ్మిది జిల్లాలకు సంబంధించిన వినియోగదారులు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల కాల్ చేయవచ్చని అందులో వివరించారు. తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలకు సంబంధించిన వినియోగదారులు చరవాణి సంఖ్య 8977716661కు కాల్ చేయవచ్చని పేర్కొన్నారు. ● తిరుపతి: 87126 52679, చిత్తూరు: 79931 47979, అన్నమయ్య: 94408 17449

ఉద్యమంలా జనసేన సభ్యత్వ నమోదు

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: జనసేన క్రియాశీలక సభ్యత్వ నమోదు ప్రక్రియ ఈనెల 26వ తేదీ నుంచి ప్రారంభమవుతుందని, అందరూ ఉద్యమంలాగా నమోదు చేయించాలని ఉమ్మడి చిత్తూరు జిల్లా పార్టీ అధ్యక్షుడు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ పిలుపునిచ్చారు. స్థానిక ప్రైవేట్ హోటల్‌లో ఆదివారం జరిగిన తిరుపతి ముఖ్య నేతలు, క్రియాశీలక కార్యకర్తలు, నాయకుల సమావేశంలో ఆయన ప్రసంగించారు. రెండువారాలపాటు జరిగే సభ్యత్వ నమోదులో అందరూ భాగస్వాములు కావాలని, జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులును తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ సభ్యత్వ నమోదు సమన్వయకర్తగా నియమించడం ఆనందదాయకమని అన్నారు. నగర అధ్యక్షుడు రాజారెడ్డి, కార్పొరేటర్ దూది కుమారి, నేతలు ఆర్కాట్ కృష్ణ ప్రసాద్, తిరుత్తణి వేణుగోపాల్, దూది శివ, జె కె. రాయల్, ముక్కు సత్యవంతుడు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, హాజరైన నేతలు, కార్యకర్తలు

నవధాన్యం.. భూమికి సారం

మార్చిలో కిట్ల పంపిణీకి చర్యలు

చిత్తూరు(వ్యవసాయం), న్యూస్‌టుడే: మోతాదుకు మించి రసాయనాల వినియోగంతో నేల నిర్జీవంగా మారుతోంది. దీంతో వ్యయం పెరిగి దిగుబడులు తగ్గి.. సాగు గిట్టుబాటవ్వక రైతులు కాడి పడేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో నేలకు పునరుజ్జీవం కల్పించి సహజ శక్తిని పెంపొందించేందుకు అధికారులు దృష్టి సారించారు. తక్కువ ఖర్చుతో ప్రకృతి విధానం సాగును ప్రోత్సహిస్తున్నారు. ఈ క్రమంలో నవధాన్యాల సాగును విస్తరించనున్నారు.

20 రకాల విత్తనాలు.. సాగు ఇలా

ఖరీఫ్ సీజన్‌కు ముందే.. వేసవిలో సుమారు 50 వేల రైతులతో 35వేల ఎకరాల్లో నవధాన్యాల విత్తనాలు వేయించాలని అధికారులు లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. నవధాన్యాల కిట్లలో జొన్న, మొక్కజొన్న, కందులు, పెసలు, వేరుసెనగ, పొద్దుతిరుగుడు, దనియాలు, మెంతులు, ఆవాలు, జీలుగలు, జనుము, పిల్లిపెసర, ఆకుకూరలు, ఉలవలు, అలసంద, మినుములు, కొర్రలు, సాములు, రాగులు, సజ్జలు, నువ్వులు, వరి, తీగ జాతి, దుంపజాతికి చెందిన 20-25 రకాల విత్తనాలతో ఓ కిట్ సిద్ధం చేస్తున్నారు. ఒక్కో కిట్లో 15 కిలోల చొప్పున అన్ని రకాల విత్తనాలుంటాయి. రుతుపవనాలు రాకముందే మార్చి, ఏప్రిల్ నెలల్లో తొలకరి వర్షాలకు పొడి నేలలో వీటిని వేయనున్నారు. ఈ పంటలతో అధిక ఆదాయం, పశువులకు మేతగా..భూసారం పెంపునకు ఉపయోగపడనున్నాయి. నవ ధాన్యాల సాగుతో ఎన్నో లాభాలున్నాయి.

జిల్లా వివరాలు..
సాగు లక్ష్యం: 35 వేల ఎకరాలు
నవ ధాన్యాల కిట్లు: 35 వేలు

నవ ధాన్యాల విత్తన శుద్ధిని పరిశీలిస్తున్న డీపీఎం శివశంకర్

వేగంగా విత్తనాలు సిద్ధం

నవ ధాన్యాల విత్తన కిట్లు వేగంగా సిద్ధం చేస్తున్నాము. సేకరించిన విత్తనాలకు విత్తన శుద్ధి చేపడుతున్నాం. కిట్టు ధర సుమారు రూ.750-800 ఉంటుంది. వీలైనంత త్వరగా కిట్లను అందజేయనున్నాం.

-శివశంకర్, డీపీఎం, జిల్లా ప్రకృతి వ్యవసాయ పథకం

సిపాయిల తిరుగుబాటుకు ముందే ఉయ్యాలవాడ ఉద్యమం

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: బ్రిటిష్ పాలకులపై సిపాయిల తిరుగుబాటుకు ముందే ఉద్యమించిన ఘనత రాయలసీమకు చెందిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి దక్కుతుందని జేసీ ఆదర్శ్ రాజేంద్రన్ అన్నారు. ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి సందర్భంగా కలెక్టరేట్‌లో ఆదివారం ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. బ్రిటిష్ పాలకులు అమలు చేసిన పన్నుల విధానం, జమీందారి వ్యవస్థతో రైతులు ఎదుర్కొన్న ఇబ్బందులపై నరసింహారెడ్డి అలుపెరగని పోరాటం చేశారని జేసీ పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా పర్యాటక శాఖ అధికారి నరేంద్రకుమార్, మేనేజర్ గౌరి తదితరులు పాల్గొన్నారు.

నరసింహారెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జేసీ ఆదర్శ్ రాజేంద్రన్

సౌత్‌జోన్ క్రికెట్ ఛాంపియన్‌గా నెల్లూరు

కడప క్రీడలు, న్యూస్‌టుడే: వైఎస్ఆర్ఆర్-ఏసీఏ స్టేడియం, కేఎస్ఆర్ఎం క్రికెట్ మైదానాల్లో జరుగుతున్న ఏసీఏ సౌత్‌జోన్ అండర్-12 క్రికెట్ పోటీల్లో ఛాంపియన్‌గా నెల్లూరు జట్టు నిలిచింది. ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లోనూ నెల్లూరు జట్టు విజయాలను సాధించి 8 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. కడప జట్టు 2 మ్యాచ్‌లు గెలిచి 4 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది. మూడో స్థానంలో కర్నూలు, నాలుగో స్థానంలో చిత్తూరు, అయిదో స్థానంలో అనంతపురం జట్లు నిలిచాయి. టోర్నమెంట్ చివరి రోజు ఆదివారం కర్నూలుపై కడప, చిత్తూరుపై నెల్లూరు జట్లు విజయం సాధించాయి.

హోరాహోరీ పోరులో సింహపురి గెలుపు

కేఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో జరిగిన క్రికెట్ మ్యాచ్‌లో చిత్తూరుపై నెల్లూరు జట్టు విజయం సాధించింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన నెల్లూరు జట్టు నిర్ణీత 35 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 205 పరుగులు చేసింది. జట్టులో జాన్సన్ 90, శ్రీరామ్ 39 పరుగులు చేశారు. చిత్తూరు బౌలర్లలో హేమ్‌సాత్విక్, పునీత్‌సాయిరెడ్డి చెరో మూడు వికెట్లు తీసుకున్నారు. 206 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌ను ఆరంభించిన చిత్తూరు జట్టు నిర్ణీత 35 ఓవర్లలో 190 పరుగులకు ఆలౌట్ అయింది. జట్టులో గోకుల్ సాయి 58, భువన్‌సాయి 21 పరుగులు చేశారు. నెల్లూరు బౌలర్లలో సుచిత్‌రెడ్డి 4, ఆయూష్, శ్రీరామ్ చెరో రెండు వికెట్లు తీసుకున్నారు. హోరాహోరీగా జరిగిన ఈ మ్యాచ్‌లో నెల్లూరు జట్టు 15 పరుగుల తేడాతో గెలుపొందింది.

ప్రచురణలు ఆవిష్కరిస్తున్న కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్

రాస్ కేవీకే సేవలు అభినందనీయం

రేణిగుంట, న్యూస్‌టుడే: జిల్లా రైతాంగానికి తాము అందిస్తున్న సేవలను కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ అభినందించారని రాస్ కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం తిరుమలలో కేంద్ర మంత్రిని కలిసి 33 ఏళ్లుగా జిల్లాలోని రైతులు, గ్రామీణ యువత, విస్తరణాధికారులకు నిర్వహించిన వివిధ కార్యక్రమాలపై ఆయన పవర్‌పాయింట్ ప్రదర్శన ఇచ్చారు. అనంతరం రాస్ కేవీకే తయారు చేసిన ప్రచురణలు, విలువ ఆధారిత ఉత్పత్తులను కేంద్రమంత్రి విడుదల చేశారు. ప్రదర్శన క్షేత్రాల నిమిత్తం రైతులకు వరి విత్తనం, జీవ సంబంధిత కీటక నాశకాలు, జీవన ఎరువులు, సూక్ష్మ పోషకాలు మంత్రి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఐసీఏఆర్-అటారీ జోన్ 10 డైరెక్టర్ డా. షేక్ మీరా, రాస్ కేవీకే ఛైర్మన్ వెంకటరత్నం, వ్యవసాయ విస్తరణ సంచాలకుడు డా. శివన్నారాయణ, పశువైద్య విస్తరణ సంచాలకురాలు డా. శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

సుధా బ్రహ్మ త్రీస్టార్ హోటల్ ప్రారంభం

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: స్థానిక తిరుమల బైపాస్ రోడ్డులో అత్యాధునిక వసతులతో విశాలమైన గదులతో నిర్మించిన సుధా బ్రహ్మ త్రీ స్టార్ హోటల్‌ను ఆదివారం ప్రారంభించారు. తితిదే మాజీ ఛైర్మన్, తిరుపతి మాజీ ఎమ్మెల్యే చదలవాడ కృష్ణమూర్తి జ్యోతి వెలిగించారు. హోటల్ ఛైర్మన్ తోట సుధా బ్రహ్మం ప్రతినిత్యం ప్రజలసేవలో ఉంటారని పలువురు ప్రముఖులు పేర్కొన్నారు. తుడా మాజీ ఛైర్మన్ ఎన్వీ ప్రసాద్, తితిదే పాలకమండలి సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, జనసేన ఉమ్మడి చిత్తూరు అధ్యక్షుడు పసుపులేటి హరిప్రసాద్, నగరపాలక సంస్థ ఉపమేయర్ ఆర్సీ మునికృష్ణ శుభాకాంక్షలు తెలిపారు. తోట సుధ, శివరామయ్య, మేనేజింగ్ డైరెక్టర్ తోట వి. రమణ, తోట సింధుజ, శివరామన్, డా. హరికుమార్, డా. శోభ, చిన్నంగారి రమణ పాల్గొన్నారు.

సుధాబ్రహ్మ త్రీస్టార్ హోటల్‌ను ప్రారంభిస్తున్న తితిదే మాజీ ఛైర్మన్ చదలవాడ కృష్ణమూర్తి

ప్రమాదవశాత్తు నదిలో పడి యువకుడి మృతి

గంగవరం, న్యూస్‌టుడే: ప్రమాదవశాత్తు కౌండిన్య నదిలో పడి యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని గుండుగల్లులో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. గుండుగల్లుకు చెందిన సాయికిరణ్(25) మండలంలోని పశుపత్తూరు నుంచి స్వగ్రామానికి సైకిల్‌పై వెళ్తుండగా.. ప్రమాదవశాత్తు పక్కన ఉన్న గోడను ఢీకొని కౌండిన్య నదిలో పడిపోయాడు. ఎవరూ గమనించకపోవడంతో నీటిలో మునిగి మృతి చెందారు. సాయికిరణ్ మృతిపట్ల తెదేపా నాయకులు, కార్యకర్తలు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాయికిరణ్ (పాతచిత్రం)

క్యూలైన్ స్కానింగ్ కేంద్రం వద్ద కుప్పకూలిన మహిళ

సీపీఆర్‌తో రక్షించిన ఎస్పీఎఫ్ కానిస్టేబుల్

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి దర్శనానికి వచ్చిన ఓ మహిళ క్యూలైన్‌లో వెళ్లే సమయంలో కుప్పకూలిపోగా సమీపంలోని ఎస్పీఎఫ్ కానిస్టేబుల్ సీపీఆర్ చేసి రక్షించారు. శనివారం రాత్రి తమిళనాడుకు చెందిన సంబగవల్లి (59) స్కానింగ్ కేంద్రం వద్దకు చేరుకోగానే కుప్పకూలారు. సమీపంలోని ఎస్పీఎఫ్ కానిస్టేబుల్ డీవీ సుబ్బారావు ఆమెకు సీపీఆర్ చేశారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం అశ్విని ఆసుపత్రికి తరలించారు. కానిస్టేబుల్‌ను తితిదే అధికారులు, భద్రతాధికారులు అభినందించారు.

డాక్ సేవక్‌లకు పురస్కారాలు

గుంటూరు(ఏటీ అగ్రహారం), న్యూస్‌టుడే: గుంటూరు నగర శివారులోని సత్యసాయి ఆధ్యాత్మిక నగరిలో ఆదివారం జాతీయ స్థాయి గ్రామీణ డాక్ సేవక్ సమ్మేళనం నిర్వహించారు. రాష్ట్రంలో ఉత్తమ పనితీరు కనబర్చిన గ్రామీణ డాక్ సేవక్‌లకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌లు పురస్కారాలు అందించి సత్కరించారు.

పురస్కారం అందుకుంటున్న చిదానందం(చిత్తూరు), నాగలత(చిత్తూరు)

నేడు కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో ప్రజా సమస్యలపై అర్జీలను స్వీకరించనున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. పీజీఆర్ఎస్‌కు అన్ని శాఖల జిల్లా అధికారులు హాజరుకావాలని ఆదేశించారు.

పోలీసు శాఖ ఆధ్వర్యంలో..

చిత్తూరు (నేరవార్తలు), న్యూస్‌టుడే: జిల్లా ఏఆర్(పాత డీపీవో) కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పోలీసు అధికారులు తెలిపారు. ఫిర్యాదులను ఎస్పీ, ఏఎస్పీలు స్వీకరించి వారం రోజుల్లోనే పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు.

EENADU Classifieds
HEALTH & CARE
TO LET
PAEDIATRIC
JOBS
Job Openings for Tele callers Salary 10,000-25,000 per month work from office, Bairagipatteda, Tirupati © 97899 96435.
REAL ESTATE
FLAT FOR SALE
GENERAL
TIRUPATI 3BHK Flat for SALE. Spacious 2000 Sqft East Facing in Narayana Puram, Lift & Car Parking Available.9703358869.
PLOT FOR SALE
GENERAL
MARKETING/ SALES
Anand Masale Require Sales & Marketing Manager, Marketing Executives. Contact: 98496 55105, 98480 53144 Email: anand masalaap-pltd @ gmail.com.
80085 13290

చిత్తూరు

●చిత్తూరు ● పూతలపట్టు ●గంగాధరనెల్లూరు ●నగరి

అభివృద్ధి పనులు వేగవంతం

చిత్తూరు నగరం, న్యూస్‌టుడే: నగరంలో అభివృద్ధి పనులు వేగవంతం చేసినట్లు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో 40వ డివిజన్‌లో రూ.9.55లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే జగన్మోహన్‌తో కలిసి మంత్రి ఆదివారం ప్రారంభించారు.

మొగిలీశ్వర స్వామి తెప్పోత్సవాలు రద్దు

బంగారుపాళ్యం, న్యూస్‌టుడే: మొగిలీశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం జరగాల్సిన చంద్రప్రభ వాహనం, తెప్పోత్సవాలను రద్దు చేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఓ వ్యక్తి కోనేరులో పడి మృతి చెందిన విషయం విదితమే. దీంతో సంప్రదాయం మేరకు ఆలయంలోని ఉత్సవాలను రద్దు చేశామని వివరించారు. ధ్వజావరోహణం, శయనోత్సవం నిర్వహించారు.

నూతన విగ్రహాల ప్రతిష్ఠ

నగరి: చింతలపట్టెడలోని ద్రౌపది సమేత ధర్మరాజుల ఆలయ పునర్ నిర్మాణ మహా కుంభాభిషేకం ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేద పండితులతో ఆలయంలో నూతన విగ్రహాల ప్రతిష్ఠ, యాగం, గణపతి హోమం, ఆలయ కలశాభిషేకం నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి జనం తరలివచ్చి పూజలు చేశారు.

ఉత్సాహంగా ఆనంద ఆదివారం

విజేతలకు బహుమతులు అందజేసిన అధికారులు

చిత్తూరు నగరం, న్యూస్‌టుడే: 'ఆనంద ఆదివారం' కార్యక్రమంలో భాగంగా నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో స్థానిక పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఆదివారం క్రికెట్ పోటీలు నిర్వహించారు. విజేతలకు నగరపాలక అధికారులు బహుమతులు, జ్ఞాపికలు అందజేశారు. నగరపాలక ఆరోగ్యాధికారి లోకేష్, ప్రజారోగ్య ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

నేడు 'డయల్ యువర్ ఎస్ఈ'

- సంప్రదించాల్సిన నంబరు: 79931 47979

చిత్తూరు(మిట్టూరు), న్యూస్‌టుడే: నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్తు సరఫరా, సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సోమవారం 'డయల్ యువర్ ఎస్ఈ' కార్యక్రమం ఉంటుందని జిల్లా విద్యుత్తు శాఖ ఎస్ఈ ఇస్మాయిల్ తెలిపారు. ఉదయం 8.30 నుంచి 9.30 గంటల వరకు కొనసాగుతుందన్నారు. విద్యుత్తు సమస్యలు, పీఎం సూర్యఘర్, పీఎం కుసుమ్ పథకం అమలులో ఎదురవుతున్న సమస్యలను తెలియజేస్తే పరిష్కరిస్తామని చెప్పారు.

అమ్మవారికి ఇత్తడి పాత్రల వితరణ

అమ్మవారికి పాత్రలు అందజేస్తున్న దాత రెడ్డప్ప

గుర్రంకొండ, న్యూస్‌టుడే: మండలంలోని చెల్లెపల్లెలో వెలసిన రెడ్డెమ్మ తల్లికి ఆదివారం కాణిపాకానికి చెందిన రెడ్డప్ప ఇత్తడి కలశం, బిందె, తీర్థం, గిన్నె, ఉద్ధరిణి, పంచామృత పాత్రలు అందజేశారు.

తపోవనంలో గాయత్రీ మహా యజ్ఞం

యజ్ఞంలో పాల్గొన్న భక్తులు

చిత్తూరు నగరం, న్యూస్‌టుడే: సిద్ధ సమాధి యోగా ఆధ్వర్యంలో స్థానిక తపోవనంలో గాయత్రీ మహా యజ్ఞాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. గాయత్రీ పరివారికి చెందిన గురు రాజారావు ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. ప్రపంచ శాంతి కోసం మహా యజ్ఞాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఎస్ఎస్‌వై యోగాచార్యుడు నరేంద్రకుమార్, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రేపు రామక్కమ్మ ఆరాధన మహోత్సవం

విజయపురం, న్యూస్‌టుడే: మిట్టూరు గ్రామంలో వెలసిన శ్రీరామక్కమ్మ అమ్మవారి ఆలయంలో మంగళవారం ఆరాధన మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆశ్రమ నిర్వాహకులు వాసుదేవ వర్మ, గ్రామస్థులు పేర్కొన్నారు.

వైభవంగా ఆలయ మహాకుంభాభిషేకం

తవణంపల్లె, న్యూస్‌టుడే: అపోలో గ్రూప్ వైస్ ఛైర్మన్ డాక్టర్ ప్రతాప్ సీ రెడ్డి స్వగ్రామమైన అరగొండలో అగ్గిగిరి ఎదురుగా ఉన్న పురాతనమైన స్వయంభువనేశ్వర కుమారస్వామి ఆలయ మహా కుంభాభిషేకం ఆదివారం వైభవంగా నిర్వహించారు. డాక్టర్ ప్రతాప్ సీ రెడ్డి, సతీమణి సుచరితారెడ్డి, కుటుంబ సభ్యులు పూజలు, అభిషేకాలు చేశారు. ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్, అపోలో హాస్పిటల్స్ సలహాదారుడు సత్యనారాయణ రెడ్డి, పారిశ్రామికవేత్త పైమాఘం సుగుణాకర్‌రెడ్డి, అపోలో హాస్పిటల్స్ చెన్నై సీఈవో నవీన్‌కుమార్‌రెడ్డి, చిత్తూరు మెడికల్ కళాశాల లీజనింగ్ అధికారి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు. ప్రతాప్ సీ రెడ్డికి వరసిద్ధి వినాయకస్వామి శేష వస్త్రం, చిత్రపటం, ప్రసాదాలు ఎమ్మెల్యే మురళీమోహన్ అందించారు.

అత్యవసరమా.. అంబులెన్స్ లేదండి

☛ రోగులకు తప్పని అవస్థలు

☛ పుత్తూరు ప్రభుత్వాసుపత్రిలో ఇదీ పరిస్థితి

డ్రైవర్ లేక దుమ్ము పట్టిన వాహనం

ప్రభుత్వ ఆసుపత్రుల్లో పేదలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని నేతలు గొప్పలు చెబుతున్నారు. అయితే ప్రభుత్వ ఆసుపత్రి వెళ్లే రోగులు అక్కడ పడుతున్న ఇబ్బందుల గురించి ఏకరువు పెడుతున్నా పట్టించుకునే నాథుడే కరవయ్యారు. ఏదైనా ప్రమాదం జరిగి ఆసుపత్రికి వెళ్లినా, కాస్త కష్టమై తిరుపతి వంటి ప్రాంతాలకు వెళ్లాలన్నా అంబులెన్స్ లేక చేతి చమురు వదిలించుకోవాల్సిందే. రాత్రి సమయాల్లో ఏదైనా ప్రమాదం జరిగి ఆసుపత్రికి వస్తే ఇక అంతే సంగతులు.

-న్యూస్‌టుడే, పుత్తూరు

పుత్తూరు వైద్య విధాన పరిషత్తు ఆసుపత్రి

12 ఏళ్లుగా పట్టించుకోక

ఆసుపత్రికి వచ్చే పేద రోగుల కోసం ఏర్పాటు చేసిన అంబులెన్స్ కాలిపోయి 12 సంవత్సరాలు అవుతున్నా పట్టించుకునే దిక్కులేదు. ఏదైనా ఇబ్బంది వస్తే 108 వాహనమే దిక్కు. ఆ వాహనం ఏదైనా కేసుకు వెళితే ప్రైవేటు వాహనాలపై ఆధారపడాల్సిందే. ఇక పుత్తూరు నుంచి అత్యవసర సమయాల్లో రోగులు తిరుపతి, చెన్నై, వేలూరు వంటి ప్రాంతాలకు వెళ్లాలంటే ప్రైవేటు వాహనాలే దిక్కు. పేదలు వేలాది రూపాయలు వాటికి చెల్లించి తీసుకెళ్లాల్సిందే.

ప్రైవేటు వాహనాలే దిక్కు

పుత్తూరు ఆస్పత్రికి 126 సంవత్సరాల చరిత్ర ఉంది. బ్రిటిష్ హయాంలో పుత్తూరు ఆసుపత్రిని ఏర్పాటు చేశారు. రోగులకు సేవలందించాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ఈ ఆస్పత్రి అంచెలంచెలుగా 50 పడకల స్థాయికి ఎదిగింది. అయితే నగరిలో 100 పడకల ఆస్పత్రి ఉండడంతో దీన్ని 29 పడకలకు కుదించారు. రోజూ ఆసుపత్రికి 600 నుంచి 800 మంది రోగులు వైద్యసేవలు పొందుతుంటారు. రోగులకు అరకొర మందులు అందుతున్నాయి. ఆసుపత్రికి వచ్చిన రోగులను మెరుగైన వైద్య సేవల కోసం తిరుపతికి తరలించేందుకు కేంద్రప్రభుత్వం జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్ ద్వారా 2007లో అంబులెన్స్‌ను అందించారు. ఇది 12 సంవత్సరాల క్రితం రేణిగుంట వద్ద జరిగిన ప్రమాదంలో పూర్తిగా దగ్ధమైంది. అప్పటి నుంచి రోగులు ప్రైవేటు వాహనాలపై ఆధారపడాల్సి వస్తోంది.

ఐదేళ్లుగా ఆసుపత్రి ఆవరణలోనే

అద్దె వాహనం ఏర్పాటు చేసుకొనే వసతి కూడా లేదని జిల్లా వైద్య,ఆరోగ్యశాఖ అధికారులు తేల్చేశారు. చిత్తూరు ఆస్పత్రికి గతంలో దివంగత ఎంపి శివప్రసాద్ కొత్త అంబులెన్స్‌లు ఏర్పాటు చేశారు. అలాగే పుత్తూరు ఆసుపత్రికి ఏర్పాటు చేస్తామని 2018లో హామీ ఇచ్చారు. ఆయన మృతితో హామీ మూలన పడింది. వైకాపా హయాంలో జీ తెలుగు సంస్థ ఓ అంబులెన్స్‌ను విరాళంగా అందజేశారు. డ్రైవర్ లేకపోవడంతో ఐదేళ్లుగా ఆసుపత్రి ఆవరణలో దుమ్ముపడుతోంది.

పెళ్లిలో రిటర్న్ గిఫ్ట్‌గా పూలమొక్క

చిత్తూరు(క్రీడలు), న్యూస్‌టుడే: వివాహమప్పుడు వధూవరులకు కానుకలు ఇవ్వడాన్ని మనం చూస్తుంటాం. ఓ నవజంట.. తమ పెళ్లికి వచ్చిన బంధుమిత్రులకు రిటర్న్ గిఫ్ట్‌గా పూల మొక్కను అందజేశారు. చిత్తూరు నగరం గిరింపేటలోని పీవీకేఎన్ ప్రభుత్వ కళాశాల సమీపంలోని ఓ కల్యాణ మండపంలో చిత్తూరుకు చెందిన అతీష్‌కుమార్, విద్యల వివాహం ఆదివారం జరిగింది. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు పెంచాలనే సందేశాన్నిస్తూ.. పెళ్లికి వచ్చినవారికి తమ బంధువుల ద్వారా పూలమొక్కను అందించడం విశేషం.

గ్రామీణులకు మెరుగైన వైద్య సేవలే లక్ష్యం

భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్

నింద్ర, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంటోందని స్థానిక ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అన్నారు. మండల పరిధి కొప్పేడులో రూ.36 లక్షలతో నిర్మించనున్న విలేజ్ హెల్త్ క్లినిక్ భవనానికి భూమిపూజ కార్యక్రమం ఎమ్మెల్యే చేతుల మీదుగా ఆదివారం నిర్వహించారు. శ్రీశైలం ఆలయ కమిటీ మాజీ ఛైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి, ఎంపీపీ భాస్కర్‌రెడ్డి, తెదేపా మండల అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.

అక్రమంగా చింత చెట్ల నరికివేత

చర్చి ఆవరణంలోని చెట్లు నరికేసిన దృశ్యం

పుత్తూరు, న్యూస్‌టుడే: పుత్తూరు పట్టణ పరిధిలోని గోవింద పాళెం లెక్కదాఖలాలోని సౌత్ ఆంధ్ర లూథరన్ చర్చికి సంబంధించిన సర్వే నంబరు 238/3లోని 5.28 ఎకరాల భూమిలోని చింత చెట్లను అనుమతులు లేకుండానే నరికేశారని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆ చర్చి ప్రతినిధులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ స్థలం సౌత్ ఆంధ్ర లూథరన్ చర్చికి సంబంధించినదని, ఆ స్థలాన్ని పట్టణానికి చెందిన ఓ వ్యక్తి 2012లో 1.98 ఎకరాల భూమిని కొనుగోలు చేశారన్నారు. చర్చి భూమి రిజిస్ట్రేషన్ చేయడం కుదరని ఆ రిజిస్ట్రేషన్‌ను కోర్టు కూడా రద్దు చేసిందన్నారు. 2024లో ఎన్నికల సమయంలో మరో గ్రూపును కలిసి 30.04.2024లో పుత్తూరులో ఎన్‌వోసీ తీసుకుని నెల్లూరులో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్నారు. ఈ విషయంలో కోర్టులో కేసు నడుస్తుండగా కొన్ని రోజులుగా స్థలాన్ని శుభ్రం చేసే పనిలో పడ్డారన్నారు. అందులో భాగంగానే ఆదివారం సెలవు కావడంతో అందులోని చింతచెట్లను నరికేశారన్నారు. కనీసం అటవీశాఖ, రెవెన్యూ అనుమతులు లేకుండానే చింత చెట్లు నరికి పర్యావరణాన్ని దెబ్బతీస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

ఆదివారం.. గ్రావెల్ అక్రమ రవాణా

తిరుమలరాజుపురం కొండ నుంచి అక్రమంగా తమిళనాడుకు తరలుతున్న గ్రావెల్ టిప్పర్

పాలసముద్రం, న్యూస్‌టుడే: పాలసముద్రం మండలం తమిళనాడుకు సరిహద్దులో ఉండటంతో ఇక్కడి నుంచి గ్రావెల్‌ను అక్రమంగా తరలిస్తున్నారు. తమిళనాడులో వాల్టా చట్టం కఠినంగా అమలు చేస్తూ, అక్కడ గ్రావెల్ తరలింపును ప్రభుత్వం నిషేధించింది. దీంతో తమిళనాడు సరిహద్దులో ఉన్న పాలసముద్రం మండలం నుంచి అక్రమార్కులు నిత్యం ఏదో ఒక మార్గంలో గ్రావెల్, మట్టిని ఆ రాష్ట్రానికి తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. పేరుకే గ్రానైట్ క్వారీ. చేసేదంతా అక్రమ గ్రావెల్ తరలింపు. ఇదంతా ఆదివారం వారికి అనుకూలంగా మారడం, రోజూ సాయంత్రం, ఉదయంలతో పాటు సెలవు రోజుల్లో ఈ దందాలు ఎక్కువగా కొనసాగిస్తున్నారు. మండలంలోని తిరుమలరాజుపురం పంచాయతీలోని క్వారీలో ఈ గ్రావెల్ మాఫియా జరుగుతోంది. పేరుకే క్వారీ పనులు చేపడుతున్నామని అధికారులకు తెలుపుతూ.. అధికారులు ఇలా వెళ్లే.. అలా టిప్పర్లలో తరలించేస్తున్నారు. ఈ మట్టి దందాలపై రెవెన్యూ అధికారులకు ప్రజలు సమాచారం ఇచ్చినా పట్టించుకోవడం లేదని విమర్శలు ఉన్నాయి. తమిళనాడు రిజిస్ట్రేషన్ ఉన్న టిప్పర్ల ద్వారానే వీటిని తరలిస్తున్నా.. పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని గ్రావెల్ అక్రమ రవాణాను అరికట్టాల్సి ఉంది. ఈ విషయంపై తహసీల్దారు గుర్రప్పను వివరణ కోరగా గ్రావెల్ అక్రమ తరలింపు తమ దృష్టికి రాలేదని, వెంటనే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పాతాళ సెంబు మురుగన్‌ను దర్శించుకున్న మాజీ మంత్రి

స్వామిని దర్శించుకుంటున్న రోజా, ఆమె కుమారుడు

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: దిండుగల్ జిల్లా రామలింగంపట్టిలోని ప్రసిద్ధి చెందిన పాతాళ సెంబు మురుగన్ ఆలయానికి ఏపీ మాజీ మంత్రి రోజా తన కుమారుడితో కలిసి విచ్చేశారు. ముందుగా సంగిలి కరుప్పై సన్నిధిని దర్శించుకున్న అనంతరం పాతాళ సెంబు మురుగన్‌ను దర్శించుకున్నారు. రెండు వేల మంది భక్తులకు అన్నదానం చేశారు. రోజాను చూసిన భక్తులు, అభిమానులు సెల్ఫీలు తీసుకున్నారు.

రోడ్డుపైనే వాహనాల పార్కింగ్

పుత్తూరు పట్టణంలో కుగ్రామంగా ఉన్నప్పుడు ఎస్‌బీఐ శాఖ ప్రధాన బ్రాంచిని కాపువీధిలో ఏర్పాటు చేశారు. ఖాతాదారులు సంఖ్య పెరగడంతో పట్టణ బ్రాంచి తిరుపతి-అరక్కోణం రోడ్డులో 15 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేశారు. అయితే టౌన్ బ్రాంచి కన్నా ప్రధాన బ్రాంచిలోనే ఖాతాదారులు అధిక సంఖ్యలో ఉన్నారు. ఈ నేపథ్యంలో ప్రధాన బ్రాంచికు వెళ్లాలంటే వాహనాలు కాపువీధిలో పార్కు చేసి వెళ్లాల్సిందే. కనీసం పార్కింగ్ స్థలం కూడా లేదు. దీంతో నిత్యం ఇబ్బందులే. మున్సిపల్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. -న్యూస్‌టుడే, పుత్తూరు

ప్రమాదకరంగా విద్యుత్తు స్తంభాలు

చిప్పారపల్లె పంచాయతీ గుంటూరువాండ్లఊరు గ్రామంలో విద్యుత్తు స్తంభాలు ప్రమాదకరంగా ఉన్నాయి. గ్రామంలోని వినాయక స్వామి ఆలయం, ఆలయ సమీపంలో రెండు విద్యుత్తు స్తంభాలకు సిమెంటు పెచ్చులు ఊడిపోయి ఇనుప కమ్మీలు బయటపడ్డాయి. పెనుగాలులకు స్తంభాలు విరిగి కూలిపోయే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ప్రమాదం జరగక ముందే అధికారులు స్పందించి విద్యుత్తు స్తంభాలను మార్పు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

-న్యూస్‌టుడే, పెనుమూరు

ప్రహరీ కూలింది.. నిర్మాణం ఎప్పుడో?

బంగారుపాళ్యం మార్కెట్ యార్డు ప్రహరీ మొంథా తుపానుకు కూలిపోయింది. ఆకతాయిలు మార్కెట్ యార్డులోకి వెళ్లి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారు. ఇటీవల పోలీసులు చేపట్టిన ధైర్య స్పర్శలో పోలీసులు హెచ్చరికలు జారీ చేసిన ఫలితం లేకపోతోంది. మూడునెలలు వ్యవధిలో మామిడికాయల సీజన్ ప్రారంభం కానుంది. మార్కెట్ శాఖ అధికారులు కూలిన గోడను పునర్ నిర్మించాలని రైతులు కోరుతున్నారు. మార్కెట్ కమిటీ ఛైర్మన్ భాస్కర్‌నాయుడును వివరణ కోరగా.. మామిడి కాయల సీజన్ లోపు కూలిన గోడను నిర్మిస్తామని తెలిపారు. మార్కెట్ కమిటీ అధికారులు ప్రహరీ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపామని తెలిపారు.

-న్యూస్‌టుడే, బంగారుపాళెం

రిక్షాల్ని పల్లెలకు పంపించరా?

గ్రామాల్లో ఇంటింటా తడి పొడి చెత్త సేకరణకు ప్రభుత్వం రిక్షాలు, ట్రాలీలు ఇచ్చింది. వాటిని క్షేత్రస్థాయికి చేర్చడంలో అధికారులు విఫలమవుతుండటంతో ప్రభుత్వ ఉద్దేశం నెరవేరడం లేదు. ఇందుకు నిదర్శనం ఈ చిత్రం. చిత్తూరు మండలంలోని గ్రామాలకు మంజూరైన ఈ రిక్షాలు.. ఇప్పటికీ చిత్తూరు ఎంపీడీవో కార్యాలయం ప్రాంగణంలో ఉన్నాయి. 20 రోజులుగా ఇవి అక్కడే ఉండటంతో కార్యాలయం ప్రాంగణంలోని చెత్తను వాటిలో వేస్తుండటం గమనార్హం.

-న్యూస్‌టుడే, చిత్తూరు గ్రామీణ

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

గుడిపాల, న్యూస్‌టుడే: శ్రీరంగపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో 1985-86లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం సమ్మేళనం నిర్వహించారు. ఆరు నుంచి పదో తరగతి వరకు వారు విద్యనభ్యసించినప్పుడు జరిగిన సంఘటనలు, తీపి జ్ఞాపకాలను గుర్తు తెచ్చుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మధు పాఠశాలలో సరస్వతి విగ్రహాన్ని ఏర్పాటు చేయించాలని కోరగా ఏడాదికల్లా పూర్తిచేసి మళ్లీ అందరూ కలుసుకుంటామని వారు హామీ ఇచ్చారు.

రైతు సంఘాల సమాఖ్య రాష్ట్రాధ్యక్షుడి మృతి

తవణంపల్లె, న్యూస్‌టుడే: రైతు సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు జి.గొల్లపల్లి గ్రామానికి చెందిన జి.వి.జయచంద్రచౌదరి(85) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. రైతుల శ్రేయస్సు కోసం ఆయన చేసిన పోరాటాలు, సేవలు ఎప్పటికీ మరచి పోలేనివని పలువురు ప్రముఖులు కొనియాడారు. ఎమ్మెల్యే మురళీమోహన్ ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపి మృతదేహానికి నివాళులు అర్పించారు.

గ్రామాల్లో నిర్బంధ తనిఖీ

బంగారుపాళ్యం, న్యూస్‌టుడే: మండలంలోని పాలేరు, బలిజపల్లె గ్రామాల్లో ఆదివారం ఉదయం సీఐ శ్రీనివాసులు నేతృత్వంలో నిర్బంధ తనిఖీలు నిర్వహించారు. చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్సై ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావుకు సత్కారం

చిత్తూరు(మిట్టూరు), న్యూస్‌టుడే: చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, జిల్లా కోర్టు ప్రభుత్వ న్యాయవాదిగా నూతనంగా నియమితులైన గోవిందరాజులను రాష్ట్ర ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కీసరం పరంజ్యోతి మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్సీలు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతి చేశారు. ఎంపీని సత్కరించి.. జ్ఞాపికను బహుకరించారు. న్యాయవాది శివయ్య, నాయకులు వెంకటేష్, సత్యం, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ ప్రసాదరావుకు జ్ఞాపిక అందజేస్తున్న ప్రభుత్వ న్యాయవాది గోవిందరాజులు, ఎస్సీ సంక్షేమ సంఘం నాయకులు

శస్త్రచికిత్సకు 67 మంది ఎంపిక

చిత్తూరు(సంతపేట): జైన్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన కంటి వైద్య శిబిరంలో 138 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. 67 మందికి తిరుపతిలోని ఎస్వీ అరవింద కంటి ఆస్పత్రిలో శస్త్రచికిత్స చేయనున్నారు.

త్వరలో పిల్లల పార్కు ఏర్పాటు

చిత్తూరు(క్రీడలు), న్యూస్‌టుడే: ఆరోగ్యం కోసం రోజూ వ్యాయామం తప్పనిసరని తెదేపా నాయకులు గురజాల చెన్నకేశవులునాయుడు అన్నారు. పీవీకేఎన్ వాకర్స్ సంఘం సర్వసభ్య సమావేశాన్ని ఆదివారం చిత్తూరులోని యోగా భవనంలో నిర్వహించారు. వాకర్స్ సంఘం అధ్యక్షుడు విశ్వనాథ్ మాట్లాడుతూ త్వరలో పీవీకేఎన్ మైదానంలో నూతన వాకింగ్ ట్రాక్, పిల్లల పార్కు ఏర్పాటు చేస్తామన్నారు. యోగాపై పిల్లలు, యువతకు శిక్షణను అందిస్తామన్నారు. కార్యక్రమంలో పార్థసారథినాయుడు, ప్రభాకర్, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

కిక్ ఇస్తే పతకమే

చిత్తూరు గ్రామీణ, న్యూస్‌టుడే: చిత్తూరు నగరానికి చెందిన బాలురు కరాటేలో ఏడాదిగా శిక్షణ పొందుతున్నారు. బ్లాక్ బెల్టులో డిగ్రీలు(డాన్)లుగా ఎదుగుతూ.. నైపుణ్యాన్ని సాధిస్తూ.. రాష్ట్ర, జాతీయ స్థాయిలో మెరుస్తున్నారు. చదువులోనూ రాణిస్తున్నారు.

జాతీయ, రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో రాణింపు

ఛాంపియన్‌షిప్‌లో సత్తా

నగరంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్నా. నాన్న రాకేష్, అమ్మ నీల. ఇద్దరూ వ్యాపారులు. గతేడాది బ్లాక్ బెల్టులో జరిగిన పరీక్షల్లో తొలి డిగ్రీ అందుకున్నా. చిత్తూరు నగరంలో గతేడాది జరిగిన జాతీయ స్థాయి గోజూ-రై కరాటే డూ ఛాంపియన్‌షిప్ పోటీల్లో టీం కటాలో వెండి, కట్టాలో బంగారు, కుమితేలో రజత పతకాలు, ప్రశంసాపత్రం అందుకున్నా. కరాటేతో పాటు బాగా చదువుకొని ఇంజినీరు కావాలనేదే నా లక్ష్యం. - రుషికేష్

పసిడి, వెండి పతకాలతో..

నగరంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఐదో తరగతి విద్యనభ్యశిస్తున్నా. నాన్న వినోద్‌కుమార్, వ్యాపారి. అమ్మ సరస్వతి, గృహిణి. గతేడాది బ్లాక్ బెల్టులో నిర్వహించిన పరీక్షల్లో బ్లాక్ బెల్టు తొలి డిగ్రీ అందుకున్నా. గతేడాది చిత్తూరులో జరిగిన జాతీయ స్థాయి గోజూ-రై కరాటే డూ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ప్రతిభ చూపా. కుమితే, కట్టా విభాగాల్లో వెండి పతకం, టీం కటా విభాగాలలో బంగారు పతకాలు సాధించా. -సంజీవి

కటా, కుమితే విభాగాల్లో..

స్థానికంగా ప్రైవేటు పాఠశాలలో ఆరో తరగతి విద్యనభ్యశిస్తున్నా. అమ్మ మంజుల, నర్సు, నాన్న దుర్గపతి, రైతు. వారి ప్రోత్సాహంతోనే ఏడాదిగా కరాటేలో శిక్షణ తీసుకుంటున్నా. నగరంలో గతేడాది జాతీయ స్థాయి గోజూ-రై కరాటే డూ ఛాంపియన్‌షిప్ పోటీల్లో టీం కటా వెండి, కట్టాలో బంగారు, కుమితేలో రజతం, ప్రశంసాపత్రం అందుకున్నా. డాక్టర్‌గా ప్రజలకు సేవ చేయాలనేదే నా ఆశయం. - చరణ్

నాన్న ప్రోత్సాహంతో..

ప్రైవేటు పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నా. అమ్మ లక్ష్మి, నర్సు. నాన్న గిరిబాబు, విద్యుత్తుశాఖ లైన్‌మెన్. నాన్న ప్రోత్సాహంతోనే కరాటేలో ఏడాదిగా శిక్షణ తీసుకొంటూ.. గతేడాది జరిగిన బ్లాక్ బెల్టు పరీక్షల్లో బ్లాక్ బెల్టులో తొలి పట్టా అందుకున్నా. చిత్తూరులో గతేడాది జరిగిన జాతీయ స్థాయి గోజూ-రై కరాటే డూ ఛాంపియన్‌షిప్ పోటీల్లో కటా, కుమితే, టీం కట్టా విభాగాల్లో వెండి, రజతం, బంగారు పతకాలు అందుకున్నా. -సుషాంక్

వన్నెకుల క్షత్రియుల ఆత్మీయ సమావేశం

నగరి, న్యూస్‌టుడే: నగరి మండల వన్నెకుల క్షత్రియుల ఆత్మీయ సమావేశం కస్తూరి మహల్‌లో ఆదివారం నిర్వహించారు. ఆ సామాజిక వర్గానికి చెందిన ప్రముఖులు మాట్లాడుతూ.. సమష్టిగా, ఒక సంఘంగా ముందుకు సాగాలన్నారు. త్వరలో కమిటీ ఏర్పాటు చేసుకొని భవిష్యత్ కార్యక్రమాలను కొనసాగించాలని నిర్ణయించారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన

పెనుమూరు, న్యూస్‌టుడే: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. పూతలపట్టు మండలంలోని శ్రీ సన్నిధి ఫుడ్స్ ఆధ్వర్యంలో తిరుపతి ఎస్వీ అరవింద కంటి ఆసుపత్రి సహకారంతో ఉచిత కంటి వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. చుట్టుపక్కల గ్రామాలకు చెందిన సుమారు 350 మంది రోగులకు కంటి పరీక్షలు నిర్వహించారు. శ్రీ సన్నిధి ఫుడ్స్ కర్మాగారం జీఎం శంకర్‌నాయుడు, అరవింద ఆసుపత్రి పీఆర్వో రమేష్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్య అభ్యసించాలి

గుడిపాల, న్యూస్‌టుడే: విద్యార్థులు విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్యనభ్యసించాలని రాష్ట్ర విద్యా సంఘం అధ్యక్షుడు గంటా మోహన్ అన్నారు. మండల కేంద్రంలోని సీఎన్ఆర్ పాఠశాల వార్షికోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన నాటకాలు, నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఎంఈవో హసన్ బాషా, పాఠశాల వ్యవస్థాపకుడు లోకేష్, ప్రధానోపాధ్యాయురాలు సుధ పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రదర్శన

సింహ ద్వార బంధం వితరణ

ప్రధాన సింహద్వార బంధం వితరణ చేసిన దాతలు

పుత్తూరు, న్యూస్‌టుడే: పుత్తూరు పట్టణం కార్వేటినగరం రోడ్డులోని శ్రీరామలింగేశ్వస్వామి ఆలయ ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న అన్నదాన సత్రంకు రూ.3 లక్షలతో మహాసింహ ద్వారబంధంను పట్టణానికి చెందిన దాతలు వెంకటసుబ్బన్న, లక్ష్మీదేవి వారి కుమారుడు, కోడలు డాక్టర్ సుబ్రమణ్యం, హిమబిందు వితరణగా ఇచ్చారు. ఆదివారం ఈ కార్యక్రమం ఆలయంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం దాతలను సత్కరించారు.

IN THE COURT OF
THE ADDL. CIVIL JUDGE
(SENIOR DIVISION) OF CHITTOOR
E.P.No.26 of 2024
O.S.No.80 of 2008
(Sub Court,Gudiyatham,T.N)
Between:
L.Dhanamjaya Reddy ..D.Hr
And
Y Madhava Reddy (died) by Legal Representative Rajesh ..J.Dr
SALE NOTICE
To
Rajesh S/o Late Y.Madhava Reddy residing at N.D SC 13/43, New No 7-100, Chittoor to Penumur Road, Penumuru Village & Post, Chittoor Dist.
Sir,
Where as to Decree Holder has obtained Decree in the above suit in **O.S.No,.80/2008 (Gudiyatham Sub Court)** in his favour. The Decree Holder filed the above Execution Petition in **E.P.No.26 of 2024** for sale E.P Shedule mentioned Property and the above E.P is posted to **16-03-2026** to detiremine the terms of Sale Proclamation.
(It is also order that you should attend before the above court on **16-03-2026 at 10-30 A.M** to take notice of the date fixed for settling the terms of the Proclamation of sale)
SCHEDULE
Sri Balaji District Registration, Tirupati -Pakala Sub District-Penumuru Mandal- all that a piece of land and a Terraced house bearing Door No. NDSC 13-43-Lakshmi Nagar colony, Penumuru village- Comprised in S.No. 509/2 total extent 86 sy.yd on Chittoor Penumuru main Road, within the following boundaries:
North: House of P.Balaji Naidu, South; House of P.Jaganadham Naidu, East: Chittoor - Karvitinagar Main Road, West; House of T.Mohan Reddy.
Sd/-**GOVINDU SAMBASIVUDU**
Advocate for Decree Holder

(c) eenadu

పలమనేరు

•పలమనేరు • కుప్పం

అవస్థలు.. డబుల్

శాంతిపురం మండలంలోని ముద్దనపల్లె బీటీ రోడ్డు ముళ్లబాటను తలపిస్తోంది. కుప్పం-కేజీఎఫ్ డబుల్ రోడ్డు నుంచి ముద్దనపల్లె మీదుగా గుడుపల్లె మండలం దాసిమానిపల్లె డబుల్ రోడ్డు కూడలి వరకు సుమారు 3 కి.మీ. పరిధి రోడ్డు రాళ్ల తరలింపు లారీల ధాటికి దెబ్బతింది. కంకర తేలిన రహదారిలో కనీసం కాలి నడకన ప్రయాణాలకు జనం తీవ్ర అవస్థలు పడుతున్నారు.

- న్యూస్‌టుడే, శాంతిపురం

ఇంటర్ పరీక్షలకు సన్నద్ధం

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: కమ్మనపల్లె ఆదర్శ పాఠశాలలో సోమవారం నుంచి జరిగే ఇంటర్ పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పాఠశాల ప్రిన్సిపల్ అనిత తెలిపారు. 215 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు చెప్పారు.

వైద్య శిబిరానికి స్పందన

శాంతిపురం: మండల పరిధి 64-పెద్దూరు ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో పీఈఎస్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి చక్కటి స్పందన లభించింది. శిబిరంలో పాల్గొన్న వారికి వివిధ రకాల వైద్య పరీక్షలతో వైద్య సేవలను అందించారు పెద్దూరు పరిసర గ్రామాల నుంచి 285 మంది హాజరు కాగా.. 26 మందిని శస్త్రచికిత్సల నిమిత్తం పీఈఎస్‌కు తరలించినట్లు పీఆర్వోలు వెంకటేష్, చంద్ర తెలిపారు.

జిల్లాస్థాయి ఆసుపత్రిగా అభివృద్ధి

పలమనేరు, న్యూస్‌టుడే: పట్టణంలోని ఏరియా ఆసుపత్రిని జిల్లాస్థాయి ఆసుపత్రిగా అభివృద్ధి చేస్తామని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే అమరనాథరెడ్డి తెలిపారు. ఆసుపత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆరు వేల లీటర్ల సోలార్ వాటర్ హీటర్‌ను ఎంపీ ప్రసాదరావుతో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రోగుల సౌకర్యం కోసం లిఫ్టు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. వసతులతో పాటు వైద్యులు కూడా మంచి సేవలు అందిస్తే ప్రజల మన్ననలు పొందగలమన్నారు. కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ పద్మాంజలి, సూపరింటెండెంట్ మమతా రాణి, కమిషనర్ ఎన్వీ రమణారెడ్డి, వైద్యులు పాల్గొన్నారు.

యంత్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

పట్రకులానికి ప్రత్యేక కార్పొరేషన్

రాష్ట్రవ్యాప్తంగా 9 లక్షల జనాభా ఉన్న పట్ర కులస్థులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి అన్నారు. ఆసుపత్రి ఆవరణలో పట్ర కులస్థులు ఆ మేరకు వినతి పత్రాన్ని అందించారు. సంఘం నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాల్లో ప్రైవేటు వ్యక్తుల దందా

❖ ఆక్రమించి అద్దె వసూలు
❖ తప్పని ట్రాఫిక్ సమస్య

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: సొమ్మొకరిదైతే సోకొకరిదన్నట్లు ప్రభుత్వ స్థలాల్లో ప్రైవేటు వ్యక్తులు దందా సాగిస్తున్నారు. మండల కేంద్రమైన బైరెడ్డిపల్లె నాలుగు రోడ్ల కూడలిలో పుంగనూరు రహదారి, జడ్పీ ఉన్నత పాఠశాల పక్కనున్న పోరంబోకు స్థలాన్ని పలువురు ఆక్రమించుకుని దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. వీరిలో కొందరు జీవనోపాధి కోసం దుకాణాలు ఏర్పాటు చేయగా. . కొందరు స్థలాలను దర్జాగా ఆక్రమించి అద్దెకు ఇచ్చారు. స్థలానికి రూ.వేలల్లో అడ్వాన్సు, ప్రతి నెలా అద్దె సైతం వసూలు చేస్తున్నారు. స్థానికంగా కొందరు నేతలతో పాటు బయట ప్రాంత వ్యక్తులు సైతం ప్రభుత్వ స్థలాలపై పెత్తనం చెలాయిస్తున్నారు. రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలతో పుంగనూరు రహదారిలో నిత్యం ట్రాఫిక్ సమస్య జఠిలంగా మారుతోంది.

దుకాణాలు.. వాహనాల పార్కింగ్

బైరెడ్డిపల్లె-పుంగనూరు ప్రధాన రహదారిలో ఇరువైపులా రస్తా పోరంబోకు స్థలం ఆక్రమణకు గురికా

బైరెడ్డిపల్లె నాలుగు రోడ్ల కూడలిలో పుంగనూరు రహదారి పక్కన ఏర్పాటు చేసుకున్న దుకాణాలు

వడంతో రోడ్డు ఇరుకుగా మారింది. బంకు దుకాణాలు, రేకుల షెడ్లు, గోడల నిర్మాణాలతో దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. దుకాణాల ఎదుట వాహనాల పార్కింగ్‌తో ట్రాఫిక్ సమస్య మరింత వేధిస్తోంది. రోడ్డు పొడువునా ఆటోలు, ఇతర వాహనాలను పార్కింగ్ చేయడంతో రహదారి కుంచించుకుపోయి రాకపోకలకు ఇబ్బందికరంగా మారుతోందని స్థానికులు వాపోతున్నారు.

సౌకర్యాల కల్పనకు హామీ

సమస్యను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా... బైరెడ్డిపల్లె నాలుగు రోడ్ల కూడలిలో ఆక్రమణలు తొలగించి బస్సు షెల్టర్, సామూహిక మరుగుదొడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి హామీ ఇచ్చారు. త్వరలోనే ఆక్రమణలు తొలగించి అభివృద్ధి పనులు చేపట్టడానికి చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రయాణికులు సమస్యలతో సతమతం

మండల పరిధిలోని 105 గ్రామాల ప్రజలు నిత్యం మండల కేంద్రం చేరుకుని పట్టణాలు, నగరాలకు ప్రయాణం సాగిస్తుంటారు. మహిళలు, పిల్లలు, కళాశాలకు వెళ్లే విద్యార్థులకు ఒకటిరెంటికి అత్యవసరమైతే ఉగ్గబట్టాల్సిన పరిస్థితి. వందల సంఖ్యలో వచ్చిపోయే ప్రయాణికులకు సామూహిక మరుగుదొడ్ల అవసరం ఉంది. ప్రజలు ఇలా సమస్యలతో సతమతమవుతుంటే ప్రైవేటు వ్యక్తులు మాత్రం ప్రభుత్వ స్థలంపై పెత్తనం చెలాయిస్తూ అద్దెలు వసూలు చేసి దందా సాగిస్తున్నారు. వీరిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
పలమనేరు: 80085 74580
కుప్పం పట్టణం: 80085 73490
పుంగనూరు: 80085 74622

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: సమస్య: స్థానిక తితిదే కల్యాణ మండపం సమీపంలోని మలుపులో సూచిక బోర్డు లేకపోవడంతో వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. **- తాండవ, కుప్పం**

సమాధానం: సూచిక బోర్డు ఏర్పాటు చేసి, ప్రమాద నివారణకు చర్యలు తీసుకుంటాం.

- శంకరయ్య, అర్బన్ సీఐ, కుప్పం

వీధి దీపం ఏర్పాటుకు చర్యలు

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని ప్యాలెస్ రోడ్డు కూడలిలో వీధి దీపం ఏర్పాటు కోసం గుంతను తవ్వి అలాగే వదిలేయడంతో సమస్యపై 'ఈనాడు'లో 'మేమున్నాం. . మీకు తోడుగా..'లో వార్త ప్రచురితమైంది. స్పందించిన పురపాలిక అధికారులు వీధి దీపం ఏర్పాటు చేసేందుకు పనులు చేపట్టారు.

స్పందనకు వందనం

సమస్యల పరిష్కారానికి వినతుల వెల్లువ

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో ఎమ్మెల్యే అమరనాథరెడ్డికి పలువురు సమస్యల పరిష్కారానికి వినతి పత్రాలు అందజేశారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: ప్రతి మహిళ ఆర్థిక స్వావలంబనతో పారిశ్రామికవేత్తగా ఎదగాలని ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పేర్కొన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో ఆదివారం మహిళా సంఘాల సభ్యులకు 100 ఈ-సైకిళ్లను ఆయన పంపిణీ చేశారు. 794 మహిళా సంఘాల సభ్యులకు స్త్రీనిధి, ఉన్నతి, బ్యాంకు రుణాల ద్వారా రూ.112.5 కోట్ల చెక్కును వెలుగు మహిళా సమాఖ్య ప్రతినిధులకు అందజేశారు. స్వర్ణరథం వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. మహిళలు బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలతో కుటీర పరిశ్రమలు స్థాపించి వ్యాపార రంగంలో రాణించాలన్నారు. కార్యక్రమంలో పలమనేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ రాజన్న, ఉపాధ్యక్షుడు దిలీప్, తెదేపా మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడు, నాయకులు సుబ్రహ్మణ్యం, భువనచంద్రగౌడు, రఘుచంద్రగుప్తా, పీఏసీఎస్ ఛైర్మన్ నాగరాజనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఈ-సైకిళ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

అపూర్వ సమ్మేళనం

శాంతిపురం, న్యూస్‌టుడే: తుమ్మిశి జడ్పీ ఉన్నత పాఠశాలలో 2002-03 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. పాఠశాల ప్రాంగణంలో సమావేశమై.. పరస్పరం యోగ, క్షేమాలను తెలుసుకున్నారు. వివిధ వృత్తులు, ఉద్యోగాల్లో స్థిరపడిన వారి అనుభవాలను పంచుకున్నారు. పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం శుద్ధజల యంత్రాన్ని వితరణగా అందజేశారు. ఉపాధ్యాయులను సత్కరించారు.

హాజరైన పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

52 మంది రక్తదానం.. కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరంలో 52 మంది రక్తదానం చేసినట్లు లయన్స్ క్లబ్ సలహాదారు మహేష్ తెలిపారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైస్ ఛైర్మన్ భాగ్యలక్ష్మి, వైద్యులు విజయకుమార్ రెడ్డి, శ్యామల, హరిప్రియ, సుప్రియ, సభ్యులు సెల్వం, శివ, ప్రసాద్, చరణ్, జయరాం పాల్గొన్నారు.

మోసం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోండి

పలమనేరు, న్యూస్‌టుడే: చిట్టీల పేరుతో తమను మోసం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని బాధితులు ఎమ్మెల్యే అమరనాథరెడ్డికి ఫిర్యాదు చేశారు. పట్టణానికి చెందిన వెంకట్రావు అనే వ్యక్తి ఐపీ పెట్టిన సంగతి విదితమే. దీంతో అతనికి సొమ్ములు ఇచ్చిన బాధితులు రెండు రోజుల నుంచి ఆందోళనలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బాధితులు ఆదివారం ఎమ్మెల్యేను కలిసి సమస్యను విన్నవించారు. బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పోలీసులకు సూచించారు.

ఉద్యమంలా సభ్యత్వ నమోదు

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశాలతో ఈ నెల 26 నుంచి జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఉద్యమంలా చేపడుతున్నట్లు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి నరేష్ తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ స్థాయి నుంచి జనసేనను బలోపేతం చేసేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. నాయకులు వామనమూర్తి, కిషోర్, హరీష్, బాలాజీ, హరీష్, పాండు, చంద్రశేఖర్, హంసగిరి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నరేష్

స్వామివారికి అభిషేకాలు

పలమనేరు, న్యూస్‌టుడే: మండలంలోని పెంగరగుంటలో శ్రీ కోటేశ్వరస్వామి ఆలయ జీర్ణోద్ధరణ పనుల్లో భాగంగా భక్తులు స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు చేశారు.

23 నుంచి బాలాలయం

సదుం, న్యూస్‌టుడే: సదుం మండలంలోని బూరగమందలో వెలసిన శ్రీప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 23 నుంచి 26 వరకు బాలాలయం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తితిదే అధికారులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.

ఆలయ వార్షికోత్సవం

సదుం, న్యూస్‌టుడే: సదుం మండలం ఊటుపల్లె క్రాస్ వద్ద వెలసిన శ్రీఅభయాంజనేయస్వామి ఆలయ 9వ వార్షికోత్సవ పూజలు ఆదివారం వైభవంగా జరిగాయి. చాందిని బండ్లు, కోలాటాలు, చెక్క భజనలు భక్తులను ఆకట్టుకున్నాయి.

భక్తిశ్రద్ధలతో ఉబ్బదేవర

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: నెల్లిపట్లలో వెలసిన వీరభద్రస్వామి ఆలయంలో ఆదివారం భక్తిశ్రద్ధలతో ఉబ్బదేవర మహోత్సవం జరిపారు. శనివారం రాత్రి శ్రీభద్రకాళి సమేత శ్రీవీరభద్రస్వామి ఉత్సవమూర్తులను సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం ఉదయం రజక కులస్థులు సామూహికంగా ఉబ్బదేవర పూజ నిర్వహించారు.

హంస వాహనంపై స్వామివారు

కల్లూరు (మంగళంపేట), న్యూస్‌టుడే: తితిదే ఆధ్వర్యంలో మంగళంపేటలో ప్రసిద్ధి చెందిన శ్రీదేవి భూదేవి సమేత శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారు ఆదివారం చిన్నశేష, హంస వాహనంపై ఊరేగారు. కల్లూరుకు చెందిన సావిత్రమ్మ, మంగళంపేటకు చెందిన భూపతి కుటుంబీకులు ఉభయదారులుగా వ్యవహరించారు.

గ్రామోత్సవంలో ఉత్సవమూర్తులు

ఎప్పుడు చదువుకోనిస్తారు..?

శాంతిపురం మండలం కడపల్లె పంచాయతీ కేంద్రంలో గ్రంథాలయ భవన నిర్మాణం అర్ధంతరంగా మారింది. వైకాపా పాలనలో ప్రారంభించిన నిర్మాణం గోడల దశలో ఆగిపోయింది. చుట్టూ పొదలు, పిచ్చి మొక్కలతో దుస్థితికి చేరుకొంది. ప్రభుత్వం స్పందించి భవన నిర్మాణాన్ని పూర్తి చేసి సామాజిక అవసరాలకు వినియోగించాల్సిందిగా స్థానికులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, శాంతిపురం

మైదానం కాదు..మంగళకుంట

ఈ చిత్రంలో మైదానంలా కన్పిస్తున్నది కొళత్తూరు గ్రామానికి సమీపంలోని మంగళకుంట. ఇక్కడి కుంటలో నీరు ఉన్నా గుర్రపుడెక్క, రబ్బరు చెట్లు పూర్తిగా కమ్మేశాయి. నీటితో నిండిన కుంట గుర్రపుడెక్క, రబ్బరు చెట్ల కారణంగా కొద్దిరోజులకే నీరు ఇంకిపోతోందని రైతులు ఆవేదన చెందుతున్నారు. కుంట కింద వరిసాగు చేసిన రైతులు నీటికి ఇబ్బందులు పడుతున్నామని, ఇరిగేషన్ అధికారులు కుంటను పరిశీలించి రబ్బరు చెట్లు, గుర్రపుడెక్కను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, పెద్దపంజాణి

ప్రమాదపుటంచున ప్రయాణం

పలమనేరు-కృష్ణగిరి జాతీయ రహదారి కుప్పం బైపాస్‌లో ఆదివారం ఓ లగేజీ వాహనం టాపుపై ముగ్గురు వ్యక్తులు ప్రమాదకరంగా ప్రయాణించారు. తమిళనాడుకు చెందిన వాహనాలు ప్రతిరోజూ ఇలానే ప్రమాదకరంగా ప్రయాణికులను రవాణా చేస్తున్నారు. చిన్న పొరబాటు జరిగినా ఊహించని ప్రమాదమే జరుగుతుందని, పోలీసులు దీనిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కుప్పం పట్టణం

కొబ్బరి చెట్లు.. కోనసీమ అందాలు..!

ఆహ్లాదకర వాతావరణానికి నిలయమైన కుప్పం ప్రాంతంలో ఉద్యాన పంటలు కోనసీమ అందాలను తలపిస్తున్నాయి. కొబ్బరితో పాటు అరటి, బొప్పాయి, జామ, మామిడి తోటలు, కూరగాయలు, పూలు, పండ్ల తోటలతో పొలాలు పచ్చదనం సోయగాన్ని తీసుకొచ్చాయి. శాంతిపురం మండలంలోని కర్ణాటక సరిహద్దు గ్రామం చిన్న గాండ్లపల్లె వద్ద బీటీ రహదారికి ఇరువైపులా ఏపుగా పెరిగిన కొబ్బరి చెట్లు, అరటి, బంగాళ దుంప పైర్లతో పచ్చదనం ఇలా ఉట్టిపడుతోంది మరి.

- న్యూస్‌టుడే, శాంతిపురం

జాతీయ రహదారి గుంతలకు మోక్షం

మండల పరిధిలో కుప్పం-పలమనేరు జాతీయ రహదారి గుంతలకు ఎట్టకేలకు మోక్షం లభించింది. రహదారి పలుచోట్ల దెబ్బతినడంతో వాహనదారుల ఇబ్బందులపై 'ఈనాడు'లో పలుమార్లు ప్రచురితమైన కథనాలకు సంబంధిత అధికారులు స్పందించారు. శాంతిపురం, బడుగుమాకులపల్లె, నాయనపల్లె, గుండిశెట్టిపల్లె, పెద్దబొమ్మనపల్లె, పోడూరు, గణేశ్‌పురం, శివపురం తదితర ప్రాంతాల్లో రోడ్డును బాగు చేశారు. - న్యూస్‌టుడే, శాంతిపురం

ఆగిన సచివాలయాలు సాగేనా?

మండల పరిధిలోని నెర్నిపల్లెలో గత ప్రభుత్వంలో చేపట్టిన సచివాలయ నిర్మాణం అసంపూర్తిగా దర్శనమిస్తోంది. అప్పట్లో నిర్మాణం కోసం రూ.25లక్షలు అంచనా వేశారు. దాదాపు 75 శాతం పనులు పూర్తయ్యాయి. బిల్లుల జాప్యంతో గుత్తేదారు భవనాన్ని పూర్తి చేయక అసంపూర్తిగా వదిలేశారు.

వి.కోట, న్యూస్‌టుడే: గత ప్రభుత్వం ఆర్భాటంగా ప్రారంభించిన సచివాలయాల నిర్మాణాలు మండలంలో పలుచోట్ల అర్ధంతరంగా ఆగిపోయాయి. దీంతో రూ.లక్షల వ్యయంతో నిర్మించిన భవనాలు నిరుపయోగంగా మారాయి. ప్రస్తుతం పలుచోట్ల సచివాలయాలు అద్దె భవనాల్లో నిర్వహించడం వల్ల ప్రభుత్వంపై అదనపు భారం పడుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి అసంపూర్తి భవనాలు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా..

అసంపూర్తి నిర్మాణాలు అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారాయి. దీంతో పాటు రూ.కోట్ల ప్రజాధనం నిరుపయోగంగా మారిందని ప్రజలు వాపోతున్నారు.

25కు 16 మాత్రమే పూర్తి..

మండల పరిధిలో 25 సచివాలయ భవనాలు నిర్మించాల్సి ఉంది. అయితే ఇందులో ఇప్పటికే 16 సచివాలయ భవనాలు పూర్తయ్యాయి. మండల పరిధిలోని బైరుపల్లె, ఓగు, నెర్నిపల్లె, పాపేపల్లె, గోనుమాకుపల్లె తదితర సచివాలయాలు పనులు పూర్తి కావాల్సి ఉంది. వీటిలో చాలా వరకు 90 శాతం పూర్తయ్యాయి.

ప్రతిపాదనలు పంపించాం

అర్ధంతరంగా ఆగిన సచివాలయ భవనాల పునఃనిర్మాణం కోసం ఇప్పటికే ఉన్నతాధికారులకు నివేదికలు పంపించాం. వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటాం. - శ్రీనివాసులు, పీఆర్ఏఈ

వాహనదారులు బిక్కుబిక్కు

రోడ్డు పక్కన ఎండిపోయి ఉన్న ఈ చెట్లు పలమనేరు-చౌడేపల్లె మార్గంలో కోగిలేరు వ్యవసాయమార్కెట్ కమిటీ సమీపంలోనివి. ఇవి పూర్తిగా ఎండిపోయి ఎప్పుడు కూలిపోతాయో తెలియని పరిస్థితి ఉందని వాహన చోదకులు భయాందోళన చెందుతున్నారు. అధికారులు ఎండిన వృక్షాలు తొలగించాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, పెద్దపంజాణి

బెదిరించి.. నిర్బంధించి

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: కుప్పంలో ఓ ప్రైవేటు ఫైనాన్స్‌లో పనిచేస్తున్న వ్యక్తిపై దాడి చేసి, అతడిని నిర్బంధించిన ఘటన ఆదివారం వెలుగు చూసింది. బాధితుడి వివరాల మేరకు.. మండల పరిధిలోని కుంజేగానూరుకు చెందిన అశోక్ కుప్పంలో ఓ ఫైనాన్స్ కంపెనీలో పని చేస్తున్నాడు. లావాదేవీల్లో భాగంగా కంపెనీకి చెందిన ఇద్దరు వ్యక్తులు అశోక్‌పై దాడి చేసి, మూడు రోజులుగా ఓ గదిలో నిర్బంధించినట్లు వివరించాడు. ఆదివారం బంధువులు కలుగజేసుకొని కుప్పంలో ఓ గదికి వేసిన తాళం పగలగొట్టి, అశోక్‌ను బయటకు తీసుకొచ్చి చికిత్స నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ విషయమై అర్బన్ సీఐ శంకరయ్యను వివరణ కోరగా.. బాధితుడి నుంచి ఫిర్యాదు అందిందని కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

రామకుప్పం న్యూస్‌టుడే: మండల పరిధిలోని నారాయణపురం తండాలో కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకొని ఓ మహిళని అరెస్టు చేసినట్లు పోలీసులు ఆదివారం తెలిపారు.

బిల్లు రాకుండా అడ్డుకుంటున్నారు

కల్లూరు (పులిచెర్ల), న్యూస్‌టుడే: గోకులం షెడ్డు నిర్మించుకుంటే బిల్లులు రాకుండా స్థానికంగా ఉన్న కొందరు, తహసీల్దారు జయసింహ, వీఆర్వో రెడ్డన్న అడ్డుకుంటున్నారని మొరవపల్లెకు చెందిన రమాదేవి, భర్త గంగరాజు ఆరోపించారు. ఆదివారం రెడ్డివారిపల్లె రెవెన్యూ పరిధిలో ఉన్న తమ పొలం వద్దకు చేరుకుని నిరసన వ్యక్తం చేశారు.

శ్రద్ధగా చదివితే ఉత్తమ ఫలితాలు

చౌడేపల్లె, న్యూస్‌టుడే: తల్లిదండ్రుల కష్టాన్ని, గురువులు చెప్పే మాటలను శ్రద్ధగా విని చదివితే జీవితంలో ఉన్నత స్థానాలకు వెళ్తారని పుంగనూరు సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శ్రీరాములనాయక్ అన్నారు. ఆదివారం ఆయన చౌడేపల్లెలో సదుం, సోమల, పుంగనూరు, చౌడేపల్లె మండలాల వసతి గృహాల విద్యార్థులకు ప్రేరణ తరగతులు నిర్వహించారు. పదో తరగతి పరీక్షల నేపథ్యంలో పిల్లలకు అవగాహన కల్పించారు. మోటివేషన్ స్పీకర్ రామమూర్తి, హెచ్ఎం నాగరాజ, వార్డెన్లు విజయ్‌భాస్కర్‌రెడ్డి, షరీఫ్‌బాషా, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

అమ్మ బాబోయ్.. గుంపు మళ్లీ వచ్చింది

కల్లూరు(కేకేపేట), న్యూస్‌టుడే: పులిచెర్ల మండలంలో నాలుగు నెలలుగా కనిపించని 16 ఏనుగుల గుంపు మళ్లీ రావడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఎల్లంకివారిపల్లె పంచాయతీ దిగువ మూర్తివారిపల్లె వ్యవసాయ పొలాల్లో పడ్డ 16 ఏనుగులు పంటలను తొక్కి ధ్వంసం చేశాయి. పలువురి రైతులకు చెందిన మామిడి చెట్లను విరిచేశాయి. ఈ విషయమై అటవీ విభాగం రేంజర్ థామస్‌కుమార్ మాట్లాడుతూ.. ఏనుగులు ప్రస్తుతం తిరుపతి జిల్లా భీమవరం అటవీ ప్రాంతానికి చేరుకున్నాయని తెలిపారు.

← ఏనుగుల దాడిలో పాడైన పంట

శుద్ధజలం అందించండి సారూ..!

✶ పాఠశాలల్లో అలంకారప్రాయంగా యంత్రాలు
✶ విద్యార్థులకు తప్పని తాగునీటి కష్టాలు

మఠం ప్రాథమిక పాఠశాలలో నిరుపయోగంగా శుద్ధజల యంత్రం

శాంతిపురం, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వం ప్రచార ఆర్భాటంగా 'నాడు-నేడు' కార్యక్రమం ద్వారా చేపట్టిన పాఠశాలల అభివృద్ధిలో భాగంగా.. శుద్ధజలం యంత్రాలను సరఫరా చేసింది. ఒక్కో యంత్రానికి రూ. 50 వేలనుంచి రూ. 2 లక్షల వరకు వెచ్చించారు. దాదాపు నాలుగేళ్ల కిందట పాఠశాల్లో ఏర్పాటు చేసిన యంత్రాలు నెలల వ్యవధిలోనే పాడైపోయాయి. కొన్ని చోట్ల ఏర్పాటు చేయకుండానే మూలకు చేరాయి.

మరమ్మతుకు నోచుకోక

శుద్ధజల యంత్రాల ఏర్పాటును ప్రైవేటు ఏజెన్సీకి అప్పగించారు. చాలా చోట్ల భవనాల మరమ్మతులు, కొత్తగా నిర్మాణాల కారణంగా యంత్రాలను నెలల తరబడి ఆరుబయట పడేశారు. ఏజెన్సీ ఇష్టారాజ్యంగా స్థాపించిన యంత్రాలకు విద్యుత్తు వసతితో పాటు నీటి సరఫరా పైపులను సక్రమంగా ఏర్పాటు చేయలేదు. దీంతో యంత్రాలు దెబ్బతిన్నాయి. ఫలితంగా విద్యార్థులకు శుద్ధజలం దూరమైందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. మరమ్మతుల కోసం సంబంధిత ఏజెన్సీకి పలుమార్లు తెలిపినా ఫలితం లేదని ఉపాధ్యాయులు అంటున్నారు.

6,840 మంది ఉన్నా..

మండల పరిధి 84 ప్రాథమిక, ఒక్క ప్రాథమికోన్నత, 20 ఉన్నత పాఠశాలల్లో 6,840 మంది విద్యార్థులు చదువులు సాగిస్తున్నారు. శుద్ధజలం అందుబాటులో లేనందున.. ఇతరత్రా అవసరాలకు వినియోగించాల్సిన నీటితోనే పిల్లలు దాహార్తిని తీర్చుకోవాల్సిన దుస్థితి ఎదుర్కొంటున్నారు. పలుచోట్ల ఇళ్లలో నుంచి సీసాల్లో అరా.. కొరాగా తెచ్చుకున్న నీటితోనే విద్యార్థులు దప్పికను తీర్చుకొంటున్నారు. అధికారులు స్పందించి యంత్రాలను బాగు చేయించాలని కోరుతున్నారు.

(c) eenadu

ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చిత్ర పటం వద్ద నివాళి అర్పిస్తున్న అధికారులు

ఉయ్యాలవాడ జీవితం స్ఫూర్తిదాయకం

అమలాపురం కలెక్టరేట్: దేశ ప్రజల హక్కుల కోసం ప్రాణాలను అర్పించిన ఉయ్యాల వాడ నరసింహారెడ్డి జీవితం స్ఫూర్తిదాయకమని డీఆర్వో కె.మాధవి అన్నారు. ఆదివారం ఉయ్యాలవాడ వర్ధంతిని కలెక్టరేట్‌లో అధికారికంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. కలెక్టరేట్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలోచనలు విరియాలి.. ఆవిష్కరణలు మెరవాలి..!

ప్రతి విద్యార్థిలో ఏదో ఒక ప్రతిభ దాగి ఉంటుంది. పాఠశాల స్థాయిలోనే సృజనాత్మకత వెలికితీసేందుకు 'ఈనాడు వైజ్ఞానిక ప్రదర్శన' నిర్వహిస్తోంది. విద్యార్థి ఆలోచనలతో ప్రయోగాలు చేసేలా ప్రోత్సహిస్తోంది. ఇందులో భాగంగా పోలీసు కన్వెన్షన్ హాల్, జిల్లాపోలీస్ లైన్ (సుబ్రహ్మణ్యస్వామి కల్యాణ మండపం వద్ద) జాంపేట, రాజమహేంద్రవరంలో ఫిబ్రవరి 26వ తేదీన మెగాసైన్స్ ఫెయిర్ నిర్వహిస్తోంది.

SRI GOWTHAMI KID SCHOOL Learning for Life
RAJAHMAHENDRAVARAM
GANDHIPURAM | SRIRAMNAGAR
93486 55501 | 93486 55503

ఈనాడు

నమోదుకు: 77027 79616
సమయం: ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గం॥ల వరకు..

నిబంధనలు.. ● 6 నుంచి 10 తరగతుల విద్యార్థులకు మాత్రమే. ● ప్రాజెక్టును ముందుగా నమోదు చేసుకోవాలి. ● ఒక ప్రాజెక్టుకి ఇద్దరు విద్యార్థులకు అనుమతి. ● పాఠశాల/ బ్రాంచ్‌కి ఒక ప్రాజెక్టుకు మాత్రమే అనుమతి. ● మొదటి ముగ్గురు విజేతలకు బహుమతులు ఉంటాయి. ● పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్స్ ప్రదానం. **రిజిస్ట్రేషన్ చివరి తేదీ : ఫిబ్రవరి 24**

ఊరి సొమ్ము... ఊడ్చేస్తున్నారు..!

పంచాయతీల్లో సిబ్బంది చేతి వాటం

న్యూస్‌టుడే, అమలాపురం కలెక్టరేట్

పంచాయతీ నిధులు కర్పూరంలా కరిగిపోతున్నాయి. అభివృద్ధి పనులకు వెచ్చించాల్సిన సొమ్మును కొందరు స్వాహా చేస్తున్నారు. బాధ్యులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవడానికి ఉన్నతాధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. గుట్టు బయట పడితే నాయకులు అండతో గ్రామ స్థాయిలోనే సర్దుబాటు చేసేలా చీకటి ఒప్పందాలు చేసుకుంటున్నారు. ఈ చర్యలను ఉన్నతాధికారులు సైతం ప్రోత్సహిస్తుండటంతో వారి ఆగడాలకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది.

సచివాలయాలు ఉన్నా..

గత వైకాపా ప్రభుత్వం ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయాలు అలంకార ప్రాయంగా మారాయి. వీటి ద్వారా డిజిటల్ లావాదేవీలను అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పిన గత ప్రభుత్వం సౌకర్యాలు కల్పించడంలో విఫలమైంది. వీటిని కేవలం పథకాలకు లబ్ధిదారుల ఎంపిక, సర్వేలకు పరిమితం చేశారు.

✦ అమలాపురం మండలం భట్నవిల్లి పంచాయతీలో ఇంటి పన్నుల సొమ్ము పక్కదారి పట్టించారు. ఇటీవల పన్ను బకాయిదారులకు తాకీదులు ఇవ్వగా తాము అప్పటికే చెల్లించామని యజమానులు చెప్పడంతో సిబ్బంది మోసం బయటపడింది. రూ.3.50 లక్షలు సొంతానికి వినియోగించినట్లు గుర్తించారు.

కొన్ని అక్రమాలు

✦ రాజోలు మండలం తాటిపాక పంచాయతీ పరిధిలో ఇంటి పన్నుల వసూళ్లలో అక్రమాలు జరిగాయని ప్రస్తుత ఉప సర్పంచి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారులు విచారణ చేసి అవినీతి వాస్తవమేనని తేల్చారు.

✦ కాట్రేనికోన మండలం బ్రహ్మసమేధ్యం పంచాయతీలో కంప్యూటర్ ఆపరేటర్.. కార్యదర్శి సంతకాన్ని ఫోర్జరీ చేసి స్వచ్ఛ భారత్ నిధులు రూ.55 లక్షలు కాజేశారు. ఈ అక్రమం బయటకు రావడంతో స్థానిక నాయకుల సమక్షంలో రాజీ ప్రయత్నాలు జరిగాయి.

పర్యవేక్షణ లేకనే..

గ్రామాల్లో వ్యాపార, వాణిజ్య దుకాణాల లైసెన్సుల రుసుం, తాగునీరు, వినోదం, పన్నులు, గదుల అద్దె, సంతలు, రోజువారీ మార్కెట్ నిర్వహించే దుకాణాల నుంచి పన్నులు వసూలవుతాయి. వీటిపై అధికారుల పర్యవేక్షణ కొరవడుతోంది. గ్రామాల్లో పారిశుద్ధ్యం, తాగునీటి సమస్యలు వెంటాడుతున్నా.. సమస్యలు పరిష్కరించినట్లు, సదుపాయాలు కల్పించినట్లు దొంగ బిల్లులతో కొందరు నిధులు స్వాహా చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

2025-26లో విడుదలైన ఆర్థిక సంఘం నిధులు

గ్రామ పంచాయతీలు:	344
టైడ్ నిధులు:	రూ.15,88,39,074
బేసిక్ గ్రాంట్:	రూ. 10,58,92,722
ఇంటి పన్ను డిమాండ్:	రూ.50 కోట్లు

ఇంటి, దుకాణాల పన్ను వసూలు చేసే సమయంలో సిబ్బంది డిమాండ్ నోటీసు ఇచ్చి నేరుగా నగదు తీసుకుని రికార్డులో నమోదు చేయకుండా సొంతానికి వాడుకుంటున్నారు. గ్రామాల అభివృద్ధికి కేంద్రం కేటాయిస్తున్న ఆర్థిక సంఘం నిధులను కొంత మంది కార్యదర్శుల కుమ్మక్కై దుర్వినియోగం చేస్తున్నారు. ఏటా రూ.కోట్లలో నిధులు వస్తున్నా, తమకు తాగునీరు రావడం లేదని, రహదారులు లేవని, కనీస వసతులు కల్పించాలని ప్రతి సోమవారం గ్రామాల నుంచి పదుల సంఖ్యలో ఫిర్యాదులు వస్తున్నాయి.

దుర్వినియోగం ఇలా..

నిరూపణ జరిగితే చర్యలు

పంచాయతీల్లో నిధులు దుర్వినియోగమైనట్లు నిరూపణ జరిగితే చర్యలు తప్పవు. ఇటీవల జిల్లాలోని కొన్ని పంచాయతీల్లో అవకవతవకలు జరిగినట్లు మా దృష్టికి వచ్చింది. వాటిపై ఫిర్యాదులు వస్తే విచారణ చేసి చర్యలు తీసుకుంటాం.

- శాంత లక్ష్మి, డీపీవో

ఉలికిపాటు..!

వణికించిన కిడ్నీ మహమ్మారి

ఈనాడు, రాజమహేంద్రవరం, న్యూస్‌టుడే, కంబాలచెరువు: ప్రశాంత రాజమహేంద్రవరం నగరాన్ని ఒక్కసారి కిడ్నీ మహమ్మారి వణికించింది. చౌడేశ్వరనగర్, స్వరూప్ నగర్, ఆర్టీసీ కార్యాలయ వెనుక ప్రాంతానికి చెందిన 14 మంది ఈ నెల 15వ తేదీ తర్వాతి రోజు నుంచి ఒకే తరహా కిడ్నీ సమస్యలతో ఆసుపత్రులపాలయ్యారు. వీరిలో ఇద్దరు చికిత్స పొందుతూ మృతి చెందగా మరో 12 మంది వివిధ ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. బాధితకుటుంబాలన్నీ కోరుకొండ మండలం నర్సాపురానికి చెందిన గణేష్ అనే పాల వ్యాపారి నుంచి రోజూ పాలు కొనుగోలు చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. పాలల్లో కలుషితం జరిగి ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

చౌడేశ్వరనగర్‌లో ఆదివారం రాత్రి వివరాలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది

బాధితులు వీరే..

ఎన్.శేషగిరి (72), బి.అనంతలక్ష్మి (72), జి.వెంకటలక్ష్మి, జి.వెంకటేశ్వరరావు (75), జి.సూర్యారావు (80), ఆర్.సూర్యకుమారి (62), కె.సత్యనారాయణ (75), బి.వీరలక్ష్మి (65), రాధాకృష్ణమూర్తి (74), ఈడీ రమణి (58), జయకృష్ణరాజ్ (3), నగరంలోని కొత్తపేట (అన్నపూర్ణమ్మపేట రైల్వేగేటు) ప్రాంతానికి చెందిన ఐదు నెలల శిశువు రుహాన్య ఉన్నారు. వీరంతా చౌడేశ్వరనగర్, స్వరూప్ నగర్‌కు చెందినవారే. వీరిలో 9 మంది ఐసీయూలో చికిత్స పొందుతున్నారు.

50 మంది నుంచి సేకరణ.. 126 ఇళ్లకు సరఫరా

కోరుకొండ మండలం నర్సాపురానికి చెందిన పాల వ్యాపారి గణేష్ ఆ పరిసర ప్రాంతాల్లోని దాదాపు 50 మంది నుంచి పాలు సేకరిస్తున్నట్లు అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. సేకరించిన పాలను దాదాపు 126 ఇళ్లకు రోజూ ఇస్తున్నట్లు తెలుసుకున్నారు. ఈ మేరకు అందరి ఇళ్ల వివరాలు సేకరించగా ఆదివారం రాత్రి 9.30 వరకు 36 చిరునామాలు తెలుసుకున్నారు. పాల వ్యాపారి గణేష్ ఇంటి పరిసరాలతోపాటు, సమీపంలో అతను పాలు సేకరిస్తున్న పాడి రైతులు తమ పశువులను పెంచే విధానం, దాణా ఏమిస్తున్నారనే అంశాలంపై విచారణ ప్రారంభించారు.

సౌకర్యాలు లేకపోయినా రిఫర్ చేశారు..

నా మనుమడికి మూడేళ్లు కూడా నిండలేదు. జీవచ్ఛవంలా పడున్నాడు. రెండేళ్ల నుంచి గణేష్ వద్దే పాలు పోయించుకుంటున్నాం. ఈనెల 17న వాంతులు, విరేచనాలుగా మొదలైంది. 19న పరిస్థితి తీవ్రమైంది. కాకినాడ జీజీహెచ్‌లో డయాలసిస్ ఇతర వసతులు ఉన్నాయని మమ్మల్ని అక్కడికి పంపారు. అక్కడ కనీసం పట్టించుకోలేదు. డయాలసిస్ వంటి వసతులు లేవని చెప్పారు. దీంతో నగరంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చాం. కాకినాడకు వెళ్లొచ్చేసరికి ఆరు గంటలు వృథా అయ్యింది. ఆరోజు నుంచి ఇప్పటికి మూడుసార్లు డయాలసిస్ చేశారు. పరిస్థితి క్రిటికల్‌గానే ఉందని చెబుతున్నారు. కాకినాడలో సౌకర్యాలు లేవని రాజమహేంద్రవరం ఆసుపత్రి సిబ్బందికి తెలియదా..? మూడేళ్ల చిన్నారిని అలా చూస్తుంటే పరిస్థితి భరించలేకపోతున్నాం.

- ప్రకాశరావు, బాలుడి తాతయ్య

అయిదు నెలల పాపకు డయాలసిస్

అన్నపూర్ణమ్మపేట రైల్వేగేటు వద్ద కొత్తపేటలో ఉంటాం. మా సోదరి కుమార్తె ఎం.రుహాన్యకు అయిదు నెలలు. రెండు నెలల నుంచి గణేష్ వద్ద పాలు పోయించుకుంటున్నాం. యూరిన్ ఆగిపోవడంతో ఈనెల 16న నగరంలోని దానవాయిపేటలో చిన్నపిల్లల ఆసుపత్రిలో చేర్చాం. అక్కడ కిడ్నీ ఇన్‌ఫెక్షన్ వచ్చిందని, డయాలసిస్ అవసరమని చెప్పడంతో మరో ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లాం. అక్కడ చికిత్స అందిస్తున్నారు. క్షణక్షణం భయంగా ఉంది.

- ఓంకార్‌సాయి, చిన్నారి మేనమామ

విద్యార్థీ.. విజయీభవ..

నేటి నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: ఇంటర్మీడియట్ పరీక్షలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. దీనికి సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి చంద్రశేఖర బాబు తెలిపారు. 40 కేంద్రాల్లో విద్యార్థులు పాటిస్తారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు పరీక్షలు జరుగుతాయి. ఉదయం 8.30 గంటలకే కేంద్రాల్లోకి అనుమతిస్తారు. 9 గంటలకు ఒక్క నిమిషం ఆలస్యమైనా అవకాశం ఉండదు. కొన్నికేంద్రాలు ప్రధాన రహదారికి దూరంగా ఉన్నచోట్ల విద్యార్థులు ముందుగానే వెళ్తే సకాలంలో చేరుకోవచ్చు. ● ఉదాహరణకు ముమ్మిడివరం ఠాణేలంక రోడ్డులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల కేంద్రం ప్రధాన రహదారికి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో ఉంది. లోపలికి వెళ్లేందుకు ఆటో సౌకర్యంలేని ఇటువంటి చోట్ల ముందుగానే చేరుకోవాల్సి ఉంటుంది.

ముమ్మిడివరంలోని బెంచీలపై హాల్‌టికెట్ నంబర్లు వేస్తున్న అధ్యాపకులు

జిల్లాలో వివరాలు..

- జిల్లాలో మొత్తం కళాశాలలు: 124
- పరీక్ష కేంద్రాలు: 40
- ప్రథమ సంవత్సర విద్యార్థులు: 13,131
- ద్వితీయ ఏడాది: 12,756
- ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు: 763
- చీఫ్ సూపరింటెండెంట్, డీఓలు: 80
- సిట్టింగ్ స్క్వాడ్ : 3
- ఫ్లైయింగ్ స్క్వాడ్: 2
- పరీక్ష పేపర్ల స్టోరేజీ పాయింట్లు: 14

ప్రశాంతంగా పరీక్షలు రాసేందుకు విద్యుత్తు, పర్నీచర్, తాగునీరు, మరుగుదొడ్లు వంటి మౌలిక వసతులు కల్పించామన్నారు.

ముందుగానే చేరుకోవాలి

ఇంటర్మీడియట్ పరీక్షల్లో నిమిషం నిబంధన ఖచ్చితంగా

పరీక్షల నిర్వహణకు పక్కా ఏర్పాట్లు

ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేశాం. ప్రతి కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలి.

- కె.చంద్రశేఖరబాబు, డీఐఈఓ

నేడు వినతుల స్వీకరణ

అమలాపురం కలెక్టరేట్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లో ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు కలెక్టరేట్ అధికారులు తెలిపారు. కలెక్టర్ మహేష్‌కుమార్, జేసీ నిశాంతితో పాటుగా అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజలు తమ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వచ్చి పరిష్కార మార్గాలు పొందాలని సూచించారు.

25న బడి బస్సుల భద్రతపై సమావేశం

అమలాపురం గ్రామీణం, న్యూస్‌టుడే : బడి బస్సుల భద్రతపై ఈ నెల 25న నిర్వహించే సమావేశానికి పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు, విద్యార్థుల తల్లిదండ్రులు హాజరు కావాలని జిల్లా రవాణాధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు కోరారు. ఇటీవల జరిగిన బడి బస్సుల ప్రమాదాలకు డ్రైవర్ల నిర్లక్ష్యమే కారణమన్నారు. వీటిని అరికట్టేందుకు పోలీసు, రవాణా, విద్యాశాఖ అధికారులతో సంయుక్త సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో మధ్యాహ్నం 3 గంటలకు సమావేశం జరుగుతుందన్నారు. మోటారు వాహనాల చట్టం నిబంధనల అమలుపై పూర్తిస్థాయిలో చర్చించనున్నట్లు తెలిపారు.

రాజమహేంద్రవరం - కొవ్వూరు మార్గం

గామన్ వంతెన మళ్లీ మూసేశారు.

ఒకవైపే రాకపోకలు

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే : నాలుగు వరుసల వంతెన (గామన్) వార్షిక నిర్వహణలో భాగంగా ఓ వైపు మాత్రమే రాకపోకలకు అనుమతిస్తున్నారు. ఆదివారం ఉదయం నుంచి రాజమహేంద్రవరం నుంచి కొవ్వూరు వెళ్లే దారిని మూసివేశారు. దీంతో రాజమహేంద్రవరం వెళ్లే దారిలోనే ఎదురుబదురుగా (రెండు వరుసల్లో) ప్రయాణాలకు ఏర్పాట్లు చేశారు. 24వ తేదీ రాత్రికి బేరింగుల తనిఖీలు, అవసరమైన చర్యలు తీసుకోనున్నామని రభశా అధికారులు తెలిపారు. 75వ స్తంభానికి బేరింగ్ పాడవడంతో కొత్త సామగ్రిని నిపుణులు అమర్చనున్నారు. రాజమహేంద్రవరం వైపు తనిఖీలు పూర్తి చేయగా తాజాగా మళ్లీ రెండు రోజుల పాటు ఆ పనులు చేయాల్సి వచ్చింది. అయితే వార్షిక నిర్వహణ పనుల కారణంగా రాకపోకలకు అవస్థలు ఎదురవుతున్నాయి. ప్రత్యామ్నాయ ఏర్పాట్ల ద్వారా ప్రమాదాలకు తావు లేకుండా పోలీసు యంత్రాంగం శ్రద్ధ చూపాలని వాహనదారులు కోరుతున్నారు.

కసరత్తులు చేసి.. కండలు పెంచి

దేహదారుఢ్య పోటీల్లో సత్తా

న్యూస్‌టుడే, మసీదు సెంటర్(కాకినాడ)

దేహదారుఢ్య పోటీల్లో కాకినాడ పీఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరుస్తూ పతకాలు సాధిస్తున్నారు. పేదరికం ప్రతిభకు అడ్డుకాదని నిరూపిస్తున్నారు. కసరత్తులు చేస్తూ తమ దేహాన్ని మలుచుకుంటూ కండల వీరులుగా మారారు. అనేక పోటీల్లో పాల్గొని పతకాలు సాధిస్తున్నారు. ఇటీవల నన్నయ్య విశ్వవిద్యాలయంలో జరిగిన పోటీల్లో కాకినాడ పీఆర్ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థులు బెస్ట్ ఫిజిక్ మెన్ టీమ్ ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నారు. పలువురు వర్సిటీ జట్టుకు ఎంపికయ్యారు. భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధిస్తామని వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

రోజూ 8 గంటల సాధన

డిగ్రీ మొదటి ఏడాది చదువుతున్నా. దేహదారుఢ్యంపై చిన్నతనం నుంచి మక్కువ. గత ఐదేళ్ల నుంచి బాడీ బిల్డింగ్ చేస్తున్నా. గతేడాది నన్నయ్య విశ్వవిద్యాలయంలో అంతర్ కళాశాలల పోటీల్లో రజత పతకం సాధించా. పలు పోటీల్లోనూ సత్తా చాటాను. జిమ్‌లో ప్రతిరోజు ఉదయం సాయంత్రం కలిపి 8 గంటలు సాధన చేస్తా. చికెన్, చేప, చపాతి, కాయగూరలు, గుడ్లు వంటి పోషకాహారం తీసుకుంటా. మాది వ్యవసాయ కుటుంబం. ఖాళీ సమయంలో ఎలక్ట్రికల్ పని చేస్తా. వచ్చిన డబ్బులను పోషకాహారానికి వినియోగించుకుంటాను. ఆలిండియా యూనివర్సిటీ స్థాయి పతకం సాధించడంతో పాటు, రైల్వేలో ఉద్యోగం సాధించాలనేది నా లక్ష్యం.

- సాయిప్రశాంత్, కాండ్రకోట

నాన్న ప్రోత్సాహంతో..

బీఏ మొదటి ఏడాది చదువుతున్నా. మాది రాజమహేంద్రవరం. నాన్న రాజగోపాల్ తాపీ మేస్త్రి. ఆయన ప్రోత్సాహంతో గత 8 ఏళ్ల నుంచి బాడీ బిల్డింగ్‌లో శిక్షణ తీసుకుంటున్నా. ప్రతిరోజూ మూడుగంటల పాటు జిమ్‌లో కసరత్తులు చేస్తా. చికెన్, గుడ్లు, ఓట్స్, ప్రొటీన్ షేక్ వంటి పోషకాహారం తీసుకుంటా. గతేడాది అంతర్ కళాశాలల దేహదారుఢ్య పోటీల్లో పాల్గొని బంగారు పతకం సాధించా. కేరళలో జరిగిన పోటీల్లో పాల్గొన్నా. వచ్చే నెలలో విశాఖలో జరిగే ఆల్‌ఇండియా పోటీలకు ఎంపికయ్యా. క్రీడాకోటాలో ఉద్యోగం సాధించడంతో పాటు నాన్న కోరిక మేరకు జాతీయస్థాయి పతకం సాధించడానికి కృషి చేస్తున్నా.

- వెంకటసూర్య ప్రకాష్, రాజమహేంద్రవరం

నాలుగేళ్ల నుంచి శిక్షణ

మాది కాకినాడ. మధ్యతరగతి కుటుంబం. గత నాలుగేళ్ల నుంచి బాడీ బిల్డింగ్ చేస్తున్నా. ప్రతిరోజు ఆరు గంటల పాటు జిమ్‌లో కసరత్తులు చేస్తా. చికెన్, గుడ్లు, ఓట్స్, ప్రొటీన్, పాల కూర తీసుకుంటా. ఖాళీ సమయంలో ఓ డెలివరీ సంస్థలో పనిచేస్తా. అమ్మ కూడా సహాయం చేస్తుంది. గతంలో నన్నయ్య విశ్వవిద్యాలయం పరిధిలో జరిగిన అంతర్ కళాశాలల పోటీల్లో రెండు బంగారు పతకాలు సాధించా. రెండుసార్లు ఆల్‌ఇండియా పోటీల్లో పాల్గొన్నా. దాతలు సహకారం అందిస్తే మరింత ప్రతిభ కనబరిచి పతకాలు సాధించి దేశానికి పేరుప్రఖ్యాతలు తీసుకొస్తా. ఆర్మీలో చేరాలనేది నా ధ్యేయం.

- విజయ్ చాముండేశ్వర్, కాకినాడ

శరవేగంగా అక్విడక్టు మరమ్మతులు

న్యూస్‌టుడే, పి.గన్నవరం

పి.గన్నవరం వద్ద వైనతేయ గోదావరి నదిపై డొక్కా సీతమ్మ అక్విడక్టు రోడ్డు వంతెన మరమ్మతు పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఈ నెల 10న ఇక్కడ పనులు మొదలు పెట్టారు. దీనికి సంబంధించి 34 ఎక్స్‌పేన్షన్ జాయింట్లలో కొత్తగా రూపకల్పన చేసిన ఇనుపకడ్డీలు అమర్చేందుకు వాటివద్ద ప్రస్తుతం ఉన్న కాంక్రీటును మూడు ట్రాక్టర్ల బ్రేకర్లతో విచ్ఛిన్నం చేస్తున్నారు. ఇంతవరకు 20 ఎక్స్‌పేన్షన్ జాయింట్ల వద్ద కాంక్రీటు పనులు పూర్తయ్యాయి. 15 జాయింట్ల వద్ద నూతనంగా తయారు చేసిన ఇనుపకడ్డీలను అమర్చారు. మొత్తం 34 జాయింట్లలో ఇనుపకడ్డీలను అమర్చి వాటిమధ్యలో రబ్బరుతో కూడిన స్ట్రిప్ సీళ్లు అమర్చి కొత్తగా కాంక్రీటుతో పూడ్చే పనులు ఈ నెలాఖరుకు నూరుశాతం పూర్తవుతాయని జలవనరులశాఖ ఏఈఈ బెహరా రమేష్‌బాబు తెలిపారు. మరోవైపు రోడ్డుపై దెబ్బతిన్న వేరింగ్‌కోట్‌ను తొలగించి కొత్తగా వేస్తున్నారు. మొత్తం 300 చదరపు మీటర్ల మేర వేరింగ్‌కోట్ దెబ్బతిందని ఏఈఈ వెల్లడించారు. ఇదికాకుండా పాదచారులు నడిచే మార్గంలో దెబ్బతిన్న 80 ఆర్‌సీసీ (రీయిన్‌ఫోర్స్‌మెంట్ సిమెంట్ కాంక్రీటు) బల్లలు స్థానే కొత్తవి ఏర్పాటు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ముందుగా ప్రకటించిన 42 రోజుల గడువులో పూర్తిచేసి అనంతరం దీనిపై ఎప్పటిలాగానే ట్రాఫిక్‌ను పునరుద్ధరిస్తామన్నారు.

ఇనుపకడ్డీలు అమర్చేందుకు కాంక్రీటును బద్దలుకొడుతున్న సిబ్బంది

వైభవంగా.. శ్రీవారి బ్రహ్మోత్సవం

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: ఆత్రేయపురం లక్ష్మీ వేంకటేశ్వరుని బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా ఆరంభమయ్యాయి. పండితులు ఖండవిల్లి సూర్య నారాయణాచార్యులు, సుదర్శనం సూర్య పురుషోత్తమ సత్యసాయి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, దీక్షాధారణ, పంచామృతాభిషేకం, అకల్మష హోమం, మృత్సం గ్రహణం(పుట్టమన్ను తేవడం), అగ్ని మథనం, ప్రతిష్ఠాపన, వాస్తుపూజ, హోమం, ధ్వజారోహణ కార్యక్రమాలు కనుల పండువగా సాగాయి. రాత్రి స్వామి వారు శేష వాహనంపై భక్తులకు అభయ ప్రదానం చేశారు. పారిశ్రామిక వేత్త శ్రీ వెంకట సత్య రాజ్యలక్ష్మి ఛారిటబుల్ ట్రస్టు అధినేత పాతపాటి వెంకట సత్యనారాయణరాజు దంపతులు స్వామి వారికి పట్టు వస్త్రాలు అందజేశారు. దేవస్థానం మేనేజర్ గోరింట వినయ్‌కుమార్ రాజు, ప్రధాన అర్చకులు వాడపల్లి పవన్ దీక్షితులు తదితరులు పాల్గొన్నారు.

48 గంటల్లోనే జాబ్‌కార్డు

మీ కోసం

కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకంలో పలు మార్పులు తీసుకొచ్చింది. పథకం పేరును వికసిత్ భారత్ గ్రామీణ రోజ్‌గార్ మిషన్ (వీబీ జీ రామ్ జీ)గా మార్పు చేస్తూ పనిదినాలు 125 రోజులకు పెంచింది. గతంలో జాబ్‌కార్డు పొందాలంటే రోజుల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి ఉండేది. అలాంటి విధానానికి స్వస్తి పలుకుతూ కొత్త జాబ్‌కార్డు కావాలనుకునే వారికి సేవలను సులభతరం చేసింది. ప్రస్తుతం దరఖాస్తు చేసిన 48 గంటల్లోనే జాబ్‌కార్డును జారీ చేస్తున్నారు. మరోవైపు అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు ఈకేవైసీని అమల్లోకి తీసుకొచ్చింది. రెండు, మూడుచోట్ల పేర్లు నమోదు చేయించుకోవడం, ఒకరికి బదులు మరొకరు పనులు చేయడం.. పనులకు రానివారి పేర్లపై మస్తర్లు వేయడం తదితర అక్రమాలకు సాంకేతిక పరిజ్ఞానంతో అడ్డుకట్టవేసింది. కొత్త జాబ్‌కార్డు కావాలనుకునేవారు నేరుగా ఉపాధిహామీ క్షేత్రసహాయకుడిని సంప్రదిస్తే ఈకేవైసీ పూర్తి చేసి దరఖాస్తు చేస్తారు. ఉన్నతాధికారుల పరిశీలించి జాబ్‌కార్డును జారీ చేస్తారు.

- న్యూస్‌టుడే, అమలాపురం గ్రామీణం

ఈనాడు

దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి

Cell: 80085 97607

ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి

Cell: 80082 34669

వైకాపా ఓ విష వృక్షం

మంత్రి సుభాష్

అమలాపురం పట్టణం న్యూస్‌టుడే: వైకాపా నాయకులు రాష్ట్రానికి విష వృక్షంలా తయారయ్యారని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ దుయ్యబట్టారు. తిరుమల వేంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదాన్ని అపవిత్రం చేసి మాజీ ముఖ్యమంత్రి జగన్ ఘోర అపచారం చేశారన్నారు. ఆదివారం అమలాపురంలోని తెదేపా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంపీ హరీష్‌మాధుర్ మాట్లాడుతూ వైకాపా 11 సీట్లకు దిగజారినా తీరు మారలేదన్నారు. ఎమ్మెల్యే ఆనందరావు మాట్లాడుతూ వైకాపాకు హిందూ దేవుళ్లు, దేవాలయాల మీద భక్తి లేదన్నారు. జగన్‌కు విలువలు లేవని, ఆ పార్టీకి భవిష్యత్తులో ఒక్క సీటైనా వస్తుందో.. లేదో చూడాలన్నారు. ప్రభుత్వ విప్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిరాజు మాట్లాడుతూ వైకాపా నాయకులు దేవుడిని రాజకీయాల కోసం వాడుకుంటున్నారన్నారు. ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం మాట్లాడుతూ వైకాపా అరాచకాలను వేంకటేశ్వరస్వామి చూసుకుంటారన్నారు. కార్యక్రమంలో తెదేపా జిల్లా అధ్యక్షుడు గుత్తుల సాయి, జిల్లా ప్రధాన కార్యదర్శి గంధం పల్లంరాజు, అముడా ఛైర్మన్ అల్లాడ స్వామినాయుడు, తెదేపా, జనసేన, భాజపా నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మంత్రి సుభాష్, చిత్రంలో ఎంపీ హరీష్‌మాధుర్, ఎమ్మెల్యేలు ఆనందరావు, దాట్ల బుచ్చిరాజు, ఎమ్మెల్సీ రాజశేఖరం, తెదేపా, జనసేన, భాజపా నాయకులు

జగన్ బృందానికి యోగా అవసరం

మానసికంగా ఇబ్బంది పడుతున్న మాజీ ముఖ్యమంత్రి జగన్‌తో పాటు ఆ పార్టీ నాయకులకు యోగా ఎంతో అవసరమని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఎద్దేవా చేశారు. ఆరోగ్యం కోసం అందరూ యోగా చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చెబితే దానిపైనా వైకాపా నాయకులు అసత్య ప్రచారం చేస్తున్నారన్నారు. వైకాపా నాయకులు చెప్పులు వేసుకుని వేంకటేశ్వరస్వామివారి ఫొటోలను శాసన మండలిలో వ్యంగంగా ప్రదర్శించి తర్వాత వాటిని విసిరేశారన్నారు. అప్పటి తితిదే ఛైర్మన్ సుబ్బారెడ్డి సతీమణి జగన్‌రెడ్డి రక్షక గోవిందా.. అన్నందుకు జగన్ రక్షకుడుగా కాకుండా భిక్షకుడిగా మారారన్నారు. ప్రతిపక్ష హోదా కావాలని భిక్షాటన చేసే పరిస్థితికి వచ్చారన్నారు.

నేడు 'డయల్ యువర్ సీఎండీ'

విశాఖపట్నం, న్యూస్‌టుడే: విద్యుత్తు సంబంధిత సమస్యలను మరింత వేగవంతంగా పరిష్కరించే లక్ష్యంతో విశాఖలోని ఈపీడీసీఎల్ కార్యాలయంలో సోమవారం 'డయల్ యువర్ సీఎండీ' కార్యక్రమం నిర్వహించనున్నట్లు సంస్థ సీఎండీ ఇమ్మడి పృథ్వీతేజ్ ఒక ప్రకటనలో తెలిపారు. సంస్థ పరిధిలోని 13 జిల్లాలకు చెందిన వినియోగదారులు 8688400499 ఫోన్ నెంబర్ ద్వారా తమ సమస్యలను తెలియజేయవచ్చునని పేర్కొన్నారు. ఉదయం 10.30 నుంచి 11.30 వరకు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. విద్యుత్తు సరఫరాలో తరచూ అంతరాయాలు, హెచ్చుతగ్గులు, కొత్త సర్వీసుల జారీ, సరఫరా పునరుద్ధరణలో జాప్యం, ట్రాన్స్‌ఫార్మర్ల మార్పిడి తదితర సమస్యలపై ఫిర్యాదులను నేరుగా తన దృష్టికి తీసుకురావొచ్చని చెప్పారు.

(c) eenadu

కడలి నేస్తమా.. కళేబరమైతివేమ్మా..!

కాకినాడ తీరంలో మృతి చెందిన ఆలివ్ రిడ్లీ తాబేళ్లు కనిపిస్తున్నాయని, ఇది పర్యావరణం, జీవవైవిధ్యానికి పెను ముప్పుగా భావించాలని, వెంటనే తాబేళ్ల సంరక్షణ చర్యలు చేపట్టాలని సామాజిక కార్యకర్తలు రంబాల సతీష్, మంగ, వరలక్ష్మి, రమ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం కాకినాడ తీరంలో అరుదైన ఆలివ్ రిడ్లీ తాబేళ్ల మృత కళేబరాల వద్ద ప్లకార్డులతో నిరసన తెలిపి.. సంరక్షణ చర్యలు చేపట్టాలని తీరంలో ర్యాలీ నిర్వహించారు. తీరంలో పరిశ్రమల నుంచి భారీగా కలుషిత జలాలను శుద్ధిచేయకుండా నేరుగా సముద్రంలో వదిలిపెడుతుండడంతో మత్స్యసంపదతోపాటు తాబేళ్లకు ముప్పు వాటిల్లుతోందన్నారు. – న్యూస్‌టుడే, రమణయ్యపేట(కాకినాడ గ్రామీణం)

పిల్లల పండగ.. ఆనందం నిండుగా

పెద్దాపురం పట్టణం లూథరన్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఆదివారం నియోజకవర్గస్థాయిలో నిర్వహించిన పిల్లల పండగ ఆకట్టుకుంది. పెద్దాపురం నియోజకవర్గంలోని 18 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. వారు ప్రదర్శించిన ఏకపాత్రాభినయం, నాటికలు, నాటకాలు, జానపద, శాస్త్రీయ నృత్యాలు, కోలాటం, నృత్యరూపకాలు అలరించాయి. నిర్వాహకులు భోజన, వసతి సౌకర్యాలు కల్పించారు. డీసీసీబీ ఛైర్మన్ రామస్వామి, పీసీసీ గౌరవాధ్యక్షుడు రాజాసూరిబాబురాజు, అధ్యక్షుడు వెంకటచలపతిరావు, శ్రీప్రకాష్ పాఠశాల డైరెక్టర్ విజయప్రకాష్, డీప్యూటీ ఈవో ప్రభాకరశర్మ, లూథరన్ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ నళిని, పిల్లల పండగ ప్రధాన కార్యదర్శి బుద్ధా శ్రీనివాస్, పీసీసీ సభ్యులు సీతారామారావు, అరుణ, క్రాంతికుమార్, ప్రభాకర వర్మ, రచయిత, దర్శకుడు కేబీ ఆనంద్, పట్టణ జనసేన అధ్యక్షుడు సత్తిబాబు, పట్టణ తెదేపా అధ్యక్షుడు రంధి సత్యనారాయణ పాల్గొన్నారు. –న్యూస్‌టుడే, పెద్దాపురం

హాజరైన బాలబాలికలు, తల్లిదండ్రులు

పరమానంద శిష్యులు నాటకం ప్రదర్శన

కారు చీకట్లో.. ప్రయాణం ఎట్టా?

రాజోలు మండలం శివకోటి నుంచి పాశర్లపూడి వరకు 22 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న బైపాస్‌పై రాత్రి సమయంలో ప్రయాణాలు ప్రమాదకరంగా సాగుతున్నాయి. విద్యుద్దీపాలు ఏర్పాటు చేయకపోవడంతో కూడళ్ల వద్ద తరచూ ఏదో ఒక ప్రమాదం చోటు చేసుకుంటున్నా సంబంధిత అధికారులు స్పందించడం లేదని వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై జాతీయ రహదారుల ఏఈ వెంకటరమణను వివరణ కోరగా త్వరలో దీపాలు ఏర్పాటు చేస్తామన్నారు. – న్యూస్‌టుడే, రాజోలు

వైభవంగా శ్రీపాదవల్లభుడికి పూజలు

పిఠాపురం, న్యూస్‌టుడే: పిఠాపురం శ్రీపాద వల్లభ మహాసంస్థానంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఫాల్గుణ శుద్ధ పంచమి సందర్భంగా భక్తులు పోటెత్తారు. స్వామివారికి అభిషేకం చేసి, ప్రత్యేక అలంకరణ చేశారు. ఈవో సౌజన్య ఏర్పాట్లు పర్యవేక్షించారు.

అభిషేకం చేస్తున్న అర్చకుడు

సిద్ధివినాయక.. వరదాయక

అయినవిల్లి: అయినవిల్లి సిద్ధివినాయకస్వామి దర్శనానికి అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆదివారం ఆలయ పరిసరాలు కిక్కిరిశాయి. ఇంటర్ పరీక్షల సందర్భంగా పెద్దసంఖ్యలో విద్యార్థులు విచ్చేసి హాల్‌టికెట్లు, కలములు స్వామివారి పాదాల చెంత ఉంచారు. పలువురు చిన్నారులకు అక్షరాభ్యాసాలు, అన్నప్రాసనలు చేశారు. వివిధ రుసుముల ద్వారా రూ.4,24,197 ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు.

వేడుకగా పెద్దింట్లమ్మ జాతర

సఖినేటిపల్లి, న్యూస్‌టుడే: మెండుపాలెం పెద్దింట్లమ్మ జాతర మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆదివారం విశేష పూజల అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. వివిధ ప్రాంతాల నుంచి వేలాదిమంది తరలివచ్చారు. పక్కనే ఉన్న కొబ్బరి తోటల్లో నైవేద్యాలు తయారు చేసి అమ్మవారికి సమర్పించి కుటుంబ సమేతంగా స్వీకరించారు. దీంతో ఆ ప్రాంతం సందడిగా మారింది.

శ్రీరంగధామంలో చినజీయర్ స్వామి పూజలు

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: గౌతమఘాట్‌లోని శ్రీరంగధామంలో స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం సాయంత్రం చినజీయర్ స్వామీజీ శ్రీరంగధామానికి విచ్చేశారు. ఆలయ మర్యాదలతో స్వామీజీకి స్వాగతం పలికారు. ఆయన పర్యవేక్షణలో మహాపూర్ణాహుతి, పూజలు నిర్వహించారు. దర్శనానికి పెద్దఎత్తున భక్తులు హాజరయ్యారు.

ఇంటర్ పరీక్షలకు పోలీస్ బందోబస్తు

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: ఇంటర్ విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా ఇంటర్ పరీక్షలు బాగా రాయాలని ఎస్పీ రాహుల్‌మీనా ఒక ప్రకటనలో కోరారు. సోమవారం ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల దృష్ట్యా జిల్లాలోని అన్ని కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ఎక్కడా ఇబ్బందులు కలగకుండా పర్యవేక్షించాలని పోలీసు యంత్రాంగాన్ని ఆదేశించారు. పరీక్ష రాసే విద్యార్థులు ఇంటి నుంచి త్వరగా బయలుదేరాలని సూచించారు.

ఓఎన్‌జీసీ కార్యకలాపాలు వద్దంటూ నిరసన

అయినవిల్లి, న్యూస్‌టుడే: వీరవల్లిపాలెంలో ఓఎన్‌జీసీ కార్యకలాపాల వల్ల ఇబ్బందులు పడతామని గ్రామస్థులు ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. ప్రధాన రహదారి చెంత కొబ్బరి తోటను తొలగించి రిగ్గు తవ్వేందుకు అధికారులు భారీ యంత్ర సామగ్రి తీసుకొచ్చారు. దీనిపై స్థానికులు ఆందోళన చెందారు. ఇక్కడ ఎటువంటి కార్యకలాపాలు చేయవద్దంటూ నినాదాలు చేశారు. పంటపొలాలు దెబ్బతింటాయని, భూగర్భ జలాలు కలుషితం అవుతాయని వాపోయారు. పి.గన్నవరం సీఐ భీమరాజు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

వీరవల్లిపాలెంలో ఓఎన్‌జీసీ సైట్ వద్ద నినాదాలు చేస్తున్న గ్రామస్థులు

అమ్మా.. నాన్నా.. పాసవ్వండి..!

పిల్లలకు ఇంటర్ పరీక్షల వేళ అప్రమత్తం

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఏటా వివిధ కారణాలతో ఇంటర్ పబ్లిక్ పరీక్షలు రాయలేకపోతున్నారు. రాసినా కొందరు ఉత్తీర్ణులు కాలేకపోతున్నారు. ఒక నిమిషం ఆలస్యమైనా అనుమతించరనే నిబంధనలను పట్టించుకోక నష్టపోతున్నారు. జిల్లాలో నేటి నుంచి ఇంటర్ పరీక్షలు ఆరంభం అవుతున్న నేపథ్యంలో అప్రమత్తం కావాల్సిఉంది. పిల్లల్ని సన్నద్ధం చేసే తల్లులు, పరీక్ష కేంద్రాలకు స్వయంగా వారిని తీసుకువెళ్లే తండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఇంటర్మీడియట్ పరీక్షలు రాసే విద్యార్థుల బాగు కోరి నిపుణులు చెబుతున్న మంచి అంశాలను ఓ సారి పరిశీలిద్దాం. – న్యూస్‌టుడే, సామర్లకోట, సామర్లకోట

ఇలా చేయాలి తల్లీ..

● బిడ్డకు ఆది గురువు అమ్మే. పరీక్షల్లో మీ పిల్లలు రాణించాలంటే మీదే మొదటి బాధ్యత. వారిని పరీక్షలకు సిద్ధం చేయడం, సులువుగా జీర్ణమయ్యే ఆహారం పెట్టండి(అది కూడా ఇంటిలోనే వండింది). పరీక్ష బాగా రాయలగవని చెప్పి వారిలో మనోధైర్యాన్ని నింపండి.● పరీక్ష రోజుకు అవసరమైన సరంజామాను ముందురోజే సర్ది ఇవ్వండి. తగిన కాటన్ దుస్తులను సిద్ధం చేయండి.● పరీక్ష రాసి ఇంటికి వచ్చాక నీరసం తొలగేలా చల్లని పానీయం అందించండి.● మీ బాబు, పాప పరీక్షకు సన్నద్ధమవుతున్నారనే విషయం మరిచి టీవీ పెట్టుకుని భారీ సౌండ్‌లో వారికి ఇబ్బందికలిగేలా వ్యవహరించొద్దు.● ఇతరులతో పోల్చుతూ.. ఆత్మన్యూనతకు గురిచేయడం మానుకోవాలి.● ఉలిక్కిపడి నిద్రలేచేలా కొట్టడం, తిట్టడం చేయకూడదు.● పొద్దున్నే నువ్వు చదవవు.. రాత్రిపూటే 11 గంటల వరకు చదువు అంటూ అలసిపోయేలా చేయవద్దు. ● బంధువులకు సంబంధించిన విషయాలను వారికి వినిపించేలా మాట్లాడకపోవడం శ్రేయస్కరం.● పిల్లల్లో అనారోగ్య లక్షణాలను గుర్తిస్తే.. వెంటనే వైద్యులకు చూపించాలి. ● ముఖ్యంగా తల్లులూ.. మీరు ఆరోగ్యంగా ఉంటేనే.. మీ పిల్లల విజయం ఖాయమనే విషయం మరిచిపోకండి.

ఆలస్యం వద్దు..

■ సామర్లకోట బ్రౌన్‌పేటలోని ఆర్సీఎం ఆశ్రమ వసతిగృహంలో ఉంటూ సమీప జడ్పీ బాలికల ప్లస్ ఉన్నత పాఠశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని గతేడాది 9.30 గంటలకు పరీక్ష కేంద్రానికి వచ్చింది. అర గంట ఆలస్యం కావడంతో అధికారులు అనుమతించలేదు. అందుకు కారణం ఆమె పరీక్షకు ముందురోజు స్వగ్రామమైన కాకినాడ గ్రామీణం సర్పవరంలోని ఇంటికి వెళ్లి తిరిగి వచ్చే క్రమంలో తండ్రి నడుపుతున్న మోటారు సైకిల్ మార్గం మధ్యలో ఆగిపోవడమే. ఆ తరువాత సప్లిమెంటరీ రాసి బయటపడింది. అదే ద్వితీయ సంవత్సరం అయితే ఆ అవకాశమూ ఉండేదికాదు. విద్యార్థులు, తల్లిదండ్రులను అప్రమత్తం చేసే ఘటన ఇది.

● పరీక్షలకు పిల్లల్ని కేంద్రాలకు తీసుకువెళ్లే ముందు వాహనంలో ఇంధనం సరిచూసుకోండి. రహదారి భద్రత నిబంధనలు పాటించండి.● నిర్దేశిత సమయానికి అర గంట ముందే కేంద్రానికి చేరుకునేలా సమయం కేటాయించుకోండి.● పరీక్ష అవగానే ఎలా రాశావు.

మరిచిపోవద్దండీ..

ఎన్ని మార్కులు వస్తాయనే ప్రశ్నలు సంధించి అయిపోయిన అంశంపై పిల్లల్ని విసిగించకూడదు. తర్వాతి రోజు పరీక్షపై ఏకాగ్రత నిలిపేలా ప్రోత్సహించాలి. ● పరీక్షలకు సన్నద్ధమవుతున్న పిల్లలున్న ఇళ్లలో ఆర్థిక, కుటుంబ పరమైన అంశాలపై వారికి వినిపించేలా చర్చలు, వాగ్వాదాలు, గొడవలకు దిగొద్దు.● పరీక్షల వేళ శుభకార్యాలు, తీర్థయాత్రల ప్రస్తావన అనవసరం. ● సమయపాలన ఆవశ్యకత వివరించాలి. బాగా రాయగలవనే నమ్మకం కలిగించండి. ● పరిమితికి మించి ఎక్కించే ఆటోల్లో కేంద్రాలకు పంపించవద్దు.● పెద్దలు ఫోన్ పట్టుకుంటే.. పిల్లలూ దాని గురించే ఆలోచిస్తారనే విషయం మరవొద్దు.

సమస్యలు గుర్తించండి..

పరీక్షలు మీ పిల్లలకే కాదు.. మీకూ అనే విషయం తల్లిదండ్రులు మరవొద్దు. పిల్లలు ఏ రకమైన మానసిక ఒత్తిడి, అనారోగ్యం బారిన పడుతున్నారో గమనించాలి. కడుపునొప్పి, తలనొప్పి, ఆందోళన లాంటివి కనిపిస్తే వారిని ఓదార్చాలి. తగిన మందులు, ధైర్యాన్ని ఇవ్వాలి. ● ఏదైనా పని గంటల తరబడి చేస్తే విసుగువస్తుంది. ఎప్పుడూ చదువేకాకుండా పిల్లలకు మధ్యలో విరామం ఇవ్వాలి. వారితో సరదా కబుర్లు చెప్పాలి. ● సాయంత్రం వేళ కాసేపు వారిని బయట ఆడుకునేలా ప్లాన్ చేయండి. వారితో కలిసి మీరూ ఆడండి. పిల్లల మనసు ఫ్రెష్ అవుతుంది. ● ఉదయం కాసేపు యోగా, ధ్యానం వంటివి చేయించండి. ● అదే పనిగా సలహాలు, సూచనలు ఇవ్వకండి. వారి ఏకాగ్రత చదువు నుంచి మరలుతుంది.

అభద్రతా భావం రానీయొద్దు

పరీక్షల వేళ పిల్లలకు ఏవిధమైన అభద్రతా భావం రాకుండా తల్లిదండ్రులు జాగ్రత్తపడాలి. వారి గొడవలు పిల్లల చదువులనేకాదు, వారి జీవితంపైనే ప్రభావం చూపుతాయి. పరీక్షలకు ముందురోజు రాత్రి నుంచి వారికి సమతుల ఆహారం అందివ్వాలి. ఆహారం మారితే ఆక్సిజన్ వారి మెదడుకు కాకుండా పొట్టకు చేరుకుని ఇబ్బందిపడతారు. పరీక్షల వేళ తల్లిదండ్రులు చరవాణి, టీవీలకు దూరంగా ఉండాలి. తల్లులు వారితోపాటే ఏదో ఒక పుస్తకం చదువుకుంటే మంచిది. – పలివెల లలితాదేవి, ఎడ్యుకేషనల్ సైకాలజిస్ట్

శెట్టిబలిజ సంఘీయులు ఐక్యతతో రాజ్యాధికారం సాధించాలి

ఆత్మీయ సమ్మేళనంలో సంఘ ప్రముఖులు

అంబాజీపేట, న్యూస్‌టుడే: శెట్టిబలిజ సంఘీయులు పార్టీలకు అతీతంగా ఐక్యంగా ఉండి రాజ్యాధికారం సాధించుకోవాలని తెలంగాణ రాష్ట్ర సంక్షేమ సంఘం అధ్యక్షుడు గుత్తుల మీరాకుమార్, ఏపీ రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్సీ కుడిపూడి సూర్యనారాయణరావు పిలుపునిచ్చారు. అంబాజీపేట మండలం గంగలకుర్రుఅగ్రహారంలో నిర్మించిన శెట్టిబలిజ స్మారక చిహ్నాన్ని ఆదివారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా సంఘ నేత ఎం.ఎం.శెట్టి అధ్యక్షతన జరిగిన ఆత్మీయ సమ్మేళన సభలో మాట్లాడారు. రానున్న రోజుల్లో ప్రభుత్వం చేపట్టే కులగణన ద్వారా శెట్టిబలిజలు రాజ్యాధికారం చేపట్టేలా పోరాటం చేయాలని ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు కోరారు. మంత్రి సుభాష్ మాట్లాడుతూ తెలంగాణలో మాజీ సీఎం కేసీఆర్ పాలనలో శెట్టిబలిజలకు తీవ్ర అన్యాయం చేశారన్నారు. భవిష్యత్తులో బీఆర్ఎస్ పార్టీ ఏపీకి విస్తరిస్తే భూస్థాపితం చేస్తామని హెచ్చరించారు. సమాజంలో సెటిల్‌మెంట్ బ్యాచ్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రెడ్డి సుబ్రహ్మణ్యం, చెల్లుబోయిన శ్రీనివాసరావు, కుడిపూడి భరత్, అమలాపురం పురపాలక ఛైర్మన్ రెడ్డి నాగేంద్రమణి, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు ప్రసంగించారు. నాయకులు విత్తనాల ఇంద్రశేఖర్, మట్టపర్తి సతీష్, రాయుడు షణ్ముఖ్, సంసాని మురళీ, దొంగ హరి, మట్టపర్తి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మంత్రి సుభాష్, చిత్రంలో మీరాకుమార్ తదితరులు

చురుగ్గా హైవే విస్తరణ పనులు

మామిడికుదురు, న్యూస్‌టుడే: పాశర్లపూడి పరిధి కైకలపేట వై.జంక్షన్ వద్ద 216 జాతీయ రహదారి విస్తరణ పనులు మొదలయ్యాయి. రాజోలు మండలం శివకోటి నుంచి ఏర్పాటైన బైపాస్ అనుసంధానమయ్యే చోట ఆక్రమణల తొలగింపులో ఏర్పడిన జాప్యం కారణంగా ఇబ్బందులు ఎదురయ్యాయి. ఎట్టకేలకు అధికారులు రహదారి పక్కన ఒకవైపు ఉన్న ఆక్రమణలను ఇటీవల తొలగించడంతో విస్తరణ పనులు చేపట్టారు. త్వరితగతిన పూర్తిచేసి వై.జంక్షన్‌ను చక్కదిద్దుతామని ఏఈఈ వెంకటరమణ తెలిపారు.

కైకలపేట వద్ద విస్తరణ పనులు

ఆలయాల అభివృద్ధిపై దృష్టి

మాన్సాస్ ఛైర్మన్ అశోక్‌గజపతిరాజు

విజయనగరం కంటోన్మెంట్, న్యూస్‌టుడే: ఆలయాల అభివృద్ధి పనులు ఆపొద్దని, ప్రత్యేకంగా దృష్టి సారించి భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని మాన్సాస్ ఛైర్మన్, 104 దేవాలయాల అనువంశిక ధర్మకర్త, గోవా రాష్ట్ర గవర్నర్ పూసపాటి అశోక్ గజపతిరాజు అన్నారు. విజయనగరం కోటలోని మాన్సాస్ కార్యాలయంలో ఆదివారం విజయనగరం పైడితల్లి, సంతపేట జగన్నాథస్వామి, శ్రీకూర్మం కూర్మనాథస్వామి, మందేశ్వరస్వామి దేవాలయాల పాలకమండలి సభ్యులు, దేవాదాయ శాఖ అధికారులతో సమావేశమయ్యారు. వార్షిక బడ్జెట్, ఖర్చులపై ఆరా తీశారు. ★ పైడితల్లి ఆలయ పునర్నిర్మాణ పనులను జూన్ నాటికల్లా పూర్తి చేయాలని ఈవో శిరీషను ఆదేశించారు. జాప్యం జరగకుండా పర్యవేక్షించాలన్నారు. శివాలయం వీధిలోని అమ్మవారి కల్యాణ మండపాన్ని పూర్తిగా తొలగించి కొత్త నిర్మాణాన్ని చేపట్టనున్నట్లు ఈవో వెల్లడించారు. భవిష్యత్తు అవసరాల దృష్ట్యా సిరిమానుల కోసం అయిదెకరాల్లో చింత చెట్లు పెంచే ప్రతిపాదనపై చర్చించారు. ★ సంతపేట ఆలయం నూతన పాలకవర్గం కొలువుదీరింది. ఎనిమిది సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. సభ్యులుగా మల్ల నాగమణి, పెంటకోట గౌరి, ఎస్.అన్నపూర్ణ, గంగళ్ల లక్ష్మీ, బంబోతుల అప్పారావు, సారిపల్లి కిరణ్‌కుమార్, చెల్లపు వెంకటరమణ,ముని శ్రీరామకృష్ణను నియమించారు. వీరు రెండేళ్లపాటు పదవిలో కొనసాగుతారు. దేవాలయానికి సంబంధించి సీజీఎఫ్ నిధులతో నిర్మించిన కాలక్షేప మండపం పరిసరాల్లో విద్యుత్తు దీపాల ఏర్పాటు, నీళ్ల ట్యాంకు, పైపులైన్ పనులు చేపట్టాలని సభ్యులు ఛైర్మన్ దృష్టికి తీసుకొచ్చారు. కాలక్షేప మండపాన్ని రోజుకు రూ.10,000కు అద్దెకిచ్చేలా తక్షణం వినియోగంలోకి తేవాలని విన్నవించారు. ★ శ్రీకాకుళం జిల్లా శ్రీకూర్మంలోని కూర్మనాథస్వామి దేవాలయం ఆవరణలో కోనేరును శుభ్రపర్చి, చుట్టూ చెట్లు నాటేందుకు రూ.10 లక్షలను ఇండిగో సంస్థ మంజూరు చేసిందని, మరికొన్ని మరమ్మతులు చేపట్టాలని పాలకమండలి సమావేశంలో నిర్ణయించారు. ★ కోనసీమ జిల్లా మందపల్లిలోని మందేశ్వరస్వామి ఆలయానికి దేవాదాయ శాఖ సీజీఎఫ్ నిధి నుంచి రూ.3 కోట్లు మంజూరయ్యాయని ఛైర్మన్ తెలిపారు. రెండు అంతస్తుల భవనాన్ని నిర్మించనున్నట్లు వెల్లడించారు.



అశోక్‌గజపతిరాజుకు మందేశ్వరస్వామి చిత్రపటాన్ని అందజేస్తున్న మందపల్లి దేవస్థానం సిబ్బంది

28 నుంచి అమలాపురంలో ప్రపంచ తెలుగు మహాసభలు

సర్పవరం, న్యూస్‌టుడే: బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం కిమ్స్ వైద్య కళాశాల ప్రాంగణంలో ఈ నెల 28 నుంచి రెండు రోజుల పాటు వైభవంగా మూడవ ప్రపంచ తెలుగు మహాసభలు, తెలుగుభాష, సాహిత్య, సంస్కృతుల సమ్మేళనం నిర్వహిస్తున్నామని మాజీ ఎమ్మెల్సీ, గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ(జీజీయూ) కులపతి కేవీవీ సత్యనారాయణరాజు(చైతన్యరాజు) తెలిపారు. కాకినాడ గ్రామీణం సర్పవరంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వివరాలు వెల్లడించారు. రాజమహేంద్రవరం శివారు జీజీయూలో రెండుసార్లు సభలు జరిపామని, మూడోసారి కిమ్స్‌లో నిర్వహిస్తామన్నారు. ప్రపంచం నలుమూలల నుంచి భారీగా ప్రముఖులు, తెలుగు భాషాభిమానులు హాజరవుతారన్నారు. ప్రధాన వేదికకు దివంగత నందమూరి తారక రామారావు పేరు పెడతామన్నారు. మరో 4 వేదికలు ఏర్పాటుచేసి 16 రకాల సాహిత్య వేడుకలు, వందల మంది కవులతో సమ్మేళనాలు తదితరాలను వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో చైతన్యగ్రూప్ డైరెక్టర్ పీవీ కృష్ణంరాజు, సాహితీవేత్తలు సూర్యనారాయణమూర్తి, డా.వేదుల శ్రీరామశర్మ, స్టేట్ టీచర్స్ యూనియన్ నాయకులు పి.సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జీజీయూ కులపతి సత్యనారాయణరాజు

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph.81422 92071.

REAL ESTATE

LAND FOR SALE

JAGGAMPETA

రాజమండ్రికి 30 కి.మీ. దూరములో మురారి, గండేపల్లి మధ్య NH5 చేర్చి 100 అ||ల రోడ్డు ఫేసింగ్‌తో 60 సెంట్లుభూమి అమ్మబడును. (నోబ్రోకర్స్) ✆ 9032988265

PLOT FOR SALE

RAJAMAHENDRAVARAM CITY

రాజమండ్రి, V.L.పురం మోడల్ కాలనీ, NH-5కి అతిదగ్గరగా వెస్ట్ ఫేసింగ్ 520 చ||గ||ల స్థలం అమ్మకం. Contact: 98850 72992, 80991 91919.

రాజమండ్రి To వైజాగ్ వెళ్లే హైవేను ఆనుకొని దివాన్‌చెరువు వద్ద గైట్ కాలేజీకి ఎదురుగా బ్రిడ్జి కొంటీని ఆనుకొని ఉన్నది, GSL కాలేజ్ దగ్గరలో E/F వెయ్యి గజాలు చొప్పున 3 ప్లాట్లు ఉన్నవి. చుట్టూ అపార్ట్మెంట్లు, హాస్టల్స్, గజం 1కి రూ.30 వేలు. 9848183683, 8686635567

EENADU eClassifieds

RAJANAGARAM

ఓనర్ డైరెక్ట్‌గా అమ్మే రెసిడెన్షియల్ ప్లాట్లు రాజానగరం మండలఆఫీస్ వెనుక, డీటీసీపీ అప్రూవ్డ్ లేఅవుట్‌లో స్థలాలు అమ్మకం. 96668 94019, 93980 83034

JOBS

డిజైనింగ్ వచ్చిన DTP ఆపరేటర్స్ సీనియర్స్/ జూనియర్స్ కావలెను. (Page Maker, ఫోటోషాప్, Coreldraw, Illustrater etc.) Rjy, 9246657116

Montra 3-వీలర్ ఎలక్ట్రిక్ ఆటో మార్కెటింగ్ చేయుటకు అనుభవం గల సేల్స్ మేనేజర్ కావలెను. సీతంపేట, రాజమండ్రి. Contact: 94947 81111.

శ్రీదేవి ఫంక్షన్‌హాలు నందు పని చేయుటకు గార్డెనింగ్, సివిల్ & క్లీనింగ్ కొరకు వర్కర్స్ కావలెను. ఉచిత వసతి, జీతం: యువకులకు 18,000/-, మధ్య వయస్కులకు 15,000/-, పెద్దవారికి 12,000/-. జి.మామిడాడ, Cell: 94909 98888.

శివ కార్తికేయ హోంకేర్‌లో వృద్ధులు, పేషంట్స్, పిల్లలను చూసుకొనుటకు నర్సులు, వర్కర్స్ కావలెను. ఫ్రీ వసతి, భో.జి. 20K. ✆ 99120 11499, 99120 11899.

EENADU for Advertisement Contact: 8008597607

MARKETING/ SALES

Anand Masale Require Sales & Marketing Manager, Marketing Executives. Contact: 9849655105, 9848053144 Email:anandmasala-appltd@gmail.com.

SECURITY GUARDS

కాకినాడ, పెద్దాపురం, ధవళేశ్వరం లలో పనిచేయుటకు సెక్యూరిటీ సూపర్‌వైజర్లు, సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. Contact Cell: 85004 98115, 98665 94189.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

★ For the Information of Trade & Industry

★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 4-65 పైII అనపర్తి ఆఫీసు: 08857-226908

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారులు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

జాతీయ రహదారిపై ఘోర ప్రమాదం

రెయిలింగ్‌లో నుంచి దూసుకెళ్లిన కారు ● ఒకరు మృతి

చింతూరు, న్యూస్‌టుడే: జాతీయ రహదారి-30పై ఓ కారు ఘోర రోడ్డు ప్రమాదానికి గురైన సంఘటన మండలంలోని సింగన్నగూడెం వద్ద ఆదివారం చోటుచేసుకుంది. చింతూరు పోలీసుల వివరాల ప్రకారం.. తమిళనాడు నుంచి ఒడిశా రాష్ట్రానికి ఎనిమిది మందితో బయలుదేరిన ఓ కారు ఎన్‌హెచ్-30లోని సింగన్నగూడెం వచ్చేసరికి అదుపు తప్పింది. మూలమలుపుల్లో ప్రమాదాల నివారణకు ఏర్పాటు చేసిన ఇనుప రెయిలింగ్ అంచును ఢీకొట్టింది. దీంతో ఇనుప బద్ది కారు మధ్యలో నుంచి రెండుగా చీల్చుకుంటూ వెళ్లిపోవడంతో అందులో ప్రయాణిస్తున్న పురేశ్‌గౌడ్(22) అక్కడికక్కడే మృతి చెందారు. మిగిలినవారికి తీవ్రగాయాలవడంతో చింతూరు ఏరియా ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్సలు నిర్వహించి భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు. చింతూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సంఘటనా స్థలాన్ని ఏఎస్పీ హేమంత్ పరిశీలించారు.

ఘటనా స్థలంలో దెబ్బతిన్న కారు

టాటా గ్రూప్ మారథాన్‌లో దాట్ల ప్రతిభ

లొల్ల(ఆత్రేయపురం), న్యూస్‌టుడే: టాటా గ్రూప్ ఆధ్వర్యంలో మహారాష్ట్రలో ఆదివారం తెల్లవారుజామున నిర్వహించిన 9వ అల్ట్రా మారథాన్‌లో లొల్ల గ్రామానికి చెందిన ట్రై అథ్లెటు, మాజీ సైనికుడు దాట్ల నాగ శ్రీరామరాజు ప్రతిభ చాటారు. 50 కిమీ పరుగును కేవలం 4.14 గంటల్లో పూర్తి చేసి నాలుగో స్థానం సాధించారు. అనంతరం నిర్వాహకుల నుంచి రూ.30 వేల నగదు, బహుమతితో పాటు పతకం, ప్రశంసా పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన్ను తోటి మాజీ సైనికులు, గ్రామస్థులు అభినందించారు.

బహుమతి అందుకున్న మాజీ సైనికుడు నాగ శ్రీరామరాజు

92.7 FM Rajamahendravaram ఈ FM 92.7 Mee FM

ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ|| 5 - ఉ|| 7
ఈ-మార్నింగ్స్	ఉ|| 7 - ఉ|| 11
నువ్వా నేనా	ఉ|| 11 - మ|| 2
సత్యభామ	మ|| 2 - సా|| 5
లైట్ తీస్కో	సా|| 5 - రా|| 9
సరదాగా కాసేపు	రా|| 9 - రా|| 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా|| 12 - తె|| 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 9000180626, 9989993175

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్ళలో)	ధర (రూ||లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):	18,000
పాతకాయ: గండేరా	30,500
గటగట	29,000
కొత్తకాయ: గండేరా	30,000
గటగట	29,000
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	18,000-21,000
కొత్త (పచ్చి) కాయ	16,000-17,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	5,000
కిలో	350

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ.లో

ఫారంరేటు	115-00
రిటైల్ లైవ్	142-00
డ్రెస్డ్	206-00
స్కిన్‌లెస్	234-00

అరుదైన వృక్షజాతి మొక్కలతో నూతన నర్సరీ

ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సందర్శనకు ఏర్పాట్లు

రాజానగరం, న్యూస్‌టుడే: దివాన్‌చెరువు రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలో గల రాష్ట్ర అటవీ పరిశోధనా కేంద్రం ప్రాంగణంలో 400 రకాల అరుదైన వృక్షజాతులతో నూతనంగా నర్సరీని ఏర్పాటు చేస్తున్నారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దీనిని త్వరలో సందర్శించనున్నారని అటవీశాఖ అధికారులు తెలిపారు. ఇందుకోసం నూతన వృక్షజాతులతో నర్సరీని ఏర్పాటు చేస్తున్నారు. వీటిలో అరుదైన, అంతరించిపోనున్న వృక్షజాతులు ఉన్నాయి. వెదురు జాతిలో వాణిజ్యపరమైన తుల్దా జాతి వెదురు, శ్రీగంధం, దాల్చినచెట్టు, పెద్దకలింగ, నాగకేశరాలు, లోలులు, రోజ్‌ఉడ్, ఎర్రచందనం, తెల్లపొలికి, సారపప్పు, అలాగే స్థానికంగా లభించే అనేక రకాల వృక్షజాతులతో ఈ నర్సరీని ఏర్పాటు చేస్తున్నారు.

నర్సరీలో పెంచుతున్న నాగకేశరాల మొక్కలు

(c) eenadu

రాజోలు
• రాజోలు • కొత్తపేట • పి.గన్నవరం

మేమున్నాం.. మీకు తోడుగా

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: రాజోలు: 80085 74174, పి.గన్నవరం: 80085 74229, కొత్తపేట: 90323 93884. ఉ॥ 10 - మ॥ 1

స్పందనకు వందనం

వీధి దీపాలకు మరమ్మతులు

మామిడికుదురు: నగరం పరిధి ముస్లింవీధి, శివాలయం సమీపంలో కొన్నిచోట్ల వీధి దీపాలు వెలగకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు చెప్పిన సమస్యను సర్పంచి జాలెం రమణకుమారి, కార్యదర్శి కూనపరెడ్డి సురేష్ వద్ద ప్రస్తావించగా స్పందించారు. కొత్త ఎల్ఈడీ దీపాలు వేయించారు.

రావులపాలెం గ్రామీణం: గోపాలపురంలో వీధి దీపాలు మరమ్మతులకు గురై సక్రమంగా వెలగకపోవడంతో రాత్రి సమయాల్లో రాకపోకలకు ఇబ్బంది పడుతున్నామని గ్రామస్థులు తెలిపిన సమస్యను పంచాయతీ కార్యదర్శి సాయిపట్టాభిరామయ్య దృష్టికి తీసుకువెళ్లగా స్పందించారు. మరమ్మతులు చేయించారు.

రహదారి చెంత వ్యర్థాల తొలగింపు

రావులపాలెం గ్రామీణం: ఈతకోటలో రహదారి చెంతన వ్యర్థాలు గుట్టలుగా పేరుకుపోయాయి. దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ కార్యదర్శి శర్మ దృష్టికి తీసుకెళ్లగా సిబ్బందితో తీయించారు.

తాడిపూడిలో పూడిక తీశారు

ఆత్రేయపురం: తాడిపూడిలో చెత్తాచెదారం పేరుకుపోవడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విషయాన్ని సర్పంచి వేముల శ్రీనివాస్ వద్ద ప్రస్తావించగా పారిశుద్ధ్య కార్మికులతో పూడికలు తీయించారు.

బస్సుకు అద్దం ఏర్పాటు

రాజోలు: రాజోలు ఆర్టీసీ డిపో బస్సు అద్దం లేకపోవడంతో ప్రయాణికులకు ప్రమాదం పొంచి ఉందంటూ 'అద్దం లేదు.. అప్రమత్తత ముఖ్యం' శీర్షికతో నెల 20న ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. డీఎం జేమ్స్‌కుమార్ సూచనలతో బస్సుకు అద్దాలను అమర్చారు.

ఈ-శ్రమ్ కార్డుతో ప్రయోజనం

ఆలమూరు, న్యూస్‌టుడే: అసంఘటిత రంగంలో పని చేస్తున్న కార్మికులకు ఈ-శ్రమ్ కార్డు, ప్రధానమంత్రి శ్రమ యోగి మంథన్ పెన్షన్ స్కీమ్‌తో అనేక ప్రయోజనాలున్నాయని మండపేట అసిస్టెంట్ లేబర్ అధికారి కె.శివనాగ మల్లేశ్వరరావు తెలిపారు. ఆలమూరులో ఆదివారం భవన నిర్మాణ కార్మికులతో సమావేశమయ్యారు. వారి వివరాలు సేకరించారు. గుర్తింపు కార్డులను నవీకరించుకోవాలన్నారు.

26న అమలాపురంలో ఉద్యోగ మేళా

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: అమలాపురం ఉపాధి కార్యాలయంలో ఈనెల 26న ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి శ్రీనివాసరావు తెలిపారు. ఇంటర్, డిగ్రీ, డిప్లొమా విద్యార్హత ఉన్న వారు పాల్గొనవచ్చున్నారు. ఆసక్తి ఉన్నవారు తమ విద్యార్హత ధ్రువీకరణ పత్రాలతో ముఖాముఖికి హాజరు కావాలన్నారు.

పునర్నిర్మాణ పనులకు విరాళం

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: ఆత్రేయపురం వేణుగోపాలస్వామి, శివాలయాల పునర్నిర్మాణ పనులకు గ్రామానికి చెందిన పత్తిమట్ల గోపాలరావు, కృష్ణవేణి దంపతులు ఆదివారం రూ.1,01,116 విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ వేగేశ్న ప్రసాదరాజు పాల్గొన్నారు.

జాగా.. కనిపిస్తే పాగా..

రాజోలు, న్యూస్‌టుడే: పొదలాడ జాతీయ రహదారి పక్కన, ప్రధాన పంటకాలువను ఆనుకుని ఇష్టారీతిన పలు దుకాణాలు వెలిశాయి. కొందరు తాత్కాలికంగా ఏర్పాటు చేయగా మరికొందరు పిల్లర్లు వేసి శాశ్వత నిర్మాణాలు చేపట్టారు. ఇక్కడ వాహనాలు తప్పుకునే అవకాశం లేకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. సంబంధిత అధికారులు ఏవిధమైన చర్యలు చేపట్టకపోవడంతో స్థానికంగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై జలవనరుల శాఖ ఏఈ రమేష్‌ను వివరణ కోరగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు చేపడతామన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

మలికిపురం, న్యూస్‌టుడే: మలికిపురంలోని ఏఎఫ్‌డీటీ జూనియర్ కళాశాలలో 1989-91లో ఇంటర్మీడియట్ చదివిన విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాలు, అమెరికా, దుబాయ్, కువైట్ తదితర దేశాల్లో ఉద్యోగాలు, వ్యాపారాలు చేస్తున్న పలువురు హాజరయ్యారు. తాము చదువుకున్న రోజులను గుర్తు చేసుకున్నారు. పలు సేవా కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు. జి.మిల్టన్, అడబాల సత్యశ్రీనివాస్, కొప్పాడి నరసింహారావు, యర్రా మాధవి, చింతపల్లి వినోద్, శ్రీను, సీహెచ్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

భానుడి భగభగలు

రాజోలు, న్యూస్‌టుడే: భానుడు ప్రతాపం చూపడంతో ఆదివారం రోడ్లన్నీ వెలవెలబోయాయి. ఎండ తీవ్రత ఒక్కసారిగా అధికమవ్వడంతో రాజోలు, తాటిపాక కూడళ్లు నిర్మానుష్యంగా మారాయి. దీంతో కర్ఫ్యూ వాతావరణం కనిపించింది. ఈ నెలలో తొలిసారిగా 32 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. రాత్రి సమయంలో చలి, మంచు, పగటిపూట ఎండ తీవ్రతకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

తెదేపా బలోపేతానికి కృషి చేద్దాం

ఫణి, రాములను సత్కరిస్తున్న మంత్రి సుభాష్

అంబాజీపేట, న్యూస్‌టుడే: తెదేపా బలోపేతానికి శ్రేణులు ముఖ్యభూమిక పోషించాలని మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. అంబాజీపేట మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులుగా ఇటీవల నియమితులైన గూడాల ఫణి, రవణం రాములను ఆదివారం ఆయన అంబాజీపేటలో సత్కరించారు. కష్టపడిన వారికే పదవులు వస్తాయన్నారు. గుబ్బల నాగవీరవెంకటరమణ, పుత్సల అలంకార్, సానబోయిన జయరామ్ పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదును బాధ్యతగా తీసుకోవాలి

మలికిపురం, న్యూస్‌టుడే: ఈ నెల 26 నుంచి ప్రారంభమయ్యే జనసేన పార్టీ సభ్యత్వాల నమోదు కార్యక్రమాన్ని ప్రతి కార్యకర్త బాధ్యతగా తీసుకోవాలని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ కోరారు. విశ్వేశ్వరాయపురంలోని క్యాంపు కార్యాలయం వద్ద మండల శాఖ అధ్యక్షుడు మల్లిపూడి సత్తిబాబు అధ్యక్షతన ఆదివారం జరిగిన సభ్యత్వ నమోదు సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో 30 వేల సభ్యత్వాలు నమోదు లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఇప్పటివరకు చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. రాష్ట్ర కార్యదర్శి గెడ్డం మహాలక్ష్మిప్రసాద్, నియోజకవర్గ సమన్వయకర్త, మార్కెట్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు, బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ గుబ్బల ఫణికుమార్, ఏఎంసీ ఉపాధ్యక్షుడు సూరిశెట్టి శ్రీనివాస్, టీసీ అధ్యక్షుడు ఆకన బాల్రెడ్డి నాయుడు, ఎంపీపీ మేడిచర్ల వెంకటలక్ష్మీనారాయణవాణి, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

శిథిలం.. భయం భయం

న్యూస్‌టుడే – అయినవిల్లి, మలికిపురం

లక్కవరంలో ఒకవైపు కుంగిపోయిన వంతెన

కొలువలపై దశబ్దాల క్రితం నిర్మించిన వంతెనలు, కల్వర్టులు శిథిలావస్థకు చేరడంతో ప్రమాదకరంగా మారుతున్నాయి. నిర్వహణ కొరవడటంతో ఎప్పుడు కూలతాయో తెలియని పరిస్థితి నెలకొంది.

అయినవిల్లిలో విలస చానల్‌పై ఆరు దశాబ్దాల క్రితం నిర్మించిన వంతెనకు రెండు వైపుల రక్షణ గోడలు ధ్వంసమయ్యాయి. అయినవిల్లి మండలం నుంచి అమలాపురం, ముక్తేశ్వరం, కొత్తపేటవైపు రాకపోకలు, కొబ్బరి, వ్యవసాయ ఉత్పత్తులు, కూరగాయల మార్కెట్‌కు తరలించేందుకు ఈ దారి ఎంతో అనుకూలం. వంతెన కిందభాగంలో స్లాబు పెచ్చులు ఊడిపడుతోంది. ఇనుప చువ్వలు బయటకు వేలాడుతున్నాయి. ఒక పక్క అంచు దిగబడి ఆగాధంలా మారింది.

మలికిపురం మండలం లక్కవరంలో చింతలపల్లి పంట కాలువపై ఉన్న వంతెన ఒకవైపు కాలువలోకి కుంగిపోయింది. సుమారు నాలుగు సంవత్సరాల క్రితం కుంగిపోయినప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదు. ఒరిగిన వంతెన మీదుగానే రాకపోకలు సాగిస్తున్నారు. కాలువలోకి కుంగిపోవడంతో నీటి ప్రవాహానికి ఆటంకంగా ఉంటోందని, వ్యర్థాలు, జంతు కళేబరాలు నిలిచిపోయి దుర్వాసనతో ఇబ్బందిపడుతున్నామని స్థానిక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై జలవనరుల శాఖ ఏఈ రమేష్‌బాబును వివరణ కోరగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

విలస, సిరిపల్లి, నేదునూరు, కొండుకుదురు గ్రామాల్లో పంట కాలువలపై వారధులు దెబ్బతిన్నాయి. ప్రజలు భయాందోళనలో రాకపోకలు సాగిస్తున్నారు. ముక్తేశ్వరం ప్రధాన రహదారిలో ఉన్నత పాఠశాల వద్ద మురుగు కాలువపై ఉన్న కల్వర్టు రక్షణ గోడలు కూలిపోయి, అంచులు కుంగిపోయి ప్రమాదకరంగా ఉంది. ప్రధాన రహదారులపై శిథిలావస్థకు చేరిన వంతెనలను పరిశీలించి మరమ్మతులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని ఆర్‌అండ్‌బీ శాఖ జేఈ రమేష్ తెలిపారు.

కొండుకుదురు ముక్తేశ్వరం పంట కాలువపై ..

స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ

రావులపాలెం పట్టణం, న్యూస్‌టుడే: రావులపాలెంలోని పోతంశెట్టి రామిరెడ్డి పార్కు సమీపంలో కొలువై ఉన్న అలివేలు మంగా పద్మావతి, ఆండాళ్ సహిత వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి, అమ్మవార్లను పెండ్లి కుమారుడు, కుమార్తెలుగా అలంకరణ చేసే కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఛైర్మన్ పడాల పెదవెంకటరెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. 17వ వార్షిక కల్యాణ బ్రహ్మోత్సవాలు మార్చి 7 వరకు జరుగుతాయని ఛైర్మన్ తెలిపారు.

ఆలయం వద్ద సంఘ సభ్యుల ర్యాలీ

భగవద్గీత పఠనంతో ఆధ్యాత్మికోన్నతి

ఆలమూరు, న్యూస్‌టుడే: భగవద్గీతా పారాయణంతో ఆధ్యాత్మిక ఉన్నతి లభిస్తుందని, మానసిక ప్రశాంతత ఏర్పడుతుందని కాకినాడ శ్రీకృష్ణ పరివార్ సేవా సంఘ సభ్యులు పేర్కొన్నారు. ఆదివారం ఆలమూరు శ్రీదేవి, భూదేవి సమేత జనార్దనస్వామి ఆలయంలో భగవద్గీతా పారాయణం నిర్వహించారు. గీతా పఠనం గొప్పతనాన్ని అందరూ తెలుసుకోవాలన్నారు. సభ్యులను ఆలయ ఛైర్మన్ బైరిశెట్టి రాంబాబు అభినందించారు.

సీఎం సహాయ నిధితో భరోసా

మలికిపురం, న్యూస్‌టుడే: వైద్య చికిత్స చేయించుకున్న ప్రతి పేదవాడికీ ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థిక సాయం అందేలా చూడాలని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ కోరారు. విశ్వేశ్వరాయపురంలోని క్యాంపు కార్యాలయం వద్ద ఆదివారం జరిగిన కార్యక్రమంలో రూ.38.23 లక్షల మొత్తాన్ని 47 మంది లబ్ధిదారులకు చెక్కుల రూపంలో అందజేశారు. రెండు సంవత్సరాల్లో 850 మందికి రూ.6.70 కోట్ల మేర ఆర్థిక సాయం అందించినట్లు చెప్పారు. ఈ పథకాన్ని అందరికీ అందించడం కోసం క్యాంపు కార్యాలయంలో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ కేతా వెంకటలక్ష్మి, భూదేవి, ఎంపీపీ సత్యవాణి, ఫణికుమార్, గెడ్డం మహలక్ష్మీప్రసాద్, చినవెంకన్నాయుడు, చాగంటి స్వామి, అడబాల యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారుకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్

తిరుమల పవిత్రతను దెబ్బతీశారు: నామన

మామిడికుదురు, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదానికి కల్తీనెయ్యి వాడించిన జగన్‌మోహన్‌రెడ్డి ఆలయ పవిత్రతను దెబ్బతీయడమే కాకుండా స్వామివారి ఫొటోలతో వైకాపా ఎమ్మెల్సీలు శాసనమండలిలో నిరసన చేపట్టి భక్తుల మనోభావాలను దెబ్బతీశారని జడ్పీ మాజీ ఛైర్మన్ నామన రాంబాబు మండిపడ్డారు. మగటపల్లిలో తెదేపా స్థానిక నాయకులతో కలిసి ఆదివారం ఆయన మాట్లాడారు. చేసిన తప్పులు కప్పిపుచ్చుకోవడానికి సభలోకి దేవుని చిత్రపటాలు తీసుకువెళ్లి మహాపచారానికి పాల్పడ్డారని వాపోయారు. కల్తీనెయ్యి పాపం జగన్‌దేనని, ఇటువంటి చేష్టలపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. కుంపట్ల బాబి, సరెళ్ల సత్యనారాయణ, కుంచె శ్రీనివాస్, చెల్లింగి సింహాచలం, భూపతి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరం.. చెరువు గట్టు

రక్షణ లేని చెరువు గట్టు

ముంగండలోని సమగ్ర రక్షిత మంచినీటి పథకానికి సంబంధించి చెరువు (సమ్మర్ స్టోరేజి ట్యాంకు) గట్టు చుట్టూ ప్రమాదకరంగా ఉంది. సుమారు రెండు దశాబ్దాల క్రితం దీనిని ప్రారంభించారు. అప్పట్లో చుట్టూ సుమారు కిలోమీటరు మేర ఎవరూ లోనికి రాకుండా ఫెన్సింగ్ వేశారు. కాలక్రమేణా అది పాడైంది. లోపలి భాగం వాలుగా ఉంది. ఏమాత్రం లోపలికి వెళ్లినా ప్రాణాలతో బయట పడటం కష్టం. ఈత వచ్చినవారు కూడా పట్టుదొరక్క పైకి రావడానికి అవకాశం లేదు. ప్రధానంగా ఇక్కడ పని చేసే నిర్వహణ సిబ్బంది, ఆర్.డబ్ల్యు.ఎస్. ఇంజినీరింగ్ అధికారులకు మాత్రమే ప్రవేశం ఉంటుంది. ఇతరులు లోనికి అనుమతించరు. అంతటి సున్నితమైన ప్రదేశం వద్ద వేర్వేరు ఘటనల్లో ఇద్దరు చెరువులో మునిగి మృతిచెందారు. ఆరేళ్ల క్రితం ముంగండ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న ఒక విద్యార్థి, ఈ నెల 19న మరొకరు చనిపోయారు. ప్రధానంగా చుట్టూ పటిష్ఠమైన ఫెన్సింగ్ ఉంటే ప్రమాదాలకు అవకాశం ఉండదని స్థానికులు అంటున్నారు. ప్రజలకు రక్షిత తాగునీరు సరఫరా చేసే ఈ ప్రాజెక్టు వద్ద ఇలాంటి ఘటనలతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా రక్షణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. గట్టు చుట్టూ ఫెన్సింగ్ కోసం రూ.20 లక్షలకు ప్రతిపాదనలు చేసి పంపినట్లు ఆర్.డబ్ల్యు.ఎస్. ఏఈఈ జె.కల్యాణచక్రవర్తి తెలిపారు.

బోదెలో తుప్పలు.. నీరందక తిప్పలు

అయినవిల్లి గ్రామంలోని నేదునూరు వెళ్లే రహదారి పక్కన పంటబోదెలో పూడికలు, తూడు, తుప్పలు పెరగడంతో అధ్వానంగా మారింది. శివారు పంటచేలు నీరందక ఇక్కట్లు తప్పవని స్థానిక రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉపాధి పనుల్లో భాగంగా పంటబోదెను శుభ్రం చేసే విధంగా చర్యలు తీసుకుంటామని ఏవో శోభ తెలిపారు. – న్యూస్‌టుడే, అయినవిల్లి

మురుగు పోయే దారేది..

వెలిచేరు జడ్పీ పాఠశాల-పంటకాలువ వంతెన వరకు ఉన్న కచ్చా డ్రెయిన్‌లో పూడికలు ఏర్పడి మురుగు కదలడం లేదు. దీనికితోడు దోమల బెడద ఎక్కువగా ఉండటంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. విషయాన్ని సర్పంచి వేముల శ్రీనివాస్ వద్ద ప్రస్తావించగా సిబ్బందిని పంపి చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, ఆత్రేయపురం

కాలువ అధ్వానం.. జలాలు కలుషితం

మామిడికుదురులోని పంటకాలువ పొడవునా చెత్తకుప్పలు, మురుగునీటితో నిండి అధ్వానంగా మారడంతో స్థానికులు, రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మూడు గ్రామాల్లోని 510 ఎకరాల్లో వరిచేలకు ఆధారమైన ఈ కాలువలో అడ్డంగా ఉన్న గొట్టాలు, నేల వంతెనల కారణంగా ఈ దుస్థితి నెలకొంది. ఇళ్లు, దుకాణాల నుంచి అక్రమంగా అమర్చిన గొట్టాల ద్వారా మురుగునీరు చేరడంతో నీరు కలుషితంగా మారుతోంది. దీనిపై పరిశీలన చేసి ఇబ్బంది లేకుండా చర్యలు చేపడతామని ఏఈ రమేష్‌బాబు తెలిపారు. – న్యూస్‌టుడే, మామిడికుదురు

పోలీసుల తనిఖీలు

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: ఆత్రేయపురం పరిసర ప్రాంతాల్లో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఆదివారం సీఐ విద్యాసాగర్ ఆధ్వర్యంలో పలువురు మైనర్లు వాహనాలు నడుపుతుండగా పట్టుకున్నారు. వాహనాలు స్వాధీనం చేసుకుని తల్లిదండ్రులు, బాలురకు కౌన్సెలింగ్ ఇచ్చినట్లు ఎస్సై రాము తెలిపారు.

ఆలయాలను రక్షించాలంటూ పాదయాత్ర

అంతర్వేది, న్యూస్‌టుడే: జీర్ణావస్థకు చేరిన ఆలయాలను పునర్నిర్మించాలని కోరుతూ పాలెపు జానకీలక్ష్మీనరసింహరాజు మంగళగిరి నుంచి అంతర్వేదికి పాదయాత్ర చేశారు. అతనికి రాజోలు నియోజకవర్గ అగ్నికులక్షత్రియులు ఆదివారం స్వాగతం పలికారు. ఆలయ నిర్మాత కొపనాతి కృష్ణమ్మ విగ్రహానికి పూలమాల వేశారు. శిథిలావస్థకు చేరిన ఆలయాలను పునరుద్ధరించి కైంకర్యాలు జరపాలని, అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి ఆలయ నిర్మాత కృష్ణమ్మ వారసులను ఫ్యామిలీ ఫౌండర్‌గా నియమించాలని కోరుతూ ఈ యాత్ర చేసినట్లు వెల్లడించారు. గత 19న మంగళగిరి లక్ష్మీనరసింహుడి ఆలయంలో పూజలు చేసి సుమారు 180 కిలోమీటర్ల మేర పాదయాత్ర చేసి ఇక్కడికి వచ్చినట్లు చెప్పారు.

తెదేపా నాయకుడు కృష్ణమూర్తి మృతి



అంకంపాలెం(ఆత్రేయపురం): సీనియర్ తెదేపా నాయకుడు, ర్యాలి రూరల్ బ్యాంక్ మాజీ అధ్యక్షుడు కరుటూరి కృష్ణమూర్తి(86) ఆదివారం మృతిచెందారు. పార్టీ ఆవిర్భావం నుంచి చురుకైన నాయకుడిగా అందరి మన్ననలు చూరగొని గ్రామాభివృద్ధికి సేవలు అందించారు. ఈయనకు ముగ్గురు కుమారులు. వీరిలో నరసింహారావు గతంలో సర్పంచి, వాడపల్లి దేవస్థానం ఛైర్మన్‌గా పనిచేయగా ప్రస్తుతం సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షుడిగా ఉన్నారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, వాడపల్లి దేవస్థానం ఛైర్మన్ ముదునూరి వెంకటరాజు, మండల పార్టీ అధ్యక్షుడు కూసంపూడి బాబు, నాయకులు ముళ్లపూడి భాస్కరరావు, మద్దూరి సుబ్బారావు, కుడప కృష్ణమూర్తి, దొడ్డపనేని శ్రీధర్, త్రినాథరావు, సర్పంచి రాజు సంతాపం వ్యక్తం చేశారు.

పశు వైద్యాధికారిగా సాంబమూర్తి

ఆలమూరు: మడికి గ్రామీణ పశువైద్యాధికారిగా సాంబమూర్తి బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు మండపేటలో ఉన్న రాష్ట్ర పశుసంవర్ధక శిక్షణ కేంద్రంలో జూనియర్ వైద్యాధికారిగా ఉన్న ఆయన బదిలీపై వచ్చారు. పాడి రైతుల అభ్యున్నతికి కృషి చేస్తానని ఆదివారం మీడియాతో ఆయన పేర్కొన్నారు.

కేశనపల్లిలో అవగాహన కల్పిస్తున్న సీఐ నరేశ్‌కుమార్

శాంతిభద్రతలకు ప్రజలు సహకరించాలి

మలికిపురం, న్యూస్‌టుడే: గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో ప్రజలు సహకరించాలని రాజోలు సీఐ టి.వి.నరేశ్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. కేశనపల్లిలో ఆదివారం పల్లె నిద్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఎస్సై పి.సురేశ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి ఇటువంటి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సైబర్ నేరాలు, డిజిటల్ అరెస్టులు, సామాజిక మాధ్యమాల్లో రెచ్చగొట్టే, అసభ్యకర పోస్టులు పెట్టడం వల్ల కలిగే సమస్యలు, రోడ్డు భద్రత, హెల్మెట్లు ధరించడం వల్ల ప్రయోజనాలు తదితర అంశాల గురించి అవగాహన కల్పించారు. సర్పంచి యెనుముల నాగు, అడబాల వెంకటేశ్వరరావు, మంచెం రమేశ్, అడబాల నాని, నరసింహారావు, యర్రంశెట్టి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు మంద కృష్ణ కృషి

మామిడికుదురులో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు

మామిడికుదురు, రావులపాలెం పట్టణం: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ నాయకత్వం వర్ధిల్లాలంటూ ఆ సంఘ నాయకులు, కార్యకర్తలు మామిడికుదురులో ఆదివారం ఊరేగింపు చేపట్టారు. 216 జాతీయ రహదారి కూడలిలోని బాబూ జగ్జీవన్‌రామ్, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసిన అనంతరం కృష్ణమాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. వాస్తవాలు తెలుసుకోకుండా కొంతమంది ఇష్టారీతిన విమర్శలు చేయడం సరికాదన్నారు. ఎంఎస్‌పీ జాతీయ నాయకుడు ముమ్మిడివరపు చినసుబ్బారావు, జిల్లా అధికార ప్రతినిధి నూటుకుర్తి సత్యనారాయణ, నాయకులు ఆకుమర్తి ఆశీర్వాదం, శెట్టిం శ్రీను, మంద గాంధీ, ఆకుమర్తి శ్రీను, భాస్కరరావు, ముస్కూడి బాలాజీ, నరసింహస్వామి పాల్గొన్నారు. ● రావులపాలెం ఇందిరాకాలనీలోని కమ్యూనిటీ భవనం వద్ద జిల్లా ఉపాధ్యక్షుడు కొమ్మర వీరరాఘవులు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ముఖ్యఅతిథిగా ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, జాతీయ నాయకుడు ముమ్మిడివరపు చినసుబ్బారావు హాజరై మాట్లాడారు. కృష్ణ మాదిగ అంబేడ్కర్ ఆశయ సాధనతో ఉద్యమాన్ని నడిపించిన విధానం అందరికీ తెలుసన్నారు. అనంతరం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో యార్లగడ్డ సత్తిబాబు, ఆకుమర్తి ఆశీర్వాదం, గంధం యాకోబు, కాపా నాగరాజు, మసేను, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

రావులపాలెంలో..

జనసేన పార్టీ శ్రేణుల సేవాభావం

రాజోలు, న్యూస్‌టుడే: బి.సావరంలో ప్రధాన రహదారిని ఆనుకుని ప్రమాదకరంగా ఉన్న వంతెన అప్రోచ్ పనులకు స్థానిక జనసేన శ్రేణులు నడుం బిగించాయి. ఇక్కడ అప్రోచ్ లేకపోవడంతో చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. దీంతో పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు గురుజు భీమరాజు, పంచాయతీ సభ్యుడు తిక్కిశెట్టి ఫణి ఆధ్వర్యంలో స్వచ్ఛందంగా నిధులు సేకరించి నిర్మాణం పూర్తిచేశారు. సర్పంచి కడియం రమాదేవి, ఉప సర్పంచి రావూరి నాగబాబు, నీటిసంఘం సభ్యుడు యాళ్ల నాగయ్య, దైవాల ప్రకాశ్ తదితరులు సహకరించారు.

అప్రోచ్ నిర్మాణంలో కార్యకర్తలు

వంతెన నిర్మాణానికి సహకరించాలి

మలికిపురం, న్యూస్‌టుడే: రాజోలు, నరసాపురం నియోజకవర్గాలను వశిష్ఠ నదిపై కలిపే వంతెన, దిండి-సీతారామపురం మధ్య నిర్మించనున్న 216 బైపాస్ జాతీయ రహదారి నిర్మాణాలకు సహకరించాలని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ కోరారు. ఈ మేరకు రోడ్డు నిర్మాణానికి భూసేకరణ విషయంలో ఓ రైతును కోరుతూ లేఖ రాశారు. గుడిమెళ్లంక గ్రామానికి చెందిన రైతు తన భూముల విషయంలో కోర్టును ఆశ్రయించడం, ఆ కేసును సుప్రీంకోర్టులో డిస్మిస్ చేసినా మళ్లీ కింది కోర్టుకు వెళ్లే అవకాశం ఇచ్చిన నేపథ్యంలో ఎమ్మెల్యే ఆదివారం లేఖ రాశారు. ప్రజాభిప్రాయాన్ని దృష్టిలో ఉంచుకుని సహకారం అందించాలని కోరారు.

అరకొర వసతులు.. క్రీడల్లో మెరికలు

– న్యూస్‌టుడే, అంబాజీపేట

అంబాజీపేట మండలం తొండవరం ఉన్నత పాఠశాల విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లోనూ దూసుకుపోతున్నారు. వీరు సాధన చేసేందుకు అనువైన స్థలం లేదు. ఉన్న వనరులను సక్రమంగా వినియోగించుకుని నిత్యం సాధన చేస్తున్నారు. పీడీ పెచ్చెట్టి సూర్యనారాయణ, హెచ్ఎం పి.వి.కేశవాచార్యులు, స్టాఫ్ సెక్రటరీ పినిపె సత్యనారాయణ ప్రోత్సాహంతో వివిధ క్రీడాంశాల్లో పాఠశాలకు పతకాలు తెచ్చి పెడుతున్నారు.

వివిధ అంశాల్లో..

2025-26లో మధ్యప్రదేశ్‌లో జరిగిన జాతీయస్థాయి తైక్వాండో పోటీల్లో పి.పూజిత, కె.అలేఖ్యసుమశ్రీ, ఎం.మౌనిక పాల్గొన్నారు. వీరిలో మౌనిక 7వ తరగతి చదువుతోంది. పూజిత, అలేఖ్య సుమశ్రీలు తొమ్మిదో తరగతి చదువుతున్నారు. 2024-25లో రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో మరికొందరు రాణించారు.

జాతీయ స్థాయిలో పాల్గొన్నా..

నా పేరు సవరపు లావణ్యశ్రీ. పదోతరగతి చదువుతున్నా. 2024-25లో ఉత్తరప్రదేశ్‌లో జరిగిన ఖోఖో పోటీల్లో పాల్గొని పతకం సాధించాను. తండ్రి వెంకటదుర్గారావు కొబ్బరికాయల వ్యాపారి. ఉత్తమ క్రీడాకారిణిగా రాణించాలని తపన పడుతున్నాను.

నిత్యం సాధన

నా పేరు పిల్లి దుర్గాదేవి. పదోతరగతి చదువుతున్నా. ప్రతిరోజు ఖోఖో సాధన చేస్తున్నా. మధ్యప్రదేశ్, కర్ణాటకల్లో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు కైవసం చేసుకున్నాను. క్రీడా కోటా మంచి ఉద్యోగం సాధించే లక్ష్యంతో ఆడుతున్నాను. నాన్న గుడిలో ఆసాది. అమ్మ గృహిణి.

ఆటలతోనే పేరుప్రఖ్యాతులు

నా పేరు సీహెచ్ అహల్య తొమ్మిదో తరగతి చదువుతున్నాను. రాష్ట్రస్థాయిలో జరిగిన పలు ఖోఖో క్రీడల్లో పాల్గొని ప్రతిభ చూపాను. ఉత్తమ క్రీడాకారిణిగా పేరు తెచ్చుకోవాలని ఉంది. ఆ దిశగా తల్లిదండ్రులు నన్ను చక్కగా ప్రోత్సహిస్తున్నారు.

దీక్షలో ఇన్‌ఛార్జి అమూల్య, నాయకులు

వైకాపా తీరుపై నిరసన దీక్ష

రాజోలు: శాసనమండలి వేదికగా వెంకటేశ్వర స్వామి చిత్రపటాలను విసిరిన వైకాపా సభ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ తెదేపా నాయకుడు సాధనాల రమేష్ తాటిపాక కూడలిలో ఆదివారం నిరసన దీక్ష చేపట్టారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి గొల్లపల్లి అమూల్య పాల్గొని మద్దతు పలికారు. ఆమె మాట్లాడుతూ తిరుపతి లడ్డూ వ్యవహారంలో వైకాపా అనుసరిస్తున్న సరిలేదన్నారు.

(c) eenadu

అమలాపురం

• అమలాపురం • ముమ్మిడివరం • రామచంద్రపురం

మార్చి 9 నుంచి 'డాక్టర్ ఆన్ వీల్'

రామచంద్రపురం, న్యూస్‌టుడే: నియోజకవర్గంలో మార్చి 9వ తేదీ నుంచి డాక్టర్ ఆన్ వీల్ కార్యక్రమం ప్రారంభిస్తున్నామని మంత్రి సుభాష్ చెప్పారు. హ్యాపీ సండే కార్యక్రమంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. గుండెపోటు మరణాలను తగ్గించేందుకు కంటైనర్ ఆసుపత్రుల ద్వారా డాక్టర్ ఆన్ వీల్ ప్రవేశపెడుతున్నామన్నారు. కార్యక్రమంలో సత్యం ఫౌండేషన్ అధినేత వాసంశెట్టి సత్యం, మున్సిపల్ కమిషనర్ రాజు, ఏఎంసీ ఛైర్మన్ అక్కల రిష్వంత్‌రాయ్, పట్టణ తెదేపా అధ్యక్షుడు ఉండవిల్లి శివ, ఎస్‌కేబీ ట్రస్టు ఛైర్మన్ సలాది నాయుడు, మాజీ కౌన్సిలర్ దంగేటి గోరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ మేళాలో 26 మంది ఎంపిక

రామచంద్రపురం: రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆధ్వర్యంలో వారం వారం ఉపాధి భవనంలో నిర్వహించే ఉపాధి మేళాలో భాగంగా ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో 26 మంది ఎంపికయ్యారు. ఉపాధి భవన్, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన మేళాలో వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు అర్హత సాధించారు.

కరాటేలో ప్రతిభ

అమలాపురం పట్టణం: రామచంద్రపురంలో ఆదివారం జరిగిన రాష్ట్ర ఇంటర్ ఇన్విటేషనల్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో అమలాపురం కరాటే స్కూల్‌కు చెందిన 53 మంది క్రీడాకారులు అద్భుత ప్రతిభ కనబరిచారని కోచ్ పడాల అంజి తెలిపారు. ఈ పోటీలకు ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల నుంచి 6 నుంచి 18 ఏళ్ల మధ్య వయసువారు 950 మంది పాల్గొన్నారని తెలిపారు. వివిధ విభాగాల్లో 32 మంది స్వర్ణం, 10 మంది రజతం, 11 మంది కాంస్య పతకాలు సాధించారని తెలిపారు.

క్రీడలతోనే 'ఆరోగ్య భారత్'

కరాటే పోటీలు ప్రారంభించిన మంత్రి సుభాష్

రామచంద్రపురం, న్యూస్‌టుడే: క్రీడలతోనే సంపూర్ణ ఆరోగ్య భారత్ సాధ్యమవుతుందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. రామచంద్రపురం ఆర్‌ఓసీఎం చర్చిలో ఆదివారం అంతర్ రాష్ట్ర ఇన్విటేషనల్ కరాటే ఛాంపియన్‌షిప్-2026 పోటీలను మంత్రి ప్రారంభించారు. పోటీల్లో ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల నుంచి 800 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. విశాఖపట్నం, అమలాపురం, రాజమహేంద్రవరం, కాకినాడ, యానాం, ముమ్మిడివరం, అనకాపల్లి తదితర ప్రాంతాల నుంచి విచ్చేసిన క్రీడాకారులు పలు విభాగాల్లో పతకాలు సాధించారు. కిక్ బాక్సింగ్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆనందబాలు పర్యవేక్షణలో మాస్టర్ బి.కె.రత్నం నిర్వహణలో జరిగిన పోటీల్లో కోచ్‌లు అంజనీకుమార్, వెంకటేష్, వినయ్‌కుమార్, గిరి, న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో చంటి రెడ్డి, మోడరన్ విద్యా సంస్థల అధినేత జి.వి.రావు, చింతా సుబ్బారెడ్డి, బూదేటి బాబి, తెదేపా అధ్యక్షుడు ఉండవల్లి శివ పాల్గొన్నారు. నాలుగు ప్రత్యేక క్రీడల్లో రాణిస్తున్న నిహారిక, కోచ్ రత్నంలను మంత్రి సుభాష్ ప్రత్యేకంగా అభినందించారు.

ఉద్యానం.. అందనంత దూరం

✦ నిర్వహణ లోపం.. వసతులు ఊసేలేదు

న్యూస్‌టుడే, ముమ్మిడివరం: పట్టణాల్లో జనాభా పెరుగుతోంది. ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు, స్థానికులతో పాటు పిల్లల చదువుల కోసం పట్టణాల బాట పట్టేవారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఉదయం వ్యాహ్యాళికి.. సాయంత్రం ఆహ్లాదకర వాతావరణంలో సరదాగా కాసేపు గడిపేందుకు పార్కులకు వెళ్లాలని ఉన్నా.. పట్టణంలో ఆ పరిస్థితి లేదు. కనీసం పార్కుగాని, పది మంది కూర్చోవడానికి సరైన స్థలం లేని పరిస్థితి. నియోజకవర్గ కేంద్రం కావడం.. కార్పొరేట్ ఆసుపత్రులు, సబ్ డివిజన్ కార్యాలయాలు ఉన్నాయి. జిల్లా పునర్విభజన నేపథ్యంలో ఇక్కడ ఎయిమ్స్‌లో జిల్లా కార్యాలయాలు ఏర్పాటు చేశారు. దీంతో పట్టణ వాసం పెరుగుతోంది. నగర పంచాయతీగా రూపాంతరం చెంది 12 ఏళ్లు గడిచిపోతున్నా.. ఓ పార్కు కూడా ఏర్పాటు చేయని పరిస్థితి నెలకొంది.

రూ.63 లక్షలతో ఆధునికీకరించిన అయ్యవారిచెరువు

ఇదీ పరిస్థితి..

గతంలో పోలమ్మచెరువుగట్టున వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయగా.. ఆతరువాతి కాలంలో అది ధ్వంసమైంది. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన అమృత్ 2.0 పథకంలో రూ.63 లక్షలతో మార్కెట్ ప్రాంతంలోని అయ్యవారిచెరువు సుందరీకరణకు చర్యలు చేపట్టడంతో ప్రజలకు పార్కు అందుబాటులోకి వస్తుందని ఆశించారు. నిధులు చాలక పనులు అరకొరగానే ముగిశాయి. చెరువుచుట్టూ గట్టును గ్రావెల్‌తో చదును చేసి.. రాతికట్టడం, చుట్టూ ప్రజలు నడిచే విధంగా పలకలతో వాకింగ్ ట్రాక్, పెన్సింగ్ ఏర్పాటు చేయాల్సి ఉంది. ప్రస్తుతం చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగిపోతున్నాయి. గ్రావెల్‌తో ఏర్పాటు చేసిన కాలిబాటనైనా అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

అయ్యవారి చెరువుచుట్టూ వాకింగ్ ట్రాక్ ఇలా..

అందుబాటులోకి తీసుకువస్తాం...

పోలమ్మచెరువు ఆధునికీకరణకు రూ.కోటికిపైగా సీఎస్ఆర్ నిధులతో పనులు చేపట్టడానికి స్థానిక ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు కార్యాచరణ రూపొందించారు. అమృత్ 2.0 పథకంలో ముమ్మిడివరం మార్కెట్ ప్రాంతంలోని అయ్యవారిచెరువు ఆధునికీకరణ పనులు పూర్తి చేశారు. చెరువు చుట్టూ మొక్కలతో సుందరీకరణ, వాకింగ్ ట్రాక్ వంటి వాటిని ఏర్పాటు చేశారు. వాకింగ్ ట్రాక్‌ను అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటాం.

-పి.రవివర్మ, కమిషనర్, ముమ్మిడివరం నగర పంచాయతీ

సమ్మెకు మద్దతు కోరుతూ వినతులు

రామచంద్రపురం: రెండు నెలలుగా వివిధ రూపాల్లో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నిరసన కార్యక్రమాలు చేపట్టిన సహకార సంఘాల ఉద్యోగులు సమ్మెకు మద్దతు కోరుతూ ప్రజాప్రతినిధులను కలిసి వినతిపత్రాలు సమర్పిస్తున్నారు. సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఆదివారం రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, అమలాపురం ఎంపీ హరీష్ మాధుర్, ఎమ్మెల్యేలు దాట్ల సుబ్బరాజు, దేవ వరప్రసాద్, గిడ్డి సత్యనారాయణ, ఆనందరావు, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులకు వినతిపత్రాలు అందించారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కోశాధికారి పెంకే సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు యర్రంశెట్టి రామచంద్రరావు, జిల్లా కోశాధికారి బొబ్బా సుబ్రహ్మణ్యం, జిల్లా నాయకులు పోలిశెట్టి ఈశ్వరుడు, వి.రామకృష్ణ, జి.సూర్యనారాయణ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీగణపతి విగ్రహ ప్రతిష్ఠ

రామచంద్రపురం: రామచంద్రపురం అంకంవారివీధి వెంకటనగర్‌లో నిర్మించిన లక్ష్మీగణపతిస్వామి ఆలయంలో విగ్రహప్రతిష్ఠా కార్యక్రమాన్ని మంత్రి సుభాష్ చేతుల మీదుగా ఆదివారం జరిపించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, రాష్ట్ర ప్రజలంతా సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని పూజలు చేసినట్లు మంత్రి చెప్పారు. శివాలయం ట్రస్టుబోర్డు ఛైర్మన్, చెరుకుపల్లి గణేష్‌శర్మ ఆధ్వర్యంలో గణపతి పూజ, పుణ్యాహవాచనం, దీక్షాధారణ, మండపారాధనలు, లక్ష్మీగణపతి హోమం, విగ్రహప్రతిష్ఠ కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ అక్కల రిష్వంత్‌రాయ్, పట్టణ తెదేపా అధ్యక్షుడు ఉండవిల్లి శివ, ఆలయ కమిటి సభ్యులు పాల్గొన్నారు.

గృహ సముదాయాల్లో విస్తృత తనిఖీలు

ద్రాక్షారామ: రామచంద్రపురం సబ్ డివిజన్ పోలీసులు ఆదివారం వేకువజామునే ఉట్రుమిల్లి రాజీవ్ గృహకల్ప సముదాయాల్లో విస్తృత తనిఖీలు చేపట్టారు. డీఎస్పీ రఘువీర్, సీఐ వెంకటనారాయణ, ఎస్సైలు ఎం.లక్ష్మణ్, నాగేశ్వరరావు, సోమేంద్ర ఆధ్వర్యంలో సిబ్బంది బృందాలుగా వేరుపడి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అసాంఘిక కార్యక్రమాలు, ఆకతాయిల కదలికలపై వివరాలు ఆరా తీశారు. అనుమానిత వ్యక్తుల సమాచారాన్ని పోలీసులకు తెలియజేయాలని కోరారు. గృహ సముదాయాల వద్ద నిలిపిన వాహనాలను తనిఖీచేసి రికార్డులు పరిశీలించారు. నేరాల నియంత్రణకు సహకరించాలని, విగ్రహాలు, ఆలయాల వద్ద సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించాలని చెప్పారు.

గౌడ సంఘం ప్రమాణ స్వీకారం

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: ముమ్మిడివరం నియోజకవర్గ గౌడ సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకారం ఆదివారం నిర్వహించారు. నగర పంచాయతీ పరిధిలోని మహిపాల చెరువు సెంటర్లోని రాజులపూడి సూరిబాబు ఇంటి వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు రాజులపూడి భీముడు, మిద్దే పట్టాభిరామ్, దాసరి ప్రసాద్‌లు హాజరయ్యారు. సంఘ బలోపేతానికి అంతా కలిసికట్టుగా పనిచేయాలని వారు పిలుపునిచ్చారు. నియోజకవర్గ గౌడ సంఘం గౌరవాధ్యక్షుడిగా మట్ట సత్తిబాబు, సలహాదారుడిగా మట్ట మాధవ్, అధ్యక్షురాలిగా దాసరి జగదీశ్వరి, ఉపాధ్యక్షులుగా మట్ట సత్యనారాయణ, నిచ్చెనకోళ్ల కృష్ణారావు, మట్ట పట్టాభిరామారావు, ప్రధాన కార్యదర్శిగా కొండేటి చంద్రరావు, కోశాధికారిగా నిచ్చెనకోళ్ల సందీప్, అధికార ప్రతినిధి రాజులపూడి సూరిబాబు, అత్తిలి గణేష్, మట్ట శ్రీనివాస్‌లు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

బుర్రకథ కళాకారుడు రామారావు మృతి

రామచంద్రపురం: రాష్ట్రపతి అవార్డు గ్రహీత, ప్రముఖ బుర్రకథ కళాకారుడు చప్పిడి వారి సావరానికి చెందిన **పల్ల రామారావు** (90) ఆదివారం మృతిచెందారు. ఆయన గొర్రెల రామం, బాబ్జి, సుంకర సూర్యనారాయణ, ప్రేమానందం బుర్రకథల బృందాల్లో హాస్య కళాకారునిగా రాణించి పేరు ప్రఖ్యాతలు సాధించారు. పలు సత్కారాలు, సన్మానాలు పొందారు. కాకినాడలోని తన కుమార్తె ఇంటిలో వృద్ధాప్య సమస్యలు, అనారోగ్యంతో ఆయన తుదిశ్వాస విడిచారు.

కంకర తొలగించరూ..!

గచ్చకాయల పోర ప్రాథమిక పాఠశాల ఆవరణలో కంకరరాళ్లు విద్యార్థులకు ఇబ్బందిగా మారాయి. ఇక్కడ 70 మంది వరకు చదువుకుంటున్నారు. నాడు-నేడులో భాగంగా తెచ్చిన కంకర రాళ్లు రెండున్నరేళ్లుగా వదిలేశారు. అసలే ఇరుకైన ఆవరణ.. ఆపై కంకర ఉండటంతో పిల్లలు ఆడుకునే క్రమంలో కిందపడితే గాయపడే ప్రమాదం ఉంది. - న్యూస్‌టుడే, కాట్రేనికోన

అధికారుల నిర్లక్ష్యం.. ప్రజలకు శాపం

అమలాపురం మండలం రోళ్లపాలెంలో గత వైకాపా పాలనలో తాగునీటి ట్యాంకు నిర్మాణం ప్రారంభించారు. అది నేటికీ అసంపూర్తిగానే దర్శనమిస్తోంది. ప్రస్తుతం గ్రామంలో తాగునీరు రోజు విడిచి రోజు అందిస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని అసంపూర్తిగా మిగిలిన తాగునీటి ట్యాంకు నిర్మాణాన్ని చేపట్టి ప్రజలకు పూర్తిస్థాయిలో తాగునీరు అందించాలని కోరుతున్నారు.

-న్యూస్‌టుడే, అమలాపురం గ్రామీణం

ఇలా వదిలేశారు..!

చెత్త రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వం గతంలో పంచాయతీలకు ఈ- రిక్షాలను అందజేసింది. వీటి విలువ సుమారు రూ.3 లక్షల వరకు ఉంటుంది. పలుచోట్ల ఉపయోగించకుండానే మూలకు చేరాయి. ఎన్.కొత్తపల్లిలో ఓ ప్రభుత్వ భవనం అరుగుపై సుమారు నాలుగు రిక్షాలు చాలా కాలంగా ఇలా వృథాగా పడి ఉన్నాయి. అధికారులు వీటిని బాగుచేసి వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, ఉప్పలగుప్తం

నిరుపయోగంగా రైతుసేవా కేంద్ర భవనం

అమలాపురం మండలం సవరప్పాలెంలోని రైతుసేవా కేంద్రం భవన నిర్మాణం ఏడాది క్రితమే పూర్తయింది. ఇప్పటి వరకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు అధికారులు చొరవ చూపడం లేదు. ప్రస్తుతం ఈ భవనం అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారుతోంది. ఈ భవనాన్ని అందుబాటులోకి తీసుకొస్తే వ్యవసాయశాఖ సిబ్బంది సేవలు మరింత మెరుగ్గా నిర్వహించేందుకు అవకాశం ఉంటుందని గ్రామస్థులు చెబుతున్నారు.

-న్యూస్‌టుడే, అమలాపురం గ్రామీణం

అన్నదాన ట్రస్ట్‌కు విరాళం

అయినవిల్లి, న్యూస్‌టుడే: అయినవిల్లి సిద్ధివినాయక స్వామి ఆలయంలోని నిత్యాన్నదాన ట్రస్ట్‌కు అమలాపురానికి చెందిన కొత్తపల్లి సునీల్‌కుమార్, లక్ష్మీశ్వేత రూ.60,601 విరాళం ఆదివారం అందజేశారు. వీరికి అర్చకులు స్వామి వారి తీర్థప్రసాదం, చిత్రపటం బహూకరించారు.

'భాజపా దాడులు గర్హనీయం'

యానాం, న్యూస్‌టుడే: దిల్లీలో జరిగిన ఏఐ సదస్సులో యువజన కాంగ్రెస్ నిరసన చేసినందుకు ప్రతిచర్యగా కాంగ్రెస్ పార్టీ కార్యాలయాలపై భాజపా శ్రేణులు దాడులు చేయడం సరికాదని యానాం సీపీఎం కార్యదర్శి జి.దుర్గాప్రసాద్ ఖండించారు. నిరసన తెలియజేసే హక్కు ప్రతి పార్టీకి ఉంటుందని, భౌతిక దాడులకు తెగబడటం ప్రజాస్వామ్య స్ఫూర్తికే విరుద్ధమన్నారు.

మౌలానా అబుల్ కలాం ఆజాద్‌కు నివాళి

యానాం, న్యూస్‌టుడే: స్వతంత్ర సమరయోధుడు, తొలి కేంద్ర విద్యామంత్రి అబుల్ కలాం ఆజాద్ వర్ధంతిని యానాం సమాచార శాఖ ఆదివారం నిర్వహించింది. స్థానిక ఫెర్రీ రోడ్డులోని ఆజాద్ విగ్రహానికి పరిపాలనాధికారి అంకిత్ కుమార్, ఎస్పీ కే వరద రాజన్, ఎస్సై పునీత్ రాజా బృందం పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

ధీరశాలి ఉయ్యాలవాడ

అమలాపురం పట్టణం: బ్రిటీష్ పాలకుల నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేసిన ధీశాలి ఉయ్యలవాడ నరసింహారెడ్డి అని ఏఆర్ డీఎస్పీ సుబ్బరాజు కొనియాడారు. అమలాపురం ఎస్పీ కార్యాలయంలో ఉయ్యలవాడ వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. ఏఆర్ డీఎస్పీ సుబ్బరాజు, పోలీస్ అధికారులు నరసింహారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

విద్యార్థులకు కళ్ల జోళ్ల పంపిణీ

ముమ్మిడివరం: ముమ్మిడివరం జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆదివారం కళ్ల జోళ్లు పంపిణీ చేశారు. గత నెలలో వైద్య ఆరోగ్య శాఖ ఆదేశాల మేరకు వైద్యులు పాఠశాలలోని విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి, 30 మందికి కళ్ల జోళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల తల్లిదండ్రుల కమిటీ ఛైర్మన్ కె.శ్యామలరావు, డి.వెంకటలక్ష్మి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

'కృష్ణమాదిగ మాటలు వక్రీకరించడం తగదు'

ఉప్పలగుప్తం: మందా కృష్ణమాదిగ మాటలను వక్రీకరించి ఆయనపై అనుచిత వాఖ్యలు చేయడం తగదని ఎంఆర్‌పీఎస్ నాయకులు పేర్కొన్నారు. ఆదివారం ఉప్పలగుప్తం బాలయోగి పార్కులో ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ అనుబంధ సంఘాల నాయకులు మందా కృష్ణమాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కృష్ణమాదిగపై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండించారు.

లారీ ఢీకొని యువకుడి మృతి

పాలకొల్లు గ్రామీణ: లారీ ఢీకొట్టడంతో యువకుడు అక్కడికక్కడే మృతి చెందిన ఘటన పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు వద్ద చోటు చేసుకుంది. అమలాపురానికి చెందిన బి.ప్రభుకుమార్ (32) ద్విచక్ర వాహనంపై ఆదివారం పాలకొల్లులో బంధువుల ఇంటికి బయలుదేరారు. పాలకొల్లు సమీపాన పెదగరువు వచ్చేసరికి అతడిని ఎదురుగా వచ్చిన లారీ ఢీకొట్టడంతో తలకు తీవ్రగాయమై మృతి చెందారు.

ప్రజల ఆనందం.. ఆరోగ్యమే లక్ష్యం: మంత్రి సుభాష్

రామచంద్రపురం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రజలకు ఆనందం, సంతోషం అందించే దిశగా ఆనంద ఆదివారం (హ్యాపీ సండే) కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. ఆదివారం చింతపల్లి సూరన్ననగర్‌లోని ఎస్‌ఐజీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో హ్యాపీ సండే కార్యక్రమంలో మంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. త్వరలోనే పట్టణంలో నాలుగు పార్కులు ఏర్పాటు చేస్తామన్నారు. మున్సిపల్ కమిషనర్ కె.వి.ఆర్.ఆర్.రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమం ఆద్యంతం ఉత్సాహంగా సాగింది.

కార్యక్రమంలో విద్యార్థులు, నాయకులతో మంత్రి సుభాష్

అమలాపురం చంద్రబాబు ఉద్యానంలో యోగా చేయిస్తున్న శిక్షకుడు కంకిపాటి వెంకటేశ్వరరావు

ఉత్సాహంగా ఆనంద ఆదివారం

అమలాపురం పట్టణం: ప్రజలు మానసిక ఒత్తిడి తగ్గించుకుని సంపూర్ణ ఆరోగ్యంగా ఉండేలా నడక, జాగింగ్, యోగా, సైక్లింగ్, వంటి వ్యాయామాలు చేయాలని మున్సిపల్ డీఈఈ కేవీవీ సత్యనారాయణ సూచించారు. అమలాపురంలోని చంద్రబాబు ఉద్యానంలో ఆనంద ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రతి నెలా 2, 4 ఆదివారాల్లో హ్యాపీ సండే కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. యోగా శిక్షకుడు కంకిపాటి వెంకటేశ్వరరావు యోగాసనాలు వేయించారు. అనంతరం మున్సిపల్ అధికారులు, ప్రజలతో నడక నిర్వహించారు. మేనేజర్ ప్రభాకర్‌రావు, టీపీవో రాణి సంయుక్త, తెదేపా నాయకులు ఆశెట్టి ఆదిబాబు, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

సీతారామ స్వామి విగ్రహ ప్రతిష్ఠ

ముమ్మిడివరం: కర్రివానిరేవు పంచాయతీ బూరుగుపేటలోని సీతారామ స్వామి వారి ఆలయ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు పాల్గొన్నారు. వేద పండితుల మంత్రోచ్ఛరణ నడుమ విగ్రహాలను ప్రతిష్ఠించారు. సర్పంచి కాశి భాగ్యలక్ష్మి, జగపతిరావు, చెల్లి అశోక్ పాల్గొన్నారు.

సీతారామ స్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు

అమ్మవారికి వెండి తొడుగు బహూకరణ

అమలాపురం గ్రామీణం: పాలగుమ్మిలోని తోటలమ్మ అమ్మవారికి ఆరు కేజీల వెండితో తొడుగు, మకర తోరణం, 111 కేజీల పంచలోహంతో మరో మకర తోరణం గ్రామానికి చెందిన బొక్కా రవికుమార్ చేయించారు. ఈ వెండి వస్తువులను ఆదివారం అలంకరించి అమ్మవారికి పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారిని గ్రామస్థులు దర్శించుకున్నారు.

వెండి వస్తువులతో తోటలమ్మ అమ్మవారు

'కాంగ్రెస్ కార్యకర్తల తీరు సరికాదు'

అమలాపురం పట్టణం: దిల్లీలోని ఏఐ సమ్మిట్ సమావేశంలో కాంగ్రెస్ కార్యకర్తలు దేశ ప్రతిష్ఠను దిగజార్చారని భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమా ఆరోపించారు. అమలాపురంలోని గడియారస్తంభం కూడలిలో భారతీయ యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు గాణాల కల్యాణ్ ఆధ్వర్యంలో భాజపా నాయకుల నిరసన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. భాజపా నాయకులు యూత్ కాంగ్రెస్ కార్యకర్తల చర్యలను ఖండిస్తూ నినాదాలు చేశారు. మోకా సుబ్బారావు, గనిశెట్టి అరవింద్, నరేంద్రవర్మ, అరిగెల నాని, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జవాను కుటుంబానికి ఎంపీ పరామర్శ

అల్లవరం: అనారోగ్యం కారణంగా మృతి చెందిన బోడసకుర్రు గ్రామానికి చెందిన ఆర్మీ జవాను బడుగు నాగబాబు కుటుంబాన్ని ఆదివారం ఎంపీ హరీష్ మాధుర్ పరామర్శించారు. ఈసందర్భంగా కుటుంబ సభ్యులు అధికారుల మధ్య సమన్వయ లోపం కారణంగా అంతిమ సంస్కారాల్లో అధికారిక లాంఛనాలు దక్కలేదని ఆయన దృష్టికి తీసుకు వచ్చారు. అయన వెంట సర్పంచి విజయలక్ష్మి, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

జవాను కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న ఎంపీ హరీష్ మాధుర్

ఫౌండేషన్ సేవలు మరింత విస్తృతం చేస్తాం

పామర్రు: అధికారంతో సంబంధం లేకుండా సమాజానికి, పేదలకి సాయం అందిస్తానని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ వ్యాఖ్యానించారు. సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ సేవలు మరింత విస్తృతం చేస్తానని మంత్రి తండ్రి వాసంశెట్టి సత్యం చెప్పారు. కె.గంగవరంలో ఆదివారం రాత్రి మండల శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో వీరిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వచ్చే మూడేళ్లలో నియోజకవర్గంలో పూరిగుడిసె లేకుండా చేస్తానని, కోటిపల్లి-ముక్తేశ్వరం రోడ్డు వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి ఇప్పటివరకు రూ.180 కోట్లు విడుదల చేయించానన్నారు. కార్యక్రమంలో శెట్టిబలిజ సంఘ నాయకులు మేడిశెట్టి రవికుమార్, పెంకే అన్నపూర్ణ, సాంబశివరావు, జుత్తుక శ్యాంప్రసాద్, పెంకే గోవింద రాజు తదితరులు పాల్గొన్నారు.

జేసీఐ సేవా కార్యక్రమాలు

అమలాపురం గ్రామీణం: జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ (జేసీఐ) ఆధ్వర్యంలో అమలాపురంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈదరపల్లిలోని టీటీడీ కల్యాణ మండపం ఎదురుగా హెల్మెట్ బరువు కాదు.. బాధ్యత అనే బోర్డును ఏర్పాటు చేశారు. అమలాపురం డీఎస్పీ కార్యాలయం వద్ద ఆకొండి సింహాచలం ట్రస్ట్ సహకారంతో పోలీసు సిబ్బందికి స్టీల్ వాటర్‌బాటిళ్లు పంపిణీ చేశారు. ఇండియా నేషనల్ వైస్ ప్రెసిడెంట్ యశస్విని, కె.ప్రమోద్‌కుమార్, లక్కం రవీంద్రరెడ్డి, శ్రీవాణి వాడ్రేవు, శ్రీరామ్ వాడ్రేవు, ప్రవీణ్ చిర్రాపూరి, మోహన్ యల్లంపల్లి, మాకిరెడ్డి పాల్గొన్నారు.

టీటీడీ కల్యాణమండపం ఎదుట ఏర్పాటు చేసిన బోర్డు వద్ద జేసీఐ ప్రతినిధులు

సామ్యవాద భావజాలాన్ని ముందుకు తీసుకెళ్లాలి

ముమ్మిడివరం: సామ్యవాద భావజాలాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాల్సిన ఆవశ్యకత ఉందని పలువురు ప్రజా సంఘాల నాయకులు అన్నారు. ముమ్మిడివరంలోని సీపీఎం కార్యాలయం వద్ద రెడ్ బుక్ డే సందర్భంగా 'సామాజిక న్యాయం-ఆవశ్యకత' అనే అంశంపై ఆదివారం నిర్వహించిన సదస్సులో చర్చించారు. కార్ల్ మార్క్స్, ఏంగెల్స్ రచించిన ఈ చిన్న గ్రంథంతో ఉద్యమాలకు బాటలు పడ్డాయన్నారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జి.దుర్గాప్రసాద్, సకిలే సూర్యనారాయణ, పాము బాలయ్య, దొమ్మేటి వీరరాఘవులు, కె.లక్ష్మణరావు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సదస్సులో పాల్గొన్న నాయకులు

యానాం టీవీకే పార్టీ ఇన్‌ఛార్జిగా తోట రాజు

యానాం, న్యూస్‌టుడే: తమిళ చలనచిత్ర కథానాయకుడు దళపతి విజయ్ నూతనంగా ప్రారంభించిన తమిళ వెట్రి కజగం(టీవీకే) పార్టీ యానాం ఇన్‌ఛార్జిగా వ్యాపారవేత్త తోట రాజును పార్టీ ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ నియమించారు. ఆదివారం సాయంత్రం స్థానిక ద్రాక్షరామ రోడ్డులోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పార్టీని బలోపేతానికి సాయశక్తులా కృషి చేస్తానని, ప్రజలంతా అండగా నిలవాలని, ఎన్నికల గుర్తు విజిల్ అని చెప్పారు. సమావేశంలో కడలి సుబ్రహ్మణ్యం, సూరంపూడి చంద్రశేఖర్, తోట పెదకాపు, బండారు పళ్లంరాజు, కాచర్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల గుర్తు 'విజిల్'ను ఊదుతున్న తోట రాజు

స్కాట్ దుస్తులలో విద్యార్థులు

యానాంలో ప్రపంచ స్కౌట్ దినోత్సవం

యానాం, న్యూస్‌టుడే: సమాజ శ్రేయస్సు పరమావధిగా ఏర్పడిన స్కౌట్ ద్వారా విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన జీవనవిధానం అలవర్చుకుంటారని పీఎం శ్రీ నవోదయ విద్యాలయ ప్రిన్సిపల్ శరత్‌చంద్ర కీర్తి అన్నారు. ఆదివారం విద్యాలయలో ప్రపంచ స్కౌట్ దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరించి, వ్యవస్థాపకుడు బెడెన్ పాల్ చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రాథమిక చికిత్స మెళకువలు, వ్యాయామ ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో స్కౌట్ ఉపాధ్యాయుడు పాపారావు, గైడ్ కెప్టెన్ లక్ష్మీ ప్రసన్న, హేమశ్రీ పాల్గొన్నారు.

ఆలోచనలు విరియాలి.. ఆవిష్కరణలు మెరవాలి..!

ప్రతి విద్యార్థిలో ఏదో ఒక ప్రతిభ దాగి ఉంటుంది. పాఠశాల స్థాయిలోనే సృజనాత్మకత వెలికితీసేందుకు 'ఈనాడు వైజ్ఞానిక ప్రదర్శన' నిర్వహిస్తోంది. వినూత్న ఆలోచనలతో ప్రయోగాలు చేసేలా ప్రోత్సహిస్తోంది. ఇందులో భాగంగా పోలీసు కన్వెన్షన్ హాల్, లజర్ఫ్ పోలీస్ లైన్ (ఉమామార్కండేశ్వరస్వామి కల్యాణ మండపం వద్ద) జాంపేట, రాజమహేంద్రవరంలో ఫిబ్రవరి 26వ తేదీన మెగా సైన్స్ ఫెయిర్ నిర్వహిస్తోంది.

ఈనాడు

K-10 SCHOOL
SRI GOWTHAMI
Learning for Life
GANDHIPURAM | SRIRAMNAGAR
RAJAMAHENDRAVARAM
93486 55501 | 93486 55503

నిబంధనలు.. ● 6 నుంచి 10 తరగతుల విద్యార్థులకు మాత్రమే. ● ప్రాజెక్టును ముందుగా నమోదు చేసుకోవాలి. ● ఒక ప్రాజెక్టుకి ఇద్దరు విద్యార్థులకు అనుమతి. ● పాఠశాల/ బ్రాంచ్‌కి ఒక ప్రాజెక్టుకు మాత్రమే అనుమతి. ● మొదటి ముగ్గురు విజేతలకు బహుమతులు ఉంటాయి. ● పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్స్ ప్రదానం. రిజిస్ట్రేషన్ చివరి తేదీ : ఫిబ్రవరి 24

నమోదుకు: 77027 79616
సమయం: ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గం॥ల వరకు..

పీజీఆర్ఎస్ నేడు

కలెక్టరేట్: పీజీఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్‌లను సోమవారం కలెక్టరేట్‌లో యథావిధిగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ కీర్తి చేకూరి ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి వివిధ సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించనున్నట్లు చెప్పారు. కలెక్టరేట్‌తోపాటు డివిజన్, మండలస్థాయిలో కూడా పీజీఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్ జరుగుతాయన్నారు.

ఉలికిపాటు..!

● వణికించిన కిడ్నీ వ్యాధి

చౌడేశ్వరనగర్‌లో ఆదివారం రాత్రి వివరాలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది

ఈనాడు, రాజమహేంద్రవరం, కంబాలచెరువు, న్యూస్‌టుడే: ప్రశాంత రాజమహేంద్రవరం నగరాన్ని ఒక్కసారి కిడ్నీ వ్యాధి వణికించింది. చౌడేశ్వరనగర్, స్వరూప్‌నగర్, ఆర్టీవో కార్యాలయ వెనుక ప్రాంతానికి చెందిన 14 మంది ఈ నెల 15వ తరువాత నుంచి ఒకే తరహా కిడ్నీ సమస్యలతో ఆసుపత్రులపాలయ్యారు. వీరిలో ఇద్దరు చికిత్స పొందుతూ మృతి చెందగా మరో 12 మంది వివిధ ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. బాధితకుటుంబాలన్నీ కోరుకొండ మండలం నర్సాపురానికి చెందిన గణేష్ అనే పాల వ్యాపారి నుంచి రోజూ పాలు కొనుగోలు చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. పాలు కలుషితం జరిగి ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

ఇంటింటా సర్వే..

చౌడేశ్వరినగర్, స్వరూప్ నగర్ పరిసర ప్రాంతాల్లో వైద్య ఆరోగ్య శాఖ, నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య బృందాలు ఇంటింటా సర్వే చేపట్టారు. ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు 14 బృందాలుగా విడిపోయి 649 ఇళ్లల్లో 957 కుటుంబాలను సర్వే చేసినట్లు వైద్య అధికారులు తెలిపారు. సర్వే నిర్వహిస్తున్న తీరును డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు, నగరపాలక సంస్థ ఎంహెచ్‌వో వినూత్న పర్యవేక్షించారు. నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగం అధికారులు ఇంటింటికీ వెళ్లి నీటి నాణ్యతా తనిఖీలు చేపట్టారు.

50 మంది నుంచి సేకరణ..

కోరుకొండ మండలం నర్సాపురానికి చెందిన పాల వ్యాపారి గణేష్ ఆ పరిసర ప్రాంతాల్లోని దాదాపు 50 మంది నుంచి పాలు సేకరిస్తున్నట్లు అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. సేకరించిన పాలను దాదాపు 126 ఇళ్లకు ఇస్తున్నట్లు తెలుసుకున్నారు. ఇందులో 30 కుటుంబాలకు నిత్యం సరఫరా చేస్తున్నాడు. ఆదివారం రాత్రి 9.30 వరకు 36 చిరునామాలు తెలుసుకున్నారు. పూర్తి వివరాలు తెలుసుకున్న తరువాత సర్వే పూర్తి చేయాలని కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశించారు.

● పాల వ్యాపారి గణేష్ ఇంటి పరిసరాలతోపాటు, సమీపంలో అతను పాలు సేకరిస్తున్న పాడి రైతులు తమ పశువులను పెంచే విధానం, దాణా ఏమిస్తున్నారనే అంశాలంపై విచారణ ప్రారంభించారు.

రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జయకృత్‌రాజ్ (3)

బాధితులు వీరే..

ఎన్.శేషగిరి (72), బి.అనంతలక్ష్మి (72), జి.వెంకటలక్ష్మి, జి.వెంకటేశ్వరరావు (75), జి.సూర్యారావు (80), ఆర్.సూర్యకుమారి (62), కె.సత్యనారాయణ (75), బి.వీరలక్ష్మి (65), రాధాకృష్ణమూర్తి (74), జయకృత్‌రాజ్ (3), నగరంలోని కొత్తపేట (అన్నపూర్ణమ్మ పేట రైల్వేగేటు) ప్రాంతానికి చెందిన అయిదు నెలల శిశువు రుహన్య ఉన్నారు. 9 మంది ఐసీయూలో చికిత్స పొందుతున్నారు. తాడి రమణి (58) పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

అక్కడ సౌకర్యాలు లేకపోయినా రిఫర్ చేశారు..

- ప్రకాశరావు, బాలుడి తాతయ్య



నా మనుమడికి మూడేళ్లు కూడా నిండలేదు. జీవచ్ఛవంలా పడున్నాడు. రెండేళ్ల నుంచి ఆయన వద్దే పాలు పోయించుకుంటున్నాం. ఈనెల 17న వాంతులు, విరేచనాలుగా మొదలైంది. 19న పరిస్థితి తీవ్రమైంది. కాకినాడ జీజీహెచ్‌లో డయాలసిస్ ఇతర వసతులు ఉన్నాయని మమ్మల్ని అక్కడికి పంపారు. అక్కడ కనీసం పట్టించుకోలేదు. డయాలసిస్ వంటి వసతులు లేవని చెప్పారు. దీంతో నగరంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చాం. కాకినాడకు వెళ్లొచ్చేసరికి ఆరు గంటలు వృథా అయ్యింది. ఆరోజు నుంచి ఇప్పటికి మూడుసార్లు డయాలసిస్ చేశారు. పరిస్థితి క్రిటికల్‌గానే ఉందని చెబుతున్నారు. కాకినాడలో సౌకర్యాలు లేవని రాజమహేంద్రవరం ఆసుపత్రి సిబ్బందికి తెలియదా..? మూడేళ్ల చిన్నారిని అలా చూస్తుంటే పరిస్థితి భరించలేకపోతున్నాం.

అయిదు నెలల పాపకు డయాలసిస్

- ఓంకార్‌సాయి, చిన్నారి మేనమామ

అన్నపూర్ణమ్మపేట రైల్వేగేటు వద్ద కొత్తపేటలో ఉంటాం. మా సోదరి కుమార్తె ఎం.రుహన్యకు అయిదు నెలలు. రెండు నెలల నుంచి గణేశ్ వద్ద పాలు పోయించుకుంటున్నాం. యూరిన్ ఆగిపోవడంతో ఈనెల 16న నగరంలోని దానవాయిపేటలో చిన్నపిల్లల ఆసుపత్రిలో చేర్చాం. అక్కడ కిడ్నీ ఇన్‌ఫెక్షన్ వచ్చిందని, డయాలసిస్ అవసరమని చెప్పడంతో మరో ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లాం. అక్కడ చికిత్స అందిస్తున్నారు. క్షణక్షణం భయంగా ఉంది.

సమగ్ర దర్యాప్తునకు ఆదేశం..

- కీర్తి చేకూరి, కలెక్టర్,

ఒకే ప్రాంతంలో అనూరియా (మూత్ర విసర్జన కాకపోవడం) సమస్యతో పలువురు ఆసుపత్రుల్లో చేరడంపై సమగ్ర విచారణ చేస్తున్నాం. బాధితులందరికీ ఒకరే పాలు పోస్తున్నట్లు గుర్తించిన నేపథ్యంలో అతను ఎక్కడ నుంచి పాలు సేకరిస్తున్నారో పశువైద్య బృందం గ్రామంలో ఆరా తీస్తోంది. ప్రభావిత ప్రాంతంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. అతని వద్ద పాలు కొనుగోలు చేసిన జాబితా ఆధారంగా వైద్యబృందాలు సర్వే చేస్తున్నారు. పాలలో కల్తీ జరిగిందన్న అనుమానాల నేపథ్యంలో నమూనాలను పరీక్షలకు పంపించారు. బాధితులందరికీ మెరుగైన వైద్యం అందేలా చర్యలు చేపట్టాం.

చప్పట్లు కొడుతూ ఉత్సాహంగా నృత్యం చేస్తున్న యువత

ఆరోగ్యానికి 5వేల అడుగులు

నడక కార్యక్రమం ప్రారంభిస్తున్న మంత్రి దుర్గేష్

సంపూర్ణ ఆరోగ్యానికి ప్రతి ఒక్కరూ కనీసం 5వేల అడుగులు వేయాలని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ సూచించారు. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఏకేసీ కళాశాల రోడ్డులో హ్యాపీ సండే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా 5కే 'స్టెప్స్' పేరిట నడక ప్రదర్శన చేపట్టారు. తారక రామారావు పార్కు నుంచి పీవీ అప్పారావు రోడ్డు మీదుగా నడక సాగింది. ఒత్తిడి లేని జీవనశైలికి నడక ఎంతో దోహదపడుతుందన్నారు. హ్యాపీ సండేతో సామాజిక అనుబంధం, సానుకూల దృక్పథం పెరుగుతున్నాయన్నారు. జుంబా, యోగా, ధ్యానం, క్రీడాపోటీలు, సంగీతం, సాహిత్యం, కళా ప్రదర్శనలు నిర్వహిస్తామన్నారు. సినీ హాస్య నటుడు భద్రం పాల్గొని యువతను ఉత్సాహపరిచారు. మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ

పూల మార్కెట్‌కు పెళ్లి కళ

కడియం, న్యూస్‌టుడే: మూఢం ముగిసింది. శుభ ఘడియలతో పెళ్లిబాజాలు మోగుతున్నాయి. కల్యాణ మండపాలు కళకళలాడుతున్నాయి. వీటితో పాటు కడియపులంక అంతర్జాతీయ పూలమార్కెట్‌కూ కొత్త కళ వచ్చింది. రెండు నెలలుగా సాధారణంగా ఉన్న మార్కెట్ ఒక్కసారిగా ఊపందుకుంది. పూల ధరలు పెరిగాయి. రానున్న నెల్లాళ్లలో వివాహాలు, శుభకార్యాలు అధిక సంఖ్యలో ఉండటంతో కొనుగోలుదారుల తాకిడి అధికంగా ఉంటుందని మార్కెట్ విశ్లేషకులు భావిస్తున్నారు.

రోజా రూ.40లక్షల మార్కెట్..

ఇక్కడి నుంచి అనంతపురం, విజయవాడ, విశాఖపట్నం, అనకాపల్లి, అమలాపురం ప్రాంతాలకు ఎక్కువగా వెళ్తాయి. అలాగే ప్రసిద్ధి పుణ్యక్షేత్రాలయిన సింహాచలం, అన్నవరం, ద్రాక్షారామ, వాడపల్లి, ద్వారకాతిరుమల, విజయవాడలోని ఆలయాలకు నిత్యం లోడు వెళ్తోంది. శుభకార్యాల సందర్భంగా హైదరాబాద్ నుంచి కడియపులంక మార్కెట్‌కు ఆర్డర్లు పెరిగాయి. ఒకరోజుకు రూ.30 లక్షల నుంచి రూ.40లక్షల వరకు కొనుగోళ్లు జరుగుతున్నాయని వ్యాపారులు చెబుతున్నారు.

కొనుగోలు దారులతో సందడిగా కడియపులంక పూలమార్కెట్

ధరలిలా: చామంతి కిలో రూ.80, లిల్లీలు రూ.350 నుంచి రూ.400, స్టార్ గులాబీలు రూ.100, బంతి రూ.35 నుంచి రూ.40, కనకాంబరం బారు ఒకటీ రూ.120 నుంచి రూ.150, మల్లెలు కిలో రూ.600, కాగడాలు రూ.350, గులాబీ కట్ట రూ.250 పలుకుతున్నాయి.

శ్రీరామనవమి తర్వాత..

ఇక్కడి సంప్రదాయం ప్రకారం శ్రీరామనవమి తర్వాత మరిన్ని వివాహాలు జరుగుతాయి. వచ్చే ఏడాది గోదావరి పుష్కరాల నేపథ్యంలో గోదావరి తీరంలో పుష్కరాలకు మూడు నెలల ముందు, ముగిసిన తర్వాత మరో మూడు నెలలు వివాహాలు చేయరు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది అధిక సంఖ్యలో కల్యాణాలు జరుగుతాయని పండితులు చెబుతున్నారు. మూడు నెలల వరకు ముహూర్తాల సమయాల్లో పెళ్లి మండపాలన్నీ బుక్ చేసుకున్నారు.

అందెల రవళి.. సంప్రదాయ జాబిలి

రాజమహేంద్రవరం ఆనంకళాకేంద్రంలో ఆదివారం శివరాత్రి శివోహం నృత్య కార్యక్రమం జరిగింది. వివిధ ప్రాంతాలకు చెందిన కళాకారులు తమ ప్రతిభను ప్రదర్శించారు. వినాయక ప్రార్థనతో మొదలైన నృత్య ప్రదర్శనలు సాయంత్రం వరకు జరిగాయి. భారత్ ఆర్ట్స్ అకాడమీ నిర్వాహకురాలు లలితారావు సారథ్యంలో నిర్వహించారు. చిన్నారులకు పురస్కారాలు అందజేశారు.

– న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం సాంస్కృతికం

ఈ వేసవి ఎంతో చల్లన..!

● విద్యుత్తు సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు

దేవీచౌక్, న్యూస్‌టుడే: జిల్లాలోని విద్యుత్తు వినియోగదారులకు ఈ వేసవిలో ఊరట లభించనుంది. అంతరాయాలు లేకుండా విద్యుత్తు సరఫరా చేసేందుకు అధికారులు ఇప్పటికే చర్యలు చేపట్టారు. ఎండల తీవ్రత పెరగడంతో 8 నుంచి 10 శాతం విద్యుత్తు వినియోగం పెరిగింది. గత ఏడాది ఫిబ్రవరిలో రోజువారీ వినియోగం సగటున 8.976 యూనిట్లు కాగా ప్రస్తుతం 9.721 యూనిట్లు ఉంది. ఈ ఏడాది 15 శాతం వరకు పెరుగుదల ఉంటుందని అంచనావేసి దానికనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

లోడ్ ఫీడర్లను విభజించి..

● లోడ్ ఎక్కువగా ఉండే 229 ఫీడర్లు విభజించాలని ప్రతిపాదించారు. ప్రస్తుతం 66 పూర్తి చేశారు. ● వ్యవసాయానికి తొమ్మిది గంటలు నిరంతరాయంగా సరఫరా చేసేందుకు 119 ఏజీఎల్ ఫీడర్లను ప్రత్యేకంగా విభజించారు. ● తూర్పు రైల్వేస్టేషన్ రోడ్డులోని వాంబే గృహాలు, కోర్లమ్మపేట, విక్రమ్‌హాలు, అయిదుబళ్ల మార్కెట్, షిర్డీసాయినగర్, రామకృష్ణానగర్, సుబ్బారావునగర్, ఆనందనగర్, కాతేరు, వెంకటేశ్వరనగర్, ఐఎంఏ హాలు, అంబేడ్కర్‌నగర్, సాయిదుర్గానగర్, బాలాజీనగర్, చైతన్యనగర్, గానుగవీధి, కొత్తరోడ్డు, గాంధీబొమ్మసెంటర్, సీతంపేట, వీరభద్రపురం ప్రాంతాల్లో లోడ్ ఫీడర్లను విభజించారు.

నిర్మాణంలో ఉన్న కడియం ఉప విద్యుత్తు కేంద్రం

కొత్త ఉప విద్యుత్తు కేంద్రాలు

రాజమహేంద్రవరంలో కొత్తగా 40 నియంత్రికలు ఏర్పాటు చేశారు. పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల కెపాసిటీ పెంచడం, అదనపు డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు చేశారు. కొత్తగా నాలుగు ఉప విద్యుత్తు కేంద్రాల నిర్మాణ పనులు చేపట్టారు. వీటిలో నన్నయ విశ్వవిద్యాలయం ఉప విద్యుత్తు కేంద్రం ఇప్పటికే అందుబాటులోకి తీసుకొచ్చారు. తీరుగూడెం, కడియం ఉప విద్యుత్తు కేంద్రాలు నిర్మాణ దశలో ఉన్నాయి. ఇవి మార్చి నెలాఖరు నాటికి అందుబాటులోకి రానున్నాయి.

పూర్తయిన రూ.146 కోట్ల విలువైన పనులు

రానున్న పుష్కరాల నేపథ్యంలో ఆర్‌డీఎస్ఎస్(రీవేంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టర్ స్కీం)లో రూ.146 కోట్ల పనులు పూర్తి చేశారు. 261 అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటుచేయడంతోపాటు నాలుగు ఉప విద్యుత్తు కేంద్రాలు నిర్మిస్తున్నారు.

'వేసవిలో ఎటువంటి అంతరాయాలు లేకుండా విద్యుత్తు సరఫరా చేస్తాం. వినియోగం పెరిగినా దానికి తగిన ఏర్పాట్లు చేశాం. కొత్త ఉప విద్యుత్తు కేంద్రాలు మార్చి నెలాఖునాటికి అందుబాటులోకి వస్తాయి' అని ఈపీడీసీఎల్ రాజమహేంద్రవరం సర్కిల్ ఎస్ఈ కె.తిలక్‌కుమార్ వెల్లడించారు.

నేటినుంచి ఇంటర్ పరీక్షలు

శ్యామలా సెంటర్, న్యూస్‌టుడే: జిల్లాలో ఇంటర్ పబ్లిక్ రాత పరీక్షలు నేటినుంచి ప్రారంభం కానున్నాయి. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు జరగనున్నాయి. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను జిల్లా అధికారులు ఇప్పటికే పూర్తి చేశారు. కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయగా 144 సెక్షన్ అమల్లో ఉంటుందని అధికారులు తెలిపారు. ● జిల్లాలో ప్రథమ సంవత్సరం జనరల్ అభ్యర్థులు 21,738 కాగా ఒకేషనల్ విభాగంలో 762 మంది, ద్వితీయ సంవత్సరం జనరల్ విద్యార్థులు 20481, ఒకేషనల్ విభాగంలో 916 మంది పరీక్షలకు హాజరుకానున్నారని ఆర్ఐవో ఐ.శారద తెలిపారు. మొత్తం 52 కేంద్రాల్లో పరీక్షలు జరుగుతాయన్నారు.

గామన్ వంతెన మళ్లీ మూసేశారు

ఒకవైపే రాకపోకలు

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే : నాలుగు వరుసల వంతెన (గామన్) వార్షిక నిర్వహణలో భాగంగా ఓ వైపు మాత్రమే రాకపోకలకు అనుమతిస్తున్నారు. ఆదివారం ఉదయం నుంచి రాజమహేంద్రవరం నుంచి కొవ్వూరు వెళ్లే దారిని మూసివేశారు. దీంతో రాజమహేంద్రవరం వెళ్లే దారిలోనే ఎదురుబదురుగా (రెండు వరుసల్లో) ప్రయాణాలకు ఏర్పాట్లు చేశారు. 24వ తేదీ రాత్రికి బేరింగుల తనిఖీలు, అవసరమైన చర్యలు తీసుకోనున్నామని ర.భ.శాఖ అధికారులు తెలిపారు. 75 స్తంభానికి బేరింగ్ పాడవడంతో కొత్త సామగ్రిని నిపుణులు అమర్చనున్నారు. రాజమహేంద్రవరం వైపు తనిఖీలు పూర్తి చేయగా తాజాగా మళ్లీ రెండు రోజుల పాటు ఆ పనులు చేయాల్సి వచ్చింది. అయితే వార్షిక నిర్వహణ పనుల కారణంగా రాకపోకలకు అవస్థలు ఎదురవుతున్నాయి. ప్రత్యామ్నాయ ఏర్పాట్ల ద్వారా ప్రమాదాలకు తావు లేకుండా పోలీసు యంత్రాంగం శ్రద్ధ చూపాలని వాహనదారులు కోరుతున్నారు.

నీటి ఎద్దడి నివారణకు 'క్రాష్'

న్యూస్‌టుడే, వి.ఎల్.పురం :

జిల్లాలోని కొన్ని గ్రామీణ ప్రాంతాల్లో వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తే పరిస్థితులు ఉన్నాయి. దీని దృష్ట్యా గ్రామీణ ప్రజలు వేసవిలో దాహార్తితో ఇబ్బందులు పడకుండా జిల్లా గ్రామీణ నీటిసరఫరా, పారిశుద్ధ్య విభాగం(ఆర్‌డబ్ల్యూఎస్) ఆధ్వర్యంలో 'క్రాష్' కార్యక్రమం నిర్వహిస్తున్నారు. వచ్చే నెల 15వరకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు.

ఏం చేస్తారంటే..

● జిల్లాలోని పలు గ్రామాల్లోని చేతిపంపులు, బోర్లు, రక్షిత నీటి ట్యాంకులను క్షేత్రస్థాయిలో ఆర్‌డబ్ల్యూఎస్ సాంకేతిక సిబ్బంది పరిశీలన చేస్తారు. ● పనిచేయని చేతి పంపులు, మరమ్మతులకు గురైన బోర్లను గుర్తించి వాటిని వినియోగంలోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటారు.

ఇదీ పరిస్థితి

ఆయా గ్రామపంచాయతీల పరిధిలో మొత్తం 2,069 చేతి పంపులతో పాటు 968 నీటి పథకాలు ఉన్నాయి. రక్షిత నీటి పథకాల ద్వారా సరఫరా అయ్యే నీటిని గ్రామీణులు తాగేందుకు వినియోగించుకుంటుండగా వాడకపు నీటి అవసరాలకు చాలా మంది చేతి పంపులపై ఆధారపడుతున్నారు. వేసవి ఎండలు ముదిరే సరికి కొన్ని చోట్ల బోర్లు, చేతిపంపులు సరిగా పనిచేయక నీటి ఎద్దడి సమస్యలు తప్పడం లేదు.

● క్రాష్ కార్యక్రమం ద్వారా 150 నీటి పథకాలు, 476 చేతిపంపుల పరిశీలించినట్లు జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ కార్యనిర్వాహక ఇంజినీర్ వెంకటగిరి తెలిపారు. పరిశీలించిన వాటిలో 373 చేతిపంపులు బాగానే పనిచేస్తుండగా 84 పూర్తిగా శిథిలావస్థకు చేరగా 19 మరమ్మతులకు గురైనట్లు గుర్తించి మరమ్మతులు చేయిస్తున్నట్లు తెలిపారు.

కోరుకొండలో చేతిపంపునకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

నిధులు ఇలా..

బోర్ల మరమ్మతులకు అవసరమైన సామగ్రి కొనుగోలుకు మండల పరిషత్తు, గ్రామ పంచాయతీ నిధులు కేటాయిస్తున్నారు. ఇటీవల మండల పరిషత్తుతోపాటు పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల య్యాయి. ఇందులోని టైడ్ విభాగంలో 15 శాతం నిధులను తాగునీటి అవసరాలకు కేటాయించారు. వీటితో బోర్ల మరమ్మతులకు, అవసరమైన గొట్టాలు తదితర విడిభాగాలను కొనుగోలు చేసి పనులు చేపడుతున్నట్లు అధికారులు చెబుతున్నారు.

'పుష్కర' ప్రణాళికలో ఆర్టీసీ భాగస్వామ్యం

కొవ్వూరు పట్టణం: పుష్కరాల నిర్వహణ ప్రణాళికలో యాత్రికులు, భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని జిల్లా ప్రజారవాణా అధికారి వైఎస్ఎన్ మూర్తి తెలిపారు. కొవ్వూరు డిపో నుంచి హైదరాబాద్‌కు వెళ్లే నూతన సర్వీసు ప్రారంభ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పుష్కరాల నేపథ్యంలో రాజమహేంద్రవరం, కొవ్వూరు తదితర ప్రాంతాల్లో ఎక్కడికక్కడ తాత్కాలిక బస్టాండ్ల ఏర్పాటు.. రాకపోకల విధానం, మౌలిక సదుపాయాల కల్పనపై క్షేత్రస్థాయి పర్యటనలు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో 750 ఈ-బస్సులు, ఆర్టీసీ ఎండీ చొరవతో సీఎన్‌జీ బస్సులు ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చే వీలుందన్నారు. కొవ్వూరు, నిడదవోలు, రాజమహేంద్రవరం, గోకవరం బస్టాండ్‌లలో తాగునీటి సౌకర్యం ఉందని, అవసరమైన చోట్ల దాతలు, ప్రజాప్రతినిధుల సహకారంతో సదుపాయాలను కల్పిస్తున్నామన్నారు. రాష్ట్రంలో కార్గో సేవల పనితీరులో జిల్లా 2వ స్థానంలో, సేవల అంశంలో 14వ స్థానంలో ఉందన్నారు. అనారోగ్యం కారణంగా విధులు నిర్వర్తించలేని వారిని గుర్తించి వారు చేయదగ్గ విధులు అప్పగించే వీలుందని, ఈ విధంగా 80 మంది సిబ్బంది ఉన్నారని తెలుస్తోందన్నారు.

శ్రద్ధాంజలి

మంచితనం, ప్రేమ, ఆప్యాయతతో మా అందరి మనస్సులలో చిరస్థాయిగా నిలిచిన మా ఇంటి దైవం, మా కుటుంబ ఉన్నతికి అహర్నిశలు శ్రమించిన

శ్రీ అనదాసు సోమరాజు గారి మరణానికి చింతిస్తూ... ఆయన పవిత్రాత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...

కీ॥శే॥ అనదాసు సోమరాజు గారు

మరణం: 13-02-2026, ముక్కినాడ భార్య: శ్రీమతి ధనలక్ష్మి

కుమారుడు : అనదాసు రుద్రయ్య కోడలు : శ్రీమతి విజయ

కుమార్తెలు / అల్లుళ్లు

కందుల సత్యవతి, Ex.ZPTC వీరరాఘవ స్వామినాయుడు (రాంబాబు) (లేటు)

గరగ కామేశ్వరి - వెంకటేశ్వరరావు

మనుమలు, మనుమరాండ్రు:

A.శ్రీవిష్ణుసాయి సోమరాజు, A.శ్రీకృష్ణ ధన ఈశ్వర్, K.బాబూరాయుడు - లక్ష్మీ సమీర, K.ఆదిలక్ష్మి - సూర్యచంద్ర శ్రీనివాస్ (లేటు), K.రత్నకుమారి - జీవన్, G.వెంకటేశ్ - భారతి, Y.కావ్య - నాగ శివప్రసాద్, M.మణిలక్ష్మి - సీతమ్ రాజు

అనదాసు సోదరులు & కుటుంబసభ్యులు

పెద్దకార్యం: ది.23-02-2026 సోమవారం, రాజానగరం మండలం, ముక్కినాడలో మా స్వగృహమునందు జరుపబడును.

కసరత్తులు చేసి.. కండలు పెంచి

దేహదారుఢ్య పోటీల్లో సత్తా

న్యూస్‌టుడే, మసీదు సెంటర్(కాకినాడ)

దేహదారుఢ్య పోటీల్లో పేదింటి బిడ్డలు సత్తాచాటుతున్నారు. ఆర్థిక సమస్యలు ప్రతిభకు అడ్డుకాదని నిరూపిస్తున్నారు. కసరత్తులతో కండల వీరులుగా మారారు. పలు పోటీల్లో పాల్గొని పతకాలు సాధిస్తున్నారు. ఇటీవల నన్నయ విశ్వవిద్యాలయంలో జరిగిన పోటీల్లో మరోసారి మెరిశారు..

నాలుగేళ్ల నుంచి శిక్షణ

మాది కాకినాడ. నాలుగేళ్ల నుంచి బాడీ బిల్డింగ్ చేస్తున్నా. రోజూ ఆరు గంటలు జిమ్‌లో కసరత్తులు చేస్తా. చికెన్, గుడ్లు, ఓట్స్, ప్రొటీన్, పాలకూర తీసుకుంటా. ఖాళీ సమయంలో ఓ డెలివరీ సంస్థలో పనిచేస్తా. అమ్మ కూడా సహాయం చేస్తుంది. నన్నయ విశ్వవిద్యాలయం పరిధిలో జరిగిన అంతర్ కళాశాలల పోటీల్లో రెండు బంగారు పతకాలు సాధించా. రెండుసార్లు ఆల్ఇండియా పోటీల్లో పాల్గొన్నా. దాతలు సహకారం అందిస్తే దేశానికి పేరుప్రఖ్యాతలు తీసుకొస్తా. ఆర్మీలో చేరాలనేది నా ధ్యేయం. - విజయ్ చాముండేశ్వర్, కాకినాడ

నాన్న ప్రోత్సాహంతో..

బీఏ మొదటి ఏడాది చదువుతున్నా. మాది రాజమహేంద్రవరం. నాన్న రాజగోపాల్ తాపీ మేస్త్రి. ఆయన ప్రోత్సాహంతో 8 ఏళ్ల నుంచి శిక్షణ తీసుకుంటున్నా. రోజూ మూడుగంటల పాటు జిమ్‌లో కసరత్తులు చేస్తా. చికెన్, గుడ్లు, ఓట్స్, ప్రొటీన్ షేక్ వంటి పోషకాహారం తీసుకుంటా. గతేడాది అంతర్ కళాశాలల దేహదారుఢ్య పోటీల్లో పాల్గొని బంగారు పతకం సాధించా. వచ్చే నెలలో విశాఖలో జరిగే ఆల్ఇండియా పోటీలకు ఎంపికయ్యా. క్రీడాకోటాలో ఉద్యోగం సాధించడం, జాతీయస్థాయిలో గుర్తింపు తెచ్చుకోవడమే లక్ష్యం.

- వెంకటసూర్య ప్రకాష్, రాజమహేంద్రవరం

ఈనాడు

దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి

Cell: 80085 97607

ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి

Cell: 80082 34669

(c) eenadu

కడలి నేస్తమా.. కళేబరమైతివేవమ్మా..!

కాకినాడ తీరంలో మృతి చెందిన ఆలివ్ రిడ్లీ తాబేళ్లు కనిపిస్తున్నాయని, ఇది పర్యావరణం, జీవవై

విధ్యానికి పెను ముప్పుగా భావించాలని, వెంటనే తాబేళ్ల సంరక్షణ చర్యలు చేపట్టాలని సామాజిక కార్యకర్తలు రంబాల సతీష్, మంగ, వరలక్ష్మి, రమ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం కాకినాడ తీరంలో అరుదైన ఆలివ్ రిడ్లీ తాబేళ్ల మృత కళేబరాల వద్ద ప్లకార్డులతో నిరసన తెలిపి.. సంరక్షణ చర్యలు చేపట్టాలని తీరంలో ర్యాలీ నిర్వహించారు. తీరంలో పరిశ్రమల నుంచి భారీగా కలుషిత జలాలను శుద్ధిచేయకుండా నేరుగా సముద్రంలో వదిలి పెడుతుండడంతో మత్స్యసంపదతోపాటు తాబేళ్లకు ముప్పు వాటిల్లుతోందన్నారు.

– న్యూస్‌టుడే, రమణయ్యపేట(కాకినాడ గ్రామీణం)

కారు చీకట్లో.. ప్రయాణం ఎట్టా?

రాజోలు మండలం శివకోటి నుంచి పాశర్లపూడి వరకు 22 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న బైపాస్‌పై రాత్రి సమయంలో ప్రయాణాలు ప్రమాదకరంగా సాగుతున్నాయి. విద్యుద్దీపాలు ఏర్పాటు చేయకపోవడంతో కూడళ్ల వద్ద తరచూ ఏదో ఒక ప్రమాదం చోటు చేసుకుంటున్నా

సంబంధిత అధికారులు స్పందించడం లేదని వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై జాతీయ రహదారుల ఏఈ వెంకటరమణను వివరణ కోరగా త్వరలో దీపాలు ఏర్పాటు చేస్తామన్నారు.

– న్యూస్‌టుడే, రాజోలు

శ్రీరంగధామంలో చినజీయర్ స్వామి పూజలు

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: గౌతమఘాట్‌లోని శ్రీరంగధామంలో స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం సాయంత్రం చినజీయర్ స్వామీజీ శ్రీరంగధామానికి విచ్చేశారు. ఆలయ మర్యాదలతో స్వామీజీకి స్వాగతం పలికారు. ఆయన పర్యవేక్షణలో మహాపూర్ణాహుతి, పూజలు నిర్వహించారు. దర్శనానికి పెద్దఎత్తున భక్తులు హాజరయ్యారు.

అభివృద్ధే లక్ష్యం

గంటాలమ్మతల్లిని దర్శించుకున్న మంత్రి

పెరవలి, న్యూస్‌టుడే: రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. పెరవలి మండలం కాకరపర్రులోని గంటాలమ్మ మహోత్సవంలో ఆదివారం ఆయన పాల్గొన్నారు. కావిడితో కానుకలు తీసుకువెళ్లి అమ్మవారికి సమర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని తెలిపారు. గ్రామంలో నిర్మిస్తున్న డ్రెయిన్ పనులను పరిశీలించి పనులను ఆరా తీశారు. వేగంగా పూర్తి చేయాలని అధికారులను సూచించారు. కార్యక్రమంలో జనసేన మండలశాఖ అధ్యక్షుడు పిప్పర రవి, సర్పంచి గుబ్బల ఆదిలక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు గుడాల రంగారావు, కూటమి నాయకులు పీవీఎస్ వర్మ, సంగిత నాగేశ్వరరావు, జయరాజు, పెన్నట్ల మధు, చిట్టూరి శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

కావిడితో కానుకలు తీసుకువెళ్తున్న మంత్రి కందుల దుర్గేష్

అమ్మా.. నాన్నా.. పాసవ్వండి..!

పిల్లలకు ఇంటర్ పరీక్షల వేళ అప్రమత్తం

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఏటా వివిధ కారణాలతో ఇంటర్ పరీక్షలు రాయలేకపోతున్నారు. రాసినా కొందరు ఉత్తీర్ణత సాధించలేకపోతున్నారు. ఒక నిమిషం ఆలస్యమైనా అనుమతించరని నిబంధనలను పట్టించుకోక నష్టపోతున్నారు. జిల్లాలో నేటి నుంచి ఇంటర్ పరీక్షలు ఆరంభం అవుతున్న నేపథ్యంలో అప్రమత్తం కావాల్సిందే. పిల్లల్ని సన్నద్ధం చేసే తల్లులు, పరీక్ష కేంద్రాలకు స్వయంగా వారిని తీసుకెళ్లే తండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఇంటర్మీడియట్ పరీక్షలు రాసే విద్యార్థులకు నిపుణులు చెబుతున్న మంచి అంశాలు ఒక సారి పరిశీలిద్దాం.

– న్యూస్‌టుడే, పాములు, సామర్లకోట

● బిడ్డకు ఆది గురువు అమ్మే. పరీక్షల్లో మీ పిల్లలు రాణించాలంటే మీదే మొదటి బాధ్యత. వారిని పరీక్షలకు సిద్ధం చేయడం, సులువుగా జీర్ణమయ్యే ఆహారం పెట్టండి(అది కూడా ఇంటిలోనే వండింది). పరీక్ష బాగా రాయలగవని చెప్పి వారిలో మనోధైర్యాన్ని నింపండి.● పరీక్ష రోజుకు అవసరమైన సరంజామాను ముందు రోజే సర్ది ఉంచండి.

ఇలా చేయాలి తల్లీ..

తగిన దుస్తులను సిద్ధం చేయండి.● పరీక్ష రాసే ముందే తేలికపాటి పానీయం అందించండి.● మీ బాబు, పాప పరీక్ష సన్నద్ధమవుతున్నారనే విషయం మరిచి టీవీ పెట్టుకుని భారీ సౌండ్‌తో వారికి ఇబ్బందికలిగేలా వ్యవహరించొద్దు.● ఇతరులతో పోల్చొద్దు. ఆత్మ న్యూనతకు గురయ్యేలా మాటలొద్దు.● ఉలిక్కిపడి నిద్రలేచేలా కొట్టడం, తిట్టడం చేయకూడదు.● రాత్రిపూట 11 గంటల వరకు చదువు అంటూ అలసిపోయేలా చేయవద్దు.● బంధువులకు సంబంధించిన విషయాలను వారికి వినిపించేలా మాట్లాడకపోవడం శ్రేయస్కరం.● పిల్లల్లో అనారోగ్య లక్షణాలను గుర్తిస్తే.. వెంటనే వైద్యులను సంప్రదించాలి.● ముఖ్యంగా తల్లులూ.. మీరు ఆరోగ్యంగా ఉండాలి.. మీ పిల్లల విజయం ధ్యేయమనే విషయం మరిచిపోకండి.

ఇలా వద్దేవద్దు..

■ సామర్లకోట బ్రౌన్‌పేటలోని ఆర్బీఎం ఆశ్రమ వసతిగృహంలో ఉంటూ సమీప జడ్పీ బాలికల ప్లస్ ఉన్నత పాఠశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని గతేడాది 9.30 గంటలకు పరీక్ష కేంద్రానికి వచ్చింది. అర గంట ఆలస్యం కావడంతో అధికారులు అనుమతించలేదు. అందుకు కారణం ఆమె పరీక్షకు ముందురోజు స్వగ్రామమైన కాకినాడ గ్రామీణం సర్పవరంలోని ఇంటికి వెళ్లి తిరిగి వచ్చే క్రమంలో తండ్రి నడుపుతున్న మోటారు సైకిల్ మార్గం మధ్యలో ఆగిపోవడమే. ఆ తరువాత సప్లిమెంటరీ రాసి ఉత్తీర్ణత సాధించింది. అదే ద్వితీయ సంవత్సరం అయితే ఆ అవకాశమూ ఉండేదికాదు. విద్యార్థులు, తల్లిదండ్రులు అప్రమత్తం చేసే ఘటన ఇది.

● పరీక్షలకు పిల్లల్ని కేంద్రాలకు తీసుకువెళ్లే ముందు వాహనంలో ఇంధనం సరిచూసుకోండి. రహదారి భద్రత నిబంధనలు పాటించండి.● నిర్దేశిత సమయానికి అర గంట ముందే కేంద్రానికి చేరుకునేలా సమయం కేటాయించుకోండి.● పరీక్ష అవగానే ఎలా రాశావ..

మరిచిపోవద్దండి..

ఎన్ని మార్కులు వస్తాయని ప్రశ్నలు సంధించి పిల్లల్ని విసిగించకండి. తర్వాతి రోజు పరీక్షపై ఏకాగ్రత నిలిపేలా ప్రోత్సహించాలి.● పరీక్షలకు సన్నద్ధమవుతున్న పిల్లలున్న ఇళ్లలో ఆర్థిక, కుటుంబ పరమైన అంశాలపై వారికి వినిపించేలా చర్చలు, వాగ్వాదాలు, గొడవలకు దిగొద్దు.● పరీక్షలకు ముందు శుభకార్యాలు, తీర్థయాత్రల ప్రస్తావన అనవసరం.● సమయపాలన ఆవశ్యకత వివరించాలి. బాగా రాయగలవనే నమ్మకం కలిగించండి.● పెద్దలు ఫోన్ పట్టుకుంటే.. పిల్లలు దాని గురించి ఆలోచిస్తారనే విషయం మరువద్దు.

సమస్యలు గుర్తించండి..

పరీక్షలు మీ పిల్లలకు కాదు, మీకూ అనే విషయం తల్లిదండ్రులు మరువద్దు. పిల్లలు ఏ రకమైన మానసిక ఒత్తిడి, అనారోగ్యం బారిన పడుతున్నారో గమనించాలి. కడుపునొప్పి, తలనొప్పి, ఆందోళన లాంటివి కనిసిస్తే వారిని ఓదార్చాలి. తగిన మందులు, ధైర్యాన్ని ఇవ్వాలి. ● ఏదైనా పని గంటల తరబడి చేస్తే విసుగువస్తుంది. ఎప్పుడూ చదువేకాకుండా పిల్లలకు మధ్యలో విరామం ఇవ్వాలి. వారితో సరదా కబుర్లు చెప్పాలి. ● సాయంత్రం వేళ కాసేపు వారిని బయట ఆడుకునేలా ప్లాన్ చేయండి. వారితో కలిసి మీరూ ఆడండి. పిల్లల మనసు ఫ్రెష్ అవుతుంది. ● ఉదయం కాసేపు యోగా, ధ్యానం వంటివి చేయించండి. ● అదే పనిగా సలహాలు, సూచనలు ఇవ్వకండి. వారి ఏకాగ్రత చదువు నుంచి మరలుతుంది.

అభద్రతా భావం రానీయొద్దు

పరీక్షల వేళ పిల్లలకు ఏవిధమైన అభద్రతా భావం రాకుండా తల్లిదండ్రులు జాగ్రత్త పడాలి. వారి గొడవలు పిల్లల చదువులనేకాదు, వారి జీవితంపైనే ప్రభావం చూపుతాయి. పరీక్షలకు ముందురోజు రాత్రి నుంచి వారికి సమతుల ఆహారం అందివ్వాలి. ఆహారం మారితే ఆక్సిజన్ వారి మెదడుకు కాకుండా పొట్టకు చేరుకుని ఇబ్బందిపడతారు. పరీక్షల వేళ తల్లిదండ్రులు చరవాణి, టీవీలకు దూరంగా ఉండాలి. తల్లులు వారితోపాటే ఏదో ఒక పుస్తకం చదువుకుంటే మంచిది.

– పలివెల లలితాదేవి, ఎడ్యుకేషనల్ సైకాలజిస్ట్

25 నుంచి అమలాపురంలో ప్రపంచ తెలుగు మహాసభలు

మాట్లాడుతున్న జీజీయూ కులపతి సత్యనారాయణరాజు

సర్పవరం, న్యూస్‌టుడే: బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం కిమ్స్ వైద్య కళాశాల ప్రాంగణంలో ఈ నెల 28 నుంచి రెండు రోజుల పాటు వైభవంగా మూడవ ప్రపంచ తెలుగు మహాసభలు, తెలుగుభాష, సాహిత్య, సంస్కృతుల సమ్మేళనం నిర్వహిస్తున్నామని మాజీ ఎమ్మెల్సీ, గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ(జీజీయూ) కులపతి కేవీవీ సత్యనారాయణరాజు(చైతన్యరాజు) తెలిపారు. కాకినాడ గ్రామీణం సర్పవరంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వివరాలు వెల్లడించారు. రాజమహేంద్రవరం శివారు జీజీయూలో రెండుసార్లు సభలు జరిపామని, మూడోసారి కిమ్స్‌లో నిర్వహిస్తామన్నారు. ప్రపంచం నలుమూలల నుంచి భారీగా ప్రముఖులు, తెలుగు భాషాభిమానులు హాజరవుతారన్నారు. ప్రధాన వేదికకు దివంగత నందమూరి తారక రామారావు పేరు పెడతామన్నారు. మరో 4 వేదికలు ఏర్పాటు చేసి 16 రకాల సాహిత్య వేడుకలు, వందల మంది కవులతో సమ్మేళనాలు తదితరాలను వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో చైతన్యగ్రూప్ డైరెక్టర్ పీవీ కృష్ణంరాజు, సాహితీవేత్తలు సూర్యనారాయణమూర్తి, డా.వేదుల శ్రీరామశర్మ, స్టేట్ టీచర్స్ యూనియన్ నాయకులు పి.సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధిపై దృష్టి

మాన్సాస్ ఛైర్మన్ అశోక్‌గజపతిరాజు

విజయనగరం కంటోన్మెంట్, న్యూస్‌టుడే: ఆలయాల అభివృద్ధి పనులు ఆపొద్దని, ప్రత్యేకంగా దృష్టి సారించి భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని మాన్సాస్ ఛైర్మన్, 104 దేవాలయాల అనువంశిక ధర్మకర్త, గోవా రాష్ట్ర గవర్నర్ పూసపాటి అశోక్ గజపతిరాజు అన్నారు. విజయనగరం కోటలోని మాన్సాస్ కార్యాలయంలో ఆదివారం విజయనగరం పైడితల్లి, సంతపేట జగన్నాథస్వామి, శ్రీకూర్మం కూర్మనాథస్వామి, మందేశ్వరస్వామి దేవాలయాల పాలకమండలి సభ్యులు, దేవాదాయ శాఖ అధికారులతో సమావేశమయ్యారు. వార్షిక బడ్జెట్, ఖర్చులపై ఆరా తీశారు.★ పైడితల్లి ఆలయ పునర్నిర్మాణ పనులను జూన్ నాటికల్లా పూర్తి చేయాలని ఈవో శిరీషను ఆదేశించారు. జాప్యం జరగకుండా పర్యవేక్షించాలన్నారు. శివాలయం వీధిలోని అమ్మవారి కల్యాణ మండపాన్ని పూర్తిగా తొలగించి కొత్త నిర్మాణాన్ని చేపట్టనున్నట్లు ఈవో వెల్లడించారు. భవిష్యత్తు అవసరాల దృష్ట్యా సిరిమానుల కోసం అయిదెకరాల్లో చింత చెట్లు పెంచే ప్రతిపాదనపై చర్చించారు. ★ సంతపేట ఆలయం నూతన పాలకవర్గం కొలువుదీరింది. ఎనిమిది సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. సభ్యులుగా మల్ల నాగమణి, పెంటకోట గౌరి, ఎస్.అన్నపూర్ణ, గంగళ్ల లక్ష్మి, బంటో తుల అప్పారావు, సారిపల్లి కిరణ్‌కుమార్, చెల్లపు వెంకటరమణ, ముని శ్రీరామకృష్ణను నియమించారు. వీరు రెండేళ్లపాటు పదవిలో కొనసాగుతారు. దేవాలయానికి సంబంధించి సీజీఎఫ్ నిధులతో నిర్మించిన కాలక్షేప మండపం పరిసరాల్లో విద్యుత్తు దీపాల ఏర్పాటు, నీళ్ల ట్యాంకు, పైపులైన్ పనులు చేపట్టాలని సభ్యులు ఛైర్మన్ దృష్టికి తీసుకొచ్చారు. కాలక్షేప మండపాన్ని రోజుకు రూ.10,000కు అద్దెకిచ్చేలా తక్షణం వినియోగంలోకి తేవాలని విన్నవించారు.★ శ్రీకాకుళం జిల్లా శ్రీకూర్మంలోని కూర్మనాథస్వామి దేవాలయం ఆవరణలో కోనేరును శుభ్రపర్చి, చుట్టూ చెట్లు నాటేందుకు రూ.10 లక్షలను ఇండిగో సంస్థ మంజూరు చేసిందని, మరికొన్ని మరమ్మతులు చేపట్టాలని పాలక మండలి సమావేశంలో నిర్ణయించారు. ★ కోనసీమ జిల్లా మందపల్లిలోని మందేశ్వరస్వామి ఆలయానికి దేవాదాయ శాఖ సీజీఎఫ్ నిధి నుంచి రూ.3 కోట్లు మంజూరయ్యాయని ఛైర్మన్ తెలిపారు. రెండు అంతస్తుల భవనాన్ని నిర్మించనున్నట్లు వెల్లడించారు.

చురుగ్గా హైవే విస్తరణ

మామిడికుదురు, న్యూస్‌టుడే: పాశర్లపూడి పరిధి కైకాలపేట వై.జంక్షన్ వద్ద 216 జాతీయ రహదారి విస్తరణ పనులు మొదలయ్యాయి. రాజోలు మండలం శివకోటి నుంచి ఏర్పాటైన బైపాస్ అనుసంధానమయ్యే చోట ఆక్రమణల తొలగింపులో ఏర్పడిన జాప్యం కారణంగా ఇబ్బందులు ఎదురయ్యాయి. ఎట్టకేలకు అధికారులు రహదారి పక్కన ఒకవైపు ఉన్న ఆక్రమణలను ఇటీవల తొలగించడంతో విస్తరణ పనులు చేపట్టారు. త్వరితగతిన పూర్తిచేసి వై.జంక్షన్‌ను చక్కదిద్దుతామని ఏఈఈ వెంకటరమణ తెలిపారు.

శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానము

ద్వారకా తిరుమల (చిన్న తిరుపతి), ఏలూరు జిల్లా-534426. ఫోన్: 08829 - 271427

Website: www.dwarakatirumala.org, e-mail: eo_dwarakatirumala@yahoo.co.in

REV65-OPOM0EOFF/1/2023-D1, Dt:21/02/2026

ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీసు

శ్రీ స్వామి వారి దేవస్థానమునకు అవసరమగు పూలు మరియు పూల దండలు ది.01-04-2026 నుండి ది.31-03-2027 వరకు ఒక సంవత్సర కాల పరిమితికి సప్లయి చేయుటకు గాను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మరియు సీల్డ్ టెండరు ద్వారా టెండర్లు కోరబడుచున్నవి. పూర్తి వివరములకు కొరకు www.apeprocurement.gov.in నందు తెలుసుకొనగలరు. ఇ-ప్రొక్యూర్‌మెంట్ మరియు సీల్డ్ టెండరు టెండర్ బాక్స్ నందు దాఖలు చేయు ప్రారంభ తేది:23-02-2026 ఉ॥ 10.00 గం॥ల నుండి చివరి తేది:09-03-2026 మ॥ 01.00 గం॥ వరకు. ఇతర వివరముల కొరకు ఫోన్: 9866730425, 9037567894 లను సంప్రదించగలరు.

శ్రీ యస్.వి. సుధాకరరావు, అధ్యక్షులు మరియు వ్యవస్థాపక ధర్మకర్త

సం/- వై. భద్రాజీ, కార్యనిర్వహణాధికారి (FAC)

వేసవి ముంగిట.. మూగజీవాల కటకట

నిర్వహణ లేక అధ్వానంగా పశువుల నీటితొట్టెలు

ధవళేశ్వరం, మోరంపూడి, న్యూస్‌టుడే: క్రమంగా ఎండలు పెరుగుతున్నాయి. కొన్నిరోజుల్లో వేసవి సమీపించనుంది. రైతులు మేత కోసం పశువులను బయటకు తీసుకెళ్తుంటారు. చాలాచోట్ల మేత లభించినా నీటి వసతి ఉండదు. దీనిని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా తొట్టెల నిర్మాణం చేపట్టింది. లక్ష్యం మంచిదే అయినా క్షేత్రస్థాయిలో నిర్వహణ లేక వాటి పరిస్థితి అధ్వానంగా ఉంది.

పిడింగొయ్యిలో నిరుపయోగంగా నీటి తొట్టె

నిర్వహణ బాధ్యత ఎవరిది..

గ్రామపంచాయతీల పరిధిలో పశువుల సంఖ్య ఆధారంగా వీటిని నిర్మించారు. గ్రామ పొలిమేరల్లో, పశువులు బీడు ప్రాంతాలకు వెళ్లే దారిలో ఏర్పాటు చేశారు. ఉపాధి హామీ పథకం ద్వారా ఒక్కో తొట్టెకు రూ.18 వేలు వెచ్చించి గతంలో నిర్మించారు. అందులో నీటిని నింపే బాధ్యతను ఆయా పంచాయతీలు తీసుకోవాలని మొదట నిర్ణయించారు. తర్వాత ఆర్‌డబ్ల్యూఎస్ విభాగానికి అప్పగించారు. క్రమంగా వాటిని విస్మరించడంతో బాధ్యత ఎవరనే దానిపై సరైన స్పష్టత లేదు. నాణ్యత లేకపోవడం, నీటిని నింపకపోవడం వంటి కారణాలతో బీటలు నిరుపయోగంగా మారాయి. ప్రస్తుతం చాలావరకు శిథిలావస్థకు చేరాయి.

జిల్లాలో ఇలా..

జిల్లాలోని 18 మండలాల్లో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా గతేడాది 207 తొట్టెలు నిర్మించాలని లక్ష్యం నిర్దేశించారు. అంతకుమించి 222 నిర్మించారు. వీటిలో సగానికి పైగా వినియోగంలో లేవు. వేసవి సమీపిస్తున్న తరుణంలో అధికారులు స్పందించి వీటిని పూర్తి వినియోగంలోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.

గ్రామ పంచాయతీలకు బాధ్యతలు..

నీటితొట్టెల నిర్వహణ బాధ్యత జిల్లాలో ఆయా గ్రామ పంచాయతీలకు అప్పగించాం. క్షేత్రస్థాయిలో పరిశీలించి పాడైన తొట్టెలను మరమ్మతులు చేయించేందుకు చర్యలు చేపడతాం. వీటిని వినియోగంలోకి తెచ్చేలా క్షేత్రస్థాయి సిబ్బందికి ఆదేశాలు జారీ చేశాం.

– నాగమహేశ్వరరావు, డ్వామా పీడీ

అరుదైన వృక్షజాతులతో నూతన నర్సరీ

ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సందర్శనకు ఏర్పాట్లు

రాజానగరం, న్యూస్‌టుడే: దివాన్‌చెరువు రిజర్వ్‌ఫారెస్ట్ పరిధిలో గల రాష్ట్ర అటవీ పరిశోధనా కేంద్రం ప్రాంగణంలో 400 రకాల అరుదైన వృక్షజాతులతో నూతనంగా నర్సరీని ఏర్పాటు చేస్తున్నారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దీనిని త్వరలో సందర్శించనున్నారని అటవీశాఖ అధికారులు తెలిపారు. ఇందుకోసం నూతన వృక్షజాతులతో నర్సరీని ఏర్పాటు చేస్తున్నారు. వీటిలో అరుదైన, అంతరించిపోనున్న వృక్షజాతులు ఉన్నాయి. వెదురు జాతిలో వాణిజ్యపరమైన తుల్దాజాతి వెదురు, శ్రీగంధం, దాల్చినచెట్టు, పెద్దకళింగ, నాగకేశరాలు, లోలులు, రోజ్‌ఉడ్, ఎర్రచందనం, తెల్లపొలికి, సారపప్పు, అలాగే స్థానికంగా లభించే అనేక రకాల వృక్షజాతులతో ఈ నర్సరీని ఏర్పాటు చేస్తున్నారు.

నర్సరీలో సంచుల్లో పెంచుతున్న నాగకేశరాల మొక్కలు

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph.81422 92071.

REAL ESTATE

LAND FOR SALE

JAGGAMPETA

రాజమండ్రికి 30 కి.మీ. దూరములో మురారి, గండేపల్లి మధ్య NH కి చేర్చి 100 అ॥ల రోడ్డు పేసింగ్‌తో 60 సెంట్లుభూమి అమ్మబడును. (నోబ్రోకర్స్) ✆ 9032988265

PLOT FOR SALE

RAJAMAHENDRAVARAM CITY

రాజమండ్రి V.L.పురం మోడల్ కాలనీ, NH-5కి అతిదగ్గరగా వెస్ట్ పేసింగ్ 520 చ॥గ॥ల స్థలం అమ్మకం. Contact: 98850 72992, 80991 91919.

రాజమండ్రి To వైజాగ్ వెళ్లే హైవేను ఆనుకొని దివాన్‌చెరువు వద్ద గైట్ కాలేజీకి ఎదురుగా బ్రిడ్జి కొంటీని ఆనుకొని ఉన్నది, GSL కాలేజ్ దగ్గరలో E/F వెయ్యి గజాలు చొప్పున 3 ప్లాట్లు ఉన్నవి. చుట్టూ అపార్ట్మెంట్లు, హాస్టల్స్, గజం 18 రూ.30 వేలు. 9848183683, 8686635567

EENADU eClassifieds

RAJANAGARAM

ఓనర్ డైరెక్ట్‌గా అమ్మే రెసిడెన్షియల్ ప్లాట్లు రాజానగరం మండలఆఫీస్ వెనుక, డీటీసీపీ అప్రూవ్డ్ లేఅవుట్‌లో స్థలాలు అమ్మకం. 96668 94019, 93980 83034

JOBS

డిజైనింగ్ వచ్చిన DTP ఆపరేటర్స్ సీనియర్స్/ జూనియర్స్ కావలెను. (Page Maker, ఫొటోషాప్, Coreldraw, Illustrater etc.) Rjy, 9246657116

Montra 3-వీలర్ ఎలక్ట్రిక్ ఆటో మార్కెటింగ్ చేయుటకు అనుభవం గల సేల్స్ మేనేజర్ కావలెను. సీతంపేట, రాజమండ్రి. Contact: 94947 81111.

శ్రీదేవి ఫంక్షన్‌హాలు నందు పని చేయుటకు గార్డెనింగ్, సివిల్ & క్లీనింగ్ కొరకు వర్కర్స్ కావలెను. ఉచిత వసతి, జీతం: యువకులకు 18,000/-, మధ్య వయస్కులకు 15,000/-, పెద్దవారికి 12,000/-. జి.మామిడాడ, Cell: 94909 98888.

శివ కార్తికేయ హోంకేర్‌లో వృద్ధులు, పేషంట్స్, పిల్లలను చూసుకొనుటకు నర్సులు, వర్కర్స్ కావలెను. ఫ్రీ వసతి, భో.జి. 20K. ✆ 99120 11499, 99120 11899.

EENADU for Advertisement Contact: 8008597607

MARKETING/ SALES

Anand Masale Require Sales & Marketing Manager, Marketing Executives. Contact: 9849655105, 9848053144 Email:anandmasala-appltd@gmail.com.

SECURITY GUARDS

కాకినాడ, పెద్దాపురం, ధవళేశ్వరం లలో పనిచేయుటకు సెక్యూరిటీ సూపర్‌వైజర్లు, సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. Contact Cell: 85004 98115, 98665 94189.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

★ For the Information of Trade & Industry

★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 4-65 పై॥

అనపర్తి ఆఫీసు: 08857-226908

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

అనూరియా కేసులపై అప్రమత్తం

ర్యాపిడ్ రెస్పాన్స్ బృందాల దర్యాప్తు ● డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వరరావు

రాజమహేంద్రవరం వైద్యం, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరం నగరంలో అనూరియా(మూత్రం ఆగిపోవడం) కేసులపై జిల్లా యంత్రాంగం అప్రమత్తమైందని డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వరరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. నగరంలోని చౌడేశ్వరనగర్, స్వరూప్‌నగర్ ప్రాంతాలకు చెందిన నలుగురు అనూరియా సంబంధిత సమస్యతో వచ్చారని కిమ్స్ ఆసుపత్రి అధికారుల నుంచి సమాచారం అందగా జిల్లా సర్వేలెన్స్ అధికారితో విచారణ ప్రారంభించామన్నారు. డీఎంహెచ్‌వో, ఎపిడిమియాలజిస్ట్, ఎపిడెమిక్ సెల్ ఆధ్వర్యంలో రోగులను పరిశీలించామన్నారు. వైద్యుల ప్రాథమిక నివేదికలు, కుటుంబ సభ్యుల వివరాలు, కేసుల చరిత్ర ఆధారంగా ఆకస్మిక మూత్రపిండ వైఫల్యంగా అనుమానం వ్యక్తమవుతోందన్నారు. క్షేత్రస్థాయి విచారణలో బాధితులంతా ఒకే పాల విక్రేత నుంచి కొనుగోలు చేసినట్లు గుర్తించామన్నారు. తదుపరి తనిఖీల్లో మరో నాలుగు కేసులను గుర్తించామన్నారు. కలెక్టర్ ఆదేశాలతో ర్యాపిడ్ రెస్పాన్స్ టీం రంగంలోకి దిగి విచారణ చేపడుతోందన్నారు. ఆహారం, నీరు, మల నమూనాలు సేకరించి ప్రయోగశాలకు పంపామన్నారు. ఆ పరీక్షల ఫలితాలు, ఆర్‌ఆర్‌టీ తుది నివేదికల ఆధారంగా తదుపరి చర్యలు చేపడతామన్నారు.

లక్షణాలుంటే ఆసుపత్రిలో సంప్రదించాలి: మంత్రి

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): రాజమహేంద్రవరంలో అనూరియా కేసుల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని మంత్రి కందుల దుర్గేష్ సూచించారు. తాజా పరిస్థితులను అధికారులు, వైద్యవర్గాలతో ఫోన్‌లో సమీక్షించామన్నారు. మెరుగైన వైద్యసేవలందించేందుకు చర్యలు చేపట్టామన్నారు. లక్షణాలుంటే వెంటనే ప్రభుత్వ ఆసుపత్రుల్లో సంప్రదించాలన్నారు.

నోడల్ అధికారి నియామకం

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ: రాజమహేంద్రవరంలో ఘటనపై నగరపాలక సంస్థ చర్యలు చేపట్టింది. ఘటనకు సంబంధించి రాజమహేంద్రవరం కార్పొరేషన్ కార్యదర్శి శైలజవల్లిని నోడల్ అధికారిగా నియమించారు. సంబంధిత సమాచారం, ఫిర్యాదుల కోసం హెల్ప్‌లైన్ నంబరును తీసుకొచ్చారు. బాధితులు 9494060060కు సంప్రదించాలని సూచించారు.

ఇంటర్ పరీక్షలకు పోలీస్ బందోబస్తు

అమలాపురం పట్టణం: ఇంటర్ విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా ఇంటర్ పరీక్షలు బాగా రాయాలని ఎస్పీ రాహుల్‌మీనా ఒక ప్రకటనలో కోరారు. సోమవారం ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల దృష్ట్యా జిల్లాలోని అన్ని కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. కంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ఎక్కడా ఇబ్బందులు కలగకుండా పర్యవేక్షించాలని పోలీసు యంత్రాంగాన్ని ఆదేశించారు. పరీక్ష రాసే విద్యార్థులు ఇంటి నుంచి త్వరగా బయలుదేరాలని సూచించారు.

ఓఎన్‌జీసీ కార్యకలాపాలు వద్దంటూ నిరసన

అయినవిల్లి, న్యూస్‌టుడే: వీరవల్లిపాలెంలో ఓఎన్‌జీసీ కార్యకలాపాల వల్ల ఇబ్బందులు పడతామని గ్రామస్థులు ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. ప్రధాన రహదారి చెంత కొబ్బరి తోటను తొలగించి రిగ్గు తవ్వేందుకు అధికారులు భారీయంత్ర సామగ్రి తీసుకొచ్చారు. దీనిపై స్థానికులు ఆందోళన చెందారు. ఇక్కడ ఎటువంటి కార్యకలాపాలు చేయవద్దంటూ నినాదాలు చేశారు.

92.7 FM Rajamahendravaram 92.7 Mee FM

ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 9000180626, 9989993175

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి	18,000
కురిడీ (వెయ్యింటికి):	
పాతకాయ: గండేరా	30,500
గటగట	29,000
కొత్తకాయ: గండేరా	30,000
గటగట	29,000
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	18,000-21,000
కొత్త (పచ్చి) కాయ	16,000-17,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	5,000
కిలో	350

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	115-00
రిటైల్ లైవ్	142-00
డ్రెస్డ్	206-00
స్కిన్‌లెస్	234-00

జాతీయ రహదారిపై ఘోర ప్రమాదం

రెయిలింగ్‌లో నుంచి దూసుకెళ్లిన కారు ● ఒకరి మృతి

ప్రమాదానికి గురైన కారు

చింతూరు, న్యూస్‌టుడే: జాతీయ రహదారి-30పై ఓ కారు ఘోర రోడ్డు ప్రమాదానికి గురైన సంఘటన మండలంలోని సింగన్నగూడెం వద్ద ఆదివారం చోటుచేసుకుంది. చింతూరు పోలీసుల వివరాల ప్రకారం.. తమిళనాడు నుంచి ఒడిశా రాష్ట్రానికి ఎనిమిది మందితో బయలుదేరిన ఓ కారు ఎన్‌హెచ్-30లోని సింగన్నగూడెం వచ్చేసరికి అదుపు తప్పింది. మూలమలుపుల్లో ప్రమాదాల నివారణకు ఏర్పాటు చేసిన ఇనుప రెయిలింగ్ అంచును ఢీకొట్టింది. దీంతో ఇనుప బద్ది కారు మధ్యలో నుంచి రెండుగా చీల్చుకుంటూ వెళ్లిపోవడంతో అందులో ప్రయాణిస్తున్న పురేశ్‌గౌడ్(22) అక్కడికక్కడే మృతి చెందారు. మిగిలినవారికి తీవ్రగాయాలవడంతో చింతూరు ఏరియా ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్సలు నిర్వహించి భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు. చింతూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సంఘటనా స్థలాన్ని ఏఎస్పీ హేమంత్ పరిశీలించారు.

డాక్‌సేవక్‌లకు పురస్కారాలు

గుంటూరు(ఏటీ అగ్రహారం): గుంటూరు నగర శివారులోని సత్యసాయి ఆధ్యాత్మిక నగరిలో ఆదివారం జాతీయ స్థాయి గ్రామీణ డాక్ సేవక్ సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా రాష్ట్రంలో ఉత్తమ పనితీరు కనబర్చిన గ్రామీణ డాక్ సేవక్‌లకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌లు పురస్కారాలు అందించి సత్కరించారు. రాజమహేంద్రవరం నుంచి దుర్గాదేవి అందుకున్నారు.

వీఆర్‌కు గోపాలపురం ఎస్సై మనోహర్

గోపాలపురం: గతంలో ఓ కేసు విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో గోపాలపురం ఎస్సై పి.మనోహర్‌ను వీఆర్‌కు పంపినట్లు ఎస్పీ నరసింహ కిశోర్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. నల్లజర్ల స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న శివగణేష్‌ను ఎస్‌హెచ్‌వోగా నియమించినట్లు తెలిపారు.

(c) eenadu

రాజమహేంద్రవరం

కూటమితోనే మైనార్టీల అభ్యున్నతి

టి.నగర్: కూటమి ప్రభుత్వంతోనే మైనార్టీల అభ్యున్నతి సాధ్యమని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం సాయంత్రం 43వ డివిజన్ మల్లికార్జున నగర్‌లో ఆయేషా మసీదులో జరిగిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పవిత్రమాసంలో ఉపవాసం, ప్రార్థనలు మనలో ఆత్మవిశ్వాసం, కరుణ పెంచుతాయన్నారు. షాదీ ఖానాల అభివృద్ధికి నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. సమాజంలో మత సామరస్యాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. శెట్టిబలిజ కార్పొరేషన్ ఛైర్మన్ కుడుపూడి సత్తిబాబు, గన్ని కృష్ణ, మజ్జి రాంబాబు, ఖాన్‌బాషా, కంటిపూడి శ్రీనివాస్, మసీదు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

దేవీచౌక్: అత్యవసర మరమ్మతుల నిమిత్తం సోమవారం పలు ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాను నిలిపివేయనున్నట్లు ఈఈ నక్కపల్లి శామ్యూల్ ఓ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు కాతేరులోని సుబ్బారావుపేట, సంజీవ్‌నగర్ కాలనీ, మిలటరీకాలనీ, వేణుగోపాలపురం, పంచాయితీ ప్రాంతం, కాతేరు-కొంతమూరు రోడ్డు, భరత్‌నగర్, దేవాంగులవీధి, సీటీఆర్ఐ రోడ్డు, జీఎస్ఆర్ ఆన్‌లైన్ ప్రాంతం, గణపతినగర్ ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఆయా ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

మేమున్నాం.. మీకు తోడుగా

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: ఉ॥ 10 - మ॥ 1
83282 39927, 80089 02897

స్పందనకు పందనం

నగరంలోని వివిధ సమస్యలపై 'మేమున్నాం.. మీకుతోడుగా'కు ప్రజల నుంచి అందిన ఫిర్యాదులను నగరపాలక సంస్థ ఆయా విభాగాధిపతుల దృష్టికి తీసుకెళ్లగా వారు స్పందించి వాటి పరిష్కారానికి చర్యలు చేపడుతున్నారు. ● స్థానిక పాతసోమాలమ్మ గుడి రోడ్డు లోంచి పోస్టల్‌కాలనీకి వెళ్లే రోడ్డు జంక్షన్‌లో భూగర్భ డ్రెయిన్‌పై మ్యాన్‌హోల్ వద్ద దెబ్బతిని ప్రమాదకరంగా ఉన్న ఇనుపచట్రాన్ని నగరపాలక సంస్థ సిబ్బంది సరిచేసి సమస్య పరిష్కరించినట్లు ఫిర్యాదుదారుడు కొండలరావు తెలిపారు. ● స్థానిక సుబ్బారావునగర్ ప్రధాన రోడ్డులోకి చెత్త తరలింపు వాహనాలు వస్తుండటంతో ఇక్కడ ఇళ్ల మధ్య పేరుకుపోయిన చెత్త కుప్పల సమస్య ప్రస్తుతానికి సమసినట్లు ఫిర్యాదుదారుడు సత్యనారాయణ తెలిపారు.

\- న్యూస్‌టుడే, వి.ఎల్.పురం

సమస్య: ఆల్కాట్‌తోట ఏరియాలోని శారదావీధి, వేమనవీధి, అన్నపూర్ణవీధులలో మురుగు కాలువలను చాలాకాలంగా శుభ్రం చేయట్లేదు. డ్రెయిన్లు పూడికతో నిండిపోయి మురుగునీరు నిలిచిపోయి దుర్వాసన వస్తోంది. దోమలు పెరిగిపోయి స్థానికులు నరకయాతన పడుతున్నాం.

\- సత్యనారాయణరెడ్డి, స్థానికుడు

సమస్య: స్థానిక గాంధీపురంలోని వైశ్యహాస్టల్ వీధి ఏరియాలో డ్రెయిన్లు శుభ్రం చేయట్లేదు. పూడికతో నిండిపోయి దుర్వాసన వస్తోంది.

\- సాయినాథ్, స్థానికుడు

సమాధానం: పారిశుద్ధ్య సిబ్బందిని పంపించి డ్రెయిన్లు శుభ్రం చేయిస్తాం.

\- వినూత్న, ఎంహెచ్‌వో

\- న్యూస్‌టుడే, వి.ఎల్.పురం

సామాజిక సమస్యలపై సర్వే అస్త్రం..

దేవీచౌక్, న్యూస్‌టుడే

కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్టు (సీఎస్‌పీ)లో భాగంగా సామాజిక స్థితిగతులపై విద్యార్థులు సర్వే చేస్తున్నారు. విద్యార్థుల తరగతులకు ఇబ్బంది లేకుండా సెలవుల్లో తాము ఉన్న ప్రాంతంలోనే ఇంటింటికీ వెళ్లి పేదరిక నిర్మూలన, చదువు, నీటి భద్రత, స్వచ్ఛాంధ్ర తదితర అంశాల గురించి తెలుసుకుంటున్నారు. ఆర్ట్స్ కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరం రెండో సెమిస్టర్ తర్వాత ద్వితీయ సంవత్సరంలోకి అడుగు పెట్టేముందు ఈ సర్వే నిర్వహిస్తున్నారు. డిగ్రీలో అన్ని కోర్సుల విద్యార్థులకు ఇది తప్పనసరి. మూడేళ్లక్రితం కళాశాలలో ఇది ప్రారంభించినా గతేడాది నుంచి సర్వే చేస్తున్నారు.

వివరాలు సేకరిస్తున్న విద్యార్థిని

విద్యార్థులకు నిర్దేశించిన అంశాలు

తొమ్మిది అంశాల్లో సర్వే చేయాలి.. 1.నీటి భద్రత, 2.పేదరిక నిర్మూలన, 3.స్వచ్ఛాంధ్ర, 4.జనాభా నిర్వహణ-మానవ వనరుల అభివృద్ధి, 5.నైపుణ్యం-ఉద్యోగ అవకాశాలు, 6.ఫార్మర్ అగ్రిటెక్, 7.డీప్‌టెక్ ఆల్ వాక్స్ ఆఫ్ లైఫ్, 8.ప్రొడక్ట్ పర్‌ఫెక్షన్, 9.కాస్ట్ ఆప్టిమైజేషన్.

● 40 రోజులు.. విద్యార్థికి ఇచ్చిన ఒక్కో అంశాన్ని 40 రోజుల్లో పూర్తి చేయాలి. అనంతరం చేసిన సర్వేపై ప్రాజెక్టు నివేదిక ఇవ్వాలి. దీనికి 100 మార్కులు ఉంటాయి. దాని ఆధారంగా మార్కులు వేస్తారు. అప్పుడే డిగ్రీ పట్టా లభిస్తుంది. దీంతో సామాజిక అంశాలపై విద్యార్థులకు అవగాహన కలుగుతుందని వాణిజ్యశాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ షణ్ముఖరావు తెలిపారు.

పేదరిక నిర్మూలనపై..

నేను పేదరిక నిర్మూలనపై సర్వే చేశాను. చదువు లేకపోవడంతో ప్రభుత్వ పథకాల గురించి చాలా మంది తెలుసుకోలేకపోతున్నారు. ప్రస్తుతం వస్తున్న ఆదాయం కుటుంబానికి సరిపోతోందా లేదా ఇతర ఆదాయ మార్గాలు ఏమైనా ఉన్నాయా అన్న అంశాలపై సర్వే చేశాను. పేదరిక నిర్మూలనకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి.

\- జి.పవన్ ఈశ్వర్, బీకాం ద్వితీయ సంవత్సరం

సమాజ స్థితిగతులు తెలుసుకున్నా..

సీఎస్‌పీ ద్వారా సమాజ స్థితిగతులను తెలుసుకోగలిగాను. భావవ్యక్తీకరణ తెలిసింది. నీటి భద్రత అనే అంశంపై సర్వే చేశాను. ఆ ప్రాంతంలో తాగునీటి పరిస్థితులు, మంచినీరు ఎప్పుడు వస్తుంది, సరిపోతున్నాయా లేదా తదితర అంశాలపై సర్వే చేశాను.

\- ఇ.మోనిక బీకాం ద్వితీయ సంవత్సరం

పేదరికంతో చదువులకు ఇబ్బంది..

ఈ సర్వే ద్వారా నిరక్షరాస్యత 10 శాతం వరకు ఉందని తెలిసింది. పేదరికంతో కొంత మంది పిల్లలు మధ్యలోనే చదువు మానేసి కూలి పనులకు వెళ్తున్నారు. దీంతో ప్రభుత్వ పథకాలపై అవగాహన ఉండట్లేదు. ఎలా వినియోగించుకోవాలో తెలియట్లేదు. ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడంతో పాటు అక్షరాస్యత పెంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

\- కె.యువదుర్గా కిరణ్, బీకాం ద్వితీయ సంవత్సరం

తాగునీటి సరఫరాకు అంతరాయం

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ: తాగునీటి సరఫరా విభాగానికి సంబంధించి ప్రధాన లైన్ పాడైపోవడంతో తాగునీటి సరఫరాకు సోమవారం అంతరాయం ఏర్పడుతుందని కమిషనర్ రాహుల్ మీనా ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. లాహాస్పిన్ హోటల్ వద్ద 10 ఎంఎల్‌డీ మరమ్మతుల నేపథ్యంలో 45, 46, 47, 48, 49 డివిజన్లలో నీటి సరఫరా నిలుస్తుందన్నారు. 24న యథావిధిగా జరుగుతుందన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సోము, వేదికపై నాయకులు

భాజపా కార్యకర్తలకు కార్యశాల

దేవీచౌక్, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరంలోని భాజపా జిల్లా కార్యాలయంలో మండల స్థాయి కార్యకర్తలకు ఆదివారం ప్రశిక్షణ కార్యశాల నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ సోము వీర్రాజు హాజరై మాట్లాడారు. కార్యకర్తలు పార్టీలో క్రమశిక్షణ, సామాజిక మాధ్యమాల ఉపయోగం, సైద్ధాంతిక విషయాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రశిక్షణ ఏవిధంగా చేపట్టాలి, ఏ అంశాలను కార్యకర్తలకు బోధించాలి అనే అంశాలపై దిశానిర్దేశం చేశారు. భాజపా జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, రాష్ట్ర కార్యదర్శి బొమ్ముల దత్తు, నాయకులు నిర్మలా కిషోర్, విజయ్‌వాణి, రేలంగి శ్రీదేవి, నర్సిపల్లి హారిక, అడబాల రామకృష్ణారావు, బేతిరెడ్డి ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులతో కలిసి ఆసనాలు వేస్తున్న సినీ హాస్యనటుడు భద్రం

వ్యాయామంతో మానసిక ఉల్లాసం

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ: నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఏకేసీ కళాశాల రోడ్డులో ఆదివారం హ్యాపీ సండే కార్యక్రమాలు ప్రారంభించారు. నందమూరి తారక రామారావు పార్కు వద్ద వేదిక ఏర్పాటు చేశారు. సినీహాస్య నటుడు భద్రం ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించారు. చిన్నారులతో కలిసి యోగాసనాలపై వివరించారు. ఒత్తిడి జయించేందుకు వ్యాయామం ఓ భాగం కావాలన్నారు. అనంతరం వేదికపై విద్యార్థులు, యువత ప్రదర్శనలు నిర్వహించారు. ఆర్ఎంసీ ఉద్యోగులు, వాకర్స్, స్పోర్ట్స్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విద్య, వైద్యానికి ప్రాధాన్యం

టి.నగర్, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం విద్య, వైద్యానికి ప్రాధాన్యం ఇస్తుందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం 11వ డివిజన్‌లో రూ.40 లక్షలతో నిర్మించనున్న శ్యామలాంబ ప్రైమరీ పాఠశాల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మోరంపూడి రోడ్డు దాటేందుకు పిల్లలు ఇబ్బంది పడుతున్న తరుణంలో ప్రైమరీ పాఠశాలను హైస్కూల్ స్థాయికి మార్చినట్లు చెప్పారు. దాతల సాయంతో నిర్మాణం జరుగుతోందన్నారు. ● స్థానిక దానవాయిపేట మదీన మసీదు అభివృద్ధికి నూతన కమిటీ కృషి చేయాలని ఎమ్మెల్యే తెలిపారు. నూతన కమిటీ ఆదివారం ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిశారు. గౌరవాధ్యక్షులు మహబూబ్ జానీ, ఎస్‌డి అమీరుద్దీన్ షా, అధ్యక్షుడు ఎండి కరీమ్ మహిద్దీన్, ఉపాధ్యక్షుడు సయ్యద్ అఫ్సర్, కార్యదర్శి షేక్ ఇంతియాజ్, సంయుక్త కార్యదర్శి సయ్యద్ ఫయాజ్, ట్రెజరర్ షాజహాన్, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

భూమిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

సమావేశంలో మాట్లాడుతున్న ఐసీఏఐ అధ్యక్షుడు ప్రసన్నకుమార్

'వికసిత్ భారత్'లో సీఏల పాత్ర కీలకం

టి.నగర్: వికసిత్ భారత్ లక్ష్య సాధనలో చార్టెడ్ అకౌంటెంట్ల పాత్ర కీలకమని ఐసీఏఐ అధ్యక్షుడు ప్రసన్నకుమార్ తెలిపారు. రాజమహేంద్రవరం బ్రాంచి ఆధ్వర్యంలో లాహాస్పిన్ హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కంపెనీల చట్టం, జీఎస్టీ, ఇన్‌కంటాక్స్ చట్టాల విషయంలో కేంద్ర ప్రభుత్వానికి సీఏలు సహకారం అందిస్తున్నారన్నారు. 2017లో జీఎస్టీ చట్టాన్ని అమల్లోకి తెచ్చినప్పుడు క్షేత్రస్థాయి అవగాహన కల్పనలో కృషి చేశామన్నారు. ఏఐతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల్లో ఇబ్బందులు ఉండగా సీఏ చదివిన వారికి ప్రయోజనకరంగా ఉందన్నారు. రూ.5 లక్షల లోపు ఆదాయం ఉన్న వారికి ఉపకార వేతనాలు అందిస్తున్నామన్నారు. దక్షిణ భారత ప్రాంతీయ మండలి అధ్యక్షుడు ముప్పాళ్ల సుబ్బారావు, రాజమహేంద్రవరం ఛైర్మన్ నరసింహారావు, వైస్ ఛైర్మన్ బీసీహెచ్ సూర్యనారాయణ, కార్యదర్శి అనిల్, కోశాధికారి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

మహనీయులను స్మరించుకోవాలి

కలెక్టరేట్, న్యూస్‌టుడే: బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా స్వాతంత్ర్య పోరాటంలో తొలిదశలోనే ధైర్యసాహసాలతో పోరాడిన వీరుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి అని.. అటువంటి మహనీయులను స్మరించుకోవాలని రాజమహేంద్రవరం రెవెన్యూ డివిజనల్ అధికారి ఆర్.కృష్ణనాయక్ కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆదివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన అమరవీరుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆర్డీవో మాట్లాడుతూ దేశభక్తి, త్యాగం, ధైర్యం వంటి గొప్ప విలువలకు ఆయన జీవితం ప్రతీకగా నిలిచిందన్నారు. నేటి తరం ఆయన జీవిత విశేషాలను తెలుసుకుని దేశ స్ఫూర్తిని అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ సంగీత కళాశాల ప్రిన్సిపల్ పి.శ్రీనివాసరావు, కలెక్టరేట్ సిబ్బంది, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నరసింహారెడ్డి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఆర్డీవో కృష్ణనాయక్, అధికారులు

రైతుబజారులో నిన్నటి ధరలు(రూ.లో)

దేవీచౌక్: టమాటా-13, వంకాయలు నలుపు-16/గులాబీ-22/తెలుపు-18/దొమ్మేరు-26, బెండ-24, కాకర-34, బీర పందిరి-30, దొండ-26, క్యారెట్-32, బీట్‌రూట్-30, దోస-20, ఆనపకాయ-18, చిక్కుళ్లు-26, పచ్చిమిర్చి-40, బంగాళదుంపలు-18, ఉల్లి -19.

బహిరంగ ప్రదేశాల్లోనే వ్యర్థాలు

కాతేరు చెరువు, ఆరోగ్య కేంద్రం, ఎంపీపీ పాఠశాల ప్రాంతాల్లో రహదారి వెంబడి చెత్త పేరుకుపోయి డ్రెయిన్ వ్యవస్థ అధ్వానంగా మారింది. ఇంటింటికీ చెత్త వాహనాలు తిరుగుతున్నా కొంతమంది బహిరంగ ప్రదేశాల్లోనే వ్యర్థాలు పడేస్తున్నారు. వెంటనే తొలగించాలని, మళ్లీ వేయకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు**

పొగతో ఉక్కిరిబిక్కిరి

రాజవోలు రోడ్డులో వాహనదారులు, పాదచారులు పొగతో ఇబ్బందులు పడుతున్నారు. రహదారి వెంబడి పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు, పాల కవర్లు వంటివి పెద్దఎత్తున కాల్చడంతో దట్టమైన పొగ వస్తోంది. ఆరోగ్యానికి హానికరమైన పాలిథిన్‌ను రోడ్డుపైనే కాల్చుతున్నారని, దీనికి అడ్డుకట్ట వేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. **- న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు**

విరిగిన పలకలతో ఇక్కట్లు..

ఆనంద్‌నగర్ రోడ్డులోని మలుపులో మ్యాన్‌హోల్ పలక విరిగింది. పూర్తిగా పాడై రెండు నెలల నుంచి ప్రమాదకరంగా కనిపిస్తుంది. విద్యార్థులు, పాదచారులు, వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలల, ఆసుపత్రులు ఉన్న మార్గం కావడంతో సంచారం ఎక్కువగా ఉంటుంది. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు**

తీగలతో గుబురు.. చీకటితో గుబులు..

నగరంలో బైపాస్‌రోడ్డులో విద్యుత్తు స్తంభానికి తీగలు అల్లుకుని ప్రమాదకరంగా మారాయి. పలుచోట్ల స్తంభాలకు సరైన నిర్వహణ లేక పడిపోయేలా ఉన్నాయి. తీగలతో దీపాలు మూసుకుపోయి రాత్రి పూట వెలుగులు పూర్తిగా కనిపించని పరిస్థితి నెలకొంది. ప్రధాన రహదారిలో సైతం సమస్య ఉండడంతో విద్యుత్తు శాఖ అధికారులు స్పందించాలని నగరవాసులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు**

హమ్మయ్య.. బాగు చేశారు

లాలాచెరువు పోస్టల్ క్వార్టర్స్ వద్ద రహదారి మధ్యలో మ్యాన్‌హోల్ చుట్టూ స్లాబు పూర్తిగా దెబ్బతింది. వాహనదారులు అప్రమత్తంగా లేకుంటే పడిపోయే ప్రమాదం ఉంది. దీనిపై గత నెల 8న 'ఈనాడు'లో 'రోడ్డు మధ్యలో ఇలా.. పట్టించుకోకుంటే ఎలా?' శీర్షికతో చిత్రకథనం ప్రచురితమైంది. అధికారులు స్పందించి మరమ్మతులు చేయించారు. **- న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు**

దివ్యాంగుడికి చక్రాల కుర్చీ అందజేత

రాజమహేంద్రవరం సాంస్కృతికం: మోరంపూడి సాయినగర్‌కు చెందిన ఎస్.విష్ణు ఉజ్వల్ కాళ్లు రెండు చచ్చుబడ్డాయి. కుటుంబ సభ్యుల సాయంతోనే జీవనం సాగిస్తున్నారు. అతను పరీక్షలకు వెళ్లేందుకు అవసరమైన చక్రాల కుర్చీని ఆదివారం అందజేసినట్లు స్వర్ణాంధ్రా సేవాసంస్థ నిర్వాహకుడు గుబ్బల రాంబాబు తెలిపారు.

సీఎం సహాయ నిధి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

సీఎం సహాయ నిధి.. పేదల ఆరోగ్యానికి పెన్నిధి

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యం ఇస్తోంది. ప్రస్తుత పరిస్థితుల్లో నాణ్యమైన వైద్యం అందడం ఖర్చుతో కూడుకున్నది కావడంతో చాలామంది పేదలు వెనకడుగు వేస్తున్నారు. ఇలాంటి వారికి ఆరోగ్యశ్రీ ద్వారా అండగా నిలుస్తున్నారు. కొన్ని సందర్భాల్లో ఆరోగ్యశ్రీ పరిధి దాటిన తర్వాత ఊహించని వ్యాధులకు వైద్యం నిమిత్తం డబ్బులు చెల్లించాల్సిన పరిస్థితి ఉంటుంది. ప్రధానంగా ఆపరేషన్లు, దీర్ఘకాలిక వ్యాధులకు మందుల నిమిత్తం ఖర్చు చేయాల్సి ఉంది. అటువంటి పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి అండగా నిలుస్తుంది.

ఎమ్మెల్యే లాగిన్‌తో దరఖాస్తులు..

నియోజకవర్గంలో సంబంధిత ఎమ్మెల్యే ద్వారా దరఖాస్తు చేయాలి. ఆరోగ్యశ్రీ మినహాయించి మిగిలిన ఇబ్బందులకు, ఆపరేషన్లకు డబ్బులు చెల్లించని పరిస్థితిలో ఉన్నవారికి ఈ విధానం అండగా నిలుస్తుంది. నగరంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆయన లాగిన్ నుంచి దరఖాస్తులు చేరవేస్తారు. అప్పటివరకు అందించిన వైద్యం, తర్వాత చికిత్స కోసం ఎంత సొమ్ము కావాలనే దానిపై వైద్యులు ధ్రువీకరించిన పత్రాలను జత చేసి లాగిన్‌తో పంపిస్తారు. ప్రాధాన్య క్రమంలో సొమ్ము విడుదల చేస్తారు.

రూ.3.72 కోట్ల పంపిణీ..

నగరంలో ప్రయోజనం ఇలా..
మొత్తం లబ్ధిదారులు – 409
విలువ – రూ.3,72,04,204
పెండింగ్‌లోని లబ్ధిదారులు – 87
వాటి విలువ – రూ.3,01,22,113

గతంలో తెదేపా హయాంలోనే చంద్రబాబు నేతృత్వంలో ముఖ్యమంత్రి సహాయ నిధి ప్రక్రియ ప్రారంభించారు. ఆ తర్వాత జగన్ హయాంలో ఈ విధానాన్ని పూర్తిగా విస్మరించారు. అయిదేళ్ల కాలంలో ఒక్క చెక్కు కూడా విడుదల చేయకపోవడం గమనార్హం. తిరిగి కూటమి ప్రభుత్వం రావడంతో పునఃప్రారంభించారు. రాజమహేంద్రవరంలో 409 మందికి సాయం చేశారు. రూ.3.72 కోట్లు పంపిణీ చేశారు. అర్హులు సద్వినియోగం చేసుకోవాలని నాయకులు, అధికారులు సూచిస్తున్నారు.

స్కౌట్స్, గైడ్స్ సేవలు ప్రశంసనీయం

వి.ఎల్.పురం, న్యూస్‌టుడే: వివిధ ఉత్సవాలు, వేడుకలు, ఆధ్యాత్మిక, సామాజిక కార్యక్రమాల్లో పాల్గొని దక్షిణ మధ్య రైల్వే భారత్ స్కౌట్స్, గైడ్స్ చిన్నారుల సేవలు ప్రశంసనీయమని విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ ఎస్.అబ్రహం పేర్కొన్నారు. ఆదివారం రాజమహేంద్రవరం ప్రధాన రైల్వేస్టేషన్ సమీపంలోని తూర్పువైపు రైల్వే క్వార్టర్స్ వద్ద ఉన్న స్కౌట్ డెన్‌లో 100వ ప్రపంచ ఆలోచనా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా 80 మంది స్కౌట్స్, గైడ్స్ చిన్నారులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు, ధ్రువపత్రాలు అందజేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న అబ్రహం మాట్లాడుతూ 150 దేశాల్లో స్కౌటింగ్ ఉందన్నారు. స్కౌట్ డెన్‌లలో చేరిన చిన్నారులకు క్రమశిక్షణతోపాటు సామాజిక సేవాదృక్పథం, ధైర్యసాహసాలు అలవడుతున్నాయన్నారు. గోదావరి పుష్కరాల్లోనూ సేవలు అందించేందుకు సంసిద్ధం కావాలని సూచించారు. స్కౌట్స్ మాస్టర్స్ యు.వి.సురేష్, టీడీవీ.ప్రసాద్, పి.సందీప్, కె.శివకుమార్, రాజ్‌పుట్, స్కౌట్స్, గైడ్స్ చిన్నారులు పాల్గొన్నారు.

చిన్నారులకు జ్ఞాపికలు అందజేస్తున్న విద్యాశాఖ జేడీ అబ్రహం

సమాజ శ్రేయస్సే ప్రధానం

శ్యామలా సెంటర్, న్యూస్‌టుడే: భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. డీఎస్ఈవో కె.వాసుదేవరావు మాట్లాడుతూ సమాజ శ్రేయస్సు కోసం దేశభక్తి కలిగి ఉండి, నిరంతరం దేశ రక్షణకు కృషి చేయాలన్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. ప్రధానోపాధ్యాయులు ఎన్.సుజాత, స్కౌట్స్ మాస్టర్స్ కె.స్వామినాధన్, జి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

చౌడేశ్వర్‌నగర్‌లో వైద్యశిబిరం

కంబాలచెరువు: నగరంలో చౌడేశ్వర్‌నగర్, స్వరూప్‌నగర్, ఆర్డీఏ కార్యాలయాల వెనుక కిడ్నీ కేసులు వెలుగు చూసిన నేపథ్యంలో యంత్రాంగం అప్రమత్తమైంది. ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో అక్కడ వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. నమూనాలు సేకరించడంతో పాటు అవసరమైన వారికి ఔషధాలు అందజేశారు.

కళ్లజోళ్ల పంపిణీ

రాజమహేంద్రవరం సాంస్కృతికం: రాజమహేంద్రవరం సింహాచలనగర్‌లో కొలువైన శ్రీవరాహ లక్ష్మీనృసింహ స్వామివారి క్షేత్రంలో ఆదివారం కళ్లజోళ్ల పంపిణీ చేశారు. ఇటీవల నిర్వహించిన స్వామివారి చందన యాత్రా మహోత్సవాల్లో భాగంగా ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. అందులో కళ్లజోళ్లు అవసరమైన 270 మందికి ఆలయ ధర్మకర్తలు కె.సింహాచలం, కె.నాగేశ్వరరావు నిర్వహణలో లబ్ధిదారులకు అందజేశారు. భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు సూర్యకుమారి, రాపర్తి శ్రీదేవి, శిఘాకొల్లి సీతారామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల్లో శ్రీవారి రథోత్సవం

రాజమహేంద్రవరం గౌతమఘాట్‌లోని శ్రీరంగ ధామంలో శ్రీభూనీలా సమేత వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం ఉదయం స్వామివారికి తిరుమంజనం, చక్రస్నానం జరిపించి విశేష పూజలు నిర్వహించారు. పట్టువస్త్రాలతో అలంకరించిన దేవతామూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన రథంలో ఉంచి ఉత్సవం జరిపించారు. ఆలయ స్థానాచార్యులు పరాసర రఘునాథభట్టర్ స్వామివారి నిర్వహణలో జరిగిన కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

\- న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం సాంస్కృతికం

పద్యం.. తెలుగుకు గర్వకారణం

రాజమహేంద్రవరం సాంస్కృతికం: తెలుగు భాషకు గర్వ కారణమైన పద్యానికి ప్రాణం పోస్తున్న కవి రాఘవేంద్రరావు అని కేంద్రీయ విద్యాలయం విశ్రాంత ఆచార్యులు బేతవోలు రామబ్రహ్మం పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం వైజంక్షన్‌లోని ఆనం రోటరీ హాలులో ఎస్.వి.రాఘవేంద్రరావు సహస్ర చంద్ర దర్శన మహోత్సవం, ఆయన రచించిన 12 పుస్తకాల ఆవిష్కరణ సభ జరిగింది. ముఖ్యఅతిథిగా బేతవోలు రామబ్రహ్మం హాజరై మాట్లాడారు. 12 పుస్తకాలు ఒకేసారి ఆవిష్కరించడం రికార్డ్ అన్నారు. విశ్రాంత ఓఎన్‌జీసీ అధికారి పి.విజయ్ కుమార్ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో రాఘవేంద్రరావు దంపతులను సత్కరించారు. మహామహోపాధ్యాయ విశ్వనాథ గోపాలకృష్ణ పాల్గొన్నారు. ఎస్.పి.గంగిరెడ్డి, తాతా సందీప్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాన్ని ఆవిష్కరించిన బేతవోలు రామబ్రహ్మం తదితరులు

గోదావరి హారతి వైభవం

రాజమహేంద్రవరం సాంస్కృతికం: రాజమహేంద్రవరం పుష్కరఘాట్‌లో ఆదివారం సాయంత్రం గోదారమ్మకు నిత్యహారతి వేడుక వైభవంగా జరిగింది. వేదపండితులు 14రకాల హారతులను ఒక్కొక్కటిగా నదీమతల్లికి సమర్పించారు. సెలవురోజు కావడంతో పెద్దసంఖ్యలో నగరవాసులు హాజరై తిలకించారు.

విద్యార్థుల క్షేత్రస్థాయి పర్యటన

రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల బీకాం, బీబీఏ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఆదివారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఉయ్యూరులోని కేసీపీ షుగర్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా సంస్థ హెచ్ఆర్ మేనేజరు వైవీ రత్నప్రసాద్, సిబ్బంది.. విద్యార్థులకు ప్లాంట్ నిర్వహణ, ఉత్పత్తి ప్రక్రియ, మానవ వనరుల వినియోగం, ఆర్థిక వ్యవహారాల నిర్వహణ తదితర అంశాలు వివరించారు. అధ్యాపకులు డాక్టర్ పి.షణ్ముఖరావు, డాక్టర్ ఏఏ అన్నపూర్ణ, డాక్టర్ వీవీవీ సత్యవతి, హరిత సులోచన, కె.సునీత పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, దేవీచౌక్

(c) eenadu

రాజమహేంద్రవరం గ్రామీణం

• రాజమహేంద్రవరం గ్రామీణం • రాజానగరం

నిత్యావసరాల పంపిణీ

నిత్యవసరాలు అందజేస్తున్న నిర్వాహకులు

బొమ్మూరు, న్యూస్‌టుడే: బొమ్మూరు బిలాల్ మసీదులో ఆదివారం ఇఫ్తార్ విందు నిర్వహించారు. తెదేపా నూర్ భాషా విభాగం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ శుభాన్ ఆధ్వర్యంలో పేద మహిళలకు జనాబ్ మీర్జా అన్వర్ బేగ్ సౌజన్యంతో రంజాన్ తోఫా అందించారు. తెదేపా మండల అధ్యక్షుడు మత్స్యేటి ప్రసాద్ ముసుబుర్ రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ స్వచ్ఛతకు శ్రీకారం

కడియం, న్యూస్‌టుడే: దుళ్లలో యువకులు ప్రజా ప్రతినిధులు గ్రామ స్వచ్ఛతకు శ్రీకారం చుట్టారు. వన సేవ సమితి బృందంగా ఏర్పడి గ్రామ శివారుల్లో పేరుకున్న వ్యర్థాలను తొలగించారు. దుళ్లను స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతూ ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలిచారు.

దుళ్లలో వ్యర్థాలు తొలగిస్తున్న గ్రామస్థులు

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ. 10 - మ. 1 మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు

ధవళేశ్వరం: 91212 29057	కడియం: 91212 29062
బొమ్మూరు: 91549 78039	మోరంపూడి: 94935 92696
రాజానగరం: 98492 36167	కోరుకొండ: 80085 74213

రోడ్డంతా బురద..

సమస్య: బొమ్మూరు చెరవుగట్టు వద్ద పైపు నుంచి నీరు వృథాగా పోతుంది. రోడ్డంతా బురదగా మారుతోంది. రాకపోకలకు ఇబ్బందిగా ఉంటుంది. – జీవ, స్థానికుడు

సమాధానం: మరమ్మతులు చేయించి నీటి వృథా నియంత్రిస్తాం. – కాశీ, గ్రామ కార్యదర్శి,

– న్యూస్‌టుడే, బొమ్మూరు

చెత్త తీయాలి

సమస్య: హుకుంపేట రామకృష్ణనగర్ మూడో వీధిలో చెత్త పేరుకుపోతోంది. దుర్వాసన వస్తోంది. – నరేష్, స్థానికుడు

సమాధానం: చెత్త రిక్షా ప్రతీ రోజు మీ ప్రాంతానికి పంపిస్తాం.

– శ్రీదేవి, గ్రామకార్యదర్శి, హుకుంపేట

– న్యూస్‌టుడే, హుకుంపేట

మామిడి దిగుబడులపై కోటి ఆశలు

రాజానగరం, న్యూస్‌టుడే: ఈ ఏడాది మామిడితోటలు విరగపూసి కళకళలాడుతున్నాయి. చెట్లన్నీ పుష్పాలతో నిండిపోవడంతో రైతులు ఎన్నో ఆశలతో ఎదురుచూస్తున్నారు. గత ఏడాది కూడా మామిడిపూత బాగానే వచ్చినప్పటికీ.. దిగుబడి సమయానికి వచ్చిన తెగుళ్ల కారణంగా ఆశించిన ఫలితాలు రాలేదని రైతులు ఆవేదన చెందారు. గత ఏడాది ప్రారంభంలో టన్ను మామిడిధర రూ.12 వేలు పలికిందని.. అంతా చేతికి వచ్చేసరికి రూ.7500కి పడిపోయిందని రైతులు వాపోయారు. కలక్టర్ రకం మామిడికాయలు టన్ను ప్రారంభంలో రూ.ఏడు వేలు పలికినా క్రమంగా తగ్గి రూ.మూడు వేలకు చేరుకుందని చెబుతున్నారు.

మామిడి పంట విస్తీర్ణం హెక్టార్లలో..

మండలం	గత ఏడాది	ఈ ఏడాది	దిగుబడి (గత ఏడాది టన్నులలో)
రాజానగరం	400	450	5000
కోరుకొండ	1820	1750	22500
గోకవరం	1400	1325	17850

మామిడిని పీడించే తెగుళ్లు..

నియోజకవర్గంలోని రాజానగరం, కోరుకొండ మండలాల్లో మామిడితోటల్లో చెట్లు ఇప్పటికే విపరీతంగా పూసి ఉన్నాయి. ఈ పూత పిందెగా మారి, కాయలు ఎదిగి, పంటగా చేతికి రావాలని రైతులు ఆశిస్తున్నారు. గత ఏడాదిలా అనుకున్నస్థాయిలో పంట చేతికి రాకపోయి నష్టాలబారినపడితే మండలాన్ని యూనిట్‌గా తీసుకోకుండా గ్రామాలను యూనిట్‌గా తీసుకుని బీమా చెల్లిస్తే రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని చెబుతున్నారు. మామిడిని పట్టిపీడించే తెగుళ్లలో పండుఈగ, బొడ్డుకిందమచ్చ అధికంగా ఉంటాయని, వీటి నివారణకు ఉద్యానశాఖ అధికారులు సలహాలు సూచనలు అందివ్వాలని రైతులు కోరుతున్నారు.

రాజానగరంలో విరగపూసిన మామిడి

మహనీయులను స్మరించుకోవాలి

కలెక్టరేట్, న్యూస్‌టుడే: బ్రిటీష్ పాలకు వ్యతిరేకంగా స్వాతంత్ర్య పోరాటంలో తొలిదశలోనే ధైర్యసాహసాలతో పోరాడిన వీరుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి అని.. అటువంటి మహనీయులను స్మరించుకోవాలని రాజమహేంద్రవరం రెవెన్యూ డివిజనల్ అధికారి ఆర్.కృష్ణనాయక్ కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆదివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆర్డీవో మాట్లాడుతూ దేశభక్తి, త్యాగం, ధైర్యం వంటి గొప్ప విలువలకు ఆయన జీవితం ప్రతీకగా నిలిచిందన్నారు. నేటితరం ఆయన జీవిత విశేషాలను తెలుసుకుని దేశ స్ఫూర్తిని అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ సంగీత కళాశాల ప్రిన్సిపల్ పి.శ్రీనివాసరావు, కలెక్టరేట్ సిబ్బంది, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నరసింహారెడ్డి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఆర్డీవో, అధికారులు

జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు కోచ్‌గా ఎంపిక

చాగల్లు: జాతీయ స్థాయి సబ్ జూనియర్స్ వాలీబాల్ పోటీలకు కోచ్‌గా ఊనగట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు కె.గంగాధరరావు వ్యవహరించనున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎన్వీ రమణ ఆదివారం తెలిపారు. ఈ నెల 23వ తేదీ నుంచి మార్చి 1వ వరకు కోల్‌కతాలో ఈ పోటీలు జరగనున్నాయని తెలిపారు.

స్కౌట్స్, గైడ్స్ సేవలు ప్రశంసనీయం

వి.ఎల్.పురం, న్యూస్‌టుడే: వివిధ ఉత్సవాలు, వేడుకలు, ఆధ్యాత్మిక, సామాజిక కార్యక్రమాల్లో పాల్గొని దక్షిణ మధ్య రైల్వే భారత్ స్కౌట్స్, గైడ్స్ చిన్నారుల సేవలు ప్రశంసనీయమని విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ ఎస్.అబ్రహం పేర్కొన్నారు. ఆదివారం రాజమహేంద్రవరం ప్రధాన రైల్వేస్టేషన్ సమీపంలోని తూర్పువైపు రైల్వే క్వార్టర్స్ వద్ద ఉన్న స్కౌట్ డెన్‌లో 100వ ప్రపంచ ఆలోచనా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా 80 మంది స్కౌట్స్, గైడ్స్ చిన్నారులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు, ధ్రువపత్రాలు అందజేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న అబ్రహం మాట్లాడుతూ 150 దేశాల్లో స్కౌటింగ్ ఉందన్నారు. స్కౌట్ డెన్‌లలో చేరిన చిన్నారులకు క్రమశిక్షణతోపాటు సామాజిక సేవా దృక్పథం, ధైర్యసాహసాలు అలవడుతున్నాయన్నారు. గోదావరి పుష్కరాల్లోనూ సేవలు అందించేందుకు సంసిద్ధం కావాలని సూచించారు. స్కౌట్స్ మాస్టర్స్ యు.వి.సురేష్, టీడీవీ.ప్రసాద్, పి.సందీప్, కె.శివకుమార్, రాజ్‌పుత్, స్కౌట్స్, గైడ్స్ చిన్నారులు పాల్గొన్నారు.

చిన్నారులకు జ్ఞాపికలు అందజేస్తున్న విద్యాశాఖ జేడీ అబ్రహం

బ్రహ్మోత్సవాల్లో శ్రీవారి రథోత్సవం

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరం గౌతమఘాట్‌లోని శ్రీరంగధామంలో శ్రీభూనీలా సమేత వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం ఉదయం స్వామివారికి తిరుమంజనం, చక్రస్నానం జరిపించి విశేష పూజలు నిర్వహించారు. పుష్పయాగంలో అలంకరించిన దేవతామూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన రథంలో ఉంచి ఊరేగింపు జరిపించారు. ఆలయ స్థానాచార్యులు వేదసర రఘునాథభట్టర్ స్వామీజీ నిర్వహణలో జరిగిన కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

శ్రీరంగపట్నంలో కల్యాణోత్సవం..

రథోత్సవంలో పాల్గొన్న కమిటీ నిర్వాహకులు

కోరుకొండ, న్యూస్‌టుడే: మండలంలోని శ్రీరంగపట్నంలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామివారి రథోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా గ్రామంలోని ప్రధాన వీధుల్లో కనులపండువగా జరిగింది. రుడా ఛైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తనకల నాగేశ్వరరావు, ఆలయ కమిటీ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

కళ్లజోళ్ల అందజేత

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరం సింహాచల నగర్‌లో కొలువైన శ్రీవరాహ లక్ష్మీనృసింహ స్వామి వారి క్షేత్రంలో ఆదివారం కళ్లజోళ్ల పంపిణీ చేశారు. ఇటీవల నిర్వహించిన స్వామివారి చందన యాత్రా మహోత్సవాల్లో భాగంగా ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. అందులో కళ్లజోళ్లు అవసరమైన 270 మందికి ఆలయ ధర్మకర్తలు కె.సింహాచలం, కె.నాగేశ్వరరావు నిర్వహణలో లబ్ధిదారులకు అందజేశారు. భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు సూర్యకుమారి, రాపర్తి శ్రీదేవి, శిఘాకొల్లి సీతారామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కళ్లజోళ్లను పంపిణీ చేస్తున్న ఆలయ ధర్మకర్తలు

కరాటేలో చిన్నారుల ప్రతిభ

మోరంపూడి, న్యూస్‌టుడే: కరాటే పోటీల్లో కవలగొయ్యి గ్రామానికి చెందిన ఎనిమిది మంది చిన్నారులు బంగారు, వెండి పతకాలను సాధించారని శిక్షకుడు పంచికట్ల శ్రీను ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం రామచంద్రాపురం ఆర్‌సీపీఎం చర్చిలో నిర్వహించిన ఇంటర్ స్టేట్ ఇన్విటేషనల్ కరాటే పోటీల్లో ఈ ప్రతిభ కనబరిచారన్నారు. కటాలో ఆరుగురు బంగారు, ఇద్దరు వెండి పతకం, కుమిటిలో బంగారు పతకాలు సాధించారన్నారు.

పతకాలు సాధించిన చిన్నారులు

విద్యార్థుల క్షేత్రస్థాయి పర్యటన

దేవీచౌక్, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల బీకాం, బీబీఏ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఆదివారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఉయ్యూరులోని కేసీపీ షుగర్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా సంస్థ హెచ్ఆర్ మేనేజర్ ఆర్.లక్ష్మణ ప్రసాద్, సిబ్బంది.. విద్యార్థులకు ప్లాంట్ నిర్వహణ, ఉత్పత్తి ప్రక్రియ, మానవ వనరుల వినియోగం, ఆర్థిక వ్యవహారాల నిర్వహణ తదితర అంశాలు వివరించారు. అధ్యాపకులు డాక్టర్ బి.షణ్ముఖరావు, డాక్టర్ ఏవీ అన్నపూర్ణ, డాక్టర్ వీవీవీ సత్యవతి, హరిత సులోచన, కె.సునీత పాల్గొన్నారు.

విద్యార్థులకు అంశాలను వివరిస్తున్న సంస్థ సిబ్బంది

చెరువుపై నిర్లక్ష్యం..

దివాన్‌చెరువు పంచాయతీ శివారు శ్రీరాంపురంలోని ఊరచెరువు కొన్నేళ్లుగా నిర్లక్ష్యానికి గురవుతోంది. నిర్వహణ లేక గుర్రపుడెక్కతో నిండిపోయింది. దీనిలోంచి సమీపంలోని జనావాసాలకు పాములు వస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. దోమల బెడద ఎక్కువగా ఉందని వాపోతున్నారు. ఆధునికీకరించాలని గ్రామస్థులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, రాజానగరం

సీసీ రోడ్డు వేయండి

బొమ్మూరు కేకేఆర్ అపార్ట్‌మెంట్ సమీపంలో రోడ్డు అధ్వానంగా తయారవుతోంది. మురుగు కదిలే కాలువ లేకపోవడంతో అందులోనే రాకపోకలు సాగిస్తున్నారు. దోమల బెడద పెరగడంతో స్థానికులు అనారోగ్య బారిన పడుతున్నారు. సీసీ రోడ్డు వేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ విషయమై కార్యదర్శి కాశీని అడగ్గా సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. – న్యూస్‌టుడే, బొమ్మూరు

ప్రమాదకరంగా స్తంభం

కొంతమూరు భవానీనగర్ ప్రధాన రహదారి పక్కన విద్యుత్తు స్తంభం ప్రమాదకరంగా ఉంది. తీగలు కిందకు వేలాడుతూ ఉండటంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ప్రమాదం జరగకముందే సంబంధిత అధికారులు సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, కొంతమూరు

నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

దేవీచౌక్, న్యూస్‌టుడే: అత్యవసర మరమ్మతుల నిమిత్తం సోమవారం పలు ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాను నిలిపివేయనున్నట్లు ఈఈ నక్కపల్లి శామ్యూల్ ఓ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు కాతేరులోని సుబ్బారావుపేట, సంజీవ్‌నగర్ కాలనీ, మిలటరీకాలనీ, వేణుగోపాలపురం, పంచాయితీ ప్రాంతం, కాతేరు-కొంతమూరు రోడ్డు, భరత్‌నగర్, దేవాంగుల వీధి, సీటీఆర్ఐ రోడ్డు, జీఎస్ఆర్ ఆన్‌లైన్ ప్రాంతం, గణపతినగర్ ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఆయా ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

రైతుబజారులో నిన్నటి ధరలు(రూ.లో)

దేవీచౌక్: టమాటా-13, వంకాయలు నలుపు-16/గులాబీ-22/తెలుపు-18/ దొమ్మేరు-26, బెండ-24, కాకర-34, బీర పందిరి-30, దొండ-26, క్యారెట్-32, బీట్ రూట్-30, దోస-20, ఆనపకాయ-18, చిక్కుళ్లు-26, పచ్చిమిర్చి-40, బంగాళదుంపలు-18, ఉల్లి -19.

తెలుగుకు గర్వకారణం 'పద్యం'

పుస్తకాన్ని ఆవిష్కరించిన బేతవోలు రామబ్రహ్మం తదితరులు

రాజమహేంద్రవరం సాంస్కృతికం: తెలుగు భాషకు గర్వకారణమైన పద్యానికి ప్రాణం పోస్తున్న కవి రాఘవేంద్రరావు అని కేంద్రీయ విద్యాలయం విశ్రాంత ఆచార్యులు బేతవోలు రామబ్రహ్మం పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం వైజంక్షన్‌లోని ఆనం రోటరీ హాలులో ఎస్.వి.రాఘవేంద్రరావు సహస్ర చంద్ర దర్శన మహోత్సవం, ఆయన రచించిన 12 పుస్తకాల ఆవిష్కరణ సభ జరిగింది. ముఖ్యఅతిథిగా బేతవోలు రామబ్రహ్మం హాజరై మాట్లాడారు. 12 పుస్తకాలు ఒకేసారి ఆవిష్కరించడం రికార్డ్ అన్నారు. విశ్రాంత ఓఎన్‌జీసీ అధికారి పి.విజయ్ కుమార్ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో రాఘవేంద్రరావు దంపతులను సత్కరించారు. మహామహోపాధ్యాయ విశ్వనాథ గోపాల కృష్ణ పాల్గొన్నారు. ఎస్.పి.గంగిరెడ్డి, తాతా సందీప్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై పశువులతో ఇబ్బందులు

గోకవరం: ప్రధాన రహదారిపై గుంపులుగా సంచరిస్తున్న పశువులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళల్లో గోకవరం రోడ్లపైనే ఇవి సేదతీరుతున్నాయి. దగ్గరకు వచ్చే వరకు ఇవి కనిపించక వాహనాలపై వెళ్లేవారు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ సమస్య పరిష్కరించాలని ఎప్పటి నుంచో స్థానికులు పంచాయతీ అధికారులను కోరుతున్నారు. పశువుల యజమానులకు నోటీసులు అందిస్తున్నామని అధికారులు చెబుతున్న క్షేత్రస్థాయిలో మాత్రం సమస్య పరిష్కారం కావడం లేదు. అధికారులు స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

గోకవరం ప్రధాన రహదారిపై పశువులు

ముగిసిన స్థల వివాదం

కోరుకొండ, న్యూస్‌టుడే: కోరుకొండ- శ్రీరంగపట్నం వెళ్లే రహదారిలో సత్తెమ్మతల్లి ఆలయ సమీపంలోని 8.48 ఎకరాల గురించి వివాదం ఉంది. ప్రభుత్వానిది అని.. కాదు ప్రైవేటు వ్యక్తులది అనే వాదన ఉండేది. ఆ స్థలం ప్రైవేటుదే అని హైకోర్టు తేల్చినట్లు భూయజమానులు చొంగా కృష్ణ, చొంగా మణికంఠ తెలిపారు. ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. దీనిపై కొంత మంది తప్పుడు ప్రచారం చేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. దీనిపై తహసీల్దారు సుస్వాగతం మాట్లాడుతూ అది ప్రభుత్వ భూమి కాదని, ప్రైవేటు వ్యక్తులదని గుర్తించామన్నారు.

విద్యుత్తు నియంత్రికను సరిచేశారు

స్పందనకు వందనం

మోరంపూడి జంక్షన్ హనుమాన్ నగర్ ప్రధాన రహదారి పక్కనే విద్యుత్తు నియంత్రిక ప్రమాదకరంగా పక్కకు వాలింది. దీనిపై 'ఈనాడు'లో 'వేలాడుతున్నా.. వదిలేశారు..' శీర్షికతో చిత్రవార్త ప్రచురితమైంది. అధికారులు స్పందించి, సరి చేయించారు.

– న్యూస్‌టుడే, మోరంపూడి

27 నుంచి సోమేశ్వరస్వామి కల్యాణోత్సవాలు

కడియం, న్యూస్‌టుడే: మురమండలో అతిపురాతన ఆలయంగా కొలువైన శ్రీసర్వకామదాంబ సమేత శ్రీసోమేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు ఈ నెల 27న ప్రారంభం కానున్నాయని ఆలయ ప్రధాన అర్చకుడు బాదంపూడి వెంకటశాస్త్రి తెలిపారు. ఆ మేరకు స్వామివారి పందిరిరాట ముహూర్తాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ నెల 27న ఆలయంలో స్వామికల్యాణం, 28న అన్నసమారాధన, 1న సదస్యం, 2న స్వామివారి రథోత్సవం, 4న జరిగే స్వామి వారి శ్రీపుష్పయాగంతో కల్యాణోత్సవాలు ముగుస్తాయని వివరించారు. గ్రామపెద్దలు ప్రత్తిపాటి రామారావుచౌదరి, దేవళ్ల రామ్మోహనరావు, వట్టికూటి జానకిరామయ్య తదితరులు పాల్గొన్నారు.

పందిరిరాట ముహూర్తంలో గ్రామపెద్దలు, కమిటీ సభ్యులు

శ్రద్ధాంజలి
శ్రీ పుల్లా వెంకన్న గారు
శ్రీ సత్య భార్గవ్ రైతు నర్సరీ
కడియపులంక, Cell: 98857 81633

శ్రద్ధాంజలి
శ్రీ పుల్లా వెంకన్న గారు
వీర వెంకట లక్ష్మి నర్సరీ
Cell: 90522 66571, 8121353339

శ్రద్ధాంజలి
శ్రీ పుల్లా వెంకన్న గారు
శ్రీ ఆంజనేయ రైతు నర్సరీ
ప్రొ: కొత్తూరి నాగబాబు (CM)
కడియపులంక, Cell : 98660 14987

శ్రద్ధాంజలి
శ్రీ పుల్లా వెంకన్న గారు
శ్రీ సత్యదేవ నర్సరీ
పుల్లా నాగేశ్వరరావు & సన్స్
పుల్లా సత్యనారాయణ (బండియ్య) & సన్స్
పుల్లా ఆంజనేయులు (అబ్బులు) & సన్స్

శ్రద్ధాంజలి
శ్రీ పుల్లా వెంకన్న గారు
పుల్లా సత్తిబాబు & సన్స్
శ్రీ సత్యదేవ ఫ్లవర్ మర్చంట్స్ శ్రీ వెంకట సత్యదేవ నర్సరీ
కడియపులంక, 9908988329, 9959111155, 9866684889

శ్రద్ధాంజలి
శ్రీ పుల్లా వెంకన్న గారు
శ్రీ ఆంజనేయ ఫ్లవర్ మర్చంట్
ప్రొ: తోరాటి సత్యనారాయణ (సతీష్)
Shop: B-14, కడియపులంక పూలమార్కెట్, సెల్: 9866766960

శ్రద్ధాంజలి
శ్రీ పుల్లా వెంకన్న గారు
పుల్లా రామారావు
మాజీ సర్పంచ్, జనసేన నాయకులు
కడియపులంక, Cell : 93999 93679

శ్రద్ధాంజలి
మా పెదనాన్న, శతాధికుడు శ్రీ పుల్లా వెంకన్న గారి మరణానికి చింతిస్తూ, వారి పవిత్రాత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ...
శ్రీ సత్యదేవ ఫ్లవర్ మర్చంట్స్
ప్రొ: పుల్లా వీర్రాజు & సన్
షాపు నెం.B7, కడియపులంక పూలమార్కెట్, 98666 85889, 90637 88999

శ్రద్ధాంజలి
శ్రీ పుల్లా వెంకన్న గారు
ఓం తేజస్వి నర్సరీ
ప్రొ. పుల్లా వెంకటేశ్వరరావు & సన్స్, కడియపులంక

ఆదర్శమూర్తికి అశ్రునివాళి
శ్రీ పుల్లా వెంకన్న గారు
జననం: 06-04-1924 మరణం: 13-02-2026
కడియపులంక
శ్రీ వీరవెంకట సత్యనారాయణ రైతు నర్సరీ
94408 64591, 98852 23532, 98857 79356

IN THE COURT OF THE CIVIL JUDGE
(SENIOR DIVISION) TANUKU
I.A. No. 1/2025 & F.D.I.A. 1/2025 in O.S. 25/2018
Between:
M/s. UCO Bank, Attili, Rep. by its Branch Manager, Attili ... Petitioner / Plaintiff
AND
Bavana Venkata Sita Mahalakshmi and Others ... Respondents / Defendants
5. Ch.Siva Pushpavathi, W/o. Ch.Samba Siva Rao, D.No. 5-428/1, Nethaji Nagar, 8th Lane, Bommuru, Rajamahendravaram Rural, E.G.Dt.

పిటీషనర్ తరపున వేయించిన ప్రకటన

ఇందుమూలముగా 5వ రెస్పాండెంట్‌కు పై నెంబరు పిటీషన్‌లో I.A.No. 1/2025 మరియు F.D.I.A. No. 1/2025లో కోర్టు వారి ద్వారా మీకు నోటీసు పంపినమా, మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టువారు నోటీసు పేపరు ప్రకటన ద్వారా ఆర్డరు వేసినారు. కావున మీరు ది. 10-03-2026 తేదీన ఉదయం 10.30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గానీ, లాయరు ద్వారా గానీ హాజరు అయి అభ్యంతరములు తెలుపుకొనవలెను. లేనియెడల మీ పరోక్షములో పిటీషన్ విచారణ చేసి తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

తణుకు సం/- గుడిమెట్ల వీర్రెడ్డి
ది. 23-02-2026 పిటీషనరు తరపు న్యాయవాది, సెల్: 94406 07793

(c) eenadu

కొవ్వూరు

•కొవ్వూరు •నిడదవోలు •గోపాలపురం

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

ఉండ్రాజవరం: కొత్తలైన్ ఏర్పాటు పనుల్లో భాగంగా మద్దూరులో ఈ నెల 23న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ నారాయణ అప్పారావు ఆదివారం తెలిపారు.

జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు కోచ్‌గా ఎంపిక

చాగల్లు: జాతీయ స్థాయి సబ్ జూనియర్స్ వాలీబాల్ పోటీలకు కోచ్‌గా ఊనగట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు కె.గంగాధరరావు వ్యవహరించనున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్‌వీ రమణ ఆదివారం తెలిపారు. ఈ నెల 28వ తేదీ నుంచి మార్చి 1వ వరకు కోల్‌కతాలో ఈ పోటీలు జరగనున్నాయని తెలిపారు.

కరాటేలో ప్రతిభ

తాళ్లపూడి: నిడదవోలులో జరిగిన కరాటే పోటీల్లో మండలంలోని అన్నదేవరపేటలోని ఏపీజే అబ్దుల్ కలాం పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు డైరెక్టర్ డి.స్వామి ఆదివారం తెలిపారు. రాష్ట్రస్థాయి కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో పది మంది విద్యార్థులు స్వర్ణ, రజతం పతకాలను సాధించారని పేర్కొన్నారు.

పతకాలతో విద్యార్థులు

విద్యార్థినుల ఆత్మగౌరవం కాపాడడమే లక్ష్యం

బయో టాయిలెట్లను ప్రారంభిస్తున్న మంత్రి దుర్గేష్

నిడదవోలు, న్యూస్‌టుడే: ప్రభుత్వ బాలికల పాఠశాలల్లో మెరుగైన మౌలిక వసతులు కల్పించి విద్యార్థినిల ఆరోగ్యం, ఆత్మగౌరవం కాపాడడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. నిడదవోలు పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల, సమిశ్రగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 'నెస్లే ఇండియా' సంస్థ సీఎస్ఆర్ నిధులతో నిర్మించిన ఆధునిక పరిజ్ఞానంతో కూడిన బయో టాయిలెట్లను ఆదివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో బోధన బాగున్నప్పటికీ కనీస సదుపాయాలు లేక ఆడపిల్లలు విద్యకు దూరమవుతున్నట్లు ఓ సర్వేలో తేలిందన్నారు. నెస్లే సంస్థ ముందుకొచ్చి దాదాపు రూ.30లక్షలతో నిడదవోలు నియోజకవర్గంలో 15 యూనిట్ల బయో టాయిలెట్లను ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం విద్యార్థులతో సరదాగా ముచ్చటించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి, సంస్థ సీనియర్ మేనేజర్ మహ్మద్, ఏఎంసీ వైస్ ఛైర్మన్ పువ్వల రతీదేవి తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల అందజేత

కూటమి ప్రభుత్వం ఆరోగ్యానికి ప్రాధాన్యమిస్తూ రాష్ట్ర బడ్జెట్‌లో ఆరోగ్యశాఖకు సుమారు రూ.19వేల కోట్లు కేటాయించిందని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. నిడదవోలులోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో ఆదివారం నియోజకవర్గానికి చెందిన 26 మంది సీఎం సహాయనిధి లబ్ధిదారులకు రూ.29.45 లక్షల విలువైన చెక్కులు, ఎల్ఓసీ పత్రాలను అందజేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న 863 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల బలోపేతానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. దరఖాస్తు చేసుకున్న వెంటనే నిధులు విడుదలయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు.

ఆత్మరక్షణ విద్య అవసరం

విజయవాడలో ఇటీవల జరిగిన ఫస్ట్ నేషనల్ మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో నిడదవోలుకు చెందిన స్పోర్ట్స్ కెంపో అసోసియేషన్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి పతకాలు సాధించడం అభినందనీయమని రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. నిడదవోలులోని క్యాంపు కార్యాలయంలో మంత్రి దుర్గేష్ వారిని అభినందించారు. ఆడపిల్లలు ఆత్మరక్షణ విద్య నేర్చుకోవడం చాలా అవసరమన్నారు.

నిఘా నీడలో ఇంటర్ పరీక్షలు

✦ నిమిషం ఆలస్యమైనా అనుమతించరు
✦ డివిజన్‌లో 15 కేంద్రాల్లో 11,962 మంది

కొవ్వూరు పట్టణం, తాళ్లపూడి, న్యూస్‌టుడే: విద్యార్థుల ఉన్నత విద్యకు ఇంటర్మీడియట్ వారధిగా నిలుస్తుంది. ఇంటర్ పరీక్షలు శుక్రవారం ప్రారంభమై మార్చి 24వ తేదీ వరకు జరగనున్నాయి. పరీక్షల నిర్వహణకు అధికార యంత్రాంగం ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగేలా చర్యలు చేపట్టారు. కేంద్రాల వద్ద ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూడాలని ఆయా కళాశాలల అధికారులకు సూచనలిచ్చారు. అన్ని కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను అమలు చేసి పటిష్ఠ బందోబస్తు మధ్య పరీక్షలు నిర్వహించనున్నారు. అందుకు అవసరమైన సిబ్బందిని ఇప్పటికే నియమించారు. వైద్య సిబ్బంది కూడా ఆయా కేంద్రాల వద్ద అందుబాటులో ఉండేలా కార్యాచరణ చేపడుతున్నారు. కొవ్వూరు డివిజన్ పరిధిలో కొవ్వూరు, గోపాలపురం, నిడదవోలు నియోజకవర్గాల్లో 15 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. చీఫ్ సూపరింటెండెంట్‌లు 15 మంది, శాఖాపరమైన అధికారులు 15 మంది, ఇన్విజిలేటర్లుగా 350 మందిని నియమించారు.

నియోజకవర్గం	కేంద్రాలు	ఏడాది	
		ప్రథమ	ద్వితీయ
కొవ్వూరు	4	1069	1040
నిడదవోలు	6	3125	2659
గోపాలపురం	5	2103	1966

చూచి రాతకు తావులేకుండా..

డివిజన్‌లోని 15 కేంద్రాల్లో మాల్ ప్రాక్టీస్‌కు తావు లేకుండా ఒక్కో కేంద్రంలో 10 నుంచి 15 వరకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. వాటిని కమిషనర్ కార్యాలయం నుంచి పర్యవేక్షించేలా అనుసంధానం చేశారు. జిల్లా వ్యాప్తంగా మూడు సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు (ఆరుగురు), మూడు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు బృందాలు (9 మంది) ఏర్పాటయ్యాయి. ప్రతి కేంద్రాన్ని ఈ బృందాలు తనిఖీ చేయనున్నాయి.

అరగంట ముందే కేంద్రాలకు..

విద్యార్థులంతా అరగంట ముందే నిర్దేశించిన కేంద్రాలకు చేరుకోవాలి. దీంతో ఎటువంటి ఒత్తిడి లేకుండా పరీక్ష రాసేందుకు వీలుంటుంది. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష రాయాల్సి ఉంది. 9 గంటల తర్వాత ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతి ఉండదు. విషయాన్ని విద్యార్థులు, తల్లితండ్రులు గమనించాలి. ● హాల్ టికెట్లు, పరీక్షా కేంద్రాల సమాచారం, ఇతర అంశాల్లో ఎలాంటి సమస్యలు, సందేహాలు ఉన్నా ప్రత్యేక కంట్రోల్ రూం నెం.0883 2473430ను సంప్రదించాలి.

- ఐ.శారద, విద్యా మండలి ప్రాంతీయ తనిఖీ అధికారి (ఆర్ఐవో)

సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వెంకటరాజు

నల్లజర్ల, న్యూస్‌టుడే: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు అన్నారు. పోతవరంలోని కొత్తపేట చంద్రన్న కాలనీలో ఏర్పాటు చేయనున్న విలేజ్ హెల్త్ క్లినిక్, తాగునీటి ట్యాంకుకు ఆదివారం ఆయన భూమి పూజ చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. గ్రామంలో మరో చోట జల్‌జీవన్ మిషన్ ద్వారా గ్రామీణ ప్రజలకు శాశ్వతంగా స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు రూ.35 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన తాగునీటి ట్యాంక్, కుళాయిలను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇంటింటికీ సురక్షిత తాగు నీరు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. తెదేపా మండలశాఖ అధ్యక్షుడు తాతిన సత్యనారాయణ, ఏఎంసీ ఛైర్మన్ యద్దనపూడి బ్రహ్మరాజు, ఏలేటి వీర వెంకట సత్యనారాయణ, పసుమర్తి రతీష్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త సర్వీసుల కల్పనపై శ్రద్ధ

నూతన బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: ప్రయాణికుల అవసరాల నేపథ్యంలో కొవ్వూరు డిపోనకు కొత్త సర్వీసులు తెచ్చే దిశగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు డిపో నుంచి తాళ్లపూడి, పోలవరం మీదుగా హైదరాబాదు (బీహెచ్ఈఎల్)కు వెళ్లే నూతన సర్వీసును ఛైర్‌పర్సన్ బావన రత్నకుమారితో కలిసి ఆదివారం ఆయన ప్రారంభించారు. జెండా ఊపి బస్సులో వెళ్లి ప్రయాణికులతో ముచ్చటించారు. ఆయన మాట్లాడుతూ కొవ్వూరు డిపో పరిధిలో సామర్థ్యం సరిగా లేని బస్సుల స్థానంలో కొత్తవి అందుబాటులోకి తీసుకొచ్చే అంశాన్ని రవాణాశాఖ మంత్రితో చర్చిస్తున్నామన్నారు. డిపో నుంచి పోలవరం మీదుగా హైదరాబాదు వెళ్లే సర్వీసు ఇప్పటికే ఉన్నా ప్రయాణికుల ఆదరణ బాగున్న తరుణంలో మరో బస్సును ప్రారంభించామన్నారు. తాళ్లపూడి మీదుగా జంగారెడ్డిగూడెంకు బస్సు నడపాలని ప్రజా విజ్ఞప్తి మేరకు త్వరలో ఆ సర్వీసు అందుబాటులోకి తెచ్చేందుకు శ్రద్ధ చూపుతున్నామన్నారు. డీటీఎం వైఎస్ఎన్ మూర్తి, డిపో మేనేజర్ నాయక్, మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు పాల్గొన్నారు.

పేదలకు కార్పొరేట్ వైద్యం

కొవ్వూరు పట్టణం: పేదలకు కార్పొరేట్ వైద్య సేవలు అందించేందుకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు పట్టణం, గ్రామీణం, తాళ్లపూడి మండలాలకు చెందిన 22 మంది సీఎం సహాయ నిధి లబ్ధిదారులకు రూ.16.60 లక్షలు విలువైన చెక్కులను తెదేపా కార్యాలయంలో అందజేశారు. ఆరుగురికి అత్యవసర వైద్య సేవలకు రూ.12.47 లక్షలు విలువైన ఎల్ఓసీ మంజూరు పత్రాలు ఇచ్చారు. ద్విసభ్య కమిటీ సభ్యుడు కంఠమణి రామకృష్ణ, ఎంపీపీ కాకర్ల సత్యనారాయణ, తెదేపా పక్ష నాయకుడు సూరపనేని చిన్ని, మద్దిపాటి సత్యనారాయణ, నాయుడు వీర్రాజు, బొల్లిన నాగేంద్ర, మనెల్లి పాల్గొన్నారు.

తీవ్ర గాలులు.. భారీ వర్షం

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: ఉదయం నుంచి ఎండతో అల్లాడిన ప్రజానీకం సాయంత్రం వాతావరణం చల్లబడటంతో ఉపశమనం పొందారు. ఆదివారం సాయంత్రం 5 గంటల నుంచి ఆకాశం మేఘావృతమై చల్లటి గాలులు ఆరంభమయ్యాయి. 6.15 గంటల నుంచి గాలుల తీవ్రత పెరిగి ఒక్కసారిగా వర్షం పడింది. సుమారు గంట పాటు ఏకధాటిగా వర్షం కురిసింది. కొవ్వూరు పట్టణం, గ్రామీణంలో ఎక్కడా అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోలేదు. ఆదివారం కూరగాయల సంత కావడంతో దుకాణదారులు, ప్రజలు వర్షానికి పరుగులు తీశారు. గాలులతో రోడ్‌కం రైలు వంతెన, రహదారులపై ఉన్న ఇసుక, మట్టి లేచి రాకపోకలకు అవాంతరాలు ఏర్పడ్డాయి.

గోపాలపురం రహదారిలో నేలకొరిగిన విద్యుత్తు స్తంభం

దేవరపల్లి, గోపాలపురం, తాళ్లపూడి, ఉండ్రాజవరం: గోపాలపురం నియోజకవర్గం మెట్ట ప్రాంతం కావడంతో పొగాకు సాగు ఎక్కువగా ఉంటుంది. ప్రస్తుతం పొగాకు క్యూరింగ్ సమయమని.. వర్షాలు కురిస్తే నష్టపోతామని రైతులు వాపోతున్నారు. ● తాళ్లపూడి మండలంలో విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలిగింది. ● ఉండ్రాజవరం మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో అరటి చెట్లు నేలకూలాయి.

మురుగుకాలువ శుభ్రం

స్పందనకు వందనం

మండలంలోని మలకపల్లిలోని ఎస్సీ కాలనీ ఏడోవార్డులో మురుగు కాలువ వ్యర్థాలతో నిండిపోయి స్థానికులు ఇబ్బంది పడుతుండడంతో ఈ సమస్యను సర్పంచి రాపాక రాజేశ్వరి, ఇన్‌ఛార్జి పంచాయతీ కార్యదర్శి కామేశ్వరి దృష్టికి 'న్యూస్‌టుడే' తీసుకువెళ్లగా వారు స్పందించారు. కూలీలతో మురుగు కాలువను బాగు చేయించారు.

- న్యూస్‌టుడే, తాళ్లపూడి

మర్యాదపూర్వక కలయిక

కృష్ణయ్యను సత్కరించిన జిల్లా బీసీ సంఘ అధ్యక్షుడు గోపి

నిడదవోలు, న్యూస్‌టుడే: జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్యను జిల్లా బీసీ సంఘ అధ్యక్షుడు గంగుల గోపియాదవ్ ఆదివారం హైదరాబాద్ బషీరాబాగ్ ప్రెస్‌క్లబ్‌లో మర్యాదపూర్వకంగా కలుసుకొని సత్కరించారు. బీసీ సంఘాల అభివృద్ధికి అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని కృష్ణయ్య వారికి సూచించారు.

రైతులు సాంకేతిక దిశగా సాగాలి

ప్రధాని ప్రసంగాన్ని వీక్షిస్తున్న భాజపా నాయకులు

ఉండ్రాజవరం, న్యూస్‌టుడే: రైతులు సాంకేతిక సాగు దిశగా ముందుకు సాగాలని ప్రధాని మోదీ సూచించారని భాజపా నాయకులు తెలిపారు. ఉండ్రాజవరంలో ఆదివారం వీరు సమావేశమై మన్ కీ బాత్ కార్యక్రమంలో ప్రధాని మోదీ దేశ యువతకు, కార్మికులకు ఇచ్చిన సందేశాన్ని టీవీ ద్వారా వీక్షించారు. భాజపా రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు బూరుగుపల్లి వెంకటేశ్వర్లు, కిసాన్ మోర్చా జిల్లా సంయుక్త కార్యదర్శి అక్కిన గోపాలకృష్ణమూర్తి, ఆకెళ్ల శ్రీనివాసరావు, కరుటూరి రామకృష్ణ, షర్మిల, శ్యామల పాల్గొన్నారు.

వేతన సవరణకు కమిటీ నియమించాలి

ఉద్యోగోన్నతి పొందిన వారిని సన్మానిస్తున్న సంఘ నాయకులు

కొవ్వూరు పట్టణం: వేతన సవరణకు కమిటీని నియమించాలని.. అంతవరకు 30 శాతం మధ్యంతర భృతినైనా చెల్లించాలని పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం (సమిశ్రగూడెం తాలూకా) అధ్యక్షుడు గొన్నూరి శ్రీధర్‌రాజు అన్నారు. సంఘం రెండవ కమిటీ సమావేశాన్ని కొవ్వూరు మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలు విడుదల చేయాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్కా గోపాలకృష్ణ సంఘ పురోభివృద్ధి, భవిష్యత్తు కార్యాచరణపై మాట్లాడారు. సమావేశానంతరం డిప్యూటీ ఎంపీడీవోగా ఉద్యోగోన్నతి పొందిన బొడ్డు అమ్మిరాజు వరప్రసాద్, కొవ్వూరు ఎంపీడీవో కార్యాలయ ఏఓగా వచ్చిన వల్లపని సత్యనారాయణచౌదరి, పంచాయతీరాజ్ సీనియర్ అసిస్టెంట్ ఎ.సునీల్‌కుమార్‌లను కమిటీ ప్రతినిధులు సన్మానించారు. కార్యక్రమంలో కొవ్వూరు, చాగల్లు, సమిశ్రగూడెం పరిధిలోని సంఘ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆరోగ్యకర జీవన శైలి అలవర్చుకోవాలి

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: ఆరోగ్యకర జీవన శైలిని అలవర్చుకొని.. సామాజిక అనుబంధాలను పెంపొందించుకోవాలని ఛైర్‌పర్సన్ బావన రత్నకుమారి అన్నారు. పురపాలక సంఘం ఆధ్వర్యంలో హ్యాపీ సండే (ఆనంద ఆదివారం) కార్యక్రమాన్ని పట్టణంలోని పీఎంఎంఎం ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. విద్యార్థులు, ఉద్యోగులు వ్యాయామాలు, యోగాసనాలు, పలు రకాల ఆటలు ఆడారు. రత్నకుమారి మాట్లాడుతూ పట్టణాల్లో ఆర్థిక కార్యకలాపాలు, మౌలిక సదుపాయాల కల్పనతో పాటు అందరిలో ఆనందం వెల్లివిరిసేలా ప్రతి నెలా 2, 4వ ఆదివారాల్లో హ్యాపీ సండే ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసన్, మేనేజర్ భరత్, ఇన్‌ఛార్జి పారిశుద్ధ్య అధికారి రవికుమార్, అన్ని విభాగాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పాల్గొన్న విద్యార్థులు, పురపాలక, సచివాలయ సిబ్బంది

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

కార్డన్ సెర్చ్‌లో 5 ద్విచక్ర వాహనాల సీజ్

ఇందిరమ్మ కాలనీలో వివరాలు సేకరిస్తున్న డీఎస్పీ జి.దేవకుమార్, సిబ్బంది

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే : శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని కొవ్వూరు డీఎస్పీ జి.దేవకుమార్ అన్నారు. జిల్లా ఎస్పీ మార్గదర్శకాల మేరకు కొవ్వూరు పట్టణ పరిధి ఇందిరమ్మ కాలనీలో కార్డన్ సెర్చ్ (అష్టదిగ్బంధనం)ను ఆదివారం నిర్వహించారు. పట్టణ సీఐ పి.విశ్వం ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ఉదయం నందమూరు రోడ్డులోని ప్రభుత్వ కాలనీలో ఇంటింటికి వెళ్లి తనిఖీలు చేపట్టారు. పలువురి వేలిముద్రలు సేకరించారు. దస్త్రాలు లేని అయిదు ద్విచక్ర వాహనాలను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. గుర్తుతెలియని వ్యక్తుల సంచారం, గంజాయి వాడకం, బెట్టింగ్‌ల నిర్వహణపై ఆరా తీశారు. సీఐ మాట్లాడుతూ ప్రత్యేక నిఘా ద్వారా కొన్ని అంశాలు సేకరిస్తున్నామని, క్షేత్ర స్థాయిలో ఆయా ప్రాంతాలను పరిశీలించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్సై అలెగ్జాండర్, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రద్ధాంజలి

డా॥ అందే వెంకట రామ సత్య తాతారావు గారు
అమ్మ హాస్పిటల్, నిడదవోలు

మంచి మనిషి, సేవాతత్పరులు, ప్రముఖ వైద్యులు అయిన
డా॥ అందే వెంకట రామ సత్య తాతారావు గారి
అకాల మరణానికి చింతిస్తూ... వారి పవిత్రాత్మకు శాంతి
చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ.. వారి కుటుంబసభ్యులకు
మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ...

DOCTORS - IMA
NIDADAVOLE

తలకు బలమైన గాయమై వ్యక్తి మృతి

నల్లజర్ల, న్యూస్‌టుడే: మూర్ఛ వచ్చి సిమెంటు రోడ్డుపై పడిపోవడంతో తలకు బలమైన గాయమై వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని ముసుళ్లకుంట గ్రామంలో ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఏలూరు జిల్లా నూజివీడు మండలం శోభనాపురం గ్రామానికి చెందిన పెద్దబోయిన గంగరాజు (44) గొర్రెలు కొనుగోలు చేసేందుకు ముసుళ్లకుంటకు వచ్చారు. కొనుగోలు చేస్తున్న క్రమంలో నడుచుకుంటూ ఓ ఇంటికి వెళ్తుండగా.. సిమెంట్ రోడ్డుపై పడిపోయారు. దీంతో తలకు బలమైన గాయం కావడంతో తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు నల్లజర్ల ఎస్సై ఆంజనేయబాబు తెలిపారు. మృతుడి కుమారుడు వెంకట కిశోర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

మూగజీవాల దాహార్తి తీర్చేలా తొట్టెల ఏర్పాటు

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: మూగజీవాల, పక్షుల దాహార్తిని తీర్చేందుకు పట్టణానికి చెందిన అనపర్తి గోపాలకృష్ణ ముందుకొచ్చారు. మూడు చోట్ల పశువులకు నీటి తొట్టెలు, పక్షులు, ఇతర జీవులకు బియ్యం, రాగులు, సజ్జలు, పండ్లు, కూరగాయలు, ఇతర ఆహారాన్ని పెడుతున్నారు. కొవ్వూరమ్మ ఆలయం ఎదురుగా ఓ దుకాణం వద్ద ఏర్పాటు చేసిన నీటి తొట్టెలో ఆదివారం మూడు వానరాలు దాహార్తిని తీర్చుకుని సేద తీరడం కనిపించింది.

కొవ్వూరమ్మ దేవాలయం సమీపంలో ఏర్పాటు చేసిన తొట్టెలో నీరు తాగుతున్న వానరం

వైభవంగా అమ్మవారి జాతర

మండలంలోని వేలివెన్నులో కొలువైన ధనలక్ష్మి అమ్మవారి జాతరను ఆదివారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి నైవేద్యాలు సమర్పించారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. అన్న సమారాధన జరిగింది. నందమూరు, నిడదవోలు, శెట్టిపేట, వేలివెన్ను, కాల్దరి ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

- న్యూస్‌టుడే, ఉండ్రాజవరం

ఘనంగా సూర్యనారాయణమూర్తి కల్యాణం

తాళ్లపూడి, న్యూస్‌టుడే: తాళ్లపూడి మండలంలోని ప్రక్కిలంక శివాలయంలో మాఘమాసం నెలరోజుల ప్రత్యేక పూజలు ఆదివారంతో ముగిశాయి. ఉషాఛాయ పద్మిని సమేత సూర్యనారాయణమూర్తి శాంతి కల్యాణ మహోత్సవాన్ని అర్చకుడు విశ్వనాథశర్మ ఆధ్వర్యంలో వేద పండితులు వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో సౌరహోమం నిర్వహించి, ఉత్సవమూర్తులను రథంపై ఊరేగించారు. భక్తులు కల్యాణాన్ని తిలకించారు. అన్నదానం జరిగింది. శశిశేఖరమిత్ర మండలి సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కల్యాణ క్రతువు నిర్వహిస్తున్న వేదపండితులు

కోటసత్తెమ్మకు పూజలు

నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెంలోని కోట సత్తెమ్మ అమ్మవారిని ఆదివారం ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. దర్శనాల, ప్రసాద విక్రయాల ద్వారా, అన్నదాన ట్రస్ట్‌కు, ఇతర టిక్కెట్లు అమ్మకాలతో రూ.1,51,167ల ఆదాయం వచ్చింది. కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్ వి.హరిసూర్యప్రకాశ్, వంశపారంపర్య ధర్మకర్త దేవులపల్లి రవిశంకర్, ఆలయ ప్రధాన అర్చకుడు ఎస్వీకేపీ శర్మ పాల్గొన్నారు.

- న్యూస్‌టుడే, నిడదవోలు

చోడేశ్వరునికి లక్షబిల్వార్చన

మహాన్యాస పూర్వక అభిషేకం చేస్తున్న రుత్వికులు

కొవ్వూరు పట్టణం: పాత ఊరు చోడేశ్వర స్వామి ఆలయంలో లక్ష బిల్వార్చన, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రుత్వికులు గణపతి పూజ, పుణ్యాహవచన, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష పత్రి పూజ చేశారు. సాయంత్రం రుద్రహోమం, అమ్మవార్కి సహస్ర కుంకుమార్చన, వేదస్వస్తి క్రతువులను జరిపించారు.

గోలింగేశ్వరస్వామికి...

గోలింగేశ్వరస్వామికి నిర్వహిస్తున్న అభిషేకాలు

నిడదవోలు: పట్టణంలోని పురాతన గోలింగేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం లక్షపత్రిపూజను ఘనంగా నిర్వహించారు. మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, అమ్మవారికి లక్షపత్రిపూజలు నిర్వహించారు.

శ్రద్ధాంజలి

చెదరని చిరునవ్వుతో
మమ్ము ఆప్యాయంగాచూసుకునే
మా డాక్టర్ గారు ఇకలేరు అన్న
చేదునిజాన్ని నమ్మలేకున్నాము.వారి
పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని
భగవంతుని ప్రార్థిస్తూ..

డా॥ AVRS తాతారావు(బాబ్జి)గారు
అమ్మహాస్పటల్, నిడదవోలు

అమ్మ హాస్పటల్ స్టాఫ్
నిడదవోలు

అమృతమూర్తికి అశ్రునివాళి

ఆప్యాయతానురాగాలతో,
చిరునవ్వుతో పలకరించే
మా అన్నయ్య మరణం
మాకు తీరని లోటు..
నీ పవిత్రాత్మకు శాంతి
కలగాలని భగవంతుని
ప్రార్థిస్తూ..

కీ॥శే॥ కొఠారు వీర వెంకటరావు (అబ్బులు) గారు, జంగారెడ్డిగూడెం

చెల్లెలు: కొడవలి శేషారత్నం
బావ: వెంకట్రావు
మేనల్లుడు: గౌతమి మునేంద్ర - కృప
మేనకోడలు: నున్న పద్మ - కృష్ణకాంత్
మనుమలు, మనుమరాండ్రు: శివతేజ, లహరి, సంజన, ఐజి

పెదకార్యం: ది. 25-2-2026 బుధవారం జంగారెడ్డిగూడెం పేరంపేట రోడ్‌లో వారి స్వగృహము నందు జరుపబడును.

ALL THE BEST

ఇంటర్మీడియట్ పరీక్షలు రాస్తున్న
గ్రేఫ్రేయర్స్ జూనియర్ కాలేజ్
విద్యార్థినీ, విద్యార్థులు మంచి ఫలితాలు
సాధించి అందరికి ఆదర్శప్రాయంగా నిలవాలని
కోరుకుంటూ... ఆల్ ది బెస్ట్...



గ్రేఫ్రేయర్స్ జూనియర్ & డిగ్రీ కళాశాల
మెయిన్‌రోడ్, RCM చర్చ్ వద్ద, దొండపూడి ఫోన్: 08812-55322, 94947 75101

నిందితులపై చర్యలు తీసుకోవాలి

నిడదవోలు: నాగర్‌కర్నూల్ జిల్లా కొమ్మెర గ్రామంలో నిర్వహించిన జాతరలో రెండు నెలల పసికందును పాదాలతో తొక్కి.. చిన్నారి మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్ నాయకుడు జువ్వల రాంబాబు ఆధ్వర్యంలో ఆదివారం నిడదవోలులో నిరసన చేశారు.

మహిళ అదృశ్యంపై కేసు

చాగల్లు: చాగల్లు మండలానికి చెందిన ఓ మహిళ తన కుమారుడితో అదృశ్యమైనట్లు ఆమె కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె.నరేంద్ర తెలిపారు. ఈ నెల 20వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో పోలీసులను ఆశ్రయించినట్లు పేర్కొన్నారు.

(c) eenadu

మండపేట

•మండపేట •అనపర్తి

గోగులమ్మ అమ్మవారి తిరునాళ్లు

గోగులమ్మ అమ్మవారు

బిక్కవోలు, న్యూస్‌టుడే: కొమరిపాలెం శివారులోని గోగులమ్మ అమ్మవారి తిరునాళ్లు ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి తిరునాళ్లు, ఆలయ వార్షికోత్సవం రెండూ కలిసి రావడంతో గ్రామస్థులు తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో గ్రామస్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్న సమారాధన ఏర్పాటుచేశారు.

నగరంలో కలకలం.. కోరుకొండలో విచారణ

కోరుకొండ : ఆహార పదార్థాల్లో కల్తీ జరిగి రాజమహేంద్రవరంలో పలువురు ఆసుపత్రి పాలయ్యారు. ఈ ఘటనతో పోలీసు, వైద్య శాఖలు అప్రమత్తమయ్యాయి. ఈ నేపథ్యంలో నరసాపురం గ్రామానికి చెందిన పాలవ్యాపారిని అదుపులోకి తీసుకున్నారు. ఆదివారం రాత్రి కోరుకొండ సర్కిల్ కార్యాలయంలో పోలీసు, వైద్యశాఖకు చెందిన కొంతమంది అధికారులు విచారించారు. డీఎస్పీ వై. శ్రీకాంత్, సీఐ ఎస్వీవీఎస్ మూర్తి, ఎస్సై శ్రీనివాస్ పలువురు వైద్య సిబ్బంది విచారణలో పాల్గొన్నారు. డీఎస్పీ శ్రీకాంత్ మాట్లాడుతూ విచారిస్తున్నామని, వైద్య పరీక్షలు తర్వాతే నిర్ధారణకు వస్తామన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ. 10 - మ. 1 మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు
మండపేట: 80085 74183 ద్వారపూడి: 98490 93850
అనపర్తి: 95333 66637 అంగర: 97044 16418
రాయవరం: 80085 74185

మురుగు పారుదలకు చర్యలు

సమస్య: మండపేట మండలం ఏడిద సీతానగరం ఆవలవారివీధి డ్రైనేజీలో వ్యర్థాలు పేరుకుపోయి మురుగు పారడంలేదు. దుర్వాసనతో పాటు దోమలు వ్యాపిస్తున్నాయి. - డి.సుబ్రహ్మణ్యం, ఏడిద సీతానగరం

పరిష్కారం: సమస్యను పంచాయతీ కార్యదర్శి స్వామిరెడ్డికి తెలియజేయగా వెంటనే సిబ్బందిని పంపించి వ్యర్థాలు తొలగించి పనులు చేయించారు. - న్యూస్‌టుడే, ద్వారపూడి

పరీక్షల సమయం.. అప్రమత్తతే ఆయుధం

రాయవరం, న్యూస్‌టుడే: విద్యార్థుల జీవితంలో పరీక్షల సమయం అత్యంత కీలకమైన మెట్టు. ఒత్తిడిని అధిగమిస్తూ, క్రమశిక్షణతో చదివితే మంచి ఫలితాలు సాధించడం సులభం. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమన్వయంతో విద్యార్థులను ప్రోత్సహించడం ద్వారా ఉత్తీర్ణతను మెరుగుపరుచవచ్చు. విద్యార్థి దశలో కీలకమైన పదో తరగతి, ఇంటర్మీడియట్ ఎంతో కీలకం. ఈనెల 23 నుంచి మార్చి 24 వరకు ఇంటర్, మార్చి 16 నుంచి ఏప్రిల్ ఒకటో తేదీ వరకు పదో తరగతి పరీక్షలు జరగనున్నాయి. పరీక్షల సమయం సమీపిస్తున్న కొద్దీ విద్యార్థుల్లో ఆందోళన పెరుగుతోంది. ఈ క్రమంలో మంచి మార్కులు సాధించాలంటే చదువుతో పాటు ఆరోగ్యం, నిద్ర, పౌష్టికాహారం అవసరమని నిపుణులు చెబుతున్నారు. ప్రశాంత వాతావరణంలో ప్రణాళికాబద్ధంగా ఏకాగ్రతతో చదివితే పరీక్షలు నిర్భయంగా రాయవచ్చని చెబుతున్నారు. మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం, అనపర్తి, బిక్కవోలు, రంగంపేట మండలాల్లో మొత్తం జడ్పీ ప్రభుత్వ పాఠశాలలు 54 ఉండగా ఆ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులు 3,222 మంది ఉన్నారు. రెండు నియోజకవర్గాల్లో ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో 2,843 మంది ఇంటర్ విద్యార్థులు ఉన్నారు.

రాయవరంలో అదనపు తరగతుల్లో పదో తరగతి విద్యార్థులు

మండలం	పాఠశాలలు	విద్యార్థులు
మండపేట	12	844
రాయవరం	8	365
కపిలేశ్వరపురం	8	373
అనపర్తి	8	572
బిక్కవోలు	8	510
రంగంపేట	10	558

వీటిని పాటిస్తే మేలు..

పరీక్షల సమయంలో నిద్రకు దూరమై చదవకుండా మధ్యలో కొంత సమయం విరామం ఇవ్వాలి. దీనివల్ల చదివిన అంశాలు చక్కగా గుర్తుండడంతో పాటు మంచి మార్కులు సాధించవచ్చు. ఏకాగ్రత దెబ్బతినకుండా పాఠ్యాంశాలపై దృష్టిసారించడంతో పాటు ప్రతి అంశాన్ని ఆకళింపు చేసుకుని చదివితే జ్ఞాపకం ఉంటుంది. పునశ్చరణ ద్వారా మరింత పట్టుసాధించే అవకాశం ఉంటుంది. చిరుతిళ్లు తినకుండా, చరవాణి, టీవీలకు దూరంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి..

విద్యార్థులు ఆరోగ్యంపై శ్రద్ధవహిస్తూ రోజుకు కనీసం ఏడు, ఎనిమిది గంటలు నిద్రపోయేలా చూసుకోవాలి. త్వరగా జీర్ణమయ్యే పోషక విలువలున్న ఆహారం, పండ్లరసాలు తీసుకోవడం ద్వారా జ్ఞాపక శక్తి పెరుగుతుంది. జంక్ ఫుడ్స్, శీతల పానీయాలకు దూరంగా ఉండాలి. చిన్నపాటి శారీరక వ్యాయామం, యోగా ద్వారా మానసికంగా దృఢంగా ఉండాలి. ఒత్తిడికి గురవకుండా నిర్భయంగా పరీక్షలు రాయాలి. పరీక్షల వేళల్లో పిల్లల చదువు, ఆరోగ్యంపై తల్లిదండ్రులు ప్రత్యేకంగా దృష్టి సారించాలి.
- డా.పద్మపర్తి అనిరుద్, పీహెచ్‌సీ వైద్యాధికారి, రాయవరం

25న చలో విజయవాడ

రంగంపేట: ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులకు ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చాలని కోరుతూ ఈనెల 25న చలో విజయవాడ ఆందోళన చేపట్టినట్టు ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.సి.జాకబ్ తెలిపారు. హామీల అమలు, డిమాండ్ల సాధనకు దశలవారీగా నిరసనలు చేపట్టినట్టు ఆయన చెప్పారు.

రజక చైతన్య సేవా సంఘం అధ్యక్షుడిగా సాంబమూర్తి

పెదపూడి: పెదపూడి మండలం రజక చైతన్య సేవా సంఘం అధ్యక్షుడిగా సాంబమూర్తి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని అనపర్తి నియోజకవర్గం అధ్యక్షుడు మురమళ్ల వెంకటరమణ ఆదివారం తెలిపారు. గండ్రేగు గ్రామంలో నిర్వహించిన సమావేశంలో దేవగుప్తపు సాంబమూర్తిని అధ్యక్షుడిగా, ములంపాక వీరబాబు ఉపాధ్యక్షుడిగా, దంగేటి మహేష్ కార్యదర్శిగా, తెల్లాకుల సుబ్రహ్మణ్యం సహాయ కార్యదర్శిగా, కోశాధికారిగా పచ్చిపాల వీరభద్రం ఎన్నికయ్యారు.

పార్టీలో చేరిన కార్యకర్తలతో ఎమ్మెల్యే జోగేశ్వరరావు

తెదేపాలో చేరిన వైకాపా కార్యకర్తలు

మండపేట, న్యూస్‌టుడే: మండపేట మండలం ఇప్పనపాడు గ్రామానికి చెందిన పలువురు వైకాపా కార్యకర్తలు ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు సమక్షంలో ఆదివారం తెదేపాలో చేరారు. గ్రామానికి చెందిన తెదేపా నాయకుడు చోడె పెదకాపు, రిమ్మలపూడి యామిని శ్రీనివాస్, తదితరుల ఆధ్వర్యంలో పాతాల రాజు, పల్లి వెంకన్న, ఇళ్ల నాగేశ్వరరావు తదితరులు తెదేపాలో చేరారు. పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వారికి పార్టీ కండువాలు వేసి ఎమ్మెల్యే సాదరంగా ఆహ్వానించారు. కూటమి ప్రభుత్వంలో రాష్ట్రం అభివృద్ధి చెందుతోందని, నియోజకవర్గంలో పార్టీ చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో తెదేపా పట్టణ అధ్యక్షుడు మత్సా నాగు, మండల మాజీ అధ్యక్షుడు యరగతపు బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

ఆ ఎమ్మెల్సీలను బర్తరఫ్ చేయాలి..: ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట, న్యూస్‌టుడే: కలియుగ ప్రత్యక్ష దైవం వేంకటేశ్వరస్వామి చిత్రపటాలు పెద్దల సభలో ప్రదర్శిస్తూ హిందువుల మనోభావాలకు భంగం కలిగేలా ప్రవర్తించిన వైకాపా ఎమ్మెల్సీలను సభ నుంచి బర్తరఫ్ చేయాలని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్సీలు చెప్పులు వేసుకుని ఏదో వస్తువు పట్టుకున్నట్లు వెంకటేశ్వరస్వామిని అవమానించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైకాపా సభ్యులు చేసిన పనికి జగన్ లెంపలు వాయించుకుని క్షమాపణ చెప్పాలని కోరారు. పట్టణ తెదేపా అధ్యక్షుడు మత్సా నాగు, మార్కెట్ కమిటీ ఛైర్మన్ చింతపల్లి రామకృష్ణ, తెదేపా మండల మాజీ అధ్యక్షుడు మరగతపు బాబ్జి, టీఎన్‌టీయూసీ రాష్ట్ర నాయకుడు వాదా ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల్లో శ్రీవారి రథోత్సవం

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరం గౌతమఘాట్‌లోని శ్రీరంగధామంలో శ్రీభూనీలా సమేత వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం ఉదయం స్వామివారికి తిరుమంజనం, చక్రస్నానం జరిపించి విశేష పూజలు నిర్వహించారు. పట్టువస్త్రాలతో అలంకరించిన దేవతా మూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన రథంలో ఉంచి ఉత్సవం జరిపించారు. ఆలయ స్థానాచార్యులు పరాసర రఘునాథభట్టర్ స్వామివారి నిర్వహణలో జరిగిన కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

శ్రీరంగపట్నంలో రుడా ఛైర్మన్ పూజలు

రథోత్సవంలో పాల్గొన్న కమిటీ నిర్వాహకులు

కోరుకొండ : మండలంలోని శ్రీరంగపట్నంలో పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామివారి రథోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా గ్రామంలోని ప్రధాన వీధుల్లో కనులపండువగా జరిగింది. రుడా ఛైర్మన్ బీవీఆర్ చౌదరి ముఖ్యఅతిథిగా పూజలు చేశారు. తనకాల నాగేశ్వరరావు, ఆలయ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష కిట్ల పంపిణీ

మండపేట (గ్రామీణం): విద్యార్థులు పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి మంచి భవిష్యత్తు అందుకోవాలని తాపేశ్వరం జీసస్ క్రైస్ట్ గ్లోరీ చర్చి బిషప్ డేనియల్ పాల్ ఆకాంక్షించారు. ఆదివారం 250 మంది విద్యార్థులకు ఆయన పెన్నులు, పరీక్ష అట్టలు అందించారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష కిట్లు అందిస్తున్న బిషప్ డేనియల్ పాల్

మన్‌కీ బాత్‌లో విజేతలకు బహుమతులు

విజేతలకు బహుమతులు అందిస్తున్న భాజపా నేతలు

రాయవరం, న్యూస్‌టుడే: ప్రధాని నరేంద్ర మోదీ 'మన్ కీ బాత్' కార్యక్రమాన్ని రాయవరం శ్రీరామయ్య జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించారు. మన్‌కీ బాత్ జిల్లా సమన్వకర్త కె.శ్రీదేవి ఆధ్వర్యంలో ముందుగా వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందించారు. దేశవ్యాప్తంగా ప్రధాని మోదీ నిర్వహించిన ఈ కార్యక్రమ దృశ్య, శ్రవణ ప్రసార కార్యక్రమాన్ని విద్యార్థులు వీక్షించారు. భాజపా నాయకులు కోన సత్యనారాయణ, రామకృష్ణారెడ్డి, లొల్ల సర్పంచి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చాట్రాతి జానకీరాంబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాల ప్రహరీ నిర్మాణం

అనపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: అనపర్తి ఆంజనేయనగర్, అనపర్తి కొత్తూరువాసుల ఇక్కట్లు తీర్చుతూ 20 అడుగుల రోడ్డుకు ఖాళీ వదులుతూ జడ్పీ ఉన్నత పాఠశాల ప్రహరీ నిర్మాణానికి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి శ్రీకారం చుట్టారు. ఆదివారం పంచాయతీ రాజ్ డీఈఈ అచ్యుతరామారెడ్డి పాఠశాల మైదానాన్ని పరిశీలించారు. పాఠశాలకు తూర్పు, ఉత్తరం వైపు రక్షణగోడ నిర్మించేందుకు ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి రూ.35 లక్షలు మంజూరు చేశారని, త్వరలో పనులు చేపడతామన్నారు. జడ్పీ ఉన్నత పాఠశాల స్థలం జీబీఆర్ విద్యా సంస్థల ఆక్రమణలో ఉండడంతో ఇటీవలే రెవెన్యూ అధికారులు తొలగించారు. ఉన్నత పాఠశాలకు సంబంధించిన స్థలంలో ప్రహరీ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. వైకాపా హయాంలోనే ఆక్రమణలకు గురవుతోందని గుర్తించి రక్షణ గోడ నిర్మించారు. దీనివల్ల ఆంజనేయనగర్ వాసుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. ఈ విషయాన్ని గుర్తించి ఎన్నికల ముందు కాలనీవాసుల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా ప్రత్యామ్నాయ మార్గం కల్పిస్తామని నల్లమిల్లి రామకృష్ణారెడ్డి హామీ ఇచ్చారు. తాజాగా మార్గం ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. అనపర్తి కొత్తూరు, ఆంజనేయనగర్ వాసుల రాకపోకలకు వీలుగా 20 అడుగుల రోడ్డుకు ఖాళీ వదిలి రెండువైపులా ప్రహరీ నిర్మాణానికి ప్రస్తుతం చర్యలు చేపట్టారు.

పాఠశాల మైదానంలో ప్రహరీ నిర్మాణంపై కూటమి నాయకులు, స్థానికులతో చర్చిస్తున్న డీఈఈ అచ్యుతరామారెడ్డి

అంగరలో ఆదియోగి

కపిలేశ్వరపురం మండలం పడమర ఖండ్రిక ఉయ్యాల జంపాల క్షేత్రంలో కొలువైన అన్నపూర్ణ సమేత శ్రీత్రయంబకేశ్వరస్వామివారి ఆలయ ముఖద్వారాన్ని అంగర నుంచి టేకి ప్రధాన రహదారిలో నిర్మిస్తున్నారు. పడమర ఖండ్రికకు చెందిన ప్రముఖ శిల్ప కళాకారుడు శనివారపు వెంకటేష్ ముఖద్వారంపై 15 అడుగుల ఆదియోగి విగ్రహాన్ని నిర్మిస్తున్నారు. సుమారు నెల రోజుల పాటు శ్రమించి విగ్రహాన్ని నిర్మించినట్లు శిల్పి వెంకటేష్ తెలిపారు. టేకి గ్రామానికి చెందిన మేడిశెట్టి అప్పారావు ఆర్థిక సౌజన్యంతో ముఖద్వారాన్ని నిర్మిస్తున్నారు. - న్యూస్‌టుడే, కపిలేశ్వరపురం

సూర్యనమస్కారాలతో ఆరోగ్యం మెరుగు

పెదపూడి, న్యూస్‌టుడే: రోజూ సూర్యనమస్కారాలు చేయడం ద్వారా ఆరోగ్యం మెరుగవుతుందని ఆదిగురు యోగాపీఠం సద్గురు సచ్చిదానందయోగి అన్నారు. పెదపూడి మండలం జి.మామిడాడ సూర్యనారాయణస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న ప్రత్యేక పూజల్లో ఆదివారం ఆయన పాల్గొన్నారు. భక్తులతో ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం మాట్లాడుతూ సూర్యనమస్కారాలతో ఆరోగ్యం, బలం, వీరత్వం వృద్ధి చెందుతాయన్నారు. కార్యక్రమంలో అర్చకులు రేజేటి వెంకట నరసింహాచార్యులు, యోగా గురువు పి.సాయివెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో మాట్లాడుతున్న సద్గురు సచ్చిదానందయోగి

ఉదయం, సాయంత్రం గందరగోళం

బలభద్రపురం మెయిన్‌రోడ్డులో ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ సమస్యలు తీవ్రంగా మారుతున్నాయి. ఉదయం ఏడు గంటల నుంచి 8.30 వరకు, సాయంత్రం 5 గంటల నుంచి ఏడు గంటల వరకు వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకాలు ఎదురవుతున్నాయి. ఆయా సమయాల్లో గ్రామంలోకి వివిధ ప్రాంతాల నుంచి విద్యా సంస్థల బస్సులు దూసుకొస్తాయి. ఒకేసారి దాదాపు 25 వరకు వాహనాల రాకపోకలతో ట్రాఫిక్ స్తంభిస్తోంది. అసలే ఇరుకురోడ్డు.. ఆపై వాహనాలు ప్రతి చోటా ఆగుతున్నాయి. వాటి వెనుక పలు ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ఇతర వాహనాలు ముందుకు కదలడం లేదు. ఒక్కోసారి బస్సులకు ట్రాక్టర్లు ఎదురొచ్చి ఆగిపోతున్నాయి. వీటిని తప్పించుకుని ముందుకు వెళ్లడం తీవ్ర ఇబ్బందిగా మారుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. - న్యూస్‌టుడే, బిక్కవోలు

అర్తమూరులో దీపోత్సవం

అర్తమూరు గ్రామంలో శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం అయిదో రోజు పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. యజ్ఞాచార్యులు కొండూరి వెంకట రమణాచార్యులు ఆధ్వర్యంలో నిత్య పూజలు జరిపించారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య సుదర్శన హోమం, లక్షతులసీ పూజ, పుష్పార్చన నిర్వహించారు. సాయంత్రం ఆలయ ఆవరణలో స్వామివారి దీపోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో సత్తి బులిస్వామిరెడ్డి, కర్రి బాపిరెడ్డి, ఉద్దగిరి ఆంజనేయులు, వెలగల శివారెడ్డి, కమిటీ సభ్యులు, మాలధారులు పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, మండపేట గ్రామీణం

మహనీయులను స్మరించుకోవాలి

కలెక్టరేట్, న్యూస్‌టుడే: బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా స్వాతంత్ర్య పోరాటంలో తొలిదశలోనే ధైర్యసాహసాలతో పోరాడిన వీరుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి అని.. రెవెన్యూ డివిజనల్ అధికారి ఆర్.కృష్ణనాయక్ కొనియాడారు. ఆదివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆర్డీవో మాట్లాడుతూ దేశభక్తి, త్యాగం, ధైర్యం వంటి గొప్ప విలువలకు ఆయన జీవితం ప్రతీకగా నిలిచిందన్నారు. నేటి తరం ఆయన జీవిత విశేషాలను తెలుసుకుని దేశ స్ఫూర్తిని అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ సంగీత కళాశాల ప్రిన్సిపల్ పి.శ్రీనివాసరావు, కలెక్టరేట్ సిబ్బంది, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నరసింహారెడ్డి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఆర్డీవో, అధికారులు

మాచవరం పోలీస్‌స్టేషన్ వద్ద ఉద్రిక్తత

ఫిర్యాదుపై విచారణకు పాస్టర్‌ని పిలిచిన పోలీసులు

పటమట, న్యూస్‌టుడే: విజయవాడలోని మాచవరం పోలీస్‌స్టేషన్ వద్ద ఆదివారం ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఓ ఫిర్యాదుపై విచారణ నిమిత్తం పోలీసులు పాస్టర్‌కు ఫోన్‌చేసి పిలవడంతో.. అతనితో పాటు చర్చికి వచ్చిన విశ్వాసులు పెద్దసంఖ్యలో స్టేషన్‌కు చేరుకున్నారు. మాచవరం సీఐ వెంకటరమణ వివరాల ప్రకారం.. విజయవాడ గ్రామీణ మండలం ఎనికేపాడులోని ఓ చర్చి పాస్టర్‌గా పనిచేస్తున్న ప్రదీప్‌కుమార్‌పై తూర్పుగోదావరి జిల్లా అనపర్తికి చెందిన కె.హరినారాయణ సీఎంవో కార్యాలయంలో పీజీఆర్‌ఎస్‌కు ఫిర్యాదు చేశారు. ప్రదీప్ విజయవాడ మొగల్రాజపురంలోని ఫ్లాట్ విక్రయిస్తానని చెప్పి విడతల వారీగా రూ.70 లక్షలు తీసుకున్నారని అందులో పేర్కొన్నారు. ఈ అంశాన్ని సీఎంవో కార్యాలయం నుంచి మాచవరం పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. మూడు రోజుల కిందట మాచవరం పోలీసులు ఆయనకు ఫోన్‌చేసి మాట్లాడేందుకు రావాలని పిలవగా.. రెండు రోజులు ఆగి వస్తానని ఆయన చెప్పారు. ఆకస్మాత్తుగా ఆదివారం దాదాపు 150 మందిని వెంటబెట్టుకొని స్టేషన్‌కు వెళ్లారు. పాస్టర్‌ని మాత్రమే పిలిచామని, అరెస్ట్ చేసేందుకు కాదని పోలీసులు చెప్పగా.. విశ్వాసులు వెళ్లిపోయారు. స్టేట్‌మెంట్ తీసుకుని ప్రదీప్‌ని కూడా పంపించారు. ఆయనపై గతంలో స్వాప్ జిమ్ ఘటనతో పాటు పలు కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. భారీ సంఖ్యలో జనాలను స్టేషన్‌కు తీసుకువచ్చి నిరసన తెలిపి శాంతి భద్రతలకు విఘాతం కలిగించినందుకు ఆయనపై తాజాగా కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

తెలుగుకు గర్వకారణం 'పద్యం'

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రామబ్రహ్మం తదితరులు

రాజమహేంద్రవరం సాంస్కృతికం: తెలుగు భాషకు గర్వకారణమైన పద్యానికి ప్రాణం పోస్తున్న కవి రాఘవేంద్రరావు అని కేంద్రీయ విద్యాలయం విశ్రాంత ఆచార్యులు బేతవోలు రామబ్రహ్మం పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం వైజంక్షన్‌లోని ఆనం రోటరీ హాలులో ఎస్.వి.రాఘవేంద్రరావు సహస్ర చంద్ర దర్శన మహోత్సవం, ఆయన రచించిన 12 పుస్తకాల ఆవిష్కరణ సభ జరిగింది. ముఖ్యఅతిథిగా బేతవోలు రామబ్రహ్మం హాజరై మాట్లాడారు. 12 పుస్తకాలు ఒకేసారి ఆవిష్కరించడం రికార్డ్ అన్నారు. విశ్రాంత ఓఎన్‌జీసీ అధికారి పి.విజయ్ కుమార్ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో రాఘవేంద్రరావు దంపతులను సత్కరించారు. మహామహోపాధ్యాయ విశ్వనాథ గోపాలకృష్ణ పాల్గొన్నారు. ఎస్.పి.గంగిరెడ్డి, తాతా సందీప్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఆడుతూ.. పాడుతూ.. ఆనందంగా

మండపేట, న్యూస్‌టుడే: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఆవరణలో హ్యాపీ సండే కార్యక్రమాన్ని ఆదివారం సందడిగా నిర్వహించారు. వివిధ పాఠశాలల విద్యార్థులు ఆడుతూ పాడుతూ సందడి చేశారు. వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు నృత్య ప్రదర్శన, పాటల పోటీలు ఆకట్టుకున్నాయి. మున్సిపల్ డీఈ కె.శ్రీనివాస్ పర్యవేక్షణలో వివిధ పాఠశాలల విద్యార్థులు, మెప్మా టీఎంఎం సుజాత, ఆర్పీలు, మున్సిపల్ సిబ్బంది ఆటపాటలతో సందడిగా గడిపారు.

నృత్య ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులు మెప్మా సిబ్బంది

సమయం లేదు.. రైతన్నా

నెలాఖరులోగా ఈపంట నమోదు

బిక్కవోలు, న్యూస్‌టుడే: ఈపంట నమోదు ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. ఈనెలాఖరులోగా రబీ పంట వివరాల ప్రక్రియ పూర్తిచేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇప్పటికే అనపర్తి నియోజకవర్గంలో 93 శాతం పంట నమోదు పూర్తయింది. సిబ్బంది క్షేత్రస్థాయికి వెళ్లి పంట నమోదు చేస్తున్నారు. గతంలో పంటవేసిన చోటే వివరాలు సేకరించేవారు. ప్రస్తుతం ఖాళీ భూముల వివరాలు కూడా నమోదు చేయాలని ప్రభుత్వం ఆదేశించడంతో నాట్లు పడని భూముల వివరాలను కూడా సేకరిస్తున్నారు. జిల్లాలోనే అనపర్తి సబ్ డివిజన్ ముందంజలో ఉందని అధికారులు చెబుతున్నారు.

ఈపంట నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న ఏవో శామ్యూల్‌జాన్

లాభాలు ఎన్నో..

ఈపంట నమోదు ద్వారా రైతులు చాలా ప్రయోజనాలు పొందుతారు. రుణం కావాలన్నా, పండిన ధాన్యం విక్రయించాలన్నా, బీమా, ప్రకృతి విపత్తు సమయాల్లో పరిహారం అందాలన్నా తప్పనిసరిగా నమోదు చేయించాలి. పొలంలో ఈ ప్రక్రియ ప్రారంభించినపుడు రైతు చరవాణికి సమాచారం వస్తుంది. అలాగే పూర్తయిన తరవాత కూడా వస్తుంది. చివరిగా ఈకేవైసీ చేయించుకోవాలని చరవాణికి సంక్షిప్త సమాచారం వస్తుంది.

రైతే స్వయంగా చేసుకోవచ్చు..

చరవాణిలో ఏపీఏఐఎంఎస్ యాప్ డౌన్‌లోడ్ చేసుకుని ఆధార్‌కార్డు ద్వారా రైతు లాగిన్ అయి పొలానికి సంబంధించిన సర్వే నంబరు ఆధారంగా స్వయంగా ఈపంట నమోదు చేసుకోవచ్చు. ధ్రువీకరణకు అంశం గ్రామంలోని వ్యవసాయ సహాయ సిబ్బందికి చేరుతుంది. సిబ్బంది ధ్రువీకరించగానే ప్రక్రియ పూర్తవుతుంది. ఇదివరకే వ్యవసాయ సిబ్బంది నమోదు చేసి ఉంటే ఆ వివరాలు యాప్‌లో చూపిస్తాయి.

నెలాఖరులోగా పూర్తి చేయాలి..

పంటల నమోదు కార్యక్రమం ఈనెలాఖరులోగా పూర్తిచేయాలి. ఇప్పటికే అనపర్తి సబ్ డివిజన్ సిబ్బంది ముందంజలో ఉన్నారు. మిగిలిన విస్తీర్ణంలో కూడా పూర్తిచేసి గడువుకు ముందే పూర్తిచేసిన జాబితాలో మనం చేర్చాలి. ఇబ్బందులు ఉన్నా సిబ్బంది వేగంగా చేస్తున్నారు. - కృష్ణ, ఏడీఏ, అనపర్తి

ఆలయ పాలకమండలి అభినందన సభ

అంగర, న్యూస్‌టుడే: కపిలేశ్వరపురం మండలం అంగర గ్రామంలో కొలువైన రుక్మిణీ, సత్యభామా సమేత వేణుగోపాలస్వామి ఆలయ పాలకమండలి సభ్యుల అభినందన సభ ఆదివారం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి తెదేపా జిల్లా ఉపాధ్యక్షుడు వి.సాయికుమార్‌బాబు ముఖ్య అతిథిగా విచ్చేసి స్వామివారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం పాలకమండలి ఛైర్మన్ త్రిపురశెట్టి వెంకటేశ్వరరావు (నాని), సభ్యులు కొంపెల్ల కామేశ్వరరావు, సూరంపూడి మంగాదేవి, సత్యవాడ శ్రీనివాస్, నూకల మంగ, తోరం రాము, పోలినాటి నాగలక్ష్మి, ఇంటి గోగులమ్మ, నిడదవోలు ప్రతాప్‌చౌదరి, పెద్దింటి మురళీకృష్ణమాచార్యులును సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ ఛైర్మన్ రెడ్డి ప్రసాద్, పుత్సల శ్రీనివాస్, అల్లూరి రామకృష్ణచౌదరి, పిల్లా బసవరాజు, సూరంపూడి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



పాలకమండలి సభ్యులను అభినందిస్తున్న కుమార్‌బాబు, రెడ్డి ప్రసాద్ తదితరులు

(c) eenadu

ఈనాడు
ఏలూరు
సోమవారం ఫిబ్రవరి 23, 2026 5

ఆరు రోజులు.. ఆపసోపాలు!

● 42,997 మందికి అందని విశిష్ట సంఖ్య ● నెలాఖరుతో ముగియనున్న గడువు

చేబోలులో వివరాలు నమోదు చేస్తున్న వీఏఏ

ఏలూరు ఆర్‌ఆర్ పేట, ఉంగుటూరు- న్యూస్‌టుడే: ఆధార్ తరహాలో రైతులకు 11 అంకెలతో విశిష్ట గుర్తింపు సంఖ్య కేటాయించేందుకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన రైతుల నమోదు ప్రక్రియ నెమ్మదిగా సాగుతోంది. జిల్లాలో ఇంకా 42,997 మంది వివరాలు నమోదు చేయాల్సి ఉంది. ఇంకో ఆరు రోజుల్లో గడువు ముగియనుండటంతో.. సిబ్బంది హడావుడి చేస్తున్నారు. రైతులకు ఫోన్ చేసి రైతు సేవా కేంద్రాలకు రావాలని.. లేకుంటే ఆధార్, ఓటీపీలు చెబితే నమోదు చేస్తామని చెబుతున్నారు.

రైతు ప్రయోజనాలకు.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్నదాతల శ్రేయస్సుకు వివిధ రాయితీలు, ప్రోత్సాహకాలు, పంటల బీమా, పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ తదితర పథకాలు అమలు చేస్తున్నాయి. వీటిని అర్హులకు మాత్రమే అందించేందుకు ఫార్మర్ రిజిస్ట్రీ పేరిట ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేస్తున్నాయి. మార్చిలో కేంద్రం పీఎం కిసాన్ నగదు విడుదల చేయనుండగా.. తొలిసారి ఫార్మర్ రిజిస్ట్రీ ఆధారంగా రైతుల ఖాతాల్లో నగదు జమ చేయనుంది.

జిల్లా వివరాలివీ..
రైతులు: 2,27,560
ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదైంది: 1,84,563
చేయకుండా ఉన్న వారు: 42,997
వెనుకబడిన మండలాలు: కలిదిండి, మండవల్లి, కొయ్యలగూడెం, పెదవేగి

అందుబాటులో లేక.. చాలా మంది రైతులు సొంతూళ్లు వదిలి వ్యాపారం, పిల్లల సంరక్షణకు వెళ్లిపోయారు. వారంతా స్థానికంగా అందుబాటులో ఉండటం లేదు. మరణించిన యజమానుల వారసులు భూముల్ని తమ పేరిట మార్చుకోకపోవడం, ఆధార్‌తో ఫోన్ నంబర్ అనుసంధానం చేయించుకోకపోవడం తదితర సమస్యలతో ప్రక్రియ ముందుకు సాగడం లేదు. 'భవిష్యత్తులో విశిష్ట గుర్తింపు సంఖ్య కీలకంగా మారుతుంది. రైతులంతా విధిగా ఫార్మర్ రిజిస్ట్రీలో వివరాలు నమోదు చేయించుకోవాలి' అని జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా తెలిపారు.

లోకపావనీ.. జగజ్జననీ పెద్దింట్లమ్మ

అమ్మవారి దర్శనానికి వరుసలో వేచి ఉన్న భక్తులు

కైకలూరు, న్యూస్‌టుడే: లోక పావనీ.. జగజ్జననీ.. పెద్దింట్లమ్మ శరణం.. శరణం.. అంటూ అమ్మవారి నామ స్మరణతో కొల్లేటి కోట మార్మోగింది. ఆదివారం పెద్దింట్లమ్మ జాతరకు ఉభయ గోదావరి, కృష్ణా, విశాఖ జిల్లాల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులతో అమ్మవారి దేవస్థానం కిటకిటలాడింది. మహిళలు ఆలయ ప్రాంగణంలో పాల పొంగళ్లు వండి పెద్దింట్లమ్మకు నైవేద్యం సమర్పించి పూజా కార్యక్రమాలు నిర్వహించి మొక్కులు చెల్లించుకుని దర్శించుకున్నారు. అంతకు ముందు ప్రధాన అర్చకుడు పరమేశ్వర శర్మ ఆధ్వర్యంలో పంచామృతాల పూజ, జల దుర్గకు ద్రవ్యాభిషేకాలతో అర్చన, ధూపసేవ, పంచ హారతులు వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దేవస్థాన ఛైర్మన్ జల్లూరి వెంకన్నబాబు, ఈవో కె.శ్రీనివాస్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

శ్రీవారి క్షేత్రంలో రద్దీ

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ కొనసాగింది. సెలవు రోజు కావడంతో అధిక సంఖ్యలో వచ్చారు. శుభ ముహూర్తాలు ఉండటంతో వివాహాలు, అన్న ప్రాసన కార్యక్రమాలు అధికంగా జరిగాయి.

చూడరు తవ్వేయ్.. అడగరు అమ్మేయ్..!

రెచ్చిపోతున్న గ్రావెల్ మాఫియా

నూజివీడు, న్యూస్‌టుడే: గత వైకాపా పాలనలో గుట్టలకు కూడా మంచి గిరాకీ వచ్చింది. మట్టి, గ్రావెల్ మాఫియాకు వారు బీజం వేయగా నేటికీ అదే కొనసాగుతోంది. తోడు దొంగలంతా ఏకమై నూజివీడు నియోజకవర్గంలో కనిపించిన గుట్టలన్నింటినీ 'గుట్టకాయ స్వాహా' చేస్తున్నారు. రాత్రి సమయాల్లో, సెలవు రోజుల్లో అక్రమార్కులు చెలరేగిపోతున్నారు. గుట్టుగా తవ్వకాలు చేస్తూ ట్రాక్టర్లు, లారీల్లో తరలించుకుపోతున్నారు. వేలంపాటల్లో కూడా పోటీ రాకుండా బేరాలు కుదుర్చుకుని ఆక్రమణ దారులు ఏర్పాటు చేసుకుని, భూమి చదును పేరుతో గ్రావెల్ తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. తవ్వకాలపై పత్రికల్లో కథనాలు వచ్చినప్పుడు రెండు రోజులు ఆపడం.. మళ్లీ షరా మామూలుగానే కొండలను కొల్లగొడుతున్నారు.

గుట్టలు కరిగించి..

☛ ఆగిరిపల్లి మండలం అమ్మవారిగూడెం, కొత్తపల్లిమెట్ట, ఈదులగూడెం తదితర ప్రాంతాల్లో, ముసునూరు మండలం రమణక్కపేట, సూరేపల్లి, నూజివీడు మండలంలోని హనుమంతులగూడెం, సిద్ధార్థ నగర్, సీతారామపురం గుట్ట, గొల్లపల్లి తదితర ప్రాంతాల్లో తవ్వకాలు నిర్వహించారు.

☛ ఇటీవల ఆగిరిపల్లి మండలం తోటపల్లిలో అనుమతులు లేకుండా గ్రావెల్‌ను తరలించేందుకు లారీలు, మిషన్లు సిద్ధం చేయడంతో స్థానికులు అడ్డుకోవడంతో తాత్కాలికంగా అక్కడ తవ్వకాలు నిలిపివేశారు.

అమ్మవారిగూడెం కొండ దగ్గర తవ్వకాలు

☛ ఈ నెల 21న ముసునూరు మండలం చెక్కపల్లిలో అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు చేస్తున్నారంటూ తహసీల్దారుకు ఫిర్యాదు రావడంతో రెవెన్యూ అధికారులు తవ్వకాలను నిలిపివేయించారు.

ప్రభుత్వ ఆదాయానికి గండి.. సాధారణంగా తవ్వకాలు జరపాలంటే గనుల శాఖ నుంచి అనుమతి తీసుకోవాలి. సంబంధిత అధికారులు, గ్రావెల్ తవ్వకం చేసే ప్రాంతాన్ని పరిశీలించి ఎంత లోతు తవ్వాలి, ఎన్ని మనపు అడుగులు మేర తవ్వకాలు చేయవచ్చు అనేది నిర్ధారించి ఆ మేరకు రుసుం కట్టిస్తారు. ఆ తర్వాత మాత్రం తవ్వకాలకు అనుమతి ఇస్తారు. ఇక్కడ అలాంటివి ఏమీ లేకుండా ట్రాక్టర్ గ్రావెల్ రూ.1000 నుంచి రూ.1200, టిప్పర్ గ్రావెల్‌కు రూ.10 వేల నుంచి రూ.12 వేల వరకు వసూలు చేసి జేబులు నింపుకొంటున్నారు.

చర్యలు తీసుకుంటాం.. అనధికార గ్రావెల్, మట్టి తవ్వకాలు చేపడితే వాహనాలు సీజ్ చేసి కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి నిఘా పటిష్ఠ పరుస్తాం. కేసులు నమోదు చేస్తాం. - బి.వినూత్న, సబ్ కలెక్టర్, నూజివీడు

అలలపై.. ఆధ్యాత్మిక విహారం..!

భవిష్యత్తు పర్యాటకానికి పోలవరం

వేలేరుపాడు గ్రామీణ, న్యూస్‌టుడే: ఇప్పటివరకు మైమరపించే ప్రకృతి అందాల యాత్ర.. పాపికొండలు అనుకున్న పర్యాటకులకు ఆకర్షిస్తున్న పాపికొండల యాత్ర.. పోలవరం ప్రాజెక్టు పూర్తయితే ఆధ్యాత్మిక పర్యాటకంగా మారబోతుంది. ఇప్పటికే గోదావరి గలగలలు.. మరోవైపు ఎత్తయిన పాపికొండలు చూస్తూ నదిలో బోటు ప్రయాణం చేస్తున్న సందర్శకులకు రానున్న రోజుల్లో కొత్త అనుభూతి పరిచయం కానుంది.

ద్వీపాలుగా మారనున్న ఆలయాలు ప్రస్తుతం నదికి ఇరువైపులా చిన్నచిన్న కొండలపై ఆలయాలు ఉన్నాయి. ప్రాజెక్టు నిర్మాణం పూర్తయ్యాక ముంపు ప్రాంతమంతా గోదావరి విస్తరిస్తుంది. కొండలపై ఉండే ఆలయాలు ద్వీపాలుగా మారిపోతాయి. పాపికొండల పర్యాటకానికి ఇవి కొత్త వన్నె తీసుకురానున్నాయి.

ప్రత్యేక ప్రణాళికతోనే.. ☛ వేలేరుపాడు మండలం లోని కట్కూరు శివాలయం నిర్వాహకులు పోలవరం ప్రాజెక్టు పూర్తయితే ఆలయం చుట్టూ ప్రత్యేక వసతి గృహాలు సమూదాయాలను ఏర్పాటు చేసి పర్యాటకంగా తీర్చిదిద్దాలనే ప్రణాళికతో ఉన్నారు.

☛ దేవీపట్నంలోని పూడిపల్లి కొండ, గండిపోశమ్మ ఆలయం, శ్రీరామగిరి, గొమ్ముగూడెం సుబ్రహ్మణ్య స్వామి ఆలయాల కొండలపై ప్రత్యేక వసతి గృహాలు నిర్మించి వసతులు సమకూర్చితే అద్భుతమైన పర్యాటకంగా మారుతుందని దేవాదాయ శాఖ అధికారులు గతేడాదే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు.

మధురానుభూతి.. ప్రస్తుతం పర్యాటకులు భద్రాచలం, వేలేరుపాడు నుంచి కోయిదాకు వాహనాల్లో ప్రయాణించి పోలవరం నుంచి పోచవరం రేవుకు చేరుకొని, అక్కడ లాంచీలు ఎక్కి ప్రకృతి అందాలు వీక్షిస్తున్నారు. ప్రాజెక్టు పూర్తయితే గోదావరి వెనుక జలాలు పెరిగి వేలేరుపాడు, వరరామచంద్రాపురం, కూనవరం, ఎటపాక మండలాల్లో చాలా గ్రామాలు, రహదారులు నీట మునుగుతాయి. ఈ నేపథ్యంలో రేవు ఆధారంగా భద్రాచలం దగ్గరగా వెళ్లిపోతుంది. పర్యాటకులు అక్కడే బోట్లు ఎక్కి పాపికొండలు వీక్షించుకుంటూ మధ్యలో ఆలయాలు సందర్శిస్తారు. దీంతో భక్తులు, సందర్శకులకు మధురానుభూతిగా నిలిచిపోతుంది.

☛ ఈ పర్యాటకం ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లకుండా ప్రభుత్వం ఇప్పటి నుంచే దేవాదాయ, జలవనరులు, పర్యాటక శాఖల అధికారులు ప్రత్యేక ప్రణాళికతో వ్యూహరించి పర్యాటకంగా.. ఆధ్యాత్మికంగా తీర్చిదిద్దితే ఏటా రూ.కోట్ల ఆదాయం సమకూరుతుంది. స్థానిక ఆదివాసీలకు ఉపాధి మార్గంగా మారే అవకాశముంది.

నీడ లేక.. నిలువ లేక!

● జాతీయ రహదారులపై కానరాని బస్సు షెల్టర్లు ● ఎండలకు అల్లాడుతున్న ప్రయాణికులు

పరిశీలన

ఉంగుటూరు, భీమడోలు, ఏలూరు అర్బన్, కొయ్యలగూడెం గ్రామీణ- న్యూస్‌టుడే: జాతీయ రహదారుల అభివృద్ధి, విస్తరణకు ప్రభుత్వాలు ప్రాధాన్యమిస్తున్నాయి. ప్రయాణికుల ప్రాథమిక అవసరాలు తీర్చడంలో మాత్రం ఉదాసీనత ప్రదర్శిస్తున్నాయి. కనీసం నీడనిచ్చే షెల్టర్లు ఏర్పాటు చేయడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారు. నిలువ నీడ లేక ఎండలో రహదారుల వెంబడి ప్రయాణికులు ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ నిరీక్షిస్తున్నారు. కొన్నిచోట్ల బస్సులు తిరిగే మార్గాల్లో నిర్మించిన షెల్టర్లు నిరుపయోగంగా మారాయి. ఇంకొన్ని చోట్ల షెల్టర్ల వద్ద బస్సులు ఆపడం లేదు.

భీమడోలు మండలం పూళ్ల, భీమడోలులో 216ఏ జాతీయ రహదారిపై షెల్టర్లు ఉండగా.. బస్సులు మాత్రం ఆపడం లేదు. ఇవి నిరుపయోగంగా మారడంతో.. రైతులు వ్యవసాయోత్పత్తులు ఆరబెట్టుకుంటున్నారు. 16వ నంబరు జాతీయ రహదారి సర్వీస్ రోడ్డుపై పోలసానిపల్లి వద్ద ఇరువైపులా బస్సు షెల్టర్లు నిర్మించారు. ఈ మార్గంలో బస్సులు తిరగవు.

● కొయ్యలగూడెం మండలం బయ్యనగూడెంలో 516డి జాతీయ రహదారి ప్రధాన కూడలిలో బస్సు షెల్టర్ లేదు. ఇటు జంగారెడ్డిగూడెం.. అటు రాజమహేంద్రవరం వైపు నిత్యం వేల మంది రాకపోకలు సాగిస్తుంటారు. విద్యార్థులు, ఉద్యోగులు, వృద్ధులు దుకాణాల ముందు నిల్చొని బస్సుల కోసం వేచి చూడాల్సి వస్తోంది.

ఉంగుటూరు మండలం కైకరంలో బస్సు షెల్టర్ నిర్మించలేదు. అక్కడ బ్బెత్తి...

లింగపాలెం, తిమ్మయ్యపాలెం, రామన్నగూడెం, లంకమాలపల్లి, వెంకట్రాయపాలెం, బ్రహ్మానందపురం గ్రామాల ప్రజలు 216 ఏ జాతీయ రహదారి మీదుగా తాడేపల్లిగూడెం, తణుకు, రాజమహేంద్రవరం వెళ్లేందుకు ఇక్కడే నిరీక్షిస్తుంటారు. బస్సులొచ్చే వరకూ మండుటెండలో పడిగాపులు కాస్తుంటారు.

పెరిగిన ఆదరణ.. స్త్రీశక్తి పథకంతో ఆర్టీసీ బస్సులకు ఆదరణ లభిస్తోంది. రోజురోజుకూ ప్రయాణికుల సంఖ్య పెరుగుతోంది. చాలా ప్రాంతాల్లో బస్సు షెల్టర్లు లేకపోవడంతో.. వృద్ధులు, మహిళలు, చిన్నారులు, విద్యార్థులు మండుటెండలో వేచి చూస్తున్నారు. వేసవి ప్రారంభమై ఎండలు పెరుగుతున్న తరుణంలో.. చెట్ల కింద, దుకాణాల ముందు నిలబడుతున్నారు. ప్రయాణికులు చేతులెత్తిన చోట బస్సులు ఆపడం వల్లే నిల్చుంటున్నారు. వేసవి పూర్తి కుంటాం. ప్రయాణికుల సౌకర్యార్థం బస్సు షెల్టర్ల వద్ద బస్సులు నిలపాలి. షెల్టర్లు లేని చోట దాతల సహకారంతో ఏర్పాటు చేయిస్తాం' అని జిల్లా ప్రజా రవాణాధికారిణి షబ్నం తెలిపారు.

దాటితే.. గండం గడిచినట్లే..

మన్యం మెట్ట మండలాల్లో వంకలు, వాగులపై ఉన్న వంతెనలు శిథిలస్థితికి చేరి ప్రమాదకరంగా మారాయి. కామవరపుకోట మండలం కళ్లచెరువు సమీపంలో గుండేరుపై ఉన్న వంతెన కుంగిపోయి ప్రమాదకరంగా దర్శనమిస్తోంది. కనీసం రక్షణ గోడలు కూడా లేని పరిస్థితి. ఇదే వంతెనపై పామాయిల్ లోడ్ లతో నిత్యం భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. 'నూతన వంతెన నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరైతే పనులు ప్రారంభిస్తాం' అని ఆర్.అండ్.బి శాఖ ఏఈ సుందర్రావు తెలిపారు.

- న్యూస్‌టుడే, కామవరపుకోట

కుల వృత్తులు లేని సమాజం లేదు: మంత్రి

మాట్లాడుతున్న పార్థసారథి

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: దేశంలో కుల వృత్తులు లేకుండా సమాజం లేదనే విషయం ప్రతి ఒక్కరూ గుర్తించాలని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఆదివారం సాయంత్రం నూజివీడులోని రాజీవ్ సర్కిల్ వద్ద రజక ఆత్మీయ మహాసభకు ఆయన హాజరయ్యారు. మాజీ ఎమ్మెల్యే డి.రామారావుతో కలిసి జ్యోతి వెలిగించి కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తరతరాల నుంచి వస్తున్న రజక వృత్తిని జాతి మరవకూడదన్నారు. ఈ జాతి అభివృద్ధి కోసం రూ.వంద కోట్లు కేటాయించినట్లు చెప్పారు. ఈ ఒక్క తేదీ పాతోనే సాధ్యమని స్పష్టం చేశారు. బీసీ వర్గాలు పారిశ్రామికంగా ఎదగడానికి తన వంతు సహకారం అందిస్తానన్నారు. రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని పార్లమెంటుకు పంపిన ఏకైక పార్టీ తెదేపాయేనని గుర్తు చేశారు. రజకులు వినియోగించే రేవులను అభివృద్ధికి వారి హక్కులను కాపాడేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. చట్ట సభల్లో, స్థానిక సంస్థల ఎన్నికల్లో దామాషా ప్రకారం సీట్లు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. పలువురు రజకులకు ఇస్త్రీ పెట్టెలను అందించారు. పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు. పట్టణ సీఐ సత్య శ్రీనివాస్, ఎస్సై నాగేశ్వరరావు బందోబస్తు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

నేడు యథావిధిగా 'మీ కోసం'

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 10 గంటలకు 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక(మీ కోసం)' నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వెట్రిసెల్వి తెలిపారు. మండల, పురపాలక, డివిజనల్ కార్యాలయాల్లోనూ కార్యక్రమం యథావిధిగా కొనసాగుతుందని చెప్పారు. 'మీ కోసం' వినతుల పరిష్కార స్థితి తెలుసుకునేందుకు టోల్‌ఫ్రీ నంబరు 1100ను సంప్రదించవచ్చని ఆమె ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు ప్రత్యేక రవాణా సదుపాయం: ఎస్పీ

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ఇంటర్మీడియట్ విద్యార్థులు సమయానికి పరీక్ష కేంద్రానికి చేరుకునేలా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక రవాణా సదుపాయం కల్పిస్తున్నట్లు ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ తెలిపారు. నగరంలోని కొత్త, పాత బస్టాండ్లు, అగ్నిమాపక కేంద్రం కూడలి తదితర ప్రాంతాల్లో పోలీసు వాహనాలు అందుబాటులో ఉంటాయన్నారు. ఆయా కేంద్రాలు వెళ్లడం ఆలస్యమైనా, రవాణా ఇబ్బందులు ఎదురైనా, పోలీసు వాహనాల్లో విద్యార్థులను సురక్షితంగా చేరుస్తామన్నారు. కనీసం 30 నిమిషాలు ముందుగా పరీక్ష కేంద్రాలకు చేరుకునేందుకు ప్రయత్నించాలని ఆయన ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఒత్తిడికి తలొగ్గకు.. లక్ష్యం మరువకు..

పరీక్షల సమయంలో వృథా వద్దు


సన్నద్ధం అవుతున్న ఇంటర్ విద్యార్థులు

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: ఇంటర్ విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయించే పరీక్షలు సమీపించాయి. సోమవారం నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. దీంతో విద్యార్థులపై ఒత్తిడి అనివార్యంగా మారింది. తమ పిల్లలు సత్ఫలితాలు సాధిస్తారా లేదా అని తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొంది. ఈ క్రమంలో ప్రణాళికాయుతంగా చదివితే సత్ఫలితాలు సాధించవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

ప్రతిక్షణం.. కీలకమే.. పరీక్షల వేళ ప్రతి క్షణం కీలకం. 24 గంటల్లో నిద్ర, ఇతర అవసరాలకు పోను మిగతా సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ముఖ్యంగా కఠిన అంశాలపై దృష్టి పెట్టాలి. పునశ్చరణకు ప్రాధాన్యం ఇవ్వాలి. ఏయే పాఠ్యాంశాలు చదవితే ఎక్కువ మార్కులు వస్తాయో వాటిపై దృష్టి పెట్టాలని అధ్యాపకులు సూచిస్తున్నారు. లక్ష్యం మరవకుండా నిత్యం సాధన చేస్తే శత శాతం ఫలితాలు వస్తాయి.

ఆందోళన చెందొద్దు.. విద్యార్థులు పరీక్షల సమయంలో ఆందోళనకర విషయాలకు ప్రాధాన్యం ఇవ్వొద్దు. ఒత్తిడికి గురి కావద్దు. పరీక్షకు సులువుగా రాస్తామనే భావనతో ముందుకు సాగాలి. ఒక సబ్జెక్టు బాగా రాయలేదని ఆలోచిస్తూ చింతిస్తే అది వేరే సబ్జెక్టుపై ప్రభావం చూపుతుంది. ఎలాంటి పరిస్థితుల్లోనైనా ప్రశాంతంగా ఉండాలి. ధైర్యం కోల్పోవద్దు.

సామాజిక మాధ్యమాలకు దూరంగా.. సామాజిక మాధ్యమాల్లో అధిక శాతం యువత గడిపేస్తోంది. పుస్తకం పట్టి చదవు అంటారని అరగంట కూడా ముందే చరవాణి వైపు మనసు లాగుతుంది. దీంతో పుస్తకాలను పక్కన పెట్టేసి చరవాణులతో అధిక సమయం గడుపుతున్నారు. ఇది లక్ష్య సాధనకు అవరోధంగా మారుతుంది. పరీక్షల సమయంలో సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలి.

ఆత్మవిశ్వాసం కోల్పోవద్దు.. పరీక్షల వేళ ఆత్మవిశ్వాసం కోల్పోరాదు. ప్రతి సబ్జెక్టులో ప్రణాళికగా రాణిస్తామని ధీమాతో ఉండాలి. మానసికంగా చికాకులు తెప్పించే విషయాలకు దూరంగా ఉండాలి. ప్రణాళికాయుతంగా చదివితే సత్ఫలితాలు సాధించ వీలుంది.

- డా.కె.హన్నా కోమలి, ప్రభుత్వ మానసిక వైద్య నిపుణురాలు.

ఆహ్లాదం.. ఆనందం.. ఆదివారం!

జంగారెడ్డిగూడెంలో షటిల్ ఆడుతున్న ఎమ్మెల్యే రోషన్ కుమార్

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: జిల్లాలో ఆనంద ఆదివారం(హ్యాపీ సండే) ఉత్సాహంగా ప్రారంభమైంది. ఏలూరు నగరంతోపాటు జంగారెడ్డిగూడెం, నూజివీడు, చింతలపూడి, కైకలూరు తదితర పట్టణాల్లో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ఏలూరు గాంధీ నగరపాలక పాఠశాల వద్ద ఉదయం 6 నుంచి 10 గంటల వరకు కార్యక్రమం సాగింది. నగర కమిషనర్ భానుప్రతాప్, చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ పాల్గొని సందడి చేశారు. యోగాసనాలు, ధ్యానం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. పిల్లలకు సాంస్కృతిక ప్రదర్శనలు, ఆటల పోటీలు నిర్వహించారు.

గ్రామ పంచాయతీలకు ఊరట

ఆర్థిక సంఘం నిధుల చెల్లింపునకు ఉత్తర్వులు

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీల్లోని ఆర్థిక సంఘం నిధుల చెల్లింపులపై కూటమి ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. ఏప్రిల్‌తో పంచాయతీల పాలకవర్గాల గడువు ముగియనుంది. ఈ నేపథ్యంలో ఆర్థిక సంఘం నిధులను ఇష్టానుసారంగా ఖర్చు చేస్తున్నట్లు ప్రభుత్వం దృష్టికెళ్లింది. వీటి వినియోగంలో పారదర్శకత పాటించేలా చర్యలు ఉపక్రమించింది. ఇష్టానుసారంగా బిల్లులు పెట్టొద్దంటూ నిధుల వినియోగంపై ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేసింది. తాజాగా మార్గదర్శకాలను సవరిస్తూ.. ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

సర్పంచులకు తీపి కబురు.. జిల్లా వ్యాప్తంగా 27 మండలాల్లో 544 పంచాయతీలున్నాయి. ఆర్థిక సంఘం నిధుల్లో 30 శాతం పారిశుద్ధ్యం, 30 శాతం తాగునీటి సరఫరా, మిగతా 40 శాతం ఇతరత్రా పనులకు వెచ్చించాలి. తాజాగా 2025-26 సంవత్సరానికి 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.33.21 కోట్లు విడుదలయ్యాయి. వాటిలో టైడ్ రూ.19.92 కోట్లు, అన్‌టైడ్ నిధి కింద రూ.13.28 కోట్లను పంచాయతీల ఖాతాల్లో జమ చేశారు. ఇప్పటి వరకు నిబంధనలు సడలింపులివ్వడంతో.. సర్పంచులకు ఊరట లభించింది.

పనుల్లో వేగం.. ఇప్పటికే పల్లె పండగ నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేస్తున్నారు. తాజాగా ఆర్థిక సంఘం నిధులతో మరిన్ని పనులు చేపట్టేందుకు మార్గం సుగమమైంది. మౌలిక వసతుల కల్పనకు అడుగులు పడుతున్నాయి. మార్చి నెలాఖరులోగా పనులు పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం నిధులు వినియోగించాలని జిల్లా పంచాయతీ అధికారి కె.అనురాధ తెలిపారు.

రైతులై.. గురువులై.. 6లో

ఉచిత శిక్షణ.. భవితకు రక్షణ..!

డీడీయూ-జీకేవైతో యువతకు ఉపాధి

'మాది పోతవరం. నేను డిగ్రీ చదివాను. కుటుంబ బాధ్యతల ప్రోత్సాహంతో ఇక్కడి కేంద్రంలో హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులో శిక్షణ పొందుతున్నా. శిక్షణ అనంతరం ఉద్యోగం చేయాలని ఉంది.' - పి.భాను, పోతవరం

'మాది తూర్పుగోదావరి జిల్లా చాగల్లు దగ్గర దారవరం. నాన్న లారీ డ్రైవర్. కొయ్యలగూడెంలో శిక్షణ పొంది ఇటీవల సూళ్లూరుపేటలోని శ్రీసిటీలో డైకిన్ ఎయిర్ కండిషనింగ్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థలో ఆపరేటర్‌గా ఉద్యోగం సాధించా' - జి.జాయ్‌కుమారి, దారవరం

ఎలక్ట్రానిక్స్ విభాగంలో శిక్షణ పొందుతున్న అభ్యర్థులు

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా కూటమి ప్రభుత్వం ఉచిత శిక్షణ అందిస్తోంది. కేంద్ర మానవ వనరుల శాఖ ఆధ్వర్యంలో దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన(డీడీయూ-జీకేవై) కార్యక్రమం ద్వారా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ(డీఆర్‌డీఏ), సెర్ప్ సంస్థ స్వచ్ఛంద సంస్థలతో సంయుక్తంగా పలుచోట్ల శిక్షణ కేంద్రాలు నిర్వహిస్తున్నారు. పోటీ ప్రపంచానికి తగ్గట్టు యువతలో నైపుణ్యాలను పెంపొందిస్తున్నారు. మూడు నెలలపాటు అభ్యర్థులకు ఉచిత శిక్షణతోపాటు భోజన వసతి సదుపాయాలను కల్పిస్తున్నారు. ఒక్కో బ్యాచ్‌లో శిక్షణ కోసం కేంద్రం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం చొప్పున సుమారు రూ.54 వేల వ్యయాన్ని భరిస్తున్నాయి. శిక్షణ అనంతరం ప్రాంగణ నియామకాల ద్వారా రాష్ట్రంతోపాటు ఇతర రాష్ట్రాల్లోని అనేక కార్పొరేట్ సంస్థలు, మల్టీ నేషనల్ కంపెనీల్లో ఉద్యోగాలు కల్పిస్తున్నారు.

శిక్షణ కేంద్రాలు ఎక్కడెక్కడ ఉన్నాయంటే.. ఉమ్మడి జిల్లాలో ఎనిమిది శిక్షణ కేంద్రాలు ఉన్నాయి. ఏలూరు జిల్లాలో కొయ్యలగూడెం, కేతవరపుం, నూజివీడు, పశ్చిమ గోదావరి జిల్లాలో భీమవరం, నరసాపురంలో శిక్షణ కేంద్రాలు కొనసాగుతున్నాయి.

శిక్షణ ఇచ్చే అంశాలేమిటంటే.. ఉద్యోగ సాధనకు అవసరమైన సాఫ్ట్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లిష్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్, కంప్యూటర్ పరిజ్ఞానంతోపాటు ఎలక్ట్రానిక్స్, హోటల్ మేనేజ్‌మెంట్, వెబ్ డెవలప్‌మెంట్, రిటైల్ ట్రేడ్, సోలార్ సిస్టమ్ తదితర పలు అంశాలపై శిక్షణ ఇస్తారు. ★ శిక్షణ సమయంలో అభ్యర్థులకు అవసరమైన అధ్యయన సామగ్రి కేంద్రంలోనే సమకూరుస్తారని శిక్షణ కేంద్రం పర్యవేక్షణ విభాగం జిల్లా మేనేజర్ పి.సురేష్ తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే 1800 మంది శిక్షణ పొందారని ఆయన చెప్పారు. ఆసక్తిగల అభ్యర్థులు తమ దగ్గర్లోని కేంద్రాన్ని సంప్రదించవచ్చని సూచించారు.

(c) eenadu

కులమతాలకతీతంగా సమ భావంతో పని చేస్తున్నాం

నృత్య ప్రదర్శనలో చిన్నారులు

పెదఅమిరం(కాళ్ల), న్యూస్‌టుడే: వివేకానందుని స్ఫూర్తితో కులమతాలకతీతంగా సమాన భావంతో పని చేస్తున్నామని స్వామి వివేకానంద సేవా సమితి అధ్యక్షుడు వేగిరాజు శివవర్మ అన్నారు. పెదఅమిరం వివేకానంద ఎడ్యుకేషనల్ సొసైటీ హాలులో ఆదివారం రాత్రి నిర్వహించిన సమితి వార్షికోత్సవంలో ఆయన మాట్లాడారు. ఈ ప్రాంతానికి స్వామి వివేకానంద మార్గంగా నామకరణం చేసేందుకు ఉప సభాపతి రఘురామకృష్ణరాజు చొరవతో కలెక్టర్ నాగరాణి అనుమతివ్వడం శుభ పరిణామమన్నారు. తాను చేస్తున్న సేవా కార్యక్రమాలకు కనుమూరి గోపాలరాజు(జేకేపీ గోపి), కనుమూరి రామకృష్ణంరాజు ప్రోత్సాహం ఎనలేనిదని కొనియాడారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు. సమితి గౌరవాధ్యక్షులు పెదసోమరాజు, ఆల్లూరి సీతారామరాజు, డాక్టర్ సోమరాజు, కార్యదర్శి దాట్ల నారాయణరాజు, వేగిరాజు సుజాత, తెలంగాణ నుంచి వచ్చిన అతిథులు పాల్గొన్నారు.

రైతులై.. గురువులై..

ప్రకృతి వ్యవసాయ సారథులుగా మహిళలు
నాణ్యమైన ఉత్పత్తులు, అధిక దిగుబడులే లక్ష్యం

కషాయాల తయారీ నేర్పుతూ..

కైకలూరు, మండవల్లి, ముదినేపల్లి, న్యూస్‌టుడే: తామే రైతులు.. తామే గురువులుగా మారిన మహిళలు ప్రకృతి సాగు పాఠాలను బోధిస్తున్నారు. రైతు అనగానే తలకు పాగా చుట్టి పొలంలో శ్రమిస్తున్న పురుషుడి రూపం మాత్రమే మన ఊహకు అందుతుంది. అయితే మహిళా రైతులు ప్రకృతి వ్యవసాయంలో ఉద్యోగులుగా మారి విలువైన సలహాలు, సూచనతో అద్భుతాలు సృష్టిస్తున్నారు. పొలాన్ని సిద్ధం చేయడం, విత్తనశుద్ధి, ప్రకృతి ప్రసాదంగా అందించిన ఎరువుల వాడకం, కషాయాలు తయారు చేసి చీడ పీడలు నివారించడం, కోత కోసే వరకు మహిళల పాఠాలే రైతులకు వరంగా మారుతున్నాయి.

75 శాతం మహిళలే.. జిల్లా వ్యాప్తంగా 200 ఆర్‌ఎస్‌కేల పరిధిలో ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరించగా ప్రస్తుతం 400 మంది వరకు మహిళా ఉద్యోగులే తమ పాఠాలతో రైతులను చైతన్యపరుస్తున్నారు. సీఆర్పీల సలహాలతో రెండేళ్ల కిందట పెరికెగూడెం పరిధిలో ఎకరాకు 45 బస్తాల దిగుబడి సాధించారు. మరోపక్క ఇళ్ల వద్ద ఉంటున్న మహిళలను కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు పండించి ఆదాయం ఆర్జించేలా అవగాహన కల్పిస్తున్నారు.

చిన్నప్పటి నుంచి ఇష్టం

స్వతహాగా మాది రైతు కుటుంబం. నాన్న పొలానికి వెళ్లేటప్పుడు వెళ్లేదాన్ని. పెళ్లయిన తర్వాత రైతుగా మారి భర్త కృష్ణారావుకు తోడుగా ఉన్నా. 2017లో ప్రకృతి వ్యవసాయంలో శిక్షణ తీసుకుని ఐసీఆర్పీగా రైతుకు చేరువయ్యా. ప్రస్తుతం నా క్లస్టర్‌లో 100 మందికి పైగా రైతులు ప్రకృతి వ్యవసాయాన్ని ఆచరించడం ఎంతో సంతోషం కలిగిస్తోంది.

- నాగవిజయ, సీఆర్పీ, మండవల్లి

పొలమే పాఠశాల

ప్రకృతి వ్యవసాయంలో పొలమే పాఠశాలగా మారి అన్నీ తానై నేర్పుతుంది. దానికి కొంత మనసు పెడితే చాలు. ఆరేళ్లుగా ప్రకృతి వ్యవసాయం చేస్తూ నాలుగేళ్లుగా శిక్షకురాలిగా రైతులకు కషాయాలు, ద్రావణాలు తయారీపై అవగాహన కల్పిస్తున్నా. మరింత మందికి చేరువ చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నా.

- అనూష, ముదినేపల్లి క్లస్టర్

ప్రకృతి వనరుల సద్వినియోగం

భారతదేశ పురాతన విజ్ఞానాన్ని పక్కన పెట్టి ఆధునిక పోకడలతో ఇష్టారాజ్యంగా కుమ్మరిస్తున్న ఎరువులు పురుగుమందులతో నేలలు జీవాన్ని పోగొట్టుకుంటున్నాయి. సేంద్రియ కర్బన పదార్థాన్ని పెంపొందించేందుకు నా వంతుగా అవగాహన కల్పిస్తున్నా. నాలుగేళ్లుగా వందల ఎకరాల్లో పొలాలు సేంద్రియ వ్యవసాయం వైపు మళ్లించినందుకు ఆనందంగా ఉంది.

- నీలపాల గంగాభవాని, కైకలూరు

నేడు 'డయల్ యువర్ సీఎండీ'

గురుద్వారా (విశాఖపట్నం), న్యూస్‌టుడే: విద్యుత్తు సంబంధిత సమస్యలను పరిశీలించేందుకు వేగవంతంగా పరిష్కరించేందుకు విశాఖలోని ఈపీడీసీఎల్ కార్యాలయంలో సోమవారం 'డయల్ యువర్ సీఎండీ' కార్యక్రమం నిర్వహించనున్నట్లు సంస్థ సీఎండీ ఇమ్మడి పృథ్వీ తేజ్ ఓ ప్రకటనలో తెలిపారు. సంస్థ పరిధిలోని 13 జిల్లాలకు చెందిన వినియోగదారులు 86884 00499 ఫోన్ నంబర్ ద్వారా తమ సమస్యలను తెలియజేయవచ్చునని పేర్కొన్నారు. ఉదయం 10.30 నుంచి 11.30 వరకు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యుత్తు సరఫరాలో తరచూ అంతరాయాలు, హెచ్చుతగ్గులు, కొత్త సర్వీసుల జారీ, సరఫరా పునరుద్ధరణలో జాప్యం, ట్రాన్స్‌ఫార్మర్ల మార్పిడి తదితర సమస్యలపై వినియోగదారులు నేరుగా తన దృష్టికి తీసుకురావచ్చన్నారు.

ప్రజల దృష్టి మరల్చేందుకే హెరిటేజ్‌పై ఆరోపణలు

మంత్రి నిమ్మల రామానాయుడు

పాలకొల్లు, న్యూస్‌టుడే: శాసనమండలి సమావేశంలో కలియుగ దైవం శ్రీవెంకటేశ్వర స్వామి చిత్రపటాలను చిత్తు కాగితాల్లా విసిరేసిన వైకాపా ఎమ్మెల్సీలకు తిరుమల క్షేత్రం పవిత్రతపై మాట్లాడే నైతిక హక్కు లేదని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. యలమంచిలి మండలంలో ఆదివారం పర్యటించిన ఆయన కల్తీ నెయ్యి అంశంపై మాట్లాడారు. నెయ్యి విషయంలో జరిగిన తప్పును ఒప్పుకోకుండా ప్రజల దృష్టిని మరల్చేందుకు వైకాపా అధినేత జగన్, ఆ పార్టీ నాయకులు హెరిటేజ్ సంస్థపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు. సాక్షాత్తు జగన్ బాబాయ్ సుబ్బారెడ్డి సైతం లడ్డూ తయారీకి కల్తీ నెయ్యి వినియోగించినట్లు అంగీకరించారన్నారు. వైకాపా ప్రభుత్వ హయాంలో నెయ్యి కేసుల్లో నిబంధనలను అడ్డగోలుగా సడలించి రూ.250 కోట్ల కుంభకోణానికి పాల్పడి తిరుమల పవిత్రతను దెబ్బతీసిన జగన్ ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు. సీఎంగా ఉన్నప్పుడు ఆలయానికి వెళ్లడం ఇష్టం లేక ఇంటి వద్దే తిరుమల సెట్టింగ్ వేయించుకున్న ఘనత జగన్‌కే దక్కిందని ఎద్దేవా చేశారు.

ధరల పాలసీ ప్రకటించకుంటే ఉద్యమం

నినాదాలు చేస్తున్న నాయకులు, రైతులు

విజయరాయి(పెదవేగి), న్యూస్‌టుడే: కోకో గింజలకు వారం రోజుల్లో ధరల పాలసీ ప్రకటించాలని, లేని పక్షంలో ఉద్యమిస్తామని కూటమికి ఏపీ కోకో రైతుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొల్లు రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి గుడిపూడి వీరారెడ్డి డిమాండ్ చేశారు. విజయరాయి గాంధీ నగర్‌లోని సీతారామ కళ్యాణ మండపంలో ఆదివారం కోకో రైతుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. అంతర్జాతీయ మార్కెట్‌లో గిరాకీ ఉన్నా కోకో గింజలకు ధర నిర్ణయించకపోవడంతో రైతుల ఆదాయం తగ్గిపోతుందన్నారు. కోకో రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడారు. అంతర్జాతీయంగా ధరలు తగ్గాయని సాకుతో రూ.50 వరకు తగ్గించడం దుర్మార్గమని మండిపడ్డారు. ప్రాంతీయ కొబ్బరి రైతుల సంఘం ఉపాధ్యక్షుడు మున్నంగి సుబ్బారెడ్డి, కోకో రైతులు పి.సురేంద్రారావు, పి.రాంబాబు, కె.సతీశ్‌బాబు, ఉంపాటి శ్రీనివాసరావు, పాసంగరి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

గుబ్బలమంగమ్మ గుడికి భక్తుల తాకిడి

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: బుట్టాయగూడెం మండలం కామవరం అడవిలోని గుబ్బల మంగమ్మ గుడికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. నైవేద్యాలు సమర్పించి, ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం వృక్షాల కింద సహపంక్తి భోజనాలు చేశారు.

భగవంతుడితో రాజకీయాలు చేస్తారా?

శాసనమండలిలో వైకాపా సభ్యుల చిత్రాలు చూపుతున్న రామరాజు, గోవిందరావు, శ్రీదేవి

భీమవరం అర్బన్, న్యూస్‌టుడే: ప్రజలు 11 సీట్లకే పరిమితం చేసినా వైకాపా నేతలకు బుద్ధి రాలేదని తెదేపా జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజు, జనసేన జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు, భాజపా జిల్లా అధ్యక్షురాలు అయినం పూడి శ్రీదేవి విమర్శించారు. భీమవరంలోని తెదేపా జిల్లా కార్యాలయంలో ఆదివారం వారు విలేకరులతో మాట్లాడారు. తిరుపతి లడ్డూ నుంచి ప్రతి విషయంలోనూ హిందువుల మనోభావాలను దెబ్బ తీయడమే ఆ పార్టీ పనిగా పెట్టుకుందన్నారు. భవిష్యత్తులో మనుగడ లేదనే విషయం గమనించి ప్రజల్ని మతం, కులం పేరిట చిచ్చు పెట్టే కుట్రలు పన్నుతున్నారన్నారు. హిందువుల మనోభావాలను పట్టించుకోని జగన్.. పచ్చి బూతులు మాట్లాడే వైకాపా నేతల్ని వెనకేసుకురావడం సిగ్గుచేటన్నారు. శాసనమండలిలో బొత్స సత్యనారాయణతోపాటు ఆ పార్టీ నాయకులు వేంకటేశ్వరస్వామి ఫొటోలు పట్టుకుని చేసిన హంగామా గురించి ప్రస్తావించారు. ప్రజా సమస్యలు, అభివృద్ధి మీద మాట్లాడకుండా కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. డబ్బొస్తే చాలు దేవుడితో నాకేం పని అన్నట్లుగా వ్యవహరిస్తున్న జగన్‌రెడ్డి తీరు మార్చుకోకపోతే ఇప్పుడు 11 సీట్లు ఇచ్చిన ప్రజలు వచ్చే ఎన్నికల్లో ఒక్క సీటుకే పరిమితం చేస్తారని పేర్కొన్నారు.

ధర్నా విజయవంతానికి పిలుపు

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: తమ డిమాండ్ల సాధనకు ఈ నెల 26, 27 తేదీల్లో పాత తాలూకా కేంద్రాల వద్ద నిర్వహించనున్న ధర్నా కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి.రెడ్డి దొర పిలుపునిచ్చారు. పవరుపేటలోని ప్రాథమికోన్నత పాఠశాలలో ఆదివారం ఏపీటీఎఫ్ జిల్లా ఉప కమిటీ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ.. 12వ పీఆర్సీ ఏర్పాటు, ఆన్‌లైన్ పనులకు ప్రత్యేక సిబ్బంది నియామకం, ఆర్థిక స్మృత ఐఆర్, డీఏలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ రద్దు చేయాలని దిల్లీలో మార్చి 10న ధర్నా చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. సంఘం జిల్లా కార్యదర్శి డీకేఎస్ ప్రకాశ్, ఉపాధ్యక్షుడు తొమ్మండ్రు ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

బలవంతపు భూ సేకరణ తగదు

పవర్‌పేట (ఏలూరు టౌన్), న్యూస్‌టుడే: ఉద్దానం ఏర్పాటుకు తాము వ్యతిరేకం కాదని, బలవంతపు భూ సేకరణ చేయొద్దని అఖిలపక్ష పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు స్పష్టం చేశారు. పవర్‌పేటలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో కొయ్యలగూడెం మండలంలో ఉద్దాన నిర్మాణానికి బలవంతపు భూ సేకరణ వ్యతిరేకంగా రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి అధ్యక్షత వహించారు. పలువురు మాట్లాడుతూ.. ప్రజల అనుమతి లేకుండా నిర్మాణం చేపట్టబోమని ఓ వైపు చెబుతూనే అధికారులు చెబుతున్నా.. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం బలవంతంగా భూములు సేకరిస్తోందని ఆరోపించారు. వైకాపా జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు ఎస్.రాజశేఖర్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అల్లరిమూకలు.. జనం కేకలు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే

జిల్లా కేంద్రం.. విద్య, వైద్య, వాణిజ్య కూడలి భీమవరంలో అల్లరిమూకలు పేట్రేగిపోతున్నాయి. మద్యం, గంజాయి మత్తులో నడిరోడ్డుపై ఘర్షణలకు దిగుతున్నారు. మత్తులో ఏం చేస్తున్నారో తెలియడం లేదు. పట్టణ శివారు ప్రాంతాలతో పాటు నడిబొడ్డున ఉన్న ఖాళీ ప్రదేశాలను వీరు అడ్డాగా చేసుకుంటున్నారు. ఉండి రోడ్డు పొడవునా రాత్రివేళల్లో కొందరు మహిళల వాహనాలు అడ్డగించి డబ్బులు గుంజుతున్నారు. బైపాస్, ప్రధాన కూడళ్లలో నిలిపిన వాహనాల చోదకుల దగ్గరకు వెళ్లి బెదిరించి చరవాణులు లాక్కెళ్లిపోవడం జరుగుతోంది. దీంతో రాత్రి పూట బయటకు రావాలంటే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది.

భీమవరంలో భయం భయం

- ☛ ఉండి రోడ్డులోని ఓ హోటల్ యజమాని దగ్గరకు గుర్తుతెలియని వ్యక్తి వెళ్లి కత్తితో బెదిరించి అతని దగ్గర ఉన్న నగదుతో పారిపోయాడు. దీనిపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు.
- ☛ భీమవరం ఒకటో పట్టణంలో బస్టాండ్ దగ్గర అర్ధరాత్రి అల్లరి చేస్తున్న వారిని అడ్డుకున్న పోలీసులపైనే దాడికి తెగబడ్డారు. కొందరిని పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.
- ☛ ఇతర ప్రాంతాల నుంచి వచ్చి కూలి పనులు చేసుకుంటూ బైపాస్ రోడ్డు కూడలి, రైల్వే అండర్ పాస్‌లో ఉంటున్న వృద్ధుల దగ్గరకు యువకులు ముఠాలుగా వస్తున్నారు. వాళ్లని బెదిరించి నగదు లాక్కెళ్లిపోతున్నారు. అడ్డుకుంటే రక్తం కారేలా కొట్టి గాయపరుస్తున్నారు.
- ☛ ఒకటో పట్టణానికి చెందిన విభిన్న ప్రతిభావంతుడు ఒకరు రాత్రి సమయంలో ఇంటికెళ్లకుండా పీపీ రోడ్డు పక్కన దుకాణం అరుగులపై పడుకున్నాడు. కొందరు యువకులు అతని దగ్గరకు వెళ్లి నగదు లాక్కున్నారు.

ఎక్కడెక్కడంటే.. ఉండి రోడ్డు, రైల్వే జంక్షన్, టౌన్ రైల్వేస్టేషన్‌కు వెళ్లే దారి, బైపాస్, లూథరన్ క్రీడా మైదానం, బ్యాంకు కాలనీ, మెంటేవారితోట, గొల్లవానితిప్ప రోడ్డు, బలుసుమూడి శివారు ప్రాంతాలు. వీటితోపాటు పలు చోట్ల ఇటీవల ఘటనలు చోటుచేసుకోగా కొన్ని మాత్రమే పోలీసుస్టేషన్‌కు చేరాయి.

గస్తీ ఎక్కడా?.. రాత్రిపూట పోలీసుల నిఘా పలుచోట్ల అంతంతమాత్రంగానే ఉంటుంది. గతంలో ప్రత్యేక బీట్లు కొన్ని బృందాలుగా ఏర్పడి గస్తీ నిర్వహించేవారు. ఇప్పుడా పరిస్థితి లేకపోవడంతోనే అల్లరిమూకలు రెచ్చిపోతున్నాయని, వారిని రాజకీయ ముసుగులో కొందరు వెనుకేసుకెళ్తున్నారనే విమర్శలొస్తున్నాయి. రాత్రివేళల్లో నిఘా పెంచి ప్రజలకు భరోసా కల్పించేలా ఉన్నతాధికారులు దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

పోలీసులకు సమాచారం ఇవ్వండి..

భీమవరం పరిసరాల్లో రాత్రివేళల్లో 10 బీట్‌లు ఉన్నాయి. అన్ని ప్రాంతాల్లో నిఘా ఉంచాం. రాత్రి అనుమానంగా తిరుగుతున్నా, దందాలకు పాల్పడినట్లు సమాచారం ఉన్నా పోలీసులకు సమాచారం ఇస్తే వెంటనే అదుపులోకి తీసుకుంటాం.

- రఘువీర్‌విష్ణు, భీమవరం డీఎస్పీ

కారు ఢీకొని చిరు వ్యాపారి మృతి

కైకలూరు, న్యూస్‌టుడే: కారు ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని ఆలపాడు వద్ద ఆదివారం చోటు చేసుకుంది. కైకలూరు గ్రామీణ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడు శివారు గుమ్ములూరుకు చెందిన చిన్నపరపు నాగ శ్రీను(50) గ్రామంలో బడ్డీ దుకాణం నిర్వహిస్తూ భార్యతో కలిసి జీవనం సాగిస్తున్నారు. ఆదివారం ఉదయం కైకలూరులో బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి తన ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి పయనమయ్యాడు. ఆలపాడు ఆదర్శ పాఠశాల వద్దకు వచ్చే సమయానికి తన వాహనం రోడ్డు పక్కన నిలుపుదల చేశారు. ఈ క్రమంలో కైకలూరు నుంచి ఆకివీడు వైపు వెళ్తున్న కారు వెనుక నుంచి వేగంగా వచ్చి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంతో నాగ శ్రీను అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న గ్రామీణ ఎస్సై రాంబాబు ప్రమాద స్థితిని పరిశీలించి మృతదేహాన్ని కైకలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి కుమారుడు భానుప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

తలకు బలమైన గాయమై మరొకరు...

నల్లజర్ల, న్యూస్‌టుడే: మూర్ఛ వచ్చి సిమెంటు రోడ్డుపై పడిపోవడంతో తలకు బలమైన గాయమై వ్యక్తి మృతి చెందిన ఘటన తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం ముసుళ్లకుంటలో ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఏలూరు జిల్లా నూజివీడు మండలం శోభనాపురం గ్రామానికి చెందిన పెద్దబోయిన గంగరాజు (44) గొర్రెలు కొనుగోలు చేసేందుకు ముసుళ్లకుంటకు వచ్చారు. కొనుగోలు చేస్తున్న క్రమంలో నడుచుకుంటూ ఓ ఇంటికి వెళ్తుండగా.. సిమెంట్ రోడ్డుపై పడిపోయారు. దీంతో తలకు బలమైన గాయం కావడంతో తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు నల్లజర్ల ఎస్సై ఆంజనేయబాబు తెలిపారు. మృతుడు కుమారుడు వెంకట కిశోర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

కుదవ పెట్టిన బంగారం మాయం

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: కుదవ పెట్టిన బంగారం మాయంపై బాధితురాలి ఫిర్యాదు మేరకు జంగారెడ్డిగూడెం పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. ఎస్సై వీరప్రసాద్ కథనం మేరకు.. జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన ఎన్.ధనలక్ష్మి 2023లో స్థానిక ఐఐఎఫ్ఎల్ గోల్డ్ లోన్స్ (ఓ ఫైనాన్స్ కంపెనీ)లో 270 గ్రాముల బంగారు ఆభరణాలు తాకట్టు పెట్టి రూ.13 లక్షలు రుణంగా పొందారు. కొంత కాలం గడిచినా ఆమె తీసుకున్న రుణానికి వడ్డీ కట్టలేకపోయారు. ఫైనాన్స్ కంపెనీ మేనేజరు, కొయ్యలగూడెం మండలం వేదాంతపురం గ్రామానికి చెందిన ఉద్దగిరి చైతన్యరాము.. తీసుకున్న అప్పును రెన్యువల్ చేస్తామని ధనలక్ష్మికి చెప్పాడు. దీంతో ఆమె చరవాణికి వచ్చిన ఓటీపీలను చైతన్యరాము పలుమార్లు అడిగి తెలుసుకున్నాడు. గత ఏడాది డిసెంబర్‌లో ధనలక్ష్మి బంగారు ఆభరణాలు విడిపించుకునేందుకు ఫైనాన్స్ కంపెనీకి వెళ్లగా... అందులో ఆమె పేరుతో ఎటువంటి ఖాతా లేనట్లు సిబ్బంది చెప్పారు. తాను చెప్పిన ఓటీపీల ద్వారా తాకట్టు పెట్టిన బంగారాన్ని విడిపించి మారుపేర్లతో వివిధ బ్యాంకుల్లో మేనేజర్ చైతన్యరాము రుణాలు పొందాడని, తనతోపాటు మరికొంత మంది బంగారు ఆభరణాలను అతను మాయం చేసి అదృశ్యమైనట్లు ధనలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఉద్దగిరి చైతన్యరాముపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానము

ద్వారకా తిరుమల (చిన్న తిరుపతి), ఏలూరు జిల్లా-534426, ఫోన్: 08829 - 271427

Website: www.dwarakatirumala.org, e-mail: eo_dwarakatirumala@yahoo.co.in

REV65-OPOM0EOFF/1/2023-D1, Dt:21/02/2026

ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీసు

శ్రీ స్వామి వారి దేవస్థానమునకు అవసరమగు పూలు మరియు పూల దండలు ది.01-04-2026 నుండి ది.31-03-2027 వరకు ఒక సంవత్సర కాల పరిమితికి సప్లయి చేయుటకు గాను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మరియు సీల్డ్ టెండరు ద్వారా టెండర్లు కోరబడుచున్నవి. పూర్తి వివరములకు కొరకు www.apeprocurement.gov.in నందు తెలుసుకొనగలరు. ఇ-ప్రొక్యూర్‌మెంట్ మరియు సీల్డ్ టెండరు టెండర్ బాక్స్ నందు దాఖలు చేయు ప్రారంభ తేది:23-02-2026 ఉ॥ 10.00 గం॥ల నుండి చివరి తేది:09-03-2026 మ॥ 01.00 గం॥ వరకు. ఇతర వివరముల కొరకు ఫోన్: 9866730425, 9037567894 లను సంప్రదించగలరు.

శ్రీ యస్.వి. సుధాకరరావు, అధ్యక్షులు మరియు వ్యవస్థాపక ధర్మకర్త

సం/- వై. భద్రాజీ, కార్యనిర్వహణాధికారి (FAC)

ఆర్థిక సాయం పేరిట.. రూ.21 లక్షలకు టోకరా!

అడవినెక్కలం (ఆగిరిపల్లి), న్యూస్‌టుడే: ఇబ్బందుల్లో ఉన్న వారికి ఆర్థిక సాయం చేస్తామంటూ సామాజిక మాధ్యమాల వేదికగా పరిచయమైన సైబర్ కేటుగాళ్లు రూ.21 లక్షలకు టోకరా వేసిన ఘటన ఆగిరిపల్లి మండలం అడవినెక్కలంలో ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసుల కథనం మేరకు.. షేక్ హబీబ్ భాషా, మీరాబీ దంపతులు అడవినెక్కలంలో నివసిస్తున్నారు. కుమార్తె ఫర్జానా, అల్లుడు వలీ అదే గ్రామంలో ఉంటారు. అయితే మీరాబీకి ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ఉంది. అది కుమార్తె ఫర్జానా వినియోగిస్తోంది. గత ఏడాది ఆగస్టు నెలలో ఇన్‌స్టాగ్రామ్ ఖాతాకు యూట్యూబర్ హర్ష సాయి పేరుతో ఉన్న ఇన్‌స్టా ఖాతా నుంచి మీరు ఏదైనా ఇబ్బందుల్లో ఉంటే నగదు సాయం చేస్తామంటూ మెసేజ్ వచ్చింది. దానికి ఫర్జానా మాకు ఇబ్బందులు ఉన్నాయి.. సాయం కావాలని కోరడంతో సైబర్ కేటుగాళ్లు వాట్సాప్ నంబర్‌ను అడిగి దాని నుంచి ఉర్దూలో మాట్లాడటం ప్రారంభించారు. మీరు రూ.వెయ్యి పంపితే రూ.10 లక్షల ఆర్థిక సాయం చేస్తామని నమ్మబలికారు. దాంతో వారు రూ.వెయ్యి పంపారు. మీ నగదు సరిపోలేదు.. దానికి కొంచెం నగదు కట్టాలని ఈ ఏడాది ఆగస్టు 2 నుంచి డిసెంబర్ 31 వరకు పలు దఫాలుగా రూ.21 లక్షలు లాగేశారు. ఏదో కొంచెం నగదు చెల్లిస్తే పెద్ద మొత్తంలో నగదు వస్తుందనే ఆశతో.. వారికి ఆస్తులు, సొంత ఇల్లు కూడా లేకపోయినా.. ఇంట్లోని బంగారం తాకట్టు పెట్టి, బయట వడ్డీలకు తెచ్చి చెల్లించారు. సైబర్ కేటుగాళ్లు తర్వాత సరిగా స్పందించక పోవడంతో మోసపోయినట్లు గుర్తించిన బాధితులు ఆదివారం ఆగిరిపల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఎస్సై కె.శుభశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రాష్ట్ర స్థాయి చదరంగం పోటీల్లో సత్తా

పతకాలు సాధించిన క్రీడాకారులతో శిక్షకులు

ఏలూరు నగరం, న్యూస్‌టుడే: తిరుపతి వేదికగా శని, ఆదివారాల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి చదరంగం పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. అండర్-19 బాలికల విభాగంలో ఎ.తేజస్విని స్వర్ణం, అండర్-15 బాలుర విభాగంలో కొల్లా భావన్ రజత పతకాలు సాధించారు. వారిని డీఎస్‌డీవో ఎస్.ఎ.అజీజ్, శిక్షకుడు మహేశ్, మేనేజర్ సూర్యనారాయణ అభినందించారు.

కిసాన్ మోర్చాను బలోపేతం చేయాలి

స్థానిక నాయకులతో సమావేశమైన వెంకటేశ్వరరాజు

వీరవాసరం, న్యూస్‌టుడే: భాజపా కిసాన్ మోర్చాను బలోపేతం చేసేదిశగా నాయకులు కృషి చేయాలని జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు గాదిరాజు వెంకటేశ్వరరాజు పిలుపునిచ్చారు. ఆదివారం గ్రామంలో పర్యటించిన ఆయన త్వరలో జరగబోయే రైతు సమావేశాల కోసం ప్రతి గ్రామంలో ఐదుగురు రైతులతో కమిటీ వేయాలని స్థానిక నాయకులకు సూచించారు. భాజపా మండల అధ్యక్షుడు వేండ్ర దివాకర్, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి గండి దుర్గామహేశ్, వీరవాసరం సొసైటీ అధ్యక్షుడు వీరవల్లి శ్రీనివాసరావు, నీటి సంఘం అధ్యక్షుడు గవిరెడ్డి చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

పీజీ సీటు ఇప్పిస్తానని మోసగించిన వ్యక్తిపై కేసు

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: విదేశాల్లో పీజీ సీటు ఇప్పిస్తానని డబ్బు తీసుకుని అనంతరం ముఖం చాటేసిన వ్యక్తిపై బాధితుడి ఫిర్యాదు మేరకు జంగారెడ్డిగూడెం పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. ఎస్సై వీరప్రసాద్ కథనం మేరకు. . జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన షంషేర్ అహ్మద్ చింతలపూడి మండలంలోని పీహెచ్‌సీలో హెల్త్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. ఆయన కుమార్తె, మేనల్లుడులు ఎంబీబీఎస్ పూర్తిచేసి ఉన్నత చదువులకు విదేశాలు వెళ్లేందుకు ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో మహబూబ్‌నగర్ మరికల్ గ్రామానికి చెందిన గుండా రాఘవ.. విదేశాల్లో పీజీ సీటు ఇప్పిస్తానని అహ్మద్, అతడి బావతో నమ్మబలికాడు. దీంతో అహ్మద్, అతడి బావ దఫదఫాలుగా రూ.19.50 లక్షలు రాఘవకు ఇచ్చారు. డబ్బు తీసుకున్న తరువాత సీటు విషయం అడిగితే ముఖం చాటేయడంతో మోసపోయినట్లు బాధితులు గుర్తించారు. అహ్మద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

ఆన్‌లైన్‌లో వైజ్ఞానిక ప్రదర్శనలు

23 నుంచి 26 వరకు పోటీలు

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: జిల్లాలో జాతీయ సైన్సు దినోత్సవాన్ని (ఈ నెల 28) పురస్కరించుకుని వైజ్ఞానిక ప్రదర్శనల పోటీలు 23వ తేదీ నుంచి ఆన్‌లైన్ వేదికగా ప్రారంభం కానున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా సైన్సు సిటీ ఆధ్వర్యంలో 'సైన్సు సమగ్ర మహోత్సవం-2026' పేరుతో పోటీలు జరగనున్నాయి. అన్ని ప్రభుత్వ పాఠశాలల నుంచి నమూనాలను ప్రదర్శించాలని మార్గదర్శకాల్లో పేర్కొన్నారు. ఒక్కో పాఠశాలలో గైడ్ టీచర్ సహా 6- 9వ తరగతులకు చెందిన ముగ్గురు విద్యార్థులు బృందంగా నమోదు కావాలి. ఒక్కో పాఠశాల నుంచి గరిష్ఠంగా పది బృందాలు పోటీలో పాల్గొనవచ్చు. ఈ మేరకు లీప్ యాప్‌లో ఈ నెల 15న ప్రారంభమైన దరఖాస్తుల రిజిస్ట్రేషను ప్రక్రియ ఆదివారంతో ముగిసింది.

పోటీలు ఇలా.. ఈ నెల 23న ఉదయం 10 నుంచి 12 గంటల వరకు పాఠశాల స్థాయిలో పోటీలను నిర్వహించి విజేతల వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. పాఠశాల స్థాయి విజేతల నమూనాలతో ఈ నెల 24, 25 తేదీల్లో మండల స్థాయి పోటీలు నిర్వహిస్తారు. 26న విజేతలను నిర్ణయించి జిల్లాకు రెండు నమూనాల చొప్పున రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తారు. 26న రాష్ట్రస్థాయి పోటీలను నిర్వహించి విజేతలను అంతర్జాలంలో ప్రకటిస్తారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ మార్గదర్శకాలు జారీ చేశారు.

ముఖ్యమంత్రి చేతుల మీదుగా సత్కారం

పోటీల్లో పాల్గొన్న వారందరికీ ధ్రువపత్రం అందజేస్తారు. రాష్ట్రస్థాయి విజేత నమూనాలను ప్రదర్శించిన విద్యార్థులకు ముఖ్యమంత్రి చేతుల మీదుగా ధ్రువపత్రం, జ్ఞాపికలను అందజేస్తారు. ఆన్‌లైన్ వైజ్ఞానిక ప్రదర్శన కార్యక్రమాలను పర్యవేక్షించి నమోదు చేయనున్న ఆసియా/ ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థలు, పాల్గొన్న వారికి, విజేతలకు ధ్రువపత్రాలను అందజేస్తారని జిల్లా విద్యాశాఖాధికారి పేర్కొన్నారు.

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా) (కిలో 1 కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -115 రిటైల్ ధర 142 చికెన్ విత్ స్కిన్ - 206 చికెన్ స్కిన్‌లెస్ - 234.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 132, 141, 152 చికెన్ విత్ స్కిన్ - 250 చికెన్ స్కిన్‌లెస్ - 260.

సాగునీరు కరవు.. రైతు గుండె బరువు

నెర్రలు తీసిన పొలాన్ని చూపుతున్న రైతులు

ఆకివీడు, న్యూస్‌టుడే: ఆకివీడు మండలం చెరుకుమిల్లిలో వరి రైతులు సాగు నీటి కోసం సతమతమవుతున్నారు. ప్రస్తుతం రబీ సాగులో వంతుల వారీ విధానంలో సాగునీటిని సరఫరా చేస్తున్నారు. వంతు సమయంలో కూడా కాలువల ద్వారా నీరు అందడం లేదని అన్నదాతలు ఆదివారం ఆందోళన బాటపట్టారు. చెరుకుమిల్లిలోని భాస్కరకాలువ పరిధిలో సుమారు 500 ఎకరాల్లో వరిచేలు నీరులేక ఎండిపోతున్నాయని రైతులు ప్రధాన రహదారిపై నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు.

అప్పు చేసి సాగు చేశా..

నేను 14 ఎకరాలు కౌలుకు తీసుకొని వరి వేశా. ఈ నెల 12తో ఒక వంతు పూర్తి అయ్యింది. అప్పుడు పూర్తిస్థాయిలో నీరు అందలేదు. తర్వాత 18 నుంచి 23 వరకు వంతు సమయం అన్నారు. ఇప్పుడు అసలు నీరే రాలేదు. ఇప్పటి వరకూ ఎకరానికి రూ.25 వేలకుపైగా అప్పులు చేసి పెట్టుబడి పెట్టా. నీరు లేక వరి చేలు ఎండిపోతున్నాయి. అధికారులను అడిగితే స్పష్టమైన సమాధానం చెప్పడం లేదు. రాత్రి నిద్రపట్టడం లేదు. ఆందోళనగా ఉంది. **- మోహనరావు, కౌలు రైతు, చెరుకుమిల్లి**

ముందుకు నెట్టారు.. ముంచేశారు

నేను 5 ఎకరాల్లో కౌలు వ్యవసాయం చేస్తున్నా. వంతుల వారీ విధానంలో సాగునీటిని పూర్తిస్థాయిలో సరఫరా చేస్తాం.. సాగుకు సన్నద్ధం కండి అంటూ అధికారులు చెప్పారు. ఇప్పుడు సాగు మధ్యలోకి వచ్చాక నీటి సరఫరా కాకపోయినా పట్టించుకోవడం లేదు. ఇలా అయితే ఎలా?.

- శివరామరాజు, కౌలురైతు

92.7 FM Rajamahendravaram

ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact

9000180626, 9989993175

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph.81422 92071.

REAL ESTATE

HOUSE FOR SALE

తాడేపల్లిగూడెం సుబ్బారావుపేట, D.S. చెర్వు దగ్గర 1000 చ॥గ॥ స్థలంతో కూడిన ఇల్లు అమ్మబడును. ఉత్తరం, పడమర, తూర్పు రోడ్ కలదు. ✆ 97010 37775, 73966 22137.

LAND FOR SALE

బొమ్మిడి గ్రామం, ఉంగుటూరు మండలం, బాదంపూడి సమీపాన 4.5 ఎకరాల వ్యవసాయ భూమి అమ్మకం. Cont: 97010 37775, 73966 22137.

కృష్ణాజిల్లా మల్లవల్లి A.P. ఇండస్ట్రియల్ ఫుడ్‌పార్క్‌కు ఆనుకుని 6 ఎకరములు ఆదాయం వచ్చు మామిడితోట అమ్మకము. కాంటాక్ట్: 99483 16161.

JOBS

శివ కార్తికేయ హోంకేర్‌లో వృద్ధులు, పేషంట్స్, పిల్లలను చూసుకొనుటకు నర్సులు, వర్కర్స్ కావలెను. ఫ్రీ వసతి, భో.జీ. 20K. ✆ 99120 11499, 99120 11899

MARKETING/ SALES

Anand Masale Require Sales & Marketing Manager, Marketing Executives. Contact: 9849655105, 9848053144 Email: anandmasalaap-pltd@gmail.com.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనలద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటన కర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

నెక్ సూచించిన కోడిగ్రుడ్డ ధర

★ For the Information of Trade & Industry

★ గోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గ్రుడ్డు ధర రూ. 4.65 పై॥

తణుకు ఆఫీసు: 08819-224254

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం

ఏలూరు

• ఏలూరు • దెందులూరు • ఉంగుటూరు

ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

పెదపాడు, న్యూస్‌టుడే: ఇంటర్ పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు చీఫ్ సూపరింటెండెంట్ ఎం.శ్రీనివాస్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఇన్విజిలేటర్లతో సమావేశమై మాట్లాడారు. చూచిరాతకు అవకాశం లేకుండా పరీక్షలు నిర్వహించాలన్నారు. రోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు కొనసాగుతాయన్నారు. విద్యార్థులు ఉదయం 8.25 గంటలకల్లా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. ఆ తర్వాత ఎవరినీ అనుమతించబోమని ఆయన స్పష్టం చేశారు. డిపార్టుమెంటల్ అధికారి ఎ.శ్రీనివాసరావు, ఇన్విజిలేటర్లు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో మన్‌కీ బాత్

భీమడోలు, న్యూస్‌టుడే: పోలసానిపల్లి గురుకుల పాఠశాలలో భాజపా నాయకులు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని ఆదివారం వీక్షించారు. భాజపా నియోజకవర్గ కన్వీనర్ శరణాల మాలతీరాణి, మండలాధ్యక్షుడు బీవీ మూర్తి, నాయకులు సుశీలారాణి, ప్రవీణ్ పటేల్, శోభారాణి, రామలక్ష్మి పాల్గొన్నారు.

శిరస్త్రాణధారణ తప్పనిసరి

భీమడోలు, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా శిరస్త్రాణం ధరించాలని ఎస్సై మదీనా బాషా అన్నారు. పోలసానిపల్లిలో 16వ నంబరు జాతీయ రహదారిపై ఆదివారం వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా శిరస్త్రాణం ధరించని ద్విచక్ర వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. సుమారు 90 మందితో శిరస్త్రాణాలు కొనుగోలు చేయించారు.

గ్రామాల్లో వసతుల కల్పనకు ప్రాధాన్యం

సీసీ రోడ్డు పరిశీలిస్తున్న ధర్మరాజు

ఉంగుటూరు, న్యూస్‌టుడే: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యమిస్తున్నట్లు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. నిడమర్రు మండలం బువ్వనపల్లి సచివాలయం, ఆర్ఎస్‌కే, ఆరోగ్య ఉప కేంద్రాలకు వెళ్లే రోడ్డును సీసీ రహదారిగా అభివృద్ధి చేస్తున్నారు. ఈ పనులను స్థానిక నాయకులతో కలిసి ఆదివారం ఎమ్మెల్యే పరిశీలించి మాట్లాడారు. పనులను త్వరితం పూర్తి చేసి రహదారిని వినియోగంలోకి తీసుకొస్తామన్నారు. పదికాలాల పాటు రోడ్డు మన్నికగా ఉండేలా నిర్మించాలని గుత్తేదారుకు సూచించారు. ఆయన వెంట నాయకులు నిమ్మల దొరబాబు, వంగా రఘు తదితరులున్నారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

ఉంగుటూరు, న్యూస్‌టుడే: వెల్లమిల్లి, నారాయణపురం, బాదంపూడి, ఉంగుటూరు, యర్రమళ్ల విద్యుత్తు ఉప కేంద్రాల పరిధిలోని ఫీడర్లపై వాలిన చెట్ల కొమ్మలను సోమవారం తొలగిస్తున్నట్లు ఈఈ కేఎం అంబేద్కర్ తెలిపారు. వెల్లమిల్లి, నారాయణపురంలోని గృహాలకు, బాదంపూడి, నీలాద్రిపురం, గుళ్లపాడులోని వ్యవసాయ కనెక్షన్లకు ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా నిలిపేస్తామని ఆయన ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

పరీక్షిస్తారా.. నీరిస్తారా?

★ కేంద్రాల్లో సదుపాయాలు మృగ్యం
★ గ్రామీణ విద్యార్థులకు ఆటోలే దిక్కు

పరిశీలన

గణపవరం, ఉంగుటూరు, ఏలూరు గ్రామీణ, నిడమర్రు– న్యూస్‌టుడే: ఏలూరు, దెందులూరు, ఉంగుటూరు నియోజకవర్గాల్లో సోమవారం నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ దఫా సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు జరగనున్నాయి. ఒక్కో గదికి 28 మంది చొప్పున విద్యార్థులను కేటాయించారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. కొన్నిచోట్ల తాగునీరు, రవాణా సమస్య వేధిస్తోంది. ప్రధానంగా నిడమర్రు మండలంలోని చాలా గ్రామాలకు ఆర్టీసీ బస్సులు నడవకపోవడంతో... విద్యార్థులు ఆటోలు, ద్విచక్ర వాహనాల్లో పరీక్ష కేంద్రాలకు రావాల్సి ఉంది. పెదపాడు పరీక్ష కేంద్రానికీ రవాణా సౌకర్యం లేదు.

ఉంగుటూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నీటి శుద్ధి కేంద్రాలు పని చేయడం లేదు. వీటిని నెలలుగా బాగు చేయించలేదు. పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థుల సౌకర్యార్థం ప్లాస్టిక్ డబ్బాల్లో మంచినీరు తీసుకొచ్చి అందుబాటులో ఉంచారు.

గణపవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిడమర్రు మండలం చానమిల్లి, అడవికొలను, పెదనిండ్రకొలను, గుణపర్రు; ఉండి మండలం కలిగొట్ల, పాందువ్వ; గణపవరం మండలం కొత్తపల్లి, వల్లూరు, ముగ్గళ్ల, వాకపల్లి విద్యార్థులు చదువుతున్నారు. ఆయా గ్రామాలకు ఆర్టీసీ బస్సులు నడవడం లేదు. విద్యార్థులు ప్రైవేట్ వాహనాల్లో పరీక్ష కేంద్రానికి చేరుకోవాల్సి ఉంది.

ఎక్కడెక్కడ అంటే?

● గణపవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రంలో చాణక్య, బాలికల ఉన్నత పాఠశాల ప్లస్ విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఇక్కడ తాగునీటి సౌకర్యం లేదు. బయట నుంచి డబ్బాల్లో నీరు కొనుగోలు చేసి తీసుకొచ్చారు.

● భీమడోలులోని మాధురి, వెంకటేశ్వర కళాశాలల్లో పరీక్షలు జరగనున్నాయి. వెంకటేశ్వర కేంద్రంలో గీతాంజలి, వెంకటేశ్వర కళాశాలల విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. ఇక్కడ ప్రహరీ సౌకర్యం లేదు. మాధురి కళాశాలలో శ్రీనివాస జూనియర్, పోలసానిపల్లి, ద్వారకాతిరుమల గురుకులాలు, గుణ్ణంపల్లి ఉన్నత పాఠశాల ప్లస్ విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

విద్యార్థుల వివరాలిలా..

మండలం	ప్రథమ	ద్వితీయ
ఏలూరు	7,635	7,715
గణపవరం	193	211
ఉంగుటూరు	242	158
భీమడోలు	386	260
పెదపాడు	301	313
దెందులూరు	29	32

● పెదపాడు పరీక్ష కేంద్రంలో అప్పనవీడు జేఎంజే బాలికల జూనియర్ కళాశాల విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉంది. ఇక్కడ తగినన్ని మరుగుదొడ్లు లేవు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

ఏలూరు అర్బన్:	80085 74486	ఏలూరు టూటౌన్:	80085 74487
దెందులూరు:	80085 74535	పెదపాడు, పెదవేగి:	80085 74483
భీమడోలు:	80085 74527	నిడమర్రు గ్రామీణం:	97040 21765
ఉంగుటూరు:	94939 90333	గణపవరం:	99480 66777

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ? చాటపర్రు రోడ్డులో పంట కాలువ ఆక్రమించి వంతెనలు నిర్మిస్తున్నారు. దీంతో నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడుతోంది. సాగు, తాగునీటికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. **- వెంకటేశ్వరరావు, స్థానికుడు**

✔ వంతెన నిర్మాణ పనులను వెంటనే అడ్డుకుంటాం. ఆక్రమణదారులకు నోటీసులు ఇస్తాం. **- దుర్గారావు, కృష్ణా కాలువ ఏఈ**

దెందులూరు, న్యూస్‌టుడే: ? దెందులూరు శివారు ప్రాంతాల్లో వీధి దీపాలు సక్రమంగా వెలగడం లేదు. రాత్రివేళ చీకట్లో రాకపోకలు సాగించలేక పోతున్నాం. **- కృష్ణకుమార్, వాహనదారుడు**

✔ సిబ్బందిని పంపి దీపాలకు మరమ్మతులు చేయిస్తాం. అవసరమైతే కొత్తవి ఏర్పాటు చేస్తాం. **- గాయత్రి, పంచాయతీ కార్యదర్శి**

పెదపాడు, న్యూస్‌టుడే: ? కలపర్రు నుంచి పెదపాడు వెళ్లే డొంక రోడ్డు అధ్వానంగా ఉంది. వ్యవసాయోత్పత్తులు తరలించేందుకు ఇబ్బంది పడుతున్నాం. సమస్యను అధికారులకు తెలియజేశాం. డొంక రోడ్డును అభివృద్ధి చేయాలి. **- సుబ్బారావు, రైతు**

✔ డొంక రోడ్డును పరిశీలిస్తాం. దాన్ని అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటాం. **- రామసీత, ఎంపీపీ ఛైర్‌పర్సన్, దెందులూరు**

మమ్మేలమ్మా.. రాట్నాలమ్మ

రాట్నాలకుంట(పెదవేగి), న్యూస్‌టుడే: రాట్నాలకుంటలో కొలువైన రాట్నాలమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారుజామున అమ్మవారికి అభిషేకం, అర్చన చేసి పట్టువస్త్రాలు, ఆభరణాలు, విశేష పుష్పాలతో అలంకరించారు. మహిళలు పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. ఆలయ ప్రాంగణంలో పెద్ద నిర్మాణానికి ఛైర్మన్ శ్రీనివాసరావు శంకుస్థాపన చేశారు. పూజా టిక్కెట్లు, శీఘ్రదర్శనం విక్రయాలతో రూ.1,33,510 ఆదాయం వచ్చిందని ఈవో సతీశ్‌కుమార్ తెలిపారు.

నమో సూర్యనారాయణ నమః

పవరుపేట(ఏలూరు ఆధ్యాత్మికం): పవరుపేట సూర్య దేవాలయంలో ఆదివారం స్వామివారికి ప్రత్యేక పూజలు, అలంకరణలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయ ప్రదక్షిణ చేసి.. స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

గంగానమ్మ అన్నప్రసాద వితరణ

ఏలూరు ఆధ్యాత్మికం: తూర్పు, పడమర వీధుల్లో గంగానమ్మ జాతర ముగిసిన నేపథ్యంలో.. కొలుపుల కమిటీల ఆధ్వర్యాన ఆదివారం మహాన్న సమారాధన నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. అంతకుముందు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు. కమిటీల కన్వీనర్లు వంకినేని భానుప్రకాశ్, చోడే బాలు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఆలయ వార్షికోత్సవం

నారాయణపురం(ఉంగుటూరు): నారాయణపురం కోదండ రామాలయ వార్షికోత్సవం నేత్రపర్వంగా కొనసాగుతోంది. ఆదివారం మహా లక్ష్మికి ధన్వంతరి హోమం, లక్ష్మీ హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. పెద్దిరెడ్డి అప్పలరాజు, ఉమాదేవి దంపతులు ఆంజనేయస్వామి విగ్రహానికి రూ.25 వేలు విలువైన వెండి చాలు(తొడుగు) కానుకగా సమర్పించారు.

ఘనంగా శిఖర ప్రతిష్ఠ

భీమడోలు: కొరుకొల్లు పెద్దింట్లమ్మ ఆలయ శిఖర ప్రతిష్ఠ, గుండుగొలను ఆంజనేయస్వామి ఆలయంలో స్వామివారి విగ్రహ పునఃప్రతిష్ఠ మహోత్సవాలు ఆదివారం నిర్వహించారు. ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

నాయకత్వ లక్షణాల పెంపునకు దోహదం

బొమ్మిడి(ఉంగుటూరు), న్యూస్‌టుడే: విద్యార్థుల్లో క్రమశిక్షణ, దేశభక్తి, నాయకత్వ లక్షణాలు, సేవాభావం పెంపొందించడమే స్కౌట్, గైడ్స్ లక్ష్యమని ప్రధానోపాధ్యాయిని శ్రీదేవి తెలిపారు. స్థానిక బొమ్మిడి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం ప్రపంచ స్కౌట్స్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా స్కౌట్ వ్యవస్థాపకుడు రాబర్ట్ బాడెన్ పావెల్ చిత్రపటానికి నివాళులర్పించారు. శిక్షకులు గొల్లపల్లి రామారావు, సురేశ్ పాల్గొన్నారు.

ఉంగుటూరు: చిత్రపటం నివాళులర్పిస్తున్న శ్రీదేవి

వట్లూరు(పెదపాడు): విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపునకు స్కౌట్ దోహదపడుతుందని స్కౌట్, గైడ్స్ జిల్లా కార్యదర్శి భాస్కర్‌కుమార్ అన్నారు. వట్లూరు అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో ఆదివారం ప్రపంచ స్కౌట్స్ దినోత్సవం నిర్వహించారు. తొలుత రాబర్ట్ బాడెన్ పావెల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రధానోపాధ్యాయిని దాసరి మేరీ రూన్సీరాణి, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

కార్మికులకు పని భద్రత కల్పించండి

మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: కార్మికులకు పని భద్రత కల్పించాలని ఇఫ్టూ రాష్ట్ర సహాయ కార్యదర్శి యు.వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక ఇఫ్టూ కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశం ఆదివారం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు కేవీ రత్నం అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని భాజపా ప్రభుత్వం కార్మికులపై దాడులు చేస్తోందని, పని గంటలను పెంచి భారం మోపుతోందని ధ్వజమెత్తారు. కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. జిల్లా కార్యదర్శి బద్దా వెంకట్రావు మాట్లాడుతూ.. సర్వజన ఆసుపత్రిలో రోగులకు మెరుగైన సేవలందించాలని కోరారు. నాయకులు రామ్మోహనరావు, ఎం.ప్రసాద్, శ్రీనివాసరావు, గ్రేష్మాకుమార్, నాగరాజు పాల్గొన్నారు.

బడి పరిసరాలు శుభ్రం

నిడమర్రు(గ్రామీణం), న్యూస్‌టుడే: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల సమీప శిథిల భవన పరిసరాలను అధికారులు ఎట్టకేలకు శుభ్రం చేయించారు. 'శిథిలమై... నిర్లక్ష్య భరితమై' శీర్షికన ఈ నెల 14న 'ఈనాడు'లో ప్రచురితమైన చిత్ర కథనానికి ఎంఈవో-2 శేషగిరిరావు స్పందించి, సమస్య పరిష్కరింపజేశారు.

దీపాలకు మరమ్మతులు.. క్రొవ్విడి గ్రామ శివారులో దెబ్బతిన్న వీధి దీపాలను అధికారులు మరమ్మతులు చేయించారు. 'మేమున్నాం.. మీకు తోడుగా'లో ఈ నెల 17న ప్రచురితమైన వార్తకు మండల అధికారులు స్పందించారు. సిబ్బందిని పంపి దీపాలను బాగు చేయించారు.

సుభానికి కళాశ్రీ పురస్కారం

జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందజేస్తున్న నిర్వాహకులు

ఏలూరు (గ్రామీణ, న్యూస్‌టుడే: నగరానికి చెందిన షేక్ సుభానిని కళాశ్రీ పురస్కారం వరించింది. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా.. విజయవాడ నగరంలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో భాషాభివృద్ధికి తోడ్పాటునందిస్తున్న పలువురికి పురస్కారాలు ప్రదానం చేశారు. పొట్లూరి హరికృష్ణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సుభానిని సత్కరించి జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందజేశారు. ఆయన సేవలను పలువురు వక్తలు కొనియాడారు. సుభానిని పలువురు నగరవాసులు, కళాభిమానులు అభినందించారు.

తాళం తీయక.. విజ్ఞానం పంచక!

ఏలూరు గ్రామీణ మండలం చాటపర్రులోని శాఖా గ్రంథాలయం తలుపులు ఆదివారం సాయంత్రం తెరవలేదు. పాఠకులు చాలాసేపు నిరీక్షించి వెనక్కి వెళ్లిపోయారు. గ్రంథ పాలకురాలితో మాట్లాడి రోజూ తెరిచేలా చూస్తామని జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ కార్యదర్శి శేఖర్‌బాబు తెలిపారు. **- న్యూస్‌టుడే, చాటపర్రు(ఏలూరు గ్రామీణ)**

నీరు రంగుమారి.. గొంతు తడారి

పెదపాడు మండలం రాజుపేట మంచినీటి చెరువులో గుర్రపు డెక్క, నాచు పెరిగిపోయాయి. వాటిని తొలగించకపోవడంతో నీరు కలుషితమై దుర్వాసన వస్తోంది. వేసవిలో గ్రామస్థులకు చెరువు నీరే దిక్కు. గుర్రపు డెక్క, నాచు తొలగించి.. నీటిని శుభ్రం చేయాలని స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, రాజుపేట (పెదపాడు)**

నాణ్యత లేక.. రోడ్డు నిలవక!

ఏలూరు గ్రామీణ మండలం వెంకటాపురం శివారు హనుమాన్ నగర్‌లో గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన సీసీ రోడ్డుకు నెర్రలిచ్చింది. గుత్తేదారు కనీస నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంతో.. ముక్కలుగా విరిగిపోయింది. గత పాలకులు నాణ్యతకు తిలోదకాలివ్వడంతో స్థానికులు పెదవి విరుస్తున్నారు. **- న్యూస్‌టుడే, ఏలూరు గ్రామీణ**

కాలువ.. నిర్లక్ష్యం చూడవా!

ఏలూరు నగరం ఆర్టీసీ గ్యారేజీ పక్కనున్న మురుగు కాలువ చెత్తాచెదారంతో నిండిపోయింది. నెలల తరబడి శుభ్రం చేయకపోవడంతో దుర్వాసన వస్తోంది. దోమల బెడద సైతం అధికంగా ఉంటోందని స్థానికులు చెబుతున్నారు. రాత్రివేళ ప్రశాంతంగా నిద్రించలేక పోతున్నామని వారు వాపోతున్నారు. **- న్యూస్‌టుడే, పవరుపేట(ఏలూరు అర్బన్)**

ఎత్తు తక్కువ.. ప్రమాదం ఎక్కువ

నిడమర్రు మండలం నిత్తోకలపల్లి ఇందిరమ్మ కాలనీలో విద్యుత్తు నియంత్రిక, ఫ్యూజు పెట్టె తక్కువ ఎత్తులో ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. ఈ మార్గంలో రోజూ పిల్లలు, పెద్దలు, పశువులు తిరుగుతుంటాయి. ఏమాత్రం ఏమరపాటు వహించినా.. ప్రమాదం సంభవించే అవకాశముంది. **- న్యూస్‌టుడే, నిడమర్రు గ్రామీణం**

చెత్త తొలగక.. సమస్య తీరక

పెదవేగి మండలం కూచింపూడి చెరువుగట్టు వద్ద ప్రధాన రహదారి వెంబడి చెత్తాచెదారం పేరుకుపోయింది. వీటిని రోజులు తరబడి తీయకపోవడంతో దుర్వాసన వస్తోంది. రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్త తొలగింపునకు చర్యలు తీసుకుంటామని పంచాయతీ కార్యదర్శి సురేశ్ తెలిపారు. **- న్యూస్‌టుడే, కూచింపూడి(పెదవేగి)**

చదువులమ్మ చెట్టు నీడలో..!

43 ఏళ్ల తర్వాత కలిసిన పూర్వ విద్యార్థులు

నారాయణపురం(ఉంగుటూరు), న్యూస్‌టుడే: నారాయణపురం జడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు సుమారు 43 ఏళ్ల తర్వాత చదువులమ్మ చెట్టు నీడలో ఆత్మీయంగా కలుసుకున్నారు. స్థానిక పాఠశాలలో 1982-83 మధ్య పదో తరగతి అభ్యసించిన వారంతా.. ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. నాటి మధుర స్మృతులను గుర్తు తెచ్చుకుని ఆనంద పరవశులయ్యారు. వివిధ కారణాలతో చనిపోయిన బాల్య మిత్రులు, ఉపాధ్యాయుల చిత్రపటాలకు నివాళులర్పించారు. పాఠశాల అభివృద్ధికి తోడ్పాటునందించాలని నిర్ణయించారు. విద్యా బుద్ధులు నేర్పిన నాటి గురువులను ఘనంగా సత్కరించారు. ఏర్పాట్లను యెలిశెట్టి పాపారావు బాబ్జి, రాధారాణి, కరారి కిశోర్ కుమార్, బండి ధర్మారావు, గోవింద్ పర్యవేక్షించారు.

రెండున్నర కి.మీ.. వదిలేశారేమి!

నిర్మాణంలో అధికారుల ఉదాసీనత

వట్లూరు(పెదపాడు), న్యూస్‌టుడే

పెదపాడు మండలం వట్లూరు నుంచి సీతారామపురం మీదుగా దుగ్గిరాల బైపాస్‌కు వెళ్లే జడ్పీ రహదారి అధ్వానంగా మారింది. సుమారు రెండున్నర కిలోమీటర్ల మేర గుంతలు రాకపోకలు సాగించలేని విధంగా తయారైంది. వట్లూరు నుంచి పదహారో నంబరు జాతీయ రహదారిపైకి దగ్గరి మార్గం కావడంతో.. పెదపాడు, పెదవేగి మండలాల ప్రజలు పెద్ద సంఖ్యలో ప్రయాణిస్తుంటారు. వట్లూరు సమీప వివిధ కళాశాలల్లో చదివే విద్యార్థులు వందలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు.

తట్టెడు మట్టి పోయక..

ఈ రోడ్డు అభివృద్ధిని గత వైకాపా ప్రభుత్వం విస్మరించింది. దారంతా గుంతలు పడి, కంకర తేలి అధ్వానంగా మారినా.. తట్టెడు మట్టి పోసిన దాఖలాల్లేవు. దాంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడే వారు. సాధారణ ఎన్నికల ముందు హడావుడిగా జడ్పీ నిధుల నుంచి కొంత మొత్తాన్ని కేటాయించారు. వట్లూరు నుంచి సీతారామపురం వరకు రోడ్డు నిర్మించారు. మిగతా రెండున్నర కిలోమీటర్లు వదిలేయడంతో సమస్య నెలకొంది. 'వైకాపా ప్రభుత్వ హయాంలో నిధులొచ్చినా.. పనులు చేయలేదు. దాంతో నిధులు వెనక్కి వెళ్లాయి. మళ్లీ ప్రతిపాదనలు పంపుతాం. నిధులు రాగానే పనులు ప్రారంభిస్తాం' అని పీఐయూ డీఈ సురేశ్ తెలిపారు.


అధ్వానంగా వట్లూరు- దుగ్గిరాల రహదారి

తవ్వేస్తూ.. యథేచ్ఛగా అమ్మేస్తూ!

ఏలూరు నుంచి జానంపేట వెళ్లే మార్గంలో జాతీయ రహదారి పక్కనున్న తమ్మిలేరులో రాత్రింబవళ్లు తేడా లేకుండా మట్టి తవ్వేస్తున్నారు. నిత్యం టిప్పర్ల ద్వారా వందలాది ట్రిప్పుల్లో మట్టి తరలిస్తున్నారు. బహిరంగంగా పొక్లెయిన్ల సాయంతో తవ్వకాలు కొనసాగుతున్నా.. అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండటం విమర్శలకు తావిస్తోంది. **- ఈనాడు, ఏలూరు**

27 నుంచి రామరాజ్య పట్టాభిషేకం

నిడమర్రు, న్యూస్‌టుడే: అడవికొలనులో ఈ నెల 27 నుంచి మూడ్రోజుల పాటు రామరాజ్య పట్టాభిషేక ఉత్సవాలు నిర్వహించనున్నారు. 27న హనుమంత వాహన సేవ, 28న సీతారామ కల్యాణం, గజ వాహన సేవ జరగనుంది. మార్చి 1న మహాసామ్రాజ్య పట్టాభిషేకం, అఖండ అన్న సమారాధన, రథయాత్ర ఉంటుందని అర్చకుడు చక్రవర్తుల సుబ్బారావు తెలిపారు.

శివారు.. తప్పని బేజారు!

వసతుల కల్పనలో పాలకుల విఫలం

నివాసాల మధ్య ఖాళీ స్థలంలో పిచ్చిమొక్కలు

చాటపర్రు(ఏలూరు గ్రామీణ), న్యూస్‌టుడే: ఏలూరు గ్రామీణ మండలంలో చాటపర్రు మేజర్ పంచాయతీ. అక్కడ అభివృద్ధి మాత్రం ఆశించిన స్థాయిలో జరగడం లేదు. బీసీ కాలనీ ఏర్పడి రెండున్నర దశాబ్దాలు గడుస్తున్నా.. కనీస సదుపాయాలు కల్పించలేదు. ఫలితంగా సుమారు 300 కుటుంబాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ విద్యుత్తు, డ్రెయిన్లు, రహదారులు తదితర సౌకర్యాలు కల్పించకపోవడంతో.. ఇళ్ల నిర్మాణాలకు ఖాళీ జాగాల యజమానులు ముందుకురావడం లేదు.

అస్తవ్యస్తంగా డ్రెయిన్లు

కాలనీలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. చిన్నపాటి వర్షానికీ నీరు రోడ్డుపైకి చేరుతోంది. ఖాళీ స్థలాల్లో జమ్ము, పిచ్చిమొక్కలు పెరిగిపోయి కాలుష్య కాసారాలుగా మారాయి. రాత్రుళ్లు కీటకాలు, విష సర్పాలు ఇళ్లలోకి వస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. దీనికితోడు దోమల బెడదతో ప్రశాంతంగా నిద్రించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మట్టి దారులే గతి..

కాలనీలో నేటికీ మట్టి రోడ్లే దర్శనమిస్తున్నాయి. చిన్నపాటి వానకే చిత్తడిగా మారాయి. ఆయా దారుల్లో రాకపోకలు సాగించలేక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. వీధి దీపాలు సైతం సరిగా వెలగకపోవడంతో పొద్దుపోతే చాలు.. అంధకారం రాజ్యమేలుతోంది. అధికారులు స్పందించి కాలనీలో సదుపాయాలు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు. కాలనీలో అభివృద్ధి పనులు చేసేందుకు చర్యలు తీసుకుంటామని పంచాయతీ కార్యదర్శి వర్మ తెలిపారు.

వాహనదారులూ.. జాగ్రత్త!

ఏలూరు గ్రామీణ మండలం చాటపర్రులో రహదారి మధ్య ధ్వజస్తంభం ఆకృతిలో దీపాలు వెలిగించే స్తంభముంది. పూర్వం ఇందులో దీపం వెలిగించే వారని స్థానికులు చెబుతున్నారు. పైభాగంలో విద్యుద్దీపమున్నా వెలగడం లేదు. స్తంభం అడుగు భాగాన వాహనదారులూ జాగ్రత్తని రాసి ఉంది. అధికారులు పరిశీలించి రాకపోకలకు ఇబ్బందుల్లేకుండా చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు. **- ఈనాడు, ఏలూరు**

పనులయ్యేనా.. నీరందేనా!

నిలిచిన పథకం పనులు

నిడమర్రు, న్యూస్‌టుడే: పెదనిండ్రకొలను కొల్లేరు రోడ్డులోని పెద్దింటమ్మ కాలనీకి తాగునీరందించేందుకు ప్రారంభించిన మంచినీటి పథకం పనులు నిలిచిపోయాయి. దశాబ్దం కిందట కాలనీలో సుమారు 200 మందికి పైగా లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందజేశారు. ఇక్కడ వసతులు లేకపోవడంతో.. గృహాలు నిర్మించుకునేందుకు ఎవరూ ముందుకు రాలేదు. కేవలం 40 మంది మాత్రమే ఇళ్లు కట్టుకున్నారు. కాలనీకి తాగునీటి సౌకర్యం లేకపోవడంతో వారు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

జల్‌జీవన్ నిధులు రూ.78.5 లక్షలతో..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టింది. 2024 అక్టోబరు 19న జల్ జీవన్ మిషన్ కింద రూ78.5 లక్షలతో మంచినీటి పథక నిర్మాణానికి ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు శంకుస్థాపన చేశారు. ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణం చివరి దశకు చేరింది. సంపు, పైపులైను, మైక్రో ఫిల్టర్ నిర్మించాల్సి ఉంది. నిధుల విడుదలలో జాప్యం చోటు చేసుకోవడంతో.. గుత్తేదారు పనులు ఆపేశారు. అధికారులు స్పందించి పనులు త్వరితం పూర్తయ్యేలా చొరవ చూపాలని కోరుతున్నారు.

అసంపూర్తిగా ట్యాంకు నిర్మాణం

గాయపడిన వృద్ధుడి మృతి

గణపవరం, న్యూస్‌టుడే: పిప్పరకు చెందిన మిరియాల నాగేశ్వరరావు తన తండ్రి ఆదినారాయణ(82), కుమార్తె గాయత్రితో కలిసి ఈ నెల 20న ద్విచక్ర వాహనంపై తాడేపల్లిగూడెం మండలం దండగర్రలో శుభకార్యానికి వెళ్లారు. తిరిగి స్వగ్రామానికి తిరిగి వెళ్తుండగా.. మార్గం మధ్యలో కారు ఢీకొంది. ఈ ఘటనలో ద్విచక్ర వాహనంలో ప్రయాణిస్తున్న ముగ్గురికి గాయాలయ్యాయి. వారిని 108 వాహనంలో తాడేపల్లిగూడెం ప్రాంతీయాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం నిమిత్తం ఆదినారాయణను తణుకులోని ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. బాధిత కుటుంబ సభ్యుడు మిరియాల సుబ్రహ్మణ్యం ఫిర్యాదు మేరకు ఎస్సై ఎం.మణికుమార్ కేసు నమోదు చేశారు.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో, ఏలూరు జిల్లా
I.A.398/2025 In FDIA.2182/1998
IN O.S.No.95/1986
Between:
పట్టి రత్నమణెమ్మ & ఇతరులు ... పిటిషనర్స్
మరియు
వెజ్జు రామచంద్రరావు
మరియు ఇతరులు ... రెస్పాండెంట్స్
To,
R 31 కొట్టె అనంత W/o. శ్రీకాంత్, R/o. రాజులపేట, భీమడోలు మండలం,ప.గో॥జిల్లా.
పై నెంబరు పిటిషన్ లో 31వ ప్రతివాది యొక్క హాజరు నిమిత్తం ది.09.03.2026వ తేదీ వాయిదా అయివున్నది.
కావున 31వ ప్రతివాది ది.09.03.2026వ తేదీ ఉదయం 10.30 గం॥లకు పై కోర్టు వారి ఎదుట ప్రత్యక్షంగా కాని, ప్లీడరు ద్వారా కాని హాజరు కావలెను. లేనిచో పై పిటిషన్ వారి పరోక్షంలో తీర్మానించబడును.
బి.గౌరీశంకర్, అడ్వకేట్, ఏలూరు

(c) eenadu

చింతలపూడి

•చింతలపూడి •పోలవరం

8 కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలు

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: సోమవారం నుంచి నిర్వహించే ఇంటర్మీడియట్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు జంగారెడ్డిగూడెం ఇంటర్మీడియట్ పరీక్షల కస్టోడియన్ శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. ఈ నెల 23 నుంచి మార్చి 18 వరకు ఇంటర్ పరీక్షలు జరుగుతాయన్నారు. జంగారెడ్డిగూడెంలో 8 సెంటర్లలో జనరల్, ఒకేషనల్ సబ్జెక్టుల్లో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇంటర్ మొదటి సంవత్సరం 2,357 మంది విద్యార్థులు, రెండో సంవత్సరం 2191 విద్యార్థులు జనరల్ సబ్జెక్టుల్లో పరీక్షలకు హాజరవుతారని, ఒకేషనల్ మొదటి సంవత్సరం 762 మంది విద్యార్థులు, రెండో సంవత్సరం 619 మంది విద్యార్థులు పరీక్షలకు హజరుకానున్నట్లు తెలిపారు. విద్యార్థులను ఉదయం 8.30 గంటల నుంచి పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తామని పరీక్షలు సీసీ కెమెరాల పర్యవేక్షణలో జరుగుతాయని వివరించారు.

క్రీడాకారుల్ని ప్రోత్సహించేందుకు దోహదం

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: క్రీడాకారుల్ని ప్రోత్సహించేందుకు ఇలాంటి టోర్నమెంట్‌లు దోహదపడతాయని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు అన్నారు. ద్వారకాతిరుమలలో ద్వారకా స్పోర్ట్స్ స్టార్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న షటిల్ టోర్నమెంట్‌ను ఆయన ఆదివారం తిలకించారు. ఈ సందర్భంగా క్రీడల్లో ఉత్తమ ప్రదర్శన చేసిన ఏలూరుకు చెందిన కె.కార్తిక్‌కు ఆయన ప్రోత్సాహక బహుమతి అందజేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉత్తమ ప్రదర్శన చేసిన క్రీడాకారుడికి బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకటరాజు

కనులపండువగా ఊరేగింపు

అలంకరణలో అమ్మవారు

వేలేరుపాడు(జీలుగుమిల్లి), న్యూస్‌టుడే: మండలంలోని దర్భగూడెంలో భూలక్ష్మీదేవి ఆలయ వార్షికోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం తెల్లవారుజామున వేదపండితుల మంత్రోచ్ఛారణలతో అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించారు. పూలమాలలు, ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం గ్రామంలోని పలు వీధుల్లో ఊరేగింపు కనుల పండువగా నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి పూజలు చేశారు.

ఇదీ తీరు.. ఏం చేద్దాం సారూ..!

● అట్టడుగున కుక్కునూరు.. అగ్రాన కొయ్యలగూడెం ● సంక్షేమ వసతి గృహాలపై ఐవీఆర్‌ఎస్ సర్వే

కొయ్యలగూడెం గ్రామీణ, కుక్కునూరు, బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: సంక్షేమ వసతి గృహాల నిర్వహణపై ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన ఐవీఆర్‌ఎస్ సర్వే ఫలితాలు వెల్లడయ్యాయి. గతేడాది డిసెంబరు, ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి నెలల్లో సర్వే నిర్వహించారు. సాంఘిక, గిరిజన, వెనుకబడిన తరగతుల సంక్షేమ వసతి గృహాలకు సంబంధించి శాఖల వారీగా ఫలితాలు విడుదల చేశారు.

కూటమి ప్రభుత్వ హయాంలో..

వైకాపా ప్రభుత్వ హయాంలో సంక్షేమ వసతి గృహాలు పూర్తిగా నిర్లక్ష్యానికి గురయ్యాయి. కూటమి ప్రభుత్వం వచ్చీరావడంతోనే వీటి అభివృద్ధిపై దృష్టి సారించింది. శిథిల భవనాలు, మరుగుదొడ్లకు మరమ్మతులు, కొత్త భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. క్రీడాపరికరాలను సరఫరా చేసింది. దుప్పట్లు, బెడ్‌షీట్లను అందజేసింది. తాగునీటికి శుద్ధిజల యంత్రాలను అందుబాటులోనికి తీసుకొచ్చింది.

సాంఘిక సంక్షేమ వసతిగృహాల్లో..

సర్వేలో అడిగిన ప్రశ్నలు-స్పందన ఇలా..

కుక్కునూరులోని బాలుర వసతిగృహం సర్వే ఫలితాల్లో రాష్ట్రంలోనే అట్టడుగున ఉంది. మెనూ ప్రకారం భోజనం అందజేస్తున్నారా ?, హాస్టల్లో తాగునీరు, పారిశుద్ధ్య నిర్వహణపై సంతృప్తిగా ఉన్నారా? అన్న ప్రశ్నలకు నూరు శాతం మంది లేదని సమాధానమివ్వడం గమనార్హం. వసతిగృహ సంక్షేమాధికారి పని తీరుపై 60 శాతం మంది సంతృప్తి వ్యక్తం చేయగా మొత్తంగా 80 శాతం తీవ్ర అసంతృప్తి వ్యక్తమైంది.

గిరిజన సంక్షేమ..

కొయ్యలగూడెంలోని పోస్ట్‌మెట్రిక్ కళాశాల బాలుర వసతిగృహం పని తీరుపై సర్వే ఫలితాల్లో 67.69 శాతం మంది వ్యతిరేకత వ్యక్తం చేశారు. వసతిగృహంలో అందిస్తున్న ఆహారంపై సంతృప్తిగా ఉన్నారా అన్న ప్రశ్నకు 53.85 శాతం, గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో భోజనం ఎలా ఉందన్న ప్రశ్నకు 50 శాతం మంది లేదని జవాబిచ్చారు. విద్యాలయాలు, వసతిగృహాల్లో వసతులు ఎలా ఉన్నాయన్న ప్రశ్నకు 50 శాతం మంది, అవాంఛనీయ సంఘటనల నివారణకు ప్రభుత్వచర్యలపై మీ అభిప్రాయం ఏమిటన్న ప్రశ్నకు 66.67 శాతం మంది అసంతృప్తి వ్యక్తం చేశారు.

పులిరాముడుగూడెం రాష్ట్రంలోనే బెస్ట్

బుట్టాయగూడెం మండలం పులిరాముడుగూడెం గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల 95 శాతం అనుకూల ఫలితాలతో రాష్ట్రంలోనే అగ్రస్థానం సాధించడం విశేషం. చింతలపూడిలోని గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల 85.42 శాతంతో ఫలితాల్లో 12వ స్థానంలో నిలిచింది.

10 AM to 1 PM మేమున్నాం.. మీకు తోడుగా..

జంగారెడ్డిగూడెం: 80085 74478
కొయ్యలగూడెం: 80085 74947
చింతలపూడి: 76759 19086

చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే: ? చింతలపూడి పట్టణం మారుతీ నగర్‌లో వీధి దీపాలు వెలగడంలేదు. మురుగునీరు ప్రవహించక దోమలు విజృంభిస్తున్నాయి. -**రామకృష్ణ, స్థానికుడు**

✔వెలగని వీధి దీపాలకు మరమ్మతులు చేస్తాం. మురుగునీరు ప్రవహించే విధంగా చర్యలు తీసుకుంటాం. -**రాంబాబు, నగర పంచాయతీ కమిషనర్**

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

జంగారెడ్డిగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం మండలంలోని లక్కవరం గ్రామంలో పారిశుద్ధ్య పనులను అధికారులు శనివారం చేపట్టారు. 'పారిశుద్ధ్యం.. అస్తవ్యస్తం' శీర్షికన శనివారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి లక్కవరం పంచాయతీ అధికారులు స్పందించారు. కార్యదర్శి వై. కొండలరావు ఆధ్వర్యంలో గ్రామంలో పలు వీధుల్లో మురుగు కాలువలను శుభ్రం చేయించారు. అలాగే చెత్త, ఇతర వ్యర్థాలను డంపింగ్ యార్డుకు తరలించి బ్లీచింగ్ చల్లారు.

గొయ్యి పూడ్చారు

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం పట్టణంలోని ప్రధాన తపాలా కార్యాలయం ఎదుట మంచినీటి పైపులైను మరమ్మతుల కోసం తవ్విన గొయ్యిని పురపాలక అధికారులు ఆదివారం పూడ్చారు. 'గొయ్యి ఇలా..రాకపోకలు ఎలా?' శీర్షికన 'ఈనాడు'లో ఆదివారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పురపాలక కమిషనర్ కేవీ రమణ ఆధ్వర్యంలో సిబ్బంది గొయ్యిని పూడ్చారు. సమస్యను పరిష్కరించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రేపటి నుంచి శ్రీరత్నతులసి ఉత్సవాలు

కామవరపుకోట, న్యూస్‌టుడే: మండలంలో తడికలపూడి శివారు రత్నగిరినగర్‌లో శ్రీరత్నతులసీ అమ్మవారి ఆలయం వద్ద 61వ వార్షిక పవిత్రోత్సవాలు ఈ నెల 24 నుంచి ప్రారంభం కానున్నాయి. వారం రోజుల పాటు నిర్వహించే ఈ ఉత్సవాల్లో భాగంగా ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు, రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు చెప్పారు. 27న అమ్మవారి ఊరేగింపు, వచ్చే నెల 2న అమ్మవారి అగ్నిగుండ ప్రవేశం కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

మానసిక ఉల్లాసం ముఖ్యం

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: యాంత్రిక జీవన విధానంలో ప్రతి మనిషికి మానసిక ఉల్లాసం ఎంతో ముఖ్యమని చింతలపూడి శాసనసభ్యుడు సొంగా రోషన్ కుమార్ అన్నారు. జంగారెడ్డిగూడెం పట్టణంలోని అల్లూరి సీతారామరాజు మున్సిపల్ పార్కులో 'హ్యాపీ సండే' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒత్తిడిని దూరం చేసే విధంగా ఆటపాటలు, యోగా, ఇతర కార్యక్రమాలతో ఉల్లాసంగా గడిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతి రెండు, నాలుగు ఆదివారాల్లో పురపాలక సంఘాల ఆధ్వర్యంలో హ్యాపీ సండే కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం పార్కు ఆవరణలో ఎమ్మెల్యే కొద్దిసేపు షటిల్ ఆడారు. కార్యక్రమంలో తెదేపా పట్టణ అధ్యక్షుడు కొండ్రెడ్డి కిశోర్ కూటమి నాయకులు రావూరి కృష్ణ, పరిమి సత్తిపండు, గుమ్మడి ప్రసాద్, పెనుమర్తి రాంకుమార్, అర్జుల మురళీ తదితరులు పాల్గొన్నారు.

రత్నగిరినగర్ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోషన్‌కుమార్

మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం

కామవరపుకోట, జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ చెప్పారు. ఆదివారం మండలంలోని తడికలపూడి, రత్నగిరినగర్, సాగిపాడు గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం పార్టీ కార్యకర్తల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే గంటా మురళీరామకృష్ణతో కలిసి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు కిలారు సత్యన్నారాయణ, జుజ్జూరి బాబ్జి, సతీష్, తూతా బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం పట్టణం, మండలానికి సంబంధించిన పలువురు బాధిత కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను చింతలపూడి శాసనసభ్యుడు సొంగా రోషన్‌కుమార్ ఆదివారం అందించారు. 16 మందికి రూ.6,80,215 విలువైన చెక్కులను అందించినట్లు తెలిపారు.

నాణ్యత ప్రమాణాలు పాటించడం తప్పనిసరి

పోలవరం, న్యూస్‌టుడే: మండలంలో ఇటుకలకోట నుంచి రేపల్లెవాడ కూడలి వరకు రూ.3.30 కోట్లతో నిర్మించే బీటీ రోడ్డు నిర్మాణానికి ఆదివారం ట్రైకార్ సంస్థ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు స్పోర్ట్సు అథారిటీ డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరితో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం బొరగం మాట్లాడుతూ మారుమూల గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించడానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. రోడ్డు నిర్మాణంలో గుత్తేదారులు నాణ్యత ప్రమాణాలు తప్పని సరిగా పాటించాలన్నారు. వారి వెంట కూటమి నాయకులున్నారు.

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన బొరగం శ్రీనివాసులు

స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించాలి

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ స్వదేశీ ఉత్పత్తులు, వస్తువులను ప్రోత్సహించాలని భాజపా ఎస్టీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి వంకా కాంచనమాల కోరారు. ప్రధానమంత్రి మోదీ ఆదివారం నిర్వహించిన మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించేందుకు బుట్టాయగూడెంలో ప్రత్యేకించి టీవీ తెరలను ఏర్పాటు చేశారు. ఏఎంసీ వైస్ ఛైర్మన్, భాజపా నియోజకవర్గ కన్వీనర్ కొండేపాటి రామకృష్ణ, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు అరవాలరాజు, ఎస్సీ మోర్చా జిల్లా కార్యదర్శి ధర్మరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

బుట్టాయగూడెంలో 'మన్‌కీ బాత్' వీక్షిస్తున్న విద్యార్థులు

ఎంపీ చిత్రపటానికి క్షీరాభిషేకం

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: రాజవరం పంచాయతీ పరిధి మూడు పుంతల కూడలి నుంచి గంగవరం వరకు రహదారి అభివృద్ధికి ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ ఇచ్చిన హామీ పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తూ ఆదివారం రాత్రి ఆయన చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు వాడపల్లి రాధాకృష్ణ, వాడపల్లి రమేష్, బల్లె కేసుబాబు, చంద్రరావు, చంద్ర మహేశ్, అనిల్, భాస్కర్ పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

కన్నెగంటి దేశభక్తి స్ఫూర్తిదాయకం

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: స్వాతంత్ర్య పోరాట యోధుడు కన్నెగంటి హనుమంతు దేశభక్తి స్ఫూర్తిదాయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. కన్నెగంటి వర్ధంతిని కొయ్యలగూడెంలో ఆదివారం బ్యాంకుల కూడలి వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో చోడిపిండి సుబ్రహ్మణ్యం, మేకల అన్నవరం, మంతెన సోమరాజు, గంజిమాల రామారావు, మంచాల వెంకయ్యానాయుడు, మేఘలాదేవి, ఆంజనేయ రాజు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ప్రయాణం

చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే: చింతలపూడి పట్టణం, మండలంలో ఆటోలు, ట్రాక్టర్లను ప్రమాదకరంగా నడుపుతున్నారు. ఇదంతా అధికారులు చూస్తున్నా వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. సామర్థ్యానికి మించి ప్రయాణికులను తరలిస్తున్నారు. ట్రాక్టర్ల డోర్ అంచులపై కూర్చుని కూలీలను తరలిస్తున్నా పట్టించుకునేవారు లేరని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. 'కూలీలను తరలించే వాహనాలపై ప్రత్యేక దృష్టి పెడతాం. ఆటోలు, ట్రాక్టర్లను తనిఖీలు చేస్తాం. నిబంధనలు పాటించని వారిపై కేసులు నమోదు చేస్తాం' అని చింతలపూడి ఎస్సై సతీశ్‌కుమార్ తెలిపారు.

చింతలపూడి పట్టణంలో ట్రాక్టర్‌పై ఇలా..

నిషేధం.. అయినా పట్టించుకోం

కామవరపుకోట, న్యూస్‌టుడే: కామవరపుకోట రహదారి బంగ్లా ఆవరణలో ప్రైవేటు వాహనాలు నిలుపుదల చేయకూడదని, మొక్కజొన్న బస్తాలు నిల్వ చేయకూడదని అధికారులు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. అయినప్పటికీ నిబంధనలు అతిక్రమిస్తూ వాహనాలు, బస్తాలతో ఆవరణ ఆక్రమిస్తున్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ర.భ.శాఖ ఏఈ సుందరరావు శనివారం తెలిపారు.

ర.భ.శాఖ బంగ్లా ఆవరణలో హెచ్చరిక బోర్డు

మలుపులు.. ప్రమాదాల పిలుపులు!

భూదేవిపేట ప్రాథమికోన్నత పాఠశాల సమీపంలో..

బుట్టాయగూడెం, పోలవరం, వేలేరుపాడు, న్యూస్‌టుడే: మన్యం గ్రామాల్లో పలు చోట్ల రహదారి మార్గాల్లో ఉన్న మలుపులు వాహన చోదకులకు ప్రమాద భరితంగా మారాయి. ఎదురుగా వచ్చే వాహనాలు కూడా కనిపించక తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. కనీసం ప్రమాద సూచికలు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసేందుకు కూడా సంబంధిత శాఖల అధికారులు పట్టించుకోవడం లేదు. ఆయా ప్రదేశాల్లో ప్రమాద సూచిక బోర్డులను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని ర.భ శాఖ డీఈ హరికృష్ణ, పంచాయతీ రాజ్ శాఖ ఇన్‌ఛార్జి ఏఈ సత్యప్రకాశ్ తెలిపారు.

● వేలేరుపాడు మండలంలో భూదేవిపేట ప్రాథమికోన్నత పాఠశాల, చాగరపల్లి- భూదేవిపేట మధ్య చినబుర్రతోగు, కట్కూరు- యడవల్లి మధ్య, బండ్లబోరు సమీపాల్లో రహదారుల మలుపుల వద్ద జరిగిన ప్రమాదాల్లో పలువురు మృత్యువాత పడగా, అనేక మంది వాహనచోదకులు గాయాల పాలయ్యారు. దీనిపై పలుమార్లు సంబంధిత అధికారులకు విన్నవించినా.. ఫలితం లేకుండా పోతోందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా వేగనియంత్రికలు, ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

● పోలవరం మండలంలో ఇటుకలకోట నుంచి రేపల్లెవాడ వెళ్లే మార్గం, గార్లగొయ్యి- గుంజవరం మధ్యలోని రహదారుల్లోని మలుపులు ప్రమాదాలకు నిలయంగా మారాయి. ఎదురెదురుగా వచ్చే వాహనాలు కూడా కనిపించక ఢీకొని పలువురు వాహనచోదకులు గాయాల పాలైన ఘటనలు అనేకం ఉన్నాయి. పలు గిరిజన గ్రామాలకు ఇవే ప్రధాన రహదారి మార్గాలు. మలుపుల్లో రహదారులకు ఇరుపక్కలా తుప్పలు పెరిగిపోవడం కూడా ప్రమాదాలకు కారణాలుగా మారాయి. రహదారులను వెడల్పు చేయాలని పలువురు కోరుతున్నారు.

● బుట్టాయగూడెం మండలంలో బుట్టాయగూడెం- జంగారెడ్డిగూడెం రహదారి మార్గంలో మర్లగూడెం, కృష్ణాపురం, రంగనాయకమ్మ కాలనీ, ఎస్టీ బాలుర వసతి గృహం, అభయాంజనేయస్వామి గుడి తదితర ప్రదేశాల్లో ప్రమాదకరంగా మలుపులు ఉన్నాయి. బుట్టాయగూడెంలో నెహ్రూ బొమ్మ కూడలి, శివాలయం, దొరమామిడి మార్గంలో ముప్పినవారిగూడెం, దుద్దుకూరు కూడలి, దొరమామిడి పీహెచ్‌సీ సమీపాన మలుపులు ఉన్నాయి.

బుట్టాయగూడెం మండలం కృష్ణాపురం వద్ద..

ఉయ్యాలవాడ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రతినిధులు

నరసింహారెడ్డికి భారతరత్న ఇవ్వాలి

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: స్వాతంత్ర్య ఉద్యమంలో బ్రిటిష్ వారిని గడగడలాడించిన మొట్టమొదటి సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి అని పలువురు వక్తలు అన్నారు. జంగారెడ్డిగూడెం పట్టణంలో చింతలపూడి నియోజకవర్గ రెడ్డి సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు పలువురు మాట్లాడుతూ... ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహాన్ని పార్లమెంటు వద్ద ఏర్పాటు చేయడంతో పాటు ఆయనకు భారతరత్న ప్రకటించాలని కోరారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఘనంగా కవలల దినోత్సవం

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం పట్టణంలోని ప్రతిభ ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో ఆదివారం కవలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో వివిధ తరగతులకు చెందిన 24 మంది కవలలు కనువిందు చేశారు. ఈ సందర్భంగా ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకుని ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రజక సామాజిక భవనానికి శంకుస్థాపన

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో బీసీల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. ఆదివారం సాయంత్రం కొప్పుల వెలమపేటలో రూ.25 లక్షలతో నిర్మించనున్న రజక కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రజకులకు కమ్యూనిటీ భవనం లేకపోవడంతో చిన్న చిన్న వేడుకలు చేసుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ భవన నిర్మాణం పూర్తి అయితే వారికి ఎంతగానో ఉపయోగపడుతుందని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. దోబీ ఘాట్ల విద్యుత్తు బిల్లులో రాయితీ కల్పించాలన్న జీవో నం.111ను అమలు చేయడానికి కృషి చేస్తామన్నారు.

బాల్యమిత్రుడికి ఆర్థిక సాయం

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: అనారోగ్యంతో బాధ పడుతున్న బాల్యమిత్రుడి తల్లి చికిత్స కోసం తమ వంతు సహకారం అందించారు అతడి స్నేహితులు. కన్నాపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో 2002-03లో పదో తరగతి బ్యాచ్‌కు చెందిన దోరా రాజు, ఎస్‌కే బాజీ, దమ్ము ప్రసాద్, మట్టే శ్రీను దిప్పకాయలపాడులోని తమ మిత్రుడు వలీని ఆదివారం కలిసి రూ.14 వేలు అందజేసినట్లు తెలిపారు.

అదుపు తప్పి లారీ బోల్తా

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: నిద్రమత్తులో వాహనం అదుపుతప్పి బోల్తాపడిన ఘటన జంగారెడ్డిగూడెం పట్టణంలో ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అశ్వారావుపేట నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న లారీ దేవరపల్లి-తల్లాడ జాతీయ రహదారిపై జంగారెడ్డిగూడెం పారిజాతగిరి ఆలయం ఆర్చి వద్దకు వచ్చేసరికి చోదకుడికి నిద్రమత్తు రావడంతో వాహనం అదుపుతప్పి రహదారి అంచున ఖాళీ స్థలంలోకి దూసుకుపోయి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో వాహన చోదకుడు లారీలో ఇరుక్కుపోవడంతో స్థానికులు 108కు సమాచారం అందించారు. 108 వాహన సిబ్బంది కె.రాజు, జి.రాంబాబు చోదకుడిని చాకచక్యంగా బయటకు లాగారు. అనంతరం ప్రథమ చికిత్స అందించారు. ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.

27 నుంచి మదన గోపాలస్వామి కల్యాణోత్సవం

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: కొయ్యలగూడెంలో మదన గోపాలస్వామి కల్యాణోత్సవాలను ఈ నెల 27 నుంచి వచ్చే నెల నాలుగో తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి తెలగంశెట్టి లక్ష్మి ఆదివారం తెలిపారు. స్వామివారి కల్యాణోత్సవాలకు హాజరు కావాలని కోరుతూ జీలుగుమిల్లిలో ఎమ్మెల్యే చిర్రి బాలరాజుకు భాజపా నాయకులు ఆదివారం ఆహ్వానపత్రం అందజేశారు. భాజపా మండల శాఖ అధ్యక్షుడు గొలిశెట్టి వాసు, ఉపాధ్యక్షుడు తవ్వా గోపాల్, జిల్లా కార్యవర్గ సభ్యుడు బొమ్మా బాబు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానపత్రం అందజేస్తున్న నాయకులు

తుప్ప పట్టి.. తుప్పల్లోకి చేరి

టి.నరసాపురం: న్యూస్‌టుడే: మండలంలో రైతులను మురిపించిన నందమూరి విజయసాగర్ ఎత్తిపోతల పథకానికి ఆదిలోనే హంసపాదు ఎదురైంది. విలువైన యంత్ర పరికరాలు తుప్పపట్టి తుప్పల్లోకి చేరడంతో రైతుల ఆశలు అడియాసలయ్యాయి. టి.నరసాపురం నందమూరి విజయసాగర్ (చెరువు) నుంచి రాజుపోతేపల్లి వరకు ఈ పథకాన్ని రూపుదిద్దారు. అనంతరం దాని నిర్వహణ, పట్టించుకునేవారు లేక పూర్తిగా పడకేసింది.

మూడు వేల ఎకరాలకు..

టి.నరసాపురం, కొరివిగూడెం, బంధంచర్ల, కేతవరం, గుడ్లపల్లి, రాజుపోతేపల్లి వంటి గ్రామాలకు చెందిన మూడు వేల ఎకరాలకు సాగు నీరు అందించేందుకు 15 ఏళ్ల కిందట సుమారు రూ.నాలుగు కోట్లతో ఈ పథకాన్ని ఏర్పాటు చేశారు. ఇది అమల్లోకి వస్తే ఈ ప్రాంతంలో భూగర్భ జలాలు కూడా పెరిగేవి. పలు కారణాలతో ఈ పథకం లక్ష్యం నెరవేరలేదు.

టి.నరసాపురంలో నిరుపయోగంగా మారిన ఎత్తిపోతల పథకం

యంత్ర పరికరాల చోరీ

టి.నరసాపురం, బంధంచర్ల వద్ద ఏర్పాటు చేసిన రూ.లక్షలు విలువ చేసే పంపుహౌస్‌లు, విద్యుత్తు పరికరాలు, యంత్రాలు నిరుపయోగంగా మారాయి. మరికొన్ని యంత్ర పరికరాలు, మోటార్లను చోరులు అపహరించుకు పోయారు. మరికొన్ని పరికరాలు తుప్పు పట్టి పాడవుతున్నాయి. ఇంత జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.

పునరుద్ధరించాలి

ఈ పథకాన్ని వినియోగంలోకి తీసుకువస్తే ఈ ప్రాంతంలో ఉద్యాన, వ్యవసాయ పంటలకు ఎంతో మేలు జరుగుతుంది. చింతలపూడి ఎత్తిపోతల పథకం నీరు నందమూరి విజయసాగర్‌లో నింపి ఈ పథకాన్ని పునరుద్ధరించాలి. -**అనుమోలు రామకృష్ణ, రైతు, బంధంచర్ల**

బంధంచర్లలో పనికిరాని పరికరాలు

సారా బట్టీపై పోలీసుల దాడి

పోలవరం, న్యూస్‌టుడే: రేపల్లెవాడ వంతెన సమీపంలో సారా తయారు చేస్తున్న బట్టీపై ఆదివారం పోలీసులు దాడిచేశారు. 60 లీటర్ల సారా స్వాధీనం చేసుకోవడంతో పాటు డమ్ముల్లో నిల్వచేసిన 800 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ జట్టి.భీమాశేఖర్ చెప్పారు. ఎల్ఎన్డీపేట గ్రామానికి చెందిన ఇళ్ల.వెంకటేశ్వర్లు సారా తయారు చేస్తున్నట్లు గుర్తించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కోడి పందేల స్థావరంపై..

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: రామానుజపురం సమీపంలో జరుగుతున్న కోడి పందేల స్థావరంపై పోలీసులు దాడి చేసి అయిదుగురిని అరెస్టు చేసినట్లు కొయ్యలగూడెం ఎస్సై చంద్రశేఖర్ ఆదివారం తెలిపారు. వారి నుంచి ఆరు ద్విచక్ర వాహనాలు, రెండు కోడి పుంజులు, రూ.2230 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

టి.నరసాపురం: న్యూస్‌టుడే: అప్పలరాజుగూడెంలో కోడిపందేల శిబిరంపై ఆదివారం దాడి చేసి ముగ్గుర్ని అరెస్టు చేసినట్లు ఎస్సై ఎం.జయబాబు తెలిపారు. వారి నుంచి రూ.2,300 ఒక కోడి పుంజు, ఒక కోడికత్తి స్వాధీనం చేసుకున్నామన్నారు.



అమృతమూర్తికి అశ్రునివాళి

ఆప్యాయతానురాగాలతో, చిరునవ్వుతో పలకరించే మా అన్నయ్య మరణం మాకు తీరని లోటు.. నీ పవిత్రాత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ..

కీ॥శే॥ కొఠారు వీర వెంకటరావు (అబ్బులు) గారు, జంగారెడ్డిగూడెం

చెల్లెలు: కొడవలి శేషారత్నం
బావ: వెంకట్రావు
మేనల్లుడు: గౌతమి మునేంద్ర - కృప
మేనకోడలు: నున్న పద్మ - కృష్ణకాంత్
మనుమలు, మనుమరాండ్రు: శివతేజ, లహరి, సంజన, ఐజి

పెదకార్యం: ది. 25-2-2026 బుధవారం జంగారెడ్డిగూడెం పేరంపేట రోడ్‌లో వారి స్వగృహము నందు జరుపబడును.

(c) eenadu

ఆధ్యాత్మిక శక్తి ఏర్పరచుకోవాలి

శ్రీతి సుతిమాల పుస్తకం అందిస్తున్న శ్రీనివాసరావు

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: ఆధ్యాత్మిక శక్తి బలపడినప్పుడే ప్రపంచ శాంతి ఏర్పడుతుందని నూజివీడు రామానుజ గోష్ఠి ప్రధాన నిర్వాహకుడు తాండవ కృష్ణ పేర్కొన్నారు. ఆదివారం ఆగిరిపల్లిలోని శోభనాచల స్వామి ఆలయంలో రామానుజ గోష్ఠి సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల్లో భక్తి భావం పెంపొందించేందుకు ద్రవిడ స్కూల్ నిర్వాహకుడు శ్రీనివాసరావు, ఉదయలక్ష్మి దంపతులు శ్రీతి సుతిమాల అనే పుస్తకాన్ని సభ్యులకు అందజేశారు. మహాలక్ష్మి, శ్రీదేవి పాల్గొన్నారు.

నూజివీడు

• నూజివీడు • కైకలూరు

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ

మండవల్లి, న్యూస్‌టుడే: మండవల్లి మండల కేంద్రం పల్లపు బజారులోని నూతన రామాలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. వేద పండితులు ద్వాదశి కామేశ్వర శర్మ ఆధ్వర్యంలో దాతలు అర్జంపూడి రామకోటేశ్వరరావు, వెంకటరమణ దంపతులచే సీతారామ లక్ష్మణ హనుమత్ సమేత కోదండరామ స్వామి విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. అంతకు ముందు విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచన, పూర్ణాహుతి, ప్రాణ ప్రతిష్ఠ, బలిహరణ నిర్వహించి శాంతి కల్యాణహోమాన్ని చేశారు. అనంతరం నిర్వహించిన అన్న సమారాధనలో భారీ ఎత్తున భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నూజివీడు :80085 74698	ఆగిరిపల్లి: 9121229090
ముసునూరు :93983 81268	చాట్రాయి: 8008574700
కైకలూరు :73060 88555	మండవల్లి: 8106099008
కలిదిండి :90594 84862	ముదినేపల్లి: 8008574693

కలిదిండి, న్యూస్‌టుడే: ? మరియు రుద్రవరంలో ప్రధాన మార్గంలో వీధి దీపాలు సక్రమంగా వెలగడం లేదు. రాత్రి వేళల్లో రాకపోకలకు ఇబ్బందిగా ఉంటుంది. **- రాజు, సానారుద్రవరం**

✔ పని చేయని దీపాలు తొలగించి కొత్తవి ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటాం. **- ఎన్.రాజేశ్వరమ్మ, సర్పంచి**

కైకలూరు, న్యూస్‌టుడే: కైకలూరు మండలం కొల్లేటి కోట నుంచి శృంగవరప్పాడు వెళ్లే మార్గంలో పంచాయతీ వీధి దీపాలు సక్రమంగా వెలగక గ్రామస్థులు అవస్థలు పడుతున్నారు. దీనిపై స్థానికుడు శేఖర్ 'ఈనాడు' 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా సమస్యను పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఆయన కొత్త దీపాలు ఏర్పాటు చేయించారు.

ఈ సారైనా నీరొచ్చేనా

● వెలవెలబోతున్న లంక గ్రామాల కాలువలు

● వట్టిపోతున్న మంచినీటి చెరువులు

మండవల్లి, న్యూస్‌టుడే: ప్రభుత్వం నీటిని విడుదల చేస్తున్న ప్రతిసారి లంక గ్రామాల్లో ప్రజలకు అన్యాయమే జరుగుతుంది. ఈసారైనా మోటూరు, గుడివాడ ఛానెళ్ల ద్వారా ప్రభుత్వం విడుదల చేస్తున్న నీరు వస్తుందా అనే ఆందోళన కనిపిస్తోంది. ఇప్పటికే లంక గ్రామాల్లో మంచినీటి చెరువులన్నీ కనీస స్థాయి నీటిమట్టానికి పడిపోయాయి. తాగు నీటితో పాటు, వాడుక నీరు, పశువులకు తాగేందుకు నీరు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

సగం గ్రామాలకే..

మోటూరు ఛానెల్ పరిధిలో సుమారు 20 గ్రామాలకు నీటిని అందించాల్సి ఉంది. కానీ పసలపూడి, చింతలపూడి, పుట్ట చెరువు, శింగనపూడి, మూలపేట, నాగభూషణపురం, ఆనందపురం, తక్కెళ్లపాడు గ్రామానికి నీరు వచ్చే సరికి గగనంగా మారుతుంది. కిందనున్న నుచ్చుమిల్లి, పులపర్రు, దెయ్యంపాడు, చింతపాడు, కొవ్వాడలంక గ్రామాలకు వేసవిలో నీరు వెళ్లే పరిస్థితి లేదు. గుడివాడ ఛానెల్ పరిధిలో ఉనికిలి, ఇంగిలిపాకలంక వరకు మాత్రమే నీరు వస్తోంది. శివారున ఉన్న శ్రీరామ్ నగర్, నందిగామ లంక, పెనుమాకలంక గ్రామాలకు తాగునీటి విషయంలో తీవ్ర అన్యాయం జరుగుతోంది. వర్షాకాలంలో కొల్లేరుకు వచ్చే నీటినే మూడు గ్రామాల్లోని చెరువుల్లో నింపుకొని సంవత్సరమంతా వాడుకోవాల్సి వస్తుంది.

ఎండిపోయిన గుడివాడ ఛానెల్

కాలుష్య కోరల్లో..

లంక గ్రామాలకు నీటినందిస్తున్న మోటూరు, గుడివాడ కాలువలు.. ఇరువైపులా ఉన్న చేపల చెరువులతో కాలుష్య కాసారంగా మారుతున్నాయి. ఈ రెండు కాలువలను చేపల చెరువుల రైతులు మురుగు కాలువల కంటే దారుణంగా వాడతారు. చేపల, రొయ్యల చెరువుల్లోని విషతుల్యమైన నీటిని కనీసం పిడికెడు బ్లీచింగ్ చల్లకుండా అలాగే కాలువలోకి వదిలేస్తున్నారు. కాలువలకు మధ్యలో అడ్డుకట్టలను నిర్మించి ఇష్టారాజ్యంగా నాశనం చేస్తున్నారు.

● దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగబాబును వివరణ కోరగా.. ప్రస్తుతం కొల్లేరు గ్రామాల్లో నీటి సరఫరాకు ఇబ్బంది లేదన్నారు. ఈ సారి వచ్చే నీరు అన్ని గ్రామాల్లోని మంచి నీటి చెరువులకు అందేలా చూస్తామని తెలిపారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

ముదినేపల్లి, న్యూస్‌టుడే: ఇంటర్ పబ్లిక్ పరీక్షలకు సర్వం సిద్ధమైంది. కైకలూరు నియోజకవర్గానికి సంబంధించి మూడు ప్రభుత్వ, ఒక ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో విద్యార్థులు పరీక్షలు రాసేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇప్పటికే విద్యార్థులకు హాల్ టికెట్లను పంపిణీ చేశారు. పరీక్షకు అరగంట ముందే కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. నిముషం ఆలస్యమైనా పరీక్షకు అనుమతించమని హెచ్చరిస్తున్నారు. విద్యార్థులకు ఆయా కళాశాలల నుంచి హాల్ టికెట్లు పంపిణీ చేశారు. ఒకవేళ హాల్ టిక్కెట్ లేకపోతే వాట్సాప్ వనమిత్ర ద్వారా 9552300009 నంబర్‌కు హాయ్ అని సందేశం పంపి, పుట్టిన తేదీ, ఆధార్ నంబరు సాయంతో విద్యార్థులు హాల్‌టికెట్ పొందవచ్చు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు ప్రభుత్వం ఆర్టీసీ ఉచిత రవాణా సౌకర్యాన్ని ఏర్పాటు చేసింది. ముదినేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని పరీక్షా కేంద్రం ఏర్పాట్లను చీఫ్ సూపరింటెండెంట్ ఓరుగంటి సత్యనారాయణ, డిపార్ట్‌మెంట్ అధికారి విక్టర్ పర్యవేక్షించారు. ప్రథమ సంవత్సరం విద్యార్థులు 200 మంది, ద్వితీయ సంవత్సరం 160 మంది పరీక్షలు రాయనున్నారు. ప్రతి గది సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉన్నాయి.

తొట్టెలో నీరు నింపారు..!

ముసునూరు, న్యూస్‌టుడే: ముసునూరు మండలం చెక్కపల్లిలో నిర్మించిన నీటి తొట్టెలో నీరు నిల్వ చేయకపోవడంతో నిరుపయోగంగా మారిందని 'ఈనాడు'లో శనివారం 'దాహం తీర్చని నీటి తొట్టె' శీర్షికతో కథనం ప్రచురితమైంది. ఆదివారం కార్యదర్శి కరుణాకర్ స్పందించి నీటి తొట్టెను శుభ్రం చేసి అందులో నీరు నింపారు. దీంతో పశు పోషకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రజక కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన

కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి పార్థసారథి

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో బీసీల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. ఆదివారం సాయంత్రం కొప్పుల వెలమపేటలో రూ.25 లక్షలతో నిర్మించనున్న రజక కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రజకులకు కమ్యూనిటీ భవనం లేకపోవడంతో చిన్న చిన్న వేడుకలు చేసుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ భవన నిర్మాణం పూర్తి అయితే వారికి ఎంతగానో ఉపయోగపడుతుందని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. దోబీ ఘాట్ల విద్యుత్తు బిల్లులో రాయితీ కల్పించాలన్న జీవో నం.111ను అమలు చేయడానికి కృషి చేస్తామన్నారు. చేతివృత్తుల్లో నైపుణ్యాలు పెంపొందించి.. రాయితీతో కూడిన రుణాలు సమకూరుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ డి.రామారావు, తితిదే బోర్డు సభ్యుడు శ్రీనివాసరావు, సీహెచ్ మన్మథరావు, నాగరాజు, మున్సిపల్ కమిషనర్ పీరయ్య, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

కైలాస గౌరి నోములు

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: ఆగిరిపల్లిలోని గంగా అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి దేవాలయంలో ఆదివారం ఆర్యవైశ్య మహిళలు భక్తిశ్రద్ధలతో కైలాస గౌరి నోములు, నిమ్మపండ్ల నోములు, పువ్వు, పండు తాంబూలం నోములు నిర్వహించారు. కైలాస గౌరి నోమును పార్వతీ పరమేశ్వరుల కటాక్షం, ఐశ్వర్యం, సౌభాగ్యం కలగాలని ఆచరించారు. ఈ కార్యక్రమానికి ఆర్యవైశ్య బ్రాహ్మణ మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని వాయినాలు తీసుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఉత్సాహంగా 'మనసులో మాట' వీక్షణ

ముదినేపల్లి: విద్యార్థినికి బహుమతి అందిస్తున్న భాజపా, జనసేన నాయకులు

ముదినేపల్లి, న్యూస్‌టుడే: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల, గౌతమ్ విద్యాసంస్థల్లో ఆదివారం ఏర్పాటు చేసిన స్క్రీన్‌లపై ప్రధాన మంత్రి నరేంద్రమోదీ మన్ కీ బాత్ (మనసులో మాట)ను విద్యార్థులు ఉత్సాహంగా తిలకించారు. ఇందులో కార్యక్రమం జిల్లా కన్వీనర్ కోటప్రోలు కృష్ణ మాట్లాడుతూ ఇటువంటి స్ఫూర్తిదాయక కార్యక్రమాలను క్రమంతప్పకుండా వీక్షిస్తూ అందులోని సందేశాలను ఆచరణలో పెట్టాలని సూచించారు. విద్యార్థుల్లో చైతన్యం, ఆలోచనా శక్తి, దేశాభిమానాన్ని పెంపొందించుతుందన్నారు. అనంతరం క్విజ్ పోటీలు నిర్వహించి ముగ్గురు విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. భాజపా, జనసేన మండలాధ్యక్షులు సత్యవోలు నాగలక్ష్మి, వీరంకి వెంకయ్య, మోటేపల్లి హనుమాప్రసాద్, కొల్లిపర నాగరాజు, వత్తుమిల్లి ప్రసాద్, రెడ్డి నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దేశం మెచ్చే స్థాయికి చేరుకోవాలి.. కైకలూరు, న్యూస్‌టుడే: దేశ భవిష్యత్తుకు వారధులైన విద్యార్థులు దేశం మెచ్చే స్థాయికి చేరుకోవాలని భాజపా మండల అధ్యక్షుడు బి.జగదీశ్, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు సమయం ఏసుబాబు అన్నారు. స్థానిక బీసీ బాలుర వసతిగృహంలో ఆదివారం ప్రధానమంత్రి మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని విద్యార్థులతో కలిసి వీక్షించారు. యువత, విద్యార్థులు దేశ ప్రగతిలో భాగస్వాములు అయ్యేందుకు ప్రధాని మోదీ సూచించిన అంశాలను ఆచరించాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేసి వసతిగృహంలో విద్యార్థులకు అందుతున్న భోజనం ఇతర సదుపాయాలపై ఆరా తీశారు. ఇందులో భాజపా నాయకులు గరికపాటి రాంబాబు, బోయిన శ్రీనివాస్, శ్యామలరావు గౌడ్, చిరంజీవి, దీపక్‌కుమార్ కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నెస్పీ కాలువలో చేపల వేట

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: ఎన్నెస్పీ నూజివీడు మేజర్ కాలువలో ఒకటి రెండు ప్రదేశాల్లో సాగర్ నీరు నిల్వ ఉంది. ఈ కొద్దిపాటి నీటిలోనే వివిధ రకాల చేపలు లభ్యం అవుతున్నాయి. మండలంలోని బత్తులవారిగూడెం వద్ద కాలువలో నీటికి కొందరు వ్యక్తులు కాలువలో నీటిని కట్టడి చేసి చేపలు పట్టుకున్నారు. స్థానికులు వీరిని ఆసక్తిగా తిలకించారు.

కాలనీ కాదు.. ఖాళీ స్థలమే..!

చాట్రాయి, న్యూస్‌టుడే: మేము నిర్మించేది కాలనీలు కాదు.. ఊళ్లు అంటూ వైకాపా పాలనలో నాయకులు ఊదరగొట్టారు. వారి మాటలకు చేతలకు పొంతనే లేదు. పోలవరం గ్రామంలో పేదల కాలనీ ఏర్పాటు చేశారు. ఇక్కడ ఏకంగా మూడు కాలనీలకు స్థలాలను పక్క పక్కనే సేకరించారు. 235 మందికి స్థలాలు చూపించారు. కరెంటు సదుపాయాన్ని సైతం కల్పించారు. ఈ కాలనీలోకి పోలవరం- యడవల్లి, పోలవరం-మర్లపాలెం రోడ్డులో కలిసేలా రోడ్డు సదుపాయం కూడా ఉంది. కానీ వీరందరికీ స్థలాలు చూపినా గృహాలు మంజూరు చేయడాన్ని మరిచిపోయారు. ఇక్కడో ఓ లబ్ధిదారుడు మంజూరైన స్థలంలో ఇంటిని నిర్మించి పెద్ద కాలనీలో ఒంటరిగా నివసిస్తున్నాడు.

లంకల దారి.. అధ్వానంగా మారి

చెక్ పోస్టు వద్ద గోతులతో రోడ్డు

మండవల్లి, న్యూస్‌టుడే: మండవల్లి మండలం కేంద్రం నుంచి కొల్లేరు లంక గ్రామాలకు వెళ్లే మండవల్లి ఇంగిలిపాక లంక రహదారి అధ్వానంగా మారింది. ముఖ్యంగా మూడుతాళ్లపాడు నుంచి చెక్ పోస్టు వరకు రోడ్డుపైన పెద్దఎత్తున గుంతలు పడి ప్రయాణికులను తీవ్రంగా ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఈ రోడ్డు ద్వారానే 12 లంక గ్రామాలు, 10 సాధారణ గ్రామాల్లోని 30 వేల మంది రాకపోకలను సాగిస్తారు. దీనిపై రోడ్లు భవనాల డీఈ అనిల్‌ను వివరణ కోరగా.. మరమ్మతులకు అంచనాలు పంపి నిధులు మంజూరవగానే పనులు చేస్తామన్నారు.

సౌకర్యాల్లేక అవస్థలు

నూజివీడు మండలం తుక్కులూరులోని పలు కాలనీల్లో సరైన రహదారులు, డ్రెయినేజీ వ్యవస్థ, తాగునీటి సౌకర్యం లేకపోవడంతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. ఇళ్ల ముందు మురుగు నిలిచి పోవడంతో దోమలు వ్యాప్తి చెంది రోగాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వస్తున్న నీటిపై శుద్ధ పేరుకుపోతోందని, తాగేందుకు క్యాన్ నీటిని కొనుగోలు చేస్తున్నామన్నారు. జల్‌జీవన్ మిషన్ నిధులు రూ.37.56 లక్షల అంచనా వ్యయంతో తుక్కులూరు పరిధిలోని కాలనీల్లో ఇంటింటికీ తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేస్తామని సచివాలయం సిబ్బంది తెలిపారు. **- ఈనాడు, నూజివీడు**

శిక్షణ ఇచ్చారు.. ప్రోత్సాహం మరిచారు!

ఏడు నెలలైనా అందని కుట్టు మిషన్లు

ముదినేపల్లి, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వం అయిదేళ్లలో మహిళల స్వయం ఉపాధికి కనీసం రుణాల మంజూరు, నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు చేపట్టలేదు. ఆయా వర్గాల అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన కార్పొరేషన్లనూ నీరసపరిచారు. దీంతో అతివలు స్వావలంబన సాధించేలా నిర్వహించిన కుట్టు శిక్షణ, మిషన్ల పంపిణీ సక్రమంగా జరగలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక శిక్షణ నిర్వహించినా మిషన్లు ఇవ్వడంలో జాప్యం చేస్తోంది.

బడ్జెట్ కోసం ఎదురు చూపులు

కైకలూరు నియోజకవర్గంలో గత ఏడాది బీసీ కార్పొరేషన్ల(పలు కులాలకు చెందిన) మహిళలకు కుట్టు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. 18 నుంచి 50 ఏళ్ల వారి నుంచి దరఖాస్తులు స్వీకరించి, అందులో మొదటి విడతగా కైకలూరు, కలిదిండి, ముదినేపల్లి మండలాల్లో రెండు బ్యాచ్‌లుగా మూడు నెలలపాటు బ్యాచ్‌కు 72 మంది చొప్పున మండలానికి 144 మందిని ఎంపిక చేసిన శిక్షణ ఇచ్చారు. శిక్షణ కాలం ముగియగానే అందరికీ కుట్టు మిషన్లు ఇస్తామని ప్రభుత్వం చెప్పడంతో వారంతా ఆసక్తిగా శిక్షణ పూర్తి చేశారు. ఏడు నెలలవుతున్నా ఇప్పటికీ అందించలేదు. అభ్యర్థిని శిక్షణకు కేటాయించిన సొమ్ములోనే మిషన్‌కు దాదాపు రూ.6 వేలు కేటాయించారు. దీనిపై శిక్షణ కోఆర్డినేటరు పి.జగన్‌ను సంప్రదించగా మహిళలకు మూడు నెలల పాటు శిక్షణ ఇచ్చామని, మిషన్లకు సంబంధించిన బడ్జెట్టు రాగానే తప్పకుండా హాజరైన వారికి కుట్టు మిషన్లు అందిస్తామని వివరించారు.

బాగా నేర్చారు కానీ..

భర్త ట్రాక్టర్ మెకానిక్. పిల్లలు చదువుకుంటున్నారు. నా వంతుగా కుటుంబానికి బాసటగా నిలవాలని ఈ శిక్షణ పొందాను. మూడు నెలల పాటు బాగా నేర్చారు. అయితే కుట్టు మిషన్ ఇస్తే దాని ద్వారా ఆర్థిక స్వావలంబన సాధించి ఆసరాగా ఉందామనుకున్నాను. **- ఆరట్ల కృష్ణకుమారి, గురజ**

నేర్చుకున్న విద్య వృథాగానే..

భర్త ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నారు. గతంలో కుట్టు మిషన్ నేర్చుకోవాలని ఉన్నా శిక్షణ కేంద్రం అందుబాటులో లేదు. ఆ సమయంలో ప్రభుత్వం ఇచ్చిన ఈ శిక్షణ దోహదపడింది. అయితే ఇస్తానన్న మిషన్ నెలలు గడుస్తున్నా ఇవ్వకపోవడంతో నిరాశ మిగిలింది. కొనుక్కునే స్థోమత లేక పోవడంతో నేర్చుకున్న విద్య వృథాగా మిగిలింది. **- ఎ. స్వప్నిక, కైకలూరు**

విద్యుత్తు నియంత్రికలో మంటలు

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: నూజివీడు 220 కేవీ సబ్ స్టేషన్‌లోని ట్రాన్స్‌ఫార్మర్‌లో ఆదివారం సాయంత్రం అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. ఉష్ణోగ్రతలు పెరగడంతో పాటు షార్ట్ సర్క్యూట్ అయి మంటలు చెలరేగాయి. ఓవర్‌లోడ్ కారణంగా ఈ మంటలు ఎగసి పడినట్లు తెలుస్తోంది. అప్రమత్తమైన సబ్‌స్టేషన్ సిబ్బంది వెంటనే తమ వద్ద ఉన్న అగ్నిమాపక పరికరాలను వినియోగించి మంటలను అదుపులోకి తీసుకు వచ్చారు. కొద్దిసేపు విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. ప్రమాదం పెద్దగా లేకపోవడంతో విద్యుత్తు అధికారులు, సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. ఎంత నష్టం జరిగింది అన్న వివరాలు తెలియాల్సి ఉంది. ప్రమాదం జరగడానికి గల కారణాలు ఆరా తీస్తున్నారు. వెంటనే కాలిన ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో కొత్తది ఏర్పాటు చేసి విద్యుత్తును పునరుద్ధరించినట్లు ఏడీఈ దుర్గారావు తెలిపారు.

కుటుంబాన్ని గుర్తు చేసుకోండి

వాహన చోదకుడికి శిరస్త్రాణం ధరింపజేస్తున్న ఎస్‌ఐ రామచంద్రరావు

మండవల్లి, న్యూస్‌టుడే: ద్విచక్రవాహన దారులు రోడ్డుమీదకు వచ్చేటప్పుడే కుటుంబాన్ని గుర్తు చేసుకుని తప్పక శిరస్త్రాణాన్ని పెట్టుకోవాలని మండవల్లి ఎస్ఐ రామచంద్రరావు పేర్కొన్నారు. మండవల్లిలో ఆదివారం శిరస్త్రాణం పెట్టుకునేలా వాహనదారులను చైతన్య పరిచారు. ద్విచక్రవాహన ప్రమాదాల్లో ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోవడానికి ప్రధాన కారణం శిరస్త్రాణం లేకపోవడమేనన్నారు. కుటుంబ పెద్దను కోల్పోతున్నా ఆ కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని వివరించారు. ద్విచక్రవాహన దారులు తప్పక హెల్మెట్ పెట్టుకోవాలని కోరారు. ఇందులో పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: శిరస్త్రాణం ద్విచక్ర వాహన చోదకులకు రక్షణ కవచమని ప్రతి ఒక్కరు తప్పనిసరిగా ధరించాలని ఎస్సై కె.శుభశేఖర్ తెలిపారు. ఆగిరిపల్లిలో ఆదివారం ద్విచక్ర వాహనదారులకు శిరస్త్రాణంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. చాలా మంది ద్విచక్ర వాహనదారులు పోలీసులు కేసులు రాస్తారన్న భయంతో, అపరాధ రుసుం కట్టాల్సి వస్తుందనే ఉద్దేశంతో తక్కువ ధరకు నాణ్యత లేని శిరస్త్రాణాలు కొనుగోలు చేస్తున్నారని, వీటితో ప్రమాద సమయంలో ప్రాణాలకే ముప్పు సంభవిస్తుందని తెలిపారు. శిరస్త్రాణం.. పోలీసుల కోసం కాదు.. మీ ప్రాణాలు కాపాడుకోవడం కోసమేనని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ రహదారి నిబంధనలు పాటించాలని సూచించారు.

గిరిజన వసతిగృహంపై దృష్టి పెట్టండి సారూ..!

నూజివీడు: కూలిన ప్రహరీ

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: నూజివీడులోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో గిరిజన సంక్షేమ వసతి గృహం సమస్యలతో సతమతమవుతోంది. చర్యలు తీసుకోవాల్సిన ఉన్నతాధికారులు తూతూ మంత్రం సమీక్షలతో కార్యాలయాలకే పరిమితమవుతున్నారు. దీంతో క్షేత్ర స్థాయిలో సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. ఇందుకు నిదర్శనమే ఈ వసతి గృహం. వసతి గృహంలో పాలిటెక్నిక్, ఇంజినీరింగ్, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు ఉంటున్నప్పటికీ సరైన సౌకర్యాలు కల్పించలేదు. కిటికీల మెష్‌లు ధ్వంసమయ్యాయి. ప్రహరీ పడిపోయి నెలలు గడుస్తోంది. మెనూ పాటించడం లేదు. విద్యార్థులకు అవసరమైన దుప్పట్లు బెడ్లు అందించలేదు. పారిశుద్ధ్య సమస్యలు నెలకొన్నాయి. చిన్న చిన్న సమస్యలు అనేకం ఉన్నాయి. వీటన్నింటికి నిధులు మంజూరు కోరుతూ ఉన్నతాధికారులకు లేఖ పంపించామని వసతి గృహ అధికారి చెబుతున్నారు.

ఐవీఆర్ఎస్ సర్వేలో వెనుకంజ

ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన ఐవీఆర్ఎస్ సర్వేలో గిరిజన సంక్షేమ వసతి గృహం వెనుకంజలో పడింది. దీంతో వసతి గృహ అధికారిని విజయవాడ కార్యాలయానికి పిలిపించి మరీ మంత్రి కొలుసు పార్థసారథి క్లాస్ తీసుకున్నారు. పద్ధతి మార్చుకుని విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని, సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. విద్యార్థుల సంఖ్య తగ్గడం వెనక కారణాలు తెలపాలని ఉన్నతాధికారులను ప్రశ్నించారు. ఇంత జరిగినా జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు మాత్రం ఈ వైపు కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది. వసతి గృహం పరిస్థితులను శుక్రవారం ఎంపీడీవో చెన్నా రాఘవేంద్రనాథ్, మండల తెదేపా అధ్యక్షులు వాసు, రఘు తదితరులు పరిశీలించారు. ఇక్కడ విద్యార్థుల ఇబ్బందులు తదితరాలను మంత్రి ద్వారా కలెక్టరుకు విన్నవిస్తామని చెప్పారు.

నాడు అవస్థల మయం.. నేడు సాఫీ ప్రయాణం

సీసీ రోడ్డు ఏర్పాటు చేసిన అనంతరం ఇలా

కైకలూరు, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వ పాలనలో రోడ్డుపై గుంతలతో వాహనదారులు పడ్డ ఇక్కట్లు అన్నీఇన్నీ కావు. కైకలూరు- కలిదిండి ప్రధాన రోడ్డు మార్గంలో గోపవరం ఎస్ మలుపు సమీపంలో రోడ్డు దుస్థితి వర్ణనాతీతం. భారీ గుంతలతో వర్షం వస్తే చెరువును తలపించేది. అడుగు తీసి వేయలేని దుర్భర స్థితిలోనే వాహనదారులు ప్రయాణాలు సాగించేవారు. ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడి ఆసుపత్రుల పాలైన సంఘటనలు కోకొల్లలు. ఈ రోడ్డు దుస్థితిపై పలుమార్లు 'ఈనాడు'లో కథనాలు ప్రచురించినా అప్పటి ప్రభుత్వ నాయకులు గుంతలు పూడ్చిన పాపాన పోలేదు. రోడ్డు దుస్థితిపై ప్రత్యేక్ష సమీక్ష చేసిన ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా కైకలూరు నుంచి వరహాపట్నం వరకు రూ.3 కోట్లతో సిమెంటు రోడ్డు ఏర్పాటు చేశారు. గోపవరంలోనూ సీసీ రోడ్డు నిర్మాణంతో చినుకు పడితే చిత్తడిగా మారే రోడ్డు ప్రయాణాలకు సాఫీగా మారి కష్టాలు సమసి పోవడంతో గ్రామస్థులు, వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

భోజనశాల నిర్మాణానికి శ్రీకారం

భూమి పూజ చేస్తున్న దాత కేశవరావు

చాట్రాయి, న్యూస్‌టుడే: చనుబండ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో భోజన శాల నిర్మాణ పనులకు దాత వనమా కేశవరావు ఆదివారం భూమి పూజ నిర్వహించారు. ఇక్కడ విద్యార్థులు భోజనం చేసేందుకు పడుతోన్న ఇబ్బందులపై 'ఈనాడు'లో జనవరి 9న 'విద్యార్థుల భోజన ఇక్కట్లు' శీర్షికతో కథనంతో వెలువడింది. ఇక్కడ ఇబ్బందులను స్థానిక ప్రముఖుడు వనమా కేశవరావు కుమారులు నవీన్, సుధాకర్ దృష్టికి ప్రధానోపాధ్యాయులు రవీంద్రనాథ్ తీసుకు వెళ్లారు. వారు స్పందించి విద్యార్థులకు భోజనశాల నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఆదివారం ఉన్నత పాఠశాలలో ఆవరణలో భోజనశాల నిర్మాణానికి స్థలాన్ని ఎంపిక చేసి భూమి పూజ నిర్వహించారు. సుమారు రూ.15 లక్షల వ్యయంతో నిర్మాణాన్ని పూర్తి చేస్తామని కేశవరావు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో మాసగిరి శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు రవీంద్రనాథ్, విద్యా కమిటీ ఛైర్మన్ బన్నె వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

వర ప్రసాదాల మాత 'మరియ తల్లి'

రాజవరం (ఆగిరిపల్లి), న్యూస్‌టుడే: ఆపదలోని వారికి కోరిన కోర్కెలు తీర్చే వర ప్రసాదాల మాత 'మరియ తల్లి' అని రెవ. ఫాదర్. అల్లం ప్రతాపరెడ్డి, రెవ. ఫాదర్ జి.హరీశ్‌లు తెలిపారు. ఆగిరిపల్లి మండలం రాజవరం వర ప్రసాదమాత మహోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. దివ్య పూజాబలిని ఫాదర్లు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ వరప్రసాద మాత తేరు ప్రదక్షిణ గ్రామోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచి జాలా భూషణం, గ్రామ పెద్దలు, సంఘస్థులు, విశ్వాసులు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జూద శిబిరంపై దాడి

ముసునూరు, న్యూస్‌టుడే: ముసునూరు మండలం సూరేపల్లిలో జూద శిబిరంపై ఆదివారం దాడి చేసినట్లు ఎస్సై ఎం.చిరంజీవి తెలిపారు. ఈ దాడిలో పది మంది వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.87,500 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అవి ఇవి అన్నీ

వంతెన నిర్మించాలని డిమాండ్.. ముసునూరు, న్యూస్‌టుడే: ముసునూరు మండలం గుళ్లపూడి, లింగపాలెం మండలం కొణిజర్ల గ్రామాల మధ్య ఉన్న తమ్మిలేరుపై వంతెన నిర్మించాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ మండల కార్యదర్శి వేముల బక్కయ్య డిమాండ్ చేశారు. ఆదివారం గుళ్లపూడి తమ్మిలేరు వద్ద నాయకులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బక్కయ్య మాట్లాడుతూ.. ఈ గ్రామాల మధ్య సుమారు వెయ్యి ఎకరాల భూములున్నాయని, పండిన పంటను తెచ్చుకోవాలంటే వర్షాల సమయంలో రాకపోకలు సాగించాలంటే రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.

స్థలం కేటాయించాలి.. నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: నూజివీడులోని జై దుర్గాభవాని ఏరియా ప్లాట్‌ఫాం రిక్షా లోడింగ్, అన్‌లోడింగ్ హమాలీ కార్మిక సంఘం కార్మికులు తమ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని మంత్రి కొలుసు పార్థసారథిని కలిసి విజ్ఞప్తి చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే తాము వివిధ కార్యక్రమాలను నిర్వహించుకునేందుకు, తమ రిక్షాల పార్కింగ్‌కు, సమావేశాల నిర్వహణకు స్థలం లేదని, పురపాలక సంఘం పరిధిలో ప్రభుత్వ స్థలాన్ని ఇప్పించి భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు.

హ్యాపీ సండే కార్యక్రమం.. నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: పురపాలక సంఘం ఆధ్వర్యంలో నూజివీడులోని ఎంప్లాయిస్ కాలనీలో ఆదివారం హ్యాపీ సండే కార్యక్రమం నిర్వహించారు. ఆటపాటలతో యువత, సచివాలయ సిబ్బంది ఆకట్టుకున్నారు. మున్సిపల్ కమిషనర్ కొర్రపాటి పీరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాడెన్ పావెల్ జయంతి.. నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: స్కౌట్స్ అండ్ గైడ్స్ వ్యవస్థాపకుడు బాడెన్ పావెల్ జయంతిని ఆదివారం నూజివీడు మండలంలోని పల్లెర్లమూడి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు జె. విజయరత్నబాబు ఆధ్వర్యంలో క్యాడెట్‌లతో కలిసి సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. స్కౌట్ మాస్టర్ స్వర్ణ వెంకటేశ్వరరావు, గైడ్ కెప్టెన్ అక్కినేని స్వర్ణ పర్యవేక్షణలో గ్రామంలో ప్రదర్శన నిర్వహించారు.

సేవ్ పునర్విక పేరిట విరాళాల సేకరణ.. ముదినేపల్లి, న్యూస్‌టుడే: ఆరోగ్య సమస్యతో బాధపడుతున్న పునర్వికను కాపాడటానికి ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి విరాళాలు అందించడం అభినందనీయమని జనసేన నియోజకవర్గ నాయకుడు ఏఎన్ బాబు అన్నారు. సింగరాయపాలెంలో ఆదివారం విరాళాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన రూ.10 వేలు విరాళాన్ని అందించారు. శ్రీహరిపురం సర్పంచి విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి రూ.20 వేలు విరాళం.. ముసునూరు, న్యూస్‌టుడే: వేల్పుచర్ల బీసీ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న రామాలయం అభివృద్ధి కోసం ఇటీవల గ్రామస్థులు ఇటీవల మంత్రి పార్థసారథి దృష్టికి తీసుకెళ్లారు. ఆదివారం మంత్రి ఆలయ అభివృద్ధికి రూ.20 వేలు నగదు పంపించారు. వాటిని గద్దె రఘు చేతుల మీదుగా కమిటీ సభ్యులకు అందించారు.

జనసేన సభ్యత్వ నమోదు విజయవంతం చేయండి.. నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నూజివీడు ప్రభుత్వ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు, జనసేన నాయకుడు ముత్యాల కామేశ్ కోరారు. ఈ నెల 26వ తేదీ నుంచి నూజివీడు నియోజకవర్గంలో పెద్ద ఎత్తున ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. సభ్యత్వం ఉన్న వారికి రూ.5లక్షలు ప్రమాద బీమా సౌకర్యం ఉంటుందన్నారు. భవిష్యత్తులో పార్టీలో వివిధ పదవులు సాధించేందుకు ఈ సభ్యత్వమే ప్రధాన పాత్ర పోషిస్తుందన్నారు.

నైపుణ్యాలు మెరుగు పరచుకుంటేనే భవిత.. కలిదిండి, న్యూస్‌టుడే : ఎప్పటికప్పుడు నైపుణ్యాలు మెరుగు పరచుకుంటేనే ఉజ్వల భవిత ఉంటుందని అప్సా డెమొక్రటిక్ జిల్లా గౌరవ అధ్యక్షుడు చెన్నంశెట్టి కృష్ణ విద్యార్థులకు సూచించారు. అప్సా డెమొక్రటిక్ ఆధ్వర్యాన కలిదిండిలోని శశి హైస్కూల్‌లో ఆదివారం కైకలూరు డివిజన్ స్థాయి స్పెల్లింగ్ బీ పోటీలు నిర్వహించారు. నియోజకవర్గంలో పది పాఠశాలలకు చెందిన 550 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నట్లు డివిజన్ ప్రధాన కార్యదర్శి పోలిశెట్టి కనకదుర్గా భవాని, ఎస్వీ రాఘవయ్య తెలిపారు. ఎల్‌కేజీ నుంచి 9వ తరగతి వరకు ప్రతి తరగతి నుంచి ప్రతిభ కనబరిచిన ఐదుగురు విద్యార్థులను జిల్లా స్థాయికి ఎంపిక చేసినట్లు వివరించారు. అప్సా డెమొక్రటిక్ ప్రతినిధులు ఘంటా రఘురాం, బీవీ నాగభూషణం, కేవీస్వీ సత్యనారాయణ (నాగు), టీవీ నారాయణ పాల్గొన్నారు.

విద్యార్థినికి బహుమతి అందిస్తున్న అప్సా డెమొక్రటిక్ ప్రతినిధులు

(c) eenadu

ఆలోచనలు విరియాలి.. ఆవిష్కరణలు మెరవాలి..!

ప్రతి విద్యార్థిలో ఏదో ఒక ప్రతిభ దాగి ఉంటుంది. పాఠశాల స్థాయిలోనే సృజనాత్మకత వెలికితీసేందుకు 'ఈనాడు వైజ్ఞానిక ప్రదర్శన' నిర్వహిస్తోంది. విద్యార్థి ఆలోచనలతో ప్రయోగాలు చేసేలా ప్రోత్సహిస్తోంది. ఇందులో భాగంగా పోలీసు కన్వెన్షన్ హాల్, రాజమహేంద్రవరంలో ఫిబ్రవరి 26న వేదికగా మెగా సైన్స్ ఫెయిర్ నిర్వహిస్తోంది.

నిబంధనలు.. ● 6 నుంచి 10 తరగతుల విద్యార్థులకు మాత్రమే. ● ప్రాజెక్టును ముందుగా నమోదు చేసుకోవాలి. ● ఒక ప్రాజెక్టుకి ఇద్దరు విద్యార్థులకు అనుమతి. ● పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రదానం. రిజిస్ట్రేషన్ చివరి తేదీ: ఫిబ్రవరి 24

SRI GOWTHAMI Learning for Life RAJAMAHENDRAVARAM GANDHIPURAM | SRIRAMNAGAR 93486 55501 | 93486 55503

ఈనాడు

నమోదుకు: 77027 79616 సమయం: ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గం.ల వరకు..

వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవం

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: ఆత్రేయపురం లక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం అంగరంగ వైభవంగా ఆరంభమయ్యాయి. ఉదయం విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, ప్రతిష్ఠాపన, హోమం, ధ్వజారోహణ కార్యక్రమాలు అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. రాత్రి స్వామి వారు శేష వాహనంపై దర్శనమిచ్చారు. పెద్దసంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.

అలంకరణలో వేంకటేశ్వరుడు

ఈనాడు కాకినాడ
సోమవారం ఫిబ్రవరి 23, 2026

విజయీభవ!

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

ఏలేశ్వరంలో పరీక్షకేంద్రంలో నంబర్లు వేస్తున్న సిబ్బంది

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: ఇంటర్మీడియట్ పరీక్షలకు జిల్లాలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. మొత్తం 58 ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో సోమవారం నుంచి పూర్తి సీసీ కెమెరాల నిఘాలో జరగనున్నాయి. సోమవారం ఉదయం 9 గంటలకు మొదటి ఏడాది విద్యార్థులకు పరీక్ష ప్రారంభమవుతుంది. అరగంట ముందే కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచించారు. నిమిషం ఆలస్యమైనా అనుమతించబోరని స్పష్టం చేశారు. ప్రథమ సంవత్సర పరీక్షకు 22,011 మంది, ద్వితీయ సంవత్సర పరీక్షకు 20,028 మంది హాజరు కానున్నారు. ఆయా రూట్లలో ఆర్టీసీ బస్సులు నడిపేలా చర్యలు తీసుకుంటున్నారు. పర్యవేక్షణకు 58 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, మరో 58 మంది డిపార్టుమెంటల్ అధికారులను నియమించారు. మూడు సిట్టింగ్ స్క్వాడ్, మరో మూడు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటుచేశారు. ఇన్విజిలేటర్లతో సహా వెయ్యి మందికి పైగా సిబ్బంది పరీక్షల విధులు నిర్వహించనున్నారు. కన్వీనర్‌గా జిల్లా ఇంటర్ విద్య అధికారి (డీఐఈవో) వి.కేశవరావు వ్యవహరించనున్నారు. పరీక్షలకు సంబంధించి ఎటువంటి సమస్యలున్నా.. కంట్రోల్ రూమ్ నంబరు 9963330995కు సమాచారమివ్వొచ్చని డీఐఈవో తెలిపారు. కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తుతో పాటు తాగునీరు, వైద్య సదుపాయం వంటి అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. లోపలకు చరవాణి, ఇతర ఎలక్ట్రానిక్స్ వస్తువులు తీసుకురావద్దని సూచించారు.

తూకం.. మోసం

న్యూస్‌టుడే, కాకినాడ కలెక్టరేట్

జిల్లాలో కొందరు వ్యాపారులు తూకంలో మోసాలకు పాల్పడుతున్నారు. ఎమ్మార్పీ ధరలకు మించి విక్రయాలు చేస్తూ వినియోగదారులను నిలువుదోపిడీ చేస్తున్నారు. ముద్రణలేని కాటాలు వినియోగిస్తూ.. ప్యాకింగ్‌లో నిర్ణీతంకంటే పరిమాణాన్ని తగ్గించి వివిధ ఉత్పత్తులను అంటగడుతూ సొమ్ము చేసుకుంటున్నారు.

● 2025 ఏప్రిల్ నుంచి 2026 జనవరి వరకు జిల్లాలో తూనికలు, కొలతల శాఖ అధికారులు తనిఖీలు చేపట్టి 642 కేసులు నమోదు చేసి, రూ.60 లక్షల మేర జరిమానా విధించారు. వీటిలో రూ.45 లక్షలు వసూలు చేయగా, ఇంకా రూ.15 లక్షలు రాబట్టాల్సి ఉంది.

● తూనికలు, కొలతల శాఖలో కేవలం ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు, ఇద్దరు టెక్నికల్ అసిస్టెంట్స్ మాత్రమే ఉన్నారు. ఉన్నవారితోనే తనిఖీలు చేపట్టగా పెద్ద సంఖ్యలో అక్రమాలు వెలుగుచూస్తున్నాయి. పూర్తి స్థాయిలో నిర్వహిస్తే మరిన్ని మోసాలు బట్టబయలయ్యే అవకాశం ఉంది.

ముద్రణలేని కాటాలతో కుచ్చుటోపీ

వేబ్రిడ్జి వద్ద తూకాన్ని తనిఖీ చేస్తున్న తూనికలు, కొలతల శాఖ అధికారులు

ఇవిగో అక్రమాలు..

● పెట్రోలు బంకులపై 23 కేసులు నమోదు కాగా, వీటిలో 18 పంపులకు సీళ్లు వేశారు. 5 చోట్ల పరిమాణంలో వ్యత్యాసాలు గుర్తించారు. ● ధాన్యం కొనే కమీషన్ ఏజెంట్లకు సంబంధించి 11 కేసులు నమోదు చేశారు. 2 కిలోల చొప్పున అదనంగా రైతుల వద్ద నుంచి కొట్టేస్తున్నట్లు గుర్తించారు. ● ఎరువుల దుకాణాల్లో 11 చోట్ల తక్కువ పరిమాణం, రెండుచోట్ల ఎక్కువ ధరలకు విక్రయించినట్లు నిర్ధారించారు. ● వేబ్రిడ్జిలపై 51 కేసులు నమోదు చేశారు. ఇవన్నీ తూకంలో వ్యత్యాసం ఉన్నవే. ● కిరాణా దుకాణాలపై 125, మాంసాహార షాపులపై 32, స్వీట్స్, బేకరీస్‌పై 38, రైతుబజార్లలో 13 కేసులు నమోదయ్యాయి.

● రైస్ మిల్లులపై 39 కేసులు నమోదుకాగా, కాటాలకు ముద్రణ లేకపోవడం, పరిమాణం తక్కువ ఉన్నట్లు గుర్తించారు.

● స్టీల్, హార్డ్‌వేర్, ఎలక్ట్రికల్ దుకాణాల్లో తూకం తక్కువ, ప్యాకేజీ నిబంధనలు పాటించనందుకు 85 కేసులు నమోదు చేశారు.

ఇలా ఫిర్యాదు చేయొచ్చు

తూకాల్లో మోసాలు, అధిక ధరలు, పరిమాణం తక్కువగా విక్రయాలపై జాతీయ వినియోగదారుల సహాయ కేంద్రం 1915కు, consumerhelpline.gov.in పోర్టల్‌కు ఫిర్యాదు చేయాలి. టోల్‌ఫ్రీ నంబరు 1100, తూనికలు, కొలతలశాఖ టోల్‌ఫ్రీ నంబరు 1967, జిల్లా అసిస్టెంట్ కంట్రోలర్ 9989159015 నంబరుకు ఫోన్ చేయొచ్చు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. వినియోగదారులు ఎలక్ట్రానిక్ కాటాలకు ఏడాది తర్వాత ముద్రణ వేయించుకోవాలి. ఈ ఏడాది ఇప్పటికి ముద్రణ రుసుం కింద రూ.1.48 కోట్లు వసూలు చేశాం. నమోదైన కేసులకు సంబంధించి జరిమానాలు విధిగా రాబడతాం.
- జనార్ధనరావు, ఉపనియంత్రికులు, తూనికలు, కొలతలశాఖ, కాకినాడ

నేడు 'డయల్ యువర్ సీఎండీ'

విశాఖపట్నం, న్యూస్‌టుడే: విద్యుత్తు సంబంధిత సమస్యలను మరింత వేగవంతంగా పరిష్కరించే లక్ష్యంతో విశాఖలోని ఈపీడీసీఎల్ కార్యాలయంలో సోమవారం 'డయల్ యువర్ సీఎండీ' కార్యక్రమం నిర్వహించనున్నట్లు సంస్థ సీఎండీ ఇమ్మడి పృథ్వీతేజ్ ఒక ప్రకటనలో తెలిపారు. సంస్థ పరిధిలోని 13 జిల్లాలకు చెందిన వినియోగదారులు 8688400499 ఫోన్ నెంబర్ ద్వారా తమ సమస్యలను తెలియజేయవచ్చునని పేర్కొన్నారు. ఉదయం 10.30 నుంచి 11.30 వరకు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. విద్యుత్తు సరఫరాలో తరచూ అంతరాయాలు, హెచ్చుతగ్గులు, కొత్త సర్వీసుల జారీ, సరఫరా పునరుద్ధరణలో జాప్యం, ట్రాన్స్‌ఫార్మర్ల మార్పిడి తదితర సమస్యలపై ఫిర్యాదులను నేరుగా తన దృష్టికి తీసుకురావొచ్చని చెప్పారు.

చూపునే కాదు.. జీవితాన్ని ఇస్తున్నారు!

న్యూస్‌టుడే, గాంధీనగర్

బడుగులకు కంటి వెలుగు ప్రసాదిస్తున్న కాకినాడ ఐ బ్యాంకు

సర్వేంద్రియానాం నయనం ప్రధానం అంటారు. శరీరంలో ఇతర అవయవాలకంటే చూపు ఉంటేనే వారి జీవితం సాఫీగా సాగుతుంది. కళ్లు కనపడక చాలామంది పరిస్థితి దుర్భరంగా మారుతోంది. అటువంటి వారికి చూపునివ్వడంతో పాటు జీవితాలకు భరోసా కల్పిస్తోంది కాకినాడలోని బాదం బాలకృష్ణ ఐ బ్యాంకు. రోజువారీ కూలీలు, ఆటో డ్రైవర్లు, విద్యార్థులు ఇలా ఎంతోమంది కళ్లల్లో వెలుగులు నింపుతోంది.

అంధత్వ నివారణకు కృషి

చూపు మందగించిన వారికి వైద్యులు సాధారణంగా శస్త్రచికిత్సల ద్వారా దర్పణాలు అమరుస్తారు. కార్నియా దెబ్బతింటే మాత్రం వారికి కార్నియా అమర్చాల్సి ఉంటుంది. ఇవి అన్నిచోట్లా అందుబాటులో ఉండవు. నేత్రదానం ద్వారా మాత్రమే వీటిని సేకరించాలి. బాదం బాలకృష్ణ ఐ బ్యాంకు నిర్వాహకులు దీనిపై అందరికీ అవగాహన కల్పించి అంగీకరించేలా చేస్తున్నారు. ఎవరైనా చనిపోతే వెంటనే కార్నియాలు సేకరించి, వాటిని భద్రపరిచి, అవసరమైన వారికి శస్త్రచికిత్స చేసి అమరుస్తున్నారు.

బాగా చదువు కోగలుగుతున్నా..

నాకు ఏడేళ్ల వయస్సు నుంచి కళ్లు సరిగ్గా కనిపించేవి కావు. ఆసుపత్రిలో చూపించుకున్నప్పుడు ఆపరేషన్ చేసి కార్నియాలు అమర్చాలన్నారు. బాదం బాలకృష్ణ ఐబ్యాంకులో కార్నియాలు వచ్చాయని చెప్పడంతో వెంటనే శస్త్రచికిత్స చేశారు. ఇప్పుడు కంటి చూపు బాగా కనిపిస్తుంది. బాగా చదువుకోగలుగుతున్నాను.
- మధుశాలిని, పదో తరగతి, సంపత్‌నగరం

మళ్లీ చదువు ప్రారంభిస్తా...

నాకు ఐదేళ్ల నుంచి కళ్లు సరిగా కనిపించడం లేదు. చదువు మధ్యలో మానేశాను. ఆసుపత్రిలో చూపిస్తే కార్నియాలు దెబ్బతిన్నాయని చెప్పారు. కొన్నాళ్లకు బాదం బాలకృష్ణ ఐబ్యాంకుకు కార్నియాలు రావడంతో ఆపరేషన్ చేశారు. మళ్లీ చదువు ప్రారంభిస్తాను. - కిషోర్ రాజు, ఉప్పాడ కొత్తపల్లి

వారి దానం.. మాకు ఆధారం

నా కంటి చూపు పూర్తిగా మందగించింది. గత ఏడాది రెండు కార్నియాలను ఆపరేషన్ చేసి అమర్చారు. ఇప్పుడు బాగా కనిపిస్తుంది. ఆటోడ్రైవర్‌గా తిరిగి ఉపాధి పొందగలుగుతున్నాను. విషాదంలోనూ అనేక మంది తమవారి నేత్రాలు దానం చేయడంతోనే మాలాంటి పేదలకు చూపు వచ్చింది. - నూకరాజు, ఉప్పాడ

జీవితంలో ఎనలేని సంతృప్తి...

19 సంవత్సరాల కిందట ప్రారంభించిన ఐబ్యాంకు ద్వారా ఇప్పటి వరకూ 7560 మందికి నేత్రాలు సేకరించి, ఎంతో మందికి చూపు ప్రసాదించాం. ఇక్కడ 24గంటలూ సిబ్బంది ఉంటారు. దక్షిణ భారతదేశంలో రెండు స్పెక్యులర్ మైక్రోస్కోప్‌లు కలిగిన ఏకైక ఐబ్యాంకు ఇది. బడుగుల జీవితాల్లో వెలుగులు నింపడం జీవితంలో ఎనలేని సంతృప్తిగా ఉంది.
- బాదం బాలకృష్ణ, ఐబ్యాంకు స్థాపకులు, కార్యదర్శి

ఐ బ్యాంక్ నంబర్లు 99897 99456 94907 10666

యథావిధిగా పీజీఆర్ఎస్

కాకినాడ కలెక్టరేట్: కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్), రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు.

రౌడీషీటర్లపై కఠిన చర్యలు

మసీదు సెంటర్(కాకినాడ), న్యూస్‌టుడే: రౌడీషీటర్లు నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ బిందుమాధవ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వివిధ పోలీసుస్టేషన్ల పరిధిలో కౌన్సెలింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. చట్టవిరుద్ధ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే చర్యలు, గొడవలు, దాడులు, భూవివాదాలు, బెదిరింపులు, అక్రమ వసూళ్లు మానుకోవాలని సూచించారు.

రేవులో పెద్దఎత్తున టూనా చేపలు

మత్స్య సందడే

150 కేజీల బరువున్న కొమ్ముకోణెం చేప

కాకినాడ సముద్ర తీరంలో ఆదివారం చేపల వేటకు వెళ్లిన మత్స్యకారులకు పలు రకాల పసందైన చేపలు చిక్కాయి. వీటిలో 150 కిలోల కొమ్ముకోణెం చేపలు రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు పలికాయి. టూనా చేపలు సుమారు 10 - 30 కిలోల వరకు బరువు తూగాయి. కొనుగోలుకు మత్స్యప్రియులు కుంభాభిషేకం రేవుకు తరలి వచ్చారు. -న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్ (కాకినాడ)

పరికరాలు ఇలా.. వ్యాయామమెలా?

కాకినాడ నగరంలో నగరపాలక సంస్థకు చెందిన రాజా ట్యాంక్-వివేకానందపార్కు ఆవరణలోని మహిళల, పురుషుల బహిరంగ వ్యాయామశాలలో పరికరాల దుస్థితి ఇది. చాలా వరకు విరిగిపోయి పనిచేయడం లేదు. మరికొన్ని తుప్పుపట్టి పోయాయి. దీంతో ఇక్కడకు కసరత్తులు చేసేందుకు వచ్చిన నగరవాసులు నిరాశగానే వెనుదిరుగుతున్నారు. మరికొంతమంది అక్కడ పరిస్థితి తెలియక పరికరాలను ఉపయోగించే క్రమంలో ప్రమాదాల పాలవుతున్నారు. పరికరాలు తుప్పుపట్టడంతో ఇనుప ముక్కలు గుచ్చుకుంటున్నాయని కొందరు వాపోతున్నారు. ఇప్పటికైనా నగరపాలక అధికారులు స్పందించి వ్యాయామశాలల్లో కొత్త పరికరాలను ఏర్పాటు చేయాలని ప్రజలు విజ్ఞప్తిచేస్తున్నారు. -ఈనాడు, కాకినాడ

ఏమి సేతువు..?

న్యూస్‌టుడే-ప్రత్తిపాడు, రౌతులపూడి, శంఖవరం

ప్రజా రవాణాలో రహదారులతో పాటు వంతెనలు కీలకం. నిర్మించడమే తప్ప నిర్వహణపై దృష్టి పెట్టరు. కొత్తవి నిర్మించాలంటే రూ.కోట్లు కావాలి. ఏలేశ్వరం మండలం అప్పనపాలెంలో ఏలేరుపై సేతువు క్రమేపీ శిథిలమై రాకపోకలకు వీలులేకుండా ఉంది. దీని నిర్మాణానికి నిధులు రాబట్టలేకపోతున్నారు. ప్రత్తిపాడు, రౌతులపూడి, శంఖవరం మండలాల్లోని ర.భ, పంచాయతీరాజ్, వైఆర్‌సీ అధీనంలో కీలకమైన వంతెనలు 24 ఉన్నాయి. వీటి మీదుగా 40 గ్రామాల ప్రజలు రోజూ ప్రయాణిస్తుంటారు. ప్రజా రవాణాకు తప్ప భారీ బరువులు మోసే సామర్థ్యం లేదు. వీటిపై 20 నుంచి 35 టన్నుల లారీలు తిరుగుతున్నాయి. రౌతులపూడి-శంఖవరం మధ్య నాలుగు వంతెనలే ఇందుకు నిదర్శనం. వీటిని బిక్కుబిక్కుమంటూ దాటాల్సి వస్తోంది. వీటిపై రెయిలింగ్‌లు, రక్షణగోడలు నిర్మించలేకపోతున్నారు.

బంగారయ్యపేట సమీపంలో ప్రమాదకరంగా వంతెన

ప్రత్తిపాడు మండలంలో ఏలేరు ఎడమకాలువ, సాగర్ కాలువ, ఇతర పంట కాలువలపై ఉన్న వంతెనలు నిర్వహణ పట్టక దెబ్బతింటున్నాయి. ఏలేరు ఎడమకాలువపై నాలుగు దశాబ్దాలపాటు నిర్మించగా కొన్నింటికి రెయిలింగ్‌లు దెబ్బతిన్నాయి. అంచులు కుంగాయి. రౌతుపాలెం సమీపంలో రోడ్డు వేసినప్పుడల్లా ఒక్కో పొర పెరుగుతూ వంతెన గోడలకు సమానమైంది. వీటిపై క్వారీ లారీలు తిరుగుతుంటాయి. ఇ.గోకవరం సమీపంలో సుబ్బారెడ్డిసాగర్ వరద కాలువపై నిర్మించిన వంతెన అప్రోచ్ భారీ వర్షాలకు కోతకు గురవుతోంది. అప్రోచ్ ఏటా కుంగిపోవడం, మట్టిపూడ్చడం తప్ప శాశ్వత ప్రాతిపదికన చర్యలు లేవు. వంతెనలకు క్వారీ లారీల తాకిడి ఎక్కడికక్కడే ఉంది. సంబంధిత శాఖలు తమ పరిధిలోని ఏటిపై కట్టల మన్నికను సమీక్షించాలన్నారు.

పిల్లల పండగ.. మది నిండుగా..

పెద్దాపురంలో ఆదివారం నిర్వహించిన పిల్లల పండగ ఉత్సాహంగా సాగింది. వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు హాజరై సందడి చేశారు. శాస్త్రీయ, జానపద నృత్యాలు, నాటికలు అలరించాయి. సామాజిక అంశాలపై ఆలోచింపజేసేలా ప్రదర్శనలు చేశారు. బాలికలను రక్షిద్దాం.. సమాజాన్ని కాపాడదాం అంటూ విద్యార్థిని వేషధారణ ఆకట్టుకుంది. – న్యూస్‌టుడే, పెద్దాపురం

కండలు పెంచి.. పతకాలు తెచ్చి

దేహదారుఢ్య పోటీల్లో సత్తా

న్యూస్‌టుడే, మసీదు సెంటర్(కాకినాడ)

దేహదారుఢ్య పోటీల్లో కాకినాడ పీఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరుస్తూ పతకాలు సాధిస్తున్నారు. పేదరికం ప్రతిభకు అడ్డుకాదని నిరూపిస్తున్నారు. కసరత్తులు చేస్తూ తమ దేహాన్ని మలుచుకుంటూ కండల వీరులుగా మారారు. అనేక పోటీల్లో పాల్గొని పతకాలు సాధిస్తున్నారు. ఇటీవల నన్నయ్య విశ్వవిద్యాలయంలో జరిగిన పోటీల్లో కాకినాడ పీఆర్ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థులు బెస్ట్ ఫిజిక్ మెన్ టీమ్ ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నారు. పలువురు వర్సిటీ జట్టుకు ఎంపికయ్యారు. భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధిస్తామని వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

రోజూ 8 గంటల సాధన

డిగ్రీ మొదటి ఏడాది చదువుతున్నా. దేహదారుఢ్యంపై చిన్నతనం నుంచి మక్కువ. గత ఐదేళ్ల నుంచి బాడీ బిల్డింగ్ చేస్తున్నా. గతేడాది నన్నయ్య విశ్వవిద్యాలయంలో అంతర్ కళాశాలల పోటీల్లో రజత పతకం సాధించా. పలు పోటీల్లోనూ సత్తా చాటాను. జిమ్‌లో ప్రతిరోజు ఉదయం సాయంత్రం కలిపి 8 గంటలు సాధన చేస్తా. చికెన్, చేప, చపాతి, కాయగూరలు, గుడ్లు వంటి పోషకాహారం తీసుకుంటా. మాది వ్యవసాయ కుటుంబం. ఖాళీ సమయంలో ఎలక్ట్రికల్ పని చేస్తా. వచ్చిన డబ్బులను పోషకాహారానికి వినియోగించుకుంటాను. ఆలిండియా యూనివర్సిటీ స్థాయి పతకం సాధించడంతో పాటు, రైల్వేలో ఉద్యోగం సాధించాలనేది నా లక్ష్యం. - సాయిప్రశాంత్, కాండ్రకోట

నాన్న ప్రోత్సాహంతో..

బీఏ మొదటి ఏడాది చదువుతున్నా. మాది రాజమహేంద్రవరం. నాన్న రాజగోపాల్ తాపీ మేస్త్రి. ఆయన ప్రోత్సాహంతో గత 8 ఏళ్ల నుంచి బాడీ బిల్డింగ్‌లో శిక్షణ తీసుకుంటున్నా. ప్రతిరోజూ మూడుగంటల పాటు జిమ్‌లో కసరత్తులు చేస్తా. చికెన్, గుడ్లు, ఓట్స్, ప్రొటీన్ షేక్ వంటి పోషకాహారం తీసుకుంటా. గతేడాది అంతర్ కళాశాలల దేహదారుఢ్య పోటీల్లో పాల్గొని బంగారు పతకం సాధించా. కేరళలో జరిగిన పోటీల్లో పాల్గొన్నా. వచ్చే నెలలో విశాఖలో జరిగే ఆల్ఇండియా పోటీలకు ఎంపికయ్యా. క్రీడాకోటాలో ఉద్యోగం సాధించడంతో పాటు నాన్న కోరిక మేరకు జాతీయస్థాయి పతకం సాధించడానికి కృషి చేస్తున్నా.
- వెంకటసూర్య ప్రకాష్, రాజమహేంద్రవరం

నాలుగేళ్ల నుంచి శిక్షణ

మాది కాకినాడ. మధ్యతరగతి కుటుంబం. గత నాలుగేళ్ల నుంచి బాడీ బిల్డింగ్ చేస్తున్నా. ప్రతిరోజు ఆరు గంటల పాటు జిమ్‌లో కసరత్తులు చేస్తా. చికెన్, గుడ్లు, ఓట్స్, ప్రొటీన్, పాల కూర తీసుకుంటా. ఖాళీ సమయంలో ఓ డెలివరీ సంస్థలో పనిచేస్తా. అమ్మ కూడా సహాయం చేస్తుంది. గతంలో నన్నయ్య విశ్వవిద్యాలయం పరిధిలో జరిగిన అంతర్ కళాశాలల పోటీల్లో రెండు బంగారు పతకాలు సాధించా. రెండుసార్లు ఆల్ఇండియా పోటీల్లో పాల్గొన్నా. దాతలు సహకారం అందిస్తే మరింత ప్రతిభ కనబరిచి పతకాలు సాధించి దేశానికి పేరుప్రఖ్యాతలు తీసుకొస్తా. ఆర్మీలో చేరాలనేది నా ధ్యేయం.
- విజయ్ చాముండేశ్వర్, కాకినాడ

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97607
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80082 34669

ఉలికిపాటు..!

రాజమహేంద్రవరంలో కిడ్నీవ్యాధి కలకలం

ఈనాడు, రాజమహేంద్రవరం, న్యూస్‌టుడే, కంబాలచెరువు : ప్రశాంత రాజమహేంద్రవరం నగరాన్ని ఒక్కసారి కిడ్నీ వ్యాధి వణికించింది. చౌడేశ్వరనగర్, స్వరూప్‌నగర్, ఆర్టీసీ కార్యాలయ వెనుక ప్రాంతానికి చెందిన 14 మంది ఈనెల 15వ తేదీ తరువాతి రోజు నుంచి ఒకే తరహా కిడ్నీ సమస్యలతో ఆసుపత్రులపాలయ్యారు. వీరిలో ఇద్దరు చికిత్స పొందుతూ మృతి చెందగా మరో 12 మంది వివిధ ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. బాధితకుటుంబాలన్నీ కోరుకొండ మండలం నర్సాపురానికి చెందిన గణేష్ అనే పాల వ్యాపారి నుంచి రోజూ పాలు కొనుగోలు చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. పాలల్లో కలుషితం జరిగి ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

చౌడేశ్వరనగర్‌లో ఆదివారం రాత్రి వివరాలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది

50 మంది నుంచి సేకరణ.. 126 ఇళ్లకు సరఫరా

కోరుకొండ మండలం నర్సాపురానికి చెందిన పాల వ్యాపారి గణేష్ ఆ పరిసర ప్రాంతాల్లోని దాదాపు 50 మంది నుంచి పాలు సేకరిస్తున్నట్లు అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. సేకరించిన పాలను దాదాపు 126 ఇళ్లకు రోజూ ఇస్తున్నట్లు తెలుసుకున్నారు. ఈ మేరకు అందరి ఇళ్ల వివరాలు సేకరించగా ఆదివారం రాత్రి 9.30 వరకు 36 చిరునామాలు తెలుసుకున్నారు. పూర్తి వివరాలు తెలుసుకున్న తరువాత సర్వే పూర్తి చేయాలని కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశించారు. ● పాల వ్యాపారి గణేష్ ఇంటి పరిసరాలతోపాటు, సమీపంలో అతను పాలు సేకరిస్తున్న పాడి రైతులు తమ పశువులను పెంచే విధానం, దాణా ఏమిస్తున్నారనే అంశాలంపై విచారణ ప్రారంభించారు.

ఇంటింటా సర్వే..

చౌడేశ్వరినగర్, స్వరూప్ నగర్ పరిసర ప్రాంతాల్లో వైద్య ఆరోగ్య శాఖ, నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య బృందాలు ఇంటింటా సర్వే చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి నీటి నాణ్యతా తనిఖీలు చేపట్టారు. ఒకే ప్రాంతంలో అనూరియా (మూత్ర విసర్జన కాకపోవడం) సమస్యతో పలువురు ఆసుపత్రుల్లో చేరడంపై సమగ్ర విచారణ చేస్తున్నామని, బాధితులందరికీ మెరుగైన వైద్యం అందేలా చర్యలు చేపట్టామని తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు.

అయిదు నెలల పాపకు డయాలసిస్

అన్నపూర్ణమ్మ పేట రైల్వేగేటు వద్ద కొత్తపేటలో ఉంటాం. మా సోదరి కుమార్తె ఎం.రుహన్యకు అయిదు నెలలు. రెండు నెలల నుంచి గణేష్ వద్ద పాలు పోయించుకుంటున్నాం. యూరిన్ ఆగిపోవడంతో ఈనెల 16న నగరంలోని దానవాయిపేటలో చిన్నపిల్లల ఆసుపత్రిలో చేర్చాం. అక్కడ కిడ్నీ ఇన్‌ఫెక్షన్ వచ్చిందని, డయాలసిస్ అవసరమని చెప్పడంతో మరో ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లాం. అక్కడ చికిత్స అందిస్తున్నారు. క్షణక్షణం భయంగా ఉంది.
- ఓంకార్‌సాయి, చిన్నారి మేనమామ

ఇనుపకడ్డీలు అమర్చేందుకు కాంక్రీటును బద్దలుకొడుతున్న సిబ్బంది

వేగంగా అక్విడక్టు మరమ్మతులు

పి.గన్నవరం: పి.గన్నవరం వద్ద వైనతేయ గోదావరి నదిపై డొక్కా సీతమ్మ అక్విడక్టు రోడ్డు వంతెన మరమ్మతు పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఈ నెల 10న ఇక్కడ పనులు మొదలు పెట్టారు. దీనికి సంబంధించి 34 ఎక్స్‌పెన్షన్ జాయింట్లలో కొత్తగా రూపకల్పన చేసిన ఇనుపకడ్డీలు అమర్చేందుకు వాటివద్ద ప్రస్తుతం ఉన్న కాంక్రీటును మూడు ట్రాక్టర్ల బ్రేకర్లతో విచ్ఛిన్నం చేస్తున్నారు. ఇంతవరకు 20 ఎక్స్‌పెన్షన్ జాయింట్ల వద్ద కాంక్రీటు పనులు పూర్తయ్యాయి. 15 జాయింట్ల వద్ద నూతనంగా తయారు చేసిన ఇనుపకడ్డీలను అమర్చారు. మొత్తం 34 జాయింట్లలో ఇనుపకడ్డీలను అమర్చి, కాంక్రీటుతో పూడ్చే పనులు ఈ నెలాఖరుకు నూరుశాతం పూర్తవుతాయని జలవనరులశాఖ ఏఈఈ బెహరా రమేష్‌బాబు తెలిపారు.

(c) eenadu

కడలి నేస్తమా.. కళేబరమైతివేమమ్మా..!

కాకినాడ తీరంలో మృతి చెందిన ఆలివ్ రిడ్లే తాబేళ్ల కళేబరాలు పెరుగుతున్నాయని, అది పర్యావరణం, జీవవైవిధ్యానికి పెను ముప్పుగా భావించాలని, తాబేళ్ల సంరక్షణ చర్యలు చేపట్టాలని సామాజిక కార్యకర్తలు రంజాల సతీష్, మంగ, వరలక్ష్మి, రమ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం కాకినాడ తీరంలో అరుదైన ఆలివ్ రిడ్లే తాబేళ్ల మృత కళేబరాల వద్ద ప్లకార్డులతో నిరసన తెలిపారు. సంరక్షణ చర్యలు చేపట్టాలని తీరంలో ర్యాలీ నిర్వహించారు. తీరంలో పరిశ్రమల నుంచి వ్యర్థాలు కలుషిత జలాలను శుద్ధిచేయకుండా నేరుగా సముద్రంలో వదిలిపెడుతుండడంతో మత్స్యసంపదతోపాటు తాబేళ్లకు ముప్పు వాటిల్లుతోందన్నారు. – న్యూస్‌టుడే, రమణయ్యపేట(కాకినాడ గ్రామీణం)

బాలలు భళా.. మురిపించారుగా..

పెద్దాపురం పట్టణ లూథరన్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన పిల్లల పండుగ ఆకట్టుకుంది. పెద్దాపురం నియోజకవర్గంలోని 18 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. వారు ప్రదర్శించిన ఏకపాత్రాభినయం, నాటికలు, నాటకాలు, జానపద, శాస్త్రీయ నృత్యాలు, కోలాటం, నృత్యరూపకాలు అలరించాయి. నిర్వాహకులు భోజన, వసతి సౌకర్యాలు కల్పించారు. డీసీసీబీ ఛైర్మన్ రామస్వామి, పీపీసీ గౌరవాధ్యక్షుడు రాజాసూరిబాబురాజు, అధ్యక్షుడు వెంకటచలపతిరావు, శ్రీప్రకాష్ పాఠశాల డైరెక్టర్ విజయప్రకాష్, డీవై ఈవో ప్రభాకరశర్మ, లూథరన్ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ నళిని, పిల్లల పండగ ప్రధాన కార్యదర్శి బుద్దా శ్రీనివాస్, పీపీసీ సభ్యులు సీతారామారావు, అరుణ, క్రాంతికుమార్, ప్రభాకర వర్మ, రచయిత, దర్శకుడు కేబీ ఆనంద్, పట్టణ జనసేన అధ్యక్షుడు సత్తిబాబు, పట్టణ తెదేపా అధ్యక్షుడు రంధి సత్యనారాయణ పాల్గొన్నారు. –న్యూస్‌టుడే, పెద్దాపురం

హాజరైన బాలబాలికలు, తల్లిదండ్రులు

పరమానంద శిష్యులు నాటకం ప్రదర్శన

మన బాధ్యత తీర ప్రాంత శుభ్రత..

సముద్ర తీర ప్రాంతాల శుభ్రత-మనందరి సామాజిక బాధ్యత, ప్లాస్టిక్ వినియోగాన్ని పర్యాటకులు స్వచ్ఛందంగా తగ్గించుకోవాలని ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ కోరారు. కాకినాడ సముద్రతీరంలో ఆదివారం ఎన్‌సీసీ కాకినాడ హెడ్ క్వార్టర్స్ గ్రూప్ కమాండర్ కల్నల్ రవిమోహన్ అగర్వాల్ ఆధ్వర్యంలో [illegible] చేపట్టిన పరిశుభ్రత కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ హాజరయ్యారు. అధికారులు, కేడెట్లతో కలిసి ఎమ్మెల్సీ వ్యర్థాలు సేకరించి పంచాయతీ సిబ్బందికి అప్పగించారు. ఏవో కల్నల్ సీకే నాయక్, కల్నల్ అనిల్ సింగ్, మానిక్, మహమ్మద్ పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, రమణయ్యపేట

శ్రీపాదవల్లభుడికి వైభవంగా పూజలు

పిఠాపురం, న్యూస్‌టుడే: పిఠాపురం శ్రీపాద వల్లభ మహాసంస్థానంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఫాల్గుణ శుద్ధ పంచమి సందర్భంగా భక్తులు పోటెత్తారు. స్వామివారికి అభిషేకం చేసి, ప్రత్యేక అలంకరణ చేశారు. ఈవో సౌజన్య ఏర్పాట్లు పర్యవేక్షించారు.

అభిషేకం చేస్తున్న అర్చకుడు

సిద్ధివినాయక.. అభయదాయక

అయినవిల్లి: అయినవిల్లి సిద్ధివినాయకస్వామి దర్శనానికి ఆదివారం పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆదివారం ఆలయ పరిసరాలు కిక్కిరిశాయి. ఇంటర్ పరీక్షల సందర్భంగా పెద్దసంఖ్యలో విద్యార్థులు విచ్చేసి హాల్‌టికెట్లు, కలములు స్వామివారి పాదాల చెంత ఉంచారు. పలువురు చిన్నారులకు అక్షరాభ్యాసాలు, అన్నప్రాసనలు చేశారు. వివిధ రుసుముల ద్వారా రూ.4,24,197 ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు.

వేడుకగా పెద్దింట్లమ్మ జాతర

సఖినేటిపల్లి, న్యూస్‌టుడే: మెండుపాలెం పెద్దింట్లమ్మ జాతర మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆదివారం విశేష పూజల అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. వివిధ ప్రాంతాల నుంచి వేలాదిమంది తరలివచ్చారు. పక్కనే ఉన్న కొబ్బరి తోటల్లో నైవేద్యాలు తయారు చేసి అమ్మవారికి సమర్పించి కుటుంబ సమేతంగా స్వీకరించారు. దీంతో ఆ ప్రాంతం సందడిగా మారింది.

లోవకు పోటెత్తిన భక్తులు

అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

తుని గ్రామీణం, న్యూస్‌టుడే: తలుపులమ్మ లోవ దేవస్థానానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకొని ముడుపులు చెల్లించారు. వసతి గదులు నిండిపోవడంతో భక్తులు ఆలయ ప్రాంగణంలోని చెట్ల కింద వంటావార్పు చేసుకొని సామూహిక భోజనాలు చేశారు. ఈ ఒక్కరోజే సుమారు 16 వేలకు పైగా భక్తులు తరలిరావడంతో ఆలయానికి రూ.5.62 లక్షలు ఆదాయం సమకూరినట్లు దేవస్థానం డిప్యూటీ కమిషనర్ విశ్వనాథరాజు తెలిపారు.

కార్యకర్తలకు భరోసా కల్పిస్తాం

జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల రామస్వామి

కాకినాడ కలెక్టరేట్: కష్టకాలంలో పార్టీ వెన్నంటి ఉండి పాలించే స్థాయికి తీసుకువచ్చిన ప్రతి కార్యకర్తను జనసేన గుర్తుంచుకుంటుందని, సముచిత స్థానం కల్పిస్తుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, డీసీసీబీ ఛైర్మన్ తుమ్మల రామస్వామి(బాబు) పేర్కొన్నారు. ఆదివారం స్థానిక సూర్యకళామందిరంలో పార్టీ జిల్లా ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ త్వరలో జనసేన పార్టీ దేశవ్యాప్తంగా విస్తరించనుందని, నాయకులు, కార్యకర్తలకు అరుదైన గౌరవం దక్కుతుందన్నారు. పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా ప్రతి కార్యకర్త, వీరమహిళలు పనిచేయాలన్నారు. జిల్లా నుంచి అత్యధిక సంఖ్యలో పార్టీ క్రియాశీలక సభ్యత్వాలను నమోదు చేయాలని కోరారు. త్వరలో జిల్లా కమిటీని ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. సమావేశంలో ఎమ్మెల్యే పంతం నానాజీ, రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ ఛైర్మన్ తోట సుధీర్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తుమ్మల రామస్వామి, హాజరైన నాయకులు, కార్యకర్తలు, వీరమహిళలు

అమ్మా.. నాన్నా.. పాసవ్వండి..!

పిల్లలకు ఇంటర్ పరీక్షల వేళ అప్రమత్తం

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఏటా వివిధ కారణాలతో ఇంటర్ పబ్లిక్ పరీక్షలు రాయలేకపోతున్నారు. రాసినా కొందరు ఉత్తీర్ణులు కాలేకపోతున్నారు. ఒక నిమిషం ఆలస్యమైనా అనుమతించరనే నిబంధనలను పట్టించుకోక నష్టపోతున్నారు. జిల్లాలో నేటి నుంచి ఇంటర్ పరీక్షలు ఆరంభం అవుతున్న నేపథ్యంలో అప్రమత్తం కావాల్సిఉంది. పిల్లల్ని సన్నద్ధం చేసే తల్లులు, పరీక్ష కేంద్రాలకు స్వయంగా వారిని తీసుకువెళ్లే తండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఇంటర్మీడియట్ పరీక్షలు రాసే విద్యార్థుల బాగు కోరి నిపుణులు చెబుతున్న మంచి అంశాలను ఓ సారి పరిశీలిద్దాం. – న్యూస్‌టుడే, పామర్రు, సామర్లకోట

ఇలా చేయాలి తల్లీ..

● బిడ్డకు ఆది గురువు అమ్మే. పరీక్షల్లో మీ పిల్లలు రాణించాలంటే మీదే మొదటి బాధ్యత. వారిని పరీక్షలకు సిద్ధం చేయడం, సులువుగా జీర్ణమయ్యే ఆహారం పెట్టండి(అది కూడా ఇంటిలోనే వండింది). పరీక్ష బాగా రాయలగవని చెప్పి వారిలో మనోధైర్యాన్ని నింపండి. ● పరీక్ష రోజుకు అవసరమైన సరంజామాను ముందు రోజే సర్ది ఇవ్వండి. తగిన కాటన్ దుస్తులను సిద్ధం చేయండి. ● పరీక్ష రాసి ఇంటికి వచ్చాక నీరసం తొలగేలా చల్లని పానీయం అందించండి. ● మీ బాబు, పాప పరీక్షకు సన్నద్ధమవుతున్నారనే విషయం మరిచి టీవీ పెట్టుకుని భారీ సౌండ్‌లో వారికి ఇబ్బందికలిగేలా వ్యవహరించొద్దు. ● ఇతరులతో పోల్చుతూ.. ఆత్మన్యూనతకు గురిచేయడం మానుకోవాలి. ● ఉలిక్కిపడి నిద్రలేచేలా కొట్టడం, తిట్టడం చేయకూడదు. ● పొద్దున్నే నువ్వు చదవవు.. రాత్రిపూటే 11 గంటల వరకు చదువు అంటూ అలసిపోయేలా చేయవద్దు. ● బంధువులకు సంబంధించిన విషయాలను వారికి వినిపించేలా మాట్లాడకపోవడం శ్రేయస్కరం. ● పిల్లల్లో అనారోగ్య లక్షణాలను గుర్తిస్తే.. వెంటనే వైద్యులకు చూపించాలి. ● ముఖ్యంగా తల్లులూ.. మీరు ఆరోగ్యంగా ఉంటేనే.. మీ పిల్లల విజయం ఖాయమనే విషయం మరిచిపోకండి.

ఇలా వద్దేవద్దు..

■ సామర్లకోట బ్రౌన్‌పేటలోని ఆర్సీఎం ఆశ్రమ వసతిగృహంలో ఉంటూ సమీప జడ్పీ బాలికల ప్లస్ ఉన్నత పాఠశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని గతేడాది 9.30 గంటలకు పరీక్ష కేంద్రానికి వచ్చింది. అర గంట ఆలస్యం కావడంతో అధికారులు అనుమతించలేదు. అందుకు కారణం ఆమె పరీక్షకు ముందురోజు స్వగ్రామమైన కాకినాడ గ్రామీణం సర్పవరంలోని ఇంటికి వెళ్లి తిరిగి వచ్చే క్రమంలో తండ్రి నడుపుతున్న మోటారు సైకిల్ మార్గం మధ్యలో ఆగిపోవడమే. ఆ తరువాత సప్లిమెంటరీ రాసి బయటపడింది. అదే ద్వితీయ సంవత్సరం అయితే ఆ అవకాశమూ ఉండేదికాదు. విద్యార్థులు, తల్లిదండ్రులను అప్రమత్తం చేసే ఘటన ఇది.

మరిచిపోవద్దండీ..

● పరీక్షలకు పిల్లల్ని కేంద్రాలకు తీసుకువెళ్లే ముందు వాహనంలో ఇంధనం సరిచూసుకోండి. రహదారి భద్రత నిబంధనలు పాటించండి. ● నిర్దేశిత సమయానికి అర గంట ముందే కేంద్రానికి చేరుకునేలా సమయం కేటాయించుకోండి. ● పరీక్ష అవగానే ఎలా రాశావు. ఎన్ని మార్కులు వస్తాయనే ప్రశ్నలు సంధించి అయిపోయిన అంశంపై పిల్లల్ని విసిగించకూడదు. తర్వాతి రోజు పరీక్షపై ఏకాగ్రత నిలిపేలా ప్రోత్సహించాలి. ● పరీక్షలకు సన్నద్ధమవుతున్న పిల్లలున్న ఇళ్లలో ఆర్థిక, కుటుంబ పరమైన అంశాలపై వారికి వినిపించేలా చర్చలు, వాగ్వాదాలు, గొడవలకు దిగొద్దు. ● పరీక్షల వేళ శుభకార్యాలు, తీర్థయాత్రల ప్రస్తావన అనవసరం. ● సమయపాలన ఆవశ్యకత వివరించాలి. బాగా రాయగలవనే నమ్మకం కలిగించండి. ● పరిమితికి మించి ఎక్కించే ఆటోల్లో కేంద్రాలకు పంపించవద్దు. ● పెద్దలు ఫోన్ పట్టుకుంటే.. పిల్లలూ దాని గురించే ఆలోచిస్తారనే విషయం మరవొద్దు.

సమస్యలు గుర్తించండి..

పరీక్షలు మీ పిల్లలకే కాదు. మీకూ అనే విషయం తల్లిదండ్రులు మరవొద్దు. పిల్లలు ఏ రకమైన మానసిక ఒత్తిడి, అనారోగ్యం బారిన పడుతున్నారో గమనించాలి. కడుపునొప్పి, తలనొప్పి, ఆందోళన లాంటివి కనిపిస్తే వారిని ఓదార్చాలి. తగిన మందులు, ధైర్యాన్ని ఇవ్వాలి. ● ఏదైనా పని గంటల తరబడి చేస్తే విసుగువస్తుంది. ఎప్పుడూ చదువేకాకుండా పిల్లలకు మధ్యలో విరామం ఇవ్వాలి. వారితో సరదా కబుర్లు చెప్పాలి. ● సాయంత్రం వేళ కాసేపు వారిని బయట ఆడుకునేలా ప్లాన్ చేయండి. వారితో కలిసి మీరూ ఆడండి. పిల్లల మనసు ఫ్రెష్ అవుతుంది. ● ఉదయం కాసేపు యోగా, ధ్యానం వంటివి చేయించండి. ● అదే పనిగా సలహాలు, సూచనలు ఇవ్వకండి. వారి ఏకాగ్రత చదువు నుంచి మరలుతుంది.

అభద్రతా భావం రానీయొద్దు

పరీక్షల వేళ పిల్లలకు ఏవిధమైన అభద్రతా భావం రాకుండా తల్లిదండ్రులు జాగ్రత్త పడాలి. వారి గొడవలు పిల్లల చదువులనేకాదు, వారి జీవితంపైనే ప్రభావం చూపుతాయి. పరీక్షలకు ముందురోజు రాత్రి నుంచి వారికి సమతుల ఆహారం అందివ్వాలి. ఆహారం మారితే ఆక్సిజన్ వారి మెదడుకు కాకుండా పొట్టకు చేరుకుని ఇబ్బందిపడతారు. పరీక్షల వేళ తల్లిదండ్రులు చరవాణి, టీవీలకు దూరంగా ఉండాలి. తల్లులు వారితోపాటే ఏదో ఒక పుస్తకం చదువుకుంటే మంచిది. – పలివెల లలితాదేవి, ఎడ్యుకేషనల్ సైకాలజిస్ట్

ఉద్యోగ, ఉపాధ్యాయ హామీలను అమలు చేయాలి

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం మ్యానిఫెస్టోలో ప్రకటించిన ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్.సాయిశ్రీనివాస్ కోరారు. స్థానిక రామారావుపేట ఎస్టీయూ భవన్‌లో జిల్లా సంఘం ప్రథమ కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. సంఘ జిల్లా అధ్యక్షుడు శేశెట్టి సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సాయిశ్రీనివాస్ మాట్లాడుతూ 12వ పీఆర్సీ కమిటీని ఏర్పాటు చేసి మధ్యంతర భృతి 30 శాతం ప్రకటించాలని, సీపీఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమల్లోకి తేవాలని డిమాండ్ చేశారు. ప్రధాన సమస్యల పరిష్కారానికి ఎస్టీయూ దశలవారీ ఉద్యమాన్ని చేస్తుందని తెలిపారు. అందులో భాగంగా ఈనెల 25న చలో విజయవాడ పిలుపునిచ్చినట్లు సాయిశ్రీనివాస్ ప్రకటించారు. ఎస్టీయూ ఉపాధ్యాయ వాణి ప్రధాన సంపాదకులు కేవీ శేఖర్, సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతు రామకృష్ణ, ఆర్థిక కార్యదర్శి రామ్‌తేజ, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి మోర్త శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి కూచిమంచి కాశీవిశ్వనాథ్, సంపత్, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్టీయూ ప్రధాన కార్యదర్శి సాయిశ్రీనివాస్

కారు చీకట్లో.. ప్రయాణం ఎట్లా?

రాజోలు, న్యూస్‌టుడే: రాజోలు మండలం శివకోటి నుంచి పాశర్లపూడి వరకు 22 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న బైపాస్‌పై రాత్రి సమయంలో ప్రయాణాలు ప్రమాదకరంగా సాగుతున్నాయి. విద్యుద్దీపాలు ఏర్పాటు చేయకపోవడంతో కూడళ్ల వద్ద తరచూ ఏదో ఒక ప్రమాదం చోటు చేసుకుంటున్నా సంబంధిత అధికారులు స్పందించడం లేదని వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై జాతీయ రహదారుల ఏఈ వెంకటరమణను వివరణ కోరగా త్వరలో దీపాలు ఏర్పాటు చేస్తామన్నారు.

28 నుంచి అమలాపురంలో ప్రపంచ తెలుగు మహాసభలు

మాట్లాడుతున్న జీజీయూ కులపతి సత్యనారాయణరాజు

సర్పవరం, న్యూస్‌టుడే: బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం కిమ్స్ వైద్య కళాశాల ప్రాంగణంలో ఈ నెల 28 నుంచి రెండు రోజుల పాటు వైభవంగా మూడవ ప్రపంచ తెలుగు మహాసభలు, తెలుగుభాష, సాహిత్య, సంస్కృతుల సమ్మేళనం నిర్వహిస్తున్నామని మాజీ ఎమ్మెల్సీ, గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ(జీజీయూ) కులపతి కేవీవీ సత్యనారాయణరాజు(చైతన్యరాజు) తెలిపారు. కాకినాడ గ్రామీణం సర్పవరంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వివరాలు వెల్లడించారు. రాజమహేంద్రవరం శివారు జీజీయూలో రెండుసార్లు సభలు జరిపామని, మూడోసారి కిమ్స్‌లో నిర్వహిస్తామన్నారు. ప్రపంచం నలుమూలల నుంచి భారీగా ప్రముఖులు, తెలుగు భాషాభిమానులు హాజరవుతారన్నారు. ప్రధాన వేదికకు దివంగత నందమూరి తారక రామారావు పేరు పెడతామన్నారు. మరో 4 వేదికలు ఏర్పాటుచేసి 16 రకాల సాహిత్య వేడుకలు, వందల మంది కవులతో సమ్మేళనాలు తదితరాలను వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో చైతన్యగ్రూప్ డైరెక్టర్ పీవీ కృష్ణంరాజు, సాహితీవేత్తలు సూర్యనారాయణమూర్తి, డా.వేదుల శ్రీరామశర్మ, స్టేట్ టీచర్స్ యూనియన్ నాయకులు పి.సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

స్త్రీ, పురుష సమానత్వానికి పోరాటం

గాంధీనగర్, న్యూస్‌టుడే: స్త్రీ, పురుష సమానత్వానికి పోరాటాలు చేస్తున్నామని, అందులో భాగంగా అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవం సందర్భంగా ప్రగతి శీల మహిళా సంఘం(స్త్రీవిముక్తి) ఆధ్వర్యంలో మార్చి 2 నుంచి 8వ తేదీ వరకూ నిర్వహించే సభలు, ర్యాలీలు జయప్రదం చేయాలని సంఘ నాయకురాలు రెడ్డి దుర్గాదేవి పిలుపునిచ్చారు. ఆదివారం సూర్యనారాయణపురంలో కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. దుర్గాదేవి మాట్లాడుతూ మార్చి 2 నుంచి జిల్లాలో వివిధ ప్రాంతాల్లో సభలు, ర్యాలీలు, అనంతరం మార్చి 7న కాకినాడలో, 8న రాజమహేంద్రవరాల్లో సభలు నిర్వహిస్తామని తెలిపారు. దేశంలో, రాష్ట్రంలో మహిళలు, చిన్నారులపై అత్యాచారాలు, అఘాయిత్యాలు పెరిగిపోయాయని ఆరోపించారు. వీటిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అరికట్టాలని డిమాండ్ చేశారు. పీవోడబ్ల్యు నాయకులు మహాలక్ష్మి, దేవి, కాదా అపర్ణ, కుమారి, నీలవేణి, పార్వతి, ఏపి ఆర్‌సిఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వి.రాజబాబు, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ప్రగతిశీల మహిళా సంఘ(స్త్రీవిముక్తి) నాయకులు

ఆలయాల అభివృద్ధిపై దృష్టి

మాన్సాస్ ఛైర్మన్ అశోక్‌గజపతిరాజు

విజయనగరం కంటోన్మెంట్, న్యూస్‌టుడే: ఆలయాల అభివృద్ధి పనులు ఆపొద్దని, ప్రత్యేకంగా దృష్టి సారించి భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని మాన్సాస్ ఛైర్మన్, 104 దేవాలయాల అనువంశిక ధర్మకర్త, గోవా రాష్ట్ర గవర్నర్ పూసపాటి అశోక్ గజపతిరాజు అన్నారు. విజయనగరం కోటలోని మాన్సాస్ కార్యాలయంలో ఆదివారం విజయనగరం పైడితల్లి, సంతపేట జగన్నాథస్వామి, శ్రీకూర్మం కూర్మనాథస్వామి, మందేశ్వరస్వామి దేవాలయాల పాలకమండలి సభ్యులు, దేవాదాయ శాఖ అధికారులతో సమావేశమయ్యారు. వార్షిక బడ్జెట్, ఖర్చులపై ఆరా తీశారు. ★ పైడితల్లి ఆలయ పునర్నిర్మాణ పనులను జూన్ నాటికల్లా పూర్తి చేయాలని ఈవో శిరీషను ఆదేశించారు. జాప్యం జరగకుండా పర్యవేక్షించాలన్నారు. శివాలయం వీధిలోని అమ్మవారి కల్యాణ మండపాన్ని పూర్తిగా తొలగించి కొత్త నిర్మాణాన్ని చేపట్టనున్నట్లు ఈవో వెల్లడించారు. భవిష్యత్తు అవసరాల దృష్ట్యా సిరిమానుల కోసం అయిదెకరాల్లో చింత చెట్లు పెంచే ప్రతిపాదనపై చర్చించారు. ★ సంతపేట ఆలయం నూతన పాలకవర్గం కొలువుదీరింది. ఎనిమిది సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. సభ్యులుగా మల్ల నాగమణి, పెంటకోట గౌరి, ఎస్.అన్నపూర్ణ, గంగళ్ల లక్ష్మి, బంబోతుల అప్పారావు, సారిపల్లి కిరణ్‌కుమార్, చెల్లపు వెంకటరమణ, ముని శ్రీరామకృష్ణను నియమించారు. వీరు రెండేళ్లపాటు పదవిలో కొనసాగుతారు. దేవాలయానికి సంబంధించి సీజీఎఫ్ నిధులతో నిర్మించిన కాలక్షేప మండపం పరిసరాల్లో విద్యుత్తు దీపాల ఏర్పాటు, నీళ్ల ట్యాంకు, పైపులైన్ పనులు చేపట్టాలని సభ్యులు ఛైర్మన్ దృష్టికి తీసుకొచ్చారు. కాలక్షేప మండపాన్ని రోజుకు రూ.10,000కు అద్దెకిచ్చేలా తక్షణం వినియోగంలోకి తేవాలని విన్నవించారు. ★ శ్రీకాకుళం జిల్లా శ్రీకూర్మంలోని కూర్మనాథస్వామి దేవాలయం ఆవరణలో కోనేరును శుభ్రపర్చి, చుట్టూ చెట్లు నాటేందుకు రూ.10 లక్షలను ఇండిగో సంస్థ మంజూరు చేసిందని, మరి కొన్ని మరమ్మతులు చేపట్టాలని పాలక మండలి సమావేశంలో నిర్ణయించారు. ★ కోనసీమ జిల్లా మందపల్లిలోని మందేశ్వరస్వామి ఆలయానికి దేవాదాయ శాఖ సీజీఎఫ్ నిధి నుంచి రూ.3 కోట్లు మంజూరయ్యాయని ఛైర్మన్ తెలిపారు. రెండు అంతస్తుల భవనాన్ని నిర్మించనున్నట్లు వెల్లడించారు.



అశోక్‌గజపతిరాజుకు మందేశ్వరస్వామి చిత్రపటాన్ని అందజేస్తున్న మందపల్లి దేవస్థానం సిబ్బంది

జాతీయ రహదారిపై ఘోర ప్రమాదం

రెయిలింగ్‌లో నుంచి దూసుకెళ్లిన కారు ● ఒకరు మృతి

చింతూరు, న్యూస్‌టుడే: జాతీయ రహదారి-30పై ఓ కారు ఘోర రోడ్డు ప్రమాదానికి గురైన సంఘటన మండలంలోని సింగన్నగూడెం వద్ద ఆదివారం చోటుచేసుకుంది. చింతూరు పోలీసుల వివరాల ప్రకారం.. తమిళనాడు నుంచి ఒడిశా రాష్ట్రానికి ఎనిమిది మందితో బయలుదేరిన ఓ కారు ఎన్‌హెచ్-30లోని సింగన్నగూడెం వచ్చేసరికి అదుపు తప్పింది. మూలమలుపుల్లో ప్రమాదాల నివారణకు ఏర్పాటు చేసిన ఇనుప రెయిలింగ్ అంచును ఢీకొట్టింది. దీంతో ఇనుప బద్ది కారు మధ్యలో నుంచి రెండుగా చీల్చుకుంటూ వెళ్లిపోవడంతో అందులో ప్రయాణిస్తున్న పురేశ్‌గౌడ్(22) అక్కడికక్కడే మృతి చెందారు. మిగిలినవారికి తీవ్రగాయాలవడంతో చింతూరు ఏరియా ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్సలు నిర్వహించి భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు. చింతూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సంఘటనా స్థలాన్ని ఏఎస్పీ హేమంత్ పరిశీలించారు.

ఘటనా స్థలంలో దెబ్బతిన్న కారు

92.7 FM Rajamahendravaram
ఈ FM 92.7 Mee FM
ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180626, 9989993175

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):	18,000
పాతకాయ: గండేరా	30,500
గటగట	29,000
కొత్తకాయ: గండేరా	30,000
గటగట	29,000
నీటి కాయ (వెయ్యింటికి): పాత (ముక్కుడు) కాయ	18,000-21,000
కొత్త (పచ్చి) కాయ	16,000-17,000
కొబ్బరినూనె మార్కెట్: 15 కిలోలు	5,000
కిలో	350

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లలో

ఫారంరేటు	115-00
రిటైల్ లైవ్	142-00
డ్రెస్డ్	206-00
స్కిన్‌లెస్	234-00

ఓఎన్‌జీసీ కార్యకలాపాలు వద్దంటూ నిరసన

అయినవిల్లి: వీరవల్లిపాలెంలో ఓఎన్‌జీసీ కార్యకలాపాల వల్ల ఇబ్బందులు పడతామని గ్రామస్థులు ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. ప్రధాన రహదారి చెంత కొబ్బరి తోటను తొలగించి రిగ్గు తవ్వేందుకు అధికారులు భారీయంత్ర సామగ్రి తీసుకొచ్చారు. దీనిపై స్థానికులు ఆందోళన చెందారు. ఇక్కడ ఎటువంటి కార్యకలాపాలు చేయవద్దంటూ నినాదాలు చేశారు. పంటపొలాలు దెబ్బతింటాయని, భూగర్భ జలాలు కలుషితం అవుతాయని వాపోయారు. పి.గన్నవరం సీఐ భీమరాజు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

వీరవల్లిపాలెంలో ఓఎన్‌జీసీ సైట్ వద్ద నినాదాలు చేస్తున్న గ్రామస్థులు

టాటా గ్రూప్ మారథాన్‌లో దాట్ల ప్రతిభ

లొల్ల(ఆత్రేయపురం), న్యూస్‌టుడే: టాటా గ్రూప్ ఆధ్వర్యంలో మహారాష్ట్రలో ఆదివారం తెల్లవారుజామున నిర్వహించిన 9వ అల్ట్రా మారథాన్‌లో లొల్ల గ్రామానికి చెందిన ట్రై అథ్లెటు, మాజీ సైనికుడు దాట్ల నాగ శ్రీరామరాజు ప్రతిభ చాటారు. 50 కిమీ పరుగును కేవలం 4.14 గంటల్లో పూర్తి చేసి నాలుగో స్థానం సాధించారు. అనంతరం నిర్వాహకుల నుంచి రూ.30 వేల నగదు, బహుమతితో పాటు పతకం, ప్రశంసా పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన్ను తోటి మాజీ సైనికులు, గ్రామస్థులు అభినందించారు.

బహుమతి అందుకున్న మాజీ సైనికుడు నాగ శ్రీరామరాజు

లోవకొత్తూరులో ఘర్షణ

తుని గ్రామీణం, న్యూస్‌టుడే: తుని గ్రామీణ మండలం లోవకొత్తూరు గ్రామంలో దుకాణ యాజమాని లోవరాజు కుమారుడు శ్రీనుని తలుపులమ్మ ఆలయానికి వస్తున్న భక్తుడొకరు గాయపరిచారు. పోలీసులు తెలిపిన వివరాలివీ.. అనకాపల్లి జిల్లా నర్సీపట్నం సమీపంలోని గురుద్వారపాలెం గ్రామానికి చెందిన పలువురు యాత్రికులు ఆదివారం ఉదయం లోవ తలుపులమ్మ దర్శనానికి వస్తూ మార్గమధ్యలో లోవకొత్తూరు గ్రామంలోని ఒక దుకాణం వద్ద చాకు కొనేందుకు ఆగారు. దుకాణంలోకి చొచ్చుకొని వస్తున్న వ్యక్తిని లోవరాజు లోపలకు రావొద్దంటూ వారించాడు. దీంతో వారు ఘర్షణకు దిగారు. వీరిని అడ్డుకోబోయిన దుకాణ యజమాని తనయుడు శ్రీనుని చాకుతో గాయపరిచాడు. మెడపై గాయం కావడంతో తుని ప్రాంతీయ ఆసుపత్రికి తీసుకెళ్లారు. దీంతో స్థానికులు నిందితుడికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారన్నారు. ఘటనపై గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణమాచారి తెలిపారు.

గాయపడ్డ శ్రీను

EENADU Classifieds

BUSINESS SERVICES
బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph.81422 92071.

REAL ESTATE
LAND FOR SALE
JAGGAMPETA
రాజమండ్రికి 30 కి.మీ. దూరములో మురారి, గండేపల్లి మధ్య NH కి చేర్చి 100 అ॥ల రోడ్డు ఫేసింగ్‌తో 60 సెంట్లుభూమి అమ్మబడును. (నోబ్రోకర్స్) ✆ 9032988265

PLOT FOR SALE
RAJAMAHENDRAVARAM CITY
రాజమండ్రి, V.L.పురం మోడల్ కాలనీ, NH-5కి అతిదగ్గరగా వెస్ట్ ఫేసింగ్ 520 చ॥గ॥ల స్థలం అమ్మకం. Contact: 98850 72992, 80991 91919.
రాజమండ్రి To వైజాగ్ వెళ్లే హైవేను ఆనుకొని దివాన్‌చెరువు వద్ద గైట్ కాలేజీకి ఎదురుగా బ్రిడ్జి కౌంటినీ ఆనుకొని ఉన్నది. GSL కాలేజ్ దగ్గరలో E/F వెయ్యి గజాలు చొప్పున 3 ప్లాట్లు ఉన్నవి. చుట్టూ అపార్ట్మెంట్లు, హాస్టల్స్, గజం 1కి రూ.30 వేలు. 9848183683, 8686635567

RAJANAGARAM
ఓనర్ డైరెక్ట్‌గా అమ్మే రెసిడెన్షియల్ ప్లాట్లు రాజానగరం మండలఆఫీస్ వెనుక, డీటీసీపీ అప్రూవ్డ్ లేఅవుట్‌లో స్థలాలు అమ్మకం. 96668 94019, 93980 83034

JOBS
డిజైనింగ్ వచ్చిన DTP ఆపరేటర్స్ సీనియర్స్/ జూనియర్స్ కావలెను. (Page Maker, ఫొటోషాప్, Coreldraw, Illustrater etc.) Rjy, 9246657116
Montra 3-వీలర్ ఎలక్ట్రిక్ ఆటో మార్కెటింగ్ చేయుటకు అనుభవం గల సేల్స్ మేనేజర్ కావలెను. సీతంపేట, రాజమండ్రి. Contact: 94947 81111.
శ్రీదేవి ఫంక్షన్‌హాలు నందు పని చేయుటకు గార్డెనింగ్, సివిల్ & క్లీనింగ్ కొరకు వర్కర్స్ కావలెను. ఉచిత వసతి, జీతం: యువకులకు 18,000/-, మధ్య వయస్కులకు 15,000/-, పెద్దవారికి 12,000/-. జి.మామిడాడ, Cell: 94909 98888.
శివ కార్తికేయ హోంకేర్‌లో వృద్ధులు, పేషంట్స్, పిల్లలను చూసుకొనుటకు నర్సులు, వర్కర్స్ కావలెను. ఫ్రీ వసతి, భో.జీ. 20K. ✆ 99120 11499, 99120 11899.

EENADU for Advertisement Contact: 8008597607

MARKETING/ SALES
Anand Masale Require Sales & Marketing Manager, Marketing Executives. Contact: 9849655105, 9848053144 Email:anandmasala-appltd@gmail.com.

SECURITY GUARDS
కాకినాడ, పెద్దాపురం, ధవళేశ్వరం లలో పనిచేయుటకు సెక్యూరిటీ సూపర్‌వైజర్లు, సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. Contact Cell: 85004 98115, 98665 94189.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర
★ For the Information of Trade & Industry
★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 4-65 పై॥
అనపర్తి ఆఫీసు: 08857-226908

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారులు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

కాకినాడ

రైతుబజార్‌లో కూరగాయల ధరలు(కిలోకు)

గాంధీనగర్, న్యూస్‌టుడే: టమాట- 8, 10, వంకాయలు- 20, 26, 30, బెండకాయలు- 32, పచ్చిమిర్చి- 56, 60, 64, కాకరకాయ- 46, బీర- 28, 32, క్యాలీఫ్లవర్- 15, 20, క్యాబేజీ- 18, క్యారెట్- 28, దొండకాయలు- 30, 34, బంగాళాదుంపలు- 16, 20, ఉల్లి- 18, 24, దోసకాయలు- 30, చిక్కుళ్లు- 20, చేమదుంపలు- 30, బీట్‌రూట్- 24, కీరదోస- 36, బీన్స్‌కాయలు- 80, అల్లం- 70, క్యాప్సికం- 60, బొబ్బర్లు- 20, చిలకడదుంపలు- 36, ఒకటి చొప్పున ఆనపకాయ- 15, 20, పొట్లకాయ- 20, 25, అరటికాయ- 6, 8, మునగకాడ- 10, 15, మామిడికాయ- 15, 20, నిమ్మకాయలు(డజన్) - 30, 42.

నగరంలో సినిమాలు

గాంధీనగర్, న్యూస్‌టుడే: ఆనంద్ సినిమాస్ 4స్క్రీన్- బూకి, నవాబ్ కేఫ్, కపుల్ ఫ్రెండ్లీ, మన శంకరవరప్రసాద్ గారు, దేవీ మల్టీప్లెక్స్ 4స్క్రీన్- నవాబ్ కేఫ్, బూకి, కపుల్ ఫ్రెండ్లీ, విత్ లవ్, లక్ష్మి- సీతాపయనం, సత్యగౌరి - కపుల్ ఫ్రెండ్లీ, తిరుమల- మన శంకరవరప్రసాద్ గారు, సీఅండ్‌సీ 1- ఫంకీ, సీఅండ్‌సీ 2- నారీ నారీ నడుమ మురారి, శ్రీప్రియ - హే బలవంత్, పద్మప్రియ- ఫంకీ, సూర్య1(వాకలపూడి) - ఫంకీ, సూర్య 2.- ఆల్ఫా మెన్ లవ్ వెన్‌జీయన్స్.

మేమున్నాం.. మీకు తోడుగా

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు:
ఉ॥ 10 - మ॥ 1
కాకినాడ నగరం: 80085 74157
సాంబమూర్తినగర్: 91548 46719, మసీదుసెంటర్: 91541 18210
గాంధీనగర్: 80085 74159, బాలాజీచెరువు: 80085 74154

స్పందనకు వందనం

ప్రమాదాన్ని అరికట్టారు..

మసీదుసెంటర్: కాకినాడ, టూటౌన్ వెనుక వీధిలో కూడలి వద్ద కల్వర్టుపై కాలువపై స్లాబు రాయి లేక ప్రమాదకరంగా ఉంది. దీనిపై 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించారు.

ఇనుపచట్రాన్ని ఏర్పాటు చేశారు..

మసీదుసెంటర్: కాకినాడ వెంకటేనగర్ ప్రధాన రహదారి కూడలిపై కాలువ వద్ద ఉన్న ఇనుపచట్రం పాడైపోయి ప్రమాదకరంగా దర్శనమిస్తోంది. దీనిపై 'ఈనాడు'లో వచ్చిన చిత్రకథనానికి అధికారులు స్పందించారు. ఇనుపచట్రాన్ని ఏర్పాటు చేయడంతో సమస్య పరిష్కారమైంది.

కూడళ్ల సుందరీకరణ ఎప్పుడు?

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: నగర పరిధిలోని అన్ని కూడళ్లను పచ్చదనంతో సుందరీకరిస్తామని గతంలో నగరపాలక సంస్థ అధికారులు ప్రకటించారు. ఇంత వరకు ఆ హామీ నెరవేరలేదు. ఇప్పటికీ ప్రధాన కూడళ్లు కళావిహీనంగా దర్శనమిస్తున్నాయి. స్మార్ట్‌సిటీ అంటే ఇదేనా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. నగర పరిధిలో 10 వరకు ముఖ్య కూడళ్లు ఉన్నాయి. నగర ప్రారంభంలోని ఇంద్రపాలెం అంబేడ్కర్ కూడలి, ఘాటీ సెంటర్, సర్పవరం, నాగమల్లి జంక్షన్‌లు కీలకమైనవి. ఇవన్నీ పచ్చదనం కొరవడి, రంగులు వెలసిపోయి కనిపిస్తున్నాయి. ఇంద్రపాలెం, జడ్పీసెంటర్, బాలాజీ చెరువు కూడళ్ల నిర్వహణను కాకినాడ సీపోర్టు నిర్వహిస్తోంది. ప్రతిరోజూ ఆ సంస్థ నీళ్లు పోసి సంరక్షిస్తున్నారు. దీంతో అవి మెరుగ్గానే ఉన్నాయి. మిగతా సర్పవరం, నాగమల్లి జంక్షన్, భానుగుడి, టౌన్ రైల్వేస్టేషన్, డైరీఫారం, ఘాటీ సెంటర్, కలెక్టరేట్ వెనక బాబూజగ్జీవన్‌రామ్ కూడలి,

కలెక్టరేట్ వెనుక రామరావుపేటలో కళావిహీనంగా బాబూజగ్జీవన్‌రామ్ విగ్రహ కూడలి

గాంధీనగర్ గాంధీ కూడలి, పొట్టి శ్రీరాములు, తదితర కూడళ్లు దారుణంగా ఉన్నాయి. నాయకుల జయంతి, వర్ధంతుల సందర్భంగా అక్కడ తాత్కాలికంగా మొక్కలు కుండీలు తెచ్చి ఏర్పాటుచేస్తుంటారు. తర్వాత వాటిని తీసుకెళిపోతారు. అలాగే గతంలో నగర ముఖద్వారాలను తీర్చిదిద్దుతామని చెప్పుకొచ్చారు. ఇంతవరకు అవి కార్యరూపం దాల్చలేదు. ప్రస్తుతం స్వచ్ఛ సర్వేక్షణ్ పోటీలు జరుగుతున్నాయి. త్వరలో నగరంలో కేంద్ర బృందాలు పర్యటించనున్నాయి. ఈ లోపు కూడళ్లను అబివృద్ధి చేస్తే ప్రయోజనం ఉంటుంది.

చర్యలు తీసుకుంటాం..

నగరాన్ని సుందరీకరించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. అందులో భాగంగా కూడళ్లు, ముఖ ద్వారాలను అబివృద్ధి చేస్తాం. నగర పరిధిలోని వంతెనలు, వాటి మధ్య ఉన్న ప్రాంతాలను తీర్చిదిద్దుతాం. జగన్నాథపురం ఎన్టీఆర్ వారధి వద్ద రెండు వంతెల మధ్య ప్రాంతాన్ని బోట్ షికారుకు ప్రతిపాదించాం.

- ఎన్‌వీవీ సత్యనారాయణ, ఇన్‌ఛార్జి కమిషనర్, నగరపాలక సంస్థ, కాకినాడ

కాకినాడ తీరంలో సందడి

సర్పవరం: కాకినాడ గ్రామీణం సూర్యారావుపేట వద్ద సముద్ర తీరం, ఎన్టీఆర్ బీచ్ పార్కు, యుద్ధ విమానం ప్రదర్శనశాల, శిల్పారామంలో ఆదివారం పెద్ద సంఖ్యలో పర్యాటకులు సందడి చేశారు. వాకలపూడి తీర రక్షక దళం సీఐ రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది, గజ ఈతగాళ్ల సాయంతో భద్రత చర్యలు చేపట్టారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

వాహనదారులకు హెల్మెట్‌పై అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

మసీదుసెంటర్, న్యూస్‌టుడే: రాత్రి వేళల్లో ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనపై ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నామని, హెల్మెట్ ధరించని వాహనదారులపై చర్యలు తప్పవని ఎస్పీ బిందుమాధవ్ తెలిపారు. ట్రాఫిక్ పోలీసులు తనిఖీలు నిర్వహించి హెల్మెట్ ధరించని వారిని, పత్రాలు, డ్రైవింగ్‌లైసెన్స్, బీమా, రిజిస్ట్రేషన్ పత్రాలను పరిశీలించారు. వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తూ, హెల్మెట్ ప్రాణ రక్షక సాధనమని వివరించారు. ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని విజ్ఞప్తి చేశారు.

వైద్యులు వృత్తి నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలి

జ్యోతివెలిగిస్తున్న డాక్టర్ ఐ.వి.రావు తదితరులు

మసీదుసెంటర్, న్యూస్‌టుడే: వైద్య రంగంలో వేగంగా మారుతున్న పరిణామాల దృష్ట్యా వైద్యుల వృత్తి నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలని ఐఎంఏ, కాకినాడ శాఖ కార్యదర్శి డా. ఎస్‌సీహెచ్‌ఎస్ రామకృష్ణ తెలిపారు. ఆదివారం కాకినాడలో ఐఎంఏ, ట్రస్ట్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి సహకారంతో నిర్వహించిన నిరంతర వైద్య విద్య(సీఎంఈ) ఘనంగా నిర్వహించారు. ప్రమ్ ఎవిడెన్స్ టు ఎక్సెలెన్స్ ఇన్ క్లినికల్ ప్రాక్టీస్ అనే అంశంతో జరిగిన ఈ సీఎంఈకి 300 మందికి పైగా వైద్యులు, పీజీ విద్యార్థులు పాల్గొన్నారు. ఐఎంఏ కాకినాడ అధ్యక్షుడు, ఆర్గనైజింగ్ ఛైర్‌పర్సన్ డా. కాదా వెంకటరమణ, ఆర్గనైజింగ్ కార్యదర్శి డా. పీవీ నిశాంత్, డా.ఐవీ రావు, డా.బాబ్జి, డా.రాఘవేంద్రరావు, డా.జీఎస్‌మూర్తి తదితరులు హాజరయ్యారు. ఆధునిక వైద్య విధానాలు, తాజా పరిశోధనలతో క్లినికల్ ప్రాక్టీస్‌లో తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేశారు.

గోదావరి జిల్లాలు.. కథా నిలయాలు



ప్రసంగిస్తున్న కె.రామచంద్రరెడ్డి

గాంధీనగర్, న్యూస్‌టుడే: గోదావరి జిల్లాలు.. కథా నిలయాలని మొత్తం కథా నిలయమేనని వక్త కె.రామచంద్రారెడ్డి అన్నారు. కథానిలయం 29వ వార్షికోత్సవ సభ ఆదివారం జేఎన్‌టీయూకే సెనేట్‌హాల్లో జరిగింది. సభాధ్యక్షుడు, కథానిలయం అధ్యక్షుడు వి.వి.నరసింహమూర్తి మాట్లాడుతూ నెల కిందటే కథా నిలయం వెబ్‌సైట్ మొబైల్‌లో చూసుకునే విధంగా ఏర్పాటు చేశామని, కొత్తగా కథలు రాసేవారు వారి వివరాలను అందించాలన్నారు. జేఎన్‌టీయూకే వీసీ సీఎస్ఆర్‌కే ప్రసాద్ మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలోని విశిష్టతను తెలియజేశారు. డాక్టర్ మేమూరి కృష్ణమూర్తి మాట్లాడుతూ తెలుగులో మూడుకోట్ల పేజీలతో లక్ష కథలతో కథానిలయం వెబ్‌సైట్ అలరారుతోందన్నారు. ఈసందర్భంగా హరివెంకట రమణ వాస్తవ కథా సంకలనం చిక్కని పని.. ఉమామహేశ్వరరావు ఆవిష్కరించగా, ముక్కాల చక్రధర్ పుస్తకం మూడోకన్నును డాక్టర్ శైలజ పరిచయం చేశారు. అనంతరం మధ్యాహ్నం కథా సాహిత్యంలో వర్తమాన గ్రామీణ జీవితం అంశంపై వాసిరెడ్డి నవీన్ సమన్వయకర్తగా చర్చాగోష్ఠి జరిగింది. ఏకే.ప్రభాకర్, ఉమామహేశ్వరరావు, కత్తి పద్మ, అద్దేపల్లి ప్రభు, వెంపల్లె షరీఫ్, హైమావతి, సుధాకర్, చంద్రశేఖర్, దాసరి అమరేంద్ర, జగన్నాధరావు తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక కేంద్రంలో విద్యార్థుల సందడి

తాళ్లరేవు, న్యూస్‌టుడే: చేబ్రోలు, యానాం పాఠశాలలకు చెందిన 60 మంది విద్యార్థులు చేబ్రోలు జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీహెచ్.ప్రకాష్ ఆధ్వర్యంలో ఆదివారం చొల్లంగి పర్యాటక కేంద్రాన్ని సందర్శించారు. చెక్కల వంతెనపై నడుచుకుంటూ మడచెట్లను తిలకించారు. వృక్ష, జంతు, మత్స్య జాతుల వివరాలను ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ధనలక్ష్మి వివరించారు. అక్కడ ఉన్న నీటి పిల్లి ఆకృతి వద్ద వారంతా ఫొటోలు తీసుకున్నారు. స్పీడ్ బోట్‌పై పర్యాటకులు సముద్రమొగ వరకు షికారు చేశారు. ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఎస్.ఎస్.వి.వరప్రసాద్ సూచనల మేరకు పర్యాటకులను ఆకట్టుకునేలా ఆలివ్ రిడ్లీ తాబేళ్ల ఆకృతిని ఏర్పాటు చేశారు. ఉపాధ్యాయులు అర్జున రావు, శేషారావు, కె.ప్రసాదరావు, నరాల శ్రీహరి, తోట వెంకట్రావు, పద్మకుమారి, సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు పోషకాహార కిట్ల పంపిణీ

చిన్నారికి కిట్టు అందిస్తున్న సదాశివమ్, గిరిజ

గాంధీనగర్, న్యూస్‌టుడే: అమెరికాలో నివసిస్తున్న ప్రవాసాంధ్రులు సేవా నిరతిని చాటారు. భారతీయ ప్రవాసాంధ్రుల సంఘం హోప్-4 స్పందన ప్రతినిధులు రంగవజ్జుల సదాశివమ్, గిరిజ దంపతులు ఆదివారం స్థానిక శ్రీరామకృష్ణ సేవా సమతిలోని వివేకానంద మందిరంలో 50 మంది చిన్నారులకు పోషకాహార కిట్లు అందజేశారు. ఇక్కడ సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నందుకు ఎంతో ఆనందంగా ఉందని, మరిన్ని సేవలను విస్తరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో శ్రీరామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు వీవీఎల్ గాంధీ, మేనేజరు కర్రి రాజు, లంక హనుమంతురావు తదితరులు పాల్గొన్నారు.

25న సామర్లకోట టీటీడీసీలో ఉద్యోగమేళా

సామర్లకోట: డీఆర్‌డీఏ, సీడాప్ ఆధ్వర్యంలో ఈనెల 25న సామర్లకోట టీటీడీసీలో ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు డీఆర్డీఏ పీడీ జి.శ్రీనివాసరావు తెలిపారు. డీమార్ట్‌లో అసోసియేట్స్, కేషియర్, పర్చేజ్ ఆఫీసర్ ఉద్యోగాలకు ఎంపికలు నిర్వహిస్తామన్నారు. కాకినాడ, రాజమహేంద్రవరం, హైదరాబాద్‌లో పనిచేయాల్సి ఉంటుందన్నారు. జీతం రూ.16 వేల నుంచి రూ.26 వేల వరకు ఉంటుందన్నారు. పదోతరగతి చదివినవారు అర్హులన్నారు.

పేలవంగా 'హ్యాపీ సండే'

గాంధీనగర్ పార్కులో సందర్శకులను పిలిచి ఇలా ఫొటో తీశారు..

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: నగరంలో ఆదివారం 'హ్యాపీ సండే' కార్యక్రమం పేలవంగా జరిగింది. కీలక అధికారులు, ప్రజాప్రతినిధులు ఎవరూ హాజరుకాలేదు. గత తెదేపా ప్రభుత్వ హయాంలో పిల్లలు, పెద్దలు, మహిళలు అందరినీ భాగస్వామ్యం చేసి సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటలు, పాటల పోటీలు వంటివి నిర్వహించేవారు. ప్రతి ఆదివారం ప్రజలు కుటుంబ సమేతంగా ఈ కార్యక్రమానికి హాజరై ఆనందాన్ని పంచుకునేవారు. తదుపరి వచ్చిన వైకాపా ప్రభుత్వం దీనిని రద్దుచేసింది. మరలా కూటమి ప్రభుత్వం పునరుద్ధరిస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. అయితే కాకినాడలో మాత్రం తొలిరోజు సాదాసీదాగా జరిపారు. గాంధీనగర్ పార్కులో నిర్వహించిన ఈ కార్యక్రమంపై ముందుగా ఎటువంటి ప్రచారాన్ని నిర్వహించలేదు. పార్కుకొచ్చిన చిన్నారులు, కొద్ది మంది పెద్దలను పిలిచి ఫొటోలు తీశారు. అదీ ఉదయం కాకుండా సాయంత్రం మొక్కుబడిగా జరపడం గమనార్హం. ప్రజలకు ఆహ్లాదం పంచేలా ఇకపై అయినా కార్యక్రమాన్ని ప్రణాళికతో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని నగరవాసులు కోరుతున్నారు.

తవ్వేశారు.. వదిలేశారు!

కాకినాడ ఒకటో డివిజన్ పరిధిలోని వైద్య నగర్ ప్రధాన రహదారిలో పైపులైను మరమ్మతుల నిమిత్తం తవ్వకాలు చేపట్టారు. పని పూర్తయిన తర్వాత రోడ్డుపై పైపు అడ్డుగా వేసి వదిలేశారు. దీంతో ప్రజలు రాకపోకల సమయంలో ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, భానుగుడిసెంటర్

వీధి దీపానికి మరమ్మతులు చేయరూ..

కాకినాడ, జగన్నాథపురం, ఎన్టీఆర్ బొమ్మ సెంటర్, గంగాధర్ మ్యూజికల్ పార్టీ ఎదురుగా ఉన్న వీధిదీపం పూర్తిస్థాయిలో వెలగకపోవడంతో ఆ ప్రాంతవాసులు ఇబ్బందులకు గురవుతున్నారు. దీపం వెలుగుతూ ఆరుతూ ఉండటంతో కళ్లు దెబ్బ తింటున్నాయని, చీకట్లు అలముకుంటున్నాయని విశ్రాంత బ్యాంక్ అధికారి ఎం.సురేష్ తదితరులు పేర్కొన్నారు. సంబంధిత అధికారులు స్పందించి వీధిదీపాన్ని వెలిగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

– న్యూస్‌టుడే, మసీదుసెంటర్

వ్యర్థాలు తరలించరూ..!

స్థానిక 43వ డివిజన్ ప్రతాప్‌నగర్, రెడ్‌క్రాస్ పాఠశాల సమీపంలో వ్యర్థాలను తొలగించడం లేదు. అది మినీ డంపింగ్ యార్డులా మారింది. వ్యర్థాలు పేరుకుపోయి పందులు, పశువులు వాటిని చెల్లాచెదురు చేస్తున్నాయి. దోమలు విజృంభిస్తున్నాయి. దుర్వాసన వెదజల్లుతోంది. పాఠశాల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఎప్పటికప్పుడు వ్యర్థాలను తరలించాలని స్థానికులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, కాకినాడ కలెక్టరేట్

పశువులతో అవస్థలు

కాకినాడ, గొడారిగుంట ప్రధాన రహదారి కూడలి వద్ద పశువులు తిష్ఠ వేస్తున్నాయి. రాత్రయితే ఎక్కడ దాడిచేస్తాయనో, అడ్డుగా రావడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని నగరవాసులు వాపోతున్నారు. ఆ రహదారి గుండా రాకపోకలు సాగించేందుకు వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. ట్రాఫిక్‌కు సైతం అంతరాయం ఏర్పడుతోంది. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

– న్యూస్‌టుడే, మసీదుసెంటర్

సామ్రాజ్యవాదంతో మానవాళి మనుగడకు ప్రమాదం

గాంధీనగర్, న్యూస్‌టుడే: సామ్రాజ్యవాదం ప్రపంచ మానవాళికి ప్రమాదమని, ప్రపంచ శాంతి కోసం కార్మికవర్గం ఐక్య ఉద్యమాలు సాగించాలని వక్త వి.రాంభూపాల్ అన్నారు. ఆదివారం కచేరిపేట యూటీఎఫ్ హోంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. లెనిన్ ప్రసిద్ధ గ్రంథం సామ్రాజ్యవాదం(పెట్టుబడిదారీ విధానపు అత్యున్నతదశ)పై రాంభూపాల్ మాట్లాడుతూ సామ్రాజ్యవాదం ఆర్థిక రంగంలోనే కాకుండా సామాజిక, సాంస్కృతిక రంగాల్లో కూడా పెత్తనం సాగిస్తుందని, కార్మికవర్గం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పెన్షనర్ల సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సత్తిరాజు, సీఐటీయూ నగర కన్వీనర్ ఎం.వెంకటరమణ, యూటీఎఫ్ నాయకుడు ఎస్.గోవిందరాజులు, ఏ.రామేశ్వరరావు, వెంకట్రావు, డాక్టర్ భానుమతి తదితరులు పాల్గొన్నారు.

నీరు వెనక్కి.. ఇక్కట్లు ముందుకు..

నిత్యం ఒడ్డు వరకు కళకళలాడే సముద్రం ఆదివారం కాకినాడ కుంభాభిషేకం చేపల రేవు వద్ద వెనక్కి మళ్లింది. దీంతో దూరంలోనే బోట్లను నిలిపి ఉంచిన మత్స్యకారులు చేపలను తట్టలు, ట్రేల ద్వారా ఒడ్డుకు చేర్చాల్సి వచ్చింది. సముద్రం ఆటుపోట్లతో అప్పుడప్పుడు ఇలా వెనక్కి మళ్లుతుందని, ఆ సమయంలో బోట్లలో ఉన్న చేపలను ఒడ్డుకు చేర్చేందుకు ఇబ్బందులు తప్పడం లేదని మత్స్యకారులు తెలిపారు.

– న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్(కాకినాడ)

కార్మికుల కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే కొండబాబు

కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలి

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: యూనియన్లలో పనిచేసే కార్మికుల కుటుంబాలను ఆదుకోవాల్సిన బాధ్యత ఆయా సంఘాలపై ఉందని నగర ఎమ్మెల్యే వనమాడి కొండబాబు అన్నారు. లక్ష్మి, వినాయక డీప్ వాటర్ పోర్టు వర్కర్స్ యూనియన్లలో పనిచేస్తూ మృతిచెందిన అయిదుగురు కార్మికుల కుటుంబ సభ్యులకు ఆయా సంఘాల తరపున ఆర్థిక సాయాన్ని గ్రూప్ ఇన్సూరెన్స్ కింద ఆదివారం ఎమ్మెల్యే అందజేశారు. లేబర్ బోర్డు డైరెక్టర్ గదుల సాయిబాబా, కార్మిక సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు పట్టా ధనలక్ష్మి, ఓలేటి పాండురంగడు, పాలెపు రాజు, బలసాడి శ్రీను, దుర్గారావు, ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

బాలుర వసతి గృహంలో విద్యార్థులకు చాపల అందజేత

మసీదుసెంటర్, న్యూస్‌టుడే: కాకినాడ సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతి గృహంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాల కార్పొరేషన్ డైరెక్టర్ కొల్లాబత్తుల అప్పారావు ఔదార్యంతో విద్యార్థులకు చాపలు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలుగుదేశం పార్టీ కో ఆర్డినేటర్ కటకంశెట్టి ప్రభాకర్ హాజరయ్యారు. నెహ్రూ, బంగారు సత్యనారాయణ, రాజు, దానబాబు, బాల తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సేవే లయన్స్ క్లబ్ లక్ష్యం

సామర్లకోట, న్యూస్‌టుడే: పేద ప్రజలకు సేవ చేయాలన్నదే లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ లక్ష్యమని లయన్స్ క్లబ్ పాస్ట్ గవర్నర్ లింగమల్లు కృష్ణమూర్తి అన్నారు. ఆదివారం సామర్లకోట భీమేశ్వర లయన్స్ క్లబ్ భవనంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు అమలకంటి శ్రీనివాసరావు, కార్యదర్శి బడుగు సీతారామరాజు, కోశాధికారి యేలేటి రమేష్ ఆధ్వర్యంలో ప్రోగ్రాం ఛైర్మన్ బుర్రె కృష్ణమోహన్ ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు.

మాట్లాడుతున్న లయన్స్‌క్లబ్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ కృష్ణమూర్తి

పెద్దాపురం భార్గవ్ ఆసుపత్రి వైద్యులు కృష్ణభార్గవ్, సీహెచ్ తేజ, రాధా శివభరత్ వైద్య పరీక్షలు చేశారు. శిబిరంలో 173 మందికి పరీక్షలు చేయగా వారిలో 21 మందికి ఎండోస్కోపి, వెరికోస్ వెయిన్స్, టుడీ ఏకో పరీక్షలు, ట్యూమర్ శస్త్రచికిత్సలు పెద్దాపురం ఆసుపత్రిలో ఉచితంగా చేస్తామని వైద్యులు తెలిపారు. లయన్స్ క్లబ్ ప్రతినిధులు ఈదల ఈశ్వరరావు, చిత్తులూరి వీర్రాజు, కర్రి ఆదినారాయణ రెడ్డి, మేకా శ్రీనివాసరావు, గుండు శంకరరావు, గిడుతూరి శ్రీనివాసరావు, వీరబాబు, సత్తిబాబు, అర్జునరావు, తదితరులు సేవలు అందించారు.

'ప్రజలకు జగన్ క్షమాపణ చెప్పాలి'

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: వేంకటేశ్వరస్వామి చిత్రాలతో మండలిలో వైకాపా ఎమ్మెల్సీలు రాద్ధాంతం చేయడం దారుణమని తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, మాజీ మేయర్ సుంకర పావని అన్నారు. ఇందుకు ఎమ్మెల్సీలతో పాటు తెరవెనుక నుంచి నడిపించిన మాజీ సీఎం జగన్ దేశ ప్రజలందరికీ క్షమాపణ చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. ఆదివారం తన నివాసంలో ఆమె మాట్లాడుతూ కనీసం కాళ్లకు చెప్పులు తీయకుండా స్వామివారి ఫొటోలు పట్టుకోవడమే కాకుండా వాటిని విసిరేయటం ద్వారా భక్తుల మనోభావాలను దెబ్బతీశారన్నారు. ఇప్పటికైనా జగన్ తీరు మార్చుకుని పార్టీ నాయకులకు క్రమశిక్షణలో నడిపించాలని సూచించారు. సమావేశంలో నగర తెదేపా మాజీ అధ్యక్షుడు తిరుమలకుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రముఖులకు సన్మానం

సర్పవరం: కాకినాడ కాపు కల్యాణ మండపంలో ఆదివారం రాష్ట్ర ఆంధ్ర కాపు సద్భావన సంఘం అధ్యక్షుడు వాసిరెడ్డి ఏసుదాసు ఆధ్వర్యంలో సంఘ గౌరవాధ్యక్షుడు బసవా ప్రభాకరరావు 85వ పుట్టినరోజును పురస్కరించుకుని వివిధ రంగాల్లో విశిష్ట సేవలు, ప్రగతి సాధించిన కాపు ప్రముఖులను సన్మానించారు. వీరిలో అమెరికా న్యూజెర్సీ కాపుసంఘం అధ్యక్షుడు చిక్కాల ఆనంద్, ఇటీవల అబుదాబిలో అంతర్జాతీయ టెన్నిస్ డబుల్స్‌లో రజత పతకం సాధించిన బసవా ప్రసాద్, విల్ల ప్రకాష్ తదితరులను సన్మానించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

తాళ్లరేవు, న్యూస్‌టుడే: తాళ్లరేవు నామన వెంకాయమ్మ జడ్పీ ఉన్నత పాఠశాలలో 1977-78లో చదువుకున్న 60 మంది పదో తరగతి విద్యార్థులు 49 ఏళ్ల తర్వాత ఆదివారం కోరింగ ఫారెస్ట్ అతిథి గృహం వద్ద ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకున్నారు. చిన్నతనంలో చేసిన అల్లర్లు, జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. గురువులను సత్కరించారు. మిత్రులంతా కలిసి భోజనం చేశారు. సామా సూర్య ప్రకాష్, గునిశెట్టి రామకృష్ణ, పొన్నాడ భైరవమూర్తి, భూసారపు పద్మారావు, భజన పద్మ, నీలాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

మోదీ మన్‌కీ బాత్.. యువతకు ప్రేరణ

గాంధీనగర్: ప్రధాని మోదీ మన్‌కీ బాత్ ద్వారా దేశాభివృద్ధి, సామాజిక బాధ్యత, యువత సాధికారత వంటి అంశాలపై యువతకు ప్రేరణ కలిగిస్తున్నారని భాజపా ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మారె బుజ్జి అన్నారు. బాలాజీచెరువు సెంటర్‌లోని సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతి గృహంలో మన్ కీ బాత్ కార్యక్రమాన్ని విన్నారు. భాజపా జిల్లా ఉపాధ్యక్షుడు ఏడిద కృష్ణ, వార్డెన్ ఎం.ప్రసాద్ బాబు, ఎం.పరమేశ్వరరావు, అజరయ్య విద్యార్థులు పాల్గొన్నారు.

జనసేనను మరింత బలోపేతం చేయాలి

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జనసేన పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేయాలని రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ పిలుపు నిచ్చారు. ఆదివారం స్థానిక కాస్మోపాలిటన్ క్లబ్‌లో కాకినాడ గ్రామీణ నియోజకవర్గం జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, వీరమహిళలతో పార్టీ క్రియాశీలక సభ్యత నమోదు సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ విధివిధానాలు వివరించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తం కావాలని సూచించారు. శిరంగు శ్రీనివాసరావు, తుమ్మలపల్లి మాచారావు, పబ్బినీడి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

శిథిల భవనం.. అవస్థలమయం

భవనం ముందు భాగాన పగిలిపోయిన గొట్టాలతో ఇలా..

సాంబమూర్తినగర్(కాకినాడ), న్యూస్‌టుడే: మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ(ఐసీడీఎస్) కాకినాడ అర్బన్ ప్రాజెక్టు కార్యాలయం అధ్వాన స్థితిలో దర్శనమిస్తోంది. డెయిరీఫారం కూడలి సమీపంలోని రాజీవ్ గృహకల్ప సముదాయాల వద్ద ఉన్న ఈ భవనం ఏళ్లు గడుస్తున్నా మరమ్మతులకు నోచుకోవట్లేదు. అర్బన్ ప్రాజెక్టు పరిధిలోని కేంద్రాల సిబ్బందితో సమావేశాలు, నెలవారీ సమీక్షలు, అంగన్‌వాడీ సిబ్బందికి శిక్షణ తరగతులు ఇక్కడే జరుగుతాయి. ముందు భాగం రంగులు వెలిసి కళావిహీనంగా కనిపిస్తోంది. భవనం నలువైపులా కింద భాగాన సిమెంటు పెచ్చులూడి ఇటుకలు, ఇనుప ఊచలు బయటకు కనిపిస్తున్నాయి. ప్రధాన మార్గం వద్ద వ్యర్థాలు వెళ్లే గొట్టాలు పగిలిపోయాయి. పై భాగాన, కిటికీ స్లాబులు బీటలు వారడంతో ఎప్పుడు ఎవరిపైన పడతాయోనని సిబ్బంది భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రహరీ లేకపోవడంతో రాత్రి సమయంలో ఆకతాయిలు చేరి మద్యం తాగి సీసాలు అక్కడే పడేస్తున్నారు.

సిబ్బందికి చోటే కరవు..

ఇక కార్యాలయంలో గదులు కూడా ఇరుగ్గా ఉండటంతో పనులు చేసేందుకు సిబ్బంది ఇబ్బంది పడాల్సి వస్తోంది. భవనం పై భాగాన సమావేశాలకు వినియోగిస్తున్నారు. కింద భాగంలో ఇరుకైన గదులతోపాటు హాలు ఉంది. ప్రస్తుతం హాలును గొడౌన్‌గా వినియోగిస్తున్నారు. అందులో పాల ప్యాకెట్లు, అంగన్‌వాడీ కేంద్రాలకు పంపిణీ చేసే ఇతర సరకులను నిల్వ ఉంచుతున్నారు. దీంతో సెక్టార్ సూపర్‌వైజర్లు, ఆఫీస్ సిబ్బంది పనులకు ఆటంకం ఏర్పడుతోంది.

మరమ్మతులు చేపడతాం..

కార్యాలయం భవన మరమ్మతులు, రంగులు వేయించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇటీవల ఎమ్మెల్యే కొండబాబు భవన మరమ్మతులు, రంగులకు నిధులు కేటాయిస్తామన్నారు. వీటికి అయ్యే ఖర్చుకు సంబంధించి ప్రతిపాదనలు పంపాం. త్వరలోనే పనులు చేపడతాం.

-జ్యోతి, సీడీపీవో, ఐసీడీఎస్ అర్బన్ ప్రాజెక్టు

కార్యక్రమంలో కవయిత్రులు, నిర్వాహకులు

ఆకట్టుకున్న కవి సమ్మేళనం

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: స్థానిక శాంతి ఆశ్రమంలో ఆదివారం కవి సమ్మేళనాన్ని నిర్వహించారు. సాహిత్య, సాంస్కృతిక కళా రంగాల ప్రోత్సాహక వేదిక ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలువురు అభ్యుదయ మహిళా కవులు, యువ కవులు పాల్గొన్నారు. తమ కవితలతో ఆకట్టుకున్నారు. వారిని వేదిక తరపున వ్యవస్థాపకుడు దాడి చంద్రశేఖరరావు సత్కరించారు.

(c) eenadu

చొల్లంగిలో నీరందక తడారుతున్న వరి పొలం

వరి పొలాలకు నీరందించండి...

చొల్లంగి, చొల్లంగిపేట గ్రామాల్లో వరి పొలాలకు నీరందక తడారుతున్నాయి. చొల్లంగి ఫారెస్ట్ పాత రోడ్డులో పది ఎకరాల వరి పొలాలకు 40 రోజుల నుంచి నీరు అందడం లేదు. విత్తనాలు వెదజల్లిన తర్వాత ఒక తడి నీరు అందింది. ఎకరానికి రూ.15 వేలు పెట్టుబడి అయ్యిందని పంటకు సకాలంలో నీరు అందక ఇబ్బందులు పడుతున్నామని రైతులు వాపోతున్నారు. - న్యూస్‌టుడే, తాళ్లరేవు

25న సామర్లకోట టీటీడీసీలో ఉద్యోగమేళా

సామర్లకోట: డీఆర్‌డీఏ, సీడాప్ ఆధ్వర్యంలో ఈనెల 25న సామర్లకోట టీటీడీసీలో ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు డీఆర్డీఏ పీడీ జి.శ్రీనివాసరావు తెలిపారు. డీమార్ట్‌లో అసోసియేట్స్, కేషియర్, పర్చేజ్ ఆఫీసర్ ఉద్యోగాలకు ఎంపికలు నిర్వహిస్తామన్నారు. కాకినాడ, రాజమహేంద్రవరం, హైదరాబాద్‌లో పనిచేయాల్సి ఉంటుందన్నారు. జీతం రూ.16 వేల నుంచి రూ.26 వేల వరకు ఉంటుందన్నారు. పదోతరగతి చదివినవారు అర్హులన్నారు.

నేడు అర్జీల స్వీకరణ

పిఠాపురం, న్యూస్‌టుడే: పిఠాపురం పాడా కార్యాలయంలో సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమం యథావిధిగా జరుగుతుందని పీడీ శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అర్జీలు స్వీకరిస్తారన్నారు. ఆన్‌లైన్ లోనూ అర్జీలు చేసుకోవచ్చన్నారు.

గొల్లప్రోలులో కలుసుకున్న 1973-74 బ్యాచ్ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

గొల్లప్రోలు, న్యూస్‌టుడే: గొల్లప్రోలులోని ఎస్ఎస్‌పీఎల్ జడ్పీ ఉన్నత పాఠశాలలో 1973-74లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ కలయికలో సందడి చేశారు. తాము చదివిన పాఠశాలలో సాయంత్రం వరకు ఆటపాటలతో గడిపారు. చిన్ననాటి సంగతులు ముచ్చటించుకుంటూ కుటుంబ, సామాజిక పరిస్థితులపై చర్చించుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి పరిచయ కార్యక్రమం అనంతరం హెచ్ఎంను సన్మానించారు. 60 మంది స్నేహితులు హాజరయ్యారు. నాలుగేళ్లుగా ఏటా కలుసుకుంటున్నట్లు తెలిపారు.

తాళ్లరేవులో 1977-78లో చదివిన పదో తరగతి విద్యార్థులు

తాళ్లరేవు, న్యూస్‌టుడే: తాళ్లరేవు నామన వెంకాయమ్మ జడ్పీ ఉన్నత పాఠశాలలో 1977-78లో చదువుకున్న 60 మంది పదో తరగతి విద్యార్థులు 49 ఏళ్ల తర్వాత ఆదివారం కోరింగ ఫారెస్ట్ అతిథి గృహం వద్ద ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. గురువులను సత్కరించారు. మిత్రులంతా కలిసి భోజనం చేశారు. సామా సూర్య ప్రకాష్, గునిశెట్టి రామకృష్ణ, పొన్నాడ భైరవమూర్తి, బూసాల పద్మారావు, జఖన పద్మ, నీలాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

పండగ వాతావరణంలో జనసేన సభ్యత్వాలు

మాట్లాడుతున్న ఎమ్మెల్యే నానాజీ

సర్పవరం: కాకినాడ గ్రామీణ నియోజకవర్గంలోని గ్రామాలు, అర్బన్ డివిజన్లలో పండగ వాతావరణంలో జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమాలు నిర్వహించాలని ఎమ్మెల్యే నానాజీ పిలుపునిచ్చారు. కాకినాడ కాస్మోపాలిటన్ క్లబ్‌లో ఆదివారం ఎమ్మెల్యే నానాజీ ఆధ్వర్యంలో జనసేన క్రియాశీల సభ్యత్వ నమోదు సన్నాహక సమావేశంలో నాయకులు, కార్యకర్తలు, వీరమహిళలకు దిశానిర్దేశం చేశారు. ప్రదాతలుగా ముందుకొచ్చిన తుమ్మలపల్లి మాచారావు, పబ్బినీడి కృష్ణలను ఎమ్మెల్యే అభినందించారు. ఎంపీపీ నందిపాటి అనంతలక్ష్మి, కార్పొరేషన్ డైరెక్టర్లు శిరంగు శ్రీనివాసరావు, వల్లూరి రాజా తదితరులు పాల్గొన్నారు.

నిఘా నీడలో ఇంటర్ పరీక్షలు

● నేటి నుంచి ప్రారంభం

న్యూస్‌టుడే - పిఠాపురం

ఇంటర్మీడియట్ పరీక్షలు సోమవారం ఉదయం 9 గంటల నుంచి ప్రారంభం కానున్నాయి. పిఠాపురం, పెద్దాపురం, కాకినాడ గ్రామీణ నియోజకవర్గాల్లో పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. నిర్వహణకు కస్టోడియన్లను నియమించారు. ఒక గంట ముందే విద్యార్థులు కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచించారు. మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా పకడ్బందీగా పరీక్షలు నిర్వహించేందు కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. వీటి ద్వారా నిర్వహణ తీరుతెన్నులను జిల్లా అధికారులు పర్యవేక్షించనున్నారు. కేంద్రాల వద్ద తాగునీరు, విద్యుత్తు, వైద్య సిబ్బందిని ఏర్పాటు చేశారు. ఇప్పటికే ప్రశ్నపత్రాలను సమీప పోలీసు స్టేషన్లలో భద్రపరిచారు. వీటిని ఏరోజుకారోజు సీఎస్‌డీవోలు పరీక్ష కేంద్రాలకు తీసుకెళ్తారు.

విద్యార్థుల సంఖ్య ఇలా..

మండలం	కేంద్రాలు	ప్రథమ	ద్వితీయ
పిఠాపురం	5	1,275	1,107
సామర్లకోట	3	1,059	1,037
పెద్దాపురం	2	1,275	1,107
వేళంగి	1	125	78

ఈ ఏడాది మార్పులు ఇవే..

● ప్రథమ సంవత్సరం లాంగ్వేజీలు, బయాలజీ సబ్జక్టులకు 24 పేజీలు, మిగిలిన వాటికి 32 పేజీల జవాబు పత్రం అందిస్తారు. ద్వితీయ సంవత్సరం అన్ని సబ్జక్టులకు, ఒకేషనల్ కోర్సులకు 24 పేజీల జవాబు పత్రాలు ఇస్తారు. అదనంగా ఇవ్వరు. ● హాల్ టికెట్లను వాట్సాప్ నుంచి నేరుగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ● కళాశాలలను జియో ట్యాగింగ్ చేశారు. జ్ఞానభూమి యాప్ ద్వారా పరీక్ష కేంద్రాల రూట్ మ్యాప్‌ను సులువుగా తెలుసుకోవచ్చు. ● మూడేసి సెట్ల ప్రశ్నపత్రాలు, ఇతర సామగ్రిని ఇప్పటికే స్టేషన్లకు పంపించారు. ● డీఈసీ సభ్యులు, ఫ్లయింగ్, సిటింగ్ స్క్వాడ్స్ పర్యవేక్షిస్తాయి. పరీక్ష కేంద్రంలోకి ఎలక్ట్రానిక్ ఉపకరణాలను అనుమతించరు.

పరీక్ష కేంద్రంలో నంబర్లు వేస్తున్న ఉద్యోగి

కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు

పరీక్ష కేంద్రాల పరిధిలో 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. గంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి. విద్యార్థులను తనిఖీ చేసిన తరువాతే కేంద్రాలకు అనుమతిస్తాం. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కేంద్రంలో ఉండాలి. హాల్ టికెట్లు, పెన్నులు తప్ప ఇతర సామగ్రి తీసుకెళ్లొద్దు. మాస్ కాపీయింగ్‌కు పాల్పడితే కేసులు తప్పవు.

- వి.కేశవరావు, డీఐఈవో, కాకినాడ

ధైర్యంగా పరీక్షలు రాయండి

పిఠాపురం: ఇంటర్మీడియట్ విద్యార్థులంతా ధైర్యంగా పరీక్షలు రాయాలని, ఆందోళనకు గురికావొద్దని సీఐ శ్రీనివాస్ సూచించారు. ఆదివారం పిఠాపురం పోలీసు సర్కిల్ కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ నాయకుల ఆధ్వర్యంలో ఆల్ ద బెస్ట్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లోవరాజు, సిద్ధూ మాట్లాడుతూ విద్యార్థులంతా పరీక్షలు బాగా రాయాలని ఆకాంక్షించారు. ద్విచక్ర వాహనాలపై పరీక్షలకు వెళ్లొద్దని బస్సుల్లోనే రాకపోకలు సాగించాలని సూచించారు.

గ్రామాల్లో స్వచ్ఛతకు ప్రత్యేక కార్యక్రమం

గొల్లప్రోలు: గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుకు ప్రత్యేక కార్యక్రమం చేపట్టనున్నట్లు ఎంపీడీవో సలాట్‌రాజు తెలిపారు. చేబ్రోలులో ఆదివారం అధికారులు, సిబ్బందితో కలిసి పర్యటించారు. పారిశుద్ధ్య నిర్వహణకు చేపట్టాల్సిన పనులపై తెదేపా నాయకులతో మాట్లాడారు. ఇంటి పన్నుల బకాయిలు చెల్లించాలని ప్రజలను కోరారు. డిప్యూటీ ఎంపీడీవో కుమార్, ఇన్‌ఛార్జి పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

కేరింతలతో ఆనంద ఆదివారం

పిఠాపురంలో నృత్యం చేస్తున్న బాలికలు

పిఠాపురం, న్యూస్‌టుడే: పిఠాపురంలో ఆనంద ఆదివారం కార్యక్రమం కమిషనర్ కనకారావు ఆధ్వర్యంలో మళ్లీ మొదలయింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇకపై రెండు, నాలుగు ఆదివారాలు ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. యోగా గురువు వనం సత్యనందం ఆధ్వర్యంలో సాంస్కృతిక ప్రదర్శనలు, యోగాసనాలు ఆకట్టుకున్నాయి. పుర ప్రజలకు ఆరోగ్యం, ఆనందంపై అవగాహన కల్పించేలా కార్యక్రమాలు నిర్వహించారు. తెదేపా, జనసేన, భాజపా నేతలు పాల్గొన్నారు.

గొల్లప్రోలు, న్యూస్‌టుడే: గొల్లప్రోలులో రాయవరం రోడ్డులోని మార్కెట్ కూడలిలో నగర పంచాయతీ ఆధ్వర్యంలో సంతోషం, సందడి, ఆరోగ్యం, ఆనందం పేరుతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతినెలా రెండు, నాలుగో ఆదివారాల్లో ఈ కార్యక్రమాలను ప్రజల ఉత్సాహం కోసం ఏర్పాటు చేయనున్నట్లు కమిషనర్ శ్రీనివాసులు తెలిపారు. పారిశుద్ధ్య పర్యవేక్షణాధికారి ప్రకాష్, హెల్త్ అసిస్టెంట్ రవికుమార్, నగర పంచాయతీ, మెప్మా, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కాకినాడ తీరంలో సందడి

సర్పవరం: కాకినాడ గ్రామీణం సూర్యారావుపేట వద్ద సముద్ర తీరం, ఎన్టీఆర్ బీచ్ పార్కు, యుద్ధ విమానం ప్రదర్శనశాల, శిల్పారామంలో ఆదివారం పెద్ద సంఖ్యలో పర్యాటకులు సందడి చేశారు. వాకలపూడి తీర రక్షక దళం సీఐ రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది, గజ ఈతగాళ్ల సాయంతో భద్రత చర్యలు చేపట్టారు.

తెదేపాతోనే ప్రజా సంక్షేమం

చెక్ అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే వర్మ

పిఠాపురం, గొల్లప్రోలు, న్యూస్‌టుడే: తెదేపాతోనే ప్రజా సంక్షేమం సాధ్యమని మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ అన్నారు. పిఠాపురంలోని 12, 15, 17వ వార్డులు, గొల్లప్రోలు మండలం కొడవలి, చెందుర్తి, చినజగ్గంపేటకు చెందిన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.4.50 లక్షలు మంజూరుకాగా ఆదివారం ఆయన చెక్కులు అందజేశారు. వైద్య ఖర్చులతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్న వారిని ఆదుకునేందుకు ప్రభుత్వం సహాయం అందిస్తోందన్నారు. జడ్పీటీసీ మాజీ సభ్యుడు మడికి సన్యాసిరావు, వన్నెపూడి సర్పంచి కందా సుబ్రహ్మణ్యం, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

బస్ షెల్టర్ ప్రారంభం

బస్ షెల్టర్‌ను ప్రారంభిస్తున్న పురపాలక మాజీ అధ్యక్షుడు రాజాసూరిబాబురాజు

పెద్దాపురం, న్యూస్‌టుడే: పట్టణానికి చెందిన తాళ్లూరి వారి సత్రం ఆధ్వర్యంలో సుమారు రూ.5 లక్షల వ్యయంతో ఏడీబీ రహదారిలో నిర్మించిన బస్ షెల్టర్‌ను పురపాలకసంఘం మాజీ అధ్యక్షుడు రాజాసూరిబాబురాజు ఆదివారం ప్రారంభించారు. జిల్లా భాజపా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు, జిల్లా రైసు మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వల్లూరి సూరిబాబు, శ్రీలలితా ఎంటర్‌ప్రైజెస్ ఎండీ మట్టే శ్రీను, తాళ్లూరి సత్రం అధ్యక్షుడు డాక్టర్ తాళ్లూరి శేఖర్, కార్యదర్శి తాళ్లూరి శ్యామ్, సభ్యులు తాళ్లూరి ప్రసాద్, రవితేజ, సత్తిరాజు, కామేశ్వరరావు, జనసేన గౌరవాధ్యక్షుడు కటారి శ్రీను, పట్టణ అధ్యక్షుడు పి.సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

పర్యాటకం పిలిచింది..


నీటి పిల్లి ఆకృతి వద్ద విద్యార్థులు, ఉపాధ్యాయులు

తాళ్లరేవు, న్యూస్‌టుడే: చేబ్రోలు, యానాం పాఠశాలలకు చెందిన 60 మంది విద్యార్థులు చేబ్రోలు జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీహెచ్.ప్రకాష్ ఆధ్వర్యంలో ఆదివారం చొల్లంగి పర్యాటక కేంద్రాన్ని సందర్శించారు. చెక్కల వంతెనపై నడుచుకుంటూ మడ చెట్లను తిలకించారు. వృక్ష, జంతు, మత్స్య జాతుల వివరాలను ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ధనలక్ష్మి వివరించారు. అక్కడ ఉన్న నీటి పిల్లి ఆకృతి వద్ద వారంతా ఫొటోలు తీసుకున్నారు. స్పీడ్ బోట్‌పై పర్యాటకులు సముద్ర మొగ వరకు షికారు చేశారు. ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఎస్.ఎస్.ఆర్.వరప్రసాద్ సూచనల మేరకు పర్యాటకులను ఆకట్టుకునేలా ఉద్యోగి రెడ్డి తాబేళ్ల ఆకృతిని ఏర్పాటు చేశారు. ఉపాధ్యాయులు అర్జున రావు, శేషారావు, కె.ప్రసాదరావు, నరాల శ్రీహరి, తోట వెంకట్రావు, పద్మకుమారి, సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సేవే లయన్స్ క్లబ్ లక్ష్యం

సామర్లకోట, న్యూస్‌టుడే: పేద ప్రజలకు సేవ చేయాలన్నదే లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ లక్ష్యమని లయన్స్ క్లబ్ పాస్ట్ గవర్నర్ లింగమల్లు కృష్ణమూర్తి అన్నారు. ఆదివారం సామర్లకోట భీమేశ్వర లయన్స్ క్లబ్ భవనంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు అమలకంటి శ్రీనివాసరావు, కార్యదర్శి బడుగు సీతారామరాజు, కోశాధికారి యేలేటి రమేష్ ఆధ్వర్యంలో ప్రోగ్రాం ఛైర్మన్ బుర్రే కృష్ణమోహన్ ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు.

మాట్లాడుతున్న లయన్స్‌క్లబ్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ కృష్ణమూర్తి

పెద్దాపురం భార్గవ్ ఆసుపత్రి వైద్యులు కృష్ణభార్గవ్, సీహెచ్ తేజ, రాధా శివభరత్ వైద్య పరీక్షలు చేశారు. శిబిరంలో 173 మందికి పరీక్షలు చేయగా వారిలో 21 మందికి ఎండోస్కోపి, వెరికోస్ వెయిన్స్, టుడీ ఏకో పరీక్షలు, ట్యూమర్ శస్త్రచికిత్సలు పెద్దాపురం ఆసుపత్రిలో ఉచితంగా చేస్తామని వైద్యులు తెలిపారు. లయన్స్ క్లబ్ ప్రతినిధులు ఈదల ఈశ్వరరావు, చిత్తులూరి వీర్రాజు, కర్రి ఆదినారాయణ రెడ్డి, మేకా శ్రీనివాసరావు, గుండు శంకరరావు, గిడుతూరి శ్రీనివాసరావు, వీరబాబు, సత్తిబాబు, అర్జునరావు, తదితరులు సేవలు అందించారు.

ప్రముఖులకు సన్మానం

ప్రముఖులను సత్కరించిన కాపు సద్భావన సంఘ ప్రతినిధులు

సర్పవరం: కాకినాడ కాపు కల్యాణ మండపంలో ఆదివారం రాష్ట్ర ఆంధ్ర కాపు సద్భావన సంఘం అధ్యక్షుడు వాసిరెడ్డి ఏసుదాసు ఆధ్వర్యంలో సంఘ గౌరవాధ్యక్షుడు బసవా ప్రభాకరరావు 85వ పుట్టినరోజును పురస్కరించుకుని వివిధ రంగాల్లో విశిష్ట సేవలు, ప్రగతి సాధించిన కాపు ప్రముఖులను సన్మానించారు. వీరిలో అమెరికా న్యూజెర్సీ కాపుసంఘం అధ్యక్షుడు చిక్కాల ఆనంద్, ఇటీవల అబుదాబిలో అంతర్జాతీయ టెన్నిస్ డబుల్స్‌లో రజత పతకం సాధించిన బసవా ప్రసాద్, విల్ల ప్రకాష్ తదితరులను సన్మానించారు. కార్యదర్శి చిట్నీడి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

రజక చైతన్య సేవా సంఘం అధ్యక్షుడిగా సాంబమూర్తి

పెదపూడి, న్యూస్‌టుడే: పెదపూడి మండలం రజక చైతన్య సేవా సంఘం అధ్యక్షుడిగా సాంబమూర్తి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని అనపర్తి నియోజకవర్గం అధ్యక్షుడు మురమళ్ల వెంకటరమణ ఆదివారం తెలిపారు. గండ్రేగు గ్రామంలో నిర్వహించిన సమావేశంలో దేవగుప్తపు సాంబమూర్తిని అధ్యక్షుడిగా, ములంపాక వీరబాబు ఉపాధ్యక్షుడిగా, దంగేటి మహేష్ కార్యదర్శిగా, తెల్లాకుల సుబ్రహ్మణ్యం సహాయ కార్యదర్శిగా, కోశాధికారిగా పచ్చిపాల వీరభద్రం ఎన్నికయ్యారు.

చేతి కళ.. అదిరేలా..

ఉపాధ్యాయుడి ప్రతిభ


వెదురు బద్దలతో మూడు అడుగుల ఈఫిల్ టవర్

న్యూస్‌టుడే, తాళ్లరేవు

పి.మల్లవరం పంచాయతీ పరిధిలోని పత్తిగొంది ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టేకుమూడి శ్రీనివాసరావు చేతి నుంచి ఆకట్టుకునే కళాఖండాలు రూపుదిద్దుకుంటున్నాయి. ఖాళీ సమయం దొరికితే చాలు.. ఇంటి వద్దనే కాగితాలపై చిత్రాలు గీయడం, బొమ్మలు వేయడం అలవాటుగా మార్చుకున్నారు. ఆ కళను విద్యార్థులకు సైతం నేర్పిస్తున్నారు. **ఆకట్టుకునే ఈఫిల్ టవర్:** మూడు అడుగుల ఎత్తుతో ఆకట్టుకునేలా ఈఫిల్ టవర్ తయారు చేశారు. 1200 సన్నటి వెదురు పుల్లలను జిగురుతో అతికించి రూపొందించారు. 5 నెలల పాటు ఖాళీ సమయాల్లో దీనిని తయారు చేసినట్లు చెప్పారు.

అగ్గి పుల్లలతో ఇండియా గేట్ నమూనాను తయారుచేస్తున్న టేకుమూడి శ్రీనివాసరావు

12వేల అగ్గిపుల్లలతో..: దిల్లీలోని ఇండియా గేట్ నమూనాను తయారు చేయడానికి 12 వేల అగ్గి పుల్లలను సేకరించారు. అడుగున్నర చొప్పున ఎత్తు, వెడల్పుతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. ఖాళీ సమయాల్లో కొంత సమయం కేటాయిస్తే ఆరు నెలలు పట్టినట్లు చెప్పారు.

ప్రమాదమని తెలిసీ..

విద్యుత్తు నియంత్రిక వద్ద పని చేస్తున్న యువకుడు

కొత్తపల్లి, న్యూస్‌టుడే: యు.కొత్తపల్లి మండలం ఉప్పాడ ప్రధాన రహదారి వెంట ఓ షాపింగ్ మాల్ ఏర్పాటు చేసేందుకు పనులు జరుగుతున్నాయి. అక్కడ విద్యుత్తు సరఫరా అవుతున్న నియంత్రిక ఉన్న సిమెంట్ దిమ్మెకు ఓ యువకుడు రంగులు వేస్తుండటం చూసి స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ఆ యువకుడిని హెచ్చరించినా పట్టించుకోలేదు. చివరికి విద్యుత్తు శాఖ సిబ్బంది అక్కడకు చేరుకుని సరఫరా నిలిపేశారు. నిర్లక్ష్యంగా యువకుడితో పనిచేయిస్తున్న మాల్ నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

అగ్నిప్రమాదంలో పాక దగ్ధం

కొత్తపల్లి: కొత్తపల్లిలోని ముత్యాలమ్మ గుడి కూడలిలో చింతా వెంకటరమణ ఓ పాకలో హోటల్ నిర్వహిస్తున్నారు. శనివారం సాయంత్రం హోటల్ నిర్వహణ ముగించుకుని ఇంటికెళ్లిపోయారు. అర్ధరాత్రి అగ్నిప్రమాదం సంభవించి మంటలు వ్యాపించడంతో స్థానికులు అదుపు చేసే ప్రయత్నం చేసినప్పటికీ పూర్తిగా దగ్ధమైంది. సామగ్రి, ఇతర వస్తువులు కాలిపోయాయని, ఆధారం లేకుండా పోయిందని విలపించారు.

ఆలయంలో మాట్లాడుతున్న సద్గురు సచ్చిదానందయోగి

సూర్యనమస్కారాలతో ఆరోగ్యం మెరుగు

పెదపూడి, న్యూస్‌టుడే: రోజూ సూర్య నమస్కారాలు చేయడం ద్వారా ఆరోగ్యం మెరుగవుతుందని ఆదిగురు యోగాపీఠం సద్గురు సచ్చిదానంద యోగి అన్నారు. జి.మామిడాడలోని సూర్యనారాయణస్వామి ఆలయంలో ఆదివారం ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు రేజేటి వెంకట నరసింహాచార్యులు, యోగా గురువు పి.సాయివెంకటేశం పాల్గొన్నారు.

తాళ్లరేవు: ప్రతి విద్యార్థిలోనూ దేశభక్తిని నింపాలనే లక్ష్యంతో యోగా, సూర్య నమస్కారాలపై శిక్షణ ఇస్తున్నట్లు ఉపాధ్యాయుడు కొండ శ్రీనివాస్ తెలిపారు. జార్జిపేట వేణుగోపాల స్వామి ఆలయంలో ఆదివారం ఉదయం 6 నుంచి 8 వరకు యోగా, సూర్య నమస్కారాలతో పాటు దేశభక్తి, తెలుగు భాష తదితర అంశాలపై స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో ఆయన శిక్షణ ఇస్తున్నారు.

తాగునీరు, పారిశుద్ధ్య పనులపై పరిశీలన

గొల్లప్రోలు, న్యూస్‌టుడే: గ్రామాల్లో తాగునీరు, పారిశుద్ధ్య నిర్వహణపై బ్రౌస్ సంస్థ ప్రతినిధులు, అధికారులు చెందుర్తి శివారు కొత్త వజ్రకూటంలో ఆదివారం పర్యటించి పరిశీలించారు. నీటి లభ్యత, నాణ్యత, మురుగు కాలువల వ్యవస్థ గురించి పరిశీలించడంతోపాటు స్థానికులతో చర్చించారు. నాణ్యమైన తాగునీటిని పొందేందుకు, మురుగు నీటి నిర్వహణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. సమగ్ర అధ్యయనం అనంతరం నివేదిక రూపొందించి ఉన్నతాధికారులకు అందజేస్తారన్నారు. డాక్టర్ సుధాకర్, డాక్టర్ శ్రీధర్, విశ్రాంత చీఫ్ ఇంజినీర్ రామ్మోహన్, ఎంపీడీవో సలాట్ రాజు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ పెద్దిశెట్టి కృష్ణ, డిప్యూటీ ఎంపీడీవో కుమార్, వివిధ కంపెనీల ప్రతినిధులు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు, సచివాలయ సిబ్బంది, స్థానిక ప్రతినిధులు పాల్గొన్నారు. పిఠాపురం మండలం ఎఫ్‌కే పాలెం, యు.కొత్తపల్లి మండలం కె.ఇసుకపల్లిలోనూ బృందం పర్యటించింది.

ప్రజలతో మాట్లాడుతున్న బ్రౌస్ సంస్థ ప్రతినిధులు

కలసికట్టుగా ఉంటే మార్పు సాధ్యం

పిఠాపురం: హిందూ సమాజాన్ని బలోపేతం చేసేందుకు అందరూ సహకరించాలని ఏపీ న్యాయవాద పరిషత్ కార్యదర్శి పతివాడ రామరాజు పిలుపునిచ్చారు. ఆదివారం పిఠాపురంలోని చిత్రాడ రైల్వే వంతెన సమీపంలో ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా సంఘ పెద్దల సమావేశం స్థానిక నేత సత్య రామచంద్రరావు ఆధ్వర్యంలో జరిగింది. కులాల పెద్దలు కలసికట్టుగా ఉంటేనే మార్పు సాధ్యమవుతుందన్నారు. నాయకులు వజ్రపు సత్యనారాయణ, నందూరి కృష్ణ, దుర్గారెడ్డి, నారాయణరెడ్డి, కృష్టారెడ్డి, కొండేపూడి శంకరరావు పాల్గొన్నారు.

తీరప్రాంత సమస్యల పరిష్కారానికి ప్రణాళిక

కొత్తపల్లి, న్యూస్‌టుడే : యు.కొత్తపల్లి మండలంలో తీరప్రాంత సమస్య పరిష్కారానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రణాళిక సిద్ధం చేశారని జనసేన మండల అధ్యక్షుడు రావు అక్షయ్ ఆదివారం మత్స్యకారులతో నిర్వహించిన సమావేశంలో అన్నారు. అన్నిశాఖల సమన్వయంతో మత్స్యకారుల జీవన ప్రమాణాలు పెంపొందించేలా సమగ్ర ప్రణాళిక సిద్ధం చేసి త్వరలో పిఠాపురం వేదికగా పవన్‌కల్యాణ్ ప్రకటించనున్నారని తెలిపారు.

వాహనాల చోరీ కేసుల్లో ఇద్దరి అరెస్టు

బేస్తవారపేట, న్యూస్‌టుడే: వాహనాల చోరీ కేసుల్లో ఇద్దరు నిందితులను బేస్తవారపేట పోలీసులు అరెస్టు చేశారు. స్టేషన్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో డీఎస్పీ నాగరాజు మాట్లాడుతూ కాకినాడ రూరల్ మండలం తిమ్మాపురానికి చెందిన ఆచంట గంగాధరరావు.. ప్రకాశం జిల్లా బేస్తవారపేట మండలం చింతలపాలెంలో ఈ నెల 14న ట్రాలీతో సహా ట్రాక్టర్‌ను అపహరించాడు. బనగానిపల్లి, మహానంది, ఐజా స్టేషన్ల పరిధిలో మరో నాలుగు ద్విచక్ర వాహనాలు, గిద్దలూరు పరిధిలో ట్రాలీ ఆటో తస్కరించాడు. చోరీ చేసిన వాహనాలను కడప జిల్లా ఎర్రగుంట్లకు చెందిన పల్లెపోగు ప్రసాద్‌కు విక్రయిస్తుండేవాడు. అతడు వాటిని బయటి మార్కెట్‌లో అధిక ధరలకు అమ్మేవాడు. కంభం ఇన్‌ఛార్జి సీఐ రామకోటయ్య, ఎస్సై రవీంద్రారెడ్డి సిబ్బందితో కలిసి కోనపల్లి అడ్డరోడ్డు వద్ద ఆదివారం వాహన తనిఖీలు చేస్తుండగా వీరిద్దరూ ట్రాక్టర్‌లో వస్తూ పోలీసులకు చిక్కారు. విచారణలో చోరీల విషయం వెలుగులోకి వచ్చింది. వారి నుంచి సుమారు రూ.14 లక్షల విలువైన వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. గంగాధరరావుపై పన్నెండు స్టేషన్లలో చోరీ కేసులు నమోదయ్యాయని డీఎస్పీ తెలిపారు.

బీటలు వారి... అధ్వానంగా రహదారి

తాళ్లరేవు, న్యూస్‌టుడే: తాళ్లరేవు మండలం నీలపల్లి పంచాయతీ పరిధిలోని చెక్కావారిపేట నుంచి సిద్దార్థ నగర్‌కు వెళ్లే సీసీ రోడ్డు బీటలు తీసి, అధ్వానంగా మారింది. ఆ దారిలో లోడు వాహనాలు వెళ్లడంతో పాటు పూర్వం రహదారి పనులు నాసిరకంగా చేయడం దానికి కారణం. దీంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లగా రహదారిని పరిశీలిస్తామని తెలిపారు. - న్యూస్‌టుడే, తాళ్లరేవు

గుర్రపుడెక్క మొలిచి.. మురుగు నిలిచి..

గొల్లప్రోలు శివాలయకాలనీ ఎదురుగా ప్రధాన కాలువ గుర్రపుడెక్క, వ్యర్థాలతో మూసుకుపోయింది. మురుగు ఎక్కడికక్కడ నిలిచిపోవడంతో దుర్వాసన, దోమల ఉద్ధృతితో రోగాలు ప్రబలే పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ సమస్యను ఇన్‌ఛార్జి పారిశుద్ధ్య పర్యవేక్షణాధికారి రఘుప్రసాద్ దృష్టికి తీసుకువెళ్లగా గుర్రపుడెక్క, వ్యర్థాల తొలగింపు పనులు చేపడతామని తెలిపారు. - న్యూస్‌టుడే, గొల్లప్రోలు

పారిశుద్ధ్యం.. తూతూమంత్రం

గ్రామాల్లో సంపద సృష్టి కేంద్రాలను సత్వరం అందుబాటులోకి తేవాలని ప్రభుత్వం ఆదేశిస్తున్నా.. క్షేత్ర స్థాయిలో మాత్రం సక్రమంగా వాడడం లేదు. ఉన్నతాధికారుల ఒత్తిడితో పశువుల పెంట తెచ్చిపోసి ఎరువు తయారు చేస్తున్నట్లు చూపి బురిడీ కొట్టిస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరావు చర్యలు తీసుకుంటామన్నారు. - న్యూస్‌టుడే, కరప

పబ్లిక్ నోటీసు

మా క్లయింటు శ్రీ చోడిశెట్టి ఈశ్వరరావు S/o. సోమరాజు, బి.పత్తిపాడు, పిఠాపురం మండలం, కాకినాడ జిల్లా వాస్తవ్యులు ఇచ్చిన సంజాయిషీపై యావన్మందికి తెలియజేయునది ఏమనగా:

విశాఖపట్నం వాస్తవ్యులు శ్రీ దంతులూరి వెంకట రామరాజు S/o. జానకీ రామరాజు గారు కింద పేర్కొన్న షెడ్యూల్ ఆస్తి తన తల్లి శ్రీమతి దంతులూరి నారాయణమ్మ గారు **ది.16-09-2016,** గల సమోదిత విల్లు పత్రం **దాక్యుమెంట్ నెం. 230/2016** గా సామర్లకోట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్టర్ చేయించిన వీలునామా ద్వారా దఖలు పడినదని, సదరు ఆస్తి వారి సంపూర్ణ స్వాధీన హక్కు భుక్తములలో కలదని తెలియజేయు చున్నారు. సదరు విషయములు యదార్థమని భావించి మా క్లయింటు క్రయం చేయుటకు సంసిద్ధులు అవుచున్నారు.

యీ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని మా క్లయింట్ అయిన **శ్రీ చోడిశెట్టి ఈశ్వరరావు** గారు క్రయం పొందే విషయమై ఎవరికైనా ఏ విధమైన ఆక్షేపణలు, అభ్యంతరములు ఉన్ననూ ఈ ప్రకటన వెలువడిన **15 రోజుల** లోపు వ్రాతపూర్వకముగా యీ దిగువ చిరునామాకు తెలియజేయగలరు. గడువులోపు ఏవిధమైన అభ్యంతరములు రాని యెడల సదరు ఆస్తిని నిర్వివాద, నిష్పేచీ ఆస్తిగా పరిగణించి మా క్లయింట్ రిజిస్ట్రేషన్ చేసుకొనెదరు. గడువు తర్వాత వచ్చు అభ్యంతరములు మా క్లయింట్‌ను బైండు చేయవని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

షెడ్యూల్ ఆస్తి వివరాలు

కాకినాడ జిల్లా, సామర్లకోట మండలం, సామర్లకోట సబ్‌రిజిష్టర్‌లో చేరిన, సామర్లకోట మున్సిపాలిటీ పరిధిలోనున్న టైల్డ్ హౌస్, డోర్ నంబర్ 16-3-16, సర్వే నంబర్ **101/3**, విస్తీర్ణం **849.33** చదరపు గజాలు. సరిహద్దులతో: **తూర్పు:** 75 అడుగుల రహదారి, **పడమర:** 72 అడుగుల రహదారి (కొంత భాగం), మిగిలిన స్థలం అమరావల్లి తలుపులు, **దక్షిణం:** 102 అడుగుల రహదారి, **ఉత్తరం:** అరిమిల్లి సురన్న గారి గోడ (106 అడుగులు)

G.S.M.N.SWAMY, G.A.S.S. JYOTHI, Advocates
#8-24-6, BF-1, Kakinada-4, Cell:9866191397

(c) eenadu

తుని
•తుని • ప్రత్తిపాడు • జగ్గంపేట

రూ.10 లక్షలతో శివాలయం రోడ్డు నిర్మాణం

సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న నాయకులు

తొండంగి: తొండంగి శివాలయం నుంచి గాంధీ బొమ్మ సెంటరు వరకు ఉపాధి హామీ నిధులు రూ.10 లక్షలు మంజూరు చేశారు. ఈ రోడ్డును ఆదివారం తెదేపా నేత యనమల రాజేష్ తెలుగు యువత అధ్యక్షుడు బంటుపల్లి అన్వేష్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే యనమల దివ్య నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. త్వరలో ఈ నిర్మాణం పూర్తి చేసి ప్రారంభిస్తామన్నారు. నాయకులు పక్కుర్తి వంశి, కందా మురళి, పక్కుర్తి నూకరాజు, తదితరులు పాల్గొన్నారు.

రాజులబాబు పండగ

రౌతులపూడి: మండలంలోని రామకృష్ణాపురం గ్రామంలో ఆదివారం రాజులబాబు పండుగ సందడి నెలకొంది. స్థానిక లవకుశల ఆలయం వద్ద భక్తుల రద్దీ నెలకొంది. పెద్దసంఖ్యలో భక్తులు ఆలయానికి విచ్చేసారు.

కనకదుర్గమ్మ తోటకు పోటెత్తిన భక్తులు

గండేపల్లి, న్యూస్‌టుడే: మురారి దుర్గమ్మను ఆదివారం భక్తులు దర్శించుకున్నారు. మురారి శివారు మామిడి, జీడిమామిడి తోటల్లో స్వయంభూగా వెలసిన దుర్గమ్మ అమ్మవారిని కాకినాడ, రాజమహేంద్రవరం జిల్లాల్లోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించారు.

మురారి దుర్గమ్మ అమ్మవారు

ఆహ్లాదంగా పాఠశాల పరిసరాలు

తొండంగి పీఎంశ్రీ ఉన్నత పాఠశాల ద్వారం

తొండంగి, న్యూస్‌టుడే: తొండంగి పీఎంశ్రీ ఉన్నత పాఠశాల ద్వారం, ప్రహరీ, పరిసరాలు ఆహ్లాదంగా ఆకట్టుకుంటున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చి ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసింది. దీంతో తొండంగి పాఠశాలకు పది మంది కొత్త ఉపాధ్యాయులు వచ్చారు. పాఠశాల ప్రహరీ, ద్వారం, ఆవరణ చిందరవందరగా ఉండడం గమనించారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మనబడి బృందం సహాయంతో విరాళాలు సేకరించి పాఠశాల బాగుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. ప్రహరీకి ప్లాస్టరింగ్, రంగులు, పాఠశాల ద్వారానికి గేటు, నేమ్ బోర్డు వంటి సదుపాయాలు సమకూర్చారు. దీంతో పాటు పాఠశాల విద్యార్థుల్లో మోటివేషన్ తీసుకురావాలనే సంకల్పంతో గోడలపై సూక్తులు రాయించారు. స్ఫూర్తిదాయకమైన సూక్తులను చదివి విద్యార్థులు తమ భవిష్యత్తుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటారనే ఆలోచనతో ఉపాధ్యాయులు తమ వంతు ప్రయత్నం చేస్తున్నారు. అటుగా వెళ్లే వారు సైతం పాఠశాల వద్ద కాసేపు ఆగి వెళ్తూ ఉపాధ్యాయుల కృషిని అభినందిస్తున్నారు.

వ్యర్థాలకు నిప్పు.. పర్యావరణానికి ముప్పు
సరిపడా కార్మికుల్లేరు.. డంపింగ్‌యార్డు లేని దుస్థితి

న్యూస్‌టుడే - తుని

రోజూ కొందరు వ్యర్థాలకు నిప్పుపెట్టి పర్యావరణానికి తీవ్ర విఘాతం కలిగిస్తున్నారు. నిత్యం పురవీధుల్లో ఉత్పత్తి అవుతున్న చెత్తలో ప్లాస్టిక్, రసాయన, ఇతర వ్యర్థాలు ఎక్కువగా ఉంటున్నాయి. వీటిని వేరుచేయాల్సి ఉండగా ఆ ప్రక్రియ జరగకుండానే ఖాళీ స్థలాల్లో వేసి మంట పెడుతున్నారు. దీంతో తీవ్రమైన పొగ, దుర్వాసన రావడంతో ప్రజారోగ్యంపై ప్రభావం పడుతోంది.

కార్మికుల కొరత.. జాగా లేని దుస్థితి

రోజూ 30 వార్డుల్లో సుమారుగా 56 మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోంది. అయితే దీనిని సేకరించి, విభజించి, తరలించడానికి సరిపోనూ పారిశుద్ధ్య కార్మికులు లేరు. పదేళ్లుగా ఈ సమస్య వెంటాడుతుండగా కొత్తగా కార్మికులను నియమించేందుకు ప్రభుత్వం అనుమతులు ఇవ్వడంలేదు. ప్రస్తుతం 90 మంది మాత్రమే కార్మికులు ఉన్నారు. మరో 30 మంది వరకూ అవసరం ఉంది. మరోపక్క భారీగా ఉత్పత్తి అవుతున్న చెత్త వేసేందుకు డంపింగ్‌యార్డుకు స్థలసేకరణ కూడా ఏళ్లుగా కార్యరూపం దాల్చలేదు.

ప్లాస్టిక్ వ్యర్థాలు కాలుస్తుండటంతో వ్యాపిస్తున్న పొగ

ఎటుచూసినా చెత్తకు నిప్పే..

డంపింగ్‌యార్డు, సరిపడా కార్మికులు లేకపోవడంతో వీధుల్లో ఉన్న ఖాళీ స్థలాల్లో వ్యర్థాలకు నిప్పు పెడుతున్నారు. రోజూవారి సేకరించిన చెత్త ఇసకలపేట హిందూ శ్మశానవాటిక వద్ద వేసి అక్కడ కూడా కాలుస్తుండటంతో స్థానికులు ఉండలేని పరిస్థితి. కాల్చినపుడు పరుపులు, థర్మాకోల్, రసాయనాల డబ్బాలు తదితరాలు తీవ్ర కాలుష్యాన్ని విడుదల చేస్తున్నాయి. ఇటీవల బాలాజీరోడ్డు, పోస్టాఫీసు వీధి, రైల్వేస్టేషన్ సెంటర్ల వద్ద ఇలా వ్యర్థాలకు నిప్పుపెట్టడంతో, పక్కనున్న పనికివచ్చే మరికొన్ని రకాల సామగ్రి కూడా దగ్ధమయ్యాయి. దగ్గరలో పార్కింగ్ చేసి ఉంచిన కార్లు, ద్విచక్ర వాహనదారులు వాటిని తీసి దూరంగా పెట్టేందుకు పరుగులు పెట్టారు.

చర్యలు తీసుకుంటున్నాం

సాధ్యమైనంత వరకూ వీధుల్లో చెత్త సేకరించి వాహనాల్లో తరలిస్తున్నాం. వివిధ రకాల వస్తువులు వేరుచేసి విశాఖలోని ఎనర్జీ ప్లాంటుకు తరలించేందుకు ఏర్పాట్లు చేశాం. ఈ వేస్ట్‌ను కూడా ప్రత్యేకంగా సేకరిస్తున్నాం.

– షేక్ సలీమ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, తుని

ఘనంగా సత్యదేవుని రథోత్సవం

అన్నవరం: అన్నవరం సత్యదేవుని సన్నిధిలో ఆదివారం స్వామి వారి రథోత్సవం వైభవంగా జరిగింది. భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.

ఆలయ వార్షికోత్సవం

గరుడ వాహనంపై స్వామివారు ఊరేగింపు

జగ్గంపేట గ్రామీణం, న్యూస్‌టుడే: కాట్రావులపల్లి శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ప్రథమ వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్వామివారిని గరుడ వాహనంపై ఊరేగింపు నిర్వహించారు. వేదపండితులు మంత్రాలు, విశ్వక్సేన ఉత్సవం నిర్వహించారు. ఆలయ ప్రాంగణం గోవింద నామస్మరణతో మార్మోగింది. పలువురు దంపతులు స్వామివారి కల్యాణంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. యర్రంపాలెం, సూరంపాలెం, మట్టపర్తి గ్రామాలకు చెందిన అధిక సంఖ్యలో భక్తులు అన్నప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయకమిటీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1 మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: తుని: 9100020946, ప్రత్తిపాడు: 98669 62946 జగ్గంపేట: 80086 22066

చేతిపంపునకు మరమ్మతులు చేయించరూ..!

సమస్య: మండలంలోని పీఈచిన్నాయిపాలెం రామాలయం వీధిలో ఉన్న చేతిపంపు మరమ్మతులకు గురైంది. వినియోగంలోకి తీసుకురావాలి. – రాంబాబు, గ్రామస్థుడు

సమాధానం: రెండు రోజుల్లో చేతిపంపునకు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తెస్తాం.
– సూరిబాబు, పంచాయతీ కార్యదర్శి
న్యూస్‌టుడే, తొండంగి

కొళాయిల ద్వారా తాగునీరు అందించరూ..!

సమస్య: కత్తిపూడి గ్రామంలో 4వ వార్డులో కొళాయిల ద్వారా తాగునీరందించాలి.
– వీరలక్ష్మి, స్థానికురాలు

సమాధానం: కొత్తగా నిర్మించిన ఓహెచ్ఎస్ఆర్‌ను ప్రారంభించాల్సి ఉంది. త్వరలోనే సమస్యను పరిష్కరిస్తాం. – మధుశేఖర్, కార్యదర్శి, కత్తిపూడి.
న్యూస్‌టుడే, శంఖవరం

గ్రామాలు శుభ్రంగా ఉంటేనే ఆరోగ్యం

జగ్గంపేట గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుపరిచేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతుందని తెదేపా జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ అన్నారు. గుర్రంపాలెం పంచాయతీకి స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్రలో మంజూరైన ట్రాక్టర్‌ను ఆదివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ఇళ్లల్లో పనికిరాని వస్తువులను పడేయకుండా ప్రభుత్వం వాటిని తీసుకుని నిత్యావసర సరకులు అందిస్తుందన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు జీను మణిబాబు, ఎస్‌వీఎస్ అప్పలరాజు, బుర్రి సత్తిబాబు, దేవరపల్లి మూర్తి, దాట్ల సూర్యనారాయణరాజు, తదితరులు పాల్గొన్నారు.

రాయడమే తరువాయి..!
ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు

న్యూస్‌టుడే-ఏలేశ్వరం, ప్రత్తిపాడు, శంఖవరం

ప్రత్తిపాడు నియోజకవర్గంలో 7 కేంద్రాల్లో 16 కళాశాలలకు చెందిన ఇంటర్ విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. సోమవారం నుంచి ప్రారంభం కానున్న పరీక్షలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. సగటున 2 నుంచి 15 కి.మీ ప్రయాణించాలి. అధిక శాతం విద్యార్థులు రెండు ఆటోలు మారి కేంద్రానికి చేరుకోవలసి ఉంది. ప్రత్తిపాడులోని మినర్వా కళాశాలలో దివిలిలోని బీఎస్ఆర్, విశ్వకవి, తామరాడ, లంపకలోవ హైస్కూలు ప్లస్, కిర్లంపూడి ప్రభుత్వ జూనియర్ కళాశాల, సీవీ రామన్, ఒమ్మంగి ఎస్సెస్సెన్, ప్రత్తిపాడు అఖిల్, ప్రగతి కళాశాలలకు చెందిన విద్యార్థులు 791 మంది పరీక్ష రాస్తారని కళాశాల ప్రధానాచార్యుడు ఆనంద్ జోషి తెలిపారు. ఏలేశ్వరం అంబేద్కరు గురుకులంలో కేంద్రానికి 751 మందిని కేటాయించినట్లు డీవో రామకృష్ణ తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 672 మందికి ఏర్పాట్లు చేసినట్లు డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ సత్యనారాయణ తెలిపారు. శంఖవరం కేజీబీవీ, ఏపీ ఆదర్శ పాఠశాల, అన్నవరం సత్యదేవ, కత్తిపూడి సీతారామా కళాశాలల్లో 850 మంది పరీక్ష రాస్తారు.

తుని పట్టణం: పట్టణ పరిధిలో ఏడు పరీక్షా కేంద్రాలు ఉన్నాయి. మొదటి సంవత్సరం జనరల్, ఒకేషనల్ సబ్జెక్టులకు 2,992 మంది విద్యార్థులు హాజరు కానున్నారని కస్టోడియన్ తారకేశ్వరి తెలిపారు.

రౌతులపూడి: ఎ.మల్లవరం సాంఘిక గురుకుల కళాశాలలో మొదటి సంవత్సరం 209 మంది, ద్వితీయ సంవత్సరం 177 మంది పరీక్షలు రాస్తున్నారని ముఖ్య పర్యవేక్షకుడు శ్రీనివాసరావు తెలిపారు.

జగ్గంపేట గ్రామీణం: సోమవారం నుంచి ప్రారంభంకానున్న ఇంటర్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ప్రిన్సిపల్ వి.శ్రీనివాసరావు తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి ప్రథమ 351, ద్వితీయ 354 మంది విద్యార్థులకు పరీక్షలకు హాజరవుతున్నారు.

జనసేన సభ్యత్వాల నమోదు

గండేపల్లి, న్యూస్‌టుడే: జగ్గంపేట నియోజకవర్గంలో గత ఏడాది 13 వేల సభ్యత్వాలు నమోదు చేశామని, ఈ ఏడాది 20వేల సభ్యత్వాలు నమోదు చేయాలని జనసేన ఇన్‌ఛార్జి తుమ్మలపల్లి రమేష్ అన్నారు. జెడ్.రాగంపేట పరిణయ ఫంక్షన్‌హాల్లో ఆదివారం నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో క్రియాశీలక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. జనసేన పార్టీలో ఉంటూ పార్టీకోసం కష్టపడే కార్యకర్త నుంచి నాయకుల వరకు సభ్యత్వ నమోదు చేసుకోవాలన్నారు. ఐటీ కో-ఆర్డినేటర్లు, మండల, గ్రామపార్టీ అధ్యక్షులు పాల్గొన్నారు.

చేయాలని దిశానిర్దేశం చేస్తున్న తుమ్మలపల్లి రమేష్

25న సామర్లకోట టీటీడీసీలో ఉద్యోగమేళా

సామర్లకోట: డీఆర్‌డీఏ, సీడాప్ ఆధ్వర్యంలో ఈనెల 25న సామర్లకోట టీటీడీసీలో ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు డీఆర్డీఏ పీడీ జి.శ్రీనివాసరావు తెలిపారు. డీమార్ట్‌లో అసోసియేట్స్, కేషియర్, పర్చేజ్ ఆఫీసర్ ఉద్యోగాలకు ఎంపికలు నిర్వహిస్తామన్నారు. కాకినాడ, రాజమహేంద్రవరం, హైదరాబాద్‌లో పనిచేయాల్సి ఉంటుందన్నారు. జీతం రూ.16 వేల నుంచి రూ.26 వేల వరకు ఉంటుందన్నారు. పదోతరగతి చదివినవారు అర్హులన్నారు.

రామాలయంలో ధ్వజస్తంభం ప్రతిష్ఠాపనలో పాల్గొన్న నాయకులు

సగరపేటలో ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన

జగ్గంపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని గుర్రంపాలెం శివారు సగరపేట రామాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవం వేడుక ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయం వద్ద వేదపండితులు హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. జ్యోతుల నవీన్‌కుమార్, తోట శ్రీరాంజీ, తెదేపా, భాజపా నాయకులు, ఆలయకమిటీ సభ్యులు పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ వద్ద మహాన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గొల్లలగుంట, గుర్రంపాలెం, మల్లిశాల, రామచంద్రాపురం గ్రామాలకు చెందిన ప్రజలు అధికసంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాలు స్వీకరించారు.

సూర్యనారాయణమూర్తి విగ్రహం..

కిర్లంపూడి, న్యూస్‌టుడే: తామరాడ గ్రామంలో ఏలేరు కాలువ చెంతన నూతనంగా నిర్మించిన సూర్యనారాయణమూర్తి ఆలయంలో వైభవంగా విగ్రహప్రతిష్ఠాపనను ఆదివారం నిర్వహించారు. ఆలయ నిర్మాణ దాత గోకాడ రాంబాబు, మాజీ సర్పంచి రూపలతాదేవి దంపతులు ఆధ్వర్యంలో సూర్యనారాయణమూర్తి విగ్రహ ప్రతిష్ఠను శాస్త్రోక్తంగా అర్చకస్వాములు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

వంతెన నిర్మించరూ..!

రౌతులపూడి - జేబుగుంట ప్రధాన రహదారిలో గిడజాం సమీపంలో వంతెన పునర్నిర్మించాల్సి ఉంది. కుచుపాత్రుని చెరువు సమీపంలోని ర.భ. రహదారిపై ఈ వంతెన ఉంది. నిత్యం వందలాది వాహనాలు ఈ మార్గంలో ప్రయాణిస్తాయి. గతంలో తుపాను ధాటికి వంతెన శిథిలస్థితికి చేరుకుంది. తాత్కాలిక మరమ్మతులను చేపట్టారు. ప్రస్తుత అవసరాలకు తగ్గట్టుగా రహదారిని విస్తరించి, వంతెనను పునర్నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు. వంతెన అవసరాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశామని ర.భ.శాఖ సిబ్బంది తెలిపారు. – న్యూస్‌టుడే, రౌతులపూడి

హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి..

కోటనందూరు నుంచి ఎల్.డి.పేట వైపుగా కాకినాడ వెళ్లే ప్రధాన రహదారిలో మలుపులు అధికంగా ఉన్నాయి. మలుపుల వద్ద అక్కడక్కడ గుంతలు ఏర్పడ్డాయి. దీంతో వాహనదారులకు ఇబ్బందిగా ఉంది. సంబంధిత అధికారులు స్పందించి హెచ్చరిక బోర్డుల ఏర్పాటు, గుంతలు పూడ్చాలని ప్రయాణికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, కోటనందూరు

నీటి కష్టాలు తీర్చరూ..!

వేసవి సమీపిస్తోంది. ఉప్పలపాడు గ్రామంలో కొంత కాలంగా జీఎల్ఆర్ ట్యాంకు నిరుపయోగంగా ఉంది. వేసవి దృష్ట్యా మరమ్మతులు చేపట్టి, కుళాయి కనెక్షన్ అందించి ఉపయోగంలోనికి తీసుకురావాలని గ్రామస్థులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, గండేపల్లి



పునాదులకే పరిమితం

గత ప్రభుత్వంలో జగనన్న కాలనీల్లో చేపట్టిన ఇళ్ల నిర్మాణాలు పలు ప్రాంతాల్లో పునాదులకే పరిమితమయ్యాయి. జగపతినగరం గ్రామశివారు కొండలను ఆనుకుని సుమారు 200 ఇళ్ల నిర్మాణానికి మంజూరు ఇచ్చారు. వాటిలో కనీసం ఒక్క ఇంటి నిర్మాణం కూడా పూర్తికాలేదు. కొందరు పునాదిస్థాయి వరకు నిర్మించుకున్నా.. వాటికి అప్పటి ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం అందించకపోవడంతో సగంలోనే వదిలేశారు. కూటమి ప్రభుత్వంలోనైనా ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కిర్లంపూడి

అంబులెన్స్‌లకు మరమ్మతులు చేయించరూ..!

ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రి ప్రాంగణంలో పలు వాహనాలు నిరుపయోగంగా పడి ఉన్నాయి. కొన్నేళ్లుగా ట్రామాకేర్ అంబులెన్సుతోపాటు సంచార చికిత్స వాహనం కూడా ఎండకు ఎండి, వానకు తడుస్తూ శిథిలావస్థకు చేరుతున్నాయి. మరమ్మతులకు గురైన తొలినాళ్లల్లో పట్టించుకోకుండా వీటిని వదిలేశారు. దీంతో పూర్తిగా పాడై మూలకు చేరాయి. అధికారులు స్పందించి వీటికి మరమ్మతులు చేయించి అందుబాటులోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, తుని పట్టణం

పతకాలు సాధించిన విద్యార్థులతో నిర్వాహకులు, కోచ్

కరాటేలో సత్తాచాటిన చిన్నారులు

తుని, న్యూస్‌టుడే: విశాఖలో రెండు రోజులు జరిగిన 31వ జాతీయస్థాయి కరాటే ఛాంపియన్‌షిప్ 2026 పోటీల్లో పట్టణానికి చెందిన పలువురు విద్యార్థులు ప్రతిభచూపారు. తుని బుడోకాన్ అకాడమికి చెందిన 10 మంది అండర్ -16 విభాగంలో కటా, కుమిటీలలో సత్తాచాటారు. విద్యార్థులు 4 బంగారు,3 రజత, మరో 3 కాంస్య పతకాలు దక్కించుకున్నట్లు శిక్షకుడు కె.రమణ తెలిపారు. ప్రతిభచూపిన విద్యార్థులను పలువురు అభినందించారు.

ప్రతిపాడు, న్యూస్‌టుడే: కరాటేలో ప్రత్తిపాడు అఖిల్ స్కూలు బాలలు సత్తాచాటారు. రామచంద్రపురంలో నిర్వహించిన అంతరరాష్ట్ర కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో దొడ్డి జోషిత, జూనియర్ విభాగంలో రాజాల అమోఘ ప్రథమ బహుమతి పొందారు. నలగట్ల నిషాంత్, తుమ్మల దుర్గారేష్మ, కడారి స్వాత్విక్‌లు పతకాలు, ప్రశంసాపత్రాలు పొందారు. వీరిని కళాశాల కరస్పాండెంట్ ఐ.గంగాధర్, ప్రిన్సిపల్ సునీత ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రశంసాపత్రాలు, బహుమతులతో బాలలు

యువ రైతులను ప్రోత్సహించాలి

ఏలేశ్వరం, న్యూస్‌టుడే: వ్యవసాయం చేస్తున్న యువతను ప్రోత్సహించేలా ప్రభుత్వ విధానాలు ఉండాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా సమావేశం డిమాండ్ చేసింది. చిన్నింపేటలో సంఘ్ జిల్లా అధ్యక్షుడు రాసంశెట్టి రాజా ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కౌలూరి పతిరాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు యల్లపు సూర్యనారాయణ, జిల్లా కార్యదర్శి ఆకుల హరిబాబు తదితరులు ప్రసంగించారు. సాగు చేసే రైతు కుటుంబాలకు ఉద్యోగాల్లో రిజర్వేషన్ కల్పించాలని, రైతును పెళ్లి చేసుకునే యువతికి రూ.10 లక్షల ఫిక్సిడ్ డిపాజిట్, వ్యవసాయం చేసే యువకులకు రూ.10వేల గౌరవ వేతనం చెల్లించాలని సమావేశంలో తీర్మానించారు.

రెచ్చగొట్టే అసత్య ప్రచారాలు చేయొద్దు

కిర్లంపూడి, న్యూస్‌టుడే: రెచ్చగొట్టే అసత్యప్రచారాలను చేయడం, ఈవ్‌టీజింగ్‌కు పాల్పడడం, సెటిల్‌మెంట్లు చేయడం, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడడం, గొడవలు పెట్టుకోవడం వంటి చర్యలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ హెచ్చరించారు. కిర్లంపూడి మండలంలోని గ్రామాల్లో ఇప్పటి వరకు రౌడీషీటర్లుగా నమోదు అయిన వారిని స్టేషన్‌కు రప్పించి ఆదివారం సీఐ శ్రీనివాస్, ఎస్సై జి.సతీష్ కౌన్సిలింగ్ ఇచ్చారు.

కిర్లంపూడిలో రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్న సీఐ, ఎస్సై

తాగునీరు, పారిశుద్ధ్య పనుల పరిశీలన

ప్రజలతో మాట్లాడుతున్న బ్రౌస్ సంస్థ ప్రతినిధులు

గొల్లప్రోలు, న్యూస్‌టుడే: గ్రామాల్లో తాగునీరు, పారిశుద్ధ్య నిర్వహణపై బ్రౌస్ సంస్థ ప్రతినిధులు, అధికారులు చెందుర్తి శివారు కొత్త వజ్రకూటంలో ఆదివారం పర్యటించి పరిశీలించారు. నీటి లభ్యత, నాణ్యత, మురుగు కాలువల వ్యవస్థ గురించి పరిశీలించడంతోపాటు స్థానికులతో చర్చించారు. నాణ్యమైన తాగునీటిని పొందేందుకు, మురుగు నీటి నిర్వహణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. సమగ్ర అధ్యయనం అనంతరం నివేదిక రూపొందించి ఉన్నతాధికారులకు అందజేస్తారన్నారు. డాక్టర్ సుధాకర్, డాక్టర్ శ్రీధర్, విశ్రాంత చీఫ్ ఇంజినీర్ రామ్మోహన్, ఎంపీడీవో సలాట్ రాజు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ పెద్దిశెట్టి కృష్ణ, డిప్యూటీ ఎంపీడీవో కుమార్, వివిధ కంపెనీల ప్రతినిధులు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు, సచివాలయ సిబ్బంది, స్థానిక ప్రతినిధులు పాల్గొన్నారు. పిఠాపురం మండలం ఎఫ్‌కే పాలెం, యు.కొత్తపల్లి మండలం కె.ఇసుకపల్లిలోనూ బృందం పర్యటించింది.

200 మందికి వైద్య సేవలు

తొండంగి, న్యూస్‌టుడే: శృంగవృక్షంలో ఆదివారం గంగాదేవి యూత్ ఆధ్వర్యంలో పిఠాపురం జేజీఆర్ ఆస్పత్రి వారిచే ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు వీరబాలాజీ, శ్రీలత హాజరై 200 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. అన్ని రకాల రోగాలకు వైద్య సేవలు అందించినట్లు గంగాదేవి యూత్ సభ్యులు సుంకర చక్రవర్తి, బొడ్డు వీరబాబు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

నేడు అర్జీల స్వీకరణ

పిఠాపురం, న్యూస్‌టుడే: పిఠాపురం పాడా కార్యాలయంలో సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమం యథావిధిగా జరుగుతుందని పీడీ శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అర్జీలు స్వీకరిస్తారన్నారు. ఆన్‌లైన్‌లోనూ అర్జీలు చేసుకోవచ్చన్నారు.

ధాన్యం వాహనం బోల్తా.. తప్పిన ప్రమాదం

ఇర్రిపాకలో బోల్తాపడిన వాహనం

జగ్గంపేట గ్రామీణం: ఇర్రిపాకలో భారత్‌గ్యాస్ గోదాం సమీపంలో ధాన్యం లోడుతో వెళుతున్న వాహనం బోల్తాపడగా పెనుప్రమాదం తప్పింది. సుమారు 15 టన్నుల బరువుతో మర్రిపాక వైపు వెళుతున్న ఈ వాహనం మూడురోడ్ల జంక్షన్ వద్ద ఏర్పడిన భారీగుంతలో పడి బోల్తాపడింది. వాహనంలో నలుగురు వ్యక్తులు సురక్షితంగా బయటపడ్డారు. అనధికార వాహనాలను అడ్డుకునేందుకు రామవరం, మర్రిపాక, ఇర్రిపాక వద్ద రోడ్డుపై ఇనుప గడ్డర్లు, గేట్లు ఏర్పాటు చేసిన వాటిని తొలగించుకుని భారీ వాహనదారులు రాత్రిపగలూ రాకపోకలు సాగిస్తున్నారు. ఈ మార్గంలో భారీ వాహనాల రాకపోకలు నిలువరించాలని స్థానికులు కోరుతున్నారు.

ఆభరణాల చోరీపై కేసు నమోదు

తుని, న్యూస్‌టుడే: పట్టణంలోని ఎమ్మార్‌పేటలో ఉన్న ఓ ఇంట్లో బంగారు, వెండి ఆభరణాలు చోరీ కావడంపై కేసు నమోదు చేశామని ఎస్సై జె.విజయబాబు తెలిపారు. స్థానికంగా నివాసం ఉండే వృద్ధురాలు టి.అప్పియమ్మ శనివారం ఉదయం దుస్తులు ఉతికి, ఆరబెట్టేందుకు మేడపైకి వెళ్లగా ఇంట్లోకి దుండగులు చొరబడ్డారన్నారు. బీరువాలోని 15 గ్రాముల బంగారు ఆభరణాలు, 46 గ్రాముల వెండి వస్తువులు చోరీ అయినట్లు బాధితులు ఫిర్యాదు చేయడంతో దర్యాప్తు చేస్తున్నామన్నారు.

హంసవరంలో రెండు తాటాకిళ్లు దగ్ధం

హంసవరంలో దగ్ధమైన తాటాకిళ్లు

తుని గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని హంసవరం గ్రామంలో శనివారం రాత్రి రెండు తాటాకిళ్లు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన కర్రి అప్పారావు, కర్రి అప్పలకొండకు చెందిన ఇళ్లు ప్రమాదవశాత్తు పూర్తిగా కాలిపోయాయి. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు. ఘటనపై స్థానిక సర్పంచు రాయి మేరి అవినాష్ బాధితులకు నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. నష్టపరిహారం అందించాలని రెవెన్యూ సిబ్బందిని ఆమె కోరారు.

పదేళ్లుగా నిరుపయోగం
రూ.లక్షల భవనం..

తుని గ్రామీణం, న్యూస్‌టుడే: అక్షరాలా రూ.78 లక్షలు వ్యయంతో పదేళ్ల కిందట నిర్మించిన భవనం.. నిరుపయోగంగా ఉండి శిథిలావస్థకు చేరడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా ఉంటోంది. తుని గ్రామీణ మండలంలోని వి.కొత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు అనుబంధంగా 2008లో సుమారు 78 లక్ష వ్యయంతో బాలికల వసతి గృహం నిర్మించారు. ఈ వసతి గృహంలో ఒక్కరు చేరకపోడంతో కొద్ది కాలం బీసీ విద్యార్థులకు వసతి గృహంగా వినియోగించారు. వారిని తుని పట్టణ పరిధిలోకి మార్చడంతో గత పదేళ్లుగా నిరుపయోగంగా ఉంది. దీంతో మందుబాబులకు, పేకాటరాయుళ్లగా ఆవాసంగా మారింది. ఉన్న భవనాన్ని సద్వినియోగం చేసుకునే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రాంగణంలో నిరుపయోగంగా ఉన్న విద్యార్థుల వసతిగృహం

(c) eenadu

ఈనాడు కర్ణాటక
సోమవారం ఫిబ్రవరి 23, 2026

కొత్తతరం అప్లికేషన్లతో సైబర్ నేరాలకు అడ్డుకట్ట

వివరాలు వెల్లడిస్తున్న అరుణ్ కుమార్, రోమానస్ తదితరులు

ఈనాడు, బెంగళూరు: వ్యాపార, వాణిజ్య రంగాల్లో కృత్రిమమేధ వాడకం అంతకంతకూ పెరుగుతున్నా ఇదే సమయంలో సైబర్ నేరాలు విస్తృతం అవుతున్నాయి. వీటిని అడ్డుకునేందుకు ఇదే స్థాయిలో సైబర్ నియంత్రిత అప్లికేషన్లు అవసరమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రపంచ స్థాయిలో డిజిటల్ ఎండ్ అప్లికేషన్లతో సైబర్ భద్రతకు ఆధునిక సేవలు అందించే జోహో కార్పొరేషన్ మేనేజ్ ఇంజిన్ సంస్థ ఈ మేరకు విలువైన సూచనలు ఇచ్చింది. సంస్థ ప్రాంతీయ ఉపాధ్యక్షుడు అరుణ్‌కుమార్ మాట్లాడుతూ ఐటీ సర్వీస్ మేనేజ్‌మెంట్ (ఐటీఎస్ఎం), నెట్‌వర్క్ మానిటరింగ్, యూనిఫైడ్ ఎండ్ పాయింట్ మేనేజ్‌మెంట్, సైబర్ సెక్యూరిటీ వంటి 60కి పైగా సేవా అప్లికేషన్లు హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్‌ల్లో ఎదురయ్యే సైబర్ సమస్యలను ముందుగానే గుర్తించి అందుకు తగిన పరిష్కారాలు వెతికి పెడతాయన్నారు. సురక్షిత పాస్‌వర్డ్‌లే, సెషన్ రికార్డింగ్‌లతో పాటు కాసల్ ఇంటెలిజెన్స్ వంటి ఇండిపెండెంట్ ఏఐలు అనవసర అంతరాయాలను గుర్తించి సేవల్లో వేగాన్ని అందిస్తాయన్నారు. భారత వ్యక్తిగత డేటా భద్రత చట్టానికి అనుగుణంగా సంస్థ 72 గంటల లోపే డేటా చౌర్యాన్ని గుర్తిస్తాయని సంస్థ ప్రొడక్ట్ హెడ్ రాకేశ్ వెల్లడించారు. గుత్తేదారులు, గిగ్ వర్కర్ వ్యవస్థలకు జీరో ట్రస్ట్ యాక్సెస్ వంటి అప్లికేషన్లను రూపొందించామన్నారు. ఈ రంగంలో నిపుణుల తయారీకి శిక్షణతో పారదర్శక సైబర్ భద్రతకు పెద్దపీట వేస్తామని వారు తెలిపారు.

మోదీ నోట రసబాలె మాట

బెంగళూరు (యశ్వంతపుర),న్యూస్‌టుడే: దేశ ప్రజల దృష్టి ఆకర్షిస్తున్న ప్రధాని నరేంద్రమోదీ నిర్వహించే మన్ కీ బాత్ కార్యక్రమంలో నంజునగూడు రసబాలె అరటి పండు, మైసూరు వీళ్య తమలపాకులు ప్రస్తావించడంపై మైసూరు ఎంపీ యదువీర్ ఒడెయర్ స్వాగతం పలికారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రస్తావించడం వల్ల రెండు పంటలకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు వస్తుందన్నారు. ఇది మైసూరు జిల్లా రైతులు గర్వించదగిన విషయమన్నారు. రెండు పంటలు విదేశాలకు ఎగుమతులు పెరిగే అవకాశాలు ఉన్నట్లు తెలిపారు.

డిజిటల్ రాకాసి.. బాల్యానికి మసి!

- వీక్షణపై నిబంధనల చట్టం వచ్చేనా?

ఈనాడు, బెంగళూరు

ప్రపంచాన్ని గడగడలాడించిన కరోనా మహమ్మారిని విజయవంతంగా తరమికొట్టగలిగాం. బలమైన టీకాలతో ఈ వైరస్‌ను నామరూపాలు లేకుండా చేశాం. ఈ వైరస్ కారణంగా అనివార్యంగా అలవాటైన డిజిటల్ వినియోగం చిన్నారుల భవిష్యత్తును నిలువునా ముంచేస్తోంది. మొబైల్ లేనిదే క్షణం కూడా గడవని రోజులు 16 ఏళ్లలోపు చిన్నారులను పెడదోవ పట్టిస్తున్నాయి. ఆన్‌లైన్ పాఠాల సంస్కృతి బడిలో మొదలై ఇంటిదాకా వెంబడించటంతో పిల్లలు అనివార్యంగా మొబైళ్లు, ట్యాబ్‌లతో కాలం గడుపుతూ ఇదే క్రమంలో బానిసలుగా మారుతూ మానసిక, శారీరక సమస్యలు కొని తెచ్చుకుంటున్నారు. ప్రస్తుతం సర్కారు కూడా ఈ సమస్యను సామాజిక పెనుముప్పుగా గుర్తించి పరిష్కారమార్గాలను అన్వేషిస్తోంది.

అందరూ బాధ్యులే..

ఓ పిల్లాడు మొబైల్‌తోనే ఎక్కువగా గడుపుతున్నాడంటే వెంటనే అతడిని దోషిగా పరిగణించే వీలులేదు. ఆ పరిస్థితులకు దారి తీసిన వాతావరణాన్ని తల్లిదండ్రులు, పాఠశాలలే కల్పించాయని భావించాలంటారు మానసిక నిపుణులు. ఇంట్లో పిల్లలముందు వారితో మాట్లాడకుండా అదే పనిగా మొబైల్ చూస్తున్న తల్లిదండ్రులూ ఈ సామాజిక అలజడికి బాధ్యత వహించాల్సిందే. ఇక బడిలోనూ 16 ఏళ్ల విద్యార్థులకు ఆన్‌లైన్ విధానంలో పాఠాలు చెప్పే బోధకులు బాధ్యులే. హోంవర్క్‌లన్నీ ఆన్‌లైన్ చేయించటం, బడికి వచ్చిన తర్వాత డిజిటల్ కంటెంట్ రూపంలో పాఠాలు చెప్పటం పిల్లలను మొబైల్ బానిసలుగా మారే పరిస్థితులు కల్పిస్తాయి. పుస్తకాల విద్యా విధానం పురాతన సంప్రదాయంగా మలచిన విద్యా సంస్థలు ఈ పాపంలో భాగమేనని విద్య, మానసిక నిపుణుల వాదన.

ప్రాంతం	పరీక్షించిన విద్యార్థులు	కంటి సమస్య గుర్తింపు	కళ్లజోళ్ల వాడకం
బీబీఎంపీ	3,75,150	16,230	5,400
బెళగావి	7,13,450	45,910	23,901
విజయపుర	4,14,560	16,890	4,389
దావణగెరె	2,34,124	10,482	4,231
బళ్లారి	3,12,341	8,312	4,543
బీదర్	2,61,313	8,344	3,897

గమనిక: రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ అనుబంధ విభాగం రాష్ట్రీయ బాల్ స్వాస్థ్య కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే) 2025-26 ఏడాదిలో చేపట్టిన సమీక్ష ఆధారం

హాలగ గ్రామంలో మొదలైన విప్లవం


గంట మోగంగానే పుస్తకాల వైపు చూపులు



అవగాహన పెంచుతున్న నిమ్హాన్స్ 'షట్' క్లినిక్

చిన్నారుల భవిష్యత్తును కాలరాస్తున్న మొబైల్ వాడకం

పెరుగుతున్న పర్యవేక్షణ

రాష్ట్ర వ్యాప్తంగా మొబైళ్ల వీక్షణకు బానిసలవుతున్న పిల్లల సంఖ్య పెరుగుతోంది. కర్ణాటక విద్యా శాఖ, మహిళా, శిశు సంక్షేమ శాఖ, పోలీసు, ఆరోగ్య శాఖలు సంయుక్తంగా చేపడుతున్న సమీక్షల ద్వారా ఆన్‌లైన్, డిజిటల్ కంటెంట్ పేరిట మొబైల్‌కు బానిసలయ్యే అనారోగ్యం పాలవుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. కరోనా తర్వాత నాలుగేళ్ల సమీక్ష ప్రకారం ప్రతి విద్యాలయంలో కంటి చూపుతో బాధపడుతున్న విద్యార్థులు, వారిలో కళ్లజోడు అనివార్యంగా వినియోగించే వారి సంఖ్య పెరుగుతోంది. పాఠశాల అభివృద్ధి పర్యవేక్షణ సమితి (ఎస్‌డీఎంసీ)ల ద్వారా ప్రతి వారాంతంలో విద్యార్థుల, వారి తల్లిదండ్రులతో సమావేశాలు, డిజిటల్ డిటాక్స్‌ను అమలు చేసేందుకు మొబైల్ బిడి-పుస్తక హిడి (మొబైల్ విడిచి - పుస్తకాన్ని పట్టుకో) వంటి కార్యక్రమాన్ని కూడా విద్యాశాఖ అమలు చేసింది.

సర్కారు కీలక అడుగు

16 ఏళ్లలోపు పిల్లలను మొబైల్ వాడకం నుంచి దూరం పెట్టేందుకు సర్కారు గట్టిగా చర్యలు తీసుకుంటోంది. ఇటీవల ముఖ్యమంత్రి సిద్ధరామయ్య విశ్వవిద్యాలయాల ఉపకులపతులతో సమావేశం సందర్భంగా 16 ఏళ్ల పిల్లలకు మొబైళ్లు ఇవ్వకుండా నిర్బంధించాలన్న నిర్ణయానికి అభిప్రాయాన్ని సేకరించారు. త్వరలోనే దీనిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు వేస్తోంది. మొబైల్, ఆన్‌లైన్ గేముల, సామాజిక మాధ్యమాల పిల్లల వాడకంతో పాటు వారి శారీరక, మానసిక ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుందని ముఖ్యమంత్రి చెప్పారు. కొందరు ఉపకులపతులు పూర్తిగా మొబైల్ నిషేధించకుండా కొన్ని వెబ్‌సైట్లను చూడకుండా నిషేధిస్తే బావుంటుందని సూచించారు. నేడు ఆన్‌లైన్ బోధన అనివార్యం కావటంతో మొబైల్ వాడక తప్పదు. ఇదే సమయంలో తల్లిదండ్రులు బాధ్యత వహించాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. సర్కారు త్వరలో 16 ఏళ్లలోపు పిల్లలను డిజిటల్ కంటెంట్ వాడకం నుంచి దూరం ఉంచే చట్టాన్ని తెచ్చేందుకు కసరత్తు మొదలుపెట్టింది. ఇదే అమలైతే ఆస్ట్రేలియా తర్వాత ఈ తరహా చట్టాన్ని అమలు చేసిన దేశం భారత్ (కర్ణాటక) కానుంది.

ఈ లక్షణాలుంటే అప్రమత్తం కండి

గతేడాది నిమ్హాన్స్‌లో ప్రారంభించిన 'షట్' (సర్వీస్ ఫర్ హెల్తీ యూజ్ ఆఫ్ టెక్నాలజీ)ని ప్రారంభించాం. ఏడాదిలోనే దాదాపు 12 వేలకు పైగా ఫిర్యాదులు తల్లిదండ్రుల నుంచి వచ్చాయి. ఈ ఏడాది నుంచి పాఠశాలలకు 'షట్' సేవలు విస్తరించాలని చూస్తున్నాం. మొబైళ్లు, గేమ్‌లు, డిజిటల్ కంటెంట్ అంటే అమితాసక్తి, నియంత్రణ లేని స్క్రీనింగ్, మొబైళ్లు లాక్కొంటే కోపంతో ఊగిపోవటం, ఇతరులతో తక్కువగా మాట్లాడటం, చదువులపై నిర్లక్ష్యం, నిద్రలేమి, అస్తవ్యస్తమైన ఆహార అలవాట్లు, ఏకాగ్రత లోపం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి.

- డా.మనోజ్‌కుమార్ శర్మ, హెచ్‌వోడీ, షట్ క్లినిక్ (నిమ్హాన్స్)

రహదారుల అభివృద్ధికి రూ.5,065 కోట్లు

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే: బెంగళూరు నగర రహదారుల అభివృద్ధికి రూ. 5,065 కోట్లు వ్యయం చేస్తామని, ఏప్రిల్ కల్లా అన్ని రహదారులకు బ్లాక్ టాపింగ్, వైట్‌టాపింగ్ పనులు పూర్తి చేయాలని అధికారులు సూచించినట్లు ఉప ముఖ్యమంత్రి **డీకే శివకుమార్** వెల్లడించారు. టెండర్లను ఆహ్వానించి మంత్రులు, శాసనసభ్యుల కోసం ఎదురు చూడకుండా పనులకు శంకుస్థాపన చేయాలని సూచించారు. ఇక్కడ ఆయన విలేకర్లతో మాట్లాడుతూ జీబీఏ నూతన చిహ్నాన్ని ఎంపిక చేశామని, దాన్ని చీఫ్ కమిషనర్ విడుదల చేస్తారన్నారు. అవుటర్ రింగ్ రోడ్డులో రూ. 420 కోట్లు, 82 ప్యాకేజీల్లో వార్డు రహదారులకు రూ. వేయి కోట్లతో పనులు చేపడతామన్నారు. వర్షాలు ప్రారంభానికి ముందే పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మూడునెలల్లో రూ. 2,671 కోట్లు టెండర్ల ఆహ్వానించామని, ఈ ప్రక్రియ 80 శాతం పూర్తి చేశామన్నారు. నగరంలో 10 లక్షల ఆస్తులకు స్కానింగ్ చేశామని, ఒకే రోజులో ఈ. ఖాతాలను ఇస్తామన్నారు. నగరంలో బీ నుంచి ఏ ఖాతా మార్పు అవుతుందని అధికారులు ఆయా ఆస్తులను పరిశీలించిన తరువాత మార్పు సాధ్యమన్నారు.

'ఎప్పుడు పడితే అప్పుడు మాట్లాడను'

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే: రాష్ట్ర రాజకీయాలపై ఎప్పుడుపడితే అప్పుడు ఎక్కడ పడితే అక్కడ మాట్లాడబోనని, చర్చించబోనని ఇది బహిరంగంగా చర్చించే విషయం కాదని ఉప ముఖ్యమంత్రి డీకేశివకుమార్ స్పష్టం చేశారు. ఎవరి ముందు మాట్లాడాలో వారితోనే చర్చిస్తానన్నారు. ఆదివారం ఇక్కడ సదాశివనగరలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ దేశ ప్రయోజనాలు దృష్టిలో పెట్టుకుని అమెరికాతో చేసుకున్న ఒప్పందాలను ప్రశ్నిస్తున్నారని, అందులో తప్పు ఏమిటని ప్రశ్నించారు. సోమవారం చిక్కబళ్లాపుర, కోలారులో జరిగే మనరేగా బచావ్ సమావేశాలకు తాను ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కలిసి హాజరవుతానన్నారు.

కోర్టుకు ఎమ్మెల్యే చంద్రు లమాణి

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: గుత్తేదారు నుంచి లంచం తీసుకుంటూ లోకాయుక్త వలకు చిక్కిన శిరహట్టి శాసనసభ్యుడు చంద్రు లమాణి, ఆయన సహాయకులు మంజు వాల్మీకి, గురు లమాణిలను లోకాయుక్త పోలీసులు శనివారం అర్ధరాత్రి గదగ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆ సమయంలో ఆసుపత్రి వద్ద ఆయన అనుచరులు, పోలీసులకు తీవ్రస్థాయిలో వాగ్వివాదం జరిగింది. అనంతరం ముగ్గురిని వాహనంలో బెంగళూరు నగరంలో ఉన్న ప్రజాప్రతినిధుల న్యాయస్థానంలో హాజరు పరిచేందుకు తీసుకొచ్చారు. సెలవు కావడంతో న్యాయమూర్తి ఇంటికి తీసుకువెళ్లి ఆయన ముందు హాజరుపరిచారు. న్యాయమూర్తి ఆ ముగ్గురిని న్యాయాంగ నిర్బంధానికి అప్పగించారు. గుత్తేదారుడు విజయ పూజార్ నుంచి రూ. 5 లక్షలు లంచం తీసుకుంటుండగా లోకాయుక్త పోలీసులు దాడి చేసి అరెస్టు చేసిన విషయం తెలిసిందే.

సీఈటీ పొడిగింపు

బెంగళూరు (యలహంక), న్యూస్‌టుడే: ఇంజినీరింగ్, ఇతర కోర్సుల్లో ప్రవేశం కోసం కర్ణాటక పరీక్ష ప్రాధికార నిర్వహించే సీఈటీ ప్రవేశ పరీక్షల కోసం దరఖాస్తు చేసుకునే గడువును ఈనెల 27వ తేదీ వరకు పొడిగించారు. అభ్యర్థుల విజ్ఞప్తి మేరకు గడువు పొడిగించినట్లు ప్రాధికార అధికారులు తెలిపారు. ఇప్పటికే 3.18 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని, మరో 1.08 లక్షల మంది విద్యార్థులు దరఖాస్తు కోసం ఆయా కళాశాలల ముందు ఉన్నట్లు తెలియజేశారు. ఈనెల 27వ తేదీ రాత్రి 11.59 గంటల వరకు అవకాశం కల్పించామన్నారు. ఫీజు చెల్లింపునకు మార్చి 3న సాయంత్రం 5.30 గంటల వరకు గడువు విధించినట్లు వివరించారు. అభ్యర్థులు ఈ విషయాన్ని గమనించాలన్నారు.

జూన్‌లోగా స్థానిక సమరం

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: జూన్‌లోగా జిల్లా, తాలూకా పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తామని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య వెల్లడించారు. ఆదివారం ఇక్కడ కార్వార సమీపంలోని అంకోలా తాలూకా మంజగుణి వద్ద నిర్మించిన గంగావళి - మంజగుణి వంతెనను ఆయన ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోకర్ణ పట్టణ పంచాయతీని ఉన్నతీకరించే ప్రతిపాదనలు ఉన్నాయన్నారు. ఎన్నికలు వస్తున్నాయని, జనాభా లెక్కలు జరుగుతున్నాయని, కొత్తగా పట్టణ పంచాయతీల ఏర్పాటు సాధ్యం కాదని స్పష్టం చేశారు. హలక్కి ఒక్కలిగరలను ఎస్టీ జాబితాలో చేర్పించే ప్రతిపాదన కేంద్రానికి పంపించామని, తిరస్కరించారని గుర్తు చేశారు. పునఃపరిశీలించి మరోసారి కేంద్రానికి ప్రతిపాదనలను పంపిస్తామన్నారు. మంజగుణి - గంగావళి వంతెన నిర్మించిన తరువాత అంకోలా, గోకర్ణ ప్రాంతాల ప్రజలు 18 కిలోమీటర్ల చుట్టూ తిరిగే పరిస్థితి ఇక ఉండబోదన్నారు. 2017లో తాను వంతెన పనులకు శంకుస్థాపన చేశానని, గత భాజపా ప్రభుత్వం పనులను పూర్తి చేయలేదని దుయ్యబట్టారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వంతెన నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రారంభించినట్లు వివరించారు. ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ మాట్లాడుతూ కరావళి ప్రాంతంలో పర్యాటక అభివృద్ధికి అనుకూలమవుతుందన్నారు. గోవా కన్నా కర్ణాటక కోస్తా తీరానికి పర్యాటకులు ఎక్కువ సంఖ్యలో వచ్చే విధంగా అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో మంత్రి మంకాళ వైద్య, శాసనసభ్యులు ఆర్‌వీదేశ్ పాండే, సతీశ్ సైల్, దినకర్ శెట్టి, భీమణ్ణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

గంగావళి- మంజగుణి వంతెనను ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకేశివకుమార్

ప్రతి జిల్లాకో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి

బెంగళూరు (యలహంక), న్యూస్‌టుడే: రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో పేదల కోసం సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులను ఏర్పాటు చేస్తామని ముఖ్యమంతి సిద్ధరామయ్య ప్రకటించారు. ఆదివారం ఇక్కడ ఉత్తర కన్నడ కార్వార వైద్య విజ్ఞాన సంస్థ కార్వారలో ప్రజాపనులశాఖ వైద్య విజ్ఞాన సంస్థ ఆవరణలో నిర్మిస్తున్న 450 పడకల మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి కట్టడాలకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సిద్ధు మాట్లాడుతూ జిల్లా కేంద్రాల్లో పేదలకు ఆధునిక వైద్య సౌకర్యం కల్పిస్తామన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో 22 ప్రభుత్వ వైద్యకళాశాలలు ఉన్నాయని, రానున్న రోజుల్లో కోలారు, పుత్తూరు, బిజాపుర ప్రాంతాల్లో వైద్య కళాశాలలను ప్రారంభిస్తామన్నారు. గ్యారంటీ పథకాలతో అభివృద్ధి పనులకు నిధులు లేవని నిత్యం ప్రతిపక్ష నేతలు విమర్శిస్తున్నారని, నిరంతరం అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ఉత్తర కన్నడ జిల్లాకు రూ. 2,954 కోట్లు గ్యారంటీ పథకాల ద్వారా ఖర్చు చేశామని, రాష్ట్రంలో ఇప్పటి వరకు రూ. 1,18,000 కోట్లు గ్యారంటీ పథకాలకు వ్యయం చేశామని వివరించారు. నిత్యం విమర్శించే భాజపా నేతలు తమ పరిపాలనలో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టలేదని ఆరోపించారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, మంత్రి డాక్టర్ శరణ ప్రకాశ్ పాటిల్, మాజీ మంత్రి ఆర్‌వీ దేశ్‌పాండె తదితరులు పాల్గొన్నారు.

దీపం వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకేశివకుమార్, మంత్రి డాక్టర్ శరణప్రకాశ్‌పాటిల్ తదితరులు

యువకుడిని కబళించిన అతివేగం

బెంగళూరు (యలహంక), న్యూస్‌టుడే: ద్విచక్రవాహనం క్యాంటర్ వాహనాన్ని ఢీకొనటంతో రామసంద్ర నివాసి మునియప్ప(19) మృతి చెందిన సంఘటన శనివారం రాత్రి జ్ఞాన భారతి పోలీసు ఠాణా పరిధిలో జరిగింది. రాత్రి 9.45 గంటలకు కొమ్మఘట్ట రోడ్డు ఈ సంఘటన జరిగినట్లు పోలీసులు తెలిపారు. తీవ్రంగా గాయపడిన వ్యక్తిని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందినట్లు తెలియజేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు.

అయ్యో.. పాపం

బెంగళూరు (యలహంక), న్యూస్‌టుడే: ఆడుకుంటున్న శంకువు ఆకారం కలిగిన ప్లాస్టిక్ వస్తువును మింగి బాలిక తనుష్క (8) మృతి చెందిన సంఘటన దక్షిణ కన్నడ జిల్లా ఉళ్లాలలో జరిగింది. మృతిచెందిన బాలికను రాజేశ్, రాజేశ్వరి దంపతుల కుమార్తెగా గుర్తించారు. ఆడుకునే సమయంలో ప్లాస్టిక్ వస్తువును నోట్లో పెట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. గొంతుకు అడ్డం పడటంతో బంధువులు బాలికను ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. శ్వాసకోశంలో ప్లాస్టిక్ వస్తువు ఇరుక్కుపోవడంతో ఊపిరి ఆడక మృతి చెందినట్లు పోలీసులు తెలియజేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశారు.

మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

ఏనుగుల దాడిలో మహిళ విషాదాంతం

బెంగళూరు(బాణసవాడి),న్యూస్‌టుడే: చిక్కమగళూరు జిల్లా ఎన్‌ఆర్‌పుర తాలూకా హుణసెహళ్లి గ్రామంలో పొలాల్లో వచ్చిన అటవీ ఏనుగులు దాడిలో బళ్లారిజిల్లా హగలగట్టి గ్రామ నివాసి బొరమ్మ (33) అనే మహిళ మృతి చెందారు. ఆదివారం ఉదయం ఈ సంఘటన జరిగినట్లు పోలీసులు తెలిపారు. జరిగిన సంఘటనను నిరసిస్తూ గ్రామస్థులు వివిధ సంఘాల కార్యకర్తలు మృతదేహాన్ని కడబగెరె వద్ద రహదారిపై ఉంచి ధర్నా నిర్వహించారు. పాలకులపై ఆక్రోశం వ్యక్తం చేశారు. అటవీ శాఖ మంత్రి రావాలని డిమాండ్ చేశారు. జిల్లా అదనపు ఎస్పీ జయకుమార్ సంఘటన ప్రదేశానికి వచ్చి ఆందోళనకారులతో చర్చించి ధర్నా విరమింపజేశారు. ఈ నెల 16న నాగేశ్‌గౌడ అనే వ్యక్తి ఏనుగు దాడిలో మృతి చెందారని గ్రామస్థులు గుర్తు చేశారు. పదేపదే ఏనుగులు దాడులకు పాల్పడుతున్నా ప్రభుత్వ అధికారులు నియంత్రణ చర్యలు చేపట్టలేదని ఆక్రోశించారు. కేసు దర్యాప్తులో ఉంది.

వర్క్‌ఫ్రం హోం పేరుతో వంచన

బెంగళూరు(యశ్వంతపుర): వర్క్‌ఫ్రం హోం పేరుతో ఓ విద్యార్థినిని సైబర్ నేరగాళ్లు మోసగించిన సంఘటన నగరంలో వెలుగులోకి వచ్చింది. న్యాయం కోసం ఆయువతి నగర సైబర్ క్రైమ్ పోలీసుఠాణాలో ఫిర్యాదు చేశారు. బెన్సన్‌టౌన్ నివాసి అయిన ఓ పీయూ విద్యార్థిని చరవాణికి సందేశం వచ్చింది. వర్క్‌ఫ్రం హోం ద్వారా డబ్బులు సంపాదించవచ్చని సందేశంలో ఆగంతుకులు సూచించారు. వారి మాటలు నమ్మిన విద్యార్థిని షాపింగ్ యాప్ ద్వారా నగదు పొందవచ్చని చెప్పడంతో అడిగినంత వరకు డబ్బులు పంపించడం ప్రారంభించారు. ఆమె ఖాతాలో కొంత నగదు జమ చేసి తరువాత నిలిపివేశారు. ఓ సారి వారిని నిలదీయడంతో పూర్తి స్థాయిలో టాస్క్ పూర్తి చేస్తే డబ్బులు వస్తాయని, మధ్యలో నిలిపివేస్తే డబ్బులు రావని బెదిరించారు. వారు అడిగిన రూ. 40 వేలు నగదును ఆమె పంపించారు. అనుమానం వచ్చి మోసపోయినట్లు గ్రహించి ఆమె సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించారు.

స్వామి వారికి అభిషేకం చేస్తున్న కుమార దంపతులు

ఆలయాలను దర్శించుకున్న కేంద్ర మంత్రి

అలంపూర్, న్యూస్‌టుడే: అలంపూర్ ఆలయాలను ఆదివారం కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ మంత్రి కుమారస్వామి దంపతులు దర్శించుకున్నారు. మంత్రికి కలెక్టర్ సంతోష్, ఎస్పీ శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు విజయుడు, కృష్ణమోహన్‌రెడ్డి హరిత టూరిజం వద్ద స్వాగతం పలికారు. ఆలయంలో అర్చకులు, ఈవో దీప్తి పూర్ణకుంభ స్వాగతం పలికారు. స్వామికి అభిషేకం, జోగులాంబకు కుంకుమార్చనలు నిర్వహించారు. అమ్మ వారి అనుగ్రహంతో ఆలయాల అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తామని మంత్రి పేర్కొన్నారు.

వారి భేటీతో వేగం

ఇటీవల రాష్ట్ర ప్రజాపనుల మంత్రి సతీశ్ జార్కిహొళి, మాజీ మంత్రి కె. రాజణ్ణ, ఎమ్మెల్యేలు బసంతప్ప, కోనరెడ్డి తదితరులతో కూడిన బృందం దిల్లీకి వెళ్లింది. ఆపై ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో ప్రత్యేకంగా భేటీ అయింది. ఈ సందర్భంగా పార్టీలో నెలకొన్న సందిగ్ధతను తొలగించకపోతే జరిగే నష్టంపై ఖర్గేకి వివరించింది. ఈ సందర్భంగా ఖర్గే ఓ భరోసా ఇచ్చినట్లు సతీశ్ జార్కిహొళి వెల్లడించారు. వీలైనంత త్వరగా రాష్ట్ర రాజకీయాల్లో మొదలైన సమస్యకు పరిష్కారం సూచిస్తామని ఖర్గే చెప్పినట్లు జార్కిహొళి తెలిపారు. ఈ పరిస్థితి ఇలానే కొనసాగితే వచ్చే ఎన్నికల్లో సముదాయాల వారీగా సమైక్యత లోపించి పార్టీకే నష్టం కలిగిస్తుందని వీరు ఖర్గేకు మనవి చేశారు. ఇదే సమయంలో సతీశ్ జార్కిహొళి ప్రస్తుతం ముఖ్యమంత్రిగా సిద్ధరామయ్య కొనసాగుతున్నారు. ఆయనను తొలగించే అవకాశం లేదని చెబుతూ మళ్లీ చర్చలకు తెరలేపారు. అధిష్ఠానం నుంచి వచ్చే నిర్ణయం ఎప్పుడో చెప్పేందుకు జార్కిహొళి నిరాకరించారు.

టిక్.. టిక్.. టిక్..

- ముహూర్తం ముంచుకొస్తోందా?

ఈనాడు, బెంగళూరు: కాంగ్రెస్ రాజకీయాలు గత రెండ్రోజులుగా వేగాన్ని అందుకున్నాయి. ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ పదేపదే దిల్లీకి వెళ్లి వస్తుండటం, ఆపై మంత్రులు, ఎమ్మెల్యేల బృందం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో భేటీ.. ఈ మధ్యలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఎక్స్ ద్వారా తనపై రాజకీయ కుట్రకు సంబంధించిన సందేశం.. ఈ పరిణామాలు కర్ణాటక రాజకీయాలు ఏ క్షణంలోనైనా మలుపు తిరిగే సంకేతాలిచ్చాయి. పైగా ఈనెల 26న డీకే శివకుమార్ మరోసారి దిల్లీ ప్రయాణం, ఈయనతోనే ముఖ్యమంత్రి కూడా వెళ్తారన్న సమాచారం కూడా ఆసక్తి గొలుపుతోంది.

26న కీలక భేటీ?

డీకే మద్దతుదారుల డిమాండ్ ప్రకారం బడ్జెట్‌లోగా నాయకత్వ మార్పుపై ఓ స్పష్టత ఇవ్వాలి. ఆపై రాష్ట్రాల్లో ఎన్నికలు, రాష్ట్రంలో స్థానిక ఎన్నికలుండటంతో రాజకీయ మార్పులు అంత సురక్షితం కాదని వీరంతా అధిష్ఠానానికి హెచ్చరించినట్లు తెలుస్తోంది. డీకే శివకుమార్ సైతం ఇదే విషయాన్ని పదేపదే అధిష్ఠానంతో చెబుతూ తన మాట నిలబెట్టుకునేందుకు యత్నిస్తున్నారు. ఈ పరిణామాలతో అధిష్ఠానం పునరాలోచనలో పడింది. రాష్ట్ర రాజకీయాలపై చర్చించేందుకు ఈనెల 26న డీకేను, ఆపై ముఖ్యమంత్రిని, ఇదే వరుసలో పలువురు మంత్రులు, వివిధ సముదాయాల నేతలను దిల్లీకి రప్పించాలని నిర్ణయించినట్లు పార్టీ వర్గాల సమాచారం.

ఎప్పుడేం జరుగుతుందో మనకేం తెలుసు.. అంతా అధిష్ఠానం నిర్ణయమే కదా

కుమారతో ఢీ

సామాజిక న్యాయంపై ముఖ్యమంత్రి ఇచ్చిన సందేశాన్ని కేంద్ర మంత్రి కుమారస్వామి ఎద్దేవా చేశారు. వీరిద్దరి మధ్య ఆదివారం ఎక్స్ ద్వారా మాటల యుద్ధమే నడిచింది. కుటుంబ రాజకీయాలు తప్ప సామాజిక న్యాయం గురించి చర్చించే నైతికత దేవేగౌడ కుటుంబానికి లేదని ముఖ్యమంత్రి ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ మాత్రమే అన్ని సముదాయాల వారిని ముఖ్యమంత్రిని చేసిందని ఒక్కలిగ నేతల పేర్లను ఆయన గుర్తు చేశారు. జేడీఎస్‌లో దేవేగౌడ కుటుంబ సభ్యుల తప్ప ఏ ఒక్క ఒక్కలిగ నేత ఎదగలేరన్నారు. ఇందుకు బదులిచ్చిన కుమారస్వామి సామాజిక న్యాయం పాటించటంతోనే సిద్ధరామయ్యకు ఉపముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రిగా దేవేగౌడ అవకాశం ఇచ్చారు. లేదంటే సిద్ధరామయ్య పంచాయతీ సభ్యులుగా కూడా గెలిచేవారు కాదు. ప్రస్తుతం ఒక్కలిగలకు అవకాశం ఇవ్వాలనుకుంటే వెంటనే ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలని కుమారస్వామి సూచించారు.

ఆసక్తి రేపిన సందేశం

ఎప్పుడు నాయకత్వ మార్పుపై ప్రశ్నించినా నిబ్బరంగా బదులిచ్చే ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఇటీవల తన ఎక్స్‌లో, ఓ పత్రికలో ఇచ్చిన సందేశం ఆసక్తి రేకెత్తించింది. తన పతనానికి కొందరు కుట్ర పన్నారు. సామాజికంగా వెనుకబడిన వర్గానికి చెందిన వాడిగా నాపై రాజకీయ కుట్రలు సహజమే. నేను పిరికివాడిని కాను. నా రాజకీయ జీవితం పూల పాన్పు కాదు. ప్రజా బలంతోనే రాళ్లు, ముళ్లున్న రాజకీయ రహదారిని ప్రజా బలంతో దాటుతూ వచ్చాను. సామాజిక న్యాయమే లక్ష్యంగా, గొర్రెల కాపరి కుటుంబ నుంచి వచ్చినా 17 బడ్జెట్‌లు ఇవ్వగలిగాను. ప్రజా బలంతో ప్రస్తుత రాజకీయ కుట్రను ఎదుర్కొంటారన్నారు. ఆయనచ్చిన ఈ దేశం పరోక్షంగా తనకు పోటీ దారులైన డీకే, ఆయన మద్దతుదారులకేనని తెలుస్తోంది.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 9121167525
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 9945050116

(c) eenadu

నమ్మ చిత్రదుర్గం..ఫలపుష్ప సోయగం

ప్రేక్షకుల్ని అలరించిన ప్రదర్శన

చెళ్లకెర(చిత్రదుర్గం),న్యూస్‌టుడే: ఉద్యానవనాలు తోటల అభివృద్ధి శాఖ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన 33వ ఫల పుష్ప ప్రదర్శన ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకొంది. వేల మంది ప్రేక్షకులు ప్రదర్శనను చూడటానికి జిల్లా నలుమూలల నుంచి విచ్చేశారు. ప్రదర్శనలో కళాకారులు రూపొందించిన అనేక కళాకృతులు చూపరులతో ఔరా అనిపించాయి. ఈ ప్రదర్శనలో ఏర్పాటు చేసిన స్వాగతం పలుకుతున్న నమ్మ చిత్రదుర్గం, జట్కా బండిలో ప్రయాణికులు, పూలకుండీ నుంచి జాలువారుతున్న పూల జలం, అరటి ఆకులతో రూపొందించిన ఎద్దుల బండి, ఆదివాసీ కుటుంబం, గ్రామీణ ప్రాంత పరిసరాల నమూనా, పూలతో ఏర్పాటు చేసిన ఈగలు, వివిధ రకాల పూల మొక్కలు, క్రోటాన్ మొక్కలు, ఫలాలు, కాయలు, పండ్లు ప్రేక్షకులను సంభ్రమపరచడమే కాకుండా మరుపరాని అనుభూతులను మిగులుస్తున్నాయి. వీటితో పాటు రకరకాల చేపల అక్వేరియం కూడా పిల్లల్ని అమితంగా ఆకట్టుకొంది. ఫలపుష్ప ప్రదర్శనల్లో భాగంగా ఆవరణ పూర్తిగా వివిధ రకాల విద్యుత్తు దీపాలతో అందంగా అలంకరించారు.

ఫలపుష్ప ప్రదర్శనలో ప్రేక్షకులకు స్వాగతం పలుకుతున్న నమ్మ చిత్రదుర్గ

జట్కా బండిలో ప్రయాణికులు

పూల కుండీ నుంచి జాలువారుతున్న పూల జలం

గ్రామీణ ప్రాంతాల్లోని కుటీరం పరిసరాలు

రాష్ట్రంలో ఏ క్షణంలో ఏమైనా జరగొచ్చు

హొసపేటె, న్యూస్‌టుడే: రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా పడిపోయాయి, ఏ క్షణంలో ఏమైనా జరగొచ్చు, ప్రజలు ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని భాజపా యువమోర్చా జిల్లాధ్యక్షుడు కిచిడి కొట్రేశ్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన ఓ ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్రంగా విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో అన్నీ వర్గాలకూ భద్రత లేకుండా పోయింది, ప్రభుత్వ ఉద్యోగులు, పోలీసులు క్షణక్షణం భయంతో విధులు నిర్వహిస్తున్నారు. విధుల్లో ఉన్న ఉద్యోగులు, పోలీసులపై కూడా తరచూ దాడులు జరుగుతున్నా, ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వాపోయారు. బాగలకోటె ఘటనలో అల్లర్లను నియంత్రించడంలో ప్రభుత్వం ఘోరంగా విఫమైందని దుయ్యబట్టారు. విధుల్లో ఉన్న పోలీస్ అధికారిపై కూడా దాడులు జరుగుతున్నాయంటే సామాన్యుల మాటేమిటని ప్రశ్నించారు.

యువమోర్చా జిల్లాధ్యక్షుడు కిచిడి కొట్రేశ్

చేతిరాత పోటీలకు విశేష స్పందన

సింధనూరు, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి ఇంటర్ స్కూలు జోనల్ చేతిరాత పోటీలకు చక్కని స్పందన లభించింది. స్థానిక పాటిల్ సీబీఎస్ఈ స్కూలు, బెంగళూరు ఎక్స్‌పర్ట్ చేతిరాత శిక్షణ సంస్థ సంయుక్తంగా ఆదివారం ఇక్కడ పోటీలు నిర్వహించాయి. పోటీలో అధికసంఖ్యలో చిన్నారులు పాల్గొని ఉత్సాహం కనబర్చారు. రాయచూరు, బళ్లారి, కొప్పళ, యాదగిరి జిల్లాల విద్యార్థులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. తొలుత విద్యార్థులను ఉల్లాసపర్చే వేదిక కార్యక్రమాల్ని నిర్వహించారు. అనంతరం పాటిల్ సంస్థ కార్యదర్శి ఆర్.సి.పాటిల్ మాట్లాడుతూ విద్యార్థులకు ప్రాథమిక విద్యలో పాఠాలతోపాటు దస్తూరీ కూడా ముఖ్యమన్నారు. భవిష్యత్తులో అందమైన చేతిరాత వారి జీవితాలను అంతే సుందరంగా మారుస్తుందని పేర్కొన్నారు.

పోటీకి విచ్చేసిన విద్యార్థులు

రైల్వే మార్గాల అభివృద్ధికి రూ.23.72 కోట్లు: ఎంపీ

కంప్లి, న్యూస్‌టుడే: అఖండ బళ్లారి జిల్లాలో రైల్వే పనుల అభివృద్ధికి రూ. 23. 72 కోట్లు కేటాయించామని ఎంపీ తుకారాం తెలిపారు. తాలూకాలోని దేవసముద్ర క్రాస్ సమీపంలో గోశాల వద్ద ఆదివారం రెండో రోజు నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ గంగావతి నుంచి కంప్లి మీదుగా దరోజ్ వరకు రైల్వే లైను పనులతో పాటు తోరణగల్లు, పాపినాయకన హళ్లి, కుడతిని రైల్వే స్టేషన్ల అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. లోక్‌సభ క్షేత్రంలో వివిధ అభివృద్ధి పనులకు రూ.5 కోట్లు కేటాయించామన్నారు. రైతులు వ్యవసాయంతో పాటు పశువుల పెంపకం చేపట్టాలి. తనకు బాల్యం నుంచి పశువుల పెంపకం అంటే చాలా ఇష్టమని ఎంపీ చెప్పారు. ఇప్పటికీ తన ఇంటి వద్ద 12 గోవులు ఉన్నాయన్నారు. గోశాల సంస్థాపకులు కె.ఎం.బసవరాజ శాస్త్రి, నాయకులు ఎం.సుధీర్, మూకయ్య స్వామి, నారాయణప్ప, హొన్నళ్లి గంగాధర్, హనుమంతప్ప, అక్కి జిలాన్ తదితరులు పాల్గొన్నారు.

గోశాల వద్ద పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ తుకారాం

అట్టహాసంగా దుర్గాంబికా జాతర

హొసపేటె, న్యూస్‌టుడే: జవళి నగరి దావణగెరెలో ఆదివారం దుర్గాంబికా జాతర అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పొట్టేళ్ల పందెం ఆద్యంతం ఉత్కంఠంగా సాగింది. రెండేళ్లకోసారి జరిగే అమ్మవారి జాతర నేపథ్యంలో రాష్ట్ర స్థాయిలో పొట్టేళ్ల పందెం ఏర్పాటు చేశారు. పొరుగు జిల్లాలైన గదగ, బాగలకోటె, శివమొగ్గ, చిత్రదుర్గ, చిక్కబళ్లాపుర హావేరి, ధార్వాడ, బెళగావి జిల్లాలు, ఆంధ్ర నుంచి కూడా పొట్టేళ్లు వచ్చి పందెంలో పాల్గొన్నాయి. రెండు, నాలుగు, ఆరు, 8 పళ్లు ఇలా నాలుగు విభాగాల్లో పందేలు ఏర్పాటు చేశారు. సుమారు 700 పొట్టేళ్లు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. పందెంలో ఒకదానికొకటి నాలుగుసార్లు ఢీకొట్టిన తర్వాత ఆ పొట్టేలు తట్టుకొని నిలబడతుందో గమనిస్తారు. ఐదు నుంచి పదడుగులు పరుగు తీస్తే అది ఓడినట్లు నిర్ణయిస్తారు. వాటిని పెంచినవారు హొన్నత్తమ్మ, కాళి, మల్లిక్ జలాల్, సుల్తాన్, అణ్ణాబాండ, పవర్ స్టార్ ఇలాంటి పేర్లతో వాటిని పిలుస్తారు.

పందెంలో ఢీకొంటున్న పొట్టేళ్లు

అన్నభాగ్య బియ్యం స్వాధీనం

హొసపేటె, న్యూస్‌టుడే: కమలాపురం మీదుగా నల్లబజారుకు తరలివెళ్తున్న 6.851 క్వింటాళ్ల అన్నభాగ్య బియ్యాన్ని శనివారం రాత్రి పోలీసులు పట్టుకున్నారు. కచ్చితమైన సమాచారం అందుకున్న ఆహార, ప్రజాపంపిణీ, పోలీసు శాఖ అధికారులు కమలాపుర శివారు హళ్లికెరె వద్ద కాపుకాసి లారీని పట్టుకున్నారు. వాటి విలువ రూ.1.54లక్షలని పోలీసులు తెలిపారు. చోదకుడు, మరో వ్యక్తి లారీ దిగి చీకట్లో పరారయ్యారు. ప్రజాపంపిణీ శాఖ అధికారి పవన్‌కుమార్, పోలీసు అధికారి మహంతేశ్ సిబ్బంది ఈ దాడుల్లో పాల్గొన్నారు. లారీ, బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న కమలాపుర పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసులు స్వాధీనం చేసుకున్న లోడు లారీ

నియంతృత్వానికి వ్యతిరేకంగా పోరాడాం

కాకతీయ కమ్మసేవా సమితి ఆత్మీయ సమావేశంలో నేతల ఉద్ఘాటన

దీపం వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఏడీజీపీ ముప్వా చంద్రశేఖర్, ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, రాయపాటి శైలజ, కబడ్డీబాబు, రామాంజనేయ, యలమంచి వాసుదేవరావు, రామారావు గంగవరపు

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: నియంతృత్వ పరిపాలనకు వ్యతిరేకంగా పోరాటం చేసి మార్పు తేవడం కష్టతరమని రాష్ట్ర ఏడీజీపీ ముప్వా చంద్రశేఖర్ పేర్కొన్నారు. దీనిపై పోరాడి అనేక కష్టాలు పడిన నేతలను ఇక్కడికి ఆహ్వానించడం హర్షణీయమన్నారు. ఆదివారం ఇక్కడ బెళ్లందూరులోని న్యూహారిజన్ ఇంజినీరింగ్ కళాశాల ఆడిటోరియంలో కాకతీయ కమ్మ సేవా సమితి వ్యవస్థాపకుడు రామారావు గంగవరపు నేతృత్వంలో జరిగిన ఆత్మీయ సమావేశాన్ని ఆయన ప్రారంభించారు. పలుకుబడి కలిగిన వ్యక్తులను ఎదుర్కొనే దాని కన్నా నియంతృత్వ ప్రభుత్వాన్ని ఎదుర్కోవడం కష్టమన్నారు. దాడులు, వేధింపులు తప్పుడు కేసులు తదితర వాటిని ఎదుర్కొని ఈ పరిపాలన తొలగించి ఉత్తమ పరిపాలన తెచ్చారని తెలిపారు. అలాంటి వారిని అభినందించాల్సిన అవసరం ఉందన్నారు. సమాజంలో దుర్మార్గులు, మోసగాళ్లను దూరంగా ఉంచాలని, లేకపోతే సంస్థలకు చెడ్డపేరు వస్తుందన్నారు. కాకతీయ కమ్మ సేవా సమితి అంటే తన బాగా ఇష్టమని సభ్యుల్లో సేవా మనోభావం ఉందన్నారు. దాన్ని చివరి వరకు కొనసాగించాలని సూచించారు. సమాజంలో సైబర్ నేరాలు అధికమవుతున్నాయని వాటి పట్ల ప్రజలు నిత్యం అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. డబ్బులు కష్టపడకుండా ఊరికే రావన్న విషయాన్ని అర్థం చేసుకుంటే సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడబోరన్నారు. ఓటరు జాబితా పునః సమీక్ష కార్యక్రమం ప్రారంభమవుతుందని ఇక్కడ నివసించే కమ్మ కుటుంబాల్లో కనీసం ఒక ఓటు అయిన బెంగళూరు నగరంలో ఉండే విధంగా చూసుకోవాలన్నారు. కర్ణాటకలో నివసిస్తున్నందున కన్నడ భాష నేర్చుకోవాలని పిలుపునిచ్చారు. దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో తెదేపాకు పూర్వ వైభవం తెచ్చేందుకు బెంగళూరు నగరంలో నివసిస్తున్న టెకీలు శ్రమించారని అభినందించారు. ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ అధ్యక్షురాలు రాయపాటి శైలజ మాట్లాడుతూ కష్టపడితే జీవితంలో పైకి వస్తారన్నారు. బెంగళూరు నగరంలో ఉన్న టెకీలు ఆంధ్రప్రదేశ్‌లో తెదేపా అధికారంలోకి వచ్చేందుకు నిరంతరం కష్టపడ్డారని తెలిపారు. కాంగ్రెస్ నేత ప్రసాద్‌బాబు (కబడ్డీబాబు) మాట్లాడుతూ రాష్ట్రంలో కమ్మ అభివృద్ధి మండలి ఏర్పాటుకు ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ సూచనప్రాయంగా అంగీకరించారని తెలిపారు. ఉపాధి కోసం నగరానికి వచ్చే కమ్మ యువతకు తమ సంస్థ అండగా ఉంటుందని కాకతీయ కమ్మ సేవాసమితి వ్యవస్థాపకుడు రామారావు గంగవరపు తెలిపారు. కార్యక్రమంలో ప్రముఖులు యలమంచి వాసుదేవరావు, హెచ్.రామాంజనేయ, గారపాటి రామకృష్ణ, సాధుదిలీప్, అనుమోలు బాలమురళీకృష్ణ, వెలమటి రేణుక, గడ్డపాటి శ్రీధర్, చంద్రయ్యనాయుడు, అట్లూరి శ్రీరామదాసు, సమితి పదాధికారులు కార్తిక్ ఇమడలపాటి, వేణు మోతుకూరి, శ్రీనివాస్ ముమ్మనేని, సుధీర్ కోనేరు, చైతన్య మాదల, ముప్పిరి టెండుల్కర్, పరమేష్ వున్నం, మణినాయుడు పాల్గొన్నారు.

కార్యక్రమానికి హాజరైన తెలుగు ప్రజలు

తంతికి చిక్కుకొని చిరుత మృతి

తోట రక్షణకు అమర్చిన తంతికి చిక్కుకొందిలా..

చెళ్లకెర(చిత్రదుర్గ),న్యూస్‌టుడే: దావణగెర జిల్లా నీలోగల్‌లో రంగనగౌడకు చెందిన వక్క తోట ప్రహరీకి అమర్చిన ఇనుప తీగలకు చిక్కుకొని చిరుత మృతి చెందిన ఘటన శనివారం రాత్రి జరిగింది. అటవీశాఖ అధికారులు ఆదివారం తెలిపిన వివరాల మేరకు.. ఆహార వేటలో భాగంగా సంచరిస్తున్న చిరుత వక్కతోటలోకి ప్రవేశించే ప్రయత్నంలో తంతుల మధ్యన చిక్కుకొని తీవ్రంగా గాయపడింది. విషయం తెలుసుకొని ఘటనా స్థలానికి చేరుకొనేసరికి అది మృతి చెందిందని అటవీ సంరక్షణ అధికారి రవీంద్ర కుమార్ తెలిపారు. కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టినట్లు తెలిపారు.

ప్రమాదంలో మహిళ దుర్మరణం

పామూరు, న్యూస్‌టుడే: ట్రాక్టర్‌ను టెంపో ట్రావెలర్ వాహనం ఢీకొనడంతో ఓ మహిళ దుర్మరణం చెందగా... మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పామూరు సమీపంలో జాతీయ రహదారి-565పై ఆదివారం తెల్లవారుజామున ఈ ఘటన చోటుచేసుకుంది. ఎస్సై కట్టా అనూక్ తెలిపిన వివరాలు... విజయనగర జిల్లా కొట్టూరు మండలం నగరకట్టు గ్రామానికి చెందిన విశాలాక్షి (48)... కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి ఆంధ్రప్రదేశ్‌లోని పుణ్యక్షేత్రాల సందర్శనకు ఈ నెల 20న టెంపో ట్రావెలర్ వాహనంలో బయలుదేరారు. మంత్రాలయం, మహానంది, శ్రీశైలం క్షేత్రాలను దర్శించుకుని... శనివారం రాత్రి తిరుపతి బయలుదేరారు. ఆదివారం తెల్లవారుజామున 5:30 గంటల సమయంలో... పామూరు సమీపంలోని గోపాలపురం వద్ద ముందు వెళ్తున్న కంకర ట్రాక్టర్‌ను వీరి వాహనం బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో విశాలాక్షికి తీవ్ర గాయాలు కావడంతో వెంటనే ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా... 108లో కందుకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విశాలాక్షి బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కనిగిరి ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి బాధితులను పరామర్శించి... సొంత నిధులతో వాహనం ఏర్పాటు చేసి వారిని స్వస్థలాలకు పంపే ఏర్పాటు చేశారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఇద్దరి మృతి

చెళ్లకెర(చిత్రదుర్గం),న్యూస్‌టుడే: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఇద్దరు మృతి చెందిన ఘటన ఆదివారం వేకువ జామున బెంగళూరు-పుణె జాతీయ రహదారి నంబరు-48పై చోటుచేసుకొంది. హిరియూరు తాలూకా పత్రేహళ్లి వద్ద దుర్ఘటన వివరాలు పోలీసు అధికారులు తెలిపారు. బెంగళూరు వైపు ప్రయాణిస్తున్న ఇన్నోవా కారు చెడిపోవడంతో రహదారి పక్కన నిలిపి చోదకుడు కిందకు దిగాడు. అతనితోపాటు ముగ్గురు ప్రయాణికులు చీకట్లో చరవాణుల వెలుతురులో కారు మరమ్మతు చేయడానికి ప్రయత్నించారు. అదే సమయంలో వెనుక వైపు నుంచి దూసుకొచ్చిన గుర్తు తెలియని వాహనం వారిని ఢీకొట్టిపోయింది. ఈ దుర్ఘటనలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా మరో ఇద్దరు తీవ్ర గాయాలతో అపస్మారక స్థితిలో పడిపోయారు. విషయం తెలుసుకొన్న హిరియూరు రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని హిరియూరు తాలూకా ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. శవ పరీక్షలకు కోసం మృత దేహాలను హిరియూరుకు తరలించారు. మృతుల వివరాలను సేకరిస్తున్నట్లు పోలీసు అధికారులు తెలిపారు. రూరల్‌పోలీసు ఠాణాలో కేసు నమోదు చేసుకొన్నారు.

EENADU Classifieds

JOBS

MARKETING/ SALES

Anand Masale Require Sales & Marketing Manager, Marketing Executives. Contact: 9849655105, 9848053144 Email: anandmasalaappltd@gmail.com

SECURITY GUARDS

Gunman (Ex. Servicemen) Urgently Wanted for Jewellery Mall at Ballari City. Gun & Gun Licence, PVC also. must 12 hours Duty. Rs. 43,000/-+PF+ESI. Age below 55 Years. Ph.: 7893197794, 8297910885.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలను ఇచ్చుటకు ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు.

బళ్ళారి : 9121167525

బెంగుళూరు : 9121167527

ప్రకటనలపై జి.ఎస్.టి. 5% వర్తించబడును

జ్యోతిషుడిపై పోక్సో కేసు నమోదు

బెంగళూరు(యలహంక),న్యూస్‌టుడే: వసంత్ నాయక్ హత్య కేసుకు సంబంధించి అరెస్టైయిన జ్యోతిషుడు కమలాకర్ భట్‌కు వ్యతిరేకంగా శివమొగ్గ జిల్లా సిద్ధాపుర పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. సిద్ధాపుర వసంత్ నాయక్ హత్య కేసులో నిందితుడు మూడో ముద్దాయి. తనను లైంగిక వేధింపులకు గురి చేశారని మహేశ్ నాయక్ కుమార్తె స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు ఆధారంగా నిందితుడికి వ్యతిరేకంగా పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో మాజీ ఎమ్మెల్యేకు గాయాలు

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: అతివేగంగా సంచరిస్తున్న కారు అదుపు తప్పి బోల్తాపడిన సంఘటనలో నాగమంగల మాజీ ఎమ్మెల్యే సురేష్ గౌడ గాయపడిన సంఘటన ఆదివారం ఇక్కడ మండ్య సమీపంలోని బెంతెకూప్పలు వద్ద జరిగింది. సురేష్ గౌడ ఆయన డ్రైవర్ కొద్దిపాటి గాయాలతో ప్రాణాలతో బయటపడినట్లు పోలీసులు తెలిపారు. వారిని చికిత్స కోసం ప్రత్యేక వాహనంలో బెంగళూరు నగరంలోని మణిపాల్ ఆసుపత్రికి తరలించారు. జేడీఎస్ కార్యకర్త వివాహానికి హాజరయ్యేందుకు ఆయన ఇంటి నుంచి బయలుదేరారు. మధ్యాహ్నం 12 గంటలకు ఈ సంఘటన జరిగినట్లు బసరాళు పోలీసులు తెలిపారు. ప్రమాదానికి కారణాలను కనిపెట్టేందుకు ఆ ప్రదేశంలో ఉన్న సీసీకెమెరాల్లో బంధించిన దృశ్యాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. కేసు దర్యాప్తులోఉంది.

చోరీ కేసును ఛేదించిన పోలీసులు

రూ.7.20 లక్షల విలువైన ఆభరణాలు, వస్తువుల స్వాధీనం

బళ్లారి, న్యూస్‌టుడే: నగరంలోని ఓ ఇంట్లో జరిగిన చోరీని గాంధీనగర్ పోలీసులు చాకచక్యంగా ఛేదించి బంగారు ఆభరణాలు, విలువైన వస్తువులు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ డాక్టర్ డి.సుమన్ పెన్నేకర్ తెలిపారు. స్థానిక గాంధీనగర పరిధిలోని ఓ ఇంట్లో 54 గ్రాముల బంగారు ఆభరణాలు, కీ ప్యాడ్ ఫోన్, ద్విచక్రవాహన దొంగతనం ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. సి.ఐ రవీంద్ర నేతృత్వంలో సిబ్బంది జయరామ్, నారాయణ రామదాసు, తిమ్మప్ప, మంజునాథ, విజయభాస్కర్, కళాలింగప్పలు బృందంగా ఏర్పడి పరారీలో ఉన్న ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి సంజీవయ్యనగర్‌కు చెందిన సోనపురెడ్డిని, పశ్చిమగోదావరి జిల్లా అచ్చుతాపురం పల్లవి వీధికి చెందిన చీపురపల్లి పూసిబాబులను అరెస్టు చేసి వారి నుంచి రూ. 7,20,600 విలువ చేసే 54 గ్రాముల బంగారు ఆభరణాలు, తదితర వస్తువులు స్వాధీనం చేసుకొన్నారు. నిందితుల్ని న్యాయమూర్తి ఎదుట హాజరు పరిచగా వారిని జైలుకు తరలించినట్లు తెలిపారు.

పోలీసులు స్వాధీనం చేసుకున్న నగదు, ద్విచక్ర వాహనం, చిత్రంలో సి.ఐ, సిబ్బంది

గురువులను మరవకూడదు

మాన్వి, న్యూస్‌టుడే : ఎక్కడున్నా, ఏ స్థాయికి చేరుకున్నా విద్యాబుద్ధులు నేర్పిన గురువులు, తల్లిదండ్రులు, పుట్టిన ఊరును మర్చిపోకూడదని కె.ఇ.నరసింహా విద్యార్థులకు సూచించారు. స్థానిక నేతాజీ పీయూసీ ద్వితీయ విద్యార్థులకు ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో ఆయన మాట్లాడారు. పిల్లలు ఉన్నత స్థానాలకు చేరాలన్న ఉద్దేశంతో తల్లిదండ్రులు ఎంతో త్యాగం చేసి శిక్షణ ఇప్పిస్తున్నారన్న విషయాన్ని విస్మరించరాదన్నారు. నేర్చుకున్న శిక్షణ సమాజంలో గౌరవప్రదమైన స్థానంలో నిలబడేవిధంగా ఉండాలన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వేదికపై కె.విజయలక్ష్మీ, కె.రాజారవివర్మ, డాక్టర్ కె.వినయ, ఆరీఫ్, చంద్రు, జాదవ్, రమేష్, వీరనగౌడ, నాగరాజ్, త్రివేణి, కావ్య తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న శిక్షణ సంస్థ నిర్వాహకులు

నాజూకు నగరి.. సౌందర్య లహరి

బెళ్లందూరు ఈకో టెక్‌పార్కు ఆవరణలో చెట్లు

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: రహదారి పొడవునా గులాబీ రంగు పూలతో కూడిన చెట్లు, కొంత దూరం పోతే నీలి, పసుపు పచ్చరంగు పూలతో కూడిన ఆహ్లాదకరమైన దృశ్యాలు హైటెక్ సిటీలో దర్శనమిస్తున్నాయి. అవి ప్రజలను ఆకట్టుకుంటున్నాయి. బెంగళూరులో ఉన్నామా? లేక విదేశాల్లో ఉన్నామా? అనే అనుభూతి కలుగుతోంది. వేసవి ప్రారంభం కావడంతో చెట్లకు ఆకులు రాలి వివిధ రకాల పూలతో చెట్లు నిండిపోతున్నాయి. చూపరులకు ఆహ్లాదం కలిగిస్తున్నాయి. ఉదయం వాయువిహారానికి వెళ్లే ప్రజలు పువ్వుల నుంచి వచ్చే వాసనకు మైమరిచిపోతున్నారు. వేసవి వచ్చిందంటే నగరంలోని వివిధ ప్రాంతాలు వాతావరణంలో విదేశాలతో పోటీ పడుతున్నాయి. ఉద్యానవనాల్లో చెట్లు పూలు పూయడం వాటిని ప్రజలు తిలకించి ఆనందించడం మామూలే. ఇందిరానగర, దొమ్మలూరు, పాత విమానాశ్రయం రహదారి, వైట్‌ఫీల్డ్, కస్తూరినగర, కల్యాణనగర, బెళ్లందూరు ఎకోటెక్ పార్కు ప్రదేశం, హెబ్బాళ్, మాన్యతా టెక్‌పార్కు, మహదేవపుర, సర్జాపుర తదితర ప్రాంతాల్లోని రహదారులకు ఇరువైపులా పింక్ ట్రంపెట్, టాబేబియా అర్జెంటియా చెట్లు గులాబీ రంగు విరులతో నిండి ఉన్నాయి. కసూర్తినగర చెరువు గట్టుపై వరుసగా ఉన్న పూలచెట్లను తిలకిస్తే విదేశాల్లో ఉన్న అనుభూతి కలుగుతుంది. విదేశీ జాతికి చెందిన గులాబీ, పసుపు పచ్చ నీలి రంగు పూలను గ్రేటర్ బెంగళూరు ప్రాధికార సిబ్బంది రహదారులకు ఇరువైపులా నాటి పెంచి పోషించారు. ఇప్పుడు ఆ చెట్లు నగర ప్రజలను కన్నుల విందులు చేస్తున్నాయి. వాటి కింద నిలబడితే ఒకవిధమైన సువాసన వస్తుంది. ఉదయం పూట సువాసన ఎక్కువగా ఉంటుంది. ఆ చెట్లను నూతన లేఔట్లల్లో పెంచుతున్నారు.

కబ్బన్‌పార్కు ఉద్యానవనంలో పసుపు పువ్వుల చెట్టు

వైట్‌ఫీల్డ్ రహదారిలో..

కట్టిపడేస్తున్న పూల చెట్ల సోయగం


కబ్బన్‌పార్కు ఉన్నత ఆవరణలో గులాబీ రంగు పువ్వుల చెట్టు

(c) eenadu

బళ్ళారి
● బళ్ళారి ● రాయచూరు ● కొప్పళ ● విజయనగర ● చిత్రదుర్గ

అభయ ఆంజనేయ స్వామి విగ్రహం

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన

కొటయ్య క్యాంపు (శ్రీరామనగర్), న్యూస్‌టుడే: గంగావతి తాలూకా కోటయ్య క్యాంపులో అభయ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య ఉదయం మూల మంత్ర హోమాలు, పంచామృతాభిషేకం, వేద పారాయణం, కలశారాధన, కుంబాభిషేకం తదితర పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం ప్రసాద వితరణ జరిగింది. ఆలయ సమితి సభ్యులు, క్యాంపు పెద్దలు, రైతులు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

మన్ కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించిన ఎమ్మెల్యే చంద్రప్ప

తిలకిస్తున్న ఎమ్మెల్యే చంద్రప్ప, జిల్లా భాజపా అధ్యక్షుడు కుమారస్వామి తదితరులు

చెళ్లకెర(చిత్రదుర్గ),న్యూస్‌టుడే: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ ప్రజలను ఉద్దేశించి మాట్లాడిన మన్ కీ బాత్ కార్యక్రమాన్ని హొళల్కెర ఎమ్మెల్యే ఎం.చంద్రప్ప వీక్షించారు. ఆదివారం హొళల్కెర భాజపా కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన భారీ ఎల్ఈడీ టీవీ తెరపై జిల్లా పార్టీ అధ్యక్షుడు కుమారస్వామి, నేతలు అనిల్‌కుమార్ తదితరులతో పాటు కార్యక్రమాన్ని తిలకించారు. తాలూకాలోని పలు గ్రామాల నుంచి సుమారు 200 మంది పార్టీ కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వసంత వైభవం

కహళె ప్రదర్శనలో కళాకారిణి

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి జిల్లా కళాకారుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కళా వైభవం-2026, రెండు వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన వసంత వైభవం(శోభ యాత్ర) విశేషంగా ఆకట్టుకుంది. స్థానిక హెచ్.ఆర్.గవియప్ప కూడలి నుంచి ప్రారంభమైన వసంత వైభవాన్ని ఎమ్మెల్సీ ఏచ రెడ్డి సతీష్, నగర పాలికె మేయర్ పూజారి గాదెప్ప, గ్రామీణ నియోజకవర్గం బగర్ హుకుం సాగువళి అధ్యక్షుడు తిమ్మనగౌడ పాల్గొని జెండా ఊపి ప్రారంభించారు. వసంత వైభవంలో సంఘం అధ్యక్షుడు యల్లనగౌడ శంకరబండ, బయలాట కళాకారుడు పంపాపతి, వీరేష్ దళవాయి. క.సా.ప జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నిష్ఠిరుద్రప్ప, సుబ్బణ్ణ, రమణప్ప భజంత్రి, అమరేష్, సుంకణ్ణ, మంజునాథ గోవిందవాడ, నాగభూషణ తదితరులు పాల్గొన్నారు. హెచ్.ఆర్.గవియప్ప కూడలి నుంచి రంగమందిర వరకు సాగిన వసంత వైభవం ఊరేగింపులో 15కు పైగా కళా బృందాలు ప్రదర్శనతో బళ్లారి నగరం కళావైభవాన్ని సంతరించుకుంది.

డోళు కుణిత కళాకారుల ప్రదర్శన

కళలు, క్రీడలతో మానసిక దృఢత్వం

◆ డిసెంబరులో బళ్లారి ఉత్సవం ◆ రూ.160 కోట్లతో నాలుగు వరుసల రహదారి

సాధు రాయప్పకు పురస్కారం అందజేస్తున్న ఎంపీ తుకారామ్, ముండరగి నాగరాజు, కాంద్ర సతీష్, యల్లనగౌడ శంకరబండ తదితరులు

బళ్లారి, న్యూస్‌టుడే: విద్యార్థులు పుస్తకాల పఠనంతో పాటు కళలు, సంస్కృతి, క్రీడలపైనా ఆసక్తి పెంచుకోవడం వల్ల శరీరకంగానే కాకుండా మానసికంగా కూడా దృఢంగా ఉంటారని లోక్‌సభ సభ్యుడు ఇ.తుకారామ్ తెలిపారు. జిల్లా కళాకారుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జోళదరాశి దొడ్డనగౌడ రంగమందిరంలో ఏర్పాటు చేసిన కళా వైభవం-2026, రెండో వార్షికోత్సవాన్ని తుకారామ్ ప్రారంభించి మాట్లాడారు. బళ్లారి రాఘవ, దొడ్డనగౌడ తదితర కళాకారులకు పుట్టినిల్లు ఇది. ఇక్కడి కళా క్షేత్రంలో వారే సుసంపన్నమైన సంపద. వారి ఆదర్శాలతో ముందుకు వెళ్లాలన్నారు.

వంతెనల నిర్మాణం:

ఉమ్మడి బళ్లారి జిల్లాలో గాదిగనూరు, పి.కె.హళ్లి, కుడతిని, తోరణగల్లు రైల్వేస్టేషన్‌పై వంతెన నిర్మాణాలు జరుగుతున్నాయి. బళ్లారి హెచ్.ఆర్.గవియప్ప కూడలిపై రైల్వే వంతెనను విస్తరిస్తామన్నారు. వేణివీరాపురం నుంచి సుధాక్రాస్ వరకు నాలుగు వరుసల రహదారి, బళ్లారిలో ఇ.ఎస్.ఐ ఆసుపత్రి నిర్మాణానికి టెండర్‌ను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో పోక్సో కేసులు పెరుగుతున్నాయి. దీనిపై యువతి, యువకులు, విద్యార్థుల్లో అవగాహన కల్పించాలని కళాకారులకు సూచించారు. లిడ్కర్ మండలి రాష్ట్ర అధ్యక్షుడు ముండరగి నాగరాజ్ మాట్లాడుతూ రంగమందిరం నిర్మించి 30 ఏళ్లు గడిచిపోయాయి. పక్కన ఖాళీ స్థలంలో అధునిక పద్ధతిలో మరో రంగమందిరాన్ని కె.ఎం.ఇ.ఆర్.సి నిధులతో నిర్మించాలని లోక్‌సభ సభ్యుడికి విజ్ఞప్తి చేశారు.

కార్యక్రమంలో పాల్గొన్న కళాకారులు, అభిమానులు

కన్నడ సాహిత సమ్మేళనం

జిల్లా కన్నడ సాహిత్య పరిషత్తు అధ్యక్షుడు డాక్టర్ నిష్ఠిరుద్రప్ప మాట్లాడుతూ బళ్లారిలో మే-జూన్‌ల్లో 88వ అఖిల భారత కన్నడ సాహిత్య సమ్మేళనం నిర్వహిస్తామన్నారు. 69 ఏళ్ల తర్వాత బళ్లారిలో ఈ సమ్మేళనం నిర్వహించనుండటం సంతోషంగా ఉందన్నారు. ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. గుత్తేదారుడు మసీదిపుర చంద్రశేఖర్‌గౌడ మాట్లాడుతూ కళాకారులను వెన్నుతట్టి ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమ ఆరంభంలో కాంద్ర సతీష్ మాట్లాడుతూ 'బళ్లారి ఉత్సవం' నిర్వహించాలని కోరారు. దీనిపై ఎంపీ స్పందిస్తూ డిసెంబరులో ఉత్సవం నిర్వహిస్తామని ప్రకటించారు.

కళాకారులకు సన్మానం

ప్రముఖ జానపద కళాకారులు సాధు రాయప్పకు సుభద్రమ్మ మన్సూరు పురస్కారాన్ని అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ప్రముఖులు సిరిగేరి పన్నారాజ్, రక్షణ వేదిక ప్రవీణ్‌శెట్టి విభాగం జిల్లాధ్యక్షుడు రాజశేఖర్, వెంకటేశ్ హెగ్డే, ఆలువేలు సురేష్, కన్నడ సాంస్కృతికశాఖాధికారి నాగరాజ్, కళాకారుల సంఘం అధ్యక్షుడు శంకరబండ యల్లనగౌడ, కార్యదర్శి తిప్పేస్వామి, పద్మవతి, వివేక్ తదితరులు పాల్గొన్నారు.

సిడిబండి రథోత్సవానికి సర్వం సిద్ధం

ఏర్పాట్లలో నిమగ్నమైన దేవాదాయశాఖ

వందేళ్ల క్రితం నిర్వహించిన సిడిబండి రథోత్సవం

బళ్లారి, న్యూస్‌టుడే: అమ్మలగన్న అమ్మ కనకదుర్గమ్మ సిడిబండి రథోత్సవానికి సర్వం సిద్ధమౌతోంది. గానుగ సముదాయం ప్రజలు భక్తిశ్రద్ధలతో ఉత్సవాన్ని ఆచరించడానికి పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ రథోత్సవానికి బళ్లారి నుంచే కాకుండా వేర్వేరు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారు. ఇందుకు జిల్లా యంత్రాంగం, దేవాదాయశాఖాధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు.

కనకదుర్గమ్మ గుడి ప్రస్థానం

బళ్లారిలో వందల ఏళ్ల క్రితం కనకదుర్గమ్మ పుట్టలో ఉద్భవించింది. నేటికి కనకదుర్గమ్మ గర్భగుడిలో కూడా పుట్టను విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. పూర్వం బళ్లారి (మిల్లర్‌పేట్, బ్రూస్‌పేట్, కౌల్‌బజార్ మూడు చిన్న గ్రామాలు)లతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కలరా, ప్లేగు, మశూచి వ్యాధులతో పిట్టల్లా రాలిపోతున్నారు. ఓ రోజు రాత్రి గానుగ సముదాయ మహిళకు అమ్మ కలలోకి వచ్చి మీకు అండగా ఉంటానని చెప్పింది. కొండగుట్టల్లో పశువులు, గొర్రెలు కాస్తున్న యాదవులు తొలుత అమ్మకు పూజలు చేయడం ప్రారంభించారు. నాటి నుంచి నేటి వరకు యాదవ సముదాయానికి చెందిన వారే పూజలు చేస్తూ వస్తున్నారు.

దుర్గమ్మ దేవస్థానం

ఎద్దులతో ముమ్మార్లు ప్రదక్షిణ

అమ్మకు ప్రతి ఏటా ప్రత్యేక రథోత్సవం నిర్వహించడాన్ని గానుగ సముదాయం ప్రజలు ప్రారంభించారు. మొదట్లో సిడిబండిపై మనిషిని కట్టి దేవస్థానం చుట్టూ తిప్పేవారు. ఒకసారి ఆ మనిషి కింద పడిపోవడంతో ఆ తర్వాత నుంచి పోతురాజు బొమ్మను కడుతున్నారు. తాజాగా సిద్ధం చేసిన సిడిబండిని సోమవారం సాయంత్రం మూడు జతల ఎద్దులతో దుర్గమ్మ గుడికి తీసుకొని వెళ్లి, మంగళవారం సాయంత్రం సిడిబండిని దేవస్థానం చుట్టూ మూడుసార్లు ప్రదక్షిణలు చేస్తారు.

ప్రత్యేక పూజలు

కౌల్‌బజార్ దుగ్గిమాదయ్య వీధిలో 1830లో నిర్మించిన దుర్గమ్మ గుడి ముందు సిద్ధమైన సిడిబండి వద్దకు సోమవారం మధ్యాహ్నం మొదట కుమ్మర సముదాయం తరపున బోనాలను ఊరేగింపుగా తీసుకు వస్తారు. అనంతరం భోవి వీధి నుంచి వాల్మీకి సముదాయం భక్తులతో పాటు గానుగ సముదాయం ఇళ్ల నుంచి బోనాలను తీసుకొని వస్తారు. దుర్గమ్మ దేవస్థానం ముందు బోనాలకు ప్రత్యేక పూజలు అనంతరం మూడు జతల ఎద్దులతో సిడిబండిని ఊరేగింపు దుర్గమ్మ గుడికి తీసుకుని వెళ్తారు. పూజార్లు బెంగళూరు రహదారిలోని సణ్ణ దుర్గమ్మ ఆలయం నుంచి బోనాలు తీసుకుని వచ్చి, దేవస్థానం దిగువ భాగంలో ఉన్న పొలేరమ్మకు సమర్పించి పూజలు చేస్తారు. అనంతరం దుర్గమ్మకు ప్రత్యేక పూజలు చేసి సిడిబండి రథోత్సవం ప్రారంభిస్తారు.

విజయవంతంగా ముగిసిన సాహిత్య సమ్మేళనం

వివిధ రంగాల్లో సేవలందించిన వారికి సన్మానం

కారటగి, న్యూస్‌టుడే: కారటగి తాలూకా మూడో సాహిత్య సమ్మేళనం శనివారం రాత్రి విజయవంతంగా ముగిసింది. సాహితీవేత్తల సమ్మేళనం, కవితాగోష్ఠి, సాంస్కృతిక ప్రదర్శనలు జరిగాయి. అంతకుముందు సమ్మేళన అధ్యక్షుడు డాక్టర్ చెన్నబసప్ప చిల్కరాగి మాట్లాడుతూ ఆధునికత మోజులో మాతృభాషను విస్మరించొద్దు. హైదరాబాద్-కర్ణాటక ప్రాంతంలో 371-జె జారీ అయినా సమర్థంగా అమలు కావడం లేదని విచారం వ్యక్తం చేశారు. కన్నడ భాష, సాహిత్యం తదితరాల్ని వివరించారు. స్థానిక ఎమ్మెల్యే, కన్నడ సాంస్కృతిక శాఖ మంత్రి శివరాజ్ తంగడగి మాట్లాడుతూ తుంగభద్ర జలాశయ క్రస్ట్‌గేట్ల అమరిక మే నెలాఖరు లోపు పూర్తవుతుంది. ఈ విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. మర్లానహళ్లిలో ఈ ఏడాది ఉన్నత పాఠశాల ప్రారంభమౌతుంది. 371- జె అమలు వల్ల ఈ ప్రాంతంలో విద్య, ఉద్యోగ అవకాశాలు మెరుగుపడ్డాయన్నారు. మర్లానహళ్లిలో ఉన్నత పాఠశాల, కారటగిలో డిగ్రీ కళాశాల, గ్రంథాలయం ఏర్పాటు, వరి ఉద్యానం (రైస్ టెక్నాలజీ పార్కు)లో స్థానికులకు ఉద్యోగాల కల్పన తదితర విషయాలపై సమ్మేళనంలో తీర్మానం చేశారు. వివిధ రంగాల్లో సేవలందిస్తున్న వారిని గుర్తించి సత్కరించారు. లక్ష్మీ వేంకటేశ్వర కల్యాణ మంటపంలో తిరుమల వేదికపై ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో కన్నడ సాహిత్య పరిషత్ నాయకులు, సాహితీవేత్తలు, కవులు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో తిరుమంజనాభిషేకం

స్వామికి పూజలు చేస్తున్న అర్చకులు

బళ్లారి, న్యూస్‌టుడే: స్థానిక విద్యానగర్‌లోని అభయ ఆంజనేయస్వామి దేవస్థానం ఆవరణలో శనివారం రాత్రి తిరుమంజనాభిషేకం, పుష్పయాగం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బళ్లారి అభయ ఆంజనేయస్వామి సేవా ట్రస్ట్, వెల్లంకి యశోద దాస సాహిత్య ప్రాజెక్ట్ సంయుక్తంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి పూజల్ని దాస సాహిత్య ప్రాజెక్ట్ విశేషించారు. పగడాల ఆనంద తీర్థ ఆచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు స్వామిని దర్శనం చేసుకున్నారు. మహిళల కోలాట ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.

వైభవంగా గాదిలింగేశ్వర స్వామి ఊరేగింపు

పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు

కురుగోడు(బళ్లారి), న్యూస్‌టుడే: తాలూకా బాదనహట్టి గ్రామంలో గాదిలింగేశ్వర స్వామి రథోత్సవం ఆదివారం సాయంత్రం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. రథోత్సవం సందర్భంగా ఉదయం స్వామికి అభిషేకం, విశేషాలంకరణతో ప్రత్యేక పూజలు చేశారు. బాదనహట్టి గ్రామం నుంచే కాకుండా సిద్ధమ్మనహళ్లి, యరంగలి, వద్దట్టి, కల్లుకంభ, తదితర చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శనం చేసుకున్నారు. సాయంత్రం ఉత్సవ మూర్తిని రథం వద్దకు తీసుకుని వచ్చి గ్రామంలో రథోత్సవం నిర్వహించారు. తరలివచ్చిన భక్తులకు స్వామికి పండ్లు, పూలు కానుకలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ముందు జాగ్రత్తగా కురుగోడు పోలీసులు భద్రత నిర్వహించారు.

రైతుల అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం

పరికరాలు పంపిణీ చేస్తున్న మంత్రి బోసురాజు, ఎంపీ కుమారనాయక్ తదితరులు

మాన్వి, న్యూస్‌టుడే : రైతుల అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేస్తామని మంత్రి ఎన్.ఎస్.బోసురాజు పేర్కొన్నారు. రాయచూరు గ్రామీణ పరిధిలోని 14 గ్రామాలకు చెందిన రైతులకు ప్రభుత్వం ప్రకటించిన వ్యవసాయ పరికరాలను లోక్‌సభ సభ్యుడు జి.కుమార్‌నాయక్‌తో కలిసి మంత్రి పంపిణీ చేసి మాట్లాడారు. రైతులకు బోరుబావులు నిర్మించుకునేందుకు, డ్రిప్ ఇరిగేషన్, చెక్‌డ్యామ్‌లు, చెరువులు, వ్యవసాయ చెరువులకు నీటి వ్యవస్థ కల్పించేందుకు చిన్ననీటి పారుదలశాఖ సహకారం అందిస్తుందన్నారు. ప్రభుత్వ సమకూర్చే సదుపాయాలని రైతులు వినియోగించుకోవాలన్నారు. భూగర్భ జలాలను సంరక్షించేందుకు శాఖ చేస్తున్న కృషికి ప్రజలు, ముఖ్యంగా రైతులు ముందుకు రావాలన్నారు. భూగర్భ జలాల వినియోగంలో రాష్ట్రం 9వ స్థానంలో ఉందన్నారు. ఎంపీ కుమార్‌నాయక్ మాట్లాడుతూ రైతులు కేవలం వ్యవసాయం మీద ఆధారపడకుండా వ్యవసాయ ఆధారిత ఇతర ఉప వృత్తులను చేపట్టాలని, సేద్యంలో అంతరపంటలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. రైతులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల యోజనలు, పథకాలను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రముఖులు మహ్మద్ శాలం, జయణ్ణ, నరసింహులు మాడగిరి, ఆంజినేయ, శివమూర్తి, అమరేగౌడ హంచినాళ, బి.రమేష్, తాయణ్ణ, మహాదేవ, గోవిందప్ప తదితరులు పాల్గొన్నారు.

3న యోగి నారాయణ జయంతి

రాయచూరు: మార్చి 3న యోగి నారాయణ యతీంద్రర (కైవార తాతయ్య) జయంతి నిర్వహణపై చర్చించేందుకు ఈ నెల 24న సన్నాహక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. జిల్లా పాలనాధికారి సభా భవనంలో మధ్యాహ్నం 12 గంటలకు మొదలవుతుంది.

రాయచూరు కమ్మ సంఘానికి నూతన సారథి

నూతన అధ్యక్షుణ్ని సన్మానిస్తున్న సభ్యులు

రాయచూరు, న్యూస్‌టుడే : రాయచూరు తాలూకా కమ్మవారి సంఘానికి నూతన అధ్యక్షుడిగా బి.వెంకటేశ్వరరావు (కొండయ్య) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మూడేళ్ల (2026-2029) వరకు పదవిలో కొనసాగుతారు. కొత్త అధ్యక్షుడిని ఎన్నుకునేందుకు ఆదివారం స్థానిక ఈదల మాణిక్యమ్మ పబ్లిక్ పాఠశాలలో సర్వసభ్య సమావేశం జరిగింది. సభ్యులంతా కొండయ్య పేరును మాత్రమే ప్రతిపాదించడంతో పోటీ లేకుండా ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులే పదవిని నిర్వహించడంతో నేరుగా అధ్యక్షుడై రికార్డు సాధించారు. ప్రస్తుత అధ్యక్షుడు బూరుగుపల్లి ప్రసాద్, ప్రముఖులు నెక్కంటి ఆదినారాయణ, రత్నమాల, వైద్యులు రవి, మద్దిపాటి శ్రీనివాస్, గొడవర్తి శ్రీనివాస్ తదితరులు వెంకటేశ్వరరావును అభినందించి సత్కరించారు.

త్వరలో నూతన కార్యవర్గం ఏర్పాటు

తనపై నమ్మకంతో ఎన్నుకున్న అందరికీ కొండయ్య ధన్యవాదాలు తెలిపారు. మాజీ అధ్యక్షులు, పెద్దలతో చర్చించి వీలైనంత త్వరగా కొత్త కార్యవర్గాన్ని ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. నూతన సమితి అధికారం చేపట్టాక సమస్యల అధ్యయనానికి, అభివృద్ధిపై సలహాలు స్వీకరణకు సమావేశం నిర్వహిస్తానని తెలిపారు. ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు.

నేపథ్యం వ్యవసాయ కుటుంబం

వ్యవసాయ కుటుంబానికి చెందిన వెంకటేశ్వరరావు కర్నూలు జిల్లా పాములపాడు మండలం కృష్ణానగర్ క్యాంపులో 1970లో జన్మించారు. మాన్వి తాలూకా కొట్నెకల్ దగ్గరి అమరావతికి 1992లో వలస వచ్చారు. రైతుగా నిలదొక్కుకున్నాక రైస్ మిల్లు స్థాపించి వ్యాపారిగా విజయవంతమయ్యారు. ఈయన తల్లిదండ్రులు తూర్పుగోదావరి జిల్లా రామచంద్రాపురం తాలూకా దంగేరి గ్రామ నివాసులు.

తుంగభద్ర ప్రధాన కాలువ మరమ్మతులు చేపట్టండి

బీటలు వారిన ఎడమ కాలువ వంతెన గోడ

కారటగి, న్యూస్‌టుడే: తుంగభద్ర ఎడమ ప్రధాన కాలువ మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. కారటగి తాలూకా మైలాపుర గ్రామ సమీప 46వ నంబరు మైలు వద్ద కాలువ గోడ బీటలు బారింది. అదే ప్రాంతంలో మరో చోట కాలువ గోడ పైన మట్టి కొట్టుకుపోయింది. ప్రస్తుతం కాలువలో నీటి ప్రవాహం లేనందువల్ల మరమ్మతులు చేపట్టాలి. ఇప్పుడు నిర్లక్ష్యం వహిస్తే వచ్చే సీజన్‌లో ఆగస్టు నుంచి నిరంతరాయంగా 8, 9 నెలలు కాలువలో నీటి ప్రవాహం ఉంటుంది. ఆ సమయంలో కాలువ మరింత దెబ్బ తినే అవకాశం ఉంది. అందువల్ల అధికారులు ముందు జాగ్రత్తగా ఇప్పుడు మరమ్మతు పనులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

రూ.37వేల కోట్ల బకాయిల చెల్లింపు ఎప్పుడు?


సమావేశంలో మాట్లాడుతున్న గుత్తేదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.మంజునాథ

బళ్లారి, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో చేసిన పనులకు రూ.37 వేల కోట్ల బకాయిల్ని ప్రభుత్వం విడుదల చేయాలి. మూడేళ్లుగా బిల్లులు పెండింగ్‌లో ఉండటం వల్ల గుత్తేదారులు విషం తాగే పరిస్థితి నెలకొంది. తక్షణం చెల్లింపులు చేయకుంటే మార్చి 6న బెంగళూరు ఫ్రీడం పార్క్‌లో సుమారు 30 వేల మంది గుత్తేదారులు ఆందోళనలో పాల్గొననున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.మంజునాథ తెలిపారు. ఆదివారం నగరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గుత్తేదారులు అప్పులు చేసి, ఆస్తులను కుదువ పెట్టి ప్రభుత్వ నిబంధనల ప్రకారం పనులు పూర్తి చేశారు. కానీ ఏళ్ల తరబడి బిల్లులు నిలిచిపోవడంపై ముఖ్యమంత్రి, ఎనిమిది మంది మంత్రుల్ని కలిశాం. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో సమావేశం నిర్వహించినా ఫలితం లేకపోయింది. ఇప్పటికే 100 పేజీలతో కూడిన వినతిపత్రాల్ని సీఎంకు అందజేసినట్లు తెలిపారు.

40శాతం ఎమ్మెల్యేలు అవినీతి పరులే

హొసపేటె, న్యూస్‌టుడే: రాష్ట్రంలో 40శాతం ఎమ్మెల్యేలు అవినీతిపరులే. అభివృద్ధి పనుల్లో వారికి కమిషన్ ఇవ్వాల్సిందేనని మంజునాథ్ ఆరోపించారు. ఆయన ఇక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

నేడు విద్యుత్తు టారిఫ్‌పై ప్రజాభిప్రాయ సేకరణ

బళ్లారి, న్యూస్‌టుడే: గుల్బర్గా విద్యుత్తు సరఫరా సంస్థ(జెస్కాం), 2024-25 ఆర్థిక సంవత్సరానికి విద్యుత్తు టారిఫ్ సవరణ కోరుతూ కర్ణాటక విద్యుత్తు నియంత్రణ కమిషన్ దరఖాస్తు దాఖలు చేసింది. 2024-25 సంవత్సరానికి విద్యుత్తు టారిఫ్ సవరణపై ప్రజాభిప్రాయ సేకరణ సమావేశం సోమవారం ఉదయం11కు కలబురగి జిల్లా పాలనాధికారి కార్యాలయంలో నిర్వహించనున్నారు. ఆసక్తిగల వారు, సంస్థలు, ఇతర ప్రజలు విద్యుత్తు టారిఫ్ సవరణకు సంబంధించి ఈ సమావేశానికి హాజరై కమిషన్ ముందు మౌఖికంగా లేదా లిఖిత పూర్వకంగా తమ అభిప్రాయాలను సమర్పించవచ్చని గుల్బర్గా జెస్కాం విభాగం సీఈ తెలిపారు.

చేపల పెంపకంతో గ్రామీణులకు ఆర్థిక ఊతం

చెళ్లకెర(చిత్రదుర్గం),న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లోని చెరువులు, చెక్‌డ్యామ్‌లు, నీటికుంటల్లో చేపల పెంపకం ద్వారా గ్రామీణ ప్రజలు ఆర్థికంగా వికాసం చెందగలరని స్థానిక ఎమ్మెల్యే టి రఘుమూర్తి పేర్కొన్నారు. ఆదివారం ఆయన తాలూకాలోని చౌళూరు వద్ద వేదావతి నదిపై నిర్మించిన చెక్ డ్యామ్ జలాల్లో చేప పిల్లలను వదలిపెట్టి మాట్లాడారు. మరో రెండు మూడు నెలల్లో వీటి ద్వారా మత్స్యకారులకు ఆదాయం సమకూరగలదన్నారు. నీటి వనరులను సమర్థంగా వినియోగించుకోవడం ద్వారా గ్రామీణ ప్రాంతాల్ని అభివృద్ధి దిశలో తీసుకుపోవచ్చున్నారు. తాలూకా మత్స్యశాఖ అధికారి దీపాలి, తాలూకా స్త్రీ, శిశు సంక్షేమ అధికారి రాజానాయక్, టీపీ నామినేటెడ్ సభ్యులు బసవరాజ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

22-02-2026 (ఉ॥ 8 గంటలకు)	ప్రస్తుతం	గత సంవత్సరం
నీటిమట్టం (అడుగుల్లో)	1601.87	1609.87
ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	000	000
అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	403	9,104
నీటి నిల్వ (టి.ఎం.సి)	24.033	37.314

గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు) వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు

చౌళూరు చెక్ డ్యామ్‌లో చేపల పిల్లలను వదులుతున్న ఎమ్మెల్యే రఘుమూర్తి

ఏనుగు దాడిలో మహిళా కూలీ మృతి

హొసపేటె, న్యూస్‌టుడే: చిక్కమగళూరు జిల్లా హుంచెహళ్లిపుర కాఫీ ఎస్టేట్‌లో ఆదివారం ఏనుగు దాడిలో విజయనగర జిల్లా కూడ్లిగి తాలూకా గెద్దలగట్టికి చెందిన మహిళ కూలీ బోరమ్మ(41) మృతిచెందింది. కుటుంబ సభ్యులతో ఆమె ఉపాధి నిమిత్తం చిక్కమగళూరు వెళ్లింది. కాఫీ తోటలో పనిచేస్తుండగా ఏనుగు దాడిచేసి కాళ్ల కిందేసి తొక్కింది. మృతురాలికి ఇద్దరు పిల్లలున్నారు. మృతదేహాన్ని స్వస్థలానికి తీసుకొచ్చారు. ఆమె మృతితో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలి

కంప్లి, న్యూస్‌టుడే: కంప్లికోటె తుంగభద్ర నది వంతెన వద్ద స్వాగత కమాను దుర్ఘటనలో బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని భాజపా నాయకుడు జి.శ్రీనివాసులు డిమాండు చేశారు. కంప్లి భాజపా కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఘటనలో మృతి చెందిన కార్మికుడి కుటుంబానికి రూ.50 లక్షలు, గాయపడిన ఇద్దరు కార్మికులకు తలా రూ.25 లక్షల పరిహారం ప్రభుత్వం అందించాలి. కమాను ఏర్పాటులో సరైన జాగ్రత్తలు తీసుకోలేదు. నిర్లక్ష్యం వహించిన పురసభ ముఖ్యాధికారి, ఇంజినీర్‌ను సస్పెండ్ చేయాలి. గుత్తేదారుపై చర్యలు తీసుకోవాలని ఒత్తిడి చేశారు. స్వాగత కమానుల ఏర్పాటులో పురసభ నిధులు దుర్వినియోగం అయ్యాయన్నారు. అర్హులైన వ్యక్తిని పురసభ ముఖ్యాధికారిగా నియమించాలని డిమాండు చేశారు. యువ మోర్చా నాయకులు మనోజ్ గౌడ, కె.ప్రశాంత్, ఎం.భాస్కర్, కె.బసవ ప్రభు, కట్టె విశ్వనాథ, సి.ఎ.చెన్నప్ప, షంషుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న భాజపా నాయకుడు శ్రీనివాసులు

(c) eenadu

రోడ్డు ప్రమాదంలో మాజీ ఎమ్మెల్యేకు గాయాలు

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: అతివేగంగా సంచరిస్తున్న కారు అదుపు తప్పి బోల్తాపడిన సంఘటనలో నాగమంగల మాజీ ఎమ్మెల్యే సురేష్ గౌడ గాయపడిన సంఘటన ఆదివారం ఇక్కడ మండ్య సమీపంలోని బెంతెకూప్పలు వద్ద జరిగింది. సురేష్ గౌడ ఆయన డ్రైవర్ కొద్దిపాటి గాయాలతో ప్రాణాలతో బయటపడినట్లు పోలీసులు తెలిపారు. వారిని చికిత్స కోసం ప్రత్యేక వాహనంలో బెంగళూరు నగరంలోని మణిపాల్ ఆసుపత్రికి తరలించారు. జేడీఎస్ కార్యకర్త వివాహానికి హాజరయ్యేందుకు ఆయన ఇంటి నుంచి బయలుదేరారు. మధ్యాహ్నం 12 గంటలకు ఈ సంఘటన జరిగినట్లు బసరాళు పోలీసులు తెలిపారు. ప్రమాదానికి కారణాలను కనిపెట్టేందుకు ఆ ప్రదేశంలో ఉన్న సీసీ కెమెరాల్లో బంధించిన దృశ్యాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

నాజూకు నగరి.. సౌందర్య లహరి

బెళ్లందూరు ఎకోటెక్‌పార్కు ఆవరణలో పూల సోయగం

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: రహదారి పొడవునా గులాబీ రంగు పూలతో కూడిన చెట్లు, కొంత దూరం పోతే నీలి, పసుపు పచ్చరంగు పూలతో కూడిన ఆహ్లాదకరమైన దృశ్యాలు హైటెక్ సిటీలో దర్శనమిస్తున్నాయి. అవి ప్రజలను ఆకట్టుకుంటున్నాయి. బెంగళూరులో ఉన్నామా? లేక విదేశాల్లో ఉన్నామా? అనే అనుభూతి కలుగుతోంది. వేసవి ప్రారంభం కావడంతో చెట్లకు ఆకులు రాలి వివిధ రకాల పూలతో చెట్లు నిండిపోతున్నాయి. చూపరులకు ఆహ్లాదం కలిగిస్తున్నాయి. ఉదయం వాయువిహారానికి వెళ్లే ప్రజలు పువ్వుల నుంచి వచ్చే వాసనకు మైమరిచిపోతున్నారు. వేసవి వచ్చిందంటే నగరంలోని వివిధ ప్రాంతాలు వాతావరణంలో విదేశాలతో పోటీ పడుతున్నాయి. ఉద్యానవనాల్లో చెట్లు పూలు పూయడం వాటిని ప్రజలు తిలకించి ఆనందించడం మామూలే. ఇందిరానగర, దొమ్మలూరు, పాత విమానాశ్రయం రహదారి, వైట్‌ఫీల్డ్, కస్తూరినగర, కల్యాణనగర, బెళ్లందూరు ఎకోటెక్ పార్కు ప్రదేశం, హెబ్బాళ్, మాన్యతా టెక్‌పార్కు, మహదేవపుర, సర్జాపుర తదితర ప్రాంతాల్లోని రహదారులకు ఇరువైపులా పింక్ ట్రంపెట్, టాబెబియా అర్జెంటియా చెట్లు గులాబీ రంగు విరులతో నిండి ఉన్నాయి. కస్తూర్తినగర చెరువు గట్టుపై వరుసగా

కబ్బన్‌పార్కు ఉద్యానవనంలో పసుపు పూల చెట్టు

వైట్‌ఫీల్డ్ రహదారిలో...

కట్టిపడేస్తున్న పూల చెట్ల సోయగం

కబ్బన్‌పార్కు ఉన్నత ఆవరణలో గులాబీ రంగు పూల అందాలు

ఉన్న పూలచెట్లను తిలకిస్తే విదేశాల్లో ఉన్న అనుభూతి కలుగుతుంది. విదేశీ జాతికి చెందిన గులాబీ, పసుపు పచ్చ నీలి రంగు పూలను గ్రేటర్ బెంగళూరు ప్రాధికార సిబ్బంది రహదారులకు ఇరువైపులా నాటి పెంచి పోషించారు. ఇప్పుడు ఆ చెట్లు నగర ప్రజలను కన్నువిందులు చేస్తున్నాయి. వాటి కింద నిలబడితే ఒకవిధమైన సువాసన వస్తుంది. ఉదయం పూట సువాసన ఎక్కువగా ఉంటుంది. ఆ చెట్లను నూతన లేఔట్‌ల్లో పెంచుతున్నారు.

మొక్కజొన్న పొలంలో ఒకరి హత్య

బెంగళూరు(బాణసవాడి),న్యూస్‌టుడే: బెళగావి జిల్లా కిత్తూరు తాలూకా హిరేనందిహళ్లి గ్రామంలో మొక్కజొన్న పంట పొలంలో కల్మేశ్‌కోటి (50) అనే వ్యక్తి హత్యకు గురయ్యారు. తుమకూరు హోం కేర్‌లో పని చేస్తున్న ఇతడు పదిరోజుల కిందట గ్రామానికి వచ్చారు. పదేళ్ల నుంచి భార్యకు దూరంగా వృద్ధ తల్లిదండ్రులతో కలిసి నివసిస్తున్నారు. హత్యకు కారణాలు తెలియరాలేదు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

గోదాములో అగ్నిప్రమాదం

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: సుగంధ ద్రవ్యాలు నిల్వ చేసే గోదాములో అగ్నిప్రమాదం సంభవించిన సంఘటన ఆదివారం ఉదయం తుమకూరు రోడ్డు మాకళి వద్ద జరిగింది. దట్టమైన పొగలు రావడంతో చుట్టుపక్కల ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. ఉదయం 11.30 గంటలకు మంటలు లేచాయి. భయంకరమైన శబ్దాలు వచ్చాయి. చూస్తుండగానే గోదాము పూర్తిగా కాలిపోయినట్లు మాదనాయకనహళ్లి పోలీసులు తెలిపారు. విషయం తెలిసిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది అక్కడికి వచ్చి మంటలను ఆర్పారు. ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. విద్యుత్తు షార్ట్ సర్క్యూట్ కారణమై ఉండవచ్చని పోలీసులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

గోదాము నుంచి ఎగిసిపడుతున్న పొగ

గురువులను మరువకూడదు

మాన్వి, న్యూస్‌టుడే : ఎక్కడున్నా, ఏ స్థాయికి చేరుకున్నా విద్యాబుద్ధులు నేర్పిన గురువులు, తల్లిదండ్రులు, పుట్టిన ఊరును మర్చిపోకూడదని కె.ఇ.నరసింహా విద్యార్థులకు సూచించారు. స్థానిక నేతాజీ పీయూసీ ద్వితీయ విద్యార్థులకు ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో ఆయన మాట్లాడారు. పిల్లలు ఉన్నత స్థానాలకు చేరాలన్న ఉద్దేశంతో తల్లిదండ్రులు ఎంతో త్యాగం చేసి శిక్షణ ఇప్పిస్తున్నారన్న విషయాన్ని విస్మరించరాదన్నారు. నేర్చుకున్న శిక్షణ సమాజంలో గౌరవప్రదమైన స్థానంలో నిలబడేవిధంగా ఉండాలన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

బెంగళూరు విపణిలో కూరగాయల ధరలు

(హాప్‌కామ్స్-కిలో..రూ.లలో)

బీన్స్-	65
క్యారెట్-	55
బీరకాయలు-	55
క్యాబేజి-	35
క్యాలీఫ్లవర్(ఒక్కటి)-	30
సొరకాయ-	55
దొండకాయలు-	45
పొట్లకాయ-	45
పచ్చి మిరపకాయలు-	115
కాకర కాయలు-	55
టమాటా(నాటు)-	35
టమాటా(సాధారణ)-	25
గుమ్మడి-	30
ఆలుగడ్డ-	35
ఉల్లి(మేలురకం)-	35
ఉల్లి(సాధారణ)-	25
వెల్లుల్లి-	160
సాంబారు ఉల్లి-	165
బీట్‌రూట్-	55
వంకాయలు-	55
బెండకాయలు-	55
ముల్లంగి-	55
నిమ్మకాయ-	210
పండ్లు, ఫలాల ధరలు	
వాషింగ్టన్ ఆపిల్-	395
సిమ్లా ఆపిల్-	285
గ్రీన్ ఆపిల్-	345
అరటి కాయలు-	35
సపోటా-	45
ఫైనాపిల్-	65
బొప్పాయి-	40
ఆరంజి-	95
బత్తాయి-	55

(న్యూస్‌టుడే, యశ్వంతపుర)

పుస్తకం విడుదల

బెంగళూరు(యలహంక),న్యూస్‌టుడే: సంప్రదాయాలు, నమ్మకాలు ఉద్దేశాలతో కూడిన కథలు ఉన్న 'ఏ లైఫ్ ఆఫ్ బిల్డింగ్ పీపుల్-బ్రాండ్ అండ్ బిలీఫ్' అనే పుస్తకాన్ని నగరంలోని కోరమంగలలోని ఉన్న సప్న బుక్‌హౌస్ ఆదివారం విడుదల చేసింది. డాక్టర్ సుజిత్ పాల్ ఈ పుస్తకాన్ని రాశారు. నిజమైన నాయకత్వమంటే పదవులు, అధికారం కాదని సహానుభూతి, కష్టమైన పరిస్థితుల్లో మంచి నిర్ణయాలనే ఆలోచనలు ఉండాలని, నిత్యం నమ్మకాన్ని నిలబెట్టుకోవాలనే ఉద్దేశంతో పుస్తకాన్ని రాసినట్లు ఆయన తెలిపారు. తన జీవితంలో ఎదురైన అనుభవాలు కష్టాలను పొందుపరిచినట్లు తెలియజేశారు.


రచయిత డాక్టర్ సుజిత్‌పాల్

క్యాన్సర్ రోగుల కోసం సంగీతం

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: క్యాన్సర్ రోగులు నిత్యం వైద్య చికిత్సలో నిమగ్నమై ఉంటారని.. అలాంటి వారి మానసిక వికాసం కోసం నగరంలోని బీజీఎస్ ఆసుపత్రి, ఫోర్టిస్ హెల్త్‌కేర్ సంయుక్తంగా ది హీలింగ్ సింఫనీ కార్యక్రమాన్ని శనివారం రాత్రి నిర్వహించాయి. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం-2026 భాగంగా ప్రముఖ కన్నడ సంగీత కళాకారులతో కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. క్యాన్సర్ రోగులకు మానసిక ఉల్లాసం కోసం, వ్యాధి నియంత్రణ కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకుడు రవిబాగలి తెలిపారు. చికిత్సతో పాటు సంగీతం రోగులకు అవసరమన్నారు. కార్యక్రమంలో వైద్యులు రాజేష్, మాతంగి, సింధు, ధర్మ, కిరణ్, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రముఖ క్యాన్సర్ వైద్య నిపుణులు

జ్యోతిషుడిపై పోక్సో కేసు నమోదు

బెంగళూరు(యలహంక),న్యూస్‌టుడే: వసంత్ నాయక్ హత్య కేసుకు సంబంధించి అరెస్టైయిన జ్యోతిషుడు కమలాకర్ భట్‌కు వ్యతిరేకంగా శివమొగ్గ జిల్లా సిద్ధాపుర పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. సిద్ధాపుర వసంత్ నాయక్ హత్య కేసులో నిందితుడు మూడో ముద్దాయి. తనను లైంగిక వేధింపులకు గురి చేశారని మహేశ్ నాయక్ కుమార్తె స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు ఆధారంగా నిందితుడికి వ్యతిరేకంగా పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

మత్తెమళె హెయ్యుత్తిదె పాటలు విడుదల

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: శ్రీ గవిరంగనాథ స్వామి పిక్చర్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్న 'మత్తెమళె హెయ్యుత్తిదె' చిత్రం పాటలను విడుదల చేశారు. 1980లో రెండవేల సంవత్సరాల్లో జరిగిన వేర్వేరు సంఘటనలు ఆధారంగా చిత్రాన్ని నిర్మిస్తున్నామని, ఇది ముమ్మాటికి ప్రేమ కథా చిత్రమని దర్శకుడు పరమ్ గుబ్బి తెలిపారు. శృంగేరి, హొరనాడు, కుప్ప, హరిహరపుర, ఆగుంబె తదితర ప్రాంతాల్లో పలు దృశ్యాలను చిత్రీకరించారు. జి.లిఖిత్, జయవర్ధన్, సులక్షణ, భూమికగౌడ, చంద్రకళ రెడ్డి, ప్రకాశ్‌మూర్తి, స్వర్ణ, శృతి, దినమణి, కావ్య తదితరులు నటిస్తున్నారు.

మత్తెమళె హెయ్యుత్తిదె చిత్రం పాటలు విడుదల కార్యక్రమంలో లిఖిత్, జయవర్ధన్, సులక్షణ, భూమికగౌడ

నియంతృత్వానికి వ్యతిరేకంగా పోరాడాం

కాకతీయ కమ్మసేవా సమితి ఆత్మీయ సమావేశంలో నేతల ఉద్ఘాటన

దీపం వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఏడీజీపీ మువ్వా చంద్రశేఖర్, ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, రాయపాటి శైలజ, కబడ్డీబాబు, రామాంజేయ, యలమంచి వాసుదేవరావు, రామారావు గంగవరపు

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: నియంతృత్వ పరిపాలనకు వ్యతిరేకంగా పోరాటం చేసి మార్పు తేవడం కష్టతరమని రాష్ట్ర ఏడీజీపీ మువ్వా చంద్రశేఖర్ పేర్కొన్నారు. దీనిపై పోరాడి అనేక కష్టాలు పడిన నేతలను ఇక్కడికి ఆహ్వానించడం హర్షణీయమన్నారు. ఆదివారం ఇక్కడ బెళ్లందూరులోని న్యూహారిజన్ ఇంజినీరింగ్ కళాశాల ఆడిటోరియంలో కాకతీయ కమ్మ సేవా సమితి వ్యవస్థాపకుడు రామారావు గంగవరపు నేతృత్వంలో జరిగిన ఆత్మీయ సమావేశాన్ని ఆయన ప్రారంభించారు. పలుకుబడి కలిగిన వ్యక్తులను ఎదుర్కొనే దాని కన్నా నియంతృత్వ ప్రభుత్వాన్ని ఎదుర్కోవడం కష్టమన్నారు. దాడులు, వేధింపులు తప్పుడు కేసులు తదితర వాటిని ఎదుర్కొని ఈ పరిపాలన తొలగించి ఉత్తమ పరిపాలన తెచ్చారని తెలిపారు. అలాంటి వారిని అభినందించాల్సిన అవసరం ఉందన్నారు. సమాజంలో దుర్మార్గులు, మోసగాళ్లను దూరంగా ఉంచాలని, లేకపోతే సంస్థలకు చెడ్డపేరు వస్తుందన్నారు. కాకతీయ కమ్మ సేవా సమితి అంటే తన బాగా ఇష్టమని సభ్యుల్లో సేవా మనోభావం ఉందన్నారు. దాన్ని చివరి వరకు కొనసాగించాలని సూచించారు. సమాజంలో సైబర్ నేరాలు అధికమవుతున్నాయని వాటి పట్ల ప్రజలు నిత్యం అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. డబ్బులు కష్టపడకుండా ఊరికే రావన్న విషయాన్ని అర్థం చేసుకుంటే సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడబోరన్నారు. ఓటరు జాబితా పునఃసమీక్ష కార్యక్రమం ప్రారంభమవుతుందని ఇక్కడ నివసించే కమ్మ కుటుంబాల్లో కనీసం ఒక ఓటు అయిన బెంగళూరు నగరంలో ఉండే విధంగా చూసుకోవాలన్నారు. కర్ణాటకలో నివసిస్తున్నందున కన్నడ భాష నేర్చుకోవాలని పిలుపునిచ్చారు. దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో తెదేపాకు పూర్వ వైభవం తెచ్చేందుకు బెంగళూరు నగరంలో నివసిస్తున్న టెకీలు శ్రమించారని అభినందించారు. ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ అధ్యక్షురాలు రాయపాటి శైలజ మాట్లాడుతూ కష్టపడితే జీవితంలో పైకి వస్తారన్నారు. బెంగళూరు నగరంలో ఉన్న టెకీలు ఆంధ్రప్రదేశ్‌లో తెదేపా అధికారంలోకి వచ్చేందుకు నిరంతరం కష్టపడ్డారని తెలిపారు. కాంగ్రెస్ నేత ప్రసాద్‌బాబు (కబడ్డీబాబు) మాట్లాడుతూ రాష్ట్రంలో కమ్మ అభివృద్ధి మండలి ఏర్పాటుకు ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ సూచనప్రాయంగా అంగీకరించారని తెలిపారు. ఉపాధి కోసం నగరానికి వచ్చే కమ్మ యువతకు తమ సంస్థ అండగా ఉంటుందని కాకతీయ కమ్మ సేవాసమితి వ్యవస్థాపకుడు రామారావు గంగవరపు తెలిపారు. కార్యక్రమంలో ప్రముఖులు యలమంచి వాసుదేవరావు, హెచ్.రామాంజనేయ, గారపాటి రామకృష్ణ, సాధుదిలీప్, అనుమోలు బాలమురళీ కృష్ణ, వెలమటి రేణుక, గడ్డపాటి శ్రీధర్, చంద్రయ్య నాయుడు, అట్లూరి శ్రీరామదాసు, సమితి పదాధికారులు కార్తిక్ ఇమడలపాటి, వేణు మోతుకూరి, శ్రీనివాస్ ముమ్మనేని, సుధీర్ కోనేరు, చైతన్య మాదల, ముప్పిరి టెండుల్కర్, పరమేష్ వున్నం, మణినాయుడు పాల్గొన్నారు.

కార్యక్రమానికి హాజరైన తెలుగు ప్రజలు

ఉత్తర కర్ణాటకలో కనకరాజ చిత్రీకరణ

కనకరాజ చిత్రంలో అనూప్ రేవణ్ణ, నిమిష

కుటుంబ కథా చిత్రం 'కనకరాజ' చిత్రం చిత్రీకరణ జోరుగా సాగుతోంది. సుక్మితి చిత్రాలయ బ్యానర్‌పై ఆర్.సనత్‌కుమార్ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. బెళగావి, గోకాక్ తదితర ప్రాంతాల్లో 15 రోజులుగా జోరుగా చిత్రీకరణ సాగుతుందని దర్శకుడు ఆర్.రవీంద్ర తెలిపారు. అనూప్ రేవణ్ణ, మంజునాథ్ అరసు, నిమిష, శ్రీనాథ్, రామకృష్ణ, పద్మావాసంతి, గిరిశ్‌జత్తి, యమునాశ్రీనిధి, మిమిక్రి గోపి తదితరులు నటిస్తున్నారు.

'త్రికారం' టీజర్ వచ్చేసింది

సద్గురు సినీ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్న 'త్రికారం' చిత్రం టీజర్‌ను ఇటీవల విడుదల చేశారు. టీజర్‌కు ప్రేక్షకుల నుంచి ఉత్తమ స్పందన వచ్చిదని దర్శకుడు అజ్జంపుర దిలీప్ కుమార్ తెలిపారు. పోరాటానికి శివుడు ప్రతీక దాన్ని చుట్టు కథ తిరుగుతుందన్నారు. 'సీదా నింతరూ లోక యాకె ఉల్టకాణ్తదె' పాటకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వస్తోందని తెలియజేశారు. పాటలకు వివేక్ చక్రవర్తి సంగీతం అందిస్తున్నారు. హర్షవర్ధన్, నిశ్చిత శెట్టి, నాగేంద్ర అరసు, బలరాజ వాడి, మంజు పావగడ తదితరులు నటిస్తున్నారు.

త్రికారం చిత్ర బృందం

ఐసీయూ చిత్రంలో రిషిరామన్

'ఐసీయూ' షురూ

బుల్లితెర నటులతో నిర్మిస్తున్న 'ఐసీయూ' చిత్రం టీజర్ విడుదలైన కొద్ది గంటల్లో ప్రేక్షకులను ఆకట్టుకుంది. రంగభూమి కళాకారులు కూడా నటిస్తున్నారు. పుట్టుక, బాల్యం, యవ్వనం, ప్రేమ, పెళ్లి, తదితర అంశాలతో పాటు దిగువ మధ్యతరగతి కుటుంబం ఎదుర్కొంటున్న సమస్యలను కళ్లకు కట్టినట్లు తెరపై చూపించేందుకు ప్రయత్నిస్తున్నట్లు దర్శకుడు రిషిరామన్ తెలిపారు. సంక్షోభంలో పేద దిగువ మధ్యతరగతి కుటుంబాలు కొట్టుమిట్టాడే పరిస్థితులను తెర ముందు ఉంచుతున్నట్లు తెలియజేశారు. రిషి రమన్, విష్ణురామన్ తదితరులు నటిస్తుండగా జుబిన్‌పాల్ సంగీతం అందిస్తున్నారు.

EENADU Classifieds

JOBS

MARKETING/ SALES

Anand Masale Require Sales & Marketing Manager, Marketing Executives. Contact: 9849655105, 9848053144 Email: anandmasalaappltd@gmail.com.

SECURITY GUARDS

Gunman (Ex. Servicemen) Urgently Wanted for Jewellery Mall at Ballari City. Gun & Gun Licence, PVC also. must 12 hours Duty. Rs. 43,000/-+PF+ESI. Age below 55 Years. Ph.: 7893197794, 8297910885.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలను ఇచ్చుటకు ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు.

బళ్ళారి : 9121167525

బెంగుళూరు : 9121167527

ప్రకటనలపై జి.ఎస్.టి. 5% వర్తించబడును

అట్టహాసంగా దుర్గాంబికా జాతర

హొసపేటె, న్యూస్‌టుడే: జవళి నగరి దావణగెరెలో జరిగిన దుర్గాంబికా జాతర అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పొట్టేళ్ల పందెం ఆద్యంతం ఉత్కంఠగా సాగింది.

పందెంలో ఢీకొంటున్న పొట్టేళ్లు

రెండేళ్లకోసారి జరిగే అమ్మవారి జాతర నేపథ్యంలో రాష్ట్ర స్థాయిలో పొట్టేళ్ల పందెం ఏర్పాటు చేశారు. పొరుగు జిల్లాలైన గదగ్, బాగలకోటె, శివమొగ్గ, చిత్రదుర్గ, చిక్కబళ్లాపుర హావేరి, ధార్వాడ్, బెళగావి జిల్లాలు, ఆంధ్ర నుంచి కూడా పొట్టేళ్లు వచ్చి పందెంలో పాల్గొన్నాయి. రెండు, నాలుగు, ఆరు, 8 పళ్లు ఇలా నాలుగు విభాగాల్లో పందేలు ఏర్పాటు చేశారు. సుమారు 700 పొట్టేళ్లు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. పందెంలో ఒకదానినొకటి నాలుగుసార్లు ఢీకొట్టిన తర్వాత ఏ పొట్టేలు తటస్థంగా నిలబడుతుందో గమనిస్తారు. బరి నుంచి బయటకు పరుగు తీస్తే అది ఓడినట్లు నిర్ధారిస్తారు. వాటిని పెంచినవారు హొన్నత్తమ్మ, కాళి, మల్లిక్ జలాల్, సుల్తాన్, అణ్ణాబాండ్, పవర్‌స్టార్ ఇలాంటి పేర్లతో వాటిని పిలుస్తారు.

చోరీ కేసును ఛేదించిన పోలీసులు

రూ.7.20 లక్షల విలువైన ఆభరణాలు, వస్తువుల స్వాధీనం

బళ్లారి, న్యూస్‌టుడే: నగరంలోని ఓ ఇంట్లో జరిగిన చోరీని గాంధీనగర్ పోలీసులు చాకచక్యంగా ఛేదించి బంగారు ఆభరణాలు, విలువైన వస్తువులు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ డాక్టర్ డి.సుమన్ పెన్నేకర్ తెలిపారు. స్థానిక గాంధీనగర పరిధిలోని ఓ ఇంట్లో 54 గ్రాముల బంగారు ఆభరణాలు, కీ ప్యాడ్ ఫోన్, ద్విచక్రవాహన దొంగతనం ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. సి.ఐ రవీంద్ర నేతృత్వంలో సిబ్బంది జయరామ్, నారాయణ రామదాసు, తిమ్మప్ప, మంజునాథ, విజయభాస్కర్, కళాలింగప్పలు బృందంగా ఏర్పడి పరారీలో ఉన్న ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి సంజీవయ్యనగర్‌కు చెందిన సోనపురెడ్డిని, పశ్చిమగోదావరి జిల్లా అచ్చుతాపురం పల్లవి వీధికి చెందిన చీపురపల్లి పూసిబాబులను అరెస్టు చేసి వారి నుంచి రూ.7,20,600 విలువ చేసే 54 గ్రాముల బంగారు ఆభరణాలు, తదితర వస్తువులు స్వాధీనం చేసుకొన్నారు. నిందితుల్ని న్యాయమూర్తి ఎదుట హాజరు పరచగా వారిని జైలుకు తరలించినట్లు తెలిపారు.

పోలీసులు స్వాధీనం చేసుకున్న నగదు, ద్విచక్ర వాహనం, చిత్రంలో సి.ఐ, సిబ్బంది

తంతికి చిక్కుకొని చిరుత మృతి

చెళ్లకెర(చిత్రదుర్గ),న్యూస్‌టుడే: దావణగెర జిల్లా నీలోగల్‌లో రంగనగౌడకు చెందిన వక్క తోట ప్రహరీకి అమర్చిన ఇనుప తీగలకు చిక్కుకొని చిరుత మృతి చెందిన ఘటన శనివారం రాత్రి జరిగింది. అటవీశాఖ అధికారులు ఆదివారం తెలిపిన వివరాల మేరకు. ఆహార వేటలో భాగంగా

సంచరిస్తున్న చిరుత వక్కతోటలోకి ప్రవేశించే ప్రయత్నంలో తంతుల మధ్యన చిక్కుకొని తీవ్రంగా గాయపడింది. విషయం తెలుసుకొని ఘటనా స్థలానికి చేరుకొనేసరికి అది మృతి చెందిందని అటవీ సంరక్షణ అధికారి రవీంద్ర కుమార్ తెలిపారు. కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టినట్లు తెలిపారు.

భర్త ఆత్మహత్య

బెంగళూరు(బాణసవాడి),న్యూస్‌టుడే: పరాయి పురుషులకు భార్య చరవాణి ద్వారా సందేశాలు పంపిస్తుందనే బాధతో బ్యాగదహళ్లి నివాసి మను (26) అనే వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శనివారం రాత్రి చిక్కమగళూరు గ్రామీణ పోలీసుఠాణా పరిధిలో జరిగింది. ఇతరులకు భార్య చరవాణి సందేశం పంపిస్తుందని గుర్తించిన అతడు భార్యతో గొడవ పడ్డాడు. అర్ధరాత్రి ఇంటి పక్కన ఉన్నచెట్టు కొమ్మకు తాడుతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

కసి.. కృషీ.. ఖుషీ

జాతీయ ఖోఖో పోటీల్లో రాణించిన బాలిక

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే: పరుగులో పాల్గొనడమంటే ఆసక్తి పెంచుకున్న భైరీదేవరకొప్పకు చెందిన శ్రీజగద్గురు సదాశివానంద ఆంగ్ల పాఠశాలకు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థిని ఖుషీ రాజేంద్ర బోస్లే హరియాణా కురుక్షేత్రలో జరిగిన 35వ సబ్‌జూనియర్ జాతీయ ఖోఖో పోటీలో కర్ణాటక తరఫున పాల్గొని సత్తా చాటింది. భారత ఖోఖో సమాఖ్య నిర్వహించిన జాతీయ పోటీలో కర్ణాటక మూడోస్థానం పొందింది. ఇటీవలే జరిగిన ఖోఖో పోటీల్లో హుబ్లీ తరఫున జాతీయ జట్టులో పాల్గొన్న ఏకైక క్రీడాకారిణి కావడం విశేషం. జాతీయ పోటీలకుగాను బెంగళూరులో ఎంపిక ట్రయల్స్‌ను మూడు దశలుగా నిర్వహించారు. దాదాపుగా 400మందికి పాల్గొన్న ఈ ట్రయల్స్‌లో

ఖుషీ రాజేంద్ర బోస్లే

చివరి దశలో 15 మంది బాలికలు ఎన్నికయ్యారు. ఇందులో ఖుషీ కూడా ఒకరు. జాతీయ పోటీల్లో 30కిపైగా జట్లు బరిలో దిగాయి. కర్ణాటక క్రీడాకారిణుల పోరాట ఫలితంగా మూడోస్థానాన్ని దక్కించుకొంది. కోచ్ వీరేశ్‌మాయకార, భైరీదేవరకొప్పకు చెందిన శ్రీజగద్గురు సదాశివానంద ఆంగ్ల పాఠశాల పాలక మండలి, పోషకులు ఇచ్చిన ప్రోత్సాహంతో ఖుషీ జాతీయ స్థాయి పోటీలో పాల్గొనే అవకాశాన్ని పొందింది. బాలిక తండ్రి రాజేంద్ర బోస్లే మాట్లాడుతూ మూడేళ్ల నుంచి ఖోఖోలో శిక్షణ పొందుతున్న ఖుషీ పాఠశాల, తాలూకా, జోనల్, జిల్లా స్థాయి పోటీల్లో చక్కని ప్రదర్శన ఇచ్చింది. విద్యతో పాటు ఆటలో కూడా కఠోరంగా శ్రమిస్తోందన్నారు. భవిష్యత్తులో భారత జట్టు తరఫున పాల్గొనాలని లక్ష్యంగా పెట్టుకొందని చెప్పారు. వైద్యురాలు కావాలని కల కంటున్న ఖుషీ సాధనకు పాఠశాల ముఖ్యోపాధ్యాయులు ఎ.ఎం. లోబో తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.

జాతీయ పోటీలో పాల్గొన్న కర్ణాటక జట్టు మిత్రులతో ఖుషీ రాజేంద్ర బోస్లే

(c) eenadu

బెంగళూరు

● బెంగళూరు ● కోలారు ● మైసూరు ● హోసూరు ● చిక్కబళ్లాపుర ● తుమకూరు

జస్టిస్ విశ్వజిత్‌శెట్టితో ఆలయ అధికారులు

ముక్కంటి సేవలో కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే : కర్ణాటక రాష్ట్ర హైకోర్టు న్యాయ మూర్తి జస్టిస్ విశ్వజిత్‌శెట్టి ఆదివారం వాయులింగేశ్వరుని దర్శించుకున్నారు. దర్శనార్థం కుటుంబ సమేతంగా వచ్చిన ఆయనకు ఆలయ అధికారులు ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఆలయంలో స్వామి, అమ్మ వార్లను దర్శించుకున్న అనంతరం వేదాశీర్వాదంతో పాటు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రోటోకాల్ పీఆర్‌ఓ రవి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ధన్వంతరీ హోమం

బెంగళూరు (కెంగేరి), న్యూస్‌టుడే : కెంగేరి ఉపనగరంలోని వర ప్రద ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం ధన్వంతరి హోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రజల ఆరోగ్యం, ఆయుషు, దైహిక, మానసిక ఆరోగ్య సంరక్షణ కోసం దేవతా పూజల్లో ఒకటైన ధన్వంతరి హోమం చేయిస్తారు. 16వ వార్షిక వేడుకల నేపథ్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. పూజల్లో పాల్గొన్న భక్తులందరికి అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు.

వరప్రద ఆంజనేయస్వామి

హోసూరు కబుర్లు

ఘనంగా గర్భిణులకు సీమంతం

హోసూరు, న్యూస్‌టుడే : హోసూరు కార్పొరేషన్ టీవీఎస్ నగర్‌లో కార్పొరేటర్, ట్రాఫిక్ కమిటీ ఛైర్మన్ చెన్నీరప్ప నేతృత్వంలో వంద మంది గర్భిణులకు ఘనంగా సీమంతం నిర్వహించారు. హోసూరు ఎమ్మెల్యే వై. ప్రకాశ్, ఉప మేయర్ సి.ఆనంద య్య ముఖ్య అతిథులుగా హాజరై మహిళలను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా చెన్నీరప్ప, డీఎంకే వార్డు కార్యదర్శి సయ్యద్ అజ్మత్‌లో పోషకాహారంతో కూడిన ఆహార కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమశాఖ అధికారులు, డీఎంకే నాయకులు సుకుమార్, వార్డు ప్రముఖులు పాల్గొన్నారు.

మహిళలను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్

విశ్వశాంతికోసం ప్రత్యేక హోమాలు

హోసూరు, న్యూస్‌టుడే : హోసూరు కమ్మరిపేటలోని ఆదిశంకర శృంగేరి ఆలయంలో ఆలయ కమిటీ ప్రతినిధులు ఆదివారం విశ్వ శాంతి కోసం ప్రత్యేక హోమాలను నిర్వహించారు. ఆలయాన్ని విద్యుత్తు దీపాలతో తీర్చిదిద్దారు. దేవతలను అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు కలశాలతో మేళ తాళాల నడుమ ఉత్సవమూర్తులను ప్రధాన వీధుల్లో ఊరేగించారు. కోలారు, బెంగళూరు, ఆనేకల్, డెంకణీకోట, మాలూరు, తదితర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

హోమం చేస్తున్న పురోహితులు, మహిళా భక్తులు

రథోత్సవానికి పాలకంబం ఏర్పాటు

డెంకణీకోట, న్యూస్‌టుడే : డెంకణీకోట తేరుపేటలోని లక్ష్మి నరసింహస్వామి రథోత్సవం మార్చి 3న నిర్వహించనున్న సందర్భంగా నిర్వాహకులు ఆదివారం పాలకంబం ఏర్పాటు చేశారు. స్వామికి అభిషేకం, విశేష అలంకరణ, పూజలు చేసి పాలకంబానికి పూజించారు. జాతరలో భాగంగా మార్చి 2న గజేంద్రమోక్షం, రేణుకా యల్లమ్మ నాటకం, 4వ తేదీ పల్లకి ఉత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

పాలకంబం నాటుతున్న సభ్యులు

తారురోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

తళి (డెంకణీకోట) న్యూస్‌టుడే : తళి శివారు గుమ్మళాపురం-తిమ్మాపురం, కుసిగెరె-బసవగిరి రోడ్డు, మారుపల్లి-బెట్టపల్లి తారు రోడ్డు నిర్మాణాలకు ఆదివారం తళి ఎమ్మెల్యే రామచంద్రన్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటున్నానన్నారు. దేశాభివృద్ధికి విద్య ముఖ్యమని, ప్రతి ఒక్కరూ చదువుకోవాలన్నారు. అందుకోసం నియోజకవర్గంలో నాలుగు కళాశాలను మంజూరు చేయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కౌన్సిలర్ కుమార్, మాజీ యూనియన్ కౌన్సిలర్లు ప్రశాంత్, జగదీశ్, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు

భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే రామచంద్రన్

టీఎంకే పార్టీని బలోపేతం చేస్తాం

శూలగిరి, (బేరికె), న్యూస్‌టుడే : శూలగిరి తాలూకా ప్రజల సహకారంతో టీవీకే పార్టీని బలోపేతం చేసి కంచుకోటగా మార్చుతామని శూలగిరి యూనియన్ మాజీ ఛైర్మన్లు లావణ్య, హేమ్‌నాథ్‌మధు పేర్కొన్నారు. అన్నా డీఎంకేలో క్రియాశీలకంగా వ్యవహరించిన వీరు పార్టీని వీడి ఇటీవల టీవీకే పార్టీలో చేరారు. మాజీ మంత్రి సెంగోట్టయన్ ఆధ్వర్యంలో హేమ్‌నాథ్‌మధు, భార్య లావణ్య చెన్నైలో తన స్నేహితులతో కలిసి విజయ్ సమక్షంలో టీవీకే పార్టీలో చేరారు. శూలగిరి తాలూకాలో రాజకీయంగా మంచి పట్టున్న నాయకులనే చెప్పవచ్చు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు అండగా ఉంటూ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు.

టీవీకే అధినేత విజయ్‌తో లావణ్య, హేమ్‌నాథ్‌మధు

హుబ్లీ కేఎస్‌సీఏ మైదానానికి సునీల్‌జోషి పేరు

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే : హుబ్లీ రాజానగర్‌లోని కర్ణాటక క్రికెట్ సంఘం (కేఎస్‌సీఏ) మైదానం పెవిలియన్‌కు కన్నడిగుడు, మాజీ క్రికెటర్ 'సునీల్‌జోషి' నామకరణం చేయనున్నట్లు కేఎస్‌సీఏ ప్రకటించింది. ఈనెల 24న కర్ణాటక, జమ్ముకాశ్మీర్ జట్ల మధ్య జరిగే ఫైనల్ పోటీ సందర్భంగా నామకరణం చేయనున్నారు. కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషి, కేఎస్‌సీఏ అధ్యక్షుడు వెంకటేశ్‌ప్రసాద్, మాజీ సీఎం జగదీశ్‌శెట్టర్, ధారవాడ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సంతోష్‌లాడ్, ప్రముఖులు పాల్గొననున్నారు.

సునీల్‌జోషి

డయాలసిస్ కేంద్రం ప్రారంభం

బెంగళూరు (కెంగేరి), న్యూస్‌టుడే : రాజాజీనగర విధానసభా క్షేత్రం దయానందనగరలోని అంబేడ్కర్ మెడికల్ కేర్ సెంటర్‌లో ఆదివారం నెప్రో ప్లస్ ఉచిత డయాలసిస్ కేంద్రాన్ని ఎమ్మెల్యే ఎస్.సురేశ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ సహకారంతో ఉచిత దంత, కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రముఖులు ఎం.మునిరాజు, శకీల మునిరాజు, ఎం.ఎస్.సంజయ్‌కుమార్, రంగణ్ణ, రాఘవేంద్రరావు, గిరీశ్‌గౌడ, కామధేను సురేశ్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

విజ్ఞానం, వినోద సమ్మిళిత ఉద్యానవనం

వన్యజీవుల వ్యాఖ్యాన కేంద్రం ముఖద్వారం

బెంగళూరు (కెంగేరి), న్యూస్‌టుడే : శివమొగ్గలోని మహాత్మాగాంధీ ఉద్యానవనం విద్యార్థుల జ్ఞానార్జనకు అనువుగా వన్యజంతువుల వ్యాఖ్యాన కేంద్రం, విజ్ఞాన ఉద్యానవనంగా రూపాంతరం చెందింది. నగరం నడిబొడ్డున వృథాగా ఉన్న ఈ ఉద్యానవనాన్ని స్మార్ట్ సిటీ వన్యజీవుల వ్యాఖ్యాన కేంద్రంగా నిర్మించారు. బాలల జ్ఞానార్జన కోసం కట్టడ నిర్మాణం, లోపుల ఏర్పాట్లు, వస్తువుల కోసం రూ.5.5 కోట్లు వ్యయం చేశారు. కేంద్రంలోని వేర్వేరు గదుల్లో ఉన్న చిత్రాలు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. పులిపిల్లలతో ఉన్న చిత్రం స్వాగతం పలుకుతుంది. శివమొగ్గ జిల్లా సంపూర్ణ చిత్రాలను ఈ కేంద్రంలో వీక్షించవచ్చు. పశ్చిమ కనుమల అటవీ ప్రాంతం, అరుదైన జంతువులు, అడవి మృగాలు, నదుల సమాచారం పొందుపరిచారు. మలెనాడులో పుట్టిన తుంగ భద్రానది, ఉపనదులు, కృష్ణ నది చేరుకోవడం వంటి వివరాలను ఈ కేంద్రంలో చూడవచ్చు. మరో గదిలో జానపద కళ, సంస్కృతి వాటి పరిచయాలు, కర్ణాటకను పరిపాలించిన రాజులు, కానుకలు, రాజవంశస్తుల సమాచారం అందుబాటులో ఉంచారు. దట్టమైన అరణ్యం చూసిన వాతావరణం కనిపిస్తుంది. రాత్రి వేళలో పశ్చిమ కనుమల్లో అడవి వాతావరణాన్ని రూపొందించారు. మూడో గదిలో కాళింగసర్పం, అడవిదున్నలు, కొండచిలువు, జింకలు, గుడ్లగూబ, అడవిపంది, గబ్బిలాలు చెట్ల మధ్యలో కనిపించేలా చిత్రీకరించారు. రాత్రి అడవిలో వినిపించే పక్షుల అరుపులు చూపరులకు మరింత ఆసక్తికరంగా ఉంటుంది. నాలుగో గదిలో ఆధునిక సాంకేతిక గురించి నీటి ఉత్పాదన, వాతావరణంలో ఆక్సిజన్, భూమి ఉష్ణోగ్రత వివరాలను తెలియచేసే ఏర్పాట్లు కల్పించారు. చివరి గదిలో సీతాకోకచిలుకల ఎగిరే చిత్రాలు, వాటర్ ఫిల్టర్‌తో నీటిని తిరిగి ఎలా వినియోగించాలనే విధానం తెలియజేస్తుంది. బాలలతో సహా పెద్దలకు కూడా వినూత్న అనుభూతి కల్గిస్తోంది. ఈ సందర్భంగా స్మార్ట్ సిటీ సహాయక అధికారి హొన్నకుమార్ మాట్లాడుతూ ఈ కేంద్రం బాలల కోసం నిర్మించారని, ఐదు గదుల్లో పశ్చిమ కనుమల జీవ వైవిధ్యం, నదులు పరిచయం, జంతువుల నమూనాలతో పాటు, ఎరుపు రంగు మూతి ఉన్న ఉడుత, వివిధ జాతుల పక్షులు, మలేనాడు ఇతిహాసం పారంపర్యాలను, కర్ణాటక ఇతిహాసాన్ని ఈ కేంద్రంలో చూడవచ్చని వివరించారు.

చిరుతపులి

ఉడుత

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి సుధాకర్, ఎమ్మెల్సీ శ్రీనివాస్

విద్యార్థినుల వసతిగృహం ప్రారంభం

చిత్రదుర్గ, న్యూస్‌టుడే : గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థినులకు ఆధునిక సదుపాయాలతో వసతి గృహాలను నిర్మిస్తున్నట్లు జిల్లా బాధ్యమంత్రి డి.సుధాకర్ పేర్కొన్నారు. ఆదివారం తాలూకాలోని హరియబ్బే గ్రామంలో రూ.3 కోట్ల వ్యయంతో నిర్మించిన వసతిగృహాన్ని మంత్రి ప్రారంభించి మాట్లాడారు. వసతి గృహాల్లో సోలార్ వేడి నీటి సదుపాయం, ప్రత్యేక తరగతుల నిర్వహణ, కంప్యూటర్ శిక్షణ తదితర అంశాలకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

తెలుగు పాస్టర్లు ఐక్యతతో సేవలందించాలి

బెంగళూరు (పీణ్యాదాసరహళ్లి), న్యూస్‌టుడే : ప్రస్తుత పరిస్థితుల్లో తెలుగు పాస్టర్లు, నాయకులు ఐక్యతతో సమాజసేవ చేయాలని తెలుగు చర్చి సీనియర్ పాస్టర్ డాక్టర్ జె.డి.మోసెస్ పేర్కొన్నారు. భైరవేశ్వరనగర అందనప్ప లేఅవుట్ న్యూజెరూసలేం ప్రార్థనాలయంలో కర్ణాటక తెలుగు క్రిస్టియన్ మినిస్ట్రీస్ నేతృత్వంలో పాస్టర్లు, నాయకుల సమావేశం నిర్వహించారు. క్రీస్తు చూపిన ప్రేమ, కరుణ, దయ క్షమాగుణం కలిగి ఉండాలని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో ప్రముఖులు బెంజమెన్, ప్రేమానందం, సాల్మన్, ఆనందరావు, దావీద్, వై.దాసు, ఎ.జి జయానందం, కె.ఎస్. కిషోర్‌కుమార్, ఫాస్టర్లు, తెలుగు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న తెలుగు పాస్టర్లు

ఉత్తమ పాదచారి మార్గాలకు ప్రాధాన్యం

ప్రజలతో మంత్రి కృష్ణబైరేగౌడ, కమిషనర్ సునీల్‌కుమార్ తదితరులు

బెంగళూరు (యలహంక), న్యూస్‌టుడే : ప్రజలు స్వేచ్ఛగా సంచరించే విధంగా పాదచారి మార్గాలు ఉండాలనే ఉద్దేశంతో ఆదివారం ఇక్కడ వాక్‌విత్ కోడిగేహళ్లి ఫుట్‌పాత్ కార్యక్రమాన్ని రెవెన్యూశాఖ మంత్రి కృష్ణబైరేగౌడ ప్రారంభించారు. స్థానిక ప్రజలతో కలిసి ఆయన ఆరు కిలోమీటర్ల పాదచారిమార్గంపై నడిచారు. పాదచారి ఆక్రమణలు తొలగించడానికి ప్రాధాన్యమివ్వాలని, ప్రజలు సంచరించేందుకు పాదచారిమార్గాలను నిర్మించినట్లు గుర్తు చేశారు. ఉత్తమ పాదచారిమార్గం ఉంటే ప్రజలు ప్రమాదాలకు గురికారని తెలిపారు. ఉత్తమ పాదచారి మార్గం కోసం ప్రజలు సహకరించాలని కోరారు. బెంగళూరు ఉత్తర నగర పాలికె కమిషనర్ సునీల్ కుమార్, రెండు వందల మంది ప్రజలు ఈ మార్గంపై నడిచారు.

పరిసరాల సంరక్షణకు సైక్లింగ్

బెంగళూరు (బాణసవాడి): పరిసరాల సంరక్షణ కోసం సైకిలిస్టులు ఆదివారం ఇక్కడ కబ్బన్‌పార్కు ఉద్యానవనంలో సైక్లింగ్ చేపట్టారు. వివిధ ప్రాంతాలకు చెందిన యువత తమ సైకిళ్లతో ఉద్యానవనానికి వచ్చారు. ఉద్యానవనం నుంచి బయలుదేరి పది కిలోమీటర్ల సంచరించి మళ్లీ ఇక్కడకే వచ్చారు. పరిసరాల సంరక్షణ కోసం సైకిల్ వినియోగం ఉత్తమం. వాయుమాలిన్యం నియంత్రణతో పాటు పరిసర మాలిన్యం అడ్డుకట్టు వేసేందుకు సైకిల్ ప్రధాన ఆయుధమని నిర్వాహకులు తెలిపారు. సైకిల్ తొక్కితే ఆరోగ్యంతో పాటు ఇంధనం ఆదా అవుతుందని తద్వారా డబ్బులు మిగులుతాయన్నారు. ఉద్యోగులు, విద్యార్థులు సైకిల్ ఉపయోగించేందుకు ప్రయత్నించాలని సూచించారు.

కబ్బన్‌పార్కు ఉద్యానవనం ముందు సైకిలిస్టులు

వెంకట్రామయ్యను సత్కరిస్తున్న అభిమానులు

భాజపా రాష్ట్ర కమిటి సభ్యుడిగా వెంకట్రామయ్య

పావగడ, న్యూస్‌టుడే : పట్టణ ప్రముఖ వైద్యుడు జి.వెంకట్రామయ్య భాజపా రాష్ట్ర కార్యనిర్వాహక కమిటీ సభ్యుడిగా ఎంపికయ్యారు. విద్య, వైద్య రంగాలతో పాటు సామాజిక సేవల్లో నిరంతరం పాల్గొనడంతో పాటు భాజపాలో చాలా ఏళ్లుగా చురుగ్గా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా స్థానిక భాజపా మండల నాయకులు అభిమానులు, స్వామి వివేకానంద కళాశాల సిబ్బంది వెంకట్రామయ్యను పూలమాలలతో సత్కరించి అభినందనలు తెలిపారు.

ఉచిత ఆరోగ్య శిబిరానికి విశేష స్పందన

పావగడ, న్యూస్‌టుడే : తాలూకాలోని వై.ఎన్.హొసకోట గ్రామంలో బెంగళూరుకు చెందిన మిత్ర మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఆర్.వి.పి. కళాశాలలో నిర్వహించిన ఉచిత ఆరోగ్య శిబిరానికి విశేష స్పందన లభించింది. అధ్యక్షత వహించి కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ఎన్.ఆర్.అశ్వత్థకుమార్ మాట్లాడుతూ నిరుపేద ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లడానికి వీలులేని పరిస్థితుల్లో ఇలాంటి ఉచిత వైద్య ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మాజీ మంత్రి వెంకటరమణప్ప, ఎమ్మెల్యే హెచ్.వి.వెంకటేశ్ మార్గదర్శనంలో నిర్వహిస్తున్న ఈ శిబిరంలో వృద్ధులు, పేదలు వైద్య చికిత్సలు చేయించుకున్నారన్నారు. కార్యక్రమంలో వై.ఎన్.హొసకోట గ్రామ పంచాయతీ అధ్యక్షుడు సోమన్న, నాయకులు శ్రీధర్ గుప్తా, శివానంద గుప్తా, హెచ్.ఎస్. రవీంద్రనాథ్, ఆర్వీపీ కళాశాల అధ్యాపకులు గోపాల్, రాజు, వైద్యులు భరత్‌రాజ్, కరుణ, రమేశ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

శిబిరాన్ని ప్రారంభిస్తున్న ముఖ్యులు

అలరించిన సంగీత కచేరీ

బెంగళూరు (సాంస్కృతికం), న్యూస్‌టుడే : నగరంలోని సంగీత సంస్థ ఉడుప ప్రతిష్ఠాన నిర్వహిస్తున్న సంగీతోత్సవాల్లో భాగంగా తాళవాద్య లయవిన్యాసం, ప్రముఖ విదుషిమణుల సంగీత కచేరీలు ఆహూతులను మంత్రముగ్ధుల్ని చేశాయి. మృదంగ వాద్యకళాకారుడు తిరువాయూరు భక్తవత్సలం, నవీన్ శర్మ(ఢోలక్), విజయ శ్యామరావ్ చౌహాన్(డోల్కి) నిర్వహించిన తాళవాద్య కచేరి లయ విన్యాసం ధ్వనులు పులకింపజేశాయి. విదుషిమణులు రంజని, గాయత్రి కర్ణాటక శాస్త్రీయ సంగీత యుగళ కచేరి ప్రేక్షకులను ఆకట్టుకుంది. విదుషి చారుమతిరఘురామన్ (వయొలిన్) విద్వాన్ కూచిభొట్ల సాయి గిరిధర్ (మృదంగం), వజ్జాపల్లి కృష్ణకుమార్ (ఘటం) వాద్య సహకారం కచేరీకి మరింత సొగసులను చేకూర్చాయి.

లయవాద్య కళాకారులకు సన్మానం

బి.నారాయణపురలో ఆక్రమణల తొలగింపు

రహదారి ఆక్రమణలను తొలగించే పనులను గ్రేటర్ బెంగళూరు ప్రాధికార (జీబీఏ) అధికారులు చేపట్టారు. బెంగళూరు తూర్పు నగర పాలికె పరిధిలో ఉన్న బి.నారాయణపుర రహదారిలో ఆక్రమణలను జేసీబీ యంత్రాలతో తొలగించారు. నిర్మించిన కాంపౌండ్‌ను కూల్చారు. ముందుగా సంబంధిత వ్యక్తులకు నోటీసులు ఇచ్చారు. గట్టి పోలీసు బందోబస్తు మధ్య జేసీబీ యంత్రాలతో నిర్మించిన ప్రహరి కూల్చివేశారు. ఈ సందర్భంగా పాలికె సంయుక్త కమిషనర్ డాక్టర్ లత మాట్లాడుతూ నిత్యం వాహన రద్దీ ఉండే రహదారి విస్తరణ కోసం ఆక్రమణలను తొలగిస్తున్నామని తెలిపారు. ప్రజావసరాలకు అనుగుణంగా రహదారి విస్తరణ పనులను పూర్తి స్థాయిలో చేపడుతున్నట్లు వెల్లడించారు. **- న్యూస్‌టుడే, బెంగళూరు (బాణసవాడి).**

రాయచూరు కమ్మ సంఘానికి నూతన సారధి

రాయచూరు, న్యూస్‌టుడే : రాయచూరు తాలూకా కమ్మవారి సంఘానికి నూతన అధ్యక్షుడిగా బి.వెంకటేశ్వరరావు (కొండయ్య) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మూడేళ్లు (2026-2029) వరకు పదవిలో కొనసాగుతారు. కొత్త అధ్యక్షుడిని ఎన్నుకునేందుకు ఆదివారం స్థానిక ఈదల మాణిక్యమ్మ వసతి పాఠశాలలో సర్వసభ్య సమావేశం జరిగింది. సభ్యులంతా కొండయ్య పేరును మాత్రమే ప్రతిపాదించడంలో పోటీ లేకుండా ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యుడి పదవిని నిర్వహించకనే నేరుగా అధ్యక్షుడై రికార్డు సాధించారు. ప్రస్తుత అధ్యక్షుడు బూరుగుపల్లి ప్రసాద్, ప్రముఖులు నెక్కింటి ఆదినారాయణ, రత్నమాల, వైట్ల రవి, మద్దిపాటి శ్రీనివాస్, గొడవర్తి శ్రీనివాస్ తదితరులు వెంకటేశ్వరావును అభినందించి సత్కరించారు.

బి.వెంకటేశ్వరరావు

త్వరలో నూతన కార్యవర్గం ఏర్పాటు

తనపై నమ్మకంతో ఎన్నుకున్న అందరికీ కొండయ్య ధన్యవాదాలు తెలిపారు. మాజీ అధ్యక్షులు, పెద్దలతో చర్చించి వీలైనంత త్వరగా కొత్త కార్యవర్గాన్ని ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. నూతన సమితి అధికారం చేపట్టాక సమస్యల అధ్యయనానికి, అభివృద్ధిపై సలహాలు స్వీకరణకు సమావేశం నిర్వహిస్తానని తెలిపారు. ఎల్లవేళల అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు.

న్యానప్పహళ్లి మైదానాన్ని అభివృద్ధి చేస్తాం

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే : బొమ్మనహళ్లి విధానసభా క్షేత్రం పరిధిలో ఉన్న న్యానప్పనహళ్లి మైదానాన్ని జాతీయస్థాయి మైదానంగా అభివృద్ధి చేస్తామని, ఇండోర్, ఈత కొలను సదుపాయాలు ఒకే చోట లభించేలా పథకాన్ని రూపొందించినట్లు ఎమ్మెల్యే సతీశ్‌రెడ్డి తెలిపారు. ఆదివారం న్యానప్పహళ్లిలో ఏర్పాటు చేసిన టెన్నిస్‌బాల్ క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఇక్కడ దశలవారీగా అన్ని ఏర్పాట్లు కల్పిస్తామన్నారు. యువకులు దురలవాట్లకు బలికాకుండా క్రీడలు, సంస్కృతి, సమాజసేవల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. నిర్వాహకుడు మంజునాథ మాట్లాడుతూ ఈ పోటీల్లో 16 జట్లు పాల్గొంటాయని, క్రీడలకు ప్రోత్సహించే బాటలో పోటీలను ఏర్పాటు చేశామన్నారు. విజేత జట్టుకు రూ.50 వేలు, రన్నర్‌అప్ జట్టుకు రూ.25 వేలతో పాటు జ్ఞాపికలు అందజేస్తామన్నారు.

వార్డుల్లో ఎల్‌ఈడీ దీపాల వెలుగులు

బెంగళూరు (కెంగేరి), న్యూస్‌టుడే : యశ్వంతపుర విధానసభా క్షేత్రం పరిధిలోని అన్ని వార్డుల్లో ఎల్‌ఈడీ విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్యే ఎస్.టి.సోమశేఖర్ తెలిపారు. కెంగెల్ హనుమంతయ్య వార్డులోని ఉద్యానవనం సమీపంలో దీపాల ఏర్పాటుకు సంబంధించిన పనులకు పూజలు చేసి ప్రారంభించారు. ఈ దీపాల ఏర్పాటు వల్ల చోరీలకు తావుండదని, పోలీసులకు అనుకూలంగా ఉంటుందన్నారు. భయం లేకుండా తిరగవచ్చన్నారు. కెంగల్ హనుమంతయ్య వార్డు అధ్యక్షుడు టి.ప్రభాకర్, చేతన్‌గౌడ తదితరులు పాల్గొన్నారు.

పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సోమశేఖర్, తదితరులు

మహిళల కళాశాలలో ఉద్యోగమేళా

బెంగళూరు (కెంగేరి), న్యూస్‌టుడే : మహారాణీ లక్ష్మీఅమ్మణ్ణి మహిళల కళాశాల, యూత్4 జాబ్స్, రోటరీక్లబ్ సహకారంతో ఆదివారం బెంగళూరు క్యాంపస్‌లో ఉద్యోగమేళా నిర్వహించారు. యాభై ఆరు కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు. వికలాంగులతో సహా 340 మంది ఉద్యోగార్థులు పాల్గొన్నారు. మేళాలో ఎంఎల్ఏసీ మేనేజింగ్ ట్రస్టీ కె.జైరాజ్, యూత్4 జాబ్స్ పాన్ ఇండియా లీడ్ మేనేజర్ శ్రీకాంత్, బెంగళూరు రోటరీ క్లబ్ అధ్యక్షుడు సుఖేన్ పద్మనాభ, సీఈవో మన్మతయ్యస్వామి పాల్గొన్నారు.

ప్రారంభ వేదికపై నిర్వాహకులు

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి

బెంగళూరు (పీణ్యాదాసరహళ్లి), న్యూస్‌టుడే : క్రీడల్లో విజయావకాశాలతో పాటు గెలుపోటములను సమానంగా స్వీకరించాలని విద్యాసమితి అధ్యక్షుడు కె.నాగభూషణం తెలిపారు. ఆదివారం అబ్బిగిరి క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన బ్యాటింగ్ చేసి ప్రారంభించారు. క్రీడాకారులు చక్కని ప్రతిభతో రాణించాలని, ప్రతి ఓటమి వెనుక విజయం ఉంటుందనే విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు నాగభూషణంను ఘనంగా సత్కరించారు.

నాగభూషణంను సత్కరిస్తున్న నిర్వాహకులు

కెనరా ఉత్సవాల ప్రారంభం

బెంగళూరు (బాణసవాడి), న్యూస్‌టుడే : మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించే ఉద్దేశంలో ఆదివారం జయమహల్ కన్వెన్షన్ హాల్లో కెనరా ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. బెస్కాం, ఆదిత్య ఇంప్యాక్ట్ సోలార్ సొల్యూషన్స్, కెనరాబ్యాంకు సంయుక్తంగా ప్రదర్శన నిర్వహించాయి. కేంద్ర ప్రభుత్వం రాయితీలో సౌరశక్తి ఉత్పత్తి కేంద్రాల ఏర్పాటుకు రుణాలను అందిస్తారు. కార్యక్రమంలో కెనరా బ్యాంకు ఫైనాన్షియల్ విభాగం అధికారి గీత, చీఫ్ జనరల్ మేనేజరు శంభులాల్, శిల్పా, సుధాపాండె తదితరులు హాజరయ్యారు. ప్రదర్శన సోమవారం ఉదయం 10గంటల నుంచి రాత్రి 8గంటల వరకు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు.

వేదికపై కెనరాబ్యాంకు, బెస్కాం సంస్థల ఉన్నతాధికారులు

(c) eenadu

బళ్లారి

● బళ్లారి ● రాయచూరు ● కొప్పళ ● విజయనగర ● చిత్రదుర్గ

‘ఎప్పుడు పడితే అప్పుడు మాట్లాడను’

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: రాష్ట్ర రాజకీయాలపై ఎప్పుడుపడితే అప్పుడు ఎక్కడ పడితే అక్కడ మాట్లాడబోనని, చర్చించబోనని ఇది బహిరంగంగా చర్చించే విషయం కాదని ఉప ముఖ్యమంత్రి డీకేశివకుమార్ స్పష్టం చేశారు. ఎవరి ముందు మాట్లాడాలో వారితోనే చర్చిస్తానన్నారు. ఆదివారం ఇక్కడ సదాశివనగరలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ దేశ ప్రయోజనాలు దృష్టిలో పెట్టుకుని అమెరికాతో చేసుకున్న ఒప్పందాలను ప్రశ్నిస్తున్నారని, అందులో తప్పు ఏమిటని ప్రశ్నించారు. సోమవారం చిక్కబళ్లాపుర, కోలారులో జరిగే మనరేగా బచావ్ సమావేశాలకు తాను ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కలిసి హాజరవుతానన్నారు.

గురువులను మరువకూడదు

మాన్వి, న్యూస్‌టుడే : ఎక్కడున్నా, ఏ స్థాయికి చేరుకున్నా విద్యాబుద్ధులు నేర్పిన గురువులు, తల్లిదండ్రులు, పుట్టిన ఊరును మర్చిపోకూడదని కె.ఇ.నరసింహ విద్యార్థులకు సూచించారు. స్థానిక నేతాజీ పీయూసీ ద్వితీయ విద్యార్థులకు ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వేదికపై కె.విజయలక్ష్మీ, కె.రాజారవివర్మ, డాక్టర్ కె.వినయ, ఆరీఫ్, చంద్రు, జాదవ్, రమేష్, వీరనగౌడ, నాగరాజ్, త్రివేణి, కావ్య తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న శిక్షణ సంస్థ నిర్వాహకులు

జూన్‌లోగా స్థానిక సమరం

గంగావళి- మంజగుణి వంతెనను ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకేశివకుమార్,

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: జూన్‌లోగా జిల్లా, తాలూకా పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తామని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య వెల్లడించారు. ఆదివారం ఇక్కడ కార్వార సమీపంలోని అంకోలా తాలూకా మంజగుణి వద్ద నిర్మించిన గంగావళి - మంజగుణి వంతెనను ఆయన ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోకర్ణ పట్టణ పంచాయతీని ఉన్నతీకరించే ప్రతిపాదనలు ఉన్నాయన్నారు. ఎన్నికలు వస్తున్నాయని, జనాభా లెక్కలు జరుగుతున్నాయని, కొత్తగా పట్టణ పంచాయతీల ఏర్పాటు సాధ్యం కాదని స్పష్టం చేశారు. హాలక్కి ఒక్కలిగరలను ఎస్టీ జాబితాలో చేర్పించే ప్రతిపాదన కేంద్రానికి పంపించామని, తిరస్కరించారని గుర్తు చేశారు. పునఃపరిశీలించి మరోసారి కేంద్రానికి ప్రతిపాదనలను పంపిస్తామన్నారు. మంజగుణి - గంగావళి వంతెన నిర్మించిన తరువాత అంకోలా, గోకర్ణ ప్రాంతాల ప్రజలు 18 కిలోమీటర్ల చుట్టూ తిరిగే పరిస్థితి ఇక ఉండబోదన్నారు. 2017లో తాను వంతెన పనులకు శంకుస్థాపన చేశానని, గత భాజపా ప్రభుత్వం పనులను పూర్తి చేయలేదని దుయ్యబట్టారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వంతెన నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రారంభించినట్లు వివరించారు. ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ మాట్లాడుతూ కరావళి ప్రాంతంలో పర్యాటక అభివృద్ధికి అనుకూలమవుతుందన్నారు. గోవా కన్నా కర్ణాటక కోస్తా తీరానికి పర్యాటకులు ఎక్కువ సంఖ్యలో వచ్చే విధంగా అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో మంత్రి మంకాళ వైద్య, శాసన సభ్యులు ఆర్‌వీదేశ్ పాండే, సతీశ్ సైల్, దినకర్ శెట్టి, భీమణ్ణనాయక్ తదితరులు పాల్గొన్నారు.

రహదారుల అభివృద్ధికి రూ.5,065 కోట్లు

బెంగళూరు(యశ్వంతపుర) : బెంగళూరు నగర రహదారుల అభివృద్ధికి రూ.5,065 కోట్లు వ్యయం చేస్తామని, ఏప్రిల్ కల్లా అన్ని రహదారులకు బ్లాక్ టాపింగ్, వైట్‌టాపింగ్ పనులు పూర్తి చేయాలని అధికారులు సూచించినట్లు ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ వెల్లడించారు. టెండర్లను ఆహ్వానించి మంత్రులు, శాసనసభ్యులు కోసం ఎదురు చూడకుండా పనులకు శంకుస్థాపన చేయాలని సూచించారు. ఇక్కడ ఆయన విలేకర్లతో మాట్లాడుతూ జీబీఏ నూతన చిహ్నాన్ని ఎంపిక చేశామని, దాన్ని చీఫ్ కమిషనర్ విడుదల చేస్తారన్నారు. అవుటర్ రింగ్ రోడ్డులో రూ.420 కోట్లు, 82 ప్యాకేజీల్లో వార్డు రహదారులకు రూ.వేయి కోట్లతో పనులు చేపడతామన్నారు. వర్షాలు ప్రారంభానికి ముందే పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మూడునెలల్లో రూ.2,671 కోట్లు టెండర్ల ఆహ్వానించామని, ఈ ప్రక్రియ 80 శాతం పూర్తి చేశామన్నారు. నగరంలో 10 లక్షల ఆస్తులకు స్కానింగ్ చేశామని, ఒకే రోజులో ఈ.ఖాతాలను ఇస్తామన్నారు.

రైతుల అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం

మాన్వి, న్యూస్‌టుడే : రైతుల అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేస్తామని మంత్రి ఎన్.ఎస్.బోసురాజు పేర్కొన్నారు. రాయచూరు గ్రామీణ పరిధిలోని 14 గ్రామాలకు చెందిన రైతులకు ప్రభుత్వం సమకూర్చిన వ్యవసాయ పరికరాలను లోక్‌సభ సభ్యుడు జి.కుమార్‌నాయక్‌తో కలిసి మంత్రి పంపిణీ చేసి మాట్లాడారు. రైతులకు బోరుబావులు నిర్మించుకునేందుకు, డ్రిప్ ఇరిగేషన్, చెక్‌డ్యాములు, చెరువులు, వ్యవసాయ చెరువులకు నీటి వ్యవస్థ కల్పించేందుకు చిన్ననీటి పారుదలశాఖ సహకారం అందిస్తుందన్నారు. ఎంపీ కుమార్‌నాయక్ మాట్లాడుతూ రైతులు కేవలం వ్యవసాయం మీద ఆధారపడకుండా వ్యవసాయ ఆధారిత ఇతర ఉపవృత్తులను చేపట్టాలని, సేద్యంలో అంతర పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. రైతులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల యోజనలు, పథకాలను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రముఖులు మహ్మద్ శాలం, జయణ్ణ, నరసింహులు మాడగిరి, ఆంజినేయ, శివమూర్తి, అమరేగౌడ హంచినాళ, బి.రమేష్, తాయణ్ణ, మహాదేవ, గోవిందప్ప తదితరులు పాల్గొన్నారు.

పరికరాలు పంపిణీ చేస్తున్న మంత్రి బోసురాజు, ఎంపీ కుమారనాయక్ తదితరులు

సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి

ఆహ్వాన పత్రికలను విడుదల చేస్తున్న మంత్రి బోసురాజు

మాన్వి, న్యూస్‌టుడే : ఈ నెల 28న నిర్వహించే 11వ తాలూకా కన్నడ సాహిత్య సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని, కన్నడ భాషా సంస్కృతులని చాటే విధంగా నిర్వహించాలని మంత్రి ఎన్.ఎస్.బోసురాజు సూచించారు. ఆదివారం తన నివాసం వద్ద సమ్మేళం ఆహ్వాన పత్రికలను విడుదల చేసి మాట్లాడారు. తాము, ఎమ్మెల్యే హంపయ్యనాయక్ సమ్మేళనానికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. సభావేదికను అందరూ వీక్షించే విధంగా ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో కసాప అధ్యక్షుడు శరణబసవ నీరమాన్వి, కార్యదర్శి తాయప్ప, కోశాధికారి శర్ఫుద్దీన్, ప్రతినిధులు లక్ష్మణజానేకల్, బాలాజీ సింగ్, రవిశర్మ, హనుమంతప్ప, పి.పరమేష్, యంకణ్ణయాదవ్, మారెప్ప తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ వ్యాధులపై అవగాహన

రాయచూరు, న్యూస్‌టుడే : ఐఎంఏ మహిళా సంఘం, బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం సంయుక్తంగా క్యాన్సర్ రోగాలపై మహిళలకు అవగాహన కల్పించే కార్యక్రమాన్ని ఆదివారం విశ్వవిద్యాలయంలో నిర్వహించారు. వైద్యులు లత కామత్, ప్రియ బాళ్ళి, శిల్ప ఉపాధ్యాయలు వ్యాధి లక్షణాలు, అందుబాటులోని చికిత్సల గురించి వివరించారు. రోగాన్ని ఆరంభంలో గుర్తిస్తే నియంత్రించడం లేక నిర్మూలించడం సాధ్యపడుతుందని వెల్లడించారు. జీవన శైలి, ఆహార పద్ధతులను మార్చుకుంటే రోగాలు దరిచేరవని తెలిపారు. మహిళలు అడిగిన సందేహాలకు వైద్యులు సమాధానం ఇచ్చారు. బ్రహ్మకుమారీస్ ప్రతినిధులు స్మితా, శారదా, ఈరమ్మ తదితరులు హాజరయ్యారు.

కేపీఎస్ రద్దుకు కలసికట్టు పోరాటం

రాయచూరు, న్యూస్‌టుడే : పేద విద్యార్థులను చదువుకు దూరం చేసేందుకు, ప్రైవేటు విద్యాలయాలకు లాభం చేయటానికి కర్ణాటక పబ్లిక్ స్కూల్స్ (కేపీఎస్) పేరిట పాఠశాలలను విలీనం చేస్తున్నారని దళిత, ప్రగతి పర సంఘటనల ఒక్కూట ముఖ్యుడు ఎం.ఆర్.బేరి ఆరోపించారు. కేపీఎస్‌ను వ్యతిరేకిస్తూ ఆదివారం ఇక్కడి అంబేద్కర్ కూడలి వద్ద ‘నమ్మూరు శాలె నమ్మ హక్కు’ (మా ఊరి పాఠశాల మన హక్కు) అనే నినాదంతో బృహత్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. విద్యార్థులు, తల్లిదండ్రులు భారీగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బేరి ప్రసంగిస్తూ ప్రభుత్వం ఎవరితో చర్చించకుండా ఏకపక్ష నిర్ణయం తీసుకుందని దుయ్యబట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా మేధావులు, విద్యార్థి, కన్నడ సంఘాలు విరోధిస్తున్నందున సర్కారు ఆదేశాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏఐడీఎస్‌వో రాష్ట్ర కార్యదర్శి అజయ్ కామత్ ఉపన్యసిస్తూ నలభై వేల సరస్వతీ నిలయాలను మూసివేయాలన్న ప్రయత్నాలను పోరాటాల ద్వారా అడ్డుకుందామని పిలుపునిచ్చారు. కల్యాణ కర్ణాటక మండలికి కేటాయిస్తున్న నిధులను స్కూల్స్ విలీనానికి వినియోగించడం బాధాకరమని వ్యాఖ్యానించారు. విశ్రాంత ప్రిన్సిపల్ బూదెప్ప, కల్యాణ కర్ణాటక సంఘం జిల్లా అధ్యక్షుడు రంగనాథ్, ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్.ఎస్.వీరేశ్, ఏఐడీఎస్‌వో జిల్లా కార్యదర్శి బసవరాజ్, చంద్రగిరీశ్ మాట్లాడారు.

హాజరైన విద్యార్థులు, తల్లిదండ్రులు

ప్రసంగిస్తున్న అజయ్‌కామత్

గ్రామాల్లో ఆరోగ్య శిబిరాలు అవసరం

రాయచూరు, న్యూస్‌టుడే : గ్రామాల్లో ఆరోగ్య సంరక్షణపై అవగాహన కార్యక్రమాలు, ఆరోగ్య శిబిరాలు తరచూ నిర్వహించాల్సిన అవసరం ఉందని వాల్మీకి విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ చెన్నప్ప అన్నారు. వాల్మీకి విశ్వవిద్యాలయం సమాజ కార్య విభాగం రాయచూరు తాలూకా యరగేరా గ్రామంలో ‘ఆరోగ్యం వైపు ఒక అడుగు’ పేరిట ఉచిత ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేసింది. ఉపకులపతి రిబ్బన్ కత్తిరించి ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ సహకారంతో సంఘాలు, సంస్థలు చేస్తున్న కార్యకలాపాలు సంతృప్తిని ఇస్తున్నాయని చెబుతూ ఇవి సరిపోవన్నారు. ఉప రిజిస్ట్రార్ డాక్టర్ వెంకటేశ్ మాట్లాడుతూ వైద్యం ఖరీదైన నేపథ్యంలో ఎక్కడ శిబిరాలు ఏర్పాటు చేసినా వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 282 మందికి ఆరోగ్య పరీక్షలు చేశారు. సమాజ కార్య విభాగ సంయోజకుడు శరణబసవరాజ, నిర్వాహకులు రష్మి, సునీల్‌కుమార్, ఉన్నత పాఠశాల ముఖ్యోపాధ్యాయురాలు బసవరాజేశ్వరి తదితరులు హాజరయ్యారు.

రిబ్బన్ కత్తిరిస్తున్న రిజిస్ట్రార్ చెన్నప్ప

రేపు బోవి నిగమ సౌలభ్యాలపై సదస్సు

పాత్రికేయులతో మాట్లాడుతున్న దేవేంద్ర

రాయచూరు, న్యూస్‌టుడే : బోవి అభివృద్ధి నిగమ సౌలభ్యాలపై అవగాహన కల్పించేందుకు ఈ నెల 24న స్థానిక రంగమందిరంలో సదస్సును ఏర్పాటు చేస్తున్నట్లు తాలూకా బోవి (వడ్డెర) సమాజం ప్రధాన కార్యదర్శి దేవేంద్ర వెల్లడించారు. బోవి సామాజిక వర్గం ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఆదివారం పత్రికాభవన్‌లో పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. నిగమ అధ్యక్షుడు రామప్ప సదస్సులో పాల్గొంటారన్నారు. సిద్ధరామేశ్వర విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తారని, అక్కడి నుంచి పాదయాత్రతో రంగమందిరాన్ని చేరుకుంటారని వెల్లడించారు. ఏవైనా సందేహాలు ఉంటే నివృత్తి చేస్తారని చెప్పారు. మంత్రి బోసురాజు, ఎమ్మెల్యేలు శివరాజ్ పాటిల్, బసవనగౌడ దద్దల్, మానప్ప వజ్జల్, మాజీ ఎమ్మెల్యే డి.ఎస్.హులిగేరా, వడ్డెర సామాజిక వర్గం ముఖ్యులు పాల్గొంటారని వివరించారు.

రాయచూరు కమ్మ సంఘానికి నూతన సారథి

రాయచూరు, న్యూస్‌టుడే : రాయచూరు తాలూకా కమ్మవారి సంఘానికి నూతన అధ్యక్షుడిగా బి.వెంకటేశ్వరరావు (కొండయ్య) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మూడేళ్లు (2026-2029) వరకు పదవిలో కొనసాగుతారు. కొత్త అధ్యక్షుడిని ఎన్నుకునేందుకు ఆదివారం స్థానిక ఈదల మాణిక్యమ్మ వసతి పాఠశాలలో సర్వసభ్య సమావేశం జరిగింది. సభ్యులంతా కొండయ్య పేరును మాత్రమే ప్రతిపాదించడంలో పోటీ లేకుండా ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యుడి పదవిని నిర్వహించకనే నేరుగా అధ్యక్షుడై రికార్డు సాధించారు. ప్రస్తుత అధ్యక్షుడు బూరుగుపల్లి ప్రసాద్, ప్రముఖులు నెక్కింటి ఆదినారాయణ, రత్నమాల, వైట్ల రవి, మద్దిపాటి శ్రీనివాస్, గొడవర్తి శ్రీనివాస్ తదితరులు వెంకటేశ్వరావును అభినందించి సత్కరించారు.

నూతన అధ్యక్షుణ్ని సన్మానిస్తున్న సభ్యులు

త్వరలో నూతన కార్యవర్గం ఏర్పాటు

తనపై నమ్మకంతో ఎన్నుకున్న అందరికీ కొండయ్య ధన్యవాదాలు తెలిపారు. మాజీ అధ్యక్షులు, పెద్దలతో చర్చించి వీలైనంత త్వరగా కొత్త కార్యవర్గాన్ని ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. నూతన సమితి అధికారం చేపట్టాక సమస్యల అధ్యయనానికి, అభివృద్ధిపై సలహాలు స్వీకరణకు సమావేశం నిర్వహిస్తానని తెలిపారు. ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు.

నేపథ్యం వ్యవసాయ కుటుంబం

వ్యవసాయ కుటుంబానికి చెందిన వెంకటేశ్వరరావు కర్నూలు జిల్లా పాములపాడు మండలం కృష్ణానగర్ క్యాంపులో 1970లో జన్మించారు. మాన్వి తాలూకా కొట్నేకల్‌కు దగ్గర్లోని అమరావతికి 1992లో వలస వచ్చారు. రైతుగా నిలదొక్కుకున్నాక రైస్ మిల్లు స్థాపించి వ్యాపారిగా విజయవంతమయ్యారు. ఈయన తల్లిదండ్రులు తూర్పుగోదావరి జిల్లా రామచంద్రాపురం తాలూకా దంగేరి గ్రామ నివాసులు.

అయ్యో.. ‘పాప’ం

బెంగళూరు(యలహంక),న్యూస్‌టుడే: ఆడుకుంటున్న శంకువు ఆకారం కలిగిన ప్లాస్టిక్ వస్తువును మింగి బాలిక తనుష్క (8) మృతి చెందిన సంఘటన దక్షిణ కన్నడ జిల్లా ఉల్లాలలో జరిగింది. మృతి చెందిన బాలికను రాజేశ్, రాజేశ్వరి దంపతుల కుమార్తెగా గుర్తించారు. ఆడుకునే సమయంలో ప్లాస్టిక్ వస్తువును నోట్లో పెట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. గొంతుకు అడ్డం పడటంతో బంధువులు బాలికను ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. శ్వాసకోశంలో ప్లాస్టిక్ వస్తువు ఇరుక్కుపోవడంతో ఊపిరి ఆడక మృతి చెందినట్లు పోలీసులు తెలియజేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఏనుగుల దాడిలో మహిళ విషాదాంతం

బెంగళూరు(బాణసవాడి),న్యూస్‌టుడే: చిక్కమగళూరు జిల్లా ఎన్‌ఆర్‌పుర తాలూకా హుణసెహళ్లి గ్రామంలో పొలాల్లో వచ్చిన అటవీ ఏనుగులు దాడిలో బళ్లారిజిల్లా హగలగట్టి గ్రామ నివాసి బొరమ్మ (33) అనే మహిళ మృతి చెందారు. ఆదివారం ఉదయం ఈ సంఘటన జరిగినట్లు పోలీసులు తెలిపారు. జరిగిన సంఘటనను నిరశిస్తూ గ్రామస్థులు వివిధ సంఘాల కార్యకర్తలు మృతదేహాన్ని కడబగెరె వద్ద రహదారిపై ఉంచి ధర్నా నిర్వహించారు. పాలకులపై ఆక్రోశం వ్యక్తం చేశారు. అటవీ శాఖ మంత్రి రావాలని డిమాండ్ చేశారు. జిల్లా అదనపు ఎస్పీ జయకుమార్ సంఘటన ప్రదేశానికి వచ్చి ఆందోళనకారులతో చర్చించి ధర్నా విరమింపజేశారు. ఈ నెల 16న నాగేశ్‌గౌడ అనే వ్యక్తి ఏనుగు దాడిలో మృతి చెందారని గ్రామస్థులు గుర్తు చేశారు. పదేపదే ఏనుగులు దాడులకు పాల్పడుతున్నా ప్రభుత్వ అధికారులు నియంత్రణ చర్యలు చేపట్టలేదని ఆక్రోశించారు. కేసుదర్యాప్తులో ఉంది.

సంస్కృతి, సంప్రదాయాలను విస్మరించొద్దు

ప్రారంభిస్తున్న లోకరెడ్డి, స్వామీజీలు

సిరివార, (మాన్వి) : భారతదేశం విశ్వగురుగా పేరుగాంచిన తరుణంలో మన ధర్మం, సంస్కృతి, సంప్రదాయాలను విస్మరించవద్దని నవలకల్ బృహన్మఠం అభినవ సోమనాథ్ శివాచార్య స్వామీజీ హితవు పలికారు. విరాట్ హిందూ సమ్మేళన కార్యక్రమానికి సాన్నిధ్యం వహించి ఆయన మాట్లాడారు. కల్లూరు మఠం శివరామానందస్వామీజీ మాట్లాడుతూ స్వాభిమానం, స్వదేశీ వస్తువుల వినియోగం, దేశాభిమానాన్ని ప్రతి ఒక్కరూ పెంపొందించుకోవాలన్నారు. విశ్వహిందూ పరిషత్ సంచాలకుడు బసవరాజ్ కీలకోపన్యాసం చేశారు. స్థానిక ప్రముఖ వర్తకుడు జి.లోకరెడ్డి సమ్మేళనానికి అధ్యక్షత వహించారు. సమ్మేళనంలో 101మంది మహిళలకు ఒడినింపారు. పట్టణంలో విరాట్ హిందూ సమ్మేళన ఊరేగింపు నిర్వహించారు. గుర్రం నృత్యం ఆకట్టుకుంది. మాజీ ఎంపీ వి.బి.నాయక్, మాజీ ఎమ్మెల్యే బసనగౌడ బ్యాగవాట్, ప్రముఖులు జె.శరణప్పగౌడ, శివరామిరెడ్డి, అయ్యనగౌడ ఏరెడ్డి, బసవరాజ్ కల్లూరు, కృష్ణాజీరావు, మహేంద్రకర్, గురుగణ్ణ తదితరులు పాల్గొన్నారు.

ఊరేగింపులో పాల్గొన్న ప్రజలు

సార్వజనిక విద్యను బలోపేతం చేద్దాం

రాయచూరు : సార్వజనిక విద్యా వ్యవస్థను బలోపేతం చేసుకోవడం మనందరి కర్తవ్యమని ఎంపీ కుమారనాయక్ పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి వేదిక, భారత జ్ఞాన విజ్ఞాన వేదిక, రాష్ట్ర మహిళా ఒక్కూట సంయుక్తంగా ఆదివారం నగరంలోని నవోదయ విద్యా సంస్థ గ్రంథాలయం సభా భవనంలో మన పాఠశాల-మన హక్కు అనే అంశంపై చర్చించేందుకు కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఎంపీ మొక్కకు నీళ్లు పోసి ప్రారంభించి మాట్లాడారు. సర్కారు విద్యను నిర్వీర్యం చేసే ప్రయత్నాలు జరగడం ఆందోళన కల్గిస్తోందన్నారు. రాజ్యాంగ పీఠికలోని విషయాలపై విజయం సాధించాలంటే, మెరుగైన సమాజం నిర్మాణం కావటానికి విద్య వల్లనే సాధ్యపడుతుందని వివరించారు. ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకునేందుకు జరుగుతున్న పోరాటాలకు తన సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. విద్యా నిపుణుడు నిరంజనారాధ్య, రాయచూరు జ్ఞాన వేదిక అధ్యక్షుడు రతన్ చౌహ్వాణ్, జిల్లా సంచాలకుడు హాఫిజుల్లా, ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణ, ఉన్నత పాఠశాలల సంఘం అధ్యక్షుడు ప్రభులింగ గద్ది తదితరులు పాల్గొన్నారు.

కోర్టుకు ఎమ్మెల్యే చంద్రు లమాణి

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: గుత్తేదారు నుంచి లంచం తీసుకుంటూ లోకాయుక్త వలకు చిక్కిన శిరహట్టి శాసనసభ్యుడు చంద్రు లమాణి, ఆయన సహాయకులు మంజు వాల్మీకి, గురు లమాణిలను లోకాయుక్త పోలీసులు శనివారం అర్ధరాత్రి గదగ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆ సమయంలో ఆసుపత్రి వద్ద ఆయన అనుచరులు, పోలీసులకు తీవ్రస్థాయిలో వాగ్వివాదం జరిగింది. అనంతరం ముగ్గురిని వాహనంలో బెంగళూరు నగరంలో ఉన్న ప్రజాప్రతినిధుల న్యాయస్థానంలో హాజరు పరిచేందుకు తీసుకొచ్చారు. సెలవు కావడంతో న్యాయమూర్తి ఇంటికి తీసుకువెళ్లి ఆయన ముందు హాజరుపరిచారు. న్యాయమూర్తి ఆ ముగ్గురిని న్యాయాంగ కస్టడీకి అప్పగించారు. గుత్తేదారుడు విజయ పూజార్ నుంచి రూ.5 లక్షలు లంచం తీసుకుంటుండగా లోకాయుక్త పోలీసులు దాడి చేసి అరెస్టు చేసిన విషయం తెలిసిందే.

కొత్తతరం అప్లికేషన్లతో సైబర్ నేరాలకు అడ్డుకట్ట

ఈనాడు, బెంగళూరు: వ్యాపార, వాణిజ్య రంగాల్లో కృత్రిమమేధ వాడకం అంతకంతకూ పెరుగుతున్నా ఇదే సమయంలో సైబర్ నేరాలు విస్తృతం అవుతున్నాయి. వీటిని అడ్డుకునేందుకు ఇదే స్థాయిలో సైబర్ నియంత్రిత అప్లికేషన్లు అవసరమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రపంచ స్థాయిలో డిజిటల్ ఎండ్ అప్లికేషన్లతో సైబర్ భద్రతకు ఆధునిక సేవలు అందించే జోహో కార్పొరేషన్ మేనేజ్ ఇంజిన్ సంస్థ ఈ మేరకు విలువైన సూచనలు ఇచ్చింది. సంస్థ ప్రాంతీయ ఉపాధ్యక్షుడు అరుణ్‌కుమార్ మాట్లాడుతూ ఐటీ సర్వీస్ మేనేజ్‌మెంట్ (ఐటీఎస్‌ఎం), నెట్‌వర్క్ మానిటరింగ్, యూనిఫైడ్ ఎండ్ పాయింట్ మేనేజ్‌మెంట్, సైబర్ సెక్యూరిటీ వంటి 60కిపైగా సేవా అప్లికేషన్లు హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్‌ల్లో ఎదురయ్యే సైబర్ సమస్యలను ముందుగానే గుర్తించి అందుకు తగిన పరిష్కారాలు వెతికిపెడతాయన్నారు. సురక్షిత పాస్‌వర్డ్‌లే, సెషన్ రికార్డింగ్‌లతో పాటు కాసల్ ఇంటెలిజెన్స్ వంటి ఇండిపెండెంట్ ఏఐలు అనవసర అంతరాయాలను గుర్తించి సేవల్లో వేగాన్ని అందిస్తాయన్నారు. భారత వ్యక్తిగత డేటా భద్రత చట్టానికి అనుగుణంగా సంస్థ 72 గంటల లోపే డేటా చౌర్యాన్ని గుర్తిస్తాయని సంస్థ ప్రొడక్ట్ హెడ్ రాకేశ్ వెల్లడించారు. కంట్రాక్టర్లు, గిగ్ వర్కర్ వ్యవస్థలకు జీరోట్రస్ట్ యాక్సెస్ వంటి అప్లికేషన్లను రూపొందించామన్నారు. నిపుణుల తయారీకి శిక్షణతో పారదర్శక సైబర్ భద్రతకు పెద్దపీట వేస్తామని వీరు తెలిపారు.

వివరాలు వెల్లడిస్తున్న అరుణ్ కుమార్, రోమానస్ తదితరులు

కుమారపై సిద్ధు శివాలు

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: తండ్రీ కుమారుడు తమ కుటుంబ స్వార్థం కోసం రాజకీయ రంగంలో పైకి ఎదిగిన నేతలను పాతాళానికి తొక్కారని, ఇద్దరూ కలిసి ఎంత మంది సొంత కులంలో నేతలను చేశారని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రశ్నించారు. సామాజిక దినోత్సవం సందర్భంగా ఓ పత్రికకు తాను రాసిన వ్యాసంపై కేంద్ర మంత్రి కుమారస్వామి చేసిన విమర్శలను ఆయన తిప్పికొడుతూ ఒక ప్రకటనను ఆదివారం ఇక్కడ పత్రికలకు విడుదల చేశారు. నీరు నిలబడితే మురుగు నీరుగా మారుతుందని నీరు పారుతుండాలని, రాజకీయ రంగంలో మార్పు ఉండాలన్నారు. తాను రాసిన వ్యాసంపై చర్చకు సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు. సామాజిక న్యాయాన్ని గురించి ఇప్పుడు మాట్లాడలేదని గత 40 ఏళ్ల నుంచి మాట్లాడుతున్నట్లు గుర్తు చేశారు. ఇప్పుడూ, ఎప్పుడూ తాను సామాజిక న్యాయం వైపు నిలబడుతానని తెలిపారు. కులవ్యవస్థ నిత్యం విమర్శిస్తున్నట్లు గుర్తుచేశారు. తాను రాసిన వ్యాసాన్ని కేంద్ర మంత్రి కుమారస్వామి విమర్శిస్తారని తానెప్పుడూ ఆశ్చర్యపోలేదన్నారు. సిద్ధరామయ్య కుర్చీ కోసం కులాన్ని తెరపైకి తెస్తున్నారని ఆయన చేసిన ఆరోపణలను తమాషాగా స్వీకరించినట్లు చెప్పారు. మాజీ ప్రధాని దేవెగౌడ, కేంద్ర మంత్రి కుమారస్వామి స్వార్థపరులు స్వకులం వ్యతిరేకులని మండిపడ్డారు.

బడ్జెట్‌లో దళితులకు న్యాయం చేయండి

రాయచూరు, న్యూస్‌టుడే : అలెమారి అభివృద్ధి నిగమను స్థాపించేలా, దళిత అంతర్గత రిజర్వేషన్ల ఆధారంగా నిధులు కేటాయించేలా, బ్యాక్‌లాగ్ ఉద్యోగాలను భర్తీ చేస్తామని బడ్జెట్‌లో ప్రకటించాలని ‘సామాజిక న్యాయం కోసం దళిత కులాల, అంతర్గత రిజర్వేషన్ల అమలు పోరాట సమితి’ మంత్రి బోసురాజుపై ఒత్తిడి చేసింది. పోరాటకారులపై నమోదైన కేసులను ఎత్తివేయాలని విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఆదివారం జిల్లా అధ్యక్షుడు అబ్రహం, ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్ నాయకత్వంలో మంత్రికి మనవిపత్రాన్ని అందజేశారు. ఆంధ్రా, తెలంగాణ, హరియాణాలో అంతర్గత రిజర్వేషన్లను సక్రమంగా జారీ చేసిన విషయాన్ని పరిగణలోకి తీసుకోవాలని కోరారు.

వినతిపత్రాన్ని చదువుతున్న అనిల్

మన్‌కీ బాత్‌లో రసబాలె ప్రస్తావన

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: దేశ ప్రజల దృష్టి ఆకర్షిస్తున్న ప్రధాని నరేంద్రమోదీ నిర్వహించే మన్ కీ బాత్ కార్యక్రమంలో నంజునగూడు రసబాలె అరటి పండు, మైసూరు వీళ్య తమలపాకులు ప్రస్తావించడంపై మైసూరు ఎంపీ యదువీర్ ఒడెయర్ స్వాగతం పలికారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రస్తావించడం వల్ల రెండు పంటలకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు వస్తుందన్నారు. ఇది మైసూరు జిల్లా రైతులు గర్వించదగిన విషయమన్నారు. రెండు పంటలు విదేశాలకు ఎగుమతులు పెరిగే అవకాశాలు ఉన్నట్లు తెలిపారు.

యదువీర్ ఒడెయర్

ఘనంగా అడవీశ్వర రథోత్సవం

కల్లూరు గ్రామంలోని గురు అడవీశ్వర శివయోగి 91వ జాతర మహోత్సవాన్ని పురస్కరించుకుని స్వామివారి రథోత్సవాన్ని భక్తులు ఘనంగా నిర్వహించారు. గురు శంభులింగ మహాస్వామీజీ సాన్నిధ్యంలో అడవీశ్వరుడికి వివిధ అభిషేక పూజలు జరిగాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు. **- న్యూస్‌టుడే, మాన్వి**

తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

22-02-2026 (ఉ॥ 8 గంటలకు)	ప్రస్తుతం	గత సంవత్సరం
నీటిమట్టం (అడుగుల్లో)	1601.87	1609.87
ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	000	000
అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	403	9,104
నీటి నిల్వ (టి.ఎం.సి)	24.033	37.314

గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు) వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు

రాజనహళ్లి స్వామీజీ కోలుకుంటున్నారు

మాన్వి, న్యూస్‌టుడే : ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రాజనహళ్లి వాల్మీకి గురుపీఠం పీఠాధిపతి వాల్మీకి ప్రసన్నానందపురి స్వామీజీ కోలుకుంటున్నారని ఎంపీ కుమార్‌నాయక్ తెలిపారు. ఆయన ఆసుపత్రిలో స్వామీజీని పరామర్శించారు. గుండెపోటుతో ఆసుపత్రిలో చేరిన స్వామీజీకి వైద్యులు స్టంట్ వేశారని, రోజూ నిపుణులైన వైద్యుల బృందం ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు ఆయన తెలిపారు.

స్వామీజీని పరామర్శిస్తున్న కుమార్‌నాయక్

మార్చి 3న యోగి నారాయణ జయంతి

రాయచూరు, న్యూస్‌టుడే : మార్చి 3న యోగి నారాయణ యతీంద్రర (కైవార తాతయ్య) జయంతి నిర్వహణపై చర్చించేందుకు ఈ నెల 24న సన్నాహక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. జిల్లా పాలనాధికారి సభా భవనంలో మధ్యాహ్నం 12 గంటలకు మొదలవుతుంది. జిల్లా పాలనాధికారి నితీశ్ అధ్యక్షత వహిస్తారు. సంఘాలు, సంస్థల ప్రతినిధులు హాజరై సలహాలు, సూచనలు ఇవ్వాలని సంబంధిత అధికారులు విజ్ఞప్తి చేశారు.

(c) eenadu

ఉయ్యాలవాడ పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలి

ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు కలెక్టరేట్, న్యూస్‌టుడే : ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పోరాటాన్ని యువత స్ఫూర్తిగా తీసుకోవాలని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ పిలుపునిచ్చారు. కర్నూలు నగరంలోని ఎ.క్యాంపులో ఆదివారం నిర్వహించిన నరసింహారెడ్డి వర్ధంతి కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ఉయ్యాలవాడ నరసింహారెడ్డి నుంచి ఆత్మగౌరవంతో జీవించడం నేర్చుకోవాలని తెలిపారు. నగరంలోని పురావస్తు శాఖ మ్యూజియాన్ని మరింత అభివృద్ధి చేసి ఉయ్యాలవాడ నరసింహారెడ్డితో పాటు ఇతర గొప్ప వ్యక్తుల జీవిత విశేషాలను అక్కడ ప్రదర్శించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. జొహరాపురంలోని పురాతన బావులను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి సేవా సమితి అధ్యక్షుడు విజయమోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ప్రతాపరెడ్డి, మాజీ అధ్యక్షుడు నరసింహారెడ్డి, కార్పొరేటర్ క్లైప పద్మలతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

కర్నూలు కలెక్టరేట్, న్యూస్‌టుడే: కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు కలెక్టర్ డా.ఎ.సిరి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతోపాటు అన్ని మండల, డివిజన్, మున్సిపల్ కార్యాలయాల్లోనూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. సమస్యలు పరిష్కారం కాకున్నా.. పరిష్కారం ఏదశలో ఉందో తెలుసుకొనేందుకు 1100 నంబరుకు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని కలెక్టర్ చెప్పారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేటి నుంచి ఇంటర్ వార్షిక పరీక్షలు

• 78,831 మంది విద్యార్థుల హాజరు

ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు సోమవారం నుంచి మార్చి 24వ తేదీ వరకు జరగనున్నాయి. పరీక్షలకు సంబంధించి అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆర్ఐవో లాలెప్ప ఆదివారం తెలిపారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు జరుగుతాయి. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది. కర్నూలు జిల్లాలో 75 కేంద్రాల్లో 48,964 మంది, నంద్యాల జిల్లాలో 55 కేంద్రాల్లో 29,867 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష జరుగుతుంది. పరీక్ష సమయానికి గంట ముందే విద్యార్థులు కేంద్రానికి చేరుకోవాల్సి ఉంటుంది. నిమిషం ఆలస్యమైనా అనుమతించరు. పరీక్షల విధుల్లో ఉండే అధికారులకు చరవాణిల అనుమతి ఉండదు. మరోవైపు విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకున్నట్లు ఆర్ఐవో చెప్పారు. విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాయాలని సూచించారు.

హెల్ప్‌డెస్కుల ఏర్పాటు

పరీక్ష కేంద్రాల వద్ద ఏవైనా సమస్యలొస్తే కర్నూలు జిల్లా విద్యార్థులు 08518 222047, నంద్యాల జిల్లావారు 62811 34324 నంబరుకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వొచ్చు. అధికారులు స్పందించి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటారు.

– న్యూస్‌టుడే, కర్నూలు విద్య, నంద్యాల విద్య

విశ్వమిథ్యాలయమే

☛ అసంపూర్తిగా క్లస్టర్ వర్సిటీ భవన నిర్మాణాలు

☛ నిధులివ్వడంలో గత ప్రభుత్వం నిర్లక్ష్యం

ఈనాడు, కర్నూలు : కర్నూలులో క్లస్టర్ విశ్వవిద్యాలయ భవనాల పనులు ముందుకు కదలడం లేదు. బిల్లుల చెల్లింపులో గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. మరోవైపు నిర్మాణ సామగ్రి ధరలు పెరిగిపోవడంతో గుత్తేదారు సంస్థ మధ్యలోనే వెళ్లిపోయింది. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం దీనిపై దృష్టి పెట్టింది. ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తామని మంత్రి లోకేశ్ చెప్పడంతో భవన నిర్మాణాలపై ఆశలు చిగురించాయి.

2021లో పనులు ప్రారంభించి..

జగన్నాథగట్టుపై 50 ఎకరాలు కేటాయించి అందులో వర్సిటీ పరిపాలన భవనాలు, సిల్వర్‌జూబ్లీ డిగ్రీ కళాశాల న్యూకాంప్లెక్స్ నిర్మించాలని నిర్ణయించారు. రూ.88.50 కోట్ల అంచనాతో 2021లో పనులు ప్రారంభించారు. బిల్లులు చెల్లించడంలో గత ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శించింది. ఈ నేపథ్యంలో 2024 అక్టోబరులో గుత్తేదారు సంస్థ పనులు ఆపేసింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆ సంస్థకు రూ.19 కోట్ల మేర పాత బకాయిలు చెల్లించినా పనులు మొదలుపెట్టలేదు.

అసంపూర్తిగా క్లస్టర్ వర్సిటీ భవనాలు

రూ.74.50 కోట్లు ఇచ్చేందుకు హామీ

క్లస్టర్ విశ్వవిద్యాలయ దుస్థితిని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అసెంబ్లీలో ప్రస్తావించారు. మంత్రి లోకేశ్ మాట్లాడుతూ క్లస్టర్ విశ్వవిద్యాలయంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని, కొత్త కోర్సులు ప్రవేశపెడతామని చెప్పారు. వచ్చే విద్యా సంవత్సరంలో రూ.74.50 కోట్లు విడుదల చేస్తామని హామీ ఇవ్వడంతో పనులు పూర్తవుతాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.

వీసీ నియామకం ఎప్పుడో..

- నూతన వీసీ నియామకానికి చర్యలు తీసుకోలేదు. ఏడాదిగా ఇన్‌ఛార్జి పాలనలోనే వర్సిటీ కొనసాగుతోంది.
- వర్సిటీ పరిధిలోని డిగ్రీ కళాశాలల్లో 169 మంది బోధన సిబ్బంది ఉన్నారు. మరో 49 మంది ప్రొఫెసర్లు, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లను నియమించాలని భావించారు. ఎప్పటికి తీసుకుంటారన్నదానిపై స్పష్టత లేదు.
- క్లస్టర్ విశ్వవిద్యాలయంలో ఇంకా పరిశోధనలే ప్రారంభంకాలేదు. పోస్టుల భర్తీ జరిగితే 200 మంది పరిశోధకులకు పీహెచ్‌డీ సీట్లు కూడా వచ్చే అవకాశం ఉంటుంది.

చంద్రబాబు చొరవతో..

గతంలో తెదేపా ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చొరవతో రాష్ట్రానికి క్లస్టర్ విశ్వవిద్యాలయాన్ని కేంద్రం మంజూరు చేసింది. నగరంలోని కేవీఆర్ మహిళా డిగ్రీ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల (బాలురు), సిల్వర్‌జూబ్లీ కళాశాలలతో 'క్లస్టర్ విశ్వవిద్యాలయం' ఏర్పాటుచేశారు. ఆయా కళాశాలల్లో వసతులు కల్పించే ఉద్దేశంతో కేంద్రం రూ.55 కోట్ల రూసా నిధులు విడుదల చేసింది. ఆ మూడు కళాశాలల్లో అధునాతన అకడమిక్ భవనాలు, గ్రంథాలయాలు, ఓవర్ హెడ్ ట్యాంకులు, క్యాంటీన్లు, సిల్వర్ జూబ్లీ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల (బాలురు)ల్లో వసతిగృహాలు నిర్మించారు. సిల్వర్‌జూబ్లీ కళాశాలకు మంజూరు చేసిన ఆడిటోరియం నిర్మాణం పూర్తి చేయలేదు. వైకాపా హయాంలో పనులు నత్తనడకన సాగాయి. నిర్మాణ సామగ్రి ధరలు పెరిగి నిధులు సరిపోలేదు.

దేవతలారా.. రారండి

• ఘనంగా ధ్వజారోహణం

ఎగువ అహోబిలంలో ధ్వజారోహణం

ప్రత్యేక అలంకరణలో జ్వాలా నృసింహస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లు

నారసింహుని బ్రహ్మోత్సవాలకు సకల దేవతలను ఆహ్వానించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎగువ అహోబిలంలో ఆదివారం ఉదయం జ్వాలా నృసింహస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి ధ్వజ స్తంభానికి ఎదురుగా ఉన్న మండపంలో కొలువుంచారు. అనంతరం ఉత్సవాలు సజావుగా సాగాలని కోరుతూ ధ్వజారోహణం చేశారు. ఉత్సవమూర్తులను పల్లకిపై కొలువుంచి మేళతాళాలతో ఊరేగించారు. మధ్యాహ్నం పంచామృతాలతో అభిషేకం జరిపారు. రాత్రి జ్వాలా నృసింహస్వామి వారు, అమ్మవార్లు సింహ వాహనంపై కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చారు. దిగువ అహోబిలంలో బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ జరిగింది. ఇందులో భాగంగా విష్వక్సేనుల వారిని ప్రత్యేకంగా అలంకరించి పల్లకిలో ఊరేగింపుగా ఆలయం బయటకు తీసుకొచ్చి అంకుర హోమం, సోమకుంభస్థాపన జరిపారు. పీఠాధిపతి రంగనాథ యతీంద్ర మహాదేశికన్, ప్రధానార్చకుడు కిడాంబి వేణుగోపాలన్ ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.

– న్యూస్‌టుడే, అహోబిలం (ఆళ్లగడ్డ గ్రామీణం)

పుర దాహార్తి తీరనుంది

పురపాలక సంఘాల పరిధిలో ఇంటింటికి కుళాయి కనెక్షన్లు ఇచ్చి ప్రజల దాహార్తి తీర్చేందుకు కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ ఇన్వెస్ట్‌మెంటు బ్యాంకు (ఏఐఐబీ) 70 శాతం, కూటమి ప్రభుత్వం 30 శాతం నిధులతో పనులు చేపట్టనున్నారు. 2015-19లో తాగునీటి పథకాలకు నిధులు మంజూరు చేశారు. ఆ తర్వాత వచ్చిన వైకాపా ప్రభుత్వం దీనిని పక్కన పెట్టింది. – న్యూస్‌టుడే, నంద్యాల పట్టణం, ఎమ్మిగనూరు

టెండర్ల ప్రక్రియ ప్రారంభం

ఎమ్మిగనూరు పురపాలక సంఘానికి రూ.157.30 కోట్లు, ఆత్మకూరు రూ.139.95 కోట్లు, ఆళ్లగడ్డ రూ.133.39 కోట్లు, నందికొట్కూరు రూ.129.87 కోట్లు కేటాయించారు. ఈనెల 20వ తేదీ నుంచి టెండర్ల ప్రక్రియ ప్రారంభించారు. టెండర్ల దాఖలుకు మార్చి 17.. చివరి తేదీగా ప్రకటించారు. కర్నూలు నగరపాలక సంస్థతోపాటు ఆదోని పురపాలక సంఘం పరిధిలో ఇప్పటికే టెండర్ల ప్రక్రియ పూర్తైంది.

• నీటి పథకాల పూర్తికి ప్రభుత్వం చర్యలు

- కర్నూలు నగర సమీపంలో జగన్నాథగట్టు వద్ద 50 ఎంఎల్‌డీ సామర్థ్యంతో వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంటు, కర్నూలు, కల్లూరు ప్రాంతాల్లో నీటిని నిల్వ చేసుకునేందుకు వీలుగా 22 ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణం చేపట్టాలని నిర్ణయించిన పనులు మాత్రం జరగలేదు.
- ఆదోని పురపాలక సంఘం పరిధిలో గతంలో తెదేపా ప్రభుత్వ హయాంలో 80 శాతం వరకు పనులు పూర్తయ్యాయి.
- ఎమ్మిగనూరు మున్సిపాలిటీకి గాజులదిన్నె రిజర్వాయర్ నుంచి నీటిని తీసుకొచ్చేలా అధికారులు ప్రణాళికలు రూపొందించారు. పనులు కొంతమేర జరిగిన తర్వాత ప్రభుత్వం మారడంతో అసంపూర్తిగా మిగిలిపోయాయి.
- గూడూరు నగర పంచాయతీలో 1.60 ఎంఎల్‌డీ సామర్థ్యంతో చేపట్టనున్న ట్యాంకు పనులు, భాగంగా సుంకేసుల నుంచి 12 కి.మీ. పొడవున పైపులైను నిర్మాణం చేపట్టాల్సి ఉండగా పనులు ఆగిపోయాయి. పిల్లర్లెత్తి నిర్మాణం జరగలేదు.

గతంలో బిల్లులు అందక..

కర్నూలు జిల్లాలో కర్నూలు నగరపాలక సంస్థతోపాటు ఆదోని, ఎమ్మిగనూరు, ఆత్మకూరు, ఆళ్లగడ్డ, నందికొట్కూరు, గూడూరు మున్సిపాలిటీల పరిధిలో ఏఐఐబీ నిధులతో 2016లో బృహత్తర నీటి పథకాలు మంజూరయ్యాయి. వివిధ రిజర్వాయర్ల నుంచి పైపులైన్ల ద్వారా నీటిని తీసుకొని ప్రజలకు శుద్ధజలం అందించడమే ఈ పథకం లక్ష్యం. ఇందులో భాగంగా మంచి నీటి ట్యాంకుల నిర్మాణం, పైపులైన్ల ఏర్పాటు, నీటి శుద్ధి ప్లాంట్లు తదితరాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. అప్పట్లో తెదేపా ప్రభుత్వం నిధులు కేటాయించి పనులు ప్రారంభించింది. 2019లో వైకాపా ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అటకెక్కాయి. బిల్లులు రాకపోవడంతో గుత్తేదారులు పనులు ఆపేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం తాజాగా టెండర్లు పిలిచింది.

రంజాన్ వేళలు

పట్టణం	ఇఫ్తార్ (సోమ)	సహెరీ (మంగళ)
కర్నూలు	6:28	5:17
నంద్యాల	6:25	5:18
ఆదోని	6:26	5:17
ఆళ్లగడ్డ	6:25	5:21
బనగానపల్లి	6:27	5:14

కళావైభవం

ప్రముఖ శైవక్షేత్రమైన శ్రీశైలంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకుంటున్నాయి. హైదరాబాద్‌కు చెందిన శివశక్తి కూచిపూడి ఆర్ట్స్ అకాడమీ బృందం పలు ఆధ్యాత్మిక గీతాలకు సంప్రదాయ నృత్య ప్రదర్శనలు ఇచ్చింది. కళాకారులను దేవస్థానం అధికారులు సత్కరించారు.

– న్యూస్‌టుడే, శ్రీశైలం, నంది సర్కిల్

బందాని గుట్టపై కన్నేశారు

☛ విలువైన ప్రభుత్వ భూమి ఆక్రమణ

రామళ్లకోట (వెల్దుర్తి), న్యూస్‌టుడే: ప్రజా అవసరాలకు ఉపయోగించాల్సిన ప్రభుత్వ భూమిని యథేచ్ఛగా ఆక్రమించుకుంటున్నారు. పట్టపగలే యంత్రాల సాయంతో భూమిని చదును చేస్తున్నా అధికారులు దృష్టి సారించడం లేదు. మండలంలోని రామళ్లకోట గ్రామంలో సర్వే నంబరు 23లో 31.85 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో వెంకటలక్ష్మి అనే మహిళకు 1.88 ఎకరాల భూమికి డి.పట్టా ఇచ్చారు. మిగిలినది ప్రభుత్వ ఆధీనంలో ఉంది. ఇందులో రాళ్లు ఉండటంతో గతంలో కొందరు రాళ్లు కొట్టుకుని జీవనం సాగించేవారు. ఇటీవల భూముల ధరలకు రెక్కలు రావడం.. ఇక్కడ ఎకరా రూ.8 నుంచి రూ.10 లక్షల వరకు పలుకుతుండటంతో ఆక్రమణలకు కన్ను పడింది.

ప్రభుత్వ భూమిలో పొక్లెయిన్‌తో జరుగుతున్న తవ్వకాలు

"సర్వే నంబరు 23లోని ప్రభుత్వ భూమిలో యంత్రాలతో పనులు చేపట్టినట్లు మా దృష్టికి వచ్చింది. వీఆర్‌ఏను పంపి పనులు ఆపించాం. ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి తదుపరి చర్యలు చేపడతాం" అని రామళ్లకోట వీఆర్వో వెంకటేశ్వర్లు చెప్పారు.

ఎవరూ పట్టించుకోక..

గ్రామ సమీపంలోని బందానిగుట్టగా పేరొందిన ఈ ప్రాంతంపై కన్నేసిన ఓ వ్యక్తి యంత్రాల సాయంతో గత వారం రోజులుగా సుమారు 9 ఎకరాల్లో రాళ్లు తొలగిస్తున్నారు. మరోవైపు పట్టా భూమికి చెందిన సర్వే నంబరు 24లోని ఓ రైతుకు చెందిన పొలంలోకి ప్రవేశించి మట్టి తవ్వకాలు చేపట్టారన్న ఆరోపణలున్నాయి.

- ఎకరా రూ.8 లక్షల లెక్కన దాదాపు రూ.72 లక్షల విలువచేసే 9 ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురవుతున్నప్పటికీ రెవెన్యూ అధికారులు పట్టించుకోవడంలేదు. అధికారులు, నేతల అండదండలు ఉండటంతోనే ఆక్రమణలు జరుగుతున్నాయని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. దీంతో పాటు ప్రైవేటు భూమిలోనూ తవ్వకాలు సాగించి ఆక్రమించుకుని భూమిలోకి మట్టిని తరలించడం దారుణమని బాధిత రైతు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విలువైన భూమి ఆక్రమణలకు గురవకుండా తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

వేరుసెనగ.. ధర మెరిసెనుగ

దిగుబడులతో విపణి కళకళ

ఎమ్మిగనూరు వ్యవసాయం, న్యూస్‌టుడే : జిల్లాలో రబీలో సాగు చేసిన వేరుసెనగ పంట చేతికందుతోంది. దిగుబడులు తగ్గినా ధర ఆశాజనకంగా ఉంది. ఈ నేపథ్యంలో మార్కెట్‌కు దిగుబడులు రాక పెరిగింది.

జిల్లాలో రబీ కింద 50 వేల ఎకరాల్లో వేరుసెనగ సాగు చేశారు. పశ్చిమ ప్రాంతంలో బోర్లు, చెరువులు, గాజులదిన్నె జలాశయం, హంద్రీనీవా కాల్వ కింద ఎక్కువగా రైతులు సాగు చేపట్టారు. ఎకరాకు రూ.25 వేల నుంచి రూ.35 వేల వరకు పెట్టుబడి పెట్టారు. దిగుబడులు ఎకరాకు 20 నుంచి 35 బస్తాల వరకు వస్తోంది. దిగుబడులు తగ్గినప్పటికీ మద్దతు ధర కంటే రూ.3 వేల వరకు అధికంగా పలుకుతుండటంతో రైతులకు కొంతమేర ఊరట లభిస్తోంది.

మార్కెట్‌కు వచ్చిన వేరుసెనగ దిగుబడులు

సరుకు పోటెత్తుతూ..

జిల్లాలో వేరుసెనగ దిగుబడులు ఎమ్మిగనూరు మార్కెట్‌కు పోటెత్తుతున్నాయి. గత కొద్దిరోజులుగా సరుకు రాక పెరిగింది. ఆదివారం సంత కావడంతో వేరుసెనగ దిగుబడులతో కళకళలాడింది. మార్కెట్‌కు 260 మంది రైతులు 8,385 బస్తాలను అమ్మకానికి తెచ్చారు. క్వింటా గరిష్ఠ ధర రూ.10,617 మధ్యస్థ ధర రూ.8,611 కనిష్ఠ ధర రూ.4,808కు వ్యాపారులు కొనుగోలు చేశారు. సీజన్‌లో గతంలో మార్కెట్‌కు 12 వేల నుంచి 15 వేల బస్తాల వరకు వచ్చేవి. వేరుసెనగ సాగు తగ్గడంతోపాటు దిగుబడులు పడిపోవడంతో ఉత్పత్తుల రాక తగ్గింది. మరోవైపు సరుకు కొనుగోలు చేసేందుకు వ్యాపారులు ఆసక్తి చూపుతున్నారు.

- రబీలో పలువురు రైతులు అక్టోబరులో వేరుసెనగ సాగు చేపట్టారు. ఈ నేపథ్యంలో దిగుబడులు ఆశాజనకంగా వస్తున్నాయి. సరైన సమయంలోకాక ముందుగా.. ఆలస్యంగా వేసిన వేరుసెనగకు సంబంధించి దిగుబడులు కొంత తగ్గాయి. మరోవైపు వేరుసెనగ గ్రాసానికి మార్కెట్‌లో ఈసారి మంచి ధర పలుకుతుండటం విశేషం.

38 రోజులు.. రూ.11.37 కోట్లు

• సెస్సు వసూళ్లలో మార్కెట్ కమిటీల వెనుకబాటు

ఉమ్మడి జిల్లాలోని వ్యవసాయ మార్కెట్ కమిటీలు సెస్సు వసూళ్లలో వెనుకబడ్డాయి. 2025-26 సంవత్సరానికి రూ.67.06 కోట్ల వసూలు లక్ష్యంగా నిర్దేశించారు. ఈనెల 18వ తేదీ నాటికి రూ.55 కోట్లకు పైగా వసూలు చేశారు. ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు మరో 38 రోజులు మాత్రమే ఉంది. ఈలోగా మిగతా సెస్సు వసూలు చేయగలరా అన్నది ప్రశ్నార్థకంగా మారింది.

– న్యూస్‌టుడే, కర్నూలు మార్కెట్

కర్నూలు మార్కెట్‌కు వచ్చిన వాము దిగుబడులు

ఉమ్మడి జిల్లాలో 15 వ్యవసాయ మార్కెట్ కమిటీలు ఉన్నాయి. అందులో కర్నూలు, నంద్యాల, ఆదోని, ఎమ్మిగనూరు, ఆళ్లగడ్డ వ్యవసాయ మార్కెట్‌లో పెద్దఎత్తున పంట ఉత్పత్తుల క్రయవిక్రయాలు జరుగుతుంటాయి. మిగిలిన వాటిల్లో పెద్దగా జరగవు. చెక్‌పోస్టులు, స్థానిక మిల్లర్లు, వ్యాపారుల నుంచి 1 శాతం సెస్సు వసూలు చేయాల్సి ఉంది. 2025 ఖరీఫ్‌లో అధిక వర్షాల కారణంగా పంట దిగుబడులు పూర్తిగా తగ్గిపోయాయి. ఉల్లి, మొక్కజొన్న, మినుములు, పొద్దుతిరుగుడు విత్తనాలు, కందులు, శనగలకు గిట్టుబాటు ధరలు లేకపోవడంతో సెస్సు వసూళ్లలో మార్కెట్ కమిటీలు చతికిలపడ్డాయి.

కర్నూలు జిల్లాలో 2025-26లో ఈనెల 18 వరకు వసూలు చేసిన సెస్ వివరాలు (రూ.కోట్లలో)

మార్కెట్ కమిటీ	సెస్సు లక్ష్యం	వసూలైంది
కర్నూలు	8.70	5.29
ఆదోని	18	16.92
ఎమ్మిగనూరు	8.50	6.75
ఆలూరు	1.10	0.51
కోడుమూరు	1.80	1.36

పత్తికొండకు.. టమాట అండ

- పత్తికొండ మార్కెట్ కమిటీ సెస్సు వసూళ్ల లక్ష్యాన్ని అధిగమించింది. ఇక్కడ టమాట క్రయవిక్రయాలు మాత్రమే జరుగుతాయి.
- ఆదోని మార్కెట్‌లో పత్తి క్రయవిక్రయాలు రికార్డు స్థాయిలో జరుగుతాయి. సీసీఐ ద్వారా కొనుగోలు చేసిన పత్తికి సంబంధించి ఒక శాతం సెస్సు జమ కావడంతో ఇప్పటికే విపణికి రూ.16.92 కోట్లు వచ్చింది.

కర్నూలులో కష్టమే..

- కర్నూలు మార్కెట్ కమిటీ.. సెస్సు వసూళ్లలో లక్ష్యానికి చేరుకొనేందుకు ఆపసోపాలు పడుతోంది. ఇప్పటివరకు రూ.5.29 కోట్లు మాత్రమే వసూలైంది. ఇంకనూ రూ.3.41 కోట్ల సెస్సు కావాల్సి ఉంది. ఈ మొత్తం రావడం కష్టమేనని సిబ్బంది పేర్కొంటున్నారు.

ప్రయాణించాలంటే.. గుండె రాయి చేసుకోవాల్సిందే

40వ జాతీయ రహదారిలో సూగూరు మెట్ట-తమ్మరాజుపల్లె మధ్య మూలమలుపులో కొండరాళ్లు ప్రమాదకరంగా ఉన్నాయి. ఇక్కడ కొండ ప్రాంతాన్ని తవ్వి రోడ్డు వేశారు. రహదారి ఇరువైపులా రక్షణ గోడలు నిర్మించకపోవడంతో కొండ చరియలు విరిగి పడుతున్నాయి. రోడ్డు పక్కనే పెద్దపెద్దరాళ్లు ఉండటంతో వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఏమాత్రం ఏమరుపాటుగా వాహనం నడిపినా ప్రమాదాలు జరిగే ఆస్కారముంది. నిత్యం రద్దీగా ఉండే జాతీయ రహదారిపై రాత్రివేళలో ప్రమాదాలు జరిగే అవకాశముంది. – ఈనాడు, కర్నూలు

నేడు న్యాయవాదుల విధుల బహిష్కరణ

కర్నూలు గాయత్రి ఎస్టేట్, న్యూస్‌టుడే : కర్నూలుకు చెందిన న్యాయవాది పవన్‌కుమార్‌పై స్థానిక నాలుగో పట్టణ సీఐ విక్రమ్‌సింహ దాడి చేయడాన్ని నిరసిస్తూ సోమవారం జిల్లా వ్యాప్తంగా న్యాయవాదులు విధులు బహిష్కరిస్తున్నట్లు జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హరినాథ్‌చౌదరి, కార్యదర్శి వెంకటేశ్వర్లు తెలిపారు. న్యాయవాదిపై దాడి చేసిన సీఐపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని భారత న్యాయవాదుల సంఘం కార్యదర్శి రవికాంత్‌ప్రసాద్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. దాడి ఘటనను ప్రతిఒక్కరూ ఖండించాలని కోరారు. సీఐను తక్షణమే సస్పెండ్ చేసి క్రిమినల్ కేసు నమోదు చేయాలని ప్రజా పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు, న్యాయవాది బలరాం డిమాండ్ చేశారు.

అక్రమాలు కనపడకొండ

పచ్చటి కొండలు.. ప్రశాంతమైన వాతావరణం.. దూరం నుంచి చూస్తే పచ్చదనంతో ఆహ్లాదకరంగా ఉంటుంది. దగ్గరికి వెళ్లి చూస్తే గానీ.. అక్రమాలు గోచరించవు.. అక్రమార్కులు యథేచ్ఛగా కొండలను పిండి చేసేస్తున్నారు. లీజులున్న ప్రాంతాల్లో ఖనిజం బయటకు వెళ్లాలన్నా.. పరిశ్రమల యజమానులు కొనుగోలు చేయాలన్నా అధికార పార్టీ నేతలు ఆదేశాలు ఉండాల్సిందే. లేకుంటే అనధికార దాడులు జరుగుతాయి. ముప్పుతిప్పలు తప్పవు. – న్యూస్‌టుడే, నంద్యాల

• గుట్టుగా తవ్వి పరిశ్రమలకు తరలింపు

కన్నపకుంట గ్రామ సమీపంలో జరిగిన తవ్వకాలు

మాట వినకుంటే అనధికార దాడులే

ఉమ్మడి జిల్లాలోని డోన్, బనగానపల్లి ప్రాంతాల్లో విలువైన డోలమైట్, సున్నపురాయి, తెల్లసుద్దరాయి, వైట్‌షెల్ తదితర ఖనిజాలు ఉన్నాయి. డోన్ పరిధిలో తెల్లసుద్ద, డోలమైట్ సమృద్ధిగా లభిస్తోంది. ఈ నేపథ్యంలో కన్నపకుంట, ధర్మవరం, కమలాపురం, కొచ్చెర్వు, బావిపల్లె, చంద్రపల్లె తదితర ప్రాంతాల్లో తవ్వేస్తున్నారు. డోలమైట్, తెల్లసుద్దకు సంబంధించి పదుల సంఖ్యలో అనుమతులున్నాయి. అనుమతులున్నవారు తవ్వకాలు సాగించాలంటే అధికార పార్టీ నేత అండదండలు ఉండాల్సిందే. సొంతంగా పనులు చేపడితే.. అధికారులతో అనధికార దాడులు చేయిస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

తనిఖీలు నామమాత్రమే

- డోన్ పరిధిలోని కొండ ప్రాంతాల్లో విలువైన ఖనిజాలను అక్రమార్కులు టిప్పర్ల ద్వారా డోన్ సమీపంలోని పరిశ్రమలకు తరలిస్తున్నారు. ఖనిజ నిక్షేపాలను ఒకచోట నిల్వ చేసి అక్కడి నుంచి ప్రతిరోజూ ఎలాంటి అనుమతులు లేకుండానే టిప్పర్ల ద్వారా అధిక లోడుతో తరలిస్తున్నారు. మైనింగ్ చెక్‌పోస్టు ఉన్నప్పటికీ నేతల అండదండలు ఉండటంతో తనిఖీలు లేకుండానే ఖనిజం తరలిపోతోంది.
- డోన్ పరిధిలో అక్రమంగా తవ్విన తెల్లరాయి సుద్దను పరిశ్రమల నిర్వాహకులకు టన్ను రూ.250 నుంచి రూ.260 వరకు అమ్ముతున్నట్లు సమాచారం. ప్రతిరోజూ 1,000 టన్నుల వరకు తరలిస్తున్నారు. నిత్యం రూ.లక్షల విలువైన ఖనిజాన్ని కొల్లగొట్టి సొమ్ము చేసుకుంటున్నారు.

వారి కనుసన్నల్లో..

- కన్నపకుంట, బావిపల్లె, కొచ్చెర్వు తదితర ప్రదేశాల్లోని కొండల్లో యంత్రాల ద్వారా సుద్దరాయి తవ్వకాలు సాగిస్తున్నారు. ప్రతిరోజూ వెయ్యి టన్నులకు పైగా సుద్దరాయిని అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం. ఇక్కడి నుంచి డోన్ సమీపంలోని పరిశ్రమలకు తెల్ల సుద్దతోపాటు డోలమైట్, ఇతర ఖనిజాలను తరలిస్తుంటారు. అక్కడ పౌడర్‌గా మార్చి పరిశ్రమలకు సరఫరా చేస్తుంటారు. ఆయా ప్రాంతాల్లో అక్రమంగా తవ్విన సుద్దరాయి తదితరాలనే వాడాలంటూ ప్రజాప్రతినిధి అండదండలున్న ఓ నేత.. పరిశ్రమల నిర్వాహకులకు హుకుం జారీ చేసినట్లు సమాచారం.
- మరో మతలబు ఏంటంటే.. లీజుదారులు టన్నుకు రూ.100 చెల్లిస్తే.. అక్రమంగా సరకు తీసుకొన్నవారి నుంచి టన్ను రూ.180 చొప్పున కొనుగోలు చేయాల్సిందే. తక్కువకు వస్తుందని ఇతరుల నుంచి కొనుగోలు చేస్తే.. అధికార పార్టీ నేతల ఆగ్రహానికి గురవ్వాల్సిందే. మైనింగ్, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు అందుతున్నా చర్యలు శూన్యమే.

జోడు రథోత్సవం.. గురుశిష్యుల వైభవం

గూళ్యం (హాలహర్వి), న్యూస్‌టుడే : మండల పరిధిలోని గూళ్యం గ్రామంలో గాదిలింగేశ్వరస్వామి జోడు రథోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. స్వామి గురువైన సిద్ధేశ్వరుడికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గాదిలింగేశ్వరస్వామికి వేదవతి నుంచి ప్రత్యేక జలం తీసుకొచ్చి అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. స్వామి దర్శనార్థం భక్తులు గంటల తరబడి వేచి ఉన్నారు. గ్రామపెద్ద కరణం రాఘవేంద్రస్వామి, రఘునందనగౌడు కుటుంబాలు మేళాతాళాలతో స్వామివారికి ప్రత్యేక కలశాలతో వచ్చి.. రథాలకు ప్రత్యేక పూజలు చేశాయి. అనంతరం గాదిలింగేశ్వరుడి రథోత్సవం ప్రారంభమైంది. స్వామివారి నామస్మరణల మధ్య జోడు రథాలు ముందుకు కదిలాయి. హాలహర్విలోపి బీరప్ప ఆలయం, బాపురం, జె.హోస్కళ్లి, సిద్ధాపురం గ్రామాల్లో రథోత్సవాలను తిలకించేందుకు వచ్చిన భక్తులకు అన్నదానం చేశారు. ఈవో రాధాకృష్ణ మాట్లాడుతూ జోడు రథోత్సవం విజయవంతమైందని, భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టామని తెలిపారు.



భక్తజనసందోహం నడుమ ముందుకు సాగుతున్న సిద్ధేశ్వరస్వామి, గాదిలింగేశ్వరస్వామి జోడు రథాలు



వంతెన ఇరుకు.. ప్రయాణం బెరుకు

ఆళ్లగడ్డ మండలంలోని అహోబిలం రహదారిలో గండ్లేరు సమీపంలోని తెలుగు గంగ కాల్వపై వంతెన ఇరుకుగా మారింది. గతంలో ఆళ్లగడ్డ నుంచి అహోబిలం వరకు రెండు వరుసల రహదారికి నిధులు మంజూరు కావడంతో ఆర్అండ్‌బీ శాఖ అధికారులు రోడ్డు విస్తరణ చేపట్టారు. కాని గండ్లేరు వద్ద తెలుగు గంగ కాల్వ వంతెనను విస్తరించలేదు. అటవీ ప్రాంతంలో ఉండటంతో అటవీశాఖ అధికారులు పనులకు అనుమతించలేదు. దీంతో అధికారులు చేసేదేమీలేక ఉన్న వంతెనపై రోడ్డు వేసి వదిలేశారు. దారి ఇరుకుగా ఉండటంతో పెద్ద వాహనం వస్తే రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. ఇరుకు రోడ్డును విస్తరిస్తే ఇబ్బందులు తొలగుతాయని వాహనదారులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, ఆళ్లగడ్డ గ్రామీణం

ప్రాణాలుపోతున్నా.. మారరే!

కోవెలకుంట్ల, బనగానపల్లి మండలాల్లో వ్యవసాయ మహిళా కూలీలు.. ఎక్కడ పని దొరికితే అక్కడికి వెళ్తుంటారు. పని ప్రాంతాలకు చేరుకోవడానికి ట్రాక్టర్లు, ఆటోలను ఆశ్రయిస్తారు. కోవెలకుంట్ల మండలం అమడాల గ్రామ సమీపంలో ఆదివారం ఓ ట్రాక్టరు ఇంజిన్‌పై అధిక సంఖ్యలో మహిళా కూలీలు ప్రమాదకరంగా ప్రయాణించారు. ఏ మాత్రం పట్టు తప్పిన ప్రమాదం తప్పదు. ఇటువంటి ప్రయాణాలపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. - న్యూస్‌టుడే, కోవెలకుంట్ల పట్టణం

తీగల ఉయ్యాల.. ఊపిరి తీసేలా

కల్లూరు పట్టణ పరిధిలోని ఆదిత్యనగర్ సమీపంలో ఓ ప్రార్థనా మందిరానికి వెళ్లే మార్గంలో రెండు విద్యుత్తు స్తంభాలు ఓ వైపు వాలిపోయాయి. తీగల ఆధారంగా వేలాడుతున్నాయి. కొన్ని నెలలుగా ఇవి ప్రమాదకరంగా ఉన్నాయని.. సరిచేయాల,ఇ నగరపాలక, విద్యుత్తు శాఖ అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ప్రమాదాలు జరగక ముందే స్తంభాలను సరిగా పాతించాలని విన్నవిస్తున్నారు.

- న్యూస్‌టుడే, కర్నూలు మార్కెట్

ప్రమాదాన్ని కప్పిపుచ్చారు

కర్నూలు సర్వజన ఆసుపత్రిలో వైద్యుల వాహనాలు నిలిపే ప్రదేశం వద్ద కూడలిలో రహదారికి అడ్డంగా ప్రవహిస్తున్న మురుగు కాలువపై కల్వర్టు పూర్తిగా నిర్మించలేదు. మలుపులో కొంత భాగాన్ని వదిలేశారు. రోడ్డు అంచుల్లోనే మూత లేకుండా ఉన్న కాలువపై పాత ఫ్లెక్సీని మూసి ఉంచారు. నిత్యం వైద్యులు, సిబ్బంది, రోగులు ఈ దారిలో రాకపోకలు సాగిస్తుంటారు. పగలు ఏమరపాటుగా ఉన్నా.. రాత్రిళ్లు చీకట్లో దీనిని గుర్తించకున్నా కాలువలో పడిపోయే ప్రమాదం ఉంది. దీనివల్ల ద్విచక్ర వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారని.. అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో కల్వర్టు నిర్మించాలని సిబ్బంది కోరుతున్నారు. - ఈనాడు, కర్నూలు

భావన బాదుడు.. రిషి దూకుడు

◆ క్రికెట్‌లో కర్నూలు క్రీడాకారుల సత్తా

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే : నగరానికి చెందిన క్రీడాకారులు భావన, రిషి క్రికెట్‌లో అద్భుత ప్రతిభ చూపుతున్నారు. క్రికెట్‌పై ఆసక్తితో బ్యాట్ పట్టిన వీరు.. శిక్షణ తీసుకుంటూ.. నిత్యం సాధన చేస్తూ ఆటలో మెలకువలు నేర్చుకున్నారు. పోటీల్లో పరుగుల వరద పారిస్తూ ప్రశంసలు అందుకుంటున్నారు. ఫీల్డింగ్, కీపింగ్‌లోనూ రాణిస్తూ ఆల్‌రౌండర్లుగా పేరు గాంచారు. పలు జిల్లా, రాష్ట్రస్థాయి అండర్-14, అండర్-15 క్రికెట్ పోటీల్లో సత్తా చాటారు. జాతీయస్థాయి మ్యాచ్‌లలో రాణించిన భారత జట్టుకు ఎంపికవ్వడమే లక్ష్యమని వీరు చెబుతున్నారు.

మైదానంలో పరుగుల వరద

ఎన్‌ఆర్‌పేటకు చెందిన డి.భావన 8వ తరగతి చదువుతోంది. తండ్రి బాలాజీ రాష్ట్ర క్రికెట్ జట్టు మాజీ క్రీడాకారుడు. తండ్రి వద్ద మూడేళ్ల కిందట క్రికెట్ నేర్చుకున్న భావన ప్రస్తుతం హైదరాబాద్‌లో మాజీ ఇండియన్ క్రికెటర్ ఎమ్మెస్కే ప్రసాద్ పర్యవేక్షణలో శిక్షణ తీసుకుంటోంది.

◆ 2025 జూన్‌లో నెల్లూరులో జరిగిన రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నీలో కర్నూలు జట్టు తరపున ఓపెనింగ్ బ్యాటర్‌గా బరిలో దిగి 84 పరుగులు చేసింది. ◆ 2025 డిసెంబరు 12న నెల్లూరు జిల్లా వెంకటగిరిలో జరిగిన రాష్ట్ర జట్టు ఎంపిక పోటీల్లో సత్తా చాటి ఏసీఏ ప్రాబబుల్స్‌కు ఎంపికైంది. ◆ ఈనెల 3 నుంచి 28వ తేదీ వరకు జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎం.ఎ.ఇస్మాన్ మెమోరియల్- 2026 అండర్- 14 క్రికెట్ టోర్నీలో కర్నూలు- బి జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తోంది. ఇప్పటి వరకు జరిగిన మూడు మ్యాచులలో ఆదోనిపై 63, కోడుమూరుపై 75, కర్నూలు-సి జట్టుపై 36 పరుగులు చేసింది.

కెప్టెన్.. ఉత్తమ బ్యాట్స్‌మెన్

నగరంలోని గుత్తి పెట్రోల్ బంకు ప్రాంతంలో నివసిస్తున్న రిషి 8వ తరగతి చదువుతున్నాడు. ఐదేళ్లుగా శిక్షకుడు సమీర్ అలీఖాన్ వద్ద క్రికెట్‌లో తర్ఫీదు పొందుతున్నాడు. ◆ 2024లో కడపలో జరిగిన అండర్-12 క్రికెట్ పోటీల్లో కర్నూలు జిల్లా జట్టు కెప్టెన్‌గా వ్యవహరించాడు. ఈ టోర్నీలో మూడు మ్యాచ్‌లలో 150 పరుగులు చేశాడు. వికెట్ కీపర్‌గా కూడా అద్భుత ప్రదర్శన చేశాడు. ◆ 2024 జూన్ 15న నెల్లూరులో జరిగిన అండర్-14 రాష్ట్రస్థాయి టోర్నీలో మూడు మ్యాచ్‌లలో 100 పరుగులు చేశాడు. * 2025లో కడప వైఎస్సార్ స్టేడియంలో జరిగిన అంతర్-14 రాష్ట్రస్థాయి పోటీల్లో కడపపై 68, అనంతపురంపై 42, నెల్లూరుపై 71 పరుగులు చేసి ఉత్తమ బ్యాటర్‌గా ఎంపికయ్యాడు. ◆ 2025 అక్టోబరులో మంగళగిరి ఏసీఏ మైదానంలో జరిగిన పోటీల్లో సౌత్ జోన్ తరపున ఆడి నార్త్‌జోన్‌పై 69, రెస్టాఫ్ సెంట్రల్ జోన్‌పై 32 పరుగులు చేశాడు. ◆ ఈనెల 3వ తేదీ నుంచి కర్నూలులో జరుగుతున్న ఎం.ఎ.ఇస్మాన్ మెమోరియల్ ట్రోఫీ పోటీల్లో కర్నూలు- సి జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తూ.. ఆదోనిపై 165, కోడుమూరుపై 37 పరుగులు చేశాడు. కీపర్‌గా 6 క్యాచ్‌లు అందుకుని ఆల్‌రౌండర్ ప్రతిభ చాటాడు.

భక్తులతో కిక్కిరిసిన నారసింహ క్షేత్రం

అహోబిలం(ఆళ్లగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: అహోబిలం నృసింహుని క్షేత్రం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. స్వామి బ్రహ్మోత్సవాలను తిలకించేందుకు దూర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ప్రత్యేక వాహనాల్లో తరలిరావడంతో ఎగువ అహోబిలం రహదారి వాహనాలతో నిండి రద్దీ నెలకొంది. భక్తుల తాకిడి అధికంగా ఉండటంతో స్వామి దర్శనానికి బారులు తీరి గంటల తరబడి క్యూలైన్‌లో నిలబడాల్సి వచ్చింది. ఎగువ, దిగువ ఆలయాలతో పాటు నల్లమల అటవీ ప్రాంతంలోని మాలోల, వరాహ, పావన నృసింహస్వామి ఆలయాలను దర్శించుకుని భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

దర్శనానికి బారులు తీరిన భక్తులు

మల్లన్నసేవలో మంత్రి సంధ్యారాణి

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జునస్వామి వార్లను ఆదివారం రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. దర్శనార్థం వచ్చిన ఆమెకు ఆలయ మహాద్వారం వద్ద ఏఈవో కె.వెంకటేశ్వరరావు సాదర స్వాగతం పలికారు. అనంతరం మంత్రి కుటుంబ సభ్యులతో కలిసి శ్రీస్వామి వారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన పూజలు నిర్వహించుకున్నారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో అర్చకులు వేదాశీర్వచనాలు పలికి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

మంత్రికి స్వామిఅమ్మవార్ల జ్ఞాపిక అందజేస్తున్న ఏఈవో

శాలరీ కాలిక్యులేటర్ పేరుతో సైబర్ మోసాలు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : ఎనిమిదో వేతన సంఘం, జీతాల పెరుగుదల పేరుతో సైబర్‌నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారని, ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ విక్రాంత్‌పాటిల్ ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. 8వ సీపీసీ శాలరీ కాలిక్యులేటర్, శాలరీ రివిజన్ టూల్ పేరుతో సామాజిక మాధ్యమాల ద్వారా ఏపీకే ఫైళ్లను పంపుతున్నారన్నారు. వాటికి క్లిక్ చేసినట్లయితే సెల్‌ఫోన్‌లోని సమాచారం మొత్తం సైబర్‌నేరగాళ్లకు చేరుతుందని, బ్యాంకు ఖాతాల్లోని సొమ్మును కాజేస్తారని హెచ్చరించారు. ఇప్పటికే జిల్లాలో ఇలాంటి మోసాలపై పలు కేసులు నమోదైనట్లు వెల్లడించారు. ఏపీకే పేరుతో వచ్చే ఫైళ్లను క్లిక్ చేయవద్దని, శాలరీ కాలిక్యులేటర్, 8 సీపీసీ టూల్ పేర్లతో వచ్చే యాప్‌ను డౌన్‌లోడు చేయవద్దని సూచించారు. అపరిచిత వ్యక్తులకు బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీ వివరాలు చెప్పవద్దన్నారు.

విభిన్న ప్రతిభావంతుల బ్యాడ్మింటన్ పోటీలు రేపు

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే : నగరంలోని డీఎస్ఏ స్టేడియంలో విభిన్న ప్రతిభావంతులకు స్టీఫెన్ హాకింగ్ పారా స్పోర్ట్స్, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 24వ తేదీన జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు ఎల్లప్ప ఆదివారం తెలిపారు. జిల్లాస్థాయిలో ప్రతిభ చూపిన వారు రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారని వెల్లడించారు.

న్యాయవాదులకు జాతీయ భావన అవసరం

నెల్లూరు(లీగల్), న్యూస్‌టుడే: న్యాయవాదుల్లో జాతీయ భావన ఉండాలని న్యాయవాద పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు అశ్వినీకుమార్ పేర్కొన్నారు. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరులో ఆదివారం న్యాయవాద పరిషత్ రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్ జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశ సమైక్యత, సమగ్రత కాపాడడంలో న్యాయవాదులు తమ వంతు పాత్ర పోషించాలన్నారు. దక్షిణ భారత అధికారి మోహన్‌కరూర్ మాట్లాడుతూ న్యాయవాది తమ వృత్తితోపాటు సామాజిక కార్యకర్తగా సమాజ ఉన్నతి కోసం పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు డమరేశ్వర్, రాష్ట్ర, జిల్లాల పదాధికారులు, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

ఆదోని జిల్లా సాధన దీక్షలకు వంద రోజులు

ఆదోని ఎస్కేడీ కాలనీ, న్యూస్‌టుడే: ఆదోని జిల్లా సాధన కోసం ఐకాస ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు సోమవారానికి వంద రోజులకు చేరాయి. పట్టణంలో పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఐకాస నాయకులు తెలిపారు. నాయకులు రఘురామయ్య, కృష్ణమూర్తిగౌడు, దస్తగిరి నాయుడు, కోదండ, లలితమ్మ తదితరులు ఆదివారం మాట్లాడుతూ.. ఆదోని డివిజన్ పరిధిలోని ఆదోని, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆలూరు, పత్తికొండ నియోజకవర్గాలు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నాయని.. వీటి అభివృద్ధి కోసం

ఆదోనిలో రిలే నిరాహారదీక్షలు చేస్తున్న ఐకాస నాయకులు

ఆదోని కేంద్రంగా ఆదోని జిల్లాగా ప్రకటించాలని డిమాండు చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి స్పందించి ఆదోని జిల్లాగా ప్రకటించాలని డిమాండు చేశారు. వంద మంది సీపీఐ నాయకులతో నిరాహారదీక్షలు, ఉద్యమ, జానపద, విప్లవ గీతాలు, భజన పాటలు, గొరవయ్యల నృత్య ప్రదర్శనలు, బుర్రకథ, నిరసన ర్యాలీ, బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం ప్రధాన రహదారిపై వంటావార్పు చేపడుతున్నామన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో పార్టీలకు అతీతంగా నాయకులు, కార్యకర్తలు, ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు స్వచ్ఛంద సంస్థలు, వ్యాపారులు, ఉద్యోగులు, కార్మికులు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

వైభవంగా గంధం ఉత్సవం

గోనెగండ్ల, న్యూస్‌టుడే: మండలంలోని గంజహళ్లిలో వెలసిన మహాత్మ బడేసాహెబ్ స్వామి ఉరుసులో భాగంగా గంధం ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గాలో స్వామి సమాధికి దర్గా పీఠాధిపతులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉరుసు సందర్భంగా దర్గాను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఆదివారం ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి, ఎంపీ బస్తిపాటి నాగరాజులు దర్గాను సందర్శించారు. ఈ సందర్భంగా దర్గా పీఠాధిపతులు వారిని స్వాగతించి ఘనంగా సన్మానించారు. అనంతరం దగ్గరుండి దర్శనం చేయించారు. కార్యక్రమంలో పీఠాధిపతులు మాహబూబ్‌బాషా, చిన్నముద్దుగోల్, రాష్ట్ర కురువ సంఘం డైరెక్టర్ రామకృష్ణ, మార్కెట్‌యార్డు ఛైర్మన్ మల్లయ్య, తెదేపా మండల కన్వీనర్ తిరుపతయ్యనాయుడు, బందె నవాజ్, కృష్ణమనాయుడు, శ్రీనివాసులు, రంగారెడ్డి, వలి, లక్ష్మన్న, బడేసా తదితరులు పాల్గొన్నారు.

దర్గాలో ఎమ్మెల్యే బీవీ, ఎంపీ బస్తిపాటి నాగరాజు తదితరులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఆలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: మొలగవల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ఆదివారం పదో తరగతి వివిధ బ్యాచ్‌లకు చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికి పూర్వ విద్యార్థి, సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ హాజరై మాట్లాడారు. పాఠశాలలో పలు సమస్యలు ఉన్నాయని, మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చొరవ చూపుతామన్నారు. పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు కూడా ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మోహన్‌రాజు, కవి వేలూరు రంగన్న, నిర్వాహకులు నాగేంద్ర, భూపేష్, ధనుంజయ్, విజయ్, పటేల్ యాదవ్, శశికళ, రాంనాథ్‌యాదవ్, ఏలూరు తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పూర్వ విద్యార్థి, సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ

అప్పలాపురంలో చమురు నిక్షేపాల సర్వే

కోవెలకుంట్ల పట్టణం, న్యూస్‌టుడే: బనగానపల్లి మండలం అప్పలాపురం గ్రామ శివారులోని పొలాల్లో చమురు నిక్షేపాల కోసం సర్వే నిర్వహిస్తున్నారు. ఓఎన్‌జీసీ గ్యాస్ సంస్థ సర్వేలో భాగంగా రైతుల పొలాల్లో బోర్లు వేస్తున్నారు. తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా, అనుమతులు తీసుకోకుండా బోర్లు వేస్తుండమేంటని రైతులు ప్రశ్నిస్తున్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సర్వే చేస్తున్నట్లు సిబ్బంది చెప్పారు.

రాఘవేంద్ర స్వామి సన్నిధిలో కేంద్రమంత్రి

మంత్రాలయం గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మంత్రాలయంలో రాఘవేంద్ర స్వామి గురువైభవోత్సవాలు అట్టహాసంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఆదివారం రాత్రి కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి క్షేత్రాన్ని సందర్శించారు. ఆయనకు శ్రీమఠం అధికారులు సాదర స్వాగతం పలికారు. ముందుగా గ్రామదేవత మంచాలమ్మను, అనంతరం రాఘవేంద్ర స్వామి మూలబృందావనాన్ని మంత్రి దర్శించుకున్నారు. మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఆయనకు శేసవస్త్రం, ఫల మంత్ర అక్షింతలు అందించి ఆశీర్వదించారు. యోగీంద్ర మండపంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలను మంత్రి తిలకించారు. అనంతరం ఆయనకు పీఠాధిపతి గురువైభవోత్సవ పురస్కారాన్ని అందించారు. కళాకారుల సంప్రదాయ నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పురస్కారాలు అందుకున్న వారిలో కేసీఏ అధ్యక్షుడు వెంకటేష్ ప్రసాద్, సీనియర్ అడ్వకేట్ రఘురామ్ ఉన్నారు.

కేంద్రమంత్రి హెచ్‌డీ కుమారస్వామికి గురువైభవోత్సవ పురస్కారం అందజేస్తున్న పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు

మహానంది ఆలయానికి రూ.65 లక్షల విరాళం

మహానంది, న్యూస్‌టుడే: మహానంది పుణ్యక్షేత్రంలో భక్తుల వసతుల కోసం రూ.10.50 కోట్లతో నిర్మిస్తున్న 55 గదుల వసతి సముదాయంలోని మొదటి అంతస్తు నిర్మాణానికి దాత రూ.65 లక్షల చెక్కును ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డికి అందజేశారు. హైదరాబాద్‌లోని యల్లారెడ్డిగూడకు చెందిన ప్రవాస భారతీయురాలు వడ్లమూడి సరోజినీ తన తల్లిదండ్రులైన దివంగత వీరమాచినేని వీరరాఘవయ్య, నాగభూషణమ్మల జ్ఞాపకార్థం రూ.1.25 కోట్ల విరాళం అందజేయడానికి గతంలోనే అంగీకారం తెలిపారు. ఈ క్రమంలోనే తొలి విడతగా రూ.65 లక్షలు అందజేశారు. ఈ సందర్భంగా ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, ఏఈవో ఎర్రమల మధు, అర్చకులు దాతను సత్కరించారు.

ఈవో శ్రీనివాసరెడ్డికి చెక్కు అందజేస్తున్న దాత సరోజిని

రాష్ట్రస్థాయి ఉత్తమ బీపీఎం అవార్డు

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: నంద్యాల జిల్లా బనగానపల్లె మండలంలోని జిల్లెల్ల పోస్ట్‌మాస్టర్ కె.భాస్కర ప్రసాద్ రాష్ట్రస్థాయి ఉత్తమ బీపీఎం అవార్డు దక్కింది. ఆదివారం గుంటూరులో జరిగిన జీడీఎస్ సమ్మేళన్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి చేతుల మీదుగా ఆయన ఈ పురస్కారాన్ని అందుకున్నారు. తపాలా శాఖలో ఆయన చేసిన సేవలకు ఈ అవార్డు వచ్చింది. సహోద్యోగులు ఆయనకు అభినందనలు తెలిపారు. అవార్డుకు ఎంపిక కావడం ఆనందంగా ఉందని మరింత నిబద్ధతతో తపాలా సేవలు అందిస్తానని భాస్కర ప్రసాద్ తెలిపారు.

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతులమీదుగా పురస్కారం అందుకుంటున్న కె.భాస్కరప్రసాద్

సమీపంలోని వారే చూసుకోవాలి

❑ క్షేత్రసహాయకులకు అదనపు బాధ్యతలు ❑ రూ.3500 చెల్లింపు

హాలహర్వి, ఆలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లో వలసలు వెళ్లకుండా స్థానికంగా ఉపాధి పొందాలని ఉద్దేశంతో ఉపాధి హామీ పథకం ప్రవేశపెట్టింది. దీన్ని ప్రత్యేకంగా చట్టం రూపొందించింది. అందులో మార్పులు చేస్తూ.. వచ్చారు. శ్రామికులకు పని కల్పించడంలో క్షేత్ర సహాయకుడి పాత్ర కీలకం. అలాంటి పోస్టులు గ్రామాల్లో ఖాళీగా ఉండటంతో ఆయా గ్రామాల్లో పనులు పూర్తిస్థాయిలో కల్పించడం లేదు. ఫలితంగా సరైన పనులు లేక ఇతర ప్రాంతాలకు వలసబాటా పడుతున్నారు. అలాంటి వాటి నుంచి తాత్కాలికంగా బయటపడేందుకు సమీప గ్రామాల్లో విధులు నిర్వహిస్తున్న క్షేత్రసహాయకులకు అదనపు బాధ్యతలు ఇచ్చేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

● జిల్లాలో అడిగిన ప్రతి కుటుంబానికి ఉపాధి హామీ పని కల్పించాలి. ఇందుకు ప్రతి గ్రామ పంచాయతీకి ఒక్కో క్షేత్రసహాయకుడు ఉండాలి. వీరి ఆధ్వర్యంలో ఉపాధి పనులు జరగాలి. ప్రభుత్వాలు మారిన ప్రతిసారి క్షేత్ర సహాయకులను మారుస్తూ వస్తున్నారు. ప్రస్తుతం ఖాళీలు ఉన్న చోట పోస్టులు భర్తీ చేయడం లేదు. స్థానికంగా ఉన్న మేటీలకు బాధ్యతలు అప్పగించాలనే ఆదేశాలు అందాయి. వీరితో కూడా పూర్తిస్థాయిలో పనులు జరగడం లేదని ప్రభుత్వం గుర్తించింది. క్షేత్రసహాయకులు లేనిచోట సమీప గ్రామాల్లో పనిచేస్తున్న క్షేత్ర సహాయకులకు అదనంగా బాధ్యతలు అప్పగించేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

ఉపాధి పనులు చేస్తున్న శ్రామికులు

● ఆదోని నియోజకవర్గంలో 40 పంచాయతీలకు గాను 16,024 జాబ్ కార్డులు ఉన్నాయి. 12 పంచాయతీలకు క్షేత్ర సహాయకులు లేరు.

● ఆలూరు నియోజకవర్గంలో 108 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇందులో 54 వేల కుటుంబాలకు ఉపాధి పత్రాలు మంజూరు చేశారు. మొత్తం 30 గ్రామాలకు క్షేత్రసహాయకులు లేరు. జిల్లా వ్యాప్తంగా చాలా పంచాయతీలది ఇదే పరిస్థితి.

అక్కడ వారి సేవలే కీలకం

సమీప గ్రామాల్లో పనిచేస్తున్న క్షేత్ర సహాయకులకు అదనపు బాధ్యతలు అప్పగించనున్నారు. వారికి నెలకు రూ.3వేలు, టీఏ కింద రూ.500 అదనంగా చెల్లించేందుకు ఉత్తర్వులు జారీ చేసింది.

● జీ రామ్‌జీ పథకంలో పనులు చేయించడంలో క్షేత్ర సహాయకులు కీలకం. ప్రతి ఆర్థిక సంవత్సరంలో పనులు ప్రారంభం నుంచి ముగింపు వరకు రికార్డులు భద్రం చేయాలి. సామాజిక తనిఖీ సమయంలో చేసిన పనులు చూపించడం, గ్రామాల్లో వివిధ అంశాలపై శ్రామికులతో చర్చించడం ప్రధానం. వీరు స్వగ్రామంలో పనులు చూడటంతో పాటు అదనపు గ్రామాల్లో పనుల పర్యవేక్షణ ఎలా జరుగుతుందో వేచి చూడాలి.

ఎక్కడెక్కడ లేరంటే..

హాలహర్వి మండలంలో బాపురం, నిట్రవట్టి, కొక్కరచేడు, టి.సాకిబండ, చింతకుంట, హొళగుంద మండలంలో సులువాయి, దేవనకొండ మండలంలో బంటుపల్లి, కరిడికొండ, నేలతలమర్రి, నల్లచెలిమల, పల్లెదిఒడ్డి, అల్లారుదిన్నె, పొట్లపాడు, కుంకునూరు, ఆస్పరి మండలంలో ఆస్పరి, అట్టేకల్, బిల్లేకల్, బిణిగేరి, చిగిలి, చిన్నహోతూరు, డి.కొటకొండ, తంగరడోణ, ఆలూరు మండలంలో మొలగవల్లి, కురుకుంద, అరికెర, చిప్పగిరి మండలంలో నంచర్ల, కుందనగుర్తి, దౌల్తాపురం, గుమ్మనూరు, ఖాజీపురం గ్రామాలకు క్షేత్ర సహాయకులు లేరు.

ఉత్తర్వులు అందాయి. - చక్రవర్తి, ఏపీవో, హాలహర్వి

క్షేత్ర సహాయకులు లేని గ్రామాలకు సమీపంలోని వారికి అదనపు బాధ్యతలు అప్పగించాలని ఉత్తర్వులు అందాయి. దీనిపై కసరత్తు చేస్తున్నాం. వివరాలు నమోదు చేసేందుకు అంతర్జాలంలో చూపడం లేదు. త్వరలో వచ్చే అవకాశం ఉంది. అడిగిన ప్రతి ఒక్కరికి ఉపాధి పనులు కల్పించేలా సిబ్బందికి దిశా నిర్దేశం చేశాం.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

కర్నూలు కలెక్టరేట్, న్యూస్‌టుడే : వ్యవసాయ శాఖ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని వ్యవసాయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవికుమార్ పేర్కొన్నారు. కర్నూలు కలెక్టరేట్‌లోని వ్యవసాయశాఖ సెమినార్ హాల్‌లో ఆదివారం వ్యవసాయ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్న ఎంసీ కాశన్న జిల్లా అధ్యక్షుడిగా, జిల్లా కార్యదర్శిగా పి.మహేంద్రబాబును, ఉపాధ్యక్షురాలిగా శ్రీదేవి (డీవీవో కార్యాలయం), సంయుక్త కార్యదర్శిగా బాబాఫకృద్దీన్, రాష్ట్ర కౌన్సిలర్‌గా సంజీవ ప్రసాద్ (నంద్యాల వ్యవసాయశాఖ)ను ఎన్నుకున్నారు. నూతన అధ్యక్ష, కార్యదర్శులను కార్యవర్గ సభ్యులు, వ్యవసాయ ఉద్యోగులు పూలమాలలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర కల్చరల్ కార్యదర్శి ఆదినారాయణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మహేంద్రబాబు, కోడుమూరు తాలూకా ఎన్జీవో సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణమోహన్ పాల్గొన్నారు.

నూతన అధ్యక్ష, కార్యదర్శులు ఎంసీ కాశన్న, పి.మహేంద్రబాబుతో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవికుమార్ తదితరులు

విద్యుదాఘాతంతో శ్రీశైలంలోని కాటేజీలో మంటలు

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: శ్రీశైల మహాక్షేత్రంలోని వీరశైవ గురుకుల పాఠశాల వెనుక ఉన్న దేవస్థానానికి చెందిన అబ్బూరు కాటేజీలో శనివారం రాత్రి విద్యుదాఘాతంతో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. కాటేజీ మొదటి అంతస్తులోని గదిలో ఉన్న ఏసీలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగినట్లు తెలుస్తోంది. దీంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో అందులో బస చేస్తున్న సుమారు 15 మంది భక్తులు ఆందోళనకు చెందారు. హుటాహుటిన భక్తులు కాటేజీ నుంచి బయటకు వచ్చి ప్రాణాలు కాపాడుకున్నారు. విద్యుదాఘాతం జరిగిన సమయంలో భక్తులు కింద అంతస్తులో ఉండడం వల్ల ప్రాణాపాయం తప్పింది. సమాచారం అందుకున్న అగ్నిమాపకశాఖ, పోలీస్ సిబ్బంది కాటేజీలో మంటలు ఆర్పివేశారు. ఘటనపై విచారణ చేస్తున్నారు.

అగ్నిప్రమాదానికి గురైన అబ్బూరు కాటేజీ

బావిలో పడి బాలుడి మృతి

సంజామల(అవుకు), న్యూస్‌టుడే: ప్రమాదవశాత్తు బావిలో పడి బాలుడు మృతి చెందిన ఘటన అవుకు మండలంలోని సంగపట్నంలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన మహేంద్ర, గుర్రమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు సంతానం. పెద్ద కుమారుడు రిషికేశ్(8) ఒకటో తరగతి చదువుతున్నాడు. ఆదివారం సెలవు కావటంతో ఆడుకుంటూ ఇంటి సమీపంలో ప్రమాదవశాత్తు బావిలో పడిపోయాడు. వెంటనే స్థానికులు గమనించి బాలుడిని బయటకు తీసి అవుకు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అప్పటికే బాలుడు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కుమారుడు అకాల మృతితో తల్లిదండ్రులు రోదించిన తీరు గ్రామస్థులను కంటతడి పెట్టించింది.

EENADU Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్, ప్రైవేట్ ఫైనాన్స్‌లో తాకట్టులో ఉన్న మీ నగలను విడిపించి కొనుగోలు చేయబడును. (ఆక్సిజెన్ పోలీస్ పర్మిషన్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ 73821 14647.

JOBS

హైదరాబాద్ యూనిట్ హోంకేర్‌లో పేషెంట్లకు సేవ చేయుటకు స్త్రీ, పురుషులు కావలెను. ఫుడ్, 81215 41212.

MARKETING/ SALES

Anand Masale Require Sales & Marketing Manager, Marketing Executives. Contact: 98496 55105, 98480 53144 Email: anandmasalaappltd@gmail.com.

అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు

B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే.

కలర్ 5 లైన్ల ప్రకటన రూ. 555/- మాత్రమే.

ప్రకటనపై 5% GST వర్తించును.

సంప్రదించండి: 99899 97628

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలను ప్రచురించే ముందు తగిన జాగ్రత్తలు తీసుకొని ప్రకటనదారుల వివరాలను పూర్తిగా పరిశీలించుకోవలసిందిగా ఈనాడు సూచిస్తున్నది. ప్రకటనదారులు చేసుకునే ఒప్పందాలకు, లావాదేవీలకు ఈనాడుకు ఎటువంటి బాధ్యత ఉండదు.

ఆదోని

• ఆదోని • ఆలూరు • పత్తికొండ

తాగునీటి సంపు ప్రారంభం

దిబ్బనకల్(ఆదోని గ్రామీణం), న్యూస్‌టుడే: దిబ్బనకల్ గ్రామంలో ఆదివారం తాగునీటి సంపును గ్రామ సర్పంచి పెద్ద లక్ష్మి ప్రారంభించారు. మండల పరిషత్ నిధులు రూ.8లక్షలు వెచ్చించి, సంపు నిర్మాణం చేశారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు లక్ష్మన్న, వలమన్న తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదిపై సీఐ దాడి హేయం

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: కర్నూలులో ఓ కేసు విషయంలో పోలీసు స్టేషన్‌కు వెళ్లిన న్యాయవాది పవన్‌కుమార్‌పై అక్కడి సీఐ విక్రమసింహ పరుష పదజాలంతో దూషించడమే కాకుండా అతనిపై దాడి చేయటం సిగ్గు చేటని పత్తికొండ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు వై.మధుబాబు అన్నారు. ఆదివారం న్యాయవాదుల సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వివిధ కేసులపై స్టేషన్‌కు వెళ్లే సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటని ఆయన అన్నారు.

నేటి నుంచి శనగ కొనుగోలు

మద్దికెర, న్యూస్‌టుడే: రైతుకు గిట్టుబాటు ధర కల్పించే చర్యల్లో భాగంగా సోమవారం నుంచి మార్క్‌ఫెడ్ ద్వారా శనగ కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నట్లు వ్యవసాయాధికారి రవి, మార్క్‌ఫెడ్ నిర్వాహకులు రామకృష్ణ తెలిపారు. క్వింటాలు రూ.5,875కు కొంటామని చెప్పారు. రైతులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఆదోని: 77996 66004
ఆలూరు: 80085 62277
పత్తికొండ: 80085 73822

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: ?: ఆదోని పట్టణంలో ఆర్ట్స్ కళాశాల రహదారితో పాటు ఎన్టీఆర్ కూడలి నుంచి మేదరవీధి కొత్త ఆకాశవంతెన వరకు రహదారులపై పశువులు సేదతీతున్నాయి. వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. – హెచ్ఎస్.నాగరాజు, ఆదోని ✔: రహదారులపై పశువులు లేకుండా చేసి, ప్రమాదాలను నివారిస్తాం. – నయీమ్ అహ్మద్, కమిషనర్, ఆదోని పురపాలక సంఘం

మద్దికెర, న్యూస్‌టుడే: ?: మద్దికెర విద్యుత్తు ఉపకేంద్రం ముందున్న మురుగు కాల్వలో నీరు నిలిచి దుర్వాసన వస్తోంది. – రామాంజనేయులు, మద్దికెర ✔: పరిశీలించి చర్యలు తీసుకుంటాం. – సుధాకర్, పంచాయతీ కార్యదర్శి. మద్దికెర

హాలహర్వి, న్యూస్‌టుడే: ?: జాతరకు వేలాది భక్తులు వచ్చిన నేపథ్యంలో తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోండి? – గాదిలింగ, గూళ్యం ✔: జాతర ముగిసే వరకు పది ట్రాక్టర్లతో బాపురం పంపుహౌసు నుంచి తాగునీరు సరఫరా చేస్తున్నాం. – శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి, గూళ్యం

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: ?: ఆదోని పట్టణంలోని ఎస్కేడీ.కాలనీలోని సాయిబాబానగర్‌లో ఉదయం వేళ రహదారులు ఊడ్చి, చెత్త ఎత్తకుండా.. అలాగే వదిలేస్తున్నారు. – జయన్న, ఆదోని ✔: ప్రజారోగ్య విభాగం సిబ్బందికి సూచించి, సమస్య పరిష్కరిస్తాం. – నయీమ్ అహ్మద్, కమిషనర్, ఆదోని పురపాలక సంఘం

ఆస్పరి, న్యూస్‌టుడే: ?: యాటకల్లు నుంచి తొగలగల్లు మీదుగా తుర్వగల్లు వరకు ఉన్న రహదారి గుంతలు ఏర్పడి అధ్వానంగా ఉంది. – ఓబులేసు, రంగన్న, తొగలగల్లు ✔: గుంతల్లో మట్టి వేసి, పూడ్చేందుకు చర్యలు తీసుకుంటాం. – అంజనయ్య, సర్పంచి, తొగలగల్లు

పెరవలి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం

పెరవలి, (మద్దికెర), న్యూస్‌టుడే: పెరవలి రంగనాథస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు పురస్కరించుకొని కార్యక్రమాల వివరాలు తెలిపే గోడపత్రాలను ఆలయ ఆవరణలో పాలక మండలి సభ్యులు, అర్చకులు ఆదివారం విడుదల చేశారు. వారు మాట్లాడుతూ.. మార్చి 1 నుంచి 10వ తేదీ వరకు జరిగే బ్రహ్మోత్సవాలను విజయవంతం చేసేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు చెప్పారు.

బ్రహ్మోత్సవాల గోడపత్రాలను విడుదల చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ఎస్టీయూ సమర శంఖం 25న

హొళగుంద, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ న్యాయమైన డిమాండ్ల సాధనకు జరుగుతున్న రాష్ట్ర స్థాయి మహాధర్నా ఈ నెల 25న చలో విజయవాడ ఎస్టీయూ సమర శంఖం కార్యక్రమానికి మండలంలోని ఉపాధ్యాయులు తరలి రావాలని రాష్ట్ర కౌన్సిలర్ మంజుల, జిల్లా కౌన్సిలర్ దొడ్డబసప్ప, మండల గౌరవ అధ్యక్షుడు పోతరాజు, మండల అధ్యక్షుడు శరణబసప్ప, కార్యదర్శి పాండురంగ పిలుపు నిచ్చారు. అనంతరం కరపత్రాలను ఆదివారం స్థానిక కన్నడ పాఠశాలలో విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు వై. వెంకటేష్, ధనుంజయ, ఈరన్న, గాదిలింగప్ప, శంకరబాయి, తిప్పేరుద్ర, రవి నాయక్, హనుమక్కబాయి తదితరులు పాల్గొన్నారు.

ఆరుబయట కష్టాలు తీరేనా..!

■ పనులు చేసేందుకు ముందుకు రాని గుత్తేదారులు ■ ఏడాదిన్నరగా మహిళల అగచాట్లు

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలో సామూహిక మరుగుదొడ్ల నిర్మాణానికి నిధులు విడుదలై ఏడాదిన్నర గడుస్తున్నా.. ఇంతవరకు పూర్తి కాలేదు. ఆరుబయట మల విసర్జన లేకుండా, స్వచ్ఛ వాతావరణం కల్పించాలనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్త భాగస్వామ్యంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా రూ.90 లక్షలు విడుదల చేశాయి. వీటితో ఆరుచోట్ల శౌచాలయ్ నిర్మించాలనుకున్నారు. వీటిలో ఏ ఒక్కటీ ఇంతవరకు పూర్తికాలేదు. దీంతో మహిళలకు ఆరుబయట కష్టాలు వెంటాడుతున్నాయి. ఒక్కో నిర్మాణానికి రూ.15 లక్షలు చొప్పున వెచ్చించాలని భావించారు. దీని వల్ల బహిరంగ మలమూత్ర విసర్జన రహిత ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు ఆటంకం ఏర్పడుతోంది. స్వచ్ఛ సర్వేక్షణ్ కేంద్ర కమిటీ పరిశీలనలో 2023-24 ఏడాదిలో 247, 2024-25 ఏడాదిలో ఆదోని పురపాలక సంఘం అఖిల భారత స్థాయిలో 734వ ర్యాంకులు సాధించింది. సామూహిక మరుగుదొడ్ల నిర్మాణం పూర్తయితే, ర్యాంకులు మరింత మెరుగై.. నిధులు విస్తారంగా వచ్చే అవకాశాలున్నాయి.

ఇదీ పరిస్థితి..

పట్టణంలో 42 వార్డుల్లో 24 సాముహిక మరుగుదొడ్లు ఉన్నాయి. చాలా వరకు మురికివాడలు, ఇరుకు ప్రాంతాలు కావడంత.. సొంతంగా మరుగుదొడ్డి నిర్మించుకోలేని పరిస్థితులు ఉన్నాయి. ఇలాంటి చోట నిర్మించాలని భావించింది. అరుణ్‌జ్యోతినగర్, అమరావతినగర్, వాల్మీకినగర్, ప్రశాంతినగర్, రాయనగర్, సాంఘిక సంక్షేమ విద్యార్థి వసతి గృహ ప్రాంతంలో నిర్మించాలని భావించారు. ఒక్కోదాంట్లో పది సీట్లు ఉండనున్నాయి. టెండర్ అయిపోయి, పలువురికి వర్క్ ఆర్డర్లు ఇచ్చినా.. నేటికీ పనులు ఆరంభించలేదు. అమరావతినగర్‌లో గతేడాది పనులు ఆరంభించారు, నేటికి పైకప్పు పూర్తిచేశారు. ఆయా వార్డుల్లో పర్యటించే అధికారులు, ప్రజాప్రతినిధులను ప్రశ్నిస్తున్నారు. తాము ఇబ్బందులు పడుతున్నామని, త్వరితగతిన నిర్మాణాలు చేపట్టి, పూర్తిచేయాలని మహిళలు కోరుతున్నారు. ప్రధానంగా స్థల సమస్యలతో పాటు బిల్లుల విడుదలపై గుత్తేదారులు సందిగ్ధంలో ఉండటంతో నిర్మాణాల అడుగు ముందుకు పడటం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. దీంతో వచ్చిన నిధులు సకాలంలో ఖర్చు కాని పరిస్థితి. వర్షాలు తగ్గుముఖం పట్టాక పనులు ప్రారంభిస్తామని పురపాలక అధికారులు పేర్కొన్నారు. అది కూడా కార్యరూపం దాల్చడం లేదు. ఇప్పటికైనా పాలకులు వీటిపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

ఆదోని పట్టణంలోని 40వ వార్డులోని నిజాముద్దిన్‌కాలనీలో నివాసం ఉండే చాలా వరకు శ్రామికులు. ఈ ప్రాంతంలో చాలా ఇళ్లకు వ్యక్తిగత మరుగుదొడ్లు లేవు. అందరూ సాముహిక మరుగుదొడ్లనే వినియోగించే వారు. ఇక్కడ పాత భవనం కూలిపోయి ఏడాదిన్నర గడుస్తోంది. ఇంతవరకు కొత్తది నిర్మించలేదు. కొత్త నిర్మాణానికి రూ.15లక్షలు మంజూరైంది. టెండర్ పూర్తయి, వర్క్‌ఆర్డర్ ఇచ్చినా.. నేటికీ పనులు ప్రారంభం కాలేదు. దీంతో మహిళలంతా ఆరుబయటకు వెళ్లాల్సి రావడంతో ఇబ్బందులు పడుతున్నారు.

దారి పొడవునా.. మురుగు సమస్యలే

ఆదోని పట్టణంలో హన్మాజీపేటలో మురుగు సమస్యలతో జనం సతమతమవుతున్నారు. ఈ ప్రాంతంలో మూడు వైపులా సీసీ రహదారి ఎత్తు పెంచి, విక్టోరియాపేట వైపు వెళ్లే రహదారిని మాత్రం వదిలేశారు. ముందు వైపు సీసీ పనుల కారణంగా, లోతట్టు ప్రాంతం కావడంతో మురుగు వెనక్కి నెట్టి నిలిచింది. వర్షం వస్తే అంతే సంగతులు. ఫలితంగా రాకపోకలకు ఇబ్బందిగా మారడంతో పాటు ఇళ్లు, దుకాణాదుల దుర్వాసనతో దుకాణాలు మూసి, ఇళ్ల వాకిళ్ల వేసుకొని జనం జీవనం సాగించాల్సి వస్తోంది. ఇప్పటికైనా పురపాలక అధికారులు స్పందించి ఇక్కడి ప్రాంత రహదారి ఎత్తు పెంచి సమస్యను పరిష్కరించాలని జనం కోరుతున్నారు. – న్యూస్‌టుడే, ఆదోని పురపాలకం

ఇదేమి చోదకం.. వెన్నంటే ప్రమాదం

ఆదోని పట్టణంలో కొందరు ద్విచక్ర వాహనాలతో ప్రమాదకర సర్కస్ ఫీట్ల ప్రయాణం చేస్తున్నారు. ద్విచక్ర వాహనాలను రవాణా సౌకర్యాలకు వినియోగిస్తున్నారు. ఇలానే ఓ వ్యక్తి ఇనుప రేకులను సీటుపై పెట్టుకుని, దానిపై కుర్చొని ప్రయాణం చేశారు. మరో వ్యక్తి ఏకంగా విద్యుత్తు తీగల రింగ్‌ను కుర్చొన్ని వేగంగా ప్రయాణిస్తూ కనిపించారు. ఒక్కరి తప్పిదాల వల్ల ఎదుటి వారి ప్రమాదాల బారిన పడేస్తోంది. రవాణాకు అనుకూలమైన వాహనాలు ఉన్నా, వాటిని వదిలేసి, ఇలా ద్విచక్ర వాహనాలను వినియోగించడం సరికాదంటున్నారు. ఇప్పటికైనా చైతన్యవంతులై రహదారి ప్రమాదాల నివారణకు అంతా కృషి చేయాలని జనం కోరుతున్నారు. – న్యూస్‌టుడే, ఆదోని పాతపట్టణం

విద్యుత్తు నియంత్రిక చుట్టూ ముప్పు

ఆలూరు పట్టణంలోని బళ్లారి-ఆదోని, కర్నూలు వెళ్లే జాతీయ రహదారి పక్కన విద్యుత్తు నియంత్రిక ప్రమాదకరంగా ఉంది.

గతంలో నియంత్రిక ఉండగా.. ఏడేళ్ల క్రితం జాతీయ రహదారి నిర్మాణం చేపట్టారు. అయితే రహదారి పూర్తి స్థాయిలో నిర్మించకపోవడంతో నియంత్రిక అలాగే ఉంచేశారు. ప్రధాన రహదారి పక్కనే ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం చోటు చేసుకుంటుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఈ మార్గం మీదుగా ఆదోని, కర్నూలు, బళ్లారి, గుంతకల్లు తదితర ప్రాంతాలకు నిత్యం వందలాది వాహనాలు తిరుగుతుంటాయి. గతంలో ద్విచక్ర వాహనదారులు కంచెకు ఢీ కొట్టి గాయపడ్డ సందర్భాలు ఉన్నాయి. తాజాగా నియంత్రిక వద్ద ప్రమాద సూచిక బోర్డు పెట్టారు. అయినా రాత్రి వేళల్లో ప్రమాదం జరిగే అవకాశాలు లేకపోలేదు. అధికారులు స్పందించి నియంత్రికను అక్కడి నుంచి మరో చోట మార్చాల్సిన అవసరం ఉంది.– న్యూస్‌టుడే, ఆలూరు

నూర్పిళ్లు.. వాహనదారులకు సవాళ్లు

ఆస్పరి మండలంలో రహదారి ప్రమాదాలు పెరిగిపోతున్నాయి. రైతులు పంట నూర్పిళ్ల కోసం పొలంలో దిగుబడులను రహదారిపై వేస్తున్నారు. ఆస్పరి నుంచి ఆదోనికి వెళ్లే రహదారిలో అధికంగా వాహనాలు తిరుగుతాయి. ద్విచక్రవాహనదారులు వేగంగా వెళ్లి రహదారిపై వేసిన దిగుబడులపై జారిపడి ప్రమాదానికి గురవుతున్నారు. రైతులు పంట దిగుబడులతో పూర్తిగా రహదారి ఆక్రమించకుండా చూడాలని వాహనదారులు కోరుతున్నారు. ఇలా రహదారిపై గోరుచు పంట నూర్పిళ్లతో ప్రమాదాలు తప్పడం లేదు. – న్యూస్‌టుడే, ఆస్పరి

వడ్డెరుల సంక్షేమానికి కృషి

వెల్దుర్తి, న్యూస్‌టుడే: వడ్డెర కార్పొరేషన్ నిధులతో వడ్డెరుల సంక్షేమానికి కృషి చేస్తామని ఛైర్మన్ మల్లెల ఈశ్వరరావ్ అన్నారు. స్థానిక పాతబస్టాండులో వడ్డెర సంఘం అశోక్, మహేశ్ ఆధ్వర్యంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. వడ్డే ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. తెదేపా ప్రభుత్వమే బీసీలకు సముచిత స్థానం కల్పించిందని, వడ్డెరులకు ప్రాధాన్యం ఇస్తోందన్నారు. జైళ్లశాఖ రమాదేవి, మహాలక్ష్మి మాట్లాడారు. కార్యక్రమంలో వడ్డెర సంఘం నాయకులు తిరుపాలుబాబు, రాముడు, సుధాకర్‌రాజు, యాగంటి, గోపాల్, ఎల్లనాగి, రాము, శివ తదితరులు పాల్గొన్నారు.

వడ్డే ఓబన్నకు నివాళి అర్పిస్తున్న ఈశ్వరరావ్, తదితరులు

దేశ ప్రతిష్ఠపై దాడి చేయడమే

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: దిల్లీలో ఏఐ సదస్సు సందర్భంగా దేశ గౌరవానికి ప్రతీక అయిన భారత మండపంపై కాంగ్రెస్ కార్యకర్తలు దాడులు చేయటాన్ని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని భాజపా నియోజకవర్గ కన్వీనర్ గోవర్ధన్‌నాయుడు, మండల అధ్యక్షుడు కరణం నరేశ్ అన్నారు. పత్తికొండలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. దేశ ప్రయోజనాల కంటే రాజకీయ లాభాలే కాంగ్రెస్ పార్టీకి ముఖ్యమన్నారు. సమావేశంలో నాయకులు మల్లికార్జున, సోమశేఖర్‌రెడ్డి, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

‘భాజపా బరితెగింపు’

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: కర్నూలు జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంపై దాడి చేయడం ప్రజాస్వామ్యంపై దాడి అని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దిలీప్ దోకా అన్నారు. ఆదోనిలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భాజపా యువమోర్చ పేరుతో కొందరు గూండాల్లా ప్రవర్తించడం సరికాదన్నారు. సమావేశంలో నాయకులు మారుతి రావు, దేవిశెట్టి వీరేశ్, శ్రీనిథ్ రాయల్, సుంకన్న పాల్గొన్నారు.

విజ్ఞానం పంచే గ్రంథాలయం

చిప్పగిరి, న్యూస్‌టుడే: బంటనహాల్‌లో విద్యార్థులకు ఉచితంగా వ్యక్తిత్వ వికాస తరగతులు, యోగా శిక్షణ, గ్రంథాలయం అందుబాటులోకి తెచ్చామని బెంగళూరుకు చెందిన వ్యాపారవేత్త నాగరాజేంద్రగౌడ్ అన్నారు. గ్రామంలోని భవనాన్ని ఆయన ఆదివారం ప్రారంభించారు. కూమారుడు తరుణ్ జ్ఞాపకార్థం తరుణ్ వికాస్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. స్వగ్రామానికి కొంత సాయం చేయాలనే ఉద్దేశంతో ఈ కేంద్రం ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు.

ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

ఆదోని విద్య, న్యూస్‌టుడే: ఆదోని, పత్తికొండ డివిజన్ పరిధిలో సోమవారం నుంచి జరుగనున్న ఇంటర్మీడియట్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు కర్నూలు ఆర్ఐవో లాలెప్ప తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష ఉంటుంది. అరగంట ముందే కేంద్రం వద్దకు చేరుకోవాలన్నారు. ఆదోని, పత్తికొండ డివిజన్ పరిధిలో మొత్తం 32 పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. మొదటి సంవత్సరంలో 10,256 మంది, రెండో సంవత్సరంలో 7,572 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నట్లు వివరించారు. ఆయా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు.

ఆలూరు, న్యూస్‌టుడే: ఆలూరులో రెండు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరం 461 మంది, ద్వితీయ 249, ఆదర్శ కళాశాలలో ప్రథమ 262, ద్వితీయ సంవత్సరం 181 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పరీక్షకు అరగంట ముందే కేంద్రాలకు చేరుకోవాలని ఆయా కళాశాలల చీఫ్ సూపరింటెండెంట్లు శశికుమార్, వీరేష్ తెలిపారు.

ఆస్పరి జూనియర్ కళాశాలలో బెంచీలు సిద్ధం చేస్తున్న అధ్యాపక బృందం

ఆస్పరి, న్యూస్‌టుడే: ఇంటర్ పరీక్షలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామని, పర్యవేక్షణకు 16 సీసీ కెమెరాలు బిగించామని కళాశాల ప్రిన్సిపల్ సంతోష్‌కుమార్ తెలిపారు. ఆవరణలో, కేంద్రం పరిసరాల్లో గుంపులుగా ఉండరాదని, 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఆస్పరి సీఐ గంగాధర్ తెలిపారు.

మద్దికెర, న్యూస్‌టుడే: మద్దికెరలోని ఆయా కళాశాలల నుంచి ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు సంబంధించిన 200 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ నాగరాజు చెప్పారు.

లైంగిక దాడి ఘటనపై విచారణ

ఆలూరు గ్రామీణ, ఆలూరు, న్యూస్‌టుడే: మండలంలో ఓ విద్యార్థిపై అదే తరగతి చదువుతున్న మరో ముగ్గురు విద్యార్థులు లైంగిక దాడికి పాల్పడిన ఘటనపై ఆదివారం జిల్లా అధికారులు విచారణ చేపట్టారు. గురుకుల పాఠశాలల జిల్లా సమన్వయకర్త గీత పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, బాధిత విద్యార్థి తల్లిదండ్రులు, బంధువుల సమక్షంలో విచారించారు. పై అధికారుల ఆదేశాల మేరకు బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

త్రైత సిద్ధాంత గ్రంథాలపై ప్రచారం

బుక్కాపురం(వెల్దుర్తి), న్యూస్‌టుడే: బుక్కాపురం, కృష్ణాపురం గ్రామాల్లో త్రైత సిద్ధాంతం, ప్రబోధ సేవా సమితి, ఇందు జ్ఞానవేదిక ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత గ్రంథాలపై ఆదివారం ప్రచారం చేపట్టారు. చింతపల్లి కమిటీ అధ్యక్షుడు పుల్లారెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో సభ్యులు నాగశేషన్న, కృష్ణవేణి, నాగలక్ష్మమ్మ పాల్గొన్నారు.

ముమ్మరంగా వంతెన నిర్మాణం పనులు

హాలహర్వి, న్యూస్‌టుడే: చింతకుంట గ్రామ శివారులో జాతీయ రహదారి వంతెన పనులు కొన్నేళ్లుగా

చింతకుంట గ్రామ శివారులో సాగుతున్న వంతెన పనులు

సాగుతూనే ఉన్నాయి. వీటిపై పలుమార్లు ‘ఈనాడు’లో చిత్ర కథనాలు ప్రచురితమయ్యాయి. ప్రజల కష్టాలు కళ్లకు కట్టారు. దీంతో అధికారులు స్పందించి పనులు ప్రారంభించారు. ఇప్పటికే వంతెనపై రహదారి నిర్మాణం పనులు పూర్తిచేశారు. ఇరువైపులా రక్షణ గోడలు నిర్మించాల్సి ఉంది. మరో నెల రోజుల్లో పనులు పూర్తియ్యే అవకాశం ఉంది. పనులు ఆలస్యం కాకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించి పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

స్పందనకు వందనం

బాగుపడిన రహదారి

హాలహర్వి, న్యూస్‌టుడే: మేదేహాల్ గ్రామ సమీపంలో వంతెన రహదారిపై కంకర ప్రమాదకరంగా ఉంది. వాహనదారుల సమస్యలపై ‘ఈనాడు’లో ఈ నెల 3న ‘జాతీయ దారిలో యమకంకరులు’ అనే శీర్షికన చిత్ర కథనం ప్రచురితమైంది. దీనికి అధికారులు స్పందించారు. కంకర రహదారిని చదును చేసి తారుపూత వేశారు. దీంతో వాహనాల రాకపోకలు సులభంగా మారింది. వంతెన అంచున కొద్ది ఊదరం వదిలేశారని, అది కూడా పూర్తి చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

పవర్‌లిఫ్టింగ్ క్రీడాకారులను సన్మానిస్తున్న అతిథులు

క్రీడాకారులకు ఘనంగా సన్మానం

ఆదోని క్రీడలు, న్యూస్‌టుడే: కర్నూలు నగరంలో గత వారం జరిగిన రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ కనబరచిన క్రీడాకారులను ఆదివారం ఆదోని బాడీబిల్డింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడాకారులను ఘనంగా సన్మానించారు. పోటీల్లో ప్రతిభ కనబరచిన క్రీడాకారులు మాస్టర్ సాకరే శ్రీనివాసులు, సురేశ్, శివ, అజయ్, మనోజ్, తిక్కయ్య, సాజిద్‌బాషాను సత్కరించారు. పురపాలక ఛైర్‌పర్సన్ లోకేశ్వరి భర్త నాగరాజు వారిని అభినందించారు.

పాఠశాలలో సరస్వతిదేవి విగ్రహం ఏర్పాటు

ఆర్ఎస్ పెండేకల్లు(తుగ్గలి), న్యూస్‌టుడే: ఆర్ఎస్ పెండేకల్లు ఉన్నత పాఠశాల ఆవరణలో పూర్వ విద్యార్థులు సరస్వతి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. 1984-85 పది బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆర్థిక సాయంతో మండపం నిర్మించగా.. 1990-91 పది బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆర్థిక సాయంతో సరస్వతి విగ్రహం సమకూర్చారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

వెల్దుర్తి, న్యూస్‌టుడే: స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో మండల తెదేపా అధ్యక్షుడు బలరాంగౌడ్ సహకారంతో సుశీల నేత్రాలయం ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. సుమారు 180 మందికి ఉచితంగా కంటి పరీక్షలు చేపట్టారు.

క్రీడలతో మానసికోల్లాసం

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: క్రీడలతో మానసికోల్లాసంతో పాటు ఒత్తిడిని అధిగమించేందుకు దోహదపడుతుందని పురపాలక కమిషనర్ నయీమ్ అహ్మద్ తెలిపారు. స్థానిక ఎస్కేడీ కాలనీలోని ధ్యాన కేంద్రం మైదానంలో ప్రజారోగ్య కార్మికులకు ఆదివారం క్రీడా పోటీలు ప్రారంభించారు. రోజూ వ్యాయామం, నడక వంటి వాటితో ఆరోగ్యం పదిలం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పురపాలక అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోటీలను ప్రారంభిస్తున్న పురపాలక కమిషనర్ నయీమ్ అహ్మద్

సంజీవరాయుడి ఉత్సవం.. తరలొచ్చిన భక్తజనం

గ్రామంలో సాగుతున్న రథోత్సవం

రథోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు

జూటూరు(పత్తికొండ గ్రామీణం), న్యూస్‌టుడే: జూటూరులో సంజీవరాయుడి రథోత్సవం ఆదివారం సాయంత్రం కన్నుల పండువగా సాగింది. వేలాదిగా భక్తులు పాల్గొని ఉత్సవమూర్తుల ఊరేగింపును తిలకించారు. స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం స్వామి వారి కల్యాణం, వివిధ పూజల అనంతరం స్వామి వారి రథోత్సవం నిర్వహించారు. జాతర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పత్తికొండ పోలీసులు బందోబస్త్ నిర్వహించారు.

సృజనకు పదును.. భవిష్యత్తు మెరుగు

• ఆలోచనా శక్తి పెరిగేలా పీఎంశ్రీ పథకం అండ
• బడిలో ప్రయోగశాలలు, గ్రంథాలయ భవనాలు

ఆదోని విద్య, న్యూస్‌టుడే: ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు కార్పొరేట్ స్థాయిలో రాణించేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. చదువుతో పాటు సృజనాత్మకత పెంచేందుకు శ్రీకారం చుట్టింది. ఈ నేపథ్యంలో ఆదోని పట్టణంలోని ఆర్ఆర్ లేబర్ కాలనీ పురపాలక ఉన్నత పాఠశాలను ప్రభుత్వం పీఎంశ్రీ పథకం కింద ఎంపిక చేసింది. పలు సౌకర్యాలు కల్పిస్తున్నారు.

ఆదోని ఆర్ఆర్ లేబర్ కాలనీ పురపాలక ఉన్నత పాఠశాలలో పూర్తికావచ్చిన కంప్యూటర్, సైన్స్ ల్యాబ్, గ్రంథాలయ భవనాలు

విద్యార్థులకు మెరుగైన విద్య

పీఎంశ్రీ పథకం కింద చేపట్టిన సైన్స్, కంప్యూటర్ ల్యాబ్స్, గ్రంథాలయ భవనాలు సమకూరితే.. విద్యార్థులకు మెరుగైన విద్య అందనుంది. భవిష్యత్తు అవసరాలకు కంప్యూటరు విద్య ఎంతో అవసరం. చదువుతో పాటు విద్యార్థులు కంప్యూటర్ విద్యను నేర్చుకోచ్చు. దీంతో పాటు సైన్స్ ల్యాబ్‌లో ప్రయోగాలు ప్రత్యక్షంగా నేర్చుకుని మెరుగైన ఫలితాలు సాధించే అవకాశం ఉంది. గ్రంథాలయంలోని పుస్తకాలతో విజ్ఞానం పెంచుకోవచ్చని విద్యార్థులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

సమకూరనున్న సౌకర్యాలు

ఆదోని పట్టణం ఆర్ఆర్ లేబర్ కాలనీ పురపాలక ఉన్నత పాఠశాలలో 800 మంది వరకు ఆరు నుంచి పదో తరగతి వరకు చదువుతున్నారు. కార్మికులు అధికంగా ఉండే ఈ ప్రాంతంలో పేద పిల్లలే అధికంగా వస్తున్నారు. ఇక్కడి విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలన్న ఉద్దేశంతో ఈ పాఠశాలను రాష్ట్ర ప్రభుత్వం పీఎంశ్రీ పథకం కింద ఎంపిక చేసింది. ఈ పథకం కింద రూ.54 లక్షల నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో పాఠశాలలో అధునాతన సౌకర్యాలతో గ్రంథాలయం, కంప్యూటర్ ల్యాబ్, సైన్స్ ల్యాబ్ ఏర్పాటు కోసం మూడు గదుల నిర్మాణాలు చేపట్టారు. ఇప్పటికే 85 శాతం మేర పనులు పూర్తయ్యాయి. గదులతో పాటు సైన్స్ ల్యాబ్‌కు నీటి వసతి, సింటెక్స్‌ల ఏర్పాటు, సంపు నిర్మాణం, తాగునీటి మోటరు ఏర్పాటు, ఈ గదుల ముందు భాగంగా ప్లాట్‌ఫారం నిర్మించాల్సి ఉంది. రూ.లక్షలు విలువ చేసే ల్యాబ్ పరికరాలు పాఠశాలకు చేరాయి. త్వరలో కంప్యూటర్ ల్యాబ్ పరికరాలు, గ్రంథాలయంలో అవసరమైన పుస్తకాలు త్వరలో రానున్నాయని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవి తెలిపారు.

IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE, ADONI
E.P.37/2023 IN O.S.356/2018

Between: M/s G.Sivarayappa a Partnership Firm Rep by its Managing Partner G.Nagaraj ..Decree Holder

V/s.

1) M/s Sree Jagadeeswari Traders Rep by its Proprietor Y.Guru Prasad Died by L.R's
2) Y.Eramma 3) Y.Nagaraju
4) Y.Sharada ..Judgment Debtors

వేలం ప్రకటన

ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయడం ఏమనగా పై దావా లోని వాది యొక్క అప్పు రూ.15,44,256/- రాబట్టుటకై పై కోర్టులో క్రింద తెలుపబడిన షెడ్యూల్లోని ఆస్తులను 12-03-2026 తేదీన ఉదయం 10.30 గంటలకు వేలం వేయబడును. కావున ఆసక్తి గలవారు వేలం పాటలో పాల్గొనగలరని కోరుచున్నాము.

SCHEDULE

Item No.3: The House is situated in Registration District of Kurnool in the Sub-Registration of Adoni in Adoni Municipal limits in A.P.H.B Colony, Adoni with the following details H.No-M.I.G.62 Constructed Building.
Measurements: East to West: 60 feet, North to South: 40 feet.
Market Value: Rs.6,00,000/-
Decree Holder Value: Rs. 20,00,000-00
Amin Value: Rs.21,00,000-00
Sd/- G.C.RANGANNA, G.RAJESH
Advocates for D.Hr.
Adoni, Cell: 98480 48424.

(c) eenadu

ఎమ్మిగనూరు
• ఎమ్మిగనూరు • మంత్రాలయం • కోడుమూరు

రోగులకు మందుల పంపిణీ

మందులు పంపిణీ చేస్తున్న సీఐ మంజునాథ్, కంటి వైద్యుడు హేమంత్‌కుమార్

ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలో ప్రైవేట్ వైద్యశాలలో ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ కింద ఉచిత కంటి చికిత్స చేయించుకున్న 50 మంది వృద్ధులకు ఆదివారం కోసిగి సీఐ మంజునాథ్, కంటి వైద్యుడు హేమంత్‌కుమార్ మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మంజునాథ్ మాట్లాడుతూ.. కోసిగిలో ప్రత్యేక వైద్యశిబిరం ఏర్పాటు చేసి కోసిగి, పరిసర గ్రామాల్లో కంటి సమస్యలతో బాధపడుతున్న 50 మందిని గుర్తించినట్లు వెల్లడించారు. వారికి ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ పథకం కింద ఉచితంగా చికిత్స అందించినట్లు తెలిపారు. దీంతో పేద వృద్ధుల కంటి సమస్య తీరిందన్నారు.

సీఎం సహాయనిధితో పేదలకు భరోసా

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పేదల ఆరోగ్య సేవలకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి పేర్కొన్నారు. ఆదివారం తన నివాసంలో కర్నూలు మండలం నూతనపల్లి గ్రామానికి చెందిన షేక్ శాలిమాబీ అనారోగ్య చికిత్సల ఖర్చుల నిమిత్తం మంజూరైన రూ.4,95,699 చెక్కును అందించారు. ఈ సందర్భంగా ఆమె సీఎం నారా చంద్రబాబునాయుడు, కేడీసీసీ ఛైర్మన్ డి.విష్ణువర్ధన్ రెడ్డి, ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరికి కృతజ్ఞతలు తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి

ఎమ్మెల్యేకు యూపీహెచ్‌సీ సిబ్బంది సన్మానం

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వంలో యూపీహెచ్‌సీ సిబ్బందిని తొలగించారు. దీనిపై ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అసెంబ్లీలో ప్రస్తావించడంపై యూపీహెచ్‌సీ సిబ్బంది ఎమ్మెల్యేను సన్మానించారు. ఎమ్మెల్యే నివాసంలో ఆదివారం ఆయన్ను కలిశారు. ఈ సందర్భంగా యూపీహెచ్‌సీ నాయకుడు అనిల్ కుమార్ మాట్లాడుతూ.. వైకాపా హయాంలో ముఖ్యమంత్రి ఆరోగ్య కేంద్రంలో పని చేస్తున్న సిబ్బందిని తొలగించడంతో రాష్ట్ర వ్యాప్తంగా వేలాది మంది రోడ్డున పడ్డారన్నారు. కరోనా సమయంలో సేవలు అందించిన సిబ్బందిని తొలగించడం బాధాకరమన్నారు. కూటమి ప్రభుత్వంలో న్యాయం చేయాలని కోరారు. ఇందుకు ఎమ్మెల్యే మద్దతు ఇవ్వడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజు, చరణ్, విజయమ్మ, రాధిక, ప్రేమ, రేవతి పాల్గొన్నారు.

నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలి

సి.బెళగల్, న్యూస్‌టుడే: గ్రామాల్లో రౌడీ షీటర్లు నేరప్రవృత్తికి స్వస్తి పలకాలని ఎస్సై వేణుగోపాల్ రాజ్ సూచించారు. ఆదివారం రౌడీ షీటర్లను ఠాణాకు పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రయాణ కష్టాలకు చెల్లు

■ రహదారుల నిర్మాణానికి అడుగులు

ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: వైకాపా హయాంలో దశాబ్ద కాలంగా రహదారి శిథిలమైనా కనీసం మరమ్మతులకు నోచుకోలేదు. గతుకుల రహదారిపై ప్రయాణం నరకప్రాయంగా మారింది. కూటమి ప్రభుత్వం ప్రయాణికుల కష్టాలను తీర్చేందుకు రహదారుల నిర్మాణానికి పూనుకుంది. ఇప్పటికే ఎమ్మిగనూరు-కంబళదిన్నె రహదారి నిర్మాణ పనులు జరుగుతున్నాయి. పెద్దకడబూరు- ఆదోని రహదారికి టెండర్ ప్రక్రియ పూర్తయింది. రహదారి కష్టాలు తీరనుండటంతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జరుగుతున్న ఎమ్మిగనూరు-కంబళదిన్నె నిర్మాణ పనులు

పదేళ్లుగా మరమ్మతులకు నోచుకోలేదు – నాగరాజు, హెచ్.మురవణి

పదేళ్లకు పైగా ఎమ్మిగనూరు- కంబళదిన్నె రహదారి మరమ్మతులు జరగక శిథిలావస్థకు చేరింది. రహదారిలో ప్రయాణిస్తే ఒళ్లు నొప్పులు వస్తున్నాయి. వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయి. రహదారి నిర్మాణంతో ప్రయాణం సాఫీగా సాగుతుంది.

40 గ్రామాల వారికి ఇక్కట్లు తీరినట్లే

ఎమ్మిగనూరు నుంచి కంబళదిన్నె వరకు 11.2 కి.మీ. రోడ్డు నిర్మాణానికి అదనపు ప్రణాళిక నిధులు రూ.5 కోట్లు విడుదల చేశారు. ఇప్పటికే పనులు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం మార్కెట్ నుంచి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయం వరకు 600 మీటర్లు రహదారి పనులు చకచకా సాగుతున్నాయి. ఈ రహదారి గుండా ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలు ఉరుకుంద ఈరన్నస్వామి, ఖాదర్‌లింగస్వామి దర్గాలకు భక్తులు వెళ్తారు. ఎమ్మిగనూరు, నందవరం, మంత్రాలయం, పెద్దకడబూరు, కోసిగి మండలాలకు చెందిన 40 గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తారు. దాదాపు 13 ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోక ప్రజలు నానా కష్టాలు పడ్డారు.

టెండర్ ప్రక్రియ పూర్తి

ఉప విభాగంలోని పెద్దకడబూరు- ఆదోని రహదారి 13.75 కి.మీ. రహదారి నిర్మాణానికి అడిషనల్ ప్లాన్ నిధులు రూ.6.40 కోట్లు విడుదలయ్యాయి. టెండర్ ప్రక్రియ పూర్తయింది. గుత్తేదారుడు ఒప్పందం చేసుకోవాల్సి ఉంది. పెద్దకడబూరు, రంగాపురం, కటిక గ్రామాల వద్ద 1.6 కి.మీ. సీసీ రహదారి, మిగిలిన బీటీ రహదారి నిర్మిస్తారు. ఈ రహదారి శిథిలావస్థ దశతో వాహనదారులు బనవాసి మీదుగా జాతీయ రహదారిపై ప్రయాణించి ఆదోనికి చేరుకోవాల్సి వస్తోంది. రహదారి నిర్మాణ పనులు త్వరలో ప్రారంభించనున్నట్లు ఆర్‌అండ్‌బీ ఏఈ విజయ్ నరేశ్ తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఎమ్మిగనూరు 8008573824
కోడుమూరు 9885988357
కౌతాళం 8008574913

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: ?: ఎల్లమ్మ బీడులో మురుగు కాల్వలు లేక ఇళ్ల ముందు గుంతలు తవ్వుకున్నాం. అధికారులు సత్వరం స్పందించి కాల్వలు నిర్మించండి. - **ఎల్లప్ప, కాలనీవాసి** ✔: కొత్త డ్రైనేజీ పనుల కోసం ప్రతిపాదనలు పెట్టాం. - **గంగిరెడ్డి, పురపాలక కమిషనర్**

?: రామయ్యకొట్టాల సమీపంలో మురుగు కాల్వలో చెత్త నిండిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. - **సోమన్న, కాలనీవాసి** ✔: సిబ్బందిని పంపించి కాల్వలు శుభ్రం చేయిస్తాం. - **శ్రీనివాసులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్, ఎమ్మిగనూరు**

గోనెగండ్ల, న్యూస్‌టుడే: ?: గ్రామంలోని గంజహళ్లి రోడ్డులో ఉన్న లక్ష్మీపేట కాలనీలో కాలువలు లేనందున మురుగునీరు రోడ్లపై నిలుస్తోంది. దీని వల్ల దోమలు పెరిగిపోయి రోగాలు వ్యాపించే ప్రమాదం ఉంది. - **రంగన్న, గోనెగండ్ల.** ✔: కాలువల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాం. అమోదం రాగానే నిర్మిస్తాం. - **సతీష్, పంచాయతీ కార్యదర్శి, గోనెగండ్ల** ?: నెరుడుప్పల గ్రామ శివారులో ఉన్న చెత్తసంపద కేంద్రం అకతాయిలకు అడ్డాగా మారింది. గ్రామంలో చెత్త సేకరణ సక్రమంగా జరగక నిరుపయోగంగా మారింది. - **రామలింగప్ప, గ్రామస్థుడు** ✔: చెత్త సేకరణకు తగు చర్యలు తీసుకొంటాం. - **అనంతశయన, డిప్యూటీ ఎంపీడీవో, గోనెగండ్ల**

సి.బెళగల్, న్యూస్‌టుడే: ?: కొండాపురం గ్రామంలో మారెమ్మ ఆలయం ఊర బావి వద్ద చెట్లు దట్టంగా పెరిగిపోయాయి. వాటిని వెంటనే తొలగించండి. - **తిమ్మప్ప కొండాపురం** ?: కొండాపురం గ్రామంలో పలు ప్రాంతాల్లో సీసీ రోడ్లు, కాలువలు లేవు. - **రాముడు, కొండాపురం**

✔: గ్రామ సర్పంచి రత్నమ్మ దృష్టికి తీసుకెళ్లి చెట్లను తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. రహదారుల విషయాన్ని మండల పంచాయతీరాజ్ శాఖ ఏఈ వెంకటప్రకాష్ దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటాం.
- **మహేశ్వరి, డిప్యూటీ ఎంపీడీవో, సి.బెళగల్**

పెద్దకడబూరు, న్యూస్‌టుడే: ?: మండలంలోని హెచ్.మురవణిలో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది.
- **సత్యన్న, స్థానికుడు** ✔: గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేయిస్తాం. - **ప్రభావతిదేవి, ఎంపీడీవో,**

కోసిగి, న్యూస్‌టుడే: ?: మండలంలోని కామనదొడ్డి గ్రామంలో కాలువల్లో మురుగు పేరుకుపోయింది.
- **హనుమంతు, కామనదొడ్డి**

✔: పారిశుద్ధ్య కార్మికులను పంపించి కాలువలు శుభ్రం చేయిస్తాం. - **నరసింహగౌడ్, సర్పంచి, కామనదొడ్డి**

నీటి వృథాకు పడాలి అడ్డుకట్ట

మండలంలోని చిన్న భూంపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం సమీపంలో తాగునీటి ట్యాంకుకు ఉన్న కుళాయి విరిగిపోయి నీరు వృథాగా పోతోంది. దీంతో కేంద్రం ఎదుట నీరు నిలిచి చిత్తడిగా మారుతోంది. పిల్లలు జారిపడే అవకాశముందని పిల్లల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, కోసిగి

ఆర్వో ప్లాంట్ పూర్తయ్యేదెన్నడో?

మండలంలోని కంబళదిన్నె గ్రామస్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించడానికి రూ.లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్ ఏళ్లుగా మూలన పడి ఉంది. 2012లో అప్పటి ఎంపీ కోట్ల జయసూర్య ప్రకాశ్‌రెడ్డి రూ.8 లక్షల ఎంపీ నిధులతో ఇక్కడ ఓ ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. పథకం ప్రారంభంలో బాగానే పని చేసినా అనంతరం అటకెక్కింది. దీంతో స్థానికులు నీటిని కొనుగోలు చేసి తాగుతున్నారు. మూలనపడ్డ ఆర్వో ప్లాంటును తిరిగి వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, పెద్దకడబూరు

ముమ్మరంగా శివాలయ నిర్మాణం

పలుకుదొడ్డి (సి.బెళగల్), న్యూస్‌టుడే: మండలంలోని పలుకుదొడ్డిలో గ్రామస్థులకు శివాలయం లేని కొరత ఆలోచన రేకెత్తించింది. గ్రామంలో శ్రావణ, కార్తీక, మాఘ మాసాల్లో శివదీక్ష పొందలన్నా ఆలయం లేకపోవడంతో ఆలయ నిర్మాణానికి పూనుకున్నారు. గ్రామంలో రైతుల నుంచి విరాళాలు సేకరించి రూ.25 లక్షలతో పైకప్పు వరకు నిర్మాణం పూర్తి చేశారు. త్వరలో ఆలయంలో బండ పరుపు, శిఖరం, విద్యుత్తు, ధ్వజస్తంభం ఏర్పాటు చేసుకుని పూర్తి చేసుకుంటామని గ్రామస్థులు తెలిపారు.

తుది దశకు చేరుకున్న పనులు

నిజాయతీని చాటుకున్న ఆర్టీసీ ఉద్యోగి

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: పోగొట్టుకున్న నగదు సంచిని బాధితుడికి అందజేసి ఆర్టీసీ కంట్రోలర్ నిజాయతీని చాటుకున్నారు. కర్నూలుకు చెందిన సలీం ఎమ్మిగనూరు నుంచి కర్నూలుకు బయలుదేరారు. ఈ క్రమంలో రూ.48 వేలు ఉన్న నగదు సంచిని బస్టాండులో జారవిడుచుకున్నారు. విషయాన్ని ఆయన ఆర్టీసీ కంట్రోలర్ జీవీఆర్ రెడ్డికి తెలపగా బస్టాండులో వెతికి డబ్బును స్వాధీనం పర్చుకొని ఆర్టీసీ సిబ్బంది విజయకు అందజేశారు. అనంతరం బాధితుడికి కంట్రోలర్ జీవీఆర్‌రెడ్డి చేతులమీదుగా నగదు సంచి అందజేశారు. కార్యక్రమంలో నేషనల్ మజ్దూర్ యూనియన్ డిపో కార్యదర్శి ముస్తాక్ అహ్మద్, సిబ్బంది పాల్గొన్నారు.

నగదు అందజేసిన కంట్రోలర్

రాకపోకలకు ఇబ్బంది లేకుండా చర్యలు

స్పందనకు వందనం

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: కర్నూలు- బళ్లారి ప్రధాన రహదారిలోని కోడుమూరు పాతబస్టాండ్‌లో దుమ్ము లేయకుండా అధికారులు చర్యలు చేపట్టారు. ఆ ప్రాంతాన్ని ట్రాంకర్లతో తడుపుతున్నారు. దుమ్ము వల్ల ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులు, రోడ్డు విస్తరణపై ఈ నెల 18న 'విస్తరణ ఊసెత్తితే ఒట్టు' శీర్షికతో కథనం ప్రచురితమడంతో అధికారులు స్పందించారు. గూడూరు కూడలి నుంచి వై కూడలి వరకు రాకపోకలకు ఇబ్బంది లేకుండా వ్యర్థాలను తొలగించారు.

పెళ్లికి వెళ్లి వస్తుండగా ప్రమాదం

◆ నలుగురికి తీవ్ర గాయాలు

గోనెగండ్ల, ఎమ్మిగనూరు వ్యవసాయం: పెళ్లి వేడుకకు హాజరై స్వగ్రామానికి తిరిగి వస్తుండగా రోడ్డు ప్రమాదం జరిగి నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన ఎమ్మిగనూరు గ్రామ శివారులో ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. గ్రామస్థులు, బంధువులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని అల్వాల గ్రామానికి చెందిన యువకులు రాము, రఘువీర, రామకృష్ణ, కాశీమన్న పెద్దకడుబూరు మండలంలోని హెచ్.మురవణి గ్రామంలో జరుగుతున్న సమీప బంధువుల పెళ్లికి వెళ్లారు. రాత్రి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. మార్గ మధ్యలో ఎమ్మిగనూరు- కోసిగి రోడ్డులో బండల ట్రాక్టరు- ద్విచక్రవాహనం ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ప్రమాదంలో రఘువీర, రాము తీవ్రంగా గాయపడగా. . మిగతా ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో ఎమ్మిగనూరు వైద్యశాలకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

క్షతగాత్రులను ఆసుపత్రికి తరలిస్తున్న 108 సిబ్బంది

ద్విచక్రవాహనం ఢీకొని నలుగురికి గాయాలు

మంత్రాలయం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని బూదూరు క్రాస్ వద్ద ఆదివారం ఉదయం రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. ఇందులో బూదూరు గ్రామానికి చెందిన గొల్ల నరేష్, కురువ మహేష్, కురువ లక్ష్మిలకు తీవ్ర గాయాలయ్యాయి. మరో ద్విచక్ర వాహనదారుడు ఆదోని మండలం నాగనాథనహళ్లికి చెందిన కురువ బీరప్పకు కూడా గాయాలలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

మంత్రాలయం గ్రామీణం, న్యూస్‌టుడే: మంత్రాలయం ఆర్టీసీ బస్టాండు సమీపంలో ఆదివారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తి స్పృహ తప్పి పడిపోగా 108 ద్వారా ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన మృతి చెందాడు. మృతుని వయస్సు 55 సంవత్సరాల పైబడి ఉంటుందన్నారు. అతని ఆచూకీ లభించలేదని.. ఎవరికైనా తెలిస్తే, మంత్రాలయం పోలీసులకు సమాచారం అందించాలని సీఐ రామంజులు కోరారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలో మతిస్థిమితం లేని వ్యక్తి (35) ఆదివారం మృతి చెందాడు. దీంతో పలువురు మానవతా దృక్పథంతో స్పందించి శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో నరసన్న, షాలేమ్, బుజ్జిబాబు, ప్రతాప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గోవధపై కేసు నమోదు

మంత్రాలయం గ్రామీణం, న్యూస్‌టుడే: కౌతాళంలో ఆదివారం గోవధపై పోలీసులు కేసు నమోదు చేశారు. తెల్లవారుజామున కామవరం రస్తాలో ఒక ఖాళీ ప్రదేశంలో ఒక కోడెదూడ, లేగదూడ, గోవును వధించి మాంసం విక్రయాలకు సిద్ధమవుతున్న తరుణంలో అనుమానంతో అశోక్, శివాజి వారిని వెంబడించారు. ఇద్దరు గోవధకు పూనుకున్నారని.. దానిపై కేసునమోదు చేయాలని విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో పోలీస్‌స్టేషను ముందు ఆందోళన చేపట్టారు. సీఐ అశోక్ కుమార్‌కు ఫిర్యాదుపత్రం అందజేశారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

సీఐకి ఫిర్యాదు పత్రం అందజేస్తున్న వీహెచ్‌పీ నాయకులు

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే కాల్స్, లింక్‌లను ఓపెన్ చేయవద్దని ఎస్సై రాజకుల్లాయప్ప సూచించారు. అదివారం సుంకేసుల గ్రామంలో ప్రజలకు సైబర్ నేరాలు, మోసపూరిత ఆఫర్లు, మహిళలపై నేరాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న ఎస్సై రాజకుల్లాయప్ప

సంగాల (సి.బెళగల్): మహిళలపై నేరాలకు పాల్పడితే తక్షణమే సమాచారం అందించాలని ఎస్సై వేణుగోపాల్ రాజ్ సూచించారు. మండలంలోని సంగాలలో ఆదివారం మహిళలపై నేరాల నివారణ, తదితర అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళలపై జరుగుతున్న నేరాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. మాదక ద్రవ్యాల రవాణా, విక్రయాలు, వినియోగంపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, యవత తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గంగాదేవి రథోత్సవం

పెద్దకడబూరు, న్యూస్‌టుడే: మండలంలోని చిన్నతుంబళం పంచాయతీ మజారా గ్రామం బాపురంలో వెలసిన గంగాదేవి రథోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారికి ఉదయం జలాభిషేకం, క్షీరాభిషేకం, పంచామృతాభిషేకం, ఆకు పూజ, కుంకుమార్చన, గణపతి పూజ, గంగపూజ, గణారాధన, కుంభ తీర్థం, మహా మంగళ హారతి నిర్వహించినట్లు ఆలయ పీఠాధిపతి బసిలింగమ్మ అవ్వ తెలిపారు. సాయంత్రం గ్రామానికి చెందిన ఉప్పర ఈరన్న ఇంటి నుంచి మహా కుంభోత్సవాన్ని ఆలయం వరకు ఊరేగింపుగా తెచ్చారు. గంగాదేవి ప్రతిమను పల్లకిలో ఉంచి రథం వరకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. అనంతరం మేళతాళాలతో రథాన్ని తిరిగి యథా స్థానానికి చేర్చారు. రథోత్సవాన్ని తిలకించేందుకు కర్ణాటక, తెంగాణ రాష్ట్రాల నుంచి వేల సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. కార్యక్రమంలో తెదేపా మండల నాయకుడు రమాకాంతరెడ్డి, వైకాపా నాయకుడు రామ్మోహన్‌రెడ్డి, గ్రామ నాయకులు హనుమంతరెడ్డి, ఎల్లప్ప, సిద్ధప్ప, వీరేశ్‌గౌడు, నర్సప్ప, శివ, వీరేశ్ తదితరులు పాల్గొన్నారు.

బాపురంలో గంగాదేవి రథోత్సవం

ఓబీసీ మోర్చా పట్టణ అధ్యక్షుడిగా ఉరుకుంద

ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ఓబీసీ మోర్చా పట్టణ అధ్యక్షుడిగా వడ్డే ఉరుకుందను నియమించినట్లు ఆదివారం భాజపా పట్టణ అధ్యక్షుడు దయాసాగర్ తెలిపారు. ఈ సందర్భంగా వడ్డే ఉరుకుందుకు ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఉల్చాల లక్ష్మణ్‌నాయుడు, భాజపా నాయకులు ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బీఎల్ నారాయణ, చిరుతపల్లి ఈరన్న, ఓబులేష్, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

కూచిపూడి నృత్యం చేస్తున్న కళాకారిణి

మంత్రాలయం గ్రామీణం, న్యూస్‌టుడే: మంత్రాలయంలో రాఘవేంద్ర స్వామి గురువైభవోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. హైదరాబాద్‌కు చెందిన కళాకారుల సంప్రదాయ నృత్యాలు వీక్షకులను ఆకట్టుకున్నాయి. పలువురు ప్రముఖులు స్వామి మూల బృందావనాన్ని దర్శించుకున్నారు.

అమలుకు నోచుకోని పోలీసు పికెటింగ్

ఎమ్మిగనూరు నేరవార్తలు, న్యూస్‌టుడే:ప్రభుత్వ ఆసుపత్రిలో పోలీసు పికెటింగ్ ఏర్పాటులో జాప్యం జరుగుతుంది. దీనిపై ఆసుపత్రి సమావేశాల్లో ప్రకటించినా అమలు కావడంలేదు. ఆసుపత్రిలో ఓపీ రోజు 500 నుంచి 700 వరకు ఉంటుంది. నెలకు 200కు పైగా ప్రసవాలు, 20 నుంచి 30 వరకు కంటి చికిత్సలు చేస్తారు. గొడవలు, పొలం తగదాలతో పాటు ఇతర వివాదాల్లో ఘర్షణకు దిగి దాడి చేసుకున్న క్షతగాత్రులను చికిత్స కోసం ఆసుపత్రికి వస్తారు. గతంలో రెండు వర్గాలు ఆసుపత్రిలో చికిత్స కోసం వచ్చి అక్కడే గొడవకు దిగారు. పోలీసు పికెటింగ్ ఉంటే వీటిని నియంత్రించడం సులభమవుతుంది. ఆ దిశగా చర్యలు తీసుకోవాలని రోగులు, వారి సహాయకులు కోరుతున్నారు.

రాఘవేంద్ర స్వామి సన్నిధిలో గద్వాల ఎమ్మెల్యే

మంత్రాలయం గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మంత్రాలయంలో రాఘవేంద్ర స్వామి గురువైభవోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం రాత్రి తెలంగాణ రాష్ట్రం గద్వాల ఎమ్మెల్యే బండ్లజ్యోతి కృష్ణమోహన్ కుటుంబ సభ్యులతో కలిసి క్షేత్రాన్ని దర్శించుకున్నారు. గ్రామ దేవత మంచాలమ్మ, రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్నారు. వారికి పీఠాధిపతి శేషవస్త్రం, ఫలమంత్ర అక్షింతలు ఇచ్చి ఆశీర్వదించారు. ఎమ్మెల్యే కుమారుడి వివాహం మార్చి 14న ఉన్నందున.. పీఠాధిపతిని ఆయన ఆహ్వానించారు.

పీఠాధిపతి ఆశీర్వాదం పొందుతున్న ఎమ్మెల్యే కుటుంబసభ్యులు

వృత్తిపై అంకితభావం అవసరం

ఎమ్మెల్యే బీవీని సన్మానించిన న్యాయవాదులు

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వం తరపున ఏజీపీగా నియమించడంతో నిబద్ధతతో ప్రజలు, ప్రభుత్వానికి సేవలు అందించాలని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి సూచించారు. ఏజీపీగా ఎంపికైన రషీదుల్లా, న్యాయవాదులు ఆదివారం ఎమ్మెల్యే బీవీని సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీవీ మాట్లాడుతూ.. వృత్తి పట్ల అంకితభావంతో పని చేయాలని సూచించారు. ప్రజలకు అవసరమైనప్పుడల్లా సేవలు అందించి మన్ననలు పొందాలని సూచించారు. న్యాయవాది వృత్తికి మంచి గుర్తింపు తేవాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు రామకృష్ణనాయుడు, తెదేపా పట్టణ అధ్యక్షుడు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

బస్సుల కొరత... సీట్ల కోసం ప్రయాస

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: పెళ్లిళ్ల సీజన్ రావడంతో పాటు విద్యార్థులకు పరీక్షల సమయం కావడంతో బస్సుల్లో సీట్లు కోసం ప్రయాణికులు పరుగులు తీస్తున్నారు. బస్సుల కొరత తీవ్రంగా ఉండడంతో వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఎమ్మిగనూరు నుంచి శ్రీశైలం, మహానంది, హైదరాబాదు, బెంగళూరు, కర్నూలు ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు బస్టాండులో ప్రయాణికుల రద్దీ నెలకొంది. అధికారులు చొరవ చూపి అదనపు బస్సులను ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

బస్సు రాగానే సీటు కోసం ఎగబడుతున్న ప్రయాణికులు

మగ్గిపోతున్న బతుకులు

☛ పింఛన్లు అందక నేతన్నల ఎదురుచూపు

కోడుమూరు పట్టణం, న్యూస్‌టుడే: చేనేత రంగంలో ఉపాధి రోజు రోజుకు తగ్గిపోతుండటంతో నేతన్నలు చితికిపోతున్నారు. రోజువారీ కూలీకి సరైన వేతనం లేక కుటుంబ పోషణ భారంగా మారి వారి కష్టాలు చెప్పనలివి గాకున్నాయి. పలువురు ఇతర రంగాలకు మారిపోయారు. ఒకప్పుడు పట్టణంలో చేనేత పరిశ్రమపై వేల కుటుంబాలు నివసిస్తే ప్రస్తుతం గణనీయంగా తగ్గిపోయింది. చీరల తయారీకి ఉపయోగించే ముడి సరుకు ధరలు రోజు రోజుకూ పెరుగుతున్నా తాము నేసిన చీరలకు మాత్రం గిట్టుబాటు ధర అందడం లేదని నేతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంతవరకు నేతన్నలకు సంబంధించిన పథకాలు అమలుకాకపోవడంతో పాటు కొత్త చేనేత పింఛన్లు మంజూరు కావడం లేదని కార్మికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గత వైకాపా ప్రభుత్వంలో నూతన ఫించన్ల కోసం దరఖాస్తు చేసుకున్నా ఇప్పటికీ మంజూరు కాలేదని వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి నూతన పింఛన్లు మంజూరు చేయాలని కోరుతున్నారు.

అర్హత ఉన్నా రాలేదు –ఎ.రాజు

నేను పట్టణంలోని లక్ష్మీనగర్ కాలనీ నందు నివసిస్తున్నాను. నా వయస్సు 52 ఏళ్లు. చేనేత పింఛనుకు అర్హత వయస్సు ఉన్నా ఇప్పటివరకు మంజూరు కాలేదు. రెండేళ్లుగా నిరీక్షిస్తున్నా. కూటమి ప్రభుత్వం స్పందించి చేనేత పింఛను మంజూరు చేయించాలి. నేతన్నల పరిస్థితి దయనీయంగా మారింది. ప్రభుత్వం చేనేతలను ఆదుకోవాలి.

కార్యాలయాల చుట్టూ తిరిగి విసిగిపోయా – తట్టె సుకన్య

నా భర్త తట్టె శ్రీనివాసులు మూడేళ్ల కిత్రం అస్వస్థతకు గురై మరణించారు. మా ఇద్దరి పిల్లలను చేనేత పని చేసుకుంటూ జీవనం గడుపుతున్నా. గత ప్రభుత్వంలో వితంతు పింఛను కోసం దరఖాస్తు చేసుకున్నా ఇంతవరకు మంజూరు కాలేదు. కార్యాలయాల చుట్టూ తిరిగి విసుగు చెందాను. కూటమి ప్రభుత్వంలోనైనా నూతన పింఛను మంజూరు చేయాలి.

ఉద్యోగ, ఉపాధ్యాయులను విస్మరించిన ప్రభుత్వం

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: రాష్ట్రంలో కూటమి సర్కారు ఏర్పడిన తరువాత ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించిందని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు మల్లు రఘునాథ్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర అధ్యక్షుడు మల్లు రఘునాథ్‌రెడ్డి

ఎస్టీయూ సర్వసభ సమావేశాన్ని ఆదివారం పట్టణంలోని మాచాని సోమప్ప బాలికల జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో భాగంగా 12వ పీఆర్సీ, ఐఆర్, బకాయిల చెల్లింపులు చేయాలన్నారు. సీపీఎస్ రద్దు చేయాలని కోరారు. ఈ నెల 25న చలో విజయవాడ నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు జనార్దన్, బాబయ్య, రామచంద్ర, లక్ష్మీదేవి, నాగరాజు, సురేష్, తిమ్మరాజు, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడిని జయిస్తే మానసికోల్లాసం

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: ఒత్తిడిని జయిస్తే మానసిక ఉల్లాసం కలుగుతుందని పురపాలక కమిషనర్ గంగిరెడ్డి పేర్కొన్నారు. పెద్ద పార్కులో ఆదివారం హ్యాపి సండే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వృద్ధులకు మానసిక ప్రశాంతత అవసరమన్నారు. ప్రతి రోజూ రెండు గంటల పాటు ధ్యానం, వ్యాయామం, యోగా వంటివి సాధన చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ సూరిబాబు, మెప్మా జయవంత్ తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు

(c) eenadu

కర్నూలు

•కర్నూలు •పాణ్యం

తక్షణం 30 శాతం ఐఆర్ ప్రకటించాలి

కర్నూలు గ్రామీణ, న్యూస్‌టుడే : ఉపాధ్యాయులకు తక్షణమే 30 శాతం ఐఆర్

ఎమ్మెల్యే దస్తగిరికి వినతిపత్రం ఇస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

ప్రకటించాలని ఏపీటీఎఫ్ నాయకులు ఎస్.ఇస్మాయిల్, మరియానందం, పి.వి.శేషయ్య ప్రభుత్వాన్ని కోరారు. ఆర్థిక బకాయిలు చెల్లించాలని, ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన దశలవారీ ఉద్యమంలో భాగంగా ఆదివారం వారు కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరిని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు తిమ్మన్న, రామలింగేశ్వరరెడ్డి, వెంకట్రాముడు, శ్రీరాములు, నరేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

కర్నూలు గ్రామీణ, న్యూస్‌టుడే : అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేదలకు సీఎం సహాయ నిధి అండగా నిలుస్తోందని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి పేర్కొన్నారు. నియోజకవర్గానికి చెందిన షేక్ సలీమాకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి అందిన ఆర్థికసాయం చెక్కును ఆదివారం ఆయన తన నివాసంలో లబ్ధిదారుకు అందజేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) కర్నూలు : 80085 52632, కర్నూలు గ్రామీణం : 85010 05408, ఓర్వకల్లు : 63004 66875

కర్నూలు నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: ?: కల్లూరులో కాలువలు పూడిపోయి మురుగు నిల్వ ఉంటోంది. కాలువల్లో పూడిక తీయించాలి. - **స్థానికులు** ?: రాంప్రియనగర్, వాసవీనగర్, గోపినగర్‌లలో దోమల సమస్య అధికంగా ఉంది. - **సాయిప్రసాద్, స్థానికుడు**
✔: కాలువల్లో పూడిక తీయిస్తాం. దోమల నియంత్రణకు ఫాగింగ్ చేయిస్తాం. - **నగరపాలక అధికారులు**

కేంద్ర మంత్రి కుమారస్వామికి స్వాగతం

కేంద్ర మంత్రి కుమారస్వామికి పూలమొక్క అందజేసి స్వాగతం పలుకుతున్న కలెక్టర్ డా.సిరి

కర్నూలు కలెక్టరేట్, ఓర్వకల్లు, న్యూస్‌టుడే : జిల్లా పర్యటనలో భాగంగా ఆదివారం కర్నూలు విమానాశ్రయానికి చేరుకున్న కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కుశాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామికి కలెక్టర్ డా.ఎ.సిరి స్వాగతం పలికారు. అలంపూర్ జోగులాంబ అమ్మవారితో పాటు మంత్రాలయం రాఘవేంద్రస్వామి దర్శనం నిమిత్తం ఆయన వచ్చారు. కలెక్టర్‌తో పాటు అదనపు ఎస్పీ హుస్సేన్‌పీరా పూలమొక్కలను అందజేసి స్వాగతం పలికారు. జిల్లాలో ఏర్పాటు కానున్న పరిశ్రమలు, ఇతర అభివృద్ధి పనుల్లో పురోగతిపై కలెక్టర్ మంత్రికి వివరించారు. అనంతరం మంత్రి రోడ్డు మార్గంలో అలంపూర్ బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో కర్నూలు ఆర్డీవో సందీప్‌కుమార్, డీఎస్పీ బాబు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. మంత్రాలయం పర్యటనకు విచ్చేసిన కేంద్ర మంత్రి కుమారస్వామిని ఆదోని ఇన్‌ఛార్జి ఆర్డీవో అజయ్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్క అందజేశారు.

నిధుల స్వాహాకు బాటలు

✧ రహదారుల పేరుతో రూ.కోట్ల వ్యయం ✧ నగర ప్రజలకు ఉపయోగపడని పనులు

కర్నూలు నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే : ప్రజా ప్రయోజనాల పేరుతో నగరపాలక సంస్థ నిధులతో చేపడుతున్న పలు పనులు అక్కరకు రాకుండాపోతున్నాయి. ఎలాంటి ప్రణాళిక లేకుండా.. నాణ్యత జాడే లేకుండా చేస్తున్న పనులు కొంతకాలానికే దెబ్బతింటున్నాయి. ఫలితంగా నిధులు దుర్వినియోగం అవుతున్నాయి. నగర పరిధిలో చేపడుతున్న రహదారుల మరమ్మతులు, మట్టిరోడ్ల నిర్మాణ పనులే ఇందుకు నిదర్శనం. రూ.కోట్లలో నిధులు వ్యయం చేసినా.. పనుల్లో నాణ్యత లోపించడంతో అవి ప్రజలకు ఉపయోగపడటం లేదు. మట్టిరోడ్ల పేరుతో నిధులు స్వాహా చేశారని ఆరోపణలు వెల్లువెత్తాయి. నిధుల వ్యయంపై విచారణ చేయాలని పలువురు డిమాండ్ చేసినా ఇంతవరకు ఎలాంటి చర్యలు లేకపోవడం గమనార్హం.

ఈ మట్టి దారిని తుంగభద్ర నది తీరంలో రాఘవేంద్ర స్వామి మఠం నుంచి రాంబొట్ల ఆలయం వరకు మూడేళ్ల కిందట వేశారు. సుమారు 2 కి.మీ రోడ్డు వేసేందుకు రూ.2 కోట్ల వరకు వెచ్చించారు. పనులు నాసిరకంగా చేయడంతో కొన్నాళ్లకే ఇది అధ్వానంగా మారింది. ప్రస్తుతం రాకపోకలు సాగించలేని పరిస్థితి. పైపై పనులను చేసి నిధులను దోచుకున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

ఇష్టానుసారం ఖర్చు

నగరపాలక పరిధిలో సుమారు 690 కి.మీ మేర రహదారులు ఉన్నాయి. వీటిలో సీసీరోడ్లు 520 కి.మీ పైగా, గ్రావెల్ రోడ్లు 125 కి.మీ, డబ్ల్యూబీఎం రహదారులు 40 కి.మీ మేర ఉన్నాయి. గత రెండేళ్ల కాలంలో సీసీరోడ్లు, బీటీ రోడ్ల మరమ్మతులకు నగరపాలక సుమారు రూ.3 కోట్ల వరకు నిధులు వెచ్చించింది. ఈ పనుల్లో ఏమాత్రం నాణ్యత పాటించకపోవడంతో కొన్నాళ్లకే మళ్లీ గుంతలు ఏర్పడుతున్నాయి. చేసిన చోటే మళ్లీ మళ్లీ మరమ్మతులు చేస్తూ నిధులు దారి మళ్లిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

● బళ్లారి చౌరస్తాలోని ఎస్‌ఏపీ క్యాంపులో నుంచి బస్సులు, వాహనాలు కొత్త బస్టాండు వైపు వెళ్లేందుకు రూ.50 లక్షలతో మట్టిరోడ్డు వేశారు. పనులు చేసే క్రమంలో సరిగా రోలింగ్ చేయలేదని, లేయర్లు తక్కువగా వేశారనే ఆరోపణలు ఉన్నాయి. ట్రాఫిక్ రద్దీ నియంత్రణ కోసం వేసిన ఈ రహదారి ప్రస్తుతం భారీ గుంతలతో కంకర తేలి అధ్వానంగా మారింది. దీంతో ఈ దారిలో రాకపోకలు అంతంత మాత్రంగానే సాగుతున్నాయి.

నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం కార్యవర్గం ఎన్నిక

నూతన కార్యవర్గ సభ్యులతో ఎన్నికల అధికారి మద్దిలేటి

కర్నూలు కలెక్టరేట్, న్యూస్‌టుడే : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం కర్నూలు నగరశాఖ నూతన కార్యవర్గ ఎన్నికలను కర్నూలు వ్యవసాయ సబ్ డివిజన్ ఏడీఏ కార్యాలయ ఆవరణలో ఆదివారం నిర్వహించారు. ఎన్నికల అధికారి ఇ.మద్దిలేటి అధ్యక్షతన జరిగిన ఎన్నికల్లో నగరశాఖ అధ్యక్షుడిగా కె.సి.నాగరాజు (ఎన్‌సీసీ), కార్యదర్శిగా బి.గోపి (వ్యవసాయశాఖ), కోశాధికారిగా కె.వి.రమణ (ఎన్‌సీసీ), అసోసియేట్ అధ్యక్షుడిగా కె.నాగరాజు (సహకారశాఖ), ఉపాధ్యక్షుడిగా వి.యశ్వంత్‌కుమార్ (సహకారశాఖ), పి.జీవన్‌కుమార్ (సమాచారశాఖ), కె.పుల్లయ్య (విద్యాశాఖ), సంయుక్త కార్యదర్శులుగా జి.మద్దయ్య, ఎ.ఖాజాబాషా, ఎన్.గౌస్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

టాస్ వేస్తున్న నగరపాలక కమిషనర్ విశ్వనాథ్

ఆశలు పెరగడంతోనే వివాహాలు ఆలస్యం

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే : నేటి యువతలో ఆశలు, ఆశయాలు పెరగడంతోనే వివాహాలు ఆలస్యం అవుతున్నాయని మాజీ ఎంపీ టీజీ వెంకటేష్ పేర్కొన్నారు. టీజీ వెంకటేష్ వివాహ వార్షికోత్సవం సందర్భంగా ఆవోపా ఆధ్వర్యంలో స్థానిక మౌర్య ఇన్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం వధూవరుల పరిచయ వేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీజీ వెంకటేష్ దంపతులు, మంత్రి టీజీ భరత్ దంపతులు హాజరయ్యారు. ఆర్యవైశ్య ప్రముఖులు చేకూరి వెంకటేశ్వర్లు, ఇల్లూరు లక్ష్మయ్య, జవహర్‌బాబు, ఆత్మకూరు సుబ్రహ్మణ్యం, వాయుగండ్ల సుబ్బారావు, మాదవి తదితరులు పాల్గొన్నారు.

వధూవరుల పరిచయ వేదికలో పాల్గొన్న మంత్రి టీజీ భరత్, టీజీ వెంకటేష్ తదితరులు

హ్యాపీ సండేతో ఆరోగ్యం.. ఆనందం

కర్నూలు నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే : ప్రజల ఆరోగ్యం.. ఆనందం కోసమే ప్రభుత్వం హ్యాపీ సండే కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ తెలిపారు. నగరంలోని కొండారెడ్డి బురుజు వద్ద ఉన్న పార్కులో ఆదివారం తొలి హ్యాపీ సండే కార్యక్రమం నిర్వహించారు. నృత్యాలు, యోగా, జానపద గీతాలు, చెస్, కబడ్డీ, సంగీత విభావరి నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్రతినెలా రెండు, నాలుగో ఆదివారాల్లో నిర్వహించే ఈ కార్యక్రమంలో నగర ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సతీష్‌కుమార్‌రెడ్డి, ప్రజారోగ్యాధికారి డా.నాగప్రసాద్‌బాబు, నగరపాలక ఇంజినీరింగ్ విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆంగ్లేయులపై తిరగబడిన ధీశాలి ఉయ్యాలవాడ



కర్నూలు కలెక్టరేట్ : ఉయ్యాలవాడ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న జేసీ నూరుల్ ఖమర్ తదితరులు

కర్నూలు కలెక్టరేట్, న్యూస్‌టుడే : ఆంగ్లేయులపై తిరుగుబాటు చేసి ప్రజల్లో స్వాతంత్ర్య స్ఫూర్తిని రగిల్చిన ధీశాలి ఉయ్యాలవాడ నరసింహారెడ్డి అని జేసీ నూరుల్‌ఖమర్ పేర్కొన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆదివారం ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. జేసీ నూరుల్ ఖమర్ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆయన త్యాగాలను కొనియాడారు. సెట్కూరు సీఈవో వేణుగోపాల్, జిల్లా పర్యాటకశాఖ అధికారి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు బి.క్యాంపు, ఓర్వకల్లు, న్యూస్‌టుడే : కర్నూలు విమానాశ్రయానికి ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పేరు అధికారికంగా పెడుతూ ప్రభుత్వం జీవో విడుదల చేసేలా కృషి చేస్తానని నంద్యాల ఎంపీ డా.బైరెడ్డి శబరి చెప్పారు. ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి సందర్భంగా ఏపీ రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కర్నూలు ఎస్టీబీసీ మైదానం నుంచి ఓర్వకల్లు విమానాశ్రయం సమీపంలోని ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహం వరకు కార్లతో ర్యాలీ నిర్వహించారు. అక్కడ ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఎగ్జిబిషన్ మైదానంలో సంఘం ఉమ్మడి కర్నూలు జిల్లా అధ్యక్షుడు పల్లె శ్రీధర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో ఎంపీ శబరి, మాజీ ఎమ్మెల్యేలు ఎస్వీ మోహన్‌రెడ్డి, కాటసాని రాంభూపాల్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో రెడ్డి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బిర్రు ప్రతాప్‌రెడ్డి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మారం మినీత్‌రెడ్డి, సంఘటన కార్యదర్శి తూముకుంట ప్రతాప్‌రెడ్డి, ఏపీ రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు సంజీవరెడ్డి, నర్వ రమాకాంత్‌రెడ్డి, పాటిల్ తిరమలేశ్వర్‌రెడ్డి, మురళీధర్‌రెడ్డి, సిద్ధం రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు బి.క్యాంపు : వాహనాల ర్యాలీ ప్రారంభిస్తున్న నంద్యాల ఎంపీ డా.బైరెడ్డి శబరి

ఓర్వకల్లు : విమానాశ్రయం వద్ద నరసింహారెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఏపీ రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు

దుకాణంలో చోరీ.. కేసు నమోదు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : కర్నూలులోని ఖడక్‌పురాకు చెందిన అన్వర్‌బాషా దుకాణంలో చోరీ జరిగింది. ఆయన తన కుమారుడితో కలిసి వెంకటరమణకాలనీలోని హైవే సమీపంలో సనా కేఫ్ పేరుతో దుకాణం నిర్వహిస్తున్నారు. రోజులాగే శనివారం రాత్రి దుకాణం మూసి ఇంటికెళ్లారు. ఆదివారం ఉదయం వచ్చి చూడగా దొంగలు తాళాలు పగులగొట్టి దుకాణంలోని సరకును అపహరించుకెళ్లినట్లు తెలిసింది. రూ.లక్ష విలువ చేసే సరకును దొంగలు దోచుకెళ్లినట్లు బాధితుడు నాలుగో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడిపై ఆటో డ్రైవర్ దాడి

కర్నూలు నేర విభాగం, న్యూస్‌టుడే : నగరంలోని పాతబస్తీ మాసుంబాషా దర్గా వద్ద ఆదివారం రాత్రి ఇద్దరు వ్యక్తుల మధ్య గొడవ ఉద్రిక్తతకు దారి తీసింది. గిరి అనే ఆటో డ్రైవర్ వాహనం నడుపుకొంటూ వెళ్తుండగా.. ఓ యువకుడు ద్విచక్రవాహనంపై రోడ్డుకు అడ్డుగా ఉండటంతో పక్కకు జరగాలని కోరాడు. దీంతో ఇద్దరి మధ్య మాటామాట పెరిగింది. ఆటో డ్రైవర్ యువకుడిపై దాడికి పాల్పడ్డాడు. దీనిపై యువకుడి సంబంధీకులు కర్నూలు ఒకటో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గాయపడిన యువకుడిని ఆసుపత్రికి తరలించారు.

తెలుగు భాషాభివృద్ధికి కృషి చేద్దాం

కర్నూలు నగరం, న్యూస్‌టుడే : తెలుగు భాషాభివృద్ధికి కవులు, రచయితలు సంఘటితంగా కృషి చేయాలని టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య పిలుపునిచ్చారు.

మాట్లాడుతున్న పత్తి ఓబులయ్య. చిత్రంలో డా.హరికిషన్ తదితరులు

మాతృభాష దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక కళాక్షేత్రంలో ఆదివారం అభ్యుదయ రచయితల సంఘం కర్నూలు శాఖ సమావేశం జరిగింది. కథా రచయిత డా.హరికిషన్ మాట్లాడుతూ తెలుగుభాషా వికాసానికి అభ్యుదయ రచయితల సంఘం ద్వారా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో రచయితలు, కవులు పాల్గొన్నారు.

● కల్లూరు పెన్షనర్స్ సంఘం కార్యాలయంలో తెలుగు కళ్లం సాహితీ సమితి అధ్యక్షుడు డా.చిన్నావుల వెంకటరాజారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం మాతృభాషా దినోత్సవం నిర్వహించారు. కవులను సత్కరించారు.

కళారంగానికి సహకారం అందిస్తా

కర్నూలు నగరం, న్యూస్‌టుడే : కళారంగానికి తనవంతు సహకారం అందించడంతో పాటు కర్నూలు టీజీవీ కళాక్షేత్రంలో ప్రేక్షకులకు మరిన్ని వసతులు కల్పిస్తామని మాజీ ఎంపీ టీజీ వెంకటేష్ పేర్కొన్నారు. టీజీ వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక టీజీవీ కళాక్షేత్రంలో ఆదివారం రాత్రి నృత్య గురువు కరీముల్లా ఆధ్వర్యంలో సప్తగిరుల నృత్య వైభవం ప్రదర్శన జరిగింది. అనంతరం మాజీ ఎంపీని కళాక్షేత్రం అధ్యక్షుడు టీజీ పత్తి ఓబులయ్య, రవీంద్ర విద్యా సంస్థల అధినేత పుల్లయ్య, ఇనాయతుల్లా, సీవీ రెడ్డి, యాగంటీశ్వరప్ప, మహ్మద్‌మియ్యా తదితరులు సత్కరించారు.

నృత్య ప్రదర్శన చేసిన కళాకారిణులతో మాజీ ఎంపీ టీజీ వెంకటేష్ తదితరులు

మాట్లాడుతున్న మునెప్ప

కార్మికులు ఉద్యమాలకు సిద్ధమవ్వాలి

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే : కేంద్ర ప్రభుత్వం తెచ్చిన కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా కార్మిక వర్గాలు ఉద్యమాలకు సిద్ధం కావాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మునెప్ప పిలుపునిచ్చారు. నగరంలోని సీఆర్ భవనంలో ఆదివారం ఏఐటీయూసీ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని భాజపా ప్రభుత్వం కార్మిక వ్యతిరేక బిల్లు తెస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. నాలుగు లేబర్ కోడ్‌లు తీసుకొచ్చి కార్మిక లోకానికి తీవ్ర అన్యాయం చేసిందన్నారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు వెంకటేష్, నాయకులు రామాంజనేయులు, రేణుక, రామకృష్ణారెడ్డి, కృష్ణారెడ్డి, నల్లన్న, రంగనాయకులు, రాము పాల్గొన్నారు.

వైద్యులు నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే : స్కిల్ ల్యాబ్ ద్వారా యువ వైద్యులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని కర్నూలు వైద్య కళాశాల ప్రిన్సిపల్ డా.చిట్టినరసమ్మ సూచించారు. స్థానిక వైద్య కళాశాలలో ఆదివారం ఈఎన్‌టీ ఏపీ ఛాప్టర్ ఆధ్వర్యంలో పీజీ విద్యార్థులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఈఎన్‌టీ వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డా.జయప్రకాష్‌రెడ్డి, కర్నూలు జిల్లా అధ్యక్షుడు డా.మహేంద్రకుమార్, డా.హరికృష్ణ, గెస్ట్‌ఫ్యాకల్టీ పీఎస్ఎన్ మూర్తి, డా.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే : జగన్నాథగట్టు సమీపంలోని టిడ్కో గృహ సముదాయం వద్ద గుర్తు తెలియని వ్యక్తి చనిపోయినట్లు ఉలిందకొండ ఎస్సై ధనుంజయ ఆదివారం తెలిపారు. మృతుడి వయసు 45-50 ఏళ్లు ఉంటుందన్నారు. నీలం రంగు జుబ్బా, నీలం రంగు అడ్డ గీతలున్న లుంగీ ధరించినట్లు వెల్లడించారు. కుడి చేతికి కడియం ఉందన్నారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు ఉలిందకొండ పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

రహదారిపై యమ పాశాలు

నగరంలోని నంద్యాల చెక్‌పోస్టు సమీపంలో ఉన్న నాగిరెడ్డి రెవెన్యూకాలనీలో ఓ విద్యుత్తు నియంత్రిక నుంచి తీగలు రోడ్డుపైకి చేరాయి. రహదారిపై అడ్డంగా పడిన వీటిని స్థానికులు పక్కకు జరిపారు. వేగంగా వెళ్లే వాహనదారులు వీటిని గమనించకుండా వెళ్తే ద్విచక్ర వాహనాల చక్రాలకు చుట్టుకుని ప్రమాదాలు జరిగే ఆస్కారముందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. - న్యూస్‌టుడే, కర్నూలు బి.క్యాంపు

మొక్క ఎండింది.. కుండీ మిగిలింది

నగర సుందరీకరణలో భాగంగా నగరపాలక సంస్థ అధికారులు ప్రధాన రహదారుల పక్కన కుండీలు ఏర్పాటు చేసి మొక్కలు నాటించారు. వాటి పెంపకంపై దృష్టి సారించకపోవడంతో చాలాచోట్ల ఎండిపోయాయి. ఖాళీ కుండీలు దర్శనమిస్తున్నాయి. రైల్వేస్టేషన్‌కు వెళ్లే దారిలో మొక్కలు లేని కుండీని చిత్రంలో చూడొచ్చు. కుండీల్లో మళ్లీ మొక్కల నాటించి సంరక్షించేలా అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.
- న్యూస్‌టుడే, కర్నూలు నగరపాలక సంస్థ

దారి తవ్వేసి.. మరమ్మతులు విస్మరించి

బి.క్యాంపు సమీపంలోని శ్రీనగర్ కాలనీలో పైపులైన్ల మరమ్మతుల కోసం నగరపాలక సిబ్బంది సీసీరోడ్డును పగులకొట్టారు. పనులు పూర్తయ్యాక రోడ్డుకు మరమ్మతులు చేయకుండా మట్టి, కాంక్రీటు వ్యర్థాలతో గుంతను కప్పి పెట్టారు. దీంతో రాత్రిళ్లు ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారినపడుతున్నట్లు కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. - న్యూస్‌టుడే, కర్నూలు బి.క్యాంపు

రగ్బీ పోటీల్లో మూడో స్థానం

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే : చెన్నైలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరుగుతున్న దక్షిణ మండలం జాతీయ స్థాయి సబ్ జూనియర్ బాలికల రగ్బీ పోటీల్లో ఏపీ జట్టు మూడో స్థానంలో నిలిచిన్ల సంఘం ప్రతినిధులు తెలిపారు. ఏపీ జట్టులో జిల్లాకు చెందిన క్రీడాకారిణులు రాణించడంతో పుదుచ్చేరిపై 10- 0, తమిళనాడుపై 5-0 పాయింట్లతో విజయం సాధించినట్లు వెల్లడించారు. మూడో స్థానంలో నిలిచిన ఏపీ జట్టుకు నిర్వాహకులు ట్రోఫీతో పాటు రూ.48 వేల నగదు పురస్కారం అందజేశారని వివరించారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

పోటీలను ప్రారంభిస్తున్న భూపతిరావు

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే : క్రీడలతో మానసిక ఉల్లాసం, ఆరోగ్య సొంతమవుతాయని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు పేర్కొన్నారు. స్థానిక ఎ.క్యాంపు మాంటిస్సోరి ఉన్నత పాఠశాల ఆవరణలో కర్నూలు బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం బాక్సింగ్ పోటీలు జరిగాయి. సంఘం అధ్యక్షుడు కె.హరికృష్ణ, కార్యదర్శి టి.తేజ, బాక్సింగ్ శిక్షకుడు, సీనియర్ క్రీడాకారులు నాగరాజ్, మధుకుమార్, సతీష్‌కుమార్‌తో కలిసి ఆయన పోటీలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యం ఇస్తోందన్నారు.

కుంటుతున్న కుటుంబ సర్వే

★ ఈనెల 28వ తేదీతో ముగియనున్న గడువు
★ పర్యవేక్షణ లేక నగరంలో వెనుకపడిన సిబ్బంది

కర్నూలు కలెక్టరేట్, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఏకీకృత కుటుంబ (యూనిఫైడ్ ఫ్యామిలీ) సర్వే నత్తనడకన సాగుతోంది. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుకు అర్హులను గుర్తించేందుకు వీలుగా ప్రణాళికశాఖ ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ చేపట్టారు. గత డిసెంబరు 14వ తేదీ నుంచి సర్వే ప్రారంభమైంది. గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది తమ పరిధిలోని ఇంటింటికి వెళ్లి కుటుంబాల వివరాలు సేకరిస్తున్నారు. వారిపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేక పోవడంతో మొక్కుబడిగా చేస్తున్నారు. ఈనెల 28వ తేదీతో సర్వే గడువు ముగియనుంది. కర్నూలు నగరం, గ్రామీణ మండలంలో చాలా నెమ్మదిగా సాగుతోంది. ఇప్పటికీ సుమారు 25 కుటుంబాలు పెండింగ్ ఉండటం సిబ్బంది పనితీరుకు అద్దం పడుతోంది.

సేకరించే వివరాలు

ఏకీకృత కుటుంబ సర్వేలో భాగంగా మొత్తం 20 రకాల వివరాలు సేకరిస్తున్నారు. కుటుంబ సభ్యుల పేర్లు, పిల్లలు, చదువు, ఉద్యోగం, ఆదాయం, కుటుంబ నేపథ్యం, ఆస్తి వివరాలు, ఆధార్, చరవాణి నంబరు, వాహనాల సంఖ్య, గ్యాస్ కనెక్షన్ వంటివి తెలుసుకుని యాప్‌లో పొందుపరుస్తున్నారు.

5 రోజుల్లో 25 శాతం చేస్తారా..

నగరంలో మొత్తం 1,55,034 కుటుంబాలు ఉన్నాయి. ఈనెల 21వ తేదీ వరకు 1,16,758 కుటుంబాల (75) సర్వే పూర్తయింది. ఇంకా 38,276 కుటుంబాలు పెండింగ్ ఉన్నాయి. నగరపాలక సంస్థలో పరిధిలోని 136 వార్డు సచివాలయాల పరిధిలో మొత్తం 1,074 మంది సిబ్బంది ఉండగా 963 మంది సర్వే చేస్తున్నారు.

● 44 సచివాలయాల పరిధిలో సర్వే పురోగతి చాలా తక్కువగా ఉంది. వీటిలో 13 సచివాలయాల్లో రోజుకు ఒక కుటుంబాన్ని కూడా సర్వే చేయడం లేదు. మరో ఆరు సచివాలయాల్లో రోజుకు ఒక కుటుంబాన్ని మాత్రమే సర్వే చేస్తున్నారు. 30 వార్డు సచివాలయాల్లో పెండింగ్ కుటుంబాలు ఎక్కువగా ఉన్నాయి.

ఇక్కడ నత్తనడకన

కర్నూలు నగరంలో సర్వే మరీ నెమ్మదిగా సాగుతోంది. శ్రీనివాసనగర్ సచివాలయం పరిధిలో 1,778 కుటుంబాలు ఉండగా.. ఇప్పటి వరకు 454 కుటుంబాలను (26 శాతం) మాత్రమే సర్వే చేశారు. ఇంకా 1,305 (74 శాతం) కుటుంబాలు పెండింగ్ ఉన్నాయి. టైపిస్ట్ కాలనీలో 1,026, భగవాన్‌నగర్ సచివాలయంలో 1,013, లక్ష్మీపురం-1లో 1,224, లక్ష్మీపురం-2లో 700, డాక్టర్స్ కాలనీ సచివాలయం 1,051, బుధవారపేట-2లో 928, పందిపాడులో 1,006, దిన్నెదేవరపాడులో 1,511, శ్రీనగర్ కాలనీలో 877, షరాఫ్ బజార్‌లో 681, ఎన్టీఆర్ కాలనీ-1లో 977, మాధవీనగర్-2లో 641, ముజఫర్‌నగర్‌లో 634, బిర్లాకాంపౌండ్‌లో 621, బాలాజీనగర్‌లో 915, అశోక్‌నగర్-1లో 602, పెద్దపాడులో 810, రోజావీధి-2లో 623, రాజీవ్ గృహకల్ప సచివాలయంలో 836 కుటుంబాలు పెండింగ్‌లో ఉన్నాయి.

సంక్షిప్త సమాచారం

కర్నూలు నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే : ఎస్బీఐ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో సోమవారం ఉదయం 10.30 గంటలకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

కర్నూలు నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే : స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి సందర్భంగా ఆదివారం వెంకటరమణకాలనీలోని నగరపాలక తాత్కాలిక కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మేనేజర్ చిన్నరాముడు, ఆర్ఐ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రాయలసీమ ఎత్తిపోతలపై త్వరలో కార్యాచరణ

మాట్లాడుతున్న వైకాపా రాష్ట్ర కార్యదర్శి సతీష్‌కుమార్‌రెడ్డి, ఎస్వీ మోహన్‌రెడ్డి, కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కర్నూలు నగరం, న్యూస్‌టుడే : రాయలసీమ ఎత్తిపోతల పథకం నిలిపివేతకు వ్యతిరేకంగా త్వరలో నంద్యాలలో సమావేశం నిర్వహించి భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తామని వైకాపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్‌కుమార్‌రెడ్డి చెప్పారు. కర్నూలులో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వంతో కుమ్మక్కై రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని పక్కన పెట్టిందని ఆరోపించారు. ఈ అంశాన్ని వైకాపా తెరపైకి తేవడంతోనే తిరుమల లడ్డూ వివాదాన్ని తీసుకొస్తోందని విమర్శించారు. వైకాపా జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ గుండ్రేవుల ప్రాజెక్టు నిర్మిస్తే తెదేపాలో చేరతానని ప్రకటించిన కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి 2019లో పట్టుబట్టి సీఎం చంద్రబాబు చేతులమీదుగా శంకుస్థాపన చేయించారన్నారు. ఇప్పుడు కోట్ల ఎమ్మెల్యేగా, చంద్రబాబు సీఎంగా ఉన్నప్పటికీ గుండ్రేవుల ప్రాజెక్టును పట్టించుకోవడం లేదని విమర్శించారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, కంగాటి శ్రీదేవి, రాష్ట్ర కార్యదర్శి తెర్నేకల్ సురేంద్రరెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

డాక్యుమెంట్ పోయినవి

నేను, కొమెరే బాల పృథ్విరాజ్ S/o. కె.బాలస్వామి, ప్లాట్ నెం.4, H.No.4-234, శ్రీనిలయం కాలనీ, జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల దగ్గర, ఎస్.ఆర్. జూనియర్ కళాశాల ప్రక్కన, కర్నూలు, ఎ.పి., 10-2-2026న కర్నూలు, నంద్యాల చెక్‌పోస్ట్ నుండి మా ఇంటికి స్కూటీపై ప్రయాణిస్తున్నప్పుడు నా ప్లాట్ యొక్క ఒరిజినల్ లింక్ డాక్యుమెంట్ నెం.6320/2017 పోయినవి. ఎవరికైనా దొరికితే దయచేసి పైన ఉన్న చిరునామాకు తెలియజేయండి లేదా సంప్రదించండి.
81256 26403

(c) eenadu

మార్కాపురం-తర్లుపాడు రహదారిలో సీఎం బహిరంగ సభ స్థలాన్ని పరిశీలిస్తున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ రాజాబాబు, ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, అధికారులు

ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు పరిశీలన

పెద్దదోర్నాల, మార్కాపురం, న్యూస్‌టుడే: జిల్లాలో ఈ నెల 25వ తేదీన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పర్యటనను విజయవంతం చేయాలని ఇన్‌ఛార్జి కలెక్టర్ రాజాబాబు అధికారులను ఆదేశించారు. పెద్దదోర్నాల మండలం గంటవానిపల్లె సమీపంలోని ఫీడరు కాలువ వద్ద జరుగుతున్న ఏర్పాట్లను ఆదివారం ఆయన మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం మార్కాపురం-తర్లుపాడు రహదారిలో బహిరంగ సభ నిర్వహించే స్థలాన్ని పరిశీలించారు. ముఖ్యమంత్రి ఫీడరు కాలువ ఆధునికీకరణ పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం మార్కాపురం పట్టణంలో జరిగే బహిరంగ సభలో పాల్గొంటారన్నారు. పర్యటనలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లలో భాగంగా వెలిగొండ ప్రాజెక్టు సొరంగాలను సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్ రఘు, జేసీ శ్రీనివాసులు, తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు, సీఈ రమేష్, ఎస్ఈ అబూతాలీం పరిశీలించారు. దోర్నాల మండలం కొత్తూరు సమీపంలోని నిర్మాణంలో ఉన్న రెండు సొరంగాలను సందర్శించారు. రెండో సొరంగంలో జరుగుతున్న లైనింగ్ పనులను ప్రాజెక్టు ఎస్ఈ వివరించారు. ఇక్కడ పనులను సీఎంకు లైవ్‌లో చూపించేందుకు చేపట్టాల్సిన ఏర్పాట్లపై చర్చించారు. వీరివెంట సబ్‌కలెక్టర్ వెంకటశివరామిరెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులున్నారు.

ఇద్దరికే చోటు... పంచ ప్రాణాలకు చేటు!

కొంతమంది యువకుల అనాలోచిత పనులు కన్న తల్లిదండ్రులకు తీరని శోకాన్ని మిగుల్చుతున్న ఘటనలు మనం నిత్యం చూస్తున్నాం. ద్విచక్రవాహనంపై కేవలం ఇద్దరు మాత్రమే ప్రయాణించాల్సి ఉండగా తర్లుపాడు-మీర్జాపేట రహదారిపై ఆదివారం ఒకే ద్విచక్రవాహనంపై ఇలా అయిదుగురు యువకులు ప్రమాదకర ప్రయాణం సాగిస్తున్నారు. ఆ చిత్రమే ఇది. - న్యూస్‌టుడే, తర్లుపాడు

అమ్మినోళ్లకు కోట్లు.. కొన్నోళ్లకు పాట్లు!

◆ 175 ఎకరాల ప్రభుత్వ భూముల్లో లేఅవుట్లు
◆ స్వాధీనానికి అధికార యంత్రాంగం ఏర్పాట్లు

గత వైకాపా పాలనలో అధికారులు, పాలకులు కుమ్మక్కయ్యారు. ఆడిందే ఆటగా..పాడిందే పాటగా భూదందాలు సాగించారు. దొంగ పట్టాలు సృష్టించి కనిగిరితోపాటు సమీప ప్రాంతాల్లోని ప్రభుత్వ, అసైన్డ్, పశువులబీడు భూములను ఆక్రమించారు. వీటిల్లో అనధికార లేఅవుట్లు వేసి ప్లాట్లు విక్రయించారు. ఈ నేపథ్యంలో ఇటీవల ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అసెంబ్లీలో కనిగిరి చుట్టుపక్కల ప్రాంతాల్లో ఆక్రమించిన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలని కోరడంతో క్రయ, విక్రయదారుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. - న్యూస్‌టుడే, కనిగిరి

కనిగిరి-పామూరు రోడ్డులోని అసైన్డ్ భూముల్లో వేసిన లేఅవుట్

అధికారాన్ని అడ్డం పెట్టుకుని...

గత వైకాపా ప్రభుత్వంలో అధికారాన్ని అడ్డం పెట్టుకుని అప్పటి వైకాపా నాయకులు అక్రమాలకు తెరలేపారు. కనిగిరి పురపాలక, మండలంతోపాటు పామూరు తదితర ప్రాంతాల్లో జాతీయ రహదారికిరువైపులా ఉన్న 175 ఎకరాల ప్రభుత్వ భూములను ఆక్రమించారు. వీటిల్లో లేఅవుట్లు వేసి దాదాపు 500కుపైగా ప్లాట్లు విక్రయించడం ద్వారా సుమారు రూ.150 కోట్లకుపైగా దోచుకున్నారు. వీటికి ప్రభుత్వపరంగా ఎలాంటి అనుమతులు లేకపోవడం, ఎమ్మెల్యే స్వయంగా స్వాధీనం చేసుకోవాలని కోరడంతో ఇటు కొనుగోలుదారుల్లో ఆందోళన నెలకొనగా, అటు విక్రయదారుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.

ఎమ్మెల్యే వద్దకు బాధితులు

ప్రభుత్వ, అసైన్డ్, పశువుల బీడు భూములు ఆక్రమించి లేఅవుట్లు వేసి ప్లాట్లు విక్రయించేసినా అధికార యంత్రాంగం ఏమాత్రం పట్టించుకోలేదు. మరో వారంలో రెవెన్యూ, పురపాలకశాఖ యంత్రాంగం ఆయా భూములను తిరిగి స్వాధీనం చేసుకునేందుకు సిద్ధమవుతుండడంతో ప్లాట్లు కొనుగోలు చేసినవారు ఏం చేయాలో అర్థం కాక లబోదిబో మంటున్నారు. ఇప్పటికే వీరందరూ పలుమార్లు ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డిని కలిశారు. ప్లాట్లు విక్రయించిన అక్రమార్కులపై పోలీస్‌స్టేషన్‌లో కేసులు పెట్టాలని, నగదు వెనక్కి తీసుకోవాలని సూచించారు. ఈ విషయమై ఆర్డీవో జి.కేశవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుంటామని, ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ముద్దసానమ్మా... మనసా స్మరామి

మార్కాపురం మండలం జమ్మనపల్లి-కోలభీమునిపాడు గ్రామశివారులోని శ్రీముద్దసానమ్మ దేవస్థానంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని పెద్దసంఖ్యలో దర్శించుకుని పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.
- న్యూస్‌టుడే, మార్కాపురం గ్రామీణం

తిప్పాయపాలెంలో 776 రకం శనగ పంటను చూపిస్తున్న ఇన్‌ఛార్జి డీఏవో బాలాజీనాయక్, ఏవో ప్రసన్నరంగలక్ష్మి, రైతులు

శనగ @ 776

● ఎకరాకు 9-10 క్వింటాళ్ల దిగుబడి

జిల్లాలో జేజే-11 రకం శనగ సాగులో ఏటా ఎండు తెగులు, వాతావరణంలో మార్పులతో రైతులు నష్టపోతున్నారు. సాగు పెట్టుబడి కూడా రావడంలేదని ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో తొలిసారిగా మార్కాపురం మండలం తిప్పాయపాలెం గ్రామానికి చెందిన రైతు కుందురు వెంకటనారాయణరెడ్డి గతేడాది దర్శి కేవీకే వ్యవసాయ పరిశోధన కేంద్రం నుంచి 776 రకం శనగ విత్తన రకం ఎకరా విస్తీర్ణంలో సాగు చేసి ఏకంగా పది క్వింటాళ్ల దిగుబడి సాధించారు. విషయం తెలుసుకున్న రైతులు ఈ రకం సాగుకు ముందుకొచ్చారు. ప్రస్తుతం తిప్పాయపాలెంలో 100 ఎకరాలు, తర్లుపాడు మండలంలో 30, కంభం మండలం జంగంగుంట్లలో 20 ఎకరాల్లో సాగవుతోంది. ఈ విషయమై ఇన్‌ఛార్జి డీఏవో బాలాజీనాయక్ మాట్లాడుతూ 776 శనగ రకం తెలికపాటి నల్లరేగడి నేలల్లో పండుతుందన్నారు. ఎండు తెగులుతోపాటు వాతారణంలోని మార్పులను తట్టుకొని దిగుబడి వస్తోందన్నారు. ఎకరాకు 9 నుంచి 10 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తోందని తెలిపారు. 452 రకం సైతం అధిక దిగుబడి ఇస్తోందని ఆయన వివరించారు. - న్యూస్‌టుడే, మార్కాపురం

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు!

● ఒక్క నిమిషం అలస్యమైనా అనుమతించరు

న్యూస్‌టుడే, ఒంగోలు నగరం, మద్దిపాడు

పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులు

ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షలు సోమవారం ప్రారంభం కానున్నాయి. తొలిరోజు జూనియర్ ఇంటర్, మరుసటి రోజు సీనియర్ ఇంటర్ విద్యార్థులకు పరీక్షలు నిర్వహించేవిధంగా షెడ్యూలు ప్రకటించారు. ఈ సారి ప్రతిష్ఠాత్మకంగా పరీక్షలు నిర్వహించేందుకు ఇంటర్మీడియట్ బోర్డు ఏర్పాట్లు చేసింది. జూనియర్ ఇంటర్ విద్యార్థులు మారిన సిలబస్‌తో తొలిసారిగా పరీక్షలు రాయబోతున్నారు. నమూనా ప్రశ్నాపత్రాలు, పాఠ్యాంశాల బోధనపై ముందుగానే అధ్యాపకులకు శిక్షణ ఇచ్చారు. నూరు శాతం ఉత్తీర్ణత సాధనే లక్ష్యంగా 50 రోజులు ప్రణాళిక అమలు చేశారు. ఈ సారి పరీక్షల విధానంలోనూ మార్పులు చేశారు. గతంలో ఇక్కడ అధికారులే ఇన్విజిలేటర్లు, ఇతర సిబ్బందిని నియమించేవారు. ప్రస్తుతం బోర్డు నుంచే ఉత్తర్వులు జారీ చేశారు. పరీక్షల పర్యవేక్షణకు ఒక అబ్జర్వర్‌ను నియమించారు. సమస్యాత్మక కేంద్రాల్లో సిటింగ్ స్క్వాడ్‌లు, ఇతర చోట్ల ఫ్లయింగ్ స్క్వాడ్‌ల నిఘా ఉంటుంది. ప్రతి కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఆర్ఐవో, ఇంటర్మీడియట్ బోర్డు కార్యాలయాలకు వాటిని అనుసంధానం చేశారు.

42,759 మంది విద్యార్థులు: ఈ ఏడాది 22,275 మంది జూనియర్, 20,484 మంది సీనియర్ ఇంటర్ విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఇందుకోసం మొత్తం 67 కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటిలో 28 ప్రభుత్వ కళాశాలలు కాగా, మిగిలినవి ప్రైవేటు కళాశాలల్లో ఏర్పాటు చేశారు. పీఈటీలు, క్రాఫ్ట్ టీచర్లు, డ్రాయింగ్, మ్యూజిక్ ఉపాధ్యాయులను ఇన్విజిలేటర్లుగా నియమించారు. ప్రైవేటు కళాశాల కేంద్రాల్లో అక్కడి బోధకులను ఇన్విజిలేటర్లుగా నియమించారు. జంబ్లింగ్ పద్ధతిలో విద్యార్థులను కేంద్రాలకు కేటాయించారు. సోమవారం మొదలయ్యే పరీక్షలు మార్చి 24వ తేదీ వరకు కొనసాగుతాయి.

ఏర్పాట్లు పూర్తిచేశాం: పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు ఆర్ఐవో కె.ఆంజనేయులు తెలిపారు. తాగునీరు, ప్రథమ చికిత్స, కేంద్రాలు ఉన్న రూట్లలో పరీక్ష సమయాల్లో బస్సులు తదితర సౌకర్యాలు కల్పించామన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష జరుగుతుందని, విద్యార్థులు గంట ముందుగా కేంద్రాలకు చేరుకోవాలన్నారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా కేంద్రాల్లోకి అనుమతించబోమని స్పష్టం చేశారు.

ఆరునూరైనా సాధించాల్సిందే!

• పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం
• వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ

న్యూస్‌టుడే, మార్కాపురం గ్రామీణం

పదోతరగతి పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా చదువులో వెనుకబడిన విద్యార్థుల కోసం 'రైజింగ్ స్టార్స్' పేరిట 30 రోజుల ప్రత్యేక గురుకుల శిక్షణ తరగతులను ప్రభుత్వం ప్రారంభించింది. పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థుల్లో సీ, డీ గ్రేడ్ల వారితోపాటు చదువులో వెనుకబడినవారిని గుర్తించి వారికి శిక్షణ తరగతులు నిర్వహిస్తోంది. వీరి కోసం ఫిబ్రవరి 9వ తేదీ నుంచి మార్చి 10వ తేదీ వరకు నెల రోజులపాటు ఉచిత గురుకులాలను నిర్వహిస్తోంది. వీరందరూ నిపుణులైన ఉపాధ్యాయుల పర్యవేక్షణలో చదువుకుంటారు. వీరికి ఉచిత భోజనం, వసతి కల్పించారు. ప్రతి రెవెన్యూ డివిజన్ స్థాయిలో బాలబాలికలకు వేర్వేరుగా వసతి కేంద్రాలను ఏర్పాటు చేశారు.

● జిల్లాలో 11 ఎంపిక చేసిన కేంద్రాల్లో 205 మంది విద్యార్థులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. బాలురకు మార్కాపురం బీసీ బాలుర వసతిగృహం, కంచర్లపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల, గిద్దలూరు ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో వసతి ఏర్పాటు చేయగా, బాలికలకు 8 కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల్లో శిక్షణ శిబిరాలు ఏర్పాటుచేశారు. ఈ విషయమై మార్కాపురం ఉపవిద్యాశాఖాధికారి ఎం.శ్రీనివాసులు మాట్లాడుతూ పదోతరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులను షైనింగ్ స్టార్స్, రైజింగ్ స్టార్స్‌గా విభజించి వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా కార్యాచరణ అమలు చేస్తున్నామన్నారు. అధిక స్కోర్ చేయగలిగేవారిని షైనింగ్ స్టార్స్‌గా, చదువులో వెనుకబడిన రైజింగ్‌స్టార్స్‌గా విభజించి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాస్థాయి అధికారులతో పాటు ఎంఈవోల నిరంతర పర్యవేక్షణలో విద్యార్థులకు తర్ఫీదునిస్తున్నట్లు వివరించారు.

మార్కాపురం బీసీ వసతి గృహంలో పదోతరగతి విద్యార్థులు

CA. I K గుప్త అండ్ కో ఒంగోలు			
CA. కూరపాటి సుబ్బారావు ఒంగోలు	CA. బాల గ్రంథే ఒంగోలు	CA. CH వెంకటేశ్వర్లు కందుకూరు	CA. D శంకరరావు CA. D L సౌజన్య ఒంగోలు
CA. K రాజేంద్రప్రసాద్ ఒంగోలు	CA. U వరప్రసాదరావు ఒంగోలు	CA. PV రంగనాథం ఒంగోలు	CA. RLN రామప్రసాద్ ఒంగోలు
CA. K అంజనీదేవి ఒంగోలు	CA. M సత్యనారాయణ ఒంగోలు	CA. P శ్రీమన్నారాయణమూర్తి చీరాల	CA.CH తిరువాయికుమార్ ఒంగోలు
CA. B జగన్‌మోహన్‌రావు ఒంగోలు	CA. మండవ వెంకటవిజయ్‌కుమార్ ఒంగోలు	CA. తాతా కేశవరావు ఒంగోలు	CA. CH మురళీకృష్ణ ఒంగోలు
CA. N వెంకటరావు ఒంగోలు	CA. V వెంకటేశ్వరరావు చీరాల	CA. V శ్రీనివాసరావు రాజంపల్లి, దర్శి	CA. V శంకర్‌నరేంద్రకుమార్ ఒంగోలు
CA. P లక్ష్మి టంగుటూరు	CA. K హరిబాబు కందుకూరు	CA. T వినోద్ ఒంగోలు	CA. పబ్బిశెట్టి కార్తీక్ CA. పబ్బిశెట్టి పేరిందేవి ఒంగోలు
CA. గ్రంథే సుధీర్ ఒంగోలు	CA. CH ప్రేమ్‌కుమార్ ఒంగోలు	CA. K కృష్ణకిషోర్ ఒంగోలు	CA. అజయ్‌రఘురామ్ మార్కాపురం
CA. K రంగనాయకులు ఒంగోలు	CA. దామా సతీష్ అద్దంకి	CA. స్వామిరెడ్డి M.V ఒంగోలు	CA. M/S బ్రహ్మారెడ్డి & కంపెనీ ఒంగోలు
CA. పచ్చిపులుసు లక్ష్మీనారాయణ ఒంగోలు	CA. కొత్తమాసు ఫణితేజ ఒంగోలు	CA. J శ్రీనివాసరెడ్డి ఒంగోలు	CA. K సరస్వతి ఒంగోలు
CA. మద్దిశెట్టి రాజేష్ ఒంగోలు	CA. బాలమురళీకృష్ణ ఒంగోలు	CA. జమ్ము రవి ఒంగోలు	CA. P స్వాతికిరణ్ ఒంగోలు
CA. G మల్లిఖార్జునరెడ్డి ఒంగోలు	CA. రావిపాటి శ్రీహరి ఒంగోలు	CA. ఉప్పాతి రమణారెడ్డి ఒంగోలు	CA. M వెంకటసుబ్రమణ్యం కోర్టుసెంటర్, ఒంగోలు
CA. T కావేరి ఒంగోలు	CA. గూడా మల్లిఖార్జునరావు ఒంగోలు	CA. ముప్పరాజుశ్రీజ ఒంగోలు	CA. G అంజిరెడ్డి ఒంగోలు
CA. J యోగిరమణారెడ్డి ఒంగోలు	CA. జశ్వంత్ ఒంగోలు	CA. అశోక్&శ్రీహరి అసోసియేట్స్ ఒంగోలు	CA. సూర్యపవన్ ఒంగోలు

స్వార్థ రాజకీయాలకు స్వామిని వాడుకుంటారా?

మాట్లాడుతున్న మంత్రి స్వామి, పక్కన ఎమ్మెల్యేలు దామచర్ల, ఉగ్ర

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: మీ స్వార్థ రాజకీయాలకు వేంకటేశ్వర స్వామిని వాడుకుంటారా? దేవుడితో ఆటలాడితే వైకాపా తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి విమర్శించారు. ఒంగోలులోని తెదేపా కార్యాలయంలో ఆదివారం ఆయన ఒంగోలు, కనిగిరి ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, కూటమి నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో అప్పటి సీఎం జగన్ తన చిన్నాన్న వైవీ.సుబ్బారెడ్డిని తితిదే ఛైర్మన్‌గా నియమించి అనేక అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. శాసన మండలిలో చెప్పులు వేసుకుని వేంకటేశ్వరస్వామి పటం తీసుకురావడం పద్ధతి కాదని, రూలింగ్ కాదని సభ వాయిదా వేసి వెళ్లినప్పటికీ వైకాపా సభ్యులు గొడవలు సృష్టించినట్లు దుయ్యబట్టారు. వైకాపా నాయకులు చేసిన తప్పులకు క్షమాపణలు చెప్పకపోగా, సిగ్గులేకుండా హెరిటేజ్‌పై బురద జల్లుతారా అని మంత్రి ప్రశ్నించారు.

నిమ్మ.. ధర అదిరిందమ్మా!

నిమ్మ ధరలు ఒక్కసారిగా పెరగడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కిలో ధర రూ.30 నుంచి రూ.75కు ఎగబాకడంతో గత వారం రోజులుగా కోతలు మొదలయ్యాయి. నిమ్మ దిగుబడులు తగ్గుముఖం పట్టడంతోనే ధరలు పెరిగినట్లు రైతులు, వ్యాపారులు చెబుతున్నారు. రెండు నెలల కిందట భారీగా దిగుబడులతో కిలో ధర రూ.5కు పడిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. జిల్లాలోని హనుమంతునిపాడు మండలంలో సుమారు 2 వేల హెక్టార్లలో నిమ్మ తోటలు సాగవుతున్నాయి. చెన్నై, గుజరాత్, మహారాష్ట్ర, తెలంగాణా తదితర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు..కాయ నాణ్యతతో ఉండి భారీగా దిగుబడులు వచ్చిన సమయంలో ధర లేదని, ప్రస్తుతం ధరలున్నా పెద్దగా ఉపయోగం లేదని రైతులు వాపోతున్నారు. కనిగిరిలో శీతల గిడ్డంగులు ఏర్పాటు చేస్తే ధర ఉన్నరోజు మార్కెట్‌కు తరలించే సౌకర్యం ఉంటుందని రైతులు కోరుతున్నారు.
- న్యూస్‌టుడే, హనుమంతునిపాడు

డాక్ సేవక్‌లకు పురస్కారాలు

గుంటూరు, న్యూస్‌టుడే: గుంటూరు నగర శివారులోని సత్యసాయి ఆధ్యాత్మిక నగరిలో ఆదివారం జాతీయస్థాయి గ్రామీణ డాక్ సేవక్ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ఉత్తమ పనితీరు కనబరిచిన గ్రామీణ డాక్ సేవక్‌లకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌లు పురస్కారాలు అందించి సత్కరించారు. వీరి చేతులమీదుగా జిల్లా కేంద్రం మార్కాపురానికి చెందిన **రాజేష్** పురస్కారం అందుకున్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : సోమ సా.6-22
సహరీ : మంగళ ఉ.5-10

కార్పొరేట్ వైద్యం.. పేదలకు దూరం

◆ రెండేళ్లుగా నిలిచిపోయిన ప్రభుత్వ వైద్యకళాశాల భవనాలు

న్యూస్‌టుడే, మార్కాపురం

రాయవరంలో అసంపూర్తిగా నిలిచిపోయిన వైద్య కళాశాల భవన సముదాయం

జిల్లాలోని పేదలకు కార్పొరేట్ వైద్యం అందని ద్రాక్షగా మారింది. గ్రామీణ ప్రజలకు అధునాతన వైద్యసేవలందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం మార్కాపురంలో ప్రభుత్వం వైద్య కళాశాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంది. గత రెండేళ్లుగా వైద్య కళాశాల భవన సముదాయం నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయింది. మార్కాపురం మండలం రాయవరం గ్రామశివారులోని 53 ఎకరాల్లో వైద్యకళాశాలతోపాటు సూపర్ స్పెషాలిటీ వైద్యశాల, విద్యార్థుల వసతి గృహాలు, క్యాంటీన్ల నిర్మాణ పనులకు గత ప్రభుత్వం రూ.475 కోట్లు మంజూరు చేసింది. 2022లో ప్రారంభమైన నిర్మాణ పనులు 2024, జూన్ నాటికి 28 శాతం మేర మాత్రమే పూర్తయ్యాయి. పనులకు రూ.90 కోట్ల వరకు ఖర్చు పెట్టగా, గుత్తేదారు సంస్థకు రూ.75 కోట్లు బిల్లుల రూపంలో చెల్లించారు. అనంతరం గుత్తేదారు సంస్థ పనులు నిలిపేసి వెళ్లిపోయింది. మరోపక్క కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం గతేడాది మంత్రివర్గ సమావేశంలో మార్కాపురం వైద్యకళాశాలను పీపీపీ విధానంలో నిర్మించేందుకు ఆమోద ముద్ర పడింది. ఇందుకు టెండర్లు పిలిచి ఏడాదవుతున్నా ఒక్కటీ దాఖలు కాలేదు.

(c) eenadu

కాటంరాజుకు ప్రత్యేక పూజలు



అలంకరణలో స్వామి

పెద్దారవీడు, న్యూస్‌టుడే: గుండంచర్ల సమీపంలోని నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన కాటం రాజుకు గంగాభవానీ అమ్మవారి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాటంరాజును సుందరంగా అలంకరించారు. గంగాభవానీ అమ్మవారికి బోనాలు సమర్పించి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం ఏర్పాటు చేశారు.

స్వామికి పూజలు చేస్తున్న వేదపండితులు

నయన మనోహరం.. లక్ష్మీనారాయణుని కల్యాణం

మార్కాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని జవహర్‌నగర్ కాలనీలో గల శ్రీదేవీ భూదేవీ సమేత అమలక లక్ష్మీనారాయణస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివార్ల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించినట్లు దేవస్థాన కమిటీ సభ్యులు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి దంపతులు కల్యాణసేవలో పాలుపంచుకున్నారు. సాయంత్రం విష్ణు సహస్రనామ పారాయణం, అనంతరం గరుడోత్సవం మహిళామణుల కోలాటనృత్యాల మధ్య ఆహ్లాదకర వాతావరణంలో సాగింది. భక్తులకు అసౌకర్యం కలగకుండా కమిటీ అధ్యక్ష కార్యదర్శులు గోళ్ల వరలక్ష్మి, వెంకటరెడ్డి, సత్యనారాయణరెడ్డి, తదితరులు తగు జాగ్రత్తలు తీసుకున్నారు.

మాట్లాడుతున్న వ్యవసాయ, కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దడాల సుబ్బారావు

పరిశ్రమలు రావాలి.. ఉపాధి దక్కాలి

❖ మార్కాపురం జిల్లా అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి అవసరం ❖ సీఎం చంద్రబాబుకు జిల్లా ప్రజల విజ్ఞప్తి

న్యూస్‌టుడే, త్రిపురాంతకం:

కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పరిపాలన సౌలభ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పశ్చిమ ప్రకాశాన్ని విభజించి మార్కాపురం కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పాటు చేసింది. దీంతో జిల్లా యువతలో ఉపాధి అవకాశాలపై కొత్త ఆశలు నెలకొన్నాయి.

మార్కాపురం జిల్లా కేంద్రం

చిన్న, మధ్య తరహాలకు ప్యాకేజీలు తప్పనిసరి

మార్కాపురం జిల్లాలో పరిశ్రమల స్థాపనకు అనుకూల పరిస్థితులు ఉన్నాయి. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం జిల్లాలో భూములను కేటాయించి ప్రత్యేక పరిశ్రమలు ఏర్పాటుకు ముందడుగు వేయాలి. స్థానిక యువత పారిశ్రామిక రంగంలో అడుగుపెట్టేలా చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలంగా మార్కాపురం జిల్లాకు ప్రత్యేక పారిశ్రామిక ప్యాకేజీతో పాటు పన్ను రాయితీలు ప్రకటించాలి. అభివృద్ధికి బాటలు వేసేలా.. మొదటి సారిగా మార్కాపురం జిల్లాకు రానున్న ముఖ్యమంత్రి చంద్రబాబు జిల్లాపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజానీకం కోరుతున్నారు.

జిల్లా : మార్కాపురం ఏర్పడిన తేదీ:31.12.2025	
భౌగోళిక విస్తీర్ణం:	6001 చ.కి.మీ.
నియోజకవర్గాలు:	4
రెవెన్యూ డివిజన్లు:	2
మున్సిపాలిటీలు:	4
మండలాలు:	21
జిల్లాలోని మొత్తం కుటుంబాలు:	3,74,914
జనాభా:	11,42,000

ఆర్థిక పురోగతికి మార్గం..

నూతన జిల్లా ఏర్పాటుతో పరిపాలనా సౌకర్యాలు పెరిగినప్పటికీ.. ఆర్థిక పురోగతి మాత్రం పరిశ్రమల ద్వారానే సాధ్యమవుతుందని చెప్పవచ్చు. మార్కాపురం జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు విస్తారమైన భూములు సహజ వనరులు ఉన్నాయి. ముఖ్యంగా ఈ జిల్లా నుంచి 3 జాతీయ రహదారులు రాజధానికి అనుసంధానంగా ఉన్నాయి. అందులో ప్రధానంగా జిల్లా కేంద్రమైన మార్కాపురం మీదుగా అనంతపురం-అమరావతి జాతీయ రహదారి ఉంది. ఇది కర్నూలు, కడప, అనంతపురం ప్రాంతాల నుంచి విజయవాడ వెళ్లే వాహనాల రాకపోకలకు ప్రధాన రహదారిగా ఉంది. దీని ద్వారా పరిశ్రమలు, వ్యాపారాలకు సంబంధించిన ముడి సరకుల రవాణా, వస్తువుల సరఫరాకు అనువైన మార్గాలు బలంగా ఉన్నాయి.

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, శీతల గిడ్డంగులు

మార్కాపురం జిల్లాకే తలమానికంగా ఉన్న వెలిగొండ ప్రాజెక్ట్ పూర్తయితే జిల్లాలోని బీడు భూములు సైతం సస్యశ్యామలంగా మారతాయి. ప్రభుత్వ సహకారం, సబ్సిడీలతో జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, పాల ఉత్పత్తుల పరిశ్రమలు, శీతల గిడ్డంగులతో పాటు వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేందుకు అవకాశాలున్నాయి.

నూతన కమిటీ కార్యవర్గ సభ్యులు

జిల్లా వీఆర్వోల సంఘం నూతన కమిటీ ఎన్నిక

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లా ఏపీ డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం జిల్లా నూతన కమిటీని ఒంగోలులోని ఏపీటీఎఫ్ భవన్‌లో ఆదివారం జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా ఎస్.నారపరెడ్డి, అధ్యక్షుడిగా బి.సుధాకర్, సహాధ్యక్షుడిగా సీహెచ్.బ్రహ్మతేజ రాజు, ఉపాధ్యక్షులుగా లక్ష్మయ్య, బి.రాజశేఖర్‌రెడ్డి, బి.అశోక్; ప్రధాన కార్యదర్శిగా సీహెచ్.వంశీకృష్ణ యాదవ్, ఎన్నికయ్యారు. సంయుక్త కార్యదర్శులుగా ఐ.ప్రశాంత్, వై.అంకమ్మ, కె.అమృతలీల; కోశాధికారిగా జి.యలమందరావు, కార్యనిర్వాహక కార్యదర్శులుగా బి.మహేంద్రరెడ్డి, మహిళా అధ్యక్షురాలుగా శ్రీలక్ష్మి, డి.మౌనికతోపాటు, కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులను అభినందించారు.

నేడు ఐసీఏఐ నూతన భవనానికి భూమిపూజ

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: స్థానిక రామనగర్ మొదటి లైన్‌లో ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) నూతన భవన నిర్మాణానికి సోమవారం ఉదయం 8.30 గంటలకు భూమిపూజ జరగనుంది. ఐసీఏఐ అధ్యక్షులు ప్రసన్నకుమార్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని ఒంగోలు బ్రాంచి ఛైర్మన్ చక్కా తిరువాయుకుమార్ తెలిపారు.

వడివడిగా తీగలేరు చప్టా విస్తరణ

పైపులు వేసే పనుల్లో సిబ్బంది

పెద్దదోర్నాల, న్యూస్‌టుడే: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ నెల 25న గంటవానిపల్లె సమీపంలో ఫీడర్ కెనాల్ ఆధునికీకరణ పనులు ప్రారంభించనున్నారు. అక్కడే సభ జరుగనుంది. సభకు వెళ్లే వాహనాలకు తీగలేరు వాగు అడ్డంకిగా మారింది. ప్రస్తుతం దానిపై 5 మీటర్ల వెడల్పున చప్టా ఉంది. దానిని మరో ఐదు మీటర్లు వెడల్పు విస్తరణ కోసం అవసరమైన పనులు పంచాయతీరాజ్ అధికారులు చేపట్టారు. ఆదివారం పైపులు తీసుకుని వచ్చి పరిచే పనులు చేపట్టారు. దానిపై మొరం పోసి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు.

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక పేస్ ఇంజినీరింగ్ కళాశాలలో వక్తృత్వ జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారు. మండల స్థాయిలో విజేతలుగా నిలిచిన 160 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. కార్యక్రమానికి రాష్ట్ర కార్యదర్శి కంచర్ల వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. పేస్ కళాశాల కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జనవిజ్ఞానవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ వి.బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ వక్తృత్వ కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నామన్నారు. తక్కువ సమయంలో సబ్జెక్టును, స్పష్టంగా మాట్లాడటాన్ని ప్రోత్సహించడం లక్ష్యమన్నారు.

వక్తృత్వ జిల్లా స్థాయి పోటీలు

పోటీల్లో మద్దిపాడు నాగార్జున స్కూలు విద్యార్థిని పీవీ సాయిపల్లవి (ప్రథమ), అమ్మనబ్రోలు ఏపీ రెసిడెన్షియల్ స్కూలు విద్యార్థిని కె.శిలోమా (ద్వితీయ), అమ్మనబ్రోలు స్కూలు విద్యార్థి సిరిచందన తృతీయ స్థానాల్లో నిలిచారు. మార్కాపురం జిల్లా నుంచి రాచర్ల స్పందన స్కూలు విద్యార్థిని పి.లహరి (ప్రథమ) బేస్తవారిపేట జెడ్పీ స్కూలు విద్యార్థిని దివ్యలక్ష్మి (ద్వితీయ) పామూరు సెయింట్ మార్క్స్ స్కూలు విద్యార్థి సాయిశంకర్ తృతీయ బహుమతి సాధించారు. విజేతలకు పుస్తకాలు, ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. కొల్లా పుల్లయ్య, కోటేశ్వరరావు, సుందరరావు పేర్లమీద వారి కుటుంబ సభ్యులు విజేతలకు ట్యాబ్‌లు అందజేశారు. రాష్ట్రస్థాయి పోటీలు 27, 28వ తేదీల్లో గుంటూరులో జరుగుతాయని వెల్లడించారు. కార్యక్రమంలో డాక్టర్ కొల్లా నాగేశ్వరరావు, కె.శ్రీనివాసులు, మధు, సుబ్బారావు, గయాజ్ తదితరులు పాల్గొన్నారు.

విజేతకు జ్ఞాపిక అందజేస్తున్న జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులు

కార్పొరేట్ శక్తుల ప్రయోజనాలే మోదీ లక్ష్యం

ఒంగోలు గ్రామీణం: దేశంలోని కార్పొరేట్ శక్తుల ప్రయోజనాలను కాపాడేందుకే మోదీ ప్రభుత్వం [illegible] వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దడాల సుబ్బారావు విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే తవనం చెంచయ్య వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక ఎల్బీజీ భవన్‌లో ఆదివారం 'సామ్రాజ్యవాదం నిన్నునేడు' అంశంపై సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అంబానీ, అదానీ లాంటి బడా కార్పొరేట్లకు దేశంలోని సహజ వనరులు, ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రజా సంపదనంతా మోదీ ప్రభుత్వం కట్టబెడుతుందని మండిపడ్డారు. సంఘం జిల్లా కార్యదర్శి ఆంజనేయులు మాట్లాడుతూ.. మాజీ ఎమ్మెల్యే తవనం చెంచయ్య తన జీవితమంతా అంటరానితనం నిర్మూలన; అణగారిన వర్గాలపై దాడులు అంతం కోసం పోరాడారని కొనియాడారు.

వేట కరవై.. బతుకు భారమై

కందుకూరు, గుడ్లూరు, ఉలవపాడు, న్యూస్‌టుడే: రామాయపట్నం ఓడరేవు నిర్మాణంతో గ్రామాలు కోల్పోయి పునరావాస కాలనీల్లో ఉంటున్న మహిళలకు ఉపాధి కరవై ఇబ్బందులు పడుతున్నారు. గుడ్లూరు మండలం ఆవులవారిపాలెం, మొండివారిపాలెం గ్రామాలకు చెందిన సుమారు 300 కుటుంబాలకు రెండేళ్ల కిందట పునరావాస కాలనీలు నిర్మించారు. ▸ కాలనీలకు రాకముందు చేపల వేటే ప్రధానంగా ఉండేది. పురుషులు సముద్రంలో వేటకు వెళ్లి తీసుకొచ్చిన మత్స్య సంపదను మహిళలు గ్రామాలు, పట్టణాల్లో అమ్మకాలు చేసేవారు. దీంతో రోజుకు సుమారు రూ.500 వరకు ఆదాయం వచ్చేది. ▸ పునరావాస కాలనీలకు వచ్చాక వేట తగ్గిపోయింది. పురుషులు ఆదాయ మార్గాలు కోల్పోయారు. దీంతో మహిళలు సైతం జీవనం కష్టంగా మారింది. ఉపాధి పనులు కొంత మేర ఆదుకుంటున్నా.. అవి లేనప్పుడు ఖాళీగా ఉండాల్సి వస్తోందని వాపోతున్నారు. ఆవేదన వ్యక్తం చేశారు.

ఖాళీగా ఉంటున్నాం

రెండేళ్లుగా ఉపాధి లేక ఖాళీగా ఉంటున్నాం. ఇతర పనులు దొరకక అప్పుల పాలవుతున్నాం. పిల్లల పోషణ భారంగా మారింది. ప్రభుత్వం తమను ఆదుకోవాలి.

-కె.మంగమ్మ, మొండివారిపాలెం

సముద్రం దూరమైంది

పునరావాస కాలనీలకు వచ్చాక పురుషులు వేటకు వెళ్లాలంటే సముద్రం దూరమైంది. దీంతో పాటు తెప్పలు పెట్టుకునేందుకు సైతం చోటు లేకుండా పోయింది. చేసేందుకు ఇతర పనులేమీ లేవు. ఏం చేయాలో తోచడం లేదు. జీవనం కష్టంగా మారింది. ఉపాధి పనులు ఎక్కువ రోజులు కల్పించి ఆదుకోవాలి.

-వి.లక్ష్మీకాంతమ్మ, ఆవులవారిపాలెం

జీవన భృతి ఇవ్వలేదు

ఓడరేవు నిర్మాణ సమయంలో పునరావాస కాలనీకు వచ్చాక కొన్ని రోజుల పాటు జీవన భృతి కింద నగదుతో పాటు బియ్యం ఇస్తామన్నారు. కానీ తమకు ఎటువంటి సహాయం అందలేదు. నెలలో కనీసం పది రోజులు కూడా పనులు దొరకడం కష్టంగా మారింది. -వి.నాగరత్నమ్మ, ఆవులవారిపాలెం

పథకంలో మార్పు చేయడంతో ఆలస్యమైంది

ఆవులవారిపాలెం, మొండివారిపాలెం పునరావాస కాలనీల వారికి ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకుంటాం. పథకంలో మార్పు చేయడంతో ఆలస్యమవుతోంది. పనులు గుర్తిస్తున్నాం.

-వెంకటేశ్వర్లు, ఏపీవో, ఉపాధి హామీ పథకం

రెండో సొరంగంలోంచి తొలి సొరంగంలోకి ఆరు రంధ్రాలు

రెండో సొరంగం నుంచి తొలి సొరంగంలోకి తవ్విన దారి

పెద్దదోర్నాల, న్యూస్‌టుడే: పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టులో రెండు సమాంతర సొరంగాల నిర్మాణం ప్రధానమైది. వాటిలో తొలి సొరంగం నిర్మాణం పూర్తయింది. ప్రస్తుతం రెండో సొరంగంలో లైనింగ్ పనులు జరుగుతున్నాయి. ఆ సొరంగంలో 11 కి.మీ వద్ద టీబీఎం (టన్నెల్ బోరింగ్ యంత్రం) ఉంది. దీంతో మిగిలిన 8 కి.మీలు తవ్వకం, లైనింగ్ పని నిర్వహణకు ఇబ్బందులు తలెత్తాయి. దీంతో రెండో సొరంగంలో 9.5 కి.మీ వద్ద తొలి సొరంగంలోకి రంధ్రం వేశారు. 12 కి.మీ నుంచి 18 కి.మీ వరకు మరో ఐదు రంధ్రాలు వేశారు. వాటి ద్వారా లైనింగ్ పనులకు అవసరమైన సామగ్రిని వాహనాల్లో తరలించి పనులు చేస్తున్నారు. లైనింగ్ పనులు పూర్తయిన తర్వాత ఆ రంధ్రాలను పూడ్చనున్నట్లు ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు.

పొగాకు వేలం కేంద్రం అధికారి బదిలీ

పొదిలి, న్యూస్‌టుడే: పొదిలి పొగాకు వేలం కేంద్రం నిర్వహణాధికారి జి.గిరిరాజ్‌కుమార్ వెల్లంపల్లి కేంద్రానికి బదిలీ అయ్యారు. ఈయన నాలుగున్నరేళ్లపాటు ఈ ప్రాంతం రైతులకు సేవలందించారు. కందుకూరు-2 వేలం కేంద్రం నిర్వహణాధికారి కె.రాజగోపాల్‌ను పొదిలి కేంద్రానికి బదిలీ చేశారు. ఈమేరకు బదిలీ ఉత్తర్వులు అందినట్లు గిరిరాజ్‌కుమార్ తెలిపారు. ఒకటి, రెండురోజుల్లో పాత వారు రిలీవ్ కావడం, కొత్తవారు చేరనున్నట్లు తెలిసింది.

ప్రకాశం జిల్లాలో బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం ధర - 115, రిటైల్ లైవ్ - 142, చికెన్ విత్ స్కిన్ - 206, చికెన్ స్కిన్‌లెస్- 234

చెంచయ్య సేవలు మరువలేనివి

చెంచయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

మార్కాపురం, న్యూస్‌టుడే: మాజీ ఎమ్మెల్యే, సీపీఎం సీనియర్ నేత దివంగత తవనం చెంచయ్య సేవలు పార్టీకి మరువలేనివని.. ఆయన లేని లోటు ఎప్పటికీ ఉంటుందని జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు దగ్గుపాటి సోమయ్య అన్నారు. ఆదివారం స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో సీపీఎం నేత చెంచయ్య 12వ వర్ధంతి జరిగింది. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సోమయ్య మాట్లాడుతూ ఉమ్మడి ప్రకాశం జిల్లాలో పార్టీ అభివృద్ధి ఎంతో కృషి చేశారన్నారు. పార్టీ కార్యకర్త నుంచి ఎమ్మెల్యే స్థాయికి ఎదిగిన నేత చెంచయ్య అని కొనియాడారు. తన చివరి శ్వాస వరకు పార్టీ, ప్రజల కోసం పని చేశారన్నారు. తనకు వచ్చే పింఛన్ కూడా పార్టీ, ప్రజల సేవ కోసం ఖర్చు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు డి.కె.ఎం.రఫీ, గుమ్మ బాలనాగయ్య, జవ్వాజి రాజు, రవికుమార్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎత్తు వేశారు.. విజేతలుగా నిలిచారు

తిరుపతి(క్రీడలు): శాప్ లీగ్ పోటీల్లో భాగంగా తిరుపతిలోని శ్రీ శ్రీనివాస క్రీడా సముదాయం వేదికగా రెండ్రోజులపాటు జరిగిన రాష్ట్ర స్థాయి చదరంగం పోటీలు ఆదివారం ఉత్సాహంగా ముగిశాయి. పోటీల్లో పలు జిల్లాలకు చెందిన బాలబాలికలు ఎత్తులకు పైఎత్తులు వేస్తూ ప్రత్యర్థులపై సత్తా చాటారు. అండర్ -14, 17, 19 విభాగాల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విజేతలకు ఆదివారం ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, తితిదే పాలకమండలి సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్, తెదేపా రాష్ట్ర మీడియా సమన్వయకర్త, శాప్ మాజీ డైరెక్టర్ శ్రీధర్‌వర్మ ట్రోఫీ, పతకం, ప్రశంసా పత్రాలు ప్రదానం చేశారు. జిల్లా క్రీడాభివృద్ధి అధికారి శశిధర్, చదరంగం సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాససూరి, శాప్ శిక్షకులు పాల్గొన్నారు.

జిల్లా హాకీ బాలబాలికల జట్ల ఎంపిక

మైనంపాడు(సంతనూతలపాడు), న్యూస్‌టుడే: మైనంపాడులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జిల్లా జూనియర్ బాలబాలికల జట్ల ఎంపిక కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా హాకీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఎంపికల్లో జిల్లా జట్టులను ఎంపిక చేశారు. మొత్తం బాలికల విభాగంలో 35 మంది, బాలుర విభాగంలో 40 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వీరిలో బాల బాలికల జట్లను ఎంపిక చేశారు. ఎంపికైన జిల్లా జట్టులను జిల్లా కార్యదర్శి ఎ.సుందరరామిరెడ్డి, విద్యాకమిటీ ఛైర్మన్ ఆకుల బ్రహ్మయ్య, హాకీ క్లబ్ అధ్యక్షుడు గొడుగు కాలేషా, పీడీలు వనజ, శ్రీనివాసరావు, పీఈటీలు తిరుమలశెట్టి రవికుమార్, పలువురు పీఈటీలు అభినందించారు.

ఎంపికైన బాలికల జట్టు

ఇద్దరు వాహన దొంగల అరెస్టు

వివరాలు వెల్లడిస్తున్న మార్కాపురం డీఎస్పీ నాగరాజు

బేస్తవారపేట, న్యూస్‌టుడే: వాహనాల దొంగతో పాటు... అతడి నుంచి వాటిని కొనుగోలు చేస్తూ సహకరిస్తున్న మరో వ్యక్తిని బేస్తవారపేట పోలీసులు అరెస్టు చేశారు. స్టేషన్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో డీఎస్పీ నాగరాజు వివరాలు వెల్లడించారు. కాకినాడ జిల్లా తిమ్మాపురానికి చెందిన ఆచంట గంగాధరరావు.. బేస్తవారపేట మండలం చింతలపాలెంలో ఈ నెల 14న ట్రాలీతో సహా ఓ ట్రాక్టర్‌ను అపహరించాడు. బనగానిపల్లి, మహానంది, ఐజా స్టేషన్ల పరిధిలో మరో నాలుగు ద్విచక్ర వాహనాలు, గిద్దలూరు పరిధిలో ట్రాలీ ఆటో తస్కరించాడు. చోరీ చేసిన వాహనాలను కడప జిల్లా ఎర్రగుంట్లకు చెందిన పల్లెపోగు ప్రసాద్‌కు విక్రయిస్తుండేవాడు. అతడు వాటిని బయటి మార్కెట్‌లో అధిక ధరలకు అమ్మేవాడు. కంభం ఇన్‌ఛార్జి సీఐ రామకోటయ్య, ఎస్సై రవీంద్రారెడ్డి సిబ్బందితో కలిసి కోనపల్లి అడ్డరోడ్డు వద్ద ఆదివారం వాహన తనిఖీలు చేస్తుండగా... వీరిరువురూ ట్రాక్టర్‌లో వస్తూ పోలీసులకు చిక్కారు. పొంతన లేని సమాధానాలు చెబుతుండడంతో స్టేషన్‌కు తరలించారు. విచారణలో చోరీల విషయం వెలుగులోకి వచ్చింది. వారి నుంచి సుమారు రూ.14 లక్షల విలువైన వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. గంగాధరరావుపై కంభం, గిద్దలూరు, దోర్నాల, గుంతకల్లు, నంద్యాల, బేతంచర్ల, పులివెందుల, తిమ్మాపురం, నరసరావుపేట, కారంపూడి, గడివేముల, నాయుడుపేట తదితర స్టేషన్లలో చోరీ కేసులు నమోదయ్యాయని డీఎస్పీ తెలిపారు.

ప్రమాదంలో కర్ణాటక మహిళ దుర్మరణం

పామూరు, న్యూస్‌టుడే: ట్రాక్టర్‌ను టెంపో ట్రావెలర్ వాహనం ఢీకొని ఓ మహిళ దుర్మరణం చెందగా... మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పామూరు సమీపంలో జాతీయ రహదారి-565పై ఆదివారం తెల్లవారుజామున ఈ సంఘటన చోటుచేసుకుంది. ఎస్సై కట్టా అనూక్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రం విజయనగర జిల్లా కొట్టూరు మండలం నగరకట్టు గ్రామానికి చెందిన విశాలాక్షి (48)... కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి ఆంధ్రప్రదేశ్‌లోని పుణ్యక్షేత్రాల సందర్శనకు ఈ నెల 20న టెంపో ట్రావెలర్ వాహనంలో బయలుదేరారు. మంత్రాలయం, మహానంది, శ్రీశైలం క్షేత్రాలను దర్శించుకుని... శనివారం రాత్రి తిరుపతి బయలుదేరారు. ఆదివారం తెల్లవారుజాము 5:30 గంటల సమయంలో... పామూరు సమీపంలోని గోపాలపురం వద్ద ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను వీరి వాహనం బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో విశాలాక్షికి తీవ్ర గాయాలు కావడంతో వెంటనే ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా... 108లో కందుకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విశాలాక్షి బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కనిగిరి ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి బాధితులను పరామర్శించి... సొంత నిధులతో వాహనం ఏర్పాటు చేసి వారిని స్వస్థలాలకు పంపే ఏర్పాటు చేశారు.

'ఆదర్శ' పాఠశాల.. విద్యార్థులకు వరం

❖ ఆరో తరగతి ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరణ

న్యూస్‌టుడే, పెద్దదోర్నాల:

కార్పొరేట్ స్థాయికి మించి విద్యనందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'ఆదర్శ' పాఠశాలలు గ్రామీణ విద్యార్థులకు వరంగా మారాయి. నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఏర్పాటు చేసిన ఈ పాఠశాలలు మార్కాపురం జిల్లాలోని మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు, కనిగిరి నియోజక వర్గాల్లో ఉన్నాయి. ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు విద్యార్థులకు ఉత్తమ విద్యనందిస్తున్నారు. ఆంగ్లమాధ్యమంలో బోధించే ఈ పాఠశాలల్లో ఆరో తరగతిలో ప్రవేశానికి ఈ నెల 23 నుంచి దరఖాస్తులు స్వీకరించాలని ప్రభుత్వం పాఠశాలలకు ఉత్తర్వులు జారీ చేసినట్లు మొట్లమల్లికార్జునపురంలో ఏపీ ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ సరళ తెలిపారు.

మొట్ల మల్లికార్జునపురంలోని ఏపీ ఆదర్శ పాఠశాల

ప్రవేశాలు పొందడం ఇలా...

ప్రభుత్వ లేక ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 2024-25, 2025-26 విద్యా సంవత్సరాల్లో చదివి ఉండాలి. 2025-26 విద్యా సంవత్సరంలో ఐదో తరగతి చదువుతూ ప్రమోషన్ అర్హత పొంది ఉండాలి.

❖ ఈ నెల 23 నుంచి మార్చి 31 వరకు దరఖాస్తు చేసుకోవాలి. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.200లు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.125లు పరీక్షా రుసుం చెల్లించాల్సి ఉంటుంది.

❖ 12.04.26న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. ఐదో తరగతి స్థాయిలో తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో ప్రశ్నపత్రాలిస్తారు. ప్రశ్నలు అబ్జెక్టివ్ టైపులో ఉంటాయి.

❖ ఓసీ, బీసీ విద్యార్థులకు 35 మార్కులు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 30 మార్కులు సాధించిన వారే అర్హులు.

❖ పూర్తి వివరాల కోసం ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్, సంబంధిత మండలాల విద్యాశాఖ అధికారులను సంప్రదించవచ్చు.

❖ ప్రవేశ పరీక్షలో పొందిన మార్కుల ఆధారంగా రిజర్వేషన్ల ప్రాతిపదికన ప్రవేశం కల్పిస్తారు. ఆరో తరగతిలో 80 నుంచి 100 మంది విద్యార్థుల వరకు ప్రవేశాలు కల్పిస్తారు.

EENADU Classifieds

BUSINESS SERVICES
బంగారం బ్యాంకులో/ ప్రైవేటు సంస్థలలో తాకట్టు పెట్టిన బంగారం విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును (స్పాట్ క్యాష్). Ph.81422 92071.

EDUCATION
DISTANCE EDUCATION
ఆచార్య నాగార్జున యూనివర్సిటీ దూరవిద్య ద్వారా M.Sc (అన్నిసబ్జెక్ట్స్), MBA, MCA, M.Com, MLISc కోర్సులకు అడ్మిషన్లు జరుగుచున్నవి. [illegible] డిగ్రీకాలేజి, ఒంగోలు. Ph: 9849124970, 9030568558.

REAL ESTATE
LAND FOR SALE
Land For Sale [illegible] 9542209665, 6304567326.

JOBS
శ్రీ జాహ్నవి ఆక్వా ఎంటర్‌ప్రైజెస్ ఆఫీసు [illegible] ERP,GST [illegible] కావలెను. 8886687399.
ప్రముఖ [illegible] PG [illegible] ✆ 63095 36439.

NATIONAL BANKS [illegible]
గుంటూరు మస్తర్లమెంట్స్ [illegible] 99122 66449, 94922 66449
ప్రముఖ బ్యాంకులో [illegible] 9710545017.
సాయి గ్రానైట్స్ [illegible] 99590 50995.

విచారణకు: 97011 12824 ఒంగోలు 80087 09902 మార్కాపురం 80081 11050
మీ చిన్నారులకు పుట్టినరోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి. B&W : రూ. 500 Colour : రూ. 700
ప్రకటనలపై 5% GST వర్తించును

Tally ఆపరేటర్ [illegible] Cont: 97034 02722
ప్రముఖ లోన్స్ [illegible] 97014 79569, 80081 00872.

MARKETING/ SALES
Anand Masale Require Sales & Marketing Manager, Marketing Executives. Contact: 9849655105, 98480 53144 Email: anandmasalappltd@gmail.com

FACULTY/ TEACHERS
[illegible] 6265397498, 9121024992

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలను ప్రచురించే ముందు [illegible]

కనిగిరి

• కనిగిరి • గిద్దలూరు

ఇళ్ల మధ్యనే మురుగు తటాకం

గిద్దలూరు ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని శ్రీనివాసనగర్‌లో డ్రైనేజీ వ్యవస్థ లేక... ఇళ్ల నుంచి వచ్చే వ్యర్థ జలాలు కాలనీలోని ఖాళీ స్థలాల్లోకి చేరుతున్నాయి. అవి మురుగు తటాకాల్లా మారి దోమలు వృద్ధి చెందుతుండడంతో నివాసితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలువలు ఏర్పాటు చేయాలని పంచాయతీ సిబ్బంది, అధికారులను కోరినా ప్రయోజనం లేకపోయిందని... ఉన్నతాధికారులైనా చొరవ చూపాలని కాలనీవాసులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, గిద్దలూరు పట్టణం

వాహన తనిఖీలు

హనుమంతునిపాడు, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహన చోదకులు విధిగా శిరస్త్రాణం ధరించాలని ఎస్సై కె.మాధవరావు పేర్కొన్నారు. హెచ్‌ఎంపాడు - కనిగిరి రహదారిలో ఆదివారం రాత్రి వాహన తనిఖీలు నిర్వహించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కళావేదిక నిర్మాణానికి భూమిపూజ

పీసీపల్లి, న్యూస్‌టుడే: విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు పునాదులు వేసే పాఠశాలల అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని వెంగళాయపల్లి సర్పంచి కరణం తిరుపతయ్య పేర్కొన్నారు. స్థానిక ప్రాథమిక పాఠశాల ఆవరణలో విద్యార్థుల సౌకర్యార్థం నూతనంగా నిర్మించనున్న కళా వేదిక పనులకు ఆదివారం భూమిపూజ చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు, సమావేశాల నిర్వహణకు తగిన వేదిక లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గుర్తించి స్వచ్ఛందంగా నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య లభిస్తోందన్నారు. బడుల్లో వసతుల కల్పనకు స్వచ్ఛందంగా ముందుకు రావాలన్నారు. ఉపాధ్యాయులు స్వర్ణ వెంకటరమణయ్య, గ్రామస్థులు పాల్గొన్నారు.

పన్నుల ఆదాయం... అభివృద్ధికి ఊతం

☛ గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్న అధికారులు

న్యూస్‌టుడే - గిద్దలూరు పట్టణం, కొమరోలు గ్రామీణం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే నిధులతో పాటు ఇంటి పన్నుల రూపంలో వచ్చే ఆదాయమే పంచాయతీల అభివృద్ధికి ఊతంగా నిలుస్తుంది. ఇదే విషయమై అధికారులు క్షేత్ర పర్యటనలు చేస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఇది కొంతమేర సత్ఫలితాలనిస్తోంది.

గిద్దలూరు మండలం ఓబులాపురంలో కరపత్రాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

గత లోటుపాట్లు సరిచేస్తూ...

గత వైకాపా పాలనలో పన్నుల వసూళ్లలో కొన్ని చోట్ల అవకతవకలు చోటుచేసుకున్నాయి. పలువురు సిబ్బంది చేతివాటం కారణంగా వసూలైన మొత్తంలో కొంత ఖజానాకు జమ కాలేదు. ఈ విషయమై పలు ప్రాంతాల్లో విచారణకు సైతం చేపట్టారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ లోటుపాట్లను సరిచేస్తూ పన్నుల వసూలుపై దృష్టి సారించింది. గడువులోగా లక్ష్యం చేరుకునేలా డీపీవోలు, డీఎల్‌పీవోలు, ఎంపీడీవోలు, డిప్యూటీ ఎంపీడీవోలకు బాధ్యత అప్పగించింది. వీరు గ్రామాల్లో తిరుగుతూ సకాలంలో పన్నులు చెల్లించడం వల్ల కలిగే ప్రయోజనాలపై గృహ యజమానులకు అవగాహన కల్పిస్తున్నారు. రహదారులు, కాలువల నిర్మాణం; పారిశుద్ధ్యం, వీధి దీపాల నిర్వహణ, తాగునీటి సౌకర్యం మెరుగు వంటి పనులు చేపట్టేందుకు వీలు కలుగుతుందని వివరిస్తున్నారు.

లక్ష్యం పూర్తికి కసరత్తు...

మార్కాపురం జిల్లా వరకు మిగతా వాటితో పోలిస్తే కనిగిరి, గిద్దలూరు నియోజకవర్గాల్లో ఇంటి పన్నుల వసూళ్లు కొంత ఆశాజనకంగా ఉన్నాయి. జిల్లాలోని 21 మండలాల్లోని పంచాయతీల్లో పాత, ప్రస్తుత పన్ను డిమాండ్ రూ.17.08 కోట్లుగా ఉంది. ఈ నెలాఖరుకు లక్ష్యం చేరుకోవాల్సి ఉండగా... ఇప్పటి వరకు రూ.7.50 కోట్లు వసూలైంది. ఇందులో కనిగిరి, గిద్దలూరు నియోజకవర్గాల నుంచే రూ.4.46 కోట్లు వచ్చింది. క్షేత్రస్థాయిలో పర్యటన, పర్యవేక్షణతో పరిస్థితిలో కొంత మార్పు వచ్చిందని... గడువులోగా లక్ష్యం పూర్తికి కృషి చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

కట్టుదిట్టంగా ఇంటర్ పరీక్షలు

కనిగిరిలో పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్

కనిగిరి, న్యూస్‌టుడే: సోమవారం నుంచి ప్రారంభం కానున్న ఇంటర్ పరీక్షలకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. కనిగిరి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, కృష్ణచైతన్య, నేతాజీ, ఎంఎస్ఎం డిగ్రీ కళాశాలల కేంద్రాలను డీఎస్పీ పి.సాయి ఈశ్వర్ యశ్వంత్ ఆదివారం పరిశీలించారు. పర్యవేక్షకులతో మాట్లాడారు. ఎక్కడా లోటుపాట్లకు తావులేకుండా పరీక్షలు నిర్వహించాలన్నారు. అన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాలతో పాటు కేంద్రాలను డ్రోన్ ద్వారా పర్యవేక్షించనున్నట్లు తెలిపారు. సీఐ శ్రీనివాసరావు, ఎస్సై సందీప్ పాల్గొన్నారు.

కొమరోలు గ్రామీణం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రానికి మొదటి సంవత్సరం విద్యార్థులు 280 మంది, ద్వితీయ సంవత్సరానికి సంబంధించి 245 మందిని కేటాయించినట్లు చీఫ్ సూపరింటెండెంట్ ఎస్.ప్రభాకర్, డీవో కె.వి.కిరణ్ తెలిపారు. గిద్దలూరు గ్రామీణ సీఐ జె.రామకోటయ్య, ఎస్సై జె.నాగరాజు కేంద్రాన్ని సందర్శించారు.

సి.ఎస్.పురం: కస్తూర్బా విద్యాలయంలో ప్రథమ సంవత్సరం 153 మంది, ద్వితీయ సంవత్సరం పరీక్షలు 79 మంది రాయనున్నట్లు పర్యవేక్షకులు గుత్తి రమణయ్య, డీవో బ్రహ్మయ్య తెలిపారు. విద్యార్థులకు ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు వివరించారు.

రైతు కేంద్రం... మందుబాబుల నిలయం

కొమరోలు-1 రైతు సేవా కేంద్రం మందుబాబులకు అడ్డాగా మారింది. రూ.22 లక్షలతో ఈ భవనం నిర్మించారు. విద్యుత్తు సౌకర్యం లేక నిరుపయోగంగా మారింది. ప్రస్తుతం ఆకతాయిలు ఇక్కడ చేరి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. కిటికీ అద్దాలు సైతం ధ్వంసం చేశారు. లోపలంతా ఖాళీ మద్యం సీసాలు, ఇతర వ్యర్థాలు పేరుకుపోయాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు విన్నవిస్తున్నారు. - న్యూస్‌టుడే, కొమరోలు గ్రామీణం

చదువుల తల్లిగా సత్యమాంబ

కంభం, న్యూస్‌టుడే: పట్టణ సమీపంలోని కోటా సత్యమాంబ అమ్మవారు ఆదివారం సరస్వతీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఇంటర్ పరీక్షలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు దర్శించుకున్నారు. అర్చకులు అభిషేకం, కుంకుమార్చనలు జరిపారు. పలువురు భక్తులు కుంకుమబండ్లు కట్టి మొక్కులు చెల్లించారు. బోనాలు, వీరలు, గాజులు సమర్పించారు. ఆలయ ప్రాంగణంలోని ఉపాలయాల్లో పూజలు చేశారు. కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఆలయ ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

నారాయణస్వామికి విశేష పూజలు

సి.ఎస్.పురం, న్యూస్‌టుడే: ప్రముఖ పుణ్యక్షేత్రం మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానంలో ఆదివారం... గోపూజ నిర్వహించారు. స్వామివారికి అభిషేకం, మహానివేదన చేపట్టారు. పల్లకీ సేవ, రథోత్సవం కనులపండువగా సాగాయి. మహిళలు పొంగళ్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అధికారులు భక్తులకు అన్న ప్రసాదం అందజేశారు.

రంగా ఆశయ సాధనకు కృషి

రాచర్ల, న్యూస్‌టుడే: వంగవీటి మోహన రంగా ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నట్లు ఆయన కుమార్తె ఆశాలత పేర్కొన్నారు. ఆదివారం... అనుములపల్లిలోని రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సేవా కార్యక్రమాల నిర్వహణకు ప్రాధాన్యమిస్తున్నట్లు చెప్పారు. ముందుగా చారిత్రక కంభం చెరువును సందర్శించారు. ఆయా కార్యక్రమాల్లో బలిజ సేవా సంఘం ప్రతినిధులు శ్రీనివాసప్రసాద్, పాండు, కోటేశ్వరరావు, జనసేన పార్టీ రాచర్ల మండల అధ్యక్షుడు బాలకృష్ణ, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రంగా విగ్రహం వద్ద ఆశాలత, సంఘం నాయకులు

కంకర పరిచి... సమస్యలు మిగిల్చి!

కంభం మండల పెద్ద నల్లకాలువ - జేబీకే పురం గ్రామాల మధ్య... జగనన్న కాలనీ నుంచి జగ్గంభొట్ల కృష్ణాపురానికి వెళ్లే దారి దుస్థితి ఇది. ఈ మార్గం అభివృద్ధికి ఏళ్ల క్రితం కంకర పరిచి... కొంతమేర తారు వేసి మిగతా వదిలేశారు. అప్పటి నుంచి ఇటుగా రాకపోకలు సాగించే స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. పనులు పూర్తి చేయాలని పలుమార్లు విన్నవించినా ఫలితం లేదని వారు వాపోతున్నారు. పంచాయతీ రాజ్ డీఈ సుబ్బారెడ్డి స్పందిస్తూ... నిధుల లభ్యతను బట్టి చర్యలు తీసుకుంటామన్నారు. - న్యూస్‌టుడే, కంభం

వైభవంగా రాధాకృష్ణుల రథోత్సవం

ఆధ్యాత్మికం

కంభం, న్యూస్‌టుడే: పెద్ద నల్లకాలువ గ్రామంలోని రాధాకృష్ణుల మందిరంలో ఆదివారం... మంగళ, దర్శన హారతులు, నవనీత యజ్ఞం, గో, తులసి, గరుడ పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. మధ్యాహ్నం హరినామ సంకీర్తన చేపట్టారు. సాయంత్రం నిర్వహించిన రథాయాత్ర కనులపండువగా సాగింది. పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అన్న ప్రసాదం అందజేశారు.

రథంపై స్వామివారి ఊరేగింపు

ఆధ్యాత్మిక చింతన అవసరం

సి.ఎస్.పురం, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి దుత్తలూరు కమిటీ అధ్యక్షుడు జి.ప్రసాద్ పేర్కొన్నారు. చింతపూడి, సి.నాగులవరం, కోమటిగుంట్ల, ఆర్వేపల్లి, రెడ్డిగారిపల్లి, కె.అగ్రహారం, మిట్టపాలెం గ్రామాల్లో ఆదివారం త్రైత సిద్ధాంత భగవద్గీతా ప్రచారం చేపట్టారు. సమాజంలో మంచి పెంపునకు అందరూ కృషి చేయాలన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

కనిగిరి : 8008574114

గిద్దలూరు పట్టణం : 8008574135

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలను, చిత్రాలను వాట్సాప్ ద్వారా పంపవచ్చు. లేదా ఫోన్లో వివరించవచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

?: **కంభం:** కందులాపురంలో కలీ ఆలయం నుంచి అర్బన్ కాలనీకి వెళ్లే దారిలో పైపులైను దెబ్బతిని నీరు వృథాగా పోతోంది. - మురళి

✓: సిబ్బందిని పంపి మరమ్మతులు చేయిస్తాం. -విజయలక్ష్మి, డిప్యూటీ ఎంపీడీవో

?: **అర్థవీడు:** నాగులవరం ఎన్టీఆర్ కాలనీలో పైపులైన్‌ను చివరి గృహాలకు విస్తరించక తాగు నీటికి ఇబ్బంది పడుతున్నాం. - సురేష్

✓: ప్రతిపాదనలు పంపాం. అనుమతులు రాగానే పనులు చేపడతాం.

- కృష్ణమోహన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి

?: **హనుమంతునిపాడు:** హెచ్‌ఎంపాడు - దాసరిపల్లి రహదారికి ఇరువైపులా చిల్లచెట్లు పెరిగి... మలుపుల్లో ఎదురెదురు వాహనాలు కనిపించక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. - కొండపురెడ్డి ఎర్రయ్య

✓: ఆయా గ్రామాల సర్పంచులతో ఇప్పటికే మాట్లాడాం. త్వరలోనే సమస్యను పరిష్కరిస్తాం. - బ్రహ్మయ్య, పంచాయతీరాజ్ ఏఈ

తవ్వి తంటాలు తెచ్చారు

కంభం మదర్ థెరెసా కాలనీలోని మంచినీటి పథకం వద్ద పైపుల మరమ్మతుల కోసం పెద్ద గుంతలు తీశారు. పనులు పూర్తయి నెలలు కావస్తున్నా తిరిగి పూడ్చలేదు. వాటిలో నీరు చేరడంతో పరిసరాలు అధ్వానంగా తయారయ్యాయి. పిల్లలు ఆడుకునే సమయంలో ఏ మాత్రం ఆదమరిచినా ప్రమాదం తప్పదు. సిబ్బందికి చెప్పినా పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. డిప్యూటీ ఎంపీడీవో విజయలక్ష్మి స్పందిస్తూ గుంతలు పూడ్చేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. - న్యూస్‌టుడే, కంభం

మొబైల్ టెక్నీషియన్ల కార్యవర్గం ఎన్నిక

మార్కాపురం: తర్లుపాడు రోడ్డులోని పీవీవీపీ గ్రీన్ గార్డెన్స్‌లో మార్కాపురం మొబైల్ షాప్- టెక్నీషియన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా కె.మురళీకృష్ణ, షేక్ షరీఫ్, కోశాధికారిగా వెంకట మల్లేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా సయ్యద్ జుబేర్, సహాయ కార్యదర్శిగా శ్రీనివాసరెడ్డి ఎంపికయ్యారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు, సంఘం గౌరవ అధ్యక్షుడు డి.కె.ఎం.రఫీ మాట్లాడుతూ అందరూ ఐక్యంగా ఉండి సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. పట్టణంలోని మొబైల్ దుకాణాల నిర్వాహకులు, టెక్నీషియన్‌లు పాల్గొన్నారు.

సామాజిక ఆసుపత్రి అభివృద్ధికి విరాళం

కనిగిరి, న్యూస్‌టుడే: కనిగిరి సామాజిక వైద్యశాల అభివృద్ధికి రాగిమానిపల్లికి చెందిన ఎనిమిరెడ్డి బాలకోటయ్య రూ.లక్ష విరాళం అందజేశారు. అమరావతి మైదానంలో ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డికి ఆదివారం ఆ మేరకు చెక్కు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటికే పలువురు దాతలు, తెదేపా నాయకులు ఆసుపత్రి అభివృద్ధికి లక్షలాది రూపాయల విరాళాలు అందజేశారన్నారు. ఆ మొత్తంతో పేద రోగుల సేవలు మెరుగు పరచడంతో పాటు... గర్భిణులు, బాలింతలకు ఉపయోగపడేలా కంగారు మదర్ కేర్ సెంటర్‌ను తీర్చిదిద్దామన్నారు. త్వరలో అన్ని వార్డులను కార్పొరేట్ ఆసుపత్రి స్థాయిలో అభివృద్ధి చేస్తామన్నారు. బాలకోటయ్యను అభినందించారు. తెదేపా మండల అధ్యక్షుడు కొండా కృష్ణారెడ్డి, నాయకులు ఓబులరెడ్డి, పెద్దన్న, నాగిరెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డికి చెక్కు అందజేస్తున్న బాలకోటయ్య

బడి చెంతనే వ్యర్థాలు

గిద్దలూరు మండలం వెంకటాపురం రహదారిలో కంచిపల్లె ప్రాథమిక పాఠశాల వద్ద పరిస్థితి ఇది. కొందరు స్థానికులు వ్యర్థాలను ఇక్కడ పారబోస్తుండడంతో గాలికి ఎగిరి దారంతా విస్తరిస్తున్నాయి. పాఠశాలలోకీ చేరి సమస్య నెలకొంటోంది. మధ్యాహ్న భోజన సమయంలో ఆహార పదార్థాలపైనా పడుతున్నాయి. సంబంధిత సిబ్బంది స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, గిద్దలూరు పట్టణం

పామూరులో వైద్యసేవల మెరుగుకు కృషి

పామూరు, న్యూస్‌టుడే: పామూరు ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో రూ.38.73 లక్షలతో నిర్మించనున్న పోస్టుమార్టం భవనానికి ఆదివారం... డైరెక్టర్లు నర్సింగు సాంబయ్య, రమణమ్మ, మౌలాలి భూమిపూజ నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి వైద్యశాలను సందర్శించారు. వైద్యుల కొరత లేకుండా చూస్తామని... ఆసుపత్రి అభివృద్ధికి అవసరమైన నిధులు సైతం సమకూర్చుతామని హామీ ఇచ్చారు. వైద్యులు ప్రవీణ, నరేంద్ర, తెదేపా మండల అధ్యక్షుడు బొల్లా నరసింహ చౌదరి, పువ్వాడి వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

భవన నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఆసుపత్రి అధికారులు, నాయకులు

ఆర్థిక సాయం అందజేస్తున్న మానవత సంస్థ ప్రతినిధులు

సేవా భావంతో సామాజిక ప్రగతి

పామూరు, న్యూస్‌టుడే: మానవత సేవా సంస్థ ఆధ్వర్యంలో పామూరు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన అయిదుగురు నిరుపేదలకు... ఒక్కొక్కరికి రూ.5 వేలు చొప్పున మొత్తం రూ.25 వేల నగదు సాయాన్ని ఆదివారం అందజేశారు. ప్రతి ఒక్కరూ సేవా భావంతో ముందుకు సాగితే సమాజం ప్రగతి పథంలో నడుస్తుందని పేర్కొన్నారు. మాజీ ఎంపీపీ జి.దశరథరామయ్య, మానవత సంస్థ ఛైర్మన్ కె.రామిరెడ్డి, అధ్యక్షుడు వి.వెంకటేశ్వర్‌రెడ్డి, కార్యదర్శి టి.వెంకటేశ్వరరావు, కోశాధికారి ఎం.నారాయణ, డైరెక్టర్ పి.రాంబాబు, ప్రతినిధులు పాల్గొన్నారు.

రవాణా కష్టాలకు చెల్లుచీటి

గిద్దలూరు మండలంలోని కంచిపల్లె - మిట్టమీదిపల్లె రహదారికి ఎట్టకేలకు మోక్షం లభించింది. రాజుపేట, మిట్టమీదిపల్లె మీదుగా గిద్దలూరుకు వెళ్లే అయిదు కిలోమీటర్ల మార్గం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. రాకపోకలు సాగించేందుకు వీలుగా లేక... కంచిపల్లె వాసులు కృష్ణంశెట్టిపల్లె మీదుగా అదనంగా మూడు కిలోమీటర్లు చుట్టూ తిరిగి ప్రయాణాలు సాగిస్తున్నారు. గత వైకాపా ప్రభుత్వం ఈ దారి అభివృద్ధిని పట్టించుకోలేదు. కూటమి సర్కారు కొలువుదీరాక స్థానిక తెదేపా నాయకుల వినతి మేరకు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి చొరవ చూపి... ఉపాధి హామీ పథకం నిధులు రూ.1.35 కోట్లు మంజూరు చేయించారు. పనులు దక్కించుకున్న గుత్తేదారు దెబ్బతిన్న తారు మార్గాన్ని యంత్రంతో తొలగిస్తున్నారు. అనంతరం వెట్‌మిక్స్ పరిచి తారు రహదారి నిర్మించనున్నారు. పనులు పూర్తయితే ఈ పరిధిలోని గ్రామాల వారు ఏళ్లుగా పడుతున్న రవాణా కష్టాలు తీరనున్నాయి. - న్యూస్‌టుడే, గిద్దలూరు పట్టణం

నమ్మండి.. ఇది కాలువేనండి!

బేస్తవారపేట మేజర్ పంచాయతీ పాపాయిపల్లి ప్రాథమిక పాఠశాల (మెయిన్) వద్ద కచ్చా కాలువ పరిస్థితి ఇది. కొన్నాళ్లుగా బాగు చేయక వ్యర్థాలు పేరుకుపోయి మురుగు కూపంలా తయారైంది. తీవ్ర దుర్వాసనతో పాటు దోమల సమస్య పెరగడంతో పరిసర నివాసితులు, బడి పిల్లలు ఇబ్బంది పడుతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి పారిశుద్ధ్య పనులు చేపట్టాలని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, బేస్తవారపేట

అరటి... ధర అదిరింది!

కంభంలో మార్కెట్‌కు తరలించేందుకు సిద్ధం చేసిన అరటి గెలలు

కంభం, న్యూస్‌టుడే:

అరటి ధరలు అనూహ్యంగా పెరిగాయి. ఉత్తరాది రాష్ట్రాల మార్కెట్లలో డిమాండ్ పెరగడం, పెళ్లిళ్ల సీజన్ ప్రారంభం కావడంతో పరిస్థితులు అనుకూలించాయని వ్యాపారులు చెబుతున్నారు. నవంబరు, డిసెంబరు నెలల్లో గెల రూ.వంద పలకడం గగనమైంది. వర్షాల కారణంగా తోటలు సైతం దెబ్బతిన్నాయి. కొనుగోలుకు ఎవరూ ముందుకు రాక చాలా చోట్ల చెట్లపైనే కాయలు మగ్గిపోయాయి. ప్రస్తుతం అన్నీ అనుకూలించి.. . గెల రూ.250 నుంచి రూ.300 వరకు పలుకుతోంది. కాయలు కిలో ధర రూ.25గా ఉంది. వ్యాపారులే తోటల వద్దకు వచ్చి కొనుగోలు చేస్తున్నారు. మార్కాపురం జిల్లాలో సుమారు 1,200 ఎకరాల్లో అరటి సాగవుతుండగా... గిద్దలూరు, కంభం, బేస్తవారపేటలోనే తోటలు ఎక్కువగా ఉన్నాయి. చాలావరకు పంట కోతలు పూర్తయ్యాయి.

దానిమ్మ, బత్తాయిదీ అదే దారి...

దానిమ్మకు సైతం గతంలో ఎప్పుడు లేనంతగా ధర లభిస్తోంది. రెండు నెలల క్రితం కిలో రూ.వంద పలకగా ప్రస్తుతం రెట్టింపయ్యింది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 1,600 ఎకరాల్లో ఈ తోటలు సాగవుతుండగా... బేస్తవారపేట, దర్శి, పొదిలి, కనిగిరి, సి.ఎస్.పురం, మార్కాపురం, గిద్దలూరు, కొమరోలు మండలాల్లోనే ఈ విస్తీర్ణం ఎక్కువ. బత్తాయి సైతం టన్ను రూ.15 వేల నుంచి రూ.25 వేలకు పెరిగింది. వచ్చే రెండు నెలల్లో వీటి ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే గత నష్టాల నుంచి గట్టెక్కుతామని రైతులు చెబుతున్నారు.

పబ్లిక్ నోటీసు

నా క్లయింటు వెండిదండి వెంకట ప్రభాకరరెడ్డి S/o పిచ్చిరెడ్డి, న్యూజెర్సీ, అమెరికా వాస్తవ్యుడు తరపున జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ వెండిదండి లక్ష్మీనరసమ్మ సంజాయిషీ మేరకు యావన్మందికి తెలియజేయునదేమనగా..

ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తి గురించి, నా క్లయింటు ప్రభాకరరెడ్డి తల్లిగారైన లేటు వెండిదండి జయలక్ష్మమ్మ, సోదరి ఇడమకంటి సరస్వతి పేర 15/5/2006 సెటిల్‌మెంటు పత్రం రిజిష్టరు చేసి నా క్లయింటు హక్కులకు భంగం కలిగించగా, నా క్లయింటు ఒంగోలు జిల్లా కోర్టులో OS 139/2015 దావావేసి పై సెటిల్‌మెంట్ డీడు రద్దు కోరగా, 24.12.2021 LOKADALAT అవార్డు ద్వారా 15.5.2006 సెటిల్‌మెంట్ దస్తావేజు రద్దు కాబడి షెడ్యూలు దాఖలా య. 7.33 సెంట్లలో నా క్లయింటుకు Ac 3.00 వెండిదండి జయలక్ష్మికి య 1.33 సెంట్లు, ఇడమకంటి సరస్వతికి య 3.00 తీసుకొనులాగున డిక్రీ కాబడినది. నా క్లయింటు అమెరికా నివాసి అయినందున, నా క్లయింటు తల్లి పైతెలిపిన డిక్రీలో 15.5.2006 తేదీ గల ద.నెం. 1999 సెటిల్‌మెంట్ డీడు రద్దు అయిన విషయం మభ్యపెట్టి సదరు సెటిల్‌మెంట్ డీడు అమలులో ఉన్నట్లుగా చూపించి ఇడమకంటి సరస్వతి తన కుమార్తె పేర షెడ్యూలు భూమిలో య 1.00 తన కుమార్తె పేర 15.5.2023 తేదీ గల సెటిల్‌మెంట్ డీడు ద.నెం. 4896/2023గాను, ఇంకొల్లు వెంకట రమణారెడ్డి పేర 15.5.2023 తేదీగల విక్రయ దస్తావేజు ద.నెం. 4897/2023గా తప్పుడు రిజిష్టరులు కనిగిరి సబ్ రిజిస్ట్రారు కార్యాలయములో రిజిష్టరు చేయగా, సదరు False రిజిష్టరుల ఆధారంగాను మరియు వెండిదండి జయలక్ష్మమ్మ వీలునామా వ్రాసినదని ప్రచారము చేసుకొనుచూ, షెడ్యూలు భూమిని ఇతరులకు అమ్ముటకు ప్రయత్నము చేయుచున్నట్లుగా తెలిసినది. కావున యావన్మందికి తెలియజేయునదేమనగా నా క్లయింటు సోదరి ఇడమకంటి సరస్వతి రద్దు కాబడిన 15.5.2006 సెటిల్‌మెంట్ డీడు ఆధారంగా చేసిన రిజిష్టరులు చెల్లవని, షెడ్యూలు భూమిలో ఇడమకంటి సరస్వతికి య. 3.00 సెంట్లు తప్ప పెచ్చు విస్తీర్ణంకు హక్కులేదని లేటు వెండిదండి జయలక్ష్మకు చెందిన య 1.33 సెంట్లలో నా క్లయింటుకు 1/2వ భాగము కలదని, ఇందుకు విరుద్ధముగా ఇడమకంటి సరస్వతి చేసిన, చేయబోవు అన్యాక్రాంతములు, విక్రయములు, ఆడుమానములు కాని ఏమియు చెల్లవని, నాక్లయింటు తీసుకొనబోవు సివిల్, క్రిమినల్ చర్యలకు బాధ్యులగుదురని తెలియజేయడమైనది.

షెడ్యూలు:- ప్రకాశం జిల్లా, కనిగిరి సబ్ రిజిస్ట్రారు కనిగిరి మునిసిపల్ ఏరియా కనిగిరి టౌన్ Sy.No. 199/c లో య 6.30 సెంట్లు, Sy.No.198/A లో య.1.03 సెంట్లు Ac 7.33 సెంట్లు ఏకప్రదేశం హద్దులు. **తూర్పు:** కోటపాటి తిరుపతిరెడ్డి, **దక్షిణం:** రోడ్డు, **పడమర:** ఆవులు తిరుపతిరెడ్డి, **ఉత్తరం:** ముక్కు వెంకటరెడ్డి

సం/- కరవది రాఘవరావు,
అడ్వకేటు, ఒంగోలు

ఒంగోలు,
21.2.2026

(c) eenadu

ఆలయ అభివృద్ధికి సహకారం

పెద్దారవీడు, న్యూస్‌టుడే: నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన గంగావానిపల్లి కాటంరాజు ఆలయ అభివృద్ధికి సహకరించాలని రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ నూకసాని బాలాజీని ఆలయ కమిటీ సభ్యులు కోరారు. ఆదివారం గుండం చర్ల సమీపంలోని కాటంరాజు ఆలయంలో స్వామివారిని ఆయన దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రతి ఏడాది ఉగాది పర్వదినం ముందు రోజు రాత్రి నిర్వహించే తిరునాళ్ల గురించి అడిగి తెలుసుకున్నారు. రోడ్డు డెవలప్‌మెంట్ డైరెక్టర్ నక్కా శ్రీను, తోకల యల్లయ్య, చేతుల నాగరాజు, పోలురాజు, తదితరులు పాల్గొన్నారు.

మార్కాపురం

•మార్కాపురం • యర్రగొండపాలెం

నారాయణస్వామికి విశేష పూజలు

సి.ఎస్.పురం, న్యూస్‌టుడే: ప్రముఖ పుణ్యక్షేత్రం మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానంలో ఆదివారం గోపూజ నిర్వహించారు. స్వామివారికి అభిషేకం, మహా నివేదన చేపట్టారు. పల్లకీ సేవ, రథోత్సవం కనులపండువగా సాగాయి. మహిళలు పొంగళ్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అధికారులు భక్తులకు అన్న ప్రసాదం అందజేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)

మార్కాపురం : 8008631313
యర్రగొండపాలెం : 8008552658

పెద్దారవీడు, న్యూస్‌టుడే:

?: రెండేళ్లుగా లైన్‌మన్ లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. పొలాల వద్ద తీగలు, పరివర్తకాల సమస్యలు వస్తే ప్రైవేటు వ్యక్తులతో పనులు చేయించుకోవాల్సి వస్తోంది. సమస్యను పరిష్కరించగలరు.
– రామకృష్ణ, పోతంపల్లి.

✓: సిబ్బంది తక్కువగా ఉండటంతో కొన్ని గ్రామాలకు లైన్‌మెన్‌ల సమస్య ఉంది. ఉన్న వారితో అన్ని గ్రామాల్లోని రైతుల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నాం. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.
– రమేష్, విద్యుత్తు ఏఈ. పెద్దారవీడు.

మార్కాపురం అర్బన్, న్యూస్‌టుడే:

?: స్థానిక పదో వార్డులోని సుబ్బారెడ్డి కాలనీలో కాలువల్లోని మురుగు సరిగా తీయడం లేదు. దీంతో కాలువల్లో పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. దోమలు పెరిగి ఇబ్బంది పడుతున్నాం. **– ఫకీరయ్య, స్థానికుడు.**

✓: సిబ్బందిని పంపి కాలువల్లోని మురుగు తీయిస్తాం. దోమల బెడద తొలగించేందుకు బ్లీచింగ్ పౌడర్ చల్లిస్తాం.
– నారాయణరావు, మున్సిపల్ కమిషనర్.

కొనకనమిట్ల, న్యూస్‌టుడే:

?: కొనకనమిట్ల మండల ప్రాథమిక పాఠశాల సమీపంలో రహదారిపైనే వ్యర్థాలు పడేస్తున్నారు. దీంతో రాకపోకలకు సమస్యగా ఉంటోంది. **– కోటయ్య, స్థానికుడు**

✓: ఆ ప్రాంతంలో పారిశుద్ధ్య పనులు చేపట్టి సమస్య లేకుండా చూస్తాం. వ్యర్థాలు తొలగించేందుకు ప్రత్యేకంగా సిబ్బందిని పంపిస్తాం.
– శ్రీనువాసులు, పంచాయతీ కార్యదర్శి

యర్రగొండపాలెం పట్టణం, న్యూస్‌టుడే:

?: యర్రగొండపాలెం మండలంలోని రేగులపల్లెలో ప్రభుత్వ పక్కా గృహం నిర్మించుకుంటున్నాం. ఒక బిల్లు వేశారు. ఇంకా రెండు బిల్లులు వేయాలి. త్వరగా వేస్తే ఇళ్లు పూర్తి చేసుకుంటాం. **– భూమని వెంకటేశ్, లబ్ధిదారుడు**

✓: బిల్లులు పెట్టాం. ప్రభుత్వం త్వరలో లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో జమ చేస్తుంది.
– ప్రకాశ్, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్

పెద్దదోర్నాల, న్యూస్‌టుడే

?: గంటవానిపల్లెలో ఓవర్‌హెడ్ ట్యాంకు లేదు. దీంతో విద్యుత్తు సరఫరా లేని సమయంలో తాగు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నాం. ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మించి నీటి సమస్య తీర్చాలి.
– నాగేశ్వరరావు, గంటవానిపల్లె.

✓: ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరైన వెంటనే నిర్మాణ పనులు చేపడతాం.
– భ్రమరాంబిక, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, దోర్నాల

ఇంటర్ పరీక్ష కేంద్రాల పరిశీలన

పొదిలి, న్యూస్‌టుడే: పొదిలిలో ఇంటర్ పరీక్ష కేంద్రాలను ఆదివారం పొదిలి సీఐ ఎం.రాజేష్‌కుమార్ పరిశీలించారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, శ్రీవీకేటీ, శ్రీవివేకానంద జూనియర్ కళాశాలలను పరీక్ష కేంద్రాలుగా కేటాయించారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని సీఐ తెలిపారు. పట్టణంలో ట్రాఫిక్ దృష్ట్యా విద్యార్థులు 30 నిమిషాల ముందుగానే కేంద్రాల వద్దకు చేరుకోవాలని సూచించారు. కేంద్రాల సమీపంలోని జిరాక్స్ సెంటర్లు మూసివేయాలని ఆదేశించినట్లు చెప్పారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా పోలీసు బందోబస్తు ఉంటుందన్నారు. విద్యార్థులు నిర్భయంగా పరీక్షలు రాయాలని సూచించారు.

పరీక్ష కేంద్రంలో సీఐ రాజేష్‌కుమార్

కుటుంబ సర్వే.. లక్ష్యానికి దూరం

• అటు సాంకేతిక లోపం, ఇటు సిబ్బంది కొరత

న్యూస్‌టుడే, పొదిలి:

రాష్ట్ర ప్రభుత్వం ఏకీకృత కుటుంబ సర్వే (యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే) ప్రతిష్ఠాత్మకంగా చేపట్టింది. నగరాల్లో, గ్రామాల్లో సచివాలయాల సిబ్బంది ఇంటింటికీ వెళ్లి సర్వే చేపట్టి ఆ కుటుంబ సభ్యుల వివరాలు పొందుపరిచి బయోమెట్రిక్ లేదా ఓటీపీ ద్వారా ధ్రువీకరిస్తున్నారు. అయితే తగినంతమంది సిబ్బంది లేకపోయినా ఉన్న సిబ్బందిపై అధికారులు లక్ష్యాలు చేరుకోవాలని ఒత్తిడి చేస్తున్నారు. దీంతో ఇటు సర్వే పూర్తికాక, అటు అధికారుల ఒత్తిడి భరించలేక తీవ్ర ఆందోళన చెందుతున్నామని జిల్లాలోని సచివాలయ సిబ్బంది వాపోతున్నారు.

సంక్షేమ, అభివృద్ధి పథకాలు అందజేయాలని..

ప్రతి కుటుంబ వివరాలను సాంకేతికంగా పొందుపరిచి సంక్షేమ, అభివృద్ధి పథకాలు అందేలా చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం సర్వే చేయిస్తోంది. ప్రతి కుటుంబ సభ్యుని ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, కులధ్రువీకరణ పత్రాలు, ఫొటో, చదువుకున్నవారైతే వారి డిగ్రీ పట్టాలన్నీ ఆన్‌లైన్‌లో పొందుపరచాల్సి ఉంటుంది. ఒక్క వ్యక్తికే పది నుంచి 15 నిమిషాల సమయం పడుతుందని సిబ్బంది చెబుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆపకుండా పనిచేసినా 20 కుటుంబాలు పూర్తి కావడం లేదు. గ్రామాల్లో అయితే కుమారులు వలసలు వెళ్లడం, పెద్దలు ఇళ్ల వద్దనే ఉండటం, వారికి కనీసం చరవాణిలు కూడా లేకపోవడంతో సర్వే ముందుకు సాగడం లేదు. పొదిలి నగర పంచాయతీలో ఈనెల 18 వరకు చేసిన సర్వేలో 33 శాతం, మండలంలో 54 శాతం పూర్తిచేశారు.

పొదిలిలో సర్వే చేస్తున్న అధికారులు

ఫిబ్రవరి 20 వరకు చేపట్టిన సర్వే వివరాలు

	సచివాలయాల సంఖ్య	సర్వే చేయాల్సిన కుటుంబాలు	పూర్తిచేసిన కుటుంబాలు
నగర పంచాయతీలో..	8	12603	4120
పొదిలి మండలంలో..	9	9077	5100

ప్రజలు సహకరించాలి

సచివాలయం సిబ్బంది ఇంటి వద్దకు వచ్చినప్పుడు ప్రజలు పూర్తిసమాచారం తెలియజేయాలి. చరవాణిలకు ఓటీపీలు వస్తాయి. వాటిని తెలియజేయాల్సి ఉంది. విద్యార్హతలు, వృత్తి, తదితర వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరచడం వల్ల భవిష్యత్తులో ఆ కుటుంబాలకు ప్రభుత్వం తరపున ఎటువంటి సంక్షేమ, అభివృద్ధి పథకాలు అమలుచేయాలో తెలుస్తుంది.
– ఎ.శ్రీనివాసరావు, ఎంపీడీవో, పొదిలి.

అనుసంధానం కాక.. అవస్థలు తొలగక..!

న్యూస్‌టుడే, పెద్దదోర్నాల:

హైదరాబాద్ నుంచి పెద్దదోర్నాల మీదుగా పెద్దారవీడు మండలం తోకపల్లె వరకు 765 జాతీయ రహదారి నిర్మించారు. శ్రీశైలం, కర్నూలు-గుంటూరు రహదారులను కలుపుతూ బైపాస్ వేశారు. దానికి పెద్దదోర్నాల-శ్రీశైలం రహదారిని అనుసంధానించలేదు. దీంతో వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు.

ప్రమాదకరంగా ఉన్న రహదారి

ఏటవాలుగా కంకరతో ప్రమాదాలు

బైపాస్ మూలమలుపు వద్ద రాకపోకలు సాగడానికి వీలుగా ఏటవాలుగా కంకర వేశారు. నిత్యం వందలది వాహనాలు ఆ రహదారిలో ప్రయాణిస్తుంటాయి. సెలవు రోజులు, వారంతాల్లో శ్రీశైలం వెళ్లే భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. వీరంతా మూలమలుపు మీద వెళ్తున్నప్పుడు ఒక్కోసారి ప్రమాదాల పాలవుతున్నారు. కొన్నిసార్లు వాహనాలు ఢీకొన్న ఘటనలు కూడా ఉన్నాయి. కొత్తవారికి రోడ్డుపై అవగాహన లేక మలుపు వద్దకు రాగానే బ్రేకులు వేస్తున్నారు. దీంతో వెనుకగా వచ్చే వాహనాలు ఢీకొంటున్నాయి. ప్రజలు, వాహనదారుల ఇక్కట్లను సంబంధిత అధికారులు స్పందించి అనుసంధాన రహదారిని వేయాలని పలువురు కోరుతున్నారు.

మొబైల్ టెక్నీషియన్ కార్యవర్గం ఎన్నిక

మార్కాపురం, న్యూస్‌టుడే: మార్కాపురంలో మొబైల్ షాప్- టెక్నీషియన్ నూతన కార్యవర్గం ఎన్నుకున్నట్లు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు, సంఘం గౌరవ అధ్యక్షుడు డి.కె.ఎం.రఫీ తెలిపారు. ఆదివారం మార్కాపురం- తర్లుపాడు రోడ్డులోని పీవీ మీవీ గ్రీన్ కార్డెన్స్‌లో మార్కాపురం మొబైల్ షాప్- టెక్నీషియన్ నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులుగా కె.మురళీకృష్ణ, షేక్ షరీఫ్, కోశాధికారిగా వెంకట మల్లేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా సయ్యద్ జుబేర్, సహాయ కార్యదర్శిగా శ్రీనివాసరెడ్డిలను ఎన్నుకోవడం జరిగింది. అనంతరం జరిగిన సమావేశంలో రఫీ మాట్లాడుతూ సీఐటీయూ యూనియన్ ద్వారా నూతనంగా ఎన్నికైన కార్యవర్గానికి సహకారం ఉంటుందన్నారు. అందరూ కలిసి సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. మార్కాపురంలో చరవాణి టెక్నీషియన్లు అనేక మంది ఉన్నా ఉపాధి లేక దుర్భర పరిస్థితుల్లో ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో షేక్ మహమ్మద్ రఫీ, బాషా, పట్టణంలోని మొబైల్ షాపు నిర్వాహకులు, టెక్నీషియన్‌లు పాల్గొన్నారు.

డి.కె.ఎం.రఫీని సన్మానిస్తున్న యూనియన్ నాయకులు

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం

మార్కాపురం అర్బన్, న్యూస్‌టుడే: పట్టణ అభివృద్ధికి కూటమి ప్రభుత్వ అనునిత్యం పనిచేస్తుందని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని 3,8,16,27 వార్డుల్లో రూ.43 లక్షలతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన శ్రీకారం చుట్టారు. వార్డుల్లో ఎప్పటి నుంచో తీవ్ర సమస్య ఉన్న సిమెంటు రోడ్లు, కాలువలకు మొదటి ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఎమ్మెల్యే నారాయణరెడ్డి చెప్పారు. ప్రజలకు అవసరమైన వనరులు సమకూర్చుకుంటూ తమ ప్రభుత్వం ముందుకెళుతుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశీస్సులు మార్కాపురం జిల్లాపై ఉన్నాయని రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో మున్సినల్ కమిషనర్ నారాయణరావు, పార్టీ నాయకులు బాబీ, సాగర్, హరిబాబు, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రగతి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

క్రమశిక్షణతో ఉన్నత స్థాయికి చేరండి

పెద్దదోర్నాల, న్యూస్‌టుడే: క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని రవీంద్ర ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ ఉన్నం రమణయ్య విద్యార్థులకు సూచించారు. ఆ పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సభ ఘనంగా జరిగింది. కార్యక్రమంలో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపల్ సరోజ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నృత్యం చేస్తున్న విద్యార్థినులు

పట్టలు కట్టరు.. ఆదేశాలు పట్టించుకోరు

ఒంగోలు- మార్కాపురం రహదారిపై లారీలు, ట్రాక్టర్లలో నిండుగా మట్టి వేసి దానిపై ఎటువంటి పట్టా కప్పకుండా తీసుకెళ్తున్నారు. దీంతో ఇసుక, మట్టి, గాలికి లేచి కళ్లల్లో పడుతుంటే కంకర రోడ్లపై పడుతోంది. రోడ్లపై వెళ్లే వాహనదారులు, ప్రయాణికులు నానా పాట్లు పడుతున్నారు. కొన్నిసార్లు కంకర కారణంగా కిందపడి గాయాల పాలవుతున్నారు. ఇసుక, మట్టి, కంకర తరలించే వాహనాలు పట్టలు కట్టుకొని వెళ్లాలని అధికారులు ఆదేశిస్తున్నా వాటి ఖాతరు చేయడం లేదు. దీంతో ఈ వాహనాల వెనుక వచ్చే వారికి ఇబ్బందులు తప్పడం లేదు. ఈ విషయంలో అధికారులు కఠినంగా వ్యవహరించాలని ప్రజలు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, కొనకనమిట్ల, న్యూస్‌టుడే:

పైపులైను పగిలి తాగునీరు నేలపాలు

పొదిలి పెద్దమసీదు సమీపంలో ఒంగోలు - కర్నూలు ప్రధాన రహదారి పక్కనే ఉన్న పైపులైను దెబ్బతింది. దీంతో కొన్ని రోజులుగా ఆ ప్రాంతంలో నీటిని సరఫరా చేసే సమయంలో నీరు వృథాగా పోతోంది. ఆదివారం ఉదయం నీరు వృథాగా రోడ్డు అంచుల్లో పారడంతో పాదచారులు, వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు. వేసవి సమీపిస్తుండటంతో నీటి ఎద్దడి తీవ్రమవుతున్న తరుణంలో నీటి వృథాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, పొదిలి:

రహదారులే.. మురుగు కాలువలు

మార్కాపురం మండలంలోని కె.కొత్తపల్లె గ్రామంలో మురుగు నీటి పారుదల వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో రహదారులపై మురుగు నీరు పారుతోంది. గ్రామంలో సంవత్సరాల కిందట నిర్మాణం చేసిన చిన్నపాటి కాలువలే నేటికీ ఉండటంతో మురుగు నీరు అంతా బయటకు వచ్చి అధ్వానంగా మారుతోంది. దీంతో గ్రామస్థులు రాకపోకల సమయంలో ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి పూట దోమల వ్యాప్తి అధికంగా ఉంటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే గ్రామంలో మురుగు నీటి పారుదల సమస్యకు పరిష్కారం చూపించాలని గ్రామస్థులు కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, మార్కాపురం

వసతి గృహాల్లో మెరుగుపడిన సౌకర్యాలు

• రూ.70 లక్షలతో ఆధునికీకరణ పూర్తి

న్యూస్‌టుడే, పొదిలి: పొదిలిలోని ఎస్సీ వసతి గృహాల్లో వసతులు మెరుగుపడ్డాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సహకారంతో ఎస్సీ బాలుర, ఎస్సీ బాలికల వసతిగృహం ఆధునికీకరణకు రూ.70 లక్షలు మంజూరు చేసింది. గతంలో వసతిగృహంలోని గదులు, పరిసరాలు అధ్వానంగా ఉండేవి. దీంతో విద్యార్థులు అసౌకర్యానికి గురయ్యే వారు. ప్రస్తుతం వసతి గృహాల్లో శ్లాబ్, గదులకు కిటికీలు, గ్రానైట్ బండపరుపు, ఆవరణలో టైల్స్ ఏర్పాటు వంటి పనులు పూర్తిచేశారు.

వసతి గృహం ఆవరణ అంతా పరిచిన టైల్స్

నీటి కొరత తీర్చేందుకు బోర్ల ఏర్పాటు

రెండుచోట్ల నీటి కొరత తీర్చేందుకు బోర్లు ఏర్పాటు చేశారు. స్నానాల గదులు, మరుగుదొడ్లకు కుళాయి కనెక్షన్లతో నీటి వసతి కల్పించారు. పొదిలికి చెందిన గుత్తేదారుడు దోర్నాల అంజిరెడ్డి ప్రత్యేక చొరవ చూపి పనులు పూర్తిచేశారు. రెండుచోట్ల అంబేడ్కర్ విగ్రహాలను ఏర్పాటు చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వసతి గృహాల్లో వసతులు మెరుగుపడటంతో విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పడితే ప్రమాదం.. తెలిసినా నిర్లక్ష్యం

న్యూస్‌టుడే, పొదిలి:

ఉమ్మడి జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో కర్రల ట్రాక్టర్లు, గ్రానైట్ లారీలతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రవాణా సమయంలో వాహనచోదకులు తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడంతో ప్రమాదాలకు కారణమవుతున్నాయి. సాధారణంగా ఈ ప్రాంతంలో నవంబరు నుంచి మార్చి వరకు పొగాకు బ్యారన్ల క్యూరింగ్ పనులు ముమ్మరంగా జరుగుతాయి. వాటి కోసం వినియోగించిన చిల్లకర్ర, మొద్దులు రాత్రివేళల్లో వాహనచోదకులు తరలిస్తుండం, ఆయా వాహనాలకు సరిగ్గా లైట్లు లేకపోవడంతో ఎదురుగా వచ్చే వారికి వెనుక లోడు కనిపించడంలేదు. ట్రాక్టర్‌లో రెక్కల లోపల బాడి వరకుమాత్రమే సరకు నింపాలి. అలా కాకుండా రెక్కల బయటకు కూడా కర్రలు నింపుతున్నారు.

రెక్కల బయట వరకు కర్రలతో వెళ్తున్న ట్రాక్టర్

ఎదురెదురుగా వాహనాలొస్తే..

ఈ ప్రాంతంలో ఇరుకురోడ్లు కావడంతో పెద్దవాహనాలు ఎదురైనప్పుడు ఇబ్బందిగా మారుతోంది. మలుపుల వద్ద అయితే రోడ్డు అంచులు దిగాల్సిన పరిస్థితి ఉంటుంది. ఈ విషయమై జిల్లా పోలీసు ఉన్నతాధికారులు సైతం అవగాహన కల్పిస్తున్నారు. పొగాకు పచ్చాకు రవాణా సమయంలో ట్రాక్టరు రెక్కలపై కూర్చొని ప్రయాణిస్తుండటం అత్యంత ప్రమాదకరమని సూచిస్తున్నారు. జిల్లాలో పలుచోట్ల ఈ విధంగా రవాణా చేయడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. వాహనచోదకులు రవాణాలో భద్రతా సూత్రాలు పాటించాల్సిన అవసరం ఉంది.

దేశభక్తి, సేవాభావం అలవరుచుకోవాలి

మార్కాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రతి పౌరుడు విద్యార్థి దశనుంచే దేశభక్తి, సేవాభావాన్ని అలవరుచుకోవాలని మార్కాపురం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. ఆదివారం పాఠశాల ఆవరణలో చంద్రయాన్ స్కౌట్స్ ట్రూప్ ఆధ్వర్యంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉద్యమ వ్యవస్థాపకుడు లార్డ్ బాడెన్ పావెల్ జయంతి సందర్భంగా చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరం 'అవర్ ఫ్రెండ్‌షిప్' అనే థీమ్‌తో ప్రపంచ వ్యాప్తంగా ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం స్కౌట్స్ శిక్షకుడు సయ్యద్ సమీవుల్లా బాష విద్యార్థులతో ప్రార్థనగీత్, స్కౌట్ ప్రామిస్, స్కౌట్స్ జెండాగీత్ పాడించారు. ఈ కార్యక్రమంలో భాజపా నాయకుడు కృష్ణారావు, ఉపాధ్యాయులు వినోద్ కుమార్, రామకృష్ణ, అస్మత్, గౌసియా తదితరులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లార్డ్ పావెల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న హెచ్‌ఎం చంద్రశేఖర్‌రెడ్డి, తదితరులు

మానవత్వమే అన్ని మతాల సారం

పెద్దదోర్నాల, న్యూస్‌టుడే: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కౌట్స్, గైడ్స్‌ల ఆధ్వర్యంలో ఆదివారం ఆలోచన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉద్యమ వ్యవస్థాపకుడు లార్డ్ బాడెన్ పావెల్ జయంతిని పురస్కరించుకుని ఆలోచన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా.. స్కౌట్స్ నిర్వాహకులు డి.పోలయ్య మాట్లాడుతూ... అన్ని మతాల సారంశమైన మానవత్వం, పరస్పర గౌరవం, సోదర భావం ప్రతి ఒక్కరు కలిగి ఉండాలన్నారు. స్కౌట్స్ ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణం, సేవా భావం, ఆత్మవిశ్వాసం, జట్టుభావం వంటి గుణాలు అభివృద్ధి చెందుతాయని ఉపాధ్యాయురాలు అనసూయదేవి వివరించారు. కార్యక్రమంలో గైడ్స్ నిర్వాహకుడు వెంకటశివ, ఉపాధ్యాయులు మీటె నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆలోచన దినోత్సవంలో పాల్గొన్న స్కౌట్స్, గైడ్స్

వేసవికి ముందే గ్రాసం కొరత

న్యూస్‌టుడే, కొనకనమిట్ల

మార్కాపురం, యర్రగొండపాలెం నియోజకవర్గాల్లో వ్యవసాయం తరువాత ఎక్కువ శాతం మంది రైతులు పాడి పరిశ్రమపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. వ్యవసాయం కష్టనష్టాలను పాడి ఆవులు, గేదెల పెంపకంతో పాల దిగుబడి ద్వారా వచ్చే ఆదాయంతో సర్దుకుపోతుంటారు. అయితే పాడి రైతులను పశుగ్రాసం కొరత వేధిస్తోంది. ఫిబ్రవరి మాసంలోనే పాడి రైతులకు పశుగ్రాసం కొరత ఏర్పడడంతో రైతుల్లో వేసవి అంతా ఎలాగోనని ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం ఎండలు పెరగడంతో పొలాల్లో పచ్చగడ్డి తగ్గిపోతోంది. పశువులను మేతకు బయటకు తీసుకెళ్లే పరిస్థితి తగ్గిపోతోంది. దీంతో రెండు పూటలా పాడి ఆవులు, గేదెలను ఇంటి దగ్గర కట్టేసి పశుగ్రాసం అందించాల్సిన పరిస్థితి నెలకొంది.

నియోజకవర్గం	ఆవులు	గేదెలు
మార్కాపురం	5464	70350
యర్రగొండపాలెం	4961	77012

తప్పని ఆర్థిక భారం...

ఈ ప్రాంతంలో వరినాట్లు తక్కువగా ఉండటంతో దర్శి ప్రాంతాల నుంచి ఎండు గడ్డిని దిగుమతి చేసుకుంటారు. దీంతో ట్రాక్టరు రూ.18వేలు నుంచి రూ.22వేల వరకు ధర పలుకుతోంది. ఫలితంగా రైతులపై ఆర్థిక భారం పెరిగి పశువుల పెంపకం భారంగా మారుతోంది.

ట్రాక్టర్లలో తీసుకెళ్తున్న వరి గడ్డి

ప్రభుత్వ సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

పశుగ్రాసం పెంపకానికి ప్రభుత్వం సహకారం అందిస్తోంది. ఐదు ఎకరాల్లోపు భూమి కలిగిన ఎస్సీ, ఎస్టీ, చిన్నకారు రైతులు ఈ పథకానికి అర్హులు ఒక్కో రైతులకు గరిష్ఠంగా 50 సెంట్ల వరకు పశుగ్రాసం సాగుకు అనుమతి ఉంటుంది. జాబ్ కార్డు ఉన్న రైతు సేవా కేంద్రంలోను, మండల పశు వైద్యాధికారిని సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలి. అధికారులు భూమిని పరిశీలించి నీటి వసతి కలిగిన రైతులను ఎంపిక చేస్తారు. 50 సెంట్ల భూమికి కూలీల వేతనం, సామగ్రి కలిపి రూ.32,992 ఖర్చుతోంది. 40 సెంట్లకు రూ.26,394, 30 సెంట్లకు రూ.19,790, 20 సెంట్లకు రూ.13,195 చొప్పున ఆర్థిక సాయం అందిస్తుంది. – శ్రీకాంత్‌రెడ్డి, పశువైద్యాధికారి, కొనకనమిట్ల

కుటుంబాలకు భరోసా.. సీఎం సహాయ నిధి

యర్రగొండపాలెం, న్యూస్‌టుడే: వైద్య ఖర్చులతో సామాన్య కుటుంబాలు నష్టపోకుండా ఉండేందుకు సీఎం సహాయనిధి భరోసానిస్తుందని నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్ బాబు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గంలోని 117మందికి రూ.75లక్షలు పంపిణీ చేశారు. అంతకుముందు స్థానిక మసీదు ప్రాంగణంలో రూ.10 లక్షలతో సిమెంటు రోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి లబ్ధిదారులతో ఎరిక్షన్‌బాబు, నాయకులు

అమ్మను దర్శించి.. నైవేద్యం సమర్పించి..

మార్కాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణ శివారులోని మార్కాపురం గ్రామదేవత శ్రీఅల్లూరి పోలేరమ్మ దేవస్థానంలో ఉగాది ఉత్సవాలు ఆదివారం ప్రారంభమైనట్లు దేవస్థాన కమిటీ సభ్యులు తెలిపారు. మొదటి ఆదివారం సందర్భంగా భక్తులు ఆలయానికి ఉదయంనుంచే తరలి వచ్చారు. కుంకుమ బండ్లు, డప్పుల వాద్యాలతో ఆదివారం పట్టణ వీధులు మార్మోగాయి. అధిక సంఖ్యలో భక్తులు పోలేరమ్మను దర్శించుకుని పొంగళ్ల నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లింకున్నారు.


ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మ

(c) eenadu

ఈనాడు నంద్యాల
సోమవారం ఫిబ్రవరి 23, 2026
5

25న ఉద్యోగమేళా

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 25న ఉద్యోగమేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ డా.శశికళ తెలిపారు. జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ మేళాలో వివిధ సంస్థలు పాల్గొంటున్నట్లు ఆదివారం ఆమె పేర్కొన్నారు. సుమారు 550 ఉద్యోగావకాశాలున్నాయని.. ఏదైనా డిగ్రీ పూర్తి చేసినవారు, డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 77993 37695, 97033 77803 నంబర్లను సంప్రదించాలని కోరారు.

గోడ కూలింది.. గోడు పట్టనంది

మండల పరిధిలోని నందివర్గం గ్రామ శివారులో వాగుపై దశాబ్దాల కిందట వంతెన నిర్మించారు. దీని నిర్వహణను ఏమాత్రం పట్టించుకోకపోవడంతో క్రమంగా శిథిలావస్థకు చేరుకుంది. దీనికితోడు రక్షణ గోడను ఓ వాహనం ఢీకొనడంతో కొంతమేర కూలిపోయింది. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించేందుకు జనం ఆందోళన చెందుతున్నారు. వెంటనే మరమ్మతులు చేయించాల్సిన అవసరం ఉంది. – న్యూస్‌టుడే, బనగానపల్లి గ్రామీణం

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: నంద్యాలలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ జి.రాజకుమారి తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్నట్లు ఆమె ఆదివారం తెలిపారు. జిల్లా అధికారులందరూ ఈ కార్యక్రమానికి హాజరుకావాలని చెప్పారు. జిల్లా కేంద్రంతోపాటు డివిజన్, మున్సిపాలిటీలు, మండల కేంద్రాల్లోనూ వినతులు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తులు పరిష్కారం కాకున్నా.. పరిష్కారం ఏ దశలో తెలుసుకొనేందుకు ఆన్‌లైన్ ద్వారానూ.. టోల్‌ఫ్రీ నంబరు 1100ను సంప్రదించి తెలుసుకోవచ్చని చెప్పారు.

నేటి నుంచి ఇంటర్ వార్షిక పరీక్షలు

● 78,831 మంది విద్యార్థుల హాజరు

ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు సోమవారం నుంచి మార్చి 24వ తేదీ వరకు జరగనున్నాయి. పరీక్షలకు సంబంధించిన అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆర్ఐవో లాలెప్ప ఆదివారం తెలిపారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు జరుగుతాయి. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది. కర్నూలు జిల్లాలో 75 కేంద్రాల్లో 48,964 మంది, నంద్యాల జిల్లాలో 55 కేంద్రాల్లో 29,867 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష జరుగుతుంది. పరీక్ష సమయానికి గంట ముందే విద్యార్థులు కేంద్రానికి చేరుకోవాల్సి ఉంటుంది. నిమిషం ఆలస్యమైనా అనుమతించరు. పరీక్షల విధుల్లో ఉండే అధికారులు చరవాణులు వినియోగించకుండా చర్యలు తీసుకుంటున్నారు. మరోవైపు విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకున్నట్లు ఆర్ఐవో చెప్పారు. విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాయాలని సూచించారు.

హెల్ప్‌డెస్కుల ఏర్పాటు

పరీక్ష కేంద్రాల వద్ద ఏవైనా సమస్యలొస్తే కర్నూలు జిల్లా విద్యార్థులు 08518 222047, నంద్యాల జిల్లావారు 62811 34324 నంబరుకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వొచ్చు. అధికారులు స్పందించి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటారు.
– న్యూస్‌టుడే, కర్నూలు విద్య, నంద్యాల విద్య

అక్రమాలు కనపడకొండ

● గుట్టుగా తవ్వి పరిశ్రమలకు తరలింపు

చుట్టూ కొండలు.. ప్రశాంతమైన వాతావరణం.. దూరం నుంచి చూస్తే పచ్చదనంతో ఆహ్లాదకరంగా ఉంటుంది. దగ్గరకి వెళ్లి చూస్తే గానీ.. అక్రమాలు గోచరించవు. అక్రమార్కులు యథేచ్ఛగా కొండలను పిండి చేసేస్తున్నారు. ఖనిజాలున్న ప్రాంతాల్లో ఖనిజం బయటకు వెళ్లాలన్నా.. పరిశ్రమ యజమానులు కొనుగోలు చేయాలన్నా అధికార పార్టీ నేతలు ఆదేశాలు ఉండాల్సిందే. లేకుంటే అనధికార దాడులు జరుగుతాయి. ముప్పతిప్పలు తప్పవు. – న్యూస్‌టుడే, నంద్యాల

కన్నపకుంట గ్రామ సమీపంలో జరిగిన తవ్వకాలు

మాట వినకుంటే అనధికార దాడులే

ఉమ్మడి జిల్లాలోని డోన్, బనగానపల్లి ప్రాంతాల్లో విలువైన డోలమైట్, సున్నపురాయి, తెల్లసుద్ద, వైట్‌షెల్ తదితర ఖనిజాలు ఉన్నాయి. డోన్ పరిధిలో తెల్లసుద్ద, డోలమైట్ సమృద్ధిగా లభిస్తోంది. ఈ నేపథ్యంలో కన్నపకుంట, ధర్మవరం, కమలపురం, కొచ్చెర్వు, బావిపల్లె, చంద్రపల్లె తదితర ప్రాంతాల్లో తవ్వేస్తున్నారు. డోలమైట్, తెల్లసుద్దకు సంబంధించి పదుల సంఖ్యలో అనుమతులున్నాయి. అనుమతులున్నవారు తవ్వకాలు సాగించాలంటే అధికార పార్టీ నేత అండదండలు ఉండాల్సిందే. సొంతంగా పనులు చేపడితే.. అధికారులతో అనధికార దాడులు చేయిస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

తనిఖీలు నామమాత్రమే

▶▶ డోన్ పరిధిలోని కొండ ప్రాంతాల్లో విలువైన ఖనిజాలను అక్రమార్కులు టిప్పర్ల ద్వారా డోన్ సమీపంలోని పరిశ్రమలకు తరలిస్తున్నారు. ఖనిజ నిక్షేపాలను ఒకచోట నిల్వ చేసి అక్కడి నుంచి ప్రతిరోజూ ఎలాంటి అనుమతులు లేకుండానే టిప్పర్ల ద్వారా అధిక లోడుతో తరలిస్తున్నారు. మైనింగ్ చెక్‌పోస్టు ఉన్నప్పటికీ నేతల అండదండలు ఉండటంతో తనిఖీలు లేకుండానే ఖనిజం తరలిపోతోంది.

▶▶ డోన్ పరిధిలో అక్రమంగా తవ్విన తెల్లరాయి సుద్దను పరిశ్రమల నిర్వాహకులకు టన్ను రూ.250 నుంచి రూ.260 వరకు అమ్ముతున్నట్లు సమాచారం. ప్రతిరోజూ 1,000 టన్నుల వరకు తరలిస్తున్నారు. నిత్యం రూ.లక్షల విలువైన ఖనిజాన్ని కొల్లగొట్టి సొమ్ము చేసుకుంటున్నారు.

వారి కనుసన్నల్లో..

● కన్నపకుంట, బావిపల్లె, కొచ్చెర్వు తదితర ప్రదేశాల్లోని కొండల్లో యంత్రాల ద్వారా సుద్దరాయి తవ్వకాలు సాగిస్తున్నారు. ప్రతిరోజూ వెయ్యి టన్నులకు పైగా సుద్దరాయిని అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం. ఇక్కడి నుంచి డోన్ సమీపంలోని పరిశ్రమలకు తెల్లసుద్దతోపాటు డోలమైట్, ఇతర ఖనిజాలను తరలిస్తుంటారు. అక్కడ పౌడర్‌గా మార్చి పరిశ్రమలకు సరఫరా చేస్తుంటారు. ఆయా ప్రాంతాల్లో అక్రమంగా తవ్విన సుద్దరాయి తరలించాలంటే ప్రజాప్రతినిధి అండదండలుండాలి. ఓ నేత.. పరిశ్రమల నిర్వాహకులకు హుకుం జారీ చేసినట్లు సమాచారం.

● మరో మాటలు ఏంటంటే.. లీజుదారులు టన్నుకు రూ.100 చెల్లిస్తే.. అక్రమంగా సరకు తీసుకొస్తున్నారు నుంచి టన్ను రూ.180 చొప్పున కొనుగోలు చేయాల్సిందే. తక్కువకు వస్తుందని ఇతరుల నుంచి కొనుగోలు చేస్తే.. అధికార పార్టీ నేతల ఆగ్రహానికి గురవ్వాల్సిందే. మైనింగ్, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు అందుతున్నా చర్యలు శూన్యమే.



ఎగువ అహోబిలంలో ధ్వజారోహణం

ప్రత్యేక అలంకరణలో జ్వాలా నృసింహస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లు

దేవతలారా.. రారండి

● ఘనంగా ధ్వజారోహణం

నారసింహుని బ్రహ్మోత్సవాలకు సకల దేవతలను ఆహ్వానించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎగువ అహోబిలంలో ఆదివారం ఉదయం జ్వాలా నృసింహస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి ధ్వజ స్తంభానికి ఎదురుగా ఉన్న మండపంలో కొలువుంచారు. అనంతరం ఉత్సవాలు సజావుగా సాగాలని కోరుతూ ధ్వజారోహణం చేశారు. ఉత్సవమూర్తులను పల్లకిపై కొలువుంచి మేళతాళాలతో ఊరేగించారు. మధ్యాహ్నం పంచామృతాలతో అభిషేకం జరిపారు. రాత్రి జ్వాలా నృసింహస్వామి వారు, అమ్మవార్లు సింహ వాహనంపై కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చారు. దిగువ అహోబిలంలో బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ జరిగింది. ఇందులో భాగంగా విష్వక్సేనుల వారిని ప్రత్యేకంగా అలంకరించి పల్లకిలో ఊరేగింపుగా ఆలయం బయటకు తీసుకొచ్చి అంకుర హోమం, సోమకుంభస్థాపన జరిపారు. పీఠాధిపతి రంగనాథ యతీంద్ర మహాదేశికన్, ప్రధానార్చకుడు కిడాంబి వేణుగోపాలన్ ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.
– న్యూస్‌టుడే, అహోబిలం (ఆళ్లగడ్డ గ్రామీణం)

పుర దాహార్తి తీరనుంది

● నీటి పథకాల పూర్తికి ప్రభుత్వం చర్యలు

పురపాలక సంఘాల పరిధిలో ఇంటింటికి కుళాయి కనెక్షన్లు ఇచ్చి ప్రజల దాహార్తి తీర్చేందుకు కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ ఇన్వెస్ట్‌మెంటు బ్యాంకు (ఏఐఐబీ) 70 శాతం, కూటమి ప్రభుత్వం 30 శాతం నిధులతో ఈ పనులు చేపట్టనున్నాయి. 2015-19లోనే తాగునీటి పథకాలకు నిధులు మంజూరుచేశారు. ఆ తర్వాత వచ్చిన వైకాపా దీనిని పక్కన పెట్టింది.
– న్యూస్‌టుడే, నంద్యాల పట్టణం, ఎమ్మిగనూరు

టెండర్ల ప్రక్రియ ప్రారంభం

ఎమ్మిగనూరు పురపాలక సంఘానికి రూ.157.30 కోట్లు, ఆత్మకూరు రూ.139.95 కోట్లు, ఆళ్లగడ్డ రూ.133.39 కోట్లు, నందికొట్కూరుకు రూ.129.87 కోట్లు కేటాయించారు. ఈనెల 20వ తేదీ నుంచి టెండర్ల ప్రక్రియ ప్రారంభమైంది. టెండర్ల దాఖలుకు మార్చి 17.. చివరి తేదీగా ప్రకటించారు. కర్నూలు నగరపాలక సంస్థతో పాటు ఆదోని పురపాలక సంఘం పరిధిలో ఇప్పటికే టెండర్ల ప్రక్రియ పూర్తైంది.

ఎక్కడికక్కడ ఆగిపోయి..

● ఆత్మకూరు పురపాలక సంఘానికి వెలుగోడు జలాశయం నుంచి నీటిని సరఫరా చేసేందుకుగాను 27 కి.మీ. పొడవునా పైపులైను, రెండు నీటిశుద్ధి ప్లాంట్లు, నాలుగు ఓవర్‌హెడ్ ట్యాంకులు నిర్మించాల్సి ఉంది. ఇందులో మూడు ట్యాంకులు నిర్మించి వదిలేశారు. రూ.5 కోట్ల విలువైన పనులు జరగ్గా.. గుత్తేదారులకు రూ.2 కోట్లు మాత్రమే చెల్లించారు.

● నందికొట్కూరు పురపాలక సంఘం పరిధిలో 19 కి.మీ. దూరంలో ఉన్న అలగనూరు జలాశయం నుంచి నీటిని తీసుకురావాలని ప్రణాళికలు రూపొందించారు. ఇక్కడ మూడు ట్యాంకుల పనులు 70 శాతం వరకు జరిగాయి.

● ఆళ్లగడ్డ పురపాలక పరిధిలో 20 కి.మీ. దూరంలోని గండ్లేరు జలాశయం నుంచి పైపులైను ఏర్పాటు చేయాల్సి ఉంది. పైపులైను, ఓవర్‌హెడ్ ట్యాంకుల పనులు మధ్యలోనే నిలిచిపోయాయి.

గతంలో బిల్లులు అందక..

కర్నూలు జిల్లాలో కర్నూలు నగరపాలక సంస్థతోపాటు ఆదోని, ఎమ్మిగనూరు, ఆత్మకూరు, ఆళ్లగడ్డ, నందికొట్కూరు, గూడూరు మున్సిపాలిటీల పరిధిలో ఏఐబీ నిధులతో 2016లోనే బృహత్తర నీటి పథకాలు మంజూరయ్యాయి. వివిధ రిజర్వాయర్ల నుంచి పైపులైన్ల ద్వారా నీటిని తీసుకుని ప్రజలకు శుద్ధజలం అందించడమే ఈ పథకం లక్ష్యం. ఇందులో భాగంగా మంచి నీటి ట్యాంకుల నిర్మాణం, పైపులైన్ల ఏర్పాటు, నీటి శుద్ధి ప్లాంట్లు తదితరాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. అప్పట్లో తెదేపా ప్రభుత్వం నిధులు కేటాయించి పనులు ప్రారంభించింది. 2019లో వైకాపా ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అటకెక్కాయి. బిల్లులు రాకపోవడంతో గుత్తేదారులు పనులు ఆపేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం తాజాగా టెండర్లు పిలిచింది.

రంజాన్ వేళలు

పట్టణం	ఇఫ్తార్ (సోమ)	సహెరీ (మంగళ)
కర్నూలు	6:28	5:17
నంద్యాల	6:25	5:18
ఆదోని	6:26	5:17
ఆళ్లగడ్డ	6:25	5:21
బనగానపల్లి	6:27	5:14

కళావైభవం

ప్రముఖ శైవక్షేత్రమైన శ్రీశైలంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకుంటున్నాయి. హైదరాబాద్‌కు చెందిన శివశక్తి కూచిపూడి ఆర్ట్స్ అకాడమీ బృందం పలు ఆధ్యాత్మిక గీతాలకు సంప్రదాయ నృత్య ప్రదర్శనలు ఇచ్చింది. కళాకారులను దేవస్థానం అధికారులు సత్కరించారు.
– న్యూస్‌టుడే, శ్రీశైలం, నంది సర్కిల్

రాకపోకలకు రాచమార్గం

● వేగంగా బైపాస్ రహదారి పనులు

సంజామల వద్ద జరుగుతున్న పనులు

రహదారుల బాగోగులను గత వైకాపా ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదు. రోడ్లన్నీ గుంతలమయమై వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యేవి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చాక రహదారులకు మహర్దశ కలిగింది. పలుచోట్ల కొత్త రోడ్లు నిర్మిస్తున్నారు. దెబ్బతిన్నవాటికి మరమ్మతులు చేస్తూ ప్రయాణ కష్టాలు తీరుస్తున్నారు.
– న్యూస్‌టుడే, కోవెలకుంట్ల, సంజామల

రూ.కోటి నిధులు కేటాయించి..

సంజామలలో ఇరుకైన రహదారి కారణంగా వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగేది. ఇటీవలకాలంలో వాహనాల సంఖ్య పెరగడంతో ఈ మార్గంలో నిత్యం ట్రాఫిక్ స్తంభించేది. సమస్యను గుర్తించిన ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం కింద రూ.కోటి నిధులతో బైపాస్ రహదారి మంజూరుకు చర్యలు తీసుకున్నారు. ఈ నేపథ్యంలో అవసరమైన భూములు సేకరించారు. ఈ క్రమంలో ఊరి వెలుపల బైపాస్ రహదారి పనులు చురుగ్గా సాగుతున్నాయి. 700 మీటర్ల పొడవు.. 6 మీటర్ల వెడల్పుతో సిమెంట్ రహదారి నిర్మించనున్నారు. ప్రస్తుతానికి రహదారి చదును చేయటంతోపాటు కంకర పరిచే పనులు చేపట్టారు.

తప్పనున్న ఇబ్బందులు

◆ సంజామలలో ప్రతి ఆదివారం పెద్దఎత్తున సంత జరుగుతుంది. వందలాది మందితో కిటకిటలాడుతూ ఉంటుంది. ప్రధాన మార్గంలో సంత నిర్వహిస్తుండగా వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడేది. బైపాస్ రహదారి నిర్మాణం పూర్తైతే చాలా వాహనాలు దారి మళ్లుతాయి.

◆ కోవెలకుంట్ల నుంచి సంజామల మీదుగా తాడిపత్రికి నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగుతుంటాయి. బైపాస్ నిర్మాణం పూర్తైతే ఊర్లో నుంచి వెళ్లాల్సిన అవసరం ఉండదు. ట్రాఫిక్ సమస్య తప్పి సులువుగా.. తక్కువ సమయంలో బైపాస్ మీదుగా రాకపోకలు సాగించే వీలు కలుగుతుంది.

38 రోజులు.. రూ.11.37 కోట్లు

● సెస్సు వసూళ్లలో మార్కెట్ కమిటీల వెనుకబాటు

ఉమ్మడి జిల్లాలోని వ్యవసాయ మార్కెట్ కమిటీలు సెస్సు వసూళ్లలో వెనుకబడ్డాయి. 2025-26 సంవత్సరానికి రూ.67.06 కోట్ల వసూలు లక్ష్యంగా నిర్దేశించారు. ఈనెల 18వ తేదీ నాటికి రూ.55 కోట్లకు పైగా వసూలు చేశారు. ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు మరో 38 రోజులు మాత్రమే ఉంది. ఈలోగా మిగతా సెస్సు వసూలు చేయగలరా అన్నది ప్రశ్నార్థకంగా మారింది.
– న్యూస్‌టుడే, కర్నూలు మార్కెట్

కర్నూలు మార్కెట్‌కు వచ్చిన వాము దిగుబడులు

ఉమ్మడి జిల్లాలో 15 వ్యవసాయ మార్కెట్ కమిటీలు ఉన్నాయి. అందులో కర్నూలు, నంద్యాల, ఆదోని, ఎమ్మిగనూరు, ఆళ్లగడ్డ వ్యవసాయ మార్కెట్‌లలో పెద్దఎత్తున పంట ఉత్పత్తుల క్రయవిక్రయాలు జరుగుతుంటాయి. మిగిలిన వాటిల్లో పెద్దగా జరగవు. చెక్‌పోస్టులు, స్థానిక మిల్లర్లు, వ్యాపారుల నుంచి 1 శాతం సెస్సు వసూలు చేయాల్సి ఉంది. 2025 ఖరీఫ్‌లో అధిక వర్షాల కారణంగా పంట దిగుబడులు పూర్తిగా తగ్గిపోయాయి. ఉల్లి, మొక్కజొన్న, మినుములు, పొద్దుతిరుగుడు విత్తనాలు, కందులు, శనగలకు గిట్టుబాటు ధరలు లేకపోవడంతో సెస్సు వసూళ్లలో మార్కెట్ కమిటీలు చతికిలపడ్డాయి.

దిగుబడులు తగ్గి.. ధరల్లేక

రూ.23 కోట్లకుపైగా...

నంద్యాల జిల్లాలో మొత్తం 8 వ్యవసాయ మార్కెట్ కమిటీలు ఉన్నాయి. వీటి పరిధిలో 23 చెక్‌పోస్టులున్నాయి. మార్కెట్ కమిటీ కార్యాలయానికి వచ్చే సెస్సును మార్కెట్ కమిటీ అధికారులు, సిబ్బంది వసూలు చేస్తున్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి జిల్లావ్యాప్తంగా అన్ని వ్యవసాయ మార్కెట్ కమిటీల నుంచి రూ.26.66 కోట్లు వసూలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. గతేడాది ఏప్రిల్ నుంచి ఈనెల 18వ తేదీ వరకు పరిశీలిస్తే రూ.23.10 కోట్ల మేర వసూలైంది.

నంద్యాల జిల్లాలో 2025-26లో ఈనెల 18 వరకు వసూలు చేసిన సెస్ వివరాలు (రూ.కోట్లలో)

మార్కెట్ కమిటీ	సెస్సు లక్ష్యం	వసూలైంది
నంద్యాల	6.30	4.76
ఆళ్లగడ్డ	6.00	4.95
డోన్	1.45	1.42
నందికొట్కూరు	3.65	3.22
ఆత్మకూరు	5.30	4.76
పాణ్యం	1.56	1.34

బనగానపల్లి ముందంజ

ఆర్థిక సంవత్సరం ముగింపునకు 38 రోజులు ముందుగానే బనగానపల్లి మార్కెట్ కమిటీ 113.43 శాతం లక్ష్యం సాధించడం విశేషం. కోవెలకుంట్ల మార్కెట్ కమిటీ 106.07 శాతంతో పురోగతిలో ఉంది. డోన్, ఆత్మకూరు, నందికొట్కూరు, పాణ్యం మార్కెట్ కమిటీలు ఆ తర్వాతి స్థానాల్లో ఉండగా.. నంద్యాల మార్కెట్ కమిటీ 75.64 శాతం సెస్సు వసూలుతో చివరి స్థానంలో నిలిచింది.

తప్పు చేసినా బుకాయింపు

● వైకాపాపై మంత్రి బీసీ ధ్వజం

మాట్లాడుతున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, పక్కన ఎమ్మెల్యే జయసూర్య తదితరులు

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : హిందూ వ్యతిరేకి.. హిందూ మతంపై నమ్మకం లేని జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు, ప్రజాస్వామ్యంపై ఏం గౌరవం ఉంటుందని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి విమర్శించారు. పట్టణంలోని తెదేపా కార్యాలయంలో నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య, భాజపా జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు, తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్, తెదేపా సీనియర్ నేత గౌరు వెంకటరెడ్డితో కలిసి ఆదివారం మాట్లాడారు. శాసనమండలిలో వెంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని తీసుకొచ్చేటప్పుడు చెప్పులు వేసుకుని మహాపరాధనకు పాల్పడ్డారన్నారు. ప్రజా సమస్యలపై చర్చించాల్సిన కౌన్సిల్‌లో రాజకీయ ఉనికి కాపాడుకొనేందుకు వైకాపా వారు వెంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని తీసుకొచ్చారని అన్నారు. చేసిన తప్పు కళ్ల ముందు కనిపిస్తున్నా తప్పుడు పని చేయలేదంటూ బుకాయిస్తున్నారని విమర్శించారు. తిరుమల లడ్డూలో కొవ్వు కలిసిందని సాక్షాత్తు వైవీ సుబ్బారెడ్డి ఒప్పుకున్న విషయాన్ని గుర్తు చేశారు. కొవ్వే కాదు.. రసాయనాలు కూడా కలిశాయని నివేదికలో తేలిందన్నారు. తిరుమల శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించడానికి ఏరోజు కూడా జగన్ తన సతీమణితో కలిసి రాలేదన్నారు. అన్యమతస్థులు తిరుమలలో ఇచ్చే డిక్లరేషన్‌పై కూడా జగన్ సంతకం పెట్టలేదన్నారు. జగన్ పరిపాలనలో హిందూ దేవాలయాలపై వందలాది దాడులు జరిగాయన్నారు. తితిదే నిధులను దారి మళ్లించిన కరుణాకర్‌రెడ్డికి ఛైర్మన్ పదవి కట్టబెట్టారన్నారు. అన్యమతస్థులను నియమించారన్నారు.

వసతులు అనుకూలించక

● పని ప్రదేశాల్లో కానరాని సౌకర్యాలు

జిల్లాలో వేసవి ఉష్ణోగ్రతలు రోజురోజుకు పెరుగుతున్నాయి. రానున్న రోజుల్లో మరింత తీవ్రమయ్యే పరిస్థితులు కనపడుతున్నాయి. మరోవైపు ఉపాధి హామీ పథకం కింద కూలీలకు గ్రామాల్లో పనులు కల్పిస్తున్నారు. వారు పనిచేసే ప్రాంతంలో కనీస సౌకర్యాలు కానరావడం లేదు. అధికారులు పట్టించుకోవడం లేదు. ఫలితంగా మండే ఎండలో పనులు చేయలేక కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. కాసేపు సేదదీరుదామన్నా షామియానాల జాడే కానరావడం లేదు. మంచినీటి సౌకర్యం కల్పించకపోవడంతో గుక్కెడు నీటికి అల్లాడుతున్నారు.
– న్యూస్‌టుడే, నంద్యాల రైతునగరం

మొత్తం జాబ్‌కార్డులు	: 2.59 లక్షలు
అందుబాటులో ఉన్నవి	: 2.13 లక్షలు
పనిచేసే కూలీలు	: 3.73 లక్షలు
వంద రోజుల పనులు పూర్తైన కుటుంబాలు	: 3,281
కూలీ సగటు వేతనం	: రూ. 264

గిట్టుబాటు లభించక..

ఉపాధి పనులతో గిట్టుబాటు దక్కడం లేదని వేతనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ పనులకు వెళితే రోజుకు రూ.500 వస్తుందని.. ఉపాధి పథకంలో పనికి తగ్గ కూలీ లభించడం లేదని పేర్కొంటున్నారు. మరోవైపు జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఉపాధి కూలీలకు 200 పనిదినాలు చూపడంలో అధికారులు విఫలమవుతున్నారన్న విమర్శలున్నాయి. పూర్తిస్థాయిలో ఉపాధి చూపాలని.. వేసవి భత్యం ఇవ్వాలని పలువురు విన్నవిస్తున్నారు.

అందుబాటులో లేక..

➡ ఎండ నుంచి రక్షణ కల్పించేందుకు.. కొంతసేపు విశ్రాంతి తీసుకొనేందుకు షామియానాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. వీటి జాడ వెతికినా కానరావడం లేదు.

➡ పనులు చేసే సమయంలో ఏదైనా ప్రమాదం జరిగితే వెంటనే ప్రథమ చికిత్స చేసేందుకు కిట్లు అందించాల్సి ఉంది. చాలా ప్రాంతాల్లో ఇవి అందుబాటులో ఉండటం లేదు.

➡ ఎండల నేపథ్యంలో వడదెబ్బ తగిలితే ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాల్సి ఉన్నా ఇవ్వడం లేదు.

➡ దూర ప్రాంతాల నుంచి వచ్చే వారు సొంతంగా ప్రయాణ ఖర్చులు భరించాల్సి వస్తోంది. నిబంధనల ప్రకారం 5 కి.మీ.లు దాటితే రవాణా ఖర్చులను అందజేయాల్సి ఉంది. కానీ ఇవ్వడం లేదని కూలీలు వాపోతున్నారు. ప్రస్తుతం ఎండలు ఎక్కువవుతున్న నేపథ్యంలో అవసరమైన సౌకర్యాలు కల్పించాల్సి ఉంది.

దాతృత్వం.. ఆధ్యాత్మిక పరిమళం

కొలిమిగుండ్ల మండలంలోని కోరుమానుపల్లె గ్రామ సమీపంలో గ్రామస్థులు, దాతల సహకారంతో పట్టాభిరామ దేవాలయం రూపుదిద్దుకుంది. ఏడాది కిందట పనులు ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో ఆలయ ప్రతిష్ఠ ఉత్సవాలు ఈనెల 27 నుంచి జరిపేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. దాతల సహకారంతో రూ.80 లక్షల వ్యయంతో ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దడం విశేషం. ఈనెల 27న గణపతి పూజ, యాగశాల ప్రవేశం, 28న వేదపారాయణం, హోమాలు, మార్చి 1న విగ్రహ, శిఖర ప్రతిష్ఠలు, మహా మంగళహారతి తదితరాలతోపాటు భజన పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు పేర్కొన్నారు. – న్యూస్‌టుడే, కొలిమిగుండ్ల

చెంతనే జలం.. తడవని పొలం

● నీటి విడుదల విషయంలో కొరవడిన స్పష్టత

ఆళ్లగడ్డ నియోజకవర్గ పరిధిలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి పంటల సాగు ప్రశ్నార్థకంగా మారింది. గతంలో కేసీ కాలువ ఆయకట్టు కింద పొలం ఉంటే రెండు కార్లు పండించుకోవచ్చన్న ధీమా ఉండేది. గత కొన్నేళ్లుగా ఆ పరిస్థితి లేదు. ఎన్నడూ లేనివిధంగా శ్రీశైలం జలాశయం జలకళ సంతరించుకుంది. కేసీ కాలువకు నీరు సమృద్ధిగా చేరాయి. ఈ పరిస్థితుల్లోనూ రెండో పంట తడిపై అధికారులు హామీ ఇవ్వడం లేదు. కేసీ చివరి ఆయకట్టుగా ఉన్న 27వ లాక్ వద్ద ప్రస్తుతం మూడున్నర అడుగుల నీటి ప్రవాహం ఉన్నా వరి సాగు చేసుకోలేకపోయారు. – న్యూస్‌టుడే, ఆళ్లగడ్డ

కేసీ ప్రధాన కాలువ పక్కనే బీడుగా ఉన్న పొలం

గత ప్రభుత్వం పట్టించుకోక..

● గత వైకాపా ప్రభుత్వ హయాంలో కేసీ అభివృద్ధికి నయాపైసా ఖర్చు చేయలేదు. పంట కాల్వలు, లాక్‌లు, స్లూయిజ్ గేట్ల పరిస్థితి అధ్వానంగా ఉంది. కూటమి ప్రభుత్వం 28 సివిల్, మెకానికల్ పనులకు రూ.2.81 కోట్లు కేటాయించింది. మరోవైపు కేసీ కాల్వ పరిధిలో 133 పనులకు ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ కింద రూ.9,35,55,000 విడుదలయ్యాయి.

● గతేడాది ఫిబ్రవరిలో ప్రతిపాదనలు పంపినా అనుమతులు ఆలస్యమవడం.. కేసీకి నీరు విడుదల వడంతో మధ్యలోనే పనులు ఆగిపోయాయి. గతేడాది మార్చిలో 1,671 పనులకు సంబంధించి రూ.162 కోట్ల విలువైన ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపించారు.

కేసీ కాలువ పొడవు	: 305 కి.మీ.
డిస్ట్రిబ్యూటర్లు	: 293
ఆయకట్టు	: 2.93 లక్షల ఎకరాలు
కేటాయించిన నీరు	: 31.90 టీఎంసీలు
కాల్వ నీటి సామర్థ్యం	: 3,800 క్యూసెక్కులు
ప్రస్తుత ప్రవాహం	: 1,100 క్యూసెక్కులు

అవగాహన కల్పించడంలో విఫలం

● తుంగభద్ర గేట్ల మరమ్మతుల కారణంగా కేసీ పరిధిలో రెండో పంటకు నీరివ్వలేమని గత డిసెంబరు 2న జరిగిన ఐఏబీ సమావేశంలో మంత్రులు ప్రకటించారు. దీంతో రెండో పంట సాగుపై సందిగ్ధత నెలకొంది. మరోవైపు అవగాహన కల్పించడంలోనూ అధికారులు విఫలమయ్యారు.

● ప్రజాప్రతినిధుల ఒత్తిడితో కేసీ కాలువ 120 కి.మీ. నుంచి ఆళ్లగడ్డ వరకు పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నుంచి నీటిని విడుదల చేస్తున్నారు. ఇప్పటికీ పొన్నాపురం పరిధిలోని 7, 16వ లాక్‌ల వద్ద ఆరున్నర అడుగుల నీరు పారుతోంది. ఇదే స్థితి కొనసాగితే మరో 20 రోజుల పాటు నీటి ప్రవాహానికి ఇబ్బందులు ఉండవు. కానీ నీటి విడుదల విషయంలో స్పష్టమైన హామీ ఇవ్వడంలో అధికారులు విఫలమయ్యారు. దీంతో ఈ ఏడాది చివరి ఆయకట్టు రైతులు రెండో పంట సాగువైపు మొగ్గు చూపలేకపోయారు.



(c) eenadu

వంతెన ఇరుకు.. ప్రయాణం బెరుకు

ఆళ్లగడ్డ మండలంలోని అహోబిలం రహదారిలో గండ్లేరు సమీపంలోని తెలుగు గంగ కాల్వపై వంతెన ఇరుకుగా మారింది. గతంలో ఆళ్లగడ్డ నుంచి అహోబిలం వరకు రెండు వరుసల రహదారికి నిధులు మంజూరు కావడంతో ఆర్అండ్‌బీ శాఖ అధికారులు రోడ్డు విస్తరణ చేపట్టారు. కాని గండ్లేరు వద్ద తెలుగు గంగ కాల్వ వంతెనను విస్తరించలేదు. అటవీ ప్రాంతంలో ఉండటంతో అటవీశాఖ అధికారులు పనులకు అనుమతించలేదు. దీంతో అధికారులు చేసేదేమీలేక ఉన్న వంతెనపై రోడ్డు వేసి వదిలేశారు. దారి ఇరుకుగా ఉండటంతో పెద్ద వాహనం వస్తే రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. ఇరుకు రోడ్డును విస్తరిస్తే ఇబ్బందులు తొలగుతాయని వాహనదారులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, ఆళ్లగడ్డ గ్రామీణం

ప్రాణాలుపోతున్నా.. మారరే!

కోవెలకుంట్ల, బనగానపల్లి మండలాల్లో వ్యవసాయ మహిళా కూలీలు.. ఎక్కడ పని దొరికితే అక్కడికి వెళ్తుంటారు. పని ప్రాంతాలకు చేరుకోవడానికి ట్రాక్టర్లు, ఆటోలను ఆశ్రయిస్తారు. కోవెలకుంట్ల మండలం అమడాల గ్రామ సమీపంలో ఆదివారం ఓ ట్రాక్టరు ఇంజిన్‌పై అధిక సంఖ్యలో మహిళా కూలీలు ప్రమాదకరంగా ప్రయాణించారు. ఏ మాత్రం పట్టు తప్పినా ప్రమాదం తప్పదు. ఇటువంటి ప్రయాణాలపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. - న్యూస్‌టుడే, కోవెలకుంట్ల పట్టణం

తీగల ఉయ్యాల.. ఊపిరి తీసేలా

కల్లూరు పట్టణ పరిధిలోని ఆదిత్యనగర్ సమీపంలో ఓ ప్రార్థనా మందిరానికి వెళ్లే మార్గంలో రెండు విద్యుత్తు స్తంభాలు ఓ వైపు వాలిపోయాయి. తీగల ఆధారంగా వేలాడుతున్నాయి. కొన్ని నెలలుగా ఇవి ప్రమాదకరంగా ఉన్నాయని.. సరిచేయాలని నగరపాలక, విద్యుత్తు శాఖ అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ప్రమాదాలు జరగకముందే స్తంభాలను సరిగా పాతించాలని విన్నవిస్తున్నారు. - న్యూస్‌టుడే, కర్నూలు మార్కెట్

ప్రమాదాన్ని కప్పిపుచ్చారు

కర్నూలు సర్వజన ఆసుపత్రిలో వైద్యుల వాహనాలు నిలిపే ప్రదేశం వద్ద కూడలిలో రహదారికి అడ్డంగా ప్రవహిస్తున్న మురుగు కాలువపై కల్వర్టు పూర్తిగా నిర్మించలేదు. మలుపులో కొంత భాగాన్ని వదిలేశారు. రోడ్డు అంచుల్లోనే మూత లేకుండా ఉన్న కాలువపై పాత ఫ్లెక్సీని మూసి ఉంచారు. నిత్యం వైద్యులు, సిబ్బంది, రోగులు ఈ దారిలో రాకపోకలు సాగిస్తుంటారు. పగలు ఏమరపాటుగా ఉన్నా.. రాత్రిళ్లు చీకట్లో దీనిని గుర్తించకున్నా కాలువలో పడిపోయే ప్రమాదం ఉంది. దీనివల్ల ద్విచక్ర వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారని.. అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో కల్వర్టు నిర్మించాలని సిబ్బంది కోరుతున్నారు. - ఈనాడు, కర్నూలు

భావన బాదుడు.. రిషి దూకుడు

◆ క్రికెట్‌లో కర్నూలు క్రీడాకారుల సత్తా

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే : నగరానికి చెందిన క్రీడాకారులు భావన, రిషి క్రికెట్‌లో అద్భుత ప్రతిభ చూపుతున్నారు. క్రికెట్‌పై ఆసక్తితో బ్యాట్ పట్టిన వీరు.. శిక్షణ తీసుకుంటూ.. నిత్యం సాధన చేస్తూ ఆటలో మెలకువలు నేర్చుకున్నారు. పోటీల్లో పరుగుల వరద పారిస్తూ ప్రశంసలు అందుకుంటున్నారు. ఫీల్డింగ్, కీపింగ్‌లోనూ రాణిస్తూ ఆల్‌రౌండర్లుగా పేరు గాంచారు. పలు జిల్లా, రాష్ట్రస్థాయి అండర్-14, అండర్-15 క్రికెట్ పోటీల్లో సత్తా చాటారు. జాతీయస్థాయి మ్యాచ్‌లో రాణించి భారత జట్టుకు ఎంపికవ్వడమే లక్ష్యమని వీరు చెబుతున్నారు.

మైదానంలో పరుగుల వరద

ఎన్ఆర్‌పేటకు చెందిన డి.భావన 8వ తరగతి చదువుతోంది. తండ్రి బాలాజీ రాష్ట్ర క్రికెట్ జట్టు మాజీ క్రీడాకారుడు. తండ్రి వద్ద [illegible] క్రికెట్ నేర్చుకున్న భావన ప్రస్తుతం హైదరాబాద్‌లోని మాజీ ఇండియన్ క్రికెటర్ ఎమ్మెస్కే ప్రసాద్ పర్యవేక్షణలో శిక్షణ తీసుకుంటోంది. ◆ 2025 జూన్‌లో నెల్లూరులో జరిగిన రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నీలో కర్నూలు జట్టు తరఫున ఓపెనింగ్ బ్యాటర్‌గా బరిలో దిగి 84 పరుగులు చేసింది. ◆ 2025 డిసెంబరు 12న నెల్లూరు జిల్లా వెంకటగిరిలో జరిగిన రాష్ట్ర జట్టు ఎంపిక పోటీల్లో సత్తా చాటి ఏసీఏ ప్రాబబుల్స్‌కు ఎంపికైంది. ◆ ఈనెల 3 నుంచి 28వ తేదీ వరకు జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎం.ఎ.ఇస్ఫాన్ మెమోరియల్- 2026 అండర్- 14 క్రికెట్ టోర్నీలో కర్నూలు- బి జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తోంది. ఇప్పటి వరకు జరిగిన మూడు మ్యాచులలో ఆదోనిపై 63, కోడుమూరుపై 75, కర్నూలు-సి జట్టుపై 36 పరుగులు చేసింది.

కెప్టెన్.. ఉత్తమ బ్యాట్స్‌మెన్

నగరంలోని గుత్తి పెట్రోల్ బంకు ప్రాంతంలో నివసిస్తున్న రిషి 8వ తరగతి చదువుతున్నాడు. ఐదేళ్లుగా శిక్షకుడు సమీర్ అలీఖాన్ వద్ద క్రికెట్‌లో తర్ఫీదు పొందుతున్నాడు. ◆ 2024లో కడపలో జరిగిన అండర్-12 క్రికెట్ పోటీల్లో కర్నూలు జిల్లా జట్టు కెప్టెన్‌గా వ్యవహరించాడు. ఆ టోర్నీలో మూడు మ్యాచ్‌ల్లో 150 పరుగులు చేశాడు. వికెట్ కీపర్‌గా కూడా అద్భుత ప్రదర్శన చేశాడు. ◆ 2024 జూన్ 15న నెల్లూరులో జరిగిన అండర్-14 రాష్ట్రస్థాయి టోర్నీలో మూడు మ్యాచ్‌లలో 100 పరుగులు చేశాడు. ◆ 2025లో కడప వైఎస్సార్ స్టేడియంలో జరిగిన అండర్-14 రాష్ట్రస్థాయి పోటీల్లో కడపపై 68, అనంతపురంపై 42, నెల్లూరుపై 71 పరుగులు చేసి ఉత్తమ బ్యాటర్‌గా ఎంపికయ్యాడు. ◆ 2025 అక్టోబరులో మంగళగిరి ఏసీఏ మైదానంలో జరిగిన పోటీల్లో సౌత్ జోన్ తరఫున ఆడి నార్త్‌జోన్‌పై 69, రెస్టాఫ్ సెంట్రల్ జోన్‌పై 32 పరుగులు చేశాడు. ◆ ఈనెల 3వ తేదీ నుంచి కర్నూలులో జరుగుతున్న ఎం.ఎ.ఇస్ఫాన్ మెమోరియల్ ట్రోఫీ పోటీల్లో కర్నూలు- సి జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తూ.. ఆదోనిపై 165, కోడుమూరుపై 37 పరుగులు చేశాడు. కీపర్‌గా 6 క్యాచ్‌లు అందుకుని ఆల్‌రౌండర్ ప్రతిభ చాటాడు.

భక్తులతో కిక్కిరిసిన నారసింహ క్షేత్రం

అహోబిలం(ఆళ్లగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: అహోబిలం నృసింహుని క్షేత్రం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. స్వామి బ్రహ్మోత్సవాలను తిలకించేందుకు దూర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ప్రత్యేక వాహనాల్లో తరలిరావడంతో ఎగువ అహోబిలం రహదారి వాహనాలతో నిండి రద్దీ నెలకొంది. భక్తుల తాకిడి అధికంగా ఉండటంతో స్వామి దర్శనానికి బారులు తీరి గంటల తరబడి క్యూలైన్‌లో నిలబడాల్సి వచ్చింది. ఎగువ, దిగువ ఆలయాలతో పాటు నల్లమల అటవీ ప్రాంతంలోని మాలోల, వరాహ, పావన నృసింహస్వామి ఆలయాలను దర్శించుకుని భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

దర్శనానికి బారులు తీరిన భక్తులు

మల్లన్న సేవలో మంత్రి సంధ్యారాణి

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జునస్వామి వార్లను ఆదివారం రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. దర్శనార్థం వచ్చిన ఆమెకు ఆలయ మహాద్వారం వద్ద ఏఈవో కె.వెంకటేశ్వరరావు సాదర స్వాగతం పలికారు. అనంతరం మంత్రి కుటుంబ సభ్యులతో కలిసి శ్రీస్వామి వారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన పూజలు నిర్వహించుకున్నారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో అర్చకులు వేదాశీర్వచనాలు పలికి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

మంత్రికి స్వామిఅమ్మవార్ల జ్ఞాపిక అందజేస్తున్న ఏఈవో

స్వచ్ఛ సంకల్పం.. కోనేరు శుభ్రం

రుద్రవరం మండలంలోని చిన్నకంబలూరు గ్రామంలోని చెన్నకేశవస్వామి ఆలయ ప్రాంగణంలో పురాతన కోనేరు పిచ్చిమొక్కలు పెరిగి, పూడికతో నిండి పోయింది. కోనేరు దుస్థితిపై ఈనెల 21వ తేదీన 'కోనేటిరాయడా... కోనేరు దుస్థితి కనుమా' అనే శీర్షిక 'ఈనాడు'లో చిత్ర కథనం ప్రచురితమైంది. స్పందించిన గ్రామస్థులు, స్వచ్ఛంద సంస్థ సభ్యులు ఆదివారం కోనేరును శుభ్రం చేసి శివలింగం ప్రతిష్ఠించి పూజలు చేశారు. గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. - న్యూస్‌టుడే, చిన్నకంబలూరు (రుద్రవరం)

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఆలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: మొలగవల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ఆదివారం పదో తరగతి వివిధ బ్యాచ్‌ల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికి పూర్వ విద్యార్థి, టీడీపీ జాతీయ కార్యదర్శి రామకృష్ణ హాజరై మాట్లాడారు. పాఠశాలలో పలు సమస్యలు ఉన్నాయని, మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చొరవ చూపుతామన్నారు. పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు కూడా ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మోహన్‌రాజు, కవి వేలూరు రంగన్న, నిర్వాహకులు నాగేంద్ర, భూపేష్, ధనుంజయ్, విజయ్, పటేల్ యాదవ్, శశికళ, రాంనాథ్‌యాదవ్, ఏలూరు తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

అప్పలాపురంలో చమురు నిక్షేపాల సర్వే

కోవెలకుంట్ల పట్టణం, న్యూస్‌టుడే: బనగానపల్లి మండలం అప్పలాపురం గ్రామ శివారులోని పొలాల్లో చమురు నిక్షేపాల కోసం సర్వే నిర్వహిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ అనుమతులతో ఓఎన్‌జీసీ గ్యాస్ సంస్థ సర్వేలో భాగంగా రైతుల పొలాల్లో బోర్లు వేస్తున్నారు. తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా, అనుమతులు తీసుకోకుండా బోర్లు వేస్తుండమేంటని రైతులు ప్రశ్నిస్తున్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సర్వే చేస్తున్నట్లు సిబ్బంది చెప్పారు.

అప్పలాపురం శివారులో భూముల్లో సర్వే చేస్తున్న సిబ్బంది

పేదలకు ఉచిత వైద్య సేవలే లక్ష్యం

సంజామల, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంత పేద ప్రజలకు ఉత్తమ వైద్య సేవలందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి ఛారిటబుల్ మెమోరియల్ ట్రస్ట్ డైరెక్టర్ పెద్దిరెడ్డి మౌలాలిరెడ్డి అన్నారు. మండలంలోని మంగపల్లెలో ఆదివారం ట్రస్ట్ ఆధ్వర్యంలో 65వ మెగా ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తన సొంత నిధులు వెచ్చించి ప్రతి నెలా పేద రోగులకు కార్పొరేట్ తరహా వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. శిబిరాలకు వచ్చే వారికి మందులతో పాటు మధ్యాహ్న భోజన సదుపాయాన్ని కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రతి నెలా వేలాదిగా రోగులు తరలివచ్చి వైద్యం చేయించుకుని వ్యాధుల నుంచి విముక్తి పొందటం ఆనందంగా ఉందన్నారు. 1200 మంది వైద్య శిబిరానికి హాజరయ్యారని చెప్పారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు షేక్షావలిరెడ్డి పాల్గొన్నారు.

రోగుల సమస్య తెలుసుకుంటున్న వైద్యులు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

నందికొట్కూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ఆగిన బొలెరో వాహనాన్ని ద్విచక్రవాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన 10బొల్లవరం గ్రామ సమీపంలోని వేణుగోపాలస్వామి ఆలయ సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. బ్రాహ్మణకొట్కూరు ఎస్సై మణికంఠ తెలిపిన వివరాల ప్రకారం.. నందికొట్కూరు పట్టణానికి చెందిన అబ్దుల్ రహిమాన్(46), మునీర్, నైమూరు రహిమాన్ ద్విచక్రవాహనంపై గార్గేయాపురం గ్రామానికి తాపీ మేస్త్రీ పనులకు వెళ్లి తిరిగి వస్తున్నారు. బొలెరో వాహనాన్ని ద్విచక్రవాహనం ఢీకొట్టడంతో డ్రైవింగ్ చేస్తున్న అబ్దుల్ రహిమాన్ అక్కడికక్కడే మృతి చెందాడు. మిగతా ఇద్దరికి గాయాలయ్యాయి. ఎస్సై సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. రహిమాన్ భార్య ఆసియా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

శ్రీ ఉమామహేశ్వర స్వామి దేవస్థానము

యాగంటి క్షేత్రము, బనగానపల్లి (మం), నంద్యాల జిల్లా.

ఇ-ప్రొక్యూర్మెంటు మరియు సీల్డు టెండరు ప్రకటన

తేదీ. 22.02.2026

శ్రీ ఉమామహేశ్వర స్వామి దేవస్థానమునకు సంబంధించిన ఈ దిగువ తెలిపిన ఐటములకు తేదీ. 04.03.2026న ఇ-ప్రొక్యూర్మెంటు టెండరు మరియు సీల్డు టెండర్లు నిర్వహించబడును. ఆసక్తి గల టెండరుదారులు టెండరు నియమ నిబంధనలు షరతుల ప్రకారము దేవస్థానము వారు కోరియున్న అన్ని డాక్యుమెంట్లు సమర్పించి టెండరు ధరావతు సొమ్ము చెల్లించి పాల్గొనవచ్చును. టెండరు షెడ్యూలు సమర్పించుటకు చివరి తేదీ. 04.03.2026న ఉ॥ 10 గం॥ వరకు. ఇ-ప్రొక్యూర్మెంటు టెండరు షరతుల కొరకు www.tender.eprocurement.gov.in నందు చూడగలరు. ఇతర వివరముల కొరకు కార్యాలయము నందు సంప్రదించగలరు.

క్ర. సం.	లీజు / లైసెన్సు వివరము	కాలపరిమితి	ధరావతు మొత్తము
1	దేవస్థానమునకు అవసరమగు లడ్డు ప్రసాదము తయారీకి సరుకులు సప్లై చేయుటకుగాను (ఇ-ప్రొక్యూర్మెంటు టెండరు ప్రకటన మరియు సీల్డు టెండరు)	01.04.2026 నుండి 31.03.2027 వరకు	50,000.00
2	దేవస్థానమునకు అవసరమగు పడితరము మరియు ప్రసాదము సరుకులు సప్లై చేయుటకు గాను (సీల్డు టెండరు)	01.04.2026 నుండి 31.03.2027 వరకు	25,000.00
3	దేవస్థానమునకు అవసరమగు పూలు మరియు పూల హారములు సప్లై చేయుటకు గాను (సీల్డు టెండరు)	01.04.2026 నుండి 31.03.2027 వరకు	10,000.00
4	దేవస్థానమునకు అవసరమగు ఆహ్వాన పత్రికలు, గోడ పత్రికలు మరియు రశీదు పుస్తకములు వగైరా ప్రింటింగ్ చేయుటకు గాను (సీల్డు టెండరు)	01.04.2026 నుండి 31.03.2027 వరకు	10,000.00
5	దేవస్థానము నందు ఎండాకాలము చలువ పందిళ్లు ఏర్పాటు చేయుటకు (సీల్డు టెండరు)	05.03.2026 నుండి 30.06.2026 వరకు	10,000.00

బండి మౌలీశ్వరరెడ్డి, ఆలయ ఛైర్మన్ & సభ్యులు

సం/- డి.పాండురంగారెడ్డి, కార్యనిర్వహణాధికారి

రాఘవేంద్ర స్వామి సన్నిధిలో కేంద్రమంత్రి

మంత్రాలయం గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మంత్రాలయంలో రాఘవేంద్ర స్వామి గురువైభవోత్సవాలు అట్టహాసంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఆదివారం రాత్రి కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి క్షేత్రాన్ని సందర్శించారు. ఆయనకు శ్రీమఠం అధికారులు సాదర స్వాగతం పలికారు. ముందుగా గ్రామదేవత మంచాలమ్మను, అనంతరం రాఘవేంద్ర స్వామి మూలబృందావనాన్ని మంత్రి దర్శించుకున్నారు. మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఆయనకు శేషవస్త్రం, ఫల మంత్ర అక్షింతలు అందించి ఆశీర్వదించారు. యోగీంద్ర మండపంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలను మంత్రి తిలకించారు. అనంతరం ఆయనకు పీఠాధిపతి గురువైభవోత్సవ పురస్కారాన్ని అందించారు. కళాకారుల సంప్రదాయ నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పురస్కారాలు అందుకున్న వారిలో కేసీఏ అధ్యక్షుడు వెంకటేష్ ప్రసాద్, సీనియర్ అడ్వకేట్ రఘురామ్ ఉన్నారు.

కేంద్రమంత్రి హెచ్‌డీ కుమారస్వామికి గురువైభవోత్సవ పురస్కారం అందజేస్తున్న పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు

మహానంది ఆలయానికి రూ.65 లక్షల విరాళం

మహానంది, న్యూస్‌టుడే: మహానంది పుణ్యక్షేత్రంలో భక్తుల వసతుల కోసం రూ.10.50 కోట్లతో నిర్మిస్తున్న 55 గదుల వసతి సముదాయంలోని మొదటి అంతస్తు నిర్మాణానికి దాత రూ.65 లక్షల చెక్కును ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డికి అందజేశారు. హైదరాబాద్‌లోని యల్లారెడ్డిగూడకు చెందిన ప్రవాస భారతీయురాలు వడ్లమూడి సరోజినీ తన తల్లిదండ్రులైన దివంగత వీరమాచినేని వీరరాఘవయ్య, నాగభూషణమ్మల జ్ఞాపకార్థం రూ.1.25 కోట్ల విరాళం అందజేయడానికి గతంలోనే అంగీకారం తెలిపారు. ఈ క్రమంలోనే తొలి విడతగా రూ.65 లక్షలు అందజేశారు. ఈ సందర్భంగా ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, ఏఈవో ఎర్రమల మధు, అర్చకులు దాతను సత్కరించారు.

ఈవో శ్రీనివాసరెడ్డికి చెక్కు అందజేస్తున్న దాత సరోజిని

రాష్ట్రస్థాయి ఉత్తమ బీపీఎం అవార్డు

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: నంద్యాల జిల్లా బనగానపల్లె మండలంలోని జిల్లెల్ల పోస్టుమాస్టర్ కె.భాస్కర ప్రసాద్ రాష్ట్రస్థాయి ఉత్తమ బీపీఎం అవార్డు దక్కింది. ఆదివారం గుంటూరులో జరిగిన జీడీఎస్ సమ్మేళన్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి చేతుల మీదుగా ఆయన ఈ పురస్కారాన్ని అందుకున్నారు. తపాలా శాఖలో ఆయన చేసిన సేవలకు ఈ అవార్డు వచ్చింది. సహోద్యోగులు ఆయనకు అభినందనలు తెలిపారు. అవార్డుకు ఎంపిక కావడం ఆనందంగా ఉందని మరింత నిబద్ధతతో తపాలా సేవలు అందిస్తానని భాస్కర ప్రసాద్ తెలిపారు.

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతులమీదుగా పురస్కారం అందుకుంటున్న కె.భాస్కరప్రసాద్

సమీపంలోని వారే చూసుకోవాలి

❑ క్షేత్రసహాయకులకు అదనపు బాధ్యతలు ❑ రూ.3500 అదనపు చెల్లింపులు

హాలహర్వి, ఆలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లో వలసలు వెళ్లకుండా స్థానికంగా ఉపాధి పొందాలని ఉద్దేశంతో ఉపాధి హామీ పథకం ప్రవేశపెట్టింది. దీన్ని ప్రత్యేకంగా చట్టం రూపొందించింది. అందులో మార్పులు చేస్తూ.. వచ్చారు. శ్రామికులకు పని కల్పించడంలో క్షేత్ర సహాయకుడి పాత్ర కీలకం. అలాంటి పోస్టులు గ్రామాల్లో ఖాళీగా ఉండటంతో ఆయా గ్రామాల్లో పనులు పూర్తిస్థాయిలో కల్పించడం లేదు. ఫలితంగా సరైన పనులు లేక ఇతర ప్రాంతాలకు వలసబాటా పడుతున్నారు. అలాంటి వాటి నుంచి తాత్కాలికంగా బయటపడేందుకు సమీప గ్రామాల్లో విధులు నిర్వహిస్తున్న క్షేత్రసహాయకులకు అదనపు బాధ్యతలు ఇచ్చేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

● జిల్లాలో అడిగిన ప్రతి కుటుంబానికి ఉపాధి హామీ పని కల్పించాలి. ఇందుకు ప్రతి గ్రామ పంచాయతీకి ఒక్కో క్షేత్రసహాయకుడు ఉండాలి. వీరి అధ్వర్యంలో ఉపాధి పనులు జరగాలి. ప్రభుత్వాలు మారిన ప్రతిసారి క్షేత్ర సహాయకులను మారుస్తూ వస్తున్నారు. ప్రస్తుతం ఖాళీలు ఉన్న చోట పోస్టులు భర్తీ చేయడం లేదు. స్థానికంగా ఉన్న మేటీలకు బాధ్యతలు అప్పగించాలనే ఆదేశాలు అందాయి. వీరితో కూడా పూర్తిస్థాయిలో పనులు జరగడం లేదని ప్రభుత్వం గుర్తించింది. క్షేత్రసహాయకులు లేనిచోట సమీప గ్రామాల్లో పనిచేస్తున్న క్షేత్ర సహాయకులకు అదనంగా బాధ్యతలు అప్పగించేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

ఉపాధి పనులు చేస్తున్న శ్రామికులు

● ఆదోని నియోజకవర్గంలో 40 పంచాయతీలకు గాను 16,024 జాబ్ కార్డులు ఉన్నాయి. 12 పంచాయతీలకు క్షేత్ర సహాయకులు లేరు.

● ఆలూరు నియోజకవర్గంలో 108 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇందులో 54 వేల కుటుంబాలకు ఉపాధి పత్రాలు మంజూరు చేశారు. మొత్తం 30 గ్రామాలకు క్షేత్రసహాయకులు లేరు. జిల్లా వ్యాప్తంగా చాలా పంచాయతీలది ఇదే పరిస్థితి.

అదనపు బాధ్యతలు, చెల్లింపులు

సమీప గ్రామాల్లో పనిచేస్తున్న క్షేత్ర సహాయకులకు అదనపు బాధ్యతలు అప్పగించనున్నారు. వారికి నెలకు రూ.3వేలు, టీఏ కింద రూ.500 అదనంగా చెల్లించేందుకు ఉత్తర్వులు జారీ చేసింది.

● జీ రామ్‌జీ పథకంలో పనులు చేయించడంలో క్షేత్ర సహాయకులు కీలకం. ప్రతి ఆర్థిక సంవత్సరంలో పనులు ప్రారంభం నుంచి ముగింపు వరకు రికార్డులు భద్రం చేయాలి. సామాజిక తనిఖీ సమయంలో చేసిన పనులు చూపించడం, గ్రామాల్లో వివిధ అంశాలపై శ్రామికులతో చర్చించడం ప్రధానం. వీరు స్వగ్రామంలో పనులు చూడటంతో పాటు అదనపు గ్రామాల్లో పనుల పర్యవేక్షణ ఎలా జరుగుతుందో వేచి చూడాలి.

ఎక్కడెక్కడ లేరంటే..

హాలహర్వి మండలంలో బాపురం, నిట్రవట్టి, కొక్కరచేడు, టి.సాకిబండ, చింతకుంట, హొళగుంద మండలంలో సులువాయి, దేవనకొండ మండలంలో బంటుపల్లి, కరిడికొండ, నేలతలమర్రి, నల్లచెలిమల, పల్లెదిఒడ్డి, అల్లారుదిన్నె, పొట్లపాడు, కుంకనూరు, ఆస్పరి మండలంలో ఆస్పరి, అట్టేకల్, బిల్లేకల్, బిణిగేరి, చిగిలి, చిన్నహోతూరు, డి.కొటకొండ, తంగరడోణ, ఆలూరు మండలంలో మొలగవల్లి, కురుకుంద, అరికెర, చిప్పగిరి మండలంలో నంచర్ల, కుందనగుర్తి, దౌల్తాపురం, గుమ్మనూరు, ఖాజీపురం గ్రామాలకు క్షేత్ర సహాయకులు లేరు.

ఉత్తర్వులు అందాయి. - చక్రవర్తి, ఏపీవో, హాలహర్వి

క్షేత్ర సహాయకులు లేని గ్రామాలకు సమీపంలోని వారికి అదనపు బాధ్యతలు అప్పగించాలని ఉత్తర్వులు అందాయి. దీనిపై కసరత్తు చేస్తున్నాం. వివరాలు నమోదు చేసేందుకు అంతర్జాలంలో చూపడం లేదు. త్వరలో వచ్చే అవకాశం ఉంది. అడిగిన ప్రతి ఒక్కరికి ఉపాధి పనులు కల్పించేలా సిబ్బందికి దిశా నిర్దేశం చేశాం.

బలిజలకు రాజకీయ అవకాశాలు కల్పించాలి

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: గ్రేటర్ రాయలసీమ జిల్లాల్లో రాజకీయ అవకాశాలు కల్పించాలని బలిజ సంఘీయులు డిమాండు చేశారు. పట్టణంలోని మధుమణి సమావేశ భవనంలో ఆదివారం బలిజ సంఘం నాయకులు ఆంధ్రప్రదేశ్ బలిజ(కాపు, తెలగ) మహాసభను నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో తిరుపతి, చిత్తూరు మాజీ ఎమ్మెల్యేలు మోహన్, మనోహర్, నంద్యాల బలిజ సంఘీయుల కల్యాణ మండపం అధ్యక్షులు వర్ధంశెట్టి రాజారాం మాట్లాడుతూ.. రాజ్యసభ, ఎమ్మెల్సీ, నామినేటెడ్ పోస్టుల్లో అవకాశాలు కల్పించాలని కోరారు. రానున్న పంచాయతీ ఎన్నికల్లో జడ్పీ ఛైర్మన్, జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలు, పురపాలికల్లో మేయర్, ఛైర్మన్, కార్పొరేటర్ పదవులను జనాభా నిష్పత్తి ప్రకారం బలిజలకు కేటాయించాలన్నారు. కాపు కార్పొరేషన్ పేరును కాపు బలిజ తెలగ కార్పొరేషన్‌గా మార్పు చేసి ఏడాదికి రూ.5 వేల కోట్లు కేటాయించాలని డిమాండు చేశారు. గతంలో బీసీ రిజర్వేషన్ సర్టిఫికేట్లు ఉన్న బలిజలకు సర్టిఫికేట్లు పునరుద్ధరించాలన్నారు. అనంతరం వివిధ జిల్లాల నుంచి వచ్చిన నాయకులతో డిమాండ్ల సాధన కోసం భవిష్యత్ కార్యాచరణ గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో డా.ఇంటి ఆదినారాయణ, శివ ప్రసాద్, శెట్టి విజయకుమార్, డా.ప్రభాకర్, నల్లగట్ల బాలుడు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న బలిజ సంఘం నాయకులు

విద్యుదాఘాతంతో శ్రీశైలంలోని కాటేజీలో మంటలు

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: శ్రీశైల మహాక్షేత్రంలోని వీరశైవ గురుకుల పాఠశాల వెనుక ఉన్న దేవస్థానానికి చెందిన అబ్బూరు కాటేజీలో శనివారం రాత్రి విద్యుదాఘాతంతో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. కాటేజీ మొదటి అంతస్తులోని గదిలో ఉన్న ఏసీలో విద్యుదాఘాతం జరిగినట్లు తెలుస్తోంది. దీంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో అందులో బస చేస్తున్న సుమారు 15 మంది భక్తులు ఆందోళన చెందారు. హుటాహుటిన భక్తులు కాటేజీ నుంచి బయటకు వచ్చి ప్రాణాలు కాపాడుకున్నారు. విద్యుదాఘాతం జరిగిన సమయంలో భక్తులు కింద అంతస్తులో ఉండడం వల్ల ప్రాణాపాయం తప్పింది. సమాచారం అందుకున్న అగ్నిమాపకశాఖ, పోలీస్ సిబ్బంది కాటేజీలో మంటలు ఆర్పివేశారు. ఘటనపై విచారణ చేస్తున్నారు.

అగ్నిప్రమాదానికి గురైన అబ్బూరు కాటేజీ

బావిలో పడి బాలుడి మృతి

సంజామల(అవుకు), న్యూస్‌టుడే: ప్రమాదవశాత్తు బావిలో పడి బాలుడు మృతి చెందిన ఘటన అవుకు మండలంలోని సంగపట్నంలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన మహేంద్ర, గుర్రమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు సంతానం. పెద్ద కుమారుడు రిషికేశ్(8) ఒకటో తరగతి చదువుతున్నారు. ఆదివారం సెలవు కావటంతో ఆడుకుంటూ ఇంటి సమీపంలో ప్రమాదవశాత్తు బావిలో పడిపోయారు. వెంటనే స్థానికులు గమనించి బాలుడిని బయటకు తీసి అవుకు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అప్పటికే బాలుడు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కుమారుడు అకాల మృతితో తల్లిదండ్రులు రోదించిన తీరు గ్రామస్థులను కంటతడి పెట్టించింది.

EENADU Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్, ఫైనాన్స్‌లో తాకట్టులో ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్మెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెని 73821 14647.

JOBS

హైదరాబాద్ యూనిటీ హోంకేర్‌లో ఏజెంట్లకు మంచి అవకాశం. మీరు వర్కర్స్‌ని పంపితే మొదటినెల 5వేలు కమీషన్. వర్కర్స్ జీ: 15K, ఫ్రీవసతి, ఫుడ్. 81215 41212.

MARKETING/ SALES

Anand Masale Require Sales & Marketing Manager, Marketing Executives. Contact: 98496 55105, 98480 53144 Email: anandmasalaappltd@gmail.com.

అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు

B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే.

కలర్ 5 లైన్ల ప్రకటన రూ. 555/- మాత్రమే.

ప్రకటనలపై 5% GST వర్తించును.

వివరాలకు: 99899 97628

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

నంద్యాల

•నంద్యాల •నందికొట్కూరు •శ్రీశైలం •పాణ్యం

ఎమ్మెల్యేకు వినతి పత్రం ఇస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

ఆత్మకూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వం రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అకడమిక్ కమిటీ సభ్యులు సాంబశివుడు, జిల్లా గౌరవాధ్యక్షులు శంకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, జిల్లా సహాధ్యక్షులు ఉమ్మర్ అన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. కనీసం వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేయలేదన్నారు. నాలుగు డీఏలను వెంటనే చెల్లించాలన్నారు.

అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తామని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి అన్నారు. సీపీఐ నేతలు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. జిల్లా కార్యదర్శి రంగనాయుడు, సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్‌లు మాట్లాడుతూ పేదలకు న్యాయం జరిగే వరకు సీపీఐ పోరాడుతుందన్నారు. సుంకయ్య, మోటారా ముడు, మురళీధర్ పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) నందికొట్కూరు: 94403 61729 ఆత్మకూరు: 90149 09024 నంద్యాల: 98853 28120

ఆత్మకూరు పట్టణం, న్యూస్‌టుడే: ?: గౌడు కేంద్రంలో తోపుడు బండ్లు నిలబడటం వల్ల వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. - **ప్రతాప్, వాహనదారుడు.** ✔: ట్రాఫిక్ కానిస్టేబుల్‌ను ఏర్పాటు చేస్తాం. - **నారాయణ, ఎస్సై.** ?: రహ్మానగర్‌లో మక్కా మసీదు ఎదురుగా ఉన్న మురుగు కాల్వలో పూడిక, వ్యర్థాలు పేరుకుపోయాయి. దుర్వాసన వెదజల్లుతోంది. **-షబ్బీర్, స్థానికుడు.** ✔: కాల్వలో వ్యర్థాలు, పూడిక తొలగిస్తాం. - **జీవన్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్.**

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే: ?: మండలంలోని సుగాలిమెట్ట గ్రామంలో దోమల బెడద ఎక్కువైంది. - **నాయక్** ✔: మండలం పిచికారి చేయిస్తాం. - **వెంకటేశ్వర్లు, డిప్యూటీ ఎంపీడీవో, పాణ్యం**

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే: ?: పాణ్యం బస్టాండ్ కూడలి సమీపంలో బనగానపల్లె దారిలో సిమెంట్ రహదారిలో మధ్యలో చీలిక వల్ల ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు - **గఫార్** ✔: సిమెంట్ రహదారికి మరమ్మతు చేసి ప్రమాదాన్ని తప్పిస్తాం. - **వెంకటేశ్వరరెడ్డి, ఏఈ, ఆర్అండ్‌బీ శాఖ**

తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు

ట్యాంకు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, మాండ్ర

నందికొట్కూరు, నందికొట్కూరు గ్రామీణం, న్యూస్‌టుడే: నియోజకవర్గంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టినట్లు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య పేర్కొన్నారు. ఆదివారం జూపాడుబంగ్లా మండలం 80బన్నూరు గ్రామంలో రూ.43.10 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన ఓవర్ హెడ్ ట్యాంకును నంద్యాల పార్లమెంట్ బాధ్యుడు మాండ్ర శివానందరెడ్డితో కలిసి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ వేసవిలో ఎలాంటి సమస్య రాకుండా చూస్తామన్నారు. కొత్తపల్లి గ్రామంలో నిర్మించనున్న బీటీ రహదారి భూమి పూజ నిర్వహించారు. మల్యాల కొత్తపల్లె గ్రామంలో జరిగే బ్రహ్మోత్సవం మల్లికార్జున స్వామి తిరునాళ్లకు రావాలని ఎమ్మెల్యే జయసూర్యకు గ్రామ సర్పంచి నవీన్, ఉత్సవ కమిటీ నిర్వాహకులు ఆహ్వాన పత్రిక అందజేశారు. కార్యక్రమంలో నాయకులు దామోదర్‌రెడ్డి, మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, పరమేశ్వరరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆయకట్టు రైతులకు తప్పని ఆందోళన

★ ఎస్సార్బీసీ నీటిపై అన్నదాతల ఆశలు

పాణ్యం, పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే: ఎస్సార్బీసీ కింద ఆయకట్టు సాగు రైతులను ఆందోళన కలిగిస్తోంది. మార్చి చివరి వరకు సాగు నీరు ఇస్తామని అధికారులు ప్రకటించారు. శ్రీశైలం జలాశయం నుంచి నీటి విడుదలను జనవరి ప్రారంభంలోనే నిలిపివేశారు. దీంతో గోరుకల్లు, అవుకు జలాశయాల్లో నిల్వ ఉన్న నీటితోనే సర్దుబాటు చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. నీటిని పొదుపుగా వదులుతుండటంతో చివరి కాల్వలకు సాగునీరు అందడం లేదని ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు.

గోరుకల్లు జలాశయంలో తగ్గిన నీరు

1.50 లక్షల ఎకరాల్లో సాగు

శ్రీశైలం జలాశయంలో 134 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నప్పటికీ కేఆర్ఎంబీ అనుమతులు అవసరం కావడంతో నీటిని వదల లేని పరిస్థితి నెలకొంది. గోరుకల్లులో ప్రస్తుతం 6.5 టీఎంసీలు, అవుకులో 2.3 టీఎంసీలు నీరు నిల్వ ఉంది. ఎస్సార్బీసీ కాల్వ కింద ఇప్పటికే 1.50 లక్షల ఎకరాల్లో వివిధ పంటలను సాగు చేశారు. అవుకు జలాశయం కింద పంటలకు నీరందించడానికి గోరుకల్లు జలాశయం నుంచి అవుకుకు ఈ వారంలో గాలేరి నగరి కాల్వ ద్వారా 1 టీఎంసీ నీటిని తరలించారు. దీంతో పాటు ఎస్సార్బీసీ ప్రధాన కాల్వలో 1000 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ప్రధాన కాల్వ నుంచి పంట కాల్వలకు(బ్రాంచ్) నీటిని వదులుతున్నారు. ఇప్పటికే సాగు నీటిపై అధికారులు తర్జనభర్జన పడటంతో పాటు అవుకు జలాశయానికి తరలించాల్సి రావడంతో సాగు చేసిన పంటలకు నీరందక పోవచ్చన్న అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. సాగునీటిపై జరుగుతున్న ప్రచారంతో ప్రతి రోజు కాల్వకు ఎన్ని నీరు వస్తున్నాయి, ఎప్పుడు నిలిపివేస్తారంటూ రైతులు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికే మిరప, మొక్కజొన్న తదితర పంటలు చివరి దశలో ఉండగా వరి నాట్లను ఇప్పటికే వేస్తున్నారు.

చేతికందే దశలో పంట - రామిరెడ్డి, రైతు, తొగర్చేడు

నాలుగు ఎకరాల్లో మిరప, 4 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశాను. రూ.లక్షలు పెట్టుబడి పెట్టి సాగు చేసిన పంట చేతికందే దశలో నీరందడం లేదు. ప్రధాన కాల్వలో నీరు పారుతున్నా పంట కాల్వలకు సక్రమంగా నీరు రావడం లేదు. దీంతో గత వారం రోజులుగా నీరు లేక నష్టపోయే ప్రమాదం ఏర్పడింది. సాగు నీటిపై రోజు సమాచారం సేకరించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎప్పుడు కాల్వలకు నీరు నిలిపివేస్తారో అని భయంగా ఉంది. మార్చి చివరి వరకు నీరిస్తామని అధికారులు చెప్పినా ఫిబ్రవరిలోనే కష్టాలు పడుతున్నాం. రైతులను దృష్టిలో ఉంచుకుని నీటిని సక్రమంగా అందించాలి.

సాగునీరందించేందుకు ప్రయత్నం - కృష్ణన్న, ఈఈ, కాడా డివిజన్, ఎస్సార్బీసీ

పంటలకు మార్చి చివరి వరకు సాగునీరందించడానికి ప్రయత్నిస్తున్నాం. ఉన్న నీటిని వృథా చేసుకుంటే సాగునీరందే పరిస్థితి లేదు. నీటిని పొదుపుగా వాడుకుని వృథా కానివ్వద్దు. అన్ని పంటలకు, కాల్వలకు నీరందించేందుకు ప్రణాళికలు వేసుకుంటున్నాం. ప్రతి పంటకు నీరందిస్తాం. రైతులు ఆందోళన చెందవద్దు. ఎస్సార్బీసీ కింద 1.50 లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేశారు. వరి పంట వేయవద్దని రైతులకు ముందస్తుగానే తెలియజేశాం. గోరుకల్లు నుంచి 5.4 టీఎంసీల నీటిని వినియోగించుకోవడానికి అవకాశం ఉంది.

మారెమ్మ ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

నందికొట్కూరు గ్రామీణం, న్యూస్‌టుడే: వడ్డెమాను గ్రామంలో నూతనంగా ప్రతిష్ఠించిన మారెమ్మ ఆలయంలో ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, మాండ్రశివానందరెడ్డిలు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ సర్పంచి రామచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డీఆర్వో

ఉయ్యాలవాడ త్యాగం స్ఫూర్తిదాయకం

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: ఉయ్యాలవాడ నరసింహారెడ్డి త్యాగం యువతకు స్ఫూర్తిదాయకమని డీఆర్వో రామునాయక్ పేర్కొన్నారు. స్వాతంత్య్ర సమరయోధుల త్యాగాలను స్మరించుకోవడం ప్రతి భారతీయుడు బాధ్యత అని తెలిపారు. ఆదివారం స్థానిక కలెక్టరేట్‌లో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉయ్యాలవాడ నరసింహారెడ్డి బ్రిటీష్ వారిపై తిరుగుబాటుకు కారణాలు వివరించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దేశభక్తి, అంకితభావం కలిగిన వీరుల చరిత్రను నేటి తరం స్ఫూర్తిగా తీసుకోవాలని స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావులు పేర్కొన్నారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. రిజర్వు ఇన్‌స్పెక్టర్లు బాబు, మంజునాథ్, సురేశ్‌బాబు, ఆర్ఎస్ఐ కాళీ శ్రీచరణ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు చిన్న కొబ్బరికాయలు విక్రయం

శ్రీశైల మహాక్షేత్రంలోని దేవస్థానం కొబ్బరికాయల విక్రయ కేంద్రాల్లో చిన్న కొబ్బరికాయలు భక్తులకు విక్రయిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. 28 సెం.మీ కంటే తక్కువ సైజు కొబ్బరికాయలు విక్రయిస్తున్నారని భక్తులు ఆరోపిస్తున్నారు. గుత్తేదారు చిన్న కొబ్బరికాయలు, పైగా లేత కాయలు సరఫరా చేస్తున్నట్లు చెబుతున్నారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో ఇదే తంతు నడిచినట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా దేవస్థానం అధికారులు స్పందించాలని భక్తులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, శ్రీశైలం ఆలయం

నిరుపయోగంగా చేతి పంపు

నంద్యాల పట్టణం ఏకలవ్య నగర్ నుంచి విశ్వనగర్ వెళ్లే దారిలో రహదారి పక్కన చేతి పంపు మరమ్మతులకు గురైంది. గత రెండేళ్ల నుంచి చేతి పంపు పాడైంది. నీటి ఎద్దడి సమయంలో స్థానికులు ఈ చేతి పంపును వినియోగించుకునేవారు. వేసవి కాలం సమీపిస్తుండటంతో మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, నంద్యాల రైతునగరం

ఒరిగిన స్తంభం ప్రమాదకరం...

పురపాలక సంఘంలోని కర్నూలు-గుంటూరు ప్రధాన రహదారిలో ఇస్లాంపేటలో ఉన్న వీధి దీపం ప్రమాదకరంగా ఉంది. ఇనుప స్తంభాన్ని గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వైపునకు ఒరిగిపోయింది. అధికంగా గాలి వీచినా, ఏదైనా వాహనం ఢీకొన్నా పూర్తిగా కూలిపోయే అవకాశం ఉంది. జాతీయ రహదారి కావటంతో రోజూ వేల సంఖ్యలో వాహనాలు, ప్రజలు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటారు. పురపాలక అధికారులు స్పందించి స్తంభాన్ని బాగు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.
–న్యూస్‌టుడే, ఆత్మకూరు పట్టణం

దారి బురదమయంగా మారి

పట్టణంలోని కాలేజ్ బైపాస్ ప్రధాన రోడ్డులో మురుగునీరు చేరి బురదమయంగా మారింది. రహదారికి ఇరువైపులా ఉన్న డ్రైనేజీ కాల్వల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతోనే నీరంతా రోడ్లపైకి చేరుతుందని స్థానికులు తెలిపారు. సుమారు రెండు నెలల నుంచి ఇదే సమస్య ఉందని వాపోతున్నారు. ఈ దారిలో పట్టణ ప్రజలు రాకపోకలు సాగించేందుకు తీవ్ర అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, వెలుగోడు

ఆధునిక దంత వైద్యంపై శిక్షణ

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: ఉమ్మడి కర్నూలు జిల్లాల దంత వైద్యులకు ఆదివారం నంద్యాలలో రూట్ కెనాల్ చికిత్సలో ఆధునిక పద్ధతులపై శిక్షణ ఇచ్చారు. అనంతరం ఇండియన్ డెంటల్ అసోసియేషన్ రాష్ట్ర స్థాయి సదస్సుకు సంబంధించిన కరపత్రాన్ని దంత వైద్యులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైద్యులు డా. రవి కుమార్, కిశోర్‌కుమార్, సుబ్బారెడ్డి, గురుప్రసాద్, కిశోర్, సంతోష్, చాందినీ తదితరులు పాల్గొన్నారు.

వసతిగృహ నిర్మాణానికి రూ.2 లక్షల విరాళం

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని ఎస్ కొత్తూరు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ పరిధిలో వసతి గృహ నిర్మాణానికి భక్తులు రూ.2 లక్షలు విరాళంగా అందజేసినట్లు ఈవో రామకృష్ణ తెలిపారు. ఆదివారం నంద్యాల పట్టణం ఎన్‌జీవోస్ కాలనీకి చెందిన ఆర్వేటి నాగయ్యశెట్టి తన కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి రూ.2,00,116 చెక్కును ఆలయ సిబ్బందికి అందజేశారు.

ఆదర్శ కమ్యూనిస్టు 'మాదాల'

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: ఆదర్శ కమ్యూనిస్ట్ మాదాల శ్రీనివాసులు అని పలువురు వక్తలు కొనియాడారు. ఆదివారం స్థానిక భగత్‌సింగ్ గ్రంథాలయం ట్రస్ట్ ఆధ్వర్యంలో ఛైర్మన్ బి.శంకరయ్య అధ్యక్షతన మాదాల శ్రీనివాసుల సంస్మరణ సభ నిర్వహించారు. సాహితి స్రవంతి రాష్ట్ర అధ్యక్షులు కెంగార మోహన్, రామకృష్ణ విద్యాసంస్థల అధినేత డా.జి.రామకృష్ణారెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి రమేశ్‌కుమార్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.నాగరాజులు, సాహితి స్రవంతి నాయకులు అన్నెం శ్రీనివాసరెడ్డి, కృష్ణమూర్తి, జనార్దన్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పుస్తకావిష్కరణ

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: నంద్యాలలో ప్రముఖ రచయిత్రి డా.కొండూరు శ్రీదేవి రచించిన 'వసంతసేన' నవలను, శ్రీకోడూరు శేషఫణి శర్మ రచించిన 'ముద్దబంతి' పుస్తకాలను సూరన సారస్వత సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా ఆవిష్కరించారు. సూరన సారస్వత సంఘం అధ్యక్షులు డా.గెల్లి సహదేవుడు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో పలువురు సాహితీవేత్తలు పాల్గొన్నారు. కార్యక్రమంలో డా.నీలం వెంకటేశ్వర్లు, నీలకంఠమాచారి, డా.చిట్టిబొట్ల మధుసూదనశర్మ, అన్నెం శ్రీనివాసరెడ్డి, పవన్‌కుమార్, కవులు నరసింహులు, రఫీ, డీవీ.సుబ్బయ్య, వసుంధర, విజయలక్ష్మీ, కృష్ణప్రియ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

క్రీడలతో సర్వతోముఖాభివృద్ధి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి క్రీడలు తోడ్పడుతాయని తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ.ఫిరోజ్ పేర్కొన్నారు. పట్టణంలోని శ్రీసంకల్ప్ పాఠశాలలో ఆదివారం నిర్వహించిన వార్షిక క్రీడా దినోత్సవం- బ్లేజింగ్ రాకెట్స్-2026 కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. శ్రీసంకల్ప్ విద్యా సంస్థల అధినేత సుధాకర్, రమ్యారెడ్డి దంపతులు, ప్రిన్సిపాల్ దివ్య కోషిలు, కౌన్సిలర్ శ్యామ్‌సుందర్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.

భాషను కాపాడుకుంటేనే జాతి భవిష్యత్తు

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: మాతృభాషను కాపాడుకుంటేనే జాతి భవిష్యత్తు ఉంటుందని సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షులు కెంగార మోహన్ పేర్కొన్నారు. ఆధునికత మోజులో తెలుగు భాషకు దూరం కావాల్సిన అవసరం లేదని తెలిపారు. ఆదివారం మిడ్‌టౌన్ రోటరీక్లబ్ ఆధ్వర్యంలో అధ్యక్ష, కార్యదర్శులు కేశవమూర్తి, వెంకటేశ్వర్లు మాతృభాష దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఏపీ రాష్ట్ర సచివాలయ గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షులు కేవీ.కృష్ణయ్య, రోటరీక్లబ్ మాజీ గవర్నర్ చిన్నపురెడ్డి, మిడ్ టౌన్ క్లబ్ మాజీ అధ్యక్షులు డీవీ.సుబ్బయ్య, చింతల మోహన్‌రావు, రమేశ్, సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షులు శ్రీనివాసమూర్తి, నీలం వెంకటేశ్వర్లు, అన్నెం శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కెంగార మోహన్

ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నూతన కమిటీ ఎంపిక

ఆత్మకూరు పట్టణం, న్యూస్‌టుడే: ఆత్మకూరు ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నూతన కమిటీని ఆదివారం ఎంపిక చేశారు. పట్టణంలో రాష్ట్ర కార్యదర్శి పి.ఎ.మజీద్, రీజియన్ కార్యదర్శి ఆర్.ఎస్.రావు హాజరై నూతన కమిటీని ఎంపిక చేశారు. కమిటీ అధ్యక్షులుగా వి.ఆర్.కె.నాయక్, కార్యదర్శిగా కె.ఎం.రావు, గ్యారేజ్ కార్యదర్శిగా వెంకటేశ్వర్లు, కోశాధికారిగా శాలుబాబులను ఎన్నుకున్నారు.

నూతనంగా ఎంపికైన కమిటీ సభ్యులు

జాతీయ రహదారికి అనుసంధానించండి

గడివేముల, న్యూస్‌టుడే: గడివేముల మండలంలోని గ్రామాలను జాతీయరహదారికి అనుసంధానించాలని ఆదివారం కరిమద్దెల గ్రామంలో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. కరిమద్దెల గ్రామం జాతీయ రహదారి 167ఏకు కేవలం 2.50 కిమీ దూరం మాత్రమే ఉందన్నారు. గాలేరు వాగు మీద వంతెన నిర్మించి జాతీయరహదారికి అనుసంధానించాలని కోరారు. కార్యక్రమంలో భారతీయ కిసాన్ సంఘ్ నాయకులు మహేశ్వరరెడ్డి, సర్పంచి సుంకన్న పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ అన్నదాన సత్రం కమిటీ ఎన్నిక

మహానంది, న్యూస్‌టుడే: మహానందిలోని విశ్వబ్రాహ్మణ అన్నదాన సత్రం కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం గౌరవాధ్యక్షులు కృష్ణమాచారి, సహదేవాచారి సంయుక్తంగా ప్రకటించారు. ఆదివారం మహానందిలో నూతన కార్యవర్గం ఎంపిక నిర్వహించారు. అధ్యక్షులుగా కాకమణి లక్ష్మీనారాయణాచారి, ఉపాధ్యక్షులుగా ఎస్వీ సుబ్రహ్మణ్యాచారి, ఫిరంగి రమేష్‌బాబుఆచారి, వడ్ల కృష్ణమాచారి, ప్రధాన కార్యదర్శిగా బాణాల నాగయ్యాచారి, కోశాధికారిగా క్రిష్ణగిరి సత్యనారాయణాచారి ఎంపికయ్యారని తెలిపారు.

విద్యార్థులకు అన్నదానం

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: నంద్యాల పట్టణం వైఎస్సార్ నగర్‌లోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆవాసియా విద్యాలయ వసతి గృహంలో శ్రీవాసవీ ఇంటర్నేషనల్ క్లబ్ సభ్యులు ఆదివారం విద్యార్థులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి నెల చేపట్టే సేవా కార్యక్రమాల్లో భాగంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు క్లబ్ అధ్యక్షులు రంజిత్‌కుమార్, కార్యదర్శి శ్రీధర్‌బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ, సురేంద్ర, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం చేసిన వాసవీ ఇంటర్నేషనల్ క్లబ్ సభ్యులు

బస్టాండులో పోలీసుల తనిఖీలు

ఆత్మకూరు పట్టణం, న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్టాండులో గుర్తు తెలియని వ్యక్తులు గంజాయి సరఫరా చేస్తున్నారనే సమాచారంతో ఆదివారం రాత్రి పోలీసులు సోదాలు నిర్వహించారు. అర్బన్ సీఐ మహేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో బస్టాండు, బస్సుల్లో ఉన్న ప్రయాణికుల వద్దకు వెళ్లి పరిశీలించారు. ఎస్సై వెంకట నారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

పీఆర్సీ కమిటీని నియమించాలి

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: 2023 సంవత్సరం నుంచి పీఆర్సీ అమలు కావడం లేదని, పీఆర్సీ కమిటీని వెంటనే నియమించాలని ఏపీ టీచర్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్ జాకీర్‌హుస్సేన్, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వి.శివయ్య డిమాండు చేశారు. పట్టణంలోని ఏపీటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం ఏపీటీఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ పీఆర్సీ కమిటీ నియామకం ఆలస్యమయితే 30 శాతం మధ్యంతర భృతి ఇవ్వాలన్నారు. పెండింగ్ డీఏలను, సరెండర్ సెలవుల బకాయిలను విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో వీరేశ్వర్ రెడ్డి, దస్తగిరి బాషా, తిమ్మారెడ్డి, పుల్లయ్య, మధు, మల్లికార్జునరావు, రాజేష్, ఇద్రూస్ బాషా తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న ఏపీటీఎఫ్ నాయకులు

పాఠశాల జ్ఞాపకాలు మరచిపోలేనివి

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే: పాఠశాలలో చదువుకునే సమయంలోని జ్ఞాపకాలు మరవలేనివని విద్యార్థులు గుర్తు చేసుకున్నారు. ఆదివారం పాణ్యం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2003-04లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు.

ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

యోగాతో మానసిక ఉల్లాసం

నందికొట్కూరు, న్యూస్‌టుడే: యోగాతో మానసిక ఉల్లాసం కలుగుతుందని, జ్ఞాపక శక్తిని ఇస్తుందని ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ జిల్లా కోఆర్డినేటర్ లింగన్న గౌడ్ విద్యార్థులకు తెలిపారు. పురపాలక సంఘం ఆధ్వర్యంలో హ్యాపీ సండే కార్యక్రమాన్ని స్థానిక బాలుర బీసీ వసతి గృహంలో నిర్వహించారు.

ఉచిత వైద్య సేవలు అభినందనీయం

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: రంజాన్ మాసంలో ఉచిత ఓపీతో ఆరోగ్య పరీక్షలు చేస్తున్న ఆర్థోపెడిక్ వైద్యులు డా.రఫీ సేవలు ఆదర్శమని ఆల్ మైనార్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు అబులైస్, ఐటీ సెక్రటరీ నబి రసూల్ అన్నారు. పట్టణంలోని జీఎస్ఆర్ ఆసుపత్రిలో డా.రఫీ, ఆయన సతీమణి మానసిక వైద్యురాలు డా.ఆరిఫా బానును ఆదివారం నాయకులు సన్మానించారు. ఏప్రిల్ 18 వరకు ఉచితంగా వైద్య సేవలందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో షేక్ మహమ్మద్ గౌస్, ఫైనాన్స్ సెక్రటరీ మహమ్మద్ ఖాసీం, కార్యవర్గ సభ్యులు అబిద్ మహమ్మద్, న్యామతుల్లా, సిరాజ్, అఫ్జల్, నూరుల్లా, రసూల్ పాల్గొన్నారు.

గణిత అధ్యాపకునికి సత్కారం

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: ప్రపంచ తెలుగు కవుల మహాసభల్లో నంద్యాలకు చెందిన గణిత అధ్యాపకులు ఎంఎండీ రఫీని సన్మానించారు. పొట్లూరి హరికృష్ణ అధ్యక్షతన ఆదివారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయనను సత్కరించారు. కవి సమ్మేళనాలు నిర్వహిస్తూ, వివిధ వ్యాసాలు రాస్తూ తెలుగు భాషాభివృద్ధికి చేసిన కృషికి సన్మానించారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డా.ఉమామహేశ్వర్, ఇందుమతి తదితరులు పాల్గొన్నారు.

సత్కారం అందుకున్న ఎంఎండీ.రఫీ

బిస్కట్ ఫ్యాక్టరీలో భారీ అగ్ని ప్రమాదం

గాజులపల్లెమెట్టలో కాలిపోతున్న ఫ్యాక్టరీ

గాజులపల్లె(మహానంది), న్యూస్‌టుడే: మండలం గాజులపల్లె మెట్ట నుంచి మహాదేవపురం వెళ్లే దారిలోని బిస్కట్ తయారీ కంపెనీలో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. ఆదివారం రాత్రి 10 గంటల సమయంలో విద్యుదాఘాతంతో ప్రమాదం సంభవించినట్లు స్థానికులు తెలిపారు. మంటలు ఆర్పేందుకు శక్తికి మించి ప్రయత్నించారు. సమాచారం అందుకున్న నంద్యాల అగ్నిమాపకశాఖ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పారు. బిస్కట్లు తయారు చేసేందుకు ఉపయోగించే యంత్రాలు, పదార్థాలు, విద్యుత్తు పరికరాలు కాలిబూడిదయ్యాయని స్థానికులు తెలిపారు. అగ్నిప్రమాదంలో రూ.లక్షల్లో నష్టం వాటిల్లిందని స్థానికులు వెల్లడించారు. ఈ ఫ్యాక్టరీలో అధికంగా మహిళలే పనులు చేస్తుంటారు.

ఉచిత ప్రయాణం.. ప్రగతి పథం

★ ఆర్థికంగా లబ్ధిపొందుతున్న మహిళలు

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం స్త్రీశక్తి పథకం అమలు చేశాక ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణాలు చేసే మహిళల సంఖ్య పెరిగింది. ఉద్యోగాలు, వ్యాపారాలు చేసే మహిళలు నిత్యం బస్సులో వెళ్లడం వల్ల కుటుంబంపై ఆర్థిక భారంపడేది. బంధువుల ఇళ్లలో జరిగే శుభకార్యాలకు హాజరుకావాలన్నా గతంలో సామాన్య, మధ్యతరగతి కుటుంబాల్లోని మహిళలు కాస్త ఆలోచించే పరిస్థితి ఉండేది. ప్రయాణ చార్జీల భారంతో ఆయా కార్యక్రమాలకు వెళ్లలేక పోయేవారు. తప్పనిసరి అయితేనే బస్సు ప్రయాణాలు చేసేవారు. ఉచిత బస్సు ప్రయాణం వల్ల ఇలాంటి ఇబ్బందులన్నీ తీరాయి. మహిళలు ఆర్థికంగా లబ్ధి పొందుతున్నారు. నెలకు రూ.వేలల్లో అయ్యే రవాణా చార్జీలను ఆదా చేసుకోగలుగుతున్నారు. మహిళా ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యాలు తలెత్తకుండా బస్టాండ్లు, బస్సుల్లో చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారిణి రజియా సుల్తానా తెలిపారు.

ఆర్టీసీ బస్సులో మహిళా ప్రయాణికుల రద్దీ

మధ్య తరగతి వారికి ఉపశమనం

● నంద్యాల జిల్లాలో 481 ఆర్టీసీ బస్సులు ఉన్నాయి. వీటిలో 394 బస్సులను స్త్రీశక్తి పథకానికి కేటాయించారు. ఇప్పటి వరకు 1.63 కోట్ల మంది మహిళా ప్రయాణికులు ఉచిత ప్రయాణాన్ని వినియోగించుకున్నారు. ప్రభుత్వం రూ.63 కోట్లు భారం భరించింది. ● గతంలో 35 శాతం మహిళా ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తుంటే.. ఇప్పుడు జిల్లాలో 55 శాతం పైగా పెరిగినట్లు అధికారులు చెబుతున్నారు. ● స్త్రీశక్తి పథకంతో పేద మధ్యతరగతి మహిళలకు ఆర్థిక ఉపశమనం లభించింది. ● బాలికలు కాలేజీలు, ట్రైనింగ్ సెంటర్లకు, ఉన్నత చదువుల కోసం ఉచితంగా ప్రయాణిస్తున్నారు. ● వివిధ పట్టణాలకు వెళ్లి ఉద్యోగాలు చేయడానికి, చిన్న వ్యాపారులకు ఎంతో ఉపయోగకరంగా మారింది. ● మహిళలు స్వతంత్రంగా ప్రయాణించే ధైర్యం పెరిగింది. ● గ్రామీణ ప్రాంతాల మహిళలు మార్కెట్లు, ఆసుపత్రులు, ప్రభుత్వ కార్యాలయాలకు ఉచితంగా రాకపోకలు సాగిస్తున్నారు. ● ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం వల్ల దేవాలయాల్లోనూ గతంలో కంటే భక్తుల రద్దీ పెరిగింది. ఎక్కువ మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో దైవ దర్శనానికి వెళ్తున్నారు.

సంక్షిప్త సమాచారం

నందికొట్కూరు గ్రామీణం, న్యూస్‌టుడే: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని నందికొట్కూరు టౌన్ సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. కొణిదేల గ్రామంలో ఆదివారం పల్లె నిద్ర చేశారు. దొంగతనాలు, రోడ్డు ప్రమాదాలు, మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలపై అవగాహన కల్పించారు.

నందికొట్కూరు, పగిడ్యాల, న్యూస్‌టుడే: కేసీ కాల్వకు నీటిని విడుదల చేసి అన్నదాతలను ఆదుకోవాలని వైకాపా జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం పగిడ్యాలకు వచ్చిన ఆయన కేసీ కాల్వను, సాగు పంటలను సందర్శించి పరిశీలించారు.

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకుంటే జరిమానా తప్పదని ఎస్సై నరేంద్రకుమార్‌రెడ్డి హెచ్చరించారు. ఆదివారం మండలంలోని సుగాలిమెట్ట వద్ద జాతీయ రహదారిపై వాహనాల తనిఖీ నిర్వహించారు.

సున్నిపెంట సర్కిల్, న్యూస్‌టుడే: సున్నిపెంటలోని మహాత్మా జ్యోతిబా ఫులె వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాలకు మరమ్మతు పనులకు రూ.50 లక్షలు మంజూరు అయినట్లు పాఠశాల ప్రిన్సిపల్ బి.జవహర్ ఆదివారం తెలిపారు. పాత భవనాలు, డార్మెటరీలలో మరమ్మతు పనులు చేపట్టనున్నట్లు తెలిపారు.

గడివేముల, న్యూస్‌టుడే: మండలంలోని పెసరవాయిలో ఆదివారం తెల్లవారుజామున పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రౌడీషీటర్లు, అనుమానాస్పద వ్యక్తుల ఇళ్లలో సోదాలు నిర్వహించారు. ధ్రువపత్రాలు లేని ఐదు ద్విచక్రవాహనాలకు జరిమానా విధించినట్లు ఎస్సై నాగార్జున రెడ్డి తెలిపారు.

(c) eenadu

ఆళ్లగడ్డ

• ఆళ్లగడ్డ • బనగానపల్లి • డోన్

జీర్ణోద్ధరణ పనులు ప్రారంభం

స్పందనకు వందనం

ఆర్ఎస్ రంగాపురం(బేతంచెర్ల), న్యూస్‌టుడే: మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామ శివారులోని ముచ్చట్ల మల్లికార్జున స్వామి దేవస్థానంలో కల్యాణ మండపం నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఏళ్లుగా నిర్లక్ష్యానికి గురైన ఆలయం అభివృద్ధికి నోచుకోక పోవడంతో గత ప్రభుత్వ హయాంలో పునరుద్ధరణ కోసం రూ.1.90 కోట్లు మంజూరైంది. కల్యాణ మండపం పనులు చేపట్టి బిల్లులు మంజూరు చేయకపోవడంతో గుత్తేదారుడు మధ్యలో నిలిపేశారు. సమస్యను తెలియజేస్తూ జనవరి 18వ తేదీన 'కోవెల అభివృద్ధి.. కనిపించని చిత్తశుద్ధి' శీర్షికన 'ఈనాడు'లో చిత్ర కథనం ప్రచురితమైంది. ఆలయ అధికారులు స్పందించి ప్రతిపాదనలు పంపడంతో ప్రభుత్వం రూ.60 లక్షలు మంజూరైంది. ఈ క్రమంలో కల్యాణ మండపం, గాలిగోపురం, బండ పరుపు పనులు ప్రారంభమయ్యాయి.

కొనసాగుతున్న కల్యాణ మండపం నిర్మాణం

చెత్త సేకరణకు ట్రైసైకిళ్లు

బేతంచెర్ల, న్యూస్‌టుడే: గ్రామాల్లో స్వచ్ఛత కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా బేతంచెర్ల మండలంలోని పంచాయతీలకు చెత్త తరలింపు బండ్లు, ట్రైసైకిళ్లు, బుట్టలు ప్రభుత్వం మంజూరు చేసింది. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ కింద 36 ట్రైసైకిళ్లు, 216 డస్ట్ బిన్లు వచ్చాయి. వీటిని త్వరలో పంచాయతీలకు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో ఫజుల్‌రహిమాన్ తెలిపారు.

నరసింహారెడ్డి జీవితం స్ఫూర్తిదాయకం

రాయలసీమ స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జీవితం స్ఫూర్తిదాయకమని పలువురు ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు పేర్కొన్నారు. ఆళ్లగడ్డ, డోన్, బనగానపల్లి నియోజకవర్గాల్లో నరసింహారెడ్డి వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహాలకు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన స్వాతంత్ర్య ఉద్యమంలో బ్రిటిష్ వారిపై పోరాడిన ఘట్టాల గురించి గుర్తుచేసుకున్నారు. స్వాతంత్ర్య సమరంలో ఆయన చూపిన ధైర్య సాహసాలను వక్తలు ప్రశంసించారు. – న్యూస్‌టుడే, ఆళ్లగడ్డ, ఆళ్లగడ్డ గ్రామీణం, కోవెలకుంట్ల, కోవెలకుంట్ల గ్రామీణం, బనగానపల్లి, బనగానపల్లి గ్రామీణం, సంజామల, అవుకు, చాగలమర్రి, ఉయ్యాలవాడ, దొర్నిపాడు.

ఆళ్లగడ్డ: కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

నరసింహారెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న గ్రామస్థులు

ట్రాఫిక్ చక్రబంధం.. ప్రయాణం నరకం

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: ఆళ్లగడ్డలో ట్రాఫిక్ సమస్య విపరీతంగా పెరిగిపోయింది. ఆళ్లగడ్డ మేజర్ పంచాయతీ నుంచి పురపాలికగా పదోన్నతి పొందినా రోడ్ల దుస్థితి మారలేదు. వాహనాలు ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోతున్నా ఇప్పటి వరకు ట్రాఫిక్ పోలీసు స్టేషన్ లేకపోవడం గమనార్హం. రహదారి విస్తరణ చర్యలు చేపట్టాలని పుర ప్రజలు కోరుతున్నారు.

పాత బస్టాండు వద్ద స్తంభించిన ట్రాఫిక్

రద్దీ కూడళ్లు ఇవే..

★ పట్టణంలోని మార్కెట్, సంత మార్కెట్, గాంధీ సెంటర్, పాతబస్టాండు, టీబీ రహదారి, నాలుగు రహదారుల కూడలి, కొత్తబస్టాండు తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ అధికంగా ఉంటుంది. ఇక నాలుగు రహదారుల కూడలిలో వాహనాలు ఎలా పడితే అలా వెళ్తుంటాయి. ఇక్కడ పోలీసులు ట్రాఫిక్ సమస్యను పట్టించుకోవడం లేదు. ఇదే సమస్య పాతబస్టాండులో కూడా ఉంది.

★ ఎస్‌బీఐ బజారు శాఖ వద్ద గ్రామాలకు వెళ్లే ఆటోలు ఇష్టానుసారంగా నిలుపుతున్నారు. రద్దీగా ఉన్న ఎస్‌బీఐ ప్రధాన శాఖ ఎదురుగా నిబంధనలకు విరుద్ధంగా తరచూ దుకాణాలు ఏర్పాటు చేసుకుంటున్నా నివారించే చర్యలు శూన్యం. వాహనాలు పెట్టేందుకు చోటు లేకపోవడంతో గత్యంతరం లేక ఖాతాదారులు రోడ్ల పక్కనే వాహనాలను నిలుపుతున్నారు.

★ పట్టణంలో వారం సంత నిర్వహించే గురువారం వస్తే చాలు రహదారులన్నీ రద్దీతో నిండిపోతాయి. సంతకు వచ్చే వాహనాలను ఎక్కడ నిలపాలో తెలియక వాహనదారులు ఎక్కడ ఖాళీ స్థలం దొరికితే అక్కడే నిలిపి ఉంచుతున్నారు.

చర్యలు తీసుకోవాలని వినతి

★ గత కొన్నేళ్లలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు పోలీసులు ఏ ఒక్క చర్య తీసుకున్న దాఖలాలు లేవు. సమస్య జటిలంగా మారినా చర్యలు లేవు. ఇక టీబీ రోడ్డులోనైతే డివైడర్ల మధ్య పదుల సంఖ్యలో ఖాళీలు ఉన్నాయి. వాటి మధ్యలో నుంచి వాహనాలు దూసుకుని రావడం, ప్రమాదాలు జరగడం సర్వసాధారణ విషయంగా మారింది.

★ ఎక్కడా లేని రీతిలో ఆళ్లగడ్డలో ప్రధాన రహదారినే ద్విచక్ర వాహనాల స్టాండుగా మారింది. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలకు వినియోగించే భవన నిర్మాణాల సమయంలో వాహనాల పార్కింగుకు తగిన ఏర్పాటు చేయకపోవడంతో రోడ్డుపైనే వాహనాలను నిలపాల్సి వస్తుంది. పురపాలికగా మారి 15ఏళ్లు దాటుతున్నా ఇప్పటికీ ట్రాఫిక్ పోలీసు స్టేషన్ ఏర్పాటు కాకపోవడం గమనార్హం.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఆళ్లగడ్డ: 8008 574916
డోన్ పట్టణం: 94408 57790
బనగానపల్లె: 80085 73763

శిరివెళ్ల, న్యూస్‌టుడే: ?: శిరివెళ్ల బీసీ, ఎస్సీ కాలనీల్లో డ్రైనేజీ కాల్వలు శుభ్రం చేయాలి. - **యానాదమ్మ.**
✔: కార్మికులతో పారిశుద్ధ్య చర్యలు తీసుకుంటాం. - **అశ్విన్‌కుమార్, ఇన్‌ఛార్జి ఈవో, శిరివెళ్ల.**

బాచేపల్లె (ఆళ్లగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: ?: బాచేపల్లె గ్రామంలో ఆంజనేయస్వామి ఆలయ పరిసరాల్లో దోమల బెడద అధికంగా ఉంది. **-నరసింహ, బాచేపల్లె.** ✔: దోమల నివారణ మందులు చల్లిస్తాం. **-నూర్జహాన్, ఎంపీడీవో.**

కోవెలకుంట్ల గ్రామీణం, న్యూస్‌టుడే: ?: పట్టణంలోని కుమ్మరి వీధి సమీపంలో వాటర్ ప్లాంట్ వద్ద మురుగు కాల్వలు నిర్మించాలి. **-చంద్ర, స్థానికుడు.** ✔: పరిశీలించి చర్యలు తీసుకుంటాం. **-ప్రకాష్‌నాయుడు, ఇన్‌ఛార్జి, ఈవో.**

సంజామల, న్యూస్‌టుడే: ?: రెడ్డిపల్లె గ్రామంలోని పొలాల రహదారులకు మరమ్మతులు చేపట్టాలి. - **శ్రీనివాసులు, రెడ్డిపల్లె.** ✔: నిధులు మంజూరైతే చర్యలు తీసుకుంటాం. - **సాల్మన్, ఎంపీడీవో, సంజామల.**

బేతంచెర్ల, న్యూస్‌టుడే: ?: ఆర్.బుక్కాపురం గ్రామంలో తాగునీటి గొట్టాల లీకేజీలను అరికట్టండి. - **ఆర్.బుక్కాపురం గ్రామస్థులు.** ✔: పరిశీలించి లీకేజీలకు మరమ్మతులు చేయిస్తాం. **-రాజశేఖర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ.**

?: ఆర్ఎస్ రంగాపురం నుంచి గూటుపల్లె వెళ్లే దారిలో శ్మశానం వద్ద వ్యర్థాలు వేయకుండా చూడాలి.
- **రంగాపురం గ్రామస్థులు.** ✔: వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకుంటాం. **-మల్లికార్జున, డిప్యూటీ ఎంపీడీవో.**

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: ?: రెవిన్యూ క్వార్టర్స్ వీధిలో కాల్వపై వేసిన కల్వర్టుకు రంధ్రం ఏర్పడింది.
- **విష్ణు, కొత్తపేట.** ✔: మరమ్మతులు చేపట్టేందుకు కృషి చేస్తాం. - **సురేష్, మున్సిపల్ ఏఈ.**

చేతి పంపు.. ఎదురుచూపు

ఆళ్లగడ్డలోని సామాజిక ఆరోగ్య కేంద్రం వద్ద సీసీ రహదారి నిర్మించే క్రమంలో చేతిపంపును సిమెంట్‌తో సగానికి మూసేశారు. నీళ్లు పట్టుకునే అవకాశం లేకపోవడంతో చేతిపంపు వృథాగా మారింది. మరోవైపు ఆళ్లగడ్డ పట్టణంలో చేతిపంపులు ఉన్నా దాదాపు అవన్నీ మరమ్మతుల గుర్తి వృథాగా మారాయి. పురపాలికలో చేతి పంపులను మరమ్మతులు చేసే విభాగమే లేకపోవడం గమనార్హం. – న్యూస్‌టుడే, ఆళ్లగడ్డ

మలుపులు.. కానరావు సూచికలు

దొర్నిపాడు మండలంలోని వెంకటేశ్వరనగర్- దొర్నిపాడు గ్రామాల మధ్య ఉన్న ప్రధాన రహదారిలో మలుపులు ప్రమాదకరంగా మారాయి. రెండేళ్ల క్రితం దొర్నిపాడు నుంచి వెంకటేశ్వరనగర్ గ్రామాల మధ్య దాదాపు 3 కి.మీ. మేర నూతన రహదారి నిర్మించారు. ఈ మార్గంలో నాలుగు మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. ఎలాంటి సూచిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. సంబంధిత అధికారులు చొరవ చూపి సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, దొర్నిపాడు

రాయితీ పైపులు.. గుజిరీకి తరలింపు

పొలాల్లో నీటిని ఆదా చేసేందుకు ఉపయోగించే బిందు సేద్యం పరికరాలు ట్రాలీ ఆటోల్లో ప్రమాదకరంగా తరలిస్తున్నారు. పొలాల్లో వాడే బిందు సేద్యం పైపులు వినియోగించకుండా వాహనంలో పట్టపగలే జాతీయ రహదారిపై యథేచ్ఛగా తీసుకెళ్తున్నారు. డోన్ నుంచి కర్నూలుకు వెళ్లే హైవేపై తరలిస్తున్నారు. వీటిని గుజిరీకి తరలించేందుకు తీసుకెళ్తున్నట్లు సమాచారం. రూ.లక్షల రాయితీతో ఇచ్చే పరికరాలను గుజిరీకి తరలించడంపై పలు విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. – న్యూస్‌టుడే, డోన్

అవుకులో తాగునీటికి కటకట

అవుకు పట్టణంలోని రాజవీధిలో జరుగుతున్న అండర్ డ్రైనేజీ నిర్మాణంలో భాగంగా చేపట్టిన పనుల్లో తాగునీటి గొట్టం పగిలింది. దీంతో రాజవీధి, బుగ్గవీధిల కుళాయిల్లో నీరు అందక పోవటంతో కాలనీ వాసులు దూరప్రాంతాలకు వెళ్లి తాగునీరు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు బిందెల్లో నీరు తెచ్చుకోలేక అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని కాలనీ వాసులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, అవుకు

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

డిమాండ్ పత్రాలను చూపుతున్న ఎస్టీయూ నాయకులు

చాగలమర్రి, న్యూస్‌టుడే: ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 25న తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమానికి పెద్దఎత్తున తరలి రావాలని ఎస్టీయూ మండల అధ్యక్షులు గురువప్పయ్య పిలుపునిచ్చారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం గోడపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ డిమాండ్లను సాధించుకునేందుకు దశల వారీగా ఉద్యమిస్తామని వివరించారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా ఉపాధ్యక్షులు రాజశేఖర్‌రెడ్డి, జిల్లా అదనపు కార్యదర్శి ఉస్మాన్, మండల ఆర్థిక కార్యదర్శి మాబుహుసేన్, జిల్లా కౌన్సిలర్ నరసింహులు, సుబ్బారావు, శేషాద్రి, గౌస్‌అహ్మద్, స్వామిరెడ్డి పాల్గొన్నారు.

ప్రమాదం వేలాడుతోంది

బనగానపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యుత్తు శాఖ అధికారుల నిర్లక్ష్య ధోరణి ప్రజలకు శాపంగా మారుతోంది. బనగానపల్లి నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఇటువంటి సమస్య తీవ్రంగా ఉంది. కొన్ని చోట్ల నియంత్రికలు తక్కువ ఎత్తులో ఉండి ప్రమాదకరంగా మారాయి. చాలా వరకు గ్రామాల్లో చెట్ల మధ్య తీగలు ఉండటంతో గాలి వీచినప్పుడు, వర్షాలు పడినప్పుడు తెగి పడుతున్నాయి. అలాగే నియంత్రికల వద్ద కంచె లేకపోవడం కూడా సమస్యగా మారుతున్నాయి. దీంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

మీరాపురంలో కంచె లేని నియంత్రికలు

చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం

☛ బనగానపల్లి పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల సమీపంలో, వెంకటాపురం గ్రామంలోని పాఠశాల సమీపంలోనూ విద్యుత్తు నియంత్రిక వద్ద ఎటువంటి కంచె లేకపోవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

☛ మీరాపురం గ్రామంలో నియంత్రికలు తక్కువ ఎత్తులో ఉండి ప్రమాదకరంగా ఉన్నాయి. ఇల్లూరుకొత్తపేట గ్రామంలోని ఎస్సీ కాలనీలోనూ విద్యుత్తు తీగలు కిందకు ఉండి ఇబ్బందులు పడుతున్నారు.

☛ కోవెలకుంట్ల పట్టణంలోని గాంధీనగర్ పాఠశాల వద్ద నియంత్రికలు ప్రమాదకరంగా ఉన్నాయి. అలాగే అమడాల గ్రామంలోని ఎస్సీ కాలనీలో విద్యుత్తు తీగలు చెట్ల మధ్య ఉన్నాయి. వర్షాకాలంలో తీగలు తెగుతున్నాయి.

సరిచేయాలని వినతి

☛ కొలిమిగుండ్ల మండలంలోని నాపరాయి గనుల్లో విద్యుత్తు తీగలు కిందకు ఉండి వేలాడుతున్నాయి. సరైన స్తంభాలు లేవని కూలీలు అంటున్నారు.

☛ సంజామల మండలం పేరుసోముల గ్రామంలోని పొలాల్లో తీగలు కిందికి ప్రమాదకరంగా వేలాడుతున్నాయి. నొస్సం గ్రామంలోనూ ఇటువంటి సమస్యలున్నాయి.

☛ అవుకు మండలంలోని శివవరం ఎస్సీ కాలనీలో విద్యుత్తు తీగలు కిందకు వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయి. ఇవే కాకుండా చాలా వరకు గ్రామాల్లో ఇటువంటి సమస్యలు వేధిస్తున్నాయి. విద్యుత్తు అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఉత్సవ వైభవం.. ఆధ్యాత్మిక పరిమళం

డోన్, న్యూస్‌టుడే: పట్టణ సమీపంలోని కోట్ల వారిపల్లె వద్ద నూతనంగా నిర్మించిన గంగమ్మ ఆలయంలో ఆదివారం విగ్రహ, యంత్ర, ధ్వజ స్తంభ ప్రతిష్ఠ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక హోమాలు నిర్వహించారు. ఉత్సవాలకు ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి, రాష్ట్ర సీడ్ కార్పొరేషన్ ఛైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి, డీఎస్పీ శ్రీనివాసులు తదితరులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వెంకటాంపల్లె (ప్యాపిలి), న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే సంప్రదాయ క్రీడల్లో యువత పాల్గొని గ్రామ సంస్కృతిని కొనసాగించాలని మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ పేర్కొన్నారు. వెంకటాంపల్లె గ్రామంలో వృషభాల బండలాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. పోటీల్లో 10 జతల ఎడ్లు పాల్గొన్నాయి. విజేతల ఎడ్ల యజమానులకు కోట్ల సుజాతమ్మ నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో టి.శ్రీనివాసులు, రాజా నారాయణమూర్తి, ఖాజాపీర్, రామ్మోహన్, మెట్టుపల్లె సుదర్శన్, ప్రిన్సిపల్ మధు, నాగార్జునకుమార్ పాల్గొన్నారు.

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: కోవెలకుంట్లలో అష్టలక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం వేడుకలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా వివిధ పూజలు, హోమాలు నిర్వహించారు. ద్రోణాచలం గాయత్రీ పీఠం వ్యవస్థాపకులు దత్తాత్రేయశర్మ ప్రవచన కార్యక్రమం నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

డోన్: ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

ఆళ్లగడ్డ గ్రామీణం, దొర్నిపాడు, న్యూస్‌టుడే: ఆళ్లగడ్డ మండలం ఆర్.కృష్ణాపురంలోని రామతీర్థం పుట్టాలమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దూర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చి పుట్టాలమ్మ, పరశురామేశ్వర, లక్ష్మీనృసింహ స్వామి, శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని దర్శించుకున్నారు. డబ్ల్యూ గోవిందిన్నె గ్రామంలో ఆదివారం మూల పెద్దమ్మతల్లి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

బనగానపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: నందవరం చౌడేశ్వరిదేవి ఆలయం, యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయాలు ఆదివారం భక్తుల సందడితో కనిపించాయి. సెలవు రోజు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి, అమ్మవార్లకు పూజలు చేశారు. యాగంటి ఉమా మహేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి పాతపాడుకు చెందిన వెంకటరామిరెడ్డి, చంద్రకళావతి దంపతులు రూ.10 వేల విరాళాన్ని ఆలయ సిబ్బందికి ఆదివారం అందజేశారు.

ప్యాపిలి: విజేతలకు నగదును అందజేస్తున్న కోట్ల సుజాతమ్మ

కోవెలకుంట్ల: ఆధ్యాత్మిక ప్రవచనం వింటున్న భక్తులు

ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

డోన్ పట్టణం, బేతంచెర్ల, ప్యాపిలి, న్యూస్‌టుడే: ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఈ నెల 23వ తేదీ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఈ నెల 24వ తేదీ నుంచి పరీక్షలు జరుగనున్నాయి. డోన్ పట్టణంలో నాలుగు, బేతంచెర్ల మండలంలో రెండు, ప్యాపిలిలో ఒక కేంద్రం చొప్పున నియోజకవర్గంలో మొత్తం ఏడు కేంద్రాల్లో పరీక్షలు ప్రారంభం కానున్నాయి. డోన్‌లో ప్రథమ సంవత్సరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 325, ఆదర్శ కళాశాలలో 275, వెంకటేశ్వర జూనియర్ కళాశాలలో 323, శ్రీసాయి జూనియర్ కళాశాలలో 422 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. బేతంచెర్లలో పాణ్యం సిమెంట్ జూనియర్ కళాశాలలో 296, ఆదర్శ కళాశాలలో 231 మంది, ప్యాపిలిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 160 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి ఇన్విజిలేటర్లకు చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు సమావేశాలను ఏర్పాటు చేసి దిశానిర్దేశం చేశారు.

ఇన్విజిలేటర్లకు శిక్షణ ఇస్తున్న చీఫ్ సూపరింటెండెంట్

తలసేమియా బాధితుల కోసం రక్తదానం

సంజామల, న్యూస్‌టుడే: తలసేమియా బాధిత చిన్నారులను ఆదుకునేందుకు ఆల్వకొండలో ఆదివారం నంద్యాల తలసేమియా వెల్ఫేర్ సొసైటీ సభ్యురాలు షఫియా ఆధ్వర్యంలో 42 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా షఫియా మాట్లాడుతూ.. నంద్యాల బ్లడ్ బ్యాంక్ సహకారంతో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించామన్నారు. పలువురు యువకులు స్పందించి చిన్నారుల కోసం రక్తదానం చేయటం అభినందనీయమన్నారు. మరింత మంది ముందుకు వచ్చి రక్తదానం చేసి రోగులను ఆదుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అంబవరం హుసేన్‌సాహెబ్, మురళి, గోపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శిబిరంలో రక్తదానం చేస్తున్న యువకులు

క్రమశిక్షణతో బంగారు భవిత

బేతంచెర్ల, న్యూస్‌టుడే: విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉంటూ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని నంద్యాల మహిళా పోలీసు స్టేషన్ సీఐ గౌతమి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని కేజీబీవీ గురుకుల పాఠశాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థుల భద్రత గురించి అడిగి తెలుసుకొని శాంతిభద్రతలపై అవగాహన కల్పించారు.

పాఠశాల మైదానాన్ని పరిశీలిస్తున్న సీఐ గౌతమి

సైబర్ నేరాలు, మాదకద్రవ్యాలు తదితరాలపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో ముందుకు సాగుతూ లక్ష్య సాధనపై దృష్టి సారించాలన్నారు. బాల్య వివాహాలు, గృహహింస, ఈవ్‌టీజింగ్, వరకట్నం వేధింపులు తదితరాలపై అవగాహన కల్పించారు. పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో లక్ష్యసాధనతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఎస్సైలు కేసీ తిరుపాల్, కల్పన, మమత తదితరులు పాల్గొన్నారు.

రహదారి నిబంధనలు తప్పనిసరి

యర్రగుంట్ల (శిరివెళ్ల), న్యూస్‌టుడే: వాహనదారులు విధిగా రహదారి నిబంధనలు పాటించాలని శిరివెళ్ల సీఐ రాము పేర్కొన్నారు. మండలంలోని యర్రగుంట్ల బస్టాప్ వద్ద సీఐ తన సిబ్బందితో కలిసి ఆదివారం వాహనాల తనిఖీ చేపట్టారు. ద్విచక్ర వాహనాలు నడిపే యువత తప్పనిసరిగా శిరస్త్రాణం ధరించాలని సూచించారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను డ్రైవర్లు తరలిస్తే చట్టప్రకారం కేసులు నమోదు చేయడంతో పాటు జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ఆటో డ్రైవర్లు విధిగా యూనిఫాం ధరించాలని, డ్రైవింగ్ లైసెన్స్ లేనివారు వాహనాలు నడపరాదన్నారు.

సంక్షిప్త సమాచారం

అహోబిలం(ఆళ్లగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: అహోబిలం లక్ష్మీనృసింహ స్వామి ఆలయాన్ని నంద్యాల మాజీ ఎంపీ గంగుల ప్రతాపరెడ్డి దర్శించుకున్నారు. అనంతరం మఠంలో పీఠాధిపతి రంగనాథ యతీంద్ర మహాదేశికన్‌ను కలిసి ఆశీర్వాదం పొందారు.

డోన్, న్యూస్‌టుడే: డోన్ ప్రభుత్వాసుపత్రిలో దాత జనార్దన్ సహకారంతో రోగులు, గర్భిణులకు పౌష్టికాహారం అందజేశారు. ప్రార్థన సమయం నిర్వాహకులు జాన ప్రభాకర్ పాల్గొన్నారు.

డోన్, న్యూస్‌టుడే: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని సీపీఎం పట్టణ కార్యదర్శి నక్కి శ్రీకాంత్ అన్నారు. స్థానిక కార్యాలయంలో సీపీఎం నాయకులతో సమావేశం నిర్వహించారు. నాయకులు చిన్నరహిమాన్, షమీంబేగం తదితరులు పాల్గొన్నారు.

డోన్, న్యూస్‌టుడే: మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను కమిషనర్ పరిష్కరించేలా కృషిచేయటం అభినందనీయమని సీఐటీయూ, మున్సిపల్ వర్కర్స్‌యూనియన్ నాయకులు శివరాం, మాణిక్యంశెట్టిలు అన్నారు. ఆదివారం ప్రసాద్‌గౌడ్‌ను మున్సిపల్ కార్మికుల తరుపున సన్మానించారు.

చాగలమర్రి, న్యూస్‌టుడే: పట్టణానికి చెందిన తెదేపా సీనియర్ నాయకులు వడియాల మాబు సతీమణి షిలార్‌బీ(61) అనారోగ్యంతో మృతి చెందారు. తెదేపా రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు అన్సర్ బాషా తదితరులు మృతికి నివాళి అర్పించారు.

చాగలమర్రి, న్యూస్‌టుడే: చాగలమర్రి పట్టణంలోని భూమానగర్ కాలనీలో రమణారెడ్డి అనే రైతుకు చెందిన గడ్డివామి ఆదివారం దగ్ధమైంది. ఆళ్లగడ్డ అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. బాధితుడికి రూ.60 వేల దాకా నష్టం వాటిల్లింది.

చాగలమర్రి, న్యూస్‌టుడే: పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో నరసింహస్వామి మాలధారులకు ఆదివారం అన్నదానం చేశారు. దాతలు గుత్తినరసింహులు, వేణుగోపాల్‌రెడ్డిలను భక్తులు సన్మానించారు. భాస్కర్‌రెడ్డి, నరసింహ, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ, న్యూస్‌టుడే: పరిసరాల పరిశుభ్రతకు ప్రజలు సహకరించాలని డిప్యూటీ ఎంపీడీవో నాగలక్ష్మమ్మ కోరారు. మండల పరిధిలోని 15 గ్రామ పంచాయతీల మంజూరైన ట్రైసైకిళ్లు, ప్లాస్టిక్ బుట్టలను ఆదివారం పంచాయతీ సిబ్బందికి అందజేశారు.

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: రౌడీషీటర్లు మంచి ప్రవర్తనతో నడుచుకోవాలని ఎస్సై మల్లికార్జునరెడ్డి అన్నారు. కోవెలకుంట్ల పోలీసు స్టేషన్‌లో రౌడీషీటర్లకు ఆదివారం మంత్రణం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరచరిత్ర కలిగినవారిపై పోలీసు నిఘా ఉంచామన్నారు. నేరాలకు దూరంగా ఉండాలన్నారు.

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: కోవెలకుంట్ల పట్టణంలో రహదారులపై పశువులు యథేచ్ఛగా సంచరిస్తున్నాయని పట్టణవాసులు వాపోతున్నారు. పశు సంచారంతో తరచూ వాహన ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నియంత్రికలు లేక.. కొత్త సర్వీసులు ఇవ్వక

డోన్, న్యూస్‌టుడే: మెట్ట భూముల్లో పంటలు వేసిన అన్నదాతల ఆశలు ఆవిరవుతున్నాయి. సేద్యాన్ని నమ్ముకుని జీవనం సాగించే రైతులు సరైన సమయానికి విద్యుత్తు కనెక్షన్లు అందక కళ్లముందే కాయలు కాసేలా ఎదురుచూపులు తప్పటంలేదు. వ్యవసాయ విద్యుత్తు సర్వీసుల కోసం దరఖాస్తు చేసుకుంటున్నా కొన్ని కనెక్షన్లు మాత్రమే మంజూరవుతున్నాయి. సకాలంలో కనెక్షన్లు, నియంత్రికలు మంజూరయ్యేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

డోన్ విద్యుత్తు కార్యాలయంలో ఉంచిన విద్యుత్తు నియంత్రికలు

నెలల తరబడి ఎదురుచూస్తున్న అన్నదాతలు

డోన్ డివిజన్ పరిధిలో విద్యుత్తు శాఖ తరఫున 2024 నుంచి ఇప్పటి వరకు వందలాది కనెక్షన్లకు దరఖాస్తులు చేసి డీడీలు చెల్లించిన రైతులకు కనెక్షన్ అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత మూడేళ్లలో 628 దరఖాస్తులకు గాను ఇప్పటి వరకు కేవలం 12 మాత్రమే మంజూరయ్యాయి. దీన్ని బట్టిచూస్తే వ్యవసాయానికి విద్యుత్తు అందక రైతులు ఎంత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారో అర్థం చేసుకోవచ్చు. డీడీలు చెల్లించి కార్యాలయాల చుట్టూ విద్యుత్తు సర్వీసుల కోసం కాళ్లరిగేలా తిరుగుతున్నామని రైతులు ఆరోపిస్తున్నారు. 'దరఖాస్తులను పరిశీలించి త్వరలోనే కనెక్షన్లు ఇస్తామని, దీనిపై అన్నదాతలు ఆందోళన చెందవద్దని'' డీఈఈ నాగేంద్ర తెలిపారు.

డోన్ డివిజన్‌లో దరఖాస్తులు, మంజూరైన కనెక్షన్లు

మండలం	2025	2026	మంజూరైనవి
బేతంచెర్ల	71	16	10
డోన్	109	19	-
జలదుర్గం	112	9	-
ప్యాపిలి	62	18	2

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
यूनियन बैंक Union Bank of India
(ఒక భారత ప్రభుత్వ రంగ సంస్థ)
శిరివెళ్ల శాఖ (25981), మెయిన్ రోడ్,
శిరివెళ్ల గ్రామం మరియు మండలం, నంద్యాల జిల్లా-518563.
ఇ-మెయిల్: ubin0825981@unionbankofindia.bank.in, Ph: 9324725981.

స్థిరాస్తుల అమ్మకం

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8 (6) లోని నిబంధనలతో చదువుకోవల్సిన సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన.
సాధారణ ప్రజానీకానికి మరియు ముఖ్యంగా రుణగ్రహీత(లు), కో-ఆబ్లిగెంట్ మరియు గ్యారెంటర్(ల)కు (వివరాలు పట్టికలో ఇవ్వబడినవి) ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా, గత ఆంధ్రాబ్యాంక్, ఇప్పుడు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు చెల్లించవల్సిన బకాయిలను (పట్టికలో తెలియజేయబడినవి) సదరు రుణగ్రహీత, గ్యారంటర్ మరియు కో-ఆబ్లిగెంట్‌ల నుండి రాబట్టుకోవటానికి, గత ఆంధ్రాబ్యాంక్, ఇప్పుడు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు తనఖా పెట్టబడిన/ఛార్జిచేయబడిన మరియు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యొక్క అధీకృత అధికారిచే సంభావిత స్వాధీనత చేపట్టబడిన దిగువ తెలిపిన స్థిరాస్తి **27.03.2026**న సమయం: మ.12:00 గం. నుండి సా.05:00 గం. వరకు "ఎక్కడ ఏది ఎలా ఉన్నది, అక్కడ అది అలానే" ప్రాతిపదికన విక్రయించబడును.
రిజర్వు ధర మరియు ధరావతు వివరాలు దిగువనివ్వబడిన పట్టికలో కలవు:

ఖాతా, రుణగ్రహీత/ల, గ్యారంటరు/ల పగైరాల పేరు
1. ఎ) శ్రీ షేక్ జాఫర్ సా అలియాస్ జగతి జాఫర్ షా (రుణగ్రహీత) తండ్రి షేక్ జగతి కాశిం, డి.నెం.10-69, శిరివెళ్ల గ్రామం, నంద్యాల జిల్లా - 518563, ఆం.ప్ర.
1.బి) శ్రీమతి షేక్ ఫైజున్ బి అలియాస్ జగతి ఫైజూన్ (సహ-రుణగ్రహీత) భర్త షేక్ జాఫర్ సా, డి.నెం.10-69, శిరివెళ్ల గ్రామం, నంద్యాల జిల్లా - 518563, ఆం.ప్ర.

"సంభావిత స్వాధీనతలో ఉన్న ఆస్తి"
నంద్యాల రిజిస్ట్రేషన్ జిల్లా మరియు శిరివెళ్ల సబ్ రిజిస్ట్రేషన్, శిరివెళ్ల గ్రామం మరియు మండలం లోని సర్వే నెం.403/1, డి.నెం.10/69తో శ్రీ షేక్ జాఫర్ సా మరియు శ్రీమతి షేక్ ఫైజున్ బి కి చెందిన నివాస భూమి మరియు ఇల్లు యావత్తు, 121 చ.గజాల విస్తీర్ణం. **సరిహద్దులు: తూర్పు:** ప్రభుత్వ దొడ్డి, **పడమర:** షేక్ జగతి కలమ్ ఇల్లు, **ఉత్తరం:** డ్రైనేజ్ కెనాల్, **దక్షిణం:** జగతి మదర్ ఇల్లు మరియు రస్తా.

రిజర్వు ధర: రూ.16,15,000 (పదహారు లక్షల పదిహేను వేల రూపాయలు మాత్రమే)
ఇఎండీ: 1,61,500/-, **బిడ్ పెంపుదల:** రూ. 17,000/-.
ఐఎఫ్ఎస్‌సి కోడ్: UBIN0825981, ఖాతా నెం.259811980050000

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు ఉన్న బకాయి: 15.10.2025 నాటికి 1,39,198.98 (ఒక లక్ష ముప్పై తొమ్మిది వేల ఒక వంద తొంభై ఎనిమిది రూపాయల తొంభై ఎనిమిది పైసలు మాత్రమే) మరియు దానిపై తదుపరి వ్యయాలు, ఖర్చులు మరియు వడ్డీ.

ధరావతు దాఖలుకు చివరి తేది : ఇ-వేలం పూర్తి అయ్యేంత వరకు.

ఇ-వేలం తేది మరియు సమయం: 27.03.2026న మ.12:00 గం. నుండి సా. 05:00 గం. వరకు. వేలం యొక్క చివరి 10 నిమిషాల లోపు బిడ్ చేయబడిన ప్రతిసారి వేలం ముగింపు సమయం 10 నిమిషాలపాటు పొడిగించబడును.

వివరమైన విక్రయ నియమనిబంధనల కొరకు www.unionbankofindia.bank.in ఇ-వేలం సర్వీస్ ప్రొవైడర్స్ వెబ్‌సైట్: https://baanknet.com. నందు ఇవ్వబడిన లింక్‌ను చూడండి.

తేది: 16.02.2026
ప్రదేశం: కర్నూలు
అధీకృత అధికారి,
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

(c) eenadu

సమావేశంలో సీఎం మోహన్, ఉపముఖ్యమంత్రి సింగ్‌దేవ్, మంత్రి ఖుంటియా, అధికారులు

రూ. 44,200 కోట్ల పెట్టుబడులకు పచ్చజెండా

భువనేశ్వర్, న్యూస్‌టుడే: మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్, టీవీ, వాహనాలకు వినియోగిస్తున్న మెమోరీ చిప్‌లు ఇక రాష్ట్రంలో తయారవుతాయి. కీలకమైన హై పెర్ఫార్మెన్స్ మాగ్నెట్ ఉత్పత్తి జరుగుతుంది. శనివారం రాత్రి భువనేశ్వర్‌లోని లోక్‌సేవా భవన్‌లో ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి అధ్యక్షతన పెట్టుబడుల మంజూరు సంఘం (హెచ్ఎల్‌సీఏ) సమావేశం జరిగింది. రూ. 44,200 కోట్ల వ్యయంతో 10 ప్రాజెక్టుల నిర్మాణాలకు ఆమోదముద్ర పడింది. ఖుర్ధా, కొరాపుట్, మల్కాన్‌గిరి, ఢెంకనాల్, పూరీ, నయాగఢ్, కలహండి, దేవగఢ్‌లలో నూతన నిర్మాణాలు జరుగుతాయి. 9 వేల మందికి ఆయాచోట్ల ఉపాధి అవకాశాలు కలుగుతాయి. ఏపీఎస్ సెమినికన్ కంపెనీ ఖుర్ధాలో రూ. 4,620 కోట్ల వ్యయంతో సెమీకండక్టర్ మెమొరీ చిప్‌ల తయారీ కేంద్రం ప్రారంభించనుంది. రూ. 1,050 కోట్లతో మాగనోవా గ్రూపు ఖుర్ధాలో హై పెర్ఫార్మెన్స్ మాగ్నెట్ తయారీ కేంద్రం ఏర్పాటు చేస్తుంది. భారత్ పోర్జ్ కంపెనీ ఢెంకనాల్‌లో రూ. 3,000 కోట్ల వ్యయంతో ఆటోమేటివ్ ఏరోస్పేస్ ఉపకరణాల తయారీ కేంద్రం ప్రారంభిస్తుంది. పూరీలో కేబుల్ ల్యాండింగ్ కేంద్రం, కొరాపుట్, మల్కాన్‌గిరిల్లో సిమెంట్ ఉత్పత్తి కర్మాగారాలు ఏర్పాటవుతాయి. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ రాష్ట్రంలో విలువైన ఉత్పత్తులకు బాటలు పడ్డాయని సమృద్ధ ఒడిశాలో పారిశ్రామిక రంగం శక్తిగా ఆవిర్భవిస్తోందని చెప్పారు. సమావేశంలో ఉపముఖ్యమంత్రి కనకవర్ధన్ సింగ్‌దేవ్, అటవీ, పర్యావరణ శాఖల మంత్రి గణేశ్‌రామ్ సింగ్ ఖుంటియా, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనూగార్గ్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సరకు రవాణాలో సరికొత్త రికార్డు

● 324 రోజుల్లో 250 ఎంటీలతో ప్రథమస్థానంలో తూర్పుకోస్తా రైల్వే

జేసీబీ సాయంతో బొగ్గు లోడు చేస్తూ...

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: సరకు రవాణాలో తూర్పుకోస్తా రైల్వే జోన్ సరికొత్త రికార్డు సాధించింది. ఈ ఆర్థిక సంవత్సరంలో కేవలం 324 రోజుల్లో 250 మిలియన్ టన్నుల (ఎంటీ) రవాణాతో దేశంలోనే ప్రథమస్థానంలో నిలిచింది. రైల్వే వర్గాలు అందించిన సమాచారం మేరకు 2024-25తో పోలిస్తే ఈ ఏడాది 31 రోజుల ముందుగానే ఈ ఘనత సాధించింది. గతేడాది ఇదే సమయంతో పోలిస్తే సరకు రవాణా 10.6 శాతం పెరిగింది. రైల్వే అధికారులు, సిబ్బంది అంకితభావంతో పనిచేయడం వల్ల ఇది సాధ్యపడింది. సరకు రవాణాలో అధికంగా బొగ్గు, ఇనుము, ఉక్కు, సిమెంటు కీలకపాత్ర పోషించాయని రైల్వేవర్గాలు స్పష్టం చేశాయి. భారతీయ రైల్వేలో సరకు రవాణా పరంగా తూర్పుకోస్తాజోన్ అగ్రస్థానంలో ఉండడం చూస్తే ఈ ప్రాంతంలో పారిశ్రామిక, ఆర్థిక పురోగతిని తెలియజేస్తుందని వెల్లడించాయి.

ఆపరేషన్ సైబర్ కవచ్.. 187 మంది అరెస్టు

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: ఒడిశా పోలీసు యంత్రాంగం చేపట్టిన ఆపరేషన్ సైబర్ కవచ్ ద్వారా 187 మందిని అరెస్టుచేశారు. పోలీసుశాఖ వెల్లడించిన వివరాల ప్రకారం.. గడిచిన 10 రోజుల్లో ఈ డ్రైవ్ ద్వారా 3,625 బ్యాంకు ఖాతాలను పరిశీలించిన పోలీసులు 187 మందిని అరెస్టు చేశారు. వీటిలో ఖుర్ధా పరిధిలో 97 ఖాతాలు, కేంద్రపడలో 88, పూరీలో 71, జాజ్‌పూర్‌లో 44 ఖాతాలను పరిశీలించారు. వీటితోపాటు రాయగడ, బొలంగీర్, బ్రహ్మపుర, గజపతి, కలహండి, కొరాపుట్, నువాపడ, మల్కాన్‌గిరి, నవరంగపూర్, కొంధమాల్, బౌద్ధ్, దేవగఢ్, ఢెంకనాల్ తదితర జిల్లాల్లో వీటి పరిశీలన కొనసాగింది. ఈ విషయమై డీజీపీ వై.బి.ఖురానియా మాట్లాడుతూ రానున్న రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో దీనిపై దృష్టి సారించనున్నట్లు పేర్కొన్నారు.

పోలీసుల అదుపులో నిందితులు

ఏనుగు దాడిలో ఇద్దరి మృతి

ఊర్మిళ మృతదేహం

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లా దిగపొహండి పోలీసు స్టేషన్ పరిధిలో ఫాసిగుడ పంచాయతీలోని జకమెరిపల్లి గ్రామంలో ఆదివారం ఏనుగు దాడిలో ఊర్మిళా రౌత్ (49). గోపీనాథ్ ప్రధాన్ (60) మృతిచెందారు. ఉదయం వీరు గ్రామ శివారులోని కాయగూరల తోటలో పనిచేస్తున్న సమయంలో ఘొడాహాడొ నది ఒడ్డు వైపు నుంచి ఓ మగ ఏనుగు హఠాత్తుగా అక్కడికి వచ్చింది. దాన్ని చూసి పరుగు తీస్తూ ఇద్దరూ కింద పడిపోయారు. దీంతో ఊర్మిళను ఏనుగు తొక్కేయడంతో ఘటనా స్థలంలోనే మృతిచెందింది. గోపీనాథ్‌ను తొండంతో విసిరేయడంతో ఆయన తీవ్రంగా గాయపడ్డాడు. సమీపంలో ఉన్న గ్రామస్థులు కేకలు వేయడంతో ఏనుగు తిరిగి అటవీ ప్రాంతంవైపు వెళ్లిపోయింది. అనంతరం గాయపడ్డ గోపీనాథ్‌ను గ్రామస్థులు దిగపొహండిలోని ఆరోగ్య కేంద్రంలో చేర్పించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని, మృతదేహాలను పరీక్షకు తరలించి, దర్యాప్తు చేపట్టారు. మరోవైపు దాడి చేసిన ఏనుగు కదలికలపై గట్టి నిఘా పెట్టామని ఇన్‌ఛార్జి రేంజర్ ప్రధాన్ పేర్కొన్నారు.

కార్యదర్శులు బాధ్యతగా విధులు నిర్వర్తించాలి

సీఎస్ అనూగార్గ్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, వ్యవసాయం, జలవనరులు, నిర్మాణరంగాలకు 2026-27లో భారీగా కేటాయింపులు జరిగిన నేపథ్యంలో నిర్దేశిత ప్రాజెక్టుల పనులు నిర్ణీత వ్యవధిలోగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) అనూగార్గ్ ఆయా శాఖల ప్రిన్సిపల్ కార్యదర్శులకు ఆదేశించారు. శనివారం రాత్రి భువనేశ్వర్‌లోని లోక్‌సేవా భవన్‌లో సీఎస్ అధ్యక్షతన కార్యనిర్వాహక టాస్క్‌ఫోర్స్ సమావేశం జరిగింది. బడ్జెట్‌లో ప్రభుత్వం ప్రకటించిన నూతన నిర్మాణాలపై సమీక్షించారు. ఏప్రిల్ 1 నుంచే అవి పట్టాలకెక్కించాలని, టెండర్ల ప్రక్రియలో స్వచ్ఛత అవలంబించాలని, వివాదాలకు ఆస్కారం ఉండరాదని సీఎస్ పేర్కొన్నారు. నిర్మాణాలకు సంబంధించి ఆయాచోట్ల స్థలసేకరణ త్వరగా చేపట్టాలన్నారు. సమావేశంలో అభివృద్ధి కమిషనర్ దేవ్‌రంజన్‌కుమార్ సింగ్, ఇతర ప్రిన్సిపల్ కార్యదర్శులు పాల్గొన్నారు.

టాస్క్‌ఫోర్స్ సమావేశంలో అనూగార్గ్, ఇతర అధికారులు

సైబర్ నేరగాళ్లపై ఉక్కుపాదం

విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఝార్సుగుడ ఎస్పీ రాఘవేంద్ర. చిత్రంలో అరెస్టయిన నిందితులు (ముఖాలకు ముసుగుల్లో)

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: సైబర్ మోసగాళ్ల సిండికేట్‌ను ఛేదించిన ఝార్సుగుడ పోలీసులు మ్యూల్ బ్యాంకు ఖాతాలు, క్రిప్టో కరెన్సీలతో సైబర్ మోసాలకు సంబంధమున్నవారిని అరెస్టు చేశారు. ఝార్సుగుడలో శనివారం సాయంత్రం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఝార్సుగుడ ఎస్పీ రెడ్డి రాఘవేంద్ర గుండాల ఈ వివరాలను తెలిపారు. జిల్లాలోని బెలపహార్, లైకెరా పోలీసు స్టేషన్లలో వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి, ఏడుగుర్ని అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరుపరిచామని ఆయన పేర్కొన్నారు. నిందితుల్లో ఒకరు ఉత్తరప్రదేశ్‌కు చెందిన మాస్టర్‌మైండ్ ఉన్నారని ఆయన వివరించారు. నిందితుల నుంచి ల్యాప్‌టాప్‌లు, చరవాణులు, ఇంటర్నేషనల్, డొమెస్టిక్ సిమ్ కార్డులు, ఏటీఎం కార్డులు, బ్యాంకు పాస్ పుస్తకాలు, చెక్‌బుక్స్, పాస్‌పోర్టు, పాన్‌కార్డులు తదితరులు స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ రాఘవేంద్ర తెలిపారు.

ఒకేరోజు 86 మ్యూల్ బ్యాంకు ఖాతాల గుర్తింపు

ఆపరేషన్ సైబర్ కవచ్ కింద గంజాం పోలీసు జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో శనివారం ఒకేరోజు 86 మ్యూల్ బ్యాంకు ఖాతాలను గుర్తించామని గంజాం ఎస్పీ కార్యాలయం అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పదకొండు కేసులు నమోదు చేశామని, 11 మంది నిందితులను శ్రీముఖాలు జారీ చేశామని తెలిపారు. ఆరుగురు మధ్యవర్తుల్ని అరెస్టు చేసి న్యాయస్థానానికి తరలించామని పేర్కొన్నారు. రూ.32.59 లక్షలు స్వాధీనం చేసుకున్నామని, ఆయా బ్యాంకు ఖాతాల ద్వారా రూ.8.78 కోట్ల మోసాల లావాదేవీలు జరిగినట్లు గుర్తించామని ఆ ప్రకటనలో తెలిపారు.

సాగులో 'హీరోద్'

● మన్‌కీ బాత్‌లో ప్రధాని మోదీ ప్రశంస

ప్రధాని మోదీ మన్‌కీ బాత్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: ఈ యువ రైతు రాష్ట్రానికి ఆదర్శం. ప్రధాని నరేంద్రమోదీ దృష్టిని ఆకర్షించి ప్రశంసలందుకున్న యువకుడు మరెవరో కాదు.. సుందర్‌గఢ్ జిల్లా టంగర్‌పల్లి సమితిలోని రతన్‌పూర్‌కి చెందిన హీరోద్ పటేల్. ఆదివారం మోదీ నిర్వహించిన 131వ మన్‌కీబాత్ (మనసులో మాట) ఆకాశవాణి కార్యక్రమంలో ఈయన గురించి ప్రస్తావించారు. ఆయన సాగు తీరును చూసి నేర్చుకోవాలని కోరడం విశేషం.


కూరగాయలు సేకరిస్తూ...

ఎవరీ హీరోద్

హీరోద్ ఐటీఐ పూర్తి చేసిన తర్వాత అందరిలా ఉద్యోగాన్వేషణ పేరిట సమయం వృథా చేయలేదు. తండ్రి శివశంకర్ పటేల్ ప్రోత్సాహంతో నేలతల్లిని నమ్ముకున్నాడు. తండ్రి వద్ద వ్యవసాయంలో మెలకువలు నేర్చుకున్న ఆయన తమకున్న 8 ఎకరాల పంట పొలాల్లో సిరులు పండిస్తున్నాడు. ఆధునిక వ్యవసాయ పద్ధతులు అలవర్చుకుని వరి, కూరగాయలు, పండ్లు, పూలు ఉత్పత్తి చేసి రూ.లక్షలు సంపాదిస్తున్నాడు. చేపల పెంపకం కూడా చేస్తున్నాడు. ఎంతోమంది రైతులు హీరోద్ వ్యవసాయ క్షేత్రానికి వచ్చి ఆధునిక పంటల గురించి తెలుసుకుంటున్నారు. ఇదంతా ప్రధాని మోదీ మన్‌కీ బాత్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా హీరోద్ విలేకర్లతో మాట్లాడుతూ స్వయంకృషితో దేన్నైనా సాధించగలమని, ప్రధాని తనను ప్రశంసించడం ఆనందంగా ఉందన్నారు.

స్వయం కృషికి నిలువుటద్దమీ యువ రైతు

శ్రీక్షేత్రం దృశ్యాలు మళ్లీ వైరల్

గోపాలపూర్, న్యూస్‌టుడే: పూరీ శ్రీక్షేత్రంలోని నిషిద్ధప్రాంతాల దృశ్యాలు ఆదివారం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. రవి తెలుగు ట్రావెలర్ ఆకౌంట్‌లో వైరల్ అయిన దృశ్యాలు తాజాగా తీసినవా? గతంలో తీసినవా? అన్న దానిపై ఇంకా స్పష్టత లేదు. దీనిపై సైబర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది.

అత్యాచార కేసులో ఐఆర్ఎస్ అధికారి?

భువనేశ్వర్, న్యూస్‌టుడే: భువనేశ్వర్ వాణీ విహార్ ప్రాంతంలోని జీఎస్టీ శాఖ అధికారుల కాలనీలో ఈ నెల 15న ఓ యువతిపై అత్యాచారం జరిగింది. జీఎస్టీ కార్యాలయంలో జాయింట్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న ఒక ఐఆర్ఎస్ అధికారి తన వసతిగృహంలో ఆమెపై అత్యాచారం చేశాడు. దీన్ని తన సోదరి ద్వారా వీడియోగ్రఫీ చేయించాడు. వివాదం విప్పితే ఈ దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేస్తానని హెచ్చరించాడు. తీవ్ర మనస్తాపానికి గురైన బాధితురాలు శనివారం దీనిపై షహీద్‌నగర్ ఠాణాలో ఫిర్యాదు చేసింది. కమిషనర్ సురేష్ దేవదత్తసింగ్‌ను కలిసి న్యాయం చేయాలని వేడుకొంది. తర్వాత బాధితురాలికి వైద్యపరీక్షలు చేయించిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిసింది. ఈ ఘటన చర్చనీయాంశం కాగా కమిషనర్ సింగ్ ఆదివారం సాయంత్రం విలేకర్లతో మాట్లాడుతూ కేసు దర్యాప్తు జరుగుతోందని, ఇంతకు మించి వివరాలు ఇప్పుడేమీ చెప్పలేమన్నారు. ఈ అధికారి పేరు, తదితరాలన్నీ గోప్యంగా ఉంచారు.

అంతరించిపోతున్న నారింజ పండ్ల సాగు

అజయగఢ్ ప్రాంతంలోని నారింజ మొక్కలు

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: గజపతి జిల్లాలోని గుమ్మ సమితి గిరిజనుల ఆదివాసీ ప్రాంతంగా వెలసిన కొండ ప్రాంతాలు వివిధ పంటలకు ప్రసిద్ధి. సంప్రదాయ వ్యవసాయం రోజురోజుకూ కనుమరుగవుతోంది. ముఖ్యంగా నారింజ సాగుకు అనువైన వాతావరణం ఉన్న అజయగఢ్, మునుసింగి, సెరంగో పంచాయతీల్లో నారింజ సాగు కనిపించడం లేదు. ఇటీవలి రోజుల్లో పెద్ద మొత్తంలో నారింజ పండ్ల ఉత్పత్తి అవుతున్నప్పటికీ, రైతులు రోజురోజుకూ ఈ సాగుకు దూరమౌతున్నారు. జీడి తోటల పెంపకం ద్వారా పర్యావరణం, నీరు, వాయు కాలుష్యంపై ప్రతికూల ప్రభావం చూపుతోందని నిపుణులు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. అందువల్ల ఇక్కడి రైతులు నారింజ పంటపై అవగాహన కల్పిస్తున్నారు. ఈ పంట వల్ల పర్యావరణ సమతుల్యమవుతుందని దీనివల్ల పంట దిగుబడి పెరుగుతుందని తెలిపారు. రైతుల ఆదాయం మెరుగుపడుతుందని రైతులు సురేష్ బడదల్లై, మాలియా పాయక్, దేవేంద్ర ప్రధాన్, రూపేంబర్, నోహ్ గమాంగ్, ఎలియాస్ సబర్, కార్తిక్ గమాంగ్ అన్నారు. ప్రభుత్వం నారింజ సాగును ప్రోత్సహిస్తే ఈ ప్రాంత రైతులు ప్రయోజనాలను పొందవచ్చునని మేధావులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

రైతులకు అవగాహన కల్పించాలి

సెరంగో, అజయ్ గడ్ ప్రాంతాల్లోని రైతులు జీడిపప్పు సాగుకు ఆధారపడకుండా నారింజ సాగుపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతో ఉంది. రైతులకు అవగాహన కల్పిస్తే ఆదాయం పెరగడమే కాకుండా సంప్రదాయ నారింజ సాగును కాపాడగలమని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. నారింజ వంటి విలువైన పంట ఉత్పత్తి అయితే చాలా మందికి స్థానిక బజారులో లభించడమే కాక

నీటి కొరత సమస్య

అజయగఢ్ ప్రాంతంలోని అదీ, బల్లుండ, కింటెసింగ్, రంగిడి, మహిరా గ్రామాల్లో 2020-24 కాలం మధ్యలో సుమారు 70 హెక్టార్ల భూమిలో నారింజ మొక్కలను నాటారని, ప్రధానంగా ఈ ప్రాంతాల్లో నీటి కొరత కారణంగా రైతులు సాగు చేయడానికి ఇష్టపడటం లేదని సమితి ఉద్యానాధికారి దిలీప్ దింగల్ అన్నారు.

భాజపా కోర్ కమిటీ కీలక సమావేశం

సమావేశంలో సీఎం మోహన్, కేంద్రమంత్రి ధర్మేంద్ర, ఉపముఖ్యమంత్రి సింగ్‌దేవ్, సామల్ తదితరులు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: భాజపా రాష్ట్రశాఖ కోర్ సంఘం సమావేశం ఆదివారం సాయంత్రం భువనేశ్వర్‌లోని ఆ పార్టీ కార్యాలయంలో ప్రారంభమైంది. కార్యక్రమంలో ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి, ఉప ముఖ్యమంత్రులు కనకవర్ధన్ సింగ్‌దేవ్, ప్రభాతి పరిడ, కేంద్రమంత్రులు ధర్మేంద్రప్రధాన్, జోయల్ ఓరం, భాజపా రాష్ట్రశాఖ అధ్యక్షుడు మన్మోహన్ సామల్, ఇతర అగ్రనేతలు పాల్గొన్నారు. త్వరలో జరగనున్న రాజ్యసభ ఎన్నికలు, ఖాళీగా ఉన్న కార్పొరేషన్‌ల అధ్యక్ష పదవుల్లో అర్హులకు నియామకాలు, రాష్ట్ర ప్రభుత్వం సమర్పించిన 2026-27 సంవత్సరం బడ్జెట్ గురించి అన్ని జిల్లా కేంద్రాల్లో విలేకర్ల సమావేశాలు, తదితరాలు చేపట్టడానికి కోర్ సంఘం చర్చలు జరుపుతున్నట్లు తెలిసింది. పూర్తి వివరాలు అధికారికంగా తెలియాల్సి ఉంది.

బతుకులు తెల్లారిపోయాయి

ఝార్సుగుడ ఆసుపత్రి ఆవరణలో బంధుమిత్రులు

మృతులు మీద వరుసలో లింగరాజ్ ధరువా, దేవదత్త సింగ్, నిరంజన్ కుజురు, దిగువ భక్తబంధు మీర్ధా, కాశీరాం భోయ్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: రాత్రంతా విధులు నిర్వహించారు. మరికొద్ది నిమిషాల్లో వారంతా ఇళ్లకు చేరుకోనున్నారు. విధులకు సంబంధించిన అంశాలు మాట్లాడుతూ ప్రయాణిస్తున్న ఆ పోలీసులకు లారీ రూపంలో మృత్యువు కబళించింది. మరోవైపు తమవారి కోసం ఎదురుచూస్తున్న వారికి ఉదయాన్నే పిడుగులాంటి సమాచారం అందింది. ప్రమాదవశాత్తు మృతి చెందారని విని వారంతా హతాశులయ్యారు. కొందరు సొమ్మసిల్లి పడిపోయారు. ఆదివారం తెల్లవారు ఝామున జరిగిన రహదారి ప్రమాదంలో మృతిచెందిన ఎస్.ఐ., ముగ్గురు కానిస్టేబుళ్లు, ఒక హోంగార్డు మృతిచెందారు. వారి పార్థివదేహాలు ఝార్సుగుడ ఆసుపత్రికి చేరుకోవడంతో బాధితుల సభ్యుల రోదనలతో పరిసరాలు విషాదంగా మారాయి.

బరగఢ్-భరగూడా వద్ద చెత్త దహనం

రాత్రివేళ వాహనదారులకు ప్రమాదం

మంటలు వ్యాపించిన దృశ్యం

బరగఢ్, న్యూస్‌టుడే: జిల్లాలోని భరగూడా గ్రామ సమీపంలో జాతీయ రహదారి పక్కన చెత్తను గుట్టలుగా వేసి నిప్పు అంటించడంతో రాత్రివేళ వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. చెత్త దహనం వల్ల దట్టమైన పొగ రహదారిపై కమ్ముకోవడంతో దృశ్యమానత తగ్గి ప్రమాదాలు జరిగే అవకాశముందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విధమైన ఘటనలు తరచూ జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. వెంటనే స్పందించి చెత్త దహనాన్ని నిలిపివేసి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. శనివారం రాత్రి ఈ ప్రాంతంలో మంటలు ఎగిసిపడుతున్న దృశ్యం కనిపించింది.

సర్వస్వం కోల్పోయాం ఆదుకోండి

భువనేశ్వర్, న్యూస్‌టుడే: అగ్నిదేవుని ఆగ్రహానికి సర్వస్వం కోల్పోయాం, పూటకింత బువ్వ పెట్టే దుకాణాలు కాలి బూడిదయ్యాయి. మానవతా దృక్పథంతో ఆదుకోవాలని పరదీప్ కూరగాయల మార్కెట్ రీటైల్ వ్యాపారులు అధికారుల వద్ద మొరపెట్టుకున్నారు. శనివారం రాత్రి 2 గంటలకు పరదీప్ బొడపొడియా కూరగాయల మార్కెట్‌లో అగ్నిప్రమాదం జరిగింది. 60 దుకాణాలు తగలబడ్డాయి. అగ్నిమాపక జవానులు చేరుకుని మంటలు నియంత్రించేలోగా తీవ్రనష్టం జరిగిపోయింది. విద్యుత్తు షార్ట్ సర్క్యూట్ ఈ ఘటనకు కారణం కాగా కూరగాయల నిల్వలన్నీ మాడి మసి అయ్యాయి. వ్యాపారులంతా పేదలు. ఈ దుకాణాలే వారి బతుకు తెరువు. ఆదివారం ఉదయం జగత్సింగ్‌పూర్ పాలనాధికారి జె.సోనాల్, పరదీప్ మున్సిపాలిటీ అధికారులు ఘటనా స్థలానికొచ్చి పరిశీలించారు. ఈ సందర్భంగా పాలనాధికారిని కలిసిన బాధితులు తామంతా మళ్లీ నిలదొక్కుకునేలా సాయం చేయాలని వినతిచేశారు. మున్సిపాలిటీ యంత్రాంగం వెండింగ్‌జోన్ నిర్మాణం చేయించి గదులు కేటాయించాలని కోరారు.

కాలిపోతున్న దుకాణాలు

ప్రమాదం తర్వాత ఇలా...

రెడ్‌ఫ్లాగ్ జాబితాలో బాలిక రేప్ కేసు

సిద్ధార్థ కటారియా

భువనేశ్వర్, న్యూస్‌టుడే: కేంద్రపడ జిల్లా రాజ్‌కనికా ప్రాంతానికి చెందిన 7వ తరగతి బాలికపై జరిగిన అత్యాచారం ఘటనను రెడ్‌ఫ్లాగ్ జాబితాలో చేర్చినట్లు ఎస్పీ సిద్ధార్థ కటారియా ఆదివారం విలేకర్లకు చెప్పారు. ఈ కేసులో ఆంగ్ల పాఠశాలకు చెందిన ముగ్గురు ఉపాధ్యాయులు, ఒక ఉపాధ్యాయిని, ప్యూన్‌ను అరెస్టు చేసినట్లు తెలిపారు. బాలికపై నలుగురు అత్యాచారం చేయగా, ఉపాధ్యాయిని వారికి సహకరించినట్లు చెప్పారు. ఈ అయిదుగురిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశామన్నారు. త్వరగా (60 రోజుల్లో) ఈ కేసు దర్యాప్తు చేసి ఛార్జిషీట్ కోర్టుకు సమర్పించి నిందితులకు శిక్ష ఖరారు చేయడాన్ని రెడ్‌ఫ్లాగ్‌గా పేర్కొంటారన్నారు. క్రైంబ్రాంచ్‌కి చెందిన ఒక ఉన్నతాధికారి పర్యవేక్షణలో దర్యాప్తు ప్రారంభమైందన్నారు. మహిళా కమిషన్, డీజీపీకి ఎప్పటికప్పుడు కేసు దర్యాప్తు వివరాలు తెలియపర్చడం రెడ్‌ఫ్లాగ్ నియమావళి అని, ఈ కేసును పోలీసు యంత్రాంగం సవాల్‌గా చేపట్టిందన్నారు.

అన్నదాతలకు అన్యాయం.. బిజద నేతల ఆందోళన

భువనేశ్వర్, న్యూస్‌టుడే: డబుల్ ఇంజిన్ పాలకులు అన్నదాతల గొంతు నులుముతున్నారని, వారి కాయకష్టానికి తగిన ఫలితం ఇవ్వడం లేదని, మండీల్లో లోపాలున్నా ఉపేక్షిస్తున్నారని, రైతన్నల ఆవేదన పట్టించుకోవడం లేదని బిజద నేతలు దుయ్యబట్టారు. ఆదివారం జగత్సింగ్‌పూర్ జిల్లా కేంద్రంలో మాజీ ఎంపీ రాజశ్రీ మల్లిక్ నాయకత్వంలో యువ, మహిళ, సీనియర్ నేతలంతా అన్నదాతలకు న్యాయం చేయాలన్న డిమాండ్‌తో ర్యాలీ నిర్వహించారు. కాలేజ్ కూడలి వద్ద జరిగిన బహిరంగ సభలో మోహన్‌చరణ్‌మాఝి పాలనా వైఫల్యాలను ఎండగట్టారు.

జగత్సింగ్‌పూర్‌లో బిజద నేతల ర్యాలీ

ఆందోళన కలిగిస్తోన్న బాల్య వివాహాలు

● పన్నెండు జిల్లాల్లో జాతీయ సగటును మించి నమోదవుతున్న కేసులు

ప్రభాతి పరిఢ

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: ఆడుతూ, చదువుతూ గడపాల్సిన బాల్యం సంసార చట్రంలో నలిగిపోతోంది. జీవితంలో ఉన్నత శిఖరాలకు బాటలు వేయాల్సిన కౌమారదశ వైవాహిక బంధంలో బందీగా మారుతోంది. రాష్ట్రంలో పెరుగుతున్న బాల్య వివాహ కేసులు తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. పన్నెండు జిల్లాల్లో జాతీయ సగటును మించి కేసులు నమోదు కావడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. శాసనసభలో శనివారం ఎదురైన ఓ ప్రశ్నకు ఉపముఖ్యమంత్రి ప్రభాతి పరిఢా బదులిస్తూ ఈ వివరాలను వెల్లడించారు. బాల్య వివాహాల కేసుల రేటు రాష్ట్రంలో 20.5 శాతంతో జాతీయ సగటు(23.3) కంటే తక్కువ ఉన్నప్పటికీ పన్నెండు రాష్ట్రాల్లో ఇది ఎక్కువగా నమోదైంది. పేదరికం, సంప్రదాయ నమ్మకాలు, సామాజిక అభద్రత, నిరక్షరాస్యత వంటి అంశాలు బాల్య వివాహాలకు కారణంగా నిలుస్తున్నాయి. వీటి నివారణకు ప్రభుత్వం అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నట్లు ప్రభాతి పేర్కొన్నారు.

జిల్లాల వారీగా నమోదవుతున్న బాల్య వివాహాల రేటు వివరాలను ఓ సారి పరిశీలిస్తే...

జిల్లా	రేటు
నవరంగపూర్	39.4
నయాగఢ్	35.7
కొరాపుట్	35.5
రాయగడ	33.2
మల్కాన్‌గిరి	32.4
మయూర్‌భంజ్	31.3
కేంఝర్	29
గజపతి	28.1
బాలేశ్వర్	26.4
బౌద్ధ్	25.3
అనుగుల్	25

ఇదీ పరిస్థితి

బాల్య వివాహ కేసులు ఎక్కువగా నమోదవుతున్న జిల్లాల జాబితాలో నవరంగపూర్, నయాగఢ్, కొరాపుట్, రాయగడ, మల్కాన్‌గిరి, మయూర్‌భంజ్ తదితర జిల్లాలు ఉన్నాయి. బాల్య వివాహాల నియంత్రణకు ఆయా జిల్లాల్లో అవగాహన, చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు అధికారులు చెబుతున్నా అవేవీ అక్కరకు రావడం లేదన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

(c) eenadu

వ్యాయామం.. నియమిత ఆహారంతో ఆరోగ్యం భద్రం

డాక్టర్ మోహన్‌రావును సత్కరిస్తున్న ప్రత్తి బుచ్చిబాబు. చిత్రంలో ఇతర ప్రతినిధులు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: నిత్యం వ్యాయామం, నియమిత ఆహారంతో ఆరోగ్యం కాపాడుకోవచ్చని వైద్యుడు ఎస్. మోహన్‌రావు అన్నారు. 'ఆర్య వైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవాప) బ్రహ్మపుర శాఖ ఆధ్వర్యంలో శనివారం రాత్రి ఓ సమావేశం జరిగింది. స్థానిక పార్కు వీధిలోని హోటల్ కామత్‌లో నిర్వహించిన దీనికి అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ తరచూ ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని, చరవాణులు, ఇతర స్క్రీన్ టైమ్‌ను తగ్గించుకోవాలని సూచించారు. అవాప అధ్యక్షుడు ప్రత్తి బుచ్చిబాబు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆ సంస్థ రాష్ట్రాధ్యక్షుడు వి.రవికుమార్ గుప్త, బ్రహ్మపుర శాఖ కార్యదర్శి ఎ.గోవిందరాజు, కోశాధికారి కె.కృష్ణారావు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో నిర్వాహకులు డాక్టర్ మోహన్‌రావు, ఎం.వి.ఎస్.వాసన్, ప్రశాంతిని సత్కరించారు.

ఉగాది వేడుకలకు అందరూ సహకరించాలి

మాట్లాడుతున్న కొండబాబు, లక్ష్మణరావు తదితరులు

రాయగడ గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లా స్థాయి ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహిద్దామని, అందరు సహకరించాలని ఉత్సవ కమిటీ అధ్యక్షుడు, భాజపా నాయకుడు, లారీ యజమానుల సంఘం అధ్యక్షుడు వై.వెంకటేశ్వరావు(కొండబాబు) అన్నారు. ఆదివారం రామలింగేశ్వర ఆలయ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. ఈ సమావేశంలో కళింగ వైశ్య సంఘం అధ్యక్షుడు కింతలి అమరనాథ్, బురదలపోలమ్మ ఆలయ కమిటీ అధ్యక్షుడు పతివాడ శ్రీనువాస నాయుడుతో పాటు పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

విద్యుత్తు అంతరాయం... గ్రామస్థుల ఆగ్రహం

నవరంగపూర్, న్యూస్‌టుడే: నెలవారీ విద్యుత్తు బిల్లులను సకాలంలో చెల్లిస్తున్నా పదే పదే విద్యుత్తు కోతలు విధిస్తున్నారని ఆరోపిస్తూ ఆదివారం నవరంగపూర్ జిల్లా ఉమర్‌కోట్ సమితి కుర్మాహండి, దల్బలి గ్రామాల ప్రజలు విద్యుత్తు శాఖ కార్యాలయాన్ని ముట్టడించారు. విద్యుత్తు అంతరాయం వల్ల అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్తు శాఖ ఇంజినీర్ సమస్య పరిశీలించి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో వెనుదిరిగారు.

కార్యాలయం వద్ద బాధిత గ్రామస్థులు

పాత్రికేయుల కృషి అభినందనీయం

వేదికపై ఉన్న ఎమ్మెల్యే దాశరథి, పక్కన అతిథులు

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: గజపతి జిల్లా మోహన సమితి బిజు కల్యాణమండపంలో ఆదివారం మోహన ప్రెస్ క్లబ్ 6వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే దాశరథి గమాంగ్, అతిథులుగా బౌద్ధ మందిరం గురూజీ ఉలి జిగ్మా రెంపో, మోహన రాణా అధికారి ఓం నారాయణ పాత్ర్, అడవా రాణా అధికారి సుబ్రాంత్ కుమార్ పండా, ఓయూజే రాష్ట్ర కార్యదర్శి రూపేష్ సాహు పాల్గొన్నారు. ఎమ్మెల్యే దాశరథి మాట్లాడుతూ పాత్రికేయులు అందరూ ఓ సంఘంగా ఏర్పడి ఇలా వార్షికోత్సవం జరుపుకోవడం ఎంతో సంతోషకరమని, సమస్యలను తెరపైకి తీసుకువచ్చి దాని పరిష్కారానికి కృషి చేస్తున్న వారి కర్తవ్యానికి అభినందనలు తెలిపారు.

జల క్రీడల సాహస శిక్షణ శిబిరం

శిబిరం ఏర్పాట్లు పరిశీలిస్తున్న క్రీడాశాఖ అధికారి స్వయిన్

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: రాష్ట్ర క్రీడా శాఖ ఆధ్వర్యంలో కటక్ మహనదిలో తొలిసారిగా జల క్రీడల సాహస శిక్షణ శిబిరం ఆదివారం ప్రారంభమైంది. మహానది సూర్య దీవిలో రాష్ట్రస్థాయిలో నిర్వహిస్తున్న దీనికి రాష్ట్ర క్రీడా శాఖ అదనపు కార్యదర్శి బిజయకుమార్ స్వయిన్ శ్రీకారం చుట్టారు. ఈమేరకు ఆయన శనివారం మహానది వద్ద తీరంలో శిబిరం ఏర్పాట్లు పరిశీలించారు. భద్రత, రక్షణ ఇతర అంశాలను క్రీడాకారులకు శిబిరంలో శిక్షణ అందించాలని ఆయన నిర్వాహకులకు సూచించారు.

ఖేలో ఇండియా ఆదివాసీ క్రీడలకు రాష్ట్ర లిఫ్టర్లు

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: ఛత్తీస్‌గఢ్‌లో వచ్చే మార్చి 12 నుంచి 22 వరకు జరగనున్న ఖేలో ఇండియా ఆదివాసీ క్రీడలు-2026కు ఒడిశా లిఫ్టర్లు ఎంపికయ్యారు. రాష్ట్ర సీనియర్ వెయిట్ లిఫ్టింగ్ కోచ్ కె.రవికుమార్ ఆదివారం 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ జిల్లాల ఉన్నత శిక్షణ కేంద్రాలనుంచి ఎంపిక చేసిన పదిహేడుమంది పురుషులు, మహిళా లిఫ్టర్లు పోటీలకు సిద్ధమవుతున్నారన్నారు. వీరంతా వివిధ శరీరబరువు కేటగిరీలలో స్నాచ్, క్లీన్ జర్క్‌లలో బరువులెత్తి పోటీపడనున్నట్లు ఆయన చెప్పారు.

పోటీలకు ఎంపికైన లిఫ్టర్లు

సాహితీవేత్తలకు సత్కారం

ప్రముఖులను సన్మానిస్తున్న దేబప్రసాద్ దాస్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: ప్రపంచ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని భువనేశ్వర్‌లోని సంస్కృతీ భవనంలో ఒడిశా సాహిత్య అకాడమీ, ఒడియా భాషా ప్రతిష్ఠాన్ సంయుక్త సారథ్యంలో వేడుకలు జరిగాయి. సాహితీవేత్తలు, రచయితలు, వివిధ రంగాల ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రదర్శన ఏర్పాటైంది. ఇది ఈ నెల 27 వరకు కొనసాగనుంది. సాహితీరంగానికి సేవలందిస్తున్న వారికి సత్కరించారు. కార్యక్రమంలో భాషా ప్రతిష్ఠాన్ సంచాలకుడు దేబప్రసాద్‌దాస్, సాహిత్య అకాడమీ కార్యదర్శి చంద్రశేఖర్ హోత్తా, సమన్వయకర్త సిద్ధార్థశంకర్ పాఢి తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులకు శిక్షణ శిబిరం

శిబిరంలో పాల్గొన్న అధికారులు

జయపురం, న్యూస్‌టుడే: జయపురం వ్యవసాయశాఖ కార్యాలయంలో ఆదివారం వ్యవసాయ, రెవెన్యూ శాఖల రబీసాగు కోసం డిజిటల్ శిక్షణ శిబిరం జరిగింది. అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి అనుమానాస్పద ప్లాట్లను గుర్తించి పంట వైవిధ్యీకరణ, భూమి పారామీటర్ పరిశీలించి ఈనెల 28 నాటికి జాబితాను సిద్ధం చేసి శాఖకు అప్పగించాలని సమితి వ్యవసాయ శాఖాధికారి శితికంఠదాస్ ఆదేశించారు. శిబిరంలో వివిధ పంచాయతీలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

భారీగా కలెక్షన్లు

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: ఖరగ్‌పూర్ డివిజన్‌లో రైల్వే టికెట్ చెకింగ్ స్టాఫ్ శనివారం పలు రైళ్లలో నిర్వహించిన తనిఖీల్లో 379 కేసులు నమోదు చేశారు. ఇందులో రూ. 2,23,290లు రికార్డు కలెక్షన్ చేసినట్లు రైల్వే ప్రకటించింది.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ

ప్రతిష్ఠించిన రాధాకృష్ణుల విగ్రహాలు

రాయగడ, న్యూస్‌టుడే: స్థానిక కోఆపరేటివ్ కాలనీలో కొత్తగా నిర్మించిన మందిరంలో ఆదివారం ఉదయం రాధాకృష్ణ విగ్రహ ప్రతిష్ఠ కన్నుల పండువగా జరిగింది. విగ్రహ ప్రతిష్ఠ అనంతరం భక్తులు దర్శన దర్శనం చేసుకొని, అనంతరం దేవతామూర్తులను దర్శించుకున్నారు. రాజ్యసభ మాజీ సభ్యుడు నెక్కంటి భాస్కర రావు, భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

అన్ని భాషలను ఆదరించాలి

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: మాతృభాషను మరవొద్దని అన్ని భాషలను సమానంగా ఆదరించాలని స్థానిక జైహింద్‌నగర్ ప్రవాసాంధ్ర నవ్య కళాపరిషత్‌లో శనివారం రాత్రి జరిగిన మాతృభాషా దినోత్సవంలో వక్తలు పేర్కొన్నారు. తెలుగుతల్లికి ఈ కార్యక్రమంలో కె.కొండలరావు, ఎం.రాజేష్, బెహరా శ్రీనివాసరావు, ఎల్.ఆర్.కె.రావు పాల్గొని ప్రసంగించారు.

టాస్క్‌ఫోర్స్ అధికారుల తనిఖీలు

బాల కార్మికులతో మాట్లాడుతున్న అధికారులు

జయపురం, న్యూస్‌టుడే: కొరాపుట్ జిల్లా పాలనాధికారి ఆదేశాల మేరకు ఆదివారం జయపురం పట్టణంలో హోటళ్లలో, గ్యారేజీల్లో టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఆరుగురు బాల కార్మికులను గుర్తించి కొరాపుట్ శిశు సంక్షేమ కేంద్రానికి తరలించారు.

బాల్య వివాహం అడ్డగింత

నవరంగపూర్, న్యూస్‌టుడే: నవరంగపూర్ జిల్లా ఉమర్‌కోట్ రాణా పరిధిలో యంత్రాంగం, పోలీసులు సంయుక్తంగా బాల్య వివాహాన్ని అడ్డగించారు. సీడీపీఓ మినతినాయక్, సిబ్బంది సంబంధిత మార్, పీఈఓ గాయత్రి బండారి తదితరులు బొశెనపల్లి గ్రామానికి చేరుకుని వివాహాన్ని నిలిపివేశారు.

కాంగ్రెస్ నేత జగబంధు కన్నుమూత

జగబంధు సమరథ్(పాతచిత్రం)

జయపురం, న్యూస్‌టుడే: కొరాపుట్ జిల్లా కొట్పాడ్ సమితి ముర్తిహండి పంచాయతీ మాజీ సమితి సభ్యుడు, కాంగ్రెస్ నేత జగబంధు సమరథ్(58) శనివారం రాత్రి గుండెపోటుతో మృతిచెందారు. ఆయనకు హఠాత్తుగా గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ మృతిచెందినట్లు వైద్యులు ప్రకటించారు.

ఐఐటీ ఖరగ్‌పూర్ మరో ముందడుగు

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: ఐఐటీ ఖరగ్‌పూర్‌లో డీఆర్‌డీఓ ఇండస్ట్రీ అకాడమీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ప్రారంభించారు. ఇది భారత దేశ స్వదేశీ రక్షణ పరిశోధన, ఆవిష్కరణ, పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేయడంలో ఒక ముఖ్యమైన మైలురాయి అని అధికారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఐఐటీ డైరెక్టర్ ఆచార్య సుమన్ చక్రవర్తి తదితరులు ప్రసంగించారు.

ప్రారంభోత్సవ కార్యక్రమంలో అతిథులు

సత్సంగంతో మంచి ఫలితాలు

వేదికపై యోగిశ్రీ చైతన్య రాంజీ తదితరులు

రాయగడ, న్యూస్‌టుడే: సత్సంగం, ధ్యానం వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుందని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త యోగిశ్రీ చైతన్య రాంజీ అన్నారు. ఆదివారం కొల్నార్ సమితి రివలకోన వనవాసి కల్యాణ ఆశ్రమంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఆశ్రమ అధ్యక్షుడు రామకృష్ణ పాణిగ్రాహి అధ్యక్షతన సంచాలకులు ప్రకాష్‌రౌతు, గీతాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఇన్నాళ్లకు పింఛను అందజేయటం ప్రారంభం

కార్యాలయంలో పింఛను అందజేస్తున్న అధికారులు

జయపురం, న్యూస్‌టుడే: జయపురం సబ్‌డివిజనల్ పరిధిలో కుంద్రా సమితి అన్న ప్రజల దీర్ఘకాలిక కోరిక నెరవేరింది. మొట్టమొదట సారిగా స్థానిక సాంస్కృతిక భవనంలో సర్పంచి రామ్‌సింగ్ గౌడ్, పీఈఓ గౌరంగచరణ్ మాఝి నేతృత్వంలో 250 మందికి పింఛన్లు అందజేశారు.

ఆరోపణలు, ప్రత్యారోపణలపై మీడియా సమావేశం

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ప్రతినిధి అశోక్

నవరంగపూర్, న్యూస్‌టుడే: నవరంగపూర్‌లో వైద్య కళాశాల నిర్మాణానికి పట్టు పట్టిన ఆరోపణలను ఆదివారం భాజపా నేతలు కొట్టివేశారు. ఉమర్‌కోట్‌లో ఎమ్మెల్యే, మంత్రి నిత్యానందగొండ్ ఉన్నప్పటికీ సమితిలో కళాశాల నిర్మాణానికి మంత్రి తన ప్రయత్నం చేయలేదని ప్రతిపక్ష పార్టీలు విమర్శించాయి. దీనిపై ఆదివారం మంత్రి ప్రతినిధి అశోక్‌పాఢి మీడియా సమావేశం నిర్వహించి మంత్రి నిర్లక్ష్యం లేదని, ముఖ్యమంత్రి నిర్ణయాన్ని సమర్థించారని అన్నారు.

దక్షిణాసియా సెపక్ తక్రాలో ఆకాష్‌కు పతకాలు

పతకాలతో ఆకాష్ కుమార్ రెడ్డి. చిత్రంలో క్రీడాశాఖ అధికారులు

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: శ్రీలంకలో జరిగిన ఆరో దక్షిణ ఆసియా సెపక్ తక్రా పోటీల్లో రాష్ట్ర క్రీడాకారుడు ఉత్తమ ఆటతో పతకాలు సాధించాడు. ఇందులో నిర్వహించిన రెగు, క్వాడ్, బృంద అంశాల్లో పోటీపడిన క్రీడాకారుడు ఆకాష్ కుమార్ రెడ్డి మూడు పసిడి పతకాలు గెలుచుకున్నాడు. ఈమేరకు శనివారం భువనేశ్వర్‌లోని కళింగ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో రాష్ట్ర క్రీడాశాఖ సంచాలకుడు విజయ్ ఎద్దుల ఇతర అధికారులు ఆకాష్‌కు అభినందనలు తెలిపారు.

సమాజాన్ని జాగృతం చేసే రచనలు చేయాలి

రాయగడ, న్యూస్‌టుడే: కవులు తమ రచనలతో సమాజాన్ని జాగృతం చేయాలని, సమాజ హితం కోసం పాటుపడాలని ప్రముఖ కవి శ్రీరంగ నాయక్ అన్నారు. ఆదివారం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల సమావేశ భవనంలో సంబాద్ సాహిత్య గృహ 14వ వార్షికోత్సవ సభలో ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. పంచవటి పత్రిక సంపాదకుడు సుశాంత్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అతిథులను సత్కరించి జ్ఞాపిక అందజేస్తున్న ప్రతినిధులు

ఆంధ్ర విద్యాలయం వార్షిక క్రీడలు

విద్యార్థులు, ఉపాధ్యాయుల ర్యాలీ

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: ఆంధ్ర విద్యాలయం(టిట్లాఘడ్) ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు సంయుక్తంగా స్థానిక బీఎన్ మైదానంలో వార్షిక క్రీడలు ఆదివారం నిర్వహించారు. పాఠశాల మేనేజింగ్ కమిటీ, ఉపాధ్యాయులు, సిబ్బంది నేతృత్వంలో ఈ కార్యక్రమం జరిగింది. మొదట విద్యార్థులు, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు, మేనేజింగ్ కమిటీ సభ్యులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పలురకాల క్రీడా పోటీలు జరిగాయి.

'ఆప్' రాష్ట్ర అధ్యక్షుడి ఆగ్రహం

ఆప్ నాయకుడు నిషికాంత్ మహాపాత్ర్, కార్యకర్తలు

బరగడ్, న్యూస్‌టుడే: ఒడిశాలోని సంబల్‌పూర్, బరగడ్ జిల్లాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను(మండీలను) ఆదివారం ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) రాష్ట్ర అధ్యక్షుడు నిషికాంత్ మహాపాత్ర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండీల్లో ధాన్యం బస్తాలు పేరుకుపోయినా కొనుగోలు చేయడం లేదని ఆరోపించారు. 48 గంటల్లో డబ్బులు ఇస్తామన్న ప్రభుత్వం, 20 రోజులైనా రైతులకు చెల్లింపులు చేయలేదని మండిపడ్డారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి రైతులకు బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

బుద్ధిమాంద్యం చిన్నారుల గుర్తింపు

చిన్నారులకు పరీక్షలు నిర్వహిస్తున్న బృంద సభ్యులు

కొరాపుట్, న్యూస్‌టుడే: జిల్లాలో బుద్ధిమాంద్య చిన్నారుల గుర్తింపు విస్తృతంగా చేపడుతున్నారు. ఏక్తా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు జిల్లాలో అన్ని సమితుల్లో పర్యటిస్తూ చిన్నారులతో మాట్లాడుతూ భిన్నంగా ప్రవర్తిస్తున్న వారి లక్షణాలు గుర్తించి అవసరమైన పరీక్షలు నిర్వహిస్తున్నారు. అవసరమైన సూచనలు చేస్తూ, వారి వికాసానికి అవసరమైన సలహాలు ఇస్తూ సర్వే నిర్వహిస్తున్నట్లు సంస్థ ప్రతినిధి జగన్నాథ మిశ్ర తెలిపారు.

అలరించిన ఫ్యాషన్ షో

భువనేశ్వర్, న్యూస్‌టుడే: భువనేశ్వర్‌లోని ప్రదర్శనా మైదానంలో ఏర్పాటైన 20వ తోషాలి చేనేత ప్రదర్శనా మేళాలో శనివారం రాత్రి ఫ్యాషన్ షో ఏర్పాటైంది. నేత కార్మికులు భక్తరాజ్ మెహర్, ఆర్.కె.మెహర్, హరిసర్కార్ మెహర్, ఉత్తమ్ మెహర్, అరింద్రమెహర్‌లను సత్కరించారు. చేనేత, జౌళి శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి పూనం తాపస్‌కుమార్ గుహ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ నెల 27 వరకు తోషాలి మేళా జరుగుతున్న సంగతి తెలిసిందే.

ఫ్యాషన్ షోలో పాల్గొన్న భామల అలరింత

ఓక్‌ల్యాండ్ పాఠశాల వార్షికోత్సవం

జయపురం, న్యూస్‌టుడే: జయపురం పట్టణం అంబాగుడ ప్రాంతంలోని ఓక్‌ల్యాండ్ స్కూల్ 11వ వార్షికోత్సవం శని, ఆదివారాలు ఘనంగా జరిగాయి. పాఠశాల అధ్యక్షుడు రమేష్‌సాహు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ నేత భాస్కర్ పట్నాయక్, ఐఐసీ సచ్చీంద్ర ప్రధాన్, అగ్నిమాపక శాఖ అధికారి సురేష్‌బారిక్ తదితరులు పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించాయి.

నేపాల్‌పై శ్రీలంక గెలుపు

ప్లేయర్ ఆఫ్ దిమ్యాచు బహుమతి అందుకుంటున్న గిమదు ఎల్ మల్కమ్

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: కటక్ బారాబటి స్టేడియంలో కొనసాగుతున్న ఏడీసీఏ టీ 20 ఆసియా కప్ క్రికెట్ టోర్నీలో శ్రీలంక జట్టు ఆరు వికెట్ల తేడాతో మ్యాచు గెలుపొందింది. ఇందులో ఆదివారం నిర్వహించిన నాలుగో మ్యాచులో టాస్ గెలిచిన నేపాల్ జట్టు బౌలింగ్‌ను ఎంచుకుంది. దీంతో తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీలంక జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 204 పరుగులు చేసింది. జట్టు క్రీడాకారులు గిమదు ఎల్ మల్కమ్ 88 (59 బంతులు), దినుక సచిన్ 49 (37) రజిత అసంక 33 (15) పరుగులు చేసి జట్టు అధిక స్కోరుకు తోడ్పడ్డారు. తర్వాత బ్యాటింగ్ బరిలోకి దిగిన నేపాల్ జట్టు 13.5 ఓవర్లలో అన్ని వికెట్లు కోల్పోయి కేవలం 47 పరుగులు మాత్రమే చేసి ఓటమి చవిచూసింది.

EENADU Classifieds
JOBS
MARKETING/ SALES
Anand Masale Require Sales & Marketing Manager, Marketing Executives. Contact: 9849655105, 9848053144 Email: anandmasalaappltd@gmail.com

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం
ఈనాడు క్లాసిఫైడ్స్
5 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే
సంప్రదించండి: 8008597609

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

అమ్ముడుపోని ధాన్యం



మండీ వద్ద ఉన్న ధాన్యం బస్తాలు

నవరంగపూర్, న్యూస్‌టుడే: వివిధ సమస్యల కారణంగా నవరంగపూర్ జిల్లాలో ధాన్యం విక్రయాలకు నోచుకోలేదు. దాంతో మండీల వద్ద దాదాపు 4.72 లక్షల బస్తాల ధాన్యం పడి ఉన్నట్టు అధికారులు తెలిపారు. అత్యధికంగా చందహండి సమితిలో ఉన్న ఆరు మండీల్లో లక్ష 18 వేల 150 బస్తాలు ఉన్నట్లు సమాచారం.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97609
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80081 11237

వైద్యుల నిర్లక్ష్యంతో మహిళ మృతి

● కుటుంబ సభ్యుల ఆరోపణ

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: పర్లాఖెముండిలోని జిల్లా ప్రధాన ఆసుపత్రిలో వైద్యుల నిర్లక్ష్యంతో మహిళ మృతి చెందిందని కుటుంబసభ్యుల ఆరోపించారు. ఈ ఘటన ఆదివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.... గుమ్మ సమితి గుమ్మ గ్రామంలోని క్రిస్టియన్ వీధికి చెందిన దీప్తిరాణి బెబర్త(42) అస్వస్థతకు గురవ్వడంతో శనివారం అర్ధరాత్రి జిల్లా ప్రధాన ఆసుపత్రిలో కుటుంబ సభ్యులు చేర్పించారు. వైద్యురాలు సరైన చికిత్స అందించకుండా నిర్లక్ష్యం చేసిందని, ఆసుపత్రిలో ఐసీయూ లేక మృతి చెందినట్లు ప్రేమ్‌కుమార్ బెబర్త, జాన్సన్ బెబర్త ఆరోపించారు. ఆసుపత్రి బెడ్‌పై రోగి మృత్యువుతో పోరాడం చూసి కుటుంబ సభ్యులు కిందపడి రోదిస్తున్న వీడియోలు ప్రస్తుతం సామాజిక మాధ్యమంలో చక్కర్లు కొడుతున్నాయి.

వాహనం ఢీకొని వృద్ధుడి మృత్యువాత

నవరంగపూర్, న్యూస్‌టుడే: గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధుడు మృతిచెందిన ఘటన నవరంగపూర్ జిల్లా డాబుగావ్ ఠాణా పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఠాణా పరిధిలో ముండిగూడ గ్రామానికి చెందిన కృష్ణ బొత్ర(70) డాబుగావ్-పపదహండి రహదారిపై ఉన్న మిల్లులో ధాన్యం విక్రయించి తిరిగి నడుచుకుంటూ వెళుతుండగా, మహేంద్ర చౌక్ వద్ద గుర్తు తెలియని వాహనం ఆయనను ఢీకొట్టింది. రక్తమోడుతూ పడి ఉన్న కృష్ణను స్థానికులు ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతిచెందినట్టు వైద్యులు ప్రకటించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

యువకుడి దుర్మరణం

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లా భంజనగర్ పోలీసు స్టేషన్ పరిధిలోని బరదా సమీపంలో ఆదివారం గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ ద్విచక్ర వాహన చోదకుడు మృతి చెందాడు. మృతుడు బిలపడ గ్రామానికి చెందిన ప్రభాత్ నాయక్ (24)గా గుర్తించారు. ఆయన మధ్యాహ్నం గ్రామం నుంచి ద్విచక్ర వాహనంపై భంజనగర్ వైపు వెళుతుండగా ఈ ఘటన జరిగింది. రహదారి పక్కన తీవ్ర గాయాలతో పడి ఉన్న క్షతగాత్రుడ్ని గ్రామస్థులు భంజనగర్ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే నాయక్ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

వృద్ధుడి బంధువుల రాస్తారోకో

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: ఝూర్‌గ్రామ్ జిల్లా గోపివల్లభ్‌పూర్ సమితి నుంచి హతీబారీ వైపునకు ఇసుక లోడుతో వెళుతున్న ఓ ట్రక్కు హతిబారీ చౌక్ వద్ద ఒక వృద్ధుడ్ని ఢీకొంది. పోలీసులు ఈ ఘటనలో మధుసూదన్ రౌత్ అనే వృద్ధుడు మృతిచెందాడని గుర్తించారు. ఈ ఘటనతో స్థానికులు రాస్తారోకో చేశారు. పోలీసులు నచ్చజెప్పడంతో విరమించుకున్నారు.

బాలింత బంధువుల ఆందోళన

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: శిశువుకు జన్మనిచ్చి అనంతరం బాలింత చనిపోయిన ఘటన మిడ్నాపూర్ వైద్య కళాశాలలో చోటుచేసుకుంది. పురన్ బేరా గ్రామానికి చెందిన గర్భిణి మౌనికా కరణ్(32) శుక్రవారం సాయంత్రం ప్రసవ వేదనతో ఆసుపత్రిలో చేరింది. రాత్రి ఒక శిశువుకు జన్మనిచ్చి ఆమె చనిపోయింది. వైద్యులు, నర్సుల అశ్రద్ధ వల్ల ఆమె మృతిచెందిందని బంధువులు ఆరోపిస్తూ ఆందోళన చేశారు.

మద్యానికి డబ్బు ఇవ్వలేదని తండ్రిపై దాడి

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: మద్యం కోసం డబ్బు ఇవ్వడానికి నిరాకరించిన తండ్రిపై మారణాయుధంతో కొడుకు దాడి చేసిన ఘటన గంజాం జిల్లా దిగపొహండి పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. తీవ్రంగా గాయపడ్డ తండ్రి కె.బుల్లు రెడ్డి (52)కి దిగపొహండి ఆరోగ్య కేంద్రంలో చికిత్స అనంతరం ఆదివారం స్థానిక ఎమ్కేసీజీ ఆసుపత్రికి తరలించారు. బి.తురుబుడి పంచాయతీలోని దశిపూర్ గ్రామానికి చెందిన కె.ధనురెడ్డి ఏపీలోని తిరుపతిలో కార్మికునిగా పనిచేస్తున్నాడు. సొంతూరు వచ్చిన ఆయన శనివారం రాత్రి మద్యం తాగేందుకు డబ్బులు ఇమ్మని తండ్రి బుల్లు రెడ్డిని అడగ్గా అతడు నిరాకరించాడు. దీంతో అర్ధరాత్రి ఆయనపై ధనురెడ్డి కత్తితో దాడి చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

గృహిణి హత్య కేసులో దంపతుల అరెస్టు

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: ఝూర్‌గ్రామ్ జిల్లా పరిధిలో నయాగ్రామ్‌కు చెందిన లక్ష్మీముర్ము అనే గృహిణి బుధవారం మెడికల్ స్టోర్‌కు వెళ్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లింది. ఆమె తిరిగి రాకపోవడంతో పోలీస్‌స్టేషన్లో బంధువులు ఫిర్యాదు చేశారు. ఊరి చివర ఆమె మృతదేహం కనిపించింది. పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని దర్యాప్తు మొదలుపెట్టారు. ఈ కేసులో పోలీసులు లక్ష్మీ ఇంటి పక్కన ఉన్న ఓ దంపతులను అదుపులో తీసుకుని విచారించారు. నిజం ఒప్పుకున్న నిందితులను శనివారం అరెస్టు చేశారు.

గోల్‌బజార్‌లో అగ్నిప్రమాదం

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: పట్టణ గోల్‌బజారులో శనివారం రాత్రి అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఒక పూజాసామగ్రి దుకాణం పూర్తిగా, మరో దుకాణం పాక్షికంగా కాలిపోయాయి. స్థానికులు అప్రమత్తమై మంటలను అదుపులోనికి తెచ్చారు. ఇంతలో అగ్నిమాపక సిబ్బంది వచ్చి పరిస్థితిని చక్కదిద్దారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ఈ ప్రమాదం జరిగిందని వ్యాపారి పేర్కొన్నారు.

ముగ్గురి అరెస్టు... ఇద్దరు పరారీ

పట్టుబడ్డ నిందితులతో పోలీసు అధికారులు

రాయగడ గ్రామీణం, న్యూస్‌టుడే: రాయగడ జిల్లా బిసంకటక్ పోలీసుస్టేషన్ డాకులగుడలో జరిగిన దోపిడీ కేసును 24గంటల్లో పోలీసులు ఛేదించారు. ఇందులో ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. మరో ఇద్దరు పరారయినట్లు తెలిపారు. శుక్రవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి ఎస్‌డీపీవో సౌధమని ఓరం తెలిపిన వివరాల ప్రకారం...డాకులగూడ గ్రామంలో వర్తకుడు బగవాన్ నాయక్ ఇంట్లో దుండగులు ప్రవేశించి, కుటుంబ సభ్యుల్ని తుపాకితో బెదిరించారు. అనంతరం వెండి వస్తువులను దోచుకున్నారు. వారు జాజ్‌పూర్‌కు చెందిన ఎర్ర్లు శివప్రధాన్, అంజయ ప్రధాన్, సోమేస్ ప్రధాన్‌లుగా గుర్తించారు. రాయగడ జిల్లా సరిహద్దున పట్టుబడిన వీరి నుంచి రెండు బైక్‌లు, 14 వెండి రింగులు, 14 చేతి ఉంగరాలు, 5వెండి గొలుసులుతో పాటు రూ.4,400 నగదు స్వాధీనం చేసుకున్నారు.

హోటల్‌లో అగ్నిప్రమాదం

కాలిపోతున్న హోటల్

జయపురం, న్యూస్‌టుడే: జయపురం పట్టణం ఎన్‌కేటీ రహదారిపై ఉన్న హోటల్‌లో అగ్నిప్రమాదం జరిగింది. వంట గ్యాస్ లీక్ అవ్వడంతో ప్రమాదం జరిగినట్టు యజమాని మణి తెలిపారు. హోటల్‌లో దాదాపు రూ. 40 వేలు విలువ చేసే సామగ్రి ధ్వంసమైంది. అగ్నిమాపక శాఖ ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు.

దొంగతనం కేసులో ఇద్దరి అరెస్టు

రాయగడ గ్రామీణం, మునిగుడ, న్యూస్‌టుడే: రాయగడ జిల్లా మునిగుడ గుండిచనగర్ కాలనీలో మారణాయుధాలతో బెదిరించి దోపిడీ చేసిన ఘటనకు సంబంధించి ఇద్దరి నిందితులను శనివారం పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..గతేడాది డిసెంబరు 13న గుండిచనగర్ నివాసి అజేయ్ కుమార రౌత్ ఇంట్లో ప్రవేశించిన దోచుకున్నారు. ఘటన అనంతరం బాధితుడు రౌత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకొని కోర్టుకు తరలించారు.

రోడ్డు ప్రమాదం ఘటనలో...

జయపురం, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో వ్యాన్ ఢీకొని యువకుడు మృతిచెందగా, ఆ కేసుకు సంబంధించి జయపురం పోలీసులు ఒకరిని అరెస్టు చేశారు. నిందితుడు ఝార్ఖండ్ రాష్ట్రం హజారిబాగ్ జిల్లా చాపర గ్రామానికి చెందిన రాకేష్ ప్రజాపతి (21)గా గుర్తించారు. ఈ నెల 18న పాత్రపుట్ వద్ద ఓ వ్యాన్ బైక్‌ను ఢీకొని గస్సీ గొలారి అనే యువకుడు మృతిచెందాడు.

మద్యం రవాణా కేసులో ...

జయపురం, న్యూస్‌టుడే: అక్రమంగా మద్యం రవాణా కేసులో జయపురం ఆబ్కారీ శాఖ ఒకరిని అరెస్టు చేసింది. నిందితుడు గొడపాదర్ పంచాయతీ కలాగూడ గ్రామానికి చెందిన అమీర్ కులదీప్(24)గా గుర్తించారు.

గంజాయి స్వాధీనం

జయపురం, న్యూస్‌టుడే: కొరాపుట్ జిల్లా బొయిపరిగుడ సమితి కరపడా పంచాయతీ మాఝిగూడ గ్రామం వద్ద ఉన్న అడవిలో పోలీసులు ఆదివారం 257 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ముందస్తు సమాచారం ప్రకారం పోలీసులు ఒక బృందంగా ఏర్పడి తనిఖీలు చేయగా, 10 గంజాయి బస్తాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

పోలీసుల దాడులు

బరగడ్, న్యూస్‌టుడే: పద్మపూర్-ఝూరబంద్ ప్రాంతంలో వెలుగుచూసిన సైబర్ మోసం కేసు దర్యాప్తు పరిధి రోజురోజుకూ విస్తరిస్తోంది. విచారణలో కొత్త వ్యక్తుల పాత్ర బయటపడుతున్న నేపథ్యంలో ఆదివారం పట్టణంలోని బదీప్రసాద్ అపార్ట్‌మెంటులో రెండు ఇళ్లపై బరగడ్ పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు.

నిధులు రాక నిలిచిపోయింది..

కంచిలి మండలం మకరాంపురంలో వైకాపా ప్రభుత్వ హయాంలో రూ.20.08 లక్షలతో ప్రారంభించిన విలేజ్ హెల్త్ క్లినిక్ నిర్మాణ పనులు నిధుల లేమితో మధ్యలో నిలిచిపోయాయి. దీంతో పంచాయతీ పరిధిలోని వైద్య సేవలు అందక స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. పనులు పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు. ఈ విషయం పీఆర్ఏఈ ప్రవీణ్ వద్ద ప్రస్తావించగా ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే పనులు ప్రారంభిస్తామన్నారు. – న్యూస్‌టుడే, కంచిలి గ్రామీణం

కల్వర్టు ధ్వంసం

ఇచ్ఛాపురం పుర పాలకసంఘ పరిధి బెల్లుపడ కాలనీలో చిన్నవీధి మధ్యలో ఉన్న కల్వర్టు శిథిలమైంది. దీంతో రాకపోకలు సాగించడానికి ఇబ్బంది పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. దానికి మరమ్మతులు చేసి కొత్త సిమెంటు పలకలు అమర్చాలని కోరుతున్నారు. ఈ సమస్యను పుర కమిషనర్ నల్లి రమేష్ వద్ద ప్రస్తావించగా ఇంజినీరింగ్ అధికారులతో పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

కూలకముందే మేల్కోండి..

దుగానపుట్టుగ పంచాయతీ మున్నిపుట్టుగ గ్రామంలో దశాబ్దాల కిందట నిర్మించిన తాగునీటి ట్యాంక్ ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంది. దీని ద్వారా సరఫరా జరిగే మంచినీటిపై గ్రామంలో 300 కుటుంబాలు ఆధారపడి ఉన్నాయి. ఏ క్షణంలో కూలిపోతుందో తెలియడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. కొత్త ట్యాంకు నిర్మించాలని కోరుతున్నారు. ఈ విషయంపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వంశీని వివరణ కోరగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. – న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

చెక్క బల్లలే ఆధారం

సోంపేట మేజర్ పంచాయతీ తెలగవీధి పరిధిలో ప్రధాన డ్రైనేజీ నిర్మాణం లేకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎగువభాగం నుంచి వచ్చే మురుగు నీరు వెళ్లేందుకు అవకాశం లేకపోవడంతో ఇళ్ల ముందు నిలిచిపోతోంది. దోమలు, దుర్వాసనతో అవస్థలు ఎదుర్కొంటున్నామని చెబుతున్నారు. ఇంటి నుంచి రాకపోకలు సాగించేందుకు చెక్క బల్లలతో ఏర్పాట్లు చేసుకుంటున్నామన్నారు. సమస్యను పంచాయతీ ఈవో ఎం.శాంతికుమారి వద్ద ప్రస్తావించగా త్వరలో పనులు చేపడతామన్నారు. – న్యూస్‌టుడే, సోంపేట

వేగ నియంత్రికలేవీ?

వజ్రపుకొత్తూరు మండలం అమలపాడు నుంచి యూఆర్ కేపురం, తామాడపేట, ఎన్‌పీరోడ్డు తదితర గ్రామాలకు వెళ్లే రహదారులు అడుగడుగునా మలుపులతో ప్రమాదకరంగా మారాయి. కనీసం హెచ్చరిక బోర్డులు, వేగ నియంత్రికలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాల బారిన పడుతున్నామని వాహనదారులు పేర్కొంటున్నారు. దీనిపై ఆర్‌అండ్‌బీ జేఈ జగదీశ్‌ను వివరణ కోరగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు గ్రామీణం

విద్యార్థి దశ నుంచే చైతన్యం కావాలి

మెళియాపుట్టి, న్యూస్‌టుడే: విద్యార్థి దశ నుంచే ప్రతీ ఒక్కరూ చైతన్యం కావాలని కరజాడ జి.ప.ఉన్నత పాఠశాల హెచ్ఎం టీవీ రమణమూర్తి తెలిపారు. పాఠశాల ప్రాంగణంలో వస్తు, సేవలకు సంబంధించి నాణ్యతా ప్రమాణాలు గుర్తించే ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో వజ్జ విఘ్నేష్, పాలక యాదగిరి, దుప్పల మాధురి, పల్లి సోనియా బహుమతులు సాధించారు.

మళ్లీ వచ్చేశాయి..

జియ్యమ్మవలస: కొన్ని రోజులుగా కొమరాడ మండలంలో సంచరించిన ఏనుగుల గుంపు జియ్యమ్మవలస పరిధిలోకి శనివారం ప్రవేశించాయి. దీంతో పంటలు నాశనం చేస్తాయని బాసంగి, వెంకటరాజపురం, గవరమ్మపేట, పెదమేరంగి కూడలి నుంచి సుభద్రమ్మవలస, బట్లభద్ర రైతులు ఆందోళన చెందుతున్నారు.

బాలికా.. భళా

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని రామానంద్‌నగర్‌కు చెందిన లక్కోజు షాలిని శాస్త్రీయ నృత్యంలో రాణిస్తూ.. ప్రశంసలు, పురస్కారాలు అందుకుంటోంది. నృత్య శిక్షకురాలు శ్రావణి వద్ద రెండేళ్లుగా సాధన చేస్తున్న ఈ బాలిక ఇటీవల హైదరాబాద్‌లో పంచమ వేద నృత్య అకాడమీ ఆధ్వర్యంలో 108 పాటలతో జరిగిన నిత్య నీరాజనం కార్యక్రమంలో ప్రదర్శన ఇచ్చి ప్రశంసలు అందుకుంది. చిన్న వయసులోనే జీనియస్ బుక్ ఆఫ్ రికార్డ్సు, డైమండ్ వరల్డ్ రికార్డ్సు, వండర్ బుక్ ఆఫ్ రికార్డ్సు, గోల్డ్ స్టార్ వరల్డ్ రికార్డ్సు, జై ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్సుకు ఎక్కి గుర్తింపు పొందింది. గతంలో పార్వతీపురం, బొబ్బిలి, సాలూరు, కురుపాం ప్రాంతాల్లో ప్రత్యేక ప్రదర్శనలతో ఆకట్టుకుంది.

ఉత్తిపోతల పథకాలు

మరమ్మతులతో సాగు నీరందక రైతుల ఇక్కట్లు

– న్యూస్‌టుడే, కంచిలి, ఇచ్ఛాపురం గ్రామీణం

ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి సోంపేట మండలాలకు సంబంధించి ఐదు ఎత్తిపోతల పథకాలున్నాయి. వీటి ద్వారా సుమారు 2 వేల ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉంది. అన్నీ మరమ్మతులకు గురవడంతో పథకాల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంది.

✤ బాహుదా నదిపై 18 ఏళ్ల కిందట ఈదుపురం వద్ద నిర్మించిన ఎత్తిపోతల పథకం మరమ్మతులకు గురై శిథిలావస్థకు చేరింది. దీంతో సమీప పంటపొలాలు బాహుదానదిపై ఆధారపడాల్సిన దుస్థితి. 2017లో ఈ విషయమై ఎమ్మెల్యే బెందాళం అశోక్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన రూ.30 లక్షలు మంజూరు చేయించి దీనిని పునరుద్ధరించారు. రెండేళ్లు పనిచేసి మళ్లీ మూలకు చేరింది. బీల నుంచి ఎత్తిపోతల పథకం వరకు కాలువ పూడికతో పేరుకుపోయింది.

✤ సోంపేట మండలంలోని పొత్తంగి, రుషికుద్ద, బెంకిలి వద్ద మరో మూడు ఎత్తిపోతల పథకాలు ఉండగా అందులో ఒకటి అరకొరగా పనిచేస్తుంది. మిగిలిన రెండు 7 ఏళ్లగా పనిచేయకపోవడంతో ఆ ప్రాంతంలో ఉన్న 700 వందల ఎకరాలకు నీరు అందక అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఈదుపురం వద్ద మూలకు చేరిన ఎత్తిపోతల పథకం

✤ కంచిలి మండలంలోని కుత్తుమ వద్ద ఆయకట్టుకు సంబంధించి 250 ఎకరాలకు నీరందిచాల్సిన పథకం 6 ఏళ్లగా మరమ్మతులకు చేరింది. మహేంద్రతనయ నదిపై జగతికేశుపురం వద్ద నిర్మించిన పథకం కూడా ఐదేళ్లుగా పనిచేయం లేదు. దీనిపై ప్రత్యక్షంగా 900, పరోక్షంగా 400 వందల ఎకరాలు ఆధారపడి ఉన్నాయి.

అధికారులు పట్టించుకోవడం లేదు..

ఏళ్లుగా ఎత్తిపోతల పథకాలకు మరమ్మతులు లేకపోవడంతో సాగు నీటికి ఇబ్బందులు పడుతున్నాం. కనీసం ఖరీఫ్‌లోనైనా నీరందేలా చర్యలు తీసుకోవాలి. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదు.
– ప్రసాద్ (రైతు), కుత్తుమ

ప్రతిపాదనలు పంపించాం..

ఎత్తిపోత పథకాలు మరమ్మతులకు గురైన విషయాన్ని గుర్తించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. రూ.10 కోట్ల అంచనాలతో ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించాం. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తాం. – జి.మధుసూదన్, ఏఈ, ఇచ్ఛాపురం నియోజకవర్గం

గిరిజన సమస్యలపై చిన్నచూపు

కొత్తూరు, న్యూస్‌టుడే: గిరిజన సమస్యలపై కూటమి సర్కారు చిన్నచూపు చూస్తోందని మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి పేర్కొన్నారు. కాకరగూడ గ్రామంలో శనివారం ఆమె పర్యటించారు. గ్రామస్థులతో మాట్లాడి, సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గిరిజన గ్రామాల్లోని రహదారులు, తాగునీటి ఇబ్బందులపై పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించడంలో విఫలమయ్యారని విమర్శించారు.

కాకరగూడ గ్రామస్థులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ఆసుపత్రికి వెళ్తున్నారా.. స్ట్రెచర్లతో జాగ్రత్త..!

శ్రీకాకుళం సర్వజనాసుపత్రిలో రోగుల కోసం ఇటీవల ఓ ప్రైవేటు ఏజెన్సీ నుంచి 45 స్ట్రెచర్లు కొనుగోలు చేశారు. వాటి నాణ్యతను చూడకుండానే అధికారులు బిల్లులు సైతం చెల్లించేశారు. తీరా చూస్తే అవి అప్పుడే విరిగిపోతున్నాయి. కొన్ని ప్రమాణాలకు అనుగుణంగా లేకపోవడంతో ఎత్తు సరి చేశారు. ఒక్కోసారి పట్టుకుంటేనే విరిగిపోతున్నాయి. ఇలా అయితే రోగిని తీసుకెళ్లే సమయంలో ఏమైనా జరిగితే పరిస్థితి ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రొఫెసర్ ఉలకాపు ప్రసన్నకుమార్‌ను వివరణ కోరగా వాటిని వెనక్కి పంపిస్తామని చెప్పారు. – న్యూస్‌టుడే, బలగ(శ్రీకాకుళం)

అడ్డదారుల్లో దాటేస్తే నిఘా కళ్లతో చుట్టేస్తాం

ఈనాడు, పార్వతీపురం మన్యం

గంజాయి అక్రమ సాగు, రవాణా, అమ్మకాలు, వినియోగాన్ని అరికట్టేందుకు కూటమి ప్రభుత్వం పటిష్ఠ చర్యలు చేపట్టింది.. పోలీసు యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది.. మత్తు వద్దు బ్రో అంటూ యువతకు పిలుపునిస్తున్నారు. గ్రామాల్లో, విద్యా సంస్థల్లో అవగాహన కల్పిస్తున్నారు. ఉమ్మడి జిల్లా పోలీసు అధికారులు, ఈగల్ బృంద సభ్యులు ప్రత్యేక నిఘాతో అక్రమార్కులకు ముకుతాడు వేస్తున్నారు.

యువకులే ఎక్కువ..

★ జల్సాలకు, సులువుగా సంపాదనకు అలవాటు పడిన కొందరు అక్రమార్కులు గంజాయి రవాణా, అమ్మకాలకు పాల్పడుతున్నారు. వీరిలో ఎక్కువగా యువకులు కావడం గమనార్హం.

★ మన్యం జిల్లా నుంచి ఇద్దరి కింగ్ పిన్లపై చర్యలకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. అనుమతి రాగానే ఎన్‌డీపీఎస్ చట్టం కింద చర్యలు తీసుకుంటారు. ఇటీవల పాత కేసుల్లోని 12 మందిని అరెస్టు చేశారు.

★ విజయనగరం జిల్లాలో ఇప్పటి వరకు ఎనిమిది మంది కింగ్ పిన్లను గుర్తించారు. వారిలో ఏడుగురిని అరెస్టు చేయగా, ఒకడు పరారీలో ఉన్నాడు. వీరితో పాటు మరో ఇద్దరిని పీడీ యాక్ట్ కింద జైలుకు పంపించారు.

గత రెండేళ్లలో నమోదైన కేసులు..

జిల్లా	2024	2025
మన్యం	39	19
విజయనగరం	83	87

చెక్ పోస్టుల పెంపు..

గతంలో రెండు జిల్లాల్లో మూడు చెక్‌పోస్టులుండేవి. ఇప్పుడు బొడ్డవర, గ్రీన్‌ఫీల్డ్ హైవే, మెంటాడ, రామభద్రపురం, గంట్యాడ, పి.కోనవలస, కొమరాడ, ఎల్విన్‌పేట, బత్తిలిలో ఏర్పాటు చేశారు. ఒడిశా పోలీసులతో సంయుక్త దాడులు, క్లూస్, డాగ్ స్క్వాడ్, రైళ్లలో తనిఖీలు, హాట్ స్పాట్స్ చెకింగ్, డ్రోన్లతో నిఘా పెంచారు.



గంజాయి తరలిస్తున్న మార్గాలు

నాడు విచ్చలవిడి.. నేడు కట్టడి..

గత ప్రభుత్వ హయాంలో అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలో గంజాయి సాగు చేసి, ఉమ్మడి జిల్లా మీదుగా దేశంలోని వివిధ ప్రాంతాలకు అక్రమంగా రవాణా చేసేవారు. ఒడిశా నుంచి కూడా వచ్చేది. విజయనగరం, పార్వతీపురం, బొబ్బిలి, గజపతినగరం, సాలూరు, రామభద్రపురం, గరివిడి, రాజాం, పాలకొండ పట్టణాలకు సులువుగా చేరేది. ప్రస్తుతం కొంతమేర కట్టడి చేశారు. డ్రోన్ల సాయంతో గుర్తించి పంట ధ్వంసం చేశారు. మన్యం ఎస్పీ మాధవరెడ్డి ఒడిశా పోలీసులతో మాట్లాడి కట్టడికి చర్యలు తీసుకుంటున్నారు.

గంజాయి అక్రమార్కులకు ముకుతాడు

నిర్మూలనకు పోలీసుల ప్రత్యేక చర్యలు

కఠినంగా శిక్షిస్తాం..

గంజాయి అమ్మకాలు, వినియోగం వీడకపోతే చట్ట ప్రకారం కఠినంగా శిక్షిస్తాం. మాదకద్రవ్యాల నిరోధానికి ప్రత్యేక నిఘా పెట్టాం. రైళ్లలో సులువుగా తరలించకుండా దాడులు చేస్తున్నాం. పూర్తిస్థాయిలో రవాణా, విక్రయాలకు అడ్డుకట్ట వేస్తాం.
– ఎస్.మాధవరెడ్డి, ఎస్పీ, పార్వతీపురం మన్యం

ఆడుదాం.. ఆత్మరక్షణ పొందుదాం

గట్కా క్రీడపై చిన్నారుల్లో పెరుగుతున్న ఆసక్తి

న్యూస్‌టుడే, నరసన్నపేట

సిక్కు సంప్రదాయ యుద్ధ కళల్లో ఒకటైన గట్కా క్రీడపై చిన్నారుల్లో ఆసక్తి పెరుగుతోంది. ఇటీవల ఈ క్రీడాంశాన్ని మన రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల క్రీడల్లో చేర్చి విద్యార్థులను ప్రోత్సహిస్తోంది. ఆత్మరక్షణ సమయంలో దాడి చేయడం, కర్ర, దండం వంటి ఆయుధాలతో విన్యాసాలు చేస్తూ ప్రతిభ చూపే గట్కా క్రీడ జిల్లాలో స్థానికంగా ప్రాచుర్యంలోకి వచ్చింది.

సత్యవరంలో విద్యార్థులకు తర్ఫీదు ఇస్తున్న శిక్షకుడు ఖగేశ్వరరావు

నరసన్నపేట వారే అధికం

అండర్- 14, 17, 18, 21 విభాగాల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. నరసన్నపేట, శ్రీకాకుళం, టెక్కలి నియోజకవర్గాల విద్యార్థులు ప్రతిభ కనబరుస్తున్నారు. ముఖ్యంగా నరసన్నపేటలోని సత్యవరం, నరసన్నపేట, పిన్నింటిపేట ప్రాంతాల విద్యార్థులు ఈ పోటీల్లో రాణిస్తున్నారు. అండర్- 19 విభాగంలో గత నెల 5 నుంచి 11 వరకు లుథియానా, అండర్- 17కు సంబంధించి గత నెల 16 నుంచి 19 వరకు రాయ్‌పూర్‌లో జరిగిన జాతీయ స్థాయి గట్కా పోటీల్లో జిల్లా నుంచి 14 మంది పాల్గొన్నారు. వీరిలో ఒక్క నరసన్నపేట నియోజకవర్గం నుంచే 9 మంది ఉన్నారు. ఇక రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లాకు చెందిన 32 మంది విద్యార్థులు పాల్గొనగా 28 మంది స్వర్ణ పతకాలు దక్కించుకున్నారు. నరసన్నపేట వారు 23 మంది ఉండటం విశేషం.

ఆసక్తికి అనుగుణంగా శిక్షణ

గొట్టిపల్లి సమీపంలోని మైదానంలో గట్కాపై తర్ఫీదునిస్తున్నాం. సత్యవరం, నరసన్నపేట పాఠశాలల విద్యార్థుల ఆసక్తికి అనుగుణంగా శిక్షణ ఇచ్చి ప్రతిభావంతులుగా తీర్చిదిద్ది రాష్ట్ర, జాతీయ స్థాయిలో పతకాలు సాధించేలా కృషి చేస్తున్నాం. – బి.ఖగేశ్వరరావు, సూరపు సురేష్, విశ్రాంత ఆర్మీ ఉద్యోగులు, నరసన్నపేట

తరచూ ప్రమాదాలు.. తెరవరా కళ్లు

కొత్తూరు మండలం మెట్టూరు నుంచి వసప వెళ్లే ఆర్ అండ్‌బీ మార్గంలో వెంకటాపురం కూడలి వద్ద మలుపు ప్రమాదకరంగా ఉంది. ఇక్కడ ఓ వైపు చెరువు, మరోవైపు రహదారికి దిగువన పొలాలుండటంతో ప్రయాణికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, తక్షణమే మలుపులను సూచించే బోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఈ సమస్యపై ఆర్అండ్‌బీ ఏఈ గోపాలరావు మాట్లాడుతూ చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, కొత్తూరు

అధికారుల పాపం.. ప్రజలకు శాపం

సారవకోట మండలం పద్మాపురం గిరిజన కాలనీలో తాగునీటి ఎద్దడి నెలకొంది. ఈ ప్రాంతం ఎత్తు ప్రదేశంలో ఉండటంతో రక్షిత నీటి పథకం కుళాయిల నుంచి నీరందడం లేదని స్థానికులు వాపోతున్నారు. దీంతో కాలనీకి దిగువన ఉన్న కుళాయిలకు వెళ్లి తెచ్చుకోవాల్సి వస్తోందని వాపోతున్నారు. అధికారులు అనాలోచితంగా పనులు చేపట్టడమే ఈ పరిస్థితికి కారణమని విమర్శలు వినిపిస్తున్నాయి. సమస్యను పరిష్కరిస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మధుబాబు చెప్పారు. – న్యూస్‌టుడే, సారవకోట

బోరు.. రావడం లేదు నీరు..!

నందిగాం పంచాయతీ వేణుగోపాలపురం గ్రామం అంగన్‌వాడీ కేంద్రం వద్ద మంచినీటి బోరు మరమ్మతులకు గురైంది. ఏడాదిన్నరగా పరిస్థితి ఇలాగే ఉన్నా పట్టించుకునే వారే లేకుండా పోయారని, దీంతో తాగడానికి నీరు లేక ఇక్కట్లు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి బోరు బాగు చేయిస్తామని పంచాయతీ కార్యదర్శి శ్రీధర్ పేర్కొన్నారు. – న్యూస్‌టుడే, నందిగాం

దారంతా మాది.. ఇక్కట్లు మీవి

ఒడిశా నుంచి కొత్తూరు మీదుగా గ్రానైట్ లోడ్‌తో భారీ వాహనాలు నిత్యం తిరుగుతున్నాయి. పరిమితికి మించిన బరువుతో రాకపోకలు చేస్తుండటంతో రోడ్లు, వంతెనలు ధ్వంసమవుతున్నాయని ప్రయాణికులు పెదవి విరుస్తున్నారు. తరచూ ట్రాఫిక్ స్తంభిస్తుండటంతో ఇక్కట్లు పడుతున్నామని, ఇప్పటికైనా అధికారులు స్పందించి, అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు. ఈ విషయాన్ని ఆర్‌అండ్‌బీ డీఈఈ సాగర్ దృష్టికి తీసుకెళ్లగా.. లారీలు అధిక బరువుతో వెళ్లకుండా చూస్తామన్నారు. – న్యూస్‌టుడే, కొత్తూరు

లారీ, కారు ఢీకొని ఇద్దరి మృతి

మందస, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా మందస మండలం బాలిగాం సమీపంలో జాతీయ రహదారిపై శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతిచెందినట్లు మందస పోలీసులు తెలిపారు. ఒడిశా రాష్ట్రం కటక్‌కు చెందిన షేక్ ఖాదర్(27), పీయూష్ కుమార్ (25), సంతోష్‌కుమార్ సాహు, సోంప్రకాశ్ సాహు కారులో పలాసవైపు వస్తుండగా, కారు అదుపుతప్పి డివైడర్ పైకి ఎక్కి రెండో వైపు పలాస నుంచి ఇచ్ఛాపురం వైపు వెళ్తున్న లారీని ఢీకొట్టింది. దీంతో కారు ముందు సీట్లో కూర్చొన్న షేక్ ఖాదర్ అక్కడికక్కడే మృతి చెందగా, గాయపడిన పీయూష్‌కుమార్ శ్రీకాకుళం సర్వజనాసుపత్రిలో మృతి చెందారు. మిగిలిన ఇద్దరు స్వల్పగాయాలతో బయటపడ్డారని, షేక్ ఖాదర్ మామ దాదుసాహు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మందస ఎస్సై కృష్ణప్రసాద్ తెలిపారు.

బాలిగాం వద్ద ప్రమాదానికి గురైన కారు

దాతల చేయూత.. సర్కారు బడులు అభివృద్ధి బాట

పూర్వ విద్యార్థుల కృషితో పనులు

– న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు గ్రామీణం

వారంతా ఆ బడుల్లో చదువుకున్న పూర్వ విద్యార్థులే. చదువుతోపాటు మంచి నడవడికను నేర్పిన బడిని మరచిపోలేదు. ఏదో ఒక మంచి చేయాలనుకున్నారు. అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టి రుణం తీర్చుకోవాలనుకున్నారు. వివిధ బ్యాచ్‌లకు చెందిన పూర్వ విద్యార్థులు, మరికొంత మంది దాతలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి ప్రభుత్వ బడుల ప్రగతిలో మేము సైతమంటూ ఆదర్శంగా నిలుస్తున్నారు. వజ్రపుకొత్తూరు మండలంలోని పాతటెక్కలి, గోవిందపురం ఉన్నత పాఠశాలల అభివృద్ధికి వారు శ్రీకారం చుట్టారు.

★ పూండికి చెందిన కొంచాడ గోవిందరావు తన తల్లిదండ్రులు సత్యనారాయణమూర్తి, కనకరత్నం జ్ఞాపకార్థం గోవిందపురం ఉన్నత పాఠశాలలో రూ.20 లక్షలకు పైగా ఖర్చు చేసి విశాలమైన భోజనశాల నిర్మించారు. త్వరలో ప్రారంభోత్సవం చేపట్టనున్నారు.

★ ఇదే పాఠశాలలో విశ్రాంత ఉపాధ్యాయుడు లఖినాన డిల్లేశ్వరరావు తన భార్య హేమలత జ్ఞాపకార్థం రూ.2 లక్షలతో నిర్మించిన స్టడీ అవర్ గ్రౌండ్ ఫ్లోరింగ్‌ను గత నెల 25న ప్రారంభించారు. దీంతో విద్యార్థులకు ఉపయుక్తంగా ఉంది.

గోవిందపురం ఉన్నత పాఠశాలలో దాత నిర్మించిన భోజనశాల

★ 2005-2026 10వ తరగతి బ్యాచ్ విద్యార్థులు పాఠశాల గదులకు ముందు భాగంలో రూ.75 వేల ఖర్చుచేసి గ్రిల్స్ ఏర్పాటు చేశారు.

★ ఇక్కడి విద్యార్థులు చెట్ల నీడల్లో మధ్యాహ్న భోజనం చేస్తూ ఎదుర్కొంటున్న అవస్థలను బిగ్‌హెల్ప్ ఫౌండేషన్ సభ్యులు, పూర్వ విద్యార్థులు గుర్తించారు. 1992-93, 1985-86 బ్యాచ్ 10వ తరగతి విద్యార్థులు చెరో రూ.50 వేలు, బిగ్‌హెల్ప్ సంస్థ రూ.1 లక్ష కలిపి మొత్తం రూ.2 లక్షల వ్యయంతో పాఠశాలలో భోజనశాల (డైనింగ్ హాల్) వసతి కల్పించారు.

★ పాతటెక్కలి ఉన్నత పాఠశాలలో ఇప్పటికే పూర్వ విద్యార్థులు రూ.లక్షకు పైగా వెచ్చించి కళావేదిక, గ్రంథాలయ భవనం, వాటర్‌ప్లాంట్ వసతులు కల్పించారు.

★ 1990-91 బ్యాచ్ పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఇక్కడ విద్యార్థుల సైకిళ్లు, ఉపాధ్యాయుల మోటారు సైకిల్‌లు ఆరుబయట ఎండావానలకు మరమ్మతులకు గురికాకుండా రూ.2.50 లక్షలతో రక్షణ షెడ్డును ఏర్పాటు చేశారు. గత ఐదు నెలల కిందట అందుబాటులోకి తెచ్చారు.

అభినందనీయం

సర్కారు బడుల్లో అభివృద్ధి పనులకు దాతలు స్పందించి ముందుకు రావడం అభినందనీయం. స్థానిక దాత గోవిందరావు పెద్ద మొత్తంలో ఖర్చుచేసి పాఠశాలలో భోజన గది నిర్మించడం మరచిపోలేనిది. త్వరలో భవనం ప్రారంభిస్తాం.
– హరిబాబు, ప్రధానోపాధ్యాయుడు, గోవిందపురం

నిర్లక్ష్యం వీడరు.. నీరు పారదు..!

కవిటి మండలంలోని గొనామారి గెడ్డ పరిస్థితి ఇది. బీల పొలాలకు సాగునీరు అందించే ఈ గెడ్డలో చాపగడ్డి ఇలా దట్టంగా పెరిగిపోవడంతో పొలాలకు సాగునీరందడం లేదు. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా ఫలితం ఉండట్లేదని, ఏటా పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై జలవనరులశాఖ ఏఈ మధుసూదన పాణిగ్రహిని మాట్లాడుతూ ఉపాధి పథకం వేతనదారులతో గడ్డి తొలగింపజేయిస్తామని తెలిపారు. – న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

బీమా పథకాలతో భరోసా

కొత్తూరు, న్యూస్‌టుడే: బ్యాంకులు అందిస్తున్న బీమా పథకాలతో భరోసా లభిస్తుందని, వీటిని ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని కొత్తూరు యూనియన్ బ్యాంకు మేనేజర్ శ్రీనివాసరామం అన్నారు. మండలంలోని ముల్లేలగూడ గ్రామానికి చెందిన సవర చిన్నారి (31) గతేడాది పిడుగుపాటుకు గురై మృతి చెందారు. ఈమె బ్యాంకు ఖాతాకు బీమా ఉండడంతో అధికారులు రూ.2 లక్షలు మంజూరు చేశారు.

(c) eenadu

వసతులు కల్పిస్తేనే.. మెరుగైన సేవలు

పిడుగురాళ్ల వైద్య కళాశాల తీరిది

ఈనాడు, నరసరావుపేట, న్యూస్‌టుడే, కుమ్మరిపాలెం (పిడుగురాళ్ల): పిడుగురాళ్ల వైద్య కళాశాల త్వరలో అందుబాటులోకి రానుంది. 20 రోజుల్లో నిర్మాణ పనులు పూర్తి చేసి తమకు అప్పగించాలని రాష్ట్ర వైద్య విద్య అదనపు సంచాలకులు డాక్టర్ వెంకటేశ్వరరావు మెగా ఇంజినీరింగ్ సిబ్బందిని ఆదేశించిన నేపథ్యంలో పనులు వేగంగా జరుగుతున్నాయి. వైద్య కళాశాల బ్లాకులు, తరగతి గదులు, ఆసుపత్రి నిర్మాణం తుది దశకు చేరుకున్నా.. ముఖ్యమైన మౌలిక వసతులపై దృష్టి పెట్టలేదు. విద్యుత్తు, నీరు, రోడ్లు వంటి పనులు చేపడితేనే పూర్తిస్థాయిలో కళాశాల అందుబాటులోకి వస్తుంది.

సర్వీసు రోడ్డు నిర్మించాల్సిన ప్రాంతం

సర్వీసు రోడ్డు ఏదీ? పిడుగురాళ్ల నుంచి మాచర్ల వెళ్లే జాతీయ రహదారికి ఆనుకుని కామేపల్లి వద్ద వైద్య కళాశాల నిర్మాణం జరుగుతోంది. జాతీయ రహదారి పక్కనే ఉన్నా లోపలకు వెళ్లడానికి దారి లేదు. బ్రాహ్మణపల్లి బైపాస్ ప్రారంభం నుంచి కళాశాల ప్రధాన గేటు వరకు సర్వీసు రోడ్డు ఏర్పాటు చేయాలి. సమీపంలో పంట కాలువ ఉంది. దానిపై కల్వర్టు నిర్మించాలి. లేదంటే రాకపోకలు కష్టమవుతుంది.

విద్యుత్తు సౌకర్యం లేదాయె.. ఆరు బ్లాకులు.. 500 పడకల ఆసుపత్రి.. తరగతి గదులు.. వసతి గృహాలు.. సిబ్బంది ఉండేందుకు గదులు.. ఇలా ఒకేచోట భవన సముదాయాలకు విద్యుత్తు సౌకర్యం ఏర్పాటు చేయాలంటే చిన్నపాటి సబ్‌స్టేషన్ నిర్మించాలి. ట్రాన్స్‌ఫార్మర్లను ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలి. ఇంతవరకు వీటి ఊసే లేదు. ఇరవై రోజుల్లో కొన్ని బ్లాకుల్లో ఆసుపత్రి ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యుత్తుకు సంబంధించి లోఓల్టేజీ సమస్యలు తలెత్తే అవకాశం ఉంది.

రూ.5.9 కోట్లతో పైపులైన్.. వైద్య కళాశాలకు నీటి వసతి కల్పించేందుకు రూ.5.9 కోట్లతో పైపులైన్లు నిర్మించారు. ఇంతవరకు ట్రయల్ రన్ నిర్వహించలేదు. మోటార్ల ద్వారా నీటి సరఫరాకు ఇబ్బందులు ఎదురవుతున్నాయా? పైపులైన్ బాగానే ఉందా? వంటివి గుర్తించాలి. అది జరగాలంటే ట్రయల్ రన్ చేయాలి. 'విద్యుత్తు, సర్వీసు రోడ్డు కోసం ఆ శాఖలకు దరఖాస్తు చేసుకున్నాం. పైపులైన్ల నుంచి నీరు కళాశాలకు రావడానికి గుత్తేదారుకు సమాచారం అందించామని ఈఈ రమణారావు తెలిపారు.

చుట్టూ సుందరం.. కాలువంతా దుర్గంధం

వినుకొండలో ఎన్నెస్పీ కాలువ పిచ్చి మొక్కలు, మురుగు, వ్యర్థాలతో నిండిపోయింది. పట్టణంలో 2 కిలోమీటర్ల మేర కాలువ ఉంది. సుందరీకరణలో భాగంగా ఇరువైపులా పచ్చదనం, రహదారి ఏర్పాటు చేశారు. పలు కాలనీల ప్రజలు రాకపోకలు సాగించేందుకు కాలువపై పలు వంతెనలు నిర్మించారు. రూ.కోట్లు వెచ్చించి సుందరీకరణ పనులు చేసినా.. కాలువ నిర్వహణ గాలికి వదిలేశారు. వ్యర్థాలతో దుర్వాసన వెదజల్లుతోంది. కాలువను శుభ్రం చేయించాలని పట్టణ వాసులు కోరుతున్నారు.
- ఈనాడు, అమరావతి, న్యూస్‌టుడే, వినుకొండ

పిచ్చి మొక్కలతో నిండి..

కాలువలో మురుగు

వైకాపాకు పట్టలేదు.. కూటమి వదల్లేదు

అమరావతి వ్యవసాయక్షేత్రంలో ప్రయోగశాలల ప్రారంభానికి ప్రణాళిక

ఈనాడు, అమరావతి

చారిత్రక అమరావతిలోని వ్యవసాయక్షేత్రంలో ఆధునిక సాంకేతిక ప్రయోగశాలలు ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ప్రయోగశాలలపై వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యం వహించింది. దీంతో భవనాలు పగుళ్లు రావడంతో పాటు పరిసరాల్లో పిచ్చిమొక్కలు పెరిగి రూ.7.30 కోట్లతో నిర్మించినవి నిరుపయోగంగా మారాయి. ఈ పరిస్థితిపై 'ఈనాడు'లో వరుస కథనాలు రావడంతో కూటమి ప్రభుత్వం స్పందించింది.

భూసార పరీక్ష ప్రయోగశాల భవనం

వ్యవసాయ క్షేత్రంలో డీఎన్‌ఏ వేలిముద్రలు, జన్యుమార్పిడి పంటల పర్యవేక్షణ ప్రయోగశాలతో పాటు ప్రాంతీయ డీకోడింగ్ కేంద్రం, మరో రెండు భవనాల నిర్మాణానికి కేంద్రం 2017లో రూ.7.30 కోట్లు మంజూరు చేసింది. 2018లో మొదలైన పనులు 2021 నాటికి పూర్తయ్యాయి. గత వైకాపా ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో గుత్తేదారు వ్యవసాయశాఖకు భవనాలు అప్పగించలేదు. నాటి నుంచి వృథాగా ఉండటంతో చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగాయి, సామగ్రి చోరీకి గురవడం, ప్రయోగశాల అద్దాలు కొన్ని పగిలిపోయి అధ్వానంగా తయారయ్యాయి. గతంలో నాసిరకంగా పనులు చేసిన గుత్తేదారుకు రూ.35 లక్షల జరిమానా విధించిన సొమ్ముతోపాటు మౌలిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం రూ.1.58 కోట్లు మంజూరు చేయడంతో పనులు జరుగుతున్నాయి. మార్చిలో ప్రయోగశాలలు అందుబాటులోకి తీసుకురావడానికి వ్యవసాయశాఖ చర్యలు చేపట్టింది.

అంతర్గత రహదారుల నిర్మాణం.. కూటమి ప్రభుత్వం వ్యవసాయ క్షేత్రంపై ప్రత్యేక దృష్టి సారించింది. డీఎన్‌ఏ ప్రయోగశాలలో కొన్ని పరికరాలు, వ్యవసాయ క్షేత్రంలో ఆయా భవనాల వద్దకు వెళ్లేందుకు అంతర్గత రహదారులు నిర్మిస్తోంది. రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ఆత్యాధునిక భూసార పరీక్ష ప్రయోగశాల ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో డ్రై కెమిస్ట్రీ విధానంలో భూసారాన్ని పరీక్షించేలా ప్రయోగశాల ఏర్పాటవుతోంది. ఇప్పటికే ఒక భవనంలో ఎరువులు, పురుగు మందులు, విత్తనాల నమూనాలను డీకోడింగ్ చేసే వివిధ ప్రయోగశాలలకు పంపే ప్రక్రియ ఒక భవనంలో కొనసాగుతోంది. డీఎన్‌ఏ ప్రయోగశాలలో వేలిముద్రలు, జన్యుమార్పిడి పంటల ప్రయోగశాలలోనే కొంతభాగంలో నానో ఎరువులు, బయో ఉత్ప్రేరకాల ఉత్పత్తుల పరీక్ష ప్రయోగశాలలు ఏర్పాటు చేస్తారు. ఎరువులు, పురుగు మందులు, విత్తనాల పరీక్ష ప్రయోగశాల మరో భవనంలో ఏర్పాటవుతుంది. నిర్మాణాలు పూర్తయిన నాలుగు భవనాలకు ప్రహరీలు నిర్మిస్తున్నారు. 120 ఎకరాల విస్తీర్ణంలో భూములు ఉన్నందున పలు పరీక్ష కేంద్రాలతోపాటు షేడ్ నెట్, పాలీహౌస్‌లలో మొక్కల పెంపకానికి ప్రాధాన్యం ఇస్తారు. అమరావతి క్షేత్రం వ్యవసాయ ప్రయోగశాలల హబ్‌గా రూపుదిద్దుకుంటుందని పనులు పర్యవేక్షిస్తున్న వ్యవసాయశాఖ అధికారి తెలిపారు.

పట్టు జారిందా.. ప్రాణం నిలుస్తుందా!

మిరప కోతలు ఊపందుకోవడంతో పెద్దసంఖ్యలో కూలీలు తరలివెళ్తున్నారు. మాచర్ల-గుంటూరు మార్గంలో నిత్యం ఇలా ఆటోలు, ట్రాక్టర్లపై వేలాడుతూ ప్రయాణిస్తున్నారు. అసలే గుంతల రోడ్డు కావడంతో వాహనం కుదుపులకు లోనైతే పట్టుజారి కిందపడిపోయే ప్రమాదముంది. వాహనాల్లో నిబంధనల మేరకు కూలీలను తరలించాలని, అధిక లోడుపై పోలీసులు, రవాణాశాఖ అధికారులు దృష్టి పెట్టి చర్యలు తీసుకోవాలని గ్రామీణులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, రాజుపాలెం

నిమిషం ఆలస్యమైనా అనుమతించరు

నేటి నుంచే ఇంటర్ పరీక్షలు

ఈనాడు, నరసరావుపేట: ఇంటర్మీడియట్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా పటిష్ఠ ఏర్పాట్లు పూర్తి చేశారు. 49 పరీక్ష కేంద్రాల్లో మొత్తం 600 సీసీ కెమెరాలతో పర్యవేక్షించనున్నారు. పల్నాడు జిల్లాలో 17,740 మంది ప్రథమ, 16,636 మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులు హాజరుకానున్నారు. మార్చి 24 వరకు పరీక్షలు జరగనున్నాయి. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. అన్ని కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. మాల్ ప్రాక్టీస్‌కు అవకాశం లేకుండా నిఘా పెట్టామని, జిల్లా ఇంటర్ విద్యాశాఖ కార్యాలయంతో పాటు కమిషనరేట్ ద్వారా నిరంతరం పర్యవేక్షణ ఉంటుందని అధికారులు తెలిపారు. ఒక నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రాల్లోకి విద్యార్థులను అనుమతించేది లేదని, అరగంట ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు.

పరీక్షలకు సన్నద్ధతలో విద్యార్థులు

సేవల సారథులు.. ప్రజలకు వారధులు

- ప్రతి పల్లెవాసికి ఆత్మీయ స్నేహితులు జీడీఎస్‌లు
- సమ్మేళనంలో సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి

'అద్భుతమైన సేవలకు సారథులు మీరు.. ప్రజల మధ్య సమాచార మార్పిడికి వారధులు మీరు.. ప్రతి పల్లెవాసికి ఆత్మీయ స్నేహితులు గ్రామీణ డాక్ సేవక్‌లు. ఎంత సాంకేతికత అభివృద్ధి చెందినా, ఏఐ తరహా పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చినా మీరు లేని లోటు ఊహించలేం. మారుతున్న కాలానికి అనుగుణంగా తపాలాశాఖలోనూ ఆధునికత సంతరించుకునేలా కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు చొరవ చూపుతాం. మిమ్మల్ని చూస్తుంటే నా చిన్నతనం గుర్తొస్తోంది.'' అని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. ఆదివారం సాయంత్రం గుంటూరు శివారులోని సత్యసాయి ఆధ్యాత్మిక నగరిలో జరిగిన జాతీయ స్థాయి గ్రామీణ డాక్ సేవక్ సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సాయంత్రం 3.30 గంటలకు హెలికాప్టర్‌లో గుంటూరుకు చేరుకున్న సీఎం చంద్రబాబుకు అధికారులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. ఆలోపే కాజ టోల్‌గేట్ నుంచి కేంద్రమంత్రులు జ్యోతిరాదిత్య సింధియా, పెమ్మసాని చంద్రశేఖర్ భారీ ర్యాలీగా సభాప్రాంగణానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా జీడీఎస్ సమూహాన్ని ఉద్దేశించి చంద్రబాబు ప్రసంగించారు.

పోస్టల్ ఉద్యోగి విశ్వేశ్వరరావును సత్కరిస్తున్న సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రులు పెమ్మసాని, జ్యోతిరాదిత్య

ఆత్మీయ పలకరింపులు.. కార్యక్రమంలో కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా, సీఎం చంద్రబాబు మధ్య ఆత్మీయ పలకరింపులు ఆకట్టుకున్నాయి. సభ జరుగుతున్నంత సేపు ఇద్దరూ అభిమానంగా మాట్లాడుకోవడం కనిపించింది. అనంతరం ఇద్దరూ చేసిన ప్రసంగాల్లోనూ తమ అనుబంధాన్ని నెమరు వేసుకున్నారు. జీడీఎస్‌లు చేస్తోన్న దేశసేవ వల్ల 38 కోట్ల తపాలా ఖాతాలు ప్రస్తుతం ఉన్నాయని, రూ.22 లక్షల కోట్ల మూలనిధి ఉందని జ్యోతిరాదిత్య అన్నారు. సుకన్య సమృద్ధి యోజన, మేరీలాడ్లీలక్ష్మి కింద 3.8 కోట్లు ఖాతాలు రూ.2.7 లక్షల కోట్ల కార్పస్ ఫండ్ అందించాయని వివరించారు. పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ భారత తపాలా వ్యవస్థ మన మట్టిలోనే ఉంది. సందేశం తీసుకెళ్లే పాదాలు పరిగెత్తికెళ్లాయని ఉత్సాహపరిచారు.

స్ఫూర్తినింపి.. ఉత్తమ సేవలందించిన గ్రామీణ డాక్ సేవక్‌లను ఈ సందర్భంగా సీఎం, కేంద్ర మంత్రులు సత్కరించారు. వారి యూనిఫామ్ స్వయంగా జ్యోతిరాదిత్య తొడగడం ఆకట్టుకుంది. భారీగా పోటెత్తిన జీడీఎస్‌లతో సభాప్రాంగణం నిండిపోయింది. నేతలు జీడీఎస్‌ల సేవలను కొనియాడుతూ వారు మరింత ఉత్సాహంగా పనిచేసేలా స్ఫూర్తినింపారు. కార్యక్రమం ఆద్యంతం అత్యంత ఉత్సాహంగా కొనసాగింది.

ఆన్‌లైన్‌లోనూ అర్జీలు స్వీకరిస్తాం

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: జిల్లా ప్రజలు తమ సమస్యలపై అర్జీలు అందించేందుకు వీలుగా కలెక్టరేట్‌లో ఈనెల 23న సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తామని కలెక్టర్ కృతికాశుక్లా తెలిపారు. ఉదయం 10 నుంచి అధికారులు అందుబాటులో ఉండి అర్జీలు స్వీకరిస్తారన్నారు. అర్జీదారులు తమ సమస్యపై కచ్చితమైన వివరాలతో దరఖాస్తు చేయాలన్నారు. దీంతో పాటు కాల్‌సెంటర్ 1100 సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. అలాగే సమస్యలపై అర్జీలను ఆన్‌లైన్‌లో Meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చని తెలిపారు. గతంలో అర్జీలు ఇచ్చిన వారు సమస్య పరిష్కారం కాకుంటే పాత రసీదు వెంట తెచ్చుకోవాలని సూచించారు. అర్జీలపై పరిష్కారానికి సంబంధించిన అంశంపై సమాధానాలు, నోటీసులు వాట్సప్‌కు అందుతాయని, అర్జీదారులు గమనించాలన్నారు.

రంజాన్ వేళలు
ఇఫ్తార్: (సోమవారం)
సాయంత్రం: 6.21
సహరి: (మంగళవారం)
ఉదయం: 5.14

ఒక్కరోజేనని సరిపెట్టేస్తున్నారు!

కోటప్పకొండ ఎక్కేందుకు ఇబ్బందులు

ఈనాడు, నరసరావుపేట, న్యూస్‌టుడే, పండరీపురం(చిలకలూరిపేట)

ఈసారి కోటప్పకొండ తిరునాళ్ల కొన్ని పాఠాలు నేర్పింది. ఓ బాలిక అస్వస్థతకు గురైన ఘటన.. మెట్ల మార్గాన్ని బాగు చేయాల్సిన అవసరాన్ని తెలియజేసింది. లోపాలపై అధికారులు ఇప్పటి నుంచే దృష్టి పెట్టాలని భక్తులు కోరుతున్నారు. కొండపై త్రికోటేశ్వరుడిని దర్శించుకోవడంలో ఆటంకాలు లేవని.. ఈసారి వీఐపీ స్లాట్ విధానం సత్ఫలితాలిచ్చిందని భక్తులంతా మెచ్చుకుంటున్నారు. అదే విధంగా కొన్ని లోపాలను కూడా సామాజిక మాధ్యమాల వేదికగా పంచుకుంటున్నారు. శివరాత్రి ఒక్కరోజు తిరునాళ్లేనని అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని. . మౌలిక వసతుల కల్పనలో శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

మెట్ల మార్గం ఆధునికీకరించాలి

కొండపైకి వెళ్లే మెట్ల మార్గం చాలా పురాతనమైంది. శివరాత్రి సమయంలోనే మెట్లకు పైపై పూతలు పూసి సరిపెడుతున్నారు. ఇంజినీరింగ్ నిపుణుల పర్యవేక్షణలో ఏం చేయాలో ఆలోచించడం లేదు. ఇతర పుణ్యక్షేత్రాల్లో మెట్ల మార్గం ఎలా ఉంటుంది? కోటప్పకొండది ఎలా ఉందో పరిశీలించాలి. ఇక్కడ మెట్లు ఎక్కడానికి అనువుగా లేవు. పైగా మధ్యలో రెయిలింగ్ కూడా లేదు. వృద్ధులు, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. మొన్నటి తిరునాళ్లలో ఎక్కేవారు, దిగేవారితో కిక్కిరిసిపోయి కొందరికి ఊపిరాడలేదు. మధ్యలో బారికేడు లాంటి రెయిలింగ్ ఉంటే ఎక్కేటప్పుడు ఎడమవైపు, దిగేటప్పుడు కుడివైపు ప్రాంతాన్ని వాడుకోవచ్చు. ఎవరికైనా ఏదైనా జరిగినా దిగువకు తీసుకెళ్లడం సులభతరమవుతుంది.

రెయిలింగ్ లేని మెట్ల మార్గం

రెండోఘాట్ రోడ్డు అవసరం

ఒకటే ఘాట్‌రోడ్డు పైగా సింగిల్‌లైన్ కావడం వల్ల తిరునాళ్లతో పాటు ఇతర పండగల సమయంలో రద్దీ ఏర్పడి ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. రెండో ఘాట్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని భక్తులు ఎప్పటినుంచో కోరుతున్నారు. ఏటికేడు భక్తుల సంఖ్య పెరుగుతోంది. ఈ ఏడు ఆర్టీసీ బస్సుల్లోనే 47 వేల మంది భక్తులు కొండకు వచ్చారని అధికారులు వెల్లడించారు. దీన్నిబట్టి రెండో ఘాట్‌రోడ్డు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

దిగుబడి తగ్గి.. ధర పెరిగి..

'నిమ్మ' రైతుల పరిస్థితి ఇదీ

ఈనాడు, అమరావతి

నిమ్మకాయల ధరలు కొన్నాళ్లుగా పెరుగుతున్నాయి. సాధారణంగా ఫిబ్రవరిలో ధరలు తక్కువగా ఉండాలి. ఈ సారి అందుకు భిన్నంగా పరిస్థితి ఉంది. కిలో గరిష్ఠంగా రూ.92 వరకు రైతులకు ధర లభించింది. తెనాలి మార్కెట్‌కు సరకు తగ్గడంతో ధరలు పెరుగుతున్నాయి. మంచి ధరలు లభిస్తున్నా అందిపుచ్చుకుంటున్న రైతులు కొందరే ఉన్నారు. ప్రతికూల వాతావరణం, మొంథా తుపానుతోపాటు జనవరి, ఫిబ్రవరి నెలల్లో అధికంగా మంచు కురవడం వల్ల పూత దశలోనే సమస్య ఏర్పడి దిగుబడులు తగ్గాయి.

ఈ ఏడాది జనవరి నుంచి నిమ్మకాయల ధరలు పుంజుకుంటున్నాయి. కిలో కాయలకు ఫిబ్రవరిలో సగటు ధర సైతం రూ.80కు తగ్గడం లేదు. డిమాండ్‌కు తగినంతగా సరకు లభ్యత లేదని మార్కెటింగ్ శాఖ అధికారులు చెబుతున్నారు. తెనాలితోపాటు ఏలూరు, గూడూరు నిమ్మ మార్కెట్లలోనూ ఇదే పరిస్థితి కొనసాగుతోంది. నిమ్మకాయలకు అధిక ధరలు పలకడం రైతులను ఊరిస్తోంది. ఈ సమయంలో ఏటా లభించే ధరలు కన్నా మూడు రెట్లు అధికంగా పలకడం వారిని ఆలోచనకు గురిచేస్తోంది. పూత, కాపు కాపాడుకున్న రైతులకు ప్రస్తుత ధరలు లాభాలు తెచ్చిపెడుతున్నాయి. అయితే 90 శాతం మంది రైతుల తోటల్లో పూత రాలిపోయింది. వీరంతా పూతను కాపాడుకునే ప్రయత్నాల్లో ఉన్నారు. నిమ్మ పంటకు కీలకమైన సమయమైన చలి కాలం నుంచి ప్రతికూల వాతావరణం ఏర్పడింది. పూత మొదలయ్యే దశలో మొంథా తుపాను ఇబ్బందికరంగా మారింది. ఇటీవల అధికంగా కురుస్తున్న హిమపాతానికి చాలా తోటల్లో పూత రాలిపోయింది. ఈ అవకాశాన్ని అందిపుచ్చుకునేలా శాస్త్రవేత్తలు సరైన సలహాలు అందించాలని వారు కోరుతున్నారు. నిమ్మకాయలకు ఎక్కువ డిమాండ్ కొనసాగే వేసవి ప్రారంభమవుతుండటంతో రైతులు మరింత జాగ్రత్తగా తోటలను కాపాడుకుంటున్నారు. పూత రాలిపోవడం వల్ల కాయ తగ్గి సరఫరా తగ్గడంతో ధర పెరిగిందని, నాణ్యమైన కాయలు తెచ్చి అవకాశాన్ని రైతులు ఉపయోగించుకోవాలని తెనాలి మార్కెట్ యార్డు కార్యదర్శి సుబ్బారావు సూచించారు.

తెనాలి మార్కెట్‌యార్డులో నిమ్మకాయల ధరలు (రూపాయల్లో)

కాలం	కనిష్ఠం	గరిష్ఠం	మోడల్
గత జనవరి	2800	3500	3100
ఈ ఏడాది జనవరి	2200	3500	2800
నిరుడు ఫిబ్రవరి	4300	5300	4900
ప్రస్తుత నెలలో..	7200	8800	8000

తెనాలి మార్కెట్‌కు సాధారణంగా వచ్చే నిమ్మకాయల్లో నాలుగోవంతు మాత్రమే సరకు వస్తోంది. నిరుడు ఇదే సమయంలో ఉన్న ధరలతో పోలిస్తే మూడు రెట్లు పెరగడం గమనార్హం.

☛ నాదెండ్ల మండలానికి చెందిన బాలుడి వయసు 17. వృత్తి పొక్లెయిన్ డ్రైవర్. పొలాల్లో మట్టి చదును చేసే పనుల్ని బాలుడితో చేయిస్తున్నారు. కోటప్పకొండ తిరునాళ్లలో పొక్లెయిన్ నడపడంలో తడబాటుకు గురై కడపకు చెందిన యువకుడిని ఢీకొన్నాడు. అక్కడే యజమాని ఉన్నాడు. బాధితులు నరసరావుపేట గ్రామీణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే రూ.లక్షతో సెటిల్‌మెంట్ చేసి యజమానిపై కేసు లేకుండా చేశారు.

☛ నడికుడికి చెందిన బాలుడు(17) ఇంటర్ చదువుతున్నాడు. ఇంట్లో పోరుపెట్టడంతో అమ్మానాన్నలు కొత్త బైక్ కొన్నారు. రెండు నెలలకే నడికుడి నుంచి దాచేపల్లికి వస్తుండగా నాగులేరు వంతెనపై అతివేగంతో అదుపుతప్పి ఎదురుగా వెళ్తున్న లారీని ఢీకొని అక్కడికక్కడే చనిపోయి తల్లిదండ్రులకు శోకం మిగిల్చాడు.

హీరోల్లా స్టంట్లు.. గాల్లో ప్రాణాలు

ద్విచక్ర వాహనాలపై మైనర్ల స్వైరవిహారం

ఈనాడు, నరసరావుపేట, న్యూస్‌టుడే, గాంధీపేట (చిలకలూరిపేట)

బండి వద్దురా! అప్పుడే నడిపే వయసా నీది.. కంట్రోల్ చేయగలవా? అంటూ ఒకప్పుడు తల్లిదండ్రులు వారించేవారు. ఇప్పుడు వాళ్లే చేతికి తాళాలు ఇచ్చి, పనులకు పురమాయిస్తున్నారు. అమ్మను బస్టాండ్‌లో దింపిరా.. ఇంటికి సరకులు తీసుకురా అంటూ మరీ పంపిస్తున్నారు. అలా చిన్నవయసులోనే బైక్‌లు నడిపేస్తున్నారు. ఇదే అదునుగా రాత్రిళ్లు కుర్రాళ్లంతా కలిసి ఏకంగా పందేలు పెట్టుకుని రయ్యిమంటూ దూసుకెళుతున్నారు. నరసరావుపేటలో మైనర్లు ద్విచక్ర వాహనాలను అతివేగంతో రోడ్లపై దూసుకెళుతున్నారు. రద్దీగా ఉండే ప్రాంతాల్లోనూ ఇష్టారీతిన డ్రైవింగ్ చేస్తున్నారు. కొన్ని ప్రైవేటు స్కూళ్లకు పదో తరగతి విద్యార్థులు బైక్‌లతో వస్తున్నారు. తిలక్ జడ్పీ హైస్కూలు, శంకరాభారతీపురం, మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులైతే ఉదయం, మధ్యాహ్నం వేళల్లో స్నేహితుల బైక్‌లతో ట్రిబుల్ రైడింగ్ చేస్తున్నారు.

విన్యాసాలతో.. నరసరావుపేట, చిలకలూరిపేట, వినుకొండ, మాచర్ల తదితర పట్టణాల్లో ప్రధాన రహదారులపైనే మైనర్లు ద్విచక్ర వాహనాలతో స్నేక్ డ్రైవింగ్ వంటి విన్యాసాలు చేస్తున్నారు. వాహన స్టాండ్లను కొద్దిగా తెరిచి.. రహదారికి తాకిస్తూ.. నిప్పులు కురిపిస్తూ వెళ్లడం.. చిత్రవిచిత్ర శబ్దాలతో ముగ్గురేసి ఒకే వాహనంపై వెళ్లడమూ ప్రమాదాలకు కారణమవుతున్నాయి. 15-18 ఏళ్లలోపు వాళ్లు స్కిడ్‌లు, స్టంట్‌లు చేస్తూ తోటి ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. టైర్లు గాలిలోకి లేపి విన్యాసాలు చేయడం.. అకస్మాత్తుగా రోడ్డుపై ఎవరైనా అడ్డొస్తే అదుపు చేయలేక ఢీకొడుతున్న ఘటనలు వెలుగుచూస్తున్నాయి.

☛ వాహనాలు నడుపుతూ మైనర్లు పట్టుపడుతున్నా పోలీసులు తల్లిదండ్రులపై లేదా యజమానులపై కేసులు నమోదు చేయడం లేదు. కేవలం కౌన్సెలింగ్ ఇచ్చి వదిలేస్తున్నారు.

అపరాలకు మద్దతు ధర

కొనుగోలుకు ప్రభుత్వం చర్యలు

సత్తెనపల్లి, నెహ్రూనగర్, న్యూస్‌టుడే

రైతుల నుంచి అపరాలు మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. జిల్లాలో ఏపీ మార్క్‌ఫెడ్, నాఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలు ప్రక్రియ చేపట్టనున్నారు. ఇప్పటికే రైతుసేవా కేంద్రాల్లో శనగల కొనుగోలుపై అన్నదాతలకు అవగాహన కల్పిస్తున్నారు. కనీస మద్దతు ధరకు ఉత్పత్తుల్ని అమ్ముకోదల్చిన రైతులు తప్పనిసరిగా ఈ-క్రాప్‌లో వివరాలు నమోదు చేసుకోవాలి. ఈ నెల 25వ తేదీ వరకు గడువు ఉండటంతో త్వరపడాలి.

☛ తొలుత రైతుసేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలి. చరవాణికి వచ్చే సంక్షిప్త సందేశంతో కొనుగోలు కేంద్రానికి వెళ్లాలి. తేమ శాతానికి అనుగుణంగా మద్దతు ధర నిర్ణయిస్తారు. పంట ఉత్పత్తులు నాణ్యంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. పంట ఉత్పత్తులు విక్రయించిన 15 రోజుల్లోపు ఆధార్‌తో అనుసంధానమైన బ్యాంకు ఖాతాకు నగదు జమ అవుతుంది. అపరాలు సాగు చేసిన రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని ఏపీ మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ కె.రమేష్ తెలిపారు.

☛ కందుల కొనుగోలుకు 35 కేంద్రాల్ని ఏర్పాటు చేశారు. రైతుసేవా కేంద్రాలకు తేమను పరీక్షించే పరికరాలు అందజేసి సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. మార్క్‌ఫెడ్, నాఫెడ్ సిబ్బంది కొనుగోళ్లను పర్యవేక్షించేలా చర్యలు తీసుకున్నారు. అపరాలు విక్రయించేందుకు సాంకేతిక పరిజ్ఞానంతో అవకాశం కల్పిస్తున్నారు.

రైతుసేవా కేంద్రాల సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న ఉద్యోగులు

పంట	సాగు విస్తీర్ణం (హెక్టార్లలో)	కొనుగోలు లక్ష్యం (టన్నుల్లో)	మద్దతు ధర (క్వింటాకు రూ.లలో)
శనగలు	11,650	5,681	5,875
కందులు	39,547	23,487	8,000
మినుములు	1,729	1,202	7,800



నారసింహాయ నమోనమః

మంగళగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: మంగళగిరి శ్రీపానకాల లక్ష్మీనరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాలు మొదటి రోజైన ఆదివారం పెండ్లి కుమారుని ఉత్సవంతో ఘనంగా ప్రారంభం అయ్యాయి. తెల్లవారుజామున స్వామివారి తీర్థ బిందె తీసుకురావడం, ప్రాతఃకాల అర్చన తదితర పూజలు చేశారు. ఉదయం 8 గంటలకు పద్మశాలీయ బహూత్తమ సంఘం ఆధ్వర్యంలో పట్టువస్త్రాలను మేళతాళాల నడుమ ఆలయానికి తీసుకురాగా.. ప్రధాన అర్చకుడు మాల్యవంతం శ్రీనివాస దీక్షితులు ఆధ్వర్యంలో పంచామృతాలతో అభిషేకం నిర్వహించి స్వామి, అమ్మవార్లను పెళ్లి కుమారుడు, పెళ్లి కూమార్తెలుగా అలంకరించారు. ఆలయ ఈవో కోగంటి సునీల్ కుమార్, ధర్మకర్తల మండలి సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

విద్యుత్తు సేవలపై సంతృప్తి

సత్తెనపల్లి, దుర్గి, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్తు కోతలు గణనీయంగా తగ్గాయి. బిల్లులు కూడా ట్రూఅప్ నుంచి ట్రూడౌన్ అవుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో నూతన విద్యుత్తు ఉపకేంద్రాల నిర్మాణం, సౌర విద్యుత్తు ఉత్పత్తికి మెరుగైన చర్యలు తీసుకుంటున్నారు. వీటితో శాఖాపరమైన సేవలు ఎలా ఉన్నాయని వినియోగదారుల నుంచి ప్రభుత్వం ఆరా తీస్తోంది. తాజాగా విద్యుత్తు పంపిణీ, సిబ్బంది పనితీరుపై ఐవీఆర్‌ఎస్ నిర్వహించింది. ప్రజల సంతృప్తిలో రాష్ట్రస్థాయిలో పల్నాడు 2వ స్థానంతో మెరిసింది. గతంతో పోల్చుకుంటే ఈ జిల్లాలో సేవలు ఎంతో మెరుగయ్యాయి. బాపట్ల జిల్లా 8వ స్థానంలో నిలిచింది. నియోజకవర్గాల్లో చిలకలూరిపేట రెండోస్థానంలో ఉంది. ఇక్కడ 83.9 శాతం మంది సంతృప్తి వ్యక్తం చేశారు.

పల్నాడు జిల్లాలో గృహ కనెక్షన్లు: 4,71,941
వాణిజ్య : 52,964
పారిశ్రామిక : 2,089
వ్యవసాయం : 90,592
ఇతరాలు : 9,185

	అవును (శాతాల్లో)	లేదు (శాతాల్లో)
నిరంతరాయంగా విద్యుత్తు సరఫరా అవుతుందా?	82.2	17.8
ఇంటికి నాణ్యమైన విద్యుత్తు పంపిణీ అవుతుందా?	82.7	17.3
విద్యుత్తు సిబ్బంది అందుబాటులో ఉంటున్నారా?	79.3	20.7

(c) eenadu

మాయమాటలతో బాలికను వంచించిన కీచకుడు

నిందితుడికే వత్తాసు పలుకుతున్న పోలీసులు

ఈనాడు, నరసరావుపేట: పదో తరగతి చదువుతున్న బాలికకు ఓ యువకుడు మాయమాటలు చెప్పి గర్భవతిని చేశాడు. బుద్ధి చెప్పాల్సిన పోలీసులు డబ్బులు తీసుకుని నిందితుడికే వత్తాసు పలికారు. చివరకు బాలిక స్కూలు మానేయడంతో ఆమె జీవితం ప్రశ్నార్థకమైంది. మాచర్ల పట్టణంలో ఈ ఘటన చోటుచేసుకుంది. పట్టణానికి చెందిన ఓ దంపతులకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. బాలిక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. వీరి ఇంటికి ఎదురుగా ఓ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తున్న ప్రభుత్వ ఉద్యోగి కుమారుడి కన్ను బాలికపై పడి వేధింపులకు గురిచేశాడు. నిందితుడి తల్లిదండ్రులు ప్రభుత్వ ఉద్యోగులు.. తండ్రి పంచాయతీరాజ్‌లో.. తల్లి వైద్యశాఖలో పనిచేస్తున్నారు. నిందితుడు హౌసింగ్ విభాగంలో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగం చేస్తున్నాడు. అతడికి ఇప్పటికే పెళ్లయింది. బాలికకు మాయమాటలు చెప్పి చెరపట్టాడు. దీంతో గర్భం దాల్చింది. విషయం బాలిక ఇంట్లో తెలిసి చదువు మాన్పించేశారు. పెళ్లి చేసేయాలని ప్రయత్నించినా వచ్చిన సంబంధాలను చెడగొట్టాడు. బాలిక తల్లిదండ్రులు పలుమార్లు పోలీసులకు ఫిర్యాదు చేసినా.. తనకున్న డబ్బు, పలుకుబడితో నిందితుడు మాచర్ల పోలీసు అధికారులను తనవైపు తిప్పుకొని కేసు లేకుండా చేశాడు. ఓ సీఐ డబ్బులు తీసుకుని బాధితుల ఫిర్యాదును పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి.

రాష్ట్ర రాజకీయాల్లో కోడెల స్థానం ప్రత్యేకం

విగ్రహావిష్కరణలో చీఫ్ విప్ జీవీ, ఎమ్మెల్యే అరవిందబాబు, పార్టీ జిల్లా అధ్యక్షుడు జానీసైదా, కోడెల శివరాం తదితరులు

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే: రాష్ట్ర రాజకీయాల్లో తన కంటూ ప్రత్యేక స్థానం పొందిన వ్యక్తి మాజీ సభాపతి డాక్టర్ కోడెల శివప్రసాదరావు అని ప్రభుత్వ చీఫ్ విప్ జి.వి.ఆంజనేయులు అన్నారు. మండలంలోని పెద్దరెడ్డిపాలెంలో ఆదివారం కోడెల విగ్రహాన్ని నరసరావుపేట ఎమ్మెల్యే అరవిందబాబు, తెదేపా జిల్లా అధ్యక్షుడు జానీసైదా, డాక్టర్ కోడెల శివరాంతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చీఫ్ విప్ మాట్లాడుతూ పల్నాడు ప్రాంత అభివృద్ధికి కోడెల ఎనలేని సేవలందించారన్నారు. నరసరావుపేట ఎమ్మెల్యే మాట్లాడుతూ డాక్టర్ కోడెల వైద్యుడిగా వృత్తి పట్ల నిబద్ధత, రాజకీయ నాయకుడిగా ప్రజా సేవ పట్ల ఆయనకున్న తపన నేటి తరానికి ఆదర్శనీయమన్నారు. జిల్లా తెదేపా అధ్యక్షుడు మాట్లాడుతూ నరసరావుపేట నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దిన ఘనత కోడెలదేనన్నారు. తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోడెల శివరాం మాట్లాడుతూ ఆయన మరణించి ఏళ్లు గడుస్తున్నా ప్రజల గుండెల్లో ఇప్పటికీ బతికే ఉన్నారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర డాక్టర్ సెల్ ఉపాధ్యక్షుడు కడియాల వెంకటేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు బండారుపల్లి విశ్వేశ్వరరావు, మార్కెట్‌యార్డు ఛైర్మన్ పూనాటి శ్రీనివాసరావు, సర్పంచి ఇండ్లమూరి రామారావు, గ్రామ నాయకులు కశిందుల హరిబాబు, డాక్టర్ పువ్వాడ సూర్యనారాయణ, చెరుకూరి సాంబశివరావు, కొక్కిరాల శ్రీనివాసరావు, మీరావలి, కార్యకర్తలు పాల్గొన్నారు. తొలుత నరసరావుపేట పట్టణం నుంచి ట్రాక్టర్లు, ద్విచక్రవాహనాలతో ర్యాలీగా ఇస్సపాలెం, ములకలూరు మీదుగా పెద్దరెడ్డిపాలెం చేరుకున్నారు.

సాగర్ కాలువలు.. వెలుగు రేఖలు

విద్యుదుత్పత్తితో స్వయం సమృద్ధి

యువతకు ఉపాధి బాట

ఈపూరు, న్యూస్‌టుడే

పల్నాడు జిల్లాలో మినీ జలవిద్యుత్తు ప్రాజెక్టులు విద్యుదుత్పత్తి చేస్తూ స్వయం సమృద్ధి సాధిస్తూ ప్రజలకు ఆసరాగా నిలుస్తున్నాయి. జిల్లాలో పలు ప్రాంతాల్లో సాగర్ కాలువలపై మొత్తం 27 మినీ హైడల్ పవర్ ప్రాజెక్టులు ఏర్పాటు చేయగా అవి రోజుకు 10 లక్షల యూనిట్ల విద్యుత్తును ఉత్పత్తి చేస్తున్నాయి. జిల్లా మొత్తం మీద విద్యుత్తు వినియోగం రోజుకు 80 లక్షల యూనిట్లు ఉండగా, అందులో 10 లక్షల యూనిట్లను ఈ మినీ హైడల్ పవర్ ప్రాజెక్టులు అందిస్తూ గ్రామాల్లో విద్యుత్తు కోతలు, లోవోల్టేజీ సమస్యలను తగ్గిస్తున్నాయి. ఈ ప్రాజెక్టులు కేవలం విద్యుదుత్పత్తి చేయడం మాత్రమే కాక అనేకమంది యువకులకు ఉద్యోగాలిచ్చి ఉపాధి కల్పిస్తున్నాయి. ఎటువంటి నీటి వృథా, కాలుష్యానికి తావులేకుండా కేవలం కాలువలో నీటి ప్రవాహ ఒత్తిడి ఆధారంగా పనిచేస్తూ విద్యుదుత్పత్తి చేస్తున్నాయి. జిల్లా పరిధిలోని అద్దంకి, బెల్లంకొండ, గుంటూరు, జూలకల్లు, ఒంగోలు బ్రాంచిల కాలువలపై వివిధ కంపెనీలు 27మినీ హైడల్ పవర్ ప్రాజెక్టులు నిర్మించాయి. అద్దంకి బ్రాంచి కాల్వపై ఈపూరు మండలం ముప్పాళ్ల వద్ద ఓ కంపెనీ మూడు పవర్ హౌస్‌లు ఏర్పాటు చేసి రోజుకు 6.2 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేస్తోంది. ఇదే తరహాలో జిల్లాలో పలు చోట్ల వివిధ సంస్థలు సాగర్ కాలువలపై 27 హైడల్ పవర్‌హౌస్‌లు నిర్మించి 40.25 మెగావాట్ల విద్యుత్తును ఉత్పత్తి చేస్తున్నాయి. ఏటా ఆగస్టు నుంచి ఏప్రిల్ వరకు సాగరు కాలువలకు నీళ్లు సరఫరా చేసిన తొమ్మిది నెలలపాటు ఈ ప్రాజెక్టులు విద్యుదుత్పత్తి చేస్తాయి. ఇక్కడ ఉత్పత్తి అయ్యే విద్యుత్తును సమీప 33కేవీ సబ్‌స్టేషన్లకు అనుసంధానం చేసి వాటి ద్వారా 132/33కేవీ సబ్‌స్టేషన్లకు పంపి గ్రామాలకు అందిస్తున్నారు.

అద్దంకి బ్రాంచి కాల్వపై ముప్పాళ్ల వద్ద పవర్ హౌస్

లోవోల్టేజీ సమస్య తీరుతోంది..

సాగరు కాలువలపై ఏర్పాటు చేసిన మినీ హైడల్ పవర్ ప్రాజెక్టులు స్వయం సమృద్ధి సాధిస్తూ ప్రజలకు ఎంతో ఉపయోగపడుతున్నాయి. వీటి ద్వారా విద్యుదుత్పత్తితో సబ్‌స్టేషన్లపై లోడు తగ్గుతుంది. పల్లెలకు విద్యుత్తు కోతలు, లోవోల్టేజీ సమస్యలు చాలా వరకు తగ్గుతున్నాయి. ఈ ప్రాజెక్టుల్లో అనేకమంది యువకులు ఉద్యోగాలు చేస్తూ ఉపాధి పొందుతున్నారు.

- కె.ఎల్.నరసింహారావు, ముప్పాళ్ల హైడల్ పవర్ ప్లాంట్ ఇన్‌ఛార్జి

నాణ్యమైన సరఫరాకు ఆసరా

మినీ హైడల్ పవర్ ప్రాజెక్టుల ద్వారా విద్యుదుత్పత్తి చేస్తూ ప్రభుత్వానికి అందిస్తున్న సంస్థలు రాష్ట్రంలో ఎక్కడో ఒకచోట ప్రభుత్వం నుంచి విద్యుత్తు తీసుకుంటున్నాయి. ఇక్కడ ఉత్పత్తి అయ్యే విద్యుత్తును సమీప విద్యుత్తు ఉపకేంద్రాలకు కలపడం వల్ల ఆయా ప్రాంతాల్లో నాణ్యమైన సరఫరాకు అవకాశం కలుగుతోంది.

- సీహెచ్ రాంభొట్లు, ఈఈ, నరసరావుపేట

వైద్యుడి పేరుతో రూ.56 వేలు కాజేత

సైబర్ పోలీసులను ఆశ్రయించిన బాధితుడు

పెదకూరపాడు, న్యూస్‌టుడే: వైద్యుడినని నమ్మించి ట్యాక్సీ చోదకుడి క్రెడిట్ కార్డు నుంచి రూ. 56 వేలు కొట్టేసిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పెదకూరపాడులో గుంటూరు రోడ్డుకు చెందిన షేక్ మాబు సుభాని బస్టాండ్ సెంటర్‌లో బియ్యం దుకాణం నిర్వహిస్తున్నాడు. ఖాళీ సమయాల్లో కారు చోదకుడిగా వెళుతుంటాడు. ఈనెల 16న బస్టాండ్ సెంటర్ వద్ద ఉన్న జ్యూస్ పాయింట్ నిర్వాహకుడు సందిరెడ్డి శ్రీనివాసరావుతో గుర్తుతెలియని వ్యక్తి పరిచయం పెంచుకున్నాడు. ప్రభుత్వాసుపత్రి వైద్యుడినని, గుంటూరు వెళ్లేందుకు కారు బాడుగకు ఏర్పాటు చేయాలని కోరాడు. శ్రీనివాస్ సుభానితో మాట్లాడి గుంటూరు పంపించారు. అక్కడికి వెళ్లాక తన వద్ద స్మార్ట్ ఫోన్ లేదని, తెలిసిన వ్యక్తులు తనకు నగదు ఫోన్‌పే చేస్తారని నమ్మించాడు. అతనికి ట్యాక్సీ చోదకుడు సెల్‌ఫోన్ ఇచ్చి ఆసుపత్రి బయట 15 నిమిషాలు వేచిచూశాడు. సదరు వ్యక్తి కనిపించకపోవడంతో అనుమానం వచ్చి మరో ఫోన్‌ద్వారా బ్యాంక్ శాఖకు ఫోన్‌చేసి, తన ఖాతాను స్తంభింపచేయాలని కోరాడు. అప్పటికే ఖాతా నుంచి ఆటోనగర్ బీసీ పాయింట్‌వద్ద రూ.11వేలు, కాకాని సూపర్ మార్కెట్ వద్ద రూ.25వేలు, హెచ్‌పీ పెట్రోల్ బంకులో రూ.20వేలు చొప్పున డ్రా అయినట్లు బ్యాంకు అధికారులు తెలిపారు. బాధితుడు సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రమేష్ ఆసుపత్రి సీసీ కెమెరాలో దుండగుడి చిత్రం నమోదవగా బాధితుడు గుర్తించాడు.

సుభాని

సహకార సంఘాలకు సూపర్‌వైజర్లు

సత్తెనపల్లి, న్యూస్‌టుడే : ఉద్యోగుల సమ్మెతో సహకార సంఘాల్లో కార్యకలాపాలు స్తంభించిన నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంది. ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల(పీఏసీఎస్) లావాదేవీలకు ఇబ్బందిలేకుండా సేవలు కొనసాగేలా సూపర్‌వైజర్లను నియమించింది. జిల్లాలో 60 పీఏసీఎస్‌లు ఉన్నాయి. డిమాండ్లు నెరవేర్చాలని సహకార సంఘాల్లో పనిచేసే కార్యదర్శులు, గుమస్తాలు, నాలుగో తరగతి సిబ్బంది సమ్మెలోకి వెళ్లారు. దీంతో ఈ నెల 16 నుంచి అవి మూతపడ్డాయి. ఉద్యోగుల సమ్మె ముగిసే వరకు రైతులు ఇబ్బందిపడకుండా ఉండేందుకు పీఏసీఎస్‌ల నిర్వహణను జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఉద్యోగులకు అప్పగించేలా ఉన్నతస్థాయి నుంచి మార్గదర్శకాలు అందాయి. జిల్లాలో 14 కేంద్ర సహకార బ్యాంకులు ఉన్నాయి. ఒక్కో బ్యాంకు ఉద్యోగికి రెండు, మూడు పీఏసీఎస్‌ల బాధ్యతలు అప్పగిస్తున్నారు. మూడుకంటే ఎక్కువ సొసైటీలు ఉంటే బ్యాంకు మేనేజర్లకు అదనపు బాధ్యతలు అప్పగించే ఆలోచన చేశారు. దీంతో రైతులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా సహకార సంఘాల సేవలు అందనున్నాయి.

శాసనమండలిలో వైకాపా తీరు హేయం

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: శాసనమండలిలో వైకాపా సభ్యులు దేవదేవుడిని రాజకీయాలకు వాడుకున్న తీరు హేయమని తెదేపా జిల్లా అధ్యక్షుడు షేక్ జానీ సైదా విమర్శించారు. జిల్లా తెదేపా కార్యాలయంలో ఆదివారం భాజపా జిల్లా అధ్యక్షుడు యేలూరి శశికుమార్, జనసేన వీరమహిళ మిరియాల వెంకటసుబ్బమ్మతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వైకాపా ఎమ్మెల్సీలు చెప్పులు ధరించి తిరుమల వేంకటేశ్వర స్వామి చిత్రపటాలను ప్రదర్శించటం దుర్మార్గం అన్నారు. లడ్డూ పవిత్రతకు మచ్చతెచ్చిన వారికి ప్రజలు రాజకీయ సమాధి కడతారని భయపడి దేవుడిని అడ్డు పెట్టుకుని రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. వైకాపా హయాంలో తిరుమలను వ్యాపారకేంద్రంగా మార్చారన్నారు. భాజపా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ ఆరోగ్యకరమైన చర్చలు చేయాల్సిన సభలో వైకాపా ఎమ్మెల్సీల తీరు ఆక్షేపణీయమన్నారు. శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ జరిగిందని నిర్ధారణ అయిన తర్వాత ప్రజలు దృష్టి మళ్లించడటానికి ప్రయత్నం చేయడం సిగ్గు చేటు అన్నారు. జనసేన వీరమహిళ మాట్లాడుతూ రాష్ట్రంలో వైకాపాకు రాజకీయంగా మనుగడ లేకుండా పోతుందన్న భయంతో అరాచకం సృష్టించాలని ప్రయత్నిస్తున్నారన్నారు. దీనిని జనసేన పార్టీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. సమావేశంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఏపీజేఏసీ జిల్లా కార్యవర్గం ఎన్నిక

నరసరావుపేట అర్బన్, యడ్లపాడు, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రం నరసరావుపేట ప్రకాశ్‌నగర్‌లోని ఎన్జీవో హోంలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కార్మికుల సంయుక్త కార్యాచరణ సమితి సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా ఛైర్మన్‌గా ఏపీఎన్జీవో జిల్లా అధ్యక్షులు మర్లపాటి రామకృష్ణ, సెక్రటరీ జనరల్‌గా ఎం.మోహన్‌రావు, కోశాధికారిగా నాగేశ్వరరావు ఎంపికయ్యారు. కోఛైర్మన్లుగా మురారి, షరీఫ్, సంపత్‌బాబు, ఏమండి ఎన్నికయ్యారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఉద్యోగ సమస్యలపై చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. కోఛైర్మన్‌గా ఎంపికైన యడ్లపాడు మండలం సంతపేట ఎంపీపీఎస్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బెజ్జం సంపత్‌బాబు మాట్లాడుతూ ఎన్నికల హామీల్లో భాగంగా కూటమి ప్రభుత్వం సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ పునరుద్ధరించాలన్నారు. మెమో 57 అమలు చేయాలని కోరారు. 12వ పీఆర్‌సీ కమిటీ వేసి 30 శాతం ఐఆర్‌ను ప్రకటించాలన్నారు. మరణించిన ఉపాధ్యాయుల వారసులకు కారుణ్య నియామకాలు అమలు చేయాలని కోరారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

REAL ESTATE

SHOP FOR SALE

GENERAL

JOBS

Wanted B or D Pharmacy candidates to work in a pharmacy, n Guntur city, pci registration mandatory. Call: 6300975241.

Wanted B.com or M.B.A candidates to work as an accountant in medical distribution firm in guntur city. ✆ : 63009 75241.

MARKETING/ SALES

Anand Masale Require Sales & Marketing Manager, Marketing Executives. Contact: 9849655105, 98480 53144 Email: anandmasalaappltc@gmail.com

గమనిక

Book your 5 lines Classified Colour Rs.770/-
3Ads Package Rs.1945/-

5 lines Classified B/W Rs.650/-
3Ads Package Rs.1625/-

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం..
ఈనాడు లో ప్రకటన ఇవ్వటం
పూర్తి వివరాలకు సంప్రదించండి
8008510541

ప్రకటనపై 5% జి.ఎస్.టి. అదనం

రోడ్డు ప్రమాదంలో అక్కాచెల్లెలు మృతి

షేక్ పీర్‌బీ, షేక్ హుస్సేన్‌బీ (పాతచిత్రాలు)

గురజాల, న్యూస్‌టుడే : గురజాల పట్టణంలోని బైపాస్ రోడ్డు వద్ద ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో అక్కాచెల్లెలు షేక్ పీర్‌బీ (59), షేక్ హుస్సేన్‌బీ (57) మృతి చెందారు. శ్రీరామపురం సత్రంలో ఉంటున్న వీరు వ్యవసాయ పనుల కోసం ఆటోలో వెళుతున్న సమయంలో ప్రమాదం చోటుచేసుకుంది. తీవ్రంగా గాయపడ్డ షేక్ పీర్‌బీ గురజాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మృతిచెందారు. షేక్ హుస్సేన్‌బీ నరసరావుపేటలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నకిలీ సిగరెట్ల అమ్మకాలు!

కారంపూడి, న్యూస్‌టుడే : సిగరెట్లపై కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏడాది పన్నులు విధిస్తున్న నేపథ్యంలో పల్నాడులోని కొన్ని ప్రాంతాల్లో నకిలీ సిగరెట్ల తయారీకి అక్రమార్కులు తెరలేపారు. ప్రముఖ కంపెనీలకు చెందిన సిగరెట్ల బండిళ్లను తక్కువ ధరకు ఇస్తుండటంతో బడ్డీకొట్ల నిర్వాహకులు కొనుగోళ్లు చేసి అమ్ముతున్నారు. గురజాల నియోజకవర్గంలో నకిలీ సిగరెట్లు తయారు చేసి మాచర్ల, గురజాల నియోజకవర్గాల్లో అమ్మకాలు చేస్తున్నారు. సిగరెట్లు తాగిన వారు నకిలీ అని గుర్తించినా ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియదని, ఉన్నతాధికారులు నకిలీ సిగరెట్ల అమ్మకాలను గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఇద్దరు వాహన దొంగల అరెస్టు

బేస్తవారపేట, న్యూస్‌టుడే: వాహనాల దొంగతో పాటు.. . అతడి నుంచి వాటిని కొనుగోలు చేస్తూ సహకరిస్తున్న మరో వ్యక్తిని బేస్తవారపేట పోలీసులు అరెస్టు చేశారు. స్టేషన్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో డీఎస్పీ నాగరాజు వివరాలు వెల్లడించారు. కాకినాడ జిల్లా తిమ్మాపురానికి చెందిన ఆచంట గంగాధరరావు చోరీ చేసిన వాహనాలను కడప జిల్లా ఎర్రగుంట్లకు చెందిన పల్లెపోగు ప్రసాద్‌కు విక్రయిస్తుండేవాడు. అతడు వాటిని బయటి మార్కెట్‌లో అధిక ధరలకు అమ్మేవాడు. కంభం ఇన్‌ఛార్జి సీఐ రామకోటయ్య, ఎస్సై రవీంద్రారెడ్డి సిబ్బందితో కలిసి కోనపల్లి అడ్డరోడ్డు వద్ద ఆదివారం వాహన తనిఖీలు చేస్తుండగా ట్రాక్టర్‌లో వస్తూ పోలీసులకు చిక్కారు. గంగాధరరావుపై తిమ్మాపురం, నరసరావుపేట, కారంపూడి, గడివేముల, నాయుడుపేట తదితర స్టేషన్లలో చోరీ కేసులు నమోదయ్యాయని డీఎస్పీ తెలిపారు.

91.9 FM Vijayawada
ఈ FM 91.9 Mee FM
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 80080 03297

ఉత్తీర్ణతే లక్ష్యంగా ప్రత్యేక శిక్షణ

- పదిలో రైజింగ్‌స్టార్స్‌కు గురుకులాల్లో బోధన
- 30 రోజుల పాటు తర్ఫీదు

అచ్చంపేట, శావల్యాపురం, పెదకూరపాడు(న్యూస్‌టుడే)

పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణతకు వంద రోజులు ప్రణాళిక ముమ్మరంగా సాగుతోంది. అందులో రైజింగ్‌స్టార్స్‌గా ఉన్నవారిని గుర్తించి వారికి ఈనెల 9నుంచి గురుకుల పద్ధతిలో విద్యా బోధనకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. 20 మార్కులకు 07మార్కుల లోపు వచ్చిన విద్యార్థులను గుర్తించి దగ్గరలోని ప్రత్యేక గురుకులాల్లో చేర్పించి పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నారు. 30రోజుల పాటు ప్రత్యేక ప్రశ్నపత్రాలతో పాసయ్యే విధంగా సిద్ధం చేస్తున్నారు.

విద్యార్థినులతో మాట్లాడుతున్న సత్తెనపల్లి డివిజన్ ఉప విద్యాశాఖాధికారి ఏసుబాబు, ప్రిన్సిపల్

విద్యార్థుల కేటాయింపు ఇలా..

జిల్లాలోని 18 జడ్పీపాఠశాలల నుంచి రైజింగ్‌స్టార్స్‌గా 295 మంది విద్యార్థులను గుర్తించారు. బాలురకు సత్తెనపల్లి, కారంపూడి సాంఘిక సంక్షేమ గురుకుల, వీపీ సౌత్‌లోని గిరిజన గురుకుల పాఠశాలలు కేటాయించారు. బాలురలో రైజింగ్‌స్టార్స్ అత్యధికంగా పిడుగురాళ్ల జడ్పీపాఠశాల నుంచి 28, మాచర్ల 27, రెంటచింతల 21, అచ్చంపేట 20 మంది ఉన్నారు. బాలికలు: జిల్లాలోని 23 జడ్పీ పాఠశాలలకు చెందిన 233 మంది విద్యార్థినులను గుర్తించి కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలకు కేటాయించారు. నరసరావుపేట, మాచర్ల, బెల్లంకొండ, అచ్చంపేట పాఠశాలలో గురుకుల పద్ధతిలో భోజనం వసతి సౌకర్యాలతో పాటు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు.

పాస్ మార్కులు వచ్చేలా ప్రణాళిక

జిల్లాలోని పదోతరగతిలో రైజింగ్‌స్టార్స్‌ను గుర్తించి 30రోజుల ప్రత్యేక రెసిడెన్షియల్ ప్రోగ్రాం ద్వారా విద్యాబోధన చేస్తున్నాం. మాదిరి ప్రశ్నపత్రాలు తయారు చేయించి పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నాం. 30 రోజులు పాటు విద్యార్థులందరికీ పరీక్షలో పాస్‌మార్కులు వచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. విద్యార్థుల ప్రగతిని ప్రతిరోజు పరిశీలిస్తాం

– వి.ఏసుబాబు, ఉపవిద్యాశాఖాధికారి, సత్తెనపల్లి డివిజన్

దంపతుల మధ్య వివాదం

ఎలుకల మందు తిని భార్య బలవన్మరణం

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే: మండలంలోని విఠంరాజుపల్లిలో దంపతుల మధ్య వివాదంతో మనస్తాపానికి గురై భార్య ఎలుకల మందు తిని బలవన్మరణం చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వినుకొండ ఇంద్రానగర్‌కు చెందిన శివనందిని (20)కి విఠంరాజుపల్లికి చెందిన చల్లా మహేష్‌తో ఏడాదిన్నర క్రితం వివాహమైంది. కారుడ్రైవర్ అయిన అతను ఏసీ మెకానిక్‌గా చెప్పి వివాహం చేసుకోవడంతో విషయం తెలిసి భార్య ప్రశ్నించింది. దీంతో ఇద్దరి మధ్య స్వల్ప వివాదం జరిగింది. శివనందిని తరచూ ఫోన్‌లో మాట్లాడటం గమనించిన భర్త మందలించాడు. దీంతో శుక్రవారం ఎలుకలమందు తింది. ఆమె తల్లిదండ్రులు ప్రకాశం జిల్లా త్రిపురాంతకం మండలం రాజుపాలెం వెళ్తూ ఆమెను వెంట తీసుకెళ్లారు. అక్కడ వాంతులు చేసుకోవడంతో అనుమానం వచ్చి ప్రశ్నించగా విషయం తెలిపింది. వెంటనే వినుకొండలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ అదే రోజు మృతి చెందింది. మృతికి ముందు తన బలవన్మరణానికి ఎవరి ప్రమేయం లేదని న్యాయమూర్తికి వాంగ్మూలం ఇచ్చినట్లు పోలీసులు తెలిపారు. దీనిపై పూర్తి విచారణ అనంతరం ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఉదయలక్ష్మి తెలిపారు.

గృహ నిర్మాణ రంగంలో కొత్త ప్రాజెక్టుకు శ్రీకారం



బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గళ్లా మాధవి, రామచంద్రరావు దంపతులు

పట్టాభిపురం, న్యూస్‌టుడే: శ్రీభ్రమర రియల్ ఎస్టేట్ సంస్థ రాగ మెలోడి ఆఫ్ లివింగ్ పేరుతో నూతన ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టిందని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి పేర్కొన్నారు. గుంటూరుకు సమీపంలోని నారాకోడూరులో ప్రాజెక్టు బ్రోచర్లను ఆదివారం ఆమె శ్రీభ్రమర గ్రూప్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ గళ్లా రామచంద్రరావు, డైరెక్టర్లతో కలిసి ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ వినూత్న ఆలోచనలతో గృహ నిర్మాణ రంగంలో శ్రీభ్రమర అద్భుతాలు సృష్టిస్తుందన్నారు. సీఆర్‌డీఏ, రెరా ఆమోదం పొంది నారాకోడూరులోని మామిడితోటలో వీకెండ్ హోమ్స్ కాన్సెప్ట్‌తో ఈ ప్రాజెక్టును అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు చెప్పారు. రామచంద్రరావు మాట్లాడుతూ ఈ ప్రాజెక్టులో రిసార్ట్స్, కాటేజీలు, ప్లాట్లు ఉన్నాయన్నారు. మామిడి తోటలో సుందరంగా తీర్చిదిద్దిన ల్యాండ్‌స్కేప్ గ్రీనరీ, థీమ్ పార్కులు, విశాలమైన రహదారులు, పిల్లల పార్కులు, పచ్చదనంతో నిండి ఉంటుందని వివరించారు.

బాడీబిల్డర్స్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక

వినుకొండ, న్యూస్‌టుడే: బాడీ బిల్డర్స్ అసోసియేషన్ పల్నాడు జిల్లా కమిటీ ఎన్నిక ఆదివారం వినుకొండలో నిర్వహించారు. నూతన అధ్యక్షుడిగా రాము, కార్యదర్శిగా అబ్దుల్లా ఎన్నికయ్యారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణ, కార్యదర్శి శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అన్ని క్రీడల మాదిరిగానే బాడీబిల్డింగ్ క్రీడను ప్రోత్సహిస్తుందని ఇందులో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని తెలిపారు. జిల్లా నుంచి వచ్చే వారిని ప్రోత్సహించి మంచి స్థానం కల్పిస్తామన్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను శాలువాలు కప్పి సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు జావిద్ తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 115, రిటైల్ ధర - 142, చికెన్ విత్‌స్కిన్ - 206, చికెన్ స్కిన్‌లెస్ - 234.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -115 రిటైల్ ధర 142 చికెన్ విత్ స్కిన్ - 206 చికెన్ స్కిన్‌లెస్ - 234.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 128, 137, 148 చికెన్ విత్ స్కిన్ - 240 చికెన్ స్కిన్‌లెస్ - 250.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 80085 10541
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80085 14589

(c) eenadu

నరసరావుపేట

• నరసరావుపేట • వినుకొండ • చిలకలూరిపేట

కత్వా వాగును కాపాడండి

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే: స్థానిక సత్తెనపల్లి రోడ్డులో ఆవులసత్రం సమీపంలోని కత్వా వాగు, చెరువు స్థలాన్ని ఆక్రమించి షాపింగ్ కాంప్లెక్స్‌లు నిర్మిస్తున్నారని, వెంటనే భూ కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని పీడీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం వారు ఆ ప్రాంతాన్ని సందర్శించి మాట్లాడుతూ కత్వావాగు, చెరువు ఆక్రమిస్తున్నారని రెవెన్యూ, మైనర్ ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా అధికారులు ఆక్రమణలపై ప్రత్యేక దృష్టిసారించి వాగు, చెరువు ఆక్రమణలకు గురి కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రామకృష్ణ, వై. వెంకటేశ్వరరావు, నల్లపాటి రామారావు తదితరులున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నరసరావుపేట అర్బన్ : 80085 73156
యడ్లపాడు : 8008145652 వినుకొండ గ్రామీణ : 9440009293

? నరసరావుపేట పట్టణం కొత్తబావి బజార్‌లో డ్రెయినేజీ పూడిక తీయడం లేదు. దుర్గంధం తట్టుకోలేకపోతున్నాం. దోమలతో ఇబ్బందులు పడుతున్నాం. **- శ్రీనివాసరావు, స్థానికుడు**
✔ సిబ్బందిని పంపి డ్రెయినేజీ పూడిక తీయిస్తాం.
- రమాదేవి, పారిశుద్ధ్య అధికారిణి
– న్యూస్‌టుడే, మల్లమ్మ సెంటర్(నరసరావుపేట)

? మండలంలో రవ్వారం పథకం ఉన్నా రాముడుపాలెం, ముప్పరాజుపాలెం, గాంధీనగరం, తిమ్మాపురం, సాయినగర్‌కు తాగునీరు ఇవ్వడం లేదు. దీంతో ఫ్లోరైడ్ నీరు తాగాల్సి వస్తుంది. **- సుధాకరరెడ్డి, గాంధీనగరం.** ✔ తాగునీరు సరఫరా చేసే పైపులు లీక్ అవడంతో ఆయా గ్రామాలకు నీరు సరఫరా కావడం లేదు. మరమ్మతులు చేసి సక్రమంగా నీరు సరఫరా అయ్యేలా చూస్తాం. **- రత్నబాబు, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్ -న్యూస్‌టుడే, నూజండ్ల**

? చిలకలూరిపేట పట్టణంలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట ప్రభుత్వ ఖాళీ స్థలంలో పిచ్చి మొక్కలు మొలిచాయి. మూత్ర విసర్జన కేంద్రంగా మార్చేయడంతో ఆ ప్రాంతంలో దుర్గంధం వెదజల్లుతోంది. చుట్టుపక్కల వారికి తీవ్ర అసౌకర్యంగా ఉంది. **- రామకృష్ణ**
✔ ఖాళీ స్థలంలో పిచ్చి మొక్కలు తొలగిస్తాం. అక్కడ మూత్ర విసర్జన చేయకుండా చర్యలు తీసుకుంటాం. **- వెంకటేశ్వరరావు,** పారిశుద్ధ్య అధికారి. **- న్యూస్‌టుడే, చిలకలూరిపేట పట్టణం**

చలో విజయవాడ విజయవంతం చేయండి

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: ఎన్నికల మేనిఫెస్టో హామీల సాధనకు దశల వారీ పోరాటంలో భాగంగా చలో విజయవాడ కార్యక్రమం చేపట్టామని ఏఐఎస్‌టీఎఫ్ జాతీయ ఆర్థిక కార్యదర్శి జోసెఫ్ సుధీర్‌బాబు తెలిపారు. పీఆర్‌సీ కమిషన్ నియమించాలని, ఐఆర్ 30శాతం తక్షణమే ప్రకటించాలని, కోరుతున్నామన్నారు. ఈనెల 25న విజయవాడలో జరిగే కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు.

26 నుంచి జనసేన సభ్యత్వ నమోదు

వినుకొండ, న్యూస్‌టుడే: జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమం ఈనెల 26 నుంచి ప్రారంభిస్తున్నట్లు ఆ పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి పొత్తూరి అభిమన్యు తెలిపారు. అన్ని మండలాల నాయకులు సభ్యత్వ నమోదును ఉద్యమంగా చేపట్టాలని ఆయన కోరారు.

ఉయ్యాలవాడకు ఘన నివాళి

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: రాయలసీమ ప్రాంతంలో తొలి స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతిని కలెక్టరేట్‌లో ఆదివారం నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బ్రిటీషర్లకు వ్యతిరేకంగా ఆయన పోరాటం చేశారని అధికారులు గుర్తుచేసుకున్నారు.

విశ్రాంత ఉపాధ్యాయుడి దాతృత్వం

గణపవరం (చిలకలూరిపేట గ్రామీణ): నాదెండ్ల మండలం గణపవరం గ్రామానికి చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు తూబాటి వెంకట సుబ్బయ్య పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం చేశారు.

ఎన్నేళ్లయినా ఇంతేనా?

వైకాపా అనాలోచిత నిర్ణయంతో ప్రజాధనం వృథా

న్యూస్‌టుడే, వినుకొండ, అరండల్‌పేట (నరసరావుపేట సెంట్రల్), న్యూస్‌టుడే

వినుకొండలో కంపచెట్లు పెరిగి నిరుపయోగంగా..

పట్టణాల్లోని వార్డుల్లో సేకరించిన వ్యర్థాలను తాత్కాలికంగా నిల్వ చేసేందుకు ప్రతి పట్టణంలో రెండింటికి తగ్గకుండా చెత్త బదిలీ కేంద్రాలు (గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్) ఏర్పాటు చేయాలని గత వైకాపా ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. 15వ ఆర్థిక సంఘం నిధులతో (టైడ్ గ్రాంటు) ఒక్కొక్క నిర్మాణానికి రూ.50లక్షలు వెచ్చించేందుకు 2020-21లో అనుమతించారు. స్థలాలు అందుబాటులో ఉన్న చోట వీటి నిర్మాణాలు ప్రారంభించి కొన్ని పూర్తి చేసి మరికొన్నింటిని మధ్యలోనే ఆపేశారు. చాలా చోట్ల సగంలో నిర్మాణాలు ఆపేయడంతో నిరుపయోగంగా మారాయి. జిల్లాలో ఏ పురపాలక సంఘంలోనూ ఇప్పటి వరకు వీటి వినియోగంలోకి తేలేదు.

పిల్లర్లు పోసి.. వినుకొండ పురపాలక సంఘంలోని తిమ్మాయపాలెం రోడ్డులో ఈద్గా వెనుక అరెకరా స్థలంలో రూ.50లక్షలతో చెత్త బదిలీ కేంద్రం నిర్మాణం చేపట్టారు. చుట్టూ ప్రహరీ నిర్మించి, లోపల నేల చదును చేసి సిమెంట్ కాంక్రీట్ పోశారు. ప్రత్యేకంగా సిబ్బంది కోసం గది కట్టారు. చెత్తను వేరు చేసేందుకు షెడ్డు కోసం పిల్లర్లు పోసి సగంలో ఆపేశారు. ఇంత వరకు సుమారు రూ.20లక్షలు ఖర్చుపెట్టి గుత్తేదారుకు ఇప్పటి వరకు బిల్లు చెల్లించలేదు. మిగిలిన పని పూర్తి చేయలేదు. దీంతో అక్కడ కంపచెట్లు పెరిగిపోయాయి. ఈ మున్సిపాలిటీలోనే కాదు దాదాపు అన్ని చోట్లా ఇదే పరిస్థితి ఉంది.

★ నరసరావుపేట పురపాలక సంఘంలో రెండింటికి అనుమతి రాగా అందులో ఒకటి కట్టి వదిలేశారు. ఇందుకోసం సుమారు రూ.20లక్షలు ఖర్చు చేశారు. ఆ తర్వాత ఇప్పటి వరకు దాని వైపు చూడలేదు. దీంతో నిరుపయోగంగా మారింది.

ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వాల్సి ఉంది

డంపింగ్ యార్డు రహిత రాష్ట్రం చేయాలన్న లక్ష్యంతో అన్ని పురపాలక సంఘాల్లో పేరుకుపోయిన చెత్త నిల్వల తొలగింపునకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా సేకరించిన వ్యర్థాలను నేరుగా వాహనాల్లో గుంటూరు సమీపంలోని చెత్త నుంచి విద్యుత్తు తయారీ కేంద్రానికి తరలించాలని ఆదేశించింది. అందువల్ల ఇక ట్రాన్స్‌ఫర్ స్టేషన్ల అవసరం లేదన్న భావనతో వాటిపై దృష్టిపెట్టలేదని అధికారులు తెలిపారు. ఇప్పటికే ప్రజాధనం వెచ్చించి నిర్మించిన వాటిని వదిలేయకుండా ఇతర అవసరాలకు వినియోగించుకుంటే మంచిదని అభిప్రాయం వెలిబుచ్చారు. మధ్యలో ఆగిపోయిన వాటిని ఎలా వినియోగించాలనే అంశంపై ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వాల్సి ఉందని రవి (డీఈఈ, నరసరావుపేట), పి.ఆదినారాయణ (ఏఈఈ, వినుకొండ) తెలిపారు.

సీఎం పర్యటన విజయవంతంపై హర్షం

ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ఆంజనేయులు

వినుకొండ, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వినుకొండ పర్యటన విజయవంతమైందని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. ఆయన ఆదివారం తన కార్యాలయంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరిశుభ్రతపై ప్రజలలో అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన సీఎంకు ప్రజలు అపూర్వ స్వాగతం పలికినందుకు కృతజ్ఞతలు తెలిపారు. సీఎం పర్యటనకు ఏర్పాట్లు సమర్థవంతంగా చేసిన కలెక్టర్ కృతికాశుక్లా, ఎస్పీ కృష్ణారావుతో పాటు ప్రభుత్వ యంత్రాంగాన్ని ఆయన అభినందించారు.

టిడ్కో సముదాయంలో సౌకర్యాలు కల్పిస్తాం

ఎమ్మెల్యే ప్రత్తిపాటికి అర్జీ అందిస్తున్న మహిళ

చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే: టిడ్కో గృహ సముదాయంలో సకల సౌకర్యాలు కల్పిస్తామని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. ఆ ప్రాంగణంలో రూ.3.60 కోట్లతో 30 గదుల షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన చేసి మాట్లాడారు. ఆరు నెలల్లో పనులు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పురపాలక సంఘ ఛైర్మన్ ఎస్‌కే రఫాని, మార్కెట్ యార్డు ఛైర్మన్ షేక్ కరీముల్లా, తెదేపా సమన్వయకర్త సదారావు, కౌన్సిలర్ జంగా సుజాత, కూటమి నాయకులు పాల్గొన్నారు. అనంతరం స్థానిక మద్దిరాలలో రూ.30లక్షలతో మున్సిపల్ కమ్యూనిటీ హాలు ఆధునికీకరణ పనులను ఆదివారం ప్రారంభించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో జనసేన పార్టీ సమన్వయకర్త తోట రాజారమేష్, పార్టీ నాయకులు సమద్‌ఖాన్, మద్దుమాల రవి, కందుల రమణ, పిల్లి కోటి, బేరింగ్ మౌలాలి తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజలు తమ సమస్యలపై ఎమ్మెల్యేకు అర్జీలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ పాలన ఫలితంగానే ప్రజలను సమస్యలు పట్టి పీడిస్తున్నాయని విమర్శించారు. భూ వివాదాలకు సంబంధించి ప్రత్యేక సెల్ ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు.

సబ్‌జైలు ఆకస్మిక తనిఖీ

పరిశీలిస్తున్న న్యాయాధికారి ఆశీర్వాదపాల్

వినుకొండ, న్యూస్‌టుడే: స్థానిక సబ్‌జైలును న్యాయాధికారి ఆర్.ఆశీర్వాదపాల్ ఆదివారం తనిఖీ చేశారు. ఖైదీలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఓ వ్యక్తి తన భార్య విభిన్న ప్రతిభావంతురాలు కావడంతో దూరంగా ఉంటుందని తన వద్దకు వచ్చేందుకు రాకుండా ఉందని... బెయిలు వచ్చినా హామీదారులు లేనందున విడుదల కాలేదని మరో ఖైదీ తన గోడు చెప్పుకున్నారు. అనంతరం ఆయన హామీదారుల విషయంలో చర్యలు తీసుకోవాలని న్యాయాధికారి పోలీసులకు సూచించారు. ఆ తర్వాత భోజన సదుపాయాలపై ఆరా తీశారు. జైలు ప్రాంగణాన్ని పరిశీలించి సిబ్బందికి సూచనలు ఇచ్చారు. న్యాయాధికారి వెంట ప్యానల్ అడ్వకేట్ పఠాన్ గౌస్‌మొహిద్దీన్‌ఖాన్, డాక్టర్ అబ్దుల్ రజాక్, ఎస్సై పుల్లారావు, లోక్ అదాలత్ వాలంటీరు రూబెన్ తదితరులు ఉన్నారు.

250 మందికి వైద్య పరీక్షలు

యడ్లపాడు, న్యూస్‌టుడే: స్థానిక పీఆర్ విజ్ఞాన కేంద్రంలో బాసట ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. మధుమేహం, రక్తపోటు, పక్షవాతం, ఫిట్స్ సంబంధిత బాధితులు 250 మందికి వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వైద్యులు గుంటుపల్లి దివ్యతేజ, ఎద్ద రవీంద్ర, ఎ.మౌనికచౌదరి, శౌరిని నవ్యశ్రీ, ఎస్.కావ్య వైద్య సేవలు అందించారు. బాసట అధ్యక్ష, కార్యదర్శులు నూతలపాటి కాళిదాసు, సామినేని శ్రీనివాసరావు, కోశాధికారి తేతా రామబ్రహ్మం, సభ్యులు పర్యవేక్షించారు.

త్వరలో శాశ్వత మరమ్మతులు చేయిస్తాం

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే: వినుకొండ - నూజండ్ల దారిలో రైల్వే కింది వంతెన వద్ద రైల్వే శాఖ ఆధ్వర్యంలో శాశ్వత మరమ్మతులు చేయనున్నట్లు రైల్వే ఇంజినీర్ రామకృష్ణ తెలిపారు. ఇక్కడ మురుగునీరు నిల్వ ఉండి దుర్వాసన వెదజల్లుతోంది. ఈ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులు ఇబ్బందులు పడటంపై తరచూ పత్రికల్లో కథనాలు రావడంతో ఆయన సిబ్బందితో కలిసి ఈ ప్రాంతం పరిశీలించారు. జిల్లా పురపాలక సంఘం ఆధ్వర్యంలో తాత్కాలిక మరమ్మతులు చేసినా ఫలితం లేదని చోదకులు ఆయన వద్ద వివరించారు. దీనిపై స్పందించిన ఇంజినీర్ రైల్వే శాఖ ఆధ్వర్యంలో త్వరలో మరమ్మతులు చేపట్టి సమస్య పరిష్కరిస్తామన్నారు.

పాఠశాలలో ఆనంద ఆదివారం

వినుకొండ, న్యూస్‌టుడే: పట్టణంలో వెల్లటూరు రోడ్డులోని శర్మ పాఠశాలలో మున్సిపల్ అధికారులు ఆనంద ఆదివారం కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు పంపిణీ చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇస్మాయిల్ తెలిపారు.

కూటమి పాలనలో పురోభివృద్ధి

రూ.5 లక్షల చెక్కు ఇస్తున్న ఎమ్మెల్యే చదలవాడ

రొంపిచర్ల, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్రం పురోభివృద్ధి సాధిస్తోందని ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు అన్నారు. మండలంలోని నల్లగార్లపాడు, మాచవరంలో పార్టీ నేతలతో కలిసి ఆయన ఆదివారం పర్యటించారు. నల్లగార్లపాడులో నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ కేంద్ర భవనం, విలేజ్ క్లినిక్, డంపింగ్‌యార్డులు ప్రారంభించారు. మొక్కలు నాటారు. వీరాంజనేయ, వినాయకుడి ఆలయంలో పూజలు చేశారు. బాప్టిస్ట్ చర్చిలో ప్రార్థనల్లో పాల్గొన్నారు. స్థానిక అంబేడ్కర్ నగర్ వద్ద శ్మశాన రోడ్డు అధ్వానంగా ఉందని స్థానికులు ఆయన దృష్టికి తేగా ఉపాధిహామీ పథకంలో నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కార్యకర్తలే పార్టీకి వెన్నెముక.. ఆపదలో ఉన్న కార్యకర్తల కుటుంబాలను ఆదుకోవడంలో తెదేపా ఎప్పుడూ ముందుంటుందని ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు అన్నారు. మండలంలోని మాచవరంలో తెదేపా కార్యకర్త పొడిచెర్ల రామాంజనేయరెడ్డి ఇటీవల మృతి చెందారు. తెదేపా కార్యకర్తల సంక్షేమ విభాగం ద్వారా మంజూరైన రూ.5లక్షల ప్రమాద బీమా చెక్కును మృతుడి భార్య సుమలతకు ఎమ్మెల్యే అందజేశారు. మంత్రి లోకేశ్ కార్యకర్తల సంక్షేమానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని తెలిపారు. సంతగుడిపాడు డీసీ ఛైర్మన్ కోటిరెడ్డి, అంజిరెడ్డి, మండల పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు నాగిరెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అంచులు దిగితే అపాయమే

నరసరావుపేటలోని బరంపేట శిశుమందిర్ రోడ్డులో ఇటీవల మురుగు కాలువ నిర్మించారు. రోడ్డు అంచుల్లో, కాలువకు మధ్య మట్టి పోయ లేదు. కొంత మేర పోసి మిగతా చోట్ల వదిలేయడంతో ఆ మార్గంలో ప్రమాదకరంగా మారింది. రాత్రిళ్లు చీకట్లో వాహనాలు అంచులు దిగితే చోదకులు కిందపడి గాయాలపాలవుతున్నారు. అధికారులు చొరవ చూపి అంచుల్లో మట్టి పోసి పూడ్చాలని వాహనచోదకులు కోరుతున్నారు. దీనిపై ఇన్‌ఛార్జి కమిషనర్ రవికుమార్‌ను సంప్రదించగా సిబ్బందిని పంపి వెంటనే సమస్య పరిష్కరిస్తామని తెలిపారు.
- న్యూస్‌టుడే, మల్లమ్మ సెంటర్ (నరసరావుపేట)

నీటి వృథా అరికట్టరూ!

జిల్లా కేంద్రం నరసరావుపేటకు తాగునీరు సరఫరా అయ్యే ప్రధాన పైపులైనులో ఎయిర్ వాల్వ్ నుంచి నిరంతరం నీరు లీకవుతోంది. రోజుల తరబడి ఇలా నీరు నేలపాలవుతున్నా ఇంజినీరింగ్ అధికారులు పట్టించుకోకపోవటంతో వందల లీటర్లు నేలపాలవుతోంది. వేసవి సమీపిస్తుండటంతో నీటి వృథాను అరికట్టడంపై అధికారులు దృష్టిపెట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయాన్ని మున్సిపల్ డీఈ రఫీ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే ఎయిర్ వాల్వ్‌కు మరమ్మతులు చేయించి నీరు వృథా కాకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. **-న్యూస్‌టుడే, నరసరావుపేట టౌన్**

ఎండలో తప్పని పడిగాపులు

చిలకలూరిపేట పట్టణంలో ఎన్నార్టీ కూడలి వద్ద చీరాల, మార్టూరు, ఒంగోలు వైపు వెళ్లే బస్సులు ఆగే చోట బస్ షెల్టర్ ఏర్పాటు చేశారు. అయితే అక్కడ బస్సులు ఆపకుండా షెల్టర్‌కు దూరంగా నిలుపుతున్నారు. దీంతో ప్రయాణికులు బస్సుల కోసం జాతీయ రహదారిపై ఎండలో నిలబడాల్సిన దుస్థితి నెలకొంది. ముఖ్యంగా మహిళలు రోడ్డుపై నిలబడేందుకు ఇబ్బంది పడుతున్నారు. సమస్యను డీఎం వేణుబాబు దృష్టికి తీసుకెళ్లగా బస్సులు నిర్దేశిత షెల్టర్ వద్ద ఆగేలా చర్యలు తీసుకుంటామన్నారు.
- న్యూస్‌టుడే, చిలకలూరిపేట పట్టణం

కర్రలు ప్రమాదాన్ని ఆపగలవా?

మండలంలో పెద్దరెడ్డి పాలెం వెళ్లే రహదారిలో లోలెవల్ చప్టాపై ఇరువైపులా రక్షణగా రెయిలింగ్ లేక ప్రయాణం ప్రమాదకరంగా మారింది. ఈ మార్గంలో పెద్దరెడ్డిపాలెం, దొండపాడు తదితర గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. రాత్రిళ్లు అంచులు కనబడక వాహనాలు పడిపోతాయని ఆందోళన చెందుతున్నారు. వర్షాకాలంలో చిన్నపాటి వర్షానికి నీరు చప్టాపై ప్రవహించి రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. ఈ విషయాన్ని ఆర్ అండ్‌బీ ఏఈ సైమన్‌పాల్ దృష్టికి తీసుకెళ్లగా నూతన బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపామని, ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే నిర్మాణ పనులు ప్రారంభిస్తామని చెప్పారు.
- న్యూస్‌టుడే, పెద్దరెడ్డిపాలెం (నరసరావుపేట సెంట్రల్)

మొక్కేకదా అని వదిలేశారు..!

స్థానిక ఎన్నెస్పీ కాలనీలోని కార్మికశాఖ కార్యాలయంలోకి వెళ్లే ప్రధాన మార్గంలో గోడలో చెట్టు పెరిగింది. మొక్క వేర్లు గోడలోకి చొచ్చుకు పోయి గోడకు నెర్రెలు వచ్చాయి. గోడపై మొక్క కనిపిస్తున్నా తొలగించాలన్న ఆలోచన రాకపోవటం సిబ్బంది నిర్లక్ష్యానికి నిదర్శనమన్న విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, నరసరావుపేట వ్యవసాయం**

ఘనంగా ప్రసన్నాంజనేయుడికి పూజలు

పూజలందుకున్న ప్రసన్నాంజనేయ స్వామి

ఈపూరు, న్యూస్‌టుడే: మండలంలో బొగ్గరం ప్రసన్నాంజనేయ స్వామి తిరునాళ్ల ఆదివారం ఘనంగా జరిగింది. తెల్లవారుజాము నుంచే స్వామికి పంచామృత అభిషేకం, విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, అభిషేకాలు, ఆకుపూజ, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలు పొంగళ్లు చేసి మొక్కులు తీర్చుకున్నారు. రైతులు తమ పశువులు, వాహనాలను దేవాలయం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వేలాది మంది భక్తులు స్వామిని దర్శించి పూజలు నిర్వహించారు. గ్రామస్థులు నిర్మించిన నాలుగు భారీ విద్యుత్తు ప్రభలు శోభాయమానంగా ప్రకాశించాయి. ప్రభలపై నిర్వహించిన పాట కచేరీలు, నృత్యాలు ప్రేక్షకులను అలరించాయి. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, భక్తులకు ఇబ్బంది రాకుండా వినుకొండ గ్రామీణ సీఐ బ్రహ్మయ్య, ఎస్సై కె.వేణుగోపాల్ ఆధ్వర్యంలో పోలీసులు పటిష్ఠ బందోబస్తు నిర్వహించారు.

శోభాయమానంగా ప్రకాశిస్తున్న భారీ విద్యుత్తు ప్రభలు

అన్నవరం గోడు వినేదెవరు?

ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రికి ఫిర్యాదు

నరసరావుపేట వ్యవసాయం, న్యూస్‌టుడే: మండలంలోని అన్నవరంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని కొద్ది నెలల క్రితం గ్రామస్థులు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యే, డీపీవోకు రిజిస్టర్ పోస్టు ద్వారా ఉత్తరాలు పంపారు. ఇదే విషయమై పీజీఆర్‌ఎస్‌లో అర్జీ నమోదు చేశారు. కొన్ని రోజుల తర్వాత అధికారులు వచ్చి గ్రామస్థులతో మాట్లాడుతూ జల్‌జీవన్ మిషన్ కింద రూ.2.50 కోట్లతో అభివృద్ధి పనులు చేశామని వివరించారు. పనులు చేస్తే తాగునీరు ఎందుకు ఇవ్వటం లేదని గ్రామస్థులు ప్రశ్నించడంతో చేసేది లేక వెనుదిరిగారు. మూడ్రోజుల క్రితం పీజీఆర్‌ఎస్ నుంచి ఫోన్ చేసి మీ సమస్య పరిష్కరించామని తెలపటంతో ఫిర్యాదుదారు కంగుతిన్నాడు. సమస్య పరిష్కారం కోరుతూ మళ్లీ అందరికీ రిజిస్టర్ పోస్టులో ఉత్తరాలు పంపారు. సమస్య పరిష్కారం కాకుండా అయినట్లు చూపడంపై క్షేత్రస్థాయిలో విచారణ చేసి గ్రామస్థులకు తాగునీరు అందించాలని కోరారు.

24న పువ్వాడ అమ్మవారి జాతర

నూజండ్ల, న్యూస్‌టుడే: మండలంలోని పువ్వాడ గ్రామదేవత పువ్వాడ అమ్మవారి తిరునాళ్ల ఈనెల 24న వైభవంగా జరగనుంది. తిరునాళ్ల రోజు కొండలరాయునిపాలెం, పాత, కొత్తపాలెంలు, కొండ్రప్రోలు, ములకలూరు, గొల్లపాలెం, ప్రకాశం జిల్లా మక్కెనోరిపాలెం, జమ్మలమడక తదితర గ్రామాల నుంచి భక్తులు తరలివస్తారు. రాత్రికి భారీ విద్యుత్తు ప్రభలు నిర్మించి సాంస్కృతిక కార్యక్రమాలు, కోలాటాలు, బృందావన భజనలు నిర్వహిస్తారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని నిర్వాహక కమిటీ తెలిపింది. అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణారావు పేర్కొన్నారు.

వైభవంగా విఘ్నేశ్వరస్వామి తిరునాళ్ల

అలంకరణలో విఘ్నేశ్వరస్వామి

యడ్లపాడు, న్యూస్‌టుడే: మండలంలోని గుత్తావారిపాలెంలో శ్రీవిఘ్నేశ్వరస్వామి వార్షిక తిరునాళ్ల మహోత్సవం ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ అర్చకుడు జంధ్యాల మల్లికార్జునరావు ఆధ్వర్యంలో స్వామికి గరిక, పూలతో ప్రత్యేక అలంకరణ చేశారు. ఉదయం నుంచే భక్తులు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. స్వామికి పొంగళ్లను నైవేద్యంగా సమర్పించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. పాట కచేరీలు, భజనలు తదితర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. గుత్తావారిపాలెం, కారుచోల, గనికపూడి గ్రామాలకు చెందిన అయిదు విద్యుత్తు ప్రభలు ఆలయ ప్రాంగణంలో కాంతులు విరజిమ్మాయి. చుట్టుపక్కల గ్రామాల వారు పెద్ద సంఖ్యలో తిరునాళ్లకు తరలివచ్చి సందడిగా గడిపారు.

తిరునాళ్లలో కాంతులీనుతున్న విద్యుత్తు ప్రభలు

అదుపు తప్పి లారీ బోల్తా

రొంపిచర్ల: మార్కెట్ యార్డు ప్రహరీపై పడిన లారీ

రొంపిచర్ల, న్యూస్‌టుడే: అద్దంకి-నార్కెట్‌పల్లి రాష్ట్రీయ రహదారి పరిధిలో రొంపిచర్ల మార్కెట్ యార్డు వద్ద సిమెంటు లారీ అదుపు తప్పి బోల్తా కొట్టింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు తెలంగాణ నుంచి చెన్నైకు సిమెంటు లోడుతో బయలుదేరిన లారీ ఆదివారం రొంపిచర్ల మార్కెట్‌యార్డు సమీపంలో ప్రయాణిస్తూ వేగాన్ని నియంత్రించుకోలేక రోడ్డు పక్కకు బోల్తా కొట్టింది. యార్డు ప్రహరీపై పడటంతో గోడ ధ్వంసం అయింది. ఈ ప్రమాదంలో లారీ పూర్తిగా దెబ్బతింది. ప్రమాద తీవ్రతకు చక్రాలు ఊడిపోయాయి. డ్రైవర్, క్లీనర్ స్వల్ప గాయాలతో బయట పడ్డారు. **టైరు పేలి..** వినుకొండ రూరల్: మండలంలో శివాపురం వద్ద కర్నూలు - గుంటూరు జాతీయ రహదారిపై మినీలారీ టైరు పేలి డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. స్థానికుల కథనం ప్రకారం కడప జిల్లా జమ్మలమడుగుకు చెందిన మినీ లారీని మరమ్మతుల నిమిత్తం విజయవాడకు తీసుకెళ్తుండగా శివాపురం వద్దకు రాగానే టైరు పేలి డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. వాహన చోదకుడికి స్వల్ప గాయాలు కావడంతో అత్యవసర వాహనంలో వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతున్నాడు.


వినుకొండ: శివాపురం వద్ద..

విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలి

విద్యార్థినుల నృత్యప్రదర్శన

సాతులూరు(చిలకలూరిపేట (గ్రామీణ), న్యూస్‌టుడే : నాణ్యమైన విద్యతో పాటు ఆటల్లోనూ విద్యార్థులను ఉన్నతస్థాయిలో ఉండేలా తీర్చిదిద్దుతున్న ఈతరం పాఠశాల డైరెక్టర్లు బండారుపల్లి సత్యనారాయణ, పాటిబండ్ల శివరామకృష్ణప్రసాద్ అభినందనీయులని ఎమ్మెల్యేలు ప్రత్తిపాటి పుల్లారావు, డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. నాదెండ్ల మండలం సాతులూరులో పాఠశాల వార్షికోత్సవంలో ఆదివారం పాల్గొని మాట్లాడారు. ఒంగోలుకు చెందిన శ్రీహర్షిణి విద్యాసంస్థల ఛైర్మన్ గోరంట్ల రవికుమార్, నరసరావుపేట భావన విద్యాసంస్థల డైరెక్టర్ మైనీడి శ్రీనివాసరావు, యోగా గురువు జగన్ పాల్గొన్నారు. వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు పతకాలు అందజేశారు. అనంతరం విద్యార్థుల నృత్యప్రదర్శనలు అబ్బురపరిచాయి.

ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోండి

నాదెండ్ల(చిలకలూరిపేట (గ్రామీణ): విద్యార్థులు ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలని హెచ్.ఎం కె.నిర్మల, ఉపాధ్యాయులు కె.రెడ్డయ్య, శయశంకర్ సూచించారు. నాదెండ్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో ఈ నెల 28న జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించనున్న నేపథ్యంలో విద్యార్థులకు ఆదివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఐ ప్రాధాన్యతలు, గణిత, సాంఘికశాస్త్ర మిళిత సైన్స్ ఆవిష్కరణలు ప్రదర్శనలో ఉండాలన్నారు. సొసైటీ ప్రతినిధి వేణుబాబు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

నూజండ్ల, వినుకొండ రూరల్, న్యూస్‌టుడే: ఇంటర్మీడియట్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తయినట్లు నూజండ్ల మండలం ఉప్పలపాడు బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపల్ రమణమ్మ తెలిపారు. పరీక్షల నిర్వహణపై ఇన్విజిలేటర్లకు ఆదివారం కళాశాలలో శిక్షణ ఇచ్చారు. ప్రతి పరీక్ష గదిలో సీసీ కెమెరాతో నిఘా ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఉదయం 9 గంటలకు పరీక్ష ప్రారంభం అవుతుందని విద్యార్థులు గంట ముందే కేంద్రానికి చేరుకోవాలన్నారు. వినుకొండ మండలం చీకటీగలపాలెం ఆదర్శ పాఠశాలలో పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ ఏడుకొండలు, డిపార్ట్‌మెంటల్ అధికారి రాఘవరావు మాట్లాడుతూ నిమిషం ఆలస్యమైనా పరీక్షకు అనుమతి ఉండదని తెలిపారు.

అశ్రునివాళి

కంటి పాపవై కాపాడావు..
కాలి బాటవై నడిపించావు...
అలుపెరగని నీ శ్రమతో
మా భవిష్యత్తును తీర్చిదిద్దావు.
మీరు మా మధ్య లేకపోయినా..
మీ క్రమశిక్షణ, మీ ఆశయాలు
మా గుండెల్లో నిరంతరం
ప్రవహిస్తూనే ఉంటాయి.
అశ్రునయనాలతో నివాళులు
అర్పిస్తూ... మీ పవిత్ర ఆత్మకు
శాంతి చేకూరాలని
ఆ భగవంతుని ప్రార్థిస్తూ...

కీ॥శే॥ శ్రీ పొత్తూరి
జనార్ధనరావు (జనాయ్) గారు
మరణం : 08-02-2026
ప్రెసిడెంట్: ది వినుకొండ బులియన్ మర్చంట్స్ & పాన్ బ్రోకర్స్ అసోసియేషన్

భార్య: పొత్తూరి ఆశా
కుమారుడు - కోడలు:
పొత్తూరి వెంకటేష్ - లలిత
మనుమడు, మనుమరాలు:
కుషాల్, నిష్విక
కుటుంబ సభ్యులు
మరియు బంధుమిత్రులు

JP జ్యూయలర్స్, మెయిన్ బజారు, వినుకొండ

వైకుంఠ సమారాధన: ది. 23-02-2026 సోమవారం మా స్వగృహం నందు జరుగును

సత్తెనపల్లి

•సత్తెనపల్లి • పెదకూరపాడు • మాచర్ల • గురజాల

కన్నెగంటి త్యాగం చిరస్మరణీయం

మాట్లాడుతున్న శాసనసభ్యుడు బ్రహ్మారెడ్డి

దుర్గి, న్యూస్‌టుడే: పల్నాటి ఉద్యమ నాయకుడు కన్నెగంటి హనుమంతు త్యాగం చిరస్మరణీయమని శాసన సభ్యుడు జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. ఆదివారం హనుమంతు 104వ వర్ధంతి కార్యక్రమాన్ని కుటుంబ సభ్యులు, రాజకీయ నాయకులు, కళాకారులు దుర్గిలో నిర్వహించారు. ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి స్థానిక బస్టాండ్ కూడలిలో హనుమంతు విగ్రహానికి పూలదండలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో యార్డు చైర్మన్ లింగా బ్రహ్మయ్య, కటకం రామారావు, శెట్టిపల్లి యల్లమంద, గుండాల వెంకటేశ్వర్లు, సూరె వెంకటేశ్వర్లు, వెలిదండి గోపాలు, పులిహరి, తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు

బోనాలు సమర్పిస్తున్న మహిళలు

గురజాల (గ్రామీణ): గురజాల - పల్లెగుంత రహదారిలో శ్రీలక్ష్మీ తిరుపతమ్మ, గోపయ్య స్వామికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మహిళలు బోనాలు నెత్తిమీద పెట్టుకుని గ్రామంలో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి సమర్పించారు. పసుపు, కుంకుమతో పూజలు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు నాగేశ్వరరావు, సతీష్, సాయి పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

సత్తెనపల్లి: 80085 73171 పెదకూరపాడు: 80088 31888
కారంపూడి: 80085 73185 గురజాల: 80085 7 3176

దాచేపల్లి, న్యూస్‌టుడే: ? పెదగార్లపాడు గ్రామంలోని పలు వీధుల్లో డ్రెయిన్లలో పూడిక సక్రమంగా తొలగించడం లేదు. దోమల బెడద ఎక్కువ అయ్యింది. **- సత్యనారాయణ, స్థానికుడు**
✔ పరిశీలన చేసి సిబ్బందితో డ్రెయిన్లను శుభ్రం చేయిస్తాం. మందులు పిచికారీ చేయిస్తాం. - రవికుమార్, పంచాయతీ కార్యదర్శి, పెదగార్లపాడు గ్రామం

అమరావతి, న్యూస్‌టుడే: ? మల్లాది ఎస్సీ కాలనీలో కొన్ని చోట్ల వీధి దీపాలు వెలగక రాత్రి అయితే వీధుల్లో చీకట్లు కమ్ముకుని ఇబ్బందులు పడుతున్నాం. **- కాలనీ వాసులు** ✔ సిబ్బందిని పంపి వెలగనివాటి కొత్తవి వేస్తాం. - ఏడుకొండలు, పంచాయతీ కార్యదర్శి, మల్లాది

ప్రణాళికతో చదివితే పదిలో విజయం
పాఠ్యాంశ నిపుణుల చిట్కాలు

సత్తెనపల్లి, దొడ్లేరు, నకరికల్లు, న్యూస్‌టుడే

ప్రణాళికతో చదివితే పదో తరగతిలో విజయం సాధించవచ్చని పాఠ్యాంశ నిపుణులు చెబుతున్నారు. ఉత్తీర్ణతతో పాటు మంచి మార్కుల సాధనకు వారు చెబుతున్న చిట్కాలు ఇవే.

తెలుగు: వంద మార్కులు రావాలంటే 32 మార్కులకు 32 మార్కులు తెచ్చే భాషాంశాలు రావాలి. పాఠాల చివరనున్న పదజాలం, వ్యాకరణాంశాలు సంపూర్ణంగా చదవాలి. రామాయణం పూర్తిగా వీలైనన్ని సార్లు చదవాలి. వాక్యరూపంలో కాండాలను రాయాలి. పరిచిత పద్య, గద్య ప్రశ్నలకు జవాబులు కూడా వాక్యరూపంలోనే రాయాలి. వ్యాసరూప ప్రశ్నలకు సమాధానాలు మూడు, నాలుగు పేరాలుగా విభజించి రాయాలి. **- కె.శేషాద్రి.**

హిందీ: పేరాగ్రాఫ్ అర్థం చేసుకుని చదివి రాస్తే 25 మార్కులు తెచ్చుకోవచ్చు. దక్షిణీ గంగా గోదావరి, స్వరాజ్య కీ నీవ్, జల్ కీ జీవన్‌హై పాఠాల రచయితల పరిచయం చదివితే 5 మార్కులు సాధించవచ్చు. తత్భవ్, క్రియ, సంఖ్య, కౌరక్, సందివిచ్ఛేద్, పర్యాయ్‌శబ్ద్, విలోమ్‌శబ్ద్, సమాస్, ఆపసర్గ్, ప్రత్యమ్, ముహవరా, లింగ్, వచన్, కాల్, శుద్ధ్‌రూప్ బాగా అభ్యాసం చేయాలి. రాష్ట్రీయ త్యోహార్, స్వచ్ఛభారత్, దూరదర్శన్, కృత్రిమ ఉపగ్రహ్, ఆదర్శ్ విద్యార్థి చదవాలి. పత్ర్‌లేఖన్‌లో చుట్టీపత్ర్, మిత్ర్‌కో పత్ర్, పితాజి కో పత్ర్ బాగా చదవితే మంచి మార్కులు సాధించవచ్చు. **- షేక్ అబ్దుల్ ఖాదర్.**

ఆంగ్లం: మూడు సెక్షన్లలో 100 మార్కుల ప్రశ్నలు వస్తాయి. సెక్షన్-ఏలో 30 మార్కులకు రీడింగ్ కాంప్రహెన్షన్, సెక్షన్-బీలో 40 మార్కులకు గ్రామర్. వకాబులరీ, సెక్షన్-సీలో 30 మార్కులకు క్రియేటివ్ ఇంప్రేషన్స్‌పై దృష్టి సారించాలి. ఎస్‌సీఈఆర్‌టీ అందించిన మూడు నమునా ప్రశ్నపత్రాలను విడివిడిగా అందించిన మెటీరీయల్‌ను సాధన చేయడం ద్వారా తక్కువ సమయంలో ఎక్కువ మార్కులు సాధించవచ్చు. వకాబులరీకి సంబంధించి అన్ని ప్రశ్నలు కచ్చితంగా రీడర్ నుంచే వస్తాయి. గ్రామర్‌లో వాయిస్, రిపోర్టెడ్ స్పీచ్, ఎడిటింగ్ అంశాలపై సాధన చేయాలి. రీడర్, సప్లిమెంటరి రీడర్‌లోని అన్ని పాఠ్యాంశాల్లో క్యారెక్టర్లు, ఇతివృత్తం, స్టోరీలు గుర్తుంచుకోవడం ద్వారా సులభంగా మార్కులు సాధించవచ్చు. లెటర్‌ను(ఏ,బీ,సీ)గా గుర్తిస్తే సరిపోతుంది. ప్రతి ప్రశ్నలో సమాధానం హింట్‌గా ఉంటుంది. **- టి.అంజిరెడ్డి.**

పుస్తక పఠనం అలవాటే పిల్లలకు బహుమతి

పుస్తకాలు పరిశీలిస్తున్న వెంకటేశ్వరరాజు, వందనాదేవి తదితరులు

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: బాల్యదశలోనే పిల్లలకు పుస్తక పఠనాన్ని అలవాటు చేయడం తల్లిదండ్రులు వారికి ఇచ్చే విలువైన బహుమానం అని రాష్ట్ర భట్రాజు సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ సరికొండ వెంకటేశ్వరరాజు, ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బీసినేని వందనాదేవి అన్నారు. పట్టణంలోని వావిలాల పార్కులో అమరావతి సేవాసమితి ఆధ్వర్యంలో పోస్టు వదలండి.. పుస్తకాలు పట్టండి కార్యక్రమంలో భాగంగా ఏర్పాటుచేసిన ఓపెన్ బుక్ రీడింగ్ సెషన్‌కు వారు హాజరై మాట్లాడారు. ఎలక్ట్రానిక్ పరికరాలతో పిల్లల్లో ఆలోచన, సృజనాత్మక శక్తి తగ్గుతున్నాయన్నారు. పుస్తకాల్ని చదివే అలవాటు వారికి ఉంటే ఆలోచనా శక్తి పెరుగుతుందన్నారు. తెదేపా మహిళా విభాగం నియోజకవర్గ అధ్యక్షురాలు తోట అంబికా, అంగన్‌వాడీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లీలావతి, పట్టణ మహిళా విభాగం అధ్యక్షురాలు రజిని, సేవాసంస్థ బాధ్యులు వీరాంజనేయులు, పావన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి కృషి

విజయపురిసౌత్: మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు మైలపల్లి అప్పలరాజు అన్నారు. ఆదివారం విజయపురిసౌత్‌లోని డౌన్ మార్కెట్‌లో మత్స్యకారుల కార్యాలయం వద్ద జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టారు. ఇప్పటికే మాచర్ల ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి కృషితో 70 ఏళ్ల తర్వాత మత్స్యకారుల సాగర్ క్వార్టర్స్ కాలనీలో నూతన సీసీ రోడ్డు నిర్మించినట్లు తెలిపారు. మత్స్యకారుల అభ్యున్నతి కోసం సాగర్ రిజర్వాయర్‌లో లక్షలాది చేపపిల్లలను విడుదల చేశామన్నారు.

సాగరమాత ఉత్సవాల పతాకావిష్కరణ

ప్రార్థనలు చేస్తున్న విచారణ గురువులు

విజయపురిసౌత్, న్యూస్‌టుడే: సాగరమాత ఉత్సవాల పతాకావిష్కరణ కార్యక్రమాన్ని గురుశ్రీ పామిశెట్టి బాలస్వామి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. విచారణ గురువులు ఫాదర్ పామిశెట్టి జోసెఫ్ బాలసాగర్, అసిస్టెంట్ ఫాదర్లు కిరణ్‌సాగర్, అనిల్‌కుమార్, గుడిపెద్దలు శౌరి రాజు, ఇన్నారెడ్డి, ప్రేమారెడ్డి, మరియదాసు, కట్టా రాజు, శౌరిబాబు, సూరజ్‌చందు పాల్గొన్నారు.

సత్తెనపల్లి యూనిట్ అధ్యక్షుడిగా మరియదాసు

నూతన కార్యవర్గ సభ్యులతో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పోతురాజు

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: జలవనరులశాఖలో వర్క్ చార్జ్‌డ్ ఎంప్లాయిస్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఆ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ పోతురాజు అన్నారు. స్థానిక ఎన్నెస్పీ కార్యాలయ ఆవరణలో సంఘం సత్తెనపల్లి శాఖ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. సత్తెనపల్లి యూనిట్ అధ్యక్షుడిగా ఎం.మరియదాసు, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాసరెడ్డి, కార్యదర్శిగా మేరీ, ఉపాధ్యక్షుడిగా సాల్మన్‌రాజు, సంయుక్త కార్యదర్శిగా వీరబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఆదంసాహెబ్ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు వ్యవహరించారు.

వ్యాపార భాగస్వామే సూత్రధారి
యూట్యూబర్ బొగ్గుల శ్రీనివాస్ హత్య కేసు ఛేదించిన పోలీసులు

ఏదులాపురం, న్యూస్‌టుడే: యూట్యూబర్ గొల్ల శ్రీనివాసులు అలియాస్ బొగ్గుల శ్రీనివాస్ (48) హత్య కేసును పోలీసులు ఛేదించారు. హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న శ్రీనివాస్ ఈ నెల 14న ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం పాలేరు జలాశయంలోకి కారు దూసుకెళ్లిన ఘటనలో విగతజీవిగా కనిపించారు. ఈ ఘటనపై మృతుడి సోదరుడు ఫిర్యాదు మేరకు హత్య కేసు నమోదు చేసిన ఖమ్మం గ్రామీణ ఏసీపీ పోలీసుల బృందం విచారణ చేపట్టింది. వ్యాపార భాగస్వామే శ్రీనివాస్‌ను హత్య చేశాడని ఏసీపీ తిరుపతిరెడ్డి ఆదివారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. నంద్యాల జిల్లా నందికొట్కూరు మండలం అల్లూరు గ్రామానికి చెందిన బొగ్గుల శ్రీనివాస్.. హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. వీడియోలు చేస్తూ యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టేవారు. ఆయన, పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలంలోని పాకాలపాడుకు చెందిన మేకల వేణుమాధవ్‌రెడ్డి (ఏ1) కర్నూలులోని సిల్వర్ జూబ్లీ కళాశాలలో కలిసి చదువుకున్నారు. పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో మళ్లీ కలుసుకుని పరిచయం పెంచుకున్నారు. ఇద్దరికీ వ్యాపార లావాదేవీల్లో పొరపొచ్చాలు వచ్చాయి. శ్రీనివాస్‌ను అడ్డు తొలగించుకునేందుకు వేణుమాధవరెడ్డి పథకం రచించారు. పోలు కోటేశ్వరరావు (ఏ2), షేక్ అబ్దుల్ హబీబ్ (ఏ3), ఎండీ హబ్బల్ అలీ (ఏ4)తో కలిసి హత్యకు పథకం రూపొందించారు. వారికి రూ.5 లక్షల సుపారీ చెల్లించారు. ఈ నెల 14న నకిరేకల్ వద్దకు కారును జనగామ వైపు వెళ్లే దారిలోకి మళ్లించారు. ఐరన్ రాడ్డుతో తలపై బలంగా మోది శ్రీనివాస్‌ను హత్య చేశారు. ప్రమాదంగా చిత్రీకరించేందుకు కారును పాలేరు రిజర్వాయర్‌లోకి నెట్టి పరారయ్యారు.

అపూర్వ కలయిక

పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయుల బృంద చిత్రం

మాచవరం, న్యూస్‌టుడే: మాచవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 1991-92 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. 34 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా అందరూ పాఠశాల ఆవరణలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఆనాటి గురువులను ఆహ్వానించి, తమ ఉన్నతికి బోధనలు, సూచనలు ఎలా దోహదం చేశాయో వివరించారు. చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు. రోజంతా సరదాగా గడిపారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టి, ఆటపాటలతో సందడి చేశారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు.

అమరావతిలో ఒడిశా యువత సందడి

ధ్యానబుద్ధ వద్ద ఒడిశా వాసులు

అమరావతి, న్యూస్‌టుడే: ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో కేంద్ర యువజన వ్యవహారాల శాఖ, మైభారత్ కేంద్ర ఆధ్వర్యంలో జరుగుతున్న యువమార్పిడి సమ్మేళనంలో పాల్గొనడానికి వచ్చిన ఒడిశా రాష్ట్రానికి చెందిన 37 మంది యువతీయువకులు ఆదివారం అమరావతిని సందర్శించారు. ధ్యానబుద్ధ ప్రాజెక్ట్, మ్యూజియం, అమరేశ్వరాలయాలను సందర్శించారు. అనంతరం జనచైతన్య సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నెహ్రూ యువకేంద్రంలో సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. గుంటూరు జిల్లా మై భారత్ కేంద్ర జిల్లా ఉపసంచాలకుడు దేవిరెడ్డి కిణ్మయి, జనచైతన్య సమితి ప్రతినిధులు దాసరి జెన్నీబాబు, అనిల్ కుమార్, సాంబశివరావు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షల నిర్వహణపై శిక్షణ

పెదకూరపాడు: ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలకు 75త్యాళ్లూరు వివేకానంద కళాశాలలో అన్ని ఏర్పాట్లు చేసినట్లు చీఫ్ సూపరింటెండెంట్‌లు రమేష్ బాబు, వీరయ్యలు తెలిపారు. ఆదివారం ఇన్విజిలేటర్లకు పరీక్షల నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. పరీక్షా కేంద్రాలన్నింటిలో సీసీ కెమెరాలు ఏర్పాటుచేశామని, ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొనసాగుతుందన్నారు. మొదటి సంవత్సరం విద్యార్థులకు ఒక్క మార్కు ప్రశ్నలుంటాయని, జవాబులు రాసేందుకు 32పేజీల బుక్‌లెట్ ఇస్తామని చెప్పారు. 543 మంది పరీక్షలు రాయనున్నారని, ఉదయం 9 నుంచి 12 గంటల వరకు జరిగే పరీక్షలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామని తెలిపారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు సాధించాలి

విజయపురిసౌత్, న్యూస్‌టుడే : విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించే దిశగా అడుగులు వేయాలని నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఈఈ రమేష్ అన్నారు. ఆదివారం విజయపురిసౌత్‌లోని ప్రభుత్వ గిరిజన బాలుర సంక్షేమ వసతి గృహాన్ని ఆయన సందర్శించి విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు అందజేశారు. అనంతరం సొంత నిధులతో వసతి గృహంలో నూతన విద్యుత్తు లైట్లను ఏర్పాటు చేసి విద్యార్థుల సమస్యను పరిష్కరించారు. కార్యక్రమంలో వార్డెన్ జాక్వెల్, హెచ్‌డీ కరీముల్లా, వర్క్ ఇన్‌స్పెక్టర్ అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

మన్‌కీ బాత్‌తో విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం

విద్యార్థులపాటు కార్యక్రమంలో పాల్గొన్న భాజపా జిల్లా అధ్యక్షుడు శశికుమార్, నాయకులు

అచ్చంపేట, న్యూస్‌టుడే: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మన్‌కీబాత్ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం పెంపొందుతుందని భాజపా పల్నాడు జిల్లా అధ్యక్షుడు ఏలూరి శశికుమార్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన అచ్చంపేట బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో భాజపా జిల్లా ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. గురుకుల పాఠశాలలో వసతి సౌకర్యాలు గురించి ఆరా తీశారు. భాజపా జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు మేళం మధుబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి విజయభాస్కర్‌రెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా నాయకులు పడకండ్ల లక్ష్మాచారి, జిల్లా కిసాన్‌మోర్చా అధ్యక్షుడు నారు శ్రీనివాసరెడ్డి, క్రోసూరు మండల అధ్యక్షుడు దమ్మాలపాటి శ్రీనివాస్, నియోజకవర్గ నాయకుడు అనంతరామయ్య, గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ కె.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

360 మందికి వైద్య సేవలు

శిబిరంలో పరీక్షలు చేయించుకుంటున్న లింగా బ్రహ్మయ్య, పక్కన ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి

దుర్గి, న్యూస్‌టుడే: మండల కేంద్రం దుర్గిలో స్థానిక సత్యసాయి కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన వచ్చింది. పలుచూరి సత్యానారాయణ, జానికమ్మ, మస్తాన్‌రావుల జ్ఞాపకార్థం హైదరాబాద్ మలక్‌పేటలోని యశోద ఆసుపత్రి ఆధ్వర్యంలో శిబిరం ఏర్పాటు చేయగా మాచర్ల శాసన సభ్యుల జూలకంటి బ్రహ్మారెడ్డి ప్రారంభించారు. మొత్తం 360 మందికి యశోద వైద్యశాల వైద్యులు, సిబ్బంది పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమాన్ని పలుచూరి వెంకట నాగేశ్వరరావు, సుబ్బారావు, రామారావు, కృష్ణారావు, గోవర్ధనరావు, తదితరులు పర్యవేక్షించారు.

కాంగ్రెస్ కార్యాలయాలపై దాడులు హేయం

సత్తెనపల్లి, న్యూస్‌టుడే : రాష్ట్రంలోని పలుచోట్ల కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయాలపై ఏబీవీపీ నాయకులు దాడులు చేయడం హేయమైన చర్య అని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు దాసరి జ్ఞాన్‌రాజ్‌పాల్ అన్నారు. పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాస్వామ్యాన్ని అపహస్యం చేసే విధంగా భాజపా, బీజేవైఎం, వీహెచ్‌పీ, ఏబీవీపీ నాయకులు వ్యవహరిస్తున్నారన్నారు. కాంగ్రెస్ కార్యాలయాలపై దాడులు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు లక్ష్మయ్య, చాన్‌బాషా, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

బుచ్చయపాలెం(పెదకూరపాడు), న్యూస్‌టుడే: మండలంలోని బుచ్చయపాలెం, హుస్సేన్‌నగరం గ్రామాల్లో ఆదివారం త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక పిడుగురాళ్ల, చిలకలూరిపేట కమిటీల ఆధ్వర్యంలో భగవద్గీతపై ప్రచారం నిర్వహించారు. సర్వ మానవాళికి సంబంధించిన జ్ఞానం భగవద్గీతలో ఉందన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కటికం సైదారావు, యద్దనపూడి వీరాంజనేయులు, అరుణ, కార్తీక్, నారాయణమ్మ, అనురాధ, వెంకటలక్ష్మిలు ఉన్నారు.

మహాప్రస్థానంలో అభివృద్ధి పనులు

క్రోసూరు (అచ్చంపేట) న్యూస్‌టుడే: క్రోసూరులోని హిందూ మహాప్రస్థానంలో సకల సౌకర్యాలకు కమిటీ శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ఆదివారం నాలుగు గదుల నిర్మాణానికి యార్డు మాజీ ఛైర్మన్, వైకుంఠ మహాప్రస్థానం కమిటీ అధ్యక్షుడు కాండ్రు కాశయ్య భూమి పూజ చేశారు. ఇప్పటికే ప్రస్థానం ముఖద్వారం, కర్మకాండల గది, సిమెంటు బల్లలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో తెదేపా నేతలు పూర్ణచంద్రరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వెయిట్‌లిఫ్టింగ్ క్రీడాకారుడికి అభినందన

మాచర్ల పట్టణం, న్యూస్‌టుడే: ఆల్ ఇండియా సీనియర్ వెయిట్‌లిఫ్టింగ్ విభాగంలో మాచర్ల పట్టణ యువకుడు విజయం సాధించటం అభినందనీయమని మండవ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ మండవ రవి అన్నారు. మాచర్ల పట్టణానికి చెందిన మంజుల అశోక్ దేశ స్థాయిలో కేల్ ఇండియా పోటీలో తృతీయ స్థానం పొంది కంచు పతకం సాధించి మాచర్ల ఖ్యాతిని చాటాడని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రూ.10 వేలు ప్రోత్సాహక నగదు ట్రస్టు సభ్యులు అందజేసి అభినందించారు. వాసు, దుర్గా, నారాయణ, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

అవీ ఇవీ

వైభవంగా ఆలయ వార్షికోత్సవం

గారపాడు(పెదకూరపాడు): పెదకూరపాడు మండలం గారపాడు గ్రామంలోని ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం వార్షికోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. స్వామివారిని జడ్పీటీసీ సభ్యులు కంకణాల స్వర్ణకుమరి, శివాజీ దంపతులు దర్శించుకున్నారు. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు నవగ్రహహోమం, తోమాల అర్చనలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం చేపట్టారు.

రాజుపాలెంలో అంకమ్మ తిరునాళ్ల

రాజుపాలెం: రాజుపాలెంలో కొలువుదీరిన అంకమ్మ తిరునాళ్ల ఆదివారం వైభవంగా జరిగింది. రాజుపాలెం-గంగిరెడ్డిపాలెం వాసులు మొక్కులు చెల్లించుకున్నారు. ఆచారవంతులు కారంపూడి నుంచి తీసుకువచ్చిన విగ్రహాలతో గ్రామోత్సవం నిర్వహించారు. మహిళలు పొంగళ్లు చేసి అమ్మవారికి బోనాలు సమర్పించారు. కోలాటాలు, పాటకచేరీలు, సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకొన్నాయి.

నృత్య పోటీల విజేతలకు బహుమతులు

గురజాల గ్రామీణ, న్యూస్‌టుడే: జంగమహేశ్వరపురంలోని వేంకటేశ్వరస్వామి తిరుణాళ్లను పురస్కరించుకుని మెగా నృత్య పోటీలు నిర్వహించగా గెలుపొందిన విద్యార్థులకు ఆదివారం బహుమతులు అందించారు. గురజాల ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థులకు మొదటి బహుమతి రూ.10వేల నగదు, షీల్డ్, జంగమహేశ్వపురం విద్యార్థులకు రూ.7,500, షీల్డ్‌ను నిర్వాహకులు అందించారు.

సబ్ రిజిస్ట్రార్ అశోక్‌కు సత్కారం

సత్తెనపల్లి, న్యూస్‌టుడే : నంద్యాల జిల్లా రిజిస్ట్రార్‌గా ఉద్యోగోన్నతిపై బదిలీ అయిన స్థానిక సబ్ రిజిస్ట్రార్ అశోక్‌ను కార్యాలయ ఉద్యోగులు, దస్తావేజులేకరులు, స్థానిక పెద్దలు పట్టణంలోని కార్యాలయంలో ఆదివారం సత్కరించారు.

అడిగొప్పలలో ఉచిత కంటి పరీక్షలు

అడిగొప్పల(దుర్గి): మండల పరిధిలోని అడిగొప్పలలో స్థానిక జడ్పీపాఠశాలలో ఆదివారం గురజాల పల్నాడు కంటి వైద్యశాల ఆధ్వర్యంలో స్థానిక తెదేపా నాయకులు, గ్రామపెద్దల సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు, సిబ్బంది ఉచితంగా పరీక్షలు చేసి మందులు అందజేశారు. కొందరికి శస్త్రచికిత్సల కోసం రిఫర్ చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు దారా రాఘవరావు, గరికపాటి పుల్లారావు తదితరులు పర్యవేక్షించారు.

పశు పోషణకు ఆర్థిక భరోసా

రైల్వేస్టేషన్‌రోడ్డు (దాచేపల్లి), న్యూస్‌టుడే

పశు పోషణ ఖర్చులు రోజురోజుకూ భారంగా మారుతున్నాయి. దాణా, మేత, మందుల ధరలు పెరిగాయి. చిన్న, మధ్య తరహా రైతులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఆర్థిక భరోసా ఇస్తోంది. అందులో భాగంగా పశు కిసాన్ క్రెడిట్ కార్డుల జారీకి శ్రీకారం చుట్టింది. ఈ కార్డులను వినియోగించుకుంటే రైతులకు తక్షణ ఆర్థిక సహాయం అందుతుందని దాచేపల్లి పశు సంవర్ధకశాఖ అధికారి చెన్నయ్య తెలిపారు. క్రెడిట్ కార్డు మాదిరిగా వినియోగించుకోవచ్చని, దాణా కొనుగోలు, పశువుల మందులు, సంరక్షణ ఖర్చులు, అత్యవసర అవసరాలకు ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు. డిజిటల్ చెల్లింపుల సౌకర్యం ఉందన్నారు.

మండల గణాంకాలివీ..

ఆవులు	2763
గేదెలు	8232
గొర్రెలు	28654
మేకలు	11519
కోళ్లు	10546

బ్యాంకుల్లో దరఖాస్తుల స్వీకరణ: పశుసంవర్ధక శాఖ గ్రామ సహాయ విభాగం అధికారులు బ్యాంకర్లతో సమన్వయం చేసుకుని అర్హులైన రైతులకు కార్డులు అందించనున్నారు. దరఖాస్తులను సమీప ప్రభుత్వ బ్యాంకుల్లో సమర్పించాలి. పాస్‌పోర్టుసైజు ఫొటోలు, ఆధార్, పాన్, ఓటర్ ఐడీ నకళ్లు అందజేయాలి.

గరిష్ఠంగా రూ.3 లక్షల రుణం: పశు కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా గరిష్ఠంగా రూ.3 లక్షల వరకు రుణం పొందవచ్చు. రూ.1.60 లక్షల వరకు ఎలాంటి పూచీకత్తు అవసరం లేదు. రుణాన్ని 40 రోజుల్లో తిరిగి చెల్లిస్తే వడ్డీ ఉండదు. అనంతరం 7 శాతం వడ్డీ విధిస్తారు. ఏడాదిలోగా క్రమం తప్పకుండా రుణాన్ని చెల్లిస్తే ఆర్బీఐ, నాబార్డు నుంచి 3 శాతం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి మరో 3 శాతం రాయితీ లభిస్తుంది. దీంతో రైతులపై వడ్డీ భారం గణనీయంగా తగ్గనుంది.

వేలిముద్రల సేకరణ

రెంటచింతల, న్యూస్‌టుడే : జెట్టిపాలెంలో చోరీ జరిగిన నాగరాజు ఇంటిని నరసరావుపేట వేలిముద్రల నిపుణలు ఆదివారం పరిశీలించారు. దొంగలు ఇంట్లో తిరిగిన ప్రాంతాల నుంచి ముద్రలు సేకరించారు. దొంగలు పాతవారా, కొత్తవారా అన్నది పరిశీలిస్తున్నామని రెంటచింతల పోలీసులు తెలిపారు. రాత్రిల్లో పోలీసు గస్తీ పెంచాలని ప్రజలు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో పల్లకీసేవ

అడిగొప్పల(దుర్గి), న్యూస్‌టుడే: పల్నాట ప్రసిద్ధి చెందిన అడిగొప్పల శ్రీనిదానంపాటి అమ్మవారి పల్లకీసేవ ఆదివారం భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో మహిళలు పొంగళ్లు వండి అమ్మవారికి నివేదన చేశారు. సాయంత్రం నిర్వహించిన అమ్మవారి పల్లకీ సేవ, గోమాతకు పూజలు, ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమాన్ని ఆలయ వంశపారంపర్య ధర్మకర్త యాగంటి వెంకటేశ్వర్లు, ఈవో, ఏసీ ఆదిశేషనాయుడు, అమ్మవారి వంశస్థులు కృష్ణమూర్తి, నారయ్య, అశోక్ తదితరులు పర్యవేక్షించారు.

CHANGE OF NAME
I, **RADHAKRISHNA PANGULURI (Old Name)**, S/o. **Panguluri Ramarao**, Resident of H.No.3-22, Chintapalli, Karempudi, Palnadu District, Andhra Pradesh-522614. I have changed my name as **PANGULURI KRISHNA (New Name)** S/o.Panguluri Ramarao. Hereafter my name is known as **PANGULURI KRISHNA (New Name)**, S/o. Panguluri Ramarao.

నగరవనం.. ఆహ్లాదకరం
50 హెక్టార్లలో రూ.1.4 కోట్లతో పార్కు అభివృద్ధి

కొండమోడు, గణపవరం, న్యూస్‌టుడే

పచ్చని పొలాలు ఒకవైపు.. అటవీ ప్రాంతం మరోవైపు.. ఈ రెండింటి మధ్య ఏర్పాటు చేసిన దేవరంపాడు నగరవనం ప్రకృతి ప్రేమికులకు ఆహ్లాదం పంచుతోంది. పార్కును యాభై హెక్టార్ల అటవీ భూముల్లో రూ.1.4 కోట్లతో అభివృద్ధి చేసి అందుబాటులోకి తీసుకొచ్చారు. అంతర్గత రోడ్లు, నడకదారి, పిల్లలు ఆడుకునేందుకు క్రీడా పరికరాలు, వేచి ఉండేందుకు పగోడాలు, యోగా కేంద్రం, సహజత్వాన్ని తలపించే అడ్వెంచర్ పార్కు, వ్యాయామశాల, తాగునీటి వసతులు కల్పించారు. పార్కులో రావి, ఉసిరి, నెమలినార, వేప, గంగరావి, యోగిస, రోజ్ ఉడ్ వంటి మొక్కలు నాటారు. చుట్టూ ఉన్న పంట పొలాలు, కాలువలు, వాగులు, రోడ్లను ఎత్తైన ప్రదేశం నుంచి చూడాలనుకొనే వారికి కొండపై భాగాన హిల్‌వ్యూ స్టేషన్ ఏర్పాటు చేస్తున్నారు. ట్రెక్కింగ్ ఇష్టపడేవారికి అనువుగా ఏర్పాట్లు చేశారు.

ఆధ్యాత్మిక ప్రశాంతత..

నగరవనం నేతి వెంకన్న ఆలయానికి ఆనుకొని ఉండటంతో స్వామిని దర్శించుకుని అక్కడ కొంతసేపు సేద తీరవచ్చు.

ఉదయం నడకతో పాటు కుటుంబ సభ్యులందరూ కలిసి ఆహ్లాదకరంగా గడిపేలా ఏర్పాట్లు చేశారు. రూ.20 ప్రవేశ రుసుంతో ఉదయం 6 నుంచి సాయంత్రం 6 వరకు పార్కులోకి అనుమతిస్తున్నారు. పిడుగురాళ్ల, నరసరావుపేట, సత్తెనపల్లి పట్టణాల వాసులకు అనువుగా ఉంటుందని, ఇతర ప్రాంతాల వారు సైతం వారాంతపు సెలవుల్లో ఇక్కడ రోజంతా సరదాగా గడిపేలా ఏర్పాట్లు చేశామని డీఆర్వో వీరేశలింగం నాయుడు తెలిపారు.

బాల్‌బ్యాడ్మింటన్‌లో విద్యార్థుల ప్రతిభ

విజేత జట్టుకు కప్పు అందజేస్తున్న నిర్వాహకులు

దుర్గి, న్యూస్‌టుడే: ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయిలో జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గుంటూరులో ఆదివారం నిర్వహించిన పోటీల్లో దుర్గి జడ్పీపాఠశాల విద్యార్థుల జట్టు విజయం సాధించిందని పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు బండ్లప్రసాద్ తెలిపారు. పాఠశాలకు చెందిన పడిగ అభిరామ్, షేక్ బాషా ప్రత్యేక బహుమతులు అందుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు హనుమంతరావు, అనంతరామయ్య, చక్రపాణి, రమేష్, వ్యాయామ ఉపాధ్యాయులు ప్రసాద్, వేణు, సునీత, విద్యార్థులను అభినందించారు.

జూదరుల అరెస్టు

ముప్పాళ్ల, న్యూస్‌టుడే : మండలంలోని పలుదేవర్లపాడు గ్రామ శివారులో పేకాట ఆడుతున్న 10 మంది జూదరులను ఆదివారం అరెస్టుచేసి వారి నుంచి రూ.18,070 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై అనిల్ కుమార్ తెలిపారు. జూద శిబిరాలు నిర్వహించేవారు, ఆడేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

బాలుడి అదృశ్యంపై ఫిర్యాదు

గురజాల గ్రామీణ, న్యూస్‌టుడే: మాచర్ల పట్టణానికి చెందిన షేక్ ఖలీల్ గురజాల పట్టణంలోని మదర్సాలో చదువుకుంటున్నాడు. ఈనెల 16న నుంచి కనిపించలేదని కుటుంబ సభ్యులు తెలిసిన చోట అంతా వెదికారు. బాలుడు జాడ తెలియక పోవడంతో గురజాల పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు.



కాలనీ స్థలమా... కబ్జా చేసేద్దాం!

ప్రభుత్వం గృహ నిర్మాణ కాలనీలకు స్థలాలు గుర్తించింది. వీటిలో ప్రజా అవసరాలకు గానూ కొంత విస్తీర్ణంలో స్థలాన్ని విడిచిపెట్టారు. బడులు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఇతర సామాజిక అవసరాలు తీర్చేందుకు దీన్ని వినియోగించాలి. కానీ రాజకీయ బలం ఉన్న కొందరు నాయకులు ఆ స్థలాన్ని ఆక్రమించి.. పక్కా నిర్మాణాలు చేపడుతున్నారు. ఇదంతా కళ్ల ముందే జరుగుతున్నా అధికారులు కనీసం అడగడం లేదు. దీంతో విలువైన ప్రభుత్వ స్థలాలు అక్రమార్కుల చేతుల్లోకి వెళ్లిపోతున్నాయి.

– న్యూస్‌టుడే, పార్వతీపురం, పురపాలక

మూడు దుకాణాలు.. 9 చోట్ల పునాదులు

పార్వతీపురం మండలంలోని గోపాలపురం పరిధిలో డి, ఈ, ఎఫ్, జి లేఅవుట్లు వేసి సుమారు 530 మందికి స్థలాలు కేటాయించారు. పట్టణ పేద ప్రజల ఇళ్ల నిర్మాణం కోసం ఈ లేఅవుట్లు అభివృద్ధి చేశారు. వీటిలో ఎక్కడికక్కడే ఆక్రమణలు జరిగాయి. ఇక్కడ వేసిన 'జి' లేఅవుట్‌లో సామాజిక అవసరాల నిమిత్తం కేటాయించిన 16 సెంట్లు ఆక్రమణలకు గురైంది. రహదారి పక్కన స్థలం కావడం, అంతా గృహాలు నిర్మించుకోవడంతో గిరాకీ పెరిగింది. ఇదే అదునుగా అప్పటి స్థానిక వైకాపా నాయకులు స్థలాలను కబ్జా చేశారు. ఇందులో మూడు దుకాణాలు నిర్మించగా.. 9 స్థలాల్లో పునాదులు వేశారు. ఇక్కడ సెంటు స్థలం విలువ రూ.4 లక్షల వరకు ఉంది. ఆక్రమించిన స్థలాలను రూ.3 లక్షల చొప్పున విక్రయించినట్లు ఆరోపణలున్నాయి. 'డి' లేఅవుట్‌లో 6 సెంట్లు, 'ఎఫ్' లేఅవుట్‌లో 12 సెంట్ల స్థలం ఆక్రమణల్లో ఉంది. వీటిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఆక్రమిత స్థలంలో నిర్మించిన దుకాణాలు, ఇల్లు

జాప్యమెందుకో?

వీటిపై అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా.. స్పందనలేదు. ముఖ్యమంత్రి కార్యాలయం వరకు ఫిర్యాదులు వెళ్లినప్పటికీ యంత్రాంగం చర్యలకు వెనకడుగు వేస్తోంది. రాజకీయ పెద్దలు అక్రమార్కులపై చర్యలను ఆపుతున్నట్లు ఆరోపణలున్నాయి. అధికారుల కాళ్లకు బంధనాలు వేస్తున్నాయి. ఆక్రమణలు తొలగించాలని ఆదేశాలు వచ్చినా అడుగులు వేయలేని స్థితి నెలకొంది. గతంలో ఫిర్యాదుల నిమిత్తం నామమాత్రంగా సర్వేలు చేసి.. ఆక్రమణకు గురైనట్లు అధికారులు నిర్ధారించారు. అక్రమ నిర్మాణాలపై నంబర్లు వేశారు. ఆక్రమిత స్థలంలో ఎలాంటి నిర్మాణాలు చేయొద్దని పురపాలక సంఘం నోటీసులు అంటించి మిన్నకుండిపోయింది. నేటికీ ఆక్రమణలపై చర్యలు కానరావడం లేదు.

పరిశీలించి.. చర్యలు: జగనన్న లేఅవుట్‌లో ఆక్రమణలను క్షేత్రస్థాయిలో పరిశీలించాల్సి ఉంది. ఆ తర్వాత చర్యలు తీసుకుంటాం.

- డి.పావని, పుర కమిషనరు

లీకులు ఆగవు.. కన్నీరింకదు!



సీతానగరం మండలం పెదంకలాం వద్ద సువర్ణముఖి నదిపై ఉన్న ఆనకట్ట షట్టర్లు మరమ్మతులకు గురి కావడంతో లీకులు ఏర్పడ్డాయి. ఆనకట్ట ద్వారా బలిజిపేట, వంగర మండలాల్లోని 8,350 ఎకరాలకు సాగునీరు అందుతుంది. అప్పట్లో షట్టర్లు పాడవడంతో గత తెదేపా హయాంలో 2 అడుగుల ఎత్తు గలవి 36 అమర్చారు. కనీస నిర్వహణ లేక మళ్లీ పాడయ్యాయి. దీంతో నీరంతా దిగువ ప్రాంతాలకు వృథాగా పోతోంది. మరమ్మతులు చేపట్టి ఆయకట్టుకు నీరందించాలని రైతులు కోరుతున్నారు. మరమ్మతుల కోసం గుత్తేదార్లను ఆహ్వానిస్తున్నామని ఇన్‌ఛార్జి ఏఈ హరిబాబు తెలిపారు.

– న్యూస్‌టుడే, సీతానగరం

సండే ఫన్‌డే

ఉత్సాహంగా పాల్గొన్న ఉద్యోగులు, నగర ప్రజలు

కుర్చీలాట ఆడాతున్న మహిళలు. వీక్షిస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

పట్టర పట్టు హైలెస్సా.. పరుగో పరుగు.. సై కుర్చీ నీదా నాదా.. అంటూ వివిధ ఆటలు ఆడుతూ సందడి చేశారు. దీనికి వేదికైంది ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం. ఉద్యోగులు, వ్యాపారులు, మహిళలు, విద్యార్థులు వారమంతా పనులతో బిజీగా గడిపిన వారంతా ఆటపాటలతో ఆదివారం ఆనందంగా గడిపారు. పురపాలక మైదానంలో టగ్‌ఆఫ్‌వార్ పోటీల్లో మహిళలు, పురుషులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఒత్తిడి నుంచి దూరం చేసేందుకు నెలలో రెండు, నాలుగు ఆదివారాల్లో హ్యాపీ సండే నిర్వహిస్తున్నట్లు కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే విజయచంద్ర అన్నారు. పుర కమిషనరు పావని, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ★ మండలంలోని వెంకంపేట క్రీడా ప్రాంగణంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ ఎన్. ప్రభాకరరెడ్డి పాల్గొని యువకులతో కలిసి క్రికెట్ ఆడి ఉత్సాహపరిచారు.

బ్యాటింగ్ చేస్తున్న కలెక్టరు ప్రభాకరరెడ్డి

– న్యూస్‌టుడే, పార్వతీపురం పట్టణం, గ్రామీణం

ఆస్తి పన్ను.. ఏదీ ఆదాయ దన్ను

వసూలైంది 55 శాతమే ముంచుకొస్తున్న గడువు

న్యూస్‌టుడే– రాజాం, బొబ్బిలి

పురపాలికల్లో ఆస్తి పన్ను బకాయిలు పేరుకుపోయాయి. మార్చి నెలాఖరుకు శతశాతం రాబట్టాల్సి ఉండగా ఫిబ్రవరి రెండో వారం పూర్తయ్యేనాటికి 55 శాతమే సాధించారు. ఇంకా ఉన్నది 40 రోజులు. దీంతో పురపాలిక అధికారులు వేగం పెంచారు. ప్రత్యేక బృందాలను నియమించారు. సచివాలయాల వారీగా లక్ష్యాలను నిర్దేశించారు. అయినా ఆశించిన ప్రగతి కనిపించడం లేదు. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో నగరం, ఆరు పట్టణాల్లో 1,37,719 అసెస్మెంట్ల నుంచి రూ.72.63 కోట్లు వసూలు చేయాలని లక్ష్యం విధించారు. ఇంత వరకు అతికష్టం మీద కేవలం రూ.37.58 కోట్లు వచ్చాయి.

రాజాంలో పన్ను వసూళ్లు పరిశీలిస్తున్న పుర కమిషనర్ రామచంద్రరావు

ఉమ్మడి జిల్లాలో ఈనెల 16 నాటికి పన్ను వసూళ్ల ప్రగతి..

మున్సిపాలిటీ	అసెస్మెంట్లు	మొత్తం డిమాండు	వసూలు (రూ.కోట్లలో)
విజయనగరం	72339	48.12	24.75
రాజాం	12469	3.64	2.02
పాలకొండ	7771	2.26	1.27
బొబ్బిలి	13224	6.76	3.39
పార్వతీపురం	14145	6.77	3.31
సాలూరు	12062	3.31	1.64
నెల్లిమర్ల	5709	1.77	1.20

రాయితీ ప్రకటనకు ఎదురుచూపు..

గతేడాది వడ్డీలో 50 శాతం రాయితీ ప్రకటించారు. ఈ ఏడాది ఇంకా ప్రకటన వెలువడలేదు. దీంతో చాలా మంది పన్ను చెల్లింపుదారులు ఎదురు చూస్తున్నారు. అత్యధిక పన్ను చెల్లించేవారంతా ముందే చెల్లిస్తే రాయితీ కోల్పోతామనే ఉద్దేశంతో ఉన్నారు. గతేడాది మార్చి నెలాఖరులో ప్రకటన వెలువడింది.

మార్చి నాటికి వసూలు చేస్తాం..: పన్నుల వసూళ్ల వందశాతం చేరువయ్యేందుకు కసరత్తు చేస్తున్నాం. పుర పాలక సంఘాల వారీగా రోజూ సమీక్ష నిర్వహిస్తున్నాం. బృందాలు ఏర్పాటు చేసి, వారాంతపు లక్ష్యాలు విధించాలని సూచించాం. మార్చి నాటికి డిమాండు మేరకు వసూలు చేస్తాం. వడ్డీ రాయితీపై ఎలాంటి ఉత్తర్వులు రాలేదు. - వి.రవీంద్ర, పురపాలకశాఖ ఆర్డీ, విశాఖ రీజియన్

అధికారుల వేధింపులు.. విద్యార్థులకు చేటు

శ్రీముఖాలపై యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన

పార్వతీపురం, న్యూస్‌టుడే: విద్యాశాఖ నిబంధనలకు తోడు, ఐటీడీఏ అధికారులు వేర్వేరు నిబంధనలను తీసుకొస్తూ గిరిజన సంక్షేమ ఉపాధ్యాయులను తీవ్ర ఒత్తిడికి గురి చేస్తున్నారంటూ ఆదివారం ఐటీడీఏ కార్యాలయం ఎదుట యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసనకు దిగారు. ఉపాధ్యాయులపై పదో తరగతి పరీక్షలకు ముందు ఇలాంటి వేధింపులు, ఒత్తిళ్లు కొనసాగిస్తే పిల్లల భవిష్యత్తుపై ప్రభావం పడుతుందని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహనరావు ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాలకు హాజరయ్యే సమయంలో ఉపాధ్యాయులు ముఖ గుర్తింపు హాజరు వేస్తున్నారని, అంతకంటే ప్రామాణికత ఏం కావాలని ప్రశ్నించారు. వేధింపులను ఆపకుంటే బుధవారం ఐటీడీఏ వద్ద రాత్రి బస చేసి, ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామన్నారు. తమకు రక్షణ కల్పించాలని సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేశ్, మంత్రి జి.సంధ్యారాణిని కోరారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కృష్ణారావు, ప్రధానకార్యదర్శి కె.భాస్కరరావు, గౌరవాధ్యక్షుడు భాస్కరరావు, జ్యోతి, శ్రీరాములు, కూర్మారావు, రమేష్, సిద్ధు, మురళీ పాల్గొన్నారు. ★ ఐటీడీఏ వద్ద నిరసనకు ముందుగా అనుమతి తీసుకోనందున పోలీసుల నుంచి అభ్యంతరం వ్యక్తమైంది. పలుమార్లు యూటీఎఫ్ నాయకులు సంప్రదింపులు జరపగా.. 12 గంటల తర్వాత కొద్ది సమయం చేసేందుకు అనుమతిచ్చారు.

వేధింపుల నుంచి విముక్తి కలిగించాలని వేడుకుంటున్న ఉపాధ్యాయులు

ఉయ్యాలవాడ త్యాగం మరువలేనిది

నివాళి అర్పిస్తున్న డీఎస్పీ థామస్ రెడ్డి

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: బ్రిటీష్ వారిని ఎదిరించిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి ధైర్యసాహసాలు, త్యాగం మరువలేనివని ఏఆర్ డీఎస్పీ థామస్ రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా పోలీసు కార్యాలయం వద్ద ఉయ్యాలవాడ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాయలసీమ ప్రాంతానికి చెందిన ఉయ్యాలవాడ బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేసి, ఆంగ్లేయుల దమనకాండకు ఎదురొడ్డి పోరాడిన తొలి విప్లవ వీరుల్లో ఒకరని కొనియాడారు. ప్రజల హక్కుల కోసం, అన్యాయపు పన్నులకు వ్యతిరేకంగా గళమెత్తిన ధైర్యశాలి అన్నారు. ఆయన ఆశయాలు నేటి యువతకు ఆదర్శమన్నారు. ఏఆర్ ఆర్ఐ నాయుడు, రాంబాబు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

వెళ్లేవారు సరే.. వచ్చేవారేరీ?

- జేఎన్‌టీయూలో బోధకుల కొరత
- సమస్యను పరిష్కరిస్తామన్న మంత్రి లోకేశ్

న్యూస్‌టుడే, విజయనగరం విద్యావిభాగం

విజయనగరంలోని జేఎన్‌టీయూ గురజాడ విద్యాలయంలో బోధన, బోధనేతర సిబ్బంది కేటాయింపు అంశంపై ఎట్టకేలకు కదలిక వచ్చింది. ఎవరెక్కడ? అన్నదానిపై ఈ విద్యాలయంతో పాటు జేఎన్‌టీయూ కాకినాడ మధ్య విషయం నాలుగేళ్లుగా నలుగుతోంది. శాసనమండలిలో చర్చకు రావడంతో నెల రోజుల్లో చర్యలు తీసుకుంటామని మంత్రి లోకేశ్ ప్రకటించారు. దీంతో కొలిక్కి వచ్చే సూచనలు కనిపిస్తున్నాయి.

హోదా దక్కినా..

2007లో జేఎన్‌టీయూకే ప్రాంగణంగా ఏర్పాటై, 2022లో విశ్వవిద్యాలయం హోదా దక్కించుకుంది. ఇంజినీరింగ్ కళాశాలగా ఉన్న సమయంలో 41 మంది బోధకులు నియమితులయ్యారు. ప్రస్తుతం 27 మంది మాత్రమే పనిచేస్తున్నారు. ఇందులో పాతవారే 17 మంది. విభజన సమయంలో ఆరుగురు కాకినాడకు ఐచ్ఛికమిచ్చినా ఇక్కడే కొనసాగుతున్నారు. వీరికి జీతాలు అక్కడి నుంచే వస్తున్నాయి. మరో నలుగురు డిప్యుటేషన్‌పై ఇక్కడ పనిచేస్తున్నారు.

100 మంది అవసరం..

యూజీ, పీజీ ప్రోగ్రాంలకు వందమంది అధ్యాపకులు ఉండాలి. యూజీలో 72 మందికి 27 మంది రెగ్యులర్ అధ్యాపకులున్నారు. మిగిలిన వారు ఒప్పంద అధ్యాపకులే. పీజీలో 28 మందికి అందరూ ఒప్పంద ఉద్యోగులే. యూజీ సివిల్ బ్రాంచిలో రెగ్యులర్ ఒక్కరూ లేరు. ఈసీఈ మినహా మిగిలిన విభాగాలకు ఇద్దరు ముగ్గురే ఉన్నారు. ఈక్రమంలో నాక్, ఎన్‌బీఏ గుర్తింపునకు దూరమవుతోంది. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్ లోనూ చోటు లభించని పరిస్థితి. గతంలో మెకానికల్, ఈసీఈ, సీఎస్సీ బ్రాంచులకు ఎన్‌బీఏ(నేషనల్ బోర్డు ఆఫ్ అక్రిడేషన్) గుర్తింపు ఉండేది. ఇప్పుడది రెండు బ్రాంచులకే(ఈసీఈ, సీఎస్సీ) పరిమితమైంది.

ఇబ్బందులివీ..

సీనియర్ అసిస్టెంట్, డీఆర్, ఏఆర్, సూపరింటెండెంట్ పోస్టులు ఆరు మంజూరయ్యాయి. ముగ్గురు కాకినాడ నుంచి డిప్యుటేషన్‌పై పనిచేస్తున్నారు. నెలలో కొన్ని రోజులే ఇక్కడుంటారు. ఈ పోస్టులను కాకినాడలో చూపించి పదోన్నతులు పొందారన్నది వాదన. సిబ్బంది కొరతతో దస్త్రాల నిర్వహణ, ఆర్థికపరమైన లావాదేవీల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

తిరిగి రాలేదు..

కొత్తగా నియమితులైన వారిలో 15 మంది బోధకులు కాకినాడ, నరసరావుపేటకు డిప్యుటేషన్‌పై వెళ్లి అక్కడే ఉండిపోయారు. వీరిని బదిలీ చేసినట్లు చూపించారు. ఇదంతా చట్టవిరుద్ధంగా జరిగిందని గతంలో జేఎన్‌టీయూజీవీ అధికారులు ప్రిన్సిపల్ కార్యదర్శికి లేఖ రాశారు. రెగ్యులర్ అధ్యాపకుల కొరతతో ఒప్పంద, హవర్లీబేస్డ్ వారితో బోధన సాగిస్తున్నట్లు పేర్కొన్నారు.

నిధుల లేమి..

విద్యాలయాన్ని నిధుల సమస్య వెంటాడుతోంది. ఇప్పటివరకు రూ.119 కోట్లు బదిలీ అయినట్లు మంత్రి లోకేశ్ తెలిపారు. గత ప్రభుత్వం నిధులివ్వకపోవడంతో ఇందులో నుంచే రూ.24 కోట్లు కురుపాం ఇంజినీరింగ్ కళాశాలకు చెల్లించారు. ఇతరత్రా రుసుముల కింద రూ.50 కోట్లు రావాల్సి ఉండగా. రూ.10 కోట్లే వచ్చినట్లు తెలుస్తోంది.

నేడు పీజీఆర్ఎస్‌లో వినతుల స్వీకరణ

పార్వతీపురం, న్యూస్‌టుడే: కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఉంటుందని, కలెక్టర్ ప్రభాకరరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. పీజీఆర్ఎస్ భవనంలో సాధారణ, నాలుగో నంబరు సమావేశ మందిరంలో రెవెన్యూ వినతులు స్వీకరిస్తారని చెప్పారు. meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

పట్టణాల్లో విస్తృత తనిఖీలు

పార్వతీపురం పట్టణం, గ్రామీణం: జిల్లాలో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా ఉండేందుకు ఎస్పీ మాధవ రెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. పార్వతీపురం, సాలూరు పట్టణ ప్రాంతాల్లోని ప్రధాన కూడళ్లు, మార్కెట్, ఆర్టీసీ కాంప్లెక్సులు, రైల్వేస్టేషన్లు, జనసంచార ప్రాంతాలు, కల్యాణ మండపాలు, పార్కులు తదితర ప్రాంతాల్లో అనుమానాస్పద వస్తువులు, లగేజీ బ్యాగులను బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహించారు. ఇతర ప్రాంతాలకు చెందిన వారు, అనుమానితుల నుంచి వివరాలు సేకరించారు.

పాట్లు పడాలి.. పాఠం వినాలి

గుమ్మలక్ష్మీపురం మండలం కె.శివడ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల అవస్థలివి. ఇక్కడ 58 మంది చదువుతున్నారు. భవనం శిథిలావస్థకు చేరి అయిదు తరగతుల నిర్వహణ కష్టమవుతోంది. ఒక గదిలో మూడో తరగతి, వరండాలో ఎండ రాకుండా పరదా కట్టి ఓ వైపు 1, 2.. మరోవైపు అయిదో తరగతి, సమీపంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో నాలుగో తరగతి విద్యార్థులకు ఉపాధ్యాయులు పాఠాలు చెబుతున్నారు. భవనం పెచ్చులూడి భయపెడుతోంది. నిర్మాణానికి ప్రతిపాదనలు పంపామని ఎంఈవో చంద్రశేఖర్ చెప్పారు. – న్యూస్‌టుడే, గుమ్మలక్ష్మీపురం

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

విద్యార్థుల భవితను నిర్దేశించే ఇంటర్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. జిల్లాలో 33 కేంద్రాల్లో జరగనున్నాయి. ప్రథమ ఏడాది జనరల్ విద్యార్థులు 5,930 మంది, వృత్తి విద్యా విద్యార్థులు 2,849 మంది, ద్వితీయ ఏడాది జనరల్ 6,127 మంది, వృత్తి విద్యా-2,616 మంది రాయనున్నారు. పరీక్షల ముందు ఆందోళనకు గురికాకుండా ప్రశాంతంగా ఉండాలని కలెక్టర్ ప్రభాకరరెడ్డి, డీఐఈవో నాగేశ్వరరావు సూచించారు.

- న్యూస్‌టుడే, పార్వతీపురం పట్టణం

విరామం ఉంది.. ఆందోళన వద్దు

పరీక్షల మధ్య విరామం..

గతేడాది వరకు పరీక్షకు, పరీక్షకు మధ్య ఒక ట్రెండు రోజులు విరామం ఉండేది. ఈసారి ఫిబ్రవరి 23న ప్రథమ సంవత్సర పరీక్షలు ప్రారంభమై వచ్చే నెల 24న ద్వితీయ సంవత్సర పరీక్షలతో ముగుస్తాయి. ప్రథమ సంవత్సరంలో భౌతికశాస్త్రం పరీక్షకు అత్యధికంగా 8 రోజులు, రసాయన శాస్త్రానికి 6, గణితానికి 4 రోజులు విరామం వచ్చింది.

ప్రత్యేక తరగతుల్లో ఇంటర్ విద్యార్థులు

ఆంగ్లం, బయాలజీ పరీక్షల మధ్య 7రోజుల విరామం ఉంది. ద్వితీయ ఏడాది పరీక్షలకు సంబంధించి గణితానికి 4రోజులు, భౌతిక శాస్త్రానికి 3, రసాయన శాస్త్రానికి 4రోజులు విరామం ఉంది. ఆ సమయాన్ని సక్రమంగా వినియోగించుకుంటే మంచి మార్కులు సాధించవచ్చని అధ్యాపకులు పేర్కొంటున్నారు. గతంలో ఆర్ట్స్, సైన్సు విద్యార్థులకు ఒకే రోజు పరీక్షలు ఉండేవి. ప్రస్తుతం రోజుకు ఒక పరీక్ష మాత్రమే నిర్వహించాలని నిర్ణయించడంతో విరామం ఎక్కువ వచ్చిందని డీఐఈవో తెలిపారు. పరీక్షల్లో నిమిషం ఆలస్యమైనా అనుమతించరు. కేంద్రానికి అరగంట ముందే చేరుకొనేలా విద్యార్థులు ప్రత్యేక ఏర్పాట్లు చేసుకోవాలని చెబుతున్నారు.

భయం వీడితే మంచి మార్కులు...: చదివింది రాయగలనా లేదా? గుర్తుకొస్తుందా లేదా అన్న భయం చాలా మందిలో ఉంటుంది. దీనివల్ల ఏదీ సాధించలేమన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి. మీపై మీరు నమ్మకాన్ని కోల్పోవద్దు. మార్కులే కొలమానం కాదు. భయం లేకుండా ప్రశాంతంగా పరీక్షలు రాస్తే మంచి మార్కులు వస్తాయి. పరీక్షల సరైన నిద్ర అవసరం. జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండి, పోషకాహారం తీసుకోవాలి.

– రస్మిత, మానసిక వైద్య నిపుణులు

విజయనగరం జిల్లా : ధర్మాన టీవీఎస్, విజయనగరం: 9014143226 | పవన్ శేఖర్ టీవీఎస్, విజయనగరం: 7780241677 | శ్రీనివాస ఆటోమొబైల్స్, పార్వతీపురం: 9848433017 | అమృతవర్షిణి ఆటోమొబైల్స్, ఎస్ కోటా: 9246671219 | గాయత్రి మోటర్స్, బొబ్బిలి: 9440193098 | పద్మ శ్రీ ఆటోమొబైల్స్, సాలూరు: 9010614619 | వినాయక ఆటోమొబైల్స్, గజపతినగరం: 9949278793 వెంకటసాయి ఏజెన్సీస్, పూసపాటిరేగ: 9392542348 | ధర్మాన టీవీఎస్, రాజాం 9010074740 | లీలా సాయి మోటార్స్, చీపురుపల్లి 8639015726 | ధర్మశాస్తా ఆటోమొబైల్స్, రామభద్రపురం: 8008335311.

(c) eenadu



దర్శనానికి వచ్చిన భక్తులతో కిటకిటలాడుతున్న ఆలయ ప్రాంగణం

ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడుకు అమ్మవారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఆలయ కమిటీ ఛైర్మన్, ఈవో

కనుల నిండుగా.. అమ్మ పండగ

చీపురుపల్లి కనకమహాలక్ష్మి అమ్మవారి జాతర ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. మూడు రోజుల పాటు ఈ ఉత్సవం జరగనుంది. తొలిరోజు భక్తజనం రాకతో పట్టణం, ఆలయ ప్రాంగణం నిండిపోయింది. విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, శాసనసభ్యుడు కిమిడి కళా వెంకటరావు తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. – న్యూస్‌టుడే, చీపురుపల్లి

క్యూ లైన్లలో భక్తుల సందడి

ప్రభలతో వస్తున్న భక్తులు

వచ్చే ఏడాదికి బీఈడీ కళాశాల తీసుకొస్తాం

● న్యాయ కళాశాలకు ప్రతిపాదనలు ● మాన్సాస్ ఛైర్మన్ అశోక్‌గజపతిరాజు

ఈనాడు, విజయనగరం, న్యూస్‌టుడే, బాబామెట్ట: మాన్సాస్ విద్యా సంస్థల్లో గతంలో బీఈడీ ఉపాధ్యాయ శిక్షణ కళాశాల ఉండేదని, నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సుతో వచ్చే విద్యా సంవత్సరం నాటికి కొత్త కళాశాల తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని గోవా గవర్నర్, మాన్సాస్ ట్రస్ట్ ఛైర్మన్ పూసపాటి అశోక్‌గజపతిరాజు వెల్లడించారు. ఈ విద్యా సంస్థ కరస్పాండెంట్ లక్ష్మీపతి రాజు అధ్యక్షతన విజయనగరం కోటలో ఆదివారం జరిగిన విద్యా సంస్థ ఉద్యోగుల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. న్యాయ కళాశాలను సైతం ప్రారంభించే ప్రతిపాదన ఉందన్నారు. సంస్థ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు సమష్టిగా కృషి చేద్దామన్నారు. ఎందరో మహానుభావులు నడయాడిన నేల మనదని, అలాంటి నేల చరిత్రను అహంతో మార్చడానికి ప్రయత్నించకూడదన్నారు.

జ్యోతి వెలిగిస్తున్న గోవా గవర్నర్

కష్టమైనా ఇష్టపడి పనిచేద్దాం..

మాన్సాస్ సంస్థలో పనిచేస్తున్న వారంతా ఎంత కష్టమైనా, ఇష్టపడి సంస్థ అభివృద్ధికి బాధ్యతగా పనిచేయాలని ఉద్యోగులకు పిలుపునిచ్చారు. అక్షరం ఎంతో విలువైంది కాబట్టి గురువులంతా ఆలోచనా విధానాల్లో మార్పులు చేసుకుని భావితరాల భవితకు భరోసా ఇవ్వాలన్నారు. దేశం కోసం ప్రాణాలర్పించిన సంతోష్‌కుమార్ లాంటి వారు కోరుకొండ సైనిక పాఠశాలలో చదివినవారేనన్నారు. ముందుగా పీవీజీ రాజు చిత్రపటానికి జ్యోతి వెలిగించి నివాళి అర్పించారు. ఈ సమావేశంలో మాన్సాస్ ఈడీ సీతారామరాజు బడ్జెట్, ప్రణాళికలను వివరించారు. సంస్థల ప్రిన్సిపాళ్లు, ఉద్యోగులు హాజరయ్యారు.

రైతుల సంక్షేమమే లక్ష్యం

మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి

బొండపల్లి, విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: రైతు సంక్షేమానికే తొలి ప్రాధాన్యమిస్తామని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. సాగునీటికి అన్నదాతలు ఇబ్బంది పడకుండా పొలాల్లో బోర్లు ఏర్పాటుచేస్తామని ఆదివారం గొట్లాంలో నిర్వహించిన సభలో వెల్లడించారు. అనారోగ్యంతో బాధపడుతున్న పార్టీ కార్యకర్త మహేష్‌ను పరామర్శించారు. పోతలకొనాయుడు సహా పలువురు కార్యకర్తలు వైకాపా నుంచి మంత్రి సమక్షంలో తెదేపాలో చేరారు. మండలాధ్యక్షుడు అచ్చిబాబినాయుడు అధ్యక్షతన నిర్వహించిన సభలో ఏఎంసీ ఛైర్మన్ గోపాలరాజు, వైస్ ఛైర్మన్ కృష్ణ, గజపతినగరం, గంట్యాడ, దత్తిరాజేరు, మండలాధ్యక్షులు శ్రీదేవి, భాస్కర్‌నాయుడు, చంద్రశేఖర్, కార్యకర్తలు పాల్గొన్నారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ విజయనగరంలోని కోటలో గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతిరాజును మర్యాదపూర్వకంగా కలిశారు. మొక్కు అందించి, పలు అంశాలపై చర్చించారు.

నారంశెట్టికి పురస్కారం

అవార్డు అందుకుంటున్న ఉమామహేశ్వరరావు

పార్వతీపురం, న్యూస్‌టుడే: పట్టణానికి చెందిన బాలసాహితీవేత్త నారంశెట్టి ఉమామహేశ్వరరావుకు ప్రపంచ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శనివారం జరిగిన కార్యక్రమంలో కావ్యశ్రీ పురస్కారంతో సత్కరించారు. ఆయన తెలుగు సాహిత్యానికి చేసిన సేవలు గుర్తింపుగా దీన్ని అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రపంచ కవుల వేదిక, ఆంధ్రప్రదేశ్ సృజనాత్మకత, సాంస్కృతిక సమితి సంయుక్తంగా ఈ కార్యక్రమం నిర్వహించాయి. భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారని ఉమామహేశ్వరరావు తెలిపారు.

విద్యుత్తు కష్టాలు తప్పేనా?

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలో ఏటా వేసవిలో విద్యుత్తు కష్టాలు తప్పడం లేదు. లోడ్ పెరిగి ట్రిప్ కావడం, జంపర్లు తెగిపోవడం, నియంత్రికలు కాలిపోవడం తదితర సమస్యలు ఏర్పడుతున్నాయి. దీంతో గంటల తరబడి సరఫరా ఆగిపోతోంది. సామర్థ్యానికి మించి వినియోగం ఉండటంతో ఈ పరిస్థితి కనిపిస్తోంది. చాలాచోట్ల ఇంకా 160 కేవీ డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లే ఉన్నాయి. వీటిని మార్చాల్సి ఉంది.

పెరుగుతున్న వినియోగం..

ఏటా వేసవిలో వినియోగం పెరుగుతోంది. ఫిబ్రవరి నుంచే మిలియన్ యూనిట్ల విద్యుత్తు మేర వాడేస్తున్నారు. జూన్ వరకు ఇదే పరిస్థితి కనిపిస్తోంది. ప్రస్తుతం వినియోగం సరాసరి రోజుకు 10 మి.యూ గా నమోదవుతోంది. గరిష్ఠంగా మేలో 11 మి.యూనిట్లకు చేరుతోంది. ఈసారి 12.5 మి.యూ వరకు చేరే అవకాశముందని అంచనా వేస్తున్నారు. ఏసీల వాడకం పెరగడం, వ్యవసాయ మోటార్లను గంటల తరబడి వినియోగిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఈ లోడును తట్టుకునేందుకు కార్యాచరణ ప్రణాళిక అమలు చేయాల్సి ఉంది.

విజయనగరంలో నియంత్రికను ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

వేసవి ప్రణాళిక ఇలా..

● నియంత్రికల స్థాయి పెంపు, డిమాండుకు అనుగుణంగా లోడ్ మార్పు తదితర చర్యలు తీసుకోనున్నారు. ● అధిక లోడ్ కలిగిన 214 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు పెట్టనున్నారు. ఇప్పటికే 156 ఏర్పాటు చేశారు. ● రూ.8.74 కోట్లతో 33/11 కేవీ విద్యుత్తు ఉపకేంద్రాలను ప్రారంభించనున్నారు. ● కొత్తగ ఉప మండల అభ్యాసాపాలెంలోని కేంద్రానికి రూ.2.70 కోట్లు, విజయనగరం దాసన్నపేటకు రూ.3.32 కోట్లు, డెంకాడ పెదతాడివాడకు రూ.2.72 కోట్లు కేటాయించారు. ● 7.5 కి.మీల పరిధిలో 33 కేవీ, 11 కేవీ లైన్లు వేస్తున్నారు.

నిరంతర సరఫరా..

రానున్న వేసవిలో ఇబ్బంది లేకుండా చూస్తున్నాం. నిరంతరం సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. గతేడాది ఎదురైన సమస్యలను దృష్టిలో పెట్టుకుని ఇప్పటికే కార్యాచరణ ప్రారంభించాం. అన్ని డివిజన్ల పరిధిలో సిబ్బందిని అప్రమత్తం చేశాం. ఎక్కడైనా అంతరాయం కలిగితే వెంటనే ఫిర్యాదు చేయొచ్చు. లోవోల్టేజీ సమస్య రానీయం. కొత్త నియంత్రికలు, లైన్లు, ఉప కేంద్రాల కోసం రూ. 15.74 కోట్లు ఖర్చు చేస్తున్నాం. – ఎం.లక్ష్మణరావు, ఎస్ఈ, ఏపీఈపీడీసీఎల్

జిల్లాలో పరిస్థితి ఇదీ..					
2025- 26 ఆర్థిక ఏడాదిలో గరిష్ఠ డిమాండు: 467 మెగావాట్లు	విద్యుత్తు వినియోగదారులు: 7,26,733	ఉప కేంద్రాలు: 98	డిస్ట్రిబ్యూషన్ నియంత్రికలు: 24,287	33 కేవీ లైన్ల పొడవు 1205.37 కి.మీ	11 కేవీ లైన్లు: 7,435.51 కి.మీ

ప్రజల భద్రతే ప్రాధాన్యం

దత్తిరాజేరు, న్యూస్‌టుడే: ఎస్పీ ఆదేశాల మేరకు ప్రజల రక్షణ, భద్రత కోసమే కార్డన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించినట్లు బొబ్బిలి డీఎస్పీ భవ్యారెడ్డి తెలిపారు. ఇంగిలాపల్లిలో ఆదివారం అన్ని ఇళ్లలో సోదాలు చేశామని నేరాల నియంత్రణ, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, ఇతర నిషేధిత వస్తువుల అక్రమ తనిఖీలు చేపట్టమన్నారు. అనుమానిత వ్యక్తులపై నిఘా ఉంచామన్నారు. అపరిచిత వ్యక్తుల వివరాలు సేకరించి వారి వేలిముద్రలు తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో గజపతినగరం సీఐ జీవీ రమణ, పలు మండలాల ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

సూచనలిస్తున్న డీఎస్పీ భవ్యారెడ్డి

ఏళ్లనాటి కల నెరవేరుతున్న వేళ

పాలకొండ మండల పరిధిలోని గోపాలపురం గ్రామస్థుల 40 ఏళ్ల కల ఎట్టకేలకు నెరవేరుతోంది. గ్రామానికి సమీపంలో గెడ్డ ప్రవహిస్తోంది. దీనికి మరోవైపున అన్నవరం, బుక్కూరు, గోపాలపురం, పాలకొండకు చెందిన 500 ఎకరాల పంట భూములున్నాయి. పంటకోసి, వాటిని గ్రామాలకు తీసుకువచ్చే సమయంలో ఆ గెడ్డను దాటేందుకు రైతన్నలు పడే అవస్థలు అన్నీఇన్నీ కావు. దీంతో వారంతా కలిసి విరాళాలు వేసుకుని ఏటా సిమెంటు పైపులు వేసి తాత్కాలిక దారిని ఏర్పాటు చేసుకునేవారు. ఇంత చేసినా.. వర్షాకాలంలో గెడ్డ ఉద్ధృతికి పైపులు కొట్టుకుపోవడం పరిపాటిగా మారింది. ఈ సమస్యను గోపాలపురం సర్పంచి సిరిపురం జగదీష్ ఆధ్వర్యంలో రైతులందరూ కలిసి ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణకు వద్ద గత ఏడాది తమ గోడు విన్నవించారు. ఆయన ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో వంతెన నిర్మాణానికి రూ.40 లక్షలు మంజూరవగా ఆదివారం పనులు ప్రారంభించారు. – న్యూస్‌టుడే, పాలకొండ గ్రామీణం

మహిళ హత్య కేసులో నిందితుడి అరెస్టు

విశాఖపట్నం (విశాలాక్షినగర్), న్యూస్‌టుడే: ఈనెల 11వ తేదీన విశాఖపట్నంలోని ఆరిలోవలో మహిళను గొంతు నులిమి హత్య చేసిన నిందితుడ్ని అరెస్టు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. నిందితుడు బొబ్బిలికి చెందిన వి.శివలింగేశ్వరరావు(టాటూ శివ)గా గుర్తించారు. అతడి ఫోన్ సిగ్నల్ ఆధారంగా పట్టుకున్నారు. తరచూ బెట్టింగ్‌లకు పాల్పడుతూ అప్పుల పాలై నేరాలకు ఒడిగట్టినట్లు పోలీసులు నిర్ధారించారు.

ఏం జరిగిందంటే.. ఆరిలోవ పాతపోలీస్‌స్టేషన్ సమీప కనకదుర్గనగర్‌లో కాపు రమణ, లక్ష్మి(45) దంపతులు నివాసం ఉంటున్నారు. రమణ జీవీఎంసీ ఉద్యాన విభాగంలో పని చేస్తున్నారు. ఆయన 11వ తేదీ ఉదయం 9 గంటలకు విధులకు వెళ్లారు. లక్ష్మి ఇంట్లో ఒంటరిగా ఉన్నప్పుడు ఇంట్లోకి చొరబడి దాడిచేసి గొంతునులిమి చంపేశాడు. ఆమె ఒంటిపై ఉన్న 8 తులాల బంగారు ఆభరణాలు, బీరువాలో ఉన్న రూ.5లక్షల నగదుతో పరారయ్యాడు. ఈ ఘటనపై భర్త రమణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు నిందితుడిని అదుపులోకి తీసుకున్నామని పోలీసులు తెలిపారు.

పెళ్లి ఇష్టం లేదని యువతి ఆత్మహత్య

ఇనుముల దివ్య (పాత చిత్రం)

సంతకవిటి, న్యూస్‌టుడే: ఇష్టంలేని పెళ్లి చేస్తున్నారని గడ్డిమందు తాగిన యువతి చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటన సంతకవిటి మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు, యువతి బంధువుల వివరాల ప్రకారం.. మండవకురిటి పంచాయతీ పరిధిలోని పోతురాజుపేట గ్రామానికి చెందిన తల్లిదండ్రులు ఇనుముల భాస్కరరావు, రమాదేవి దంపతులది వ్యవసాయ కుటుంబం. వీరికి కుమార్తె, కుమారుడు సంతానం. కుమార్తె దివ్య (22) డిగ్రీ వరకు చదువుకుంది. తల్లిదండ్రులు, బంధువులు ఇటీవల విశాఖకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీరుతో పెళ్లి చేసేందుకు సంబంధం కుదిర్చారు. మార్చి 7న ముహూర్తం నిర్ణయించారు. పెళ్లి కోసం అంతా సిద్ధం చేశారు. ఈ క్రమంలో దివ్య తనకు ఇష్టంలేని పెళ్లి చేసుకోనని చెప్పింది. ముహూర్తాలు పెట్టిన తరువాత చెప్పడమేంటని తల్లిదండ్రులు నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు. అయినా వినిపించుకోకుండా ఈనెల 21న రాత్రి గడ్డిమందు తాగింది. కుటుంబ సభ్యులు రాజాం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం వేకువజామున మృతి చెందింది. తల్లి రమాదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సంతకవిటి హెడ్‌కానిస్టేబుల్ వి.జనార్దనరావు తెలిపారు.

వ్యాయామశాలలో మంటలు.. బూడిదైన పరికరాలు

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: ఉన్నత చదువులు చదివారు.. తమతో పాటు మరో పదిమందికి ఉపాధి ఇవ్వాలనే ఆలోచనతో రూ.లక్షలు వెచ్చించి వ్యాయామశాలను ఏర్పాటు చేసుకున్నారు. విద్యుత్తు షార్ట్ సర్క్యూట్‌తో ఆశలన్నీ అడియాశలయ్యాయి. జిమ్‌లో అగ్నిప్రమాదం చోటు చేసుకుని, సామగ్రి కాలిబూడిదయ్యింది. వివరాల్లోకి వెళ్తే.. కోటవానివలసకు చెందిన వివేక్, పట్టణానికి చెందిన శామ్యూల్ వేరే వాళ్ల వద్ద రూ.35లక్షలతో జిమ్ కొనుగోలు చేశారు. బెలగాం శివారులో ఉన్న ఈ జిమ్‌లో యువతకు వ్యాయామ శిక్షణ ఇస్తున్నారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా శనివారం అర్ధరాత్రి మంటలు చెలరేగాయి. స్థానికుల సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మంటలు అదుపు చేశారు. ప్రమాదంలో అత్యాధునిక వ్యాయామ పరికరాలు కాలిబూడిదయ్యాయి. సుమారు రూ.18లక్షల వరకు ఆస్తి నష్టం ఉండొచ్చని ప్రాథమిక అంచనా.

అనుమానం.. ఆపై వేధింపులు

గృహిణి బలవన్మరణం

మాధవీదేవి (పాత చిత్రం)

బొబ్బిలి, న్యూస్‌టుడే: అనుమానం పెంచుకున్న భర్త తాగివచ్చి వేధిస్తుండడంతో జీవితంపై విరక్తి చెందిన గృహిణి ఉరివేసుకుని, ఆత్మహత్య చేసుకున్న ఘటన బొబ్బిలి పట్టణంలో చోటుచేసుకుంది. సీఐ నారాయణరావు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని కుమ్మరివీధికి చెందిన సుంకరి మాధవీదేవికి (40) బాడంగి మండలం చిన్న భీమవరానికి చెందిన మర్రి నరేష్‌తో 16 ఏళ్ల కిందట ప్రేమ వివాహం అయ్యింది. భర్త కారు చోదకుడిగా, ఆమె ఓ ప్రైవేటు పాఠశాలలో గణిత ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. కుమారుడు పదో తరగతి, కుమార్తె తొమ్మిదో తరగతి చదువుతున్నారు. ఆమె పనిచేస్తున్న పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఫోన్ చేస్తున్న కారణంగా భర్త అనుమానం పెంచుకున్నాడు. తాగి వచ్చి తరచూ ఘర్షణకు దిగేవాడు. శనివారం రాత్రి మాధవీదేవి పిల్లలతో కలిసి సమీపంలో ఉంటున్న కన్నవారి ఇంటివద్ద భోజనం చేసి, కాసేపు నిద్రించారు. భర్త నరేష్ ఫోన్ చేయడంతో రాత్రి 9.30 సమయంలో ఇంటికి వెళ్లింది. మాధవీదేవికి వరుసకు తమ్ముడైన కిశోర్‌కు ఆదివారం ఉదయం నరేష్ ఫోన్‌చేసి, మీ అక్క చనిపోయిందని చెప్పడంతో వారంతా చేరుకున్నారు. ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అల్లుడు తరచూ వేధించడంతోనే తమ కుమార్తె ప్రాణాలు తీసుకుందని మృతురాలి తండ్రి వెంకటరమణమూర్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు. ఆదివారం రాజాం యాత్రకు వెళ్దామని తల్లిదండ్రులతో మాట్లాడిన కొద్దిగంటల్లోనే ఈ అఘాయిత్యానికి పాల్పడడంతో జీర్ణించుకోలేకపోతున్నారు. గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది.

వారు పట్టించుకోరులే.. తవ్వి తరలించేద్దాం

పేదలకు గృహనిర్మాణాలకు ఆర్థిక భారం పడకూడదని ప్రభుత్వం అమలుచేస్తున్న ఉచిత పథకాన్ని ఆసరాగా చేసుకుని అక్రమార్కులు ఇసుక అక్రమంగా తరలించేస్తున్నారు. రాత్రీ పగలూ తేడాలేకుండా తవ్వేస్తుండడంతో జిల్లాలోని నదీ గర్భాలు కోతకు గురవుతున్నాయి. జిల్లాలోని చంపావతి, గోస్తనీ నదుల్లో రక్షిత పథకాల వద్ద గుంతలు కనిపిస్తున్నాయి. నీటి సరఫరాపై ప్రభావం చూపుతోంది. ప్రమాదాలకు కారణమవుతోంది.

–న్యూస్‌టుడే, జరజాపుపేట(నెల్లిమర్ల), ఎస్.కోట, భోగాపురం

చంపావతి, గోస్తనీలో యథేచ్ఛగా ఇసుక అక్రమ తవ్వకాలు

నెల్లిమర్ల కొండపేట ప్రాంతంలో చంపావతి నదిలో అక్రమంగా తవ్విన నిల్వలు

ఊటబావుల వద్ద..

తాగునీటి ఊటబావుల వద్ద ఎక్కువగా ఇసుక తవ్వి విజయనగరం, విశాఖ ప్రాంతాలకు లారీల్లో తరలించేస్తున్నారు. కొన్నిచోట్ల నాటుబళ్లపై తీసుకెళ్లి నిల్వ చేసి, అక్కడి నుంచి ట్రాక్టర్లతో గమ్యస్థానాలకు చేర్చి సొమ్ము చేసుకుంటున్నారు. వాల్టా చట్టాన్ని ధిక్కరిస్తున్నా.. ఊటబావులను దెబ్బతీస్తున్నా.. అధికారుల్లో స్పందన లేదు. దీంతో అక్రమార్కులు చెలరేగిపోతున్నారు.

గుంతల్లో పడి ప్రమాదాలు..

ప్రధానంగా చంపావతి, గోస్తనీ నదుల్లో ఇసుక తవ్వకాల వల్ల భారీ స్థాయిలో గుంతల్లోకి తాటిపూడి, ఆంధ్ర జలాశయాల నుంచి నీరు విడుదల చేసిన సమయాల్లో నీరు చేరి ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఎస్.కోట నియోజకవర్గంలో గతంలో గోపాలపల్లి, కొట్టాం ప్రాంతాల్లో మృతి చెందారు. కొట్టాం వద్ద ఎడ్లు, పశువులు మృత్యువాత పడ్డాయి. ఈ ఏడాది తుపాన్ సమయంలో ధామస్‌పేట ప్రాంతంలో జరజాపుపేటకు చెందిన కనకల అప్పలనాయుడు చంపావతి నదిలో స్నానానికి దిగి గుంతలో పడి మృతి చెందాడు.

ఎక్కడెక్కడంటే..

నెల్లిమర్ల ప్రాంతంలో ధామస్‌పేట, కొండపేట, రామతీర్థం కూడలి, నీలంరాజుపేట ప్రాంతాల్లో జోరుగా తవ్వకాలు కొనసాగుతున్నాయి. జరజాపుపేటలో నారాయణపట్నం, మొయిద, భోగాపురంలో కోటభోగాపురం, పూసపాటిరేగలో రెల్లివలస, కొప్పెర్ల, డెంకాడలో నాతవలస, సింగవరం, ముంగినాపల్లి, ఎస్.కోట ప్రాంతంలో ముసిడిపల్లి, మధుపాడ, వేమలాపల్లి తదితర ప్రాంతాల్లో అధికంగా తవ్వకాలు చేపడుతున్నారు.

అడ్డుకునేందుకు చర్యలు..

చంపావతి నదీ గర్భంలో ఇసుక తవ్వకాలను అడ్డుకునేందుకు చర్యలు చేపడుతున్నట్లు తహసీల్దారు కె.శ్రీకాంత్ అన్నారు. స్థానిక వీఆర్వోలకు ప్రత్యేక బాధ్యతలను అప్పగించామన్నారు. ● గోస్తనీ నదిలో అక్రమ తవ్వకాలు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దారు డి.శ్రీనివాస్ అన్నారు. భారీ వాహనాలతో ఇసుకను తరలించే వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.



ఫిర్యాదు పత్రాలతో డీసీసీ ప్రతినిధులు

భాజపా నాయకులపై చర్యలకు డిమాండు

విజయనగరం మయూరి కూడలి, న్యూస్‌టుడే: భాజపా, బీజేవైఎంకు చెందిన నాయకులపై చర్యలు తీసుకోవాలని ఏపీసీసీ సభ్యుడు, డీసీసీ మాజీ అధ్యక్షుడు సరగడ రమేష్ కుమార్, సీనియర్ నాయకుడు సతీష్ కుమార్ డిమాండు చేశారు. విజయనగరంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఈనెల 21న తోటపాలెంలోని కార్యాలయ ఆవరణలో పార్టీ జెండాలు, ఫ్లెక్సీలను దగ్ధం చేయడం దారుణమన్నారు. ఈమేరకు వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ● అబుల్ కలామ్ ఆజాద్ దేశానికి ఎనలేని సేవలు అందించారని డీసీసీ ప్రతినిధులు పేర్కొన్నారు. ఆయన వర్ధంతి సందర్భంగా పార్టీ కార్యాలయంలో చిత్రపటానికి నివాళులర్పించారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	130	230	240

EENADU eClassifieds

JOBS

Haier Exclusive Service Centerలో M.S.ఆఫీస్ సాఫ్ట్ స్కిల్స్ అనుభవజ్ఞులైన Female కావలెను. VZM ✆ 9381973800.

శ్రీతిరుమల ఆటోఫైనాన్స్ (3 వీలర్) నందు పనిచేయుటకు బిజినెస్ & కలెక్షన్ ఎగ్జిక్యూటివ్ కావలెను. జీతం: 18K+2K పెట్రోల్ & ఇన్సెంటివ్ లొకేషన్ విజయనగరం, S. కోట. 9100960677.

VZM, కోట జంక్షన్, DTDC కొరియర్ నందు పనిచేయుటకు రిసెప్షనిస్ట్ (F) కావలెను. 3.00 to 9.30, జీ: 8,500/- Con: 9885980790.

విజయనగరం జిల్లాలో గల శ్రీరామ్ గ్రూప్ రాజాం పరిధిలోగల రూరల్ & అర్బన్ ప్రాంతాల్లో Incharges & BDE's కావలెను. Any డిగ్రీ or డిప్లొమా కలిగి ఉండాలి. మంచి Salary, PF, ESI, Yearly బోనస్ 28,000/- కలవు. అర్బన్ బ్రాంచెస్‌లో Executive Trainee (MBA or PG) (20,000) అందరికీ వయసు 36 సం.రాలు లోపు కలిగి ఉండి, మంచి అనుభవం ఉన్నవారికి మంచి శాలరీ, ప్రాధాన్యత కలదు. Products, కలెక్షన్స్, డిపాజిట్స్, చిట్స్, లైఫ్ ఇన్సూరెన్స్ ✆ 9849824071.

హైదరాబాద్ యూనిటీ హోంకేర్‌లో ఏజెంట్లకు మంచి అవకాశం. మీరు వర్కర్స్‌ని పంపితే మొదటినెల 5వేలు కమీషన్. వర్కర్స్ జీ:15K, ఫ్రీవసతి,ఫుడ్. 8121541212

WANTED

Sales Girl Required - Saree Showroom (Pradeep Nagar, Vizianagaram)

Looking for a sales girl with minimum 1 year experience in Saree / Showroom Sales.

Good communication skills and customer handling required.

Immediate joining preferred.

Location: D.N. Kumar Pradeep Nagar, Vizianagaram.

Call: 8247482361

MARKETING/ SALES

Anand Masale Require Sales & Marketing Manager, Marketing Executives. Contact: 9849655105, 9848053144 Email: anandmasalaappltd@gmail.com.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే సంప్రదించండి: 8008597609

నేడు 'డయల్ యువర్ సీఎండీ'

గురుద్వారా(విశాఖపట్నం), న్యూస్‌టుడే: విద్యుత్తు సంబంధిత సమస్యలను మరింత వేగవంతంగా పరిష్కరించే లక్ష్యంతో విశాఖలోని ఈపీడీసీఎల్ కార్యాలయంలో సోమవారం 'డయల్ యువర్ సీఎండీ' కార్యక్రమం నిర్వహించనున్నట్లు సంస్థ సీఎండీ ఇమ్మడి పృథ్వీతేజ్ ఓ ప్రకటనలో తెలిపారు. సంస్థ పరిధిలోని 13 జిల్లాలకు చెందిన వినియోగదారులు 86884 00499 ఫోన్ నెంబర్ ద్వారా తమ సమస్యలను తెలియజేయవచ్చునని పేర్కొన్నారు. ఉదయం 10.30 నుంచి 11.30 వరకు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యుత్తు సరఫరాలో తరచూ అంతరాయాలు, హెచ్చుతగ్గులు, కొత్త సర్వీసుల జారీ, సరఫరా పునరుద్ధరణలో జాప్యం, ట్రాన్స్‌ఫార్మర్ల మార్పిడి తదితర సమస్యలపై ఫిర్యాదులను నేరుగా తన దృష్టికి తీసుకురావొచ్చునన్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97609
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80081 11237

దేశీయ కోళ్ల పెంపకంతో ఆర్థికాభివృద్ధి

ఉమ్మడి జిల్లాలో 760 యూనిట్లు

పార్వతీపురం, న్యూస్‌టుడే: గిరిజనుల ఆర్థికాభివృద్ధి, పోషకాహార భద్రతే ధ్యేయంగా పార్వతీపురం ఐటీడీఏ దేశీయకోళ్ల పెంపకాన్ని ప్రత్యేక పథకంగా అమలుచేయడానికి నిర్ణయించింది. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో పార్వతీపురం ఐటీడీఏ పరిధిలోకి వచ్చే నాలుగు మండలాలను ఎంపిక చేశారు. ఈ మండలాల్లో అమెరికాకు చెందిన 'హేఫర్ ఇంటర్‌నేషనల్' సంస్థ సహకారంతో కోళ్ల పెంపకం చేపడుతున్నారు. ఈ పథకం కింద ఎంపికైన గిరిజన కుటుంబాలకు శతశాతం రాయితీపై యూనిట్లు అందించనున్నారు.

పథకం అమలు ఇలా..

● మన్యం నుంచి సాలూరు, పాచిపెంట, విజయనగరం నుంచి శృంగవరపుకోట, మెంటాడ ● జిల్లాకు 380 యూనిట్ల చొప్పున 760 యూనిట్లు ఏర్పాటు చేస్తారు. ● ఒక యూనిట్‌కు రూ.15వేలు ఖర్చవుతుంది. మొత్తం ఖర్చు ప్రభుత్వమే భరిస్తుంది. ● యూనిట్‌లో 45 నుంచి 50 కోడిపిల్లలను అందిస్తారు. ● ఆరు నెలలకు సరిపడా దాణా అందిస్తారు. ● ఈ పథకానికి రెండు జిల్లాలో రూ.1.14కోట్లు వెచ్చిస్తున్నారు.

ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా..

ప్రస్తుతం నాటుకోడి మాంసానికి, గుడ్లకు మార్కెట్‌లో మంచి గిరాకీ ఉంది. కిలో మాంసం రూ.వెయ్యి వరకు ధర పలుకుతోంది. గిరిజన మహిళా సంఘాలకు, స్వయం సహాయక బృందాలకు దేశవాళీ కోళ్ల యూనిట్లను పంపిణీ చేస్తున్నాం. మండలాల్లో ఎంపీడీవోలు లబ్ధిదారులను ఎంపిక చేస్తారు. ఎంపికైన వారికి కోళ్ల పెంపకంపై శిక్షణ, వ్యాధినిరోధక టీకాలు కూడా అందిస్తారు. కోళ్లను పెంచేందుకు ప్రత్యేక గూడును ఇచ్చే విధంగా ప్రభుత్వానికి ప్రతిపాదించామని పార్వతీపురం ఐటీడీఏ పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

ఎప్పుడు ఎటు పడిపోతుందో!

ఈ చిత్రంలో కనిపిస్తున్న రక్షిత మంచినీటి పథకం ట్యాంకు సాలూరు మండలం పెదపారన్నవలస గ్రామంలోనిది. ఏళ్ల క్రితం నిర్మించిన ఈ ట్యాంకు ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంది. ట్యాంకు పైభాగంలో విరిగిపోయిన ఓ సిమెంటు నిర్మాణం ఎప్పుడు ఎవరి మీద పడుతుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. దీనికితోడు మెట్ల పక్కన రక్షణ కోసం వేసిన రెయిలింగ్ శిథిలమైంది. దీనిపై పంచాయతీ కార్యదర్శి మౌళి మాట్లాడుతూ.. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు తెలియజేసి సమస్యను పరిష్కరిస్తామన్నారు.

– న్యూస్‌టుడే, సాలూరు గ్రామీణం

తెచ్చారు.. వృథాగా వదిలేశారు

గత ప్రభుత్వ హయాంలో రీసర్వే చేసి, కంచె ఏర్పాటు చేసేందుకు తీసుకువచ్చిన కొలత రాళ్లు చాలా చోట్ల ఇలా వృథాగా దర్శనమిస్తున్నాయి. మండలంలోని వడమ, కొండాపురం, పనుకువలస తదితర గ్రామాల్లో ఈ పరిస్థితి కనిపిస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి వినియోగించేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. దీనిపై తహసీల్దారు రాధాకృష్ణమూర్తి వద్ద ప్రస్తావించగా పరిశీలించి, చర్యలు తీసుకుంటామని తెలిపారు.

– న్యూస్‌టుడే, పాలకొండ

నిరుపయోగంగా ఫైబర్ నెట్ యంత్రాలు

గతంలో ప్రభుత్వం అందించిన ఏపీ ఫైబర్ నెట్‌వర్క్ యంత్రాలు పాచిపెంట మండలంలో పలుచోట్ల నిరుపయోగంగా పడి ఉన్నాయి. అంతర్జాల సేవల కోసం వినియోగించేందుకు అందించారు. రూ.లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన వీటికి వైపై అమర్చడం మరిచారు. దీనికితోడు సొంత భవనాల్లేని పంచాయతీలకు అందించారు. దీంతో ఎందుకూ ఉపయోగపడటం లేదు. పెద్దవలస కార్యాలయంలో వృథాగా ఉన్న యంత్రంపై కార్యదర్శి రాంప్రసాద్ మాట్లాడుతూ చర్యలు తీసుకుంటామన్నారు.

– న్యూస్‌టుడే, పాచిపెంట

కాలవలో చెత్త తొలగించండి

పార్వతీపురం పట్టణంలోని వీధుల్లో స్వచ్ఛత మాట అటుంచితే.. సాగునీటి కాలువల్లో చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. డంపింగ్ యార్డులను తలపిస్తున్నాయి. పట్టణంలోని కొత్తవలస నుంచి మార్కొండపుట్టి వెళ్లే మార్గంలో జంఝావతి కాలువ ఉంది. సమీపంలో ఉన్నవారంతా అందులోనే చెత్త వేస్తుండడంతో అధ్వానంగా మారింది. సాగునీరు పారేందుకు అవకాశం లేదు. అటువైపు వెళ్లేవారు ముక్కుమూసుకోవాల్సిందే. ఇలానే సాగితే కొన్నాళ్లకు చెత్త కుప్పలు తప్ప కాలువ కనిపించదు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, పార్వతీపురం

నిర్మాణం సరే.. ప్రారంభమెప్పుడో?

సాలూరు మండలం కరాసువలస పంచాయతీ కొమ్మానవలసలో నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ భవనం ఇది. వైకాపా హయాంలో నాడు -నేడు కింద 13 మంజూరవగా.. నిధుల జాప్యం కారణంగా ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. కూటమి వచ్చాక మరో ఏడింటిని మంజూరు చేసి, ఒక్కోదానికి రూ.12 లక్షల చొప్పున కేటాయించింది. దీంతో నిర్మాణం పూర్తి చేశారు. రెండు నెలలు కావస్తున్నా నేటికీ ప్రారంభించలేదు. సీడీపీవో మంగమ్మ మాట్లాడుతూ... త్వరలోనే ప్రారంభించి వినియోగంలోకి తీసుకువస్తామని తెలిపారు.

– న్యూస్‌టుడే, సాలూరు గ్రామీణం

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)

పార్వతీపురం	8008566244
పాలకొండ	8008574299
సాలూరు	8008786820
కురుపాం	9849044696

?: నిడగల్లు బస్టాండు వీధిలోని గొట్టపు బావి మరమ్మతుకు గురైంది. తాగునీటికి ఇబ్బందులు పడుతున్నాం. **- రామినాయుడు, స్థానికుడు** ● మరమ్మతు పనులు చేపడతాం. **- వెంకటరావు, ఇన్‌ఛార్జి ఎంపీడీవో** – న్యూస్‌టుడే, సీతానగరం

?: పట్టణం సమీపంలోని వైకేఎం కాలనీ హనుమాన్ కూడలిలో బొబ్బిలి వైపు వెళ్లే బస్సులు ఆపడం లేదు. ఇబ్బంది పడుతున్నాం. **- నారాయణ, వైకేఎం కాలనీ.** ● క్షేత్రస్థాయిలో పరిశీలించి, చర్యలు తీసుకుంటాం. **- లక్ష్మణరావు, డిపోమేనేజర్**

– న్యూస్‌టుడే, పార్వతీపురం గ్రామీణం.

?: పాలకొండ వీధుల్లో కుక్కల బెడద అధికంగా ఉంది. **- లేహన, విద్యార్థిని** ● చర్యలు తీసుకుంటాం. **- రత్నరాజ్, నగర పంచాయతీ కమిషనర్** – న్యూస్‌టుడే, పాలకొండ గ్రామీణం

?: బత్తిలి మేజర్ పంచాయతీలో వీధుల్లో మురుగు పేరుకుపోయింది. దోమల బెడద ఎక్కువగా ఉంది. **- గ్రామస్థులు** ● పారిశుద్ధ్యం పనులు చేయించి, క్లోరినేషన్ చేస్తాం. **- శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి**

– న్యూస్‌టుడే, భామిని

?: దిబ్బగుడ్డివలసలో కాలువ పూడికతో నిండి వాడుక నీరు రోడ్డుపైకి వస్తోంది. **- స్థానికులు** ● పరిశీలించి, చర్యలు తీసుకుంటాం. **- శర్మ, ఉప ఎంపీడీవో**

– న్యూస్‌టుడే, పార్వతీపురం గ్రామీణం

రక్తదానం చేస్తూ... ఆయువు నిలుపుతూ

పాలకొండ గ్రామీణం, పాలకొండ, న్యూస్‌టుడే

నేటి యువతరం సేవల్లో తరిస్తున్నారు. కష్టకాలంలో తామున్నామంటూ భరోసానిస్తున్నారు. రక్తం విలువ తెలుసుకున్న పాలకొండకు చెందిన పలువురు యువకులు స్వచ్ఛందంగా రక్తదానానికి ముందుకొస్తూ.. ఎందరో ప్రాణాలు నిలిపి, స్ఫూర్తిగా నిలుస్తున్నారు.

రక్తదానం చేస్తున్న యువత

క్రీయా సంస్థ పేరిట..

పాలకొండకు చెందిన కొందరు యువకులు క్రీయా సంస్థను ఏర్పాటు చేసి రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నారు. 2020లో బ్లడ్ డోనర్స్ పేరిట వాట్సప్ గ్రూప్ ఏర్పాటు చేశారు. ఇందులో 143 మంది సభ్యులు ఉన్నారు. ఎవరికైనా రక్తం అవసరమైనట్లు గ్రూప్‌లో సందేశం పంపితే స్పందించి అందిస్తున్నారు. అత్యవసర సమయాల్లో 35 మందికి రక్తం అందించారు. పాలకొండతో పాటు రాజాం, శ్రీకాకుళంలో చికిత్సలు పొందుతున్న రోగుల చెంతకు వెళ్లి రక్తదానం చేస్తూ అండగా ఉంటున్నారు. మూడేళ్లుగా ఎనిమిది శిబిరాలు నిర్వహించి 215 యూనిట్ల వరకు రక్తాన్ని సేకరించి రెడ్‌క్రాస్, పాలకొండ ప్రభుత్వ ఆసుపత్రి బ్లడ్ బ్యాంకుకు అందజేశారు. * హెల్పింగ్ హ్యాండ్స్ పేరిట మరికొంతమంది గ్రూప్‌గా ఏర్పడి పాలకొండ, వీరఘట్టం మండలాల్లో రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నారు. అత్యవసర సమయాల్లోనూ రక్తదానం చేస్తున్నారు. గత రెండేళ్లలో 55 మంది రక్తదానం చేశారు.

మావంతుగా సేవలు..

అత్యవసర సమయాల్లో రక్తం లభించడం చాలా కష్టం. ఇది గుర్తించి రక్తదానం చేస్తున్నా. దీంతో పాటు క్రీయా సంస్థ ఆధ్వర్యంలో ఎప్పటికప్పుడు శిబిరాలు ఏర్పాటు చేస్తూ సమాజానికి మా వంతు సేవలందిస్తున్నాం. – ఎం.మురళీకృష్ణ, క్రీయా సంస్థ నిర్వాహకుడు

యువతలో చైతన్యం..

రక్తదానం అనే సరికి చాలా మంది నేటికీ భయపడుతున్నారు. ఈ భయాన్ని పోగొట్టేందుకే ప్రతీ ఆరు నెలలకోసారి రక్తదానం చేస్తున్నా. యువతలోనూ అవగాహన కల్పించి వారితో రక్తదానం చేయిస్తున్నాం. – శిల్లా బ్రహ్మాజీ, క్రీయా సంస్థ క్రియాశీల సభ్యుడు

ఎక్కడికక్కడే మరమ్మతులు.. పారని సాగునీరు

సీతానగరం, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ గాలికొదిలేయడంతో అన్నదాతలకు కష్టాలు తప్పడం లేదు. సీతానగరం ఆనకట్ట పరిధిలో సీతానగరం, మక్కువ మండలాలకు చెందిన 17 గ్రామాల్లో 3,500 ఎకరాలకు సాగునీరు అందుతుంది. మక్కువ మండలంలోని కంచేడివలస వద్ద కాలువకు రక్షణ గోడ పాడైంది. అక్కడక్కడ లీకులు, రెండు బావులు మరమ్మతులకు గురయ్యాయి. ఎడమ కాలువ 800 మీటర్లు, కుడి కాలువ 12 కి.మీ.ల పరిధిలో అదే బావులు, రెండు సైఫన్లు, డ్రాప్‌లు, పంట కాలువలకు షట్టర్ల అమరిక పనులు చేయాల్సి ఉంది. వెంగళరాయసాగర్ జలాశయం నుంచి సీతానగరం పరిధిలో 3 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతుంది. 17 ఎల్, 19 ఎల్ కాలువలకు లచ్చయ్యపేట, రామవరం, అంటిపేట, ఆర్.వెంకంపేట, బక్కుపేట, వెంకటాపురం పరిధిలో డ్రాపులు శిథిలావస్థలో ఉన్నాయి. ఇసుక పనులు అద్దంపట్టుకున్నాయి. సీతానగరం ఆనకట్ట, వీఆర్ఎస్ పరిధిలోని కాలువలపై ఉన్న కట్టడాల మరమ్మతులకు నిధుల కోసం ప్రతిపాదనలు పంపించినట్లు ఏఈ సుధీర్ తెలిపారు.

కాశాపేట సమీపంలో మరమ్మతులకు గురైన బావి

మురుగులో పాలిథిన్ పరుగు

పట్టణంలోని మురుగు కాలువల్లో పాలిథిన్ పరుగులు పెడుతోంది. ప్రధాన వీధులతోపాటు కాలువల్లో ఎక్కువగా పాలిథిన్ వ్యర్థాలే దర్శనమిస్తున్నాయి. ఇవి చెరువులు, వేగావతి నదిలోకి కలుస్తుండడంతో నీరు కలుషితమవుతోంది. పలు ప్రాంతాల్లోని టిఫిన్ సెంటర్లు, తినుబండారాల దుకాణాలే సమస్యకు కారణమని పలువురు చెబుతున్నారు. దీనిపై పుర పారిశుద్ధ్య అధికారి బాలకృష్ణను వివరణ కోరగా పాలిథిన్ వినియోగాన్ని అరికడుతున్నామని, చర్యలు చేపడతామని తెలిపారు. – న్యూస్‌టుడే, సాలూరు

ముగిసిన గాయత్రి మహాయజ్ఞం

జియ్యమ్మవలస, న్యూస్‌టుడే: గంగమ్మపేటలో మూడు రోజుల పాటు జరుగుతున్న గాయత్రి మహాయజ్ఞం ఆదివారంతో ముగిసింది. పూర్ణాహుతి, అన్నసమారాధనలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు యజ్ఞంలో పాల్గొన్నారు. హరిద్వార్ శాంతికుంజ్ ప్రతినిధులు శివాజీరావు, విక్రమ్, రామదాసు, గాయత్రి పరివార్ సభ్యులు హాజరయ్యారు.

శివలింగాల ప్రతిష్ఠ

మండలంలోని గొడుగూడలో నిర్మించిన కోటి లింగేశ్వర స్వామి ఆలయ మహోత్సవం సందర్భంగా ఆదివారం 108 శివలింగాలను ప్రతిష్ఠించారు. వేదపండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు.

– న్యూస్‌టుడే, గుమ్మలక్ష్మీపురం

ఆట స్థలాల్లో చెత్త వేస్తే చర్యలు

పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రభుత్వ, ఆట స్థలాల్లో చెత్త వేస్తున్న వారికి అపరాధ రుసుము విధించాలని కలెక్టరు ఎన్.ప్రభాకరరెడ్డి కార్యదర్శి వెంకటనాయుడుకు ఆదేశించారు. ఆదివారం వెంకంపేట క్రీడా ప్రాంగణాన్ని సందర్శించారు. కలెక్టర్ చెత్త కుప్పలు పేరుకుపోవడంతో మండిపడ్డారు. ఒడిశా నుంచి వలసపోయే వారి కోసం రుద్ర కంపెనీ బస్సులు ఇక్కడ నిలుపుతున్నారు. వారు అవసరాలు తీర్చుకుని చెత్త వేస్తున్నారని సిబ్బంది కలెక్టర్‌కు నివేదించారు. ఆ సంస్థకు రూ.10 వేలు అపరాధ రుసుము విధిస్తూ నోటీసులు పంపాలన్నారు. సర్పంచి ప్రతినిధి మాధవనాయుడు ఉన్నారు.

పంచాయతీ పాలకులతో మాట్లాడుతున్న కలెక్టర్

తల్లిదండ్రులకు కౌన్సెలింగ్

పాలకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: పాలకొండ పట్టణానికి చెందిన ఇంటర్ విద్యార్థిని తల్లిదండ్రులకు ఆదివారం శక్తి బృందం సభ్యులు కౌన్సెలింగ్ ఇచ్చారు. బాలికకు పెళ్లి చేస్తున్నట్లు తెలియడంతో అక్కడికి చేరుకున్న సభ్యులు బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలను వారికి వివరించారు. దీంతో 18 ఏళ్లు దాటిన తర్వాతే కుమార్తెకు పెళ్లి చేస్తామని ఆ తల్లిదండ్రులు తెలిపారు.

బార్ అండ్ రెస్టారెంట్‌లో చోరీ యత్నం

పార్వతీపురం పురపాలక, న్యూస్‌టుడే: పట్టణంలోని ఓ బార్ అండ్ రెస్టారెంట్, గాజుల దుకాణంలో చోరీ యత్నం జరిగింది. సోమవారం ఉదయం బార్ తెరవగా లోపల వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. నిర్వాహకులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎటువంటి ఆస్తి నష్టం జరగలేదని తెలిపారు. కేసు నమోదు చేసినట్లు సీఐ వెంకటరావు తెలిపారు. * ప్రధాన రహదారిలోని కుమ్మరి వీధిలో ఉన్న ఓ గాజుల షాపు తలుపులు తెరిచేందుకు ఆగంతకులు ప్రయత్నం చేసినట్లు యజమాని చెప్పారు. సమీపంలో ఇనుప రాడ్డు ఉండడాన్ని గమనించి పోలీసుల దృష్టికి తీసుకువెళ్లామన్నారు.

వాతావరణంలో మార్పులు.. ఆరోగ్యానికి చిక్కులు

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే

దగ్గు, గొంతునొప్పితో చికిత్స పొందుతున్న బాలలు

ఎండ తీవ్రత ఎక్కువైంది. మొన్నటి వరకు చల్లగా ఉండే వాతావరణం కాస్త వేడెక్కడంతో ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఉదయం, రాత్రి చల్లని వాతావరణం, మధ్యాహ్నం వేడి.. ఇలా భిన్న వాతావరణానికి జ్వరం, ఒళ్లు నొప్పులు, కాళ్లనొప్పులు, దగ్గు, గొంతునొప్పి వంటి రుగ్మతలు వస్తున్నాయి. గత వారం రోజులుగా పగటి పూట ఉష్ణోగ్రతలు 35 డిగ్రీలకు పైబడి, రాత్రి 26-28 డిగ్రీల మధ్య నమోదవుతున్నాయి. దీంతో చాలా మంది వైరల్ జ్వరాల బారిన పడుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు.

ఓపీ 920 దాటి..

ఉదయం పూట కురిసే మంచువల్ల ఊపిరితిత్తుల్లో కఫం చేరుతోంది. దీంతో రెండు, మూడు వారాలపాటు దగ్గు వేధిస్తోంది. మందులు వాడుతున్నా తగ్గడం లేదు. జ్వరం తగ్గడానికి మూడు రోజులు పడుతుంటే నీరసం కారణంగా కోలుకొనేందుకు వారం, పది రోజులు అవుతోందని రోగులు చెబుతున్నారు. దీంతో ఆసుపత్రులు కిటకిటలాడుతున్నాయి. గత వారం రోజులుగా జిల్లా ఆసుపత్రిలో రోజూ ఓపీ 920 దాటి నమోదవుతోంది. ఇందులో దగ్గు, జలుబు, జ్వరం తదితరాలతో బాధపడే రోగులు 250 మందికిపైగా ఉంటున్నారు. పరిస్థితి తీవ్రంగా ఉన్నవారు ఆసుపత్రిలో ఇన్‌పేషెంట్లుగా చేరుతున్నారు. 150 పడకలకు 280 మంది దాటి ఉంటున్నారు. ఇందులో సీజనల్ వ్యాధులతో వచ్చేవారు 100 మందిపైనే ఉంటున్నారు. 'వాతావరణ పరిస్థితులు మారుతుండడంతో తగు జాగ్రత్తలు పాటించాలి. మంచులో ప్రయాణాలు మానుకోవాలి. గోరువెచ్చని నీరు తాగాలి. వేడి ఆహారం మాత్రమే తీసుకోవాలి. మాస్కులు ధరిస్తే మంచిది.' అని చిన్నపిల్లల వైద్యుడు గణేష్ తెలిపారు.

వినూత్నంగా ఆలోచించాలి

వీరఘట్టం, న్యూస్‌టుడే: మహిళలు పారిశ్రామికంగా ఎదగాలంటే వినూత్నంగా ఆలోచించాలని డీఆర్‌డీఏ పీడీ పి.సుధారాణి అన్నారు. మండలంలోని తలవరం గ్రామంలో జీవనోపాధుల సర్వేను ఆదివారం పరిశీలించారు. జిల్లాలో సమగ్ర సర్వే నిర్వహించి, ఆయా రంగాల్లో ఆసక్తి ఉన్నవారికి ప్రోత్సహిస్తామన్నారు. వ్యాపారాభివృద్ధికి చేపట్టే కార్యక్రమాలకు సహకారం అందిస్తామన్నారు. ఏపీఎం కె.రాము, సీసీ అనిత పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు

సీతంపేట: సారా, మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ఎస్సై అమ్మనరావు అన్నారు. సీతంపేట పీఎమ్మార్సీ కూడలి వద్ద డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. రహదారి భద్రతా నియమాలు పాటించాలన్నారు.

ఐటీడీఏలో పీజీఆర్ఎస్ నేడు

సీతంపేట: సీతంపేట ఐటీడీఏ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక సోమవారం నిర్వహించనున్నట్లు సిబ్బంది తెలిపారు. గిరిజనులు తమ వ్యక్తిగత, గ్రామ సమస్యలపై వినతులు అందజేసుకోవచ్చని తెలిపారు. సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

గుమ్మలక్ష్మీపురం: గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లోని సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ నాయకుడు మల్లేష్ డిమాండు చేశారు. పి.ఆమిటి ఆశ్రమపాఠశాల విద్యార్థులతో మాట్లాడారు. 467 మందికి ఇద్దరు మాత్రమే వంట మనుషులు ఉన్నారని, మరో ఇద్దరిని సంరక్షకులు నియమించారన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి

గుమ్మలక్ష్మీపురం: పరీక్షా కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని గిరిజన విద్యార్థి సంఘం అధ్యక్షుడు సురేష్ కోరారు. పంకాలు, తాగునీటి సదుపాయాన్ని కల్పించాలన్నారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

పార్వతీపురం గ్రామీణం: మండలంలోని అడ్డాపుశీల పంచాయతీకి చెందిన ఓ బాలిక ఈ నెల 16 రాత్రి నుంచి కనిపించడం లేదని కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారని, ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై రాజేష్ తెలిపారు.

వృద్ధురాలికి గాయాలు

పార్వతీపురం పట్టణం, జియ్యమ్మవలస: మండలంలోని ఎరుకుల పేటకు చెందిన నారాయణమ్మ గుమ్మలక్ష్మీపురం వెళ్తుండగా ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో గాయపడిన ఘటన జియ్యమ్మవలస మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు ఆమెను జిల్లా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

శ్రీముఖాలు ఉపసంహరించుకోవాలి

పార్వతీపురం పట్టణం: గిరిజన పాఠశాలల్లో పనిచేస్తున్న 21మంది హెచ్ఎంలకు ఇచ్చిన శ్రీముఖాలను అధికారులు ఉపసంహరించుకోవాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.బాలకృష్ణారావు, జిల్లా అధ్యక్షుడు ఎం.మహేష్ ఒక ప్రకటనలో కోరారు.

విస్తృత తనిఖీలు

సాలూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్, ప్రధాన రహదారుల్లో ఆదివారం పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తనిఖీలు చేస్తున్నట్లు సీఐ బి.అప్పలనాయుడు తెలిపారు. కాంప్లెక్స్‌లో పార్శిల్స్, ఇతర లగేజీలను డాగ్ స్క్వాడ్ టీమ్ తనిఖీ చేసింది.

భూ తగాదాలో ఒకరికి గాయాలు

గాయాల పాలైన లచ్చుమునాయుడు

భామిని, న్యూస్‌టుడే: భూమి వ్యవహారంలో మాటామాటా పెరిగి కొట్టాటకు దిగడంతో ఒకరికి గాయాలైన ఘటన మండలంలోని పెద్దదిమిలి గ్రామంలో చోటుచేసుకుంది. బత్తిలి ఎస్సై అప్పారావు వివరాల మేరకు.. పెద్దదిమిలికి చెందిన బుయ్యాల వీరంనాయుడుకు ఇద్దరు కుమారులు. భార్య మృతి చెందిన తర్వాత చిన్న కుమారుడు లచ్చుమునాయుడు వద్ద ఉంటున్నారు. గతంలో తండ్రి కొనుగోలు చేసిన ఎకరా భూమిలో 0.33 సెంట్లు చిన్న కుమారుడి పేరిట గ్రామ పెద్దల సహకారంతో రిజిస్ట్రేషన్ చేయించారు. మిగిలిన భూమిని ఆయన తనువుచాలించిన తర్వాత ఇద్దరు కుమారులకు సమానంగా పంపకాలు జరపాలని చెప్పారు. దీనిపై పెద్ద కుమారుడు వెంకటరావు, మనవడు సుధాకర్ లచ్చుమునాయుడు, అతని భార్య సావిత్రమ్మలపై దాడి చేసి గాయపరిచారు. వాళ్లు బత్తిలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు వారిని కొత్తూరు ఆసుపత్రికి తరలించారు. అనంతరం ఇరు కుటుంబాలకు కౌన్సెలింగ్ ఇచ్చామని తెలిపారు.

'వైకాపా నీచ రాజకీయాలకు నిదర్శనం'

వెంకన్న చిత్రపటాలతో అసెంబ్లీకి వచ్చిన వైకాపా నేతల ఫొటోలు చూపిస్తున్న విప్

గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: హిందూ మత విశ్వాసాలు, సంస్కృతి, సాంప్రదాయాలపై వైకాపా అధినేత జగన్, ఆ పార్టీ నేతలకు కనీసం భయం, భక్తి లేవని ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి అన్నారు. దేవుడిని సైతం రాజకీయాలకు వాడుకునే నీచ స్థితికి దిగజారారని ఆమె మండిపడ్డారు. చెప్పులు, బూట్లు వేసుకుని వేంకటేశ్వర స్వామి చిత్రపటాలు పట్టుకుని నినాదాలు చేయడం హిందువుల మనోభావాలు దెబ్బతీశాయన్నారు.

తెదేపాతోనే గ్రామీణాభివృద్ధి

పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: తెదేపాతోనే గ్రామీణాభివృద్ధి సాధ్యమని ఏఎంసీ ఛైర్మన్ జి.గౌరి అన్నారు. ఆదివారం మండలంలోని విశ్వంభరపురంలో రోడ్డు, కాలువ పనులు ప్రారంభించారు. విలేకరులతో మాట్లాడుతూ పార్వతీపురం మండలానికి రూ.2 కోట్లు మంజూరయ్యాయన్నారు. నర్సిపురం పంచాయతీ విశ్వంభరపురంలో రూ.6లక్షలతో రోడ్డు, కాలువలకు, రూ.5లక్షలతో ఓలేటిపారం కాలనీలో కాలువల పనులు ప్రారంభమయ్యాయన్నారు. కార్యక్రమంలో తెదేపా ఇన్‌ఛార్జి రమణ, ఎంపీటీసీ2 తవిటి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

విశ్వంభరపురంలో రోడ్డుపనులు ప్రారంభిస్తున్న ఏఎంసీ ఛైర్మన్

వాస్తవికతకు అద్దంపట్టేలా 'అన్వేషణ'

పార్వతీపురం, న్యూస్‌టుడే: శిరంశెట్టి కాంతారావు రచించిన 'అన్వేషణ' నవల వాస్తవికతకు అద్దం పట్టే అంశాలతో పాఠకులను ఆలోచింపజేస్తుందని పి.చిన్నంనాయుడు అన్నారు. స్నేహకళాసాహితి ఆధ్వర్యంలో ఎస్.స్వామినాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ నవలను ఆయన పరిచయం చేశారు. కథనంలో పాఠకులను తనతో తీసుకువెళ్లే రీతిలో ఉంటుందని పేర్కొన్నారు. గాజుల తయారీ పరిశ్రమలో పిల్లలు పడుతున్న వేదన, వారి జీవితాలను అధ్యయనం చేసి, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, ఉత్తర ప్రదేశ్ వంటి ప్రాంతాల్లో కూడా పరిశీలించి రాసినట్లు చెప్పారు. కార్యక్రమంలో గంటేడ గౌరునాయుడు, పారినాయుడు, రఘునాథ శర్మ, టి.శివకేశవరావు, రవీంద్రనాథ్, గోపాలరావు, రంజిత్, పరశురాం, జి.చిన్నంనాయుడు, బి.శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

అభివృద్ధి దిశగా తోటపల్లి దేవస్థానం

గరుగుబిల్లి, న్యూస్‌టుడే:

ఉత్తరాంధ్ర చినతిరుపతిగా పేరుగాంచిన తోటపల్లి వేంకటేశ్వర కోదండ రామాలయం దేవస్థానం 1972లో నిర్మించారు. ఇక్కడ వేంకటేశ్వరస్వామి స్వయంభూగా వెలిశారు. వేలాదిమంది భక్తులు వచ్చి స్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకునేవారు. కాలం గడిచేకొద్దీ ఆలయ నిర్మాణాలన్నీ పూర్తిగా శిథిలమయ్యాయి. స్థానిక జట్టు సంస్థ ఛైర్మన్ డి.పారినాయుడు, తోటపల్లి సర్పంచి, పెద్దలు పరిసర గ్రామాల నుంచి 600 మంది అభివృద్ధి కమిటీగా ఏర్పడి ఆలయ పునర్నిర్మాణం చేయడానికి పూనుకున్నారు.

వేంకటేశ్వరస్వామి దేవాలయం

రూ.3కోట్ల అంచనాతో..

జీర్ణావస్థకు చేరిన ఆలయం స్థానంలో కొత్తగా ప్రధాన దేవాలయాలతో పాటు ఉప దేవాలయాలయాలు లక్ష్మీదేవి, వినాయకుడు, ఆంజనేయస్వామి ఆలయాలతో పాటు స్వాగత ద్వారానికి రంగులు రూ.3కోట్లతో చేశారు. వీటికి రూ.83.60 లక్షలు నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. ప్రాకార స్లాబ్ నిర్మాణం పూర్తయింది. మిగిలిన పనులు పూర్తి చేయడానికి ప్రభుత్వం రూ.80లక్షలు మంజూరు చేసిందని దేవస్థానం ఈవో శ్రీనివాసరావు తెలిపారు. షాపింగ్ కాంప్లెక్సు 11 గదుల నిర్మాణం పూర్తి చేసి వ్యాపారులకు అద్దె లేకుండా ఉచితంగా ఇస్తామని దేవస్థానం అభివృద్ధి సేవా ట్రస్టు ప్రధాన కార్యదర్శి డి.పారినాయుడు అన్నారు. ప్రస్తుతం రూ.62 లక్షలతో రాజగోపురం నిర్మాణం, ప్రభుత్వం మంజూరు చేసిన మరో రూ.4 లక్షలతో గోశాల పనులు జరుగుతున్నాయి. ఆలయం అన్ని ప్రాంతాలను కలుపుతూ సీసీ రహదారి వేసేందుకు రూ.1.50కోట్లు మంజూరయ్యాయి. ఆలయం చుట్టూ ప్రహరీ నిర్మాణంతో సహ మిగిలిన పనులు పూర్తి కావడానికి రూ.3కోట్లు అవసరమని అభివృద్ధి కమిటీ తెలిపింది. అందువల్ల భక్తులు కూడా కొంత మేర విరాళాలు అందజేయాలని కోరుతున్నారు.

నది మెట్ల పనులు..

తోటపల్లి దేవస్థానానికి వచ్చిన భక్తులు నాగావళి నదిలో పుణ్యస్నానాలు ఆచరించడం పూర్వం నుంచి ఆనవాయితీగా మారింది. నదిలో దిగి స్నానం చేసుకునేందుకు మెట్లు లేకపోవడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. మెట్ల నిర్మాణాలు చేయాలని కోరుతున్నారు.

వేలం ప్రకటన

మహారాజశ్రీ బొబ్బిలి సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
E.P. 22/2024 : O.S. 24/2023

పూడి సింహాచలం ...డిక్రీ హోల్డర్
మిరియాల సత్యనారాయణ @ సత్యం నాయుడు ..జడ్జిమెంట్ డెటార్

పై నెంబరు అమలులో అమలు మొత్తము J.Dr వద్దనుండి ఈ క్రింది షెడ్యూల్ ఆస్తిని వేలం వేయిపించి రాబట్టే నిమిత్తమూ ఇందు మూలముగా ఇందలి D.HR దాఖలు చేసినందున సదరు అమలులో షెడ్యూల్ యిస్తియారు తే. 12.03.2026ది ఉదయం గం. 10.30 ని.లకు శ్రీ కోర్టు వారి వద్ద బహిరంగ వేలం జరుపబడును. కావున ఆసక్తి ఉన్నవారు సదరు వేలము యిస్తియారు ప్రకారము లోబడి పాడుకొనగలరు.

షెడ్యూల్

[illegible]

// శ్రీ కోర్టువారి ఆదేశానుసారము //

తిరుపతి పాణిగ్రాహి
డిక్రీ హోల్డర్ తరఫు న్యాయవాది
అల్లిరామా వీధి, బొబ్బిలి, సెల్: 9440180660

పూల మార్కెట్‌కు పెళ్లి కళ

కడియం, న్యూస్‌టుడే: మూఢం ముగిసింది. శుభ ఘడియలతో పెళ్లిబాజాలు మోగుతున్నాయి. కల్యాణ మండపాలు కళకళలాడుతున్నాయి. వీటితో పాటు కడియపు లంక అంతర్రాష్ట్ర పూలమార్కెట్‌కూ కొత్త కళ వచ్చింది. రెండు నెలలుగా సాధారణంగా ఉన్న మార్కెట్ ఒక్కసారిగా ఊపందుకుంది. పూల ధరలు పెరిగాయి. రానున్న నెలల్లో వివాహాలు, శుభకార్యక్రమాలు అధిక సంఖ్యలో ఉండటంతో కొనుగోలుదారుల తాకిడి అధికంగా ఉంటుందని మార్కెట్ విశ్లేషకులు భావిస్తున్నారు.

రోజూ రూ.40లక్షల మార్కెట్..

ఇక్కడి నుంచి అనంతపురం, విజయవాడ, విశాఖపట్నం, అనకాపల్లి, అమలాపురం ప్రాంతాలకు ఎక్కువగా వెళ్తాయి. అలాగే ప్రసిద్ధి పుణ్యక్షేత్రాలయిన సింహాచలం, అన్నవరం, ద్రాక్షారామ, వాడపల్లి, ద్వారకా తిరుమల, విజయవాడలోని ఆలయాలకు నిత్యం లోడు వెళ్తోంది. ప్రత్యేకమైన ఆర్డర్లతో కడియపులంక మార్కెట్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న ఆర్డర్లతో ఒకరోజుకు రూ.30లక్షల నుంచి రూ.40లక్షలు కొనుగోళ్లు జరుగుతున్నాయని వ్యాపారులు చెబుతున్నారు.

కొనుగోలు దారులతో సందడిగా కడియపులంక పూలమార్కెట్

ధరలిలా..

చామంతి కిలో రూ.80, లిల్లీలు రూ.350 నుంచి రూ.400, స్టార్ గులాబీలు రూ.100, బంతి రూ.35 నుంచి రూ.40, కనకాంబరం బారు ఒకటి రూ.120 నుంచి రూ.150, మల్లెలు కిలో రూ.600, కాగడాలు రూ.350, గులాబీ కట్ట రూ.250 పలుకుతున్నాయి.

శ్రీరామనవమి తర్వాత..

ఇక్కడి సంప్రదాయం ప్రకారం శ్రీరామనవమి తర్వాత మరిన్ని వివాహాలు జరుగుతాయి. వచ్చే ఏడాది గోదావరి పుష్కరాల నేపథ్యంలో గోదావరి తీరంలో పుష్కరాలకు మూడు నెలలు ముందు, ముగిసిన తర్వాత మరో మూడు నెలలు వివాహాలు చేయరు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది అధిక సంఖ్యలో కల్యాణాలు జరుగుతాయని పండితులు చెబుతున్నారు. మూడు నెలల వరకు ముహూర్తాల సమయాల్లో పెళ్లి మండపాలన్నీ బుక్ చేసుకున్నారు.

పంచాయతీ ఎన్నికలకు కసరత్తు

● మార్చి 9న తుది ఓటర్ల జాబితా విడుదలకు సన్నాహాలు

రంపచోడవరం, న్యూస్‌టుడే: త్వరలో పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగానే ప్రస్తుతం పంచాయతీలకు సంబంధించి వార్డు డివిజన్ల కార్యక్రమాన్ని చురుకుగా చేపడుతున్నారు. మార్చి 9న తుది ఓటర్ల జాబితాను ప్రచురించేందుకు రెవెన్యూ, పంచాయతీ అధికారులు సన్నద్ధమయ్యారు. దీంతో గ్రామాల్లో ఎప్పుడు ఎన్నికలు నిర్వహిస్తారని వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు ఆశక్తిగా ఎదురు చూస్తున్నారు.

జిల్లాలో 186 పంచాయతీలు..

పోలవరం జిల్లాలో రెండు రెవెన్యూ డివిజన్లు ఉన్నాయి. వీటిలో రంపచోడవరం రెవెన్యూ డివిజన్ ఏడు మండలాల్లో 120 పంచాయతీలకు, చింతూరు డివిజన్‌లో 66 పంచాయతీలకు ఎన్నికలు జరగనున్నాయి. వీటన్నింటిలోనూ రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రస్తుతం వార్డు డివిజన్ ప్రక్రియను చేపడుతున్నారు. ఏప్రిల్‌లో ఎన్నికలను నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

ముగియనున్న సర్పంచుల పదవీ కాలం

ఇప్పటివరకు పనిచేస్తున్న పంచాయతీ సర్పంచుల పదవీకాలం ఏప్రిల్ నెలతో ముగుస్తుంది. పంచాయతీలకు సంబంధించి మార్చి 9న తుది ఓటర్ల జాబితాను ప్రచురించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. పది, ఇంటర్ పరీక్షలు పూర్తయిన వెంటనే ఎన్నికలను నిర్వహించేందుకు సన్నద్ధం కావాలని ఇప్పటికే తమకు ఎన్నికల సంఘం ఆదేశించింది.

– కోటేశ్వరరావు, జిల్లా పంచాయతీ అధికారి, పోలవరం జిల్లా, రంపచోడవరం

విద్యార్థీ.. విజయీభవ

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం

రాజవొమ్మంగి, రంపచోడవరం, న్యూస్‌టుడే: ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి.

జిల్లాలో పరీక్ష స్వరూపం ఇలా..

మొత్తం కళాశాలలు	32
సమయం	ఉదయం 9 నుంచి 12
మొత్తం పరీక్ష కేంద్రాలు	10
ప్రథమ సంవత్సరం విద్యార్థులు	2,619
ద్వితీయ సంవత్సరం విద్యార్థులు	2,336
ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు	02
సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు	01
చీఫ్‌సూపరింటెండెంట్‌లు	10
డిపార్ట్‌మెంటల్ అధికారులు	10
ఇన్విజిలేటర్లు	150

రెండో సంవత్సరం విద్యార్థులకు 24 నుంచి పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో మాల్ ప్రాక్టీస్‌కు తావులేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఇంటర్ విద్యా మండలి డీఐఈవో ఎస్.భీమశంకరరావు తెలిపారు. విద్యార్థులు అరగంట ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలి. కేంద్రాలన్నింటిలో సీసీ కెమెరాలు ఏర్పాటుచేశామని, ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొనసాగుతుందన్నారు. జిల్లాలో పరీక్షల నిర్వహణపై ఆదివారం ఆయన న్యూస్‌టుడేతో మాట్లాడారు.


రాజవొమ్మంగిలో నంబర్లు పరిశీలిస్తున్న ప్రిన్సిపల్ షీలా, సిబ్బంది

32 పేజీల బుక్‌లెట్..

● ఈ ఏడాది ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఒక్క మార్కుల ప్రశ్నలను ప్రవేశపెట్టారు. జవాబులు రాసేందుకు వీలుగా 32 పేజీల బుక్‌లెట్‌ను ఇస్తాం. ● రెండో సంవత్సరం విద్యార్థులకు మాత్రం పాత విధానంలోనే పరీక్షలు కొనసాగుతాయి. వారికి 24 పేజీల బుక్‌లెట్ ఇస్తారు.

సీసీ కెమెరాల పర్యవేక్షణలో..

ఎలాంటి మాల్ ప్రాక్టీస్‌కు తావు లేకుండా అన్ని కేంద్రాల్లో నిఘా కెమెరాలు ఏర్పాటు చేశాం. వాటిని ఇంటర్ బోర్డు సెక్రటరీ, డీఐఈవో కార్యాలయాలకు అనుసంధానిస్తాం. అక్కడి నుంచి నేరుగా పర్యవేక్షిస్తారు. ● జ్ఞాన భూమి యాప్ ద్వారా పరీక్ష కేంద్రాల రూట్ మ్యాప్ సులువుగా తెలుసుకోవచ్చు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది. విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా అన్ని కేంద్రాల్లో అవసరమైన సౌకర్యాలు సిద్ధం చేశాం.

కంట్రోల్ రూం ఏర్పాటు

పాడేరు (ఉమ్మడి అల్లూరి జిల్లా)లోని డీఐఈవో కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూంను ఏర్పాటుచేశాం. పోలవరం జిల్లాలో హాల్ టికెట్లు, పరీక్ష కేంద్రాల సమాచారంతో పాటు ఇతర ఎలాంటి సమాచారం, సందేహాలున్నా 9493259259 నంబరును సంప్రదించొచ్చు. పరీక్షల పర్యవేక్షణకు జిల్లాలో మొదటిసారిగా డీఈసీ (జిల్లా ఇంటర్మీడియట్ పరీక్షల కమిటీ) ఏర్పాటు చేశారు. పోలవరం జిల్లాలో డీఈసీ సభ్యులు శ్రీనివాసరావు, కృష్ణ పర్యవేక్షిస్తారు.

నేడు 'డయల్ యువర్ సీఎండీ'

విశాఖపట్నం, న్యూస్‌టుడే: విద్యుత్తు సంబంధిత సమస్యలను మరింత వేగవంతంగా పరిష్కరించే లక్ష్యంతో విశాఖలోని ఈపీడీసీఎల్ కార్యాలయంలో సోమవారం 'డయల్ యువర్ సీఎండీ' కార్యక్రమం నిర్వహించనున్నట్లు సంస్థ సీఎండీ ఇమ్మడి పృథ్వీతేజ్ ఒక ప్రకటనలో తెలిపారు. సంస్థ పరిధిలోని 13 జిల్లాలకు చెందిన వినియోగదారులు 8688400499 ఫోన్ నెంబర్ ద్వారా తమ సమస్యలను తెలియజేయవచ్చునని పేర్కొన్నారు. ఉదయం 10.30 నుంచి 11.30 వరకు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. విద్యుత్తు సరఫరాలో తరచూ అంతరాయాలు, హెచ్చుతగ్గులు, కొత్త సర్వీసుల జారీ, సరఫరా పునరుద్ధరణలో జాప్యం, ట్రాన్స్‌ఫార్మర్ల మార్పిడి తదితర సమస్యలపై ఫిర్యాదులను నేరుగా తన దృష్టికి తీసుకురావొచ్చని చెప్పారు.

పుష్కర ప్రణాళికలో ఆర్టీసీ భాగస్వామ్యం

కొవ్వూరు పట్టణం: పుష్కరాల నిర్వహణ ప్రణాళికలో యాత్రికులు, భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ ప్రత్యేక దృష్టి చూపుతోందని తూర్పుగోదావరి జిల్లా ప్రజారవాణా అధికారి వైఎస్ఎన్ మూర్తి తెలిపారు. కొవ్వూరు డిపో నుంచి హైదరాబాద్‌కు వెళ్లే నూతన సర్వీసు ప్రారంభ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పుష్కరాల సేవల్లో రాజమహేంద్రవరం, కొవ్వూరు తదితర ప్రాంతాల్లో ఎక్కడికక్కడ తాత్కాలిక బస్టాండ్లు ఏర్పాటు చేస్తామన్నారు. రాకపోకల విధానం, మౌలిక సదుపాయాల కల్పనపై క్షేత్రస్థాయి పర్యటనలు చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో 750 ఈ-బస్సులు, ఆర్టీసీ ఎండీ ద్వారకాతిరుమలరావు సీఎన్‌జీ బస్సులను ప్రయాణికుల అందుబాటులోకి తెచ్చే వీలుందన్నారు. కొవ్వూరు, నిడదవోలు, రాజమహేంద్రవరం, గోకవరం బస్టాండ్‌లలో తాగునీటి సౌకర్యం ఉందని, అనపర్తిలో పాత బస్టాండ్ స్థలంలో దాతలు, ప్రజాప్రతినిధుల సహకారంతో సదుపాయాలను కల్పిస్తున్నామన్నారు. రాష్ట్రంలో కార్గో సేవల పనితీరులో జిల్లా 2వ స్థానంలో, సేవల అంశంలో 14వ స్థానంలో ఉందన్నారు.

ఏజెన్సీలో మరిన్ని వైద్య శిబిరాలు నిర్వహించాలి

● ఇన్‌ఛార్జ్ జేసీ శుభం నొక్వాల్

ఎటపాక, న్యూస్‌టుడే: ఏజెన్సీలో మరిన్ని ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఇన్‌ఛార్జ్ జేసీ శుభం నొక్వాల్, రంపచోడవరం ఓఎస్‌డీ పంకజ్‌కుమార్‌మీనా అన్నారు. నెల్లిపాక పీహెచ్‌సీ ఆవరణలో తపస్వ విద్యా సంస్థల అధినేత ముప్పాళ్ల శ్రీధర్ సహకారంతో శ్రీ తపస్వి ఎడ్యుకేషనల్ సేవా సమితి నటరాజా శంకర్‌రావు ఆధ్వర్యంలో హైదరాబాద్ మలక్‌పేట బ్రాంచి కేర్ హాస్పిటల్ వైద్యులు ఉచిత మెగా వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక సర్పంచి కొర్సా భద్రమ్మ ప్రారంభించారు. శిబిరంలో సుమారు 750 మందికి గుండె, నరాలు, ఎముకలు, క్యాన్సర్, స్త్రీల గర్భాశయ వ్యాధులకు సంబంధించిన వైద్యులు పాల్గొని ఈసీజీ, 2డీఈకో, వివిధ పరీక్షలు చేశారు. జిల్లా ఉప వైద్యాధికారి పుల్లయ్య, కేర్ హాస్పిటల్ వైద్యులు భవానీప్రసాద్, నవీన్, మోహన్, స్థానిక వైద్యులు దుర్గాప్రసాద్, కేశారు వెంకటేశ్వరరావు, నటరాజు శ్రీకాంత్ చౌదరి, పుల్లి రమేష్‌బాబు, వల్లభనేని చంద్ర, గడేసుల రంజిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నెల్లిపాకలో వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచి భద్రమ్మ, ఇన్‌ఛార్జ్ జేసీ శుభం నొక్వాల్, ఓఎస్‌డీ పంకజ్‌కుమార్‌మీనా

నేటి నుంచి యూసీసీ క్రికెట్ టోర్నీ

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే: యునైటెడ్ క్రికెట్ క్లబ్ (యూసీసీ) 12వ మెగా టోర్నీ సోమవారం నుంచి ప్రారంభం కానుంది. రైల్వే స్టేడియం, ఏసీఏ-వీడీసీఏ అంతర్జాతీయ స్టేడియంలో ఈ నెల 27 వరకు పోటీలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. రైల్వే స్టేడియంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆయా జట్ల కెప్టెన్లు పాల్గొని జెర్సీలు ఆవిష్కరించారు. తొలి మ్యాచ్ రైల్వే క్రికెట్ జట్టు, వైజాగ్ బ్లూస్ జట్ల మధ్య జరుగుతుందని యూసీసీ కార్యదర్శి వెంకటేష్ చెప్పారు.

రేవులో పెద్దఎత్తున ట్యూనా చేపలు

మత్స్య సందడే

కాకినాడ సముద్ర తీరంలో ఆదివారం చేపల వేటకు వెళ్లిన మత్స్యకారులకు పలు రకాల మత్స్యసంపద చిక్కింది. వీటిలో 150 కిలోల కొమ్ముకోణం చేపలు రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు పలికాయి. ట్యూనా చేపలు సుమారు 10 - 30 కిలోల వరకు బరువు తూగాయి. కొనుగోలుకు మత్స్యప్రియులు కుంభాభిషేకం రేవుకు తరలి వచ్చారు. -న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్ (కాకినాడ)

150 కేజీల బరువున్న కొమ్ముకోణం చేప

పిల్లల పండగ.. మది నిండుగా..

పెద్దాపురంలో ఆదివారం నిర్వహించిన పిల్లల పండగ ఉత్సాహంగా సాగింది. వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు హాజరై సందడి చేశారు. శాస్త్రీయ, జానపద నృత్యాలు, నాటికలు అలరించాయి. సామాజిక అంశాలపై ఆలోచింపజేసేలా ప్రదర్శనలు చేశారు. బాలికలను రక్షిద్దాం.. సమాజాన్ని కాపాడదాం అంటూ విద్యార్థిని వేషధారణ ఆకట్టుకుంది. – న్యూస్‌టుడే, పెద్దాపురం

కండలు పెంచి.. పతకాలు తెచ్చి

దేహదారుఢ్య పోటీల్లో సత్తా

న్యూస్‌టుడే, మసీదు సెంటర్(కాకినాడ)

దేహదారుఢ్య పోటీల్లో కాకినాడ పీఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరుస్తూ పతకాలు సాధిస్తున్నారు. పేదరికం ప్రతిభకు అడ్డుకాదని నిరూపిస్తున్నారు. కసరత్తులు చేస్తూ తమ దేహాన్ని మలుచుకుంటూ కండల వీరులుగా మారారు. ఆయా పోటీల్లో పాల్గొని పతకాలు సాధిస్తున్నారు. ఇటీవల నన్నయ్య విశ్వవిద్యాలయంలో జరిగిన పోటీల్లో కాకినాడ పీఆర్ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థులు బెస్ట్ ఫిజిక్ మెన్ టీమ్ ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నారు. పలువురు వర్సిటీ జట్టుకు ఎంపికయ్యారు. భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధిస్తామని వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

రోజూ 8 గంటల సాధన

డిగ్రీ మొదటి ఏడాది చదువుతున్నా. దేహదారుఢ్యంపై చిన్నతనం నుంచి మక్కువ. గత ఐదేళ్ల నుంచి బాడీ బిల్డింగ్ చేస్తున్నా. గతేడాది నన్నయ్య విశ్వవిద్యాలయంలో అంతర్ కళాశాలల పోటీల్లో రజత పతకం సాధించా. పలు పోటీల్లోనూ సత్తా చాటాను. జిమ్‌లో ప్రతి రోజు ఉదయం సాయంత్రం కలిపి 8 గంటలు సాధన చేస్తా. చికెన్, చేప, చపాతీ, కాయగూరలు, గుడ్లు వంటి పోషకాహారం తీసుకుంటా. మాది వ్యవసాయ కుటుంబం. ఖాళీ సమయంలో ఎలక్ట్రికల్ పని చేస్తా. వచ్చిన డబ్బులను పోషకాహారానికి వినియోగించుకుంటాను. ఆలిండియా యూనివర్సిటీ స్థాయి పతకం సాధించడంతో పాటు, రైల్వేలో ఉద్యోగం సాధించాలనేది నా లక్ష్యం. - సాయిప్రశాంత్, కాండ్రకోట

నాన్న ప్రోత్సాహంతో..

బీఏ మొదటి ఏడాది చదువుతున్నా. మాది రాజమహేంద్రవరం. నాన్న రాజగోపాల్ తాపీ మేస్త్రి. ఆయన ప్రోత్సాహంతో గత 8 ఏళ్ల నుంచి బాడీ బిల్డింగ్‌లో శిక్షణ తీసుకుంటున్నా. ప్రతిరోజూ మూడుగంటల పాటు జిమ్‌లో కసరత్తులు చేస్తా. చికెన్, గుడ్లు, ఓట్స్, ప్రొటీన్ షేక్ వంటి పోషకాహారం తీసుకుంటా. గతేడాది అంతర్ కళాశాల దేహదారుఢ్య పోటీల్లో పాల్గొని బంగారు పతకం సాధించా. కేరళలో జరిగిన పోటీల్లో పాల్గొన్నా. వచ్చే నెలలో విశాఖలో జరిగే ఆల్ఇండియా పోటీలకు ఎంపికయ్యా. క్రీడాకోటాలో ఉద్యోగం సాధించడంతో పాటు నాన్న కోరిక మేరకు జాతీయస్థాయి పతకం సాధించడానికి కృషి చేస్తున్నా. - వెంకటసూర్య ప్రకాష్, రాజమహేంద్రవరం

నాలుగేళ్ల నుంచి శిక్షణ

మాది కాకినాడ. మధ్యతరగతి కుటుంబం. గత నాలుగేళ్ల నుంచి బాడీ బిల్డింగ్ చేస్తున్నా. ప్రతిరోజూ ఆరు గంటల పాటు జిమ్‌లో కసరత్తులు చేస్తా. చికెన్, గుడ్లు, ఓట్స్, ప్రొటీన్, పాలు ఆహారం తీసుకుంటా. ఖాళీ సమయంలో ఓ డెలివరీ సంస్థలో పనిచేస్తా. అమ్మ కూడా సహకారం అందిస్తుంది. గతంలో నన్నయ్య విశ్వవిద్యాలయం పరిధిలో జరిగిన అంతర్ కళాశాలల పోటీల్లో రెండు బంగారు పతకాలు సాధించా. రెండుసార్లు ఆల్ఇండియా పోటీల్లో పాల్గొన్నా. దాతలు సహకారం అందిస్తే మరింత ప్రతిభ కనబరిచి పతకాలు సాధించి దేశానికి పేరుప్రఖ్యాతలు తీసుకొస్తా. ఆర్మీలో చేరాలనేది నా ధ్యేయం. - విజయ్ చాముండేశ్వర్, కాకినాడ

అర్ధరాత్రి మట్టి తవ్వకాలు

మన్యంలో అర్ధరాత్రి ఎర్ర మట్టి తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. దేవీపట్నం మండలం కచ్చులూరు పునరావాస కాలనీ- పెద్దరమణయ్యపేట గ్రామాల మధ్య శనివారం అర్ధరాత్రి జేసీబీతో ఎర్రమట్టిని మైదాన ప్రాంతాలకు తరలించారు. అధికారులకు సమాచారం వెళ్లడంతో ఆదివారం తెల్లవారేసరికి మట్టి తవ్వకాలను నిలిపివేశారు. ఇదిలా ఉంటే ఇప్పటికే పలుచోట్ల ఎర్రమట్టి తవ్వకాలకు దళారులు ఏర్పాట్లు చేశారు. పగలు సమయంలో అధికారుల తనిఖీలు ఉండటంతో అర్ధరాత్రి సమయాల్లో ఇలా గుట్టుచప్పుడు కాకుండా వేల రూపాయల మట్టిని మైదాన ప్రాంతాలకు తరలించేస్తున్నారు. మన్యంలో అక్రమ మట్టి తవ్వకాలపై మైనింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, దేవీపట్నం

మోదుగ పూసింది.. వేసవి వచ్చేస్తుంది

ఏజెన్సీలో వేసవి రాకను ముందుగా తెలిపేది మోదుగ పువ్వే. మోదుగ పువ్వులు వచ్చాయంటేనే వేసవి వస్తుందని సంకేతం. కూనవరం, వీఆర్‌పురం, చింతూరు, ఎటపాక మండలాల్లోని ఏ గ్రామానికి వెళ్లినా రహదారుల పక్కన ఎరుపు రంగులో అందమైన పూలతో మోదుగ చెట్లు పర్యాటకులను ఆకర్షిస్తుంటాయి. వీటిని స్థానిక ఆదివాసీ మహిళలు జడల్లోనూ అలంకరించుకుంటారు. హోలీ రంగుల్లోనూ ఈ పువ్వులను వినియోగిస్తారు. – న్యూస్‌టుడే, కూనవరం

గండిపోశమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు

దేవీపట్నం, న్యూస్‌టుడే: వేసవి ప్రారంభం కావడంతో గోదావరి ఒడ్డున గండిపోశమ్మ అమ్మవారి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. మైదాన ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో వచ్చిన భక్తులు కొండపై నుంచే అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం వరకూ దాదాపు రెండు వేల మందికి పైగా భక్తులు దర్శించుకున్నారు. ఆలయం వద్ద గోదావరి తగ్గుముఖం పట్టింది. గండిపోశమ్మ అమ్మవారి ఆలయం నుంచి మూడు బోట్లలో 206 మంది పర్యాటకులు పాపికొండల విహారయాత్రకు వెళ్లారని కంట్రోల్ రూం అధికారులు తెలిపారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97607
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80082 34669

ఉలికిపాటు..!

రాజమహేంద్రవరంలో కిడ్నీవ్యాధి కలకలం

ఈనాడు, రాజమహేంద్రవరం, న్యూస్‌టుడే, కంబాలచెరువు : ప్రశాంత రాజమహేంద్రవరం నగరాన్ని ఒక్కసారి కిడ్నీ వ్యాధి వణికించింది. చౌడేశ్వరనగర్, స్వరూప్‌నగర్, ఆర్టీఏ కార్యాలయ వెనుక ప్రాంతానికి చెందిన 14 మంది ఈనెల 15వ తేదీ తరువాతి రోజు నుంచి ఒకే తరహా కిడ్నీ సమస్యలతో ఆసుపత్రులపాలయ్యారు. వీరిలో ఇద్దరు చికిత్స పొందుతూ మృతి చెందగా మరో 12 మంది వివిధ ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. బాధితకుటుంబాలన్నీ కోరుకొండ మండలం నర్సాపురానికి చెందిన గణేష్ అనే పాల వ్యాపారి నుంచి రోజూ పాలు కొనుగోలు చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. పాలల్లో కలుషితం జరిగి ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

చౌడేశ్వరనగర్‌లో ఆదివారం రాత్రి వివరాలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది

50 మంది నుంచి సేకరణ.. 126 ఇళ్లకు సరఫరా

కోరుకొండ మండలం నర్సాపురానికి చెందిన పాల వ్యాపారి గణేష్ ఆ పరిసర ప్రాంతాల్లోని దాదాపు 50 మంది నుంచి పాలు సేకరిస్తున్నట్లు అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. సేకరించిన పాలను దాదాపు 126 ఇళ్లకు రోజూ ఇస్తున్నట్లు తెలుసుకున్నారు. ఈ మేరకు అందరి ఇళ్ల వివరాలు సేకరించగా ఆదివారం రాత్రి 9.30 వరకు 36 చిరునామాలు తెలుసుకున్నారు. పూర్తి వివరాలు తెలుసుకున్న తరువాత సర్వే పూర్తి చేయాలని కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశించారు. ● పాల వ్యాపారి గణేష్ ఇంటి పరిసరాలతోపాటు, సమీపంలో అతను పాలు సేకరిస్తున్న పాడి రైతులు తమ పశువులను పెంచే విధానం, దాణా ఏమిస్తున్నారనే అంశాలంపై విచారణ ప్రారంభించారు.

చౌడేశ్వరినగర్, స్వరూప్ నగర్ పరిసర ప్రాంతాల్లో వైద్య ఆరోగ్య శాఖ, నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య బృందాలు ఇంటింటా సర్వే చేపట్టారు.

ఇంటింటా సర్వే..

ఇంటింటికీ వెళ్లి నీటి నాణ్యతా తనిఖీలు చేపట్టారు. ఒకే ప్రాంతంలో అనూరియా (మూత్ర విసర్జన కాకపోవడం) సమస్యతో పలువురు ఆసుపత్రుల్లో చేరడంపై సమగ్ర విచారణ చేస్తున్నామని, బాధితులందరికీ మెరుగైన వైద్యం అందేలా చర్యలు చేపట్టామని తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు.

అయిదు నెలల పాపకు డయాలసిస్

అన్నపూర్ణమ్మపేట రైల్వేగేటు వద్ద కొత్తపేటలో ఉంటాం. మా సోదరి కుమార్తె ఎం.రుహన్యకు అయిదు నెలలు. రెండు నెలల నుంచి గణేష్ వద్ద పాలు పోయించుకుంటున్నాం. యూరిన్ ఆగిపోవడంతో ఈనెల 16న నగరంలోని దానవాయిపేటలో చిన్నపిల్లల ఆసుపత్రిలో చేర్చాం. అక్కడ కిడ్నీ ఇన్‌ఫెక్షన్ వచ్చిందని, డయాలసిస్ అవసరమని చెప్పడంతో మరో ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లాం. అక్కడ చికిత్స అందిస్తున్నారు. క్షణక్షణం భయంగా ఉంది.
- ఓంకార్‌సాయి, చిన్నారి మేనమామ

గొమ్ముగూడెంలో నల్లి కాటుతో ఎండిపోతున్న మిర్చి తోట

నల్లి కాటు.. దిగుబడులపై పోటు

● మిరప పంటకు తెగుళ్ల బెడద
● ఆందోళనలో రైతులు

కూనవరం, న్యూస్‌టుడే: కూనవరం, వీఆర్‌పురం, ఎటపాక, చింతూరు మండలాల్లో మిరప సాగు ప్రధాన వాణిజ్య పంట. నాలుగు మండలాల్లోనూ దీనిపై ఆధారపడి వేలాది కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. కూనవరంలో 2,500 ఎకరాలు, ఎటపాకలో 5,250, వీఆర్‌పురంలో 1,300, చింతూరులో 150 ఎకరాల్లో మిర్చి సాగు జరుగుతోంది. ఈ ఏడాది ఇతర ప్రాంతాల్లో మిర్చి సాగు దెబ్బతినడంతో మిరపకాయలకు మంచి డిమాండ్ పెరిగింది. సీజన్ ఆరంభం నుంచి మిర్చి ధరలు ఆశాజనకంగానే ఉండడంతో రైతులు మరింత పట్టుదలగా సాగు చేశారు. రైతులకు కాయలు చేతికందే సమయానికి క్వింటాళ్ల ధర రూ.20వేలు నుంచి రూ.25వేల వరకు ఉండడంతో కోతలను ఉత్సాహంగా ప్రారంభించారు. రెండు, మూడు కోతల వరకు తెగుళ్ల జాడ కన్పించలేదు. ప్రస్తుతం గత ఇరవై రోజులుగా విలీన మండలాల్లోని మిరప పంటలకు తెగుళ్ల ఆశించడం మొదలైంది. ఏటా రైతులను ఇబ్బందిపెట్టే నల్లి కాటు ఈ ఏడాది వదల్లేదు. నల్లి కాటుతో తోటలు ఎండిపోవడం మొదలయ్యాయి. కళ్లెదుటే తోటలు ఎండిపోవడంతో కర్షకులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికే ఎకరాకు రూ.లక్ష దాటి పెట్టుబడులు పెట్టిన వారికి తెగుళ్ల రూపంలో పంటలు కోల్పోవడం కన్నీళ్లు మిగుల్చుతున్నాయి. ముదురు తోటల వారికి మాత్రం దీని ప్రభావం అంతగా లేదు. చివరి కోతలకు మాత్రమే తెగుళ్లు ఆశించాయి.

(c) eenadu

కడలి నేస్తమా.. కళేబరమైతివేమ్మా..!

కాకినాడ తీరంలో మృతి చెందిన ఆలివ్ రిడ్లీ తాబేళ్లు కనిపిస్తున్నాయని, ఇది పర్యావరణం, జీవవైవిధ్యానికి పెను ముప్పుగా భావించాలని, వెంటనే తాబేళ్ల సంరక్షణ చర్యలు చేపట్టాలని సామాజిక కార్యకర్తలు రంజాల సతీష్, మంగ, వరలక్ష్మి, రమ్య ఆదివారం వ్యక్తం చేశారు. ఆదివారం కాకినాడ తీరంలో అరుదైన ఆలివ్ రిడ్లీ తాబేళ్ల మృత కళేబరాల వద్ద ప్లకార్డులతో నిరసన తెలిపారు. సంరక్షణ చర్యలు చేపట్టాలని తీరంలో ర్యాలీ నిర్వహించారు. తీరంలో పరిశ్రమల నుంచి భారీగా కలుషిత జలాలు కడలిలో కలవడం, వేట సమయంలో సముద్రంలో వదిలివేయడం వంటి వాటి వల్ల మత్స్యసంపదతోపాటు తాబేళ్లకు ముప్పు వాటిల్లుతోందన్నారు. - న్యూస్‌టుడే, రమణయ్యపేట(కాకినాడ గ్రామీణం)

పిల్లల పండగ.. ఆనందం నిండుగా

హాజరైన బాలబాలికలు, తల్లిదండ్రులు

పరమానంద శిష్యులు నాటకం ప్రదర్శన

పెద్దాపురం పట్టణం లూథరన్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఆదివారం నియోజకవర్గస్థాయిలో నిర్వహించిన పిల్లల పండగ ఆకట్టుకుంది. పెద్దాపురం నియోజకవర్గంలోని 18 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. వారు ప్రదర్శించిన ఏకపాత్రాభినయం, నాటికలు, నాటకాలు, జానపద, శాస్త్రీయ నృత్యాలు, కోలాటం, నృత్యరూపకాలు అలరించాయి. నిర్వాహకులు భోజన, వసతి సౌకర్యాలు కల్పించారు. డీసీసీబీ ఛైర్మన్ రామస్వామి, పీసీసీ గౌరవాధ్యక్షుడు రాజాసూరిబాబురాజు, అధ్యక్షుడు వెంకటబలపతిరావు, శ్రీకాంత్, పాఠశాల డైరెక్టర్ విజయప్రకాష్, డీఎస్‌ఈవో ప్రభాకరరావు, లూథరన్ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ నళిని, పిల్లల పండగ ప్రధాన కార్యదర్శి బుద్ధ శ్రీనివాస్, సీపీఐ సభ్యులు సీతారామారావు, అరుణ, క్రాంతికుమార్, ప్రభాకర వర్మ, రమేశ్, దర్శకుడు కేవీ ఆనంద్, పట్టణ జనసేన అధ్యక్షుడు సత్తిబాబు, పట్టణ తెదేపా అధ్యక్షుడు రంధి సత్యనారాయణ పాల్గొన్నారు. -న్యూస్‌టుడే, పెద్దాపురం

కారు చీకట్లో.. ప్రయాణం ఎటా?

రాజోలు మండలం శివకోటి నుంచి పాశర్లపూడి వరకు 22 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న బైపాస్‌పై రాత్రి సమయంలో ప్రయాణాలు ప్రమాదకరంగా సాగుతున్నాయి. విద్యుద్దీపాలు ఏర్పాటు చేయకపోవడంతో కూడళ్ల వద్ద తరచూ ఏదో ఒక ప్రమాదం చోటు చేసుకుంటున్నా సంబంధిత అధికారులు స్పందించడం లేదని వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై జాతీయ రహదారుల ఏఈ వెంకటరమణను వివరణ కోరగా త్వరలో దీపాలు ఏర్పాటు చేస్తామన్నారు. - న్యూస్‌టుడే, రాజోలు

వైభవంగా శ్రీపాదవల్లభుడికి పూజలు

అభిషేకం చేస్తున్న అర్చకుడు

పిఠాపురం, న్యూస్‌టుడే: పిఠాపురం శ్రీపాద వల్లభ మహాసంస్థానంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఫాల్గుణ శుద్ధ పంచమి సందర్భంగా భక్తులు పోటెత్తారు. స్వామివారికి అభిషేకం చేసి, ప్రత్యేక అలంకరణ చేశారు. ఈవో సౌజన్య ఏర్పాట్లు పర్యవేక్షించారు.

సిద్ధివినాయక.. వరదాయక

అయినవిల్లి: అయినవిల్లి సిద్ధివినాయకస్వామి దర్శనానికి అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆదివారం ఆలయ పరిసరాలు కిక్కిరిశాయి. ఇంటర్ పరీక్షల సందర్భంగా పెద్దసంఖ్యలో విద్యార్థులు విచ్చేసి హాల్‌టికెట్లు, కలములు స్వామివారి పాదాల చెంత ఉంచారు. పలువురు చిన్నారులకు అక్షరాభ్యాసాలు, అన్నప్రాసనలు చేశారు. వివిధ రుసుముల ద్వారా రూ.4,24,197 ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు.

వేడుకగా పెద్దింట్లమ్మ జాతర

సఖినేటిపల్లి, న్యూస్‌టుడే: మండపాలెం పెద్దింట్లమ్మ జాతర మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆదివారం విశేష పూజలు అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. వివిధ ప్రాంతాల నుంచి వేలాదిమంది తరలివచ్చారు. పక్కనే ఉన్న కొబ్బరి తోటల్లో నైవేద్యాలు తయారు చేసి అమ్మవారికి సమర్పించి కుటుంబ సమేతంగా స్వీకరించారు. దీంతో ఆ ప్రాంతం సందడిగా మారింది.

శ్రీరంగధామంలో చినజీయర్ స్వామి పూజలు

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: గౌతమఘాట్‌లోని శ్రీరంగధామంలో స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం సాయంత్రం చిన జీయర్ స్వామీజీ శ్రీరంగధామానికి విచ్చేశారు. ఆలయ మర్యాదలతో స్వామీజీకి స్వాగతం పలికారు. ఆయన పర్యవేక్షణలో మహాపూర్ణాహుతి, పూజలు నిర్వహించారు. దర్శనానికి పెద్దఎత్తున భక్తులు హాజరయ్యారు.

లక్షణాలుంటే ఆసుపత్రిలో సంప్రదించాలి: మంత్రి

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): రాజమహేంద్రవరంలో అనారియా కేసుల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని మంత్రి కందుల దుర్గేష్ సూచించారు. తాజా పరిస్థితులను అధికారులు, వైద్యవర్గాలతో ఫోన్‌లో సమీక్షించామన్నారు. మెరుగైన వైద్యసేవలందించేందుకు చర్యలు చేపట్టామన్నారు. లక్షణాలుంటే వెంటనే ప్రభుత్వ ఆసుపత్రుల్లో సంప్రదించాలన్నారు.

ఓఎన్‌జీసీ కార్యకలాపాలు వద్దంటూ నిరసన

అయినవిల్లి, న్యూస్‌టుడే: వీరవల్లిపాలెంలో ఓఎన్‌జీసీ కార్యకలాపాల వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని గ్రామస్థులు ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. ప్రధాన రహదారి చెంత కొబ్బరి తోటను తొలగించి రిగ్గు తవ్వేందుకు అధికారులు భారీ యంత్ర సామగ్రి తీసుకొచ్చారు. దీనిపై స్థానికులు ఆందోళన చెందారు. ఇప్పటి ఎటువంటి కార్యకలాపాలు చేయవద్దంటూ నినాదాలు చేశారు. పంటపొలాలు దెబ్బతింటాయని, భూగర్భ జలాలు కలుషితం అవుతాయని వాపోయారు. పి.గన్నవరం సీఐ భీమరాజు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

వీరవల్లిపాలెంలో ఓఎన్‌జీసీ సైట్ వద్ద నినాదాలు చేస్తున్న గ్రామస్థులు

అమ్మా.. నాన్నా.. పాసవ్వండి..!

పిల్లలకు ఇంటర్ పరీక్షల వేళ అప్రమత్తం

● బిడ్డకు ఆది గురువు అమ్మే. పరీక్షల్లో మీ పిల్లలు రాణించాలంటే మీదే మొదటి బాధ్యత. వారిని పరీక్షలకు సిద్ధం చేయడం, సులువుగా జీర్ణమయ్యే ఆహారం పెట్టండి(ఇది కూడా ఇంటిలోనే వండింది). పరీక్ష బాగా రాయాలనేవని చెప్పి వాటితో మనోధైర్యాన్ని నింపండి. ● పరీక్ష రోజుల ఉదయాన్నే మెలకువగా అనుకునేలా ముందు రోజే సద్ది ఇవ్వండి.

జర చేయూతి తల్లీ..

తగిన కాటన్ దుస్తులను సిద్ధం చేయండి. ● పరీక్ష రాసి ఇంటికి వచ్చాక నీరసం తొలగేలా పల్చని పానీయం అందించండి. ● మీ బాబు, పాప పరీక్షకు సన్నద్ధమవుతున్నారని విషయం మరిచి టీవీ పెట్టుకుని భారీ సౌండ్‌తో వారికి ఇబ్బందికలిగేలా వ్యవహరించొద్దు. ● ఇతరులతో పోల్చుతూ.. ఆత్మన్యూనతకు గురిచేయడం మానుకోవాలి. ● ఐటీఐఏల నిద్రలేకుండా కొట్టడం, తిట్టడం చేయకూడదు. ● పొద్దున్నే నువ్వు చదవాలి. రాత్రిపూట 11 గంటల వరకు చదువు అయినా అలసిపోయేలా చేయవద్దు. ● బంధువులకు సంబంధించిన విషయాలను వారికి వినిపించేలా మాట్లాడకపోవడం శ్రేయస్కరం. ● పిల్లల్లో అనారోగ్య లక్షణాలను గుర్తిస్తే.. వెంటనే వైద్యులకు చూపించాలి. ● ముఖ్యంగా తల్లులూ.. మీరు ఆరోగ్యంగా ఉంటేనే.. మీ పిల్లల విజయం వాయవినే విషయం మరిచిపోకండి.

ఆలస్యం వద్దు..

■ సామర్లకోట బ్రౌన్‌పేటలోని ఆర్‌సీఎం ఆశ్రమ వసతిగృహంలో ఉంటూ సమీప జడ్పీ బాలికల హై ఉన్నత పాఠశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని గతేడాది 9.30 గంటలకు పరీక్ష కేంద్రానికి వచ్చింది. ఆ ఒక్క గంట ఆలస్యం కావడంతో అధికారులు అనుమతించలేదు. అందువల్ల ఆమె పరీక్షకు ముందరోజు స్వగ్రామమైన కాకినాడ గ్రామీణ సర్పవరంలోని ఇంటికి వెళ్లి తిరిగి వస్తూ ప్రమాదంలో తండ్రి నడుపుతున్న మోటారు సైకిల్ మార్గం మధ్యలో ఆగిపోవడంతో.. ఆ తరువాత సప్లిమెంటరీ రాసి బయటపడింది. అదే ద్వితీయ సంవత్సరం అయితే ఆ అవకాశమూ ఉండేదికాదు. విద్యార్థులు, తల్లిదండ్రులు అప్రమత్తం చేసే ఘటన ఇది.

నిబంధనలను పట్టించుకోక నష్టపోతున్నారు. జిల్లాలో నేటి నుంచి ఇంటర్ పరీక్షలు ఆరంభం అవుతున్న నేపథ్యంలో అప్రమత్తం కావాల్సిందే. పిల్లల్ని సన్నద్ధం చేసే తల్లులు, పరీక్ష కేంద్రాలకు స్వయంగా వారిని తీసుకువెళ్లే తండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఐదువిద్యార్థుల పరీక్షలు రాసే విద్యార్థి వాగు కాని కేంద్రానికి వెళుతున్న మంచి అంశాలను ఓ సారి పరిశీలిద్దాం. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఏటా వివిధ కారణాలతో ఇంటర్ పబ్లిక్ పరీక్షలు రాయలేకపోతున్నారు. రాసినా కొందరు ఉత్తీర్ణులు కాలేకపోతున్నారు. ఒక నిమిషం ఆలస్యమైనా అనుమతించరనే - న్యూస్‌టుడే, పాముర్రు, సామర్లకోట

● పరీక్షలకు పిల్లల్ని కేంద్రాలకు తీసుకువెళ్లే ముందు వాహనంలో ఇంధనం సరిచూసుకోండి. రహదారి భద్రతా నిబంధనలు పాటించండి. ● నిర్దేశిత సమయానికి అర గంట ముందే కేంద్రానికి చేరుకునేలా సమయం కేటాయించుకోండి. ● పరీక్ష అయ్యాక ఎలా రాశావు..

మరిచిపోవద్దండి..

ఎన్ని మార్కులు వస్తాయనే ప్రశ్నలు సంధించి ఆయాపయిన అంశాన్ని పిల్లల్ని విసిగించకూడదు. తర్వాతి రోజు పరీక్షపై ఏకాగ్రత నిలిపేలా ప్రోత్సహించాలి. ● పరీక్షలకు సన్నద్ధమవుతున్న పిల్లలున్న ఇళ్లలో ఆర్థిక, కుటుంబ పరమైన అంశాలు వారికి వినిపించేలా చర్చలు, వాగ్వాదాలు, గొడవలకు దిగొద్దు. ● పరీక్ష వేళ శుభకార్యాలు, తీర్థయాత్రలు ప్రస్తావన అనవసరం. ● సమయపాలన ఆవశ్యకత వివరించాలి. బాగా రాయగలవనే నమ్మకం కలిగించండి. ● పరీ మితికి మించి ఎక్కువ ఆశల్లో కేంద్రాలకు పంపించవద్దు. ● పెద్దలు ఫోన్ వద్దునుంటే.. పిల్లలు దాని గురించి ఆలోచిస్తారనే విషయం మరవొద్దు.

సమస్యలు గుర్తించండి..

పరీక్షలు మీ పిల్లలకే కాదు. మీకూ అనే విషయం తల్లిదండ్రులు మరవొద్దు. పిల్లలు ఏ రకమైన మానసిక ఒత్తిడి, అనారోగ్యం బారిన పడుతున్నారో గమనించాలి. కడుపునొప్పి, తలనొప్పి, ఆందోళన లాంటివి కనిపిస్తే వారిని ఓదార్చాలి. తగిన మందులు, ధైర్యాన్ని ఇవ్వాలి. ● ఏదైనా పని గంటల తరబడి చేస్తే విసుగువస్తుంది. ఎప్పుడూ చదువేకాకుండా పిల్లలకు మధ్యలో విరామం ఇవ్వాలి. వారితో సరదా కబుర్లు చెప్పండి. ● సాయంత్రం వేళ కాసేపు వారిని బయట ఆడుకునేలా ప్లాన్ చేయండి. వారితో కలిసి మీరూ ఆడండి. పిల్లల మనసు ఫ్రెష్ అవుతుంది. ● ఉదయం కాసేపు యోగా, ధ్యానం వంటివి చేయించండి. ● అదే పనిగా సలహాలు, సూచనలు ఇవ్వకండి. వారి ఏకాగ్రత చదువు నుంచి మరలుతుంది.

అభద్రతా భావం రానీయొద్దు

పరీక్షల వేళ పిల్లలకు ఏవిధమైన అభద్రతా భావం రాకుండా తల్లిదండ్రులు జాగ్రత్త పడాలి. వారి గొడవలు పిల్లల చదువులనేరావు, వారి జీవితంపైనే ప్రభావం చూపుతాయి. పరీక్షలకు ముందురోజు రాత్రి నుంచి వారికి సమతుల ఆహారం అందివ్వాలి. ఆహారం మారితే ఆక్సిజన్ వారి మెదడుకు కావాలంటే పొట్టకు చేరుకుని ఇబ్బందులు తాయి. పరీక్షల వేళ తల్లిదండ్రులు చరవాణి, టీవీలకు దూరంగా ఉండాలి. తల్లులు వారితోపాటే ఏదో ఒక పుస్తకం చదువుకుంటే మంచిది. - పలివెల లలితాదేవి, ఎడ్యుకేషనల్ సైకాలజిస్ట్

శెట్టిబలిజ సంఘీయులు ఐక్యతతో రాజ్యాధికారం సాధించాలి

ఆత్మీయ సమ్మేళనంలో సంఘ ప్రముఖులు

మాట్లాడుతున్న మంత్రి సుభాష్, చిత్రంలో మీరాకుమార్ తదితరులు

అంబాజీపేట, న్యూస్‌టుడే: శెట్టిబలిజ సంఘీయులు పార్టీలకు అతీతంగా ఐక్యంగా ఉండి రాజ్యాధికారం సాధించుకోవాలని తెలంగాణ రాష్ట్ర సంక్షేమ సంఘం అధ్యక్షుడు గుత్తుల మీరాకుమార్, ఏపీ రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్సీ కుడిపూడి సూర్యనారాయణరావు పిలుపునిచ్చారు. అంబాజీపేట మండలం గంగలకుర్రుఅగ్రహారంలో నిర్మించిన శెట్టిబలిజ స్మారక చిహ్నాన్ని ఆదివారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా సంఘ నేత ఎం.ఎం.శెట్టి అధ్యక్షతన జరిగిన ఆత్మీయ సమ్మేళన సభలో మాట్లాడారు. రానున్న రోజుల్లో ప్రభుత్వం చేపట్టే కులగణన ద్వారా శెట్టిబలిజలు రాజ్యాధికారం చేపట్టేలా పోరాటం చేయాలని ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు కోరారు. మంత్రి సుభాష్ మాట్లాడుతూ తెలంగాణలో మాజీ సీఎం కేసీఆర్ పాలనలో శెట్టిబలిజలకు తీవ్ర అన్యాయం చేశారన్నారు. భవిష్యత్తులో బీఆర్ఎస్ పార్టీ ఏపీకి విస్తరిస్తే భూస్థాపితం చేస్తామని హెచ్చరించారు. సమాజంలో సెటిల్‌మ్మెంట్ బ్యాచ్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రెడ్డి సుబ్రహ్మణ్యం, చెల్లుబోయిన శ్రీనివాసరావు, కుడిపూడి భరత్, అమలాపురం పురపాలక ఛైర్మన్ రెడ్డి నాగేంద్రమణి, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు ప్రసంగించారు. నాయకులు విత్తనాల ఇంద్రశేఖర్, మట్టపర్తి సతీష్, రాయుడు షణ్ముఖ్, సంసాని మురళీ, దొంగ హరి, మట్టపర్తి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా హైవే విస్తరణ పనులు

కైకాలపేట వద్ద విస్తరణ పనులు

మామిడికుదురు, న్యూస్‌టుడే: పాశర్లపూడి పరిధి కైకాలపేట వై.జంక్షన్ వద్ద 216 జాతీయ రహదారి విస్తరణ పనులు మొదలయ్యాయి. రాజోలు మండలం శివకోటి నుంచి ఏర్పాటైన బైపాస్ అనుసంధానమయ్యే చోట ఆక్రమణల తొలగింపులో ఏర్పడిన జాప్యం కారణంగా ఇబ్బందులు ఎదురయ్యాయి. ఎట్టకేలకు అధికారులు రహదారి పక్కన ఒకవైపు ఉన్న ఆక్రమణలను ఇటీవల తొలగించడంతో విస్తరణ పనులు చేపట్టారు. త్వరితగతిన పూర్తిచేసి వై.జంక్షన్‌ను చక్కదిద్దుతామని ఏఈఈ వెంకటరమణ తెలిపారు.

ఆలయాల అభివృద్ధిపై దృష్టి

మాన్సాస్ ఛైర్మన్ అశోక్‌గజపతిరాజు



అశోక్‌గజపతిరాజుకు మందేశ్వరస్వామి చిత్రపటాన్ని అందజేస్తున్న మందపల్లి దేవస్థానం సిబ్బంది

విజయనగరం కంటోన్మెంట్, న్యూస్‌టుడే: ఆలయాల అభివృద్ధి పనులు ఆపొద్దని, ప్రత్యేకంగా దృష్టి సారించి భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని మాన్సాస్ ఛైర్మన్, 104 దేవాలయాల అనువంశిక ధర్మకర్త, గోవా రాష్ట్ర గవర్నర్ పూసపాటి అశోక్ గజపతిరాజు అన్నారు. విజయనగరం కోటలోని మాన్సాస్ కార్యాలయంలో ఆదివారం విజయనగరం పైడితల్లి, సంతపేట జగన్నాథస్వామి, శ్రీకూర్మం కూర్మనాథస్వామి, మందేశ్వరస్వామి దేవాలయాల పాలకమండలి సభ్యులు, దేవాదాయ శాఖ అధికారులతో సమావేశమయ్యారు. వార్షిక బడ్జెట్, ఖర్చులపై ఆరా తీశారు. ★ పైడితల్లి ఆలయ పునర్నిర్మాణ పనులను జూన్ నాటికల్లా పూర్తి చేయాలని ఈవో శిరీషను ఆదేశించారు. జాప్యం జరగకుండా పర్యవేక్షించాలన్నారు. శివాలయం వీధిలోని అమ్మవారి కల్యాణ మండపాన్ని పూర్తిగా తొలగించి కొత్త నిర్మాణాన్ని చేపట్టనున్నట్లు ఈవో వెల్లడించారు. భవిష్యత్తు అవసరాల దృష్ట్యా సిరిమానుల కోసం అయిదెకరాల్లో చింత చెట్లు పెంచే ప్రతిపాదనపై చర్చించారు. ★ సంతపేట ఆలయం నూతన పాలకవర్గం కొలువుదీరింది. ఎనిమిది సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. సభ్యులుగా మల్ల నాగమణి, పెంటకోట గౌరి, ఎస్.అన్నపూర్ణ, గంగళ్ల లక్ష్మి, బంబోతుల అప్పారావు, సారిపల్లి కిరణ్‌కుమార్, చెల్లపు వెంకటరమణ, ముని శ్రీరామకృష్ణను నియమించారు. వీరు రెండేళ్లపాటు పదవిలో కొనసాగుతారు. దేవాలయానికి సంబంధించి సీజీఎఫ్ నిధులతో నిర్మించిన కాలక్షేప మండపం పరిసరాల్లో విద్యుత్తు దీపాల ఏర్పాటు, నీళ్ల ట్యాంకు, పైపులైన్ పనులు చేపట్టాలని సభ్యులు ఛైర్మన్ దృష్టికి తీసుకొచ్చారు. కాలక్షేప మండపాన్ని రోజుకు రూ.10,000కు అద్దెకిచ్చేలా తక్షణం వినియోగంలోకి తేవాలని విన్నవించారు. ★ శ్రీకాకుళం జిల్లా శ్రీకూర్మంలోని కూర్మనాథస్వామి దేవాలయం ఆవరణలో కోనేరును శుభ్రపర్చి, చుట్టూ చెట్లు నాటేందుకు రూ.10 లక్షలను ఇండిగో సంస్థ మంజూరు చేసిందని, మరికొన్ని మరమ్మతులు చేపట్టాలని పాలక మండలి సమావేశంలో నిర్ణయించారు. ★ కోనసీమ జిల్లా మందపల్లిలోని మందేశ్వరస్వామి ఆలయానికి దేవాదాయ శాఖ సీజీఎఫ్ నిధి నుంచి రూ.3 కోట్లు మంజూరయ్యాయని ఛైర్మన్ తెలిపారు. రెండు అంతస్తుల భవనాన్ని నిర్మించనున్నట్లు వెల్లడించారు.

28 నుంచి అమలాపురంలో ప్రపంచ తెలుగు మహాసభలు

మాట్లాడుతున్న జీజీయూ కులపతి సత్యనారాయణరాజు

సర్పవరం, న్యూస్‌టుడే: బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం కిమ్స్ వైద్య కళాశాల ప్రాంగణంలో ఈ నెల 28 నుంచి రెండు రోజుల పాటు వైభవంగా మూడవ ప్రపంచ తెలుగు మహాసభలు, తెలుగుభాష, సాహిత్య, సంస్కృతుల సమ్మేళనం నిర్వహిస్తున్నామని మాజీ ఎమ్మెల్సీ, గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ(జీజీయూ) కులపతి కేవీవీ సత్యనారాయణరాజు(చైతన్యరాజు) తెలిపారు. కాకినాడ గ్రామీణం సర్పవరంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వివరాలు వెల్లడించారు. రాజమహేంద్రవరం శివారు జీజీయూలో రెండుసార్లు సభలు జరిపామని, మూడోసారి కిమ్స్‌లో నిర్వహిస్తామన్నారు. ప్రపంచం నలుమూలల నుంచి భారీగా ప్రముఖులు, తెలుగు భాషాభిమానులు హాజరవుతారన్నారు. ప్రధాన వేదికకు దివంగత నందమూరి తారక రామారావు పేరు పెడతామన్నారు. మరో 4 వేదికలు ఏర్పాటుచేసి 16 రకాల సాహిత్య వేడుకలు, వందల మంది కవులతో సమ్మేళనాలు తదితరాలను వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో చైతన్యగ్రూప్ డైరెక్టర్ పీవీ కృష్ణంరాజు, సాహితీవేత్తలు సూర్యనారాయణమూర్తి, డా.వేదుల శ్రీరామశర్మ, స్టేట్ టీచర్స్ యూనియన్ నాయకులు పి.సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph.81422 92071.

REAL ESTATE

LAND FOR SALE

JAGGAMPETA

రాజమండ్రికి 30 కి.మీ. దూరములో మురారి, గండేపల్లి మధ్య NH కి చేర్చి 100 అ||ల రోడ్డు ఫేసింగ్‌తో 60 సెంట్లుభూమి అమ్మబడును. (నోబ్రోకర్స్) ✆ 9032988265

PLOT FOR SALE

RAJAMAHENDRAVARAM CITY

రాజమండ్రి V.L.పురం మోడల్ కాలనీ, NH-5కి అతిదగ్గరగా వెస్ట్ ఫేసింగ్ 520 చ||గ||ల స్థలం అమ్మకం. Contact: 98850 72992, 80991 91919.

రాజమండ్రి To వైజాగ్ వెళ్లే హైవేను ఆనుకొని దివాన్‌చెరువు వద్ద గైట్ కాలేజీకి ఎదురుగా బ్రిడ్జి కౌంటీని ఆనుకొని ఉన్నది, GSL కాలేజ్ దగ్గరలో E/F వెయ్యి గజాలు చొప్పున 3 ప్లాట్లు ఉన్నవి. చుట్టూ అపార్ట్మెంట్లు, హాస్టల్స్. గజం 1కి రూ.30 వేలు. 9848183683, 8686635567

EENADU Classifieds

RAJANAGARAM

ఓనర్ డైరెక్ట్‌గా అమ్మే రెసిడెన్షియల్ ప్లాట్లు రాజానగరం మండలఆఫీస్ వెనుక, డీటీసీపీ అప్రూవ్డ్ లేఅవుట్‌లో స్థలాలు అమ్మకం. 96668 94019, 93980 83034

JOBS

డిజైనింగ్ వచ్చిన DTP ఆపరేటర్స్ సీనియర్స్/ జూనియర్స్ కావలెను. (Page Maker, ఫొటోషాప్, Coreldraw, Illustrater etc.) Rjy, 9246657116

Montra 3-వీలర్ ఎలక్ట్రిక్ ఆటో మార్కెటింగ్ చేయుటకు అనుభవం గల సేల్స్ మేనేజర్ కావలెను. సీతంపేట, రాజమండ్రి. Contact: 94947 81111.

శ్రీదేవి ఫంక్షన్‌హాలు నందు పని చేయుటకు గార్డెనింగ్, సివిల్ & క్లీనింగ్ కొరకు వర్కర్స్ కావలెను. ఉచిత వసతి, జీతం: యువకులకు 18,000/-, మధ్య వయస్కులకు 15,000/-, పెద్దవారికి 12,000/-. జి.మామిడాడ, Cell: 94909 98888.

శివ కార్తికేయ హోంకేర్‌లో వృద్ధులు, పేషంట్స్, పిల్లలను చూసుకొనుటకు నర్సులు, వర్కర్స్ కావలెను. ఫ్రీ వసతి, భో.జీ. 20K. ✆ 99120 11499, 99120 11899.

EENADU for Advertisement Contact: 8008597607

MARKETING/ SALES

Anand Masale Require Sales & Marketing Manager, Marketing Executives. Contact: 9849655105, 9848053144 Email:anandmasala-appltd@gmail.com.

SECURITY GUARDS

కాకినాడ, పెద్దాపురం, ధవళేశ్వరం లలో పనిచేయుటకు సెక్యూరిటీ సూపర్‌వైజర్లు, సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. Contact Cell: 85004 98115, 98665 94189.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

★ For the Information of Trade & Industry

★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 4-65 పైII అనపర్తి ఆఫీసు: 08857-226908

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

జాతీయ రహదారిపై ఘోర ప్రమాదం

రెయిలింగ్‌లో నుంచి దూసుకెళ్లిన కారు ● ఒకరు మృతి

ఘటనా స్థలంలో దెబ్బతిన్న కారు

చింతూరు, న్యూస్‌టుడే: జాతీయ రహదారి-30పై ఓ కారు ఘోర రోడ్డు ప్రమాదానికి గురైన సంఘటన మండలంలోని సింగన్నగూడెం వద్ద ఆదివారం చోటుచేసుకుంది. చింతూరు పోలీసుల వివరాల ప్రకారం.. తమిళనాడు నుంచి ఒడిశా రాష్ట్రానికి ఎనిమిది మందితో బయలుదేరిన ఓ కారు ఎన్‌హెచ్-30లోని సింగన్నగూడెం వచ్చేసరికి అదుపు తప్పింది. మూలమలుపుల్లో ప్రమాదాల నివారణకు ఏర్పాటు చేసిన ఇనుప రెయిలింగ్ అంచును ఢీకొట్టింది. దీంతో ఇనుప బద్దీ కారు మధ్యలో నుంచి రెండుగా చీల్చుకుంటూ వెళ్లిపోవడంతో అందులో ప్రయాణిస్తున్న పురేశ్‌గౌడ్(22) అక్కడికక్కడే మృతి చెందారు. మిగిలినవారికి తీవ్రగాయాలవడంతో చింతూరు ఏరియా ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్సలు నిర్వహించి భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు. చింతూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సంఘటనా స్థలాన్ని ఏఎస్పీ హేమంత్ పరిశీలించారు.

టాటా గ్రూప్ మారథాన్‌లో దాట్ల ప్రతిభ

బహుమతి అందుకున్న మాజీ సైనికుడు నాగ శ్రీరామరాజు

లొల్ల(ఆత్రేయపురం), న్యూస్‌టుడే: టాటా గ్రూప్ ఆధ్వర్యంలో మహారాష్ట్రలో ఆదివారం తెల్లవారుజామున నిర్వహించిన 9వ అల్ట్రా మారథాన్‌లో లొల్ల గ్రామానికి చెందిన ట్రై అథ్లెటు, మాజీ సైనికుడు దాట్ల నాగ శ్రీరామరాజు ప్రతిభ చాటారు. 50 కిమీ పరుగును కేవలం 4.14 గంటల్లో పూర్తి చేసి నాలుగో స్థానం సాధించారు. అనంతరం నిర్వాహకుల నుంచి రూ.30 వేల నగదు, బహుమతితో పాటు పతకం, ప్రశంసా పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన్ను తోటి మాజీ సైనికులు, గ్రామస్థులు అభినందించారు.

92.7 FM Rajamahendravaram (ఈ FM 92.7 Mee FM)

ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 9000180626, 9989993175

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):	18,000
పాతకాయ: గండేరా	30,500
గటగట	29,000
కొత్తకాయ: గండేరా	30,000
గటగట	29,000
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	18,000-21,000
కొత్త (పచ్చి) కాయ	16,000-17,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	5,000
కిలో	350

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	115-00
రిటైల్ లైవ్	142-00
డ్రెస్డ్	206-00
స్కిన్‌లెస్	234-00

అరుదైన వృక్షజాతి మొక్కలతో నూతన నర్సరీ

ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సందర్శనకు ఏర్పాట్లు

నర్సరీలో పెంచుతున్న నాగకేశరాల మొక్కలు

రాజానగరం, న్యూస్‌టుడే: దివాన్‌చెరువు రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలో గల రాష్ట్ర అటవీ పరిశోధనా కేంద్రం ప్రాంగణంలో 400 రకాల అరుదైన వృక్షజాతులతో నూతనంగా నర్సరీని ఏర్పాటు చేస్తున్నారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దీనిని త్వరలో సందర్శించనున్నారని అటవీశాఖ అధికారులు తెలిపారు. ఇందు కోసం నూతన వృక్షజాతులతో నర్సరీని ఏర్పాటు చేస్తున్నారు. వీటిలో అరుదైన, అంతరించిపోనున్న వృక్షజాతులు ఉన్నాయి. వెదురు జాతిలో వాణిజ్యపరమైన తుల్దాజాతి వెదురు, శ్రీగంధం, దాల్చినచెట్టు, పెద్దకళింగ, నాగకేశరాలు, లోలులు, రోజ్‌ఉడ్, ఎర్రచందనం, తెల్లపొలికి, సారపప్పు, అలాగే స్థానికంగా లభించే అనేక రకాల వృక్షజాతులతో ఈ నర్సరీని ఏర్పాటు చేస్తున్నారు.

(c) eenadu

మారేడుమిల్లిలో ప్రభుత్వ జూనియర్ కళాశాలకు కొత్త సిమెంట్ రోడ్డు

రహదారి నిర్మించారు

ఈనాడు కథనానికి స్పందన

మారేడుమిల్లి : మారేడుమిల్లిలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను వృత్తివిద్యా కేంద్ర(వీటీఐ) భవనంలో నిర్వహిస్తున్నారు. అయితే ఈ కళాశాలకు వెళ్లే రహదారి రాళ్లు, గుంతలతో అధ్వానంగా ఉండేది. దీనిపై గతంలో 'ఈనాడు'లో 'అధ్వానదారిలో అవస్థలు' శీర్షికతో కథనం, అనంతరం 'మేమున్నాం.. మీకుతోడుగా..!'లో చిత్ర కథనాలు ప్రచురించడంతో ఎట్టకేలకు అధికారులు స్పందించారు. గ్రామ పంచాయతీ నిధులతో సిమెంట్ రోడ్డు నిర్మించారు. దీంతో విద్యార్థులు, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన

ఏపీ జెన్‌కో డీఏవీ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుడు కె.ఫణికుమార్ ఆధ్వర్యంలో ఆదివారం వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. జలవిద్యుత్కేంద్రం ప్లాంట్ మేనేజర్ బీమవరపు బాలకృష్ణ, టెక్నికల్ డీఈ వరప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరై.. విద్యార్థులు పరీక్షలు బాగా రాసి, మంచి ఉత్తీర్ణత సాధించాలని అన్నారు. తొమ్మిదో తరగతి విద్యార్థులు నృత్యాలతో అలరించారు. – న్యూస్‌టుడే, మోతుగూడెం

మోతుగూడెంలో పర్యాటకుల సందడి

మోతుగూడెంలోని పర్యాటక ప్రాంతాలు ఆదివారం కళకళలాడాయి. పొల్లూరు జలపాతం, ఫోర్‌బే, ఏవీపీ, డొంకరాయి జలాశయాలు, సీలేరు నది పరివాహక ప్రాంతాలను వీక్షించిన సందర్శకులు తీయని అనుభూతిని పొందారు. ఈ ప్రాంతాల సందర్శనకు వచ్చే భక్తులు ముందుగా పొల్లూరు దారాలమ్మ తల్లిని సందర్శించుకుని అనంతరం పర్యాటక ప్రాంతాల సందర్శనకు వెళ్లారు. ఎక్కువ సమయం దారాలమ్మ పిక్నిక్ స్పాట్ వద్ద సీలేరు నదిలో, పొల్లూరు జలపాతంలో జలకాలాడుతూ ఆనందంగా గడిపారు. – న్యూస్‌టుడే, మోతుగూడెం

పొల్లూరు జలపాతంలో జలకాలాడుతున్న పర్యాటకులు

నాలుగు కాళ్లతో పుట్టిన కోడిపిల్ల

మండలంలోని సీతాపురానికి చెందిన చుక్కా హరికుమారి దంపతులకు చెందిన ఇంట్లో గత రెండు రోజుల క్రితం ఒక కోడి నాలుగు పిల్లలకు జన్మనిచ్చింది. అందులో ఒక కోడి పిల్ల నాలుగు కాళ్లతో పుట్టడంతో స్థానికులను ఆశ్చర్యానికి గురిచేసింది. ప్రస్తుతం కోడి పిల్ల ఆరోగ్యంగా ఉందని యజమాని చొక్కా కుమారి ఆదివారం తెలిపారు. దీనిపై ఎటపాక పశువైద్యుడు అన్వేష్‌ని వివరణ కోరగా జన్యుపరమైన లోపాల వల్ల ఇలా పుడతాయన్నారు. – న్యూస్‌టుడే, ఎటపాక

మేమున్నాం.. మీకు తోడుగా

రంపచోడవరం 9490877172 అడ్డతీగల 9491575045

ఉ॥ 10 - మ॥ 1 దేవీపట్నం 7673936638 గంగవరం 9493541083

సమస్య: మారేడుమిల్లి మండలం గుజ్జుమామిడి వలసలో అసంపూర్తిగా నిలిచిపోయిన రైతుసేవా కేంద్రం భవనాన్ని పూర్తి చేయాలి. ఇది అందుబాటులో లేకపోవడంతో గిరిజన రైతులు ఇబ్బందులు పడుతున్నారు. - కొరగాని సువర్ణరాజు, జీఎంవలస

పరిష్కారం: రైతుసేవా కేంద్ర భవనాన్ని వెంటనే పూర్తి చేయడానికి చర్యలు చేపడతాం.

- చైతన, డీఈఈ, గి.సం.ఇంజినీరింగు విభాగం – న్యూస్‌టుడే, మారేడుమిల్లి

కొండకోనల్లో జలధారలు..ప్రకృతి ఒడిలో పండ్ల తోటలు

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే

అల్లూరి జిల్లా పూర్తిగా వ్యవసాయాధారిత ప్రాంతం. 90 శాతం గిరిపుత్రులు వర్షాధారంగానే పంటలు పండిస్తున్నారు. కాఫీ, మిరియాలు, పసుపు, అల్లం, రాజ్‌మా, రాగులు తదితర పంటలను సాగు చేస్తున్నారు. కాలానికి అనుగుణంగా గిరిజన రైతులూ ఉద్యాన పంటల సాగుకు ముందుకొస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు నాబార్డు, ఐటీడీఏ ఉద్యాన తోటల సాగుకు ఆర్థిక వనరులు అందించడంతోపాటు సాంకేతిక సహకారం అందిస్తున్నాయి.

నాబార్డు సాయంతో గ్రావిటీ పథకాల ఏర్పాటు

▼ గూడెంకొత్తవీధి మండలంలోని 15 గ్రామాల్లో గిరిజన అభివృద్ధి పథకం కింద 500 ఎకరాల్లో పండ్ల తోటల పెంపకానికి నాబార్డు తోడ్పాటు అందిస్తోంది. క్షేత్రస్థాయిలో ఈ పథకాన్ని గిరిజన వికాస్ సంస్థ పర్యవేక్షిస్తోంది. ఈ పథకంలో ప్రతి రైతు ఎకరా విస్తీర్ణంలో పండ్ల తోటలను సాగు చేయాల్సి ఉంటుంది.

శ్రమదానంతో పనులు చేస్తున్న రైతులు

మొక్కలు నాటేందుకు తవ్వే గోతుల మొదలు మొక్కల సరఫరా, తోటల సంరక్షణ, నీటి తడులు, అవసరమైన ఎరువులు వంటి నిర్వహణ చర్యలన్నింటికీ సంబంధిత రైతుల బ్యాంకు ఖాతాలకు నిధులు జమయ్యేలా పథకాన్ని రూపొందించారు. ఒక్కో రైతుకు 37 లిచీ, 37 సపోటా, 60 జామ, 60 వక్క మొక్కలు పంపిణీ చేశారు.

▼ కొండలపై ఉద్యాన పంటలు పండించాలంటే ఏడాది పొడవునా సాగునీరు అవసరం. కొండకోనల్లో వర్షాధారం తప్పా మరో ప్రత్యామ్నాయం లేదు. గిరిజన వికాస్ సంస్థ ప్రతినిధులు గ్రావిటీ పథకాల ద్వారా ఉద్యాన తోటలకు సాగునీరందించే దిశగా చర్యలు చేపట్టారు. కొండలపై ఉండే నీటి వనరుల ఆధారంగా అక్కడే నీటిని ట్యాంకుల్లో నిల్వ చేసి వాటిని పైపుల ద్వారా పండ్ల తోటలకు నీరందించే ప్రయత్నంలో విజయం సాధించారు. ఇందుకు అవసరమైన సాంకేతిక సహకారాన్ని, అవసరమైన సామగ్రిని నాబార్డు సాయంతో గిరిజన వికాస్ అందించింది. రైతులంతా ఏకమై శ్రమదానంతో గ్రావిటీ పథకాలను నిర్మించుకుని పండ్ల తోటలకు నీటిని మళ్లించుకోగలిగారు. పైసా ఖర్చు లేకుండా ఏడాది పొడవునా తోటలకు పుష్కలంగా నీరందుతోందని సాగులు, బూసులు గ్రామాలకు చెందిన రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గిరిజన ప్రాంతాల్లో సుస్థిర ఆదాయం పొందేందుకు వనరులు పుష్కలంగా ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకుంటే సత్ఫలితాలు సాధించవచ్చని గిరిజన వికాస్ సంస్థ సీఈవో సత్యనారాయణ పేర్కొన్నారు.

పాఠ్యాంశాలలో రాజ్యాంగాన్ని చేర్చాలి

రంపచోడవరం : విద్యార్థులకు రాజ్యాంగాన్ని పాఠ్యాంశాలలో చేర్చాలని ఏజెన్సీ దళిత ఐక్యవేదిక కన్వీనర్ మాదే రామచంద్రరావు డిమాండ్ చేశారు. ఆదివారం ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ డాక్టరు బి.ఆర్ అంబేడ్కర్ రుపొందించిన రాజ్యాంగంతో అన్ని వర్గాల సంక్షేమంతో పాటు అభివృద్ధికి నోచుకొంటున్నారని తెలిపారు.

విద్యుత్తు కోతతో అవస్థలు

వై.రామవరం : శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు, ఆదివారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు జాతీయ రహదారుల విస్తరణలో భాగంగా విద్యుత్తు సరఫరా నిలిపివేయడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీని కారణంగా మోటార్లు పనిచేయక తాగునీటి ఎద్దడి ఎదుర్కొన్నామని పలువురు వాపోయారు. మరో పక్క కార్యాలయాల్లో కంప్యూటర్లు పనిచేయని పరిస్థితి నెలకొంది. అధికారులు విద్యుత్ సరఫరాను సక్రమంగా అమలు చేయాలని వినియోగదారులు కోరారు.

ఇంకెన్నాళ్లకో బీఎస్ఎన్ఎల్ సేవలు

వై.రామవరం, న్యూస్‌టుడే: వై.రామవరంలో బీఎస్ఎన్ఎల్ కేంద్రాన్ని ఏర్పాటు చేసి మారుమూల గిరిజన గ్రామాలకు సేవలు అందిస్తున్నాం.. ఇది ఆనాటి మాటగానే మిగిలిపోయింది. ఈ కేంద్ర నిర్వహణకు ఇప్పటికీ ఏ ఒక్కరినీ నియమించలేదు. విద్యుత్తు ఉంటేనే సేవలు అందుబాటులో ఉంటాయి. లేకుంటే నిలిచిపోతాయి. గత మూడేళ్లుగా ఇదే పరిస్థితి. నెలకు 15 రోజుల వరకు సిగ్నల్స్ నిలిచిపోయి సేవలకు అంతరాయం ఏర్పడుతోంది. సమస్యను అధికారులకు తెలియజేద్దామన్నా వారు ఎక్కడ ఉంటారో తెలియని పరిస్థితి నెలకొంది. వినియోగదారులు ఆ సిమ్‌కు వందలు పెట్టి రీఛార్జ్‌లు చేస్తున్నా సేవలు ఉండట్లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిర్వాసితుల సమస్యలు పరిష్కరించండి

రంపచోడవరం, న్యూస్‌టుడే: పోలవరం నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర ఎస్సీ కమిషన్ ఛైర్మన్ జవహర్‌కు వినతిపత్రం అందజేశామని మాజీ ఎమ్మెల్యే శీతంశెట్టి వెంకటేశ్వరరావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. ఆదివారం పశ్చిమగోదావరి జిల్లా పోలవరం మండలం చీడూరు, దేవీపట్నం మండలం ఏనుగులగూడెం నిర్వాసితులతో కలసి ఛైర్మన్‌కు సమస్యలను వివరించామన్నారు. పోలవరం ప్రాజెక్టు గేట్లు మూయడంతో వ్యవసాయ భూములన్నీ నీటిలో మునిగిపోయాయని వాటికి పరిహారం ఇప్పించి ఆదుకోవాలన్నారు. దీనిపై చర్యలు తీసుకుంటామని ఛైర్మన్ హామీ ఇచ్చినట్లు చెప్పారు.

ఎస్సీ కమిషన్ ఛైర్మన్‌కు వినతిపత్రం అందజేస్తున్న నిర్వాసితులు, మాజీ ఎమ్మెల్యే

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

వై.రామవరం, న్యూస్‌టుడే: నేటి నుంచి జరిగే ఇంటర్మీడియట్ పరీక్షలకు అరగంట ముందే పరీక్షా కేంద్రాలకు రావాలని ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్ ఈశ్వర కృష్ణ తెలిపారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు జరుగుతాయన్నారు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు సంబంధించిన 381 మంది విద్యార్థులు ఈ పరీక్ష కేంద్రంలో పరీక్షలు రాస్తారన్నారు.

కూనవరం: టేకులబోరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అయిదు కళాశాలల నుంచి ప్రథమ సంవత్సరం 202 మంది, ద్వితీయ సంవత్సరం 227 మంది, సప్లిమెంటరీ 11 మంది పరీక్షలు రాయనున్నట్లు ప్రధానాచార్యుడు శ్రీరామచంద్రమూర్తి తెలిపారు. ఇప్పటికే అన్ని గదులలో నిఘా నేత్రాలు అమర్చామన్నారు. ఎటపాక సీఐ కన్నపరాజు, ఎస్సై రామకృష్ణ పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు.

సీసీ కెమెరాల పనితీరును పరిశీలిస్తున్న సీఐ కన్నపరాజు, ఎస్సై రామకృష్ణ

రాజవొమ్మంగి: స్థానిక గిరిజన సంక్షేమ గురుకుల బాలికల జూనియర్ కళాశాలలో 391 మంది ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు తెలుగు పరీక్షకు హాజరుకానున్నారని చీఫ్ సూపరింటెండెంట్ షీలా తెలిపారు. వీరికి 15 పరీక్ష గదులు ఏర్పాటు చేయగా, అన్ని గదుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు.

వరరామచంద్రాపురం: వీఆర్‌పురం ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో పరీక్షలు నిర్వహించే గదులను ఎటపాక సీఐ కన్నప్పరాజు ఆదివారం పరిశీలించారు. మొత్తం విద్యార్థుల సంఖ్య, పరీక్షలు నిర్వహించే గదులు, వాటి సౌకర్యాలపై కళాశాల సిబ్బందితో చర్చించారు. ఎస్సై సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

మారేడుమిల్లి: గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాల్లో మారేడుమిల్లితో పాటు మూడు కళాశాలలకు చెందిన విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి 184, గురుకుల జూనియర్ కళాశాల నుంచి 260, కస్తూర్బాగాంధీ బాలికల జూనియర్ కళాశాల నుంచి 77 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. పరీక్షల కేంద్రంలో గదులను సిద్ధం చేశారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేశామని కళాశాల ప్రిన్సిపల్ సత్యనారాయణ తెలిపారు.

మే నెలలో మోదకొండమ్మ జాతర

పాడేరు : మోదకొండమ్మ అమ్మవారి జాతర మే 10, 11, 12 తేదీల్లో జరగనుంది. ఈ వేడుకలకు సంబంధించి ఆదివారం మధ్యాహ్నం ఆలయ కమిటీ ఛైర్మన్, ప్రధాన కార్యదర్శి, సభ్యులు, గ్రామ పెద్దలు సమావేశమై చర్చించారు. సమావేశం అనంతరం ఆలయ ప్రధానార్చకులు సుబ్రహ్మణ్యం జాతర తేదీలను వెల్లడించారు. ఉత్సవ కమిటీ అధ్యక్షులుగా ఆలయ కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు వ్యవహరించనున్నారు. రెండు రోజుల్లో ఉత్సవ కమిటీని ప్రకటిస్తామని ఆలయ కమిటీ ప్రతినిధులు చెప్పారు.

ఆలయ మండపంలో కమిటీ సభ్యుల సమావేశం

బ్యాడ్మింటన్ విజేతలకు నగదు పురస్కారం

రంపచోడవరం: అల్లూరి సీతారామరాజు బ్యాడ్మింటన్ అసోసియేషన్ (రంపచోడవరం) ఆధ్వర్యంలో ఈ నెల 20, 21 తేదీల్లో మండల స్థాయి డబుల్స్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ జరిగింది. స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన బ్యాడ్మింటన్ కోర్టులో జరిగిన ఈ పోటీల్లో 40 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. విజేతలుగా కల్యాణ్, దొరబాబు నిలిచారు. ద్వితీయస్థానంలో రాజేశ్, చిన్నారెడ్డి నిలిచారు. వీరికి షీల్డ్‌తో పాటు నగదు బహుమతిని అందజేశారు. టోర్నమెంట్ నిర్వాహకులు నేపా చిన్నబ్బాయి, దేశాల నాగేశ్వరరావు, చుక్కా అభిషేక్, నాగేంద్ర, సురేష్ పాల్గొన్నారు.

మూడో రోజూ కొనసాగిన వైద్య శిబిరం

రాజవొమ్మంగి: మారేడుబాక పంచాయతీ ఉర్లాకులపాడులో మూడో రోజు వైద్య శిబిరం నిర్వహించారు. జడ్డంగి పీహెచ్‌సీ వైద్యాధికారి నాగార్జున 10 మందిని పరీక్షించి మందులను అందజేశారు. సోమవారం కొసూరివారి వీధిలో వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారి నాగార్జున తెలిపారు. కాగా ఉర్లాకులపాడు గ్రామంలో గిరిజనులు వ్యాధులతో అల్లాడుతున్న నేపథ్యంలో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్న విషయం విదితమే.

రహదారి పనుల్లో నాసిరకం సామగ్రి

జాతీయ రహదారి 516ఈ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, ప్రస్తుతం గంగవరం-అడ్డతీగల మధ్యలో నిర్వహిస్తున్న పెండింగ్ పనుల్లో వినియోగిస్తున్న సామగ్రి నాణ్యత లేకుండా ఉందని పలువురు ఆరోపిస్తున్నారు. అలాగే పనులు చేస్తున్న ప్రాంతాల్లో సూచిక(హెచ్చరిక) బోర్డులు లేక ప్రమాదాల బారిన పడుతున్నారని ప్రయాణికులు వాపోతున్నారు. ఇప్పటికైన హెచ్చరిక బోర్డులను ఏర్పాటుచేసి, నాణ్యత ప్రమాణాలు పాటించాలని వారు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, గంగవరం

కళాశాలకు ప్రహరీ నిర్మించండి..

మారేడుమిల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ప్రహరీ లేకపోవడంతో విద్యార్థులు, అధ్యాపకులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. చుట్టూ ఖాళీ ప్రదేశం ఉండడంతో సెలవు దినాల్లో ఆకతాయిల చేష్టలకు అడ్డాగా మారుతోంది. అంతేకాకుండా పశువుల సంచారం అధికంగా ఉండడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికైనా సంబంధిత ప్రభుత్వ శాఖలు స్పందించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.– న్యూస్‌టుడే, మారేడుమిల్లి

హమ్మయ్య.. దారి వేశారు

జగ్గవరం క్రాస్‌రోడ్డు నుంచి చింతూరు ప్రధాన రహదారి గుంతలు, రాళ్లు తేలి అధ్వానంగా ఉండేది. ఈ మార్గంలో వెళ్లడానికి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. గత అయిదేళ్లుగా అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం రహదారులపై ప్రత్యేక దృష్టి సారించడంతో ఈ దారికి నిధులు మంజూరయ్యాయి. దీంతో క్రాస్‌రోడ్డు నుంచి కోతులగుట్ట వరకు కొత్త తారు రోడ్డు వేశారు. దీనిపై ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. – న్యూస్‌టుడే, కూనవరం

'ఉరక'లేస్తున్న జలపాతం

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: రాజవొమ్మంగి మండలంలోని జడ్డంగి స్వయంభూ భ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామి ఆలయం సమీపంలో మడేరు వాగు ప్రవహిస్తోంది. ఎత్తైన రాళ్ల నుంచి నీరు పడుతూ పర్యావరణ ప్రేమికులను మంత్ర ముగ్ధుల్ని చేస్తోంది. ఉరక జలపాతంగా పేరు గాంచిన ఈ ప్రాంతానికి వెళ్లేందుకు ఇటీవల తాళ్లవంతెన (రోప్ వే) ను ఏర్పాటుచేశారు. పర్యాటకులు అక్కడికి వచ్చి స్నానమాచరించి స్వామివారిని దర్శించుకుని వెళ్తున్నారు.

అంబులెన్సులో ప్రసవం

పుట్టిన శిశువుతో 108 సిబ్బంది

చింతూరు, న్యూస్‌టుడే: పురిటి నొప్పులు అధికమై మార్గమధ్యలోనే గర్భిణికి 108 సిబ్బంది ఆదివారం ప్రసవం చేశారు. మండలంలోని సూరన్నగొంది గ్రామానికి చెందిన పొడియం భీమమ్మకి ఆదివారం సాయంత్రం పురిటినొప్పులు వచ్చాయి. వెంటనే కుటుంబసభ్యులు 108 వాహనంలో చింతూరు ఏరియా ఆసుపత్రికి తీసుకువెళ్తుండగా మార్గమధ్యలోనే నొప్పులు అధికం కావడంతో ఈఎంటీ సుజాత కుయుగూరు వద్ద వాహనం ఆపి ప్రసవం చేశారు. మగబిడ్డ జన్మించాడు. కాగా తల్లి, బిడ్డను చింతూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. పైలెట్ సురేశ్ పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరంలో 2,250 మందికి సేవలు

రంపచోడవరం, న్యూస్‌టుడే: రామకృష్ణ మిషన్ ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని సిరిగిందలపాడు గ్రామంలో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 250 మంది రోగులకు వైద్యసేవలను అందించి మందులను పంపిణీ చేసినట్టు రామకృష్ణమిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనందమహరాజ్ తెలిపారు. డాక్టర్లు శ్రీనివాసురాయుడు, పోతుల రామారావు, దాసరి ఉమామహేశ్వరరావు, రాజేష్‌ఖన్నా రోగులకు వైద్యం అందించారు. 90 మందికి రక్తపరీక్షలు, 12 మందికి థైరాయిడ్, ఇద్దరికి ఈసీజీలు, ఆరుగురికి ఎక్స్‌రేలను, 17 మందికి ఫిజియోథెరపీ చేసినట్టు తెలిపారు. రామకృష్ణమిషన్ కోఆర్డినేటర్ కానుమోను శ్రీనివాసు, సిబ్బంది విజయభాస్కరరావు, దాసరి పెద్దఅప్పారావు పాల్గొన్నారు.

సిరిగందలపాడులో వైద్యం అందిస్తున్న డాక్టర్ శ్రీనివాసరాయుడు

గిరిజనులకు వైద్యసేవలందించడానికి ముందుకు రావాలి

మారేడుమిల్లి : మన్యంలోని లోతట్టు గిరిజన గ్రామాల్లోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించడానికి ప్రతిఒక్కరు ముందుకు రావాలని రాజమహేంద్రవరానికి చెందిన వైద్య నిపుణుడు గోలి వెంకటరామారావు పిలుపునిచ్చారు. ఆదివారం గుర్తేడులో సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య నిపుణులు కస్తూరి సుబ్రహ్మణ్యం, ప్రభాకర్‌రావు, రామకృష్ణ, అవినాశ్, సాయి ప్రసన్న, జ్యోత్స్న, రవిరాజ్, పరమహంస, రవికిరణ్ తదితరులు పాల్గొని రోగులకు వైద్య సేవలను అందించారు. మారేడుమిల్లి, గుర్తేడు మండలాల పరిధిలోని వివిధ గ్రామాలు, అల్లూరి జిల్లా పరిధిలోని గ్రామాలకు చెందిన సుమారు 2 వేల మంది రోగులు పాల్గొని, వైద్య సేవలను పొందారు. వీరందరికీ అవసరమైన పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. రోగులకు భోజన వసతి కల్పించారు. వేమగిరి పరమహంస నేత్రాలయం ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించి, ఉచితంగా కళ్లజోళ్లు అందించారు. ● గుర్తేడులో నిర్వహించిన మెగా వైద్య శిబిరానికి ఎస్సై రాజ్‌కోటి పర్యవేక్షణలో గిరిజన గ్రామాల నుంచి రోగులను ఉచితంగా తరలించడానికి ప్రత్యేకంగా రెండు ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేశారు.

గుర్తేడు వైద్యశిబిరంలో రోగులకు ఓపీ రాస్తున్న వాలంటీర్లు

నిబంధనలు పాటించకుంటే చర్యలు: ఎస్సై

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: మన్యంలోని మారేడుమిల్లి మీదుగా రాకపోకలు సాగించే వాహనదారులు నిబంధనలను కచ్చితంగా పాటించాలని, అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్సై కె.శ్రీనివాసరావు హెచ్చరించారు. ఆయన మాట్లాడుతూ.. ఆదివారం స్థానిక ప్రధాన కూడలిలో విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించామన్నారు. గంజాయి, నాటు సారా వంటి మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టడానికి పటిష్ఠ చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై ప్రకాశ్, పోలీసు, సీఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

వాహన తనిఖీలు చేస్తున్న ఎస్సై శ్రీనివాసరావు

మోతుగూడెం: గుర్తేడు మండలం, బొడ్డగండి పంచాయతీ డొంకరాయి పోలీస్‌స్టేషన్ చెక్‌పోస్టు వద్ద ఆదివారం ఎస్సై చరణ్ నాయక్, సీఆర్పీఎఫ్ సిబ్బందితో వాహనాల తనిఖీలు నిర్వహించారు. గంజాయిని తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రహదారి భద్రతపై పలు సూచనలు చేశారు.

కుందులూరుదే విజయం

కూనవరం, న్యూస్‌టుడే : గ్రామంలోని పోలీస్ మైదానంలో జరుగుతున్న కూనవరం ప్రీమియర్ లీగ్ పోటీల్లో భాగంగా ఆదివారం ఆర్‌జే స్ట్రైక్ ఫోర్స్ నందిగామ, కుందులూరు కింగ్స్ జట్లు తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన ఆర్‌జే స్ట్రైక్ ఫోర్స్ 20 ఓవర్లలో ఎనిమిది వికెట్లు కోల్పోయి 132 పరుగులు చేయగా కుందులూరు కింగ్స్ 12.4 ఓవర్లలోనే మూడు వికెట్లు కోల్పోయి 134 పరుగులు చేసి విజయం సాధించింది. బ్యాటింగ్‌లో 28 పరుగులు, కీపింగ్‌లో నాలుగు క్యాచ్‌లు అందుకున్న ప్రవీణ్‌ప్రకాశ్‌కు తెదేపా నాయకుడు ఎచ్చు రవి మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అందించారు.

రత్నాబాయికి నివాళి అర్పించిన ఎమ్మెల్సీ వీర్రాజు

రంపచోడవరం, న్యూస్‌టుడే: ఇటీవల మృతి చెందిన మాజీ ఎంపీ తడపట్ల రత్నాబాయికి ఎమ్మెల్సీ సోము వీర్రాజు నివాళి అర్పించారు. ఆదివారం రంపచోడవరంలో రత్నాబాయి కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం ఆమె సమాధి వద్ద మొక్కను నాటారు. ఆయన మాట్లాడుతూ ఎంపీతో పాటు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, జీసీసీ ఛైర్మన్‌గా ఆమె ఎన్నో సేవలను అందించారన్నారు. పీసీసీ కార్యదర్శి దంగేటి సత్తిబాబు, భాజపా రాష్ట్ర కార్యదర్శి స్వప్నకుమారి, మాజీ జడ్పీటీసీ బాలాజీశ్రీను తదితరులు పాల్గొన్నారు.

సమాధి వద్ద మొక్క నాటుతున్న ఎమ్మెల్సీ సోము వీర్రాజు

మొద్దులగూడెంలో అగ్నిప్రమాదం

వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే: మొద్దులగూడెంలో ఆదివారం జరిగిన అగ్ని ప్రమాదంలో సోడే శరత్‌కుమార్, సోడె సరోజినిలకు చెందిన రెండిళ్లు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. వీరంతా వ్యవసాయ కూలీలు. ఆదివారం సాయంత్రం వారి ఇళ్లలో విద్యుత్తు షార్టుసర్క్యూట్‌తో అకస్మాత్తుగా మంటలు రావడంతో క్షణాల్లో అంతా మంటలు వ్యాపించాయి. కూనవరం నుంచి అగ్నిమాపక శకటం వచ్చి మంటలను అదుపుచేసింది. ఆర్ఐ రామకృష్ణ, వీఆర్వో రమాదేవి, బాధిత కుటుంబాలను పరామర్శించి, ఆస్తినష్టాన్ని అంచనా వేశారు. మొత్తం రూ.ఏడు లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందన్నారు. తక్షణ సాయంగా బియ్యం పంపిణీ చేశారు.

ఆస్తినష్టాన్ని అంచనావేస్తున్న రెవెన్యూ సిబ్బంది

ఆక్రమణలు తొలగించారు.. అభివృద్ధి మరిచారు

● ఇప్పటికీ వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం

మారేడుమిల్లి, న్యూస్‌టుడే:

ప్రముఖ పర్యాటక ప్రదేశంగా అభివృద్ధి చెందిన మారేడుమిల్లిలోని ప్రధాన రహదారులు అస్తవ్యస్తంగా మారాయి. ఆయా రహదారుల్లోని ఆక్రమణలను ప్రభుత్వ శాఖలు తొలగించినప్పటికీ, వాటిని అభివృద్ధి చేయడంలో నిర్లక్ష్యం కారణంగా పర్యాటకులకు ఇబ్బందులు తప్పడం లేదు.

ప్రధాన రహదారిలో ఇలా..

ప్రధానంగా మారేడుమిల్లి నుంచి బోదులూరు వెళ్లే ప్రధాన రహదారి పరిస్థితి మరింత అధ్వానంగా ఉంది. ఈ రహదారిలో ఒక వైపు కొత్తగా డ్రెయినేజీకి రూ.లక్షల వ్యయంతో నిర్మించిన కొద్ది రోజులకే అది పని చేయకుండా పోయింది. గత సంవత్సరం ఆయా రహదారుల్లోని ఆక్రమణలను తొలగించే ప్రక్రియ చేపట్టారు.

అస్తవ్యస్తంగా మారిన మారేడుమిల్లి-బోదులూరు రహదారి

మురుగు పారక ఇక్కట్లు

ఈ ప్రధాన రహదారి వద్ద పెద్ద భవనాలను సైతం నిర్ణీత కొలతల వరకు తొలగించారు. అయితే ఇందులో భాగంగా వచ్చిన శిథిలాలను మాత్రం తొలగించకుండానే వదిలేశారు. ఈ శిథిలాలతో డ్రెయినేజీ పూర్తిగా మూసుకుపోయింది. ఇవి అడ్డుపడి మురుగునీరు పోయే పరిస్థితి కూడా లేకుండా పోయింది. దీంతో రహదారులను వెడల్పు చేసినా, దానిని అభివృద్ధి చేయకపోవడంతో పరిస్థితి షరా మామూలుగానే మిగిలిపోయింది.

మళ్లీ అదే తీరు..

క్రమంగా తొలగించిన ఆక్రమణలు తిరిగి పునరుద్ధరణ అవుతున్నాయి. ఆయా నిర్మాణాలకు సంబంధించిన సామగ్రికి రహదారులపైనే వేయడంతో భారీ వాహనాల రాకపోకలకు తీవ్ర అవస్థలు ఎదురవుతున్నాయి. అసలే పర్యాటకుల వాహనాలతో రద్దీ ఉండే ఈ రహదారుల్లో వీటి వల్ల తరచూ ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత ప్రభుత్వ శాఖలు స్పందించి, తగు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

వారపుసంతలో సేంద్రియ కూరగాయలు

మోతుగూడెం, న్యూస్‌టుడే: సీలేరు నది పొడవునా ఉన్న గిరిజనులు సేంద్రియ ఎరువులతో వివిధ రకాల ఆకుకూరలు, కూరగాయలను పండిస్తున్నారు. వాటిని వారపు సంతకు తీసుకువచ్చి తక్కువ ధరలకే విక్రయిస్తున్నారు. దీపారాధనకు పవిత్రంగా వాడే విప్పనూనెను లీటరు రూ.100కు అమ్ముతున్నారు. చుట్టు పక్కల గ్రామాల ప్రజలు వీటిని కొనుగోలు చేయడానికి ఎక్కువ ఆసక్తి చూపిస్తున్నారు.

సేంద్రియ కూరగాయలు విక్రయిస్తున్న గిరిజనులు

(c) eenadu

ఈనాడు
ప్రకాశం
సోమవారం 23 ఫిబ్రవరి 2026

మార్కాపురం-తర్లుపాడు రహదారిలో సీఎం బహిరంగ సభ స్థలాన్ని పరిశీలిస్తున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ రాజాబాబు, ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, అధికారులు

ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు పరిశీలన

పెద్దదోర్నాల, మార్కాపురం, న్యూస్‌టుడే: జిల్లాలో ఈ నెల 25వ తేదీన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పర్యటనను విజయవంతం చేయాలని ఇన్‌ఛార్జి కలెక్టర్ రాజాబాబు అధికారులను ఆదేశించారు. పెద్దదోర్నాల మండలం గంటవానిపల్లె సమీపంలోని ఫీడరు కాలువ వద్ద జరుగుతున్న ఏర్పాట్లను ఆదివారం ఆయన మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం మార్కాపురం-తర్లుపాడు రహదారిలో బహిరంగ సభ నిర్వహించే స్థలాన్ని పరిశీలించారు. ముఖ్యమంత్రి ఫీడరు కాలువ ఆధునికీకరణ పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం మార్కాపురం పట్టణంలో జరిగే బహిరంగ సభలో పాల్గొంటారన్నారు. పర్యటనలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లలో భాగంగా వెలిగొండ ప్రాజెక్టు సొరంగాలను సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్ రఘు, జేసీ శ్రీనివాసులు, తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు, సీఈ రమేష్, ఎస్ఈ అబూతాలీం పరిశీలించారు. దోర్నాల మండలం కొత్తూరు సమీపంలోని నిర్మాణంలో ఉన్న రెండు సొరంగాలను సందర్శించారు. రెండో సొరంగంలో జరుగుతున్న లైనింగ్ పనులను ప్రాజెక్టు ఎస్ఈ వివరించారు. ఇక్కడ పనులను సీఎంకు లైవ్‌లో చూపించేందుకు చేపట్టాల్సిన ఏర్పాట్లపై చర్చించారు. వీరివెంట సబ్‌కలెక్టర్ వెంకటశివరామిరెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులున్నారు.

ముద్దసానమ్మా...
మనసా స్మరామి

మార్కాపురం మండలం జమ్మనపల్లి-కోలభీమునిపాడు గ్రామశివారులోని శ్రీముద్దసానమ్మ దేవస్థానంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని పెద్దసంఖ్యలో దర్శించుకుని పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.
- న్యూస్‌టుడే, మార్కాపురం గ్రామీణం

అమ్మినోళ్లకు కోట్లు.. కొన్నోళ్లకు పాట్లు!

◆ 175 ఎకరాల ప్రభుత్వ భూముల్లో లేఅవుట్లు
◆ స్వాధీనానికి అధికార యంత్రాంగం ఏర్పాట్లు

గత వైకాపా పాలనలో అధికారులు, పాలకులు కుమ్మక్కయ్యారు. ఆడిందే ఆటగా..పాడిందే పాటగా భూదందాలు సాగించారు. దొంగ పట్టాలు సృష్టించి కనిగిరితోపాటు సమీప ప్రాంతాల్లోని ప్రభుత్వ, అసైన్డ్, పశువులబీడు భూములను ఆక్రమించారు. వీటిల్లో అనధికార లేఅవుట్లు వేసి ప్లాట్లు విక్రయించారు. ఈ నేపథ్యంలో ఇటీవల ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అసెంబ్లీలో కనిగిరి చుట్టుపక్కల ప్రాంతాల్లో ఆక్రమించిన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలని కోరడంతో క్రయ, విక్రయదారుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. - న్యూస్‌టుడే, కనిగిరి

కనిగిరి-పామూరు రోడ్డులోని అసైన్డ్ భూముల్లో వేసిన లేఅవుట్

అధికారాన్ని అడ్డం పెట్టుకుని...

గత వైకాపా ప్రభుత్వంలో అధికారాన్ని అడ్డం పెట్టుకుని అప్పటి వైకాపా నాయకులు అక్రమాలకు తెరలేపారు. కనిగిరి పురపాలక, మండలంతోపాటు పామూరు తదితర ప్రాంతాల్లో జాతీయ రహదారికిరువైపులా ఉన్న 175 ఎకరాల ప్రభుత్వ భూములను ఆక్రమించారు. వీటిల్లో లేఅవుట్లు వేసి దాదాపు 500కుపైగా ప్లాట్లు విక్రయించడం ద్వారా సుమారు రూ.150 కోట్లకుపైగా దోచుకున్నారు. వీటికి ప్రభుత్వపరంగా ఎలాంటి అనుమతులు లేకపోవడం, ఎమ్మెల్యే స్వయంగా స్వాధీనం చేసుకోవాలని కోరడంతో ఇటు కొనుగోలుదారుల్లో ఆందోళన నెలకొనగా, అటు విక్రయదారుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.

ఎమ్మెల్యే వద్దకు బాధితులు

ప్రభుత్వ, అసైన్డ్, పశువుల బీడు భూములు ఆక్రమించి లేఅవుట్లు వేసి ప్లాట్లు విక్రయించేసినా అధికార యంత్రాంగం ఏమాత్రం పట్టించుకోలేదు. మరో వారంలో రెవెన్యూ, పురపాలకశాఖ యంత్రాంగం ఆయా భూములను తిరిగి స్వాధీనం చేసుకునేందుకు సిద్ధమవుతుండడంతో ప్లాట్లు కొనుగోలు చేసినవారు ఏం చేయాలో అర్థం కాక లబోదిబో మంటున్నారు. ఇప్పటికే వీరందరూ పలుమార్లు ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డిని కలిశారు. ప్లాట్లు విక్రయించిన అక్రమార్కులపై పోలీస్‌స్టేషన్‌లో కేసులు పెట్టాలని, నగదు వెనక్కి తీసుకోవాలని సూచించారు. ఈ విషయమై ఆర్డీవో జి.కేశవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుంటామని, ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

మాపై కరుణ చూపరూ?

• స్వయం ఉపాధి రుణాలకు లబ్ధిదారుల ఎదురుచూపులు
• బ్యాంకర్లు ఆమోదించినా రాయితీ విడుదలలో జాప్యం

న్యూస్‌టుడే, ఒంగోలు కలెక్టరేట్

బీసీ కార్పొరేషన్ ద్వారా జిల్లాలోని బీసీ, ఈడబ్ల్యూఎస్, కాపు, మేదర, కుమ్మరి, శాలివాహన తదితర సామాజిక వర్గాలకు చెందిన పేదలకు స్వయం ఉపాధి నిమిత్తం 2024-25 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం యూనిట్లు మంజూరు చేసింది. అయిదేళ్ల అనంతరం యూనిట్లు మంజూరు కావడంతో దరఖాస్తులు అధిక సంఖ్యలోనే వచ్చాయి. మంజూరైన యూనిట్లకు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తి చేసి బ్యాంకర్ల ద్వారా రుణ మంజూరు పత్రాలు కూడా ఇచ్చారు. నేటికీ వాటి గ్రౌండింగ్ కాలేదు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రాయితీ నగదు విడుదల కాక పోవడంతో పది నెలలకుపైగా లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు.

2,069 యూనిట్లు... 12,675 దరఖాస్తులు...

2019-24 మధ్య వైకాపా ప్రభుత్వ పాలనలో ఈబీసీలకే కాదు... ఎస్సీ, ఎస్టీ, బీసీలతోపాటు అగ్రవర్ణ పేద వర్గాలకు ఒక్క స్వయం ఉపాధి యూనిట్ కూడా మంజూరు చేయలేదు. దీంతో ఆయా వర్గాల యువత ఉపాధి యూనిట్ల మంజూరు నిమిత్తం ప్రైవేటు వ్యాపారులు లేదా వాణిజ్య బ్యాంకులను ఆశ్రయించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎన్నికల హామీల్లో భాగంగా కార్పొరేషన్లను గాడిలో పెట్టేందుకు ప్రణాళిక చేసింది. ఇందులో భాగంగా వెనుకబడిన తరగతుల (బీసీ) ప్రజలకు వెన్నుదన్నుగా ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం బీసీ కార్పొరేషన్ ద్వారా బీసీలతోపాటు అగ్రవర్ణ పేదలకు కూడా జీవనోపాధుల నిమిత్తం రాయితీపై బ్యాంకు లింకేజీ కింద కోట్లాది రూపాయలు రుణాల రూపంలో ఇవ్వాలని నిర్ణయించింది. ఈ మేరకు 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఉమ్మడి ప్రకాశం జిల్లాకు 2,069 యూనిట్లు...రూ.49.65 కోట్లు మంజూరు లక్ష్యంగా నిర్ణయించారు. అందుకు రెండు నెలలపాటు దరఖాస్తులు స్వీకరించగా మొత్తం 12,675 వచ్చాయి. లబ్ధిదారుల ఎంపిక విషయంలో తీవ్ర పోటీ నెలకొనడంతో స్థానిక ఎమ్మెల్యేలు సైతం సిఫార్సులు చేశారు.

1,070 మందికి బ్యాంకు రుణం

2024లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆర్థికంగా వెనుకబడిన అన్ని సామాజిక వర్గాల పేదలకు రాయితీ రుణాలు అందించే క్రమంలో ఆరు రంగాలను ప్రాధాన్యంగా తీసుకుంది. మహాత్మ జ్యోతిబాపూలే జయంతిని పురస్కరించుకుని గతేడాది ఏప్రిల్ 11న ఒంగోలులోని కలెక్టరేట్‌లో స్వయం ఉపాధి యూనిట్ల మెగా గ్రౌండింగ్ మేళా నిర్వహించారు. ఆ రోజున తొలి దశగా జిల్లాలోని 611 మందికి స్వయం ఉపాధి యూనిట్ల కింద రూ.16.24 కోట్ల మేర మంజూరు చేసినట్లు ప్రకటించారు. ఆ తర్వాత ఎంపిక చేసిన వారితో కలిపి మొత్తం 1,070 మందికి రూ.32.64 కోట్లు మంజూరుకు బ్యాంకర్లు ఆమోదించారు. మార్గదర్శకాల మేరకు రాయితీ 40 శాతం ఇవ్వనున్నట్లు ప్రకటించారు. ఇంతవరకు ప్రభుత్వం నుంచి రాయితీ మొత్తం విడుదల కాలేదు. మరోపక్క నిరుద్యోగులు తమకు యూనిట్లు ఎప్పుడిస్తారంటూ మండల కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

• ఒక్క నిమిషం అలస్యమైనా అనుమతించరు

న్యూస్‌టుడే, ఒంగోలు నగరం, మద్దిపాడు

పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులు

ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షలు సోమవారం ప్రారంభం కానున్నాయి. తొలిరోజు జూనియర్ ఇంటర్, మరుసటి రోజు సీనియర్ ఇంటర్ విద్యార్థులకు పరీక్షలు నిర్వహించేవిధంగా షెడ్యూలు ప్రకటించారు. ఈ సారి ప్రతిష్ఠాత్మకంగా పరీక్షలు నిర్వహించేందుకు ఇంటర్మీడియట్ బోర్డు ఏర్పాట్లు చేసింది. జూనియర్ ఇంటర్ విద్యార్థులు మారిన సిలబస్‌తో తొలిసారిగా పరీక్షలు రాయబోతున్నారు. నమూనా ప్రశ్నాపత్రాలు, పాఠ్యాంశాల బోధనపై ముందుగానే అధ్యాపకులకు శిక్షణ ఇచ్చారు. నూరు శాతం ఉత్తీర్ణత సాధనే లక్ష్యంగా 50 రోజులు ప్రణాళిక అమలు చేశారు. ఈ సారి పరీక్షల విధానంలోనూ మార్పులు చేశారు. గతంలో ఇక్కడ అధికారులే ఇన్విజిలేటర్లు, ఇతర సిబ్బందిని నియమించేవారు. ప్రస్తుతం బోర్డు నుంచే ఉత్తర్వులు జారీ చేశారు. పరీక్షల పర్యవేక్షణకు ఒక అబ్జర్వర్‌ను నియమించారు. సమస్యాత్మక కేంద్రాల్లో సిటింగ్ స్క్వాడ్‌లు, ఇతర చోట్ల ఫ్లయింగ్ స్క్వాడ్‌ల నిఘా ఉంటుంది. ప్రతి కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఆర్ఐవో, ఇంటర్మీడియట్ బోర్డు కార్యాలయాలకు వాటిని అనుసంధానం చేశారు.

42,759 మంది విద్యార్థులు: ఈ ఏడాది 22,275 మంది జూనియర్, 20,484 మంది సీనియర్ ఇంటర్ విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఇందుకోసం మొత్తం 67 కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటిలో 28 ప్రభుత్వ కళాశాలలు కాగా, మిగిలినవి ప్రైవేటు కళాశాలల్లో ఏర్పాటు చేశారు. పీఈటీలు, క్రాఫ్ట్ టీచర్లు, డ్రాయింగ్, మ్యూజిక్ ఉపాధ్యాయులను ఇన్విజిలేటర్లుగా నియమించారు. ప్రైవేటు కళాశాల కేంద్రాల్లో అక్కడి బోధకులను ఇన్విజిలేటర్లుగా నియమించారు. జంబ్లింగ్ పద్ధతిలో విద్యార్థులను కేంద్రాలకు కేటాయించారు. సోమవారం మొదలయ్యే పరీక్షలు మార్చి 24వ తేదీ వరకు కొనసాగుతాయి.

ఏర్పాట్లు పూర్తిచేశాం: పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు ఆర్ఐవో కె.ఆంజనేయులు తెలిపారు. తాగునీరు, ప్రథమ చికిత్స, కేంద్రాలు ఉన్న రూట్లలో పరీక్ష సమయాల్లో బస్సులు తదితర సౌకర్యాలు కల్పించామన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష జరుగుతుందని, విద్యార్థులు గంట ముందుగా కేంద్రాలకు చేరుకోవాలన్నారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా కేంద్రాల్లోకి అనుమతించబోమని స్పష్టం చేశారు.

కొత్త ఆలోచన పండించారు!

కందుకూరు మండలం గుడ్లూరు గ్రామానికి చెందిన రైతు రామాల నారపరెడ్డి ట్రాక్టర్‌తో వ్యవసాయ పనులు చేసే సమయంలో అనేక ఆటుపోట్లు ఎదుర్కొన్నారు. ఎద్దులతో చేయాలంటే సమయం, కష్టంతో కూడిన పని కావడంతో వినూత్నంగా ఆలోచించారు. ఖర్చుతోపాటు సమయం ఆదా చేయడంతోపాటు మూడు రకాల పనులు (గొర్రు, గుంటకి, ఎరువులు ఎదపెట్టడం) ఒకేసారి చేసేవిధంగా గొర్రుఅడ్డను ఎత్తు పెంచి మొక్కలకు తగలకుండా ఉండేలా చేయించారు. దీనిపైనే ఎరువులు ఎదపెట్టేలా చేసి అందులో పీవీసీ పైపుతో సొంతంగా తయారు చేసిన జల్లెడ, లివర్‌ను ఏర్పాటు చేశారు. ట్రాక్టర్‌కు ముందు భాగంలో ఎత్తు పెంచి సన్నటైర్లను ఏర్పాటు చేశారు. ట్రాక్టరుకు అదనంగా సుమారు రూ.1.50 లక్షల వరకు ఖర్చు చేశారు. దీంతో రోజుకు కనీసం పదెకరాల్లో సేద్యం చేస్తున్నారు. ఎద్దులతో మూడు ఎకరాలకు మించి చేయలేమని, దీంతో ఈ విధానంను ఆలోచించినట్లు తెలిపారు.
- న్యూస్‌టుడే, కందుకూరు గ్రామీణం

శిథిల వంతెన.. నరక యాతన

జాతీయ రహదారి నుంచి ప్రముఖ పుణ్యక్షేత్రం శింగరకొండ, అద్దంకి చేరుకోవడానికి ముప్పవరం వద్ద ఎన్ఎస్‌పీ కాలువపై నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారింది. వంతెనకు సమీపంలో ప్రమాదకర మలుపులో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. వంతెన ఇరుకుగా ఉండడం, రక్షణ గోడలు లేకపోవడంతో రాత్రి వేళల్లో రాకపోకలు సాగించేందుకు వాహనచోదకులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ విషయమై ఆర్అండ్‌బీ ఏఈ శివన్నారాయణ మాట్లాడుతూ హైలెవల్ వంతెన నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని, నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడతామని తెలిపారు. -న్యూస్‌టుడే, అద్దంకి, జె.పంగులూరు

స్వార్థ రాజకీయాలకు స్వామిని వాడుకుంటారా?

మాట్లాడుతున్న మంత్రి స్వామి, పక్కన ఎమ్మెల్యేలు దామచర్ల, ఉగ్ర

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: మీ స్వార్థ రాజకీయాలకు వేంకటేశ్వర స్వామిని వాడుకుంటారా? దేవుడితో ఆటలాడితే వైకాపా తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి విమర్శించారు. ఒంగోలులోని తెదేపా కార్యాలయంలో ఆదివారం ఆయన ఒంగోలు, కనిగిరి ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, కూటమి నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో అప్పటి సీఎం జగన్ తన చిన్నాన్న వైవీ.సుబ్బారెడ్డిని తితిదే ఛైర్మన్‌గా నియమించి అనేక అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. శాసన మండలిలో చెప్పులు వేసుకుని వేంకటేశ్వరస్వామి పటం తీసుకురావడం పద్ధతి కాదని, రూలింగ్ కాదని సభ వాయిదా వేసి వెళ్లినప్పటికీ వైకాపా సభ్యులు గొడవలు సృష్టించినట్లు దుయ్యబట్టారు. వైకాపా నాయకులు చేసిన తప్పులకు క్షమాపణలు చెప్పకపోగా, సిగ్గులేకుండా హెరిటేజ్‌పై బురద జల్లుతారా అని మంత్రి ప్రశ్నించారు.

నిమ్మ.. ధర అదిరిందమ్మా

నిమ్మ ధరలు ఒక్కసారిగా పెరగడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కిలో ధర రూ.30 నుంచి రూ.75కు ఎగబాకడంతో గత వారం రోజులుగా కోతలు మొదలయ్యాయి. నిమ్మ దిగుబడులు తగ్గుముఖం పట్టడంతోనే ధరలు పెరిగినట్లు రైతులు, వ్యాపారులు చెబుతున్నారు. రెండు నెలల కిందట భారీగా దిగుబడులతో కిలో ధర రూ.5కు పడిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. జిల్లాలోని హనుమంతునిపాడు మండలంలో సుమారు 2 వేల హెక్టార్లలో నిమ్మ తోటలు సాగవుతున్నాయి. చెన్నై, గుజరాత్, మహారాష్ట్ర, తెలంగాణా తదితర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు..కాయ నాణ్యతతో ఉండి భారీగా దిగుబడులు వచ్చిన సమయంలో ధర లేదని, ప్రస్తుతం ధరలున్నా పెద్దగా ఉపయోగం లేదని రైతులు వాపోతున్నారు. కనిగిరిలో శీతల గిడ్డంగులు ఏర్పాటు చేస్తే ధర ఉన్నరోజు మార్కెట్‌కు తరలించే సౌకర్యం ఉంటుందని రైతులు కోరుతున్నారు.
- న్యూస్‌టుడే, హనుమంతునిపాడు

నేడు కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 10 గంటలకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)తోపాటు రెవెన్యూ క్లినిక్‌ను నిర్వహించనున్నట్లు కలెక్టర్ పి.రాజాబాబు ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారుల తమ సమస్యల పరిష్కార నిమిత్తం మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని ఆయన కోరారు.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : సోమ సా.6-22
సహరీ : మంగళ ఉ.5-10

కార్పొరేట్ వైద్యం.. పేదలకు దూరం

◆ రెండేళ్లుగా నిలిచిపోయిన ప్రభుత్వ వైద్యకళాశాల భవనాలు

న్యూస్‌టుడే, మార్కాపురం

రాయవరంలో అసంపూర్తిగా నిలిచిపోయిన వైద్య కళాశాల భవన సముదాయం

పేదలకు కార్పొరేట్ వైద్యం అందని ద్రాక్షగా మారింది. గ్రామీణ ప్రజలకు అధునాతన వైద్యసేవలందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం మార్కాపురంలో ప్రభుత్వం వైద్య కళాశాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంది. గత రెండేళ్లుగా వైద్య కళాశాల భవన సముదాయం నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయింది. మార్కాపురం మండలం రాయవరం గ్రామశివారులోని 53 ఎకరాల్లో వైద్యకళాశాలతోపాటు సూపర్ స్పెషాలిటీ వైద్యశాల, విద్యార్థుల వసతి గృహాలు, క్యాంటీన్ల నిర్మాణ పనులకు గత ప్రభుత్వం రూ.475 కోట్లు మంజూరు చేసింది. 2022లో ప్రారంభమైన నిర్మాణ పనుల్లో కళాశాల తరగతి భవనాలు, విద్యార్థినీ, విద్యార్థులకు వేర్వేరుగా వసతి గృహాలు, సెంట్రల్ క్యాంటీన్ నిర్మాణం చేపట్టారు. ఈ పనులు పైకప్పు వరకు పూర్తి కాగా, సూపర్ స్పెషాలిటీ వైద్యశాల భవనాలు పునాదుల దశలోనే నిలిచిపోయాయి. 2024, జూన్ నాటికి 28 శాతం మేర పనులు పూర్తయ్యాయి. ఈ పనులకు రూ.90 కోట్ల వరకు ఖర్చు పెట్టగా, గుత్తేదారు సంస్థకు ఇప్పటివరకు రూ.75 కోట్లు బిల్లుల రూపంలో చెల్లించారు. అనంతరం గుత్తేదారు సంస్థ పనులు పూర్తిగా నిలిపేసి వెళ్లిపోయింది. మరోపక్క కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం గతేడాది మంత్రివర్గ సమావేశంలో మార్కాపురం వైద్యకళాశాలను పీపీపీ విధానంలో నిర్మించేందుకు ఆమోద ముద్ర పడింది. ఇందుకు టెండర్లు పిలిచి ఏడాదవుతున్నా ఒక్కటీ దాఖలు కాకపోవడం గమనార్హం.

భూమి పూజ కార్యక్రమ మహోత్సవ ఆహ్వానం
CA INDIA
THE INSTITUTE OF CHARTERED ACCOUNTANTS OF INDIA
(Setup by on Act of Parliament)
ONGOLE BRANCH (SIRC)
తేది: 23-02-2026న సోమవారం ఉ॥8.30ని॥లకు
స్థలం: రామ్‌నగర్ ।వ లైన్, ఒంగోలు
ముఖ్య అతిధి: శ్రీ CA. ప్రసన్నకుమార్.D గారు
ప్రెసిడెంట్, ICAI

విశిష్ట అతిధి: శ్రీ CA. ముప్పాల సుబ్బారావు గారు, ఛైర్మన్ SIRC
CA. I K గుప్త అండ్ కో, ఒంగోలు
CA. కూరపాటి సుబ్బారావు, ఒంగోలు
CA. బాల గ్రంథే, ఒంగోలు
CA. CH వెంకటేశ్వర్లు, కందుకూరు
CA. D శంకరరావు, CA. D L సౌజన్య, ఒంగోలు
CA. K రాజేంద్రప్రసాద్, ఒంగోలు
CA. U వరప్రసాదరావు, ఒంగోలు
CA. PV రంగనాథం, ఒంగోలు
CA. RLN రామప్రసాద్, ఒంగోలు
CA. K అంజనీదేవి, ఒంగోలు
CA. M సత్యనారాయణ, ఒంగోలు
CA. P శ్రీమన్నారాయణమూర్తి, చీరాల
CA.CH తిరువాయుకుమార్, ఒంగోలు
CA. B జగన్‌మోహన్‌రావు, ఒంగోలు
CA. మండవ వెంకటవిజయకుమార్, ఒంగోలు
CA. తాతా కేశవరావు, ఒంగోలు
CA. CH మురళీకృష్ణ, ఒంగోలు
CA. N వెంకటరావు, ఒంగోలు
CA. V వెంకటేశ్వరరావు, చీరాల
CA. V శ్రీనివాసరావు, రాజంపల్లి, దర్శి
CA. V శంకర్‌నరేంద్రకుమార్, ఒంగోలు
CA. P లక్ష్మి, టంగుటూరు
CA. K హరిబాబు, కందుకూరు
CA. T వినోద్, ఒంగోలు
CA. పబ్బిశెట్టి కార్తీక్, CA. పబ్బిశెట్టి పేరిందేవి, ఒంగోలు
CA. గ్రంథే సుధీర్, ఒంగోలు
CA. CH ప్రేమ్‌కుమార్, ఒంగోలు
CA. K కృష్ణకిషోర్, ఒంగోలు
CA. అజయ్‌రఘురామ్, మార్కాపురం
CA. K రంగనాయకులు, ఒంగోలు
CA. దామా సతీష్, అద్దంకి
CA. స్వామిరెడ్డి M.V, ఒంగోలు
CA. M/S బ్రహ్మారెడ్డి & కంపెనీ, ఒంగోలు
CA. పచ్చిపులుసు లక్ష్మీనారాయణ, ఒంగోలు
CA. కొత్తమాసు ఫణితేజ, ఒంగోలు
CA. J శ్రీనివాసరెడ్డి, ఒంగోలు
CA. K సరస్వతి, ఒంగోలు
CA. మద్దిశెట్టి రాజేష్, ఒంగోలు
CA. బాలమురళీకృష్ణ, ఒంగోలు
CA. జమ్ము రవి, ఒంగోలు
CA. P స్వాతికిరణ్, ఒంగోలు
CA. G మల్లిఖార్జునరెడ్డి, ఒంగోలు
CA. రావిపాటి శ్రీహరి, ఒంగోలు
CA. ఉప్పాతి రమణారెడ్డి, ఒంగోలు
CA. M వెంకటసుబ్రమణ్యం, కోర్టుసెంటర్, ఒంగోలు
CA. T కావేరి, ఒంగోలు
CA. గూడా మల్లిఖార్జునరావు, ఒంగోలు
CA. ముప్పరాజు శ్రీజ, ఒంగోలు
CA. G అంజిరెడ్డి, ఒంగోలు
CA. J యోగిరమణారెడ్డి, ఒంగోలు
CA. జశ్వంత్, ఒంగోలు
CA. అశోక్&శ్రీహరి అసోసియేట్స్, ఒంగోలు
CA. సూర్యపవన్, ఒంగోలు

(c) eenadu

కాటంరాజుకు ప్రత్యేక పూజలు

అలంకరణలో స్వామి

పెద్దారవీడు, న్యూస్‌టుడే: గుండంచర్ల సమీపంలోని నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన కాటంరాజుకు గంగాభవానీ అమ్మవారి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాటంరాజును సుందరంగా అలంకరించారు. గంగాభవానీ అమ్మవారికి బోనాలు సమర్పించి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం ఏర్పాటు చేశారు.

స్వామికి పూజలు చేస్తున్న వేదపండితులు

నయన మనోహరం.. లక్ష్మీనారాయణుని కల్యాణం

మార్కాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని జవహర్‌నగర్ కాలనీలో గల శ్రీదేవీ భూదేవీ సమేత అమలక లక్ష్మీనారాయణస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివార్ల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించినట్లు దేవస్థాన కమిటీ సభ్యులు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి దంపతులు కల్యాణ సేవలో పాలుపంచుకున్నారు. సాయంత్రం విష్ణు సహస్రనామ పారాయణం, అనంతరం గరుడోత్సవం మహిళామణుల కోలాటనృత్యాల మధ్య ఆహ్లాదకర వాతావరణంలో సాగింది. భక్తులకు అసౌకర్యం కలగకుండా కమిటీ అధ్యక్ష కార్యదర్శులు గోళ్ల వరలక్ష్మి, వెంకటరెడ్డి, సత్యనారాయణరెడ్డి, తదితరులు తగు జాగ్రత్తలు తీసుకున్నారు.

మాట్లాడుతున్న వ్యవసాయ, కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దడాల సుబ్బారావు

పరిశ్రమలు రావాలి.. ఉపాధి దక్కాలి

❖ మార్కాపురం జిల్లా అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి అవసరం ❖ సీఎం చంద్రబాబుకు జిల్లా ప్రజల విజ్ఞప్తి

న్యూస్‌టుడే, త్రిపురాంతకం:

కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పరిపాలన సౌలభ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పశ్చిమ ప్రకాశాన్ని విభజించి మార్కాపురం కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పాటు చేసింది. దీంతో జిల్లా యువతలో ఉపాధి అవకాశాలపై కొత్త ఆశలు నెలకొన్నాయి.

మార్కాపురం జిల్లా కేంద్రం

చిన్న, మధ్య తరహాలకు ప్యాకేజీలు తప్పనిసరి

మార్కాపురం జిల్లాలో పరిశ్రమల స్థాపనకు అనుకూల పరిస్థితులు ఉన్నాయి. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం జిల్లాలో భూములను కేటాయించి ప్రత్యేక పరిశ్రమలు ఏర్పాటుకు ముందడుగు వేయాలి. స్థానిక యువత పారిశ్రామిక రంగంలో అడుగుపెట్టేలా చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలంగా

జిల్లా : మార్కాపురం ఏర్పడిన తేదీ:31.12.2025	
భౌగోళిక విస్తీర్ణం:	6001 చ.కి.మీ.
నియోజకవర్గాలు:	4
రెవెన్యూ డివిజన్‌లు:	2
మున్సిపాలిటీలు:	4
మండలాలు:	21
జిల్లాలోని మొత్తం కుటుంబాలు:	3,74,914
జనాభా:	11,42,000

మార్కాపురం జిల్లాకు ప్రత్యేక పారిశ్రామిక ప్యాకేజీతో పాటు పన్ను రాయితీలు ప్రకటించాలి. అభివృద్ధికి బాటలు వేసేలా.. మొదటి సారిగా మార్కాపురం జిల్లాకు రానున్న ముఖ్యమంత్రి చంద్రబాబు జిల్లాపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజానీకం కోరుతున్నారు.

ఆర్థిక పురోగతికి మార్గం..

నూతన జిల్లా ఏర్పాటుతో పరిపాలనా సౌకర్యాలు పెరిగినప్పటికీ.. ఆర్థిక పురోగతి మాత్రం పరిశ్రమల ద్వారానే సాధ్యమవుతుందని చెప్పవచ్చు. మార్కాపురం జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు విస్తారమైన భూములు సహజ వనరులు ఉన్నాయి. ముఖ్యంగా ఈ జిల్లా నుంచి 3 జాతీయ రహదారులు రాజధానికి అనుసంధానంగా ఉన్నాయి. అందులో ప్రధానంగా జిల్లా కేంద్రమైన మార్కాపురం మీదుగా అనంతపురం-అమరావతి జాతీయ రహదారి ఉంది. ఇది కర్నూలు, కడప, అనంతపురం ప్రాంతాల నుంచి విజయవాడ వెళ్లే వాహనాల రాకపోకలకు ప్రధాన రహదారిగా ఉంది. దీని ద్వారా పరిశ్రమలు, వ్యాపారాలకు సంబంధించిన ముడి సరకుల రవాణా, వస్తువుల సరఫరాకు అనువైన మార్గాలు బలంగా ఉన్నాయి.

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, శీతల గిడ్డంగులు

మార్కాపురం జిల్లాకే తలమానికంగా ఉన్న వెలిగొండ ప్రాజెక్ట్ పూర్తయితే జిల్లాలోని బీడు భూములు సైతం సస్యశ్యామలంగా మారతాయి. ప్రభుత్వ సహకారం, సబ్సిడీలతో జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, పాల ఉత్పత్తుల పరిశ్రమలు, శీతల గిడ్డంగులతో పాటు వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేందుకు అవకాశాలున్నాయి.

వక్తృత్వ జిల్లా స్థాయి పోటీలు

విజేతకు జ్ఞాపిక అందజేస్తున్న జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులు

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక పేస్ ఇంజినీరింగ్ కళాశాలలో వక్తృత్వ జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారు. మండల స్థాయిలో విజేతలుగా నిలిచిన 160 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. కార్యక్రమానికి రాష్ట్ర కార్యదర్శి కంచర్ల వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. పేస్ కళాశాల కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జనవిజ్ఞానవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ వి.బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ వక్తృత్వ కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నామన్నారు. తక్కువ సమయంలో సులభంగా, స్పష్టంగా మాట్లాడటాన్ని ప్రోత్సహించడం లక్ష్యమన్నారు. ఈ పోటీల్లో మద్దిపాడు నాగార్జున స్కూలు విద్యార్థిని పీవీ సాయిపల్లవి (ప్రథమ), అమ్మనబ్రోలు ఏపీ రెసిడెన్షియల్ స్కూలు విద్యార్థిని కె. శిలోమా (ద్వితీయ), అమ్మనబ్రోలు సాయి స్కూలు విద్యార్థి సిరిచందన తృతీయ స్థానాల్లో నిలిచారు. మార్కాపురం జిల్లా నుంచి రాచర్ల స్పందన స్కూలు విద్యార్థిని పి.లహరి (ప్రథమ) బేస్తవారిపేట జెడ్పీ స్కూలు విద్యార్థిని దివ్యలక్ష్మి (ద్వితీయ) పామూరు సెయింట్ మార్క్స్ స్కూలు విద్యార్థి సాయిశంకర్ తృతీయ బహుమతి సాధించారు. విజేతలకు పుస్తకాలు, ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. కొల్లా పుల్లయ్య, కోటేశ్వరరావు, సుందరరావు పేర్లమీద వారి కుటుంబ సభ్యులు విజేతలకు ట్యాబ్‌లు అందజేశారు. రాష్ట్రస్థాయి పోటీలు 27, 28వ తేదీల్లో గుంటూరులో జరుగుతాయని వెల్లడించారు. కార్యక్రమంలో డాక్టర్ కొల్లా నాగేశ్వరరావు, కె.శ్రీనివాసులు, మధు, సుబ్బారావు, గయాజ్ తదితరులు పాల్గొన్నారు.

పోలెండ్‌లో ఘనంగా వెంకన్న విగ్రహ ప్రతిష్ఠ

వేంకటేశ్వరస్వామి విగ్రహం

సంతమాగులూరు, న్యూస్‌టుడే: పోలెండ్ రాజధాని వార్సాలో కలియుగ దైవం వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించారు. ఈ మేరకు శనివారం నాడు వేడుకలు నిర్వహించినట్లు ప్రవాసాంధ్రుడు, సంతమాగులూరు మండలం వెల్లలచెరువుకు చింతా శ్రీకాంత్‌బాబు ఆదివారం తెలిపారు. సొంత నిధులు రూ.15 లక్షలతోపాటు అక్కడి తెలుగు వారి సహకారంతో 4.3 అడుగుల ఎత్తైన విగ్రహాన్ని రూపొందించి ప్రతిష్ఠాపన వేడుక నిర్వహించినట్లు చెప్పారు. చుట్టుపక్కల నగరాల నుంచి 1500 మందికి పైగా తెలుగువారు హాజరయ్యారన్నారు.

నేడు ఐసీఏఐ నూతన భవనానికి భూమిపూజ

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: స్థానిక రామనగర్ మొదటి లైన్‌లో ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) నూతన భవన నిర్మాణానికి సోమవారం ఉదయం 8.30 గంటలకు భూమిపూజ జరగనుంది. ఐసీఏఐ అధ్యక్షులు ప్రసన్నకుమార్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని ఒంగోలు బ్రాంచి ఛైర్మన్ చక్కా తిరువాయుకుమార్ తెలిపారు.

జిల్లా వీఆర్వోల సంఘం నూతన కమిటీ ఎన్నిక

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లా ఏపీ డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం జిల్లా నూతన కమిటీని ఒంగోలులోని ఏపీటీఎఫ్ భవన్‌లో ఆదివారం జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా ఎస్.నారపరెడ్డి, అధ్యక్షుడిగా బి.సుధాకర్, సహాధ్యక్షుడిగా సీహెచ్.బ్రహ్మతేజ రాజు, ఉపాధ్యక్షులుగా లక్ష్మయ్య, బి.రాజశేఖర్‌రెడ్డి, బి.అశోక్; ప్రధాన కార్యదర్శిగా సీహెచ్.వంశీకృష్ణ యాదవ్, ఎన్నికయ్యారు. సంయుక్త కార్యదర్శులుగా ఐ.ప్రశాంత్, వై.అంకమ్మ, కె.అమృతలీల; కోశాధికారిగా జి.యలమందరావు, కార్యనిర్వాహక కార్యదర్శులుగా బి.మహేంద్రరెడ్డి, మహిళా అధ్యక్షురాలుగా శ్రీలక్ష్మి, డి.మౌనికతోపాటు, కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులను అభినందించారు.

నూతన కమిటీ కార్యవర్గ సభ్యులు

కార్పొరేట్ శక్తుల ప్రయోజనాలే మోదీ లక్ష్యం

ఒంగోలు గ్రామీణం: దేశంలోని కార్పొరేట్ శక్తుల ప్రయోజనాలను కాపాడేందుకే మోదీ ప్రభుత్వం అమెరికాకు దాసోహంగా ఉంటుందని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దడాల సుబ్బారావు విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే తవనం చెంచయ్య వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక ఎల్‌బీజీ భవన్‌లో ఆదివారం 'సామ్రాజ్యవాదం నిన్న-నేడు' అంశంపై సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అంబానీ, ఆదాని లాంటి బడా కార్పొరేట్లకు దేశంలోని సహజ వనరులు, ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రజా సంపదనంతా మోదీ ప్రభుత్వం కట్టబెడుతుందని మండిపడ్డారు. సంఘం జిల్లా కార్యదర్శి ఆంజనేయులు మాట్లాడుతూ.. మాజీ ఎమ్మెల్యే తవనం చెంచయ్య తన జీవితమంతా అంటరానితనం నిర్మూలన; అణగారిన వర్గాలపై దాడులు అంతం కోసం పోరాడారని కొనియాడారు.

వేట కరవై.. బతుకు భారమై

కందుకూరు, గుడ్లూరు, ఉలవపాడు, న్యూస్‌టుడే: రామాయపట్నం ఓడరేవు నిర్మాణంతో గ్రామాలు కోల్పోయి పునరావాస కాలనీల్లో ఉంటున్న మహిళలకు ఉపాధి కరవై ఇబ్బందులు పడుతున్నారు. గుడ్లూరు మండలం ఆవులవారిపాలెం, మొండివారిపాలెం గ్రామాలకు చెందిన సుమారు 300 కుటుంబాలకు తెట్టు మార్గంలో రెండేళ్ల కిందట పునరావాస కాలనీలు నిర్మించారు. ◗ కాలనీలకు రాకముందు చేపలవేట ప్రధానంగా ఉండేది. పురుషులు సముద్రంలో వేటకు వెళ్లి తీసుకొచ్చిన మత్స్య సంపదను మహిళలు గ్రామాలు, పట్టణాల్లో అమ్మకాలు చేసేవారు. దీంతో రోజుకు సుమారు రూ.500 వరకు ఆదాయం వచ్చేది.◗ పునరావాస కాలనీలకు వచ్చాక వేట తగ్గిపోయింది. పురుషుల ఆదాయ మార్గాలు మూసుకుపోయాయి. దీంతో మహిళలకు సైతం జీవనం కష్టంగా మారింది. ఉపాధి పనులు కొంత మేర ఆదుకుంటున్నా.. అవి లేనప్పుడు ఖాళీగా ఉండాల్సి వస్తోందని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు

సముద్రం దూరమైంది

పునరావాస కాలనీలకు వచ్చాక పురుషులు వేటకు వెళ్లాలంటే సముద్రం దూరమైంది. దీంతో పాటు తెప్పలు పెట్టుకునేందుకు సైతం చోటు లేకుండా పోయింది. చేసేందుకు ఇతర పనులేమీ లేవు. ఏం చేయాలో తోచడం లేదు. జీవనం కష్టంగా మారింది. ఉపాధి పనులు ఎక్కువ రోజులు కల్పించి ఆదుకోవాలి.

–వి.లక్ష్మీకాంతమ్మ, ఆవులవారిపాలెం

జీవన భృతి ఇవ్వలేదు

ఓడరేవు నిర్మాణ సమయంలో పునరావాస కాలనీలకు వచ్చాక కొన్ని రోజుల పాటు జీవన భృతి కింద నగదుతో పాటు బియ్యం ఇస్తామన్నారు. కానీ తమకు ఎటువంటి సహాయం అందలేదు. నెలలో కనీసం పది రోజులు కూడా పనులు దొరకడం కష్టంగా మారింది. –వి.నాగరత్నమ్మ, ఆవులవారిపాలెం

ఖాళీగా ఉంటున్నాం

రెండేళ్లుగా ఉపాధి లేక ఖాళీగా ఉంటున్నాం. బతుకు దెరువుకు అష్టకష్టాలు పడుతున్నాం. పిల్లల పోషణ భారంగా మారింది. ప్రభుత్వం తమను ఆదుకోవాలి.

–కె.మంగమ్మ, మొండివారిపాలెం

పథకంలో మార్పు చేయడంతో ఆలస్యమైంది

ఆవులవారిపాలెం, మొండివారిపాలెం పునరావాస కాలనీల వారికి ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకుంటాం. పథకంలో మార్పు చేయడంతో ఆలస్యమవుతోంది. పనులు గుర్తిస్తున్నాం.

–వెంకటేశ్వర్లు, ఏపీవో, ఉపాధి హామీ పథకం

రెండో సొరంగంలోంచి తొలి సొరంగంలోకి ఆరు రంధ్రాలు

రెండో సొరంగం నుంచి తొలి సొరంగంలోకి తవ్విన దారి

పెద్దదోర్నాల, న్యూస్‌టుడే: పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టులో రెండు సమాంతర సొరంగాల నిర్మాణం ప్రధానమైది. వాటిలో తొలి సొరంగం నిర్మాణం పూర్తయింది. ప్రస్తుతం రెండో సొరంగంలో లైనింగ్ పనులు జరుగుతున్నాయి. ఆ సొరంగంలో 11 కి.మీ వద్ద టీబీఎం (టన్నెల్ బోరింగ్ యంత్రం) ఉంది. దీంతో మిగిలిన 8 కి.మీలు తవ్వకం, లైనింగ్ పని నిర్వహణకు ఇబ్బందులు తలెత్తాయి. దీంతో రెండో సొరంగంలో 9.5 కి.మీ వద్ద తొలి సొరంగంలోకి రంధ్రం వేశారు. 12 కి.మీ నుంచి 18 కి.మీ వరకు మరో ఐదు రంధ్రాలు వేశారు. వాటి ద్వారా లైనింగ్ పనులకు అవసరమైన సామగ్రిని వాహనాల్లో తరలించి పనులు చేస్తున్నారు. లైనింగ్ పనులు పూర్తయిన తర్వాత ఆ రంధ్రాలను పూడ్చనున్నట్లు ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు.

పొగాకు వేలం కేంద్రం అధికారి బదిలీ

పొదిలి, న్యూస్‌టుడే: పొదిలి పొగాకు వేలం కేంద్రం నిర్వహణాధికారి జి.గిరిరాజ్‌కుమార్ వెల్లంపల్లి కేంద్రానికి బదిలీ అయ్యారు. ఈయన నాలుగున్నరేళ్లపాటు ఈ ప్రాంతం రైతులకు సేవలందించారు. కందుకూరు-2 వేలం కేంద్రం నిర్వహణాధికారి కె.రాజగోపాల్‌ను పొదిలి కేంద్రానికి బదిలీ చేశారు. ఈమేరకు బదిలీ ఉత్తర్వులు అందినట్లు గిరిరాజ్‌కుమార్ తెలిపారు. ఒకటి, రెండురోజుల్లో పాత వారు రిలీవ్ కావడం, కొత్తవారు చేరనున్నట్లు తెలిసింది.

ప్రకాశం జిల్లాలో బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం ధర - 115, రిటైల్ లైవ్ - 142, చికెన్ విత్ స్కిన్ - 206, చికెన్ స్కిన్‌లెస్- 234

చెంచయ్య సేవలు మరువలేనివి

చెంచయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

మార్కాపురం, న్యూస్‌టుడే: మాజీ ఎమ్మెల్యే, సీపీఎం సీనియర్ నేత దివంగత తవనం చెంచయ్య సేవలు పార్టీకి మరువలేనివని.. ఆయన లేని లోటు ఎప్పటికీ ఉంటుందని జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు దగ్గుపాటి సోమయ్య అన్నారు. ఆదివారం స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో సీపీఎం నేత చెంచయ్య 12వ వర్ధంతి జరిగింది. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సోమయ్య మాట్లాడుతూ ఉమ్మడి ప్రకాశం జిల్లాలో పార్టీ అభివృద్ధి ఎంతో కృషి చేశారన్నారు. పార్టీ కార్యకర్త నుంచి ఎమ్మెల్యే స్థాయికి ఎదిగిన నేత చెంచయ్య అని కొనియాడారు. తన చివరి శ్వాస వరకు పార్టీ, ప్రజల కోసం పని చేశారన్నారు. తనకు వచ్చే పింఛన్ కూడా పార్టీ, ప్రజల సేవ కోసం ఖర్చు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు డి.కె.ఎం.రఫీ, గుమ్మ బాలనాగయ్య, జవ్వాజి రాజు, రవికుమార్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎత్తు వేశారు.. విజేతలుగా నిలిచారు

తిరుపతి(క్రీడలు): శాప్ లీగ్ పోటీల్లో భాగంగా తిరుపతిలోని శ్రీ శ్రీనివాస క్రీడా సముదాయం వేదికగా రెండ్రోజులపాటు జరిగిన రాష్ట్ర స్థాయి చదరంగం పోటీలు ఆదివారం ఉత్సాహంగా ముగిశాయి. పోటీల్లో పలు జిల్లాలకు చెందిన బాలబాలికలు ఎత్తులకు పైఎత్తులు వేస్తూ ప్రత్యర్థులపై సత్తా చాటారు. అండర్ -14, 17, 19 విభాగాల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విజేతలకు ఆదివారం ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, తితిదే పాలకమండలి సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్, తెదేపా రాష్ట్ర మీడియా సమన్వయకర్త, శాప్ మాజీ డైరెక్టర్ శ్రీధర్‌వర్మ ట్రోఫీ, పతకం, ప్రశంసా పత్రాలు ప్రదానం చేశారు. జిల్లా క్రీడాభివృద్ధి అధికారి శశిధర్, చదరంగం సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాసరావు, శాప్ శిక్షకులు పాల్గొన్నారు.

జిల్లా హాకీ బాలబాలికల జట్ల ఎంపిక

మైనంపాడు(సంతనూతలపాడు), న్యూస్‌టుడే: మైనంపాడులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జిల్లా జూనియర్ బాలబాలికల జట్ల ఎంపిక కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా హాకీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఎంపికల్లో జిల్లా జట్టులను ఎంపిక చేశారు. మొత్తం బాలికల విభాగంలో 35 మంది, బాలుర విభాగంలో 40 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వీరిలో బాల బాలికల జట్లను ఎంపిక చేశారు. ఎంపికైన జిల్లా జట్టులను జిల్లా కార్యదర్శి ఎ.సుందరరామిరెడ్డి, విద్యాకమిటీ ఛైర్మన్ ఆకుల బ్రహ్మయ్య, హాకీ క్లబ్ అధ్యక్షుడు గొడుగు కాలేషా, పీడీలు వనజ, శ్రీనివాసరావు, పీఈటీలు తిరుమలశెట్టి రవికుమార్, పలువురు పీఈటీలు అభినందించారు.

ఎంపికైన బాలికల జట్టు

ఇద్దరు వాహన దొంగల అరెస్టు

వివరాలు వెల్లడిస్తున్న మార్కాపురం డీఎస్పీ నాగరాజు

బేస్తవారపేట, న్యూస్‌టుడే: వాహనాల దొంగతో పాటు... అతడి నుంచి వాటిని కొనుగోలు చేస్తూ సహకరిస్తున్న మరో వ్యక్తిని బేస్తవారపేట పోలీసులు అరెస్టు చేశారు. స్టేషన్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో డీఎస్పీ నాగరాజు వివరాలు వెల్లడించారు. కాకినాడ జిల్లా తిమ్మాపురానికి చెందిన ఆచంట గంగాధరరావు.. బేస్తవారపేట మండలం చింతలపాలెంలో ఈ నెల 14న ట్రాలీతో సహా ఓ ట్రాక్టర్‌ను అపహరించాడు. బనగానిపల్లి, మహానంది, ఐజా స్టేషన్ల పరిధిలో మరో నాలుగు ద్విచక్ర వాహనాలు, గిద్దలూరు పరిధిలో ట్రాలీ ఆటో తస్కరించాడు. చోరీ చేసిన వాహనాలను కడప జిల్లా ఎర్రగుంట్లకు చెందిన పల్లెపోగు ప్రసాద్‌కు విక్రయిస్తుండేవాడు. అతడు వాటిని బయటి మార్కెట్‌లో అధిక ధరలకు అమ్మేవాడు. కంభం ఇన్‌ఛార్జి సీఐ రామకోటయ్య, ఎస్సై రవీంద్రారెడ్డి సిబ్బందితో కలిసి కోనపల్లి అడ్డరోడ్డు వద్ద ఆదివారం వాహన తనిఖీలు చేస్తుండగా... వీరిరువురూ ట్రాక్టర్‌లో వస్తూ పోలీసులకు చిక్కారు. పొంతన లేని సమాధానాలు చెబుతుండడంతో స్టేషన్‌కు తరలించారు. విచారణలో చోరీల విషయం వెలుగులోకి వచ్చింది. వారి నుంచి సుమారు రూ.14 లక్షల విలువైన వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. గంగాధరరావుపై కంభం, గిద్దలూరు, దోర్నాల, గుంతకల్లు, నంద్యాల, బేతంచర్ల, పులివెందుల, తిమ్మాపురం, నరసరావుపేట, కారంపూడి, గడివేముల, నాయుడుపేట తదితర స్టేషన్లలో చోరీ కేసులు నమోదయ్యాయని డీఎస్పీ తెలిపారు.

ప్రమాదంలో కర్ణాటక మహిళ దుర్మరణం

పామూరు, న్యూస్‌టుడే: ట్రాక్టర్‌ను టెంపో ట్రావెలర్ వాహనం ఢీకొని ఓ మహిళ దుర్మరణం చెందగా... మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పామూరు సమీపంలో జాతీయ రహదారి-565పై ఆదివారం తెల్లవారుజామున ఈ సంఘటన చోటుచేసుకుంది. ఎస్సై కట్టా అనూక్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రం విజయనగర జిల్లా కొట్టూరు మండలం నగరకట్టు గ్రామానికి చెందిన విశాలాక్షి (48)... కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి ఆంధ్రప్రదేశ్‌లోని పుణ్యక్షేత్రాల సందర్శనకు ఈ నెల 20న టెంపో ట్రావెలర్ వాహనంలో బయలుదేరారు. మంత్రాలయం, మహానంది, శ్రీశైలం క్షేత్రాలను దర్శించుకుని... శనివారం రాత్రి తిరుపతి బయలుదేరారు. ఆదివారం తెల్లవారుజాము 5:30 గంటల సమయంలో... పామూరు సమీపంలోని గోపాలపురం వద్ద ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను వీరి వాహనం బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో విశాలాక్షికి తీవ్ర గాయాలు కావడంతో వెంటనే ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా... 108లో కందుకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విశాలాక్షి బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కనిగిరి ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి బాధితులను పరామర్శించి... సొంత నిధులతో వాహనం ఏర్పాటు చేసి వారిని స్వస్థలాలకు పంపే ఏర్పాటు చేశారు.

'ఆదర్శ' పాఠశాల.. విద్యార్థులకు వరం

❖ ఆరో తరగతి ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరణ

న్యూస్‌టుడే, పెద్దదోర్నాల:

కార్పొరేట్ స్థాయికి మించి విద్యనందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'ఆదర్శ' పాఠశాలలు గ్రామీణ విద్యార్థులకు వరంగా మారాయి. నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఏర్పాటు చేసిన ఈ పాఠశాలలు మార్కాపురం జిల్లాలోని మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు, కనిగిరి నియోజక వర్గాల్లో ఉన్నాయి. ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు విద్యార్థులకు ఉత్తమ విద్యనందిస్తున్నారు. ఆంగ్లమాధ్యమంలో బోధించే ఈ పాఠశాలల్లో ఆరో తరగతిలో ప్రవేశానికి ఈ నెల 23 నుంచి దరఖాస్తులు స్వీకరించాలని ప్రభుత్వం పాఠశాలలకు ఉత్తర్వులు జారీ చేసినట్లు మోట్లమల్లికార్జునపురంలో ఏపీ ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ సరళ తెలిపారు.

మోట్ల మల్లికార్జునపురంలోని ఏపీ ఆదర్శ పాఠశాల

ప్రవేశాలు పొందడం ఇలా...

ప్రభుత్వ లేక ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 2024-25, 2025-26 విద్యా సంవత్సరాల్లో చదివి ఉండాలి. 2025-26 విద్యా సంవత్సరంలో ఐదో తరగతి చదువుతూ ప్రమోషన్ అర్హత పొంది ఉండాలి.

❖ ఈ నెల 23 నుంచి మార్చి 31 వరకు దరఖాస్తు చేసుకోవాలి. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.200లు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.125లు పరీక్షా రుసుం చెల్లించాల్సి ఉంటుంది.

❖ 12.04.26న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. ఐదో తరగతి స్థాయిలో తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో ప్రశ్నపత్రాలిస్తారు. ప్రశ్నలు అబ్జెక్టివ్ టైపులో ఉంటాయి.

❖ ఓసీ, బీసీ విద్యార్థులకు 35 మార్కులు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 30 మార్కులు సాధించిన వారే అర్హులు.

❖ పూర్తి వివరాల కోసం ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్, సంబంధిత మండలాల విద్యా శాఖ అధికారులను సంప్రదించవచ్చు.

❖ ప్రవేశ పరీక్షలో పొందిన మార్కుల ఆధారంగా రిజర్వేషన్ల ప్రాతిపదికన ప్రవేశం కల్పిస్తారు. ఆరో తరగతిలో 80 నుంచి 100 మంది విద్యార్థుల వరకు ప్రవేశాలు కల్పిస్తారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph.81422 92071.

EDUCATION

DISTANCE EDUCATION

ఆచార్యనాగార్జున యూనివర్సిటీ దూరవిద్యాకేంద్రం నిర్వహిస్తున్న M.Sc (అన్నికోర్సులు), M.A (అన్నికోర్సులు) MBA, MCA, M.Com, MLiSc కోర్సులకు అడ్మిషన్లు జరుగుచున్నవి. గీతం డిగ్రీకాలేజ్, ఒంగోలు. సెల్: 9849124970, 9030568558.

REAL ESTATE

LAND FOR SALE

Land For Sale టంగుటూరు - కామేపల్లి రోడ్డులో జరుగుమల్లి మండలము రామచంద్రాపురం గ్రామంలో రోడ్డుకు ఆనుకొని ఇండ్ల స్థలాలకు అనుకూలమైన 76 సెంట్లు వ్యవసాయ భూమి అమ్మకమునకు కలదు. సెల్: 9542209665, 6304567326

JOBS

శ్రీ జాహ్నవి ఆక్వా ఎంటర్‌ప్రైజెస్ ఆఫీసు సంతపేట సాయిబాబా గుడి దగ్గర ఒంగోలులో పనిచేయుటకు ERP,GST ట్యాలీలోఅనుభవం కల అకౌంటెంట్,హెల్పర్స్, కీపర్స్ కావలెను. 8886687399

ప్రముఖ టోల్ ప్లాజా నందు 10th-PG గల కంప్యూటర్ ఆపరేటర్ క్యాషియర్ కావలెను. 8 గం||ల డ్యూటీ, భోజనం + వసతి ఉచితం. ✆ 63095 36439

NATIONAL BANKSనందు, ఒంగోలు, అద్దంకి, దర్శి, మార్కాపురం, గిద్దలూరు, కందుకూరులో పనిచేయుటకు మేల్ ఫీల్డ్‌స్టాఫ్ & ఒంగోలునందు ఫీమేల్ ఆఫీస్‌స్టాఫ్ కావలెను. అర్హత 10th, ఇంటర్, డిగ్రీ. సం|| 99122 66449, 94922 66449

గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజ్ నందు వార్డెన్స్, హాస్టల్ ఇన్‌ఛార్జ్‌గా పనిచేయుటకు స్త్రీలు మరియు పురుషులు కావలెను. జీతం: 10000/- నుండి 15000/- వరకు ఇవ్వబడును. (ఉచిత భోజన వసతి కల్పించబడును). విద్యార్హతలు: ఇంటర్ మరియు డిగ్రీ, వయస్సు: 22సం||లపైన ఉండవలెను. వివరాలకు సంప్ర||. ఫోన్ నెం: 90593 22491.

ప్రముఖ బ్యాంకులో స్కానింగ్ కోసం అభ్యర్థులు అవసరం. అర్హత: ఇంటర్/ ఏదైనా డిగ్రీ, ఒంగోలు. ఫోన్ నంబర్: 9710545017.

సాయి గ్రానైట్స్ చీమకుర్తిలో పని చేయుటకు క్వారీ నందు పనిచేసిన ఎకౌంటెంట్స్ కావలెను. మరియు పర్మిట్స్ తీసే అనుభవం కలిగిన వారు కావలెను. 99599 50995.

అధిక స్పందనలు పొందండి. వాహనాలు అమ్మకం, ఉద్యోగాల భర్తీ, ఇళ్లు, ప్లాట్లు, స్థలాలు అమ్మకాలు, కొనుగోళ్లు, ఇళ్లు, షాపులు, ప్లాట్లు అద్దెకు మరియు అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు... B/W 5 లైన్ల ప్రకటన రూ.275/- మాత్రమే

వివరాలకు..
97011 12824
ఒంగోలు
80087 09902
మార్కాపురం
80081 11050

మీ చిన్నారులకు పుట్టినరోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి.
B&W : రూ. 500
Colour : రూ. 700
ప్రకటనలపై 5% GST వర్తించును

శివ కార్తికేయ హోంకేర్‌లో వృద్ధులు, పేషంట్స్, పిల్లలను చూసుకొనుటకు నర్సులు, వర్కర్స్ కావలెను. ఫ్రీ వసతి, భోజ. 20K. ✆ 99120 11499, 99120 11899

Tally అకౌంటెంట్ బిల్లింగ్ పర్సన్ (ఒంగోలు టౌన్‌లో చేయుటకు) కావలెను. ఆకర్షణీయమైన జీతం. Cont: 97034 02722

ప్రముఖ లోన్స్ ఏజెన్సీ నందు లోన్స్ చేయుటకు టెలికాలర్స్ & మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. 97014 79569, 80081 00872.

MARKETING/ SALES

Anand Masale Require Sales & Marketing Manager, Marketing Executives. Contact: 9849655105, 9848053144 Email: anandmasalaappltd@gmail.com

FACULTY/ TEACHERS

నలంద CBSE స్కూల్ కావలి, గాయత్రి నగర్ నందు పనిచేయుటకు I to V తెలుగు టీచర్, PROs & వాచ్‌మెన్, ఆయాలు కావలెను. మంచి జీతం + ఉచిత భోజనం, వసతి(నాన్ లోకల్స్) కల్పించబడును. ✆ 6265397498, 9121024992

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారులు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయం లో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బు ను వసూలు చేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మ రియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

కందుకూరు

•కందుకూరు • కొండపి

ఆలయ పాలక మండలి ప్రమాణ స్వీకారం

చైర్మన్ పెదబాబును అభినందిస్తున్న మంత్రి స్వామి

జరుగుమల్లి, న్యూస్‌టుడే: మండలంలోని కామేపల్లి పోలేరమ్మ ఆలయ పాలక మండలి ఛైర్మన్ పోటు పెదబాబు, సభ్యులు ఆదివారం పదవీ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, రాష్ట్ర మారిటైంబోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య, ప్రకాశం జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్పర్సన్ ముప్పవరపు సుచిత్ర ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా అమ్మవారిని దర్శించుకున్న అనంతరం, నూతన పాలక మండలి చేత అధికారులు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి, భక్తులకు సౌకర్యాలు కల్పించేందుకు నూతన కమిటీ కృషి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో తెదేపా మండల అధ్యక్షుడు పోకూరి రవీంద్ర పాల్గొన్నారు.

భాజపా కార్యాలయం ప్రారంభం

టంగుటూరు: గ్రామ స్థాయి నుంచి భాజపా గెలుపు కోసం పార్టీ శ్రేణులు కృషి చేయాలని భాజపా రాష్ట్ర నాయకుడు కల్యాణ్ చక్రవర్తి అన్నారు. టంగుటూరులో ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా భాజపా టంగుటూరు మండల కన్వీనర్‌గా చిల్లర సురేష్‌బాబును ఎంపిక చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సెగ్గెం శ్రీనివాసరావు, బెల్లం కోటేశ్వరరావు, పత్తిపాటి నరసయ్య, తలపనేని రమేష్ మార్, కూరపు రాజు, మల్లవరపు కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

కందుకూరు: 70939 81624

కొండపి: 96424 56296

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలను, చిత్రాలను వాట్సాప్ ద్వారా పంపవచ్చు. లేదా ఫోన్లో వివరించవచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే

?: బంగారమ్మ గుడి వెనుక ప్రధాన రోడ్డు నుంచి కోటారెడ్డినగర్, ఆర్డీవో కార్యాలయానికి వెళ్లే కూడలిలో వారం రోజులుగా చెత్త తీయడం లేదు. -ఆమని, మార్కండేయవీధి

✓: పారిశుద్ధ్య సిబ్బందిని పంపి సమస్య పరిష్కరిస్తాం .-కె.అనూష, మున్సిపల్ కమిషనర్

జరుగుమల్లి, న్యూస్‌టుడే

?: మండలంలోని తుమాడులో దోమల బెడద అధికంగా ఉంది. రాత్రివేళ కంటి మీద కునుకు ఉండటం లేదు.

-పేరయ్య, స్థానికుడు.

✓: దోమల నివారణకు చర్యలు చేపడతాం.

-మౌనిక, పంచాయతీ కార్యదర్శి

మర్రిపూడి, న్యూస్‌టుడే

?: వేమవరం నుంచి గార్లపేటకు వెళ్లే రహదారిలో చప్టా సమీపంలోని మలుపు వద్ద చిల్లచెట్లు ఏపుగా పెరగడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. -శ్రీనివాసులు, స్థానికుడు

✓: పరిశీలించి రహదారికి ఇరువైపులా ఉన్న చిల్లచెట్లు తొలగిస్తాం.

-నరసింహారావు, పంచాయతీ కార్యదర్శి

వార్డెన్ల బాధ్యతారాహిత్యాన్ని సహించం

బాలికలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగేశ్వరరావు

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని టీఆర్ఆర్ ప్రభుత్వ కళాశాల ఆవరణలోని బాలికల వసతి గృహాన్ని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బాలికలు తమ సమస్యలను ఏకరవు పెట్టారు. మెనూ పట్టించుకోకుండా రోజూ పప్పు, పచ్చడితో సరిపెడుతున్నారని, స్నాక్స్ అన్న మాటే లేదని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. కనీసం బెడ్లు కూడా లేవని, నేలపై పడుకుంటున్నామని చెప్పారు. దీంతో వార్డెన్లపై శాసనసభ్యుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యతా రాహిత్యంగా ఉంటే సహించబోమని హెచ్చరించారు. బాలికలు పడుతున్న ఇబ్బందులను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానన్నారు. తన ఫోన్ నంబరును పట్టికలో రాయించారు. విద్యార్థినులకు ఇబ్బంది కలిగితే ఫోన్ చేయాలని సూచించారు. ఆయన వెంట తెదేపా నాయకులు దామా మల్లేశ్వరరావు, రఫి, సూర్యనారాయణ తదితరులు ఉన్నారు.

సీసీ రోడ్డు ప్రారంభం: పట్టణంలోని దివి వెంకట సుబ్బయ్య వీధిలో రూ.28.5లక్షలతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే నాగేశ్వరరావు ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.అనూష, తెదేపా నాయకులు పిడికిటి వెంకటేశ్వర్లు, ఉప్పుటూరి శ్రీనివాసరావు, బెల్లం వెంకటేశ్వర్లు, నవీన్, రాము తదితరులు పాల్గొన్నారు.

పాదచారులను పట్టించుకునేదెవరు..?

టంగుటూరు, న్యూస్‌టుడే

రోడ్ల విస్తరణ, ఆధునాతన సిగ్నళ్లు, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ వంటి అంశాల్లో జాతీయ రహదారులపై ఎప్పటికప్పుడు మార్పులు చేస్తూ వస్తున్నారు. అయితే పాదచారుల కోసం సరైన ఏర్పాట్లు చేయడం లేదు. కొన్ని ఫుట్‌పాత్‌లు నిర్మించినా వాటితో పెద్దగా ప్రయోజనం ఉండటం లేదు. నిర్వహణ పట్టించుకోకపోవడంతో అధ్వానంగా తయారై.. ప్రస్తుతం నిరుపయోగంగా మారాయి. ఈ కారణంగా రాకపోకల సమయంలో పాదచారులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు.

పిచ్చి మొక్కలు, మద్యం సీసాలతో...

ప్రకాశం జిల్లాలో 16వ నంబరు జాతీయ రహదారి 60 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. గ్రామాల మధ్యలో నుంచి వెళుతుండటంతో పలుచోట్ల అండర్‌పాస్‌లు ఏర్పాటు చేశారు. రద్దీ ప్రాంతాల్లో, సర్వీసు రోడ్లలో పాదచారులు రాకపోకలు సాగించేందుకు ఫుట్‌పాత్‌లు నిర్మించారు. వాటి నిర్వహణ సరిగా లేకపోవడంతో ప్రస్తుతం అవి దెబ్బతిన్నాయి. పిచ్చిమొక్కలు మొలిచి నడిచేందుకు ఏమాత్రం అనుకూలంగా లేవు. టంగుటూరు, సింగరాయకొండ, వల్లూరు, కె.బిట్రగుంట, నాయుడుపాలెం, సూరారెడ్డిపాలెం గ్రామాల సమీపంలో మందు బాబులు తాగి ఖాళీ చేసిన సీసాలను వాటిలో వేసి ధ్వంసం చేస్తున్నారు.

టంగుటూరు-కొండపి మార్గంలో అండర్‌పాస్ వద్ద దెబ్బతిన్న ఫుట్‌పాత్

దూసుకొస్తున్న వాహనాలు...

అండర్‌పాస్‌లు, సర్వీసు రోడ్లలో తప్పించి కొన్ని రద్దీ ప్రాంతాల్లో అసలు ఫుట్‌పాత్‌లే నిర్మించలేదు. పలు చోట్ల వంతెనలు నిర్మించిన సమయంలో చేపట్టిన పనులను అసంపూర్తిగా వదిలేశారు. ఈ కారణంగా పాదయాత్రలు చేసేవారు, ఆలయాలకు నడుచుకుంటూ వెళ్లేవారు, ఇతరులు నడిచేందుకు వీలులేకుండా పోయింది. అటుగా వెళ్లే వారిపైకి వాహనాలు దూసుకొస్తున్నాయి. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా ఫుట్‌పాత్‌లను పూర్తిస్థాయిలో నిర్మించి, ఉన్నవాటిలో పిచ్చిమొక్కలు తొలగించి వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థి మృతిపై త్రిసభ్య కమిటీ విచారణ

శిక్షణ కేంద్రంలో దస్త్రాలు పరిశీలిస్తున్న కమిటీ సభ్యులు

సింగరాయకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: మూలగుంటపాడులోని నవోదయ శిక్షణ కేంద్రంలో వారం రోజుల క్రితం అనుమానాస్పద స్థితిలో విద్యార్థి తౌషిక్(11) మృతిచెందిన ఘటనకు సంబంధించి విచారణను వేగవంతం వేసి కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామని డీఈవో రేణుక తెలిపారు. కలెక్టర్ నియమించిన త్రిసభ్య కమిటీ సభ్యులు మూలగుంటపాడు పాఠశాలలో ఆదివారం విచారణ చేశారు. ముందుగా ఆవరణ, స్నానాల గది, తరగతి గదులను పరిశీలించారు. అనంతరం పాఠశాలకు సంబంధించిన అనుమతులు, దస్త్రాలను తనిఖీ చేసి విద్యార్థుల హాజరు పట్టికను స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ మాధురి, తహసీల్దార్ రాజేష్, ఒంగోలు డిప్యూటీ డీఈవో చంద్రమౌళీశ్వర్, ఎంఈవోలు శ్రీనివాసులు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల పరిశీలన

పంటల వివరాలు నమోదు చేస్తున్న ప్రాజెక్టు మేనేజరు సుభాషిణి, సిబ్బంది

టంగుటూరు, న్యూస్‌టుడే: మండలంలోని కందులూరు గ్రామంలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను రైతు సాధికార సంస్థ నేచురల్ ఫార్మింగ్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ సుభాషిణి ఆదివారం క్షేత్ర స్థాయిలో పరిశీలన చేశారు. రైతులు రాంబ్రహ్మం, శేషయ్య పెంచుతున్న మామిడి మొక్కలను చూశారు. నాణ్యమైన, రుచికరమైన దిగుబడులు రావాలంటే పంచగవ్య, చేప, బెల్లంతో తయారు చేసిన ద్రావణం పిచికారీ చేయాలని సూచించారు. మొక్కల పాదుల్లో 15 రోజులకోసారి జీవామృతం పారించాలని తెలిపారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనీలు నరసింహులు, వెంకట్రావు, విజయలక్ష్మి, ఐసీఆర్పీలు పాల్గొన్నారు.

సరైన పత్రాలు లేని వాహనాల స్వాధీనం

కొండపి గ్రామీణం, న్యూస్‌టుడే: సరైన పత్రాలు లేని 33 వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సోమశేఖర్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఆదివారం తెల్లవారుజామున కొండపి బీసీ కాలనీలో సర్కిల్ పరిధిలోని కొండపి, పొన్నలూరు, మర్రిపూడి మండలాల స్టేషన్ల సిబ్బంది 30 మందితో కలిసి కార్డెన్ సెర్చ్ నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేని ద్విచక్ర వాహనాలు, ఆటోలు స్వాధీనం చేసుకొని స్టేషన్‌కు తరలించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కొండపి, పొన్నలూరు ఎస్సైలు ప్రేమ్‌కుమార్, సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

కొండపి స్టేషన్‌కు తరలించిన వాహనాలు

బస్సులు ఆపి.. ట్రాఫిక్ నిలిచి!

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని పామూరు బస్టాండు ప్రాంతంలో ప్రయాణికులను ఎక్కించుకునేందుకు ఆర్టీసీ బస్సులను రోడ్డుపై నిలుపుతుండటంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తి.. రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని పట్టణ ప్రజలు వాపోతున్నారు. బస్టాండ్ కావడం.. రోడ్డు అంచులో ఆటోలు, తోపుడు బండ్లు ఉండటంతో బస్సులను రోడ్డుపై నిలపాల్సి వస్తోంది. ఈ విషయమై మున్సిపల్, పోలీసు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఇంటర్మీడియట్ పరీక్షలకు పక్కా ఏర్పాట్లు

అధికారులతో చర్చిస్తున్న ప్రాంతీయ పర్యవేక్షణాధికారి వరప్రసాద్

వలేటివారిపాలెం, న్యూస్‌టుడే: ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు నెల్లూరు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి వరప్రసాద్ తెలిపారు. ఆదివారం మండలంలోని చుండి మోడల్ పాఠశాలలోని పరీక్ష కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలన్నారు. గంట ముందు కేంద్రాలకు చేరుకోవాలని చెప్పారు. అనంతరం చీఫ్ సూపరింటెండెంట్ శ్రీనివాసన్, డిపార్టుమెంట్ అధికారి బీవీ కాశీరత్నంలకు పలు సూచనలు చేశారు.

25 నుంచి నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు

మర్రిపూడి, న్యూస్‌టుడే: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పృథులగిరి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 25 నుంచి మార్చి 7 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో నారాయణరెడ్డి తెలిపారు. 25న అంకురారోపణ, 26న శేష వాహనం, 27న హంస వాహనం, 28న సింహ వాహనం, మార్చి 1న హనుమంత వాహనం, 2న గరుడోత్సవం, 3న ఉదయం ఎదురుకోలు ఉత్సవం, రాత్రికి కల్యాణం, 4న రథోత్సవం, 5న అశ్వవాహనం, 6 పూర్ణాహుతి, 7న స్థానిక వేణుగోపాలస్వామి ఆలయంలో ఏకాంత సేవతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు.

యంత్రం పనిచేయక.. నీటి సమస్య తీరక!

మండలంలోని నెన్నూరుపాడు ఎంపీపీ పాఠశాలలో తాగునీటి యంత్రం మూలకు చేరి ఏడాదవుతోంది. ఇక్కడ ఏడుగురు ఉపాధ్యాయులు, సుమారు 84 మంది విద్యార్థులు ఉన్నారు. వీరికి రోజుకు సుమారు 5 క్యాన్ల తాగునీరు అవసరమవుతుంది. యంత్రం పనిచేయపోవడంతో రోజుకో ఉపాధ్యాయుడి చొప్పున వారి సొంత నిధులు ఖర్చు చేసి ప్రైవేటు కేంద్రాల్లో కొనుగోలు చేసి నీరు తెప్పిస్తున్నారు. ప్రభుత్వం స్పందించి సమస్య పరిష్కరించాలని వారంతా కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, కొండపి గ్రామీణం

జీవ జలం.. నేలపాలు!

కొండపి నియోజకవర్గంలో తాగునీటి సమస్య పరిష్కారంలో భాగంగా 2018లో రూ.కోట్లు వెచ్చించి రామతీర్థం జలాలు తీసుకొచ్చారు. వేగంగా నీరు తరలించేలా ఎయిర్ వాల్వులు సైతం అమర్చారు. అవి దెబ్బతినకుండా సిమెంట్ పిల్లర్లు ఏర్పాటు చేశారు. అయితే ఎయిర్ వాల్వుల్లో రబ్బర్లు దెబ్బతిని ప్రతి గ్రామంలో తాగునీరు వృథాగా పోతోంది. ఈ కారణంగా శివారు ప్రాంతాలకు పూర్తి స్థాయిలో నీరందడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, టంగుటూరు

అడ్డుగా ఉన్నా.. అడ్డంగా పనులు!

మండలంలోని పలుకూరు గ్రామంలో ప్రధాన రహదారిని ఇటీవల రూ.లక్షలు వెచ్చించి నిర్మించారు. అయితే ఆ సమయంలో అడ్డుగా ఉన్న విద్యుత్తు స్తంభాలను పక్కకు మార్చకుండానే పనులు చేశారు. పర్యవేక్షించాల్సిన అధికారుల నిర్లక్ష్యంతోనే ఇటువంటి పొరపాట్లు జరుగుతున్నాయని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. గతంలో కూడా ఆక్రమణలు తొలగించకుండానే కాలువ నిర్మాణం చేశారని విమర్శిస్తున్నారు.

– న్యూస్‌టుడే, కందుకూరు గ్రామీణం

అరుగు కాదు.. హద్దురాళ్లు

మండలంలోని మన్నేటికోట గ్రామస్థులు, చుట్టుపక్కల పొలాలు ఉన్న రైతులు వినూత్నంగా ఆలోచించారు. పొలాల్లో పాతేందుకు పనికిరాని హద్దురాళ్లతో గుడి వద్ద ఉన్న చెట్టు చుట్టూ అరుగు ఏర్పాటు చేశారు. దీంతో అటు వైపు వచ్చిన రైతులు, ఉలవపాడు వెళ్లే ప్రయాణికులు కూర్చోవడానికి ఉపయోగపడుతోంది.

- న్యూస్‌టుడే, ఉలవపాడు

నివాళులర్పిస్తున్న తెదేపా మైనార్టీ సెల్ నాయకులు

మౌలానా ఆజాద్‌కు నివాళి

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే: దేశంలో విద్యా రంగ అభివృద్ధికి కృషి చేసిన మహోన్నత వ్యక్తి డాక్టర్ మౌలానా అబుల్‌కలాం ఆజాద్ అని తెదేపా మైనార్టీ సెల్ పట్టణ అధ్యక్షుడు అహ్మద్‌బాషా అన్నారు. ఆజాద్ వర్ధంతి సందర్భంగా ఆదివారం స్థానిక తెదేపా కార్యాలయంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు రూబీ, నజీర్, సలాం, గౌస్ బాషా, నాయబ్ రసూల్, ఖాదర్, ఆసీఫుద్దీన్, హాజీ పాల్గొన్నారు.

'చలో విజయవాడ' విజయవంతానికి పిలుపు

జరుగుమల్లి, న్యూస్‌టుడే: ఉద్యోగ, ఉపాధ్యాయ, పింఛనర్లకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 25న నిర్వహించనున్న 'చలో విజయవాడ' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘం నాయకులు ఆదివారం జరుగుమల్లిలో పిలుపునిచ్చారు. ఎస్టీయూ మండల అధ్యక్షుడు ఎ.గంగయ్య, కార్యదర్శి ఎంవీ.రామయ్య, జిల్లా నాయకుడు నర్రా కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి అవసరం

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే: ప్రస్తుత కాలంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై దృష్టి సారించాలని మున్సిపల్ కమిషనర్ కె.అనూష తెలిపారు. ప్రజల ఆరోగ్యం మెరుగు పరిచేందుకు ప్రభుత్వం హ్యాపీ సండే కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. ఇందులో భాగంగా పట్టణంలోని జడ్పీ బాలురోన్నత పాఠశాల మైదానంలో సచివాలయ ఉద్యోగులు, మున్సిపల్ అధికారులకు ఆదివారం క్రికెట్, షటిల్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ తదితరులు పాల్గొని ఆటలు ఆడారు. విజేతలకు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు చేతుల మీదగా బహుమతులు అందజేశారు.

క్రికెట్ ఆడుతున్న కమిషనర్ అనూష

అడుగంటిన చెరువు.. అన్నదాత గుండె బరువు

ఈ ఏడాది వర్షాలు పుష్కలంగా పడటంతో మండలంలోని పాజర్ల చెరువు నిండింది. దీంతో దాని ఆయకట్టు పరిధిలో సుమారు 250 ఎకరాల్లో రైతులు వరిసాగు చేశారు. ప్రస్తుతం పంట పొట్ట దశలో ఉంది. మరో నెల రోజుల పాటు నీటి తడులు అందించాల్సి ఉంటుంది. అయితే నిర్వహణ సరిగా లేకపోవడంతో ప్రస్తుతం చెరువు అడుగంటింది. ఉన్న నీటితో పంట గట్టెక్కుతుందో లేదోనన్న ఆందోళన రైతుల్లో నెలకొంది. ఇప్పటికే మోటార్లు ఏర్పాటు చేసి తడుపుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టామని, అధికారులు స్పందించి తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, గుడ్లూరు

ఉద్యోగులు, కార్మికుల హక్కుల పరిరక్షణకు కృషి

సింగరాయకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: కార్మికులు, ఉద్యోగుల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం పిలుపునిచ్చారు. సింగరాయకొండలో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన దాచూరి రామిరెడ్డి, అనసూయమ్మ ప్రజా సంఘాల నూతన కార్యాలయాన్ని ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యలపై యూటీఎఫ్, ప్రజాసంఘాలు సంయుక్తంగా పోరాడాలని సూచించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు కేశవరాజు, పూనాటి ఆంజనేయులు, రాము, వెంకయ్య, డా.హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బాలసుబ్రహ్మణ్యం

స్వచ్ఛంద సంస్థ గోడ ప్రతుల ఆవిష్కరణ

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే: మానసిక, శారీరక బాధితులకు సాయం చేయాలన్న సంకల్పంతో పట్టణంలో హెల్పింగ్ ఫర్ సొసైటీ సంస్థ ఏర్పాటు చేయడం అభినందనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆ సంస్థకు చెందిన గోడ ప్రతులను పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఆదివారం ఆవిష్కరించారు. కులం, మతం, ప్రాంతం వంటి భేదాభిప్రాయాలు లేకుండా సహాయ, సహకారాలు అందించాలని వక్తలు నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో సొసైటీ వ్యవస్థాపకుడు జంగాల శ్రీమిత్, డాక్టర్ టి.మల్లికార్జున, వివిధ సంఘాల నాయకులు చనమాల కోటేశ్వరరావు, జి.హరిప్రసాద్, రవీంద్ర, సుబ్బారావు, ఆదాము, కోటేశ్వరరావు, పి.కోటేశ్వరరావు, థామస్, సింగయ్య పాల్గొన్నారు.

బోధనేతర వస్తువుల వితరణ

వలేటివారిపాలెం, న్యూస్‌టుడే: ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల నేపథ్యంలో చుండి మోడల్ పాఠశాల విద్యార్థులకు ఆదివారం ఓ దాత బోధనేతర వస్తువులు అందజేశారు. గొట్టిపాటి హరికృష్ణ తరపున గ్రామానికి చెందిన కామినేని అశోక్, మేకల అశోక్, అనిల్‌లు.. పరీక్ష అట్టలు, పెన్నులు, స్కేల్స్ తదితర వస్తువులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ శ్రీవెంకటేశ్వర్ పాల్గొన్నారు.

పొగాకు బ్యారన్ దగ్ధం

పొన్నలూరు, న్యూస్‌టుడే: పొన్నలూరు ఉప్పలదిన్నె రోడ్డులో ఆదివారం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో దేవరపల్లి రామిరెడ్డి, చేబోలు చంద్రమౌళిలకు చెందిన బ్యారన్ దగ్ధమైంది. పొగాకు క్యూరింగ్ చేసే సమయంలో కర్రలు జారి గొట్టంపై పడటంతో మంటలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకురావడంతో పెద్ద ప్రమాదం తప్పింది. సుమారు రూ.6 లక్షల మేర ఆస్తి నష్టం సంభవించినట్లు బాధితులు తెలిపారు.

లారీలు ఢీకొని చోదకుడి మృతి

సింగరాయకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: సింగరాయకొండ పరిధిలో 16వ నంబరు జాతీయ రహదారిపై శనివారం అర్ధరాత్రి రెండు లారీలు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతిచెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. స్థానిక కందుకూరు రోడ్డు పైవంతెన వద్ద ఒంగోలు వైపు వెళుతున్న కంటైనర్ లారీని.. నెల్లూరు వైపు నుంచి పుచ్చకాయల లోడుతో వేగంగా వస్తున్న మినీ లారీ అదుపు తప్పి వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మినీలారీ చోదకుడు ఇగ్గేలు వెంకట సుబ్బారావు(35)కు తీవ్ర రక్తగాయాలై సంఘటనా స్థలంలోనే మృతిచెందాడు. అతడిది గుంటూరు జిల్లా నందివెలుగుగా గుర్తించారు. లారీ ముందు భాగం నుజ్జునుజ్జు కాగా.. పుచ్చకాయలు రహదారిపై చెల్లాచెదురుగా పడిపోయాయి. సమాచారం అందుకున్న హైవే పోలీసులు.. ఆయా వాహనాలను తొలగించి రాకపోకలకు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకున్నారు. వెంకట సుబ్బారావు మృతదేహాన్ని ఒంగోలు రిమ్స్‌కు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేంద్ర తెలిపారు.

యువకులకు గాయాలు...

టంగుటూరు, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలు కాగా.. మరొకరు స్వల్పంగా గాయపడ్డారు. ఈ సంఘటన టంగుటూరు-ఒంగోలు రోడ్డులోని రైల్వే అండర్‌పాస్ సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. ఒంగోలు గ్రామీణ మండలం ఉలిచి గ్రామానికి చెందిన సురేష్ అనే యువకుడు ద్విచక్ర వాహనంపై టంగుటూరు నుంచి ఒంగోలు వెళుతున్నాడు. స్థానిక పొగాకు తోటలకు డ్రోన్ల ద్వారా మందులు పిచికారీ చేసే నిమిత్తం శ్రీకాకుళం జిల్లాకు చెందిన నాగేంద్రబాబు, రేవంత్ అనే యువకులు ద్విచక్ర వాహనంపై తూర్పు నాయుడుపాలెం వెళుతున్నారు. రైల్వే అండర్ పాస్ వద్ద ఆ రెండూ వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో సురేష్ ఎడమ కాలు, చెయ్యి విరిగాయి. రేవంత్‌కు తీవ్ర గాయాలవడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. నాగేంద్రబాబు స్వల్ప గాయమైంది. స్థానికులు 108 వాహన సిబ్బందికి సమాచారం అందించగా.. వారు వచ్చి ఒంగోలు రిమ్స్‌కి తరలించారు.

పబ్లిక్ నోటీసు

ప్రకాశం జిల్లా, సింగరాయకొండ మండలం, సింగరాయకొండ గ్రామ కాపురస్తులు తన్నీరు కోటయ్య కుమారుడు తన్నీరు రామకృష్ణ మాకిచ్చిన సంజాయిషీ మేరకు యావన్మందికి తెలియజేయునది ఏమనగా, ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తి ప్రకాశంజిల్లా, సింగరాయకొండ మండలం, కలికవాయ గ్రామస్తుడు అయిన లేటు తన్నీరు అంకయ్య కుమారుడు తన్నీరు బసవయ్యకు చెందినది అయివున్నది. సదరు షెడ్యూలు ఆస్తిని తన్నీరు బసవయ్య మా క్లయింటుకు 17.02.2025వ తేదిన అమ్మి రూ॥4,00,000/-లు అడ్వాన్స్‌గా తీసుకొని, మా క్లయింటు పేరున విక్రయ ఖరారు అగ్రిమెంటు వ్రాయించి ఇచ్చినాడు. సదరు తన్నీరు బసవయ్య మా క్లయింటు వద్ద మిగిలిన 17 లక్షలు రూపాయలు తీసుకోకుండా, రిజిష్టర్ చేయనందున మా క్లయింటు తన్నీరు బసవయ్యపై కందుకూరు, సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో సదరు ఆస్తిని రిజిష్టర్ చేయమని దావా దాఖలు చేసివున్నాడు. ఇటీవల మాక్లయింటుకు తెలిసిన సమాచారం మేరకు సదరు తన్నీరు బసవయ్య విక్రయ ఖరారు అగ్రిమెంటు గురించి, దావా గురించి మభ్యపెట్టి షెడ్యూలు దాఖలా ఆస్తిని ఇతరులకు అమ్మేప్రయత్నం చేస్తున్నట్లుగా మా క్లయింటుకు తెలియవచ్చినది. కావున సదరు తన్నీరు బసవయ్య షెడ్యూలు దాఖలా ఆస్తిపై ఎటువంటి లావాదేవీలు జరిపిన యెడల అవి చట్టవిరుద్ధమని, అలా మాక్లయింటుకు తెలియకుండా జరిపిన లావాదేవీలు మాక్లయింటును బద్ధపరచజాలవని, వారిపై మా క్లయింటు తీసుకొను చర్యలకు బాధ్యులవుదురని పత్రిక ప్రకటన ద్వారా తెలియపరచడమైనది.

షెడ్యూలు: ప్రకాశంజిల్లా రిజిస్ట్రేషన్- సింగరాయకొండ సబ్ రిజిస్ట్రేషన్ -సింగరాయకొండ రెవిన్యూ మండలం- మూలగుంటపాడు గ్రామపంచాయతి -ఖాతానెం. 651- కోరు మాగాణి సర్వేనెం. 43-4B2b- LPNo. 991- ULPNo.778 JOEDD ONDKHO - విస్తీర్ణం య0.21 సెంట్లు - **హద్దులు: తూర్పు:** పంటకాలువ **దక్షిణం:** పర్ణశాల వీరరాఘవాచార్యులు భూమి, **పడమర:** గుంజి శ్రీనివాసరావు భూమి, **ఉత్తరం:** కుంచాల నరసింహంభూమి.

సం/- బక్కమంతల వెంకటేశ్వర్లు., B.Sc, B.LI.Sc, BL, LLM, అడ్వకేట్ & పబ్లిక్ నోటరీ

తేది: 22-02-2026 చిమటా కోదండపాణి, BL అడ్వకేట్, సింగరాయకొండ

(c) eenadu

అద్దంకి
•అద్దంకి • దర్శి

ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలు

అద్దంకి, న్యూస్‌టుడే : విద్యాహక్కు చట్టం ప్రకారం అన్ని ప్రైవేటు పాఠశాలల్లో ఒకటి నుంచి పదో తరగతి వరకు ఉచిత ప్రవేశాల కోసం దరఖాస్తులు చేసుకోవచ్చని ఎంఈవో -2 కేవీ శ్రీనివాసరావు తెలిపారు. 5 సంవత్సరాలు నిండి, అనాథ, దివ్యాంగ, హెచ్ఐవీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల చిన్నారులు అర్హులన్నారు. ఆర్థికంగా వెనుకబడిన బీసీ, మైనార్టీ, ఓసీ వర్గాల విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈనెల 20 నుంచి మార్చి 10వ తేదీ వరకు సచివాలయం వద్ద పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. లాటరీ ద్వారా అడ్మిషన్లు ఇస్తారని ఆయన వెల్లడించారు.

పోలేరమ్మకు ప్రత్యేక పూజలు

ముండ్లమూరు, న్యూస్‌టుడే: మారెళ్ల గ్రామంలో కొలువుదీరిన పోలేరమ్మతల్లికి ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. అర్చకులు ప్రసాదు, అమ్మవారి సేవకులు సుబ్బారావు అభిషేకాలు, అర్చనలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు పొంగళ్లు పొంగించి పూలు, పండ్లు పసుపు, కుంకుమ నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ముండ్లమూరు, బొప్పూడివారిపాలెం, కెల్లంపల్లి, నూజెళ్లపల్లి, పూరిమెట్ల తదితర గ్రామాల్లో ఆలయాల్లో భక్తులు పాల్గొని పూజలు చేశారు. అనంతరం వారికి తీర్థప్రసాదాలు అందజేశారు.

అలంకరణలో పోలేరమ్మ తల్లి

బాదాపురంలో...

దొనకొండ, న్యూస్‌టుడే: బాదాపురంలో వెలసిన శ్రీవల్లీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ఆదివారం ఘనంగా పూజలు జరిగాయి. స్వామి వారిని పూలు, నిమ్మకాయలు, కుంకుమ, పసుపుతో అందంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పొంగళ్లు వండి నైవేద్యంగా సమర్పించారు. వచ్చిన వారికి ఆలయ కమిటీ సభ్యులు ప్రసాదాలు అందించారు.

తాళ్లూరు, న్యూస్‌టుడే : గుంటిగంగకు ఆదివారం భారీగా భక్తులు తరలి వచ్చి గంగాభవానీ అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. వేకువజామునే పూజారులు ప్రకాశరావు, కామేశ్వర శర్మ, బాలరాజు, విజయలక్ష్మి కలసి అమ్మవారికి పూజలు చేశారు.

నిఘా నీడలో ఇంటర్ పరీక్షలు

☛ దర్శి, అద్దంకి ప్రాంతాల్లో పక్కా ఏర్పాట్లు

న్యూస్‌టుడే, తాళ్లూరు, దర్శి, అద్దంకి :

సోమవారం నుంచి ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు విస్తృత ఏర్పాట్లు చేశారు. నిఘా కెమెరాల నీడన పకడ్బందీగా చేపట్టనున్నారు. సోమవారం తొలిరోజున ఇంటర్ ప్రథమ సంవత్సరం వారు రాయనున్నారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా కేంద్రం లోపలకు అనుమతించబోమని అధికారులు చెబుతున్నారు. గదుల్లో సీసీ కెమెరాలను బిగించి సిద్ధంగా ఉంచారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. ప్రజలు గుంపులుగా తిరిగేందుకు వీలులేదని పోలీసులు స్పష్టంచేశారు. కేంద్రాల సమీపంలో పుస్తకాల దుకాణాలు, జిరాక్సు సెంటర్లను మూసివేయించారు. ప్రతి కేంద్రం వద్ద పోలీసు సిబ్బంది బందోబస్తుగా ఉండి పర్యవేక్షించనున్నారు.

ఆదర్శ, కేజీబీవీ విద్యార్థులకు..

దర్శి నియోజకవర్గంలో ప్రథమ సంవత్సర విద్యార్థులు 2202 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 1744 మంది పరీక్షలు రాసేందుకు ఏర్పాట్లు చేసినట్లు అధికారులు చెప్పారు. ముండ్లమూరులోని ఆదర్శ పాఠశాల వారు దర్శి కేంద్రంలో, కేజీబీవీ విద్యార్థినులు తాళ్లూరులో, కురిచేడు కేజీబీవీ బాలికలు దొనకొండ కేంద్రాల్లో రాయనున్నారు. అదేవిధంగా అద్దంకి నియోజకవర్గంలో ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులు 2426 మంది పరీక్షలు రాయనున్నారు.

తాళ్లూరు పరీక్షా కేంద్రంలో ఏర్పాట్లు

144 సెక్షన్ అమలు..

అద్దంకి, న్యూస్‌టుడే : ఇంటర్ పరీక్షలు ప్రారంభం అవుతున్న నేపథ్యంలో సోమవారం నుంచి ఆయా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని సీఐ సుబ్బరాజు అన్నారు. పరీక్షలు జరిగే ప్రభుత్వ జూనియర్ కళాశాల, విశ్వభారతి, శ్రీచైతన్య జూనియర్ కళాశాలల ఏరియాలోని జిరాక్స్ కేంద్రాలను ఉదయం 9 నుంచి 12 గంటల వరకు మూసివేయాలన్నారు. తల్లిదండ్రులు, విద్యార్థులు ముందుగానే పరీక్షా కేంద్రానికి హాజరు కావాలని ఆయన సూచించారు.

మొక్కుబడిగా సర్వసభ్య సమావేశం

సంతమాగులూరు, న్యూస్‌టుడే: మండల పరిషత్తు కార్యాలయంలో ఆదివారం జరిగిన సర్వ సభ్య సమావేశం మొక్కుబడిగా సాగింది. ఎంపీపీ వై.యలమంద అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ పథకాల అమలు తీరుపై అధికారులు వివరించారు. ఎంపీటీసీ సభ్యులు ఆయాగుంట సమావేశానికి వచ్చి సంతకాలు చేసి వెళ్లిపోయారు. ఎంపీడీవో జ్యోతిర్మయి, తహసీల్దారు కె.రవిబాబు, ఎంఈవో వి.కోటేశ్వరరావు, ఖాశీం, అధికారులు, సర్పంచులు పాల్గొన్నారు.

జిరాక్స్ నిర్వాహకులు నిబంధనలు పాటించాలి

తాళ్లూరు, న్యూస్‌టుడే : ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాలను దర్శి సీఐ రామారావు ఆదివారం తనిఖీ చేశారు. దర్శి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, న్యూస్ జూనియర్ కళాశాల, గీతాంజలి, ఐయోలాతోపాటు తాళ్లూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చేసిన ఏర్పాట్లు, వసతులను పరిశీలించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. జిరాక్స్ నిర్వాహకులు నిబంధనలు పాటించాలన్నారు. పరీక్షల నిర్వహణ సమయంలో పోలీసులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఎస్సై మల్లికార్జునరావు, పలువురు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

తాళ్లూరులో పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న సీఐ రామారావు, ఎస్సై మల్లికార్జునరావు

విద్యార్థినుల నృత్య సందడి

విద్యార్థులు పట్టుదలతో చదివితే మంచి మార్కులు పొందొచ్చని వసతిగృహం సంక్షేమాధికారిణి తెరేజమ్మ అన్నారు. తాళ్లూరులోని బీసీ బాలికల వసతిగృహంలో ఆదివారం పదో తరగతి విద్యార్థినులకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు చేసిన నృత్యాలు అలరింపజేశాయి. విద్యార్థినుల తల్లిదండ్రులు, పలువురు పెద్దలు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, తాళ్లూరు

అద్దంకిలో కార్డెన్ సెర్చ్

అద్దంకి పట్టణం గరటయ్యకాలనీలో ఆదివారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేని 29 ద్విచక్ర వాహనాలు, అయిదు ఆటోలను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అద్దంకి సీఐ సుబ్బరాజు నేతృత్వంలో సబ్‌డివిజన్‌లోని 38 మంది ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు. గంజాయి, మాదక ద్రవ్యాల వినియోగంపై ఆరా తీశారు. కాలనీలోని ప్రతి ఇంటిని తనిఖీ చేసి అనుమానితుల్ని నిశితంగా ప్రశ్నించారు. ఈ సందర్భంగా డీఎస్పీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ గంజాయి తరలించే వారిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. అనంతరం డ్రగ్స్ వద్దు బ్రో అంటూ స్థానికులతో కలిసి ప్రదర్శన చేపట్టారు. – న్యూస్‌టుడే, అద్దంకి

ఆదివారం అదిరింది

అద్దంకి పురపాలక సంఘంలో 'ఆనంద ఆదివారం' కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. పట్టణంలో ప్రతి నెల 2, 4 ఆదివారాల్లో హ్యాపీ సండే నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఆదివారం ఉదయం పురపాలక కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో కమిషనర్ డి.రవీంద్ర, మేనేజరు శ్రీదేవి, పురపాలక సిబ్బంది, ఔత్సాహికులు పెద్దఎత్తున పాల్గొన్నారు. చిన్నారుల భరతనాట్యం, పెద్దల సంగీత విభావరి, చెన్నుపల్లి నాగేశ్వరరావు బృందం కోలాట ప్రదర్శన అలరించాయి. సంగీత విభావరిలో పాటలు పాడిన గాయకుడు శేషగిరిరావుకు రొటేరియన్ గూడా మహాలక్ష్మిరెడ్డి నగదు బహుమతి అందించారు. కార్యక్రమంలో పాల్గొన్న వారిని కమిషనర్, మేనేజరు, ఇతర సిబ్బంది అభినందించారు. – న్యూస్‌టుడే, అద్దంకి

ప్రయాణించాలంటే నరకయాతనే

దర్శి-చీమకుర్తి ప్రధాన రహదారి కొన్నిచోట్ల అధ్వానంగా మారింది. తాళ్లూరు మండలం గుంటిగంగ సమీపాన 132 కేవీ విద్యుత్తు ఉపకేంద్రం నిర్మాణ ప్రాంతంలో రహదారి దెబ్బతింది. అర కిలోమీటరు పరిధిలో గుంతలు పడ్డాయి. దీంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రహదారులు, భవనాల శాఖ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, తాళ్లూరు

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

అద్దంకి: 94409 15704,
దర్శి: 9848 671678
మేదరమెట్ల: 79933 00506

దొనకొండ, న్యూస్‌టుడే:

?: దొనకొండ మండలంలోని లక్ష్మీపురంలో కోతుల బెడద ఎక్కువగా ఉంది. ఇళ్లలోకి వచ్చి సామాన్లు చిందరవందర చేస్తున్నాయి. పిల్లలపై దాడులకు పాల్పడుతున్నాయి. – ఏడుకొండలు, లక్ష్మీపురం

✓: పంచాయతీలో తీర్మానం చేయించి కోతులను పట్టించి సమీప అటవీప్రాంతంలో వదిలేలా చర్యలు తీసుకుంటాం. – శ్రీనివాసరావు, డిప్యూటీ ఎంపీడీవో

కురిచేడు, న్యూస్‌టుడే:

?: కురిచేడులోని వాల్మీకి, కోట బజార్లలో పలుచోట్ల వీధి దీపాలు వెలగడం లేదు. దీంతో రాత్రి వేళల్లో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. వీధి దీపాలు ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నాం. – కొండలు, స్థానికుడు

✓: పరిశీలించి నాలుగు రోజుల్లో వీధి దీపాలు ఏర్పాటు చేయిస్తా. – కృష్ణయ్య, సర్పంచి

బహుమతులిస్తున్నఎంఈవో రమాదేవి, నిర్వాహకులు

క్రమశిక్షణకు పెద్దపీట

దర్శి (తాళ్లూరు), న్యూస్‌టుడే : దర్శి పట్టణంలోని కిజిజి ఉన్నత పాఠశాలలో ఆదివారం వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణకు పెద్దపీట వేయాలన్నారు. అనంతరం వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఎంఈఓ రమాదేవి, కేవీకే శాస్త్రవేత్త డాక్టరు సంధ్యారాణి, హెచ్ఎం ఆంథోని, డైరెక్టరు రమణారెడ్డి, తూము సుబ్బారెడ్డి, పలువురు ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

తెదేపా నేత చెన్నయ్యకు నివాళి

దర్శి (తాళ్లూరు), న్యూస్‌టుడే : దర్శి మండలం పోతవరం పంచాయతీ పరిధి తిమ్మాయిపాలెంలో (మోటుపల్లి) ఆదివారం తెదేపా నాయకుడు తలపాటి చెన్నయ్య మృతి చెందారు. దర్శి మండల తెదేపా అధ్యక్షులు మారెళ్ల వెంకటేశ్వర్లు, దర్శి పట్టణ అధ్యక్షులు పి.సత్యనారాయణ, స్థానిక నాయకులు రామచంద్రారెడ్డి, రమణారెడ్డి, తదితరులు భౌతిక కాయం వద్ద నివాళులు అర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు.

పనికి తగ్గ వేతనం చెల్లించాలి

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: గత ఏడాది జూన్‌లో నిర్వహించిన కార్మికుల సమ్మె తాలూకా వేతనాలు చెల్లించాలని కోరుతూ మున్సిపల్ కార్మికుల యూనియన్ నాయకులు కమిషనర్ వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం సమ్మె చేసిన కాలానికి వేతనాలు చెల్లించాలని జీవో జారీ చేసిన ఇంతవరకు చెల్లించలేదని యూనియన్ జిల్లా కార్యదర్శి కొర్నెపాటి శ్రీనివాసరావు వెల్లడించారు. అదే విధంగా కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నగర కన్వీనర్ మహేష్, నరసింహం, విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మేదరమెట్ల, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన కొరిశపాడు మండలం మేదరమెట్ల గ్రామంలోని జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ఒంగోలు వైపు నుంచి వస్తున్న ద్విచక్రవాహనం మేదరమెట్ల సమీపంలోని దక్షిణ బైపాస్‌లో అదుపుతప్పి పడింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న యువకుడికి, మహిళకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను అంబులెన్స్‌లో ఒంగోలు వైద్యశాలకు తరలించారు. గాయపడిన వారి వివరాలు తెలియాల్సి ఉంది.

క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలు

పేర్నమిట్ట(సంతనూతలపాడు), న్యూస్‌టుడే: విద్యార్థులు క్రమశిక్షణగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని బి.వి.సుబ్బయ్య ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ బొడ్డు కోటిలింగం సూచించారు. ఆదివారం రాత్రి పాఠశాల్లో బి.వి.సుబ్బయ్య మాస్టారు 103వ జయంతి సందర్భంగా క్రీడల్లో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు బహుమతుల అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బి.వి.సుబ్బయ్య ఆశయాలతో జీవితంలో ముందుకు వెళ్లాలన్నారు. డీసీ ఛైర్మన్, పాఠశాల వైస్ ప్రెసిడెంట్ నల్లూరి కృష్ణారావు మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే లక్ష్యంతో సుబ్బయ్య పనిచేశారని పేర్కొన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా నడుచుకోవాలని తెలిపారు. ముందుగా బి.వి.సుబ్బయ్య చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో రవి ప్రసాద్, పాఠశాల ముఖ్య సలహాదారు వెంకటేశ్వరరావు, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు ఎం.వి.కృష్ణయ్య, విశ్రాంత ఉపాధ్యాయులు సత్యనారాయణ, విజయసారథి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వై.వేణుగోపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మురిసిన మల్లె రైతులు

❖ కిలో ధర రూ.350 పైనే

పేరాయపాలెం (అద్దంకి), న్యూస్‌టుడే : మల్లె పూల గుబాళింపు మొదలైంది. ఏడాదిలో రెండు నెలలు తప్ప మిగతా కాలమంతా పూత ఉంటుంది. నవంబరులో పూత నిలిచిపోగా, జనవరి చివరి వారం నుంచి తిరిగి చిగురిస్తుండటంతో రైతుల్లో సందడి మొదలైంది. మండలంలోని ధేనువకొండ, పేరాయపాలెం, ఉమ్మినేనివారిపాలెం, మద్దిపాడు మండలం దొడ్డవరం, కొలచనకోట, తాళ్లూరు మండలం కొర్రపాటివారిపాలెం, శివరాంపురం తదితర గ్రామాల్లో మల్లెతోటలు పెద్దఎత్తున సాగు చేస్తున్నారు. ఎకరం కౌలు సుమారు రూ.50 వేల నుంచి రూ.70 వేల వరకు పలుకుతోంది. ఇక్కడి పూలకు సువాసనతో పాటు ఘాటు ఎక్కువగా ఉండటంతో గిరాకీ బాగా ఉంటోంది. పూల ఉత్పత్తులను ఒంగోలు, గుంటూరు, విజయవాడ, హైదరాబాద్, తిరుపతి, శ్రీశైలం వంటి ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఇప్పటికే పూలను తెంచి ఏజెంట్ల ద్వారా ప్రత్యేక వాహనాల్లో పట్టణాలకు తీసుకెళుతున్నారు. ఏప్రిల్ నాటికి పూర్తిస్థాయి దిగుబడులు వస్తాయని రైతులు చెబుతున్నారు. సాధారణంగా మల్లెల ధర కిలో రూ.70 వరకూ ఉంటుంది. ప్రస్తుతం ధర రూ.350 పలుకుతోంది. మొన్నటి వరకూ రూ.450 వరకూ ఉండేదని వారంటున్నారు.

పేరాయపాలెంలో మల్లెపూలు కోస్తున్న కూలీలు

రూ.లక్షలు వెచ్చించి.. నిర్లక్ష్యంగా వదిలేసి..

పరిశీలన

కురిచేడు, న్యూస్‌టుడే: లక్షలు వెచ్చించి నిర్మించిన ప్రభుత్వ భవనాలను నిర్లక్ష్యంగా వదిలేశారు. నిరుపయోగంగానే దర్శనమిస్తున్నాయి. నాలుగేళ్ల క్రితం మండలంలోని 15 పంచాయతీల పరిధిలో 11 సచివాలయాలను నిర్మించారు. వాటిలో కొన్నింటిని అప్పటి ప్రజాప్రతినిధులు, అధికారులు ముందు ఆలోచన లేకుండా గ్రామాలకు దూరంగా ఏర్పాటు చేశారు. బోధనంపాడు గ్రామంలో నిర్మించిన రైతు సేవా కేంద్రం, పడమర వీరాయపాలెంలో నిర్మించిన భారత్ నిర్మాణ్ సేవా కేంద్రం, రైతు సేవా కేంద్రాలు చిల్లచెట్ల మధ్యనే దర్శనమిస్తున్నాయి. కురిచేడు సచివాలయం-2 పరిధిలో ఎస్సీస్పీ కాలనీలో నిర్మించిన రైతు సేవా కేంద్రం, భారత్ నిర్మాణ్ సేవా కేంద్రం, గ్రామ సచివాలయం భవనాల చుట్టూ చిల్లచెట్లు పెరిగాయి. దీంతో ఆ భవనాలు మందుబాబులకు అడ్డాగా మారాయి. భారత్ నిర్మాణ్ సేవా కేంద్రం తలుపు తాళాలు పగులగొట్టారు. వాటిని వెంటనే వినియోగంలోకి తెచ్చి ప్రజలకు అందుబాటులో ఉంచాలని మండల ప్రజలు కోరుతున్నారు.

బోధనంపాడులో చిల్లచెట్ల మధ్య రైతు సేవాకేంద్రం

పడమర వీరాయపాలెంలో భారత్‌నిర్మాణ్ సేవా కేంద్రం

నగదు ప్రోత్సాహకం అందుకుంటున్న ఏపీ జట్టు క్రీడాకారులు

రగ్బీలో సత్తా చాటిన హర్షిణి

తాళ్లూరు, న్యూస్‌టుడే : చెన్నైలో ఆదివారం జరిగిన దక్షిణ భారత జోనల్‌స్థాయి రగ్బీ పోటీల్లో రాష్ట్ర సబ్ జూనియర్ బాలికల జట్టు సత్తా చాటింది. తమిళనాడుపై విజయం దక్కించుకుని కాంస్య పతకం సాధించింది. తాళ్లూరు మండలం బొద్దికూరపాడు జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని వై.తులసీహర్షిణి రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించి విజయంలో కీలకపాత్ర పోషించింది. ఈ మేరకు కాంస్య పతకంతో పాటు నగదు ప్రోత్సాహకాలు అందజేసినట్లు ఏపీ రగ్బీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు తెలిపారని బీకేపాడు పాఠశాల పీడీ రవిప్రసాద్‌రెడ్డి చెప్పారు.

అద్దంకిలో ప్రతిభావంతుల సభ

అద్దంకి, న్యూస్‌టుడే : సినీ పాట చరిత్రలో వాణీ జయరాం గాత్రం అద్వితీయమని విశ్రాంత ఉద్యోగి మోటుపల్లి రామదాసు అన్నారు. ఏపీఎస్ ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో బంగ్లారోడ్డులోని చిన్ని శాంతయ్య భవనం వద్ద 'ప్రతిభావంతులు సభ' నిర్వహించారు. ఈ సందర్భంగా గాయని వాణీ జయరాం విశేష ప్రతిభపై వక్తలు మాట్లాడారు. పీసీ హెచ్.కోటయ్య, చందలూరి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

హోమంలో పాల్గొన్న దంపతులు

వైభవంగా నాగేంద్రుని విగ్రహ ప్రతిష్ఠ

అద్దంకి, న్యూస్‌టుడే : దక్షిణ అద్దంకి నర్రావారి ఇలవేల్పు నాగేంద్రస్వామి విగ్రహ పునఃప్రతిష్ఠ ఆదివారం వైభవంగా జరిగింది. మూడురోజుల నుంచి జరుగుతున్న ప్రతిష్ఠా మహోత్సవాల్లో నర్రా ఇంటిపేరు కలిగిన వారితోపాటు వారి ఆడపిల్లలకు సంబంధించిన బంధువులు పెద్దఎత్తున హాజరయ్యారు. నిర్దేశించిన సమయానికి ప్రతిష్ఠ జరిగింది. రూ.35 లక్షల వ్యయంతో ఆలయం నిర్మించారు. రెండు నెలలుగా ఆలయ పునః నిర్మాణ పనులు చురుగ్గా జరిగాయి. విఘ్నేశ్వరుడు, కుమారస్వామి, జంటనాగులు, ఆంజనేయస్వామి విగ్రహాల ప్రతిష్ఠ జరిగింది. భక్తులకు అన్నదానం నిర్వహించారు.

ఘనంగా రేణుకమ్మ తల్లి గ్రామోత్సవం

జె.పంగులూరు, న్యూస్‌టుడే: మండల కేంద్రం పంగులూరులో వేంచేసి ఉన్న రాయిని వంశ దేవర రేణుక అంకమ్మ తల్లి ఆలయంలో పూజలు నిర్వహించారు. రెండో రోజైన ఆదివారం మా తుడుపు, పుట్టబంగారం, గజాల కొలువు, జలాధివాసం, గ్రామోత్సవం నిర్వహించినట్లు ప్రధానాచార్యులు వేముల శ్రీహరి చౌదరి తెలిపారు. ఈ వేడుకలో రాయిని వంశస్థులతో పాటు, బంధువులు, గ్రామస్థులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పూజల్లో పాల్గొన్న రాయిని వంశీయులు, భక్తులు

శాంతినగర్‌లో ధ్వంసం చేసిన పరివర్తకం

రాగితీగ చోరులకెన్నడో కళ్లెం !

న్యూస్‌టుడే, అద్దంకి, తాళ్లూరు :

విద్యుత్తు తీగ వద్దకు వెళ్లాలంటేనే వెన్నులో వణుకు పుడుతుంది. అలాంటిది కొద్దిపాటి రాగితీగ కోసం పరివర్తకాన్నే ధ్వంసం చేస్తున్నారు. అద్దంకి, దర్శి ప్రాంతాల్లో ఇలాంటి చోరీలు నిత్యకృత్యంగా మారాయి. ఫలితంగా పొలాలు ఎండి రైతులు

ఏడాదికాలంలో దొంగతనాలు

- అద్దంకి విద్యుత్తు డివిజన్ : 19
- దర్శి విద్యుత్తు డివిజన్ : 78

● **దిక్కుతోచని రైతన్నలు**

తల్లడిల్లిపోతున్నారు. గత కొంతకాలంగా దర్శి, అద్దంకి ప్రాంతాల్లో దోపిడీ ముఠాలు చెలరేగిపోతున్నా పోలీసులు అడ్డుకట్ట వేయలేకపోతున్నారు.

దర్శి, అద్దంకి ప్రాంతాల్లోని ఎత్తిపోతల పథకాలు, సాగునీటి ప్రయోజనాల కోసం ఏర్పాటుచేసిన సింగిల్ ఫేజ్, త్రీఫేజ్ పరివర్తకాలను కాపాడుకోవడం రైతన్నలకు తలకు మించిన భారంలా మారింది. దశాబ్దకాలం క్రితం నియంత్రికలను విద్యుత్తు స్తంభాలకు అనుసంధానంగా ఎత్తులో బిగించడం, చుట్టూ ఇనుప కమ్మీలు అమర్చడం వంటివి చేసేవారు. పెరిగిన వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్ల నేపథ్యంలో అలాంటి వాటికి మంగళం పాడారు. ఇది దొంగలకు వరంగా మారింది. సింగిల్ ఫేజ్ పరివర్తకం ఖరీదు రూ.65 వేలు ఉండగా, త్రీఫేజ్‌ది రూ.రెండు లక్షల వరకు ఉంది. అద్దంకి, దర్శి నియోజకవర్గాల్లో 2025-26 ఆర్థిక సంవత్సరంలో పలు కేసులు నమోదవ్వగా, చోరులు మాత్రం చిక్కలేదు. దర్శి డివిజన్ పరిధిలో ఎక్కువ కేసులు నమోదవుతున్నాయి.

కేవలం రూ.2 వేల కోసం..

పరివర్తకం ఏర్పాటు చేయాలంటే కనీసం రూ.రెండు లక్షల వరకు ఖర్చవుతుంది. అందులోని రాగితీగ తీసి అమ్మితే వచ్చేది కేవలం రూ.మూడు వేలు మాత్రమే. ఇక కొత్త పరివర్తకం ఏర్పాటు చేయాలంటే వారాల తరబడి అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. అప్పటికే పంటలు ఎండిపోయి తీవ్రంగా నష్టపోతున్నామని వారు వేదన చెందుతున్నారు. దర్శి పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో ప్రత్యేక సిబ్బందితో బృందాన్ని ఏర్పాటు చేసినట్లు దర్శి డీఎస్పీ బి.లక్ష్మీనారాయణ తెలిపారు. త్వరలోనే దొంగలను పట్టుకుంటామన్నారు.

ఇబ్బంది లేకుండా చూస్తున్నాం

– మస్తాన్‌రావు, అద్దంకి ఈఈ; పి.శ్రీనివాసులు, దర్శి ఈఈ

విద్యుత్తు పరివర్తకాలు అపహరణకు గురైన సమయంలో రైతులు ఇబ్బంది పడకుండా సత్వరమే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నాం. రైతుల పంట పొలాలకు విద్యుత్తు సరఫరాకు ఆటంకం లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. సాధ్యమైనంత వరకు రైతులు అప్రమత్తంగా ఉండాలి.

(c) eenadu

ఒంగోలు

•ఒంగోలు •సంతనూతలపాడు

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: ఒంగోలు నగర పరిధిలోని పలు స్తంభాల మరమ్మతుల కార ణంగా వైఎస్సార్, జయప్రకాష్, జాషువా, ఇందిరమ్మ కాలనీ తదితర ప్రాంతాల్లో సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్తు సర ఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్తుశాఖ ఏఈ శ్రీధర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

చీమకుర్తిలో రెండు పరీక్ష కేంద్రాలు

చీమకుర్తి: చీమకుర్తి గెలాక్సీపురిలోని ప్రభుత్వ జూనియర్, సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలల్లో ఇంటర్ పబ్లిక్ పరీక్షల కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ఆయా కేంద్రాల్లో తాగునీరు, బల్లలు, తదితర అన్ని రకాల వసతులు కల్పించారు. 144 సెక్షన్ అమల్లో ఉన్న నేప థ్యంలో చుట్టూ పక్కల ప్రాంతాల్లోని జిరాక్స్ కేంద్రాలను మూసి వేయాలని సీఐ ప్రసాద్ సూచించారు.

వేతనాలు చెల్లించాలని వినతి

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: గత ఏడాది జూన్‌లో నిర్వహించిన కార్మికుల సమ్మె తాలూకా వేతనాలు చెల్లిం చాలని కోరుతూ మున్సిపల్ కార్మికుల యూనియన్ నాయకులు కమిషనర్ వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అంద జేశారు. రాష్ట్ర ప్రభుత్వం సమ్మె చేసిన కాలానికి వేతనాలు చెల్లించాలని జీవో జారీ చేసిన ఇంతవరకు చెల్లించ లేదని యూనియన్ జిల్లా కార్యదర్శి కొర్నెపాటి శ్రీనివాసరావు వెల్లడించారు. అదే విధంగా కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నగర కన్వీనర్ మహేష్, నరసింహం, విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

దామచర్ల జనార్దన్‌ను సన్మానిస్తున్న పార్టీ నాయకులు, ముస్లిం పెద్దలు

మసీదులో ఎమ్మెల్యే ప్రత్యేక ప్రార్థనలు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఒంగోలులోని ఇస్లాంపేట మక్కా మసీదులో ఆదివారం సాయంత్రం ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సంద ర్భంగా గంజి పంపిణీ ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యేను ముస్లింలు సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు షేక్ కుబీరతాషా, జాకీర్, అమురుల్లా, భక్షి, నాయబ్ రసూల్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

ఒంగోలు గ్రామీణం: ముఖ్యమంత్రి సహాయ నిధి(సీఎంఆర్ఎఫ్) పథకం కింద ఒంగోలు నియోజకవర్గంలోని చెందిన 58 మంది లబ్ధిదారులకు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.67.21 లక్షల ఆర్థికసాయం మంజూరు చేశారు. ఈ మేరకు సదరు చెక్కులను స్థానిక గుంటూరురోడ్డులోని తెదేపా కార్యాలయంలో ఆదివారం ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ చేతుల మీదుగా లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదల వైద్యఖర్చుల నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ కింద తక్షణ సహాయం అందిస్తున్నదని తెలిపారు. ఈ మేరకు పేదలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

జనసేన పార్టీ పటిష్ఠానికి కృషి

మద్దిపాడు: జనసేన పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్క జనసైనికుడు, వీరమ హిళ కృషి చేయాలని తాడేపల్లిగూడెం శాసనసభ్యుడు బొలిశెట్టి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం నెల్లూరు నుంచి అమరావతి వెళుతూ మండల పార్టీ అధ్యక్షుడు నున్నా బాల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో మండల పార్టీ కార్యాల యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జన సేన క్రియాశీలక సభ్యత్వం తీసుకోనే విషయంలో ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలన్నారు. రాష్ట్ర అధికార ప్రతినిధి రాయపాటి అరుణ మాట్లాడుతూ.. ఉప ముఖ్యమంత్రి ఆదేశాలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం రాబోయే 15 సంవత్సరాలు అధికారంలో ఉండేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్ర మంలో ఒంగోలు కార్పొరేటర్ రమేష్ మండల పార్టీ ఉపాధ్యక్షుడు వెంకటే శ్వర్లు, శేషయ్య, శ్రీను, హరిత, ప్రియాంక, శ్యామ్, సత్యం పాల్గొన్నారు.

తాగునీటి సమస్యల పరిష్కారానికి డిమాండు

ఒంగోలు గ్రామీణం: ఒంగోలు నగర శివారు కాలనీల్లో తాగునీటి సమస్య పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి షేక్ మాబు డిమాండ్ చేశారు. స్థానిక సుందరయ్య భవన్‌లో ఆదివారం నిర్వహించిన రాజకీయ శిక్షణ తర గతులనుద్దేశించి ఆయన మాట్లాడారు. తాగునీటి సమస్య దృష్ట్యా ప్రతి మూడు రోజులకోసారి ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలని కోరారు. ప్రస్తుతం వారానికి ఒక్కసారి మాత్రమే ఇంటికి రెండు డ్రమ్ముల చొప్పున నీరు ఇస్తు న్నట్లు తెలిపారు. కొన్ని కాలనీల్లో 10 రోజులైనా ట్యాంకర్లు రాని పరిస్థితి ఉందన్నారు. అన్ని కాలనీలకు పైపులైన్లు వేసి, ఇంటింటా కుళాయి ద్వారా రక్షిత నీరు అందించి శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ నాయకులు చీకటి శ్రీనివాసరావు, జి.రమేష్, తంబి శ్రీని వాసులు, ఎస్డీ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలతోనే బ్యారన్ ప్రమాదాలకు అడ్డుకట్ట!

న్యూస్‌టుడే, మద్దిపాడు, నాగులుప్పలపాడు

❖ జనవరి 30: మద్దిపాడు మండలం గుండ్ల సముద్రానికి చెందిన పరిమి వెంకటేశ్వర్లు బ్యారన్‌లో మొద్దు గొట్టంపై అల్లిక కర్ర పడి అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. లోపలి పొగాకు మొత్తం బూడిదై రూ.3 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లింది.

❖ అంతకు వారం రోజుల ముందు నాగులు ప్పలపాడు మండలం బి.నిడమానూరు, టంగు టూరు మండలం ఎం.నిడమానూరు, వలేటివా రిపాలెం మండలం అయ్యవారిపల్లిలోనూ ఇదే తరహాలో ప్రమాదాలు చోటుచేసుకుని మొత్తంగా రూ.12.50 లక్షల విలువైన పొగాకు అగ్నికి ఆహుతైంది. ఏటా పొగాకు బ్యారన్లలో చోటుచేసుకుంటున్న అగ్ని ప్రమాదాల కార ణంగా రైతులు రూ.లక్షల్లో నష్టపోతున్నారు. కొద్దిపాటి జాగ్రత్తలు పాటించడం ద్వారా ఈ ప్రమాదాలకు అడ్డుకట్ట వేయొచ్చని బోర్డు అధి కారులు సూచిస్తున్నారు.

ప్రధాన కారణాలివే...

అల్లిక కర్రలను బ్యారన్‌లో సరిగా అమర్చక పోవడమే ఎక్కువ శాతం ప్రమాదాలకు కారణ

నాగులుప్పలపాడు మండలం బి.నిడమానూరులో దగ్ధమైన బ్యారన్ (పాత చిత్రం)

మని అధికారులు చెబుతున్నారు. కట్టు సమ యంలో లోపల సరిగా ఇమడక మొద్దు గొట్టంపైన అవి పడి మంటలు రేగి మొత్తానికి విస్తరిస్తున్నాయి. ఇలా జరిగితే లోపలి ఆకును బయటకు తెచ్చే పరిస్థితి ఉండదు. మొత్తం నష్టపో వాల్సిందే. రైతులకు రూ. 2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు నష్టపోతు న్నారు. విద్యుత్తు సరఫ రాకు లోపల అమర్చిన తీగలు సరిగా లేకపో వడమూ ప్రమాదాలకు మరో కారణం. నిరం తర పర్యవేక్షణ, కర్రల అమరికలో జాగ్రత్తల తోనే వీటికి అడ్డుకట్ట వేయొచ్చని అధికారులు చెబుతున్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి...

'బ్యారన్‌లో పొయ్యిపై తప్పనిసరిగా జల్లెడ కట్టుకోవాలి. తద్వారా అల్లిక కర్రలు పడినా సమస్య ఉండదు. క్యూరింగ్ ప్రారంభానికి ముందే పొయ్యి, మొద్దు గొట్టం అన్నీ సరిగా ఉన్నాయో లేదో సరి చూసుకోవాలని క్షేత్రాధి కారి సామినేని హర్ష తెలిపారు. ఆకు అల్లికకు సన్నని కర్రలు వాడరాదని... బరువు ఎక్కువైతే అవి విరిగి పడే అవకాశం ఉందని చెప్పారు. బ్యారన్ లోపల అడ్డుగా ఉండే గుంజలు (టైర్లు) బలంగా ఉండేలా చూసుకోవాలన్నారు. చిన్న బ్యారన్లకు 900, పెద్దవైతే 1,100 కర్రలు మాత్రమే ఉంచాలని పేర్కొ న్నారు. రైతులు తప్పనిసరిగా బీమా చేయించుకోవాలని తద్వారా నష్టం వాటిల్లినా పరి హారంతో కొంత ఉపశమనం లభిస్తుందని వివరించారు.

ఒంగోలు-1, 2, వెల్లంపల్లి వేలం కేంద్రాల పరిధిలో ఏటా యావరేజ్‌గా వరకు బ్యారన్ అగ్ని ప్రమాదాలు చోటుచేసు కుంటున్నాయి.

ప్లాస్టిక్ వినియోగం హానికరం

కొత్తపట్నం సముద్రతీరంలో స్వచ్ఛత కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆంధ్రకేసరి విశ్వవిద్యా లయం ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఆదివారం కొత్తపట్నం సముద్ర తీరాన్ని శుభ్రం చేశారు. ఉపకులపతి డీవీఆర్ మూర్తి ఆదేశాల మేరకు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ మండే హర్షప్రీతమ్ ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఉపకులపతి మాట్లాడుతూ.. ప్లాస్టిక్‌ను అతిగా వినియోగించడం వల్ల జల, వాయు, భూ కాలుష్యం ఏర్పడి వాతావరణ సమతుల్యత దెబ్బతింటుందన్నారు. ఫలితంగా జీవ వైవిధ్యం మానవ మనుగడకు ముప్పు కలుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో ప్లాస్టిక్ వాడకాన్ని నివారించాలన్నారు. కార్యక్రమంలో ఆదిత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కె.సురేష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి శ్రీని వాస్, మెరైన్ పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అబుల్ కలాం ఆజాద్ సేవలు మరువలేనివి

అబుల్ కలాంకి నివాళులర్పిస్తున్న జిల్లా గ్రంథాలయ ప్రతినిధులు

ఒంగోలు అంజయ్యరోడ్డు, న్యూస్‌టుడే: జిల్లా గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థు లకు చదవడం మాకు ఇష్టం కార్య క్రమాన్ని నిర్వహిం చారు. ముందుగా పుస్తకాల ప్రదర్శన, మోటివేషనల్ తరగతులు నిర్వహించారు. అనంతరం చల్లా నాగేశ్వరమ్మ ఆధ్వర్యంలో విద్యార్థులకు పాటల తరగతులు నిర్వహిం చారు. తరగతుల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. గ్రంథాలయ ఇన్ ఛార్జి లైబ్రేరియన్ సంపూర్ణ ఆధ్వర్యంలో భారదేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ 68వ వర్థంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఆయన చిత్రపటానికి పూలమాలలు నివాళులర్పిం చారు. కార్యక్రమంలో సిబ్బంది, కోటేశ్వరరావు, సరయు, రవి, డీసీఎల్ ఒంగోలు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉన్నవి వెలగవు.. వెలిగినవి ఆరవు

నగరంలోని ఎల్కాన్ డివిజన్ 18లో చెర్వుకొ మ్ము పాలెం ఎస్సీ కాలనీ, సరస్వతీ కళా శాల ఎదురు రోడ్లలో ఇక్కడ పగలు రాత్రి లేకుండా నిరంతరం వీధి దీపాలు వెలుగు తుంటాయి. కొన్ని చోట్ల అయితే వీధి దీపాలు ఉన్న వెలగటం లేదని స్థాని కులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబం ధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



– న్యూస్‌టుడే, ఒంగోలు అంజయ్యరోడ్డు

మూతలు తీశారు.. మూయడం మరిచారు

మండల కేంద్రంలోని జాతీయ రహదారి డ్రైనేజీ సర్వీస్ రహదారిలో డ్రైనేజీ కాలువపై మూతలు తీసి ఐదు నెలలు దాటిన వాటికి మూతలు మూయడం విస్మ రించారు. గత ఆక్టోబరులో కురిసిన భారీ వర్షాల సమయంలో అప్పటి జేసీ గోపా లకృష్ణ షడియాపూడి పునరావాస కాలనీ సందర్శనకు వచ్చి పరిస్థితిని గమనించి నీరు బయటకు తరలించాలని ఆదేశాలు జారీ చేశారు. గ్రామ కార్యదర్శి అప్పటిక ప్పుడు హైవే డ్రైనేజీలకు మూతలు తీసి పూడికలు తీయించి నీరు పోయేలా చర్యలు తీసుకున్నారు. మూతలు రహదారికి సగం అడ్డంగా పడేయడంతో, ఆటుగా రాకపోకలు సాగించే చిన్నారులు, వృద్ధులు ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి పూర్ణారావుకు వివరణ కోరగా ఉన్నతాధికారు లతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, మద్దిపాడు

విజయభాస్కరరెడ్డితో పూర్వవిద్యార్థులు

గురుశిష్యుల ఆత్మీయ సమావేశం

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: సాంఘిక సంక్షేమశాఖ గురుకుల పాఠ శాల, కళాశాలల్లో పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన మారం విజయభాస్కరరె డ్డిని ఆయన దగ్గర చదువుకున్న పూర్వవిద్యార్థులు ఘనంగా సన్మానించుకు న్నారు. నగరంలోని సరోవర్ హోటల్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో వివిధ ప్రాంతాల్లో ఉంటున్న పూర్వవిద్యార్థులు హాజరయ్యారు. గురువుతో ఉన్న అనుబంధాన్ని పంచుకున్నారు. విజయభాస్కరరెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఉత్తమ పౌరులుగా ఎదిగి సమాజానికి ఉపయోగపడితే సైనికు లుగా మారాలన్నారు. వెలిగొండ, మహేష్, కుమారు, నాయుడు పేట, పొదిలి, బీమ కర్రి, అద్దంకిలోని గురుకులాల్లో చదివిన పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..
(10 AM TO 1 PM)
ఒంగోలు నగరం: 8008574067
ఒంగోలు గ్రామీణం: 8008564455
ఒంగోలు అంజయ్య రోడ్డు: 8247324766
కొత్తపట్నం: 8464085451
ఎస్.ఎన్.పాడు: 8008552692

?: **చీమకుర్తి:** చీమకుర్తి ప్రధాన రహదారి గన్నెల స్వామి బజారు ప్రారంభంలో వీధి దీపం వెలగడం లేదు. సమస్యను పరిష్కరించ గలరు. – శ్రీనివాసరావు, చీమకుర్తి.

✓: వెంటనే మరమ్మతులు చేయిస్తాం. – రామకృష్ణయ్య, కమిషనర్, చీమకుర్తి పురపాలక సంఘం.

?: **నాగులుప్పలపాడు:** సీహెచ్ ఉప్పలపాడు గ్రామంలో ఇటీవల దెబ్బతిన్న స్తంభాల స్థానంలో నూతన స్తంభాలను ఏర్పాటు చేశారు. ఆయా స్తంభాలకు విద్యుత్తు తీగలను బిగించలేదు. – వెంకటేశ్వర్లు, స్థానికుడు

✓: గుత్తేదారుతో పనులను పూర్తి చేయిస్తాం. – తిరుపాలు, లైన్‌ఇన్‌స్పెక్టరు

?: **ఒంగోలు నగరం:** గాంధీనగర్ ఒకటోలైన్ ఉత్తరం వైపు చివర చెరువుకు పైపులైన్ వాల్వ్ వద్ద లీకై నీరు వృథాగా పోతోంది. సమస్యను పరిష్కరించగలరు. – రాఘవయ్య, కాలనీవాసి

✓: సిబ్బందిని పంపించి మరమ్మతులకు చర్యలు తీసుకుంటాం. – ఏసయ్య, మున్సిపల్ ఇంజినీర్

?: గద్దలగుంట మూడుబొమ్మల కూడలిలో కాలు వలు శుభ్రం చేయడంలేదు. – హరిప్రసాద్

✓: సిబ్బందిని పంపించి కాలువలు శుభ్రం చేయిస్తాం. – ఎన్.పిచ్చయ్య, శానిటరీ సూపర్‌వైజర్

?: చైతన్య నగర్ ఎక్స్‌టెన్షన్‌లో కొత్తగా వేసిన రెండు స్తంభాలకు వీధి దీపాలు లేవు. – బొల్లె శ్రీనివాసరావు

✓: కొత్తగా వేసిన స్తంభాలకు వీధి దీపాలు ఏర్పాటు చేయిస్తాం. – ఏసయ్య, మున్సి పల్ ఇంజినీర్

?: **మద్దిపాడు:** మద్దిపాడు మండలం గుండ్లకమ్మ జలాశయం ఎడమ కాలువలో తుంగ, నాచు, గుర్రపుడెక్క, ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండి పోయింది. దీని వల్ల నీరు క్రమంగా దిగువకు పారటం లేదు. – నరసింహారావు, రైతు, మద్దిపాడు.

✓: జలాశయ ఉన్నతాధికారులతో సంప్ర దించి కాలువలో పేరుకు పోయిన వ్యర్థాలతో పాటు పిచ్చి మొక్కలను తొలగిస్తాం. – రామాంజనేయులు, ఏఈ.

?: పడమర పాలెం నుంచి జాతీయ రహదా రికి వెళ్లే రహదారి గుంతలమయమైంది. దీంతో పాదచారులు, వాహనదారులు రాకపోక లకు ఇబ్బందులు పడుతున్నారు. – సంజీవ రావు, మద్దిపాడు, గ్రామ నివాసి

✓: మండల పరిషత్ అధికారులతో చర్చించి బీటీ రహదారి నిర్మించుకు చర్యలు తీసు కుంటాం. – రవిబాబు, పీఆర్ ఏఈ

విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

క్రమశిక్షణతోనే ఉన్నత శిఖరాలు

పేర్నమిట్ట(సంతనూతలపాడు): విద్యార్థులు క్రమశిక్షణగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని బి.వి.సుబ్బయ్య ఉన్నత పాఠశాల కరస్పాం డెంట్ బోడ్డు కోటిలింగం సూచించారు. ఆదివారం రాత్రి పాఠశాల్లో బి.వి. సుబ్బయ్య మాస్టారు 103వ జయంతి సందర్భంగా క్రీడల్లో ప్రతిభ కనపరి చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బి.వి.సుబ్బయ్య ఆశయాలతో జీవితంలో ముందుకు వెళ్లా లన్నారు. డీసీ ఛైర్మన్, పాఠశాల వైస్ ప్రెసిడెంట్ నల్లూరి కృష్ణారావు మాట్లా డుతూ.. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే లక్ష్యంతో సుబ్బయ్య పనిచేశారని పేర్కొన్నారు. ముందుగా బి.వి.సుబ్బయ్య చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకు న్నాయి. కార్యక్రమంలో రవిప్రసాద్, పాఠశాల ముఖ్య సలహాదారు వెంకటే శ్వరరావు, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు ఎం.వి.కృష్ణయ్య, విశ్రాంత ఉపా ధ్యాయులు సత్యనారాయణ, విజయసారథి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వై.వేణుగోపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత

ఒంగోలు సాంస్కృతికం: ధ్యానంతో శారీరక, మానసిక ఆరోగ్యం మెరు గుపడడమే కాకుండా పరీక్షల్లో విద్యార్థులు మంచి ఫలితాలు సాధిం చేందుకు దోహదపడు తుందని చిన్మయ మిషన్ ప్రబోధకుడు పవిత్ర

బాలవిహార్ శిక్షణ తరగతుల్లో పాల్గొన్న విద్యార్థులు

చైతన్య పేర్కొన్నారు. ఆదివారం శ్రీగిరి గోశాలేత్ర ఆలయంలో నిర్వహించిన శ్రీగిరి బాలవిహార్ శిక్షణ తరగతుల్లో పవిత్ర చైతన్య విద్యార్థులతో ధ్యాన సాధన చేయించి, ధ్యానం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. హనుమాన్ చాలీసా ప్రాముఖ్యతను తెలియ చెప్పారు. విద్యార్థులు పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమాన్ని శ్రీగిరి నిర్వాహకులు పర్యవేక్షించారు.

అపూర్వ కలయిక

పేర్నమిట్ట(సంతనూతలపాడు): పేర్నమిట్ట లోని ప్రవేటు కళ్యాణ మండపంలో బి.వి. సుబ్బయ్య పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 1991లో పదో తర గతి, 1992-93లో ఇంటర్‌మీడియట్ చదివిన పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ఈ సమ్మేళనం చేపట్టారు. ఈ సందర్భంగా పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. పేదలైన పూర్వ విద్యార్థుల కుటుంబాలకు రూ.4.50లక్షల విద్య, వైద్యానికి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. సుబ్బయ్య మాస్టారు కాంస్య విగ్రహం ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నారు. పూర్వ ఉపాధ్యాయులు

పూర్వ విద్యార్థుల బృందం

నల్లూరి కృష్ణారావు, కె.వి.శేషయ్య, వాకా వెంకటే శ్వరరెడ్డి, గోవర్ధన్, ఆంజనేయులు, యోహాన్‌రెడ్డి, పాల్సన్, రమణయ్య, నాగేశ్వరరావు, మస్తాన సుబ్బారావులను ఘనంగా సన్మానించారు. కార్య క్రమంలో హనుమంతరావు, పూర్వ విద్యార్థులు విష్ణువర్ధన్, శ్రీనివాసరావు, హరిబాబు, హనుమం తరావు, పలువురు పర్యవేక్షించారు.

అందరి సహకారంతోనే బాలోత్సవం విజయవంతం

ఒంగోలు అంజయ్యరోడ్డు, ఒంగోలు నగరం: చిన్నారుల్లో దేశభక్తి, శాస్త్రీయ దృక్పథం స్నేహభావనలు, లౌకిక తత్వం పెరగాలని ప్రకాశం బాలో త్సవం కమిటీ అధ్యక్షుడు బండారు లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ఈ నెల 7, 8 వ తేదీల్లో నిర్వహించిన ప్రకాశం బాలోత్సవాలపై సమీక్షా సమావేశం, అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు బండారు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ విద్యార్థుల్లో దేశ భక్తి, సామాజిక స్పృహ, శాస్త్రీయ అవగాహన పెంపొందించే ప్రధాన లక్ష్యంతో బాలోత్సవాలు నిర్వ హించామని అన్నారు. విద్యార్థుల ఆసక్తికి అనుగుణంగా వివిధ అంశాలపై పోటీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. బాలోత్సవాలు విజయవంతం కావడానికి సహకరించిన విద్యార్థుల తల్లిదండ్రులకు, జిల్లా యంత్రాంగానికి, ప్రజా ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో బాలో త్సవ కమిటీ కన్వీనర్ ప్రసాద్, ఉమామహేశ్వర, సురేష్, కమిటీ నాయకులు నాయుడు, మాల్యాద్రి, వెంక టేశ్వర్లు, ప్రభాకర్‌రెడ్డి, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కమిటీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ

మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం

యల్లయ్య నగర్ ప్రాంతంలోని కంకర మిల్లులో మొక్కలు నాటుతున్న దృశ్యం

చీమకుర్తి, న్యూస్ టుడే: వాతావరణ కాలుష్యం నియంత్రణలో భాగంగా పచ్చదనం పెంపొందించ చేసేందుకు చీమకుర్తి మండలం రామతీర్థం, యల్లయ్య నగర్ ప్రాంతాల్లోని కంకర మిల్లుల వద్ద మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కంకర పరిశ్ర మల ప్రాంతంలో కాలుష్య నియంత్రణ చర్యలు పూర్తిస్థాయిలో చేపట్టిన విష యం 'కంకర మిల్లులకు తాళీ'లను' అనే శీర్షికన కనిపించిన ఈనాడులో వార్త ప్రచురితమయింది. ఈ నేపథ్యంలో స్టోన్‌క్రషర్ల ప్రాంతంలో సుమారుగా 200 మొక్కలు నాటాలని నిర్ణయించారు. ఆమేరకు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కాలుష్య నియంత్రణ మండలి సహాయ ఇంజినీర్ సునీల్ కుమార్, కంకర మిల్లుల యజమానుల సంఘం ప్రతినిధులు బి.మధుసూదనరావు, శ్రీనివాస రావు, నాగేశ్వరరావు, జనార్దన్ రెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మకంగా ఆలోచించాలి

ఒంగోలు నగరం: గ్రామీణ యువత విద్యార్థుల్లో న్యాయాలను పెంపొందించడంతో పాటు, సృజనాత్మకంగా ఆలోచించే శక్తిని పెంపొందించేందుకు కృషి చేయాలని ప్రధాని ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గాదంశెట్టి శ్రీనివాసులు పేర్కొన్నారు. స్థానిక క్విస్

ప్రధానమంత్రి మన్‌కీబాత్ కార్యక్రమంలో పాల్గొన్న క్విస్ ఇంజినీరింగ్ విద్యార్థులు

ఇంజినీరింగ్ కళాశాలలో ప్రధానమంత్రి మన్‌కీబాత్ కార్యక్రమ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు సూచనలు చేశారు. మానసిక దృఢ త్వంతో ప్రపంచంలో ఎదురయ్యే అన్నింటిని ఎదుర్కొనే సత్తా కలిగి ఉండాలని తెలిపారు. పీఎం మన్‌కీబాత్ కార్యక్రమాన్ని విద్యార్థులకు ఉపకరించేలా రూపొందించారని వెల్లడించారు. సమాజంలో సమస్యల పరిష్కారానికి నూతన ఆవిష్కరణలు చేసేలా విద్యార్థులు ముందుకు సాగాలన్నారు. మన్‌కీబాత్ కార్యక్రమ జిల్లా కన్వీనర్ మాకినేని అమరసింహం, క్విస్ కళాశాల అధినేత నిడ మానూరి కళ్యాణచక్రవర్తి, భాజపా జిల్లా అధ్యక్షుడు సెగ్గం శ్రీనివాసరావు విద్యార్థు లకు సూచనలు ఇచ్చారు. విద్యార్థులు వీడియో ద్వారా కార్యక్రమాన్ని వీక్షించారు.

మట్టి కుప్పను ఢీకొని వ్యక్తి మృతి

కొత్తపట్నం, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనదా రుడు వేగంగా వచ్చి మట్టికుప్పను ఢీకొనగా ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన కొత్త పట్నం మండలం మోటుమాల గ్రామంలో ఆది వారం రాత్రి చోటు చేసుకుంది. గుండమాల గ్రామా నికి చెందిన రేపు సురేష్ (40)అనే వ్యక్తి కొత్త పట్నం వెళ్లి తిరిగి స్వగ్రామానికి తిరిగి వస్తుండగా.. మోటుమాల గ్రామం వద్ద రోడ్డు పనుల నిమిత్తం మట్టికుప్ప తోలారు. ఆ మట్టికుప్ప వ్యక్తికి కనిపిం చకపోవడంతో వెళ్లి ఢీకొనడంతో ద్విచక్ర వాహన టైరు జారి రాయి మీద పడ్డాడు. దీంతో తలకు తీవ్ర గాయాలు అయ్యాయి. సమాచారం అందుకున్న అంబులెన్సు సమాచారం అందించేలోపు సురేష్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు.

ఉయ్యాలవాడకు నివాళి

నరసింహారెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డీఆర్వో ఓబులేసు, ఇతర అధికారులు

ఒంగోలు కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఉయ్యాల వాడ నరసింహారెడ్డి వర్థంతి సందర్భంగా జిల్లా యువజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో స్థానిక ప్రకాశం భవన్‌లో ఆదివారం ఆయన చిత్రపటా నికి పలువురు అధికారులు పూలమాల వేసి నివా ళులర్పించారు. కార్యక్రమంలో డీఆర్వో ఓబులేసు, సెట్ సీఈవో శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం బలోపేతానికి చెంచయ్య కృషి

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: మాజీ ఎమ్మెల్యే తవనం చెంచయ్య, సీపీఎం సీనియర్ నాయకుడు పమిడి కోటయ్య జిల్లాలో సీపీఎం నిర్మాణానికి విశేష కృషి చేశారని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి షేక్ మాబు కొనియాడారు. స్థానిక సుంద రయ్య భవన్‌లో ఆదివారం వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూమి లేని కూలీలకు భూమి దక్కాలనే నినాదంతో పలు భూ పోరాటాలకు నాయ కత్వం వహించారన్నారు. అంటరానితనం, సామాజిక బహిష్కరణలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యవంతులను చేసి, పలు పోరాటాలు నడిపారని ఆయన పేర్కొన్నారు. సీని యర్ నాయకుడు జాల అంజయ్య మాట్లాడుతూ.. కష్టజీవుల కోసం జీవితాన్ని అంకితం చేసి, నిరాడంబర జీవనానికి ప్రతీ కగా నిలిచారని వెల్లడించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు చీకటి శ్రీనివాసరావు, పుల్లారావు, కొండారెడ్డి, హనుమంతరావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మద్దిపాడు,న్యూస్‌టుడే: పేద ప్రజల అభివృద్ధికి అలుపెరు గని కృషి చేసిన పోరాటయోధుడు తవనం చెంచయ్య అని

చెంచయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

మండల సీపీఎం కన్వీనర్ ఆదిలక్ష్మి పేర్కొన్నారు. ఆదివారం మండలకేంద్రంలోని స్థానిక వెలుగు కార్యాలయం వద్ద సంత నూతలపాడు మాజీ శాసన సభ్యుడు తవనం చెంచయ్య వర్థంతి సభను ఆ పార్టీ నాయకుడు ఉబ్బా వెంకటేశ్వర్లు అధ్య క్షతన నిర్వహించారు. విశ్రాంత ఉద్యోగుల ఆధ్వర్యంలో చెంచయ్య చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఖాసీం, సుబ్బారావు, యలమంద, నరసిం హారావు, సుబ్బారావు, వెంకట రవి తదితరులు పాల్గొన్నారు.

ఒంగోలు నగర పరిసర ప్రాంత ప్రజలకు, "బాంబేటెక్స్" వారి శుభవార్త
బాంబేటెక్స్
జెంట్స్ క్లాత్ & కట్ పీసెస్ షోరూమ్
రోటెక్ కట్ ఫోర్మేషన్ డే
బాంబేటెక్స్ వారి రంజాన్ శుభాకాంక్షలతో ఆఫర్.... ఆఫర్....

Raymond Phant	1.30 cut Rs. 500/-
Cotton shirt	1.60 Cut Rs. 300/-
BSL Phant	1.30 cut Rs. 500/-
Cotton shirt	1.60 Cut Rs. 300/-
OCM Phant	1.30 cut Rs. 500/-
Cotton shirt	1.60 Cut Rs. 300/-

Cootton Shirt 1.60 Cut 2+2 = 4 Shirts Rs.1000/-
Linen Cotton Shirt 1.60 Cut Rs. 600/-
Special Offer
Lalchi + Paijama Rs. 600/-
BOMBAYTEX
GENTS CLOTH & CUT PIECES SHOW ROOM
SHOP NO. 134 & 135, S.B.M.C. ONGOLE.
PROP:- K.V. SUBBA RAO, CELL:- 9966003542

ప్లాస్టిక్ కాదు.. ఫోర్టిఫైడ్ బియ్యమే

న్యూస్‌టుడే, నెల్లూరు(కలెక్టరేట్)

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తెల్ల రేషన్‌కార్డుదారులకు ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తున్నాయి. నీటిలో నానబెట్టినప్పుడు పైకి తేలుతున్నాయని.. ప్లాస్టిక్ బియ్యంగా భావించి ఎక్కువమంది తినకుండా విక్రయిస్తున్నారు. ఇదే అదనుగా రేషన్ బియ్యం మాఫియా రూ.10కి కొనుగోలు చేసి రూ.20కి అమ్ముకుంటున్నారు. బియ్యంలో శరీరానికి శక్తిని అందించే కార్బోహైడ్రేట్లు మెండుగా ఉంటాయి. దేశంలో చాలా మంది ప్రజలు విటమిన్ బీ12 లోపంతో బాధపడుతున్నారు. బీ12తో పాటుగా ఇనుము, ఫోలిక్ ఆమ్లం వంటి పలు సూక్ష్మ పోషకాలను కలిపి ఫోర్టిఫైడ్ రైస్‌ను తయారు చేసి వీటిలో కలిపి ప్రభుత్వం సరఫరా చేస్తోంది. తెల్ల బియ్యం కంటే ఎక్కువ ప్రోటీన్, ఫైబర్ కలిసి ఉంటాయని అధికారులు తెలిపారు. వీటిపై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన లేక తినడం లేదని చెబుతున్నారు.

ప్రజలకు అవగాహన కల్పిస్తాం

కార్డుదారులకు అందించే బియ్యం ఖర్చు రూ.కోట్లల్లో ఉంటోంది. ప్రభుత్వమే భరించి ఉచితంగా అందిస్తోంది. ఇవి పూర్తి పోషక విలువలు కలిగిన ఫోర్టిఫైడ్ బియ్యం. వీటిని తినడం వల్ల అనారోగ్య సమస్యలు తీరి, విటమిన్ లోపాలు తగ్గుతాయి. ప్రజలకు అవగాహన కల్పిస్తాం.
– లీలారాణి, ఇన్‌ఛార్జి డీఎస్వో

డిపోలు: 1513 | కార్డులు: 7,21,524 | ప్రతినెలా బియ్యం సరఫరా: 10,923.295 మెట్రిక్ టన్నులు

జలం.. అన్నదాతకు బలం

సోమశిల జలాశయంలో నీటి నిల్వలు

న్యూస్‌టుడే, ఆత్మకూరు

సోమశిల జలాశయంలో ఈ ఏడాది పుష్కలంగా నీటి నిల్వలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రాజెక్టు నీటి యాజమాన్య విధానం మారింది. అధికారులు నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించడంతో రెండో పంటకు జలాలు అందుబాటులో ఉన్నాయి. అలాగే తాగునీటికి సమస్యలు తలెత్తవు.

66.98 టీఎంసీల నీరు

జలాశయంలో ప్రస్తుతం 66.98 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత ఏడాది ఇదే రోజు 60.30 టీఎంసీలు ఉన్నాయి. గత ఏడాదికన్నా అదనంగా 6.68 టీఎంసీలు నిల్వ ఉంది. జలాశయంలోకి గత ఏడాది ఇదే సమయంలో 512 క్యూసెక్కుల ప్రవాహం ఉండగా.. ప్రస్తుతం 1550గా ఉంది. ప్రాజెక్టు పరిధిలో సాగులో ఉన్న

రెండో పంటకు అవకాశం

మొదటి పంట షెడ్యూల్ మార్చి నెలాఖరు వరకు ఉంటుంది. ఆపై మరో 15 రోజులు ఆలస్యంగా నాటిన పంట అవసరాలు ఉండే అవకాశం ఉంది. రెండో పంట ఏప్రిల్, మేలో సాగుచేయనున్నారు. ప్రస్తుతం పంటల సాగుకు జలాశయం నుంచి 4వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. వచ్చే ప్రవాహం తగ్గినా 11టీఎంసీలు లోపు మొదటి పంట అవసరాలు తీరే అవకాశం ఉంది. అంటే జలాశయంలో మొదటి పంట పూర్తయ్యే నాటికి దాదాపు 55 టీఎంసీలు నిల్వలు ఉంటాయని ఇంజినీరింగ్ నిపుణులు అంచనా వేస్తున్నారు.

కండలేరులో..

కండలేరు జలాశయంలోనూ ఈ ఏడాది నిల్వలు పుష్కలంగా ఉన్నాయి. ప్రస్తుతం 55.19 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వచ్చే ఏడాది పంట సాగుకు రైతులకు కలిసి రానుంది. వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తవు.

● సాగునీటి అవసరాలు తీరేలా సోమశిలలో నిల్వలు ఉన్నాయని ప్రాజెక్ట్ ఈఈ శ్రీనివాసకుమార్ తెలిపారు.

కేసులకు వెరవం.. మత్తులో పయనం..

● పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రతి శని, ఆదివారాల్లో ఎన్‌ఫోర్సుమెంట్ నిర్వహిస్తున్నారు. అంటే రాత్రి పది గంటల నుంచి తెల్లవారుజాము వరకు జిల్లా వ్యాప్తంగా తనిఖీలు చేస్తున్నారు. నెలలో నాలుగు రోజులు ప్రత్యేక డ్రైవ్ ఉంటుంది. జనవరిలో డ్రంకెన్ డ్రైవ్ కింద 59 కేసులు నమోదు చేయగా, 24 వాహనాలు సీజ్ చేశారు.

● నగరంలోని సౌత్, నార్త్ ట్రాఫిక్ పోలీసు స్టేషన్ల పరిధిలో ఇటీవల మద్యం తాగి వాహనాలు నడిపిన దాదాపు 12 మందిపై కేసు నమోదు చేసి న్యాయస్థానంలో హాజరుపరచగా ఒక్కొక్కరికి రూ. 10 వేల వంతున జరిమానా విధించారు.

● నగర పరిధిలోని నార్త్, సౌత్ ట్రాఫిక్ పోలీసు స్టేషన్ల పరిధిలో నిత్యం డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు జరుగుతున్నాయి. నార్త్ పరిధిలో ప్రతిరోజూ మూడు నుంచి నాలుగు, సౌత్ ప్రాంతంలో మూడు నుంచి ఐదు కేసులు నమోదు చేస్తున్నారు.

న్యూస్‌టుడే, నెల్లూరు(నేర విభాగం)

సురక్షితంగా గమ్యం చేరి కుటుంబ సభ్యులతో హాయిగా గడపాల్సిన కొందరు.. మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. జిల్లాలో చోటు చేసుకుంటున్న రోడ్డు ప్రమాదాలకు కారణం అధిక శాతం మంది మద్యం మత్తులో వాహనాలు నడపడంతోనే అని పోలీసు అధికారులు చెబుతున్నారు.

తీరు మార్చుకోని మందుబాబులు

నెల్లూరు నగరంలోని అన్ని పోలీసు స్టేషన్లతో పాటు ట్రాఫిక్ పోలీసు స్టేషన్ల పరిధిలో నిత్యం డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపడుతున్నారు. ఒకవైపు ఇవి జరుగుతున్నా.. మందుబాబులు తీరు మార్చుకోవడం లేదు. ఏదో ఒక ప్రాంతంలో మద్యం తాగి వాహనాలు నడుపుతూ తనిఖీల్లో పట్టుబడుతున్నారు. సాధారణ రోజుల్లో ఒకట్రెండు ఉండే కేసుల సంఖ్య శని, ఆదివారాల్లో పదుల్లో ఉంటున్నాయి. పట్టుబడిన వారే మళ్లీ తనిఖీల్లో చిక్కడంతో పోలీసులు కోర్టులో హాజరుపరుస్తున్నారు.

పెరుగుతున్న డ్రంకెన్ డ్రైవ్ కేసులు

వాహనదారుడిని తనిఖీ చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

వివరాలు ఇలా..

సంవత్సరం	కేసులు	జైలుశిక్ష
2023	1440	12
2024	1320	25
2025	1560	34

జరిమానాతో పాటు జైలుశిక్ష

ఎస్పీ ఆదేశాల మేరకు నిత్యం డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపడుతున్నాం. సాధారణ రోజులతో పాటు వారాంతపు రోజుల్లోనూ ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నాం. ఒకటికి రెండు సార్లు పట్టుబడితే కఠిన చర్యలు ఉంటాయి. జరిమానాతో పాటు జైలుశిక్ష పడేలా చూస్తున్నాం.
– వెంకటరెడ్డి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్

ఏకాంతసేవతో.. బ్రహ్మోత్సవాలు సమాప్తం

నెల్లూరు మూలాపేట మూలస్థానేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ముగిశాయి. అర్చకులు ఆదివారం రాత్రి ప్రత్యేక పూజలు అనంతరం స్వామివారికి ఏకాంతసేవ నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.
–న్యూస్‌టుడే, నెల్లూరు (ఆర్టీసీ)

కలుషిత నీరు.. పట్టించుకోరు

ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు నెల్లూరు నగరపాలకసంస్థ రూ.కోట్లు ఖర్చు చేస్తోంది. క్షేత్రస్థాయిలో రంగుమారిన, వాసన వస్తున్న నీరే సరఫరా అవుతోంది. పైపుల లీకులతో పాటు పలు ప్రాంతాల్లో కాలువల్లో ఉండటంతో తాగునీరు కలుషితమవుతోంది. నగరంలోని కోటమిట్ట, జెండావీధి, మన్సూర్‌నగర్, మనుమసిద్ధినగర్ తదితర ప్రాంతాల్లో కుళాయిల ద్వారా రంగుమారిన నీరు వస్తుండటంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని నగర ప్రజలు కోరుతున్నారు.
–న్యూస్‌టుడే, నెల్లూరు(నగరపాలక సంస్థ)

పునాదుల్లో నాడు - నేడు.. షెల్టర్‌లో చదువులు చూడు

అమరజీవి పొట్టిశ్రీరాములు నడయాడిన గ్రామం.. జువ్వలదిన్నె. ఇక్కడి జడ్పీ ఉన్నత పాఠశాలకు శాశ్వత భవనం లేదు. గ్రామ నడిబొడ్డున పురాతన తుపాన్ షెల్టర్‌లో తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రాథమికోన్నత స్థాయి నుంచే ఇదే పరిస్థితి. శాశ్వత భవనాల కోసం రూ.1.20 కోట్లతో నాడు- నేడు పథకం కింద చేపట్టిన పనులు పునాదుల దశలోనే ఉన్నాయి. దీంతో 200 మంది విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు.
– న్యూస్‌టుడే, బిట్రగుంట

కదలిక.. రైల్వే భూములపై ఆరా
ప్రగతి పట్టాలెక్కేదాకా!

బిట్రగుంట రైల్వే ప్రగతి పట్టాలెక్కే దిశగా అడుగులు పడుతున్నాయి. కావలి డివిజన్ పారిశ్రామికంగా అభివృద్ధి చెందడం.. అందుకు అనుగుణంగా ఇక్కడి రైల్వే ఆస్తులను వినియోగించుకోవాలన్న ఆలోచన ప్రజాప్రతినిధుల్లో ఏర్పడింది. అందులో భాగంగానే కలెక్టర్ హిమాన్షు శుక్లా వారం రోజుల కిందట బోగోలు రెవెన్యూ కార్యాలయానికి వచ్చారని తెలిసింది. ఇదే జరిగితే పూర్వ వైభవం వస్తుంది.

బిట్రగుంటలో విలువైన భూములు

న్యూస్‌టుడే, బిట్రగుంట

బ్రిటీష్ పాలనలో బిట్రగుంట రైల్వేకు దక్షిణ ఆసియా ఖండంలోనే మంచి పేరుండేది. నాలుగు దశాబ్దాల కిందట విజయవాడ- చెన్నై మధ్య విద్యుత్తు రైలింజన్ల పరుగుతో ఈ ప్రాంతానికి ప్రాధాన్యం తగ్గిపోయింది. తాజాగా కలెక్టర్ వెల్లడించిన అంశాలను పరిగణలోకి తీసుకుంటే జిల్లాలోని ప్రజాప్రతినిధుల పాత్ర కీలకంగా ఉందని తెలుస్తోంది. ఇక్కడ రైల్వేకి వందల కోట్ల రూపాయల విలువజేసే 500 ఎకరాల భూములు ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. రామాయపట్నం పోర్టు, జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్, దగదర్తి విమానాశ్రయం బిట్రగుంట రైల్వే స్టేషన్‌కు దగ్గరలో ఏర్పాటుకానున్నాయి. రవాణా వ్యవస్థకు ఇక్కడి రైల్వే ఖాళీ భూములను ఉపయోగించుకుంటే బహుళ ప్రయోజనాలు ఉంటాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. వీటి వెనుక జిల్లాలోని ఎంపీలు, ఎమ్మెల్సీల పాత్ర ఉన్నట్టు తెలుస్తోంది.

అనువైన ప్రాజెక్టులు

మల్టీపుల్, లాజిస్టిక్ పార్క్ ఏర్పాటుకు ఈ ప్రాంతం అనువైంది. ఈ విషయం ఇదివరికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి ప్రజాప్రతినిధులు, అధికారులు తీసుకెళ్లారు. పోర్ట్, ఫిషింగ్ హార్బర్, విమానాశ్రయం ఏర్పడబోయే పలు ప్రాజెక్టుల రవాణా వ్యవస్థకు రైల్వే స్థలాలు ఉపయోగించుకోవచ్చు. రొటీన్ ఓవర్ హాలింగ్ గూడ్సు రైళ్ల డిపో ఏర్పాటుకు అనువైన ప్రాంతమని గతంలో రైల్వే అధికారుల బృందం స్థల పరిశీలన చేసి నిర్ధారించింది. వారి అభిప్రాయానికి నేతల సహకారం అందిస్తే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుంది.

లెక్కల్లో మాయాజాలం
పీఎంశ్రీ పథకం నిధుల వ్యయంలో అక్రమాలు

న్యూస్‌టుడే, సంగం: జిల్లాలో పీఎంశ్రీ పథకం పనుల్లో పర్యవేక్షణ కొరవడి అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. కొన్ని పాఠశాలలు పథకాన్ని సద్వినియోగం చేసుకుంటుండగా, మరి కొన్నింటిలో నిధులు పక్కదారి పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికే కొంతమేర మౌలిక వసతులు కలిగిన పాఠశాలలను గుర్తించి వాటిని సంపూర్ణంగా అభివృద్ధి చేసేందుకు 2022-23 ఆర్థిక సంవత్సరంలో పీఎంశ్రీ పథకానికి కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అయిదేళ్ల కాల వ్యవధిలో ఒక్కో పాఠశాలకు సరాసరి రూ.1.5కోట్ల నుంచి రూ. రెండు కోట్ల వరకు నిధులు అందించి అభివృద్ధి చేసి వాటిని మిగిలిన పాఠశాలలకు ఆదర్శంగా తీర్చిదిద్దాలన్నదే లక్ష్యం.

వస్త్రధారణకు రూ.22వేలా?

సంగం మండలంలో రెండు పీఎంశ్రీ పాఠశాలలు ఉన్నాయి. ఒక దానిలో జరిగిన సాంస్కృతిక వేడుకలో విద్యార్థుల వస్త్రధారణకు రూ.22 వేలు వ్యయం చేసినట్లు లెక్కలు చూపించాలని ప్రయత్నించగా, కొందరు ఉపాధ్యాయులు ప్రశ్నించడంతో అక్రమం వెలుగులోకి వచ్చింది. అధికారులు స్పందించి అక్రమాలు జరగకుండా చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

రూ.7.15 కోట్లు మంజూరు

జిల్లా వ్యాప్తంగా ఎంపికైన 42 పీఎంశ్రీ పాఠశాలలకు 2024-25 ఆర్థిక సంవత్సరంలో 219 పనులకు రూ.7.14 కోట్లు మంజూరు చేశారు. వాటితో పాఠశాలల్లో మౌలిక వసతులు, రూ.నాలుగు లక్షలతో క్రీడా మైదానాలు ఏర్పాటు చేయాలి. భౌతిక శాస్త్ర ప్రయోగశాలను సంపూర్ణ వసతులతో ఏర్పాటు చేయాలి. తాగునీటి ప్లాంట్లు, కిచెన్ గార్డెన్, వర్షపునీటి సంరక్షణ, బాలబాలికలకు వేర్వేరుగా మరుగుదొడ్ల నిర్మాణం, గ్రంథాలయం, ఆరోగ్య సంరక్షణ కార్యక్రమాలు చేపట్టాలి.

సంగం బాలికల గురుకుల పాఠశాలలో నిర్మాణంలో బాస్కెట్‌బాల్ మైదానం

నామమాత్రంగా నిర్వహణ

ప్రతి పాఠశాలకు అదనంగా రూ.2.25 లక్షలు మంజూరు చేశారు. అందులో కంటింజెంట్ నిధులుగా రూ.లక్ష, ఏక్‌భారత్ శ్రేష్ఠభారత్ కార్యక్రమానికి రూ.25వేలు, వార్షికోత్సవానికి రూ.50వేలు, వృత్యంతర శిక్షణ యాత్రకు రూ.15వేలు, క్షేత్ర పర్యటనకు రూ.25వేల వంతున, మాదకద్రవ్యాల వ్యతిరేకంగా అవగాహన కార్యక్రమానికి రూ.10 వేలు అందించారు. కార్యక్రమాలను నామమాత్రంగా నిర్వహిస్తూ నిధులు పక్కదారి పట్టిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.



నగరంలోని పరీక్ష కేంద్రంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఆర్ఐవో వరప్రసాదరావు

విజయీభవ
నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

న్యూస్‌టుడే, నెల్లూరు(విద్య)

ఇంటర్ పరీక్షల నిర్వహణకు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. సోమవారం ప్రథమ, మంగళవారం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు జరగనున్నాయి. ప్రతిరోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తారు. 8.30 గంటలకు విద్యార్థులను కేంద్రాల్లోకి అనుమతిస్తారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా ఏర్పాట్లు చేశామని జిల్లా కన్వీనర్, ఆర్ఐవో టి.వరప్రసాదరావు తెలిపారు. జిల్లాలో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల విద్యార్థులు 53,404 మంది, వృత్తివిద్యకు సంబంధించి ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 2,335 మంది పరీక్షలు రాయనున్నారు. వీరికి 29 ప్రభుత్వ, 52 ప్రైవేట్ కళాశాలల్లో కేంద్రాలను ఏర్పాటు చేశారు. విద్యార్థులకు సమస్యలు ఉంటే ఆర్ఐవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నంబర్ 0861 2320312కిసమాచారం ఇవ్వాలని తెలిపారు.

నారీ.. పథకాలు దరిచేరి
పొదుపు మహిళలకు ప్రభుత్వం చేయూత

న్యూస్‌టుడే, నెల్లూరు(కలెక్టరేట్)

పట్టణ స్వయం సహాయక సంఘ సభ్యుల జీవనోపాధుల కల్పనకు, ఆర్థిక ప్రగతికి కూటమి ప్రభుత్వం పలు పథకాలకు శ్రీకారం చుడుతోంది. అందులో భాగంగా 'ఒక కుటుంబానికి.. ఒక వ్యాపారవేత్త' నినాదంతో ముందుకు సాగుతోంది. మెప్మా ఆధ్వర్యంలో వివిధ పథకాలను అమలు చేస్తూ వారి ఉపాధికి బాటలు వేస్తోంది. బ్యాంకు లింకేజీ, జీవనోపాధులు, పీఎం స్వానిధి, పీఎంఈజీపీ, పీఎంఎఫ్ఎంఈ, ముద్ర యోజన, ఎంఎస్ఎంఈ, సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ప్రోగ్రాంలను దరి చేరుస్తోంది.

60 రకాల యూనిట్లు

మెప్మా ఆధ్వర్యంలో మహిళలకు 60 రకాల యూనిట్లు ఉన్నాయి. కొత్తగా చాయ్ రస్తా, ఎగ్ మార్ట్, స్మార్ట్ స్ట్రీట్, అరకు కాఫీ, ఫుడ్ కియోస్క్, రోబోటిక్, ర్యాపిడో, ఈజీ మార్ట్, హోమ్ డెకరేషన్, హెర్బల్, ఆర్టిఫిషియల్ జ్యువెలరీ, డిజిలక్ష్మి, టీ దుకాణాలు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు తదితరాలు ఏర్పాటుచేసుకోవచ్చు. వీటితో నెలకు రూ.30వేలు వరకు ఆదాయం వస్తుంది.

నగరం, పట్టణం..	సభ్యుల సంఖ్య
నెల్లూరు	1,52,089
కావలి	21,014
బుచ్చిరెడ్డిపాలెం	7,250
ఆత్మకూరు	7,597

అధికారిక వెబ్‌సైట్ ద్వారా..

లైవ్లీ హుడ్ ప్రమోషన్ సెల్ (ఎల్‌హెచ్‌పీసీ) ద్వారా వ్యాపారవేత్తలను తీర్చిదిద్దుతున్నారు. జిల్లాలోని నెల్లూరు నగరం, కావలి, ఆత్మకూరు, బుచ్చిరెడ్డిపాలెంలో సంఘాలు కొనసాగుతున్నాయి. వీరికి జీవనోపాధులు కల్పించేందుకు ఒక్కో ఆర్పీకి నాలుగు యూనిట్ల చొప్పున లక్ష్యం విధించారు. ఇప్పటి వరకు 1300 దరఖాస్తులు వచ్చాయని అధికారులు చెబుతున్నారు. కొత్త వారు https://www.apmepma.gov.in ద్వారా నమోదు చేసుకోవచ్చు. 18-55 ఏళ్ల మధ్య వయస్సు ఉండాలి.

ట్రాఫిక్‌లో వసూళ్లు
ఏఎస్సై సస్పెన్షన్

నెల్లూరు(నేర విభాగం), న్యూస్‌టుడే: ట్రాఫిక్‌లో వసూళ్లకు పాల్పడుతున్న ఏఎస్సై వెంకటేశ్వర్లును సస్పెండ్ చేస్తూ ఎస్పీ అజిత వేజెండ్ల శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఫోన్ పే ద్వారా నగదు పంపించాలని విద్యార్థిపై ఒత్తిడి చేస్తున్నట్లు వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. ఆగ్రహం వ్యక్తం చేసిన ఎస్పీ సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన యువకుల నుంచి ట్రాఫిక్ పోలీసులు భారీస్థాయిలో నగదు వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ పట్టుబడితే రూ.10వేలు అపరాధ రుసుంతో పాటు జైలు శిక్ష పడుతుందనే బూచి చూపించి దోచుకుంటున్నారు. బ్రీత్ ఎనలైజరు యంత్రంతో పరీక్షించిన అనంతరం తాగి ఉన్నావని, చలానా తీయాలంటూ భయభ్రాంతులకు గురిచేస్తూ కానిస్టేబుళ్ల నుంచి అధికారుల వరకు దండుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. డ్రైవింగ్ లైసెన్సులు, వాహన పత్రాలు లేకపోయినా వసూళ్లకు పాల్పడుతున్నారు. ఈ నేపథ్యంలోనే ట్రాఫిక్ ఏఎస్సై వసూళ్లకు పాల్పడ్డారని సమాచారం.

అప్పుడే ఇలా.. నాణ్యత కల!

న్యూస్‌టుడే, కావలి

జిల్లాలో జాతీయ రహదారి నిర్మాణ పనులు నాసిరకంగా జరుగుతున్నాయి. కావలి- సీతారామపురం జాతీయ రహదారి 107.2 కి.మీ. దూరం రూ.600 కోట్లతో పనులు చేపట్టారు. నిర్మాణంలో డొల్లతనం అప్పుడే వెలుగులోకి వస్తోంది. ఈ మార్గంలో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. కావలి పట్టణంలో ట్రంకురోడ్డు నుంచి మద్దూరుపాడు చెన్నై- కోల్‌కతా 67వ నంబర్ జాతీయ రహదారికి అనుసంధాన పనుల్లోనూ ఇలాంటి నాసిరకం పనులే కనిపిస్తున్నాయి. అంతే కాదు ఇక్కడి పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది.

కావలి- సీతారామపురం జాతీయ రహదారిలో బుడంగుంట వద్ద తారు జారిపోతూ రోడ్డుపై ఏర్పడిన గుంతలు ఇవి. నెలల వ్యవధిలోనే ఇలా కావడానికి నిర్మాణ సమయంలో లోపాలే కారణమని సమాచారం.

● ఇదే మార్గంలో జాతీయ రహదారి అంచున బరమ్స్ పనుల్లో నిర్లక్ష్యం చోటుచేసుకుంది. గ్రావెల్ తీసుకొచ్చి కుప్పగా పోసి వదిలేశారు. కనీసం అయిదారుసార్లు రోలింగ్ చేయాల్సి ఉన్నా..ఆ దిశగా చర్యలు లేవు. వాహనదారులు రహదారి అంచుకు వస్తే జారిపోవాల్సిందే.

సరిదిద్దుతాం

రహదారి నిర్మాణ పనుల్లో లోపాలుంటే సరిదిద్దేందుకు చర్యలు తీసుకుంటాం. తారు పూత అంశంలో ఇబ్బందులు లేకుండా చూస్తాం. పనులు వేగవంతం చేసి వాహనదారులకు ఇబ్బంది లేకుండా చేస్తాం. – బి.నాగిరెడ్డి, ఉప ఇంజినీర్, జాతీయ రహదారుల సంస్థ

చంద్రగ్రహణం రోజే.. ప్రసన్నుడి కల్యాణం
26 నుంచి బ్రహ్మోత్సవాలు

నూతనంగా నిర్మించిన కల్యాణవేదిక

బిట్రగుంట, న్యూస్‌టుడే: బిలకూటక్షేత్రం కొండబిట్రగుంట శ్రీప్రసన్న వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మార్చి 3వ తేదీన కల్యాణ మహోత్సవం జరగనుంది. ఆ రోజు పౌర్ణమి. ఉదయం 9 నుంచి రాత్రి 7.30గంటల వరకు చంద్రగ్రహణం ఉన్నందున ఆలయం మూసివేస్తారు. ఆలయ శుద్ధి, సంప్రోక్షణ అనంతరం అదేరోజు రాత్రి 8గంటలకు కొండదిగువన కొత్తగా నిర్మించిన కల్యాణ మండపంలో స్వామివారి కల్యాణం జరగనున్నట్లు ఆలయ కమిటీ ఛైర్మన్ శ్రీరామ్ మాల్యాద్రి, ఈవో రాధాకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26 ఉదయం గిరిప్రదక్షిణ, రాత్రి 7గంటలకు అంకురార్పణతో ప్రసన్నుడి నవాహ్నిక బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. 27వ తేదీ ఉదయం తిరుమంజనం, రాత్రి ధ్వజారోహణ, శేషవాహనోత్సవం, 28 ఉదయం చందనాలంకరణ, రాత్రి హనుమంతసేవ, మార్చి1న ఉదయం మోహినీ ఉత్సవం, రాత్రి గరుడసేవ, ఫిబ్రవరి 2న రాత్రి గజవాహనసేవ, 3న రాత్రి ప్రసన్నుడి కల్యాణం, 4న ఉదయం రథోత్సవం, రాత్రి తెప్పోత్సవం జరుగుతాయి. 5న ఉదయం సూర్యప్రభ, రాత్రి చంద్రప్రభ వాహనసేవలు, 6న ఉదయం కల్పవృక్ష వాహనం, రాత్రి అశ్వ వాహనం, 7న ఉదయం చక్రస్నానం, రాత్రి ధ్వజావరోహణం, 8వ తేదీ ఉదయం పుష్పయాగం, రాత్రి స్వామి ఏకాంతసేవతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ప్రకటనల కొరకు సంప్రదించండి: 800 800 1790

పేదల ముసుగులో వమ్ము..
నేతలకు సొమ్ము
అమ్మకానికి జగనన్న ఇళ్లు, స్థలాలు

● నగరంలోని కొత్తూరు ప్రాంతం అక్కచెరువుపాడులోని జగనన్న కాలనీలో ఖాళీగా ఉన్న ఒక్కో స్థలం రూ.1.50 లక్షల నుంచి రూ.2లక్షలకు విక్రయించారు. పునాదుల దశ దాటి నిర్మించిన వాటిని రూ.3లక్షలకు అమ్మకానికి పెట్టినట్లు అధికారులకు ఫిర్యాదులు అందాయి.

● నెల్లూరు నగరంలో జాతీయ రహదారికి ఆనుకుని భగత్‌సింగ్‌కాలనీ ప్రాంతంలో ఉన్న జగనన్న కాలనీలో ఇళ్లు, స్థలాలు విక్రయిస్తున్నారు. ఇళ్లు, డబ్బున్న వారికి స్థలాలు కేటాయించడంతో పాటు నగదు మంజూరు కావడంతో కొందరు గృహాలు నిర్మించి, మరికొందరు ఖాళీ స్థలాలను రూ.3లక్షల నుంచి రూ.8లక్షలకు అమ్ముకుంటున్నారు.

న్యూస్‌టుడే, నెల్లూరు(కలెక్టరేట్)

ఇళ్లు కాదు.. ఊళ్లు నిర్మిస్తున్నామంటూ నాటి ముఖ్యమంత్రి జగన్ ఆర్భాటంగా జగనన్న కాలనీలకు శ్రీకారం చుట్టారు. అప్పట్లో లబ్ధిదారుల ముసుగులో ఆ పార్టీ నేతల అనుచరులు స్థలాలు, ఇళ్లు పొందారు. ప్రస్తుతం ముసుగు తొలగించి వాటిని అమ్మి రూ.లక్షల్లో సొమ్ము చేసుకుంటున్నారు. కొనుగోలుదారులకు షరతులతో కూడిన కాగితాలు రాసిస్తున్నారు. జిల్లాలో మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు కీలక ప్రాంతాల్లో స్థలాలు, ఇళ్లు పొందారు. వారి అనుచరులూ రాయించుకుని వాటిని ఇప్పుడు అమ్మకానికి పెట్టారు.

ఆప్షన్-1,2 ఇళ్లు: 53,732
ఆప్షన్-3 ఇళ్లు: 28,690

కొండ్లపూడిలోని జగనన్న కాలనీ

అధికారులు ఏమంటున్నారంటే..

'ప్రభుత్వం మంజూరు చేసిన స్థలాలు, ఇళ్ల విక్రయాలు అధికారికంగా చెల్లవు. ఆ స్థలాలకు లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ చేసి పట్టాలు ఇచ్చాం. భవిష్యత్తులో ప్రభుత్వం నుంచి గృహ పథకానికి వారికి అర్హత ఉండదు. అనధికార విక్రయాలపై తగిన ఆధారాలతో ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వం మంజూరు చేసిన ఇంటికి లబ్ధిదారు పేరు మీదనే నిర్మాణ దశను బట్టి నిధులు వారి ఖాతాలకు జమ చేస్తాం' అని గృహ నిర్మాణ సంస్థ ఇన్‌ఛార్జి పీడీ మోహన్‌రావు తెలిపారు.

(c) eenadu

మూడేళ్లుగా.. అసంపూర్తిగా

కోటలోని బాలుర ఉన్నత పాఠశాలలో మూడో తరగతి నుంచి పది వరకు 320 మంది, ప్లస్‌లో 125 మంది విద్యార్థులున్నారు. నాలుగే క్లాసు ప్లస్‌టూ విద్యార్థులకు తరగతులు నిర్వహణకు, ప్రయోగశాలలకు రూ.40 లక్షలతో అదనపు గదుల నిర్మాణం చేపట్టారు. మూడేళ్లుగా పనులు చేయకుండా నిధుల కొరతతో అలాగే వదిలేశారు. కూటమి ప్రభుత్వంలోనైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి పనులు పూర్తి చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు. - న్యూస్‌టుడే, కోట

గేటు వేస్తే.. అరగంట ఆగాల్సిందే..!

కోవూరు జనమ దుగు సెంటర్ వద్ద రైల్వే రాకపోకల సమయంలో గేటు వేస్తే అరగంట ఆగాల్సి వస్తోందని వాహనదారులు వాపోతున్నారు. నెల్లూరుకు సమీపంలో పడుగుపాడు స్టేషన్ ఉంది. మూడో లైన్ వేసిన తరువాత రైల్వే రాకపోకలకు సమస్య తీవ్రంగా ఉంది. పడుగుపాడు, ఇనమడుగు, వేగూరు, ఇతర ప్రాంతాల నుంచి కోవూరు, నెల్లూరు, రావూరు ఈ మార్గంలో ఎక్కువ మంది వెళుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ఆర్వోబీ లేదా ఆర్‌యూబీ నిర్మిస్తేనే ట్రాఫిక్ సమస్య ఉండదని ప్రజలు విన్నవిస్తున్నారు. - న్యూస్‌టుడే, కోవూరు

రూ.లక్షలు వెచ్చించారు.. వినియోగం మరిచారు

ముత్తుకూరు మండలం కృష్ణపట్నంలో ఏర్పాటు చేసిన శుద్ధజల కేంద్రం అధ్వానంగా ఉంది. గత వైకాపా ప్రభుత్వం రూ.లక్షలు వెచ్చించి అర్భాటంగా నిర్మించి తరువాత పట్టించుకోలేదు. కొందరు ప్లాంట్‌ను ధ్వంసం చేసి అందులోని విలువైన సామగ్రి అపహరిస్తున్నారు. ప్రజా దాహార్తి కోసం రూ.లక్షలు వెచ్చించి నిర్మిస్తే వినియోగంలో లేదని స్థానికులు వాపోతున్నారు. రానున్న వేసవి దృష్ట్యా అధికారులు స్పందించి విని యోగంలోకి తేవాలని విన్నవిస్తున్నారు. - న్యూస్‌టుడే, ముత్తుకూరు

ఉయ్యాలవాడ ధైర్యసాహసాలు అసమానం

చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డీఆర్వో విజయకుమార్, అధికారులు

నెల్లూరు (కలెక్టరేట్), న్యూస్‌టుడే: ఉయ్యాలవాడ నరసింహారెడ్డి 1846లో జరిగిన ఉద్యమంలో చూపిన ధైర్యసాహసాలు అసమానమని, ఆయన త్యాగనిరతి, దేశభక్తి నేటి తరానికి స్ఫూర్తిదాయకమని జిల్లా రెవెన్యూ అధికారి విజయకుమార్ తెలిపారు. ఆదివారం కలెక్టరేట్‌లో యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో ఆయన వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమంలో సెట్నెల్ సీఈవో నాగేశ్వరరావు, మేనేజర్ శ్రీనివాస్ వర్మ, ప్రభుత్వ సంగీత కళాశాల ప్రతినిధి పినాకపాణి తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదులకు జాతీయ భావన అవసరం

మాట్లాడుతున్న పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీకుమార్

నెల్లూరు(లీగల్), న్యూస్‌టుడే: న్యాయవాదుల్లో జాతీయ భావన ఉండాలని న్యాయవాది పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీకుమార్ పేర్కొన్నారు. నెల్లూరులో ఆదివారం న్యాయవాద పరిషత్ రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్ జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశ సమైక్యత, సమగ్రత కాపాడడంలో న్యాయవాదులు తమ వంతు పాత్ర పోషించాలన్నారు. దక్షిణ భారత అధికారి మోహన్‌కుమార్ మాట్లాడుతూ న్యాయవాది తమ వృత్తితోపాటు సామాజిక కార్యకర్తగా సమాజ ఉన్నతి కోసం పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు దమరేశ్వర్, రాష్ట్ర, జిల్లా పదాధికారులు, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

హిందువుల మనోభావాలు దెబ్బతీస్తున్న వైకాపా: జనసేన

మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

నెల్లూరు (మార్కెట్ సెంటర్), న్యూస్‌టుడే: హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా వైకాపా వ్యవహరిస్తోందని ప్రభుత్వ విప్, తాడేపల్లిగూడెం జనసేన ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ఆరోపించారు. ఆదివారం నెల్లూరు నగరంలోని మాగుంట లేఅవుట్‌లో జనసేన పార్టీ నగర అధ్యక్షుడు దుగ్గిశెట్టి సుజయ్‌బాబు ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు ప్రారంభించారు. ఈసందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైకాపా నాయకులు భగవంతుడ్ని కూడా రాజకీయాల్లోకి లాగుతున్నారని మండిపడ్డారు. శాసనమండలిలో వెంకటేశ్వరస్వామి చిత్రాలను ప్రదర్శించడం హేయమైన చర్యగా వర్ణించారు. వారు తప్పు చేసి, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ క్షమాపణ చెప్పాలనడం ఏమిటని ప్రశ్నించారు. సుజయ్‌బాబు తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో జనసేన నాయకులు పలువురు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ ఏపీ ఎస్పీడీసీఎల్ సీఎండీ

తిరుపతి(జీవకోన), న్యూస్‌టుడే: ఎస్పీడీసీఎల్ సర్కిల్ స్థాయిలో విద్యుత్తు వినియోగదారుల సమస్యలపై ఫిర్యాదు, పరిష్కారానికి సోమవారం డయల్ యువర్ సీఎండీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సంస్థ సీఎండీ శివశంకర్ లోతేటి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సర్కిల్ పరిధిలోని తొమ్మిది జిల్లాలకు సంబంధించిన వినియోగదారులు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు కాల్ చేయవచ్చని అందులో వివరించారు. తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలకు సంబంధించిన వినియోగదారులు చరవాణి సంఖ్య 8977716661కు కాల్ చేయవచ్చని పేర్కొన్నారు. నెల్లూరు జిల్లా వాసులు 08612 320427 ఈ నెంబరులో సంప్రదించాలన్నారు.

అడ్డ రోడ్లు.. మృత్యుకుహరాలు

అతివేగం.. పొదలకు నిర్లక్ష్యం.. కారణం ఏదైనా అధికారుల పర్యవేక్షణ లేక జాతీయ రహదారిపై నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారి ఉన్న మనుబోలు మండలంలో ప్రతి రోజూ రక్తమోడుతోంది.. ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్న అడ్డదారులను బ్లాక్‌స్పాట్లుగా గుర్తించినా ఎలాంటి రక్షణ చర్యలు తీసుకోకపోవడంతో పలువురు ప్రాణాలు కోల్పోతున్నారు.

న్యూస్‌టుడే, మనుబోలు

సర్వేపల్లి నియోజకవర్గం మనుబోలు మండలంలోని బద్దెవోలు అడ్డరోడ్డు నుంచి కొమ్మలపూడి అడ్డరోడ్డు వరకు సుమారు 15 కి.మీ పరిధిలో ఆరు కూడళ్లు ఉండగా నాలుగు బ్లాక్‌స్పాట్లను అధికారులు గుర్తించారు. కూడళ్ల వద్ద ద్విచక్రవాహనం క్రాస్ చేస్తుండగా వాహనాలు ఢీకొనడం, కార్లలో వేగంగా వస్తూ అదుపుతప్పడం, అడ్డదారుల్లో ఒక్కసారిగా రోడ్డుపైకి రావడంతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. సర్వీసు రోడ్ల నుంచి జాతీయ రహదారిపైకి వచ్చే క్రమంలో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. సర్వీసురోడ్లు లేకపోవడంతో వాహనదారులు వ్యతిరేక దిశలో ప్రయాణం సాగిస్తూ ప్రమాదాల బారినపడుతున్నారు.

కూడళ్ల వద్ద ప్రమాదాల వివరాలు..

సం॥	2024	2025	2026 (జనవరి)
ప్రమాదాలు	24	33	6
మృతులు	20	19	3
క్షతగాత్రులు	7	9	4

అక్కడే ఎందుకు జరుగుతున్నాయంటే.. జాతీయ రహదారిపై ఎక్కువ బ్లాక్‌స్పాట్లు ఉన్నాయి. బద్దెవోలు, మనుబోలు, వీరంపల్లి, కాగితాలపూరు, కొండూరుసత్రం, కొమ్మలపూడి అడ్డరోడ్లు ప్రమాదకరంగా ఉన్నాయి. లైటింగ్ లేకపోవడం, కూడళ్లలో బ్లింకర్లు పెట్టకపోవడం, రహదారి దాటే క్రమంలో వేగాన్ని అంచనా వేయలేకపోవడం, మలుపు వద్ద జాగ్రత్తలు పాటించకపోవడం, హోటళ్లు, దాబాలు ఉండటం, రహదారిపైనే వాహనాలు నిలపడమే ప్రమాదాలకు కారణమని అధికారులు గుర్తించారు.

● 2024 నుంచి 2026 జనవరి వరకు 63 ప్రమాదాలు జరగ్గా 42 మంది ప్రాణాలు కోల్పోగా 20 మంది క్షతగాత్రులై మంచాన పడ్డారు. ఇవి కేవలం నమోదైనవి మాత్రమే. చిన్నపాటి ప్రమాదాలు జరిగినా ఫిర్యాదుచేయనివి ఎక్కువగా ఉంటాయని స్థానికులు చెబుతున్నారు.

● పొదలకూరు సీఐ శివరామకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాలను అనుకుని జాతీయ రహదారి వెళుతోందన్నారు. ఆయా గ్రామాల పరిధిలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నామని, జాతీయ రహదారిపై తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాలను బ్లాక్‌స్పాట్లుగా గుర్తించామన్నారు. హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయించామని, మత్తులో వాహనాలు నడిపేవారిని గుర్తించేందుకు నిత్యం తనిఖీలు చేస్తున్నామని పేర్కొనానరు. తెల్లవారుజామున వెళ్లేవారితో ఫేస్ వాష్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.



జిల్లాను ప్రగతిపథంలో నిలపాలి

ఉద్యోగోన్నతులు పొందిన వారితో కలెక్టర్ హిమాన్షు శుక్లా

నెల్లూరు(కలెక్టరేట్), న్యూస్‌టుడే: సమర్థంగా పనిచేస్తూ జిల్లాను ప్రగతి పథంలో నిలపాలని కలెక్టర్ హిమాన్షుశుక్లా తెలిపారు. ఆదివారం నెల్లూరులోని తన క్యాంపు కార్యాలయంలో రెవెన్యూ విభాగంలో పనిచేస్తున్న 26 మందికి వివిధ హోదాల్లో ఉద్యోగోన్నతులు కల్పిస్తూ ఉత్తర్వులు అందించారు. సీనియర్ అసిస్టెంట్ నుంచి మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లుగా ఏడి మిది మంది, గ్రేడ్-1 గ్రామ రెవెన్యూ అధికారి నుంచి సీనియర్ అసిస్టెంట్ హోదాకు 18 మందికి ఉద్యోగోన్నతులు ఇచ్చారు. కార్యక్రమంలో డీఆర్వో విజయకుమార్, ఏవో విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్తు సరఫరానే లక్ష్యం

నెల్లూరు (విద్యుత్), న్యూస్‌టుడే: జిల్లాలో వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్తు అందించడమే లక్ష్యంగా అధికారులు, సిబ్బంది పనిచేయాలని ఏపీఎస్పీడీసీఎల్ టెక్నికల్ డైరెక్టర్ కె.గురవయ్య ఆదేశించారు. ఆదివారం నగరంలోని విద్యుత్తు భవన్‌లో జిల్లా ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ వినియోగదారులకు సూర్యఘర్ పథకంలో సోలార్ కనెక్షన్లు యుద్ధప్రాతిపదికన ఇవ్వాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆర్‌డీఎస్ఎస్ పనులు వేగవంతం చేయాలని సూచించారు. వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని అవసరమైన చోట అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటుచేయాలని తెలిపారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజినీరు కె.రాఘవేంద్రం, ఈఈ బెనర్జీ పాల్గొన్నారు.

భార్యను హత్య చేసిన భర్త

కుమారుడు చూస్తుండగానే దారుణం

చేగుంట, న్యూస్‌టుడే: తల్లిపై దాడి చేస్తుంటే కుమారుడు కేకలు వేయడానికి ప్రయత్నిస్తే భయపెట్టాడా తండ్రి.. అరిస్తే నిన్ను కూడా చంపేస్తానని బెదిరించడంతో ఆ బాలుడు తల్లడిల్లిపోయాడు. ఆ పసివాడి కళ్ల ముందే పారతో భార్య తలపై కొట్టి హత్య చేసి అతను పరారయ్యాడు. భీతిల్లిన ఆ చిన్నారికి ఏం చేయాలో తెలియక రాత్రంతా అమ్మ మృతదేహం వద్దే ఏడుస్తూ ఉండిపోయాడు. మెదక్ జిల్లా చేగుంటలో శనివారం రాత్రి జరిగింది. ఎస్సై చైతన్యరెడ్డి తెలిపిన ప్రకారం చేగుంటకు చెందిన ఉప్పరి వరలక్ష్మి (33)కినెల్లూరు జిల్లాకు చెందిన త్రిమూర్తులుతో 2015లో వివాహం జరిగింది. అప్పటి నుంచి అతను ఇల్లరికం వచ్చి చేగుంటలోనే ఉంటున్నాడు. వీరికి కుమారుడు దుర్గాప్రసాద్ ఉన్నాడు. వరలక్ష్మి ప్రైవేటుగా చిన్న ఉద్యోగం చేస్తుండగా, త్రిమూర్తులు ఏ పని చేయకుండా కాలం గడుపుతున్నాడు. కొన్ని రోజులుగా గొడవలు జరుగుతున్నాయి. శనివారం రాత్రి వరలక్ష్మి నిద్రపోతుండగా, పారతో తండ్రి అక్కడికి రావడాన్ని కుమారుడు గమనించి అరిచేందుకు ప్రయత్నించగా బెదిరించడంతో, కిమ్మనకుండా ఉండిపోయాడు. నిద్రిస్తున్న భార్య తలపై పారతో కొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందింది. ఆదివారం ఉదయం ఇంట్లో నుంచి బయటకు వచ్చిన కుమారుడు విషయాన్ని చుట్టుపక్కల వారికి చెప్పాడు. బాధితురాలి అక్క సంతోషి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని, నిందితుడిని పట్టుకునేందుకు గాలిస్తున్నామని ఎస్సై తెలిపారు. ఈ నెల 19న ప్రైవేటు బ్యాంకులో కుదువపెట్టిన పుస్తెలతాడును వరలక్ష్మి విడిపించుకుని తెచ్చుకోగా. . ఆ బంగారంపై కన్నేసిన త్రిమూర్తులు.. భార్యను హతమార్చాడని ఎస్సై వివరించారు.

జిల్లా వ్యాప్తంగా నాకాబందీ

నెల్లూరు (నేర విభాగం) : నేరాల నియంత్రణకు పోలీసు శాఖ శనివారం రాత్రి జిల్లాలో నాకాబందీ నిర్వహించింది. ఎస్పీ అజిత ఆదేశాలతో శనివారం రాత్రి 8 నుంచి 10 గంటల వరకు తనిఖీలు చేపట్టారు. జిల్లాలోని అన్ని కూడళ్లు, జాతీయ రహదారుల ప్రవేశం, నిష్క్రమణ ప్రాంతాల్లో 1563 వాహనాలను తనిఖీ చేశారు. జిల్లా వ్యాప్తంగా 54 లాడ్జీలను సోదా చేశారు. 22 డ్రంకెన్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్ 18, ఎంవీ యాక్ట్ కింద 142 కేసులు నమోదు చేసి రూ.1,12,485 అపరాధ రుసుం విధించారు.

జిల్లా స్థాయి పారా క్రీడా పోటీలు

నెల్లూరు (క్రీడా విభాగం), న్యూస్‌టుడే: ఏసీ సుబ్బారెడ్డి క్రీడా మైదానంలో ఆదివారం జిల్లా స్థాయి పారా క్రీడా పోటీలు జరిగాయి. జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.విజయ్‌కుమార్ ప్రారంభించారు. బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్ తదితర విభాగాల్లో జరగ్గా. . క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో పారా క్రీడాకారుల అసోసియేషన్ నాయకులు మాల్యాద్రినాయుడు, యాదగిరి పాల్గొన్నారు.

బాలలు.. ప్రతిభావంతులు

కావలి, న్యూస్‌టుడే

వారికి అయిదేళ్లు కూడా లేవు. కానీ వివిధ అంశాల్లో ప్రతిభ చూపుతున్నారు. పోటీల్లో సత్తా చాటుతున్నారు. అవార్డులు, ప్రశంసలు అందుకుంటున్నారు. పట్టణానికి చెందిన చిన్నారులు చిరుప్రాయంలోనే ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ఓ బాలిక నృత్యంలో.. బాలుడు పద్య పఠనంలో అబ్బురపరుస్తున్నాడు.

రియాన్సిక.. రికార్డుల మోత

పట్టణంలోని క్రిస్టియన్‌పేటకు చెందిన పామూరి శివప్రసాద్, జయంతి దంపతుల కుమార్తె రియాన్సిక కు అయిదేళ్లు కూడా లేవు. కూచిపూడిలో ప్రావీణ్యం సంపాదించింది. 30 వేదికలపై ప్రదర్శనలు ఇచ్చింది. నాట్యమయూరిగా గుర్తింపు పొందింది. సంవత్సరన్నర నుంచి నృత్యంలో శిక్షణ పొందుతోంది. యూకేజీ చదువుతున్న ఈమె ఇప్పటికే నృత్య శిఖామణి అవార్డుతో పాటు జానపద నాట్య కళావేణి, అయోధ్య రామ నృత్య నీరాజనం, శ్రీనందికేశ్వర కూచిపూడి పురస్కారాలను అందుకుంది. తెలుగు, జీనియస్ బుక్ ఆఫ్ రికార్డుల్లో చోటు సంపాదించింది. గిన్నిస్‌బుక్‌లో చోటు కోసం ప్రయత్నిస్తోంది. తండ్రి వైద్యుడు కాగా.. తల్లి న్యూట్రిషనిస్టు.

చిరుప్రాయం.. పద్యపఠనంలో ఘనం

పట్టణంలోని అళహరివారి వీధికి చెందిన చెన్నా పవన్, సుస్మిత దంపతుల కుమారుడు హర్షిత్ మహాసువన్ స్థానిక ప్రైవేటు పాఠశాలలో ఎల్‌కేజీ చదువుతున్నాడు. వేమన శతకాన్ని చక్కగా చెబుతున్నాడు. తెలుగు పద్యాలు వాటి తాత్పర్యాలను అందరికీ అర్థమయ్యేలా వివరిస్తున్నాడు. భక్తి పాటలు, హనుమాన్ చాలీసా తదితర గేయాలను అలవోకగా వల్లె వేస్తున్నాడు. తెలుగు సాంస్కృతిక కార్యక్రమాల వేదికలపై పద్యాలు ఆలపిస్తున్నాడు. ఉగాది వేడుకలు, పాఠశాలల్లో వార్షికోత్సవాల్లోనూ ప్రతిభ చూపి బహుమతులు అందుకుంటున్నాడు. తాతయ్య వెంకట్రామయ్య తెలుగు భాష పరిరక్షణకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆయన బాటలో మనవడు చిన్ననాటి నుంచే పయనిస్తున్నాడు.

PUBLICATION
IN THE COURT OF THE HON'BLE IV ADDL. JUNIOR CIVIL JUDGE (EXCISE) AT: KARIMNAGAR
O.S. No. 487 OF 2023

Between:-
State Bank of India, Karimnagar Main Branch (4903), rep. by its Branch Manager ...Plaintiff
AND
Mr. Chintaboyana Ramesh ...Defendant

To,
Defendant:
Mr. Chintaboyana Ramesh, S/o. Penchalaiah, aged 40 years, Occ: Pvt. Employee, R/o. Post: Saguturu, Veerlagunapadu, Nellore, Sri Potti Sriramulu Nellore District - 524402

Whereas the above named Plaintiff bank has filed above suit for recovery of money against you and summons issued to you are returned as un-served. Take notice that the above suit is posted on 24-02-2026 for your appearance and W.S. if any, you are hereby summoned to appear before the above said Court at 10:30 A.M. either in person or through an advocate failing which the matter will be decided as per law.

//BY ORDER OF THE COURT//
Sd/-, PADALA RAJU
SBI Panel Advocate
Counsel for the Plaintiff
Karimnagar. Cell: 8790997657

పర్యవేక్షణ శూన్యం.. ఫిర్యాదులు అధికం

బీసీ వసతి గృహాల్లో తనిఖీలు చేయక సిబ్బంది ఇష్టారాజ్యం

'బీసీ వసతిగృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించాలి. కూరగాయలు, కోడిగుడ్లలో కక్కుర్తి ఎందుకు? ఆ సొమ్ములు మిగిల్చి ఏం బతికేస్తారు మీరు? మీ పిల్లలు హాస్టళ్లలో ఉంటే ఇలాగే చేస్తారా? బయట చెప్పుకోవడానికే అవమానం' అంటూ ఈనెల 11న వివిధ జిల్లాల బీసీ వసతిగృహాల అధికారుల సమీక్ష సమావేశంలో మంత్రి సవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతసాగరం బాలుర వసతి గృహంలో భోజనం, చికెన్ సరిగా పెట్టడం లేదని వచ్చిన ఫిర్యాదులను జిల్లా అధికారులతో ప్రస్తావించారు. మారకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

న్యూస్‌టుడే, అనంతసాగరం

వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థులకు సరైన వసతులు, పోషకాహారం అందక గత వైకాపా పాలనలో పలు ఇబ్బందులు పడ్డారు. కూటమి ప్రభుత్వం వచ్చాక మహోన్నత సంకల్పంతో వివిధ పథకాలు అమలు చేస్తోంది. కొన్ని చోట్ల క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే అధికారులు, ఉద్యోగులు, వంట చేసే అవుట్ సోర్సింగ్ సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. సకాలంలో వైద్య పరీక్షలు చేయడం, వండిన భోజనం వార్డెన్లు రుచి చూశాకే పెట్టాలని ప్రభుత్వం స్పష్టం చేసినా అమలు కావడం లేదు. నెల్లూరు, కావలి, గూడూరు, ఆత్మకూరు, కోవూరు, సర్వేపల్లి, వెంకటగిరి నియోజకవర్గాల పరిధిలో అధికారుల పర్యవేక్షణ లేక పిల్లలకు అందించే భోజనంలో నాణ్యత లేకపోవడం, మెనూ పాటించకపోవడం, చాలీ చాలకుండా అందిస్తున్నారనే ఫిర్యాదులున్నాయి. నెలకోసారి కూడా అధికారులు తనిఖీలు చేయడం లేదు. కొన్ని చోట్ల వచ్చినా వసతిగృహాల్లో దస్త్రాలు పరిశీలించి వెళుతున్నారు.

అనంతసాగరం బీసీ వసతిగృహంలో విద్యార్థులు

కొరవడిన పరిశీలన..

జిల్లాలో పరిశీలిస్తే బీసీ వసతి గృహాలోల విద్యార్థులు ఎంతమంది ఉంటున్నారు..? వారికి అన్ని సదుపాయాలు అందుతున్నాయా లేదా..? వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నారా.. లేదా.. ఇబ్బందులు ఎదుర్కొంటున్నారా..? అధికారులు పరిశీలించి ప్రభుత్వానికి నివేదించాలి. జిల్లా, డివిజన్ అధికారులు ఏదో ఒక రోజు స్థానికంగా రాత్రి సమయాల్లో సందర్శించాల్సి ఉన్నా మమ అనిపిస్తున్నారు. ప్రభుత్వం నేరుగా ఐవీఆర్ఎస్ ద్వారా క్షేత్రస్థాయిలో పరిస్థితులు తెలుసుకొని సరిదిద్దేలా చర్యలు చేపట్టింది.

● ఆత్మకూరు ఏబీసీడబ్ల్యూవో కృష్ణయ్య మాట్లాడుతూ.. బీసీ వసతి గృహాల విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నామని, మెనూ ప్రకారం భోజనం అందేలా చూస్తున్నామన్నారు. నూతన మరుగుదొడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయి. నాణ్యమైన ఆహారంతో పాటు మౌలిక వసతులు కల్పిస్తున్నామని పేర్కొన్నారు.

జిల్లాలో బీసీ సంక్షేమ వసతి గృహాలు -79 | విద్యార్థుల సంఖ్య : 4,121

శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహ స్వామివారి దేవస్థానము

పెంచలకోన క్షేత్రము, రాపూరు మండలం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా.
Email: eo.penchalakona@gmail.com. Ph. No. 08621-221604. Cell: 94910 00737

ప్రకటన నెం. ఎ3/08/2026. తేది: 21.02.2026

టెండరు ప్రకటన

పై దేవస్థానము నందు 2026 సం॥ బ్రహ్మోత్సవముల సందర్భంగా దిగువ పనులు చేయుటకు తేది. 14.03.2026 మ॥ గం. 2.00లకు సీల్డు టెండర్లు పిలువబడుచున్నవి.

వ. నెం.	పని వివరములు	ధరావత్తు రూ.
1.	ఎలక్ట్రికల్ డెకరేషన్ చేయుట	50,000/-
2.	పుష్పం సరఫరా చేయుట	25,000/-
3.	పుల్లకోత కోయుట	10,000/-
4.	సున్నం వేయుట	10,000/-
5.	బ్రహ్మోత్సవ కార్యక్రమములు వీడియో, ఫొటోలు తీయుట ఎల్.ఇ.డి. స్క్రీన్స్ ఏర్పాటు చేయుట	10,000/-
6.	వాల్‌పోస్టర్లు, కరపత్రములు ముద్రణ	10,000/-
7.	హైరర్స్ సామాన్లు సరఫరా చేయుట	10,000/-
8.	స్పెషల్ మేళం ఏర్పాటు చేయుట	10,000/-
9.	తే. 27.04.2026 నుండి తేది. 03.05.2026 వరకు రోజుకు 20 మంది చొప్పున సెక్యూరిటీ గార్డులను ఏర్పాటు చేయుట	10,000/-
10.	ప్రచారం నిమిత్తం ఫ్లెక్స్ బ్యానర్స్ తయారు చేయుట	10,000/-
11.	ప్రచారం నిమిత్తం ప్రతిగ్రామం నందు వాల్‌పోస్టర్లు అంటించుట	10,000/-
12.	2026 సం॥ బ్రహ్మోత్సవముల సందర్భంగా శానిటేషన్ కూలీలు ఏర్పాటు చేయుటకు	10,000/-
13.	2026 సం॥ బ్రహ్మోత్సవములకు దేవస్థానము వారు నిర్దేశించిన ప్రదేశములలో సి.సి. కెమెరాలు మరియు మోనిటర్స్ ఏర్పాటు చేయుట	10,000/-
14.	దేవస్థానము పరిసర ప్రాంతములలో వేసవి చలువ పందిళ్ళు వేయుట (01.04.2026 నుండి 30.06.2026 వరకు)	25,000/-
15.	2026 బ్రహ్మోత్సవములు సందర్భంగా తాత్కాలిక పందిళ్ళు వేయుట, క్యూ లైన్లు ఏర్పాటు (27.04.2026 నుండి 03.05.2026 వరకు)	25,000/-
16.	ఖాళీ నెయ్యి మరియు నూనె డబ్బాలు విక్రయించుట	10,000/-
17.	శ్రీవారి నిత్య అన్నదానమునకు భక్తులు సమర్పించిన మిక్స్‌డ్ బియ్యం విక్రయించుట	10,000/-
18.	దేవస్థానము నందు నిరుపయోగంగా ఉన్న ఇనుప వస్తువులు వగైరా విక్రయము	10,000/-
19.	2026 బ్రహ్మోత్సవములు సందర్భంగా తాత్కాలిక అంగళ్ళు ఏర్పాటు చేసుకొనుటకు స్థలమును లైసెన్సుకు ఇచ్చుట. (26.04.2026 నుండి 07.06.2026 వరకు)	3,000/-

షరతులు

గమనిక: 1. టెండరు షెడ్యూళ్లను తేది: 10.03.2026 నుండి తేది: 14.03.2026 ఉ. గం. 10.00ల వరకు రూ. 2000/- చెల్లించి పొందవచ్చును. 2. పూర్తిచేసిన టెండర్లను తేది: 14.03.2026 ఉ॥ గం. 11.00ల లోపు టెండరుబాక్సు నందు దాఖలు చేయవలెను. 3. టెండర్లను అదేరోజు మ॥ గం.02.00లకు టెండరుదారుల సమక్షములో తెరువబడును. 4. వ. నెం. 16, 17, 18 టెండర్లు తేది. 14.03.2026న & 19 లోని టెండరు తేది 20.03.2026న ఉ. గం. 11.00లకు బహిరంగ వేలంపాటలు నిర్వహించబడును. ఇతర వివరములను ఆఫీసు పనివేళలలో అడిగి తెలుసుకొనవచ్చును.

సం/- పోరెడ్డి శ్రీనివాసులు రెడ్డి
ఉప కమీషనరు & కార్యనిర్వహణాధికారి

ఆర్టీసీ బస్సులో పొగలు.. ప్రయాణికుల భయాందోళన

రోడ్డుపై వేచి ఉన్న ప్రయాణికులు

చిల్లకూరు, న్యూస్‌టుడే: మండల పరిధిలోని బూదనం టోల్ ప్లాజా సమీపంలో జాతీయ రహదారిపై ఆర్టీసీ బస్సులో నుంచి పొగలు వచ్చాయి. సూళ్లూరుపేట డిపోనకు చెందిన బస్సు నెల్లూరు నుంచి ప్రయాణికులతో వెళుతోంది. ఇక్కడకు రాగానే ఇంజిన్‌లో నుంచి పొగలు వ్యాపించడంతో అప్రమత్తమైన డ్రైవర్ రోడ్డు పక్కన నిలిపేశారు. అందులో ఉన్న వారు కిందకు దిగేయడంతో ప్రమాదం తప్పింది. ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు చేర్చే విధంగా ఆర్టీసీ అధికారులు చర్యలు చేపట్టారు.

రెండు దేవాలయాల్లో చోరీలు

ఆలయంలో పరిశీలిస్తున్న సీఐ

కలువాయి : మండలంలోని కుల్లూరులో శ్రీదేవి, భూదేవి సమేత అచ్యుతస్వామి, చెన్నకేశవస్వామి దేవాలయాల్లో శనివారం రాత్రి దుండగలు చోరీలకు పాల్పడ్డారు. స్థానికుల వివరాల మేరకు దేవాలయ అర్చకులు ఉదయాన్నే ఆలయాలకు వెళ్లగా తాళాలు ధ్వంసం చేసి ఉండడాన్ని గమనించి గ్రామస్థులకు సమాచారం ఇచ్చారు. రెండు దేవాలయాల్లో ఉన్న నిఘా నేత్రాలు ధ్వంసం చేసి హార్డ్‌డిస్క్‌లను ఎత్తుకెళ్లారు. చెన్నకేశవస్వామి ఆలయంలో 1.5 కేజీల వెండి, అమ్మవారి మెడలో ఉన్న రెండు గ్రాముల బంగారు మంగళసూత్రాలను అపహరించారు. అచ్యుత స్వామి గర్భగుడి తాళాలు రాకపోవడంతో అక్కడ చోరీ జరగలేదు. సమాచారం తెలుసుకున్న రాపూరు సీఐ సత్యనారాయణ వెంటనే చేరుకొని పరిశీలించారు. వేలిముద్రలను సేకరించారు.

అనారోగ్యంతో ఖైదీ మృతి

వెంకటాచలం, న్యూస్‌టుడే: అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఖైదీ మృతి చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. విజయవాడలోని భవానిపురానికి చెందిన మట్టి సుబ్బారావు(65) ఒక కేసులో నిందితుడిగా ఉండి నెల్లూరు జిల్లాలోని చెముడుగుంట వద్ద ఉన్న కేంద్ర కారాగారంలో ఉన్నారు. శనివారం మధ్యాహ్నం అనారోగ్యంతో అస్వస్థతకు గురికావడంతో చికిత్స నిమిత్తం హుటాహుటిన నెల్లూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆదివారం ఉదయం మృతి చెందాడు. జైలు అధికారుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సమాచార స్రవంతి

బంగారం ధరలు

గ్రాముధర:	రూ.15,038
(3 శాతం జీఎస్టీ కలిసిన ధర)	
సవర ధర:	రూ.1,20,304
వెండి గ్రాము :	రూ.279.00

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్	137
లేయర్	90
బ్రాయిలర్స్	244
బ్రాయిలర్ స్కిన్‌లెస్	270
లేయర్ మాంసం	153

సాంకేతికత అందిపుచ్చుకుంటే.. సాగు సులభతరం

న్యూస్‌టుడే, పొదలకూరు రూరల్

ఆధునిక యుగంలో మారుతున్న పరిస్థితులకనుగుణంగా రైతులు సాంకేతికతను అందిపుచ్చుకుంటే వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవచ్చు. ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేసేందుకు ఏపీఏఐఎంఎస్ 2.0 యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. యాప్ ద్వారా స్థానిక రైతులకు త్వరగా, తేలికగా యంత్ర సేవలు అందుతాయి. దీని వలన సమయంతో పాటు కూలీల ఖర్చు ఆదా చేసుకోవచ్చు.

త్వరలో మరిన్ని సేవలు...

ప్రభుత్వం ఈ యాప్ ద్వారా రైతులకు డ్రోన్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. పంటను ఆశించిన చీడపీడల నివారణకు మందుల పిచికారీ కోసం డ్రోన్‌ను ఉపయోగించవచ్చు. యాప్‌లో నమోదు చేసిన వెంటనే రైతులకు ఎప్పుడు సేవలందుతాయనే వివరాలు తెలియజేస్తారు. నిర్ణీత సమయంలో రైతు పొలంలో మందు పిచికారీ చేసి వారి అద్దె తీసుకుంటారు. త్వరలోనే ట్రాక్టర్ ద్వారా రోటావేటర్, దుక్కి చేసే నాగలి, నూర్పిడి యంత్రాలను అందుబాటులోకి తీసుకువచ్చేలా వ్యవసాయశాఖ చర్యలు తీసుకుంటోంది. ఈ యాప్ విధి విధానాలపై రైతు సేవా కేంద్రాల్లో సాగుదారులకు అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. ఉద్యానవన, వ్యవసాయ పంటలకు సంబంధించిన వీడియోలు సైతం యాప్‌లో ఉంటాయి.

● ఏవో ప్రతాప్ మాట్లాడుతూ ఏపీఏఐఎంఎస్ 2.0 యాప్‌ను రైతులు తమ చరవాణిలో నిక్షిప్తం చేసుకుంటే పలు రకాల సేవలు పొందవచ్చన్నారు. పంటలను ఆశించే చీడపీడల నివారణకు సూచనలు సలహాలు అందుతాయని తెలిపారు. డ్రోన్, ఇతర ట్రాక్టర్ యంత్ర సేవలు సైతం ఈ యాప్ ద్వారా నమోదు చేసుకుంటే రాయితీలు, సదుపాయాలు పొందవచ్చని పేర్కొన్నారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

FOR SALE

హోటల్ సామాగ్రి అమ్మబడును. టిఫిన్ సెంటర్స్, వెజ్ & నాన్‌వెజ్‌కు సంబంధించిన పూర్తి సామగ్రి +ఫ్రిజ్‌లు, టేబుల్స్, కుర్చీలు అమ్మబడును, కావలి. సంప్ర. 7842016046

EDUCATION

DISTANCE EDUCATION

Ph.D, B.Tech, M.Tech, Diploma, MBA, MCA, M.Sc, B.Sc, BCA, BBA, Pharmacy, LLB, 10th, Inter ✆ 9030030125

REAL ESTATE

HOUSE FOR SALE

రాంజీనగర్ 4వ వీధిలో 25 అంకణముల స్థలంలో 80 అంకణముల కట్టుబడితో 3 ఫ్లోర్స్ ఇల్లు అమ్మబడును. ✆ 9160820740

LAND FOR SALE

గూడూరు, పోర్టు కొత్త రోడ్డు 27 ఎకరాల భూమి అమ్మబడును. Contact: 89778 00003

JOBS

Wanted Marketing Manager. Salary+TA. Global Degrees abroad education consultancy. Nellore. Contact : 7207770918

మా ఆఫీస్‌నందు పనిచేయుటకు B.Sc. కెమిస్ట్రీ కల్గిన 30 సం||లోపు M/F ఫ్రెషర్/Exp. కావలెను. టైమింగ్స్: 10 AM to 9 PM. ✆ 9030313333

పొగతోటలోని నర్సింగ్‌హోమ్ నందు పనిచేయుటకు డే / నైట్ సిస్టర్, ఫార్మాసిస్ట్ 1 year exp. కావలెను. 9736090211, Whatsup 9247758977

సేల్స్ బాయ్స్ జూనియర్స్ / సీనియర్స్ కావలెను. నెల్లూరు టౌన్ RTC బస్టాండ్ దగ్గర మెడికల్ షాపులో పనిచేయుటకు సంప్రదించండి. ✆ 7569897700

నెల్లూరులో ప్రముఖ సంస్థ నందు పని చేయుటకు క్రింది డిపార్ట్‌మెంట్లకు 40 సం||లోపు స్టాఫ్ కావలెను. అడ్మినిస్ట్రేషన్, ఫొటోషాప్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, స్టాఫ్ అసిస్టెంట్స్, డ్రైవర్లు. 8555993478

హైదరాబాద్ యూనిటీ హోంకేర్‌లో ఏజెంట్లకు మంచి అవకాశం. మీరు వర్కర్స్‌ని పంపితే మొదటినెల 5వేలు కమీషన్. వర్కర్స్ జీ:15K, ఫ్రీవసతి,ఫుడ్. 8121541212

లేడీ టెలికాలర్స్ కావలెను. Future First Educational Service Kavali నందు లేడీ టెలికాలర్స్ కావలెను. జీతం: 8000 - 10,000 + Incentives. అర్హత: ఇంటర్ మరియు డిగ్రీ. సంప్రదించండి. 7530008646

MARKETING/ SALES

Anand Masale Require Sales & Marketing Manager, Marketing Executives. Contact: 9849655105, 9848053144 Email: anandmasalaappltd@gmail.com.

అధిక స్పందనలు పొందండి. వాహనాలు అమ్మకం, ఉద్యోగాల భర్తీ, ఇళ్లు, ప్లాట్లు, స్థలాలు అమ్మకాలు, కొనుగోళ్లు, ఇళ్లు, షాపులు, ప్లాట్లు అద్దెకు మరియు అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు...
B/w 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే
వివరాలకు..
నెల్లూరు 80080 01790

మీ చిన్నారులకు పుట్టినరోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి.
B&W : రూ. 600
Colour : రూ. 800
ప్రకటనలపై 5% GST వర్తించును

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటన దారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయ రాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

కావలి

• కావలి • ఉదయగిరి • ఆత్మకూరు

రెవెన్యూ సమస్యలు తీర్చాలి

ఉదయగిరి, న్యూస్‌టుడే: బండగానిపల్లి పంచాయతీలో భూముల రీ సర్వేలో భాగంగా జరిగిన తప్పిదాలు సవరించాలని రైతులు మూడేళ్లుగా రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా కనికరం చూపేవారు లేరని సీపీఎం జిల్లా నాయకుడు కె.అజయ్‌కుమార్ అన్నారు. స్థానిక పుల్లలపల్లి సుందరయ్య భవనంలో ఆదివారం సీపీఎం నాయకులు ప్రాంతీయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బండగానిపల్లి పంచాయతీలో గతంలో జరిగిన రీ సర్వేలో రెవెన్యూ అధికారులు చేసిన తప్పిదాలు రైతుల పాలిట శాపంగా మారిందన్నారు. ఒకరి భూములు మరొకరి పేరుపై నమోదు చేయటం, జాయింట్ ఎల్పీఎం కింద పెట్టడం, చనిపోయిన వ్యక్తుల పేర్లపై భూములు నమోదు చేయటం తదితర తప్పిదాలతో రైతులకు భూ సమస్యలు ఉత్పన్నమయ్యాయన్నారు. అధికారులు, పాలకులు పట్టించుకోకపోతే ఆందోళనలు ఉద్ధృతం చేస్తామన్నారు. సీపీఎం నాయకులు కె.వెంకటయ్య, కోడె రమణయ్య, పరుద్దీన్‌బాషా, కామక్షమ్మ తదితరులు పాల్గొన్నారు.

మసీదు ఆస్తులు కాపాడాలి

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: మసీదు ఆస్తులను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని వక్ఫ్ బోర్డు రాష్ట్ర ఛైర్మన్ అబ్దుల్ అజీజ్ అన్నారు. నెల్లూరు చిన్నబజారులోని అబ్బాస్ అలీఖాన్ మసీదుకు 400 ఏళ్ల చరిత్ర ఉందని తెలిపారు. ఆదివారం మసీదులో జరిగిన ఇఫ్తార్‌లో పాల్గొన్నారు. కార్యక్రమంలో మదీనా వాచ్ షాప్ ఇంతియాజ్, కరిముల్లా, సాబీర్‌ఖాన్, సమీఉల్లా పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM)
కావలి : 80080 51666, 91548 46698
ఉదయగిరి : 80085 73944 ఆత్మకూరు: 8008573949

సమస్య: వరికుంటపాడు మండలం కనియంపాడు ప్రధాన రహదారిలో వీధిదీపాలు వెలగకపోవడంతో రాత్రిళ్లు రాకపోకలు చేయాలంటే ఇబ్బంది పడుతున్నాం. — కొండయ్య, స్థానికుడు
సమాధానం: పరిశీలించి దీపాలు ఏర్పాటు చేస్తాం. —చంద్రశేఖరరావు, పంచాయతీ కార్యదర్శి

? కావలి పట్టణంలోని 31వ వార్డు పెదపవని రోడ్డు ప్రాంతంలో పదిరోజులుగా నీరు సరఫరా కావడంలేదు. —రుద్రనాయుడు, వైకుంఠపురం
✓ అక్కడ పైపులైన్ నిర్మాణం జరుగుతోంది. అప్పటివరకు ట్యాంకర్లతో నీటిని అందిస్తాం. — నాయుడు, డీఈఈ, కావలి పురపాలకసంఘం

? సంగం మండలం మక్తాపురం గ్రామంలో ప్రాథమిక పాఠశాల సమీపంలో విద్యుత్తు నియంత్రిక ప్రమాదకరంగా ఉంది. —సునీల్, మక్తాపురం
✓ పరిశీలించి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటాం. — మున్వర్‌రావు, డిస్కం ఏఈ

? అనంతసాగరం మండలం జెడ్‌ఉసుపల్లిలోని పలు వీధుల్లో రహదారికి ఇరువైపులా డ్రెయిన్లు ఉండడంతో దుర్వాసన, దోమలతో ఇబ్బంది పడుతున్నాం. —పద్మయ్య, గ్రామస్థుడు
✓ డ్రెయిన్లను దూర ప్రాంతాలకు తరలించేలా చూస్తాం. —రమణారావు, పంచాయతీ కార్యదర్శి

ముఖ్యమంత్రి సహాయ నిధితో పేదలకు మేలు

చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి

కావలి, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి సహాయనిధితో పేదవర్గాలకు మేలు జరుగుతుందని ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని ఆయన స్వగృహంలో 53 మందికి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు నియోజకవర్గంలో వెయ్యిమందికి పైగా సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా సాయం అందించామన్నారు. అత్యవసరమైన పేద కుటుంబాలకు ఎల్ఓసీ (లెటర్ ఆఫ్ క్రెడిట్) మంజూరు చేస్తున్నామన్నారు. తిరుమల లడ్డూ కల్తీలో తెదేపా పాత్ర ఉందని ఎవరైనా కావలి వేదికగా విమర్శలు చేస్తే సహించనని హెచ్చరించారు. నాయకులు మదుబూబునాయుడు, కిశోర్, బాబూరావు, రామకృష్ణ, దేవకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా రాష్ట్రస్థాయి జంప్‌రోప్ పోటీలు

పోటీలో విద్యార్థులు

కావలి, న్యూస్‌టుడే: జంప్‌రోప్ ఫెడరేషన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి సీనియర్ జంప్‌రోప్ పోటీలను ఆదివారం పట్టణంలోని డీబీఎస్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించారు. పదిహేను ఏళ్ల వయసు ఉన్న 150 మంది విద్యార్థులు పలు జిల్లాల నుంచి వచ్చారు. ఓవరాల్‌గా పోటీల్లో చిత్తూరు, నంద్యాల, నెల్లూరు జట్లు విజేతలుగా నిలిచాయి. ప్రతిభ చూపిన వారంతా ఈనెల 25, 26తేదీల్లో మహారాష్ట్రలో జరిగే జాతీయస్థాయి పోటీలకు హాజరుకానున్నట్లు నిర్వాహకులు తెలియజేశారు. కళాశాల కరస్పాండెంట్ దామిశెట్టి సుధీర్‌నాయుడు, ప్రిన్సిపల్ పీవీ రావు, జంప్‌రోప్ క్రీడాకారుల అసోసియేషన్ రాష్ట్రకార్యదర్శి సుబ్బయ్య, ఉపాధ్యక్షులు సాంబశివరావు, సంయుక్త కార్యదర్శి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

గండి పడితే కడగండ్లే

చేజర్ల వద్ద దక్షిణ కాలువ పొంగి పొర్లుతోంది. గట్టు ఎత్తు తక్కువగా ఉండడంతో తరచూ ఇదే పరిస్థితి ఏర్పడుతుంది. గత ఏడాది ఇదే ప్రదేశంలో గండిపడడంతో పొలాలు ముంపునకు గురయ్యాయి. గండి పూడ్చి దిగువ ఆయకట్టుకు నీరు అందించేందుకు నాలుగు రోజులు శ్రమించాల్సి వచ్చింది. ప్రస్తుతం పొంగి పొర్లుతుండడంతో సమస్య పునరావృతమవుతుందేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

న్యూస్‌టుడే, చేజర్ల

దిగువ ఆయకట్టు భూములకు నీటి ఎద్దడి తలెత్తకుండా ఉండేందుకు సోమశిల దక్షిణ కాలువ నుంచి పరిమితికి మించి నీటి ప్రవాహాన్ని విడుదల చేస్తున్నారు. ఇదే సమయంలో పలుచోట్ల కాలువ గట్టు దాటి నీరు పొంగి పొర్లుతుండడంతో సమీప పొలాలు ముంపునకు గురయ్యే ప్రమాదం పొంచి ఉంది.

ఇదీ పరిస్థితి

సోమశిల జలాశయం నుంచి ప్రారంభమై నెల్లూరు రూరల్ పరిధిలోని కందమూరు వద్ద ముగిసే దక్షిణ కాలువ 78 కి.మీ పొడవునా ఉంటుంది. దీని పరిధిలో 40 వేల ఎకరాల మాగాణి ఉంది. కలువాయి, వెదవాడ, సర్వేపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు ఉన్నాయి. చివరి ఆయకట్టు పంటలను కాపాడాలన్న లక్ష్యంతో జలవనరులశాఖ అధికారులు వెదవపర్తి రిజర్వాయర్(33కి.మీ)కు కండలేరు వరద కాలువ ద్వారా నీటిని తరలించి దిగువకు సరఫరా చేస్తున్నారు. ఇక్కడే సమస్య మొదలయింది. అక్కడ నుంచి దిగువకు దక్షిణ కాలువ వెడల్పు లేకపోవటం గట్టు ఎత్తు తక్కువగా ఉండడంతో.. 36కి.మీ-50 కి.మీ పరిధిలో నీరు పొర్లి సమీపంలో ఉన్న పొలాల మీదుగా వాగులకు చేరుతుంది. చేజర్ల మండలం కాలాయపాలెం, చేజర్ల, చీర్లవరికంట్రిగ సమీపంలో ఈ పరిస్థితి ఉన్నది.

అంచనాలు రూపొందించినా..

సాగునీటి సంఘాల ప్రతినిధుల సూచనల మేరకు జలవనరుల శాఖ రూ.120 కోట్లతో అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. కానీ నిధులు మంజూరు కాలేదు. దీనికితోడు కాలువ పర్యవేక్షణ, నీటి నియంత్రణకు సిబ్బంది లేకపోవడంతో నీటి ప్రవాహంలో హెచ్చుతగ్గులు వస్తున్నాయి. కాలువలకు ముప్పు వాటిల్లితే దిగువన 20 వేల ఎకరాల్లో సాగులో ఉన్న పంటలు దెబ్బతినే అవకాశం ఉంది. ప్రధాన కాలువ నీటి విడుదల గరిష్ఠ సామర్థ్యం 350 కాగా చివరి ఆయకట్టుకు అంతరాయం లేకుండా నీటి సరఫరా జరగాలంటే ప్రవాహ సామర్థ్యాన్ని 500 క్యూసెక్కులకు పెంచాలి. కాంక్రీట్ లైనింగ్ చేయాలి. గట్టు ఒక మీటరు ఎత్తు పెంచడంతోపాటు కాలువ వెంబడి పర్యవేక్షకులను నియమించాలని రైతులు కోరుతున్నారు.

తక్షణ చర్యలు తీసుకుంటున్నాం

తాత్కాలిక సిబ్బందిని నియమించుకుని కాలువ వెంబడి పర్యవేక్షణ పెంచాం. నీరు పొర్లే ప్రదేశాల్లో ప్రస్తుతానికి కాలువకు ప్రమాదం లేకున్నా గట్టు ఎత్తు పెంచేలా చర్యలు తీసుకుంటున్నాం.
—చాంద్‌బాషా, డీఈఈ, సోమశిల విభాగం

ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి నివాళి

ఆత్మకూరు, న్యూస్‌టుడే: ఆత్మకూరు ఆర్డీవో కార్యాలయంలో ఆదివారం ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఎంపీవో రాములు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దేశం పట్ల బాధ్యతాయుతంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ

ఆత్మకూరు, న్యూస్‌టుడే: ఆత్మకూరు పట్టణంలోని 11వవార్డులో షేక్ సుల్తాన్ బీబీ భర్త ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. ఆమె కుటుంబం పేదరికంతో ఇబ్బందులు పడుతున్నారు. వీరి కష్టాలు తెలుసుకున్న డాక్టర్ విజయ్ దొరసానమ్మ ట్రస్ట్ ఛైర్మన్ డాక్టర్ ప్రణీత్ స్పందించారు. మూడు నెలలకు సరిపడ నిత్యావసరాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అశోక్, పావుద్దీన్ రహీం తదితరులు పాల్గొన్నారు.

సోమశిలకు 1,550 క్యూసెక్కుల వరద

అనంతసాగరం, న్యూస్‌టుడే: సోమశిల జలాశయంలో ఆదివారం నాటికి ఎగువ ప్రాంతాల నుంచి 1,550 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. జలాశయంలో 77.988కు 66.983 టీఎంసీల నీరు నిల్వ ఉండగా 325.033 అడుగుల మేర నీటిమట్టం నమోదైంది. -17, -18 రివర్ స్లూయిస్ ద్వారా 50, క్రస్ట్‌గేట్ల లీకేజీల ద్వారా 50, పవర్ టన్నెల్ ద్వారా 2,850 క్యూసెక్కులు పెన్నాకు విడుదల చేస్తున్నారు. నార్త్‌ఛానెల్ కండలేరు వరద కాలువకు 150, దక్షిణ కాలువకు 200, ఉత్తర కాలువకు 700 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. రోజుకు సగటున 262 క్యూసెక్కులు ఆవిరవుతున్నట్లు ప్రాజెక్టు అధికారులు వివరించారు.

పైపులైన్ లీకు.. వృథాగా నీరు!

గొనుగుంటపెంట గ్రామం మలుపులో పైపులైన్ మరమ్మతులకు గురయింది. అక్కడ గుంత ఏర్పడడంతో నీరు నిల్వ ఉంటోంది. దీనికితోడు రోడ్డుపై పారుతోంది. రాకపోకలు చేసేవారు అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ విషయమై పంచాయతీకార్యదర్శి రవీంద్రను వివరణ కోరగా పరిశీలించి సమస్య పరిష్కరిస్తామని తెలిపారు. — న్యూస్‌టుడే, కొండాపురం

సంపద కేంద్రం.. నిర్మాణానికే పరిమితం

నార్తుమోపూరులోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వినియోగంలోకి తీసుకురాకపోవడంతో సేకరించిన చెత్తను రోడ్లపక్కనే కాల్చుతూ పడేస్తున్నారు. వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. కమిషనర్ ఉమామహేశ్వరరావును వివరణ కోరగా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. —న్యూస్‌టుడే, అల్లూరు

విద్యుత్తు నియంత్రిక.. ప్రమాదానికి సూచిక

స్థానిక బీఎస్ఎన్ఎల్ కార్యాలయం పక్కన సంజీవరాయ కొండకు వెళ్లే రోడ్డులో విద్యుత్తు నియంత్రిక నేలమీద ఎలాంటి రక్షణ కంచె లేకుండా ప్రమాదకరంగా ఉంది. ఆ మార్గంలో పాదచారులు, విద్యార్థులు నిత్యం రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో ఏదైనా ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించి రక్షణ కంచె ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.— వింజమూరు, న్యూస్‌టుడే

వెలగని దీపాలు.. తప్పని అవస్థలు

కావలి పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో సోలార్ ఆధారిత విద్యుత్తు దీపం ఇది. ఇలాంటివి ఆసుపత్రి ప్రాంగణంలో పదిపైనే ఉండగా.. సుమారు ఏడు వరకు వెలగడం లేదు. రోగుల బంధువులతోపాటు, మార్చురీకి మృతదేహాలను తీసుకువచ్చే సమయంలో ఆసుపత్రి సిబ్బంది, అంబులెన్స్ నిర్వాహకులు అవస్థలు పడుతున్నారు.
— న్యూస్‌టుడే, కావలి

ఎప్పటికి పూర్తవుతుందో..?

ఇక్కడ కనిపిస్తున్న అసంపూర్తి నిర్మాణం.. బ్రహ్మేశ్వరంలోనిది. గత వైకాపా ప్రభుత్వం హయాంలో డిజిటల్ గ్రంథాలయాన్ని నిర్మించేందుకు పనులు చేపట్టారు. నిధులు సక్రమంగా అందకపోవడంతో గుత్తేదారులు నిలిపేశారు. పీఆర్ ఏఈ హజరత్ మాట్లాడుతూ అసంపూర్తి నిర్మాణాల విషయమై అధికారుల నుంచి ఎలాంటి ఉత్తర్వులు రాలేదన్నారు. - న్యూస్‌టుడే, దుత్తలూరు

ఆదరణ కరవై.. బతుకు భారమై

శరీరంలో సత్తువంతా సన్నగిల్లి అనారోగ్యం బారిన పడ్డాడు ఆ తండ్రి. కుటుంబ సభ్యుల ఆదరణ కోల్పోయి అనాథగా మిగిలాడు. అప్యాయతలు, అనురాగాల మధ్య జీవితాన్ని సాగించాల్సిన ఆయన బతుకు భారమై బస్సు షెల్టర్‌లో కాలం వెళ్లదీస్తున్నాడు.. మర్రిపాడు మండలంలోని కేతిగుంట గ్రామానికి చెందిన రంపతోటి ఓబులేసు(54). తన ఆవేదనను ఇలా వెల్లబుచ్చారు.. 'నాకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. వారికి వివాహం అయింది. భార్యతో మనస్పర్థలు రావడంతో కొన్నేళ్లుగా కర్ణాటకలో బేల్దారి కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించా. రెండేళ్ల క్రితం పక్షవాతం రావడంతో ఒక కాలు, ఒక చెయ్యి పూర్తిగా పనిచేయడంలేదు. కూలిపనులకు వెళ్లలేని పరిస్థితి. తిరిగి ఇంటికి రాగా కుటుంబసభ్యులు ఆదరించలేదు. ఎలాంటి ఆస్తులు లేకపోవడంతో ఆరు నెలలుగా మర్రిపాడులో బస్‌షెల్టర్‌లో తలదాచుకుంటున్నా. ఎవరైనా దయతలచి అన్నం పెడితే కడుపు నింపుకోవడం, లేకుంటే పస్తులతో పడుకుంటున్నా. ఆధార్‌కార్డు లేకపోవడంతో పింఛను అందడం లేదు. అధికారులు స్పందించి ఆధార్ కార్డు మంజూరు చేసి, పింఛను ఇప్పించి ఆదుకోవాలి' అని వేడుకుంటున్నారు. -న్యూస్‌టుడే, మర్రిపాడు(ఆత్మకూరు గ్రామీణం)

పశువులతో ట్రాఫిక్ కష్టాలు..

అనంతసాగరం, సోమశిల గ్రామాల్లోని బస్టాండ్ సెంటర్లలో పశువులు తిరుగుతూ అక్కడే సేద తీరుతుండటంతో వాహనచోదకులు, ప్రజలకు నిత్యం అవస్థలు తప్పడంలేదు. అసలే ఇరుకు రోడ్డు కావడం ఆపై దుకాణాల వద్ద వాహనాలు నిలుపుతున్నారు. దీనికి తోడు గేదెలు, ఆవులు సంచరిస్తుండటంతో ఆయా గ్రామాలకు వెళ్లే వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. పంచాయతీ అధికారులు, పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, అనంతసాగరం

వినియోగంలోకి తెస్తే ఆహ్లాదమే

నగర పంచాయతీ పరిధిలో అల్లూరు-నార్త్ మోపూరు మార్గంలో బోడిసత్రం వద్ద రోడ్డు పక్కన ఉన్న స్థలం కంపచెట్లతో నిండి అధ్వానంగా మారింది. నగర పంచాయతీ పరిధిలో ప్రజలు సేదతీరేందుకు ఎక్కడా పార్కులు లేవు. దీంతో ఆ ప్రాంతం పార్కు ఏర్పాటుకు అనుకూలంగా ఉంటుందని అధికారులు స్పందించి కంపచెట్లను తొలగించి పార్కును ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, అల్లూరు

బోడిసత్రం వద్ద కంపచెట్లతో నిండిన ప్రాంతం

కలప అక్రమ తరలింపు.. అడ్డుకున్న రైతులు

వరికుంటపాడు, న్యూస్‌టుడే: నక్కలగండి జలాశయం పరిధిలో చిల్లకర్రను కొట్టి తరలిస్తుండగా ఆదివారం ఆయకట్టు రైతులు అడ్డుకున్నారు. మార్కాపురం జిల్లా పామూరు మండలం జంగాలపల్లికి చెందిన రైతులు మీకు అనుమతి ఎవరిచ్చారంటూ వారితో వాదనకు దిగడంతో వారు అక్కడి నుంచి వెనుతిరిగి వెళ్లిపోయారు. ఆప్రాంతం జలాశయం పరిధిలోనిది అని కొంతమంది అటవీశాఖ పరిధిలోనిది అంటున్నారు. ఈ విషయమై అటవీశాఖ బీట్ అధికారి శ్రీరాములు మాట్లాడుతూ తమ శాఖకు సంబంధించినది కాదన్నారు. ఇరిగేషన్ ఏఈ రమేష్ మాట్లాడుతూ జలాశయం పరిధిలో వేలం నిర్వహించేందుకు అనుమతి ఇచ్చామన్నారు.

సొసైటీ డైరెక్టర్‌కు సేవా పురస్కారం

సీతారామపురం, న్యూస్‌టుడే : సీతారామపురం లోని మారంరెడ్డిపల్లి సొసైటీ డైరెక్టర్ పెనుబడి రఘురాములు తెలుగుభాషా సేవాపురస్కారాన్ని అందుకున్నారు. పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాదులోని చిక్కడపల్లిలోని త్యాగరాయగానసభలో అంతర్జాతీయ మాతృభాషాదినోత్సవం సందర్భంగా ఈ అవార్డు అందుకున్నట్లు రఘురాములు తెలిపారు. సినీదర్శకులు నిట్టల గోపాలకృష్ణ, సినీరచయిత వై.శ్రీరామ్‌ల చేతులమీదుగా అవార్డులు పంపిణీ చేశారన్నారు.

పాలకుల నిర్లక్ష్యం.. రైతన్నకు కష్టం

న్యూస్‌టుడే, బిట్రగుంట

అధ్వానంగా ఎస్వీపీఎం ఛానల్ అక్విడెక్టు

వరి వెన్ను దశలో ఉంది. నీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. సీజనుకు ముందుగా కాలువలను బాగుచేయాల్సిన అధికారులు ఆవిషయాన్ని విస్మరించారు. దీంతో పూడికతో నిండిన వాటిలో ప్రవాహం సాగడం లేదు. పైగా కాలువలపై నిర్మించిన అక్విడెక్టులు, వెల్‌సైఫన్లు శిథిలమవడంతో నీరు వృథాగా పోతుంది. ఈపరిస్థితుల్లో నీరు అందక పంట చేతికి రాదేమోనని ఆందోళన చెందుతున్నారు. ఇదీ ఎస్వీసీఎం ఛానల్ పరిధిలోని కర్షకుల పరిస్థితి. ఈ కాలువ ద్వారా 20 వేల ఎకరాలకు పైగా ఆయకట్టు ఉంది. గత వైకాపా ప్రభుత్వ హయాంలో నిర్వహణ చేయకపోవడంతో పూడిక చేరడంతోపాటు చెట్లు పెరిగి అధ్వానంగా తయారైంది. దీన్ని బాగుచేయాలని సీజనుకు ముందే అధికారులకు ఆయకట్టుదారులు విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదు. ఫలితంగా ప్రస్తుతం సాగుదారులను కష్టాలు వెంటాడుతున్నాయి. నీరు వదిలినా పొలాలకు సక్రమంగా చేరడం లేదు. తాళ్లూరు-కొండబిట్రగుంట మధ్య అక్విడెక్టు శిథిలమైంది. ఈప్రాంతంలో నీటి నిర్వహణకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఇది కూలే ప్రమాదం ఉంది. అదేజరిగితే ఏడు వేల ఎకరాలు బీళ్లుగా మారే ప్రమాదం ఉంది. ప్రసన్నుడి పుష్కరిణికి నీరందించే కాలువ కూడా ఇదే. ఈ విషయమై సోమశిల సబ్‌డివిజన్ బిట్రగుంట డీఈఈ సత్యప్రసాద్‌ను వివరణ కోరగా.. నిధులు కేటాయింపులు జరిగాయని తెలిపారు. త్వరలో పనులు చేసేందుకు చర్యలు తీసుకుంటామని వివరించారు.

స్థల వివాదంలో ఇరువర్గాల దాడులు.. మహిళ ఆత్మహత్యాయత్నం

అనంతసాగరం, న్యూస్‌టుడే: ఓ స్థలం విషయంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరగగా.. ఓ మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన ఆదివారం మండల పరిధిలోని యాకర్లపాడు గ్రామంలో జరిగింది. స్థానికుల వివరాల మేరకు గ్రామంలో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు అదే గ్రామానికి చెందిన ఓ మహిళ స్థలాన్ని ముగ్గురు వ్యక్తులు అడిగారు. మహిళ కుటుంబసభ్యులు ఒప్పుకోవడంతో వారు వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసుకునేందుకు సన్నద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో మనస్పర్థలు రావడంతో మహిళ బంధువులు స్థలం ఇచ్చేందుకు సుముఖత తెలపలేదు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. అనంతరం కొడవలి, రాళ్లతో దాడులు చేసుకున్నారు. ఓ వ్యక్తి తల పగిలింది. మరో వ్యక్తికి గాయాలయ్యాయి. ఇరువర్గాల ఘర్షణకు తానే కారణమని మనస్థాపానికి గురైన సదరు మహిళ తలకు రంగు వేసుకునే ద్రావణం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వీరందరిని స్థానికులు ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులకు సమాచారం అందడంతో గ్రామంలో అల్లర్లు జరగకుండా పికెట్ ఏర్పాటు చేశారు. దీనిపై పోలీసు స్టేషన్లో ఎలాంటి కేసు నమోదు కాలేదు.

పొలం బాగుచేసుకుంటే అడ్డంకులు సృష్టిస్తున్నారు

వరికుంటపాడు, న్యూస్‌టుడే: తమకు ప్రభుత్వం ఇచ్చిన పొలంలో ఉన్న రాళ్ల మట్టిని తొలగించి బాగు చేసుకుంటే అడ్డంకులు సృష్టిస్తున్నారని అశోక్‌నగర్‌కు చెందిన మహిళా రైతు సూరా సరస్వతి ఆవేదన వ్యక్తం చేశారు. పొలం వద్ద ఆదివారం విలేకరులతో మాట్లాడారు. '20 ఏళ్ల కిందట ప్రభుత్వం సర్వే నంబరు 46-7 లో 1.20 ఎకరాలు, 46-10లో 0.28 సెంట్లు పొలం మంజూరు చేసింది. ప్రస్తుతం వరి పంటను సాగు చేసుకునేందుకు మట్టి, రాళ్లను తొలగించుకొని బాగు చేసుకుంటుంటే కొంత మంది ఇబ్బందులకు గురిచేస్తున్నారు. అధికారులు న్యాయం చేయాలి' అంటూ కోరారు. ఈవిషయమై డిప్యూటీ తహసీల్దారు చెంచయ్యను వివరణ కోరగా పట్టా పొలంలో మట్టి తీయించుకోవాలన్నా రెండు అడుగుల లోతు వరకు రెవెన్యూ అనుమతి, ఆపైనా లోతు తీయ్యాలంటే మైనింగ్ శాఖ అనుమతి ఉండాలన్నారు.

యోగాభ్యాసం.. ఒత్తిడి దూరం

జ్ఞానముద్ర వేస్తున్న బాలికలు

సంగం, న్యూస్‌టుడే: యోగా.. శరీరం, మనసు, ఆత్మ మధ్య ఐక్యతను సాధించే భారతీయ ప్రాచీన సాధనా వ్యవస్థ. దీని ద్వారా మానసిక శాంతి దరిచేరుతుంది. ఒత్తిడి లేకుండా ఏ పనైనా చేయవచ్చు. చిన్నప్పటి నుంచి యోగా సాధన చేస్తే ఆరోగ్యంతోపాటు క్లిష్ట పరిస్థితులను ప్రశాంత చిత్తంతో ఎదుర్కొనే సమయస్ఫూర్తి అలవరుతుంది. ముఖ్యంగా విద్యార్థులు పరీక్షలు వచ్చేసరికి ఆందోళన, ఒత్తిడికి గురవుతుంటారు. బాగా చదివే వారు కూడా చివరికి వెనకబడిపోతుంటారు. దీన్ని అధిగమించేందుకు సంగంలోని డా.బీఆర్. అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో క్రమం తప్పకుండా వేకువ జామున విద్యార్థులతో యోగాభ్యాసం చేయిస్తున్నారు. ఇంటర్, పది తరగతుల్లో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు.

● వేకువజామున నిద్ర లేవడంతో శరీరానికి, మెదడుకు ఎంతో మేలు చేస్తుంది. ఆ సమయంలో యోగాభ్యాసం చేస్తే మరింత ప్రయోజనం చేకూరుతుంది. గురుకులంలో 640 మంది విద్యార్థినులు ఉండగా.. రోజూ ప్రాణాయామం,సూర్యనమస్కారం, జ్ఞానముద్రలు అభ్యాసం చేస్తున్నారు. వీటి వల్ల ఒత్తిడిని దూరం కావడంతో పాటు ఏకాగ్రత, చురుకుదనం అలవరుతుందని ఉదయం అయిదు గంటల నుంచి ఆరు గంటల వరకు సాధన చేయిస్తున్నామని ప్రధానాచార్యులు సుమతమ్మ, వ్యాయామ ఉపాధ్యాయిణిలు లక్ష్మీ ప్రసన్న, నజీమా తెలిపారు.

ఉచిత నేత్ర వైద్యశిబిరం


పేర్లు నమోదు చేస్తున్న వైద్య శిబ్బంది

జలదంకి, న్యూస్‌టుడే: మండలంలోని స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ప్రాంగణంలో చాగణం లలితమ్మ, భాస్కరరావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తిరుపతికి చెందిన అరవింద్ కంటి ఆసుపత్రి వైద్యులు ఆదివారం వైద్యశిబిరం నిర్వహించారు. 252 మంది పరీక్షలు చేయించుకున్నారు. వైద్యులు వారికి ఉచితంగా కళ్ల అద్దాలు అందజేశారు. శస్త్ర చికిత్స అవసరమైన 40 మందిని తిరుపతి వైద్యశాలకు తరలించారు. నిర్వాహకులు మాల్యాద్రి, హరినారపరెడ్డి, ఆంథోనిబాబులు రోగులకు అన్ని వసతులు సమకూర్చారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడమేమనగా మా కక్షిదారు అయిన **తిరివీధి చినవెంగయ్య S/o.** మునిస్వామి, R/o. గుదివారిపాళెం, నర్రవాడ, దుత్తలూరు మండలం, యస్.పి.యస్.ఆర్. నెల్లూరు జిల్లా వారు ఇచ్చిన ఇన్‌స్ట్రక్షన్స్ ప్రకారం ఈక్రింది విధముగా తెలియజేయడమైనది. మా కక్షిదారు అయిన **తిరివీధి చినవెంగయ్య S/o.** మునిస్వామి, R/o. గుదివారిపాళెం, H/o. నర్రవాడ, దుత్తలూరు మండలం, యస్.పి.యస్.ఆర్. నెల్లూరు జిల్లా అను వ్యక్తి దుత్తలూరు మండలం, నర్రవాడకు చెందిన వ్యక్తులు: **1. పీసరి శ్రీకాంత్‌రెడ్డి S/o. మల్లారెడ్డి 2. ఏనుగు శ్రీనివాస్‌రెడ్డి S/o. మల్లారెడ్డి, 3. యాస వెంకటేశ్వర్‌రెడ్డి** అనువారి వద్ద నుండి జాయింటుగా దుత్తలూరు మండలం, కొత్తపేట గ్రామ కోరుమెట్ట, సర్వే నెంబరు 138లో (యల్.పి.నెంబరు 1805)లో, సర్వే నెంబరు 138లో (యల్.పి.నెంబరు 1806)లో, సర్వే నెంబరు 138లో (యల్.పి.నెంబరు 1807)లో ఉన్న Ac. 8-43 సెంటుల భూమిని పై వారి నుండి కొనుగోలు చేయుచున్నందున, పై భూమిపై ఎవరికేని హక్కు కలిగి స్వాధీనానుభవం కలిగియుండునట్లు హక్కు పత్రములు కలిగియున్న యెడల వారి అభ్యంతరములను ఈ ప్రకటన చూసిన 15 రోజులలో ఈ క్రింది అడ్రస్‌కు తెలియజేయవలసినదిగా కోరుచున్నాము.

షెడ్యూలు

యస్.పి.యస్.ఆర్. నెల్లూరు రిజిస్ట్రేషన్ డిస్ట్రిక్ట్ - ఉదయగిరి సబ్ రిజిస్ట్రేషన్ డిస్ట్రిక్ట్ - దుత్తలూరు మండలం - నర్రవాడ గ్రామం - సర్వే నెంబరు 138 (యల్.పి. నెంబరు 1805) సర్వే నెంబరు 138 (యల్.పి.నెంబరు 1806), సర్వే నెంబరు 138 (యల్.పి.నెంబరు 1807)లో పూర్తి విస్తీర్ణం Ac. 8-43 Cents భూమికి హద్దులు. **తూర్పు:** పచ్చా రామయ్య భూమి, పచ్చా భూమయ్య వగైరా, **దక్షిణం:** సి.జె.యఫ్.యస్ ల్యాండ్ (గవర్నమెంట్ ల్యాండ్), **పడమర :** కొత్తపేట - నర్రవాడ రోడ్, **ఉత్తరం:** నాగోతు తిరుపాలునాయుడు గారి భూమి.

ఆక్షేపణలు తెలియజేయవలసిన అడ్రసు :
తిరివీధి చినవెంగయ్య, S/o. మునిస్వామి,
నర్రవాడ చెన్నకేశవ స్వామి టెంపుల్,
సెల్: 94415 65783.

ఇట్లు: **యం. వెంకటేశ్వర్లు,** B.A., B.L.,
హెచ్. మేఘన, B.A., LL.M
అడ్వకేట్స్, ఆత్మకూరు, SPSR నెల్లూరు జిల్లా.

వంగవీటి రంగా సేవలు ఎనలేనివి

జలదంకి, న్యూస్‌టుడే: వంగవీటి మోహన్ రంగా చేసిన సేవలు ఎనలేనివని కాపు నాయకులు దామిశెట్టి సుధీర్‌నాయుడు, డి.శ్రీనివాసులు అన్నారు. ఆదివారం మండలంలోని వేములపాడులో మాజీ సర్పంచి, తెదేపా నాయకుడు టి.పెంచలయ్య ఆధ్వర్యంలో రంగా విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

రహదారి పనుల ప్రారంభం

పనులు ప్రారంభిస్తున్న కూటమి నాయకులు

జలదంకి, న్యూస్‌టుడే: ఎలాంటి అభివృద్ధికి నోచుకోని మారుమూల గ్రామాలకు సైతం రోడ్లు నిర్మించి రవాణా వసతి కల్పించిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని సోమశిల ప్రాజెక్టు వైస్ ఛైర్మన్ పి మధురెడ్డి అన్నారు. ఆదివారం కావలి జాతీయ రహదారి నుంచి నాగిరెడ్డిపాలెం గ్రామానికి 1.4 కి.మీ మేర నిర్మిస్తున్న సిమెంట్ రోడ్డు పనులను ప్రారంభించారు. ఉపాధి నిధులు రూ.88 లక్షలు వెచ్చించి నిర్మిస్తున్నామన్నారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

వంతెన నిర్మాణం.. హామీలకే పరిమితం

వంతెన నిర్మించాల్సిన ప్రాంతం

— న్యూస్‌టుడే, వరికుంటపాడు —

మండల పరిధిలోని కనియంపాడు- భాస్కరాపురం గ్రామాల మధ్య ఉన్న చవట వాగుపై వంతెన లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. నాలుగు నెలల కిందట కురిసిన వర్షానికి నేటికీ నీరు ప్రవహిస్తోంది. భాస్కరాపురం గ్రామస్థులు ఏ చిన్న వస్తువుకైనా కనియంపాడు, వరికుంటపాడుకు రావాల్సిందే. వాగుపై వంతెన లేకపోవడంతో వర్షాల సమయంలో రాకపోకలు పూర్తిగా స్తంభించిపోతాయి. ఫర్లాంగు దూరం రోడ్డుతో పాటు వాగుపై వంతెన నిర్మిస్తే ఇబ్బందులు తొలగుతాయి. ఏళ్లుగా పాలకులు వంతెన నిర్మాణం చేస్తామని హామీలు గుప్పిస్తున్నారే తప్ప ఆచరణలోకి తేవడం లేదు. కనియంపాడు-భాస్కరాపురం గ్రామాలు దగ్గరగా ఉంటాయి. పశుపోషకులు సైతం ఇబ్బందులకు గురవుతున్నారు. వంతెన నిర్మించాలని కోరుతున్నారు.

పాలకులు స్పందించాలి: మాల్యాద్రి, స్థానికుడు

చవట వాగుపై వంతెన నిర్మిస్తే ఇబ్బందులు ఉండవు. దారి పొడవునా వీధి దీపాలు ఏర్పాటు చేయాలి. వాగు ప్రాంతం కావడం.. చెట్లు పెరగడంతో విషపురుగుల సంచారం అధికంగా ఉంది. పాలకులు స్పందించి వంతెన నిర్మాణం చేయాలి.

మైనర్లకు వాహనాలిస్తే కఠిన చర్యలు

ఉదయగిరి, న్యూస్‌టుడే : మైనర్లకు వాహనాలిచ్చి రోడ్లపైకి పంపితే సంబంధిత వాహన యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై కర్నాటి ఇంద్రసేనా రెడ్డి హెచ్చరించారు. పట్టణంలోని మెయిన్ బజార్‌లో ఆదివారం వాహనాలను తనిఖీ చేశారు. ఎలాంటి పత్రాల్లేని, ట్రాఫిక్ నిబంధనలు పాటించని వాహనాలకు జరిమానాలు విధించారు.

గూడూరు

• గూడూరు • కోవూరు • సర్వేపల్లి

వైభవంగా ఇందుకూరమ్మ విగ్రహ ప్రతిష్ఠ

కలశ స్థాపన చేస్తున్న వేదపండితులు

ఇందుకూరుపేట, న్యూస్‌టుడే: ఇందుకూరుపేట గ్రామదేవత ఇందుకూరమ్మ నూతన విగ్రహ ప్రతిష్ఠ, కుంభాభిషేకం మహోత్సవం వేడుకగా జరిగింది. మూడు రోజులుగా జరుగుతున్న వేడుకల్లో ఆదివారం వేదపండితుల ఆధ్వర్యంలో కలశ స్థాపన ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. దాతలు నాగార్జున నాయుడు, ఇరగరాజ శివకుమార్, గ్రామస్థులు పాల్గొన్నారు.

చేపల తూకాల్లో మోసాలు

బుచ్చిరెడ్డిపాళెం, న్యూస్‌టుడే: బుచ్చిరెడ్డిపాళెం పురపాలక పరిధిలోని రామచంద్రారెడ్డి కాలనీ వద్ద ఉన్న చేపల దుకాణాల్లో తూకాల్లో వ్యత్యాసాలు ఉండడంతో ఆదివారం తూనికల కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ రియాజ్ అహ్మద్ పట్టుకున్నారు. ఆయన మాట్లాడుతూ చేపల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి తూకాల్లో లోపాలు ఉన్న 15 కాటాలను సీజ్ చేశామన్నారు. కిలోకు 100 గ్రాముల నుంచి 300 గ్రాములు తక్కువగా ఉన్నట్లు గుర్తించామన్నారు. కొన్ని రోజులుగా వస్తున్న ఫిర్యాదుల మేరకు చేపల దుకాణాలపై దాడులు నిర్వహించామని అధికారులు తెలిపారు. సమాచారం తెలుసుకున్న పలువురు వ్యాపారులు వెంటనే వాటిని సరిచేశారని వినియోగదారులు తెలిపారు. ఎవ్వరైనా తూకాల్లో మోసాలకు పాల్పడితే చర్యలు తప్పవని ఇన్‌స్పెక్టర్ హెచ్చరించారు.

గేటు ధ్వంసమై రెండేళ్లు..!

పొదలకూరు నిమ్మ మార్కెట్ యార్డులో రెండేళ్ల క్రితం గుర్తు తెలియని వాహనం ఢీకొని రెండో గేటు దిమ్మెతో సహా విరిగిపోయింది. అప్పటి నుంచి మరమ్మతులు చేయలేదు. రూ.లక్షల విలువైన నిమ్మ దేశంలోని పలు ప్రాంతాలకు తరలిస్తున్నారు. ప్రతి రోజూ గ్రామాల నుంచి ఉదయాన్నే ఆటోల్లో తీసుకొస్తారు. ధరలు బాగుంటే నిమ్మ బస్తాలు అపహరిస్తున్నారని వాపోతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గేటు మరమ్మతులు చేయాలని రైతులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, పొదలకూరు

పూడిక తీయక.. మురుగు కదలక

పొదలకూరు అగ్రహారం నివాసాల మధ్య ఉన్న మురుగు కాలువలు పూడిపోయాయి. సుమారు ఆయిదేళ్ల క్రితం కాలనీలో రోడ్డు నిర్మించే సమయంలో అంచులకు మట్టిని వేసే క్రమంలో గుత్తేదారు నిర్లక్ష్యంతో పూడిపోయాయి. అప్పటి నుంచి అధికారులకు విన్నవించినా పట్టించుకోకపోవడంతో కాలువల్లో మురుగు కదలక దోమల బెడదతో స్థానికులు సతమతమవుతున్నారు. అధికారులు స్పందించి పూడిక తీయించాలని విన్నవిస్తున్నారు. – న్యూస్‌టుడే, పొదలకూరు రూరల్

భవనం శిథిలం.. బిక్కుబిక్కుమంటూ విద్యార్థులు

చిల్లకూరు మండలంలోని తూర్పుకనుపూరు ప్రాథమిక పాఠశాల భవనం స్లాబ్ పెచ్చులూడుతోంది. ఏళ్ల క్రితం నిర్మించిన భవనం కావడంతో ప్రస్తుతం శిథిలావస్థలో ఉంది. గత్యంతరం లేక అందులోనే బిక్కుబిక్కుమంటూ విద్యార్థులు చదువుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. పాఠశాలకు నూతన భవనాన్ని మంజూరు చేయాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, చిల్లకూరు

పిచ్చిమొక్కలతో అధ్వానం

కోవూరు మండల పోలిరెడ్డిపాళెంలో సచివాలయం ఎదుట ఉన్న ఖాళీ ప్రాంగణంలో పిచ్చి మొక్కలు విస్తరించడంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. సచివాలయం చుట్టూ వ్యవసాయ పొలాలు ఉండడంతో విషపురుగులు సంచరించే ప్రమాదముందని స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించి పిచ్చి మొక్కలను తొలగించాలని, కార్యాలయ పరిసరాలు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు విన్నవిస్తున్నారు. – న్యూస్‌టుడే, కోవూరు

ఆదమరిస్తే ప్రమాదమే..

కోట పంచాయతీ పరిధిలోని శ్యామసుందరపురం రోడ్డు పక్కనే ఉన్న తాగునీటి పైపులైన్ గేట్ వాల్వు మూత దెబ్బతిని ప్రమాదకరంగా ఉంది. ఈ మార్గంలో ప్రాథమిక పాఠశాల ఉంది. నిత్యం వాహనాలు రద్దీగా వెళుతుంటాయి. ఆదమరిస్తే గుంతలో పడే ప్రమాదముంది. అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని తల్లిదండ్రులు వాపోతున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అరవింద్‌ను వివరణ కోరగా సమస్య వెంటనే పరిష్కరిస్తామని పేర్కొన్నారు. – న్యూస్‌టుడే, కోట

ధ్రువపత్రాలకు తప్పని నిరీక్షణ

చిల్లకూరు, న్యూస్‌టుడే: మండలంలోని పలు గ్రామాలకు చెందిన విద్యార్థులు కుల, ఆదాయ, ఈడబ్ల్యూఎస్, ఓబీసీ, తదితర ధ్రువపత్రాలను పొందేందుకు నిరీక్షణ తప్పడంలేదు. చిల్లకూరు తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన కె.శ్రీనివాసులు జనవరి నెలాఖరులో ఉద్యోగ విరమణ పొందారు. దాదాపు 22 రోజులు గడుస్తున్నా, ఇక్కడ తహసీల్దారుగా ఎవరినీ నియమించకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. కుల, ఆదాయ ధ్రువపత్రాల కోసం 80 మంది, ఈడబ్ల్యూఎస్, ఓబీసీ ధ్రువపత్రాల మంజూరుకు మరో 30 మంది చేసుకున్న దరఖాస్తులు రోజుల తరబడి పెండింగ్‌లోనే ఉన్నాయి. ఇన్‌ఛార్జి తహసీల్దార్ బాధ్యతలను స్థానిక ఉప తహసీల్దార్‌కు అప్పగించినా డిజిటల్ కీ తీసుకోవడంలో జాప్యం కారణంగా ధ్రువపత్రాల జారీకి మోక్షం కలగలేదు. ఇటీవల ప్రకటించిన జేఈఈ ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు కళాశాలల్లో చేరేందుకు సంబంధిత పత్రాలు అవసరం కావడంతో ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం రెవెన్యూ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ధ్రువపత్రాల మంజూరుకు చర్యలు చేపట్టాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

అసంపూర్తి భవనాలు.. విద్యార్థులకు అగచాట్లు

న్యూస్‌టుడే, కోట

ప్రభుత్వ పాఠశాలల్లో గత వైకాపా పాలనలో చేపట్టిన నాడు-నేడు పనులు అసంపూర్తిగా వదిలేశారు.. నిధుల కొరత కారణంగా అదనపు భవనాల నిర్మాణాలు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. గూడూరు, కోట, చిల్లకూరు మండలాల్లో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మనబడి- మన భవిష్యత్తు కింద పనులు చేపడతామని తెలిపారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి పనులు పూర్తి చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు విన్నవిస్తున్నారు. ● ఎంఈవో-2 మస్తానయ్య మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలల్లో నిలిచిపోయిన భవనాలను పూర్తి చేసేందుకు నిధుల మంజూరుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపామన్నారు. మంజూరైన వెంటనే పనులు చేపడతామని పేర్కొన్నారు.

● గూడలిలోని ఉన్నత పాఠశాలలో 210 మంది విద్యార్థులు చదువుతున్నారు. నాలుగేళ్ల క్రితం రూ.45 లక్షలతో అయిదు అదనపు గదులు నిర్మించాలని

గూడలిలో అర్ధాంతరంగా నిలిచిన ఉన్నత పాఠశాల భవన నిర్మాణం

చేపట్టారు. మూడేళ్లగా పనులు నిలిచిపోయాయి. పది తరగతులు నిర్వహించేందుకు పూర్తిస్థాయిలో గదులు లేక అవస్థలు పడుతున్నారు. ఉన్న ఇరుకు గదులు, చెట్ల కిందనే చదువుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

● నెల్లూరుపల్లి కొత్తపాళెం ఉన్నత పాఠశాలలో 180 మంది విద్యార్థులున్నారు. పాత భవనం దెబ్బతింది. నాలుగేళ్ల క్రితం మూడు అదనపు గదులు నిర్మించేందుకు

నెల్లూరుపల్లిలో గోడలకే పరిమితం

రూ.25 లక్షలు నిధులు మంజూరు చేశారు. గోడల వరకు నిర్మించి వదిలేశారు. ప్రస్తుతం మొండిగోడలే దర్శనమిస్తున్నాయి. ఉన్న మూడు గదుల్లోనే తరగతులు నిర్వహిస్తూ అవస్థలు పడుతున్నారు.

పేదలకు అండగా కూటమి ప్రభుత్వం

చెక్కు అందజేస్తున్న గూడూరు ఎమ్మెల్యే సునీల్‌కుమార్

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: పేద ప్రజలకు అండగా ఉండడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ తెలిపారు. గూడూరు పట్టణంలోని ఎమ్మెల్యే నివాసం వద్ద అనారోగ్యంతో బాధపడుతున్న మునిస్వామికి సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన రూ.41 వేల ఎల్‌వోసీ చెక్కును ఆదివారం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థికంగా ఇబ్బందులు పడే ప్రజలకు సీఎం చంద్రబాబు సహకారంతో సీఎంఆర్ఎఫ్ ద్వారా సాయం అందిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పట్టణ సీఐ శేఖర్‌బాబు, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) గూడూరు: 85002 02046
కోవూరు :79950 67034, సర్వేపల్లి : 80085 73980

సమస్య: కోట మండలం వీరారెడ్డిసత్రం సమీపంలోని ర.భ రోడ్డు పక్కనే చెత్త పేరుకుపోయి దుర్వాసన వస్తుంది. దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. సత్వరం పారిశుద్ధ్య పనులు చేపట్టాలి. **– రఘురామ్, స్థానికుడు**

సమాధానం : పరిశీలించి సమస్యను పరిష్కరిస్తాం. **– వేణు, డిప్యూటీ ఎంపీడీవో**

? తోటపల్లిగూడూరు మండలం కాటేపల్లి సముద్రతీరంకు వెళ్లే రోడ్డు మార్గంలో మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి **– హరిబాబు**

✓ పరిశీలించి మలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తాం. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేస్తాం. **– నరేశ్, ర.భ ఏఈ**

? తోటపల్లిగూడూరు మండలం మల్లికార్జునపురం వద్ద పారుదల కాలువలో గుర్రపుడెక్క, పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. **– రమణయ్య**

✓ పరిశీలించి తొలగింపునకు చర్యలు తీసుకుంటాం. **– అలీ, నీటిపారుదలశాఖ ఏఈ**

? పొదలకూరు పట్టణ వీధుల్లోని సైడు కాలువల్లో పూడిక పేరుకుపోవడంతో దోమల ఉద్ధృతి పెరిగి ఇబ్బందులు పడుతున్నాం. **– రామయ్య**

✓ వీధులు, కాలనీల వారీగా కాలువలన్నీ శుభ్రం చేయిస్తాం. బ్లీచింగ్, క్లోరినేషన్ చేయిస్తాం. **– యశ్వంత్ సింగ్, పంచాయతీ కార్యదర్శి**

? పొదలకూరు రూరల్ పరిధిలోని కనపర్తిలో బోరు మరమ్మతులకు గురై ఏడాదిగా నిరుపయోగంగా ఉంది. **– ప్రసాద్, స్థానికుడు**

✓ బాగు చేయిస్తాం. **– నరసింహారావు, ఎంపీడీవో**

? మనుబోలు మండలం జట్లకొండూరు సమీపంలోని మనుబోలు-పొదలకూరు ర.భ రహదారి పక్కన విద్యుత్తు స్తంభాలు పక్కకు వాలి ప్రమాదకరంగా ఉన్నాయి. **– మల్లికార్జున్**

✓ పరిశీలించి మరమ్మతులు చేపడతాం. **– అనిల్‌కుమార్, డిస్కం ఏఈ**

? రాపూరులో అడవి పందుల బెడద అధికమైంది. పంగిలి, కోటూరుపాడుగ్రామాల్లో వరి పంట వెన్ను దశలో ఉంది. **– రైతులు**

✓ చర్యలు తీసుకుంటాం. **–మాల్యాద్రి, రేంజర్**

? నెల్లూరు-మైపాడు మార్గంలో రోడ్డు పనులు జరుగుతున్నాయి. స్తంభాలు సక్రమంగా వేయక ప్రమాదాలు జరిగే అవకాశముంది. **– రవికృష్ణ**

✓ చర్యలు తీసుకుంటాం **–సురేంద్ర, ఏడీఈ**

స్థానికులకు ప్రాధాన్యమివ్వాలి

వెంకటాచలం, న్యూస్‌టుడే: ఎన్‌సీఈఆర్టీలో ఉద్యోగాల కల్పన, పనుల నిర్వహణలో స్థానికులకు ప్రాధాన్యం ఇవ్వాలని తెదేపా నాయకులు, చవటపాళెం గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఎన్‌సీఈఆర్టీ వద్ద ఆదివారం మాట్లాడుతూ... వెంకయ్యనాయుడు సహకారంతో సంస్థ వచ్చిందన్నారు. నిర్మాణ పనుల్లో గుత్తేదారులు స్వచ్ఛందంగా భూములిచ్చిన స్థానికులకు ఎలాంటి అవకాశాలు కల్పించడం లేదన్నారు. బయట ప్రాంతాల వారు తరలిస్తున్న ఇసుకను తాము అడ్డుకుంటే ట్రాక్టర్‌కు రూ.200 చొప్పున ఎమ్మెల్యే వసూలు చేయిస్తున్నట్లు వైకాపా నాయకులు ఆరోపించడం దారుణమన్నారు. నాయకులు రాధాకృష్ణ నాయుడు, సతీశ్ నాయుడు గ్రామస్థులు పాల్గొన్నారు.

అధ్వానంగా కనుపూరు కాలువ వంతెన

పొదలకూరు: సూరాయపాళెం వెళ్లే మార్గంలో ఉన్న కనుపూరు కాలువ వంతెనపై ఆదివారం లారీ ఇరుక్కుంది. రోడ్డు దారుణంగా దెబ్బతిని గుంతలు ఏర్పడ్డాయి. భారీ వాహనాలు తిరుగుతూ రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఆర్‌అండ్‌బి అధికారులు వంతెన ఉన్న ప్రాంతం తమ పరిధిలోకి రాదని చెబుతుండగా, ఇరిగేషన్ అధికారులు తమ వద్ద నిధులు లేవని కొన్నేళ్లుగా కాలయాపన చేస్తున్నారని వాహనచోదకులు వాపోతున్నారు.

పేద విద్యార్థులకు అండగా నిలుస్తాం

ప్రమాణం చేస్తున్న బలిజసేవా సంఘం నాయకులు

పొదలకూరు, న్యూస్‌టుడే: ఐక్యంగా ఉంటే సమస్యలు పరిష్కారమవుతాయని విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు కోటేశ్వరరావు అన్నారు. ఆదివారం పొదలకూరులో మండల బలిజ సేవా సంఘం నూతన కార్యవర్గంతో ప్రమాణం చేయించారు. అధ్యక్షుడిగా ఎంపికైన మలిశెట్టి శివశంకర్ మాట్లాడుతూ పేద విద్యార్థులు చదువుల్లో రాణిస్తే ఆర్థిక సాయం చేస్తామని, అనారోగ్యంతో బాధపడే వారికి తమవంతు సహకారమందిస్తామని బలిజ కమ్యూనిటీహాలు నిర్మిస్తామన్నారు. ఉపాధ్యక్షులు పోతురాజు రామ్మోహన్, జనకల శ్రీనివాసులు, వెంకటరమణ, సుబ్బయ్య, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

వన భోజనం.. ఆత్మీయ అనుబంధం

శివపార్వతుల ఊరేగింపు

తోటపల్లిగూడూరు, న్యూస్‌టుడే: తోటపల్లిగూడూరు మండలం వరిగొండలోని జ్వాలాముఖి అమ్మవారి ఆలయం ఆవరణలో ఆదివారం జంగమ సేవా సంఘం వార్షికోత్సవం సందర్భంగా వన భోజన మహోత్సవం నిర్వహించారు. విజయదుర్గ ఆస్థాన పీఠాధిపతులు పత్రి బ్రహ్మయ్య స్వామీజీ పర్యవేక్షణలో పార్వతీ పరమేశ్వరుల కల్యాణం వైభవంగా జరిపించారు. వైద్యశిబిరం, పరిచయ వేదిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పిల్లలకు బహుమతులు అందజేశారు. వన భోజనాలు చేశారు. రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి, వనభోజన మహోత్సవం గౌరవాధ్యక్షులు దశరథరామయ్య, కమిటీ ఛైర్మన్, నెల్లూరు నగర 20వ డివిజన్ కార్పొరేటర్ చేజర్ల మహేష్, జిల్లా కార్యదర్శి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

గంజాయి రహిత సమాజమే లక్ష్యం

గ్రామస్థులతో మాట్లాడుతున్న కృష్ణపట్నం సీఐ రవినాయక్

తోటపల్లిగూడూరు, న్యూస్‌టుడే : గంజాయి, మత్తు పదార్థాల జోలికి వెళ్లొద్దని కృష్ణపట్నం సీఐ రవినాయక్ సూచించారు. మండలంలోని చింతోపు గ్రామంలో ఆదివారం స్థానికులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యాలు, గంజాయి రహిత సమాజమే లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు. పలు చట్టాలపై అవగాహన కల్పించారు. ఎస్సై వీరేంద్రబాబు, స్థానికులు పాల్గొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

బుచ్చిరెడ్డిపాళెం : పదోతరగతిలో శత శాతం ఉత్తీర్ణత సాధించాలని సాంఘిక సంక్షేమశాఖ డీడీ శోభారాణి అన్నారు. బుచ్చిలోని బాలికల వసతి గృహాన్ని ఆదివారం ఆకస్మికంగా తనిఖీచేశారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేసి, దస్త్రాలు పరిశీలించారు.

పేదల కోసం భూపోరాటం

నినాదాలు చేస్తున్న సంఘం నాయకులు

సైదాపురం : పేదల కోసం భూపోరాటాలు సాగించి, వారికోసమే ప్రాణాలార్పించిన రాగయ్య ప్రజల గుండెల్లో నిలిచారని రైతుకూలీ సంఘం జిల్లా కన్వీనర్ పోలయ్య అన్నారు. మండలంలోని తలుపూరు చావతిప్ప గిరిజన కాలనీవద్ద కామ్రేడ్ పంతగిరి రాగయ్య వర్ధంతి సభ ఆదివారం నిర్వహించారు. వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మరుగుదొడ్లు లేక ప్రయాణికుల అవస్థలు

న్యూస్‌టుడే, పొదలకూరు రూరల్

జనాభా ఎక్కువగా ఉన్న మేజర్ పంచాయతీలు, మండల కేంద్రాల వద్ద కూడళ్లలో మరుగుదొడ్లు లేక వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పురపాలక కేంద్రాల్లో ఏర్పాటు చేశారు. పొదలకూరు, రాపూరు, కలువాయి, సైదాపురం, విడవలూరు, ఇందుకూరుపేట, నరుకూరు తదితర ప్రాంతాల్లో లేకపోవడంతో అవస్థలు తప్పడం లేదు.

● పొదలకూరులోని ప్రధాన కూడళ్లలో మరుగుదొడ్ల సౌకర్యం లేక వృద్ధులు, మహిళలకు అవస్థలు తప్పడం లేదు. వివిధ ప్రాంతాలకు కూడలిగా ఉండడంతో ఇతర ప్రాంతాల ప్రయాణికులు, పనుల నిమిత్తం నిత్యం మూడు వేల మంది వరకు ప్రజలు పట్టణానికి వస్తుంటారు. ప్రధానంగా ఆర్టీసీ బస్టాండు మినహాయిస్తే మూడు కూడళ్లు ఉన్నాయి. సంగం రోడ్డు, రాంనగర్ కూడలి, పంచాయతీ బస్టాండు వద్ద ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు నిత్యం బస్సుల కోసం వందల సంఖ్యలో ప్రయాణికులతో రద్దీగా ఉంటోంది. ప్రధాన కూడళ్లలో పంచాయతీ ఆధ్వర్యంలో మరుగుదొడ్లు నిర్మించాలని ప్రతిపాదనలు ఉన్నా కార్యరూపం దాల్చడం లేదు. నాలుగేళ్ల క్రితం నిర్మాణాలు చేపట్టాలని తీర్మానాలు చేసినా కాగితాలకే పరిమితమయ్యాయి. అత్యవసరమైతే అర కిలో మీటరు దూరంలో ఉన్న పాత బస్టాండుకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. అధికారులు స్పందించి ప్రధాన కూడళ్లలో తగు వసతులు కల్పించాలని విన్నవిస్తున్నారు.

పొదలకూరు పంచాయతీ బస్టాండు కూడలిలో ప్రయాణికులు

● ఈవోపీఆర్డీ యశ్వంత్ సింగ్ మాట్లాడుతూ.. కూడలి ప్రాంతాల్లో మరుగుదొడ్లు అవసరమైన చోట పంచాయతీ ఆధ్వర్యంలో నిర్మిస్తామన్నారు. విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేసి తప్పకుండా శౌచాలయాల సౌకర్యం కల్పిస్తామని పేర్కొన్నారు.

ఉల్లాసంగా హ్యాపీ సండే

గూడూరుపట్టణం, న్యూస్‌టుడే: గూడూరు పట్టణంలోని టిడ్కో గృహాల వద్ద ప్రభుత్వ ఆదేశాల మేరకు హ్యాపీ సండే కార్యక్రమాన్ని ఆదివారం పురపాలక అధికారులు నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రజలను ఆరోగ్యంగా ఉంచేందుకు ఒత్తిడి తగ్గించి సంతోషంగా గడిపేలా ప్రభుత్వ దృష్టి పెట్టిందని చెప్పారు. అందరూ కలిసి మెలిసి ఆనందంగా గడపాలని సూచించారు. అనంతరం ఆటలు, పాటలు, డ్యాన్సులు వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో పురపాలక అధికారులు మురళి, దీనరాజు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆలయ రోడ్డు పనులు ప్రారంభం

ఇందుకూరుపేట, న్యూస్‌టుడే: మండలంలోని గంగపట్నంలో వెలసిన చాముండేశ్వరి అమ్మవారి ఆలయం కోనేరు చుట్టూ నిర్మించనున్న నూతన రోడ్డు పనులు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఛైర్మన్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ భక్తుల సౌకర్యార్థం రూ.30 లక్షలతో సిమెంట్ రోడ్డు నిర్మిస్తున్నామని తెలిపారు. ఈవో తాతారావు, పంచాయతీరాజ్ డీఈఈ సుధాకర్ రెడ్డి, ఉప సర్పంచి వెంకటరమణారెడ్డి, తెదేపా నాయకులు మల్లికార్జున రెడ్డి పలువురు ధర్మకర్తలు పాల్గొన్నారు.

శాంతియుతంగా పరిష్కరించుకుందాం

కోట, న్యూస్‌టుడే: కోట మండలం గూడలిలో ఇరువర్గాల మధ్య వివాదం నెలకొంది. ఆదివారం ప్రార్థనలు చేస్తుండగా కొందరు అభ్యంతరం తెలపడంతో ఒక్కసారిగా ఉద్రిక్తత చోటుచేసుకుంది. సీఐ శేఖర్‌బాబు, ఎస్సై పవన్‌కుమార్ సిబ్బందితో వెళ్లారు. ఇరు వర్గీయులను పోలీసుస్టేషన్‌కు పిలిపించి మాట్లాడారు. సీఐ మాట్లాడుతూ శాంతియుతంగా ఉండాలని, ఈ విషయమై రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

మరుపూరులో అరటి లోడు వాహనం బోల్తా

పొదలకూరు, న్యూస్‌టుడే: పొదలకూరు మండలం మరుపూరు సమీపంలో ఆదివార మధ్యాహ్నం రాజంపేట నుంచి నెల్లూరుకు అరటి కాయల లోడుతో వెళుతున్న మినీ వ్యాను టైరు పంక్చర్ కావడంతో ఒక్కసారిగా అదుపుతప్పి బోల్తా పడింది. అరటి గెలలన్నీ రోడ్డుకు అడ్డంగా పడ్డాయి. కొంత సేపు వాహనాలు బారులు తీరాయి. స్థానికులు స్పందించి వాటిని తొలగించి రాకపోకలు పునరుద్ధరించారు.

గాంధీ మార్గం ఆచరణీయం

కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

ఇందుకూరుపేట, న్యూస్‌టుడే: స్వాతంత్ర్య పోరాటంలో గాంధీ చూపిన సన్మార్గం ఆచరణీయమని ఆశ్రమ మేనేజర్ మనోజ్ అన్నారు. మండలంలోని పల్లిపాడు గాంధీ ఆశ్రమంలో ఆధ్వర్యంలో సర్వమత ప్రార్థనలు జరిగాయి. ముందుగా గాంధీ విగ్రహానికి ఖాదీ వస్త్రాలు, స్థల దాత కనకమ్మకు పట్టు వస్త్రాలు సమర్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న గ్రామస్థులు, విద్యార్థులకు గాంధీ జీవిత విశేషాలను తెలియజేశారు.

ద్విచక్రవాహనదారులు శిరస్త్రాణం ధరించాలి

యువతకు అవగాహన కల్పిస్తున్న సీఐ శ్రీనివాస్

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనదారులు కచ్చితంగా శిరస్త్రాణం ధరించి వాహనాలు నడపాలని రెండో పట్టణ సీఐ శ్రీనివాస్ తెలిపారు. గూడూరులోని తిలక్‌నగర్ వద్ద రోడ్డు ప్రమాదాల నివారణపై వాహనదారులకు ఆదివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ నిబంధనలు పాటించి వాహనాలను నడపాలని, వాహనపత్రాలు తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

వెంకటాచలం, న్యూస్‌టుడే: మండలంలోని కాకుటూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు... నెల్లూరు జగ్జీవన్‌రాం కాలనీకి చెందిన బాబురావు (58) శనివారం రాత్రి కాకుటూరులో రహదారి పక్కన నిలబడి ఉండగా... గూడూరు నుంచి నెల్లూరు వైపునకు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ప్రమాదంలో కాలు, చేయి విరిగి బాబురావు తీవ్రంగా గాయపడ్డారు. 108లో నెల్లూరులోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోళ్ల వ్యర్థాల వాహనాలు సీజ్

వెంకటాచలం, బుచ్చిరెడ్డిపాళెం, న్యూస్‌టుడే: గూడూరు నుంచి నెల్లూరు వైపునకు కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్న వాహనాన్ని ఆదివారం వెంకటాచలం టోల్‌గేట్ వద్ద మత్స్యశాఖ అధికారులు పట్టుకొని వెంకటాచలం పోలీసులకు అప్పగించారు. డ్రమ్ముల్లో ఉన్న వ్యర్థాలను గుంత తీసి పూడ్చారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బుచ్చి మండలం దామరమడుగు వద్ద చేపలకు వేసేందుకు తీసుకెళుతున్న కోళ్లవ్యర్థాల వాహనాన్ని ఎస్సై సంతోష్‌కుమార్‌రెడ్డి ఆదివారం వేకువజామున పట్టుకొని సీజ్‌చేశారు.

అతివ..ఆర్థిక ప్రగతి

న్యూస్‌టుడే, తోటపల్లిగూడూరు

గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు ఆర్థికాభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్నారు. ఆ మహిళలు ఉపాధి మార్గాలతో కుటుంబాల ఆర్థిక వృద్ధికి దోహదపడుతూ అభివృద్ధి వైపు అడుగులు వేస్తున్నారు. గత వైకాపా పాలనలో రుణాలందక ఇబ్బందులు పడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నుంచి అతివల ప్రగతే ధ్యేయంగా పలు పథకాలు అమలవుతున్నాయి. వాటిని సద్వినియోగం చేసుకుని కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకొని స్వయం ఉపాధి పొందుతున్నారు. పొదుపు సంఘాల్లోని సభ్యులకు స్త్రీనిధి, బ్యాంకు లింకేజీ, ఉన్నతి, తదితర పథకాల కింద వ్యాపారాలు చేసుకునేందుకు రుణాలు మంజూరవుతున్నాయని ఏపీఎం విజయలక్ష్మి పేర్కొన్నారు.

కుటుంబానికి అండగా ...

తోటపల్లిగూడూరు మండలం ఇస్కపాలెం గ్రామానికి చెందిన కె.చెంగమ్మ స్వయం సహాయక సంఘం అపర్ణ గ్రూపులో సభ్యురాలిగా ఉన్నారు. బ్యాంకు రుణం రూ.2 లక్షలు తీసుకుని వస్త్ర దుకాణం ఏర్పాటు చేశారు. వ్యాపారం నిర్వహిస్తూ స్వయం ఉపాధి పొందుతున్నారు. కుటుంబానికి తనవంతుగా ఆర్థిక భరోసా కల్పిస్తున్నారు.

పిండిమిల్లు నిర్వహిస్తూ..

ఇస్కపాలేనికి చెందిన రాజ్యలక్ష్మి రేణుకాదేవి స్వయం సహాయక సంఘంలో సభ్యురాలిగా చేరారు. ఇంటి వద్దనే వ్యాపారం చేయాలని భావించారు. బ్యాంకు లింకేజీ కింద రూ.రెండు లక్షలు రుణం మంజూరవగా ఇంటి వద్దనే పిండిమిల్లు పెట్టారు. నెలకు రూ.10 వేలకు పైగా సంపాదిస్తూ కుటుంబానికి ఆర్థికంగా తోడ్పాటు అందిస్తున్నారు.

ప్రమాదకరంగా గుంత.. వాహనదారులకు తంటా

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో మార్చిలోగా గుంతలు లేని రోడ్ల నిర్మాణం చేయాలనే ప్రభుత్వం సంకల్పం క్షేత్ర స్థాయిలో అమలు కావడం లేదు. ర.భ శాఖ అధికారుల నిర్లక్ష్యం వాహనదారుల పాలిట శాపంగా మారింది. గత డిసెంబరు నెలలో కురిసిన వర్షాలకు గూడూరు మండలం పగడాలపల్లి గ్రామ సమీపంలో గూడూరు-మిట్టాత్మకూరు రహదారి వద్ద రోడ్డు కోతకు గురై భారీగా గుంత పడింది. అటు వెళ్లే వాహనదారులు, ప్రయాణికులు రాత్రి సమయాల్లో ప్రమాదాల బారిన పడి క్షతగాత్రులవుతున్నా, ఇంత వరకు అధికారులు కనీసం తాత్కాలికంగా మరమ్మతులు చేయడం లేదు. కొన్ని నెలలుగా ప్రమాదకరంగా ఉండే గుంతలను పూడ్చకపోవడంతో వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులైన చర్యలు తీసుకోవాలని గుంతలను పూడ్చాలని ప్రయాణికులు కోరుతున్నారు.

గూడూరు-మిట్టాత్మకూరు రహదారి వద్ద రోడ్డు దుస్థితి

1st ANNIVERSARY

ప్రథమ వార్షికోత్సవ శుభాకాంక్షలు

మా కస్టమర్ దేవుళ్లకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు, మార్కెటింగ్ సిబ్బందికి భూమి ఇన్‌ఫ్రా రియల్టీ పొదలకూరు బ్రాంచ్ ప్రారంభించి 1వ సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రథమ వార్షికోత్సవ శుభాకాంక్షలు.

మైలా కోటేశ్వరరావు, ఛైర్మన్
కూరపాటి శ్రీహరికృష్ణారెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్
భూమి ఇన్‌ఫ్రా రియల్టీ (బ్రాంచ్-2)
పొదలకూరు మెయిన్‌రోడ్డు, కాకాణి రమణారెడ్డికాలనీ,
పొదలకూరు. Cell: 93469 48665, 93817 79202

(c) eenadu

నెల్లూరు

• నెల్లూరు • నెల్లూరు గ్రామీణం

నినాదాలు చేస్తున్న బీసీవై నాయకులు, కార్యకర్తలు

సింహగర్జనకు తరలిన బీసీవై శ్రేణులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: గుంటూరులో జరుగుతున్న బీసీ సింహగర్జన సభకు జిల్లా నుంచి బీసీవై పార్టీ శ్రేణులు ఆదివారం తరలివెళ్లారు. మినీబైపాస్ రోడ్డులో జ్యోతిరావు పూలే దంపతుల విగ్రహాలకు ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు బుదవరపు బాలాజీ, ఇతర నాయకులు, కార్యకర్తలు నివాళులర్పించారు. అనంతరం వాహనాల్లో వెళ్లారు.

మసీదు ఆస్తులను కాపాడాలి

ప్రార్థనలు చేస్తున్న అబ్దుల్ అజీజ్ తదితరులు

నెల్లూరు(నగరపాలకసంస్థ): చిన్నబజారులోని అబ్బాస్ అలీఖాన్ మసీదుకు 400 ఏళ్ల చరిత్ర ఉందని వక్ఫ్ బోర్డు రాష్ట్ర చైర్మన్ అబ్దుల్ అజీజ్ తెలిపారు. ఆదివారం మసీదులో జరిగిన ఇఫ్తార్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మసీదు ఆస్తులను కాపాడాల్సిన బాధ్యత నూతన కమిటీపై ఉందన్నారు. కార్యక్రమంలో మదీనా వాచ్ షాప్ జంషీయాజ్, కరీముల్లా, సాబీర్‌ఖాన్, సమీర్‌ఖాన్ పాల్గొన్నారు.

వాకర్లకు వైద్య పరీక్షలు

నెల్లూరు (వేదాయపాలెం): వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీ సుబ్బారెడ్డి క్రీడా మైదానంలో వాకర్లకు ఆదివారం ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు కేవంత్ రెడ్డి, కార్యదర్శి ఆరి ప్రసాద్, కోశాధికారి మొగల్ ఖలీల్ బేగ్, గౌరవాధ్యక్షుడు మేకల నరేంద్రరెడ్డి పాల్గొన్నారు.

రూ.కోట్లు ఖర్చు.. నిర్వహిస్తే ఒట్టు!

సిగ్నల్ వ్యవస్థపై అధికారుల నిర్లక్ష్యం

న్యూస్‌టుడే, నెల్లూరు (నగరపాలకసంస్థ)

నగరంలో సిగ్నల్ వ్యవస్థ ఏర్పాటుచేస్తున్నాం.. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తాం.. ఇవీ నిన్నటి వరకు చెప్పిన మాటలు.. అన్నట్లుగాం సిగ్నళ్లు ఆర్భాటంగా ప్రారంభించారు. ఇవి ఆరంభశూరత్వంగా మారాయి. ఒకటీ రెండు రోజులు వెలిగాయి. ఆతరువాత మరిచిపోయారు. దీంతో ఎవరిష్టం వచ్చినట్లు వారు వెళుతున్నారు. నగరవాసికి ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు. ఇదీ నగరంలో రూ.1.40 కోట్లతో ఏర్పాటుచేసిన సిగ్నళ్ల కథ.

పది లక్షల మంది ఉన్న నగరంలో రోడ్ల విస్తరణ పేరుతో రూ.కోట్లు వెచ్చించారు. ప్రధాన కూడళ్లలో మాత్రం ఉదయం నుంచి రాత్రి వరకు వాహనాలు బారులుదీరి నిలిచిపోతున్నాయి. రద్దీ వేళల్లో గంటలకొద్దీ ట్రాఫిక్ దిగ్బంధంలో చిక్కుకుంటున్నారు. నగరంలో 50 వేల వరకు వాహనాలు ఉన్నట్లు అంచనా. వీటిలో సిటీ బస్సులు, ఆటోలు రెండు వేల వరకు రాకపోకలు సాగిస్తుంటాయి. వీటితో పాటు ద్విచక్రవాహనాలు, కార్లు, పాఠశాలలు, ఆర్టీసీ బస్సులు ఉన్నాయి. ఇవన్నీ క్రమపద్ధతిలో వెళ్లకపోవడంతో ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. దీనికి పరిష్కారంగా ప్రధాన కూడళ్లలో సిగ్నళ్లను ఏర్పాటుచేయగా.. వాటిని నిర్వహించడం లేదు.

అలంకారప్రాయంగా సిగ్నల్ లైట్లు

మూడు నెలలుగా నిరుపయోగం

నగరపాలకసంస్థ అధికారులు రూ.1.40 కోట్లతో ఏడు కూడళ్లలో అత్యాధునిక ట్రాఫిక్ సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేశారు. రామలింగాపురం, హరనాథపురం, వీఆర్సీ సెంటరు, కేవీఆర్ పెట్రోలు బంకు, కనకమహల్ సెంటరు, డీకేడబ్ల్యు కళాశాల, ఏసీ కూరగాయల మార్కెట్ ప్రాంతాల్లో నెలకొల్పారు. మంత్రి నారాయణ చేతుల మీదుగా ప్రారంభించారు. ఏర్పాటు చేసిన కూడళ్లలో ఆక్రమణలను తొలగించకుండా వినియోగంలోకి తెస్తే ఇబ్బందులు తలెత్తుతాయని పోలీసు శాఖ చెబుతోంది. నలువైపులా ఆక్రమణల కారణంగా ట్రాఫిక్ నిలిచిపోయే అవకాశం ఉందని, తాము నిర్వహణ చేయలేమని చేతులెత్తేశారు. 15 ఏళ్ల క్రితం రూ.25 లక్షలతో సిగ్నల్ లైట్లను ఏర్పాటుచేయగా.. రెండు శాఖల మధ్య సమన్వయలోపంతో పనికిరాకుండా పోయాయి. మళ్లీ రూ.1.40 కోట్లు వీటి పేరుతో వృథా చేశారు. ఇవి కూడా తుప్పు పట్టి పోయే ప్రమాదం ఉంది. పాలకులు, ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని వినియోగంలోకి తీసుకురావాలని నగరవాసులు కోరుతున్నారు.

శ్రీనివాసులురెడ్డి కుటుంబ సభ్యులకు ఎంపీ పరామర్శ

శ్రీనివాసులురెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు(నగరపాలక సంస్థ), న్యూస్‌టుడే: తెలుగుదేశం పార్టీ నాయకుడు, వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం మాజీ ఛైర్మన్ ఇందుపూరు శ్రీనివాసులురెడ్డి ఇటీవల మృతి చెందగా.. ఆయన కుటుంబ సభ్యులను ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పరామర్శించారు. ఆదివారం పొట్టేపాలెంలోని నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, నగర ఇన్‌ఛార్జి మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, నాయకులు కేతంరెడ్డి వినోద్‌రెడ్డి ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టబోతున్న ఈ-వే బిల్లుతో ఇబ్బందులు తలెత్తుతాయని నెల్లూరు బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఎంపీకి విన్నవించారు. నెల్లూరులోని ఎంపీ నివాసంలో కలిసి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఆ అసోసియేషన్ అధ్యక్షులు శాంతిలాల్ జైన్, కార్యదర్శి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. సాగర మిత్ర ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటేశ్వర్లు, లక్ష్మయ్య, స్వప్న, ఆశిత, లక్ష్మీ తదితరులు కలిసి తమ సమస్యలు పరిష్కారానికి ప్రయత్నించినందుకు ధన్యవాదాలు తెలిపారు.

గ్రామాల్లో ప్రశాంత వాతావరణం ఉండాలి: కోటంరెడ్డి

నెల్లూరు(నగరపాలకసంస్థ): గ్రామాల్లో ప్రశాంత వాతావరణం ఉండాలని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సూచించారు. ఆదివారం రూరల్ నియోజకవర్గ పరిధిలోని కొత్తవెల్లంటిలో రూ.2.17 కోట్లతో త్రీఫేజ్ విద్యుత్తు వ్యవస్థ, పాతవెల్లంటిలో రూ.40 లక్షలతో నిర్మించిన నూతన సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి తురిమెళ్ల లక్ష్మమ్మ, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయ ఇన్‌ఛార్జి దాట్ల చక్రవర్ధన్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు దేవసేనమ్మ, మండల పరిషత్ అధ్యక్షులు బూడిద విజయకుమార్, ఏఎంసీ ఛైర్మన్ మనుబోలు శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే కార్యాలయంలో తెదేపా నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి సమక్షంలో అక్కచెరువుపాడుకు చెందిన షేక్ మున్సూర్, గులామ్, పామిడి, ఇస్మాయిల్, ఉదయ్ తదితరులు తెదేపాలో చేరారు. పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

వీఆర్ కళాశాల ఎంతో నేర్పింది

నెల్లూరు (విద్య): వీఆర్ కళాశాల తనకు ఎంతో నేర్పిందని గ్రామీణ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని వీఆర్ కళాశాలలో 1983-86 పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందులో నేర్చుకున్న రాజకీయ పాఠాలు, పోరాటాలు నేడు జిల్లాలో ఉండే పెద్దపెద్ద రాజకీయ కుటుంబాలను ఎదిరించి నిలబెట్టాయని వివరించారు.

ఉత్సాహంగా రాష్ట్రస్థాయి జంప్‌రోప్ పోటీలు

కావలి, న్యూస్‌టుడే: జంప్‌రోప్ ఫెడరేషన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి సీనియర్ జంప్‌రోప్ పోటీలను ఆదివారం పట్టణంలోని డీబీఎస్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించారు. పదిహేను ఏళ్ల వయసు ఉన్న 150 మంది విద్యార్థులు పలు జిల్లాల నుంచి వచ్చారు. ఓవరాల్‌గా పోటీల్లో చిత్తూరు, నంద్యాల, నెల్లూరు జట్లు విజేతలుగా నిలిచాయి. ప్రతిభ చూపిన వారంతా ఈనెల 25, 26తేదీల్లో మహారాష్ట్రలో జరిగే జాతీయస్థాయి పోటీలకు హాజరుకానున్నట్లు తెలియజేశారు. కళాశాల కరస్పాండెంట్ దామిశెట్టి సుధీర్‌నాయుడు, ప్రిన్సిపల్ వీవీ రావు, జంప్‌రోప్ క్రీడాకారుల అసోసియేషన్ రాష్ట్రకార్యదర్శి సుబ్బయ్య, ఉపాధ్యక్షులు సాంబశివరావు, సంయుక్త కార్యదర్శి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

సౌత్‌జోన్ క్రికెట్ ఛాంపియన్‌గా నెల్లూరు

రెండో స్థానంలో కడప జట్టు

జాన్సన్ (90 పరుగులు)

సుచిత్‌రెడ్డి (నాలుగు వికెట్లు)

కడప క్రీడలు, న్యూస్‌టుడే : వైఎస్ఆర్ ఆర్-ఏసీఏ స్టేడియం, కేఎస్ఆర్ఎం క్రికెట్ మైదానాల్లో జరుగుతున్న ఏసీఏ సౌత్‌జోన్ అండర్-12 క్రికెట్ పోటీల్లో ఛాంపియన్‌గా నెల్లూరు జట్టు నిలిచింది. ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లోనూ నెల్లూరు జట్టు విజయాలను సాధించి 8 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. కడప జట్టు 2 మ్యాచ్‌లు గెలిచి 4 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది. మూడో స్థానంలో కర్నూలు, నాలుగో స్థానంలో చిత్తూరు, అయిదో స్థానంలో అనంతపురం జట్లు నిలిచాయి. టోర్నమెంట్ చివరి రోజు ఆదివారం కర్నూలుపై కడప, చిత్తూరుపై నెల్లూరు జట్లు విజయం సాధించాయి.

కేఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో జరిగిన మ్యాచ్‌లో చిత్తూరుపై నెల్లూరు జట్టు విజయం సాధించింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన నెల్లూరు జట్టు నిర్ణీత 35 ఓవర్లలో 8 వికెట్లకు 205 పరుగులు చేసింది. జాన్సన్ 90, శ్రీరామ్ 39 పరుగులు చేశారు. 206 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌ను ఆరంభించిన చిత్తూరు జట్టు నిర్ణీత 35 ఓవర్లలో 190 పరుగులకు ఆలౌట్ అయింది. నెల్లూరు బౌలర్లలో సుచిత్‌రెడ్డి 4, ఆయుష్, శ్రీరామ్ చెరో రెండు వికెట్లు తీసుకున్నారు. 15 పరుగుల తేడాతో గెలుపొందింది.

వేడుకగా అయ్యప్ప విగ్రహ ప్రతిష్ఠ

నెల్లూరు(మార్కెట్ సెంటర్), న్యూస్‌టుడే: నగరంలోని కస్తూర పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఆదివారం అయ్యప్ప స్వామి విగ్రహాన్ని వేడుకగా ప్రతిష్ఠించారు. శబరిగిరినాథ భక్త బృందం ఆధ్వర్యంలో విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహక అధ్యక్షుడు శేగు షణ్ముగరావు, శబరిగిరినాథ భక్త మండలి బృందం సభ్యులు పాల్గొన్నారు.

పూజలు చేస్తున్న అర్చకులు

కలెక్టర్‌ను కలిసిన జిల్లా రిజిస్ట్రార్

నెల్లూరు(మార్కెట్ సెంటర్), న్యూస్‌టుడే: జిల్లా రిజిస్ట్రార్‌గా బాధ్యతలు చేపట్టిన రవితేజ ఆదివారం మర్యాదపూర్వకంగా కలెక్టర్ హిమాన్షు శుక్లాను కలిశారు. పలు అంశాలను చర్చించారు. ఆయన వెంట ప్రకాశం జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రికి ఇద్దరి నేత్రదానం

నెల్లూరు(మార్కెట్ సెంటర్), న్యూస్‌టుడే: అనారోగ్యంతో మృతి చెందిన ఇద్దరు నేత్రదానం చేశారు. నగరంలోని హరనాథపురానికి చెందిన రూప్సీ, మనుబోలు మండలం పిడూరుపాలేనికి చెందిన వెంకటేష్ మృతి చెందారు. వీరి కుటుంబ సభ్యుల అంగీకారంతో ఆదివారం కార్నియా రికవరీ స్పెషలిస్ట్ డాక్టర్ సుష్మిత, సునీల్ నేత్రాలు సేకరించి ప్రభుత్వ ఆసుపత్రికి అందజేశారు.

రోడ్డుపై కొమ్మలు.. రాకపోకలకు ఇక్కట్లు

నగరంలోని సుజాతమ్మ కాలనీలో రోడ్డుపై చెట్ల కొమ్మలు అడ్డుగా ఉండడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వారం క్రితం స్థానికులు ఇళ్లలోని చెట్లను కొట్టి రోడ్డుపై వేశారు. నిత్యం వాహనాలతో రద్దీగా ఉంటుంది.

– న్యూస్‌టుడే, నెల్లూరు (టౌన్)

వెలగని వీధి దీపాలు



నగరంలోని 51వ డివిజన్ కపాడిపాలెంలో వీధి దీపాలు వెలగకపోవడంతో రాత్రిళ్లు అంధకారంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దండు వీధి, కమ్యూనిటీ హాల్ రోడ్లలో వారం రోజులుగా దీపాలు వెలుగడం లేదు.

–న్యూస్‌టుడే నెల్లూరు(ఏసీ నగర్),

ఇక్కడ జరభద్రం

నెల్లూరు నగరం నుంచి ముత్తుకూరు వెళ్లే రోడ్డులో ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధన స్థానం వద్ద రహదారిపై పెద్ద గుంత పడింది. దీనివల్ల వాహదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రి సమయంలో దగ్గరికి వచ్చే వరకు కనిపించక అధిక సంఖ్యలో ప్రమాదాలు జరుగుతున్నాయి. సంబంధిత అధికారులు వెంటనే రోడ్డుకు మరమ్మతులు చేయాలని నగర ప్రజలు కోరుతున్నారు.– న్యూస్‌టుడే, నెల్లూరు(పద్మావతిసెంటర్)

కాలువ అధ్వానం.. దుర్గంధభరితం

నగరంలోని పొగతోట కాంప్లెక్స్ రోడ్డులో కాలువ అధ్వానంగా తయారైంది. ఇక్కడ ఉన్న కాలువలు పూడికతో నిండిపోవడంతో మురుగునీరు ప్రవహించడం లేదు. దీంతో దుర్గంధం వెదజల్లుతోంది. పాదచారులు ముక్కులు మూసుకొని రాకపోకలు సాగిస్తున్నారు.

– న్యూస్‌టుడే, నెల్లూరు(ఏసీ నగర్)

ఆదమరిస్తే ఆసుపత్రికే!

నగరంలోని కరెంటు ఆఫీసు కూడలి జీఎన్టీ రోడ్డు నుంచి ఏకే నగర్ పోస్టాఫీసుకు వెళ్లే మార్గం అధ్వానంగా ఉండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వాటర్ ట్యాంకు సమీపంలో రోడ్డు మలుపు వద్ద కాలువపై స్లాబు లేనందున ఏమాత్రం ఆదమరిచినా ప్రమాదానికి గురయ్యే అవకాశాలున్నాయి.

– న్యూస్‌టుడే, నెల్లూరు (నవాబుపేట)

రుణం పేరుతో మోసం

నెల్లూరు (వేదాయపాలెం): రుణం పేరుతో మహిళను మోసగించిన వ్యక్తిపై వేదాయపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. ఇంటి రుణం ఇప్పిస్తానని పడారుపల్లిలో ఉంటున్న స్వప్నను అరుణకుమార్ అనే వ్యక్తి నమ్మించాడు. ఖర్చుల కోసం రూ.1.35 లక్షలు తీసుకుని లోన్ ఇప్పించకుండా మోసం చేశాడు. అతనిపై ఆదివారం బాధితురాలు వేదాయపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి వినతి

నెల్లూరు (విద్య): ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఆదివారం ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో శాసనమండలి సభ్యులు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డికి నాయకులు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు ఏ.సురేంద్రరెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను శాసనమండలిలో చర్చించి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుపోవాలని కోరారు. ప్రధాన కార్యదర్శి పిచ్చిబాబు, ఫెడరేషన్ బాధ్యులు పాల్గొన్నారు.

గరుడ వాహనంపై రంగడి విహారం

గరుడ వాహనంపై ఊరేగుతున్న రంగనాథుడు

నెల్లూరు(మార్కెట్ సెంటర్), న్యూస్‌టుడే: నగరంలోని రంగనాథస్వామి ఆలయంలో ఆదివారం గరుడోత్సవం వేడుకగా జరిగింది. ఫాల్గుణ పంచమిని పురస్కరించుకుని స్వామి వారికి గరుడ సేవ నిర్వహించారు. గరుడ వాహనంపై కొలువుదీరిన స్వామివారు పుర వీధుల్లో విహరించారు. భక్తులు హారతులిచ్చారు. కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాస్‌రెడ్డి, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

వైభవంగా భాగవత సప్తాహం

నెల్లూరు (మార్కెట్ సెంటర్): నగరంలోని బాలాజీ నగర్ సీతారామాంజనేయస్వామి ఆలయంలో ఆదివారం పద్య సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో భాగవత సప్తాహం జరిగింది. రచయిత వెంకటప్పయ్య కృష్ణార్జునులు, కుచేలుడి ఘట్టాలను తెలిపారు. కార్యక్రమంలో పద్య సారస్వత పరిషత్ సభ్యులు చంద్రశేఖరం, జయప్రకాష్, బలరామయ్య, ఆలయ కమిటీ అధ్యక్షుడు మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

సాయి మందిరంలో అఖండ పారాయణం

నెల్లూరు(మార్కెట్ సెంటర్), న్యూస్‌టుడే: నగరంలోని పద్మావతినగర్ సాయిదర్బార్ అద్దాల మందిరంలో ఆదివారం శ్రీసాయి అఖండ పారాయణ మహాయజ్ఞం వేడుకగా సాగింది. ఉదయం 8 నుంచి సాయంత్రం 6గంటల వరకు జరిగింది. 108 మంది భక్తులు పారాయణం చేశారు.

ఉచిత వైద్యశిబిరం

నెల్లూరు (విద్య) : జిల్లా నూర్‌బాషా ముస్లిం బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని భగత్‌సింగ్ కాలనీలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి గైనకాలజీ వైద్యురాలు పి.వినీలరెడ్డి మాట్లాడుతూ ఇటువంటి వైద్యశిబిరాలు పేదలకు ఉపయోగపడతాయని తెలిపారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు షేక్ ఖాదర్ బాషా, యూత్ అధ్యక్షులు సుభాన్‌బాషా, యూత్ ప్రధాన కార్యదర్శి అక్బర్ పాల్గొన్నారు.

గీతామయి వృద్ధాశ్రమంలో అన్నదానం

నెల్లూరు (మార్కెట్ సెంటర్): నగరంలోని బాలాజీనగర్‌లో గీతామయి వృద్ధాశ్రమంలో ఆదివారం వీఆర్సీ గ్రౌండ్ వాకర్స్ లాఫింగ్ క్లబ్ సభ్యులు అన్నదానం నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు బి.సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో వృద్ధాశ్రమంలో వస్త్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి రియాజ్ అహ్మద్, గౌరవాధ్యక్షుడు నన్నేసాహెబ్, ఉపాధ్యక్షుడు రఘుఆచారి, రమణారెడ్డి పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) నెల్లూరు, గ్రామీణం 80085 50332 80085 74001

సమస్య: నెల్లూరు నగరంలోని కోటమిట్ట మెక్లిన్స్ రోడ్డు పరిసర ప్రాంతాల్లో కుక్కలు అధికంగా ఉన్నాయి. రంజాన్ కావడంతో ముస్లింలు మసీదుకు వెళుతుంటారు. వీటితో ఇబ్బందులు పడుతున్నారు.– **అబ్దుల్ సలామ్**

సమాధానం: కుక్కలను పట్టించేందుకు చర్యలు చేపడతాం. – డాక్టర్ మదన్‌మోహన్, వెటర్నరీ అధికారి

? పొదలకూరు రోడ్డు డైకస్ రోడ్డు సెంటరు శాంతినగర్‌లో కాలువలు శుభ్రం చేయడం లేదు. మురుగునీరు నిలిచి దుర్వాసన వస్తోంది. – **రమణమ్మ, స్థానికురాలు**

✓ కాలువలను శుభ్రం చేయిస్తాం.

– **డాక్టర్ దినేష్, ఆరోగ్యాధికారి**

–న్యూస్‌టుడే, నెల్లూరు (నగరపాలకసంస్థ)

తెరపై ఈనాడు

ఎం.I సినిమాస్: స్క్రీన్.1. నవాబ్ కేఫ్(తెలుగు), బూకీ (తెలుగు) స్క్రీన్.2. హే బల్వన్త్(తెలుగు) స్క్రీన్.3. కపుల్ ఫ్రెండ్లీ(తెలుగు), ఫంకీ(తెలుగు) **స్పైస్.సినిమాస్:** స్క్రీన్.1. కపుల్ ఫ్రెండ్లీ(తెలుగు) స్క్రీన్.2. గోట్ 3డి(ఇంగ్లీషు) స్క్రీన్.3 ఫంకీ(తెలుగు) స్క్రీన్.4. నవాబ్ కేఫ్(తెలుగు), బూకీ(తెలుగు) స్క్రీన్.5. హే బల్వన్త్(తెలుగు) **రెయిన్ సినిమా:** స్క్రీన్.1. హే బలవంత్ (తెలుగు) స్క్రీన్.2. కపుల్ ఫ్రెండ్లీ(తెలుగు) స్క్రీన్.3. నవాబ్ కేఫ్(తెలుగు) స్క్రీన్.4. అల్ఫా మెన్ లవ్ వేంజన్స్ (తెలుగు), బూకీ(తెలుగు)

ఖాళీ స్థలం.. రోగాలకు మూలం..!

న్యూస్‌టుడే, నెల్లూరు(నగరపాలకసంస్థ)

నగరంలో ఖాళీ స్థలాలు విషసర్పాలకు ఆవాసాలుగా, దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారాయి. వాటి నిర్వహణను స్థల యజమానులు, నగరపాలకసంస్థ అధికారులు పూర్తిగా మరిచారు. ఫలితంగా మురుగునీరు, చెత్తకుప్పలు, కంపచెట్లతో దర్శనమిస్తున్నాయి. అందులోనే పందులు నివాసం ఏర్పాటు చేసుకున్నాయి. పరిసరాలు అపరిశుభ్రంగా మారి దుర్గంధాన్ని పంచుతున్నాయి. సమీపంలోనే నివాసం ఉన్న వారు అసౌకర్యానికి గురవుతున్నారు. అధికారులు దృష్టికి తీసుకెళ్లినా ఆ బాధ్యత మాదికాదని అంటున్నారు. స్థల యజమానులను గుర్తించి నోటీసులు ఇస్తామని చెప్పి పంపుతున్నారు. నగరంలోని ప్రతి డివిజన్‌లోనూ ఖాళీ స్థలాలు పదుల సంఖ్యలో ఉన్నాయి.

మన్సూర్‌నగర్‌లో ఖాళీ స్థలంలో పెరిగిన పిచ్చిమొక్కలు

స్థలాల యజమానులు, అధికారులు వీటిని వదిలేయడంతో డంపింగ్ యార్డులను తలపిస్తున్నాయి. ప్రజారోగ్య చట్టం ప్రకారం ఖాళీ స్థలాల యజమానులపై చర్యలు తీసుకునే అవకాశం ఉన్నా ఆ అధికారాన్ని అధికారులు వినియోగించడం లేదు. మన్సూర్‌నగర్‌లోని రహ్మాతీయా మసీదు ప్రాంతంలో ఖాళీ స్థలంలో పిచ్చిమొక్కలు మొలిచాయి. అక్కడ విషసర్పాలు తిరుగుతుండడంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ఆదివారం ఓ సర్పం రావడంతో పాములు పట్టే వారిని పిలిపించి పట్టించారు.

చట్టం ఏం చెబుతోంది: ● ఖాళీ స్థలాల వల ప్రజారోగ్యానికి, సాధారణ జన జీవనానికి ప్రమాదం వాటిల్లితే నగర, పుర ప్రణాళిక విభాగం ద్వారా ప్రాథమికంగా చర్యలు తీసుకుంటారు. ● స్థల యజమానులు స్పందించకపోతే నగర, పుర కమిషనర్ నోటీసులు జారీ చేస్తారు. ● కమిషనర్ తాఖీదులను నిర్లక్ష్యం చేస్తే సంస్థకు చెందిన స్టాండింగ్ కౌన్సిల్ (న్యాయవాది) ద్వారా నోటీసులు అందజేసి కోర్టులో కేసు నమోదు చేస్తారు. ఆరోపణలు రుజువైతే జైలు శిక్షతో పాటు జరిమానా కూడా విధించే అవకాశం ఉంది.

స్థల యజమానులు సహకరించాలి

– నందన్, కమిషనర్

స్థల యజమానులు పరిసరాల పరిశుభ్రత కోసం సహకరించాలి. ఖాళీ స్థలాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశాలు జారీ చేశాం. పరిస్థితిలో మార్పు రాకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

నీలగిరి సంఘం.. సమస్యల నిలయం

నీలగిరి సంఘంలో అధ్వానంగా ఉన్న రోడ్డు

నెల్లూరు(మార్కెట్ సెంటర్), న్యూస్‌టుడే: నగరంలోని బట్వాడిపాలెం సమీపంలో ఉన్న నీలగిరి సంఘంలో ప్రజలు సమస్యలతో సతమతమవుతున్నారు. నెక్లెస్‌రోడ్డు పక్కనే విస్తరించిన ఈ సంఘంలో రోడ్లు అధ్వానంగా మారాయి. ఇక్కడ ప్రధాన రోడ్లు రెండు, పలు అడ్డరోడ్లు ఉండగా అవి దారుణంగా తయారయ్యాయి. సిమెంట్ రోడ్లు అడ్డదిడ్డంగా పగిలి రాళ్లు తేలి దర్శనమిస్తున్నాయి. గోతులమయంగా ఉన్న రహదారులపై రాకపోకలకు స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. చిన్న రహదారులు కావడంతో సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఈ ప్రాంతంలో కాలువల్లో మురుగు పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది. మురుగునీరు ముందుకు కదలడం లేదు. కుళాయిల్లో వచ్చే తాగునీరు మురుగుగా వస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఈనీరు తాగలేక క్యాన్ వాటర్ కొనుగోలు చేసుకుంటున్నామని అంటున్నారు. వర్షాకాలంలో వీరి బాధలు వర్ణనాతీతంగా ఉంటున్నాయి. లోతట్టు ప్రాంతం కావడంతో ముంపునకు గురవుతోంది. భారీ వర్షం కురిస్తే నెక్లెస్ రోడ్డు కట్ట పక్కనే ఉన్న నివాసాల్లోకి నీరు చేరుతోంది. కట్టపై చెత్తాచెదారం పేరుకుపోయి, పిచ్చిమొక్కలు మొలవడంతో విష సర్పాలు సంచరిస్తున్నాయని స్థానికులు తెలిపారు. రాత్రి అయితే మందుబాబుల ఆగడాలు తట్టుకోలేకున్నామని వాపోతున్నారు. అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

నెల్లూరు (వేదాయపాలెం): రైల్వే పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన వైనమిది. నెల్లూరు రైల్వేస్టేషన్ నాలుగో ప్లాట్‌ఫారంపై 65 నుంచి 70 సంవత్సరాల మధ్య వయసు కలిగిన వ్యక్తి మృతి చెంది ఉండగా ఆదివారం ప్రయాణికులు గుర్తించారు. ఈసమాచారంతో రైల్వే పోలీసులు వచ్చి పరిశీలించారు. మృతుడి వద్ద ఆధారాలు లభ్యం కాలేదు. తెలుపు రంగు గీతల ఫుల్‌హ్యాండ్స్ షర్ట్, ఎరుపు రంగు అంచుతో ఉన్న గోధుమ రంగు పంచె, ఎరుపు రంగు బనియన్ ధరించి ఉన్నాడు. రైల్వే ఎస్సై హరిచందన కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డాక్ సేవక్‌లకు పురస్కారాలు

సీఎం చంద్రబాబు నుంచి పురస్కారం అందుకుంటున్న ఖాజావలి

గుంటూరు(ఏటీ అగ్రహారం): గుంటూరు నగర శివారులోని సత్యసాయి ఆధ్యాత్మిక నగరిలో ఆదివారం జాతీయ స్థాయి గ్రామీణ డాక్ సేవక్ సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా రాష్ట్రంలో ఉత్తమ పనితీరు కనబర్చిన గ్రామీణ డాక్ సేవక్‌లకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌లు పురస్కారాలు అందించి సత్కరించారు.

వేదాయపాలెం.. సౌకర్యాలు కనం

న్యూస్‌టుడే, నెల్లూరు(టౌన్)

నగరం శరవేగంగా విస్తరిస్తోంది. జనావాసాలు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో సుందరీకరణ పనులు చేపడుతున్నారు. ఇందుకు ఏటా లక్షల రూపాయలు ప్రజాధనం వెచ్చించి పచ్చదనంతో పాటు కూడళ్లను అభివృద్ధి చేస్తున్నారు. వాటి నిర్వహణను గాలికొదిలేస్తున్నారు. నగర వ్యాప్తంగా 22 కిలోమీటర్ల మేరకు డివైడర్లు ఉన్నాయి. అయ్యప్పగుడి, వేదాయపాలెం, ప్రభుత్వాసుపత్రి, వీఆర్సీ సెంటరు, మద్రాసు బస్టాండు తదితర ప్రాంతాల్లో 20 ట్రాఫిక్ ఐల్యాండ్లు ఉన్నాయి. వాటితో పాటు డివైడర్ల మధ్య పచ్చదనం పెంచారు. పలు ప్రాంతాల్లో పచ్చదనం హరించుకుపోయింది. నీరు పెట్టేందుకు ప్రత్యేకంగా సిబ్బంది, ట్యాంకర్లు ఉన్నా.. అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో పచ్చిక ఎండిపోయింది.

ఆచూకీ లేని సుందరీకరణ

నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని వేదాయపాలెంలో సుందరీకరణ పనులకు అడుగులు పడడం లేదు. రెండేళ్ల క్రితం డివైడర్ల మధ్య భారీగా పెరిగిన మొక్కలను కత్తిరించారు. అవి మరలా పచ్చదనంతో నిండుకున్నా. మధ్యలో పచ్చిక ఎండిపోయి అధ్వానంగా తయారైంది. జనాభా పెరిగినా.. సౌకర్యాలకు నోచుకోలేదు. జీఎన్టీ రోడ్డుపై మురుగునీరు ప్రవహిస్తోంది. చంద్రమౌళినగర్, వెంకటరెడ్డినగర్, గాంధీనగర్, అయ్యప్పగుడి, ఆటోనగర్, ఏకేనగర్ తదితర ప్రాంతాలు ఉన్నాయి. ఆటోనగర్, ఏకేనగర్‌లో కార్మికులు అధికంగా ఉన్నారు. ఈ ప్రాంతంలో అన్న క్యాంటీన్ ఏర్పాటు రైతుబజారుకు నోచుకోలేదు. కూరగాయల కోసం ఏసీ మార్కెట్‌కు రావాల్సి వస్తోంది. అధికారులు స్పందించి సౌకర్యాల కల్పనకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

న్యాయం చేయాలని బాధితుల ఆందోళన

నెల్లూరుగ్రామీణం, న్యూస్‌టుడే: నెల్లూరు రూరల్ మండలంలోని పాత వెల్లంటి రోడ్డు మర్రిచెట్టు దగ్గర దుకాణాలను కూల్చివేసిన ఘటనలో బాధితులను ఆదుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి పూడిపర్తి జనార్దన్ ఆధ్వర్యంలో బాధితులు, గ్రామస్థులు ఆదివారం సంఘటనా స్థలంలో ఆందోళన చేశారు. ఆ సమయంలో అటుగా రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి రాగా.. తమకు జరిగిన అన్యాయాన్ని నాయకులు వివరించారు. పూర్తిస్థాయిలో విచారణ చేయాలని తహసీల్దార్‌ని ఆదేశిస్తానని, న్యాయం జరిగేలా చూస్తానని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ నాయకులు ఆలూరు తిరుపాలు, మండల కమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న బాధితులు

(c) eenadu

ఈనాడు
శ్రీ సత్యసాయి

సోమవారం ఫిబ్రవరి 23, 2026

ఇంటర్మీడియట్ పరీక్షలకు
సర్వం సిద్ధం

➡ నేటి నుంచి మార్చి 24 వరకు నిర్వహణ

జిల్లా:	శ్రీసత్యసాయి
ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు:	113
ప్రథమ ఇంటర్ విద్యార్థులు:	11,737
ద్వితీయ ఇంటర్:	12,115
పరీక్షా కేంద్రాలు:	42

కొత్తచెరువు, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయి జిల్లాలో నేటి నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు నిర్వహించనున్నారు. ఇందుకోసం అధికారులు సర్వం సిద్ధం చేశారు. సోమవారం ఉదయం 9 గంటలకు పరీక్ష ప్రారంభమై మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతుంది. అరగంట ముందుగానే విద్యార్థులు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలి. ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించమని అధికారులు పేర్కొంటున్నారు.

● కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్తు, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించారు. గాలి, వెలుతురు ఉండేలా తగు ఏర్పాట్లు చేశారు. విద్యార్థులకు అత్యవసర సమయాల్లో చికిత్స కోసం వైద్య సిబ్బందిని నియమించారు.

భద్రత కట్టుదిట్టం

జిల్లాలోని 42 పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. పరీక్ష నిర్వహించే తరగతి గదులు, కళాశాల ప్రవేశం, పరిసరాల్లో కెమెరాలతో నిఘా ఉంటుంది. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. రెండంచెల తనిఖీ మేరకు హాల్ టికెట్లు ఉన్న విద్యార్థులను మాత్రమే కేంద్రంలోకి అనుమతిస్తారు. మొబైల్ ఫోన్లు, చేతి గడియారాలు, ఎలక్ట్రానిక్ పరికరాలు, క్యాలిక్యులేటర్లు అనుమతించరు. మాస్‌కాపీయింగ్‌కు పాల్పడకుండా రెండు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, నాలుగు సిట్టింగ్ స్క్వాడ్‌లతో పాటు జిల్లా పరీక్షల మండలి సభ్యులు, నోడల్ అధికారి పరీక్షలను పర్యవేక్షించనున్నారు.

అన్ని ఏర్పాట్లు చేశాం - చెన్నకేశవ ప్రసాద్, డీఐఈవో

ఇంటర్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. విద్యార్థులు అరగంట ముందుగానే హాల్ టికెట్‌తో పరీక్షా కేంద్రానికి చేరుకోవాలి. పరీక్షా కేంద్రంలో ఇన్విజిలేటర్ అందించే ఓఎంఆర్ షీటులో ప్రతి విద్యార్థి నమోదు చేసిన వ్యక్తిగత వివరాలను ఒకటికి రెండు సార్లు సరి చూసుకోవాలి. పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించడానికి ప్రతిఒక్కరూ సహకరించాలి.

ఘనంగా చైనీస్ నూతన సంవత్సర వేడుకలు

పుట్టపర్తి, న్యూస్‌టుడే: పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయంలో చైనీస్ నూతన సంవత్సర వేడుకలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. సాయి సన్నిధిలో ఏటా చైనీస్ వేడుకలు నిర్వహించడం ఆనవాయితీ. ఈ వేడుకలను సత్యసాయి ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రశాంతి నిలయాన్ని భక్తులు చైనీస్ సంప్రదాయం ఉట్టిపడేలా అలంకరించారు. విద్యుత్తు లాంతర్లు, చైనీస్ దీపాలు ఏర్పాటు చేశారు. సత్యసాయిని కీర్తిస్తూ భక్తులు సంగీత విభావరి నిర్వహించారు. రెండు రోజులపాటు జరిగే ఈ వేడుకల్లో పాల్గొనేందుకు వివిధ దేశాలకు చెందిన భక్తులు విశేష సంఖ్యలో తరలి రావడంతో మందిరం పరిసరాలు కిటకిటలాడుతున్నాయి. భక్తులు బారులుదీరి బాబా మహాసమాధిని దర్శించుకున్నారు.

వేడుకలను ప్రారంభిస్తున్న ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్

రాలుతున్న పూత..
రైతుల్లో గుబులు

■ మామిడిని వెంటాడుతున్న వాతావరణ పరిస్థితులు

ఉమ్మడి జిల్లాలో మామిడి సాగు ఇలా..

విస్తీర్ణం : 85,026 ఎకరాలు
రకాలు : బెంగళూరు (తోతపూరి), బేనీషా, నీలం, అల్ఫాన్సా, సోనా రేఖ, మల్లిక, చిన్న, పెద్ద రసాలు
ఎగుమతి : ప్రధాన మెట్రో నగరాలైన బెంగళూరు, హైదరాబాద్, దిల్లీ, చెన్నై

ఉష్ణోగ్రత 50 డిగ్రీలు అంచనా

● శివరాత్రి దాటిన తర్వాత రాత్రి, పగలు ఉష్ణోగ్రతలు పెరిగాయి. జిల్లాలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 35 డిగ్రీలు దాటింది. ఈసారి మార్చిలో 50 డిగ్రీలు నమోదు కావచ్చని వాతావరణశాఖ తెలిపింది. వేడిమికి పూత మాడిపోయి నల్లగా మారి రాలడం ఇప్పటి నుంచే మొదలు కావడంతో ఆందోళన నెలకొంది.

అనంతపురం (వ్యవసాయం), న్యూస్‌టుడే : జిల్లాలో ఈ ఏడాది భారీ స్థాయిలో మామిడి పూత పట్టింది. అదంతా కాయ కాస్తే చెట్టు నిలబడుతుందా? అన్న అనుమానం రైతుల్లో వ్యక్తమవుతోంది. డిసెంబరులోనే పూత వస్తే ఏప్రిల్‌లో పంటకోతకు వచ్చేది. ఏప్రిల్, మే, జూన్ మొత్తం అమ్మకాలు సాగేవి. అయితే ఈసారి అలా జరగలేదు. ఫిబ్రవరిలో పూత పట్టింది. జూన్ నెలాఖరుకు పంట కోత మొదలవుతుంది. ఈ వెంటనే వర్షాలు, తెగుళ్లు ఉంటాయి. ఈ పరిస్థితి రైతుల్లో ఆందోళన పెంచుతోంది.

విరబూసిన మామిడి పూత

● చెట్లకు పూతను చూసిన వ్యాపారులు కొందరు ముందుస్తుగా మామిడి తోపులు కొనుగోలు చేశారు. వేలాది రూపాయలు వెచ్చించి సస్యరక్షణ చర్యలు చేపట్టారు. రాలుతున్న పూత చూసి వ్యాపారులు దిగాలు చెందుతున్నారు. కొందరు రైతులు మామిడి తోటలు విక్రయించకుండా సంరక్షించుకుంటూ యాజమాన్య పద్ధతులు ఆచరిస్తూ పంట నిలుపుకొంటున్నారు.

సస్యరక్షణ ముఖ్యం..

దిగుబడులపై మామిడి రైతులు దిగాలు చెందాల్సిన పనిలేదు. ఈ ఏడాది పూత రావడం ఆలస్యమైంది. అంతే.. గతేడాది నవంబరు, డిసెంబరు నెలల్లో భూమిలో తేమ శాతం అధికంగా ఉండడం, చలి తీవ్రత, పొగమంచు అధికంగా ఉండటం వంటి పరిస్థితులు ఎదురయ్యాయి. భూమిలో అధిక తేమ శాతం కారణంగా పూత ఆలస్యమైంది. ఇపుడు వేడి పెరగ్గానే తెగుళ్ల తీవ్రత తగ్గి, వేడికి పూత రాలుతోంది. ఇది సాధారణమే. వంద పూవుల్లో 2 శాతం పూత, కాయ నిలిచినా ఎకరాకు 3-4 టన్నులు దిగుబడి వస్తోంది. ఉన్న పూతను కాపాడుకునేలా సస్యరక్షణ చర్యలు చేపట్టడంపై దృష్టి పెట్టాలి.

\- ఉమాదేవి,
ఉప సంచాలకులు (ఉద్యానశాఖ)

ఉచిత న్యాయ సహాయంపై సందేహాలున్నాయా?

ఈనాడు మీ తోడు

అనంతపురం (మూడోరోడ్డు), న్యూస్‌టుడే: ఉచిత న్యాయ సహాయం పొందటంపై ఏవైనా సందేహాలున్నాయా? తగిన సలహాలు, సూచనలు ఆశిస్తున్నారా? నివృత్తికి 'ఈనాడు' అవకాశం కల్పిస్తోంది. జిల్లా న్యాయసేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) అందించే సేవలకు పాఠకులకు తెలియజెప్పే కార్యక్రమాన్ని రూపొందించింది. ఉచిత న్యాయ సహాయంపై సందేహాలకు డీఎల్ఎస్ఏ కార్యదర్శి, న్యాయమూర్తి ఎన్. రాజశేఖర్ సమాధానాలు ఇస్తారు. పాఠకులు తమ సందేహాలను ఫోన్ చేసి తెలుసుకోవచ్చు. మహిళలు, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, సంవత్సర వార్షిక ఆదాయం రూ.3 లక్షల్లోపు ఉన్న వారికి డీఎల్ఎస్ఏ ఉచిత న్యాయ సహాయం అందిస్తుంది. జాతీయ విపత్తుల బాధితులు, ఇతర పీడిత వర్గాల వర్గాల ప్రజలు తమకు ఉన్న సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు.

● తేది: 23-02-2026 (సోమవారం)
● సమయం: ఉదయం 11 నుంచి 12 గంటలలోపు

ఫోన్ చేయాల్సిన నంబరు:
94409 01044

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నేడు

పుట్టపర్తి, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయి జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. జిల్లాలోని మున్సిపాలిటీ, మండల కేంద్రాల్లోనూ సంబంధిత అధికారులు వినతులు స్వీకరిస్తారని పేర్కొన్నారు.

● జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం యథావిధిగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందని ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు ఎస్పీ పేర్కొన్నారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (సా॥)	సహర్ (ఉ॥)
హిందూపురం	6.30	5.25
కదిరి	6.27	5.21
ధర్మవరం	6.32	5.21

నిరుద్యోగ యువకులకు ఉద్యోగ భరోసా!

అనంతపురం (అశోక్‌నగర్), న్యూస్‌టుడే: పదోతరగతి ఉత్తీర్ణత ఆపైన చదివినా ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగానికి ఎంపిక చేస్తారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలోని యువకులు అవకాశాన్ని వినియోగించుకోవచ్చు. ఏవైనా సందేహాలు ఉంటే ఫోన్ నంబరు 89850 91256ను సంప్రదించాలని డీఆర్‌డీఏ పీడీ శైలజ తెలిపారు.

ఉద్యోగం పొందే కంపెనీ ఏదంటే: పేటీఎం
మీరు చేసే ఉద్యోగం పేరు: ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, టీం లీడరు
ఎంత వయసు ఉండాలంటే: 19 నుంచి 35 సంవత్సరాల్లోపు
వేతనం ఎంతిస్తారంటే: రూ.16,500 నుంచి రూ.21 వేలు (ఈఎస్ఐ, పీఎఫ్, ఇన్సెంటివ్, మెడికల్ ఇన్సూరెన్సు అదనం)
ఉద్యోగం చేసే ప్రాంతాలు: అనంతపురం, రాయదుర్గం, తాడిపత్రి, గుంతకల్లు, గుత్తి, కళ్యాణదుర్గం, కదిరి, హిందూపురం, ధర్మవరం, మడకశిర
ఇవి తప్పని సరి: డ్రైవింగ్ లైసెన్సు, బైకు
ఇంటర్వ్యూ ఎక్కడ, ఎప్పుడంటే: రాప్తాడు పంగల్ రోడ్డు వద్ద టీటీడీసీలో.. 24.2.2026

విపణి సూత్రం.. తరుణీ మంత్రం

■ సొంత వ్యాపారంలో రాణిస్తూ ప్రేరణ ■ లక్షలాది రూపాయల టర్నోవర్

హిందూపురం పట్టణం, న్యూస్‌టుడే: ప్రభుత్వాలు, బ్యాంకులు అందిస్తున్న ఊతాన్ని అందిపుచ్చుకొని, స్వయం ఉపాధికి బాటలు పరుచుకొంటున్నారు. తమ కుటుంబాలకే కాకుండా, మరికొందరికి బతుకుదెరువు చూపుతున్నారు. ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకొని ఆన్‌లైన్ విపణిలోని తమ ఉత్పత్తులను విక్రయించుకొంటున్నారు. లక్షలాది రూపాయలు టర్నోవర్ చేస్తూ, అందరినీ అబ్బురపరుస్తున్నారు. తమలాంటి వారికి ప్రేరణగా నిలుస్తున్నారు. వారి ప్రతిభకు గుర్తింపుగా ప్రభుత్వం నుంచి రూ.50 వేలు నగదు బహుమతులను, ప్రశంసాపత్రాలను అందుకొన్నారు.

స్వప్నం.. సాకారం

పట్టణంలోని కోట ప్రాంతానికి చెందిన **స్వప్న** చదువులో ప్రతిభావంతురాలు. డిగ్రీ పూర్తి చేసి, ప్రభుత్వ ఉద్యోగాన్ని తెచ్చుకోవాలని కలలు కన్నారు. కానీ, కుటుంబ పరిస్థితులు ఆమె లక్ష్యాన్ని వెనుక్కు లాగాయి. అంతలోనే పెళ్లి, పిల్లలు.

భర్త సంపాదనతోనే కుటుంబం రాణించడం కష్టమని గుర్తించింది. ఆమె అత్త, మామలు బజ్జీలు, పెరుగు వడ అమ్మే చిరు వ్యాపారం చేసేవారు. డ్వాక్రా సభ్యురాలిగా సంఘంలో రూ.10 వేలు రుణం తీసుకొని తమ వారసత్వ వ్యాపారంలోకి శ్రీ సాయి కృపా కాండిమెంట్సు పేరుతో అడుగు పెట్టింది. వ్యాపార విస్తరణ కోసం బ్యాంక్‌ల్లో రూ.50 వేలు, రూ.లక్ష, రూ.2 లక్షలు ఇలా రుణాలు తీసుకొంది. సక్రమంగా చెల్లిస్తుండటంతో బ్యాంకులు ఆమెకు ప్రస్తుతం రూ.10 లక్షల రుణం ఇచ్చాయి. వ్యాపారంలో పోటీ ఎక్కువగా ఉన్నా, ఏటా లక్షలాది రూపాయలు టర్నోవర్ సాధిస్తున్నారు. 10 మందికి ఉపాధి కల్పిస్తున్నారు.

దిగులు చెందక.. ముందడుగు..

పట్టణంలోని శ్రీకంఠపురానికి చెందిన **సుజాత** చదువు రాకపోయినా, సొంత కాళ్లపై నిలబడేందుకు ఏదో ఒక నైపుణ్యాన్ని నేర్చుకోవాలని తపించింది. ఆమెకు టైలరింగ్‌లో, వస్త్రాల విక్రయంలో మెలకువలు నేర్చుకున్నారు. పెళ్లి తరువాత టైలరింగ్‌తో ఎదగడం సాధ్యం కాదని, గుర్తించి, పూర్తిగా చీరల విక్రయంపైనే దృష్టిసారించారు. డ్వాక్రా సంఘంలో రూ.2 లక్షలు రుణం తీసుకొని, తన ఇంటిలోనే ఓ భాగాన్ని దుకాణంగా మార్చుకొని, ఓం శక్తి శారీస్ పేరుతో దుకాణాన్ని నడుపుతున్నారు. కాటన్, పట్టు చీరలు, ఉప్పాడ, గద్వాల్ చీరలు, స్మూత్ శారీస్... ఇలా అన్ని రకాల చీరలను విజయవాడ, బెంగళూరు, సూరత్ నుంచి నేరుగా దిగుమతి చేసుకుంటున్నారు. వాటిని విక్రయిస్తూ లక్షలాది రూపాయల టర్నోవర్ సాధిస్తున్నారు. ఆమెతోపాటు మరో ఐదుగురు తన దుకాణంలో పని చేస్తున్నారు.

మెరిసిన బాలలు.. మోమున నవ్వులు

గ్రామీణ నేపథ్య సాంస్కృతిక కార్యక్రమాలకు పిల్లల పండగ 'అనంత బాలోత్సవం వేదికైంది. విద్యార్థులు తమ అంతర్లీన, సృజనాత్మకతకు పదును పెట్టి ఆలోచింపజేసే పరిశోధనలు, ప్రయోగాలు చేసి అబ్బురపరిచారు. జాతీయ నాయకులు, దేవతలు, సైనికులు, పోలీసులు, పోరాట యోధుల వేషధారణల్లో చిన్నారులు ప్రతిభ చాటారు. విద్యార్థులు చేసిన గిరిజన, జానపద సంప్రదాయ నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

\- న్యూస్‌టుడే, ఆజాద్‌నగర్ (అనంతపురం)

పాడి రైతులకు సర్కారు అండ

ఆధునిక హంగులతో పశువుల హాస్టళ్లు

ధర్మవరం గ్రామీణం, న్యూస్‌టుడే: వ్యవసాయంతోపాటు పాడిని నమ్ముకున్న రైతులకు తీపి కబురు. పశువుల పోషణ భారమై, సరైన వసతులు లేక ఇబ్బంది పడుతున్న రైతులకు ఊరటనిస్తూ ప్రభుత్వం 'కమ్యూనిటీ అనిమల్ హాస్టళ్లు' (పశువులశాల) పథకానికి శ్రీకారం చుట్టింది. శ్రీసత్యసాయి జిల్లా వ్యాప్తంగా ఐదు యూనిట్లను మంజూరు చేస్తూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. దీంతో పచ్చని గ్రాసంతోపాటు పుష్కలమైన పాలు లభించనున్నాయి. పశువులశాల నిర్మాణాలు పూర్తయితే పాడిపరిశ్రమపై ఆధారపడిన వేలాదిమంది రైతులకు మేలు చేకూరనుంది.

జిల్లా :	శ్రీ సత్యసాయి
మంజూరైన యూనిట్లు :	5
నిర్మాణ వ్యయం :	రూ.50 లక్షలు
సామర్థ్యం :	షెడ్డుకి 20 పశువులు
ఆవులు, ఎద్దుల సంఖ్య:	2.95 లక్షలు
గేదెలు:	95 వేలు
జీవాలు:	36 నుంచి 37 లక్షలు

జిల్లాలో ప్రాధాన్య క్రమంగా ధర్మవరం, ముదిగుబ్బ, పరిగి, సోమందేపల్లి, అమరాపురంలో పశువుల హాస్టళ్లను నిర్మించనున్నారు. ఒక్కోదానికి రూ.10 లక్షలు వ్యయం చేయనున్నారు. 50 సెంట్ల విస్తీర్ణంలో నిర్మించే ఈ షెడ్లలో ఒకేసారి 20 పశువులు ఆశ్రయం పొందేలా ప్రణాళిక సిద్ధం చేశారు. ఉపాధి హామీ పథకం ద్వారా భవన నిర్మాణాలు చేపట్టనున్నారు. ఇప్పటికే ఆయా మండలాల్లో ప్రభుత్వ భూములను పరిశీలించారు. తెలంగాణలో ఇప్పటికే కొనసాగుతున్న ఈ విధానాన్ని ఇప్పుడు రాష్ట్రంలో పక్కాగా అమలు చేసేందుకు సిద్ధమయ్యారు.

★ పశువుల గ్రాసం కొరత తీర్చేందుకు ప్రభుత్వం హాస్టళ్ల సమీపంలోని ప్రభుత్వ స్థలాల్లో సుమారు ఎకరా విస్తీర్ణంలో నేపియర్ గడ్డిని సాగు చేసేందుకు రైతులకు అవకాశం కల్పించనుంది. ఇందుకోసం ఎకరాకు రూ.33 వేలు రాయితీ కూడా అందజేస్తుంది. తద్వారా పశువులకు పోషక విలువలతో కూడిన మేత తక్కువ ధరకే లభించే అవకాశం ఉంది.

అన్ని సౌకర్యాలతో షెడ్లు నిర్మిస్తాం

\- శుభదాసు, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి

ఎండా, వానకు పశువులు బయట ఉండి రోగాల బారిన పడకుండా కమ్యూనిటీ అనిమల్ హాస్టళ్లను అన్ని సౌకర్యాలతో నిర్మిస్తాం. మార్చి తర్వాత పనులు ప్రారంభమయ్యేలా ఇప్పటికే గ్రామాల్లో స్థల పరిశీలన చేస్తున్నాం. హాస్టళ్లు అందుబాటులోకి వస్తే ఆర్థిక స్థోమత లేని ఎంతోమంది పాడి రైతులకు మేలు జరుగుతుంది.

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక

మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి

పూర్తి వివరములకు: 8008709784

బంధం దూరమై.. గుండె బరువై..

రక్తసంబంధాలు, ఆత్మీయతలు, మృత్యుబాధలు, రోదనలు మనుషులకే ఉంటాయనుకుంటే పొరపాటే. ప్రతి జీవిలోనూ ఈ చలించే తత్వం ఉంటుంది. అది ఒక్కసారిగా పెల్లుబికినపుడే మనకు కనిపిస్తాయి. అలాంటి వేదనే ఈ కుక్కపిల్లది. తనతో కలిసి మెలిసి పెరిగి.. అకస్మాత్తుగా చనిపోయిన తోటి పిల్లను చూసినపుడు శోకం తన్నుకు వచ్చింది. తాకుతూ, ముఖంపై రుద్దుతూ, అది కదలకుండా ఉండటం చూసి గట్టిగా అరుస్తూ వేదన వ్యక్తపరిచింది. దీన్ని చూసిన స్థానికులు.. కుక్కపిల్ల బాధాతప్త హృదయాన్ని అర్థం చేసుకున్నారు. గుడిబండ మండలం గుడిబండ - పళారం రోడ్డులో మరువ నీరు ప్రవహించే కాజ్‌వే వద్ద ఆదివారం సాయంత్రం కుక్కపిల్ల మృతి చెందిన సమయంలో తోటి కుక్కపిల్ల మూగరోదన దృశ్యమిది..

\- న్యూస్‌టుడే, గుడిబండ

అంత్యక్రియలు

జననం 01-06-1947

మరణం 13-01-2026

కీ॥శే॥ డా॥ చందమూరి నరసింహారెడ్డి గారు
(Dr. C N Reddy) M.Sc (Ag) Ph.D.,
Chemtex Environmental Laboratories, Texas, USA.
తల్లిదండ్రులు: స్వర్గీయ C.ఆదిలక్ష్మమ్మ & స్వర్గీయ C.బాబిరెడ్డి
జవుకులదిన్నె, గోరంట్ల మండలం, శ్రీ సత్యసాయి జిల్లా

శ్రీ సత్యసాయి జిల్లా, గోరంట్ల మండలం, జవుకులదిన్నె వాసి డా॥ సి.ఎన్.రెడ్డి గారు 1974 నందు USA వెళ్ళి అక్కడే స్థిరపడి.Texas నందు Chemtex సంస్థలు స్థాపించి వేల కుటుంబాలకు ఉపాధికల్పించి ఎంతో పేరు ప్రఖ్యాతలు గడించిన నా... దేహం నా మాతృభూమిలోనే కలవాలనే వారి సంకల్పం మేరకు వారి పార్థివదేహానికి అంత్యక్రియలు 24-02-2026వ తేది మంగళవారం ఉదయం 9.00 నుండి 10.00లోపు గోరంట్ల మండలం జవుకులదిన్నె గ్రామంలో జరుగును.
దైవ సన్నిధికి చేరినవారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ..

భార్య: శ్రీమతి డా॥ నాగరత్నారెడ్డి USA
కుమారుడు: బాబి స్వరూప్‌రెడ్డి చందమూరి USA, కుమార్తె: స్వప్న రెడ్డి చందమూరి USA
సోదరులు: సి.గోవిందరెడ్డి, సి.గోపాల్‌రెడ్డి, సి.నర్శిరెడ్డి USA, సి.రామచంద్రారెడ్డి USA
మరియు చందమూరి వారి కుటుంబ సభ్యులు
జవుకులదిన్నె, గోరంట్ల మండలం, శ్రీ సత్యసాయి జిల్లా
Cell: 9573133480, 9440930298

వైకుంఠ సమారాధన: 26-02-2026వ తేది గురువారం మధ్యాహ్నం 12.00 గం॥లకు జవుకులదిన్నె గ్రామంలో జరుగును.

రాజకీయాల కోసం హిందూమతాన్ని కించపరుస్తారా?

జగన్‌పై ఎన్డీయే కూటమి నేతల ధ్వజం

మాట్లాడుతున్న అధ్యక్షుడు పూలనాగరాజు, వరుణ్, సురేంద్రబాబు, శ్రీధర్‌చౌదరి, రాజేష్, తదితరులు

రాంనగర్ (అనంతపురం), న్యూస్‌టుడే: దేవుడంటే భక్తిలేదు. హిందువుల మనోభావాలంటే గౌరవం లేదు. అధికారంలో ఉన్నప్పుడు హిందూ ధర్మాన్ని అవమానించి, ఇప్పుడు రాజకీయ ప్రయోజనాల కోసం దేవుడినే వాడుకుంటూ కించపరుస్తారా? అంటూ ఎన్డీయే కూటమి నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం జిల్లా తెదేపా కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పూలనాగరాజు అధ్యక్షతన మీడియా సమావేశం నిర్వహించారు. జనసేన అధ్యక్షుడు వరుణ్, భాజపా అధ్యక్షుడు రాజేశ్, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే సురేంద్రబాబు, ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌చౌదరి, మాజీ గ్రంథాలయం జిల్లా అధ్యక్షుడు గౌస్‌మొద్దీన్, తదితరులతో కలిసి పూలనాగరాజు మాట్లాడుతూ.. రాష్ట్రంలో అభివృద్ధి చూసి ఓర్వలేక వైకాపా నాయకులు పిచ్చి పట్టి మాట్లాడుతున్నారని ప్రజలు బుద్ధి చెప్పినా వారి తీరు మారలేదని మండిపడ్డారు. శాసనమండలిలో కల్తీ నెయ్యి వ్యవహారాన్ని తప్పుదోవ పట్టించడానికే లేనిపోనివి మాట్లాడటం వారికే చెల్లుతోందన్నారు. శాసన మండలిలో జగన్ దర్శకత్వంలో వైకాపా సభ్యులు వికృతంగా ప్రవర్తించడం నీచ రాజకీయాలకు నిదర్శనమని దుయ్యబట్టారు.

రాష్ట్రస్థాయి శాప్ లీగ్ చెస్‌లో జిల్లాకు రెండు స్వర్ణాలు

శామ్యూల్ స్టీఫెన్ నోబుల్ యశస్విని సహృద్

అనంతపురం క్రీడలు: తిరుపతిలో ఆదివారం ముగిసిన రాష్ట్రస్థాయి శాప్ లీగ్ చదరంగం పోటీల్లో జిల్లా క్రీడాకారులు పరిమళించారు. ఎత్తులకు పైఎత్తులతో ప్రత్యర్థులను చిత్తుచేసి ప్రథములుగా నిలిచారు. రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లాకు మూడు ట్రోఫీలు రావడం గమనార్హం. చెస్‌లో దూసుకుపోతూ అంతర్జాతీయ పోటీల్లో మెరిపిస్తున్న శామ్యూల్ స్టీఫెన్ నోబుల్ అండర్-15 విభాగం టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు. చక్కటి ఆటతీరుతో ప్రత్యర్థులు అవలీలగా ఓడించి ట్రోఫీని కైవసం చేసుకున్నాడు. అండర్-13 బాలుర విభాగంలో ఎంపీ సహృద్ ద్వితీయ స్థానం సాధించాడు. త్రుటిలో ప్రథమస్థానం చేజారింది. అండర్-13 బాలికల విభాగం టైటిల్‌ను ఎ.యశస్విని సొంతం చేసుకుంది. ఈమె ప్రత్యర్థులను చిత్తుచేసి రాష్ట్రస్థాయిలో ప్రథమస్థానం సాధించింది. రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లాకు మూడు పతకాలు రావడం పట్ల డీఎస్‌డీఓ ఎస్‌ఎం మంజుల హర్షం వ్యక్తం చేశారు.

అనుకూల మార్పులు.. మెరుగైన మార్కులు

అనంతపురం (వైద్యం), న్యూస్‌టుడే: ఏడాది మొత్తం చదివింది ఒక ఎత్తైతే పరీక్షల సమయంలో చదవటం మరో ఎత్తు.. పరీక్షలు ప్రారంభమవుతాయంటేనే విద్యార్థుల్లో ఒకింత భయం పుడుతుంది. ఈ సమయంలో తెలివైన విద్యార్థులు సైతం ఒత్తిడికి లోనవుతుంటారు. పరీక్షలు ఎలా రాస్తామో. . మంచి మార్కులు వస్తాయో లేదోనన్న బెంగ సహజం. ఈ కారణాలతో కొందరు

పరీక్షల వేళ తిండి, నిద్ర ముఖ్యం

విద్యార్థులు తినరు. కంటి నిండి నిద్రపోరు. ఈ ధోరణి ఏ మాత్రం ఆరోగ్యానికి మంచిది కాదని ఆహార నిపుణులు చెబుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో విద్యార్థుల వివరాలిలా	
పదోతరగతి	: 54,182
ఇంటర్	: 65,121
ఒకేషనల్	: 6,877

ఇలా చేయండి..

● జాగ్రత్తలు : పరీక్షల సమయంలో తిండి, నిద్ర విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని తగినంత ఆహారం, కంటి నిండా నిద్రపోవాలి. అప్పుడే మెదడు చురుగ్గా పనిచేస్తుంది. పాఠ్యాంశాలను గుర్తించుకోవాలంటే భయాన్ని వీడి మళ్లీ మళ్లీ మననం చేయడం ముఖ్యం.

● తినాల్సినవి : తేలిగ్గా జీర్ణమయ్యే ఆహారం తీసుకోవాలి. అల్పాహారం తినకుండా ఉండకూడదు. మాంసాహారం, నూనెతో చేసిన పదార్థాలు తక్కువగా తీసుకోవాలి. అన్నం తక్కువ మోతాదులో తీసుకుంటూ పప్పుధాన్యాలు, సోయాగింజలు, పెరుగు, పాల పదార్థాలు ఆహారంలో భాగం చేసుకోవాలి. జొన్న, సజ్జ, గోధుమ, రొట్టెలు తీసుకుంటే మంచిది. ఆకుకూరలు, రాగిజావ, నువ్వులు, బాదం, ఉసిరికాయలు కూడా తినొచ్చు. నీరు ఎక్కువ మోతాదులో తీసుకోవాలి. నిమ్మకాయ, గ్లూకోజ్, పండ్ల రసాలు తీసుకోవచ్చు.

● దూరం పెట్టండి : చిప్స్, శీతల పానీయాలు, తీపి పదార్థాలను ఎక్కువగా తింటే నిద్ర ఎక్కువగా వస్తుంది.. కాబట్టి వీటిని తీసుకోకపోవటం మంచిది. కాఫీ, టీలను తగ్గించాలి. బయట నుంచి కొనుగోలు చేసే ఆహార పదార్థాలను తీసుకోకపోవటం ఉత్తమం.

లక్షణాలను పసిగట్టాలి..

ఆందోళన, ఒత్తిడి పెరిగితే విద్యార్థులకు తలనొప్పి, వికారం వంటివి వస్తుంటాయి. కొందరికి కడుపునొప్పి, వణుకు లక్షణాలు రావటంతో ఏకాగ్రత కోల్పోతారు. తాము ఎంత చదివినా గుర్తుండటం లేదని, అనుకున్నంతగా చదవటం లేదని. . తదితర ప్రతికూల భావనలతో ఆత్మవిశ్వాసం సన్నగిల్లి నిరాశకు లోనవుతారు.

అలవాట్లు సైతం

పరీక్షల సమయంలో ఆహారపు అలవాట్లు మార్చుకుంటే మెరుగైన ఫలితాలు సాధించగలరు. పోషకాహారం తీసుకుంటే మెదడు చురుగ్గా పనిచేసేందుకు దోహదపడే బి కాంప్లెక్స్, విటమిన్ సి, జింక్, ఐరన్ వంటివి తినే పదార్థాల్లో ఉండేలా చూసుకోవాలి. వీటిని తీసుకుంటే హార్మోన్లను సమతుల్యం చేస్తాయి. జ్ఞాపకశక్తి పెరిగేందుకు సెనగ, నువ్వులు వంటి గింజలు వంటివి తీసుకోవచ్చు. **- సౌజన్య, పోషకాహార నిపుణురాలు, సర్వజన వైద్యశాల, అనంతపురం**

కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

సిద్ధేశ్వర ఆలయ హుండీ ఆదాయం లెక్కింపు

అమరాపురం, న్యూస్‌టుడే: మండలంలోని హేమావతి సిద్ధేశ్వరాలయంలో ఆదివారం బ్రహ్మోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన హుండీలో భక్తులు వేసిన కానుకలను లెక్కించారు. తాత్కాలిక హుండీ ద్వారా రూ.3.33 లక్షలు, శాశ్వత హుండీ ద్వారా రూ.6.67 లక్షల ఆదాయంతో పాటు 130 మిల్లీగ్రాములు బంగారం సమకూరినట్లు ఈవో నరసింహరాజు, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కరేగౌడ్ తెలిపారు.

కసాపురం ఆలయ సమాచారం

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయంలో సోమవారం జరిగే పూజ కార్యక్రమాలు ఇలా... వేకువ జామున 4.15 నుంచి 5.15గంటల వరకు స్వామికి పంచామృతాభిషేకం, 5.30 నుంచి 6గంటల వరకు స్వామి నిజరూప దర్శనం, ఉదయం 6నుంచి మధ్యాహ్నం 12.50 గంటల వరకు భక్తులకు సర్వదర్శనం, ఆర్జిత సేవలు ఉంటాయి. తిరిగి మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 8.30గంటల వరకు భక్తులకు సర్వ దర్శన భాగ్యం కల్పిస్తారు.

సంతల ఆదాయం రూ.4.08 లక్షలు

అనంతపురం (వ్యవసాయం), న్యూస్‌టుడే: అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులోని వారం సంతల్లో మొత్తం 4,08,950 ఆదాయం వచ్చింది. అందులో శనివారం గొర్రెలు, మేకల సంతలో రూ.2,39,850 ఆదాయం రాగా, ఆదివారం జరిగిన పశువుల సంతలో 1,69,100 ఆదాయం వచ్చిందని ఎంపిక శ్రేణి ఇన్‌ఛార్జి కార్యదర్శి, ఏడీఎం రాఘవేంద్రకుమార్ తెలిపారు. వచ్చిన ఆదాయాన్ని సోమవారం ప్రభుత్వ ఖజానాకు జమ చేస్తామని ఏడీఎం తెలిపారు.

నేడు డయల్ యువర్ ఏపీ ఎస్పీడీసీఎల్ సీఎండీ

తిరుపతి(జీవకోన), న్యూస్‌టుడే: ఎస్పీడీసీఎల్ సర్కిల్ స్థాయిలో విద్యుత్తు వినియోగదారుల సమస్యలపై ఫిర్యాదు, పరిష్కారానికి సోమవారం డయల్ యువర్ సీఎండీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సంస్థ సీఎండీ శివశంకర్ లోతేటి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్కిల్ పరిధిలోని తొమ్మిది జిల్లాలకు సంబంధించిన వినియోగదారులు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు 89777 16661 నంబరుకు ఫోన్ చేయవచ్చని పేర్కొన్నారు. అనంతపురం జిల్లా వినియోగదారులు ఎస్ఈ నంబర్ 91547 90350కు, శ్రీసత్యసాయిజిల్లా వినియోగదారులు ఎస్ఈ నంబర్ 99637 07847కు ఫోన్ చేసి సమస్యలపై ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

EENADU Classifieds

AGRI BUSINESS

అనంతపురం నగరంలోని రుద్రంపేట, ఆలమూరు సమీపంలో అన్ని సదుపాయాలతో కూడిన 55x125 సైజుగల విశాలమైన గొర్రెల ఫారం లీజుకు ఇవ్వబడును. ఆసక్తిగలవారు సంప్ర|| 9133399861.

BUSINESS SERVICES

BUSINESS OFFER

బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్, ఫైనాన్స్‌లో తాకట్టులో ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. (రెడ్డి పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డ్‌ట్రేడింగ్ కంపెనీ 7382114647.

EDUCATION

COACHING CENTRES

ఉచిత శిక్షణ & ఉద్యోగావకాశం 10th పాస్/ ఇంటర్/ డిగ్రీ పాస్ లేదా ఫెయిల్ అయినవారు విద్యార్థి నిరుద్యోగులకు In-store Demonstrator/ MS-Office/ Soft Skills కోర్సుల నందు ఉచిత హాస్టల్ & భోజన సదుపాయాలతో కూడిన ఉచిత శిక్షణకై సంప్ర: Sun Skills ట్రైనింగ్ సెంటర్, 2nd ఫ్లోర్, Agisam Complex, డ్రైవర్స్‌కాలనీ ఎదురుగా, కమలానగర్, అనంతపురం. ✆ 6304081005.

REAL ESTATE

హిందూపురం రైల్వేస్టేషన్‌కి 3kmలో అద్భుతంగా డెవలప్ చేసిన ప్రాజెక్ట్‌లో ప్లాట్లు & 38 లక్షలకే డబుల్ బెడ్‌రూమ్ హౌస్‌లు కలవు. సం: 6281824204.

PLOT FOR SALE

అరవకూరు దగ్గర, బళ్లారి హైవేకి మొదటి బిట్టు కార్నర్ హట్ ఎదుర్కొని ఉత్తరం ఉన్న 50 సెంట్ల ప్లాట్ అమ్మబడును కలదు. సంప్ర: 9908469828.

JOBS

హైదరాబాద్ యూనిటీ హోంకేర్‌లో ఏజెంట్లకు మంచి అవకాశం. మీరు వర్కర్స్‌ని పంపితే మొదటినెల 5వేలు కమీషన్. వర్కర్స్ జీ: 15K, ఫ్రీ వసతి, ఫుడ్. 8121541212

MARKETING/ SALES

Anand Masale Require Sales & Marketing Manager, Marketing Executives. Contact: 9849655105, 9848053144 Email: anandmasalaappltd@gmail.com.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారులు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

EENADU CLASSIFIEDS 5 లైన్ల ప్రకటన రూ. 395/- మాత్రమే

తక్కువ ఖర్చుతో... ప్రతిరోజు క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వండి.... అధిక స్పందనలు పొందండి. వాహనాల అమ్మకం... ఉద్యోగాల భర్తీ... ఇళ్లు, ఫ్లాట్లు, స్థలాల అమ్మకాలు, కొనుగోళ్లు... ఇళ్లు, షాపులు, ఫ్లాట్లు అద్దెకు మరియు అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు...

వివరాలకు : 8008709784

ప్రకటనలపై జి.ఎస్.టి. 5% వర్తించబడును

పెయ్య దూడల లక్ష్యం నెరవేరిన వేళ..!

కొండిరెడ్డిపల్లిలో ఆవు, దూడ

గోరంట్ల, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం పశువైద్యశాఖ ద్వారా మేలుజాతి (పెయ్య దూడలు) ఆవులనే ఉత్పత్తి చేయడానికి ఎస్ఎస్ (సెక్స్‌డ్ సార్టెడ్ సెమెన్) పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి చంద్రశేఖర్ పేర్కొన్నారు. కేవలం పెయ్య దూడలను మాత్రమే ఉత్పత్తి చేస్తూ.. పెంచుతూ, ఆవులకు సుఖప్రసవం జరగడానికి చేపట్టిన ఈ పథకం గోరంట్ల మండలంలో విజయవంతం అయిందని వివరించారు. మండలంలోని కొండిరెడ్డిపల్లి, గోవిదేవరపల్లిలో రెండు పెయ్య దూడలు శుక్రవారం పుట్టాయని తెలిపారు.

తొమ్మిది నెలలకు: ఇంజెక్షన్ వేసిన తొమ్మిది నెలలకు ఆవు ఈనుతుందని కేవలం పెయ్య దూడనే పుడుతుందని పశువైద్యాధికారి చెప్పారు. గోరంట్ల మండల వ్యాప్తంగా విడతల వారీగా ఇప్పటి వరకు 450 పశువులకు ఇంజక్షన్ వేశామన్నారు. మొదటి విడ యంగా శుక్రవారం రెండు దూడలు పుట్టాయని వివరించారు.

ఉమ్మడి అనంతపురంలో ఉచితం

ఒక్కో పశువుకు ఈ ఇంజెక్షన్ వేయడానికి రూ.1300 ఖర్చు అవుతుందని, రాష్ట్ర వ్యాప్తంగా పశుపోషకుల నుంచి రాయితీపై కేవలం రూ.150 వసూలు చేస్తున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాకు ఈపథకం పూర్తిగా ఉచితం.

ప్లానర్ల సమస్యల పరిష్కారానికి కృషి

అనంత నగరపాలక, న్యూస్‌టుడే: అనంతపురం జిల్లాలో ప్లానింగ్ సెక్రటరీలు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర స్థాయి నేతల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి మార్గం ఏర్పడిందని అనంతపురం జిల్లా నేతలు రూ, ధనుంజయరెడ్డి, వినయ్ తెలిపారు. ఆదివారం ప్లానింగ్ సెక్రటరీల టెక్నికల్ అసోసియేషన్ సమావేశానికి అనంతపురం జిల్లా నుంచి సంఘం నేతలతో పాటు పలువురు ప్లానింగ్ సెక్రటరీలు పాల్గొన్నారు. ఏపీ జేఏసీ ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు దృష్టికి తీసుకెళ్లగా తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు.

కళాత్మక బోధన.. వినూత్న సాధన

జాతీయ సమృద్ధి పోటీల్లో సత్తాచాటిన రోజ్‌మేర్సీరాణి

విద్యార్థులకు కళాత్మక బోధన చేస్తున్న ఉపాధ్యాయురాలు రోజ్‌మేర్సీరాణి

లేపాక్షి, హిందూపురం అర్బన్, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయి జిల్లా లేపాక్షి మండలం పులమతి ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయినిగా విధులు నిర్వహిస్తున్న డి.రోజ్‌మేర్సీరాణి కళలను సమన్వయం చేసుకుంటూ వినూత్న పద్ధతుల్లో పాఠ్యాంశాలను బోధిస్తున్నారు. ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్‌లో 'కళ సమన్వయ బోధన విధానం' అంశంపై ఉపాధ్యాయులకు నిర్వహించిన జాతీయస్థాయి సమృద్ధి పోటీల్లో పాల్గొని పేరు ప్రఖ్యాతులు పొందారు. దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి 98 మంది ఉపాధ్యాయులు పాల్గొన్న ఈ పోటీల్లో రాష్ట్రం నుంచి 4 జట్లు పాల్గొన్నాయి. ఇందులో రోజ్‌మేర్సీరాణి పాల్గొని ఆంగ్ల పాఠ్యాంశమైన 'ద్రిమ్‌సెస్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్‌లో 'కోయ ట్రైబల్' గురించి వినూత్న కూరాపాలను ప్రదర్శించి ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు.

ఆంగ్లంపై మక్కువ పెరిగేలా....

గ్రామీణ విద్యార్థులకు ఆంగ్లం అంటే ఎనలేని భయం. ఆ భయం ఏ విద్యార్థిలో కనిపించని విధంగా ఉపాధ్యాయురాలు బొమ్మలు, ఉపకరణాలు, బుర్రకథ వంటి సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు పాఠ్యాంశాలను వివరిస్తున్నారు. పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత, ఆంగ్లంపై పూర్తి అవగాహన కల్పిస్తోంది. జిల్లా రిసోర్స్ పర్సన్‌గా పాఠ్యాంశాలకు సంబంధించిన ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తూ ప్రత్యేక గుర్తింపు సొంతం చేసుకుంది. బుర్రకథలో పాత్రదారుడిలా నటిస్తూ విద్యార్థులకు పాఠ్యాంశాలు సులువుగా అర్థమయ్యేలా వివరిస్తోంది. ప్రతి యేటా నిర్వహించే కళాఉత్సవ్‌లో విద్యార్థులతో ప్రదర్శనలు ఇప్పించి వారిలో సృజనాత్మకతను వెలికి తీస్తోంది. ప్రతి బుధవారం పాఠశాలలో ఆంగ్ల దినం పాటించి ఆంగ్ల క్లబ్ ద్వారా స్పోకెన్ ఇంగ్లిష్‌పై శిక్షణ ఇస్తున్నారు. చిన్నతనం నుంచే కళలలో ప్రావీణ్యం కల్గి ఉండటమే కాకుండా క్రీడల్లో రాష్ట్ర స్థాయిలో రాణించేది. స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో గైడ్ కెప్టెన్‌గా యూనిట్‌ను నడిపిస్తూ విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, సేవాభావం పెరిగేలా కృషి చేస్తున్నారు.

రథాన్ని లాగుతున్న భక్తులు

నేత్రపర్వం.. శ్రీసుంకలాపార్వతీదేవి రథోత్సవం

విడపనకల్లు, న్యూస్‌టుడే: విడపనకల్లు మండలం పాల్తూరులో శ్రీసుంకలాపార్వతీదేవి రథోత్సవం ఆదివారం సాయంత్రం కన్నుల పండువగా సాగింది. చుట్టుపక్కల ప్రాంతాలతోపాటు కర్ణాటక నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం శోభ ఉన్న రథం నడుమ రథోత్సవం ఘనంగా నిర్వహించారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

పట్టులో సాంకేతికతతోనే అధిక దిగుబడులు

వివిధ రకాల పట్టుగూళ్లను పరిశీలిస్తున్న అధికారులు, రైతులు

పెనుకొండ, న్యూస్‌టుడే: పట్టు రైతులు సాగులో ఆధునిక సాంకేతిక పద్ధతులను ఉపయోగించి అధిక దిగుబడులు సాధించవచ్చని సీఎస్ఆర్‌అండ్‌టీఐ(సెంట్రల్ సెరికల్చర్ రీసర్చ్ అండ్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్) మైసూర్ డైరెక్టర్ దీప పేర్కొన్నారు. ఆదివారం స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో అనంతపురం ప్రాంతీయ పట్టుపరిశోధన కేంద్రం ఇన్‌ఛార్జి మురళి ఆధ్వర్యంలో పట్టు రైతుల సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భం నిర్వహించిన సమావేశంలో నూతన సాగు పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ఏర్పాటు చేసిన వివిధ రకాల ప్రదర్శనలు పరిశీలించారు. కార్యక్రమంలో పట్టుపరిశ్రమశాఖ అడిషనల్ డైరెక్టర్ అరుణకుమారి, జిల్లా సంయుక్త సంచాలకులు శోభారాణి, డీడీ ఉమాశ్వర్, సిబ్బంది, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పీఎస్‌హెచ్‌ఎంల సమస్యలు పరిష్కరించాలి

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని పీఎస్‌హెచ్‌ఎంల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీవీ ప్రసాద్ డిమాండ్ చేశారు. ఉమ్మడి అనంత జిల్లా పీఎస్‌హెచ్‌ఎంల సంఘం సమావేశం స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో ఆదివారం జరిగింది. తమ సమస్యలపై చర్చించారు. ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలనే ఉద్దేశంతో ఆదర్శ ప్రాథమిక పాఠశాలలు ప్రవేశపెట్టారు. స్కూల్ అసిస్టెంట్లను పీఎస్‌హెచ్‌ఎంలుగా నియమించారు. కానీ ఎలాంటి జాబ్‌చార్ట్ ప్రకటించలేదన్నారు. జాబ్‌చార్ట్ ప్రకటించాలన్నారు. రాబోయే బదిలీల్లో తిరిగి స్కూల్ అసిస్టెంట్లుగా వెనక్కు వెళ్లడానికి ప్రాధాన్యం కల్పించాలన్నారు. యూడైస్ కేటాయించాలన్నారు. పీఎస్‌హెచ్‌ఎంలను గ్రేడ్-3 ప్రధానోపాధ్యాయులుగా మార్చాలన్నారు. శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షులు మహబూబ్ బాషా, అనంతపురం జిల్లా అధ్యక్షులు రామాంజనేయులు, నాయకులు రంగారెడ్డి, సూర్యనారాయణ,, సాయిరాం నాయక్, సత్యనారాయణరెడ్డి, రవీంద్రనాయక్ పాల్గొన్నారు.

ప్లకార్డులు ప్రదర్శిస్తున్న పీఎస్‌హెచ్‌ఎం సంఘం నాయకులు

చెంబులన్నాడు.. సొమ్ము దోచాడు

వైకాపా నాయకుడి అరెస్ట్

స్వాధీనం చేసుకున్న చెంబులు, నగదును చూపుతున్న పోలీసులు

కదిరి, న్యూస్‌టుడే: రైస్‌పుల్లింగ్ పేరిట మహిమలున్న చెంబులు తయారు చేసి ఇస్తానంటూ డబ్బులు తీసుకొని మోసం చేసిన కేసులో చింతకుంట కృష్ణారెడ్డి అలియాస్ డిక్కీబాబును అరెస్టు చేసినట్లు డీఎస్పీ శివనారాయణస్వామి తెలిపారు. నిందితుడి నుంచి ఒక కారు, ఐదు రాగి చెంబులు, మూడు సెల్‌ఫోన్లు, రూ.1.08 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. కదిరి రూరల్ సర్కిల్ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో డీఎస్పీ కేసు వివరాలను వెల్లడించారు. శ్రీసత్యసాయి జిల్లా తలుపుల మండలం బురుజుపల్లి గ్రామానికి చెందిన కృష్ణారెడ్డి తలుపులలో నివాసం ఉంటున్నాడు. ఇతడు ప్రస్తుతం తలుపుల మండల వైకాపా కన్వీనర్‌గా ఉన్నాడు. తనకు రైస్ పుల్లింగ్ మహిమ చెంబులు తయారు చేసే విద్య తెలుసని, మార్కెట్‌లో అమ్మితే రూ.2 కోట్లు పొందవచ్చని నమ్మించాడు. ప్రలోభ పడిన వేణుగోపాల్‌రెడ్డి 2025 జూన్‌లో రూ.5 లక్షలు, జులైలో రూ.5 లక్షలు ఇచ్చాడు. మరో రూ.10 లక్షలు ఇస్తే మహిమలున్న రాగి చెంబును తయారు చేసి ఇమ్మిస్తానని నిందితుడు చెప్పాడు. అనుమానం కలిగిన బాధితుడు చెంబు అవసరం లేదు, తానిచ్చిన రూ.10 లక్షలు వెనక్కి ఇవ్వాలని కోరాడు. డబ్బు వెనక్కి ఇవ్వకుండా, రాగి చెంబు నీవద్ద పెట్టుకో తర్వాత అమ్మిస్తానని నమ్మించాడు. బాధితుడు ఈనెల 15న డిక్కీబాబు ఇంటికెళ్లి రాగిచెంబు ఇచ్చేసి, డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరాడు. నువ్వే రూ.10 లక్షలు ఇవ్వాలని, లేదంటే చంపుతానంటూ వేణుగోపాల్‌రెడ్డిని నిందితుడు బంధించి బెదిరించాడు. బాధితుడు విషయం స్నేహితులకు చెప్పటంతో వారొచ్చి రూ.3 లక్షలు ఇచ్చారు. మిగిలిన రూ.7 లక్షలకు ప్రామిసరీ నోట్లపై బలవంతంగా సంతకాలు పెట్టించుకున్నాడని వేణుగోపాల్‌రెడ్డి ఫిర్యాదు మేరకు శనివారం నిందితుడ్ని అరెస్టు చేసినట్లు డీఎస్పీ వివరించారు. డిక్కీబాబుపై ఇప్పటికే ఎనిమిది కేసులు నమోదయ్యాయని, ఒక కేసులో శిక్ష పడిందన్నారు. ఇతని ఆస్తులు అటాచ్ చేసి బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని, బహిష్కరణకు చర్యలు చేపడతామని డీఎస్పీ తెలిపారు.

రైలులో చైన్ లాగి.. బంగారం గొలుసు చోరీ

అనంతపురం (రైల్వే), న్యూస్‌టుడే: శనివారం రాత్రి.. సమయం 11 గంటలు. యశ్వంతపూర్ నుంచి లాథూర్‌కు (16583) వెళ్లే రైలు గంటకు 120 కి.మీ. వేగంతో కల్లూరు రైల్వేస్టేషన్ సమీపాన పరుగులు తీస్తుంది. అందరూ నిద్రలోకి జారుకుంటున్నారు. ఈ సమయంలో రైలు గొలుసు లాగిన శబ్దం. వేగం నెమ్మదించాక.. వెంటనే స్లీపర్ బోగీలో ప్రయాణికురాలు శారద మెడలో ఉన్న 5 తులాల బంగారు ఆభరణాలు లాక్కొని ఓ ఆగంతుకుడు రైలు దిగిపారిపోయాడు. ధర్మవరం తర్వాత ఈ రైలు గుంతకల్లులో మాత్రమే ఆగుతుంది. ఈ రైలుకు అనంతపురంలో స్టాపేజీ లేదు. యాదగిరి వెళ్లడానికి ఆమె ధర్మవరంలో రైలు ఎక్కింది. చోరీ విషయమై ఆమె రైల్వే పోలీసులకు సమాచారం అందజేసింది. గుంతకల్లు స్టేషన్‌లో పోలీసులు ఆమెను విచారించారు. యాదగిరి పోలీస్‌స్టేషన్‌లో రాతపూర్వక ఫిర్యాదు ఇవ్వాలని సూచించారు.

వృద్ధురాలి మెడలో..

హిందూపురం, న్యూస్‌టుడే: హిందూపురం గ్రామీణ మండలం చౌళూరుకు చెందిన వృద్ధురాలు సంజీవమ్మ ఆదివారం ఉదయం పాలు తీసుకొని ఇంటి లోపలికి వెళ్లగా మాటు వేసిన దొంగ ఆమె ముఖంపై టవల్ బిగించి మెడలో ఉన్న ఐదు తులాల రెండు వరుసల బంగారు గొలుసును అపహరించి పరారయ్యాడు. ఆమె కుమారుడు, కోడలు శనివారం వివాహానికి బంధువుల ఊరికి వెళ్లటంతో అవకాశం కోసం వేచి చూస్తున్న దొంగ వృద్ధురాలు ఒంటరిగా ఉండటంతో ఈ ఘటనకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు.

లారీ ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలు

సోమందేపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని పాపిరెడ్డిపల్లి వద్ద జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి కియా అనుబంధ పరిశ్రమలోకి విధులకు వెళ్తున్న సాయికిరణ్, నాగేంద్ర ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరికీ తీవ్రగాయాలయ్యాయి. ఏఎస్సై దేవానంద్, సిబ్బంది రామకృష్ణ తదితరులు ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను పెనుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం ట్రాఫిక్‌ను తొలగించి, వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు.

రెండు ద్విచక్ర వాహనాల ఢీ.. ఒకరి దుర్మరణం

శివన్న

గుమ్మఘట్ట, న్యూస్‌టుడే: మండలంలోని గోనబావి గ్రామం వద్ద ఆదివారం రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఒకరు మృతిచెందారు. పోలీసుల వివరాల మేరకు.. రాయదుర్గం వైపు నుంచి ద్విచక్ర వాహనంలో ఇద్దరు వ్యక్తులు వస్తుండగా.. రాయదుర్గం వైపు ద్విచక్ర వాహనంలో కొండాపురం శివన్న వెళ్తున్నారు. వీరి వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో శివన్న(55) రోడ్డుపై పడటంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఆయన్ను స్థానికులు రాయదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఎస్ఐ చిన్నరాయుడు ఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. శిరస్త్రాణం లేకపోవటంతోనే ప్రాణాలు పోయాయని పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో భవన నిర్మాణ కార్మికుడు..

కూడేరు(ఉరవకొండ), న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో భవన నిర్మాణ కార్మికుడు మృతి చెందిన ఘటన కూడేరు మండలంలో చోటు చేసుకుంది. సీఐ రాజు తెలిపిన వివరాలిలా.. మండలంలోని అంతరగంగ గ్రామానికి చెందిన వెంకటేశ్ (35) భవన నిర్మాణ కార్మికుడిగా పని చేస్తూ, కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆదివారం అనంతపురంలో పని ముగించుకుని రాత్రి ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వస్తున్నాడు. కమ్మూరు సమీపంలో జాతీయ రహదారిపై ఎదురుగా వచ్చిన కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతను అక్కడికక్కడే మృతి చెందాడు. అతనికి భార్య అరుణ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కారులో ప్రయాణిస్తున్న లక్షిత్ అనే చిన్నారికి స్వల్ప గాయాలయ్యాయి. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

మణేసముద్రంలో లారీ కిందపడి వృద్ధుడు..

హిందూపురం, న్యూస్‌టుడే: లారీ చక్రాలు ఎక్కడంతో ఓ వృద్ధుడు మృతి చెందిన ఘటన ఆదివారం హిందూపురం గ్రామీణ మండలం మణేసముద్రంలో చోటుచేసుకుంది. ఆదివారం సాయంత్రం మణేసముద్రానికి చెందిన నారాయణప్ప(80) ఆగి ఉన్న లారీ వెనకాల ఉన్నాడు. అది చూసుకోని డ్రైవర్ లారీని వెనక్కి తీసే సమయంలో వెనుక చక్రాలు ఎక్కడంతో వృద్ధుడు అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. సంఘటనపై గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని శవపరీక్షకు హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

కృష్ణమనాయుడు

ముదిగుబ్బ, న్యూస్‌టుడే: విద్యుత్తు మరమ్మతులు చేస్తుండగా ప్రమాదవశాత్తు తీగలు తగిలి ఓ రైతు అక్కడికక్కడే మృతి చెందిన విషాద ఘటన ఆదివారం ముదిగుబ్బలోని సంకేపల్లి దగ్గర చోటుచేసుకుంది. ముదిగుబ్బలోని గీతా మందిరం కాలనీకి చెందిన కృష్ణమనాయుడు (42) వ్యవసాయంతోపాటు ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ పనులు చేస్తూ జీవనం సాగించేవారు. ఆదివారం సంకేపల్లి సమీపంలో బేల్దారి వెంకటరమణకు చెందిన తోటలో విద్యుత్తు సమస్య తలెత్తడంతో, దాన్ని సరిచేయడానికి కృష్ణమనాయుడు వెళ్లారు. ఎల్‌సి తీసుకోకుండానే స్తంభం ఎక్కి మరమ్మతులు చేస్తుండగా ప్రమాదవశాత్తు 11కేవీ విద్యుత్తు తీగలు తగిలి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. అతనికి మూడేళ్ల కిందటే రజితతో వివాహమైంది. ఇంటికి పెద్ద దిక్కును కోల్పోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.

హెచ్చెల్సీలో నగరవాసి గల్లంతు!

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: స్థానిక మూడో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సుబ్రహ్మణ్యేశ్వర ఆలయానికి వచ్చి హెచ్చెల్సీ నీటిలో పడి వ్యక్తి గల్లంతు అయినట్లు పోలీసులు తెలిపారు. కమలానగర్‌కు చెందిన రామాంజనేయులు (55) స్థానికంగా చేపల మార్కెట్ వద్ద మారుతీ సప్లయర్స్ నిర్వహిస్తున్నాడు. అతడు శనివారం సాయంత్రం ఆలయానికి వచ్చి తిరిగి ఇంటికి వెళ్లలేదు. ఎంతసేపటికి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆలయం వద్దకు వచ్చి చూడగా, పక్కన ఉన్న హెచ్చెల్సీ కాలువ ఒడ్డున పర్స్, చెప్పులు కనిపించాయి. ప్రమాదవశాత్తు నీటిలో పడ్డాడా, బలవన్మరణానికి పాల్పడ్డాడా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఆదివారం ఉదయం నుంచి అగ్నిమాపక సిబ్బంది హెచ్చెల్సీ నీటిలో గాలించినా ఫలితం లేదు.

సోదనపల్లిలో పది మందికి అస్వస్థత

శింగనమల, న్యూస్‌టుడే: మండల పరిధిలోని సోదనపల్లి గ్రామంలో శనివారం రాత్రి వాంతులు విరేచనాలు కావడంతో పది మందికి పైగా అస్వస్థతకు గురయ్యారు. బాధితులను గ్రామస్థులు శింగనమల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యాధికారులు సోదనపల్లిలో పర్యటించారు. దీనిపై శింగనమల ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి రోహినాథ్ వివరణ కోరగా బాధితులందరూ కోలుకుంటున్నారని, తాగునీరు కలుషితం అయి ఉండవచ్చని అనుమానాన్ని వ్యక్తం చేశారు. మరోవైపు తాగునీటి కలుషితం అయిందని గ్రామంలో ప్రచారం జరుగుతోంది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

చికిత్స పొందుతున్న రోగులు

హిందూపురం

•హిందూపురం •పెనుకొండ •మడకశిర

వైభవంగా కల్యాణోత్సవం

లేపాక్షి, న్యూస్‌టుడే: మండలంలోని చోళసముద్రం పంచాయతీ నాగానిపల్లిలో ఆదివారం లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాన్ని భక్తజనసందోహం నడుమ వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో అభిషేకాలు, అర్చనలు చేశారు. శ్రీదేవి, భూదేవి సమేత నరసింహస్వామి ఉత్సవ విగ్రహాలకు అర్చకులు శాస్త్రోక్తంగా వివాహం జరిపించారు. కార్యక్రమంలో లేపాక్షి ఆలయ కమిటీ ఛైర్మన్ రమానందన్, బెంగళూరుకు చెందిన నరసింహమూర్తి, స్థానికులు దుర్గా నాని, రాజేష్, శ్రీదర్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీదేవి, భూదేవి సమేత నరసింహస్వామి

17 ఏళ్లకు అపూర్వ సమ్మేళనం

అధ్యాపకులతో పూర్వ విద్యార్థులు

పెనుకొండ, న్యూస్‌టుడే: స్థానిక పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2006-09 మధ్య డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు 17ఏళ్ల తరువాత ఆదివారం కలుసుకున్నారు. ఆప్యాయంగా పలకరించుకుంటూ, గత జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. అనంతరం అధ్యాపకులను సత్కరించారు. కళాశాల ప్రిన్సిపల్ జయప్ప, అధ్యాపకులు బాలరెడ్డి, రామన్న, ఓబులేసు, తదితరులు పాల్గొన్నారు.

కెంచమాంభదేవి వార్షికోత్సవం

అమరాపురం, న్యూస్‌టుడే: గౌడనకుంట కెంచమాంభదేవి ఆలయంలో ఆదివారం మొదటి వార్షికోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఏడాది క్రితం రూ.3కోట్లతో చందాల సేకరించి ఆలయం నిర్మాణం పూర్తి చేసి పెద్ద జాతర నిర్వహించారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాన్ని చెరువు వద్ద ఉన్న వేపమాను కట్ట వద్దకు తీసుకువెళ్లి పూజలు చేశారు. అనంతరం మేళతాళాలతో దేవస్థానం వరకు తీసుకువచ్చి ఆలయ ప్రవేశం చేయించారు. ఉత్సవాలకు హాజరైన భక్తులకు అన్నదానం చేశారు.

ఘనంగా మారెమ్మదేవత విగ్రహ ప్రతిష్ఠాపన

కలశాల ఊరేగింపులో మహిళలు

మడకశిర గ్రామీణం, న్యూస్‌టుడే: కల్లుమర్రి గ్రామంలోని మారెమ్మదేవత ఆలయంలో ఆదివారం అమ్మవారి నూతన విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి రాష్ట్ర వక్కలిగ కార్పొరేషన్ ఛైర్మన్ లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు సతీమణి ఉమాదేవి, మండల కన్వీనర్ నాగరాజు తదితరులు హాజరయ్యారు. మహిళలు కలశాలను ఊరేగించారు. నూతనంగా ప్రతిష్ఠించిన అమ్మవారికి అభిషేకపూజలు, అర్చనలు నిర్వహించారు.

అనాథ బాలికలంటే అంత అలుసా!

22 మందికి ఒకే మరుగుదొడ్డి, స్నానపు గది

అధ్వానంగా మరుగుదొడ్డి

హిందూపురం, న్యూస్‌టుడే: తల్లీదండ్రి లేని అనాథ పిల్లలు.. సుదూర ప్రాంతం నుంచి రెండు అక్షరాలు నేర్వటానికి మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న బాలికా సదనంలో చేరారు. వీరికి సౌకర్యాలు, సకాలంలో మెనూ ప్రకారం భోజనాలు అందేవిధంగా చొరవ తీసుకోవాల్సిన ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు ఇటువైపు కన్నెత్తి చూడటం లేదు. వసతి గృహంలో కనీస సౌకర్యాలు లేక బాలికలు కష్టాల్లో మగ్గుతున్నారు.

అడగకలేక.. మౌనంగా భరిస్తూ..

హిందూపురం పట్టణం డీబీ కాలనీలోని ఓ అద్దె భవనంలో బాలికా సందనం నిర్వహిస్తున్నారు. కదిరి, ఓడీసీ, జిల్లాలోని సుదూర ప్రాంతాలకు చెందిన తల్లీదండ్రి, ఏ ఆధారం లేని బాలికలు 22 మంది ఉన్నారు. వీరంతా 5వ తరగతి లోపు చదువుతున్న చిన్నారులే. అందుకే ఎన్ని ఇబ్బందులు పడుతున్నా మౌనంగా ఉంటున్నారు. కనీసం వారు దిన చర్యలకు అవసరమైన నీరు కూడా అందుబాటులో లేదు. మెనూ మేరకు భోజనాలు అందించాల్సి ఉండగా సిబ్బంది తిలోదకాలు ఇచ్చి పెట్టింది తిను అనే వైఖరిని ప్రదర్శిస్తున్నారు. ఒక మరుగుదొడ్డి, ఒక స్నానపుగది ఉండటంతో అత్యవసర సమయంలోనే బిగబట్టాల్సిన దుస్థితి చిన్నారులు ఎదుర్కొంటున్నారు.

రూ.12వేల అద్దె ఇస్తున్నా.. చుక్కనీరు లేదు

ఈ భవనానికి ప్రతినెలా రూ.12వేలు అద్దె చెల్లిస్తున్నా కుళాయిలో చుక్కనీరు రావటం లేదు. దీంతో ట్యాంకర్‌లో నీటిని కొంటున్నామని సిబ్బంది అంటున్నా ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ట్యాంకర్ రాక నీరు అందుబాటులో లేక బాలికల బాధలు వర్ణనాతీతంగా మారాయి. దాతలు వాటర్ ఫిల్టర్ అందించినా అది మూలకు పడటంతో రోజూ రెండు, మూడు బిందెల మినరల్ వాటర్‌ని కొంటున్నా ఈ నీరు వారికి సరిపడటం లేదు. వాషింగ్ మిషన్ పనిచేయక మాసిన గుడ్డలతోనే చిన్నారులు రోజూ బడికి వెళ్తున్నారు.

ఆటో రాక బడికి నడిచే వెళ్తూ..

వసతిగృహం నుంచి శ్రీకంఠపురంలోని ఝాన్సీ లక్ష్మీబాయి పాఠశాలకు వెళ్లాలంటే దూరంగా, ప్రధాన రహదారి సమీపంలో ఉండటంతో గతంలో ఆటోలో వీరిని రోజు తీసుకెళ్లేవారు.. ప్రస్తుతం ఈ సౌకర్యానికి మంగళం పాడటంతో చిన్నారులు కాలిబాటనే చేరుకొంటున్నారు. పై విషయాలపై ఇన్‌ఛార్జి సీడీపీవో వరలక్ష్మిని వివరణ కోరగా ఈ సదనం అద్దె భవనంలో కొనసాగుతోంది. అక్కడ నెలకొన్న సమస్యలను ఇప్పటికే ఉన్నతాధాకారులకు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరామని తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా

హిందూపురం : 91548 46650
పెనుకొండ : 91000 20922
మడకశిర : 76759 19016

సమస్య: సలామత్‌నగర్‌లో మురుగునీరు రహదారిపై పారుతోంది. **- జాకీర్**
సమాధానం: సిబ్బందిని పంపి శుభ్రం చేయిస్తా. **- అశ్వర్థనారాయణ, సర్పంచి, పులమతి**
సమస్య: గోపిందేవరపల్లిలో వీధిదీపాలు సక్రమంగా వెలగడం లేదు. **- అనిల్‌కుమార్**
సమాధానం: మూడు రోజుల్లోపు ఏర్పాటు చేయిస్తాం. **- నేత్రావతి, సర్పంచి, శిరివరం**
సమస్య: పీఎన్‌పాళ్యం, గుడిబండ రోడ్డు కంకర తేలి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. **-శశిధర్**
సమాధానం: మట్టిని వేసి చదును చేస్తాం. **-సాయికుమార్, మండల ఇంజినీరు, గుడిబండ**
సమస్య: మద్దనకుంట ఎస్సీ కాలనీలో వీధి దీపాలు లేవు. **- హనుమంతరాయప్ప**
సమాధానం: మూడు రోజుల్లో ఏర్పాటు చేస్తాం. **- అమరీశ్, పంచాయతీ కార్యదర్శి**

– న్యూస్‌టుడే, లేపాక్షి, గుడిబండ

భక్తిశ్రద్ధలతో అభయాంజనేయ స్వామి..

ప్రతిష్ఠించిన విగ్రహం

హిందూపురం సాంస్కృతికం, న్యూస్‌టుడే: పట్టణంలోని సడ్లపల్లి గ్రామంలో దాతల సహకారంతో రూ.2కోట్లతో నూతనంగా నిర్మించిన ఆంజనేయస్వామి ఆలయంలో మూడు రోజుల నుంచి తిరుపతి నుంచి వచ్చిన వేదపండితులు ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆఖరి రోజు ఆదివారం ఆలయంలో గణపతి, నవగ్రహాలు, ఆంజనేయుడి విగ్రహాలను ప్రతిష్ఠించారు. అనంతరం ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికలో ఆంజనేయ, శ్రీరామతారక హోమం నిర్వహించారు. మున్సిపల్ ఛైర్మన్ డీఈ రమేశ్‌కుమార్, ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శులు డా.సురేంద్ర, బాలాజి, అభయాంజనేయ స్వామి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తామరపుష్పాలతో హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

ప్రత్యేక పూలతో అమ్మవారి అలంకారం

కొల్హాపుర మహాలక్ష్మికి కుంభాభిషేకం

హిందూపురం సాంస్కృతికం: పట్టణంలోని కన్యకాపరమేశ్వరి వీధిలో ఉన్న కొల్హాపుర మహాలక్ష్మి అమ్మవారి కుంభాభిషేక మహోత్సవంలో భాగంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆవరణలో 101 తామరపుష్పాలతో ప్రత్యేకంగా హోమం చేశారు. బెంగళూరు నుంచి తెచ్చిన 150కిలోల వివిధ రకాల పుష్పాలతో అమ్మవారి అలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆలయ అధ్యక్షుడు శ్రీనివాసప్రసాద్, కార్యదర్శి రవీంద్రనాథ్, ట్రెజరర్ శ్రీనివాసులు, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

పెనుకొండలో హ్యాపీ సండే

యోగా సాధన చేస్తున్న పట్టణవాసులు

పెనుకొండ, న్యూస్‌టుడే: పట్టణ ప్రాంతాలోల పౌరుల శ్రేయస్సు పౌరుగు వారితో సత్సంబంధం, ప్రజల ఆరోగ్యకరమైన జీవనశైలి, ప్రజాస్థలాల సానుకూల వినియోగానిన ప్రోత్సహించే ఉద్దేశంతో ప్రతినెలా 2, 4వ ఆదివారం హ్యాపీ సండే నిర్వహిస్తున్నట్లు కమిషనర్ సతీశ్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో యోగా మాస్టర్ వెంకటేశ్ ఆధ్వర్యంలో ఆసనాలు వేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, పట్టణ వాసులు, నగరపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

అమరాపురం, న్యూస్‌టుడే: స్థానిక ప్రాథమిక పాఠశాలలో ఆదివారం వైద్య ఆరోగ్య మైత్రి కూటమి నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 180 మంది రోగులు పాల్గొని ఉచిత వైద్య సేవలు పొందారు. చిత్రదుర్గం యూనిటీ హెల్త్ కాంప్లెక్స్ స్త్రీ వ్యాధి నిపుణురాలు డాక్టర్ జ్యోతివిజయ్‌కుమార్ వంద మంది మహిళా రోగులను పరీక్షించి రూ.20వేల విలువైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. సామాన్య వ్యాధి నిపుణులు ఓంకార్‌నాయక్ 80 మంది రోగులను పరీక్షించి మందులు అందజేశారు. మైత్రి కూటమి సభ్యులు రమేష్, శ్రీనివాసమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ జ్యోతి

రేకులకుంటలో 200 మంది రోగులకు..

మడకశిర గ్రామీణం: రేకులకుంట గ్రామానికి చెందిన నరసింహాగౌడ జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. అనంతపురం కిమ్స్ సవేరా వైద్య బృందం 200 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వైద్యులు ఆదిశేష, మహ్మద్‌ఇర్ఫాన్, సిద్దిక్, 2డీ ఎకోటెక్నీషియన్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి జమ్మలబండలో జాతర

గుడిబండ: జమ్మలబండలో సోమవారం నుంచి శ్రీకొల్హాపురమ్మ జాతర మహోత్సవం నిర్వహించనున్నట్లు తెదేపా రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి, మాజీ సర్పంచి శ్రీనాథ్ తెలిపారు. సోమవారం అమ్మవారి జలధి, మంగళవారం జ్యోతులు, బుధవారం గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు.

19న చౌడేశ్వరిదేవి జ్యోతుల ఉత్సవం

సోమందేపల్లి, న్యూస్‌టుడే: సోమందేపల్లిలో పాతూరులో వెలసిన తొగటవీర క్షత్రియుల ఆరాధ్య దైవం చౌడేశ్వరి దేవి అమ్మవారి పంచమ జ్యోతుల ఉత్సవాన్ని మార్చి నెల 19న అత్యంత వైభవంగా నిర్వహించ నున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు, మాజీ సర్పంచి డీసీ ఈశ్వరయ్య తెలిపారు. ఉత్సవాల నిర్వహణకు దాతలు ముందుకు వచ్చి తమ సహకారం అందించవచ్చని ఆయన కోరారు.

ఆర్యవైశ్యులు ఐక్యంగా ఉండాలి

భవనాలను ప్రారంభిస్తున్న డుండిరాకేశ్, ఎంఎస్ ఉమాదేవి, తదితరులు

గుడిబండ, న్యూస్‌టుడే: ఆర్యవైశ్య సోదరులు ఐకమత్యంగా ఉండి, వ్యక్తిగత, సామాజికంగా అభివృద్ధి చెందాలని ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య రాష్ట్ర వెల్ఫేర్, డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ డుండి రాకేశ్ పేర్కొన్నారు. ఆయన మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు సతీమణి ఎంఎస్ ఉమాదేవితో కలిసి గుడిబండలో ఆర్యవైశ్య సోదరులు నిర్మించిన వ్యాపార సముదాయ భవనాన్ని ఆదివారం ప్రారంభించారు. రాకేశ్ మాట్లాడుతూ ఆర్యవైశ్య సోదరులకు వడ్డీ లేని రుణాలు అందిస్తామని, వ్యాపారాలు చేసుకుని అభివృద్ధి చెందాలన్నారు. గుడిబండలో వ్యాపార సముదాయభవనం నిర్మించుకుని ఆదర్శంగా నిలిచారన్నారు. కన్యకాపరమేశ్వరి ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళాన్ని ప్రకటించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, మాజీ హుడాఛైర్మన్, ఆర్యవైశ్య జిల్లా సంఘం అధ్యక్షుడు కోట సత్యం, గుడిబండ ఆర్యవైశ్య సంఘం నాయకుడు జయప్రకాశ్, ఉపాధ్యక్షుడు కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి శ్రీధర్, యువనాయకుడు రవికుమార్, ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.

వైద్య చికిత్సకు మంత్రి సాయం

రొద్దం: కొన్ని నెలల నుంచి వింత వ్యాధితో బాధపడుతూ వైద్య చికిత్సల కోసం ఆర్థిక ఇబ్బందులు పడుతున్న కోగిర గ్రామానికి చెందిన ప్రశాంతి అనే వివాహితకు మంత్రి సవిత రూ.25 వేల ఆర్థిక సాయం చేశారు. ఆదివారం సాయంత్రం బాధితురాలు గ్రామానికి చేరుకోవడంతో తెదేపా నాయకులు ఆంజనేయులు, ఎల్‌ఐసీ అంజి, తదితరులు వెళ్లి చరవాణి ద్వారా మంత్రితో మాట్లాడించారు. మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసుకుంటామని మంత్రి భరోసా ఇచ్చారు. అనంతరం నగదును నాయకులు అందజేశారు.

ఆదమరిస్తే.. ప్రమాదమే..!

హిందూపురం నుంచి లేపాక్షి వెళ్లే రోడ్డులో శ్రీకంఠపురం చెరువు కట్టపై రాకపోకలు సాగించే వాహనాలు అదుపుతప్పితే ప్రమాదానికి గురికావాల్సిందే. అరకిలోమీటరు దూరం ఉన్న ఈ రోడ్డులో ఒక వైపు ర్యాంప్ ఉంటే రెండో వైపు లేదు. ఈ విషయమై నీటిపారుదలశాఖ డీఈ శ్రీకేష్ మాట్లాడుతూ భద్రత కల్పించేలా చర్యలు తీసుకుంటామన్నారు. - న్యూస్‌టుడే, హిందూపురం గ్రామీణం

అపరిశుభ్రం.. అనారోగ్యం

మరువపల్లిలోని ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో మురుగు కాలువ పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది. చీకటి పడితే దోమల బెడద అధికంగా ఉందని, జ్వరాల బారిన పడుతున్నామని స్థానిక ప్రజలు వాపోతున్నారు. పంచాయతీ కార్యదర్శి వేణుగోపాల్‌ను వివరణ కోరగా హరిత రాయబారులతో శుభ్రం చేయిస్తామని తెలిపారు. - న్యూస్‌టుడే, మడకశిర గ్రామీణం

పాచిపట్టిన నీరు ఎలా తాపేది?

మందలపల్లిలోని గుడిబండ రోడ్డులో నిర్మించిన పశువుల నీటి తొట్టెలో నీరు పాచిపట్టడంతో పశువులకు ఏలా తాగించాలని ఇబ్బందులు పడుతున్న పరిస్థితి ఏర్పడిందని రైతులు వాపోతున్నారు. ఈ నీరు తాగిస్తే రోగాల బారిన పడే ప్రమాదముందని, శుభ్రపరచాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయమై డిప్యూటీ ఎంపీడీఓ నాగరాజునాయక్ మాట్లాడుతూ శుభ్రం చేసి మంచి నీటిని నింపుతామన్నారు. - న్యూస్‌టుడే, గుడిబండ

భాజపాను గ్రామస్థాయిలో బలోపేతం చేయాలి

రొద్దం, న్యూస్‌టుడే: అందరూ సమన్వయంతో పనిచేసి పార్టీని గ్రామ, వార్డుల్లో బలోపేతం చేయాలని భాజపా జిల్లా కార్యదర్శి జీవన్ గోపాల్ సూచించారు. ఆదివారం స్థానిక పెన్నా నది పరివాహక ప్రాంతంలో మండల భాజపా కార్యాలయ నిర్మాణం కోసం స్థలం పరిశీలించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన నరేశ్ అనే యువకుడికి కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి రవికుమార్, భాజపా మండల కమిటీ అధ్యక్షుడు పవన్, సీనియర్ నాయకులు నారాయణరెడ్డి, గంగాధర్, చల్లా అరుణ, తిప్పేస్వామి, మహదేవ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

రైతన్నకు మెరుగైన సేవలు ఏవీ?

దిష్టిబొమ్మల్లా కియోస్క్‌లు

తమ్మడేపల్లి ఆర్ఎస్‌కేలో పనిచేయని కియోస్క్ యంత్రం

మడకశిర గ్రామీణం, అమరాపురం, న్యూస్‌టుడే: రైతులకు మెరుగైన సేవలందించేందుకు వైకాపా హయాంలో రైతుసేవాకేంద్రాల్లో ఏర్పాటుచేసిన కియోస్క్ యంత్రాలు దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. యంత్రాలు ఏర్పాటు చేసినప్పటికీ చాలా వాటికి ఇంటర్నెట్ సౌకర్యం కల్పించకపోవడం, కొన్నింటికి ఆధార్ అప్‌డేట్ లేక, మరికొన్నింటికి ఏళ్లుగా సర్వీసింగ్ చేయకపోవడంతో అవి పనిచేయడం లేదు.. ఇంటర్నెట్ సౌకర్యం కల్పించిన చోట నెట్‌వర్క్ సమస్యతో వాటిని ఉపయోగించడం లేదు. దీంతో వాటిని మూలన ఉంచి ట్యాబ్‌లు, సెల్ ఫోన్లలో రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, మందులు, ఇతర వివరాలను నమోదు చేస్తున్నారు.

మండలాల వారీగా పనిచేయనివి		
మడకశిర	16	4
గుడిబండ	14	9
అగళి	11	2
అమరాపురం	15	6
రొళ్ల	10	3

66 ఆర్ఎస్‌కేలలో..

మడకశిర నియోజకవర్గ వ్యాప్తంగా 66 ఆర్ఎస్‌కేలలో ఒక్కో కియోస్క్ యంత్రం రూ.75వేలతో ఏర్పాటు చేశారు. ఇందులో 20కి పైగా పనిచేయడం లేదు. వీటిని ఉపయోగంలోకి తెస్తే రైతులకు మెరుగైన సేవలందించడంతో పాటు పనులు శరవేగంగా సాగేందుకు ఆస్కారముంది.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం
- తిమ్మప్ప, ఏఓ, మడకశిర

చాలా చోట్ల పనిచేయడం లేదని తెలిసింది. కొన్ని మరమ్మతు చేయాల్సి ఉంది. ఇంటర్‌నెట్ సౌకర్యం ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ విషయాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తాం.

విద్యావనరుల కేంద్రం.. బహు సుందరం

గోడలపై దేశనాయకుల చిత్రాలతో తీర్చిదిద్దిన మండల విద్యా వనరుల కేంద్రం

పెనుకొండ, న్యూస్‌టుడే: శిథిలావస్థకు చేరిన మండల విద్యాశాఖాధికారి కార్యాలయం గత ఐదేళ్ల వైకాపా పాలనలో నిధులివ్వకపోవడంతో అధ్వానంగా ఉండేది. ప్రస్తుతం కూటమి పాలనలో రూ.5లక్షల నిధులు మంజూరు చేశారు. మంజూరైన నిధులతో శిథిలావస్థకు చేరిన కార్యాలయం పైకప్పు, విద్యుత్ సౌకర్యం, మరుగుదొడ్లు, ఇతర మౌలిక సదుపాయాలు సమకూర్చారు. కర్యాలయ భవనం మరమ్మతులు పూర్తి చేయించారు.

ఉపాధ్యాయుల చొరవతో దేశ నాయకుల చిత్రాలు

కార్యాలయం మరమ్మతులు పూర్తవ్వడంతో ఇటీవల పలువురు ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు దాతృత్వంతో భవనం గోడలపై అంబేడ్కర్, సావిత్రిబాయిపులే, జ్యోతిరావుపులె, సర్వేపల్లి రాధాకృష్ణన్, జవహర్‌లాల్‌నెహ్రూ, అల్లూరిసీతారామరాజు, సుభాష్‌చంద్రబోస్, భగత్‌సింగ్, మహాత్మాగాంధీ తదితర దేశనాయకుల చిత్రాలు గీయించి సుదరంగా తీర్చిదిద్దారు. ఒక్కో చిత్రానికి రూ.2500 నుంచి 6వేల వరకు వెచ్చించారు. మండల విద్యాధికారులు సైతం చిత్రాలు, మండల పటం వేయించారు. బుక్కపట్నం మండలంలోని గూనిపల్లి గ్రామానికి చెందిన చిత్రకారుడు నరసింహులు సైతం కార్యాలయం పేరు ఉచితంగా రాశారు.

రోడ్డు ప్రమాదాలు తగ్గించడమే లక్ష్యం

మాట్లాడుతున్న ఎస్పీ సతీశ్‌కుమార్

పెనుకొండ, న్యూస్‌టుడే: రహదారి ప్రమాదాల్లో ప్రాణనష్టం అధికంగా జరుగుతోందని, ప్రమాదాలను తగ్గించడమే లక్ష్యంగా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ సతీశ్‌కుమార్ సూచించారు. ఆదివారం పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో సబ్‌డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్సైలతో సమావేశం నిర్వహించారు. ప్రమాదాలపై వాహనదారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. అతి వేగంతో, మద్యం తాగి వాహనాలు నడిపేవారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పని సరిగా శిరస్త్రాణం ధరించేలా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. కారులో ప్రయాణికులు సీటుబెల్టు వినియోగంపై వాహనతనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. ప్రమాదాలకు కారణమయ్యే బ్లాక్‌స్పాట్‌లు గుర్తించి, ప్రత్యేక నిఘా ఉంచాలని, పాఠశాలలు, కళాశాలల పరిసరాల్లో ట్రాఫిక్ నియంత్రణ కట్టుదిట్టం చేయాలని సూచించారు. ప్రమాదాల నివారణలో పోలీసుల పాత్రతో పాటు, ప్రజల సహకారం అవసరమని, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ప్రతి పౌరుడి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ నరసింగప్ప, డీటీఆర్బీ సీఐ లక్ష్మీకాంత్‌రెడ్డి, సీఐలు రాఘవన్, శేఖర్, రాజ్‌కుమార్, సుబ్రహ్మణ్యం, పలువురు ఎస్సైలే పాల్గొన్నారు.

క్రీడాకారిణి దీపికకు సన్మానం

సన్మానిస్తున్న మద్దనకుంటప్ప, లక్ష్మీనరసప్ప

గుడిబండ, న్యూస్‌టుడే: భారత అంధుల క్రికెట్ జట్టు కెప్టెన్ దీపికను సింగిల్ విండో అధ్యక్షుడు మద్దనకుంటప్ప, మండల తెదేపా కన్వీనర్ లక్ష్మీనరసప్పలు మందలపల్లిలో సత్కరించారు. మద్దనకుంటప్పకు దీపిక సమీప బంధువు కావడంతో ఆయన స్వగృహానికి ఆదివారం ఆమె వచ్చారు. దీంతో మద్దనకుంటప్ప, సతీమణి భాగ్యమ్మ, మాజీ సర్పంచి సన్నమారెప్ప, మంజునాథ్, నాగరాజు, శ్రీధర్, వీరక్యాతప్ప తదితరులు ఆమెను సత్కరించారు. భారత క్రికెట్ మండలి ద్వారా ఆడి మరొక్కసారి ప్రపంచ గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు.

పనులు ప్రారంభిస్తున్న తెదేపా నాయకులు

రహదారి నిర్మాణానికి శ్రీకారం

రొద్దం, న్యూస్‌టుడే : మండలంలోని రాచూరు నుంచి నారనాగేపల్లికి రూ.80 లక్షలతో చేపడుతున్న బీటీ రోడ్డు పనులను ఆదివారం తెదేపా సీనియర్ నాయకులు మాధవనాయుడు, మండల కన్వీనర్ నరహరి, సింగిల్ విండో అధ్యక్షుడు వీరాంజనేయులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రి సవిత సహకారంతో మండలంలోని కుర్లపల్లి నుంచి నాగిరెడ్డిపల్లి, చెరుకూరు నుంచి ఉప్పరపల్లి రోడ్డు నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వెంకటరామిరెడ్డి, ఆంజనేయులు, పాతర్లపల్లి నరసింహులు, రొద్దం మాజీ సర్పంచి అశ్వర్థనారాయణ, హరీష్, రుద్రప్రసాద్ పాల్గొన్నారు.

చిన్నపాటి జాగ్రత్తలతో..

ఆస్తులు భద్రం

అగ్నిమాపక అధికారి విజయ్‌కుమార్‌తో ముఖాముఖి

మడకశిర గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రస్తుతం ఎండల తీవ్రత అధికంగా ఉంది. దీనికి తోడు గాలి కాలం కావడంతో తరచూ అగ్ని ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. విలువైన తోటలు, ఆస్తులు దగ్ధమై లక్షల రూపాయలు నష్టపోవాల్సి వస్తోంది. ప్రమాదం చోటు చేసుకోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మడకశిర అగ్నిమాపక అధికారి విజయ్‌కుమార్ ఏమన్నారంటే..

"మడకశిర నియోజకవర్గ వ్యాప్తంగా వక్క, ఆకు, కొబ్బరి, దానిమ్మ, సపోటా, జామ తదితర తోటలు అధికంగా ఉన్నాయి. వీటితో పాటు కొండలు, గుట్టలు, అటవీ ప్రాంతానికి ఆనుకుని చింత తోపులు ఉన్నాయి. ప్రస్తుత ఎండా కాలంలో ఎండుగడ్డి అధికంగా ఉండడంతో ఆకతాయిల చేష్టలతో అగ్నిప్రమాదాలు జరుగుతున్నాయి."

తోటల వద్ద మంటలు వ్యాపించకుండా ఏమి చేయాలి..

★ ప్రధానంగా వక్క, ఆకుతోటలు, దానిమ్మతోటలకు మంటలు వ్యాపించకుండా ఉండాలంటే తోటల చుట్టూ ఆరేడు మీటర్ల వరకు ఎండుగడ్డి లేకుండా ట్రాక్టరుతో దుక్కిచేసి శుభ్రంగా తొలగించాలి. ★ ముందు జాగ్రత్తగా తోటల వద్ద తొట్టెల్లో నీటిని నిల్వ ఉంచుకోవాలి. మంటల ప్రారంభంలోనే నీటిని చెల్లి అదుపుచేయవచ్చు. ★ ఇసుక, ఆకు కొమ్మలతో కూడా మంటలు అదుపుచేయవచ్చు.

ఇళ్లలో గ్యాస్ ప్రమాదాలు జరగకుండా..

★ భోజనం వండిన వెంటనే గ్యాస్ రెగ్యులేటర్‌ను ఆఫ్ చేయాలి. అధిక ఉష్ణోగ్రత ఉండే ప్రాంతంలో గ్యాస్ సిలిండర్ ఉంచరాదు.

★ గ్యాస్ ప్రమాదం చోటుచేసుకున్నప్పుడు లైట్ వేయడం కాని, ఆర్పడం కాని చేయకూడదు. అలా చేస్తే స్పార్క్ అయ్యి స్టౌ కూడా పేలుతుంది. ఇళ్లలో బక్కెట్లలో నీటిని నింపి ఉంచాలి. మంటలును ప్రారంభ దశలోనే మగ్గుతో నీరు చెల్లి అదపు చేసేందుకు వీలుంటుంది. పై జాగ్రత్తలతో చాలా వరకు ఆస్తినష్టం, ప్రాణాపాయం జరగకుండా నివారించుకోవచ్చని వివరించారు.

నిండిన వ్యర్థాలు.. కదలని మురుగు

పెనుకొండ రోడ్డు పట్టుగూళ్ల మార్కెట్ నుంచి ఆర్టీసీ కాలనీకి వెళ్లే రహదారిలో మురుగు కాలువ ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండి కదలనంటోంది. మురుగు నిలవడంతో దుర్వాసన వెదజల్లుతోందని, దోమలకు నిలయంగా మారిందని స్థానికులు వాపోతున్నారు. మున్సిపల్ పారిశుద్ధ్య అధికారి శంకర్‌ను వివరణ కోరగా పరిశీలించి వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు.

- న్యూస్‌టుడే, హిందూపురం సాంస్కృతికం

(c) eenadu

పుట్టపర్తి

• పుట్టపర్తి • ధర్మవరం • కదిరి • రాప్తాడు

వైభవంగా జ్యోతుల మహోత్సవం

పుట్టపర్తి, న్యూస్‌టుడే: పోతలయ్య, చెన్నకేశవస్వామి, బంగారు లింగమయ్య స్వాములను ప్రత్యేకంగా అలంకరించి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఆదివారం ఉదయం పుట్టపర్తి పరిసరాల్లోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన వేలాది మంది భక్తులు జ్యోతులు, బోనాలు ఎత్తుకుని, ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. వేలాది మంది భక్తులతో ఆలయం కిటకిటలాడింది. భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. మూడు రోజుల పాటు జరిగిన ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి.

ప్రత్యేక అలంకరణలో పోతలయ్యస్వామి

కాటికోటేశ్వరుడికి విశేష పూజలు

తాడిమర్రి, న్యూస్‌టుడే: మండల పరిధిలోని చిల్లవారిపల్లి గ్రామ సమీపంలో ఉన్న కాటికోటేశ్వర క్షేత్రంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పురోహితుడు బాలకిశ స్వామిని ప్రత్యేకంగా అలంకరించి కుంకుమార్చన, తైలాభిషేకం చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. పలువురు భక్తులు గుడిగుండం వద్ద పూజలు చేసి తలనీలాలు సమర్పించారు.

ప్రత్యేకాలంకరణలో మూలవిరాట్

మేమున్నాం.. మీకు తోడుగా

పుట్టపర్తి: 80085 73039
కదిరి: 80085 73033
ధర్మవరం: 99596 98222

సమస్య: పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల మైదానంలోకి వెళ్లేదారిలో చెత్త వేస్తుండటంతో దుర్వాసన వస్తోంది. - నాగేంద్ర, శంకర్, వార్డు
సమస్య: శారదానగర్‌లో డ్రైనేజీకాలువలో మురుగు పేరుకుపోయి రోడ్డుపై ప్రవహిస్తోంది. చెత్త కూడా తొలగించడం లేదు. - కాలనీవాసులు
సమాధానం: పారిశుద్ధ్య కార్మికులను పంపి శుభ్రం చేయిస్తాం. కాలువలో మురుగు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకుంటాం.
పై ప్రశ్నలకు పట్టణ శానిటేషన్ అధికారి శ్యామ్‌సన్ సమాధానమిచ్చారు
- న్యూస్‌టుడే ధర్మవరం పట్టణం

గ్రామీణ రహదారులు.. ప్రయాణానికి అవస్థలు

గుంతలు పడి ప్రయాణికుల తీవ్ర ఇక్కట్లు

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: ధర్మవరం మండల పరిధిలోని పలు గ్రామాల రహదారులు కంకర తేలి అధ్వానంగా మారాయి. మరమ్మతులు చేపట్టి, నూతన రహదారులు నిర్మించకపోవడంతో ప్రజలు రాకపోకలు సాగించేందుకు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గ్రామాల నుంచి పట్టణానికి వచ్చే ప్రధాన దారులు శిథిలావస్థకు చేరినా పట్టణానికి రావాలంటే ఇదే దారుల్లో ప్రయాణించాల్సివస్తోంది. నిధుల కొరత కారణంగా అభివృద్ధి తాత్కాలికంగా గుంతలను పూడ్చివేశారు. కానీ శాశ్వత పరిష్కారం చూపలేదు. కనీస మరమ్మతులు చేపట్టక గత పదేళ్లుగా ఈ రహదారుల్లో ప్రమాదాలు ఎక్కువవుతున్నాయని ప్రయాణికులు వాపోతున్నారు. దీనికితోడు దారిలోని మలుపులు ప్రమాదకరంగా మారాయి. ఇరువైపులా కంపచెట్లు, పిచ్చిమొక్కలు పెరిగి చోదకులకు ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

ఈ గ్రామాల ప్రజలకు తిప్పలు

• తుమ్మల, మల్లేనిపల్లి, సుబ్బారావుపేట గ్రామాల ప్రజలు పట్టణానికి రావాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 5 కి.మీ. మేర గుంతలు పడిన దారుల్లోనే ప్రయాణించాల్సి వస్తోంది. గతంలో పలుమార్లు ఈదారి మరమ్మతులకు నిధులు మంజూరైనా పనులు చేపట్టలేదు.
• మల్లాకాలువ, నడిమిగడ్డపల్లి గ్రామాల నుంచి నిత్యం వందలాది మంది విద్యార్థులు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు వివిధ వాహనాల్లో వస్తుంటారు. ఈదారిలో మూడు, నాలుగు కి.మీ. మేర ఆనవాళ్లు లేవు. మట్టిరోడ్డే దర్శనమిస్తోంది. నూతన రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా పనులు నత్తనడకన సాగుతున్నాయని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
• కత్తెకోట్ల, తండాలకు వెళ్లే దారులకు ఏళ్లుగా మరమ్మతులు చేపట్టకపోవడంతో గోతులు దర్శనమిస్తున్నాయి. ఇటీవల కూటమి ప్రభుత్వం వాటి నిర్మాణాలకు నిధులు మంజూరు చేసినా పనులు వేగంగా సాగడంలేదు.

అధ్వానంగా మల్లేనిపల్లి- ధర్మవరం ప్రధాన రహదారి

ప్రతిపాదనలు పంపాం

మండల పరిధిలోని పలు గ్రామాల్లో నూతన దారులు ఏర్పాటు చేయాలని, వాటికి అవసరమైన నిధుల కోసం ప్రతిపాదనలు పంపాం. మంజూరు కాగానే పనులు ప్రారంభించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేస్తాం.
- పాండురంగారెడ్డి, పంచాయతీరాజ్ డీఈ

ఖాద్రీశుని సేవలో కర్ణాటక ఉపలోకాయుక్త

కదిరి, న్యూస్‌టుడే: శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామిని ఆదివారం కర్ణాటక ఉప లోకాయుక్త, జస్టిస్ కె.ఎన్.ఫణీంద్ర కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ సందర్శనకు వచ్చిన ఉప లోకాయుక్తకు ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ప్రదక్షిణల అనంతరం గర్భాలయంలోని మూలవిరాట్‌ను దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆలయంలోని అమృతవల్లి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ విశిష్టత, ప్రాశస్త్యాన్ని తెలుసుకున్నారు. ఉపలోకాయుక్తకు శ్రీవారి చిత్రపటం, శేషవస్త్రం, తీర్థప్రసాదాలను ఆలయ ఈవో శ్రీనివాసరెడ్డి, అర్చకులు అలంకార్‌స్వాములు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రెడ్డిశేఖర్, ఆర్‌ఐ విజయ్, తదితరులు పాల్గొన్నారు.

ఉపలోకాయుక్త ఫణీంద్రకు స్వామివారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఆలయ సిబ్బంది

ఉత్తమ ఫలితాలు సాధించాలి

తాడిమర్రి: వచ్చే నెలలో జరిగే పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని భాజపా అసెంబ్లీ కన్వీనర్ గోపాల్‌రెడ్డి తెలిపారు. తాడిమర్రి కేజీబీవీ విద్యార్థినులు మన్‌కీబాత్ కార్యక్రమంలో నిర్వహించిన క్విజ్ పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచారు. ఆదివారం విజేతలకు భాజపా నాయకులు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో భాజపా మండల అధ్యక్షుడు దేవర రాము, నాయకులు పోతులయ్య, చిన్న పార్థసారథి, నరేశ్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి సామగ్రి వితరణ

గాండ్లపెంట, న్యూస్‌టుడే: మండల పరిధిలోని కటారుపల్లి విశ్వవేమన కొండలో భక్తులకు నిత్యాన్నదానం చేయడానికి రూ. పదివేల విలువైన గ్యాస్ సామగ్రిని ఆదివారం స్వర్ణభారత్ గ్యాస్ యాజమాని కత్తి భరద్వాజ్ అందజేశారు.

జిల్లా కోర్టు ఏర్పాటుకు స్థల పరిశీలన

పుట్టపర్తి, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయి జిల్లా కేంద్రమైన పుట్టపర్తిలో జిల్లా కోర్టు కాంప్లెక్స్ సామూహిక భవన నిర్మాణాల నిమిత్తం అవసరమైన స్థలం సత్వరమే కేటాయిస్తే, నివేదిక పంపాలని జిల్లా జడ్జి భీమారావు రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఆదివారం ఆయన, ఆర్డీవో సువర్ణ, పుట్టపర్తి జూనియర్ సివిల్ జడ్జి ముజీబ్ పసవల సయ్యద్‌తో కలిసి స్థలాన్ని పరిశీలించారు. బీడుపల్లి రహదారిలో హైస్కూల్‌కు సమీపంలోని స్థలం, విద్యుత్తు సబ్‌స్టేషన్ వద్ద కోర్టు ఏర్పాటుకు భూములను పరిశీలించారు. రెండు ప్రాంతాల్లో 11 ఎకరాల భూమిని ఖరారు చేయాల్సి ఉంది. ఒక చోట కోర్టు కాంప్లెక్స్, జడ్జి వసతి గృహాల నిర్మాణానికి అనువుగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు రహమాన్, యదుభూషణ్, చంద్రశేఖర్, కృష్ణప్రసాద్, శ్రీనివాస్, కిరణ్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

స్థలాన్ని పరిశీలిస్తున్న జిల్లా జడ్జి భీమారావు, ఆర్డీవో సువర్ణ తదితరులు

మానసిక ఉల్లాసానికే హ్యాపీ సండే

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: వైనం దిన కార్యక్రమాలతో ప్రజలు నిత్యం ఒత్తిడితో జీవనం సాగిస్తుంటారని, వారి సంతోషం కోసం రాష్ట్ర ప్రభుత్వం హ్యాపీ సండే కార్యక్రమాన్ని చేపడుతోందని ఇంఛార్జి కమిషనర్ సాయిక్రిష్ణ, మెప్మా అధికారి విజయ్‌భాస్కర్ తెలిపారు. ఆదివారం పట్టణంలోని శివానగర్ పార్కులో మున్సిపాలిటీ అధికారులు హ్యాపీ సండే కార్యక్రమాన్ని నిర్వహించారు. సమావేశంలో పలువురు కళాకారులు చేసిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సినిమా పాటలకు యువకులు హుషారుగా డ్యాన్సులు వేశారు. కళాకారులను అధికారులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో వార్డు సచివాలయ మేనేజర్ అశ్వర్థనారాయణ, పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మెప్మా అధికారి విజయభాస్కర్

గోడపత్రాల విడుదల

ధర్మవరం, న్యూస్‌టుడే: ప్రధాని నరేంద్రమోదీ మన్‌కీ బాత్ ప్రసంగం ఒక విజ్ఞాన తరంగమని భాజపా పట్టణ ఉపాధ్యక్షుడు కేకే చంద్రమౌళి అన్నారు. ఆదివారం స్థానిక 11వ వార్డులో మన్‌కీ బాత్ ప్రచార గోడపత్రాలను భాజపా నాయకులు విడుదల చేశారు. ప్రధాని నరేంద్రమోదీ మన్‌కీ బాత్ ప్రసంగం విన్న తరువాత నిర్వహించే పోటీ పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో భాజపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మనసులో మాట ప్రచార గోడపత్రాలను ఆవిష్కరిస్తున్న భాజపా నాయకులు

ఒరిగిన స్తంభం.. ప్రమాదకరం

నంబులపూలకుంటలోని దిగువపల్లి రోడ్డు నుంచి నాగార్జున స్కూల్‌కు వెళ్లే దారిలో విద్యుత్తు స్తంభం ఒక వైపు వాలి ప్రమాదకరంగా మారింది. గాలివానలు వచ్చిన సమయంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు భయపడుతున్నారు. స్తంభం ఒరగడంతో తీగలు కూడా కింద వేలాడుతున్నాయి. దీనిపై విద్యుత్తు ఏఈ సాలేహుబాషను వివరణ కోరగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.
- న్యూస్‌టుడే, నంబులపూలకుంట

లక్షలు వెచ్చించారు.. మూలన పడేశారు

చెత్త నుంచి సంపద సృష్టించడంలో భాగంగా చెత్తలో వచ్చే ప్లాస్టిక్ వస్తువులను నుర్చుడి చేసేందుకు బుక్కపట్నం మేజర్ పంచాయతీలో రూ. లక్షలు వెచ్చించి తెచ్చిన యంత్రాన్ని మూలన పడేశారు. దీంతో తుప్పుపట్టే పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి ఉపయోగిస్తే సంపద సృష్టి లక్ష్యం నెరవేరేలా దోహదపడుతుందని స్థానికులు అంటున్నారు. విషయం ఎంపీడీవో శ్రీనివాసులు దృష్టికి తీసుకెళ్లగా యంత్రాన్ని పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. - న్యూస్‌టుడే, బుక్కపట్నం

నీటి వృథా.. పట్టదా!

నంబులపూలకుంటలో గత కొన్ని రోజులుగా మంచినీళ్లు సరఫరా అయిన ప్రతిసారి వీధి కుళాయిల నుంచి నీరు వృథాగా పోతోంది. ఈ నీరు కదిరి- రాయచోటి మెయిన్‌రోడ్డుపైకి చేరడంతో ప్రయాణికులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. నీటి వృథాను ఎవరూ పట్టించుకోవడంలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి రమేశ్‌ని వివరణ కోరగా వృథా కాకుండా చర్యలు చేపడతామన్నారు. - న్యూస్‌టుడే, నంబులపూలకుంట

విద్యార్థిని మృతిపై న్యాయం చేయాలి

తలుపుల, న్యూస్‌టుడే: నా కుమార్తె దీపిక విజయవాడ సిద్ధార్థ మెడికల్ కళాశాలలో పీజీ చదువుతూ ఈనెల 5న ఆకస్మికంగా మృతి చెందడంపై అనుమానాలు ఉన్నాయని ఆమె తండ్రి రాష్ట్ర మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కోదండరామిరెడ్డి ఓ ప్రెస్ నోట్‌లో పేర్కొన్నారు. ఆయన తలుపుల మండలం మాడికవాండ్లపల్లిలో పెళ్లి చేసుకొన్నారు. ఆయన కుమార్తె దీపిక మృతదేహాన్ని కూడా ఇక్కడే ఖననం చేశారు. 18 రోజులైనా ఇంత వరకు పోస్టుమార్టమ్ రిపోర్టు ఇవ్వలేదన్నారు. వీటిపై పలు సందేహాలు ఉన్నాయన్నారు. నారా లోకేష్, సత్యకుమార్ యాదవ్‌లు స్పందించి సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి తనకు న్యాయం చేయాలని కోరారు.

అడవులకు నిప్పు.. పర్యావరణానికి ముప్పు

తలుపుల, బుక్కపట్నం, న్యూస్‌టుడే: తలుపుల, బుక్కపట్నం మండలాల్లో పచ్చని అడవులు అగ్నికి ఆహుతి అవుతున్నాయి. తలుపుల మండలంలోని తురకవాండ్లపల్లి వద్ద నిగ్గిడి అభయారణ్యం చాలా వరకు కాలిపోయింది. బుక్కపట్నం మండలంలోని మల్లప్పకొండ, బొమ్మనయ్యకొండలకు నాలుగు రోజుల కిందట మంటలు అంటుకున్నాయి. దీంతో కొండకు దిగువన ఉన్న మామిడి తోటలకు ఎక్కడ మంటలు వ్యాపిస్తాయోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. కాత సమయంలో అగ్నికీలలు తోటలను ఎక్కడ దహించి వేస్తాయోనని వాపోతున్నారు. రాత్రి పగలు కాపలా ఉంటున్నారు. ఒకవైపు అటవీ అధికారులు ఆర్పే ప్రయత్నం చేస్తున్నా మంటలు అదుపు కాలేదు. అధికారులు సమస్య నివారణ చర్యలు చేపట్టి ఆదుకోవాలని కోరుతున్నారు.

అదుపులోకి తెస్తాం..

నిగ్గిడి, కుంట్లపల్లి బీట్లలో అడవికి నిప్పంటుకుంది. 15 మంది కూలీలతో, సిబ్బంది మంటలను ఆర్పుతున్నా, గాలులకు వీలు కావడం లేదు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటంతో మంటలను ఆర్పడం కష్టంగా మారింది. రాత్రివేళ కూడా అడవుల్లోనే ఉండాల్సి వస్తుంది. మంటలను పూర్తిగా అదుపులోకి తెస్తాం. అడవులకు నిప్పు పెట్టకుండా సమీప అటవీ గ్రామాల ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.
- గుర్రప్ప, ఎఫ్ఆర్వో, కదిరి

ఉచిత కంటి వైద్య శిబిరం

కదిరి: చిన్నపిల్లాడిని పరీక్షిస్తున్న వైద్యురాలు

ధర్మవరం, న్యూస్‌టుడే: ఉచిత కంటి వైద్య శిబిరాల నిర్వహణకు దాతల సహకారం మరువలేనిదని లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు ఆకులేటి రమేష్‌బాబు అన్నారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వబాలుర ఉన్నత పాఠశాల ఆవరణంలో లయన్స్‌క్లబ్, లయన్స్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి దాతగా వ్యవహరించిన బండి వేణుగోపాల్‌ను లయన్స్ క్లబ్ ప్రతినిధులు సన్మానించారు. 65 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 45 మందికి కంటి ఆపరేషన్లు అవసరమన్నారు. వారికి పట్టణంలోని లయన్స్ కంటి ఆసుపత్రిలో ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తామని అన్నారు. డా.జాహ్నవి, లయన్స్ కంటి ఆసుపత్రి వ్యవస్థాపకుడు వెంకటస్వామి, వేణుగోపాలాచార్యులు, గూడూరు మోహన్‌దాస్, కుళ్లాయప్ప, రాధాకృష్ణ, పల్లెం వేణుగోపాల్, పుట్లూరు నరసింహులు, నాగేంద్ర, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కదిరిలో చిన్నపిల్లలకు..

కదిరి, న్యూస్‌టుడే: పట్టణంలోని రిషిత చిన్నపిల్లల ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత చైల్డ్ డెవలప్‌మెంట్ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్య శిబిరంలో తిరుపతి సంజీవ్ చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్ వైద్యులు పాల్గొని సుమారు 70 మంది పిల్లలను పరీక్షించారు. పిల్లల్లో మాటలు, వినికిడి, బుద్ధి మాంద్యం గల పిల్లలను పరీక్షించారు. కార్యక్రమంలో వైద్య నిపుణులు మదన్‌కుమార్, శైలజ, ప్రసన్నకుమార్‌రెడ్డి, లావణ్యతో పాటు సంజీవ్, తాహిర్‌అలీ, అజంతుల్లా, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక లాభాలు

గాండ్లపెంట, న్యూస్‌టుడే: ప్రియాన్ డ్రై సోయింగ్ విధానంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించడంతో అధిక దిగుబడితో పాటు లాభాలు పొందవచ్చని ఎన్ఎఫ్ఏ దామోదర్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని పీఎం తండా యూనిట్‌గా మల్లమీదపల్లి పంచాయతీ కుమ్మరవాండ్లపల్లిలో రైతులకు అవగాహన కల్పించారు. ద్వారకనాథ్‌నాయుడు, గోపాల్‌కు చెందిన పొలంలో ఈ విధానంలో అనుములు, కంది, సజ్జ, గోరుచిక్కుడు, ఆముదంతో పాటు 20 రకాల బయోడైవర్సిటీ విత్తనాలను కలిపి బీజామృతంతో శుద్ధి చేసి ఘన జీవామృతంతో పాటు పొలంలో వేశారు. ఇలా చేయడం వల్ల వేసవిలో భూవేడి తాపానికి తట్టుకొని ప్రధాన పంటలకు కావాల్సిన పోషకాలు అందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కుమారప్ప, భాస్కరనాయుడు, సుధాకర్‌రెడ్డి, సునీత, రైతులు కుసుమానంద్‌నాయుడు, చంద్రమల్లప్పనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పొలంలో విత్తనాలు చల్లుతున్న వ్యవసాయ సిబ్బంది

'ఎస్టీ జాబితాలో సాధనకు ఉద్యమబాట'

మాట్లాడుతున్న వాల్మీకి సేవ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బంగారు కృష్ణమూర్తి

ఓబుళదేవరచెరువు, న్యూస్‌టుడే: వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చడానికి ఉద్యమబాట పట్టాలని వాల్మీకి సేవ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బంగారు కృష్ణమూర్తి పిలుపునిచ్చారు. వాల్మీకి సంఘం రాయలసీమ జిల్లాల మహిళా విభాగం అధ్యక్షురాలు మిట్టపల్లి నాగవేణి అధ్యక్షతన ఆదివారం మండల కేంద్రంలోని మేల్కో వాల్మీకి కార్యక్రమం నిర్వహించారు. వాల్మీకి విగ్రహం నుంచి అంబేడ్కర్ కూడలి వరకు ర్యాలీ చేశారు. దాదాపు ఆరు దశబ్దాలుగా వాల్మీకి బోయలు ఎస్టీ రిజర్వేషన్ కోల్పోయి సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా వెనుకబడ్డారన్నారు. కర్ణాటకలో ఎస్టీలుగా, ఏపీలో కొన్ని జిల్లాల్లో బీసీలుగా, కొన్ని జిల్లాల్లో ఎస్టీలుగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి రాష్ట్రఅధికార ప్రతినిధి మేకలశివప్రసాద్, కార్యదర్శి ఆనంద్, జిల్లా నాయకులు శ్రీరాములు, సుదర్శన్, చిన్ననరసింహులు, పరుశురాం, మల్లెంఅశోక్, మనోహర్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

కదిరి, న్యూస్‌టుడే: పట్టణంలో ఆర్టీసీ విమరణ ఉద్యోగి ఉస్మాన్‌ఖాన్ అంత్యక్రియలకు ఆర్థిక సాయం అందజేశారు. ఉస్మాన్‌ఖాన్ ఆదివారం తెల్లవారు జామున మృతి చెందారు. దీంతో విరమణ ఉద్యోగులు సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. అంత్యక్రియలకు ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రూ.5వేలు, తెదేపా కార్యనిర్వాహణ కార్యదర్శి పవన్‌కుమార్‌రెడ్డి రూ.5వేల సాయం చేశారు. ఈ మొత్తాన్ని ఉస్మాన్‌ఖాన్ కుమారుడికి అందజేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు ఎం.బాషా, హరిమోహన్, నర్సింగరావులు పాల్గొన్నారు.

మహిళా చట్టాలు పక్కాగా అమలు చేయాలి

పుట్టపర్తి, న్యూస్‌టుడే: మహిళలు పోరాడి సాధించుకున్న చట్టాలు పక్కాగా అమలు చేయాలని, లేని పక్షంలో ఉద్యమిస్తామని ప్రగతి శీల మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు లక్ష్మి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పద్మ పిలుపునిచ్చారు. ఆదివారం ఎన్ఎఫ్ఐడబ్ల్యూ, మహిళ సమైక్య జిల్లా కమిటీ ప్రగతిశీల జిల్లా కమిటీ సమావేశం షాదీమహల్‌లో జిల్లా అధ్యక్షురాలు జయలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. జిల్లా నూతన కమిటీని 25 మందితో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకురాలు విమల, శ్రీదేవి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రామోత్సవం

బత్తలపల్లి, న్యూస్‌టుడే: బత్తలపల్లి మండలం యర్రాయపల్లి గ్రామంలో పసలకాటమయ్యస్వామి, సంగాలప్పస్వామి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. సాయంత్రం స్వాములను పూలతో అలంకరించి పూజలు చేశారు. అనంతరం గ్రామస్థుల ఆధ్వర్యంలో ఊరేగించారు. వేడుకను చూసేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

ఊరేగింపులో పసలకాటమయ్య, సంగాలప్ప

బ్యాడ్మింటన్‌లో సత్తాచాటుతున్న పుష్పాంజలి

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీకామ్ ప్రథమ సంవత్సరం చదువుతున్న పుష్పాంజలి బ్యాడ్మింటన్ క్రీడలో సత్తాచాటుతోంది. బ్యాడ్మింటన్‌లో పోటీల్లో రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచి ఎస్కే యూనివర్సిటీ జట్టుకు ఎంపికై జాతీయ స్థాయి పోటీల్లో రాణిస్తోంది. ఫిబ్రవరి 10న చెన్నై యూనివర్సిటీలో జరిగిన ఆల్ ఇండియా బ్యాడ్మింటన్ పోటీల్లో ఎస్‌కేయూ జట్టుకు ప్రాతినిధ్యం వహించింది. గతంలో ఎస్‌కే యునివర్సిటీ బ్యాడ్మింటన్ జట్టు మొదటి రౌండ్ కూడా దాటలేదు. పుష్పాంజలి జట్టులో చేరిన తరవాత ఆ జట్టు వరుసగా మూడు రౌండ్లు గెలుపొందింది. ఇందులో పుష్పాంజలి కీలకపాత్ర పోషించింది.

ఇంటర్ నుంచే..

పట్టణంలో ఇంటర్ చదువుతున్న సమయంలోనే బ్యాడ్మింటన్‌లో ఆసక్తి చూపుతుండటంతో స్థానికంగానే ఆమె తల్లిదండ్రులు ప్రత్యేక శిక్షణ ఇప్పించారు. అండర్-17 విభాగంలో పలు వేదికల్లో జరిగిన పోటీల్లో పాల్గొని ట్రోఫీలు కైవసం చేసుకుంది. ఉత్తమ బ్యాడ్మింటన్ క్రీడాకారిణిగా రెండు సార్లు రాష్ట్రస్థాయిలో ఎంపికైంది. ఎస్‌కే యూనివర్సిటీ పరిధిలోని 30 అంతర్ కళాశాలల టోర్నమెంట్‌లో బెస్ట్ బ్యాడ్మింటన్ క్రీడాకారిణిగా ఎంపికై ఉన్నతాధికారుల నుంచి ప్రశంసలు, అవార్డులు అందుకుంది. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరిన తరవాత ప్రిన్సిపల్ ప్రభాకర్‌రెడ్డి, పీడీ ఆనంద్ సహకారంతో బ్యాడ్మింటన్‌లో చక్కగా రాణిస్తోంది. భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదిగి ప్రభుత్వ ఉద్యోగం సాధించి గ్రామీణ అమ్మాయిలకు బ్యాడ్మింటన్‌లో శిక్షణ ఇస్తానంటోంది పుష్పాంజలి.

ఉయ్యాలవాడ త్యాగం మరువలేనిది

పుట్టపర్తి, న్యూస్‌టుడే: దేశ స్వాతంత్రం కోసం బ్రిటిష్ పాలకులపై వీరోచితంగా పోరాడిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి త్యాగం మరువలేనిదని, నేటి తరానికి ఆదర్శమని డీఆర్వో సూర్యనారాయణరెడ్డి కొనియాడారు. ఆదివారం కలెక్టరేట్లో పర్యాటకశాఖ ఆధ్వర్యంలో నరసింహారెడ్డి వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పర్యాటకశాఖ మేనేజర్ ప్రతాప్‌రెడ్డి, అధికారులు అలీబాష, రామ్మోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న డీఆర్వో సూర్యనారాయణరెడ్డి, తదితరులు

క్రైమ్.. కార్నర్

కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య

ఓబుళదేవరచెరువు, న్యూస్‌టుడే: కుటుంబ కలహాలతో వివాహిత పద్మావతి(34) పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై మల్లికార్జునరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని గౌరాపురం గ్రామానికి చెందిన రాజశేఖర్‌రెడ్డి భార్య పద్మావతి ఆస్తుల విషయంలో కుటుంబ కలహాలతో శనివారం పరుగు మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. వెంటనే బంధువులు కదిరి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యచికిత్స కోసం బెంగుళూరుకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె ఆదివారం మృతి చెందారు.

జూదరుల అరెస్ట్

పుట్టపర్తి పట్టణం, న్యూస్‌టుడే: పుట్టపర్తి రూరల్ పరిధిలోని గంగిరెడ్డిపల్లి సమీపంలోని వ్యవసాయ పొలంలో ఆదివారం జూదం ఆడుతున్న 9 మందిని అరెస్ట్ చేసినట్లు సీఐ సురేశ్, ఏఎస్సై ప్రసాద్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.44,250 నగదు, 8 చరవాణులు, 5 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారని, వారిని కూడా త్వరలోనే అరెస్ట్ చేస్తామన్నారు. గంగిరెడ్డిపల్లికి చెందిన సురేశ్ గతంలో నేరాలకు పాల్పడుతుండడంతో తహసీల్దార్ సమక్షంలో రూ.1లక్ష పూచికత్తులో బెండోవర్ చేశామని, అయితే బెండోవర్ కాలంలో తిరిగి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడటం, నిబంధనలు ఉల్లంఘన కింద రూ.1లక్ష కట్టాలని లేదా ఆరు నెలలు జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపుతామని సీఐ తెలిపారు. బెండోవర్ నిబంధనలు ఉల్లఘించిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

యువకుడిపై కొడవలితో దాడి.. కేసు నమోదు

ధర్మవరం, న్యూస్‌టుడే: ధర్మవరం పట్టణంలోని కేతిరెడ్డికాలనీలో శనివారం రాత్రి వెంకటేష్ అనే యువకుడిపై అదే కాలనీకి చెందిన పుల్లప్ప అనే వ్యక్తి కొడవలితో దాడి చేసి గాయపరిచాడు. గాయపడిన వెంకటేష్‌ను స్థానికులు ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. పుల్లప్ప కుమార్తెతో వెంకటేష్ మాట్లాడేందుకు వచ్చాడని ఆగ్రహించి కొడవలితో పుల్లప్ప దాడి చేశాడని రెండోపట్టణ పోలీసులు తెలిపారు. వెంకటేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

In the Court of the Ist Addl. District Judge, Ananthapuramu
E.P. No: 282/2025 in Arbitration Case No: 303/2024
Between:
M/s Five Star Business Finance Limited, Chennai. Represented by its Authorized Signatory G.Giddaiah, Kurnool ...Petitioner / D.Hr
And
1. Kanchu Kommala Radhika
2. Kanchu Kommala Mahesh Babu
...Respondents / J.Drs
J.Dr. 1 కి Order 21 Rule 64 CPC Notice
J.Dr No 1: Kanchu Kommala Radhika, W/o K.Mahesh Babu, D.No. 13-35, Kammavaripalli (V), Reddipalli, Nallamada Mandal, Sri Sathyasai District.
డిక్రీ హోల్డరుకు రావలసిన E.P. మొత్తము వసూలు చేయటకు గాను E.P. లోని షెడ్యూలు ఆస్తిని జప్తు చేసియున్నారు. సదరు E.P. వేలము షరతులు నిర్ణయించుటకు మీ హాజరు నిమిత్తం 26-02-2026 వ తేదిన వాయిదా వేసి యున్నారు. అందుకు మీకు ఆక్షేపణలున్న యెడల సదరి దినము ఉదయం: 10:30 గం॥లకు స్వతహాగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టు యందు హాజరు కావలెను. లేనియెడల మీ పరోక్షము నందు పై అర్జీని విచారించి తీర్మానించెదరు.
(కోర్టు వారి ఉత్తర్వుల మెరకు)
P.Gopal Rao, Advocate
Anantapuramu, Cell : 9849429739

(c) eenadu

సందేహాలు అడిగేశారు..
రాణించేందుకు అడుగేశారు..!

- 'ఈనాడు-జిల్లా విద్యాశాఖ' ఆధ్వర్యంలో ఫోన్ ఇన్
- పది పరీక్షల వరకు కొనసాగనున్న కార్యక్రమం

న్యూస్‌టుడే, కలెక్టరేట్(శ్రీకాకుళం)

పది పరీక్షలపై విద్యార్థులు, తల్లిదండ్రుల్లో నెలకొన్న సందేహాల నివృత్తికి 'ఈనాడు-జిల్లా విద్యాశాఖ' ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఫోన్ ఇన్‌కు విశేష స్పందన లభించింది. విద్యార్థులు ప్రత్యేక తరగతుల అనంతరం నిపుణులకు కాల్ చేశారు. భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి జిల్లాతో పాటు విజయనగరం, విశాఖపట్నం, కర్నూలు, వైఎస్సార్ కడప, అన్నమయ్య, గుంటూరు, బాపట్ల జిల్లాల నుంచి కూడా ఫోన్ చేయడం విశేషం.

7 సబ్జెక్టులు.. 206 కాల్స్..

ఏడు సబ్జెక్టుల నిపుణులకు మొత్తం 206 మంది ఫోన్ చేసి సందేహాలు నివృత్తి చేసుకున్నారు. విశేష స్పందన రావడంతో కార్యక్రమాన్ని పరీక్షల ముందు రోజు వరకు కొనసాగించనున్నట్లు డీఈవో ఎ.రవిబాబు, ఉపవిద్యాశాఖాధికారిణి ఆర్.విజయకుమారి ప్రకటించారు. రోజూ రాత్రి 8 నుంచి 9 గంటల వరకు ఫోన్ ఇన్ జరుగుతుందని, విద్యార్థులు అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. జిల్లా పరీక్షల విభాగం మాజీ కార్యదర్శి జి.రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులతో ఫోన్‌లో మాట్లాడుతున్న విషయ నిపుణులు, చిత్రంలో ఉపవిద్యాశాఖాధికారి విజయకుమారి

చిత్రాలు, పట్టికలే కీలకం..

భౌతికశాస్త్రంలో 8 మార్కుల ప్రశ్నలు బాగా రాయాలంటే చిత్రాలు, పట్టికలు, సమీకరణాలు బాగా నేర్చుకోవాలి. చిత్రాలకు భాగాలు గుర్తించడంతో పాటు ఉపయోగాలూ సైడ్ హెడ్డింగ్స్ పెడుతూ రాయాలి. సూత్రాలు, యూనిట్లు రాయడం మర్చిపోకూడదు. నిర్వచనం అడిగితే పూర్తిగా రాయాలి. నమూనా ప్రశ్నపత్రాలు సాధన చేయాలి.
– ఆర్.రవికుమార్, కొత్తపేట జడ్పీ హెచ్ఎస్

➡ భౌతిక శాస్త్రం ☛ 29 ✆ 79897 99306

అక్షర దోషాలు ఉండకూడదు..

తెలుగులో మంచి మార్కులు సాధించాలంటే అక్షర దోషాలు లేకుండా మంచి దస్తూరితో రాయాలి. పద్యభాగంలో కవి పరిచయం, గద్యభాగంలో లేఖ, అభినందన పత్రం, కరపత్రం, సంభాషణలు వంటి ప్రక్రియలపై పట్టు సాధించాలి. వ్యాకరణాంశాలు బాగా చదవాలి. సృజనాత్మక ప్రశ్న-జవాబులు సాధన చేయాలి.
– పి.మోహనరావు, ఆమదాలవలస ప్రభుత్వ ఉన్నత పాఠశాల

➡ తెలుగు ☛ 20 ✆ 94404 40600

ఒక్క మార్కేగా అనుకోవద్దు..

రాబోయే 20 రోజుల్లో వీలైనన్ని గ్రాండ్ టెస్ట్‌లు రాయాలి. నమూనా ప్రశ్నపత్రాలు సాధన చేయాలి. ముఖ్యంగా ఒక మార్కు ప్రశ్నలపై ప్రత్యేక శ్రద్ధ అవసరం. రోజుకో అధ్యాయాన్ని రివిజన్ చేయాలి. కష్టంగా అనిపించే అంశాలను బాగా నేర్చుకోవాలి. పరీక్షల ముందు కొత్త అంశాలు నేర్చుకునేందుకు ప్రయత్నించకూడదు.
– జి.వి.ఎస్ శాస్త్రి, ఎం.సున్నాపల్లి ఎంపీయూపీ పాఠశాల

➡ గణితం ☛ 30 ✆ 99517 14135

సూచిక: సబ్జెక్టు: ➡ కాల్స్: ☛ ఫోన్ నంబరు: ✆

జీవక్రియలపై పట్టు అవసరం..

జీవశాస్త్రంలో పూర్తిస్థాయిలో మార్కులు రావాలంటే జీవక్రియలు పాఠ్యాంశంపై పట్టు సాధించాలి. కనీసం రెండు ప్రశ్నలు పరోక్ష పద్ధతిలో అడిగేందుకు అవకాశం ఉంది. ప్రశ్నపత్రాన్ని క్షుణ్నంగా చదివి రాయాలి. – కంచరాపు నాగరాజు, పొందూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల

➡ జీవశాస్త్రం ☛ 18 ✆ 99630 63720

బ్లూ ప్రింట్ గుర్తుంచుకోండి..

ఎస్ఈఆర్‌టీ విడుదల చేసిన బ్లూ ప్రింట్‌కు అనుగుణంగా చదివితే మంచి మార్కులొస్తాయి. సమాచార నైపుణ్యాల పైఛార్ట్, బార్ గ్రాఫ్‌లపై అవగాహన అవసరం. పర్వతాలు, నదులు మ్యాప్ పాయింట్ ద్వారా గుర్తించాలి. డీజీఈ నమూనా పత్రాలు ప్రాక్టీసు చేయాలి. – కరిమి రాజేశ్వరరావు, జేఆర్‌పురం జడ్పీ హెచ్ఎస్

➡ సాంఘికశాస్త్రం ☛ 45 ✆ 93908 99377

ప్రశ్నలు అర్థం చేసుకోవాలి..

ఆంగ్లంలో మంచి మార్కులు రావాలంటే వ్యాకరణాంశాల ప్రశ్నలు ఎక్కువసార్లు సాధన చేయాలి. ప్రశ్నపత్రంలో మూడు సెక్షన్లలో అన్నింటికీ సమాధానాలు రాయాలి. సీ సెక్షన్‌లో 10 మార్కుల ప్రశ్నలకు గరిష్ఠ మార్కులు పొందాలంటే తప్పుల్లేకుండా చూసుకోవాలి. ప్రశ్నపత్రాన్ని బాగా చదివి అర్థం చేసుకున్నాకే జవాబులు రాయాలి.
– పి.కాశీవిశ్వనాథరావు, డీ మత్స్యలేశం జడ్పీ హెచ్ఎస్

➡ ఆంగ్లం ☛ 19 ✆ 70131 43938

లేఖారచన కీలకం..

నమూనా ప్రశ్నపత్రాల సాధన ద్వారా హిందీలో సులువుగా మార్కులు తెచ్చుకోవచ్చు. ఆదర్శ్ విద్యార్థి, పర్యావరణ ప్రదూషణ్, త్యోహార్, పుస్తకాలయ్, దూరదర్శన్ పాఠ్యాంశాల నుంచే వ్యాసరూప ప్రశ్నలు వస్తాయి. లేఖారచనపై పట్టు సాధించాలి. అంతిమంగా మంచి దస్తూరితో పేపర్ ప్రజెంటేషన్ చక్కగా ఉండేలా చూసుకోవాలి.
– ఇ.సంతోష్‌కుమార్, పిరువాడ జడ్పీ హెచ్ఎస్

➡ హిందీ ☛ 44 ✆ 80740 81951

నేడు 'డయల్ యువర్ సీఎండీ'

గురుద్వారా(విశాఖపట్నం), న్యూస్‌టుడే: విద్యుత్తు సంబంధిత సమస్యలను మరింత వేగవంతంగా పరిష్కరించే లక్ష్యంతో విశాఖలోని ఈపీడీసీఎల్ కార్యాలయంలో సోమవారం 'డయల్ యువర్ సీఎండీ' కార్యక్రమం నిర్వహించనున్నట్లు సంస్థ సీఎండీ ఇమ్మడి పృథ్వీతేజ్ ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాకు చెందిన వినియోగదారులు 8688400499కు ఫోన్ చేసి సమస్యలను తెలియజేయవచ్చునని పేర్కొన్నారు. ఉదయం 10.30 నుంచి 11.30 వరకు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యుత్తు సరఫరాలో తరచూ అంతరాయాలు, హెచ్చుతగ్గులు, కొత్త సర్వీసుల జారీ, సరఫరా పునరుద్ధరణలో జాప్యం, ట్రాన్స్‌ఫార్మర్ల మార్పిడి తదితర సమస్యలపై ఫిర్యాదులను నేరుగా తన దృష్టికి తీసుకురావొచ్చునన్నారు.

3 నుంచి కూర్మనాథ క్షేత్రంలో డోలోత్సవాలు

గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజుకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఈవో వాసుదేవరావు తదితరులు

గార(శ్రీకూర్మం), విజయనగరం కంటోన్మెంట్, న్యూస్‌టుడే: శ్రీకూర్మంలోని కూర్మనాథ క్షేత్రంలో వచ్చే నెల మూడో తేదీ నుంచి డోలోత్సవాలు నిర్వహించనున్నారు. విజయనగరంలోని మాన్సాస్ ట్రస్టు కార్యాలయంలో గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతిరాజుకు వేడుకల ఆహ్వాన పత్రికను దేవస్థానం పాలకమండలి సభ్యులు, ఈవో వాసుదేవరావు, అర్చకుడు చామర్ల కిశోర్ అందజేశారు. అంతకు ముందు వారితో సమావేశమయ్యారు. ఆలయాభివృద్ధికి ప్రభుత్వ పరంగా చేపట్టిన కార్యాచరణపై చర్చించారు. కోనేరును శుభ్రం చేసి చుట్టూ మొక్కలు నాటడానికి ఇండిగో సంస్థ రూ.10 లక్షలు మంజూరు చేసిందని, మరికొన్ని మరమ్మతులు చేపట్టాలని నిర్ణయించినట్లు ఈవో తెలిపారు.

ఆక్రమిస్తాం.. అమ్మేస్తాం..!

- కాశీబుగ్గలో యథేచ్ఛగా ప్రభుత్వ భూముల కబ్జా

న్యూస్‌టుడే, కాశీబుగ్గ

అక్రమార్కులు ప్రభుత్వ భూములను ఆక్రమించేస్తున్నారు. పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘ పరిధిలో కొండల్ని సైతం ఆక్రమించేసి స్థలాలుగా మార్చేస్తున్నారు. అనంతపురం రెవెన్యూ పరిధిలో 200 పడకల కిడ్నీ పరిశోధన కేంద్రం, పాత జాతీయ రహదారి మధ్య ఉన్న డీ పట్టా స్థలాల్లో ఇప్పటికే చాలా వరకు చేతులు మారాయి. కిడ్నీ పరిశోధన కేంద్రం ఏర్పాటు, సమీపంలోనే కేంద్రీయ విద్యాలయానికి స్థలం కేటాయించడంతో భూముల విలువ అమాతం పెరిగిపోయింది. ఈ నేపథ్యంలో గత మూడేళ్లలో సుమారు రూ.5 కోట్ల విలువైన డీ పట్టా భూములు క్రయ విక్రయాలు జరిగినట్లు సమాచారం. పక్కనున్న రెవెన్యూ గ్రామాలకు సంబంధించిన సర్వే నంబర్లతో రిజిస్ట్రేషన్లు జరిగిపోతున్నాయి. ప్రస్తుతం ఆ స్థలాల్లో యథేచ్ఛగా నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. వీటిపై తరచూ వివాదాలు చోటు చేసుకుంటున్నా రెవెన్యూ, మున్సిపల్ యంత్రాంగం కన్నెత్తి చూడకపోవడం గమనార్హం. ఈ విషయమై పలాస తహసీల్దారు కల్యాణ చక్రవర్తి మాట్లాడుతూ డీ పట్టా భూముల క్రయ విక్రయాలు చేస్తే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

అనంతపురం వద్ద ప్రభుత్వ స్థలంలో చేపడుతున్న పనులు

రాళ్లు రప్పలు.. తప్పని తిప్పలు

హిరమండలంలోని నవతల-శ్రీముఖలింగం రహదారి దుస్థితి ఇది. కొద్ది నెలల కిందట రోడ్డు అభివృద్ధికి రూ.4 కోట్లు మంజూరుకాగా ఎమ్మెల్యే గోవిందరావు పనులు ప్రారంభించారు. 80 శాతం పూర్తి చేసి వదిలేశారు. దీంతో గొట్టాబ్యారేజీ నుంచి భగీరథపురం కాలనీ మధ్యలో కి.మీ. పొడవునా రాళ్ల దారిలో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పనులు త్వరగా పూర్తి చేయాలని భగీరథపురంకాలనీ, పింద్రువాడ, అక్కరాపల్లి, రెల్లివలస, అంబావల్లి, కిట్టాలపాడు గ్రామస్థులు కోరుతున్నారు. త్వరలో పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని ఏఈ యోగి తెలిపారు. – న్యూస్‌టుడే, హిరమండలం

ఆదిత్యుని ఆదాయం రూ.6.75 లక్షలు

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. వేకువజాము నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు క్యూలైన్లు కిటకిటలాడాయి. పలువురు ఇంద్రపుష్కరిణిలో స్నానాలు ఆచరించి కేశఖండనశాలలో మొక్కులు చెల్లించుకున్నారు. ఆర్జిత సేవలు, ప్రసాదాల విక్రయాల ద్వారా ఆలయానికి రూ. 6.75 లక్షల ఆదాయం సమకూరినట్లు ఈవో కె.ఎన్.వి.డి.వి.ప్రసాద్ తెలిపారు.

విజయీభవ

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

జిల్లాలో వివరాలిలా...	పరీక్ష కేంద్రాలు: 71	మొదటి ఏడాది విద్యార్థులు: 19,850 మంది	ద్వితీయ సంవత్సరం: 19,997 మంది

న్యూస్‌టుడే, కలెక్టరేట్(శ్రీకాకుళం)

ఇంటర్మీడియట్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. జిల్లా వ్యాప్తంగా 71 కేంద్రాల్లో పకడ్బందీగా నిర్వహణకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 39,847 మంది ఈ ఏడాది హాజరుకానున్నారు. మార్చి 24 వరకు పరీక్షలు జరుగుతాయి. విద్యార్థులు అరగంట ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష ఉంటుందని, 9 గంటల తర్వాత నిమిషం ఆలస్యమైనా పరీక్ష హాలులోకి అనుమతించరని స్పష్టం చేశారు.

కంట్రోల్ రూం ఏర్పాటు..

అన్ని కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది. ఆర్ఐవో కార్యాలయంలో కంట్రోల్ రూంను ఏర్పాటు చేశారు. విద్యార్థులు ఏమైనా సమస్యలు, సందేహాలుంటే 96528 85144కు కాల్ చేయొచ్చు. చూచిరాతకు తావులేకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా ఏర్పాట్లు చేశామని ఆర్ఐవో ఆర్.సురేష్‌కుమార్ తెలిపారు. వైద్య సిబ్బంది కేంద్రాల వద్ద అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు.

సిట్టింగ్ స్క్వాడ్‌లు: 03	ఫ్లయింగ్ స్క్వాడ్‌లు: 03	
చీఫ్ సూపరింటెండెంట్‌లు: 71 మంది	డిపార్ట్‌మెంటల్ అధికారులు: 71	ఇన్విజిలేటర్లు: 1,058 మంది

శ్రీకాకుళం జిల్లా: ధర్మాన టీవీఎస్, శ్రీకాకుళం: 9246631177 | ధర్మాన టీవీఎస్, నరసన్నపేట: 9246634112 | సాయికృష్ణ ఆటోమోటివ్స్, టెక్కలి: 9440105664 | శ్రీ శ్రీనివాస టైర్స్ & ఆటోమొబైల్స్, పలాస: 9440195172 | శ్రీ శ్రీనివాస ఆటోమొబైల్స్, సోంపేట: 8277151090 | శ్రీ లక్ష్మీనారాయణ మోటార్స్, ఆమదాలవలస: 9949278793 | GK ఆటోమొబైల్స్ రణస్థలం: 9618458637 ధర్మాన టీవీఎస్, పెదపాడు: 8802555999 | శ్రీనివాస ఆటోమొబైల్స్ కొత్తూరు: 9440618100 | శ్రీ సూర్య మోటార్స్, పాలకొండ : 9573181711.

(c) eenadu

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

జిమ్నాస్టిక్స్ ప్రదర్శనలో చిన్నారులు

నృత్యం చేస్తున్న బాలికలు

నగర ప్రజలకు మానసికోల్లాసం కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఆనంద ఆదివారం కార్యక్రమం నిర్వహిస్తోందని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో బలగ వద్ద ఈ కార్యక్రమం నిర్వహించారు. పలువురు చిన్నారులు కూచిపూడి నృత్య ప్రదర్శన, జిమ్నాస్టిక్స్, యోగాసనాలతో ఆకట్టుకున్నారు. జుంబా డ్యాన్స్, మార్షల్ ఆర్ట్స్ అలరించాయి. విజేతలకు ఎమ్మెల్యే బహుమతులు, ధ్రువపత్రాలు అందజేశారు. అనంతరం మొక్కలు నాటారు. నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్.కూర్మారావు, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, శ్రీకాకుళం నగరం

సాగర తీరంలో సందడి

గార మండలం వత్సవలస పంచాయతీ పరిధి చిన్నవత్సవలసలో రాజమ్మ తల్లి ఉత్సవానికి వచ్చిన భక్తులు ఆదివారం సముద్ర స్నానాలు చేశారు. అనంతరం భూలోకమ్మ ఆలయం వద్ద పూజలు చేసుకుని మొక్కులు చెల్లించుకున్నారు. తాగునీరు సరఫరా కాకపోవడంతో ఇబ్బంది పడ్డారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పోలీసులు వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించారు. రాజమ్మతల్లి ఉత్సవానికి వచ్చిన భక్తులు తిరుగు ప్రయాణంలో కూర్మనాథుడి దర్శనానికి తరలిరావడంతో శ్రీకూర్మం రహదారులు కిటకిటలాడాయి. – న్యూస్‌టుడే, గార (వత్సవలస)

ప్రమాదమని తెలిసినా తప్పని ప్రయాణం

పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట నుంచి కొత్తూరు, మెట్టూరు మీదుగా గొట్టిపల్లి ప్రాంతానికి సరకుల వ్యాన్‌లో ప్రయాణికులు కిక్కిరిసి రాకపోకలు సాగిస్తున్నారు. కొత్తూరు మండలం గొట్టిపల్లి, అడ్డంగి పంచాయతీల్లో 26 గ్రామాల గిరిజనులకు ఆర్టీసీ బస్సు సదుపాయం లేదు. వీరంతా ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తూ పలుమార్లు ప్రమాదాల బారిన పడ్డారు. గొట్టిపల్లికి పాలకొండ డిపో నుంచి తిరిగిన బస్సు సర్వీసును రద్దు చేయడంతో ప్రత్యామ్నాయం లేక ఇలా రాకపోకలు సాగిస్తున్నామని గిరిజనులు తెలిపారు. ఈ విషయాన్ని స్థానిక ఆర్టీసీ కంట్రోలర్ జె.వెంకట్రావు వద్ద ప్రస్తావించగా డిపో మేనేజర్ దృష్టికి సమస్యను తీసుకెళ్లినట్లు తెలిపారు. – న్యూస్‌టుడే, కొత్తూరు

కార్గో ఎయిర్‌పోర్టు ఏర్పాటుపై తప్పుడు ప్రచారం నమ్మొద్దు

మెట్టూరులో రైతులు, నాయకులతో చర్చిస్తున్న తెదేపా నియోజకవర్గ సమన్వయకర్త వెంకన్న చౌదరి

వజ్రపుకొత్తూరు, న్యూస్‌టుడే: మెట్టూరులో కార్గో ఎయిర్‌పోర్టు ఏర్పాటుపై వస్తున్న అపోహలపై రైతులు, నాయకులతో ఆదివారం తెదేపా పలాస నియోజకవర్గ సమన్వయకర్త వెంకన్న చౌదరి సమీక్ష నిర్వహించారు. భూసేకరణ విధానంపై చర్చించారు. ఎయిర్‌పోర్టు ఏర్పాటుతో కలిగే ప్రయోజనాలు వివరించారు. తప్పుడు ప్రచారాలను నమ్మొద్దని, భూములు కోల్పోయిన ప్రతి రైతుకు పూర్తి స్థాయి పరిహారం, ఇతర వసతులు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. రైతులకు అవగాహన కల్పించడంలో అలసత్వమైందని, దీంతో ప్రజల్లో లేనిపోని అనుమానాలు ఏర్పడ్డాయని కొందరు అభిప్రాయపడ్డారు. భూసేకరణ విధానంపై స్పష్టత ఇవ్వాలన్నారు. రైతులను అన్ని విధాలా ఆదుకునే పలు విషయాలను సభ దృష్టికి తీసుకెళ్లారు. రైతుల నుంచి వచ్చే ప్రతి అంశాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తున్నట్లు వెంకన్న చౌదరి తెలిపారు. పలాస ఏఎంసీ ఛైర్మన్ మల్లా శ్రీనివాసరావు, వజ్జ బాబూరావు, మెట్టూరు, చీపురుపల్లి పంచాయతీ పరిధి రైతులు, నాయకులు పాల్గొన్నారు.

నీరు వృథా.. రైతుల వ్యథ

అడ్డుకట్ట నిర్మిస్తేనే బాహుదా జలాల సద్వినియోగం

న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

ఒకచోట అవసరానికి నీరు అందదు. మరోచోట వరద ముంచేస్తోంది. బాహుదా నదికి సమీపంలోనే ఈ సమస్యలున్నాయి. వీటి పరిష్కారానికి కొన్నేళ్లుగా చేస్తున్న ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమవుతున్నాయి. వేసవిలో చర్యలు తీసుకుంటే మరింత ఇబ్బంది పడతామని ఇచ్ఛాపురం మండల పరిధి ఈదుపురం, బెల్లుపడ ప్రజలు, రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బాహుదా జలాలు ఆధారంగా ఈదుపురంలో సుమారు 3 వేలు, బెల్లుపడలో 1,800 ఎకరాల మేర సాగు భూమి ఉంది. జాతీయ రహదారి కొత్త వంతెన సమీపంలో బెల్లుపడ వద్ద రక్షణ గట్టు లేకపోవడంతో అన్నదాతలకు కన్నీరే మిగులుతోంది.

ఇదీ పరిస్థితి

● కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత దీపం-2 పథకం ప్రారంభించడానికి ఇచ్ఛాపురం నియోజకవర్గానికి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి బాహుదా నది కారణంగా ఎదురవుతున్న ఇబ్బందులను ప్రభుత్వ విప్ బెందాళం అశోక్, ఈదుపురం, బెల్లుపడ రైతులు తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించారు. బెల్లుపడ వద్ద రక్షణ గట్టు నిర్మించాలని కోరుతున్నారు.

బాహుదా జలాలు వృథా కాకుండా అడ్డుకట్ట నిర్మించాల్సిన ప్రాంతం

● బాహుదా నది కొత్త, పాత వంతెనల నడుమ ఉత్తర గట్టు కొంతమేర కొట్టుకుపోయింది. భారీ వర్షాల సమయంలో సమస్య తీవ్రత పెరుగుతోంది. జాతీయ రహదారి, బెల్లుపడ రోడ్డు, శివారు ప్రాంతాల వరకు వరద చేరుతోంది. వెంటనే కార్యాచరణ ప్రారంభిస్తే జూన్ తర్వాత వర్షాలు కురిసినా సమస్య తలెత్తదని బెల్లుపడ, ఈదుపురం ప్రజలు, రైతులు సూచిస్తున్నారు.

● ఐదు ఎకరాల సాగుకు సుమారు రూ.1.50 లక్షలు వ్యయం చేస్తున్నామని.. ఎక్కువగా నీటి కోసం పాట్లు పడుతున్నామని అన్నదాతలు తెలిపారు. వాస్తవంగా బాహుదా జలాలు అందితే ఖరీఫ్, రబీ, వేసవిలో పంటలు సాగు చేయగలమని ఆదర్శ రైతు గోపాలరెడ్డి వివరించారు.

ప్రతిపాదనలు పంపాం..

రక్షణ గోడ నిర్మాణానికి రూ.77 లక్షలతో ప్రతిపాదనలు పంపాం. దానికి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరుతూ ప్రభుత్వ విప్ అశోక్ నివేదిక అందజేశాం. ఉన్నతాధికారుల నుంచి అనుమతి రాగానే కార్యాచరణ చేపడతాం.

– మధుసూదన పాణిగ్రాహి, ఏఈ, జలవనరుల శాఖ, ఇచ్ఛాపురం

నిధులు సమీకరిస్తున్నాం..

బాహుదా జలాలను సద్వినియోగం చేసుకోవడానికి ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తున్నాం. తాగు, సాగునీరు సక్రమంగా అందేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాం. ఇప్పటికే పరిస్థితిని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాం. పనులు చేపట్టడానికి అధ్యయనం జరుగుతోంది. అవసరమైన మేరకు నిధులు సమీకరిస్తున్నాం.

– బెందాళం అశోక్, ప్రభుత్వ విప్, ఇచ్ఛాపురం

ఐక్యతతోనే సామాజికవర్గ అభ్యున్నతి

వేమన విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న రెడ్డిక కుల పెద్దలు

కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే: ఐకమత్యంతోనే రెడ్డిక సామాజికవర్గ అభ్యున్నతి సాధ్యమని కుల పెద్దలు అన్నారు. శ్రీకాకుళం, పూరీ, గంజాం జిల్లాల రెడ్డిక మహాజన పురోభివృద్ధి సంఘం రిజిస్ట్రేషన్ చేసి 100 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం కవిటి మండలం కొత్త కొజ్జిరియా గ్రామం రెడ్డిక సామాజిక భవనం వద్ద ఐక్యత స్తూపం, యోగి వేమన విగ్రహాన్ని ఆవిష్కరించారు. పూర్వీకులు సామాజికవర్గానికి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. సామాజికవర్గంలో వెనకబడిన కుటుంబాలకు తోడ్పాటు అందిస్తూ నిలబడాలని తీర్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కుల పెద్దలు సాడి శ్యామ్‌ప్రసాద్ రెడ్డి, కొండా శంకర్ రెడ్డి, ఆశి జీవులు రెడ్డి, మణిచంద్ర ప్రకాశ్‌రెడ్డి, బి.కామేష్‌రెడ్డి, డి.ఢిల్లీరావురెడ్డి, సాడి సహదేవు రెడ్డి, పి.రాజలక్ష్మి, 16 సంఘాల ప్రతినిధులు, గంజాం రెడ్డిక సంఘం సభ్యులు పాల్గొన్నారు.

నేడు ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరంలోని జిల్లా పరిషత్తు సమావేశ మందిరంలో సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్‌ఎస్) కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్జీలను నేరుగా లేదా meekosam.ap.gov.inలోనూ సమర్పించొచ్చన్నారు. అర్జీల స్థితికి సంబంధించి సమాచారం తెలుసుకునేందుకు 1100ను సంప్రదించొచ్చని స్పష్టం చేశారు.

రేపు జిల్లా స్థాయి సైక్లింగ్ పోటీలు

పాతబస్టాండ్, న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరంలోని కోడిరామ్మూర్తి క్రీడా మైదానంలో ఈ నెల 24న (మంగళవారం) జిల్లా స్థాయి సైక్లింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు డీఎస్‌డీవో ఎ.మహేశ్‌బాబు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. బాలబాలికలకు అండర్-18 విభాగంలో వేర్వేరుగా ఎంపికలు జరుగుతాయని పేర్కొన్నారు. ఎంపికైన జట్లు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటాయని తెలిపారు. జిల్లాకు చెందిన క్రీడాకారులు వారి వివరాలను sports.ap.gov.in లో నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 28న ఎన్టీఆర్ జిల్లాలో రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 93903 52942, 94948 14087కు ఫోన్ చేసి సంప్రదించాలని కోరారు.

వైకాపావి నీచ రాజకీయాలు

మాట్లాడుతున్న కూటమి నేతలు

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: 'వైకాపా కార్యకర్త నుంచి ఆ పార్టీ అధినేత జగన్ వరకు దారుణంగా నీచ రాజకీయాలు చేస్తున్నారు' అని తెదేపా పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు మొదలవలస రమేష్ విమర్శించారు. శ్రీకాకుళం నగరంలోని తెదేపా జిల్లా కార్యాలయంలో ఆదివారం కూటమి నేతలు విలేకరుల సమావేశం నిర్వహించారు. రమేష్ మాట్లాడుతూ 'జగన్‌కు దేవుడంటే భక్తి, భయం లేవు. ఆయన ప్రవర్తన హిందువులపై వేరుగా ఉంది. వేంకటేశ్వరస్వామి అంటే దేశ ప్రజలకు భయం ఉంది. ధర్మాన్ని రక్షించాలి, కాపాడటం ద్వారా బాగుండాలని ప్రజలు మొక్కుకుంటారు. వైకాపా నేతలకు దళితులు, బీసీలపై అభిమానం లేదు. వారికి అధికారం మాత్రమే కావాలి. అందుకు ఎంతకైనా దిగజారి మాట్లాడతారు. ప్రజలు దీన్ని గమనిస్తున్నారనే విషయం తెలుసుకోవాలి. చట్టసభల్లో వికృత చేష్టలు చేయడం బాధాకరం' అని వ్యాఖ్యానించారు. భాజపా జిల్లా అధ్యక్షుడు ఎస్.తేజేశ్వరరావు మాట్లాడుతూ 'ఎక్కడైనా హిందూ మతానికి, సనాతన ధర్మానికి నష్టం జరిగితే కూటమి ప్రభుత్వం క్షమించదు. శాసనమండలిలో ఇటీవల ఆ పార్టీ సభ్యులు చెప్పులు ధరించి కలియుగ దైవం వేంకటేశ్వర స్వామి చిత్రపటాలను పట్టుకుని అగౌరవపరచడం సరికాదు. దేవుడంటే భయం, భక్తి లేకుండా ఉండటాన్ని ఖండిస్తున్నాం. దేవుడితో రాజకీయాలు చేయడం సిగ్గుచేటు' అని పేర్కొన్నారు. జనసేన జిల్లా అధ్యక్షుడు పిసిని చంద్రమోహన్ మాట్లాడుతూ 'వైకాపా పాలనలో అన్ని రంగాలు నాశనమయ్యాయి. కూటమి ప్రభుత్వం సుపరిపాలన అందిస్తుండటాన్ని చూసి వైకాపా నేతలు ఓర్వలేకపోతున్నారు. ఆటంకం కలిగించాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నారు. వారి తీరును ప్రజలు సహించబోరనే విషయం తెలుసుకోవాలి. తిరుమల లడ్డూలో రసాయనాలు కలిపి హిందువుల మనోభావాలను దెబ్బతీసిన వైకాపాను రాష్ట్రం నుంచి తరిమికొట్టాలి' అని పేర్కొన్నారు.

బహిరంగ క్షమాపణ చెప్పాల్సిందే..

పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు మాట్లాడుతూ 'కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్రం ప్రగతిపథంలో దూసుకెళ్తోంది. ప్రజారంజక బడ్జెట్‌ను చూసి వైకాపా కుట్ర రాజకీయాలు చేస్తోంది. 2024 ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పినా.. 11 సీట్లకు పరిమితం చేసినా మీరు మారరా? తిరుమల లడ్డూను రసాయనాలతో నింపిన కారణంగా ప్రజలకు జగన్, వైకాపా నేతలు బహిరంగ క్షమాపణ చెప్పాలి' అని డిమాండ్ చేశారు. తెదేపా నగర అధ్యక్షుడు పాండ్రంకి శంకర్, ఆ పార్టీ నేత పీఎంజే బాబు పాల్గొన్నారు.

TENDER NOTICE

Govt. of Andhra Pradesh, Director of Medical Education, Govt. General Hospital, SRIKAKULAM

Rc.No.2890/A1/2024 Dt.21.02.2026.

The Sealed Tenders are invited from eligible firms / reputed / dealers for the supply of i.e "**1. Drugs / Medicines, 2.Surgicals, 3.Lab Items, 4.Minor equipment and 5.Physiotherapy instruments**" to the Govt. General Hospital Srikakulam. Tender document charges for fee for each application for Rs.5,000/- will be paid by way of DD in any National bank in favour of "**Hospital Development Society Government General Hospital Srikakulam**." Or in cash in this office. The tender application available in this office (Accounts Section) from **Dt.24.02.2026 to Dt.13.03.2026**, the Last date of submission of Tenders on **Dt.16.03.2026** and all Details will be available at **Srikakulam.ap.gov.in**

Superintendent

లారీ, కారు ఢీకొని ఇద్దరు దుర్మరణం

ప్రమాదానికి గురైన కారు

మందస, న్యూస్‌టుడే: జాతీయ రహదారిపై మందస మండలం బాలిగాం సమీపంలో శనివారం అర్ధరాత్రి చోటుచేసుకున్న ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారని పోలీసులు తెలిపారు. ఒడిశాలోని కటక్‌కు చెందిన షేక్ ఖాదర్(27), పీయూష్ కుమార్(25), సంతోష్‌కుమార్ సాహు, సోంప్రకాశ్ సాహు కారులో పలాస వైపు బయలుదేరారు. కారు అదుపుతప్పి విభాగిని ఎక్కింది. రెండో వైపు పలాస నుంచి ఇచ్ఛాపురం వైపు వెళ్తున్న లారీని ఢీకొట్టింది. ముందు సీట్లో కూర్చున్న షేక్ ఖాదర్ అక్కడికక్కడే మృతి చెందగా, పీయూష్‌కుమార్ శ్రీకాకుళం సర్వజనాసుపత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు. మిగిలిన ఇద్దరు స్వల్పగాయాలతో బయటపడ్డారు. ఖాదర్ మామ దాదుసాహు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మందస ఎస్సై కృష్ణప్రసాద్ తెలిపారు.

చెన్నైలో వలస కార్మికుడి మృతి

సోమేశ్వరరావు (పాత చిత్రం)

పాతపట్నం, న్యూస్‌టుడే: చెన్నైలో వలస కార్మికుడిగా పని చేస్తున్న పాతపట్నం పంచాయతీ పరిధి అచ్యుతాపురానికి చెందిన సలాన సోమేశ్వరరావు(41) ప్రమాదవశాత్తు మృతి చెందారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. సోమేశ్వరరావు కొన్నేళ్లుగా చెన్నైలో భవన నిర్మాణ కార్మికుడిగా పని చేస్తున్నారు. శుక్రవారం మూడో అంతస్తు నుంచి కిందకు పడి తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. ఆయన మృతదేహం ఆదివారం గ్రామానికి చేరుకోగా కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. సోమేశ్వరరావుకు భార్య లక్ష్మి, కుమారుడు సాయిచరణ్ ఉన్నారు.

చీరకు నిప్పంటుకుని మహిళ..

నరసన్నపేట, న్యూస్‌టుడే: స్థానిక సాయినగర్ కాలనీకి చెందిన మెండ సీత (54) ప్రమాదవశాత్తూ చీరకు నిప్పంటుకుని మృతి చెందారు. ఎస్సై గణేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆమె ఈ నెల 21న పూజ చేస్తూ హారతి ఇస్తుండగా, చీరకు నిప్పు అంటుకుంది. గాయపడిన ఆమెను రాగోలు జెమ్స్ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ఆదివారం కన్నుమూశారు. భర్త సింహాచలం, ఇద్దరు కుమార్తెలున్నారు. ఎస్సై గణేష్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

కంట్లో కారం కొట్టి.. బంగారు ఆభరణాల చోరీ

నందిగాం, న్యూస్‌టుడే: నర్సిపురం గ్రామానికి చెందిన నెయ్యిల మహాలక్ష్మీ మెడలోని బంగారు పుస్తెల తాడు, గొలుసు గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బాధితురాలు గ్రామంలోని గొడేబందకు ఆదివారం మధ్యాహ్నం స్నానానికి వెళ్తుండగా.. ఇద్దరు వ్యక్తులు ఆమె కంట్లో కారం కొట్టారు. తేరుకునే లోపే బంగారు ఆభరణాలు లాక్కొని పరారయ్యారు. మహాలక్ష్మి భర్త పార్వతీశం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ చిన్నంనాయుడు, చిత్రంలో ఎస్సై ముకుందరావు

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: ఇచ్ఛాపురం పుర పరిధి అప్పన్నపేటలోని ఓ ఇంట్లో చోరీకి పాల్పడిన నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. పలు చోట్ల కాజేసిన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. ఆయా వివరాలను స్థానిక సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో సీఐ ఎం.చిన్నంనాయుడు వెల్లడించారు. ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్ వద్ద ఆదివారం ఓ అనుమానితుడు ఉన్నట్లు పట్టణ ఎస్సై ఎం.ముకుందరావుకు సమాచారం రాగా ఆయన సిబ్బందితో వెళ్లి మధ్యవర్తుల సమక్షంలో తనిఖీ చేశారు. అతను తెలంగాణలోని నారాయణపేటకు చెందిన కొండలోల సాయికుమార్‌గా గుర్తించారు. ఈ నెల 9న అప్పనపేటలో తులం పావు బంగారం, రూ.6,500 నగదు చోరీ చేశాడు. అతని వద్ద నుంచి మరో 48 గ్రాముల బంగారం, రూ. 10,500 స్వాధీనం చేసుకున్నారు. మెళియాపుట్టి, జేఆర్‌పురం, నరసన్నపేట, ఆమదాలవలస, విజయనగరం ఒకటో పట్టణ పరిధిలో నమోదైన కేసుల్లోనూ నిందితుడని తెలిపారు. పట్టణ ఎస్సై ఎం.ముకుందరావు పాల్గొన్నారు.

కుండీలు నిర్మించారు.. లక్ష్యాన్ని మరిచారు

పాతపట్నం నియోజకవర్గంలో మత్స్యకారులందరికీ చేప పిల్లలను స్వయంగా ఉత్పత్తి చేసి అందజేసేందుకు 2017లో తెదేపా ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఎల్‌ఎన్‌పేట మండలం పెద్ద కొల్లివలస వద్ద రూ.50 లక్షలతో చేప పిల్లల కేంద్రం నిర్మాణం చేపట్టింది. కుండీలు నిర్మించిన అనంతరం వచ్చిన వైకాపా సర్కారు ఈ కేంద్రం ఊసే పట్టించుకోకపోవడంతో ఆ నిర్మాణాలు అసంపూర్తిగానే ఉన్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చి రెండేళ్లయినా ఇటువైపు చూడలేదని, ఇప్పటికైనా అధికారులు స్పందించి చేప పిల్లల కేంద్రం నిర్మాణం పూర్తి చేయాలని మత్స్యకారులు కోరుతున్నారు. ఈ విషయంపై ఆ శాఖ అధికారిణి ప్రభావతి వద్ద ప్రస్తావించగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.

– న్యూస్‌టుడే, ఎల్‌ఎన్‌పేట

ఘనంగా కవలల దినోత్సవం

సారవకోట మండలం అవలింగిలో జేబీటీ పాఠశాల ఆవరణలో ఆదివారం ప్రపంచ కవలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అవలింగి, బుడితి, చీడిపూడి గ్రామాల్లో 6 నుంచి 60 ఏళ్ల వయసు గల కవలలను ఓ చోటకు చేర్చారు. ఈ సందర్భంగా పాఠశాల వ్యవస్థాపకుడు మోహన్‌గాంధీ వారికి జ్ఞాపికలు అందజేసి సన్మానించారు. ఓ చోట కలిసిన కవలలను చిత్రంలో చూడొచ్చు.

– న్యూస్‌టుడే, సారవకోట

EENADU eClassifieds

REAL ESTATE

శ్రీకాకుళం నగరంలో New 3BHK Flat 1300 Sq.ft to 2000 Sq.ft (East Facing) కావలెను. సంప్రదించండి: 7013447345.

JOBS

Chandana Marine Consultancy, Female Computer Operator with Degree age 20to35 Yrs Salary:7 to8K ✆ 9949940511, Srikakulam.

ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీ SUBHAGRUHA ఉద్యోగావకాశాలు SALARY + INCENTIVES 8106863499 9010988707

శ్రీతిరుమల ఆటోఫైనాన్స్ (3 వీలర్) నందు పనిచేయుటకు బిజినెస్ & కలెక్షన్ ఎగ్జిక్యూటివ్ కావలెను. జీతం: 18K-2K పెట్రోల్ & ఇన్సెంటివ్ లొకేషన్ శ్రీకాకుళం. Ph.: 9100960677.

శ్రీకాకుళం జిల్లాలో గల శ్రీకాకుళం టౌన్ రణస్థలం, ఆమదాలవలస, టెక్కలి, పలాస టౌన్ & రూరల్ ప్రాంతాలలో BM's, Outlet Incharges, BDE's, కలెక్షన్ టీం, స్త్రీ, పురుషులు ఏదైనా డిగ్రీ చదివి 42 సం||లోపు కలిగి, మార్కెటింగ్ రంగంలో మంచి అనుభవం ఉండి, ఇతర చిట్‌ఫండ్స్, LIC, ఇతర లైఫ్ ఇన్సూరెన్స్‌లలో ఏజెంట్‌గా అనుభవం ఉన్నవారు, ఇంటర్ పాసైనప్పటికీ ఇంటర్వ్యూ ప్రాతిపదికపై వారికి కూడా పర్మినెంట్ ఆన్‌రోల్ జాబ్ ఇవ్వడం జరుగుతుంది. మంచి జీతం, భవిష్యత్తు కొరకు ✆ 9849824071.

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే సంప్రదించండి: 8008597609

హైదరాబాద్ యూనిటీ హోంకేర్‌లో ఏజెంట్లకు మంచి అవకాశం. మీరు వర్కర్స్‌ని పంపితే మొదటినెల 5వేలు కమీషన్. వర్కర్స్ జీ:15K, ఫ్రీవసతి,ఫుడ్. 8121541212

MARKETING/ SALES

Anand Masale Require Sales & Marketing Manager, Marketing Executives. Contact: 9849655105, 9848053144 Email: anandmasalaappltd@gmail.com

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

విభిన్న ప్రతిభావంతుల హక్కుల జాతీయ వేదిక కార్యవర్గ ఎన్నిక

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరంలో ఏడు రోడ్ల కూడలి వద్ద నగరపాలకోన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం విభిన్న ప్రతిభావంతుల హక్కుల జాతీయ వేదిక జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎ.వేణుగోపాల్, కార్యదర్శిగా పి.మోహనరావు, ఉపాధ్యక్షులుగా ఎస్.లక్ష్మి, జి.సిరపయ్య, పలువురు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	150	255	275

ఈనాడు

దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి

Cell: 80085 97609

ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి

Cell: 80081 11237

అశ్రునయనాలతో జవాన్ అంత్యక్రియలు

జవాన్ అమృతకుమార్ భౌతికకాయం వద్ద అంజలి ఘటిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

నరసన్నపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మణిపూర్‌లో విధులు నిర్వర్తిస్తూ గుండెపోటుతో మృతి చెందిన దంత అమృతకుమార్(41) అంత్యక్రియలు స్వగ్రామం చిక్కాలవలసలో అశ్రునయనాల మధ్య సైనిక లాంఛనాలతో ఆదివారం జరిగాయి. సీఆర్పీఎఫ్ అధికారులు భౌతికకాయం వద్ద అంజలి ఘటించి, కుటుంబ సభ్యులకు ఆయన చిత్రపటాన్ని అందజేశారు. అనంతరం అంతిమయాత్ర నిర్వహించారు. పోలీసులు గౌరవ వందనంగా గాల్లోకి కాల్పులు జరిపారు. ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, పోలాకి జడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణచైతన్య నివాళులర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు.

ముందుగానే 10 పాఠాల బోధన..!

● తొమ్మిదో తరగతి విద్యార్థులకు బ్రిడ్జి కోర్సు అమలు

న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

పదో తరగతిలో విద్యార్థులు మంచి మార్కులు సాధించడం, శత శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా విద్యా శాఖ సిద్ధమవుతోంది. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా బ్రిడ్జి కోర్సు అమలు చేయాలని నిర్ణయించింది. ప్రస్తుతం తొమ్మిదో తరగతి చదువుతున్న వారికి వచ్చే నెల 12 నుంచి పదో తరగతి పాఠ్యాంశాలు బోధించనున్నారు.

మార్గదర్శకాలు జారీ

● జిల్లాలో 410 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. 20,506 విద్యార్థులు తొమ్మిదో తరగతి చదువుతున్నారు. వారిలో బాలురు 9,683 మంది, బాలికలు 10,823 మంది ఉన్నారు.

● పరీక్షలకు ముందుగానే తర్ఫీదు పొందితే ఆ విద్యార్థి/అభ్యర్థిలో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. సమస్యను సవాల్‌గా తీసుకోవడానికి సిద్ధమవుతారు. వచ్చే విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివే ప్రభుత్వ బడి విద్యార్థులకు ముందస్తుగా పాఠ్యాంశాలు బోధించనున్నారు. ఈమేరకు ప్రభుత్వం మార్గదర్శకాలను జారీ చేసింది. బ్రిడ్జి కోర్సును సిద్ధం చేశారు.

● వచ్చే నెల 12 నుంచి పదో తరగతి పాఠ్యాంశాలతో కూడిన బ్రిడ్జి కోర్సును నెల రోజుల పాటు బోధించనున్నారు. వేసవి సెలవులకు ముందే అసెస్‌మెంట్-2 పరీక్షలు నిర్వహించడానికి కార్యాచరణ రూపొందించారు.

కార్యాచరణ ఇలా..

● గణితం, సైన్స్, ఆంగ్లం, హిందీలో పట్టు సాధించేలా బోధించనున్నారు. ఆయా సబ్జెక్టులపై భయం పోగొట్టడానికి బ్రిడ్జి కోర్సు ఉపకరిస్తుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ● గణితంలో ఎక్కువ మార్కులు సాధించడానికి పాటించాల్సిన విధానాలు, సైన్స్‌లో ప్రాథమిక పాఠ్యాంశాలు బోధించనున్నారు. మంచి మార్కులు రావడానికి ఎంపిక చేసిన అధ్యాయాలపై తర్ఫీదు ఇవ్వనున్నారు. వ్యాకరణం, సూత్రాలపై పట్టు పెంచుకునేలా మెలకువలు నేర్పుతారు. పదో తరగతి పరీక్ష తీరు, పాత ప్రశ్నపత్రాలిచ్చి సమాధానాలు ఎలా రాయాలి? అనే అంశాలపై సంబంధిత ఉపాధ్యాయులు అవగాహన కల్పిస్తారు.

వెనకబడిన వారిపై దృష్టి సారిస్తాం..

కొత్త విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే బ్రిడ్జి కోర్సు అమలుతో పట్టు పెంచుకుంటారు. వేసవి సెలవుల్లో కొంత సమయం చదువు కోసం కేటాయించడానికి వీలుంటుంది. వెనకబడిన విద్యార్థులను ముందే గుర్తించి ప్రత్యేక తర్ఫీదు ఇవ్వొచ్చు. ఉత్తమ ఫలితాలు సాధించడమే లక్ష్యం.

– ఎ.రవిబాబు, డీఈవో, శ్రీకాకుళం

పలాస
• పలాస • ఇచ్ఛాపురం

అదిరిందయ్యా అన్నదాతా..

ప్రభుత్వం అన్నదాతలకు రాయితీపై మినీ ట్రాక్టర్లు అందించింది. కొందరు రైతన్నలు వాటిని భూ సారవంతమైన పనులకే కాకుండా బహుళ ప్రయోజనాలకు వినియోగిస్తుండటం విశేషం. వినూత్న ఆలోచనతో మినీ ట్రాక్టర్ ఇంజిన్‌కు వెనక, ముందు భాగాల్లో సమతుల్యంగా ఉండేలా స్టాండ్లు ఏర్పాటు చేసి నీటి డబ్బాలు తీసుకెళ్తున్నారు. వజ్రపుకొత్తూరు మండలం అక్కుపల్లి, బైపల్లి, బాతుపురం, చినవంక, పల్లిసారథి, డోకులపాడు, మెట్టూరు, చీపురుపల్లి తదితర ప్రాంతాల ఉద్యాన తోటల్లో వ్యవసాయ బోరులు లేకపోవడంతో జీడి, మామిడి పంటలకు మందుల పిచికారీకి ఇబ్బందులు తప్పడం లేదు. ఈ క్రమంలో సుదూర ప్రదేశాల నుంచి నీటిని తీసుకురావాల్సి వస్తోంది. దీంతో ఇలా ట్రాక్టర్‌తో తరలిస్తున్నారు. శ్రమతోపాటు పెట్టుబడులు సైతం తగ్గుతున్నట్లు రైతులు చెబుతున్నారు. – న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు

ఎల్లమ్మ ఆలయంలో కుంకుమ పూజ

సోంపేట గ్రామదేవత ఎల్లమ్మ ఆలయం వద్ద ఆదివారం కుంకుమ పూజ నిర్వహించారు. జామి ఎల్లమ్మ జాతరలో భాగంగా ప్రత్యేక పూజలు చేపట్టారు. మహిళలు సామూహిక కుంకుమ పూజల్లో పాల్గొన్నారు. రాత్రి నిర్వహించిన దీపారాధన ఆకట్టుకుంది. – న్యూస్‌టుడే, సోంపేట

వేడుకగా డోలోత్సవాలు

బెజ్జిపుట్టుగలో చక్రధర పెరుమాళ్ స్వామి డోలోత్సవం వేడుకగా నిర్వహిస్తున్నారు. ఆలయ ధర్మకర్త పొందల కృష్ణారావు ఆధ్వర్యంలో స్వామివారికి సుప్రభాత సేవ, నిత్య పూజలు చేశారు. అనంతరం పల్లకీ సేవను నిర్వహించి మంగళవాయిద్యాల మధ్య తిరువీధి చేపట్టారు. గ్రామస్థులు, మహిళలు పాల్గొన్నారు. రాత్రి నిర్వహించిన హరికథ గానం అందరినీ ఆకట్టుకుంది. – న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

రేపు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

కవిటి గ్రామీణం: జగతి, బొరివంక ఉపకేంద్రాల పరిధిలో నిర్వహణ పనుల నిమిత్తం జగతి, బొరివంక, బెజ్జిపుట్టుగ గ్రామాలకు మంగళవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలుగుతుందని పలాస విద్యుత్తు శాఖ ఈఈ జి.యజ్ఞేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ, గృహ వినియోగదారులు సహకరించాలని కోరారు.

తెరపై ఈనాడు

పలాసలో.. ఎస్వీ మ్యాక్స్: మన శంకర వరప్రసాద్‌గారు **హరిశంకర్:** హే బలవంత్, **భాస్కరరామ:** ఎర్రచీర **ఇచ్ఛాపురంలో..** మణికంఠ ఎల్ మ్యాక్స్: హే బలవంత్, **పూర్ణ:** మన శంకర వరప్రసాద్‌గారు **సోంపేటలో..** ఎస్ఎస్‌మ్యాక్స్: మన శంకర వరప్రసాద్‌గారు, శివ: హే బలవంత్

– న్యూస్‌టుడే, పలాస, ఇచ్ఛాపురం, సోంపేట

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM) 8008574279 9063144707

మీ ప్రాంతంలో ఏ ప్రజాసమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలు, చిత్రాలను వాట్సప్ ద్వారా పంపొచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

సమస్య: రత్తకన్న నాయుడువీధి కూడలిలో కాలువ పరిస్థితి ప్రమాదకరంగా ఉంది.
- రమణసాహు, ఇచ్ఛాపురం సమాధానం: కౌన్సిల్‌లో నిధులు కేటాయించాక పనులు చేపడతాం. **- ఎన్.రమేష్, కమిషనర్, ఇచ్ఛాపురం**
– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

? పలాస మండలం తర్లాకోటలోని విష్ణు ఆలయం సమీపంలో తాగునీటి సరఫరాకు ఐదు కుళాయిలు ఏర్పాటు చేయాలి.
- స్థానికులు ★ కుళాయిలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటాం. **- సుధాకర్, పంచాయతీ అభివృద్ధి అధికారి, తర్లాకోట**
– న్యూస్‌టుడే, పలాస గ్రామీణం

? కంచిలి మండలం కొన్నాయిపుట్టుగలో వీధి దీపాలు నిత్యం వెలుగుతూనే ఉన్నాయి.
- స్థానికులు ★ సిబ్బందితో మాట్లాడి చర్యలు తీసుకుంటాం. **- తిరుమలరావు, ఎంపీడీవో, కంచిలి** – న్యూస్‌టుడే, కంచిలి

? కంచిలి మండలం జాడుపూడిలో ఎస్సీ వీధి చివరలో వీధి దీపం మూడు నెలలుగా వెలగడం లేదు. **- పిలక మోహనరావు, జాడుపూడి** ★ పరిశీలించి, వీధి దీపం వెలిగేందుకు చర్యలు తీసుకుంటాం.
- ఈశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి, జాడుపూడి – న్యూస్‌టుడే, కంచిలి గ్రామీణం

తొట్టె నింపక నీరుగారుతున్న లక్ష్యం

– న్యూస్‌టుడే, కంచిలి గ్రామీణం

వేసవిలో మూగజీవాల దప్పికను తీర్చేందుకు ఉపాధి హామీ నిధులతో కూటమి ప్రభుత్వం నీటితొట్టెలు నిర్మించింది. ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాల్లో 2025-26 ఆర్థిక సంవత్సరానికి 180 నీటి తొట్టెలు మంజూరు కాగా ఇప్పటి వరకు 128 పూర్తి చేశారు.

వివరాలిలా

మండలం	మంజూరు	పూర్తి
కంచిలి	25	20
కవిటి	21	18
ఇచ్ఛాపురం	22	15
సోంపేట	23	12
మందస	40	29
పలాస	17	16
వజ్రపుకొత్తూరు	32	18

ప్రభుత్వం ఒక్కో నీటి తొట్టె నిర్మాణానికి రూ. 32 వేలు వెచ్చించింది. రెండు నియోజకవర్గాల్లో రూ. 57.60 లక్షలు కేటాయించినప్పటికీ క్షేత్రస్థాయిలో వీటి నిర్వహణపై అధికారుల మధ్య సమన్వయం లేకపోవడంతో చాలా తొట్టెలు నిరుపయోగంగా మారాయి. దీంతో ప్రభుత్వ ఆశయం నీరుగారింది. వేసవి తాపం ప్రారంభమవుతున్న వేళ వాటిలో నీరు నింపి మూగజీవాల దప్పిక తీర్చాలని పలువురు కోరుతున్నారు.

ఇచ్ఛాపురం మండలం కేసుపురంలో నిరుపయోగంగా పశువుల నీటి తొట్టె

ఇచ్ఛాపురం నియోజకవర్గంలో ఇచ్ఛాపురం మండలం కేసుపురం, బాలకృష్ణాపురం, మండపల్లి, కవిటి మండలం వడ్డిజల్లుపుట్టుగ, ఆర్.బెలగాం, రాజపురం, డీజీపుట్టుగ, మాణిక్యపురం, సోంపేట మండలం సోంపేట, జింకిభద్ర, నూకలూరు, కంచిలి మండలం ఎంఎస్‌పల్లి గ్రామాల్లో నిర్మించిన నీటి తొట్టెలు నీరు నింపకపోవడంతో చెత్తను తలపిస్తున్నాయి.

పలాస నియోజకవర్గంలో మందస మండలం హంసరాలి పంచాయతీ తుబ్బూరు, కొండలోగాం పంచాయతీ వైద్యనాథవీధి, టంగరపుట్టి, నర్సింగాపురం తదితర గ్రామాల్లో నీటి తొట్టెల్లో నీరు లేక నిరుపయోగంగా మారాయి.

నిర్మాణాల వరకే మా బాధ్యత.. నీటి తొట్టెల నిర్మాణమే తమ పరిధిలో ఉంటుందని ఉపాధి హామీ పథకం ఏపీడీ సీహెచ్.శ్రీనివాసరావు పేర్కొన్నారు. గ్రామీణ నీటి సరఫరా అధికారులు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో వీటి నిర్వహణ చేపడతారన్నారు.

బోరు.. ఇదేం తీరు..

ఇచ్ఛాపురం రాజావారి మైదానంలో క్రీడా సాధన చేసేవారు, నడక, పరుగు, వ్యాయామ సాధన చేసేవారికి ఉపయోగపడే మంచినీటి బోరు ఇది. కొద్ది రోజులుగా లోపల పరికరాలు పాడైపోవడంతో చాలా సేపు కొడితే గానీ కొద్దిపాటి నీరు రావడం లేదు. దీంతో క్రీడాకారులు ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్యపై పుర ఏఈ స్పందిస్తూ బోరుకు మరమ్మతు చేస్తామన్నారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

నిర్లక్ష్యం వీడరు.. వృథా ఆపరు

సోంపేట పరిధి మొగలికొత్తూరు పాఠశాల వద్ద పైపులు రెండేళ్లుగా లీకేజీకి గురై సుజలధార నీరు వృథా పోతోంది. అయినా గ్రామీణ నీటిసరఫరా అధికారులు పట్టించుకోవడం లేదు. పలుమార్లు 'ఈనాడు'లో కథనాలు రాగా గొయ్యి తవ్వి వదిలేశారే తప్ప పనులు మాత్రం చేయలేదు. సమస్యను పంచాయతీ ఈవో ఎం.శాంతికుమారి దృష్టికి తీసుకెళ్లగా సంబంధిత అధికారులతో మరోసారి మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, సోంపేట

పొంచి ఉన్న ప్రమాదం

పాత శశానం సమీపంలో ఓ నేల బావి అడుగున్నర ఎత్తులో ప్రమాదకరంగా దర్శనమిస్తోంది. అది రహదారి పక్కనే ఉండటం, అటు వైపు నుంచే రైతులు పొలాలకు వెళ్లడంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఎంపీడీవో కె.రామారావును వివరణ కోరగా పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామన్నారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం

మలుపులో ముప్పు

ఇచ్ఛాపురం పట్టణం 23వ వార్డు రెండో లైనులోని రోడ్డు మలుపులో ప్రమాదకర పరిస్థితి నెలకొంది. రెండు వీధులను కలిపే చోట కాలువపై ఏనాడో వేసిన సిమెంటు పలకలు దెబ్బతిన్నాయి. ఒక పలక పూర్తిగా విరిగి కాలువలో పడిపోగా, మిగిలిన వాటిలో మరో మూడు ఇదే పరిస్థితిలో ఉన్నాయి. రోడ్డు వెడల్పుగా ఉండటంతో పలకలు కాకుండా, శ్లాబ్ కల్వర్టు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. కొత్త పలకలు రాగానే సమస్యను పరిష్కరిస్తామని కమిషనర్ రమేష్ తెలిపారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

పరిశీలించి.. పరిష్కరించారు

స్పందనకు వందనం

ఇచ్ఛాపురం డంపింగ్‌యార్డులో ఏళ్ల తరబడి పేరుకుపోయి ఉన్న చెత్తతోపాటు హానికర ప్లాస్టిక్ వ్యర్థాలను వేరుచేసి, పునరుత్పత్తి దిశగా మార్పు చేసేందుకు కార్యక్రమాన్ని చేపట్టారు. ఇక్కడి పరిస్థితులపై గత గురువారం 'పాలిథిన్ ముప్పు.. ఆరోగ్యానికి ముప్పు' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి పుర అధికారులు స్పందించారు. స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా డంపింగ్ యార్డును పూర్తిగా శుభ్రం చేస్తున్నారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

బారువ పోలీసుస్టేషన్ పరిధిలో చెరువు పక్కన పేరుకుపోయిన చెత్తచెదారాలను పంచాయతీ సిబ్బంది తొలగించారు. ఈ సమస్యపై 'ఈనాడు'లో ఈనెల 20న 'డంపింగ్ యార్డు కాదు' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన చిత్ర కథనానికి ఈవో రాజేష్ స్పందించి చర్యలు తీసుకున్నారు. – న్యూస్‌టుడే, సోంపేట

డిగ్రీ సెమిస్టర్‌లో సత్తా చాటారు

డిగ్రీ ఐదో సెమిస్టర్ పరీక్షల్లో చక్కటి ఫలితాలతో ఇచ్ఛాపురం విద్యార్థులు సత్తా చాటారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు రమేష్(బైపీసీ), గార సంయుక్త, శ్యామ్‌సుందర్, సూరు అనూష, సరంగి రేణుక, పూజా బిస్వాల్, తెప్పెలి శ్రీనిజ, స్వర్ణభారతి డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రియదర్శిని, దుర్గా ఐశ్వర్య, నిహ్మాన పూజ, జాహ్నవి ఉత్తమ ఫలితాలు సాధించారు. వీరిని ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ కె.శ్రీనివాసరావు, అధ్యాపకులు, స్వర్ణభారతి యాజమాన్యం ఊలేష్, మహేశ్వర్ అభినందించారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

మినీ స్టేడియం నిర్మాణానికి స్థల పరిశీలన

స్థలం పరిశీలిస్తున్న వెంకన్నచౌదరి

మందస, న్యూస్‌టుడే: నియోజకవర్గంలో మినీ స్టేడియం నిర్మాణానికి తెదేపా నియోజకవర్గ సమన్వయకర్త వై.వెంకన్నచౌదరి స్థల పరిశీలన చేశారు. ఆదివారం హరిపురంలో ప్రభుత్వ స్థలాలను పరిశీలించారు. హరిపురం నుంచి మందస వరకు రహదారి విస్తరణ, కార్గో విమానాశ్రయం నిర్మాణం జరిగే ప్రాంతాలను సందర్శించారు. వాసుదేవ ఆలయంలో పూజలు చేశారు. నాయకులు బి.దుర్యోధన, డి.తాతారావు, ఎల్.రుద్రయ్య, నవీన్ పాల్గొన్నారు.

గొలుసు దుకాణాలు తొలగించండి

మాట్లాడుతున్న ఎంపీపీ దానయ్య

మందస, న్యూస్‌టుడే: మండలంలో గొలుసు దుకాణాలను తక్షణమే తొలగించేలా చర్యలు చేపట్టాలని ప్రజాప్రతినిధులు డిమాండు చేశారు. మందసలో ఎంపీపీ డి.దానయ్య అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించారు. గ్రామాల్లో విచ్చలవిడిగా మద్యం ఏరులై పారుతోందని, గొలుసు దుకాణాలు పుట్టగొడుగుల్లా ఉన్నాయని, అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్నారు. రెవెన్యూ, జలవనరులు, స్త్రీ, శిశు సంక్షేమ, ఇతర శాఖలు తమ పరిధిలోని అంశాలు వివరించారు. మండల ఉపాధ్యక్షుడు ఆదినారాయణ ప్రసాద్, ఎంపీడీవో వెంకటరమణ, తహసీల్దార్ ఎం.శ్రీకాంత్, జడ్పీటీసీ సభ్యురాలు చంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్ష కేంద్రాల వద్ద సెక్షన్ 163 అమలు

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా జరిగేందుకు అందరూ సహకరించాలని తహసీల్దారు ఎన్.వెంకటరావు కోరారు. ఇచ్ఛాపురంలో ప్రభుత్వ బాలిక జూనియర్, స్వర్ణభారతి, ఆదిత్య కళాశాలల్లో సోమవారం నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ఆయా కేంద్రాల వద్ద బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 163 (గతంలో ఐపీసీ 144) అమలులో ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

టెట్ నుంచి మినహాయింపు హర్షణీయం

సంఘ నేతను సత్కరిస్తున్న ఇచ్ఛాపురం ప్రతినిధులు

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: టెట్ పరీక్ష నుంచి ఉపాధ్యాయులను మినహాయింపు ఇచ్చిన పీఎం, ఏపీ సీఎం, కేంద్ర విద్యాశాఖమంత్రి ధర్మేంద్రప్రధాన్‌కు జిల్లా ఆపస్ ఉపాధ్యాయ సంఘం ధన్యవాదాలు తెలిపింది. ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) జిల్లా కార్యవర్గ సమావేశం ఇచ్ఛాపురంలో ఆదివారం జరిగింది. జిల్లా అధ్యక్షుడు శివరాంప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. జిల్లా సంఘ ప్రధాన కార్యదర్శి సోమేశ్వరరావు పలు అంశాలు ప్రవేశ పెట్టారు. ప్రభుత్వం వెంటనే ఐఆర్ ప్రకటించి, డీఏలు విడుదల చేయాలని కోరారు. సంఘ అభివృద్ధికి కృషి చేస్తున్న ఆనంద్, శంకరం, సోమేశ్, చలపతి తదితరులను సత్కరించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యం, రాష్ట్ర కార్యదర్శి చలపతిరావు, జిల్లా ముఖ్యులు మహేష్, మన్మథప్రధాన్, భవానీశంకర్, జ్యోతి, ధనలక్ష్మి, యశోద పాల్గొన్నారు.

యువకుల చేయూత

సీతూరులో బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న యువకులు

కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే: కవిటి మండలం సీతూరుకు చెందిన తెప్పల శ్యామ్‌సుందర్ కిడ్నీ వ్యాధితో బాధపడుతూ ఇటీవల మరణించారు. ఈ నేపథ్యంలో భార్య, ముగ్గురు పిల్లలు పడుతున్న ఇబ్బందులను గమనించిన స్థానిక, చుట్టు పక్కల గ్రామాల యువకులు కలిసి రూ.1,17,289 బాధిత కుటుంబానికి అందజేశారు. గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ఇచ్ఛాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: ఈదుపురానికి చెందిన శరత్ బెహరా ఐదేళ్ల క్రితం ప్రమాదానికి గురయ్యారు. ప్రస్తుతం బ్రహ్మపురలో చికిత్స పొందుతున్నారు. నిరుపేద కుటుంబం కావడంతో వైద్య ఖర్చులకు ఇబ్బందులు పడుతుండటంతో విషయం తెలుసుకున్న గ్రామానికి చెందిన యువకులు రూ.10,500 ఆర్థిక సాయం అందించారు. హేంగాంగ్ బెహరా పాల్గొన్నారు.

చిన్నారి వైద్యానికి సాయం

వజ్రపుకొత్తూరు, న్యూస్‌టుడే: కొండపురుకు చెందిన చిన్నారి భవ్య ఐదేళ్ల చిన్నారి గుండె సంబంధిత వ్యాధి దాఘాతానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మెరుగైన వైద్యం అందించేందుకు పూడిజగన్నాథపురానికి చెందిన హ్యాండ్స్ టుగెదర్ సంస్థ ఆదివారం బాధిత కుటుంబ సభ్యులకు రూ.30 వేల ఆర్థిక సాయం అందించారు. సంస్థ ప్రతినిధులు ఆదినారాయణ, గౌరిశ్రీ, శంకర్, కూర్మారావు, గణపతి, కోదండరావు, రామారావు పాల్గొన్నారు.

కార్యవర్గ ఎంపిక

జిల్లా ఎస్సీ దండోరా సామాజికవర్గం అభివృద్ధి సేవా సంఘ కార్యవర్గాన్ని ఆ సంఘ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు కంచిలి మార్కెట్ యార్డ్ ప్రాంగణంలో ఆదివారం ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షుడిగా సవరాల సంతోష్, ఉపాధ్యక్షుడిగా ఎ.మోహనరావు, మహిళా సహాయ అధ్యక్షురాలిగా మినిని జమంతి, ప్రధాన కార్యదర్శిగా జారు బాలకృష్ణ, సంయుక్త కార్యదర్శిగా కొండ ధర్మారావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి జె.చంద్రమోహన్, కోశాధికారి కె.మిట్టు, యువజన విభాగం అధ్యక్షుడు దుర్యోధన, లీగల్ సెల్ అధ్యక్షుడు బి.హరికృష్ణను ఎన్నుకున్నారు. – న్యూస్‌టుడే, కంచిలి

సామాజికవర్గ అభివృద్ధికి సహకరించండి

సోంపేట, న్యూస్‌టుడే: సామాజికవర్గ అభివృద్ధికి అందరూ సహకరించాలని కంచి కామాక్షి అగ్నికుల క్షత్రియ సంక్షేమ సంఘం సహాధికారి దుప్ప ప్రసాద్ కోరారు. ఆదివారం సోంపేటలో సంఘ నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. అధ్యక్ష, కార్యదర్శులుగా జుత్తు సోమేశ్వరరావు, వి.శ్రీనివాసరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా దున్న జోగారావు, జి.తేజేశ్వరరావు, కోశాధికారిగా జె.గిరిబాబు, సహాయకులుగా ఎస్.దేవ, డి.మోహనరావు, సంయుక్త కార్యదర్శులుగా కె.చిరంజీవులు, జె.కృష్ణారావును ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా దున్న చిన్నారావు వ్యవహరిస్తారు. పలు తీర్మానాలు ఆమోదించి భవిష్యత్తు కార్యక్రమాల గురించి చర్చించారు.

సీతారామాలయ, శిర్డీసాయి మందిర కమిటీల ఎన్నిక

పలాసలో నూతన కమిటీల అధ్యక్ష, కార్యదర్శులతో కార్యవర్గ సభ్యులు

పలాస, న్యూస్‌టుడే: పలాస రైల్వేకాలనీలో శ్రీరామా కల్చరల్ అసోసియేషన్ (సీతారామాలయం), శిర్డీసాయి ధ్యానమందిర కమిటీల నియామకం ఆదివారం నిర్వహించారు. సీతారామాలయ కమిటీ గౌరవాధ్యక్షుడిగా కొంచాడ భీమారావు, అధ్యక్షుడిగా టి.నర్సింహమూర్తి, ఉపాధ్యక్షులుగా పి.లోకనాథం, పి.సంజిత్‌కుమార్, కార్యదర్శిగా జయశంకర్ రెడ్డి, కోశాధికారిగా టి.హరికుమార్, సహాయ కార్యదర్శులుగా కేవీఎస్ హరిప్రసాద్, జీసీహెచ్.రెడ్డి, విక్రమ్ రామారావు, ఆర్వీ రావు, జి.బాలకృష్ణ, ఉమామహేశ్వరరావు, జి.శివశంకర్‌ను ఎన్నుకున్నారు. శిర్డీసాయి ధ్యానమందిరం అధ్యక్షుడిగా టి.హరికుమార్, ఉపాధ్యక్షుడిగా పెంట కృష్ణానందస్వామి, కార్యదర్శిగా జీజేఎస్ రెడ్డి, సహాయ కార్యదర్శిగా హరినారాయణ, కోశాధికారిగా కె.చలపతిరావు, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

ఈ సారీ వారే..

● జిల్లా స్థాయి గ్రిగ్స్ పోటీల్లో సత్తా చాటిన పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు

– న్యూస్‌టుడే, పలాస క్రీడలు

ఇష్టమైన ఆట కోసం అకుంఠిత దీక్షతో నిరంతరం సాధన చేస్తూ జిల్లాస్థాయిలో సత్తా చాటుతున్నారు పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాల చిన్నారులు. పేదరికం వారి క్రీడాసంకల్పానికి అడ్డంకి కాలేకపోయింది. ఈనెలలో శ్రీకాకుళంలో జరిగిన జిల్లాస్థాయి గ్రిగ్స్ పోటీల్లో సీనియర్స్ విభాగంలో టెన్నికాయిట్ క్రీడాంశంలో బాలురు, బాలికల విభాగాల్లో విజేతలుగా నిలిచి తమ పటిమను చాటుకున్నారు.

పలాస మైదానంలో సాధన చేస్తున్న విద్యార్థులు

● డబుల్స్‌లో బాలుర విభాగంలో కె.జయంత్, ఎస్.చరణ్‌రెడ్డి, కె.గౌతమ్ విజేతలుగా నిలవగా, బాలికల విభాగంలో ఎన్.దివ్య, కె.బిందుమాధవి, వై.మాధవి సత్తా చాటారు.

● గతేడాది కూడా ఇదే పాఠశాల విద్యార్థులు టెన్నికాయిట్‌లో బాలబాలికల విభాగాల్లో, ఖోఖోలో విజేతలుగా నిలిచి గేమ్స్ ఛాంపియన్‌షిప్ గెలుచుకున్నారు. ఈ ఏడాది విజేత జట్లలో ఇద్దరు జాతీయ పోటీల్లోనూ పతకాలు అందుకున్నారు.

తొలి యత్నంలోనే జాతీయస్థాయిలో పతకాలు

నెయ్యిల దివ్య: తొమ్మిదోతరగతి విద్యార్థిని. గతేడాది డిసెంబరులో కేరళ నేషనల్స్‌లో మిక్స్‌డ్ డబుల్స్‌లో రజత పతకాన్ని సాధించింది. బాలికల టీం ఛాంపియన్‌షిప్‌లో కాంస్యపతకం సొంతం చేసుకుంది. ఈ క్రీడాకారిణి గతేడాది వజ్రపుకొత్తూరు స్టేట్‌మీట్‌లో తొలిసారిగా ఆడింది. తర్వాత చింతలపూడి (ప.గో), పలాస, చిట్యాల (తూ.గో), మండపేట (కాకినాడ), చీరాల (బాపట్ల) రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహించింది. తల్లిదండ్రులు నాగేష్, సావిత్రి తోపుడుబండిపై అమ్మకాలు చేస్తుంటారు.

కొరికాన జయంత్: తొమ్మిదో తరగతి విద్యార్థి. గతేడాది డిసెంబరులో కేరళ నేషనల్స్‌లో మిక్స్‌డ్ డబుల్స్‌లో, బాలుర టీం ఛాంపియన్‌షిప్‌లో కాంస్య పతకాలు గెలుచుకున్నాడు. ఈ క్రీడాకారుడు జంగారెడ్డిగూడెం (ప.గో)లో తొలి స్టేట్‌మీట్ ఆడగా.. తర్వాత వజ్రపుకొత్తూరు రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ఆటగాడిగా ఎంపికయ్యాడు. చింతలపూడి (ప.గో)లో టీం ఛాంపియన్‌షిప్‌లో నాలుగోస్థానంలో నిలిచాడు. తండ్రి ధనంజయ, తాపీమేస్త్రి కాగా తల్లి సావిత్రి జీడిపరిశ్రమలో కార్మికురాలు.

హిందూ సమాజాన్ని శక్తిమంతంగా మార్చాలి

కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే: హిందూ సమాజాన్ని మరింత శక్తిమంతంగా మార్చాల్సిన అవసరం ఉందని వక్త యుగంధర్ (విజయవాడ) అన్నారు. ఆదివారం కవిటి గొండ్యాలపుట్టుగ రోడ్డులోని ఆర్ఎస్ఎస్ హిందూ వర్గీయుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో హిందూ సమాజం ప్రపంచానికి మార్గదర్శకంగా ఉండేదని, కాలక్రమేణా హిందువులు తగ్గిపోతున్నారని పేర్కొన్నారు. హిందూ సమాజాన్ని సంఘటితం చేస్తూ శక్తిమంతంగా తయారు చేయాలని కోరారు.

కనీస వేతనాలు చెల్లించాలి

సోంపేట: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్ల(ఆయాల)కు కనీస వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు అల్లు మహాలక్ష్మి డిమాండ్ చేశారు. ఆదివారం సోంపేటలో జిల్లా కార్యదర్శి ఎస్.లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పలు డిమాండ్లతో తీర్మానం ఆమోదించారు. యూనియన్ నాయకులు చంద్రకళ, దమయంతి, గంగాభవాని, కృష్ణవేణి, రోజా, సంధ్య, గౌరి పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

పలాస గ్రామీణం: బొడ్డపాడులో దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం(పీడీఎం) ఆధ్వర్యంలో ఈనెల 27న నిర్వహించనున్న స్వాతంత్ర్య సమరయోధుడు చంద్రశేఖర ఆజాద్ 95వ సంస్మరణ సభను విజయవంతం చేయాలని పీడీఎం నాయకులు కోరారు. ఈ మేరకు బొడ్డపాడులో ఆదివారం కరపత్రాలు ఆవిష్కరించారు.

'కప్పిపుచ్చుకోవడానికే వంద అబద్ధాలు'

కవిటి గ్రామీణం: కలియుగ వైకుంఠ వాసుడు నెయ్యి లడ్డూ ప్రసాదం వ్యవహారంలో వైకాపా ఒక అబద్ధాన్ని కప్పి పుచ్చుకోవడానికి వంద అబద్ధాలు ఆడుతోందని తెదేపా జిల్లా పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు సీపాన వెంకటరమణ అన్నారు. ఆదివారం ఆయన బైరిపురంలో తెదేపా నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడాడు. మండలాధ్యక్షుడు కృష్ణారావు, ఏఎంసీ ఛైర్మన్ మణిచంద్ర ప్రకాష్, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ చిన్నబాబు పాల్గొన్నారు.

క్రమశిక్షణ, నాయకత్వ పటిమ అవసరం

విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ, సేవాభావం, నాయకత్వ పటిమ, దేశభక్తి అవసరమని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయురాలు జయలక్ష్మి అన్నారు. స్కౌట్స్ శిక్షకుడు సాయిబాబా, గైడ్స్ కెప్టెన్ రామలక్ష్మి ఆధ్వర్యంలో ఆదివారం ప్రపంచ స్కౌట్స్ అండ్ గైడ్స్ దినోత్సవం నిర్వహించారు. తొలుత పుర వీధుల్లో స్కౌట్ ఉద్యమ వ్యవస్థాపకుడు రాబర్ట్ బాడెన్ పావెల్ చిత్రపటంతో ప్రదర్శన చేపట్టారు. పాఠశాల ఆవరణలో పావెల్‌కు నివాళులర్పించారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

మాజీ మంత్రి జన్మదిన వేడుకలు

పలాస, వజ్రపుకొత్తూరు, న్యూస్‌టుడే: మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు జన్మదినాన్ని పలాస నియోజకవర్గ వైకాపా నాయకులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. కాశీబుగ్గ కిడ్నీ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. వజ్రపుకొత్తూరు పార్టీ కార్యాలయంలో కేకు కోసి శుభాకాంక్షలు తెలిపారు. పట్టణ అధ్యక్షుడు ఎస్.గోపి, కౌన్సిలర్ బి.శ్రీను, ఎంపీటీసీ సభ్యుడు దుర్యోధన, నాయకులు ఎం.మన్మథరావు, బి.బల్లయ్య, పి.వెంకటరావు(చిట్టి), డి.రవి, వీర్రాజు పాల్గొన్నారు.

అప్రమత్తత తప్పనిసరి

పలాస గ్రామీణం: మహాదేవిపురంలో ఆదివారం పోలీసులు అవగాహన సదస్సు నిర్వహించారు. నారీ శక్తి, సైబర్ నేరాలు, సంకల్పం, మహిళలపై జరుగుతున్న నేరాలు, బాల్య వివాహాలు మొదలైన అంశాలపై అవగాహన కల్పించారు. ఎస్సై నరసింహమూర్తి పాల్గొన్నారు.

రాజగోపాలరావుకు నివాళి

కాశీబుగ్గ, పలాస, న్యూస్‌టుడే: శ్రీకాకుళం మాజీ ఎంపీ దివంగత బొడ్డేపల్లి రాజగోపాలరావు వర్ధంతిని కాశీబుగ్గ కె.టి.రోడ్డులో వైకాపా నాయకులు నిర్వహించారు. స్థానిక రాజగోపాలరావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వైకాపా పట్టణ అధ్యక్షుడు ఎస్.గోపి, బి.బల్లయ్య, ఎం.మన్మథరావు, బి.దుర్యోధనరావు, డి.రవి, రమణయ్య, మోహన్, ఆర్.వెంకటరమణ, ముకుందరావు తదితరులు పాల్గొన్నారు.

కాశీబుగ్గలో బొడ్డేపల్లి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైకాపా నాయకులు

(c) eenadu

టెక్కలి

•టెక్కలి •నరసన్నపేట •పాతపట్నం

బడిలో.. జ్ఞాపకాల ఒడిలో

ఆత్మీయ కలయికలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

పోలాకి, న్యూస్‌టుడే: పోలాకి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1975-76 సంవత్సరం పదోతరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం రేవంపలాంలో నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్ననాటి స్నేహితులంతా పాత జ్ఞాపకాలను నెమరువేసుకుని ఆనందంగా గడిపారు. నిర్వాహకుడు నల్లాన వెంకునాయుడిని సన్మానించారు.

బ్యాడ్మింటన్ విజేత మెళియాపుట్టి

జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో మెళియాపుట్టి జట్టు విజేతగా నిలిచింది. మూడు రోజులుగా మెళియాపుట్టిలోని ఇండోర్ కోర్టు ఆవరణలో కొండపల్లి చంద్రశేఖర్, దమయంతి ట్రస్టు ఆధ్వర్యంలో జరిగిన పోటీలు ఆదివారంతో ముగిశాయి. విజేతకు రూ.6,666, రన్నరప్‌గా నిలిచిన సీది జట్టుకు రూ.4,444 నగదు పురస్కారాలు, జ్ఞాపికలను ట్రస్టు ప్రతినిధులు మణిమాల, కుమారస్వామి అందించారు. – న్యూస్‌టుడే, మెళియాపుట్టి

ఎరువుల పంపిణీపై నిలదీత

వ్యవసాయాధికారిణిని ప్రశ్నిస్తున్న సభ్యుడు

ఎల్‌ఎన్‌పేట, న్యూస్‌టుడే: పంటలు వేయని రైతులకు ఎరువులు ఇవ్వడంపై సర్వసభ్య సమావేశంలో సభ్యులు మండల వ్యవసాయాధికారిణి కిరణ్ వాణిని సభ్యులు నిలదీశారు. ఎంపీపీ రెడ్డి జ్యోతిలక్ష్మి అధ్యక్షతన ఆదివారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కొమ్మువలస, రావిచెంద్రి సర్పంచులు సీతారాం, లక్ష్మంనాయుడు మాట్లాడుతూ రబీలో వరి, మొక్కజొన్న పంట వేసిన రైతులకు యూరియా ఇవ్వలేదని మండిపడ్డారు. దీనిపై ఏవో మాట్లాడుతూ ఇకపై పొరపాటు జరగకుండా చూస్తామన్నారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు వివిధ సమస్యలను ఏకరువు పెట్టారు. ఎంపీడీవో పైడి శ్రీనివాసరావు, తహసీల్దారు జామి ఈశ్వరమ్మ, ఎంఈవో చంద్రమౌళి, జడ్పీటీసీ సభ్యుడు కిలారి త్రినాథరావు పాల్గొన్నారు.

అభాసుపాలు..!

కాగితాలకే పరిమితమైన పాలసేకరణ కేంద్రాల పనులు

– న్యూస్‌టుడే, పోలాకి, జలుమూరు, సారవకోట, నరసన్నపేట

పోలాకి మండలం ప్రియాగ్రహారంలో అసంపూర్తిగా నిర్మాణం

వైకాపా హయాంలో చేపట్టిన ప్రభుత్వ భవనాల నిర్మాణాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. బల్క్‌మిల్క్ కేంద్రాల పరిస్థితి ఇదే విధంగా మారింది. పాలు అమ్ముకుని జీవించే వారికి ఆర్థికంగా ఆసరా అందిస్తామని, అందరికీ అందుబాటులో ఉండేలా భవనాలు ఏర్పాటు చేస్తున్నామని నాటి నేతలు ఊదర గొట్టారు. ఐదేళ్ల పాలన పూర్తయినా ఇచ్చిన మాట నిలబెట్టుకోలేదు. దీంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా పరిస్థితి మారింది.

నియోజకవర్గంలో ఇలా...

మండలం	మంజూరైన కేంద్రాలు
పోలాకి	20
సారవకోట	16
నరసన్నపేట	22
జలుమూరు	26

నరసన్నపేట నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు సంబంధించి 84 పాల సేకరణ కేంద్రాలు మంజూరయ్యాయి. మూడు చోట్ల మినహా మిగతా అన్ని ప్రాంతాల్లో స్థల సమస్యలు ఎదురయ్యాయి. ఒక్కో భవన నిర్మాణానికి రూ.15.74 లక్షల నిధులు ఉపాధిహామీ పథకం నుంచి వినియోగించుకోవాలని మండలాధికారులకు ఆదేశాలు అందాయి. పునాదుల వరకు పనులు చేపట్టినా బిల్లులందక పోవడంతో నిర్మాణాలు పూర్తి చేసేందుకు గుత్తేదారులు ముందుకు రాలేదు. నరసన్నపేట మండలం సుందరాపురం భవనం పూర్తవగా దానిని వేరే శాఖ వారు ఉపయోగిస్తున్నారు. పోలాకి మండలం ప్రియాగ్రహారంలో గోడల వరకు పని చేసి వదిలేశారు. దేశవానిపేటలో పునాది స్థాయిలో ఉండిపోయింది. కొత్త ప్రభుత్వం వచ్చి రెండేళ్లు కావస్తున్నా అధికార యంత్రాంగం ఈ సమస్యపై దృష్టి సారించలేదు. దీంతో పాడి రైతులకు ఎదురుచూపులే మిగిలాయి. ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

పనులు చేపట్టిన మేరకు బిల్లులు అందాయి. మూడు చోట్ల మినహా మిగిలిన మండలాల్లో నిర్మాణాలు జరగలేదు. దీనిపై శాఖాపరంగా ఆదేశాలు రాలేదు. సమస్యను ఉన్నతాధికారులకు నివేదించి, వారి సూచనలు మేరకు చర్యలు తీసుకుంటాం.
– జి.సత్యం నాయుడు, డీఈఈ, పీఆర్, నరసన్నపేట

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM) 9441426248 8374620852

?: నందిగాం మండలం దిమ్మిడిజోల గ్రామం ప్రధాన వీధిలో విద్యుత్తు తీగలు ఇళ్లను తాకుతూ ప్రమాదకరంగా ఉన్నాయి. దీంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.
- రేగల కూర్మారావు, స్థానికుడు

• క్షేత్రస్థాయిలో పరిశీలించి, సిబ్బందికి తెలియజేస్తాం. - నేతాజీ, జేఈఈ, విద్యుత్తు శాఖ, నందిగాం – న్యూస్‌టుడే, నందిగాం

మాజీ సర్పంచి మృతికి సంతాపం

కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: కోటబొమ్మాళి మేజర్ పంచాయతీ మాజీ సర్పంచి, తెదేపా సీనియర్ నాయకుడు కమ్మకట్టు అప్పలరాజు రెడ్డి (75) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈయన మృతికి కేంద్ర, రాష్ట్రమంత్రులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు సంతాపం తెలిపారు. అంత్యక్రియల్లో రాష్ట్ర కళింగ కోమట్ల కార్పొరేషన్ ఛైర్మన్ బోయిన గోవిందరాజులు, పార్టీ మండలాధ్యక్షుడు రమేష్ పాల్గొన్నారు.

రాజగోపాలరావు సేవలు చిరస్మరణీయం

నివాళులర్పిస్తున్న పేరాడ తిలక్, ఇతర నాయకులు

కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: పార్లమెంట్ సభ్యుడిగా బొడ్డేపల్లి రాజగోపాలరావు అందించిన సేవలు చిరస్మరణీయమని వైకాపా టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ అన్నారు. కోటబొమ్మాళిలో ఆదివారం నిర్వహించిన ఆయన వర్ధంతి కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు. పార్టీ మండలాధ్యక్షుడు సంపతిరావు రాజు, రాష్ట్ర ప్రతినిధి నాక సత్యరాజ్, నేతలు రోణంకి మల్లయ్య, కోత సతీష్, సర్పంచి సంజీవరావు ఉన్నారు.

చలో విజయవాడ విజయవంతం చేయాలి

పోలాకి, న్యూస్‌టుడే: ఈ నెల 25న విజయవాడలో చేపట్టనున్న శంఖారావం కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు విజయవంతం చేయాలని ఎస్టీయూ జిల్లా కార్యదర్శి శ్రీనివాసరావు కోరారు. ఆదివారం పోలాకిలో సంఘం కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతూ 12వ పీఆర్సీ ఏర్పాటు చేయాలని కోరుతున్నా ప్రభుత్వం స్పందించక పోవడం దురదృష్టకరమన్నారు. రాజశేఖర్ ఉన్నారు.

నేడు ఆలయ వార్షికోత్సవం

జలుమూరు, న్యూస్‌టుడే: జోగిలి పంచాయతీ అబ్బాయిపేటలో శ్రీమురళీకృష్ణ స్వామి ఆలయ వార్షికోత్సవం సోమవారం జరుగనుంది. కల్యాణం నిర్వహిస్తామని, ఈమేరకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు పురోహితుడు చామర్తి జగన్నాథాచార్య, కమిటీ సభ్యులు తెలిపారు.

బాధ్యతల స్వీకరణ

మెళియాపుట్టి, న్యూస్‌టుడే: శాంతి భద్రతలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు ఎస్సై మహ్మద్ అమీర్ అలీ అన్నారు. మెళియాపుట్టి ఎస్సైగా ఆయన ఆదివారం బాధ్యతలు చేపట్టారు. గతంలో పాతపట్నం, నందిగాం, కొత్తూరు మండలాల్లో విధులు నిర్వహించారు. ఇక్కడ పనిచేసిన రమేష్‌బాబు వీఆర్‌లో ఉన్నట్లు సమాచారం.

కరాటేలో స్వర్ణ పతకం

కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: మేజర్ పంచాయతీకి చెందిన జోగి దుర్గారావు కరాటే సీనియర్ విభాగంలో స్వర్ణ పతకం సాధించారు. ఆదివారం నిడదవోలులో ఈ పోటీలు జరిగాయి.

తూతూమంత్రంగా సర్వసభ్య సమావేశం

సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు

నందిగాం, న్యూస్‌టుడే: స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపీపీ శ్రీరామ్మూర్తి అధ్యక్షతన ఆదివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. నిర్మాణాలు పూర్తయిన గృహాలకు బిల్లులు చెల్లించలేదని గృహ నిర్మాణ సంస్థ ఇన్‌ఛార్జి ఏఈపై సభ్యులు అసహనం వ్యక్తం చేశారు. దీనబంధుపురం ప్రాథమిక పాఠశాలలో స్వీపర్‌ను అన్యాయంగా తొలగించారని ఎంఈవోపై సర్పంచి మండిపడ్డారు. బంజీరుపేట, జమ్మిపేట సౌర రక్షిత మంచినీటి పథకాలకు మరమ్మతులు చేపట్టాలని కోరారు. నందిగాం పీహెచ్‌సీ సిబ్బంది సమయపాలన పాటించడం లేదన్నారు. ఎంపీడీవో కుమార్ పట్నాయక్, మండల ఉపాధ్యక్షురాలు లక్ష్మీకాంతం, సువ్వారి వసంతకుమార్ పాల్గొన్నారు.

కొత్తూరు విద్యార్థుల ప్రతిభ

కొత్తూరు, న్యూస్‌టుడే: శ్రీకాకుళంలో వేదం ఇంటర్నేషనల్ ఏఐ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన జిల్లాస్థాయి ప్రతిభా పోటీల్లో కొత్తూరుకు చెందిన మహర్షి ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ప్రిన్సిపల్ ముగితి రాంబాబు ఆదివారం మాట్లాడుతూ.. సీహెచ్ విష్ణుప్రియ(7వ తరగతి), పెద్దిన పార్వతీతన్వి(7వ తరగతి), ఎ.మోక్షిత (3వ తరగతి) బహుమతులు గెలిచినట్లు చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటం

నరసన్నపేట, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటం చేద్దామని సీఐటీయూ జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి తేజేశ్వరరావు అన్నారు. స్థానిక ఎంపీడీవో సమావేశ మందిరం వద్ద ఆదివారం సమావేశం ఏర్పాటు చేశారు. అంగన్‌వాడీ సిబ్బంది, మధ్యాహ్న భోజన నిర్వాహకుల సమస్యల పరిష్కారం కోసం పోరాటానికి సిద్ధం కావాలని చెప్పారు. నాయకురాలు నాగమణి పాల్గొన్నారు.

సమస్యలపై ఐక్యంగా పోరాడాలి

కొత్తూరు, న్యూస్‌టుడే: ఐక్యంగా పోరాడితేనే కళాకారుల సమస్యలు పరిష్కారమవుతాయని వక్తలు పేర్కొన్నారు. ఆదివారం కొత్తూరు మండలం గూనభద్ర ఆర్ అండ్ ఆర్ కాలనీలో వివిధ ప్రాంతాల కళాకారులు ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కళలను ఆదరించాలని కోరారు. పేద కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. గుర్రం జాషువా కళాపీఠం గౌరవాధ్యక్షుడు ఎస్.మన్మథరావు పాల్గొన్నారు.

దత్తాత్రేయస్వామికి పూజలు

సారవకోట, న్యూస్‌టుడే: సత్రాం గ్రామంలో కొలువైన దత్తాత్రేయ స్వామి ఆలయ వార్షికోత్సవం ఆదివారం వైభవంగా ప్రారంభమైంది. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అరటి గెలలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. ఈనెల 24 వరకు ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతాయని కమిటీ సభ్యులు తెలిపారు.

వైద్య శిబిరానికి స్పందన

సారవకోట, న్యూస్‌టుడే: అలుదు ఉన్నత పాఠశాలలో స్థానిక విజయాంబికా యువజన సంఘం వ్యవస్థాపకుడు చల్ల ఆనందరావు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కంటి వైద్య శిబిరానికి స్పందన లభించింది. శంకర్ ఫౌండేషన్ వైద్యులు అపూర్వ, అరుణ సేవలందించారు. అలుదు, బుడితి ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు టి.రామారావు, జి.రాము పాల్గొన్నారు.

విద్యుత్తు సమస్యలు పరిష్కరించాలి

ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న తెదేపా నాయకులు

పాతపట్నం, న్యూస్‌టుడే: పాతపట్నం మేజర్ పంచాయతీ పరిధిలోని విద్యుత్తు సమస్యలు పరిష్కరించాలని తెదేపా మండలాధ్యక్షుడు పైల బాబ్జీ, పట్టణ కమిటీ అధ్యక్షుడు సైలాడ సతీష్, ఇతర నాయకులు కోరారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే మామిడి గోవిందరావుకు ఈమేరకు వినతి పత్రం అందజేశారు.

భాష ద్వారానే భావ వ్యక్తీకరణ

కొత్తూరు: భాష ద్వారానే భావ వ్యక్తీకరణ సాధ్యమని కొరవే సభ్యురాలు ఎ.కామేశ్వరి అన్నారు. ఆదివారం స్థానిక విజ్ఞానభారతి పాఠశాల ప్రాంగణంలో కొత్తూరు రచయిత వేదిక (కొరవే) ఆధ్వర్యంలో మాతృభాషా దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపల్ కలమట శ్రీరాములు, భాషా పండితులు పాల్గొన్నారు.

కాసారం.. కానరాని వైనం

కోటబొమ్మాళి- టెక్కలి మార్గంలోని మంచాలపేట చెరువులో పనికిరాని మొక్కలు, పూడిక పేరుకుపోయింది. కొంతకాలంగా నిర్వహణను పట్టించుకోక పోవడంతో మైదానాన్ని తలపిస్తోందని గ్రామస్థులు వాపోతున్నారు. వంశధార ప్రధాన కాలువ పక్కనే ఉన్నా నీటి జాడ లేదని చెబుతున్నారు. ఈ విషయాన్ని ఏపీవో హరిప్రసాద్ వద్ద ప్రస్తావించగా.. క్షేత్రస్థాయిలో పరిశీలించి తటాకాన్ని మెరుగు పరుస్తామన్నారు. – న్యూస్‌టుడే, ఎత్తురాళ్లపాడు(కోటబొమ్మాళి)

మీటర్ రీడర్ల పొట్ట కొట్టొద్దు

టెక్కలిలో నిరసన వ్యక్తం చేస్తున్న మీటర్ రీడర్లు

టెక్కలి పట్టణం: స్మార్ట్ మీటర్లు ఏర్పాటుచేసి తమకు అన్యాయం చేయొద్దని విద్యుత్తు మీటర్ రీడర్ల యూనియన్ ప్రతినిధులు డిమాండు చేశారు. ఆదివారం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయం వద్ద ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. సంఘ అధ్యక్షుడు బి.ఓంకారరావు, ప్రధాన కార్యదర్శి డి.భాస్కరరావు, ఉపాధ్యక్షుడు వి.ప్రసాద్ పాల్గొన్నారు.

దాహం తీర్చని కుళాయిలు

పోలాకి మండలం గంగివలసలో కుళాయిలు అమర్చి మూడేళ్లయినా సరఫరా చేపట్టలేదు. దీంతో గ్రామంలోని 175 కుటుంబాలు బావులు, చేతిపంపుల పైనే ఆధారపడుతున్నారు. పలుమార్లు గ్రామ సభలో ఈ విషయం ప్రస్తావించినా ఫలితం లేకుండా పోయిందని స్థానికులు పెదవి విరుస్తున్నారు. సమస్యను ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లగా.. జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా నీటి సదుపాయం కల్పిస్తామని చెప్పారు. – పోలాకి, న్యూస్‌టుడే

రేపు ఉద్యోగ మేళా

టెక్కలి పట్టణం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 24న జేకేసీ, బీబీక్యూ నేషన్ సంస్థ ఆధ్వర్యంలో ఉద్యోగ మేళా జరుగుతుందని ప్రిన్సిపల్ టి.గోవిందమ్మ ఓ ప్రకటనలో తెలిపారు. కనీసం పదో తరగతి ఉత్తీర్ణత సాధించి, 28 ఏళ్ల లోపు వయసు గల వారు అర్హులన్నారు.





విజ్ఞాన యాత్రలతో వికాసం

విజ్ఞాన యాత్రలతో వికాసం పెంపొందుతుందని పాతపట్నం పీఎంశ్రీ ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ రత్నకుమారి, వైస్ ప్రిన్సిపల్ ప్రసాదరావు పేర్కొన్నారు. విద్యార్థులను ఆదివారం ప్రముఖ పర్యాటక కేంద్రమైన శాలిహుండం సందర్శనకు తీసుకెళ్లారు. వంశధార నది ఒడ్డున ఉన్న ప్రాచీన బౌద్ధ క్షేత్రం గురించి వివరించారు. – న్యూస్‌టుడే, పాతపట్నం

వెంకటేశ్వరాలయంలో సామూహిక ఉపనయనాలు

నరసన్నపేట వెంకటేశ్వరాలయంలో సామూహిక ఉపనయనాలు జరిగాయి. గుండుగోల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఆదివారం వైశ్య సామాజిక వర్గానికి చెందిన 102 మంది యువకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సంఘం ప్రతినిధులు పొట్నూరు సాయిబాబు, ప్రసాద్, బోయిన వెంకటరమణమూర్తి, తంగుడు జోగారావు ఉన్నారు. – న్యూస్‌టుడే, నరసన్నపేట

గణితమంటే భయం వద్దు

విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తున్న జి.వి.ఎస్.శాస్త్రి

నరసన్నపేట గ్రామీణం, న్యూస్‌టుడే: గణితమంటే భయం వద్దని, సాధనతో పట్టు సాధించవచ్చని గణితశాస్త్ర నిపుణుడు జి.వి.ఎస్.శాస్త్రి పేర్కొన్నారు. ఉర్లాం ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక శిక్షణ తరగతులకు ఆదివారం ఆయన హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా పిల్లల సందేహాలను నివృత్తి చేశారు. ఏ విధంగా సాధన చేయాలి, పరీక్షల్లో ప్రశ్నలను ఎలా ఎదుర్కోవాలి, మంచి మార్కులు ఎలా సాధించాలనే అంశాలపై సూచనలు, సలహాలు అందించారు. గణిత ఉపాధ్యాయుడు అశోక్ ఉన్నారు.

వైభవంగా శ్రీనివాసుడి కల్యాణం

కొత్తూరు, న్యూస్‌టుడే: మెట్టూరు సమీపంలోని నేరడి కొండపై కొలువైన శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా చేపట్టారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది.

రూ.1.48 కోట్లు మంజూరు

హిరమండలం, న్యూస్‌టుడే: సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకెళ్తుందని కొమనాపల్లి సర్పంచి పల్లి శారద, వార్డు సభ్యులు అన్నారు. ఆదివారం వారు మాట్లాడుతూ.. గ్రామంలో 3 కి.మీ. మేర బీటీ, సీసీ రోడ్ల పనులకు రూ.1.48 కోట్లు మంజూరైనట్లు చెప్పారు.

(c) eenadu

శ్రీకాకుళం

•శ్రీకాకుళం •ఆమదాలవలస •ఎచ్చెర్ల

సీతారామస్వామి సేవలో ఎమ్మెల్యే శంకర్

శ్రీకాకుళం గ్రామీణ మండలం తండెంవలస పంచాయతీ పరిధి బెండువానిపేటలో ఆదివారం విద్యాగణపతి, మహాలక్ష్మి సమేత సీతారామస్వామి విగ్రహాల ప్రతిష్ఠోత్సవం వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. ఎమ్మెల్యే గొండు శంకర్ ప్రత్యేక పూజలు చేశారు. - న్యూస్‌టుడే, శ్రీకాకుళం గ్రామీణం

పిల్ల కాలువ గొల్లుమంటోంది

సరుబుజ్జిలి నుంచి బుడ్డివలస గ్రామ కూడలి వరకు ఉన్న సాగునీటి పిల్లకాలువ పూడికతో అధ్వానంగా మారింది. దీంతో రైతులకు సాగునీరందక అవస్థలు పడుతున్నారు. కాలువలో పనికిరాని మొక్కలు, చెత్త పేరుకుపోవడంతో అస్తవ్యస్తంగా తయారైంది. వంశధార ఏఈ జగదీశ్వరరావు వద్ద ప్రస్తావించగా పరిశీలించి అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. -న్యూస్‌టుడే, సరుబుజ్జిలి

లక్ష్యం 'నీరు'గారింది

ఆమదాలవలస పుర పరిధిలోని 23 వార్డుల్లో తాగునీరు అందించే ఉద్దేశంతో వైకాపా హయాంలో ఏఐఐబీ నిధులతో పనులు ప్రారంభించారు. గుత్తేదారులు సిమెంట్ గొట్టాలు తీసుకొచ్చి, తాండ్రసిమెట్ట, గేదెలవానిపేట, పార్వతీశంపేట, చింతాడ, మెట్టక్కివలస ఇతర ప్రాంతాల్లో ఉంచారు. ఆ తరువాత నిధుల కొరత, పలు కారణాలతో పనులు ఆగిపోయాయి. దీంతో సిమెంట్ గొట్టాలు నిరుపయోగంగా మారి, ముళ్ల పొదల్లో దర్శనమిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుని కుళాయిలు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఎమ్మెల్యే కూన రవికుమార్ వివరణ కోరగా త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు. -న్యూస్‌టుడే, ఆమదాలవలస పట్టణం

అపరాలపై మనసు

వరేతర పంటలపై దృష్టిసారిస్తున్న రైతులు

కళ్లేపల్లిలో మొక్కజొన్నసాగు

శ్రీకాకుళం గ్రామీణం, న్యూస్‌టుడే

అపరాలసాగుపై గ్రామీణ రైతుల్లో ఆసక్తి పెరుగుతోంది. ప్రధాన పంటలుగా సాగు చేస్తుండేవారు. గతంలో పండించిన వరి, మిరప, సరుగుడు, చెరకు కలిసి రాకపోవడంతో అధికారులు సూచన మేరకు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించారు.

☛ మొక్కజొన్న అధిక విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. నీరు పుష్కలంగా ఉండటంతో రెండు సార్లు నీరు అందించొచ్చు. ఎకరాకు 30 నుంచి 40 బస్తాల వరకు దిగుబడి వస్తాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. పెసర, మినప, రాగి, నువ్వుల పంటలకు సైతం ప్రాధాన్యమిస్తున్నారు.

☛ మొక్కజొన్నకు ఎరువులను ఎక్కువగా వేయాల్సిన అవసరం లేదు. పెట్టుబడి మినహా మంచి లాభం వస్తుంది. శ్రీకాకుళం గ్రామీణ మండల పరిధిలోని గత ఏడాది 1121 ఎకరాలల్లో మొక్కజొన్న సాగు చేస్తే, ఈ ఏడాది 2420 ఎకరాల్లో పండిస్తున్నారు.

సాగు వివరాలు ఇలా..

పంట	పండిస్తున్న విస్తీర్ణం (ఎకరాల్లో)
మినుములు	2992
పెసలు	950
ఉలవలు	50
మొక్కజొన్న	2420
రాగులు	501
నువ్వులు	320
మొత్తం	7233

'సచివాలయ సిబ్బంది, క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించడంతో మంచి ఫలితాలు వస్తున్నాయి. గిట్టుబాటు ధరకు విక్రయించేలా ప్రోత్సహిస్తున్నాం' అని -పి.నవీన్, మండల వ్యవసాయ అధికారి

తెరపై ఈనాడు

● సరస్వతి: ఫంకీ ● ఎస్‌వీసీ (రామలక్ష్మణ): మన శంకరవరప్రసాద్ గారు ● సన్‌మ్యాక్స్: హే బల్‌వంత్ ● మారుతి : బూకీ, ● కిన్నెర : విత్ లవ్ ● కీర్తన: ఆల్కా, ● కీర్తిక: నవాబ్ కేఫ్ ● సూర్య : కపుల్ ఫ్రెండ్లీ

- న్యూస్‌టుడే, పాతబస్టాండ్

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM) 9502198883 8008552704

మీ ప్రాంతంలో ఏ ప్రజాసమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలు, చిత్రాలను వాట్సప్ ద్వారా పంపొచ్చు. లేదా ఫోన్లో వివరించొచ్చు. వాటిని బాధ్యులదృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

? పట్టణంలోని లక్ష్మీనగర్ నుంచి కృష్ణాపురానికి వెళ్లే చెరువుగట్టు రహదారికి ఇరువైపులా వ్యర్థాలు వేస్తున్నారు. - రామకృష్ణ, స్థానికుడు

★: పరిశీలించి, తగు చర్యలు తీసుకుంటాం.

- టి.రవి, మున్సిపల్ కమిషనర్, ఆమదాలవలస

?: పట్టణ ప్రధాన రహదారిలో కొందరు దుకాణ యజమానులు రోడ్డుపై బోర్డులు ఏర్పాటు చేయడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. - వాసు, స్థానికుడు ★: దుకాణదారులతో మాట్లాడి, బోర్డులను తొలగిస్తాం. బాలరాజు, ఎస్సై ఆమదాలవలస

న్యూస్‌టుడే, ఆమదాలవలస పట్టణం

కూరగాయల ధరలు

శ్రీకాకుళం రైతుబజారులో కూరగాయల నిన్నటి ధరలు (కిలో రూపాయల్లో) ● టమాటాలు 12 ● వంకాయలు 26/34 ● బెండ 40 ● పచ్చిమిర్చి 66 ● కాకర 44 ● బీర 44 ● కాలీఫ్లవర్ 15/20 ● క్యాబేజీ బుట్ట 20 ● క్యారెట్ 34 ● దొండ 30 ● బంగాళదుంపలు 16 ● ఉల్లిపాయలు 20/24 ● గోరుచిక్కుడు 40 ● ఆనప 16 ● అరటికాయ(జత) 16 ● గోల్కొండ చిక్కుడు 24 ● అల్లం 80 ● వెల్లుల్లి 130 ● బీట్రూట్ 30 ● క్యాప్సికమ్ 80 ● కీరదోస 46 ● పప్పుదోస 26 ● బరానీ 44 - న్యూస్‌టుడే, కలెక్టరేట్(శ్రీకాకుళం)

ఆఖరి మజిలీకి అవస్థలు

సరుబుజ్జిలి మండలంలోని కూనజమ్మన్నపేట గ్రామంలో దహన సంస్కారాలు చేసేందుకు స్థానికులు అవస్థలు పడుతున్నారు. గ్రామ శివారులో కొమనాపల్లి రహదారి పక్కన ఉన్న శ్మశాన వాటిక పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. దీంతో అక్కడ ముళ్లపొదలు ఏపుగా పెరిగాయి. దీంతో లోపలికి వెళ్లేందుకు వీల్లేకుండా పోయింది. అధికారులు స్పందించి పనులు పూర్తి చేయించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై ఎంపీడీవో ఎం.పావని వద్ద ప్రస్తావించగా పరిశీలించి, సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. - న్యూస్‌టుడే, సరుబుజ్జిలి

నీటి తొట్టె.. నిర్వహణ తీసికట్టు..!

ఉపాధి హామీ పథకంలో భాగంగా పశువుల దాహార్తి తీర్చేందుకు సిమెంట్ తొట్టెలు నిర్మించారు. నిర్వహణ పట్టించుకోకపోవడంతో అవి నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. వేసవి ప్రారంభం కావడంతో వినియోగంలోకి తీసుకొస్తే మూగజీవాలకు ప్రయోజనమని పలువురు అభిప్రాయ పడుతున్నారు. ఈ విషయమై ఉపాధి హామీ ఏపీవో సత్యనారాయణ వద్ద ప్రస్తావించగా సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. - న్యూస్‌టుడే, జి.సిగడాం

దోమల బెడద.. కునుకు కరవు

పొందూరు మండలం నరసాపురం అగ్రహారం గ్రామంలో కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోయాయి. దీంతో మురుగు నిలిచి దుర్వాసన, దోమల బెడద ఎక్కువైంది. రాత్రి వేళ కునుకు కరవవుతోందని స్థానికులు వాపోతున్నారు. అధికారులు పారిశుద్ధ్య పనులు చేయించాలని కోరుతున్నారు. ఈ విషయమై ఎంపీడీవో వాసుదేవరావు వద్ద ప్రస్తావించగా పారిశుద్ధ్య కార్మికులతో పనిచేయిస్తామని ఆయన తెలిపారు. - న్యూస్‌టుడే, పొందూరు గ్రామీణం

నిరుపయోగం.. సాగు భారం

పొందూరు మండలం గోకర్ణపల్లి వెళ్లే మార్గంలోని రెల్లిగడ్డ కాలువలో కొన్నిచోట్ల పూడిక, పనికిరాని మొక్కలతో అధ్వానంగా మారింది. వీటిని తీయకపోవడంతో నీరు పొలాల్లోకి రావడంలేదని రైతులు వాపోతున్నారు. ముఖ్యంగా మొదలవలస - గోకర్ణపల్లి గ్రామాల మధ్య ప్రవహించే కాలువ పరిస్థితి దారుణంగా ఉంది. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కర్షకులు కోరుతున్నారు. ఈ విషయమై నీటిపారుదల ఈఈ రాంబాబు వద్ద ప్రస్తావించగా పరిశీలించి, చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. - న్యూస్‌టుడే, పొందూరు గ్రామీణం

వాహనాలు కనిపించట్లేదు

ఆమదాలవలస మండలం రామచంద్రాపురం-చిట్టివలస గ్రామాల మధ్య రహదారిలో పనికిరాని మొక్కలు, ముళ్ల పొదలు పెరగడంతో వాహనదారులకు ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించడం లేదు. అధికారులు స్పందించి మొక్కలు తొలగించాలని కోరారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని ఎంపీడీవో రామ్మోహనరావు తెలిపారు. - న్యూస్‌టుడే, ఆమదాలవలస గ్రామీణం

ప్రోత్సహిస్తే పతకాలే

న్యూస్‌టుడే, ఎచ్చెర్ల, లావేరు

బొంతలకోడూరు జడ్పీ పాఠశాల విద్యార్థులు క్రీడల్లో రాణిస్తున్నారు. అరకొర సౌకర్యాలు ఉన్నప్పటికీ వ్యాయామ ఉపాధ్యాయుడు కొండపల్లి రవికుమార్ సహకారంతో సత్తా చాటుతున్నారు. పాఠశాల తరగతులు పూర్తయిన తరువాత కబడ్డీ, కరాటే, ఖోఖోలో అథ్లెటిక్స్‌లో సాధన చేస్తూ... పతకాలు సాధిస్తున్నారు. ప్రోత్సాహమందిస్తే మరింత రాణిస్తామంటున్నారు.

'డిసెంబరులో కర్నూలులో జరిగిన రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ కబడ్డీ పోటీల్లో జిల్లా జట్టు తరఫున పాల్గొనే అవకాశం వచ్చింది. రజత పతకం సాధించాను. పాఠశాలలో శిక్షణతోనే సత్తా చాటాను. ఇదే స్ఫూర్తితో జాతీయస్థాయిలో ప్రతిభ చూపాలన్నదే నా లక్ష్యం' అని పొన్నాడ గ్రామానికి చెందిన విద్యార్థి కార్తిక్ తెలిపారు.

● ఇటీవల ఎచ్చెర్లలోని కేశవరెడ్డి స్కూల్లో జరిగిన అంతర పాఠశాల (గ్రిగ్స్) పోటీల్లో పలువురు బాలురు కబడ్డీ విభాగంలో ప్రథమ, ఖో-ఖోలో ద్వితీయ, బాలికల విభాగంలో కబడ్డీ, ఖో-ఖోలో ప్రథమ స్థానాలు కైవసం చేసుకుని గుర్తింపు తెచ్చుకున్నారు.

● ఈ నెల 18, 19 తేదీల్లో అల్లినగరం జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన నియోజకవర్గస్థాయి క్రీడా పోటీల్లో బాలుర విభాగంలో ఆల్‌రౌండ్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ ఛాంపియన్‌షిప్ గెలుచుకున్నారు.

● ఇటీవల కాకినాడలో జరిగిన 68వ స్కూల్ గేమ్స్ కరాటే పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రదర్శన చేశాను. ఈ పోటీలు నాలో ఆత్మవిశ్వాసాన్ని నింపాయి. భవిష్యత్తులో పతకాలు సాధిస్తాను.

- వి.మోహన్‌కుమార్, పదో తరగతి, పొన్నాడ గ్రామం.

రామకృష్ణ పరమహంస బోధనలు అనుసరణీయం

సర్వజన హితమే రామకృష్ణ పరమహంస లక్ష్యమని.. ఆయన బోధనలు అనుసరణీయమని యోగా గురువు రామారావు అన్నారు. రామకృష్ణ పరమహంస బోధనల వ్యాప్తిలో భాగంగా శ్రీకాకుళం నగరంలోని గాంధీ మందిరంలో ఆదివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ పరమహంస చిత్రపటానికి రామారావు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వివిధ వర్గాలకు చెందిన పి.అప్పారావు, శరత్‌బాబు, మహిబుల్లా ఖాన్ పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, శ్రీకాకుళం నగరం

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

లావేరు, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనం అదుపు తప్పి బోల్తా పడిన ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. లావేరు మండల కేంద్రానికి చెందిన కనకం గంగారావు, ఆకాశపు వెంకటరమణలు శనివారం రాత్రి ఇంటి నుంచి శ్రీకాకుళం వెళ్తుండగా బొడ్డపాడు సమీపంలోని ద్విచక్రవాహనం అదుపుతప్పి కింద పడిపోయింది. వెంకటరమణ తలకు బలమైన గాయాలయ్యాయి. ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్సపొందుతున్నారు. లావేరు పోలీసులను సంప్రదించగా ప్రమాదంపై ఫిర్యాదు రాలేదని తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

పొందూరు గ్రామీణం, న్యూస్‌టుడే: సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై సత్యనారాయణ పేర్కొన్నారు. వావిలపల్లిపేట ఆదర్శ పాఠశాలలో శనివారం ఆయన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలని సూచించారు. అనంతరం పలు అంశాల గురించి వివరించారు.

జూదరుల అరెస్టు

శ్రీకాకుళం నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరంలో పలుచోట్ల నిర్వహిస్తున్న జూద కేంద్రాలపై టాస్క్‌ఫోర్సు పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. శరగడాల వీధిలోని ఓ ఇంట్లో ఐదుగురు జూదరులను అదుపులోకి తీసుకుని రూ.23,740 స్వాధీనం చేసుకున్నారు. వాంబే కాలనీలోని ఓ ఇంట్లో ఏడుగుర్ని పట్టుకుని రూ.8 వేలు స్వాధీనం చేసుకున్నారు. వారిని ఒకటో పట్టణ పోలీసులకు అప్పగించారు. ఎస్సై హరికృష్ణ కేసు నమోదు చేశారు.

తూతూమంత్రంగా సర్వసభ్య సమావేశం

సమావేశంలో రెవెన్యూ వివరాలు వెల్లడిస్తున్న ఉపతహసీల్దార్ ఆర్.అప్పలరాజు

లావేరు, న్యూస్‌టుడే: గ్రామాల్లో ఉన్న ప్రజా సమస్యలను సర్వసభ్య సమావేశంలో చర్చించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిన ప్రజాప్రతినిధులు, అధికారులు సర్వసభ్య సమావేశానికి హాజరుకాకపోవడంపై పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లావేరు మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం ఎంపీపీ [illegible] అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. తొలుత పలు శాఖల సమీక్ష నిర్వహించారు. సమావేశానికి హాజరైన పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు మధ్యలోనే వెళ్లిపోయారు. కార్యక్రమానికి ఎంపీడీవో వెంకటరాజు, జడ్పీటీసీ సభ్యుడు సీతంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యుని సేవలో నటుడు పృథ్వీరాజ్

అరసవల్లిలో సూర్యనారాయణ స్వామిని ఆదివారం నటుడు పృథ్వీరాజ్ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ప్రత్యేక పూజల అనంతరం అనివెట్టి మండపంలో ఆలయ ప్రధానార్చకుడు ఇప్పిలి శంకరశర్మ వేదాశీర్వచనం పలికి ప్రసాదాలు అందజేశారు. - న్యూస్‌టుడే, శ్రీకాకుళం నగరం

సమగ్రాభివృద్ధితో ప్రాంతాలకు కొత్త ఊపిరి

కొంతకాలంగా మండలంలో పలు ప్రాంతాలు వివక్షకు గురై అభివృద్ధికి నోచుకోలేదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత చేపడుతున్న సమగ్రాభివృద్ధితో ప్రాంతాలకు కొత్త ఊపిరి వస్తుందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. గార మండల పరిషత్తు కార్యాలయం వద్ద చెత్త సేకరణకు పంచాయతీలకు ట్రైసైకిళ్లు పంపిణీ, సతివాడ పంచాయతీ యాళ్లపేటలో పాఠశాల అభివృద్ధి పనులకు శంకుస్థాపన, రాళ్లపేటలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ట్రైసైకిల్ తొక్కారు. ఎంపీడీవో శ్రీనివాసులు, తహసీల్దారు చక్రవర్తి, పార్టీ శ్రేణులు బడగల వెంకట అప్పారావు, వెంకట రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు. -న్యూస్‌టుడే, గార(రాళ్లపేట)

అటు వెళ్లాలంటే.. ముక్కు మూసుకోవాల్సిందే

పట్టణ వీధుల్లో మురుగు అంతా చేరే ప్రధాన కాలువలో పూడిక తీత పనులు చేపట్టకపోవడంతో దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దుర్వాసన వస్తుండటంతో కాలువల పక్క నుంచి వెళ్లలేకపోతున్నామని వాపోతున్నారు. మున్సిపల్ కమిషనర్ టి.రవి వద్ద ప్రస్తావించగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

రోడ్లపైకి మురుగు

ఆమదాలవలస మండలం రామచంద్రాపురంలో కాలువలు లేకపోవడంతో మురుగు నీరు రోడ్లపైకి వచ్చి నిలిచిపోతోంది. సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. ఈ విషయమై ఈవోపీఆర్డీ గోపాలరావు వద్ద ప్రస్తావించగా నిధులు మంజూరైతే నిర్మిస్తామని అన్నారు. -న్యూస్‌టుడే, ఆమదాలవలస పట్టణం, ఆమదాలవలస గ్రామీణం

ఏడాది పాటు ఉపనిషన్మందిరం వజ్రోత్సవాలు

శ్రీకాకుళం సాంస్కృతికం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలో పాలకొండ రోడ్డులో ప్రసిద్ధ ఆర్ష సాహిత్య, ఆధ్యాత్మిక సేవ, సాంస్కృతిక సంస్థ ఉపనిషన్మందిరం వజ్రోత్సవాలను ఏడాది పాటు నిర్వహించనున్నట్లు ఉపనిషన్మందిరం సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు గుమ్మా నగేష్, విశ్వనాథం కామేశ్వరరావులు తెలిపారు. ఈ సంస్థ ఏర్పాటు చేసి 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం సర్వసభ్య సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. మార్చి 19న ఉగాది పర్వదినం నుంచి వివిధ కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నట్లు వారు తెలిపారు. కార్యవర్గం సభ్యులు నిష్టల నరసింహమూర్తి, డా.సనపల నరసింహమూర్తి, డా.మందుల మోహనరావు, డీజీ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బొడ్డేపల్లి సేవలు చిరస్మరణీయం

బొడ్డేపల్లి రాజగోపాలరావు విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

గోపీనగరం(ఆమదాలవలస గ్రామీణం), న్యూస్‌టుడే: మాజీ ఎంపీ బొడ్డేపల్లి రాజగోపాలరావు సేవలు చిరస్మరణీయమని అన్ని పార్టీల నాయకులు అన్నారు. ఆయన వర్ధంతి సందర్భంగా ఆమదాలవలస మండలం గోపీనగరం కొత్త రోడ్డు వద్ద ఉన్న రాజగోపాలరావు విగ్రహానికి నివాళులర్పించి.. జిల్లాకు ఆయన చేసిన సేవలు కొనియాడారు. వంశధార ప్రాజెక్టు నిర్మాణం చేపట్టి జిల్లా రైతులకు పుష్కలంగా సాగునీరు అందించే విధంగా కృషి చేశారు. ఆమదాలవలస పట్టణంలో చక్కెర కర్మాగారాన్ని నిర్మించి ఉపాధి కల్పించారు. కళింగ సామాజిక వర్గాన్ని బీసీలో చేర్పించిన ఘనత ఆయనదేనన్నారు. తెదేపా, వైకాపా, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఉయ్యాల వాడ పోరాటం స్ఫూర్తిదాయకం

చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న అదనపు ఎస్పీ శ్రీనివాసరావు

శ్రీకాకుళం నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: స్వాతంత్ర్యోద్యమంలో ఉయ్యాలవాడ నర్సింహారెడ్డి సాగించిన వీరోచిత పోరాటం దేశభక్తికి నిదర్శనమని అదనపు ఎస్పీ పి.శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఉయ్యాలవాడ 178వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి చేయూత

జి.సిగడాం, న్యూస్‌టుడే: జి.సిగడాం మండలం డీఆర్‌వలస గ్రామానికి చెందిన కుమరాపు చందు కొన్ని రోజులుగా బోన్ క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. ఆదివారం గ్రామస్థులు, యువత, జీఎంఆర్ ఫౌండేషన్ సహకారంతో సుమారుగా రూ.3 లక్షలు సమకూర్చి బాధిత కుటుంబానికి అందజేశారు.

మొక్కలు తొలగించారు

స్పందనకు వందనం

ఆమదాలవలస మండలం ఆనందపురం గ్రామానికి వెళ్లే రహదారిలో విద్యుత్తు స్తంభం చుట్టూ పనికిరాని మొక్కలు పెరిగాయి. శనివారం 'మొక్కలు తొలగించండి' శీర్షికతో కథనం ప్రచురితం కావడంతో ఏఈ రవికుమార్ సిబ్బందితో తొలగింపజేశారు.

-న్యూస్‌టుడే, ఆమదాలవలస గ్రామీణం

కళ్లలో ఇసుక.. దారి మసక

పొందూరు గ్రామీణం, న్యూస్‌టుడే



బొడ్డేపల్లి గ్రామం వద్ద ఇసుకతో నిండిన తారురోడ్డు

ఆమదాలవలస నియోజకవర్గంలో సింగూరు, బొడ్డేపల్లి, చిన్న బొడ్డేపల్లి, దూసి, ముద్దాడపేట, కొత్తవలస, యరగాం, పెద్ద సవలాపురం గ్రామాల మీదుగా ఇసుక లారీలు రవాణా చేస్తున్నాయి. తీసుకెళ్తున్న ఇసుక లోడులపై పరదాలు కప్పకపోవడంతో అవి ఎగిరి రోడ్లపై పడుతున్నాయి. రాకపోకలు చేస్తున్న వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు తీసుకొస్తున్నాయి.

● పొందూరు మండలంలో సింగూరు, చినబొడ్డేపల్లి, పెద బొడ్డేపల్లి సమీపంలో ప్రవహిస్తున్న వంశధారలోని ఇసుక సేకరిస్తున్న లారీలు, ట్రాక్టర్లు సరైన చర్యలు తీసుకోవడం లేదు. వాహనదారుల కళ్లల్లో పడటం, లేదంటే రోడ్డుపై పడిన ఇసుకపై వాహనాలు వెళితే జారి పడిపోవడం వంటివి జరుగుతున్నాయి. గతంలో ప్రమాదాల ఘటనలు చోటు చేసుకుని క్షతగాత్రులకు మారారు.

● ఈ మార్గంలోనే శ్రీకాకుళం, పొందూరు మండలంలో కింతలి, తాడివలస, కావలి, పనసపేట, పెద్ద సవలాపురం, సంతకవిటి, ఆమదాలవలస మండలాల్లో చాలా గ్రామాల ప్రజలు ప్రయాణం చేస్తుంటారు. ఇసుక తరలింపు సమయంలో తగు చర్యలు తీసుకుని సమస్య పరిష్కరించాలని ప్రయాణికులు, ప్రజలు కోరుతున్నారు.

'ఫిర్యాదులు అందాయి. జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి వారి ఆదేశాల మేరకు చర్యలు చేపడతాం' అని నాలుగు మండలాల ఎంపీడీవోలు వాసుదేవరావు, రామ్మోహనరావు, తిరుపతిరావు, పావనిలు తెలిపారు.

(c) eenadu

శాస్త్రోక్తంగా కుంభాభిషేకం

అన్నానగర్, న్యూస్‌టుడే: చెన్నై పాపుకారుపేటలోని శ్రీ రంగనాయకి సమేత శ్రీ రంగనాథస్వామి ఆలయంలో నూతన గోపుర కలశాలతోపాటు దేవతామూర్తుల సన్నిధుల విమానాలకు జీర్ణోద్ధరణ, అష్ట బంధన మహా సంప్రోక్షణ కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా శుక్రవారం నుంచి యాగపూజలు నిర్వహించారు. ఆదివారం మహా పూర్ణాహుతి అనంతరం పుణ్య తీర్థం కలశాలను ఊరేగింపుగా తీసుకెళ్లి నూతన రాజగోపురంతోపాటు దేవతామూర్తుల సన్నిధుల విమానాలకు ఏకకాలంలో మహా సంప్రోక్షణ నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. శేషవాహనంపై స్వామివారిని మాడ వీధుల్లో ఊరేగించారు.

గోపుర కలశాలకు పూజలు చేస్తున్న దృశ్యం

మహిళా శక్తికి నిదర్శనం జయలలిత

మన్ కీ బాత్‌లో ప్రధాని మోదీ

సైదాపేట, న్యూస్‌టుడే: జయలలిత మహిళా శక్తికి నిదర్శనమని ప్రధాని నరేంద్ర మోదీ కొనియాడారు. ఈనెల 24న జయలలిత జయంతిని పురస్కరించుకుని 'మన్ కీ బాత్' కార్యక్రమంలో జయలలితను ప్రధాని కొనియాడారు. మహిళల సంక్షేమానికి జయలలిత పాటుపడ్డారని అన్నారు. మహిళా శక్తికి నిదర్శనమని చెప్పారు. ఆమె దేశభక్తి అపారమైందని తెలిపారు. రాష్ట్ర శాంతిభద్రతల పరిరక్షణకు కఠిన చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు. సామాజిక సంక్షేమం కోసం పాటుపడ్డారని, మహిళలకు ప్రాముఖ్యం ఇచ్చిన ఎవరైనా ఎప్పటికీ ప్రజల హృదయాల్లో నిలిచిపోతారని వ్యాఖ్యానించారు. ఇప్పటికీ తాను తమిళనాడు వెళ్లినప్పుడు ప్రజలు జయలలితపై ఎంతో ప్రేమను ప్రదర్శిస్తున్నారని, గుజరాత్‌లో తన పదవీ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారని గుర్తుచేసుకున్నారు. ఆమె ఆలోచనలు చాలా స్పష్టమైనవని తెలిపారు.

ఎన్నికల్లో తమిళనాడు, ఎన్డీయే మధ్య పోటీ

■ ముఖ్యమంత్రి స్టాలిన్

ప్యారిస్, న్యూస్‌టుడే: రానున్న శాసనసభ ఎన్నికల్లో తమిళనాడు, ఎన్డీయే మధ్య పోటీ ఉంటుందని, ఇందులో తమిళనాడు విజయం సాధిస్తుందని ముఖ్యమంత్రి స్టాలిన్ పేర్కొన్నారు. ఎంఎన్ఎం అధ్యక్షుడు కమల్‌హాసన్ కల్చరల్ సెంటర్ తరఫున మదురై గాంధీ మ్యూజియంలో శనివారం రాత్రి ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఇందులో పాల్గొన్న ముఖ్యమంత్రి స్టాలిన్ మాట్లాడుతూ... మహాత్మాగాంధీని ప్రజలు మరువకూడదని కమల్ ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు. గాంధీని ఎలాగైనా ప్రజల మనసుల్లోంచి తొలగించాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోందని, ఆ మేరకు గ్రామీణ ఉపాధి హామీ పథకానికి పేరు తొలగించిందన్నారు. తర్వాత కరెన్సీ నోట్లపై కూడా ఫొటో తీసినా తీసేయొచ్చని విమర్శించారు. భాజపాకి చెందిన ఓ ముఖ్యమంత్రి మత విద్వేషాలు ప్రేరేపిస్తున్నారని తెలిపారు. కమల్ మాట్లాడేది తమకు అర్థం కాలేదని కొంత మంది అంటున్నారని, వారికి అర్థం కాకపోవడం కాదని, అర్థం చేసుకోకూడదని అనుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైగో, టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుంతగై, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి షణ్ముగం తదితరులు పాల్గొన్నారు.

స్టాలిన్‌కు అంబేడ్కర్, గాంధీ, పెరియార్ విగ్రహాలతో జ్ఞాపిక అందిస్తున్న కమల్‌హాసన్

ముంచుకొస్తున్న శబ్ద ముప్పు

చెన్నై నగరవాసులు ప్రశాంతంగా పడుకోవడంలేదు. వారి చెవులు శబ్దాలతో తూట్లు పడుతున్నాయి. శబ్ద ధ్వనులతో విసిగెత్తిపోతున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా ఇబ్బంది పడుతున్నారు. వారి ఆరోగ్యాలు సైతం ఇబ్బందుల్లో పడుతున్నాయి. ఐఐటీ మద్రాస్ నిపుణులు చెన్నై నగరంలో జరిపిన అధ్యయనంలో పలు కీలక విషయాలు వెలుగు చూశాయి. - ఈనాడు-చెన్నై

■ చెన్నైలో తీవ్రంగా ధ్వని కాలుష్యం

■ రేయింబవళ్లు నరకం అనుభవిస్తున్న నగరవాసులు

ఐఐటీ మద్రాస్‌కు చెందిన నిపుణులు నగరవ్యాప్తంగా గతేడాది 8 నెలల పాటు శబ్ద కాలుష్యాన్ని అంచనా వేశారు. ఒక్కో స్టేషన్ అంచనా వేసేందుకు ఒక్కో జోన్‌కు 4 సెన్సర్ల చొప్పున మొత్తం 15 జోన్లలో 60 శబ్ద కాలుష్య సెన్సర్ పరికరాల్ని వినియోగించారు. అధ్యయనంలో బయటపడిన విషయాలపై ఓ ప్రాథమిక అంచనాకు వచ్చారు. వీటిని మరింత లోతుగా విశ్లేషిస్తున్నారు.

వలసరవాక్కంలో అత్యధికం

ఇతర ప్రాంతాలతో పోల్చితే వలసరవాక్కంలో అత్యధిక శబ్ద కాలుష్యం ఉన్నట్లు గ్రహించారు. ఆ తర్వాతి స్థానంలో అంబత్తూరు, అడయార్, మణలి, తేనాంపేట తదితర ప్రాంతాలున్నాయి. ఒక్కో ప్రాంతంలో 3,354-3,508 ఇళ్ల వరకు పగటిపూట ప్రభావానికి గురవుతుండగా, రాత్రిళ్లు 1,686-1,770 ఇళ్లలోనివారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తేలింది. వలసరవాక్కం ప్రాంతంలో ట్రాఫిక్ రద్దీ కారణంగా విపరీత శబ్దాలు వస్తున్నాయి. పగలు సాధారణంకన్నా 84.01శాతం ఎక్కువగా, రాత్రి 91.53శాతం ఎక్కువగా శబ్దాలు దాటిపోతున్నట్లుగా అంచనా వేశారు. తేనాంపేటలోనూ పగలు 94.26 శాతం, రాత్రి 99.18శాతం ఎక్కువగా శబ్దాలు నమోదయ్యాయి. ప్రధానంగా నిరంతరం ట్రాఫిక్ విపరీతంగా ఉండటం, నిర్మాణ పనులు కొనసాగుతుండటం శబ్దాలకు కారణంగా అధ్యయనంలో బయటపడింది. అక్కడి ప్రజలు ఈ తరహా శబ్దాలతో ఆరోగ్యపరంగా ఇబ్బందులు ఉన్నట్లు అంచనా వేస్తున్నారు.

కేటగిరీలవారీగా మ్యాపింగ్

ముప్పును గుర్తించేందుకు ఏయే ప్రాంతాల్లో ఎలాంటి చర్యలు చేపట్టాలో సులువుగా యంత్రాంగం తెలుసుకునేందుకు చర్యలు చేపట్టారు. కేంద్ర, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి, ఐఐటీ మద్రాస్ నిపుణులు కలిసి శబ్ద కాలుష్య తీవ్రతను బట్టి ప్రాంతాల్ని వివిధ కేటగిరీలుగా విభజించి మ్యాపింగ్ చేస్తున్నారు. ఇదివరకు పెట్టుకున్న జనావాసాలు, పరిశ్రమలు, నిశ్శబ్దంగా ఉండాల్సిన ప్రాంతాలు, వాణిజ్యకేంద్రాలు ఇలాంటి కేటగిరీల్ని మ్యాపింగ్‌కి అన్వయిస్తున్నారు. ముప్పును విశ్లేషించడానికి ఏఐ సాధనాలనూ వినియోగిస్తున్నారు.

నియంత్రణకు సమగ్ర పరిశోధన

ఏ ప్రాంతంలో శబ్ద కాలుష్యం ఎంత ఉందనే బదులు.. ఆ ప్రాంతంలో ఆ శబ్దం ఎలా వస్తోంది? దానికి కారణమేంటి? అనే దానిమీదే తాము సమగ్ర పరిశోధన చేసినట్లు ఐఐటీ మద్రాస్ సివిల్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ శివనాగేంద్ర తెలిపారు. దీన్ని మరింతగా విశ్లేషిస్తున్నామని, తద్వారా ఆయా ప్రాంతాల్లో ప్రభుత్వపరంగా తీసుకోవాల్సిన చర్యలు, అవగాహన కల్పించాల్సిన విషయాలపై దృష్టి పెట్టేందుకు ఆస్కారం ఏర్పడుతుందన్నారు. మరోవైపు ఆయాచోట్ల శబ్దాల నియంత్రణకు, ప్రజలు ప్రభావానికి గురవకుండా ఏం చేయవచ్చనేదీ విశ్లేషిస్తున్నామని వివరించారు. గోడలు, పైకప్పు, ఫ్లోరింగ్ నిర్మాణాల్లో తీసుకోవాల్సిన శ్రద్ధ, శబ్ద కాలుష్యం తగ్గించేలా అమలుచేయాల్సిన వినూత్న విధానాల్ని ప్రభుత్వానికి నివేదిస్తున్నట్లు తెలిపారు. అడయార్ క్యాన్సర్ ఆసుపత్రి ప్రాంతంలో సైతం శబ్దాలు విపరీతంగా వస్తున్నాయన్నారు. నిశ్శబ్దంగా ఉండాల్సిన ఈ ప్రాంతంలో సైతం ముప్పు కనిపిస్తోందని గుర్తుచేశారు. ఇలాంటిచోట్ల శబ్దాల్ని ఎంత తక్కువగా నియంత్రించవచ్చనేదీ వినూత్న పద్ధతుల ద్వారా అంచనాలు వేస్తున్నామని వివరించారు.

మాట్లాడుతున్న పళనిసామి

అవినీతి మంత్రులు జైలుకెళ్లడం ఖాయం: ఈపీఎస్

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: అవినీతికి పాల్పడిన మంత్రులు జైలుకు వెళ్లడం ఖాయమని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిసామి హెచ్చరించారు. తిరువళ్లూర్ జిల్లా అంబత్తూరులో శనివారం రాత్రి జరిగిన ప్రచార సభలో ఆయన మాట్లాడుతూ.. సుమారు ఐదేళ్ల డీఎంకే పాలన అవినీతిమయంగా సాగిందని ఆరోపించారు. అవినీతికి పాల్పడటంతో మాజీ మంత్రి సెంథిల్ బాలాజీ జైలుపాలయ్యారని, ప్రస్తుతం మంత్రి నెహ్రూ మెడకు ఉచ్చు బిగిసిందని, మరో మంత్రి వేలు తదితరులు కూడా అవినీతి కేసుల్లో అరెస్టయ్యే అవకాశం లేకపోలేదన్నారు.

ఐయూఎంఎల్‌తో కొలిక్కిరాని సీట్ల పంపకాలు

చెన్నై, న్యూస్‌టుడే: డీఎంకే కమిటీతో ఐయూఎంఎల్ కమిటీ చేపట్టిన సీట్ల సర్దుబాటు చర్చలు కొలిక్కి రాలేదు. ఐదు సీట్లు కేటాయించాలని డిమాండ్ చేసిన ఐయూఎంఎల్ కమిటీ చివరకు నాలుగైనా కేటాయించాలని కోరింది. ఈ విషయాన్ని విలేకరులతో వెల్లడిస్తూ పార్టీ జాతీయ అధ్యక్షుడు ఖాదర్ మొహిద్దీన్ స్పృహకోల్పోవడంతో అన్నా అరివాలయంలో కాసేపు ఉద్రిక్తత నెలకొంది. రానున్న శాసనసభ ఎన్నికల దృష్ట్యా కూటమి పార్టీలతో సీట్ల సర్దుబాటు చర్చలకు డీఎంకే తెరలేపిన నేపథ్యంలో తొలిగా ఐయూఎంఎల్‌ను చర్చలకు ఆహ్వానించింది. ఆ మేరకు ఐయూఎంఎల్ జాతీయ అధ్యక్షుడు ఖాదర్ మొహిద్దీన్, రాష్ట్ర ప్రధానకార్యదర్శి కె.ఎ.ఎం.ముహమదు అబుబకర్, రాష్ట్ర కోశాధికారి ఎం.ఎస్.ఎ.షాజహాన్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అబ్దుల్ రహమాన్‌లతో కూడిన బృందం ఆదివారం ఉదయం అన్నా అరివాలయం చేరుకుంది. డీఎంకే కోశాధికారి టి.ఆర్.బాలు నేతృత్వంలో వ్యవస్థాపక కార్యదర్శి ఆర్.ఎస్.భారతి, మంత్రులు ఎం.ఆర్.కె.పన్నీర్‌సెల్వం, కె.ఎన్.నెహ్రూ, వేలు, ఎంపీలు తిరుచ్చి శివ, ఎ.రాజాలతో కూడిన కమిటీతో చర్చలు జరిపింది. తర్వాత విలేకరులతో ఖాదర్ మొహిద్దీన్ మాట్లాడుతూ... తమ పార్టీకి సీట్ల సర్దుబాటు ఇంకా ఖరారు కాలేదన్నారు. ఐదు సీట్లు డిమాండ్ చేశామని, కనీసం 4 సీట్లయినా ఇవ్వాలని కోరామని తెలిపారు. డీఎంకే సుపరిపాలన మళ్లీ కొనసాగాలనే ఉద్దేశంతో కూటమి పార్టీలు కృషి చేస్తున్నాయని పేర్కొన్నారు. మీడియా ప్రతినిధులతో మాట్లాడుతుండగానే ఆయన అకస్మాత్తుగా స్పృహ కోల్పోయారు. వెంటనే ఆయనకు నిర్వాహకులు ప్రథమ చికిత్స అందించి అన్నా అరివాలయం లోపలకు తీసుకెళ్లారు. రంజాన్ ఉపవాసం ఉన్న ఆయన చాలా సేపటివరకు మీడియా ప్రతినిధుల ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వడం వల్ల స్పృహ కోల్పోయినట్లు సమాచారం.

చర్చలు జరుపుతున్న దృశ్యం

స్పృహకోల్పోయిన ఖాదర్ మొహిద్దీన్

పెరంబూర్ నియోజకవర్గం నుంచి విజయ్ పోటీ

టీవీకే సమావేశంలో తీర్మానం

చెన్నై, న్యూస్‌టుడే: రానున్న శాసనసభ ఎన్నికల్లో టీవీకే అధ్యక్షుడు విజయ్ చెన్నైలోని పెరంబూర్ నియోజకవర్గం నుంచి పోటీ చేయాలంటూ ఆ పార్టీ సమావేశం తీర్మానించింది. టీవీకే పెరంబూర్ శాసనసభ నియోజకవర్గం నిర్వాహకుల సమావేశం వ్యాసర్పాడిలో జరిగింది. ఇందులో.. రానున్న శాసనసభ ఎన్నికల్లో టీవీకే అధ్యక్షుడు విజయ్ పెరంబూర్ నియోజకవర్గం నుంచి పోటీ చేయాలంటూ ఆ పార్టీ ఎన్నికల ప్రచార నిర్వహణ ప్రధానకార్యదర్శి ఆదవ్ అర్జున తీర్మానాన్ని ప్రతిపాదించగా దానిని ఏకగ్రీవంగా ఆమోదిస్తున్నట్లు ప్రధానకార్యదర్శి బుస్సి ఆనంద్ తెలిపారు. సమావేశం తర్వాత ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్ సెంగోట్టైయన్ విలేకర్లతో మాట్లాడుతూ... 'జన నాగయన్' చిత్రాన్ని స్తంభింపజేసినా ప్రజాస్వామ్యాన్ని కాపాడే ఏకైక గళం టీవీకే అధ్యక్షుడు విజయ్ గళం మాత్రమేనని తెలిపారు. 234 నియోజకవర్గాల్లోనూ టీవీకే గెలుస్తుందని, రాష్ట్రాన్ని విజయ్ ఏలుతారని ధీమా వ్యక్తం చేశారు.

ప్రసంగిస్తున్న ఆదవ్ అర్జున

పెరిగిన మౌంటెన్ రైళ్ల ఛార్జీలు

ట్రిప్లికేన్, న్యూస్‌టుడే: కోయంబత్తూర్ జిల్లా మేట్టుపాళైయం నుంచి నీలగిరి జిల్లాలోని ఊటీ వరకు మౌంటెన్ రైళ్లు నడుస్తున్నాయి. మేట్టుపాళైయం నుంచి కున్నూరు వరకు ఫస్ట్ క్లాస్‌కు రూ.500, సెకండ్ క్లాస్‌కు రూ.250, కున్నూరు-ఊటీ ఫస్ట్ క్లాస్‌కు రూ.290, సెకండ్ క్లాస్‌కు రూ.150, మేట్టుపాళైయం-ఊటీ ఫస్ట్ క్లాస్‌కు రూ.వెయ్యి, సెకండ్ క్లాస్‌కు రూ.550 ఛార్జీ వసూలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇకపై ఛార్జీలను ఐదు శాతం పెంచుతున్నట్లు దక్షిణ రైల్వే తెలిపింది. రైళ్ల నిర్వహణ ఖర్చులు, సిబ్బంది వేతనాలు గణనీయంగా పెరిగాయని, దీంతో ఛార్జీలను ఐదు శాతం పెంచినట్లు పేర్కొంది. కొత్త ఛార్జీలు శనివారం నుంచి అమల్లోకి వచ్చాయని చెప్పింది. బుకింగ్ ఛార్జీల్లో ఎలాంటి మార్పు లేదని తెలిపింది.

ఒక్కో కుటుంబానికి రూ.5.30 లక్షల నష్టం

అన్నాడీఎంకే

సైదాపేట, న్యూస్‌టుడే: గత ఐదేళ్ల డీఎంకే పాలనలో ఒక్కో కుటుంబానికి రూ.5.30 లక్షలు నష్టమని అన్నాడీఎంకే ఆరోపించింది. ఇందుకు సంబంధించి అన్నాడీఎంకే అధిష్ఠానం ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో... గత ఐదేళ్ల డీఎంకే పాలనలో ప్రజలు పడుతున్న కష్టాలను తెలియజేసే విధంగా అన్నాడీఎంకే తరఫున 'విడియా ఆట్చి-ఉంగ వీట్టు బిల్లే సాచ్చి' పేరుతో ఈ ఏడాది జనవరి 28వ తేదీ నుంచి ప్రచారం జరుగుతోందని, ఇప్పటివరకు 1.04 లక్షల కుటుంబాలను కలిశామని, ఒక్కో కుటుంబానికి రూ.5.30 లక్షల నష్టం ఏర్పడిందని, రాష్ట్ర వ్యాప్తంగా 2.20 కోట్ల కుటుంబాలకు లెక్కిస్తే మొత్తం రూ.11.66 లక్షల కోట్ల నష్టం జరిగిందని పేర్కొంది.

నేడు తపాలాశాఖ పురస్కారాల ప్రదానం

వడపళని, న్యూస్‌టుడే: తపాలా శాఖ 2025-25 సంవత్సరానికిగాను 'రీజినల్ ఎక్సలెన్స్ అవార్డ్స్' కార్యక్రమాన్ని సోమవారం నిర్వహిస్తోంది. తమిళనాడు టెక్స్ట్‌బుక్స్ అండ్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ కార్పొరేషన్ గౌరవ సలహాదారు డాక్టర్ టి.శంకర శరవణన్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని పీఐబీ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపింది. మధ్యాహ్నం 2.30 గంటలకు జరిగే కార్యక్రమానికి చెన్నై సెంట్రల్ స్టేషన్ సమీపంలోని విక్టోరియా పబ్లిక్ హాలు వేదిక కానుంది.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పనిచేస్తేనే అభివృద్ధి

■ ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్

ప్యారిస్, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేసినప్పుడే ఏ ప్రాంతమైనా అభివృద్ధి సాధించగలదని ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన శివగంగై జిల్లా తిరుప్పత్తూర్‌లోని సౌమ్య నారాయణ పెరుమాళ్ ఆలయానికి విచ్చేశారు. ఆయనకు ఎంపీ కార్తి చిదంబరం, జిల్లా కలెక్టరు పొర్కొడి తదితరులు స్వాగతం పలికారు. అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు. వెంట భాజపా రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్, జిల్లా అధ్యక్షుడు పాండిదురై తదితరులు ఉన్నారు. అనంతరం అక్కడి నుంచి శివగంగై ప్యాలెస్‌కి వెళ్లిన ఉప రాష్ట్రపతి అక్కడున్న రాజు శశివర్ణదేవర్, రాణి వేలు నాచ్చియార్ విగ్రహాలకు నివాళులు అర్పించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎల్లప్పుడూ కలిసి పనిచేస్తే ఒక ప్రాంతం అభివృద్ధి చెందగలదని సూచించారు. అమెరికా విధించిన సుంకాల తగ్గింపు భారతదేశ ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతుందన్నారు.

వేలు నాచ్చియార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న సీపీ రాధాకృష్ణన్

బంగ్లాదేశ్ ఖైదీలను స్వదేశానికి పంపాలి

మద్రాసు హైకోర్టు

ప్యారిస్, న్యూస్‌టుడే: జైల్లో ఉన్న 28మంది బంగ్లాదేశీయులను వారి దేశానికి పంపాలని మద్రాసు హైకోర్టు ఆదేశించింది. తిరుప్పూర్ జిల్లాలో బంగ్లాదేశీయులు అక్రమంగా నివాసం ఉంటూ అక్కడి బనియన్ కంపెనీల్లో పని చేస్తున్నట్లు పోలీసులకి సమాచారం అందింది. ఆ మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టి ముహమ్మద్ సలీం, ఆశిక్, ముహమ్మద్ హరీఫ్ మొదలైన 28 మందిని అరెస్టు చేశారు. తిరుప్పూర్ కోర్టు వారికి తలా రెండేళ్ల జైలు శిక్ష, రూ.10 వేల చొప్పున జరిమానా విధించింది. అనంతరం 28 మంది మద్రాసు హైకోర్టులో అప్పీల్ చేశారు. ఈ పిటిషన్‌ను విచారించిన జస్టిస్ సుందర్‌మోహన్.. పిటిషనర్ల కుటుంబీకులు బంగ్లాదేశ్‌లో ఉండటంతో వారు కూడా స్వదేశానికి వెళ్లాలని అనుకుంటున్నారని, కావున ట్రయల్ కోర్టు విధించిన శిక్షను మారుస్తున్నట్లు తెలిపారు. ఇదివరకే వారు ఏడాదికి పైగా జైల్లో ఉండటంతో ఆ శిక్ష వారికి సరిపోతుందన్నారు. కాబట్టి వారిని విడుదల చేస్తున్నట్లు ఉత్తర్వులు ఇచ్చారు. చట్టపరమైన విధివిధానాలు పూర్తయిన తర్వాత వారిని స్వదేశానికి పంపాలని, సంబంధిత అధికారులు ఈ ప్రక్రియను మూడు నెలల్లో పూర్తి చేయాలని ఆదేశించారు.

కూటమి నిర్ణయంపై రామదాస్ సమాలోచన

సైదాపేట, న్యూస్‌టుడే: కూటమి నిర్ణయంపై పార్టీ కార్యనిర్వాహక కమిటీ సభ్యులతో పీఎంకే వ్యవస్థాపకులు రామదాస్ ఆదివారం సమాలోచనలు జరిపారు. రామదాస్, ఆయన కుమారుడు అన్బుమణి మధ్య విబేధాల కారణంగా పీఎంకే రెండుగా చీలిపోయింది. ఇప్పటికే అన్బుమణి వర్గం ఎన్డీయేలో చేరింది. రామదాస్ వర్గం కూటమి గురించి ఓ నిర్ణయానికి రాలేకపోతోంది. డీఎంకే కూటమిలో ఉన్న వీసీకే రామదాస్‌కు అడ్డుపడుతున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో కూటమి గురించి పార్టీ కార్యనిర్వాహక కమిటీ సభ్యులతో రామదాస్ ఆలోచనలు జరిపారు.

రాష్ట్రంలో పెరుగుతున్న న్యుమోనియా కేసులు

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో న్యుమోనియా కేసులు పెరుగుతున్నందున జలుబు, పొడి దగ్గు, జ్వరం, శ్వాసతీసుకోవడానికి ఇబ్బంది పడుతున్నవారు నిర్లక్ష్యంగా ఉండవద్దని ప్రజారోగ్యశాఖ సూచించింది. రాష్ట్రంలో కురుస్తున్న మంచు కారణంగా న్యుమోనియా కేసులు పెరుగుతున్నాయని పేర్కొంది. రోజుకు 50మందికి పైగా ఆస్పత్రులలో చికిత్స పొందుతున్నారని, చిన్నపిల్లలపై ప్రభావం పెద్దగా లేకపోయినా, రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు, వృద్ధులు, ఇతర వ్యాధులు ఉన్నవారు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించింది. లక్షణాలుంటే ఆలస్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని సూచించింది.

పార్టీ నిర్వహణకు సీపీఎం చందాల సేకరణ

గిండి, న్యూస్‌టుడే: పార్టీ నిర్వహణ ఖర్చులకు సీపీఎం ప్రజల నుంచి చందాలు సేకరిస్తోంది. అందులో భాగంగా ఆదివారం చెన్నై ప్యారిస్‌లోని ఎన్ఎస్‌సీ బోస్ వీధిలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి షణ్ముగం రోడ్డు పక్కన చిరు దుకాణదారుల నుంచి చందాలు సేకరించారు. ఈ సందర్భంగా షణ్ముగం విలేకరులతో మాట్లాడుతూ.. పార్టీ నిర్వహణకు ప్రజల నుంచి నిధులు సేకరించి వారికే వినియోగిస్తున్నట్లు తెలిపారు. కోర్టుల ద్వారా డీఎంకే అవినీతిని ఎండగడతామని చెప్పిన నయినార్ నాగేంద్రన్.. పీఎం కేర్ నిధులను మాయం చేసిందే కాకుండా లెక్క చూపించనక్కర్లేదని చెప్పిన ఆయనకు రాష్ట్ర పరిస్థితుల గురించి మాట్లాడే అర్హత లేదన్నారు.

చందాలు సేకరిస్తున్న రాష్ట్ర కార్యదర్శి షణ్ముగం

ఫలించని ప్రతిపక్షాల కుట్రలు: ఉదయనిధి స్టాలిన్

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: ఎన్నికలను కారణంగా చూపి మగలిర్ ఉరిమైతొగై సాయాన్ని కోర్టు ద్వారా అడ్డుకోవాలని కొందరు కుట్ర పన్నారని, అయితే అవి ఫలించలేదని ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ పేర్కొన్నారు. తిరుప్పూర్ సౌత్ జిల్లా పార్టీ సీనియర్ నాయకులను సత్కరించే కార్యక్రమం ఉడుమలైపేట్టైలోని డీఎంకే కార్యాలయంలో ఆదివారం జరిగింది. పాల్గొన్న ఉదయనిధి స్టాలిన్ సీనియర్ నాయకులను సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... మహిళలకు మగలిర్ ఉరిమైతొగై సాయం చేరకుండా కేంద్ర ప్రభుత్వం పలు పథకాలు వేసిందని, కానీ మన అధ్యక్షుడు వాటిని పటాపంచలు చేశారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో డీఎంకే కూటమి 200కు పైగా స్థానాల్లో విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

సీనియర్ నాయకులను సత్కరిస్తున్న ఉదయనిధి

అమరన్‌కు 8 విభాగాల్లో ఫిల్మ్‌ఫేర్ అవార్డులు

చెన్నై, న్యూస్‌టుడే: రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వంలో శివకార్తికేయన్, సాయిపల్లవి జంటగా నటించిన 'అమరన్' చిత్రం 8 విభాగాల్లో ఫిల్మ్‌ఫేర్ పురస్కారాలు అందుకుంది. 70వ ఫిల్మ్‌ఫేర్ అవార్డ్స్ సౌత్ విత్ కేరళ టూరిజం పేరిట కేరళలోని కొచ్చిలో శనివారం జరిగింది. దక్షిణ భారతదేశ చలనచిత్ర పరిశ్రమలోని ఉత్తమ చిత్రాలు, దర్శకులు, నటులు తదితర పలు విభాగాల కింద పురస్కారాలు ప్రదానం చేశారు. ఇందులో తమిళ చిత్రసీమ.. ఉత్తమ చిత్రంగా 'అమరన్', ఉత్తమ దర్శకుడిగా వినోద్‌రాజ్ (కొట్టుకాళి), రాజ్‌కుమార్ పెరియసామి (అమరన్), ఉత్తమ చిత్రం (క్రిటిక్స్) - 'మెయ్యళగన్' (ప్రేమ్ కుమార్), ఉత్తమ నటుడు (ప్రధాన పాత్ర) - శివకార్తికేయన్ (అమరన్), ఉత్తమ నటుడు (క్రిటిక్స్) - అరవింద్ సామి (మెయ్యళగన్), ఉత్తమ నటి (ప్రధానపాత్ర) - సాయి పల్లవి (అమరన్), ఉత్తమ నటి (క్రిటిక్స్) - అన్నా బెన్ (కొట్టుకాళి), ఉత్తమ సహాయ నటుడు - కార్తి (మెయ్యళగన్), ఉత్తమ సహాయ నటి - శ్వాసిక (లబ్బర్ పందు), ఉత్తమ సంగీత ఆల్బమ్ - జీవీ ప్రకాశ్‌కుమార్ (అమరన్), ఉత్తమ గేయరచయిత - ఉమాదేవి (యారో ఇవన్ యారో - మెయ్యళగన్), ఉత్తమ నేపథ్య గాయకుడు -హరిచరన్ (హే మిన్నలే - అమరన్), ఉత్తమ నేపథ్య గాయని - శ్వేతా మోహన్ (హే మిన్నలే - అమరన్), ఉత్తమ వర్ధమాన దర్శకుడు - సురేశ్ మారి (జే బేబి), తమిళరసన్ పచ్చముత్తు (లబ్బర్ పందు), ఉత్తమ వర్ధమాన నటుడు - రితు హరూన్ (థగ్స్), ఉత్తమ వర్ధమాన నటి - శ్రీ గౌరీప్రియ (లవర్), ఉత్తమ ఛాయాగ్రాహకుడు - సి.హెచ్.సాయి (అమరన్), అత్యుత్తమ నటన - విక్రమ్ (తంగలాన్). 8 విభాగాల్లో పురస్కారాలు అందుకున్న సందర్భంగా 'అమరన్' చిత్రబృందం సర్‌ప్రైజ్ వీడియోను విడుదల చేసింది. అందులో.. సినిమా, పోటీలను అధిగమించిన అమరన్ అనే టైటిల్‌తో సినిమాలోని కొన్ని సన్నివేశాలను ఉంచింది.

13ఏళ్ల తర్వాత ముందు వరుసలోకి: శివకార్తికేయన్

పురస్కారాన్ని అందుకున్న తర్వాత నటుడు శివకార్తికేయన్ మాట్లాడుతూ... 13ఏళ్ల కిందట ఫిల్మ్ ఫేర్ పురస్కారాన్ని అందుకోవడానికి తననూ సరదాగా ధనుష్ తీసుకొచ్చారని తెలిపారు. అప్పుడు రెండో వరుసలో కూర్చున్నానని, మొదటి వరుసకు వచ్చేందుకు 13ఏళ్లు పట్టిందని పేర్కొన్నారు. 'అమరన్' చిత్రం కోసం ఒప్పందం చేసుకునేటప్పుడు కమల్‌హాసన్ కార్యాలయంలో పలు పురస్కారాలు ఉన్నాయన్నారు. అప్పుడు ఆయన 'ఇవి నాకు చాలు, ఇక యువ కథానాయకుల పురస్కారాలు అందుకోవాలి' అని అన్నారని గుర్తు చేసుకున్నారు. అది ప్రస్తుతం జరిగిందన్నారు. రాజ్‌కుమార్ పెరియసామి కథే ఈ పురస్కారం అందుకోవడానికి కారణమని తెలిపారు.

పదవి కోసం ఏం చేయడానికైనా ఓపీఎస్ సిద్ధం: టీటీవీ దినకరన్

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: పదవి కోసం ఒ.పన్నీర్‌సెల్వం ఏం చేయడానికైన సిద్ధపడతారని ఏఎంఎంకే ప్రధానకార్యదర్శి టీటీవీ దినకరన్ విమర్శించారు. పార్టీ నిర్వాహకుడి ఇంట్లో జరుగుతున్న శుభకార్యంలో పాల్గొనేందుకు ఆదివారం కుంభకోణం విచ్చేసిన టీటీవీ విలేకరులతో మాట్లాడుతూ... ఓపీఎస్ వర్గానికి చెందిన అయ్యప్పన్ అసెంబ్లీలో ఎంజీఆర్, జయలలిత ఆశీర్వాదంతో మళ్లీ డీఎంకే ప్రభుత్వం వస్తుందని, స్టాలిన్ ముఖ్యమంత్రి అవుతారని చెప్పడం క్షమించరాని తప్పన్నారు. ఎంజీఆర్, జయలలిత మద్దతుదారులు, రాష్ట్ర ప్రజలు తగిన గుణపాఠం చెప్తారన్నారు. ఓపీఎస్‌ని అన్నాడీఎంకే నుంచి బహిష్కరించడం సరైనదేనని ఇప్పుడు అర్థమవుతోందని తెలిపారు. అసెంబ్లీలో అయ్యప్పన్ మాట్లాడినప్పుడు 1989 మార్చి 25న జయలలితకు జరిగిన అవమానమే గుర్తొచ్చిందన్నారు. అమ్మ అభిమానులంతా ఐక్యంగా డీఎంకేని ఓడించాలనే తాము ఎన్డీయేలో చేరినట్లు తెలిపారు.

మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌శాఖలో అవినీతి వ్యవహారం

ఆ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులపై చర్యలు చేపట్టండి

డీజీపీకి మళ్లీ లేఖ పంపిన ఈడీ

ప్యారిస్, న్యూస్‌టుడే: తమిళనాడు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, నీటి సరఫరాల శాఖలో జరిగిన అవినీతిలో ఐపీఎస్, ఐఏఎస్ అధికారులకి సంబంధం ఉందని రాష్ట్ర డీజీపీకి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) మళ్లీ లేఖ పంపింది. రాష్ట్రంలో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, నీటి సరఫరాల శాఖలో కాంట్రాక్టులు అప్పగింత, ఉద్యోగ నియామకాల్లో అవకతవకలు, భారీగా అవినీతి జరిగిందని ఈడీ ఆరోపిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ, అవినీతి నిరోధకశాఖకు ఇదివరకే రెండుసార్లు లేఖ పంపింది. ఇదిలా ఉండగా టెండర్ల జారీలో జరిగిన అవినీతిలో కొంతమంది ఐఏఎస్, ఐపీఎస్ అధికారులకు సంబంధం ఉందని డీజీపీకి మళ్లీ లేఖ పంపింది. చెన్నై మహానగర పాలక సంస్థకు చెందిన పారిశుద్ధ్య కార్మికులకు యూనిఫాం అందజేసే కాంట్రాక్టుని సూచించిన వ్యక్తికే అప్పగించాలని తరచూ వార్తల్లో నిలిచే యువ ఐపీఎస్ అధికారి మధ్యవర్తిని సంప్రదించారని, ఇందుకు సంబంధించిన ఆధారాలు ఉన్నట్లు ఈడీ తెలిపింది. ఆ అధికారి రహస్య, సున్నితమైన సమాచారాన్ని మూడో వ్యక్తితో పంచుకున్నారని, ఈ విషయంలో చర్యలు తీసుకుంటామని ఈడీ హెచ్చరించింది. అదే విధంగా వసూలు చేసిన లంచాన్ని విదేశాలకు అక్రమంగా బదిలీ చేశారని, ఈ వ్యవహారంలో తమిళనాడు పోలీసులు వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేయాలని, ఆధారాలు ఉండి కూడా చర్యలు చేపట్టకుంటే సంబంధిత అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిపింది.

(c) eenadu

రంజాన్ వేళలు ఇఫ్తార్: సోమవారం(సా) 6.20 సహర్: మంగళవారం(ఉ) 5.04

టీవీకేలోకి మాజీ సభాపతి ధనపాల్ కుమారుడు

విజయ్‌తో లోకేశ్ తమిళ్‌సెల్వన్

చెన్నై, న్యూస్‌టుడే: అన్నాడీఎంకేకు చెందిన మాజీ సభాపతి, అవినాశి ఎమ్మెల్యే ధనపాల్ కుమారుడు లోకేశ్ తమిళ్‌సెల్వన్ చెన్నైలో టీవీకే అధ్యక్షుడు విజయ్‌ను కలిసి ఆ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ... తన తండ్రి వంటి సీనియర్లకు అన్నాడీఎంకేలో మర్యాద లేదన్నారు. చిన్నప్పటి నుంచే విజయ్‌కు అభిమానినని, తన తండ్రి నిర్ణయం వల్లే టీవీకేలో చేరడం ఆలస్యమైందని తెలిపారు. తన తండ్రికి గుండెపోటు వచ్చినప్పుడు పార్టీ అధిష్ఠాన నిర్వాహకులు ఎవరూ ఆయన్ను చూసేందుకు రాలేదని, అప్పుడే మన స్థానానికి గురయ్యామని పేర్కొన్నారు. 2026లో అవినాశి నియోజకవర్గం నుంచి తండ్రికి బదులుగా పోటీ చేసేందుకు ఆశావహులతో దరఖాస్తు సమర్పించిన తనకు గుర్తింపు ఇవ్వలేదన్నారు. ఇమ్మానువేల్ శేఖరన్ మనవడు చక్రవర్తి, ఎంజీఆర్, జయలలితతో సుదీర్ఘకాలం పనిచేసిన అన్నాడీఎంకేకు చెందిన బాబుజీ గౌతమ్, రజినీ అభిమానుల సంఘానికి చెందిన న్యాయవాది సినేరా పి.ఎస్.అశోక్ తదితరులు విజయ్ సమక్షంలో టీవీకేలో చేరారు. అన్నాడీఎంకే సాంకేతిక సమాచార విభాగం బాధ్యులు, ఎంజీఆర్ యువజన విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించిన లోకేశ్ తమిళ్‌సెల్వన్ 2024 లోక్‌సభ ఎన్నికల్లో నీలగిరి నుంచి పోటీ చేసి మూడో స్థానంలో నిలిచారు. ఆయనకు మాజీ ముఖ్యమంత్రి ఎంజీఆర్ పేరు పెట్టగా ఆయన వివాహాన్ని దివంగత ముఖ్యమంత్రి జయలలిత జరిపించడం గమనార్హం.

24, 25 తేదీల్లో ఎమ్మార్టీఎస్, మెట్రో మార్గాల్లో భద్రతా తనిఖీలు

వడపళని, న్యూస్‌టుడే: వేళచ్చేరి-సెయింట్ థామస్ మౌంట్ వరకు మాస్ రాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్(ఎమ్మార్టీఎస్) మార్గంలో ఈ నెల 24వ తేదీ రైల్వే భద్రతా విభాగ కమిషనర్ ఏఎం చౌదరి ఆధ్వర్యంలోని బృందం స్పీడ్ ట్రయల్ రన్, భద్రతా తనిఖీలు నిర్వహించనుంది. 25వ తేదీ పోరూర్ నుంచి వడపళని వరకు మెట్రో రెండో దశ నాలుగో మార్గంలో తనిఖీలు నిర్వహిస్తారు. రెండో తనిఖీని 25న తాత్కాలికంగా నిర్వహించాలని సీఎంఆర్‌ఎల్ వర్గాలు తెలిపాయి. రెండో విడత తనిఖీ ఫ్రాన్స్‌కు చెందిన సంస్థ నిర్వహించనున్న స్వతంత్ర భద్రతా ఆడిట్ రేపటితో ఆధారపడి ఉంటుందని, వీటినుంచి ఒకటిరెండు రోజుల్లో నివేదిక అందుతుందని సీఎంఆర్‌ఎల్ వర్గాలు భావిస్తున్నాయి. అనుమతి రాగానే ఈ నెలాఖరులో మళ్లీ నుంచి పోరూర్ మీదుగా వడపళని వరకు సేవలను ప్రారంభించాలని అధికారులు యోచిస్తున్నారు.

'ఎంజీఆర్, జయలలిత ఆత్మలు ఓపీఎస్‌ను క్షమించవు'

ప్యారిస్, న్యూస్‌టుడే: ఎంజీఆర్, జయలలిత ఆత్మలు ఓ.పన్నీర్‌సెల్వాన్ని ఎప్పటికీ క్షమించవని మాజీ మంత్రి కడంబూర్ రాజు పేర్కొన్నారు. తూత్తుకుడిలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... ముఖ్యమంత్రి కలవడం, డీఎంకేలో చేరడం ఒకరి వ్యక్తిగతమని, కానీ ఎంజీఆర్, జయలలిత ఆశీర్వాదంతో స్టాలిన్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని చెప్పారన్నారు. ఎంజీఆర్, జయలలిత ఆత్మలు ఎప్పటికీ ఆయన్ను క్షమించవని, కచ్చితంగా శిక్ష ఉంటుందన్నారు. 1989 శాసనసభ ఎన్నికల్లో జయలలితకు వ్యతిరేకంగా ఓపీఎస్ పని చేశారని, వాటన్నింటిని మన్నించి జయలలిత ఆయనకు పదవి ఇచ్చారన్నారు.

'డీఎంకే మునిగిపోయే నావ'

గిండి, న్యూస్‌టుడే: డీఎంకే మునిగిపోయే నావ అని, వచ్చే ఎన్నికలలో ఎన్డీయే గెలుస్తుందని అన్నాడీఎంకే మాజీ మంత్రి సెల్లూర్ రాజు ధీమా వ్యక్తం చేశారు. మదురై పశ్చిమ నియోజకవర్గంలోని 70వ వార్డు దురైసామి నగర్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. డీఎంకే ఎన్ని పార్టీలతో పొత్తు పెట్టుకున్నా డీఎంకే ఓడిపోవడం ఖాయమన్నారు.

సీఎంఆర్‌ఎల్ ఆధీనంలోకి ఎమ్మార్టీఎస్ మార్గం

రైల్వే బోర్డుకు మెమోరాండం పంపేందుకు చర్యలు

- న్యూస్‌టుడే, వడపళని

చెన్నై నగరవాసులకు రవాణా వ్యవస్థను మరింత మెరుగుపరిచేందుకు మాస్ రాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్(ఎమ్మార్టీఎస్) మార్గాన్ని చెన్నై మెట్రో రైల్ లిమిటెడ్(సీఎంఆర్‌ఎల్) ఆధీనంలోకి తీసుకొచ్చేందుకు గతంలోనే ప్రణాళికలు, ప్రతిపాదనలు ప్రారంభమయ్యాయి. చాలా నెలల తర్వాత ఇందుకు సంబంధించిన మెమోరాండం(ఎంఓయూ)ను దక్షిణ రైల్వే రాష్ట్ర ప్రభుత్వానికి పంపింది. ముసాయిదా మెమోరాండం డ్రాఫ్టును మార్చి నెలలో దక్షిణ రైల్వే.. రైల్వే బోర్డుకు పంపే అవకాశాలున్నాయి.

జూన్‌లో సంతకాలు

త్వరలో ఎంఓయూకు ఆమోదం లభిస్తే రాష్ట్ర ప్రభుత్వం, దక్షిణ రైల్వేల మధ్య 'ఎంఓయూ'పై జూన్‌లో సంతకాలు జరగొచ్చని అధికారులు పేర్కొన్నారు. సీఎంఆర్‌ఎల్‌ను ఎమ్మార్టీఎస్‌తో అనుసంధానం చేయాలనే ఆలోచన 2010లోనే ప్రారంభమైందని, అయితే ఆ తర్వాత పలు కారణాలతో పనులు ముందుకు సాగలేదని, అనుసంధానంపై గత ఏడాది జులైలో రైల్వే బోర్డు నుంచి సూత్రప్రాయ ఆమోదం లభించినప్పటికీ ఎంఓయూ మీద సంతకాలు జరగలేదని తెలిపారు.

నిబంధనలతో మళ్లీ చర్చలు

ఎంఓయూకి ముందుగా దక్షిణ రైల్వే ముసాయిదా మెమోరాండంలో కొన్ని నిబంధనలు ప్రవేశపెట్టింది. ఆ క్రమంలో మళ్లీ చర్చలు జరపాలని, వారం లేదా పక్షం రోజుల్లో ఎంఓయూ పత్రాన్ని దక్షిణ రైల్వేకు తిరిగి పంపుతామని పేర్కొంది. దక్షిణ రైల్వే నుంచి ఈ రకమైన సమాధానం రావడంతో తుది ఆమోదం కోసం రైల్వే బోర్డుకు దక్షిణ రైల్వే మార్చి నెలలో పంపుతుందని ఆశిస్తున్నామని ప్రభుత్వ ఉన్నత వర్గాలు పేర్కొన్నాయి.

స్టేషన్ల అభివృద్ధికి నిధులు

ఎంఓయూలో సంతకాలు చేసే పని జూన్‌లో జరిగితే ఎమ్మార్టీఎస్ స్టేషన్ల పునరుద్ధరణ పనులు బాగా ఆలస్యం అవుతాయని సీఎంఆర్‌ఎల్ పేర్కొంది. ఎంఓయూకు ముందుగా స్టేషన్ల స్థాయిని పెంచేందుకు టెండర్లు ఆహ్వానించాలని సీఎంఆర్‌ఎల్ భావించింది. ఇప్పుడు ప్రణాళికలో మార్పు జరగడంతో ముందుగానే వివరణాత్మక

ఎమ్మార్టీఎస్ మార్గంలో వెళ్తున్న రైలు

ప్రాజెక్టు నివేదిక తయారవుతోందని, పునరుద్ధరణకు సంబంధించిన టెండర్లు కూడా ఎంఓయూపై సంతకాలు చేసిన తర్వాతనే జరుగుతాయని అధికారులు తెలిపారు. ఎంఓయూపై సంతకాల ప్రక్రియ ముగిసి, టెండర్ల ద్వారా కాంట్రాక్టరును నియమించిన తర్వాత రెండు సంవత్సరాల్లో గడువులోగా పనులు పూర్తి చేయాల్సి ఉంటుంది. ఆ సమయంలో దక్షిణ రైల్వే స్టేషన్ల నిర్వహణ పనులు చూసుకుంటుంది. చెన్నై బీచ్-వేళచ్చేరి వరకు ఎమ్మార్టీఎస్ మార్గంలో స్టేషన్ల స్థాయి పెంచడానికి రూ.4,000 కోట్ల మేరకు నిధులు ఖరారు చేయడానికి చర్చలు జరుగుతున్నాయని ఉన్నతాధికారి ఒకరు చెప్పారు.

ఇంజినీరింగ్ చదివి మావోయిస్టు ఉద్యమంలోకి

పోలీసు కస్టడీలో వసంత్ వాంగ్మూలం

ప్యారిస్, న్యూస్‌టుడే: కర్ణాటక అటవీ ప్రాంతాల్లో ఆయుధ శిక్షణ తీసుకున్నట్లు మావోయిస్టు వసంత్ క్యూ బ్రాంచ్ పోలీసులకి వాంగ్మూలం ఇచ్చాడు. కేరళ జైల్లో ఉన్న రాణిపేటకి చెందిన మావోయిస్టు వసంత్‌ని తమిళనాడు క్యూ బ్రాంచ్ పోలీసులు కస్టడీకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అతను పోలీసులకి ఇచ్చిన వాగ్మూలంలో.. తాను ఇంజినీరింగ్ చదివానని, 16ఏళ్ల క్రితం తనకు వేలూర్ జిల్లా సత్తువాచ్చారికి చెందిన రాఘవేంద్ర పరిచయం అయ్యాడని, తామిద్దరం తరచూ కలుసుకుని రాజకీయాల గురించి మాట్లాడుకునేవారమని, రాఘవేంద్ర మావోయిస్టు ఉద్యమంలో చేరడంతో చదువు మధ్యలోనే ఆపేశాడని చెప్పాడు. అనంతరం రాఘవేంద్ర తన పేరు వినోద్‌కుమార్, రవి ముఖేష్ అని మార్చుకున్నాడని, సాయుధ పోరాటం గురించి అతను తనకు రహస్యంగా బోధించేవాడని తెలిపాడు. అనంతరం ఇంటి నుంచి బయటకు వచ్చిన అతను కేరళ వెళ్లి, అక్కడున్న అటవీ ప్రాంతంలో మావోయిస్టులకి ఆయుధ శిక్షణ ఇచ్చాడని చెప్పాడు. అందుకని తాను కూడా 2010లో ఇంటి నుంచి బయటకు వచ్చినట్లు చెప్పాడు. అప్పుడు తేనికి చెందిన కార్తిక్, సంతోష్‌కుమార్, షర్మిళ మొదలైన మావోయిస్టుల స్నేహం లభించిందని, ఆ తర్వాత తాను కర్ణాటక అటవీ ప్రాంతాల్లో ఆయుధ శిక్షణ తీసుకున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో 2021లో కేరళ పోలీసులు రాఘవేంద్రను అరెస్టు చేశారని, ఆ తర్వాత కార్తిక్, సంతోష్‌కుమార్ తదితరులను తమిళనాడు క్యూ బ్రాంచ్ పోలీసులు అరెస్టు చేసినట్లు చెప్పాడు. అనంతరం తనతో పాటు ఐదుగురు మావోయిస్టులు గతేడాది లొంగిపోయినట్లు తెలిపాడు.

మహిళలతోనే అధికారం మార్పు: అన్బుమణి

గిండి, న్యూస్‌టుడే: రాష్ట్రంలో మహిళలతోనే అధికారం మారుతుందని పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి తెలిపారు. ధర్మపురి సమీపం వెల్లైపట్టి పంచాయతీ పరిధిలో పీఎంకే తరపున కల్యాణ మండపం నిర్మించారు. దీనిని ఆదివారం అన్బుమణి ప్రారంభించారు. ఈ సందర్భంగా అన్బుమణి మాట్లాడుతూ.. ఎన్నికల వేళ డబ్బులు పంచడం, కానుకలు ఇచ్చినంత మాత్రాన ప్రజల సమస్యలకు పరిష్కారం దక్కదని, వారికి విద్య, ఉద్యోగావకాశాలతోనే మేలు జరుగుతుందని తెలిపారు.

ఓపీఎస్ పరిస్థితి దయనీయం: ఖుష్బూ

సైదాపేట, న్యూస్‌టుడే: మాజీ ముఖ్యమంత్రి ఓ.పన్నీర్‌సెల్వం పరిస్థితి దయనీయంగా ఉందని భాజపా నాయకురాలు ఖుష్బూ తెలిపారు. చెన్నై విమానాశ్రయంలో ఆదివారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ... విజయకాంత్ ప్రాణాలతో ఉండుంటే డీఎండీకే ఎన్నటికీ డీఎంకేతో కలిసేది కాదన్నారు. పన్నీర్‌సెల్వాన్ని తలచుకుంటే బాధగా ఉందని, పొత్తుకు ఎవరైనా ఆహ్వానిస్తారా అని ఎదురుచూస్తున్నారని తెలిపారు. డీఎంకే, కాంగ్రెస్ కూటమి నిర్ధారణ కాలేదని, ఆ పార్టీల మధ్య సమస్య ఉందని పేర్కొన్నారు. టీవీకే అధ్యక్షుడు విజయ్ కాంగ్రెస్ కోసం వేచి చూస్తున్నారని తెలిపారు. డీఎంకే ప్రభుత్వంలో రూ.10 లక్షల కోట్ల అప్పు ఉందని, అలాంటప్పుడు నెలకు రూ.2000 ఎలా ఇస్తారని ప్రశ్నించారు.

టీ20 ప్రపంచ కప్ మనదే: క్రికెటర్ నటరాజన్

సైదాపేట, న్యూస్‌టుడే: టీ20 ప్రపంచ కప్ ఈసారి భారత జట్టు దక్కించుకుంటుందని భారత క్రికెటర్ నటరాజన్ ధీమా వ్యక్తం చేశారు. సేలంలో ఓ ప్రైవేటు సంస్థ క్రీడాకారుల వస్త్ర దుకాణం ఏర్పాటు చేసింది. దీనిని నటరాజన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ... ప్రస్తుతం జరుగుతున్న టీ20 ప్రపంచకప్‌లో భారత క్రీడాకారులు చాలా చక్కగా ఆడుతున్నారని తెలిపారు. తప్పకుండా భారత జట్టు కప్పు గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. త్వరలో ఫిట్‌నెస్ నిరూపించుకుని మళ్లీ భారత జట్టులో ఆడుతానని పేర్కొన్నారు. తన క్రికెట్ అకాడమీలో చాలా మంది శిక్షణ పొందుతున్నారని, ప్రస్తుతం జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరుస్తున్నారని తెలిపారు.

రేపు విద్యుత్తు వినియోగదారుల సమావేశం

వడపళని, న్యూస్‌టుడే: తమిళనాడు విద్యుత్తు పంపిణీ సంస్థ(టీఎన్‌పీడీసీఎల్) విద్యుత్తు వినియోగదారుల సమావేశాన్ని షోలింగనల్లూరు డివిజన్‌లో 24వ తేదీ నిర్వహిస్తోంది. చేరన్ నగర్, పెరుబాక్కం 110 కేవీ పెరుంబాక్కం సబ్‌స్టేషను సమీపంలోని షోలింగనల్లూరు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుంది. షోలింగనల్లూర్, మేడవాక్కం, నన్మంగళం, జల్లాడియంపేట్, గౌరివాక్కం, పల్లికరనై, కోవిలంబాక్కం, ఎస్.కొలత్తూర్, నారాయణపురం, సీతలపాక్కం, అరసన్‌కళని, పెరుంబాక్కం ప్రాంతాలవాసులు సమావేశంలో పాల్గొని సమస్యలు పరిష్కరించుకోవచ్చు.

రాష్ట్రంలో క్షీణించిన శాంతిభద్రతలు: ఈపీఎస్

సైదాపేట, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఉగ్రవాదులను ఢిల్లీ పోలీసులు వచ్చి అరెస్టు చేసేవరకు డీఎంకే ప్రభుత్వం ఏం చేస్తోందని పళనిసామి ప్రశ్నించారు. ఆదివారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో... తిరుప్పూరులో ఉగ్రవాద దాడికి ప్రణాళిక రచించిన 8మంది ఉగ్రవాదులను ఢిల్లీ పోలీసులు అరెస్టు చేసినట్లు వార్తలు వచ్చాయని తెలిపారు. తమిళనాడులో శాంతిభద్రతలు దారుణంగా క్షీణించాయన్నారు. 2022లో కోయంబత్తూరులో పేలుళ్లు జరిగినప్పుడు తమిళనాడుకు ఉగ్ర ముప్పు ఉందని అంగీకరించకుండా సిలిండర్ పేలుడు అని సమర్థించేందుకే డీఎంకే ప్రభు త్వం యత్నించిందని ఆరోపించారు. ఎన్ఐఏ రాష్ట్రంలో ఉగ్రవాదులను అరెస్టు చేస్తున్న నేపథ్యంలో ఉగ్రవాదాన్ని అడ్డుకునేందుకు తమిళనాడు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలేంటని ప్రశ్నించారు. మళ్లీ డీఎంకే ప్రభుత్వాన్ని కొనసాగితే 1998 వంటి భయంకరమైన ఘటన పునరావృతం అవుతుందనే భయం ప్రజల్లో ఉందన్నారు.

'కేటీసీటీ'లో ఘనంగా 'ప్రతిభ-26' వేడుకలు

కార్యక్రమంలో నిర్వాహకులు, అతిథులు, విద్యార్థినులు

టీనగర్, న్యూస్‌టుడే: చెన్నైలోని కేటీసీటీ బాలికల పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో 'ప్రతిభ-26' వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. చెన్నై ప్యారిస్‌లోని గోవిందప్ప నాయకన్ వీధిలో ఉన్న వాసవి అమ్మవారి హాల్ వేదికగా సంఘ అధ్యక్షురాలు సి.లతా బాలాజీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి అతిథులుగా టాబ్లెట్స్ ఇండియా లిమిటెడ్ అడ్వైజర్ సీవీ సుబ్బారావు, మురుగప్ప గ్రూప్ విశ్రాంత సీనియర్ జనరల్ మేనేజరు ఎన్.కృష్ణకుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో ఉత్తమ సేవలందించిన మహిళలు, ఉపాధ్యాయులకు 'వనిత కిశోరం' అవార్డులు, సీనియర్ పూర్వ విద్యార్థులకు పురస్కారాలు అందజేశారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యదర్శి మాలతి సంతోష్, కోశాధికారి భాను సుబ్రహ్మణ్యంతో పాటు సలహాదారులు శ్రీలక్ష్మీ మోహన్ రావు, సుజాతా రమేశ్ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎస్‌కేపీడీ పాఠశాలల కరెస్పాండెంట్ సోలేటి లోకయ్య సుదర్శనం, కేటీసీటీ ప్రస్తుత ప్రధానోపాధ్యాయిని అనిల, ఎస్‌కేపీడీ పాఠశాల ప్రధానోపాధ్యాయిని లీలారాణి తదితరులు పాల్గొన్నారు.

నమ్మకమే అత్యుత్తమ ప్రసాదం

సైదాపేట, న్యూస్‌టుడే: భగవంతుడు మనతో ఉన్నాడన్న నమ్మకమే అత్యుత్తమ ప్రసాదమని ప్రముఖ ఆధ్యాత్మిక గురువు రవిశంకర్ తెలిపారు. కృష్ణగిరి జిల్లా హోసూరు వద్ద ఉన్న దక్షిణ తిరుపతిగా పేరుగాంచిన శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరుగుతున్నాయి. హిందూ ధర్మ చైతన్య మహాసభ తరపున పలు కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమాల్లో పాల్గొన్న ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ వ్యవస్థాపకులు, ప్రముఖ ఆధ్యాత్మిక గురువు శ్రీశ్రీ రవిశంకర్ ఉపన్యసించారు. భగవంతుడు ఎల్లవేళలా అందరికీ ప్రేమానురాగాలు అందిస్తున్నారని, మనం గట్టిగా నమ్మాలని సూచించారు. భగవంతుడు మనతో ఉన్నారన్న నమ్మకమే అత్యుత్తమ ప్రసాదమని తెలిపారు.

'వీఐటీ-చెన్నై'లో ముగిసిన 'వైబ్రన్స్-26' వేడుకలు

వడపళని, న్యూస్‌టుడే: వేలూర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(వీఐటీ) చెన్నై ప్రాంగణంలో నాలుగు రోజులపాటు 'వైబ్రన్స్-26' పేరిట జరిగిన వార్షిక అంతర్జాతీయ మెగా సాంస్కృతిక కార్యక్రమాలు శనివారం ముగిశాయి. చివరి రోజు కార్యక్రమానికి సినీనటి డాక్టర్ శ్రీలీల ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమానికి వీఐటీ వ్యవస్థాపకుడు, కులపతి డాక్టర్ జి.విశ్వనాథన్, ఉపాధ్యక్షుడు డాక్టర్ జీవీ సెల్వం అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా చెన్నైలోని

విజేతలకు ట్రోఫీ అందిస్తున్న నటి శ్రీలీల. చిత్రంలో జి.విశ్వనాథన్ తదితరులు

ఎస్ఎస్ఎన్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ 'సాంస్కృతిక ఛాంపియన్‌షిప్ ట్రోఫీ'ని గెలుచుకుంది. ఈ ఏడాది జరిగిన కార్యక్రమంలో యూకే, బ్రెజిల్, జపాన్ సహా 11 దేశాల విద్యార్థులతో పాటు దేశంలోని వివిధ విద్యా సంస్థలకు చెందిన 30 వేల మందికిపైగా పాల్గొన్నారు. సాంకేతిక, సాహిత్య పోటీలు, సాంస్కృతిక ప్రదర్శనలతో పాటు 200కు పైగా పలు రకాల కార్యక్రమాలు జరిగాయి. ప్రొ వైస్‌ఛాన్స్‌లర్ డాక్టర్ టి.త్యాగరాజన్, డైరెక్టర్ డాక్టర్ కె.సత్యనారాయణన్ తదితరులు పాల్గొన్నారు.

పాతాళ సెంబు మురుగన్‌ను దర్శించుకున్న నటి రోజా

భక్తులకు అన్నదానం చేస్తున్న రోజా

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: దిండుగల్ జిల్లా రామలింగంపట్టిలోని ప్రసిద్ధ పాతాళ సెంబు మురుగన్ ఆలయానికి శనివారం ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి, సినీనటి రోజా, ఆమె కుమారుడు విచ్చేశారు. ముందుగా సంగిలి కరుప్పై సన్నిధికి చేరుకుని అనంతరం మురుగన్‌ను దర్శించుకున్నారు. తర్వాత 2వేల మంది భక్తులకు అన్నదానం చేశారు.

సౌమ్య నారాయణుని సేవలో దుర్గా స్టాలిన్

ఆలయంలో దుర్గా స్టాలిన్

ప్యారిస్: శివగంగై జిల్లా తిరుప్పత్తూర్‌లోని ప్రసిద్ధ సౌమ్య నారాయణ పెరుమాళ్ ఆలయానికి ఆదివారం రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాలిన్ సతీమణి దుర్గా స్టాలిన్ విచ్చేశారు. జిల్లా కలెక్టరు పోర్కొడి ఆమెకు స్వాగతం పలికారు. అనంతరం వేదపండితులు స్వామివారి దర్శనం చేయించి ప్రసాదాలు అందజేశారు.

తన కుమార్తె వివాహ నిశ్చితార్థానికి రావాలని కోరుతూ వీసీకే అధ్యక్షుడు తిరుమావళవన్‌కు ఆదివారం ఆహ్వానపత్రిక అందజేస్తున్న టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వ పెరుంతగై

- న్యూస్‌టుడే, సైదాపేట

చెన్నైలో అదనంగా బస్సు సర్వీసులు

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: చెన్నైలో సబర్బన్ రైళ్ల సేవలకు అంతరాయం కలగడంతో పలు మార్గాలలో అదనంగా 60 బస్సులు నడుపుతున్నట్లు ఎంటీసీ తెలిపింది. ఈనెల 20 నుంచి ఏప్రిల్ 5వ తేదీ వరకు రాయపురం తాత్కాలిక బస్టాండ్ నుంచి బీచ్ రైల్వే స్టేషన్, గిండి, తాంబరం మీదుగా 75 బస్సులు, గిండి, తాంబరం నుంచి 43 బస్సులు, బీచ్ రైల్వేస్టేషన్, పార్క్ స్టేషన్, ఎగ్మోర్ స్టేషన్ మార్గంలో 55 బస్సులు, పరంగిమలై రైల్వేస్టేషన్ మార్గంగా 20 బస్సులు నడుస్తాయని, వీటితోపాటు అదనంగా రాయపురం తాత్కాలిక బస్టాండ్ నుంచి 27 బస్సులు కిళాంబాక్కం వరకు, పల్లావరం నుంచి తాంబరం మీదుగా చెంగల్పట్టు వరకు 15 బస్సులు, ఎగ్మోర్ రైల్వేస్టేషన్ నుంచి సచివాలయం మీదుగా ఎనిమిది బస్సులు, నుంగంబాక్కం మీదుగా ఐదు, పరంగిమలై రైల్వేస్టేషన్ మీదుగా ఐదు మొత్తం 60 బస్సులు నడపనున్నట్లు ఎంటీసీ పేర్కొంది.

నేడు అగరంచ్చేరిలో టీవీకే బహిరంగ సభ

పకడ్బందీగా ఏర్పాట్లు

వేలూర్, న్యూస్‌టుడే: వేలూర్ జిల్లా పల్లికొండ సమీపం అగరంచ్చేరి వద్ద చెన్నై-బెంగళూరు జాతీయ రహదారి పక్కన ఉన్న సుమారు 33 ఎకరాల విస్తీర్ణంలో తమిళగ వెట్రి కళగం బహిరంగ సభ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరిగే సభలో పార్టీ అధ్యక్షుడు విజయ్ పాల్గొని ప్రసంగిస్తారు. దాదాపు 4,900 మంది పాల్గొనేందుకు పోలీసులు అనుమతిచ్చారు. పాల్గొనేవారికి క్యూఆర్ కోడ్‌తో కూడిన పాస్‌లు ఇవ్వనున్నారు. 900 మంది పోలీసులు భద్రతా విధులు నిర్వర్తించనున్నారు.

EENADU Classifieds
JOBS
MARKETING/ SALES
Anand Masale Require Sales & Marketing Manager, Marketing Executives. Contact: 98496 55105, 98480 53144 Email: anandmasalaappltd@gmail.com.

పలు అభివృద్ధి ప్రాజెక్టులు ప్రారంభం

బస్టాండు ప్రారంభిస్తున్న ఉదయనిధి స్టాలిన్

ట్రిప్లికేన్, న్యూస్‌టుడే: కోయంబత్తూర్ జిల్లా పొళ్లాచ్చిలో కొత్తగా నిర్మించిన బస్టాండును ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ ఆదివారం ప్రారంభించారు. తర్వాత ఆళియార్ జలాశయం తాగునీటి ప్రాజెక్టును ప్రారంభించారు. అదేవిధంగా సూళూరు, వాల్‌పారై, కినత్తుక్కడవు నియోజకవర్గాలలో కొత్తగా నిర్మించిన ఆరోగ్య ఉప కేంద్రం, అంగన్వాడీ భవనం, రేషన్ దుకాణ భవనాలను కూడా అందుబాటులోకి తీసుకొచ్చారు. అనంతరం పొళ్లాచ్చిలో కొత్తగా నిర్మించిన రోడ్డుకు పొళ్లాచ్చి మహాలింగం రోడ్డుగా నామకరణం చేశారు. కార్యక్రమాల్లో మంత్రులు సామినాథన్, చక్రపాణి, ఎంపీ ఈశ్వరసామి, జిల్లా కలెక్టర్ పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులు, పోలీసులు మాతో పెట్టుకోవద్దు

వివాదాస్పదంగా భాజపా నాయకుడి వ్యాఖ్యలు

ట్రిప్లికేన్, న్యూస్‌టుడే: ప్రభుత్వ అధికారులు, పోలీసులు తమతో పెట్టుకోవద్దని భాజపా నాయకుడు అయ్యప్పన్ చేసిన వ్యాఖ్యలు దుమారం రేపా యి. అరియలూరు జిల్లా తా.పుళూర్‌లో ఎన్డీయే తరపున శనివారం రాత్రి ప్రచార సభ జరిగింది. ఇందులో పాల్గొన్న భాజపా రాష్ట్ర కార్యనిర్వాహక కమిటీ సభ్యుడు అయ్యప్పన్ ప్రసంగిస్తూ... పోలీసులు, ప్రభుత్వ అధికారు లు తమతో పెట్టుకోవద్దని, వచ్చేది ఎన్డీయే ప్రభుత్వమని హెచ్చరికలు చేశా రు. సమావేశం తర్వాత మహిళలు సురక్షితంగా ఇంటికి వెళ్లాలని, ఎందుకంటే రాష్ట్రంలో పిల్లల నుంచి 80ఏళ్ల వృద్ధుల వరకు లైంగిక వేధింపులకు గురయ్యే పరిస్థితి ఉందన్నారు. పోలీసులకు కూడా భద్రత లేదన్నారు.

సెల్వ పెరుంతగైపై చర్యలు అవసరం

సైదాపేట, న్యూస్‌టుడే: మతాన్ని దాచిన టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వ పెరుంతగైపై చర్యలు అవసరమని భాజపా ముఖ్య ప్రతినిధి నారాయణన్ తిరుపతి తెలిపారు. శనివారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో... సెల్వ పెరుంతగై కుమార్తె నిశ్చితార్థ ఆహ్వానపత్రిక చూస్తే ఆయన క్రైస్తవ మతానికి చెందినవారని స్పష్టమవుతోందని తెలిపారు. ఆయన ఏ మతానికి చెందినవారైనా సమస్య లేదని, అయితే ఎమ్మెల్యేగా విజయం సాధించిన శ్రీపెరుంబుదూరు అసెంబ్లీ నియోజకవర్గం దళిత సామాజికవర్గానికి కేటాయించిందన్నారు. ఆ ప్రకారం సెల్వ పెరుంతగై చట్టానికి విరుద్ధంగా నిజాన్ని దాచి పోటీ చేశారని, కావున ఆయనపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని తెలిపారు.

ఎన్డీయే బహిరంగ సభ ఏర్పాట్ల పరిశీలన

ప్యారిస్, న్యూస్‌టుడే: మదురైలో మండేలా నగర్‌లో మార్చి 1న ఎన్డీయే తరఫున భారీ బహిరంగ సభ జరుగనుంది. ఈ క్రమంలో అక్కడ ఏర్పాట్లను కేంద్ర సహాయ మంత్రి ఎల్.మురుగన్ ఆదివారం పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తిరుప్పరంకుండ్రం కొండపై కార్తిక దీపం వెలిగించాలని భక్తుల తరపున కొన్నేళ్లుగా వేడుకుంటున్నామని, మురుగన్ భక్తులు ఏళ్ల తరబడి పోరాడుతున్నారని తెలిపారు. ఆ మేరకు తీర్పు ఇచ్చిన న్యాయమూర్తి జస్టిస్ స్వామినాథన్‌ను తొలగించాలని డీఎంకే రాజకీయాలు చేస్తోందన్నారు. డీఎంకేకి బుద్ధి చెప్పేలా భక్తులంతా ఒక్కటై తమ ఇళ్ల ముందు 23వ తేదీ దీపం వెలిగించాలని పిలుపునిచ్చారు. మార్చి 1న సభకు ముందు పలు పార్టీలు తమ కూటమిలో చేరే అవకాశం ఉందని, తమ పార్టీ బలంగా ఉందన్నారు. .

మంత్రులపై ఒత్తిడి తీసుకొస్తున్న భాజపా: ముఖ్యమంత్రి స్టాలిన్

ప్రసంగిస్తున్న స్టాలిన్

ప్యారిస్, న్యూస్‌టుడే: దేశంలోని ప్రతిపక్షాల్లో డీఎంకే నేతలపైనే భాజపా ఎక్కువగా దర్యాప్తు సంస్థల దాడులు చేపిస్తోందని, తమ మంత్రులపై ఒత్తిడి తీసుకొస్తోందని ముఖ్యమంత్రి స్టాలిన్ ఆరోపించారు. మదురై ఉత్తంగుడిలో డీఎంకే దక్షిణ జోన్ పోలింగ్ బూత్ ఏజెంట్ల సమావేశం శనివారం రాత్రి జరిగింది. పాల్గొన్న స్టాలిన్ మాట్లాడుతూ... ఎన్నికలు కారణం చూపి 'మగళిర్ ఉరిమై తొగై' సాయాన్ని అడ్డుకోవాలని చూశారని, కానీ రూ.5వేలు అందించామన్నారు. ప్రతిపక్ష నేత ఎడప్పాడి పళనిసామి తమిళనాడు హక్కుల కోసం గొంతు విప్పాలని, కానీ ధైర్యం లేక ద్రోహిగా మారారని విమర్శించారు. ఆయనలా భయపడే వ్యక్తిని తాను కాదని, అధికారం, పదవి మాత్రమే కాదు ప్రాణాలు పోయినా దిగులు పడనని తెలిపారు. దర్యాప్తు సంస్థలకు తాము భయపడమన్నారు. దేశంలో ఏ రాష్ట్రం సాధించలేని అభివృద్ధిని సాధించామని, ప్రతిరోజు ఓ పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు.

రైళ్ల సమాచారం

వడపళని, న్యూస్‌టుడే: తిరువనంతపురం డివిజన్‌లోని మన్రోతురుట్టు స్టేషనులో జరుగుతున్న సాంకేతిక పనుల కారణంగా పలు రైళ్లు ఆలస్యంగా నడవనున్నాయని దక్షిణ రైల్వే ఓ ప్రకటన విడుదల చేసింది. ● **16127** చెన్నై ఎగ్మోర్-గురువాయూర్ 23న 10.40కి బయలుదేరే రైలు మార్గంలో 1.15 నిమిషాలు ఆలస్యంగా నడవనుంది. ● **16128** గురువాయూర్-చెన్నై ఎగ్మోర్ 23న 23.15కు బయలుదేరే రైలు మార్గంలో 25 నిమిషాలు ఆలస్యమవుతుంది. ● చెన్నై డివిజన్‌లో జరుగుతున్న సాంకేతిక పనుల కారణంగా **17654** పుదుచ్చేరి-కాచిగూడ 23న 12.45కు బయలుదేరే రైలు మార్గంలో 45 నిమిషాలు ఆలస్యం కానుంది. * **17654** పుదుచ్చేరి-కాచిగూడ 24న 12.45కు బయలుదేరే రైలు 1.30 నిమిషాలు ఆలస్యంగా నడుస్తుంది. **● చెన్నై ఎగ్మోర్-విళుపురం సెక్షనులోని మయిలం, దిండీవనం స్టేషన్ల మధ్య జరుగుతున్న లైన్ బ్లాక్ పనుల కారణంగా 24, 26, 28 తేదీల్లో పలు మెము సర్వీసులు పాక్షికంగా రద్దయ్యాయి.** ● **66045** తాంబరం-విళుపురం మెము 09.40 రైలు 24, 26, 28 తేదీలు దిండీవనం వరకు నడుస్తుంది. ● **66046** విళుపురం-తాంబరం 13.30 రైలు 24, 26, 28 తేదీలు దిండీవనం నుంచి బయలుదేరుతుంది.

● **యథాతథంగా సేవలు...** నార్తర్న్ రైల్వేలోని ఢిల్లీ కిషన్‌గంజ్‌లో జరుగుతున్న ఇంటర్ లాకింగు పనుల కారణంగా వైష్ణోదేవి కత్రా-కన్నియాకుమారి ఎక్స్‌ప్రెస్ రైలు దారి మళ్లించినట్టు గతంలో దక్షిణ రైల్వే ప్రకటించింది. దారి మళ్లింపు లేదని యథాతథంగానే నడుస్తుందని తాజాగా మరో ప్రకటన విడుదల చేసింది. ● **16318** శ్రీ వైష్ణో దేవి కత్రాలో 23, మార్చి 2న 22.30కి బయలుదేరి కన్నియాకుమరి వెళ్లే హిమసాగర్ ఎక్స్‌ప్రెస్ ఎప్పటిలాగానే మామూలు మార్గంలో నడుస్తుంది. ● **16032** శ్రీ వైష్ణోదేవి కత్రాలో 24, 28 తేదీల్లో 22.30 గంటలకు బయలుదేరి చెన్నై సెంట్రల్‌కు వచ్చే రైలు యథాతథంగా మామూలు మార్గంలోనే పయనిస్తుంది.

రాష్ట్రంలో 3 రెట్లు పెరిగిన గంజాయి కేసులు

విలేకరులతో మాట్లాడుతున్న వానతీ శీనివాసన్

ట్రిప్లికేన్, న్యూస్‌టుడే: గత ఐదేళ్లలో రాష్ట్రంలో గంజాయి కేసులో మూడు రెట్లు పెరిగాయని భాజపా ఎమ్మెల్యే వానతీ శీనివాసన్ తెలిపారు. డీఎంకే ప్రభుత్వ తీరును ఖండిస్తూ కోయంబత్తూర్‌లోని శివానంద కాలనీలో భాజపా యువజన విభాగం, ఎన్డీయే ఆధ్వర్యంలో శనివారం రాత్రి నిరసన కార్యక్రమం జరిగింది. ఇందులో పాల్గొన్న భాజపా ఎమ్మెల్యే వానతీ శీనివాసన్ మాట్లాడుతూ.. గత ఐదేళ్లలో రాష్ట్రంలో గంజాయి కేసులు మూడు రెట్లు పెరిగాయని, ప్రతి వీధిలో మద్యం దుకాణాలు ఉన్నాయన్నారు.

23 నుంచి అదనపు షటిల్ సర్వీసులు

వడపళని, న్యూస్‌టుడే: చెన్నై బీచ్-తాంబరం-చెంగల్పట్టు వరకు నడుస్తున్న సబర్బన్ సర్వీసుల్లో జరిగిన మార్పులతో శుక్రవారం అనేక మంది ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో దక్షిణ రైల్వే చెన్నై డివిజన్ మార్గంలో కార్యకలాపాలను స్థిరీకరించేందుకు ప్రత్యామ్నాయ ప్రణాళికను రూపొందించింది. సోమవారం నుంచి గూడువాంజేరి, సెయింట్ థామస్ మౌంట్ మధ్య అదనపు షటిల్ సర్వీసులు నడుస్తాయని అధికారులు ప్రకటించారు. దీంతో ప్రయాణికులు మెట్రో రైలు సేవలకు మారే వీలుంటుంది. పరిస్థితిని పరిశీలించేందుకు అధికారులు శనివారం షటిల్ సర్వీసులపై ట్రయల్ రన్ నిర్వహించారు. ఎం టీసీ లాంటి రవాణా సంస్థలను సంప్రదించకుండా రైల్వే అధికారు లు కార్యకలాపాలు చేపట్టాలనే నిర్ణయంపై చెన్నై యూనిఫైడ్ మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ(సీయూఎంటీఏ) అసంతృప్తి వ్యక్తం చేసింది. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా వేసవి సెలవుల్లో పని చేయాలని సిఫార్సు చేస్తున్నామని సీయూఎంటీఏ వర్గా లు పేర్కొన్నాయి. డివిజనల్ రైల్వే యూజర్స్ కన్సల్టేటివ్ మాజీ సభ్యుడు కె.భాస్కర్ మాట్లాడుతూ తాంబరం, చెన్నై బీచ్ మధ్య తక్కువ స్టాపింగులతో కూడిన సర్వీసులు నడపవచ్చని సూచించారు.



కూటమి పార్టీలతో చర్చలు ప్రారంభించడానికి ముందుగా ఆదివారం డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్‌ను ఆ పార్టీ సీట్ల సర్దుబాటు చర్చల కమిటీ మర్యాదపూర్వకంగా కలిసిన దృశ్యం. చిత్రంలో టి.ఆర్.బాలు, ఆర్.ఎస్.భారతి, ఎం.ఆర్.కె. పన్నీర్‌సెల్వం, కె.ఎన్.నెహ్రూ, వేలు, తిరుచ్చి శివ ఉన్నారు.

- న్యూస్‌టుడే, చెన్నై

పొళ్లాచ్చిలో అడవి ఏనుగుల పోట్లాట

'ఎస్ఎం'లో వీడియో వైరల్

ట్రిప్లికేన్, న్యూస్‌టుడే: పొళ్లాచ్చి సమీపం పరంబికుళం కన్నిమారటేకు ప్రాంతంలో రెండు ఏనుగులు పోట్లాడుకున్న దృశ్యాలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. కేరళ అటవీశాఖ సిబ్బంది పర్యాటకులను జీపులో తీసుకెళ్తుండగా పరంబికుళం వద్ద కన్నిమారటేకు వెళ్లే మార్గంలో రెండు మగ ఏనుగులు పోట్లాడుకుంటూ కనిపించాయి. అది చూసిన పర్యాటకులు సెల్‌ఫోన్లలో రికార్డు చేసి సామాజిక మాధ్యమంలో పోస్టు చేయడంతో వైరలయ్యాయి.

వడం ట్రైలర్ విడుదల

చెన్నై, న్యూస్‌టుడే: వి.కె.కేందిరన్ దర్శకత్వంలో విమల్ కథానాయకుడిగా నటించిన చిత్రం 'వడం'. స్థానిక సంస్కృతి ఘటనల్లో ఒకటిగా ఎద్దును అణచివేసే పోటీని ఇతివృత్తంగా చేసుకుని ఈ చిత్రాన్ని రూపొందించారు. ఇందులో నట్టి అలియాస్ నట్రాజ్ సుబ్రమణియం, సనక్షా శ్రీ, బాలా శరవణన్ తదితరులు ఇతర ముఖ్యమైన పాత్రల్లో నటించారు. చిత్రం మార్చి 6న విడుదల కానున్న నేపథ్యంలో ట్రైలర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. చిత్రానికి డి.ఇమాన్ సంగీతం అందించారు.

ఎస్46పై జీవీ ప్రకాశ్‌కుమార్ అప్డేట్

చెన్నై: వెంకి అట్లూరి దర్శకత్వంలో 'కరుప్పు' చిత్రంలో సూర్య, మమితా బైజు జంటగా నటిస్తున్న విషయం తెలిసిందే. ఇది సూర్యకు 45వ చిత్రం. ఈ చిత్రం పనులు శరవేగంగా జరుగుతున్న నేపథ్యంలో ఆయన తర్వాతి చిత్రం గురించి సంగీత దర్శకుడు జీవీ ప్రకాశ్‌కుమార్ తన 'ఎక్స్' ఖాతా ద్వారా వెల్లడించారు. అందులో. ఎస్46 కోసం వంట జరుగుతోందని, అతి త్వరలో వస్తామని, త్వరలో అప్డేట్లు ఉంటాయని తెలిపారు.

అజిత్‌ను కలిసిన మంజు వారియర్

అజిత్‌తో మంజు వారియర్

చెన్నై: దుబాయ్‌లో జరుగుతున్న కారు రేసులో పాల్గొన్న నటుడు అజిత్‌కుమార్‌ను పలువురు సినీ తారలు నేరుగా కలిసి శుభాకాంక్షలు చెబుతున్నారు. ఆ వరుసలో నటి మంజు వారియర్ కూడా నిలిచారు. దీని గురించి ఆమె తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో వెల్లడించారు. మనసులో రగిలే ఆసక్తిని ఎలా వెతికి అనుసరించాలో నేర్పినందుకు అజిత్‌కు కృతజ్ఞతలన్నారు. నేరుగా థ్రిల్లింగ్ రేస్‌ను చూసేలా చేసినందుకు హృదయపూర్వక కృతజ్ఞతలు చెప్పారు. ఇది ఓ అద్భుతమైన అనుభవమని పేర్కొన్నారు.

మళ్లీ క్రికెట్ వ్యాఖ్యాతగా ఆర్జే బాలాజీ

చెన్నై, న్యూస్‌టుడే: రేడియో జాకీ నుంచి నటుడు, దర్శకుడిగా అవతారమెత్తిన ఆర్జే బాలాజీ క్రికెట్ వ్యాఖ్యాతగానూ వ్యవహరించారు. ఈ నేపథ్యంలో మళ్లీ ఆయన క్రికెట్ వ్యాఖ్యాతగా మారుతున్నారు. టీ20 ప్రపంచ కప్ జరుగుతున్న నేపథ్యంలో భారత్-జింబాబ్వే జట్ల మధ్య జరిగే పోటీకి ఆయన తమిళంలో వ్యాఖ్యానం అందించనున్నారు. ఈ విషయాన్ని స్టార్ స్పోర్ట్స్ తన 'ఎక్స్' ఖాతా ద్వారా అధికారికంగా నిర్ధారించింది.

ఘనంగా వేద విజ్ఞాన వేదిక వార్షికోత్సవం

సత్కారం పొందిన కళాకారులతో కందనూరు మధు, జేకే రెడ్డి, వరప్రసాద్ రెడ్డి, ప్రభా రమేష్ తదితరులు ◄ ఆహూతులు

టీనగర్, న్యూస్‌టుడే: చెన్నైలోని ప్రఖ్యాత సాంస్కృతిక సాహితీ సేవా సంస్థ 'వేద విజ్ఞాన వేదిక 16వ వార్షికోత్సవం టీనగర్ ఆంధ్రా క్లబ్‌లోని గోదావరి హాల్‌లో ఆదివారం సాయంత్రం ఘనంగా జరిగింది. అతిథులుగా విచ్చేసిన హైదరాబాద్‌కు చెందిన శాంతా బయోటెక్ సంస్థ వ్యవస్థాపకులు వరప్రసాద్ రెడ్డి, ప్రముఖ సినీనటి ప్రభా రమేష్ మాతృభాష ప్రాముఖ్యత గురించి ప్రసంగించారు. ప్రభా రమేష్ సితార వాయించి ఆహూతులను అలరించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సంగీత నీరాజనం కచేరి ఆకట్టుకుంది. ప్రముఖ కర్ణాటక సంగీత గాత్ర కళాకారిణి, సంగీత కళానిధి డాక్టర్ శ్రీపాద పినాకపాణి ముని మనవరాలు భవ్య తూములూరు తన గాత్రంతో సభికులను పరవశింపజేశారు. ఆమె శిష్యురాలు హిమబిందు చల్లా కూడా తన గాత్ర సహకారాన్ని అందించి కచేరీకి మరింత శోభ చేకూర్చారు. వారికి వయోలిన్‌పై వెంకట సుందరం, మృదంగంపై శ్యామ కృష్ణ, మల్లా జోస్యుల వాద్య సహకారం అందించారు. వేద విజ్ఞాన వేదిక అధ్యక్షులు జేకే రెడ్డి మాట్లాడుతూ... గత 16ఏళ్లుగా తమ సంస్థ కళలు, సంస్కృతిని ప్రోత్సహించడంలో ముందుందని పేర్కొన్నారు. కార్యదర్శి కందనూరు మధు సంస్థ కార్యకలాపాలను వివరించారు. ఈ సందర్భంగా కళాకారులను సత్కరించారు. పెద్ద సంఖ్యలో సంగీత ప్రియులు, స్థానిక ప్రముఖులు, ప్రముఖ నటీమణి శారద, సినీ నిర్మాత కాట్రగడ్డ ప్రసాద్, సంగీత కళాకారులు పలువురు పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన ఎన్‌టీఎస్సీ-2026

పుస్తకావిష్కరణలో డాక్టర్ ఎన్.ఆనందవల్లి తదితరులు

వడపళని, న్యూస్‌టుడే: అరివియల్ సంగం, సీఎస్ఐఆర్ స్ట్రక్చరల్ ఇంజినీరింగ్ రిసెర్చ్ సెంటర్ సంయుక్తంగా నిర్వహించిన 'జాతీయ తమిళ సైన్స్ కాన్ఫరెన్స్(ఎన్‌టీఎస్సీ-2026)' రెండు రోజుల సదస్సు శనివారం ఘనంగా ముగిసింది. సదస్సులో విద్యాపరమైన చర్చలు, శాస్త్రీయ ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు చోటు చేసుకున్నాయని పీఐబీ ఆదివారం ప్రకటన విడుదల చేసింది. 'సైన్స్ అండ్ టెక్నాలజీ ద్వారా స్థిరమైన అభివృద్ధి' అనే అంశంపై జరిగిన సదస్సుకు సీఎస్ఐఆర్‌లోని విజ్ఞాన్ ఆడిటోరియం వేదికగా నిలిచింది. చెన్నైలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ టీచర్స్ ట్రెయినింగ్ అండ్ రిసెర్చ్ డైరెక్టర్, ఆచార్యులు డాక్టర్ ఉషా నటేశన్ సదస్సును శుక్రవారం ప్రారంభించారు. సీఎస్ఐఆర్-ఎస్ఈఆర్సీ డైరెక్టర్, సీఎస్ఐఆర్ మద్రాస్ కాంప్లెక్స్ కోఆర్డినేటింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎన్.ఆనందవల్లి అధ్యక్షత వహించారు. సీఎస్ఐఆర్ సెంట్రల్ లెదర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్, డాక్టర్ పి.తనికైవేలన్, అన్నా వర్సిటీ మాజీ ఆచార్యులు, డీన్, డాక్టర్ ఎస్.కందసామి, చీఫ్ సైంటిస్టు డాక్టర్ ఎస్.మహేశ్వరన్, ఎన్నార్సీకి చెందిన 8మంది శాస్త్రవేత్తలు ప్రసంగించారు. శనివారం సదస్సులో తమిళనాడు సెంట్రల్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్, ఆచార్యులు ఎం.కృష్ణన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సీఎస్ఐఆర్ ఎస్ఈఆర్సీ నుంచి 12 మంది శాస్త్రవేత్తలు, వర్సిటీలు, కళాశాలల నుంచి 24 మంది ఆచార్యులతో కూడిన 36 మంది న్యాయమూర్తులు శాస్త్రీయ పద్ధతిలో మూల్యాంకనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సదస్సుకు సంబంధించిన పుస్తకావిష్కరణ జరిగింది.

అలా చేయకుండా కులం, మతం లేదని

ధ్రువపత్రం కోరడం కుదరదు

ప్యారిస్, న్యూస్‌టుడే: మతం నుంచి బయటకు రాకుండా కులం, మతం లేదని సర్టిఫికెట్ ఇవ్వాలని కోరడం కుదరదని మద్రాసు హైకోర్టు మదురై ధర్మాసనం తెలిపింది. శివగంగైకి చెందిన సెల్వ మాణిక్కం అనే వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌లో... తాను కులం, మతం లేదని సర్టిఫికెట్ ఇవ్వాలని కోరుతూ తిరుప్పత్తూర్ తహసీల్దారుకి దరఖాస్తు చేసుకున్నట్లు చెప్పారు. కానీ తన దరఖాస్తుని నిరాకరించినట్లు తెలిపారు. ఈ ఉత్తర్వులను రద్దు చేసి, తనకు కులం, మతం లేదని సర్టిఫికెట్ ఇచ్చేలా ఆదేశాలివ్వాలని కోరారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన జస్టిస్ కృష్ణన్ రామసామి జారీచేసిన ఉత్తర్వుల్లో... పిటిషనరు హిందూ మతాన్ని వదులుకోకుండా కులం, మతం లేదని సర్టిఫికెట్ ఇవ్వాలని కోరుతూ దరఖాస్తు చేస్తే అధికారులు పరిశీలించరని చెప్పి, అతని పిటిషన్‌ను కొట్టివేస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. అదేవిధంగా పిటిషనరు తన మతం నుంచి బయటకు వచ్చినట్లు ఆధారాలు దాఖలు చేస్తే అధికారులు నిబంధనలు పాటించి పరిశీలించవచ్చని పేర్కొన్నారు.

■ సైదాపేట: తిండల్ వేలాయుధస్వామి ఆలయంలో... ■ పళ్లిపట్టు: కలశాలను గోపురంపైకి తీసుకెళ్తున్న దృశ్యం

వైభవంగా కుంభాభిషేకం

పొన్నేరి: కుంభాభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

పొన్నేరి, న్యూస్‌టుడే: తిరువళ్లూర్ జిల్లా పొన్నేరి సమీపం ఆస్థానపుదూరులోని చెన్నకేశవ పెరుమాల్ ఆలయంలో కుంభాభిషేకం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా యాగపూజలు జరిపారు. వివిధ పుణ్య క్షేత్రాల నుంచి తీసుకొచ్చిన పవిత్ర జలాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి విమాన కలశాలపై అభిషేకించారు. పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులకు అన్నదానం చేశారు.

ఆళీశ్వరాలయంలో... ఊత్తుకోట: తిరువళ్లూర్ జిల్లా ఊత్తుకోట సమీపం లచ్చివాక్కంలోని ప్రసిద్ధ ఆళీశ్వర ఆలయం శిథిలావస్థకు చేరింది. భక్తుల విరాళాలతో చేపట్టిన జీర్ణోద్ధరణ పనులు పూర్తవడంతో ఆదివారం మహా కుంభాభిషేకం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. **సైదాపేట:** ఈరోడు జిల్లా తిండల్‌లోని ప్రసిద్ధ తిండల్ వేలాయుధస్వామి ఆలయ మహా కుంభాభిషేకం ఆదివారం ఘనంగా జరిగింది. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. **వళ్లిపట్టు:** తిరువళ్లూర్ జిల్లా పళ్లిపట్టు తాలూకా వంగనూరు గ్రామంలోని ప్రసిద్ధ ఎల్లమ్మ ఆలయ మహా కుంభాభిషేకం ఆదివారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా పవిత్ర జలాలున్న కలశాలను ఊరేగింపుగా తీసుకెళ్లి గోపుర కలశాలను అభిషేకించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం జరిగింది. రాత్రి అమ్మవారిని గ్రామంలో ఊరేగించారు.

1,500 మెగావాట్ల విద్యుత్తు కొనుగోలుకు సన్నాహాలు

వడపళని, న్యూస్‌టుడే: వేసవి సమీపిస్తుండటంతో విద్యుత్తు కొరతను అధిగమించేందుకు తమిళనాడు విద్యుత్తు పంపిణీ సంస్థ (టీఎన్‌పీడీసీఎల్) 1,500 మెగావాట్ల విద్యుత్తును కొనుగోలు చేయడానికి సిద్ధమైంది. వేసవి డిమాండు తట్టుకునేందుకు అధిక ధరలతో విద్యుత్తు కొనుగోలు చేయకుండా తమిళనాడు ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్(టీఎన్ఈఆర్సీ) 'ఫైనాన్స్, ఓన్ అర్ ఆపరేట్'(ఎఫ్ఓసీ) మార్గదర్శకాల ఆధారంగా 1,500 మెగావాట్ల విద్యుత్తును సేకరించుకోవడానికి ఐదేళ్ల వరకు సింగిల్ మీడియం టర్మ్ టెండర్‌ను దాఖలు చేయడానికి అనుమతిచ్చింది. ఈ క్రమంలో టీఎన్‌పీడీసీఎల్ టెండరు ఆహ్వానానికి కావలసిన పనులను ప్రారంభించింది.

త్వరలో టెండర్ల ఆహ్వానం..

విద్యుత్తు కొనుగోలుకు ప్రత్యేక అనుమతి కోరడంపై టీఎన్ఈఆర్సీకి విద్యుత్తుశాఖ అఫిడవిట్‌లో వివరాలు పేర్కొంది. 2023-24లో రద్దీ డిమాండు సమయంలో 1,000 మెగావాట్ల విద్యుత్తును అధిక ధరతో కొనుగోలు చేయాల్సి వచ్చిందని, రానున్న రెండేళ్లలో 'సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ(సీఈఏ)' మార్గదర్శకాల ప్రకారం దాదాపు 4,500 మెగావాట్ల విద్యుత్తు కొరత అంచనాగా ఉందని తెలిపింది. ఈ ఏడాదికి గరిష్ఠ డిమాండు 23,000 మెగావాట్లు అంచనాగా ఉందని టీఎన్‌పీడీసీఎల్ డేటా చూపిస్తోంది. అయితే 2024 ఏప్రిల్‌లో రాష్ట్రంలో గరిష్ఠ డిమాండ్ 20,830 మెగావాట్లు, వినియోగం 454.32 మిలియన్ యూనిట్లుగా నమోదైంది. రాష్ట్రంలో పవన, సౌర విద్యుత్తు ఉత్పత్తితో 22వేల మెగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని కలిగి ఉన్నప్పటికీ వనరులు అనూహ్యంగా ఉన్నాయి. కేంద్ర విద్యుత్తు మంత్రిత్వశాఖ జారీ చేసిన మార్గదర్శకాల మేరకు టారిఫ్ ఆధారిత పోటీ బిడ్డింగ్ ద్వారా మీడియం టర్మ్ కాంట్రాక్టు కోసం టీఎన్‌పీడీసీఎల్ త్వరలో టెండర్లను ఆహ్వానించనుంది.

అన్నాడీఎంకేలో పలువురి చేరిక

సైదాపేట, న్యూస్‌టుడే: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పలువురు అన్నాడీఎంకేకు మద్దతు ప్రకటించారు. అన్నాడీఎంకే నేతృత్వంలోని ఎన్డీయేలో టీఎంసీ, పీఎంకే అన్బుమణి వర్గం, ఏఎంఎంకే తదితర పార్టీలున్నాయి. ఇంకా పలు చిన్న పార్టీలు మద్దతు తెలుపుతున్నాయి. ఈ నేపథ్యంలో శనివారం సాయంత్రం పలువురు అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిసామిని కలిసి మద్దతు ప్రకటించారు. సేలంలోని ఆయన నివాసంలో కార్యక్రమం జరిగింది. తమిళగ నీతి కట్చి అధ్యక్షుడు వాళవందియార్, ఆదితమిళర్ వెట్రి కళగ రాష్ట్ర అధ్యక్షుడు కనకరాజన్ అయ్యావు తమ పార్టీ నిర్వాహకులతో కలిసి వచ్చి మద్దతు ప్రకటించారు. అదేవిధంగా డీఎంకే, కొంగు మక్కల్ దేశీయ కట్చి పార్టీలకు చెందిన పలువురు అన్నాడీఎంకేలో చేరారు.

ఈపీఎస్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న డీఎంకే నిర్వాహకులు

ఆక్రమణకు గురైన సాగునీటి కాలువ

కాలువపై రోడ్డు నిర్మించిన దృశ్యం

మామల్లపురం, న్యూస్‌టుడే: చెంగల్పట్టు జిల్లా కాట్టాంగొళత్తూర్ పంచాయతీ యూనియన్ వండలూర్ పంచాయతీలో సుమారు 300 ఎకరాల విస్తీర్ణంలో పంటలు పండిస్తున్నారు. వండలూర్ చెరువు నుంచి కాలువ ద్వారా పొలాలకు నీరు చేరుతోంది. ఇదిలా ఉండగా నాలుగేళ్ల క్రితం ఓ ప్రైవేట్ సంస్థ 12 ఎకరాల వ్యవసాయ భూములను కొనుగోలు చేసి అందులో బహుళ అంతస్తుల భవనాల నిర్మాణాలు చేపట్టింది. అనంతరం ప్రధాన రహదారి నుంచి నిర్మాణాలు చేపడుతున్న ప్రాంతం వరకు 45 అడుగుల వెడల్పు 200 అడుగుల పొడవుతో కాంక్రీట్ రోడ్డును నిర్మించారు. రోడ్డు నిర్మాణానికి 5 అడుగుల వెడల్పు, 45 అడుగుల పొడవైన నీటి పారుదల కాలువను ఆక్రమించినట్లు రైతులు ఆరోపిస్తున్నారు. ఫలితంగా పంటలకు సరిగా నీరందక సాగు విస్తీర్ణం తగ్గిపోయిందని, కావున ఆక్రమణలో ఉన్న కాలువను పునరుద్ధరించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

సైబర్ నేరాల్లో చోరీ సొత్తు స్వాధీనం

అన్నానగర్, న్యూస్‌టుడే: తిరునెల్వేలికి చెందిన విశ్రాంత ఉద్యోగి నటరాజన్‌కు ఫోన్ చేసిన ఓ వ్యక్తి.. తాను పోలీస్ అధికారినని, మీ బ్యాంకు ఖాతాకు అక్రమంగా నగదు లావాదేవీలు జరిగాయని, అరెస్టు చేయకుండా ఉండాలంటే మీ ఖాతాలోని డబ్బులు తాము చెప్పే బ్యాంకు ఖాతాకు బదిలీ చేయాలని బెదిరించాడు. దీంతో వృద్ధుడు తన ఖాతాలో ఉన్న రూ. 29.50లక్షలను బదిలీ చేశారు. అనంతరం మోసపోయినట్లు గ్రహించి ఈ నెల 6న సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు బ్యాంకు ఖాతాను స్తంభింపజేసి వివరాలను కోర్టులో నివేదించారు. ఈ నేపథ్యంలో నటరాజన్ కోల్పోయిన నగదుతో పాటు మొత్తం రూ. 45.18లక్షలను స్వాధీనం చేసుకున్నారు.

సినీ నిర్మాతల సంఘం అధ్యక్షుడిగా

తమిళ్ కుమరన్

ముగిసిన ఎన్నికలు

చెన్నై, న్యూస్‌టుడే: తమిళనాడు సినీ నిర్మాతల సంఘం అధ్యక్షుడిగా తమిళ్ కుమరన్ ఎన్నికయ్యారు. 2026-29 ఏడాదికి సంఘ నిర్వాహకుల ఎన్నికలు ఆదివారం ముగిశాయి. అన్నానగర్‌లోని కందసామి నాయుడు కళాశాలలో విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ రాజేశ్వరన్ సమక్షంలో ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరిగింది. ఇందులో పలువురు తమ ఓటు హక్కు వినియోగించుకుని విలేకరులతో మాట్లాడారు. నటుడు రజనీకాంత్ మాట్లాడుతూ... నిర్మాతలకు పలు సమస్యలు ఉన్నాయని, ఈ ఎన్నికల్లో ఎన్నికయ్యేవారు వాటిని పరిష్కరిస్తారని ఆశిస్తున్నానని తెలిపారు. డీఎండీకే కోశాధికారి ఎల్.కె.సుదీశ్ మాట్లాడుతూ... తాను 25 ఏళ్లుగా నిర్మాతగా ఉన్నానని, ప్రతి ఎన్నికల్లోనూ ప్రజాస్వామ్య బాధ్యత నిర్వర్తిస్తున్నానని పేర్కొన్నారు. డీఎంకే కూటమిలోకి డీఎండీకే చేరడాన్ని విజయకాంత్ ఆత్మ క్షమించదంటూ ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలకు స్పందించడానికి నిరాకరించారు. నటి ఖుష్బూ మాట్లాడుతూ... నిర్మాతలు పలు కష్టాలు అనుభవిస్తున్నారని, వారు బాగుంటేనే తమిళ చిత్రసీమ బాగుంటుందని తెలిపారు. 'జన నాయగన్' వ్యవహారంపై మీడియా ప్రతినిధులు లేవనెత్తిన ప్రశ్నకు విశాల్ స్పందిస్తూ.. ఈ సమస్య తలెత్తినప్పుడే నిర్మాతల సంఘానికి కేవీఎన్ ప్రొడక్షన్స్ వచ్చి ఉంటే ఏమైనా జరిగి ఉండొచ్చన్నారు. కోట్లాది మంది ఏం చూడాలి? దేనిని కట్ చేయాలని నలుగురైదుగురు ఉన్న సెన్సార్ బోర్డు నిర్ణయిస్తుందని, వాస్తవానికి ఇందులో తనకు సుముఖత లేదని తెలిపారు. అయినా నిబంధనలు ఉన్నప్పుడు దానికి అనుగుణంగా వ్యవహరించాలని పేర్కొన్నారు.

పోటీలో రెండు ప్యానెళ్లు

ఓ అధ్యక్షుడు, 2 ఉపాధ్యక్షులు, 2 కార్యదర్శులు, ఒక కోశాధికారి, ఒక సంయుక్త కార్యదర్శి, 26 మంది కార్యవర్గ సభ్యులు తదితర 33 పదవులకు 100 మంది పోటీ చేశారు. జి.ఎం.తమిళ్‌కుమరన్ నేతృత్వంలో 'నలం కాక్కుం' ప్యానెల్, మురళీ రామసామి నేతృత్వంలో రామ నారాయణన్ ప్యానెల్ పోటీ చేశాయి. 'నలం కాక్కుం' ప్యానెల్‌లో అధ్యక్షుడిగా తమిళ్ కుమరన్, కార్యదర్శిగా రాధాకృష్ణన్, కమీలా నాజర్, ఉపాధ్యక్షుడిగా కమలకణ్ణన్, ఆర్కే సురేశ్, కోశాధికారిగా సుభాష్ చంద్రబోస్, సంయుక్త కార్యదర్శిగా సుజాతా విజయకుమార్, రామ నారాయణన్ ప్యానెల్‌లో అధ్యక్షుడిగా మురళీ రామసామి, కార్యదర్శిగా రాజా, సౌందర పాండియన్, ఉపాధ్యక్షులుగా విజయ్ మురళీ, మతియళగన్, కోశాధికారిగా సి.వి.కుమార్ జాయ్, సంయుక్త కార్యదర్శిగా దయా పన్నీర్‌సెల్వం, స్వతంత్రులుగా పలువురు పోటీ చేశారు. నిర్మాతల సంఘంలో 1,524 మంది సభ్యులు ఉండగా 1,171 మంది ఓటు హక్కు వినియోగించుకున్నట్లు తెలిసింది. పోలింగ్ ముగిసిన వెంటనే ఓట్ల లెక్కింపు చేపట్టారు. అధ్యక్ష పదవికి నలం కాక్కుం ప్యానెల్‌కు చెందిన తమిళ్‌కుమరన్ ఎన్నికయ్యారు. ఆయనకు 788 ఓట్లు రాగా 527 ఓట్ల మెజారిటీతో గెలవడం గమనార్హం. ఇప్పటివరకు జరిగిన నిర్మాతల సంఘం ఎన్నికల్లో అధ్యక్ష పదవికి పోటీ చేసి అత్యధిక ఓట్లతో గెలిచిన వ్యక్తిగా గుర్తింపు పొందారు. కోశాధికారి పదవికి సుభాష్ చంద్రబోస్ 609 ఓట్లతో గెలిచారు. సంయుక్త కార్యదర్శిగా సుజాత విజయకుమార్ 715 ఓట్లతో విజయం సాధించారు.

పాదయాత్రగా వెళ్తున్న భక్తులను ఢీకొన్న కారు: ఇద్దరి మృతి

ప్యారిస్, న్యూస్‌టుడే: పాదయాత్రగా వెళ్తున్న భక్తులను కారు ఢీకొనడంతో ఇద్దరు మృతిచెందిన ఘటన విరుదునగర్‌లో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు... విరుదునగర్ జిల్లా కారియాపట్టికి చెందిన కొందరు భక్తులు తిరుచ్చెందూర్ మురుగన్ ఆలయానికి పాదయాత్రగా బయలుదేరారు. ఆదివారం అరుప్పుక్కోట్టై వద్ద వెళ్తుండగా వెనుక నుంచి వేగంగా వచ్చిన కారు కరుప్పన్(35), ముత్తుపాండి(35)ను ఢీకొట్టింది. ఇద్దరూ ఘటనా స్థలిలోనే మృతిచెందారు. సమాచారం మేరకు పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టానికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

రైల్లోంచి పడి వృద్ధుడు...

రెడ్‌హిల్స్: చెన్నై సెంట్రల్ నుంచి తిరువళ్లూర్ రైల్వేస్టేషన్‌కు ఓ సబర్బన్ రైలు ఆదివారం చేరుకుంది. సుమారు 65ఏళ్ల వృద్ధుడు రైల్లోంచి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి వివరాలు తెలియరాలేదు. రైల్వే పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సముద్రంలో గల్లంతై మహిళ...

ప్యారిస్: తూత్తుకుడి జిల్లా తాళముత్తునగర్‌కి చెందిన కర్పగం(44) మానసిక వ్యాధితో బాధపడుతోంది. శనివారం మధ్యాహ్నం స్థానికంగా ఉన్న బీచ్‌కి వెళ్లింది. సముద్రంలో దిగిన ఆమె అలల్లో చిక్కుకుని నీటమునిగింది. మెరైన్ పోలీసులు గాలించి మృతదేహాన్ని గుర్తించారు. పోలీసులు పోస్టుమార్టానికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

కుమార్తెకు నిద్రమాత్రలిచ్చి

ప్రియుడితో అత్యాచారం చేయించిన తల్లి

ప్యారిస్, న్యూస్‌టుడే: కన్న కుమార్తెకు నిద్రమాత్రలు ఇచ్చిన తల్లి.. తన ప్రియుడితో అత్యాచారం చేయించిన ఘటన చెన్నైలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు... చెన్నై సాలిగ్రామానికి చెందిన ఓ వ్యక్తి కాపలాదారుడిగా పనిచేస్తున్నాడు. ఇతనికి భార్య, 20ఏళ్ల కుమార్తె ఉన్నారు. ఇదిలా ఉండగా కాపలాదారుగా పని చేస్తూ వారానికి ఒకసారే ఇంటికి వెళ్తుండటంతో భార్య మరో వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకుంది. భర్త ఇంట్లో లేని సమయంలో ప్రియుడిని పిలిపించుకుంటుండగా కుమార్తె తల్లిని మందలించింది. వినకపోవడంతో మాట్లాడటం మానేసింది. ఈ క్రమంలో గత నెల 3వ తేదీ అనారోగ్యంతో ఉన్న కుమార్తెకి తల్లి నిద్రమాత్రలు ఇచ్చి ప్రియుడిని పిలిపించి అత్యాచారం చేయించింది. 23వ తేదీ మళ్లీ యువతికి అనారోగ్యం ఏర్పడటంతో నిద్రమాత్రలు ఇచ్చి అత్యాచారానికి పాల్పడటంతో స్పృహలోకి వచ్చిన యువతి పెద్దగా కేకలు వేసింది. బయటకు చెప్పకూడదని బెదిరించిన తల్లి గదిలో ఉంచి తాళం వేసింది. అనంతరం తప్పించుకున్న యువతి తిరువణ్ణామలైలో ఉన్న బంధువు ఇంటికి వెళ్లి జరిగిన విషయం చెప్పింది. ఈ నేపథ్యంలో కడుపునొప్పితో బాధపడుతున్న యువతిని బంధువులు ఆస్పత్రికి తీసుకెళ్లగా గర్భంతో ఉన్నట్లు తేలింది. సెయ్యారు మహిళా పోలీసు స్టేషన్‌లో తల్లి ప్రియుడు దక్షిణామూర్తి(50)పై ఫిర్యాదు చేశారు. ఘటన జరిగింది వడపళనిలో కావడంతో వడపళని ఆల్ ఉమెన్ పోలీస్‌స్టేషన్‌కి కేసుని బదిలీ చేశారు. అనంతరం పోలీసులు ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నాటు తుపాకులు, బాంబులు స్వాధీనం

వేలూర్, న్యూస్‌టుడే: తిరుపత్తూరు జిల్లా ఆంబూరు పోలీసులకు ఆదివారం తెల్లవారు జామున అందిన సమాచారం మేరకు ఆంబూరు సమీపం కాంబికొల్లై ప్రాంతంలోని సత్యనాథన్ అనే వ్యక్తి ఇంట్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. అడవి జంతువులను వేటాడేందుకు ఉంచిన 4 నాటు తుపాకీలు, 14 నాటు బాంబులను స్వాధీనం చేసుకున్నారు. తప్పించుకుని పారిపోయిన సత్యనాథన్ కోసం గాలిస్తున్నారు.

దళితుల ఇళ్లపై పెట్రోల్ బాంబులతో దాడి

అన్నానగర్, న్యూస్‌టుడే: తిరునెల్వేలి జిల్లా నాంగునేరి ప్రాంతంలో దళితుల నివాస ప్రాంతంలో పెట్రోల్ బాంబు దాడి కలకలం సృష్టించింది. శనివారం రాత్రి ద్విచక్ర వాహనంపై వచ్చిన ముగ్గురు వ్యక్తులు ఆ ప్రాంతంలో నివసించే అన్బళగన్ అనే వ్యక్తి ఇంటి వద్ద పెట్రోల్ బాంబులు విసిరారు. దీంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలిని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

భార్యను హత్య చేసిన భర్త అరెస్టు


కవిత (పాతచిత్రం), నిందితుడు వినోద్‌కుమార్

తిరువణ్ణామలై, న్యూస్‌టుడే: తిరువణ్ణామలై జిల్లా ఆరణి సమీపం పేయూర్ గ్రామానికి చెందిన వినోద్ కుమార్(40) కారు డ్రైవరు. ఆయనకు భార్య ఆశ, ఇద్దరు కుమార్తెలు న్నారు. అదే గ్రామానికి చెందిన వెంకటేశ్‌కు భార్య కవిత, కుమారుడు సాయికిరణ్(14) ఉన్నారు. 9ఏళ్ల క్రితం వెంకటేశ్ మృతి చెందడంతో ఆయన భార్య కవితను వినోద్‌కుమార్ రెండో వివాహం చేసుకున్నాడు. ఇద్దరు భార్యలతో విడివిడిగా కాపురం పెట్టాడు. వినోద్‌కుమార్, కవితకు దిలీప్(7) అనే కుమారుడు ఉన్నాడు. ఇదిలా ఉండగా కవితపై అనుమానం పెంచుకున్న భర్త అప్పుడప్పుడూ గొడవ పడేవాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి భార్య సెల్‌ఫోన్లో మాట్లాడుతుండగా ఆగ్రహించిన వినోద్‌కుమార్ గొడవపడ్డాడు. ఆక్రోశంతో భార్య తలను గోడకేసి కొట్టాడు. తీవ్రంగా గాయపడిన ఆమెను వినోద్‌కుమార్ ఆరణి ప్రభుత్వాస్పత్రిలో చేర్చి పారిపోయాడు. కవిత తల్లి భానుమతి ఆస్పత్రికి రాగా కవిత మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. పోలీసులు గాలింపు చేపట్టి వినోద్‌కుమార్‌ను అరెస్టు చేశారు.

మత్తుపదార్థాల కేసులో ఇద్దరు...

దినేష్ అలియాస్ బబ్లూ, మెక్‌లెన్ ట్రెవర్

గిండి: చెన్నై వానగరం పోలీసులకు అందిన సమాచారం మేరకు అడైయాలంపట్టు సర్వీసు రోడ్డులో వాహనాల తనిఖీ చేపట్టారు. అటుగా వచ్చిన రెండు కార్లను ఆపి సోదా చేశారు. మత్తుపదార్థాలను గుర్తించారు. అందులో ఉన్న వ్యాసార్పాడికి చెందిన దినేష్ అలియాస్ బబ్లూ, కొరట్టూర్‌కు చెందిన మెక్‌లెన్ ట్రెవర్‌లను అరెస్టు చేశారు. వారి నుంచి 18 గ్రాముల మత్తుపదార్థం, 100 గ్రాముల ఓజీ గంజాయి, 1.3 కిలోల గంజాయి, రూ. 1,12,300 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను ఆదివారం కోర్టులో హాజరుపరిచి రిమాండుకు తరలించారు.

పరారీ నిందితులు ఇద్దరు...

శరవణన్, ధనుష్

గిండి: చెన్నై సైదాపేట ప్రాంతానికి చెందిన తల్లి, కుమార్తెపై 2024లో దాడి జరిగింది. ఇందుకు సంబంధించి సైదాపేట పోలీసులు నిందితుడు శరవణన్‌ను అరెస్టు చేశారు. అదేవిధంగా 2025లో జరిగిన ఓ దారి దోపిడీ కేసులో నిందితుడు ధనుష్‌ను అరెస్టు చేశారు. వీరు బెయిలుపై బయటికొచ్చి కోర్టులో హాజరవకుండా తప్పించుకు తిరుగుతున్నారు. ఈ క్రమంలో వారికి కోర్టు అరెస్టు వారెంట్లు జారీ చేసింది. ఈ నేపథ్యంలో పోలీసులు వారి కోసం గాలించి శుక్రవారం అరెస్టు చేశారు. అనంతరం కోర్టులో హాజరుపరచి రిమాండుకు తరలించినట్లు పోలీసులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Ph: 044-28232390
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 97910 83205, 97910 74993

ఈనాడు
తిరుపతి
సోమవారం ఫిబ్రవరి 23, 2026

పదింతల ఫలితాలకు దిశానిర్దేశం

భాషపై పట్టు.. మార్కులకు మెట్టు (తెలుగు)

● భాషాంశాలపై పట్టు సాధిస్తే మంచి మార్కులు వస్తాయి. మొదట వ్యాసరూప ప్రశ్నలపైన దృష్టి సారించాలి. పది లేదా పన్నెండు వాక్యాల్లో, చిన్న, చిన్న పేరాలుగా జవాబు రాయాలి. లఘు ప్రశ్నలకు నాలుగైదు వాక్యాల్లో సమాధానం ఉండాలి. బహుళైచ్ఛిక ప్రశ్నలకు సంబంధిత అ, ఆ, ఇ, ఈ ఐచ్ఛికాలతోపాటు ఆ పదాలు రాయాలి. అవగాహన - ప్రతి స్పందన విభాగంలోని చిన్న పద్యాలు ఆటవెలది, తేటగీతి, కంద పద్యాలకు జవాబులు వాక్యరూపంలో రాయాలి. వ్యక్తీకరణ- సృజనాత్మకత విభాగంలో 44 మార్కులుంటాయి. కవి పరిచయం, ప్రక్రియ లేదా నేపథ్యం, ఓ పాత్ర స్వభావం ఇస్తారు. వీటిపై దృష్టి సారించాలి. పద్య, గద్య పాఠ్యాంశాల నుంచి ఒక్కొక్క వ్యాసరూప ప్రశ్నలు వస్తాయి. సృజనాత్మకత ప్రశ్నకు సంబంధించి లేఖ, సంభాషణ, ప్రకటన, ముఖాముఖి, అభినందన పత్రం, కరపత్రం, వర్ణన వస్తాయి. భాషాంశాల విభాగంలో పద జాలం, వ్యాకరణాంశాలు పాఠంలోనివి, పద విజ్ఞానంలోనివి ఇస్తారు.

- యువశ్రీ మురళి, పాఠ్య పుస్తక రచయిత

అధ్యయనం.. పునశ్చరణ (గణితం)

నూటికి నూరు మార్కులు సాధించాలంటే 3.15 గంటలను చక్కగా వినియోగించుకోవాలి. ఒక మార్కు ప్రశ్నలు 30 నిమిషాలు, రెండు మార్కుల ప్రశ్నలు 45 నిమిషాల్లో, నాలుగు మార్కుల ప్రశ్నలు 60 నిమిషాల్లో రాయాలి. వ్యాసరూప ప్రశ్నలు మొదటే పూర్తి చేయాలి. స్టాటిస్టిక్స్, ప్రాబబులిటీ, లీనియర్ ఈక్వేషన్స్, కోఆర్డినేట్ జామెట్రీ, అర్థమెటిక్ ప్రోగ్రెషన్‌పై దృష్టి సారిస్తే 40 మార్కులు సొంతమవుతాయి. ఎక్కడా స్టెప్స్ వదలకూడదు. విలువలు రాయడం, సూత్రాలు బాక్స్‌లో ఉంచడంతో అదనంగా 5-10 మార్కులు వస్తాయి. చివరి 15 నిమిషాలు రాసిన వాటిని సరిచూసుకోవాలి. గ్రాఫ్ ఆధారిత సమస్యలు, నిర్మాణాలపై పట్టు సాధించాలి. **- మురళి, నిపుణుడు**

సాధన చేస్తే 50 మీ సొంతం

ఈసారి జీవశాస్త్రం పరీక్ష కొత్త విధానంలో జరుగుతుంది. బ్లూమ్స్ టాక్సానమీ ఆధారంగా ఆబ్జెక్టివ్‌ల ఆధారంగా జరుగుతుంది. ఇందులో జ్ఞానం, అవగాహన, వినియోగం, విశ్లేషణ, సృజనాత్మకత వంటివి ఉంటాయి. చిత్రాలు గీయడం, ప్రయోగాలపై పట్టు, భేదాలు, కారణాలు, వివరణలు, ఉదాహరణలు తెలిపేలా సమాధానాలు ఉండాలి. జీవక్రియలు, ప్రత్యుత్పత్తి, నియంత్రణ సమన్వయం పాఠాలు, మెండల్ సిద్ధాంతాలు, లింగనిర్ధయం బాగా చూసుకోవాలి. వంద రోజుల ప్రణాళికలోని ప్రశ్నలు చదివితే మంచి మార్కులు వస్తాయి. **- నీలకంఠం, పాఠ్యపుస్తక రచయిత**

సాధనతో సత్ఫలితం (హిందీ)

తప్పుల్లేకుండా.. పదాలు, వాక్యాల మధ్య తగినంత ఖాళీ ఉండేలా రాయాలి. నిబంధ్‌లేఖన్‌లో కనీసం ఐదు సైడ్ హెడ్డింగ్‌లు ఉండేలా, ఒక్కో దాని కింద కనీసం ఐదారు లైన్లు ఉండేలా చూసుకోవాలి. ఇందులో రాష్ట్రీయ త్యోహార్, విద్యార్థి జీవన్, స్వచ్ఛభారత్ ముఖ్యం. పత్ర్‌లేఖన్ రాసేటప్పుడు కామా, ఫుల్‌స్టాప్‌లు చూసుకోవాలి. పితాజీకో పత్ర, చుట్టి పత్ర, పుస్తక్ విక్రేత్ కే నామ్ పర్ పత్ర్, కాలేజ్ ప్రవేశ పత్ర్ సాధన చేయాలి. ప్రతి సారాంశం రాసిన తర్వాత విశేషత లేదా నీతి ఉండాలి. వ్యాకరణాంశాలు తప్పకుండా సాధన చేయాలి. సారాంశాలు బరసతే బాదల్, కణ కణకా అధికారి, మీరాకి భక్తి భావనా, ఈద్గాహ్, లోక్‌గీత్, అచ్చే నాగరిక్, ఛాత్ర్‌కే గున్ ముఖ్యమైనవి. పేరాగ్రాఫ్ ప్రశ్నలు, వ్యాకరణాంశాలపై దృష్టి సారించాలి.

- చిట్టేటి కుమార్, ఉపాధ్యాయులు

విద్యార్థుల ప్రశ్నలకు ఫోన్‌లో సమాధానాలు చెబుతున్న విషయ నిపుణులు, చిత్రంలో డీఈవో కేవీఎన్ కుమార్, పరీక్షల నిర్వహణాధికారిణి సుధ, సమగ్రశిక్షా సీఎంవో సురేష్

☛ 'ఈనాడు- జిల్లా విద్యాశాఖ' ఆధ్వర్యంలో ఫోన్‌ఇన్ ☛ విద్యార్థుల నుంచి విశేష స్పందన

తిరుపతి (విద్య), న్యూస్‌టుడే: పదో తరగతి పరీక్షలకు మరో 22 రోజులే గడువు. ఇప్పటికే విద్యాశాఖ వందరోజుల ప్రణాళిక అమలు చేస్తోంది. అత్యధిక మార్కులు సాధించడమెలా? ఒత్తిడిని ఎలా జయించాలి? సమయం సద్వినియోగమెలా? వంటి సందేహాలతోపాటు ఆయా సబ్జెక్టుల్లో ఉన్న అనుమానాలను నివృత్తి చేసేందుకు 'ఈనాడు- జిల్లా విద్యాశాఖ' ఆధ్వర్యంలో ఆదివారం తిరుపతి డీఈవో కార్యాలయంలో నిర్వహించిన ఫోన్‌ఇన్ కార్యక్రమానికి విశేష స్పందన వచ్చింది. జిల్లా నలుమూలల నుంచి 149 మందికి పైగా విద్యార్థులు ఫోన్ కాల్స్ చేశారు. పరీక్షల వేళ ఈ కార్యక్రమం విద్యార్థులకు ఎంతో ఉపయుక్తమని డీఈవో కేవీఎన్ కుమార్ అభిప్రాయపడ్డారు. పరీక్షలు పూర్తయ్యే వరకు నిత్యం సాయంత్రం 6- 7 గంటల మధ్య విషయ నిపుణులు అందుబాటులో ఉంటారని తెలిపారు. కార్యక్రమానికి కార్వేటినగరం డైట్ మానసిక నిపుణురాలు హేమలత హాజరై మాట్లాడారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఇతరులతో పోల్చితే వారిపై ఒత్తిడి పెరుగుతుందన్నారు. ఒత్తిడిని జయించేందుకు పలు మెలకువలు, పరీక్షల సమయంలో తీసుకోవాల్సిన ఆహార పదార్థాలు తెలిపారు.

వ్యాకరణం, పద సంపద ముఖ్యం (ఆంగ్లం)

సృజనాత్మక రచనా విభాగంలో సంభాషణ, దినచర్య నమోదు, లేఖా రచన, సమాచారం మార్పిడి వంటి ప్రశ్నలు వస్తాయి. ఇవి సరైన విధానంలో రాయాలి. అక్షర, వ్యాకరణ దోషాలు లేకుండా చక్కటి దస్తూరితో ఉండాలి. సవరణ ప్రశ్నల్లో వాక్యాల్లో ఇచ్చిన తప్పు పదాలు గుర్తించి సరిచేయాలి. ఇందుకు నామవాచకం, క్రియ, విశేషణం, క్రియావిశేషణం, సంధి పదం, ఉపసర్గ వంటి పదభేదాలపై పట్టు ఉండాలి. పదసంపద ప్రశ్నల్లో సందర్భానికి తగినట్లు మంచి పదాన్ని రాస్తే పూర్తి మార్కులు పొందవచ్చు. గద్యభాగం ప్రశ్నలకు సంక్షిప్తంగానే జవాబు రాయాలి. అవసరం లేని పూర్తి వాక్యాలు రాయకూడదు. వ్యాకరణంపై అవగాహనతో మంచి మార్కులు సాధించవచ్చు. **- భాగ్యశేఖర్ రెడ్డి, విషయ నిపుణులు**

ప్రయోగాలు.. ఉదాహరణలే ప్రాణం (భౌతిక శాస్త్రం)

ఎస్‌ఏ-1, గ్రాండ్ టెస్ట్‌లో ఇచ్చిన ప్రశ్నలకు కుణ్ణంగా సమాధానాలు నేర్చుకోవాలి. ఎస్‌సీఈఆర్టీ ఇచ్చిన బ్లూప్రింట్ మార్కుల సాధనలో కీలకం. విద్యార్థులు దాని ప్రకారం సాధన చేస్తే చాలు. 8 మార్కుల ప్రశ్నల కోసం దీర్ఘదృష్టి, హ్రస్వదృష్టి లోపాల సవరణ, శ్రేణి సంధానాలు, సమాంతర సంధానాలు, ఓయిరెస్టడ్ ప్రయోగం, విద్యుత్ ప్రవహించే తీగ అయస్కాంత క్షేత్రంలో ఉంచితే దానిపై బలం పనిచేస్తుంది అనే ప్రయోగాలపై పట్టు సాధించాలి. సమీకరణాల తుల్యం చేయడం, రసాయన సమీకరణాలు రకాలు, ఉదాహరణలు, కార్బన్ సమ్మేళనాల రసాయన శాస్త్రం పాఠ్యాంశం నుంచి సబ్బు - దుస్తులు శుభ్రపరిచే విధానం, ఆల్కేన్, ఆల్కీన్, ఆల్కైన్, ప్రమేయ సమూహాలు ఫార్ములాలు అభ్యాసం చేయాలి. 4 మార్కుల ప్రశ్నల కోసం కాంతి పరావర్తనం, వక్రీభవనం పాఠ్యాంశం నుంచి కిరణ రేఖాచిత్రాలు, డేటా అనాలసిస్ (టేబుల్ బేస్డ్) ప్రశ్నలు, ఆమ్లాలు-క్షారాలు, లవణాలు, లోహాలు, అలోహాలు పాఠ్యాంశం నుంచి ఉపయోగాలు, బొమ్మలు సాధన చేయాలి. ప్రశ్నలకు తగిన పాయింట్స్ రాస్తే మంచి మార్కులు వస్తాయి. చివరి గ్రేడ్ విద్యార్థులు చిత్రపటాలు- ఉపయోగాలు పట్టిక, ప్రశ్నలు- కృత్యాలపై పట్టు సాధించాలి.

- రుద్రయ్య, విషయ నిపుణులు

గ్రాఫ్‌లు, పట్టికల సాధనతో ప్రయోజనం (సాంఘిక శాస్త్రం)

బ్లూ ప్రింట్‌పై పూర్తి అవగాహన ఉండాలి. ఈ ఏడు ప్రశ్నల రూపకల్పనలో మార్పులు చోటుచేసుకున్నాయి. కేవలం జ్ఞాపకశక్తి ఆధారిత ప్రశ్నలే కాకుండా అంచనా, సృష్టించడం వంటి సామర్థ్యాలు పరీక్షించేవి రానున్నాయి. సమాధానాలు పాయింట్ల రూపంలో, స్పష్టంగా, క్రమబద్ధంగా రాయడం ముఖ్యం. చరిత్ర, భౌగోళిక శాస్త్రం, పౌర, అర్థశాస్త్రాల్లోని ప్రాథమిక అంశాలపై అవగాహన తప్పనిసరి. చరిత్ర అంశాలను అధ్యయనం చేసే సమయంలో వ్యక్తులు, సంఘటనలు, వాటి మధ్య ఉన్న సంబంధాన్ని కాలక్రమానుసారంగా అవగాహన చేసుకోవాలి. విశ్లేషణాత్మక ప్రశ్నలను అర్థం చేసుకుని సమాధానాలు రాయాలి. భారతదేశ పటంలో రాష్ట్రాలు, నదులు, భౌగోళిక ప్రదేశాలు, పట్టణాలు, సరిహద్దు దేశాలు, జాతీయ రహదారులు, ఖనిజ సంపద లభించే ప్రాంతాలు, పారిశ్రామిక కేంద్రాలు గుర్తించగలగాలి. ప్రపంచ పటంలో ముఖ్య దేశాలను గుర్తించేలా సాధన ఉండాలి.

- కూనాటి సురేష్, విషయ నిపుణులు

లోడ్.. ఎయిమ్.. షూట్

☛ కూటమి పాలనలో అందివచ్చిన రైఫిల్ షూటింగ్ రేంజ్

తిరుపతి (క్రీడలు), న్యూస్‌టుడే: శ్రీశ్రీనివాస క్రీడా సముదాయం (శాప్) సరికొత్త ఆటలను పరిచయం చేస్తోంది. రాష్ట్ర విభజన తర్వాత దూరమైన రైఫిల్ షూటింగ్ శిక్షణ కేంద్రాన్ని కూటమి ప్రభుత్వం ఏర్పాటైన ఏడాదిలోపే ఇక్కడ అందుబాటులోకి తీసుకొచ్చారు. శాప్ ఛైర్మన్ రవినాయుడు కృషి ఫలితంగా 10మీటర్ల రేంజ్ ఏర్పాటు కావడంతో పలువురు క్రీడాకారులు రాటుదేలుతున్నారు. శిక్షకుడి పర్యవేక్షణలో సాధన చేస్తే అనతి కాలంలోనే రాణించే అవకాశం ఉంటుందని, సద్వినియోగం చేసుకోవాలని శిక్షకుడు విజయహర్ష చెబుతున్నారు.

గురిపెడితే.. తప్పదంతే

తిరుపతిలోని ఉపాధ్యాయనగర్‌కు చెందిన ఎం. ఎస్. ఎ. శ్రీవాస్తవ, ఎం. రాధిక దంపతుల కుమార్తె అద్భుత వైష్ణవి. 12వ తరగతి చదువుతోంది. ఆరేళ్ల వయసు నుంచి సాధన చేస్తోంది. మొదట్లో ఓపెన్ సైట్ రైఫిల్‌తో, 9వ తరగతి నుంచి 'పిస్టల్'తో సాధన చేస్తోంది. 522- 530 స్కోర్‌తో జాతీయస్థాయిలో రాణిస్తోంది.

లక్ష్యం వైపు గురి

దేశానికి ప్రాతినిధ్యం వహించాలన్న లక్ష్యంతో సాధన చేస్తున్నట్లు చెబుతున్నాడు బాలప్పగారి నందగోపాల్. తల్లిదండ్రులు సునీత, చక్రధర్. తిరుపతి గ్రామీణం తాటితోపులో ఉంటున్నారు. 12వ తరగతి చదువుతున్న నందగోపాల్ 2022 నుంచి సాధన చేస్తున్నాడు. 'వాల్తర్ ఎయిర్ రైఫిల్'తో రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తున్నాడు. గత ఏడాది జాతీయస్థాయి ఛాంపియన్‌షిప్‌లో ప్రాతినిధ్యం వహించాడు. ఎయిర్ రైఫిల్‌లో 604-615 స్కోర్‌తో దూసుకెళ్తున్నాడు.

పిట్ట కొంచెం.. కూత ఘనం

సరిగ్గా రైఫిల్ ఎత్తు లేకపోయినా.. ఈ కుర్రాడు లక్ష్యాన్ని అవలీలగా ఛేదిస్తున్నాడు. న్యూమారుతీనగర్‌కు చెందిన పవన్‌కుమార్, బిందు దంపతుల కుమారుడు పి. హేమల్ నాలుగో తరగతి చదువుతున్నాడు. 'ఓపెన్ సైట్ రైఫిల్' కేటగిరిలో రెండేళ్లుగా సాధన చేస్తున్నాడు. నైపుణ్యాలు మెరుగుపర్చుకుని పోటీలకు సైఅంటున్నాడు.

అశేష భక్తజనసందోహం మధ్య పల్లకీని మోసుకువస్తున్న భక్తులు ◗ ఉత్సవమూర్తుల శోభ

శయనోత్సవం.. నయనోత్సవం

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాల్లో శయనోత్సవ వైభవాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. ఈ విశేషోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం రాత్రి శ్రీఉమాదేవి సమేత చంద్రశేఖరస్వామి ఉత్సవమూర్తులకు విశేష అలంకరణలు చేపట్టారు. వెండి పల్లకీల్లో ఓవైపున చంద్రశేఖరస్వామి.. ఆయనకు ఎదురుగా ఉమాదేవిని ఉంచి ఇద్దరిని శయనోత్సవ మండపానికి తీసుకువచ్చారు. ఆలయ ప్రధాన దీక్షా గురుకుల్ స్వామినాథన్ నేతృత్వంలో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ట్రస్టుబోర్డు ఛైర్మన్ కొట్టే సాయిప్రసాద్, ఈవో బాపిరెడ్డితోపాటు పలువురు అధికారులు, ట్రస్టుబోర్డు సభ్యులు పాల్గొన్నారు.

అడవికి హనుమాన్ అభయం

☛ నిరంతరం అందుబాటులో తక్షణ సహాయ బృందాలు ☛ త్వరలో ప్రారంభానికి అడుగులు

తిరుపతి (మంగళం), న్యూస్‌టుడే: వన్యప్రాణుల సంరక్షణ, తక్షణ కార్యకలాపాల నిర్వహణకు అటవీ, పర్యావరణ శాఖ నేతృత్వంలో హనుమాన్ ప్రాజెక్టు రూపుదిద్దుకుంటోంది. అటవీ పరిధి ఎక్కువగా కలిగిన జిల్లాల్లో వన్యప్రాణులకు.. మనుషులకు మధ్య ఘర్షణ వాతావరణాన్ని నివారించడం, రెండువైపులా ప్రాణాపాయ పరిస్థితులు నివారించడం లక్ష్యంగా ప్రభుత్వం దీన్ని తెరపైకి తెచ్చింది.

తిరుపతి బయోట్రిమ్‌లో బృందాలకు శిక్షణ ఇస్తున్న అధికారులు

ఏనుగుల టాస్క్‌ఫోర్స్ తరహాలో

తొలి విడతలో ఏనుగులకు మనుషులకు మధ్య ఘర్షణ వాతావరణాన్ని నివారించేందుకు కుంకీ ఏనుగుల ప్రాజెక్టును ఏర్పాటు చేసి, ప్రత్యేకంగా శిక్షణ పొందిన బలగాలను ఏర్పాటు చేశారు. ఇప్పుడు వన్యప్రాణులన్నింటికీ వర్తింపజేస్తూ ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్ (ఆర్ఆర్‌టీ)ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా 12 టెరిటోరియల్ ఫారెస్ట్ సర్కిళ్లు ఉండగా వాటిలో విశాఖపట్నం, రాజమహేంద్రవరం, అనంతపురం, గుంటూరు, కర్నూలు, తిరుపతి వైల్డ్‌లైఫ్ మేనేజ్‌మెంట్ సర్కిళ్లు వన్యప్రాణుల మనుగడకు అత్యంత ప్రధానమైనవిగా ప్రభుత్వం గుర్తించింది. విస్తీర్ణం అధికంగా ఉన్న జిల్లాలనూ ఈ ప్రాజెక్టులో చేర్చి మార్చిలో ప్రారంభించేలా చర్యలు మొదలుపెట్టారు.

బృందాల ఏర్పాటు ఇలా..

రేంజ్, సెక్షన్, బీటు అధికారులతోపాటు వాచర్లను కలిపి ఐదుగురు సభ్యులతో ర్యాపిడ్ రెస్పాన్స్ బృందాలు ఏర్పాటు చేస్తున్నారు. దాదాపు అన్ని సర్కిళ్ల పరిధిలో ఇవి ఉంటాయి. వన్యప్రాణుల రక్షణకు ఉపయోగించే పరికరాలపై ఇప్పటికే శిక్షణ ప్రారంభించారు. వీటిని నెలాఖరులోగా పూర్తి చేసి.. గ్రామాల్లోని యువకులను వాలంటీర్లుగా నియమించి శిక్షణ ఇస్తారు. వీరందరికీ రేంజ్ అధికారి నాయకుడిగా వ్యవహరిస్తారు.

ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు

ఒక్కో సర్కిల్ పరిధిలో రెండు బృందాలు విధులు నిర్వహించనుండగా వీటికి వైర్‌లెస్ సెట్లు, యానిమల్ మేనేజ్‌మెంట్ పరికరాలు అందజేస్తారు. గాయపడే వన్యప్రాణులకు తక్షణ చికిత్స అందించేలా రెండు అంబులెన్సులు, ఇద్దరు వెటర్నరీ వైద్యులు ఉంటారు. బృందాలు తక్షణం వెళ్లేలా ఏర్పాట్లు చేస్తున్నారు. క్షేత్రస్థాయి నుంచి సమాచారం వచ్చేలా టోల్‌ఫ్రీ నంబర్లు కేటాయించనున్నారు. ప్రత్యేక యాప్ సైతం సిద్ధం చేయనున్నారు.

వన్యప్రాణులకు రక్షణ కవచం

తిరుపతి, పనపాకం, భాకరాపేట, శ్రీకాళహస్తి, ఏర్పేడు, పుత్తూరు రేంజ్‌ల పరిధితోపాటు అన్నమయ్య జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో ఎక్కువగా ఘర్షణ వాతావరణం నెలకొంటోంది. ఈ నేపథ్యంలోనే ప్రత్యేక బృందాలు రక్షణ కవచాల్లా ఉపయోగపడతాయి. **- సి.సెల్వం, కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్, తిరుపతి వైల్డ్‌లైఫ్ మేనేజ్‌మెంట్**

24 నుంచి ఎస్వీయూ దూరవిద్య ప్రవేశాలు

తిరుపతి (ఎస్వీయూ), న్యూస్‌టుడే: ఎస్వీయూ దూర విద్య విభాగంలో 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి పలు యూజీ, పీజీ, డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాల నిమిత్తం రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ఈనెల 24వ తేదీ నుంచి ప్రారంభం కానుంది. ఇందుకు సంబంధించి విద్యార్థులు www.svudoe.ac.in, www.svudde.in వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్లు, విభాగాలు ఎంపిక చేసుకోవచ్చని డీడీఈ డైరెక్టర్ ఆచార్య వి.రమేష్‌బాబు తెలిపారు. ఇతర వివరాలకు 0877 289380, 97051 05270 నంబర్లలో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

చెత్త తరలింపు.. చిక్కులతో తలవంపు

☛ వ్యర్థాల నిర్వహణ ముందుకూ వెనక్కు

పుత్తూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలులోకి తీసుకొస్తున్నా పట్టణాల్లో చెత్త సమస్యలకు పరిష్కారం లభించడం లేదు. నివాస గృహాలు, వ్యాపార సముదాయాలు, కార్యాలయాల నుంచి సేకరించిన వ్యర్థాలను సక్రమంగా డంపింగ్ యార్డులకు తరలించలేని పరిస్థితులు క్షేత్రస్థాయిలో ఎదురవుతున్నాయి. ఈక్రమంలో తడి, పొడి వ్యర్థాలను వేర్వేరుగా సేకరించి వాటి నుంచి సంపద సృష్టించాలనే ఆశయం నీరుగారుతోంది. పట్టణాలను పరిశుభ్రంగా మార్చేందుకు గత ప్రభుత్వం క్లీన్ ఆంధ్రప్రదేశ్ (క్లాప్) చేపట్టగా అదికాస్తా నీరుగారిపోయింది. కూటమి ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేసి స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ నేపథ్యంలో డంపింగ్ యార్డుల్లోని చెత్తను 80 శాతం వరకు సెగ్రిగేషన్ చేయగలిగారు. ప్రతి శనివారం కార్యక్రమాలు నిర్వహిస్తుండగా ఇదే సమయంలో క్షేత్రస్థాయిలో తడి, పొడి చెత్త సేకరణ మొక్కుబడిగా మారి ఎక్కడికక్కడ దర్శనమిస్తోంది. పక్కా సేకరణ, విభజనకు అడుగులు పడటం లేదు.

పుత్తూరులో రోడ్డుపై చెత్త కుప్పలు

రూ.6.53 కోట్లు వృథానే..

ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని నగరాలు, పట్టణాల్లో తడి, పొడి చెత్తతోపాటు హానికర వ్యర్థాల్ని వేర్వేరుగా సేకరించాలని సుమారు రూ.6.53 కోట్లు వెచ్చించి బుట్టలు పంపిణీ చేశారు. అయితే ఏ పురపాలికలోనూ అమలుకావడం లేదు. దీంతో ప్రభుత్వం అనుకున్న లక్ష్యం నెరవేరడం లేదు. ఈ నేపథ్యంలో సంపద సృష్టి ఆగమ్యగోచరంగా తయారైంది.

వేర్వేరుగా సేకరణ జరగాల్సిందే

రాష్ట్ర ప్రభుత్వం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా తడి, పొడి చెత్త సేకరణ వేర్వేరుగా జరగాల్సిందేనని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. డంపింగ్ యార్డుల్లోని చెత్త పూర్తిగా తొలగించి సంపద సృష్టి జరిగేలా చూడాలని కమిషనర్లకు సూచనలు చేశాం. ఆ దిశగా చర్యలు చేపట్టేలా చూస్తాం.

- నాగరాజు, పురపాలకశాఖ ఆర్డీ

రోజువారీగా పోగవుతున్న చెత్త టన్నుల్లో	
పుత్తూరు	25
తిరుపతి	150
శ్రీకాళహస్తి	30
వెంకటగిరి	30
సూళ్లూరుపేట	30
నాయుడుపేట	30

విజేతలతో కలెక్టర్ వెంకటేశ్వర్, భానుప్రకాష్‌రెడ్డి, నరసింహ యాదవ్, శ్రీధర్ వర్మ

ఎత్తు వేశారు.. విజేతలుగా నిలిచారు

తిరుపతి(క్రీడలు), న్యూస్‌టుడే: శాప్ లీగ్ పోటీల్లో భాగంగా తిరుపతిలోని శ్రీశ్రీనివాస క్రీడా సముదాయం వేదికగా రెండ్రోజులపాటు జరిగిన రాష్ట్రస్థాయి చదరంగం పోటీలు ఆదివారం ఉత్సాహంగా ముగిశాయి. పోటీల్లో పలు జిల్లాలకు చెందిన బాలబాలికలు ఎత్తులకు పైఎత్తులు వేస్తూ ప్రత్యర్థులపై సత్తాచాటారు. మొదటిమూడు స్థానాల్లో నిలిచిన వారికి ఆదివారం ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, తితిదే పాలకమండలి సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్, తెదేపా రాష్ట్ర మీడియా సమన్వయకర్త, శాప్ మాజీ డైరెక్టర్ శ్రీధర్‌వర్మ ట్రోఫీ, పతకం, ప్రశంసా పత్రాలు ప్రదానం చేశారు. జిల్లా క్రీడాభివృద్ధి అధికారి శశిధర్, చదరంగం సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాససూరి, శాప్ శిక్షకులు పాల్గొన్నారు.

12 వేల టోకెన్ల జారీ

తిరుపతి (తితిదే) : శ్రీవారి దర్శనానికి సంబంధించి శ్రీనివాసం, విష్ణు నివాసం, భూదేవి కాంప్లెక్స్ వద్ద ఆదివారం భక్తులకు 12 వేల సర్వ దర్శన టోకెన్లు జారీ చేశారు. వీరికి సోమవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు దర్శనం కానుంది. శ్రీవారి మెట్టు నడకదారి భక్తులకు మరో 2 వేల టోకెన్లు జారీ చేశారు.

సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల : నేరుగా వచ్చే భక్తులకు 10 గంటలు, రూ.300 టికెట్లు కలిగిన భక్తులకు మూడు గంటల్లో శ్రీవారి దర్శనం లభించనుంది. శనివారం శ్రీవారిని 82,043 మంది భక్తులు దర్శించుకున్నారు. రూ.3.74 కోట్ల హుండీ కానుకలు లభించాయి.

104FM Tirupati
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వానేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
8008555167, 9154991499

తూకాల్లో మోసాలే తూచేది

చిత్తూరు, తిరుపతి (కలెక్టరేట్) : వ్యాపారుల మోసాలు పెద్దఎత్తున కొనసాగుతున్నాయి. లైసెన్సులు పునరుద్ధరించుకోకపోవడం, అధిక ధరలు వసూలు చేయడం పరిపాటిగా మారింది. ఫిర్యాదులున్నా లెక్క లేదు. అధికారులు అడపాదడపా జరిమానాలతో సరిపెడుతున్నారు.

చిత్తూరు బస్టాండ్‌లో తనిఖీ చేస్తున్న అధికారులు

● యూరియాకు డిమాండ్ ఏర్పడగా అధిక ధరలు వసూలు చేసిన చిత్తూరులోని ఫర్టిలైజర్ దుకాణదారుకు రూ.25 వేల జరిమానా విధించారు. ● తక్కువ తూకం ఉండటంతో రూ.25 వేలు, మరో మూడు బ్రాండెడ్ షూ దుకాణాలకు రూ.75 వేల జరిమానా విధించారు.

2025-26లో కేసుల నమోదు	
తూకాల్లో వ్యత్యాసంపై :	45
అధిక ధరలు :	51
జరిమానాల వసూలు :	రూ.12 లక్షలు
స్టాంపింగ్ రుసుములు:	రూ.29.97 లక్షలు

చర్యలు తీసుకుంటున్నాం.. మండలాల వారీగా నిత్యం తనిఖీలు చేస్తున్నాం. వినియోగదారులు 1100, 78938 13707 చరవాణిలో సంప్రదించవచ్చు. **- స్వామి, అసిస్టెంట్ కంట్రోలర్, తిరుపతి**

బేరం కుదరక.. క్రమబద్ధీకరణ పడక

☛ తుడా ప్రణాళిక విభాగాన్ని పీడిస్తున్న లంచావతారులు

తిరుపతి(నగరపాలిక), న్యూస్‌టుడే:
● తిరుపతి గ్రామీణ మండలం పేరూరు మార్గంలోని ఓ అనధికారిక లేఅవుట్‌లో ఇంటి జాగాల క్రమబద్ధీకరణ కోసం నాలుగు దరఖాస్తులు అందగా వాటిలో రెండు ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను 15 రోజుల వ్యవధిలో ఆమోదించారు. మూడునెలలైనా మిగిలిన రెండు దరఖాస్తులకు ఆమోదం లభించకపోవడానికి కారణం ముందస్తుగా కలవకపోవడమేనని తేలింది.
● తిరుచానూరు- పాడిపేట మార్గంలో అనుమతులు లేకుండా ఆరు అంతస్తుల భవన నిర్మాణం జరుగుతోంది. గత ప్రభుత్వ హయాంలో రూ.3 లక్షలు తీసుకుని అనుమతించినట్లు ఆరోపణలున్నాయి. ఇటీవలే ఆరో శ్లాబ్ పూర్తిచేశారు. చివరకు కొంత ముట్టజెప్పి బీపీఎస్‌కు దరఖాస్తు చేశారు.

తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థలో అవినీతి జలగలు సామాన్యులను పట్టిపీడిస్తున్నాయి. అందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన బీపీఎస్, ఎల్ఆర్ఎస్ పథకాలే అద్దం పడుతున్నాయి. ప్రభుత్వ ఖజానాతో మాకేంటి.. మా జేబులు నిండితే చాలనే భావనతో పథకాలను నిర్వీర్యం చేస్తున్నారు. పరిశీలించాలని ముందస్తుగా మాట్లాడుకునేవారి దరఖాస్తులను మాత్రమే పట్టణ ప్రణాళిక విభాగపు సిబ్బంది లాగిన్‌లో ప్రత్యక్షం అవుతున్నాయి. మిగిలినవి పెండింగ్ దశకే పరిమితం అవుతున్నాయి. అక్రమ నిర్మాణాలు చూసీ చూడనట్లు ఉండేందుకు ఓ ధర, వాటి ఎల్ఆర్ఎస్, బీపీఎస్ కోసం మరో ధర నిర్ణయించి దండుకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం ఇటీవల గడువు పెంచినా కొందరు సిబ్బంది తీరుతో ప్రభుత్వ ఖజానాకు నష్టం తప్పేలా లేదు.

జిల్లాలో (ఎల్ఆర్ఎస్- బీపీఎస్) పరిస్థితి ఇదీ	
దరఖాస్తుల అంచనా :	15,000- 5,000
వచ్చింది	4000-600
పరిష్కారం	450-120

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ప్రకటనల కొరకు సంప్రదించండి : 80085 13290

(c) eenadu

తెదేపా కార్యాలయ నిర్మాణానికి భూమి పూజ

భూమి పూజలో పాల్గొన్న పనబాక లక్ష్మి తదితరులు

తిరుపతి (గ్రామీణం), న్యూస్‌టుడే: అవిలాల పంచాయతీ బాలాజీ డెయిరీ వద్ద తెదేపా తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ కార్యాలయ భూమిపూజ ఆదివారం జరిగింది. పార్లమెంట్ అధ్యక్షురాలు పనబాక లక్ష్మి ఆధ్వర్యంలో ఉదయం అర్చకులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి డాలర్ దివాకర్‌రెడ్డి, తిరుపతి నియోజకవర్గ బాధ్యురాలు, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్, ఎమ్మెల్యేలు బొజ్జల సుధీర్‌రెడ్డి, నెలవల విజయశ్రీ, కురుగొండ్ల రామకృష్ణ, పాశం సునీల్, గురవారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, హాజరైన నేతలు, కార్యకర్తలు

ఉద్యమంలా జనసేన సభ్యత్వ నమోదు

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: జనసేన క్రియాశీలక సభ్యత్వ నమోదు ప్రక్రియ ఈనెల 26వ తేదీ నుంచి ప్రారంభమవుతుందని, అందరూ ఉద్యమంలాగా నమోదు చేయించాలని ఉమ్మడి చిత్తూరు జిల్లా పార్టీ అధ్యక్షుడు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ పిలుపునిచ్చారు. స్థానిక ప్రైవేట్ హోటల్‌లో ఆదివారం జరిగిన తిరుపతి ముఖ్య నేతలు, క్రియాశీలక కార్యకర్తలు, నాయకుల సమావేశంలో ఆయన ప్రసంగించారు. రెండువారాలపాటు జరిగే సభ్యత్వ నమోదులో అందరూ భాగస్వాములు కావాలని, జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ సభ్యత్వ నమోదు సమన్వయకర్తగా నియమించడం ఆనందదాయకమని అన్నారు. నగర అధ్యక్షుడు రాజారెడ్డి, కార్పొరేటర్ దూది కుమారి, నేతలు ఆర్కాట్ కృష్ణ ప్రసాద్, కిరణ్ రాయల్, మబ్బు సత్యవంతుడు, వేణుగోపాల్, దూది శివ, జె.కె. రాయల్ తదితరులు పాల్గొన్నారు.

స్త్రీనిధి.. సత్వర ఉపాధి

పొదుపు మహిళలకు అండగా రుణాలు

తిరుపతి (భవానీనగర్), న్యూస్‌టుడే: స్త్రీనిధి రుణాలు స్వయం సహాయక సంఘాల మహిళల (ఎస్‌హెచ్‌జీ) ఆర్థిక స్వావలంబనకు అండగా నిలుస్తున్నాయి. మహిళల వ్యాపారానికి అవసరమైన పెట్టుబడిని స్త్రీనిధి ద్వారా రుణాలుగా మంజూరు చేస్తున్నారు. దాంతో అతి పలు ఉపాధి యూనిట్లు ఏర్పాటు చేసుకుని సెలవారీ కంతులు చెల్లిస్తూ ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. అర్హులకు సకాలంలో రుణాలు మంజూరు చేస్తున్నట్లు స్త్రీనిధి ఏజీఎం వి.హేమంత్‌కుమార్ వెల్లడించారు. ఇలా కుటుంబ అవసరాలు, పిల్లల చదువులకు ఏ లోటుకూరకుండా చూస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

జిల్లాలో స్త్రీనిధి రుణాలు కేటాయింపులు (రూ.కోట్లలో)		
సంవత్సరం	సభ్యులు	రుణం
2022–23	25,652	129.34
2023–24	28,937	167.29
2024–25	32,859	206.15
2025–26	42,756	323.41
మొత్తం	1,30,204	826.19

నేటివ్ అరకు కాఫీ వ్యాపారంతో

కుటుంబ పరిస్థితులు మెరుగుపరచుకోవడం, పిల్లల భవిష్యత్తు కోసం ఏదైనా వ్యాపారం చేయాలని ఆలోచన బలంగా ఉండేది. సంఘంలో చేరాక స్త్రీనిధితోపాటు సంఘంలో ఇతర రూపేణా రూ.12 లక్షల వరకు రుణం పొందా. నేటివ్ అరకు కాఫీ, హోటల్‌ను ప్రారంభించాను. నెలకు రూ.75 వేల వరకు ఆదాయం పొందుతున్నా. ఇంటి ఖర్చులు, పిల్లల భవిష్యత్తుకు ఇది ఎంతగానో ఉపయోగపడింది. - శశికళ, గుడిమల్లం, ఏర్పేడు

ఆర్థిక భరోసాగా నిలిచింది

దుస్తుల వ్యాపారం చేస్తూ కుటుంబానికి చేదోడువాదోడుగా ఉన్నా. స్త్రీనిధి నుంచి రూ.లక్ష రుణం తీసుకుని వ్యాపారం ప్రారంభించా. నెలకు రూ.45 వేల వరకు ఆదాయం వస్తుంది. పిల్లలు బీటెక్ చదువుతున్నారు. వారి ఉన్నత చదువులకు, కుటుంబ అవసరాలకు ఏ ఇబ్బంది లేకుండా జీవితాన్ని సాగిస్తున్నా. - ప్రవంతి, రామాపురం, రామచంద్రాపురం

రూ.50 వేల రుణంతో..

కుటుంబం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న సమయంలో స్త్రీనిధి అండగా నిలిచాయి. రూ.50 వేల రుణం మంజూరు చేయడంతో ఆవులు కొన్నా. మరోవైపు కిరాణా దుకాణంతో జీవనోపాధి పొందుతున్నా. చిరు వ్యాపారాలు చేస్తుంటూ నెలకు రూ.20 వేలవరకు ఆదాయం పొందుతూ కుటుంబానికి తోడుగా నిలుస్తున్నా. పిల్లల చదువులకు ఏ ఇబ్బందులు ఉండటం లేదు. - సౌజన్య, కుంట్రపాకం, తిరుపతి గ్రామీణ

కుటుంబంతో సంతోషంగా ఉన్నా

సంఘంలో చేరక ముందు ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడ్డా. చేరిన తర్వాత స్త్రీనిధి నుంచి రూ.75 వేల రుణం పొందా. టైలరింగ్, ఫ్యాన్సీ దుకాణం నడుపుతున్నా. నెలకు రూ.35 వేల వరకు ఆదాయం వస్తుంది. బయట అధిక వడ్డీల బాధ తప్పింది. నా అవసరం మేరకు స్త్రీనిధి నుంచి అప్పు తీసుకుని వ్యాపారం అభివృద్ధికి పెట్టుబడి పెట్టా. కుటుంబంతో సంతోషంగా ఉన్నా. - కవిత, రామాపురం, రామచంద్రాపురం

కలశాలతో రుత్వికుల ప్రాకారోత్సవం

వేడుకగా వేదనారాయణుడి మహాకుంభాభిషేకం

నాగలాపురం, న్యూస్‌టుడే: నాగలాపురంలో వేదవల్లీ సమేత వేదనారాయణ స్వామి ఆలయ మహాకుంభాభిషేకం ఆదివారం వైభవంగా జరిగింది. భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. సుప్రభాత సేవానంతరం కుంభ ఆరాధన, హోమాలు నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. పూజల్లో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, వైకాపా నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ పాల్గొన్నారు. ఏర్పాట్లను తితిదే డిప్యూటీ ఈవో గోవిందరాజులు, సూపరింటెండెంట్ దయ్యాల, ఆలయ ధికారులు చెంగల్రాయులు, శ్రీనివాసులు పర్యవేక్షించారు.

విశేషాలంకరణలో శ్రీదేవి, భూదేవి సమేత వేదనారాయణులు

నేడు డయల్ యువర్ ఏపీ ఎస్పీడీసీఎల్ సీఎండీ

తిరుపతి(జీవకోన), న్యూస్‌టుడే: ఎస్పీడీసీఎల్ సర్కిల్ స్థాయిలో విద్యుత్తు వినియోగదారుల సమస్యలపై ఫిర్యాదు, పరిష్కారానికి సోమవారం డయల్ యువర్ సీఎండీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సంస్థ సీఎండీ శివశంకర్ లోతేటి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సర్కిల్ పరిధిలోని తొమ్మిది జిల్లాలకు సంబంధించిన వినియోగదారులు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల కాల్ చేయవచ్చని అందులో వివరించారు. తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలకు సంబంధించిన వినియోగదారులు వరుసగా 8977716661కు కాల్ చేయవచ్చని పేర్కొన్నారు. ● తిరుపతి: 87126 52679, చిత్తూరు: 79931 47979, అన్నమయ్య: 94408 17449

నేడు ప్రజాసమస్యల పరిష్కార వేదిక

తిరుపతి(కలెక్టరేట్), న్యూస్‌టుడే: కలెక్టరేట్‌లో సోమవారం జరగనున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికను ప్రజలు వినియోగించుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అర్జీలు స్వీకరిస్తామని తెలిపారు.

ముక్కంటి సేవలో కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: కర్ణాటక రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విశ్వజిత్‌శెట్టి ఆదివారం వాయులింగేశ్వరున్ని దర్శించుకున్నారు. కుటుంబ సభ్యులతో వచ్చిన ఆయనకు ఆలయ అధికారులు మంగళ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు పర్యవేక్షించారు. అనంతరం వేదాశీర్వచనంతోపాటు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ ప్రొటోకాల్ పీఆర్‌వో రవి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

జస్టిస్ విశ్వజిత్‌శెట్టితో ఆలయ అధికారులు

ఉయ్యాలవాడకు ఘన నివాళి

తిరుపతి(కలెక్టరేట్), న్యూస్‌టుడే: స్వతంత్ర సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి కలెక్టర్ వెంకటేశ్వర్ నివాళి అర్పించారు. ఆదివారం ఆయన వర్ధంతి సందర్భంగా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. డీఆర్వో నరసింహులు పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

ఆలయం ఎదుట కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్, అదనపు ఈవో వెంకయ్యచౌదరి, బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి తదితరులు ● మంత్రి అచ్చెన్నాయుడు కుటుంబం ● ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్

శ్రీవారిని దర్శించుకున్న కేంద్రమంత్రి

తిరుమల, తిరుచానూరు: శ్రీవారిని కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ ఆదివారం దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్‌లో శ్రీవారి ఆలయం వద్దకు చేరుకున్న కేంద్రమంత్రికి తితిదే అదనపు ఈవో వెంకయ్యచౌదరి స్వాగతం పలికి శ్రీవారి మూలమూర్తి దర్శనం చేయించారు. అనంతరం రంగనాయక మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించగా తితిదే అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు. వీరితోపాటు రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్, మాజీ ఎంపీ చింతామోహన్, తితిదే బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి దర్శించుకున్నారు. పద్మావతి అమ్మవారిని కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్, మంత్రి అచ్చెన్నాయుడు వేర్వేరుగా దర్శించుకున్నారు.

అపురూప వేడుక.. ఆనంద వీచిక

ఒకే రూపం కలిగిన కవలలను చూసి.. ఔరా అని పిస్తుంది. అలాంటిది ఒకే వేదికపై వంద జంటలు ఎదురైతే.. కనులకు ఇంపుగా మారుతుంది. ఈ అపురూప దశ్యం ఆదివారం కవలల దినోత్సవం సందర్భంగా తిరుపతిలోని వేమన విజ్ఞాన కేంద్రం కనిపించింది. తిరుపతికి చెందిన హేమావతి, హేమలత కవలలు. వీరు బెంగళూరులో ఓ ప్రైవేటు సంస్థలో విధులు నిర్వహిస్తున్నారు. కొన్నేళ్లుగా ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాలకు చెందిన కవలలను ఒకే వేదిక పైకి తెచ్చి కవలల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. తిరుపతిలో వారి రుచులు.. అభిరుచులను తెలుసుకుంటూ పండగ వాతావరణంలో కార్యక్రమం జరిగింది. - న్యూస్‌టుడే, తిరుపతి (బైరాగిపట్టెడ)

కేంద్రమంత్రికి ఘన వీడ్కోలు

రేణిగుంట, న్యూస్‌టుడే: కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు రేణిగుంట విమానాశ్రయంలో ఘన వీడ్కోలు లభించింది. ఉమ్మడి చిత్తూరు జిల్లా పర్యటన ముగించుకుని ఆదివారం ఆయన ఇక్కడి నుంచి ప్రత్యేక విమానంలో న్యూదిల్లీకి వెళ్లారు. ఈ సందర్భంగా విమానాశ్రయంలో ఆయనకు శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, జేసీ గోవిందరావు, ఏపీడీ భూమినాథన్, తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి తదితరులు వీడ్కోలు పలికారు.

విమానాశ్రయంలోకి వెళ్తున్న కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు

'ఎన్ని కేసులు పెట్టినా బెదిరేది లేదు'

మాట్లాడుతున్న అంబటి రాంబాబు, పక్కన మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, వెంకటరెడ్డి

రైల్వేకోడూరు: కూటమి ప్రభుత్వం ఎన్ని కేసులు పెట్టినా బెదిరేది లేదని మాజీమంత్రి అంబటి రాంబాబు పేర్కొన్నారు. రైల్వేకోడూరు మండల పరిధిలోని వెంకటరెడ్డిపల్లెలో ఆదివారం జరిగిన ఓ వివాహ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులుతో కలిసి పట్టణంలోని వైకాపా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. 2012 ఉప ఎన్నికల సమయంలో రైల్వేకోడూరులో పర్యటించానన్నారు. ఇక్కడి ప్రజలు చూపుతున్న అభిమానానికి కృతజ్ఞతాభావంతో ఉంటానన్నారు. కొరముట్ల మాట్లాడుతూ ముక్కుసూటిగా మాట్లాడే రాంబాబుపై ప్రభుత్వం కక్ష సాధింపులకు పాల్పడుతోందని విమర్శించారు. నాయకులు సాయికిషోర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, వెంకటరెడ్డి, సీహెచ్ రమేష్, మందల నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సుధా బ్రహ్మ త్రీస్టార్ హోటల్ ప్రారంభం

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: స్థానిక తిరుమల బైపాస్ రోడ్డులో అత్యాధునిక వసతులతో విశాలమైన గదులతో నిర్మించిన సుధా బ్రహ్మ త్రీ స్టార్ హోటల్‌ను ఆదివారం ప్రారంభించారు. తితిదే మాజీ ఛైర్మన్, తిరుపతి మాజీ ఎమ్మెల్యే చదలవాడ కృష్ణమూర్తి జ్యోతి వెలిగించారు. హోటల్ ఛైర్మన్ తోట సుధా బ్రహ్మం ప్రతినిత్యం ప్రజలసేవలో ఉంటారని పలువురు ప్రముఖులు పేర్కొన్నారు. తుడా మాజీ ఛైర్మన్ ఎన్‌వీ ప్రసాద్, తితిదే పాలకమండలి సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, జనసేన ఉమ్మడి చిత్తూరు అధ్యక్షుడు పసుపులేటి హరిప్రసాద్, నగరపాలక సంస్థ ఉపమేయర్ ఆర్సీ మునికృష్ణ శుభాకాంక్షలు తెలిపారు. తోట సుధ, శివరామయ్య, మేనేజింగ్ డైరెక్టర్ తోట వి. రమణ, తోట సింధుజ, శివరామన్, డా.హరికుమార్, డా.శోభ, చిన్నంగారి రమణ పాల్గొన్నారు.

సుధాబ్రహ్మ త్రీస్టార్ హోటల్‌ను ప్రారంభిస్తున్న తితిదే మాజీ ఛైర్మన్ చదలవాడ కృష్ణమూర్తి

గరుడ అట్లాస్‌లో సరికొత్త కువకువలు

ఏర్పేడు, న్యూస్‌టుడే: పక్షులపై పరిశోధన చేసేందుకు తిరుపతి భారతీయ విజ్ఞాన శిక్షణ, పరిశోధన సంస్థ(ఐసర్) శ్రీకారం చుట్టింది. పక్షుల జీవన విధానం, వాటి స్థితిగతులు తెలుసుకునేందుకు 2022లో తిరుపతి బర్డ్ అట్లాస్ పేరుతో ప్రారంభించి ఐదేళ్లలో 274 పక్షి జాతులను గుర్తించి పరిశోధనలు జరిపింది. ప్రస్తుతం ఐసర్, తిరుపతి నేచర్ సొసైటీ (టీఎన్ఎస్), అటవీశాఖ సమన్వయంతో గరుడ అట్లాస్ పేరుతో తిరుపతి పరిసర ప్రాంతాల్లో ఈనెల 20 నుంచి 23 వరకు పక్షుల పరిశోధన, వాటి నమోదు చేపట్టారు. హరీషా, పుష్యమిత్ర, రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో 72 యూనిఫాం గ్రిడ్లుగా ఏర్పడి 200కు పైబడి పక్షులను గుర్తించారు. సోమవారం పక్షుల గుర్తింపు కొనసాగనుండటంతో వీటి సంఖ్య పెరిగే అవకాశం ఉందని నిర్వాహకులు తెలిపారు. గరుడ అట్లాస్ కార్యక్రమంతో అంతరించి పోతున్న పక్షులను కాపాడేందుకు దోహదపడుతుందని వివరించారు.

రాస్ కేవీకే సేవలు అభినందనీయం

రాస్ కేవీకే ప్రచురణలను ఆవిష్కరిస్తున్న కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్

రేణిగుంట, న్యూస్‌టుడే: జిల్లా రైతాంగానికి తాము అందిస్తున్న సేవలను కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ అభినందించారని రాస్ కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం తిరుమలలో కేంద్ర మంత్రిని కలిసి 33 ఏళ్లుగా జిల్లాలోని రైతులు, గ్రామీణ యువత, విస్తరణాధికారులకు నిర్వహించిన వివిధ కార్యక్రమాలపై ఆయన పవర్‌పాయింట్ ప్రదర్శన ఇచ్చారు. అనంతరం రాస్ కేవీకే తయారు చేసిన ప్రచురణలు, విలువ ఆధారిత ఉత్పత్తులను కేంద్రమంత్రి విడుదల చేశారు. ప్రదర్శన క్షేత్రాల నిమిత్తం రైతులకు వరి విత్తనం, జీవ సంబంధిత కీటక నాశకాలు, జీవన ఎరువులు, సూక్ష్మ పోషకాలు మంత్రి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఐసీఏఆర్-ఆటారీ జోన్ 10 డైరెక్టర్ డా.షేక్ మీరా, రాస్ కేవీకే ఛైర్మన్ వెంకటరత్నం, వ్యవసాయ విస్తరణ సంచాలకుడు డా.శివన్నారాయణ, పశువైద్య విస్తరణ సంచాలకురాలు డా.శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

డీపీవో, డీఎల్‌పీవోకు హైకోర్టు నోటీసులు

తిరుపతి (గ్రామీణం), న్యూస్‌టుడే: గ్రామీణ మండలం చిగురువాడ పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై హైకోర్టులో దాఖలైన రిట్ పిటిషన్‌పై 8 వారాల్లోపు విచారణ జరిపి నివేదిక సమర్పించాలని జిల్లా పంచాయతీ అధికారి, డీఎల్‌పీవోకు హైకోర్టు ఈనెల 13న నోటీసులు జారీచేసింది. చిగురువాడ పంచాయతీలో నిధులు దుర్వినియోగమైనట్లు ఉప సర్పంచి ఎం.మోహనరామిరెడ్డి జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన అధికారులు, ఆ తర్వాత తుది నిర్ణయం తీసుకోలేదు. దీనిపై ఆయన హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. పరిశీలించిన హైకోర్టు కేసును డిస్పోజ్ చేసి, నిధుల దుర్వినియోగంపై పంచాయతీరాజ్ చట్టం ప్రకారం విచారణ జరిపి 8 వారాల్లో నివేదిక సమర్పించాలని ఆదేశాలు జారీచేసింది.

ప్రజారోగ్యంతో చెలగాటమాడొద్దు

తిరుపతి(నగరపాలిక), న్యూస్‌టుడే: మాంసాన్ని కల్తీ చేసి విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర మాంసాభివృద్ధి సంస్థ ఛైర్మన్ చంద్రదండు ప్రకాష్ నాయుడు హెచ్చరించారు. లీలామహల్, కొర్లగుంట ప్రాంతాల్లోని మాంసపు దుకాణాల్ని ఆయన ఆదివారం అధికారులతో కలిసి తనిఖీ చేశారు. నిర్వహణ కొరవడిన దుకాణాలకు జరిమానాలు విధించారు. కోళ్ల నిల్వ, విక్రయప్రాంతం, కోళ్ల వధించే ప్రాంతంలో శుభ్రత, వేడినీటి సౌకర్యం, వ్యర్థాల తరలింపు, సిబ్బంది అలవాట్లు ఆరా తీశారు. ప్రజారోగ్య ప్రమాణాలు పాటించకుండా చనిపోయిన, కుళ్లిన మాంసం, నిల్వ చేసిన మాంసాన్ని విక్రయించరాదని ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నగరపాలిక పశువైద్యాధికారి గుణశేఖర్, పశుసంవర్ధకశాఖ ఏడీ మదన్, ఆహార భద్రతాధికారి జగదీష్ పాల్గొన్నారు.

తిరుపతిలో దుకాణాలను తనిఖీ చేస్తున్న మాంసాభివృద్ధి సంస్థ ఛైర్మన్ చంద్రదండు ప్రకాష్‌నాయుడు

క్యూలైన్ స్కానింగ్ కేంద్రం వద్ద కుప్పకూలిన మహిళ

సీపీఆర్‌తో రక్షించిన ఎస్పీఎఫ్ కానిస్టేబుల్

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి దర్శనానికి వచ్చిన ఓ మహిళ క్యూలైన్‌లో వెళ్లే సమయంలో కుప్పకూలిపోగా సమీపంలోని ఎస్పీఎఫ్ కానిస్టేబుల్ సీపీఆర్ చేసి రక్షించారు. శనివారం రాత్రి తమిళనాడుకు చెందిన సంబగవల్లి (59) స్కానింగ్ కేంద్రం వద్దకు చేరుకోగానే కుప్పకూలారు. సమీపంలోని ఎస్పీఎఫ్ కానిస్టేబుల్ డీవీ సుబ్బారావు ఆమెకు సీపీఆర్ చేశారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం అశ్విని ఆసుపత్రికి తరలించారు. కానిస్టేబుల్‌ను తితిదే అధికారులు, భద్రతాధికారులు అభినందించారు.

ఎర్రచందనం స్వాధీనం.. ఇద్దరు స్మగ్లర్ల అరెస్టు

తిరుపతి (జీవకోన), న్యూస్‌టుడే: తిరుపతి అటవీ శాఖ ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు పీలేరు - కల్లూరు మార్గంలో నిర్వహించిన దాడుల్లో వాహనాన్ని సీజ్‌చేసి, ఇద్దరు స్మగ్లర్లను అదుపులోకి తీసుకొని, అర టన్ను ఎర్ర చందనం దుంగలు స్వాధీనం చేసుకున్నారు. రేంజర్ సుబ్బారాయుడు కథనం మేరకు.. ఆదివారం సాయంత్రం 04.30 గంటల ప్రాంతంలో పెట్రోలింగ్‌లో భాగంగా పీలేరు-కల్లూరు మార్గంలో పాటూరు వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఎర్ర చందనం దుంగలు తరలిస్తున్న ఇన్నోవా వాహనాన్ని సీజ్‌చేసి, అందులోని 483.4 కిలోల బరువైన 16 దుంగలు స్వాధీనం చేసుకున్నారు. తమిళనాడులోని తిరువణ్ణామలై జిల్లాకు చెందిన జి.తిరుమల, ఎ.తిరుమల అనే ఇద్దరు నిందితులను అరెస్టు చేసి, కేసు నమోదు చేశారు. దాడుల్లో ఎఫ్ఆర్ఓ సుబ్బరాయుడు, ఎఫ్ఎస్ఓ శశికుమార్, ఎస్బీవో చంద్రబాబు పాల్గొన్నారు.

దుంగలు, కారు, నిందితులను చూపుతున్న ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి.. ఇద్దరికి గాయాలు

శ్రీకాళహస్తి గ్రామీణం (ఏర్పేడు), న్యూస్‌టుడే: వేగంగా వచ్చిన లారీ రెండు ద్విచక్ర వాహనాలను ఢీకొనడంతో ఒకరు మృతిచెందగా మరో ఇద్దరు గాయపడిన ఘటన శ్రీకాళహస్తి మండలం ఊరందూరు సమీపంలో ఆదివారం జరిగింది. గ్రామీణం ఎస్సై వెంకటేష్ కథనం మేరకు.. లారీ డ్రైవర్ నిర్లక్ష్యంగా నడుపుతూ అదుపుతప్పి రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాడు. ఈ ఘటనలో శ్రీకాళహస్తి మండలంలోని నారాయణపురానికి చెందిన చెంగారెడ్డి(40) అక్కడికక్కడే మృతిచెందగా సుధాకర్, రమేష్ గాయపడ్డారు. క్షతగాత్రులను వైద్యం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

లారీ క్యాబిన్‌లోనే ప్రాణాలొదిలిన డ్రైవర్

తడ, న్యూస్‌టుడే: లారీ క్యాబిన్‌లో నిద్రకు ఉపక్రమించిన డ్రైవరు సిలంబరసన్(35) అందులోనే ప్రాణాలు కోల్పోయాడు. పోలీసుల కథనం మేరకు. . మండలంలోని కారూరు పారిశ్రామికవాడలో ఈనెల 10న సరకు అన్‌లోడు చేశాడు. అక్కడి నుంచి తిరుగు ప్రయాణంలో లోడింగు ఉందనడంతో అక్కడే లారీ ఉంచి ఊరెళ్లాడు. గురువారం తిరిగి వచ్చిన అతను మద్యం తాగి అదేరోజు రాత్రి లారీ క్యాబిన్‌లో పడుకున్నాడు. శుక్రవారం సిలంబరసన్ సోదరుడు పలుమార్లు ఫోన్ చేసినా తీయలేదు. ఆదివారం ఉదయం స్థానిక దుకాణదారుడికి అనుమానం వచ్చి పరిశీలించగా లారీలోంచి దుర్వాసన వచ్చింది. ఎంత అరిచినా స్పందన లేవకపోవడంతో తడ పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు మృతదేహాన్ని గుర్తించి కిందికి దించారు. రెండు రోజుల క్రితమే అతను చనిపోయినట్లు నిర్ధారించారు. మృతుడు తమిళనాడు రాష్ట్రం రెడ్‌హిల్స్ ప్రాంతానికి చెందిన వాడిగా గుర్తించారు. అతని బంధువులకు సమాచారం అందించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తడ ఎస్సై కొండపనాయుడు తెలిపారు.

బీఈడీ విద్యార్థిని ఆత్మహత్య

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని రంగనాయకులపేటకు చెందిన ఆమంచి భార్గవి(25) ఆదివారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై లక్ష్మీప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆమె స్థానికంగా ఓ ప్రైవేటు కళాశాలలో బీఈడీ చదువుతోంది. తల్లిదండ్రులు కొంతకాలం కిందట విడాకులు తీసుకోవడం, కుటుంబ పరిస్థితులు సక్రమంగా లేకపోవడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడినట్లు ఆమె తల్లి పద్మ ఫిర్యాదు చేసినట్లు ఎస్సై చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పురుగుల మందు తాగి వ్యక్తి..

సత్యవేడు, న్యూస్‌టుడే: దంపతుల మధ్య మనస్పర్థల కారణంగా వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని చెన్నేరి ఎస్టీ కాలనీలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన సుధాకర్ తరచూ మద్యం తాగేవారు. ఆదివారం అతని భార్యతో చిన్నపాటి గొడవ జరిగింది. ఈ క్రమంలోనే సుధాకర్ పురుగుల మందు తాగారు. గుర్తించిన కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం తిరువళ్లూరు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయినాథ్ చౌదరి తెలిపారు.

EENADU Classifieds

HEALTH & CARE

PAEDIATRIC

శ్రీవిష్ణు చిన్నపిల్లల హాస్పిటల్: డా॥ కె.కీర్తన (M.D., Pediatrics, SVMC & Ex. Senior Resident RUIA, Fellow in Neonatology) పురిటి బిడ్డలు & చిన్నపిల్లల వైద్యనిపుణులు, 24X7 ఎమర్జెన్సీ కేసులు చూడబడును. మనోహరి హాస్పిటల్ ప్రక్కన, రెడ్డి & రెడ్డి కాలనీ, తిరుపతి ✆ 63035 53359.

REAL ESTATE

FLAT FOR SALE

GENERAL

TIRUPATI 3BHK Flat for SALE. Spacious 2000 Sqft East Facing in Narayana Puram, Lift & Car Parking Available.9703358869.

తిరుపతి గెస్ట్‌లైన్ హోటల్‌కి ఆనుకొని మాస్టర్‌ప్లాన్ 80 feet రోడ్డుకు AB Aavas Phoenix Tower Smart Homesలో 2 BHK, 3 BHK Flats సేల్స్‌కు కలవు. RERA PROJECT ✆ 95055 02346

PLOT FOR SALE

GENERAL

రేణిగుంట, బుగ్గవీధి నుంచి ఇమామ్ వీధిలోకి వెళ్లే కార్నర్ ఇంటి డి.నెం12-296, వెనుకఉన్న, పడమరఫేసింగ్ కొ:29x40 ఉన్న ఖాళీజాగా అమ్మబడును No Brokers ✆ 94911 35998.

తిరుపతి IIT దగ్గర దుర్గిపేరినందు 25x40 కొలతలతో పడమర ఫేసింగ్ ప్లాట్ కలదు. కేవలం 4,20,000/- మాత్రమే. ✆ 80997 85333.

TO LET

చంద్రగిరి కొత్తపేట, బజారువీధి D.No. 2/7, 2BHKహౌస్, 24 hrs వాటర్ మరియు ఏసీతో కలిపి అద్దెకు ఇవ్వబడును ✆ 98858 01024, 94903 62354.

JOBS

Job Openings for Tele callers Salary 10,000-25,000 per month work from office, Bairagipatteda, Tirupati ✆ 97899 96435.

హైదరాబాద్ యూనిటీ హోంకేర్‌లో ఏజెంట్లకు మంచి అవకాశం. మీరు వర్కర్స్‌ని పంపితే మొదటినెల 5వేలు కమీషన్. వర్కర్స్ జీ:15K, ఫ్రీవసతి,ఫుడ్. 8121541212

అడ్మినిస్ట్రేటివ్ పర్సన్స్ కావలెను. Qly: డిగ్రీ/ MBA అనుభవం, ఉత్సాహవంతులైన వారు తిరుపతి టౌన్‌లో పని చేయుటకు. ఆకర్షణీయమైన జీతం. ✆ 97034 02722.

ఆటో డ్రైవర్ కావలెను. అనుభవం, లైసెన్స్ కలిగి ఉండవలెను. (తిరుపతి టౌన్‌లో పని చేయుటకు) ఆకర్షణీయమైన జీతం. Cont: 97034 02722.

MARKETING/ SALES

Anand Masale Require Sales & Marketing Manager, Marketing Executives. Contact: 98496 55105, 98480 53144 Email: anand masalaap-pltd @ gmail.com.

మా సౌత్ ఇండియన్ హోమ్ బేస్డ్ స్నాక్స్ కంపెనీకి నగరి మరియు పుత్తూరు సమీప ప్రాంతాలలో సేల్స్ ఏజెంట్స్ కావలెను. (ఫుల్ టైం & పార్ట్ టైం). మంచి జీతం + ప్రోత్సాహకాలు. సెల్: 74117 41878.

EENADU THE WAY CLASSIFIEDS

B/W 5 లైన్ల ప్రకటన రూ. 500/-

Colour 5 లైన్ల ప్రకటన రూ. 600/- మాత్రమే

తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల్లో అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు

వివరాలకు...

80085 13290

మీ చిన్నారులకు పుట్టిన రోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి

B/W: రూ. 600 Colour: రూ. 800

ప్రకటనలపై 5% GST వర్తించును

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

తిరుపతి

• తిరుపతి • చంద్రగిరి

చేనేత ప్రదర్శన ప్రారంభం

తిరుపతి (నగరం), న్యూస్‌టుడే: శిల్పారామంలో తిరుపతి హస్తకళ మేళా (రాష్ట్ర చేనేత ప్రదర్శన)ను ఆదివారం యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహయాదవ్, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ ప్రారంభించి మాట్లాడారు. 9 రాష్ట్రాల నుంచి విచ్చేసిన 64 మంది చేనేత కళాకారులు చీరలు, డ్రెస్ మెటీరియల్స్, ఇతర ఉత్పత్తులు ప్రదర్శనకు ఉంచారని తెలిపారు. శిల్పారామం ఛైర్‌పర్సన్ మంజులరెడ్డి, సీఈవో స్వామినాయుడు, సర్పంచి జ్యోతి పాల్గొన్నారు.

కంకణాలు, పెన్నుల అందజేత

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: పది విద్యార్థులకు బాసర సరస్వతి అమ్మవారి ఆలయంలో పూజించిన కంకణాలు, పెన్నులను ఆదివారం తిరుపతి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అందజేశారు. భాజపా జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు దిండుకుర్తి నరసింహులు, సభ్యులు పాల్గొన్నారు.

వేడుకల్లో సంగీత, వాయిద్య కళాకారులు

ముగిసిన త్యాగరాజ ఆరాధనోత్సవాలు

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: స్థానిక అన్నమాచార్య కళామందిరంలో తితిదే శ్రీ త్యాగరాజ స్వామి వారి సంస్మరణ, ఆరాధన ఉత్సవ వేడుకలు ఆదివారంతో ఘనంగా ముగిశాయి. దాస రసజ్ఞ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ సంగీత మహోత్సవ వేడుకలు కళా ప్రియులను అమితంగా ఆకట్టుకున్నాయి. నగర సంకీర్తన కార్యక్రమాలు నిర్వహించారు. సంస్థ అధ్యక్షులు వెంకటేష్, కార్యదర్శి రామ్‌కుమార్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జేఈవో డాక్టర్ ఎ.శరత్, చిత్రంలో పెద్దజీయర్, చిన్నజీయర్, అనంతాళ్వార్ వంశస్థులు

ఆదర్శనీయులు అనంతాళ్వార్

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవైష్ణవ భక్తాగ్రేసరుడు, ఆళ్వారుల్లో ప్రముఖుడైన శ్రీఅనంతాళ్వార్ జీవితం అందరికీ ఆదర్శప్రాయమని తితిదే జేఈవో డాక్టర్ ఎ. శరత్ పేర్కొన్నారు. స్థానిక అనంతాళ్వార్ తోట (పురుశైవారితోట)లో శ్రీఅనంతాళ్వార్ 972వ అవతార మహోత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. భక్తి అంటే సేవ అని నిరూపించిన మహనుభావుడు అనంతాళ్వార్ అని ఆయన కీర్తించారు. 972 సంవత్సరాలుగా అనంతాళ్వార్ వంశీకులు శ్రీవారికి పుష్పకైంకర్యం చేస్తున్నారని, వారి పరంపర ఎల్లప్పటికీ కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా అనంతాళ్వార్ వంశీకులు 'నాలాయిర దివ్యప్రబంధ గోష్ఠిగానం' నిర్వహించారు. పెద్దజీయర్, చిన్నజీయర్ స్వామి అనుగ్రహభాషణం చేశారు. వేంకటకృష్ణ స్వామి, భరద్వాజస్వామి పాల్గొన్నారు.

ఘనంగా బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: స్థానిక కరకంబాడి రోడ్డులోని ఉద్దండ గణపతి వేద పాఠశాలలో ఆదివారం దక్షిణ భారత బ్రాహ్మణ వధూవరుల వివాహ పరిచయ వేదిక, షష్ఠిపూర్తి మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. తిరుపతి జిల్లా బ్రాహ్మణ సేవా సంఘాల సమితి అధ్యక్షుడు డా. ఎన్ నరసింహాచార్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేదం హరిప్రసాద్, వేదిక్ యూనివర్సిటీ వీసీ రాణి సదాశివ మూర్తి, సంస్కృత వర్సిటీ వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

జ్యోతి వెలిగిస్తున్న నిర్వాహకులు, అతిథులు

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)

నగరపాలిక: 80080 20003, తిరుపతి (విద్య, తితిదే): 93936 28003
తిరుచానూరు: 80082 30008, మంగళం-జీవకోన: 80080 40005
తిరుపతి గ్రామీణ: 80085 74564, చంద్రగిరి: 80085 74561

తిరుపతి(నగరపాలిక), న్యూస్‌టుడే: **సమస్య:** శివజ్యోతి నగర్‌లోని అఖిల రెసిడెన్సీ వద్ద మురుగు కాలువ పొంగి రోడ్డుపైన పారుతుంది. చాలా కాలంగా ఇదే పరిస్థితి. **- మల్లిఖార్జున, శివజ్యోతి నగర్**

సమస్య: గాంధీ రోడ్డులో ఏడాది కిందట నిర్మించిన మురుగు కాలువ పూడింది. వ్యర్థ జలాలన్నీ దుకాణాల ఎదుట పారుతున్నాయి.

సమాధానం: రెండు చోట్ల పరిశీలించి వెంటనే చర్యలు చేపడతాం.

- డా. యువఅన్వేష్, వైద్యాధికారి, నగరపాలిక.

శ్మశానవాటిక ఆక్రమణకు యత్నం

చంద్రగిరి, న్యూస్‌టుడే: పనపాకం పంచాయతీ పనపాకంపేటలోని సర్వే సంఖ్య 150లోని 10 సెంట్ల శ్మశానవాటిక భూమిని ఆక్రమించుకోడానికి కొందరు యత్నిస్తున్నారని జనసేనకు చెందిన రేవతి, ఆమె కుటుంబ సభ్యులు ఆదివారం ఆరోపించారు. యాదవులు శ్మశనంగా వినియోగించే భూమిని కొందరు ఆశ్రమం, దేవాలయం పేరిట ఆక్రమించుకునే ప్రయత్నాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని నియోజకవర్గ బాధ్యులు దేవర మనోహర్ దృష్టికి ఆమె తీసుకెళ్లారు.

మహిళా ఉద్యోగులు రాణించాలి

తిరుపతి (వైద్యవిభాగం): మహిళా ఉద్యోగులు క్రీడా పోటీల్లో రాణించాలని ఎస్వీఎంసీ ప్రిన్సిపల్ డాక్టర్ రవి ప్రభు, రుయా ఎంఎస్ డాక్టర్ రాధా, డీఎంహెచ్ఓ డాక్టర్ బాలకృష్ణ నాయక్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఏపీ హంస సంఘం ఆధ్వర్యంలో మహిళా ఉద్యోగులకు ముందస్తు క్రీడా పోటీలు ఎస్వీఎంసీ మైదానంలో నిర్వహించారు.

రీసర్వేలో భూ సమస్యలకు పరిష్కారం

రామచంద్రాపురం, న్యూస్‌టుడే: గ్రామాల్లో రైతుల సమస్యలు పరిష్కరించడానికే భూముల రీసర్వే జరుగుతుందని తహసీల్దార్ మధుసూదనరావు అన్నారు. ఆదివారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మండల సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపీపీ వెంకట బ్రహ్మానందరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. గైర్హాజరైన ఎక్సైజ్, ఆర్టీసీ, ఆర్ అండ్ బి, పోలీసులకు ఎంపీపీ షోకాజ్ నోటీసులు ఇవ్వాలని నిర్ణయించారు.

ఔషధ విజ్ఞాన తరగతులు ప్రారంభం

తిరుపతి(మహిళా వర్సిటీ), న్యూస్‌టుడే: తిరుపతి సర్వ వైద్య మహా సంఘం ఆధ్వర్యంలో సంప్రదాయ వైద్యులకు మూడురోజులపాటు నిర్వహిస్తున్న ఔషధ విజ్ఞాన శిక్షణ తరగతులు ఆదివారం స్థానిక యూత్ హాస్టల్లో ప్రారంభమయ్యాయి. సంప్రదాయ వైద్యులు నరసింహప్రసాద్, వేణుగోపాల్‌రెడ్డి శిక్షణ ఇచ్చారు. సంఘం సెక్రటరీ శ్రీనివాసులు, ట్రెజరర్ బాలకృష్ణ పాల్గొన్నారు.

తోడుగా నీడగా..!

తిరుపతి (విద్య), న్యూస్‌టుడే: తల్లి గర్భం నుంచి ఒకేసారి పురుడు పోసుకున్నారు. అచ్చం ఒకేలా ఉంటూ అందరినీ అయోమయానికి గురిచేస్తూ తమకంటూ ప్రత్యేకత చాటుతున్నారు. అభిరుచులు, అలవాట్లు ఒకేలా ప్రోది చేసుకుని లక్ష్యాల సాధన దిశగా అడుగులు వేస్తున్నారు. ఆదివారం స్థానిక యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో దాదాపు 101 కవలలు ఒకే వేదికపై కలవనుండటం ప్రత్యేకత సంతరించుకుంది.

ఉద్యోగం చేస్తూనే..



బెంగళూరులోని ప్రైవేట్ సంస్థలో విధులు నిర్వహిస్తున్నాం. కొంతకాలంగా తిరుపతిలో ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు ప్రాంతాలకు చెందిన కవలలను ఒకే వేదికపైకి తీసుకొచ్చి తిరుపతిలో పండగ వాతావరణంలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం.
- హేమావతి, హేమలత

అమ్మానాన్నలు గర్వపడేలా..



మల్లిక, శ్యామ్ తల్లిదండ్రుల రెండో సంతానం. ప్లే క్లాస్ చదువుతున్నాం. చిన్నప్పటి నుంచి కలిసి ఆడుకుంటూ చదువుకుంటూ పెరుగుతున్నాం. మా మధ్య మంచి స్నేహం ఉంది. ఆటలో ఒకరు గెలిస్తే మరొకరు ఆనందపడతాం. ఉపాధ్యాయులు, స్నేహితులు ప్రేమగా చూస్తారు. అమ్మానాన్నలు మమ్మల్ని చూసి గర్వపడాలన్నదే లక్ష్యం. **- దక్ష్, మోక్ష్**

కలిసి ఎదగాలని..



జంటగా పుట్టడం మా జీవితంలో అద్భుతమైన అనుభవం. ఒకేరోజు ఒకేచోట మొదలైన మా ప్రయాణంలో ఒకరి భావాలు మరొకరికి మాటలు లేకుండానే అర్థమవుతాయి. నమ్మకం, ప్రేమే మా బలం. ఒకరు దిగులుగా ఉంటే మరొకరం ధైర్యం చెప్పుకొంటాం. కలిసి విజయాలు సాధించడం మా లక్ష్యం. **- హుసైన్, హుస్సేన్**

డిగ్రీ చదువుతున్నాం



తిరుపతిలో డిగ్రీ చదువుతున్నాం. చిన్నప్పటి నుంచి ప్రతి దశలో పరస్పరం తోడ్పాటుగా నిలుస్తున్నాం. జీవితంలో ఎదురయ్యే ప్రతి సవాలును కలిసే ఎదుర్కొంటాం. ఒకరికొకరు తోడుగా ఉంటూ ఎదగడమే లక్ష్యం.
- రమాదేవి, లక్ష్మీదేవి

ఆటల్లోనూ ప్రతిభ



ప్రస్తుతం ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాం. చదువులో మేటిగా నిలుస్తూనే ఆటల పోటీల్లో ప్రతిభ చాటుతున్నాం. ఇద్దరికీ ఒకే రూపం రావడం అదృష్టం. స్నేహితులను సరదాగా ఆటపట్టిస్తుంటాం. జీవితంలో ఉన్నత చదువులు చదివి మంచి ఉద్యోగాలు సాధించడమే మా ఇద్దరి లక్ష్యం.
- మధుప్రియ, మధుశంకర్

విలువలకు కట్టుబడి



కవలలుగా పుట్టడం గొప్పవరంగా భావిస్తున్నాం. చిన్నప్పటి నుంచి ప్రతి ఆనందం, సవాలును కలిసి ఎదుర్కొంటున్నాం. ఒకరికి ఒకరం బలం, ధైర్యం, ప్రేరణగా నిలుస్తున్నాం. బయటి ప్రపంచంలో పోటీ ఉన్నా మా మధ్య ఎప్పుడూ ప్రేమ, ఐక్యతే ఉంటుంది. కుటుంబం మాకు నేర్పిన విలువలు గౌరవిస్తూ ఎదగడం లక్ష్యం. **- కాకాని రామ్, లక్ష్మణ్**

మాట్లాడుతున్న దీపక్ రెడ్డి, వేదికపై సుగుణమ్మ, కోడూరు బాలసుబ్రహ్మణ్యం

తిరుపతిలో బలిజ భవన నిర్మాణం

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: తిరుపతి నగరంలో బలిజ భవన్ నిర్మాణాన్ని త్వరగా ప్రారంభించి పూర్తి చేయాలని పలువురు వ్యక్తులు పేర్కొన్నారు. బలిజ భవన్ డవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ఓ ప్రైవేటు హాల్‌లో బలిజ సామాజిక వర్గానికి చెందిన పెద్దలు, యువత, మహిళల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెదేపా జోన్ -4 కోఆర్డినేటర్ దీపక్ రెడ్డి, తెదేపా రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కోడూరు బాలసుబ్రహ్మణ్యం, నియోజకవర్గ ఇన్‌ఛార్జి సుగుణమ్మ, బుల్లెట్ రమణ, ఎడిపై ప్రణీత్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. భవన నిర్మాణం కోసం తెదేపా ప్రభుత్వం 2014లో భూమి, రూ. 2 కోట్లు నిధులు ఇచ్చిందన్నారు. వైకాపా ప్రభుత్వం విస్మరించిందన్నారు. అభివృద్ధి సొసైటీ అధ్యక్షులు వసంతం శ్రీనివాసులు, కార్యదర్శి చిన్నా రాయల్ పాల్గొన్నారు.

వైభవంగా మారు పొంగళ్లు

యర్రావారిపాలెం: తలకోన సిద్దేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు ముగిసిన మరుసటి ఆదివారం కావడంతో మారు పొంగళ్లు నిర్వహించారు. ఆలయ అధికారులు స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం అభిషేకాలు ఘనంగా నిర్వహించారు.

శరవేగంగా శ్రీవారి పుష్కరిణిలో తెప్ప నిర్మాణం

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమలలో శ్రీవారి సాలకట్ల తెప్పోత్సవాలు ఈనెల 26 నుంచి మార్చి 2వ తేదీ వరకు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో శ్రీవారి పుష్కరిణిలో తెప్ప నిర్మాణం శరవేగంగా పూర్తవుతోంది. తితిదే ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఈ పనులు జరుగుతున్నాయి. మరోవైపు శ్రీవారి పుష్కరిణి చుట్టూ ఉన్న ఇత్తడి గ్రిల్స్‌ను కార్మికులు శుభ్రం చేస్తున్నారు. ఈనెల 20 నుంచి మార్చి 5వ తేదీ వరకు పుష్కరిణిని మూసివేసిన విషయం తెలిసిందే. ప్రత్యేకంగా పుష్కరిణి ఎదుట ఫ్లెక్సీ ఏర్పాటు చేసింది.

ఓ వైపు సిద్ధమవుతున్న తెప్ప.. మరోవైపు గ్రిల్స్‌ను శుభ్రపరుస్తున్న సిబ్బంది

చెక్‌మేట్ టోర్నీలో క్రీడాకారుల సత్తా

తిరుపతి(క్రీడలు), న్యూస్‌టుడే: చదరంగంతో మెదడుకు పదును, పనితీరు మెరుగుపరచుకోవచ్చని తూర్పు పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. స్థానిక మంగళం రోడ్డులోని చెస్‌క్లబ్ ఆధ్వర్యంలో అండర్- 7, 9, 13, 15 విభాగాల్లో చెక్‌మేట్ టోర్నమెంట్ నిర్వహించారు. 80 మంది క్రీడాకారులు తరలివచ్చారు. ఒక్కో కేటగిరిలో మొదటి ఐదుగురికి ట్రోఫీలు, ప్రశంసా పత్రాలను ప్రదానం చేశారు.

క్రీడాకారులతో హెడ్ కోచ్‌లు ఇంజం శివకేశవులు, గిరీష్ కుమార్

ఆర్థోపెడిక్ సెంటర్ ప్రారంభం

తిరుపతి (వైద్యవిభాగం), న్యూస్‌టుడే: తిరుపతి రెడ్డి రెడ్డి కాలనీలో అర్క ఆర్థోపెడిక్ సెంటర్ ప్రారంభోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. తితిదే ఏఈవో వెంకయ్య చౌదరి హాస్పిటల్ ప్రారంభించారు. అధునాతన వైద్య పరికరాలు, నిష్ణాతులైన వైద్యులతో రోగులకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలని హాస్పిటల్ అధినేత డాక్టర్ కిరణ్ భరత్‌కు సూచించారు. జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పెనుమాడు ప్రణీత్, సాదు ప్రకాష్, శ్రీనివాస్ ప్రసాద్, మోహన్ ప్రసాద్ పాల్గొన్నారు.

తితిదే ఏఈవో వెంకయ్య చౌదరికి స్వాగతం పలుకుతున్న నిర్వాహకులు

'అమెరికా ఎదుట నిస్సహాయ స్థితిలో మోదీ'

తిరుపతి (నగరం), న్యూస్‌టుడే: అమెరికా ఆర్థిక దౌర్జన్యాన్ని ఎదుర్కోలేని స్థితిలో ప్రధాని మోదీ ఉన్నాడని సీపీఐ జాతీయ నేత నారాయణ విమర్శించారు. ఆదివారం బైరాగిపట్టెడలోని సీపీఐ కార్యాలయంలో జిల్లా సమితి సమావేశంలో ఆయన మాట్లాడారు. అమెరికా విధిస్తున్న సుంకాల వలన భారత ప్రజానీకంపై మరింత భారం పడుతుందన్నారు. అమెరికా కోర్టులే ట్రంప్ విధానాలను బహిరంగంగా వ్యతిరేకిస్తున్నాయని, భారత ప్రధాని మోదీ తప్పించుకు తిరుగుతున్నాడని ఎద్దేవా చేశారు. ప్రజలు దీనికి సిద్ధంగా ఉన్నారని చెప్పారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామానాయుడు, చిన్నం పెంచలయ్య, రాధాకృష్ణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సీపీఐ జాతీయ నేత నారాయణ

ఉత్సాహంగా పశువుల పండగ

చంద్రగిరి, న్యూస్‌టుడే: కొత్తపేట ద్వారకానగర్‌లో పశువుల పండుగ ఆదివారం ఉత్సాహంగా సాగింది. స్థానిక మిట్టగంగమ్మ దేవాలయంలో గంగమ్మతల్లికి పూజలు చేశారు. పోలీసు బందోబస్తు మధ్యన వేలాదిగా తరలివచ్చిన యువకుల కేరింతల మధ్య పండగ సాగింది. ఆంధ్రా, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి పోరాట పటిమ కలిగిన కోడెలు పాల్గొన్నాయి. కొందరు యువకులు గాయపడ్డారు. ఎమ్మెల్యే పులివర్తి నాని తనయుడు పులివర్తి వినీల్ పాల్గొన్నారు. సుమారు 20 మందికి పైగా రక్తగాయాలకు గురయ్యారు. ఇరువర్గాల మధ్యన గొడవలు చోటుచేసుకున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా ఉత్సవాన్ని నిర్వహించిన కొందరిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

పరుగులు తీస్తున్న కోడె

కస్తూర్బా గాంధీ మహోన్నతురాలు

తిరుపతి(జీవకోన), న్యూస్‌టుడే: మహాత్మా గాంధీ సతీమణి కస్తూర్బా గాంధీ మహోన్నతురాలని డాక్టర్ పీసీ రాయలు అన్నారు. తిరుపతి నగరంలోని కస్తూర్బా గాంధీ కేంద్రీయ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఆమె వర్ధంతిని నిర్వహించారు.

కస్తూర్బా గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పీసీ రాయలు

విప్లవ పోరాట స్ఫూర్తి.. ఉయ్యాలవాడ

తిరుపతి(వైద్యవిభాగం), న్యూస్‌టుడే: బ్రిటీష్ పాలకులపై మొదట తిరుగుబాటు చేసి విప్లవ పోరాట స్ఫూర్తిని ఉయ్యాలవాడ నరసింహారెడ్డి రగిలించారని ఏపీ మెడికల్ కౌన్సిల్ ఛైర్మన్ డాక్టర్ శ్రీహరిరావు, ఎస్వీఎంసీ ప్రిన్సిపల్ డాక్టర్ రవిప్రభు పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమరయోధులు ఉయ్యాలవాడ వర్ధంతి సందర్భంగా ఎస్వీ వైద్య కళాశాలలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డాక్టర్ రమాదేవి, సిబ్బంది అరుణ్‌బాబు, గోవిందయ్య పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైద్యులు

జనసేన ఆత్మీయ సమావేశం

చంద్రగిరి, న్యూస్‌టుడే: ప్రజాసమస్యలు సత్వరమే పరిష్కరించడమే జనసేన హితమని ఆ పార్టీ నియోజకవర్గ బాధ్యులు దేవర మనోహర్ అన్నారు. పనపాకంలో ఆదివారం జనసేన ఆత్మీయ సమావేశానికి హాజరై మాట్లాడారు. సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలన్నారు. వివిధ పార్టీలకు చెందిన బుడ్డా అనిల్‌కుమార్, కోనంగి ఈశ్వర్, హరికృష్ణ, నరేంద్ర, ఆలం ప్రభాకర్, రేవతి తదితరులు పార్టీలో చేశారు.

ముగిసిన శిక్షణ

తిరుపతి (విద్య), న్యూస్‌టుడే: తిరుపతి జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో గత వారం రోజులుగా జరుగుతున్న స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ ఆదివారం ముగిసింది. వర్సిటీ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు పలు సేవా కార్యక్రమాలు, రక్తదాన శిబిరాలపై అవగాహన కల్పించారు. ప్రజలకు సేవ చేయాలని పలువురు వక్తలు సూచించారు. ఆచార్య వెంకట రావు, రాదా గోవింద త్రిపాఠి, ఆచార్య దక్షిణామూర్తి శర్మ, డాక్టర్ ఎం. దత్తాత్రేయ శర్మ పాల్గొన్నారు.

దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలి

పాకాల, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యలు వెంటనే పరిష్కరించాలని బహుజన టీచర్స్ అసోసియేషన్(బీటీఏ) జాతీయ ఉపాధ్యక్షుడు గుండ్లపల్లి ఆంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక ఎన్‌వీఎన్ పాఠశాలలో బీటీఏ మండల శాఖ అధ్యక్షుడు జ్యోతిప్రసాద్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. 12వ పీఆర్సీ, 30శాతం ఐఆర్ ఇవ్వాలన్నారు. 11వ పీఆర్సీ బకాయిలు, పెండింగ్ 4 డీఏలను చెల్లించాలన్నారు. బీటీపీ జిల్లా అధ్యక్షుడు టి.విశ్వనాథం, రామమూర్తి, రామచంద్రయ్య, ఎంవీమోహన్ పాల్గొన్నారు.

క్రీడలతో ఆత్మవిశ్వాసం

తిరుపతి(మహిళా వర్సిటీ) : క్రీడలతో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని సెట్విన్ సీఈవో యశ్వంత్ పేర్కొన్నారు. కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ (మైభారత్ -చిత్తూరు) ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక యూత్ హాస్టల్‌లో జిల్లా స్థాయి పురుషుల వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు.

ఏపీఆర్‌టీఎఫ్ ఆవిర్భావం

తిరుపతి (విద్య): విశ్రాంత ఉపాధ్యాయులతో ఆంధ్రప్రదేశ్ రిటైర్డ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీఆర్‌టీఎఫ్) ఆదివారం ఆవిర్భవించింది. సంఘీభావంగా ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హృదయరాజు, చిరంజీవి హాజరయ్యారు. అనంతరం రాష్ట్ర అడహక్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా ఏ.సదాశివరావు, (విజయనగరం) కో కన్వీనర్ చంగల్‌రాయ మండడి (చిత్తూరు), సభ్యులుగా కొందరిని నియమించారు.

'మా ప్రాణాలకు రక్షణ కల్పించండి'

చంద్రగిరి, న్యూస్‌టుడే: మామిడి, టేకు, అరటి వృక్షాలను జేసీబీ యంత్రాలతో తొలగించి దౌర్జన్యంగా మా భూమిని కబ్జా చేయడంతో పాటు మాపై దాడులకు పాల్పడ్డారని బాధితులు ఆరోపించారు. బాధితులు భావన, హేమాద్రి దంపతుల కథనం మేరకు.. పనపాకం పంచాయతీ జక్కులవారిపల్లి సర్వే సంఖ్య 652/1డి1లో 4 సెంట్ల భూమిలో మామిడి, టేకు, అరటిచెట్లు పెంచుకుంటూ ఉన్నామన్నారు. కొందరు ఇటీవల తమ కుటుంబంపై పరుష పదజాలంతో దూషించారని, అస్థలం మాదంటూ దౌర్జన్యం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆక్రమణలను అడ్డుకున్న తమపై భౌతికదాడులకు పాల్పడ్డారని తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా న్యాయం చేయలేదన్నారు.

చంద్రబాబువి డైవర్షన్ పాలిటిక్స్: భూమన

తిరుపతి(జీవకోన), న్యూస్‌టుడే: చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నాడని తితిదే మాజీ ఛైర్మన్, వైకాపా జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డి ఆరోపించారు. తిరుపతిలో ఆదివారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. వైకాపా ఎమ్మెల్సీలు సభలోకి వేంకటేశ్వరస్వామి చిత్రపటం తెస్తారా తమ్ముళ్లు అంటూ చంద్రబాబు వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. దేవాలయం వంటి సభలోకి వేంకటేశ్వరస్వామి చిత్రపటం తెస్తే తప్పేంటని ప్రశ్నించారు. ఆయన బూట్లు ధరించి ఎన్నోసార్లు దేవుడు చిత్రాలు ఇవ్వలేదంటూ వ్యాఖ్యానించారు. సుప్రీంకోర్టు అంటే చంద్రబాబుకు లెక్కే లేదని, ఆయన విష ప్రచారం ఎత్తుకున్నారని విమర్శించారు. పరకామణి కేసుపై హైకోర్టులో వ్యాజ్యం పెండింగ్‌లో ఉండగానే మళ్లీ ఎఫ్ఐఆర్ వేయాలని చూస్తారని ఆరోపించారు. మేయర్ డాక్టర్ శిరీష తదితరులు పాల్గొన్నారు.

పోలీసులను కక్షలకు వాడుకుంటున్నారు: అంబటి

తిరుపతి(జీవకోన), న్యూస్‌టుడే: శాంతిభద్రతలు కాపాడాల్సిన పోలీస్ వ్యవస్థను కూటమి ప్రభుత్వం రాజకీయ కక్షలకు వాడుకుంటోందని మాజీ మంత్రి అంబటి రాంబాబు ఆరోపించారు. తిరుపతికి వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు. నా ఇల్లు, ఆఫీస్ పై దాడి జరిగిన సమయంలో పోలీసులు ప్రేక్షక పాత్ర పోషించారన్నారు. పోలీసులను చంద్రబాబు, లోకేశ్‌లు ఏ విధంగా ఉపయోగిస్తున్నారో ప్రజలు గమనిస్తున్నారన్నారు.

అభివృద్ధి అడుగు.. ట్రాఫిక్ పిడుగు

నాయుడుపేట - పూతలపట్టు జాతీయరహదారిలో తనపల్లి క్రాస్ వద్ద ఆరులైన్ల హైవే పనులు జరుగుతున్నాయి. దీంతో తిరుపతి నుంచి మామిడికాయల మండీ మీదుగా తనపల్లి క్రాస్‌కు వచ్చే వాహనాలను తిరుచానూరు ఫ్లైఓవర్ బ్రిడ్జి మీదుగా పంపడంతో కూడలిలో భారీగా ట్రాఫిక్ స్తంభిస్తుంది. అత్యవసరంగా.. శ్రీపద్మావతి అమ్మవారి దర్శనార్థం వెళ్లే శ్రీవారి భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. పనులు జరిగే జాతీయరహదారి వద్ద యూ టర్న్ తీసుకోకుండా రహదారిని ప్రమాదకరంగా ద్విచక్ర వాహన చోదకులు దాటుతున్నారు. అధికారులు పర్యవేక్షించాల్సిన అవసరముంది.

- ఈనాడు, తిరుపతి

తిరుచానూరు ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద స్తంభించిన ట్రాఫిక్

ప్రమాదకరంగా తనపల్లిక్రాస్‌లో బైకుల రాకపోకలు

పాత కక్షలతో కుటుంబంపై దాడి

చంద్రగిరి, న్యూస్‌టుడే: పాత కక్షల మనసు పెట్టకొని కొందరు దుండగులు అర్ధరాత్రి ఓ కుటుంబంపై దాడి చేశారు. ఈ ఘటనలో వృద్ధురాలు గాయపడ్డారు. ఈ ఘటన ఆదివారం రాత్రి ముంగిళిపట్టులో చోటుచేసుకుంది. పోలీసులు, బాధితుల వివరాల మేరకు.. 2025 డిసెంబర్‌లో పశువులు వ్యవసాయ పొలంలో మేయడంతో సుబ్బమ్మ, కుమారుడు పరసురాం, మనవడు సతీష్‌లు పశువుల యజమానులు భానుప్రకాష్, మునికృష్ణను నిలదీశారు. ఈ క్రమంలో అప్పట్లో ఇరువర్గాల మధ్యన గొడవలు జరిగాయి. ఆదివారం రాత్రి ఆమె ఇంట్లోకి చొరబడి దాడిచేశారు. పోలీసులు గాయపడ్డ వృద్ధురాలిని రుయా ఆసుపత్రికి తరలించారు. బాధితురాలి వాగ్మూలం మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేశారు.

రైల్లోంచి జారిపడి గాయాలు

పాకాల, న్యూస్‌టుడే: మండలంలోని చెన్నుగారిపల్లి రైల్వే గేటు సమీపంలో రైల్లోంచి జారిపడటంతో గుర్తు తెలియని వ్యక్తి తీవ్రగాయాల పాలై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గ్యాంగ్‌మ్యాన్ గుర్తించి రైల్వే పోలీసులకు సమాచారమిచ్చారు. 108 వాహనంలో క్షతగాత్రుడిని పి.కొత్తకోట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. రైల్వే ఎస్సై వెంకటనరసింహ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అంతర్‌జిల్లా దొంగ అరెస్టు

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: ఓ ప్రయాణికుడి నుంచి రూ.2 లక్షల నగదు దొంగలించిన అంతర్‌జిల్లా దొంగను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. వైఎస్సార్ కడప జిల్లా వల్లూరు మండలం గోటూరుకు చెందిన జయరామిరెడ్డి శనివారం గ్రామం వద్ద బస్సు ఎక్కగా కడప నగర సమీపంలోని అలంఖాన్‌పల్లె వద్ద ఘటన జరిగింది. ఫిర్యాదు నేపథ్యంలో ఆదివారం భగత్‌సింగ్ పార్కు వద్ద తిరుపతికి చెందిన మల్లిబాబును అరెస్టు చేశారు. వెంకటేష్, మరో దొంగ పరారీలో ఉన్నారు. మల్లిబాబుపై మదనపల్లె, వాల్మీకిపురం ప్రాంతాల్లో చోరీ కేసులు నమోదయ్యాయి.

(c) eenadu

శ్రీకాళహస్తి
• శ్రీకాళహస్తి • సత్యవేడు • రైల్వేకోడూరు

చంద్రప్రభపై దేవదేవుడి దివ్యదర్శనం

శ్రీకాళహస్తి (గ్రామీణం)(ఏర్పేడు), న్యూస్‌టుడే: శ్రీకాళహస్తి మండలంలోని తొండమనాడుపురంలో వెలిసిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం స్వామివారు చంద్రప్రభ వాహనాన్ని అధిరోహించి గ్రామవీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు.

చంద్రప్రభ వాహనంపై భక్తులకు దర్శనమిస్తున్న స్వామివారు

విద్యుత్తు నియంత్రికల ఏర్పాటు

రేణిగుంట, న్యూస్‌టుడే: రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని అధిక లోడు సమస్యను తగ్గించే క్రమంలో మండలంలోని వెంకటాపురం గ్రామంలో నూతనంగా రెండు అదనపు కొత్త విద్యుత్తు నియంత్రికలు ఏర్పాటు చేసినట్లు రేణిగుంట పట్టణ ట్రాన్స్‌కో ఏఈ పుణ్యకోటి తెలిపారు. వీటిని గ్రామ పెద్దల సహకారంతో ఆదివారం ప్రారంభించినట్లు తెలిపారు.

ఘనంగా ప్రపంచ ఆలోచన దినోత్సవం

బీఎన్‌కండ్రిగ, న్యూస్‌టుడే: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ ద్వారా ఆదివారం ప్రపంచ ఆలోచన దినోత్సవాన్ని నిర్వహించారు. స్కౌట్ వ్యవస్థాపకులు లార్డ్ స్టీఫెన్ సన్ స్మిత్ బ్యాడన్ పావెల్, ఒలేవా బేడెన్ బ్రౌన్ జయంతి సందర్భంగా పాఠశాల స్కౌట్ అండ్ గైడ్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు.

సర్వేశ్వరుడికి.. మంత్రపుష్ప నివేదన

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా వేదపఠనం శ్లోకార్చన జరిపారు. ఈ విశేషోత్సవాన్ని పురస్కరించుకుని ధూర్జటి కళా ప్రాంగణం ఆదివారం వేదపండితుల మంత్రోచ్చారణలతో మార్మోగిపోయింది. ప్రచార రథంలో కొలువుదీరిన ఉమాదేవి సమేత చంద్రశేఖరస్వామి ఉత్సవమూర్తులకు విశేష అలంకరణలు చేపట్టారు.

విశేష అలంకరణలో ఉమాదేవి సమేత చంద్రశేఖరస్వామి ఉత్సవమూర్తులు

కమనీయం.. కల్యాణం

ఊంజలసేవలో ఉత్సవమూర్తులు

నాగలాపురం, న్యూస్‌టుడే: నాగలాపురంలో వెలసిన భద్రావతి భావనారుషుల కల్యాణోత్సవం ఆదివారం కమనీయంగా జరిగింది. ఉదయం ఆలయంలో నిత్యకైంకర్యాలు చేపట్టిన తర్వాత భద్రావతి భావనారుషులకు వేదమంత్రాల అభిషేకాలు చేశారు. అలాగే ఊంజల మండపంలో సిద్ధం చేసిన కల్యాణ వేదికపై ఉత్సవమూర్తులను ఉంచి వేదమంత్రాలతో స్వామి అమ్మవార్ల కల్యాణాన్ని నిర్వహించారు. కల్యాణానికి పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు జయపెరుమాళ్, వాసంతి దంపతులు, అఖిల భారత పద్మశాలి సంఘం ఉపాధ్యక్షుడు ఓబులపతి సారె సమర్పించారు.

నృత్యం.. ఆద్యంతం రమణీయం

ధూర్జటి కళా ప్రాంగణంలో నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: నృత్యకారుల అద్వితీయమైన నాట్య ప్రదర్శనతో సభికులు పులకించిపోయారు. ధూర్జటి కళా ప్రాంగణంలో ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు తమదైన నృత్య ప్రదర్శనతో ఆకట్టుకున్నారు.

నేడు బ్రహ్మోత్సవ అభినందన సభ

మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా ఆలయం తరఫున సోమవారం అభినందన సభను ఏర్పాటు చేయనున్నారు. జ్ఞానప్రసూనాంబిక అతిథి గృహం ఎదురుగా ఉన్న బ్రహ్మగుడి ఆవరణలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. బ్రహ్మోత్సవాల్లో సమన్వయ సహకారాలు అందించిన అన్ని శాఖల అధికారులను సత్కరించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

భవిష్యత్తు.. మీ చేతుల్లోనే

పుల్లంపేట, న్యూస్‌టుడే: మీ భవిష్యత్తు మీ చేతుల్లోనే ఉందని ప్రిన్సిపల్ శ్రీనివాసులు అన్నారు. ఆదివారం స్థానిక శాంతినికేతన్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సభ నిర్వహించారు. సమావేశానంతరం విద్యార్థుల నృత్య ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది.

ప్రయోగం.. సత్ఫలం

* ఉత్సవాలు విజయవంతం
* నేడు శాంతి అభిషేకాలతో ముగింపు

కైలాసగిరి ప్రదక్షిణోత్సవానికి అశేషంగా తరలివచ్చిన జనం

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రయోగాత్మక నిర్ణయాలు సత్ఫలితాలు ఇచ్చాయి. ముందస్తుగా నిర్వహించిన సమీక్షలు, శాఖల సమన్వయం, సహకారంతో వార్షికోత్సవాలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పూర్తయ్యాయి.

రద్దీలోనూ ప్రథమం.. ప్రశాంతం

శివరాత్రి రోజు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్నీ శైవాలయాల్లోకి శ్రీకాళహస్తీశ్వరాలయం రద్దీ నేపథ్యంలో ప్రథమ స్థానంలో నిలిచింది. శ్రీశైలంలో ఉత్సవాలు ప్రారంభం సందర్భంగా జరిగిన తొక్కిసలాట, లారీ చార్జి ఘటనతో శివరాత్రి రోజు 98 వేల మంది భక్తులు దర్శనం చేసుకున్నారు. అదే శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఉదయం నుంచి రాత్రి ఆలయం మూత వేసే సమయానికి 1.28 కోట్ల మంది దర్శించుకోవడం ఓ రికార్డు.

భారీగా జనం

బ్రహ్మోత్సవాల్లో ఉత్సవాలు ఫలవంతంగా సాగాయి. ప్రధాన రోజుల్లో కన్నా ఆలస్యమైన ఉత్సవ నిర్వహణను చూసేందుకు భక్తులు భారీగా వచ్చారు.

విమర్శలకు అవకాశం

వార్షిక ఉత్సవాల దృష్ట్యా విమర్శలు చోటు చేసుకున్నాయి. నందిసేవ ఉత్సవం తరువాత ఉత్సవమూర్తులను లోనికి తీసుకెళ్లే సమయంలో తోపులాటలు, భక్తులతో పాటు శివస్వాములను కట్టడి చేసేందుకు పోలీసులు చర్యలు చేపట్టడం, శివరాత్రి రోజు మణెమ్మ అనే మహిళ రాజగోపురం వద్ద స్పృహతప్పి పడిపోవడం, ఆస్పత్రికి తీసుకెళ్లేలోగా మృతి చెందడం చర్చనీయాంశం అయ్యాయి. ఇక గిరిప్రదక్షిణ రోజున కొబ్బరికాయ వివాదం కొంత గందరగోళానికి దారితీసింది. శ్రీపాదకూలీలు అలకతో అధికారులకు కొంత ఇబ్బందులు తప్పలేదు. ప్రొటోకాల్ సక్రమంగా పాటించడం లేదంటూ కొందరు ట్రస్టుబోర్డు సభ్యులు బహిర్గతంగా అసంతృప్తి వ్యక్తం చేయడం గమనార్హం.

కలిసొచ్చిన కొత్త నిర్ణయాలు

వార్షిక బ్రహ్మోత్సవాల్లో ఈ ఏడాది తీసుకున్న కొత్త నిర్ణయాలు ఉత్సవాలు ఫలవంతం అయ్యేందుకు ఎంతో దోహదపడ్డాయి. ప్రధానంగా ఆలయ ఆవరణలో నిర్వహించే రూ.5 వేలు, రూ.2,500 రాహు, కేతు సర్ప దోష నివారణ పూజలు రద్దు చేయడం, అంతరాలయ దర్శనాలు కట్టడి చేయడం, ప్రత్యేక దర్శన టికెట్ రూ.50 రద్దు, ముందస్తుగా లఘు దర్శనాలు అమల్లోకి తీసుకురావడం వంటి కారణాలతో భక్తులు సంతృప్తిగా దర్శనం చేసుకోగలిగారు. కైలాసగిరి ప్రదక్షిణ మహోత్సవం సందర్భంగా వాహనాల రాకపోకలపై ఆంక్షలు విధించడంతో ఊహించని విధంగా భక్తులు నడుస్తూ ఉత్సవంలో పాల్గొనడం విశేషతను సంతరించుకుంది.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
శ్రీకాళహస్తి : 80085 74555
నాగలాపురం : 98854 43308
ఓబులవారిపల్లె : 99664 67525
రైల్వేకోడూరు : 97035 72572

ఏర్పేడు, న్యూస్‌టుడే: సమస్య: ఐసర్ సమీపంలో ఏర్పేడు-వెంకటగిరి ప్రధాన రహదారి వెంబడి కోళ్ల వ్యర్థాలను పడవేస్తుండడంతో దుర్వాసన వెదజల్లుతోంది. వాహన చోదకులు అవస్థలు పడుతున్నారు. – వెంకటేష్, స్థానికుడు

సమాధానం: సంబంధిత పంచాయతీ అధికారులతో చర్చించి వ్యర్థాలను శుభ్రం చేస్తాం. ఇకపై రోడ్డు పక్కన పడవేయకుండా చర్యలు తీసుకుంటాం. – రమణకుమార్, డిప్యూటీ ఎంపీడీవో

విన్నారు.. పరిష్కరించారు

స్పందనకు వందనం

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: పట్టణంలోని పీర్ల చావిడి వీధిలో పేరుకుపోయిన వ్యర్థాలను పారిశుద్ధ్య కార్మికులు తొలగించారు. వ్యర్థాలతో ఇబ్బందులను 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా పురపాలక సంఘ అధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. కమిషనర్ భవానీ ప్రసాద్ సూచనలతో పారిశుద్ధ్య కార్మికులు వ్యర్థాలు తొలగించారు. **ఓబులవారిపల్లె, న్యూస్‌టుడే:** మండల పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద లీకవుతున్న పైపులైన్‌కు మరమ్మతులు చేశారు. **సత్యవేడు:** మండల కేంద్రంలోని అటవీ అభివృద్ధి కార్యాలయం, ప్రిన్సస్ వీధిలో మురుగు కాలువలను పారిశుద్ధ్య కార్మికులు శుభ్రం చేశారు. శనివారం 'ఈనాడు'లో సమస్యపై వార్త రావడంతో స్పందించిన పంచాయతీ కార్యదర్శి మునిరవికుమార్ కాలువలోని వ్యర్థాలను శుభ్రం చేయించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

అప్పటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

కేవీబీపురం, న్యూస్‌టుడే: మండలంలోని అంజూరు ఉన్నత పాఠశాలలో 2003-04 ఏడాదిలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం సమావేశమయ్యారు. అప్పటి జ్ఞాపకాలను పూర్వ విద్యార్థులు గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్షా సామగ్రిని పంపిణీ చేశారు.

డిజిటల్ చెల్లింపులతో అక్రమాలకు చెక్

వరదయ్యపాళెం, న్యూస్‌టుడే: డ్వాక్రా మహిళా పొదుపు సంఘాల ఆర్థిక లావాదేవీల్లో డిజిటల్ చెల్లింపులకు ప్రభుత్వం అవకాశం కల్పించడం ద్వారా అక్రమాలకు అడ్డుకట్ట పడుతుందని డీపీఎం సత్యవేడు గుత్తి త్యాగరాజు అన్నారు. ఆదివారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ వెలుగు, స్త్రీశక్తి రుణాలపై డిజిటల్ ఆన్‌లైన్ చెల్లింపులకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. దీని వల్ల వెలుగు, స్త్రీనిధి చెల్లింపులను ఆన్‌లైన్ ద్వారా జరిగేలా చర్యలు తీసుకోవాలని తాను గత ఏడాది జనవరి 30వ తేదీన మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు విన్నవించినట్లు తెలిపారు. ఈ మేరకు ప్రభుత్వం స్పందించడం పట్ల కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

ముగిసిన కుంభాభిషేకం

సత్యవేడు, న్యూస్‌టుడే: మండలంలోని మదనంబేడు గ్రామంలో పునర్నిర్మించిన శ్రీ అంకాళ పరమేశ్వరి ఆలయంలో మూడు రోజులుగా నిర్వహించిన మహాకుంభాభిషేకం పూజలు ఆదివారం ముగిశాయి. ఈ వేడుకల్లో పాల్గొన్న తెదేపా నియోజకవర్గ కో-ఆర్డినేటర్ కూరపాటి శంకర్‌రెడ్డి, నాయకులను ఆలయ నిర్వాహకులు, గ్రామపెద్దలు సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు పరమశివం, శివకుమార్ నాయుడు, కృష్ణయ్యయాదవ్, చిన్నా తదితరులు పాల్గొన్నారు.

వాల్టా చట్టానికి తూట్లు

పుల్లంపేట, న్యూస్‌టుడే: పచ్చని చెట్లను కూల్చి వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తున్నా అధికారులు పట్టించుకోవడంలేదని పలువురు ఆరోపిస్తున్నారు. పుల్లంపేట మారెమ్మ గుడి వెనుక భాగంలోని కాలువ గట్టున ఉన్న భారీ చెట్టును ఆదివారం నరికేశారు. ఈ విషయమై అధికారులను వివరణ కోరగా.. ఎలాంటి అనుమతి ఇవ్వలేదని తెలిపారు.

ఆకట్టుకున్న వేద పఠనం

వేద పఠనానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పండితులు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన సామూహిక వేద పఠనం అద్భుతం ఆకట్టుకుంది. ఆలయ ఆవరణలోని శ్రీమేధా దక్షిణామూర్తి సన్నిధి వద్ద ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఘనాపాటీలు, వేదపండితుల సామూహిక వేద మంత్రోచ్చారణలు ఆకట్టుకున్నాయి. ఈ విశేషోత్సవంతో ముక్కంటి ఆలయం పులకించిపోయింది. కార్యక్రమంలో ఆలయ ఈవో బాపిరెడ్డి, డిప్యూటీ ఈవో ఎన్.ఆర్.కృష్ణారెడ్డి, ట్రస్టు బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

దాతల సహకారంతో అన్నదాన భవనం

ఏర్పేడు, న్యూస్‌టుడే: దాతల సహకారంతో గుడిమల్లంలో వెలిసిన శ్రీ పరశు రామేశ్వరాలయంలో నిత్యాన్నదాన భవనం నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. దీనికి సంబంధించి ఆలయ ఛైర్మన్ గిరినాయుడు, ఈవో రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం భూమిపూజ చేశారు. మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే కుటుంబ సభ్యులు గతంలో భూమి విరాళంగా అందజేయగా విశాఖపట్నంకు చెందిన మైత్రి భవన నిర్మాణ సంస్థ రూ.40 లక్షలతో ఉచితంగా అన్నదాన భవనాన్ని నిర్మించేందుకు ముందుకు వచ్చింది. ఈ క్రమంలోనే ఆత్మారామ హంగులతో రెండు వేల మందికి పైగా భక్తులు అన్నప్రసాదం స్వీకరించేలా భవన నిర్మాణం చేపట్టేందుకు చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

భూమిపూజ చేస్తున్న ఆలయ ఛైర్మన్ గిరినాయుడు

నడిరోడ్డుపై నీటి గుంత

మండలంలోని కాట్రకాయలగుంట సమీపంలో శ్రీకాళహస్తి-పంగూరు ప్రధాన రహదారిపై నీరు ఉప్పొంగుతోంది. వ్యవసాయ మోటారు నుంచి నీరు సరఫరా చేసే పైపులైను పగిలి పోవడంతో ఇలా నిత్యం ఊట బావి వలే నీరు పైకి ఎగసి పడుతోంది. దీంతో ప్రధాన రహదారిపై ఏర్పడిన చిన్నపాటి గుంత రోజురోజుకు ప్రమాదకరంగా మారుతోంది. రోజు రాకపోకలు సాగించే వాహనాలు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉందని స్థానికులు వాపోతున్నారు. **- న్యూస్‌టుడే, ఏర్పేడు**

బోరును బాగు చేయండి

మండల కేంద్రంలోని దళవాయి అగ్రహారం రెండో వీధిలో చేతి పంపు అధ్వానంగా తయారైంది. చేతి పంపు బోరు మరమ్మతులకు గురై సుమారు ఆరు నెలలు గడుస్తున్నా పట్టించుకునే వారే లేరని స్థానికులు ఆరోపిస్తున్నారు. సమస్యను పంచాయతీ అధికారులకు చెప్పినా పెడచెవిన పెడుతున్నారని వాపోతున్నారు. చేతి పంపు బోరును మరమ్మతులు చేసి ప్రజలకు అందుబాటులో తేవాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, సత్యవేడు**

అసంపూర్తి పనులతో అవస్థ

స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో నాడు-నేడు కింద నిర్మించిన భవనం అసంపూర్తిగా నిలిచిపోవడంతో గదుల కొరతతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలలో 600 మందికి పైగా విద్యార్థులు ఉన్నారు. అదనపు తరగతి గదులకు నాడు-నేడు నిధులు మంజూరు కావడంతో, స్థలం లేని కారణంగా కూలడానికి సిద్ధంగా ఉన్న శిథిల గదులను కూల్చివేసి ఆ స్థానంలో నూతన భవనాన్ని నిర్మించగా నిధుల కొరత కారణంగా మూడేళ్లుగా అసంపూర్తిగా దర్శనమిస్తోంది. అధికారులు స్పందించి గదుల నిర్మాణానికి చర్యలు తీసుకోవాల్సి ఉంది. **- న్యూస్‌టుడే, వరదయ్యపాళెం**

రహదారికి అడ్డుగా లారీ.. రాకపోకలకు అంతరాయం

శ్రీకాళహస్తి-తడ రహదారి సుద్దమిట్ట ఎస్టీ కాలనీ వద్ద ఆదివారం ట్రాఫిక్ స్తంభించింది. తడ నుంచి శ్రీకాళహస్తి వైపు వెళుతున్న లారీ డ్రైవర్ వాహనాన్ని వెనుకకు తిప్పేందుకు ప్రయత్నించడంతో రోడ్డుకు అడ్డంగా నిలిచి ఆగిపోయింది. దీంతో ట్రాఫిక్ స్తంభించడంతో డ్రైవర్ భయపడి పరారయ్యారు. ఇతర వాహన చోదకులు శ్రమించి అడ్డుగా ఉన్న లారీని తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు.

- న్యూస్‌టుడే, బీఎన్‌కండ్రిగ

కమనీయం.. కల్యాణం

పుల్లంపేట, న్యూస్‌టుడే: మండల పరిధిలోని కొత్తపేట పంచాయతీ అయోధ్యనగర్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆలయంలో ఆదివారం సీతారామలక్ష్మణ ఆంజనేయస్వామి మూలవిరాట్ విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. అనంతరం సీతారామ ఉత్సవ విగ్రహాలకు మంగళవాయిద్యాల నడుమ కల్యాణం నిర్వహించారు.

సీతారాముల కల్యాణం చేస్తున్న పండితులు

పచ్చదనం అభివృద్ధి లక్ష్యం

మొక్కలు నాటుతున్న స్కౌట్స్ విద్యార్థులు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: స్కౌట్స్ అండ్ గైడ్స్ వ్యవస్థాపకులు బేడన్ పావెల్ వందో జయంతిని పురస్కరించుకుని ఆదివారం పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాల ఆవరణలో స్కౌట్ విద్యార్థులు మొక్కలు నాటారు. ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జిల్లా శిక్షణాధికారి సావిత్రి, యూత్ ఛైర్మన్ ఎస్.కె.అజారుద్దీన్, కుసుమకుమారి, విద్యాసాగర్, వెంకటేష్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఏళ్ల కల నెరవేరింది

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: ఏళ్లుగా కంటున్న కలలు ఇప్పటికి నెరవేరాయని బలిజ సంఘం నేతలు అన్నారు. పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహానికి సమీపంలో ఆదివారం బలిజ భవన నిర్మాణానికి భూమిపూజ చేపట్టారు. ఐదు నెలల్లో బలిజ భవన నిర్మాణం పూర్తి చేస్తున్నట్లు నేతలు వివరించారు. కార్యక్రమంలో భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్, ట్రస్టుబోర్డు ఛైర్మన్ కొట్టే సాయిప్రసాద్, ట్రస్టుబోర్డు మాజీ ఛైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, పురపాలక సంఘ మాజీ ఛైర్మన్ పార్థసారథి, నాయకులు సురేష్, స్వర్ణమూర్తి, ఉప్పు కృష్ణయ్య, కృష్ణమూర్తి, రాఘవయ్య, చంద్ర, వెంకటేష్, దుమ్ముగాయల్, నరేంద్ర, ఉమ, సత్యం, కంటా రమేష్, కాసరం రమేష్, రాజు, గణేష్, కిషోర్, షణ్ముగం తదితరులు పాల్గొన్నారు.

బలిజ భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న వివిధ పార్టీల నేతలు

శ్రీకాళహస్తి అమ్మాయి.. స్వీడన్ అబ్బాయి

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: వృత్తిరీత్యా ఒకే దగ్గర పనిచేస్తున్న వారి మధ్య ఏర్పడ్డ స్నేహం ప్రేమగా మారింది. చివరకు ఖండాంతరాలను దాటి పెళ్లి పీటలెక్కి ఒక్కటయ్యారు. ఆర్టీసీలో కండక్టర్‌గా పని చేస్తూ ఉద్యోగ విరమణ చేసిన శ్రీకాళహస్తి పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీకి చెందిన వెలుగోటి వెంకటరమణ, అరుణ కుమార్తె శ్రీలేఖ వెలుగోటి సాఫ్ట్‌వేర్ ఇంజినీరుగా పలుచోట్ల పనిచేసి చివరకు స్వీడన్‌లో స్థిరపడ్డారు. ఆమెతోపాటు పనిచేస్తున్న స్నేహితురాలి ద్వారా స్వీడన్‌కు చెందిన ఉల్ఫ్ కార్ల్‌సన్, లిండా కార్ల్‌సన్ కుమారుడు జోనాథన్ కార్ల్‌సన్‌తో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. వీరిరువురు పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకుని విషయాన్ని తల్లిదండ్రుల దృష్టికి తీసుకెళ్లారు. అంగీకరించిన పెద్దలు శుక్రవారం తిరుపతిలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో హిందూ సంప్రదాయం ప్రకారం వివాహాన్ని జరిపించారు.

పెళ్లిపీటలపై శ్రీలేఖ, జోనాథన్

నేడు 'చాగంటి' పురాణ ప్రవచనం

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలు ముగింపు సందర్భంగా బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు పురాణ ప్రవచనాన్ని ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తెలిపారు. ధూర్జటి కళా ప్రాంగణం ఆవరణలో సోమవారం సాయంత్రం 6 గంటలకు చాగంటి కోటేశ్వరరావు పురాణ ప్రవచనం జరుగుతుందని, భక్తులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరానికి స్పందన

పుల్లంపేట, న్యూస్‌టుడే: విభిన్న ప్రతిభావంతుల సమైఖ్య సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి మంచి స్పందన లభించిందని సంఘం అధ్యక్షుడు సుబ్బనరసారెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక ఎస్‌బీవీడీ సభా ఉన్నత పాఠశాల ప్రాంగణంలో కడప పుష్పగిరి నేత్ర వైద్య బృందం ఈ వైద్య శిబిరం నిర్వహించింది. ఎనిమిది మందిని నేత్ర శస్త్రచికిత్సకు ఎంపిక చేసినట్లు వైద్యులు సునీల్, జస్వంత్, ఆకాష్, తెలిపారు.

శస్త్రచికిత్సలకు ఎంపికైన వారితో దివ్యాంగుల సంఘం నాయకులు, వైద్య బృందం

8న ఆత్మీయ సమ్మేళనం

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: వన్నెకుల క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో వచ్చే నెల 8వ తేదీన ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసినట్లు కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల రవి తెలిపారు. తిరుపతిలో నిర్వహించే ఈ కార్యక్రమంతో పాటు వివాహ పరిచయ వేదికను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ మేరకు పట్టణంలోని ప్రైవేటు అతిథి గృహంలో ఆదివారం గోడపత్రికలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో బాలసుబ్రహ్మణ్యం, మునిరత్నంరెడ్డి, సుబ్రహ్మణ్యంరెడ్డి, బాలాజీరెడ్డి, ఎం.ఎస్.రెడ్డి, జనార్దన్‌రెడ్డి, రామారావు, కరుణాకర్‌రెడ్డి, రుద్రకిశోర్, రాము, మధు, ప్రసాద్ పాల్గొన్నారు.

భవిష్యత్తు లక్ష్యాలు సాధించాలి

తొట్టంబేడు, న్యూస్‌టుడే: విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పరీక్షలు ఎదుర్కొని, భవిష్యత్ లక్ష్యాలను సాధించాలని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి సూచించారు. సోమవారం నుంచి ఇంటర్మీడియేట్ పరీక్షలు ప్రారంభం కానున్న సందర్భంగా ఆయన ఆదివారం స్పందించారు. విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపిన ఆయన ఉత్తమ ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. వేసవి దృష్ట్యా విద్యార్థులు ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతో పాటు ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాయాలని కోరారు.

మము బ్రోవ రావమ్మా.. అనంతపురమ్మ

పుల్లంపేట, న్యూస్‌టుడే: మండల పరిధిలోని ఎగువరెడ్డిపల్లెలో వెలసిన అనంతపురమ్మ పొంగళ్లను ఆదివారం నిర్వహించారు. మహిళలు పొంగళ్లతో ఊరేగింపుగా ఆలయ ప్రాంగణానికి చేరుకుని మొక్కులు తీర్చుకున్నారు.

ఎగువరెడ్డిపల్లెలో కొలువుదీరిన అమ్మవారు

అసాంఘిక శక్తులపై పోలీసు ఉక్కుపాదం

కేవీబీపురం: మండలంలో అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపడమే పోలీస్ శాఖ ముందున్న లక్ష్యమని ఎస్సై ఓబయ్య అన్నారు. ఆదివారం మండలంలోని రంగయ్యగుంటలో గ్రామస్థులతో సమావేశమైన ఆయన గంజాయి, చైన్ స్నాచింగ్, చీటింగ్, మత్తుపదార్థాల పంపిణీ వంటి కార్యక్రమాల్లో కొంత మంది యువత వ్యసనాలకు బానిసై పాల్గొంటున్నారని చెప్పారు. వీటిని రూపుమాపేందుకు ప్రజల సహకారం అవసరమని పేర్కొన్నారు. సిబ్బంది రాధాకృష్ణ, విశ్వనాథం, సుజా, దయాకర్, గ్రామస్థులు పాల్గొన్నారు.

దుకాణాలపైకి దూసుకెళ్లిన కారు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: పట్టణంలోని కొత్తపేట వద్దనున్న దుకాణాలపైకి ఆదివారం రాత్రి ఓ కారు దూసుకెళ్లింది. కారు నడుపుతున్న వ్యక్తి వేగంగా నడుపుతూ అదుపు చేయలేక పక్కనున్న దుకాణాలపై దూసుకెళ్లారు. అయితే ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న ఒకటో పట్టణ ఎస్సై రవి ఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. కారు నడిపిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నారు.

సమతానగర్‌లో పోలీసుల సోదాలు

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: మండల పరిధిలోని సమతానగర్‌లో పోలీసులు ఆదివారం కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. సీఐలు చంద్రశేఖర్, శ్రీనివాసులు, ఎస్సై లక్ష్మీప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది అక్కడి నివాసాలు, పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఎలాంటి రికార్డులు లేని 15 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలు, పోలీసులు

'గాలేరు-నగరి సుజల స్రవంతికి నిధులెక్కడ'

చిట్వేలి, ఓబులవారిపల్లె, న్యూస్‌టుడే: రాష్ట్ర బడ్జెట్‌లో గాలేరు-నగరి సుజల స్రవంతికి నిధులు కేటాయించకపోవడం దారణమని సాగునీటి రంగం విశ్లేషకుడు టి.లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం చిట్వేలి మండలంలోని వెంకటరాజుపల్లె గ్రామంలో రైతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మలిశెట్టి జతిన్, రాహుల్, రాజా, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియమాలు పాటించని వ్యక్తిపై కేసు

ఓబులవారిపల్లె, న్యూస్‌టుడే: మండల పరిధిలోని చిన్నఓరంపాడు జాతీయ రహదారిపై ఆదివారం ట్రాఫిక్ నియమాలు పాటించకుండా ద్విచక్ర వాహనం నడుపుతున్న వ్యక్తిపై కేసు నమోదు చేశామని ఎస్సై మహేష్ తెలిపారు.

CHANGE OF SURNAME
I, BATTALA VARA LAKSHMI (OLD NAME), W/o BATTALA VENKATESULU, R/o D.No:8/28-2, VADDIPALLI, KODUR, RAILWAY KODUR (M), ANNAMAYYA DIST., - 516101. HAVE CHANGED MY SURNAME TO **KUNCHAM VARALAKSHMI (NEW NAME)**. HENCEFORTH, I SHALL BE KNOWN AS **KUNCHAM VARALAKSHMI (NEW NAME)**.

(c) eenadu

ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

దొరవారిసత్రం, న్యూస్‌టుడే: మండలంలోని మాలిక్ పాడులో ఉన్న ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతిలో చేరే విద్యార్థులు ఆన్‌లైన్‌లో, పాఠశాలలో నేరుగా దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపల్ సీహెచ్ సుమలత ఆదివారం తెలిపారు. విద్యార్థులు సెప్టెంబరు 2014 నుంచి ఆగస్టు 2016 మధ్య జన్మించి ఉండాలని, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో అయిదో తరగతి చదువుతూ ప్రమోషన్ పూర్తి చేసి ఉండాలన్నారు.

చంద్రప్రభపై దేవదేవుడి దివ్యదర్శనం

శ్రీకాళహస్తి గ్రామీణం(ఏర్పేడు), న్యూస్‌టుడే: శ్రీకాళహస్తి మండలంలోని తొండమానుపురంలో వెలిసిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం స్వామివారు చంద్రప్రభ వాహనాన్ని అధిరోహించి గ్రామవీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు.

సూళ్లూరుపేట

• సూళ్లూరుపేట • వెంకటగిరి

తాగునీటి సమస్య తీరుస్తాం

నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

వాకాడు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన జలజీవన్ మిషన్ ప్రాజెక్టు ద్వారా నియోజకవర్గంలో తాగునీటి సమస్యలను తీరుస్తామని గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. ఆదివారం ఆయన వాకాడు మండలం వావిళ్లపాలెం గ్రామంలో తెదేపా నేత వాకాటి గంగాధర్‌రెడ్డి కూతురు వివాహానికి వచ్చారు. చిల్లకూరు, కోట, వాకాడు, చిట్టమూరు తీర మండలాల్లో తాగునీటి ఎద్దడిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొంటున్నట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో తెదేపా నేతలు మధురెడ్డి, కృష్ణమూర్తి, సన్నారెడ్డి విజయశేఖర్‌రెడ్డి, చంద్రభూషణ్‌రెడ్డి, కుంచం దయాకర్, జనార్దన్‌రెడ్డి, గంగాధర్‌రెడ్డి పాల్గొన్నారు.

మానసికోల్లాసంతోనే చక్కటి ఆరోగ్యం

చిన్నారులను అభినందిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణ

వెంకటగిరి, న్యూస్‌టుడే: మానసికోల్లాసంతోనే ఆరోగ్యవంతమైన జీవనం సాధ్యమని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. ఆదివారం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో హ్యాపీ సండే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు చిన్నారులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత తెదేపా పాలనలో యువత, చిన్నారులు, ఉద్యోగులకు ఒత్తిడి తగ్గించేందుకు హ్యాపీ సండే కార్యక్రమం చేపట్టారన్నారు. కూటమి పాలనలో మళ్లీ ప్రారంభించామని చెప్పారు. నృత్యప్రదర్శన చేసిన చిన్నారులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో పుర కమిషనర్ కిరణ్, మేనేజర్ సాంబశివయ్య, ఏఎంసీ ఛైర్మన్ విశ్వనాథం, పట్టణాధ్యక్షుడు సత్యనారాయణ, నేతలు రాజేశ్వరరావు, గంగాధర్ పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదుతోనే పదవులు

మాట్లాడుతున్న జనసేన నాయకులు

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: సభ్యత్వ నమోదుతోనే పార్టీలో పదవులకు ఎంపిక చేస్తారని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ అవకాశం కల్పిస్తారని సూళ్లూరుపేట జనసేన నాయకుడు అట్ల కృష్ణారావు పేర్కొన్నారు. నాయుడుపేట జనసేన కార్యాలయంలో ఆదివారం సభ్యత్వ నమోదుపై మాట్లాడారు. సభ్యత్వ నమోదు చేయించిన వారికి పార్టీలో తగిన గుర్తింపు ఉంటుందన్నారు. పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠ

వెంకటగిరి, న్యూస్‌టుడే: కుమ్మరిగుంటలోని అయ్యప్ప స్వామి ఆలయంలో ఆదివారం ఘనంగా నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. నూతనంగా నిర్మించిన మందిరంలో నవగ్రహాలను వేద పండితులు సంప్రదాయబద్ధంగా ప్రతిష్ఠించారు. అనంతరం మహా పూర్ణాహుతి, సంప్రోక్షణ చేశారు. ఆలయంలో భక్తులకు అన్నప్రసాదాలు వితరణ చేపట్టారు. విగ్రహదాత కావేరిపాకం పురుషోత్తం, శాంతిలను ఆలయ నిర్వాహకులు సత్కరించారు.

పల్లె దారులకు మహర్దశ

రూ.19.84 కోట్లతో అభివృద్ధి

మరమ్మతులు చేయనున్న వేణుంబాక రోడ్డు

సూళ్లూరుపేట, నాయుడుపేట, న్యూస్‌టుడే: పంచాయతీరాజ్‌శాఖ పరిధిలో అధ్వానంగా ఉన్న పల్లె రోడ్లకు త్వరలో మోక్షం కలగనుంది. కూటమి ప్రభుత్వం సూళ్లూరుపేట, వెంకటగిరి, గూడూరు నియోజకవర్గాల్లో 31.18కి.మీ నడివి కలిగిన 13 రోడ్లను ఏపీఆర్ఆర్ఎస్ ద్వారా రూ.19.84 కోట్లతో మరమ్మతులు చేయనున్నారు. ఇందుకు సంబంధించిన టెండర్ల ప్రక్రియను పీఆర్ ఇంజినీరింగ్ విభాగం చేపట్టింది.

పనులు చేసే ప్రాంతాలు

తడ మండలంలో సీకే రోడ్డు అండగుండాల, సూళ్లూరుపేట మండలంలో ఐటీ రోడ్డు నుంచి సుద్దమడుగుతాగేలి, పెళ్లకూరు మండలంలో పీఎన్ రోడ్డు నుంచి చవటకండ్రిగ, దొరవారిసత్రం మండలం సి.కె రోడ్డు వేణుంబాక, వెంకటగిరి మండలంలో యల్లకారు నుంచి నీలకంఠపురం, ఎన్‌వీరోడ్డు నుంచి పెట్లూరు, యతలూరు నుంచి కె.ఉప్పరపల్లి, యతలూరు నుంచి పెట్లూరు ఎస్సీ కాలనీ, డక్కిలి మండలంలో ఈసీరోడ్డు నుంచి శ్రీపురం, వాకాడు మండలంలో జీడీ రోడ్డు నుంచి దుర్గవరం, చిట్టమూరు మండలంలో అలేటిపాడు నుంచి వాకాడు, ఓడీ రోడ్డు నుంచి అలేటిపాడు వరకు ఉన్న పీఆర్ రోడ్లకు శాశ్వతంగా మరమ్మతులు చేయనున్నారు.

అయిదేళ్లుగా నిర్లక్ష్యం

పంచాయతీరాజ్ శాఖ రోడ్ల నిర్వహణకు వైకాపా ప్రభుత్వం నిధులు కేటాయించడంలో తీవ్రజాప్యం చేసింది. వరదలు, వాహనాల రద్దీకి పలుచోట్ల రోడ్లు దెబ్బతిన్నాయి. ఇవికాకుండా పీఎంజీఎస్‌వై, నాబార్డు, పీఆర్ పథకాలు చేపట్టినా రోడ్ల నిర్వహణ కూడా చేపట్టకపోవడంతో చిన్నపాటి గుంతలు పెద్దవిగా మారి అధ్వానంగా తయారయ్యాయి. కూటమి ప్రభుత్వం శాశ్వత మరమ్మతులకు నిధులు కేటాయించడంతో రోడ్లు కొత్తరూపు సంతరించుకోనున్నాయి.

నిధులు వివరాలు

పథకం	: ఏపీఆర్ఆర్ఎస్‌పీ
మంజూరైన పనులు	: 13
అభివృద్ధి చేసే దూరం	: 31.18 కి.మీ
మంజూరైన నిధులు	: రూ.19.84 కోట్లు

మేమున్నాం.. మీకు తోడుగా..

నాయుడుపేట: 80085 73970
సూళ్లూరుపేట: 88979 08890
వెంకటగిరి: 80085 73966
సమయం 10 AM TO 1 PM

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: సమస్య: నాయుడుపేట శ్రీకాళహస్తి రోడ్డుపై మేనకూరు సెజ్ కంపెనీల ప్రైవేటు బస్సులు ఎక్కడబడితే అక్కడ ఆపుతున్నారు. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. **- స్థానికులు**

సమాధానం: కంపెనీలకు సిబ్బందిని తరలించే వాహనాల యజమానులను సమావేశపరిచి సూచనలు చేస్తాం. **-చెంచుబాబు, డీఎస్పీ**

సూళ్లూరుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: సమస్య: మండలంలోని ఇల్లుపూరు గ్రామంలో విద్యుత్తు దీపాలు నిత్యం వెలుగుతున్నాయి. **- మల్లికార్జున్, స్థానికుడు**

సమాధానం: పరిశీలించి చర్యలు తీసుకొంటాం **- శేఖర్‌బాబు, విద్యుత్తు శాఖ ఏడీ**

సూళ్లూరుపేట పట్టణం, న్యూస్‌టుడే: సమస్య: పట్టణంలోని బాపూజీ వీధిలో దీపాలు వెలగడం లేదు. **- రమేష్, స్థానికుడు**

సమాధానం: వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం. **- చిన్నయ్య, కమిషనర్**

సమస్య: పట్టణంలోని చాకలి వీధిలో రహదారి పక్కన, మురుగు ముందుకు కదలకపోవడంతో దుర్వాసన వస్తోంది. దోమల బెడద ఎక్కువగా ఉంది. **-వెంకటేష్, స్థానికుడు**

సమాధానం: మురుగును సిబ్బందితో వెంటనే తొలిగించేలా చర్యలు తీసుకుంటాం. **- చిన్నయ్య, కమిషనర్**

విద్యార్థినికి ఆర్థిక సాయం

చిట్టమూరు, న్యూస్‌టుడే: మండలంలోని కొత్తగుంట టీఎంఆర్ కళాశాలలో ఇంటర్ రెండో ఏడాది చదువుతున్న వెంకటలక్ష్మికి బయ్యావారికండ్రిగ గ్రామానికి చెందిన బెజవాడ అశోక్ రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు.

సర్వసభ్య సమావేశం

మాట్లాడుతున్న ఏపీవో లక్ష్మీనారాయణ

సూళ్లూరుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని మండల ప్రజా పరిషత్తు కార్యాలయంలో ఆదివారం ఎంపీడీవో మురళీకృష్ణ ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం జరిగింది. ఆయన అన్ని శాఖలపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దారు గోపీనాథ్‌రెడ్డి, ఎంపీపీ అనిల్‌రెడ్డి, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

నూతన ఎస్సైగా అజయ్‌కుమార్

సూళ్లూరుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: సూళ్లూరుపేట ఎస్సైగా అజయ్‌కుమార్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ట్రాఫిక్ నియంత్రణకు ప్రాధాన్యం ఇస్తామని ఆయన తెలిపారు. వాహనదారులకు హెల్మెట్, లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలన్నారు. నిబంధనలు పాటించకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రమాదాల నివారణకు చర్యలు

దొరవారిసత్రం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు తగిన చర్యలు చేపడుతామని ఆదివారం కొత్తగా బాధ్యతలు చేపట్టిన దొరవారిసత్రం ఎస్సై గరికపాటి వెంకటేశ్వర చౌదరి తెలిపారు. సిబ్బందికి ఆయనకు స్వాగతం పలికారు. మండలంలోని శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు.

- దొరవారిసత్రం ఎస్సై వెంకటేశ్వర చౌదరి

యువత అభివృద్ధే లక్ష్యం

బాలాయపల్లిలో ప్రసంగిస్తున్న ఎమ్మార్పీఎస్ నేత దేవదాస్

బాలాయపల్లి, న్యూస్‌టుడే: యువత అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించడమే లక్ష్యంగా కృషిచేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌ఛార్జి వర్ల దేవదాస్ పిలుపునిచ్చారు. బాలాయపల్లిలో ఆదివారం ఎమ్మార్పీఎస్ మండలశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా కో ఇన్‌ఛార్జి మంగళపూరి సురేష్, మండల నాయకులు రాజ్‌కుమార్, ప్రశాంత్, రత్నమ్మ పాల్గొన్నారు.

నంది అవార్డు ప్రదానం

స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడికి అవార్డు ప్రదానం చేస్తున్న సొసైటీ సభ్యులు

బాలాయపల్లి, న్యూస్‌టుడే: స్థానిక యువతరం ఫౌండేషన్ నిర్వాహకుడు సీహెచ్ శ్రీనివాసులుకు హైదరాబాద్‌లో ఆదివారం ప్రసన్న ఆరూహి ఆర్ట్స్ కల్చరల్ సొసైటీ నంది అవార్డును ప్రదానం చేసింది. పచ్చారిచేనుకు చెందిన ఆయన ఈ ఫౌండేషన్ ద్వారా నిర్వహించే సేవలను గుర్తించి కల్చరల్ సొసైటీ మూడో వార్షికోత్సవం సందర్భంగా అవార్డును బహూకరించినట్లు ఆయన తెలిపారు.

ఆర్టీసీ బస్సులో పొగలు

చిల్లకూరు, న్యూస్‌టుడే: శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా బూదనం టోల్‌ప్లాజా సమీపంలో జాతీయ రహదారిపై ఆర్టీసీ బస్సులో నుంచి పొగలు రావడంతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. సూళ్లూరుపేట డిపోనకు చెందిన బస్సు ఆదివారం నెల్లూరు నుంచి ప్రయాణికులతో వెళుతోంది. ఇక్కడకు రాగానే ఇంజిన్‌లో నుంచి పొగలు వ్యాపించడంతో డ్రైవర్ అప్రమత్తమై రోడ్డు పక్కన నిలిపేశారు.

అలరించిన 'హ్యాపీ సండే'

కార్యక్రమంలో నాయకులు, అధికారులు

సూళ్లూరుపేట పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 'హ్యాపీ సండే' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పురపాలక కమిషనర్ చిన్నయ్య మాట్లాడుతూ పట్టణ జీవనంలో ఆనందం, భావోద్వేగ శ్రేయస్సు, ఒత్తిడి లేని జీవనశైలి గురించి తెలిపారు. యువతలో చైతన్యం నింపేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతి రెండు, నాలుగో ఆదివారంలో 'హ్యాపీ సండే' కార్యక్రమం నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ ఆకుతోట రమేష్, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కక్షసాధింపు చర్యలు తగదు

వెంకటగిరి, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని వైకాపా నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయనకు ఎస్సై ఏడుకొండలు 41ఏ నోటీసు అందించారు. దీనిపై ఆయన మాట్లాడుతూ 2024లో జరిగిన నిరసన ఘటనకు సంబంధించి కేసు నమోదు చేశారన్నారు. వీటికి భయపడనన్నారు.

చెత్త తొలగింపు

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: మండలంలోని బజారు వీధుల్లో చెత్తను రెండు రోజులుగా పారిశుద్ధ్య సిబ్బంది తొలగిస్తున్నారు. ఇటీవల 'ఈనాడు'లో 'మేమున్నాం మీకు తోడుగా' శీర్షికన సమస్యను ప్రచురించగా, అధికారులు స్పందించి వీధులను శుభ్రం చేయించారు.

స్పందనకు వందనం

స్తంభానికి అల్లుకున్న తీగలు..

తడ, న్యూస్‌టుడే: తడకండ్రిగ పంచాయతీ పరిధిలోని బీసీ కాలనీకి వెళ్లే మార్గంలో విద్యుత్తు స్తంభానికి ప్రమాదకరంగా తీగలు అల్లుకున్న విషయమై 'ఈనాడు'లో ఇటీవల 'మేమున్నాం మీకు తోడుగా' శీర్షికన వార్త ప్రచురించగా, డిస్కం ఏఈ మురళి స్పందించారు. సిబ్బందిని పంపి తీగలను తొలగించారు.

ట్రాఫిక్ కష్టాలు తీరేదెప్పుడో?

తడలో ట్రాఫిక్ కష్టాలు రోజురోజుకూ అధికమవుతున్నాయి. తడ పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుండటంతో జనాభా పెరిగారు. పరిశ్రమలకు కార్మికులను తరలించే వాహనాలు, చెన్నై-శ్రీకాళహస్తి, తిరుపతికి మధ్య రాకపోకలు సాగించే భారీ వాహనాల కారణంగా ట్రాఫిక్ సమస్య ఎదురవుతోంది. సర్వీసు రహదారుల వెంట ఆక్రమణలు పెరిగిపోవడంతో కాలినడకకూ కష్టంగా మారుతోంది. అధికారులు సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

- తడ, న్యూస్‌టుడే

కల్వర్టుకు రక్షణ గోడలేక..

నాయుడుపేట ఆర్టీసీ బస్టాండు నుంచి ఓవర్ బ్రిడ్జి వరకు వెళ్లే ప్రధాన డ్రైనేజీ కాల్వపై ఒక వైపు గోడ లేక ప్రమాదకరంగా ఉంది. ఇక్కడ కాలువ దాటేచోట అమర్చిన కల్వర్టుకు ఒక వైపు రక్షణ గోడ లేకపోవడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. దీన్ని నిర్మించేలా అధికారులు చొరవ తీసుకోవాల్సి ఉంది.

- న్యూస్‌టుడే, నాయుడుపేట పట్టణం

దినదిన గండం.. పాఠశాల భవనం

ఓజిలి మండలం కురుగొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవనం శిథిలావస్థకు చేరింది. భవనం శ్లాబ్ పెచ్చులూడుతూ ప్రమాదకరంగా ఉండటంతో విద్యార్థులు ప్రాణం గుప్పిట్లో పెట్టుకుని చదువుతున్నారు. వైకాపా ప్రభుత్వ హయాంలో నాడు-నేడు ద్వారా నూతన భవన పనులు చేపట్టారు కానీ నిధుల కొరతతో పనులు మధ్యలోనే ఆగిపోయాయి. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాల్సి ఉంది.

- న్యూస్‌టుడే, ఓజిలి

పెచ్చులూడిన ఫుట్‌పాత్

సూళ్లూరుపేట పట్టణ పరిధిలోని హోలీక్రాస్ నుంచి వట్రపాళెం వెళ్లే మార్గంలో జాతీయ రహదారి పక్కన ఫుట్‌పాత్ మీద పెచ్చులు లేచిపోయాయి. దీంతో అటువైపు వెళ్లే పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. పలుమార్లు అధికారులకు సమస్య విన్నవించినా పట్టించుకోవడంలేదని అంటున్నారు. ఇప్పటికైనా స్పందించి చర్యలు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

న్యూస్‌టుడే, సూళ్లూరుపేట గ్రామీణం

నియమ నిబంధనలతో ప్రయాణం సాగిద్దాం

ఆటో సంఘం జెండా ఆవిష్కరణలో పాల్గొన్న ఎస్సై నిఖిల్‌బాబు, కార్మికులు

వాకాడు, న్యూస్‌టుడే: నియమ నిబంధనలు పాటిస్తూ ప్రయాణం సాగిద్దామని సీఐటీయూ నాయకులు బి.వి.రమణయ్య, బాలచంద్రయ్య, లక్ష్మయ్య అన్నారు. ఆటో కార్మికులు ర్యాలీ నిర్వహించారు. వాకాడులో సీఐటీయూ శిలాఫలకం, జెండాను ఆదివారం స్థానిక ఎస్సై నిఖిల్‌బాబు ఆవిష్కరించారు. ఎస్సై మాట్లాడుతూ మద్యం తాగి వాహనాన్ని నడపొద్దని, అలా చేస్తే రూ.10 వేల జరిమానా విధిస్తామన్నారు. అనంతరం వాకాడు ఆటో సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా బాలచంద్రయ్య, కార్యదర్శిగా ముత్యాలయ్య, అధ్యక్షుడిగా మస్తానయ్య, సహాయ కార్యదర్శి అశోక్, ఉపాధ్యక్షుడు నారాయణ, కోశాధికారిగా నాగరాజును ఎన్నుకున్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: చట్టాలను గౌరవిస్తూ జీవనం సాగించాలని నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు పేర్కొన్నారు. నాయుడుపేట మండలం మేనకూరు పంచాయతీ పరిధిలో ఆదివారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. కంపెనీలు, ఇతర నిర్మాణ పనుల్లో పనిచేసే కార్మికులకు అవగాహన కల్పించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తీవ్రంగా ఉంటాయన్నారు. ఇటీవల కొందరు గంజాయి వాడకం, అమ్మకాలు జరిపిన దాఖలాలు ఉండటంతో కఠినమైన సూచనలు చేశారు. సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై ఆదిలక్ష్మి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మేనకూరులో యువతకు సూచనలిస్తున్న డీఎస్పీ చెంచుబాబు, పక్కన సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై ఆదిలక్ష్మి, సిబ్బంది

యుద్ధ ప్రాతిపదికన టిడ్కో ఇళ్ల పనులు

ఉగాదికి సీఎం చేతులమీదుగా ప్రారంభం

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: ఉగాదికి టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందించేలా యుద్ధ ప్రాతిపదికన పనులు జరుగుతున్నాయి. నాయుడుపేటలోని టిడ్కో ఇళ్లను సీఎం నారా చంద్రబాబునాయుడు చేతుల మీదుగా ప్రారంభించేలా పనులు చేస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సీఎం కార్యక్రమం ఉంటుందని శరవేగంగా పనులు చేస్తున్నారు.

గత పాలనలో..

టిడ్కో ఇళ్లను ఆనుకుని భారీగా పెరిగిన కంపచెట్లు, పిచ్చిమొక్కలు, చెత్తను తొలగిస్తున్నారు. వైకాపా హయాంలో ఇక్కడి అపార్టుమెంట్ల మధ్యలోనే గుట్టలుగుట్టలుగా చెత్త చేశారు. ఇక్కడ ఉన్న ఇసుక నిల్వల్ని మాత్రం వైకాపా నాయకులు తరలించి సొమ్ము చేసుకున్నారు.

తొలగిన అడ్డంకులు

ఇళ్లకు కేటాయించిన 40 ఎకరాల భూములు ఎన్నో ఏళ్ల క్రితం గిరిజనులకు కేటాయించినవి. పంటలు సాగు చేయక నిరుపయోగంగా ఉండటంతో స్వాధీనం చేసుకుని టిడ్కో గృహాల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. వైకాపా హయాంలో ఈ భూములు 22ఏ నిషేధిత జాబితాలో ఉండటంతో ఇటీవల కలెక్టరు తొలగించడంతో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ మొదలైంది.

పూర్తవుతున్న మౌలిక వసతులు

ఈ గృహాల వద్ద అధికారులు విద్యుత్తు దీపాలను అమర్చుతున్నారు. పార్కుకు కేటాయించిన స్థలంలో పచ్చదనం అభివృద్ధి చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. తాగునీటి పంపిణీకి పైపులైన్లు పనులు పూర్తి చేశారు. స్వర్ణముఖి నది నుంచి ఒక ఎంఎల్ నీటి సరఫరాకు అవసరమైన పనులు చేశారు. నివాసాల నుంచి వచ్చే మురుగునీటి వ్యర్థాలను శుద్ధ జలాలుగా చేసే యూనిట్‌ను అమర్చారు. టిడ్కో ఈఈ మహేష్ మాట్లాడుతూ.. పనులన్నీ పూర్తి కావచ్చాయని, మౌలిక వసతుల కల్పన జరుగుతోందన్నారు. భవిష్యత్తులోనూ అవసరమైన అన్ని సదుపాయాలు కల్పిస్తామన్నారు.

వివరాలు ఇలా..

లబ్ధిదారులకు నిర్మించిన టిడ్కో ఇళ్లు : 2064

పథకం పేరు : పీఎంఏవై, ఎన్టీఆర్ గృహ పథకం, నిర్మాణ వ్యయం అంచనా : రూ. 700 కోట్లు పైగానే

అభివృద్ధికి దూరం.. సమస్యలతో సతమతం

సూళ్లూరుపేట పట్టణం, న్యూస్‌టుడే: పురపాలక పరిధిలోని 3, 4 వార్డుల్లోని ప్రజలు పలు సమస్యలతో సతమతమవుతున్నారు. పురపాలక పరిధిలో ఉన్నామన్న భావన ఉన్నప్పటికీ సరైన మౌలిక వసతులు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. 5 వేలకు పైగా జనాభా కలిగిన ఈ ప్రాంతంలో నీళ్ల సమస్య, మురుగు నీటి పారుదల వ్యవస్థ లేకపోవడం, పారిశుద్ధ్య నిర్వహణ లోపం, అంతర్గత రోడ్లు లేకపోవడం, దోమలు, కుక్కలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

డ్రైనేజీ వ్యవస్థ, అంతర్గత రోడ్లు లేకపోవడంతో అవస్థలు

● సోనియాగాంధీ నగర్‌లో ప్రధానంగా రోడ్లపై నీరు చేరడంతో పాదచారులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బంది పడుతున్నారు. మురుగునీటి పారుదల వ్యవస్థ లేకపోవడంతో, రోడ్లపై వ్యర్థాలు నిల్వ ఉండటంతో దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి.

● సోనియాగాంధీ నగర్‌లో రహదారి పక్కన చెత్త వేయడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చెత్త తొలగించకపోవడంతో దుర్వాసన వస్తోందని, దోమల బెడద ఎక్కువగా ఉందని స్థానికులు వాపోతున్నారు. దోమలు నివారణకు చేసే ఫాగింగ్ గురించి అధికారుల పట్టించుకోవడం లేదంటున్నారు.

బాపూజీ కాలనీలో అంగన్‌వాడీ కేంద్రం వద్ద పేరుకుపోయిన చెత్త, మురుగు

● వాకాటి నారాయణ రెడ్డి నగర్, గిరిజన కాలనీలో అంతర్గత రోడ్ల నిర్మాణం లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు. ఇళ్ల మధ్యలో ఖాళీ స్థలాలు ఉండటంతో వర్షపు నీరు నిల్వ ఉండటంతో పరిసరాలు దుర్వాసన వస్తున్నాయి.

● బాపూజీ కాలనీలోని ప్రధానంగా గిరిజన కాలనీ వాసులు నీరు రాకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. 3, 4 నెలల నుంచి నీళ్లు రావడం లేదంటూ వాపోతున్నారు.

అధికారి వివరణ: ఈ ప్రాంతంలోని సీసీ రోడ్లకు, డ్రైనేజీ కొరకు ప్రతిపాదనలు పంపాం. పారిశుద్ధ్యం, నీటి సమస్యలను పరిశీలించి చర్య లు చేపడతాం. **- కె.చిన్నయ్య, పురపాలక కమిషనర్**

క్రైం కార్నర్

ఇద్దరిపై కేసు నమోదు.. బాలాయపల్లి : చెరువులో చేపలు పడుతుండగా శనివారం తన వద్దకు ఇద్దరు వచ్చి దాడిచేసినట్లు కాట్రగుంటకు చెందిన వై.శీనయ్య ఆదివారం ఫిర్యాదు చేశారు. ఈ ఘటనలో శంకర్‌రెడ్డి, గోపిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గోపి తెలిపారు.

ప్రభుత్వ స్థలం ఆక్రమణపై ఫిర్యాదు..
ఓజిలి: మండలంలోని వాకాటివారికండ్రిగలో ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాల ముందు ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాన్ని కొందరు ఆక్రమించుకున్నారని ప్రిన్సిపల్ గుణసాగర్ సింగ్ పోలీసులకు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆ స్థలంలో దుకాణాలు ఏర్పాటు చేసి మత్తుపదార్థాలు అమ్ముతున్నారని, వాటిని తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయమై ఇన్‌ఛార్జి తహసీల్దారు మధుసూదన్ రాజు వద్ద ప్రస్తావించగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

కోడి పందెం స్థావరాలపై దాడి..చిట్టమూరు: మండలంలోని నార్త్‌వరత్తూరు గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో కోడి పందెం స్థావరంపై ఆదివారం పోలీసులు దాడులు చేశారు. ఈ దాడుల్లో మూడు కోళ్లు, మూడు ద్విచక్ర వాహనాలు, కొంత నగదు పట్టుకుని ఆరుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై నాగరాజు తెలిపారు.

బంగారు ఆభరణాల చోరీ..
నాయుడుపేట పట్టణం: స్థానిక ఆర్టీసీ బస్టాండులో ఆదివారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో కె.వెంకటరమణమ్మ అనే మహిళ నుంచి ఎనిమిది సవర్ల బంగారు నగలు చోరీ చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. మార్కాపురం జిల్లా కనిగిరికి చెందిన వెంకటరమణమ్మ సూళ్లూరుపేటలోని ఆమె మనవరాలి పెళ్లికి వచ్చింది. తిరిగి స్వగ్రామానికి వెళ్లే క్రమంలో నాయుడుపేట ఆర్టీసీ బస్టాండులో గుర్తు తెలియని వ్యక్తులు సంచిలో ఉన్న నగల్ని దోచుకుని వెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాహన దొంగల అరెస్టు

బేస్తవారపేట: వాహనాల దొంగతో పాటు.. అతడి నుంచి వాటిని కొనుగోలు చేస్తూ సహకరిస్తున్న మరో వ్యక్తిని బేస్తవారపేట పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. డీఎస్పీ నాగరాజు వివరాల ప్రకారం.. కాకినాడ జిల్లా తిమ్మాపురానికి చెందిన ఆచంట గంగాధరరావు.. పలు ప్రాంతాల్లో వాహనాలు అపహరించాడు. చోరీ చేసిన వాటిని కడప జిల్లా ఎర్రగుంట్లకు చెందిన ప్రసాద్‌కు విక్రయిస్తుండేవాడు. అతనిపై కంభం, గిద్దలూరు, దోర్నాల, గుంతకల్లు, నంద్యాల, బేతంచర్ల, పులివెందుల, తిమ్మాపురం, నరసరావుపేట, కారంపూడి, గడివేముల, నాయుడుపేట తదితర స్టేషన్లలో చోరీ కేసులు నమోదయ్యాయని డీఎస్పీ తెలిపారు.

(c) eenadu

‘ఈనాడు వైజ్ఞానిక ప్రదర్శన’ రేపు

విశాఖపట్నంలోని ‘డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ హాల్, బుల్లయ్య కాలేజ్ పక్కన రామా టాకీస్ వద్ద నిర్వహణ.

ఈనాడు– విశాఖపట్నం: విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు ‘ఈనాడు వైజ్ఞానిక ప్రదర్శన’ నిర్వహిస్తోంది. ‘డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ హాల్, బుల్లయ్య కాలేజ్ పక్కన, రామా టాకీస్ దరి, విశాఖపట్నంలో మంగళవారం ఉదయం 9.30 గంటలకు ఈ మెగా సైన్స్ ఫెయిర్ ప్రారంభం కానుంది. విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లోని వివిధ పాఠశాలలకు చెందిన ఆరు నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు తమ ప్రాజెక్టులతో పాల్గొననున్నారు. విద్యార్థులను వినూత్న ఆలోచనలతో ప్రయోగాలు చేసేలా ప్రోత్సహించడం ‘ఈనాడు వైజ్ఞానిక ప్రదర్శన’ ముఖ్య ఉద్దేశం. సుమారు 100 ప్రాజెక్టులు ప్రదర్శించనున్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల స్వీకరణ

వన్‌టౌన్, కార్పొరేషన్, జగదాంబకూడలి, న్యూస్‌టుడే : విశాఖ ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యల్ని పరిష్కరించేలా సోమవారం కలెక్టరేట్‌లో, జీవీఎంసీ కార్యాలయాల్లో, పోలీస్ కమిషనరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాలను నిర్వహించనున్నట్టు కలెక్టర్ హరేంధిరప్రసాద్, మేయర్ పీలా శ్రీనివాసరావు, సీపీ శంఖబ్రతబాగ్చీ ఆదివారం వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, జీవీఎంసీ ప్రధాన, జోనల్ కార్యాలయాల్లో 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, కమిషనరేట్‌లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం వరకు ఫిర్యాదుల స్వీకరణ ఉంటుందన్నారు. కలెక్టరేట్‌లో అందించిన ఫిర్యాదుల పరిష్కార స్థితిని తెలుసుకునేందుకు కాల్ సెంటర్ (1100) సేవలు వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. కలెక్టరేట్‌లో ‘రెవెన్యూ క్లినిక్’ అందుబాటులో ఉంటుందని అధికారులు సూచించారు.

కొండైనా కొట్టేస్తాం.. వాగైనా కప్పేస్తాం!

- ఇష్టారాజ్యంగా ప్రభుత్వ భూమిలో రోడ్డు నిర్మాణం
- భూముల విలువ పెంచుకోవడానికి ఓ నేత పన్నాగం

ఆనందపురం, న్యూస్‌టుడే

ఆనందపురం మండలం ఇచ్ఛాపురం గిరిజన గ్రామంలో ఆక్రమణదారులు రెచ్చిపోతున్నారు. తమ భూముల విలువను పెంచుకోవడానికి కొండను తవ్వి, వాగును పూడ్చేసి రోడ్డును నిర్మిస్తున్నారు. కిలోమీటరుకు పైగా 30అడుగుల వెడల్పుతో భారీ యంత్రాలతో ఆయా పనులు సాగుతున్నాయి. ఇంత జరుగుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు.

గెడ్డవాగుపై నుంచి కల్వర్టు నిర్మాణం

గత ప్రభుత్వ హయాంలో..: గిరిజనులకు కొంత జిరాయితీ, డి-పట్టా భూములున్న ఇచ్ఛాపురం గ్రామంపై వైకాపాకు చెందిన ఓ మాజీ ప్రజాప్రతినిధి కన్ను పడింది. ఈ నేపథ్యంలో ఫ్రీహోల్డ్ చేసుకునేందుకు 2019లోనే తక్కువ ధరకు కొందరు గిరిజనుల నుంచి సుమారు 50 ఎకరాలు కొనుగోలు చేశాడు. ఆయా భూముల్లోకి వెళ్లేలా రహదారి నిర్మించేందుకు 2020లోనే ప్రయత్నించాడు. నాడు స్థానిక గిరిజన పెద్దలు అడ్డుకోవడంతో నిర్మాణం ఆగిపోయింది. అప్పట్లో అడ్డుకున్న వారిలో కొందరు పెద్దలు ఇటీవల మరణించడంతో ఆ నేత అమాయకులైన కొందరు గిరిజనులకు మాయమాటలు చెప్పి మళ్లీ రోడ్డు నిర్మాణం ప్రారంభించాడు.

వెలుగులోకి ఇలా..: గిరిజనుల భూముల్లో నుంచి దౌర్జన్యంగా రహదారి నిర్మించడంపై పోలీసులు, గనుల శాఖ అధికారులకు ఫిర్యాదులందడంతో అక్రమం వెలుగులోకి వచ్చింది. ఈ విషయం బయటపడకుండా తామే రోడ్డు వేయించుకుంటున్నట్లు స్థానిక గిరిజనులతో చెప్పించే ప్రయత్నం చేస్తున్నారు. విచారణకు వచ్చిన రెవెన్యూ అధికారులకు అలానే చెప్పించారు. మరో వైపు గనుల శాఖ అధికారులు అక్కడి యంత్రాలను స్వాధీనం చేసుకొని పోలీసులకు అప్పగించారు. వాస్తవానికి అనుమతి లేకుండా అటవీ భూములకు సమీపంలో కొండలను తొలిచి రహదారి నిర్మించడం నేరం. దీన్నుంచి తప్పించుకునేందుకు కొంతమంది స్థానికులతో కలిసి ఆ నేత నాటకం ఆడుతున్నారు.

ఈ విషయమై తహసీల్దార్ శ్రీనుబాబును వివరణ కోరగా ప్రభుత్వ భూమిలోనైనా, సొంత స్థలాల్లోనైనా రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. గిరిజన గ్రామంలో రహదారి నిర్మాణంపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

డాక్‌యార్డు వంతెనపై రయ్‌రయ్..

రెండేళ్ల తర్వాత రాకపోకలు షురూ

మల్కాపురం, న్యూస్‌టుడే : కాన్వెంట్ కూడలి నుంచి నావల్ డాక్‌యార్డుకు వెళ్లే మార్గంలో ఉన్న వంతెన శిథిలస్థితికి చేరుకోవడంతో రెండేళ్ల కిందట మరమ్మతులకు శ్రీకారం చుట్టారు. ఈ కారణంగా వాహనాల రాకపోకలను నిలిపేశారు. ఐఎఫ్ఆర్‌లో భాగంగా ఇటీవల వంతెన నిర్మాణ పనులను యుద్ధప్రతిపాదికన పూర్తిచేశారు. దీంతో వారం రోజులుగా వాహనాలు వంతెనపై రయ్.. రయ్ అంటూ దూసుకెళ్తున్నాయి. ఇది వరకు నగరం నుంచి డాక్‌యార్డ్ వైపు గాజువాక వెళ్లాలంటే దుమ్ములో చుట్టూ తిరుగుతూ.. గంటల తరబడి ప్రయాణించాల్సి వచ్చేది. ఇరుకుమార్గంలో భారీ వాహనాల రాకపోకలతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకునేవి. ఎట్టకేలకు వంతెన అందుబాటులోకి రావడంతో ఆ కష్టాలు తప్పాయని వాహనచోదకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా వంతెన మరమ్మతుల పనులు కొంత మిగిలి ఉన్నాయని, ఈ కారణంగా కొన్నాళ్లు రాకపోకలు నిలిపేస్తారన్న ప్రచారం వాహనదారుల్లో ఆందోళన కలిగిస్తోంది. ప్రస్తుతం కొత్త వంతెనపై భారీ వాహనాలు మినహా బైక్‌లు, ఆటోలు, కార్లు వేగంగా దూసుకెళ్తున్నాయి.

వంతెనపై రాకపోకలు సాగిస్తున్న వాహనాలు

‘త్రిశూల్’.. మరో మణిహారం..!

- ★ కైలాసగిరిపై 65 అడుగుల్లో నిర్మాణం
- ★ పుణె నుంచి వచ్చిన ఆకృతులు

ఈనాడు, విశాఖపట్నం

పర్యాటక సిరి.. కైలాసగిరిపై మరో ఆకర్షణ సిద్ధమవుతోంది. ఇప్పటికే శివపార్వతుల విగ్రహాలు, రోప్‌వే, స్కై సైక్లింగ్, జిప్‌లైనర్ పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఇప్పుడు చేపట్టిన త్రిశూల్ ప్రాజెక్టు మరింత ఆసక్తి కలిగిస్తోంది. దీనికి సంబంధించిన పనులు యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్నాయి. వాస్తవానికి వీఎంఆర్‌డీఏ శివరాత్రి నాటికి దీన్ని పూర్తి చేయాల్సినప్పటికీ పలు కారణాలతో ఆలస్యమైంది. ఉగాది నాటికి ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

తుపాన్లను తట్టుకునేలా..: తుపాను గాలులు, భూకంపాలను తట్టుకునేలా ఈ త్రిశూల్ ప్రాజెక్టు చేపడుతున్నారు. హాట్ ఎయిర్ బెలూన్‌తో అధ్యయనం చేసి ఎంత ఎత్తులో నిర్మించాలో పరిశీలించారు. మొదట 55 అడుగుల్లో నిర్మించాలనుకున్నప్పటికీ తర్వాత 65 అడుగులకు పెంచారు. కింద నుంచి పైవరకు త్రిశూలం పొడవు 65 అడుగులైతే అందులో ఒక్క ఢమరుకం 10 అడుగుల ఎత్తు, 18 అడుగుల వెడల్పు ఉండనుంది.

త్రిశూలం నమూనా

త్రిశూలమైతే 25 అడుగుల ఎత్తు, 20 అడుగుల వెడల్పుతో తయారు చేశారు. ఆయా ఆకృతులను పుణెలో రూపొందించారు. ఇవి ప్రస్తుతానికి విశాఖ చేరుకున్నాయి. సుదూరంలోని నగర ప్రజలకు కనిపించేలా త్రిశూలం లోపలి భాగంలో ఎల్ఈడీ దీపాలు అమర్చనున్నారు. అలాగే చుట్టూ 30 అడుగుల విస్తీర్ణంలో వేదిక నిర్మిస్తున్నారు. మొదట్లో ఈ వేదిక నిర్మాణం ఆలోచన చేయలేదు. తర్వాత పర్యాటకులు సెల్ఫీలు తీసుకునేందుకు, కూర్చునేందుకు వీలుగా దాన్ని చేపడుతున్నారు.

ఉగాదికి పూర్తయ్యేలా..: సందర్శకుల కోసం కైలాసగిరిపై పలు ప్రాజెక్టులు చేపడుతున్నాం. ఇప్పటికే శివపార్వతుల విగ్రహాలు ఉన్నాయి. అదనంగా భారీ త్రిశూలం నిర్మిస్తే బాగుంటుందనే ఆలోచన చేశాం. పర్యాటకులు కాసేపు సేదతీరేలా ఆ ప్రదేశాన్ని అభివృద్ధి చేస్తున్నాం. ఉగాది నాటికి అందుబాటులోకి తెచ్చేలా చర్యలు తీసుకుంటాం.

– ప్రణవ్‌గోపాల్, వీఎంఆర్‌డీఏ ఛైర్మన్

ఇదీ ప్రాజెక్టు స్వరూపం..	వ్యయం:	ఎత్తు:	చుట్టు కొలత:	మెటీరియల్:	డయాస్ విస్తీర్ణం:	ఎల్ఈడీ దీపాలు :
	రూ.2.50 కోట్లు	65 అడుగులు	3 అడుగులు	ఫైబర్ రీఇన్ ఫోర్స్‌డ్ ప్లాస్టిక్	30 అడుగుల వెడల్పు	100

అక్కడికి వెళ్తే సాధారణ ప్రసవమే..!

- గతేడాది 3,214 మంది శిశువుల జననం
- ఘోషాసుపత్రి సేవలకు ఐఎస్‌వో ధ్రువీకరణ

ఈనాడు, విశాఖపట్నం

ప్రభుత్వ విక్టోరియా ఆసుపత్రి(ఘోషాసుపత్రి) పేద, మధ్య తరగతి కుటుంబాల గర్భిణులకు వర ప్రదాయినిగా నిలుస్తోంది. ఇక్కడ వైద్యులు తొలుత సాధారణ ప్రసవానికి ప్రయత్నిస్తారు. వీలుకాని పక్షంలో సిజేరియన్ (సీ-సెక్షన్) చేస్తుంటారు. దీంతో ఎక్కువ మంది ఇక్కడకు వెళ్లేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. రోగుల భద్రత, సేవల నాణ్యత, రికార్డుల నిర్వహణ తదితర అంశాల్లో ప్రమాణాలు మెరుగ్గా ఉండటంతో ఇటీవల హైదరాబాద్‌కు చెందిన ‘హెచ్‌వైఎం’ ఇంటర్నేషనల్ సంస్థ ఐఎస్‌వో ధ్రువీకరణ పత్రం అందజేసింది.

నవజాత శిశువుల సంరక్షణలో నర్సులు

- **పడకలు..వైద్య సేవలిలా:** ఆసుపత్రిలో 250 పడకలు అందుబాటులో ఉన్నాయి. సొంతంగా నలుగురు వైద్యులు ఉన్నారు. ఆంధ్ర వైద్య కళాశాలకు చెందిన నలుగురు ప్రొఫెసర్లు, ఒక అసోసియేట్ ప్రొఫెసర్, 9 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు డిప్యుటేషన్‌పై సేవలందిస్తున్నారు.
- ఇక్కడకు విశాఖతోపాటు ఒడిశా నుంచి గర్భిణులు ప్రసవాలకు వస్తుంటారు. అనకాపల్లి ఆసుపత్రుల నుంచి హైరిస్క్ జాబితాలో ఉన్న గర్భిణులను తీసుకొస్తుంటారు.
- లాప్రోస్కోపిక్ సర్జరీలకు అవసరమైన అత్యాధునిక సామగ్రిని ప్రభుత్వం, దాతలు అందించారు.
- హైరిస్క్ గర్భిణులు ప్రసవం తర్వాత ఇంటికి వెళ్లిపోయినా.. సాధారణ స్థితికి వచ్చేవరకు సీహెచ్‌సీ, పీహెచ్‌సీ వైద్యులు, ఆశా కార్యకర్తల ద్వారా పర్యవేక్షిస్తుంటారు.

గతేడాది ప్రసవాలు..
- సాధారణ: 3,214
- సిజేరియన్: 2123

- ప్రస్తుతం రోజుకు దాదాపు 200 వరకు ఓపీ నమోదవుతోంది. 10 మేజర్, 12 మైనర్ శస్త్ర చికిత్సలు, 25 వరకు ప్రసవాలు జరుగుతుంటాయి.
- కొత్తగా మదర్, ఛైల్డ్ బ్లాక్ నిర్మించాలని, ఎనస్తీషియా, పిల్లల వైద్య నిపుణులు ఒక్కొక్కరే ఉండటంతో నియామకం చేపట్టాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు.

గత మూడేళ్లలో ప్రసవాలు, శస్త్రచికిత్సలు..

సంవత్సరం	ప్రసవాలు	మేజర్ శస్త్రచికిత్సలు	మైనర్
2023	5,806	660	1807
2024	5,093	714	2131
2025	5,337	756	2208

- **గర్భిణులకు నాణ్యమైన వైద్య సేవలు..:** గర్భిణుల ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. వారికి నాణ్యమైన సేవలందిస్తున్నాం. స్పెషల్ న్యూబార్న్ కేర్ యూనిట్ ద్వారా నవజాత శిశువులకు చికిత్స అందిస్తున్నాం. ఇన్‌ఫెక్షన్లు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం.

– డాక్టర్ ఉషా ప్రసాద్, సూపరింటెండెంట్

ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించరు

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు సోమవారం నుంచి 85 కేంద్రాల్లో ప్రారంభమవుతాయని ఇంటర్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షకులు(ఆర్ఐఓ) పి.మురళీధర్ తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. విద్యార్థులు కనీసం 30 నిమిషాలు ముందుగా చేరుకోవాలని సూచించారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించమన్నారు.

నిర్వహణకు పొరుగు జిల్లాల అధ్యాపకులు.. జిల్లాలో ఇంటర్ పరీక్షల నిర్వహణకు తగినంత మంది అధికారులు, సిబ్బంది లేకపోవడంతో పొరుగునున్న అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల నుంచి అధికారులను రప్పిస్తున్నారు. ఆయా జిల్లాల నుంచి 44 మంది చీఫ్ సూపరింటెండెంట్(సీఎస్)లు, డిపార్ట్‌మెంట్ అధికారులు(డీఓ)ను తీసుకొచ్చినట్లు ఇంటర్ బోర్డు ఆర్ఐఓ పి.మురళీధర్ తెలిపారు. వీరితోపాటు ఇన్విజిలేటర్లుగా పనిచేసేందుకు జిల్లా విద్యాశాఖ నుంచి 153 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులను తీసుకుంటున్నామన్నారు. వీరంతా పెందుర్తి, భీమిలి, ప్రభుత్వ మహిళా, డాక్టర్ వీఎస్ కృష్ణా జూనియర్ కళాశాలల్లో, మధురవాడ, మారికవలసలోని గిరిజన సంక్షేమ, కొమ్మాదిలోని సాంఘిక సంక్షేమ కళాశాలల్లో ఇన్విజిలేటర్లుగా విధులు నిర్వహించనున్నారని పేర్కొన్నారు.

ఒక కొమ్మకు పూచిన ప్రతి‘రూపాలు’

ఏకంగా 100 మంది కవలలు కొలువుదీరిన అరుదైన దృశ్యం ఆదివారం డాబాగార్డెన్స్‌లోని ఓ హోటల్లో కనిపించింది. అంతర్జాతీయ కవలల దినోత్సవం సందర్భంగా వీరంతా కలిశారు. తమకు ఎదురైన అనుభవాలు, చదువు, ఉద్యోగం, వారి జీవిత పయనం.. అనురాగ బంధాలను పంచుకున్నారు. – జగదాంబకూడలి, న్యూస్‌టుడే

చెవికెక్కని ‘హెచ్చరిక..’

తెలుగుతల్లి వంతెనపై మలుపు తిరిగే చోట గతంలో ప్రమాదాలు జరిగి ఐదు మంది ప్రాణాలు కోల్పోయారు. దీంతో పోలీసులు ఆ మలుపు వద్ద 40 కి.మీ. వేగంతో వాహనాలు నడపాలని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. అయితే పలువురు చోదకులు హెచ్చరికను పెడచెవిన పెట్టి దూసుకెళుతున్నారు. ప్రమాదని తెలిసినా కొందరు సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనం నడుపుతున్నారు. –ఈనాడు, విశాఖపట్నం

సరకు రవాణాలో... ‘విశాఖ పోర్టు’ రికార్డు

వన్‌టౌన్, న్యూస్‌టుడే : విశాఖ పోర్టు అథారిటీ (వీపీఏ) సరకు రవాణాలో సరికొత్త రికార్డును నెలకొల్పింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోని 327 రోజుల్లో (ఈనెల 21 వరకు) 80.08 మిలియన్ మెట్రిక్ టన్నుల (ఎంఎంటీ) సరకును రవాణా చేసింది. పోర్టు చరిత్రలో ఇదే ప్రథమమని ఛైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇదే ఉత్సాహంతో ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి 90 ఎంఎంటీ లక్ష్యాన్ని చేరుకుంటామని ఆశాభావం వ్యక్తం చేశారు. 2024-25 ఏడాదిలో 357 రోజుల్లో 80.11 ఎంఎంటీ సరకు, 2023-24 ఏడాదిలో 362 రోజుల్లో 80.02 ఎంఎంటీ సరకు రవాణా చేసినట్టు ఆయన వివరించారు. పోర్టు కార్యాచరణ, సిబ్బంది నైపుణ్యం, మెరుగైన నిర్వహణ, భాగస్వామ్య సంస్థల సమన్వయంతోనే సరకు రవాణాలో స్థిరమైన పురోగతి సాధించామన్నారు.

TANISHQ
A TATA PRODUCT
Gajuwaka Jewellery Showroom requires
RETAIL SALES OFFICER
Male candidates having relevant retail experience will be preferred.
Freshers can also apply.
Walk-in Interview
(23rd to 25th February 2026 from 11 am to 5 pm) at
Tanishq, Gajuwaka
Ph : 80192 51234

ఉద్యోగానికి ఆరు మెట్లు..!

- ✦ ‘ఏఐ’ ప్రభావంలోనూ అవకాశాలు
- ✦ విద్యార్థులకు నిపుణుల సూచనలు

ఈనాడు, విశాఖపట్నం

ప్రపంచ వ్యాప్తంగా అన్ని రంగాల్లో కృత్రిమ మేధ కీలకంగా మారుతోంది. ఇది ఉద్యోగాలపై ప్రతికూల ప్రభావం చూపుతుందనే ఆందోళన విద్యార్థులు, నిరుద్యోగుల్లో వ్యక్తమవుతోంది. అయితే మారుతున్న సాంకేతికతకు తగ్గట్టుగా ఎప్పటికప్పుడు కొత్త నైపుణ్యాలు నేర్చుకుంటే.. ఉద్యోగావకాశాలు పెరుగుతాయని నిపుణులు సూచిస్తున్నారు. ఏఐ ప్రభావం పెరుగుతున్న నేపథ్యంలో గీతం విశ్వవిద్యాలయంలో ఇటీవల నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు ఆరు నైపుణ్యాలపై దృష్టి సారించాలని నిపుణులు సూచించారు.

1 కొత్త అంశాలు నేర్చుకోవాలి: మార్పులను అందిపుచ్చుకుని, నిరంతరం కొత్త విషయాలను నేర్చుకోవాలనే ఆసక్తి ఉన్నవారినే కంపెనీలు ఎంపిక చేసుకుంటున్నాయి. మీకు ఎంత అనుభవమున్నా.. కొత్త అంశాలు నేర్చుకోవడంపై దృష్టి సారించాలి. సాంకేతికతను ఒత్తిడి పెంచే అంశంగా కాకుండా.. సరదాగా నేర్చుకోవాలి.

2 నైపుణ్యాలు కూడబెట్టుకుంటేనే..: ఏఐతో వివిధ కొత్త ఉద్యోగాలు పుట్టుకొస్తున్నాయి. ఎంట్రీ లెవెల్ ఉద్యోగాల అర్థాన్ని ఏఐ మారుస్తోంది. దీన్ని బాధ్యతాయుతంగా వినియోగించాలి. ఏదో ఒక నైపుణ్యముంటే ఉద్యోగం సాధించవచ్చని అనుకోవడం సరికాదు. మీరు ఎంత మేర నైపుణ్యాలను కూడబెట్టుకుంటే.. అన్ని ఎక్కువ అవకాశాలు వస్తాయి.

3 పరిమితులు వద్దు..: ఉద్యోగాలు తక్కువ.. అభ్యర్థులు ఎక్కువగా ఉంటే కంపెనీలు నియామకాలు తగ్గించుకోవాలని చూస్తాయి. కంపెనీల అవసరాలకు తగ్గట్టుగా మీలో మార్పులు చేసుకోవాలి. కేవలం విశాఖలోనో, దక్షిణాదిలోనో పనిచేస్తామని పరిమితులు పెట్టుకోవద్దు. ఆ పరిధి దాటి ఆలోచించండి.

4 సామర్థ్యాలను వివరించాలి: సైబర్ సెక్యూరిటీ రంగంలో ఉద్యోగం సాధించాలంటే.. ఆ విభాగంలో మీకున్న నైపుణ్యాలు, సామర్థ్యాలపై 30 సెకన్ల వీడియోను సామాజిక మాధ్యమాల్లో పంచుకోండి. ఆయా నిపుణుల కోసం చూస్తున్న కంపెనీలకు మీరు చేసిన వీడియో చేరుతుంది. రెండు వారాల్లోనే ఇంటర్వ్యూకు ఆహ్వానిస్తూ సమాచారం వస్తుంది.

5 సమస్య పరిష్కారానికే ప్రాధాన్యం..: ప్రస్తుతం నియామక ప్రక్రియలో.. మార్కుల కంటే నైపుణ్యాలకే ఎక్కువ ప్రాధాన్యమిస్తున్నారు. 9.5 సీజీపీఏ ఉన్నప్పటికీ.. 7.5 సీజీపీఏతో ఇంటర్న్‌షిప్, హ్యాకథాన్స్ ప్రాజెక్టులు, సమస్య పరిష్కారంలో ఎక్కువ అనుభవమున్న వారినే కంపెనీలు ఎంపిక చేసుకుంటున్నాయి.

6 ప్రాథమిక అంశాలపై శ్రద్ధ: ఇంజినీరింగ్ చివరి రెండేళ్లలో వీలైనన్ని ఎక్కువ ప్రాజెక్టులు చేయడంపై దృష్టి పెట్టాలి. ఎలాంటి పరిస్థితులనైనా తట్టుకునేందుకు సిద్ధంగా ఉండాలి. ఇంటర్వ్యూకు వెళ్లే ముందు రెజ్యూమ్ ప్రత్యేకంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. ఇంటర్వ్యూల్లో కంపెనీల ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు సూటిగా సమాధానం చెప్పగలగాలి.

రజతోత్సవ సందడి..

నగరంలోని జీవీఎంసీ పాఠశాలల్లో పనిచేస్తూ 25 ఏళ్ల సర్వీసు(రజతోత్సవం) పూర్తి చేసుకున్న సందర్భంగా 150 మంది ఉపాధ్యాయినులు ఆదివారం ముడసర్లోవ పార్కులో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. డీఎస్సీ-2000 బ్యాచ్‌కు చెందిన వీరంతా ఆటపాటలతో సందడి చేశారు. – న్యూస్‌టుడే, మురళీనగర్

ఎట్టకేలకు హంతకుడి పట్టివేత

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే : ఈనెల 11న ఆరిలోవలో మహిళ గొంతు నులిమి హత్య చేసిన నిందితుడు పోలీసులకు చిక్కాడు. నిందితుడు బొబ్బిలికి చెందిన వి.శివలింగేశ్వరరావు(టాటూ శివ)గా గుర్తించారు. చరవాణి సిగ్నల్ ఆధారంగా అదుపులోకి తీసుకున్నారు. తరచూ బెట్టింగ్‌లు కాస్తూ, అప్పుల పాలై నేరాలకు పాల్పడుతున్నాడని పోలీసులు నిర్ధారించారు.

ఇదీ జరిగింది...! ఆరిలోవ పాతపోలీస్‌స్టేషన్ సమీప కనకదుర్గనగర్‌లో కాపు రమణ, లక్ష్మి (45) దంపతులు నివాసం ఉంటున్నారు. ఈనెల 11వ తేదీ ఉదయం లక్ష్మి ఒంటరిగా ఉండడం గుర్తించిన నిందితుడు టోపీ, ముఖానికి మాస్క్ ధరించి ఇంట్లోకి ప్రవేశించాడు. ఆమెపై దాడి చేసి గొంతును లిమి చంపేశాడు. 8 తులాల బంగారు ఆభరణాలు, బీరువాలో ఉన్న రూ.5 లక్షల నగదుతో పరారయ్యాడు. పోలీసులు పది రోజుల పాటు శ్రమించి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.



సాగరానికి మురుగు.. ముక్కుపుటాలు అదురు..!

గెడ్డల్లోని మురుగునీరు వ్యర్థాల సహా నేరుగా సముద్రంలో కలుస్తోంది. పర్యాటకంగా ప్రాధాన్యం ఉన్న సాగర్‌నగర్ ప్రాంతంలో ఈ మురుగు దృశ్యం చూసి పర్యాటకులు ఆవేదన చెందుతున్నారు. దుర్వాసనకు ముక్కులు మూసుకుని రాకపోకలు సాగిస్తున్నారు. – ఈనాడు, విశాఖపట్నం

అంధత్వం తలవంచే.. పతకాలు వరించే..!

పారా అథ్లెటిక్స్‌లో విద్యార్థిని రవన్నీ సత్తా

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: అంధత్వం ఆమె ఆశయానికి అడ్డు కాలేదు. మనోనేత్రాన్నే కన్నులుగా చేసుకుని మొక్కవోని దీక్షతో సాధన చేసి అథ్లెటిక్స్‌లో రాణిస్తోంది. రాష్ట్ర, జాతీయస్థాయి పారా అథ్లెటిక్స్ పోటీల్లో పతకాలు సాధించి ప్రశంసలు అందుకుంటోంది. ఆమే అల్లూరి జిల్లా రంగసింగిపాడు ప్రాంతానికి చెందిన వలసనేని రవన్నీ. నగరంలోని చినజీయర్ స్వామి ఆధ్వర్యంలో నడుస్తోన్న నేత్ర విద్యాలయంలో విద్యను అభ్యసించడంతోపాటు పరుగులో శిక్షణ పొందింది.

తల్లిదండ్రులు కూలి పనిచేస్తారు. గిరిజన కుటుంబం. ఐదుగురు సంతానం. ఇందులో ముగ్గురు అంధులు(పాక్షిక) కావడంతో ఆ కుటుంబానికి మోయలేని భారమైంది. ఆ ముగ్గురిని నేత్ర విద్యాలయం అక్కున చేర్చుకుని విద్యాబుద్ధులు నేర్పిస్తోంది. వారిలో రవన్నీ చదువుతోపాటు క్రీడల్లోనూ సత్తా చాటుతోంది. ఇటీవల దుబాయ్‌లో జరిగిన యూత్ పారా అథ్లెటిక్స్‌లో ఒక రజతం, రెండు కాంస్య పతకాలు కైవసం చేసుకుంది. ప్రస్తుతం డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. భవిష్యత్తులో పారా ఒలింపిక్స్‌లో బంగారు పతకం సాధించాలనే లక్ష్యంతో శిక్షణ పొందుతోంది.

దుబాయ్‌లో సాధించిన పతకాలతో రవన్నీ

సాధించిన విజయాలు...

2022 బెంగళూరులో జరిగిన జాతీయ స్థాయి పారా అథ్లెటిక్స్‌లో రెండు బంగారు, కాంస్య పతకాలు. 2023 గుజరాత్‌లో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో ఒక స్వర్ణం, రెండు రజతం, పుణెలో జరిగిన పోటీల్లో స్వర్ణం, రెండు కాంస్యం పతకాలు కైవసం చేసుకుంది. 2024 బెంగళూరులో జరిగిన జూనియర్ జాతీయ స్థాయి పోటీల్లో రెండు స్వర్ణం, ఒక కాంస్యం, గోవాలో జరిగిన సీనియర్ జాతీయ స్థాయి పోటీల్లో ఒక స్వర్ణం, రెండు కాంస్యం, 2025 చెన్నైలో జరిగిన సీనియర్ జాతీయస్థాయిలో ఒక స్వర్ణం, కాంస్యం, గ్వాలియర్‌లో జరిగిన పోటీల్లో రెండు స్వర్ణం, ఒక రజత పతకం సాధించింది.

(c) eenadu

మూడేళ్ల బాలికకు అరుదైన చికిత్స !

హోమీ భాభా క్యాన్సర్ ఆసుపత్రి వైద్యుల ఘనత

అగనంపూడి, న్యూస్‌టుడే : విశాఖలోని అగనంపూడి హోమీబాభా క్యాన్సర్ ఆసుపత్రి వైద్య సిబ్బంది మూడేళ్ల బాలికకు అరుదైన చికిత్స అందించారు. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఓ బాలికకు ఎంబ్రాయినల్ ట్యూమర్ విత్ మల్టీ లేయర్డ్ రోసెట్స్ (ఇ.టి.ఎం.ఆర్) అనే అరుదైన వ్యాధి సోకింది. ఇది అత్యంత దూకుడుగా ఉండే మెదడు కణితి. ఇది వేగంగా పెరుగుతుంది. ప్రమాదకరమైనది. దీనికి ముందుగా ముంబయిలోని టాటా మెమోరియల్ కేంద్రంలో శస్త్రచికిత్స నిర్వహించి కీమోథెరపీ అందించారు. అక్కడి నుంచి టాండమ్ ఆటోలాగస్ స్టెమ్ ట్రాన్స్‌ప్లాంట్ కోసం (ఇది రోగి స్టెమ్స్‌నే ఉపయోగించి చేసే చికిత్స విధానం) విశాఖలోని హోమీబాభా ఆసుపత్రికి సిఫార్సు చేశారు. ఇక్కడ అనుభవం కలిగిన వైద్యులు సమన్వయంతో పనిచేసి చికిత్సను విజయవంతంగా పూర్తిచేశారు. బాలిక కోలుకోవడంతో డిశ్చార్జ్ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ ఉమేష్‌మహంత్ శెట్టి మాట్లాడుతూ.. దేశంలోనే తొలిసారిగా ఈ తరహా చికిత్స అందించినట్లు భావిస్తున్నామన్నారు.

చికిత్స పొందిన బాలికతో వైద్య బృందం

పర్యవేక్షణ లేక... భద్రత కానరాక..!

కేజీహెచ్‌లో వరుస ఘటనలతో పలువురి ఆందోళన

వన్‌టౌన్, న్యూస్‌టుడే

ఉత్తరాంధ్ర జిల్లాల ఆరోగ్య ప్రదాయినిగా గుర్తింపు పొందిన కింగ్‌జార్జ్ ఆసుపత్రి (కేజీహెచ్)లో భద్రత ప్రశ్నార్థకంగా మారింది. గోనెసంచిలో మృతశిశువును పడేసి మూడు రోజులు దాటినా భద్రత సిబ్బంది గుర్తించకపోవడం దారుణమైన అంశం. 100కు పైగా సీసీ కెమెరాలు, 275 మంది భద్రత సిబ్బంది అందుబాటులో ఉన్నప్పటికీ... ఎక్కడికక్కడ ఘటనలు చోటు చేసుకుంటున్నాయి.

ఆసుపత్రి ఓపీ విభాగం వద్ద నిరీక్షిస్తున్న రోగులు

కొరవడిన సమన్వయం..! ■ ఆసుపత్రి వైద్యాధికారుల మధ్య సమన్వయం లేకపోవడంతో పాటు, పరిపాలన అధికారులు, వైద్యాధికారుల మధ్య ఆధిపత్య పోరు ఎక్కువైంది. ■ ఏడీఎంఈ స్థాయిలో ఉన్న వైద్యాధికారి ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా కొనసాగుతున్నారు. డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారి ఆసుపత్రి అడ్మిన్‌గా పని చేస్తున్నారు. ■ సివిల్ సర్జన్ ఆర్ఎంఒ, డిప్యూటీ సివిల్ సర్జన్ ఆర్ఎంఒ, ముగ్గురు ఆర్ఎంఓలు ఆసుపత్రిలో వ్యవహారాలు పర్యవేక్షిస్తున్నారు. అయినా భద్రతాలోపం స్పష్టంగా కనిపిస్తుంది.

ఏటా రూ.5.88 కోట్లు ■ ఆసుపత్రిలో భద్రత కోసం 275 మంది సిబ్బంది ఒప్పంద ప్రాతిపదికన సేవలు అందిస్తున్నారు. వారి జీతభత్యాల కింద ప్రభుత్వం నెలకు రూ. 49 లక్షల చొప్పున, ఏటా రూ. 5.88 కోట్లు ఖర్చు చేస్తోంది. అయినా పూర్తిస్థాయిలో భద్రత కానరావడం లేదు. ■ ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ దృష్టి సారించి భద్రత, పర్యవేక్షణ లోపాలను సరిదిద్దాలని పలువురు కోరుతున్నారు.

ఇవీ ఘటనలు..! ■ గతంలో కొందరు వ్యక్తులు ప్రసూతి విభాగం నుంచి ఓ శిశువును ఎత్తుకుపోయారు. పోలీసులు ఆ కేసును ఛేదించి శిశువును తల్లిదండ్రులకు అప్పగించారు. ■ కొద్దిరోజుల కిందట గిరిజన ప్రాంతానికి చెందిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆమె మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లేందుకు అంబులెన్స్ వాహనం కోసం భర్త అయిదు గంటల సేపు నిరీక్షించాల్సి వచ్చింది. ■ అలాగే పిల్లల విభాగం ఐసీయూ వెంటిలేటర్ల నుంచి మంటలు వచ్చాయి. కార్డియాలజీ విభాగం ఐసీయూలో విద్యుత్తు షార్ట్ సర్క్యూట్‌తో పొగలు వ్యాపించాయి. ■ ఆసుపత్రి ఆవరణలోని ఆక్సిజన్ సరఫరా పైపులను దుండగులు కత్తిరించి, తీసుకెళ్లిపోయారు. ■ వీటికి తోడు తరచూ ఆవరణలోని ద్విచక్ర వాహనాలు మాయమవడం, రోగుల బంధువులకు సంబంధించి విలువైన వస్తువులు చోరీకి గురవడం వంటి ఘటనలు జరుగుతూనే ఉన్నాయి.

ఆత్మహత్యాయత్నం.. కాపాడిన పోలీసులు..

మాధవధార, న్యూస్‌టుడే: ఆర్థిక ఇబ్బందులతో రైల్వే ట్రాక్‌పై ఆత్మహత్య చేసుకునేందుకు యత్నించిన వ్యక్తిని కంచరపాలెం పోలీసులు అడ్డుకొని కౌన్సెలింగ్ ఇచ్చి ఇంటికి పంపించారు. వివరాలు ఇలా ఉన్నాయి. జీవీఎంసీ 49వ వార్డుకు చెందిన ఆనంద్(46) ఇంటి అవసరాల నిమిత్తం అప్పులు చేశాడు. ఆదాయం అంతంతమాత్రం కావడంతో తీసుకున్న అప్పులు చెల్లించలేక సతమతమవుతున్నాడు. తాను ఆత్మహత్య చేసుకుంటానని ఇంటిలో చెప్పి ఆదివారం ఉదయం బయటకు వచ్చేశాడు. దీంతో వెంటనే కుటుంబ సభ్యులు నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీకి ఫోన్ చేసి విషయం తెలియజేశారు. తక్షణమే సీపీ స్పందించి కంచరపాలెం పోలీసులకు సమాచారం ఇచ్చి అతని ఫోన్ నెంబర్ ట్రాక్ చేయాలని ఆదేశించారు. దీంతో ఎస్సై రవికుమార్, బ్లూకోర్ట్ సిబ్బంది రాంబాబు ఫోన్ సిగ్నల్స్‌ను పరిశీలించగా ఆర్‌పీ పేట రైల్వే ట్రాక్ వద్ద ఉన్నట్లు గుర్తించారు. వెంటనే వారు అక్కడికి చేరుకొని ఆనంద్‌ను ట్రాక్ నుంచి బయటకు తీసుకొచ్చి కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

లారీ ఢీకొని విశ్రాంత ఉద్యోగి మృతి

సత్యనారాయణ (పాత చిత్రం)

గాజువాక, న్యూస్‌టుడే : జాతీయ రహదారి పాతగాజువాక పెట్రోల్ బంకు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో బీహెచ్‌పీవీ విశ్రాంత ఉద్యోగి పి.సత్యనారాయణ (79) మృతిచెందారు. ఈ మేరకు గాజువాక ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. . గాజువాక జోగివానిపాలేనికి చెందిన సత్యనారాయణ మధ్యాహ్నం ద్విచక్ర వాహనంపై చిన గంట్యాడ వైపు వెళ్తుండగా.. వెనుక నుంచి వచ్చిన లారీ ఢీ కొంది. దీంతో ఆయన వెనుక చక్రాల కింద వాహనంతో సహా పడిపోయారు. తల మీదుగా లారీ చక్రం వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. కుమారుడు సుధీర్ ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేశారు. ప్రమాదానికి కారణమైన లారీని పోలీసులు సీజ్ చేశారు. ట్రాఫిక్ సీఐ హుస్సేన్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పాత పింఛను పునరుద్ధరించాలని ఆందోళన

కార్పొరేషన్, న్యూస్‌టుడే : పాత పింఛను అమలు చేయాలని ప్రభుత్వ ఉద్యోగులు కోరారు. ఆదివారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద 'ఆంధ్రప్రదేశ్ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 'సాగర సంగ్రామ దీక్ష' పేరిట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోరుకొండ సతీష్ మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు పాత పింఛను పునరుద్ధరించాలన్నారు. ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు వెంటనే విడుదల చేసి, పెండింగ్‌లో ఉన్న సమస్యల్ని పరిష్కరించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు అధిక సంఖ్యలో హాజరై.. . ప్లకార్డులు చేతపట్టుకుని నినదించారు. కార్యక్రమంలో సంఘం గౌరవ సలహాదారులు అప్పలరాజు, ప్రకాష్, ప్రతినిధులు త్రినాథస్వామి, లోహితాస్యుడు, ఏపీ ఎన్జీఓ సంఘం అధ్యక్షుడు ఈశ్వరరావు, సభ్యులు చంద్రరావు, టి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వేదికపై సంఘీభావం తెలుపుతున్న ప్రతినిధులు

రద్దీ రోడ్డులో అడ్డదిడ్డం..

మద్దిలపాలెం నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్‌కు వెళ్లే మార్గంలో తెలుగుతల్లి వంతెన కింద నిర్మించిన అండర్ గ్రౌండ్ పాత్‌వే వద్ద వాహనాలు అడ్డదిడ్డంగా రాకపోకలు సాగిస్తున్నాయి. ఇక్కడ నిత్యం రద్దీగా ఉంటుంది. అటువంటి ప్రాంతంలో పలువురు ఆటోవాలాలు హఠాత్తుగా మలుపు తిరుగుతున్నారు. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతూ వాహనాలు బారులుతీరుతున్నాయి. ట్రాఫిక్ పోలీసులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని చోదకులు కోరుతున్నారు. – ఈనాడు, విశాఖపట్నం

దాడి ఘటనలో ఆటోడ్రైవర్ అరెస్టు

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : రౌడీషీటర్‌పై దాడి చేసిన ఆటోడ్రైవర్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని మహారాణిపేట సీఐ దివాకర్ తెలిపారు. శనివారం అర్ధరాత్రి సమయంలో జగదాంబకూడలి బస్‌స్టాప్ సమీప మద్యం దుకాణం వద్ద రౌడీషీటర్ అప్పలరాజుకు ఆటోడ్రైవర్ వరుణ్‌కు మధ్య గొడవ జరిగింది. వారిద్దరూ ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. దీంతో ఆగ్రహించిన వరుణ్ కత్తితో అప్పలరాజు కడుపులో పొడిచి పరారయ్యాడు. బాధితుడిని స్థానికులు వెంటనే కేజీహెచ్‌కు తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని, కేసు నమోదు చేశారు. ఆదివారం నిందితుడు వరుణ్‌ను అరెస్టు చేశారు.

నేడు 'డయల్ యువర్ సీఎండీ'

గురుద్వారా, న్యూస్‌టుడే: విద్యుత్తు సంబంధిత సమస్యలను మరింత వేగవంతంగా పరిష్కరించే లక్ష్యంతో గురుద్వారాలోని ఈపీడీసీఎల్ కార్యాలయంలో సోమవారం 'డయల్ యువర్ సీఎండీ' కార్యక్రమం నిర్వహించనున్నట్లు సంస్థ సీఎండీ ఇమ్మడి పృథ్వీతేజ్ ఓ ప్రకటనలో తెలిపారు. సంస్థ పరిధిలోని 13 జిల్లాలకు చెందిన వినియోగదారులు 8688400499 ఫోన్ నెంబర్ ద్వారా తమ సమస్యలను తెలియజేయవచ్చని పేర్కొన్నారు. ఉదయం 10.30 నుంచి 11.30 వరకు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యుత్తు సరఫరాలో తరచూ అంతరాయాలు, హెచ్చుతగ్గులు, కొత్త సర్వీసుల జారీ, సరఫరా పునరుద్ధరణలో జాప్యం, ట్రాన్స్‌ఫార్మర్ల మార్పిడి తదితర సమస్యలపై ఫిర్యాదు లను నేరుగా తన దృష్టికి తీసుకురావచ్చన్నారు.

ఏసీపీగా అంబేడ్కర్ నియామకం

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : విశాఖ మహిళా పోలీస్ స్టేషన్ ఏసీపీగా సీహెచ్.అంబేడ్కర్‌ను నియమిస్తూ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ కార్యాలయం నుంచి ఆదివారం ఉత్తర్వులు విడుదలయ్యాయి. గత కొంత కాలంగా ఖాళీగా ఉన్న పోస్టును వెయిటింగ్‌లో ఉన్న అంబేడ్కర్‌తో భర్తీ చేశారు.

నేటి నుంచి యూసీసీ క్రికెట్ టోర్నీ

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే : యునైటెడ్ క్రికెట్ క్లబ్ (యూసీసీ) 12వ మెగా టోర్నీ సోమవారం నుంచి ప్రారంభం కానుంది. ఈనెల 27 వరకు రైల్వే స్టేడియం, ఏసీఏ-వీడీసీఏ అంతర్జాతీయ స్టేడియంలో పోటీలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. ఆదివారం రైల్వే స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో ఆయా జట్ల కెప్టెన్లు పాల్గొని జెర్సీలు ఆవిష్కరించారు. తాలిమ్మాన్ రైల్వే జట్టు, వైజాగ్ బ్లూస్ జట్ల మధ్య రైల్వే స్టేడియంలో జరుగుతుందని యూసీసీ కార్యదర్శి వై.వెంకటేష్ తెలిపారు.

జెర్సీలు ఆవిష్కరిస్తున్న ఆయా జట్ల కెప్టెన్లు

విద్యార్థులకు దిక్సూచి 'మన్ కీ బాత్'

మధురవాడ, సాగర్‌నగర్, న్యూస్‌టుడే: ప్రధాని నరేంద్ర మోదీ నిర్వహిస్తున్న 'మన్ కీ బాత్' (మనసులో మాట) కార్యక్రమం కేవలం ప్రసంగం మాత్రమే కాదని, విద్యార్థులకు దేశాభివృద్ధిపై దిశానిర్దేశం చేసే అద్భుతమైన వేదికని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్.మాధవ్ అన్నారు. ఆదివారం బీచ్‌రోడ్‌లోని సన్ ఇంటర్నేషనల్ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలలో నిర్వహించిన ప్రధాని ప్రసంగ కార్యక్రమంలో విద్యార్థులతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ 131వ 'మన్ కీ బాత్' ప్రసంగంలో దేశాభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలను విద్యార్థులు శ్రద్ధగా ఆలకించారు. అనంతరం మాధవ్ మాట్లాడుతూ... ఏఐ రంగంలో దేశం గ్లోబల్ లీడర్‌గా ఎదుగుతోందని, వ్యవసాయం, పశుసంవర్ధక రంగాల్లో సాంకేతికతను వినియోగించుకోవాలని ప్రధాని చెప్పారన్నారు. పది నెలల వయసులో అవయవదానం చేసిన శిరీన్ అబ్రహాం అనే చిన్నారి సాహసాన్ని ప్రస్తావిస్తూ సామాజిక బాధ్యతపై స్ఫూర్తిని నింపారన్నారు. ప్రపంచ క్రికెట్‌లో రాణిస్తున్న భారత సంతతి క్రీడాకారుల ప్రతిభను మెచ్చుకున్నారన్నారు. కేరళలో ప్రారంభమైన కుంభమేళా విశిష్టతను గుర్తు చేస్తూ దేశ వారసత్వాన్ని చాటి చెప్పారన్నారు. అనంతరం ప్రధాని ప్రసంగంలో అడిగిన పలు ప్రశ్నలతో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన 10 మంది విద్యార్థులకు పి.వి.ఎన్.మాధవ్ చేతులమీదుగా బహుమతులు అందించారు. కార్యక్రమంలో పలువురు భాజపా నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులతో కలిసి ప్రధాని మోదీ ప్రసంగం వింటున్న భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్.మాధవ్, తదితరులు

'ఉగాది'కి వేప పువ్వు దొరికేనా..

మధురవాడ, న్యూస్‌టుడే: ఉగాది పేరు చెప్పగానే గుర్తుకు వచ్చేది వేపపువ్వు. ఈ ఏడాది షడ్రుచుల పచ్చడిలో వేప పువ్వు కరవయ్యే అవకాశం కనిపిస్తోంది. గడిచిన మూడేళ్లుగా వేప చెట్లను పట్టి పీడిస్తున్న 'డైబ్యాక్' (కొమ్మల ఎండు తెగులు) ఈ సారి మరింత ఉగ్రరూపం దాల్చింది. నగరంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడ చూసినా ఎనభై శాతానికి పైగా చెట్లు ఆకులు ఎండిపోయి మోడుల్లా దర్శనమిస్తున్నాయి. సాధారణంగా ఏటా ఫిబ్రవరిలో వేపచెట్లు చిగురించి తెల్లని పూతతో కళకళలాడుతుండేవి. మరో నెల రోజుల్లో ఉగాది పర్వదినం రానున్న నేపథ్యంలో ఎండిన వేప చెట్లను చూసి ప్రజలు నిరుత్సాహ పడుతున్నారు. మిగిలిన చెట్లన్నీ పచ్చదనంతో కళకళలాడుతుండగా కేవలం వేప చెట్లకే ఈ గండం రావడం పర్యావరణ ప్రేమికులను సైతం కలవరపెడుతోంది. దీనిపై మధురవాడ జోన్ ఉద్యానవన విభాగ అధికారి గిరి మాట్లాడుతూ.. వాతావరణ మార్పులు, 'ఫోమోప్సిస్ అజాదిరక్టే' అనే శిలీంధ్రం తెగులు వ్యాపించడం వల్ల వేపచెట్లు ఆకులు ఎండిపోవడం, క్రమంగా చెట్టు మొత్తం వాడిపోవడం జరుగుతుందన్నారు. ఈ ఏడాది పూత పూయాల్సిన దశలో చెట్టు శక్తిని కోల్పోవడం తెగులు ప్రధాన లక్షణమన్నారు.

మధురవాడలో ఆకులు ఎండిన వేపచెట్లు

నేటి నుంచి ధ్వజస్తంభం పునఃప్రతిష్ఠాపన పూజలు

సింహాచలం, న్యూస్‌టుడే: సింహగిరి క్షేత్ర పాలకుడు శ్రీబాలా త్రిపురసుందరి సమేత త్రిపురాంతక స్వామి ఆలయ ధ్వజస్తంభ పునః ప్రతిష్ఠాపన పూజలు సోమవారం నుంచి సంప్రదాయబద్ధంగా ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే శిథిలావస్థకు చేరిన పాత ధ్వజస్తంభం తొలగింపు పనులు పూర్తి చేసి పంచనామా నిర్వహించారు. సోమవారం నుంచి ఈ నెల 27వ తేదీ వరకు శైవాగమ విధానంలో ప్రతిష్ఠాపన వేడుకలు జరగనున్నాయి. 27న ఉదయం 11.25 గంటలకు పునర్వసు నక్షత్రం, వృషభ లగ్నంలో ప్రతిష్ఠాపన జరుగుతుందని ఈవో జె.వెంకటరావు తెలిపారు.

'ఉనికి చాటుకునేందుకే ఎస్ఎఫ్ఐ దాడి'

గురుద్వారా, న్యూస్‌టుడే: ఏయూలో తమ ఉనికి చాటుకోవడానికి ఎస్ఎఫ్ఐ సభ్యులు ఆర్ఎస్ఎస్ సభ్యులపై దాడులకు పాల్పడ్డారని అఖిల భారత విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) జాతీయ కమిటీ సభ్యుడు కిరణ్ ఆరోపించారు. ఏయూలో జరిగిన దాడి ఘటనపై గురుద్వారా దరి ఓ హోటల్‌లో ఆదివారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 75 ఏళ్లుగా ఏయూలో ఆర్ఎస్ఎస్ శాఖ తమ కార్యకలాపాలు చేస్తోందని, దీనికి మతం పేరుతో ఆచార్యులపై తప్పుగా మాట్లాడినట్లు సృష్టిస్తున్నారని పేర్కొన్నారు. విశ్వవిద్యాలయంలో అశాంతి నెలకొల్పుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వందేళ్ల చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా మత, కుల విద్వేషాలు రెచ్చగొడుతున్నారని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి వెంకట గోపి ధ్వజమెత్తారు. సోషల్ మీడియాలో ప్రచారం కోసం గొడవలు సృష్టిస్తున్నారన్నారు. అసత్య ఆరోపణలతో కరపత్రాలు ముద్రించి పంపిణీ చేస్తున్నారని అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ కమిటీ సభ్యుడు చందు, ఏబీవీపీ ఏయూ అధ్యక్షుడు వెంకయ్యానాయుడు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఏబీవీపీ జాతీయ కమిటీ సభ్యుడు కిరణ్, చిత్రంలో వెంకట గోపి, చందు తదితరులు

'కవలలు' కలిసే.. సందడి చేసే..!

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : అంతర్జాతీయ కవలల దినోత్సవం సందర్భంగా ఆదివారం డాబాగార్డెన్స్ ప్రైవేటు హోటల్లో వేడుక నిర్వహించారు. ఆంధ్ర, తెలంగాణ కవలల అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఇరు రాష్ట్రాల నుంచి వంద జంట కవలలు హాజరయ్యారు. వారంతా ఆట,పాటలతో సందడి చేశారు. అసోసియేషన్ అధ్యక్షులు రామరాజు, లక్ష్మణరాజు మాట్లాడుతూ... ఏటా సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ కవలల దినోత్సవాన్ని ప్రత్యేకంగా నిర్వహిస్తున్నామన్నారు. వచ్చే ఏడాది మరిన్ని కవల జంటలు హాజరయ్యేలా ప్రణాళికలు సిద్ధం చేస్తామని, సంఘం ఆధ్వర్యంలో సామాజిక, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

ఆంధ్ర, తెలంగాణ నుంచి వచ్చిన కవల జంటలు

క్రికెట్ లీగ్ విజేత.. మాస్టర్ బ్లాస్టర్స్

విశాఖక్రీడలు, న్యూస్‌టుడే : గత కొద్ది రోజులుగా జరుగుతున్న వైజాగ్ ప్రీమియర్ క్రికెట్ లీగ్ పోటీలు ఆదివారం ముగిశాయి. విజేతగా మాస్టర్స్ బ్లాస్టర్స్ జట్టు నిలిచింది. గీతం వర్సిటీ మైదానంలో జరిగిన బహుమతి ప్రదానోత్సవానికి వీఎంఆర్‌డీఏ ఛైర్మన్ ఎం.వి. ప్రణవ్‌గోపాల్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విజేత జట్టుకు ట్రోఫీ, రూ.2 లక్షల నగదు అందించారు. కార్యక్రమంలో నిర్వాహకులు రాజా, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న వీఎంఆర్‌డీఏ ఛైర్మన్ ప్రణవ్‌గోపాల్

EENADU eClassifieds

BUSINESS SERVICES

లోన్స్ గోల్డ్ లోన్స్ బ్యాంక్/ ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అధిక ధరకు మార్కెట్ రేటుకు కొనబడును. ✆ 9848488068, 7799223300.

FINANCIAL SERVICES

Govt. ఉద్యోగస్తులకు, రిటైర్డ్ పెన్షనర్లకు మరియు ప్రైవేటు పర్సనల్ ఫైనాన్స్, ఇన్సూరెన్సు వారికి ఫైనాన్సు ఇవ్వబడును. Cell: 73862 01191.

REAL ESTATE

LAND FOR SALE

GENERAL

పూసపాటిరేగ 'మం' గోవిందపురం రోడ్డు ప్రక్కన 1/2KM దూరంలో హైవే 9&4 ఎకరాల కొబ్బరితోట అమ్మకం & పోర్టుకు దగ్గరలో ఉన్నది. ✆ 9440255187.

54 సెంట్లు మెట్టుభూమి (NH16 8 5KM దూరంలో) అమ్మకం జరిగిన పంచాయితీ, పెందుర్తి మం, జిల్లా. Cont: 7013929308.

PLOT FOR SALE

ANANDAPURAM

ఆనందపురం AI గూగుల్ దగ్గరలో VMRDA అప్రూవ్డ్ లేఅవుట్‌లో 200 గజాల ఈస్ట్ ఫేసింగ్ ప్లాట్ అమ్మబడును. ✆ 9000254116

KOTHAVALASA

కొత్తవలస-రాయపూర్ హైవేకి 1KM లో 516E ... 2కిమీ VMRDA PLOTS గజం: 12వే. 7416862947, 9182857713

PENDURTHI

VMRDA Approved Plots Gated Community Layout. Just 10 Minutes from Tarluwada (Upcoming Google DataCentre) Facing NH-16 Nr. Pendurthi. 9398694446

TO LET

WANTED

GENERAL

RK బీచ్‌రోడ్డుకు దగ్గరగా 2BHK (or) 3BHK Full Furnished House required 3Months ... ✆ 9848299619.

JOBS

Wanted Plot Sale Agents. Reputed Real Estate Company seeking experienced Plot Sale Agents. * Attractive commission structure * High earning potential * Flexible working Hours * Immediate joining. Candidates must have good communication skills and knowledge of Local Property Market. ✆ 7675964466, 9000086656.

Required Sr. Accountant (F) Experience in GST Filing and Tally & MS Office for our Granite Export Comp., VSP. 9908664521.

Wanted Exp. Marketing Field Staff to Promote SS Kitchenware items. Two Wheeler is must. ✆ 9346519358, 7993640075.

ప్రముఖ ... FMCG ... 9390918114, 8367797975.

హైదరాబాద్ యూనిట్ హోంకేర్‌లో ఏజెంట్లకు మంచి అవకాశం. మీరు వర్కర్స్‌ని పంపితే మొదటినెల 5వేలు కమీషన్. వర్కర్స్ జీ:15K, శ్రీవసతి,ఫుడ్. 8121541212

MARKETING/ SALES

Anand Masale Require Sales & Marketing Manager, Marketing Executives. Contact: 9849655105, 9848053144 Email: anandmasalaeapplt@gmail.com.

SECURITY GUARDS

సెక్యూరిటీగార్డ్స్ :- మధురవాడ ఏరియాలో ... 9440387815, 0891 2721672

1. మేనేజర్స్ / మేనేజర్ ... Depts. State/ Central Retd./ Working/ VRS/ Insurance Sector, Degree 30+ Salary+ Perks 1.5L to 2.5L PM (T&C apply) In: 23rd & 24th. 7981588758, 8142580999.

గమనిక

లారీ నుంచి మంటలు.. హడలెత్తిన ప్రయాణికులు

గురుద్వారా, న్యూస్‌టుడే: లారీలో నుంచి మంటలు చెలరేగిన ఘటన ఆదివారం మధ్యాహ్నం జాతీయ రహదారి శాంతిపురం కూడలిలో చోటుచేసుకుంది. సకాలంలో పోలీసులు స్పందించి మంటలు అదుపు చేయడంతో ప్రమాదం తప్పింది. ఏపీ35 టీబీ2699 నెంబరు లారీ కోళ్ల లోడుతో చిప్పాడ వెళ్లి కోళ్లను దించేసి తిరిగి పోర్టుకు వెళ్లేందుకు బయలుదేరింది. సరిగ్గా శాంతిపురం కూడలి పెట్రోల్ బంకు సమీపానికి వచ్చేసరికి ఇంజిన్‌లో నుంచి మంటలు వ్యాపించడంతో అక్కడ ఉన్న ట్రాఫిక్ కానిస్టేబుల్ గమనించి నాలుగో పట్టణ పోలీసులకు సమాచారం అందించారు సకాలంలో పోలీసులు అక్కడికి చేరుకుని అటుగా నీళ్ల డబ్బాలతో వెళ్తున్న వాహనాన్ని ఆపి ఆ నీటితో మంటలను అదుపు చేశారు. లారీలో నుంచి దట్టమైన పొగ రావడంతో అటుగా రాకపోకలు సాగిస్తున్న ప్రయాణికులు హడలిపోయారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా వాహనాన్ని అక్కడ నుంచి తరలించారు. సీఐ ఉమాకాంత్, ఎస్సై బాలకృష్ణ ఘటనా స్థలానికి చేరుకుని మంటలకు గల కారణాలపై ఆరా తీశారు.

లారీ నుంచి వెలువడుతున్న పొగ

హోరాహోరీగా చదరంగం పోటీలు

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: గీతం డీమ్డ్ వర్సిటీ వేదికగా అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ (ఏఐయూ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సౌత్ జోన్ అంతర విశ్వవిద్యాలయాల మహిళల చదరంగం పోటీలు రెండో రోజు ఆదివారం హోరాహోరీగా సాగాయి. లక్ష్మీ భాయ్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ డీన్ (గ్వాలియర్) కృష్ణకాంత్ సాహు పర్యవేక్షణలో పోటీలు జరుగుతున్నాయి. మూడు రౌండ్లు పూర్తయ్యేసరికి యూనివర్సిటీ ఆఫ్ మద్రాస్, ఎస్ఆర్ఎం, అన్నా, జేఎన్‌టీయూ (కాకినాడ) విశ్వవిద్యాలయాలు ముందంజలో ఉన్నాయని గీతం డీన్ అరుణ్ కార్తిక్, క్రీడా విభాగం డిప్యూటీ డైరెక్టర్ జి.శ్రీనివాస్, మేనేజర్ కె.తపశ్వి పేర్కొన్నారు. సోమవారం ఫైనల్స్ పోటీలు జరుగుతాయన్నారు.

పోటీల్లో తలపడుతున్న క్రీడాకారిణులు

పోలీసుల అరెస్టుకు డిమాండ్

కార్పొరేషన్, న్యూస్‌టుడే : కాకినాడకు చెందిన దళిత యువకుడు వీధి సుబ్రహ్మణ్యం హత్యకేసులో ప్రధాన నిందితుడు, వైకాపా ఎమ్మెల్సీ అనంతబాబుకు అనుకూలంగా వ్యవహరించిన నాటి పోలీసు అధికారులను సస్పెండ్ చేయడమే కాకుండా, వెంటనే అరెస్టు చేయాలని విదసం (విశాఖ దళిత సంఘాలు) సమన్వయకర్త బూసి వెంకట్రావు డిమాండ్ చేశారు. ఆదివారం విశాఖపట్నంలోని జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సంఘం ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... హత్య కేసులో కేవలం ఎమ్మెల్సీ అనంతబాబును మాత్రమే అరెస్టు చేసి, ఆ తర్వాత బెయిల్‌పై విడుదల చేశారన్నారు. ఇప్పుడు సుప్రీంకోర్టు కీలక తీర్పుతో ఆయన భార్యను కూడా అరెస్టు చేయాలని కోరారు. ఈ కేసులో దోషులతో కుమ్మక్కైన అధికారుల పేర్లు ఛార్జ్‌షీట్‌లో నమోదు చేయాలని కోరారు. విదసం ప్రతినిధులు ఓంకార్, సుధాకర్, ప్రసాద్, రాజు, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విదసం ప్రతినిధులు

ట్రావెల్ బస్సుల్లో వాణిజ్య సరకులు తరలిస్తే కేసులు

మాధవధార, న్యూస్‌టుడే: ప్రయాణికుల భద్రత దృష్ట్యా ట్రావెల్స్ బస్సుల్లో వాణిజ్య సరకులు, ఇతర సామగ్రి రవాణా చేస్తే కేసులు నమోదు చేస్తున్నట్లు డీటీసీ ఆర్.సి. హెచ్.శ్రీనివాస్ తెలిపారు. ఈనెల 11 నుంచి ఇప్పటివరకు 41 బస్సులపై కేసులు నమోదు చేసి వారి నుంచి రూ.3,52,870 అపరాధ రుసుం వసూలు చేసినట్లు ఆయన తెలియజేశారు. ప్రయాణికుల బస్సుల్లో వాణిజ్య సరకులు, మండే వస్తువులు, వివిధ షోరూంలకు సంబంధించిన పార్శిళ్లు తరలించడం చట్ట వ్యతిరేకమని, వీటిని ఎవరూ ప్రోత్సహించవద్దన్నారు. యజమానులు నిబంధనలు పాటించి బస్సులు నడపాలని, ఈ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయన్నారు.

నిత్య వ్యాయామంతో ఆరోగ్యం

వన్‌టౌన్, అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే : నిత్య వ్యాయామంతో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని పలువురు పేర్కొన్నారు. ఆదివారం విశాఖ పోర్టు అథారిటీ (వీపీఏ) ఆధ్వర్యంలో 'ఫిట్ ఇండియా సైక్లింగ్ డ్రైవ్' కార్యక్రమం నిర్వహించారు. సంస్థ ఉద్యోగులు, సీఐఎస్ఎఫ్ సిబ్బంది, పాఠశాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆరోగ్యకరమైన జీవన విధానంలో భాగంగా కేంద్రం అమలు చేస్తున్న సైక్లింగ్ డ్రైవ్‌ను ప్రతి వారం నిర్వహిస్తూ, పలువురికి అవగాహన కల్పిస్తున్నామని పోర్టు ప్రతినిధులు తెలిపారు.

సైక్లింగ్‌లో పాల్గొన్న వీపీఏ ఉద్యోగులు, సీఐఎస్ఎఫ్ సిబ్బంది, విద్యార్థులు

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	115	110
లైవ్	142	130
డ్రెస్డ్	206	230
స్కిన్‌లెస్	234	240

(c) eenadu

పెందుర్తి

తెరపై ఈనాడు
లక్ష్మీకాంత్ స్క్రీన్-1: హే బలవంత్
స్క్రీన్-2: ఆల్ఫా

రహదారి నిర్మాణం.. నివాసితుల హర్షం

చినముషిడివాడ (పెందుర్తి), న్యూస్‌టుడే: జీవీఎంసీ 97వ వార్డు చినముషిడివాడ శ్రమశక్తినగర్ కాలనీ 6వ లేఅవుట్‌లో కొత్తగా రహదారి నిర్మాణం పనులు ప్రారంభించడంపై నివాసితులు, కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. ఈ లేఅవుట్‌లోని పార్కు చుట్టూ రహదారి అభివృద్ధికి నోచుకోకపోవడంతో నివాసితులు తీవ్ర అవస్థలు ఎదుర్కొన్నారు. ఈ సమస్యపై 'ఈనాడు'లో పలుమార్లు వెలువడిన కథనాలకు వార్డు కార్పొరేటర్ శానాపతి వసంత స్పందించారు. నిధుల మంజూరుకు కృషి చేయడంతో పనులు ప్రారంభమయ్యాయి.

సీఐ బాలికల వసతిగృహం సందర్శన

విద్యార్థినులతో మాట్లాడుతున్న సీఐ మల్లికార్జునరావు

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలం భరణికం గ్రామంలో న్యూపోర్ట్ బాలికల వసతిగృహాన్ని ఆదివారం పరవాడ సీఐ మల్లికార్జునరావు సందర్శించారు. ఇక్కడ బాలికలకు అందిస్తున్న సౌకర్యాలపై ఆరా తీసి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా పోలీసులకు తెలియజేయాలని సూచించారు. ఎస్సై మహాలక్ష్మి పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

80085 74978 సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

వేపగుంట, న్యూస్‌టుడే: ?: 94వవార్డు అప్పలనరసయ్యకాలనీలోని కాలువల్లో చెత్త పేరుకుపోయి దుర్గంధం వెలువడుతోంది. -నారాయణరావు, రాజారావు, స్థానికులు. ✓: వెంటనే పరిశీలించి శుభ్రత పనులు చేపడతాం. -ప్రసాదరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్.

సబ్బవరం, న్యూస్‌టుడే: ?: విద్యుత్తు సబ్‌స్టేషన్‌కు వెళ్లే రహదారి పూర్తిగా శిథిలం కావడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. -వి.రాజేష్, సబ్బవరం. ✓: ఈ సమస్యపై ఉన్నతాధికారులకు తెలియజేస్తాం. -అశోక్‌కుమార్, ఏఈ, ఏపీఈపీడీసీఎల్.

?: సబ్బవరం సామాజిక భవనం వెనుక రహదారి పూర్తిగా దెబ్బతినడంతో స్థానికులు ఇబ్బందులు గురవుతున్నారు. -ఎస్.నాగేంద్రకుమార్, సబ్బవరం ✓: ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తాం. -డి.ప్రసాదరావు, సబ్బవరం

పరవాడ, న్యూస్‌టుడే: ?: పరవాడ పార్కులోని ఆట వస్తువులు తుప్పు పట్టి, పిచ్చిమొక్కలతో అధ్వానంగా మారింది. -శ్రీను, పరవాడ ✓: పార్కులోని పరికరాలను శుభ్రం చేయించి వినియోగంలోకి తెచ్చేందుకు చర్యలు చేపడతాం. -మల్లికార్జునరావు, ఈవోపీఆర్డీ, పరవాడ.

ప్రమాదకరంగా వేగ నియంత్రికలు

ఫోకస్

పరవాడ, న్యూస్‌టుడే: వాహన చోదకులు సురక్షితంగా గమ్యం చేరేందుకు పలుచోట్ల ఏర్పాటు చేసిన వేగ నియంత్రికలు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయి. ఇవి పలు చోట్ల వాహన చోదకులకు స్పష్టంగా కనిపించేలా లేకపోవడంతో కొందరు మృత్యువాత పడగా, మరికొందరు గాయాలపాలయ్యారు. ★ పరవాడ మండలంలోనూ పలుచోట్ల ఇవి ప్రమాదకరంగా మారాయి. పరవాడ గండివారివీధి, బొంకులదిబ్బ ప్రాంతాలతో పాటు వెన్నెలపాలెం, తానాం, తాడి ఐవోసీఎల్ కంపెనీ, జేఎన్‌ఫార్మాసిటీలో వేసిన వేగనిరోధకాలకు రేడియం స్టిక్కర్లు, రంగులు లేవు. రాత్రి వేళ ఇవి కనిపించక ద్విచక్రవాహనదారులు అవస్థలు పడుతున్నారు. వేగంగా ప్రయాణించే వాహనదారులు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వేగ నిరోధకాలు స్పష్టంగా కనిపించేలా రంగులు వేయించాలని, రేడియం స్టిక్కర్లు అమర్చాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

పరవాడ రహదారిలో ఇలా..

వేపగుంట, న్యూస్‌టుడే: వేపగుంట కూడలి నుంచి గోపాలపట్నం పెట్రోల్ బంక్ వరకు, వేపగుంట-పెందుర్తి రహదారిలో పురుషోత్తపురం వరకు, వేపగుంట నుంచి పాతగోశాల కూడలి వరకు, పాతగోశాల కూడలి నుంచి గోపాలపట్నం పెట్రోల్‌బంక్ వరకు ఉన్న స్పీడ్‌బ్రేకర్లపై తెలుపు రంగు సూచికలు పూర్తిగా చెరిగిపోయాయి. ఈ మూడు మార్గాల్లోని మధ్య దారుల్లో 26, సేవా మార్గాల్లో 15 స్పీడ్‌బ్రేకర్లు ఉన్నాయి. వీటికి రేడియం స్టిక్కర్లు ఇరువైపులా వేయాల్సి ఉన్నప్పటికీ కొన్నిచోట్లకే పరిమితం అయ్యాయి. వేపగుంట నుంచి పురుషోత్తపురం వరకు వీటిని ఒకవైపున అమర్చలేదు. గతంలో వేసిన రబ్బరు స్పీడ్‌బ్రేకర్లు భూమిలోకి కూరుకుపోయాయి.

వేపగుంట బీఆర్టీఎస్ మధ్య దారిలో.. భూమిలోకి చొచ్చుకుపోయిన స్పీడ్‌బ్రేకర్

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలంలో ఎన్‌హెచ్-16 రహదారికి ఇరువైపులా సుమారు 45 చోట్ల వేగ నియంత్రికలు ఉన్నాయి. అయిదేళ్ల క్రితం వాటిని వేసినందున ప్రస్తుతం రంగులు చెరిగిపోయి రాత్రి పూట ప్రాణాంతకంగా మారాయి. ★ నారపాడు హైవే పైవంతెనను ఆనుకుని వేసిన స్పీడు బ్రేకర్లు కనిపించక ఓ వ్యక్తి అదుపు తప్పి కింద పడి మృతి చెందాడు. సబ్బవరం పోలీస్‌స్టేషన్ వద్ద ఒకరు ప్రాణాలు కోల్పోయారు. ★ అనకాపల్లి-ఆనందపురం హైవే (బైపాస్ రహదారి) ఇరువాడ కూడలి వద్ద ఎలాంటి సూచికలు లేక వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. సబ్బవరం ఎన్టీఆర్ సర్కిల్, ఆర్టీసీ కాంప్లెక్స్, ప్రభుత్వ ఆసుపత్రి, బాలుర వసతిగృహం, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కొత్త, పాత రోడ్ల వద్ద వేగ నియంత్రికలున్నా అవి కనిపించేలా లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

సబ్బవరం బైపాస్‌లో అసకపల్లి కూడలి వద్ద..

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

రోగులను పలకరిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు

సరిపల్లి (పెందుర్తి), న్యూస్‌టుడే: నగరానికి చెందిన ఆర్య ఆసుపత్రి వైద్యుడు డాక్టర్ రాయవరపు రేవంత్ ఆధ్వర్యంలో ఆదివారం పెందుర్తి మండలం సరిపల్లి గ్రామంలో ఉచిత మెగా వైద్య శిబిరం జరిగింది. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన శిబిరాన్ని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. యువ వైద్యులు ఇలాంటి శిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. సరిపల్లి పరిసర గ్రామాలకు చెందిన సుమారు 300మందికి వివిధ వైద్య, ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ మాజీ ఫ్లోర్‌లీడర్ రెడ్డి నారాయణరావు, ఎంపీటీసీ సభ్యుడు గొల్లవిల్లి వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ కలయిక

ప్రహ్లాదపురం(వేపగుంట), న్యూస్‌టుడే: నేవల్ డాక్‌యార్డ్‌లో విధులు నిర్వహించిన విశ్రాంత ఉద్యోగులు ఆదివారం ప్రహ్లాదపురంలో కలుసుకుని సందడి చేశారు. ఈ సందర్భంగా పలువురు సీనియర్ విశ్రాంత అధికారులను ఘనంగా సత్కరించారు. దూరమైన స్నేహితులకు శ్రద్ధాంజలి ఘటించారు. ఆదారి పాపారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రతినిధులు సరోజు, శ్యాంప్రసాద్, పి.ఎస్.ఎన్.మూర్తి, పి.శ్రీహరి, ఎస్.ప్రకాశరావు, ఎం.పి.దత్, ఎండీ హుస్సేన్, పి.ఆదినారాయణ తదితరులు సహాయ సహకారాలు అందించారు. ఈ సమావేశానికి వివిధ ప్రాంతాల నుంచి పలువురు విశ్రాంత ఉద్యోగులు హాజరై పరస్పరం యోగక్షేమాలు తెలుసుకుని రోజంతా ఉత్సాహంగా గడిపారు.

చేతులెత్తి ఐక్యత చాటుతున్న నేవల్ డాక్‌యార్డ్ విశ్రాంత ఉద్యోగులు

ఘనంగా అమ్మవార్ల ఊరేగింపు

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ పైడిమాంబ, తానాం పండిశెట్టమ్మ, దేశపాత్రునిపాలెం పోలమాంబ వేడుకలు ఆదివారం రాత్రి ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పైడిమాంబ గరగ, పండిశెట్టమ్మ, పోలమాంబ ఘటాలను మేళతాళాలు, బాణసంచా కాల్పుల నడుమ గ్రామపురవీధుల్లో ఊరేగించారు. సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

నేడు ఉద్యోగ మేళా

పెందుర్తి, న్యూస్‌టుడే: స్థానిక ఆదర్శ్ డిగ్రీ కళాశాలలో సోమవారం ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ షోరా ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి జరుగుతున్న ఈ శిబిరంలో 2015 నుంచి 2026 వరకు డిగ్రీ, బీటెక్ పూర్తి చేసినవారు, ఇంకా చివరి సంవత్సరం చదువుతున్న అభ్యర్థులు పాల్గొనవచ్చని తెలిపారు. వివిధ సంస్థల ప్రతినిధులు మౌఖిక పరీక్షలు నిర్వహిస్తారని వివరించారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రాకపోకలకు మార్గం సుగమం

స్పందనకు వందనం

పెందుర్తి, న్యూస్‌టుడే: జీవీఎంసీ 96వ వార్డు పాత పెందుర్తిలోని జెడ్పీ ఉన్నత పాఠశాల సమీపంలో వేగ నియంత్రికలు ప్రమాదకరంగా మారిన నేపథ్యంలో ఇటీవల 'ఈనాడు'లో 'ఎంతటి వాహనమైనా.. అక్కడ ఆగి వెళ్లాల్సిందే..' శీర్షికన వెలువడిన కథనానికి జీవీఎంసీ అధికారులు స్పందించారు. ప్రమాదకరంగా ఉన్న వేగ నియంత్రికలను తొలగించి వాటి స్థానంలో వాహనాలు సాఫీగా ప్రయాణించేలా పరిమితమైన ఎత్తుతో కొత్తగా నిర్మించడంతో వాహన చోదకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత నియంత్రికలు రాత్రి వేళ స్పష్టంగా కనిపించేలా రేడియం స్టిక్కర్లు, అవసరమైతే సూచికలు ఏర్పాటు చేయాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

అబాకస్ పోటీల్లో ప్రతిభ

పతకాలు సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

పెందుర్తి, న్యూస్‌టుడే: ఏలూరులో ఆదివారం జరిగిన రాష్ట్రస్థాయి అబాకస్, వేద గణితం పోటీల్లో పెందుర్తి లిటిల్ ఫ్లవర్స్ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రదర్శన కనబరిచినట్లు ప్రిన్సిపల్ కేఎస్ఎన్ రాజు తెలిపారు. అబాకస్ లెవెల్-2లో రేష్మ, షణ్ముఖ ప్రియ మొదటి బహుమతి, ప్రీ లెవెల్ విభాగంలో అనన్య మూడవ బహుమతి, వేద గణితంలో ఈశ్వర్ రెండవ, తనుశ్రీ మూడవ బహుమతులు సాధించినట్లు వివరించారు. దీంతో పాటు బెస్ట్ టీచింగ్ అవార్డు కూడా సొంతమైనట్లు వివరించారు. ఈ సందర్భంగా సంబంధిత విద్యార్థులను ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు అభినందించారు.

రైల్వేస్టేషన్ రోడ్డులో ఆక్రమణల బెడద

ఎంఈవో కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన దుకాణం

పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తి రైల్వేస్టేషన్ రోడ్డులో ఆక్రమణలు పెరుగుతున్నాయని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలీస్ స్టేషన్ నుంచి రైల్వేస్టేషన్‌కు వెళ్లే దారి ఇరుకుగా ఉంటుంది. రద్దీ సమయాల్లో ఈ రోడ్డులో తరచూ ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ క్రమంలో ఎంఈవో కార్యాలయం సమీపంలో గతంలో పాడైపోయిన ఓ లారీ ఉండేది. దాన్ని ప్రస్తుతం తొలగించడంతో ఆ ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తులు బడ్డీ పెట్టారు. ఈ మార్గంలో పెందుర్తి సీహెచ్‌సీ, మండల వ్యవసాయ, విద్యా శాఖ, పీ-4 ప్రగతి కార్యాలయాలున్నాయి. ఇక్కడికి వేర్వేరు పనుల కోసం వచ్చే వారంతా తమ వాహనాలను రోడ్డుపైనే పార్కింగ్ చేస్తున్నారు. ఆ ప్రదేశంలోనే తాజాగా బడ్డీ ఏర్పాటు చేయడంతో వాహనాల పార్కింగ్‌కు తీవ్ర ఇబ్బంది ఏర్పడుతోంది. దీంతో పాటు ట్రాఫిక్ సమస్యలు తీవ్రమవుతున్నాయని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి ఈ మార్గంలోని ఆక్రమణలు తొలగించాలని కోరుతున్నారు.

గెడ్డలో పేరుకుపోయిన వ్యర్థాలు..

దర్పణం

పాపయ్యరాజుపాలెం (పెందుర్తి), న్యూస్‌టుడే: జీవీఎంసీ 95వ వార్డు పాపయ్యరాజుపాలెంలోని సాయినగర్ ఆలయ సమీప గెడ్డలో వ్యర్థాలు పేరుకుపోయి దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు వాపోతున్నారు. ఇక్కడ మురుగు నిలిచిపోవడంతో దోమల బెడద కూడా వెంటాడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత కొన్నాళ్లుగా ఇక్కడ పరిశుభ్రత పనులు జరగకపోవడం వల్ల ఈ పరిస్థితి తలెత్తిందని అంటున్నారు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

విజేతలకు బహుమతుల అందజేత

తానాం(పరవాడ), న్యూస్‌టుడే: పరవాడ మండలం తానాం గ్రామంలో పండిశెట్టి ఉత్సవాల సందర్భంగా ఆర్‌కెకె యువసేన, తెలుగు యువత సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండలస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు ముగిశాయి. ఈ పోటీల్లో ప్రతిభ చాటిన సాలాపువానిపాలెం, తాడి, తానాం-1, తానాం-2 జట్లు వరుస విజేతలుగా నిలిచాయి. వీరికి ఆదివారం రాత్రి రూ.8వేలు, రూ.6వేలు, రూ.4వేలు, రూ.2వేలు చొప్పున నగదు బహుమతులతో పాటు జ్ఞాపికలను మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి అందజేశారు. 79వవార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి క్రికెట్ పోటీల విజేత 'దోసూరు'

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ పైడిమాంబ వేడుకల సందర్భంగా రెండు వారాలుగా జరుగుతున్న జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు ఆదివారం సాయంత్రం ముగిశాయి. ఈ పోటీల్లో అచ్యుతాపురం మండలం దోసూరు జట్టు (ప్రథమ), గొర్లెవానిపాలెం జట్టు (ద్వితీయ), ఎలమంచిలి జట్టు (తృతీయ) విజేతలుగా నిలిచాయి. వీరికి వరుసగా రూ. 25వేలు, రూ. 15వేలు, రూ. 10వేలు నగదు బహుమతులు, జ్ఞాపికలను స్థానిక నాయకులు సిరిపురపు అప్పలనాయుడు, పైలా శ్రీనివాసరావు, మువ్వల రామునాయుడు, పైలా సన్యాసిరావు చేతులమీదుగా అందజేశారు. నిర్వాహకులు పడాల చంద్రశేఖర్, పైలా బుజ్జి, పైలా కృష్ణ, గండి మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

విజేత జట్టుకు జ్ఞాపికతో పాటు నగదు అందజేస్తున్న నాయకులు, నిర్వాహకులు

అవీ ఇవీ

85 యూనిట్ల రక్త నిల్వల సేకరణ

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలం జోడుగుళ్ల బంగారమ్మతల్లి సేవా సమితి ఆధ్వర్యంలో తాసుబిల్లి ఫౌండేషన్ ఛైర్మన్ శంకర్‌నాయుడు జన్మదినాన్ని పురస్కరించుకుని సబ్బవరంలో ఆదివారం స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో రోటరీ బ్లడ్ బ్యాంకు ప్రతినిధులు 85 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. బంగారమ్మతల్లి సేవా సమితి అధ్యక్షుడు సింగంపల్లి వెంకట్రావు, తదితర నాయకులు రక్తదానం చేసిన వారిని అభినందించారు.

24న పైడిమాంబ జాతర

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ పైడిమాంబ అమ్మవారి జాతర ఈనెల 24వ తేదీన జరగనుంది. ఈ మేరకు సోమవారం అర్ధరాత్రి నుంచి అమ్మవారి దర్శనాలు ప్రారంభమై మంగళవారం రాత్రి వరకు కొనసాగుతాయి. ఇందుకోసం ఆలయం వద్ద జరుగుతున్న ఏర్పాట్లను గ్రామపెద్దలు, ఉత్సవ కమిటీ ప్రతినిధులతో కలిసి సీఐ మల్లికార్జునరావు పరిశీలించారు. భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన క్యూలైన్లు, బారికేడ్లు, టెంట్లు పరిశీలించారు. భక్తులకు తాగునీరు అందుబాటులో ఉంచాలని, ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా తగిన చర్యలు చేపట్టాలని సూచించారు.

సంప్రదాయబద్ధంగా బల్లల పండగ

అగనంపూడి, న్యూస్‌టుడే : అగనంపూడి పరిధి కొండయ్యవలస కాలనీలో ఆదివారం శ్రీ బొర్రమాంబ రజక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సంప్రదాయబద్ధంగా బల్లల పండగను నిర్వహించారు. కులదైవం వడివేలు దేవుడికి ప్రత్యేక పూజలు చేశారు. విశాఖ జిల్లా రజక సంక్షేమ సంఘం అధ్యక్షుడు తోకాడ రాము పాల్గొన్నారు.

ఘనంగా 'బ్రహ్మకుమారీస్' వార్షికోత్సవం

పురుషోత్తపురం (పెందుర్తి), న్యూస్‌టుడే: ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయ వార్షికోత్సవం పురుషోత్తపురంలోని ఆదివారం సాయంత్రం రాజయోగ ధ్యాన కేంద్రంలో ఘనంగా జరిగింది. 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు, పెందుర్తి ఎస్ఐ లక్ష్మీ, భాజపా జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు నాదెళ్ల జ్యోతి, పెందుర్తి భాజపా కన్వీనర్ గొర్లె రామునాయుడు ఈ వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా బ్రహ్మకుమారీస్ సమాజానికి అందిస్తున్న సేవలను నిర్వాహకులు వివరించారు. బ్రహ్మకుమారీస్ ప్రతినిధులు సత్యవతి, తదితరులు పాల్గొన్నారు.

వేడుకల్లో పాల్గొన్న బ్రహ్మకుమారీలు, అతిథులు

శ్రీనివాసుడి సన్నిధిలో ప్రముఖులు

ఎమ్మెల్యే గణబాబుకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న అర్చకులు

నాయుడుతోట(వేపగుంట), న్యూస్‌టుడే: నాయుడుతోట సమీప రవినగర్ శేషాద్రి శిఖరంపై గల కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం హయగ్రీవ హోమం నిర్వహించారు. ఈ పూజల్లో ప్రభుత్వ విప్, పశ్చిమం ఎమ్మెల్యే గణబాబు, జనసేన నాయకుడు బెహరా భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు. వారిని అర్చకులు ఆశీర్వదించి స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. పలు కళాశాలల విద్యార్థులు ఈ పూజల్లో పాల్గొన్నారు. సాయంత్రం మహాలక్ష్మీ అమ్మవారికి సామూహిక కుంకుమ పూజలు చేపట్టారు. ఈనెల 23న ఉదయం నృసింహ హోమం, పంచామృతాభిషేకాలు, సాయంత్రం 5గంటల నుంచి స్వామివారి వార్షిక కల్యాణోత్సవం జరుగుతుందని అర్చకులు తెలిపారు.

భూలోకమాంబ పండగ

అప్పన్నపాలెం(వేపగుంట), న్యూస్‌టుడే: అప్పన్నపాలెం పరిసర ప్రాంతాల ప్రజల ఆరాధ్యదైవం భూలోకమాంబ అమ్మవారి పండగ ఆదివారం ఘనంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అధ్యక్షుడు పీతల విష్ణుమూర్తి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఘటాల ఊరేగింపు, మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. సాయంత్రం నిర్వహించిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్పొరేటర్లు పీవీ నరసింహం, బల్ల శ్రీనివాసరావులతో పాటు స్థానిక పెద్దలు పీతల అప్పలరాజు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సిరుల తల్లికి శ్రీసూక్త పూజలు

మహాలక్ష్మి అమ్మవారు

పెందుర్తి, న్యూస్‌టుడే: వేంకటాద్రిపై జరుగుతున్న ఫాల్గుణ పక్షోత్సవాల్లో భాగంగా సిరులొలికే శ్రీమహాలక్ష్మీ అమ్మవారికి ఆదివారం శ్రీసూక్త సహిత కుంకుమార్చన జరిగింది. ఆలయ ప్రధానార్చకులు మహర్తి రామానుజాచార్యులు నేతృత్వంలో అర్చకులు జగన్మాతను పట్టు పీతాంబరాలు, ఆభరణాలతో అలంకరించి ధూపదీప సేవలు జరిపారు. భక్తులు పాల్గొని సామూహిక స్తోత్ర పారాయణం చేశారు.

శివలింగం ప్రతిష్ఠాపన

ప్రహ్లాదపురం(వేపగుంట), న్యూస్‌టుడే: ప్రహ్లాదపురం శిరిడి సాయిబాబా ఆలయ ప్రాంగణంలో కొత్తగా శివలింగ ప్రతిష్ఠాపనోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శివుడ్ని దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన చేపట్టారు. ఆలయ కమిటీ సభ్యులు సహాయ సహకారాలు అందించారు.

ముగిసిన ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు

సింహపురికాలనీ (వేపగుంట), న్యూస్‌టుడే: సింహపురికాలనీ సీతారామాలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. ముగింపు పూజల్లో కార్పొరేటర్లు పి.వి.నరసింహం, బల్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని కార్పొరేటర్లు ప్రారంభించారు. బ్రహ్మోత్సవాలకు సహకరించిన భక్తులకు, దాతలకు ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

అన్నసమారాధన ప్రారంభిస్తున్న కార్పొరేటర్లు నరసింహం, శ్రీనివాసరావు తదితరులు

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం శ్రీఉమారామలింగేశ్వర స్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం ఈనెల 26వ తేదీన నిర్వహించనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఆరోజు ఉదయం 6గంటల నుంచి స్వామికి ప్రత్యేక పూజలు, 10గంటల నుంచి శివ పార్వతుల కల్యాణం జరుగుతుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

వేపగుంట, న్యూస్‌టుడే: వేపగుంట ఓపెన్ జిమ్ వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం ఆదివారం ఓపెన్‌జిమ్ ప్రాంగణంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ఇంటర్నేషనల్ వాకర్స్ అసోసియేషన్ డిస్ట్రిక్ట్ గవర్నర్ మహేశ్ అతిథిగా హాజరై నూతన సభ్యులతో ప్రమాణం చేయించారు. అసోసియేషన్ అధ్యక్షులుగా బి.ఎన్.కుమార్, కార్యదర్శిగా నానాజీ, కోశాధికారిగా రాజు, ఇతర సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. అసోసియేషన్ గతంలో చేపట్టిన రక్తదాన, ఉచిత వైద్య శిబిరాలతో పాటు ఇతర సేవలను మహేశ్ అభినందించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులంతా పాల్గొన్నారు.

కమిటీ సభ్యులతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న డిస్ట్రిక్ట్ గవర్నర్ మహేశ్

నేరాల నియంత్రణపై అవగాహన

మాట్లాడుతున్న సీఐ చంద్రమౌళి

సత్తివానిపాలెం(వేపగుంట), న్యూస్‌టుడే: సత్తివానిపాలెంలోని కాలనీవాసులకు ఆదివారం నేరాల నియంత్రణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు స్థానిక ఆకృతి అపార్ట్‌మెంట్ ప్రాంగణంలోని కాలనీ సంఘాలకు క్రైం సీఐ ఎం.చంద్రమౌళి, ఎస్ఐ డి.సూరిబాబు పలు సూచనలు చేశారు. చోరీల నివారణకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. పోలీసులకు అపరిచిత వ్యక్తుల సమాచారం అందించాలని కోరారు.

మత్తు వదిలితే బంగారు భవిత

జంగాలపాలెంలో యువతకు సూచనలిస్తున్న సీఐ సతీశ్‌కుమార్

జంగాలపాలెం (పెందుర్తి), న్యూస్‌టుడే: దురలవాట్లను దూరంగా ఉంచితే బంగారు భవిత సొంతమవుతుందని పెందుర్తి సీఐ కె.వి.సతీశ్‌కుమార్ యువతకు సూచించారు. ఆదివారం ఆయన పెందుర్తి మండలం జంగాలపాలెం గ్రామంలోని హెలిప్యాడ్ మైదానంలో ఆటలాడుతున్న యువతతో సమావేశమయ్యారు. గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలతో సంబంధం ఉండే వారికి సహకరించడం వల్ల తలెత్తే చట్టపరమైన ఇబ్బందులను తెలియజేశారు. అలాంటి కేసుల్లో ఇరుక్కుంటే జీవితంపై చూపే ప్రభావాన్ని వివరించారు. క్రమశిక్షణ, మంచి అలవాట్లతో యువత ఆదర్శవంతంగా ఉండాలని సూచించారు.

(c) eenadu

భీమిలి

సినిమాలు

చిట్టివలస (తగరపువలస), న్యూస్‌టుడే

గణేశ్ - మన శంకర వరప్రసాద్ గారు
రాములమ్మ - భర్త మహాశయులకు విజ్ఞప్తి
తాతా - హే బల్వంత్!
సప్తగిరి - కపుల్ ఫ్రెండ్లీ

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు

భీమునిపట్నం, న్యూస్‌టుడే: భీమిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రంలో సోమవారం నుంచి ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ కేంద్రానికి ఇతర కళాశాలలకు చెందిన 615 మంది విద్యార్థులను జంబ్లింగ్ పద్ధతిలో కేటాయించారు. ఉదయం 9 నుంచి 12 వరకు పరీక్షలు జరుగుతాయి. ప్రధానాచార్యులు పి.రామ్‌ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు హాల్ టికెట్లతో అరగంట ముందు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

మేమున్నాం.. మీకు తోడుగా

99122 22247 సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

ఎండాడ, న్యూస్‌టుడే: ?: మిథిలాపురి వుడా కాలనీ(మధురవాడ)లో శివాలయం పరిసరాల్లో చెత్త కుప్పలు పేరుకుపోయాయి. - కాలనీవాసులు ✓: శుభ్రతకు చర్యలు తీసుకుంటాం. - రవి, వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్

?: ధర్మపురికాలనీ (మధురవాడ)లో పందుల బెడద తీవ్రంగా ఉంది. - రాము ✓: పందుల నివారణకు చర్యలు తీసుకుంటాం. - రాజా రవికుమార్, ఆరోగ్య అధికారి

?: బక్కన్నపాలెం(మధురవాడ)లో కాలువలు లేక మురుగునీరు నిలిచిపోతోంది. - స్థానికులు ✓: త్వరలో కాలువల నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం. - అయ్యప్పనాయుడు,. జోన్-2 కమిషనర్

?: ఎండాడ కూడలిలో మద్యం దుకాణం ఎదురు రోడ్డులో మందుబాబుల బెడద తీవ్రంగా ఉంది. - రాంబాబు ✓: సంబంధిత ప్రాంతాల్లో గస్తీ ఏర్పాటు చేసి కేసులు నమోదు చేస్తాం. - పీఎంపాలెం గస్తీ పోలీసులు

వ్యర్థాల తొలగింపు

స్పందనకు వందనం

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: బీచ్ రోడ్డు సాగర్‌నగర్ ప్రధాన కూడలి సమీప వంతెన దిగువ భాగంలో పేరుకుపోయిన వ్యర్థాలను జీవీఎంసీ పారిశుద్ధ్య విభాగాధికారుల పర్యవేక్షణలో తొలగించారు. పర్యావరణానికి హాని కలిగించేలా అసౌకర్యకర పరిణామాలు తలెత్తాయని 'ఈనాడు'లో ఈ నెల 15న 'పేరుకుపోయిన చెత్త' శీర్షికతో వెలువడిన కథనానికి అధికారులు స్పందించారు. జేసీబీ సాయంతో శుభ్రత చర్యలు చేపట్టారు.

25న సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: సాగర్‌నగర్‌లోని శిర్డీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవం ఈ నెల 25న ఘనంగా నిర్వహించడానికి నిశ్చయించామని సాగరేశ్వరాలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు, అర్చకులు గన్నవరపు గోపాలకృష్ణ తెలిపారు. ఆ రోజున ఉదయం నుంచే ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

నేటి నుంచి ఎల్లమ్మ జాతర ఉత్సవాలు

భీమునిపట్నం, న్యూస్‌టుడే: భీమిలిలో వేంచేసిన ఎల్లమ్మ జాతర ఉత్సవాలు సోమవారం నుంచి మూడు రోజులపాటు నిర్వహించనున్నారు. స్థానిక రెల్లివీధి వద్ద వేంచేసిన ఆలయాన్ని సుందరంగా అలంకరించారు. సోమవారం రాత్రి తొలేళ్ల వేడుక నిర్వహించి ఈనెల 24న దేవాలయంలో భక్తులకు దర్శనాలు కల్పిస్తారు. అదే రోజు సాయంత్రం ఆలయం వద్ద జాతర నిర్వహిస్తారు. చివరి రోజు 25న కుంకుమ పూజల్లో మహిళలు పాల్గొనాలని దేవాలయ ఉత్సవ కమిటీ ప్రతినిధి శేఖర్ కోరారు.

చోరీ సొత్తు స్వాధీనం

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే : విశాఖ రైల్వేస్టేషన్‌లో చోరీకి గురైన ప్రయాణికురాలి సొత్తును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆ వివరాలు... విశాఖ నుంచి ఆగ్రాకు వెళ్తున్న మహిళ బ్యాగులోని 200 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.12,500 నగదు మాయమయ్యాయి. దీంతో బాధితురాలు సీపీ శంఖబ్రతబాగ్చీకి ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాలతో ఆర్పీఎఫ్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సీసీటీవీ ఫుటేజీలు పరిశీలించి, హరియాణాకు చెందిన నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. చోరీ సొత్తును స్వాధీనం చేసుకుని, బాధితురాలికి సమాచారం అందించారు. సీపీ స్పందించిన తీరుకు బాధితురాలు కృతజ్ఞతలు తెలిపారు.

వైభవంగా త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవం

ఆనందపురం, న్యూస్‌టుడే: గుడిలోవ విజ్ఞాన విహార ఆవాస విద్యాలయంలోని భారతీ కళా విహార్‌లో త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవం ఆదివారం నిర్వహించారు. విశాఖ నగరానికి చెందిన కళాకారిణి గాంగేయుల పద్మాక్షి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మృదంగం, గాత్రం ఉపాధ్యాయులచే పంచరత్న సేవ, త్యాగరాజ స్వామి కీర్తనలు ఆలపించారు. కార్యక్రమంలో సాయి బ్రహ్మాజీరావు, సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సంకీర్తనలో విద్యార్థులు

25న వాహనాల వేలం

ఆనందపురం, న్యూస్‌టుడే: గత కొన్నేళ్లుగా వివిధ కేసుల ద్వారా ఆనందపురం పోలీసుస్టేషన్‌లో ఉన్న ఎనిమిది ద్విచక్ర వాహనాలను భీమిలి కోర్టు ఉత్తర్వుల మేరకు ఈ నెల 25న బహిరంగ వేలం వేయనున్నట్లు సీఐ వాసునాయుడు తెలిపారు. వేలంపాట వేసిన వాహనాలు రోడ్డుపై నడిపేందుకు పనికిరావన్నారు. బుధవారం 11 గంటలకు పోలీసుస్టేషన్ ఆవరణలో వేలంపాట ఉంటుందన్నారు.

శ్రీ బాసరలో 'మన్‌కీబాత్'

చిట్టివలస(తగరపువలస), న్యూస్‌టుడే: తగరపువలస శ్రీ బాసర కళాశాలలో ప్రధాని మోదీ మన్‌కీబాత్ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ప్రత్యక్ష ప్రసారంలో ప్రధాని ఇంటర్ పరీక్షల నేపథ్యంలో విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. ప్రధాని సూచనలను విద్యార్థులు శ్రద్ధగా విన్నారు. బాసర విద్యా సంస్థల ఛైర్మన్ పూడి రమేశ్, డీన్ మజ్జి భాస్కర్, హెచ్‌ఎం కేశవ్, భాజపా నగర ఉపాధ్యక్షులు జీరు కైలాశ్‌రెడ్డి, నాయకులు నాగార్జున, త్రినాథ్, సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

బాంబు పేలుళ్లు.. దద్దరిల్లుతున్న గ్రామాలు

ఇష్టారాజ్యంగా క్వారీల నిర్వహణ

పద్మనాభం, న్యూస్‌టుడే

పద్మనాభం మండలం... గోస్తనీ నది పరవళ్లు, సహజ సిద్ధమైన కొండలు, పచ్చని పొలాలతో ప్రకృతి రమణీయతకు పెట్టింది పేరు. అలాంటి చోట అభివృద్ధి పేరిట సహజ వనరులను కొల్లగొట్టడంతో పర్యావరణానికి విఘాతం కలుగుతోంది. మండల పరిధిలో కృష్ణాపురం, పాండ్రంగి, రెడ్డిపల్లి, బాందేవుపురం తదితర పంచాయతీల పరిధిలో ఏర్పాటు చేసిన క్వారీలతో కొండలు కనుమరుగవుతున్నాయి. బాంబులు పేల్చి రాయిని, గ్రావెల్‌ను తవ్వడంతో ప్రమాదకర రసాయనాలు భూగర్భంలో కలిసిపోతున్నాయి. సమీప ప్రాంతాలు కాలుష్య కాసారంగా మారుతున్నాయి. పచ్చదనం కనుమరుగవుతోంది. రాజకీయ పలుకుబడితో క్వారీలకు అనుమతులు తెచ్చుకొని ఇష్టారాజ్యంగా తవ్వకాలు సాగించడమే ఇందుకు కారణమని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

★ కృష్ణాపురం, పాండ్రంగి పంచాయతీ పరిధి కురపల్లి, రెడ్డిపల్లి, బాందేవుపురం తదితర గ్రామాల్లో నల్లపిక్క, గ్రావెల్ క్వారీలు నిర్వహిస్తున్నారు. కొంత మంది నిబంధనలకు విరుద్ధంగా బాంబులతో బ్లాస్టింగ్ చేసి ఇష్టారీతిన తవ్వకాలు చేస్తున్నారు. కురపల్లి వద్దనున్న నల్లరాయి కొండలు కరిగిపోయాయి. కృష్ణాపురం పంచాయతీలోని గెలమెట్ట కనుమరుగవుతోంది. రెడ్డిపల్లి పరిధిలో పచ్చని కొండలు ధ్వంసమవుతున్నాయి. మండల పరిధిలోని క్వారీలన్నీ గ్రామాలకు ఒకటిన్నర, రెండు కిలోమీటర్ల పరిధిలోనే ఉన్నాయి. ఇప్పటికే భూగర్భ జలాలు కలుషితం కావడంతో ప్రజలు అనారోగ్యంతో సతమతమవుతున్నారు. రెడ్డిపల్లి పంచాయతీ పరిధి భద్రయ్యపేట గ్రామంలో పలువురు కిడ్నీ సంబంధిత సమస్యలతో బాధ పడుతున్నారు. కొంత మంది మృత్యువాత పడటంతో కుటుంబాలు ఛిన్నాభిన్నమయ్యాయి. పశువులు, మేకలు, గొర్రెల పెంపకం సైతం గణనీయంగా తగ్గిపోయింది. మామిడి, జీడి మామిడి తదితర తోటలు దెబ్బతింటున్నాయి.

కురపల్లి వద్ద కనుమరుగైన నల్లరాయి కొండ

పర్యవేక్షణ అంతంతమాత్రమే: గ్రావెల్, రోడ్లు, ఇళ్ల నిర్మాణానికి వినియోగించే నల్లపిక్కను ఇక్కడ క్వారీల్లో తవ్వుతున్నారు. ఒకసారి అనుమతి వస్తే చాలు కొంతమంది ఏళ్ల తరబడి ఇష్టారాజ్యంగా సహజ వనరులను కొల్లగొడుతున్నారు. అధికారుల పర్యవేక్షణ కూడా అంతంతమాత్రమే. జిల్లాకు శివారు ప్రాంతం కావడంతో జిల్లా అధికారులు ఇటువైపు పెద్దగా రాకపోవడంతో వారికి కలిసి వస్తోంది. మండల అధికారులు తమకు క్వారీలకు సంబంధించి ఎటువంటి వివరాలు తెలియవని చెబుతున్నారు. అనుమతులు లేకపోయినా కొంత మంది క్వారీయింగ్ చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. బాంబులు సైతం పేలుస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దృష్టిసారించి పర్యావరణ పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మాతృభాషను గౌరవిద్దాం

సాహిత్యకారుడు నండూరి రామకృష్ణను సత్కరిస్తున్న ఫ్రెండ్స్ వనితా వాకర్స్ క్లబ్ సభ్యులు

పీఎంపాలెం, న్యూస్‌టుడే: అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా పీఎంపాలెం తులసీనగర్ పార్కులో ఫ్రెండ్స్ వనితా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం వేడుకలు నిర్వహించారు. ముఖ్య వక్తగా వాకర్స్ ఇంటర్నేషనల్ కార్యదర్శి జనరల్, ప్రముఖ సాహిత్యకారుడు నండూరి రామకృష్ణ విచ్చేసి మాతృభాష ప్రాముఖ్యతను వివరించారు. దీనిలో భాగంగా వనమాలి టెర్రస్ గార్డెన్ ప్రతినిధులు ఉష, కవిత క్లబ్ సభ్యులకు విత్తనాలు, నారు మొక్కలు పంపిణీ చేశారు. క్లబ్ సెక్రటరీ ఎస్.రాజ్యలక్ష్మి, కోశాధికారి వి.ఇందిరారావు ఆర్గానిక్ అల్పాహారం, మందార టీ అతిథులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు బి.పద్మజ, డీజీఈ కె.జ్యోతి కమల, తూర్పు షిరిడీ వాకర్స్ అసోసియేషన్, వైభవ్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో పట్నా హైకోర్టు న్యాయమూర్తి

జస్టిస్ అనుపమ చక్రవర్తి దంపతులకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న డిప్యూటీ ఈవో రాధ

సింహాచలం, న్యూస్‌టుడే: పట్నా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.అనుపమ చక్రవర్తి కుటుంబ సమేతంగా సింహాద్రి అప్పన్న స్వామిని దర్శించుకున్నారు. వారికి డిప్యూటీ ఈవో సింగం రాధ, అర్చకులు స్వాగతం పలికారు. కప్పస్తంభం ఆలింగనం చేసుకుని బేడామండపం ప్రదక్షిణం చేశారు. అంతరాలయంలో స్వామిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. పండితులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. డిప్యూటీ ఈవో రాధ స్వామివారి ప్రసాదం, చిత్రపటం, శేషవస్త్రాలు అందజేశారు.

తీరప్రాంతాల శుభ్రత అందరి బాధ్యత

కార్యక్రమంలో పోలీసులు, గీతం అధికారులు, విద్యార్థులు

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా సముద్రజలాలు కలుషితం కాకుండా తీర ప్రాంతాల పరిశుభ్రత విషయంలో అంతా బాధ్యతగా వ్యవహరించాలని మెరైన్ పోలీసుస్టేషన్ సీఐ వి.శ్రీనివాసరావు సూచించారు. గీతం డీమ్డ్ వర్సిటీ జాతీయ సేవాపథకం (ఎన్‌ఎస్‌ఎస్) విద్యార్థుల ఆధ్వర్యంలో రుషికొండ బీచ్ పరిసరాల్లో సామాజిక బాధ్యతగా ఆదివారం 'మెగా బీచ్ క్లీనింగ్' కార్యక్రమం నిర్వహించారు. పలు ప్రమాదకర తీరాల్లో యువత అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. బీచ్‌లు పరిశుభ్రతగా ఉండటం వల్ల చేకూరే ప్రయోజనకర అంశాలను వివరించారు. టూరిజం బ్లూఫ్లాగ్ బీచ్ సిబ్బంది సహకారంతో చేపట్టిన ఈ కార్యక్రమంలో గీతం అడ్మిషన్ల డైరెక్టర్ ఎం.జగదీష్, ఆర్.సాయి శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ అధికారులు ఎస్వీజీ రెడ్డి తదితరులతో పాటు నగర పరిధిలోని పలు విద్యాలయాల నుంచి దాదాపు 400 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా మరుగుదొడ్ల ఆధునికీకరణ

గాంధీనగర్‌లో మరుగుదొడ్లకు మరమ్మతులు చేస్తున్న కార్మికులు

కొమ్మాది, న్యూస్‌టుడే: జీవీఎంసీ 5వ వార్డు పరిధిలో పలుచోట్ల ప్రజా మరుగుదొడ్లు అధ్వానంగా మారాయని ఇటీవల 'ఈనాడు'లో 'నిర్వహణ కరవై.. స్వచ్ఛత దూరమై' శీర్షికతో కథనం ప్రచురితమైంది. స్పందించిన జెడ్సీ అయ్యప్ప నాయుడు వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈఈ శాంతిరాజు, డీఈ మణికుమార్ పరిశీలించి రూ.6 లక్షల నిధులతో ఆధునికీకరణకు చర్యలు చేపట్టారు. గాంధీనగర్, సాయిరాంకాలనీ, పరదేశిపాలెం ప్రాంతాల్లో అధ్వానంగా ఉన్న ప్రజామరుగుదొడ్లకు మరమ్మతులు చేపడుతున్నారు.

విదేశీయులు అష్టలక్ష్మీ దేవాలయం సందర్శన

కొమ్మాది, న్యూస్‌టుడే: ఆధ్యాత్మికత, ఆలయాల నిర్మాణంపై అధ్యయనం చేస్తున్న పలువురు విదేశీ (రష్యా) ప్రతినిధులు ఆదివారం కొమ్మాదిలోని అష్టలక్ష్మీ దేవాలయాన్ని సందర్శించారు. ఇక్కడ 'శివకేశవ' ఆలయం విశిష్టత, ఆలయం నీడలో చేసే ప్రదక్షిణ, అమ్మవారు వీణ ధరించి ఉండటం తదితర ప్రాముఖ్యతలపై ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు ఓ వీడియోలో వివరించారు. దీంతో ఎంతో ఆసక్తితో ఇక్కడికి విచ్చేసి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్ఫటిక లింగ విశిష్టతను వారు అడిగి తెలుసుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధర్ స్వామి వారికి ఆలయ విశేషాలను వివరించారు. అనంతరం విదేశీయులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

కొమ్మాది అష్టలక్ష్మీ దేవాలయంలో రష్యా దేశస్థులు

నూతన కార్యవర్గం ఎన్నిక

కొత్తగా ఎన్నికైన మధురవాడ ఫ్రెండ్స్ అసోసియేషన్ కార్యవర్గం

మధురవాడ, న్యూస్‌టుడే: మిథిలాపురి వుడా కాలనీ బృందావనం అపార్టుమెంట్‌లో ఆదివారం జరిగిన మధురవాడ ఫ్రెండ్స్ అసోసియేషన్ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పిళ్లా వెంకటవిజయభాస్కర్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా కె.మోహన్ రెడ్డి, కార్యదర్శి మురళీకృష్ణ, కోశాధికారి పి.రంగబాబు, సంయుక్త కార్యదర్శిగా ఐ.ఎస్.పి.ఠాగూర్, సభ్యులుగా డి.రాజేష్, హరీష్, రమేష్ తదితరులు బాధ్యతలు స్వీకరించారు. నూతన కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ.. అసోసియేషన్ సభ్యుల మానసిక ఉల్లాసం కోసం చదరంగం, క్యారమ్, బ్యాడ్మింటన్ తదితర క్రీడలను అందుబాటులోకి తెస్తామన్నారు. వీటితో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ సంఘం చురుగ్గా పాల్గొంటుందన్నారు.

ఘనంగా రామదాసు జయంతి

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: సాగర్‌నగర్ బీచ్‌రోడ్డులోని మొగధారమ్మ మహాలక్ష్మీ పద్మాలయంలో రామదాసు జయంతి ఆదివారం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త సూరపనేని లక్ష్మీప్రసాద్ సహకారంతో మౌనిక పబ్లికేషన్స్ వ్యవస్థాపకులు డి.శివకుమార్ సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్ మాట్లాడారు. వాగ్గేయకార వైభవానికి ప్రతీకగా నిలిచిన రామదాసు భద్రాచలంలో శ్రీరామచంద్రుని ఆలయాన్ని నిర్మించడానికి తన పరిపూర్ణమైన జీవితాన్ని అంకితం చేశారని కొనియాడారు. మన సంస్కృతి సంప్రదాయాలు గొప్పతనాన్ని అభివర్ణించేలా గత కొన్నేళ్లుగా కూచిపూడి ప్రదర్శనలు చేస్తున్న చిన్నారుల తల్లిదండ్రులను సత్కరించి ఆయా బాలలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. వి.రవి, ఎ.హేమరాను కుమార్, మౌనికాపట్నాయక్, రాజకుమారి, రాజేశ్వరి, రమ్య తదితర నాట్య గురువులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆధ్యాత్మికవేత్త రాజశేఖర్

మందుబాబులకు అడ్డాగా ఆరోగ్య కేంద్రం

ఎండాడ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మద్యం సీసాలు

ఎండాడ, న్యూస్‌టుడే: ఎండాడలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆకతాయిలకు అడ్డాగా మారింది. రాత్రివేళ మందుబాబులు కేంద్రంలోకి ప్రవేశించి మద్యం తాగుతూ హల్‌చల్ చేస్తున్నారు. సీసాలను అక్కడే పగులుగొడుతున్నారు. మత్తులో తలుపులు, కిటికీలు ఫర్నిచర్‌ను ధ్వంసం చేస్తున్నారు. దీంతో ప్రాంగణమంతా అధ్వానంగా దర్శనమిస్తోంది. ఫలితంగా వైద సిబ్బందితో పాటు రోగులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. కేంద్రంలో ప్రహరీకి గేటు లేకపోవడంతో సులువుగా అందులోకి ప్రవేశిస్తున్నారు. ఇటీవల ఈ కేంద్రంలో ఏర్పాటు చేసిన బోరును ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నించగా వీలుకాక వైర్లను ధ్వంసం చేశారు. పక్కనే ఓ ఫంక్షన్ హాలు ఉండటంతో అక్కడికి వచ్చిన కొందరు ఇక్కడ చొరబడి ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని స్థానికులు వాపోతున్నారు. పోలీసులు, అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రంజాన్ మాసంలో ప్రత్యేక ప్రార్థనలు

భీమునిపట్నం, న్యూస్‌టుడే: రంజాన్ మాసం ప్రారంభం కావడంతో పురాతన భీమిలి జామియా మసీదులో ముస్లింలు ప్రతి రోజు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా మసీదును శోభాయమానంగా అలంకరించారు. ప్రతీరోజు ఉపవాస దీక్షలను నిర్వహిస్తూ ప్రార్థనల్లో పాల్గొంటున్నారు. సాయంత్రం దీక్షలను విరమించిన తర్వాత సామూహికంగా ఇఫ్తార్‌ను స్వీకరిస్తున్నారు. పేదలకు దానాలు చేస్తున్నారు.

భీమిలి జామియా మసీదులో ఇఫ్తార్‌ను స్వీకరిస్తున్న ముస్లింలు

అలరించిన నృత్య ప్రదర్శనలు

కొమ్మాది: మధురవాడ శిల్పారామం (జాతర)లో ఆదివారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మీనాక్షీ డ్యాన్స్ ఇన్‌స్టిట్యూట్ నృత్య దర్శకురాలు డి.మీనా ఆధ్వర్యంలో చిన్నారులు చేసిన నృత్యాలు అలరించాయి. శిల్పారామ పరిపాలనాధికారి రమేష్‌రెడ్డి పర్యవేక్షించారు.

నృత్యాలను ప్రదర్శిస్తున్న చిన్నారులు

అనుమానాస్పద స్థితిలో లారీ డ్రైవర్ మృతి

తగరపువలస, న్యూస్‌టుడే: భీమిలి మండలం గొల్లల తాళ్లవలస సమీపంలోని కొబ్బరితోటలో ఓ లారీ డ్రైవర్ ఆదివారం అనుమానాస్పదంగా మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. ఆనందపురం మండలం పెద్దిపాలెం గ్రామానికి చెందిన ఇద్దిపిల్లి ఎల్లాజీ (44) లారీ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తుంటారు. మద్యం ఎక్కువై వాహనం నడపలేని స్థితిలో ఉన్న ఆయన్ను లారీ యజమాని నగరం నుంచి స్వగ్రామానికి తీసుకొచ్చి విడిచిపెట్టారు. ఈ క్రమంలో తోటల వైపు వెళ్లిన ఆయన విగతజీవిగా పడి ఉండటాన్ని అటుగా వెళ్లే వారు చూసి పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహానికి భీమిలి ప్రభుత్వాసుపత్రిలో పంచనామా చేశారు. మృతుని కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తిరుమలరావు చెప్పారు.

'ఉద్యమి'ని విజయవంతం చేయాలి

ఆనందపురం, పద్మనాభం, న్యూస్‌టుడే: జనసేన పార్టీ బలోపేతం కోసం ఈ నెల 26 నుంచి ప్రారంభం కానున్న ఉద్యమి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆనందపురం, పద్మనాభం మండలాల జనసేన పార్టీ అధ్యక్షులు తమ్మిన అప్పలరాజు, కె.రామస్వామి నాయుడు కార్యకర్తలను కోరారు. ఆదివారం ఆనందపురం జనసేన రూరల్ పార్టీ కార్యాలయంతో పాటు పద్మనాభం కూడలిలో పార్టీ ప్రత్యేక సమావేశాలు జరిగాయి. జిల్లా ఉద్యమి కమిటీ సభ్యుడు వీబీ.నాయుడు, రౌతు నాగరాజు, టి.శివకృష్ణ, మూర్తి, కుప్ప రామలక్ష్మి, తాడివాడ ప్రశాంత్, పి.అప్పలరాజు, వై.సూరప్పుడు, సీహెచ్.సోమేశ్వరావు, కిలారి రమణ తదితరులు పాల్గొన్నారు.

ఆనందపురంలో..

పద్మనాభంలో మాట్లాడుతున్న జనసేన నాయకులు

భాజపాలో చేరికలు

మధురవాడ, న్యూస్‌టుడే: ప్రధాని మోదీ విధానాలకు ఆకర్షితులై పలువురు యువత, మహిళలు భాజపాలో చేరుతున్నారని పార్టీ రాష్ట్ర కార్యదర్శి కేతినేని సురేంద్రమోహన్, రాష్ట్ర మీడియా ప్రతనిధి కె.ఎన్.పి.చక్రవర్తి అన్నారు. ఆదివారం భాజపా ఎండాడ మండలాధ్యక్షుడు చోడవరపు నాగరాజు అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 'మన్ కీ బాత్'లో భాగంగా ప్రధాని మోదీ ప్రసంగం ఆలకించారు. అనంతరం 6, 8 వార్డులకు చెందిన సుమారు 30 మంది యువత, మహిళలకు నాయకులు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించడంతో పాటు సభ్యత్వాలు అందజేశారు. పార్టీలో చేరిన వారు క్రమశిక్షణ, సమయపాలన పాటిస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనవ్య, చింతాడ మోహనరావు, సుబ్బరాజు, అంకమ్మరావు, చంద్రశేఖరరాజు, కోస్ట్ రఘు, గౌరి, తదితరులు ఉన్నారు.

పార్టీలో చేరిన వారితో భాజపా నాయకులు

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

ఎండాడ, న్యూస్‌టుడే: ఎండాడలో కైట్స్ నోబుల్ స్కూల్, ఎంవీపీలోని సంస్కృతి గ్లోబల్ ప్రీ స్కూల్ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా వైద్యులు డాక్టర్ కిరణకుమార్, డాక్టర్ స్వేత మాధవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఇద్దరు పేద విద్యార్థులు గుడ్ల రూపేష్ కుమార్, యోగేంద్రలకు పాఠశాల తరఫున రూ.42,759 యాజమాన్యం ఆర్థిక సహాయం చేసింది. విజేతలకు ప్రిన్సిపల్ ధనలక్ష్మి, తదితరులు బహుమతులు అందజేశారు.

చిన్నారుల నృత్య ప్రదర్శన

భగవన్నామాలన్నీ మంత్రాలే..

ఎంవీపీకాలనీ, న్యూస్‌టుడే: కటపం లేని మనసుతో భగవంతుడిని ఆరాధిస్తే భక్తి లభిస్తుందని ప్రముఖ ప్రవచనకర్త సామవేదం షణ్ముఖ శర్మ అన్నారు. విశాఖ రుషి పీఠం, సత్సంగం ఆధ్వర్యంలో ఎంవీపీకాలనీ సెక్టార్-6లో ఉన్న ఏబీసీ పార్కులో భాగవతం ప్రవచన యజ్ఞం నాలుగో రోజు ఆదివారం కొనసాగింది.

ప్రయాణికులకు మెరుగైన సేవలు

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే : రైల్వే ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని తూర్పు కోస్తా రైల్వే వాల్తేర్ ఏడీఆర్‌ఎం కె.రామారావు తెలిపారు. ఆదివారం ఆయన విశాఖ రైల్వేస్టేషన్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆన్‌బోర్డు హౌస్‌కీపింగ్ సిబ్బంది, లినెన్ సరఫరాదారులతో మాట్లాడారు. ప్రయాణికులకు పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించాలని, ప్రతి ఒక్కరితో మర్యాదగా మాట్లాడాలని సూచించారు. అనంతరం సిబ్బంది, సూపర్‌వైజర్లు, హెల్త్ ఇన్‌స్పెక్టర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు.

రైల్వేస్టేషన్‌లో పర్యటిస్తున్న ఏడీఆర్‌ఎం రామారావు, అధికారులు

ఏయూ ప్రతిష్ఠ పెంచేందుకు కృషి చేయాలి

ఏయూ ప్రాంగణం: ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రతిష్ఠ పెంచేందుకు విద్యార్థులు కృషి చేయాలని తెలుగునాడు విద్యార్థి ఫెడరేషన్ (టి.ఎన్.ఎస్.ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు ఎం.వి.ప్రణవ్‌గోపాల్ అన్నారు. ఈ మేరకు ఏయూలోని విద్యార్థి సంఘాలు సమన్వయంతో మెలగాలని ఓ ప్రకటనలో కోరారు. వర్సిటీలో విద్యా పరంగా చూస్తే గతంలో కన్నా ఎంతో పురోగతి సాధించామని, మంత్రి నారా లోకేష్ విద్యా వ్యవస్థలో ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చారని అన్నారు.

సిరుల స్వామికి వైభవంగా స్వర్ణ పుష్పార్చన

స్వామి, అమ్మవార్లు

నిత్య కల్యాణంలో పాల్గొన్న భక్తజనం

సింహాచలం, న్యూస్‌టుడే: సిరులొలికే సింహాద్రినాథుడికి ఆదివారం స్వర్ణ పుష్పార్చన ప్రత్యేక పూజా కార్యక్రమం వైభవోపేతంగా జరిగింది. అర్చకులు దేవేరుల సమేతుడైన గోవిందరాజ స్వామిని సర్వాంగ సుందరంగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆశీనులను చేశారు. బంగారు సంపెంగ పుష్పాలతో అష్టోత్తర శతనామార్చన జరిపారు. అనంతరం నిత్య కల్యాణోత్సవాన్ని కమనీయంగా జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని సేవించారు.

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: ఇస్కాన్ మందిరం(సాగర్‌నగర్)లో హరేరామ.. హరేకృష్ణ నామస్మరణతో ఆదివారం పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు వేడుకగా నిర్వహించారు. రాధాకృష్ణులు, సుభద్ర బలభద్ర జగన్నాథస్వామి విగ్రహాలను పుష్పాలతో ఆకర్షణీయంగా అలంకరించారు. ఇస్కాన్ అధ్యక్షుడు సాంబాదాస్, మాతాజీ నితాయిసేవిని తదితర కృష్ణభక్తులు ఉత్సవ మూర్తుల మహిమలు, లీలల్ని వర్ణిస్తూ భజనల నిర్వహణ, గీతాలాపనలు చేశారు. అన్న సమారాధనలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఉత్సవమూర్తులు

విశ్రాంత ఉద్యోగుల ఆరోగ్యంపై నీలినీడలు

ఈహెచ్‌ఎస్ కార్డుల జారీలో జాప్యం

మధురవాడ, న్యూస్‌టుడే: విధి నిర్వహణలో ఎన్నో ఏళ్లు సేవలందించిన ఏపీఎస్‌ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులకు ప్రస్తుతం అత్యవసర వైద్య సేవలు అందడం గగనంగా మారుతోంది. ఈ విషయంలో కొందరు అధికారులు వ్యవహరిస్తున్న తీరు వీరి ఆరోగ్య భద్రతను ప్రశ్నార్థకం చేస్తోంది. ప్రభుత్వం ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు, వారి జీవిత భాగస్వాములకు 'ఉద్యోగుల ఆరోగ్య పథకం' (ఈహెచ్‌ఎస్) వర్తింపజేయాలని స్పష్టంగా ఉత్తర్వులు జారీ చేసింది. కొంత మంది అధికారుల ఉదాసీనత కారణంగా క్షేత్రస్థాయిలో ఈహెచ్‌ఎస్ కార్డుల జారీ ప్రక్రియ నత్తనడకన సాగుతోంది.

సహకరించని యూనిట్ అధికారులు..: ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను అమలు చేయడంలో కొందరు రీజనల్ మేనేజర్లు, యూనిట్ అధికారులు మొండిగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధానంగా 2024 జనవరి 1వ తేదీ తర్వాత పదవీ విరమణ పొందిన వారికి కార్డులు అందకపోవడం వల్ల వారు ఆరోగ్యపరంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వృద్ధాప్యంలో వచ్చే అనారోగ్య సమస్యలకు ఖరీదైన చికిత్సలు చేయించుకోలేక, కార్డుల కోసం అధికారుల చుట్టూ తిరగలేక సతమతమవుతున్నారు. ఈ సమస్యను సుమారు 250 మంది విశ్రాంత ఉద్యోగులు ఎదుర్కొంటున్నారు.

ఏపీఎస్‌ఆర్టీసీ వైస్ ఛైర్మన్, ఎండీ బాలసుబ్రహ్మణ్యంకు వినతి పత్రం అందిస్తున్న విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రతినిధులు

వినతులు ఇచ్చినా చర్యలు శూన్యం..: విశాఖ రీజియన్ పరిధిలో నెలకొన్న ఈ సమస్యపై ఇప్పటికే విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రతినిధులు పలుమార్లు విజయవాడతో పాటు నగరంలోని పలువురు ఉన్నతాధికారులను కలిసి తమ ఆవేదన విన్నవించామన్నారు. ఆరోగ్య కార్డుల జారీలో సహకరించని ఉద్యోగులపై చర్యలు తీసుకుంటామని ఉన్నతాధికారులు మాటలు చెప్పడం తప్ప క్షేత్రస్థాయిలో అమలుకు నోచుకోవడం లేదని వాపోతున్నారు.

(c) eenadu

విశాఖ తూర్పు

ఏయూ ప్రతిష్ఠ పెంచేందుకు కృషి చేయాలి

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రతిష్ఠ పెంచేందుకు విద్యార్థులు కృషి చేయాలని తెలుగునాడు విద్యార్థి ఫెడరేషన్ (టి.ఎన్.ఎస్.ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు ఎం.వి.ప్రణవ్‌గోపాల్ అన్నారు. ఈ మేరకు ఏయూలోని విద్యార్థి సంఘాలు సమన్వయంతో మెలగాలని ఓ ప్రకటనలో కోరారు. వర్సిటీలో విద్యా పరంగా చూస్తే గతంలో కన్నా ఎంతో పురోగతి సాధించామని, మంత్రి నారా లోకేష్ విద్యా వ్యవస్థలో ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చారని అన్నారు. విశ్వవిద్యాలయాల్లో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలు అమలు చేసేందుకు విశేష కృషి చేస్తున్నారని కొనియాడారు.

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ. 10 నుంచి మ. ఒంటి గంట మధ్య
పెదవాల్తేరు, ఎంవీపీ కాలనీ: 8008574769
మద్దిలపాలెం: 9912120229

ఆరిలోవ, న్యూస్‌టుడే: ?: 12వ వార్డు పరిధి లీలాసుందరయ్యనగర్, అంబేడ్కర్‌నగర్ వీధి కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోయి మురుగు నీరు నిలిచిపోయింది. - సన్యాసిరావు, లీలాసుందరయ్యనగర్ ✓: సిబ్బందిని పంపి కాలువల్లో వ్యర్థాలు తొలగిస్తాం. మురుగు నీరు నిలిచిపోకుండా శుభ్రం చేయిస్తాం. - అబ్దుల్ మీర, శానిటరీ ఇన్‌స్పెక్టర్

ఇందిరానగర్, (విశాలాక్షినగర్), న్యూస్‌టుడే: ?: పదో వార్డు ఇందిరానగర్ రామాలయం ముఖద్వారం వద్ద కల్వర్టు నిర్మాణం జరుగుతున్న నేపథ్యంలో కాలువలో మురుగు నీరు నిలిచిపోయి, దోమలు వృద్ధి చెందుతున్నాయి. -సత్యశ్రీ, ఇందిరానగర్. ✓: దోమల నివారణకు ఫాగింగ్ చేయిస్తాం. -శివప్రసాద్‌నాయుడు, పారిశుద్ధ్య ఇన్‌స్పెక్టర్.

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: ?: విశాలాక్షినగర్ సీతకొండ చివరి ప్రాంతంలోని ఫారెస్ట్ గెస్ట్‌హౌస్ వద్ద భూగర్భ మురుగునీటి శుద్ధి కేంద్రం నుంచి విడుదలవుతున్న నీరంతా నేరుగా సముద్రంలో కలుస్తుంది. దీంతో సాగర జలాలు కలుషితమవుతున్నాయి. -ప్రభాకర్, సడక సంఘం ప్రతినిధి. ✓: క్షేత్రస్థాయిలో పరిశీలించి, తగిన చర్యలు తీసుకుంటాం. -శ్రీనివాస్, ఏఈ.

శివాజీపాలెం(మద్దిలపాలెం), న్యూస్‌టుడే: ?: జీవీఎంసీ 22వ వార్డు మంగాపురంకాలనీ సామాజిక భవనం వద్ద వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. - సత్యనారాయణ ✓: సిబ్బందిని పంపించి చెత్త తొలగించేలా చేస్తాం. - శ్రీనివాసరావు, వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్

ఎం.ఎం.టి.సి.కాలనీ(మద్దిలపాలెం), న్యూస్‌టుడే: ?: జీవీఎంసీ 15వ వార్డు ఎం.ఎం.టి.సి.కాలనీ ప్రాంతాల్లోని కాలువల్లో పూడికలు తొలగించడం లేదు. - ప్రసన్నకుమార్ ✓: కాలువల శుభ్రత చర్యలు తీసుకుంటాం. - కిశోర్, వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్

స్పందనకు వందనం

టీఐసీపాయింట్ (ఆరిలోవ), న్యూస్‌టుడే: జీవీఎంసీ 13వ వార్డు రామకృష్ణాపురం వీధుల్లో పేరుకుపోయిన వ్యర్థాలు, కాలువల్లో పూడికలు తొలగించక స్థానికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై 'ఈనాడు'లో వార్తలు ప్రచురితమయ్యాయి. స్పందించిన పారిశుద్ధ్య ఇన్‌స్పెక్టర్ పి.వెంకటేశ్వరావు ఆధ్వర్యంలో సిబ్బంది శుభ్రత పనులు చేపట్టారు.

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: విశాలాక్షినగర్ పరిధి కనకమహాలక్ష్మినగర్, కో-ఆపరేటివ్ లేఅవుట్ కాలనీలో దోమల బెడద ఎక్కువై, స్థానికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ఇటీవల 'ఈనాడు'లో వార్తలు ప్రచురితమయ్యాయి. స్పందించిన మలేరియా అధికారి శ్రీనివాస్ తమ సిబ్బందితో ఫాగింగ్ చేయించారు.

సీబీఎం కాంపౌండ్ (పెదవాల్తేరు), న్యూస్‌టుడే: సీబీఎం కాంపౌండ్‌లో వ్యర్థాలు పేరుకుపోయాయని ఇటీవల 'ఈనాడు'లో వార్త ప్రచురితమైంది. స్పందించిన శానిటరీ ఇన్‌స్పెక్టర్ గోవింద్ తమ సిబ్బందితో చెత్తను తొలగించి పరిసరాలు శుభ్రం చేయించారు.

స్వర్ణభారతి(మద్దిలపాలెం), న్యూస్‌టుడే: జీవీఎంసీ 22వ వార్డు న్యూరేసపువానిపాలెంలో రహదారిపై వ్యర్థాలు దర్శనమిస్తున్నాయని ఆదివారం 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తకు వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు స్పందించారు. సిబ్బందితో చెత్త తొలగించి శుభ్రం చేయించారు.

నిర్వహణ లేక నిరుపయోగం..!

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: విశాఖ నగరంలో బహిరంగ మల,మూత్ర విసర్జన నివారణ చర్యల్లో భాగంగా పలుచోట్ల సామాజిక, ప్రజా మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. అయితే వాటికి సరైన నిర్వహణ లేకపోవడంతో చాలాచోట్ల నిరుపయోగంగా మారాయి. దీంతో ప్రజలకు ఇక్కట్లు తప్పడం లేదు.

ఇదీ పరిస్థితి..!: ■ హనుమంతువాకలోని వీఎంఆర్‌డీఏ ఆరోగ్య ప్రాంగణం, ఆరిలోవ శ్రీహరినగర్ శ్మశానవాటిక, పాతడెయిరీఫారం నాటుకోళ్ల సంత, తెన్నేటిపార్కు వాహనాల పార్కింగ్, అప్పూఘర్, జోడుగుళ్లపాలెం, పెదగదిలి బీఆర్‌టీఎస్ ప్రాంతాల్లో ఉన్న మరుగుదొడ్లకు నీటి సరఫరా లేక అధ్వానంగా మారాయి.

■ జీవీఎంసీ ప్రజారోగ్య విభాగం ఆధ్వర్యంలో సామాజిక, ప్రజా మరుగుదొడ్లను శుభ్రం చేస్తున్నారు. అయితే కొన్నిచోట్ల ప్రైవేటు సంస్థల నిర్వహణ ఉండడంతో, నామమాత్రపు రుసుము వసూలు చేస్తున్నారు.

■ జీవీఎంసీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న మరుగుదొడ్ల వద్ద సిబ్బంది ఉండడం లేదు. దీంతో కొన్నింటిని పాక్షికంగా, మరికొన్నింటిని పూర్తిగా మూసేశారు. జనాభా రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో మరుగుదొడ్లు లేక పలువురు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

అధ్వానంగా ప్రజా మరుగుదొడ్లు

హనుమంతువాక వీఎంఆర్‌డీఏ ఆరోగ్య ప్రాంగణం వద్ద మూతపడిన సామాజిక మరుగుదొడ్డి

నియోజకవర్గంలో ఇలా..

- ప్రజా మరుగుదొడ్ల సంఖ్య : 24
- పూర్తిగా మూతపడినవి : 6
- మరమ్మతులు చేయాల్సినవి : 9 (ఇవి పాక్షికంగా పని చేస్తున్నాయి)
- అందుబాటులో ఉన్నవి : 9

■ **వినియోగంలోకి తీసుకొస్తాం..:** క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి, అన్ని మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకొస్తాం. కొన్నిచోట్ల ఆకతాయిలు కుళాయిలను, పైపులను ధ్వంసం చేసి, తలుపులు, విద్యుత్తు బల్బులు తొలగించినట్టు ఫిర్యాదులు అందాయి. అన్నింటినీ పరిశీలించి.. అవసరమైన చర్యలు తీసుకుంటాం. ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తాం. - ప్రసాద్, సహాయ వైద్యాధికారి.

'హ్యాపీ సండే'తో మానసిక ఉల్లాసం

హెచ్‌బీకాలనీ(మద్దిలపాలెం), న్యూస్‌టుడే: జీవీఎంసీ 15వ వార్డు జేఆర్‌నగర్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జేఆర్‌నగర్ పార్కులో ఆదివారం 'హ్యాపీ సండే' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పిల్లలకు కరాటే, యోగా, మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జీవీఎంసీ అదనపు కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ చాలాకాలంగా ప్రజలు ప్రస్తుత యాంత్రిక జీవనం గడుపుతున్నారని ఈ సమయంలో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల పరస్పర సహకారం, స్నేహపూర్వక వాతావరణంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. తూర్పు జోన్ కమిషనర్ కె.శివప్రసాద్, జేఆర్‌నగర్ కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.మూర్తి, అసోసియేషన్ సభ్యులు కె.దేవేంద్రవర్మ, బి.సాయి మల్లికార్జున్, డి.రవిరాజు, ఎం.బంగార్రాజు, జి.ఎస్.శివప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల విజేతలను అభినందిస్తున్న జీవీఎంసీ అదనపు కమిషనర్ నల్లనయ్య, కాలనీవాసులు

ఘనంగా విజయదుర్గమ్మ జాతర

హనుమంతువాక(విశాలాక్షినగర్), న్యూస్‌టుడే: హనుమంతువాక విజయదుర్గమ్మ అమ్మవారి వార్షిక జాతరను ఆదివారం ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై పూజలు చేశారు. సాయంత్రం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కొనసాగుతున్న నిరసన

హెచ్‌బీకాలనీ(మద్దిలపాలెం), న్యూస్‌టుడే: కృష్ణ నవాటిక అభివృద్ధికి దేవాదాయ, రెవెన్యూ అధికారులు అడ్డుకోవడంపై కొత్తవెంకోజీపాలెం గ్రామసేవా సంఘం, పాతవెంకోజీపాలెం గ్రామస్థులు, శ్రీసీతారామ సంఘం సభ్యులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష ఆదివారం ఏడో రోజుకు చేరుకుంది. తమ సొంత నిధులతో రహదారి నిర్మాణం చేపడితే అధికారులు గ్రామస్థులపై చర్యలు తీసుకుంటామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలని డిమాండ్ చేశారు. గ్రామ సేవా సంఘం అధ్యక్షుడు ఆదారి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి పీలా ప్రేమ్ కిరణ్, కె.వి.ఎస్.అప్పారావు, నాయకులు కాళ్ల వరహాలు, ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

చోరీ సొత్తు స్వాధీనం

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: విశాఖ రైల్వేస్టేషన్‌లో చోరీకి గురైన ప్రయాణికురాలి సొత్తును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆ వివరాలు... విశాఖ నుంచి ఆగ్రా వెళ్తున్న మహిళ బ్యాగులోని 200 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.12,500 నగదు మాయమయ్యాయి. దీంతో బాధితురాలు సీపీ శంఖబ్రతబాగ్చీకి ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాలతో ఆర్పీఎఫ్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సీసీటీవీ ఫుటేజీలు పరిశీలించి, హరియానాకు చెందిన నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. చోరీ సొత్తును స్వాధీనం చేసుకుని, బాధితురాలికి సమాచారం అందించారు. సీపీ స్పందించిన తీరుకు బాధితురాలు కృతజ్ఞతలు తెలిపారు.

నిందితుడిని అదుపులోకి తీసుకున్న రైల్వే పోలీసులు

తీర ప్రాంతాల శుభ్రత అందరి బాధ్యత

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా సముద్రజలాలు కలుషితం కాకుండా తీర ప్రాంతాల పరిశుభ్రత విషయంలో అంతా బాధ్యతగా వ్యవహరించాలని మెరైన్ పోలీసుస్టేషన్ సీఐ వి.శ్రీనివాసరావు సూచించారు. గీతం డీమ్డ్ వర్సిటీ జాతీయ సేవాపథకం (ఎన్ఎస్ఎస్) విద్యార్థుల ఆధ్వర్యంలో రుషికొండ బీచ్ పరిసరాల్లో సామాజిక బాధ్యతగా ఆదివారం 'మెగా బీచ్ క్లీనింగ్' కార్యక్రమం నిర్వహించారు. పలు ప్రమాదకర తీరాల్లో యువత అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. బీచ్‌లు పరిశుభ్రతగా ఉండటం వల్ల చేకూరే ప్రయోజనకర అంశాలను వివరించారు. టూరిజం బ్లూఫ్లాగ్ బీచ్ సిబ్బంది సహకారంతో చేపట్టిన ఈ కార్యక్రమంలో గీతం అడ్మిషన్ల డైరెక్టర్ ఎం.జగదీష్, ఆర్.సాయి శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ అధికారులు ఎస్‌వీజీ రెడ్డి తదితరులతో పాటు నగర పరిధిలోని పలు విద్యాలయాల నుంచి దాదాపు 400 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పోలీసులు, గీతం అధికారులు, విద్యార్థులు

వ్యర్థాల పారబోతతో అవస్థలు

చినగదిలి (ఆరిలోవ), న్యూస్‌టుడే : ముడసర్లోవ డంపింగ్ యార్డు నుంచి ఆరిలోవ ఆఖరి బస్‌స్టాప్‌నకు వెళ్లే మార్గంలో భవన నిర్మాణ వ్యర్థాలు గుట్టలు పేరుకుపోతున్నాయి. కొందరు గుర్తుతెలియని వ్యక్తులు రాత్రి సమయంలో వాహనాల్లో తీసుకొచ్చి రహదారికి అడ్డంగా డంప్ చేస్తున్నారు. దీంతో ఆ మార్గంలో రాకపోకలు సాగించే వారు అవస్థలు పడుతున్నారు. అలాగే 13వ వార్డు పరిధి ఖాళీ స్థలాల్లో, రహదారుల పక్కన వ్యర్థాలను పారబోస్తున్నారు. ఈ సమస్యపై పలుమార్లు ఫిర్యాదు చేసినా.. జీవీఎంసీ అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని వారు కోరుతున్నారు.

ఇలా తవ్వి.. వదిలేశారు..!

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే : జీవీఎంసీ తొమ్మిదో వార్డు పరిధి సంజీవ్‌నగర్ కాలనీ ప్రాథమిక పాఠశాల, కైలాసగిరి రెవెన్యూ పార్కు వద్ద, జోడుగుళ్లపాలెం ప్రాథమిక పాఠశాలల వద్ద రహదారిలో వివిధ పనుల నిమిత్తం గోతులు తవ్వేసి వదిలేశారు. 15 రోజులు పూర్తయినా... వాటిని పూడ్చలేదు. దీంతో రాత్రి సమయాల్లో ప్రయాణించే ద్విచక్ర వాహనచోదకులు అదుపు తప్పి ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి.. తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కాలువల్లో తాగునీటి పైపులు

కేఆర్‌ఎంకాలనీ (మద్దిలపాలెం), న్యూస్‌టుడే: జీవీఎంసీ 16వ వార్డు మద్దిలపాలెం, శివాలయం, కేఆర్‌ఎంకాలనీ ప్రాంతాల్లో తాగునీటి పైపులైన్లను మురుగు కాలువల్లో వేశారు. వేసవిలో ఎండ వేడికి పైపులు పగిలి కాలువలోని మురుగు అందులోకి చేరి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై గతంలోనే పలుమార్లు ఫిర్యాదులు చేసినా.. ఎవరూ పట్టించుకోవడం లేదని వారు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలువల్లో పైపులైన్లను పక్కకు మార్చాలని కోరుతున్నారు.

16వ వార్డు కేఆర్‌ఎంకాలనీలో పైపులు ఇలా..

నూతన కార్యవర్గాల ఎన్నిక

సుందర్‌నగర్ (విశాలాక్షినగర్), న్యూస్‌టుడే : జీవీఎంసీ పదో వార్డు వివేకానందనగర్‌లోని వివేకానంద స్వచ్ఛంద సేవా సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కాళ్ల సన్యాసినాయుడు, ఉపాధ్యక్షుడిగా సీహెచ్.అప్పలనాయుడు, ప్రధాన కార్యదర్శిగా వై.మురళి, కోశాధికారిగా కనకల శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. నూతన కమిటీ ప్రతినిధులను కాలనీవాసులు అభినందించారు.

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: బీచ్ రోడ్డులో మార్నింగ్ బీచ్ వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం ఉదయం జరిగింది. పార్కు హోటల్ కూడలి ఏనుగు బొమ్మ వద్ద నిర్వహించిన సమావేశంలో అధ్యక్షులుగా వై.కృష్ణ, కార్యదర్శిగా ఎ.రాజు, కోశాధికారిగా పోలారావు, ఉపాధ్యక్షులుగా వెంకటి, శ్రీనివాస్‌లతో పాటు పలువురు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం అసోసియేషన్ అధ్యక్షులు వై.కృష్ణ మాట్లాడుతూ బీచ్‌రోడ్డులో అసోసియేషన్ ఆధ్వర్యంలో వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు.

ఎంపికైన వారిని అభినందిస్తున్న వివేకానందనగర్ నివాసితులు

మార్నింగ్ బీచ్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

ఆకట్టుకున్న నృత్యరూపకాలు

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: హరే కృష్ణ మూవ్‌మెంట్ ఫ్రెండ్స్ ఆఫ్ లార్డ్ కృష్ణ మహిళ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులు ఆదివారం సాయంత్రం మద్దిలపాలెంలోని సీఎంఆర్ సెంట్రల్ ఆవరణలో నృత్యం, సంకీర్తన, ఫ్లాష్‌మాబ్ చేసి ఆకట్టుకున్నారు. మార్చి 4 నుంచి 6 తేదీ వరకు గంబీరంలో హరే కృష్ణ వైకుంఠంలో శ్రీచైతన్య మహాప్రభు జయంతి ఉత్సవాలను, హరే కృష్ణ మహా మంత్రం కార్యక్రమాలు నిర్వహించనున్నారు. వీటి ఉద్దేశం భక్తులకు తెలియజేయడం కోసం ఈ కార్యక్రమాలు నిర్వహించినట్లు నృత్య విభాగం మహిళ సభ్యురాలు భారతిమాతాజీ తెలిపారు.

వేణుగానం చేస్తున్న విద్యార్థులు

భగవన్నామాలన్నీ మంత్రాలే..

ఎంవీపీకాలనీ(మద్దిలపాలెం), న్యూస్‌టుడే: కపటం లేని మనసుతో భగవంతుడిని ఆరాధిస్తే భక్తి లభిస్తుందని ప్రముఖ ప్రవచనకర్త సామవేదం షణ్ముఖ శర్మ అన్నారు. విశాఖ రుషి పీఠం, సత్సంగం ఆధ్వర్యంలో ఎంవీపీకాలనీ సెక్టార్-6లో ఉన్న ఏబీసీ పార్కులో భాగవతం ప్రవచన యజ్ఞం నాలుగో రోజు ఆదివారం కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన పలు విషయాలను భక్తులకు వివరించారు. భగవన్నామాలన్నీ మంత్రాలేనని పేర్కొన్నారు. కోరికలు ధర్మబద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో భాగంగా ఉదయం తులసి కల్యాణం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ప్రసంగిస్తున్న షణ్ముఖశర్మ

బాధ్యులను శిక్షించాలని డిమాండ్

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : ఏయూలో విద్యార్థులపై దాడి చేసిన వారిని శిక్షించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు రామ్మోహన్‌రావు డిమాండ్ చేశారు. ఆదివారం జగదాంబకూడలిలోని సిటూ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏయూలో మతపరమైన కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఆర్ఎస్ఎస్‌ను అడ్డుకున్న విద్యార్థులపై దాడి చేయడం దారుణమన్నారు. వర్సిటీల్లో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్ఎఫ్ఐ నాయకులు అజయ్, కుసుమాంజలి, తరుణ్, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు రామ్మోహన్‌రావు

సిరుల స్వామికి వైభవంగా స్వర్ణ పుష్పార్చన

సింహాచలం, న్యూస్‌టుడే: సిరులొలికే సింహాద్రినాథుడికి ఆదివారం స్వర్ణ పుష్పార్చన ప్రత్యేక పూజా కార్యక్రమం వైభవోపేతంగా జరిగింది. అర్చకులు దేవేరుల సమేతుడైన గోవిందరాజ స్వామిని సర్వాంగ సుందరంగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆశీనులను చేశారు. బంగారు సంపెంగ పుష్పాలతో అష్టోత్తర శతనామార్చన జరిపారు. అనంతరం నిత్య కల్యాణోత్సవాన్ని కమనీయంగా జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని సేవించారు.

స్వామి, అమ్మవార్లు

వివేకానంద వృద్ధాశ్రమ వార్షికోత్సవం

వన్‌టౌన్, న్యూస్‌టుడే : రక్తదానంతో ఆపదలో ఉన్న వారి ప్రాణాలు కాపాడొచ్చని నగర పోలీసు కమిషనర్ శంఖబ్రతబాగ్చీ సూచించారు. పాతనగరం స్వామి వివేకానంద సేవా సంస్థ ఆవరణలో ఆదివారం రామకృష్ణ పరమహంస జయంతి, వివేకానంద వృద్ధాశ్రమ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. సామాజిక బాధ్యతగా సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. శిబిరంలో పలువురు పాల్గొని రక్తదానం చేశారు. అనంతరం సీపీ చేతుల మీదుగా రక్తదాతలను అభినందించారు. పేదలకు దుప్పట్లు అందజేసి, అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. సంస్థ గౌరవ అధ్యక్షులు డాక్టర్ జహీర్ అహ్మద్, రైటర్స్ అకాడమీ అధ్యక్షులు వీవీ రమణమూర్తి, జలీల్ అహ్మద్, సంస్థ అధ్యక్షులు సూరాడ అప్పారావు, వన్‌టౌన్ సీఐ వరప్రసాద్, ఇతర సభ్యులు పోతురాజు, అప్పారావు, కేపీ.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

శిబిరంలో పాల్గొన్న సీపీ శంఖబ్రతబాగ్చీ, తదితరులు

రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలి

ఎంవీపీకాలనీ (మద్దిలపాలెం), న్యూస్‌టుడే: రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని సత్యసాయి సిటీ సమితి కన్వీనర్ బి.సాయికుమార్ పిలుపునిచ్చారు. ఎంవీపీకాలనీలో సత్యసాయి ప్రేమసదన్ మందిరంలో సత్యసాయి విశాఖ నగర సమితి ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారికి రక్తదానం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సుమారు 27 మంది రక్తదానం చేశారు. ఎన్టీఆర్ రక్తనిధి కేంద్ర ప్రతినిధులు రక్తాన్ని సేకరించారు. శిబిరం ఇన్‌ఛార్జి కె.వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదాతకు ధ్రువీకరణ పత్రం ఇస్తున్న దృశ్యం

'జాతర'లో సందడే సందడి

కొమ్మాది, న్యూస్‌టుడే: మధురవాడ శిల్పారామం (జాతర)లో ఆదివారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మీనాక్షీ డ్యాన్స్ ఇన్‌స్టిట్యూట్ నృత్య దర్శకురాలు డి.మీనా ఆధ్వర్యంలో చిన్నారులు చేసిన నృత్యాలు అలరించాయి. శిల్పారామ పరిపాలనాధికారి రమేష్‌రెడ్డి పర్యవేక్షించారు.

నృత్యాలను ప్రదర్శిస్తున్న చిన్నారులు

అనుమానాస్పద స్థితిలో లారీ డ్రైవర్ మృతి

తగరపువలస, న్యూస్‌టుడే: భీమిలి మండలం గొల్లల తాళ్లవలస సమీపంలోని కొబ్బరితోటలో ఓ లారీ డ్రైవర్ ఆదివారం అనుమానాస్పదంగా మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. ఆనందపురం మండలం పెద్దిపాలెం గ్రామానికి చెందిన ఇద్దిపిల్లి ఎల్లాజీ (44) లారీ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తుంటారు. మద్యం ఎక్కువై వాహనం నడపలేని స్థితిలో ఉన్న ఆయన్ను లారీ యజమాని నగరం నుంచి స్వగ్రామానికి తీసుకొచ్చి విడిచిపెట్టారు. ఈ క్రమంలో తోటల వైపు వెళ్లిన ఆయన విగతజీవిగా పడి ఉండటాన్ని అటుగా వెళ్లే వారు చూసి పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహానికి భీమిలి ప్రభుత్వాసుపత్రిలో పంచనామా చేశారు. మృతుని కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తిరుమలరావు చెప్పారు.

శిరస్త్రాణంతో ప్రాణాలకు రక్ష

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే : ద్విచక్ర వాహనచోదకులు విధిగా శిరస్త్రాణం ధరించాలని పోలీసులు సూచించారు. ఆదివారం ఆరిలోవ ట్రాఫిక్‌పోలీస్ స్టేషన్ పరిధి జోడుగుళ్లపాలెం, హనుమంతువాక కూడళ్లలో వాహన తనిఖీలు నిర్వహించారు. ట్రాఫిక్ ఎస్సై ధర్మేంద్ర పర్యవేక్షణలో నిబంధనలు పాటించని వాహనచోదకులకు జరిమానాలు విధించారు.

జోడుగుళ్లపాలెం అవుట్‌పోస్టు వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

వాలీబాల్ పోటీలకు ఎంపిక

క్రీడాకారిణులతో డీఆర్‌ఎం లలిత్‌బోహ్రా, తదితరులు

విశాఖక్రీడలు, న్యూస్‌టుడే : జాతీయస్థాయి సబ్‌జూనియర్ వాలీబాల్ పోటీలకు నగర క్రీడాకారిణులు పి.వి.సాయి జిషిత, రక్షణ ఎంపికయ్యారు. పోటీలు ఈనెల 24 నుంచి వచ్చే నెల ఒకటి వరకు పశ్చిమబెంగాల్‌లో జరగనున్నాయి. ఎంపికైన క్రీడాకారిణులు రైల్వే ఉద్యోగుల కుమార్తెలు కావడంతో ఆదివారం డీఆర్‌ఎం లలిత్‌బోహ్రా, ఆయన సతీమణి జ్యోత్స్నబోహ్రా అభినందించారు. జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ చూపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో క్రీడా సంఘాల ప్రతినిధులు బి.సతీష్, రక్షణ్‌కుమార్, కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు మెరుగైన సేవలు

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే : రైల్వే ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని తూర్పు కోస్తా రైల్వే వాల్తేర్ ఏడీఆర్‌ఎం కె.రామారావు తెలిపారు. ఆదివారం ఆయన విశాఖ రైల్వేస్టేషన్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆన్‌బోర్డు హౌస్‌కీపింగ్ సిబ్బంది, లినెన్ సరఫరాదారులతో మాట్లాడారు. ప్రయాణికులకు పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించాలని, ప్రతి ఒక్కరితో మర్యాదగా మాట్లాడాలని సూచించారు. అనంతరం సిబ్బంది, సూపర్‌వైజర్లు, హెల్త్ ఇన్‌స్పెక్టర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు.

రైల్వేస్టేషన్‌లో పర్యటిస్తున్న ఏడీఆర్‌ఎం రామారావు, అధికారులు

అప్పన్న సన్నిధిలో పట్నా హైకోర్టు న్యాయమూర్తి

జస్టిస్ అనుపమ చక్రవర్తి దంపతులకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న డిప్యూటీ ఈవో రాధ

సింహాచలం, న్యూస్‌టుడే: పట్నా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.అనుపమ చక్రవర్తి కుటుంబ సమేతంగా సింహాద్రి అప్పన్న స్వామిని దర్శించుకున్నారు. వారికి డిప్యూటీ ఈవో సింగం రాధ, అర్చకులు స్వాగతం పలికారు. కప్పస్తంభం ఆలింగనం చేసుకుని బేడామండపం ప్రదక్షిణం చేశారు. అంతరాలయంలో స్వామిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. పండితులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. డిప్యూటీ ఈవో రాధ స్వామివారి ప్రసాదం, చిత్రపటం, శేషవస్త్రాలు అందజేశారు.

విదేశీయులు అష్టలక్ష్మీ దేవాలయం సందర్శన

కొమ్మాది, న్యూస్‌టుడే: ఆధ్యాత్మికత, ఆలయాల నిర్మాణంపై అధ్యయనం చేస్తున్న పలువురు విదేశీ (రష్యా) ప్రతినిధులు ఆదివారం కొమ్మాదిలోని అష్టలక్ష్మీ దేవాలయాన్ని సందర్శించారు. ఇక్కడ 'శివకేశవ' ఆలయం విశిష్టత, ఆలయం నీడలో చేసే ప్రదక్షిణ, అమ్మవారు వీణ ధరించి ఉండటం తదితర ప్రాముఖ్యతలపై ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు ఓ వీడియోలో వివరించారు. దీంతో ఎంతో ఆసక్తితో ఇక్కడికి విచ్చేసి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్ఫటిక లింగ విశిష్టతను వారు అడిగి తెలుసుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధర్ స్వామి వారికి ఆలయ విశేషాలను వివరించారు. అనంతరం విదేశీయులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

కొమ్మాది అష్టలక్ష్మీ దేవాలయంలో రష్యా దేశస్థులు

(c) eenadu

పతకాలతో లావణ్య (మధ్యలో నిల్చున్న మహిళ)

మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో ప్రతిభ

మురళీనగర్, న్యూస్‌టుడే: మధ్యప్రదేశ్ జబల్‌పూర్‌లో ఈనెల 13 నుంచి 15 వరకు జరిగిన 45వ నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో మహిళా వాకర్స్ క్లబ్ సభ్యురాలు అమరాణి లావణ్య ప్రతిభ సాధించి పతకాలు గెలుచుకున్నారు. 100, 200 మీటర్ల నడకపోటీల్లో వరుసగా ప్రథమ, ద్వితీయ, లాంగ్‌జంప్‌లో ద్వితీయ స్థానంలో నిలిచి పతకాలు సాధించారు. ఈ సందర్భంగా ఆదివారం ఆమెకు మహిళా వాకర్స్ క్లబ్ కార్యవర్గసభ్యులు అభినందనలు తెలిపారు.

విశాఖ ఉత్తరం

• విశాఖ ఉత్తరం • విశాఖ దక్షిణం

ఆరోగ్యానికి క్రీడలు దోహదం

విజిలెన్స్ విభాగం ఓఎస్డీ కింజరాపు ప్రభాకర్‌తో చిన్నారులు

మురళీనగర్, న్యూస్‌టుడే: సెక్టార్-8 వైశాఖి స్పోర్ట్స్ పార్కు స్కేటింగ్ రింకులో కియా వరల్డ్ స్కూల్ ఆధ్వర్యంలో స్కేటింగ్ క్రీడాకారులకు పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఓఎస్డీ కింజరాపు ప్రభాకర్ హాజరై మాట్లాడారు. క్రీడలు పిల్లల్లో ఆరోగ్యాన్ని పెంపొందిస్తాయన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఆ దిశగా ప్రోత్సహించాలన్నారు. అనంతరం విజేతలకు ధ్రువపత్రాలు, మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ స్కేటింగ్ కోచ్ కె.గంగాధర్, పాఠశాల నిర్వాహకులు శ్రీరాం, అనిల్‌కుమార్, తోట లలితప్రియ, కోచ్ పి.సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

విశాఖ ఉత్తరం: 8008574796

విశాఖ దక్షిణం: 8008574977

జగదాంబకూడలి, న్యూస్‌టుడే: ?: జీవీఎంసీ 39వ వార్డు కురుపాం మార్కెట్ పరిసరాల్లో పేరుకుపోయిన వ్యర్థాలను సకాలంలో తొలగించడం లేదు. తీవ్ర దుర్వాసన, ఈగలు, దోమలతో స్థానికులు అవస్థలు పడుతున్నారు.
– సురేష్, స్థానిక నివాసి. ✓: సిబ్బందిని పంపి, శుభ్రత పనులు చేయిస్తాం.
– రంగరాజు, వార్డు పారిశుద్ధ్య ఇన్‌స్పెక్టర్

మాధవధార, న్యూస్‌టుడే: ?: జీవీఎంసీ 50వ వార్డు వంశీనగర్ గెడ్డ, కాలువలు వ్యర్థాలతో నిండి మురుగు నిలిచిపోతోంది.
– ఎం.గిరి ✓: సిబ్బందిని పంపించి శుభ్రం చేయిస్తాం. – బి.సుధాకర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్

ఆలయ ఆదాయానికి గండి

నూతన కమిటీ ఏర్పాటుకు గ్రామస్థుల డిమాండ్

గురుద్వారా, న్యూస్‌టుడే

జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెంలో అభయ దుర్గాదేవి, ఆంజనేయస్వామి ఆలయం ఆదాయానికి కమిటీ సభ్యులు గండి కొడుతున్నట్లు గ్రామస్థుల నుంచి పెద్దఎత్తున ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆలయ కమిటీ సభ్యులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ భక్తులు కానుకల రూపంలో ఇస్తున్న వేలాది రూపాయల నగదు, బంగారాన్ని లెక్కలు తేల్చకుండా స్వాహా చేస్తున్నారంటూ వారంతా మండిపడుతున్నారు. 2016లో ఈ ఆలయాన్ని నిర్మించగా అప్పటి నుంచి గ్రామస్థుల ఆమోదంతో ఏడుగురు కమిటీ సభ్యులు నియమితులయ్యారు. వీరిలో ముగ్గురు కమిటీ తీరునచ్చక తప్పుకోగా మిగిలిన వారంతా ఆలయానికి వస్తున్న విరాళాలు అందినంత మేరకు తమ జేబులు నింపుకొంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. నగదు, బంగారం ఓ మహిళ దగ్గర దాచిపెట్టడంతో: భక్తులు విరాళాల ద్వారా ఆలయానికి ఇచ్చే నగదు, బంగారం ఓ మహిళ దగ్గర దాచి పెట్టారు. ఈ వ్యవహారం బయటకు పొక్కడంతో గ్రామస్థులంతా కమిటీని నిలదీయగా అంతా మా ఇష్టమని నచ్చింది చేసుకోమని దురుసుగా ప్రవర్తించడంతో వారంతా మండిపడుతున్నారు. ఇటీవల అమ్మవారి ఆభరణాలు మాయమయ్యాయని గ్రామస్థులు వాపోతున్నారు. ఆలయ కమిటీ తీరుపై ఆ ప్రాంతీయులంతా తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులు దృష్టికి తీసుకెళ్లినా తీరు మారలేదని మండిపడుతున్నారు. ప్రస్తుతమున్న కమిటీని రద్దు చేసి ఆదాయం తాలూకా వివరాలు బహిర్గతం చేయాలని, కమిటీ సభ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు చొరవ తీసుకుని విచారణకు ఆదేశించి, ప్రజల భాగస్వామ్యంతో కూడిన నూతన కమిటీని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

నక్కవానిపాలెంలోని దుర్గాదేవి అమ్మవారి ఆలయం

రక్తదానంతో ప్రాణాలు కాపాడొచ్చు

వన్‌టౌన్, న్యూస్‌టుడే : రక్తదానంతో ఆపదలో ఉన్న వారి ప్రాణాలు కాపాడొచ్చని నగర పోలీసు కమిషనర్ శంఖబ్రతబాగ్చీ సూచించారు. పాతనగరం స్వామి వివేకానంద సేవా సంస్థ ఆవరణలో ఆదివారం రామకృష్ణ పరమహంస జయంతి, వివేకానంద వృద్ధాశ్రమ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. సామాజిక బాధ్యతగా సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. శిబిరంలో పలువురు పాల్గొని రక్తదానం చేశారు. అనంతరం సీపీ చేతుల మీదుగా రక్తదాతలను అభినందించారు. పేదలకు దుప్పట్లు అందజేసి, అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. సంస్థ గౌరవ అధ్యక్షులు డాక్టర్ జహీర్ అహ్మద్, రైటర్స్ అకాడమీ అధ్యక్షులు వీవీ రమణమూర్తి, జలీల్ అహ్మద్, సంస్థ అధ్యక్షులు సూరాడ అప్పారావు, వన్‌టౌన్ సీఐ వరప్రసాద్, ఇతర సభ్యులు పోతురాజు, అప్పారావు, కేపీ.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

శిబిరంలో పాల్గొన్న సీపీ శంఖబ్రతబాగ్చీ, తదితరులు

స్పందనకు వందన

మురుగు సమస్యకు మోక్షం: అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: సంగం శరత్ సినిమాహాలు పక్క రోడ్డులో డ్రైనేజీ లీకై మురుగంతా రహదారిపై ప్రవహించడంతో స్థానికులు పడుతున్న ఇబ్బందులపై 'ఈనాడు'లో 'కాలువల్లో వ్యర్థాలు.. రహదారిపై మురుగు' శీర్షికతో ఈనెల 22న ప్రచురించిన వార్తకు కార్పొరేటర్ జి.వీరారావు, వార్డు ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ స్పందించారు. కార్మికులతో పూడిక తొలగించి మురుగు సక్రమంగా ప్రవహించేలా చేశారు.

ఈ-కార్నర్ వద్ద ఛైర్మన్ కొమ్మారెడ్డి రాంబాబు, బ్యాంకు ఉద్యోగులు, సిబ్బంది

ఎక్కడి వ్యర్థాలు అక్కడే..!

జగదాంబకూడలి, న్యూస్‌టుడే

జీవీఎంసీ 37వ వార్డు జాలరిపేట సామాజిక భవనం వద్ద చెత్తకుండీ లేకపోవడంతో స్థానిక నివాసితులు రహదారి పక్కనే వ్యర్థాలను పారబోస్తున్నారు. తీవ్ర దుర్వాసనతో పాటు, దోమల బెడద ఎక్కువై స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. పశువులు, పందులు అక్కడకు చేరి.. వ్యర్థాలను చెల్లాచెదురు చేయడంతో పరిసరాలు అధ్వానంగా మారుతున్నాయి. ఇదే రహదారిలో వార్డు సచివాలయం ఉండడంతో నిత్యం రాకపోకలు సాగించే వారికి అవస్థలు తప్పడం లేదు. ఈ సమస్యపై పలుమార్లు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెత్త కుండీని ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

తవ్వేసి.. ఇలా వదిలేసి..!

జగదాంబకూడలి, న్యూస్‌టుడే

జీవీఎంసీ 31వ వార్డు యల్లమ్మతోట రహదారిలో ప్రయాణించేందుకు వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. భూగర్భ విద్యుత్తు కేబుల్స్ అమరిక కోసం గతంలో తవ్విన గోతుల్ని పూర్తిస్థాయిలో పూడ్చకుండా వదిలేశారు. దీంతో ద్విచక్ర వాహనచోదకులు తరచూ అదుపుతప్పి ప్రమాదాల బారిన పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేయించాలని పలువురు కోరుతున్నారు.

చోరీ సొత్తు స్వాధీనం

నిందితుడిని అదుపులోకి తీసుకున్న రైల్వే పోలీసులు

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే : విశాఖ రైల్వేస్టేషన్‌లో చోరీకి గురైన ప్రయాణికురాలి సొత్తును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆ వివరాలు... విశాఖ నుంచి ఆగ్రాకు వెళ్తున్న మహిళ బ్యాగులోని 200 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ. 12,500 నగదు మాయమయ్యాయి. దీంతో బాధితురాలు సీపీ శంఖబ్రతబాగ్చీకి ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాలతో ఆర్పీఎఫ్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సీసీటీవీ ఫుటేజీలు పరిశీలించి, హరియాణాకు చెందిన నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. చోరీ సొత్తును స్వాధీనం చేసుకుని, బాధితురాలికి సమాచారం అందించారు. సీపీ స్పందించిన తీరుకు బాధితురాలు కృతజ్ఞతలు తెలిపారు.

వాలీబాల్ పోటీలకు ఎంపిక

విశాఖక్రీడలు, న్యూస్‌టుడే : జాతీయస్థాయి సబ్‌జూనియర్ వాలీబాల్ పోటీలకు నగర క్రీడాకారిణులు పి.వి.సాయి జిషిత, రక్షణ ఎంపికయ్యారు. పోటీలు ఈనెల 24 నుంచి వచ్చే నెల ఒకటి వరకు పశ్చిమబెంగాల్‌లో జరగనున్నాయి. ఎంపికైన క్రీడాకారిణులు రైల్వే ఉద్యోగుల కుమార్తెలు కావడంతో ఆదివారం డీఆర్ఎం లలిత్‌బోహ్రా, ఆయన సతీమణి జ్యోత్స్నబోహ్రా అభినందించారు. జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ చూపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో క్రీడా సంఘాల ప్రతినిధులు బి.సతీష్, రక్షణ్‌కుమార్, కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారిణులతో డీఆర్ఎం లలిత్‌బోహ్రా, తదితరులు

మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు రామ్మోహన్‌రావు

బాధ్యులను శిక్షించాలని డిమాండ్

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : ఏయూలో విద్యార్థులపై దాడి చేసిన వారిని శిక్షించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు రామ్మోహన్‌రావు డిమాండ్ చేశారు. ఆదివారం జగదాంబకూడలిలోని సిటూ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏయూలో మతపరమైన కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఆర్ఎస్ఎస్‌ను అడ్డుకున్న విద్యార్థులపై దాడి చేయడం దారుణమన్నారు. వర్సిటీల్లో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్ఎఫ్ఐ నాయకులు అజయ్, కుసుమాంజలి, తరుణ్, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి కోఆపరేటివ్ బ్యాంకులో ఈ-కార్నర్ ప్రారంభం

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: కనకమహాలక్ష్మి కోఆపరేటివ్ బ్యాంకు ప్రధాన కార్యాలయం(అక్కయ్యపాలెం) శాఖలో ఈ-కార్నర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. బ్యాంకు ఛైర్మన్ కొమ్మారెడ్డి రాంబాబు ముఖ్యఅతిథిగా పాల్గొని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరిన్ని వినూత్న సేవలందించేందుకు బ్యాంకు పని వేళలతో సంబంధం లేకుండా ఖాతాదారులు తమ ఖాతాల్లో నగదు డిపాజిట్ చేయడానికి వీలుగా ఈ-కార్నర్‌ను అందుబాటులోకి తెచ్చామన్నారు. కార్యక్రమంలో బ్యాంకు ముఖ్య కార్యనిర్వహణాధికారి కె.శ్యామ్‌కిశోర్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సభ్యత్వం తీసుకుని పార్టీ బలోపేతానికి కృషి చేయండి

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: ప్రజలు, జనసేన పార్టీ కార్యకర్తలు 'ఉద్యమి'లో సభ్యత్వం నమోదు చేసుకుని పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఉత్తర నియోజకవర్గం జనసేన సమన్వయకర్త ఉషాకిరణ్ పిలుపునిచ్చారు. శంకరమఠం రోడ్డులోని ఓ హోటల్‌లో ఆదివారం నిర్వహించిన 'ఉద్యమి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. అధికసంఖ్యలో జన సైనికులు సభ్యత్వం నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు శంకు వెంకటేశ్వరరావు, కార్పొరేటర్లు ఉషశ్రీ, ఆళ్ల లీలావతి, నాయకులు దివాకర్, శ్రీధర్, అప్పారావు, నాగమణి, త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఉషాకిరణ్, శంకు వెంకటేశ్వరరావు, ఉషశ్రీ, లీలావతి తదితరులు

రౌడీషీటర్లు పరివర్తనతో మెలగాలి

మాధవధార, న్యూస్‌టుడే: రౌడీషీటర్లు పరివర్తనతో మెలగాలని, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే పీడీ యాక్ట్ అమలు చేస్తామని కంచరపాలెం ఎస్సై రవికుమార్ హెచ్చరించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. కష్టపడి పని చేసుకుంటూ కుటుంబాలకు అండగా ఉండాలని ఇతరులను ఎటువంటి ఇబ్బందులకు కలిగించవద్దన్నారు. రౌడీషీటర్లపై నిత్యం పోలీసుల నిఘా ఉంటుందన్నారు. పరివర్తనతో మెలిగిన వారికి రౌడీషీట్ తొలగించేలా సిఫార్సు చేస్తామన్నారు.

రౌడీషీటర్లతో మాట్లాడుతున్న కంచరపాలెం ఎస్సై రవికుమార్

ఘనంగా ఎరుకుమాంబ మారువారం పండగ

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: దొండపర్తిలోని ఎరుకుమాంబ అమ్మవారి మారువారం పండగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో నిర్వహించిన భారీ అన్నసమారాధనను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈఓ సురేష్ బాబు, ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాస్, కార్పొరేటర్లు జి.వీరారావు, ఎ.లీలావతి, 27వ వార్డు తెదేపా, జనసేన అధ్యక్షులు ఎ.సత్యనారాయణరెడ్డి, జి.సురేష్‌బాబు, కూటమి నేతలు లక్ష్మీశివప్రసాద్, కె.మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆహారం వడ్డిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, కార్పొరేటర్లు వీరారావు, లీలావతి తదితరులు

ముగిసిన దుర్గాలమ్మ జాతర

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : జీవీఎంసీ 35వ వార్డు పూర్ణామార్కెట్ దుర్గాలమ్మ తల్లి జాతర ముగిసిన నేపథ్యంలో ఆదివారం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. సింహాచలం దేవస్థానం బోర్డు మాజీ సభ్యులు ఎస్.శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు కె.గోవింద్, అప్పలరాజు, సీహెచ్.వెంకట అప్పారావు, బి.గోవింద్, పి.అప్పలరాజు, బాలు తదితరులు పాల్గొన్నారు.

భోజనం పెడుతున్న నిర్వాహకులు, అతిథులు

పాత పింఛను అమలు చేయాలని కోరుతూ ఆదివారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిర్వహించిన ఆందోళనలో ఉపాధ్యాయులు, ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని... ప్లకార్డులు చేతపట్టుకుని నినదించారు (చిత్రంలో..).
– న్యూస్‌టుడే, కార్పొరేషన్

ఘనంగా పేరాల భరతశర్మ జయంతి

'మధురా దాక్షిణ్యము' పుస్తకావిష్కరణ చేస్తున్న కోలవెన్ను మలయవాసిని, నిర్వాహకులు

సీతంపేట, న్యూస్‌టుడే: శ్రీవిశ్వనాథ సాహిత్య పీఠం ఆధ్వర్యంలో ఆచార్య సరస్వతి పేరాల భరత శర్మ 93వ జయంతి పౌరగ్రంథాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. డాక్టర్ ఏల రవికుమార్ అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్యఅతిథి ఆచార్య కోలవెన్ను మలయవాసిని జ్యోతి వెలిగించి భరతశర్మ చిత్రపటానికి నివాళి అర్పించారు. పేరాల సాహితీ పురస్కారాన్ని రచయిత ఎ.వి.దక్షిణామూర్తికి ప్రదానం చేశారు. అనంతరం ఆయన రాసిన 'మధురా దాక్షిణ్యము' పుస్తకాన్ని ఆవిష్కరించారు. డాక్టర్ టి.పి.శ్రీనివాస రామానుజం పుస్తక సమీక్ష చేశారు. పలువురు సాహితీ ప్రియులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు మెరుగైన సేవలు

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే : రైల్వే ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని తూర్పు కోస్తా రైల్వే వాల్తేర్ ఏడీఆర్ఎం కె.రామారావు తెలిపారు. ఆదివారం ఆయన విశాఖ రైల్వేస్టేషన్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆన్‌బోర్డు హౌస్‌కీపింగ్ సిబ్బంది, లినెన్ సరఫరాదారులతో మాట్లాడారు. ప్రయాణికులకు పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించాలని, ప్రతి ఒక్కరితో మర్యాదగా మాట్లాడాలని సూచించారు. అనంతరం సిబ్బంది, సూపర్‌వైజర్లు, హెల్త్ ఇన్‌స్పెక్టర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు.

రైల్వేస్టేషన్‌లో పర్యటిస్తున్న ఏడీఆర్ఎం రామారావు, అధికారులు

'హ్యాపీ సండే'తో మానసిక ఉల్లాసం

తాటిచెట్లపాలెం, అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: తాటిచెట్లపాలెం, నరసింహనగర్‌లోని పార్కుల వద్ద ఆదివారం జీవీఎంసీ ఆధ్వర్యంలో 'హ్యాపీ సండే' కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఉత్తరం జోన్ జెడ్సీ బొడ్డేపల్లి రాము, ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు కుమార్తె భాజపా నాయకురాలు శ్యామలా దీపిక పాల్గొని మాట్లాడారు. నగర ప్రజల ఆరోగ్యానికి, మానసిక ఉల్లాసానికి ఈ కార్యక్రమం దోహద పడుతుందన్నారు. నెలలో ప్రతి రెండు, నాలుగో ఆదివారాల్లో ఈ కార్యక్రమం జరపనున్నామన్నారు. అనంతరం ప్రజలతో యోగాసనాలు, సూర్య నమస్కారాలు చేయించారు. విద్యార్థులతో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఆర్‌ఓ బాబూరావు, ఏపీడీ పుణ్యవతి తదితరులు పాల్గొన్నారు.

సంతోషంతో నినాదాలు చేస్తున్న జెడ్సీ రాము, శ్యామలా దీపిక, ప్రజలు

అప్పన్న సన్నిధిలో పట్నా హైకోర్టు న్యాయమూర్తి

సింహాచలం, న్యూస్‌టుడే: పట్నా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.అనుపమ చక్రవర్తి కుటుంబ సమేతంగా ఆదివారం అప్పన్న స్వామిని దర్శించుకున్నారు. వారికి డిప్యూటీ ఈవో సింగం రాధ, అర్చకులు స్వాగతం పలికారు. కప్పస్తంభం ఆలింగనం చేసుకుని బేడామండపం ప్రదక్షిణం చేశారు. అంతరాలయంలో స్వామిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. పండితులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు.

జస్టిస్ అనుపమ చక్రవర్తి దంపతులకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న డిప్యూటీ ఈవో రాధ

వైభవంగా విజయ దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవం

తాటిచెట్లపాలెం, న్యూస్‌టుడే: జీవీఎంసీ 45వ వార్డు సత్యసాయినగర్‌లోని విజయ దుర్గాదేవి అమ్మవారి ఆలయ వార్షికోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి వేద పండితుల సమక్షంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, చేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణం వద్ద ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, కార్పొరేటర్ కంపా హనోక్, కూటమి నేతలు చిక్కాల విజయబాబు, శ్యామలా దీపిక, గ్రామ అధ్యక్షుడు భరణికాన రాజు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఉత్సవంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా నాలుగో పట్టణ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

అమ్మవారి సన్నిధిలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, నేతలు

సిరుల స్వామికి స్వర్ణ పుష్పార్చన

సింహాచలం, న్యూస్‌టుడే: సిరులొలికే సింహాద్రినాథుడికి ఆదివారం స్వర్ణ పుష్పార్చన ప్రత్యేక పూజా కార్యక్రమం వైభవోపేతంగా జరిగింది. అర్చకులు దేవేరుల సమేతుడైన గోవిందరాజ స్వామిని సర్వాంగ సుందరంగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆశీనులను చేశారు. బంగారు సంపెంగ పుష్పాలతో అష్టోత్తర శతనామార్చన జరిపారు. అనంతరం నిత్య కల్యాణోత్సవాన్ని కమనీయంగా జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని సేవించారు.

ఆలయాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి

తాటిచెట్లపాలెం, న్యూస్‌టుడే: రైల్వేన్యూకాలనీలోని ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం నూతనంగా నియమితులైన ఆలయ కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్యఅతిథిగా భాజపా నాయకురాలు శ్యామలా దీపిక, కార్పొరేటర్ ఆళ్ల లీలావతి పాల్గొని కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కొత్త కమిటీ ఆలయ పురోభివృద్ధికి చర్యలు చేపట్టాలన్నారు. కమిటీ ఛైర్మన్ మొల్లేటి గణేష్, సభ్యులు ఎం.మంజుల, జి.జగదీశ్వరి, సుమలత, ఎస్.పార్వతి, జె.శ్రీనివాసరావు, ఎన్.శాంతి, బి.నాగేశ్వరరావు, కూటమి నాయకులు ఆళ్ల శ్రీనివాసరావు, ఆకిరెడ్డి జగదీశ్, గురుగోవింద్ సింగ్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారం చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

భగవన్నామాలన్నీ మంత్రాలే..

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: కపటం లేని మనసుతో భగవంతుడిని ఆరాధిస్తే భక్తి లభిస్తుందని ప్రముఖ ప్రవచనకర్త సామవేదం షణ్ముఖ శర్మ అన్నారు. విశాఖ రుషి పీఠం, సత్సంగం ఆధ్వర్యంలో ఎంవీపీకాలనీ సెక్టార్-6లో ఉన్న ఏబీసీ పార్కులో భాగవతం ప్రవచన యజ్ఞం నాలుగో రోజు ఆదివారం కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన పలు విషయాలను భక్తులకు వివరించారు. భగవన్నామాలన్నీ మంత్రాలేనని పేర్కొన్నారు. కోరికలు ధర్మబద్ధంగా ఉండాలన్నారు.

సరైన నిద్రతో రుగ్మతలు దూరం

మురళీనగర్, న్యూస్‌టుడే: సెక్టార్-8 వాకర్స్ క్లబ్ సభా ప్రాంగణంలో ఆదివారం రెయిన్‌బో ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 120 మందికి పైగా కాలనీవాసులు పాల్గొని వైద్యసేవలు పొందారు. ఆప్తమాలజీ సర్జన్ డాక్టర్ సురేశ్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ కనీసం 8 గంటలు సమయం నిద్రపోవాలని సూచించారు. ఇందులో భాగంగా రక్తపోటు, మధుమేహం, కంటి పరీక్షలు నిర్వహించారు. అనంతరం వైద్యుడు సురేశ్‌ను వాకర్స్ కమిటీ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో నర్సింగ్ సిబ్బంది మేఘన, సంతోష్, రేణుక, శిరీష, క్లబ్ అధ్యక్షుడు ప్రసాదరావు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

వైద్యుడిని సత్కరిస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

ఆదివారం.. ఆనందాలమయం

నియోజకవర్గంలో విజయవంతంగా నిర్వహించేలా చర్యలు

మాధవధార, న్యూస్‌టుడే

ఉదయం నిద్ర లేచినప్పటి నుంచి మళ్లీ రాత్రి పడుకునే వరకు జీవితం యాంత్రికంగా మారుతోంది. దీనికి తోడు ఒత్తిడితో సతమతమవుతున్నారు. ఈ నేపథ్యంలో చిరు ప్రాయంలోనే రక్తపోటు, మధుమేహం, ఇతర వ్యాధుల బారిన పడుతున్నారు. వీటి నుంచి ఉపశమనం పొందేందుకు కూటమి ప్రభుత్వం 'ఆనంద ఆదివారం' (హ్యాపీ సండే) కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. వచ్చే నెల నుంచి ఆయా నియోజకవర్గాల జోనల్ కమిషనర్ల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలను పూర్తి స్థాయిలో నిర్వహించేందుకు తగు చర్యలు చేపట్టనున్నారు.

ఆటలాడుతున్న చిన్నారులు

■ **ఆరోగ్యంతో పాటు పర్యావరణ పరిరక్షణ:** ఆనంద ఆదివారంలో ప్రధానంగా ఆహ్లాదం, ఆనందం, ఆరోగ్యానికి చోటు కల్పించాలి ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. వీటితో పాటు యోగా, ధ్యానం, నడక, సైక్లింగ్, మ్యాజిక్, నృత్యం, కథలు, ఆటలు, పాటలు, చిత్రలేఖనం తదితర వాటికి ప్రాధాన్యం ఇచ్చి పోటీలు నిర్వహిస్తున్నారు. ప్రజలు, పలు కాలనీల అసోసియేషన్లు, స్వచ్ఛంద సంస్థలను భాగస్వాములను చేసి వారితో మొక్కలు నాటించడం, రోడ్ల శుభ్రత కార్యక్రమాలు నిర్వహించి పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్నారు. ప్రతి నెలలో రెండు, నాలుగు ఆదివారాల్లో రెండు నుంచి 3 గంటల పాటు ఈ కార్యక్రమాలు జరపనున్నారు. విశాల రోడ్లు ఉన్న వీధుల్లో, కూడళ్లు, కళావేదికలు, ఉద్యానవనాలు, ప్రజలు ఎక్కువగా గుమిగూడే ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేసేలా చూస్తున్నారు. ఉత్తరం నియోజకవర్గంలో 5.60 లక్షల జనాభా ఉండటంతో దీన్ని మరింత విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నారు.

(c) eenadu

గాజువాక

• గాజువాక • విశాఖ పశ్చిమం

భక్తిశ్రద్ధలతో ఉత్సవ విగ్రహం ఊరేగింపు

పెదగంట్యాడ, న్యూస్‌టుడే : నెల్లిముక్కు పెంటమాంబ ఆలయ ఉపదేవతల విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవంలో భాగంగా ఆదివారం అమ్మవార్ల ఊరేగింపు నిర్వహించారు. పురవీధుల్లో ఊరేగింపులో భక్తులు విశేషంగా పాల్గొన్నారు. పెంటమాంబ ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

సంప్రదాయబద్ధంగా బల్లల పండగ

అగనంపూడి, న్యూస్‌టుడే : అగనంపూడి పరిధి కొండయ్యవలస కాలనీలో ఆదివారం శ్రీ పొర్రమాంబ రజక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సంప్రదాయబద్ధంగా బల్లల పండగను నిర్వహించారు. కులదైవం వడివేలు దేవుడికి ప్రత్యేక పూజలు చేశారు. విశాఖ జిల్లా రజక సంక్షేమ సంఘం అధ్యక్షుడు తోరాడ రాము, సంఘం నాయకులు గురుమూర్తి, శ్రీనివాసరావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న స్థానికులు

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ. 10 నుంచి మ. ఒంటి గంట వరకు
గాజువాక: 98494 65088
పశ్చిమం (గోపాలపట్నం): 95428 96869

గాజువాక, పెదగంట్యాడ, న్యూస్‌టుడే: ?: వుడాకాలనీ ఎంఐజీ బ్లాకుల్లో డ్రైనేజీల్లో మురుగు పారక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. బీసీరోడ్డు సీతారాంనగర్‌లోనూ ఇళ్ల మధ్య కలుపులు జామయ్యాయి. -ఈశ్వరరావు, వుడాకాలనీ -లక్ష్మణ్, సీతారాంనగర్
✓: సిబ్బందిని పంపి ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. -కిరణ్‌కుమార్, ఏఎంవోహెచ్

?: దినకొండ్ల వైఖరజంక్షన్‌రోడ్డులో వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉంది. నడిచి వెళ్లే వారిపై ఇవి దాడి చేస్తున్నాయి. -చిన్నారావు, ప్రశాంత్, 76వ వార్డు ✓: స్పెషల్ డ్రైవ్ చేపట్టి నివారణకు కృషిచేస్తాం. -కిరణ్‌కుమార్, ఏఎంవోహెచ్.

స్పందనకు వందనం

పైపులైన్ల పునరుద్ధరణ

పెదగంట్యాడ, న్యూస్‌టుడే : కేబీఆర్ పరిధిలో మరమ్మతులకు గురైన తాగునీటి పైపు లైన్ల పునరుద్ధరణ పనులకు జీవీఎంసీ నీటి సరఫరా సిబ్బంది చర్యలకు చేపట్టారు. 'ఈనాడు'లో పైపులైన్ల లీకులపై వరుసగా వచ్చిన కథనాలకు సంబంధిత అధికారులు కదిలారు. 70, 71, 73 వార్డుల్లో లీకుల నివారణకు పైపులను మార్చారు. సహాయ ఇంజినీర్లు పనులు పరిశీలించారు.

అబ్రకదబ్ర.. అదిరిందబ్బా..

✦ గాజువాక మాంత్రికుల మాయాజాలం ✦ నేడు ప్రపంచ మెజీషియన్ల దినోత్సవం

గాజువాక, న్యూస్‌టుడే : వారి చేతిలో చిత్తు కాగితాలు కరెన్సీలవుతాయి. జేబు రుమాలు రివ్వున ఎగిరే గువ్వలవుతాయి. రెప్పపాటుకాలంలో అబ్రకదబ్ర అంటూ కళ్ల ముందు వస్తువులు మాయం చేసి అబ్బురపరుస్తూ గాజువాకకు చెందిన ప్రముఖ ఇంద్రజాలికులు తమదైన గుర్తింపును తెచ్చుకున్నారు. జాతీయ అంతర్జాతీయ స్థాయిలో వేలాది మిమిక్రీ ప్రదర్శనలిచ్చి ప్రముఖుల ప్రశంసలు అందుకున్నారు. సోమవారం ప్రపంచ మాంత్రికుల దినం సందర్భంగా ప్రత్యేక కథనం..

వసంత్.. 2500 ప్రదర్శనలు

సౌత్ ఇండియా రైల్వే కాంట్రాక్టర్‌గా కొనసాగుతున్న మెజీషియన్ జయంతి వసంత్ కుమార్ ఇంద్రజాల విద్యలో 18 ఏళ్ల అనుభవం ఉంది. జాతీయస్థాయిలో ఇప్పటికి 2500 వరకు ప్రదర్శనలిచ్చారు. మరియో కాస్ట్యూమ్‌లో భాగంగా క్యామిడీ మ్యాజిక్, ఇంటరాక్టివ్ యాక్ట్స్, ఫ్యామిలీ ఎంటర్‌టైన్‌మెంటులో వసంత్ ముందుంటున్నారు.

* ఇటీవల వైజాగ్ లైట్‌హౌస్ ఫెస్టివల్‌లో నూతన పంథాలో ప్రదర్శనలిచ్చి అందరి మన్ననలు పొందారు. పారిశ్రామిక ప్రాంతంలో ప్రభుత్వ పాఠశాలలు, వివిధ విద్యాసంస్థల్లో విద్యార్థులకు ఉపయుక్తంగా ఉండే అంశాలను ప్రదర్శించి ప్రశంసలు పొందారు. విశాఖ పూర్వ కలెక్టర్ మల్లికార్జున, అప్పటి జీవీఎంసీ కమిషనర్ల నుంచి ఉత్తమ పురస్కారాలు, సత్కారాలందుకున్నారు.

మామిడికాయలు సృష్టించి..

ఉక్కునగరం, న్యూస్‌టుడే : స్టీలుప్లాంట్‌లో మేనేజర్‌గా పనిచేసిన కె.విజయకుమార్ 25 ఏళ్లుగా తన ఇంద్రజాల ప్రదర్శనలతో అలరిస్తున్నారు. దేశంలో పలు ప్రాంతాల్లో ఆయన తన ప్రదర్శనలు ఇచ్చి ప్రశంసలందుకున్నారు. మ్యాజిక్‌తో మామిడికాయలు సృష్టించిన ఆయన ప్రదర్శనల్లో అద్భుతమైనదిగా చెప్పవచ్చు. పి.సి.సర్కార్ తనకు స్ఫూర్తి అని ఆయన చెప్పుతారు.

హిమచంద్.. కనువిందు..

తన 20వ ఏటనే సింగరాజు హిమచంద్ మిమిక్రీలో తనదైన ముద్ర వేసుకున్నారు. ఇంద్రజాలం, జగ్లింగ్ తదితర కళల్లో రాణిస్తున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో 5వేల వరకు ప్రదర్శనలిచ్చారు. టీవీల్లో విద్యాభ్యాసం పూర్తిచేసిన ఈయన వృత్తిగా మలచుకుని ముందుకు సాగుతున్నారు. జీవీఎల దర్శకేంద్రుడు రాఘవేంద్రరావు నుంచి ప్రశంసలు అందుకుని ఉత్తమ పురస్కారం పొందారు. నగరవ్యాప్తంగా ఎక్కడ స్టేజ్ ప్రోగ్రాములున్నా అక్కడ చంద్ ప్రదర్శనలుంటాయి. తొలి నుంచీ మిమిక్రీ అంటే ఇష్టమని అదే తనకు గుర్తింపు తెచ్చిందని తెలిపారు.

మాజీ క్రికెటర్‌కు చెక్కు అందజేత

గాజువాక, న్యూస్‌టుడే : గాజువాక గ్రీన్స్ జట్టు మాజీ క్రికెటర్ శేఖర్ అనారోగ్య కారణాలతో ఇబ్బందులు పడుతుంటే సీఎంఆర్‌ఎఫ్ కింద మంజూరైన రూ.లక్షల చెక్కును ఆదివారం ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అందజేశారు. జింక్ మైదానంలో బాధితుడు శేఖర్‌ను పరామర్శించారు. తెదేపా సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, వీఎమ్‌సీ ప్రతినిధులు పురుషోత్తంరెడ్డి, సాయికుమార్, నూకరాజు, గోమాడ వాసు, బుల్లెట్ శ్రీను, రాజారావు తదితరులు పాల్గొన్నారు.

చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే పల్లా

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

గాజువాక, పెదగంట్యాడ, న్యూస్‌టుడే : జీవీఎంసీ కమిషనర్ ఇచ్చిన ఆదేశాల మేరకు గాజువాక జోన్‌లో ఆదివారం పలుచోట్ల హ్యాపీ సండే వేడుకలు నిర్వహించారు. ప్రతి నెలా 2, 4వ ఆదివారాల్లో ఈ కార్యక్రమం చేయాలన్న ఆదేశాలతో ఉదయం వికాస్‌నగర్ ఇండోర్ స్టేడియంలో చిన్నారులకు కరాటే పోటీలు, యోగా, చినగంట్యాడ అమరావతి పార్కులో మహిళలకు వివిధ పోటీలు, హ్యాపీ సండే ర్యాలీ నిర్వహించారు. జోనల్ కమిషనర్ బీఆర్‌ఎస్ శేషాద్రి, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

కరాటే బాలలతో నిర్వాహకులు

మలుపులో బిక్కు బిక్కు...

గాజువాక, న్యూస్‌టుడే: భూగర్భ విద్యుత్తు తీగల పనులు చినగంట్యాడ జగ్గుసెంటర్ వాసులకు చుక్కలు చూపిస్తున్నాయి. కేబుల్ కోసం తవ్వి, అక్కడే పని ముట్లు, కేబుల్ రోల్స్‌ను పడేశారు. వాహనాలు మలుపు తిరిగే క్రమంలో ఇవి అడ్డంకిగా ఉన్నాయి. ఏమాత్రం జారిపడ్డా ప్రాణాల మీదకు వస్తుంది. అటుగా రాకపోకలు సాగించాలంటేనే బిక్కు బిక్కుమంటున్నారు. ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

జగ్గుసెంటర్ మలుపు చక్రం

పైపులైను పనులతో అవస్థలు

ఫోకస్

పెదగంట్యాడ, న్యూస్‌టుడే : చిననడుపూరు నూకాంబిక గుడి రోడ్డులో పైపులైను కోసం తవ్విన గొయ్యి, మట్టి వల్ల అటుగా వెళ్లేవారంతా బితుకుబితుకుమంటున్నారు. వాహనాలు జారి పడిపోతున్నాయి. గోపాలరెడ్డినగర్ నుంచి నడుపూరు వచ్చేవారంతో గుండెలు అరచేత్తే పట్టుకుంటున్నారు. త్వరితగతిన పనులు పూర్తయ్యేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

దారిలో పెద్ద గొయ్యి

ఆదమరిస్తే అంతే సంగతులు..

గాజువాక, న్యూస్‌టుడే : గాజువాక 76వ వార్డు చినకోరాడ సామాజిక భవనం వద్ద విద్యుత్తు స్తంభం గుబులు రేపుతోంది. కాలువ చెంతన ప్రహరీని ఆనుకుని స్తంభానికి పవర్ బాక్సు వేలాడుతోంది. అటుగా వెళ్లే చిన్నారులు పట్టుకుంటే ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు ఉన్నాయి. స్తంభాన్ని పునరుద్ధరించి ఇబ్బందులు తీర్చాలని స్థానికులు విద్యుత్తు అధికారులను కోరుతున్నారు.

మత్తుకు బానిసలు కావొద్దు: డీవైఎఫ్ఐ

మల్కాపురం, న్యూస్‌టుడే : నేడు యువత, విద్యార్థులు డ్రగ్స్, గంజాయి, మద్యం వంటి మత్తు పదార్థాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకుంటున్నారని డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న ఆవేదన వ్యక్తం చేశారు. జీవీఎంసీ 60వ వార్డు శ్రీహరిపురం కోరమాండల్ సమీప కూడలిలో ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) ఆధ్వర్యంలో 'జన చైతన్య బైక్ యాత్ర'ను ఆయన ప్రారంభించారు. డ్రగ్స్, గంజాయి, మద్యంకు వ్యతిరేకంగా ఈ యాత్ర చేపడుతున్నారన్నారు. ఈనెల 28వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా పలుచోట్ల ఈ బైక్ యాత్ర కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జీవీఎంసీ నాయకులు పి.వెంకటరెడ్డి, డీవైఎఫ్ఐ నాయకులు రాజు, వాసు, శ్రావణ్, ప్రభు, రాము తదితరులు పాల్గొన్నారు.

జెండా ఊపి బైక్ యాత్రను ప్రారంభిస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

సత్యనారాయణ సేవలు అభినందనీయం

మల్కాపురం, న్యూస్‌టుడే : బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి, కార్మిక హక్కుల సాధనకై పలు ఉద్యమాలు చేసిన దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ఉపాధ్యక్షులు మండే సత్యనారాయణ సేవలు అభినందనీయమని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కాండ్రేగుల సత్యాంజనేయ అన్నారు. జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం గ్రామ మండలిలో ఆదివారం దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో మండే సత్యనారాయణ పదవీ విరమణ సభ జరిగింది. డీహెచ్‌పీఎస్‌లో ఉంటూ దళితుల పక్షాన పోరాడాలని పలువురు నాయకులు ఆయనను కోరారు. ఈ కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ నాయకులు గుడాల రాంబాబు, కామేశ్వరరావు, పి.దుర్గారావు, విజయకుమార్, వెంకటరమణ, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై చెత్త తొలగింపు

అక్కిరెడ్డిపాలెం, న్యూస్‌టుడే : షీలానగర్‌లో ఆదివారం ఉదయం తిరుమల బాలాజీ దివ్యక్షేత్రం నుంచి అయ్యప్పస్వామి ఆలయం వరకు సుమారు 500 మీటర్ల రహదారి, పరిసరాలను స్థానిక వాకర్స్ అసోసియేషన్ సభ్యులు శుభ్రం చేశారు. శుభ్రతకు అవసరమైన పరికరాలు సభ్యులకు పంపిణీ చేశారు. ఎస్టీబీఎల్ ఛైర్మన్ గుత్తికొండ బాలాజీ వీరభద్రరావు, ప్రతినిధులు అలమండ రాజు, జి.గంగా మహేశ్, సభ్యులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సాయం

అగనంపూడి, న్యూస్‌టుడే : జీవీఎంసీ 85వ వార్డు పరిధి పెదమడకలో భర్త మరణించడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్న ఈగల లోకేశ్వరి కుటుంబానికి సర్వహిత ఛారిటబుల్ ట్రస్టు సాయం అందించింది. ఆదివారం ట్రస్టు సభ్యులు బాధిత కుటుంబాన్ని కలిసి రూ. 20వేల నగదుతో పాటు నెలకు సరిపడా నిత్యావసరాలు ఇచ్చారు. ట్రస్టు వ్యవస్థాపకుడు సుశీలగజేంద్రరావు, ప్రతినిధులు ఎం. మస్తాన్‌రెడ్డి, గంధోళి నర్సింగరావు, వి.వెంకటరమణ, పిల్లా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అన్నప్రసాదానికి వితరణ

అక్కిరెడ్డిపాలెం, న్యూస్‌టుడే: షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని శ్రీ తిరుమల బాలాజీ దివ్య క్షేత్రంలో అన్నప్రసాద వితరణ భోజనం ప్లేట్లకు భక్తుడు ఒకరు రూ.55వేలు విరాళం అందజేశారు. దాత రమణ, ఆయన భార్య ఝాన్సీ, కుమార్తె పూర్ణిమలను అర్చకులు సత్కరించారు.

నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

కరాస, న్యూస్‌టుడే : మరమ్మతుల నేపథ్యంలో దుర్గానగర్, పైడిమాంబకాలనీ, ఆర్పీపేట, గొల్లకంచరపాలెం, గవరకంచరపాలెం, కంచరపాలెం మెయిన్‌రోడ్డు ప్రాంతాల్లో సోమవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్తుకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్, ఆపరేషన్ జోన్-2 ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు బీకే నాయుడు తెలిపారు.

శాకాహార సద్భావన ర్యాలీ

బీసీరోడ్డు(గాజువాక), న్యూస్‌టుడే : పరమాత్మ పిరమిడ్ ధ్యాన కేంద్రం ఆధ్వర్యంలో బీసీరోడ్డులో ఆదివారం శాకాహార సద్భావన ర్యాలీ నిర్వహించారు. శాకాహారం ప్రయోజనాలను వివరిస్తూ నినదించారు. కేంద్రం నిర్వాహకులు అప్పారావు, అహింస ధ్యాన కేంద్రం ఇన్‌ఛార్జి మీసాల శివగణేశ్వరరావు, సభ్యుల రేవతిదేవి, బాలాజీ, పద్మావతి పాల్గొన్నారు.

శాకాహార ర్యాలీలో పాల్గొన్న పిరమిడ్ కేంద్రాల సభ్యులు

పోటీతత్వంతో విద్యార్థుల రాణింపు

బీసీరోడ్డు(పెదగంట్యాడ), న్యూస్‌టుడే : బీసీరోడ్డు ఎస్సీ బాలికల కళాశాల వసతిగృహంలో పీఎం మోదీ మనసులో మాట.. ఎపిసోడ్ ప్రత్యక్ష ప్రసార కార్యక్రమం ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ములకలపల్లి ప్రకాశ్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి భాజపా కన్వీనర్ కరణం రెడ్డి నర్సింగరావు చేతుల మీదుగా ధ్రువపత్రాలు అందజేశారు. నాయకులు సురేశ్, గనిరెడ్డి రాకేశ్, మహిళా జిల్లా అధ్యక్షురాలు నాదెళ్ల జ్యోతి, వెంకటరావు, పేర్ల సత్యారావు, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

క్విజ్ విజేతకు ధ్రువపత్రం అందజేస్తున్న కన్వీనర్ నర్సింగరావు, తదితరులు

సేవలతోనే వ్యక్తులకు గుర్తింపు: ఏసీపీ

చినగంట్యాడ (గాజువాక), న్యూస్‌టుడే: సమాజానికి ఉత్తమ సేవలందించేవారికి తగిన గుర్తింపు ఉంటుందని సౌత్ ఏసీపీ వై.శ్రీనివాసరావు అన్నారు. చినగంట్యాడలోని స్ఫూర్తి నిరాధార బాలల ఆశ్రమానికి తుంగ్లాం గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐలు గొందేశి సుధీర్ రెడ్డి, సుకుమార్‌రెడ్డిలు రూ. 85వేల విలువచేసే నిత్యావసరాలు, విద్యా సామగ్రిని ఏసీపీ చేతుల మీదుగా అందజేశారు. అళహరి పార్థసారథి, స్ఫూర్తి ఆశ్రమం ఇన్‌ఛార్జి రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న సౌత్ ఏసీపీ వై.శ్రీనివాసరావు, సీఐ పార్థసారథి, సుధీర్‌రెడ్డి తదితరులు

చిన్నారుల యోగాసనాల సాధన

తిరుమలనగర్‌లో హ్యాపీ సండే

కూర్మన్నపాలెం (తిరుమలనగర్), న్యూస్‌టుడే : జిల్లా అధికారులు ఆదేశాల మేరకు తిరుమలనగర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో హ్యాపీ సండే కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. కాలనీలోని పిల్లల పార్కులో చిన్నారులు, మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. సంఘం ప్రతినిధులు జి.విశ్వేశ్వరరావు, ఎం.పరమానందం, ఎ.చంద్రశేఖర్, ఎం.రాము, కె.భాస్కరరావు పాల్గొన్నారు.

కార్మిక సంక్షేమానికి బీఎంఎస్ కృషి

అక్కిరెడ్డిపాలెం, న్యూస్‌టుడే : ఉమ్మడి విశాఖ జిల్లా బీఎంఎస్(భారతీయ మజ్దూర్ సంఘ్) సర్వసభ్య సమావేశం ఆదివారం షీలానగర్‌లోని బీవీకే పాఠశాలలో జరిగింది. కార్మిక సంక్షేమానికి, కర్మాగారాల అభివృద్ధికి బీఎంఎస్ నిత్యం కృషి చేస్తుందని సంఘ ప్రతినిధులు పేర్కొన్నారు. నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా నియమించారు. అధ్యక్షులుగా రొక్కం సురేశ్‌కుమార్, ఉపాధ్యక్షులుగా చింతాడ రమణ, వినోద్, భూలోకనాయుడు, మధుబాబు, కార్యదర్శిగా అనిల్‌కుమార్, కోశాధికారిగా గౌరీశ్వరరావు తదితరులను ఎన్నుకున్నారు. విశాఖ డెయిరీ, నేవల్ డాక్‌యార్డ్, బీఎస్ఎన్ఎల్, పోర్ట్, ఉక్కు, పోస్టల్, రైల్వే, షిప్‌యార్డ్, భెల్ కార్మికులు పాల్గొన్నారు.

హాజరైన బీఎంఎస్ కార్యవర్గ సభ్యులు

వైభవంగా భూలోకమాంబ పండగ

గోపాలపట్నం(కొత్తపాలెం), న్యూస్‌టుడే : జీవీఎంసీ 89వ వార్డు కొత్తపాలెంలో శ్రీ భూలోకమాంబ అమ్మవారి పండగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి పసుపు, కుంకుమాభిషేకాలు చేపట్టారు. పరిసర ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం సమీపంలోని పోలిపల్లి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

★ జీవీఎంసీ 89వ వార్డు చంద్రనగర్‌లోని శ్రీగౌరీపరమేశ్వరుల ఆలయ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి పంచామృతాభిషేకాలు, శివ కల్యాణోత్సవం జరిపారు. పరిసర ప్రాంతాల భక్తులతోపాటు పశ్చిమ తెదేపా యువజన నాయకులు పి.మౌర్యసింహ, వార్డు కార్పొరేటర్ దాడి వెంకటరమేశ్, కొత్తపాలెం పీఏసీఎస్ ఛైర్మన్ బొడ్డేటి విజయ్‌కుమార్, రాష్ట్ర కళింగ సంక్షేమ డైరెక్టర్ పెప్పీ రమణ తదితరులు పాల్గొన్నారు.

పూజలందుకుంటున్న అమ్మవారు

రజకవీధిలో..

కరాస, న్యూస్‌టుడే : బల్లల పండగను 52వ వార్డు మర్రిపాలెం వుడాలేవుట్, రజకవీధిలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. దివంగత కామాకుల నాగేశ్వరరావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రజకుల పనిముట్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జియ్యాని శ్రీధర్, మారుతీ, బండయ్య, మంగపతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకోదండ రామాలయం తీర్థం

ఎన్ఏడీకూడలి (బుచ్చిరాజుపాలెం), న్యూస్‌టుడే: జీవీఎంసీ 91వ వార్డు బాజీకూడలిలోని శ్రీకోదండ రామాలయం తీర్థమహోత్సవం ఆదివారం నిర్వహించారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, సీతారాముల కల్యాణం వైభవం జరిగింది. పరిసర ప్రాంతాల భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో పరస, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

నూతన కార్యవర్గం ఎంపిక

కూర్మన్నపాలెం, న్యూస్‌టుడే : కూర్మన్నపాలెంలోని ఎంవీవీ, ఎంకే పార్కు యజమానుల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం జరిగింది. అధ్యక్షునిగా ఎస్వీ రామకృష్ణ, ఉపాధ్యక్షునిగా మహ్మద్ ఆదిల్, కార్యదర్శిగా ఎల్.రంజిత్‌కుమార్, అదనపు కార్యదర్శిగా బి.శ్రీనివాసరావు, కోశాధికారిగా కె.భార్గవ్, సభ్యులుగా ఎం.సన్యాసిరావు, పి.నాగేశ్వరరావు, జి.రామప్రసాద్, కె.సంతోష్‌కుమార్, ఎం.రాజేష్, సీహెచ్.ఈశ్వరరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సేవలకు సత్కారం

అక్కిరెడ్డిపాలెం, న్యూస్‌టుడే: సేవలకు తప్పక గుర్తింపు లభిస్తుందని మాజీ ఎమ్మెల్యే, అంబికా సంస్థల అధినేత అంబికా కృష్ణ అన్నారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆదివారం సర్ సీవీ రామన్(సేవా సాంస్కృతిక సంస్థ) 38వ ఉగాది పురస్కారాల కార్యక్రమం జరిగింది. నాతయ్యపాలెంకు చెందిన చరపాక నాగార్జునరాజుకు 'అన్నదాన వైభవ రత్న' అవార్డుతో పాటు సువర్ణ కంకణం, బంగారు మెడల్, శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. నాగార్జునరాజును అంబికా కృష్ణ, శ్రీకృష్ణ చాముండేశ్వరి మహర్షి, సీవీ రామన్ అకాడమీ ప్రతినిధులు సత్కరించారు. ఆయన సేవలను కొనియాడారు. శ్రీ మణికంఠ జ్యోతిభక్త సేవాసంఘం ఆధ్వర్యంలో 23 ఏళ్లగా, శ్రీ మణికంఠ సేవాపీఠం ద్వారా 3 ఏళ్లగా చేపడుతున్న అన్నదాన కార్యక్రమాలు, హైందవ సంస్కృతి సంప్రదాయాలను ప్రచారం చేస్తున్నందుకు పురస్కారం లభించిందని నిర్వాహకులు పేర్కొన్నారు.

నాగార్జునరాజుని సత్కరిస్తున్న అంబికా కృష్ణ, శ్రీకృష్ణ చాముండేశ్వరి మహర్షి, సీవీ రామన్ అకాడమీ ప్రతినిధులు

బాధితుడి కుటుంబానికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే గణబాబు

సీఎం సహాయనిధి అందజేత

గోపాలపట్నం, న్యూస్‌టుడే : జీవీఎంసీ 52, 89, 92వ వార్డులకు చెందిన దమ్ము శివచైతన్య, ఎం.జశ్వంత్, ఎస్.కార్తిక్ ఇటీవల తీవ్ర అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందారు. ఆర్థిక ఇబ్బందులతో ఉన్న బాధితులకు సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన రూ.1,61,267 చెక్కులను పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు.. తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం అందజేశారు.

మెగా వైద్య శిబిరానికి స్పందన

అక్కిరెడ్డిపాలెం, న్యూస్‌టుడే: జీవీఎంసీ 69వ వార్డు తుంగ్లాంలో ఆదివారం నిర్వహించిన మెగా వైద్య శిబిరానికి స్పందన లభించిందని నిర్వాహకులు పేర్కొన్నారు. వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి, పవన్ సాయి ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో వైద్య శిబిరం జరిగింది. రోగులకు ఉచితంగా పలు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఆసుపత్రి ఎండీ పి.రామారావు, ప్రతినిధులు వినోద్ బాబు, వైద్యులు, నిర్వాహకులు, స్థానికులు పాల్గొన్నారు.

రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

రావులచెరువులో చెత్త తొలగింపు

కూర్మన్నపాలెం, న్యూస్‌టుడే : రావులచెరువులో పేరుకుపోయిన పాలిథిన్ సంచులు, చెత్త చెదారాలు తొలగించేందుకు ఆధ్యాత్మిక సంస్థ సంత్ నిరంకారి మిషన్ సభ్యులు ముందుకు వచ్చారు. స్వచ్ఛమైన నీరు... స్వచ్ఛమైన మనసు పేరుతో ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు సుమారు 200 మంది సభ్యులు తొలగింపు కార్యక్రమం చేపట్టారు. సంస్థ విశాఖ జిల్లా ఇన్‌ఛార్జి పిల్లి వెంకటరావు, ప్రతినిధులు ప్రేమ్, వేణుగోపాల్, ఆర్ఆర్ వాకర్స్ సంక్షేమ సంఘం ప్రతినిధులు బొండా యల్లాజీరావు, బి.భాస్కరరావు, బాలంప్రకాష్, సురేష్, ముత్యాలునాయుడు తదితరులు పాల్గొన్నారు.

చెరువులో చెత్త తొలగిస్తున్న సంత్ నిరంకారి మిషన్ సభ్యులు

(c) eenadu

కనకమహాలక్ష్మీ.. కరుణించు

అట్టహాసంగా జాతర ప్రారంభం

ప్రత్యేకాలంకరణలో అమ్మవారు

చీపురుపల్లి, న్యూస్‌టుడే: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు చీపురుపల్లి కనకమహాలక్ష్మి జాతర ఆదివారం వేకువజామున అట్టహాసంగా ప్రారంభమైంది. ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు దంపతులు, తెదేపా రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు రాత్రి 1.45 గంటల సమయంలో అమ్మవారికి శాస్త్రోక్తంగా మొదటి పూజ చేశారు. అనంతరం దర్శనానికి వేలాది మంది భక్తులు పోటెత్తారు. సంప్రదాయబద్ధంగా నేత్రోత్సవం, పాలధారోత్సవం, ఘటాలు, ప్రభల ఊరేగింపు జరిగింది. అమ్మవారికి కిరీటం, పుస్తెలతాడు, కాసులపేరు, మామిడి పిందెల హారం తదితర రూ.2 కోట్ల విలువ గల ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించారు.

అమ్మవారి దర్శనానికి కుటుంబ సమేతంగా వస్తున్న ఎమ్మెల్యే కళా వెంకటరావు

మొక్కులు తీర్చుకోవడానికి వెళ్తున్న భక్తులు

పైడితల్లి.. పాహిమాం..!

దర్శనానికి విచ్చేసిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్, రాజాం, బొబ్బిలి ఎమ్మెల్యేలు మురళీమోహన్, బేబినాయన, ఎమ్మెల్సీ కావలి గ్రీష్మ

రాజాం, రాజాం గ్రామీణం, న్యూస్‌టుడే: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు రాజాం పోలిపల్లి పైడితల్లి అమ్మవారి శత జాతర ఉత్సవం ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ సతీసమేతంగా హాజరై అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్సీ కావలి గ్రీష్మ, బొబ్బిలి ఎమ్మెల్యే బేబినాయన తదితర ప్రముఖులు పైడితల్లిని దర్శించుకున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

పూజలు అందుకుంటున్న పోలిపల్లి పైడితల్లి

నేడు కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్

ఉడాకాలనీ, న్యూస్‌టుడే: విజయనగరంలోని కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పీజీఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్ నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఎస్.రాంసుందర్‌రెడ్డి తెలిపారు. అర్జీదారులు పూర్తి వివరాలతో దరఖాస్తు చేయాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని ఆదేశించారు. జిల్లా కేంద్రంతో పాటు మండల, మున్సిపల్ కార్యాలయాల్లోనూ పరిష్కార వేదిక జరుగుతుందని, ప్రజలు సమీపంలో ఉన్న కేంద్రాలకు వెళ్లాలని కోరారు. 1100 టోల్ ఫ్రీ నంబరు ద్వారా కూడా అర్జీని నమోదు చేసుకోవచ్చన్నారు.

ఆనందాల ఆదివారం

వేదికపై నృత్యం చేస్తున్న సహాయ కమిషనరు అప్పలరాజు, ఉద్యోగులు, సిబ్బంది

విజయనగరంలోని కోట వద్ద 'హ్యాపీ సండే' కార్యక్రమం సందడిగా జరిగింది. ఉదయం 6.30 గంటల నుంచి నగరపాలక సంస్థ ఉద్యోగులు, సిబ్బంది, పలువురు చిన్నారులు అలరించారు. సహాయ కమిషనరు కె.అప్పలరాజు నృత్యంతో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. . ఒత్తిడిని దూరం చేసేందుకు ప్రతినెలా రెండు, నాలుగో ఆదివారాల్లో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తామని వెల్లడించారు. ఈఈ పీవీఎస్ఎస్.ప్రసాద్, సహాయ సిటీ ప్లానర్ హరిబాబు, ఉద్యానశాఖ ఏడీ సంతోష్ పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

ఆలయాల అభివృద్ధిపై దృష్టి

మాన్సాస్ ఛైర్మన్ అశోక్‌గజపతి రాజు

సంతపేట జగన్నాథ ఆలయ పాలకవర్గంతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఈవో శిరీష, చిత్రంలో ధర్మకర్త అశోక్ గజపతిరాజు

విజయనగరం కంటోన్మెంట్, న్యూస్‌టుడే: ఆలయాల అభివృద్ధి పనులు ఆపొద్దని, ప్రత్యేక దృష్టిసారించి భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని మాన్సాస్ ఛైర్మన్, 104 దేవాలయాల అనువంశిక ధర్మకర్త, గోవా రాష్ట్ర గవర్నర్ పూసపాటి అశోక్ గజపతి రాజు అన్నారు. విజయనగరం కోటలోని మాన్సాస్ కార్యాలయంలో ఆదివారం విజయనగరం పైడితల్లి, సంతపేట జగన్నాథస్వామి, శ్రీకూర్మం కూర్మనాథ స్వామి, తూర్పుగోదావరి జిల్లా మందేశ్వరస్వామి దేవాలయాల పాలకమండలి సభ్యులు, దేవాదాయ శాఖ అధికారులతో సమావేశమయ్యారు. వార్షిక బడ్జెట్, ఖర్చులపై ఆరా తీశారు.

◆ పైడితల్లి ఆలయ పునర్నిర్మాణ పనులను జూన్ నాటికల్లా పూర్తి చేయాలని ఈవో శిరీషను ఆదేశించారు. జాప్యం జరగకుండా పర్యవేక్షించాలన్నారు. శివాలయం వీధిలోని అమ్మవారి కల్యాణ మండపాన్ని పూర్తిగా తొలగించి కొత్త నిర్మాణాన్ని చేపట్టనున్నట్లు ఈవో వెల్లడించారు. భవిష్యత్తు అవసరాల దృష్ట్యా సిరిమానుల కోసం అయిదెకరాల్లో చింత చెట్లు పెంచే ప్రతిపాదనపై చర్చించారు.

◆ తూర్పుగోదావరి జిల్లా మందపల్లిలోని మందేశ్వరస్వామి ఆలయానికి దేవాదాయ శాఖ సీజీఎఫ్ నిధుల నుంచి రూ.3 కోట్లు మంజూరయ్యాయని ఛైర్మన్ తెలిపారు. రెండు అంతస్తుల భవనాన్ని నిర్మించనున్నట్లు వెల్లడించారు.

◆ సంతపేట ఆలయం నూతన పాలకవర్గం కొలువుదీరింది. ఎనిమిది మంది సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. సభ్యులుగా మల్ల నాగమణి, పెంటకోట గౌరి, ఎస్.అన్నపూర్ణ, గంగళ్ల లక్ష్మి, బంటోతుల అప్పారావు, సారిపల్లి కిరణ్‌కుమార్, చెల్లపు వెంకటరమణ, ముని శ్రీరామకృష్ణను నియమించారు. వీరు రెండేళ్లపాటు పదవిలో కొనసాగుతారు. దేవాలయానికి సంబంధించి సీజీఎఫ్ నిధులతో నిర్మించిన కాలక్షేప మండపం పరిసరాల్లో విద్యుత్తు పరికరాల ఏర్పాటు, నీళ్ల ట్యాంకు, పైపులైన్ పనులు చేపట్టాలని సభ్యులు ఛైర్మన్ దృష్టికి తీసుకొచ్చారు. కాలక్షేప మండపాన్ని రోజుకు రూ.10,000కు అద్దెకిచ్చేలా తక్షణం వినియోగంలోకి తేవాలని విన్నవించారు.

◆ శ్రీకాకుళం జిల్లా శ్రీకూర్మంలోని కూర్మనాథస్వామి దేవాలయం ఆవరణలోని కోనేరును శుభ్రపర్చి, చుట్టూ చెట్లు నాటేందుకు రూ.10 లక్షలను ఇండిగో సంస్థ మంజూరు చేసిందని, మరికొన్ని మరమ్మతులు చేపట్టాలని పాలక మండలి సమావేశంలో నిర్ణయించారు.

ఆస్తి పన్ను.. ఏదీ ఆదాయ దన్ను

వసూలైంది 55 శాతమే
ముంచుకొస్తున్న గడువు

న్యూస్‌టుడే– రాజాం, బొబ్బిలి

పురపాలికల్లో ఆస్తి పన్ను బకాయిలు పేరుకుపోయాయి. మార్చి నెలాఖరుకు శతశాతం రాబట్టాల్సి ఉండగా ఫిబ్రవరి రెండో వారం పూర్తయ్యేనాటికి 55 శాతమే సాధించారు. ఇంకా ఉన్నది 40 రోజులు. దీంతో పురపాలిక అధికారులు వేగం పెంచారు. ప్రత్యేక బృందాలను నియమించారు. సచివాలయాల వారీగా లక్ష్యాలను నిర్దేశించారు. అయినా ఆశించిన ప్రగతి కనిపించడం లేదు. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో నగరం, ఆరు పట్టణాల్లో 1,37,719 అసెస్మెంట్ల నుంచి రూ.72.63 కోట్లు వసూలు చేయాలని లక్ష్యం విధించారు. ఇంత వరకు అతికష్టం మీద కేవలం రూ.37.58 కోట్లు వచ్చాయి.

రాజాంలో పన్ను వసూళ్లు పరిశీలిస్తున్న పుర కమిషనర్ రామచంద్రరావు

ఉమ్మడి జిల్లాలో ఈనెల 16 నాటికి పన్ను వసూళ్ల ప్రగతి..

మున్సిపాలిటీ	అసెస్మెంట్లు	మొత్తం డిమాండు	వసూలు (రూ.కోట్లలో)
విజయనగరం	72339	48.12	24.75
రాజాం	12469	3.64	2.02
పాలకొండ	7771	2.26	1.27
బొబ్బిలి	13224	6.76	3.39
పార్వతీపురం	14145	6.77	3.31
సాలూరు	12062	3.31	1.64
నెల్లిమర్ల	5709	1.77	1.20

రాయితీ ప్రకటనకు ఎదురుచూపు..

గతేడాది వడ్డీలో 50 శాతం రాయితీ ప్రకటించారు. ఈ ఏడాది ఇంకా ప్రకటన వెలువడలేదు. దీంతో చాలా మంది పన్ను చెల్లింపుదారులు ఎదురు చూస్తున్నారు. అత్యధిక పన్ను చెల్లించేవారంతా ముందే చెల్లిస్తే రాయితీ కోల్పోతామనే ఉద్దేశంతో ఉన్నారు. గతేడాది మార్చి నెలాఖరులో ప్రకటన వెలువడింది.

మార్చి నాటికి వసూలు చేస్తాం..: పన్నుల వసూళ్లు వందశాతం చేరువయ్యేందుకు కసరత్తు చేస్తున్నాం. పురపాలక సంఘాల వారీగా రోజూ సమీక్ష నిర్వహిస్తున్నాం. బృందాలు ఏర్పాటు చేసి, వారాంతపు లక్ష్యాలు విధించాలని సూచించాం. మార్చి నాటికి డిమాండు మేరకు వసూలు చేస్తాం. వడ్డీ రాయితీపై ఎలాంటి ఉత్తర్వులు రాలేదు. **- వి.రవీంద్ర, పురపాలకశాఖ ఆర్డీ, విశాఖ రీజియన్**

నేటి నుంచి 66 కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలు

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: జిల్లాలో సోమవారం నుంచి 66 కేంద్రాల్లో ఇంటర్ పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ ఏడాది 39,037 మంది విద్యార్థులు రాయనున్నారు. ఎలాంటి లోపాలకు అస్కారం లేకుండా ఏర్పాట్లు చేశామని డీఐఈవో ఎస్.తవిటినాయుడు తెలిపారు. ఉదయం తొమ్మిది గంటలకు ప్రారంభమవుతుందని, ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించబోమని స్పష్టం చేశారు.

హాల్‌టిక్కెట్ తప్పనిసరి..

- విద్యార్థులు 8.30 గంటలకే కేంద్రాలకు చేరుకోవాలి
- ఓఎమ్మార్ షీట్‌పై వ్యక్తిగత వివరాలను సరిచూసుకోవాలి
- ఉదయం 8.45 గంటల ప్రశ్నపత్రం తెరుస్తారు
- పరీక్ష సమయం చివరి వరకు కేంద్రాల్లోనే ఉండాలి
- చరవాణి, స్మార్ట్‌వాచ్‌లు, కాలిక్యులేటర్లు, ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లు నిషేధం

ఏర్పాట్లు ఇలా..

జోన్లు: 18
స్టోరేజీ పాయింట్లు: 20
కస్టోడియన్లు: 16
చీఫ్ సూపరింటెండెంట్లు: 66
డిపార్ట్‌మెంట్ అధికారులు: 66
ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు: 03
సిట్టింగ్ స్క్వాడ్‌లు: 03
ఇన్విజిలేటర్లు: 1,000

సీసీ కెమెరాలతో నిఘా..

ప్రతి గదిలో సీసీ కెమెరాలతో నిఘా వ్యవస్థ ఏర్పాటు చేశారు. విద్యార్థులు సకాలంలో కేంద్రాలకు చేరుకునేలా బస్సు సర్వీసులు నడపాలని ఆర్టీసీ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఫర్నిచర్, తాగునీరు, విద్యుత్తు, వైద్యం.. తదితర సౌకర్యాలు ఉండేలా చర్యలు తీసుకున్నారు. అత్యవసర సమస్యల కోసం ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ కార్యాలయంలో ఉదయం 7 నుంచి సాయంత్రం వరకు అందుబాటులో ఉండేలా టోల్‌ఫ్రీ నంబరు(08922 237988)తో కంట్రోల్‌రూం ఏర్పాటు చేశారు.

వెళ్లేవారు సరే.. వచ్చేవారేరి?

- జేఎన్‌టీయూలో బోధకుల కొరత
- సమస్యను పరిష్కరిస్తామన్న మంత్రి లోకేశ్

న్యూస్‌టుడే, విజయనగరం విద్యావిభాగం

విజయనగరంలోని జేఎన్‌టీయూ గురజాడ విద్యాలయంలో బోధన, బోధనేతర సిబ్బంది కేటాయింపు అంశంపై ఎట్టకేలకు కదలిక వచ్చింది. ఎవరెక్కడ? అన్నదానిపై ఈ విద్యాలయంతో పాటు జేఎన్‌టీయూ కాకినాడ మధ్య విషయం నాలుగేళ్లుగా నలుగుతోంది. శాసనమండలిలో చర్చకు రావడంతో నెల రోజుల్లో చర్యలు తీసుకుంటామని మంత్రి లోకేశ్ ప్రకటించారు. దీంతో కొలిక్కి వచ్చే సూచనలు కనిపిస్తున్నాయి.

హోదా దక్కినా..

2007లో జేఎన్‌టీయూకే ప్రాంగణంగా ఏర్పాటై, 2022లో విశ్వవిద్యాలయం హోదా దక్కించుకుంది. ఇంజినీరింగ్ కళాశాలగా ఉన్న సమయంలో 41 మంది బోధకులు నియమితులయ్యారు. ప్రస్తుతం 27 మంది మాత్రమే పనిచేస్తున్నారు. ఇందులో పాతవారే 17 మంది. విభజన సమయంలో ఆరుగురు కాకినాడకు ఐచ్ఛికమిచ్చినా ఇక్కడే కొనసాగుతున్నారు. వీరికి జీతాలు అక్కడి నుంచే వస్తున్నాయి. మరో నలుగురు డిప్యుటేషన్‌పై ఇక్కడ పనిచేస్తున్నారు.

100 మంది అవసరం..

యూజీ, పీజీ ప్రోగ్రాంలకు వందమంది అధ్యాపకులు ఉండాలి. యూజీలో 72 మందికి 27 మంది రెగ్యులర్ అధ్యాపకులున్నారు. మిగిలిన వారు ఒప్పంద అధ్యాపకులే. పీజీలో 28 మందికి అందరూ ఒప్పంద ఉద్యోగులే. యూజీ సివిల్ బ్రాంచిలో రెగ్యులర్ ఒక్కరూ లేరు. ఈసీఈ మినహా మిగిలిన విభాగాలకు ఇద్దరు ముగ్గురే ఉన్నారు. ఈక్రమంలో నాక్, ఎన్‌బీఏ గుర్తింపునకు దూరమవుతోంది. ఎన్ఆర్ఐఎఫ్ ర్యాంకింగ్‌లోనూ చోటు లభించని పరిస్థితి. గతంలో మెకానికల్, ఈసీఈ, సీఎస్సీ బ్రాంచులకు ఎన్‌బీఏ(నేషనల్ బోర్డు ఆఫ్ అక్రిడేషన్) గుర్తింపు ఉండేది. ఇప్పుడది రెండు బ్రాంచులకే(ఈసీఈ, సీఎస్సీ) పరిమితమైంది.

ఇబ్బందులివీ..

సీనియర్ అసిస్టెంట్, డీఆర్, ఏఆర్, సూపరింటెండెంట్ పోస్టులు ఆరు మంజూరయ్యాయి. ముగ్గురు కాకినాడ నుంచి డిప్యుటేషన్‌పై పనిచేస్తున్నారు. నెలలో కొన్ని రోజులే ఇక్కడుంటారు. ఈ పోస్టులను కాకినాడలో చూపించి పదోన్నతులు పొందారన్నది వాదన. సిబ్బంది కొరతతో దస్త్రాల నిర్వహణ, ఆర్థికపరమైన లావాదేవీల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

తిరిగి రాలేదు..

కొత్తగా నియమితులైన వారిలో 15 మంది బోధకులు కాకినాడ, నరసరావుపేటకు డిప్యుటేషన్‌పై వెళ్లి అక్కడే ఉండిపోయారు. వీరిని బదిలీ చేసినట్లు చూపించారు. ఇదంతా చట్టవిరుద్ధంగా జరిగిందని గతంలో జేఎన్‌టీయూజీవీ అధికారులు ప్రిన్సిపల్ కార్యదర్శికి లేఖ రాశారు. రెగ్యులర్ అధ్యాపకుల కొరతతో ఒప్పంద, హావర్లీబేస్డ్ వారితో బోధన సాగిస్తున్నట్లు పేర్కొన్నారు.

నిధుల లేమి..

విద్యాలయాన్ని నిధుల సమస్య వెంటాడుతోంది. ఇప్పటివరకు రూ.119 కోట్లు బదిలీ అయినట్లు మంత్రి లోకేశ్ తెలిపారు. గత ప్రభుత్వం నిధులివ్వకపోవడంతో ఇందులో నుంచే రూ.24 కోట్లు కురుపాం ఇంజినీరింగ్ కళాశాలకు చెల్లించారు. ఇతరత్రా రుసుముల కింద రూ.50 కోట్లు రావాల్సి ఉండగా. రూ.10 కోట్లే వచ్చినట్లు తెలుస్తోంది.

సీఎం పర్యటనకు ఏర్పాట్లు ముమ్మరం

చీపురుపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబు ఈనెల 28న చీపురుపల్లి మండలం రావివలస పంచాయతీలో పర్యటించనున్నారు. ఏర్పాట్లకు సంబంధించి జేసీ సేధుమాధవన్ అధికారులతో కలిసి ఆదివారం స్థలం పరిశీలించారు. పైలపేట వద్ద హెలీప్యాడ్, సభా స్థలం, కార్యకర్తలతో సమావేశానికి అవసరమైన స్థలానికి ఓ ప్రైవేటు లేఅవుట్ అనువుగా ఉండడంతో అధికారులు మొగ్గు చూపారు. సీఎం హెలీప్యాడ్‌లో దిగగానే పైలపేటలో లబ్ధిదారులకు పింఛన్లు అందించడానికి వెళ్లే మార్గం అనుకూలంగా ఉండేటట్లు చూస్తున్నారు.

స్థలం పరిశీలించి, సిబ్బందికి సూచనలిస్తున్న జేసీ సేధుమాధవన్

రావివలస సర్పంచి మణికంఠతో జేసీ పలు అంశాలపై చర్చించారు. జిల్లా ట్రాన్స్‌కో ఎస్ఈ లక్ష్మణరావు, ఇన్‌ఛార్జి ఆర్డీవో ప్రమీలాగాంధీ, డీడీవో హేమసుందర్, తహసీల్దారు ధర్మరాజు, ఎంపీడీవో సురేష్ పాల్గొన్నారు.

పాత పింఛను విధానాన్ని అమలుచేయాలి

విద్యావిభాగం, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 2003-డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పింఛను విధానాన్ని తక్షణమే అమలు చేయాలని ఏపీ ఉపాధ్యాయ సంఘం(ఆపస్) జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు డిమాండు చేశారు. నగరంలోని సంస్కృత ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. సీపీఎస్‌ను రద్దు చేసి, ఓపీఎస్ అమలుచేయాలన్నారు. పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేసి, మధ్యంతర భృతి ఇవ్వాలని, డీఏ బకాయిలు చెల్లించాలని కోరారు. సర్వీసు ఉపాధ్యాయులను టెట్ నుంచి మినహాయించాలని, వందరోజుల ప్రణాళికలో భాగంగా సెలవుదినాల్లో పనిచేసిన వారికి సీసీఎల్ మంజూరు చేయాలన్నారు. జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి రామునాయుడు, నాయకులు అప్పారావు, తాతారావు, కిరణ్‌కుమార్, శ్రీహరి, పద్మలత పాల్గొన్నారు.

పాఠాలు చదివేస్తాం.. పంటలూ పండిస్తాం

ప్రకృతి సాగుబాటన ఇంజినీరింగ్ విద్యార్థులు

న్యూస్‌టుడే, డెంకాడ

కిచెన్ గార్డెన్‌లో పనిచేస్తున్న దృశ్యం

విద్యార్థులు అంటే.. కేవలం పాఠాలు, పరీక్షలు, ఆటలే కాదు.. అన్ని అంశాలపై అవగాహన కలిగి ఉండాలి. ఆరోగ్యకరమైన, పౌష్టికాహారం అందించేందుకు.. అధ్యాపకుల పర్యవేక్షణలో సేంద్రియ పద్ధతుల్లో కూరగాయలను పండిస్తూ.. ఆదర్శంగా నిలుస్తున్నారు డెంకాడ మండలం చింతలవలస ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు.

ప్రస్తుతం వ్యవసాయంలో రసాయన ఎరువులు, పురుగు మందుల వినియోగం పెరగడంతో తినే ఆహారం కలుషితమై పలువురు అనారోగ్యం బారిన పడుతున్నారు. ఈ నేపథ్యంలో కళాశాల ప్రాంగణంలోని రెండున్నర ఎకరాల స్థలంలో వివిధ పంటల సాగుకు కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు సంయుక్తంగా శ్రీకారం చుట్టారు.

ఏం పండిస్తారంటే..

ఖాళీ సమయంలో విద్యార్థులను భాగస్వామ్యం చేస్తూ బిందు సేద్యం ద్వారా పంటలు సాగు చేయిస్తున్నారు. ఆకుకూరలు, కూరగాయలు.. అరటి, బొప్పాయి తదితర పండ్ల జాతులు పండిస్తున్నారు. వాటిని కళాశాల వసతి గృహాల్లో విద్యార్థుల భోజనాలకు వినియోగిస్తున్నారు. మిగిలినవి విక్రయిస్తున్నారు.

జీవ ఎరువుల వినియోగం: నారుమడులు తయారు చేసి ఆకుకూరలు, కూరగాయల విత్తనాలు నాటుతున్నారు. ఆవుపేడ, కుళ్లిన వ్యర్థాలు, బీజామృతం, జీవామృతం, వేప పిండితో సొంతంగా కషాయాలు చేసి పంటకు ఎరువులుగా వినియోగిస్తున్నారు.

విద్యార్థులకు అవగాహన: సేంద్రియ వ్యవసాయ హబ్‌గా ఏర్పాటు చేయాలనే ఆలోచనతో ప్రకృతి వ్యవసాయానికి శ్రీకారం చుట్టాం. కళాశాల యాజమాన్యం సహకారంతో విద్యార్థులను భాగస్వామ్యం చేస్తున్నాం. **- బి.మాధవ వర్మ, కోఆర్డినేటర్, కళాశాల అధ్యాపకుడు**

విజయనగరం జిల్లా : ధర్మాన టీవీఎస్, విజయనగరం: 9014143226 | పవన్ శేఖర్ టీవీఎస్, విజయనగరం: 7780241677 | శ్రీనివాస ఆటోమొబైల్స్, పార్వతీపురం: 9848433017 | అమృతవర్షిణి ఆటోమొబైల్స్, ఎస్ కోట: 9246671219 | గాయత్రి మోటర్స్, బొబ్బిలి: 9440193098 | పద్మ శ్రీ ఆటోమొబైల్స్, సాలూరు: 9010614619 | వినాయక ఆటోమొబైల్స్, గజపతినగరం: 9949278793 వెంకటసాయి ఏజెన్సీస్, పూసపాటిరేగ: 9392542348 | ధర్మాన టీవీఎస్, రాజాం 9010074740 | లీలాసాయి మోటార్స్, చీపురుపల్లి 8639015726 | ధర్మశాస్తా ఆటోమొబైల్స్, రామభద్రపురం: 8008335311.

(c) eenadu

కనుల నిండుగా.. అమ్మ పండగ

దర్శనానికి వచ్చిన భక్తులతో కిటకిటలాడుతున్న ఆలయ ప్రాంగణం

ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడుకు అమ్మవారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఆలయ కమిటీ ఛైర్మన్, ఈవో

చీపురుపల్లి కనకమహాలక్ష్మి అమ్మవారి జాతర ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. మూడు రోజుల పాటు ఈ ఉత్సవం జరగనుంది. తొలిరోజు భక్తజనం రాకతో పట్టణం, ఆలయ ప్రాంగణం నిండిపోయింది. విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, శాసనసభ్యుడు కిమిడి కళా వెంకటరావు తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

– న్యూస్‌టుడే, చీపురుపల్లి

క్యూ లైన్లలో భక్తుల సందడి

ప్రభలతో వస్తున్న భక్తులు

వచ్చే ఏడాదికి బీఈడీ కళాశాల తీసుకొస్తాం

● న్యాయ కళాశాలకు ప్రతిపాదనలు ● మాన్సాస్ ఛైర్మన్ అశోక్‌గజపతిరాజు

ఈనాడు, విజయనగరం, న్యూస్‌టుడే, బాబామెట్ట: మాన్సాస్ విద్యా సంస్థల్లో గతంలో బీఈడీ ఉపాధ్యాయ శిక్షణ కళాశాల ఉండేదని, నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సుతో వచ్చే విద్యా సంవత్సరం నాటికి కొత్త కళాశాల తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని గోవా గవర్నర్, మాన్సాస్ ట్రస్ట్ ఛైర్మన్ పూసపాటి అశోక్‌గజపతిరాజు వెల్లడించారు. ఈ విద్యా సంస్థల కరస్పాండెంట్ లక్ష్మీపతి రాజు అధ్యక్షతన విజయనగరం కోటలో ఆదివారం జరిగిన విద్యా సంస్థల ఉద్యోగుల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. న్యాయ కళాశాలను సైతం ప్రారంభించే ప్రతిపాదన ఉందన్నారు. సంస్థ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు సమష్టిగా కృషి చేద్దామన్నారు. ఎందరో మహానుభావులు నడియాడిన నేల మనదని, అలాంటి నేల చరిత్రను అహంతో మార్చడానికి ప్రయత్నించకూడదన్నారు.

జ్యోతి వెలిగిస్తున్న గోవా గవర్నర్

కష్టమైనా ఇష్టపడి పనిచేద్దాం..

మాన్సాస్ సంస్థలో పనిచేస్తున్న వారంతా ఎంత కష్టమైనా, ఇష్టపడి సంస్థ అభివృద్ధికి బాధ్యతగా పనిచేయాలని ఉద్యోగులకు పిలుపునిచ్చారు. అక్షరం ఎంతో విలువైంది కాబట్టి గురువులంతా ఆలోచనా విధానాల్లో మార్పులు చేసుకుని భావితరాల భవితకు భరోసా ఇవ్వాలన్నారు. దేశం కోసం ప్రాణాలర్పించిన సంతోష్‌కుమార్ లాంటి వారు కోరుకొండ సైనిక పాఠశాలలో చదివినవారేనన్నారు. ముందుగా పీవీజీ రాజు చిత్రపటానికి జ్యోతి వెలిగించి నివాళి అర్పించారు. ఈ సమావేశంలో మాన్సాస్ ఈడీ సీతారామరాజు బడ్జెట్, ప్రణాళికలను వినిపించారు. సంస్థల ప్రిన్సిపాళ్లు, ఉద్యోగులు హాజరయ్యారు.

రైతుల సంక్షేమమే లక్ష్యం

మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి

బొండపల్లి, విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: రైతుల సంక్షేమానికే తొలి ప్రాధాన్యమిస్తామని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. సాగునీటికి అన్నదాతలు ఇబ్బంది పడకుండా పొలాల్లో బోర్లు ఏర్పాటుచేస్తామని ఆదివారం గొల్లుపాలెంలో నిర్వహించిన సభలో వెల్లడించారు. అనారోగ్యంతో బాధపడుతున్న పార్టీ కార్యకర్త మహేష్‌ను పరామర్శించారు. పోతల కన్నంనాయుడు సహా పలువురు కార్యకర్తలు వైకాపా నుంచి మంత్రి సమక్షంలో తెదేపాలో చేరారు. మండలాధ్యక్షుడు అచ్చిమినాయుడు అధ్యక్షతన నిర్వహించిన సభలో ఏఎంసీ ఛైర్మన్ గోవిందరాజు, వైస్ ఛైర్మన్ కృష్ణ, గజపతినగరం, గంట్యాడ, దత్తిరాజేరు, మండలాధ్యక్షులు శ్రీదేవి, భాస్కర్‌నాయుడు, చంద్రశేఖర్, కార్యకర్తలు పాల్గొన్నారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ విజయనగరంలోని కోటలో గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతిరాజును మర్యాదపూర్వకంగా కలిశారు. మొక్క అందించి, పలు అంశాలపై చర్చించారు.

నారంశెట్టికి పురస్కారం

అవార్డు అందుకుంటున్న ఉమామహేశ్వరరావు

పార్వతీపురం, న్యూస్‌టుడే: పట్టణానికి చెందిన బాలసాహితీవేత్త నారంశెట్టి ఉమామహేశ్వరరావుకు ప్రపంచ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శనివారం జరిగిన కార్యక్రమంలో కావ్యశ్రీ పురస్కారంతో సత్కరించారు. ఆయన తెలుగు సాహిత్యానికి చేసిన సేవలు గుర్తింపుగా దీన్ని అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రపంచ కవుల వేదిక, ఆంధ్రప్రదేశ్ సృజనాత్మకత, సాంస్కృతిక సమితి సంయుక్తంగా ఈ కార్యక్రమం నిర్వహించాయి. భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారని ఉమామహేశ్వరరావు తెలిపారు.

విద్యుత్తు కష్టాలు తప్పేనా?

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలో ఏటా వేసవిలో విద్యుత్తు కష్టాలు తప్పడం లేదు. లోడ్ పెరిగి ట్రిప్ కావడం, జంపర్లు తెగిపోవడం, నియంత్రికలు కాలిపోవడం తదితర సమస్యలు ఏర్పడుతున్నాయి. దీంతో గంటల తరబడి సరఫరా ఆగిపోతోంది. సామర్థ్యానికి మించి కనెక్షన్లు ఉండడంతో ఈ పరిస్థితి కనిపిస్తోంది. చాలాచోట్ల ఇంకా 160 కేవీ డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లే ఉన్నాయి. వీటిని మార్చాల్సి ఉంది.

పెరుగుతున్న వినియోగం..

ఏటా వేసవిలో వినియోగం పెరుగుతోంది. ఫిబ్రవరి నుంచే మిలియన్ యూనిట్ల విద్యుత్తు మేర వాడేస్తున్నారు. జూన్ వరకు ఇదే పరిస్థితి కనిపిస్తోంది. ప్రస్తుతం వినియోగం సరాసరి రోజుకు 10 మి.యూ గా నమోదవుతోంది. గరిష్ఠంగా మేలో 11 మి.యూనిట్లకు చేరుతోంది. ఈసారి 12.5 మి.యూ వరకు చేరే అవకాశముందని అంచనా వేస్తున్నారు. ఏసీల వాడకం పెరగడం, వ్యవసాయ మోటార్లను గంటల తరబడి వినియోగిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఈ లోడును తట్టుకునేందుకు కార్యాచరణ ప్రణాళిక అమలు చేయాల్సి ఉంది.

విజయనగరంలో నియంత్రికను ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

నిరంతర సరఫరా..

రానున్న వేసవిలో ఇబ్బంది లేకుండా చూస్తున్నాం. నిరంతర సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. గతేడాది ఎదురైన సమస్యలను దృష్టిలో పెట్టుకుని ఇప్పటికే కార్యాచరణ ప్రారంభించాం. అన్ని డివిజన్ల పరిధిలో సిబ్బందిని అప్రమత్తం చేశాం. ఎక్కడైనా అంతరాయం కలిగితే వెంటనే ఫిర్యాదు చేయొచ్చు. లోవోల్టేజీ సమస్య రానీయం. కొత్త నియంత్రికలు, లైన్లు, ఉప కేంద్రాల కోసం రూ.15.74 కోట్లు ఖర్చు చేస్తున్నాం.

– ఎం.లక్ష్మణరావు, ఎస్ఈ, ఏపీఈపీడీసీఎల్

వేసవి ప్రణాళిక ఇలా..

● నియంత్రికల స్థాయి పెంపు, డిమాండుకు అనుగుణంగా లోడ్ల మార్పు తదితర చర్యలు తీసుకోనున్నారు ● అధిక లోడ్ కలిగిన 214 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు పెట్టనున్నారు. ఇప్పటికే 156 ఏర్పాటు చేశారు. రూ.8.74 కోట్లతో 33/11 కేవీ విద్యుత్తు ఉప కేంద్రాలను ప్రారంభించనున్నారు ● కొత్తగా ఉప మండలం ఆధ్వర్యంలోని కేంద్రానికి రూ.2.70 కోట్లు, విజయనగరం దాసన్నపేట- రూ.3.32 కోట్లు, డెంకాడ పెదతాడివాడ- రూ.2.72 కోట్లు కేటాయించారు ● 7.5 కి.మీ. పరిధిలో 33 కేవీ, 11 కేవీ లైన్లు వేస్తున్నారు.

జిల్లాలో పరిస్థితి ఇదీ..	2025- 26 ఆర్థిక ఏడాదిలో గరిష్ఠ డిమాండు	విద్యుత్తు వినియోగదారులు	ఉప కేంద్రాలు	డిస్ట్రిబ్యూషన్ నియంత్రికలు	33 కేవీ లైన్ల పొడవు	11 కేవీ లైన్లు
	467 మెగావాట్లు	7,26,733	98	24,287	1205.37 కి.మీ	7,435.51 కి.మీ

ప్రజల భద్రతే ప్రాధాన్యం

దత్తిరాజేరు, న్యూస్‌టుడే: ఎస్పీ ఆదేశాల మేరకు ప్రజల రక్షణ, భద్రత కోసమే కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించినట్లు బొబ్బిలి డీఎస్పీ భవ్యారెడ్డి తెలిపారు. ఇంగిలాపల్లిలో ఆదివారం అన్ని ఇళ్లల్లో సోదాలు చేశామని నేరాల నియంత్రణ, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, ఇతర నిషేధిత వస్తువులే లక్ష్యంగా తనిఖీలు చేపట్టామన్నారు. అనుమానిత వ్యక్తులపై నిఘా ఉంచామన్నారు. అపరిచిత వ్యక్తుల వివరాలు సేకరించి వారి వేలిముద్రలు తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో గజపతినగరం సీఐ జీఏవీ రమణ, పలు మండలాల ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

సూచనలిస్తున్న డీఎస్పీ భవ్యారెడ్డి

ఏళ్లనాటి కల నెరవేరుతున్న వేళ

పాలకొండ మండల పరిధిలోని గోపాలపురం గ్రామస్థుల 40 ఏళ్ల కల ఎట్టకేలకు నెరవేరుతోంది. గ్రామానికి సమీపంలో గెడ్డ ప్రవహిస్తోంది. దీనికి మరోవైపున అన్నవరం, బుక్కూరు, గోపాలపురం, పాలకొండకు చెందిన 500 ఎకరాల పంట భూములున్నాయి. పంటకోసి, వాటిని గ్రామాలకు తీసుకువచ్చే సమయంలో ఆ గెడ్డను దాటేందుకు రైతన్నలు పడే అవస్థలు అన్నీఇన్నీ కావు. దీంతో వారంతా కలిసి విరాళాలు వేసుకుని ఏటా సిమెంటు పైపులు వేసి తాత్కాలిక దారిని ఏర్పాటు చేసుకునేవారు. ఇంత చేసినా.. వర్షాకాలంలో గెడ్డ ఉద్ధృతికి పైపులు కొట్టుకుపోవడం పరిపాటిగా మారింది. ఈ సమస్యను గోపాలపురం సర్పంచి సిరిపురం జగదీష్ ఆధ్వర్యంలో రైతులందరూ కలిసి ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణకు వద్ద గత ఏడాది తమ గోడు విన్నవించారు. ఆయన ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో వంతెన నిర్మాణానికి రూ.40 లక్షలు మంజూరవగా ఆదివారం పనులు ప్రారంభించారు. – న్యూస్‌టుడే, పాలకొండ గ్రామీణం

మహిళ హత్య కేసులో నిందితుడి అరెస్టు

విశాఖపట్నం (విశాలాక్షినగర్), న్యూస్‌టుడే: ఈనెల 11వ తేదీన విశాఖపట్నంలోని ఆరిలోవలో మహిళను గొంతు నులిమి హత్య చేసిన నిందితుడ్ని అరెస్టు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. నిందితుడు బొబ్బిలికి చెందిన వి.శివలింగేశ్వరరావు(టాటూ శివ)గా గుర్తించారు. అతడి ఫోన్ సిగ్నల్ ఆధారంగా పట్టుకున్నారు. తరచూ బెట్టింగ్‌లకు పాల్పడుతూ అప్పుల పాలై నేరాలకు ఒడిగట్టినట్లు పోలీసులు నిర్ధారించారు.

ఏం జరిగిందంటే.. ఆరిలోవ పాతపోలీస్‌స్టేషన్ సమీప కనకదుర్గనగర్‌లో కాపు రమణ, లక్ష్మి(45) దంపతులు నివాసం ఉంటున్నారు. రమణ జీవీఎంసీ ఉద్యాన విభాగంలో పని చేస్తున్నారు. ఆయన 11వ తేదీ ఉదయం 9 గంటలకు విధులకు వెళ్లారు. లక్ష్మి ఇంట్లో ఒంటరిగా ఉన్నప్పుడు ఇంట్లోకి చొరబడి దాడిచేసి గొంతునులిమి చంపేశాడు. ఆమె ఒంటిపై ఉన్న 8 తులాల బంగారు ఆభరణాలు, బీరువాలో ఉన్న రూ.5లక్షల నగదుతో పరారయ్యాడు. ఈ ఘటనపై భర్త రమణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు నిందితుడిని అదుపులోకి తీసుకున్నామని పోలీసులు తెలిపారు.

పెళ్లి ఇష్టం లేదని యువతి ఆత్మహత్య

ఇనుముల దివ్య (పాత చిత్రం)

సంతకవిటి, న్యూస్‌టుడే: ఇష్టంలేని పెళ్లి చేస్తున్నారని గడ్డిమందు తాగిన యువతి చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటన సంతకవిటి మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు, యువతి బంధువుల వివరాల ప్రకారం.. మండవకురిటి పంచాయతీ పరిధిలోని పోతురాజుపేట గ్రామానికి చెందిన తల్లిదండ్రులు ఇనుముల భాస్కరరావు, రమాదేవి దంపతులది వ్యవసాయ కుటుంబం. వీరికి కుమార్తె, కుమారుడు సంతానం. కుమార్తె దివ్య (22) డిగ్రీ వరకు చదువుకుంది. తల్లిదండ్రులు, బంధువులు ఇటీవల విశాఖకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీరుతో పెళ్లి చేసేందుకు సంబంధం కుదిర్చారు. మార్చి 7న ముహూర్తం నిర్ణయించారు. పెళ్లి కోసం అంతా సిద్ధం చేశారు. ఈ క్రమంలో దివ్య తనకు ఇష్టంలేని పెళ్లి చేసుకోనని చెప్పింది. ముహూర్తాలు పెట్టిన తరువాత చెప్పడమేంటని తల్లిదండ్రులు నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు. అయినా వినిపించుకోకుండా ఈనెల 21న రాత్రి గడ్డిమందు తాగింది. కుటుంబ సభ్యులు రాజాం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం వేకువజామున మృతి చెందింది. తల్లి రమాదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సంతకవిటి హెడ్‌కానిస్టేబుల్ వి.జనార్దనరావు తెలిపారు.

అనుమానం.. ఆపై వేధింపులు

గృహిణి బలవన్మరణం

మాధవీదేవి (పాత చిత్రం)

బొబ్బిలి, న్యూస్‌టుడే: అనుమానం పెంచుకున్న భర్త తాగివచ్చి వేధిస్తుండడంతో జీవితంపై విరక్తి చెందిన గృహిణి ఉరివేసుకుని, ఆత్మహత్య చేసుకున్న ఘటన బొబ్బిలి పట్టణంలో చోటుచేసుకుంది. సీఐ నారాయణరావు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని కుమ్మరివీధికి చెందిన సుంకరి మాధవీదేవికి (40) బాడంగి మండలం చిన్న భీమవరానికి చెందిన మర్రి నరేష్‌తో 16 ఏళ్ల కిందట ప్రేమ వివాహం అయ్యింది. భర్త కారు చోదకుడిగా, ఆమె ఓ ప్రైవేటు పాఠశాలలో గణిత ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. కుమారుడు పదో తరగతి, కుమార్తె తొమ్మిదో తరగతి చదువుతున్నారు. ఆమె పనిచేస్తున్న పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఫోన్ చేస్తున్న కారణంగా భర్త అనుమానం పెంచుకున్నాడు. తాగి వచ్చి తరచూ ఘర్షణకు దిగేవాడు. శనివారం రాత్రి మాధవీదేవి పిల్లలతో కలిసి సమీపంలో ఉంటున్న కన్నవారి ఇంటివద్ద భోజనం చేసి, కాసేపు నిద్రించారు. భర్త నరేష్ ఫోన్ చేయడంతో రాత్రి 9.30 సమయంలో ఇంటికి వెళ్లింది. మాధవీదేవికి వరుసకు తమ్ముడైన కిశోర్‌కు ఆదివారం ఉదయం నరేష్ ఫోన్‌చేసి, మీ అక్క చనిపోయిందని చెప్పడంతో వారంతా చేరుకున్నారు. ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అల్లుడు తరచూ వేధించడంతోనే తమ కుమార్తె ప్రాణాలు తీసుకుందని మృతురాలి తండ్రి వెంకటరమణమూర్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు. ఆదివారం రాజాం యాత్రకు వెళ్దామని తల్లిదండ్రులతో మాట్లాడిన కొద్దిగంటల్లోనే ఈ అఘాయిత్యానికి పాల్పడడంతో జీర్ణించుకోలేకపోతున్నారు. గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది.

వ్యాయామశాలలో మంటలు.. బూడిదైన పరికరాలు

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: ఉన్నత చదువులు చదివారు.. తమతో పాటు మరో పదిమందికి ఉపాధి ఇవ్వాలనే ఆలోచనతో రూ.లక్షలు వెచ్చించి వ్యాయామశాలను ఏర్పాటు చేసుకున్నారు. విద్యుత్తు షార్ట్ సర్క్యూట్‌తో ఆశలన్నీ అడియాశలయ్యాయి. జిమ్‌లో అగ్నిప్రమాదం చోటు చేసుకుని, సామగ్రి కాలిబూడిదయ్యింది. వివరాల్లోకి వెళ్తే.. కోటవానివలసకు చెందిన వివేక్, పట్టణానికి చెందిన శామ్యూల్ వేరే వాళ్ల వద్ద రూ.35లక్షలతో జిమ్ కొనుగోలు చేశారు. బెలగాం శివారులో ఉన్న ఈ జిమ్‌లో యువతకు వ్యాయామ శిక్షణ ఇస్తున్నారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా శనివారం అర్ధరాత్రి మంటలు చెలరేగాయి. స్థానికుల సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మంటలు అదుపు చేశారు. ప్రమాదంలో అత్యాధునిక వ్యాయామ పరికరాలు కాలిబూడిదయ్యాయి. సుమారు రూ.18లక్షల వరకు ఆస్తి నష్టం ఉండొచ్చని ప్రాథమిక అంచనా.

వారు పట్టించుకోరులే.. తవ్వి తరలించేద్దాం

పేదలకు గృహనిర్మాణాలకు ఆర్థిక భారం పడకూడదని ప్రభుత్వం అమలుచేస్తున్న ఉచిత పథకాన్ని ఆసరాగా చేసుకుని అక్రమార్కులు ఇసుక అక్రమంగా తరలించేస్తున్నారు. రాత్రీ పగలూ తేడాలేకుండా తవ్వేస్తుండడంతో జిల్లాలోని నదీ గర్భాలు కోతకు గురవుతున్నాయి. జిల్లాలోని చంపావతి, గోస్తనీ నదుల్లో రక్షిత పథకాల వద్ద గుంతలు కనిపిస్తున్నాయి. నీటి సరఫరాపై ప్రభావం చూపుతోంది. ప్రమాదాలకు కారణమవుతోంది.

–న్యూస్‌టుడే, జరజాపుపేట(నెల్లిమర్ల), ఎస్.కోట, భోగాపురం

చంపావతి, గోస్తనీలో యథేచ్ఛగా ఇసుక అక్రమ తవ్వకాలు

నెల్లిమర్ల కొండపేట ప్రాంతంలో చంపావతి నదిలో అక్రమంగా తవ్విన నిల్వలు

ఊటబావుల వద్ద..

తాగునీటి ఊటబావుల వద్ద ఎక్కువగా ఇసుక తవ్వి విజయనగరం, విశాఖ ప్రాంతాలకు లారీల్లో తరలించేస్తున్నారు. కొన్నిచోట్ల నాటుబళ్లపై తీసుకెళ్లి నిల్వ చేసి, అక్కడి నుంచి ట్రాక్టర్లతో గమ్యస్థానాలకు చేర్చి సొమ్ము చేసుకుంటున్నారు. వాల్టా చట్టాన్ని ధిక్కరిస్తున్నా.. ఊటబావులను దెబ్బతీస్తున్నా.. అధికారుల్లో స్పందన లేదు. దీంతో అక్రమార్కులు చెలరేగిపోతున్నారు.

గుంతల్లో పడి ప్రమాదాలు..

ప్రధానంగా చంపావతి, గోస్తనీ నదుల్లో ఇసుక తవ్వకాల వల్ల భారీ స్థాయిలో గుంతల్లోకి తాటిపూడి, ఆంధ్ర జలాశయాల నుంచి నీరు విడుదల చేసిన సమయాల్లో నీరు చేరి ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఎస్.కోట నియోజకవర్గంలో గతంలో గోపాలపల్లి, కొట్టాం ప్రాంతాల్లో మృతి చెందారు. కొట్టాం వద్ద ఎడ్లు, పశువులు మృత్యువాత పడ్డాయి. ఈ ఏడాది తుపాన్ సమయంలో థామస్‌పేట ప్రాంతంలో జరజాపుపేటకు చెందిన కనకల అప్పలనాయుడు చంపావతి నదిలో స్నానానికి దిగి గుంతలో పడి మృతి చెందాడు.

ఎక్కడెక్కడంటే..

నెల్లిమర్ల ప్రాంతంలో థామస్‌పేట, కొండపేట, రామతీర్థం కూడలి, నీలంరాజుపేట ప్రాంతాల్లో జోరుగా తవ్వకాలు కొనసాగుతున్నాయి. జరజాపుపేటలో నారాయణపట్నం, మొయిద, భోగాపురంలో కోటభోగాపురం, పూసపాటిరేగలో రెల్లివలస, కొప్పెర్ల, డెంకాడలో నాతవలస, సింగవరం, ముంగినాపల్లి, ఎస్.కోట ప్రాంతంలో ముసిడిపల్లి, మధుపాడ, వేమలాపల్లి తదితర ప్రాంతాల్లో అధికంగా తవ్వకాలు చేపడుతున్నారు.

అడ్డుకునేందుకు చర్యలు..

చంపావతి నదీ గర్భంలో ఇసుక తవ్వకాలను అడ్డుకునేందుకు చర్యలు చేపడుతున్నట్లు తహసీల్దారు కె.శ్రీకాంత్ అన్నారు. స్థానిక వీఆర్వోలకు ప్రత్యేక బాధ్యతలను అప్పగించామన్నారు. ● గోస్తనీ నదిలో అక్రమ తవ్వకాలు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దారు డి.శ్రీనివాస్ అన్నారు. భారీ వాహనాలతో ఇసుకను తరలించే వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.


ఫిర్యాదు పత్రాలతో డీసీసీ ప్రతినిధులు

భాజపా నాయకులపై చర్యలకు డిమాండు

విజయనగరం మయూరి కూడలి, న్యూస్‌టుడే: భాజపా, బీజేవైఎంకు చెందిన నాయకులపై చర్యలు తీసుకోవాలని ఏపీసీసీ సభ్యుడు, డీసీసీ మాజీ అధ్యక్షుడు సరగడ రమేష్ కుమార్, సీనియర్ నాయకుడు సతీష్ కుమార్ డిమాండు చేశారు. విజయనగరంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఈనెల 21న తోటపాలెంలోని కార్యాలయ ఆవరణలో పార్టీ జెండాలు, ఫ్లెక్సీలను దగ్ధం చేయడం దారుణమన్నారు. ఈమేరకు వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ● అబుల్ కలామ్ ఆజాద్ దేశానికి ఎనలేని సేవలు అందించారని డీసీసీ ప్రతినిధులు పేర్కొన్నారు. ఆయన వర్ధంతి సందర్భంగా పార్టీ కార్యాలయంలో చిత్రపటానికి నివాళులర్పించారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	130	230	240

నేడు 'డయల్ యువర్ సీఎండీ'

గురుద్వారా(విశాఖపట్నం), న్యూస్‌టుడే: విద్యుత్తు సంబంధిత సమస్యలను మరింత వేగవంతంగా పరిష్కరించే లక్ష్యంతో విశాఖలోని ఈపీడీసీఎల్ కార్యాలయంలో సోమవారం 'డయల్ యువర్ సీఎండీ' కార్యక్రమం నిర్వహించనున్నట్లు సంస్థ సీఎండీ ఇమ్మడి పృథ్వీతేజ్ ఓ ప్రకటనలో తెలిపారు. సంస్థ పరిధిలోని 13 జిల్లాలకు చెందిన వినియోగదారులు 86884 00499 ఫోన్ నెంబర్ ద్వారా తమ సమస్యలను తెలియజేయవచ్చునని పేర్కొన్నారు. ఉదయం 10.30 నుంచి 11.30 వరకు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యుత్తు సరఫరాలో తరచూ అంతరాయాలు, హెచ్చుతగ్గులు, కొత్త సర్వీసుల జారీ, సరఫరా పునరుద్ధరణలో జాప్యం, ట్రాన్స్‌ఫార్మర్ల మార్పిడి తదితర సమస్యలపై ఫిర్యాదులను నేరుగా తన దృష్టికి తీసుకురావొచ్చునన్నారు.

దేశీయ కోళ్ల పెంపకంతో ఆర్థికాభివృద్ధి

ఉమ్మడి జిల్లాలో 760 యూనిట్లు

పార్వతీపురం, న్యూస్‌టుడే: గిరిజనుల ఆర్థికాభివృద్ధి, పోషకాహార భద్రతే ధ్యేయంగా పార్వతీపురం ఐటీడీఏ దేశీయకోళ్ల పెంపకాన్ని ప్రత్యేక పథకంగా అమలుచేయడానికి నిర్ణయించింది. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో పార్వతీపురం ఐటీడీఏ పరిధిలోకి వచ్చే నాలుగు మండలాలను ఎంపిక చేశారు. ఈ మండలాల్లో అమెరికాకు చెందిన 'హెఫర్ ఇంటర్‌నేషనల్' సంస్థ సహకారంతో కోళ్ల పెంపకం చేపడుతున్నారు. ఈ పథకం కింద ఎంపికైన గిరిజన కుటుంబాలకు శతశాతం రాయితీపై యూనిట్లు అందించనున్నారు.

పథకం అమలు ఇలా..

● మన్యం నుంచి సాలూరు, పాచిపెంట, విజయనగరం నుంచి శృంగవరపుకోట, మెంటాడ ● జిల్లాకు 380 యూనిట్ల చొప్పున 760 యూనిట్లు ఏర్పాటు చేస్తారు. ● ఒక యూనిట్‌కు రూ.15వేలు ఖర్చవుతుంది. మొత్తం ఖర్చు ప్రభుత్వమే భరిస్తుంది. ● యూనిట్‌లో 45 నుంచి 50 కోడిపిల్లలను అందిస్తారు. ● ఆరు నెలలకు సరిపడా దాణా అందిస్తారు. ● ఈ పథకానికి రెండు జిల్లాలో రూ.1.14కోట్లు వెచ్చిస్తున్నారు.

ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా..

ప్రస్తుతం నాటుకోడి మాంసానికి, గుడ్లకు మార్కెట్‌లో మంచి గిరాకీ ఉంది. కిలో మాంసం రూ.వెయ్యి వరకు ధర పలుకుతోంది. గిరిజన మహిళా సంఘాలకు, స్వయం సహాయక బృందాలకు దేశవాళీ కోళ్ల యూనిట్లను పంపిణీ చేస్తున్నాం. మండలాల్లో ఎంపీడీవోలు లబ్ధిదారులను ఎంపిక చేస్తారు. ఎంపికైన వారికి కోళ్ల పెంపకంపై శిక్షణ, వ్యాధినిరోధక టీకాలు కూడా అందిస్తారు. కోళ్లను పెంచేందుకు ప్రత్యేక గూడును ఇచ్చే విధంగా ప్రభుత్వానికి ప్రతిపాదించామని పార్వతీపురం ఐటీడీఏ పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

EENADU Classifieds

JOBS

Haier Exclusive Service Center@ M.S.ఆఫీస్ పై స్కిల్స్ అనుభవమున్న Female కావలెను. VZM ✆ 9381973800.

శ్రీతిరుమల ఆటోఫైనాన్స్ (3 వీలర్) నందు పనిచేయుటకు బిజినెస్ & కలెక్షన్ ఎగ్జిక్యూటివ్ కావలెను. జీతం 18K+2K పెట్రోల్ & ఇన్సెంటివ్ లొకేషన్ విజయనగరం, S. కోట. 9490600677.

VZM, కోట జంక్షన్, DTDC కొరియర్ నందు పనిచేయుటకు డిస్పాచర్ (F) కావలెను. 3.00 to 9.30, జీ. 8,500/- Con: 9885980790.

విజయనగరం జిల్లాలో గల శ్రీరామ్ గ్రూప్ రాజాం ... Incharges & BDE's కావలెను. Any డిగ్రీ or డిప్లొమా కలిగి ఉండాలి. మంచి Salary, PF, ESI, Yearly బోనస్ 28,000/- ... Executive Trainee (MBA or PG) (20,000) ... Products, ... ✆ 9849824071.

హైదరాబాద్ యూనిట్ ... 8121541212

WANTED
Sales Girl Required - Saree Showroom (Pradeep Nagar, Vizianagaram)
Looking for a sales girl with minimum 1 year experience in Saree / Showroom Sales. Good communication skills and customer handling required. Immediate joining preferred.
Location: D.N. Kumar Pradeep Nagar, Vizianagaram.
Call: 8247482361

MARKETING/ SALES
Anand Masala Require Sales & Marketing Manager, Marketing Executives. Contact: 9849655105, 9848053144
Email: anandmasalaappltd@gmail.com

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం
ఈనాడు క్లాసిఫైడ్స్
5 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే
సంప్రదించండి: 8008597609

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేస్తున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారుడు సరుకుల అమ్మకం లేదా అందించే సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి డబ్బు వసూలు చేయడాలు ... డబ్బును వసూలు చేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే హక్కు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97609
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80081 11237

బొబ్బిలి

•బొబ్బిలి •రాజాం •గజపతినగరం •చీపురుపల్లి

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)

బొబ్బిలి - 80085 74367
గజపతినగరం - 80085 74332
రాజాం - 80085 74308
గరివిడి- 80085 74348

? బుచ్చింపేట వార్డు పరిధిలోని ప్రధాన రహదారిలో చెత్త పారబోస్తున్నారు. - స్థానికులు ★ చర్యలు తీసుకుంటాం. - ప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ - న్యూస్‌టుడే, రాజాం పట్టణం

? వన్నలి- జీఎస్‌పురం రహదారిలో వన్నలి సమీపంలో రహదారి పక్కనే పెద్దగొయ్యి ఏర్పడింది. - శ్రీనివాసరావు, చాటాయివలస ★ పరిశీలించి, చర్యలు తీసుకుంటాం. - జి.సతీష్‌కుమార్, జేఈ - న్యూస్‌టుడే, రేగిడి

? మురపాక గ్రామంలో కాలువలు లేక మురుగు ఇళ్లల్లోకి వస్తోంది. - స్థానికులు ★ ప్రతిపాదనలు పంపించాం. - కృష్ణమూర్తి, పీఆర్ ఏఈ - గంట్యాడ గ్రామీణం

? లింగాపురం గ్రామంలో వీధి కాలువలు లేక ఇబ్బందులు పడుతున్నాం. - స్థానికులు ★ చర్యలు చేపడతాం. - ఆర్.నీలిమ, డిప్యూటీ ఎంపీడీవో - న్యూస్‌టుడే, తెర్లాం

వ్యర్థాల తొలగింపు

స్పందనకు వందనం

గంట్యాడ గ్రామీణం: కిర్తుబర్తి గ్రామంలో వ్యర్థాలు పేరుకుపోయి దుర్వాసనతో ప్రజలు ఇబ్బంది పడేవారు. దీనిపై ఇటీవల వార్త ప్రచురితమవడంతో అధికారులు స్పందించి పారిశుద్ధ్య పనులు చేపట్టారు.

ఇక్కట్లు తీరాయ్

దత్తిరాజేరు: దత్తి నుంచి భోజరాజపురం, దత్తిరాజేరు, గడబవలస, పాపయ్యవలస రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. దీనిపై పలుమార్లు వార్తలు ప్రచురితమవడంతో రూ.6 కోట్లు మంజూరు చేశారు. పనుల పూర్తికి చర్యలు తీసుకున్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

బొబ్బిలి, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఏపీటీఎఫ్ (1938) నాయకులు కోరారు. ఈ మేరకు ఆదివారం ఎమ్మెల్యే బేబీనాయనను బొబ్బిలిలో కలిసి వినతిపత్రం అందజేశారు. ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు మడక బలరాంనాయుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దాసరి వెంకటనాయుడు, జిల్లా ఉపాధ్యక్షులు గంట సత్యనారాయణ, సీహెచ్ రామారావు పాల్గొన్నారు.

ఒత్తిడి తగ్గేందుకు ఆనంద ఆదివారం

ఆసనాలు వేస్తున్న పురపాలిక ఉద్యోగులు

బొబ్బిలి, న్యూస్‌టుడే: బొబ్బిలి పురపాలికలో ఆనంద ఆదివారం కార్యక్రమాన్ని పురపాలిక అధ్యక్షుడు రాంబార్కి శరత్‌బాబు ప్రారంభించారు. నిత్యం పని ఒత్తిడితో సతమతమయ్యే వారికి ఇది కొంత ఉపశమనం కలిగిస్తుందన్నారు. ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులతో కలిసి యోగాసనాలు వేశారు. అనంతరం పుర అధ్యక్షుడితో కలిసి కమిషనర్ రామలక్ష్మి షటిల్ బ్యాడ్మింటన్ ఆడారు. తెదేపా పట్టణాధ్యక్షుడు గెంబలి శ్రీనివాసరావు, పురపాలిక సిబ్బంది పాల్గొన్నారు.

మీరు చెల్లించకండి.. మేము చర్యలు తీసుకోం

రూ.కోట్లలో ఖాళీస్థలాల పన్నుల బకాయిలు

న్యూస్‌టుడే- బొబ్బిలి

బొబ్బిలి పురపాలికకు ఆదాయం తీసుకొచ్చే ఖాళీ స్థలాల పన్నుల వసూళ్లలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. రూ.కోట్లలోనే బకాయిలు ఉన్నాయి. ఈ ఏడాది 1,350 ఖాళీ స్థలాల నుంచి రూ.2.23 కోట్లు వసూలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇంతవరకు 50 శాతం కూడా రాబట్టలేదు. మరోవైపు సదరు ఖాళీ స్థలాల యజమానులు ఏళ్ల తరబడి పన్ను కట్టకుండా.. ప్రస్తుతం లేఅవుట్లు వేసేందుకు సిద్ధం చేస్తున్నా అధికారులు కన్నెత్తి చూడటంలేదు.

లేఅవుట్‌గా సిద్ధం చేసిన స్థలం

పట్టణంలోని తారకరామకాలనీ ఎదురుగా లక్ష్మీ శ్రీనివాస జనపనార పరిశ్రమకు చెందిన అయిదు ఎకరాల స్థలాన్ని పట్టణానికి చెందిన పలువురు వర్తకులు కొనుగోలు చేశారు. కార్మికులకు ఇవ్వాల్సిన బకాయిలు 80 శాతం మేర చెల్లించారు. పురపాలికకు చెల్లించాల్సిన ఖాళీ స్థలం పన్ను (వీఎల్‌టీ) మాత్రం అయిదేళ్లుగా కట్టడంలేదు. దాదాపుగా రూ.40 లక్షల మేర కట్టాలి. దీంతోపాటు వాణిజ్య పన్నులశాఖకు రూ.50 లక్షలు పైచిలుకు చెల్లించాలని గతంలో నోటీసులు ఇచ్చారు. ఇంత పెద్ద మొత్తంలో ఉన్నా అధికారులు మాత్రం మౌనం పాటిస్తున్నారు. ప్రస్తుతం మిల్లులో ఉండే యంత్రాలు, భవనాలను తొలగించి చదును చేశారు. లేఅవుట్ మాదిరిగా మార్చుతున్నారు.

పెద్ద పద్దులు వదిలేస్తున్నారు..

సాధారణ వ్యక్తులు ఏడాది ఆస్తి పన్ను చెల్లించకపోతే కుళాయి కనెక్షన్ తదితరవి నిలిపివేసే అధికారులు అయిదేళ్లుగా పన్ను కట్టకపోయినా ఎందుకు స్పందించడంలేదో అనే చర్చ జరుగుతోంది. ఇటీవల అక్కడ నిర్మాణాలకు భూమిపూజ కూడా చేశారు. ఆ సమయంలో కూడా సిబ్బంది తమకు పట్టనట్లు వ్యవహరించారు. దీంతోపాటు మరికొన్ని పెద్ద పద్దుల విషయంలో చర్యలు అంతంతమాత్రంగానే ఉంటున్నాయి.

యజమానులు ఎక్కడున్నారో..

రాజమహల్, నాయుడుకాలనీ, కోరాడవీధి, స్వామివారి వీధి, గొల్లపల్లి, పాతబొబ్బిలి తదితర ప్రాంతాల నుంచి ఖాళీ స్థలాల పన్నులు వసూలు కావాల్సి ఉంది. కొంతమంది స్థలాలు కొనుగోలు చేసి ఎక్కడో ఉంటున్నారు. వారి చిరునామా సేకరణలో జాప్యం జరుగుతోంది. ప్రభుత్వ కార్యాలయాల బకాయిలు చాలా ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల నుంచి రూ.1.11 కోట్లు, కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల నుంచి రూ.40 లక్షలు బకాయిలు ఉన్నాయి. పన్నుల వసూళ్లకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామని పురపాలక కమిషనర్ రామలక్ష్మి తెలిపారు. చెల్లించని వారికి నోటీసులు ఇస్తున్నామని, వంద శాతం వసూలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

ఆత్మీయ కలయిక.. జ్ఞాపకాల వేడుక

గజపతినగరం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో గృహ నిర్మాణశాఖలో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులు ఆదివారం గజపతినగరంలోని ఓ కల్యాణ మండపంలో ఆత్మీయ కలయిక నిర్వహించారు. వీరి సమస్యలపై పోరాడేందుకు సంక్షేమ సంఘం ఏర్పాటు చేసుకున్నారు. సంఘ అధ్యక్షుడిగా మోహనరావు, ప్రధాన కార్యదర్శిగా త్రినాథస్వామిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గృహనిర్మాణశాఖ చీఫ్‌ఇంజినీర్లుగా పనిచేసిన శ్రీరాములు, ప్రసాద్, జిల్లాలో సేవలందించిన మేనేజర్లు, ఇంజినీర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

రైతులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

రైతు జట్టు సభ్యులతో మాట్లాడుతున్న మాదిరెడ్డి ప్రతాప్

బాడంగి, న్యూస్‌టుడే: బాడంగి మండల కేంద్రంలోని దీక్ష మహిళా వెల్ఫేర్ సొసైటీ సభ్యులతో ఏపీ రోడ్డు భద్రతా ప్రాధికార సంస్థ ఛైర్మన్ మాదిరెడ్డి ప్రతాప్ ఆదివారం సమావేశమయ్యారు. మహారాష్ట్రలో ఏఐ వినియోగించి చెరకు సాగు చేస్తున్న విధానం, వారి విజయాల గురించి వివరించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా రైతులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలని సూచించారు. బెల్లం తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. తృణధాన్యాలతో తయారుచేసిన ఆహార పదార్థాల నాణ్యతను చూసి అభినందించారు. సంస్థ సీఈవో శాంతి పాల్గొన్నారు.

పట్టు తప్పితే కాలువలోకే

గంట్యాడ మండలం పెదమజ్జిలో మురుగు కాలువలపై వంతెనలు లేకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఒకవైపు మురుగు పేరుకుపోయి తీవ్ర దుర్గంధం వస్తోంది. మరోవైపు కాలువ దాటి ఇళ్లల్లోకి వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదుపుతప్పితే కాలువలో పడిపోయే ప్రమాదముంది. సమస్యను పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వరరావు వద్ద ప్రస్తావించగా.. వంతెనలు ఏర్పాటు చేస్తామన్నారు. - న్యూస్‌టుడే, గంట్యాడ గ్రామీణం

పరాయి పంచన ఇంకెన్నాళ్లు?

గుర్ల, గరివిడి మండలాలకు సంబంధించి గుర్లలో రెండేళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఐసీడీఎస్ కార్యాలయానికి పక్కా భవనం లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గుర్ల మండలంలో 95, గరివిడి మండలంలో 82 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ప్రస్తుతం కేసలి స్వచ్ఛంద సంస్థ భవనంలో కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. ఈ విషయం సీడీపీవో ఆరుద్ర వద్ద ప్రస్తావించగా.. పక్కా భవనం సమస్య జిల్లా అధికారులకు నివేదిస్తామని, పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. - న్యూస్‌టుడే, గుర్ల

పూడిక పెరిగింది.. నీరు తగ్గింది

వంగర మండలంలోని మద్దువలస ఎడమ ప్రధాన కాలువ, మగ్గూరు బ్రాంచి కెనాల్‌లో పూడికలు పేరుకుపోయి అధ్వానంగా తయారయ్యాయి. వీటి పరిధిలో 600 ఎకరాలకు నీరు అందించాల్సి ఉంది. పూడికల వల్ల శివారు పొలాలకు నీరు అందడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను నీటి పారుదల శాఖ అధికారులు అనిల్, క్రాంతికుమార్ వద్ద ప్రస్తావించగా.. పూడికలు తొలగించేందుకు రూ.4 లక్షలతో ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపామన్నారు. - న్యూస్‌టుడే, వంగర

శిథిల ట్యాంకుతో చింత

బొండపల్లి మండలం దేవుపల్లి గ్రామంలో రక్షిత మంచినీటి పథకం ట్యాంకు శిథిలావస్థకు చేరింది. కనీసం ట్యాంకు శుభ్రం చేసేందుకు కూడా వీలు లేని విధంగా మారింది. దీంతో కలుషిత నీరు వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేసవి ఎండలు పెరగకముందే స్పందించి, చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. సమస్యను గ్రామీణ నీటి పారుదల శాఖ ఏఈ అలేఖ్య వద్ద ప్రస్తావించగా.. ఉన్నతాధికారులకు తెలియజేస్తామన్నారు. - న్యూస్‌టుడే, బొండపల్లి

అడుగుకో గుంత.. అవస్థలే అంతా

రాజాం పట్టణం పరిధిలోని రాజాం- సుందరం పేట దళితవాడ రోడ్డులో గుంతలు ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. ఈ రహదారి మీదుగా గడ్డిముడిదాం, అమరాం, దోసరి, రామినాయుడువలస తదితర గ్రామాలకు రాకపోకలు సాగిస్తుంటారు. రాత్రి సమయాల్లో ప్రయాణం ప్రమాదకరంగా ఉంటోందని చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను పంచాయతీరాజ్ జేఈ ఆనందరావు వద్ద ప్రస్తావించగా.. మరమ్మతులు చేపడతామన్నారు. - న్యూస్‌టుడే, రాజాం పట్టణం

'విశ్వాసం తగ్గించేలా వ్యవహరిస్తున్నారు'

రాజాం, న్యూస్‌టుడే: తిరుమల పవిత్రత, భక్తుల విశ్వాసం తగ్గించేలా వైకాపా నాయకులు వ్యవహరిస్తున్నారని చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు అన్నారు. ఆదివారం రాజాంలోని కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. దేవుడితో పెట్టుకోవడం వల్లే జగన్‌రెడ్డి గతంలో జైలుకు వెళ్లొచ్చారు. వైకాపా పాలనలో తిరుమల లడ్డును కల్తీ చేశారని విమర్శించారు. చెప్పులేసుకుని, దేవుని చిత్రాలు పట్టుకుని మండలిలో నానాయాగీ చేయడం సీనియర్ నేతగా బొత్స సత్యనారాయణకు తగునా అని ప్రశ్నించారు.

నాణ్యమైన విద్య అందేందుకు కృషి

రామభద్రపురం, న్యూస్‌టుడే: ఏపీ ఎస్టీ కమిషన్ ఛైర్మన్ డీవీజీ శంకరరావు ఆదివారం విజయనగరం, పార్వతీపురం జిల్లాల గిరిజన సంఘాల నేతలు, ఉద్యోగులతో రామభద్రపురం మండలం భూసాయవలసలో సమావేశమయ్యారు. ఆదివాసీ ప్రాంతాల సమస్యలపై చర్చించారు. గిరిజన ప్రాంతాల్లో నాణ్యమైన విద్య, ఆరోగ్యం, ఉపాధి అవకాశాలపై ప్రభుత్వం దృష్టి సారించేలా కృషి చేస్తున్నామన్నారు. దుక్క సీతారాం, ఆరిక చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కూటమితోనే అభివృద్ధి సాధ్యం

రామభద్రపురం, బాడంగి, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే బేబీనాయన అన్నారు. రామభద్రపురం బైపాస్ రహదారిలో రూ.10 లక్షలతో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్తు దీపాలను ఆదివారం ప్రారంభించారు. ఈ దారిలో గతంలో ప్రమాదాలు జరిగేవని, ఇప్పుడు ఆ బాధ తప్పుతుందని ఎమ్మెల్యే అన్నారు. తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చింతల రామకృష్ణ, సర్పంచి ఈశ్వరరావు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భక్తజన సంద్రం.. అమ్మవారి సంబరం

చీపురుపల్లి, రాజాం, గ్రామీణం, పట్టణం, న్యూస్‌టుడే: చీపురుపల్లి కనకమహాలక్ష్మి, రాజాం పోలిపల్లి పైడితల్లి అమ్మవార్ల తొలిరోజు జాతర సందర్భంగా భక్తులు వేకువజాము నుంచి వరుసల్లో బారులుదీరారు. ఆలయ ప్రాంగణాలు భక్తజనంతో కిక్కిరిశాయి. జడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్యే గద్దే బాబూరావు, జేసీ సేధుమాధవన్, డీడీవో కె.హేమసుందర్ తదితరులు చీపురుపల్లిలో మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ ఛైర్మన్ గవిడి నాగరాజు, ఈవో ఎస్.నానాజీబాబు పాల్గొన్నారు. ● రాజాం పోలిపల్లి పైడితల్లిని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, డీఎస్పీ రాఘవులు తదితరులు దర్శించుకున్నారు. రాత్రి ఉత్తరాంధ్ర స్థాయి నృత్య పోటీలు జరిగాయి.

ముర్రాటతో భక్తురాలు

రాజాంలో దర్శనానికి బారులుదీరిన భక్తులు

రాజాం: నృత్య ప్రదర్శనలో చిన్నారులు

విద్యుత్తు కాంతుల్లో రాజాం పట్టణం (డ్రోన్ చిత్రం)

చీపురుపల్లి: దర్శనానికి వస్తున్న ఎమ్మెల్సీ బొత్స

ఆకట్టుకున్న కోలాటం

వంగర, న్యూస్‌టుడే: వంగర మండలం రుషింగిలో దుర్గా షిర్డీసాయి ఆలయం 19 వార్షికోత్సవం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర స్థాయి కోలాటం పోటీలు నిర్వహించారు. అనకాపల్లి, పార్వతీపురం, గుర్ల, శ్రీకాకుళం, బొబ్బిలి, తెర్లాం తదితర ప్రాంతాల నుంచి 20 బృందాలు పాల్గొన్నాయి. అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. అనకాపల్లి బృందం ప్రథమ, బొబ్బిలి మండలం పక్కి బృందం ద్వితీయ బహుమతులు గెలుచుకున్నాయి. ఆలయ ధర్మకర్త వై.మురళీకృష్ణ బహుమతులు అందజేశారు.

పరీక్షలపై భయం వీడండి

బొబ్బిలి, న్యూస్‌టుడే: విద్యార్థులు పరీక్షలపై భయం వీడితే అత్యధిక మార్కులు సాధించగలరని జిల్లా బీసీ సహాయ సంక్షేమాధికారిణి శ్యామలారాణి అన్నారు. ఆదివారం బొబ్బిలి సమీకృత వసతిగృహంలో రాజాం, బొబ్బిలి నియోజకవర్గాల పరిధిలోని బీసీ వసతి గృహాల్లో చదువుతున్న పదోతరగతి విద్యార్థులకు ప్రేరణ తరగతులు నిర్వహించారు. విద్యార్థులకు విద్యాసామగ్రి అందజేశారు. సంక్షేమాధికారులు శ్రీనివాస రెడ్డి, దాసు, పావని, గౌతమి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సహాయ సంక్షేమాధికారిణి శ్యామలారాణి

సులువుగా విద్యాబోధన చేయాలి

రాజాం, న్యూస్‌టుడే: భౌతికశాస్త్రంలో సులువుగా విద్యాబోధన చేయడం కీలకమని విశాఖ జిల్లా సమగ్ర శిక్షా ఏపీసీ జోగా చంద్రశేఖర్‌రావు అన్నారు. రాజాం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో భౌతికశాస్త్ర ఉపాధ్యాయులకు ఆదివారం కార్యశాల నిర్వహించారు. ఉపాధ్యాయులు, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

పదవి ఆమెది.. పెత్తనం ఆయనది

న్యూస్‌టుడే- గరివిడి

స్థానిక సంస్థల్లో మహిళలకు ప్రాధాన్యత ఇచ్చేందుకు ప్రభుత్వం ఇచ్చిన రిజర్వేషన్లు క్షేత్రస్థాయిలో దుర్వినియోగమవుతున్నాయి. పేరుకే మహిళలు ప్రజాప్రతినిధులుగా ఉంటున్నా.. పెత్తనమంతా వారి భర్తలే చెలాయిస్తున్నారు. చివరకు అధికారిక సమావేశాల్లో సైతం ఆమెకు చోటివ్వకుండా భర్తలే హాజరవుతున్నారు. ఇందుకు ఆదివారం జరిగిన గరివిడి మండల పరిషత్తు సర్వసభ్య సమావేశమే నిదర్శనం.

సమావేశానికి వచ్చినవారిలో మహిళా ప్రజాప్రతినిధుల భర్తలు కొందరు..

మండలంలో మొత్తం 20 మంది ఎంపీటీసీ సభ్యులకు గాను 16 మంది, 30 మంది సర్పంచులకు గాను 22 మంది సమావేశానికి హాజరయ్యారు. 12 మంది మహిళా ఎంపీటీసీల్లో ఎంపీపీగా ఉన్న కొండలక్ష్మీపురం ఎంపీటీసీ సభ్యురాలు ఎం.విజయలక్ష్మి ఒక్కరే సమావేశానికి హాజరుకాగా.. 9 మంది మహిళా ఎంపీటీసీలు రాలేదు. ఇద్దరు సభ్యుల స్థానంలో వారి భర్తలు కనిపించారు. గ్రామ పంచాయతీల్లో 15 మంది మహిళా సర్పంచులుండగా.. వీరిలో కేవలం శేరీపేట సర్పంచి పిళ్ల రామయ్యమ్మ ఒక్కరే హాజరయ్యారు. ఆరుగురు మహిళా సర్పంచుల స్థానంలో వారి భర్తలు కూర్చున్నారు. మండల సమావేశంలో ప్రభుత్వ శాఖలపై జరిపిన సమీక్షలో మహిళా ప్రతినిధుల భర్తలే ప్రశ్నలు సంధించి అధికారులపై పెత్తనం చేయడంపై పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రతిసారీ మండల సమావేశాల్లో మహిళా ప్రజా ప్రతినిధులకు బదులు భర్తలు హాజరైనా అధికారులు ప్రశ్నించలేకపోతున్నారు. ఇకనుంచైనా ఆమెకు కల్పించిన హక్కును సక్రమంగా అమలు చేయాలని పలువురు కోరుతున్నారు.

నాయకులకే యూరియా ఇస్తారా?

గరివిడి, న్యూస్‌టుడే: గరివిడి మండల పరిషత్తు కార్యాలయంలో మండలాధ్యక్షురాలు విజయలక్ష్మి అధ్యక్షతన ఆదివారం సర్వసభ్య సమావేశం జరిగింది. వ్యవసాయశాఖపై జరిగిన సమీక్షలో రైతులు పడుతున్న ఇబ్బందులను తెలియజేశారు. రబీలో మండలంలో 832 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ చేసినట్లు వ్యవసాయాధికారి ప్రసాదరావు చెప్పడంతో సభ్యులు ఆయనపై ధ్వజమెత్తారు. పీఏసీఎస్‌లు, రైతుసేవా కేంద్రాలకు కేటాయించిన యూరియాను అధికార పార్టీ నేతలకు అప్పగించారని వెదుళ్లవలస, అర్తమూరు, కోనూరు సర్పంచులు జి.తమ్మినాయుడు, పి.కుమార్, బి.శ్రీరాములు ఆరోపించారు. ఆర్‌ఈసీఎస్‌లో వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లకు డబ్బులు కట్టించుకుని కనెక్షన్ ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారని మండిపడ్డారు. కోడూరు, కందిపేట, కొండలక్ష్మీపురం, వెదుళ్లవలస గ్రామాలకు ఇందిరమ్మ సుజలధార నాగావళి నీటి పథకం ద్వారా నీరు సరఫరా కావడం లేదని, వేసవిలో ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఆయా గ్రామాల సర్పంచులు తెలిపారు. బొండపల్లి, కోనూరు పీహెచ్‌సీ వైద్యాధికారులతో పాటు పలు శాఖల అధికారులు సమావేశానికి హాజరుకాలేదని, వారికి మెమోలు జారీ చేస్తామని ఎంపీడీవో సుబ్రహ్మణ్యం తెలిపారు. జడ్పీటీసీ సభ్యుడు వి.శ్రీనివాసరావు, మండల ఉపాధ్యక్షుడు రామకృష్ణరాజు పాల్గొన్నారు.

వార్డు ఒకటి.. సమస్యలు వంద

న్యూస్‌టుడే - రాజాం పట్టణం

రాజాం పురపాలక సంఘం పరిధిలోని ఒకటో వార్డు పొనుగుటివలసలో ప్రజలు సమస్యలతో సతమతమవుతున్నారు. సంతకవిటి మండలంలోని ఓ పంచాయతీగా ఉండి.. పురపాలికలో కలిసినా అభివృద్ధి జరగలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టణ శివారున ఉన్న తమపై నిర్లక్ష్యం చూపుతున్నారని వాపోతున్నారు.

కాలువలు, రహదారులు, మంచినీరు తదితర సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. పన్నులు చెల్లిస్తున్నా.. ప్రాంతాన్ని అభివృద్ధి చేయడంలేదని యువత ఆవేదన వెల్లబుచ్చుతున్నారు. నేటికీ మట్టి రహదారులు ఉన్నాయి. మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. వార్డు పరిధిలోని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని కమిషనర్ రామచంద్రరావు తెలిపారు. ప్రజలందరితో సమావేశం ఏర్పాటు చేసి, సమస్యలు తెలుసుకుంటామన్నారు.

పొనుగుటివలస బీసీ కాలనీలో మట్టి రహదారి

✧ పురపాలిక : రాజాం
✧ వార్డు: 1 ✧ జనాభా: 1,728 మంది
✧ నివాస గృహాలు: 590
✧ వార్డు పరిధిలోని ప్రాంతాలు: పొనుగుటివలస బీసీ, ఎస్సీ కాలనీలు, ప్రధాన, చాకలి వీధులు

ఇదీ పరిస్థితి..

★ గ్రామ పంచాయతీగా ఉన్న సమయంలో నిర్మించిన సీసీ రహదారులే నేటికీ దిక్కు. ★ కాలువల్లో చెత్త పేరుకుపోవడంతో దోమలు, దుర్వాసన అధికంగా ఉంటున్నాయి. ★ శ్మశాన వాటికకు సరైన రహదారి లేదు. పైగా ఆక్రమణకు గురవుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ★ భూములు గ్రామ కంఠంలో ఉండటం వల్ల రిజిస్ట్రేషన్‌కు ఇబ్బందులు పడుతున్నామని చెబుతున్నారు. ★ బీసీ కాలనీకి మట్టి రోడ్డు, కాలువలు నిర్మించలేదు. ★ ఎస్సీ వీధి 2, 3వ లైన్‌లలో కాలువలు పూడికలతో నిండిపోయాయి. ★ మంచినీరు సక్రమంగా అందడం లేదు. ★ ప్రధాన, శివాలయం వీధుల్లో రహదారులు, కాలువలు లేవు. ★ చాకలి వీధిలో మట్టి రహదారులే దిక్కు.

రోగులకు ఆర్థికసాయం

బొబ్బిలి: హెచ్ఐవీ రోగులకు పౌష్టికాహారం నిమిత్తం కారుణ్య ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు జేసీ రాజు రూ.20 వేలు ఆర్థికసాయం అందజేశారు. ఛైల్డ్ ఫౌండ్ ఇండియా జిల్లా ప్రబంధకుడు అప్పలనాయుడు, పర్యవేక్షకుడు ప్రసాద్‌కు అందజేశారు. సభ్యులు ప్రవీణ్ కుమార్, రమేష్, రామకృష్ణ, చిన్నారావులు పాల్గొన్నారు.

పారదర్శకంగా పనిచేయాలి

బొండపల్లి: అధికారులు పారదర్శకంగా పనిచేయాలని ఎంపీపీ చల్లంనాయుడు అన్నారు. తనకు సమాచారమివ్వకుండా పాసుపుస్తకాలు పంపిణీ చేశారని ఆదివారం నిర్వహించిన బొండపల్లి మండల సర్వసభ్య సమావేశంలో అన్నారు. హాజరైన సభ్యులు తమ గ్రామాల పరిధిలోని వివిధ సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. ఎంపీడీవో గిరిబాల తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్నారు

బొబ్బిలి: పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో ఆదివారం ఎం.నారాయణమ్మ అనే నిరుపేద వృద్ధురాలు మృతి చెందారు. అంత్యక్రియలు చేసేందుకు కుటుంబ సభ్యులు ఇబ్బందులు పడ్డారు. ఎమ్మెల్యే బేబీనాయన విషయం తెలుసుకుని రూ.5 వేలు, పట్టణానికి చెందిన పలువురు మరో రూ.5 వేలు అందజేశారు.

మాస్టారు సేవలు గొప్పవి

బాడంగి: మండలం కేంద్రంలోని ముగడ కాలనీలో ఏర్పాటు చేసిన సత్యారావు మాస్టారు విగ్రహాన్ని రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్, బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన ఆదివారం ఆవిష్కరించారు. తాము బాల్యంలో సత్యారావు మాస్టారు వద్ద చదువుకున్నట్లు తెలిపారు. ఉద్యోగ విరమణ తర్వాత కూడా ఖాళీగా ఉండకుండా విద్యార్థులకు శిక్షణ ఇచ్చేవారని కొనియాడారు.

అగ్నిప్రమాద బాధితులకు చేయూత

దత్తిరాజేరు: నీలకంఠరాజపురంలో అగ్నిప్రమాద బాధితులైన కెల్ల సింహాచలం, రెడ్డి చిన్నమ్మిలకు అమ్మా ఫౌండేషన్ సభ్యులు అండగా నిలిచారు. వంట సామగ్రి, పంకాలు, నిత్యావసరాలు అందించారు.

బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలి

బొబ్బిలి: దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని జిల్లా దివ్యాంగుల సేవా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బోను త్రినాథరావు, తాడ్డి హరిబాబు కోరారు. బొబ్బిలిలో మాట్లాడారు. బ్యాంకు రుణాలు మంజూరు చేయాలని, బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలన్నారు.

కళాకారులకు పురస్కారాలు

బొబ్బిలి: శివరాత్రి సందర్భంగా రాజమహేంద్రవరంలో వేంకటేశ్వర ఆనమ్ కళా కేంద్రం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించింది. బొబ్బిలి కళాకారులు గౌరునాయుడు, నమస్వని, మాధురి, మానసవీణకు పురస్కారం అందజేశారు.

తారకరామ కాలనీలో కార్డెన్ సెర్చ్

బొబ్బిలి, న్యూస్‌టుడే: బొబ్బిలి పట్టణంలోని తారకరామకాలనీలో ఆదివారం పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఉదయం 5 గంటల నుంచి 8.30 వరకు ఇంటింటికీ వెళ్లి తనిఖీలు చేశారు. 570 ఇళ్లలో వివరాలు సేకరించినట్లు సీఐ నారాయణరావు తెలిపారు. పత్రాల్లేని 20 వాహనాలు సీజ్ చేశామన్నారు. బొబ్బిలి పట్టణం, రూరల్, గజపతినగరం సర్కిళ్ల పరిధిలోని సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు. అంతకుముందు డీఎస్పీ భవ్యారెడ్డి సిబ్బందికి సూచనలు ఇచ్చారు.

స్టేషన్ వద్ద సిబ్బందికి సూచనలు ఇస్తున్న డీఎస్పీ భవ్యారెడ్డి

తెదేపా కార్యాలయం ప్రారంభం

దత్తిరాజేరు, న్యూస్‌టుడే: దత్తిరాజేరులో తెదేపా మండల కార్యాలయాన్ని ఆ పార్టీ కన్వీనర్ చంద్రశేఖర్ ఆదివారం ప్రారంభించారు. ఇక నుంచి కార్యకర్తలకు నాయకులు మండల కార్యాలయంలో అందుబాటులో ఉంటారని తెలిపారు. నాయకులు సత్యారావు, ఈశ్వరరావు, సత్తిబాబు, మోహన్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్..

గజపతినగరం: ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధిస్తూ తహసీల్దారు ఉత్తర్వులు జారీ చేశారని ఎస్సై కిరణ్‌కుమార్ నాయుడు ఆదివారం తెలిపారు. గజపతినగరం ప్రభుత్వ, శ్రీప్రతిభ, కృష్ణా, సాయిసిద్ధార్థ జూనియర్ కళాశాలల వద్ద సెక్షన్ 144 అమలులో ఉంటుందని తెలిపారు.

CHANGE OF NAME

I Jinagam Srinivasa Rao S/o Jinagam Viswanadham late previously called Jinagam srinu Resident of 15-124,Latchayyapeta, Rajam, Vizianagaram. Now changed my name from **Jinagam Srinu** to **Jinagam Srinivasa Rao** Hence forth I will be called as **Jinagam Srinivasa Rao** for all purpose.

ALL THE BEST INTERMEDIATE STUDENTS

స్వర్గీయ డా॥ రెడ్డి సత్యారావు గారు విద్యాసంస్థల వ్యవస్థాపకులు

అడ్మిషన్లు జరుగుచున్నవి
9493987535
లక్ష్మమ్మ మెమోరియల్ ఒకేషనల్ జూనియర్ కాలేజ్, పాత బస్టాండ్, బొబ్బిలి
ప్రిన్సిపాల్ & స్టాఫ్

విజయనగరం

● విజయనగరం ● నెల్లిమర్ల ● ఎస్.కోట

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)

విజయనగరం పట్టణం	80089 02900
విజయనగరం గ్రామీణం	80085 74317
ఎస్.కోట	80085 74326
భోగాపురం	70959 54646

?: సుంకరిపేటకు వెళ్లే మార్గంలో వీధి దీపాలు ఏర్పాటు చేయాలి. - **స్థానికులు**

★ పరిశీలించి, చర్యలు తీసుకుంటాం. - **శ్రీనివాసరావు, ఈవోపీఆర్డీ**

- న్యూస్‌టుడే, విజయనగరం గ్రామీణం

?: కొత్తపేట కుమ్మరివీధి నుంచి అక్కడి శ్మశానవాటికకు వెళ్లే మార్గంలో వీధి దీపాలు వెలగడం లేదు. - **వినోద్, స్థానికుడు**

★ సిబ్బందిని పంపించి, బాగు చేయిస్తాం. - **రత్నాకర్, డీఈఈ, నగరపాలక సంస్థ**

- న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

పలకలు వేశారు

స్పందనకు వందనం

విజయనగరం పట్టణం: నగరపాలిక పరిధిలోని కంటుభుక్తవారి వీధి ప్రధాన దారిలో కల్వర్టు పలకలు ధ్వంసమయ్యాయి. బాగు చేయాలని స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా'కు ఫిర్యాదు చేశారు. సమస్యను ఈఈ ప్రసాద్ దృష్టికి తీసుకెళ్లగా.. స్పందించి, మరమ్మతులు చేశారు.

నీళ్ల ట్యాంకు శుభ్రం

లక్కవరపుకోట: ఎల్.కోటలో సురక్షిత నీటి పథకం ద్వారా బురద నీరు సరఫరా అయ్యింది. దీంతో ఇబ్బందులు ఎదురయ్యాయి. 'ఈనాడు'లో 'బురద నీటినే తాగాలా' శీర్షికన వచ్చిన చిత్ర కథనంపై జేఈ సన్యాసిరావు స్పందించి, ట్యాంకును శుభ్రం చేయించారు.

లబ్ధిదారుకు చెక్కు ఇస్తున్న ఎమ్మెల్యే నాగమాధవి

సీఎం సహాయనిధి పేదలకు వరం

నెల్లిమర్ల, న్యూస్‌టుడే: సీఎం సహాయనిధి పేదలకు వరమని ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. నెల్లిమర్ల ప్రాంతానికి చెందిన ప్రియాంకకు ఇటీవల హృదయ సంబంధిత చికిత్స జరిగింది. బాధితురాలికి మంజూరైన రూ.2,06,900 సీఎం సహాయనిధి చెక్కును శనివారం స్థానిక జనసేన కార్యాలయంలో అందజేశారు. పార్టీ నాయకులు జి.సతీష్, ఎ.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల జోలికి పోవద్దు

విజయనగరం అయ్యన్నపేట, న్యూస్‌టుడే: జీవితాలను నాశనం చేసే మాదక ద్రవ్యాల జోలికి పోవద్దని విజయనగరం గ్రామీణ సీఐ బి.లక్ష్మణరావు సూచించారు. ఆదివారం రాత్రి ధర్మపురిలోని వసంతవిహార్‌లో పల్లె నిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. గంజాయి విక్రయించినా, రవాణా చేసినా, వినియోగించినా కఠిన చర్యలు తప్పవన్నారు. బాల్య వివాహాల నివారణ, రోడ్డు నిబంధనలు, సైబర్ కేసులు.. తదితర అంశాలపై సూచనలు చేశారు. ఎస్సై అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పల్లె నిద్రలో భాగంగా ధర్మపురిలో స్థానికులతో మాట్లాడుతున్న సీఐ లక్ష్మణరావు

తెరపై ఈనాడు

● ఎన్సీఎస్: ఫంకీ ● శ్రీకృష్ణ: కపుల్ ఫ్రెండ్లీ ● ఆదిత్య: నిలవే ● లీలామహల్: నారీ నారీ నడుమమురారీ, మనసంతా నువ్వే ● రంజనీ స్క్రీన్-1: హెయ్ బల్వంత్ ● శివరంజనీ స్క్రీన్-2: మన శంకరవరప్రసాద్ గారు, నవాబ్ కాఫీ ● హిమగిరి: మన శంకర వరప్రసాద్‌గారు ● సప్తగిరి: హెయ్ బల్వంత్

- న్యూస్‌టుడే, కంటోన్మెంట్

మార్కెట్ కిటకిట.. వసూళ్లకు కటకట

- న్యూస్‌టుడే, శృంగవరపుకోట

శృంగవరపుకోట మేజరు పంచాయతీలో పెద్దఎత్తున వ్యాపార లైసెన్సు రుసుము పక్కదారి పడుతోంది. పట్టణంలో సుమారు మూడు వేల వరకు దుకాణాలున్నాయి. వీటిల్లో కేవలం 118 నుంచే పంచాయతీ వసూలు చేస్తోంది. దీనిని బట్టి ఎంత మేర ఆదాయం కోల్పోతోందో అర్థం చేసుకోవచ్చు. ఈ ప్రభావం అభివృద్ధి, వేతనాల చెల్లింపులపై పడుతోంది.

వెనకడుగు ఎందుకో?

భారీగా దుకాణాలు ఉన్నా.. పంచాయతీ సిబ్బంది వసూళ్లకు మాత్రం వెనకడుగు వేస్తున్నారు. వచ్చే ఆదాయంతోనే పలు రకాల అభివృద్ధి, వీధిదీపాల ఏర్పాటు, పారిశుద్ధ్యం తదితర పనులు జరగాలి. కానీ నగదు లేక కార్మికులకు సైతం ఒక్కోసారి చెల్లింపులు నిలిచిపోతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని పట్టణవాసులు కోరుతున్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి, అందరి నుంచి వసూలు చేస్తామని **ఏవో చంద్రశేఖర్** తెలిపారు. లైసెన్సులు తీసుకుని విధిగా చెల్లింపులు చేయాలన్నారు.

అవే అధికం..

పట్టణంలో ఔషధ దుకాణాలు 20 వరకు ఉండగా కేవలం ముగ్గురు నిర్వాహకులు మాత్రమే రుసుము చెల్లిస్తున్నారు. 15 ఆసుపత్రులకు గానూ ఆరు, ఏడు ప్రైవేటు వేడుక మందిరాల్లో రెండు మాత్రమే ఏటా ముందుకొస్తున్నాయి. అన్ని దుకాణాల నుంచి సక్రమంగా సొమ్ము అందితే ఏడాదికి సుమారు రూ.30 లక్షల వరకు ఆదాయం సమకూరుతుంది. కానీ ప్రస్తుతం రూ.3.02 లక్షలు మాత్రమే అందుతోందంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. అయినా అధికారులకు పట్టడం లేదు.

ఇదీ పరిస్థితి..

పంచాయతీలో వ్యాపారం నిర్వహించే దుకాణాలు, సంస్థలు, ప్రైవేటు ఆసుపత్రులు, ఔషధాలు, మద్యం దుకాణాలు.. తదితర రంగాల్లో ఏ వ్యాపారం చేసినా పంచాయతీ నుంచి లైసెన్సు తీసుకొని, ఏటా ఫీజు చెల్లించాలి. ఈపీడీసీఎల్ సంస్థ పట్టణంలో మూడు వేల వరకు వాణిజ్య కేటగిరీ కింద విద్యుత్తు బిల్లులు వసూలు చేస్తోంది. అవన్నీ రుసుము కట్టాల్సిందే. కానీ కొందరే స్పందిస్తున్నారు.

నోటీసులు లేకుండా భూములెలా కేటాయిస్తారు

తహసీల్దారును ప్రశ్నిస్తున్న ఎమ్మెల్సీ రఘురాజు

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: జిందాల్ కోసం సేకరించిన భూములను 2008లోనే కంపెనీకి ఇచ్చేస్తే ఆ స్థలాలన్నీ ఇంకా 22ఎ జాబితాలోనే ఎందుకున్నాయని ఎమ్మెల్సీ రఘురాజు రెవెన్యూ అధికారులను ప్రశ్నించారు. ఆదివారం ఎంపీపీ సోమేశ్వరరావు అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. నోటీసులు ఇవ్వకుండా భూములను ఎలా కేటాయించారని అడగ్గా.. ఈ వ్యవహారం కోర్టులో ఉన్నందున మాట్లాడలేమని తహసీల్దారు డి.శ్రీనివాసరావు సమాధానమిచ్చారు. వైస్ ఎంపీపీ సుబ్బలక్ష్మి, ఎంపీడీవో సతీష్ తదితరులు పాల్గొన్నారు.

జనసేనలో 100 కుటుంబాల చేరిక

పార్టీలో చేరినవారితో విక్రమ్ తదితరులు

విజయనగరం అయ్యన్నపేట, న్యూస్‌టుడే: విజయనగరం నగరపాలక సంస్థ పరిధిలోని 19వ డివిజన్‌కు చెందిన పలువురు వైకాపా నాయకులు 100 కుటుంబాల వారితో కలిసి జనసేనలో చేరారు. పార్టీ సీనియర్ నాయకుడు అవనాపు విక్రమ్ వారికి కండువాలు వేసి ఆహ్వానించారు. అధినేత పవన్ కల్యాణ్ బాటలో నడవాలని కోరారు. పత్తిగిల్లి వెంకటరావు, రామకృష్ణ, ఉమా మల్లికార్జునరావు, నరసింగరావు, చక్రవర్తి, సంపత్‌రాజు, కుమార్, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

సెంచూరియన్‌లో ఉత్సాహంగా గజజ్యోతి వేడుక

నెల్లిమర్ల, న్యూస్‌టుడే: నెల్లిమర్ల మండలం టెక్కలి సమీపంలోని సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో రెండు రోజుల పాటు కొనసాగిన గజజ్యోతి వేడుకలు ఆదివారం ముగిశాయి. వర్సిటీ ఉపాధ్యక్షుడు, ప్రొఫెసర్ డీఎన్.రావుతో పాటు ఆయన సతీమణి హాజరయ్యారు. విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకతలను వెలికితీసేందుకు ప్రాజెక్టులు ఎంతగానో దోహదపడతాయన్నారు. విద్యార్థులు చేసిన ప్రాజెక్టులను తిలకించారు. ఛాన్సలర్ జీఎస్ఎన్.రావు, వైస్ ఛాన్సలర్ ప్రశాంతకుమార్ మహంతి, రిజిస్ట్రార్ పల్లవి, పలువురు రాజకీయ నాయకులు పాల్గొన్నారు.

సాఫీ ప్రయాణానికి సంకేతాలు

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: విజయనగరం నగరపాలక సంస్థ పరిధిలో ట్రాఫిక్ సిగ్నళ్ల ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. పాతవాటికి మరమ్మతులతో పాటు కొత్తగా ఎనిమిది చోట్ల బిగిస్తున్నారు. నిబంధనలు అతిక్రమించిన వారికి ట్రాఫిక్ పోలీసులు అపరాధ రుసుము విధిస్తున్నారు. ఇందులో నుంచి సగభాగం నగరపాలికకు అందుతోంది. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ సేఫ్టీ కమిటీ, పోలీసు యంత్రాంగంతో కలిసి పనులు చేస్తున్నారు.

దీపాలను ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

ప్రాంతాల వారీగా..

❈ హైదరాబాద్‌కు చెందిన ఎస్పీటీ నెట్‌వర్క్‌తో నగరపాలక సంస్థ ఒప్పందం చేసుకుంది. ఇందుకు అయ్యే ఖర్చును సాధారణ నిధుల ద్వారా భరించనుంది. తిరిగి రోడ్డు భద్రత నిధుల నుంచి రీయింబర్స్‌మెంట్ వచ్చేలా ఇప్పటికే కౌన్సిల్ ఆమోదం తెలిపింది. ఆయా పనులు ప్రస్తుతం ప్రారంభమయ్యాయి. రెండేళ్ల పాటు గుత్తేదారు సంస్థ నిర్వహణ బాధ్యతలు చేపట్టనుంది.

❈ దాసన్నపేట రైతు బజారు, సింహాచలం మేడ వద్ద రూ.3.15 లక్షలతో మరమ్మతులు చేస్తున్నారు.

❈ బాబామెట్ట పెట్రోల్ బంకు వద్ద రూ.18.71 లక్షలు, సీఎంఆర్ కూడలి- రూ.16.71 లక్షలు, కలెక్టరేట్ కూడలి- రూ.22.28 లక్షలు, కొత్తపేట ట్యాంకు కూడలి- రూ.18.71 లక్షలు, ఎంఆర్ ఆసుపత్రి కూడలి- రూ.16.71 లక్షలు, న్యూపూర్ణా థియేటర్- రూ.22.28 లక్షలు, ఆర్అండ్‌బీ కూడలి- రూ.22.28 లక్షలు, వీటీ.అగ్రహారంలో రూ.16.71 లక్షల కొత్తగా పనులు చేస్తున్నట్లు **నగరపాలిక ఈఈ ప్రసాద్** 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

4 కేంద్రాలు.. 162 మంది విద్యార్థులు

పదో తరగతి వారికి వసతి గృహాల్లో శిక్షణ

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: పదో తరగతిలో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. వందరోజుల ప్రణాళికలో దీర్ఘకాలికంగా పాఠశాలలకు గైర్హాజరు కావడం, చదువులో వెనుకబడిన వారి కోసం నిర్వహిస్తున్నారు. ఉత్తీర్ణులయ్యేలా చదవడం, రాయడంపై తర్ఫీదు ఇస్తున్నారు. ఈమేరకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు.

విజయనగరం నియోజకవర్గంలో 1,439 మంది పదో తరగతి పరీక్షలకు హాజరుకానున్నారు. వీరిలో వెనుకబడిన 162 మంది కోసం నాలుగు కేంద్రాలను ఎంపిక చేశారు. కేజీబీవీ, జిల్లా విద్యాశిక్షణ సంస్థలో రెసిడెన్షియల్ తరహాలో అక్కడే ఉండి చదువుకునే చర్యలు తీసుకున్నారు. ఈనెల 9 నుంచి తరగతులు ప్రారంభమయ్యాయి. అయితే కొందరు రాత్రి సమయంలో ఉండేందుకు నిరాకరించడంతో నగర పాలకసంస్థ పరిధిలోని కస్పా, బీపీఎం పాఠశాలల్లో డేస్కాలర్ విధానంలో శిక్షణ అందిస్తున్నారు. రోజూ ఉదయం 7.30 నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు ఉపాధ్యాయులు అందుబాటులో ఉంటున్నారు.

బీపీఎం పాఠశాలలో శిక్షణ తరగతులను పరిశీలిస్తున్న డీఈవో, డిప్యూటీ డీఈవో తదితరులు

కేటాయింపు ఇలా

కేంద్రం	సంఖ్య
కేజీబీవీ	40
డైట్	43
కస్పా	53
బీపీఎం	26

చేపట్టిన చర్యలివీ..

★ సబ్జెక్టుకొక ఉపాధ్యాయుడు చొప్పున నియమించారు.

★ రెసిడెన్షియల్ విధానం ఉన్న చోట అదనంగా ఒక పీడీ

★ ఉదయం, సాయంత్రం వేళల్లో యోగా, వ్యాయామం

★ పాత విధానంలోనే మెనూ అమలు

★ డేస్కాలర్ వారికి ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి వేళల్లో భోజనం

మురుగు కూపంలా పెద్దచెరువు

విజయనగరం నగరపాలిక పరిధిలోని పెద్దచెరువు మురుగు కూపంలా దర్శనమిస్తోంది. నిర్వహణ లేకపోవడంతో అన్ని వైపుల నుంచి వ్యర్థ జలాలు చేరుతున్నాయి. గత అయిదేళ్లలో సుందరీకరణ పనుల పేరుతో రూ.2.45 కోట్ల మేర ఖర్చు చేశారు. అయినప్పటికీ వ్యర్థాలు, ప్లాస్టిక్ కనిపిస్తున్నాయి. మరోవైపు గుర్రపుడెక్క పేరుకుపోయింది. ఇందులో బోటు షికారు ఏర్పాటు చేస్తామని చెప్పినా చర్యల్లేవు. శుభ్రం చేస్తామని నగరపాలిక సహాయ కమిషనర్ అప్పలరాజు తెలిపారు. - న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

ప్రమాదకరంగా విద్యుత్తు స్తంభం

నెల్లిమర్ల నగరపంచాయతీ పరిధిలోని పలు విద్యుత్తు స్తంభాలు భయపెడుతున్నాయి. చాలాచోట్ల ఇంకా ఇనుప స్తంభాలే ఉన్నాయి. ఏళ్ల నాటివి కావడం, మార్పు చేయకపోవడంతో తుప్పు పట్టి ఒరిగిపోయి కనిపిస్తున్నాయి. స్థానిక తెలకల వీధిలోని ప్రధాన రహదారిలో కొన్ని నెలలుగా ఈ పరిస్థితి కనిపిస్తున్నా చర్యల్లేవు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆ కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. పరిశీలిస్తామని నగర పంచాయతీ అధికారులు తెలిపారు.

- న్యూస్‌టుడే, నెల్లిమర్ల

లీకులతో తాగునీటి కొరత

నగరపాలిక పరిధిలోని మజ్జి వీధిలో దెబ్బతిన్న పైపులైన్లు

విజయనగరం నగరపాలక సంస్థ పరిధిలో తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. ఇక్కడ రోజూ 46 ఎంఎల్‌డీల నీరు అవసరం కాగా.. ప్రస్తుతం రోజు విడిచి రోజు 25 ఎంఎల్‌డీలను మాత్రమే అందిస్తున్నారు. పైగా లీకుల కారణంగా ఎక్కడికక్కడే వృథాగా పోతోంది. దీంతో శివారు ప్రాంతాలకు సకాలంలో చేరడం లేదు. కొన్ని పైపులు మురుగు కాలువల్లో ఉండడంతో నీళ్లు దుర్వాసన వస్తున్నాయని పలు కాలనీల వారు గగ్గోలు పెడుతున్నారు. పరిశీలించి, చర్యలు తీసుకుంటామని సహాయ కమిషనర్ అప్పలరాజు తెలిపారు.

- న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

ఇంకా కచ్చా కాలువలే దిక్కు

నగరంలో ఏటా కాలువల నిర్మాణానికి రూ.కోట్లు ఖర్చు చేస్తున్నారు. వాటి వల్ల పూర్తిస్థాయిలో ప్రయోజనం కనిపించని పరిస్థితి నెలకొంది. శివారు కాలనీ, విలీన పంచాయతీల్లో అపార్టుమెంట్లు, గ్రూపు ఇళ్లు నిర్మిస్తున్న వారు అవుట్‌లెట్లను ప్రధాన కాలువలకు కలపడం లేదు. దీంతో ఖాళీ స్థలాల్లో మురుగునీరు చేరుతోంది. ఇక్కడ 70 కి.మీ పరిధిలో ఇంకా కచ్చాకాలువలే ఉన్నాయి. కలెక్టరేట్ నుంచి కణపాక, కేఎల్ పురంలో ఎక్కువగా కనిపిస్తున్నాయి. పరిశీలించి, కొత్త నిర్మాణాలకు ప్రతిపాదన చేస్తామని ఈఈ ప్రసాద్ తెలిపారు.

- న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

నేటినుంచే యల్లారమ్మ జాతర

జామి, న్యూస్‌టుడే: ఉత్తరాంధ్రలో ప్రసిద్ధి చెందిన జామి యల్లారమ్మ జాతర ఈనెల 23, 24, 25 తేదీల్లో నిర్వహించేందుకు దేవాదాయ శాఖ ఏర్పాట్లు చేసింది. ఏటా జరిగే ఈ ఉత్సవాలకు రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా తెలంగాణ, ఒడిశా తదితర ప్రాంతాల నుంచి సుమారు వేలాది మంది వస్తారని అంచనా. తొలిరోజు తొలేళ్ల ఉత్సవాన్ని నిర్వహిస్తారు. ఆలయ పూజారి ఇంటి నుంచి ఆలయం వరకు అమ్మవారిని తీసుకువెళ్లి పసుపు, కుంకుమ, చీరలు సమర్పిస్తారు. 24న తీర్థ మహోత్సవం, 25న చినతీర్థం జరగనున్నాయి.

అలంకరణలో అమ్మవారు

ఏర్పాట్లు ఇలా..

ఆలయ ప్రాంగణంలో రద్దీ సమస్య తలెత్తకుండా క్యూలైన్లలో బారికేడ్లను ఏర్పాటు చేశారు. అదనంగా పారిశుద్ధ్య కార్మికులను తీసుకువస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా 200 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తున్నట్లు ఎస్సై వీర జనార్దన్ తెలిపారు. ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులను కేటాయించారు. వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారిణి సామ్రాజ్యలక్ష్మి అన్నారు. విద్యుత్తుకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నామని ఏఈ జ్యోతీశ్వరరావు అన్నారు. అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు ఆలయ ఈవో ప్రసాదరావు చెప్పారు. అధికారుల సహకారంతో జాతరను విజయవంతం చేయనున్నట్లు ఉత్సవ సేవా కమిటీ అధ్యక్షుడు అల్లాడ పెద్ద వెల్లడించారు.

❖ యల్లారమ్మను ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, ఎమ్మెల్సీ గాదె శ్రీనువాసులనాయుడు ఆదివారం దర్శించుకున్నారు. వీరికి ఈవో ప్రసాదరావు స్వాగతం పలికారు. అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం ఏర్పాట్ల గురించి అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. కొప్పల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ ఎం.శ్రీలక్ష్మి, సేవాకమిటీ అధ్యక్షుడు అల్లాడ పెద్ద, తెదేపా మండలాధ్యక్షుడు వర్రి రమణ తదితరులు పాల్గొన్నారు.

ఆలయం వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్లు

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

విజయనగరం గ్రామీణం: విజయనగరంలోని మండల పరిషత్తు కార్యాలయంలో సోమవారం పీజీఆర్ఎస్ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వెంకటరావు తెలిపారు. అర్జీదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

60 మందికి కంటి పరీక్షలు

ఎస్.కోట: ఎస్.కోటలోని గౌరీ సామాజిక భవనంలో వాసన్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 60 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించి, 20 మందిని శస్త్ర చికిత్సలకు సిఫార్సు చేశారు.

నిమ్మలపాలెంలో గడ్డివాము దగ్ధం

కొత్తవలస: అగ్నిప్రమాదంలో గడ్డివాము దగ్ధమైన ఘటన నిమ్మలపాలెంలో జరిగింది. అప్పలనాయుడుకు చెందిన గడ్డివాము నుంచి మంటలు చెలరేగడంతో అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు ఆర్పారు. నష్టం రూ.20 వేల వరకు ఉంటుందని అంచనా వేశారు.

అవినీతిపై దృష్టి పెట్టాలి

విద్యావిభాగం: విద్యాశాఖలో జరుగుతున్న అవినీతిపై దృష్టి పెట్టాలని రెవల్యూషనరీ స్టూడెంట్స్ యూనియన్ జాతీయ అధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. హౌసింగ్ కాలనీలో జరిగిన సమావేశంలో మాట్లాడారు.

వేపాడ: చామలాపల్లి పంచాయతీలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి జాతర ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా నిర్వహించిన మహిళల కోలాటం ఆకట్టుకుంది. సర్పంచి కె.సతీష్, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ..అన్నీ

దుస్తుల అందజేత

శృంగవరపుకోట: యంగ్‌స్టార్ స్పోర్ట్సు క్లబ్ సభ్యులు అడ్రీగుడ గిరిశిఖర గ్రామంలోని 40 కుటుంబాలకు దుస్తులు, దుప్పట్లు, విద్యార్థులకు దుస్తులు, పుస్తకాలు, వితంతువులు, ఒంటరి మహిళలకు బియ్యం అందజేశారు. క్లబ్ వ్యవస్థాపకుడు చాపా రామచంద్రరావు, వి.చందుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బంగారమ్మతల్లి తీర్థం

కొత్తవలస: చినరావుపల్లిలో బంగారమ్మతల్లి తీర్థ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. సర్పంచి బి.దేముడు తదితరులు ఉన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటు

వేపాడ: వావిలపాడు గ్రామానికి చెందిన రౌడీ బాయ్స్ యువజన సంఘం రూ.76 వేలతో 9 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి, పర్యవేక్షణను సచివాలయానికి అనుసంధానించారు. గ్రామ రక్షణ కోసం తీసుకున్న ఈ నిర్ణయాన్ని వల్లంపూడి ఎస్సై సుదర్శన్ అభినందించారు.

గౌరవ వేతనం ఇవ్వాలి

శృంగవరపుకోట: ఎంపీటీసీ సభ్యులకు 23 నెలల నుంచి, సర్పంచులకు ఏడు నెలల నుంచి గౌరవ వేతనం అందడం లేదని, వెంటనే చెల్లించాలని ఎంపీటీసీలు, సర్పంచులు ఎమ్మెల్సీ రఘురాజుకు వినతిపత్రం అందజేశారు. శాసన మండలిలో ప్రస్తావించానని ఆయన తెలిపారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

భోగాపురం, న్యూస్‌టుడే: గ్రామాల అభివృద్ధికి అధికారులు, నాయకులు కృషి చేయాలని ఎమ్మెల్సీ సురేష్‌బాబు అన్నారు. మండల ప్రజా పరిషత్తు కార్యాలయంలో ఎంపీపీ అనూషారెడ్డి అధ్యక్షతన ఆదివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వేసవి సమీపిస్తుండటంతో నీటి ఎద్దడి లేకుండా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఎ.రావివలస పంచాయతీలో మూడు నెలల క్రితం శ్మశానవాటికకు రహదారిని నిర్మించినా, ఎంబుక్‌లో రికార్డు చేయకుండా పంచాయతీరాజ్ జేఈ గణేష్ కాలయాపన చేస్తున్నారని సర్పంచి శివారెడ్డి ఆరోపించారు.



ఎల్లమ్మతల్లికి పూజలు

నగరంలోని సంగీత కళాశాల సమీపంలో ఎల్లమ్మతల్లి సిరుల జాతర ప్రారంభమైంది. తొలిరోజు అమ్మవారి పుట్టకు భక్తులు పసుపు, కుంకుమలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. ఆలయాన్ని విద్యుత్తు దీపాలతో అలంకరించారు. సోమవారం తొలేళ్లు, మంగళవారం సిరిమాను ఉత్సవం జరగనుంది. ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ తెలిపింది. - న్యూస్‌టుడే, కంటోన్మెంట్

గంజాయి విక్రయిస్తే చర్యలు

అయ్యన్నపేట, న్యూస్‌టుడే: గంజాయి విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ దామోదర్ ఓ ప్రకటనలో హెచ్చరించారు. మత్తు పదార్థాలతో ఎదురయ్యే అనర్థాలపై విద్యార్థులు, యువతకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. నిందితులను సకాలంలో అరెస్టు చేస్తున్నామని, జైళ్లకు పంపిస్తున్నామని చెప్పారు. ఫిర్యాదు చేయాలనుకుంటే 1972ను సంప్రదించాలన్నారు.

డాక్యుమెంట్ పోయినది

చందక సత్యవతి W/o లేటు రామారావు డోర్. నెం. 24-11-34. సుంకరవీధి, విజయనగరం నా యొక్క ఒరిజినల్ డాక్యుమెంట్ (ఇంటి యొక్క) No: 3250/11 గల బండి మీద తే॥ 28-01-2025న కోట జంక్షన్ వద్ద జిరాక్స్ షాపు కోట దరి వెళ్ళుచుండగా మార్గ మధ్యలో పడిపోయింది. ఎవ్వరికైనా దొరికినచో ఈ క్రింది నెంబరుకు తెలియజేయగలరు.

చందక సత్యవతి W/o లేటు రామారావు విజయనగరం, Cell: 9849647362

శ్రద్ధాంజలి

కరిగే కాలంలో తరగని జ్ఞాపకం మీరు, కదిలే ఆలోచనలో చెరగని స్మృతి మీరు. దివికేగిన మీ దివ్య ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుని ప్రార్థిస్తూ.... బాధాతప్త హృదయాలతో...

జననం 12-06-1942 మరణం 10-02-2026

కీ॥శే॥ విరోతి అచ్చియ్యమ్మ గారు, మాజీ సర్పంచ్, మాజీ ఎం.పీ.టీ.సి, తుమ్మికాపల్లి గ్రామం, కొత్తవలస మండలం

కుమారుడు - కోడలు: విరోతి కొండలరావు, సర్పంచ్ - వెంకటలక్ష్మి

కుమార్తెలు - అల్లుళ్లు: కనకమహాలక్ష్మి - శంకరరావు, రమణమ్మ - (లేటు) రాము

మనుమలు, మనుమరాండ్రు మరియు కుటుంబసభ్యులు, బంధుమిత్రులు

ఐటలు పెట్టడం & విందు: తే23-02-2026ది సోమవారం నాడు తుమ్మికాపల్లి గ్రామంలో స్వగృహమునందు జరుపబడును

అమృతమూర్తికి శ్రద్ధాంజలి

మరణం 19-02-2026

కీ॥శే॥ శిరికి సత్యనారాయణ గారు

Ex. Contractor, TDP Senior Leader

అలుగుబిల్లి, ఎస్‌కోట మండలం సెల్ : 9642240172, 9849240133

మంచికి మమతానురాగాలకు మారుపేరుగా నిలిచి అందరిని ఆప్యాయతగా పలకరిస్తూ.. ఉన్నతమైన వ్యక్తిత్వము కలిగిన మీరు మమ్ములను ఉన్నతులుగా తీర్చిదిద్ది కుటుంబ శ్రేయస్సుకై అహర్నిశలు శ్రమించిన మీరు మా నుండి దూరమైనను, మీ మధురస్మృతులు మా మదిలో పదిలం. మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ... భార్య: శిరికి దేముడమ్మ

కుమారులు - కోడళ్ళు: నాగేశ్వరరావు - లీల, గోపి - ఉమ, రాజేష్ - విద్యాసౌజన్య

తమ్ముడు మరియు కుటుంబము: శిరికి అప్పలనాయుడు - శిరికి ఎర్రమ్మ

కూతుళ్ళు - అల్లుళ్ళు: రంది ఎర్రయ్యమ్మ - రంది సూర్యారావు, చీకటి శ్రీదేవి - చీకటి అనిల్‌కుమార్

కుమారుడు - కోడలు: శిరికి రమణమూర్తి - శిరికి జయంతి

బావమరిది కుటుంబం: రాయవరపు అప్పలనాయుడు - మాధవి మరియు తోడల్లుళ్ళ కుమారులు: బొబ్బిలి నరసింహనాయుడు, బొబ్బిలి సత్యనారాయణ, చొక్కాకుల శ్రీను, చొక్కాకుల పైడంనాయుడు మరియు వారి కుటుంబ సభ్యులు.

పెద్దకర్మ: తే 23-02-2026 ది సోమవారం మా స్వగృహమందు జరుపబడును.

విస్తృతంగా జనసేన సభ్యత్వ నమోదు

భోగాపురం, న్యూస్‌టుడే: రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 26 నుంచి ప్రారంభంకానున్న జనసేన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం మాధవి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం నియోజకవర్గ నాయకులతో సమావేశమయ్యారు. అన్ని మండలాల్లో విస్తృతంగా చేపట్టాలని, ప్రతిజ్ఞకూరా బాధ్యత తీసుకోవాలన్నారు. నాయకులు వాసుదేవరావు, రమణ పాల్గొన్నారు.

ఉయ్యాలవాడకు నివాళులు

విజయనగరం ఉడాకాలనీ, అయ్యన్నపేట, న్యూస్‌టుడే: స్వాతంత్ర సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి మహనీయుడని సంయుక్త కలెక్టర్ ఎస్.సేధు మాధవన్ అన్నారు. ఆదివారం విజయనగరంలోని కలెక్టరేట్ ఆడిటోరియంలో జిల్లా యువజన సర్వీసులశాఖ ఆధ్వర్యంలో నరసింహారెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సెట్విజ్ సీఈవో విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ❖ నరసింహారెడ్డికి విజయనగరంలోని పోలీసు కార్యాలయంలో పలువురు అధికారులు, సిబ్బంది నివాళులర్పించారు.

నరసింహారెడ్డి చిత్రపటం వద్ద జేసీ తదితరులు

శ్రీవారి క్షేత్రంలో రద్దీ

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ కొనసాగింది. సెలవు రోజు కావడంతో భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. శుభ ముహూర్తాలు ఉండటంతో వివాహాలు, అన్న ప్రాసన కార్యక్రమాలు అధికంగా జరిగాయి.

లోకపావనీ.. జగజ్జననీ పెద్దింట్లమ్మ

కైకలూరు, న్యూస్‌టుడే: లోకపావనీ.. జగజ్జననీ.. పెద్దింట్లమ్మా శరణు.. శరణు.. అంటూ అమ్మవారి నామ స్మరణతో కొల్లేటి కోట మార్మోగింది. ఆదివారం పెద్దింట్లమ్మ జాతరకు ఉభయ గోదావరి, కృష్ణా, విశాఖ జిల్లాల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులతో అమ్మవారి దేవస్థానం కిటకిటలాడింది. మహిళలు ఆలయ ప్రాంగణంలో పాల పొంగళ్లు వండి పెద్దింట్లమ్మకు నైవేద్యం సమర్పించి పూజా కార్యక్రమాలు నిర్వహించి మొక్కులు చెల్లించుకుని దర్శించుకున్నారు. అంతకు ముందు ప్రధాన అర్చకుడు పరమేశ్వర శర్మ ఆధ్వర్యంలో పంచామృత పూజ, జల దుర్గకు ద్రవ్యోపచారాలతో అర్చన, ధూప సేవ, పంచ హారతులు వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దేవస్థాన ఛైర్మన్ జల్లూరి వెంకన్నబాబు, ఈవో కె.శ్రీనివాస్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అమ్మవారి దర్శనానికి క్యూ లైన్లలో వేచిఉన్న భక్తులు

ప్రజల దృష్టి మరల్చేందుకే హెరిటేజ్‌పై ఆరోపణలు

పాలకొల్లు, న్యూస్‌టుడే: శాసనమండలి సమావేశాల్లో శ్రీవేంకటేశ్వర స్వామి చిత్రపటాలను చిత్తు కాగితాల్లా విసిరేసిన వైకాపా ఎమ్మెల్సీలకు తిరుమల క్షేత్రం పవిత్రతపై మాట్లాడే నైతిక హక్కు లేదని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. యలమంచిలి మండలంలో ఆదివారం పర్యటించిన ఆయన కల్తీ నెయ్యి అంశంపై మాట్లాడారు. నెయ్యి విషయంలో జరిగిన తప్పును ఒప్పుకోకుండా ప్రజల దృష్టిని మరల్చేందుకే వైకాపా అధినేత జగన్, ఆపార్టీ నాయకులు హెరిటేజ్ సంస్థపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు. సాక్షాత్తూ జగన్ బాబాయ్ సుబ్బారెడ్డి సైతం లడ్డూ తయారీకి కల్తీ నెయ్యి వినియోగించినట్లు అంగీకరించారన్నారు. వైకాపా ప్రభుత్వ హయాంలో నెయ్యి కొనుగోళ్ల నిబంధనలను అడ్డగోలుగా సడలించి రూ.250 కోట్ల కుంభకోణానికి పాల్పడి తిరుమల పవిత్రతను దెబ్బతీసిన జగన్ ప్రజలకు క్షమాపణ చెప్పాలని వెల్లడించారు.

యలమంచిలిలో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న నిమ్మల

ఏటిగట్టు పనులపై అసంతృప్తి

ఏటిగట్టు పనుల తీరుపై మంత్రి నిమ్మల రామానాయుడు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. యలమంచిలి మండలంలో ఏటిగట్టు పనులను పరిశీలించిన ఆయన పర్యవేక్షణ అధికారులు, గుత్తేదారును పిలిపించి మాట్లాడారు. టెండరు నిబంధనల ప్రకారం ఏం చేయాలి, మీరు ఏం చేస్తున్నారంటూ ప్రశ్నించారు. నాణ్యత విషయంలో రాజీ పడితే ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని.. మీ తప్పిదాలకు మీరే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

నమ్మొద్దు.. మోసపోవద్దు..

దళారుల వలలో నిరుద్యోగుల విలవిల

భీమవరం పట్టణం, నరసాపురం, న్యూస్‌టుడే: ఉపాధి పేరుతో కేటుగాళ్లు యువతకు వల విసురుతున్నారు. విదేశాల్లో ఉద్యోగాలంటూ.. ప్రభుత్వ కొలువుల్లో చేరుస్తామంటూ సొమ్ములు లాగేస్తున్నారు. ఉద్యోగం ఆశతో నిరుపేద యువత అప్పులు చేసి మరీ సొమ్ములిచ్చి మోసపోతున్నారు. ఇచ్చిన సొమ్ము తిరిగి రాకపోగా కేటుగాళ్లు పత్తాలేకుండా పోతున్నారు. మోసపోయామని తెలుసుకున్నాక బాధితులు పోలీసుల్ని ఆశ్రయిస్తున్నారు.

● ప్రభుత్వాసుపత్రిలో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి ప్రసాద్‌రాజు అనే వ్యక్తి రెండు దఫాలుగా రూ.9.80 లక్షలు తీసుకొని ఉద్యోగం ఇప్పించలేదని భీమవరం రెండో పట్టణానికి చెందిన ఓ మహిళ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కొన్ని ఉదంతాలు..

● రైల్వేలో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి మోడి గ్రామానికి చెందిన ఓ యువకుడి నుంచి రూ.30 లక్షలు తీసుకొని హైదరాబాద్‌కు చెందిన ముఠా మోసగించింది.

● సచివాలయ ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి మొగల్తూరు మండలం కొత్తోటకు చెందిన ఇద్దరు యువకుల నుంచి రూ.12 లక్షలు తీసుకొని కేటుగాళ్లు కనిపించకుండా పోయారు.

● న్యాయస్థానంలో ఉద్యోగం ఇప్పిస్తానని ఓ కేటుగాడు రూ.2 లక్షలు తీసుకొని ప్రస్తుతం సమాధానం ఇవ్వడం లేదని వీరవాసరానికి చెందిన ఓ వ్యక్తి 'మీకోసం'లో ఫిర్యాదు చేశారు.

రెండేళ్లలో అప్పి, ఆర్థిక నేరాల గణాంకాలివీ	
2024	698
2025	516

● ప్రభుత్వ ఉద్యోగం ఎరవేసి తాడేపల్లిగూడేనికి చెందిన వ్యక్తి రూ.10 లక్షలు చొప్పున వసూలు చేశాడని తాడేపల్లిగూడెం పట్టణం, పెంటపాడు, తణుకు గ్రామీణ ప్రాంతాలకు చెందిన బాధితులు మీకోసంలో ఫిర్యాదు చేశారు.

● మంగళగిరి బెటాలియన్‌లో కానిస్టేబుల్‌నని, హోంగార్డు ఉద్యోగం ఇప్పిస్తానంటూ రూ.8.5 లక్షలు తీసుకుని మోసం చేశాడని నరసాపురానికి చెందిన ఒకరు వాపోయారు.

● తన కుమారుడికి ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి ఓ వ్యక్తి రూ.8 లక్షలు తీసుకొని మోసం చేశాడని భీమవరం పట్టణానికి చెందిన మహిళ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఇప్పటికీ 11 మంది.. గల్ఫ్‌లో ఉద్యోగాలిప్పిస్తామని నరసాపురం నియోజకవర్గానికి చెందిన వేములదీవి, సారవ, కేపీపాలెం తదితర ప్రాంతాలకు చెందిన యువకులను ఓ సంస్థ నమ్మించింది. ఒక్కొక్కరి నుంచి రూ.2.70 లక్షలు చొప్పున తీసుకుంది. నకిలీ పత్రాలతో ఆ సంస్థ మోసగించడంతో ఇప్పటికీ తేలిన 11 మంది బాధితులు పోలీసులను ఆశ్రయించారు. ముంబయికి చెందిన జోగిస్ సంస్థగా తెలుస్తోంది.

ఒత్తిళ్లతో ఆత్మహత్యలు ఉపాధి కల్పిస్తామని, ఉద్యోగాలిప్పిస్తామంటూ మోసగించారని 'మీకోసం'లో ఫిర్యాదులు వస్తూనే ఉన్నాయి. బయటకు రాకుండా రాజీ అయ్యేవి ఎక్కువగానే ఉంటాయి. హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలిప్పిస్తానని నిరుద్యోగులను నమ్మించాడు. ఒక్కొక్కరి నుంచి రూ.5 లక్షలు చొప్పున జిల్లాలోని ఏజెంట్ల ద్వారా వసూలు చేయించాడు. తర్వాత ఆ వ్యక్తి ఆచూకీ లేకపోవడంతో సొమ్ములు చెల్లించిన వారి నుంచి వస్తున్న ఒత్తిళ్లు తట్టుకోలేక భీమవరానికి చెందిన ఓ ఏజెంటు ఆత్మహత్యకు పాల్పడ్డారు.

ఎవరికీ డబ్బులివ్వొద్దు ప్రభుత్వ ఉద్యోగ ప్రకటన అనేది ప్రభుత్వం ముందుగా ప్రకటిస్తుంది. నిబంధనల మేరకు విద్యార్హతలు, మెరిట్ జాబితాననుసరించి ఉద్యోగాలకు ఎంపిక చేస్తారు. డబ్బులిచ్చి మోసపోవద్దు. **- అద్నాన్ నయిం అస్మి, ఎస్పీ**

నిమిషం ఆలస్యమైనా అనుమతించరు: కలెక్టర్

నేటి నుంచి నిఘా నీడన ఇంటర్ పరీక్షలు

భీమవరం అర్బన్, పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలో సోమవారం నుంచి జరుగనున్న ఇంటర్ పరీక్షల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని కలెక్టర్ నాగరాణి ఒక ప్రకటనలో తెలిపారు. 53 కేంద్రాల్లో 37,841 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు ఆమె వెల్లడించారు. ఉదయం 9 గంటలకు పరీక్ష ప్రారంభమవుతుందన్నారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా లోపలికి అనుమతించబోమని స్పష్టం చేశారు. ఉదయం 8.30కే కేంద్రాల వద్దకు చేరుకోవాలని మధ్యాహ్నం 12 గంటలకు పరీక్ష పూర్తయ్యేంత వరకు ఎవరినీ బయటకు విడిచిపెట్టరని తెలిపారు. అన్ని చోట్లా సీసీ టీవీ నిఘా ఏర్పాటు చేశామన్నారు. పరీక్ష కేంద్రాల్లోకి చరవాణి, స్మార్ట్‌వాచ్, కాలిక్యులేటర్ వంటివి తీసుకెళ్లరాదని సూచించారు. ఎక్కడా మాస్‌కాపీయింగ్‌కు తావు లేకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

● విద్యార్థులు నిర్ణీత సమయం కంటే ముందుగానే పరీక్ష హాల్‌కు చేరుకోవాలని డీఐఈవో సూచించారు. ఎక్కడైనా పరీక్షలకు సంబంధించి ఇబ్బందులుంటే జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి(డీఐఈవో) 99412 34240 నంబరుకు ఫోన్ చేయొచ్చన్నారు.

అలలపై.. ఆధ్యాత్మిక విహారం..!

భవిష్యత్తు పర్యాటకానికి పోలవరం

వేలేరుపాడు గ్రామీణ, న్యూస్‌టుడే: ఇప్పటివరకు మైమరిపించే ప్రకృతి అందాలతో పర్యాటకులను ఆకర్షిస్తున్న పాపికొండల యాత్ర.. పోలవరం ప్రాజెక్టు పూర్తయితే ఆధ్యాత్మిక పర్యాటకంగా మారబోతోంది. ఒకవైపు గోదావరి గలగలలు.. మరోవైపు ఎత్తయిన పాపికొండలు చూస్తూ నదిలో బోటు ప్రయాణం చేస్తున్న సందర్శకులకు రానున్న రోజుల్లో కొత్త అనుభూతి పరిచయం కానుంది.

ద్వీపాలుగా మారనున్న ఆలయాలు.. ప్రస్తుతం నదికి ఇరువైపులా చిన్నచిన్న కొండలపై ఆలయాలు ఉన్నాయి. ప్రాజెక్టు నిర్మాణం పూర్తయ్యాక ముంపు ప్రాంతమంతా గోదావరి విస్తరిస్తుంది. కొండలపై ఉండే ఆలయాలు ద్వీపాలుగా మారిపోతాయి. పాపికొండల పర్యాటకానికి ఇవి కొత్త వన్నె తీసుకురానున్నాయి.

ప్రత్యేక ప్రణాళికతోనే..

☛ వేలేరుపాడు మండలంలోని కట్కూరు శివాలయం నిర్వాహకులు పోలవరం ప్రాజెక్టు పూర్తయితే ఆలయం చుట్టూ ప్రత్యేక వసతి గృహాల సముదాయాలను ఏర్పాటుచేసి పర్యాటకంగా తీర్చిదిద్దాలనే ప్రణాళికతో ఉన్నారు.

☛ దేవీపట్నంలోని పూడిపల్లి కొండ, గండిపోశమ్మ ఆలయం, శ్రీరామగిరి, గొమ్ముగూడెం సుబ్రహ్మణ్య స్వామి ఆలయాల కొండలపై ప్రత్యేక వసతి గృహాలు నిర్మించి వసతులు సమకూర్చితే అద్భుతమైన పర్యాటకంగా మారుతుందని దేవాదాయ శాఖ అధికారులు గతేడాదే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు.

మధురానుభూతి.. ప్రస్తుతం పర్యాటకులు భద్రాచలం, వేలేరుపాడు నుంచి కోయిదాకు వాహనాల్లో ప్రయాణించి వరరామచంద్రాపురం మండలం పోచవరం రేవుకు చేరుకొని, అక్కడ లాంచీలు ఎక్కి ప్రకృతి అందాలు వీక్షిస్తున్నారు. ప్రాజెక్టు పూర్తయితే గోదావరి వెనుక జలాలు పెరిగి వేలేరుపాడు, వరరామచంద్రాపురం, కూనవరం, ఎటపాక మండలాల్లో చాలా గ్రామాలు, రహదారులు నీట మునుగుతాయి. ఈ నేపథ్యంలో రేవు దాదాపుగా భద్రాచలం దగ్గరగా వెళ్లిపోతుంది. పర్యాటకులు అక్కడే బోట్లు ఎక్కి పాపికొండలు వీక్షించుకుంటూ మధ్యలో ఆలయాలు సందర్శిస్తారు. దీంతో భక్తులకు, సందర్శకులకు మధురానుభూతిగా నిలిచిపోతుంది.

☛ ఈ పర్యాటకం ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లకముందే ప్రభుత్వం ఇప్పటి నుంచే దేవాదాయ, జలవనరులు, పర్యాటక శాఖల అధికారులు ప్రత్యేక ప్రణాళికతో వ్యవహరించి పర్యాటకంగా.. ఆధ్యాత్మికంగా తీర్చిదిద్దితే ఏటా రూ.కోట్ల ఆదాయం సమకూరుతుంది. స్థానిక ఆదివాసీలకు ఉపాధి మార్గంగా మారే అవకాశముంది.

రక్త పరీక్షా.. రేపు రండి..!

పీహెచ్‌సీల్లో ఎల్‌టీ, ఫార్మసిస్టుల కొరత

ఈనాడు డిజిటల్, భీమవరం, తణుకు, నరసాపురం, భీమవరం గ్రామీణం, పాలకొల్లు గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు ఏర్పాటు చేసిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో (పీహెచ్‌సీ) పూర్తిస్థాయిలో సిబ్బంది లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. మూడేసి రోజులు సర్దుబాటు చేయడంతో సిబ్బందిపై భారం పడుతుండగా, రోగులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పరిశీలన

రేలంగిలో ఖాళీగా ఉన్న ఫార్మసిస్టు కుర్చీ

● వేల్పూరు పీహెచ్‌సీకి బుధ, శనివారాల్లో పెనుమంట్ర పీహెచ్‌సీ నుంచి ఎల్‌టీ వస్తున్నారు. రేలంగిలో ఫార్మసిస్టు లేకపోవడంతో ఇరగవరం నుంచి సోమ, మంగళ, శుక్రవారాల్లో వచ్చి సేవలందిస్తున్నారు. అత్తిలిలో ఎల్‌టీ లేకపోవడంతో రేలంగి నుంచి మంగళ, గురువారాల్లో వెళ్లి సేవలందిస్తున్నారు.

● మొగల్తూరు పీహెచ్‌సీలో సగటున నిత్యం 60కి పైగా ఓపీ ఉంటుంది. ఫార్మసిస్టు ఇక్కడ, పోడూరులో మూడేసి రోజులు వంతున పని చేస్తున్నారు. స్టాఫ్ నర్సులు ముగ్గురు ఉండాల్సి ఉండగా ఇద్దరు, హెల్త్ అసిస్టెంట్స్ అయిదుగురికి ముగ్గురే ఉన్నారు.

● గొల్లవానితిప్ప పీహెచ్‌సీలో సరాసరిన రోజూ 30 ఓపీ ఉంటుంది. ఎల్‌టీ ఇక్కడ, కొణితివాడ పీహెచ్‌సీల్లో మూడేసి రోజులు సేవలందిస్తున్నారు. తుందుర్రు పీహెచ్‌సీలో ఫార్మసిస్టు లేరు. వారంలో మూడు రోజులు మార్టేరు నుంచి వచ్చి సేవలందిస్తున్నారు.

సిబ్బంది	ఉండాల్సింది	కొరత
ల్యాబ్ టెక్నీషియన్లు	34	13
ఫార్మసిస్టులు	34	13

మూడేసి రోజుల సర్దుబాటు.. జిల్లాలో 34 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలుండగా పూర్తిస్థాయిలో ఎల్‌టీలు, ఫార్మసిస్టుల లేరు. దీంతో మూడేసి రోజులు సర్దుబాటు చేశారు. పీహెచ్‌సీకి ఎంత మెడిసిన్ కావాలి, స్టాక్ నిర్వహణ, ఏఏ మాత్రలు ఎక్కువ వినియోగిస్తున్నారు వంటి సమాచారం ఫార్మసిస్టులు చూస్తారు. కొన్నిచోట్ల లేకపోవడంతో స్టాఫ్ నర్సులే ఆ బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు.

● 'రోగులకు ఇబ్బందులు లేకుండా సిబ్బందిని సర్దుబాటు చేశాం. పోస్టుల భర్తీ కోసం ఉన్నతాధికారులకు నివేదించాం.' అని డీఎంహెచ్‌వో గీతాబాయ్ వెల్లడించారు.

ఆర్థిక భారం.. పీహెచ్‌సీల్లో పూర్తిస్థాయిలో ఎల్‌టీలు లేకపోవడంతో ప్రభుత్వం నిర్దేశించిన పరీక్షలు జరగడం లేదని రోగులు వాపోతున్నారు. హిమోగ్లోబిన్, ప్లేట్‌లెట్ కౌంట్, టోటల్ బ్లడ్ సెల్ కౌంట్, రాండమ్ బ్లడ్ షుగర్, బ్లడ్ యూరియా, సీరం సోడియం, థైరాయిడ్, తదితర 63 పరీక్షలు చేయాలి. చాలాచోట్ల మధుమేహం, రక్తపోటు, థైరాయిడ్ పరీక్షలకు పరిమితం అవుతున్నారు. కొన్నిచోట్ల రక్త, మూత్ర నమూనాలను సేకరించి వేరొక పీహెచ్‌సీకి తీసుకెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. లంకలకోడేరు పీహెచ్‌సీలో ఎల్‌టీలున్నా యూరిన్ పరీక్షలు చేసే యంత్రం లేకపోవడంతో పాలకొల్లు ప్రాంతీయ ఆసుపత్రికి పంపిస్తున్నారు. ప్రైవేటు ల్యాబ్‌లను ఆశ్రయించడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని రోగులు వాపోతున్నారు.

పోలీసు శాఖలో ఏం జరుగుతోంది..?

☛ వరుస ఘటనలతో నిత్యం వార్తల్లో
☛ మొన్న డీఎస్పీ.. నేడు ఏఎస్పీ

ఈనాడు డిజిటల్, భీమవరం, భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: పోలీసు శాఖలో జరుగుతున్న వరుస ఘటనలు ఆ శాఖలో చర్చనీయాంశం అవుతున్నాయి. అప్పటి భీమవరం డీఎస్పీ ఆర్‌జీ జయసూర్యపై ఆరోపణలు రావడం, ప్రజాప్రతినిధులు పోటీపడి ఆయనకు మద్దతు పలకడం, అంతా సద్దుమణిగిందని అనుకున్న తరుణంలో బదిలీ కావడం రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఇటీవల తణుకు గ్రామీణ సీఐతోపాటు తణుకు రూరల్, అత్తిలి ఎస్సైలు సెలవులో వెళ్లిపోయారు. రోజుల వ్యవధిలో తణుకు పట్టణ స్టేషన్‌లో అనిశా నిర్వహించిన దాడుల్లో లంచం తీసుకుంటూ రైటర్ దొరికారు. ఈ ఘటనలు మరువక ముందే కాకినాడకు చెందిన దళిత యువకుడు వీధి సుబ్రహ్మణ్యం హత్య కేసులో ప్రధాన నిందితుడు, వైకాపా ఎమ్మెల్సీ అనంతబాబుకు అనుకూలంగా వ్యవహరించారనే ఆరోపణలతో అప్పటి కాకినాడ డీఎస్పీ, ప్రస్తుత పశ్చిమ గోదావరి జిల్లా ఏఎస్పీ భీమారావుపై సస్పెన్షన్ వేటు పడటం జిల్లాలో ప్రస్తుతం చర్చకు దారి తీసింది.

కొందరి తీరుతోనే.. పోలీసు శాఖపై ఆరోపణలు రావడం సహజమే అయినా జిల్లాలో ఇటీవల మరింత పెరిగాయి. తాజాగా ఏఎస్పీ భీమారావుపై వేటు పడటంతో పోలీసు శాఖ ఉన్నతాధికారులు ఆలోచనలో పడ్డారు. కొందరి తీరు వల్ల మొత్తం శాఖకు మచ్చ వస్తుందని, తీరు మారాలనే భావాన్ని వ్యక్తం చేస్తున్నారు. కొందరు పోలీసులు రాజకీయ నేతలకు తొత్తులుగా మారి శాఖాపరంగా, ఇతర అంశాలను ఎప్పటికప్పుడు చేరవేస్తున్నారు. ఫలితంగా.. కొందరు రాజకీయంగా లబ్ధి పొందుతుంటే... మరికొందరు బలవుతున్నారు. ప్రభుత్వాలు మారినప్పుడు ఉద్యోగుల పరిస్థితి మరింత దారుణంగా ఉంటోంది. విధుల్లో కచ్చితంగా వ్యవహరించాలంటే పోలీసుశాఖలో సాధ్యం కావడం లేదని కొందరు అధికారులు పేర్కొంటున్నారు.

దాటితే.. గండం గడిచినట్లే..

కామవరపుకోట మండలం కళ్లచెరువు సమీపంలో గుండేరుపై ఉన్న వంతెన కుంగిపోయి ప్రమాదకరంగా దర్శనమిస్తోంది. కనీసం రక్షణ గోడలు కూడా లేని పరిస్థితి. ఇదే వంతెనపై పామాయిల్ లోడ్‌లతో నిత్యం భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. 'నూతన వంతెన నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరైతే పనులు ప్రారంభిస్తాం' అని ర.భ శాఖ ఏఈ సుందర్రావు తెలిపారు. **- న్యూస్‌టుడే, కామవరపుకోట**

అల్లరిమూకలు.. జనం కేకలు
● భీమవరంలో భయం భయం
6లో
రైతులై.. గురువులై..
ప్రకృతి వ్యవసాయ సారథులుగా మహిళలు

అక్షరం.. ఆయుధం..

తణుకు, న్యూస్‌టుడే: విద్య.. పేదరికాన్ని సులువుగా జయించి ఉన్నత స్థానాలకు చేరడానికి ఏకైక అర్హత. చాలా మంది యాభై ఏళ్ల కిందటి పరిస్థితుల మాదిరిగా ఇప్పటికీ నిరక్షరాస్యులుగా మిగిలారు. దీంతో చిన్నపాటి అవసరాలకు సైతం ఇతరులపై ఆధారపడుతున్నారు. ఇలాంటి వారి కోసం ప్రభుత్వం అక్షర ఆంధ్ర పేరిట అక్షరాలు దిద్దిస్తూ వారిలో చైతన్యం నింపుతోంది.

వంద శాతం లక్ష్యంగా.. రాష్ట్రంలో వంద శాతం అక్షరాస్యత సాధించాలనే లక్ష్యంతో ప్రతి ఒక్కర్నీ విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ఉల్లాస్ అక్షర ఆంధ్ర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.

గ్రామాల్లో వయోజన విద్యను ప్రోత్సహిస్తూ మహిళా సమాఖ్య, ఉపాధి హామీ పథకాల్లో ఉన్న నిరక్షరాస్యులను గుర్తించి పది మంది వయోజనులకు ఒక వాలంటీర్ ద్వారా శిక్షణ ఇచ్చే ఏర్పాట్లు చేశారు. అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని పురస్కరించుకొని సెప్టెంబరు 8న ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభించారు. చదువురాని వయోజనులకు వంద గంటలపాటు నిర్దేశించిన అంశాలపై శిక్షణ ఇస్తున్నారు.

శిక్షణ ఇస్తున్న వాలంటీర్

ఉపయోగాలివీ.. మహిళా సమాఖ్య యానిమేటర్లు సాయంత్రం వేళ గ్రూపు సభ్యుల్లో గుర్తించిన వయోజనులకు పాఠాలు చెబుతారు. ప్రాథమిక అక్షరాస్యత, డిజిటల్ విద్య, ఆర్థిక విద్య, జీవన నైపుణ్యాలపై తరగతులు నిర్వహిస్తారు. పెద్దలకు అక్షరాలను సులభంగా గుర్తించడం, రాయడం, చదవడం నేర్పిస్తారు. బయటకు వెళ్లినప్పుడు ఒకరిపై ఆధారపడకుండా గ్రామాల పేర్లు, బోర్డులపై ఉన్న అక్షరాలు, దినపత్రికలు చదవగలుగుతారు. రాష్ట్రాన్ని అక్షరాస్యతలో అగ్రగామిగా లేదా ఒకటి నుంచి మూడు స్థానాల్లో నిలబెట్టే దిశగా అడుగులు వేస్తున్నారు. మండల స్థాయిలో ఎంపీడీవో, ఎంఈవో, ఏపీఎం, ఏపీవోల ద్వారా పర్యవేక్షిస్తున్నారు.

69,392 మంది అక్షరాస్యులుగా..

జిల్లాలో మెప్మా, డీఆర్డీఏ, డ్వామా పరిధిలో ఈ ఏడాది 69,392 మంది వయోజనులను అక్షరాస్యులుగా మార్చేందుకు ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించింది. 45 గంటలు తరగతి గదిలో, 40 గంటలు సాధన పత్రాలు, 15 గంటలు డిజిటల్ వీడియోల ద్వారా పది మందికి ఒకరు చొప్పున వాలంటీర్లు క్షేత్రస్థాయిలో శిక్షణ ఇస్తున్నారు. వారు నేర్చుకున్న అంశాలపై మార్చి 29న పరీక్ష నిర్వహించి ధ్రువపత్రాలు అందజేస్తాం.
- కేవీవీ సత్యనారాయణ, వయోజన విద్య జిల్లా నోడల్ అధికారి

గ్రామ పంచాయతీలకు ఊరట

ఆర్థిక సంఘం నిధుల చెల్లింపునకు ఉత్తర్వులు

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీల్లోని ఆర్థిక సంఘం నిధుల చెల్లింపులపై కూటమి ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. ఏప్రిల్‌తో పంచాయతీల పాలకవర్గాల గడువు ముగియనుంది. ఈ నేపథ్యంలో ఆర్థిక సంఘం నిధులను ఇష్టానుసారంగా ఖర్చు చేస్తున్నట్లు ప్రభుత్వం దృష్టికెళ్లింది. వీటి వినియోగంలో పారదర్శకత పాటించేలా చర్యలకు ఉపక్రమించింది. ఇష్టానుసారంగా బిల్లులు పెట్టొద్దంటూ నిధుల వినియోగంపై ప్రత్యేక మార్గదర్శకాలు విడుదల చేసింది. తాజాగా మార్గదర్శకాలను సడలిస్తూ.. ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

సర్పంచులకు తీపి కబురు.. జిల్లా వ్యాప్తంగా 27 మండలాల్లో 544 పంచాయతీలున్నాయి. ఆర్థిక సంఘం నిధుల్లో 30 శాతం పారిశుద్ధ్యం, 30 శాతం తాగునీటి సరఫరా, మిగతా 40 శాతం ఇతరత్రా పనులకు వెచ్చించాలి. తాజాగా 2025-26 సంవత్సరానికి 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.33.21 కోట్లు విడుదలయ్యాయి. వాటిలో టైడ్ రూ.19.92 కోట్లు, అన్‌టైడ్ నిధి కింద రూ.13.28 కోట్లను పంచాయతీల ఖాతాల్లో జమ చేశారు. ఇప్పటి వరకున్న నిబంధనలకు సడలింపులివ్వడంతో.. సర్పంచులకు ఊరట లభించింది.

పనుల్లో వేగం.. ఇప్పటికే పల్లె పండగ నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేస్తున్నారు. తాజాగా ఆర్థిక సంఘం నిధులతో మరిన్ని పనులు చేపట్టేందుకు మార్గం సుగమమైంది. మౌలిక వసతుల కల్పనకు అడుగులు పడుతున్నాయి. మార్చి నెలాఖరులోపు పనులు పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం నిధులు వినియోగించాలని జిల్లా పంచాయతీ అధికారి కె.అనురాధ తెలిపారు.

నీడ లేక.. నిలువ లేక!

● జాతీయ రహదారులపై కానరాని బస్సు షెల్టర్లు
● ఎండలకు అల్లాడుతున్న ప్రయాణికులు

భీమడోలు మండలం పూళ్ల, భీమడోలులో 216ఏ జాతీయ రహదారిపై షెల్టర్లు ఉండగా.. బస్సులు మాత్రం ఆపడం లేదు. ఇవి నిరుపయోగంగా మారడంతో.. రైతులు వ్యవసాయోత్పత్తులు ఆరబెట్టుకుంటున్నారు. 16వ నంబరు జాతీయ రహదారి సర్వీస్ రోడ్లపై పోలసానిపల్లి వద్ద ఇరువైపులా బస్సు షెల్టర్లు నిర్మించారు. ఈ మార్గంలో బస్సులు తిరగవు.

ఉంగుటూరు, భీమడోలు, ఏలూరు అర్బన్, కొయ్యలగూడెం గ్రామీణ- న్యూస్‌టుడే: జాతీయ రహదారుల అభివృద్ధి, విస్తరణకు ప్రభుత్వాలు ప్రాధాన్యమిస్తున్నాయి. ప్రయాణికుల ప్రాథమిక అవసరాలు తీర్చడంలో మాత్రం విఫలమవుతున్నారు. కనీసం నీడనిచ్చే షెల్టర్లు ఏర్పాటు చేయడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారు. నిలువ నీడ లేక ఎండలో రహదారుల వెంబడి ప్రయాణికులు ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ నిరీక్షిస్తున్నారు. కొన్నిచోట్ల బస్సులు తిరగని మార్గాల్లో నిర్మించిన షెల్టర్లు నిరుపయోగంగా మారాయి. ఇంకొన్ని చోట్ల షెల్టర్ల వద్ద బస్సులు ఆపడం లేదు.

● కొయ్యలగూడెం మండలం బయ్యనగూడెంలో 516డి జాతీయ రహదారి ప్రధాన కూడలిలో బస్సు షెల్టర్ లేదు. ఇటు జంగారెడ్డిగూడెం.. అటు రాజమహేంద్రవరం వైపు నిత్యం వేల మంది రాకపోకలు సాగిస్తుంటారు. విద్యార్థులు, ఉద్యోగులు, వృద్ధులు దుకాణాల ముందు నిల్చొని బస్సుల కోసం వేచి చూడాల్సి వస్తోంది.

ఉంగుటూరు మండలం కైకరంలో బస్సు షెల్టర్ నిర్మించలేదు. అక్కుపల్లి గోకవరం, తిమ్మయ్య పాలెం, రామన్నగూడెం, లంకమాలపల్లి, వెంకటకృష్ణాపురం, బ్రహ్మానందపురం గ్రామాల ప్రజలు 216 ఏ జాతీయ రహదారి మీదుగా తాడేపల్లిగూడెం, తణుకు, రాజమహేంద్రవరం వెళ్లేందుకు ఇక్కడే నిరీక్షిస్తుంటారు. బస్సులొచ్చే వరకూ మండుటెండలో పడిగాపులు కాస్తుంటారు.

పెరిగిన ఆదరణ.. స్త్రీశక్తి పథకంతో ఆర్టీసీ బస్సులకు ఆదరణ లభిస్తోంది. రోజురోజుకూ ప్రయాణికుల సంఖ్య పెరుగుతోంది. చాలా ప్రాంతాల్లో బస్సు షెల్టర్లు లేకపోవడంతో.. వృద్ధులు, మహిళలు, చిన్నారులు, విద్యార్థులు మండుటెండలో వేచి చూస్తున్నారు. వేసవి ప్రారంభమై ఎండలు పెరుగుతున్న తరుణంలో.. చెట్ల కింద, దుకాణాల ముందు నిలబడుతున్నారు. 'ప్రయాణికులు చేతులెత్తిన చోట బస్సులు ఆపకుండా వెళ్లే సిబ్బందిపై చర్యలు తీసుకుంటాం. ప్రయాణికుల సౌకర్యార్థం బస్సు షెల్టర్ల వద్ద బస్సులు నిలపాలి. షెల్టర్లు లేని చోట దాతల సహకారంతో ఏర్పాటు చేయిస్తాం' అని జిల్లా ప్రజా రవాణాధికారిణి షబ్నం తెలిపారు.

క్రికెట్ మ్యాచ్‌లో పాల్గొన్న జేసీ, ఆర్డీవో, రెవెన్యూ ఉద్యోగులు

ఆటలతో ఆరోగ్యం : జేసీ

భీమవరం అర్బన్, న్యూస్‌టుడే: ఆటల వల్ల ఒత్తిడి తగ్గడమే కాకుండా శారీరక దారుఢ్యం లభిస్తుందని జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి అన్నారు. భీమవరం మండలం యనమదుర్రులోని విష్ణు క్యాంపస్ మైదానంలో ఆదివారం రెవెన్యూ, సర్వే శాఖలు, పౌరసరఫరాల సంస్థకి చెందిన జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా జేసీ హాజరై కాసేపు బ్యాటింగ్ చేసి ఉద్యోగులను ఉత్సాహపరిచారు. తరచూ ఇలా ఆటలు ఆడాలని సూచించారు. ఆర్డీవో ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన మ్యాచ్‌లో తహసీల్దార్ రావి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు యథావిధిగా పీజీఆర్ఎస్

భీమవరం అర్బన్, న్యూస్‌టుడే: సోమవారం జరగాల్సిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కలెక్టరేట్‌లో యథావిధిగా కొనసాగుతుందని కలెక్టర్ నాగరాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జరిగే కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కలెక్టరేట్‌తోపాటు డివిజన్, మున్సిపల్, మండల కార్యాలయాల్లోనూ ఈ కార్యక్రమం కొనసాగుతుందని వెల్లడించారు.

(c) eenadu

కులమతాలకతీతంగా సమ భావంతో పని చేస్తున్నాం

నృత్య ప్రదర్శనలో చిన్నారులు

పెదఅమిరం(కాళ్ల), న్యూస్‌టుడే: వివేకానందుని స్ఫూర్తితో కులమతాలకతీతంగా సమాన భావంతో పని చేస్తున్నామని స్వామి వివేకానంద సేవా సమితి అధ్యక్షుడు వేగిరాజు శివవర్మ అన్నారు. పెదఅమిరం వివేకానంద ఎక్సలెన్సీ హాల్‌లో ఆదివారం రాత్రి నిర్వహించిన సమితి వార్షికోత్సవంలో ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతానికి స్వామి వివేకానంద మార్గ్‌గా నామకరణం చేసేందుకు ఉప సభాపతి రఘురామకృష్ణరాజు చొరవతో కలెక్టర్ నాగరాణి అనుమతివ్వడం శుభ పరిణామమన్నారు. తాను చేస్తున్న సేవా కార్యక్రమాలకు కనుమూరు గోపాలరాజు(జీకేఎఫ్ గోపి), కనుమూరు రామకృష్ణంరాజు ప్రోత్సాహం ఎనలేనిదని కొనియాడారు. అనంతరం విద్యార్థినులు పలు సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు. సమితి గౌరవాధ్యక్షులు పెదసోమరాజు, అల్లూరి సీతారామరాజు, డాక్టర్ సోమరాజు, కార్యదర్శి దాట్ల నారాయణరాజు, వేగిరాజు సుజాత, తెలంగాణ నుంచి వచ్చిన అతిథులు పాల్గొన్నారు.

కుల వృత్తులు లేని సమాజం లేదు: మంత్రి

మాట్లాడుతున్న పార్థసారథి

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: దేశంలో కుల వృత్తులు లేకుండా సమాజం లేదనే విషయం ప్రతి ఒక్కరూ గుర్తించాలని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఆదివారం సాయంత్రం నూజివీడులోని రాజీవ్ సర్కిల్ వద్ద రజక ఆత్మీయ మహాసభకు ఆయన హాజరయ్యారు. మాజీ ఎమ్మెల్సీ డి.రామారావుతో కలిసి జ్యోతి వెలిగించి కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తరతరాల నుంచి వస్తున్న రజక వృత్తిని జాతి మరవకూడదన్నారు. ఈ జాతి అభివృద్ధి కోసం రూ.వంద కోట్లు కేటాయించినట్లు చెప్పారు. ఇది ఒక్క తెదేపాతోనే సాధ్యమని స్పష్టం చేశారు. బీసీ వర్గాలు పారిశ్రామికంగా ఎదగడానికి తన వంతు సహకారం అందిస్తానన్నారు. రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని పార్లమెంటుకు పంపిన ఏకైక పార్టీ తెదేపాయేనని గుర్తు చేశారు. రజకులు వినియోగించే చెరువుల అభివృద్ధికి వారి హక్కులను కాపాడేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. చట్ట సభల్లో, స్థానిక సంస్థల ఎన్నికల్లో దామాషా ప్రకారం సీట్లు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. పలువురు రజకులకు ఇస్త్రీ పెట్టెలను అందించారు. పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు. పట్టణ సీఐ సత్య శ్రీనివాస్, ఎస్సై నాగేశ్వరరావు బందోబస్తు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ధరల పాలసీ ప్రకటించకుంటే ఉద్యమం

నినాదాలు చేస్తున్న నాయకులు, రైతులు

విజయరాయి(పెదవేగి), న్యూస్‌టుడే: కోకో గింజలకు వారం రోజుల్లో ధరల పాలసీ ప్రకటించాలని, లేని పక్షంలో ఉద్యమానికి పూనుకుంటామని ఏపీ కోకో రైతుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొల్లు రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి గుదిబండి వీరారెడ్డి డిమాండ్ చేశారు. విజయరాయి గాంధీ నగర్‌లోని సీతారామ కల్యాణ మండపంలో ఆదివారం కోకో రైతుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. ఆయిల్‌పామ్ గెలల తరహాలో కోకో గింజలకు ధర నిర్ణయించాలన్నారు. కంపెనీలు ఇష్టానుసారంగా ధరలు తగ్గిస్తుండటంతో.. కోకో రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. కోకో రైతుల సంఘం ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ.. అంతర్జాతీయ మార్కెట్ ధరలు తగ్గాయన్న సాకుతో రూ.50 వరకు తగ్గించడం దుర్మార్గమని మండిపడ్డారు. ప్రాంతీయ కొబ్బరి రైతుల సంఘం ఉపాధ్యక్షుడు మున్నంగి సుబ్బారెడ్డి, కోకో రైతులు పి.నరసింహారావు, పి.రాంబాబు, కె.సతీశ్‌బాబు, ఆలపాటి శ్రీనివాసరావు, పానుగంటి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

గుబ్బలమంగమ్మ గుడికి భక్తుల తాకిడి

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: బుట్టాయగూడెం మండలం కామవరం అడవిలోని గుబ్బల మంగమ్మ గుడికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. నైవేద్యాలు సమర్పించి, ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం వృక్షాల కింద సహపంక్తి భోజనాలు చేశారు.

అల్లరిమూకలు.. జనం కేకలు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే

జిల్లా కేంద్రం.. విద్య, వైద్య, వాణిజ్య కూడలి భీమవరంలో అల్లరిమూకలు పేట్రేగిపోతున్నాయి. మద్యం, గంజాయి మత్తులో నడిరోడ్డుపై ఘర్షణలకు దిగుతున్నారు. మత్తులో ఏం చేస్తున్నారో తెలియడం లేదు. పట్టణ శివారు ప్రాంతాలతో పాటు నడిబొడ్డున ఉన్న ఖాళీ ప్రదేశాలను వీరు అడ్డాగా చేసుకుంటున్నారు. ఉండి రోడ్డు పొడవునా రాత్రివేళల్లో కొందరు మహిళల వాహనాలు అడ్డగించి డబ్బులు గుంజుతున్నారు. బైపాస్, ప్రధాన కూడళ్లలో నిలిపిన వాహనాల చోదకుల దగ్గరకు వెళ్లి బెదిరించి చరవాణులు లాక్కెళ్లిపోవడం జరుగుతోంది. దీంతో రాత్రి పూట బయటకు రావాలంటే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది.

భీమవరంలో భయం భయం

☛ ఉండి రోడ్డులోని ఓ హోటల్ యజమాని దగ్గరకు గుర్తుతెలియని వ్యక్తి వెళ్లి కత్తితో బెదిరించి అతని దగ్గర ఉన్న నగదుతో పారిపోయాడు. దీనిపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

☛ భీమవరం ఒకటో పట్టణంలో బస్టాండ్ దగ్గర అర్ధరాత్రి అల్లరి చేస్తున్న వారిని అడ్డుకున్న పోలీసులపైనే దాడికి తెగబడ్డారు. కొందరిని పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

☛ ఇతర ప్రాంతాల నుంచి వచ్చి కూలి పనులు చేసుకుంటూ బైపాస్ రోడ్డు కూడలి, రైల్వే అండర్ పాస్‌లో ఉంటున్న వృద్ధుల దగ్గరకు యువకులు ముఠాలుగా వస్తున్నారు. వాళ్లని బెదిరించి నగదు లాక్కెళ్లిపోతున్నారు. అడ్డుకుంటే రక్తం కారేలా కొట్టి గాయపరుస్తున్నారు.

☛ ఒకటో పట్టణానికి చెందిన విభిన్న ప్రతిభావంతుడు ఒకరు రాత్రి సమయంలో ఇంటికెళ్లకుండా పీపీ రోడ్డు పక్కన దుకాణం అరుగులపై పడుకున్నాడు. కొందరు యువకులు అతని దగ్గరకు వెళ్లి నగదు లాక్కున్నారు.

ఎక్కడెక్కడంటే.. ఉండి రోడ్డు, రైల్వే జంక్షన్, టౌన్ రైల్వేస్టేషన్‌కు వెళ్లే దారి, బైపాస్, లూథరన్ క్రీడా మైదానం, బ్యాంకు కాలనీ, మెంటేవారితోట, గొల్లవానితిప్ప రోడ్డు, బలుసుమూడి శివారు ప్రాంతాలు. వీటితోపాటు పలు చోట్ల ఇటీవల ఘటనలు చోటుచేసుకోగా కొన్ని మాత్రమే పోలీసుస్టేషన్‌కు చేరాయి.

గస్తీ ఎక్కడా?.. రాత్రిపూట పోలీసుల నిఘా పలుచోట్ల అంతంతమాత్రంగానే ఉంటుంది. గతంలో ప్రత్యేక బీట్లు కొన్ని బృందాలుగా ఏర్పడి గస్తీ నిర్వహించేవారు. ఇప్పుడా పరిస్థితి లేకపోవడంతోనే అల్లరిమూకలు రెచ్చిపోతున్నాయని, వారిని రాజకీయ ముసుగులో కొందరు వెనుకేసుకెళ్తున్నారనే విమర్శలొస్తున్నాయి. రాత్రివేళలో నిఘా పెంచి ప్రజలకు భరోసా కల్పించేలా ఉన్నతాధికారులు దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

పోలీసులకు సమాచారం ఇవ్వండి..

భీమవరం పరిసరాల్లో రాత్రివేళల్లో 10 బీట్‌లు ఉన్నాయి. అన్ని ప్రాంతాల్లో నిఘా ఉంచాం. రాత్రి అనుమానంగా తిరుగుతున్నా, దందాలకు పాల్పడినట్లు సమాచారం ఉన్నా పోలీసులకు సమాచారం ఇస్తే వెంటనే అదుపులోకి తీసుకుంటాం.

- రఘువీర్‌విష్ణు, భీమవరం డీఎస్పీ

భగవంతుడితో రాజకీయాలు చేస్తారా?

శాసనమండలిలో వైకాపా సభ్యుల చిత్రాలు చూపుతున్న రామరాజు, గోవిందరావు, శ్రీదేవి

భీమవరం అర్బన్, న్యూస్‌టుడే: ప్రజలు 11 సీట్లకే పరిమితం చేసినా వైకాపా నేతలకు బుద్ధి రాలేదని తెదేపా జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజు, జనసేన జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు, భాజపా జిల్లా అధ్యక్షురాలు అయినంపూడి శ్రీదేవి విమర్శించారు. భీమవరంలోని తెదేపా జిల్లా కార్యాలయంలో ఆదివారం వారు విలేకరులతో మాట్లాడారు. తిరుపతి లడ్డూ నుంచి ప్రతి విషయంలోనూ హిందువుల మనోభావాలను దెబ్బ తీయడమే ఆ పార్టీ పనిగా పెట్టుకుందన్నారు. భవిష్యత్తులో మనుగడ లేదనే విషయం గమనించి ప్రజల్ని మతం, కులం పేరిట చిచ్చుపెట్టే కుట్రలు పన్నుతున్నారన్నారు. హిందువుల మనోభావాలను పట్టించుకోని జగన్.. పచ్చి బూతులు మాట్లాడే వైకాపా నేతల్ని వెనకేసుకు రావడం సిగ్గుచేటన్నారు. శాసనమండలిలో బొత్స సత్యనారాయణతోపాటు ఆ పార్టీ నాయకులు వేంకటేశ్వరస్వామి ఫొటోలు పట్టుకుని చేసిన హంగామా గురించి ప్రస్తావించారు. ప్రజా సమస్యలు, అభివృద్ధి మీద మాట్లాడకుండా కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. డబ్బొస్తే చాలు దేవుడితో నాకేం పని అన్నట్లుగా వ్యవహరిస్తున్న జగన్‌రెడ్డి తీరు మార్చుకోకపోతే ఇప్పుడు 11 సీట్లు ఇచ్చిన ప్రజలు వచ్చే ఎన్నికల్లో ఒక్క సీటుకే పరిమితం చేస్తారని పేర్కొన్నారు.

హేతువాద సంఘ నాయకురాలి మృతి

దమయంతి (పాత చిత్రం)

భీమవరం అర్బన్, న్యూస్‌టుడే: హేతువాద సంఘం జిల్లా మాజీ అధ్యక్షురాలు కడలి దమయంతి ఆదివారం భీమవరంలో మృతి చెందారు. ఆమె భర్త కడలి శ్రీరామమూర్తి ప్రముఖ హేతువాది, ఉపాధ్యాయుడు. ఆయన 1983లోనే మృతి చెందారు. ఆయన ఆశయాలకు కొనసాగింపుగా ఆమె సంఘంలో చేరి ఉద్యమాన్ని సమర్థంగా నడిపారు. ప్రముఖ హేతువాదులు కత్తి పద్మారావు, రావిపూడి వెంకటాద్రి, వంగపండు ప్రసాద్, సల్లాది భాస్కరరావు, కఠారి ప్రభాకరరావు తదితరులతో కలిసి పని చేశారు. ఆమె మృతి పట్ల పలువురు ప్రముఖులు సంతాపం తెలిపారు.

నేడు 'డయల్ యువర్ సీఎండీ'

గురుద్వారా (విశాఖపట్నం), న్యూస్‌టుడే: విద్యుత్తు సంబంధిత సమస్యలను మరింత వేగవంతంగా పరిష్కరించే లక్ష్యంతో విశాఖలోని ఈపీడీసీఎల్ కార్యాలయంలో సోమవారం 'డయల్ యువర్ సీఎండీ' కార్యక్రమం నిర్వహించనున్నట్లు సంస్థ సీఎండీ ఇమ్మడి పృథ్వీతేజ్ ఓ ప్రకటనలో తెలిపారు. సంస్థ పరిధిలోని 13 జిల్లాలకు చెందిన వినియోగదారులు 86884 00499 ఫోన్ నంబర్ ద్వారా తమ సమస్యలను తెలియజేయవచ్చునని పేర్కొన్నారు. ఉదయం 10.30 నుంచి 11.30 వరకు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యుత్తు సరఫరాలో తరచూ అంతరాయాలు, హెచ్చుతగ్గులు, కొత్త సర్వీసుల జారీ, సరఫరా పునరుద్ధరణలో జాప్యం, ట్రాన్స్‌ఫార్మర్ల మార్పిడి తదితర సమస్యలపై ఫిర్యాదులను నేరుగా తన దృష్టికి తీసుకురావొచ్చునన్నారు.

రైతులై.. గురువులై..

ప్రకృతి వ్యవసాయ సారథులుగా మహిళలు

నాణ్యమైన ఉత్పత్తులు, అధిక దిగుబడులే లక్ష్యం

కషాయాల తయారీ నేర్పుతూ..

కైకలూరు, మండవల్లి, ముదినేపల్లి, న్యూస్‌టుడే: తామే రైతులు.. తామే గురువులుగా మారిన మహిళలు ప్రకృతి సాగు పాఠాలను బోధిస్తున్నారు. రైతు అనగానే తలకు పాగా చుట్టి పొలంలో శ్రమిస్తున్న పురుషుడి రూపం మాత్రమే మన ఊహకు అందుతుంది. అయితే మహిళా రైతులు ప్రకృతి వ్యవసాయంలో ఉద్యోగులుగా మారి విలువైన సలహాలు, సూచనలతో అద్భుతాలు సృష్టిస్తున్నారు. పొలాన్ని సిద్ధం చేయడం, విత్తనశుద్ధి, ప్రకృతి ప్రసాదంగా అందించిన ఎరువుల వాడకం, కషాయాలు తయారు చేసి చీడ పీడలు నివారించడం, కోత కోసే వరకు మహిళల పాఠాలే రైతులకు వరంగా మారుతున్నాయి.

75 శాతం మహిళలే.. జిల్లా వ్యాప్తంగా 200 ఆర్‌ఎస్‌కేల పరిధిలో ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరించగా ప్రస్తుతం 400 మంది వరకు మహిళా ఉద్యోగులే తమ పాఠాలతో రైతులను చైతన్య పరుస్తున్నారు. సీఆర్పీల సలహాలతో రెండేళ్ల కిందట పెరిగిన పరిధిలో ఎకరాకు 45 బస్తాల దిగుబడి సాధించారు. మరోవైపు ఇళ్ల వద్ద ఉంటున్న మహిళలను కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు పండించి ఆదాయం ఆర్జించేలా అవగాహన కల్పిస్తున్నారు.

చిన్నప్పటి నుంచి ఇష్టం

స్వతహాగా మాది రైతు కుటుంబం. నాన్న పొలానికి వెళ్తుంటే నేనూ వెళ్లేదాన్ని. పెళ్లయిన తర్వాత రైతుగా మారి భర్త కృష్ణారావుకు తోడుగా ఉన్నా. 2017లో ప్రకృతి వ్యవసాయంలో శిక్షణ తీసుకుని ఐసీఆర్పీగా ఉద్యోగంలో చేరా. ప్రస్తుతం నా క్లస్టర్‌లో 100 మందికి పైగా రైతులు ప్రకృతి వ్యవసాయం ఆచరించడం ఎంతో సంతోషం కలిగిస్తోంది.

- నాగవిజయ, సీఆర్పీ, మండవల్లి

పొలమే పాఠశాల

ప్రకృతి వ్యవసాయంలో పొలమే పాఠశాలగా మారి అన్నీ తానై నేర్పుతుంది. దానికి శ్రద్ధగా మనసు పెడితే చాలు. ఆరేళ్లుగా ప్రకృతి వ్యవసాయం చేస్తూ నాలుగేళ్లుగా శిక్షణ ఇస్తున్నా. రైతులకు కషాయాలు, ద్రావణాలు తయారీపై అవగాహన కల్పిస్తున్నా. నాణ్యమైన మంచి దిగుబడే లక్ష్యంగా పనిచేస్తున్నా.

- అనూష, ముదినేపల్లి క్లస్టర్

ప్రకృతి వనరుల సద్వినియోగం

భారతదేశ పురాతన విజ్ఞానాన్ని పక్కన పెట్టి ఆధునిక పోకడతో ఇష్టారాజ్యంగా కుమ్మరిస్తున్న ఎరువులు పురుగుమందులతో నేలలు జీవాన్ని పోగొట్టుకుంటున్నాయి. సేంద్రియ కర్బన పదార్థాన్ని పెంపొందించేందుకు నా వంతుగా అవగాహన కల్పిస్తున్నా. నాలుగేళ్లుగా వందల ఎకరాల్లో పొలాలు సేంద్రియ వ్యవసాయం వైపు మళ్లించినందుకు ఆనందంగా ఉంది.

- నీలపాల గంగాభవాని, కైకలూరు

బలవంతపు భూ సేకరణ తగదు

పవరుపేట (ఏలూరు వన్‌టౌన్), న్యూస్‌టుడే: ఆయుధాగారం ఏర్పాటుకు తాము వ్యతిరేకం కాదని, బలవంతపు భూ సేకరణ మాత్రమే వ్యతిరేకిస్తున్నామని అఖిలపక్ష పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు స్పష్టం చేశారు. పవరుపేటలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో కొయ్యలగూడెం మండలంలో ఆయుధాగార నిర్మాణానికి బలవంతపు భూ సేకరణకు వ్యతిరేకంగా రౌండ్ టేబుల్ సమావేశం ఆదివారం నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి అధ్యక్షత వహించారు. పలువురు మాట్లాడుతూ.. ప్రజల అనుమతి లేకుండా నిర్మాణం చేపట్టబోమని నేతలు చెబుతున్నా.. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం బలవంతంగా భూములు సేకరిస్తోందని ఆరోపించారు. వైకాపా జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు ఎస్.రాజశేఖర్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని చిరు వ్యాపారి మృతి

కైకలూరు, న్యూస్‌టుడే: కారు ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని ఆలపాడు వద్ద ఆదివారం చోటు చేసుకుంది. కైకలూరు గ్రామీణ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడు మండలం గుమ్ములూరుకు చెందిన చిన్నపరెడ్డి నాగ శ్రీను(50) గ్రామంలో బడ్డీ దుకాణం నిర్వహిస్తూ భార్యతో కలిసి జీవనం సాగిస్తున్నారు. ఆదివారం ఉదయం కైకలూరులో బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి తన ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి పయనమయ్యారు. ఆలపాడు ఆర్‌పీ పాఠశాల వద్దకు వచ్చే సమయానికి తన వాహనం రోడ్డు పక్కన నిలిపి ఉండగా.. ఈ క్రమంలో కైకలూరు నుంచి ఆకివీడు వైపు వెళ్తున్న కారు వెనుక నుంచి వేగంగా వచ్చి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో నాగ శ్రీను అక్కడికక్కడే దుర్మరణం చెందారు. సంఘటనా స్థలానికి చేరుకున్న గ్రామీణ ఎస్సై రాంబాబు ప్రమాద స్థితిని పరిశీలించి మృతదేహాన్ని కైకలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి కుమారుడు బాలప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

తలకు బలమైన గాయమై మరొకరు..

నల్లజర్ల, న్యూస్‌టుడే: మూర్ఛ వచ్చి సిమెంటు రోడ్డుపై పడిపోవడంతో తలకు బలమైన గాయమై వ్యక్తి మృతి చెందిన ఘటన తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం ముసుళ్లకుంటలో ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఏలూరు జిల్లా నూజివీడు మండలం శోభనాపురం గ్రామానికి చెందిన పెద్దబోయిన గంగరాజు (44) గొర్రెల కాపరిగా జీవనం సాగిస్తున్నారు. కొన్నేళ్ల నుంచి ముసుళ్లకుంటకు వచ్చారు. గొర్రెలను మేపుతున్న క్రమంలో నడుచుకుంటూ ఓ ఇంటికి వెళ్తుండగా.. సిమెంట్ రోడ్డుపై పడిపోయారు. దీంతో తలకు బలమైన గాయం కావడంతో తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు నల్లజర్ల ఎస్సై అంజనేయబాబు తెలిపారు. మృతుడు కుమారుడు వెంకట కిశోర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ..

గణపవరం, న్యూస్‌టుడే: పిప్పరకు చెందిన మిరియాల నాగేశ్వరరావు తన తండ్రి ఆదినారాయణ(82), కుమార్తె గాయత్రితో కలిసి ఈ నెల 20న ద్విచక్ర వాహనంపై తాడేపల్లిగూడెం మండలం దండగర్రలో శుభకార్యానికి వెళ్లారు. తిరిగి స్వగ్రామానికి తిరిగి వెళ్తుండగా.. మార్గం మధ్యలో కారు ఢీకొంది. ఈ ఘటనలో ద్విచక్ర వాహనంలో ప్రయాణిస్తున్న ముగ్గురికి గాయాలయ్యాయి. వారిని 108 వాహనంలో తాడేపల్లిగూడెం ప్రాంతీయాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం నిమిత్తం ఆదినారాయణను తణుకులోని ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. బాధిత కుటుంబ సభ్యుడు మిరియాల సుబ్రహ్మణ్యం ఫిర్యాదు మేరకు ఎస్సై ఎం.మణికుమార్ కేసు నమోదు చేశారు.

కుదవ పెట్టిన బంగారం మాయం

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: కుదవ పెట్టిన బంగారం మాయంపై బాధితురాలి ఫిర్యాదు మేరకు జంగారెడ్డిగూడెం పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. ఎస్సై వీరప్రసాద్ కథనం మేరకు.. జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన ఎన్.ధనలక్ష్మి 2023లో స్థానిక ఐఐఎఫ్ఎల్ గోల్డ్ లోన్స్ (ఓ ఫైనాన్స్ కంపెనీ)లో 270 గ్రాముల బంగారు ఆభరణాలు తాకట్టు పెట్టి రూ.13 లక్షలు రుణంగా పొందారు. కొంతకాలం గడిచినా ఆమె తీసుకున్న రుణానికి వడ్డీ కట్టలేకపోయారు. ఫైనాన్స్ కంపెనీ మేనేజరు, కొయ్యలగూడెం మండలం వేదాంతపురం గ్రామానికి చెందిన ఉద్దగిరి చైతన్యరాము..తీసుకున్న అప్పును రెన్యువల్ చేస్తామని ధనలక్ష్మికి చెప్పాడు. దీంతో ఆమె చరవాణికి వచ్చిన ఓటీపీలను చైతన్యరాము పలుమార్లు అడిగి తెలుసుకున్నాడు. గత ఏడాది డిసెంబర్‌లో ధనలక్ష్మి బంగారు ఆభరణాలు విడిపించుకునేందుకు ఫైనాన్స్ కంపెనీకి వెళ్లగా...అందులో ఆమె పేరుతో ఎటువంటి ఖాతా లేనట్లు సిబ్బంది చెప్పారు. తాను చెప్పిన ఓటీపీల ద్వారా తాకట్టు పెట్టిన బంగారాన్ని విడిపించి మారుపేర్లతో వివిధ బ్యాంకుల్లో మేనేజర్ చైతన్యరాము రుణాలు పొందాడని, తనతోపాటు మరికొంత మంది బంగారు ఆభరణాలను అతను మాయం చేసి అదృశ్యమైనట్లు ధనలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఉద్దగిరి చైతన్యరాముపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

ఆర్థిక సాయం పేరిట.. రూ.21 లక్షలకు టోకరా!

అడవినెక్కలం (ఆగిరిపల్లి), న్యూస్‌టుడే: ఇబ్బందుల్లో ఉన్న వారికి ఆర్థిక సాయం చేస్తామంటూ సామాజిక మాధ్యమాల వేదికగా పరిచయమైన సైబర్ కేటుగాళ్లు రూ.21 లక్షలకు టోకరా వేసిన ఘటన ఆగిరిపల్లి మండలం అడవినెక్కలంలో ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసుల కథనం మేరకు.. షేక్ హబీబ్ బాషా, మీరాబీ దంపతులు అడవినెక్కలంలో నివసిస్తున్నారు. కుమార్తె ఫర్జానా, అల్లుడు వలీ ఇదే గ్రామంలో ఉంటారు. మీరాబీకి ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ఉంది. అది కుమార్తె ఫర్జానా వినియోగిస్తోంది. గత ఏడాది ఆగస్టు నెలలో ఇన్‌స్టాగ్రామ్ ఖాతాకు యూట్యూబర్ హర్ష సాయి పేరుతో ఉన్న ఇన్‌స్టా ఖాతా నుంచి మీరు ఏదైనా ఇబ్బందుల్లో ఉంటే నగదు సాయం చేస్తామంటూ మెసేజ్ వచ్చింది. దానికి ఫర్జానా మాకు ఇబ్బందులు ఉన్నాయి.. సాయం కావాలని కోరడంతో సైబర్ కేటుగాళ్లు వాట్సప్ నంబరు అడిగి దాని నుంచి ఉర్దూలో మాట్లాడటం ప్రారంభించారు. మీరు రూ.వెయ్యి పంపితే రూ.10 లక్షల ఆర్థిక సాయం చేస్తామని నమ్మబలికారు. దాంతో వారు రూ.వెయ్యి పంపారు. మీ నగదు సరిపోలేదు.. దానికి కొంచెం నగదు కట్టాలని ఆ ఏడాది ఆగస్టు 2 నుంచి డిసెంబర్ 31 వరకు పలు దఫాలుగా రూ.21 లక్షలు లాగేశారు. ఏదో కొంచెం నగదు చెల్లిస్తే పెద్ద మొత్తంలో నగదు వస్తుందని ఆశతో.. వారికి ఉన్న సొంత ఇల్లు కూడా లేకపోయినా.. బంధువుల బంగారం తాకట్టు పెట్టి, బయట వడ్డీలకు తెచ్చి చెల్లించారు. సైబర్ కేటుగాళ్లు తర్వాత సరిగా స్పందించక పోవడంతో మోసపోయినట్లు గుర్తించిన బాధితులు ఆదివారం ఆగిరిపల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఎస్సై కె.శుభశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పతకాలు సాధించిన క్రీడాకారులతో శిక్షకులు

రాష్ట్ర స్థాయి చదరంగం పోటీల్లో సత్తా

ఏలూరు నగరం, న్యూస్‌టుడే: తిరుపతి వేదికగా శని, ఆదివారాల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి చదరంగం పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. అండర్-19 బాలికల విభాగంలో ఎ.తేజస్విని స్వర్ణం, అండర్-15 బాలుర విభాగంలో కొల్లా భావన్ రజత పతకాలు సాధించారు. వారిని డీఎస్‌డీవో ఎస్.ఎ.అజీజ్, శిక్షకుడు మహేశ్, మేనేజర్ సూర్యనారాయణ అభినందించారు.

స్థానిక నాయకులతో సమావేశమైన వెంకటేశ్వరరాజు

కిసాన్ మోర్చాను బలోపేతం చేయాలి

వీరవాసరం, న్యూస్‌టుడే: భాజపా కిసాన్ మోర్చాను బలోపేతం చేసేదిశగా నాయకులు కృషి చేయాలని జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు గాదిరాజు వెంకటేశ్వరరాజు పిలుపునిచ్చారు. ఆదివారం గ్రామంలో పర్యటించిన ఆయన త్వరలో జరగబోయే రైతు సమావేశాల కోసం ప్రతి గ్రామంలో ఐదుగురు రైతులతో కమిటీ వేయాలని స్థానిక నాయకులకు సూచించారు. భాజపా మండల అధ్యక్షుడు వేంద్ర దివాకర్, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి గండి దుర్గామహేశ్, వీరవాసరం సొసైటీ అధ్యక్షుడు వీరవల్లి శ్రీనివాసరావు, నీటి సంఘం అధ్యక్షుడు గవిరెడ్డి చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

పీజీ సీటు ఇప్పిస్తానని మోసగించిన వ్యక్తిపై కేసు

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: విదేశాల్లో పీజీ సీటు ఇప్పిస్తానని డబ్బు తీసుకుని అనంతరం ముఖం చాటేసిన వ్యక్తిపై బాధితుడి ఫిర్యాదు మేరకు జంగారెడ్డిగూడెం పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. ఎస్సై వీరప్రసాద్ కథనం మేరకు.. జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన షంషేర్ అహ్మద్ చింతలపూడి మండలంలోని పీహెచ్‌సీలో హెల్త్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. ఆయన కుమార్తె, మేనల్లుడులు ఎంబీబీఎస్ పూర్తిచేసి ఉన్నత చదువులకు విదేశాలు వెళ్లేందుకు ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో మహబూబ్‌నగర్ మరికల్ గ్రామానికి చెందిన గుండా రాఘవ.. విదేశాల్లో పీజీ సీటు ఇప్పిస్తానని అహ్మద్, అతడి బావతో నమ్మబలికాడు. దీంతో అహ్మద్, అతడి బావ దఫదఫాలుగా రూ.19.50 లక్షలు రాఘవకు ఇచ్చారు. డబ్బు తీసుకున్న తరువాత సీటు విషయం అడిగితే ముఖం చాటేయడంతో మోసపోయినట్లు బాధితులు గుర్తించారు. అహ్మద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

ఆన్‌లైన్‌లో వైజ్ఞానిక ప్రదర్శనలు

23 నుంచి 26 వరకు పోటీలు

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: జిల్లాలో జాతీయ సైన్సు దినోత్సవాన్ని (ఈ నెల 28) పురస్కరించుకుని వైజ్ఞానిక ప్రదర్శనల పోటీలు 23వ తేదీ నుంచి ఆన్‌లైన్ వేదికగా ప్రారంభం కానున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా సైన్సు సిటీ ఆధ్వర్యంలో 'సైన్సు సమగ్ర మహోత్సవం-2026' పేరుతో పోటీలు జరగనున్నాయి. అన్ని ప్రభుత్వ పాఠశాలల నుంచి నమూనాలను ప్రదర్శించాలని మార్గదర్శకాల్లో పేర్కొన్నారు. ఒక్కో పాఠశాలలో గైడ్ టీచర్ సహా 6- 9వ తరగతులకు చెందిన ముగ్గురు విద్యార్థులు బృందంగా నమోదు కావాలి. ఒక్కో పాఠశాల నుంచి గరిష్ఠంగా పది బృందాలు పోటీలో పాల్గొనవచ్చు. ఈ మేరకు లీప్ యాప్‌లో ఈ నెల 15న ప్రారంభమైన దరఖాస్తుల రిజిస్ట్రేషను ప్రక్రియ ఆదివారంతో ముగిసింది.

పాఠశాల స్థాయిలో.. ఈ నెల 23న ఉదయం 10 నుంచి 12 గంటల వరకు పాఠశాల స్థాయిలో పోటీలను నిర్వహించి విజేతల వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. పాఠశాల స్థాయి విజేతల నమూనాలతో ఈ నెల 24, 25 తేదీల్లో మండల స్థాయి పోటీలు నిర్వహిస్తారు. 26న విజేతలను నిర్ణయించి జిల్లాకు రెండు నమూనాల చొప్పున రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తారు. 26న రాష్ట్రస్థాయి పోటీలను నిర్వహించి విజేతలను అంతర్జాలంలో ప్రకటిస్తారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ మార్గదర్శకాలు జారీ చేశారు.

ముఖ్యమంత్రి చేతుల మీదుగా సత్కారం

పోటీల్లో పాల్గొన్న వారందరికీ ధ్రువపత్రం అందజేస్తారు. రాష్ట్రస్థాయి విజేత నమూనాలను ప్రదర్శించిన విద్యార్థులకు ముఖ్యమంత్రి చేతుల మీదుగా ధ్రువపత్రం, జ్ఞాపికలను అందజేస్తారు. ఆన్‌లైన్ వైజ్ఞానిక ప్రదర్శన కార్యక్రమాలను పర్యవేక్షించి నమోదు చేయనున్న ఆసియా/ ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థలు, పాల్గొన్న వారికి, విజేతలకు ధ్రువపత్రాలను అందజేస్తారని జిల్లా విద్యాశాఖాధికారి పేర్కొన్నారు.

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా) (కిలో 1 కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -115 రిటైల్ ధర 142 చికెన్ విత్ స్కిన్ - 206 చికెన్ స్కిన్‌లెస్ - 234.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 132, 141, 152 చికెన్ విత్ స్కిన్ - 250 చికెన్ స్కిన్‌లెస్ - 260.

సాగునీరు కరవు.. రైతు గుండె బరువు

నెర్రలు తీసిన పొలాన్ని చూపుతున్న అన్నదాతలు

ఆకివీడు, న్యూస్‌టుడే: ఆకివీడు మండలం చెరుకుమిల్లిలో వరి రైతులు సాగు నీటి కోసం సతమతమవుతున్నారు. ప్రస్తుతం రబీ సాగులో వంతుల వారీ విధానంలో సాగునీటిని సరఫరా చేస్తున్నారు. వంతు సమయంలో కూడా కాలువల ద్వారా నీరు అందడం లేదని అన్నదాతలు ఆదివారం ఆందోళన బాటపట్టారు. చెరుకుమిల్లిలోని భాస్కరకాలువ పరిధిలో సుమారు 500 ఎకరాల్లో వరిచేలు నీరులేక ఎండిపోతున్నాయని రైతులు ప్రధాన రహదారిపై నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు.

అప్పు చేసి పండిస్తున్నా..

నేను 14 ఎకరాలు కౌలుకు తీసుకొని వరి వేశా. ఈ నెల 12తో ఒక వంతు పూర్తి అయ్యింది. అప్పుడు పూర్తిస్థాయిలో నీరు అందలేదు. తర్వాత 18 నుంచి 23 వరకు వంతు సమయం అన్నారు. ఇప్పుడు అసలు నీరే రాలేదు. ఇప్పటి వరకూ ఎకరానికి రూ.25 వేలకుపైగా అప్పులు చేసి పెట్టుబడి పెట్టా. నీరు లేక వరి చేలు ఎండిపోతున్నాయి. అధికారులను అడిగితే స్పష్టమైన సమాధానం చెప్పడం లేదు. రాత్రి నిద్రపట్టడం లేదు. ఆందోళనగా ఉంది.

- మోహనరావు, కౌలు రైతు, చెరుకుమిల్లి

ముందుకు నెట్టారు.. ముంచేశారు

నేను 5 ఎకరాల్లో కౌలు వ్యవసాయం చేస్తున్నా. వంతుల వారీ విధానంలో సాగునీటిని పూర్తిస్థాయిలో సరఫరా చేస్తాం.. సాగుకు సన్నద్ధం కండి అంటూ అధికారులు చెప్పారు. ఇప్పుడు సాగు మధ్యలోకి వచ్చాక నీటి సరఫరా కాకపోయినా పట్టించుకోవడం లేదు. ఇలా అయితే ఎలా?.

- శివరామరాజు, కౌలు రైతు

92.7 FM Rajamahendravaram 92.7 Mee FM
ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180626, 9989993175

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ఫైనాన్స్ సంస్థలలో తాకట్టులో ఉన్నది విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్టార్ క్యాష్). Ph.81422 92071.

JOBS

శ్రీ కార్తికేయ హోమ్‌కేర్ వృద్ధులు, పేషెంట్స్, పిల్లలను చూసుకొనుటకు ఆడ, మగ వర్కర్స్ కావలెను. జీతం 20K. ☎ 99120 11499, 99120 11899

MARKETING/ SALES

Anand Masale Require Sales & Marketing Manager, Marketing Executives. Contact: 9849655105, 9848053144 Email: anandmasalaap-pltd@gmail.com.

REAL ESTATE

HOUSE FOR SALE

తాడేపల్లిగూడెం సుబ్బారావుపేట, D.S. [illegible] దగ్గర 1000 చ.గ॥ స్థలంలో [illegible] ఇల్లు అమ్మబడును. ఉత్తరం, పడమర, తూర్పు రోడ్ కలదు. ☎ 97010 37775, 73966 22137.

LAND FOR SALE

బొమ్మిడి గ్రామం, ఉంగుటూరు మండలం, బాదంపూడి సమీపాన 4.5 ఎకరాల వ్యవసాయ భూమి అమ్మకము. Cont: 97010 37775, 73966 22137.

కృష్ణాజిల్లా మల్లవల్లి A.P. [illegible] అమ్మబడును. కాంటాక్ట్: 99483 16161.

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం

భీమవరం

• భీమవరం • ఉండి

ఉత్సాహంగా ఆనంద ఆదివారం

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరంలో ఆనంద ఆదివారం ఉత్సాహంగా నిర్వహించారు. ఏఎస్ఆర్‌నగర్‌లోని అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద యోగ, నృత్య, సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేశారు. చిన్నారులు, యువత, మహిళలు, వృద్ధులు పాల్గొని ఆనందంగా గడిపారు. భీమవరం సహాయ కమిషనర్ ఎ.రాంబాబు, అధికారులు పాల్గొన్నారు.

సొంత భవనాలైతే ఇలాగే వదిలేస్తారా?

వృథాగా వదిలేసిన సౌర విద్యుత్తు స్తంభాలు

ఆకివీడు, న్యూస్‌టుడే: మండల పరిషత్తు భవనం ప్రాంగణంలో మహిళా సమాఖ్య, పంచాయతీ రాజ్, వ్యవసాయ, విద్యా శాఖ తదితర కార్యాలయాలున్నాయి. వాటి నిర్వహణ కంటితుడుపుగా ఉంది. ముఖ్యంగా రాత్రి సమయంలో భద్రత విషయంలో తీసుకున్న చర్యలు శూన్యంగా ఉన్నాయి. ప్రాంగణంలోకి ప్రవేశించే ప్రధాన మార్గం వద్ద గేటు కూడా లేదు. గతంలో ఏర్పాటు చేసిన సోలార్ దీపాల స్తంభాలు నేలకొరిగి వృథాగా పడి ఉన్నాయి. పరిసరాల శుభ్రత గాలికొదిలేశారు. అధికారుల సొంత భవనాలైతే ఇలానే వదిలేస్తారా అని కార్యాలయాలకు వచ్చే ప్రజలు వాపోతున్నారు.

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

భీమవరం గ్రామీణ, న్యూస్‌టుడే: లోసరిలో కొత్తగా నిర్మిస్తున్న విద్యుత్తు ఉపకేంద్రానికి లైన్ల ఏర్పాటు పనులు చేపడుతున్నట్లు ఈఈ వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు లోసరి, దెయ్యాలతిప్ప, నాగేంద్రపురం, తోకతిప్ప, బర్రెవానిపేట, గరవళ్లదిబ్బ గ్రామాలతో పాటు ఆక్వా చెరువులకు సరఫరా నిలిపివేస్తున్నట్లు వెల్లడించారు.

పార్టీ బలోపేతానికి కృషి

భీమవరం అర్బన్, న్యూస్‌టుడే: కార్యకర్తలంతా తెదేపా బలోపేతానికి కృషి చేయాలని రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ ఛైర్మన్ కొల్లు పెద్దిరాజు అన్నారు. భీమవరం మండలం పెదగరువు గ్రామాన్ని ఆయన ఆదివారం సందర్శించి పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. పలు అంశాలపై వారితో మాట్లాడారు. తెదేపా మండల కమిటీ అధ్యక్షుడు గణపతి, బూత్ కన్వీనర్ ప్రకాష్, ఏసు రత్నరాజు తదితరులు పాల్గొన్నారు.

బాలాత్రిపురసుందరికి పెన్నులతో అలంకరణ

భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానున్న సందర్భంగా మెంటేవారితోటలోని బాలాత్రిపురసుందరి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు చేసి సుమారు 1,000 పెన్నులతో అలంకరించారు. అమ్మవారి దర్శనానికి వచ్చే విద్యార్థులకు పెన్నులు అందజేసినట్లు ఆలయాభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు.

బాధ్యతలు మోస్తూ.. పతకాలు సాధిస్తూ

భీమవరం అర్బన్, న్యూస్‌టుడే: సాధించాలనే తపన ఉండి.. కృషి, పట్టుదలతో సాధన చేస్తే విజయం సొంతం చేసుకోవచ్చని నిరూపిస్తున్నారు భీమవరం పట్టణానికి చెందిన ఎస్.జరీనా, నీలిమ, తనుశ్రీ. వివిధ బాధ్యతలు మోస్తూనే మరో పక్క వారికిష్టమైన ఆటల్లో కఠోర సాధన చేస్తూ విజయాలు నమోదు చేస్తున్నారు. దాని వల్ల శారీరక సామర్థ్యంతో పాటు మానసిక ప్రశాంతత కలుగుతోందంటున్నారు. కుటుంబ సభ్యుల అండ, శిక్షకుల ప్రోత్సాహం వల్ల తాము రాణించగలుగుతున్నామని చెబుతున్నారు. వారి విజయాలు, లక్ష్యాలపై 'న్యూస్‌టుడే' కథనం.

సరదాగా ప్రారంభించి

నేను ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సు చేశాను. ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాను. మొదట సరదాగా షటిల్ నేర్చుకోవడం ప్రారంభించినా మూడేళ్లుగా సీరియస్‌గా సాధన చేస్తున్నాను. గత ఏడాది డిసెంబరులో భీమవరంలో జరిగిన పోటీల్లో తృతీయ స్థానంలో నిలవడం సంతోషాన్నిచ్చింది. అంతకు ముందు డివిజన్ పోటీల్లో మూడు పతకాలు గెలుచుకున్నాను. ఈ ఆట వల్ల శారీరక దృఢత్వం పెరుగుతుంది. రోజుకి మూడు గంటలు సాధన చేస్తున్నాను. **- ఎన్.నీలిమ, భీమవరం**

క్రీడా కోటాలో ఉద్యోగం సాధించాలని

డిగ్రీ ఆఖరి ఏడాది చదువుతున్నాను. క్రీడా కోటాలో ప్రభుత్వ ఉద్యోగం సాధించాలన్నది నా కోరిక. అందుకే నాకిష్టమైన బ్యాడ్మింటన్‌లో రెండేళ్లుగా సీరియస్‌గా సాధన చేస్తున్నాను. తాజాగా రాజమహేంద్రవరంలో జరిగిన పోటీల్లో సత్తా చాటాను. విశ్వవిద్యాలయం జట్టులో స్థానం దక్కించుకోవడం ఆనందాన్నిచ్చింది. గతంలో విజయవాడ, విశాఖపట్నంలో నిర్వహించిన రాష్ట్ర పోటీల్లో విజయాలు సాధించాను. జిల్లాలో మరో రెండు పతకాలు గెలుచుకున్నాను. **- కె.తనుశ్రీ, భీమవరం**

ఒలింపిక్ పతకమే లక్ష్యం

నాకు మొదటి నుంచి రైఫిల్ షూటింగ్ అంటే ఎంతో ఇష్టం. అందుకే శ్రద్ధగా నేర్చుకొని గతంలో విశాఖలో జరిగిన సీనియర్స్ విభాగంలో స్వర్ణం గెలుచుకున్నాను. గత ఏడాది మేలో రైఫిల్ షూటింగ్ అఫ్ ఏపీ నిర్వహించిన రాష్ట్ర పోటీల్లో బంగారు పతకం సాధించాను. ఇప్పటి వరకు ఆరు స్వర్ణం, రెండు రజత, నాలుగు కాంస్య పతకాలు గెలుచుకున్నాను. ఇప్పుడు పిస్టల్ విభాగంలో సాధన చేస్తున్నాను. త్వరలో జరగనున్న జాతీయ పోటీలకు సిద్ధమవుతున్నాను. అక్కడ గెలిస్తే భారత్ జట్టులో స్థానం దక్కే అవకాశం ఉంది. ప్రస్తుతం రోజుకి 6 గంటలు సాధన చేస్తున్నాను. ఒలింపిక్ పతకం సాధించడమే లక్ష్యం. **- ఎస్.జరీనా, భీమవరం**

మేమున్నాం.. మీకు తోడుగా..

భీమవరం పట్టణం:	80085 74471	గునుపూడి:	80085 74474
భీమవరం మండలం:	80085 74533	వీరవాసరం:	80085 74475
పాలకోడేరు:	80085 74467	ఉండి:	80085 74526
ఆకివీడు:	80085 74525	కాళ్ల:	94401 04042

ఆకివీడు, న్యూస్‌టుడే: ? ఆకివీడు పెదపేట ప్రాంతంలోని డ్రెయినేజీల్లో పూర్తిస్థాయిలో ఆటంకాలు తొలగించడం లేదు. తరచూ మురుగు సమస్య ఏర్పడుతోంది. **- సుబ్బారావు**

✔ మట్టి పూడిక తదితర ఆటంకాలు తొలగించేలా చర్యలు తీసుకుంటాం. **- సాకేత్‌బాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్, ఆకివీడు**

వీరవాసరం, న్యూస్‌టుడే: ? ఒకటో వార్డులో విద్యుత్తు లోవోల్టేజీ సమస్య వేధిస్తోంది. ఒక్కోసారి గృహోపకరణాలు పనిచేయక ఇబ్బంది పడుతున్నాం. **- వెంకటేశ్వరరావు**

✔ పరిశీలించి చర్యలు తీసుకుంటాను. **- ఆర్‌వీ.అప్పారావు, ట్రాన్స్‌కో ఏఈ, వీరవాసరం**

? నడపనవారిపాలెం వద్ద గొంతేరు డ్రెయిన్లో వ్యర్థాలు పేరుకుపోయాయి. వర్షాలు కురిస్తే మురుగు ప్రవాహానికి ఆటంకం ఏర్పడుతుంది. **- నరసింహారావు**

✔ వ్యర్థాల తొలగింపునకు చర్యలు తీసుకుంటాను. **- వెంకటరమణ, మురుగునీటి పారుదల శాఖ ఏఈ, వీరవాసరం**

ఉండి, న్యూస్‌టుడే : ? ఉండి పెదపేటలో అక్కడక్కడా వీధిలైట్లు సరిగా వెలగకపోవడంతో రాత్రిపూట రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. **- వెంకటరత్నం, స్థానికుడు**

✔ మరమ్మతులు చేయిస్తాం. **- అనిల్‌కుమార్, పంచాయతీ అభివృద్ధి అధికారి, ఉండి**

భీమవరం గునుపూడి, న్యూస్‌టుడే: ? 13వ వార్డు, బేతనిపేటలో పలు వీధుల్లో డ్రెయిన్లు శుభ్రం చేయడం లేదు. దోమల బెడద ఎక్కువగా ఉంది. **-రాంబాబు, స్థానికుడు**

✔ శుభ్రం చేయిస్తాం. **- జె.సత్యనారాయణ రాజు, పురపాలక పారిశుద్ధ్య అధికారి**

జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందుకున్న విద్యార్థులతో గురువు, నిర్వాహకులు

తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో భీమవరం చిన్నారులు

భీమవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: సిరి మువ్వల సందడి సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం గుడివాడ ఐఎంఏ భవనంలో 108 మంది విద్యార్థులతో నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శనలో తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ సాధించారు. భీమవరానికి చెందిన తాండవ నృత్య నికేతన్ విద్యార్థులు 12 మంది పాల్గొని జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందుకున్నట్లు నృత్య గురువు ఎస్‌టీవీ లక్ష్మీప్రసన్న తెలిపారు.

గ్రామ పెద్దల ఐక్య కృషితో పనులు

పాములపర్రు (ఉండి), న్యూస్‌టుడే: ఉపసభాపతి కనుమూరు రఘురామకృష్ణరాజు సహకారంతో పాములపర్రులో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని మండల తెదేపా అధ్యక్షుడు కరిమెరక నాగరాజు తెలిపారు. పాములపర్రులో పోశాలమ్మ జాతర మహోత్సవాల ముగింపు వేడుకల్లో భాగంగా ఆదివారం అమ్మవారికి ఆలయ కమిటీ ప్రతినిధులు ప్రత్యేక నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలొచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఉండి తెదేపా అధ్యక్షుడు కాగిత బుజ్జి, అభయాంజనేయస్వామి ఆలయ కమిటీ ఛైర్మన్ కేశన కోటి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు వర్రే పైడియ్య మాట్లాడారు. అనంతరం వేలాదిగా భక్తులు తరలొచ్చి అమ్మవారి ప్రసాదం స్వీకరించారు.

లక్ష్యానికి మించి క్రియాశీలక సభ్యత్వాల నమోదు

గోడపత్రాలు విడుదల చేసిన జనసేన నాయకులు

ఉండి, న్యూస్‌టుడే: లక్ష్యానికి మించి క్రియాశీలక సభ్యత్వాల నమోదుకు పార్టీ శ్రేణులందరూ దృష్టి సారించాలని జనసేన పీఏసీ సభ్యుడు, క్షత్రియ కార్పొరేషన్ రాష్ట్ర ఛైర్మన్ వేగేశ్న కనకరాజు సూరి పిలుపునిచ్చారు. ఉండి ఏఎంసీలో నియోజకవర్గస్థాయి జనసేన ఆత్మీయ సమ్మేళనం ఆదివారం మధ్యాహ్నం నిర్వహించారు. ఈ సందర్భంగా 'సేనా సిద్ధం కండి' గోడపత్రికలు విడుదల చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వంలో సమన్వయంతో పనిచేయాల్సిన అవసరాన్ని గుర్తు చేశారు. జిల్లా గ్రంథాలయాల సంస్థ ఛైర్మన్, నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు మాట్లాడుతూ క్రియాశీలక సభ్యత్వాల సేకరణలో గతంలో రాష్ట్రంలోనే ఉండి పోటీపడిన విషయాన్ని గుర్తుచేశారు. నాడు 13,700 పైచిలుకు సభ్యత్వాలు నమోదు చేశామని, నేడు 25-30 వేల లక్ష్యంతో ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. పార్టీ శ్రేణులంతా ఈ క్రతువులో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. డీసీసీబీ మాజీ అధ్యక్షుడు ముత్యాల వెంకటేశ్వరరావు (రత్నం), ఆకివీడు ఏఎంసీ వైస్ ఛైర్మన్ గదర లక్ష్మి, కాళ్ల, పాలకోడేరు మండలాల అధ్యక్షులు ఎద్దుబండి రామాంజనేయులు, గాదం నానాజీ, రాష్ట్ర కార్యదర్శి మాల కమిటీ కార్యదర్శి తోట వాసు తదితరులు మాట్లాడారు. నాలుగు మండలాల కార్యవర్గాలు, గ్రామ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు, ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా నేరం

పాలకోడేరు, న్యూస్‌టుడే: మానవ అక్రమ రవాణా నిర్మూలించడం మనందరి బాధ్యతగా గుర్తించాలని విస్సాకోడేరు సెయింట్ పాల్స్ క్రీస్తు లూథరన్ దేవాలయం పాస్టర్ భాగ్యరాజ్, ప్రజ్వల స్వచ్ఛంద సేవా సంస్థ రాష్ట్ర సమన్వయకర్త శ్రావ్య శృతి కోరారు. ఆదివారం స్థానిక చర్చిలో స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మానవ అక్రమ రవాణా నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. మానవ అక్రమ రవాణా నిరోధించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నంబర్ల గురించి వివరించారు. అనంతరం అక్రమ రవాణాకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. ఏఎంవో ప్రభాకర్‌రెడ్డి, అంబర్‌సింగ్, భూపాల్, చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యపురి గ్రామ పరిధిలో ప్రమాదకరంగా మలుపు

ఏ వాహనం వస్తుందో.. ఏమవుతుందో..?

వీరవాసరం - మత్స్యపురి రహదారిలో మలుపులతో ప్రమాదాలు జరుగుతున్నాయి. బొబ్బనపల్లి నుంచి మత్స్యపురి వరకు 3 కిలోమీటర్ల పొడవునా 10 మలుపులు ప్రమాదకరంగా మారాయి. ఇక్కడ కనీసం హెచ్చరిక బోర్డులు కూడా లేకపోవడంతో వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. మత్స్యపురి గ్రామ పరిధిలో మలుపుల వద్ద కొందరు స్థానికులు భవన నిర్మాణ సామగ్రి నిల్వ చేస్తుండటంతో మరింత ప్రమాదకరంగా మారింది. పరిశీలించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయిస్తానని ఆర్ అండ్‌బీ ఏఈ డీఎస్ఎన్.మూర్తి తెలిపారు.

- న్యూస్‌టుడే, మత్స్యపురి (వీరవాసరం)

హేతువాద నాయకురాలి మృతికి సంతాపం

భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా హేతువాద సంఘం పూర్వపు అధ్యక్షురాలు కడలి దమయంతి (95) మృతికి సీపీఎం నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. ఆదివారం భీమవరం పట్టణంలోని ఆమె నివాసం వద్ద నాయకులు జేఎన్‌వీ.గోపాలన్, బి.సత్యనారాయణ దమయంతి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

గుంతలో కర్ర.. ఆపుతుందా ప్రమాదాన్ని

జువ్వలపాలెం నుంచి కలవపూడి వెళ్లే రహదారిలో ఏర్పడిన పెద్ద గొయ్యి ప్రమాదకరంగా ఉంది. ప్రమాదాన్ని హెచ్చరించేలా ఓ కర్రను ఏర్పాటు చేశారు. రాత్రి సమయంలో ఎదురుగా ఏదైనా వాహనం వస్తే ప్రమాదం తప్పదని స్థానికులు చెబుతున్నారు. పైపులైను మరమ్మతుల కోసం ఎప్పుడో గుంత తవ్వి తరువాత పూడ్చకుండా వదిలేయడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడిందని.. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, కలవపూడి(కాళ్ల)**

బిందె నిండితే చాలు..అదే పదివేలు..

ఉండి శివారు ప్రాంతాల్లో తాగునీటి ఇబ్బందులు మొదలయ్యాయి. మండల కేంద్రానికి మూడు కిలోమీటర్ల దూరంలోని ఉప్పుగుంటలో కుళాయిలకు పూర్తిస్థాయిలో నీరందటం లేదని స్థానికులు వాపోతున్నారు. ప్రధాన లైను వద్ద లీకవుతున్న నీటిని వడగట్టి ఒక వృద్ధురాలు పట్టుకుంటున్న చిత్రం 'న్యూస్‌టుడే' కెమెరాకు చిక్కింది. లీకవుతున్న నీరు లభించినా మహాభాగ్యమనే పరిస్థితి ఏర్పడింది. దీనిపై పంచాయతీ అభివృద్ధి అధికారి అనిల్‌కుమార్ స్పందిస్తూ అన్నిప్రాంతాలకు పూర్తిస్థాయిలో మంచినీరు సరఫరా చేస్తున్నామని తెలిపారు. **- న్యూస్‌టుడే, ఉండి**

పొంచి ఉన్న ప్రమాదం

భీమవరం బ్యాంకు కాలనీలో ప్రాథమిక పాఠశాలకు వెళ్లే మార్గంలోని రెండు పరివర్తకాలు ప్రమాదకరంగా ఉన్నాయి. సరైన రక్షణ లేక, తీగజాతి మొక్కలు అల్లుకుపోయి విషపురుగులు, దోమలకు నిలయంగా మారాయి. నిత్యం విద్యార్థులు, స్థానికులు రాకపోకలు చేసే ఈ మార్గంలో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని భయాందోళన చెందుతున్నారు. విద్యుత్తు శాఖ ఏఈ రవివర్మ మాట్లాడుతూ పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామన్నారు. **- న్యూస్‌టుడే, భీమవరం గునుపూడి**

వాకర్స్ కార్యవర్గం ప్రమాణస్వీకారం

భీమవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల వాకర్స్ నూతన కార్యవర్గంతో వాకర్స్ జిల్లా గవర్నర్ వడుపు గోపి ప్రమాణ స్వీకారం చేయించారు. ఆదివారం కళాశాల ఆవరణలో గౌరవాధ్యక్షుడిగా భూపతిరాజు సత్యనారాయణరాజు, అధ్యక్షుడిగా కనుమూరి రామ్‌ప్రసాదరాజు, ఉపాధ్యక్షుడిగా కూనపరాజు ఆంజనేయరాజు, కార్యదర్శిగా పల్లికొండ పీటర్, సహాయ కార్యదర్శిగా డి.అప్పలరాజు, కోశాధికారిగా కొల్లి కిషోర్, జాలి వాకర్‌గా కాంబరి రాణి ప్రమాణం చేశారు. ఈ సందర్భంగా సీనియర్ వాకర్స్ ప్రతినిధులను సత్కరించారు.

శ్రీలక్ష్మికి సాహితీ ప్రభ పురస్కారం

భీమవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: మాతృ భాషా దినోత్సవం సందర్భంగా జీటీపీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ సూరి శ్రీలక్ష్మికి గోదావరి 'సాహితీ ప్రభ' పురస్కారంతో సత్కరించారు. ఆదివారం అరసవల్లి ట్రస్టు కార్యాలయంలో గోదావరి సాహితీ ప్రభ ఆధ్వర్యంలో నిర్వహించిన కవి సమ్మేళనంలో పాల్గొన్న ఆమెకు పురస్కారం అందించినట్లు సాహితీ ప్రభ నిర్వాహక అధ్యక్షుడు కాళ్లకూరి సుబ్రహ్మణ్యం తెలిపారు. సాగిరాజు సత్యనారాయణరాజు అధ్యక్షతన జరిగిన కవి సమ్మేళనంలో సాహితీవేత్తలు పంపన సాయిబాబు, రామనాగేశ్వర రావు, సీహెచ్.లక్ష్మీనారాయణ, జి.రామకృష్ణంరాజు, ఎస్.శ్రీలక్ష్మి, కె.సుబ్రహ్మణ్యశర్మ, ఎం.జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

సంఘటితం.. అభివృద్ధి మంత్రం

హౌసింగ్‌బోర్డు కాలనీ సంఘం కృషితో మౌలిక వసతులు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలో అభివృద్ధి చెందుతున్న ప్రాంతాల్లో హౌసింగ్ బోర్డుకాలనీ ఒకటి. స్థానికులంతా భీమవరం హౌసింగ్‌బోర్డు కాలనీ సంఘంగా ఏర్పడి అభివృద్ధిపై దృష్టి సారించారు. దాతలు కూడా తమవంతుగా చేయూతనిస్తున్నారు. కలెక్టర్ చదలవాడ నాగరాణి, జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి, పురపాలక అధికారుల ప్రోత్సాహంతో ఇటీవల కాలంలో ఈ కాలనీ అభివృద్ధిపథంలో దూసుకెళ్తోంది.

పార్కు

భారీ ప్రాజెక్టుగా చేపట్టి.. కాలనీలోని ఓ పార్కు స్థలాన్ని రూ.70 లక్షలతో ఆధునికీకరించారు. నడక దారి, సౌర విద్యుద్దీపాలు, సిమెంటు బల్లలు, రేకులు షెడ్లు.. మానసిక ప్రశాంతతనిచ్చేలా గౌతమబుద్ధుని విగ్రహం, పచ్చదనంతో తీర్చిదిద్దారు. ఇందులో దాతలు, పురపాలక సంఘం, హౌసింగ్‌బోర్డు కాలనీ సంఘం సౌజన్యం ఉంది.

☛ కాలనీలోకి కొత్త వ్యక్తులు వచ్చినా, అనుమానితులను గుర్తించేందుకు 26 సీసీ కెమెరాలు అమర్చారు. పచ్చదనం, పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటారు. ప్రతి వీధిలో ఫలాలు, పూలు, నీడనిచ్చే మొక్కలు నాటి సంరక్షిస్తున్నారు. చెత్త వేసేందుకు డబ్బాల ఏర్పాటుతోపాటు ఇంటింటా చెత్త సేకరణపై కాలనీ సంఘం అధ్యక్షుడు సరిపిడకల రామారావు, కార్యదర్శి కుక్కల బాల, కోశాధికారి జె.మధు, కార్యవర్గం కృషి చేస్తోంది.

కాలనీ- భీమవరం హౌసింగ్‌బోర్డు కాలనీ

ఎప్పుడు ఏర్పడిందంటే : 1998-2000 సంవత్సరాల మధ్య కాలంలో

కుటుంబాలు- 2100కుపైగా

ఇంకా చేయాల్సిన పనులు.. కాలనీలోని రహదారులు అభివృద్ధి చేశారు. ఓ వైపు డ్రెయిన్ పనులు చేయాలి. ట్రాఫిక్ పార్కు అభివృద్ధి చేయాలి. నీటి సరఫరాలో ఇబ్బందులు అధిగమించాలి. కాలనీ ఏర్పడిన కాలంలో కేవలం 472 గృహాలు ఉండేవి. ప్రస్తుత జనాభా అవసరాలకు తగ్గట్టుగా వసతులు కల్పించాలి.

ఏసీ కార్మికుల సంఘం సమావేశం

పాల్గొన్న యూనియన్ సభ్యులు

భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే: గుర్తింపు కార్డు ఉన్న టెక్నీషియన్ల వద్దే వినియోగదారులు తమ గృహోపకరణాలకు మరమ్మతులు చేయించుకోవాలని మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఏసీ మెకానిక్స్(భీమవరం) యూనియన్ సభ్యులు విజ్ఞప్తి చేశారు. పట్టణంలో కొత్తగా ఏర్పడిన యూనియన్ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. యూనియన్ గౌరవాధ్యక్షుడిగా రామ సుధాకర్, అధ్యక్షుడిగా యిర్రింకి ప్రసాద్, ఉపాధ్యక్షుడిగా గౌస్ బాషా, కార్యదర్శిగా బొమ్మిండి భార్గవ్ తదితరులను నియమించుకున్నారు.

కుట్టు మిషన్ల పంపిణీతో మహిళలకు ఉపాధి

భీమవరం గునుపూడి, న్యూస్‌టుడే: కుట్టు మిషన్ల పంపిణీతో పేద మహిళల ఉపాధికి చేయూత అని దళిత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందర్‌కుమార్ అన్నారు. బేతని లూథరన్ చర్చి ఆవరణలో ఆదివారం రాజ్ ట్రస్టు ఆధ్వర్యంలో 21 మంది మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్ల పంపిణీలో ఆయన మాట్లాడారు. పాస్టర్ ఎస్.దానియేల్, ఏఈఎల్‌సీ సీనియర్ ప్రతినిధి పట్టా దేవరాజు, ట్రస్టు అధ్యక్షుడు గంటా రాజ్‌కుమార్, చర్చి ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇళ్లు ఇచ్చారు.. వీధిన పడేశారు

మౌలిక సదుపాయాలు లేని కాలనీ

విస్సాకోడేరు (పాలకోడేరు), న్యూస్‌టుడే: విస్సాకోడేరు పైపుల చెరువు వద్ద గల పేదల కాలనీలో రోడ్లు, డ్రెయినేజీ, తాగునీరు తదితర సౌకర్యాలు లేక లబ్ధిదారులు అవస్థలు పడుతున్నారు. గత వైకాపా ప్రభుత్వంలో పట్టాలిచ్చి, ఇళ్లు మంజూరు చేశారు. కనీస మౌలిక సదుపాయాలు లేక ఎండ కాస్తే దుమ్ము, వర్షం వస్తే బురదమయంగా తయారవుతున్నాయి. విస్సాకోడేరు గ్రామానికి చెందిన 164 మందికి,. వేండ్ర గ్రామానికి సంబంధించిన 127 మందికి ఇక్కడ స్థలాలు కేటాయించారు. కానీ మౌలిక సౌకర్యాలు కల్పించకపోవడంతో 29 మంది లబ్ధిదారులు మాత్రమే ఇళ్లు నిర్మించుకున్నారు.

దూరం..భారం.. ఇక్కడ స్థలాలు కేటాయించిన లబ్ధిదారులకు లేఅవుట్ దూరంగా ఉండటంతో ఇళ్లు నిర్మించుకునేందుకు మక్కువ చూపడం లేదు. విస్సాకోడేరు గ్రామానికి సుమారు 3 కిలోమీటర్లు, వేండ్రకు సుమారు 4 కిలోమీటర్ల మేర దూరం ఉంటుంది. మరోపక్క ఈ లేఅవుట్‌కు చేరడానికి రవాణా సౌకర్యం కూడా లేదు. విస్సాకోడేరు లింకు రోడ్డు నుంచి లేఅవుట్‌కు వెళ్లేందుకు సరైన మార్గం లేదు. వర్షాకాలం వచ్చిందంటే కనీసం నడిచే పరిస్థితి కూడా ఉండదని లబ్ధిదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా రహదారులు, ఇతర సౌకర్యాలు కల్పిస్తే ఇళ్లు నిర్మించుకుంటామని లబ్ధిదారులు వాపోతున్నారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని పాలకోడేరు ఎంపీడీవో వి.రెడ్డియ్య తెలిపారు.

కనులపండువగా అలుగులమ్మ గ్రామోత్సవం

నృత్యం చేస్తున్న యువతులు

చెరుకువాడ (ఉండి), న్యూస్‌టుడే: చెరుకువాడలో అలుగులమ్మ జాతరలో భాగంగా అమ్మవారి గ్రామోత్సవాన్ని ఆదివారం కనులపండువగా నిర్వహించారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా తీర్చిదిద్దిన రథంపై ఇంటింటికీ తరలొస్తున్న అమ్మవారికి సారె సమర్పిస్తూ హారతులిచ్చి ఆశీర్వాదాలు స్వీకరించారు. బాజా భజంత్రీలు, బాణసంచా కాల్పులు, విచిత్ర వేషధారణలు, ప్రత్యేక నృత్య రూపకాల మధ్య అమ్మవారి ఊరేగింపు భారీస్థాయిలో నిర్వహించారు. మార్చి ఒకటి వరకు ఉత్సవాలు కొనసాగుతాయని కమిటీ ప్రతినిధులు తెలిపారు.

బీచ్‌లో పర్యాటకుల సందడి

మొగల్తూరు, న్యూస్‌టుడే: పేరుపాలెంసౌత్, కేపీపాలెంసౌత్‌లలోని బీచ్‌కు ఆదివారం అధిక సంఖ్యలో పర్యాటకులు తరలివచ్చారు. వారు ఉదయం నుంచి సాయంత్రం వరకు తీరంలో ఆటపాటలతో ఆహ్లాదంగా గడిపారు. పలువురు సముద్ర అలల్లో స్నానాలు చేస్తూ సేదదీరారు.

మాకో దారి చూపండి

తలతాడితిప్ప ప్రభుత్వ కాలనీలో ప్రజలు రహదారులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షం కురిస్తే ఖాళీ స్థలాల్లో నీరు నిలిచిపోయి కీటకాలు, విషసర్పాలు సంచరిస్తున్నాయని వాపోతున్నారు. పంచాయతీ అధికారులు పలు చోట్ల సీసీ రహదారులపై మళ్లీ సీసీ రహదారులు నిర్మించేందుకు నిధులు కేటాయిస్తూ అసలు రహదారులు లేని ప్రాంతాలను విస్మరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. నిధుల లభ్యతను బట్టి రహదారుల నిర్మాణానికి చర్యలు తీసుకుంటానని పంచాయతీ కార్యదర్శి కె.లక్ష్మి తెలిపారు. **- న్యూస్‌టుడే, వీరవాసరం**

దాడి చేసిన వారిపై కేసు

ఆకివీడు, న్యూస్‌టుడే: పాత గొడవలు పురస్కరించుకొని ఆకివీడు గంగానమ్మకోడు ప్రాంతానికి చెందిన ఇరు వర్గాల యువకులు ఘర్షణకు పాల్పడ్డారు. ఎస్సై నాగరాజు తెలిపిన వివరాల మేరకు గంగానమ్మకోడు ప్రాంతానికి చెందిన మేకల పవన్‌కుమార్‌ను అదే ప్రాంతానికి చెందిన పసుపురెడ్డి గోపిచంద్, మేకల వెంకటేశ్వరరావు ఆదివారం ఉదయం చాకుతో పొడిచి, చేత్తో కొట్టి గాయపరిచారు. చికిత్స కోసం పవన్‌కుమార్ ఆకివీడు ప్రభుత్వ ఆసుపత్రిలో చేరాడు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు ఆదివారం రాత్రి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పేదల ఆకలి తీరుస్తున్న దాతలు

ఉండి, న్యూస్‌టుడే: అన్న క్యాంటీన్ ప్రాంగణంలో అన్నదానం చేస్తూ పేదల ఆకలి తీరుస్తున్న దాతలు అభినందనీయులని ఉండి ఏఎంసీ ఛైర్మన్ కలిదిండి రామకృష్ణంరాజు తెలిపారు. ఉండి అన్నక్యాంటీన్ ప్రాంగణంలో నీటి వినియోగదారుల సంఘం మాజీ అధ్యక్షుడు ఉద్దరాజు చిట్టిబాబు సహకారంతో ఆదివారం 400 మంది పేదలకు అన్నదానం చేశారు. దాత చిట్టిబాబును మండల తెదేపా ప్రధాన కార్యదర్శి కళ్లేపల్లి సతీష్‌రాజు, మాజీ అధ్యక్షుడు కరిమెరక శ్రీనివాసరావు, జడ్పీటీసీ మాజీ అధ్యక్షుడు కాగిత మహంకాళి తదితరులు సత్కరించారు.

(c) eenadu

నరసాపురం

•నరసాపురం •పాలకొల్లు •ఆచంట

1న బాలోత్సవం

గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న నిర్వహణ కమిటీ సభ్యులు

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: చిన్నారుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు మార్చి 1న నరసాపురంలో 'బాలోత్సవం' పిల్లల పండగ నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు పులిశెట్టి శ్రీనివాస్, గుత్తుల సాగర్, పండా నాగేంద్ర ప్రసాద్, కప్పర నరసింహస్వామి తెలిపారు. నరసాపురం పట్టణంలోని వైఎన్ కళాశాల ప్రాంగణంలో 1న పట్టణం, మండల పరిధిలోని 4 నుంచి 10వ తరగతి విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, తెలుగు కథల రచన, దేశభక్తి, అభ్యుదయ గీతాలపన, జానపద, శాస్త్రీయ నృత్యాలు, విచిత్ర వేషధారణ పోటీలు జరుగుతాయని తెలిపారు. పాల్గొనే విద్యార్థులు ఈ నెల 25వ తేదీ లోపు వివరాలు నమోదు చేసుకోవాలని తెలిపారు.

ఆధ్యాత్మిక చింతనతోనే ప్రశాంతత

పాలకొల్లు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: పాలకొల్లు కోడిగట్టు ప్రాంతంలో ఉన్న సరస్వతీ శిశుమందిరంలో ఆదివారం సూర్య హోమాలు నిర్వహించారు. తొలుత పండితుడు ములుకుట్ల రవీంద్రనాథ్ ఆధ్వర్యంలో సూర్య నమస్కారాలు, శాంతిహోమాలు, పూజలు జరిపించారు. వైద్యుడు మల్లికర్జున మాట్లాడుతూ కరోనా వ్యాప్తి సమయంలో లోక కల్యాణార్థం సూర్య హోమాలు ప్రారంభించామని తెలిపారు. ఇప్పటికి 300 వారాలు పూర్తయ్యాయని పేర్కొన్నారు. ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత లభిస్తుందని, చక్కటి ఆరోగ్యానికి సూర్య నమస్కారాలు దోహదం చేస్తాయని పేర్కొన్నారు.

బండి ముత్యాలమ్మకు అర్చనలు

మొగల్తూరు, న్యూస్‌టుడే: ముత్యాలపల్లిలో కొలువైన బండి ముత్యాలమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు అర్చనలు చేశారు. పలు ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

మాట్లాడుతున్న ఆర్డీవో రాజు, హాజరైన క్యాడెట్లు

క్రమశిక్షణకు ప్రతీక ఎన్‌సీసీ

నరసాపురం, పట్టణం, న్యూస్‌టుడే: ఎన్‌సీసీలో పనిచేసే విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ, జాతీయ భావం అలవడుతాయని ఆర్డీవో దాసి రాజు అన్నారు. సెవన్ ఆంధ్రా నేవల్ యూనిట్ ఎన్‌సీసీ క్యాడెట్లు పట్టణంలోని వశిష్ఠ గోదావరి తీరంలో ఆదివారం శ్రమదానం చేసి వ్యర్థాలు తొలగించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆర్డీవో విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. అనంతరం విద్యార్థులతో కలిసి చెత్త తొలగింపు పనుల్లో పాల్గొన్నారు. కమాండెంట్ ఆఫీసర్ లెఫ్టినెంట్ సంజిత్ రౌత్, మామిళ్ల రాము, ధర్మరాజు, వైఎన్ కళాశాల, పాలకొల్లు ఏఎస్ఎన్ఎం ప్రభుత్వ కళాశాల, వాసవీ పెనుగొండలోని ఎస్వీకేపీ కళాశాల, సీతారామపురం స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాల, తణుకు, కొప్పర్రు జడ్పీ ఉన్నత పాఠశాలలు, భీమవరం భారతీయ విద్యాభవన్స్‌కు చెందిన క్యాడెట్లు పాల్గొన్నారు.

వంతెనొస్తే.. వణుకే!

శిథిలమైన రక్షణ గోడలు

పెనుమంట్ర, నరసాపురం గ్రామీణ, పాలకొల్లు గ్రామీణ న్యూస్‌టుడే: నరసాపురం డివిజన్ పరిధిలో ప్రధాన రహదారుల్లో పలు గ్రామాల్లో పంట, మురుగు కాలువలపై ఉన్న వంతెనలు, కల్వర్టుల రక్షణ గోడలు శిథిలమై విరిగిపోయాయి. ఈ ప్రాంతాల్లో వాహనదారులు ఏమాత్రం అదుపు తప్పినా కాలువల్లో పడిపోయే ప్రమాదం ఉంది. సమస్య తీవ్రంగా ఉన్నా కనీస మరమ్మతులు చేయకపోవడంతో వాహనదారులు బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగిస్తున్నారు.

పాలి- నత్తారామేశ్వరం- మల్లిపూడి రహదారిలో గోస్తనీ డ్రెయిన్ ఉన్న వంతెన రక్షణ గోడలు దెబ్బతిని ఇలా ఇనుప చువ్వలు బయటకొచ్చాయి. ఈ వంతెన మీదుగా నత్తారామేశ్వరం, జుత్తిగ, మల్లిపూడి, పాలి, అత్తిలి, పెనుమంట్ర వాసులు రాకపోకలు సాగిస్తారు. విద్యాసంస్థల బస్సులు, భారీ వాహనాల రద్దీ కూడా ఎక్కువే. రక్షణ గోడలు లేకపోవడంతో ఎప్పుడు ఏ ముప్పు ముంచుకొస్తుందోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అన్ని చోట్లా ఇదే పరిస్థితి.. ● వాసవీ పెనుగొండ మండలంలో ములపర్రు, దేవ, వదలి గ్రామాల్లో కల్వర్టులు, వంతెనల రక్షణ గోడలు దెబ్బతినడంతో రాత్రి వేళ ప్రమాదాలు జరుగుతున్నాయి. ● పాలకొల్లు మండలంలో ఆగర్తి, పెదగరువు గ్రామాల్లో వంతెనల రక్షణ గోడలు కూలిపోయాయి. అగర్తిపాలెం పంట కాలువపై కల్వర్టు రెయిలింగ్ శిథిలమై ఊచలు సైతం బయటకొచ్చాయి. ● పెనుమంట్ర మండలం మామిడూరు పరిధిలో చిట్టమట్లగరువు మార్గంలోని కల్వర్టు రక్షణ గోడలు దెబ్బతిన్నాయి. వెలగలవారిపాలెం, పాలి మార్గంలో నత్తారామేశ్వరం శివారు, బట్టిమగుటూరులో శ్రీరామపురం కాలువపై, పోలమూరు పంచాయతీ పరిధిలో చెన్నాదేవరపల్లో కల్వర్టులు ప్రమాదకరంగా మారాయి. ● నరసాపురం మండలం కె.బేతపూడిలో తోళ్లేరు డ్రెయిన్‌పై, వేములదీవి పడమరలో మైనవానిలంక సముద్ర పాయ వద్ద నిర్మాణాలు సైతం దెబ్బతిన్నాయి.

పాలకొల్లు మండలం ఆగర్తిలో..

ఉన్నతాధికారులకు నివేదించాం: గ్రామాల్లో శిథిల కల్వర్టులను ఇప్పటికే గుర్తించి వాటి పరిస్థితిపై ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చామని ఆర్అండ్‌బీ ఏఈ యశ్వంత్, పంచాయతీరాజ్ ఏఈ అశోక్, జల వనరుల శాఖ ఏఈ శ్రీనివాస్ తెలిపారు. వారి ఆదేశాల మేరకు తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

నిర్వహణ లేక.. వంతెనలు, కల్వర్టులను అధికారులు రెండు, మూడేళ్లకోసారి పరిశీలించి అవసరమైన నిర్వహణ పనులు చేయాల్సి ఉంటుంది. ఈ దిశగా ఎలాంటి చర్యలు లేవు. భారీ వాహనాలు రాకపోకలు సాగించే మార్గాల్లో ఉన్న వంతెనల వద్ద వాటి సామర్థ్య సూచికలు తెలిపే వివరాలతో బోర్డులు ప్రదర్శించాలి. ఎక్కడా ఇలాంటి బోర్డులు లేవు.

పాలకొల్లులో..

స్వర్ణ ధనుస్సుకు పూజలు

పెనుమంట్ర, న్యూస్‌టుడే: అయోధ్యలో సరయూ నది తీరంలో నిర్మిస్తున్న 108 అడుగుల కల్యాణ రాముడి విగ్రహానికి అలంకరించే స్వర్ణ ధనుస్సు పాదుకలను ఆదివారం మార్టేరులోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తుల దర్శనార్థం ఉంచారు. గ్రామంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ధనుస్సుతో పాటు స్వామివారి పంచలోహ విగ్రహం, పాదుకలను దర్శించుకున్నారు.

పాలకొల్లు ఆధ్యాత్మికం, పోడూరు, న్యూస్‌టుడే: స్వర్ణ ధనుస్సు, పాదుకలను ఆదివారం కొమ్ముచిక్కాల క్షత్రియ రామాలయంలో భక్తుల దర్శనార్థం ఉంచారు. ఉత్సవ కమిటీ ఛైర్మన్ గొట్టుముక్కల సూర్యనారాయణరాజు - శేషారత్నం దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. సర్పంచి గుంటూరి రామకృష్ణంరాజు, భక్తులు పాల్గొన్నారు.

★ పాలకొల్లులో స్వర్ణ ధనుస్సుకు తెదేపా నాయకుడు కర్నేన గౌరునాయుడు నివాసంలో ప్రత్యేక పూజలు జరిపించారు.

ఘనంగా అక్షరాభ్యాసాలు

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: నరసాపురం పట్టణంలోని రాజగోపాల స్వామి ఆలయంలోని లక్ష్మీ హయగ్రీవ స్వామి సన్నిధిలో ఆదివారం సామూహిక అక్షరాభ్యాసాలను ఘనంగా నిర్వహించారు. చిన్నారులు అక్షర స్వీకార మహోత్సవంలో పాల్గొని పూజలు చేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నరసాపురం	80085 74504	ఆచంట	90631 44737
పాలకొల్లు	80085 74510	వాసవీ పెనుగొండ	80085 74469
పోడూరు	90631 44741	పెనుమంట్ర	91212 29087

నరసాపురం, న్యూస్‌టుడే: ? పురపాలక కార్యాలయం రోడ్డులో పలు చోట్ల గుంతలు ఏర్పడటంతో రాకపోకలకు ఇబ్బంది పడుతున్నాం. - సత్యనారాయణ, నరసాపురం

✔ ఆ ప్రాంతాన్ని పరిశీలించి గుంతలు పూడ్చేందుకు చర్యలు తీసుకుంటాం. - ఆర్.గంగావరప్రసాద్, పురపాలక డీఈ

మొగల్తూరు, న్యూస్‌టుడే: ? కోట రోడ్డులో తాగునీటి పైపులైనుకు లీకేజీ ఏర్పడింది. కొద్ది రోజులుగా శుద్ధిజలాలు వృథాగా పోతున్నాయి. - సూర్యనారాయణ, మొగల్తూరు

✔ మరమ్మతులు చేయిస్తాం. - టి.లోకేశ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఇన్‌ఛార్జి ఏఈ

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: ? భూపతి వారి వీధిలో నివాసాల మధ్య చెత్త పేరుకుపోయింది. దోమల బెడద ఎక్కువగా ఉంది. - బి. ఆంజనేయులు, నరసాపురం

✔ చెత్త తొలగింపు పనులు చేయిస్తాం. - పాత్రుడు, శానిటరీ ఇన్‌స్పెక్టర్

వాసవీ పెనుగొండ, న్యూస్‌టుడే: ? వాసవీ పెనుగొండ శివారు చిన్నంవారిపాలెంలో నాలుగు వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రి వేళ రాకపోకలకు ఇబ్బంది పడుతున్నాం. - సి.శ్రీనివాస్

✔ మరమ్మతులు చేయిస్తాం. - టి.కృష్ణారెడ్డి, పంచాయతీ కార్యదర్శి

వ్యర్థాల తొలగింపు.. వాసవీ పెనుగొండ, న్యూస్‌టుడే: సంతమార్కెట్ ఆవరణలో చెత్త పేరుకుపోయిన తీరుపై ఈ నెల 21న 'ఈనాడు- మేమున్నాం..మీకు తోడుగా'లో ప్రచురితమైన వార్తకు సర్పంచి నక్కా శ్యామలాసోని, పంచాయతీ కార్యదర్శి టి.కృష్ణారెడ్డి స్పందించారు. ఆదివారం ఆ ప్రాంతంలో చెత్త తొలగింపు పనులు చేయించారు.

ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే పితాని

గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యం

పెనుమంట్ర, న్యూస్‌టుడే: మౌలిక వసతుల కల్పనతో పాటు గ్రామాల సమగ్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. మల్లిపూడి గ్రామంలో రూ.47.50 లక్షలతో చేసిన పలు అభివృద్ధి పనులను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పితాని మాట్లాడుతూ గత వైకాపా ప్రభుత్వం సమస్యలను గాలికి వదిలేసి ప్రజాధనాన్ని అడ్డగోలుగా దండుకుందని విమర్శించారు. సర్పంచి మహాలక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు దండు లక్ష్మి, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధితో పేదలకు భరోసా

పోడూరు, న్యూస్‌టుడే: పేదలకు భరోసా కల్పించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ ఆలస్యం లేకుండా సీఎం సహాయ నిధి ద్వారా ఆర్థిక సాయం మంజూరు చేస్తున్నారని ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. 40 మందికి మంజూరైన రూ.23,16,107 విలువైన చెక్కులను ఆయన ఆదివారం కొమ్ముచిక్కాలలోని తన కార్యాలయంలో అందజేసి మాట్లాడారు.

కూటమి పాలనతోనే ప్రగతి

శిలాఫలకం వద్ద మంత్రి నిమ్మల, నాయకులు

యలమంచిలి, న్యూస్‌టుడే: మరో 15 ఏళ్ల కూటమి ప్రభుత్వం అధికారంలో ఉంటేనే రాష్ట్రం అన్ని రంగాల్లో ప్రగతి సాధిస్తుందని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. నియోజకవర్గంలో పలు ప్రాంతాల్లో ఆదివారం పర్యటించిన ఆయన రూ. 4.43 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఇప్పటికే జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. యలమంచిలి మండలం అడవిపాలెం, కొంతేరు, ఆర్యపేట, యలమంచిలి, మేడపాడు, వైవీలంక, ఇలపకుర్రు, దొడ్డిపట్ల గ్రామాల్లో శంకుస్థాపనలు జరిగాయి. రాష్ట్ర ప్రగతికి కృషి చేస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రజలంతా మద్దతుగా నిలవాలని కోరారు. నాయకులు కడలి గోపాలరావు, బోనం నాని, ఉన్నమట్ల కబర్ది, ఉన్నమట్ల ప్రేమకుమార్ పాల్గొన్నారు.

తెదేపా బలోపేతానికి కృషి.. నరసాపురం, న్యూస్‌టుడే: తెదేపాను మరింత బలోపేతం చేసేలా కృషిచేయాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు నాయకులకు సూచించారు. నరసాపురం మూడో వార్డులో పార్టీ పట్టణ అధ్యక్షుడు కాగిత వెంకటేశ్వరరావు అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నాయకులు కొప్పాడ రవీంద్రనాథ్ ఠాగూర్, భూపతి రమేశ్, నాగిడి రాంబాబు, పట్నాల జగన్, బొర్రా చిన్నాయమ్మ, పొన్నాల నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

వైకాపా ఎమ్మెల్సీల తీరు అప్రజాస్వామికం

సమావేశంలో నాయకర్, రామరాజు, నాయకులు

నరసాపురం, న్యూస్‌టుడే: శాసనమండలిలో ఇటీవల వైకాపా ఎమ్మెల్సీలు ప్రవర్తించిన తీరు అప్రజాస్వామికమని నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ అన్నారు. పట్టణంలోని జనసేన కార్యాలయంలో తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, కూటమి పార్టీల నాయకులతో కలిసి ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైకాపా అధినేత జగన్‌మోహన్‌రెడ్డి, ఆ పార్టీ నాయకులు కూటమి పార్టీల మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు.

హిందువులకు క్షమాపణలు చెప్పాలి.. మార్టేరు, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వినియోగం విషయంలో వైకాపా హిందువులకు బహిరంగ క్షమాపణలు చెప్పాలని కూటమి నాయకులు డిమాండ్ చేశారు. మార్టేరులో ఆదివారం కూటమి పార్టీల నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. తమనంపూడి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ వైకాపా నాయకులకు హిందువులపై, హిందూ దేవుళ్లపై ఏమాత్రం గౌరవం లేదన్నారు. భాజపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి ప్రసాదరెడ్డి మాట్లాడుతూ హిందువుల మనోభావాలతో వైకాపా ఆటలాడుతోందని మండిపడ్డారు.

బాలాత్రిపురసుందరికి పెన్నులతో అలంకరణ

భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానున్న సందర్భంగా మెంటేవారితోటలోని బాలాత్రిపురసుందరి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు చేసి సుమారు 1,000 పెన్నులతో అలంకరించారు. అమ్మవారి దర్శనానికి వచ్చే విద్యార్థులకు పెన్నులు అందజేసినట్లు ఆలయాభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు.

దిగబడి.. రాళ్లు తేలి!

జుత్తిగ- మల్లిపూడి మార్గంలో అర్జునుడిపాలెం వద్ద రహదారి ఇలా గుంతలతో, రాళ్లు తేలి అధ్వానంగా మారింది. ఈ మార్గం జీఅండ్‌వీ కాలువను చేర్చి ఉండటంతో పలు చోట్ల దిగబడి ఎగుడు.. దిగుడుగా మారింది. దీంతో వాహన చోదకులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. మల్లిపూడి- అర్జునుడిపాలెం రహదారి సైతం దెబ్బతింది. ఈ రహదారుల పరిస్థితిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి మరమ్మతులకు చర్యలు తీసుకుంటామని ఈ ఆర్అండ్‌బీ ఏఈ యశ్వంత్ చెప్పారు. - న్యూస్‌టుడే, పెనుమంట్ర

తెచ్చారు.. మూలకు చేర్చారు!

పాలకొల్లు గ్రామీణ, న్యూస్‌టుడే: గ్రామాల్లో ఇంటింటి చెత్త సేకరణ కోసం వైకాపా ప్రభుత్వ హయాంలో సమకూర్చిన రిక్షాలను సక్రమంగా వినియోగించడం లేదు. పాలకొల్లు మండలం ఆగర్తిపాలెంలో పంచాయతీ కార్యాలయం వద్ద రెండు రిక్షాలను ఇలా వృథాగా వదిలేయడంతో తుప్పు పట్టి పనికి రాకుండా పోతున్నాయి. వాటికి మరమ్మతులు చేయించి వినియోగంలోకి తెస్తామని పంచాయతీ కార్యదర్శి సతీశ్ తెలిపారు.

శిథిల భవనం.. మరమ్మతులు చేస్తే పదిలం!

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: మల్లవరం పెదలంకలో 2000 సంవత్సరంలో ఎంపీ నిధులు రూ. 6 లక్షల వ్యయంతో ఎస్సీ సామాజిక భవనాన్ని నిర్మించారు. దీనిలో కొన్నేళ్ల పాటు ప్రభుత్వ, సామాజిక కార్యక్రమాలను నిర్వహించారు. నిర్వహణ లోపాలతో ప్రస్తుతం ఈ భవనం శిథిలస్థితికి చేరింది. దీనికి మరమ్మతులు చేసి వినియోగంలోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.

ఆక్రమణల చెరలో పంట కాలువ

వాసవీ పెనుగొండ గ్రామీణ, న్యూస్‌టుడే: దేవ గ్రామంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ సమీపాన పంట కాలువ వెంబడి భూమి ఆక్రమణకు గురైంది. దీనిలో అరటి సాగు చేస్తున్నారు. అధికారులు పట్టించుకోకపోవడంతో కాలువ విస్తీర్ణం తగ్గిపోయి ప్రవాహ సామర్థ్యం కోల్పోయిందని.. శివారు ప్రాంతాలకు నీరు చేరడం లేదని రైతులు పేర్కొంటున్నారు.

విగ్రహం వద్ద సంఘ నాయకులు, సభ్యులు

స్ఫూర్తిప్రదాత ఉయ్యాలవాడ

మార్టేరు, న్యూస్‌టుడే: మహనీయుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్ఫూరిగా తీసుకోవాలని రెడ్డి సేవా సంఘ నాయకులు పిలుపునిచ్చారు. ఆ సంఘం ఆధ్వర్యంలో మార్టేరు కూడలి వద్ద ఆదివారం స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత ఉయ్యాలవాడ నరసింహారెడ్డి కూడలి వద్ద విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

శంకుస్థాపన చేస్తున్న అంగర

రూ.15 లక్షలతో అభివృద్ధి పనులు

పాలకొల్లు గ్రామీణ, న్యూస్‌టుడే: పాలకొల్లు మండలం కాపవరంలో రూ.15 లక్షలతో చేపట్టిన సీసీ రహదారులు, డ్రెయినేజీల పనులకు మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్ ఆదివారం శంకుస్థాపన చేశారు. సర్పంచి కోలాటి రాధ, అంగర చిన్న, పాముల రజని తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని యువకుడి మృతి

పాలకొల్లు గ్రామీణ, న్యూస్‌టుడే: లారీ ఢీకొట్టడంతో యువకుడు అక్కడికక్కడే మృతి చెందిన ఘటన పాలకొల్లు వద్ద చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురానికి చెందిన బి. ప్రభుకుమార్ (32) ద్విచక్ర వాహనంపై ఆదివారం ఉదయం పాలకొల్లులో బంధువుల ఇంటికి బయలుదేరారు. పాలకొల్లు సమీపాన పెదగరువు వచ్చేసరికి అతడిని ఎదురుగా వచ్చిన లారీ ఢీకొట్టడంతో తలకు తీవ్రగాయమై మృతి చెందారు. మృతదేహాన్ని పాలకొల్లు ప్రాంతీయ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై పృథ్వీ తెలిపారు.

రహదారి ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: నరసాపురం- మొగల్తూరు రహదారిలో ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పోడూరు మండలం జిన్నూరుకు చెందిన తాడి జోషి, గొట్టుముక్కల శామ్యూల్‌రాజు కలిసి ఆదివారం బైక్‌పై పేరుపాలెం బీచ్‌కు వెళ్లి తిరిగివస్తుండగా సెవంత్ డే పాఠశాల సమీపాన వ్యాన్ ఢీకొట్టింది. ఈ ఘటనలో వారిద్దరికీ తీవ్ర గాయాలు కాగా స్థానికులు గమనించి 108 అంబులెన్సుకు సమాచారం ఇచ్చారు. 108 సిబ్బంది వచ్చి క్షతగాత్రులకు ప్రాథమిక చికిత్స చేసి నరసాపురం ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు.

ఉచిత వైద్య సేవలు అభినందనీయం

మొగల్తూరు, న్యూస్‌టుడే: గ్రామీణుల కోసం ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు అన్నారు. మండలంలోని జగన్నాథపురంలో స్థానిక సొసైటీ, ఏలూరు ఆశ్రం ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నేత్ర వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. వైద్యులు పలువురికి పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు, కళ్ల జోళ్లు అందించారు. సొసైటీ ఛైర్మన్ వేగేశ్న త్రినాథరాజు, సీఈవో కొపనాతి వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

దర్శకుడు కోడి రామకృష్ణకు నివాళి

పాలకొల్లు సాంస్కృతికం, న్యూస్‌టుడే: సినీ దర్శకుడు కోడి రామకృష్ణ వర్ధంతిని ఆదివారం పాలకొల్లు మారుతీ థియేటర్ ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా అభిమానులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ధ్యాన సాధనతో ఆరోగ్యం

పెనుమంట్ర, న్యూస్‌టుడే: డబ్బుతో కొనలేనవి ఆరోగ్యం, ఆనందమని.. వీటిని ధ్యాన సాధనతో సొంతం చేసుకోవచ్చని సీనియర్ పిరమిడ్ శిక్షకురాలు దండు విజయలక్ష్మి అన్నారు. పెనుమంట్రలో పత్రీజీ పిరమిడ్ ధ్యాన మందిరంలో ఆదివారం ఉచిత ధ్యాన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పాల్గొని స్థానికులతో సామూహికంగా ధ్యాన సాధన చేయించారు.

అవి ఇవి అన్నీ

పోరాట యోధుడు కన్నెగంటి

నరసాపురం, న్యూస్‌టుడే: స్వాతంత్ర్య సమరయోధుడు కన్నెగంటి హనుమంతు వర్ధంతిని పట్టణంలో కాపు ఐకాస ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు తొలుత హనుమంతు చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్య ఉద్యమంలో హనుమంతు చూపిన పోరాట పటిమను నాయకులు వివరించారు.

బీచ్‌లో పర్యాటకుల సందడి

మొగల్తూరు, న్యూస్‌టుడే: పేరుపాలెంసౌత్, కేపీపాలెం సౌత్‌లలోని బీచ్‌కు ఆదివారం అధిక సంఖ్యలో పర్యాటకులు తరలివచ్చారు. వారు ఉదయం నుంచి సాయంత్రం వరకు తీరంలో ఆటపాటలతో ఆహ్లాదంగా గడిపారు. పలువురు సముద్ర అలల్లో స్నానాలు చేస్తూ సేదదీరారు.

సీసీ రహదారులకు శంకుస్థాపన

పోడూరు, న్యూస్‌టుడే: పోడూరు మండలంలోని పలు గ్రామాల్లో జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించనున్న సీసీ రహదారులు, డ్రెయిన్ పనులకు ఆదివారం కూటమి నాయకులు శంకుస్థాపనలు చేశారు. కొమ్ముచిక్కాల, మట్టపర్రు, వద్దిపర్రు, పెనుమదం గ్రామాల్లో రూ.85 లక్షలతో ఈ పనులు చేపట్టనున్నారు. సర్పంచులు గుంటూరి రామకృష్ణంరాజు, దొమ్మేటి శ్రీను, వడ్లపాటి రాజేంద్రప్రసాద్, తానేటి బాబూరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కళ తప్పిన అలంకృతి!

చినమల్లం: భవనంలో వృథాగా పడి ఉన్న కుట్టు మిషన్లు

వాసవీ పెనుగొండ గ్రామీణ, మార్టేరు, న్యూస్‌టుడే: గతంలో ఎందరో మహిళలకు ఉపాధి చూపిన లేసు అల్లికలు క్రమంగా ప్రాభవం కోల్పోతున్నాయి. లేసు అల్లికల ద్వారా మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే యోచనతో గతంలో గ్రామాల్లో అలంకృతి పేరిట భవనాలు నిర్మించి శిక్షణ తరగతులు నిర్వహించారు. కాలక్రమేణా వీటిని పట్టించుకోకపోవడంతో భవనాలు, విలువైన కుట్టుమిషన్లు, ఇతర పరికరాలు నిరుపయోగంగా మారాయి.

రూ.25 లక్షల వ్యయంతో.. 2017లో రూ.25 లక్షల వ్యయంతో వాసవీ పెనుగొండ మండలంలోని చినమల్లం, రామన్నపాలెం గ్రామాల్లో మినీ అలంకృతి భవనాలు నిర్మించారు. అప్పట్లో ఆధునిక యంత్రాలను సైతం సమకూర్చడంతో మహిళలకు మెరుగైన ఉపాధి లభించింది. క్రమంగా ఎగుమతులు లేకపోవడం, ఆపై వచ్చిన వైకాపా ప్రభుత్వం వీటిని పట్టించుకోకపోవడంతో ప్రాభవం కోల్పోయాయి. ఈ కేంద్రాలను వినియోగంలోకి తీసుకొచ్చి తమకు ఉపాధి అవకాశాలు కల్పించేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల మహిళలు కోరుతున్నారు. ఈ అంశంపై వెలుగు ఏపీఎం టి.పుష్పవతి స్పందిస్తూ సమస్యను ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

శ్రద్ధాంజలి
మా ఆప్తులు, శ్రీ అందే భుజంగరావు గారి కుమారుడు శ్రీ డా॥ అందే వెంకటరామ సత్య తాతారావు గారి ఆకస్మిక మృతికి చింతిస్తూ... వారి కుటుంబ సభ్యులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ...
శ్రీ డా॥ అందే వెంకటరామ సత్య తాతారావు M.D. (Gen) C.S.R.M.O. డిస్ట్రిక్ట్ హాస్పటల్, తణుకు పేరుపాలెం
శ్రీ అందే బాపన్న & బ్రదర్స్ సహకార జూనియర్ కళాశాల
శ్రీ కోట్ల వెంకట రంగారావు డిగ్రీ కళాశాల, మొగల్తూరు
ప్రిన్సిపాల్: కుక్కల కృష్ణమాధవ్
బోధన మరియు బోధనేతర సిబ్బంది
విద్యార్థినీ విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు

ఇలాగే వదిలేస్తే.. ప్రజారోగ్యం ఖాళీ

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: నరసాపురం పురపాలక సంఘం పరిధిలో నివాస సముదాయాల మధ్య ఖాళీ జాగాల అపరిశుభ్రతకు నిలయాలుగా మారాయి. వీటిలో పిచ్చి మొక్కలు, పొదలు పెరిగి చిట్టడవులను తలపిస్తున్నాయి. ఏళ్ల తరబడి వీటిని పట్టించుకొనే వారు లేకపోవడంతో వ్యర్థాలు పేరుకుపోయి, మురుగు నిలిచి దోమలకు ఆవాసాలుగా మారాయి.

పందుల సంచారంతో.. పీచుపాలెం, పొన్నపల్లి, మాధవాయిపాలెం, మారుతీ నగర్, ఏటిగట్టు రోడ్డు, ఆదర్శ నగర్, కంబాలవారి వీధుల్లో నివాసాల మధ్య ఖాళీ జాగాల్లో పందులు గుంపులుగా తిష్ఠ వేస్తున్నాయి. వీటి వల్ల అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

నోటీసులతో సరి.. ఖాళీ స్థలాలను శుభ్రం చేయించుకోవాలంటూ పురపాలక అధికారులు వాటి యజమానులకు నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకొంటున్నారు. వాటిని యాజమానులు పట్టించుకోవట్లేదు. ఖాళీ స్థలాల సమస్య పూర్తి స్థాయిలో పరిష్కారమయ్యేలా దృష్టి సారిస్తామని, పందులు, దోమల నివారణకు చర్యలు తీసుకుంటామని పురపాలక కమిషనర్ ఆర్. వెంకటరామిరెడ్డి తెలిపారు.

నరసాపురం పట్టణ పరిధి మారుతీనగర్‌లో నివాసాల మధ్య ఖాళీ జాగాలో ఇలా మురుగు నిలిచి పసర్లు పట్టడంతో దుర్వాసన, దోమల బెడదతో చుట్టుపక్కల నివాసితులు నిత్యం నరకరం అనుభవిస్తున్నారు. పట్టణంలో దాదాపు అన్ని వార్డుల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

సమ్మేళనానికి తరలివెళ్లిన తపాలా ఉద్యోగులు

ఆచంట, న్యూస్‌టుడే: గుంటూరులో ఆదివారం జరిగిన గ్రామీణ డాక్ సేవక్ సమ్మేళనంలో పాల్గొనేందుకు జిల్లా నుంచి తపాలా ఉద్యోగులు తరలివెళ్లారు. ఉమ్మడి జిల్లా నుంచి 20 బస్సులు, ఇతర వాహనాల్లో వెయ్యి మందికి పైగా ఉద్యోగులు గుంటూరు వెళ్లినట్లు ఆ సంఘ నాయకులు తెలిపారు. ఏపీలోని 17 వేల మంది తపాలా ఉద్యోగుల సేవలు ప్రభుత్వ చెల్లింపులకు వినియోగించుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

శ్రద్ధాంజలి
చెరగని చిరునవ్వుతో, కల్మషం ఎరగని మనస్సుతో మా అందరి హృదయాలలో నిలిచిన శ్రీ డా॥ అందే వెంకటరామ సత్యతాతారావు మృతికి చింతిస్తూ.. శోకతప్త హృదయాలతో..
శ్రీ డా॥ అందే వెంకటరామ సత్యతాతారావు M.D. (Gen) C.S.R.M.O డిస్ట్రిక్ట్ హాస్పటల్, తణుకు, పేరుపాలెం
అందే వెంకట బుచ్చిబాబు
అందే సూర్యనారాయణ (సూరి)
అంబటి రాము
అందే పిచ్చియ్య
అందే ఏడుకొండలు (కొండ)

(c) eenadu

తాడేపల్లిగూడెం

కుంచనపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి ఉచిత బస్సు

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెం మండలం కుంచనపల్లిలోని శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామిని భక్తులు దర్శించుకోవడానికి ప్రతి శనివారం దాతల సహకారంతో ఉచిత బస్సు సౌకర్యం ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు మల్లికార్జునరావు తెలిపారు. తొలుత కింబర్లీ పాఠశాల యాజమాన్యం ఉచిత బస్సు ఏర్పాటు చేసిందని తెలిపారు. ఈ బస్సు ఉదయం 9.30 గంటలకు ఓవర్ బ్రిడ్జి కింద నుంచి బయలుదేరి మసీదురోడ్డు, సత్యవతినగర్, కనకమహాలక్ష్మి ఆలయం మీదుగా కుంచనపల్లి చేరుకుంటుందని తెలిపారు.

ఆలయ నిర్మాణానికి రూ.51,116 విరాళం

జగన్నాథపురం(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెం మండలం జగన్నాథపురం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ వరసిద్ధి వినాయక ఆలయానికి తాడేపల్లిగూడెం తెదేపా తెలుగు యువత అధ్యక్షుడు గంధం సతీష్, లతాప ద్మశ్రీదంపతులు ఆదివారం రూ.51,116 విరాళాన్ని ఆలయ కమిటీకి అందించారు.

నగదు అందజేస్తున్న సతీష్

తాగునీరు అందడం లేదా? చెత్త తీయడం లేదా?

నేడు 'డయల్ యువర్ మున్సిపల్ కమిషనర్'

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: మీ ప్రాంతానికి తాగునీరు సక్రమంగా రావడం లేదా? పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా లేక ఇబ్బంది పడుతున్నారా? దోమల బెడద తీవ్రంగా ఉందా? విద్యుత్తు దీపాలు వెలగడం లేదా? పింఛన్లు, రేషన్‌కార్డులు, రహదారి సమస్యలున్నాయా..? మీ ఇబ్బందుల్ని మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేదుకు 'ఈనాడు - మీతోడు' ఆధ్వర్యంలో 'డయల్ యువర్ కమిషనర్' కార్యక్రమం నిర్వహిస్తోంది. మీరు చేయాల్సిందల్లా కింద పేర్కొన్న ఫోన్ నంబరుకు ఫోన్‌చేసి నేరుగా మున్సిపల్ కమిషనర్ ఏసుబాబుతో మాట్లాడి సమస్య తెలియజేయవచ్చు. మరెందుకు ఆలస్యం ఫోన్ తీసుకొని నంబరు కొట్టేయండి. సమస్య చెప్పేయండి.

తేదీ: 23.02.2026 సోమవారం
సమయం: ఉదయం 9.00 నుంచి 10.00 గంటల వరకు
ఫోన్ నంబరు: 08818-224188

ప్రణాళిక సిద్ధం.. ఆక్రమణలే అడ్డం

రోడ్ల నిర్మాణానికి వేగంగా అడుగులు

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: పట్టణంలో పలు రహదారులు పయనించలేని విధంగా ఉండేవి. గత ప్రభుత్వం రహదారుల నిర్మాణం గాలికి వదిలేయడంతో ఆయా వార్డుల వారికి ఇబ్బందులు పడ్డారు. కూటమి ప్రభుత్వం రహదారుల నిర్మాణాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఇందులో భాగంగా ఎస్సీ నిధుల నుంచి రూ.2.5 కోట్లు, కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.2.12 కోట్లు నిధులు మంజూరు అయ్యాయి. దీంతో పట్టణంలోని ప్రాధాన్యం ఉన్న రహదారులను త్వరితగతిన పూర్తి చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

ఎస్సీ నిధులు: పట్టణంలోని కడకట్ల, యాగర్లపల్లి, మామిడి తోట తదితర ప్రాంతాల్లో ఎస్సీ నిధులను వినియోగించనున్నారు. ఆయా ప్రాంతాల్లో ప్రాధాన్యాన్ని బట్టి రహదారులను నిర్మించనున్నారు. ఇప్పటికే కొన్నింటిని గుర్తించి పనులు ప్రారంభించారు.

కొండయ్య చెరువు పక్కన నిర్మిస్తున్న సీసీరోడ్డు

గణేశ్ నగర్ రోడ్డు.. గణేశ్ నగర్ రోడ్డు జీవీమాల్ నుంచి ఒకటో వార్డు గణేశ్ నగర్ వినాయకుడి గుడి వరకు ప్రస్తుతం ఇరవై అడుగుల రహదారి ఉండగా దాన్ని 80 అడుగులకు విస్తరించనున్నారు. ఇది ఏపీ నిట్‌కు పశ్చిమ ముఖద్వారం కానుండటంతో రహదారి విస్తరణకు ప్రాముఖ్యం సంతరించుకుంది. ఈ నిర్మాణం పూర్తి అయితే పట్టణంలో ఇదే సువిశాలమైన రహదారి అవుతుంది. ఈ దిశగా పురపాలక సంఘం పనులు ప్రారంభించింది. జీవీమాల్ ఎదురుగా ఎనభై అడుగుల రహదారిని విభజించి మధ్యలో వాటర్ ఫౌంటెన్ నిర్మాణం ప్రారంభించారు.

విస్తరణకు సమస్యలు: ఈ రహదారి వెంబడి తూర్పున కొందరు ఆక్రమించుకుని స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. దీంతో వారు ఆయా నివాసాలను ఖాళీ చేయడానికి అభ్యంతరాలు తెలుపుతున్నారు. గతం నుంచి ఇది ఏరోడ్ భూములు అయి ఉండటం, ప్లానులో 80 అడుగుల రహదారి అని ఉండటంతో పురపాలక అధికారులు దాన్ని మార్కింగ్ చేసి మండల తహసీల్దారుతో ఆయా నివాసాల వారికి నోటీసులు ఇచ్చే పనిలో ఉన్నారు. కచ్చితంగా రహదారి నిర్మిస్తామని అధికారులు తెలుపుతున్నారు. ఇక్కడ వారు అభివృద్ధికి సహకరిస్తారా.. అనేది ప్రశ్నార్థకంగా మారింది.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
తాడేపల్లిగూడెం : 99488 53114
తణుకు : 85558 50851
తణుకు గ్రామీణం: 63005 79402
అత్తిలి : 91548 46774

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: ? గణేష్‌చౌక్ సెంటరు వద్ద చెత్త పేరుకుపోయి రహదారిలోకి వస్తోంది. రాకపోకలకు ఇబ్బంది పడుతున్నాం. - సంతోశ్
✔ చెత్త తొలగించేలా సిబ్బందిని ఆదేశిస్తాం చేపడతాం. - సోమేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్
? మామిడితోటలో పురపాలక ట్యాంకరు నీరు చాలక స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. - సత్యనారాయణ
✔ నీరు సమృద్ధిగా అందేలా చర్యలు చేపడతాం. సకాలంలో ట్యాంకరును పంపిస్తాం. - ఎం.ఏసుబాబు, పురపాలక కమిషనర్
తణుకు: ? ఉండ్రాజవరం పంట కాలువలో తూడుపెరిగి నీటి ప్రవాహానికి ఆటంకంగా మారింది. -రైతులు
✔ చర్యలు తీసుకుంటాం. -మురళీ కృష్ణ, ఏఈ
? వేల్పూరులో కుక్కల బెడద ఎక్కువైంది. -స్థానికులు
✔ కుక్కల నియంత్రణకు ఉన్నతాధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటాం. -మూర్తి, డిప్యూటీ ఎంపీడీవో

శిరిడీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

ఇరగవరం, న్యూస్‌టుడే: రేలంగిలోని శిర్డీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవం సందర్భంగా సాయినాథుడికి ఆదివారం క్షీరాభిషేకం చేశారు. అష్టోత్తర పూజ నిర్వహించారు. ఈ నెల 26 వరకు సాయికి ప్రత్యేక పూజలు, నిత్యాభిషేకాలు, తులాభారాలు జరుగుతాయని ఆలయ అర్చకులు బాదంపూడి మురళీకృష్ణ శర్మ చెప్పారు. ఈ నెల 26న అన్న సమారాధన ఏర్పాటు చేసినట్లు శిర్డీసాయి సేవా కమిటీ సభ్యులు తెలిపారు.

వాసవి ఆలయానికి బంగారు ధనుస్సు

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: అయోధ్యలో ప్రతిష్ఠించబోయే స్వర్ణ ధనుస్సు, రాముల వారి పాదుకలు సోమవారం భక్తుల దర్శనార్థం వాసవి అమ్మవారి ఆలయానికి తీసుకురానున్నారు. సోమవారం సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు భక్తులు దర్శించుకోవచ్చని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

జువ్వలపాలెంలో వేంకన్న కల్యాణం

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: పట్టణంలోని జువ్వలపాలెంలో ఆదివారం ఉదయం వేంకటేశ్వర స్వామి కల్యాణం వైభవంగా జరిగింది. గ్రామ భక్తబృందం సభ్యులు బాలం శ్రీనివాసరావు, సిద్దాంతి రామకృష్ణ, సత్తి వెంకటేశ్వరరావు, తోట రామస్వామి, శెనగశెట్టి రామకృష్ణ, మాణిక్యాలరావు తదితరుల పర్యవేక్షణలో ఈ క్రతువు నిర్వహించారు. కల్యాణం అనంతరం హోమాలు, విగ్రహ ప్రతిష్ఠ, అన్నదాన కార్యక్రమాలు జరిగాయి. కల్యాణం వీక్షించడానికి పరిసర ప్రాంత ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆహ్లాదంగా ఆనంద ఆదివారం..

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: రాష్ట్రప్రభుత్వ ఆదేశాల ప్రకారం ప్రతి నెలా 2,4 ఆదివారాలు నిర్వహించే హ్యాపీ సండే కార్యక్రమంలో భాగంగా తాడేపల్లిగూడెం పురపాలక కమిషనర్ ఎం.ఏసుబాబు ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం ఎస్.వి.ఆర్.సర్కిల్‌లో ఉదయం యోగాభ్యాసం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిల్లలు, పెద్దలు, మున్సిపల్ ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు. యోగాభ్యాసంతో మానసిక ఒత్తిడిని తగ్గించుకోవచ్చని, రోజంతా ఉల్లాసంగా పనిచేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్‌తో పాటు పురపాలక అధికారులు జగదీష్, రవి సుధాకర్, సీతారాం, సోమేశ్వరరావు, పవన్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

యోగాభ్యాసం చేస్తున్న పట్టణ ప్రజలు, మున్సిపల్ సిబ్బంది

మల్లిపూడి అభినందనీయుడు: ఆరిమిల్లి

తణుకు, న్యూస్‌టుడే: పాన్, బీడీ వర్తక సంఘం వ్యవస్థాపకుడు మల్లిపూడి రామారావు సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. మల్లిపూడి రామారావు విగ్రహాన్ని ఆదివారం రాధాకృష్ణ ఆవిష్కరించి మాట్లాడారు. రామారావు జీవించి ఉండగానే ఆయన విగ్రహం ఏర్పాటు చేయడం హర్షణీయమని కొనియాడారు. కార్యక్రమంలో సంఘం సభ్యులతో పాటు కూటమి నాయకులు పాల్గొన్నారు.

రామారావును సత్కరిస్తున్న రాధాకృష్ణ

నేషనల్ పాస్టర్స్ ఫెలోషిప్‌నకు పురస్కారాలు

సోమాజిగూడ, న్యూస్‌టుడే: నేషనల్ పాస్టర్స్ ఫెలోషిప్ (ఎన్‌పీఎఫ్)నకు ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్, ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ పురస్కారాలు దక్కాయి. 2025 డిసెంబరు 15న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పశ్చిమ గోదావరి జిల్లా తణుకులో కొవ్వొత్తులతో రూపొందించిన అతి పెద్ద నక్షత్ర మానవ ఆకృతిని విజయవంతంగా ఏర్పాటు చేయడంతో ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్, ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ దాన్ని పరిగణనలోకి తీసుకున్నాయి. ఆ సంస్థలు ఆదివారం హైదరాబాద్‌లోని లోక్ భవన్‌లో తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా ఎన్‌పీఎఫ్ వ్యవస్థాపకుడు, ఛైర్మన్ రెవరెండ్ బిషప్ డా.మ్యాథ్యూ మేఘర్ వీటిని అందుకున్నారు.

గవర్నర్ నుంచి అవార్డు అందుకుంటున్న మ్యాథ్యూ

మీరా సేవలు మరువలేనివి

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: తెదేపా సీనియర్ నేత 14వ వార్డు కమిటీ సభ్యుడు షేక్‌మీరా సేవలు మరువలేనివని తెదేపా రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి గొర్రెల శ్రీధర్ అన్నారు. ఆదివారం మీరా హఠాన్మరణం చెందగా ఆయన పాడె మోసి అంతిమ సంస్కారాల్లో పాల్గొన్నారు.

విద్యార్థినులకు పరీక్ష సామగ్రి వితరణ

తణుకు, న్యూస్‌టుడే: మానవత సంస్థ ఆధ్వర్యంలో దాత మన్నే హేమ ప్రియ ఆర్థికసాయంతో ప్రభుత్వ వసతి గృహంలో 45 విద్యార్థినులకు పరీక్షా సామగ్రి అందించారు. వి.ఆశా జ్యోతి పెన్నులు, నీళ్ల డబ్బాలు పంపిణీ చేశారు.

కవి ప్రసాద్‌కు సత్కారం

తణుకు, న్యూస్‌టుడే: ప్రపంచ తెలుగు కవుల మహా సభల్లో తణుకు పట్టణానికి చెందిన వి.ఎస్.వి.ప్రసాద్‌కు సత్కారం లభించింది. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటనలో విడుదల చేశారు. శనివారం విజయవాడలోని తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో నిర్వహించి ప్రపంచ తెలుగు కవుల మహా సభలలో పొట్లూరి హరికృష్ణ, నారం సెట్టి ఉమామహేశ్వరరావు, అనంతలక్ష్మీ మధు చేతుల మీదుగా జ్ఞాపిక అందుకున్నారన్నారు.

హిందువుల మనోభావాలు దెబ్బతీస్తున్న వైకాపా: శ్రీనివాస్

నెల్లూరు (మార్కెట్ సెంటర్), న్యూస్‌టుడే: హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా వైకాపా వ్యవహరిస్తోందని ప్రభుత్వ విప్, తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ఆరోపించారు. ఆదివారం శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు నగరంలోని మాగుంట లేఅవుట్‌లో జనసేన పార్టీ నగర అధ్యక్షుడు దుగ్గిశెట్టి సుజయ్ బాబు ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వైకాపా నాయకులు భగవంతుడ్ని కూడా రాజకీయాల్లోకి లాగుతున్నారని మండిపడ్డారు. శాసనమండలిలో వెంకటేశ్వరస్వామి చిత్రాలను ప్రదర్శించడం హేయమైన చర్యగా వర్ణించారు. వారు తప్పు చేసి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ క్షమాపణ చెప్పాలనడం ఏమిటని ప్రశ్నించారు. సుజయ్‌బాబు తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో జనసేన నాయకులు పలువురు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొలిశెట్టి

టైలర్ల ఆత్మీయ సమావేశం

సాలిపేట(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: పట్టణంలోని సాలిపేటలో ఏపీ టైలర్స్ ఫెడరేషన్ అభివృద్ధి సహకార ఛైర్మన్ ఆకాశపు స్వామి ఆధ్వర్యంలో ఆయన నివాసం వద్ద ఆదివారం టైలర్స్ ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. దర్జీల సంక్షేమానికి పాటు పడిన ఆకాశపు అప్పల నరసింహమూర్తి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం స్వామి మాట్లాడుతూ ఫెడరేషన్ ఏర్పాటుపై కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూనే ఆదరణ 3.0 పథకంలో భాగంగా ప్రత్యేక కార్యాలయం కేటాయించాలని కోరారు. కార్మికుల గుర్తింపు కోసం సమష్టిగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దర్జీ సంఘ నాయకులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అప్పలస్వామి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దర్జీలు

ప్రమాదకర ప్రయాణం..

పెంటపాడు మండలంలోని యానాలపల్లి నుంచి వ్యాను మహిళలతో ఇలా ప్రమాదకరంగా ప్రయాణిస్తోంది. కొందరు మహిళలు ఓ శుభ కార్యానికి ఉండి మండలం పాలంపాడు నుంచి తాడేపల్లిగూడెం జువ్వలపాలెం గ్రామానికి వెళ్తున్నారు. మహిళలతో పాటు చిన్నారులు కూడా వ్యాన్ అంచున కూర్చున్నారు. ఎటువైపు నుంచి ఏ ప్రమాదం సంభవిస్తుందో తెలియదు. రోజూ పెంటపాడు నుంచి పదుల సంఖ్యలో ఇలాంటి వ్యాన్‌ల రాకపోకలు సాగించడం అలవాటుగా మారుతోంది. - న్యూస్‌టుడే, యానాలపల్లి (తాడేపల్లిగూడెం వన్‌టౌన్)

కాలువలున్నది చెత్తకోసమా?

ఇరగవరం, న్యూస్‌టుడే: రేలంగి గ్రామంలోని ప్రధాన డ్రెయిన్ మురుగంతా శివారు ప్రాంతంగా ఉన్న అంతర్వారి పాలెం సమీపంలో ప్రవహిస్తున్న రేలంగి పంట కాలువలో కలుస్తోంది. ఎప్పటికప్పుడు డ్రెయిన్ శుభ్రం చేయకపోవడంతో మురుగు నీటితో పాటు ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు, ఇతర చెత్త చెదారాలన్నీ పేరుకుపోయాయి. దీంతో దుర్వాసన, దోమలతో ఇబ్బంది పడుతున్నామని స్థానికులు చెబుతున్నారు. అత్తిలి మండలం పాలి, మంచిలి తదితర దిగువ ప్రాంతాలకు ఈ కాలువ నీరే సాగునీరు, తాగునీరుగా ఉపయోగపడుతోంది. డ్రెయిన్ శుభ్రం చేయడంతోపాటు, కాలువలోకి మురుగు చేరకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మొరాయించి.. మూలకు చేరి

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: స్త్రీలకు ఉచిత బస్సు పథకం ప్రవేశపెట్టిన ప్రభుత్వం అందుకు తగిన బస్సులు ఏర్పాటు చేయలేదు. దీంతో డొక్కు బస్సుల్నే ప్రయాణం సాగించాల్సి వస్తోంది. తాడేపల్లిగూడెం డిపోకి చెందిన తాడేపల్లిగూడెం- ఆచంట బస్సు అత్తిలిలో మొరాయించడంతో బస్టాండులో మూలకు చేర్చారు. దీంతో బస్సులు తగిన సమయానికి రాక ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. గత కొన్ని రోజులుగా ఇదే పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE (SENIOR DIVISION) TANUKU
E.P. 17/2025 in O.S. 1/2025
Between:
Meesala Yesupadam ... DHR
AND
Nadapana Venkateswari & Others ... JDR's
వేలం ప్రకటన
పై నెంబరు అమలు E.P. పిటిషన్‌లో డిక్రీ + వడ్డీ మరియు ఖర్చులు రాబట్టు నిమిత్తం పై జడ్జిమెంట్ డెటారు యొక్క ఈ క్రింది షెడ్యూల్ ఆస్తిని తేది 09-03-2026న వేలం వేయుటకు మహారాజశ్రీ కోర్టు వారు ఉత్తర్వులు జారీచేసియున్నారు. కావున వేలం తేది 09-03-2026 ఉదయం గం. 10.30 ని॥ల నుండి సా. 5.00 గం.ల మధ్య సమయంలో వేలం వేయుదురు. సదరు వేలంపాటలో పాల్గొనదలచిన, ఆసక్తిగలవారు పై తేదీన, పై తెలిపిన శ్రీ కోర్టువారి ఎదుట హాజరై వేలం షరతులకు లోబడి పాడుకొనవచ్చునని ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడమైనది.
SCHEDULE: West Godavari District, Bhimavaram Sub-registrar, Tanuku Sub Division / Tanuku Maldal, Tanuku Municipal area, Tanuku Town in R.S.No. 262/9 in Ac. Total 0.44 cents or 2129 Sq. yards under D.No. 2-2-15/1, assessment number 1081011100 in eastern side 260 Sq. yards is bounded by.
East : Land of Komaravaram Road
West : Land of the Nadapana Srinivasa Rao
North : Land of Nadapana Srinivasa Rao
South : Land of Devani Pallaparao and others
DHR Value: 35,00,000/- Amin Value: 6,10,615/- /
Total Extent Value: Rs. 50,00,000/-
JDR Value not furnished
(By order of the Hon'ble court)
Sd/- **M.B.Avinash,** Advocate
Tadepalligudem, Cell: 78936 74560

సంచార శకటంతో ఇంటింటికీ వైద్యం

తణుకు, న్యూస్‌టుడే: సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిషా ఫౌండేషన్ సంయుక్తంగా ఆదివారం సంచార శకటం ద్వారా ఇంటింటికీ వైద్యం కార్యక్రమం నిర్వహించారు. ప్రముఖ నేత్ర వైద్యులు హుస్సేన్ అహ్మద్, ఎముకల వైద్య నిపుణులు ఎం.రాజేందర్ తణుకు పట్టణంలోని వివిధ ప్రాంతాలు పర్యటించి మంచానికే పరిమితమైన వృద్ధులకు ఉచిత వైద్య సేవలు అందించారు. కాకరపర్తి అనంత వీరవెంకట సత్యవతి ఆర్థిక సహాయంతో ఉచితంగా మందులు అందజేశారు. ఈ ఉచిత వైద్య సేవలు కావాల్సిన వారు సెల్: 998 534 3530, 905 929 0717 నంబర్లను సంప్రదించాలని కోరారు.

రోగిని పరీక్షిస్తున్న వైద్యుడు

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని బల్లిపాడు జనసేన అధ్యక్షుడు ఆకుల రామచంద్రరావు ఆర్థిక సహకారంతో తణుకు భాగ్యశ్రీ, సితార ఆసుపత్రుల సంయుక్త ఆధ్వర్యంలో గ్రామ ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మధుమేహం, రక్తపోటు, గుండెకు సంబంధించిన ఈసీజీ పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు అందజేశారు.

కడకట్ల(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: పట్టణంలోని కడకట్ల జనతా ఆసుపత్రిలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని తాడేపల్లిగూడెం లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు గరికపాటి బాపయ్య శర్మ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ శిబిరంలో 120 మందికి పరీక్షలు నిర్వహించారు. 23 మందికి శస్త్ర చికిత్సలకు సిఫార్సు చేయగా అవసరమైన వారికి ఉచిత కళ్లజోళ్లు, మందులు అందించారు.

ఆర్థికంగా ఆధారం.. హార్దికంగా సహకారం

తణుకు, న్యూస్‌టుడే

మెప్మాతో మహిళలకు చేయూత

ఒకప్పుడు ఇంటి పనులకే పరిమితమైన చేతులు.. నేడు యంత్రాలను నడుపుతున్నాయి. .నేను ఎదిగితే చాలు అనే భావన నుంచి కలిసి ఎదగాలి అనే సంకల్పంతో మరికొంత మందికి ఉపాధి కల్పిస్తున్నారు పలువురు మహిళలు. ఆర్థిక స్వావలంబనతో పాటు వారి కాళ్లపై వారు నిలబడుతున్న తీరు పలువురికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ద్వారా పట్టణాల్లో మహిళలకు ప్రభుత్వం వివిధ రకాల రుణ సదుపాయాలు అందిస్తూ వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దుతోంది.

25మందికి ఉపాధి కల్పిస్తూ.. నేను 20 ఏళ్లుగా మెప్మాలో సాయి మహిళా పొదుపు సంఘం సభ్యురాలిని. తొమ్మిదేళ్ల క్రితం రూ.లక్ష రుణం తీసుకుని విస్తరాకులతో ప్లేట్ల తయారీ సంస్థ పరిశ్రమ ప్రారంభించా. ఈ తొమ్మిదేళ్లలో మెప్మాలో వివిధ రకాలు రుణాలు తీసుకుంటూ ప్లేట్లతో పాటు కప్స్ ఇలా నాలుగు రకాల ఉత్పత్తులను తయారు చేస్తున్నా. మొదట్లో నేను, నా భర్త, అత్తగారుతో ప్రారంభించా. ప్రస్తుతం 25 మందికి ఉపాధి కల్పిస్తున్నా. జిల్లాలో ప్రేరణ సఖి పథకంలో నన్ను ఎంపిక చేశారు. దీని వల్ల ప్రభుత్వం నుంచి రూ.50వేలు ప్రోత్సాహం అందించనున్నారు. - **శీలం వరలక్ష్మి, టి.వేమవరం**

మరింత విస్తరిస్తాం.. నేను కీర్తన మహిళ పొదుపు సంఘంలో సభ్యురాలిని. ఐదేళ్ల క్రితం భర్తతో కలిసి రూ.25వేల పెట్టుబడితో రెడీమేడ్ రాగి చపాతి, చిట్టి పరోట, చిట్టి పూరి అమ్మకాలు ప్రారంభించాం. మొదట్లో వ్యాపారం అంతంతమాత్రంగా ఉండేది. ప్రస్తుతం తణుకు పరిసర ప్రాంతాల్లో 50 ఊర్లు, 40 దుకాణాలకు సరఫరా చేస్తూ రోజుకు పదివేల వరకు సరకు అమ్మకాలు చేస్తున్నాం. అదనంగా మరో వ్యక్తిని పెట్టుకుని విక్రయాలు సాగిస్తున్నాం. మెప్మా ద్వారా మరికొంత రుణం తీసుకుని వ్యాపారాన్ని విస్తరించేందుకు ప్రయత్నిస్తున్నాం. -**ప్రగడ లక్ష్మీ దుర్గ, తణుకు**

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
E.P.No. 05/2026 in O.S.No. 403/2025
బిట్వీన్:
బొక్కా శాంతి స్వర్ణ ... DHR
మరియు
మల్లేశ్వరపు దుర్గాప్రసాద్ ... JDR
వేలం ప్రకటన
పై నంబరు E.P.No. 5/2026 తాలూకా DHR కు JDR నుండి రావలసిన డిక్రీ బాకీ వసూలు నిమిత్తం JDR కు చెందిన ఈ దిగువ షెడ్యూలు స్థిరాస్తిని పై కోర్టువారి ఎదుట ది. 10-03-2026 తేదీ ఉదయం 10.30 ని॥ లగాయితూ వేలం వేయబడును. కావున ఆసక్తికలవారు వేలంపాటలో పాల్గొని పాడుకొనవచ్చును.
షెడ్యూలు: పశ్చిమగోదావరి జిల్లా, భీమవరం జిల్లా రిజిస్ట్రారు పరిధిలో చేరిన, పెంటపాడు సబ్ డివిజన్‌కు చెందిన పెంటపాడు మండలంలోని బి.కొండేపాడు గ్రామ పంచాయతీ తాలూకా R.S.No. 137/7లో Ac. 0.42 సెంట్లు, R.S.No. 137/8లో Ac. 0.20 సెంట్లు, R.S.No. 137/9లో Ac. 0.08 సెంట్లు వెరశి మూడు నెంబర్ల తాలూకా ఏకప్రతిగా గల Ac. 0.70 సెంట్లలో గల Ac. 0.03 సెంట్లు స్థలములో D.No. 3-21/3, Assessment No. 663తో గల దక్షిణం వైపు Ac. 0.01 1/2 సెంట్లు లేక 72.6 చ॥గ॥ స్థలము అందులోగల RCC బిల్డింగునకు హద్దులు.
తూర్పు: రెండు గజముల వెడల్పు గల దారి మార్గము, **దక్షిణం:** పంచాయతీ సిమెంటు రోడ్డు, **పడమర:** పిల్లి శ్రీను గారి స్థలము, **ఉత్తరం:** మల్లేశ్వరపు నర్సయ్య గారి రేకుల షెడ్డు.
DHR విలువ: Rs. 5,00,000/- Amin విలువ: Rs. 4,50,000/-
తాడేపల్లిగూడెం సం/- **V.లక్ష్మీనారాయణ**
ది. 21-02-2026 DHR తరపు న్యాయవాది

పారిశుద్ధ్యం కరవు.. దోమల దరువు

25వ వార్డు నివేదన

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: పురపాలక సంఘం అధికారులు పారిశుద్ధ్యాన్ని గాలికి వదిలేయడంతో నిత్యం దోమలు, పందులతో ఇక్కట్లు తప్పడం లేదు. 25వ వార్డు ప్రజల బాధ మరింత దయనీయంగా ఉంది. గతుకుల రోడ్లు, కలుషిత నీరు, వీధి దీపాలు తదితర సమస్యలతో నరకం అనుభవిస్తున్నారు.

ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. ఈ వార్డుకు సరిహద్దులో పంటపొలాలు ఉండటంతో దోమలు విపరీతంగా ఉన్నాయి. వార్డులో మురుగు ఎక్కువగా ఉన్న ప్రాంతాలను పరిశీలించి పైపులైన్లు మురుగు నీటిలో లేకుండా చర్యలు తీసుకుంటామని శానిటరీ ఇన్‌స్పెక్టర్ సోమేశ్వరరావు తెలిపారు.

ప్రాంతాలు: చుక్కావారి వీధి, పాత లైబ్రరీ వీధి, కాకరపర్తి వారి వీధి, పుంతరోడ్డు, సర్వీసు రోడ్డు

పాత లైబ్రరీ వీధిలో మురుగు నీటిలో ఉన్న మంచినీటి పైపులు

ప్రధాన సమస్యలు: దోమల బెడద
- కుక్కల సంచారం ఎక్కువగా ఉందని రాత్రి సమయాల్లో ఇంటికి వస్తున్నప్పుడు భయంగా ఉంటోందని అంటున్నారు.
- మురుగు సక్రమంగా పారడం లేదు.
- 24, 25 వార్డుల్లో ఫాగింగ్ చేపట్టడం లేదు.
- సర్వీసు రోడ్డు గతుకులుగా ఉంది.
- పుంతరోడ్డును బాగు చేయాలి.

ప్రతి ఒక్కరికీ సేవా దృక్పథం అవసరం

సుబ్బారావుపేట(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ సేవా దృక్పథంతో ఉండాలని తాడేపల్లిగూడెం జిల్లా పరిషత్ ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు రవికుమార్ సూచించారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 100వ ప్రపంచ థింకింగ్ దినోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. చిత్రలేఖనం, వ్యాసరచనల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

తెలుగు బుక్ ఆఫ్ రికార్డులో భీమవరం చిన్నారులు

భీమవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: సిరి మువ్వల సందడి సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం గుడివాడ ఐఎంఏ భవనంలో 108 మంది విద్యార్థులతో నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శనలో తెలుగు బుక్ ఆఫ్ రికార్డు సాధించారు. భీమవరానికి చెందిన తాండవ నృత్య నికేతన్ విద్యార్థులు 12 మంది పాల్గొని జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందుకున్నట్లు నృత్య గురువు ఎస్‌టీపీ లక్ష్మీస్వరూప తెలిపారు.

వివాదాస్పదంగా మారిన ఆలయంలో విగ్రహం తొలగింపు

కొండయ్య చెరువు(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: పట్టణంలోని కొండయ్య చెరువు వద్ద 30 వార్డు విఘ్నేశ్వర ఉత్సవ కమిటీ ప్రభుత్వ భూమిలో ఆలయ నిర్మాణం చేపట్టింది. స్థానికుడు తానేటి అజయ్ తొలుత ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. పురపాలక అధికారులు ప్రభుత్వ భూమిలో ఎటువంటి కట్టడాలు కట్టకూడదని కమిటీకి తెలిపారు. అనంతరం అజయ్ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. దీంతో హైకోర్టు నుంచి కలెక్టర్ నాగరాణికి ఆదేశాలు వచ్చాయి. అది తెలుసుకున్న ఉత్సవ కమిటీ రాత్రికి రాత్రే విఘ్నేశ్వరుడి విగ్రహం ఆలయంలో ఏర్పాటు చేశారు. విషయం తెలుసుకున్న పురపాలక కమిషనర్ ఎం.ఏసుబాబు సిబ్బంది, పట్టణ ఎస్సై బాదం శ్రీనివాస్‌లతో కలిసి వెళ్లి విగ్రహాన్ని తొలగించారు. స్థానికులు వాగ్వాదానికి దిగగా వారికి సర్ది చెప్పారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రణాళిక అధికారి జగదీశ్, డివిజనల్ సర్వేయర్ రామకృష్ణ, పోలీసు, పురపాలక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి నివాళి

పెంటపాడు(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: భారత తొలి స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి అని వక్తలు కొనియాడారు. ఆయన వర్ధంతిని రెడ్డి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో పెంటపాడు మండలం పెంటపాడులో ఆదివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.

శ్రద్ధాంజలి

ఆప్యాయతానురాగాలకు, మంచికి, మానవత్వానికి, మారు పేరుగా నిలిచి, మా అందరి హృదయాలలో చెరగని ముద్రవేసిన శ్రీ డా॥ AVRS తాతారావు గారి ఆకస్మిక మరణమునకు చింతిస్తూ.. వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ.. కుటుంబ సభ్యులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము.
కీ॥శే॥ డా॥ AVRS తాతారావు గారు
మరణం: 11-02-2026
CSRMO జిల్లా ఆసుపత్రి, తణుకు
మెడికల్ సూపరింటెండెంట్ వైద్యులు మరియు సిబ్బంది
జిల్లా ఆసుపత్రి - తణుకు

(c) eenadu

పెద్దమ్మ ఉత్సవం.. బోనమెత్తిన భాగ్యం

జమ్మలమడుగులో పెద్దమ్మ దేవర ఆదివారం వైభవంగా ప్రారంభమైంది. స్థానిక ముద్దనూరు రోడ్డులోని రాజరాజేశ్వరి ఆలయం నుంచి మహిళలు 1200 కలశాలతో గ్రామోత్సవం నిర్వహించారు. పాత బస్టాండ్ మీదుగా మెయిన్ రోడ్డులోని పెద్దమ్మ విగ్రహం వరకు కొనసాగింది. కలశాల ఊరేగింపులో ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, తెదేపా కడప పార్లమెంట్ అధ్యక్షుడు భూపేష్‌రెడ్డి పాల్గొని సంఘీభావం తెలిపారు. - న్యూస్‌టుడే, జమ్మలమడుగు

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: కడప కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరనాయుడు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని సభాభవనంలో 10.30 గంటలకు మొదలయ్యే పీజీఆర్‌ఎస్‌లో అర్జీలు సమర్పించి తమ సమస్యలు పరిష్కరించుకోవచ్చన్నారు. కడప నగరంతో పాటు అన్ని మున్సిపాలిటీలు, మండల కేంద్రాల్లో కూడా ఇదే కార్యక్రమం ఉంటుందన్నారు. అక్కడ కూడా ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావచ్చన్నారు.

బస్టాండ్లలో బాదేస్తున్నారు బాబోయ్!

ఇటీవల మేజిస్ట్రేట్ ఒకరు వేరే ఊరు వెళ్లేందుకు బస్టాండ్‌కు వచ్చారు. అక్కడి దుకాణంలో ఓ వస్తువు కొనుగోలు చేశారు. దుకాణదారు అధికంగా వసూలు చేశాడు. అదేమని అడిగితే బస్టాండ్లలో అంతేనంటూ నిర్లక్ష్య సమాధానమిచ్చాడు. ఈ విషయాన్ని సదరు మేజిస్ట్రేట్ ఫిర్యాదు పుస్తకంలో నమోదు చేయడంతో దుకాణాన్ని అధికారులు జప్తు చేశారు. ఆర్టీసీ బస్టాండ్లలో ధరల దోపిడీకి ఇదో నిదర్శనం. జిల్లా వ్యాప్తంగా ఏడు డిపోలున్నాయి. వీటి పరిధిలో 620 బస్సులున్నాయి. ఇవి రోజూ 3.26 లక్షల కిలో మీటర్లు నడుస్తున్నాయి. 2.25 లక్షల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరుస్తున్నాయి. ఈ క్రమంలో కీలకమైన బస్టాండ్లలో కొందరు వ్యాపారులు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. సామాన్య ప్రయాణికులను నిత్యం నిలువునా బాదేస్తున్నారు. ఫిర్యాదు చేస్తున్నా చర్యలు మాత్రం తీసుకోవడం లేదు.

ఆర్టీసీ బస్టాండులోని దుకాణాలు

ఇష్టారీతిన ధరలు నిర్ణయించి అమ్మకాలు

కడపలో వాళ్లెంత చెబితే అంత

కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రమైన కడప ఆర్టీసీ బస్టాండ్‌లోని పలు దుకాణాల్లో నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. తాగునీటి సీసాలు మొదలు తినుబండారాల వరకు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ప్రతి ఒక్కవస్తువుపై రూ.5 రూ.10 వరకు అధికంగా వసూలు చేస్తున్నారు. పండగలు, జాతరలు వస్తే అ'ధన'ంగా మరింత బాదేస్తున్నారు. ● కడప బస్టాండ్ నుంచి రోజూ 10 నుంచి 15 వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. అర్ధరాత్రి వేళల్లో ఇతర రాష్ట్రాల నుంచీ బస్సులు వస్తుంటాయి. ఆ సమయంలో బయట ఎలాంటి హోటళ్లు, దుకాణాలుండవు. ఇదే అదనుగా భావించి ప్రయాణికులను మరింత దోచేస్తున్నారు.

బద్వేలులో కొనబోతేనే బెంబేలు

బద్వేలు: బద్వేలు ఆర్టీసీ బస్టాండ్ నుంచి నిత్యం పది వేల మంది వరకు ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. ఉమ్మడి రాష్ట్రాలకు చెందిన బస్సులే కాకుండా కర్ణాటకవీ ఇటుగా నిత్యం వెళ్తుంటాయి. తెల్లవారుజాము నాలుగు గంటల నుంచి రాత్రి పది గంటల వరకు ప్రయాణికులతో కిక్కిరిసి ఉంటుంది. బస్టాండ్ చుట్టూ హోటళ్లు, అల్పాహార, టీ అంగళ్లు అనేకం వెలిశాయి. వీటిలో కొందరు తినుబండారాలను ఇష్టారీతిన విక్రయిస్తున్నారు. బస్సులు అటూ ఇటూ వచ్చే ధాటికి దుమ్ము ఎగిసి పడుతున్నా పట్టించుకోవడం లేదు. బస్టాండ్‌లోని సెప్టిక్ ట్యాంక్ తరచూ నిండి నీరు బయటికి పారుతోంది. దుర్వాసన రావడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయాన్ని ఆర్టీసీ డీఎం చైతన్య నిరంజన్‌తో 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా. . పరిశీలించి తినుబండారాలపై దుమ్ము, ఈగలు వాలకుండా చర్యలు చేపడతామన్నారు.

మైదుకూరులో మాయాజాలం

మైదుకూరు: ఉమ్మడి రాష్ట్రాల నుంచి మైదుకూరు బస్టాండ్‌కు రోజుకు 644 బస్సులు వస్తుంటాయి. బస్టాండ్ మీదుగా సుమారు 30 వేల మంది వరకు ప్రయాణిస్తారని అంచనా. ఇంతటి కీలకమైన బస్టాండ్‌లో కొందరు వ్యాపారులు మాయాజాలం ప్రదర్శిస్తున్నారు. ఇక్కడ పేరుకు వస్తువుల ధరలను ఒకలా ప్రదర్శిస్తారు. వాస్తవంలో మరో ధరకు విక్రయిస్తుంటారు. నీటిసీసా ధర రూ.18 అయితే రూ.25కు అమ్ముతున్నారు. బిస్కెట్ ప్యాకెట్ ధర రూ.9 అయితే రూ.15తో విక్రయిస్తున్నారు.

ద్విచక్ర వాహనాల స్టాండ్‌లో రెండు రకాలుగా ఉన్న ధర

పులివెందులలో ఇచ్చినవే తాగాలి

పులివెందుల: పులివెందుల ఆర్టీసీ బస్టాండ్ ద్వారా రోజూ సుమారు రెండు వేల మంది వరకు రాకపోకలు సాగిస్తుంటారు. ఇక్కడి దుకాణాల్లో ఏం కొనాలన్నా ఎమ్మార్పీ కంటే అధికంగా చెల్లించాల్సిందే. స్థానికంగా తయారైన(ఐఎస్‌ఐ మార్కు లేని) నీటి సీసాలను విక్రయిస్తున్నారు. తినుబండారాలపై రూ.5 నుంచి రూ. 10 వరకు వసూలు చేస్తున్నారు. ● మరుగుదొడ్ల నిర్వహణ నామమాత్రంగానే ఉంది. మూత్ర విసర్జనకు ఉచితమని బోర్డు పెట్టినప్పటికీ రూ. 2 వసూలు చేస్తున్నారు. అదేమని అడిగితే నిర్వహణ కోసమని బుకాయిస్తున్నారు.

రాజంపేటలో అందాల నిధి

రాజంపేట పట్టణంలో సినీ కథానాయిక నిధి అగర్వాల్ సందడి చేశారు. ఓ షాపింగ్ మాల్ ప్రారంభానికి ఆదివారం వచ్చిన ఆమెను చూసేందుకు పెద్దసంఖ్యలో అభిమానులు తరలి వచ్చారు. అక్కడ ఏర్పాటు చేసిన వేదికపై కొద్ది సేపు నృత్యం చేసి ఆహూతులను అలరించారు. ఫొటోలు దిగేందుకు ఉత్సాహం కనబరిచారు. ఈ సందర్భంగా నిధి అగర్వాల్ మాట్లాడుతూ రాజంపేటకు రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. - న్యూస్‌టుడే, రాజంపేట

బినామీల పేరుతో బొక్కుడు

రూ.కోట్ల స్థలం వివాదం

సిద్దవటం, న్యూస్‌టుడే: కడప-చెన్నై జాతీయ రహదారి సిద్దవటం మండలం పెద్దపల్లె రెవెన్యూ గ్రామ పరిధిలోని ప్రభుత్వ, డీకేటీ భూములు అన్యాక్రాంతమవుతున్నాయి. కొందరు అక్రమార్కులు ఖాళీ స్థలాలు కనిపిస్తే చాలు యంత్రాలతో చదును చేసి కాజేసే ప్రయత్నాలు సాగిస్తున్నారు. రాజకీయ నేతల బినామీల పేరిట కబ్జాల పరంపర సాగిస్తున్నట్లు ఆరోపణలు తీవ్రస్థాయిలో వినిపిస్తున్నాయి.

ఉప్పరపల్లెలో ఖాళీ స్థలం

ఇదీ విషయం!

సోమశిల జలాశయం వెనుక జలాలతో [illegible] ఒంటిమిట్ట మండలానికి చెందిన కొందరు నిర్వాసితులకు నాలుగు దశాబ్దాల కిందట సిద్దవటం మండలం ఉప్పరపల్లెలోని సర్వే సంఖ్య 936/ఏలో పునరావాసంగా నివాసాలు నిర్మించుకున్నారు. నివాసాల పక్కన మరికొంత స్థలాన్ని తమ ఖాళీగా ఉంచుకున్నట్లు బాధితులు చెబుతున్నారు. ఈ స్థలాలు ఏళ్ల తరబడి ఖాళీగా కనిపించడంతో కొందరు నేతల కళ్లు దానిపై పడ్డాయి.

యంత్రాలతో చదును పనులు

ఒంటిమిట్ట మండలానికి చెందిన నాయకులు వీరి తరఫున కొందరు బినామీలను రంగంలోకి దింపారు. ఈ స్థలానికి తమకు పట్టాలు ఉన్నాయంటూ జేసీబీ యంత్రంతో చదును చేయించారు. అక్కడే ఉన్న చిన్నపాటి గుడిని ధ్వంసం చేసి చదును చేశారని స్థానికులు చెబుతున్నారు. సమీపంలో ఖాళీగా ఉన్న 28 సెంట్ల స్థలంలో సుమారు 20 సెంట్ల రూ.కోట్ల విలువైన స్థలాన్ని ఆక్రమించి యంత్రంతో పునాదులు తీయించారు. సోమశిల నిర్వాసితులు పనులను అడ్డుకుని వాగ్వాదానికి దిగారు. తమ వద్ద అన్ని ఆధారాలున్నాయంటూ మరో వర్గం బుకాయిస్తూ పనులు కొనసాగిస్తున్నారు. ఈ కబ్జా వ్యవహారంలో ఒంటిమిట్టకు చెందిన ఓ కీలక నేత హస్తం ఉన్నట్లు నిర్వాసితులు ఆరోపిస్తున్నారు.

● ఈ విషయమై తహసీల్దారు తిరుమలబాబు మాట్లాడుతూ.. ఉప్పరపల్లెలో రెండు వర్గాల మధ్య నెలకొన్న స్థల వివాదంపై విచారిస్తున్నామన్నారు. ఇటీవల కొందరు సదరు స్థలంలో పునాదుల పనులు చేస్తుండగా అడ్డుకుని నిలిపేశామని.. ఆ స్థలానికి ఎవరికి హక్కులు ఉన్నాయో నిర్ధారించుకుని వారి వద్ద ఉండే డీ పారాలు రెవెన్యూ కార్యాలయానికి తీసుకురావాలని ఆదేశించామన్నారు. విచారించి అర్హులకు న్యాయం చేస్తామన్నారు.

అరణ్యంలో అందాల అతిథులు

చిటవ

లంకమల, పెనుశిల అభయారణ్యంలో దేశీయ విహంగాలు సందడి చేస్తున్నాయి. ఎన్నో రకాల పక్షులు ఇక్కడి వనంలో ఉన్నాయి. సంతానోత్పత్తి చేసుకుని తిరిగి స్వస్థలాలకు వెళ్తుంటాయి. కిలకిలారావాలతో ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. ప్రధానంగా చిటవ, యనప్ప చిలువ, ఎర చిలువ, బూడిద రంగు కంజు, అడవి పాద ఎలిసే వంటి పక్షులు అందంతో పాటు ఆకర్షణీయంగా ఉంటాయని విశ్రాంత అటవీ క్షేత్రాధికారి మహ్మద్ హయాత్ తెలిపారు. - న్యూస్‌టుడే, ఒంటిమిట్ట

బూడిద రంగు కంజు

అడవి పాద ఎలిసే

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ సోమవారం (సా)	సహర్ మంగళవారం (ఉ)
కడప	6.27	5.20
ప్రొద్దుటూరు	6.28	5.24

నిత్యాన్నదానానికి ఇదిగో.. అదిగో

సాగుతున్న వాయిదాల పర్వం

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: ఒంటిమిట్ట కోదండ రామాలయం దర్శనానికి వచ్చే భక్తులకు నిత్యాన్నదానం పూర్తి స్థాయిలో ఇంకా అందుబాటులోకి రాలేదు. గతేడాది జరిగిన శ్రీరామనవమి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా జరిగిన సీతారాముల కల్యాణోత్సవానికి హాజరైన సీఎం చంద్రబాబు మూడు పూటల భక్తులకు భోజన వసతి కల్పించాలని తితిదే ఉన్నతాధికారులను ఆదేశించినా నేటికీ ప్రారంభం నోచుకోలేదు.

సాగదీస్తున్నారు..

రామయ్య క్షేత్రానికి సమీపంలో నామం వనం పక్కనే తాత్కాలిక ఏర్పాట్లు చేయాలని అధికారులు నిర్ణయించారు. కేంద్ర పురావస్తు శాఖ నుంచి అనుమతులు రావడంలో జాప్యం జరిగింది. కాస్త ఆలస్యంగా పచ్చజెండా ఊపినా సదుపాయాలు కల్పించే పనులు ఇప్పటికీ సాగుతూనే ఉన్నాయి. గతేడాదిలో విజయదశమి రోజున నిత్యాన్నదానం అమలులోకి తెస్తామని అనుమతులు వచ్చినా అమలులోకి రాలేదు. ఈ ఏడాది ప్రారంభంలో నిత్యాన్నదానం సేవలకు శ్రీకారం చుట్టాలని యత్నించినా కుదరలేదు. మాఘ మాసంలో వినియోగంలోకి తీసుకొస్తామని చెప్పినా.. వాయిదాల పర్వం ఇంకెన్నాళ్లు అని పర్యాటకులు ప్రశ్నిస్తున్నారు.

ఒంటిమిట్టలో సాగుతున్న పనులు

బ్రహ్మోత్సవాలకైనా అమలయ్యేనా..

నిత్యాన్నదాన విషయమై తితిదే పాలకమండలి సమావేశంలోనూ చర్చించి ఆమోదముద్ర వేశారు. ఇందుకోసం రూ.నాలుగు కోట్లకు పైగా నిధులివ్వడానికి ముందుకొచ్చారు. తాత్కాలికంగా జర్మన్ షెడ్ ఏర్పాటు చేసి భక్తుల రాకపోకలకు అనువుగా ర్యాంపులు, బారికేడ్లు ఏర్పాటు చేయాలి. వంటశాల నుంచి భోజనం, కూరలను తీసుకురావడానికి సిమెంటు బాటలు ఇంకా నిర్మించలేదు. ఒకేసారి 150-200 మంది భక్తులు భోజనం చేసేలా అవకాశమున్నా బల్లలు ఏర్పాటు చేయలేదు. వంట చేసేందుకు అవసరమైన యంత్ర సామగ్రి మాత్రమే ఏర్పాటు చేస్తున్నారు. సీఎం ఆదేశించి 10 నెలలు గడిచినా ఇంతవరకు అమలుకు నోచుకోకపోవడంతో విమర్శలు వినిపిస్తున్నాయి. వచ్చే నెల మార్చి 26న శ్రీరామనవమి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. భారీ సంఖ్యలో సందర్శకులు తరలి రానున్నారు. అప్పటికైనా అందుబాటులోకి తీసుకు రావాలని భక్తులు, యాత్రికులు కోరుతున్నారు.

బావితరాలకు చారిత్రక నిధి

సిద్దవటం అటవీ ప్రాంతంలో ఏళ్ల కిందట నిర్మించిన సాహెబ్ బావి నేటికీ పదిలంగానే ఉంది. వర్షాకాలంలో నీటితో నిండి వన్య, వన సంపద, వన్యప్రాణుల దాహార్తి తీరుస్తోంది. ఆంగ్లేయుల కాలంలో సిద్దవటం రేంజ్ పరిధిలో కాలం చెల్లిన చెట్ల వేలం ద్వారా విక్రయించి ప్రభుత్వానికి ఆదాయాన్ని సమకూర్చేవారు. అప్పట్లో సిద్దవటానికి చెందిన సాహెబ్ అనే గుత్తేదారు లంకమల అడవుల్లో కాలం చెల్లిన చెట్ల వేలం హక్కును దక్కించుకుని కూలీలతో నరికించేవారు. వాటిని వంట చెరకు విక్రయానికి, బొగ్గు తయారీ కోసం వినియోగించేవారు. కూలీలు, పాడిపశువులకు తాగునీటి సౌకర్యార్థం అప్పట్లో సిద్దవటం శివారులోని రహదారి పక్కన ఉన్న అటవీ ప్రాంతంలో బావిని తవ్వించి నిర్మించారు. అందులోని నీటిని కూలీలు వినియోగించుకునేవారు. అక్కడే వంట చేసుకుని తినేవారు. దీంతో దానికి సాహెబ్ బావి అని పేరు వచ్చింది. ఈ బావి నేటికీ చెక్కుచెదరకుండా ఉండడం విశేషం. తర్వాత అక్కడ బేస్ క్యాంపు శిబిరం ఏర్పాటు కావడంతో బోరు ఏర్పాటు చేసి అటవీ సిబ్బందికి, వన్యప్రాణులకు తాగునీటిని అందించేలా ఏర్పాట్లు చేశారు. - న్యూస్‌టుడే, సిద్దవటం

అటవీ సిబ్బంది, వన్యప్రాణులకు తీరుతున్న దాహం

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

కడప నగరంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్ఐవో వెంకటేశ్వర్లు

కడప విద్య, న్యూస్‌టుడే: ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. మొదటి సంవత్సరం విద్యార్థులకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష జరగనుంది. జిల్లావ్యాప్తంగా 62 పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాల పర్యవేక్షణలో 17,100 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. అందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని ఆర్ఐవో వెంకటేశ్వర్లు తెలిపారు. కడప నగరంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో పరీక్షల ఏర్పాట్లను ఆదివారం ఆయన పరిశీలించారు. నిర్వహణలో ఏవైనా సమస్యలుంటే 08562-244171 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఉత్తమ డాక్ సేవక్‌కు సీఎం సత్కారం

గుంటూరు(ఏటీ అగ్రహారం), న్యూస్‌టుడే: గుంటూరు నగర శివారులోని సత్యసాయి ఆధ్యాత్మిక నగరిలో ఆదివారం జాతీయ స్థాయి గ్రామీణ డాక్ సేవక్ సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా రాష్ట్రంలో ఉత్తమ పనితీరు కనబర్చిన గ్రామీణ డాక్ సేవక్‌లకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌లు పురస్కారాలు అందించి సత్కరించారు. జిల్లా నుంచి **రియాజ్ అహ్మద్‌**కు పురస్కారం వరించింది.

ఆమెకు పథకం అభయ్‌మిచ్చె

కడప గ్రామీణ, న్యూస్‌టుడే

స్వయం ఉపాధి దిశగా మహిళలు అడుగులు వేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తోడ్పాటునందిస్తున్నాయి. రుణాలు ఇప్పించి ఆర్థికంగా ఎదిగేందుకు కావాల్సిన వనరులను ప్రధాన మంత్రి అనుసుచిత్ జాతి అభ్యుదయ యోజన (పీఎం అజయ్) కింద రాయితీలు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎస్సీ కార్పొరేషన్, సెర్ప్ సమన్వయంతో లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నారు.

లబ్ధిదారుల ఎంపిక పూర్తి

● జిల్లా వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లోని స్వయం సహాయక సంఘాల్లోని ఎస్సీ మహిళలకు ప్రభుత్వం పీఎం అభయ్ పథకం ద్వారా కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తోంది. స్వయం సహాయక సంఘంలో సభ్యులుగా ఉండి 25 ఏళ్ల నుంచి 35 ఏళ్ల మధ్యలో ఉన్న ఎస్సీ మహిళ మాత్రమే అర్హులు. ఈ పథకం కింద ఎంపిక కావాలంటే సదరు సభ్యురాలు ఉండే సంఘం బ్యాంకు, స్త్రీనిధి తదితరాల్లో రుణం తీసుకుని సకాలంలో చెల్లించేదిగా ఉండాలి. రుణం సకాలంలో చెల్లించక ఎన్‌పీఏ కింద ఉన్న సంఘాల్లోని సభ్యులకు అర్హత లేదు.

● ఒక్కో మండలానికి 5 మంది చొప్పున లక్ష్యం మేరకు ఎంపిక చేసి కలెక్టర్ అనుమతితో సెర్ప్ ఉన్నతాధికారులకు నివేదిక పంపారు. అక్కడ నుంచి అనుమతులు రాగానే పథకం అమలు చేస్తామని డీఆర్‌డీఏ అధికారులు చెబుతున్నారు. యూనిట్ ధర రూ.లక్ష నుంచి దాదాపు రూ.3 లక్షల వరకు ఆయా యూనిట్‌ను బట్టి ఉంటోంది. అందులో 50 శాతం రాయితీ పోను మిగిలిన 10 శాతం లబ్ధిదారు వాటాగానూ 40 శాతం ఉన్నతి కింద వడ్డీలేని రుణం కింద ఇస్తారు.

జిల్లా : వైఎస్సార్ కడప
మండలాలు : 40
స్వయం సహాయక సంఘాలు 26,676
సభ్యులు : 1,92,678 మంది

175 యూనిట్లకు రూ.2.38 కోట్లు

జిల్లాలో ఎంపిక చేసిన 175 మంది లబ్ధిదారుల్లో పలు రకాల యూనిట్లు దరఖాస్తు చేసుకున్నారు. వీటిలో 18 మంది ద్విచక్ర, త్రి చక్ర వాహనాలపై ఐస్‌క్రీమ్ వ్యాపారం చేసేందుకు యూనిట్లు కావాలని దరఖాస్తు చేసుకున్నారు. మరో 12 మంది ఆటోలు కావాలని, మిగిలిన 145 మందిలో చీరల వ్యాపారం, బొటిక్, స్టేషనరీ తదితర వ్యాపారాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. లబ్ధిదారుల ఎంపిక అనంతరం యూనిట్లు మొత్తం కలిపి సుమారు రూ. 2.38 కోట్లు అయిందని అధికారులు పేర్కొన్నారు.

నేడు డయల్ యువర్ సీఎండీ

కడప గ్రామీణ, న్యూస్‌టుడే: విద్యుత్తు వినియోగదారుల సమస్యలు పరిష్కారానికి డయల్ యువర్ సీఎండీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏపీ ఎస్పీడీసీఎల్ సీఎండీ శివశంకర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10 నుంచి 12.30 వరకు ఉంటుందన్నారు. వినియోగదారులు 89777 16661 నంబర్‌కు ఫోన్ చేసుకోవచ్చన్నారు. జిల్లా పరిధిలో ఎస్ఈ ఆధ్వర్యంలోనూ డయల్‌యువర్ ఎస్ఈ కార్యక్రమం ఉదయం 8.30 నుంచి 9.30 వరకు ఉంటుందన్నారు. 08562 242457 నంబర్‌కు ఫోన్ చేసి సమస్యలు పరిష్కరించుకోవచ్చన్నారు.

డ్రోన్ పిచికారీ.. రైతులకు ఉపకారి

ఆసక్తి చూపుతున్న అన్నదాతలు

కమలాపురం, న్యూస్‌టుడే: సాగులో ఏటా కూలీల కొరతను నివారించేందుకు రైతులకు సహకారం అందించే దిశగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోంది. సాంకేతికతను అందుబాటులోకి తెచ్చి డ్రోన్లతో మందులు పిచికారీ చేసేందుకు శ్రీకారం చుట్టింది. ప్రత్యేక యాప్ ద్వారా రైతులు క్యాబ్ తరహాలో డ్రోన్‌లను బుక్ చేసుకునే వెసులుబాటు కల్పించింది. రైతులకు అవసరమైనప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. చరవాణిలో గూగుల్ ప్లే స్టోర్‌కి వెళ్లి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని వివరాలు నమోదు చేసుకోవాలి. లొకేషన్ ఆధారంగా డ్రోన్ల వివరాలు చూపిస్తుండగా దాని ఆధారంగా బుక్ చేసుకోవచ్చు. రైతు సేవా కేంద్రాల వద్ద గోడపత్రికల్లో ఉన్న క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా బుక్ చేసుకోవచ్చు. జిల్లాలోని కమలాపురం, వల్లూరు, పెండ్లిమర్రి, సీకేదిన్నె, చెన్నూరు మండలాల రైతులు సద్వినియోగం చేసుకుంటున్నారు.

డ్రోన్‌తో మందులు పిచికారీ చేస్తున్న శిక్షకురాలు

రాయితీతో పాటు శిక్షణ

80 శాతం రాయితీపై రైతులకు డ్రోన్లు అందజేసి ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. పొలాల్లో సస్య రక్షణ, మందులు పిచికారీ, విత్తనాలు చల్లడానికి డ్రోన్లను ఉపయోగిస్తారు. ఎక్కువ మంది పురుగు మందులు పిచికారీ చేసేందుకు వినియోగిస్తున్నారు. నిర్వాహకులు అద్దెకిచ్చి ఉపాధి పొందుతున్నారు. ఈ విషయమై కమలాపురం ఏడీఏ నరసింహారెడ్డి మాట్లాడుతూ. . డ్రోన్ల పిచికారీపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. సమయంతో పాటు నగదు ఆదా అవుతుండటంతో ఎక్కువ మంది మొగ్గుచూపుతున్నారని ఆయన చెప్పారు.

కేసీ నీళ్లు.. అందక కన్నీళ్లు!

ఎగువన ఉన్న రిజర్వాయర్ల నుంచి కేసీ కాలువలో నీరు పుష్కలంగా వస్తోంది.. కాలువ నిండా నీరు ప్రవహిస్తున్నా.. ఆయకట్టు రైతుకు సాగునీరు అందక కన్నీళ్లు తెప్పిస్తోంది. శివాలపల్లె మీదుగా కొక్కరాయపల్లె, చెన్నూరు గ్రామాలకు సాగునీరందించే పంట కాలువ కింద రబీలో వందల ఎకరాల్లో వరి పంట సాగైంది. ప్రస్తుతం పిలకల దశలో ఉన్న పంటకు వారం నుంచి నీరు సక్రమంగా అందక పంట పూర్తిగా బీటలు వారుతోంది. కొక్కరాయపల్లెలో నీరందక బీటలు వారిన ఈ చిత్రమే అందుకు నిదర్శనం. - న్యూస్‌టుడే, చెన్నూరు

జ్ఞాపకాల మదిలో...
జాతస్య హిధ్రువో మృత్యుః ధ్రువం జన్మ మృత్యస్యచ
తస్మాద పరిహార్యేర్థే నత్వం శోచితు మర్హసి
మీరు చూపిన ఆత్మీయత ..
అనురాగం మా అభివృద్ధికి వేసిన పూబాట
మీరు భౌతికంగా దూరమైనా మా చెంత ఉన్నట్లే ఉంది.
ఏమిచ్చి రుణం తీర్చుకోము మా యదలోతుల్లోని
భావాలను అక్షర రూపంలో
నివేదించడం తప్ప
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం
స్మృతి, వర్ధంతి, జయంతి
ప్రకటనల వివరాలకు
ఈనాడు కార్యాలయము, ఆలంఖాన్‌పల్లి, కడప.
కడప : 99899 97626

(c) eenadu

కార్మిక హక్కుల సాధనకు పోరాటం

నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఏఐటీయూసీ నాయకులు, కార్మికులు

మారుతీనగర్, న్యూస్‌టుడే: కార్మికులు పోరాటాలు చేసి పొందిన ప్రయోజనాలు, కార్పొరేట్, పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట సుబ్బయ్య, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వలసాని వెంకటరామరావు పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ జిల్లా మహాసభల సందర్భంగా ఆదివారం కోటిరెడ్డి కూడలి నుంచి నగరంలోని పలు కూడళ్ల మీదుగా కళాక్షేత్రం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్మికుల హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హరించివేస్తున్నాయని ఆరోపించారు. ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు, సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర, నాయకులు నాగసుబ్బారెడ్డి, వేణుగోపాల్, రామలింగారెడ్డి, మల్లికార్జునరెడ్డి, బాదుల్లా పాల్గొన్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన డీసీసీబీ ఛైర్మన్

అట్లూరు, న్యూస్‌టుడే: కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను కడప డీసీసీ బ్యాంకు ఛైర్మన్ మంచూరి సూర్యనారాయణ రెడ్డి ఆదివారం దిల్లీలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి పుష్ప గుచ్ఛం అందించి, శాలువాతో సన్మానించారు. ఆయన వెంట స్థానిక నాయకులున్నారు.

రాజ్‌నాథ్ సింగ్‌కు పుష్పగుచ్ఛాన్ని అందిస్తున్న డీసీసీ బ్యాంకు ఛైర్మన్ సూర్యనారాయణరెడ్డి

గడువులోపు పనులు పూర్తయ్యేనా?

వేంపల్లెలో నిర్మాణంలో ఉన్న సిమెంట్ రోడ్డు

● ఉపాధి హామీ నిధులతో చేపట్టిన రహదారి నిర్మాణాల దుస్థితి

పులివెందుల (గ్రామీణ, వేంపల్లె), న్యూస్‌టుడే: జాతీయ ఉపాధి హామీ పథకంలో మెటీరియల్ కాంపోనెంట్ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులు పూర్తి చేసేందుకు గడువు త్వరలో ముగియనుంది. కానీ క్షేత్రస్థాయిలో పనులు పూర్తయ్యేలా కనిపించడం లేదు. గడువు లోపల పూర్తికాకపోతే మిగిలిన పనులు చేసే అవకాశం ఉండదు. దీంతో నిధులు మురిగిపోనున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లాలో జరుగుతున్న పనులు గడువు లోపల పూర్తవడంపై ప్రశ్నార్థకంగా మారింది.

● జిల్లాలో ఉపాధి నిధులు రూ.220 కోట్లతో 2,120 రకాల సిమెంటు, తారు, మెటల్ రహదారులు, పంచాయతీ భవనాలు తదితర పనులు చేయాల్సి ఉంది. ఈ విడతపై పనులను మార్చి 15 తేదీ నాటికి పూర్తి చేసి ఆ తర్వాత చేసిన పనులకు బిల్లులను అప్‌లోడ్ చేసేందుకు ప్రభుత్వం గడువు ఇచ్చింది. కానీ క్షేత్రస్థాయిలో పనులు జరగలేదు. 2,120 రకాల పనులకు రూ.60 కోట్లతో 540 రకాల పనులు పూర్తి చేశారు. రూ.37 కోట్లతో చేపట్టిన మరో 380 పనులు నిర్మాణంలో ఉన్నాయి.

● సిమెంట్ రోడ్ల నిర్మాణం 286 కిలోమీటర్లు పొడవున చేపట్టాల్సి ఉండగా 59 కి.మీ. మాత్రమే పూర్తి చేశారు. తారురోడ్డు 120 కి.మీ. నిర్మించాల్సి ఉండగా కేవలం 25 కి.మీ., మెటల్ రోడ్డు 133 కి.మీ. నిర్మించాల్సి ఉండగా 20 కి.మీ. దూరం మాత్రమే పనులు పూర్తయ్యాయి.

● కొన్ని పంచాయతీల్లో ఇంకా పనులు ప్రారంభం కాలేదు. గడువులోపు పనులు పూర్తి చేయకపోతే, బిల్లులు వస్తాయో లేదోనని గుత్తేదారులు ఆసక్తి చూపడం లేదు. ఫలితంగా 1,163 పనులు క్షేత్రస్థాయిలో ప్రారంభం కాలేదు. అలాగే 37 పంచాయతీ భవన నిర్మాణ పనులకు అడుగులు పడలేదు.

చర్యలు తీసుకుంటాం

గడువు లోపల పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం. జిల్లాకు కేటాయించిన నిధులు వెనక్కిపోకుండా సద్వినియోగం చేసుకుంటాం.

- దయాకర్‌రెడ్డి, ఈఈ, పంచాయతీరాజ్‌శాఖ

కార్యకర్తల సంక్షేమమే తెదేపా లక్ష్యం

అరవిందనగర్ (కడప), న్యూస్‌టుడే: కార్యకర్తల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకుని వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించడమే తెదేపా లక్ష్యమని జిల్లా అధ్యక్షుడు భూపేష్ రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం కడప మరియాపురం సమీపంలో తెదేపా కార్యాలయ నిర్మాణానికి కమలాపురం ఎమ్మెల్యే కృష్ణచైతన్యరెడ్డితో కలిసి ఆయన భూమిపూజ చేశారు. భూపేష్‌రెడ్డి మాట్లాడుతూ 6 నెలల్లో పార్టీ కార్యాలయాన్ని కార్యకర్తలకు అందుబాటులోకి తీసుకువస్తామని స్పష్టం చేశారు. 30 ఏళ్ల తర్వాత జిల్లాలో కార్యాలయం ఏర్పాటవుతోందన్నారు. ఎమ్మెల్యే కృష్ణచైతన్యరెడ్డి మాట్లాడుతూ రానున్న రోజుల్లో జిల్లాలో తెదేపా మరింతగా ఎదుగుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు విజయమ్మ, లింగారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పుల్లయ్య, తెదేపా రాష్ట్రకార్యనిర్వాహక కార్యదర్శులు గోవర్ధన్‌రెడ్డి, హరిప్రసాద్, ఉపాధ్యక్షుడు అమీర్‌బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి జనార్దన్, పార్థసారధిరెడ్డి తదితరులు హాజరయ్యారు.

తెదేపా కార్యాలయ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న జిల్లా అధ్యక్షుడు భూపేష్‌రెడ్డి, ఎమ్మెల్యే కృష్ణచైతన్యరెడ్డి, నేతలు

యువకుడిపై పెట్రోల్ పోసి నిప్పంటించిన దుండగులు

కాశినాయన, న్యూస్‌టుడే: యువకునిపై గుర్తు తెలియని వ్యక్తులు పెట్రోల్ పోసి నిప్పంటించి పరారైన ఘటన కాశినాయన మండలం పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు గంగనపల్లి గ్రామానికి చెందిన దిలీప్(24)పై ఆకులనారాయణపల్లె మార్గం మధ్యలో కాశినాయన ఆశ్రమ సమీపంలో ఇద్దరు వ్యక్తులు వచ్చి పెట్రోల్ పోసి నిప్పంటించారు. స్థానికులు గమనించి 108 ద్వారా పోరుమామిళ్ల ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తీసుకెళ్లారు. యువకునిపై నిప్పంటించడానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. ఈ మేరకు విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చేయీ చేయీ కలిపారు.. వంతెన పునరుద్ధరించుకున్నారు

రాయవరం(సుండుపల్లె), న్యూస్‌టుడే: ఎవరో వస్తారూ.. ఏదో చేస్తారు అని వారు ఎదురు చూడలేదు. వర్షాల కష్టాన్ని చూసి పట్టుకు తెలగలేదు. చేయీ చేయీ కలిపి సమస్యను పరిష్కరించుకున్నారు రెడ్డివారిపల్లె గ్రామస్థులు. ఏడు మాసాల క్రితం రాయవరం-రెడ్డివారిపల్లె మధ్య బాహుదా నదిపై నిర్మించిన వంతెన వరద ఉద్ధృతికి ధ్వంసమైంది. దాంతో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి. ప్రస్తుతం నీటి ప్రవాహం తగ్గినా.. ప్రభుత్వం చర్యలు చేపట్టలేదు. దాంతో గ్రామస్థులే చందాలు వేసుకుని.. సుమారు రూ.90 వేల వ్యయంతో వంతెనను పునరుద్ధరించుకున్నారు.

బాహుదా నదిపై నిర్మించుకున్న రహదారి

నందీశ్వరాలయం.. ప్రారంభోత్సవానికి సిద్ధం

23 నుంచి వేడుకలు

చక్రాయపేట (వేంపల్లె), న్యూస్‌టుడే: నందిపల్లెలో నందీశ్వరాలయం నిర్మాణం పూర్తయింది. ఈ నెల 23వ తేదీ నుంచి ఐదు రోజుల పాటు ప్రారంభోత్సవ వేడుక నిర్వహించనున్నారు. ఇందుకు పలువురు ప్రముఖులు హాజరుకానున్నారు.

రాతితో నిర్మించిన నందీశ్వరాలయం

● చరిత్ర ఇదే: వేంపల్లె మండలం నందిపల్లెలో పూర్వం నందీశ్వరాలయం ఉండేది. ఆ దేవాలయం పేరుతోనే ఆ ఊరికి నందిపల్లె అనే పేరు వచ్చింది. కాలక్రమంలో ఆ దేవాలయం కనుమరుగైంది. దీంతో ఆ ఊరి పేరు మీదనే ఆలయం నిర్మించుకోవాలని గ్రామస్థులు భావించారు. దాతల సహకారంతో రూ.70 లక్షలు సేకరించారు. ప్రభుత్వం నుంచి రూ.1.80 కోట్లు అందింది. మిగిలిన ఖర్చును భరించడానికి గ్రామ సర్పంచి కుమారుడు మారం శ్రీకాంత్‌రెడ్డి ముందుకొచ్చారు.

అందుబాటులో నాణ్యమైన వస్త్రాలు

రాజంపేట, న్యూస్‌టుడే: పెద్ద పట్టణాలకే పరిమితం కాకుండా చిన్న పట్టణమైన రాజంపేటలో చందన షాపింగ్‌మాల్‌ను ఏర్పాటు చేసి నాణ్యమైన వస్త్రాలను అందుబాటులోకి తెచ్చారని సినీనటి నిధి అగర్వాల్ అన్నారు. రాజంపేట పట్టణం రైల్వేస్టేషన్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన చందన షాపింగ్‌మాల్‌ను ఆదివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తక్కువ ధరలకే నాణ్యమైన వస్త్రాలను అందించడం అభినందనీయమన్నారు. ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, శ్రీశైలం ఆలయ ఛైర్మన్ రమేష్‌నాయుడు, పుర ఛైర్మన్ శ్రీనివాసులరెడ్డి, షాపింగ్‌మాల్ ఎండీ శ్రీనివాసరావు, డైరెక్టర్లు వెంకట గణేష్, సంతోష్ రామ్మోహన్ పాల్గొన్నారు.

షాపింగ్‌మాల్‌ను ప్రారంభిస్తున్న సినీనటి నిధి అగర్వాల్

మఠాధిపతుల పట్టాభిషేక మహోత్సవ ఏర్పాట్ల పరిశీలన

బ్రహ్మంగారిమఠం, న్యూస్‌టుడే: వీరబ్రహ్మేంద్రస్వామి మఠంలో ఈనెల 24వ తేదీ నుంచి 26 వరకు మఠాధిపతుల పట్టాభిషేక మహోత్సవానికి ఏర్పాట్లను ఆదివారం సీఐ శివశంకర్, ఎస్సై శివప్రసాద్ మఠం మేనేజర్ ఈశ్వరయ్య ఆచారి పరిశీలించారు. మఠం సిబ్బందికి వారు పలుసూచనలు, సలహాలిచ్చారు. భక్తులు, ముఖ్య ఆహ్వానితులకు ఇబ్బందులు కలగకుండా భద్రతా ఏర్పాట్లలో భాగంగా మఠ పరిసరాలను కలియజూశారు. వీరి వెంట, దత్తాత్రేయస్వామి, ప్రసాద్, ఓబులయ్య, రాజేష్ ఉన్నారు.

బ్రహ్మంగారిమఠం ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న సీఐ శివశంకర్, ఎస్సై శివప్రసాద్

ప్రశ్నించే గుణం అలవర్చుకోవాలి

ఉపన్యాస పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులతో జవివే నాయకులు

కడప విద్య, న్యూస్‌టుడే : విద్యార్థులు ర్యాంకులు, మార్కులే కాకుండా ప్రశ్నించే గుణం అలవర్చుకోవాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విశ్వనాథ అన్నారు. స్థానిక ఎస్టీయూ భవన్‌లో ఆదివారం విద్యార్థులకు జవివే ఆధ్వర్యంలో వక్తృత్వపు పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. 8, 9, 10 తరగతుల విద్యార్థులకు పాఠశాల, మండల, జిల్లా స్థాయిల్లో పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర నాయకులు రమణారెడ్డి, ఇలియాస్‌బాషా, జవివే సభ్యులు సురేష్‌బాబు, సనావుల్లా, వెంకటరమణ, రామలింగరాజు, గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే: రానున్న రోజుల్లో రెండు తెలుగు రాష్ట్రాల్లో ధనిక్‌భారత్ విద్యాసంస్థలు ప్రభంజనం సృష్టిస్తాయని విద్యాసంస్థల డైరెక్టరు, యూపీఎస్సీ ర్యాంకర్ బాలలత అన్నారు. రాయలసీమ జిల్లాలోని పలు పాఠశాలల్లోని విద్యార్థులకు అవగాహన సదస్సు కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఆదివారం కడప ఎర్రముక్కపల్లెలోని బాలవికాస్ పాఠశాలలో విద్యార్థులతో ఆమె ముచ్చటించారు. త్వరలోనే రాయలసీమ జిల్లాలోనూ ధనిక్‌భారత్ విద్యాసంస్థలను ఏర్పాటు చేస్తామన్నారు. విద్యార్థులను చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో అజయ్‌విక్రమ్, బాలవికాస్ పాఠశాల కరస్పాండెంట్ గంగయ్య తదితరులున్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న ధనిక్ భారత్ విద్యాసంస్థల డైరెక్టర్ మల్లవరపు బాలలత

ఇద్దరు వాహన దొంగల అరెస్టు

బేస్తవారపేట, న్యూస్‌టుడే: వాహనాల దొంగతో పాటు.. అతడి నుంచి వాటిని కొనుగోలు చేస్తూ సహకరిస్తున్న మరో వ్యక్తిని మార్కాపురం జిల్లా బేస్తవారపేట పోలీసులు అరెస్టు చేశారు. స్టేషన్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో డీఎస్పీ నాగరాజు వివరాలు వెల్లడించారు. కాకినాడ జిల్లా తిమ్మాపురానికి చెందిన ఆచంట గంగాధరరావు.. బేస్తవారపేట మండలం చింతలపాలెంలో ఈ నెల 14న ట్రాలీతో సహా ఓ ట్రాక్టర్‌ను అపహరించాడు. బనగానిపల్లి, మహానంది, ఐజా స్టేషన్ల పరిధిలో మరో నాలుగు ద్విచక్ర వాహనాలు, గిద్దలూరు పరిధిలో ట్రాలీ ఆటో తస్కరించాడు. చోరీ చేసిన వాహనాలను కడప జిల్లా ఎర్రగుంట్లకు చెందిన పల్లెపోగు ప్రసాద్‌కు విక్రయిస్తుండేవాడు. అతడు వాటిని బయటి మార్కెట్‌లో అధిక ధరలకు అమ్మేవాడు. కంభం ఇన్‌ఛార్జి సీఐ రామకోటయ్య, ఎస్సై రవీంద్రారెడ్డి సిబ్బందితో కలిసి కోనపల్లి అడ్డరోడ్డు వద్ద వాహన తనిఖీలు చేస్తుండగా... వీరిరువురూ ట్రాక్టర్‌లో వస్తూ పోలీసులకు చిక్కారు. విచారణలో చోరీల విషయం వెలుగులోకి వచ్చింది. వారి నుంచి సుమారు రూ.14 లక్షల విలువైన వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. గంగాధరరావుపై కంభం, గిద్దలూరు, దోర్నాల, గుంతకల్లు, నంద్యాల, బేతంచర్ల, పులివెందుల, తిమ్మాపురం, నరసరావుపేట, కారంపూడి, గడివేముల, నాయుడుపేట తదితర స్టేషన్లలో చోరీ కేసులు నమోదయ్యాయని డీఎస్పీ తెలిపారు.

పోరాట యోధుడు ఉయ్యాలవాడ

కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే: ఉయ్యాలవాడ నరసింహారెడ్డి బ్రిటిష్ వారి ఆగడాలను ఎదుర్కొని అలుపెరగని పోరాట యోధుడిగా నిలిచారని ఏఆర్ అదనపు ఎస్పీ రమణయ్య కొనియాడారు. ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి సందర్భంగా ఆదివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆర్ఐ శివరాముడు, ఆర్ఎస్సై వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

ఉయ్యాలవాడ చిత్రపటానికి పూజలు చేస్తున్న ఏఆర్ ఏఎస్పీ రమణయ్య, చిత్రంలో పోలీసులు

ప్రొద్దుటూరులో 35 తులాల బంగారం అపహరణ

ప్రొద్దుటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరు పట్టణం బొల్లవరంలోని తిమ్మయ్య కాలనీలో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. ఇంట్లో భద్రపరిచిన దాదాపు 35 తులాల బంగారం, 40 తులాల వెండి అపహరణకు గురైనట్లు బాధితులు చెబుతుండగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ముద్దనూరు మండలం పెనికలపాడుకు చెందిన బాలిరెడ్డి కుటుంబం రెండున్నరేళ్ల కిందట ప్రొద్దుటూరులోని తిమ్మయ్య కాలనీలోని స్థిరపడింది. బేకరీల్లో స్వీట్స్ తయారీకి సంబంధించిన ముడి సరకు సరఫరా చేస్తుంటారు. పెనికలపాడులో బంధువుల శుభకార్యం ఉండటంతో శనివారం సాయంత్రం ఇంటికి తాళం వేసి వెళ్లారు. రెక్కీ నిర్వహించిన దొంగలు ఇంటికి తాళం కనిపించడంతో ధ్వంసం చేసి లోనికి వెళ్లి బంగారం, వెండి ఎత్తుకెళ్లారు. ఆదివారం ఉదయం తలుపు తెరిచి ఉండటాన్ని గమనించిన స్థానికులు బాలిరెడ్డికి సమాచారం ఇవ్వగా వారు ఇంటికి చేరుకుని పరిశీలించారు. ఇంట్లో వస్తువులన్నీ చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. బంగారం, వెండి వస్తువులు కనిపించకపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ కొండారెడ్డి, ఎస్.ఐలు సంజీవరెడ్డి, మైనుద్దీన్‌లు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. క్లూస్‌టీం పలు ఆధారాలు సేకరించింది. డాగ్‌స్క్వాడ్ తనిఖీలు నిర్వహించింది. నిందితులను గుర్తించేందుకు సీసీ కెమెరాలను పరిశీలించింది. ఇప్పటికే పలువురు అనుమానితులను పోలీసులు విచారించారు. పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

చోరీ జరిగిన ఇంట్లో పరిశీలిస్తున్న పోలీసులు

వాహనం ఢీకొని ఒకరు మృతి

ఇద్దరికి తీవ్ర గాయాలు

సుండుపల్లి, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనాన్ని బొలేరో ఢీకొట్టడంతో ఒకరు మృతి చెందగా.. ఇద్దరు తీవ్రంగా గాయపడిన ఘటన సుండుపల్లి మండల పరిధిలోని సుండుపల్లి-రాయచోటి ప్రధాన రహదారిపై ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు అన్నమయ్య జిల్లా రాయచోటి మండలానికి చెందిన రఘుపతి(40) నాగూర్ బాషా, షేక్‌షావలి భవన నిర్మాణ పనుల నిమిత్తం సుండుపల్లికి వస్తుండగా.. ముచ్చుగుంతరాళ్ల గుట్ట సమీపంలో ఎదురుగా వస్తున్న బొలేరో ఢీకొంది. ప్రమాదంలో బైక్‌పై ఉన్న ముగ్గురూ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తలకు బలమైన గాయమైన రఘుపతి చికిత్స పొందుతూ మృతి చెందారు. మిగిలిన ఇద్దరినీ మెరుగైన చికిత్స కోసం తిరుపతికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై హుస్సేన్ తెలిపారు.

వివాహిత బలవన్మరణం

ఎర్రగుంట్ల, న్యూస్‌టుడే: మండలంలోని చిలమకూరు గ్రామానికి చెందిన వల్లెపు సునీత (29) అనే వివాహిత విషద్రావణం సేవించి మృతి చెందినట్లు ఆదివారం ఎర్రగుంట్ల సీఐ విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు. సీఐ వివరాల మేరకు.. చిలమకూరు గ్రామానికి చెందిన వల్లెపు శ్రీహరిని సునీత పదేళ్ల కిందట కులాంతర వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు సంతానం ఉన్నారు. కుటుంబ కలహాల నేపథ్యంలో సునీత విషద్రావణం సేవించడంతో ఆమెను ప్రొద్దుటూరు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందారని వివరించారు. భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

IN THE COURT OF THE HONORABLE JUNIOR CIVIL JUDGE, KAMALAPURAM

E.P. No. 41/2024 in O.S. No. 73/2023

Dudyala Venkata Chandra Mohan Reddy, aged about 46 years, Son of Raghava Reddy, residing at Hanumanagutti Village, Yerraguntla Mandal, Kadapa District. - D.Hr

Vs.

Ramisetty Chinna Pullaiah, aged about 44 years, son of Pullaiah, residing at Kogatam Village, Kamalapuram Mandal, Kadapa District. - J.Dr

PROCLAMATION

ఇందుమూలముగా యావన్మంది ప్రజానీకానికి తెలియజేయడం ఏమనగా ఈ క్రింది షెడ్యూల్‌లో వివరించబడిన ఆస్తిని 11-03-2026వ తేదీన, రాజశ్రీ కమలాపురం జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టు నందు బహిరంగంగా ఉదయం 10.30 గంll నుంచి సాయంత్రం 5.00 గంll లోపల వేలం జరపబడును. వేలము నందు ఎవరైనను పాల్గొనవచ్చును. కోర్టు షరతులు వర్తించును.

షెడ్యూల్ : కడప జిల్లా, కమలాపురం సబ్-డిస్ట్రిక్ట్, కమలాపురం మండలం, కోగటం గ్రామ పొలములోని సర్వే నెం.408లో విస్తీర్ణం ఎ. 2-38 సెంట్లు గల భూమికి చెక్కుబంది.

తూర్పు : బాబన్ బాయి గారి రహమత్‌బీ భూమి

పడమర : ముళ్ళ గౌసుపీర్ భూమి ఉత్తరం : రామిసెట్టి రాజేశ్వరి భూమి, దక్షిణం : రామిసెట్టి పుల్లయ్య భూమి

with all easementary rights.

(Amended as per orders in E.A No.165 of 2025, Dated 30-10-2025)

D.Hr Value : Rs. 7,00,000-00

Amin Value : Rs. 8,00,000-00

Market Value: Rs. 7,14,000-00

వాయిదా తేదీ : 11-03-2026

స్థలము : కమలాపురం

వాది తరపున న్యాయవాది

B. NARAYANA REDDY, Advocate, Kamalapuram

భాజపా జిల్లా అధికార ప్రతినిధిగా గౌరీశంకర్

ప్రొద్దుటూరు విద్య, న్యూస్‌టుడే: భాజపా జిల్లా అధికార ప్రతినిధిగా ప్రొద్దుటూరుకు చెందిన పర్లపాడు గౌరీశంకర్ నియమితులయ్యారు. ఆ మేరకు జిల్లా అధ్యక్షుడు జంగిటి వెంకటసుబ్బారెడ్డి ప్రకటించారు. గౌరీ శంకర్ 20 ఏళ్లుగా పార్టీలో పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి కీలక బాధ్యతలు అప్పగించిన పార్టీ ముఖ్య నేతలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. జిల్లా అధికార ప్రతినిధిగా నియమితులైన ఆయనను పలువురు నాయకులు అభినందించారు.

అంతర్ జిల్లా చోరుడి అరెస్టు

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: ఓ ప్రయాణికుడి నుంచి నగదు దొంగలించిన అంతర్‌జిల్లా దొంగను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. వల్లూరు మండలం గోటూరుకు చెందిన జయరామిరెడ్డి శనివారం రూ.2 లక్షల నగదుతో గ్రామం వద్ద బస్సు ఎక్కారు. కడప నగర సమీపంలోని అలంఖాన్‌పల్లె వద్దకు రాగానే ఇద్దరు ప్రయాణికులు ఎక్కారు. వారిలో ఒకరు కావాలనే జయరామిరెడ్డిపై పడి డబ్బులున్న బ్యాగును బ్లేడ్‌తో కట్ చేశాడు. వెంటనే జయరామిరెడ్డి ఎందుకు బ్యాగును కట్ చేశారని వారితో వాగ్వాదానికి దిగారు. బిల్టప్ వద్దకు రాగానే వారిద్దరూ అతని వద్ద ఉన్న డబ్బుల సంచి తీసుకుని ఉడాయించారు. ప్రయాణికులు వారిని వెంటపడగా వారు డబ్బుల సంచిని కింద పడేసి వెళ్లిపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఈ క్రమంలో ఆదివారం భగత్‌సింగ్ పార్కు వద్ద తిరుపతికి చెందిన మల్లిబాబు అనుమానాస్పద స్థితిలో ఉండగా పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా డబ్బుల సంచి దొంగలించింది తామేనని ఒప్పుకున్నారు. వెంకటేష్, మరో దొంగ పరారీలో ఉన్నారు. మల్లిబాబుపై మదనపల్లె, వాల్మీకిపురం ప్రాంతాల్లో చోరీ కేసులు నమోదయ్యాయి. ఈ మేరకు మల్లిబాబును అరెస్టు చేసి అతని వద్ద ఉన్న రూ.9,500 నగదు స్వాధీనం చేసుకున్నారు.

పంటను కాపాడే తీగే యజమానికి యమపాశమైంది

శివయ్యనాయుడు (పాత చిత్రం)

సుండుపల్లి, న్యూస్‌టుడే: ఆరు గాలం శ్రమించి సాగు చేసిన పంటను అడవి పందుల నుంచి రక్షించుకునేందుకు వేసిన విద్యుత్తు తీగే ఆ రైతు పాలిట యమపాశమైంది. ప్రమాదవశాత్తు పంటకు రక్షణగా వేసుకున్న తీగ తగిలి ఓ రైతు మృతి చెందిన విషాదకర ఘటన సుండుపల్లి మండలంలోని కొత్తనాయునిపల్లెలో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామస్థులు, పోలీసుల వివరాల ప్రకారం.. కొత్తనాయునివారిపల్లెకు చెందిన గురిగింజకుంట రామప్పనాయుడు కుమారుడు శివయ్యనాయుడు (40) భూమిని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నారు. అడవి పందుల నుంచి పంటను రక్షించుకునేందుకు రక్షణగా చుట్టూ విద్యుత్తు తీగ కంచెను ఏర్పాటు చేసుకున్నారు. ఈ క్రమంలో శనివారం రాత్రి పొలానికి వెళ్లారు. వైరుకు కనెక్షన్ ఇచ్చే క్రమంలో పొరపాటున ఆ తీగను తాకడంతో విద్యుదాఘాతం తగిలి నేలకూలారు. ఆదివారం గమనించిన తోటి రైతులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి భార్య పార్వతి ఫిర్యాదు మేరకు మృత దేహాన్ని శవపరీక్ష నిమిత్తం రాయచోటికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై హుస్సేన్ తెలిపారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

పల్లా హాస్పిటల్ 7 రోడ్స్ సర్కిల్ కడప నందు పనిచేయుటకు వార్డు బాయిస్, O.T. టెక్నీషియన్స్, నర్సింగ్ స్టాఫ్ కావలెను. Cont: 9849040153.

BUSINESS OFFER

బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్, ఫైనాన్స్‌లో తాకట్టులో ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్మెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెని 7382114647.

హైదరాబాద్ యూనిటీ హోంకేర్‌లో ఏజెంట్లకు మంచి అవకాశం. మీరు వర్కర్స్‌ని పంపితే మొదటినెల 5వేలు కమీషన్. వర్కర్స్ జీ:15K ప్రీవసతి,ఫుడ్. 8121541212

REAL ESTATE

PLOT FOR SALE

Plot for sale. 5cents in A1 Colony, Saipeta, near Vinayaka Nagar, Kadapa. Interested parties can call to below number for further details. Contact: 9764770492.

Sukun ఫర్నీచర్ నందు పని చేయుటకు లేడీ సూపర్ వైజర్స్ మరియు ఆటో డ్రైవర్ కావలెను. ఆలాంఖాన్ పల్లె, కడప. Cont: 9949237857.

MARKETING/ SALES

Anand Masale Require Sales & Marketing Manager, Marketing Executives. Contact: 9849655105, 9848053144 Email: anandmasalaap-pltd@gmail.com.

JOBS

Pace Engineering College Office Branch Kadapa Wanted Female Employees Q: Any Degree Pass / Fail Cont: 8332925147.

Wanted Teachers L.K.G to V Class & VI to X Class Part time/Full time Hostel Facility for Non Local, Kadapa. ✆ 9866300506.

ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన రూ.330/- మాత్రమే Contact: KDP: 9989997626 8008514248 PDTR: 8008597620 ప్రకటనలపై జీ.ఎస్.టి. 5% అదనం

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చటపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

IN THE HON'BLE COURT OF II ADDITIONAL DISTRICT JUDGE: PRODDATUR

G.W.O.P. No:47/2025

In the matter of permission for sale of minors property as per Hindu Minority and Guardianship act 1956.

Vangala Amala, W/o Late Amarnatha Reddy, 31 Years, Hindu, R/o Door No.1/70, Nagarajupalle (V), Peddamudium (M), Y.S.R. Kadapa (Dist). ...Petitoner

Vs

Nil ...Respondent

In the above G.W.O.P. No.47/2025, Vangala Mary Aadhya, Who is Minor Girl, Aged 6 years and D/o Petitioner is having the following schedule property and to sale the same the petitioner filed the petition in the said Hon'ble Court to sell the schedule Minors Property which belongs to Minor Girl Vangala Mary Aadhya with permission of the Hon'ble District Court.

Hence, therefore, if anyone is having any objections in the said G.W.O.P. No.47/2025 Petition in the above Hon'ble court may file objections on 01.04.2026 by 10:30 am appearing before the above court or otherwise the matter will be decided as exparty.

SCHEDULE

Item No:1 Kadapa District, Jammalamadugu Sub-Divison, Jammalamadugu Nagar Panchayat, Kanneluru, Village fields in Sy.No. 180/1A-P1, 180/1A-P2, 180/1A-P3 Mutated and 24th Ward, Girijana Colony, Jammalamadugu Town (Sri Datta Colony) the site nearby D.No.24/1369 in the plot No.7 the extent of 1.346 cents and is bounded by East: 30 feet Rasta, West: Plots of others, North: Item No.2 property, South: Remaining Part of Plot No.7.

Item No:2 Kadapa District, Jammalamadugu Sub-Divison, Jammalamadugu Nagar Panchayat, Kanneluru, Village fields in Sy.No. 180/1A-P1, 180/1A-P2, 180/1A-P3 Mutated and 24th Ward, Harijana Girijana Colony, Jammalamadugu Town (Sri Datta Colony) the site nearby D.No.24/1369 in the plot No.6 the extent of 2.86 cents and is bounded by East: 30 feet Rasta, West: Plots of others, North: Remaining Part of Plot No.6, South: Item No.1 property. The total extent of Item No. 1 and Item No.2 is 4.210 Cents

Adjournment:- 01.04.2026.

G.Srirami Reddy, Advocate, Jammalamadugu.

సౌత్ జోన్ క్రికెట్ ఛాంపియన్‌గా నెల్లూరు

● రెండో స్థానంలో కడప జట్టు

కడప క్రీడలు, న్యూస్‌టుడే : వైఎస్ఆర్ఆర్-ఏసీఏ స్టేడియం, కేఎస్ఆర్ఎం క్రికెట్ మైదానాల్లో జరుగుతున్న ఏసీఏ సౌత్‌జోన్ అండర్-12 క్రికెట్ పోటీల్లో ఛాంపియన్‌గా నెల్లూరు జట్టు నిలిచింది. ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లోనూ విజయాలను సాధించి 8 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. కడప జట్టు 2 మ్యాచ్‌లు గెలిచి 4 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది. మూడో స్థానంలో కర్నూలు, నాలుగో స్థానంలో చిత్తూరు, అయిదో స్థానంలో అనంతపురం జట్లు నిలిచాయి. టోర్నమెంట్ చివరి రోజు ఆదివారం కర్నూలుపై కడప, చిత్తూరుపై నెల్లూరు జట్లు విజయం సాధించాయి.

● వైఎస్ఆర్ఆర్-ఏసీఏ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో కడప జట్టు 162 పరుగుల తేడాతో భారీ విజయాన్ని అందుకుంది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన కడప నిర్ణీత 35 ఓవర్లలో 2 వికెట్లు మాత్రమే కోల్పోయి 280 పరుగుల భారీ స్కోరు సాధించింది. జట్టులో యోగాంజనేయులు అజేయంగా 157 పరుగులు (ఫోర్లు-26, సిక్స్-1) చేశారు. మరో బ్యాటర్ భానువర్షిత్‌రెడ్డి 73 పరుగులతో రాణించారు. కర్నూలు బౌలర్లలో హితేష్, గౌతమ్‌రెడ్డి చెరో వికెట్ తీసుకున్నారు. అనంతరం కర్నూలు జట్టు నిర్ణీత 35 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 118 పరుగులు మాత్రమే చేసింది. జట్టులో నీలేష్ 24 పరుగులు చేశారు. బ్యాటింగ్‌లో రాణించిన భానువర్షిత్ రెడ్డి బౌలింగ్‌లోనూ 3 వికెట్లు తీసుకోగా.. మరో బౌలర్ ఎస్ఎండీ ఆదాంకు 2 వికెట్లు దక్కాయి.

● కేఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో జరిగిన క్రికెట్ మ్యాచ్‌లో చిత్తూరుపై నెల్లూరు జట్టు విజయం సాధించింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన నెల్లూరు జట్టు నిర్ణీత 35 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 205 పరుగులు చేసింది. జట్టులో జాన్సన్ 90, శ్రీరామ్ 39 పరుగులు చేశారు. చిత్తూరు బౌలర్లలో హేమ్‌సాత్విక్, పునీత్‌సాయిరెడ్డి చెరో మూడు వికెట్లు తీసుకున్నారు. 206 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌ను ఆరంభించిన చిత్తూరు జట్టు నిర్ణీత 35 ఓవర్లలో 190 పరుగులకు ఆలౌట్ అయింది. జట్టులో గోకుల్‌సాయి 58, భువన్‌సాయి 21 పరుగులు చేశారు. నెల్లూరు బౌలర్లలో సుచిత్‌రెడ్డి 4, ఆయూష్, శ్రీరామ్ చెరో రెండు వికెట్లు తీసుకున్నారు. హోరాహోరీగా జరిగిన ఈ మ్యాచ్‌లో నెల్లూరు జట్టు 15 పరుగుల తేడాతో గెలుపొందింది.

యోగాంజనేయులు (157 పరుగులు, నాటౌట్)

భానువర్షిత్‌రెడ్డి (73 పరుగులు, 3 వికెట్లు)

జాన్సన్ (90 పరుగులు)

సుచిత్‌రెడ్డి (నాలుగు వికెట్లు)

(c) eenadu

రాజంపేట

•రాజంపేట • బద్వేలు

నిరుపయోగంగా ఆర్వో ప్లాంట్

పోరుమామిళ్ల, న్యూస్‌టుడే: మండలంలోని యరసాల హరిజనవాడ, ఫాతిమాపురం గ్రామాల కోసం ఏర్పాటు చేసిన నీటిశుద్ధి యంత్రం నిరుపయోగంగా మారింది. రూ.4 లక్షల వ్యయంతో నిర్మాణం చేపట్టి వినియోగంలోకి తీసుకురాకుండా వదిలేశారు. వినియోగంలోకి తీసుకొస్తే రెండు గ్రామాలకు తాగు నీటి ఇబ్బందులు ఉండవు. అధికారులు స్పందించి నీటి శుద్ధి యంత్రాన్ని వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

నాగారపమ్మకు ప్రత్యేక పూజలు

పెద్దినేనికాలువ(సుండుపల్లి), : మండలంలోని బి.ఈడిగపల్లెలో నాగారపమ్మ తల్లికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని.. తీర్థప్రసాదాలు స్వీకరించారు.

బ్రహ్మోత్సవాల జయప్రదానికి వినతి

ఆహ్వాన పత్రాలు ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ, తదితరులు

బద్వేలు గ్రామీణ, న్యూస్‌టుడే: మండలంలోని లక్ష్మీపాళెం ప్రసన్న వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 26 నుంచి మార్చి 8వ తేదీ వరకు వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ఛైర్మన్ సంజీవకుమార్, ప్రధాన అర్చకులు భరద్వాజ్ తెలిపారు. ఆదివారం ఆలయంలో బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రాలను దేవాదాయశాఖ ఈవో రామలింగారెడ్డితో కలిసి వారు ఆవిష్కరించారు. మార్చి 3న గరుడ వాహనంతో మొదలైన ఉత్సవాలు పూలంగి సేవ కార్యక్రమంతో ముగుస్తాయని వెల్లడించారు. ఆలయ ధర్మకర్తలు, గ్రామ పెద్దలు చంద్రయ్య, పీరయ్య, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికతో చదివితే విజయం

అవగాహన కల్పిస్తున్న ధనిక్ భారత్ విద్యాసంస్థల డైరెక్టర్ బాలలత

బద్వేలు, న్యూస్‌టుడే: ప్రణాళికాబద్ధంగా చదివితే మంచి విజయం సాధించవచ్చని ధనిక్ భారత్ విద్యాసంస్థల డైరెక్టర్ బాలలత అన్నారు. స్థానిక ఫాతిమా హైస్కూల్లో ఆదివారం విద్యా విలువలపై జరిగిన అవగాహన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అయిదు వేల మందిని ఐఏఎస్‌లుగా చేయాలన్నదే తన లక్ష్యమన్నారు. త్వరలో జరగనున్న పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో పలు విషయాలు చర్చించారు. హెచ్‌ఎం జ్యోతి శ్రీ పాల్గొని ప్రసంగించారు.

నిండా నీళ్లు.. పొలాలన్నీ బీళ్లు

నిండుకుండలా కన్యకా చెరువు

నందలూరు, న్యూస్‌టుడే: మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీలోని కన్యకా చెరువు జలసిరితో నిండుకుండలా మారింది. ఈ జలనిధి కింద ఈదరపల్లె, దుర్గాపురం ఎస్టీ కాలనీ, నందలూరు దళితవాడ రైతులకు చెందిన సుమారు 500 ఎకరాలు ఉన్నాయి. వీటికి ఈ నీరు ఆధారం. కానీ, పొలాలన్నీ కొన్నేళ్లుగా బీళ్లుగా మారాయి. కొంత కాలంగా చెరువుకు నీరు రాకపోవడంతో ఆయకట్టు రైతులు వ్యవసాయంపై ఆసక్తి చూపడం మానేశారు. దాంతో పొలాలన్నీ పిచ్చి మొక్కలతో దర్శనమిస్తున్నాయి. చెరువు నిండా నీరు ఉన్నా.. ఉపయోగం లేకుండా పోతోంది. అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాల్సి ఉంది.

ఇదీ విషయం: 2001లో అన్నమయ్య డ్యామ్ నిర్మించడంతో చెయ్యేరులో నీరు ప్రవహించక చెరువు ఎండిపోతూ వచ్చింది. దాంతో సాగుకు సరిపడా నీరు అందక రైతులు పంటలు వేయడం మానేశారు. మరికొందరు గిట్టుబాటు కాక పొట్టకూటి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లారు. అయితే 2021లో వచ్చిన భారీ వరదలతో అన్నమయ్య డ్యామ్ తెగిపోయింది. దాంతో అయిదేళ్లుగా కురుస్తున్న వర్షాలకు చెయ్యేరులో నీరు యథావిధిగా ప్రవహిస్తోంది. ఆ నీటిని దాదాపు 30 రోజుల పాటు కాలువలకు మళ్లించి కన్యకా చెరువును నింపారు. అయితే ఆ నీటితో సాగు చేసేవారే లేరని అధికారులు చెబుతున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం

కన్యకా చెరువు కింద రైతులకు పంటలు వేసుకొనే విధంగా అవగాహన కల్పిస్తున్నాం. కూటమి ప్రభుత్వం రైతులకు ఇచ్చే సంక్షేమ పథకాలను వివరించాం. వారు పండించే పంటలకు మండల వ్యవసాయశాఖ ద్వారా పూర్తి సహకారం అందిస్తాం. **- మల్లికార్జున, వ్యవసాయాధికారి, నందలూరు**

నైపుణ్యాల వెలికితీతకు బాలల పండగ

రాజంపేట, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో దాగివున్న నైపుణ్యాలను వెలికితీయడానికే బాలల పండగ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య కమిటీ నాయకులు ప్రభాకర్‌నాయుడు, నందకిశోర్‌గౌడ్ తెలిపారు. మార్చి1న నిర్వహిస్తున్న బాలల పండుగ కార్యక్రమ నిర్వహణపై స్థానిక బాలికల జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై సబ్‌జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు వివరించారు. వివిధ సంఘాల నాయకులు రమణ, నాగమునిరెడ్డి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు సెక్యూరిటీపై దాడి.. కేసు నమోదు

రాజంపేట, న్యూస్‌టుడే: పట్టణంలోని ప్రైవేట్ బ్యాంకు ఏటీఎం వద్ద సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తున్న రాజశేఖర్‌ను శనివారం రాత్రి ఇద్దరు దాడి చేసినట్లు పోలీసులు తెలిపారు. వారి వివరాల మేరకు ఏటీఎంకి సమీపంలోని వీధిలోకి వెళుతున్న ఇద్దరు వ్యక్తులను సెక్యూరిటీ గార్డు అటుగా వెళ్లకూడదని చెప్పారు. దాంతో కోపోద్రిక్తులైన వారు అతనిపై దాడి చేసినట్లు వివరించారు. బాధితుని ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అంగన్‌వాడీ... అధ్వానంగా మారి

మండలంలోని పలు నూతన అంగన్‌వాడీ భవనాలు అసంపూర్తిగా మారాయి. గుత్తేదారులకు బిల్లులు రాకపోవడంతో కొన్ని చోట్ల పనులు మధ్యలోనే ఆపేశారు. దాంతో పిచ్చిమొక్కలకు నిలయంగా మారాయి. హత్యరాల గ్రామంలో ఉన్న అంగన్‌వాడీ భవనం కంపచెట్లతో అధ్వానంగా మారింది. మండలవ్యాప్తంగా సుమారు 12 భవనాల్లో ఇదే దుస్థితి నెలకొంది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, రాజంపేట గ్రామీణ**

ధోబీఘాట్ ధ్వంసం.. జీవనోపాధికి కష్టం

అట్లూరులోని రజక కుటుంబాలు ధోబీఘాట్ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. గతంలో ఏర్పాటు చేసిన దానిని పలువురు ధ్వంసం చేయడంతో జీవనోపాధికి కష్టంగా మారిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యపై అధికారులకు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని వివరిస్తున్నారు. గ్రామంలో 60 రజక కుటుంబాలున్నాయి. అధికారులు స్పందించి చర్యలు తీసుకుంటే ఉపయోగకరంగా ఉంటుంది. ఎంపీడీవో వెంగమునిరెడ్డి మాట్లాడుతూ ధోబీఘాట్ పునరుద్ధరణకు ప్రతిపాదనలు పంపామన్నారు. **- న్యూస్‌టుడే, అట్లూరు**

తటాకం.. కంపచెట్లమయం

మండలంలోని అక్కివారిపల్లె సమీపంలోని కలసపాడు చెరువు నిర్వహణ లేక అధ్వానంగా మారింది. కంపచెట్లు పెరిగిపోవడంతో చెరువు నీటి సామర్థ్యం తగ్గే అవకాశం ఉందని ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. కట్టపై కూడా పిచ్చిమొక్కలు పెరిగాయని.. దాంతో కట్ట బలహీనపడే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. నీటిపారుదలశాఖ ఈఈ మల్లికార్జున మాట్లాడుతూ చెట్ల తొలగింపునకు చర్యలు తీసుకుంటామన్నారు. **- న్యూస్‌టుడే, కలసపాడు**

మేమున్నాం.. మీకు తోడుగా.. / స్పందనకు వందనం

(10 AM to 1 PM) రాజంపేట : 9441872651 బద్వేలు గ్రామీణ : 8008573493

● మండలంలోని వనంపులలో సచివాలయ సిబ్బంది వీధి దీపాలు ఏర్పాటు చేశారు. ఈ నెల 18వ తేదీన వీధి దీపాలు వెలగడం లేదని 'ఈనాడు' 'మేమున్నాం మీకు తోడుగా'లో సమస్య వార్త ప్రచురితమైంది. స్పందించిన అధికారులు సిబ్బంది దీని వెలిగేలా చూశారు.

● బద్వేలు పురపాలికలోని ముబారక్ నగర్‌లో పారిశుద్ధ్య సిబ్బంది కాలువల్లో పూడికతీత పనులు చేపట్టారు. ఈ నెల 18వ తేదీన కాలువల్లో పూడికతీత పనులు జరగకపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్లు 'ఈనాడు'లో వార్త ప్రచురితమైంది. స్పందించిన వార్డు సచివాలయ అధికారులు పూడికతీత చేపట్టారు. **- న్యూస్‌టుడే, బద్వేలు**

● లక్కవారిపల్లెలో నిరంతరాయంగా వెలుగుతున్న వీధి దీపాలకు అధికారులు స్విచ్‌లు ఏర్పాటు చేసి చర్యలు తీసుకున్నారు. ఈ నెల 19న 'ఈనాడు' లో ఈ సమస్యపై వార్త ప్రచురితమైంది. దీనికి స్పందించిన పంచాయతీ కార్యదర్శి వీరశేఖర్‌రెడ్డి సిబ్బందిని పంపి చర్యలు తీసుకున్నారు.

● బ్రహ్మణపల్లెలో మురికి కాలువల్లో పెరిగిన గడ్డిని అధికారులు తొలగించారు. ఈ నెల 19న 'ఈనాడు'లో కాలువల్లో గడ్డి పెరిగి ఇబ్బందులు స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని వార్త ప్రచురితమైంది. స్పందించిన పంచాయతీ కార్యదర్శి మోసే కాలువను శుభ్రం చేయించారు. **- న్యూస్‌టుడే, గోపవరం**

పరస్పర సహకారం మానవతకు మూలం

సుండుపల్లి, న్యూస్‌టుడే: సంఘంలోని సభ్యుల మధ్య సహకారం, ఆత్మీయత పెరగడం మానవతా సంస్థ సేవలకు మూలంగా ఉంటుందని ఆ సంఘం సుండుపల్లి శాఖ డైరెక్టరు రవీంద్రనాథరెడ్డి అన్నారు. ఇటీవల మృతి చెందిన ఆ సంఘ రాష్ట్ర నాయకుడు ఆలపాటి నాగేశ్వరరావు, నగర అధ్యక్షులు సాంబశివారెడ్డి తల్లికి సభ్యులు ఆదివారం నివాళి అర్పించారు. అనంతరం చేపట్టనున్న సేవా కార్యక్రమాలను చర్చించారు. మండల అధ్యక్షులు లక్ష్మయ్యనాయుడు, కన్వీనరు కృష్ణమరాజు, డైరెక్టరు శ్రీధర్‌రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

బెటాలియన్‌లో ఉయ్యాలవాడ వర్ధంతి

సిద్దవటం, న్యూస్‌టుడే: సిద్దవటం శివారులోని ఏపీఎస్పీ పదకొండో బెటాలియన్‌లో ఆదివారం ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ రాజశేఖర్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఉయ్యాలవాడ జీవిత చరిత్రను వివరించారు. ఆర్ఐ, ఆర్ఎస్సై, ఏఆర్ఎస్సై, శిక్షణ కానిస్టేబుళ్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

కలసపాడు, న్యూస్‌టుడే: ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై సుభాన్ అన్నారు. మండల కేంద్రంలోని గిద్దలూరు ప్రధాన రహదారిలో తెల్లపాడు క్రాస్‌రోడ్డు వద్ద ఆదివారం పలు ప్రైవేట్ ట్రావెల్ బస్సులను తనిఖీ చేశారు. చోదకులకు సూచనలిచ్చారు. పత్రాలు సరిగా లేని వాహనాలకు జరిమానా విధించారు.

కొత్తమాధవరంలో యూరియా పంపిణీ

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: మండలంలోని కొత్తమాధవరం రైతు సేవా కేంద్రంలో సోమవారం రైతులకు యూరియా పంపిణీ చేస్తామని వ్యవసాయాధికారి మంజులరాణి ఆదివారం తెలిపారు. స్థానిక ఆర్ఎస్కేలో 19.80 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉన్నట్లు వివరించారు. ఒంటిమిట్ట, కొత్తమాధవరం, నర్వకాటిపల్లె, కొండమాచుపల్లె పంచాయతీల్లోని రైతులు సంబంధిత పత్రాలతో వస్తే అందజేస్తామని చెప్పారు.

నిత్యపూజకోనలో స్వచ్ఛాంధ్ర అమలుకు విన్నపం

సిద్దవటం, న్యూస్‌టుడే: జిల్లాలో ప్రముఖ శైవ క్షేత్రమైన నిత్యపూజస్వామికోనలో 'స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమాన్ని అమలు చేయాలని కడపకు చెందిన సుముఖి ఎండోమెంట్ ఛారిటబుల్ సంస్థ అధ్యక్షుడు నాగదాసరి మునికుమార్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఇటీవల శివరాత్రి ఉత్సవాలు సందర్భంగా ఆలయ పరిసరాలతో వ్యర్థాలు పేరుకుపోయాయని తెలిపారు. వాటిని శుభ్రం చేసే చర్యలు అధికారులు తీసుకోవాలని ఆయన విన్నవించారు.

భూ కబ్జాలు నిరూపించాలి

రాజంపేట, న్యూస్‌టుడే: ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి భూకబ్జాలకు పాల్పడ్డారంటూ ఆరోపించడం కాకుండా నిరూపించాలని వైకాపా జిల్లా అధికార ప్రతినిధి డిమాండ్ చేశారు. స్థానిక ఆకేపాటి భవనంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ పార్టీలకు అతీతంగా ఎమ్మెల్యే సేవా కార్యక్రమాలు చేస్తున్నారన్నారు. అలాంటి వ్యక్తిపై ఆరోపణలు చేయడం దారుణమన్నారు. నాయకులు గోపి, పెంచలయ్య, తదితరులు పాల్గొన్నారు.

గుడి ఆదాయానికి గండి!

అభివృద్ధికి నోచుకోని అయ్యవారస్వామి ఆలయం

సిద్దవటం, న్యూస్‌టుడే: జిల్లాలో ప్రముఖ శైవ క్షేత్రమైన నిత్యపూజస్వామి కోనకు అనుసంధానంగా ఉన్న అయ్యవారస్వామి గుడి ఆదాయం స్వాహా అవుతున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ఏటా శివరాత్రి ఉత్సవాల్లో వచ్చే హుండీ, ఇతర ఆదాయం పక్కదారి పడుతున్నట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. అక్రమాల నివారణకు గుడిని దేవాదాయశాఖలో విలీనం చేయాలని గతంలో పలుమార్లు కోరినా సంబంధిత అధికారులు ఖాతరు చేయలేదు. ఉన్నతాధికారులైన స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఇదీ విషయం: ఏటా శివరాత్రి ఉత్సవాల్లో అయ్యవారస్వామి ఆరాధన వైభవంగా నిర్వహిస్తారు. ఇక్కడ శివరాత్రి రోజుల్లో భక్తులు కానుకల రూపంలో రూ.లక్షకు పైగా ఆదాయం సమకూరుతుంది. అయితే గుడి నిర్వహణ బాధ్యత తమదే అంటూ కొందరు హుండీ, ఇతర ఆదాయాన్ని స్వాహా చేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. ఫలితంగా ఏళ్లుగా ఆలయ అభివృద్ధి, భక్తులకు మౌలిక వసతులు కల్పన జరగడం లేదు. దాంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. పలువురు దాతలే ఉత్సవాలు నిర్వహించాల్సి వస్తోంది.

అధికారుల దృష్టికి తీసుకెళ్తాం

నిత్యపూజస్వామి కోవెలకు అయ్యవారస్వామి గుడి అనుసంధానంగా ఉన్నట్లు తెలిసింది. ఇక్కడ వచ్చే ఆదాయాన్ని ఇతరులు తీసుకెళ్లడం అన్యాయం. ఈ విషయాన్ని దేవదాయశాఖ సహాయ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి చర్చిస్తాను. సమస్య పరిష్కారణకు కృషి చేస్తాం. **- శ్రీధర్, ఇన్‌ఛార్జి ఈవో, నిత్యపూజస్వామి దేవస్థానం**

మాట్లాడుతున్న రాజంపేట తెదేపా ఇన్‌ఛార్జి జగన్‌మోహన్‌రాజు

వైకాపా హయాంలో లక్షల ఎకరాలు అన్యాక్రాంతం

వీరబల్లి, న్యూస్‌టుడే: వైకాపా హయాంలో ఆ పార్టీ నాయకులు లక్షల ఎకరాల ప్రభుత్వ భూములను ఆక్రమించి అన్యాక్రాంతం చేశారని, అలాంటి వారి పట్ల సీఎం కొరడా ఝుళిపించనున్నారని రాజంపేట తెదేపా ఇన్‌ఛార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు అన్నారు. దిగువరాచపల్లిలో జరిగిన తెదేపా పార్టీ గ్రామసభలో ఆదివారం ఆయన మాట్లాడారు. వైసీపీ నాయకులు అభివృద్ధిపై దృష్టి సారించకుండా భూములు ఆక్రమించి ఆస్తులు పెంచుకున్నారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం వాటిని స్వాధీనం చేసుకుని పేదలకు పంచి పెడుతుందని తెలిపారు. సీఎం చంద్రబాబు అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల తీరును చూసి ఓర్వలేక వైకాపా తప్పుడు ప్రచారాలు చేస్తోందన్నారు. మండల అధ్యక్షులు భానుగోపాల్‌రాజు, సింగిల్‌విండో సొసైటీ అధ్యక్షుడు అమరేశ్వర్‌రాజు, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి యల్లమ్మ తిరునాల

సుండుపల్లి, న్యూస్‌టుడే: చెన్నంశెట్టిపల్లి సమీపంలోని యల్లమ్మ తిరునాల సోమవారం నుంచి బుధవారం వరకు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఆదివారం తెలిపారు. సోమవారం అంకురార్పణ, ప్రత్యేక పూజలు, అమ్మవారి ఊరేగింపు నిర్వహిస్తామని చెప్పారు. మంగళవారం అభిషేకాలు, పుట్టబంగారు తెచ్చుట పొంగుబాలు, రాత్రి చెక్కభజన కార్యక్రమాలు ఉంటాయన్నారు. బుధవారం చాందినీబండ్ల తిరునాల ఉంటుందని తెలిపారు.

24న సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణం

రాజంపేట, న్యూస్‌టుడే: పట్టణ పరిధి మన్నూరులోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 24న వల్లీదేవసేన సమేత స్వామివారి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం స్వామివారి కల్యాణం, మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ, సాయంత్రం గ్రామోత్సవం ఉంటుందని వివరించారు. భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకోవాలని కోరారు.

'రౌడీయిజం, భూదందాలు వైకాపాకే చెల్లు'

మాట్లాడుతున్న టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, నాయకులు

రాజంపేట, న్యూస్‌టుడే: ఎమ్మెల్యే అమర్‌నాథ్‌రెడ్డి భూకబ్జాలపై ప్రభుత్వం విచారణకు ఆదేశిస్తే.. ఆయన ఎందుకు కోర్టుకు వెళ్లారని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్ ప్రశ్నించారు. స్థానిక తెదేపా కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. అవినీతి, అక్రమాలు, రౌడీయిజాలు, భూదందాలు వైకాపాకే చెల్లునని ఆరోపించారు. ఇలాంటి వాళ్లకి తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి జగన్‌మోహన్‌రాజును విమర్శించే అర్హత ఎక్కడిదని అన్నారు. వైకాపా నాయకులు మాట్లాడే ముందు నోరు అదుపులో పెట్టుకోవాలని వివరించారు. నాయకులు సిద్ధిక్, శివకుమార్, యానాది, వంశీ పాల్గొన్నారు.

అన్నమాచార్య సంకీర్తనలు ఆలపించడం పుణ్యం

సంకీర్తనలు ఆలపిస్తున్న విద్యార్థులు

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే: వేంకటేశ్వర స్వామి పరమ భక్తుడు తాళ్లపాక అన్నమాచార్యులు రచించిన సంకీర్తనలు ఆయన స్వగ్రామంలో ఆలపించడం మా జన్మ పుణ్యంగా భావిస్తున్నామని సంప్రదాయ పాఠశాల విద్యార్థులు అన్నారు. మండలంలోని బోయనపల్లి అన్నమాచార్యుల 108 అడుగుల విగ్రహం వద్ద ఆదివారం సాయంత్రం హైదరాబాద్‌కు కళా సమితి ఆధ్వర్యంలో తమిళనాడు రాష్ట్రం కాంచీపురంలోని సంప్రదాయ పాఠశాల విద్యార్థులు అన్నమయ్య సంకీర్తనలు ఆలపించారు.

బద్వేలులో రెవెన్యూ క్లినిక్ నేడు

బద్వేలు గ్రామీణ, బద్వేలు, న్యూస్‌టుడే: మండల తహసీల్దారు కార్యాలయంలో సోమవారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ క్లినిక్ నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు ఉదయభాస్కర్‌రాజు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు ఆర్డీవో చంద్రమోహన్ ఆధ్వర్యంలో జరుగుతుందన్నారు. భూ సమస్యలు ఉన్న రైతులు సంబంధిత పత్రాలతో హాజరు కావాలని ఆయన కోరారు.



చర్చిని సందర్శించిన విశ్వాసులు

కాలి నడకన పురాతన సీఎస్ఐ చర్చి సందర్శన

కలసపాడు, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని సగిలేరు ఒడ్డున ఉన్న పురాతన సీఎస్ఐ (పరిపేతురు-పరిపౌలు) చర్చిని ఆదివారం నంద్యాల జిల్లా వాసులు సందర్శించారు. చాగలమర్రి మండలం తోడెండ్లపల్లెకు చెందిన విశ్వాసులు కాలి నడకన వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. లెంట్ దినాలను పురస్కరించుకొని చర్చిలో సామూహిక ప్రార్థనలు చేశారు. ఉపాధ్యాయుడు ప్రవీణ్ చర్చి చరిత్ర ప్రతులను వారికి అందజేశారు. రెవరెండ్ ఆశిష్‌గాబ్రియేల్, జాన్సన్, కిశోర్, సైమన్, రత్నరాజు, ప్రసన్న పాల్గొన్నారు.

తలుపులు ధ్వంసం చేసి చోరీ

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: గుర్తు తెలియని వ్యక్తులు పట్టపగలే ఇంట్లోకి చొరబడి చోరీ చేసిన ఘటన మండల పరిధి సాలాబాదులో చోటుచేసుకుంది. ఇదే ప్రాంతానికి చెందిన సుధాకర్‌రెడ్డి-విజయమ్మ దంపతులు తిరుపతిలో నివాసం ఉంటున్నారు. కడపలో సమీప బంధువు వివాహానికి హాజరు కావాలని శనివారం వారు సాలాబాదుకు వచ్చారు. ఇంటి నుంచి ఆదివారం కడపకు వెళ్లారు. అదే వివాహానికి వెళ్లిన ఆయన సోదరుడు శ్రీనివాసులురెడ్డి తిరిగి ముందుగానే స్వగ్రామానికి చేరుకున్నారు. ఆ సమయంలో సుధాకర్‌రెడ్డి ఇంటి తలుపు ధ్వంసం అయి ఉండటంతో ఆయనకు సమాచారం ఇచ్చారు. వెంటనే బాధితుడు పోలీసులకు తెలిపారు. ఒంటిమిట్ట సీఐ పి.నరసింహరాజు, ఎస్.ఐ వి.శ్రీనివాసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బీరువాలో ఉన్న రూ.లక్ష విలువ గల వెండి వస్తువులను చోరీ జరిగినట్లు గుర్తించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు విచారణ చేస్తున్నట్లు సీఐ, ఎస్.ఐ తెలిపారు.

సమస్యల సాధనకు అంగన్‌వాడీల రిలే దీక్షలు

రాజంపేట, న్యూస్‌టుడే: సమస్యల సాధన కోసం ఈనెల 23 నుంచి మూడు రోజుల పాటు అంగన్‌వాడీ కార్యకర్తలు రిలే దీక్షలు చేపట్టనున్నారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద చేపట్టే దీక్షలకు సీఐటీయూ మద్దతు ఇస్తున్నట్లు ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రవికుమార్ ఆదివారం తెలిపారు.

గుక్కెడు నీటికీ పడిగాపులు

కాసనగరంలో బోరు వద్ద నీటి కోసం నిరీక్షిస్తున్న స్థానికులు

బి.కోడూరు, న్యూస్‌టుడే: మండల పరిధిలోని కాసనగరం కాలనీలో భూగర్భ జలాలు అడుగంటి పోయాయి. నీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చేసేదేమీ లేక పంట పొలాల్లో వచ్చే నీటిని తెచ్చుకుంటున్నారు. వేసవి ఆరంభంలోనే ఇలా ఉంటే తర్వాత పరిస్థితి ఎలా ఉంటుందోనని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

CHANGE OF NAME
I, SHAIK ABDUL LATHEEF (OLD NAME), R/o D.No.4/43-C8, USMAN NAGAR, RAJAMPET, Y.S.R. KADAPA DISTRICT, A.P., HAVE CHANGED MY NAME AS SHAIK ABDUL LATHIF (NEW NAME), S/o SHAIK KAREEM BASHA.

CHANGE OF NAME
I, SHAIK JAMILA (OLD NAME), R/o D.No.4/43-C8, USMAN NAGAR, RAJAMPET, Y.S.R. KADAPA DISTRICT, A.P., HAVE CHANGED MY NAME AS SHAIK JAMEELA (NEW NAME), W/o SHAIK ABDUL LATHIF.

పేదలకు ఆసరాగా సీఎం సహాయ నిధి

బాధితులకు సహాయనిధి పత్రాలు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే విజయమ్మ

కలసపాడు, బద్వేలు, న్యూస్‌టుడే: మండలంలోని పేదలకు సీఎం సహాయనిధి ఆసరాగా నిలుస్తోందని బద్వేలు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ అన్నారు. స్థానిక తెదేపా పార్టీ కార్యాలయంలో ఆదివారం లింగారెడ్డిపల్లెకు చెందిన పలువురికి సహాయనిధి పత్రాలు ఆమె అందజేశారు. పేదల ఆర్థిక భరోసాకి సీఎం సహాయనిధి చాలా ఉపయోగపడుతోందని తెలిపారు. పలువురు తెదేపా నాయకులు పాల్గొన్నారు.

బోయనపల్లెలో వైద్య శిబిరం

మాట్లాడుతున్న వాకర్స్ క్లబ్ మాజీ ఉపాధ్యక్షుడు శరత్‌కుమార్‌రాజు, పక్కన వైద్యులు, అధికారులు

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే: మండలంలోని బోయనపల్లిలో వాకర్స్ ఇంటర్నేషనల్ క్లబ్ ఆధ్వర్యంలో సయ్యద్ మహబూబ్ జ్ఞాపకార్థంగా ఆదివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి వచ్చిన పలువురికి పరీక్షలు చేశారు. అవసరమైన వారికి వైద్యులు ఉచితంగా మందులు అందజేశారు. రాజంపేట వాకర్స్ ఇంటర్నేషనల్ క్లబ్ మాజీ ఉపాధ్యక్షుడు శరత్‌కుమార్, ప్రతినిధులు రవిరాజు, మునికృష్ణ, సుబ్రహ్మణ్యం, తిరుపతికి చెందిన వైద్యులు బాలరామరాజు, బాలరాజు, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 99899 97626
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 91771 11468

(c) eenadu

ప్రొద్దుటూరు

● ప్రొద్దుటూరు ● జమ్మలమడుగు ● మైదుకూరు

ఆగని అక్రమాలు.. దర్జాగా తవ్వకాలు

గగ్గితిప్ప వద్ద తవ్వకాలు చేస్తున్న యంత్రాలు

మైదుకూరు, న్యూస్‌టుడే: పగలు రాత్రి అనే తేడా లేదు. మైదుకూరు పురపాలక సంఘం ఎల్లంపల్లె సమీప గగ్గితిప్ప వద్ద యథేచ్ఛగా మట్టి తవ్వకాలు సాగుతున్నాయి. గగ్గితిప్ప చుట్టూ ఇక్కడ అక్కడ అని కాకుండా ఎక్కడపడితే అక్కడ తవ్వకాలు చేస్తున్నారు. మట్టితో వ్యాపారం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మట్టి కోసం గగ్గితిప్ప వద్దకు వెళ్లాలంటేనే భయపడే వారు. అటు పోలీసులు ఇటు రెవెన్యూ మరోవైపు భూగర్భగనుల శాఖ అధికారులు చర్యలు తీసుకున్నారు. తమ గ్రామం వద్ద గుట్ట ఉన్నా ఇంటి నిర్మాణానికి మట్టి తవ్వుకోలేక పోతున్నామంటూ ఎల్లంపల్లె వాసులు ఆందోళన వ్యక్తం చేసిన సందర్భాలున్నాయి.

● ప్రజల నుంచి ఒత్తిడి పెరగడంతో అనుమతి తీసుకున్న తర్వాతే మట్టి తవ్వకాలు చేపట్టాలని గతంలో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ సూచించారు. అనంతరం గగ్గితిప్పపై అధికారుల పట్టు సడలింది. ఆ ప్రాంతాన్ని తొక్కి చూడకపోవడంతో కొందరు పొక్లెయిన్‌తో ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేస్తూ ట్రాక్టర్లతో మట్టిని తరలిస్తూ దండుకు తెరలేపారు. మట్టి అక్రమ తవ్వకాలపై చర్యలకు ఆశాఖ అధికారులు చూసుకోవాలని ఒక శాఖ అధికారులు, ఆ శాఖ అధికారులకు బాధ్యత లేదా అని మరొక శాఖ ఇలా ఒకరిపైనొకరు నెట్టేసుకుని అక్రమ తవ్వకాలకు ఊతమిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు గగ్గితిప్ప వద్ద సాగుతున్న అక్రమ తవ్వకాలను కట్టడి చేయాల్సి ఉంది.

26న నక్కలదిన్నెలో విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు

చాపాడు, న్యూస్‌టుడే: చాపాడు మండలం నక్కలదిన్నెలో నూతనంగా నిర్మించిన శ్రీగణపతి, సుబ్రమణ్యస్వామి, శివపార్వతిదేవీ ఆలయాల్లో శిఖర ధ్వజ సహిత నవగ్రహ ప్రతిష్ఠ చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 24న ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు జరుగనున్నాయి. 26న విగ్రహ ప్రతిష్ఠ శివపార్వతుల కల్యాణం ఉంటాయి. వృషభరాజాలతో బండలాగుడు ప్రదర్శన ఏర్పాటు చేశారు. చెక్క భజనలు, కోలాట నృత్యాలు, అన్నదానం ఉంటాయని వివరించారు.

నూతనంగా నిర్మించిన ఆలయం

వృద్ధులకు అన్నదానం

వృద్ధులకు అన్నదానం నిర్వహిస్తున్న గురు మోహన్

ఖాజీపేట, న్యూస్‌టుడే: మండలంలోని ములపాకు సమీపంలో ఉన్న పునీత్ లారెన్స్ వృద్ధాశ్రమంలో ఆదివారం మధ్యాహ్నం మైదుకూరు మండలం తిప్పిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన డీఎల్ యువసేన సభ్యుడు గురుమోహన్ నేస్తం సేవా సంస్థ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. మాజీ మంత్రి డీఎల్ రవీంద్రారెడ్డి, సుభద్రమ్మల వివాహ వార్షికోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. మైదుకూరు, ఖాజీపేట పరిధిలోని నిరాశ్రయులకు అల్పాహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సేవా సంస్థ సభ్యులు పాల్గొన్నారు

పోలీసు కుటుంబానికి ఆసరా.. ఆర్థిక సాయంతో భరోసా

● స్పందించిన అధికారులు

● సమకూరిన రూ.8 లక్షలు

జాన్సన్‌బాబు కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న సీఐలు, మిత్రులు

ముద్దనూరు, న్యూస్‌టుడే: కలిసి పోలీసు శాఖలో శిక్షణ పొందిన అధికారులు తమ సహచరుడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జాన్సన్‌బాబు గత ఏడాది అనారోగ్యంతో మృతిచెందడంతో ఆయన కుటుంబానికి రూ.8 లక్షలు ఆర్థిక సాయం చేసి మేమున్నాం.. అంటూ మానవీయతను చాటుకున్నారు. వీరంతా ముద్దనూరు పట్టణంలో పులివెందుల రోడ్డు స్టేట్ బ్యాంక్ సమీపంలోని చర్చిలో ఆదివారం సమావేశం ఏర్పాటుచేశారు. గత సంవత్సరం కర్నూల్ పోలీసు శాఖలో వీఆర్‌లో తాత్కాలిక నియామకంపై పనిచేస్తూ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జాన్సన్‌బాబు అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన కుటుంబానికి ఆర్థిక సాయంగా 2002 బ్యాచ్‌కు చెందిన పోలీస్ అధికారులు, మిత్రులు కలిసి రూ.8 లక్షలు అందజేశారు. ఈ సందర్భంగా సీఐ నాగేష్‌బాబు మాట్లాడుతూ మండలంలోని నల్లబల్లె గ్రామానికి చెందిన జాన్సన్ బాబుతోపాటు తాము శిక్షణపొందామన్నారు. అనారోగ్యంతో గత అక్టోబరు ఆరో తేదీన మరణించడంతో సురక్ష సేవా సంఘం ఆధ్వర్యంలో వితరణగా ఆర్థిక సాయం అందించామన్నారు. భవిష్యత్తులో ఏ అవసరం వచ్చినా తామంతా అండగా ఉంటామని భరోసా చాటుకున్నారు. సురక్ష సేవా సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కిక్కుర గోపీ శంకర్ యాదవ్, విజిలెన్స్ అధికారి శ్యామల వెంకటేష్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు నగేష్‌బాబు, సదాశివయ్య, ఓబులేసు, నర్సింహులు, రాజా, లింగప్ప, మహ్మద్‌బాబా, సుధాకర్‌రెడ్డి, నరసింహస్వామి, పార రాజు మాట్లాడారు. జాన్సన్‌బాబు తల్లి, భార్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలు సమస్త జీవకోటికి నేస్తాలు

ప్రొద్దుటూరు, న్యూస్‌టుడే: సమస్త జీవకోటికి ప్రాణాధారం మొక్కలేనని ఏఎస్పీ విభాకృష్ణ, తెలంగాణ రాష్ట్ర జంగారెడ్డి గూడెం ఎస్‌డీవో సుస్మిత రామనాథన్ (ఏఎస్పీ సతీమణి) అన్నారు. స్థానిక రోటరీ ఇంటర్నేషనల్ క్లబ్ కొత్తపల్లి పురస్కరించుకొని రోటరీ కంటి ఆసుపత్రి సభా భవనంలో 'లైఫ్ ఆఫ్ ట్రీ' అనే అంశంపై 8, 9వ తరగతి విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. 300 మంది విద్యార్థులు హాజరయ్యారు. 8వ తరగతి విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో జి.వాసిని (గీతాంజలి పాఠశాల), ఎస్.పరిమళ (జస్మోక్ పాఠశాల), రిత్విక (జీవనజ్యోతి పాఠశాల), 9వ తరగతి విభాగంలో కె.వి.మహిధర్‌రెడ్డి (టీవీఆర్ పాఠశాల), ఎస్.బాజామహమ్మద్ అలీ (ఎస్సీపీ ప్రభుత్వ పాఠశాల)కి నగదు, ప్రశంసా పత్రాలు, పాల్గొన్న ప్రతి విద్యార్థికి ప్రోత్సాహకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కంటి ఆసుపత్రి ప్రతినిధులు కె.వి.మురళీధర్‌రెడ్డి, గజ్జల వెంకటేశ్వర్‌రెడ్డి, కొప్పూరు రమేష్‌రెడ్డి, బేపారి జాకీర్ అహమ్మద్, ఆయుష్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులను ప్రదానం చేసిన ఏఎస్పీ విభా కృష్ణ, రోటరీ క్లబ్ ప్రతినిధులు

కాలువ కంపుకొడుతోంది..!

కొండాపురం శాంతినగర్ నుంచి రామసుబ్బారెడ్డి కాలనీకి వెళ్లే రహదారి పక్కన మురుగు కాలువ అధ్వానంగా ఉండటంతో రాకపోకలు సాగించేవారు ఇబ్బంది పడుతున్నారు. కాలువలో చెత్తతో పాటు రాళ్లు ఉండటంతో నీరు సక్రమంగా ముందుకు పారడంలేదు. అధికారులు స్పందించి కాలువను శుభ్రం చేయించి నీరు సక్రమంగా ప్రవహించేలా కాలువ నిర్మాణం చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కొండాపురం

మా ఇష్టం.. అడ్డదారిలో నడిపేస్తాం

రోడ్డు ప్రమాదాల నివారణలో సూచిక అవశ్యకత ఎంతో ఉంది. అయితే వాహనదారులు వాటిని పట్టించుకోవడం లేదు. భారీ వాహనాలు ఎడమవైపు వెళ్లాలని హుబ్లీ-గుత్తి పట్టం జాతీయ రహదారిపై పెద్ద బోర్డులు ఏర్పాటు చేసినా చోదకులు నిబంధనలు పాటించడం లేదు. భారీ వాహనాలు ఎడమవైపు, వేగంగా వెళ్లే వాహనాలు కుడివైపు వెళ్తే ప్రమాదాలు నివారించవచ్చని వాహన తనిఖీ అధికారులు చెబుతున్నారు. - న్యూస్‌టుడే, మైదుకూరు

చట్టం పట్టదా.. మైనరూ!

ఈ చిత్రంలో ఒకే ద్విచక్ర వాహనంపై ముగ్గురు మైనర్ బాలురు ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారు. వాహనాన్ని డ్రైవింగ్ చేయాల్సిన యువకుడు చేతులు కట్టుకొని ఉండగా అతని వెనుక మధ్యలో కూర్చున్న మరో యువకుడు వాహనం నడుపుతున్న చిత్రం ముద్దనూరులో కనిపించగా న్యూస్‌టుడే క్లిక్‌మనిపించింది. - న్యూస్‌టుడే, ముద్దనూరు

తవ్వేస్తున్నారు.. తరలిస్తున్నారు

ఖాజీపేట మండల పరిధిలో ఇసుకు అధికంగా లోడ్ చేసి ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా తరలిస్తున్నారు. రోడ్డు భద్రతా నిబంధన పాటించకుండా ఇసుక రవాణా జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇసుక ట్రాక్టర్‌పై పట్టా లేదా కవర్ లేకుండా రవాణా చేయడంతో వెనుక వస్తున్న వాహనదారుల కళ్లలో ఇసుకపడుతోంది. - న్యూస్‌టుడే, ఖాజీపేట

చెత్తమయం.. స్వచ్ఛత మాయం

ప్రభుత్వం ఐదేళ్లుగా చెత్తసేకరణ చేపడుతూ తడి, పొడి చెత్తను వేరుచేసి సంపద కేంద్రాలకు, డంపింగ్ యార్డులకు తరలిస్తున్నారు. అయితే జమ్మలమడుగులో కొన్ని రోజుల నుంచి ప్రధాన రహదారులపై చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. శనివారం మధ్యాహ్నం మైలవరం మండల పరిధిలోని సిమెంట్ పరిశ్రమ పరిసరాల నుంచి లారీలో చెత్తను తరలిస్తుండగా పట్టణంలోని పలుచోట్ల చెత్త కింద పడింది. - న్యూస్‌టుడే, జమ్మలమడుగు గ్రామీణ

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM to 1 PM)
ప్రొద్దుటూరు: 9966349431
జమ్మలమడుగు: 9494294241
మైదుకూరు: 8008573447

? : ప్రొద్దుటూరు పట్టణం సుబ్బిరెడ్డికొట్టాలకు వెళ్లే మలుపు వద్ద వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు ఏర్పాటు చేసిన దీపాన్ని తొలగించారు. - వెంకటేష్, స్థానికుడు

☑ : దీపం ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటాం. - వెంకటరమణ, ఏఈ -న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు పట్టణం

? : ముద్దనూరు మండలం నోస్సుమోరిపల్లెలో మురుగు రోడ్డుపై పారుతోంది. - సుధాకర్‌రెడ్డి, నోస్సుమోరిపల్లె

☑ : నోస్సుమోరిపల్లెలోమురుగు తొలగించేలా చర్యలు తీసుకుంటాం. - మస్తాన్, ఇన్‌ఛార్జి పంచాయితీ కార్యదర్శి

? : నోస్సుమోరిపల్లెలో పలు చోట్ల వీధి దీపాలు లేకపోవడంతో అంధకారం నెలకొంది. - మోహన్‌రెడ్డి, గ్రామస్థుడు

☑ : వీధి దీపాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటాం.
- మస్తాన్, ఇన్‌ఛార్జి పంచాయితీ కార్యదర్శి - న్యూస్‌టుడే, ముద్దనూరు

ఉయ్యాలవాడ ధైర్య సాహసాలు యువతకు స్ఫూర్తి

ప్రొద్దుటూరులో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సంఘ నాయకులు

ప్రొద్దుటూరు, జమ్మలమడుగు గ్రామీణ, న్యూస్‌టుడే: విప్లవ వీరుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి దేశం కోసం చేసిన త్యాగం మరువలేనిది, ఆయన ధైర్య సాహసాలు నేటి యువతకు స్ఫూర్తిదాయకమని రేనాటి సూర్యచంద్రుల సేవా సంఘం అధ్యక్షుడు డాక్టర్ స్వరూప్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం రేనాటి సూర్యచంద్రుల సేవా సంఘం ఆధ్వర్యంలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి సందర్భంగా స్థానిక కొర్రపాడురోడ్డులోని ఆయన విగ్రహానికి పూలమాలలేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నాగదస్తగిరిరెడ్డి, ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయ పాలకమండలి సభ్యుడు డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి, తితిదే పాలక మండలి మాజీ సభ్యుడు మారుతీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

● జమ్మలమడుగు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న నరసింహారెడ్డి విగ్రహానికి డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జీవిత చరిత్రను పాఠ్యాంశాలలో చేర్చాలని డిమాండ్ చేశారు. నరసింహారెడ్డి చరిత్ర భావితరాలకు తెలియచెప్పే బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు.

జమ్మలమడుగులో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహం వద్ద నినాదాలు పలుకుతున్న డీవైఎఫ్ఐ నాయకులు

అందుబాటులోకి చక్రాల కుర్చీలు

ప్రొద్దుటూరు వైద్యం, న్యూస్‌టుడే: రోగులకు ఉపయోగపడేలా చక్రాల కుర్చీలను, స్ట్రెచర్లను సిబ్బంది పట్టిస్తున్నా మందులు పెట్టెలను మోసేందుకు వినియోగిస్తున్నారని ఈ నెల 18న 'రోగులు గాలికి.. మందులు లోనికి' అనే శీర్షికన 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. స్పందించిన ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆనంద్‌బాబు వీటిని రోగులకు అందుబాటులోకి తెచ్చేలా చర్యలు తీసుకున్నారు.

లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదవాలి

మైదుకూరు, న్యూస్‌టుడే: భవిష్యత్తులో సాధించాల్సిన లక్ష్యాన్ని నిర్దేశించుకుని కష్టపడి చదవినప్పుడే రాణిస్తారని దనిక్ భారత్ విద్యా సంస్థల వ్యవస్థాపకురాలు మల్లవరపు బాలలత అన్నారు. ఉద్యోగం సాధించడం కాదు ఉద్యోగాలు కల్పించే స్థాయికి చేరుకోవాలన్నారు. దనిక్ భారత్ విద్యా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం మైదుకూరు పట్టణంలోని సెయింట్ జోసెఫ్ పాఠశాలలో 9, 10వ తరగతుల విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ డైరెక్టర్ మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు పరీక్షల దగ్గర పడుతున్న సమయంలో ప్రతిరోజు పరీక్ష రాస్తే మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తారని వెల్లడించారు. పబ్లిక్ పరీక్ష మూడు గంటల సమయాన్ని మూడు భాగాలుగా విభజించుకుని జవాబులు రాయాలని చివరి 5 నిమిషాలు ముఖ్యమైన పాయింట్లకు అండర్‌లైన్ చేయాలన్నారు. ప్రతిరోజు ఏడెనిమిది గంటలు చదవాలని, పౌష్టికాహారం తీసుకోవాలని, రాత్రి 10.30 గంటల నుంచి తెల్లవారుజాము 5.30 గంటల వరకు నిద్ర పోవాలన్నారు. ఈ సమావేశంలో ఆర్సీఎం చర్చి ఫాదర్ ఆశీర్వాదం, పాఠశాల ప్రిన్సిపల్ మేరీబెర్తా, సహాయ ప్రిన్సిపల్ లైసారోజ్, లాయిడ్ గ్రూప్ ప్రతినిధులు పాల్గొన్నారు.

సదస్సులో ప్రసంగిస్తున్న మల్లవరపు బాలలత

సకాలంలో బస్సులు నడపాలని వినతి

జమ్మలమడుగు గ్రామీణ, న్యూస్‌టుడే: ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలు ప్రారంభంకానున్న నేపథ్యంలో పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు సకాలంలో చేరుకునేలా ఆర్టీసీ బస్సు సర్వీసులను నడపాలని ఆదివారం ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి హరిబాబు ఆర్టీసీ డిపో సూపర్‌వైజర్ అరుణకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు చరణ్, మధు తదితరులు పాల్గొన్నారు.

సూపర్‌వైజర్ అరుణకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

చౌడూరులో ఇసుక అక్రమ రవాణా

ప్రొద్దుటూరు గ్రామీణ, న్యూస్‌టుడే: స్థానిక చౌడూరులోని పెన్నా పరివాహకంలో పొక్లెయిన్ ద్వారా టిప్పర్లతో జోరుగా ఇసుక అక్రమ రవాణా కొనసాగుతోందని ఆదివారం సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరుగుతోంది. అధికార పార్టీలోని అసమ్మతి వర్గం ఈ మేరకు వాట్సప్‌ల్లో సమాచారం పంపుతున్నట్లు రెవెన్యూ సిబ్బంది చెబుతున్నారు. రానున్న వేసవిలో సమీప పంచాయతీల్లోని గ్రామాలకు నీటి ఎద్దడి తప్పదని, ఇసుక అక్రమ రవాణా కాకుండా పోలీసు, రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయంపై తహసీల్దారు గంగయ్యను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా 60 ఎకరాల్లో కేటాయించిన పారిశ్రామిక పార్కులో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో భాగంగా హిటాచీ యంత్రాన్ని వినియోగిస్తున్నట్లు తెలిపారు.

ప్రైవేట్ వ్యక్తులకు డబ్బులు చెల్లించొద్దు

స్పందనకు వందనం

ప్రొద్దుటూరు పట్టణం, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరు పురపాలక పరిధిలో ప్రైవేటు వ్యక్తులకు డబ్బులు చెల్లించవద్దని ఆర్ఐ రమేష్ అన్నారు. ఆదివారం 'ఈనాడు'లో 'ప్రొద్దుటూరులో కోడి లంచాలు మేస్తోంది' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి ఆర్ఐ స్పందించారు. పలు చికెన్ సెంటర్ల దుకాణాల వద్దకు వెళ్లి విచారణ చేశారు. తమకు ఏ సౌకర్యాలు కల్పించడం లేదని వాపోయారు. ఆర్ఐ మాట్లాడుతూ పుర పాలక సంఘం జారీ చేసిన కచ్చితమైన రశీదులు ఇస్తేనే డబ్బులు చెల్లించాలన్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల
(అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 99899 97626
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 91771 11468

గురుకుల విద్యాలయంలో జనరేటర్ ఏర్పాటు

కొండాపురం, న్యూస్‌టుడే: కొండాపురంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల విద్యాలయంలో నూతనంగా జనరేటర్‌ను ఏర్పాటు చేశారు. గతంలో విద్యాలయంలో సరైన వసతులు లేక విద్యార్థినులు తీవ్ర ఇబ్బంది పడేవారు. వారి ఇబ్బందులను గుర్తించిన కూటమి ప్రభుత్వం గురుకుల విద్యాలయంలో సుమారు రూ.62 లక్షలతో నిర్వహణ పనులు చేపట్టింది. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు, మౌలిక వసతులు కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా జనరేటర్‌ను ఏర్పాటు చేశారు. దీంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రెవెన్యూ క్లినిక్ నేడు

దువ్వూరు, ప్రొద్దుటూరు గ్రామీణ, న్యూస్‌టుడే : దువ్వూరు, ప్రొద్దుటూరు తహసీల్దారు కార్యాలయాల వద్ద సోమవారం ఉదయం 9 గంటలకు రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆయా తహసీల్దార్లు వై.సంజీవరెడ్డి, గంగయ్య ఆదివారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. కలెక్టరు ఆదేశాలతో ఆర్డీవో సాయిశ్రీ ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారుల పర్యవేక్షణలో ఈ క్లినిక్ ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మండల పరిధిలో పెండింగ్‌తోపాటు కొత్తగా దరఖాస్తుదారులు తమ సమస్యలు, ఫిర్యాదులకు సంబంధించి పత్రాలను తీసుకు రావాలని కోరారు. వీటి పరిష్కారంలో భాగంగా పరిశీలన, విచారణకు అవి ఉపయుక్తంగా ఉంటాయన్నారు.

బండారుకు స్వాగతం.. తరలివచ్చిన భక్తజనం

జమ్మలమడుగులో మారెమ్మ చెట్టుకు కట్టిన బండారు

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: శ్రీ పెద్దమ్మ దేవర సందర్భంగా మైలవరం మండలం ఎం.కంభాలదిన్నె గ్రామం నుంచి జమ్మలమడుగు పెన్నానదికి బండారు చేరుకుంది. పెన్నాలో విడిది చేసి బండారు వద్ద పూజలు చేశారు. పెద్దమ్మ కథ చెప్పడం పూర్తైన తర్వాత బండారును తప్పెట్లు, వాయిద్యాలతో కన్యకాపరమేశ్వరి ఆలయం, అంబా భవానీ ఆలయం మీదుగా మారెమ్మ చెట్టు వద్దకు ఊరేగింపు చేరుకుంటుంది. బండారును మారెమ్మ చెట్టుకు కట్టడంతో దేవర ప్రారంభించినట్లని ఉత్సవ కమిటీ అధ్యక్షుడు తాతిరెడ్డి సూర్యనారాయణరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా పెన్నానదిలో పట్టణ ప్రజలు బండారుకు ఎదురేగి ఘనంగా స్వాగతం పలికారు. 23, 24, 25వ తేదీల్లో పెద్దమ్మ, గంగమ్మ, పోలేరమ్మ ఆలయాల వద్ద చల్ల పోసే కార్యక్రమం ఉంటుందన్నారు.

జాతీయ సమైక్యతా శిబిరానికి విద్యార్థి ఎంపిక

అరకటవేముల బాలు

మైదుకూరు, న్యూస్‌టుడే : కర్ణాటక రాష్ట్రం బెలగావిలో నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ జాతీయ సమైక్యతా శిబిరానికి మైదుకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి అర్కటవేముల బాలు ఎంపికయ్యారు. యోగివేమన విశ్వ విద్యాలయం నుంచి ఎంపికై రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహిస్తారని ప్రిన్సిపల్ పి. నారాయణరెడ్డి పేర్కొన్నారు. వివిధ రాష్ట్రాలకు చెందిన యువతను ఒకే వేదికపై తెచ్చి భిన్న భాషలు, సంస్కృతులు, సంప్రదాయాల మధ్య పరస్పర అవగాహనను పెంపొందించడంలో కీలకపాత్ర పోషిస్తుందని, నాయకత్వ లక్షణాలను నేర్పిస్తుందని వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

కొండాపురం, న్యూస్‌టుడే: కడప-తాడిపత్రి జాతీయ రహదారిలోని కొండాపురం మండలం పి.అనంతపురం క్రాస్ వద్ద కారును ఐషర్ వాహనం ఢీకొనడంతో ఒకరు గాయపడిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. తాడిపత్రి మండలం తిప్పిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన సుదర్శననాయుడు కారులో కొండాపురం మండలం లావనూరు గ్రామానికి బయలుదేరారు. మార్గమధ్యలోని పి.అనంతపురం క్రాస్ వద్ద కారును ఐషర్ లారీ ఢీకొట్టడంతో కారులోని సుదర్శననాయుడు గాయపడ్డారు. క్షతగాత్రుని 108 అంబులెన్స్‌లో తాడిపత్రిలోని వైద్యశాలకు తరలించారు. ఈ ఘటనలో కారు నుజ్జుయింది.

క్రీడా మైదానం...సమస్యలకు నిలయం

ప్రొద్దుటూరు, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరు అనిబిసెంట్ పురపాలక బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో సమస్యలు దర్శనమిస్తున్నాయి. ఇది వరకు కళకళలాడే పచ్చని గడ్డి ఎండిపోయింది. మహిళలు, పురుషులకు వేర్వేరుగా ఏర్పాటు చేసిన బహిరంగ వ్యాయామశాలల్లోని పరికరాలు విరిగిపోయాయి. వీటికి ఉన్న ఇనుప తీగల రక్షణ కంచెలు, గేట్లు తొలగించారు. పారిశుద్ధ్య పనుల్లో భాగంగా ఏర్పాటు చేసిన చెత్త డబ్బాలు ధ్వంసమయ్యాయి. క్రీడాకారుల కోసం ఏర్పాటు చేసిన కబడ్డీ, వాలీబాల్, క్రికెట్ పిచ్‌లు, రన్నింగ్ ట్రాక్‌లైన్లు, హై, లాంగ్ జంపు కోర్టులు పాడయ్యాయి.

పురుషుల ఓపెన్ జిమ్‌లో విరిగిపోయిన వ్యాయామ పరికరం

పర్యవేక్షణ కరవు

పార్కులో దుస్థితికి కొరవడిన పర్యవేక్షణ, నిర్వహణ లోపమే

● పురపాలక సంఘంలో దుస్థితి

ప్రధాన కారణం. ప్రతి ఏటా దసరా ఉత్సవాలు పురస్కరించుకొని ఎగ్జిబిషన్ నిర్వహణకు మైదానానికి వేలం నిర్వహించగా రూ.కోటి నుంచి రూ.2 కోట్ల వరకు రాబడి వస్తోంది. ఇంత ఆదాయం సమకూరుతున్నా మైదానంలో వ్యాయామం, క్రీడాభివృద్ధికి అవసరమయ్యే సౌకర్యాలు కల్పించకపోవడం చాలా దారుణమని క్రీడాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, పాలకులు స్పందించి మైదానంలో సౌకర్యాలు కల్పించాలని పుర ప్రజలు కోరుతున్నారు.

ప్రణాళిక రూపొందించాం

ప్రొద్దుటూరు పురపాలక మైదానంలో పచ్చదనం అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం. వ్యాయామశాలల్లోని పరికరాల మరమ్మతులు చేయించేందుకు ప్రణాళిక రూపొందించాం.
- శ్రీనివాసులు, ఇంజినీరింగ్ విభాగం ఈఈ, పురపాలక సంఘం

విద్యార్థులకు క్రమశిక్షణ, సేవ అవసరం

చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంఈవో ప్రమీళ, స్కౌట్స్, గైడ్స్

చాపాడు, న్యూస్‌టుడే: బేడన్ పావెల్ సమాజానికి సేవ చేయాలనే ఉద్దేశంతో విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ, సేవ, దేశభక్తి అలవడేలా స్కౌట్స్‌ను ప్రవేశపెట్టాడని బద్వేలు ఎంఈవో ప్రమీళ అన్నారు. ఆదివారం చాపాడులోని గూడూరు అప్పయ్యగారి సుబ్బరాయుడు జడ్పీ హైస్కూల్‌లో ఆలిండియా స్కౌట్స్ ఉద్యమ నేత రాబర్ట్ స్టీఫన్సన్ స్మిత్ బేడన్‌పావెల్ జయంతి నిర్వహించారు. స్కౌట్ మాస్టర్ ఓబయ్య, గైడ్ కెప్టెన్ ఖైరున్‌బీ, స్కౌట్స్, గైడ్స్ బేడన్‌పావెల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఆలయ పునర్నిర్మాణానికి అంకురార్పణ

ఖాజీపేట: శ్రీ నాగనాథేశ్వర స్వామి ఆలయం సరికొత్త హంగులతో పునర్నిర్మాణం కానుంది. ఈ నేపథ్యంలో ఆదివారం దేవదాయ శాఖ అధికారుల సమక్షంలో పాత ఆలయ కట్టడాలను తొలగించినట్లు ఆలయ ఛైర్మన్ వెంకట సూర్య సుమన్ రెడ్డి తెలిపారు. ఎలాంటి ఆటంకాలు లేకుండా పక్కా ప్రణాళికతో పనులు చేపట్టినట్లు తెలిపారు.

పెద్దకర్మ
జననం : 01.07.1942
మరణం : 13-02-2026

కీ॥శే॥ శ్రీ రెడ్డి మునియ్య గారు
శ్రీ రెడ్డి మునియ్య గారు 13.02.2026వ తేదీ శుక్రవారం సాయంత్రం స్వర్గస్తులైనారు.
కావున వీరి ఆత్మశాంతికై 23.02.2026 తేదీ సోమవారం ఉదయం "పెద్దకర్మ" మా స్వగృహం నందు జరుగును. కావున తెలుపడమైనది.
ఇట్లు : కుటుంబ సభ్యులు - బంధుమిత్రులు
శాస్త్రినగర్, ప్రొద్దుటూరు.

కడప

• కడప • పులివెందుల • కమలాపురం

రాయలసీమ నవలలపై అవగాహన

పరిశోధక విద్యార్థి రవీంద్రను సన్మానిస్తున్న నిర్వాహకులు

మారుతీనగర్, న్యూస్‌టుడే: విభిన్న సామాజిక అంశాల సమాహారం 70వ దశకం రాయలసీమ నవల అని వైవీయూ తెలుగుశాఖ పరిశోధక విద్యార్థి రవీంద్ర అన్నారు. సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో నిర్వహించిన నెల నెలా సీమసాహిత్యం సదస్సులో భాగంగా ఆదివారం రాయలసీమ నవలలు అనే అంశంపై ప్రసంగ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు భూతపురి గోపాలకృష్ణశాస్త్రి, చింతకుంట శివారెడ్డి, సహాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శన

పులివెందుల, న్యూస్‌టుడే: పులివెందులలోని శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. ఈ మేరకు ఎస్‌కే డ్యాన్స్ అకాడమీ, నంద నృత్య మాస్టర్, శ్రీసాయి కోలాట బృందం వారు ఆదివారం చేసిన నృత్యాలు స్థానికులను అలరించాయి. శిల్పారామం ఏవో విశ్వనాథ రెడ్డి ఏర్పాట్లను పరిశీలించారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, పక్కన అధికారులు

రైతుల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం

కమలాపురం, న్యూస్‌టుడే: రైతుల అభివృద్ధే కూటమి ప్రభుత్వం లక్ష్యం అని ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి అన్నారు. మార్కెట్‌యార్డు ఛైర్మన్ రామచర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం మండలంలో ఏర్పాటు చేసిన శనగల కొనుగోలు కేంద్రాన్ని జిల్లా వ్యవసాయశాఖ అధికారి చంద్రనాయక్, డీసీవో వెంకటసుబ్బయ్యతో కలిసి ఆయన ప్రారంభించారు. రైతులు ఇబ్బందులు లేకుండా జిల్లాలో 41 కొనుగోలు కేంద్రాలుంటే మన ప్రాంతంలో 4 కేంద్రాలు పెట్టామన్నారు. భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో పీఏసీ నరసింహారెడ్డి, ఏవోలు సరస్వతి, శ్యాంబాబు, పల్లూరు మండల కన్వీనర్ నాగేశ్వర్‌రెడ్డి, వాసుదేవరెడ్డి, సుధాకర్‌రెడ్డి, దివాకర్‌రెడ్డి, జంపాల నరసింహారెడ్డి పాల్గొన్నారు.

అంతులేని నిర్లక్ష్యం.. జలమంతా మురుగుకూపం

• కాలువలో తాగునీటి సరఫరా పైపులైన్లు

కడప నగరపాలక, న్యూస్‌టుడే: నగరంలోని ప్రతి వీధిలో మురుగు, తాగునీటి కాలువలు కలిసి పయనిస్తున్నాయి. కొన్ని చోట్ల పైపులైన్లు మురుగు కాలువల్లో కలిసిపోతున్నాయి. ఏళ్ల కిందట వేసిన పైప్‌లైన్లు లీకేజీలతో కలుషిత జలాలను సరఫరా చేస్తూ ప్రజలను వ్యాధుల రూపంలో కాటేయడానికి ఎదురుచూస్తున్నాయి. రూ.కోట్ల విలువైన హామీలనిచ్చే నేతలకు ఈ ప్రమాదం కంటికి కనిపించడం లేదు. నీటి పన్నుల రూపంలో నగరపాలక సంస్థ ఏటా రూ.10 కోట్లు వసూలు చేస్తోంది. ప్రజల నుంచి వసూలు చేసే మొత్తం తాగునీటి సరఫరా వ్యవస్థ నిర్వహణకే సరిపోవడం లేదని అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో పాలనా యంత్రాంగానికి కలుషిత జలాల సరఫరా సమస్యగా మారింది. దీంతో నగర ప్రజానీకం కార్పొరేషన్ సరఫరా చేసే నీటిని తాగలేక వాటర్ ప్లాంట్ల నుంచి డబ్బా నీటిని కొనుగోలు చేస్తున్నారు.

బీకెఎం వీధిలో కాలువలో తాగునీటి సరఫరా చేసే పైపులు

• నగర జనాభా 4.70 లక్షలు
• రోజూ సరఫరా చేస్తున్న నీరు 50 ఎంఎల్‌డీ
• ఓవర్ హెడ్ ట్యాంకులు 19
• పంపింగ్ మెయిన్ లైన్లు 61.9 కిమీ
• డిస్ట్రిబ్యూషన్ లైన్లు 550 కిమీ
• కుళాయి కనెక్షన్ల సంఖ్య 60వేలు

• నగరపాలకలో ఒక వీధిని ఏర్పాటు చేసే సమయంలో మురుగు కాలువ నిర్మాణం, తాగునీటి పైప్‌లైన్, వీధి దీపాలు, స్తంభాల ఏర్పాటు, రహదారికి నిబంధనల ప్రకారం తగినంత స్థలాన్ని వదలాల్సి ఉంది. కానీ తాగునీటి పైప్‌లైన్ల ఏర్పాటుకు వదిలిన స్థలాలను కబ్జాచేసి నిర్మాణాలు చేపడుతున్నారు. దీంతో పైప్‌లైన్లను కాలువల్లో ఏర్పాటు చేస్తున్నారు.

• నగరంలోని బీకెఎం వీధి, మోచంపేట, ఖలీల్‌నగర్, గౌస్‌నగర్, నకాశ్, కటిక వీధి, నాగరాజుపేట తదితర ప్రాంతాల్లో దాదాపు 30 ఏళ్ల కిందట వేసిన పైపులైన్లు శిథిలావస్థకు చేరాయి. చాలా చోట్ల కాలువల్లో పైప్‌లైన్లు ఉండడంతో మురుగు తాగునీటితో కలిసిపోతోంది. కాలం తీరిన పైప్‌లైన్లను సమూలంగా మార్చడానికి ప్రణాళిక రూపొందించి అమలు చేస్తే సమస్య పరిష్కారం అవుతుంది.

కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు

మాట్లాడుతున్న వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ ఛైర్మన్ అమర్నాథ్‌యాదవ్

పులివెందుల, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో బుడ్డ శనగ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ ఛైర్మన్ అమర్నాథ్‌యాదవ్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. రైతులు పండించిన బుడ్డ శనగను మార్కెట్లో ఉన్న ధరకంటే అధిక ధర చెల్లించి కొనుగోలు చేస్తున్నామన్నారు. సోమవారం నుంచి కొనుగోలు ప్రక్రియ ప్రారంభిస్తామన్నారు. దీని ద్వారా రైతులకు రవాణా ఖర్చుల భారం తగ్గుతుందన్నారు. కొనుగోలు అనంతరం 15 రోజుల్లో రైతులకు ప్రభుత్వం డబ్బులు చెల్లిస్తుందని ఆయన వివరించారు. కార్యక్రమంలో సింహాద్రిపురం మార్కెట్ కమిటీ ఛైర్మన్ బండి రామసుబ్బారెడ్డి, పులివెందుల వ్యవసాయ కమిటీ వైస్ ఛైర్మన్ చంద్రవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

కడప డీసీసీబీ కార్యాలయంలో నరసింహారెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఓఎస్డీ గురప్ప, తదితరులు

ఉయ్యాలవాడ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి

తెలుగుజాతి గర్వించదగ్గ వ్యక్తి ఉయ్యాలవాడ

కడప గ్రామీణ, మారుతీనగర్, జిల్లా సచివాలయం, పులివెందుల, న్యూస్‌టుడే: ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం ఆయా ప్రాంతాల్లో నిర్వహించారు. కడప డీసీసీబీ కార్యాలయంలో ఉయ్యాలవాడ చిత్రపటానికి ఓఎస్డీ గురప్ప, ఉద్యోగులు నివాళులర్పించారు. కలెక్టరేట్‌లో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి సందర్భంగా స్టెప్ సీఈవో విజయ్‌కుమార్, పర్యాటకశాఖాధికారి సురేష్‌కుమార్‌లు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. కడప రెడ్డి సేవాసమితి సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి, సుబ్బిరెడ్డి, చెంచిరెడ్డి, శివనారాయణరెడ్డి, రెడ్డిసేవాసమితి విద్యార్థులు పాల్గొన్నారు. పులివెందులలోని ఉయ్యాలవాడ విగ్రహానికి పురపాలక సంఘం వైస్ ఛైర్మన్ మనోహర్‌రెడ్డి, రెడ్డి సంఘం నాయకులు పూలమాలలువేసి నివాళులు అర్పించారు.

పులివెందులలో అంజలి ఘటిస్తున్న పురపాలక వైస్ ఛైర్మన్ మనోహర్‌రెడ్డి, రెడ్డి సంఘం సభ్యులు

సీహెచ్‌సీలో రక్త పరీక్షలు కరవు

చెన్నూరు, న్యూస్‌టుడే: చెన్నూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రంలోని అధికారులు ఆదివారం రక్త పరీక్షలకు సెలవుగా మార్చేశారు. మండలంలో కొంత కాలంగా విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. ఈ నేపథ్యంలో రక్త పరీక్షల కోసం వచ్చిన రోగులు ఎంత సేపటికీ గది తాళం తీయకపోవడంతో సిబ్బందిని ప్రశ్నించారు. ఆదివారం ఇక్కడ రక్త పరీక్షలు చేయరని సిబ్బంది సమాధానం ఇచ్చారు. ఈ విషయమై వైద్యాధికారి హర్షితను వివరణ కోరగా.. ఇక్కడ పనిచేస్తున్న ఇద్దరు ల్యాబ్ సిబ్బందిలో ఒకరు మెటర్నిటీ సెలవుపై వెళ్లారని, మరొకరికి ఈ రోజు సెలవు అని చెప్పారు. రోగులకు రక్త పరీక్ష అందని విషయమై డీసీహెచ్ఎస్ హిమబిందును వివరణ కోరగా సమస్యను గుర్తించి పరిష్కరిస్తామని స్పష్టం చేశారు.

బెడెన్ పావెల్ అడుగుజాడల్లో నడవాలి

జయంతి కార్యక్రమంలో పాల్గొన్న స్కౌట్ మాస్టర్లు

కడప విద్య, న్యూస్‌టుడే : బెడెన్ పావెల్ అడుగుజాడల్లో నడవడం మన బాధ్యత అని జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్ రామకృష్ణ అన్నారు. స్థానిక శంకరాపురంలోని భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రాంతీయ శిక్షణ కేంద్రంలో ఆదివారం స్కౌట్స్ అండ్ గైడ్స్ వ్యవస్థాపకులు లార్డ్ బెడెన్ పావెల్ జయంతి పురస్కరించుకుని 'వరల్డ్ థింకింగ్ డే' వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో రిటైర్డ్ టీచర్ యనమల చంద్రశేఖర్‌రెడ్డి, సహాయ కార్యదర్శి బాదరీదాసు, సంయుక్త కార్యదర్శి వెంకటసుబ్బయ్య, డీవోసీ రమణయ్య, రోహిణి, జేసీడీవో రూతుఆరోగ్యమేరి, స్కౌట్ మాస్టర్లు అమర్‌నాథ్‌బాబు, సగినాల అహమ్మద్, శివప్రసాద్, బాలసుందరం, శివకేశవ, సురేంద్రనాయక్, బద్రీనాథ్, మహమ్మద్ అలీ, దేవదత్తం తదితరులు పాల్గొన్నారు.

ఆమరణ నిరాహార దీక్షలకు సంఘీభావం

దీక్షలకు సంఘీభావం తెలుపుతున్న యూటీఎఫ్ నాయకులు

కడప విద్య, న్యూస్‌టుడే : మున్సిపల్ కార్మికుల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం సత్వరమే పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు కోరారు. స్థానిక నగరపాలకసంస్థ కార్యాలయం ఎదుట మున్సిపల్ కార్మికులు చేస్తున్న ఆమరణ నిరాహారదీక్షలకు యూటీఎఫ్ నాయకులు సంఘీభావం తెలియజేశారు. అకారణంగా తొలగించిన మున్సిపల్ కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలన్నారు. నాయకులు కుర్రా చెన్నయ్య, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చోదకా.. ఇక్కడ జర భద్రం!

మండలంలోని ఇ.కొత్తపల్లె గ్రామ ప్రవేశం మార్గం పక్కన పాడుబడిన బావి ఉంది. దాని చుట్టూ ఎలాంటి ప్రహరీ లేదు. కానీ ఈ మధ్య కాలంలో కొంతమేర మట్టితో ఆ బావిని పూడ్చారు. దాన్ని పూర్తిగా పూడ్చకపోవడంతో ప్రమాదకరంగా మారింది. అటువైపుగా వెళుతున్న వాహన చోదకులు ఏ మాత్రం ఆదమరిచినా ప్రమాదం సంభవిస్తుంది. దీంతో ద్విచక్రవాహన చోదకులు రాత్రిపూట భయం భయంగా వెళుతున్నారు. ఎలాంటి ప్రమాదం సంభవించక ముందే అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఎంపీడీవో కృష్ణమూర్తి మాట్లాడుతూ బావి పూడ్చివేతకు చర్యలు తీసుకుంటామన్నారు.
- న్యూస్‌టుడే, పులివెందుల గ్రామీణ

చందమామ కథలను చిన్నారులకు చెబుతున్న జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ దాసరి భానుప్రకాష్

'చదువుట మాకెంతో ఇష్టం'

మారుతీనగర్, న్యూస్‌టుడే: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఆదివారం 'చదువుట మాకెంతో ఇష్టం' కార్యక్రమం నిర్వహించారు. ఇందుకు జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ దాసరి భానుప్రకాష్ హాజరై విద్యార్థులకు బాలల బొమ్మలు, చందమామ కథల పుస్తకంలోని నీతి కథలను చిన్నారులకు చెప్పారు. ఆదివారం చదువుట మాకెంతో ఇష్టం కార్యక్రమంతో ఉపాధ్యాయుల ద్వారా చిన్నారులకు డ్రాయింగ్, కథలు చెప్పడం, నేర్పడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి అమీరుద్దీన్, డిప్యూటీ లైబ్రేరియన్ పవన్‌కుమార్, రాజకుమార్, భాజపా నాయకుడు రామకృష్ణారెడ్డి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసు స్టేషన్‌కు తాగునీటి వసతి

సింహాద్రిపురం, న్యూస్‌టుడే: సింహాద్రిపురం పోలీసు స్టేషన్‌ను డీఎస్పీ మురళీ ఆదివారం పరిశీలించారు. అనంతరం అక్కడ నూతనంగా ఏర్పాటు చేసిన నీటి బోరును ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ. . పోలీసుల అవసరాలను తెలుసుకుని సమస్యను పరిష్కరించటంలో చొరవ చూపిన బీటెక్‌రవికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సీఐ ఎన్‌వీ రమణ, ఎస్ఐ అనిల్‌కుమార్, పోలీసులు పాల్గొన్నారు.

నీటి బోరును ప్రారంభిస్తున్న డీఎస్పీ మురళీ

సంక్షిప్త సమాచారం

నేడు రెవెన్యూ క్లినిక్ : కమలాపురం: కడప ఆర్డీవో జాన్ ఎర్విన్ ఆధ్వర్యంలో ఈ నెల 23న స్థానిక కార్యాలయంలో రెవెన్యూ క్లినిక్ నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ శివరామిరెడ్డి ఆదివారం పేర్కొన్నారు. పట్టణంతో పాటు గ్రామాల ప్రజలు తమ సమస్యలపై అర్జీలు ఇస్తే పరిష్కరిస్తారని చెప్పారు.

ముదిరాజ్ సంఘం కార్యవర్గం ఎన్నిక : చక్రాయపేట(వేంపల్లె): వేంపల్లె మండలం ముదిరాజ్ సంఘం అధ్యక్షుడిగా పీవీ చలపతిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గవిమల్లేశ్వరస్వామి ఆలయం వద్ద ముదిరాజ్ సంఘం కార్యవర్గ సమావేశం ఆదివారం నిర్వహించారు. గౌరవ అధ్యక్షుడిగా జి.ఓబులేసు, ఉపాధ్యక్షులుగా నాగార్జున, అంజి, బాలనరసింహులు, వెంకటేష్, కార్యదర్శిగా వి.అంజి, సహాయ కార్యదర్శిగా రమణ, కోశాధికారి వెంకటసుబ్బయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మల్లేశును ఎన్నుకున్నారు.

మద్యం తాగి వాహనం నడిపినందుకు కేసు : కడప చిన్నచౌకు: కడప చిన్నచౌకు ఠాణా పరిధిలో అంబేడ్కర్ భవన్ వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా సోమశేఖర్ అనే వ్యక్తిని తనిఖీ చేయగా మద్యం తాగినట్లు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజరాజేశ్వరరెడ్డి తెలిపారు.

గ్రంథాలయానికి పుస్తకాల అందజేత : కడప గ్రామీణ: జిల్లా కేంద్ర గ్రంథాలయానికి ప్రముఖ కవి కొప్పర్తి వెంకట రమణమూర్తి రచించిన పుస్తకాలను డీసీసీబీ ఓఎస్డీ గురప్ప అందచేశారు. కొప్పర్తి కవిత్వం పుస్తకాలను గ్రంథాలయ ఛైర్మన్ భానుప్రకాష్‌కు అందచేశారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా : పులివెందుల: వారాంతపు రోజు ఉల్లాసంగా.. ఉత్సాహంగా గడపాలని యోగా గురూజీ వెంకట్రామిరెడ్డి, రాష్ట్ర హజ్‌కమిటీ డైరెక్టర్ మహబూబ్‌బాషా అన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన హ్యాపీ సండే కార్యక్రమాన్ని ఆదివారం పులివెందులలోని వైఎస్ఆర్ మెమోరియల్ పార్కులో నిర్వహించారు. పురపాలక కమిషనర్ మునికుమార్ పాల్గొన్నారు.

మారుతున్న కాలానికి అనుగుణంగా సేవలు : అరవిందనగర్ (కడప): మారుతున్న కాలానికి అనుగుణంగా ఫిజియోథెరపీ సేవలు అందుబాటులోకి వచ్చాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఎస్సీ కమిషన్ సెక్రటరీ చినరాముడు తెలిపారు. ఆదివారం నగరంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో శివానాయక్ ఏర్పాటు చేసిన ఫిజియోథెరపీ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. తంబళ్లపల్లె ఎమ్మెల్యే ద్వారకానాథ్‌రెడ్డి, భాజపా జిల్లా అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి, మాజీ మేయర్ సురేష్‌బాబు, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి శశిభూషణ్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ జిల్లా ఛైర్మన్ భాను ప్రకాశ్, ప్రముఖ వైద్యులు పాల్గొన్నారు.

32 ద్విచక్రవాహనాలు సీజ్ : చక్రాయపేట(వేంపల్లె) : వేంపల్లెలోని శ్రీరాంనగర్‌లో ఆదివారం సీఐలు, ఎస్సైలు నాకాబందీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ నరసింహులు మాట్లాడుతూ.. సరైన పత్రాలు లేని 32 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీఐ సీతారామిరెడ్డి, ఎస్సైలు తిరుపాల్ నాయక్, తాయార్ హుస్సేన్ పాల్గొన్నారు.

దాన గుణం అలవర్చుకోవాలి : పులివెందుల: అందరూ దాన గుణం అలవర్చుకోవాలని పులివెందుల శ్రీరంగనాథస్వామి ఆలయ ఛైర్మన్ సుధీకర్ రెడ్డి అన్నారు. రామిశెట్టి శివశంకర్ ఆదివారం ఆలయానికి అవసరమయ్యే నీటి డ్రమ్ములు, వ్యవసాయ పరికరాలను వితరణ చేశారు.

దంపతుల ఆత్మహత్యాయత్నం : కడప నేరవార్తలు, చెన్నూరు : గొడవలతో భార్యభర్తలిద్దరూ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. చెన్నూరు మండలంలోని ఓ గ్రామానికి చెందిన దంపతులు ప్రస్తుతం నగరంలోని ఎన్జీవో కాలనీలో నివాసం ఉంటున్నారు. ఈ నేపథ్యంలో ఇద్దరూ తరచూ గొడవ పడుతుండేవారు. ఈ క్రమంలో ఆదివారం ఇద్దరూ విషద్రావణం తాగి నిద్రమాత్రలు మింగారు. వారిని కడప రిమ్స్‌కు తరలించారు.

వృద్ధులకు అన్నదానం : కడప ఏడురోడ్లు : షా సోషల్ జస్టిస్ సివిల్-హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ప్రతినిధులు ఆదివారం స్థానిక ఆజాద్ నగర్‌లోని వృద్ధాశ్రమంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ మౌలానీ, ప్రతినిధులు రియాజ్‌ఖాన్, విజయసాయి, సుజాత, స్వప్న, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి ప్రతిభ : కడప విద్య : రాష్ట్రీయ మిలిటరీ స్కూల్ ప్రవేశ పరీక్షలో కడప నగరంలోని తమ సంస్థ విద్యార్థి ప్రతిభ చాటినట్లు శ్రీదిన్నెపాటి బసిరెడ్డి వికాస్ కోచింగ్ సెంటర్ కరస్పాండెంట్ శ్రీదిన్నెపాటి బసిరెడ్డి అన్నారు. స్థానిక సంస్థ కార్యాలయంలో ఆదివారం ప్రతిభ చూపిన విద్యార్థిని అభినందించారు. ప్రవేశ పరీక్ష ఫలితాలలో 200 మార్కులకుగానూ 148 మార్కులు సాధించినట్లు వివరించారు.

నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్టీసీ పొరుగుసేవల ఉద్యోగులు

ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్

కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే: ఆర్టీసీలో పని చేస్తున్న పొరుగు సేవల ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆ సంఘం నాయకుడు గంగాంజినేయులు కోరారు. నగరంలో ఏఐటీయూసీ జిల్లా మహాసభలు సందర్భంగా ఉద్యోగులు కోటిరెడ్డి కూడలి నుంచి ర్యాలీ చేపట్టారు. పొరుసేవల ఉద్యోగులకు ఆర్టీసీ యాజమాన్యం నేరుగా ఉద్యోగుల ఖాతాలో జీతాలను జమ చేయాలన్నారు. కార్మికులందరికీ జీతంతో కూడిన వారాంతరపు, లేబర్ సెలవులు ఇవ్వాలన్నారు. ఆన్‌కాల్ డ్రైవర్లకు ఏదైనా ప్రమాదం జరిగితే యాజమాన్యం బాధ్యత వహించాలన్నారు.

రైతుబజారులో కూరగాయల ధరలు

కడప వ్యవసాయం, న్యూస్‌టుడే: రైతుబజారులో కూరగాయల ధరలు కిలో (నిన్నటివి) ఇలా...బంగాళదుంప-40, క్యాబేజి-30, క్యారెట్-40, బీన్స్-60, బీట్‌రూట్-35, కీర-40, దోస-40, దొండకాయలు-45, ముల్లంగి-30, అల్లం-90, కాలీఫ్లవర్-25, క్యాప్సికం-60, టమాట-12, మిరపకాయలు 40, వంకాయలు-20, బెండకాయలు-30, బీర-40, కాకర-40, మటిక్కాయ-40, చిక్కుడు-30, అలసందకాయలు-35, అనపకాయలు-35, ఉల్లిపాయలు-25.

చూసుకుని వెళ్లకపోతే ప్రమాదమే!

మండలంలోని నల్లపురెడ్డిపల్లె నుంచి అంబకపల్లె గ్రామానికి వెళ్లే మార్గంలో ద్విచక్ర, అరటి లోడు వాహనాలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటాయి. చోదకులు వేగంగా వెళుతుండటంతో రోడ్డు దాటేందుకు పాదచారులు భయాందోళనకు గురవుతున్నారు. ఆ వాహనాలు అదుపు చేసేందుకు నల్లపురెడ్డిపల్లె పీహెచ్‌సీ కేంద్రం సమీపాన రహదారిపై గతంలో స్పీడ్ బ్రేకర్ వేశారు. కానీ ప్రస్తుతం అది పగిలిపోయింది. దీంతో అటువైపుగా వెళుతున్న వారికి దెబ్బతిన్న స్పీడ్ బ్రేకర్ కనిపించక రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు. దాన్ని పూర్తిగా తొలగించి పునర్నిర్మాణ పనులు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఆర్అండ్‌బీ డీఈ వేణుగోపాల్ మాట్లాడుతూ పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామన్నారు. **- న్యూస్‌టుడే, పులివెందుల గ్రామీణ**

అనుమానితుల కదలికలపై తనిఖీలు

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: కడప ఒకటో పట్టణ ఠాణా పోలీసులు ఆదివారం నగరంలోని పలు ప్రాంతాల్లో అనుమానితుల కదలికలపై నిఘా ఉంచారు. సీఐ చిన్నపెద్దయ్య ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్‌లో ఎస్సై అమర్‌నాథ్‌రెడ్డి తనిఖీలు నిర్వహించారు. ప్రయాణికుల బ్యాగులను పరిశీలించారు. అనుమానితుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైలు మార్గాల్లో గంజాయి సరఫరా అవుతున్నట్లు సమాచారం రావడంతో ఆ దిశగా తనిఖీలు చేపట్టారు. అలాగే ఎస్సై ప్రదీప్ వైవీ స్ట్రీట్‌లో పలు ప్రాంతాల్లో పరిశీలించారు. విస్తృతంగా పోలీసుల తనిఖీలు

రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేస్తున్న పోలీసులు

కడప నేరవార్తలు, : నగరంలో గంజాయి, మత్తు పదార్థాలు లేకుండా వాటిని వినియోగించే వారిని కట్టడి చేసేందుకు ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు రెండో పట్టణ ఠాణా పరిధిలో పోలీసులు ముమ్మరంగా డ్రోన్ కెమెరాలతో గాలింపు చర్యలు చేపట్టారు. సమాధులు, పాతభవనాలు, ముళ్లపొదల్లో సైతం కెమెరాలతో గాలించారు. అల్మాస్‌పేట, ఖలీల్‌నగర్, వక్కలపేట, సంఘంపేట, సాయిపేట, మాసాపేట, యానాదికాలనీ, నకాష్, తదితర ప్రాంతాల్లో జల్లెడపట్టారు. సీఐ ప్రసాద్‌రావు మాట్లాడుతూ రెండో పట్టణ ఠాణా పరిధిలో ఎక్కడైనా గంజాయి, మత్తు పదార్థాలు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. తనిఖీల్లో ఎస్సైలు రామకృష్ణ, రఫి, స్పెషల్ పార్టీ పోలీసులున్నారు.

భౌతికశాస్త్రంలో పీహెచ్‌డీ ప్రదానం

వైవీయూ: భౌతిక శాస్త్రంలో కందుల భార్గవికి యోగివేమన విశ్వవిద్యాలయం (వైవీయూ) పీహెచ్‌డీ ప్రదానం చేసింది. 'ప్రాంతీయ స్థాయి నుంచి ప్రపంచ స్థాయి వరకు కరవు, గమనికలు, వాతావరణ అనుసంధానాల ప్రభావాలపై స్థల-కాల విశ్లేషణ' అంశంపై విశ్వవిద్యాలయంలోని భౌతిక శాస్త్ర విభాగంలో ప్రొఫెసర్ డాక్టర్ కృష్ణారెడ్డి మార్గదర్శకత్వంలో పరిశోధన చేశారు. ఈమె స్వగ్రామం నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ మండలం ఓబులంపల్లె.

సచివాలయాల్లో ఆధార్ సేవలు నిల్!

వల్లూరు, న్యూస్‌టుడే: మండల వ్యాప్తంగా ఉన్న సచివాలయాల్లో ఆధార్ సేవలు అందుబాటులో లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆధార్ కార్డులో ఏవైనా మార్పులు చేసుకోవాల్సి వస్తే స్థానికులు కడప, కమలాపురం పరిసర మండలాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో ప్రజలు అధిక వ్యయ ప్రయాసలకు గురవుతున్నారు. మండల వ్యాప్తంగా 9 సచివాలయాలున్నాయి. ఏ ఒక్క సచివాలయంలో కూడా ఆధార్ సేవలు లభించడం లేదు. గతంలో మండలంలోని లేబాక, కొప్పోలు సచివాలయాల్లో ఆధార్ సేవలు అందుబాటులో ఉండేవి. ఇక్కడ పనిచేసే డిజిటల్ అసిస్టెంట్లు ఆధార్ సేవలు అందించే అర్హతను(ఎల్ఎమ్ఎస్)ను రెన్యువల్ చేసుకోవాల్సి ఉంటుంది. వీరు చేసుకోకపోవడంతో ప్రస్తుతం ఈ రెండు కేంద్రాల్లో కూడా ఆధార్ సేవలు నిలిచిపోయాయి. దీంతో మండల వ్యాప్తంగా ఆధార్ సేవలు అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రభుత్వ పథకాలు అందాలంటే ఆధార్ తప్పనిసరి. ఇందులో ఉన్న తప్పులను సరిచేసేందుకు విద్యార్థులు, మహిళలు మండల కేంద్రాల్లోని సచివాలయాల్లోకి వెళ్లినా ప్రయోజనం లేకపోయింది. దీంతో వారు పక్క మండలాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఇదీ పరిస్థితి: సచివాలయాల్లో ఆధార్ సేవలు అందించాలంటే డిజిటల్ అసిస్టెంట్లు ప్రభుత్వం నిర్వహిస్తున్న ఎల్ఎమ్ఎస్ పరీక్షను రాయాల్సి ఉంటుంది. అందుకు వారు ముందుకు రాకపోవడంతో ఈ దుస్థితి ఏర్పడిందని అధికారులు చెబుతున్నారు. ఈ విషయమై ఎంపీడీవో రఘురామ్‌ను వివరణ కోరగా ఎల్ఎమ్ఎస్ పరీక్షలు రెండు నెలల్లో ప్రభుత్వం నిర్వహిస్తుందన్నారు. ఈ పరీక్షలకు డిజిటల్ అసిస్టెంట్లు హాజరయ్యేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అప్పటి వరకు మీసేవా కేంద్రాల్లో ఆధార్ సేవలు పొందాలని సూచించారు.

నిరంతర సాధనతో ప్రతిభకు మెరుగు

పులివెందుల గ్రామీణ, న్యూస్‌టుడే: పోటీ ప్రపంచంలో నిలిచేందుకు తమ ప్రతిభను మెరుగు పరుచుకోవాలని హెచ్ఎం రవిచంద్రారెడ్డి అన్నారు. మండలం పరిధి నల్లపురెడ్డిపల్లెలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఆదివారం ప్రతిభా పోటీలు నిర్వహించారు. దాత బ్రహ్మాంరెడ్డి ఆర్థిక సహకారంతో నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన పరీక్షకు 113 మంది విద్యార్థులు హాజరయ్యారు. ప్రతిభ చూపిన వారికి నగదు బహుమతి, ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

చక్రాయపేట : పదోతరగతి విద్యార్థులకు నియోజకవర్గం స్థాయిలో నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో మండలంలోని జిల్లా పరిషత్తు బాలికల పాఠశాలకు చెందిన వై.పూజ సత్తా చాటిందని ఆ పాఠశాల హెచ్ఎం నాగాంజనేయులు చెప్పారు. ఈ పోటీలు పులివెందులలోని నల్లపురెడ్డిపల్లె జిల్లా పరిషత్తు పాఠశాలలో ఆదివారం నిర్వహించగా పూజ పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు.

ధ్రువ పత్రాలతో విద్యార్థులు

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 99899 97626
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 91771 11468

(c) eenadu